

కవులు
ఆచార్యులు-రచనలు,జీవిత చరిత్ర
ఆంధ్ర కవుల చరిత్రము- 1 నుంచి 3


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

ఆంధ్రకవుల చరిత్రము

ప్రథమ భాగము

(పూర్వాంధ్రకవులు)

కీ. శే. కందుకూరి వీరేశలింగము

ప్రకాశకులు
హితకారిణీ సమాజము
రాజమహేంద్రవరము

కృతికర్త
నవ కవితా వైతాళికుడు



కీ. శే. శ్రీ కందుకూరి వీరేశలింగం గారు

తీగ తెగి మూగవోయిన రాగవీణ
లెన్ని తీయగా మరల మ్రోయింపఁబడియె,
ఎన్ని నిర్గంధ కుసుమమ్ము లెగసె వలపు
అతని చేతి విన్యాస మహస్సు వలన.

— శ్రీసహదేవ

పరిచయం

శ్రీ కందుకూరి వీరేశలింగంగారు ఆంధ్రకవుల చరిత్ర రచనను 1886-వ సంవత్సరంలో ఉపక్రమించి 1894-వ సంవత్సరంలో పరిపూర్తి చేసినారు. వారు కవుల చరిత్రను వ్రాస్తూ ఎప్పటికప్పుడు " వివేకవర్ధని, చింతామణి " పత్రికలలో ప్రచురిస్తూ వచ్చారు.

ఆంధ్రకవుల చరిత్ర ప్రథమభాగమును నేను 1887-వ సంవత్సరమునందు ప్రకటించితిని." అని శ్రీ కందుకూరి వారు తమ జీవితచరిత్రలో పేర్కొన్నారు. 1894-వ సంవత్సరములో ఒకసారి, 1897-వ సంవత్సరంలో మరియొక సారి ప్రచురించినారు.

ఆంధ్రకవుల చరిత్రను - పూర్వాంధ్రకవులు - మధ్యకాలపుకవులు - ఆధునిక కవులు - అని మూడు భాగాలుగా విభజించి 1890-వ సంవత్సరములో ఒకే ఒక్క సంపుటముగా వెలువరించినారు. ఆనాడు ఆంధ్రకవుల చరిత్రమీద వచ్చిన సమీక్షల్ని పరికించి, పండితమిత్రుల సలహాలను పాటించి శ్రీ వీరేశలింగంగారు కొన్ని మార్పుల్ని చేర్పుల్ని చేసి నన్నపార్యుని మొదలు కవిరాక్షసుని వరకు పూర్వాంధ్రకవులుగా విభజించి 1917-వ సంవత్సరంలో ప్రథమభాగముగా ప్రకటించారు. వృద్ధాప్యకారణముచేత ఆంధ్రకవులచరిత్ర తక్కిన రెండుభాగాల్ని శ్రీ వీరేశలింగంగారు తమచేతిమీదుగా పరిష్కరించ లేకపోయినారు.

శ్రీవీరేశలింగంగారికన్నా మున్నుగా గురుజాడ శ్రీరామమూర్తిగారు, ఆంధ్రకవుల జీవితాల్ని రచించి 1876 వ సంవత్సరంలోనే ప్రచురించారు. పెద్దాపురంనుండి ప్రకటింపబడే " శ్రీ ప్రబంధ కల్పవల్లి " అనే పత్రికలో ప్రచురిస్తూ ఉండేవారు. వారికవుల జీవితరచనలో కాలక్రమాన్ని పాటించ లేదు. భారతాంధ్రకవులు-రామాయణాంధ్రకవులు - ఆంధ్రపంచకావ్యకవులు-ఇత్యాదిగా విభాగించి రచించారు. ఆ కవుల జీవితరచన సమగ్రంగా లేక

జనశ్రుతిలోని కథలతో గాథలతోనిండి ఉంది. అయినా గురజాడ శ్రీరామ మూర్తిగారి కవిజీవితాలు శ్రీవీరేశలింగంగారి కవులచరిత్ర రచనకు ప్రేరక మని చెప్పవచ్చు.

శ్రీ కందుకూరి వారు తమ కవులచరిత్రలో కవులకాలనిర్ణయాలకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు. కవుల కావ్యాల గుణదోషాలను కూలంకషంగా కాక పోయినా దిఙ్మాత్రంగా నయినా సమీక్షించారు వారు నిర్ణయించిన కొందరి కవుల కాలనిర్ణయాలను ఆధునికులంగీకరింపక విమర్శించారు. ఆ విమర్శనల్ని పరికించిన శ్రీ వీరేశలింగంగారు అలా జరగడానికి హేతువుల్ని తమ కవుల చరిత్ర పీఠికలోను తమ జీవితచరిత్రలోను ఉల్లేఖించు కొన్నారు. ప్రథమ ప్రయత్నంలో ప్రమాదాలు దొరలడం వింతకాదు. విమర్శనీయం కాదు.

ఆనాటికి-అనగా శ్రీవీరేశలింగంగారు కవులచరిత్ర వ్రాసేనాటికికన్నా నేడు అనేక శిలాశాసనాలు, తామ్రశాసనాలు బాహిరిల్లినవి. అనేక తాళపత్ర గ్రంథాలు వెలుగులోనికి వచ్చాయి. క్రొంగ్రొత్త రీతులలో విశిష్ట పరిశోధ నలు దారులు తీశాయి. స్థిరంగా కవుల కాలనిర్ణయాలు, చేయడానికి వలను పడుతున్నది. అయినా యింకా కొందరి కవుల కాలనిర్ణయాలు ఊహగానాలే, ఆనాటికవులుతమకావ్యాల్ని నృపాలాంకితించేస్తూ వారి సాహసౌదార్యాంకాలను వారివంశానుక్రమణికలను తమరచల్ని తమవంశాల్ని ఉటంకించుకొన్నారే కానితమ జీవితచరిత్రాంశాలను లవలేశమైనా ఉల్లేఖించుకొన్నారుకాదు. ఆకార ణంగా వారి అభిరుచులు, అలవాట్లు, దినచర్య జీవితంలోని రసవత్తర ఘట్టాలు, అన్నీ విస్మృతి కుహరంలోనే వుండిపోయినాయి. అది ఆంధ్రుల దురదృష్టం. ఈనాటి వారివలె ఆనాటి కవీశాసులు స్వీయచరిత్ర ప్రస్తావనా ప్రలోభలోలుపులుగారేమో.

శ్రీ వీరేశలింగంగారి మరణానంతరం వారి ఆంధ్రకవులచరిత్ర సమగ్రంగా సంస్కరింపబడకుండగానే 1937 వ సంవత్సరంలో యథాతథంగా ముద్రణ పొందింది. తదుపరి 1940 వ సంవత్సరంలో ఆంధ్రకవులచరిత్ర ద్వితీయ భాగాన్ని 1950వ సంవత్సరంలో తృతీయ భాగాన్ని హితకారిణీ సమాజం అచ్చొత్తించింది.

ఆంధ్రకవుల చరిత్రలో కొట్టవచ్చినట్లు కానిపిస్తున్న కొన్ని లోపాలను చక్కదిద్ది ప్రచురించాలనే ఉద్దేశంతో మధురకవి శ్రీ నాళము కృష్ణారావు, శ్రీ దంగేటి నారాయణస్వామి అధ్యక్ష కార్యదర్శులుగానున్న హితకారిణీ సమాజం 1950 వ సంవత్సరంలో ఆంధ్రకవుల చరిత్రను పరిష్కరించే బృహత్కార్య భారాన్ని ఆంధ్రచరిత్రపరిశోధక వైదుషీధురంధురులయిన శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారి భుజస్కంధాలమీదనుంచింది. సహృదయంతో ఆకార్యభారాన్ని స్వీకరించి సువిమృష్టంగా పరిశీలించి వారాంధ్ర కవుల చరిత్రను సంస్కరించి 1952 వ సంవత్సరప్రాంతాలలో అవతారికతో పాటు హితకారిణీ సమాజం వారికందచేశారు.

ఆనాటినుండి హితకారిణీ సమాజంవారు ఆంధ్రకవులచరిత్రను పునః ముద్రించడంకోసం బహుళప్రయత్నాలు చేసినారు. నేటికి దైవమనుకూలించింది. ఆంధ్రప్రదేశ ప్రభుత్వం ఆర్థికసహాయం చేసింది. ఆంధ్రకవుల చరిత్ర ప్రథమభాగం వెలుగుచూచింది.

శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు ఆంధ్రకవుల చరిత్రలో నూతనంగా సంతన చేసిన కవుల నామాలముందు విషయసూచికలో చుక్కల గుర్తులుంచినాము.

వారిందులో చేర్చిన నూత్న విశేషాల్ని, అధస్సూచికల్ని [ ] ఈ బ్రాకెట్లచే సూచించినాము.

వారు చేర్చిన విశేషాంశాలు, అధస్సూచికలు ఎంత అమూల్యాలో విద్వద్వర్యులకు వివరింపనక్కరలేదు.

ఓం తత్ సత్

రాజమహేంద్రవరం
12 - 2 - 1978

విద్వాన్ సహదేవ సూర్యప్రకాశరావు
ఉపాధ్యక్షులు
హితకారిణీ సమాజము

ప్రస్తావన

సంఘ సంస్కర్తలు. నవకవితా వైతాళికులు శ్రీకందుకూరి వీరేశలింగంగారు రచించిన ఆంధ్రకవుల చరిత్ర ప్రతులకోసం తెలుగునాడు నాల్గు చెరగుల నుండి మాకు ఉత్తరాలు పుంఖాను పుంఖాలుగా వచ్చినవి. వస్తున్నవి. అప్పటికే ఆంధ్రకవులచరిత్ర మూడు భాగముల ప్రతులన్నియు చెల్లుబడి యయి పోయినవి.

పుస్తకాపేక్షితులయిన ఆంధ్రపుత్రుల అభ్యర్థనల ననుసరించి. ఆ నాటికి ఆంధ్ర కవులచరిత్ర మీది విమర్శనలను గమనించి దానిని సమగ్రంగా సంస్కరించి ప్రచురింప ఆనాటి హితకారిణీ సమాజంవారు కృతనిశ్చయులైనారు

ఆనాటి హితకారిణీ సమాజమునకు అధ్యక్షులు మధురకవి శ్రీ నాళము కృష్ణారావు కార్యదర్శి శ్రీ దంగేటి నారాయణస్వామి, శ్రీ నాళము కృష్ణారావు అధ్యక్షతను 30-10-50 నాడు జరిగిన హితకారిణీ సమాజ కార్య నిర్వాహక వర్గ ప్రత్యేకసభలో ఈ క్రింది తీర్మాన మామోదింపబడినది.

"ఆంధ్ర కవులచరిత్ర సవరణలో అత్యవసరమని తోచిన సవరణలు, మార్పులు, చేర్పులు, ఈ వగైరా మార్పులు చేర్చుట లేక Foot Notes లో చేర్చుట, అనే మొదలగు సూచనలన్నియు శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారికే వదలివేయుటకు తీర్మానింపబడినది. అతి ముఖ్యమని తోచిన చోట్ల మార్పులుచేస్తూ వీరేశలింగంగారి ప్రత్యేకతకు భంగం రానివ్వరని కమిటీవారు విశ్వసించుచున్నారు."

ఆ తీర్మానము ననుసరించి శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు ఆంధ్రకవుల చరిత్రను సమగ్రంగా పరిశీలించి పరిష్కరించి హితకారిణీ సమాజం వారికి అందచేశారు.

శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారిని ఆ బృహత్కార్యం నిర్వర్తించి నందులకు - మా హితకారిణీ సమాజం 500 రూపాయలు పారితోషిక మిచ్చి ఘనంగా సన్మానించింది.

ఆ నాటినుండి ఆంధ్రకవులచరిత్రను ప్రచురించడంకోసం ప్రయత్నాలు చేస్తున్నాము, ప్రధానంగా ధనాభావమే మా ప్రయత్నానికి అవరోధమని మనవి చేయనవసరంలేదు. నేటికి మా ప్రయత్నం సఫలీకృతమయింది. గౌరవనీయులు, ఆంధ్రప్రదేశ, ప్రభుత్వ విద్యాశాఖామాత్యులు శ్రీ మండలి వేంకట కృష్ణారావుగారి సహృదయత వల్లనే ఆంధ్రప్రదేశ ప్రభుత్వం నుండి ఆంధ్ర కవులచరిత్ర ముద్రణకోసం రు 10,000 విరాళమందనది. వారికి మా మనః పూర్వక కృతజ్ఞతాభివందనాలు, ఆంధ్రకవుల చరిత్ర ప్రథమ భాగాన్ని ముద్రించినాము. ఇటులనే ఆంధ్రకవుల చరిత్ర ద్వితీయ భాగాన్ని (మధ్యకాలపు కవులు) తృతీయ భాగాన్ని (ఆధునిక కవులు) ప్రచురించడానికి విరాళ మందీయుమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని అభ్యర్థించుచున్నాము,

పాఠకుల ఉపయోగార్థం పూర్వ ప్రచురణల పీఠికల్ని ఈ గ్రంథంలో పొందు పఱచినాము.

ఇందులో ఇంకను ఏమయిన మార్పులు చేయవలసి యున్నను, పొసగిన దొసగులను మలి ముద్రణలో సవరించగల వారము.

సాకల్యంగా ఆంధ్ర కవులచరిత్రమును పరిష్కరించి ఇచ్చిన చరిత్ర చతురాననులు కీ. శే. శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారికి మా శ్రద్ధాంజలి. మమ్ము ప్రోత్సహించి, మాతో సహకరించి ఈ గ్రంథమును సర్వాంగ సుందరముగా తీర్చి దిద్ది పరిచయవాక్యాలు వ్రాసిన మా హితకారిణీ సమాజోపాధ్యక్షులు విద్వాన్ శ్రీ సహదేవ సూర్యప్రకాశరావుగారికి కృతజ్ఞతా పూర్వకంగా మా సుమాంజలి.

పుస్తక మచ్చువేసి యిచ్చిన శ్రీ సుజన రంజనీ ముద్రాశాల వారికి మా అభినందనాలు.

మొండ్రేటి లక్ష్మీవతి
అధ్యక్షులు

దంగేటి లక్ష్మణరావు
కార్యదర్శి

రాజమహేంద్రవరం
12—2—1978

హితకారిణీ సమాజము

పీఠిక

నే నీకవులచరిత్రమును వ్రాసి ప్రకటించి యిప్పటికి ముప్పది సంవత్సరములు దాఁటి పోయినది. నేనప్పటికి దొరికినసాధనకలాపముతో కవులకాలనిర్ణయాదులను జేయుచు నేదో యొకరీతిని గ్రంథము సాంతముచేసితిని. ఇప్పటివలె నప్పుడు గ్రంథాలయములు లేవు; ఇప్పుడు ముద్రింపఁబడి యెల్లవారికిని సుసాధ్యము అయి యున్నగ్రంథములలో నూఱులకొలఁది కాకపోయినను పదులకొలఁది యైనను తెలుఁగుగ్రంథము లప్పు డముద్రితము అయి తాళపత్రైకశరణ్యములయి దుస్సాధ్యము లయి యుండెను; ఇప్పుడు ప్రకటింపఁబడియున్న శిలాతామ్ర శాసనాదులలో ననేకము లప్పుడు ప్రకటింపఁబడకుండెను. ఇట్టిస్థితిలో కవులచరిత్రమును వ్రాయుట యెప్పు డెంతకష్టకార్యముగా నుండునో నేను చెప్పనక్కఱ లేకయే బుద్ధిమంతు లూహించుకోవచ్చును. అయినను నేను వ్యయప్రయాసములకు వెనుకదీయక పుస్తకసంపాదనమునకయి చెన్నపురి తంజాపురి మొద లయినదూరప్రదేశములకు సహిత మరిగి యిచ్చినవారియొద్దనుండి తాళపత్రపుస్తకములను సంపాదించియుఁ గొన్నిటికి మాతృకలకు పుత్రికలు వ్రాయించియు నియ్యనివారికడ జీర్ణతాళపత్రపుస్తకముల నెరవుగాఁ గొని చదివి వానినుండి కావలసిన చరిత్రాంశములను వ్రాసికొనియు నెలలకొలఁది చెన్నపట్టణములో నుండి యచ్చటి ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారమున కనుదినమును బోయి యందలిపుస్తకముల నెల్లఁ బరిశోధించి వానిలోనుండి యావశ్యకభాగములను వ్రాసికొనియు శక్తివంచనలేక పాటుపడి నా కప్పటికి లభించిన పరికరసాహాయ్యమున నాంధ్రకవులను గూర్చి యేదో తోఁచినదానిని వ్రాసి ప్రకటించి కవులచరిత్రమనిపించితిని. క్రొత్తగా పూనుకొని పనిచేయుట కష్టము; చేసినదానిలో తప్పులు పట్టుట సులభము. నేను వ్రాసినదానిలో తప్పులు కుప్పలుగాఁ గలవని నే నెఱుఁగుదును; బహుస్థలములయందు మార్పులు చేయుట యావశ్యకమనియు నే నెఱుఁగనివాఁడను గాను. అయినను నాకంతకంతకు వృద్ధత్వమునకు తోడు వ్యాధిబాధలును శరీరదౌర్బల్యములును గూడ హెచ్చుచు వచ్చుటచేత నేమి చేయుటకును శక్తుఁడను గాక పోయితిని. అందుచేత నేను పుస్తకమును మరలముద్రింపవలసివచ్చినప్పుడు మార్పులు చేయుట మాట యటుండఁగా ప్రూఫులు దిద్దుటకు సహితము సమర్థుఁడను గాక సమస్తమునకును ముద్రాశాలలవారినే నమ్మి పుస్తక మున్న దాని నున్నట్టుగానే పలుతడవలు ముద్రింపింపవలసినవాఁడ నయితిని, ఇఁక నేను పుస్తకమును సవరింపఁగలుగుదు నన్న యాశను చిరకాలము క్రిందటనే వదలుకొని నిరాశతో నాయొద్ద నప్పటి కుండిన

వ్రాఁత పుస్తకములను సహితము వారు మంచియుపయోగమునకుఁ దెత్తు రన్న యుద్దే
శముతో నితరులకిచ్చి వేసితిని; కవులను గొందఱిని గూర్చి తరువాతివా రప్పుడప్పుడు
పత్రికలలో వ్రాయుచు వచ్చినవానిని జాగ్రత్తచేసి యుంచక చదివినవాని నప్పటి
కప్పుడే యొకమూల పాఱవైచి యశ్రద్ధచేసి వాని వలనిలాభమును బోఁగొట్టుకొంటిని.
ఇట్లుండఁగా నీనడుమ నొక రిద్దఱుభాషాభిమాను లొకానొకయాంధ్రకవిని గూర్చి
పత్రికలలో వ్రాయుచు తత్కవులను గూర్చి నేను పడినప్రమాదములను నాపుస్త
కమునందలిలోపములను సుహృద్భావముతో వ్యక్తీకరింపఁ బ్రయత్నింపక తాము
వ్రాసినవ్యాసములలో నాయజ్ఞతను గూర్చి యించుక నిందాగర్భముగా వ్రాయఁ
జొచ్చిరి. నే నట్టినిందకు సంపూర్ణార్హుఁడ నే నయినను నాకు మహోపకారము
లయినవారిదూషణభాషణములు ప్రకృతిదౌర్బల్యదోషమునుబట్టి నాకుఁ గొంతరోష
మును పుట్టించి యీసారి నాకవులచరిత్రమును చేతనైనంతవఱకు సంస్కరించి మఱి
ప్రకటింపవలె నన్నబుద్ధిని నా హృదయములో నంకురింపఁ జేసినవి. ఈబుద్ధి పుట్టుట
చేత నావఱకే కొంతకాలమునుండి పునర్ముద్రణము నపేక్షించి యున్నకవులచరిత్రము
నీసారి దిద్ది మఱి ప్రకటింపవలె నని నిశ్చయము చేసికొంటిని. ఇట్లు నిశ్చయము చేసి
కొన్నదినముననే యీశ్వరమహిమ యేమోకాని కారణము లేకయే యాకస్మికముగా
నాయారోగ్యములో మంచికి మార్పు కనఁబడెను. ఈయారోగ్యాభివృద్ధివలనఁ
గొంతయుత్సాహవంతుఁడ నయి నే నీపనికిఁ బూనుట యీశ్వరేచ్ఛ యన్నవిశ్వాస
మును బొందినవాఁడ నయి శక్యాశక్య విచారము చేయక "తలఁచుకొన్నప్పుడే తాత
పెండ్లి" యన్న ట్లా దినముననే పని నుపక్రమించితిని. ఇట్లు జరగుట కడచినఫాల్గుణ
మాసారంభమున. నా కప్పటి కఱువదితొమ్మిదేండ్లు నిండవచ్చుచుండినవి. ఈపని
లో మిత్రులను భాషాభిమానులును నాకు తోడ్పడకమాన రన్నవిశ్వాసముతో
నాంధ్రభాషావిషయమునఁ బనిచేయుచున్నయైదాఱుగురుమిత్రులకు లేఖలను వ్రాసి
మార్చినెలనడుమను వార్తాపత్రికలలో నొకచిన్నవిన్నపమును బ్రకటించితిని. ఈవిజ్ఞా
పనమునకు కొరాపుట్టినుండి భాస్కరరావుగా రొక్కరు మాత్రమే స్వాభిప్రాయము
నిచ్చుచు బదులు వ్రాసిరి. నేను లేఖలను వ్రాసినమిత్రులలో నొక రీక్రొత్తకూర్పులో
నాంధ్రభాషావాఙ్మయచరిత్రమునుగూడఁ జేర్పవలసినదని వ్రాసిరి; ఇం కొకరు
ప్రబంధములకంటె శతకములే జనసామాన్యములో నెక్కువగా వ్యాపించియుండుట
చేత శతకములను జేసినకవులను గూర్చికూడ నిందొకప్రకరణమును జేర్పవలసిన దని
వ్రాసిరి. చేయుట చెప్పినంతసులభము కాక పోవుటచేత నేనీడెబ్బదవయేట నీ
దేహదౌర్బల్యముతో మిత్రులు కోరినంత చేయఁగలనో లేనో కాని చేత నైనంతవఱకుఁ
జేయఁ బ్రయత్నించెదను. వృద్ధత్వదోషముచేత నాయవయవపటుత్వములో విశేష

భాగము తగ్గి పోయినను నాబుద్ధిబల మింకను పూర్ణముగా తగ్గిపోలే దని నే నీప్రయత్నమువలనఁ దెలిసికొనుచున్నాఁడను. వ్రాయునప్పుడు నా చేతులు వడఁకుచున్నవి; కన్నులు మందుచున్నవి. అయినను కలము చేతఁ బుచ్చుకొన్నప్పుడు మునుపటివలెనే చిత్తక్కుఅలేకయే వ్రాయఁగలుగుచున్నాను. ఈప్రథమభాగ మేదో యొకవిధముగా నిప్పటికి ముగింపఁబడెనుగదా! దీనియం దీవఱ కితరుఁ లెఱుఁగని నూతనవిషయములును చరిత్రాంశములును విశేషముగా లేకపోయినను పుస్తక పరిమాణముమాత్ర మేలాగుననో మూడురెట్లకంటె నధికముగా పెరిగి యీయొక్క భాగమే యొక్క ప్రత్యేకసంపుటముగాఁ జేయఁబడ వలసినదయ్యెను.

ఈపనిలో నాకుఁ దోడ్పడినవారిలో నామిత్రులును విజ్ఞానచంద్రికాసంస్థాపకులును నయినశ్రీకొమర్రాజు వేంకటలక్ష్మణరావుగారగ్రగణ్యు లని చెప్పవలసియున్నది. వారు గ్రంథసంస్కారమునుగూర్చి యనేకసూచనలు చేయుటయేకాక నేను కోరిన శాసనములను గ్రంథభాగములను వ్రాసినవెంటనే పంపి నాకృతజ్ఞత కత్యంత పాత్రులయి యున్నారు. ఆంధ్రపరిషత్సంస్థాపకులును పరిషత్పత్రికా సంపాదకులు నయిన మన్మిత్రులు జయంతి రామయ్యపంతులుగారు యుద్ధమల్లునిశాసనములోనిపద్యములను వ్రాసి పంపియు తాము ప్రకటించుచుండినకవిజనాశ్రయచ్ఛందస్సుయొక్క పీఠికను ముద్రింపఁబడక ముందేజేసినట్లు చేసియు నాకు సాయము చేసిరి. ఆంధ్రపరిషత్పత్రికాకార్యనిర్వాహకు లైనకొత్తపల్లి సూర్యారావుగారును, చెన్నపురి ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగార కార్యస్థానమునందు పండితులుగానున్న వేటూరి ప్రభాకర శాస్త్రిగారును, పంచాగ్నుల దక్షిణామూర్తి శాస్త్రిగారును, తమగ్రంథాలయములలో నున్నపుస్తకభాగములను పద్యములను నేను కోరినవానిని వ్రాసి పంపి నాకెంతో తోడుపడిరి. పిఠాపురములోని యాంధ్రపుస్తకపరిశోధకమండలివారి గ్రంథాలయ కార్యనిర్వాహకులైనవంగూరిసుబ్బారావుగారుతమగ్రంథాలయములోని పుస్తకములను నేనుకోరినవానినిదెచ్చి యిచ్చియు కవులనుగూర్చి తాము వ్రాసిన సేకరించిన యంశములను దెలిపియు నాకు సాహాయ్యము చేసిరి. వారి కందఱికి నిందుమూలమున నాకృతజ్ఞతాపూర్వకములైన వందనములను సమర్పించుచున్నాను. వారు చేయవలసిన సాయ మింతటితో తీఱిపోలేదు. ఇప్పు డన్నిటిలో చిన్న దయిన ప్రథమభాగ మొక్కటిమాత్రమే ముగిసి యింకను పెద్దభాగములు రెండును మిగిలియే యున్నందున వారు చేయవలసినసాయ మంతయు నించుమించుగా ముందే యున్నదని చెప్పవచ్చును. మధ్యకవులలోను, ఆధునికకవులలోను, క్రొత్తగా చేరవలసినవారిపేరులను చరిత్రములను దెలుపవలెను; ఉన్నవానిలో తాఱుమాఱుగాఁ బడియున్నవానిని జాగ్రతతోగాక యందలిలోపములను గనఁబఱుపవలెను. ఇంకను బహువిధములఁ

జేయవలసినమార్పులను సూచింపవలెను. పైని పేర్కొనఁబడినవారు గాక గిడుగు రామమూర్తి పంతులుగారును బుఱ్ఱా శేషగిరిరావుపంతులుగారును గూడఁదమకుఁ దోఁచినయభివృద్ధిమార్గములను నాకుపదేశించి నాకృతజ్ఞత కర్హులైరి. అందఱికంటె నెక్కువగా నాకు చిరకాలమిత్రులును, ఆంధ్ర భాషా వాఙ్మయము నందు విశేషకృషి చేసినవారును, దేశాటనముచేసి యపూర్వపుస్తకసంపాదనము చేసినవారును నైన శ్రీమానవల్లి రామకృష్ణకవిగారు నాకెంతో సాయపడుదురని కొండంతయాశ పెట్టుకొంటినిగాని వారిసాయమును బొందుభాగ్యము నాకింకను లభింపకుండుటకుఁ జింతిల్లుచున్నాను. కడచినమార్చినెలలో మిత్రుల నైదారుగురికి వ్రాసినప్పుడే వీరికిని వ్రాయఁగా జూన్ నెలవఱకును తాము సాయము చేయుటకు పనులతొందరచేత నవకాశ ముండదని వారప్పు డుత్తర మిచ్చిరి. ఒకపనిని చేయవలెనని సంకల్పించుకొన్నతరువాత దాని నారంభించి ముగించువఱకును నాకు నిదపట్టదు. కాల మమూల్య మయినది. నేఁడు వ్యర్థముగాఁ బోఁగొట్టఁబడిన కాలము రేపు కలిసిరాదు. చేయఁదలఁచుకొన్న పనిని రేపటి కని నిలిపి యుంచక నేఁ డున్నదినముననే చేయవలెనని తొందరపడుస్వభావముగలవారిలోఁ జేరినవాఁడను నేను. బ్రతు కస్థిరమగుటచేత రేపటిదినము మన దగునో కాదో యన్న సందేహముతో వారు పెట్టినగడువు వచ్చువఱకు నేను వేచియుండక తోడనే కవిచరిత్రమును సవరింప నారంభించి సవరించిన భాగము నెప్పటికప్పుడే ముద్రింపింపఁ దొడఁగితిని. అందుచేత నేను పుస్తకముయొక్క సవరణము ముగించునప్పటికి పుస్తకముయొక్క ముద్రణము సహితమించుమించుగా ముగిసెను. ఈలోపల నేను చెన్నపురిమీఁదుగా కడచిన యేప్రిల్ నెలలో బెంగుళూరికిఁ బోవుచుఁ ద్రోవలో నీపనిమీఁదనే చెన్నపట్టణములో రెండుదినములు నిలిచి ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారమునకుఁ బోయినప్పుడు వారిపను లనుకొన్న దానికంటె శీఘ్రముగానే తీఱి శ్రీరామకృష్ణకవిగారు చెన్నపట్టణము చేరఁగలిగినందున వారి నక్కడఁ దలవనితలంపుగాఁ జూడఁదటస్థించెను. ఆకాలమున లేఖామూలమునఁ జేసిన ప్రార్థనమునే నే నప్పుడు వారికి స్వయముగాఁ గూడఁ జేసితిని. నేను బెంగుళూరు చేరి పనిచేయుచు నేప్రిల్ నెలకడపట వారివాగ్దానమును జ్ఞప్తికిఁ దెచ్చుచు వారి కుత్తరములు వ్రాసితిని. నాయుత్తరములకుఁ బ్రత్యుత్తరముగా వారు తాము జూన్ నెలతరువాతనే సాయము చేయఁగలుగుదు మని వాగ్దానము చేసితి మనియు, తమకార్యస్థానపుపని సామాన్యముగా నుండుదానికంటె నత్యధికముగా నుండిన దనియు, తమపుస్తకము లన్నియు వనపర్తిలోనే విడిచిపెట్టఁబడిన వనియు, అయినను దమశక్తిలో నున్నంతవఱకు నేను గోరినసమాచారమును మఱునాఁటి టపాలోఁ బంపెద మనియు, నేను వేగిరపాటుతో పని నడుపుచున్నందులకు చింతిల్లుచున్నా మనియు, మొదటిభాగములోఁ జేయఁబడిన ప్రాంతనిర్దేశము లనేకములు మార్పఁబడవలసి యున్నవనియు, నాలుగురు నవకవులు మొదటిభాగములోఁ జేర్పఁ

బడవలసి యున్నారనియు, తెలుపుచు మెయినెల రెండవ తేదీని వారు నాపేర వ్రాసిరి. నేను వారిని పంపుఁడని కోరినవానిలో విక్రమసేనము, విజయసేనము, అథర్వభారతము, అథర్వచ్ఛందస్సు మొదలయినవాని యవతారికలు చేరి యున్నవి. వారు మఱునాఁడే పంపెదమన్నసమాచార మేహేతువుచేతనో నా కీవఱకును జేరనే లేదు. అట్లు చేరకపోవుట ప్రోషణకార్యస్థానభటులలోపమువలన నయియుండును. క్రొత్తగా నేను భోజరాజీయమును వరాహపురాణమును ముద్రింపఁబూనినప్పుడు వాని ప్రత్యంతరములను గద్వాలసంస్థానమున సంపాదించి తెచ్చి నాకిచ్చి ౧౯౦౮ వ సంవత్సరమునకుఁ బూర్వమునందే నా కృతజ్ఞతకుఁ బాత్రులైనపరమమిత్రులుశ్రీమానవల్లి రామకృష్ణయ్యగారు నేను కోరినపుస్తకము లప్పుడు తమయొద్దలేకుండుటచేతనే పంపలేకపోయియుందురు గాని నామీఁదియనాదరముచేతఁ బంపక యుండియుండరు. వారు నాకియ్యఁదలఁచుకొన్న కవులనుగూర్చిన సమాచారము నిప్పుడిచ్చినను నేను దానిని కృతజ్ఞతాపూర్వకముగా నంగీకరించి దీని కనుబంధముగాఁ బ్రచురించెదను. ఆంధ్రపరిషత్పుస్తకభాండాగారములోని యసమగ్రమైన యుదాహరణపుస్తకమును నేను వ్రాయించి తెప్పించుటచేత నా కనేకపూర్వకవులనామములును వారి గ్రంథనామములును దెలిసినవి. శ్రీరామకృష్ణకవిగారియొద్ద నున్న జగ్గనకృతమైన ప్రబంధరత్నాకరముకూడ లభించి యుండినయెడల నింకను నెక్కువగాఁ బూర్వకవులపేరులును వారిగ్రంథములపేరులును నాకుఁ దెలిసియుండును. ఆపుస్తకమునకుఁ బ్రతికైనను వ్రాయించి తెప్పించుకొనుట కయి నేనుప్రయత్నములు చేసియు సఫలమనోరథుఁడను గాలేక పోయితిని. దానిని ముద్రింపించు చుండినట్లు కొన్నిమాసముల క్రిందట శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు కృష్ణాపత్రికలోఁ బ్రకటించిరి గాని గ్రంథముద్రణము పరిసమాప్తమయి కొనఁగోరువారికది లభ్యమయి నట్లింతవఱకును గానఁబడదు. ఇటువంటిపుస్తకములను గలవారు తాము వానిని తమయొద్దనే యడఁచిఁ బెట్టుకొని యుంచక మాతృక నియ్యకపోయినను ప్రతికలనైనను వ్రాయించి ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారములవంటిప్రసిద్ధపుస్తకాలయములయం దుంచినచో వానిని జదువఁగోరెడునావంటివారి కవి సుసంపాద్యములగును.

ఉదాహరణగ్రంథాదులవలన నాకిప్పుడు పూర్వకవులగ్రంథములపేరులును వానిలోని పద్యములును పెక్కులు తెలిసినను, ఆకవులు నేను చేసికొన్నసంకేతమునుబట్టి పూర్వకవులలోఁ జేర్పఁదగినవారో మధ్యకవులలోఁ జేర్పఁదగినవారో యిప్పుడు స్పష్టముగా తెలియరానందున వాని నీప్రథమభాగమునందుఁ జేర్పక తెలిసినవా రాకవులకాలనిర్ణయాదులు చేసి తెలుపుదు రన్నయపేక్షతో వారిలోఁ గొందఱి నీ పీఠికలోఁ దెలుపుచున్నాను.

1. పెదపాటి సోమనాథుఁడు — ఈతనినే కవిలోకబ్రహ్మయందురు. ఇతఁ డరుణాచలపురాణము, శివజ్ఞానదీపిక, కేదారఖండము మొదలగు గ్రంథము లను జేసెను.

అరుణాచలపురాణములో 'వాక్ప్రౌఢిపోషితదక్షవాటీమహాస్థాన భీమువేములవాడభీము" అని భీమకవిని స్తుతించియుండుటచేత నాతని తరువాత నుండిన వాఁడు.

ఉ. రాజులు విక్రమోగ్రమృగరాజులు విశ్రుతదివ్యకాంతిరే
రాజులు రూపురేఖ రతిరాజులు మానగుణంబునందు రా
రాజులు దానశక్తి ధనరాజులు వైభవభోగవృద్ధి స్వా
రాజు లనంగ నొప్పుదురు రాజితతేజులు తత్పురంబునన్.

అరుణాచలపురాణము.

ఉ. కన్నియ రూపు గోరుఁ గనకంబును గోరునుదల్లి బుద్ధిసం
పన్నతఁ గోరుఁ దండ్రి కులభవ్యత గోరు బంధుకోటి ప
క్వాన్నఫలాదిభక్షణము లన్యులు గోరుదు రిట్టు లిన్ని యుం
బన్నగనొక్కచో నొడవె భాగ్యము చేసితిఁ గన్య నిచ్చెదన్.

కేదారఖండము.

2. నూరన్న — ఇతఁడు వనమాలీవిలాసము, ఉదయనోదయము, అనుగ్రంథము లను రచించెను.

ఉ. ఆతఁడె రాజమంచనివహాంచలవీధుల కేగుదెంచున
బ్జాతదళాక్షిఁ బల్కె నటుచంద్రనిభానన దాదిపట్టి వి
జ్ఞాతసమస్తభూరమణజాతగుణాన్వయ వేత్రదండమున్
జేతఁ దమల్చి మోపు జనసింధురవం బెడలించె వేడ్కతోన్. —వన.

చ. సరభసలీలఁ గేళిసితసౌధము లొక్కట నిర్గమించి చ
ల్లిరి నరనాథుమీఁదఁ బురిలేమలు లాజలు దోయిలించి చే
చ్చెర శరదంబువాహములు చించి బయల్పడు చంచలాలతల్
పరిమితవృష్టిబిందువులఁ బర్వతరాజముఁ గప్పునాకృతిన్ —

ఉదయనోదయము.

3. పొన్నాడపెద్దన్న — ఇతఁడు ప్రద్యుమ్న చరిత్రమును రచించెను.

క. పురగోపురశిఖరంబుల
గర మరుదై పద్మరాగకలశము లమరున్
జరమాచరమాద్రులపై
సరిపున్నమఁ దోఁచుసూర్యచంద్రులభంగిన్.

4. పెదపాటియెఱ్ఱాప్రెగడ — ఇతఁడు కుమారనైషధము, మల్హణచరిత్రము, లక్ష్మీపరిణయము చేసెను.

సీ. అలరేకుతెప్ప లలార్చినయందాఁక
యనిమిషకన్య కా దనఁగ వశమె?
యమృతంబు చిలుక మాటాడినయందాఁకఁ
గనకంపుఁబ్రతిమ కా దనఁగ వశమె?

కుమారనైషధము.

సీ. కువలయకమలాభినవమనోజ్ఞం బయ్యుఁ
బంకజీవనపరిప్లవము గాక
ఘనసారపున్నాగకమనీయ మయ్యును
గితవదుష్కలికసంయుతము గాక - మల్హణచరిత్రము.

5. చైతరాజుముమ్మయ్య — ఇతఁడు విష్ణుకథానిధానము చేసెను.

చ. వలపెటువంటిదో ముసలివాఁ డనవచ్చునె? యద్దిరయ్య! ప
ల్కులజవరాలు దాఁ జదువులోన జపంబులలోనఁ బాయ ద
గ్గలమున నెల్లప్రొద్దును మొగంబునఁ గట్టినయట్లు యుండు నా
కొలువవ నంచుఁ గాముకులు నవ్వవిధాత శుభంబు నీవుతన్.

విష్ణుకథానిధానము.

6. శాకమానిగంగాధరుఁడు — ఇతఁడు బాలభారతము చేసెను.

శా. అలజ్జావతి ధామ్యపంపున శిఖివ్యాలోలకీలాలిపై
నోలిన్ వేల్చినలాజరాజిపవనప్రోద్ధూతవారాశివీ
చీలోలోద్ధతివిభ్రమోట్లని నధిక్షేపించుకట్టాణిమూ
త్యాలో నాఁ కనుపట్టె నట్టియెడ నందబ్రాజహంసంబుగాన్.

బాలభారతము.

7. రాయసముగణపయ్య — ఇతఁడు సౌగంధికాపహరణము చేసెను.

శా. అంతంతం గబళింపఁగాఁ గడఁగె బాలార్కున్ ఫలభ్రాంతి వే
శంతోల్లంఘనకేళి దాఁటెను సరస్వంతున్ మహాదానవా
క్రాంతారామమహీరుహంబుల నుదగ్రక్రీడఁ ద్రుంచెన్ హనూ
మంతుండుం గపి యన్యమా ల్గిపురె సామాన్యాటవీచారముల్.

సౌగంధికాపహరణము.

8. పోతరాజువీరయ్య — ఇతఁడు త్రిపురవిజయము చేసెను.

సీ. తమ్ముల బెదరించుతళుకువెన్నెలసోగ
కన్నె గేదఁగిరేకు గారవింప
పదినూఱుపడిగెలఁ బరపైనపదకంబు
పవడిముత్యపుఁబన్నసరముఁ బ్రోవ — త్రిపురవిజయము.

9. వాసిరాజురామయ్య — ఇతఁడు బృహన్నారదీయమును చేసెను.

సీ. మల్లికానవసముత్ఫుల్లపాటలపుష్ప
వల్లరీసౌరభ్యవాసితంబు
కాసారనీరజవ్యాసక్త మధుకరీ
ఝంకారముఖరితాశాముఖంబు — బృహన్నార.

10. గంగరాజుచౌడప్ప — ఇతఁడు నందచరిత్రమును చేసెను.

చ. మదిమికి మందు వాగ్మితకు మంగళిజిహ్వ తపఃఫలంబు స
మ్మదమునివాస మింపుగని మారవికారము పోలిది కామినీ
వదనవిభూషణంబు జనవశ్యము హాస్యరసాబ్ధి లాస్యసం
పదయుదరస్థలంబు మధుపానసుఖంబు జగత్త్రయంబునన్ —

నందచరిత్రము.

ఈప్రకారముగా సంకలితగ్రంథములలోను లక్షణగ్రంథములలోను చేర్కొనఁబడిన వారు జినేంద్రపురాణమును రచించినపద్మకవి (ప్రభాచంద్రుఁడు), ముద్రామాత్యము రచించినశివదేవయ్య, ప్రద్యుమ్నవిజయము రచించినఫణిభట్టుఁడు, జలపాలిమహాత్మ్యము రచించిన నడివానిమల్లుభట్టు, పద్మినీవల్లభము శంకరవిజయము మంగళగిరివిలాసము రచించినబొడ్డపాటిపేరయ్య, వాసవదత్తోపాఖ్యానము రేవతీపరిణయము రచించినమద్దికాయలమల్లయ్య, ఆదిపురాణము రచించినసర్వదేవయ్య, కుశలవోపాఖ్యానము ఐరావతచరిత్రము రచించిన చిరుమూరిగంగాధరుఁడు, పద్మావతీకళ్యాణము

రచించినముత్తరాజు, పరమభాగవత చరిత్రము రచించినయప్పన్న, మొదలైనవారు పలువురున్నారు. ఇటువంటివారికాలము చరిత్రము తెలిసినవారు సకారణముగాఁ దెలిపి నాయుద్యమమునకుఁ దోడ్పడుదురు గాక!

వెనుకటికూర్పులలో నెల్ల ౧౪౫౦ వ సంవత్సరమువఱకు నుండిన కవులను మాత్రమే పూర్వకవులలోఁ జేర్చినను, ఈకూర్పునం దిప్పుడు కొంచెము మార్చి ౧౪౫౦ వ సంవత్సరము మొదలుకొని ౧౫౦౦ వ సంవత్సరమువఱకును నుండిన కవులను గూడ నీ ప్రథమభాగమునందుఁ జేర్చి పూర్వకవులనుగాఁ జెప్పియున్నాను. అందుచేత నింతవఱకును మధ్యకవులుగా పరిగణింపఁబడి ద్వితీయభాగములోఁ జేర్పఁబడి యుండినవారు పలువురైనను నిప్పుడు పూర్వకవులుగా నీ ప్రథమభాగములోనికిఁ దీసికొనఁబడిరి. ఇట్టి మార్పు చేయుటకుఁ గల కారణమును గూర్చి విశేషముగాఁ జెప్పవలసినపని లేదు. ౧౫౦౦ వ సంవత్సరప్రాంతమువఱకునుగల కాలము పురాణయుగమని కాని భాషాంతరీకరణకాల మని కాని చెప్పఁబడఁదగినదిగానున్నది. ౧౫౦౯ వ సంవత్సరమునందు రాజ్యమునకు వచ్చి తెలుఁగు కవిత్వమునకు నూతన జీవమును గలిగించి యాంధ్రభోజుఁ డని పేరొందినకృష్ణదేవరాయని కాలమునుండియు నాంధ్రవాఙ్మయమున నొకనూతనశాఖ మారంభమైనది. కేవలభాషాంతరీకరణములు గాక రాజాదరమువలన నూతనకల్పనలతో ప్రబంధరాజములు పుట్టనారంభ మయిన యీ కాలమును ప్రబంధయుగ మని చెప్పవచ్చును. ఈ నూతన ప్రబంధనిర్మాణమునకు మార్గదర్శి యయినవాఁడు కృష్ణదేవరాయలయాస్థానకవి యయి మనుచరిత్రమును రచియించి యాంధ్రకవితాపితామహుఁ డని బిరుదొందిన యల్లసాని పెద్దన్న. పెద్దనయే యునవేల? విష్ణుచిత్తీయము మనునామాంతరము గలయాముక్తమాల్యద యనెడి మహాప్రబంధమును రచించి కృష్ణదేవరాయలే మార్గదర్శి యయ్యె నని చెప్పినను చెప్పవచ్చును. ఆంధ్రసారస్వతమునందలి యీనూతనశాఖారంభమునకుఁ బూర్వమునం దుండినవారిని పూర్వకవు లనియు, ఆ కాలమునకు నిప్పటికాలమునకు మధ్యకాలమునం దుండినవారిని మధ్యకవులనియు. విభాగముచేయుట యుక్తసహము కాక పోదు.

కవులచరిత్రమును సంస్కరింపవలె నన్నబుద్ధి పుట్టినమార్చినెలలోనే పనికి బూని మార్చుట కారంభించి యిప్పుడు మార్చినదాని నప్పుడె ముద్రణమున కిచ్చుచు వచ్చితి నని యీవఱకే చెప్పి యుంటిని గదా? మార్చుట కారంభించినప్పుడు పుస్తకమునంతను మరల వ్రాయఁ గలుగుదు నన్న ధైర్యము లేనివాఁడ నయి ప్రాఁత బొంతకు క్రొత్త యతుకులు వేసిన ట్లక్కడక్కడ నచ్చుపుస్తకములోనే క్రిందను మీఁదను ప్రక్కలను హంసపాదములతో క్రొత్తముక్కల నతికించుచు గ్రంథమును సాగింప నారంభించితిని. అందుచేతఁ గొన్నిచోట్ల నీక్రొత్తముక్కలు పూర్వోత్తర సందర్భమున కనుకూలమగునట్టు చక్కఁగా నతుకక కొందఱిచరిత్రములు కొంతవఱకు నతుకుల బొంతలుగానే యుండుట తటస్థించెను. తరువాతచరిత్రములను మార్చుటకయి గ్రంథపరిశోధనము చేయుచు వచ్చినప్పుడు కొన్నిచోట్ల వెనుకటివారి చరిత్రములలో వేసినయతుకులలోఁ గొన్ని తీసివేసి క్రొత్తమాసికలు వేయవలసినయావశ్యకము కనఁబడుచు వచ్చెను గాని ముద్రిత మయినదానిని మొదలంటఁ దీసివేయక

యట్టిపని సాధ్యము కానందున నొక్కొక్కచోట నెందేని పూర్వాపరవిరుద్ధాంశములు సహిత మిందు పడి యున్నవి. అట్టి వేవేని కనఁబడినపక్షమున మొదటఁ జెప్పఁబడినదానికంటెఁ దరువాతఁ జెప్పఁబడినది యధిక ప్రమాణ మని చదువరులు గ్రహింతురు గాక! ఈ ప్రకారముగా చిన్నవో పెద్దవో యతుకులు వేయుచు బెంగుళూరిలో గ్రంథమును శ్రీనాథునివఱకు నెట్లో యీడ్చుకొని వచ్చితిని గాని యక్కడకు వచ్చు నప్పటికి కొంతపెద్దయతుకులు వేసినను గుదరక క్రొత్తయల్లిక విశేషముగా కావలసి వచ్చెను. అందుచేత శ్రీనాథునిచరిత్రములో ముప్పాతిక మువ్వీసము క్రొత్త గా వ్రాయవలసినవాఁడ నైతిని. ఈ ప్రకారముగానే యీభాగమునందు మున్ను లేని వయి యిప్పుడు క్రొత్తగాఁ జేర్పఁబడినవన్నెచోడుఁడు మొదలైనవారిచరిత్రము లన్నియు నూతనముగానే వ్రాయఁబడినవి. ఇవి యన్నియు బెంగుళూరిలోనే వ్రాయఁబడిన వగుటచేత నచ్చటఁ గర్ణాటకకవిచరిత్రాదులను జదివి వానివలని లాభమును గొంతవఱకుఁ బొందుట తటస్థించెను. నన్నెచోడునిచరిత్రమునందును భీమకవిచరిత్రమునందును నథర్వణాచార్యునిచరిత్రమునందును నేనచ్చటఁ బొందినయీలాభము కొంతవఱకు తేటపడ వచ్చును. శ్రేయాంసి బహువిఘ్నాని యన్నట్లు బెంగుళూరిలో సహితము నాపని నిర్విఘ్నముగా సాగినది కాదు. అక్కడ నావెంట వచ్చినవారియొక్క చిన్నదానికి స్ఫోటకము వచ్చెను. ఈయంటురోగమునకు భయపడి మే మక్కడ కుదుర్చుకొన్నబాలసేవకుఁడను పనికత్తెయుఁ గూడ నొక్క సారిగా మమ్ము విడిచి పోయిరి. వారిస్థానమున క్రొత్తసేవకులు దొరకరైరి. అందుచేత నసహాయుల మయి నేనును నావెంట నాసంరక్షణమునిమిత్తము వచ్చిన లోకానుభవము చాలనియువతీమణియు సదా రోగిని కనిపెట్టుకొని యుండి యుపచారములను చికిత్సలను జేయవలసినవార మయితిమి. ఈశ్వరానుగ్రహమువలన రోగి స్వస్థపడెను గాని మనోవ్యాకులతచేతను రాత్రులు నిద్రలేకపోవుటచేతను నేను జ్వరపడి యత్యంతదుర్బలుండ నయి రాజమహేంద్రవరమునకు వచ్చినతరువాత సహితము నెల దినములకంటె నెక్కువకాలము నేనేమియు పనిచేయ లేక పోతిని. అయిన నాయెడ నీశ్వరానుగ్రహము పూర్ణముగా నుండినందున నేను మరల స్వస్థపడి విఘ్నమృగముల బారికి తప్పి బైలపడి యీ ప్రథమభాగము నొకవిధముగా ముగింప శక్తుఁడ నయితిని. నాయెడలఁ జూపినయీయసాధారణానుగ్రహమునకై నేనీశ్వరునకు భక్తిపూర్వకము లైనవందనసహస్రములను సమర్పించుచున్నాను. మిగిలిన రెండుభాగములను గూడ సంస్కరించి ప్రకటించు శక్తిని మానసోత్సాహమును భక్తాభీష్టప్రదాయకుఁ డైనపరమేశ్వరుఁడు నాకు ప్రసాదించును గాక! జరాభారము వలనను రోగభారమువలనను ప్రూఫులను తిన్నఁగా దిద్దలేకపోవుటవలన ననివార్యముగా పడినయచ్చుపొరపాటులను సరకుగొనక చదువరులు నన్ను మన్నింతురు గాక!

నేను బెంగుళూరిని విడుచుటకు రెండుమూఁడుదినములు ముందు శ్రీనాథునిచరిత్రసంబంధమున సర్వజ్ఞబిరుదాంచితుఁ డైన శ్రీరావుసింగభూపాలుని కాలనిర్ణయమును గూర్చి యాలోచించుచుండినప్పుడు నా కాకస్మికముగా తద్వంశజులును ప్రస్తుతపీఠికాపురాధీశ్వరులును సాధారణముగా సమస్తసత్కార్యాభివృద్ధులకొఱకును విశేష

ముగా నాంధ్రభాషాభివృద్ధికొఱకును సమాజనిరంతరాదరౌదార్యములను జూపుచున్న వారును నైనమహారాజశ్రీశ్రీరాజా రావు వేంకటకుమారమహీపతిసూర్యారావు బహదురు గారు నాకుస్మరణకు వచ్చి యీకవులచరిత్రమును వారి కంకితము చేయవలె నన్నబుద్ధి పుట్టినది. అది యీశ్వరాదేశ మని భావించి యీకవిచరిత్రమును వారికిఁ గృతి యిచ్చుట కప్పుడే నిశ్చయము చేసికొంటిని. వారినుగుణసంపదను గూర్చి యిందుచెప్పుట స్తోత్రపాఠముగాఁ గనఁబడ వచ్చును. గాన నిం దింతకంటె నధికముగా వ్రాయను లోకరక్షకుఁ డైనయీశ్వరుఁడు లోకోపకారార్థముగా వారికి దీర్ఘాయురారోగ్యైశ్వర్యములను బ్రసాదించును గాక !

నే నీకవులచరిత్రమును శీఘ్రకాలములోఁ బ్రచురింపవలె నని కోరఁగా ప్రతిదినమును రెం డేసిఫారములచొప్పున నచ్చుగూర్చియిచ్చి పుస్తక మింత శీఘ్రముగా వెలువడుటకు హేతుభూతులైన శ్రీమనోరమాముద్రాక్షరశాలాధికారులకు వందనములు చేయుచున్నాను.

రాజమహేంద్రవరము
౧౧ వ అక్టోబరు ౧౯౧౭ సం॥ } కందుకూరి-వీరేశలింగము.

రెండవకూర్పునకుఁ బీఠిక.

ఆధునికాంధ్రసారస్వత పితామహుఁడును శతాధిక గ్రంథకర్తయు నాంధ్రవచన రచనాచక్రవర్తియు నైన రావుబహాదూర్ కందుకూరి వీరేశలింగముపంతులుగారు, చిరకాలము క్రిందట నాంధ్రకవులచరిత్రము మూడుభాగములుగా రచియించి, యీమూడుభాగముల నొక సంపుటముగానే మొదట ప్రకటించిరి పిమ్మట మొదటి భాగములోని కవులనుగురించి నూతనాంశములు పెక్కులు లభించుటచే ప్రథమభాగమును విపులముగాఁజేసి దాని నొక ప్రత్యేకసంపుటముగాఁ బ్రకటించిరి ఆ సంపుటము పండితులయొక్కయు, భాషాభిమానులయొక్కయు, నాదరణముఁబడయుటచే నప్పుడు ప్రచురించిన గ్రంథములన్నియు విక్రయింపఁబడియెను. అందుచేత మూడు సంవత్సరముల క్రిందటనే యీ సంపుటము పునర్ముద్రణము కావలసియుండెను. ఈ గ్రంథమునుఁ బంపుమని యాంధ్ర దేశమునందలి నానాభాగములనుండి పలువురు వ్రాయుచున్నారు. ఆకారణమున నిప్పుడీ గ్రంథము రెండవసారి ముద్రింపఁబడి హితకారిణీసమాజమువారిచేతఁ బ్రకటింపఁబడినది

ఱగ మెఱుంగు బ్రాహ్మణునకు జందె మెందుక న్నట్లు శ్రీ వీరేశలింగంపంతులుగారి గ్రంథముయొక్క గుణములు వర్ణింపనక్కరలేదు. అవి పాఠకమహాశయులకే స్వయంవ్యక్తములుగదా ?

చిలకమర్తి లక్ష్మీనరసింహం,
హితకారిణీసమాజోపాధ్యక్షుఁడు.
పెద్దాడ సుందరశివరావు,
హితకారిణీసమాజగౌరవకార్యదర్శి.

రాజమహేంద్రవరము,
20—1—1937 }

మొదటికూర్పు ఉపోద్ఘాతము

కవిచరిత్రములను వ్రాయఁబూను నావంటివారికి గ్రంథసామగ్రి తక్కువయగుటచేత కవులకాలనిర్ణయాదులను సరిగా వ్రాయుటకాని, అందఱి చరిత్రములను వ్రాయఁగలుగుటగాని, సాధ్యముకాదు. అయినను ముందువారికి మార్గదర్శకముగా నుండు నన్న యపేక్షతో నాకు దొరకిన యల్పాధారములతోను పరిమిత గ్రంథ సాహాయ్యముతోను నాశక్తి కొలఁది నేదో యొకరీతి చరిత్రము వ్రాయఁబూనినాను. ఇందు తప్పులు తప్పులుగా నుండవచ్చును. విద్వాంసులగువారు నన్ను పరిహసింపక వాత్సల్యముతో నా లోపములను జూపి దిద్దించియు, నా యొద్దలేని గ్రంథములను నాకుఁ బంపియు నాయుద్యమమును గొనసాగింతురని విశ్వసించుచున్నాను. నేనిందు వ్రాసిన చరిత్ర సంగ్రహములో ౧౬౫౦ వ సంవత్సరమునకుఁ బూర్వమునందుండిన కవులందఱియొక్క చరిత్రమును జేర్చితినని చెప్పఁజాలనుగాని యిందుఁ జేర్పఁబడిన కవులందఱును మాత్రమాకాలమునకుఁ బూర్వపువారేయని నిశ్చయముగాఁ జెప్పఁగలను. కృతికర్తయొక్కగాని, కృతిపతులయొక్కగాని కాలమును దెలిసికొనుట కాధారములు చిక్కకపోవుటచేతను, అప్పకవీయాది లక్షణ గ్రంథములలో నుదాహరింపబడి యుండకపోవుటచేతను, ఇప్పుడు నాకు లభించియున్న గ్రంథములలోనే కొన్ని యప్పకవి కాలమునకుఁ బూర్వమునందు రచింపఁబడినవియున్నను నేనవి విడచిపెట్టియుండవచ్చును.

* * *

*

రాజమహేంద్రవరము
౭ వ నవంబరు ౧౮౮౭ వ సం. } కం. వీరేశలింగము

రెండవ కూర్పు

ఇందు మొదటి నూఱుపుటల గ్రంథమును ప్రథమశాస్త్రపరీక్షకుఁ బఠనీయముగా నేర్పడియున్నందున, ఆ భాగమునందు మార్పులు చేయుటకు వలనుపడలేదు.

ఆ భాగములో జేర్పఁదలఁచుకొన్న యంశములలోఁ గొన్ని యీ పుస్తకాంతమున ననుబంధముగాఁ జేర్పఁబడినవి. మొదటి కూర్పునందు విడువఁబడిన యనేక కవుల చరిత్రములిందుఁ గడపటిభాగమునఁ జేర్పఁబడి యుండుట, యీ కూర్పుయొక్క పుటలసంఖ్యవలననే తెలియవచ్చును. ఇందుఁగనఁబడెడి లోపములను నాకుఁ జూపుటకును, నాకు లభింపని గ్రంథములు తమయొద్దనున్నచోఁ బంపుటకును, ఇందుండఁదగిన నూతనాంశములను దెలుపుటకును ఆంధ్రభాషాభిమానులనెల్ల సవినయముగాఁ బ్రార్థించుచున్నాను.

రాజమహేంద్రవరము
౫ వ ఫిబ్రవరు ౧౮౯౭ } కం. వీరేశలింగము

---

* ఈ పీఠిక సమగ్రముగా మా కుపలబ్ధము కాలేదు.

విషయసూచి

సంఖ్య		పుటసంఖ్య
	అవతారిక	1
1	నన్నయభట్టు	8
2	నారాయణభట్టు	88
3	మల్లియరేచన	89
4	గోకర్ణదేవుడు	91
5	మల్లికార్జున పండితుడు	92
6	నాగదేవభట్టు	96
7	అమృతనాథుఁడు	97
8	మంత్రిభాస్కరుఁడు	98
9	యథావాక్కుల అన్నమయ్య	101
10	పెద్దయామాత్యుడు	104
11	వెన్నెలకంటి అన్నయ	105
12	క్షేమేంద్రుఁడు	106
13	ఆంధ్రభోజుఁడు	107
14	పంచతంత్ర రచయిత	108
15	కామందకకర్త	801
15a	శివదేవయ్య	109
16	తిక్కన సోమయాజి	111
17	గణపనారాధ్యుఁడు	173
18	ఎఱ్ఱాప్రగడ	174
19	పావులూరి మల్లన	200
20	వన్నెచోడకవి	206

21	ప్రతాపరుద్రుఁడు	242
22	పాలకురికి సోమనాథుఁడు	245
23	రంగనాథుఁడు	254
24	కేతన	261
25	బద్దెనకవి	269
26	నండూరి కేతనమంత్రి •	276
27	మంచన	277
28	అథర్వణాచార్యుఁడు	283
29	కాచవిభుఁడు, విట్ఠలరాజు.	301
30	మారన	305
31	విన్నకోట పెద్దన్న	310
32	చిమ్మపూడి అమరేశ్వరుఁడు	317
33	హుళక్కి భాస్కరుఁడు	327
34	నాచన సోముఁడు	346
35	వేములవాడ భీమకవి	365
36	మడికి సింగన్న	399
37	అప్పనమంత్రి •	407
38	దోనయామాత్యుఁడు •	408
39	పశుపతి నాగనాథుఁడు •	409
40	భవదూరుఁడు •	410
41	కొఱవి సత్యనారన •	411
42	శ్రీగిరి కవి •	412
43	ప్రకాశ భారతయోగి •	412
44	మడికి అనంతయ్య •	413
45	జక్కయకవి	414
46	అనంతామాత్యుఁడు	422
47	రావిపాటి తిప్పన్న	431
8	శరభాంకకవి	440

49	కమలనాభామాత్యుడు ♦	440
49a	వినుకొండ వల్లభరాయఁడు	441
50	శ్రీనాథుఁడు	450
51	బమ్మెరపోతరాజు	581
52	నిశ్శంక కొమ్మన్న	615
53	వెలిగందల నారయ ♦	621
53a	సదానందయోగి ♦	621
54	గంగనార్యుఁడు ♦	622
55	శ్రీధరుఁడు ♦	622
56	కృష్ణమాచార్యుఁడు ♦	623
57	అయ్యలరాజు తిప్పయ్య ♦	623
58	ఏర్చూరి సింగన ♦	624
59	పిడుపర్తి బసవన ♦	624
59a	తాళ్లపాక అన్నయాచార్యులు ♦	625
60	రేవణూరి తిరుమల కొండయార్యుఁడు	625
61	పిడపర్తి నిమ్మనాథుఁడు ♦	626
62	ప్రోలుగంటి చెన్నశౌరి ♦	626
63	గౌరనమంత్రి	627
64	దగ్గుపల్లి దుగ్గయ్య	642
65	భైరవకవి	648
66	పిల్లలమఱ్ఱి పినవీరన్న	654
67	నంది మల్లయ్య - ఘంట సింగయ్య	669
68	దూబగుంటి నారాయణకవి	683
69	వెన్నెలకంటి సూరన్న	688
70	ఫణిభట్టు	698
71	మనుమంచిభట్టు	704
72	కేతనమంత్రి	710
73	కవిభల్లటుఁడు	712
74	కవిరాక్షసుఁడు	714

ఆంధ్రకవుల చరిత్రము

అవతారిక

దేశాభ్యున్నతికిని, భాషావాఙ్మయముల తత్త్వపరిశీలనమునకును చరిత్రము మిక్కిలి యావశ్యకము. చరిత్రలేని దేశము గాని, భాష గాని, వాఙ్మయము గాని నాగరకతాముద్రను పొందఁజాలవు. భారతదేశమునందేగాక దేశాంతరములందును పేరుప్రతిష్ఠలు సంపాదించిన ఆంధ్రభాషావాఙ్మయముల చరిత్ర మందఱికిని ఉపాదేయము. ఈ గ్రంథమునందుఁ ప్రత్యేకముగ ఆంధ్ర వాఙ్మయాభివృద్ధికి దోహదమొనర్చి, పోషించిన కవుల గూర్చిన విషయములు విపులముగ నీయఁబడినవి.

ప్రాచీన కాలమునుండియు నాంధ్రులు సుప్రసిద్ధులయి, తమ విశిష్టతను నిలుపుకొనుచున్నారు. వేదకాలమునందును ఆంధ్రులు ప్రసిద్ధులు. ఆంధ్రులొకప్పుడు భారతదేశమునందలి విశాల భాగమునకుఁ ప్రభువులై యవిచ్ఛిన్నముగ రాజ్యపాలన మొనర్చుటయేగాక, పెక్కు ఘనకార్యముల నొనర్చినట్లును. భాషా వాఙ్మయములను పోషించినట్లును తెలియుచున్నది.

ప్రాచీనాంధ్ర ప్రభువులగు శాతవాహనులు సుప్రసిద్ధులు. శక కర్తలు. హాలుఁడు ప్రాకృతమున గొప్ప విద్వాంసుఁడై గాథా సప్తశతిని గూర్చిన యంశము విద్వద్విదితము. ఇట్లే ప్రాచీనాంధ్రులగు ప్రభువర్యులు సంస్కృతమును, ప్రాకృతమును బోషించి, ఆ వాఙ్మయములందు పెక్కు ఉద్గ్రంథములు వెలువడుటకుఁ గారణభూతులయిరి.

అతి ప్రాచీనకాలము నుండియు ఆంధ్రుల ప్రశంస శ్రుతి పేయమగుచున్నను క్రీస్తు శకము ౧౦ శతాబ్దులు గడచిన వఱకును, — అనగా నన్నయభట్టు మహాభారత రచనకుఁ బ్రారంభించు వఱకును చెప్పుకొనఁదగిన వాఙ్మయ మాంధ్రమున వెలయకుండుట కడుంగడు విచారహేతు వగుచున్నది. అంతకుఁబూర్వము వెలువడిన వాఙ్మయము లభ్యము కానంతమాత్రమున నన్నయకుఁ బూర్వ మాంధ్ర వాఙ్మయము లేనేలేదని చెప్ప వలనుపడదు. నన్నయ రచనయే ఆంధ్ర వాఙ్మయమున కారంభమైనచో, అట్టి యుత్కృష్ట కవిత వెలువడుట అసంభావ్యమని విమర్శకుల యాశయము.

నన్నయకుఁ బూర్వమున గ్రంథ రూపమున తెలుఁగు వాఙ్మయము వెలువడ కున్నను శాసనములందుఁ గొన్ని పద్యములును, గద్యలును కానవచ్చుచునే యున్నవి. వానిని పరిశీలించినచో, శాసన రచయితలు విద్వత్కవులని తెలియకమానదు. వారు సంస్కృతమునందును నిష్ణాతలని యా శాసనములే చాటుచున్నవి.

శాసన రచయితలను కొందఱిని కొందఱు చరిత్రకారులు కవులుగాఁ బరిగ ణించిరి. [౧]శాసనమునఁ గొలఁది పద్యములను గూర్చినంతమాత్రమున — అట్టి రచయితలను రచయితలనుగాఁ బరిగణింపనక్కఱలేదని కొందఱు విమర్శకుల యాశయము అట్టి వారు కవుల పట్టిక కెక్కినను — ఎక్క కున్నను — నన్నయకుఁ బూర్వమున నుండిన తెలుఁగు వాఙ్మయము స్వరూప మును దెలిసికొనుటకు — అట్టి శాసన కర్తలను గూర్చి కొంతవఱకుఁ దెలిసి కొనుట యప్రస్తుతము కాఁజాలదు.

(1) ఉపలబ్ధములగు శాసనములలో క్రీ. శ 848 ప్రాంతమునాఁటి 'అద్దంకి' శాసనము మొదటిది. ఇది చాళుక్య వంశీయుఁడగు గుణగవిజయాదిత్యుని ప్రథమ రాజ్య సంవత్సరమునాఁటిదఁట' పండరంగఁడను సేనాధిపతి తన ప్రభువు గుణగవిజయాదిత్యుని పేరిట ఆదిత్యభట్టారకునికి కొంత నేల దానము చేసినట్లిందుఁ గలదు. దీని కర్త యెవ్వరో తెలియరాలేదు పండరంగఁడే

(౧) చూడుఁడు — శ్రీ నిడుదవోలు వేంకటరావుగారి 'తెనుఁగు కవుల చరిత్ర'

శాసనకవియయి యుండునని శ్రీ నిడుదవోలు — వేంకటరావుగా రూహించు చున్నారు ౨ ఇందు తరువోజయును, కొంత గద్యభాగమును గలవు.

(2) దీని తర్వాతిది కందుకూరిలో లభించిన పద్యమయ శాసనము ఇది పూర్తిగా లేదు. ఇందలి లిపి తూర్పు చాళుక్యులనాఁటిదఁట: ఇందలి పద్యము సీసపద్యమని కీ. శే. శ్రీ కొమర్రాజు — వేంకట లక్ష్మణరావుగారు గుర్తించిరి. ఇయ్యదియు గుణగవిజయాదిత్యునకు సంబంధించినదవి శ్రీ నిడుదవోలు — వేంకటరావుగారు తెల్పుచున్నారు ౩

(3) గుణగవిజయాదిత్యుని నాఁటిదే యని చెప్పఁబడుచున్న ధర్మవరము శాసన మొకటి పద్యమయము కలదు. ౪ ఈ శాసనము ప్రారంభమున 'స్వస్తి సర్వలోకాశ్రయ .. (క్య) భీమమహారా (జులవి) జయరాజ్యస (ం) వత్సరంబు — (యే) నగునే (ణ్డీ) ఉత్త (రా) యనస (ంక్రావ్తి) స్థితి' అవి యుండుటం బట్టి యిది చాళుక్యభీమమహారాజు శాసనమని ప్రసిద్ధము. ఇది యత్కర్తృకమో తెలియదు

(4) ఏడువాడలపాలెపు శాసనము నొకదానిని కీ. శే. పెండ్యాల — వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రిగారు పరిచయము చేసిరి. ౫ శాసనములోని 'స్వస్తి - సకొబ్దంబు ల్దొంభ నూటానల్వదియగు నేణ్డి —' అను దానినిబట్టి యిది క్రీ. శ. 1018 నాఁటిదని తెలియుచున్నది.

(5) నన్నయ కంటెఁ బ్రాచీనములగు శాసనములలో ముఖ్యమైనది 'యుద్ధ మల్లుని బెజవాడ శిలాశాసనము'. ఇది యుద్ధమల్లుఁడను చాళుక్యరాజు బెజవాడలోఁ గుమారస్వామికి గుడియు, దానిఁ జేర్చి యొక మఠమును కట్టించి, ఆ మఠములో శైవేతరులు నివసింపరాదని యేర్పాటుచేసి చెక్కించిన శాసనము బాగుగఁ బరిశీలించినచో నిది యొక్క శాసనము కాదనియు,

---

(౨) చూ. తెనుఁగు కవుల చరిత్ర — పుట 25.

(౩) చూ. తెనుఁగు కవుల చరిత్ర పుట 33

(౪) డా నేలటూరి—వేంకటరమణయ్యగారి 'గుణగవిజయాదిత్యుని వర్తమానములు.' భారతి ౨౩, ౨౪ సం.

౫) చూ. రాజరాజనరేంద్ర పట్టాభిషేక సంచిక,

రెండు శాసనములనియు, ఇందలి చివటి భాగమును బట్టి యుద్ధమల్లుఁడు, తన తాత మల్లపరాజు కట్టించిన గుడికి గోపురమును గట్టించెనని స్పష్టమగుచున్నదనియు శ్రీ వేంకటరావుగారు వ్రాయుచున్నారు.[౬] ఈ శాసనము గుణగవిజయాదిత్యుని శాసనమున కించుమించుగా ఏఁబదియేండ్లకుఁ దర్వాత పుట్టినదని కీ. శే. శ్రీ జయంతి - రామయ్యపంతులుగారు వ్రాసిరి.[౭] ఇయ్యది యసమగ్రము.

శాసనమును బట్టి దీని కర్త యెవ్వరైనదియుఁ దెలియదు. వీరశైవ పండిత త్రయములోఁ దొలివాఁడగు శ్రీపతి పండితుఁడే యీ శాసనమును గూర్చెనని శ్రీ వేంకటరావుగారు చెప్పుచున్నారు. శ్రీపతి పండితుఁడు బెజవాడ వాస్తవ్యుఁడగుటయు, కవి యగుటయు, మల్లేశ్వరాలయమున నిప్పులు మూటగట్టి శివభక్తి మహిమను బ్రదర్శించుటయుఁ దమ యూహకుఁ గారణముగా వివరించినారు.[౮] ఈయూహ కింకను బ్రబలములగు హేతువు లావశ్యకములు.
(6) కీ. శే శ్రీ వేటూరి-ప్రభాకరశాస్త్రిగారు సంతరించిన 'ప్రబంధరత్నావళి' లో పద్మకవి రచనగా నొక సీసపద్య మీయఁబడినది. అది 'జినేంద్రపురాణము' లోనిది. 'జినేంద్రపురాణము' ను రచించిన పద్మకవియే కన్నడవాఙ్మయమున ఆదికవి యని చెప్పఁబడు పంప మహాకవి యని శ్రీ వేంకటరావుగారి యభిప్రాయము.[౯] ఉపలబ్ధమగు పద్యము ప్రాచీనతర రచనగాఁ దోఁచలేదని శ్రీ ప్రభాకర శాస్త్రిగారు తెల్పియున్నారు.[౧౦] పద్మకవియే పంపకవి యని నిశ్చయమైనచో, అతఁడు నన్నయ కంటెఁ బ్రాచీనుఁడు కావచ్చును.

(7) మడికి సింగన సమకూర్చిన 'సకల నీతిసమ్మత' మను గ్రంథమున నీయఁబడిన కృతి, కృతికర్త్రు నామములో 'గజాంకుశ' ప్రశస్తి కలదు.

---

(౬) చూ. తెనుఁగు కవుల చరిత్ర, పుట 55.

(౭) చూ. శాసనపద్యమంజరి — పీఠిక

(౮) చూ. తెనుఁగుకవుల చరిత్ర పుటలు 68, 69.

(౯) చూ. తెనుఁగుకవుల చరిత్ర. పుటలు 83, 84.

(౧౦) ప్రబంధ రత్నావళి, పీఠిక. పుట 27.

కన్నడ కవి సుప్రసిద్ధుఁడు. 'గజాంకుశుఁడు' కలఁడని కన్నడ కవి చరిత్ర కారులు తెల్పుచున్నారు. ఈ కన్నడ కవి క్రీ శ. 1000 ప్రాంతపువాఁడు. ఆంధ్ర కవియు, నీ కన్నడ కవియు నభిన్నులని శ్రీ వేంకటరావుగారి యాశయము.౧౧

మఱియు నీతనిం గూర్చి తెనుఁగు కవుల చరిత్రలో నిట్లు వ్రాయఁబడినది—"గజాంకుశుఁడనునది బిరుదమే కాని స్వతస్సిద్ధమగు పేరు కాదు. ఈతని పేరు నారాయణుఁడు. ఈతఁడు రాష్ట్రకూటరాజగు మూఁడవ కృష్ణచక్రవర్తి కాలమున నాతని ప్రధానియై ప్రసిద్ధికెక్కెను. మూఁడవ కృష్ణచక్రవర్తి క్రీ.శ. 939 నుండి 965 వఱకును 29 యేండ్లు పరిపాలించినాఁడు.

*　　*　　*　　*

రామపార్యసుత శ్శ్రీమాన్ వగాన్వోఽయం ప్రతాపవాన్
నారాయణాభిధానేన నారాయణ ఇవాపరః,
విఖ్యాతో భువి విద్యావాన్ యో గజాంకుశ సంజ్ఞయా
ప్రధానః కృష్ణరాజస్య మంత్రీసన్ సంధి విగ్రహే—

*　　*　　*　　*

పారగో రాజవిద్యానాం కవిముఖ్యః ప్రియంవదః (?)
యస్తు ధర్మరతో భాతి ధర్మో విగ్రహవానివ."

గజాంకుశుఁడు కవి యని తెలియనగునను భావమున శ్రీ వేంకటరావుగారు 'కవిముఖ్యః' అను దాని నధోరేఖాంకితము చేసినారు. కాని వా రొసఁగిన యా భాగము అనన్వితమగుటచే, అది సరియైన పాఠముగాఁ దోఁచుటలేదు. ఇంతకును గజాంకుశుని రచన యాంధ్రమున లభ్యము కాలేదు. కావున ఆంధ్ర, కన్నడ గజాంకుశుల యభిన్నతను గాని, ఆంధ్ర గజాంకుశుని - లేదా - నారాయణుని కాలమును గాని నిర్ణయింపఁదగిన కారణము లపేక్షణీయములు.

(8) 'ప్రబంధ రత్నావళి' యందలి యుదాహృతులను బట్టి సర్వదేవుఁడను నొక కవి యుండెననియు, అతఁడు 'ఆదిపురాణ' మను జైన గ్రంథమును,

(౧౧) చూ. తెనుఁగుకవుల చరిత్ర. పుటలు 88, 89.

భారతమునందలి విరాటపర్వమును రచించినట్లు తెలియుచున్నది. రాయల కాలము నాఁటివాఁడగు 'ఎడపాటి - ఎఱ్ఱన' తన 'మల్హణచరిత్ర' లో సర్వదేవుని స్తుతించి యున్నాఁడు. కన్నడమున సుప్రసిద్ధుఁడగు పొన్నకవి సర్వదేవుఁడని ప్రసిద్ధుఁడనియు, రాష్ట్రకూటరాజగు మూఁడవ కృష్ణచక్రవర్తి కాలమున నుండినవాఁడనియు, పంపకవి 'ఆదిపురాణము' ను కన్నడమున రచింపఁగా పొన్నకవి దానిని తెలుఁగున రచించి యుండుననియు శ్రీ వేంకట రావుగా రభిప్రాయపడుచున్నారు.[౧౨] లభించిన పద్యములను జూడఁగా నవి ప్రాచీనతర రచనముగాఁ దోపఁకున్నదని శ్రీ ప్రభాకరశాస్త్రిగారు తెల్పఁగా 'మనకు దొరకిన రెండు మూఁడు పద్యములతోడనే కావ్యకవితా ప్రాచీనతా నవీనతలను నిర్ణయింపరా' దని డాక్టరు నేలటూరి - వేంకటరమణయ్య గారును, శ్రీ వేంకటరావుగారును తెల్పుచున్నారు [౧౩]

(9) విజయాదిత్యుఁడను నామాంతరము గల బాదపమహారాజు పదియవ శతాబ్ది చివరి భాగమున నుండినట్లు అయ్యనభట్టు రచించిన 'ఆరుంబాక' శాసనము వలనఁ దెలియుచున్నది. శాసనమంతయు సంస్కృతమయము. అయినను కందపద్య లక్షణముతోఁ గూడిన యొక పద్య మందుండుటఁ బట్టి అయ్యనభట్టాంధ్ర కవి యగునని శ్రీ వేంకటరావుగా రనుచున్నారు.[౧౪] కాని, శాసనరచయిత యాంధ్రుఁడనుటలో నిది హేతువు కావచ్చును. అతఁడాంధ్రకవి యనుట కింకను ప్రబలమగు హేతువు కావలసి యున్నది.

(10) క్రీ. శ. 1000 ప్రాంతమునందలిదగు విరియాల కామసాని గూడూరు శాసనము తెలుఁగుపద్యములగు చంపకోత్పలమాలికలతోఁ గూడియున్నది. శాసనమునందుఁ బ్రస్తుతింపఁబడిన మొదటి బేతరాజు శా. శ 950 నాఁటి వాఁడు. కావున అతని కాలము క్రీ. శ. 1028 అని చెప్పవచ్చును. అందు వలన నీ శాసనము క్రీ. శ. 1000 ప్రాంతములోనిదని చెప్పవచ్చును. శాసన కర్త యెవ్వరైనదియుఁ దెలియుటలేదు.

---

(౧౨) చూ. తెనుఁగుకవుల చరిత్ర. పుట 94.

(౧౩) చూ. ఉదయిని, మేనెల సంచిక 1936. తెనుఁగుకవుల చరిత్ర పుట 93.

(౧౪) తెనుఁగుకవుల చరిత్ర. పుట 98.

(11) రాజరాజనరేంద్రుని రాజ్యకాలమునఁ బొలిదసముఁడో బేతనభట్టను శాసనరచయిత యుండెను. ఇతని కాలము క్రీ. శ. 1022 ప్రాంతమనుట సుస్పష్టము. ఇతఁడు కోరుమిల్లి శాసనమునకుఁ గర్త. ఈ శాసనము, రాజనరేంద్రుఁడు చంద్రగ్రహణకాలమున వినమార్యుఁడను సద్బ్రాహ్మణు నికి కోరుమిల్లి గ్రామ మగ్రహారముగా నొసరించి దానము చేసిన విషయ మును తెల్పుచున్నది. ఇది సంస్కృతమయము. కాని యిది దేశీయచ్ఛం దస్సగు రగడ యొక్క లక్షణములను గలిగియుండుటవలన — బేతనభట్టు తెనుఁగుకవి యగుట స్పష్టమని శ్రీ వేంకటరావుగారు తెలుపుచున్నారు (౧౫) కాని దీనింబట్టి బేతనభట్టు తెనుఁగులక్షణ సంప్రదాయముల నెఱిఁగినవాఁడని మాత్రము నిశ్చయింపవచ్చును.

ఈ రీతిని పద్యమయశాసనములేకాక గద్య శాసనములును పెక్కు కానవచ్చు చున్నవి. అయ్యవి క్రీ. శ. 575 ప్రాంతము నుండియు వెలసినవి లభ్యము లగుచున్నవి. కాని యవి యన్నియు వాఙ్మయఖండములని గాని, శాసన కర్తలు రచయితలని గాని చెప్పుట కవకాశము తక్కువ. ఇట్లే నన్నయకుఁ బూర్వమున నుండిన పద్యశాసనములను బట్టియు గవులను నిర్ణయించుట కింకను పరిశోధనలు జరుగవలసి యున్నవి.

పయి యంశములను బట్టి నన్నయకుఁ బూర్వము కూడ తెలుఁగుకవిత వెలసి యుండెననియు, అయ్యది గ్రంథరూపముగ నుండినచో అనుపలబ్ధమనియు మాత్రము చెప్పవచ్చును

---

(౧౫) చూ. తెనుఁగు కవుల చరిత్ర. పుట 112.

ఆంధ్రకవుల చరిత్రము

పూర్వకవులు

నన్నయభట్టు

నన్నయభట్టారకుఁడు * సంస్కృతభారతమును దెనిఁగింప నారంభించిన కవి. ఇతఁడు ముద్గలగోత్రజాతుఁడగు వైదికబ్రాహ్మణుఁడు. ఒకానొక రీతఁడు వైదికబ్రాహ్మణుఁడు కాఁడనియు, తెలుఁగు కవిత్వమునకు మొదటినుండియు నియోగులే ప్రసిద్ధులయి యుండుటచేత నీతఁడును నియోగియేయయి యుండుననియు, భట్ట శబ్దధారణ మాత్రముచేత నీతఁడు వైదికియని భ్రమింపగూడదనియు, నియోగియైన శ్రీనాథకవి గూడ తన కాశీఖండము లోని "చిన్నారిపొన్నారి చిఱుతకూఁకటినాఁడు" అను పద్యములోఁ దన్నుఁ గూర్చి "శ్రీనాథభట్టసుకవి" యని చెప్పికొనియెననియు, వ్రాసియున్నారు. నన్నయభట్టారకుని కాలమునాఁటికే యాంధ్రస్మార్తబ్రాహ్మణులలో వైదిక నియోగి భేద మేర్పడియుండినను, నియోగివైదికుల కిరువురకును సమానము

* భారతమునందలి యొక పద్యము [ఆది–1–25] ను బట్టి యితనికి 'నన్నయభట్టు' అనియు, ఆదిపర్వమునందలి వేఱొక [1–9] పద్యమును బట్టి 'నన్నపార్యుఁ' డనియు నామములు ప్రసిద్ధములైనట్లు తెలియుచున్నది. శాసనములంబట్టి 'నన్నియభట్ట'ను నామమున్నట్లు తెలియుచున్నది. కొందఱు విమర్శకులు భారత రచయితయగు నన్నయ కంటె శాసనరచయిత భిన్నుఁడను నభిప్రాయమును తెల్పియున్నారు. కాని యిర్వురు నభిన్నవ్యక్తులు. 'నన్నియ' ప్రాచీనరూపము; 'నన్నయ' నవీనరూపము.

గానే "భట్ట" శబ్దము చెల్లుచుండినను, నన్నయభట్టు తాను రాజు యొక్క కులబ్రాహ్మణుఁ డయినట్లు "తన కులబ్రాహ్మణు ననురక్తు నవిరళజప హోమతత్పరు . . ..నన్నపార్యు జూచి పరమధర్మవిదుఁడు వరచళుక్యాన్వయాభరణుఁ డిట్లు లనియెఁ గరుణతోడ" నని యాదిపర్వములోఁ జెప్పుకొని యుండుటచేత నన్నయ వైదికశిఖామణి యనియే నిశ్చయింప వలసియున్నది. కులబ్రాహ్మణులయి వంశపరంపరగా రాజపురోహితత్వము నిర్వర్తించుచుండుట వైదికులలోనేకాని నియోగులలో లేదు. ఇంకొకరు, చాళుక్యులు పశ్చిమమునుండి వచ్చినవా రగుటచేత నన్నయభట్టు మహారాష్ట్ర దేశ ప్రాంతములనుండి రాజరాజనరేంద్రుని పూర్వుల వెంట వచ్చిన మహారాష్ట్ర బ్రాహ్మణులసంతతివాఁ డయి యుండునని వ్రాసి యున్నారు. అదియు విశ్వసనీయము కాదు. * నన్నయ వేఁగినాటి బ్రాహ్మణుఁ డని యూహించుటకుఁ దగిన నిదర్శనములు నన్నయార్య విరచితమైన భారత భాగములోనే కనుపట్టుచున్నవి. ఇతఁ డర్జునుని తీర్థయాత్రలను వివరించుటలో నీ క్రింది వర్ణనము నాదిపర్వమునందుఁ జేసియున్నాఁడు.

"సీ. దక్షిణగంగ నాఁ దద్దయు నొప్పిన గోదావరియు జగదాదియైన
భీమేశ్వరంబును బెడఁగగుచున్న శ్రీపర్వతంబునుజూచి యుర్విలోన
ననఘమై శిష్టాగ్రహారభూయిష్ఠమై ధరణీసురోత్తమాధ్వరవిధాన
పుణ్యసమృద్ధమై పొలుచు వేఁగీదేశవిభవంబుఁ జూచుచు విభుఁడు దక్షి

గీ. ణాంబురాశితీరంబున కరిగి దురిత
హారియైన కావేరీమహాసముద్ర
సంగమంబున భూసురేశ్వరుల కభిమ
తార్థదానంబుఁ జేసి కృతార్థుఁ డగుచు."

స్వదేశమునం దభిమాన మెల్లవారికిని సహజమై యుండును గదా! ఈతఁడు వేఁగినాటివాఁ డగుటచేతనే మూలగ్రంథమైన సంస్కృతమహాభారతములో లేని వేఁగిదేశ మహత్త్వవర్ణనము నుత్తమ విశేషగుణములతోఁ

* నన్నయభట్టు కర్ణాటకుఁడని కొందఱు తలఁచుచున్నారు. ఈ యభిప్రాయము కూడ సరికాదు.

దెలుఁగుభారతమునఁ జొప్పించి తనయనూనదేశాభిమానమును గనఁబఱిచి యున్నాఁడు.

నన్నయ వేదాధ్యయన సంపన్నుఁడు ఇతఁడు సంస్కృతాంధ్రభాషల యందసమానపాండిత్యము కలవాఁడయి, ఉభయభాషలయందును గవిత్వము చెప్పుటకు సమర్థుఁడయి యుండెను. తక్కిన తెలుఁగు గ్రంథములయందువలెఁ గాక యితఁ డాంధ్రభారతాదియందు దేవతాస్తుతి నిట్లు సంస్కృతశ్లోకముతోఁ జేసి యున్నాడు

శ్లో. శ్రీవాణీగిరిజా శ్చిరాయ దధతో వక్షోముఖాంగేషు యే
లోకానాం స్థితి మావహ న్త్యవిహతాం స్త్రీపుంసయోగోద్భవామ్
తే వేదత్రయమూర్తయ స్త్రీపురుషా స్సంపూజితా వ స్సురై
ర్భూయాసుః పురుషోత్తమాంబుజభవశ్రీకంధరా శ్శ్రేయసే

ఇతఁ డవతారికలో షష్ఠ్యంతపద్యములు వేయలేదు. భాస్కరరామాయణ మీ విషయమున దీనిని బోలి యున్నది. స్వప్నకథను షష్ఠ్యంతములను మొట్టమొదట జేర్చినవాఁడు తిక్కనసోమయాజియే. ఆతనిని జూచి యించుమించుగాఁ దరువాతికవు లందఱును దమకు స్వప్నములో నిష్టదేవతా సాక్షాత్కారమును షష్ఠ్యంతపద్యములను దమ గ్రంథములలో వెట్టిగా నేఁటి వఱకును వేసికొనుచున్నారు. నన్నయభట్టారకుఁడు భారతములోఁ దన్ను గూర్చి యీ యొక్క పద్యమును మాత్రము వేసికొన్నాఁడు. *

సీ. తనకులబ్రాహ్మణుల ననురక్తు నవిరళ
    జపహోమతత్పరు విపులశబ్ద
శాసను సంహితాభ్యాసు బ్రహ్మాండాది
    నానాపురాణవిజ్ఞాననిరతుఁ
బాత్రు నాపస్తంబసూత్రు ముద్గలగోత్ర
    జాతు సద్వినుతావదాతచరితు
లోకజ్ఞు నుభయభాషాకావ్యరచనాభి
    శోభితు సత్ప్రతిభాభియోగ్యు

* నన్నయభట్టు తన పూర్వులను గూర్చి యేమియు తెలుపలేదు. నన్నయ రణస్థిపూఁడి శాసనము వ్రాసిన భీమనభట్టు యొక్క కాని, కోరుమిల్లి శాసనమును రచించిన వేతనభట్టు యొక్క కాని కుమారుఁడయి యుండునని 'ఆంధ్రకవి తరంగిణి' కర్త శ్రీ చాగంటి శేషయ్యగారు తెలిపియున్నారు.

ఆ. నిత్యసత్యవచను మత్యమరాధిపా
చార్యు సుజను నన్నపార్యుఁ జూచి
పరమధర్మవిదుఁడు వరచళుక్యాన్వయా
భరణుఁ డిట్టులనియెఁ గరుణతోడ.

ఈ భారతమును దెనిఁగించుటలోఁ దనకు నారాయణభట్టు* సహాయుఁడుగా నున్నట్టు కవియే చెప్పుకొనుచున్నాఁడు. నన్నయ వేఁగిదేశమునకు రాజయిన రాజనరేంద్రుని యాస్థానపండితుఁడు పూర్వ మాంధ్రదేశమునకుఁ గొంత కాలము వేఁగిదేశ మని వ్యవహారము కలదు. నిజమైన వేఁగిదేశము

---

* ఉ పాయక పాకశాసనికి భారతఘోరరణంబునందు నా
రాయణునట్టు, తానును ధరామరవంశవిభూషణుండు నా
రాయణభట్టు వాఙ్మయధురంధరుఁడుం దనకిష్టుఁడు న్సహా
ధ్యాయుఁడు నైనవాఁ డభిమతంబుగఁ దోడయి నిర్వహింపఁగన్ ॥ఆ॰ పర్వ

[ఈ పద్యము యొక్క రెండవపాదమున 'తానును ధరామరవంశ విభూషణుండు' అనుచోట 'తానును'కు బదులుగా 'వానస' అను పాఠమున్నది దానినే పలువురంగీకరించి యున్నారు 'వానస' వంశమున హారితసగోత్రులు, కౌస్యప గోత్రులు, వసిష్ఠగోత్రులు గలరు. నారాయణభట్టు హారితసగోత్రుఁడు. కావున 'వానస' అనునది గ్రామనామము గాని, పౌరుషనామము గాని యయియుండ వచ్చునని కొందఱి మతము

ఈ పద్యము పెక్కు భారతప్రతులయందుఁ గన్పట్టుటలేదనియు, అప్పకవి మాత్రము దీని నుదాహరణముగా గ్రహించెను గాని, తత్పూర్వము వ్రాయఁబడిన భారతప్రతులు లభించనందున, ఏ సంగతిని ఇదమిత్థమ్మని నిశ్చయింపవలనుపడదనియు శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు భారతరచనలో నారాయణభట్టు నన్నయకు సాయపడెనను విషయమును సందేహించుచున్నారు కాని నారాయణభట్టు నన్నయ సమకాలికుఁడని మాత్ర మంగీకరించుచు ఈ పద్య విషయమెట్లున్నను నారాయణభట్టు నన్నయ సమకాలికుఁ డగుటకు నందమపూఁడి శాసనమే ప్రమాణము' అని వ్రాయుచున్నారు. [చూ. తెనుఁగుకవుల చరిత్ర పుటలు 158, 159.

నారాయణభట్టు భారతరచనమున నన్నయభట్టునకు సాయపడెనని శ్రీ కావలి వెంకటరామస్వామిగారు (Biographical Sketches of Dekkan Poets గ్రంథకర్త), 'కవి జీవితము' లను రచించిన శ్రీ గురజాడ శ్రీరామమూర్తిగారు, 'ఆంధ్రకవి తరంగిణి' ని రచించిన శ్రీ చాగంటి శేషయ్యగారు మున్నగువారభి ప్రాయపడుచున్నారు.]

(వేఁగినాడు) ౮౦౦౦ చదరపుమైళ్ళ వైశాల్యము కలదయి పడమటను తూర్పుకనుమలకును, తూర్పున సముద్రమునకును, ఉత్తరమున గోదావరీ నదికిని, దక్షిణమునఁ గృష్ణానదికిని మధ్యస్థమయిన తెలుఁగుదేశము. మొట్టమొదట నీ వేఁగిదేశమునకు వేఁగి యను పట్టణము రాజధానిగా నుండెను. ఆ వేఁగీపురము హేలాపుర మనబడెడి యేలూరున కుత్తరమున నేడుమయిళ్ళదూరమున నున్నది ఇది పూర్వము రెండుక్రోశముల పొడవును వెడల్పును గల గొప్ప పట్టణమయి యుండియు, మహమ్మదీయులు దండెత్తి వచ్చి నాశనము చేయుటచేతనో మఱి యే హేతువుచేతనో యిప్పుడు బొత్తిగా పాడుపడిపోయి పూర్వ పట్టణము యొక్క రెండుకొనలయందును వరుసగా పెదవేఁగి చినవేఁగి యను పల్లెలను మాత్రము కలిగియున్నది. ఇక్కడ నిప్పటికిని పాడుపడిపోయిన దేవాలయము లేఁబదికంటె నధికముగా నున్నవి. ఇక్కడి దేవాలయములను పడఁగొట్టి మహమ్మదీయు లారాళ్ళతో నేలూరునం దొక కోటను గట్టిరి ఈ పెదవేఁగి రాజమహేంద్రవరమునకు దక్షిణమున నలుబదియైదుమైళ్ళ దూరమున నున్నది. పెదవేఁగి కైదుమైళ్ళ దూరములో నున్న దెందులూరివఱకును గూడ పడిపోయిన దేవాలయాదుల చిహ్నములు కొన్ని కనఁబడుచున్నవి వేఁగీరాజ్యము నిజమైన వేఁగినాటనుమాత్రమేకాక దక్షిణమునఁ గాంచీపురము రాజధానిగాఁగల పల్లవవంశజులదైన చోళ మండలము వఱకును, నుత్తరమున గంగావంశజుల దయిన కళింగరాజ్యము వఱకును, వ్యాపించి యుండెను. రాజ్యమునకు మధ్యగా నుండునిమిత్తమయి రాజధాని వేఁగీపురమునుండి రాజమహేంద్రవరమునకు రాజమహేంద్రుఁ డను బిరుదునామము వహించిన యమ్మరాజుకాలములో మార్పఁబడిన దని చెప్పుదురు. ఈ పట్టణమునకు రాజమహేంద్రవరపుర మన్నపే రీతనిని బట్టియే వచ్చినదనియుఁ జెప్పుచున్నారు "వేఁగీదేశంబునకు నాయక రత్నంబునుబోని రాజమహేంద్రపురంబునందు" అని భారతమునందుఁ జెప్పఁబడుటచేతనే చాళుక్యరాజులచేఁ బాలింపఁబడుచుండిన వేఁగీరాజ్యములో రాజమహేంద్రపురము మధ్యభాగమున నున్నట్టు స్పష్టమగుచున్నది. ఆ కాలమునందు వేఁగిదేశమున కధీశ్వరుఁడును చళుక్యవంశసంభవుఁడును విమలాదిత్యుని పుత్త్రుఁడును నగు రాజరాజనరేంద్రుఁడు రాజమహేంద్ర

వరము తనకు రాజధానిగా విష్ణువర్ధనుఁ డను బిరుదు పేరితోఁ జిరకాలము రాజ్యము చేసెను. ఈ పట్టణమునందలి కోటను కట్టినవాఁ డితఁడే. ఇతఁడు విమలాదిత్యుని పుత్రుఁ డయినట్టును చాళుక్యవంశజుఁ డయినట్టును భారతములోని యీ క్రింది పద్యము చెప్పుచున్నది.

క. విమలాదిత్యతనూజుఁడు,
విమలవిచారుఁడు కుమారవిద్యాధరుఁడు
త్తమచాళుక్యుఁడు వివిధా
గమవిహితశ్రముఁడు తుహినకరుఁ డురుకాంతిన్.

ఈ రాజమహేంద్రుఁడు శివభక్తుఁడును జంద్రవంశ్యుఁడును నయినట్టు కవిని గూర్చి యతఁడు పలికినరీతిగా నాదిపర్వమునఁ జెప్పఁబడిన యీ పద్యముల వలనఁ దెలియవచ్చు చున్నది.

మ. ఇవి యేనున్ సతతంబు నాయెడఁ గరం బిష్టంబులై యుండుఁ బా
యవు భూదేవకులాభితర్పణమహీయఃప్రీతియున్ భారత
శ్రవణాసక్తియుఁ బార్వతీపతిపదాబ్జధ్యానపూజామహో
త్సవమున్ సంతతదానశీలతయు శశ్వత్సాధుసాంగత్యమున్.

చ. హిమకరుఁదొట్టి పూరు భరతేశ కురుప్రభు పాండుభూపతుల్
క్రమమున వంశకర్త లనఁగా మహి నొప్పినయస్మదీయవం
శమునఁ బ్రసిద్ధులై విమలసద్గుణశోభితు లైనపాండవో
త్తములచరిత్ర నాకు సతతంబు వినంగ నభీష్ట మెంతయున్.

ఆపస్తంబసూత్రుఁడును భారద్వాజగోత్రుఁడును నయిన చీదమార్యుఁడను బ్రాహ్మణునకు రాజరాజనరేంద్రుఁడు చంద్రగ్రహణ పుణ్యకాలమునందు గోదావరీమండలములోని కోరుమిల్లి యగ్రహారము నిచ్చినప్పటి తామ్రదాన శాసనమునుబట్టి చూడఁగా రాజరాజనరేంద్రుఁడు సింహాసనమునకు వచ్చిన కాలము మొదలగునవి తేటపడుచున్నవి ఆ శాసనమందు రాజరాజనరేంద్రుని పూర్వుఁడైన విజయాదిత్యుఁ డయోధ్యానగరమునుండి దక్షిణదేశము మీఁద

దండెత్తి వచ్చి యీ దేశమును పాలించుచుండిన త్రిలోచనపల్లవునితో యుద్ధము చేసి రణనిహతుఁ డయినట్టును, భర్త వెంట వచ్చిన యాతని భార్య గర్భవతియై యుండియు నా యాపత్సమయములోఁ బురోహితునిని గొందఱు పరిచారికలను వెంటఁగొని ముదివేము అగ్రహారమునకుఁ దప్పించుకొని పాఱిపోఁగా విష్ణుభట్టసోమయాజి యను బ్రాహ్మణుఁ డామె నాదరించి తన యింటఁ బెట్టుకొని తానుగన్న కొమార్తెనువలెఁ జూచి యామె గర్భమున జనించిన పురుషశిశువునకు రాజోచితము లయిన జాతకర్మాది సంస్కారములు నడిపి విష్ణువర్ధనుఁ డని పేరు పెట్టి పెంచినట్టును, ఆతడు తన తల్లి వలన సర్వవృత్తాంతమును విని చళుక్యపర్వతమునకుఁ బోయి తపస్సుచేసి తన తండ్రి రాజ్యమును వహించి, కదంబులను గాంగులను జయించి నర్మద మొదలుకొని సేతువు వఱకునున్న యేడుకోట్ల యేఁబదిలక్షల గ్రామములుగల దేశమునంతను పాలించినట్లును, చెప్పఁబడి యున్నది. అప్పటినుండియు నాతని వంశమువారికి విష్ణువర్ధనుఁ డను బిరుదు పేరు పరంపరగా వచ్చుచున్నది. ఈ చళుక్యవంశపురాజులు రెండు శాఖలవారయి యొక శాఖవారు కళ్యాణపురమునందును రెండవశాఖవారు రాజమహేంద్రవరమునందును రాజ్యము చేయుచుండిరి. వీరిలోఁ గళ్యాణపురము రాజధానిగాఁగల పడమటి చాళుక్యులు కుంతలరాజులనియు, రాజమహేంద్రవరము రాజధానిగాఁ గల తూర్పుచాళుక్యులు వేఁగిరాజు లనియు, వ్యవహరింపఁబడుచు వచ్చిరి. ఈ విష్ణువర్ధనునిముమ్మనుమఁడయిన కుబ్జవిష్ణువర్ధనుఁడు క్రీస్తుశకము ౬౧౫ వ సంవత్సరమునందు వేఁగిదేశమునకు మొదటఁ దనయన్నయైన సత్యాశ్రయునిచేఁ బాలకుఁడుగా నియమింపఁబడి పిమ్మట దానేఁ రాజయ్యెను. అతని కిరువదియేడవతరమువాఁడయిన విమలాదిత్యుఁడు ౧౦౧౫ వ సంవత్సరమున సింహాసనమునకు వచ్చి యేడుసంవత్సరములు రాజ్యముచేసి మృతినొందఁగాఁ దెలుఁగుభారతమును గృతినందిన యాతని కొడుకు విష్ణువర్ధనుఁ డను రాజనరేంద్రుఁడు శాలివాహనశకము ౯౪౪ వ సంవత్సరము శ్రావణ బహుళ

ద్వితీయాగురువారమునాఁ డుత్తరభాద్రానక్షత్రమున * సింహాసన మెక్కినట్లు చెప్పఁబడి యున్నది. లెక్క వేసిచూడఁగా నీకాలము క్రీస్తుశకము ౧౦౨౨ వ సంవత్సరము జూలయినెల పందొమ్మిదవతేదితో సరియగును రాజనరేంద్రుని ముమ్మనుమఁడైన రెండవకులోత్తుంగచోళదేవుఁడు గోదావరీమండలము లోని కోరంగికి సమీపముననుండు చెల్లూరు గ్రామమును కొలనికాటము

---

* స్రగ్ధర తస్మాచ్చాళుక్యచూడామణి రథ విమలాదిత్యదేవా న్మహీశా
చ్చోడక్ష్మాపాలకన్యా ఇవ రచితతనోః కుండవాయాశ్చ దేవ్యా
జాతశ్శ్రీరాజరాజో రజనికరకులశ్రీమదంభోధిరాజో
రాజద్రాజన్య సేవ్యా మభృత భుజబలా ద్రాజ్యలక్ష్మీం పృధివ్యాః.

వసంతతిలక. యో రక్షితుం వసుమతీమ్ శకవత్సరేషు
వేదాంబురాశి విధివర్తిషు సింహగేర్కే
కృష్ణద్వితీయదివసోత్తరభాద్రికాయాం
వారే గురోర్వణిజలగ్న వరేభిషిక్తః.

శ్లో. యస్యోత్తమాంగం పట్టేన సమబంధి మహీయసా
భర్తుం విశ్వంభరాభారం జనైరారోపితం చిరమ్.

*　　　*　　　*　　　*

శా. పిత్రోర్వంశగురూ బభూవతు రలం యస్య స్ఫురత్తేజసౌ
సూర్యాచంద్రమసౌ నిరస్తతమసౌ దేవౌ జగచ్చక్షుషీ
దంష్ట్రాకోటిసముద్ధృతాఖిలమహీచక్రం మహత్క్రీడయా
విష్ణో రాదివరాహరూప మభవ ద్యచ్చాపనే లాంఛనమ్.

స్రగ్ధర. ఆద్యంతాత్యంతదూరాత్ సమజని జగతాం జ్యోతిషో జన్మహేతు
ర్బ్రహ్మాధామప్రజానా మభవ దథ తరః కాశ్యపో నామవేధాః
భారద్వాజస్తతో భూన్మని రధికతపస్తస్య గోత్రే పవిత్రే
తత్రాపస్తంబసూత్రే శ్రుతిని థిరుదగా చ్ఛీదమార్యక్రమేణ.

గద్య... . . ..సకలమునిగణనుతాపస్తంబసూత్రాయ తత్ర సంగీత
భారద్వాజగోత్రాయ ... .ధారాకరేణాగ్రహారీకృతః కోరుమల్లి
నామాగ్రామ ఇందూపరాగేదత్తో మయాచంద్రతారకం హితిష్ఠేత్.

*　　　*　　　*　　　*

నాయకుని కిచ్చినట్టియు, కాలేరగ్రహారమును దాక్షారామపీఠికాపురసత్రములను జరుపుటకయి ముద్గలగోత్రుఁడును పోతనార్యపుత్రుఁడును నయిన మేడమార్యుఁడను బ్రాహ్మణున కిచ్చినట్టియు, దానశాసనములనుబట్టి రాజరాజనరేంద్రుని పుత్రుఁడైన ప్రథమ కులోత్తుంగచోళదేవుఁడు శాలివాహనశకము ౯౮౫ వ సంవత్సర మనఁగా క్రీస్తుశకము ౧౦౬౩ వ సంవత్సరమున రాజ్యమునకు వచ్చినట్టు చెప్పఁబడి యున్నది. ఇందువలన రాజరాజనరేంద్రుఁడు ౧౦౨౨ వ సంవత్సరము మొదలుకొని ౧౦౬౩ వ సంవత్సరము వఱకు ౪౧ సంవత్సరములు రాజ్యపాలనము చేసినట్లు సిద్ధాంత మేర్పడుచున్నది. కనుక, * తదాస్థానపండితుఁ డయిన నన్నయభట్టారకుఁడును ౧౦౨౨ వ సంవత్సర ప్రాంతము మొదలుకొని యున్నవాఁడనుట స్పష్టము. ♦ కాఁబట్టి నన్నయభట్టు కాల మిప్పటికి ౯౦౦ సంవత్సరము లయి యున్నది. భారత రచనమునందు నన్నయభట్టున కత్యంత సహాయుఁడుగా నుండిన నారాయణ భట్టునకు రాజరాజనరేంద్రుఁడు తన రాజ్యపాలనముయొక్క ముప్పదిరెండవ సంవత్సరమునందు నందమపూడి యను గ్రామము నగ్రహారముగా నిచ్చెను. ఈ గ్రామము గౌతమీ వైనతేయనదుల మధ్యమున నప్పుడు రెండేరులవాడి విషయమనఁబడెడి యిప్పటి యమలాపురము తాలూకాలో నున్నది. "ద్వాత్రింశత్తమే విజయ రాజ్యవర్షే వర్ధమానే కృత మిదంశాసనమ్" అని ముప్పదిరెండవయేట ననియు, "సోమగ్రహణనిమిత్తే . . ...దత్తమ్" అని చంద్రగ్రహణసమయమునం దనియు, దానశాసనమున దుఁ జెప్పఁబడి యుండుటచేత దానకాలము శాలివాహనశకము ౯౭౪ వ సంవత్సరము మార్గశీర్ష శుద్ధ పూర్ణిమాభానువార మనఁగా క్రీస్తుశకము ౧౦౫౩ వ సంవత్సరము నవంబరునెల ౨౮ వ తేది యగుచున్నది. ఈ శాసనమునందు నారాయణభట్టిట్లు వర్ణింపఁబడి యున్నాఁడు.

---

* తదనుజో విమలాదిత్య స్సప్త, తత్పుత్రో రాజరాజదేవ ఏకచత్వారింశత్. తత్పుత్రశ్శ్రీకులోత్తుంగచోడదేవ ఏకోనపంచాశత్ ... . రాజ్యంప్రశాసతి.

♦ ఇది క్రీ. శ 1022 వ సం॥రము ఆగస్టునెల 16 వ తేదీకి సరిపడునని చరిత్రకారుల యభిప్రాయమైనట్లు 'ఆంధ్ర కవితరంగిణి' లో గలదు. [పుట 109.] ఈ ఆంధ్రకవుల చరిత్రమునను ౨౦వ పుటలో నిట్లే కలదు.

"ప. య స్సంస్కృతకర్ణాటప్రాకృతపైశాచికాంధ్రభాషాసు
కవిరాజశేఖర ఇతి ప్రథిత స్సుకవిత్వవిభవేన

ప. కవీ న్మనీషాలవదుర్విదగ్ధాన్ మనోహరాభి ర్నిజసూక్తిభి ర్యః
కుర్వన్నగర్వా న్పటుభి ర్బిభర్తి కవీభవజ్రాంకుశనామసార్థమ్

గ. తస్మై సకలజగదభినుతగుణశాలినే సరస్వతీకర్ణావతంసా యాష్టా
దశావధారణచక్రవర్తినేనన్నినారాయణాయ భవద్విషయే నందమ
పూణ్డినామగ్రామోగ్రహారీకృత్య సోమగ్రహణనిమిత్తే ధారాపూ
ర్వక మస్మాభి స్సర్వకరపరిహారేణ దత్త మితి విదిత మస్తు వః" *

ఇతఁడు సుకవిత్వవిభవముచేత సంస్కృతకర్ణాటప్రాకృతపైశాచికాంధ్రభాషాకవిశేఖరుఁ డనియు, మనీషాలవదుర్విదగ్ధు లయిన కవులను మనోహరము లైన నిజసూక్తులచేత గర్వభంగము నొందినవారినిగాఁ జేసి కవీభవజ్రాంకుశబిరుదమును సార్థకము చేసికొన్నవాఁ డనియు, అష్టాదశావధానచక్రవర్తి యనియు, పయి వాక్యములు తెలుపుచున్నవి. ఇతఁడు హారీతగోత్రుఁడును ఆపస్తంబసూత్రుఁడును పురోడాశపవిత్రవక్త్రుఁడును నగు కాంచనసోమయాజి ప్రపౌత్రుఁడును, కంచనార్యుని పౌత్రుఁడును శౌచాంజనేయసామికొంబలపుత్రుఁడును, అయినట్టు పై శాసనమే చెప్పుచున్నది. ఈ నారాయణభట్టాంధ్రసంస్కృతముల యందుమాత్రమేకాక కన్నడమునందును మహాకవి యయి యుండెను. చాళుక్యులు కర్ణాటదేశమునకును వేఁగిదేశమునకునుగూడ పరిపాలకులయి యుండుటచేత రాజాస్థానముల యందుండిన యాకాలపు విద్వాంసులు సాధారణముగా కర్ణాటాంధ్రభాషాపండితు లయి కన్నడమునందును తెనుఁగునందు ప గవిత్వము చెప్పగలవా రయి యుండిరి. కర్ణాటకభాషయందు సుప్రసిద్ధకవియైన నాగవర్మ తన ఛందోంబుధిలోఁ దన జన్మస్థలము వేఁగీదేశ మని చెప్పుకొనెను. బహుభాషల

* ఈ శాసనము శాలివాహనశకము 975 వ చంద్రగ్రహణమునాఁడు -అనఁగా క్రీ శ. 1053 నవంబరు 3వ తేదిని వ్రాయఁబడినట్లు తేలుచున్నదని 'ఆంధ్రకవితరంగిణి' యందుఁ గలదు [చూ పుట 1౨౦]

యందసమానపాండిత్యము గల నారాయణభట్టు భారతాంధ్రీకరణమునందు భారతరణమునం దర్జునునికి శ్రీకృష్ణుఁడు సహాయుఁ డయినట్టే విశేష సహాయుఁడయి యుండును. భారతాంధ్రీకరణమునందు సాహాయ్యపడు చుండిన హేతువుచేతఁ గూడ రాజరాజనరేంద్రుఁడు నారాయణభట్టున కీ దానము చేసియుండవచ్చును ! ఈ దానశాసనమును రచించినవాఁడు నన్నయభట్టు; రాగిరేకులమీఁదఁ జెక్కినవాఁడు గండాచార్యుఁడు. "కావ్యానాం కర్తా నన్నియభట్టో లేఖకో గండాచార్యః" అని శాసనము యొక్క కడపటి భాగమునం దున్నది. దీని వలన రాజరాజనరేంద్రుని పరిపాలనము నందు ముప్పదిరెం డేండ్లవఱకును నన్నయభట్టారకుఁడు జీవించియుండుట నిశ్చయము. ఇతఁడిప్పటికే భారతాంధ్రీకరణము నారంభించి యుండును. ఈతని మరణముచేతనో కొందఱు చెప్పినట్టు మతిభ్రమణముచేతనో రాజనరేంద్రుని జీవితకాలములోనే యాంధ్రభారతరచనము నిలిచిపోయి యుండును ఈ విషయమయి చెప్పఁబడెడు కథ లన్నియు విశ్వాసార్హములు కాకపోయినను, తరువాత రాజరాజనరేంద్రుఁడు తెనుఁగుభారతమును బూర్తిచేయింపఁ బ్రయత్నించె నన్నకథను స్థాపించుచున్నవి. మరణమునకుఁ గాని మతిభ్రమణమునకుఁ గాని మనవారు కథలలోఁ జెప్పిన కారణములు గాక వేఱుకారణము లుండవచ్చును మరణము గాని మతిభ్రమణము గాని కవి యొక పర్వమును సాంతముగా విరచించువఱకును నిలిచియుండవు అవి కవిని సగము చేయుచుండఁగానే నడుమ నెప్పుడో వాత వేసికొన వచ్చును. ఆశ్వాసమధ్యమున "శారదరాత్రులు" అన్న పద్యమును రచించు నప్పటికే మృత్యువాసన్నుఁడయి నన్నయభట్టారకుని గ్రంథరచనమున కసమర్థునిఁ జేసి యుండును. ఈ శాసనానంతరమున రాజనరేంద్రుఁడు సహితము చిరకాలము జీవింపక తొమ్మిది సంవత్సరములలోనే మృత్యు ముఖగతుఁ డయ్యెను. రాజనరేంద్రుఁడు నారాయణభట్టునకు నందమపూడి యగ్రహారమును, పావులూరి మల్లన్నకు నవఖండవాడ యగ్రహారమును, ఇచ్చినను నన్నయభట్టున కగ్రహారాదు లేవియు నిచ్చినట్టు కానఁబడదు. భారతాంధ్రీకరణసమాప్తి యైనతరువాత నియ్యఁదలఁచెనేమో ! ఇట్లీయ్యక

పోవుట రాజుకాలములోనే నన్నయభట్టాంధ్రభారతరచనమధ్యమున లోకాంతరగతుఁ డగుటను సూచించుచున్నది తిక్కనసోమయాజి విరాట పర్వము నందు

ఉ. ఆదరణీయసారవివిధార్థగతిస్ఫురణంబు గల్గి య
ష్టాదశపర్వనిర్వహణసంభృత మై పెనుపొంది యుండ నం
దాదిఁ దొడంగి మూఁడుకృతు లాంధ్రకవిత్వవిశారదుండు వి
ద్యాదయితుం డొనర్చె మహితాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్

అని చెప్పుట నాధారము చేసికొని యిప్పటివారు కొందఱు నన్నయభ ట్టారణ్యపర్వమునంతను సంపూర్ణముగానే చేసె ననియు, అందుచేతనే తిక్కన విరాటపర్వముతో నారంభించె ననియుఁ దిక్కన కాలమునాఁటి కారణ్యపర్వాంతమువఱకు నుండినను దరువాత నేకారణముచేతనో యది నశింపఁగాఁ ఎఱ్ఱాప్రెగడ నన్నయభట్టునందలి గౌరవముచేత నాతని పేరనే పూరించెననియు, మున్నెవ్వరు కనని వినని క్రొత్తవాదము నొకదాని నారంభించిరి. ఈవాద మపూర్వమయినదే నన్నయభట్టు మరణా నంతరమున నిన్నూఱుసంవత్సరములకుండిన తిక్కనసోమయాజి వఱకును నారణ్యపర్వము సంపూర్ణముగానే యుండిన దఁట! అట్లయినచో వీరి వాదానుసారముగా

ఉ. సారకథాసుధారస మజస్రము నాగళపూరితంబుగా
నారఁగఁ గ్రోలుచున్ జనులు హర్షరసాంబుధిఁ దేలునట్లుగా
భారతసంహితన్ మును త్రిపర్వము లెవ్వఁ డొనర్చె నట్టివి
ద్యారమణీయు నంధ్రకవితాగురు నన్నయభట్టుఁ గొల్చెదన్

అని మారన తన మార్కండేయపురాణములో నన్నయభట్టును స్తుతించుచు నతఁడు త్రిపర్వము లొనర్చెనని చెప్పి యుండుటచేత, ౧౩౨౩ వ సంవత్స రమువఱకును రాజ్యము చేసిన ప్రతాపరుద్రుని దండనాధుఁ డైన నాగనగన్న దండనాధున కంకితము చేయఁబడిన మార్కండేయపురాణ గ్రంథకర్త కాలము వఱకు ననగా ౧౩౨౩ వ సంవత్సర ప్రాంతము వఱకు నన్నయభట్ట కృతారణ్యపర్వము పూర్ణముగ నుండెనని చెప్పవలెను. ఎఱ్ఱాప్రెగడ వలన

హరివంశమును గృతిఁగొన్న పోలయవేమారెడ్డి ౧౩౪౫ వ సంవత్సరము వఱకు రాజ్యపాలనము చేసినవాఁడు వీరి వాదమును బట్టి తిక్కనసోమయాజి తరువాత నేఁబదిసంవత్సరముల కుండిన యెఱ్ఱాప్రెగడ కాలమునాఁటికిఁ దిక్కన భారతము పదునేనుపర్వములు నశింపకుండఁగా, గతించిన యిన్నూట యేఁబదిసంవత్సరములనుండి నన్నయభారతములోని రెండుపర్వముల మూఁడాశ్వాసములు నశింపకుండఁగా, నిరువది ముప్పదిసంవత్సరముల లోపల నారణ్యపర్వము నాల్గవయాశ్వాసములోని "శారదరాత్రు" లన్న పద్యము నుండి మాత్రము కారణము లేకయే యొక్కసారిగా నాంధ్రదేశములో నున్న యన్నిప్రతులలోను మాయ మయ్యె నఁట! ఇది వివేకులు నమ్మఁదగిన మాట గాదు. నన్నయభట్టు మూఁడవపర్వమునఁ గూడ మూఁడాశ్వాసములు పైఁగా రచియించి యుండుటచేతఁ దిక్కనసోమయాజి రెండుపర్వముల మూఁడాశ్వాసముల ౨౪౨ పద్యము లని విశేషముగాఁ జెప్పక సామాన్యముగా మూఁడుకృతులని చెప్పినవాఁడు. అంతే కాని వేఱేమియు లేదు. లోక వ్యవహారమునందు సహిత మొక సభకు వచ్చిన జనులు లెక్కకుసరిగా ౯౩౭ గురే యున్నను మనము సామాన్యముగా వేయిమంది వచ్చి రనియే చెప్పుదుము. మిగిలిన భాగమును రచియించిన యెఱ్ఱాప్రెగడ,

క. ధీరవిచారుఁడు తత్కవి
తారీతియుఁ గొంత దోఁపఁ దద్రచనయకా
నారణ్యపర్వశేషము
పూరించెఁ గవీంద్రకర్ణపుటపేయముగాన్.

అని తా నారణ్యపర్వశేషమును బూరించితినని చెప్పెను. శేష మనఁగా మిగిలినది యని యర్థము గదా! నన్నయభట్టారకుఁడు రచింపఁగా మిగిలిన దనక పోయినయెడల నిచ్చట శేషశబ్దమున కర్థ మే మగును? ఎఱ్ఱాప్రెగడ సహితము నన్నయభట్టారణ్యపర్వమును గొంత చేసెననియు, చేయఁగా మిగిలిన దానిని దాను జేసితిననియు, తెలుపుట కొఱకే శేషశబ్దమును బ్రయోగించెను,

ఉ. ఆదిని శబ్దశాసనమహాకవి చెప్పిన భారతంబులో
నేది వచింపఁగాఁబడియె నెందును దానినె కాని సూత్రసం
పాదన లేమిచేఁ దెలుఁగుబల్కు మ యొక్కటి గూర్చి చెప్పఁగా
రా దని దాశవాటికవిరాక్షసుఁ డీనియమంబు చేసినన్.

క. ఆమూఁడుపర్వములలో
నామాన్యుఁడు నుడువుతెనుఁగు లరసికొని ? కృతుల్
తాము రచించిరి తిక్కను
ధీమణి మొద లైన తొంటితెలుఁగుకవీంద్రుల్.

అని యెఱ్ఱాప్రెగడ యారణ్యపర్వశేషమును రచించిన తరువాత నన్నయప్పకవి మొదలైనవారు సహితము మూఁడుపర్వము లని సామాన్యముగాఁ జెప్పుచున్నారే కాని మూఁడుపర్వములు పూర్తిగా నని చెప్పుట వారియుద్దేశ మెంతమాత్రమును గాదు. పూర్వకాలమునుండియు లిఖింపఁబడుచు వచ్చిన భారతతాళపత్రపుస్తకము లన్నిఁటిలోను "స్ఫురదరుణాంశురాగరుచి" యన్న పద్యమునకు ముందు "ఇక్కడనుండి యెఱ్ఱాప్రెగడ కవిత్వము" అని వ్రాయఁబడుచువచ్చుటచేత నన్నయభట్టంతవఱకు మాత్రమే చేసె నని తెల్లమగుచున్నది. కలియుగాదిని భారతము తెనిఁగింపఁబడె నని కాకునూర్యప్పకవి వ్రాసి యున్నాఁడు, కాని యావ్రాఁత కాధారము లేవియుఁ గనఁబడవు.

[ఆంధ్రభారతములోని యేయేభాగముల నెవ్వరెవ్వరు పూరించిరి? అను విషయమున పలువురు రచయితలు విభిన్నములును, విచిత్రములు నగు నభిప్రాయములను వెల్లడించి యున్నారు

నన్నయభట్టు భారతములోని యాది, సభాపర్వములను, అరణ్యపర్వములోని కొంతభాగమును తెలిఁగించెననియు, ఎఱ్ఱాప్రెగడ అరణ్యపర్వశేషమును పూర్తిచేసెననియు, తిక్కనసోమయాజి విరాటపర్వము మొదలు పదునైదుపర్వముల నాంధ్రీకరించి, భారతమును పూర్తిచేసెననియు సామాన్యముగ నందఱు నంగీకరించుచున్నారు కవి కవుల చరిత్రములను రచించిన కొందఱు వేఱువిధముగఁ దలంచుచున్నట్లు తెలియుచున్నది.

'Biographical sketches of Dekkan Poets' రచించిన శ్రీ కావలి వేంకటరామస్వామిగారు నన్నయ మరణము వలనఁ బూర్తికాక నిలిచిపోయిన అరణ్యపర్వము నాతని శిష్యుఁడగు బాలసరస్వతి పూరించెనని యభిప్రాయపడిరి. వారి మాటలను గమనింపుఁడు—

"This poet also translated two Volumes of the Mahabharat, into Telugu in conjunction with Narainbhat, a bramin of the Indra sect but while employed in translating the third Volume, Nannaya unfortunately died, and as no other poet would undertake to complete the translation, a disciple of Nannaya Bhatt named Balasaraswati who was a fellow student, with Sarangadhara the son of Raja Rajnaraindra completed the work after intense labour and application"
[Page 80]

కాని యిది విశ్వాసార్హము కాదు. రాజరాజునకు సారంగధరుఁ డను పుత్రుఁడే లేనట్లును, చిత్రాంగి వృత్తాంతము కల్పితమైనట్లును చరిత్రకారులు నిర్ణయించి యున్నారు కాఁగా అతఁడు నన్నయభట్టునకు శిష్యుఁడై యుండుటయు పొసఁగదు అప్పకవి తన గ్రంథమున 'సిద్ధుఁ డయిన సారంగధరుఁడు బాలసరస్వతి కాంధ్రశబ్దచింతామణి నొసఁగఁగా, అతఁడు దానికి టీకను వ్రాసె' నని చెప్పగా, శ్రీ వేంకటరామస్వామిగా రింకను ముందునకు సాగి, బాలసరస్వతి సారంగధరుని సహపాఠియనియు, తన గురువైన నన్నయభట్టు పూర్తిచేయక విడిచిన యరణ్యపర్వమును తెనిఁగించె ననియుఁ జెప్పుటలో వింతలలో వింత!

"కవి జీవితము" లను రచించిన శ్రీ గురుజాడ శ్రీరామమూర్తిగారు—అధర్వణునికిఁ దాను చేసిన ద్రోహమును దలంచి పశ్చాత్తప్తుఁడై విరాగియై భారతాంధ్రీకరణమునకు వేఱొకరిని నియమింపఁగోరినట్లును, తిక్కనను ప్రార్థింపఁగా—అతఁడు సమ్మతించి విరాటపర్వమునుండి ప్రారంభించి భారతము నాంధ్రీకరించినట్లును—పిదప ఎఱ్ఱాప్రెగడ అరణ్యపర్వమును పూర్తి చేసినట్లును తెలిపియున్నారు

కాని యిట్లూహించుట సరికాదు. నన్నయ, తిక్కనలు సమకాలికులు కానందునను, వీరిర్వురికిని నడుమ రెండుశతాబ్దులకాలము వ్యవధానముండుటఁ బట్టియు యూహ యుక్తము కాదు.

అరణ్యపర్వము కొంతవఱకును వ్రాయునప్పటికి నన్నయ మృతిఁ జెందెనని కాని, అతనికిఁ జిత్తవిభ్రాంతి కలిగెనని కాని కొంద అందురు

నన్నయభట్టు మృతికిఁ బూర్వమే రాజరాజు మరణించుటవలనను, ఆతని కుమారుఁడగు కులోత్తుంగచోడుఁడు దక్షిణదేశమునందే యుండుటవలన, అతని కాంధ్రభాషయం దభిమానము లేకుండుటవలనను నన్నయభట్టునకు విరక్తికలిగి భారతరచన నిలిచిపోయి యుండవచ్చునని "ఆంధ్రకవి తరంగిణి" రచయిత లభిప్రాయ పడుచున్నారు

నన్నయ భారతరచనను క్రీ. శ. [illegible] ల నడుమ సాగించెనని 'ఆంధ్ర కవి తరంగిణి' లోఁ గలదు. [పుట. 13] కీ శే నడకుదుటి వీరరాజుగారు, నన్నయ క్రీ శ. 1055 ప్రాంతమున మరణించెనని యభిప్రాయపడిరని, అందే తెల్పఁబడినది. భారతరచన క్రీ. శ 1025—1030 ల నడుమ జరిగిన దనియు, నన్నయభట్టు నందంపూఁడి శాసనరచయితకంటె భిన్నుఁడనియు శ్రీమారేమండ రామారావుగా రభిప్రాయపడుచున్నారని 'ఆంధ్రకవితరంగిణి' [పుట 14] లోఁ దెల్పఁబడినది.]

ఆంధ్ర భారతరచనారంభకాలమునం దాంధ్రదేశమునకుఁ బ్రభువుగా నుండిన రాజనరేంద్రుని యొక్క పూర్వులరాజ్యక్రమము నిందు సంక్షిప్తముగాఁ దెలుపుట యనావశ్యకము కాదు. విష్ణుశర్మచేత సంరక్షింపఁబడి చళుక్య పర్వతమున గౌరిని గూర్చి తపస్సుచేసి సేనలను గూర్చుకొనివచ్చి దక్షిణ హిందూస్థానము నంతను జయించిన (విజయాదిత్య పుత్రుఁడగు) విష్ణు వర్ధనుఁడు తాను పొందిన జయములను బట్టి జయసింహుఁ డను బిరుద నామమును బొందినట్టు కనఁబడుచున్నది. ఈ విజయములు నాల్గవశతాబ్దాంత మున జరిగి యుండును ఇతఁడు కాంచీపురము రాజధానిగాఁ గల పల్లవరాజు కొమార్తెను వివాహ మాడి, యామెవలన విజయాదిత్యుఁ డనుకుమారుని గనెను. ఈ విజయాదిత్యునికి రణరాగుఁ డనుబిరుదనామము కల దఁట.

విజయాదిత్యునికుమారుఁడు పులికేశివల్లభుఁడు. ఈ పులికేశివల్లభుని జ్యేష్ఠపుత్రుఁడు కీర్తివర్మపృథివీవల్లభుఁడు. ఇతఁడు క్రీస్తుశకము ౫౬౭ వ సంవత్సరమువఱకును రాజ్యము చేసెను. కీర్తివర్మ యొక్క ప్రథమపుత్రుఁడగు సత్యాశ్రయుఁడన్న బిరుదనామము గల (రెండవ) పులికేశివల్లభుఁడు తన పినతండ్రియైన మంగళేశుని తరువాత ౬౧౦ వ సంవత్సరమున రాజ్యమునకు వచ్చెను. ఈ సత్యాశ్రయుఁడు మిగుల బలవంతుఁడయి బహుదేశములను జయించి, యాకాలమునందు పిష్టపుర మనఁబడెడి పీఠికాపురమునందలి దుస్సాధ్యమయిన దుర్గమును బట్టుకొనెను. ఈ యుద్ధములయం దీతనికిఁ దమ్ముఁడును యువరాజు నయిన విష్ణువర్ధనుఁడు మిక్కిలి సహాయుఁడయి యుండెను. కీర్తివర్మయొక్క ద్వితీయపుత్రుఁడయిన కుబ్జవిష్ణువర్ధనుఁడు ౬౧౫ వ సంవత్సరమునందు వేఁగిదేశమును బాలించుటకయి యన్నగారయిన సత్యాశ్రయునిచే నియమింపఁబడెను. కాని యతఁడు కొంతకాలములోనే స్వతంత్రుఁడయి తూర్పుచాళుక్యరాజులకు మూలపురుషుఁడయి పూర్వచాళుక్యరాజ్య స్థాపకుఁడయ్యెను. వేఁగిదేశము బౌద్ధమతస్థులగు సాలంకాయనరాజులనుండి కైకొనఁబడిన దగుటచే, ఈ కుబ్జవిష్ణువర్ధనుని రాజ్యములోనే యాంధ్రదేశమునందు బౌద్ధమతమునకు క్షీణత్వమును బ్రాహ్మణమతమునకుఁ బ్రాబల్యమును బ్రారంభ మయ్యెను. ఈ చాళుక్యరాజులు శైవులగు బ్రాహ్మణమతస్థులు, మానవ్యగోత్రులు.

౧. కుబ్జవిష్ణువర్ధనుఁడు — ఇతఁడు పైనిజెప్పినట్టు ౬౧౫ వ సంవత్సరమున చైత్రశుద్ధ పూర్ణిమ తరువాత రాజ్యమునకు వచ్చి ౬౩౩ వ సంవత్సరము వఱకును బదునెనిమిదిసంవత్సరములు రాజ్యము చేసెను. ఇతఁడు మొదటి విష్ణువర్ధనుఁడు. ఈ విష్ణువర్ధనుఁడు దిమిలిసీమలోని కలవకొండగ్రామమును దనరాజ్యకాలముయొక్క పదునెనిమిదవసంవత్సరమున శాలివాహనశకము ౫౫౫ శ్రావణశుద్ధ పూర్ణిమనాఁటి (క్రీస్తుశకము ౬౩౨ వ సంవత్సరము జూలయినెల యేడవతేది) చంద్రగ్రహణ సమయమునందు విష్ణుశర్మ మాధవశర్మ యను బ్రాహ్మణులకు దానము చేసినట్లున్న దానశాసనమునుబట్టి యీతని రాజ్యము విశాఖపట్టణమండలములోని సర్వసిద్ధితాలూకాలోని దిమిలిసీమ పైవఱకును వ్యాపించి యుండినట్లు స్పష్టమగుచున్నది.

కుబ్జవిష్ణువర్ధనుకును తత్పూర్వులకును రణాధిదేవత యయి షాణ్మాతురుఁ డయిన కార్తికేయుఁడు (కుమారస్వామి)ను, ఆదిశక్తులైన మాతృకలును, కులదైవతము లయినట్టును, తత్కులమువారు వారిచే రక్షింపఁబడుచుండు నట్టును ౬౧౬ వ సంవత్సరమునందుఁ జేయఁబడిన సతారాదానశాసనము చెప్పుచున్నది. బ్రాహ్మి, మాహేశ్వరి, కౌమారి, వైష్ణవి, వారాహి, ఇంద్రాణి, చాముండ —సప్తమాతృకలు.

౨. జయసింహుఁడు—విష్ణువర్ధనుని జ్యేష్ఠపుత్త్రుఁడయిన (మొదటి) జయసింహుఁడు ౬౩౩ వ సంవత్సరము మొదలుకొని ౬౬౩ వ సంవత్సరమువఱకును ముప్పది యేండ్లు రాజ్యము చేసెను ఇతనికి సర్వసిద్ధి యను బిరుదనామము కలదు. ఇతఁడు గుడివాడ తాలూకాలో పెణుకపఱ్ఱుగ్రామము నొకబ్రాహ్మణుని కిచ్చినట్లు దానశాసన మున్నందున, ఇతనిరాజ్యము నెల్లూరిమండలమువఱకును వ్యాపించి యుండెను

౩. ఇంద్రభట్టారకుఁడు- ఇతఁడు కుబ్జవిష్ణువర్ధనుని ద్వితీయ పుత్త్రుఁడు; జయసింహుని తమ్ముఁడు. ఈ యింద్రరాజు ౬౬౩ వ సంవత్సరములో నేడుదినములుమాత్రమే రాజ్యము చేసి మృతుఁ డయ్యెను

౪. విష్ణువర్ధనుఁడు- ఇతఁ డింద్రభట్టారకునికొడుకు. ఇతనికి సర్వలోకాశ్రయుఁ డనియు విషమసిద్ధి యనియు బిరుదుపేళ్ళు గలవు ఇతఁడు ౬౬౩ వ సంవత్సరము మొదలుకొని ౬౭౨ వ సంవత్సరము వరకును తొమ్మిదిసంవత్సరములు రాజ్యము చేసెను. ఇతఁడు చేసిన యొక దానశాసనమునందు "ఆత్మనో విజయరాజ్యపంచమే సంవత్సరే ఫాల్గునమాసే అమావాస్యాయాం సూర్యగ్రహణనిమిత్తం" అని శకసంవత్సరము ౫౯౦ ఫాల్గున బహుళామావాస్యకు సరియైన ౬౬౮ వ సంవత్సరము ఫిబ్రవరినెల ౧౭ వ తేది యితనిరాజ్యములో నైదవయేడని చెప్పఁబడి యుండుటచేత, ఈతనిరాజ్యము ౬౬౩ వ సంవత్సరము ఫాల్గునబహుళములో నారంభమయినట్టు తోఁచుచున్నది.

౯ మంగియువరాజు- ఇతఁడు రెండవవిష్ణువర్ధనుని పుత్రుఁడు. సర్వలోకాశ్రయుఁడనియు విజయసిద్ధి యనియు బిరుదనామములు గలవాఁడు. ఇతఁడు ౬౭౨ వ సంవత్సరము మొదలుకొని ౬౯౬ వ సంవత్సరమువఱకును, ఇరువదియైదు సంవత్సరములు రాజ్యపరిపాలనము చేసెను.

౧౦ జయసింహుఁడు- ఇతఁడు మంగియువరాజునకు ప్రథమపుత్రుఁడు; మొదటి జయసింహుని పౌత్రుఁడు. ఈ రెండవ జయసింహుఁడు ౬౯౬ మొదలుకొని ౭౦౯ వఱకును పదుమూడు సంవత్సరములు రాజ్యపాలనము చేసెను

౧౧. కొక్కిలిరాజు- ఇతఁడీరెండవజయసింహుని సవతితమ్ముఁడు మంగియువరాజునకు ద్వితీయకళత్రమువలనఁ బుట్టిన రెండవకొడుకు; ఇతఁడు ౭౦౯ వ సంవత్సరములో * తొమ్మిదినెలలు మాత్రము ప్రజాపాలనము చేసెను.

౧౨. విష్ణువర్ధనుఁడు- ఇతఁడు కొక్కిలికి జ్యేష్ఠభ్రాత. సవతియన్నయగు జయసింహుని మరణానంతరమున రాజ్యము స్వక్రమముగా నాక్రమించుకొన్న కొక్కిలిరాజును సింహాసనవిహీనుని జేసి ౭౦౯ మొదలుకొని ౭౪౬ వఱకును ముప్పదియేడు సంవత్సరములు దేశము నేలెను. ఇతఁడు మూఁడవవిష్ణువర్ధనుఁడు.

౧౩. విజయాదిత్యుఁడు - ఇతఁడు మూఁడవవిష్ణువర్ధనుని కొడుకు. విక్రమరాముఁడనియు విజయసిద్ధి యనియు బిరుదములు గలవాఁడు. ౭౪౬ మొదలుకొని ౭౬౪ వఱకును పదునెనిమిదేండ్లు భూపరిపాలనము చేసెను ఇతఁడు విజయాదిత్యనామముగల వారిలో మొదటివాఁడు

౧౪. విష్ణువర్ధనుఁడు - ఇతఁడు విజయాదిత్యుని కుమారుఁడు, ౭౬౪ మొదలు ౭౯౯ వఱకు ముప్పదియాఱుసంవత్సరములు రాజ్యభారము వహించెను. ఇతఁడు నాల్గవ విష్ణువర్ధనుఁడు

[* 6 మాసములు మాత్రము రాజ్యము చేసె నట్లాంధ్రకవితరంగిణిలోఁ గలదు. (పుట 84)]

౧౧. విజయాదిత్యుఁడు - ఇతఁడు నాల్గవ విష్ణువర్ధనుని కొడుకు; విజయాదిత్యుని మనుమఁడు. ఈ రెండవవిజయాదిత్యుఁడు నరేంద్రమృగరాజనియు, సమస్త భువనాశ్రయుఁడనియు, చాళుక్యార్జునుఁడనియు బిరుదుపేరులు వహించి, ౭౯౯ మొదలు ౮౪౩ వఱకును నలువదినాలుగు సంవత్సరములు రాజ్యపాలనము చేసెను ఇతఁడు గాంగులతోను రాష్ట్రకూటులతోను బహుయుద్ధములు చేసి వారిని జయించి, తన రాష్ట్రమునందు నూటయెనిమిది శివాలయములు గట్టించెను

౧౨. విష్ణువర్ధనుఁడు - ఈ యైదవ విష్ణువర్ధనుఁడు విజయాదిత్యుని కొడుకు. సర్వలోకాశ్రయుఁడు, విషయసిద్ధి యను బిరుదాంకములను గలవాఁడు. ఇతఁడు ౮౪౩ మొదలు ౮౪౪ వఱకు పదునెనిమిదినెలలు రాజ్యము చేసెను. ♦ ఈతని కాలమునఁ బుట్టిన శాసనములలోఁ గొంతభాగము తెలుఁగు భాషలో నున్నది.

౧౩ విజయాదిత్యుఁడు - ఈ మూఁడవ విజయాదిత్యుఁడు (ఐదవ) విష్ణువర్ధనుని పెద్దకొడుకు. ఇతఁడు గణితశాస్త్రమునందు పండితుఁ డగుటచేత గణకవిజయాదిత్యుఁడని పిలువఁబడుచు వచ్చెను. *ఇతఁడు రాష్ట్రకూటులను జయించి, మంగిరాజు శిరస్సు ఖండించి, ౮౪౪ మొదలు ౮౮౮ వఱకు నలువదినాలుగు సంవత్సరములు ప్రజాపరిపాలనము చేసెను ఈతనికి యువరాజవిక్రమాదిత్యుఁ డనియు, యుద్ధమల్లుఁ డనియు నిద్దఱు తమ్ములుండిరి

౧౪ చాళుక్యభీముఁడు - ఇతఁడు యువరాజవిక్రమాదిత్యుని కొమారుఁడు. ఇతఁడు తన పెద్దతండ్రియైన విజయాదిత్యుని పిమ్మట రాజ్యమునకు వచ్చి, రాష్ట్రకూటరాజయిన రెండవ కృష్ణుని జయించి యావఱ కన్యాక్రాంతమైన

[♦ ఈతఁ డొక్క సంవత్సరమే రాజ్యము పాలించెనని 'ఆంధ్రకవితరంగిణి'. (పుట 89)

* గణక విజయాదిత్యుఁ డనుటకుఁ దగిన యాధారములేదనియు, ఇతఁడు గుణాంకవిజయాదిత్యుఁడు, గుణగాంక విజయాదిత్యుఁడు నని చెప్పబడుచున్నాఁడనియు 'ఆంధ్రకవితరంగిణి.' (పుట 89)]

వేఁగిదేశముయొక్క భాగమును మరల నాక్రమించుకొని, ౮౮౮ మొదలు ౯౧౮ వఱకు ముప్పది సంవత్సరములు నేల యేలెను.

౧౫. విజయాదిత్యుఁడు - చాళుక్యభీముని జ్యేష్ఠపుత్రుఁడైన యీ నాల్గవ విజయాదిత్యుఁడు కళింగులను జయించి, ౯౧౮ వ సంవత్సరములో నాఱు మాసములు రాజ్యముచేసి దేహవియోగము నొందెను. ఈతఁడు కొల్లభిగండ విజయాదిత్యుఁడని పిలువఁబడుచుండెను

౧౬. అమ్మరాజ విష్ణువర్ధనుఁడు - ఇతఁడు నాల్గవ విజయాదిత్యుని పెద్ద కుమారుఁడు. ఈతఁడు రాజమహేంద్రుఁడన్న బిరుదనామము గలవాఁడు. ఈతని కాలములోనే రాజధాని వేఁగీపురమునుండి రాజమహేంద్రవరమునకు మార్పఁబడెననియు, ఈతనిపేరనే యా పట్టణమున కాపేరు కలిగినదనియు చెప్పుదురు. ఆఱవ విష్ణువర్ధనుఁడైన యీ యమ్మరాజు ౯౧౮ మొదలు ౯౨౫ వఱకు నేడేండ్లు భూపరిపాలనము చేసెను.

౧౭. విజయాదిత్యుఁడు - ఈ యైదవ విజయాదిత్యునికి బేటరాజని నామాంతరము గలదు. ఇతఁ డమ్మరాజుయొక్క జ్యేష్ఠపుత్రుఁడు. ౯౨౫ వ సంవత్సరములో పదునేను దినములు రాజ్యము చేసిన తరువాత నీతనిని యుద్ధమల్లుని కొడుకైన♦తాళరాజు రాజ్యపదభ్రష్టునిజేసి చెఱసాలయందుఁబెట్టి రాజ్యమును గైకొనెను

౧౮. తాళరాజు- యుద్ధమల్లునికొడుకైన యీ తాళరాజు రాజ్య మాక్రమించుకొని ౯౨౫ వ సంవత్సరములో నెల దినములు రాజ్యపాలనము చేసిన తరువాత చాళుక్యభీముని ద్వితీయపుత్రుఁడును నాల్గవ విజయాదిత్యుని యనుజుఁడునైన విక్రమాదిత్యుఁ డీతనిని జంపి రాజ్యమును గైకొనెను.

౧౯. విక్రమాదిత్యుఁడు- చాళుక్యభీమునికొడుకైన యీ రెండవ విక్రమాదిత్యుఁడు వేఁగి త్రికళింగదేశములను ౯౨౫-౨౬ సంవత్సరములలో పదునొక్కమాసములు పాలించినతరువాత అమ్మరాజ విష్ణువర్ధనుని కొడుకగు భీముఁ డీతనిని సింహాసనవిహీనుని జేసి రాజ్యముఁ గైకొనెను

[♦ ఈతనికే తాలపుఁడు తాడపుఁడు నను నామాంతరములు గలవని 'ఆంధ్ర కవితరంగిణి' (పుట 95)]

౨౦ భీముఁడు- అమ్మరాజవిష్ణువర్ధనుని కొడుకును నయిదవ విజయాదిత్యుని తమ్ముఁడును నైన యీ మూఁడవ భీముఁడు విక్రమాదిత్యుని జయించి ౯౨౮-౯౨౯ సంవత్సరములలో * నెనిమిది మాసములు రాజ్యము చేసిన తరువాత, తాళరాజుకొడు కైన యుద్ధమల్లుఁ డీతనిని జంపి రాజ్యమును జేకొనెను.

౨౧ యుద్ధమల్లుఁడు- ఈ రెండవ యుద్ధమల్లుఁడు తాళరాజు కొడుకు. ఇతఁడు ౯౨౯ మొదలుకొని ౯౩౫ వఱకు నేడు సంవత్సరములు రాజ్యము చేసినతరువాత నాల్గవ విజయాదిత్యుని ద్వితీయపుత్రుఁడైన చాళుక్య భీమునిచే జయింపఁబడి రాజ్యపదభ్రష్టుఁ డయ్యెను ఈతనికాలపు బెజవాడ శాసనములో తెలుఁగుపద్యము లున్నవి. [(మొదటి) యుద్ధమల్లుఁడను ప్రసిద్ధిగల మల్లపరాజు బెజవాడలోఁ గుమారస్వామికి ఒకఆలయమును, దానింజేర్చి యొకమఠమును కట్టించెను. ఈ యంశములుగల శాసనమే యుద్ధమల్లుని బెజవాడ శిలాశాసనముగాఁ బ్రసిద్ధము. ఈ (రెండవ) యుద్ధమల్లుఁ డతని మనుమఁడు. ఇతఁడు పయి గుడికి ముఖమంటపమునో, గోపురమునో కట్టించెను.]

౨౨ చాళుక్యభీమవిష్ణువర్ధనుఁడు - రెండవ చాళుక్యభీముఁడును నేడవ విష్ణువర్ధనుఁడు నైన యితఁడు నాల్గవ విజయాదిత్యుని రెండవ భార్య కొడుకు; అమ్మరాజు విష్ణువర్ధనుని సవతితమ్ముఁడు. ఇతఁడు గండమహేంద్రుఁడు, రాజమార్తాండుఁడు, అను బిరుదులు గలవాఁడై, చోళరాజైన లోవబిక్కి, రాష్ట్రకూటప్రభు వైన యైదవగోవిందరాజు మొదలైన వారిని జయించి, ౯౩౫ మొదలు ౯౪౭ వఱకు పండ్రెండు సంవత్సరములు రాజ్యపాలనము చేసెను.

౨౩. అమ్మరాజవిజయాదిత్యుఁడు- రెండవ యమ్మరాజును నాఱవ విజయాదిత్యుఁడును నైన యితఁడు రెండవ చాళుక్యభీముని చిన్నకొడుకు. ఈతని కాలమునందలి యొక దానశాసనములో నితఁడు శాలివాహనశకము ౮౬౭వ సంవత్సరము మార్గశీర్ష బహుళత్రయోదశీ శుక్రవారమునాఁ డనఁగా

[* రెండునెలలు మాత్రమే రాజ్యమేలెనని కవితరంగిణి. (96)]

క్రీస్తుశకము ౯౪౫ వ సంవత్సరము డిసెంబరు నెల ౫ వ తేదిని పట్టాభిషిక్తుఁ డయినట్టు చెప్పఁబడి యున్నది. ఇతఁడు రాజపరమేశ్వర త్రిభువనాంకుశాదిబిరుదాంకములను గలవాఁడై ౯౪౫ మొదలు ౯౭౦ వఱకు నిరువదియైదు సంవత్సరములు భూపరిపాలన మొనర్చెను.

౨౪. దానార్ణవుఁడు- ఇతఁడు రెండవ చాళుక్యభీముని జ్యేష్ఠపుత్రుఁడు; అమ్మరాజ విజయాదిత్యుఁని సవతియన్న. ఇతఁడు ౯౭౦ మొదలు ౯౭౩ వఱకును మూఁడు సంవత్సరములు రాజ్యము చేసెను. ఒకశాసనములో నితఁడు ముప్పది సంవత్సరములు రాజ్యము చేసినట్లున్నదిగాని ౯౭౩ మొదలు ౧౦౦౩ వఱకు ముప్పది సంవత్సరములు దేశ మరాజకమై యున్నట్లు బహుశాసనములవలనఁ దెలియ వచ్చుచున్నది ఈ కాలములో చోళు లీదేశమునకు దండెత్తివచ్చి గెలిచినట్టును, కొంతకాలము వేఁగిదేశమును పాలించినట్లును కనఁబడుచున్నది *

౨౫. శక్తివర్మ- ఇతఁడు దానార్ణవుని పెద్దకొడుకు. చాళుక్యచంద్రుఁ డన్నబిరుదుపేరు గలవాఁడు. ఇతఁడు ౧౦౦౩ మొదలు ౧౦౧౫ వఱకు పండ్రెండేండ్లు దొరతనము చేసెను. ఈతని బంగారునాణెములు ఆరకాను దేశమునందును సయాము దేశమునందును గనఁబడినవి.

౨౬ విమలాదిత్యుఁడు- ఇతఁడు శక్తివర్మ తమ్ముఁడు, దానార్ణవుని రెండవకొడుకు ఇతఁడు రాజేంద్రచోడుని చెల్లెలును గంగయికొండ రాజరాజ రాజకేసరివర్మ కూఁతురును నగు కుందవాంబాదేవి ♦ యను చోడరాజకన్యను వివాహమాడి యామెవలన నాంధ్రభారత కృతిపతి యగు రాజనరేంద్రునిఁ గనెను. ఈ రాజనరేంద్రునిది మాతామహునిపేరు విమలాదిత్యుఁడు ౧౦౧౫ మొదలు ౧౦౨౨ వఱకు నేడు సంవత్సరములు ప్రభుత్వము చేసెను.

౨౭. రాజరాజవిష్ణువర్ధనుఁడు- ఇతడే భారతకృతిపతి. విమలాదిత్యుని పుత్రుఁడైన యితఁడు రాజరాజు లనఁబడెడువారిలో మొదటివాఁడును,

---

* రాజ్యమరాజకమైనదేశాని, చోళులు దీనిని జయించి పాలించిరనుట నిరాధారమని 'ఆంధ్రకవితరంగిణి' (పుట 101)

♦ ఈమె కుందవదేవి యని కవితరంగిణి. (పుట 103)

విష్ణువర్ధనులలో నెనిమిదవవాఁడును అయి యుండెను "విష్ణువర్ధనుండు వంశవర్ధనుండు" అని యాంధ్రభారతములో సహిత మీ రాజనరేంద్రునకు విష్ణువర్ధననామ మున్నట్టు చెప్పఁబడియున్నది ఇతఁడు తన మేనమామ యగు రాజేంద్రచోళునికూఁతు రయిన యమ్మంగదేవిని వివాహ మాడెను. ఈ రాజరాజు శకసంవత్సరము ౯౪౪ భాద్రపద బహుళ ద్వితీయాగురు వారము ఉత్తరాభాద్రపదనక్షత్రమున ననఁగా క్రీస్తుశకము ౧౦౨౨ సంవత్సరము ఆగష్టునెల ౧౬ వ తేదిని పట్టాభిషిక్తుఁ డయ్యెను. ఇతని తమ్ముఁడు విజయాదిత్యుఁడు ఈ యేడవ విజయాదిత్యుఁడు కులోత్తుంగచోడదేవుని కాలములో ౧౦౬౩ వ సంవత్సరము మొదలుకొని ౧౦౭౭ వ సంవత్సరము వఱకును వేఁగిదేశమునకు పాలకుఁడుగా నుండెను. ఈ రాజనరేంద్రుఁడు ౧౦౨౨ మొదలుకొని ౧౦౬౩ వఱకు నలువదియొక్క సంవత్సరములు రాజ్యపాలనము చేసెను. ఈతని పేరు గల యీతనిరాజ్యకాలపు బంగారు నాణెము లీ నడుమను ఆరకాను, సయాము దేశములలోఁ గనిపెట్టబడినవి.

౨౧. కులోత్తుంగ చోడదేవుఁడు- ఇతఁడు రాజనరేంద్రుని ప్రథమ పుత్రుఁడు. ఇతఁడే రాజేంద్రచోడుఁడు. ఇతని మొదటిపేరిదియే యైనను, ఇతఁడు వేఁగిదేశరాజ్యభారమును వహించిన మొదటి సంవత్సరము లోనే చోళదేశమునకు దండెత్తి దానిని జయించి స్వాధీనపఱచుకొన్న తరువాత కులోత్తుంగచోడదేవుఁ డనఁబడుచు వచ్చెను. ఇతనికి రాజనారాయణుఁడని బిరుదుపేరు. ఈతనిని కరికాలచోళుఁడనియు వాడుచు వచ్చిరి. మూఁడుతరములనుండి చోళరాజులకూఁతులను వివాహమాడుచు వచ్చుటచేత తమతల్లులనుబట్టియు భార్యలనుబట్టియు చాళుక్యుల కంతకంతకు వేఁగి దేశమునకంటె చోళదేశముమీఁద నభిమాన మెక్కుడగుచు వచ్చెను. విమలాదిత్యుఁడు రాజరాజుకూఁతురైన కుందవాంబాదేవిని వివాహ మాడి తన కుమారునకు రాజరాజని పేరుపెట్టెను; రాజరాజు తన మేనమామ యైన రాజేంద్రచోళుని కూఁతురైన అమ్మంగదేవిని పెండ్లియాడి తనపుత్రు నకు రాజేంద్రచోడు డనియే నామకరణము చేసెను. తరువాత రాజేంద్ర చోడుఁడును రాజేంద్రచోడుని కూఁతురైన మధురాంతకదేవిని పరిణయము

చేసికొని, చోళదేశముమీఁదనే యధికాదరము గలవాఁడయి తా నా దేశమును జయించినతోడనే తనరాజధానిని చోళదేశమునకు మార్చుకొని, వేఁగిదేశమును పాలించుటకయి పాలకులను నియమించి రాజ్యాధికారమును వారికి విడిచిపెట్టెను ౧౦౬౩ వ సంవత్సరమునందు వేఁగిదేశమును పాలించుట కయి కులోత్తుంగ చోడదేవుఁడు తన పినతండ్రియైన విజయాదిత్యుని నియమింపఁగా నతఁడు పదునేను సంవత్సరములు రాజ్యపాలనము చేసి వార్ధకదశలో ౧౦౭౭ వ సంవత్సరమునందుఁ జోడదేశమునకుఁబోయి చేరెను; అటుతరువాత ౧౦౭౭ వ సంవత్సరములోనే వేఁగిదేశపరిపాలనము నిమిత్తము తన రెండవకొడు కైన రాజరాజును బంపి యతఁ డక్కడ నుండ నొల్లక మరుసటి సంవత్సరములోనే తల్లిదండ్రులవద్దకు లేచి రాఁగా, ౧౦౭౮ వ సంవత్సరమునందు శ్రావణమాసములో తన మూఁడవ కొడుకైన వీరచోడదేవుని వేఁగిదేశపాలకునిగాఁ బంపెను. ఈవీరచోడదేవుఁడు (తొమ్మిదవ) విష్ణువర్ధనుఁ డను బిరుదుపేరితో ౧౧౦౦ సంవత్సరము వఱకును వేఁగిదేశాధిపుఁడుగా నుండెను కులోత్తుంగచోడదేవునికి విక్రమచోడుఁడు, రాజరాజు, వీరచోడదేవుఁడు మొదలుగాఁ గల కొడుకులును, రాజసుందరి యను కూఁతురును గలిగిరి. ఈ రాజసుందరి కళింగరాజయిన రాజరాజునకు భార్యయయ్యెను. కులోత్తుంగచోళదేవుఁడు ౧౦౬౩ మొదలు ౧౧౧౨ వఱకును నలువదితొమ్మిది సంవత్సరములు రాజ్యపాలనము చేసెను. చాళుక్యులు తాము చంద్రవంశజుల మనియు, చోళులు తాము సూర్యవంశజుల మనియు, చెప్పుకొను చుండినవా రయినను, తండ్రివంశమున శుద్ధచాళుక్యుఁ డయి చోళమండలమును జయించి చోళరాజ్యమును పాలించుచు చోళదా జనఁబరఁగిన కరికాలచోడుఁ డను కులోత్తుంగచోడుని సంతతివారు తాము సూర్యవంశ్యుల మని చెప్పుకొనసాగిరి ఆ కాలమునందు చరిత్రాంశములను దెలిపెడు పుస్తకములు రెండు పుట్టినవి. అందొకటి జయనకొండనిచే నఱవములోఁ జేయఁబడిన "కళింగట్టుపరణి"; మఱి యొకటి బిల్హణునిచే సంస్కృతమునఁ జేయబడిన "విక్రమాంకదేవచరిత్ర" ఇందు మొదటిది ౧౦౬౩ మొదలుకొని ౧౧౧౨ వ సంవత్సరమువఱకును

చోళదేశమును పరిపాలించిన కులోత్తుంగచోడదేవుని విజయములను దెలుపుచున్నది. రెండవది ౧౦౭౬ మొదలుకొని ౧౧౨౬ వ సంవత్సరము వఱకును కుంతలదేశమును పాలించిన పశ్చిమచాళుక్యరాజయిన (యాఱవ) విక్రమాదిత్యునివిజయములను దెలుపుచున్నది. ఈరాజు లిద్దఱును జిరకాలము సమకాలీనులుగా నుండుటయేకాక ౧౦౭౬ మొదలుకొని ౧౧౧౨ వరకును ౩౬ సంవత్సరములు సమకాలిక ప్రజాపాలకులుగాఁగూడ నుండిరి. "కళింగవిజయ" మనునర్థ మిచ్చెడి పూర్వోక్తమయిన యఱవకావ్యములో రెండు సంవత్సరములు కళింగరాజు కప్పము కట్టుట మానివేయఁగాఁ గులోత్తుంగచోడదేవుఁ డతనిని దండించుటకయి తన దండనాథులలో నొకఁ డయిన కరుణాకరపల్లవుని సైన్యముతో దండయాత్ర పంపిన ట్లొకచోటఁ జెప్పఁబడినది. చోళరాజ్యవిషయమున విక్రమాదిత్యునకును గులోత్తుంగ చోడునికిని పలుమాఱు యుద్ధములు జరుగుచువచ్చి జయాపజయములు పర్యాయమున మాఱుచు వచ్చెను. తండ్రియైన ప్రథమసోమేశ్వరుఁడు రాజ్య పాలనము చేయుచుండఁగానే యన్న యయిన ద్వితీయసోమేశ్వరుఁడు యువరాజుగా నుండఁగానే యీ విక్రమాదిత్యుఁడు చోళదేశముమీఁదికి జనకునిచే విజయయాత్రకుఁ బంపఁబడినట్టు విక్రమాంకదేవచరిత్రము చెప్పుచున్నది. మఱియొకసారి యితఁడు చోళులపై దండయాత్ర వెడలి నప్పుడు చోళమండలాధీశ్వరుఁ డీతనిధాటికి భయపడి తనకూఁతు నాతని కిచ్చి వివాహము చేసి సంధిచేసికొన్నట్టు చెప్పఁబడియున్నది. ఇటీవల నత్యల్పకాలములోనే దేశవిప్లవము సంభవించి చోళరాజు మరణము నొంది దేశ మరాజకముకాఁగా వెంటనే విక్రమాదిత్యుఁడు కాంచీనగరమునకు సేనలతో వచ్చి రాజద్రోహులను పాఱఁద్రోలి తనభార్య సోదరుని చోళ సింహాసనమునందు నిలిపి కంచిలోఁ దాను నెలదినములుండి స్వరాజ్యసీమ యైన తుంగభద్రాతీరమునకుఁ బోయెను అతఁ డట్లడుగు తీయఁగానే కొన్నిదినములలోపలనే మరల నూతనదేశవిప్లవ మొకటి తటస్థించి యందు రా జయిన తన శ్యాలకుఁడు ప్రాణములు గోలుపోయెననియు, వేఁగిదేశా

ధీశుఁ డయిన రాజేంద్రచోడుఁడు కాంచీపురరాజ్య మాక్రమించుకొనియె నని సు, వార్తయాతనిచెవిసోఁకెను. ఇది ౧౦౬౩ వ సంవత్సరమున నను టకు సందేహము లేదు. ఈసారి శత్రుఁ డల్పుఁడు కాకుండుట తలపోసి మహాప్రయత్నముచేసి విక్రమాదిత్యుఁడు వెంటనే తన యన్నయైన ద్వితీయసోమేశ్వరునితోఁ గలిసి రాజేంద్రచోడుఁ డనఁబడెడు కులోత్తుంగ చోడదేవునిమీఁదికి దండెత్తివచ్చెను ఇరువురు రాజులకును ఘోరసంగ్రామము జరిగినమీఁదట తాత్కాలికజయము విక్రమాదిత్యునకే కలిగి రాజేంద్రచోడుఁడు పలాయనము నొందవలసినవాఁ డయ్యెను; కాని సోమేశ్వరుఁడు ప్రతిపక్షిచేతిలోఁ జిక్కి కారాబద్ధుఁడుగాఁ జేయబడెను. ఇటీవల చోళులకును చాళుక్యులకు ననఁగా పూర్వచాళుక్యులకును పశ్చిమచాళుక్యులకును చోళరాజ్యసంబంధమున యుద్ధములు పలుమాఱు జరగుచు వచ్చెను. ఈ యుద్ధములు చోళదేశముతో నిలువక వేఁగిదేశమువఱకును గూడ వ్యాపించినట్టు కనఁబడుచున్నవి. ఈ యుద్ధములలో నొకసారి విక్రమాదిత్యుఁడు వేఁగిదేశమును సహితము స్వాధీనము చేసికొన్నట్టు చెప్పఁబడినది గోదావరీమండలములోని దాక్షారామములోఁ గల శాలివాహనశకము ౧౦౪౫, ౧౦౪౮ సంవత్సరములనాఁటి విక్రమాదిత్యుని శాసనము లీ విషయమును గొంత స్థిరపఱుచుచున్నవి. సాధారణముగా "కళింగట్టుపరణి" కులోత్తుంగచోడుని విజయములను, "విక్రమాంక దేవచరిత్ర" విక్రమాదిత్యుని విజయములను పొగడుచుండును.

౨౯. విక్రమచోడుఁడు- ఇతఁడు కులోత్తుంగచోడు డనఁబడెడు రాజేంద్రచోడుని జ్యేష్ఠకుమారుఁడు, ఇతఁడు కొంతకాలము వేఁగిదేశపాలకుఁడుగా నుండెను. ఇతఁడు తండ్రియొక్క మరణానంతరమున వేఁగిదేశము విడచి చోళరాజ్యమును వహించుటకుఁ బోయెనని యొక శాసనమున నున్నది. ఈతఁడు ౧౧౧౮ మొదలు ౧౧౩౩ వఱకు పదునేను సంవత్సరములు రాజ్యము చేసెను.

౩౦. కులోత్తుంగ చోడదేవుఁడు- ఈ రెండవ కులోత్తుంగుఁడు విక్రమచోడునికొడుకు ఇతఁడు ౧౧౩౩ వ సంవత్సరమున రాజ్యమునకు

వచ్చెను. ఇతఁడు చోళరాజ్యమును ౧౧౫౮ వ సంవత్సరమువఱకును పాలించెను. ఇతనికొడుకు రాజేంద్రచోడుఁడు పండ్రెండవ శతాబ్ద్యంతము వఱకును, రాజేంద్రచోడునికొడుకు రాజరాజచోడుఁడు ౧౨౩౨ వ సంవత్సరము వరకును, చోడరాజ్యమును పాలించినట్టు కనఁబడుచున్నది. ఈ రెండవ కులోత్తుంగచోడదేవుని కాలములోనే వేఁగిదేశ మితరచాళుక్యుల యధీన మయినట్టు స్పష్టముగాఁ గనఁబడుచున్నది. ౧౨౦౨ వ సంవత్సరమునందు మల్లవిష్ణువర్ధనుఁడు వేఁగిదేశప్రభువుగా నుండిన ట్టొక శాసన మునం దున్నది. ఆ శాసనమునందే యాతనితండ్రి విజయాదిత్యుఁడు చిరకాలము వేఁగిదేశమును బాలించినట్టును జెప్పఁబడియున్నది. దీనినిబట్టి చూడఁగా రెండవ కులోత్తుంగ చోడదేవునికాలములోనే విజయాదిత్యుఁడు వేఁగిదేశరాజ్యమును వహించినట్టు తోఁచుచున్నది. ఈ విజయాదిత్యుఁడు పైని వివరింపఁబడిన పదునేఁడవ తూర్పుచాళుక్యరా జగు బేటవిజయాదిత్యుని కాఅవతరమువాఁడు బేటవిజయాదిత్యుని కొడుకు సత్యాశ్రయుఁడు; సత్యాశ్రయునికొడుకు విజయాదిత్యుఁడు, విజయాదిత్యునికొడుకు విష్ణువర్ధనుఁడు; విష్ణువర్ధనునికొడుకు మల్లప్పదేవుఁడు; మల్లప్పదేవుని కొడుకు వేఁగిదేశప్రభు వైన విజయాదిత్యుఁడు. ౧౨౨౮ వ సంవత్సరమునందు కృష్ణాగోదావరీ మధ్యమునందున్న వేఁగిదేశమంతయు గణపతి రాజుల యధీన మైనది. కులోత్తుంగచోడదేవునికాలమునుండియు చాళుక్య చోడు లందఱును తాము వేఁగిదేశమును విడిచి చోళుల బిరుదావళులను వహించి తాము చోళులుగానే పరిగణింపఁబడుచు వచ్చుటచేత వారినిగూర్చి యిందు వివరించుట యనావశ్యకము. చాళుక్యులు చంద్రవంశపురాజులు; చోళులు సూర్యవంశపురాలు * ఈ క్రిందిది చాళుక్యుల వంశవృక్షము.

[* ఈ చాళుక్యులు సూర్యవంశమువారు గాని, చంద్ర వంశమువారు కాని కారనియు, వీరు దాక్షిణాత్యులును ద్విజేతురులునైయుండి తమ వంశమునకు గౌరవము నాపాదించుటకై యీ గాథలను కల్పించుకొని వానిని శాసనములలోని కెక్కించికొనిరనియు నవీనచరిత్రకారులను చున్నారనియు అది సత్యమే కావచ్చుననియు 'ఆంధ్రకవి తరంగిణి' లోఁగలదు] (పుట 71)

- 1 కుబ్జవిష్ణువర్ధనుఁడు (615–633)
  - 2. జయసింహుఁడు (633–663)
  - 3. ఇంద్రభట్టారకుఁడు (663).
    - 4. విష్ణువర్ధనుఁడు (663–672).
      - 5. మంగియువరాజు (672–695).
        - 6. జయసింహుఁడు. (996–709)
        - 8 విష్ణువర్ధనుఁడు (709–746)
          - 9. విజయాదిత్యుఁడు (746–764)
          - 10. విష్ణువర్ధనుఁడు. (764–799)
            - 11 విజయాదిత్యుఁడు (799–843)
              - 12. విష్ణువర్ధనుఁడు (843–844)
                - 13. గణక విజయాదిత్యుఁడు (844–888)
                - విక్రమాదిత్యుడు
                  - 14 చాళుక్యభీముఁడు. (888–918)
                    - 15. విజయాదిత్యుఁడు (918)
                      - 16. అమ్మ రాజవిష్ణువర్ధనుఁడు. (918–925)
                        - 17. చేటవిజయాదిత్యుఁడు (925)
                          - సత్యాశ్రయుఁడు
                            - విజయాదిత్యుఁడు
                        - 20 భీముఁడు (926–927)
                    - 19 విక్రమాదిత్యుఁడు (925–926)
                      - 22 చాళుక్యభీముఁడు (934–945)
                        - 24. దానార్ణవుఁడు (970–973)
                          - 25 శక్తివర్మ (1003–1015)
                          - 26 విమలాదిత్యుఁడు (1015–1022)
                        - 23. అమ్మవిజయాదిత్యుఁడు (945–970)
                - యుద్ధమల్లుడు
                  - 18. తాళరాజు (925)
                    - 21. యుద్ధమల్లుఁడు (927–934)
            - నృపరుద్రుఁడు.
        - 7. కొక్కిలి (709)

విష్ణువర్ధనుఁడు
|
మల్లప్పదేవుఁడు
|
విజయాదిత్యుఁడు
|
మల్లవిష్ణువర్ధనుఁడు (1202)

27. రాజరాజు (1022-1063) — విజయాదిత్యుఁడు
|
28. రాజేంద్రకులోత్తుంగచోడదేవుఁడు. (1063-1112)
|
29. విక్రమచోడుఁడు. (1112-1127) — రాజరాజు — వీరచోడదేవుఁడు.
|
30. కులోత్తుంగ చోడదేవుఁడు (1127-1158)
|
31. రాజేంద్రచోడుఁడు (1158-1200?)
|
32. రాజరాజచోడుఁడు (1200?-1235?)

[ఈ వంశవృక్షములో నీయఁబడిన రాజులకాలము 'ఆంధ్రకవితరంగిణి' లో క్రిందిరీతి నీయఁబడియున్నది.

1) కుబ్జవిష్ణువర్ధనుండు 616-633 2) జయసింహుఁడు 634-666. 3) ఇంద్ర భట్టారకుఁడు 666. 4) విష్ణువర్ధనుఁడు 667-675. 5) మంగియువరాజు 676-700. 6) జయసింహుఁడు 701-713. 7) కొక్కిలి 714. 8) విష్ణు వర్ధనుఁడు 714-750 9) విజయాదిత్యుఁడు 751-768 10) విష్ణువర్ధనుఁడు 768-803 11) విజయాదిత్యుఁడు 804-848. 12) విష్ణువర్ధనుఁడు 849. 13) గణక (గుణగ) విజయాదిత్యుఁడు 850-892. 14) చాళుక్యభీముఁడు 892-918. 15) విజయాదిత్యుఁడు 919. 16) అమ్మరాజవిష్ణువర్ధనుఁడు 919-925. 17) బేటవిజయాదిత్యుఁడు 926. 18) తాళరాజు 925. 19) విక్ర మాదిత్యుఁడు 925-926. 20) భీముఁడు 926. 21) యుద్ధమల్లుఁడు 925-933 22) చాళుక్యభీముఁడు 934-945. 23) అమ్మరాజవిజయాదిత్యుఁడు 945-970 24) దానార్ణవుఁడు 970-973 25) శక్తివర్మ 1000-1011. 26) విమలా దిత్యుఁడు 1011-1022. 27) రాజరాజు 1022-1063]

ఈనన్నయభట్టారకుఁడు భారతమునందలి యాదిపర్వమును, సభాపర్వమును, ఆరణ్యపర్వములోని నాల్గవ యాశ్వాసము మూఁడవవంతు వఱకును రాజ నరేంద్రున కంకితముగా తెనిఁగించెను. ఈతఁడు రచించిన దానిలో

ఉ. శారదరాత్రు లుజ్జ్వలలసత్తరతారకహారపంక్తులన్
జారుతరంబులయ్యె వికసన్నవకైరవగంధబంధురో
దారసమీరసౌరభము దాల్చి సుధాంశువికీర్యమాణక
ర్పూరపరాగపాండురుచిపూరము లంబరపూరితంబులై.

అనునది కడపటి పద్యము. ఈ పద్యమునందలి నాలవ చరణములోని "రుచిపూరము లంబరపూరితంబులై" యని యున్నచోట "రుచిపూరములు+అంబరపూరితంబులై" యనుటకు మాఱుగా "రుచిపూరములం+బరపూరితంబులై" యని పదవిభాగము చేసి యక్కడనుండి పయి పద్యము లన్నియు నన్నయవి గాక పరపూరితము లన్న యర్థము స్ఫురించుచున్న దని యొకానొకరు చమత్కారముగా వ్రాసియున్నారు. ఈతనిది మృదువయిన సులభశైలి; కవిత్వము ద్రాక్షాపాకమయి మిక్కిలి రసవంతముగా నుండును. ఈయన కవనమందించుమించుగా రెండు వంతులు సంస్కృత పదములును, ఒకవంతు తెలుఁగుపదములును నుండును. ఈ యంశము లీయనకవిత్వధోరణిని జూపుటకయి యిందు క్రింద నుదాహరింపఁబడిన పద్యములవలనఁ దెలిసికోవచ్చును.

క. అడవులు నేఱులు నవి నీ
పడసినయవి యెట్లు పుణ్యభాగీరధి యి
ప్పుడమిఁ గలవారి కెల్లను
నెడపక సేవ్యంబకాక యిది నీయదియే. [ఆది. అ ౭-౪౧]

ఉ. వీరుఁడు వీఁడు పాండవుఁడు వృష్ణికులోత్తములైన సీరిదై
త్యారు లెఱుంగకుండఁగ మహారథుఁడై తరుణిన్ సుభద్ర నం
భోరుహనేత్రఁ దోడ్కొనుచుఁ బోయెడు నీతనిఁబోవ నిచ్చినన్
ధీరుఁడు మాధవుండు బలదేవుఁడు నల్గుదురంచు నడ్డమై
(ఆది. ఆ ౮-౧౯౯)

మ. కురువృద్ధు ల్గురువృద్ధబాంధవు లనేకు ల్చూచు చుండ న్మదో
ద్ధురుఁడై ద్రౌపది నట్లు చేసిన ఖలున్ దుశ్శాసనున్ లోకభీ

కరలీలన్ వధియించి తద్విపులవక్షశ్శైలరక్తౌఘని
ర్ఝర ముర్వీపతి చూచుచుండ నని నాస్వాదింతు నుగ్రాకృతిన్.
(సభా. ఆ ౨-౨౩౩)

ఈయనకవిత్వమంతయు మొత్తముమీఁద రసపుష్టి కలదిగానే యున్నను, అరణ్యపర్వమునందలి కొన్ని భాగములుమాత్రము నిస్సారములుగాఁ గనఁబడుచున్నవి. అవసానకాలమునకు ముందు రోగబాధచేతనో చిత్తవైకల్యముచేతనో బుద్ధిబలము తగ్గియున్నప్పు డవి చేయఁబడియుండవచ్చును. కవిత్వనైపుణి యెట్లున్నను కథమాత్రము మూలగ్రంథ మగు వ్యాసవిరచితసంస్కృతభారతమునకు సరియైన భాషాంతరముకాదు. ఈ కవి యొక్కఁడు మాత్రమేగాక సంస్కృతపురాణములను తెనిఁగించిన యాంధ్రకవు లందఱునుగూడ తమయిష్టానుసారముగాఁ గొన్నిచోట్ల మూలగ్రంథములోని కథలను సంగ్రహపఱిచియు కొన్నిచోట్ల పెంచియు, కొన్నిచోట్ల కథలను మార్చి వేఱుకథలను చేర్చియు, కొన్నిచోట్ల కథలు తాఱుమాఱు చేసియు, కొన్నిచోట్ల నూతనకథలను గల్పించియు, కొన్నిచోట్ల మును పున్నవానిని బొత్తిగా తీసివేసియు యథేచ్ఛము లయిన వర్ణనలు పెట్టి ప్రధానకథాంశమునుమాత్రము వదలక నానావిధముల మూలగ్రంథములకంటె తమ గ్రంథములు భిన్నములుగా నుండునట్లు చేసిరి. ఈ హేతువుచేతనే సంస్కృతమున లక్ష యిఱువదియైదువేలు గల భారతము తెనుఁగున నేఁబదివేల గ్రంథమునకు దిగినది. ప్రతిపదార్థభావప్రధానములైన కావ్యనాటకములందు మాత్రమే భాషాంతరము సరిగా మూలానుసారముగా నుండవలెను గాని కేవలకథామాత్రప్రధానములైన పురాణేతిహాసములయం దట్లుగాక వినువారి వీనుల కింపుగా నుండునట్లు కథను యథేచ్ఛముగా వ్రాయుటయే సముచిత మని కొంద ఱనుచున్నారు అట్లే కావచ్చును. నన్నయభట్టాదిపర్వమునందు సంస్కృతమున శకుంతలకథతరువాత నున్న యయాతీచరిత్రమును శకుంతలోపాఖ్యానమునకు ముందుంచుటయు, ధృతరాష్ట్రునకు కణికుఁడు చెప్పినట్లున్న జంబుకాదులకథ మొదలయినవానిని తెనిఁగింపక విడిచివేయుటయు, పయివానికి దృష్టాంతములుగా గ్రహింపవచ్చును.

తిక్కనసోమయాజినిగూర్చి వ్రాయునపు డీ విషయము కొంత వివరింపఁ బడును దుష్యంతునికంటె యయాతి యెంతో పూర్వుఁ డగుటచేత ముందుగా యయాతిచరిత్రమును జెప్పుటయే సమంజసము కావచ్చును. నన్నయకాలపుభారతప్రతులలోఁ గూడ నొకవేళ పారసుప్తే యుండిన నుండ వచ్చును. ఈ కవులు సంస్కృతశ్లోకములను తెలిఁగించెడు రీతిని తెలుపుట కయి రెండు మూడు శ్లోకములను, వానికి సమములయిన పద్యములును మాత్రమిక్కడ నుదాహరింపఁబడుచున్నవి—

సంస్కృతసభాపర్వము

శ్లో॥ కదళీదండసదృశం సర్వలక్షణసంయుతమ్,
గజహస్తప్రతీకాశం వజ్రప్రతిమగౌరవమ్.
అభ్యుత్స్మయిత్వా రాధేయం సంప్రేక్ష్య యన్నివ.
ద్రౌపద్యాః ప్రేక్షమాణాయా స్సవ్యమూరు మదర్శయత్.
భీమసేన స్తమాలోక్య నేత్రే ఉత్ఫాల్య లోహితే
ప్రోవాచ రాజమధ్యే తం సభాం విశ్రావయ న్నివ.
పితృభి స్సహ సాలోక్యం మా స్మ గచ్ఛే ద్వృకోదరః,
యద్యేతమూరుం గదయా న భేద్యాం తే మహాహవే.

తెలుఁగు సభాపర్వము

ఉ. అమ్మదిత న్విభీతహరిణాక్షిఁ గలాపవిభాసికేశభా
రమ్మున నొప్పుదానిఁ దన రమ్యపృథూరుతలంబు నెక్కఁగా
రమ్మని సన్న చేసె ధృతరాష్ట్రసుతాగ్రజుఁ డప్డు దాని దూ
రమ్మునఁ జూచి కౌరవకురంగమృగేంద్రుఁడు భీముఁ డల్కతోన్.

క. అయమేఘఘనవు బ్రహ్మధరని ।
ర్దయుఁడై ధరణీశు లెల్లఁ దన పలుకులు వి
స్మయసంభ్రమసంభృతులై ।
భయమున వినుచుండ నా సభం దగఁ బలికెన్.

ఉ. ధారుణి రాజ్యసంపదమదంబునఁ గోమలిఁ గృష్ణఁ జూచి రం
భోరు విజోరుదేశమున నుండఁగఁ బిల్చిన యిద్దురాత్ము దు
ర్వార మదీయబాహుపరివర్తితచండగదాభిఘాతభ
గ్నోరుతరోరుఁ జేయుదు సుయోధను నుగ్రరణాంతరంబునన్.

(సభా. ఆశ్వా ౨-౨౪౭-౨౪౯)

సంస్కృతమున మొదటిశ్లోకమునందుఁ గదళీస్తంభసదృశమనియు సర్వలక్షణసంయుత మనియు గజహస్తప్రతీకాశ మనియు వజ్రప్రతిమగౌరవ మనియు దుర్యోధనునితొడ వర్ణింపబడినది. దానితెనుఁగు నందో రమ్యపృథూరుతలం బని మాత్రము చెప్పఁబడినది. చూచుచున్న ద్రౌపదికని సంస్కృతమున నుండఁగా తెనుఁగున ద్రౌపదికి విభీతహరిణాక్షి యనియు కలాపవిభాసికేశభారమున నొప్పుదాని యనియు క్రొత్తవిశేషణములు చేర్పఁబడినవి. రెండవ శ్లోకముయొక్క పూర్వార్ధములోని రాధేయున కుబ్బు పుట్టించి భీమునకుఁ దిరస్కారము కలుగునట్లుగా నన్నమాటలు బొత్తిగా వదలివేయఁబడినవి. మూఁడవ శ్లోకములోని భీమసేనుఁడు కనులెఱ్ఱచేసి దానిని తేఱిపాఱఁ జూచి యన్నవాక్యము 'దానిదూరమ్మునఁజూచి కౌరవకురంగమృగేంద్రుఁడు భీముఁ డల్కతో' నని తెనిఁగింపఁబడి మూలములో లేని ''కౌరవకురంగమృగేంద్రుఁ'' డను విశేషణ మధికముగాఁ జేర్పఁబడినది. అటుతరువాత సభవారు వినునట్లుగా రాజమధ్యమునం దిట్లు పలికె నని యున్న శ్లోకముయొక్క యుత్తరార్ధమునకు ''లయసమయదండధరనిర్దయుఁ డయి, ధరణీశు లెల్లఁ దనపలుకులు విస్మయసంభ్రమసంభృతులై భయమున వినుచుండ నా సభన్ దగఁబలికె'' నని తెనుఁగుచేయఁబడినది. ఈ వాక్యము 'లయసమయదండధరనిర్దయుఁ డయి' యనియు 'విస్మయసంభ్రమసంభృతులయి' యనియు మూలములో లేని మాటలు కవిచేఁ గల్పింపఁబడినవి. నీ యీ తొడను గదచేత మహాయుద్ధమునందు విఱుగఁ గొట్టనియెడల వృకోదరుఁడు పితృపితామహాదులతోడి సాలోక్యమునకుఁ దప్పినవాఁ డగునన్నకడపటి శ్లోకమును 'ధారుణి రాజ్యసంపదమదంబున'

నన్నపద్యమునుగాఁ దెనిఁగించుచో "ధారుణి రాజ్యసంపద మదంబునఁ గోమలిఁ గృష్ణఁజూచి రంభోరునిజోరుదేశమున నుండఁగఁ బిల్చిన యిద్దురాత్ము" నన్నంతవఱకు క్రొత్తగాఁ జేర్పఁబడినది. గదతోనని మూలములో నున్నదానికి "దుర్వారమదీయబాహుపరివర్తిత చండగదాభిఘాత"ముచేత నని పెంచి చెప్పఁబడినది. పితృపితామహులలోకమునకుఁ దప్పినవాఁడ నగుదు నన్నమూలములోని వాక్యము విడువఁబడినది. పరిశీలించి చూచిన పక్షమున భాషాంతరమంతయు నిదేప్రకారముగా నుండునుగాని సరిగా మూలము ననుసరించి యుండదు. మూలముతో సరిపోల్పక ప్రత్యేకముగాఁ జూచునప్పుడు మాత్ర మాంధ్రభారతము మనోహరముగా నుండుననుటకు సందేహము లేదు. కొన్నిచోట్ల మూలమునకంటెను హృద్యతరముగానుండి రసాతిశయము పుట్టించుననుటయు నిర్వివాదాంశమే !

నన్నయభట్టారకుఁడు తాను రచియింప నారంభించిన శ్రీమహాభారతమును సంపూర్ణముగా నాంధ్రీకరింపలేకపోవుటకుఁ గారణములు పలువురు పలు విధములుగాఁ జెప్పుదురు కొందఱు వేములవాడ భీమకవి శాపముచేతఁ గలిగిన మరణము కారణ మందురు. మఱికొంద అధర్వణాచార్యులు తెలిఁగించుచుండిన భారతమును తగులఁబెట్టించుట చేతఁ గలిగిన చిత్తచాంచల్యము కారణ మందురు. ఈ రెండు కారణములలో నేది నిజమైనను, ఈకవి పరోత్కర్షము సహింపఁజాలని దుస్స్వభావము కలవాఁడయిన ట్టూహింపఁదగి యున్నది. ఈయనతోడి సమకాలికుఁడైన వేములవాడ భీమకవి రాఘవపాండవీయమును, కవిజనాశ్రయములోఁ జేర్చి యొకవ్యాకరణమును జేసి రాజసన్మానమును బొందుటకయి రాజమహేంద్రపురమునకుఁ దెచ్చి విష్ణువర్ధనుని యాస్థానపండితుఁడయి యున్న నన్నయభట్టునకుఁ జూపఁగా నతఁ డాతనికవిత్వము మిక్కిలి శ్లాఘాపాత్రముగా నుండుట చూచి యోర్వలేక యా పుస్తకములు లోకములో వ్యాపించినయెడలఁ దన పుస్తకములకుఁ బ్రసిద్ధి రానేరదనియెంచి వానివి తగులఁబెట్టించినట్లును, అటు మీఁదట నతఁడింట లేనప్పుడు భీమకవి వచ్చి యాతనిభార్యను నీభర్త యేమి చేయుచున్నాఁ డని యడిగి యామె తనభర్త రహస్యస్థలమున నుండి

యరణ్యపర్వము రచించుచున్నాఁ డని చెప్పినమీఁదట నతఁ డింకను నరణ్యములోనేయున్నాఁడా ? యట్లే యుండునుగాక' యని శపించి తన పుస్తకముల నడఁగ ద్రొక్కెనన్న కోపముచేత నన్నయభట్టు రచించిన ఛందస్సును, వ్యాకరణమును అతనిభార్య నడిగి పుచ్చుకొని వానిని చించి గోదావరిలోఁ గలిపివేసి తాను చిరకాలము కష్టపడి చేసిన గ్రంథములు పోయినవన్న దుఃఖముచేత బెంగపెట్టుకొని కాలధర్మము నొందినట్లును, ఆతని శాపము తగిలి నన్నయభట్టు వనములో మృతినొందినట్లును, అట్లు నశించిన వ్యాకరణము సిద్ధులలోఁ గలిసిన సారంగధరుఁడు తాను చిన్న తనములో నేర్చుకొని యుండుటచేత మరల బాలసరస్వతి యను బ్రాహ్మణు నకుఁ జెప్పినట్లును, లోకప్రవాదము కలిగియున్నది. దీని కుపబలముగా నప్పకవీయమునందు

"గీ. ఆంధ్రశబ్దచింతామణి వ్యాకరణము
ముందు రచియించి తత్సూత్రములఁ దెనుఁగు
బాసచేఁ జెప్పె నన్నయభట్టు తొల్లి
పర్వములు మూఁడు శ్రీమహాభారతమున. [ఆ. ౧-౪౨]

గీ. భారతముఁ దెనిఁగించుచుఁ దా రచించి
నట్టి రాఘవపాండవీయము నడంచె
ఛందము నడంప నీఫక్కి సంగ్రహించె
ననుచు భీమన యెంతయు నడఁచె దాని. [ఆ. ౧-౪౪]

గీ. రాజరాజనరేంద్రతనూజుఁ డార్య
సఖుఁడు సారంగధరుఁడు శైశవమునందు
నన్నయ రచించునెడఁ బరసం బొనర్చి
నన్య లెవ్వ రెఱుంగ రీయాంధ్రపక్కి. [ఆ. ౧-౪౭]

క. ఆ లోకనుతుఁడు మొన్నటి
కీలకసమ నామతంగగిరికడ నొసఁగెన్
బాలసరస్వతులకు నతఁ
డోలిఁ దెనుఁగుటీక దాని కొప్పుగఁ జేసెన్, [ఆ ౧-౫౦]

క. ఆదిని భీమకవీంద్రుఁడు
గోదావరిలోనఁ గలిపెఁ గుత్సితమున నా
మీఁదట రాజనరేంద్ర
క్ష్మాదయితునిపట్టి దాని మహి వెలయించెన్" [ఆ. ౧-౩౧]

అను పద్యములు కనఁబడుచున్నవి. అంతేకాక పింగళిసూరకవి విరచితమైన రాఘవపాండవీయమునందును దత్కృతిపతి యగు వేంకటాద్రిరాజు కవి నుద్దేశించి,

"శా. రెండర్థంబులపద్య మొక్కటియు నిర్మింపంగ శక్యంబు గా
కుండుం దద్గతిఁ గావ్య మెల్ల నగునే నోహో యనం జేయదే!
పాండిత్యం బిఁక నందునుం దెనుఁగుకబ్బం బద్భుతం బంద్రు ద
క్షుం డెవ్వాఁ డిల రామభారతకథ ల్జోడింప భాషాకృతిన్.

ఉ. భీమన తొల్లి చెప్పె నను పెద్దలమాటయెకాని యందు నొం
డేమియు నేయెడ న్నిలుచు టెవ్వరుఁ గాన; రటుండ నిమ్ము నా
నామహితప్రబంధరచనాఘనవిశ్రుతి నీకుఁ గల్గుటన్
నామదిఁ దద్వయార్థకృతినైపుణియుం గల దంచు నెంచెదన్."
[రాఘవ-పీఠిక-10, 11]

అని యన్నట్టు చెప్పఁబడి యున్నది ఈరెండు పుస్తకములలోను వ్రాయఁబడినదానినిబట్టి చూడఁగా భీమకవి రాఘవపాండవీయమును రచించినట్టును అది యే హేతువుచేతనో నశించినట్టును స్పష్ట మగుచున్నది. ఆ పుస్తకము నశించుట కప్పకవి చెప్పినదానినిబట్టి యొకవేళ నన్నయభట్టు కారకుఁడయిన నయి యుండు ననుకొన వచ్చును గాని యీ యిరువురు కవులును సమకాలీనులు కాకపోవుటచేత నీయూహ కవకాశము లేశమును లేదు.

ఈ ప్రకారముగానే యధర్వణాచార్యుని భారతమును గూడ నన్నయభట్ట డఁగఁద్రొక్కినట్టు లోక ప్రతీతి కలదు. అధర్వణాచార్యుఁడు భారతమును దెనిఁగించి దానికి రాజనరేంద్రుని కృతిభర్తనుగాఁ జేసి బహుమానమును పొందు [illegible] వని ధాజుమహేంద్రవరమునకు వచ్చి నన్నయభటునకు

గ్రంథమును జూపి తనకు రాజసందర్శనము చేయింపుమని వేఁడె ననియు, ఆ గ్రంథము సర్వోత్కృష్టముగా నున్నందున దానిని ప్రకటనపఱిచినయెడల స్వగ్రంథప్రాశస్త్యము చెడు నని యతఁడాలాగుననే యని చెప్పి త్రిప్పుచు నొకనాఁ డథర్వణాచార్యుఁడింట లేని సమయమునం దతఁడు బసచేసియున్న యింటివారికి లంచ మిచ్చి యాపుస్తకమును గాల్పించెననియు, ఇల్లు విడిచి పోవునప్పు డథర్వణాచార్యుఁడెవ్వరికో చూపుటకయి తనతోఁగూడఁ దీసికొని పోయిన విరాటపర్వమొక్కటి మాత్రము నశింపక మిగిలె ననియు, ఈ దుర్నయము నన్నయభట్టువలన జరగిన దని తెలిసికొని యథర్వణాచార్యుఁ డాతనిని శపించుచు దుఃఖముతో లేచిపోయె ననియు, సాధుపురుషునకు నిష్కారణముగ ద్రోహము చేసిన చింతచేత నన్నయభట్టు మతిచెడి వెఱ్ఱివాఁడయి గ్రంధరచనకు సమర్థుఁడు కాకపోయె ననియు, చెప్పుదురు. కాని యీ కథ యెంతమాత్రము విశ్వాసార్హ మయినది కాదు. అథర్వణాచార్యుఁడును నన్నయభట్టును సమకాలీను లని నిర్ణయించుటకుఁ దగిన నిదర్శనము లేవియుఁ గానరావు. అథర్వణాచార్యకృతమయిన వికృతి వివేక మను వ్యాకరణకారికావళిని నన్నయభట్టువిరచిత మనెడి యాంధ్ర శబ్దచింతామణిని విమర్శించి చూడఁగా నథర్వణాచార్యుఁడు నన్నయభట్టునకుఁ దరువాతివాఁ డని యూహింపఁ దగియున్నది. అయినను, ఈ యూహను వేఱువిధముగాఁగూడ చేయవచ్చును. నన్నయభట్టారకుఁడు భారతము నారణ్యపర్వమువఱకును దెనిఁగించి కాలధర్మము నొందిన తరువాత తిక్కనసోమయాజి పూరింపఁ బూనుకొనకమునుపో, పూనుకొన్న సంగతి యెఱుఁగకమునుపో మిగిలిన భాగమును తా నాంధ్రీకరింపఁ బూని విరాటపర్వమునుమాత్రమే చేసి యథర్వణాచార్యుఁడు తక్కినభాగమును ముగింపకయే లోకాంతరగతుఁ డయి యుండవచ్చును.

నన్నయభట్టు రచియించిన వన్న యితరగ్రంథములు లక్షణసార మను తెలుఁగుఛంద స్సొకటియు, ఆంధ్రశబ్దచింతామణి యనఁబడు తెలుఁగు వ్యాకరణ మొకటియు, ఇంద్రవిజయ మను గ్రంథము నొకదానినిఁగూడ నన్నయ రచియించిన ట్లానందరంగరాట్ఛందములో నుదాహరింపఁబడిన యొక

పద్యమువలనఁ దెలియవచ్చుచున్నది. భీమన నశింపఁజేయుటచేతఁ గాక పోయినను మఱియేహేతువుచేతనో నన్నయభట్టకృత మైన ఛందస్సిప్పు డెక్కడను కానబడదు నన్నయభట్ట విరచితమైన లక్షణసార మిప్పుడున్న దనియు, దానిలో నితరలాక్షణికు లుదాహరించిన పద్యము లన్నియు నున్న వనియు తిక్కనకృతమైన కవివాగ్బంధనమునందువలెనే దీనియందును విశేషవిషయము లేవియు లేవనియు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రులవారు వ్రాయుచున్నారు లక్షణసారమును, ఇంద్ర విజయమును, నన్నయభట్ట విరచితములుగాక యన్నయభట్టవిరచితము లని మఱియొక మిత్రులు నాపేర వ్రాయుచున్నారు వేఱొకరు నన్నయభట్టు రాఘవాభ్యుదయములోని దని యొక పద్యము నుదాహరించి యున్నారు ఆంధ్రశబ్దచింతామణికి ప్రక్రియా కౌముది యని మఱియొక పేరు కలదు దీనిని రచించుట చేతనే నన్నయ భట్టునకు వాగనుశాసనుఁ డను బిరుదుపేరు కలిగిన దందురు, గాని, యీ యంశము విశ్వసనీయము కాదు ఈ తెలుఁగు వ్యాకరణము సంస్కృతభాషలో నెనుబదిరెండార్యావృత్తములలో రచియింపఁ బడినది. దీనిని నన్నయభట్టీయ మని సాధారణముగా జనులు వాడుదురు. ఈ యాంధ్ర వ్యాకరణమున కెలకూచి బాలసరస్వతి యను పండితుఁడు మొట్టమొదట తెలుఁగున టీక యొకటి వ్రాసెను దానికి బాలసరస్వతీయ మని పేరు అటుతరువాత వాసుదేవుఁ డను మఱియొక పండితుఁ డీ వ్యాక రణమునకు వార్త్తిక మొక్కటి వ్రాసెను. దానిని వాసుదేవవృత్తి యని వ్యవహరింతురు. తదనంతరము కాకునూర్యప్పకవి యీ వ్యాకరణమును దెనిఁగింపఁ బూని సంజ్ఞా సంధిపరిచ్ఛేదములను మాత్రము తెనుఁగున నయిదాశ్వాసములుగల పద్యకావ్యమునుగా రచించెను. ఈతనియనంతర మహోబలపండితుఁ డాంధ్రశబ్దచింతామణికి సంస్కృతభాషలో నొక వ్యాఖ్యా నము చేసి దానికిఁ గవిశిరోభూషణ మని పేరుపెట్టెను. దానినిప్పు డహోబల పండితీయ మని పిలుతురు. పిమ్మట నృసింహపండితుఁ డను వాఁడుకూడ నన్నయభట్టీయమున కొక వ్యాఖ్యానము చేసెను. దానికి నృసింహపండితీయ మను నామము.

ఆంధ్రశబ్దచింతామణి నన్నయభట్టారకవిరచితము కాదనుటకుఁ గల హేతువులనుగూర్చి యిచ్చటఁ గొంత విమర్శింతము. అప్పకవీయము పంచమాశ్వాసమునందు శబ్దానుశాసన మూలసూత్ర మని "ను మ్యోచతో హల్యథర్వణాచార్యమతాత్" అని యొక సూత్ర ముదాహరింపఁబడి యున్నది. ఇది నిజముగా నన్నయభట్టీయసూత్రమే యయినయెడల, అథర్వణాచార్యుఁడు నన్నయభట్టునకుఁ బూర్వకాలికుఁ డనియే చెప్పవలెను. అదియే నిజమయినపక్షమున, "అప్రయుక్తత్వదోష స్తున విరుద్ధో హరే ర్మతే" యని యథర్వణకారికలలోఁ జెప్పఁబడి యుండుటచేత హరికారికలును నన్నయభట్టీయమునకుఁ బూర్వపువే యయి యుండవలెను ఇప్పుడు శిష్టు కృష్ణమూర్తిగారిచేత వ్యాఖ్యానము చేయఁబడి చిన్నయసూరిగారి బాలవ్యాకరణములోని సర్వాంశములను గలిగి యున్న హరికారికలే * నిజమయిన హరికారికలయి యీ హరికారికలును అథర్వణకారికలును గూడ నన్నయభట్టీయ వ్యాకరణమునకుఁ బూర్వపు వయినపక్షమున నన్నయభట్టీయమున కంత ప్రసిద్ధివచ్చుటకుఁ గాని విశేషాంశములతో నిండియున్న యటువంటి యుత్తమ కారికావళు లుండగా నల్పాంశములను మాత్రమే కలిగి వాని ముందర నిష్ప్రయోజకమని చెప్పఁదగిన యాంధ్రశబ్దచింతామణి నన్నయభట్టు రచించుటకుఁ గాని హేతు వుండదు. శబ్దానుశాసన మూలసూత్రమని యప్పకవీయములోఁ బేర్కొనఁబడిన, పయి సూత్రమును, మరి కొన్ని సూత్రములును ప్రత్యేకముగా నున్న యిప్పటి యాంధ్రశబ్దచింతామణియందుఁ గానఁబడకపోవుటచేత నప్పకవి యుదాహరించిన యాసూత్రములు ప్రక్షిప్తములని కొందఱు చెప్పుచున్నారు. ఈ సూత్రముమాత్రమే కాక గ్రంథమంతయు ప్రక్షిప్తమగుట మరింత యుక్తముగా నుండును. ఈ ప్రకారముగానే శిష్టు కృష్ణమూర్తిగారును బాలవ్యాకరణము రచియింపఁబడిన తరువాతనే హరికారికలని పేరుపెట్టి తాన్గ్రంథమును రచించి ♦ వ్యాఖ్యానము

[(* హరికారికావళి శిష్టు కృష్ణమూర్తిశాస్త్రి రచన. అది యాంధ్రశబ్దచింతామణికి వివరణమని, జ్యోత్స్న్య నామాంతరమని తెలియనగును)

(♦ శిష్టు కృష్ణమూర్తిశాస్త్రిగారు కారికలను రచించిరేగానీ, వానికి వ్యాఖ్యానము చేయులేద.)]

చేసెననియు, అట్లు కానియెడల కేతన, తాతంభట్టు, ముద్దరాజు రామన్న, అప్పకవి, కూచిమంచి తిమ్మకవి, మొదలయిన లక్షణగ్రంథకర్త లొక్క-రయిన నీ హరికారికలమాటయయినఁ దలపెట్టకపోరనియు, ఇప్పటివారు కొంద అనుచున్నారు ఇది యట్లుండఁగా మఱికొంద ఱాంధ్రశబ్దచింతామణి నన్నయభట్ట విరచితము కాదనియు, అతఁడు చేసినదైన పక్షమున కేతనాది కవుల కది తెలియక పోవుటయు, కేతన తన యాంధ్రభాషాభూషణమునందు

క. మున్ను తెలుఁగునకు లక్షణ
మెన్నఁడు నెవ్వరును జెప్ప, రేఁ జెప్పెద వి
ద్వన్నికరము మది మెచ్చఁగ
నన్నయభట్టాదికవిజనంబులకరుణన్

గీ సంస్కృతప్రాకృతాదిలక్షణము చెప్పి
తెలుఁగునకు లక్షణము మున్ను దెలుప కునికి
కవిజనంబులనేరమి గాదు నన్ను
ధన్యుఁ గావింపఁ దలఁచినతలఁపు గాని.

అని చెప్పుట తటస్థింప దనియు, అప్పకవి చెప్పినట్లుగా భీమన యాంధ్ర శబ్దచింతామణిని గోదావరిలోఁ గలిపినయెడల నాలుగయిదువందలసంవత్సర ములవఱకు నడఁగి యుండి యిప్పటికి మూఁడు నాలుగు వందల సంవత్సర ముల క్రిందట బయలఁబడుట సంభవింప నేరదనియు, బాలసరస్వతులో మరియెవ్వరో దీనిని రచించి తమ గ్రంథప్రసిద్ధికై కర్తృత్వమును నన్నయభట్టునం దారోపించి సారంగధరుఁడు తమకిచ్చె నన్న కథ కల్పించి రనియు, అభిప్రాయపడుచున్నారు ఇది సత్యమనియే తోఁచుచున్నది. కాని మొదల, "నుమ్మోచ్చతో" ఇత్యాదిసూత్ర మాంధ్రశబ్దచింతామణియందుఁ జొచ్చుటకు హేతువు లేదు. * ఈ యసందర్భము నాలోచించియే యిటీవలి వారీ సూత్రమును పుస్తకమునుండి తొలఁగించి యుండ వచ్చును.

(* అథర్వణుని కారికావళి చింతామణికి శేషగ్రంథమని పలువురి యభి ప్రాయము.)

మొట్టమొదట రాజరాజనరేంద్రునకు సారంగధరుఁడను కొడుకు కుండె నన్న మాటయే సంశయింప వలసి యున్నది. రాజనరేంద్రుని శాసనములలోఁ గాని యాతని సంతతివారి శాసనములలోఁ గాని రాజనరేంద్రునకు రత్నాంగి యను భార్య కాని సారంగధరుఁ డను పుత్రుఁడుగాని యుండినట్లెచ్చటను జెప్పఁబడి యుండలేదు. అందుచేత సారంగధరనామము గల రాజరాజపుత్రుఁడే లేఁడనియు, ఇటీవలి కవులు చమత్కారార్థముగా సారంగధర చరిత్రమును సారంగధరునిఁ గూడా గల్పించిరనియు, చెప్పవలసి యున్నది. మొదట సారంగధరుఁడే లేనప్పుడు వ్యాకరణము నతఁడు పఠించుటయు, బాలసరస్వతి కిచ్చుటయు కల్ల లే యగును. వేములవాడ భీమకవి నన్నయభట్టు కాలమునకుఁ దరువాత బహుసంవత్సరములకుఁగాని యుండినవాడు కాకపోవుటచేత నా తఁ డా వ్యాకరణమును గోదావరిలోఁ గలిపెననుటయు పెద్దకల్లయే.

నన్నయభట్టు క్రీ. శ. ౧౦౨౩ వ సంవత్సర ప్రాంతముల యందున్న వాఁడు. ఆ కాలమునం దాంధ్రశబ్దచింతామణి రచియింపఁబడ్డట్టెవ్వరు నెఱిఁగినట్టు నిదర్శనము కానరాదు. తరువాత రెండువందల సంవత్సరములకుఁ బిమ్మటఁ దిక్కనసోమయాజి కాలములో నున్న యభినవదండి యావఱ కెవ్వరును దెనుఁగునకు శబ్దలక్షణమును (వ్యాకరణమును) జెప్పలేదు గనుక నాంధ్రభాషాభూషణంబును రచియించెద ననుటచేతఁ దిక్కనాదుల కాలమునందును నన్నయభట్టీయ వ్యాకరణము లేదు. శ్రీనాథుల కాలము వఱకును ఆంధ్రభాషాభూషణమే లక్షణగ్రంథముగా వాడఁబడుచుండఁగా కేతనకు రెండు వందల సంవత్సరముల తరువాత వెల్లంకి తాతంభట్టు 'కవిచింతామణి'

(* సారంగధరుని చరిత్రము వోలిన కథలు భారతదేశమునందలి వివిధ ప్రాంతములకు సంబంధించినవి కలవు. గౌరన "నవనాథ చరిత్రము" నందును, చేమకూర వేంకటకవి "సారంగధర చరిత్ర" యందును ఇయ్యది మాళవదేశమునకు సంబంధించినట్లు చెప్పబడినది. సారంగధరుని తండ్రి రాజమహేంద్రుఁ డగుటచే - వేంగి ప్రభువగు రాజరాజునకీకథ యంటఁగట్టబడి యుండవచ్చును. సారంగధరుఁడు రాజరాజ పుత్రుఁడు కాఁడని చరిత్రకారులు నిర్ణయించి యున్నారు.)

యను లక్షణగ్రంథమును వ్రాసెను అప్పటికి నన్నయభట్టీయముయొక్క యునికి యెవ్వరికిని దెలియదు. తరువాత నూఱు సంవత్సరములకు రాఘవ పాండవీయమునకు వ్యాఖ్యానము చేసిన ముద్దరాజు రామన్న కాలమునందుఁ గూడ కవిచింతామణియు, నాంధ్రభాషాభూషణంబును దప్ప తెలుఁగునకు వేఱు లక్షణగ్రంథములు లేవు. ముద్దరాజ రామన 'కవిలోక సంజీవని' యను లక్షణమును రచియించెను. తరువాత నేఁబది సంవత్సరముల కుద్భవించిన బాలసరస్వతుల కాలమునం దనఁగా నన్నయభట్టారకుని మరణానంతరమున దాదాపుగా నాఱు వందల సంవత్సరముల కాంధ్రశబ్దచింతామణి బయలఁబడినది అది బాలసరస్వతులకు లభించిన దన్న విధము కూడ మిక్కిలి యాశ్చర్యకరముగా నున్నది * అప్పకవీయములోని యీ క్రింది పద్యములనుబట్టి నన్నయ భట్టీగ్రంథమును రచించుట యొక్క సారంగధరుఁడు తప్ప మఱియెవ్వరు నెఱుఁగరఁట! అతఁడు దండ్రిచేతఁ గాళ్ళు చేతులు నఱికి వేయఁబడి సిద్ధులలోఁ గలిసిన యైదువందల యేఁబది సంవత్సరములకుఁ దరువాత నెల్లూరిమండలములోని మతంగగిరియొద్దకు వచ్చి పుస్తకము రచింపబడు నప్పుడు తాను జిన్ననాఁడు పఠించి జ్ఞప్తినిబట్టి దానిని బాలసరస్వతుల కేకరువు పెట్టెనఁట! నిపుణముగాఁ బరిశీలించినచో నింతకంటె విరుద్ధమైన కథ మఱియొకటి యుండదు. అప్పకవీయములోని పద్యములను జూడుఁడు—

'గీ. రాజరాజనరేంద్రుఁడు తనూజుఁ డార్య
సఖుఁడు సారంగధరుఁడు శైశవమునందు
నన్నయ రచించునెడఁ బఠనం బొనర్చె
నన్యు లెవ్వ రెఱుంగ రీ యాంధ్రఫక్కి. [ఆ. ౧-౪౮]

క. ఆ లోకసుతుఁడు మున్నటి
కీలకసమ నామతంగగిరికడ నొసఁగెన్
బాలసరస్వతులకు నతఁ
డోలిఁ దెలుఁగుటీక దాని కొప్పుగఁ జేసెన్.' [ఆ ౧-౫౦]

(* చింతామణిలో అప్పకవి పాఠములు వేఱు, బాలసరస్వతీ పాఠములు విభిన్న ముద్రణములలో విభిన్నరీతుల నున్నవి.)

దీనినిబట్టి చూడఁగా నాంధ్రభాషాభూషణాదులను, అథర్వణ కారికావళిని సహాయపఱుచుకొని బాలసరస్వతియే యాంధ్రశబ్ద చింతామణిని జేసి దానికి గౌరవము కలుగుటకయి నన్నయభట్టారకుని పేరుపెట్టినట్లు నిశ్చయింప వలసియున్నది. అప్పకవి యాంధ్రశబ్దచింతామణి వ్యాఖ్యానము నారంభించి నది శాలివాహన శకవర్షములు ౧౫౭౭ మన్మథ సంవత్సర మనఁగా హూణశకము ౧౬౫౬ వ సంవత్సరము బాలసరస్వతికిఁ బుస్తకము దొరకిన దన్న కీలకసంవత్సరము హూణశకము ౧౬౦౫ వ సంవత్సర మగును. ఆంధ్రశబ్ద చింతామణి నన్నయభట్ట ప్రణీతము కాదనుట కా పుస్తకములోనే నిదర్శనము లున్నవి. అప్పకవికాలమునం దా పుస్తకములో "నుమ్యోచ్చతో హల్య థర్వణాచార్యమతాత్" అను సూత్రముండుట చేతను, దాని నప్పకవి

గీ. సమసనమున నామాంతశృంగముల కెల్ల
హల్లు గదియ స్వార్థంబునఁ బొల్లుద్రుతము
వికృతి నాగమమై ద్రుత ప్రకృతిపగిది
గాంచు సంధి నథర్వణకవిమతమున.

అని తెనిఁగించుటచేతను నన్నయభట్టారకుని తరువాతి కాలపు వాఁడైన యథర్వణాచార్యుని పే రాంధ్రశబ్ద చింతామణియం దుండుట యొక్క-టియే యది నన్నయభట్ట విరచితము కాదని స్థాపించుచున్నది. ఈ బాధకమును తొలఁగించుటకై తరువాతివారు పయి సూత్రములోని "యథర్వణాచార్యమతా"త్తను భాగమును దీసివేసినారు. భారతమును జదివిన బాలురకు సహితము తెలుఁగున పదాదియందు యకారము లేదని నన్నయభట్టమత మగుట కరతలామలక మగును అట్లయ్యు నాంధ్రశబ్ద చింతామణి యందు "అవ్యః క్రియాసు భూతార్థ ద్యోతిన మాద్యగం వినా సర్వః" అను సూత్రములోఁ బదాది యకారమున్నట్లు చెప్పఁబడినది.

"సర్వత్రాఽన్య త్కార్యం జ్ఞేయం యస్య ద్రుతప్రకృతి కేభ్యః"

అని యీ ఆంధ్రశబ్ద చింతామణి సూత్రము ద్రుతప్రకృతికముల కంటె బరమయిన యకారమున కంతట నచ్చువలెఁ గార్యమగునని చెప్పుచున్నది.

ఇది భారతప్రయోగముల కెల్ల విరుద్ధమయిన దని యెల్లవారికిని దెలియును. కాఁబట్టి యీరెండు సూత్రములును నన్నయభట్టు వయి యుండవు.

"నిత్య మనుత్తమ పురుషక్రియా స్విత:"

అనెడి యీ యాంధ్రశబ్ద చింతామణి సూత్రము ప్రథమ మధ్యమ పురుష క్రియాపదములయం దికారమున కచ్చు పర మగునప్పుడు సంధి నిత్యమని చెప్పుచున్నది. ప్రథమ పురుష క్రియాపదముల యికారమునకు సంధి వైకల్పిక మయినట్లు భారతమునందలి నన్నయభట్టారకుని ప్రయోగములే చెప్పుచున్నవి ఆ ప్రయోగములకు విరుద్ధముగా నున్నయిది నన్నయభట్టు సూత్రము కానేరదు. అరణ్యపర్వములోని యీ క్రింది పద్యభాగమును జూడుఁడు.

"అంతఁ గొంద అధికహాస్యంబుచేసిరి
యడవి సేమి రోసె దనిరి కొంద
అవ: నీవు వేల్పు వౌ దని కొందఱు
మోడ్పుఁగేలితోడ మ్రొక్కిరంత" [ఆ. ౨-౧౦౨]

సమస్తభాషల యందును గ్రియలలో ననుబంధ మక్కఱలేకయే వర్తమానార్థకమును దెలిపెడి రూప ముండును. "పలికెడు" అనునది వర్తమానార్థక రూపకముగాను, "పలుకును" అనునది భవిష్యదర్థక రూపముగాను, ఉన్నట్టు భారతాది గ్రంథములలోని ప్రయోగములు తెలుపుచున్నవి.

క. అఱిపోఱడు కుఱువచేతులు
నోఱవ శరీరంబు గలిగి యొరులకుఁ జూడం
గొఱ గాకుండియు మన్మధు
నోఱ వులఁ బడిమెడు నితండు యువతి ప్రియుఁడై.

[అరణ్యపర్వము, ఆ. ౨-౧౩౪]

క. నాయొద్ద నుండు దేనియుఁ
జేయు రథాశ్వముల గతులు చిత్రంబులుగా

సీయెడ నావుడు నట్టుల
చేయుదు నని నలుఁడు వాని సేవించెఁ దగన్.

[ఆరణ్యపర్వము, ఆ. ౨-౧౩౦]

అని నన్నయభట్టారకుఁ డారణ్యపర్వమునందు వర్తమానార్థమున "పడియెడు" ననియు భవిష్యదర్థకమున "చేయుదు" ననియు, వాడియున్నాఁడు ఈ ప్రకారముగానే సభాపర్వమునందును

చ. ఇది యుచితంబు గాదనక యిక్కురుముఖ్యులు చూచుచుండ దు
ర్మదుఁడయి వీఁడు నన్ను నవమానముఁ "జేసెడి" సర్వధర్మసం
విదు లన నున్నయీ భరతవీరుల ధర్మము నేఁ డధర్మసం
పద నతినింద్య మయ్యె నని భామిని కృష్ణ దలంచె భీతయై.

[ఆ. ౨-౨౧౯]

అని వర్తమానార్థమునఁ "జేసెడి" ననియు,

మ. కురువృద్ధు ల్గురువృద్ధబాంధవు లనేకుల్ చూచుచుండ న్మదో
ద్ధురుఁడై ద్రౌపది నట్లుచేసిన ఖలున్ దుశ్శాసనున్ శోకభీ
కరలీల న్వధియించి తద్విపులవక్షశ్శైలరక్తౌఘని
ర్ఝరముర్వీపతి చూచుచుండ నని నాస్వాదింతు నుగ్రాకృతిన్

[ఆ ౨-౨౩౩]

అని భవిష్యదర్థమున "నాస్వాదింతు" ననియు, ప్రయోగించెను ఈ రీతినే యాదిపర్వమునందును

చ. అమిత జగద్భయంకర విషాగ్నియు నప్రతిహతప్రమాణవీ
ర్యముఁ గలయట్టి సర్పముల కా జనమేజయుఁ జేయు సర్పయా
గమున నుదగ్రపావక శిఖాహతులం దొరఁగంగఁ గారణం
బమల చరిత్ర యేమి చెపుమంచు వినం గను వేడ్క యయ్యెడున్.

అని వర్తమానార్థకమున "నయ్యెడు" ననియు

క. తనసతి కపకారము చే
సిన పాముల కలిగి బాధ చేయుఁడు నని చి

క్కని దండము గొని పాములఁ
గనినప్పుడ యడువఁ దొడఁగె గహనములోనన్. [ఆ. ౧-౫౨]

అని భవిష్యదర్థమున "చేయుదు" ననియు, నన్నయభట్టు ప్రయోగించెను. శబ్దశాసను కవిత్వములో నుండి వర్థమానార్థకమున కున్నాను బంధముగాని. భవిష్యదర్థమునకు కలానుబంధముగాని, వచ్చిన రూపము నొక్కదానినైనను జూపగలరా ? ఇది యొక్కటియే యాంధ్రశబ్ద చింతామణి నన్నయభట్ట విరచితము కాదని స్థాపించుటకుఁ జాలినంత ప్రబల ప్రమాణము కాదా ?

"ఉ. ఆదిని శబ్దశాసనమహాకవి చెప్పిన భారతంబులో
నేది వచింపఁగాఁబడియె నెందును దానినెకాని సూత్రసం
పాదనలేమిచేఁ దెలుగుఁపల్కు మఱొక్కటి గూర్చి చెప్పఁగా
రాదని దాక్షవాటికవిరాక్షసుఁడే నియమంబు చేసినన్."

క. ఆ మూఁడు పర్వములలో
నామాన్యుఁడు నుడువు తెలుఁగు లరసికొని కృతుల్
దాము రచించిరి తిక్కను
భీమణీ మొదలైన తొంటి తెలుగు కవీంద్రుల్.
[అప్పకవీయము, పీఠిక ౪౬, ౪౭]

అనునట్లు తెలుఁగు వ్యాకరణము లేకపోవుటచేత నన్నయభట్టారకుఁడు చేసిన ప్రయోగానుసారముగానే కాని వేఱు విధముగా పదప్రయోగము చేయఁగూడదని కవిరాక్షసుఁడు చేసిన నియమమునుబట్టి తన్మతానుసారముగానే తిక్కనాదులు తెలుఁగుకావ్యములు రచించి రనుటయు,

"శ్లో. అధర్వణాని కాణ్వాని బార్హస్పత్యాని సంవిదన్
కౌముదీ మాంధ్రశబ్దానాం సూత్రాణి చ కరోమ్యహమ్"

అని యాంధ్రకౌముది కర్తయు,

"శ్లో. బార్హస్పత్యాని సర్వాణి కాణ్వం వ్యాకరణం విదన్
కరో మ్యాధర్వణం శబ్దం సర్వలక్షణలక్షితం."

అని త్రిలింగ శబ్దానుశాసనకర్తయు, లక్షణ గ్రంథకర్తలైన యితరాంధ్ర లాక్షణికులును పూర్వాంధ్ర వ్యాకరణ కర్తలపేరు లుదహరించి బాలసరస్వతి

కాలమువఱకు నెవ్వరును నన్నయభట్టు పేరెత్తక పోవుటయు, ఇప్పటి యాంధ్రశబ్ద చింతామణి నన్నయకృతము కాదని సహస్రముఖముల ఘోషించుచున్నది. పై శ్లోకములలో నుదాహరింపఁ బడిన బృహస్పతి శారదాదర్పణ గ్రంథకర్తయని చెప్పుచున్నారు

తిక్కనసోమయాజి కాలమునం దివియే వర్తమాన భవిష్యదర్థక రూపములుగాఁ బరిగణింపఁబడుచున్నట్లు కేతన కృతియైన యాంధ్రభాషా భూషణ మీ క్రింది పద్యములతో ఘోషించుచున్నది

క. డును, దరు, లొరులకు, నెదిరికిఁ
దనరంగాదు, దవు, దరులు, తనకుఁ దను, దముల్,
చను నేకబహువచనముల
మనుసన్నిభ! క్రియల వర్తమానార్థములన్. [ప. ౧౪౨]

క. అడిగెడు నడిగెద రనఁగా
నడిగె దడిగెదవు ధనంబు నడిగెద రనఁగా
నడిగెద నడిగెద మనఁ బొ
ల్పడరంగా వరుసతో నుదాహరణంబుల్. [ప. ౧౪౩]

క. ఉను, దురు, లొరులకుఁ జెప్పను;
ననరఁగ దువు, దురు, లెదిరికిఁ, దనకు దును, దుముల్,
తనరఁగ నివి యేకబహువ
చనము లగు భవిష్యదర్థకసంసూచకముల్. [ప. ౧౪౪]

క. పలుకును బలుకుదు రనఁగాఁ
బలుకుదువు పలుకుదువు రనఁగఁ బలుకుదు నర్థిన్
బలుకుదు మనఁగా నివ్వియు
నలఘుమతీ! వరుసతో నుదాహరణంబుల్. [ప. ౧౪౫]

ఈ ప్రకారముగానే విన్నకోట పెద్దన తన కావ్యాలంకార చూడామణి యందు

"వ. ప్రథమ పురుషంబునకు వర్థమానార్థమునందు నేకవచన బహువచనంబులకు నెడినెదరులును మధ్యమపురుషంబులకు నెదవెదరులును నుత్తమ

పురుషంబునకు నెదనెద లును మధ్యమంబున నా దేశంబులయ్యెఁ దన్ని
రూపణం బెఱిఁగింప

క. అరిగెడి నరిగెను రనఁగా
నరిగెద వరిగెద రనంగ నతిపురికై
యరిగెద నరిగెద మనఁగాఁ
బరువడి నిది వర్తమానభవితార్థ మగున్

వ. ప్రథమ పురుషమునకు భవిష్యదర్థంబునందు నేకవచన బహువచనంబులకు నుదురులును మధ్యమపురుషంబునకు దుదువుదురులును నుత్తమ పురుషంబునకు దునుదుములును నను నాదేశంబులయ్యెఁ దన్నిరూపణంబు లెట్లనిన

క. చేయును జేయుదు రనఁగాఁ
జేయుదు చేయుదువు మీరు చేయుదు రనఁగాఁ
జేయుదుఁ జేయుదు మనఁగా
నాయనముగ నిది భవిష్యదర్థం బయ్యెన్.

[నవమోల్లాసము - పరిషత్ప్రతి పుటలు 64, 65]

అని చెప్పియున్నాఁడు. ఇది యిట్లుండఁగా నాంధ్రశబ్ద చింతామణియందు
"వసతి రనుబంధక స్స్యా ద్యత్ర లడర్థో వివక్షిత స్తత్ర"

అని క్రియాపదంబునకు వర్తమానార్థము వివక్షిత మగునప్పుడు 'వస' ధాత్వర్థమైన "యున్న" యనుబంధక మగు ననియు

"అస్తి రనుబంధక స్స్యా ద్యత్ర లృడర్థో వివక్షితోధాతోః"

అని క్రియాపదంబునకు భవిష్యదర్థము వివక్షిత మగునప్పుడు 'అస' ధాత్వర్థమైన "ఁల" యనుబంధక మగు ననియు చెప్పఁబడియున్నవి. అనుబంధము లేక వర్తమాన భవిష్యదర్థక రూపము లున్నట్టు చెప్పనట్లెయు భవిష్యదర్థ

మునం దెప్పుడో గాని రాని కలజ్యను బంధమును నిత్యముగా విధించు నట్టియు నివి నన్నయసూత్రము లయి యుండవు

"కవిభల్లటైః క్రియాణాం నామ్నాం చోల్లోప ఇష్యతే హ్యేషు,
ప్రథమైక వచనమాత్రేవికృతౌ నాన్తాదయోపి కథ్యన్తే"

అనెడి యాంధ్రశబ్ద చింతామణి సూత్రము (చూడర్జునులు, విల్వాని, ఇత్యాది స్థలములలో) క్రియాపదముల యొక్కయు నామపదముల యొక్కయు ఉకారము లోపించునని కవిభల్లటులచేత విధింపఁబడినట్లు చెప్పు చున్నది. నన్నయ్యభట్టునకుఁ బూర్వమునందే యిట్టి సూక్ష్మాంశములను సహితము దెలుపు తెలుగుఁ వ్యాకరణము లుండిన యెడల నాంధ్రశబ్ద చింతామణితోఁ బ్రయోజనమే యుండదు కవిభల్లటుఁడు నన్నయ్యభట్టునకుఁ దరువాతివాఁ డయినట్టు తెలియ వచ్చుచున్నది ఈ కవి విక్రమార్కచరితమును రచించి యున్నాఁడు ఇట్లాంధ్రశబ్ద చింతామణిలో నిటీవలివారిపేరు లుండుట యది నన్నయభట్టవిరచితము కాదని నిర్వివాదముగా స్థాపించు చున్నది.

(* ఆంధ్రశబ్ద చింతామణి నన్నయభట్ట విరచితమే యని శ్రీవజ్ఝల - చిన సీతారామస్వామిశాస్త్రిగా రభిప్రాయపడుచున్నారు శ్రీశాస్త్రిగారు తమ 'చింతామణి విషయ పరిశోధనము'లో శ్రీవీరేశలింగము పంతులుగారు చూపిన యాక్షేపణలకు సమాధానములను వ్రాయుచు నిట్లనుచున్నారు- 'సర్వత్రాజ్వతాం కార్యం క్షేమం యస్య ద్రుతప్రకృతి కేభ్యః అను సూత్రము ద్రుతప్రకృతికము కంటె బరమందున్న యకారమున కంతటను నచ్చువలెఁ గార్యమగునని చెప్పుచున్న దనియు, నిది భారత ప్రయోగ విరుద్ధమగుటచే చింతామణి నన్నయ రచితము కానేరదనియు నొక యుక్తిని (పంతులుగారు) చెప్పిరి ఎప్పుడు మొదలగు శబ్దములలోఁ బదాది నచ్చే యున్నదని కొందఱ యాశయము అచట యకారము పదముకంటెఁ బరమగునపుడు సంధివేళలో లోపించుననియుఁ జింతామణికారుని యభిప్రాయము ఉచ్చారణములోనున్న యకారము లేదనుట సరికాదనితలఁచి చింతామణికారుఁ డద్దానిని సంగికరించుచుఁ బ్రయోగ విషయమున బాధలేకుండఁ బైరతిని సరిపెట్టెను. [చూ. విషయము ౪౭]

'చింతామణి ప్రథమ పురుషైకార సంధియు నిత్యమే యని చెప్పుచున్నదనియు నయ్యాది నన్నయ భారతప్రయోగములకు విరుద్ధమనియు నుఱొక యుక్తిని జెప్పుచు వీరేశలింగము పంతులుగా రుదాహరించిరి .. తెలుగునఁ బాదాంతమగు నపుడు

ఇవి యన్నియు నాంధ్రశబ్దచింతామణి నన్నయకృతము కాదని యూహించుటకుఁ దోడుపడుచున్నవి. బాలసరస్వతికిఁ బూర్వము నందుండిన కవులు కొందఱు నన్నయభట్టారకుని "శబ్దశాసన" పదముతోను తదర్థబోధకము లయిన "వాగనుశాస' నాది పదములతోను వ్యవహరించుచు వచ్చినందున నాంధ్రశబ్ద చింతామణియొక్క యునికి వారికిఁ దెలియునని కొందఱు భ్రమ పడుచున్నారు. వ్యాకరణము జేయుటచే నీ బిరుదాతనికి వచ్చినట్లు దేని వలనను గనఁబడదు. భాషననుశాసించి సలక్షణ మయిన యాంధ్రకవిత్వమునకు దారి చూపుటచేతనే యీ బిరుదము నతఁడు వహించి యుండవచ్చును. జక్కనకవి తన విక్రమార్కచరిత్రమునందు నన్నయభట్టు నీ క్రింది పద్యముతో స్తుతించి యున్నాఁడు.—

వాక్యాంత మయ్యెనేని సంధి వైకల్పికమని నన్నయాభిప్రాయము [చూ విషయము ౭౫]

'నన్నయ భారతభాగములోని ప్రయోగములకు సరిగా నాంధ్రభాషా భూషణము, కావ్యాలంకార చూడామణి మున్నగు ప్రాచీన లక్షణ గ్రంథములలో 'ఎడ్యెడు' ప్రత్యయాంత రూపములును, ఎదగాగమ యుక్తరూపములును వర్తమానార్థకములనియు, దుగాగమ యుక్తరూపములు భవిష్యదర్థము లనియుఁ జెప్పఁబడి యున్నట్లును, నాంధ్రశబ్ద చింతామణిలో నట్లు ప్రాచీన పద్ధతిని చెప్పఁబడక 'ఉన్నాను బంధ' యుక్తరూపములు వర్తమానార్థకములనియు, 'కలానుబంధ' యుక్తరూపములు భవిష్యదర్థకములనియు నవీనపద్ధతిని జెప్పఁబడినట్లును. నకారణమున నాంధ్రశబ్ద చింతామణి ప్రాచీన మనుటకు కలను పడనట్లును నాంధ్రకవుల చరిత్రమున వ్రాయబడియున్నది.

'ఆంధ్రభాషా భూషణ, కావ్యాలంకార చూడామణికర్తలు భారతమునే గాక యీ కాలమునఁదవలి యాంధ్రవాఙ్మయమునే బాగుగఁ బరిశీలింపక యే క్రియారూపముల కాలముల నుపదేశించిరనుట సాహసము కాదు. వీరేశలింగము పంతులుగారు స్వవాదోపయుక్తములగు ప్రయోగములను మాత్రమే భారతమునుండి చూపి బాధక ప్రయోగములను జూపకుండుట యుక్తముకాదు. పురాతనాధునాతన వాఙ్మయములో నెచ్చటను దుగాగమ యుక్తరూపములకుఁగాని, ఎదగామ యుక్తరూపములకుఁ గాని కాలనియమ మగపడదు ద్వివిధరూపములను వర్తమాన,భవిష్యత్కారములు రెండింటి యందును నన్నయభట్టారకుఁడే వాడి యున్నాఁడు. ఇంకను దుగాగమ యుక్తరూపములకు భూతకాలమునందును సరుసగ వాడుక కలదు [విష. ౨౮, ౬౦]

ఉ. వేయి విధంబులందుఁ బదివేవురు పెద్దలు సుప్రబంధముల్
పాయక చెప్పి రట్లు రసబంధురభావభవాభిరామ ధౌ
రేయులు శబ్దశాసనవరేణ్యులు నాఁగఁ బ్రశస్తి కెక్కిరే
యేయెడ నన్నపార్యగతి నిద్ధర నట్టి మహాత్ముఁ గొల్చెదన్.

(అశ్వా. ౧-౧౨)

ఈ కవి నన్నయభట్టును స్తుతించిన పయిపద్యములో సుప్రబంధములుచేసిన వారు పదివేవు రుండఁగా వారెవ్వరును గాక యతఁ డొక్కఁడే శబ్దశాసన వరేణ్యుఁ డయ్యెనని వర్ణించుటచేతఁ గొందఱనుకొను నట్లాతనికి శబ్దశాసన బిరుదము వ్యాకరణ రచనచేత రాలేదనియు, సలక్షణమైన ప్రౌఢ కవిత్వ రచనచేతనే వచ్చినదనియు స్పష్టపడుచున్నది * తాను విపుల శబ్దశాసనుఁడ

(* శ్రీనిడుదవోలు - వేంకటరావుగారి 'తెనుఁగు కవుల చరిత్ర'లో క్రిందివిషయమును వెల్లడించుచున్నారు

నన్నయ భారతమునఁ దాను శబ్దశాసనుఁడ నని చెప్పుకొనుటచే, నాతఁడు వ్యాకరణ రచయిత యని చెప్పవీలులేదు. శబ్దశాసన బిరుదము నన్నయకు లేదు. అది తర్వాతి వారిచే నాతని కారోపింపఁ బడియున్నది.

నన్నయ వ్యాకరణమును రచించినచో - అనఁగా 'అనుశాసనము' చేసినచో 'శబ్దాను శాసనుఁడు కావలయును. 'శాసనుఁడు, అనుశాసనుఁడు' అనునవి వేఱు వేఱర్థములు కలవి. 'శబ్దశాసనుఁడనునది బిరుదమని నన్నయ చెప్పుకొనలేదు. ఇది బిరుదైనచో 'జపహోమ తత్పరుఁడు, సంహితాభ్యాసుఁడు, నానాపురాణ విజ్ఞాననిరతుండు' మున్నగునవియు నతని బిరుదములే యని యనవలసి వచ్చును నన్నయకు 'శబ్దశాసన' బిరుద మున్నట్లు తిక్కన, ఎఱ్ఱాప్రెగ్గడ, మడికిసింగన పోతన - మున్నగువారు చెప్పలేదు. వసుచరిత్రను రచించిన రామరాజభూషణుఁడు 'మహిముక్ వాగనుశాసనుండు సృజియింపన్' అని 'శబ్దశాసనుండు' అను దానిని 'వాగనుశాసనుఁడు'గా మార్చెను. అప్పటినుండియు నిదియే నన్నయ బిరుదుగా వాడుకలోనికి వచ్చెను. నిజముగా 'శబ్దశాసనుఁడు' బిరుదైనచో దానికి బర్యాయపదముండుటకు వీలులేదు. బిరుద పదములు పర్యాయపదా సహిష్ణువులగుట భాషాసంప్రదాయాభిజ్ఞులకు గ్రొత్తకాదు పర్యాయములను వాడవచ్చుచున్నచో 'శంభుదాసు'ను 'శంకరదాసు'గను, 'ఉభయకవిమిత్రుని' 'ద్విభాషా కవిమిత్రుఁ' డనియు నీరీతిగాఁ జెప్పవలసి వచ్చుచుండును కాన 'శబ్దానుఁ శాసనుఁడు' బిరుదు కాదనియే చెప్పవలెను)

నని భారతములోనే నన్నయభట్టారకుఁడు చెప్పుకొని యున్నాడు. ఈ పద ప్రయోగమునుబట్టియే యాతని కితర కవులు వాగనుశాసనాది విశేషణములు చేర్చి యున్నారు ఇటీవల నాంధ్రశబ్ద చింతామణిని రచియించినవారును "విపులశబ్ద శాసన" నన్న ప్రయోగము నాధార పఱుచుకొనియే యది నన్నయభట్ట కృతమని లోకమును మోహపెట్టి యున్నారు "విపులశబ్దశాసన" బిరుదము వ్యాకరణ రచనచేతనే వచ్చిన దనెడు పక్షమున, ఆంధ్రశబ్ద చింతామణిలోని "ఇతి శ్రీసకల భాషావాగను శాసన నన్నయభట్టు విరచితాంధ్ర శబ్ద చింతామణౌ" అను పరిచ్ఛేదాంత గద్యమునుబట్టి యతఁడు సకల భాషలకును వ్యాకరణములు చేసెనని చెప్పవలసి వచ్చుగదా! అట్లతఁడు చేసి యుండక పోవుట స్పష్టము. అతఁడు తనకుఁగల పాండిత్య విశేషాదులను భారతములోనే తెలుపుకొని యుండుటచేతఁ దద్విరుద్ధముగా నున్న "సకల భాషావాగను శాసన" పదప్రయోగమువలననే యా పుస్తకము నన్నయభట్ట విరచితము గాక తదన్య కల్పిత మనియు, పుస్తకమున కౌత్కృష్ట్యమును కలిగించుటకయి గ్రంధకర్త లీ విశేషణమును నన్నయభట్టునకుఁ జేర్చిరనియు, గ్రంథము నన్నయభట్ట కృతిమేయయిన పక్షమున, నిట్టి విశేషణ ముండదనియు, దీనినిబట్టిఁ సులభముగాఁ దెలిసికొనవచ్చును. ఆంధ్రశబ్ద చింతామణి నన్నయభట్టవిరచిత మని తమ స్వప్నదర్శన వృత్తాంతమునుబట్టి మొట్టమొదటఁ జెప్పినవారుకూడ నేతద్గ్రంధ రచనము నొక్క సారంగధరుఁడు తక్క నన్యు లెవ్వరు నెఱుఁగ రనియు, దాని నతఁ డొక్క బాలసరస్వతి కిచ్చెననియునే కదా చెప్పుచున్నారు! వారి మాటలను విశ్వసించినను, నన్నయభట్టాంధ్రశబ్ద చింతామణిని రచించిన ట్లాతని తరువాతకవులకెవ్వరికిని దెలిసి యుండనట్టు స్పష్టమగుచున్నది. ఇది యిట్లుండగా నప్పకవికిఁ తరువాత నాంధ్రశబ్ద చింతామణికి సంస్కృత వ్యాఖ్య చేసిన యహోబల పండితుఁడు "నుమ్మోచ్ఛతో" ఇత్యాది సూత్రమునందుఁ గల "హల్యధర్వణాచార్యమతాత్" అను భాగమును వదలివేసి (హల్యధర్వణ స్వమత ఇత్యప్పకవి పుస్తక పారస్తు నైతత్పార సామంజస్యం లభ్యత ఇత్యుపేక్షితః) హల్లిథర్వణ మతప్రకారముగా లభించిన దన్న యప్పకవి పాఠ క్షి

పారముతో సరిపోవనందున నుపేక్షింపఁబడినదని వ్రాసియున్నాఁడు. అంత యల్పకాలములో నిన్ని పాఠభేదము లెట్లు గలిగెనో దురూహ్యముగా నున్నది. అప్పకవి మతానుసారముగా సారంగధరుని యనుగ్రహము వలన బాలసరస్వతి కొక్క పుస్తకము మాత్రమే లభించి యతఁడు చేసిన తెలుఁగు టీకతో నతని కది స్వప్నములో సాక్షాత్కరించిన గోపాలకృష్ణుని యనుగ్రహమువలన నొక బ్రాహ్మణునిచే లభించినది. అప్పటికిఁ బాఠభేదములు లేవు. అంతటి యల్పకాలములో బహుపాఠభేదములు కలుగుట కవకాశము సహితము లేదు. ఇఁక నహోబల పండితుని మతానుసారముగా (పాఠభేదాస్తు బహవోదృశ్యంతే పుస్తకద్వయే మయా ప్రాయస్సరస్వత్యాః పుస్తకం గృహ్యతే) పాఠభేదము లనేకములు కనఁబడుచుండగా నందు బాలసరస్వతి పాఠమే యతనిచేఁ దఱుచుగా గ్రహింపబడుచు వచ్చినది. ఈ రెండు మతములలో నప్పకవి చెప్పినట్లు సారంగధరుఁ డొక్క పాఠము నొక బాలసరస్వతి కిచ్చిన మాట నిజమో! లహోబలపండితుఁడు చెప్పినట్లు పెక్కుపాఠభేదములుండి యందు బాలసరస్వతి దొక్కటి యగుట నిజమో! ఏది యెట్టిదయినను బాలసరస్వతినో, మఱియెవ్వరిచేతనో యాంధ్రశబ్దచింతామణి యూ కాలమునందే రచియింపఁబడుట మాత్రము నిజము. అందుఁ గనఁబడుచు వచ్చిన దోషముల నప్పుడప్పుడు వారువారు తమకుఁ దోచినట్లుగా దిద్దుచు వచ్చుటచేత నేర్పడినవే యీ పాఠభేదము లయియుండును. "అద్యః క్రియాసు భూతార్థద్యోతిన మాద్యగం వినా సర్వః" అను దానిలోని దోషమును గనిపెట్టి యప్పకవి దానిని "అద్యః క్రియాసు భూతాద్యర్థసముద్యోతి రం వినా సర్వః" అని సంస్కరించినాఁడు. అట్లే యహోబల పండితుఁడును మఱియొక దోషమును గనిపెట్టి "హల్యధ్వరణాచార్యమతాత్" అన్న దానిని వదలివేసి యింకొక సంస్కారమును జేసినాఁడు. కలవన్ని పాఠభేదము లన్నియు నిట్టివే. ఈ పాఠభేదములను గూర్చి యిందింత కంటె నధికముగా చర్చించుట యనావశ్యకము. ఆంధ్రశబ్దచింతామణి నన్నయ కృతము కాదని చూపుట కింతయే చాలియుండును. ఇది యిట్లుండఁగా నీ నడుమ ననంతపురమండల పండితు లిరువురు తమకుఁ గ్రొత్తగా నన్నయభట్టీయ ముద్రాపకులు మొద

లైన వారి కెవ్వరికిని దొరకని బాలసరస్వతి కృతటీకాసహితాంధ్రశబ్ద చింతామణి లభించినదనియు, తన్మూలమున నప్పకవి మొదలైన వారికథ లబద్ధములయి సత్యము తేటపడినదనియు, ఆ గ్రంథమును జూచి యుండిన యెడల నేను నా కవులచరిత్రములో నట్లు వ్రాసియుండననియు, నుడువుచు బాలసరస్వతి కా గ్రంథము లభించిన మార్గమునుగూర్చి యప్పకవ్యాదులు చెప్పిన దానికంటెను నెక్కుడు యసంగతముగా నున్న కథతోఁ గూడిన యీ క్రింది యవతారిక నుదాహరించుచు నాంధ్రసాహిత్య పరిషత్పత్రిక కొక వ్యాసము వ్రాసియున్నారు.* —

"ఉ. ఏమి మహాద్భుతం బది ! హరీహరి ! యెక్కడియాంధ్రశబ్ద చిం
తామణి ఫక్కి ? యెక్కడి మతంగనగంబు ? యుగాదిసంభవుం
డై పని చన్ననన్నమహాకవి యెవ్వఁడు ? సిద్ధుఁ డెవ్వఁడా
హా ! మదగణ్యపుణ్యసముదగ్రతఁ జేకుఱెఁగాదె యిన్నియున్.

మ. ఇలఁ బ్రజ్ఞానిధులౌ కవు ల్మనుపు లేరే ? వారు వ్యాఖ్యాన క
ర్తలు గానోపరె ? పెక్కువత్సరము లంతర్భూతమై యున్నయీ
తెలుఁగువ్యాకరణంబు నా కొసఁగె బ్రీతిం డీక గావింపుమం
చల సిద్ధుండు మదిష్టదేవత విరూపాక్షుండు నిక్కంబుగన్.

వ. ఆంధ్రశబ్ద చింతామణిఁ దెనిఁగించెద నిది తొల్లి సకల కవితా ప్రవర్తకుండగు శబ్దశాసనుండు సకలహితంబుగా యధోచిత సూత్రగర్భితంబులగు నార్యావృత్తంబుల బంచ పరిచ్ఛేదంబుగా సమకట్టె. నేను నా నేర్చుకొలఁదిఁ దత్సూత్ర విభాగంబును, దత్ప్రమేయ వివరణంబును, దదుదాహరణ స్వరూపంబులునునంధ్రమయ గద్యపద్యంబుల నేర్పరించి నా యాత్మదేవత యగు నంబాదేవి కర్పించువాఁడ."

(* శ్రీమల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారు, శ్రీరాళ్ళపల్లి గోపాలకృష్ణ శర్మగారును అనంతపురమండలమున సంపాదించిన బాలసరస్వతీయము 1932లో ఆంధ్రసాహిత్య పరిషత్తువారిచేఁ బ్రకటితము.)

పయి వాక్యము లందుండినవో లేవో కాని బాలసరస్వతీయము మాత్రము వా రనుకొన్నట్లుగాక యెల్లవారికిని నెల్లచోటులను లభ్యమగుచునేయున్నది. బాలసర్వతీయము చెన్నపురి ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమునం దున్నది పూర్వ మాంధ్రశబ్దచింతామణిని చెన్నపట్టణములో ముద్రించినవారు పుస్తక ముఖపత్రమునందు

"ఆంధ్రభాషను సలక్షణముగా నభ్యసించుటకు
ముఖ్యసాధనముగా నుండెడు నన్నయభట్ట ప్రణీ
తాంధ్రశబ్ద చింతామణి
యను నాంధ్ర వ్యాకరణ గ్రంథము
ఎలకూచి బాలసరస్వతి యను నుత్తమ పండితునిచే
నాంధ్రంబున రచియింపంబడిన బాలసరస్వతీయమను
టీకతోఁ జేర్చి
పురాణం హయగ్రీవ శాస్త్రిలుగారిచే
లేఖక ప్రమాదజనితదోషంబులవల్లం బరిష్కరింపంబడి
ప్లవంగసంవత్సరాశ్వయుజ శుద్ధాష్టమియందు
వివేకాదర్శ మనుస్వకీయ ముద్రాక్షరశాలలో
అచ్చు వేయింపంబడెను.
దీని మూల్యము అణాలు ౧౨"

అనియు, పుస్తకాంతమునందు

"బాలసరస్వతీయ టీకా సహితాంధ్రశబ్ద
చింతామణి గ్రంథము సంపూర్ణము"

అనియు, ముద్రించి యున్నారు. అది యటుండనిండు.

అప్పకవియు నహోబలపండితుడును చెప్పిన ప్రకారముగా నన్నయభట్టు రచించి నప్పుడు పఠించిన సారంగధరుడే సిద్ధులలో గలిసి తనకు ముఖస్థ మయి స్వాధీనములో నుండిన పుస్తకమును దెచ్చి మతంగగిరికడ బాలసర స్వతుల కిచ్చెను. ఈ పుస్తక పీఠికను బట్టి పుస్తకముతో సంబంధమేమియు

లేని సిద్ధుఁ డొక్కఁడు తిక్కనకేతనాది సుప్రసిద్ధాంధ్రకవులకును పెద్దనాది లక్షణవేత్తలకును నెవ్వరికిని బహుశత సంవత్సరముల నుండి పేరైనను దెలియకుండిన తెలుఁగు వ్యాకరణ సూత్రములను దెచ్చి డీక చేయుమని మతంగగిరికడనే తానావఱ కెఱుఁగని బాలసరస్వతుల కిచ్చెను. దేశాటనము చేయుచుండిన సిద్ధుఁ డీ యపూర్వాంధ్ర వ్యాకరణమును మోక్షదాయకమైన యోగసిద్ధాంత గ్రంథమని సంపాదించి తెచ్చి యిచ్చెనా? తనకుఁ గల సామాన్యాంధ్ర భాషాభిమానమునుబట్టి వెదకి తెచ్చి యిచ్చెనా? మఱి యే హేతువుచేత తెచ్చి యిచ్చెను? నిజ మారయఁగా బాలసరస్వతియే తాను దీనిని రచియించి గ్రంథప్రామాణ్య సంసిద్ధిని కథను గల్పించి యుండును. గ్రంథ ప్రాశస్త్యార్థమైన యెడల, కర్తృత్వమును తానే వహించి యాకీర్తిని తానే పొందక నన్నయభట్టున కేల యారోపింపవలయు ననియు, ఆరోపింప దలఁచిన యెడలఁ దనవంశములోనివాఁడైన నన్నయ కారోపింపక నన్నయ భట్టునకే యేల యారోపింపవలయుననియు, మన మిత్రు లడుగుచున్నారు. పుస్తకమునకుఁ గలిగిన ప్రమాణత్వ మంతయు నన్నయభట్టుయొక్క గొప్ప తనమువలన వచ్చినదే కాని స్వయోగ్యత వలన వచ్చినది కాదు దీనినే బాలసరస్వతి కృతమని కాని తత్ప్రపితామహకృతమని కాని చెప్పినచో నెవ్వరు ప్రామాణికబుద్ధితో నాదరించి దానిని బహూకరింతురు? గ్రంథము యొక్క యర్హతను బట్టియే చూచెడు పక్షమున, అథర్వణకారికావళి దీనికంటె శతగుణము లధిక గౌరవార్హ మయినదిగా నుండును నే నీ పుస్తకము నన్నయ కృతము కాదన్నది పుస్తకములోని యంతస్సాక్ష్యమునుబట్టిగాని టీకలోఁ జెప్పఁబడిన దానినిబట్టి కాదు ఇఁకఁ టీకలోని విషయ విచారమునకు వత్తము.

మొదటి పద్యములో "యుగాది సంభవుండై మనిచిన నన్నన మహాకవి యెవ్వఁడు?" అని యున్నది. అప్పటి కయిదాఱునూఱుల సంవత్సరముల క్రిందట నుండిన నన్నయ యెక్కడ? యుగాది యెక్కడ? ఈతడు కలిగించిన భ్రమలోనే పడి యప్పకవి కలియుగమున కాదిని నన్నయ రాజమహేంద్రవరములో నుండెనని చెప్పెను. రెండవ పద్యములో "పెక్కు

వత్సరము లంతర్భూతమైయున్న యీ తెలుఁగు వ్యాకరణంబు నాకొసఁగె" నని యున్నది. పెక్కు సంవత్సరము లనఁగా నప్పటి పెక్కువందల సంవత్సరము లని యేమో! రచియింపఁబడిన తరువాత గ్రంథము నిజముగానే పెక్కు సంవత్సరము లంతర్భూతమై యుండెనేమో! తెలుఁగు వ్యాకరణ మనుచో మొదటి దేగణము? గువర్ణ మెటు గురువగును? కడపటి వచనములో "సకల కవితా ప్రవర్తకుండగు శబ్దశాసనుం" డనుట ఆంధ్రశబ్ద చింతామణి గద్యములో నున్న "సకల భాషావాగనుశాసన"యను దాని కనుకూలముగా నుండుట కొఱకా? మఱి యెందుకొఱకు? "తత్సూత్ర విభాగంబును . .. దదుదాహరణ స్వరూపంబును సంగ్రహమయ గద్య పద్యంబుల నేర్పరించి" యని యున్నది గదా? ఇవి సత్యమా యసత్యమా? సూత్ర విభాగములు మొదలయినవి యెన్ని పద్యములుగా నున్నవి? పుస్తకములోని యంతస్సాక్ష్యమును నిరాకరించి యీ పీఠికలోఁ జెప్పఁబడిన దానినే వేదవాక్యముగా నంగీకరించుట యీ కల్పకులకును సమ్మతమా?

నన్నయభట్టారకుఁడు భీమకవియొక్క రాఘవపాండవీయము నడఁచుటచే నతఁడు నన్నయభట్టీయమును గోదావరిలోఁ గలిపె నన్న యప్పకవి కథ కల్పిత మనుటనుగూర్చి యీ సందర్భమున నింక గొంచెము చెప్పవలసి యున్నది. ఈ క్రింది శ్లోకములతో నప్పకవికథనే యహోబలపండితుఁడును జెప్పి యున్నాఁడు.

శ్లో. నే యం కృతి ర్వేములవాడ భీమప్రబంధకర్త్రా హిమమత్సరేణ
గోదాజలే నాశ మవాపితాభూ దిత్యుద్గతాసీ ద్భువి కింవదంతీ.

* * * *

రాజరాజ తనూజాతః సారంగధర బాలకః
స కృతః పాణిపాదేన రహితోజని హేతునా,
మత్స్యేంద్ర నామసిద్ధేంద్ర మహిమ్నా సిద్ధతాంగతః
జగ్రాహ వ్యాకృతిం తస్మా త్కవివాలసరస్వతీ,
ఎలకూచి కులాంభోధిశరద్రాకానిశాకరః
సమస్త కవితాదక్షో వత్సరే కీలకాహ్వయే

ఈ కథ యబద్ధమని చూపుటకు భీమకవి కృతమైన కవిజనాశ్రయ ఛంద మొకటి కనఁబడుచున్నది. ఈ ఛందస్సు మల్లయరేచఁ డను కోమటిపేర భీమకవిచే రచియింపఁ బడినది ఈ కవిజనాశ్రయములో

క. పరఁగిన విమలయశోభా
సురచరితుఁడు భీమనాగ్రసుతుఁ డఖిలకళా
పరిణతుఁ డయ్యెను భూసుర
వరప్రసాదోదిత ధ్రువశ్రీయుతుడై

(కవిజనాశ్రయము అధస్సూచిక పుట. 2)

క. అసమానదానసవితన
యుపమానోన్నతుఁడు వాచకాభరణుడు ప్రా
ణ సమానమిత్రుఁ డీ కృతి
కి సహాయుఁడుగా నుదాత్తకీర్తి ప్రీతిన్.

(కవిజ. పుట 2 అధస్సూచిక)

క. అనవద్య కావ్యలక్షణ
మొనరంగాఁ గవిజనాశ్రయుఁడు మల్లయరే
చనసుకవి కవిజనాశ్రయ
మను ఛందముఁ దెలుఁగుబాస నరుదుగఁ జెప్పెన్.

(కవిజ .సంజ్ఞా ప. 3)

అని భీమనాగ్రసుతుని తోడ్పాటుతో గ్రంథమును మల్లయరేచన రచించినట్లు చెప్పబడినది. భీమనాగ్రసుతుఁ డనునది "దాక్షారామభీమేశ నందనుఁ డన్" అని కవి చెప్పుకొన్నట్లు భీమేశ్వర పుత్రుడగు భీమకవి యనియే యర్థము చేయవలెనుగాని భీమకవి పుత్రుఁ డనిచేయఁ గూడదు. భీమకవి పుత్రుఁ డని యర్థము చేసెడు పక్షమునఁ గవిజనాశ్రయము భీమకవి కృతమని

గీ. వికటకవులు కొన్ని వింతలు కల్పించి
కవిజనాశ్రయమునఁ గలిపినారు
వానిఁ గైకొనంగ వలదు ప్రయుక్తంబు
నేల చెప్పు బీముఁ దెలిఁగి యెలిఁగి.

ఇట్లప్పకవి లోనగువారు చెప్పిన వచనము లన్నియు నిరర్థకము లగును గదా? ఇందలి గద్యమునందు "ఇతి శ్రీవాగీంద్ర చూడామణి చరణ సరసీరుహ మధుకరాయమాన శ్రావకాభరణాంక విరచితం బయిన కవిజనాశ్రయంబున"నని యున్నది. కవిజనాశ్రయములో పేమన కొన్నిచోట్ల

క. విత్రస్తాఘ పవిత్రచ
రిత్రత్రిదశవర వరధరిత్రీసురస
న్మిత్రాంబుజ మిత్ర గుణా
మాత్ర యనుప్రాస మిదియు మల్లయరేచా

(కవిజ సంజ్ఞాధికారము ౪౿.)

అని యిట్లు మల్లయరేచని సంబోధించియు, కొన్నిచోట్ల

సీ. వివిధచతుష్షష్టి విద్యల నజుఁ డని
విమలనయోపాయవిమల బుద్ధి
నమరేంద్రగురుఁ డని యధికతేజంబున
నాదిత్యుఁ డని సుందరాంగయుక్తి
నంగజుం డని యీఁగి నంగాధిరా జని
యలపున నభిమన్యుఁ డని సమస్త
జనులు ముదంబున శ్రావకాభరణాంకు
సత్కవికవిజనాశ్రయగుణాంబుఁ
బొగడుచుండుదు రని యిట్లు పూర్వరచన
నలరఁ జెప్పిన వడి సీస మయ్యె దీని
పశ్చిమార్ధంబు వడి యొండుపాట నిలుప
నదియె యంకిలివడిసీస మయ్యెఁ గృతుల

(కవిజ జాత్యధికారము ౧౯)

అని యిట్లు రేచనను బొగడియు, కొన్నిచోట్ల

సీ. ప్రాసంబు నాలుగు పాదంబు లందును
బన్నుగా నిడి పెఱపాదములను
బ్రాసంబు లిడక తత్పాదంబులం దెల్లఁ
బన్నుగా వడు లిట్లు పరఁగ నిలిపి
తెలిసి తెలుంగునఁ దియ్యనినుడువులఁ
దెల్లఁబుగా నర్ధదృష్టి దెలుపఁ
బ్రాససీసము దీని పశ్చిమార్ధంబునఁ
బ్రాసంబు వేఱొక ప్రాసమైన
శ్రీసమేతుఁడైన శ్రీపాదపంకజ
వాసమధుకరుఁడు వాసవప్ర
హాసభాసి రేచఁ డను పండితుం డిటు
ప్రాససీస మరసి పఱగఁ జెప్పె.

(కవిజనా - జాత్యధికారము 16)

అని రేచఁడు రచించినట్లు చెప్పియు, నానావిధ పద్యములను జేర్చియున్నాడు. ఇట్టి భీమకృతమైన కవిజనాశ్రయములోని యతిచ్ఛందోధికారమునందు

క ద్వీపమునకు నాకమునకు
నాపై శాస్త్రోక్తి నచ్చు లాదేశసమా
సాపత్తి గలుగుటయు వళు
లాపాదింపుదురు కొంద ఱచ్చను హల్లున్. రాఘ

అను లక్షణమును జెప్పి లక్ష్యము లనుగఁ గావ్యాలంకార చూడామణి నుండి

ఉ ద్వీపుల ద్రుంచి విశ్వజగతీపతి యుత్తమశక్తి జాంబవ
ద్వీపమునందు గోవులకు నిమ్మగఁ జేయుటకుం బ్రసన్నయై
గోపతిధేను వవ్విభునకుం దనవైభవ మిచ్చెఁ గాక యే
భూపతు లీ వదాన్యగుణబుద్ధుల నిట్లు వహించి రుర్వరన్.

క. నీకరవాలము పాలై
నాకంబున కరిగి రాజనారాయణ యా
భూకాంతు లెంతచనువో
నాకవితో త్తముల దూల నడచెదు కడిమిన్ * రారా

అను పద్యములను కవియుదాహరించి యున్నాడు దీనినిబట్టి వేములవాడ భీమకవి కావ్యాలంకార చూడామణిని కృతి నందిన విశ్వేశ్వరరాజు కాలము లోనో, తరువాతనో యుండి యుండవలెను. విశ్వేశ్వరరాజు రాజనరేంద్రున కేడవ మనుమడగుటచేత, రాజరాజనరేంద్రుని కాలములోనున్న నన్నయ భట్టారకుని తరముల తరువాతఁ బుట్టిన విశ్వేశ్వరరాజు కాలములో నుండిన భీమ కవి చేసిన రాఘవపాండవీయము నశించుట సంభవింపనేరదు కాఁబట్టి తన రాఘవపాండవీయము నడఁచినట్టుగ మనసులోఁ బెట్టుకొని భీమకవి నన్నయభట్టారకుని యాంధ్రశబ్దచింతామణిని గోదావరిలోఁ గలిపెననుటయు దానిని సారంగధరుఁడు మరల నుద్ధరించెననుటయు నిరాధారములయిన యసత్యకల్పనము లనుటకు లేశమాత్రమును సందేహము లేదు కవి జనాశ్రయములోని యీ పద్యములు భీమకవి నన్నయభట్టున కాఱుతరముల నన్నఁగా నించుమించుగా నిన్నూఱు సంవత్సరముల తరువాత నున్నట్టు నిరాక్షేపముగా స్థాపించుచున్నవి భీమకవియు నథర్వణాచార్యుఁడును గూడ నన్నయభట్టారకునికిఁ దరువాతి కాలమువారని యేర్పడుటచేత నీర్ష్యాగ్రస్తు డని జను లన్యాయముగా నారోపించిన నిందనుండి విముక్తుఁడయి నన్నయ భట్టారకుఁ డనింద్య చరిత్రుఁ డగుచున్నాఁడు.

నన్నయభట్టే యాదికవి యైనట్టుగా నిటీవలి తెలుఁగుకవులచేత గొనియాడఁ బడుచు వచ్చినను, వాగనుశాసనునకుఁ బూర్వమునందుఁ దెలుఁగుకవులు లేకపోలేదు. అయినను పూర్వకవులు చేసిన గ్రంథములు మాత్ర మిప్పు డేవియు నేత్రగోచరములు కాకున్నవి. ఏ హేతువుచేతనో యా కాలపు పుస్తకము లన్నియు నశించి యుండును. ఆంధ్రదేశమంతయు నొకసారి

* ఈ లక్ష్యములు కొన్నిప్రతులలో లేవనియు, తరువాత నెవ్వరో కవిజనాశ్రయములోఁ గలిపినారనియు, ఒకరు వ్రాయుచున్నారు.

పరరాష్ట్రీయులచేత దగ్ధము చేయఁబడినట్టును, అందుచేతనే యీ దేశము నకు దగ్ధరాష్ట్రమనియు, వేగిదేశ మనియు నామములు కలిగినట్టును చెప్పఁ బడి యున్నది ఆ మహాదహనసమయమునం దావఱకున్న పుస్తకము లన్నియు తగులఁబడిపోయి యుండవచ్చును. అట్లుగాక యావఱ కేమియుఁ బుస్తకములే లేక యుండిన పక్షమున నన్ని కట్టుదిట్టములతో నంత నిర్దుష్ట ముగా నూతనముగా గ్రంధరచన చేయుట నన్నయభట్టునకు గాని మరియెవ్వ రికిఁ గాని సాధ్యమై యుండదు. అయినను మనవారు కొందఱు భారత మునకుఁ బూర్వము తెనుఁగు కవిత్వము లేదనియు, నన్నయభట్టే భారత రచనచేత నాంధ్రకవనమును బుట్టించెననియు, పట్టుదలతో వాదించుచున్నారు. భారతరచనారంభమునకు ముందే రాజరాజనరేంద్రుఁ "డుభయ భాషాకావ్య రచనాభిశోభితుఁ" డని తన్నుఁగూర్చి భావించినట్లు నన్నయభట్టే చెప్పుకొని యుండుటచేత నప్పటికే సంస్కృత కవిత్వమువలెనే తెనుఁగు కవిత్వముకూడ నున్నట్టు స్పష్ట మగుచున్నది ఇది గాక నన్నయ కాలమునందే గణితమును రచించిన పావులూరి మల్లన్నయు, ఆంధ్రభారత రచనకుఁ తోడుపడిన నారా యణభట్టును, తెనుఁగుకవు లుండి యున్నారు. కుమారసంభవమును రచిం చిన నన్నెచోడుఁడు తన పుస్తకమునందుఁ బ్రథమాశ్వాసములో

"క మును మార్గకవిత లోకం
బున వెలయఁగ దేశికవిత బుట్టించి తెనుం
గు నిలిపి రంధ్ర విషయ*మున
జనసత్యాశ్రయుని దొట్టి చాళుక్యనృపుల్." (ప. ౨౩)

అను ౨౩వ పద్యమున సత్యాశ్రయాదులైన చాళుక్యరాజులు తెలుఁగు కవి త్వమును బుట్టించి వెలయఁజేసి రని చెప్పియున్నాఁడు. ఇక్కడ మార్గకవిత యనఁగా సంస్కృత కవిత్వ మని యర్థము. ♦

(* గున నిలిపి రంధ్ర విషయంబున జన చాళుక్యరాజు మొదలుగఁ బల్వుర్ - సరియైన పాఠము.)

(♦ ఈ విషయమును గూర్చి మద్రాసు విశ్వవిద్యాలయమువారు ప్రకటించిన "కుమార సంభవము" యొక్క 'పాఠభేదములు - లఘువ్యాఖ్య'లో నిట్లున్నది-

శ్లో. మార్గదేశివిభాగేన సంగీతం ద్వివిధం మతమ్।
ద్రుహిణేన యదుద్దిష్టం యదుక్తం భరతేన చ॥
తద్దేశీ హి యయా రీత్యా యత్స్యా ల్లోకానురంజనమ్।
దేశేదేశే నుసంగీతం తద్దేశీత్యభిధీయతే॥

అని సంగీత దర్పణమునం దుదాహరింపబడినది. బ్రహ్మచేతను భరతుని చేతను సంస్కృతమున విధింపబడినది మార్గకవిత యనియు, కర్ణాటాది దేశములయందు నా యా దేశభాషలలో నేర్పఱుపఁ బడినది దేశికవిత యనియు, పయిదానితాత్పర్యము. ఈ సత్యాశ్రయుఁడు పూర్వ చాళుక్య రాజ్యమును స్థాపించిన కుబ్జవిష్ణువర్ధనుని యన్నయే యైనచో నన్నయభట్టు నకుఁ బూర్వ మాఱు నూఱుసంవత్సరముల క్రిందటనే తెలుఁగు కవిత్వ మారంభమయినట్టు తెలియవచ్చుచున్నది. కుబ్జవిష్ణువరనుఁడు వేఁగీదేశము నకుఁ బరిపాలకుఁడుగా నియమింపఁబడుటకు మును సత్యాశ్రయుడు కర్ణాట వేఁగీ దేశములకు రెంటికిని నేకచ్ఛత్రాధిపతియయి, తన రాజ్యకాలములో కర్ణాటాంధ్ర భాషలను రెంటిని ప్రోత్సాహపఱిచెను. ఈతని తరువాతివారైన కుబ్జవిష్ణువర్ధనాది చాళుక్యరాజులు సహితము మల్లె వేఁగిని వచ్చినందున. వారి యాస్థానములయందలి విద్వాంసులు సామాన్యముగ నంస్కృత కర్ణాటాంధ్ర భాషావేత్తలగు చుండిరి. నారాయణభట్టువలెనె నన్నయభట్టును తెలుఁగునందు మాత్రమె కాక కన్నడమునందును పాండిత్యము గలవాఁ డయి యుండెను. కర్ణాటక భాషా సంపర్కమువలనె యా కాలమునందలి తెలుఁగు కవిత్వములో ఱకారములు మొదలైనవి విశేషముగా వాడబడుచుండెను. రాజ నరేంద్రునకుఁ బూర్వము నూఱు సంవత్సరముల క్రిందట జేటవిజయాది త్యుఁడను నామాంతరమైన రెండవ సత్యాశ్రయుఁ డుండెను గాని యతఁడు

(మార్గకవిత = ప్రాచీన సంస్కృత సాహిత్యమార్గానుసార లక్షణ లక్షితమగు దేశ భాషా కవిత. దేశికవిత = దేశీయ సంప్రదాయ బహుళంబగు కవిత. మును మార్గకవిత లోకమున వెలయఁగా దేశికవితయను తెనుంగునఁ బుట్టించి ఆంధ్రదేశమున నిలిపిన వారు చాళుక్యరాజులు మొదలుగ పలువురు (చోళాదులును) అట్లు చేసిరి. ఆంధ్రము విషయము. అందు తెనుంగున దేశికవిత పుట్టించి తెనుంగుభాషను నిలిపిన వారు చాళుక్యరాజులు. "సత్యాశ్రయుని వొట్ట" యను 'చాళుక్య' పారమునకుమూల మెట్టిదో తెలియరాదు)

రాజుగాక కేవలమాండలిక పరిపాలకుఁడై యుండుటచేతఁ కుమారసంభవము నందుఁ బేర్కొనఁబడిన సత్యాశ్రయుఁ డీతఁడయి యుండఁడు. క్రీస్తు శకము ౯౨౭ మొదలుకొని ౯౩౪ సంవత్సరమువఱకు ననఁగా రాజరాజనరేంద్రుని కంటె నూఱు సంవత్సరములు ముందుగా రాజ్యము చేసిన యుద్ధమల్లుని దానశాసనములలో నొక దానియందు

మధ్యాక్కరలు

1 స్వస్తి నృపాంకుశాత్యంతవత్సల సత్యత్రిణేత్ర
విస్తరణ శ్రీయుద్ధమల్లు డనవద్య విఖ్యాతకీర్తి
ప్రస్తుతరాజాశ్రయుండు త్రిభువనాభరణుండు సకల
వస్తు సమేతుండు రాజసల్కిభూవల్లభుం డర్థి.

2. పరగంగ బెజవాడ గొమరుసామికి భక్తుఁడై గుడియు
నిరుపమమతి నృపధాము డెత్తించె నెగిదీర్చె మఠము
గొరగ ల్గా కొరులిందు విడిసె బృందంబు గొనియుండువారు
పరిగాక యవ్వారణాసి వ్రచ్చిన పాపంబు గొంద్రు.

3 వెలయంగ నియ్యెట్టు డస్సి చులినురై విడిసిన బ్రోల
నల తానపతులును రాజు పట్టముం గట్టిన పతియు
నలియం బైవారల వెల్వరించిన నశ్వమేధంబు
ఫల ముపేక్షించి నాగలింగబడసిన పాపంబు దమకు.

4. జననుత చేబ్రోలనుండి బెజవాడజాత్రకు వచ్చి
త్రిణయనసుతుఁ డొండుచోటు మెచ్చక తివిరి యిన్నెలన
ఘనఘుండు చేకొని యుండు ప్రత్యక్షమై యున్న నచ్చ
టని మల్ల డెత్తించె గుడియు మఠమును గార్తికేయునకు.

5. రమణతో బెజవాడ కెల్ల బెనగును రక్షయుం గాను
సమతాత మల్లపరాజు వేర్వెఱ దాను గట్టించె
నగమున దానికి కలశ మిడ్డట్లుగా మొగమాడు
నమరంగ శ్రీయుద్ధమల్లు డెత్తించె నమితతేజుండు.

మొదలుగాఁ గల పద్యము లున్నవి. ఇత్యాది నిదర్శనములనుబట్టి నన్నయ [illegible] మహాకావ్యరచనమునం దితఁ డాదికవియే నన్నయభట్టకృతము లయిన లక్షణ సారములోని పద్యము నింద్రవిజయములోనిపద్యమునని చెప్పఁబడుచున్న నం దుదాహరింపబడిన పద్యములలో నొక్కొక్క దాని నిం దుదహరించుఁ చున్నాను :—

గీ. అచ్చు హల్లును లాపశబ్దాదివర్ణ
మునకుఁ జెప్పిన ఘట్ యతి యనగఁ దనరు
నంబురుహ గేహిని సమనులాప యనగ
లక్ష్మి వాగ్జితకోకిలాలాప యనఁగ —లక్షణసారము

చ. ఒకపలు వాతఁ గొన్నకిటియున్ దల లోనిడు కూర్మ భర్త నా
లిక లిరుగొన్న సీదరపు జేఁడు బయోధరధారఁ బొట్ట పెం
చుకులనగాళి యీడు ప్రతి జోడని యెంచఁగ గూడ దేరి కె
న్నికగ యయాతియంచె ధరణీభర ముంచి చెలంగుదానికిన్:—

ఇంద్ర విజయము.

ముందు జెప్పినట్లు నన్నయభట్టు రాఘవాభ్యుదయ మను నొక గ్రంథమును జేసినట్టు వ్రాసి యా గ్రంథములోని దని యీ క్రింది పద్యము నొకానొక రుదాహరించి యున్నారు.

క. వికలుని ఖరదూషణముఖ
సకలవనచరులు పొదివిరి సమ్మదముగ ని
ష్పకకుప్పకు మూఁగెడు మిడు
తుకపిండువితాన బాఁతి తోచెడు బుద్ధిన్.

ఈ పద్యము నన్నయ్యభట్టారకుని కవిత్వమును బోలి యుండక పోవుట చేత సీఁత డా నామము గల మఱియొక యప్రౌఢకవి యయి యుండ వచ్చును

నన్నయభట్టు విరచితమైన "చాముండికావిలాస" మను పద్యకావ్య మొకటి నూతనముగా లభించిన ట్లీనడుమ నాంధ్ర పత్రికయందుఁ బ్రకటింప బడినది దుర్మతినామ సంవత్సరమునం దనఁగా నిప్పటి కేఁబదియైదు సంవత్సరముల క్రిందట పూర్వపు మాతృకనుజూచి దొర్ని పేరయ్య యను నాతనిచే వ్రాయ బడిన పుత్రికను దెప్పించి సావధానముగా నే నామూలాగ్రముగాఁ జదివి తిని. చదివినకొలఁదిని నాకదినన్నయభట్టకృతము కాదన్న యభిప్రాయము బలపడసాగినది చాముండిక యనఁగా గౌరీదేవి చాళుక్య వంశజులకు తర ములనుండి వచ్చిన కులదైవత మగుటచేతను, గద్యమునందు నన్నయభట్టు విరచిత మని యుండుటచేతను, రాజనరేంద్రుని ప్రీతికయి నన్నయభ ట్టొకవేళ భారతాంధ్రీకరణారంభమునకు ముందు దీనిని రచియించి యుండు నేమో యని యూహింపవలసి యున్నను కవిత్వవిధమునుబట్టి యాలోచిం పఁగా నా యూహ కవకాశము కలుగకున్నది. ఈ గ్రంథమును రచించిన కవి వేఱొక నన్నయభ ట్టనుకొనుటకును వీలులేకుండఁ బ్రథమాశ్వాసా రంభమున నున్న యీ క్రింది సీసపద్యము బాధించుచున్నది.—

సీ. వ్యాసాదిఋషులకు వందన మొనరించి
కవిమల్లులను జాల ఘనత నెంచి
సుకవీశ్వరుల నెల్ల సొంపుగా వినుతించి
గురుపాదయుగ్మము ల్సరవిఁ గొలిచి
యిష్టదేవాళి సంతుష్టత సేవించి
మంత్రాధిదేవత మది దలంచి
సర్వజనాళికి సంతోష మొనరించి
పార్థివసభల వైభవము గాంచి

యాంధ్ర వాక్యానుశాసనం బతిశయిల్ల
జేసి లోకోపకారార్థసిద్ధిఁ జేసి
ఘనత రాజనరేంద్రునికరుణఁ బడసి
నట్టివాడను నన్నయభట్టు నేను.

రాజనరేంద్రుని కరుణ బడసిన యీ కవి యీ పుస్తకముసు రాజనరేంద్రున కేల యంకిత మొనర్పలేదో! చాముండికావిలాసము శ్రీరాముస కంకితము వేయబడినది. ఇందలి మొదటి పద్యము "శా. శ్రీవాణీ గిరిజా సమన్వితుల .. ..—సేవింతు స్మరి నా త్రిమూర్తులను నా చిత్తంబులో నెప్పుడున్." అని యింపమింపుగా నాది పర్వము "శ్రీవాణీ గిరిజా శ్చిరాయ" యను శ్లోకమునకు భాషాంతరము వలె నున్నది. రెండవ పద్యము నందుకవి "యిందిరను వాణిని పార్వతిని" తలంచెను. మూఁడవ పద్యమునందు "విఘ్నదేవుఁడు"ను నాల్గవ పద్యము నందు "నాంజనేయుఁడు"ను స్తుతింపబడిరి. పయి సీసపద్య మయిదవది. "ఆ జనకసుతావిభు"నకు మొదలుగాఁ గల నాలుగు కందపద్యములును (౬, ౭, ౮, ౯) రాముని గూర్చిన షష్ఠ్యంతములు. ఆరంభ పద్యము రామునిఁ బేర్కొనక, తాను నన్నయభట్టు నని చెప్పుకొన్న వెంబడినే రాముని గూర్చిన షష్ఠ్యంతములు వేయుట వింతగా గనఁబడుచున్నది ఈ గ్రంథము నన్నయభట్టకృతము గాదని తలంచుటకు నాకుఁగల కారణముల నిందు క్రింద సంగ్రహము దెలుపుచున్నాను.

(౧) నన్నయభట్టుకాలము మొదలుకొని యించుమించుగా తిక్కనకాలము వఱకునుగల కవులు తమగ్రంథమున కాదియం దొక సంస్కృత శ్లోకమును వేసి తరువాత తెలుఁగు పద్యములను వేయుట యాచార మయి యున్నది. నన్నయభట్టాది పర్వము మొదట

"శ్రీవాణీ గిరిజా శ్చిరాయ దధతో వక్షోముఖాంగేషు యే"

* * * *

భూయాసుః పురుషోత్తమాంబుజభవశ్రీకంధరా శ్శ్రేయసే"

అను శ్లోకమును వేసెను ఆ కాలములోనే యున్న * పావులూరి మల్లన్న తన గణితశాస్త్రమనందు మొదట

(* పావులూరి మల్లన్న 12-వ శతాబ్దివాఁడని విమర్శకుల యాశయము. ఆయనంతె మతని చరిత్రమున వివరింపఁబడును.)

"శ్రీకంఠం సగుణం సమస్తజగతాంకర్తార మీశం గురుం
భూతో ర్వ్యనలానిలేంద్ర సూర్యపవనవ్యోమాత్మమూర్తిం విభుం
నిత్యానందమయోపయో గిరిజయా సార్ధం ప్రజావృద్ధయే
మాయాయోగ ముపైతి తం శివకరం వందే శివం శ్రేయసే"

అను శ్లోకమును వేసెను. కావ్యాలంకారచూడామణిని రచియించిన విన్నకోట పెద్దన్న తన పుస్తకముమొదట

"శ్రీవాగాస్పదయోః పరస్పరియుజోః శ్రుత్యుత్సవశ్లాఘయోః
రాగాలాపనిరూఢయో ర్యతిగణవ్యాపారపారీణయోః
సారస్యంగిరిజేశయో రివ సదా సంగీతసాహిత్యయో
ర్విద్వద్విశ్రమహేతుకం విరహతాం చాళుక్యవిశ్వప్రభౌ."

అను శ్లోకమును వేసెను. తిక్కన తన నిర్వచనోత్తరరామాయణము మొదట

శ్రీరాస్తాం మనుమక్షితీశ్వరభుజాస్తంభే జగన్మండల
ప్రాసాదస్థిరభారభాజి దధతీసా సాలభంజీ శ్రియమ్
శుండాలోత్తమగండభిత్తిషు మదవ్యాసంగవశ్యాత్మనాం
యాముత్తేజయతేతరాం మధులిహా మానందసాంద్రా స్థితిః"

అను శ్లోకమును వేసెను. ఇట్లుండగా చాముండికావిలాసమునం దాదిని సంస్కృతశ్లోకము లేకుండుటచే నది నన్నయకాలపుది కా దనుట స్పష్టము.

(౨) నన్నయభట్టుకాలమునం దాచారములో లేని షష్ఠ్యంత పద్యము లిందుండుట.

(౩) నన్నయ్యభట్టుకాలమునందు విశేషముగా వాడఁబడుచుండిన మధ్యాక్కర మొదలగు పద్యము లిందు లేకపోవుట.

(౪) నన్నయ సీసపద్యములకంటె భిన్నవిధమైన సీసపద్యము లిందుండుట. నన్నయ సాధారముగా తన సీసపద్యమును వడితో నారంభించిన పక్షమునఁ

దుదవఱకును వడులనే పెట్టియు, ప్రాసముతో (ప్రాసయతితో) నారంభించిన పద్యమునఁ దుద వఱకును ప్రాసములనే పెట్టియు, ఉన్నాఁడు. దీని కొక్కొక్క లక్ష్యమును జూపెదను

వడిసీసము.

సీ. అడవిలో నేకాంత మతిఘోరతపముమై
నున్నమా గురులపై నురగళవము
వైచుట విని యల్గి వారి తనూజుండు
శృంగి యన్వాఁడు కార్చిచ్చువంటి
శాపంబు నీ కిచ్చె సప్తాహములలోన
నా పరిక్షితుఁడు నా యలుకఁ జేసి
తక్షకువిషమున దగ్ధుఁ డయ్యెడు మని
దానికి గురులు సంతాప మంది

భూతలేశ ! నన్నుఁ బుత్తెంచి రిప్పుడు
తద్భయంబు లెల్లఁ దలఁగునట్టి
మంత్ర తంత్రవిధు లమర్చి యేమఱకుండు
సది నిరంతరంబు నవియుఁ గఱప. (ఆ. ౧-౧౮౧)

ప్రాస సీసము

సీ. పాండుకుమారులు పాండుభూపతిపరో
క్షంబున హస్తిపురంబునందు
ధృతరాష్ట్రునొద్ద దత్సుతులతో నొక్కటఁ
బెరుఁగుచు భూసురవరులవలన
వేదంబులును ధనుర్వేదాది విద్యలుఁ
గఱచుచుఁ గడలేని యెఱుకఁ దనరు
చున్నఁ దద్విపులగుణౌన్నతి సైపక
దుర్యోధనుండు దుష్కార్య మెత్తి

దుర్ణయమున శకుని కర్ణ దుశ్శాసనుల్
గఱపఁ బాండవులకు నఱయ చేయఁ
గడఁగె బాండవులును గడు ధార్మికులు గానఁ
బొరయ రైరి వారిదురితవిధుల. (ఆ ౩-౧౨)

పయి రెండు సీసపద్యములును జదివినచో నాది పర్వము ద్వితీయాశ్వాసము లోని మొదటి దానియందు మొదటినుండి కడవరకును వడులే యుండు టయు. తృతీయాశ్వాసములోని రెండవ దానియందు మొదటినుండి కడవర కును ప్రాసములే యుండుటయు, మీరు కనిపెట్టి యుందురు. నన్నయ భట్టారకుని సీసపద్యము లిట్లుండగా, చాముండికావిలాసములోని సీసపద్య ములు వడిప్రాససంకరము లయి యిండునట్లు మీరీ క్రింది సీసపాదముల వలనఁ దెలిసికోవచ్చును.

సీ. పా. ఇష్టదేవాళి సంతుష్టత సేవించి
మంత్రాధిదేవత మదిఁ దలంచి—ఆ౧౨ పద్యము ౫.

సీ. పా. ఘోరంబులైన యాకారము ల్గను నట
భయపడి భీషణబాహుయుద్ధ—ఆ ౨౨ పద్యము ౫.

నన్నయ నియమమునకు కేవల విరుద్ధముగా పయి సీసపాదములు పూర్వార్ధ మునందు ప్రాసమును, ఉత్తరార్ధమునందు వడిని, కలవిగా నున్నవి.

(౫) రాజమహేంద్రవరపు తెలుఁగును గాక దత్తమండలములలో వాడు కలో నున్న "బుద్ధి బుద్ధీ" త్యాది పదప్రయోగములను దరచుగాఁ గలిగి యుండుట—

౧. దేవా! బుద్ధిబుద్ధి మహాప్రసాదంబనియట్లనే యొనర్చెదము. ఆ౨,౪౦.
౨. తల్లీ! బుద్ధిబుద్ధి మహాప్రసాదంబ నీ యాజ్ఞాధారకులము ఆ ౩. ౧

(౬) ఒక వర్ణమును జేయునప్పుడు దానికి ముందు క్రొత్తగా నేఁబది యఱువది సంవత్సరముల క్రిందట చెన్నపురినుండి వచ్చిన యక్షగాన రూపకము లయిన ప్రహ్లాదాది నాటక పుస్తకములయం దుండిన రీతిగా "ఎట్టు లనిన" "ఎట్లంగి ననిన" లోనగు పదప్రయోగములను జేయుట.

౧ "ఒకయాడుఁబడుచు పుట్టె నెట్టు లనిన.

సీ. ఘనకరాళవరాస్యగహ్వరంబులు గల్గి
పరఁగు చతుశ్శీర్ష పంక్తిమెరయ

* * * *

రూప మైనట్టి పడుచును రూఢి గాఁగఁ
దాము దర్శించి పూర్వంబు దలఁచి తలఁచి" ఆ. ౨., ౨౧.

౨. అట్టి దానియందు మహాశక్తి యుదయించి వచ్చె నెట్లనిన,

ఉ. భీకరసింహ వక్త్రములు పేర్మిఁ జతుష్టయ మొప్పుచుండఁగా
లోకభయంకరంబు లయి లోచనముల్దనరారఁ బాటల
ప్రాకటవర్ణము ల్గలిగి భాసిలి మీఱుచు నాల్గు హస్తముల్
వీఁక నెసంగఁగా నపుడు వీరమహాద్భుత శక్తి చెల్వుగన్." ఆ. ౩., ౩.

౩. "తా మంతఃపురంబులకు బోయి రెట్లంగి ననిన,

చ. వదలిన కేశబంధములు వక్షువగుబ్బల మీఁది హారముల్
చెదరిన కుంకుమంబులును జెక్కుల వ్రాసిన పత్రవల్లులున్
బ్రిదిలిన నీవిబంధములు విశ్రుతమైన మునుంగు లెంతయుం
గదలఁగ తేమ మందుచుఁ గాంతలు పోయి గృహాంతరంబులన్."

ఆ ౩, ౨౨.

చాముండికా విలాసములోని మూఁడాశ్వాసములలోను ప్రథమాశ్వాసమునం దాఱువేల వారియొక్కయు. నందవరీకుల యొక్కయు వృత్తాంతమును,

ద్వితీయ, తృతీయాశ్వాసములయందు తొలగు కులమువారనఁ బడెడి దేవాంగుల కథయు చెప్పఁబడినవి. ఇందు మొదటి యాశ్వాసమునందు ౨౪ పద్యములును, రెండవ యాశ్వాసమునందు ౨౦ పద్యములును, మూఁడవ యాశ్వాసమునందు ౩౦ పద్యములును మొత్తముమీఁద పుస్తకమునందు ౧౨౪ పద్యగద్యము లున్నవి. "ఇది శ్రీసకల భాషావాగను శాసన శ్రీనన్నయభట్ట విరచితంబైన చాముండికావిలాసంబునందుఁ బ్రథమాశ్వాసము' అనియు, "ఇది శ్రీసకల సుకవిజన శ్రేష్ఠ నన్నయభట్ట విరచితంబైన చాముండికావిలాసంబను మహాప్రబంధంబునందు ద్వితీయాశ్వాసము' అనియు "ఇది శ్రీసకల కవి బుధవినుత సర్వవిద్యా విచక్షణ నన్నయభట్ట విరచితంబైన చాముండికావిలాసం బను మహాప్రబంధంబునందుఁ దృతీయాశ్వాసము అనియు, ఆశ్వాసాంత గద్యములు వేఱువేఱు విధముగా నున్నవి పయిని జెప్పఁబడిన హేతువులనుబట్టి విచారింపఁగా నీ చాముండికా విలాసమును నూఱు సంవత్సరముల క్రిందట దత్తమండలములలోని నందవరీకు లెవ్వరో నన్నయభట్టు పేరుపెట్టి రచించినట్టు నాకుఁ దోఁచుచున్నది కర్నూలులోని చంద్రమౌళీశ్వర ముద్రాయంత్రములో ౧౯౧౬వ సంవత్సరమునందు ముద్రింపఁబడిన "చౌడేశ్వరీ విలాస" మను పుస్తకమును నేను గొన్ని దినముల క్రిందటఁ జూడ తటస్థించినది. ఈచౌడేశ్వరవిలాసము సరిగా చాముండికావిలాసమే; చాముండికావిలాసమని యున్నచోట్లనెల్ల చౌడేశ్వరీ విలాసమని మార్చఁబడి యుండుట తప్ప భేదమేదియు లేదు. వ్రాఁత పుస్తకమునందువలెనే యచ్చుపుస్తమునందును తప్పులు కుప్పలుగా నున్నవి. ఇది నన్నయభట్టు కవిత్వ మగునో కాదో తామే నిర్ణయించు కొనఁగలుగుట కనుకూలముగా నుండునని యీ రెండు పుస్తకములనుబట్టి సవరించి నందవరచరిత్రము నిందు క్రిందఁ బొందుపఱుచుచున్నాను.

"............... ..సోమవంశసంభవుండైన నందచక్రవర్తి యన్మహారాజ శ్రేష్ఠుండు నందవరపురంబున సకల ధర్మాభిజ్ఞుండై సర్వవేదవేదాంగ

పురాణేతిహాసార్థజ్ఞ కౌశలమనీషావిరాజిత మహాయశుండై యొక్కనాఁడు విబుధకవిగాయక పాఠకమాగధవంది బృందసమేతంబుగాఁ బేరోలగం బున్నసమయంబున. 26.

సీ వెన్నెల నదలించి విఱ్ఱవీఁగు విభూతి
పూఁత శృంగారమై పొల్పు మీఱ
మహనీయదండ కమండలంబులు హ స్త
పద్మంబులను రూఢిఁ బరిఢవిల్ల
మేఘంబులో నుండు మెఱుపుఁదీగలరీతిఁ
బరఁగుచుండెడు జటాపంక్తి మెఱయ
సిద్ధౌషధంబులఁ జెలువొందు కంథయుఁ
గాషాయ వస్త్రము ల్గరిమఁ జెలఁగఁ

గీ జూపరులకు నద్భుతంబుగఁ జూచుచుండ
నాకసంబుననుండి తా నతిముదమున
వచ్చి తపసునిభంగి సభాస్థలంబుఁ
జేర వచ్చెను నపు డొక్క సిద్ధయోగి.

వ వచ్చిన నాశ్చర్యానందభయభక్తి సమేతుండై దిగ్గన లేచి యెదుర్కొని జాంబూనదరత్నమయ సింహాసనమున సుఖాసీనుంజేసి యర్ఘ్యపాద్యంబు లొసంగి తత్పాదోదకంబు శిరంబున నిడుకొని పుణ్యశరీరుండునై తి దేవా మీరు వేంచేయుటకు నిమిత్తం బెయ్యది యది సవిస్తరంబుగ నానతీయుం డని విజ్ఞాపన పూర్వకంబుగాఁబలికిన న మ్మహాసిద్ధ లోకేశ్వరుం డిట్లనియె.28

మ. కమనీయాత్ములఁ జూచి తెంతయును నే గాళింగకాంభోజమ
త్స్యమహారాష్ట్ర పుళిందహూణశకవంగాంగాదిభూమీశులన్
క్షమలో వారలు నిన్నువంటి సుగుణస్థైర్యాధికు ల్గారు నిన్
గొమరొప్పన్మరి గంటి సంతసిలి నీగోష్ఠంతయుం జూచితిన్. 29.

వ. నీవు పుణ్యాత్ముండ వగుటఁజేసి నీకు రేపటినుండి వారణాసియందు [illegible] స్నానంబు చేకూరఁగలది యని యభిమంత్రి [illegible] నొసంగి నీ వర్ధరాత్రంబున మేల్కొని యాచమనంబుచేసి దృఢభక్తి నొక్కసారి యీ మంత్రంబు పఠియించి మనస్సున గంగాతీరంబునఁ బుణ్యస్థలంబున నుండవలయు మంత్రాధి దైవతంబా యవిధ్యానంబుఁజేర్చి నేత్రంబులు మోడ్చి క్షణమాత్ర ధ్యానంబుచేసి నమస్కరించి ముహూర్తమాత్రంబునకుఁ గన్నులు విచ్చి చూచిననంతఁ గాశియందు నీ మనస్సంకేతిత పుణ్యస్థలంబునందుఁ బ్రవేశంబై యమ్మహాగంగా ప్రవాహినియందు సుస్నాతుండవై యచ్చటి వేదవేదాంగ శాస్త్రపురాణపారంగతు లయిన భూసురోత్తముల కనేక స్వర్ణముద్రిక లొసంగి వారలచే నాశీర్వచనంబులఁ పుచ్చుకొని మగుడ నీ పురంబునకు వచ్చి నిత్యం బీరీతి నొకండవె పోయి వచ్చుచు సకల ధర్మంబు లాచరించుచు విప్రోత్తములకు షోడశదానంబులు చేయుచుఁ పుణ్యాత్ముండవై యుండు, మిందుల కనృతంబు రాదీ వాక్యంబమోఘం బని యవి యొసంగి యతండు తిరోహితుండయ్యె నంతట 38

మ. అతఁ డాశ్చర్యముతోడ దారుమయమౌ నప్పాదుకాద్వంద్వ మా
తతభక్తిం గయికొంచుఁ బూర్వకృత విస్తార ప్రపుణ్యంబు నం
చితమై కన్పడురీతి నీతఁ డెవడో సిద్ధేంద్రుఁ డత్యంత స
మ్మతితో న గ్గరుణించి యిచ్చె నవి నమ్మన్వచ్చుఁ జిత్తంబులోన్

వ. అని మనంబున వితర్కించుకొనియే నీ మేటిమంత్రంబు పఠియించిన నిదర్శనంబు గనిపించెనేని సులభంబున గంగాస్నాన ఫలంబు లభియించు నని విచారం బొనర్చుకొని యున్నయంతమధ్యాహ్నంబున గగనమధ్యంబున దినమణి ప్రకాశమానుండయ్యె నట్టియెడ సమీప స్థితులైనవారలు దేవా! స్నానంబునకు వేంచేయవలయునని విన్నవించిన లేచి సకల సామంత కవి గాయకాది సభాస్థితులైన వారలను గృహంబులకుఁ బొండని యనుజ్ఞ యొసంగి తానును గృహాంతరంబునకు వచ్చి జలంబులాడి ధౌతవస్త్రధరుండై

వేత్రౌక సద్మంబున నూర్ధ్వ పుండ్రాలంకృతుండై మధ్యాహ్న విహిత సంధ్యాతర్పణాదికాలోచితకృత్యంబులు నిర్వర్తించి [illegible] నేగి పత్నీకరపచనంబైన షడ్రసోపేతంబైన [illegible] బారగించి లేచి ప్రక్షాళిత గదనకర పదుండై [illegible] యొక్క విహిత స్థలంబున గూర్చుండి జాంబూనద [illegible] యావికాసినాగ వల్లీదళంబును మౌక్తిక చూర్ణసమే[illegible]ంబు మెసవి ముహూర్తంబు వామభాగంబున శయించి [illegible] నిద్రించి మగుడి లేచి యాస్థానమండపంబున [illegible] ప్రొద్దు పుచ్చుచున్న యెడ నీ రాజురాక [illegible] వేగ గాశికిం బోయి తత్తింవాసులకప యేగనో యను [illegible] నంతర్ధానంబునొందె. సంధ్యారాగా క్రాంత విచిత్రంబైన గగనంబునందు నక్షత్రంబులు గననయ్యె; నంత జంద్రుండు పూర్వదిగ్భాగంబున నుదితుండయ్యె. ధాత్రీవుండు కొలువు చాలించి సదనంబునకేగి భోజనంబు చేసి యెప్పు డెప్పుడని తిమురుమ శయ్యపై శయనించి ప్రాతః పాదఘట్టనం బొనర్ప నీషన్నిద్రాభరంబున మేల్కాంచిదిగ్గనలేచి ప్రభాతంబయ్యెనోయని తలంచి బహిరంగణంబులకువచ్చి నక్షత్రదర్శనంబుచేసి ప్రహరత్రయంబగుట నికాయంబునకుం బోయి నిష్కాది ద్రవ్యంబనేకంబు గ్రహించి యాసిద్ధోక్త ప్రకారంబుగా నాచమనీయం బొనర్చి యర్ధ నిమీలితలోచనుండై తన్మంత్రపఠనం బొనర్చిన విశ్వేశ్వరమాధవకుండిదండపాణిభైరవ విరాజితంబైన వారణాసిం జేరి తద్గంగాతీరంబున సూర్యోదయం బగుటయు మదీయ పూర్వపుణ్యఫలంబని యత్యంతాశ్చర్యంబునొంది కృతస్నానుండై సంధ్యాద్యనుష్ఠానంబులు నిర్వర్తించి తత్తీరస్థితులైన మేదినీ నిర్జరులకు బహుసువర్ణ ముద్రిక లొసంగి వారివలన నాశీర్వచనంబులు గైకొని మగుడి యొక్క రహస్య స్థలంబునకు వచ్చి పావలు మెట్టి కన్నులు మొగిడ్చి మంత్రపఠనం బొనర్చి తన పురంబునకు వచ్చి యథాప్రకారంబున నొరులకు దేటపడకుండ వర్తింపుచు నిట్లు బహుదినంబులు సంతోషంబున నుండె నొక్క దినంబున స్నానప్రయాణంబు చేయుచున్న పతిం జూచి,

గీ. ఏకశయ్య యందు జోకతో శయనించు
[illegible] కిదేమి
మాయయో యటంచు మన్ననతోడ నా
తనికి నిట్టు లనియె వినయముగను. 34

వ. నిరంతరం బరుణోదయపూర్వంబున నెక్కడ కేగెద వీ యాశ్చర్యం బేమి ? యిది సవిస్తరంబుగాఁ దెలియజెప్పుమనిన నతండు దరహసితవదన[illegible]గూడ దనియును గామినుల బుద్ధులు నమ్మరాదనియును బెక్కులైననీతిమార్గంబులుచిత్తంబునఁదలపోసియేమియు ననక యూరకున్న నతనిభార్య యత్యంతానుకూలిని గావున నీతోడుతఁ బుణ్యపాపంబులకు బాధ్యనైన నన్ను నిర్దయ చేయుట ధర్మంబే ? ప్రాణవల్లభా ! యని బహువినయోక్తులఁ బలికిన నతండు ప్రత్యుత్తరంబుతోఁచక యుండి యెట్టకేలకు నిట్లనియె,

గీ ఎవ్వరికిఁ జెప్పరాదు సుమీ రహస్య
మిదియు నీ కెఱిగించెద నిష్టముగను
సిద్ధవర్యుఁ డొక్కండు కాశీస్థలంబు
నందు స్నానం బొనర్పు మం చతిశయముగ. 35

వ. మంత్రంబు చెప్పి యిప్పావ లొసంగి చనియె, నాఁటనుండియు గాశికిం బోయి గంగ నాడి వచ్చి సుఖంబుగా నుండినవాఁడ నిప్పుడును దత్కార్యార్థినై పోయి వచ్చెద ననిన 'నన్నెడఁబాసి పోవుట నీకు ధర్మంబగునే ? యని బహుకరినోక్తులు పలికి వచ్చెదననిన నతండు కూడదని పల్కి వినక పోవ నేమగునో యని తలంచి యరుణోదయ సమయం బగుటయు భార్యతోడన మంత్రపఠనం బొనర్చి నిమిషమాత్రంబున వారణాసీ స్థలంబుఁ జేరి జలంబులాడి విప్రులకు ననేక దానంబులొనర్చి శీఘ్రంబున మగిడగమనంబు దలంచుచున్న సమయంబున. 36

గీ. పొల్పుగాఁ దీరమున శుచిర్భూతయైన
యతనిసుందరి పుష్పిణియై ప్రియుండు
వినిన నే మనునో యని ప్రేమ దక్కి
పిలిచినను బల్కకుండెను బ్రియునితోడ. 37

వ. అది యెఱుంగక యా రాజు సమీపంబునకు వచ్చి పోదము లెమ్మన్న నేను పుష్పవతినైతినని సదరహాసితభయంబుగాఁ బలికిన విని గుండె జల్లన ధరిత్రీపతి రాజ్యంబుపరులాక్రమించుటకు సమయంబయ్యె నిక్కడ నాల్గు దినంబులునికికి హేతువయ్యెగదా యని చింతించుచున్న యతనిం జూచి యక్కడ నుండెడు బ్రాహ్మణు లిట్లనిరి. 38

గీ. నీదుభార్య పుష్పిణియైన నిత్యదోష
మెల్లఁ బరిహార మొనరించి మేము శీఘ్ర
ముగను బరిశుద్ధఁ జేసెద మొగిని మాకు
నేమి యొసఁగంగఁ గలవాఁడ వీవు చెపుము 39

వ అనిన మీర లీ దివసంబున నన్ను నా కాంతతోఁ గూడఁ పురంబు ప్రవేశింపఁ జేసితిరేని మీకు నా రాజ్యంబులో నర్ధంబు నొసంగి యుండం జేసెదననిన వారలు నట్ల కాక యని యమ్మహాస్థలంబున నదీతీరంబున నుండెడు చాముండికయును నద్దేవాలయంబున నుండెడు నర్జున మాలూర వృక్షంబులును సాక్షులని ధర్మంబుగాఁ బలికి వారలు రాజకాంతను గంగాతీరంబున గూర్చుండ నియమించి చతుర్వేదంబుల యందలి మహామంత్రంబులు పఠియించి తద్భామిని కుదకంబు దేహంబున ప్రోక్షించి స్నానంబులొనరించి యా మంత్రంబునఁ బరిశుద్ధంజేయ శుద్ధియైన యత్తన్వి నతనికిం జూపిఁ తోడ్కొని పురంబునకుం జనుమనిన నతండుసంతుష్టాంతరంగుండై మునుపు వచ్చినయట్ల నిజపత్నితోడఁ పురంబు ప్రవేశంబై నాఁటనుండియు నిది మోసం బని గంగాస్నానంబు విసర్జించి తచ్చింతాంతరంగ మగ్నుండయి యుండెఁ గొన్ని సంవత్సరంబు లరగిన గాశియందు దుర్భిక్షంబు వచ్చిన

బ్రాహ్మణులకన్న వస్త్రంబులు లేక కఠినదినంబు లోఁచి వినఁ బూర్వఁబున నందవరంబున నుండి నందచక్రవర్తి యను విశ్వంభరేశ్వరుండువచ్చి చిక్కుపడి యిచ్చిన మాట దలంచి తద్భూమాదోషనివారకులైన వార లార్వేలేనూటికి నా దేశంబునకుఁ బోద మా భూమీశుం డర్ధరాజ్యంబు నొసంగం గలవాఁడని యన్యోన్యంబుగా ననుకొని యమ్మహాస్థలంబు వెడలి కతిపయదినంబులకుఁ జేరవచ్చి యతనికిఁ దమరాక యెఱింగించిన నతండు విని దీనికి సాక్షులం దోడ్కొని రావలయుననిన వారలు "దురాత్మా! చాముండికాసమీపంబున నీ వాడినమాట లేదనిన నమ్మహాశక్తి యధర్మంబు పల్కునే తోడితెచ్చెదము తదనంతరంబ యర్ధదేశం బిత్తువుగాక" యని కోపంబున మగిడిపోయి రందుఁ గొందఱు విప్రులు మనముపోవుట యెట్లు! తచ్ఛక్తి వచ్చుట యేలాగున మేమార్వేలవార మీదేశంబుననె యుండెదము మా యదృష్టం బుండునట్లు కాఁగలదని మగిడి వచ్చి దక్షిణదేశంబున వృత్తులు నుద్యోగంబులు ననుసరణ పూర్వకంబుగా సంపాదించు కొనిరి తక్కిన యేనూఱు గురు విప్రులు నభిమానంబునఁ బోయి కాశిఁ బ్రవేశించి చాముండికా సమీపంబున బహు తపం బొనర్చిన నద్దేవి కరుణించి వరం బొసంగెద వేఁడుడనిన వారలు దుష్టాత్మకుండైన రాజు పూర్వంబున నీ ముందట నిచ్చిన మాట మాకొసంగడయ్యె నట్లు గావున నీవు స్వస్వరూపంబున వచ్చి మా కర్థరాజ్యం బొసగునట్లుగాఁ జేయవలయుననిన నేను బహుదినంబుల నుండి యీ పుణ్యస్థలంబున వసియించుదాన నెట్లు రావలతునని చింతించి మీ ఘోర తపంబునకు మెచ్చితి నింకేమి చేయుదునైనఁ బోదము లెం డనవుడు వార లమ్మహాశక్తినింద్ర ద్రుబిల్వ వృక్షసహితంబుగా దోడ్కొని వచ్చి నంద పురంబునకు నర్ధక్రోశంబున నిల్పిన నా శక్తి యా దుష్టుని దోడ్కొని రమ్మనిన వారలు వచ్చి 'పాపాత్మా శక్తి నిన్ను రమ్మని నియమించె, నీ గ్రామసమీపంబునకు వచ్చిన' దనిన విని సంతసిల్లి యతి త్వరతోడ వచ్చి యా దేవికి సాష్టాంగదండ ప్రణామంబు లాచరించి.

గీ. నేఁడు నానోము ఫలియించె నిక్కముగను
నేఁ గృతార్థుండ నైతి నిన్నిపుడు చూచి
నన్నుఁ బ్రోవుము నాతల్లి నిన్ను భజన
చేయుచుండుదు నేవేళఁ జిత్తమునను. 41

వ. అని బహుస్తోత్రంబు లొనర్చి మీరిందు వసియింపవలయు, వీరల కర్ధ రాజ్యం బొసంగెద; గంగాస్నానంబునకు వచ్చి బహుప్రయాసంబు నొం దుట మీకుఁ దెలియుంగదా యని నాటనుండి రాకుండితి మీ దర్శనం బపే క్షించి యీ బ్రాహ్మణులతో నన్నృతంబు పలికి మిమ్ముం దోడ్కొని రం డనిన సమర్థులైన వార లగుటంజేసి మిమ్ముం దోడ్కొనివచ్చి రది కారణం బుగ మీర లీ స్థలంబునన యునికి యొనర్ప వలయునని బహుభంగులఁ బ్రార్థించినఁ బ్రసన్నయై యమ్మహాశక్తి యట్లగాక యనియె దక్షిణంబున వారల కర్ధరాజ్యం బొసంగి నందపురంబు నొసంగి తాను దగ్గామంబునకు నిమిత్తమాత్రుండై చాముండికా దర్శనంబు నిరంతరంబును జేసికొనుచు సంతోషంబున నుండె, నంత నవ్విప్రులు నందవరం బగ్రహారంబుగా వరించుట నందవరీకులను సంజ్ఞగలవారలైరి; మున్ను వారి వెంబడిం బోక నిల్చిన వార లార్వేల వారనం దగిరి.''

పయి నుదాహరింపఁ బడిన పుస్తకభాగమునుబట్టి యొక్కొక్క చిన్న పద్య మును, పద్యమునకుఁ దరువాత బెద్దవచనమును నుండుచు వచ్చినట్టు చదు వరులు తెలిసికొని యుందురు. ఈప్రకారముగానే పుస్తకమంతయు నత్యల్ప పద్యభాగముతోడను నత్యధిక గద్యభాగముతోడను గూడి యున్నది.

నన్నయభట్టారకుని గూర్చి

శ్లో॥ వాచా మాంధ్రమయీనాం యః
ప్రవక్తా ప్రథమోభవత్
ఆచార్యం తం కవీంద్రాణాం
వందే వాగనుశాసనమ్ ''

అను శ్లోకము పండితులలో పరంపరగా వాడఁబడుచున్నది.

* * *

నారాయణభట్టు

నారాయణభట్టు భారత రచనమున నన్నయభట్టునకు సాయపడెనని 'పాయక పాకశాసనికి' అను పద్యము వలనఁ దెలియుచున్నది. ఆ పద్యము కొన్ని ప్రతులలోఁ గానరాదని చెప్పినవారుకూడా నన్నయ రచించిన నందమపూఁడి శాసనమును బట్టి నారాయణభటు నన్నయ సమకాలీనుఁ డనుట నంగీక రింతురు.

నారాయణభట్టు కుమార్తె కుపమ దాక్షారామ భీమేశ్వరున కఖండదీపమునకై లోహపు దివియ నొసంగి క్రీ శ. 105౦ లో నొక శాసనము వేయించెను. దానింబట్టి నారాయణభట్టు క్రీ. శ. 1044 మొదలు 1058 వఱకును కల్యాణ కటకము నేలినవాఁడును, త్రైలోక్యమల్లాది బిరుదాంకితుఁడును అగు ప్రథమ సోమేశ్వరునివద్ద ప్రధానిగా నుండినట్లు తెలియుచున్నది. ఈ యంశమును కీ. శే. శ్రీకొమర్రాజు - వేంకట లక్ష్మణరావుగారు మున్నగువారు తెల్పి యున్నారు.

నారాయణభట్టు త్రైలోక్య మల్ల సోమేశ్వరుని ప్రధానియేయైనచో. ఆ ప్రభు వుని సామంతుండగు రాజరాజువలన దానమును పరిగ్రహింపనేల? యనియు, కావున ప్రధాని నారాయణభట్టును, నన్నయ సహాధ్యాయుఁడును విభిన్న వ్యక్తులనియు—'ఆంధ్రకవితరంగిణి' కారులు విపులముగఁ దెల్పియున్నారు. [పుట 138]

కర్ణాటభాషలో 'రెట్టమతము' ను రచించిన రెట్టఁడను కవి తన గ్రంథమునకు నారాయణభట్టు రచించిన గ్రంథ మాధారమని చెప్పెనఁట! ఈయంశము—అయ్యల భాస్కరకవి రచించిన 'రెట్టమతశాస్త్రము' నందలి 'ఉదిత కీర్త్యాఖ్యచే నొనరు నారాయణ భట్టమతంబును' అనుదానివలనఁ దెలియుచున్నదఁట! [చూ. ఆంధ్రకవితరంగిణి—పుట 139]

మల్లియ - రేచన

భీమకవి కృతిగాఁ బ్రసిద్ధిచెందిన 'కవిజనాశ్రయ'మను ఛందోగ్రంథమును రచించినవాఁడు మల్లియ రేచన. కవిజనాశ్రయము ప్రథమలక్షణగ్రంథ మని పండితలోకమునఁ బ్రసిద్ధము. ఇయ్యది వేములవాడ భీమకవి కృతి కాదని 'వేములవాడ-భీమకవి' చరిత్రమున వివరింపఁబడును.

భీమకవి కాలము నిర్వివాదముగ క్రీ. శ. 1150-1180 ప్రాంతముగ స్పష్టపడి యున్నది. కవిజనాశ్రయము క్రీ. శ 1100 ప్రాంతమందలిది.

కవిజనాశ్రయమునందలి భాగములగు 'అధికారము'ల గద్యలయందు 'ఇది శ్రీవాదీంద్రచూడామణి చరణ సరసీరుహ మధుకరాయమాన . .'' అని యున్నది. ఈ 'వాదీంద్రచూడామణి' అను జైన సమయాచార్యుని, నన్నెచోడమహాకవి రచించిన కుమారసంభవమునకుఁ గృతిపతియైన జంగమ మల్లికార్జునయోగి వాదమునందోడించినట్లు 'పరవాదీంద్రఘనాఘనా నిలు' అను పద్యపాదము [కుమార. ౧-౧౦-౧౯౭] ధ్వనించుచున్నదనియు, కుమారసంభవమునఁ గవిజనాశ్రయపుటనుసరణములు కానవచ్చుచున్న వనియు 'తెనుఁగు కవుల చరిత్ర' (పుట 171) లోఁ గలదు. * నన్నెచోడుఁడు 1130-40 ప్రాంతమువాఁ డగునప్పుడు కవిజనాశ్రయము 1100 ప్రాంతము ననే వెలసినదని చెప్పుటకు వీలు కలుగుచున్న' దని ఆ పుటయందే శ్రీ వేంకటరావుగారు తెల్పియున్నారు.

ఈ క్రిందియంశము 'తెనుఁగు కవుల చరిత్ర' ననుసరించియే తెలుపఁబడు చున్నది.

'అఱవభాషలో 12 వ శతాబ్దికిఁ బూర్వమే 'యాప్పిరుంగలమ్ కారికై' అను లక్షణగ్రంథము ప్రసిద్ధమైయున్నది. ఇందు అఱవమునందలి ఛందోగ్రంథ

* కుమారసంభవమున నవమాశ్వాసాంతమున నున్నట్లు 'తెనుఁగు కవుల చరిత్ర' లోఁ గలదు. కాని యిది అందలి ౧౦వ ఆశ్వాసమున 197 వ పద్యముగాఁగలదు.

ములే కాక కర్ణాటాంధ్రచ్ఛందోగ్రంథములను పేర్కొనఁబడినవి. అందు "రేచియార్ శెయ్‌ద వడుగచ్ఛందము' కలదు. ఇది కవిజనాశ్రయమే! ఈయంశమును కీ శే. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారే తొట్టతొలుత ఆంధ్ర లోకమున కెఱుకపఱచిరి.

క్రీ. శ. 990 ప్రాంతములో నుండిన కన్నడకవి నాగవర్మ రచించిన 'ఛందోంబుధి' కిని, కవిజనాశ్రయమునకును పెక్కు పోలికలు కలవు కావున 'ఛందోంబుధి' ననుసరించి కవిజనాశ్రయము రచింపఁబడిన దనవచ్చును. ఇందలి పద్య మొకటి మడికి-సింగన కూర్చిన 'సకల నీతి సమ్మతము' లో నుదాహరింపఁబడినది సింగన క్రీ. శ. 1400 ప్రాంతపువాఁ డగుటచే నియ్యది తత్పూర్వమనుటలో సందేహమేలేదు. 'యాప్పిరుంగ లమ్ కారికై' లో నిది పేర్కొనఁబడుటఁబటి, కవిజనాశ్రయము క్రీ. శ. 1100 ప్రాంతమందలిదని నిర్ణయింపవచ్చును.

కవిజనాశ్రయుఁడు మలియ రేచన, విమల యశోభాసుర చరితుఁడు, భీమనాగ్రసుతుఁడు సహాయుఁడుగా నీ కవిజనాశ్రయమును రచించినట్లు స్పష్టముగఁ గలదు.

గోకర్ణదేవుఁడు

గౌరన, అప్పకవి మున్నగురిచేఁ బేర్కొనఁబడిన 'గోకర్ణచ్ఛందస్సు'ను రచించిన గోకర్ణదేవుఁడు—చోడవంశపురాజు. గోకర్ణదేవుని పేరిట నొక శాసనము కలదు ఆశాసనమును నిల్పినవాఁడును, ఛందస్సుకర్తయు నభిన్నులనియే అందఱు నంగీకరింతురు. పయి ఛందో గ్రంథములోని "భాస్కర కులవిలసితవార్ధిచంద్ర ! గోకర్ణనృపా !" అను పద్యభాగము పయి యభిప్రాయమును దృఢపఱచుచున్నది. శాసనమునుబట్టి గోకర్ణదేవుఁడు క్రీ శ. 1127 ప్రాంతపువాఁడని స్పష్టమగుచున్నది.

గోకర్ణ చ్ఛందస్సులోని కొన్నిపద్యములు మాత్రము లభించినవి. వానిం బట్టి-కవిజనాశ్రయకర్తయగు రేచనవలెనే గోకర్ణదేవుఁడును తన్ను తాను సంబోధించుకొన్నట్లు తెలియుచున్నది.

ఈ గోకర్ణదేవుఁడే కవిజనాశ్రయకర్తయైనట్లు శ్రీ మానవల్లి రామకృష్ణ కవిగారును, కీ. శే. శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారును తలంచుట పొరపాటయి యుండవచ్చును.

మల్లికార్జున పండితుఁడు

శైవమతవ్యాప్తి నొనర్చిన శ్రీపతి, మంచెన, మల్లికార్జున పండితులు ముప్వురికిని పండితత్రయమని పేరు. ఆ పండితులలో నితఁడు మూఁడవ వాఁడు. గొప్ప మతసంస్కర్త. ఆంధ్రదేశమునందలి లింగధారుల మత సంప్రదాయముల కితఁడే మూలపురుషుఁడు. ఈ మల్లికార్జునపండితుని చరిత్రను దెలిసికొనుటకు—ఈతని వెనుక 40 ఏండ్ల నాఁడుండిన పాల్కురికి—సోమనాథుఁడు రచించిన 'పండితారాధ్యచరిత్ర' మను ద్విపదకావ్యమే యాధారము ఈ 'పండితారాధ్యచరిత్రము'నే శ్రీనాథమహాకవి క్రి శ. 14వ శతాబ్దిలో పద్యకావ్యముగా రచించినట్లు తెలియుచున్నది

మల్లికార్జునుఁడు గోదావరిమండలములోని దాక్షారామ భీమేశ్వరుని యర్చకుఁడగు భీమనపండితునకును, గౌరాంబకును పుత్రుఁడు. ఇతఁడు ఋగ్వేదియనియు, గౌతమ గోత్రజుఁడనియు "చతుర్మరనిర్ణయ' మను నొక సంస్కృతగ్రంథమునందుఁ జెప్పఁబడినదఁట ! (చూ. తెనుఁగు కవుల చరిత్ర పుట 251) వానసవంశీయుఁడని పండితారాధ్యచరిత్రమున నున్నది. కోటిపల్లిలో నివసించుచుండిన 'ఆరాధ్యదేవర' యీతని గురువు. ఇతఁడు గురువునొద్ద శైవదీక్షఁ గైకొని, శైవమతరహస్యములను సాకల్యముగా గుర్తెఱిఁగి, శ్రుతిపురాణోక్తిసహితముగ శైవమత మహత్త్వమును ప్రచారము చేసెడివాఁడు. తాను శివపూజానియమమున నున్నను, జంగములు వచ్చినచో వెంటనే వారిని పూజించెడివాఁడు :

మల్లికార్జున పండితుఁడు సనదవోలు (చందవోలు) రాజగు వెలనాటి చోడుని సభలో మతాంతరుల వాదములను ఖండించి శైవమతమును నిల్పె నఁట ! ఇతఁడు కల్యాణపురమున నున్న బసవేశ్వరునిఁ జూచుటకు కుటుంబముతోను, శిష్యులతోను బయలుదేరి దారిలో 'నిడుగుము' లనుచోటఁ దనశిష్యుఁడు దోనయ్యగారికి అన్నయైన వీరచాకి రాజయ్యగారిచే

గౌరవింపఁబడి పానుగంటికిఁ బోయెను. ఆ యూరి నపుడు 'ఉదయనుఁడు' పాలించుచుండెను పింగళి గోవింద ప్రధాని యాతనిమంత్రి. పండిత భక్తుఁడగు గోవిందుఁ డితనిని మిక్కిలి గౌరవించెను. ధవళేశు నామయ్య యను భక్తుఁ డీతని సేవలో మగ్నుఁడయి రాజసేవయందుఁ బ్రమత్తుఁడై తుద నాత్మహత్య చేసికొనెనఁట.

వనిపురమునొ [illegible]యను భక్తుని పూజలు గొని ప్రయాణము కొనసాగఁగా, అంతట నుండెనిమిది దినముల క్రిందటనే [illegible]శ్వరుఁడు [illegible] మిక్కిలి దుఃఖించి [illegible] శ్రీశైలమునకుఁ బ్రయాణమయ్యె[illegible] తాను వెల్లటూరిలో నిలిచి తనశిష్యుఁడైన దోచయ్యను గిరిప్రదక్షిణముచేసి, శివరాత్రికి శ్రీశైలమునకేఁగి, తన వ్రత పరిసమాప్తి నొందింపవలెనని కోరెను అతఁడు తిరిగి వచ్చిన తర్వాత పండితారాధ్యుఁడు భార్యాపుత్రాదులతో లింగైక్యముఁ జెందెను

ఈతని 'శివతత్త్వసారము'నకు విపులముగ నుపోద్ఘాతమును వ్రాసిన శ్రీ కొమర్రాజు వేంకట లక్ష్మణరావుగారే యీతని కాలమును నిర్ణయించిరి. క్రీ శ. 1163--1189 నడుమనున్న వెలనాఁటి చోడుఁడు, 1162 ప్రాంతమున నున్న ఉదయావనీశుఁడు, 1171 ప్రాంతమున నుండిన బుద్ధరాజు నితని సమకాలికులు. కావున నితఁడు 1120—1190 ల మధ్యకాలమున నుండ వలయును

మల్లికార్జున పండితుఁడు శివతత్త్వసారము, మహిమ్నస్తవము, మలహ ణము, పంచగద్యలు, రుద్రమహిమ, శంకరగీత, రక్షాధ్వరము, నాసాష్టకము తుమ్మెదపదములు, ఆనందపదములు, శంకరపదములు మున్నగు పెక్కు గ్రంథములను రచించినట్లు సోమనాథుని 'పండితారాధ్యచరిత్రము' వలననే తెలియుచున్నది ఇతఁడు కన్నడమున 'గణసహస్రనామ' మను కావ్య మును రచించెనని కన్నడకవిచరిత్రమునం దున్నది కాని యిప్పటికి లభించిన దొక్క 'శివతత్త్వసారము' మాత్రమే.

ముద్రితమైన 'శివతత్త్వసారము'న 489 కందపద్యము లున్నవి ఇందు వేయి పద్యము లుండియుండవలెనని కొందఱి యభిప్రాయము 'శివతత్త్వ

సారము' కన్నడమునను గలదు. అందలి కొన్నిపద్యములు మద్రాసు ప్రభుత్వ ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారమువారు ప్రచురించుచున్న పత్రికలో (Vol II No. 1, 2. 1949) ప్రకటింపఁబడినవి [184 నుండి 491 వఱకు, 715 నుండి 740 వఱకును] కన్నడగ్రంథమునకు మూలము తెనుఁగు గ్రంథమని స్పష్టముగాఁ దెలియుచున్నది. ఈ గ్రంథమును బట్టియు తెలుఁగు గ్రంథములోని పద్యసంఖ్య సహస్రమై యుండవచ్చునని తోఁచుచున్నది.

పాల్కురికి సోమనాథుఁడు తన యనుభవసారములో సీతనింగహర్చి

'... ... ... శివతత్త్వ
సార గద్య పద్య సమితి శివుని
మహిమఁ దెలిపినట్టి మల్లికార్జున పండి
తయ్యగారిఁ దలఁతు ననుదినంబు'

అని చెప్పియున్నాఁడు. 'ఆంధ్రకవితరంగిణి' కారులు పైయంశము నుటంకించుచు 'పండితయ్య రచించిన శివతత్త్వసారము గద్య పద్యాత్మకమని యీ పద్యమునఁ జెప్పఁబడినది. కాని యాగ్రంథమున పద్యములేగాని గద్యలు లేవు' [రెండవసంపుటము-పుట 34] అని వ్రాసిరి కాని పయి పద్యభాగము 'మల్లికార్జునపండితయ్య శివతత్త్వసారమును, గద్యలను, పద్యములను రచించె' ననియే చెప్పుచున్నది; కాని శివతత్త్వసారము గద్య పద్యాత్మకమని తెల్పుటలేదు.

'శివతత్త్వసారము' శతకమని కవి స్వయముగాఁ జెప్పకున్నను— దీని లక్షణము లన్నియును శతకలక్షణములే యగుటవలన నిది శతకమే యన దగు నని శ్రీ వేదము వేంకటకృష్ణశర్మగారు తమ 'శతకవాఙ్మయ సర్వస్వము' లోఁ జెప్పియున్నారు. 'శతకంబు శివతత్త్వ సారమాదిగను- గద్య పద్యంబు లాకాంక్షఁ జదువుచును'—(దీక్షాప్రకరణము) శతకము శివతత్త్వసారము దీప-కళిక, మహానాటకము నుదాహరణ' (పర్వతప్రక రణము)' అను సోమనాథుని గ్రంథభాగములను దానికిఁ బ్రమాణముగా నిచ్చియున్నారు. [పుటలు 11, 12]

శ్రీ శర్మగారు 'శతక' మనుదానిని 'శివతత్త్వసార' మనుదానికి విశేషణముగా గ్రహించినందున, ఆరీతిఁ దలఁపవలసివచ్చినది. కాని 'శతక' మనునది విశేషణమే యనుటకుఁ బ్రమాణములేదు. నూఱుపద్యములు కలదే శతకము. వేయి పద్యములు గలది శతకమనుట సంప్రదాయసిద్ధముకాదు. సోమనాథుఁడు పేర్కొనిన 'శతకము' శ్రీ విడుదవోలు వేంకటరావుగారు (తారణ-ఫాల్గుణమాస భారతి) భావించినట్లు పండితారాధ్యుని 'శ్రీ గిరి మల్లికార్జునశతక'మై యుండవలెను. అందలి పద్యమొకటి 'తెనుఁగు కవుల చరిత్ర' అనుబంధమునందు (పుట 388) ఈయఁబడినది. మఱియు, తెలుఁగు శతకములకుఁగల మకుటనియమము శివతత్త్వసారమునఁ గానరాదు.

మల్లికార్జునపండితుఁడు పెక్కుగ్రంథములను రచించినను, అవి లభింపక పోవుటయు, లభించిన 'శివతత్త్వసార' మసమగ్రముగా నుండుటయు నాంధ్రుల దురదృష్టము.

నాగదేవభట్టు

ఇతఁ డమరకోశమునకు వ్రాసిన తెలుఁగు టీక యొకటి లభ్యమగుచున్నది. అందు 'నాగదేవభట్టోపాధ్యాయ' కృత మని యున్నది. విద్వాంసుఁడగు నాగదేవభట్టారకుని ప్రశంస శ్రీనాథుని క్రీడాభిరామమునఁ గలదు. క్రీ. శ. 1134 ప్రాంతమున నుండిన సుప్రసిద్ధవ్యాఖ్యాత మల్లినాథసూరి తన 'వైశ్యవంశసుధార్ణవము'న నీతని యమరటీకను పేర్కొనియున్నందున, ఇతఁ డతనికంటెఁ బూర్వుఁడనుట స్పష్టము.

క్రీ శ 1149 నాఁటి దాక్షారామ శాసనములోను, క్రీ. శ. 1154 నాఁటి ప్రేంపల్లి భావనారాయణసామి యాలయములోనున్న శాసనమునందును పేర్కొనఁబడిన నాగదేవకవియే యీ నాగదేవభట్టారకుఁడని 'తెనుఁగు కవుల చరిత్ర' (పుట 285) వలనఁ దెలియుచున్నది.

ఇతని గ్రంథము లేవియును లభించలేదు. కాని మైలమభీమనను గూర్చి చెప్పిన పద్యమొకటి 'కాచనబసవన' యొక్క 'కవిసర్పగారుడము' నందుదాహరింపఁబడినది. ఈ మైలమ భీమననే వేములవాడ భీమకవి కాని యాడియున్నాఁడు. మైలమ భీమనయే చిక్కభీముఁడు. ఇతని శాసనము క్రీ. శ. 1168 నాఁటిది ద్రాక్షారామమునఁ గలదు. భీముని తల్లియగు మైలమ దేవియొక్క శాసనము క్రీ. శ. 1099 నాఁటిది కలదు. కావున భీముని కాలమునుబట్టి యమృతనాథుఁడును క్రీ. శ. 1150-60 ప్రాంతమునందలివాఁడగునని చెప్పవచ్చునని 'తెనుఁగు కవుల చరిత్ర'యందుఁ గలదు [పుట287]

మంత్రి భాస్కరుఁడు

మంత్రి భాస్కరుఁడు సుప్రసిద్ధుఁడును, కవిబ్రహ్మయునగు తిక్కన సోమయాజి పితామహుఁడు. తిక్కన యాతనిని తన నిర్వచనోత్తర రామాయణమునందు 'నాపితామహుఁడగు మంత్రి భాస్కరునిఁబట్టియే నాకృతికి ఆదరము కలుగు'నని ప్రశంసించియున్నాఁడు. తిక్కనకు 'దశకుమార చరిత్రము నంకిత మొసఁగిన కేతన యీ మంత్రి భాస్కరుని -

'శాపానుగ్రహ శక్తియుక్తుఁడమలా
చారుఁడు, సాహిత్య వి
వ్యాపారీణుఁడు ధర్మమార్గపథికుం
డర్థార్థి లోకావన
వ్యాపారవ్రతుఁ డంచుఁ జెప్ప సుజన
వ్రాతంబు గౌరీపతి
శ్రీపాద ప్రవణాంతరంగు విబుధ
శ్రేయస్కరున్ భాస్కరున్''

అని కొనియాడియున్నాఁడు మంత్రి భాస్కరుఁడు క్రీ. శ. 1190-1220 నడుమ నుండి వాఁడు

ఇప్పుడు 'భాస్కర రామాయణ' మని ప్రచారమున నున్న గ్రంథములోని అరణ్యకాండ మీతఁడు రచించినదై ' తాళపత్రప్రతుల పరిశీలనమువలన బాల, అయోధ్యాకాండలను కూడ నీతఁడే రచియించి యుండవలెనని చెప్పవచ్చును. కాండముల చివటి గద్యలు, రణ్యకాండమందలి ఆశ్వాసవిభాగము, రచనా వైలక్షణ్యము. ఇట్టి యూహ కాధారములు. మంత్రి భాస్కరుఁడు రచించిన కాండముల చివటి పద్యములు విభక్త్యంతములతో నుండఁగా, తక్కినవి సంబోధనాంతములై యున్నవి ప్రక్షిప్తములు ఎక్కువగా చేరినవి.

మంత్రి భాస్కరుఁడు రచించిన రామాయణము మూలము ననుసరించినది కాదు. ఇందు కథాంశములు, వర్ణనలును సంగ్రహింపఁబడినవి కావుననే మఱల ఎఱ్ఱాప్రెగడ మూలానుసారముగ 'రామాయణము'ను రచింపవలసి వచ్చినది. భాస్కరుని రచనలో సంస్కృతపదము లెక్కువ. ఎఱ్ఱన రచనలో సంస్కృతాంధ్ర పదములు సమానముగ నుండును.

మంత్రి భాస్కరుఁడు రామాయణమును సమగ్రముగా రచింపలేదు. అసమగ్రమైన యీరామాయణమును హుళక్కి భాస్కరుఁడు మున్నగు వారు పూరించిరి కాని, ప్రారంభించిన కవి పేరును, పూర్తిచేసిన కవి పేరును 'భాస్కరుఁడే' అగుటచే దీనికి 'భాస్కరరామాయణ' మని పేరు కలిగినది; మఱియు రామాయణకర్తృత్వమునుగూర్చి వివాదములు చెల రేఁగుట కవకాశము నేర్పడినది.

భాస్కర రామాయణములోని కొంతభాగము మంత్రి భాస్కర రచితమని 'తెనుఁగు కవుల చరిత్ర' కారులును వ్రాసియున్నారు. (పుటలు 313, 314) 'ఆంధ్రకవితరంగిణి' కర్తయు దీనికి సమ్మతించిరి [చూ. 2 వ సంపుటము- మంత్రి భాస్కరుఁడు]

మఱియు 'ఆంధ్ర కవితరంగిణి' లో నిట్లున్నది—'కవిజీవితకారులగు శ్రీ గురుజాడ శ్రీరామమూర్తి పంతులుగారును, ఆంధ్ర కవులచరిత్ర ప్రథమముద్రణమున శ్రీ వీరేశలింగము పంతులుగారును, మంత్రి భాస్కరుఁడు రామాయణమునఁ గొంతభాగమును రచియించి యుండెనని యభిప్రాయపడియున్నారు అందుపైని శ్రీ కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారు భాస్కరోదంతమను ౨౪ పేజీల గ్రంథమున నీవిషయమును విమర్శించి, భాస్కర రామాయణముతో మంత్రి భాస్కరునకు సంబంధము లేదనియు, హుళక్కి భాస్కరుఁడే రామాయణ గ్రంథకర్త యనియు నిరూపించి యున్నారు. దానినిబట్టి కందుకూరి శ్రీ వీరేశలింగము పంతులుగారు తమ యభిప్రాయమును మార్చుకొని కవుల చరిత్ర రెండవ ముద్రణమున రామాయణకర్త హుళక్కి భాస్కరుఁ డని వ్రాసియున్నారు

భాస్కరోదంతము క్రీ. శ. ౧౮౯౫ వ సంవత్సరమున ననఁగా దాదాపు యేబది సంవత్సరముల క్రిందట ముద్రితమైనది. పంతులుగారి కవుల చరిత్రము రెండవ ముద్రణమును, భాస్కరోదంతమును, జదివిన పిమ్మటఁగూడ నాయభిప్రాయము మారలేదు. మంత్రి భాస్కరుఁడు రామాయణములోఁ గొంతభాగమును రచియించి యుండెననియే నా నిశ్చితాభిప్రాయము. భాస్కరోదంతమునందలి విషయములు కొన్ని సత్యమునకు విరుద్ధముగా నున్నవి. ఎఱ్ఱాప్రెగ్గడ రచించిన రామాయణ కృతికర్త అనవేమారెడ్డి యని భాస్కరోదంతము తెలుపుచున్నది. అది వాస్తవముకాదు. ఆ రామాయణ కృతికర్త ప్రోలయ వేమారెడ్డికాని అనవేమారెడ్డి కాఁడు. మంత్రి భాస్కరునియొక్కయుఁ, దిక్కన సోమయాజి యొక్కయు కాలమును భాస్కరోదంతము సరిగా నిర్ణయించలేదు [రెండవ సంపుటము-పుటలు 126,127]

భాస్కర రామాయణమునకు పీఠికను వ్రాసిన శ్రీ మేదేపల్లి వేంకటరమణాచార్యులుగారు భాస్కర రామాయణముతో మంత్రి భాస్కరునకు సంబంధములేదని తెలిపి యున్నారు,

యథావాక్కుల అన్నమయ్య

ప్రాచీనులగు శివకవులలో యథావాక్కుల అన్నమయ్య యొకఁడు' ఇతఁడు 'సర్వేశ్వరా!' అను మకుటముతో శివస్తుతి నొనరించుచు నొక కృతిని రచించెను. అది 'సర్వేశ్వరశతకము'గా ప్రసిద్ధమైయున్నది. ఇందలి పద్యసంఖ్య వివిధములగు వ్రాఁతప్రతులలో విభిన్నముగ నున్నది కొన్నింట ౧౨౩, కొన్నింట ౧౩౪, పరిషత్తువారు ముద్రించిన ప్రతిలో ౧౨౮ పద్యములు, మఱికొన్నింట ౧౪౭ పద్యములును కానవచ్చుచున్నవి. ఇందలి పద్యములు కొన్ని యితరగ్రంథములందును (అబ్బయామాత్యుని కవిరాజమనోరంజనమునను కలదు. ప్రబంధరత్నావళియందు, ముమ్మయ జైతరాజు రచనగా నొకపద్యముకలదు) కానవచ్చుచున్నవి. ఇతరులు పై మకుటముతో వ్రాసిన పద్యములు కొన్ని యిందుఁజేరినట్లు విమర్శకు లభిప్రాయపడుచున్నారు. కావున ఇందలి పద్యసంఖ్యను నిర్ణయించుట కష్టము. కవి, తాను శతకమును వ్రాసితినని చెప్పనందున—ఇది శతక మగునో, కాదో నిర్ణయించుటయు కష్టము. అన్నమయ్య తాను 'సర్వేశ్వర ప్రాకామ్యస్తవము'ను జెప్పినట్లును. 'సర్వేశ్వరస్తోత్రంబు' చెప్పినట్లును తెల్పియున్నాఁడు. మఱియు 'సర్వేశ్వర స్తోత్రం బన్నయచెప్పె' నను పద్యభాగమునుబట్టి యితనికి 'అన్నయ' అను పేరు నున్నట్లు స్పష్టము.

'శాకాబ్దంబులు వార్ధి షట్క పురజి
త్సంఖ్యం బ్రవర్తింపఁగా
శ్లోకానందకరంబుగా మహిమతో
శోభిల్ల సర్వేశ్వర
ప్రాకామ్యస్తవ మొప్పఁజెప్పె శుభకృ
త్సంవత్సరవర్షంబునన్
శ్రీకంఠార్పితమై వసుంధరపయిం
జెన్నొంద సర్వేశ్వరా!'

అను నీతని పద్యమునుబట్టి యేతద్గ్రంధరచనాకాలము ౧౧౬౪ నకు సరియగు క్రీ. శ. ౧౨౪౨ గా తెలియుచున్నది.

ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు ప్రకటించిన 'సర్వేశ్వరశతక' పీఠికనుబట్టి యీ యన్నమయ్య ఆత్రేయసగోత్రుఁడగు నారాధ్యబ్రాహ్మణుఁ డనియు, యజుశ్శాఖాధ్యాయి యనియు, గోదావరీ తీరవాసియనియు, పట్టెసమున వెలసిన వీరభద్రేశ్వరస్వామి యీతని యిలవేలుపనియుఁ దెలియుచున్నది. ఈ వృత్తాంతము పరిషత్తువారికి శ్రీ శేషగిరిరావుగారు సంపాదించి యిచ్చినట్లును సోమరాజు, వేంకట శివునిచే వ్రాసియుంచఁబడినట్లును తెలియుచున్నది.

అన్నమయ్య ప్రాచీనుఁ డగుటచే 'సమూహి, విగుర్వించు, సురంగము, బహురూపమాడు' మున్నగు పదములను ప్రయోగించెననియు, ఇట్టివి సోమనాథాదుల గ్రంధములందును గలవనియు 'తెనుఁగు కవుల చరిత్ర'లోఁ గలదు.

పెక్కువిషయములలో అన్నమయ్య కృతికిని, సోమనాధుని గ్రంధములకును పోలిక కానవచ్చుచున్నది. సోమనాధుఁడు క్రీ. శ. 1190-1260 ల నడుమ నుండెనని నిశ్చయించిన శ్రీ వేంకటరావుగారు సోమనాధు ననుసరించియే అన్నమయ్య గ్రంధరచన సాగించెననియు, అన్నమయ్య అతి రమ్యంబుగ దూదికొండ మహనీయారాధ్య సోమేశ్వర, ప్రభుకారుణ్య వసంతసంజనితమత్పద్య ప్రసూనావళిన్'—అనునెడ పేర్కొనిన దూది కొండలోని ఆరాధ్య సోమేశ్వరుఁడు పాలకుఱికి సోమనాధుఁడే యయి యుండుననియు తెలియఁజేసియున్నారు

సోమనాధుఁడు ద్వితీయ ప్రతాపరుద్రుని కాలమున నుండెనని తలఁచుచున్న 'ఆంధ్రకవితరంగిణి' కర్త 'శతకవాఙ్మయ సర్వస్వ' కర్త మున్నగువారు ఆరాధ్య సోమేశ్వరుఁడు సోమనాధుఁడు కాఁడనియు, అన్నమయ్య కృతి ననుసరించియే సోమనాధుఁడు తన గ్రంథములను రచించెననియు నభిప్రాయపడుచున్నారు. ఏదియెట్లున్నను, అన్నమయ్య 13 వ శతాబ్ది నడుమ నున్నవాఁ డనుట నిశ్చయము.

అన్నమయ్య రచించిన వేఱొకకృతి 'లీలానంద సర్వేశ్వర శతక' మున్నట్లు శ్రీ వేంకటరావుగారు 'తెనుఁగు కవుల చరిత్ర'లోఁ దెల్పియున్నారు. (పుట 377) ఈ 'లీలానందసర్వేశ్వరశతకము'న అన్నమయ్య శైలి ననుసరింపని పద్యములున్నందున, ఇది అన్నమయ్య కృతి కాదని 'ఆంధ్రకవితరంగిణి' కారుల యభిప్రాయము ప్రాచీన భాషా సంప్రదాయములిందుండుటచే, అన్నమయ్య రచనయే యగునని శ్రీ వేఁకటరావుగా రనుచున్నారు.

సర్వేశ్వర స్తుతిలో నెన్నిపద్యములున్నదియు నిశ్చయము కాలేదు. ఒకవేళ నివి యందలి పద్యము లేమో! 'లీలానంద' అనునది 'సర్వేశ్వరా!' అను దానికి విశేషణమని గ్రహించినచో— అది ప్రత్యేకకృతి యనుటకంటె— ఉపలబ్ధములగు పద్యములు 'సర్వేశ్వర శతకము'లోనివే యని యూహించుటకును అవకాశము లేకపోలేదు.

పెద్దయామాత్యుఁడు

ఇతనింగూర్చి 'తెనుఁగు కవుల చరిత్ర'లో వ్రాయఁబడినది. తెలుఁగు కవులలో పెద్దయలు పెక్కురు కలరు. ఇతఁడు విక్రమార్కచరిత్రమును రచించిన ఒక్కనకు పితామహుఁడు నెల్లూరిని పాలించిన మనుమసిద్ధి రాజునకుఁ దండ్రియగు చోళతిక్కరాజు కాలమున నున్నట్లు జక్కన చెప్పిన '....నెల్లూరి తిరుకాళ మనుజవిభుని, సమ్ముఖమ్మున సాహిత్యసరణి మెఱసి' అను పద్యభాగమువలననే తెలియుచున్నది. తిక్కరాజే తిరుకాళత్తి యని శ్రీ వేంకటరావుగారు తెలిపిరి. కావున నీకవి క్రీ. శ 1208-1239 ల నడుమ నుండెనని చెప్పవచ్చును.

పెద్దయామాత్యుని గ్రంథములు లభింపలేదు. ఇతఁడు 'ఆశు-మధుర-చిత్ర-విస్తరము'లను చతుర్విధ కవిత్వములందు నాఱితేఱినవాఁడు.

వెన్నెలకంటి అన్నయ

ఇతఁడు 'షోడశకుమారచరిత్రము'ను రచించెను. దీనికి 'బేతాళపంచవింశతి' అను నామాంతరము కలదు. బేతాళపంచవింశతి కవిభల్లట రచనగా లాక్షణికులు చెప్పుచున్నారు. ముద్రిత షోడశకుమారచరిత్రములోని భాగములను, అముద్రిత బేతాళ పంచవింశతిలోని భాగములను అభిన్నములయి యున్నవి.

అన్నయ తనగ్రంథమును తండ్రియగు సూరనామాత్యుని కంకిత మిచ్చెను. సూరనామాత్యుని, పశ్చిమ చాళుక్య చక్రవర్తియగు సోమేశ్వరుని (క్రీ. శ. 1126-1138) తోడను, జగదేకమల్లుని (క్రీ. శ. 1148) తోడను, కృష్ణకందారుఁ డను యాదవరాజు (క్రీ. శ. 1250) తోడను, కవి పోల్చి యుండుటచే నీతఁడు క్రీ. శ. 1250 ప్రాంతమువాఁడయి యుండవచ్చునని 'తెనుఁగు కవుల చరిత్ర'లోఁ దెలుపఁబడి యున్నది.

క్షేమేంద్రుఁడు

సంస్కృతమున సుప్రసిద్ధుఁడగు క్షేమేంద్రుఁడు కాశ్మీరదేశవాసి. క్రీ.శ.1060 ప్రాంతమున నుండెను. ఆ క్షేమేంద్రుని నామమునే బిరుదముగా ధరించిన 'లక్కాభట్టను ఆంధ్రకవి యొకఁడుండెను. (క్షేమేంద్రుఁడే లక్కాభట్టని శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు 'సకలనీతిసమ్మతము' యొక్క పీఠికలో తెలిపియున్నారు.) ఇతఁడు సంస్కృత క్షేమేంద్రునికిఁ దర్వాతివాఁడు. క్రీ. శ. 1250 ప్రాంతమున నుండిన తిక్కన రచించిన 'కవివాగ్బంధము'న నీతనింగూర్చియు, ఇతని గ్రంథమును గూర్చియు నుండుటవలన నీతఁడు క్రీ. శ. 1250 కి పూర్వుఁడని 'తెనుఁగు కవుల చరిత్ర' లోఁ గలదు. (పుట 381) కవి వాగ్బంధము తిక్కనకృతి కాదని 'ఆంధ్రకవితరంగిణి'కారులు నిరూపించియున్నారు. (రెండవ-సంపుటము పుట 185.)

ఈ క్షేమేంద్రుఁడు 'శూద్రకరాజుచరిత్రము, శతపక్షిసంవాదము, ముద్రా మాత్యము' నను కృతులను రచించెనని 'సకలనీతిసమ్మత' పీఠికలో శ్రీ రామకృష్ణకవిగారు తెల్పియున్నారు. శూద్రకరాజుచరిత్రము కవిభల్లట కృతిగా లక్షణగ్రంథములనుబట్టి తెలియుచున్నది. పయి గ్రంథములలోని పద్యములు కవివాగ్బంధము, వెల్లంకి తాతంభట్టు రచించిన కవిచింతామణి, సకలనీతిసమ్మతము మున్నగు గ్రంథములలో నుదాహరింపఁబడి యున్నవి.

ఆంధ్రభోజుఁడు

పదునొకండవ శతాబ్దిలో ధారానగరము రాజధానిగా మాళవదేశమును పాలించిన భోజమహారాజు మహావిద్వాంసుఁడై సంస్కృతభాషా వాఙ్మయములను పోషించెను. ఈ యంశమెల్లరకు నెఱుక. ఆ రీతినే యాంధ్రభాషావాఙ్మయములను పోషించిన యొక ప్రభువు 'ఆంధ్రభోజ' బిరుదము నొందెను. అతని నామ మిపుడు మఱుగుపడి బిరుదనామమే నిలిచెను. ఇతఁడు 'నీతిభూషణ' మను రాజనీతి గ్రంథమును రచించినట్లు శ్రీ రామకృష్ణకవిగారు 'సకలనీతిసమ్మత' పీఠికలోఁ దెల్పియున్నారు. ఆ గ్రంథమునందలి కొన్ని పద్యములు 'సకలనీతిసమ్మతము' న ఉదాహృతములైనవి.

'ఆంధ్రభోజుఁడు' భోజునికంటె భిన్నుఁడు. ఇతఁడు భోజునికిఁ దర్వాతను, మడికి సింగనకుఁ బూర్వమున నుండి యుండవలెను. 16 వ శతాబ్దిలో నుండిన లింగమగుంట తిమ్మకవి 'నీతిభూషణము' లోని పద్యములను తన 'బాలబోధచ్ఛందము'న నుదాహరించియున్నాఁడు.

పంచతంత్రి రచయిత

మడికి సింగన కూర్చిన 'సకలనీతిసమ్మతము'లో 'పంచతంత్రి' నుండి కొన్ని పద్యము లుదాహరింపఁబడినవి; కాని తత్కర్త పేర్కొనఁబడలేదు. ఈ గ్రంథము లభింపలేదు. పంచతంత్రికర్త క్రీ. శ. 1250 ప్రాంతమువాఁడై యుండునని 'తెనుఁగు కవుల చరిత్ర'లోఁ జెప్పఁబడినది. (పుట 383)

'కామందక' కర్త

'కామందకము' నుండి కొన్నిపద్యములు 'సకలనీతిసమ్మతము'న నుదాహృతములైనవి. కర్తపేరు తెలియలేదు. గ్రంథమును లభ్యముకాదు. ఈ గ్రంథకర్త పదునాల్గువ శతాబ్ది చివఱివాఁడై యుండవచ్చునని శ్రీ వేంకటరావుగారనుచున్నారు.

శివదేవయ్య

శివదేవయ్య గొప్ప విద్వాంసుఁడు. రాజ్యతంత్రజ్ఞుఁడు; ఇతఁ డోరుగంటిని పాలించిన గణపతిదేవుని యొద్దను. ఆతని పుత్రికయగు రుద్రమదేవి యొద్దను మంత్రిగానుండెను. మనుమసిద్ధిని తిరిగి రాజ్యమును నిలుపుటలోఁ దిక్కనకు మిగుల తోడ్పడెనఁట. ఇతఁడు గణపతిదేవుని దీక్షాగురువగు విశ్వేశ్వరదేశికుల కంటె విభిన్నుఁడు.

ఇతఁడు 'పురుషార్థసార' మను గ్రంథమును రచించెనని 'సకలనీతి సమ్మతము'న నుదాహరింపఁబడిన యందలి పద్యములనుబట్టి తెలియుచున్నది. ఆ గ్రంథముమాత్రము లభింపలేదు.

శివదేవయ్య 'శివదేవధీమణీ!' అను మకుటముతో నొక శతకమును రచించెనని తెలుపుచు శ్రీ మానవల్లి రామకృష్ణకవిగా రందలి పద్యము నొకదానిని తమ 'త్రిపురాంతకోదాహరణ' పీఠికలో నుదాహరించియున్నారు

ఈతనికి 'ఆంధ్రకవితాపితామహ' బిరుదము కలదు. తర్వాత అల్లసాని పెద్దన మున్నగువారి కీబిరుద మీయఁబడినది. ఈ బిరుదు పొందినవారిలో నీతఁడే ప్రథముఁడని తెలియుచున్నది.

తిక్కనసోమయాజి

తిక్కనసోమయాజి యనియెడి యీ కవి యించుమించుగా నన్నయ భట్టారకునికి రెండువందల సంవత్సరముల తరువాత నున్నట్టు కనఁబడు చున్నాఁడు. తిక్కనసోమయాజి నన్నయభట్టుతోడి సమకాలికుఁ డని జనులు వాడుకొనుచు, ఆ విషయమయి పెక్కుకధలు చెప్పుకొను చున్నారు. * కాని యవి యవిచారమూలకము లగుటచేత మనము విశ్వ సింపఁ దగినవి కావు. ఈ కవి తన నిర్వచనోత్తరరామాయణము నంకితము చేసిన మనుమభూపాలుఁడు పదుమూఁడవ శతాబ్దమధ్యమున నున్నట్లు కొన్ని శిలాశాసనములవలనఁ దెలియవచ్చుచున్నది. ఈ మనుమరాజు తాతయును సిద్ధిరాజని సామాన్యముగాఁ బిలువఁబడువాఁడును నయిన మనుమసిద్ధి పండ్రెండవ శతాబ్దమునం దుండుట నిశ్చయము. అది గాక కృష్ణామండలములో నందిగామ సీమలోని అనమంచిపల్లె గ్రామమునందలి శివాలయముయొక్క గర్భాలయముముందఱి రాతి పలకమీఁది నాలిగింటిలో నొక శిలాశాసనమునందు శాలివాహనశకము ౧౧౮౨ వ సంవత్సరమం దనఁగా క్రీస్తుశకము ౧౨౬౦ వ సంవత్సరమునందు "మన్మభూపతి" యున్నట్టు వ్రాయఁబడియున్నది. మఱియును కృష్ణామండలములోని నూజివీడు సంస్థానములోని కొండనాయనివర గ్రామములోని చెఱువుగట్టు మీఁద నున్న దేవాలయ సమీపమునందలి యొక రాతిమీఁద చెక్కఁబడిన దానశాసనములో శాలివాహనశకము ౧౧౮౫ వ సంవత్సరమునం దనఁగా క్రీస్తుశకము ౧౨౬౩ వ సంవత్సరమునందు "మనుమరాజు" భూదానము చేసినట్టు చెప్పఁబడి యున్నది. పైవి గాక మనుమసిద్ధిరాజుయొక్క శాసనములు కందుకూరిసీమలోని పెంట్రాలగ్రామములో ౧౨౫౩ వ సంవత్సరము మొదలుకొని ౧౨౬౦ వ సంవత్సరమువఱకును నున్నవి కానిపించు చున్నవి. ౧౨౫౩ వ సంవత్సరములోని నందలూరు శాసనములో మనుమ

[* చూ. శ్రీ గురజాడ శ్రీరామమూర్తి గారి 'కవిజీవితములు']

సిద్ధి కోడూరుగ్రామము నొక బ్రాహ్మణునకు దానము చేసినట్లును, కాకతీయగణపతిదేవునికరుణను కాంక్షించుచుండినట్లును చెప్పఁబడి యున్నది వీనివిబట్టి చూడఁగా గణపతిదేవుఁడు ౧౨౫౭ వ సంవత్సరమువఱకును మనుమసిద్ధికి సాయము చూపినట్లు కానఁబడదు. చూపినచో ౧౨౫౮ వ సంవత్సరమునకును ౧౨౬౦ వ సంవత్సరమునకును నడుమ చూపి యుండ వలెను. ౧౨౬౨ వ సంవత్సరమునకుఁ బయిని మనుమసిద్ధిశాసనము లెందును గానరావు. అందుచేత నాతఁ డా తరువాత నల్పకాలములోనే కాల ధర్మము నొందియుండును. అంతేకాక కృష్ణామండలచరిత్రసంగ్రహము నందు * యఱ్ఱగడ్డ రాజయిన కాటమరాజును పల్నాడుప్రభువైన పద్మ నాయకుఁడును గలిసి పశువులమేఁతబీళ్ళవిషయమయి పదుమూఁడవ శతాబ్దమునందు నెల్లూరిప్రభువైన సిద్ధిరాజుతో యుద్ధము చేసినట్లును, సిద్ధిరాజుసేనలు కవితిక్కన తమ్మునికుమారుఁడైన తిక్కనమంత్రిచే నడుపఁ బడినట్లును, చెప్పఁబడి యున్నది కవి తిక్కనతమ్ముఁ డనుటకుఁ దమ్ముని కుమారుఁ డని పొరపాటునఁ బడి యుండవచ్చును. ఈ రణతిక్కన్న మన తిక్కన్నకు సాక్షాత్సహోదరుఁడు కాక పెదతండ్రికొడుకయి యున్నాఁడు. ఇవి యన్నియు నిటుండఁగా తిక్కనసోమయాజిశిష్యుఁడయిన మారన తాను తెనిఁగించిన మార్కండేయపురాణమును ప్రతాపరుద్రదేవునిమంత్రులలో నొకఁ డయిన నాగయగన్నమంత్రి కంకితము చేసిన ట్లా పురాణములోని యీ క్రిందిపద్యమువలనఁ దేటపడుచున్నది.—

సీ. తన సముజ్జ్వలమూర్తి జనలోచనాంభోజ
　　　ములకు మార్తాండుని మూర్తిగాఁగ
　తన నయోపార్జితధనమున కర్థిదో
　　　స్స్థలులు విక్షేపణస్థలులుగాఁగ
　తనభూరితరతేజ మనుపమనిజవంశ
　　　భవనంబునకుఁ బ్రదీపంబుగాఁగ
　తన వినిర్మలయశంబునకు దిశాతటం
　　　బులు దృఢశాసనశిలలుగాఁగ

[* ఇది యెఱ్ఱగడ్డపాడుగాని యఱ్ఱగడ్డ కాదు.]

ప్రకటగుణగణసంపదఁ బరఁగుచున్న
ధన్యుఁ డథగతవృషుఁడు ప్రతాపరుద్ర
దేవసామ్రాజ్యవర్ధనస్థిరవినీతి
కరణకుశలుండు నాగయగన్నవిభుఁడు.'

మార్కండేయపురాణ గద్యమునందు మారన "శ్రీమదుభయకవిమిత్ర తిక్కనసోమయాజిప్రసాదలబ్ధసరస్వతీపాత్ర తిక్కనామాత్యపుత్ర" యని వ్రాసికొని యుండుటచేత నతఁడు తిక్కనసోమయాజిశిష్యుఁ డగుటకు సందేహము లేదు మారనతండ్రి యైన తిక్కనామాత్యుఁడు కవితిక్కన్న గాక వేఱొక్కతిక్కన్న యయి యున్నాఁడు

ప్రతాపరుద్రదేవుఁడు ౧౨౯౫-వ సంవత్సరము మొదలుకొని ౧౩౨౩-వ సంవత్సరమువఱకును రాజ్యము చేయుటయు, ఈ కడపటి సంవత్సరమునం దతఁడు ఢిల్లీచక్రవర్తియైన జిల్లాలుద్దీనుమేనల్లుఁడును అయోధ్యనబాబు నయిన అల్లా-ఉద్దీన్‌చేత పట్టుకోఁబడి ఢిల్లీనగరమునకుఁ దీసికొని పోఁబడు టయు, సుప్రసిద్ధములు. ఈ పయి నిదర్శనముల నన్నిఁటిని పరిశీలించి చూడఁగా తిక్కనసోమయాజి పదుమూఁడవశతాబ్ద మధ్యమున నుండె ననియు ఈ కవికిని నన్నయభట్టారకునికి మధ్య రెండు వందల సంవత్సరము లెడ మున్నదనియు, నిశ్చయింపవలసి యున్నది. కాబట్టి తిక్కనసోమయాజి యిప్పటి కాఱువందలయేఁబది సంవత్సరములక్రిందట నుండి యున్నాఁడు.

తిక్కనసోమయాజి నన్నయభట్టు కాలములోనివాఁడు కానట్టును, హూణ శకము పదుమూఁడవ శతాబ్దమునందే యుండినట్టును స్థాపించుటకయి మరి కొన్ని నిదర్శనములు కూడఁ గనఁబడుచున్నవి. మెకాంజి దొరగారు సంపాదించి చెన్నపురి రాజకీయప్రాచ్యలిఖితపుస్తకనిలయమునం దుంచిన వ్రాఁతప్రతులలో నొకదానియందుఁ దిక్కనసోమయాజి శాలివాహనశకము ౧౧౨౦-వ సంవత్సరమునం దనఁగా హూణశకము ౧౧౯౮-వ సంవత్స రమునందు మృతినొందెనని చూపెడి యీ క్రింది పద్య మొకటి కానఁబడు చున్నది.'

క. అంబర రవి శశిశాకా
బ్దంబులు చనఁ గాళయుక్తి భాద్రపదపుమా
సంబున నంబరమణిబిం
బం బనఁదగు తిక్కయజ్వ బ్రహ్మముఁ జేరెన్. *

ఈ కవి కాకతీయగణపతిదేవునికాలములో నుండినట్లు ప్రబల నిదర్శనము లున్నందునను, గణపతిదేవుఁడు పదుమూడవ శతాబ్ద మధ్యమువఱకు రాజ్యము చేసినందునను, ఈ పద్య మంతగా విశ్వాసార్హ మయినది కాదు. ఈ పద్యముయొక్క సత్యమెట్టి దయినను, మన్మరాజును, దిక్కనసోమయాజియుఁ గాకతీయప్రభువైన గణపతిదేవుని కాలమునందుండుట నిశ్చయము. గణపతిదేవుఁడు ౧౨౬౦ వ సంవత్సరమువఱకును రాజ్యము చేసినట్టును, ఆ సంవత్సరము మొదలుకొని యాతని కొమారితయగు రుద్రమదేవి పరిపాలనము చేసినట్లును, చరిత్రమును, శిలాశాసనాదులును తెలుపుడు చేయుచున్నవి. అక్కన, బయ్యన లనువారు మన్మరాజును రాజ్యవిహీనునిగాఁ జేయఁగాఁ దన ప్రభువుపక్షముఁ దిక్కనసోమయాజి గణపతిదేవునిసభకుఁ బోయినట్లు సిద్ధేశ్వచరిత్ర మను నామాంతరము గల ప్రతాపచరిత్రమను శైవ గ్రంథమునందు వ్రాయఁబడి యున్నది ♦ ఈ యంశమే యిటీవల నిప్పటికి నూటయేఁబది సంవత్సరములకు లోపఁ

* విల్సనుదొరవారు తమపుస్తక వివరణపట్టికలో నీపద్యమునే యుదాహరించి "అంకానాం వామతో గతిః" అనియున్న న్యాయమునుబట్టి పండ్రెండని యర్థమిచ్చెడు రవిశబ్దము తెలిపెడి ౧ ౨ అంకెలను కుడినుండి యెడమకు ౨ ౧ గాఁ బెట్టి ౧౨౧౦ శాలివాహనశకమునుగాఁ జేసిరి. అప్పు డది క్రీ.శ. ౧౨౮౮ అయి యించుమించుగా తిక్కనమరణకాలము సరిపోవచ్చును గాని కాళయుక్తి సంవత్సరము కాదు.

[కొందఱు 'రవిశశి' అను దానిని 'శశిరవి' గాఁ జదువ వలెననిరి. అప్పుడును ౧౨౧౦ యే యగును. అది సరికాదు]

♦ దీని రచయిత కాసె సర్వప్ప, ఇతఁడు ౧౭౦౦ ప్రాంతమువాఁడని 'ఆంధ్ర కవి తరంగిణి'.

గూడిమంచి జగ్గకవి రచియించిన సోమదేవరాజీయమునందును జెప్పబడి యున్నది. ఏతదంశమును దేటపఱచెడి యా గ్రంథభాగముల నిం దుదాహరించుచున్నాను

(సిద్ధేశ్వరచరిత్ర, ద్విపదకావ్యము.)

సారెసారెకుఁ గేరి సన్నుతుల్ చేయ
సారపారావారసరసగంభీర
సారుఁడై కీర్తివిస్తారుఁడై యలరు
నా రీతి గణపతి నటు చూచువేడ్కఁ
దిక్కనసోమయా జక్కడ కొకట

* * *

దిక్కుదిక్కులనుండి తెరలి విద్యార్థు
లక్కడక్కడను గావ్యముల శ్లోకార్థ
మొక్కొక్కవిధమున నొగి వినిపింపఁ
జక్కన వినుచును నొక్క యందలము
నెక్కి తిక్కనసోముఁ డక్క దేతెంచె
నా రీతిగా సోమయాజుల రాక
వారక చని ఫణిహారులు దెల్ప

* * * *

అట్టి మహాత్ముని నా సోమయాజి
నెట్టన నెదురేగి నేర్పుతో రాజు
తెచ్చి యర్ఘ్యాసనస్థితునిఁగా జేసి
మెచ్చి తాంబూలాది రెమ్ముగా నిచ్చి

* * * *

అను భారతాశ్వాస మాపీరవరులు
తగఁ జేసినట్టి యుద్ధప్రకారములు
వినియు సంతోషించెఁ గనినట్లు చెప్ప

* * *

అంతఁ దిక్కనసోమయాజికి మెచ్చి
వింతవస్త్రంబులు వివిధభూషణము
లత్యంతభక్తితో నప్పు డిచ్చుచును
సత్యసంధుడును సత్యవర్తనుఁడు
నగు సోమయాజి తా నా రాజు కనియెఁ
దగుమాట విను మొక్కధర్మకార్యంబు
సూర్యవంశంబున సొబగొందునట్టి
యార్యపూజితవర్యుఁ డా మన్మసిద్ధి
రాజు దా నెల్లూరు రమణతో నేల

* * * *

అక్కన బయ్యన లధికబలిష్ఠు
లక్కట' సిద్ధిరాయనిఁ బాఱఁదోలి
దక్కిన రాజ్యంబు తామె యేలుచును
నొక్క కా సైనను జక్కఁగ సీరు
వారల దండించి వారినెల్లూరు
వార కిప్పింపు మవారణఁ బ్రీతి
ననిన గణపతిరా జట్ల కా కనుచు

* * * *

వెడలి గణపతియు విజయంబునకును
గుడిమెడమల నేన కొలిచి యేతేర
వెలనాడు చేరియు వీ డెల్లఁ గాల్చి
వెలనాటిరాజును వెస గెల్చి వాని
యప్పనంబులు గొని యటఁ జని రాజు
గుప్పున నెల్లూరు కూడ నేతెంచి
యక్కన బయ్యన నచట సాధించి

* * * *

నెల్లూరిప్రజలకు నేర్పు వాటిల్లఁ
జెల్లఁచె మన్మనసిద్ధిరాజునకు
నెల్లూరుపట్టంబు నేర్పుతోఁ గట్టి
సల్లలితావృతి సమదుర్గములను
నలువదెనిమిదియు నగు పట్టణముల
నరుదొంద సాధించి యా మన్మసిద్ధి
రాజు కిచ్చియుఁ దనతేజంబు దిశలఁ

బూజ కెక్కఁగ ఘనరాజితయశుఁడు
ఘనతటాకంబుఁ దాఁ గట్టించె నచటఁ
గొనకొని నెల్లూరఁ గొన్నాళ్లు లుండి
మనుమసిద్ధికి రాజ్యమహిమలు దెల్పె'

ఈగ్రంథము కొంత పురాతనమైనను దీనియందు లక్షణదోషము లనేకములు కానవచ్చుచున్నవి. సంగతులు సత్యములే యైనను, ఇందుఁ జెప్పిన సంవత్సరములు మాత్రము చాలవఱకు సరియైనవికావు. ఈ పుస్తకము గణపతిదేవునికాలములోఁ గాక నూఱు నూటయేఁబదిసంవత్సరములకుఁ దరువాత విన్న కథలనుబట్టి వ్రాయఁబడిన దగుటచేత నిందుఁ జెప్పఁబడిన విషయములు సహితము కొన్ని వ్యత్యస్తములుగా నున్నవి. తిక్కన్న గణపతిదేవునియొద్దకుఁ బోవునప్పటికి యజ్ఞముచేసి యుండలేదు. భారత మును రచియించి యుండలేదు. ఈ పుస్తకము చేయునప్పటికి తిక్కన సోమయాజి యజ్ఞము చేసి భారతము రచియించి యుండుట కవి విని యెఱిఁగినవాఁ డగుటచేత కాలభేదమును నిర్ణయింపలేనివాఁ డయి వెనుక జరిగినదానిని ముందు జరిగినట్టు వ్రాసి యుండును సోమదేవరాజీయము నందుఁ జెప్పిన సంవత్సరములును దీని ననుసరించియే వ్రాయఁబడినవి.

(సోమదేవరాజీయము)

గీ॥ చేయఁ దక్కువయైన దేవాయతనము
లపుడు పూర్తిగఁ గట్టించి యలరుచున్న
చోట నొకనాఁడు తిక్కనసోమయాజి
వచ్చె నెల్లూరినుండి భూవరునికడకు.

సీ॥ వచ్చిన యయ్యార్యవర్యు నెదుర్కొని
　　　　వినయసంభ్రమభక్తు లినుమడింప
నతిథిపూజ లొనర్చి యతనిచే భారతా
　　　　ర్థమును ద్వైతాద్వైత తత్త్వములును
విస్మృతచిదచిద్వివేకలక్షణములుఁ
　　　　బ్రకటధర్మాధర్మపద్ధతులును
రాజనీతిప్రకారంబును భారత
　　　　వీరుల మహిమంబు వినుచునుండి

యనుమకొండనివాసు లైనట్టి బౌద్ధ
జనుల రావించి వారిఁ దిక్కనమనీషి
తోడ వాదింపఁజేసినఁ దొడరి వారిఁ
జులకఁగా సోమయాజులు గెలుచుటయును.

వ. అప్పుడు బౌద్ధదేవాలయంబులు గూలం ద్రోయించి గణపతి దేవరాజు సోమయాజుల పటువాక్యశక్తికి మెచ్చి యతనిన్ బహుప్రకారంబుల బూజించి యెనిమిది గ్రామంబు లొసంగి యతఁడు వచ్చిన కార్యం బడిగిన నా భూవరునకుఁ గవివరుం డిట్లనియె.

గీ. ఇనకులోద్భవుఁ డైనట్టి మనుమసిద్ధి
రాజు నెల్లూరు పాలించుచోఁ జెలంగి
యతనిదాయాదు లతని నుక్కఱఁగఁ బట్టి
యునిచి రాజ్యంబుఁ దమ రేలుచున్నవారు

క. కావున మీ రిపు డచటికి
వేవేగం దరలి వచ్చి విడకుండఁగ నా
భూవరుఁ బునరభిషిక్తునిఁ
గావింపఁగవలయు ననిన గణపతివిభుఁడున్.

గీ. 'అట్ల కాక' యనుచు నా పని కొడఁబడి
యత్యుదారగుణసమగ్రుఁ డగుచుఁ

దవిలి యప్పు డొక్క నవలక్ష ధనమును
యజ్ఞకుండలములు నతని కిచ్చె.

క. పనుచు నెడఁ దిక్కమఖి యా
జనవరుసింహాసనమున సచివాగ్రణియై
తనరెడు శివదేవయ్యన్
గనుఁగొని యా రాజుతోడఁ గడఁకం బలికెన్.

గీ. 'వసుమతీనాథ! యీతఁ డీశ్వరుఁడు గాని
మనుజమాత్రుండు గాఁడు పల్మాఱు నితని
యనుమతంబున నీవు రాజ్యంబు నెమ్మి
నేలు'మని చెప్పి యా ఘనుఁ డేగుటయును.

సీ. గణపతిదేవుఁ డా ఘనుననుమతిఁ గాంచి
యతిసత్వరమునఁ బ్రయాణభేరి
వేయించి చతురంగపృతనాసమేతుఁడై
తరలి ము న్వెలనాటిధరణిపతుల
గెలిచి వారలచేత లలి నప్పనముఁగొని
వారి నందఱఁ దనవశము చేసి
కొని చని నెల్లూరు గొబ్బునఁ జొచ్చి య
క్కనయు బయ్యనయు నన్ఖలులఁ దఱిమి.

మనుమసిద్ధిరాజుఁ బునరభిషిక్తుఁగా
వించి మించి రెండువేలు నైదు
నూఱు గ్రామములు మనోవృత్తి కతనికి
నిచ్చి కడమఁ దాను బుచ్చుకొనియె.

ఈ పుస్తకమునందుఁ గణపతిదేవుఁడు రెండువేలయేనూఱు గ్రామములు మనుమసిద్ధి కిచ్చినట్లు గొప్పగాఁ జెప్పినను, ప్రతాపచరిత్రమునుబట్టి యఱువ దెనిమిది గ్రామములను మాత్రమే యాతని కుంచినట్లు స్పష్టమగు చున్నది. దీనినిబట్టి చూడఁగా మన్మసిద్ధియొక్కయుఁ దిక్కనయొక్కయు

కాలము నిర్ధారణ మగుటయే కాక సిద్ధిరాజొక్క చిన్న సంస్థానాధిపతి యైనట్లు కూడఁ దేటపడుచున్నది అటులయినగూడ మనుమసిద్ధికి నెల్లూరు రాజ్యము స్థిరపడినది కాదు. గణపతిదేవుని మరణానంతరము సిద్ధిరాజునకును పల్నాటిప్రభువైన కాటమరాజునకును బసులమేపు బీళ్లనిమిత్తమయి వివాదము వచ్చి జరగిన పోరాటములో సిద్ధిరాజును కాటమరాజును గూడఁ బ్రాణములు గోలుపోయినట్లు కాటమరాజుకథవలనఁ దెలియ వచ్చుచున్నది. [కాటమరాజునకును, మనుమసిద్ధిరాజునకును జరగిన యుద్ధమును గూర్చి యీ క్రింది విషయమును చెప్పుట గలదు.

కవిగిరిసీమలోని ఎఱ్ఱగడ్డపాటి ప్రభువు కాటమరాజు కఱవుల కారణమున తమ పశువులబీడులు ఎండిపోఁగా, మనుమసిద్ధిరాజు పాలనలోనున్న బీడులలో తమపశువులను మేతకు విడిచి, కొంతపుల్లరిని చెల్లించుట కంగీకరించెను. కాని కాటమరాజు మనుమసిద్ధికి పుల్లరినీయక ఎదిరింపఁగా యుద్ధము సంభవించెను కాటమరాజు పల్నాటిప్రభువుకాఁడు.

కాటమరాజు పుల్లరి నీయకుండుటకుఁ గారణమును కొందఱిట్లు చెప్పుదురు— 'మనుమసిద్ధి యుంపుడుకత్తె పెంచుచున్న చిలుక యొకటి పంజరమునుండి తప్పించుకొనిపోయి కాటమరాజు పశువులు మేయుచున్న యడవికేఁగి మనుష్యులవలె మాటలాడుచుండఁగా పశువులు బెదరి చెదరి మేఁతను మానినవఁట! పశువులకాపరులు చిలుకను చంపివేయఁగా, సిద్ధిరాజు మనుష్యులా పసులకాపరులను చీకాకుపఱచిరఁట! ఆ కారణముననే కాటమరాజు పుల్లరినీయక యుద్ధమునకు సిద్ధపడెనఁట!

యుద్ధములో పల్నాటిప్రభువైన పద్మనాయకుఁడు మున్నగువారు కాటమరాజునకు సాయపడిరఁట!] ఈ యుద్ధములోఁ దిక్కనసోమయాజికి (పెదతండ్రి సిద్ధనకుమారుఁడు) సహోదరుఁడైన ఖడ్గతిక్కన సేనానియై యుండి సేనలను నడిపినట్లును, ఆ యుద్ధములో నతఁడు ప్రాణములు కోలుపోయినట్లును ఖడ్గతిక్కన చరిత్రమువలన విదిత మగుచున్నది. మొదట నీ రణతిక్కన శత్రువుల కోడి పాఱివచ్చినట్లును, అప్పు డాతనితల్లి యాతనిని జూచి కోపపడి కోడలితో 'నీవును నీ భర్తయు నేనును మనయింట ముగ్గు

రాఁడువార మయితి' మని హేళనముగాఁ బలికినట్లును, నందుపయి నాతనికి రోషము వచ్చి మరల యుద్ధమునకుఁ బోయి వీరమరణము నొందినట్లును, పయి చరిత్రమునందే చెప్పఁబడి యున్నది ఆ పుస్తకమునందలి కొన్ని పద్యములు నిం దుదాహరించుచున్నాను —

సీ. సిరవికాయంబు వేదనినాదంబుఁ
బాయక యేప్పొద్దు మ్రోయుచుండు
భూసురప్రకరంబు నేసలు చల్లంగఁ
బాయ కెన్నియొ కుటుంబములు బ్రదుకు
బ్రాహ్మణావళికి ధారలు పోసినజలంబు
సతతంబు ముంగిట జాలువాఱు
రిపుల కొసఁగిన పత్రికల పుత్రికలను
బాయక కరణముల్ వ్రాయుచుంద్రు
మానఘనుఁడైన తిక్కనమంత్రియింట
మదనసముఁడైన తిక్కనమంత్రియింట
మహితయశుఁడైన తిక్కనమంత్రియింట
మంత్రిమణి యైన తిక్కనమంత్రియింట.

* * * *

క. పగఱకు వెన్నిచ్చినచో
నగరే నిను మగతనంపునాయకులందున్
ముగు రాఁడువార మైతిమి
వగ పేటికి జలక మాడ వచ్చినచోటన్. *

* రణతిక్కన స్నానమునకు వచ్చినప్పుడు భార్య స్త్రీలకు పెట్టినట్లుగా రహస్యస్థలమున నీళ్ళబిందె యుంచి దానికి నులకమంచము చాటుపెట్టి దానిమీఁద పసుపుముద్ద యుంచె ననియు, అది చూచి యతఁడు వ్యసనపడుచుండఁగా భార్య యీమాట లనియె ననియు, చెప్పుదురు.

క॥ అసదృశముగ నరివీరుఁడు
మసి పోవఁగ విఱిగి వచ్చె మగపందక్రియన్
గసవున్ మేయఁగ బోయిన
పసుల న్వెలిఁ ద్రొబ్బి తిక్కపాలుఁడు దిరుగన్. *

చ. పదటున వాజి రాహుతులపై దుమికింపుమఁ దిక్కఁ డార్చినన్
బెదరి పరిభ్రమించి కడుఁ బిమ్మటి వీరులు భీతచిత్తులై
యదె యిదె డాలు వాల్మెఱుఁగు లల్లదె యల్లదె యాతఁ డంచనన్
గొదుకక యాజిఁజేసె రిపుకోటుల కందఱ కన్నిరూపులై.

* * * *

ఉ. చిక్కక మన్మసిద్ధివిభుచే మును గొన్న ఋణంబుఁ దీర్చి మా
తిక్కనమంత్రి సోమశిలదేవర సాక్షిగఁ బెన్న సాక్షిగా
నెక్కిన వాజి సాక్షిగ మహి న్నుతికెక్కిన కీర్తి సాక్షిగా
ద్రుక్కక మాఱుకొన్న రణశూరులు సాక్షిగఁ గొంత సాక్షిగన్.

* * * *

సీ. ధైర్యంబు నీమేనఁ దగిలి యుండుటఁజేసి
చలియించి మందరాచలము తిరిగె
గాంభీర్య మెల్ల నీకడన యుండుటఁజేసి
కాకుత్స్థుచే వార్ధి కట్టువడియె
జయలక్ష్మి నీయురస్స్థలినె యుండుటఁజేసి
హరి పోయి బలి దాన మడుగుకొనియె
నాకార మెల్ల నీయందె యుండుటఁజేసి
మరుఁడు చిచ్చునఁ బడి మడిసి వసియెఁ

* క. అసదృశముగ నరివీరులఁ । బసమీఱఁగ [illegible]లుకలేక పందక్రియ న్నీ
వసెవైచి విఱిగివచ్చినఁ । బసులు న్విఱిగాప, తిక్క! పాలు న్విఱిగెన్ —
అని పాఠాంతరము. అన్నములోఁ [illegible] పాలు విఱిగిపోఁగా నల్లి యతనితో పరిహాసముగా నీవాక్య మన్నదందురు.

తిక్కదండనాథ దేవేంద్రపురికి నీ
పరుగ వెడలఁగ నగము లెసఁగ నుడుగ
బ్బి కట్టుపిడుము నమ్మెపెలొ మాని
మసఁడు మరలఁ గలుగు మంగలరాజ!

సీ. నందిని బుత్తెంచు నిందుశేఖరుఁడు నీ
వన్న! యేతెమ్ము తారాద్రికడకు
గరుడుని బుత్తెంచె నరహరి రావయ్య
వడి సిద్ధతిక్క! కైవల్యమునకు
హంసను బుత్తెంచె నజుఁడు నీకడకు ను
భయకులమిత్ర రా బ్రహ్మసభకు
నైరావతముఁ బంపె నమరేంద్రుఁ డిప్పుడు
దివమున కేతెమ్ము తిక్కయోధ!
యనుచు వేఱువేఱ నర్థితోఁ బిలువఁగ
వారు వీరుఁ గూడ వచ్చి వచ్చి
దివ్యయోగి యైన తిక్కనామాత్యుండు
సూర్యమండలంబుఁ జొచ్చి పోయె!

బ్రహ్మశ్రీ గురుజాడ శ్రీరామమూర్తిపంతులుగారు తిక్కన సోమయాజి కాలనిర్ణయమునుగూర్చి యీ పైని నేను వ్రాసినది స్థిరమార్గము కాదని నిర్ణయించి తిక్కన నన్నయభట్టుతోడి సమకాలికుఁడని సిద్ధాంతము చేయుటకయి యేమేమో వ్రాసి యున్నారు. అందలి ముఖ్యాంశముల నిందించుక చర్చింతము. తిక్కన తన నిర్వచనోత్తర రామాయణము నంకితముచేసిన మనుమసిద్ధిరాజు క్రీస్తుశకము ౧౨౫౭-వ సంవత్సరమున భూదానము చేసిన ట్టున్న శిలాశాసనమునుగూర్చియు, ౧౨౬౦-వ సంవత్సరమునందు రాజ్యము చేయుచుండినట్లున్న శిలాశాసనమునుగూర్చియు, స్యూయల్ దొరవారి ప్రాచీనశాసనపట్టికనుండి నే నుదాహరించిన చరిత్రాంశముల మాట తలపెట్టక వానినుపాయముగా జాఱవిడిచి, వా రటు తరువాత "కృష్ణామండల చరిత్ర సంగ్రహమునం దెఱ్ఱగడ్డరా జయినకాటమరాజును

పల్నాడు ప్రభువైన పద్మనాయకుఁడును గలిసి పశువులమేఁతబీళ్ళవిషయమయి పదుమూఁడవ శతాబ్దమున నెల్లూరు రాజయిన సిద్ధిరాజుతో యుద్ధము చేసినట్లును, సిద్ధిరాజుసేనలు కవితిక్కన తమ్మునికుమారుఁడైన తిక్కన మంత్రిచే నడుపఁబడినట్లును, చెప్పఁబడి యున్నది." అని నేను వ్రాసిన వాక్యము నింతవఱకు మాత్రమే గ్రహించి, "కవితిక్కనతమ్ముఁ డనుటకుఁ దమ్మునికొమారుఁ డని పొరపాటునఁ బడి యుండవచ్చు" నన్న తరువాతి వాక్యమును బుద్ధిపూర్వకముగా నుపేక్ష చేసి, రణతిక్కన తిక్కన సోమయాజికి పితృవ్యపుత్రకుఁ డయిన తమ్ముఁ డని యెంచి యుండిరి * తమ్మునికొడు కని సిద్ధాంతముచేసి, పదుమూఁడవ శతాబ్దము ౧౨౦౦ లు మొదలుకొని ౧౩౦౦ ల సంవత్సరమువఱకు నుండవచ్చును, గాన రణతిక్కన ౧౨౧౧-వ సంవత్సరమున యుద్ధములోఁ జచ్చి ౧౧౩౦ లోనో ౧౧౪౦ లోనో ౧౧౫౦ లోనో తన తండ్రి కఱువదవ పడిలోనో యెప్పుడో పుట్టి యుండవచ్చు ననియు, ఆ ముసలితండ్రికంటె నలువదియేండ్ల పెద్దవాఁడయిన సవతియన్న యైనచోఁ దిక్కన తన తమ్మునికుమారునికంటె నూఱేండ్లుపెద్దవాఁడు కావచ్చు ననియు, అందుచేతఁ దిక్కన ౧౨౩౦-వ సంవత్సరప్రాంతమున నన్నయభట్టు కాలములో నుండవచ్చు ననియు, ఊహలమీఁది యూహలతో బయలఁ బందిరి వేసిరి. రణతిక్కన కవితిక్కన తమ్మునికుమారుఁడు కాకపోవుటచే నివి యంతయు నేల విడిచి సాము చేయుట గాని వేఱుకాదు

'ఉ. ఏమి తపంబు చేసి పరమేశ్వరు నేమిటఁ బూజ చేసిరో
రామునితల్లి యుం బరశురామునితల్లియు భీముతల్లియున్
గామునికన్నతల్లియును గంజదళాక్షుననుంగుదల్లియున్
శ్రీమహితప్రతాపుఁ డగు సిద్ధనతిక్కనఁ గన్నతల్లియున్ !

అనెడి (ఖడ్గతిక్కన యనఁబడు) రణతిక్కనచరిత్రములోని యీ పద్యమును బట్టి రణతిక్కన సోమయాజికి (కేవలసహోదరుఁడుగాక) మూఁడవ పెద్ద

* మఱి యిరువదిపంక్తులతరువాత నే "రణతిక్కన తండ్రి సిద్ధయ. ఈసిద్ధయ సోమయాజికి మూఁడవపెత్తండ్రి" అని వ్రాసియున్నారు.

తండ్రియైన సిద్ధనకొడుకయినట్టు స్పష్ట మగుచున్నది. కవితిక్కనకును రణతిక్కనకును గల యీబంధుత్వమే కాటమరాజుచరిత్రమునందును జెప్పఁబడి యున్నది.

తిక్కనసోమయాజికి శిష్యుఁడైన మారన్న క్రీస్తుశకము ౧౨౯౫-వ సంవత్సరము మొదలుకొని ౧౩౨౩-వ సంవత్సరము వఱకును రాజ్యము చేసిన ప్రతాపరుద్రుని దండనాథుఁడయిన నాగయగన్నమంత్రికిఁ దన మార్కండేయపురాణము నంకితము చేసినందునఁ దిక్కనసోమయాజి పదుమూడవశతాబ్దమధ్యమునం దున్న వాఁ డని నేను వ్రాసినదానికి ప్రతాపరుద్రు లనేకు లున్నందున వారిలో నెవ్వరి మంత్రియైన నాగయగన్నయకుఁ గవి కృతి యిచ్చెనో యని శంక తెచ్చుకొని దానినిబట్టి తిక్కన కాలనిర్ణయము చేయ వలనుపడ దనిరి. మార్కండేయపురాణమునందుఁ జెప్పఁబడిన ప్రతాపరుద్రుఁడు కాకతీయగణపతిదేవునకు దౌహిత్రుఁ డయిన రెండవప్రతాపరుద్రుఁడు. మొదటి కాకతీయ ప్రతాపరుద్రుఁడు తిక్క[illegible] దుండిన గణపతిదేవునితండ్రి మార్కండేయపురాణములోఁ గృతిపతియొక్క వంశానువర్ణనము చేయుచో—

క. కులరత్నాకరచంద్రుం
డలఘుఁడు నాగాంకుఁ డన్వయస్థితికొఱకున్
గులశీలరూపగుణములు
గలకన్నియఁ బెండ్లియాడఁగాఁ దలఁచి మదిన్.

సీ. ఏరాజు రాజుల నెల్ల జయించి ము
న్నొట్టియ గొనియె దోర్విక్రమమున
నే రాజు సేతునీహారాద్రిమధ్యోర్వి
నేకపట్టముగ నేలె వాసి
నే రాజు నిజకీర్తి యెప్పుదిదిశల ను
ల్లాసంబు నొంద నలంకరించె
నే రాజునవతేజ మీజగంబునకు న
ఖండకదీపంబు గా నొనరెఁ

నట్టి శ్రీరుద్రగణపతిక్ష్మాధినాథు
ననుఁగుఁదలవరి ధర్మాత్ముఁ డఫైకపుణ్యుఁ
డయిన మేచకనాయకప్రియతనూజ
నతులశుభలక్షణస్ఫురితామలాంగి

చ. శివుఁ డగజాత, రాఘవుఁడు సీతఁ, గిరీటి సుభద్రఁ బెంపు సొం
పు వెలయఁ బ్రీతిఁ బెండ్లి యగుపోలిక నాగచమూవిభుండు భూ
రివిభవ మల్లసిల్లఁగ వరించె సమంచితరూపకాంతిభా
గ్యవిభవగౌరవాదిసుగుణానుకృతాంబిక మల్లమాంబికన్.

శా. ఆ మల్లాంబను నాగశౌరికి విశిష్టాచారు లుద్యద్గుణ
స్తోమాకల్పు లనల్పకీర్తిపరు లస్తోకస్థిర శ్రీయుతుల్
ధీమంతు ల్సుతులుద్భవించి రొగిఁ గౌంతేయప్రతాపోన్నతుల్
రామప్రఖ్యులు వహ్నితేజులు జగత్ప్రఖ్యాతశౌర్యోజ్జ్వలుల్.

వ. అం దగ్రజుండు.

సీ. తన సుందరాకృతిఁ గని మది వెఱఁగంది
వనిత లంగజునొప్పు వక్రపఱుపఁ
దన కళావిశదత్వమున కద్భుతము నొంది
బుధులు భోజునినేర్పు పొల్లునేయఁ
దన నయాభిజ్ఞత వినినప్రాజ్ఞులు దివి
జేశువితద్జ్ఞత యేపు డింపఁ
దన యాశ్రయంబున ననుబంధుమిత్రవ
ర్గము కల్పతరువునాశ్రమము దెగడ

నెగడె నెంతయు జగమునఁ బొగడు వడసి
కాకతిక్ష్మాతలాధీశుకటకపాలుఁ
డతులసితకీర్తిధవలోలుఁ డన్వయాబ్జ
షండదినవల్లభుఁడు గంగసైన్యవిభుఁడు.

చ. ఎలమిఁ బ్రతాపరుద్రమనుజేంద్రునిచేఁ బడసెం బ్రవీణుఁడై
కొలిచియు శౌర్యశీల రిపుకోటి రణావని గీటడంచియున్
బలరిపుతుల్యవిక్రముఁడు నాగయగన్నవిభుండు తేజమున్
విలసితరాజచిహ్నములు విశ్రుతలక్ష్మియు నాయకత్వమున్.

అను పద్యములయందుఁ గవి కృతిపతియొక్క మాతామహుఁడైన మేచ నాయకుఁడు కాకతీయగణపతియొక్క తలవరి యైనట్టును, కృతిపతి యగు గన్నదండనాథుఁడు కాకతీయప్రతాపరుద్రుని దళవాయి యయినట్టును, స్పష్టముగాఁ జెప్పి యున్నాఁడు. తిక్కనసోమయాజి శిష్యుఁ డయిన మారనవలన మార్కండేయపురాణమును గృతి నందిన గన్నమంత్రియొక్క ప్రభువగు ప్రతాపరుద్రుఁ డీతఁడనియు, ఆ ప్రతాపరుద్రునికాల మిది యనియు, స్పష్టపడినప్పుడు తిక్కన కాలమును నిశ్చయముగా తెలిసినట్టే! గణపతిదేవుని కూఁతురయిన రుద్రమదేవి యనంతరమునందు రాజ్యమునకు వచ్చిన యా యోరుగంటి ప్రతాపరుద్రుఁడు ౧౨౯౫-వ సంవత్సరము మొదలుకొని * ౧౩౨౩-వ సంవత్సరమువఱకును రాజ్యపాలనము చేయుటయు, ౧౩౦౯-వ సంవత్సరమునందు మహమ్మదీయు లేకశిలానగర మనఁబడెడి యోరుగంటిమీఁదికి దండెత్తి వచ్చి మొట్టమొదటఁ బ్రతాప రుద్రునిచే నోడఁగొట్టఁబడి, పలాయితులయ్యును, రెండవ యుద్ధమునం దాతనిని జయించి ఢిల్లీ పాదుషాకుఁ గప్పము గట్టునట్లు చేయుటయు, తరువాత నతఁడు దేవగిరిరాజును దనకు సహాయునిగాఁ జేకొని మహమ్మ దీయులకుఁ గప్పము కట్టుట మానివేయఁగా నప్పటి టోగ్లాకు చక్రవర్తి ప్రతాపరుద్రుని శిక్షించుటకయి ౧౩౨౧-వ సంవత్సరమునందుఁ దన కొడు కగు ఉలగ్‌ఖానును సేనలతోఁ బంపినప్పు డతఁడువచ్చి కోటను ముట్టడించి కడపటఁ బరాజితుఁడయి చెల్లాచెద రయిన తనసేనలతోఁ బాఱిపోవుటయు, ఈ యవమానమును దీర్చుకొనుటకయి మహమ్మదీయులు ౧౩౨౩-వ సంవత్సరమునందు మరల దండెత్తి వచ్చి ప్రతాపరుద్రుని నోడించి

* [౧౩౨౬-వ సంవత్సరమువఱకు రాజ్యపాలనము చేసినట్లు 'ఆంధ్రకవి తరంగిణి'లోఁ గలదు. (ద్వితీయసంపుటము 47 పుట)]

కారాబద్ధునిగాఁ జేసి ఢిల్లీనగరమునకుఁ గొనిపోవుటయు, సుప్రసిద్ధములైన చరిత్రాంశములు ప్రతాపరుద్రునికిఁ బూర్వమునను దాతనితల్లి తల్లియైన రుద్రమదేవి తన తండ్రి మరణానంతరము క్రీస్తుశకము ౧౨౬౦-వ సంవత్సరము మొదలుకొని ౧౨౯౫-వ సంవత్సరము వఱకును ముప్పది యైదు సంవత్సరములు రాజ్యపాలనము చేసినట్లు దానశాసనములవలనను, చరిత్రకారులు వ్రాసినదానివలనను స్పష్టముగాఁ దెలియవచ్చుచున్నది. సోమదేవరాజీయమునందును రుద్రమదేవి ముప్పదియెనిమిది సంవత్సరములు రాజ్యపాలనము చేసినట్లీ క్రిందిపద్యమునఁ జెప్పఁబడినది—

సీ. 'తదనంతరమునఁ బ్రతాపరుద్రక్షమా
జాని సింహాసనాసీనుఁ జేయఁ
దలఁచి రుద్రమదేవి తా శివదేవయ్య
గారిని రావించి కడఁక [illegible]
పాదంబులకు నా నృపాలుచే మ్రొక్కించి
యా యయ్యచే భూతి నతనినొసలఁ
బెట్టించి ధరణికిఁ బట్టాభిషిక్తునిఁ
గావించి యా రుద్రదేవనృపుని

నాయనకు నప్పగించి యయ్యమ్మ యట్లు
బుధజనంబులఁ బ్రజలను బొగడ నవని
ముప్పదియునెన్మిదేఁడులు మోద మొదవ
నేలి కైలాసశిఖరికి నేఁగుటయును'

కాఁబట్టి యామెతండ్రి యైన గణపతిదేవుఁడు ౧౨౬౦ వఱకును రాజ్యభారము వహించి యుండవలెను. "గణపతిదేవమహారాజచంద్రుం డేఁబది యెనిమిది హాయనంబులు మహామహిమతోడ రాజ్యంబు పాలించె" నని సోమదేవరాజీయము ద్వితీయాశ్వాసమునఁ జెప్పఁబడియుండుటచేత గణపతిదేవుఁడు పదుమూఁడవ శతాబ్దారంభమునుండియు భూపరిపాలనము చేసి యుండవలెను. ఇప్పుడు దొరకినంతవఱకు నాతని దానశాసనము లన్నియు

౧౨౧౧-వ సంవత్సరమునకు ౧౨౬౦-వ సంవత్సరమునకును నడిమిదిగా నున్నవి. తిక్కనసోమయాజి తన ప్రభుని కార్యమునిమిత్తమై గణపతిదేవుని యాస్థానమునకుఁ బోయియుండుట నిర్వివాదాంశ మగుటచేత నాతఁడు ౧౨౦౦ లకును ౧౨౬౦ కును మధ్య నెప్పుడో యోరుగంటికిఁ బోయి యుండవలెను. ౧౨౩౭, ౧౨౬౦ సంవత్సరములకు మధ్య పోయినట్టు కనఁబడుచున్నది. ఈ కాలమునం దుండిన తిక్కనసోమయాజి యింతకుఁ బూర్వమునం దిన్నూఱు సంవత్సరములక్రిందట నుండిన నన్నయభట్టారకునితో సమకాలికుఁ డని సాధించుట యే తర్కముచేతను సాధ్యము కానేరదు. దాన శాసనాదులవలె నంత విశ్వాసార్హములైనవి కాకపోయినను, కాకతీయ వంశమునుగూర్చి యిటీవలివారు వ్రాసిన గ్రంథములనుబట్టి చూచినను దిక్కనసోమయాజి నన్నయభట్టుకాలమునం దున్నట్టు చూపుట యసాధ్యమే! సర్వప్పచేత రచియింపఁబడిన ద్విపద సిద్ధేశ్వరచరిత్రములోను, మల్లపరాజ పుత్రుఁడైన వీరనార్యునిచే రచియింపఁబడిన ప్రతాపచరిత్రములోను, జగ్గకవికృతమైన సోమదేవరాజీయములోను, కాకతిప్రళయుఁ డోరుగంటి కోటను గట్టి రాజధానిని అనమకొండనుండి యోరుగంటికి శాలివాహన శకము ౯౯౦ కి సరియైన క్రీస్తుశకము ౧౦౬౮-వ సంవత్సరమునందు మార్చుకొన్న ట్టైకకంర్యముతోఁ జెప్పఁబడి యున్నది. ఈ విషమునును గూర్చిన సోమదేవరాజీయములోని పద్యము నిం దుదాహరించుచున్నాను—

సీ. 'అవనిపై శాలివాహనశకాబ్దంబులు
తొమ్మిదినూఱుల తొంబదియగు
వరశుభకృన్నామవత్సరంబునను గా
ర్తికశుక్లపంచమితిథిని దివిజ
గురువాసరంబునఁ గరమొప్పరోహిణీ
నక్షత్రమున నా ఘనప్రభుండు
మానుగా నేకశిలానగరంబుఁ గ
ట్టించె నెంతేనియు రీవి మెఱయ

కారాబద్ధునిగాఁ జేసి ఢిల్లీనగరమునకుఁ గొనిపోవుటయు, సుప్రసిద్ధములైన చరిత్రాంశములు. ప్రతాపరుద్రునికిఁ బూర్వరాజును దాతనితల్లి తల్లియైన రుద్రమదేవి తన తండ్రి మరణానంతరము క్రీస్తుశకము ౧౨౬౦-వ సంవత్సరము మొదలుకొని ౧౨౯౫-వ సంవత్సరము వఱకును ముప్పది యైదు సంవత్సరములు రాజ్యపాలనము చేసినట్లు దానశాసనములవలనను, చరిత్రకారులు వ్రాసినదానివలనను స్పష్టముగాఁ దెలియవచ్చుచున్నది. సోమదేవరాజీయమునందును రుద్రమదేవి ముప్పదియెనిమిది సంవత్సరములు రాజ్యపాలనము చేసినట్లు క్రిందిపద్యమునఁ జెప్పఁబడినది—

సీ. 'తదనంతరమునఁ బ్రతాపరుద్రక్షమా
        జాని సింహాసనాసీనుఁ జేయఁ
    దలఁచి రుద్రమదేవి తా శివదేవయ్యఁ
        గారిని రావించి కడఁక [illegible]సి
    పాదంబులకు నా నృపాలుచే మ్రొక్కించి
        యా యయ్యచే భూతి యతనినొసలఁ
    బెట్టించి ధరణికిఁ బట్టాభిషిక్తునిఁ
        గావించి యా రుద్రదేవనృపుని

    నాయనకు నప్పగించి యయ్యమ్మ యట్లు
    బుధజనంబులుఁ బ్రజలును బొగడ నవని
    ముప్పదియునెన్మిదేఁడులు మోద మొదవ
    నేలి కైలాసశిఖరికి నేఁగుటయును'

కాఁబట్టి యీమెతండ్రి యైన గణపతిదేవుఁడు ౧౨౬౦ వఱకును రాజ్యభారము వహించి యుండవలెను. "గణపతిదేవమహారాజచంద్రుం డేఁబది యెనిమిది హాయనంబులు మహామహిమతోడ రాజ్యంబు పాలించె" నని సోమదేవరాజీయము ద్వితీయాశ్వాసమునఁ జెప్పఁబడియుండుటచేత గణపతిదేవుఁడు పదుమూఁడవ శతాబ్దారంభమునుండియు భూపరిపాలనము చేసి యుండవలెను. ఇప్పుడు దొరకినంతవఱకు కాతని దానశాసనము లన్నియు

సీ. 'అలఘుఁ బాండ్యదేశాధీశ్వరుని మీఁద
దండెత్తి వానిమస్తకము దునిమి
తత్పురాధిపుని సంపదముగఁ బట్టము గట్టి
వానిచేఁ గోటి సువర్ణ నిష్క
ములు పన్ను గొని రయంబున సేతుబంధరా
మేశ్వరంబున కేగి యెలమితో ధ
నుష్కోటిలోనఁ బొందుగఁ దీర్థమాడి యె
న్మిదితులాపురుషము ల్గొదుక కచటఁ
దూఁగి క్రమ్మఱ నిజపురి కేగి రీవి
వఱల నెమ్మది నఱువదివత్సరములు
రాజ్య మెన్నంగ నమ్మహారాజమౌళి
కీర్తి మెఱయంగ ధాత్రిఁ బాలించె నంత'

పయి పద్యముప్రకారము కాకతిప్రోలయునిపుత్రుఁ డయిన యీ మొదటి ప్రతాపరుద్రుని రాజ్యకాలము శాలివాహనశకవత్సరములు ౧౦౬౨ మొదలు ౧౧౨౨ వఱకును అగును ప్రతాపరుద్రుని యనంతరమునందే యాతని పుత్రుఁడయిన గణపతిదేవుఁడు రాజ్యమునకు వచ్చినందున, ఈతనిరాజ్యారంభకాలము శాలివాహనశకము ౧౧౨౨-వ సంవత్సర మనఁగా క్రీస్తుశకము ౧౨౦౦-వ సంవత్సరమగును. పయిని చెప్పిన ట్లితఁ డేఁబది యెనిమిది సంవత్సరములు రాజ్యము చేసినందున, సోమదేవరాజీయమును బట్టి సహితము గణపతిదేవుఁడు ౧౨౦౦-వ సంవత్సరము మొదలుకొని ౧౨౬౦-వ సంవత్సరమువఱకును రాజ్యము చేసినట్లే యేర్పడుచున్నది ఈ కాలము శాసనములవలనఁ దెలియవచ్చెడు కాలముతో నించుమించుగా సరిపోవుచున్నది గణపతిదేవుని రాజ్యకాలములోఁ దిక్కనసోమయాజి తనప్రభువగు సిద్ధిరాజుపనిమీఁద నాతనియాస్థానమునకుఁ బోయి యుండినందునఁ దిక్కన తప్పక ౧౨౦౦-౧౨౬౦ సంవత్సరముల మధ్యమున జీవించి యుండవలెను. సత్యమి ట్లుండఁగా శ్రీరామమూర్తిపంతులుగారు రామాయణకర్తయగు భాస్కరుని కాలనిర్ణయము చేయుటలో సోమదేవ

రాజీయమునుబట్టి కాకతిరాజు శా॥ శ॥ ౯౦౯౯వ సంవత్సరములో రాజ్యము నకు వచ్చినట్లు వ్రాసి యున్నారు నాయొద్ద నున్న సోమదేవరాజీయము వ్రాతప్రతిలోను, శ్రీరామమూర్తిగారి యాజ్ఞానుసారముగా ముద్రింపఁబడిన యచ్చుప్రతిలోనుగూడ తొమ్మిదివందలతొంబది యని యున్నదిగాని వారు వ్రాసినట్లు తొమ్మిదివందలతొమ్మిది యని లేదు. తమవద్దనున్న పుస్తకాను సారముగా ముద్రింపఁబడిన తరువాత, ౯౦౯ ఈ ప్రత్యంతరము వారి కెక్కడ లభించినదో?

తిక్కన నన్నయభట్టుకాలములోనివాఁడు కాఁడని నేను జూపిన గ్రంథ నిదర్శనముల నీ ప్రకారముగా ఖండించి పంతులువారు తిక్కనసోమయాజి నన్నయభట్టారకునికాలములోనివాఁడే యని కొన్ని యద్భుతమార్గములచేత సిద్ధాంతము చేసి యున్నారు అందు మొదటిమార్గము వాసిష్ఠరామాయణ గ్రంథకర్త యగు సింగనకవి తనతండ్రి తిక్కనసోమయాజులమనుమరాలి కొడుకనియు, అతఁడు (తనతండ్రి) శా॥ శ॥ ౧౨౨౨ మొదలు ౧౨౫౭ వఱకును రాజ్యము చేసిన తొయ్యేటి యనపోతభూపాలునిమంత్రి యనియు, వ్రాసినందున తల్లిపితామహుఁ డగు తిక్కనసోమయాజి యతని కంటె నూటయేఁబది సంవత్సరములు పూర్వముననుండవలెనని. ఒకఁడు డెబ్బదిసంవత్సరములు బ్రతికినట్టయిన దనకాలములోనే మనుమరాలిబిడ్డలను జూడవచ్చును. హిందువులలో నొకయువతి బిడ్డను గనునప్పటి కామెతాత నూటయేఁబదిసంవత్సరముల క్రిందట మృతుఁడగుట యెప్పుడును సంభ వింపదు శ్రీరామమూర్తిగారు చెప్పినప్రకారముగానే తొయ్యేటి యనపోత రెడ్డి రాజ్యకాలము క్రీస్తుశకము ౧౨౯౯ మొదలు ౧౩౨౮ వఱకు నగు చున్నది అతని మంత్రియు నాకాలములోనివాఁడేకదా! ఆ యయ్యలమంత్రి యొక్క మాతామహుని తండ్రి యగు తిక్కనసోమయాజి యయ్యలమంత్రి కంటె నూటేఁబదియేండ్లుముందే పరమపదము నొందె ననుకొన్నను, తిక్కన సోమయాజి ౧౨౨౭వ సంవత్సరమువఱకైన జీవించి యుండవలెను పంతులవారు చూపిన యీ మార్గమువలన గూడ నే నేర్పఱిచినకాలమే

సిద్ధాంత మగుచున్నది కాని తిక్కనసోమయాజిని మఱి యిన్నూఱు సంవత్సరములు వెనుకకు నన్నయభట్టుకాలమునకుఁ దీసికొని పో నెంచినవారి కోరిక సఫలము కాకున్నది

వారు చూపిన రెండవమార్గము దాక్షారామ దేవాలయముమీఁది యొక శిలాశాసనములో గణపతిదేవుని యల్లుడు ౧౧౩౫ వ సంవత్సరములో దానము చేసినట్లున్నందున గణపతిదేవుఁ డా కాలమునకు మున్నూఱు సంవత్సరములు పూర్వమున నుండి యుండవలె ననియుఁ, దిక్కనసోమయాజియు నా కాలములోనివాఁడే యనియు, ఈ యూహలలెక్కప్రకారమయినను దిక్కనసోమయాజికంటె నన్నయభట్టు నూఱు సంవత్సరములు పూర్వపువాఁడే యగును గాని వారియభీష్ట మందువలనను సిద్ధింపలేదు. పయి శాసనముయొక్క కాలము సరియైనది కాదు. ఈ శాసనమును శ్రీరామమూర్తిపంతులుగారు స్యూయల్‌దొరగారి పూర్వశాసనముల పట్టిక రెండవ సంపుటము ౧౧౫-వ పుటనుంటి గ్రహించినారు. ఈ శాసనములపయిని స్యూయల్‌దొరగారు తాము వానిలోని కాలమును శోధింప లే దనియు, అందుచేత "చరిత్రకార్యములకయి యీ క్రింది సంవత్సరముల నాధారపఱుచుకొనఁగూడదు" అనియు శీర్షికగా వ్రాసియున్నారు మఱియు నా క్రిందనే ౧౨౦౧-వ సంవత్సరము మొదలుకొని ౧౨౪౮-వ సంవత్సరమువఱకును గల గణపతిదేవునికాలములోని శాసనము లనేకము లుదాహరింపఁబడి యున్నవి ఇట్లు ప్రత్యక్షముగా గణపతిదేవునికాలమును తెలుపు శాసనము లనేకము లుండఁగా వానిని గైకొనక వాని కన్నిఁటికిని విరుద్ధముగా నున్న మఱియొకరినిగూర్చిన యీ తప్పుశాసనము నొక్కదానిని మాత్రము సత్యమునుగా స్వీకరించి దానిపైని వింతయూహల నేల యల్లవలయునో తెలియరాకున్నది.

పంతులవారు చూపిన మూడవ మార్గము కాకతీయగణపతిరాజు మంత్రులలో నొకఁడగు గన్నమంత్రి వసిష్ఠరామాయణకృతికర్త యగు సింగనకవివలనఁ బద్మపురాణోత్తరఖండమును గృతినందిన కందనమంత్రి కాఱవ పురుషుఁడయినందున, గణపతిదేవునికాలములో నుండిన తిక్కనసోమయాజి మిక్కిలి పూర్వుఁడని, కందనమంత్రికిని గన్నమంత్రికిని నడుమను ముగ్గురు పురుషులే

యున్నారు; కాని వారన్నట్లాఱుగురు లేరు. కందనమంత్రి ౧౩౫౦-వ సంవత్సర ప్రాంతములయందుండినవాఁ డయినందున, ఆతనితాతతాత యగు గన్నమంత్రి యతనికంటె నూఱు సంవత్సరములు ముందనఁగా ౧౨౫౦-వ సంవత్సర ప్రాంతములయందుండి యుండవలెను. గన్నమంత్రి గణపతి దేవులమంత్రులలో నొకం డయినందున నిది యాతనికాలముతో సరిపోవు చున్నది. దీనినిబట్టి విచారించినను గణపతిదేవునికాలములో నున్న తిక్కన సోమయాజి ౧౨౫౦ సంవత్సర ప్రాంతములయందే యున్నటు స్థిరపడు చున్నది తిక్కనసోమయాజుల ప్రార్థనమీఁద గణపతిదేవుఁడు సేనలతో దండయాత్ర బైలుదేఱి పెలనాఁటిరాజులను జయించి నెల్లూరు పోయి మనుమసిద్ధికి మరల రాజ్యమిచ్చినట్లు సోమదేవరాజీయమునందుఁ జెప్పఁబడి యున్నదిగదా ? కృష్ణామండలములోని యినమళ్ళగ్రామమునందలి శాసనము వలన ౧౧౫౪-వ సంవత్సరమున గణపతిదేవుఁడు చోళులను జయించినట్టు తెలియవచ్చుచున్నది. అప్పుడు జయింపఁబడిన చోళులక్కన బయ్యన లేమో ! అయినపక్షమున సోమయాజులు ౧౨౫౩-వ సంవత్సరమున నోరు గంటికి గణపతిదేవుని దర్శింపఁబోయినట్టు కనబడుచున్నది. కాని యతఁడు గణపతిదేవుని దర్శింపఁబోయిన కాలము ౧౨౫౮-వ సంవత్సరమునకుఁ దరువాత.

వారు చూపిన కడపటిదగు నాలవమార్గము నే మదహరించిన "అంబర రవిశశిశాకాబ్దంబు" లన్న పద్యమునుబట్టి తిక్కనకాలమును నిర్ణయించుట. ఈ పద్యమునుబట్టి తిక్కనమరణకాలము శాలివాహనశకము ౧౧౭౦-వ సంవత్సరము కాఁగా. తిక్కన నూఱేండ్లు బ్రతికెననుకొన్నచో నాతని జన్మ కాలము శాలివాహనశకము ౧౦౭౦ అనఁగా క్రీస్తుశకము ౧౧౪౮-వ సంవత్సర మగునఁట ! నిజముగా నట్లయినను దిక్కనసోమయాజి నన్నయ భట్టు కాలములోనివాఁ డను వారివాదమున కిది పరిపడక నన్నయమరణా నంతరమున నేఁబది సంవత్సరములకుఁగాని తిక్కన పుట్టనే లేదని చూపు చున్నది. ఈ పద్యము విశ్వాసార్హమయినది కా దని యీవఱకే చెప్పి యున్నాను. మెకంజిదొరవారి లిఖిత పుస్తకములపట్టికయం దీ పద్యమునే

యుదాహరించి విల్సన్‌దొరగారు దీనినిబట్టి శాలివాహనశకము ౧౨౧౦-వ సంవత్సరమునం దనఁగా హూణశకము ౧౨౭౭-వ సంవత్సరమున దిక్కన సోమయాజి మృతుఁడయినట్టు వ్రాసి యున్నారు. మరణముగూర్చిన యీ పద్యమును వలెనే యొకానొకరు జన్మమునుగూర్చి కూడఁ జెప్పి సోమయాజిగారు శాలివాహనశకము ౧౦౪౨-వ శార్వరీసంవత్సర ఫాల్గున బహుళదశ మీకుజవాసరంబున జనన మొంది రని వ్రాసి యున్నారు. మరణమునుగూర్చిన యీ పద్య మెంత నిజమో జననమునుగూర్చిన యీ పద్యము నంతే నిజమయి యుండును

ఇవి గాక నిర్వచనోత్తరరామాయణమునుబట్టి కూడఁ దిక్కన కాల నిర్ణయమును జేయవచ్చును.

మ. 'కమలాప్తప్రతిమానమూర్తి యగునా కర్ణాటసోమేశు దు
ర్దమదోర్గర్వము యేపుమాపి నిజదర్పంబుం బ్రతిష్ఠించి లీ
లమెయిం జోళుని భూమిపై నిలిపి చోళస్థాపనాచార్యనా
మము దక్కం గొని తిక్కనభూవిభుఁడు సామర్థ్యంబు చెల్లింపఁడే'

అను పద్యముబట్టి మనుమరాజుయొక్కతండ్రి యైన తిక్కనృపాలుఁడు కర్ణాటసోమేశుని జయించినట్టు కనఁబడుచున్నది. ఈ జయింపఁబడిన సోమేశుఁడు పశ్చిమచాళుక్యుఁ డయిన నాలవ సోమేశుఁ డయి యుండును. [ఇయ్యెడ 'ఆంధ్రకవి తరంగిణి' కర్తలు క్రింది విధమున వ్రాసి యున్నారు—

'ఈ జయింపఁబడిన సోమేశుఁడు పశ్చిమచాళుక్యుఁడైన నాలవ సోమేశుఁ డయి యుండును' అని శ్రీ వీరేశలింగము పంతులుగారాంధ్రకవుల చరిత్రలో వ్రాసి యున్నారు. కాని యది సరియైనట్లు కన్పట్టదు ఈ పశ్చిమ చాళుక్యుఁడగు నాలవ సోమేశుఁడు శా. శ. ౧౧౦౪-౧౧౧౧ వఱకు రాజ్యము చేసిన వాఁడు. ఈ కాలములో తిక్కరాజు లేఁడు ఉన్నను, పదేండ్ల లోపు వయసు కలవాఁడై యుండును. ఏమనిన-వెలనాటి పృధ్వీశ్వరుని ఈ తిక్కరాజు తన శైశవముననే చంపియుండెననియు, నది శా. శ. ౧౧౨౯ాకు తరువాతనై యుండుననియుఁ బైన వ్రాసియుంటిమి.

.... ఇంతేకాదు. చాళుక్య నాల్గవ సోమేశ్వరుని కాలములో చోళరాజ్యమును బరిపాలించుచున్నవాఁడు మూఁడవ కులోత్తుంగచోళుఁడు. ఇతఁడు మిగుల పరాక్రమశాలి చోళదేశమే కాకుండ, ఆంధ్రదేశముకూడ నీతని యేలుబడిక్రింద నుండెను అట్టివాని నీ నాల్గవసోమేశుఁడు చోళ సింహాసనమునుండి తలిమివేయుట తటస్థింపదు .... ఇందు (పద్యమునందు) చూపఁబడిన సోమేశ్వరుఁడు (హొయ్సలవంశీయుఁడు) కర్ణాటదేశమును శా. శ ౧౧౫౫ మొదలు ౧౧౮౫ వఱకును పాలించినట్లు శాసనాధారములు కన్పించుచున్నవి . .. .. . ఈకాలములో చోళ రాజ్యమును బరిపాలించుచున్నవాఁడు మూఁడవ రాజేంద్రచోళుఁడు. ఇతఁడు బలహీనుఁడై రాజ్యసంరక్షణమునం దసమర్థుఁడై యుండెననియు. నీ సమయమున నీ వీరసోమేశ్వరుఁడు బలవంతుఁడై యాతనిని జయించి చోళసింహాసనము నాక్రమింపఁగా, మన తిక్కరాజు వీరసోమేశ్వరు నెదుర్కొని పోరాడి, చోళసింహాసనమున మూఁడవరాజేంద్రుని నిలిపె ననియుఁ జరిత్రకారులు తలంచుచున్నారు ఇది సత్యమనుటకు సంశయింప నక్కరలేదు. ఈమూఁడవ రాజేంద్రచోళుఁడు. శా శ. ౧౧౬౮ మొదలు ౧౧౯౯ వఱకును చోళ సింహాసనమునం దున్నవాఁడు కావున తిక్కరాజు శా. శ. ౧౧౬౮ సంవత్సరమునకుఁ బిమ్మట ననఁగా శా. శ. ౧౧౮౦ ప్రాంత మున సోమేశ్వరుని జయించి యుండవచ్చునని తలంపవలసియున్నది. ఈ సోమేశ్వరునిచే జయింపఁబడినవాఁడు మూఁడవ రాజేంద్రచోళుఁడు గాక మూఁడవ రాజరాజని తలంచితిమేని, యాతని పరిపాలనాకాలము శా. శ. ౧౧౩౮ మొదలు ౧౧౮౦ వఱకునునై యున్నది. కావున తిక్కన సోమేశ్వరుని జయించినది శా. శ ౧౧౬౦ ప్రాంతమైయుండును. ఇదియే సత్యమని నా అభిప్రాయము. (చూ రెండవసంపుటము పుటలు 203–205)"]

అయియుండినపక్షమున ఈ యుద్ధము ౧౧౯౯-వ సంవత్సరప్రాంతముల యందు జరిగి యుండవలెను. దీనినిబట్టి తిక్కనృపాలుఁడు ౧౨౦౦-వ సంవత్సరప్రాంతమువఱ కయినను రాజ్యము చేసి యుండును. దీనినిబట్టి యీ తిక్కనృపాలునిపుత్రుఁడును, నిర్వచనోత్తరరామాయణకృతిపతియు

నగు మనుమరాజు ౧౨౭౦-వ సంవత్సరప్రాంతములయందు రాజ్యము కోలుపోవుటలో వింత యేమియు లేదు. మనుమరాజుకాలములోనివా డయిన తిక్కన ౧౩-వ శతాబ్దారంభముననుండి యుండి యుండవలెను. ఈ సందర్భమున శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు తమయాంధ్రులచరిత్రము ద్వితీయభాగమున నిట్లు వ్రాసియున్నారు

"ఈపై పద్యములలో నితఁడు... .. ... . చోడునిసింహాసనముపై నుంచి చోడస్థాపనాచార్యబిరుదమును గైకొనియె ననియుఁ జెప్పఁబడి యున్నది. ఈ పద్యములలోఁ జెప్పఁబడిన విషయము లన్నియు సత్యము లనుటకు సందియము లేదు మూఁడవ కులోత్తుంగచోడచక్రవర్తి వెనుక రాజ్యపదవిని వహించిన మూఁడవ రాజరాజచోడుఁడు సమర్థుఁడు గాక మిక్కిలి బలహీనుఁ డగుటవలనను, గృహకలహములవలనను, మధ్యఁ గొంతకాలము రాజ్యమును బోఁగొట్టుకొనవలసినవాఁడయ్యెను ఇతని కాలమున మారవర్మ సుందరపాండ్యమహారాజువలనను, కర్నాటక వీర సోమేశ్వరునివలనను, పల్లవుండైన కొప్పరింజింగదేవుఁ డను మహామండ లేశ్వరునివలనను, రాజ్యమున కుపద్రవము సంభవించెను మహామండ లేశ్వరుఁడైన యీ తిక్కభూపాలుఁడు పాండ్యులను, కర్ణాటక వీర సోమేశ్వరుని జయించి, రాజరాజచోడుని సింహాసనమున నిలిపి చోళ స్థాపనాచార్యుఁ డను బిరుదమును వహించెను. గాంగవాండిదేశమును బరి పాలించుచుండిన హొసలరాజయిన వీరసోమేశ్వరుని శాసనములు క్రీ. శ. ౧౨౩౪ మొదలుకొని ౧౨౫౩ వఱకును గానంబడుచుండుటచేతను, అతనితోఁ దిక్కభూపతి సమకాలికుం డని చెప్పఁబడి యుండుటచేతను, తిక్కరాజుకాలము మనకు స్పష్టముగాఁ దెలియుచున్నది వీరసోమేశ్వరుఁడు గూడ చోళుని సింహాసనమునఁ గూర్చుండఁబెట్టె ననియు, అతఁడును తిక్కభూపాలుఁడు నొండొరులతోఁ బోరాడుచుండి రనియును, దెలియు చుండుటచేత, నిరువురును చోళసింహాసనమునకై పోరాడువారిలోఁ జెఱి యొకపక్కను జేరి యుద్ధము చేసిరని యూహింపనగు."

నేను మొదట చెప్పినది గాక ౧౨౩౪ నకు తరువాత నని పైనిఁ జెప్పఁబడినకాలమే యెక్కువ సరియైనదని నమ్ముచున్నాను. ౧౨౩౪-వ సంవత్సరము నం దీ తిక్కభూపాలుని పేర కాంచీనగరమునందలి యొక దేవాలయములో దానశాసన మొకటి కలదు. తిక్కన నిర్వచనోత్తర రామాయణములోనే యీ తిక్కనరపాలుఁడు తనశైశవమునందే పృథ్వీశ రాజుతల చెండాడె నని యీక్రింది పద్యమునఁ జెప్పఁబడినది.

> "ఉ. కేశవసన్నిభుండు పరిగీతయశోనిధి చోళతిక్కధా
> త్రీశుఁడు కేవలుండె? నృపు లెవ్వరి కా చరితంబు కల్గునే?
> శైశవలీలనాఁడె పటుశౌర్యధురంధరబాహుఁడైన పృ
> థ్వీశనరేంద్రుమస్తకము నేత్తెఱఁ గందుకకేళి సల్పదే"

ఈ పృథ్వీశరాజు పండ్రెండవ శతాబ్దాంతమునం దుండిన వెలనాటి చోడ సామంతరాజు. ఈతని శాసనములు ౧౧౭౦ వఱకును గానఁబడుచున్నవి. ఇతఁడు తరువాతఁ గూడ బహుసంవత్సరములు జీవించియుండినట్టు నిదర్శనములు కనఁబడుచున్నవి. అందుచేత నీ తిక్కనృపతి తన యౌవనారంభదశలో ౧౧౯౦ సంవత్సరప్రాంతముల రణరంగమునందు పృథ్వీశరాజుతలఁ దునిమి యుండును, * ఇవి యన్నియుఁ దిక్కనసోమయాజి ౧౨౫౦ సంవత్సరప్రాంతమునం దుండెనని స్థాపించుచున్నవి.

తిక్కనసోమయాజికాలము నింకను బహువిధములచేత నిర్ణయింపవచ్చును. భోజరాజీయాదికావ్యరత్నములను రచించిన యనంతకవి తన ప్రపితామహుఁ

[* 'ఆంధ్రకవి తరంగిణి' లో నిచ్చట క్రింది కీలిక గలదు —

'ఈ పృథ్వీశ్వరుఁడు వెలనాటి చోడుఁడు, మూఁడవ గొంకరాజునకును, జయాంబికకును కుమారుఁడు .... పృథ్వీశ్వరుని శాసనములు శా. శ. ౧౧౦౭ మొదలు ౧౧౨౭ వఱకును కన్పట్టుచున్నవి . .... ౧౧౨౭ తరువాత నీతని శాసనములు గన్పట్టుటలేదు. తిక్కరాజు తన శైశవమునందే యీతనిని జంపెనని పై పద్యమునందుఁ జెప్పియుండుటచే ౧౧౨౭-వ యేట నీతఁడు పృథ్వీశ్వరుని సంహరించెననియు, దానినిబట్టి తిక్కరాజుయొక్క జననము ౧౧౧౦ ప్రాంతమై యుండుననియు నిశ్చయింపవచ్చును.' (రెండవ సంపుటము, పుట 201)

డైన బయ్యనమంత్రినిగూర్చి వ్రాయుచు నతఁడు తిక్కనసోమయాజిచేత భవ్యభారతి యని పేరు గాంచినట్లు భోజరాజీయములో నీక్రిందిపద్యమునఁ జెప్పి యున్నాఁడు.

"చ. క్షితిఁ గ్రతుకర్తనా వినుతి కెక్కొని పంచమవేదమైన భా
రతముఁ దెనుఁగుబాస నభిరామముగా రచియించినట్టి యు
న్నతచరితుండు తిక్కకవినాయకుఁ డాదట మెచ్చి భవ్యభా
రతి యనఁ బేరుగన్నకవిరత్నము బయ్యనమంత్రి యల్పుడే."

ఈ బయ్యన్న మంత్రికొడుకు మమ్మఁడన్న, మమ్మఁడన్న కొడుకు తిక్కన; తిక్కనకొడుకు భోజరాజీయాది గ్రంథకర్త యైన యనంతకవి. ఈ యనంతకవి తనరసాభరణమునందు తా నా గ్రంథమును రచించిన కాలము శాలివాహనశకము ౧౩౫౬-వ సంవత్సరమనఁగా క్రీస్తుశకము ౧౪౩౪-వ సంవత్సర మైనట్లీ క్రిందిపద్యమునఁ జెప్పి యున్నాఁడు.

"శా. జానొందన్ శకవర్షముల్ ఋతుశరజ్వాలేందులై యొప్ప న
య్యానందాబ్దమునందు మాఘమునఁ గృష్ణైకాదశీ భౌమయు
క్తానామామృతవేళ నీ కృతి యనంతాఖ్యుండు సమ్యగ్గస
శ్రీ నిండం ధ్రువపట్టణాధిపున కిచ్చెన్ భక్తిపూర్వంబుగన్."

ఈ కవికిని, తిక్కనసోమయాజికిని నడుమ ముగ్గురు పురుషులుమాత్రమే యున్నారు. ఒక్కొక్క పురుషాంతరమునకు నలువదియైదేసి సంవత్సరములు చూచినను సోమయాజులు ౧౩౦౦ సంవత్సరప్రాంతమువఱకును జీవించి యుండెనని తేలుచున్నది. తిక్కనసోమయాజులు ౮౦ సంవత్సరములు జీవించెనని ప్రసిద్ధి గలదు. అదియే నిజమైనపక్షమున నతఁడు ౧౨౨౦-వ సంవత్సరప్రాంతమున జననమొంది ౧౩౦౦ సంవత్సరప్రాంతమువఱకును జీవించి యుండవలెను. అప్పు డతఁడు ముప్పది నలువది యేండ్ల ప్రాయమున మనుమసిద్ధిజీవితకాలములో నిర్వచనోత్తరరామాయణమును రచించినట్లును, భారతమును మనుమరాజు మరణానంతరముననే రచియించినట్లును, ఏర్పడుచున్నది తిక్కనసోమయాజి తన నిర్వచనోత్తరరామాయణము

నందు కృతిపతి యైన మనుమసిద్ధియొక్క పరాక్రమమును వర్ణించుచు మహారాష్ట్రసారంగునిఁ దోలి తురంగమును గొనిన ట్లీ క్రిందిపద్యమునఁ జెప్పి యున్నాఁడు.—

"శా. శృంగారంబు నలంగ దేమియును బ్రస్వేదాంకురశ్రేణి లే
దంగంబుల్ మెఱుఁగేడ వించుకయు మాహారాష్ట్రసామంతసా
రంగుం దోలి తురంగముం గొనిన సంగ్రామంబునం దృప్త స
ప్తాంగస్ఫారయశుండు మన్మవిభుపంపై చన్న సైన్యంబునన్."

ఇందు బేర్కొనఁబడిన మహారాష్ట్రసారంగుఁ డద్దంకిసీమకుఁ బాలకుఁడుగా నుండి కాకతీయగణపతిదేవునికి లోఁబడి యుండిన సామంతరాజు. పయి పద్యమునందు మనుమసిద్ధి మహారాష్ట్రసామంతుఁడైన సారంగుని దోలి తురంగముం గొనినప్పుడు శృంగారంబు చెడలేదనియు దేహమునఁ జెమ్మట పట్టలేదనియు నంగములు మెఱుఁగు విడువలేదనియుఁ జెప్పెనేకాని సారంగుని గెలిచి రాజ్యమును గైకొన్నట్టుగాని, యాతనిని పట్టుకొన్నట్లు గాని చెప్పలేదు ఈపోరాటమునందు సంపూర్ణ విజయము నొందకయే యాతనితోడ సంధి చేసికొన్న గణపతిదేవుని యనుగ్రహమునకు పాత్రుఁ డయ్యెనని తోఁచుచున్నది. * ఈ మనుమసిద్ధి మొదటినుండియు స్వతంత్ర రాజు గాక మొదట కాంచీపురచోడచక్రవర్తులకును, కడపట కాకతీయ గణపతికిని లోఁబడిన సామంతరాజుగా నుండెను. మహారాష్ట్రసామంతుని తోడి యీ యుద్ధము ౧౨౫౭-వ సంవత్సరప్రాంతమునందలి దయి యుండును. ఈ మనుమరాజు పలుమాఱు శత్రువుల కోటువడి రాజ్యమును పోఁగొట్టుకొనుచు వచ్చెను. కడపట దాయాదులచేత రాజ్యపదభ్రష్టుఁ డయినప్పుడు ౧౨౬౦-వ సంవత్సరము లోపలనే తిక్కనప్రార్థనపైని గణపతిదేవుఁ డీతనికి తోడుపడి శత్రువుల నడఁచి రాజ్యమునందు మరల నిలిపి యుండును ౧౨౫౭-వ సంవత్సరము వఱకును జరిగిన వృత్తాంతము లుత్తరరామాయణమునందు పేర్కొనఁబడి యుండుటచేత నా పుస్తక మా

[* సారంగుఁడు మనుమసిద్ధిచే యుద్ధమున నోడింపఁబడినట్లు శ్రీ చిలుకూరి వీరభద్రరావుగా 'రాంధ్రులచరిత్రము'న వ్రాసియున్నారు.]

కాలమునందే రచియింపఁబడి యుండును పసులమేఁతబీళ్ళపుల్లరివిషయమున జరిగిన జగడములో కాటమరాజువలెనే మనుమసిద్ధియు ౧౨౬౩-వ సంవత్సరప్రాంతమున రణ నిహతుఁ డయ్యెను అంతటితో సీతనిరాజ్య మంతరించెను. అప్పటికి భారతము రచింపఁబడలేదు. అందుచేత సోమదేవ రాజీయాదుల యందుఁ జెప్పఁబడిన భారతశ్రవణకధ కవికల్పిత మనుటకు సందేహము లేదు. [సోమదేవరాజీయాదులయందలి వాక్యములనుబట్టి భారతరచన యంతకుమున్నే జరిగిన ట్లూహింపవీలులేదు. తిక్కన సంస్కృత భారతమును జదివి వినిపించి గణపతిదేవుని మెప్పించి యుండును. కావున పయిగ్రంథములోని వాక్యములు విరుద్ధములని యనుకొననక్కఱలేదు]

కవియొక్క కాలనిర్ణయమునుగూర్చి యింకొక చిన్న యాధారమును మాత్రము చూపి యీ విషయము నింతటితో విడిచిపెట్టెదను. పద్మపురాణోత్తరఖండము మొదలైన బహుకావ్యములను రచియించిన మడికి సింగన్న తన పితామహుడైన యల్లాడమంత్రికి తిక్కనసోమయాజితోఁ గల బంధుత్వమును తన వాసిష్ఠరామాయణములో నీ క్రింది పద్యమునఁ దెలిపి యున్నాఁడు.

సీ. అతఁడు తిక్కనసోమయాజులపుత్రుడై
కొమరారు గుంటూరికొమ్మవిభుని
పుత్రివిట్టాంబిక బుధలోకకల్పక
వల్లి వివాహమై వైభవమున
భూసారమగు కోట భూమిఁ గృష్ణానది
దక్షిణతటమున ధన్యలీల
నలరు రావెల యను నగ్రహారము తన
కేకభోగంబుగా నేలుచుండి

యందుఁ గోవెల గట్టి గోవిందునన్న
గోపినాథుఁ బ్రతిష్ఠయుఁ గోరి చేసి
యఖిలభువనంబులందును నతిశయిల్లె
ఘనుజమందారుఁ డల్లాడమంత్రివిభుఁడు.'

ఈ యల్లాదమంత్రి తిక్కనసోమయాజిమనుమరాలిభర్త; కవి సింగన్న యల్లాదమంత్రి మనుమడు. తిక్కనసోమయాజిపుత్రుఁడు కొమ్మన; కొమ్మనకూఁతురు చిట్టాంబ కల్లాదమంత్రివలనఁ గలిగిన పుత్రుఁ డయ్యలమంత్రి; అయ్యలమంత్రి పుత్రుడు గ్రంథకర్త యైన సింగన్న. ఈ కవి తాను పద్మోత్తరఖండమును రచించిన కాలము శకవర్షము ౧౩౪౪ అయినట్లు పురాణమునం దీక్రిందిపద్యమునఁ జెప్పియున్నాడు.

మంగళమహాశ్రీ వృత్తము

''ఆకరయుగానలమృగాంకశకవత్సరములై పరఁగు శార్వరిని బుణ్య
ప్రాకటితమార్గశిరపంచమిని బొల్చు బుధుపాలసుతవాసరమునందున్
శ్రీకరముగా మడికి సింగన చెనుంగున రచించెఁ దగఁ బద్మపురాణం
బాకమలమిత్రశశిరాఁశుపుగఁ గందపచివాగ్రణికి మంగళమహాశ్రీ.''

ఈ పుస్తకము శాలివాహనశకము ౧౩౪౪ శార్వరి సంవత్సర మార్గశిర పంచమీ బుధవారమునం దనఁగా క్రీస్తుశకము ౧౪౨౨-వ సంవత్సరము నందు ముగింపఁబడెను. ఈ కవికిని తిక్కనసోమయాజికిని నడుమను మూఁడు తరములుమాత్రము చెల్లినవి. ఒక్కొక్క తరమున కంతరము నలుబదేసి సంవత్సరములచొప్పునఁ జూచినను తిక్కనసోమయాజి ౧౩౦౦ సంవత్సరప్రాంతమున నుండి యుండవలెను పయి పద్యములలో మొదటి దానియందు ''తిక్కనసోమయాజులపౌత్రుఁడై కొమరారు గుంటూరికొమ్మ విభుని'' అను పాఠము కొన్ని ప్రతులలోఁగానఁబడు చున్నది. అది ప్రమాదజనితమైన యపపాఠము కొమ్మన్న సోమయాజుల పుత్రుఁడు గాని పౌత్రుఁడు గాడు. సోమయాజులవంశజులలో నిప్పుడు జీవించియున్న పాటూరి శరభరాజుగారిచే నీయఁబడిన వంశానుక్రమణిక యీ విధముగా నున్నది

సీ. 'భారతపర్వము ల్పదియేను వరుసగాఁ
దెనిఁగించె గుంటూరితిక్కయజ్వ
యా మహాత్మునిపుత్రుఁడౌ కొమ్మనఘనుండు
కల్పించెఁ బాటూరికరిణీకంబు

నా కొమ్మనకుఁ గల్గె హరిహరామాత్యుండు
నెమ్మితో నతనికిఁ గొమ్మఘనుఁడు
రహిమీఱ నతనికి రామన తిప్పన
యా రామనకు సోమయాహ్వయుండు

ఆ ఘనునకు వీరనామాత్యుఁ డతనికి
సోమలింగమంత్రి యా మహాత్ము
నకును సోమరాజనాముఁడుఁ జిటివీర
ఘనుఁ డనంగ సుతులు గలిగి రందు.

సీ. సోమమంత్రికిఁ గల్గె సుతుఁడు పాపనమంత్రి
యతనికి వీరన యా ఘనునకుఁ
గూరిమితనయులు గోపాలభద్రార్య
నరసింహమంత్రు లనంగ ముగురు
వారిలో నరసింహవరునకు శరభార్యుఁ
డును భాస్కరామాత్యుఁడు నరసింహ
ఘనుఁ డనఁ బుత్రులు కలిగిరి మువ్వురు
వారిలో శరభార్యవర్యునకును

వీరఘనుఁడు గలిగె వేడ్కనా మంత్రికి
శరభమంత్రి వరుఁడు జననమొంది
ప్రబలి యున్నవాఁడు పాటూరిలోఁ దన
కులము వర్ధిలంగఁ గొమరుమీఱి '

ఈ పద్యములు రెంటిలో మొదటిది పూర్వరచిత మని చెప్పి శరభరాజు గారిచ్చినది; రెండవది శరభరాజుగా రిచ్చిన వంశానుక్రమణికను బట్టి బ్రహ్మశ్రీ శతఘంటము వేంకటరంగశాస్త్రిగారిచే రచియింపఁబడినది. ఇప్పుడున్న శరభరాజుగారికిని తిక్కనసోమయాజిగారికిని నడుమ ౧౩ తరములు చెల్లినవి. ఆద్యంతములయం దున్న వీరి నుభయులనుగూడఁ గలుపుకొని తరమొకటికి నలువదేసి సంవత్సరములచొప్పున పదునేనుతర

ముల కాలమునూఱు సంవత్సరములు లెక్క వేసినను తిక్కనసోమయాజి
కాలము ౧౩౦౦ ల సంవత్సరముకంటె ముందుకు పోదు. ('ఆంధ్రకవి
తరంగిణి' కారులు తిక్కనసోమయాజి చరిత్రములో కవి కాలమును గురించి
విపులముగాఁ జర్చించి, యీ 'ఆంధ్రకవుల చరిత్రము' నందలి విషయము
లను గూర్చి తమ యభిప్రాయమును తెల్పిరి. తమ సిద్ధాంతమును వివ
రించిరి. దాని సారము మాత్ర మిచట తెలుపఁబడుచున్నది.

'బ్ర. శ్రీ వీరేశలింగము పంతులుగా రాంధ్రకవుల చరిత్రమునఁ దిక్కన
కాలమును సరిగానే నిర్ణయించిరి కాని, వారు గైకొనిన యాధారములు
సంశయాస్పదములుగా నున్నవి వారాధారముగాఁ గైకొనిన పెంట్రాల
శాసనములు మన మనుమసిద్ధివి గావనియు, ముక్కంటికాడువెట్టి వంశ
యుఁడైన భుజ బల వీర మనుమసిద్ధివనియుఁ దోఁచుచున్నది. మనుమ
సిద్ధి నామధారులు పెక్కురున్నారు' (రెండవ సంపుటము పుట 196)

'బ్ర. శ్రీ వీరేశలింగము పంతులుగారు (మాటూరి శరభరాజుగారిచ్చిన)
వంశావళినిబట్టి తిక్కనకాలమును నిర్ణయింప యత్నించిరి. ఇప్పుడు శాసన
సాహాయ్యమున నీ మహాకవికాలము స్పష్టముగాఁ దెలియుచున్నది. కావున
నందుల కీ వంశావళితోఁ బనిలేదు' (రెండవ సంపుటము పుట 155)

తిక్కన నిర్వచనోత్తర రామాయణమును కీ శ. 1253-1258 నడుమ రచించి
యుండుననియు ఇతఁడును, కృతిపతియగు మనుమసిద్ధియు నించుమించుగ
సమవయస్కులనియు, అప్పటికి తిక్కన వయస్సు నలువది సంవత్సరము
లుండుననియు, నందుచే నీతని జననము క్రీ శ. ౧౨౨౦ ప్రాంతమున
నుండుననియు మనుమసిద్ధి నిర్యాణానంతరము భారతరచన ప్రారంభింపఁ
బడి యుండుననియు, ఆ రచన క్రీ శ. 1270-1280 ల నడుమ జరిగి
యుండుననియు నందు వివరింపఁబడియున్నది. తిక్కన నిర్యాణమును
గూర్చిన 'అంబర రవి శశి ..' అను పద్యము ప్రమాణము కానందున,
దానింబట్టి తిక్కన నిర్యాణకాలమును నిర్ణయించుట సరికాదని అందఱు
నంగీకరింతురు. తిక్కన 78 ఏండ్లు జీవించియుండెనని వాడుక యున్నందున
అతనికాలము క్రీ. శ. ౧౨౨౦ మొదలు ౧౩౦౦ వఱకు నుండవచ్చునని
యూహింపవచ్చును.)

కవితిక్కన నియోగిబ్రాహ్మణుఁడు ఈతనిపూర్వుల నివాసస్థలము మొట్ట మొదట కృష్ణామండలములోని వెల్లటూరుగ్రామమనియు, ఉద్యోగధర్మము చేత వా రీతనితాతకాలమున గుంటూరునకు వచ్చిరనియు, తరువాత నెల్లూరిరా జగు మనుమసిద్ధి యీతనికుటుంబము నాదరించి నెల్లూరికిఁ దీసికొనివచ్చి పూర్వము హరిహరదేవాలయ ముండిన యిప్పటి రంగనాయకస్వామి యాలయసమీపమున గృహము కట్టించి యిచ్చి తిక్కనసోమయాజుల నం దుంచె ననియు, మనుమసిద్ధిమరణముతో నా రాజవంశ మంతరింపఁగా సోమయాజుల కొడుకు కొమ్మన్న పాటూరి కరిణికము సంపాదించి నెల్లూరు విడిచి యందు వసించెననియు, చెప్పుచున్నారు ఈ పాటూరిగ్రామము నెల్లూరికి పడమట రెండు మూఁడుక్రోసులదూరమున నుత్తరపినాకినీతీర మునం దున్నది. ఈ కవియొక్క పితృపితామహులది గుంటూ రగుటచేత నీతనియింటిపేరు గుంటూరివా రని చెప్పుదురు. నా కిటీవల లభించిన కేతనకృత మైన దశకుమారచరిత్రమునుబట్టి చూడఁగా దిక్కనసోమయాజి యింటిపేరు కొట్టరువువా రయినట్టు తెలియవచ్చినది. తిక్కనసోమయాజి కంకితముచేయఁబడిన యీ గ్రంథమునం దీతనివంశావళి సమగ్రముగా వర్ణింపఁబడినది. దశకుమారచరిత్రమునందు సోమయాజి తాత యైన మంత్రిభాస్కరుఁ డిట్లు వర్ణింపఁబడెను.

శా. 'శాపానుగ్రహశక్తియుక్తుఁ డమలాచారుండు సాహిత్యవి
ద్యాపారీణుఁడు ధర్మమార్గపథికుం డర్థార్థిలోకావన
వ్యాపారవ్రతుఁ డంచుఁ జెప్పు సుజనవ్రాతంబు గౌరీపతి
శ్రీపాదప్రవణాంతరంగు విబుధశ్రేయస్కరున్ భాస్కరున్.'

కృతికర్త యీ భాస్కరమంత్రి గ్రంథరచన చేసినట్టు చెప్పకపోయినను "శాపానుగ్రహశక్తియుక్తుఁడు" అనియు, "సాహిత్యవిద్యాపారీణుఁడు" అనియు చెప్పుటచేతనే యాతఁడు కవియైన ట్లూహచేయవచ్చును.

కవి యటుతరువాత భాస్కరునికి నలుగురు పుత్రు లయిన ట్లీ క్రింది పద్యములలోఁ జెప్పెను.

ఉ. ధీనిధి భాస్కరార్యునకు ధీరగుణాన్విత కొమ్మమాంబకునున్
మానవకోటిలోపల సమస్తగుణమ్ములవాఁడు పెద్దనా
వానికి వాఁడు పెద్ద యన వానికి వానికి వాఁడు పెద్దనా
వానికి వార లందఱకు వాఁ డధికుం డనఁ బుట్టి రాత్మజుల్.

సీ. వివిధవిద్యాకేళిభవనభావంబున
జలజజుముఖచతుష్టయముఁబోలి
విబుధవిప్రతిపత్తివిదళనక్రీడమై
జలశాయిభుజచతుష్టయముఁబోలి
ధర్మమార్గక్రియాదర్శకత్వంబున
సన్నుతాగమచతుష్టయముఁబోలి
పృథుతరప్రథితగాంభీర్యగుణంబున
శంబరాకరచతుష్టయముఁబోలి
సుతచతుష్టయంబు నుతి కెక్కె గుణనిధి
కేతనయును బారిజాతనిభుఁడు
మల్లనయును మంత్రిమణి సిద్ధనయు రూప
కుసుమమార్గణుండు కొమ్మనయును

తిక్కనసోమయాజియొక్క పెద్దతండ్రులలో మొదటివాఁడును, రెండవ వాఁడును నయిన కేతనను మల్లనను వారి తనయులను వర్ణించినతరువాత, సోమయాజికి మూఁడవపెదతండ్రియు, మన్మభూపాలుని తండ్రియైన తిక్కరాజుమంత్రియు నైన సిద్ధనామాత్యునిని, అతని యగ్రపుత్రుఁ డయిన రణతిక్కనను ఇట్లు వర్ణించెను.

ఉ. స్థాపితసూర్యవంశవసుధాపతినాఁ బరతత్త్వభూతవా
జీపతినా నుదాత్తనృపనీతిబృహస్పతినా గృహస్థగౌ
రీపతినాఁ గృపారసపరిప్లుతినాఁ బొగడొందె సిద్ధసే
నాపతిప్రోఢ తిక్కజననాథశిఖామణి కాప్తమంత్రియై.

క. సామూద్యుపాయపారగుఁ
డాముష్యాయణుఁడు సిద్ధనామాత్యునకున్
గామితవవిసుత్రాణన
భూమిజనితకల్పవల్లి ప్రోలాంబికకున్.

సీ. విపులనిర్మలయశోవిసరగర్వీకృత
దిక్కండు నాఁదగు తిక్కనయును
దర్పితక్రూరశాత్రవసముత్కరతమో
భాస్కరుం డనఁదగు భాస్కరుండు
నప్రతిమానరూపాధరీకృతమీన
కేతనుం డనఁదగు కేతనయును
నిజభుజాబలగర్వనిర్జితోగ్రప్రతి
మల్లుండు నాఁదగు మల్లనయును
శ్రీయుతుండు చౌహత్తనారాయణుండు
మల్లనయు నీతివిక్రమమండనుండు
పిన్నభాస్కరుండును బుధప్రీతికరుఁడు
పెమ్మనయు నుదయించిరి పెంపు వెలయ.

వ. అందగ్రసంభవుండు.

సీ. వేఁడిన నర్థార్థి వ్యర్థుఁడై చనఁడని
దానంబు తనకు బాంధవుఁడు గాఁగ
నెదిరిన జమునైన నెదిరికి పోవఁగనీని
శౌర్యంబు తన కిష్టసఖుఁడు గాఁగ
శరణువొచ్చిన శత్రువరునైన రక్షించు
కరుణయె తనకు సంగాతి గాఁగఁ
బలికినఁ బాండవప్రభునైన మెచ్చని
సత్యంబు తనకు రక్షకుఁడు గాఁగ

జగతి నుతికెక్కె రాయవేశ్యాభుజంగ
రాజ్యరత్నాకరస్ఫూర్తి రాజమూర్తి
గంధవారణబిరుదవిఖ్యాతకీర్తి
దినపతేజుండు సిద్ధయతిక్కశౌరి.'

అటుపిమ్మట గృతికర్త యయిన యభినవదండి సోమయాజుల తల్లిదండ్రుల నిట్లు వర్ణించెను——

సీ. స్వారాజ్యపూజ్యుఁడో ! కౌరవాధీశుఁడో
నాఁగ భోగమున మానమున నెగడె
రతినాథుఁడో దినరాజతనూజుఁడో
నాఁగ రూపమున దానమున నెగడె
ధరణీధరేంద్రుఁడో ధర్మసంజాతుఁడో
యనఁగ ధైర్యమున సత్యమున నెగడె
గంగాత్మజన్ముఁడో గాండీవధన్వుఁడో
యనఁగ శౌచమున శౌర్యమున నెగడె

సూర్యవంశకభూపాలసుచిరరాజ్య
వనవసంతుండు బుధలోకవత్సలుండు
గౌతమాన్వయాంభోనిధిశీతకరుఁడు
కులవిధానంబు కొట్టరుకొమ్మశౌరి.

క. అతఁడు రతిఁ జిత్తసంభవు
గతి రోహిణిఁ జంద్రుమాడ్కిఁ, గమలావాసన్
శతదళలోచను క్రియ, న
ప్రతిమాకృతి నన్నమాంబఁ బరిణయ మయ్యెన్.

సీ. పతిభక్తి నలయరుంధతి పోలెనేనియు
సౌభాగ్యమహిమ నీ సతికి నెనయె ?
సౌభాగ్యమున రతి సరియయ్యెనేని భా
గ్యంబున నీ యంబుజాక్షి కెనయె ?

భాగ్యంబునందు శ్రీపతి యయ్యెనేనియుఁ
దాలిమి నీ లతాతన్వి కెనయె?
తాలిమి భూదేవి తగుపాటి యగునేని
నేర్పున నీ పద్మనేత్ర కెనయె?

యని యనేకవిధంబుల నఖిలజనులు
పొగడ నెగడెఁ గృపాపరిపూరితాంత
రంగ కొమ్మనామాత్యునర్ధాంగలక్ష్మి
యఖిలగుణగణాలంకృత యన్నమాంబ'

ఇట్లు వంశాభివర్ణనము చేసినతరువాతఁ గేతనకవి తిక్కనజన్మాదికమును జెప్పి యాతని నిట్లు వర్ణించెను—

వ. * * * అతండు జాతకర్మ ప్రముఖసంస్కా-రానంతరంబున వేదాదిసమస్తవిద్యాభ్యాసియగుచు ననుదినప్రవర్ధనంబుఁ జెంది తుహినభానుండునుంబోలె బహుకళాసంపన్నుండును, గార్తికేయుండునుంబోలె నసాధారణశక్తియుక్తుండును నధరీకృతమయూరుండునునై, పరమేశ్వరుండునుంబోలె లీలావిసర్జితకుసుమసాయకుండును నకలంక విభూత్యలంకృతుండునునై, నారాయణుండునుం బోలె ననంతభోగసంశ్లేష శోభితగాత్రుండును శ్రీమత్పురుషోత్తమత్వ ప్రసిద్ధుండును లక్ష్మీసమా లింగితవక్షుండునై వెలసె, నా తిక్కనామాత్యుగుణవిశేషంబు లెట్టి వనిన.

సీ. సుకవీంద్రబృందరక్షకుఁ డెవ్వఁ డనిన వీఁ
డను నాలుకకుఁ దొడవైనవాఁడు
చిత్తనిత్యస్థితశివుఁ డెవ్వఁ డనిన వీఁ
డను శబ్దమున కర్థమైనవాఁడు
దశదిశావిశ్రాంతయశుఁ డెవ్వఁ డనిన వీఁ
డని చెప్పుటకుఁ బాత్రమైనవాఁడు
సకలవిద్యాకళాచణుఁ డెవ్వఁ డనిన వీఁ
డని చూపుటకు గుఱియైనవాఁడు

మనుమసిద్ధిమహీశసమస్త రాజ్య
భారాధౌరేయుఁ డభిరూపభావభవుఁడు
కొట్టరువుకొమ్మనామాత్యుకూర్మిసుతుఁడు
దీనజనతానిధానంబు తిక్కశౌరి.

క. అగు ననఁ గొమ్మయతిక్కఁడు
జగతి నపూర్వార్థ శబ్దచారుకవితమై
వెగడిన 'బాణోచ్ఛిష్టం
జగత్త్రయం' బనిన పలుకు సఫలం బయ్యెన్.

క. కృతులు రచియింప సుకవుల
కృతు లొప్పఁ గొనంగ నొరునికిం దీరునే? వా
కృతనిభుఁడు వితరణశ్రీ
యుతుఁ డన్నమసుతుఁడు తిక్కఁ డొకనికిఁ దక్కన్.

క అభినుతుఁడు మనుమభూవిభు
సభఁ దెనుఁగున సంస్కృతమునఁ జతురుండై తా
నుభయకవిమిత్రనామము
త్రిభువనముల నెగడ మంత్రితిక్కఁడు దాల్చెన్.

సీ. సరసకవీంద్రుల సత్ప్రబంధము లొప్పఁ
గొను నను టధికకీర్తనకుఁ దెరువు
లలితనానాకావ్యములు చెప్పు నుభయభా
షలయందు ననుట ప్రశంసత్రోవ
యర్థిమైఁ బెక్కూళ్ళ నగ్రహారంబుల
గా నిచ్చు ననుట పొగడ్త పొలము
మహితదక్షిణ లైన బహువిధయాగంబు
లొనరించు ననుట వర్ణనముదారి

పరుని కొక్కని కిన్నియుఁ బ్రకటవృత్తి
నిజములై పెంపు సొంపారి నెగడునట్టి
కొమ్మనామాత్యతిక్కనకొలఁది సచివు
లింక నొక్కరుఁ డెన్నఁగ నెందుఁ గలఁడు?

ఈ పద్యములలో స్పష్టముగాఁ జెప్పకపోయినను దిక్కన రామాయణాది గ్రంథములను జేసినట్టును, [illegible]వులు చేసినట్టును గవి సూచించియున్నాఁడు. దశకుమారచరిత్రమును కృతి [illegible]దునప్పటికి తిక్కన భారతరచన మారంభించి యుండఁడు; కేతన యెక్కడను తిక్కన్నను సోమయాజి యని చెప్పి యుండకపోవుటచేత నతఁ డప్పటికి యజ్ఞము సహితము చేసియుండఁడు. ఆధానమును జేసి యుండునేమో! తిక్కన్న మనుమసిద్ధిమంత్రిగా నుండి సంపదలతోఁ దులదూఁగుచున్న కాలముననే కేతన యాతనికి దశకుమార చరిత్రము నంకితము చేసెను. మఱియు నీతని వంశాభివర్ణనమునుబట్టి ముగ్గురు తిక్కనులు లే రనియుఁ గవితిక్కనయే మంత్రితిక్కన యనియు రణతిక్కన యనియు ఖడ్గతిక్కన యనియుఁ జెప్పఁబడునతఁడు కవితిక్కనకుఁ బితృవ్యపుత్త్రుఁడనియు స్పష్టపడితది.

కొమ్మన్ననుండి యాతని సంతతివారు పాటూరివా రయినారు. ఈ తిక్కన కవి గౌతమగోత్రుఁడు. ఈతని తండ్రి కొమ్మన; తల్లి అన్నమ్మ. కేతన, మల్లన, సిద్ధన, అనువా రీతని పెదతండ్రులు. * ఈ కవిగ్రామణియొక్క

---

* సీ. మజ్జనకుండు సన్మాన్యగౌతమగోత్ర
మహితుండు భాస్కరమంత్రితనయుఁ
డన్నమాంబాపతి యనఘులు కేతన
మల్లన సిద్ధనామాత్యవరుల
కూరిమితమ్ముండు గుంటూరివిభుఁడు కొ
మ్మనదండనాథుఁడు మధురకీర్తి
విస్తరస్ఫారుఁ డాపస్తంబసూత్రప
విత్రశీలుఁడు సాంగవేదవేది
యర్థిఁ గల వచ్చి వాత్సల్య మతిశయిల్ల
నస్మదీయప్రణామంబు లాదరించి
తుష్టి దీవించి కరుణార్ద్రదృష్టిఁ జూచి
యెలమి నిట్లని యానతి యిచ్చె నాకు.—విరాటపర్వము.

మ. అమలోదాత్తమనీష నే నుభయకావ్యప్రౌఢిఁ బాటించుశి
ల్పమునం బారగుఁడం గళావిదుఁడ నాపస్తంబసూత్రుండ గౌ
తమగోత్రుండ మహేశ్వరాంఘ్రికమలధ్యానైకశీలుండ న
న్నమకుం గొమ్మనమంత్రికిన్ సుతుఁడఁ దిక్కాంకుండ సన్మాన్యుఁడన్.
—నిర్వచనోత్తరరామాయణము.

తండ్రి తాతలు రాజాస్థానములయందు గొప్ప గొలువులు చేసి ప్రభుసన్మానము పొంది మిక్కిలి ప్రసిద్ధి కెక్కినవారు. కవితండ్రి యైన కొమ్మన మంత్రి కృష్ణామండలములోని గుంటూరునకు దండనాథుఁడయి యుండెను. తాతయైన భాస్కరుఁడు గుంటూరి కధిపతిగా నుండి విద్యలయం దపమానుఁడయి మంత్రిభాస్కరుం డని విఖ్యాతి కెక్కెను. మొట్టమొదట రామాయణమును పద్యకావ్యమునుగా తెనిఁగించిన మహాకవి యితఁడే యని చెప్పుదురు. ఆ గ్రంథ మీయనపేరనే భాస్కరరామాయణమని నేఁటివఱకును ప్రసిద్ధి చెందుచున్న దనియుఁ జెప్పుదురు ఇప్పుడున్న భాస్కరరామాయణమున కాపేరు హుళక్కిభాస్కరునివలననే కలిగినదిగాని మంత్రిభాస్కరునివలనఁ గలిగినదిగా కనఁబడదు *

రామాయణ మంతకు ముందు రచియింపఁబడి యుండుటచేతనే తిక్కనసోమయాజి రామాయణముయొక్క యుత్తరకాండమును తెనిఁగింప నారంభించెననియు పోతరాజకృతభాగవతములోని కొన్నిభాగము లాతని యనంతరమున నుత్సన్నము లయి పోఁగా పోయిన భాగములను వెలిగందల నారాయణాదులు పూరించినట్లె భాస్కరవిరచితరామాయణమునహిత మొక్కయారణ్యకాండము తక్క తక్కినభాగములు కొంతకాలమున కుత్సన్నములు కాఁగా మిగిలినకాండములను హుళక్కి భాస్కరాదులు పూరించిరనియు కొందఱందురు కాని యీ యంశమును స్థాపించుటకు నిర్బాధకము లైన యాధారము లేవియుఁ గానరావు ఈ మంత్రిభాస్కరుఁడు రామాయణమును రచియించి యుండినయెడల, తిక్కన తన నిర్వచనోత్తరరామాయణమునం దా మాట నేల చెప్పియుండఁడు? ఇది యింకను విమర్శనీయ మయిన వివాదాంశము. ♦

[* 'మంత్రిభాస్కరుఁడు' అను శీర్షిక క్రింద నీవిషయము చర్చింపఁబడినది. మంత్రిభాస్కరునిఁబట్టియు 'భాస్కరరామాయణ' మను పేరు కలుగవచ్చును]

[♦ ఇందలి 'మంత్రిభాస్కరుఁడు, హుళక్కిభాస్కరుఁడు' అను శీర్షికలలోని విషయములను గమనించునది]

తిక్కన తాను రచియించిన నిర్వచనోత్తర రామాయణమునందు

గీ. 'సారకవితాభిరాము గుంటూరివిభుని
మంత్రిభాస్కరు మత్పితామహునిఁ దలఁచి
యైన మన్ననమెయి లోక మాదరించు
వేఱ నా కృతిగుణములు వేయునేల?'

అవి తన కావ్యము స్వగుణముచేతఁ గాకపోయినను తన తాత యైన మంత్రి భాస్కరునిసారకవిత్వమహిమచేత నయినను లోకాదరణమునకు పాత్ర మగునని చెప్పియున్నాఁడు మంత్రిభాస్కరుని వితరణాదులను గుఱించి కవులు పెక్కండ్రు పెక్కు పద్యములను జెప్పి యున్నారు. వితరణమును గూర్చి ప్రసిద్ధుఁ డయిన మంత్రిభాస్కరుఁడు రాయనభాస్కరుఁడు ఈ క్రింది చాటువు రామయామాత్యభాస్కరుని ప్రఖ్యాతిని జెప్పు నదియె యైనను మనోహరముగా నుండుటచే నిందుఁ జేర్పఁబడినది

మ. సరి బేసై రిపు డేల భాస్కరులు భాషానాథపుత్రా ', వసుం
ధరయం దొక్కఁడు మంత్రియయ్యె నినుకొండన్, రామయామాత్యభా
స్కరుఁడో, యౌ, నయినన్ సహస్రకరశాఖ ల్లే, వవే యున్న వే
తిరమై దానము చేయుచో రిపుల హేతి న్వ్రేయుచో వ్రాయుచోన్.'

రావిపాటి తిప్పరాజు.

ఈ కవిపూర్వులు లౌకికాధికారధూర్వహు లగుటయే కాక యీతనిది పండిత వంశ మనియు నిందువల్ల తేటపడుచున్నది. ఈయన తండ్రి యయిన కొమ్మన్న శివలీలావిలాస మను గ్రంథమును రచించినట్టు చెప్పుచున్నారు. శివలీలావిలాసమును రచియించిన కొమ్మన్న తిక్కనసోమయాజుల తండ్రి కాక శ్రీనాధునికాలములో రాజమహేంద్రవరమును పాలించుచుండిన వీర భద్రారెడ్డియొక్క తమ్ముఁడైన దొడ్డభూపతికిఁ దన పుస్తకము నంకిత మొనర్చిన నిశ్శంక కొమ్మనామాత్యుఁడని యిటీవల లభించిన యా పుస్తక మునుబట్టి తెలియుచున్నది. నెల్లూరికి రా జయిన మనుమనృపాలుని యాస్థానకవీశ్వరుఁడుగా నుండిన యీతఁడు కవితిక్కన యనియు, ఆ రాజు కడ మంత్రిగా నుండిన యీతని పెదతండ్రి పెద్దకుమారుఁడు కార్యతిక్కన

యనియు, సేనానాయకుఁడుగా నుండిన యాతనితమ్ముఁడు ఖడ్గతిక్కన యనియు, ప్రసిద్ధి చెందినట్టు చెప్పుదురుగాని పూర్వోదాహృతపద్యములను బట్టి తిక్కన లిరువురే యైనట్టు స్పష్టపడుచున్నది.

తిక్కనసోమయాజికొమారుఁడు కొమ్మన్న. తిక్కనసోమయాజి సూర్య వంశపురాజై నెల్లూరిమండలమున కధినాథుఁడుగా నుండిన మనుమసిద్ధికడ నాస్థానకవిగా నుండినను, ఆ రాజున కాశ్రితునివలె నుండక యాతనిచే సమానుఁడుగాఁ జూడఁబడి గౌరవింపఁబడుచుండెను. రాజునకును, కవికిని మామవరుస ఈ కవీంద్రుఁడు రచియించిన నిర్వచనోత్తరరామాయణము కృతి నందిన మనుమభూపాలుడు

క. 'ఏ నిన్ను మామ యనియెడు
దీనికిఁ దగ నిమ్ము భారతీకన్యక నా
కీ నర్హుఁడ వగు దనినను
భూనాయకుపలుకు చిత్తమున కింపగుడున్ '

'నిన్ను మామా! యని పిలుచుచున్నందునకై భారతీకన్యను నాకిమ్మని యడిగినట్లు చెప్పఁబడి యున్నది తిక్కన నిర్వచనోత్తరరామాయణము నందు నన్నపార్యుని పూర్వకవిని గా వర్ణింపలేదు, అనంతరమున రచి యించిన భారతమునం దైనను,

ఉ ఆదరణీయసారవివిధార్థగతిస్ఫురణంబు గల్గి య
ష్టాదశపర్వనిర్వహణసంభృతమై పెనుపొంది యుండు నం
దాది దొడంగి మూఁడు కృతు లాంధ్రకవిత్వవిశారదుండు వి
ద్యాదయితుండొనర్చె మహితాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్.

ఆంధ్రకవితావిశారదుం డైన నన్నయభట్టు మొదటి మూఁడు పర్వములను తెనిఁగించెనని చెప్పెనేకాని యాతని నాదికవినిగాఁ జెప్పి స్తుతింపలేదు. అందుచేతఁ దిక్కన నన్నయభట్టారకుని నూతనకవినిగాఁ బరిగణించినట్టు స్పష్టమగుచున్నది. ఇది యిట్లుండఁగా నిర్వచనోత్తరరామాయణమునందు

వ 'హరిహరపద్మగర్భులను నాదికవీంద్రుల నూత్నసత్కవీ
శ్వరులను భక్తిఁ గొల్చి మఱి వారికృపన్ గవితావిలాసవి
స్తరమహనీయుఁడైన నను సర్వగుణోత్తరమూర్తి మన్మభూ
వరుఁడు తగంగ రాఁబనిచి వారనిమన్నన నాదరించుచున్.'

అని యాదికవీంద్రులను, నూత్నకవీంద్రులను స్తుతించుటచేత నన్నయాదులకుఁ బూర్వమునందుఁ గూడ నాంధ్రకవీంద్రు లనేకు లున్నట్టు స్పష్టపడుచున్నది *

తిక్కన రచియించిన తెనుఁగుకావ్యములు రెండు, అందు మొదటిది నిర్వచనోత్తరరామాయణము ఈ గ్రంథము రచించునప్పటి కీతఁడు యజ్ఞము చేయలేదు. తిక్కన తెనుఁగుపుస్తకములవలెఁ గాక రఘువంశాది సంస్కృత కావ్యములవలె దీని నీ కవి నడుమ నడుమ వచనము లుంచక సర్వమును పద్యములుగానే రచించెను. ఈతఁడు రచించిన భారతమువలె నీ యుత్తర రామాయణ మంత రసవంతముగాను, ప్రౌఢముగాను లేకపోయినను, పద వాక్య సౌష్ఠవము కలిగి మొత్తముమీఁద సరసముగానే యున్నది. ఇది బాల్యమునందు రచియింపఁబడిన దగుటచే నిట్లుండి యుండును. ఈ గ్రంథమునందు పదకాఠిన్య మంతగా లేకపోయినను, బహుస్థలములయం దన్వయ కాఠిన్యము గలదు ఇందలి కథ సంస్కృతములో నున్నంత లేక మిక్కిలి సంగ్రహపఱుపఁబడినది శైలి పలుచోట్ల నారికేళపాక మనియే చెప్పవచ్చును. అందుచేతనే యీ గ్రంథము భారతమువలె సర్వత్ర వ్యాపింపకున్నది ఇతఁడు పది యాశ్వాసములగ్రంథమును వ్రాసినను పుస్తకమునుమాత్రము ముగింపలేదు. రామనిర్యాణకథను చెప్పుట కిష్టము లేక గ్రంథపూర్తి చేయలేదని పెద్దలు చెప్పుదురు రామనిర్యాణకథను జెప్పుటకు భీతిల్లి దానిని వదలిపెట్టినయెడల, తిక్కన భారతమునందు స్త్రీపర్వకథయు, కృష్ణనిర్యాణమును జెప్పుట కేల భయపడ లే దని యొకరు ప్రశ్న వేయుచున్నారు!, ప్రతిమరణకథకును భయపడి దానిని విడుచుచు

* ఈకవులు తెలుఁగుకవులని నిశ్చయింప నాధారములులేవు సంస్కృతకవులైన గావచ్చును, సంస్కృతికవులనుగూడ నాంధ్రకవులు స్తుతించుట పరిపాటి.

వచ్చినచో భారతమును రచింపకయే యుండి యుండవలెను. మరణమును జెప్పుట కిష్టము లేకుండుటయు భయపడుటయు కొందఱివిషయమునవే యుండును. ఏదియు లేకపోయినయెడల భారతమును రచించునంతటి దీర్ఘ కాలము జీవించియుండియు తిక్కన దాని నేల ముగించి యుండఁడు? తిక్కన సంపూర్ణముగానే రచించెననియు, తరువాత నా భాగ ముత్పన్న మయ్యెననియు నొకరు చెప్పుచున్నారు. ఈ యుత్పన్నకథ మనవారికి ప్రతివిషయమునందును చక్కఁగా తోడుపడుచున్నది. తరువాతఁ గొంత కాలమునకు మిగిలిన భాగము నేకాశ్వాసముగా రచియించిన జయంతి రామ భట్టు తిక్కన సోమయాజి మనుమరాజున కిచ్చినట్టుగా నరాంకితము చేయక తాను జేసిన కడపటి యాశ్వాసమును శ్రీ భద్రాద్రిరామున కంకితము చేసెను. తాను రచించిన యేకాదశాశ్వాసమున రామభట్టీక్రింది పద్యమును జెప్పి యున్నాఁడు.

ఉ. తిక్కనసోమయాజి మును తెల్గున నుత్తరకాండ చెప్పి యం
దొక్కటి చెప్పఁ డయ్యెఁ గడు నొద్దిక నే రచియింప వేడ్కచే
నిక్కము సంస్కృతంబు విని నెమ్మది భక్తిని నే రచించితిన్
జక్కని దేవళంబుతుద స్వర్ణఘటం బిడుపోల్కిఁ దోఁపఁగన్.'

నిర్వచనోత్తరరామాయణముయొక్క శైలిని గనఁబఱచుట కయి రెండు పద్యము లిందు క్రిందఁ బొందుపఱచుచున్నాను :

శా. మాలిం జంపిన మాల్యవంతుఁ డుదితామర్ష ప్రకర్షంబునం
గాలాగ్నిప్రతిమానుఁడై నిజభుజాగర్వంబుమై లీల ను
న్మీలజ్జ్వాలకరాళశక్తిఁ గొని మే మే దాఁకి వక్షస్థ్సలిన్
గీలించెన్ జలదంబుపై మెఱుఁగుమాడ్కిన్ శౌరికింజెన్నుగాన్.

ఆ. ౩.

చ. ఎఱుఁగవుగాక భోగముల కెల్లను నెచ్చెలి జవ్వనంబ యి
త్తఱి నుడి వోవకుండ నుచితంబుగ జక్కవదోయిఁబోని క్రి
క్కిఱిసిన చిన్ని చన్నుఁగవ యిం పెసలారఁగ నాదువక్ష మ
న్వాఱలు సరోవరంబున నవారణఁ గేళి యొనర్చు కోమలీ!'

ఆశ్వాసము ౫.

ఈ కవి రచించినరెండవగ్రంథము భారతశేషము అరణ్యపర్వమువఱకును నన్నయభట్టు తెనిఁగించి మృతి నొందఁగా తరువాత నీ మహాకవి యారణ్యపర్వశేషమును మాత్రము విడిచిపెట్టి విరాటపర్వము మొదలుకొని తక్కిన పదియేను పర్వములను తెనిఁగించెను. ఆరణ్యపర్వ మాంధ్రీకరించుట చేతనే నన్నయభట్టు మతిభ్రమణము కలిగి మృతి నొందె నని తలఁచుకొని తాను దానిని తెలిఁగించినచో తన గతియు నట్లే యగు నన్న భీతిచేత నితఁడు దానిని తెనిఁగింపఁ డయ్యెను. అందుచేత తెనుఁగుభారతము కొంత కాలము పూర్ణముగా లేక కొఱఁతపడి యుండెను. ఆ కాలమునందు వ్రాయఁబడిన తాళపత్రగ్రంథములు కొన్ని యిప్పటికిని వనపర్వశేషము లేకయే కానఁబడుచున్నవి. తిక్కన భయపడి యరణ్యపర్వశేషమును తెనిఁగింపక విడిచి పెట్టలే దనియు, ఆతనికాలమునాటికి నన్నయభట్టుచేత రచియింపఁబడి యారణ్యపర్వము పూర్ణముగా నుండుటచేతనే యతఁడు విరాటపర్వ మారంభించి చేసె ననియు, తరువాత నారణ్యపర్వశేషము శంభుదాసుని కాలమునాఁటి కుత్సన్నము కాఁగా దాని నతఁడు పూరించె ననియు బుద్ధిమంతు లొకరు వ్రాయుచున్నారు. ఈ యుత్సన్నసిద్ధాంత కథ యిప్పుడు ప్రతిపూర్వగ్రంథవిషయములోను మనవారిచేతిలో నమూల్యసాధన మయి నిలిచి తోడుపడుచున్నది. శంభుదాసుఁడు తిక్కనసోమయాజికి తరువాత నేఁబది సంవత్సరముల లోపలనే యుండినవాఁడు నన్నయభట్టే నిజముగా నారణ్యపర్వమును పూర్ణముగాఁ దెలిఁగించి యుండినచో నిన్నూఱు సంవత్సరములు తిక్కనకాలమువఱకు చెడక యుండి నిలిచిన యా భాగము తరువాత నేఁబది సంవత్సరములకు శంభుదాసునికాలమునకు దేశములోని యన్ని ప్రతులలో నొక్కసారిగా నశించుట సంభవించి యుండదు. నన్నయ దానిని చేయనే లే దనుటయే యుక్తియుక్త మయి విశ్వాసార్హమయిన పక్షము. తిక్కన తా నెంతటి పండితుఁ డయినను తన కాలపువిశ్వాసములను భయములను లేనివాఁ డగుట సాధారణముగా సంభవింపనేరదు ఈ కవిని బట్టిన భీతియే తరువాత నారణ్యపర్వశేషమును జేసిన యెఱ్ఱాప్రెగడకును పట్టి తన పేరిట గ్రంథరచన చేయక రాజనరేంద్రుని కంకితముగా నన్నయభట్టు

పేరు పెట్టియే దానిని రచించెను. అంతేకాక భారతమును చదువువారు సహి తము నేటి వఱకును ఆరణ్యపర్వములోని కొంతభాగము వదలియే మఱి గ్రంధపఠనము చేయుచున్నారు.

నన్నయభట్టు పోవునప్పటికిని పోయిన తరువాత రాజరాజనరేంద్రు డున్నప్పు డును తిక్కనసోమయాజి యున్నాఁ డని చెప్పెడు కధలు నమ్మఁదగినవి కాకపోయినను వినుటకు మాత్రము సొంపుగా నుండును. గనుక వానిలో నొక కధ నిందుఁ జెప్పుచున్నాను

తన కంకితముగా నాంధ్రీకరింప నారంభించిన భారతము పరిసమాప్తి నొందింపకయే నన్నయభట్టు మృతి నొందినందుకు చింతాక్రాంతుఁడయి రాజనరేంద్రుఁడు దానిని తా నెట్లయిన సాంతము చేయింపవలె నని బహు ప్రయత్నములు చేసి బహుపండితులను రావించి చూపఁగా వా రెవ్వరును తన్మహాకార్యమునకు సమర్థులు కారైరఁట ! నిర్వచనోత్తరరామాయణమును జేసి ప్రసిద్ధి నొందిన యొక యాంధ్రకవీంద్రుఁడు నెల్లూరియం దుండె ననియు, అతనివలన గ్రంధపరిసమాప్తికాఁగలదనియు. విని పండితుల యనుమతిమీఁద సభాపర్వములోని

మ. 'మదమాతంగతురంగకాంచనలసన్మాణిక్యగాణిక్యసం
　పద లోలిం గొని తెచ్చి యిచ్చి ముద మొప్పం గాంచి సేవించి ర
　య్యుదయాస్తాచలసేతుసీతనగమధ్యోర్వీపతు ల్వంతతా
　భ్యుదయున్ ధర్మజుఁ దత్ప్రభాసితు జగత్పూర్ణప్రతాపోదయున్.'

అను పద్యమును తాటాకులమీఁద వ్రతులు వ్రాసి దానితో సమానమయిన పద్యమును వ్రాయుఁడని తక్కిన రాజాస్థానములయందలి పండితులకును, సిద్ధిరాజుసభయం దున్న తిక్కనకునుగూడఁ బంపినట్టును, మిగిలినవా రందఱును తమ తమకు తోఁచిన పద్యములను వ్రాసి పంపగాఁ తిక్కన మాత్ర మట్లు చేయక తా నా పద్యమునే మరల మఱియొక తాటాకుమీఁద వ్రాసి దానికి వర్ణమువేసి పంపినట్టును, రాజరాజనరేంద్రుఁడు మిగిలిన కవుల పద్యముల నన్నిఁటిని జదివి వానిలో నేదియు నన్నయపద్యముతో సరి

రాకపోయినందున వానిని నిరాకరించి తాను రచింపఁబోయెడు గ్రంథము నన్నయభట్టారకునికవిత్వమువలెనే యుండినను తన దంతకంటె మెఱుఁగుగా నుండునని సూచించుట కయి తిక్కన యట్లు చేసెనని గ్రహించి యాతనిని పిలిపించినట్లును, గ్రంథరచనకుఁ బూర్వమునం దాతనిచేత గౌతమీతీరమున యజ్ఞము చేయించి భారతము సంపూర్ణము చేయించినట్లును చెప్పుదురు. మఱికొంద ఱట్లు పంపిన పద్య మాదిపర్వములోని

ఉ. 'నిండుమనంబు నవ్యనవనీతసమానము, పల్కు దారుణా
ఖండలశస్త్రతుల్యము, జగన్నుత! విప్రులయందు; నిక్క మీ
రెండును రాజులందు విపరీతము, గావున విప్రుఁ డోపు, నో
పం డతిశాంతుఁడయ్యు నరపాలుఁడు శాపముఁ గ్రమ్మఱింపఁగన్'

అననది యనియు, రాజనరేంద్రుఁడు తిక్కనయభిప్రాయమును దెలిసికొన్నమీఁదట తనవద్ద కా కవీంద్రునిఁ బంపుమని సిద్ధిరాజునకు విజ్ఞాపనపత్రమును పంపగాఁ నతఁ డా ప్రకారము చేసెద నని వాగ్దానము చేసెననియు, పిమ్మటఁ దిక్కనను రప్పించి రాజనరేంద్రునికిఁ దాను జేసిన వాగ్దానమును జెప్పి నెల్లూరినుండి రాజమహేంద్రవరమునకుఁ బోవఁ బ్రార్థించె ననియు, ఆ రా జెన్నివిధముల జెప్పినను వినక తిక్కన రాజమహేంద్రవరము పో నని మూర్ఖపుపట్టుపట్టగా తనమాటకు భంగము వచ్చునని కోపించి రా జాతనితో నీవు నా యాజ్ఞప్రకారము పోని పక్షమున నీ మీసములు గొఱిగించి వాద్యములతో నగరివీధులవెంబడిని ద్రిప్పి యూరిబయల వేసిన తాటాకులపాకలోఁ బెట్టి నీచేత మాంసము తినిపించెద నని బెదరించెననియు, ఆగ్రహావేశముచేతఁ బలికిన యా రాజుతర్జనభర్జనములకు భయపడక తిక్కన తనపట్టును వదలక స్థైర్యముతో నుండఁగా రాజనరేంద్రుఁ డా సంగతి తెలిసికొని యెట్లయిన భారతమును తెనిఁగించినఁ జాలునని నెల్లూరిరాజయిన మనుమసిద్ధికి వర్తమానము పంపెననియు, తరువాత సిద్ధిరాజు తిక్కనను బతిమాలుకొని తాఁ జేసిన ప్రతిజ్ఞ బొంకు గాకుండునట్లుగా, యజ్ఞదీక్షకు ముందు విధివిహిత మయిన క్షురకర్మ

చేయించి తిక్కనను వాద్యములతో నూరేగించి యూరివెలుపట వేయించిన యజ్ఞశాలయందు ప్రవేశపెట్టి యాతనిచేతను యజ్ఞముచేయించి పురోడాశము తినిపించె ననియు, అట్లు చేసినను రాజుమీఁది కోపము పూర్ణముగా తీఱక తిక్కన తన భారతము నా రాజునకుఁ గృతియియ్యక నెల్లూరియందున్న హరిహరనాథదేవున కంకితము చేసెననియు చెప్పుదురు. హరిహరనాథుని గుడి నెల్లూరియం దిప్పుడు శిథిలమయిపోయినదఁట! పయి కథ యెట్టిదయినను, తిక్కన నిర్వచనోత్తరరామాయణము చేయునప్పటికి యజ్ఞము చేయకుండుటయు, భారతమును రచించునప్పటికి యజ్ఞముచేసి యుండుటయు మాత్రము సత్యము. దీని సత్యమును "బుధారాధన విధేయ తిక్కననామధేయప్రణీతంబైన" యను నిర్వచనోత్తరరామాయణమునందలి గద్యమును బట్టియు "బుధారాధనవిరాజి తిక్కనసోమయాజి ప్రణీతం బయిన" యను భారతమునందలి గద్యమునుబట్టియు స్థాపింపవచ్చును. మిగిలిన యీ కథాంశమునం దేమాత్రము సత్యమున్నను తిక్కనసోమయాజి విరాటపర్వము యొక్క పీఠికయందే వ్రాసియుండును. ఆ పీఠికయందు రాజనరేంద్రుని పేరైన నెత్తఁబడి యుండక పోవుటయే తిక్కన రాజనరేంద్రుని కాలము వాఁడు కాఁడనుటను సిద్ధాంతీకరించుచున్నది

తిక్కనసోమయాజి యీ భారతమును జెప్పునప్పుడు దీనిని వ్రాయుటకయి నిర్ణయింపఁబడినవాఁడు * కుమ్మరగురునాథుఁడని చెప్పుదురు. ఆతనికి చెప్పిన

* ఈ కుమ్మర గురునాథుఁడు తిక్కనసోమయాజితండ్రియైన కొమ్మనామాత్యునకే పుట్టెననియు, కొమ్మనామాత్యుఁడు గర్భాధానార్థము మంచిముహూర్తము పెట్టుకొని తన యత్తవారింటికిఁ బోవుచుండఁగా నాకస్మికముగా పెన్నపొంగి నదిదాటుటకు శక్యముగాక తెడుగుపాడను గ్రామసమీపమున నిలిచిపోవలసి వచ్చెననియు, అప్పు డా గ్రామమునందున్న కుంభకారుఁ డొకఁ డాతని ప్రార్థించి తన యింటికిఁ గొనిపోయి యాదరించి యా సుముహూర్తమునందు సంపూర్ణయౌవనవతియు ఋతుస్నాతయు నయి యున్న తన కొమార్తెకు పుత్రదానము చేయవలెనని వేఁడుకొనెననియు, అతఁడు వాని ప్రార్థనను త్రోచివేయలేక యంగీకరించి యా రాత్రి యా కులాలయువతితో సంభోగింపఁగా గురునాథుఁ డను పుత్రుడు కలిగెననియు, ఒక కథ చెప్పుదురు. అది యెంతవఱకు నమ్మఁదగియుండునో దీనిని జదివెడువారే నిశ్చయించుకోవలెను.

దానిని మరల నడుగక వ్రాయఁగల శక్తి యున్నదట. దీనినిబట్టి చూడఁగాఁ బూర్వకాలమునందు బ్రాహ్మణేతరులలో సహితము చక్కఁగా చదువుకొన్నవా రుండియున్నట్టు విదిత మగుచున్నది ఈ భారతమును రచియించునప్పుడు తిక్కనసోమయాజి తడవుకొనకుండ కవిత్వమును జెప్పెదననియు, తా నొక్కసారి చెప్పిన దానిని మరలఁ జెప్పననియు చెప్పినదాని నెప్పుడును మరల మార్చుకొనననియు ప్రతిజ్ఞ చేసినట్లును, చెప్పిన మాటను మరల నడుగక గురునాధుఁడు వ్రాయుచుండఁగా శల్య పర్వములో ప్రథమాశ్వాసము కడపట సహదేవుఁడు శకునిని చంపినతరువాత దుర్యోధనుఁడు తొలఁగి పోయెనని ధృతరాష్ట్రునితో చెప్పు భాగమున

క. పలపలనిమూఁకలోఁ గా
ల్నిలువక గుఱ్ఱంబు డిగ్గి నీ కొడుకు గదా
కలితభుజుఁడగుచు నొక్కఁడుఁ
దొలఁగి చనియె.'

అన్నంతవఱకు పద్యమును చెప్పి తరువాత నేమియు తోఁచక తిక్కన "యేమిచెప్పుదు గ్గురునాథా" యని కుమ్మర గురునాధు నడిగినట్లును, అతఁ డది తన్నడిగిన ప్రశ్నగా భావింపక పద్యముతోఁ జేర్చి

"తొలఁగి చనియె నేమిచెప్పుదు గ్గురునాథా !"

యని వ్రాసినట్లును, అప్పుడు తిక్కనసోమయాజి తన ప్రతిజ్ఞకు భంగము వచ్చెనని చింతించుచుండఁగా "నేమి చెప్పుదు గ్గురునాథా" యని కవి లేఖకునిగూర్చి యుద్దేశించినది "కురునాథా !" యని ధృతరాష్ట్రున కన్వయించి యా ప్రశ్నయే పద్యపూరణమున కనుకూలించెనని గురునాధుఁ డాతని నూరార్చినట్లును, ఒక కథను జెప్పుదురు. శ్రీమహాభారతము నాంధ్రీకరించిన యీ మహాకవి కీ చిఱు పద్యములోని యల్పభాగము తోఁచకపోయె నని సాధించుట కీ కథ పనికిరాదు గాని తిక్కనకవి యాశుధారగా కవిత్వము చెప్పఁగలవాఁడని స్థాపించుటకయి కల్పింపఁబడెనని మాత్ర మూహింపఁదగి యున్నది.

ఈ తెలుఁగుభారతము కష్టపడి సావకాశముగా నాలోచించి వ్రాయఁగాఁజేయఁబడిన గ్రంథమే కాని జను లనుకొనునట్లు మూలగ్రంథమును ముట్టక తెరలోఁ గూర్చుండి నోటికి వచ్చినట్లెల్లను చేయఁబడినది కాదు. తిక్కన సోమయాజి పూర్వోత్తరసందర్భములు చెడకుండుటకయి తాను వెనుక రచియించినదానిని మరల మరలఁ జూచుకొనుచు, సమానవర్ణనలు గలిగిన భాగములను రచియింప వలసినచో పూర్వము వ్రాసినదానిని జూచి తదనుగుణముగాను కొన్నిచోట్ల పూర్వము రచించిన పద్యములనే కొంత మార్చియు, మార్పకయు మరల వేసికొనుచు వచ్చెను. ఈ ప్రకారముగాఁ జూచుకొనుచు వచ్చినది భారతములోని యుత్తరపర్వములను రచించునప్పుడు పూర్వపర్వములను మాత్రమే కాక భారతమును రచించునప్పుడు తత్పూర్వరచితమైన నిర్వచనోత్తర రామాయణమును గూడఁ జూచుచు వచ్చెను. ఇట్లు వేసినందున కిందుఁ గొన్నియుదాహరణము లిచ్చెదను.

౧. శ్రీకృష్ణుని కౌరవులయొద్దకుఁ బంపునప్పుడు భీముఁడు చెప్పిన యుద్యోగ పర్వములోని

గీ. "అన్నదమ్ములమై యుండి యిచట మనకు
నోరులు తలయెత్తి చూడ నొండొరులతోడఁ
బెనఁగనేటికి? ఏనేల పెద్దవారి
బుద్ధి విని పంచి కుడుచుట పోలుఁ గాక."

అను పద్యమే పుత్రమరణదుఃఖార్తయైన గాంధారికి కోపశాంతి కలుగు నట్లుగా భీముఁడు చెప్పినట్లు స్త్రీపర్వమున వేయఁబడినది.

౨. విరాటుఁడు తన కూఁతురైన యుత్తరను నాట్యవిద్యాభ్యాసార్థము బృహన్నల కప్పగించుటకు రప్పించునప్పు డామెను వర్ణించిన విరాట పర్వములోని

సీ. అల్లఁదిఁగలను సనుపు మైదాసఁ జూచు
నడపుకాంతికి వింత తోడవు గాఁగ
పెడపెడ సింగారి వింతమై మేర్పడఁ
దారని వశలలో నారు నిగుడ
నిట్టలు ద్రోమచు నెలవులు కలమేర
కెల్లను జిగియెక్కు యేర్పడంగఁ
దెలుపును గప్పును వెలయంగ మెఱుఁగెక్కు
తారకంబులఁ గల్కితనము తొడరఁ

జరణములును నడుముఁ జన్నులుఁ గన్నులు
జవ్వనంబు చెన్ను నివ్వటిల్లు
"చునికిఁ దెలుపుచుండ నుత్తర చనుదెంచె
నలరు మరునిపువ్వుటమ్ముఁ బోలె."

అను పద్యమే సృంజయరాజపుత్రిని నారదుఁడు మోహించిన కథా సందర్భమున గీతపద్యమునందలి మూఁడు నాల్గు చరణములుమాత్రము "ఉనికిఁ దెల్ప సృంజయునిపుత్రి మెలఁగు విధంబు నారదునకుఁ దగులొనర్చె" నని మార్పఁబడి శాంతిపర్వమున వేయఁబడినది.

౩. దేవదానవయుద్ధసంబంధమున నుత్తరరామాయణములో నున్న

మ. పటువేగంబున శాతభల్లవయసంపాతంబున న్మింట మి
క్కుటమై పర్వ ధగద్ధగీయ మగుచుం గోపంబు రూపంబులై
వటులక్రీడఁ జరించున ట్లిరువురున్ శౌర్యోన్నతిం బోరి రు
త్కటదర్పోద్ధతులై పరిస్ఫురజయాకాంక్షాప్రచండంబుగన్.'

అను పద్యమే "పర్వ ధగద్ధగీయమగుచున్" అని యున్న పదములు "మంట ధగద్ధగద్ధగ యనన్" అనియు, "పరిస్ఫురజయాకాంక్షాప్రచండంబుగన్" అనుపదము "పరిస్ఫురజయాకాంక్షం బ్రచండంబుగన్" అనియు మార్పఁబడి, వేయఁబడి యున్నది.

౪. నిర్వచనోత్తరరామాయణములో రావణకుబేరయుద్ధవర్ణనమునందున్న

శా. శ్రావ్యంబై చెలఁగన్ గభీరమధురజ్యానాద ముద్దామమై
రవ్యాపారనిరూఢతం బ్రతిశరారంభంబు మర్దించుచున్
సవ్యప్రౌఢి దృఢాపసవ్యతిగ నాశ్చర్యంబుగా నేయుచున్
దివ్యాస్త్రంబులఁ బోరి రిద్దఱును సాదృశ్యం బదృశ్యంబుగన్.'

అను పద్యము మార్పేమియు లేకయే విరాటపర్వమున నుత్తరగోగ్రహ ణమునందు ద్రోణాచార్యయుద్ధవర్ణనములో వేయఁబడెను.

తిక్కన మొదట రచించిన పర్వములను జూచి వానియందు విశేషవృత్త ములు లేకపోఁగా పండితు లాతఁడు సామాన్యవృత్తములతో కాలము గడుపుచున్నాఁడే కాని యపూర్వవృత్తరచనాకుశలుఁడు కాడని యాక్షే పించినమీఁదట నతఁడు త్రిపర్వమునందు బహువిధ వృత్తములను రచియించె నన్న వాడుక కూడ తిక్కనసోమయాజులు తాను రచియించుచు వచ్చిన గ్రంథమును పండితులకుఁ జూపుచు వచ్చెననుటను స్థాపించుచున్నది. తిక్కనసోమయాజి రచియించిన పదునేను పర్వములలోను నలువది యా ఱాశ్వాసములకంటె నెక్కువగ్రంథము లేదు. ఒక్కొక్క యాశ్వాసమునకు నాలుగువందల యేఁబదేసి పద్యముల చొప్పున లెక్క చూచినను శ్రీమహా భారతములో తిక్కనసోమయాజి రచియించిన భాగ మంతలోను నించు మించుగా నిరువదివేల పద్యములకంటె నధిక ముండవు. దినమునకు పది పద్యముల చొప్పున రచియించినను, ఇంత గ్రంథము నయిదాఱు సంవత్స రములలో రచియింపవచ్చును కాఁబట్టి యిట్టిగ్రంథరచన యొక యసాధ్య ములోనిది కాదు. కాని తిక్కనసోమయాజిశైలితో సమానముగా వ్రాయుట మాత్ర మెవ్వరికిని సాధ్యము కాదు. తెలుఁగుభాషయందెన్నో గ్రంథము లున్నను, తిక్కనసోమయాజికవిత్వముతో సమానముగాఁగాని దానిని మించునట్లుగాఁగాని కవిత్వము చెప్పఁగలిగినవారు నేఁటివఱకొక్కరును కనఁబడలేదు; తిక్కనకవిత్వము ద్రాక్షాపాకమయి మిక్కిలి రసవంతముగా నుండును; ఈతని కవిత్వమునందు పాదపూరణమునకయి తెచ్చిపెట్టుకొనెడు

వ్యర్థపదము లంతగా నుండవు; పదములకూర్పుమాత్రమేకాక యర్థసందర్భమును మిక్కిలి పొందికగా నుండును. ఏ విషయము చెప్పినను యుక్తియుక్తముగాను, ప్రౌఢముగాను నుండును; ఎక్కడ నే విశేషణము లుంచి యే రీతి నే పదములు ప్రయోగించి రసము పుట్టింపవలయునో యీకవికిఁ దెలిసినట్లు మఱి యొకరికి తెలియదు. ఈయన కవిత్వము లోకోక్తులతోఁ గూడి జాతీయముగా నుండును; ఈయన పదలాలిత్యమును, యుక్తిబాహుళ్యమును, అర్థగౌరవమును, రచనాచమత్కృతియు, శయ్యావిశేషమును, సందర్భశుద్ధియు, కల్పనాకౌశలమును, అన్యులకు రావు. ఈ కవిశిఖామణి యొక్క కవిత్వమునం దొకవంతు సంస్కృతపదములును, రెండువంతులు తెలుఁగు పదములు నుండును ఇటీవలి యాంధ్రకవులు కొందఱు తాము రచియించెడివి తెలుఁగు పుస్తకము లన్నమాట మఱచియో తమ పాండిత్యమును కనఁబఱుపవలెననియో తమ గ్రంథములను సాంస్కృతికదీర్ఘ సమాసములతోను, కఠినములయిన సంస్కృతపదములతోను నింపివేసిరి నన్నయభట్టువలెనే యీ కవియుఁ దన గ్రంథమును మూలమునకు సరిగాఁ దెనిఁగింపలేదు విరాటపర్వమునందుమాత్రము కథ తగ్గింపక కొంత పెంచినను, తక్కిన పర్వములయందు కథను మిక్కిలి సంగ్రహపఱిచెను. ఉద్యోగపర్వమునందలి సనత్కుమారోపదేశమును మూలములో పది పండ్రెండు పత్రము లున్నదానిని తెనుఁగున రెండు మూడు పద్యములతో సరిపెట్టెను; భగవద్గీతలు, ఉత్తరగీతలు, మొదలయిన వానిని తెలిఁగింపనే లేదు. భగవద్గీతలు తెనిఁగింపలేదనుట సరిగాదనియు, కొన్ని పద్యములలో దానిని సంగ్రహపఱిచెననియు, విమర్శకు లొకరు వ్రాయుచున్నారు. పదునెనిమిదధ్యాయముల మహాగ్రంథములో

శ్లో॥ 'ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః,
మామకాః పాండవాశ్చైవ కిమకుర్వత సంజయ!'

అను ప్రథమశ్లోకమును

క. 'మానుగ ధర్మక్షేత్రం
బైన కురుక్షేత్రమున మహాహావమునకుఁ
బూని మనబలముఁ బాండవ
సేనయు నిటు వన్ని యేమి చేసెం జెపుమా?'

అనియు,

శ్లో. 'యత్రయోగేశ్వరః కృష్ణో యత్రపార్థో ధనుర్ధరః।
తత్రశ్రీర్విజయో భూతి ర్ధ్రువా నీతి ర్మతిర్మమ॥'

అను నంత్యశ్లోకమును

గీ. 'అధిప యోగేశ్వరేశ్వరుండైన కృష్ణుఁ
డును ధనుర్ధరవర్యుఁ డర్జునుఁడు నెపట
నిలిచి రచ్చట విజయంబు నీతి సిరియు
భూతి నిత్యంబు లగు నిది నాతలంపు'

అనియు, తెలిఁగించి నడుమ నాలుగయిదు పద్యములు వేయుట గ్రంథమును భాషాంతరీకరించుట కానేరదు ఇది గుహ్యమైన యోగశాస్త్ర మవియో యుద్ధమధ్యమున శత్రువు లెదుటనుండఁగా పదునెనిమిది యధ్యాయములు గల మహాగ్రంథమును గృష్ణుఁ డర్జుననకుఁ జెప్పెననుట విశ్వాసయోగ్యముగా నుండదని భావించియో, తిక్కన భగవద్గీతలను దెలిఁగింపఁడయ్యెను.

ఈయన సంస్కృతమును తెలిఁగించిన రీతిని దెలుపుటకయి మూలగ్రంథములోని కొన్ని శ్లోకములను వానియర్థమును దెలుపు పద్యములను కొన్నిటిని క్రింద వివరించుచున్నాను—

విరాటపర్వము శ్లోకము

శ్లో. ఆలోకయసి కిం వృక్షం సూద! దారుకృతేన వై,
యది తే దారుభిః కృత్యం బహిర్వృక్షాన్నిగృహ్యతామ్.

పద్యము

మ. వలలుం డెక్కడఁ జాచె? నొండెడ ననేవ్యక్ష్మజముల్ పుట్టవే?
ఫలితంబై వరశాఖ లొప్పఁగ ననల్పప్రీతి సంధించుచున్
విలసచ్ఛాయ నుపాశ్రితప్రతతికి న్విశ్రాంతిఁ గావింపఁగాఁ
గల యీ భూజము వంటకట్టియలకై ఖండింపఁగా నేటికిన్?

శ్లోకములు

శ్లో. సా సభాద్వార మాసాద్య రుదతీ మత్స్య మబ్రవీన్.
అవేక్షమాణా సుశ్రోణీ పతీం స్తాన్ దీనచేతసః.
ఆకార మభిరక్షంతీ ప్రతిజ్ఞాం ధర్మసంహితాం.
దహ్యమానేన రౌద్రేణ చక్షుషా ద్రుపదాత్మజా

సీ. ఏలఁదీగఁ గప్పిన లలితపరాగంబు
క్రియ మేన మేదినీరేణు వొప్ప
చంపకంబున నవసౌరభం బెసఁగెడు
కరణి నాసిక వేఁడిగాడ్పు నిగుడ
తోయజదళములతుది నుంచు దొరిఁగెడు
గతిఁ గనుఁగవ నశ్రుకణము లురుల
నిందుబింబముమీఁది కందువందంబునఁ
గురులు నెమ్మొగమున నెరసియుండ

సర్వజనవంద్య యైన పాంచాలి సింహ
బలునిచే నివ్విధంబున భంగపాటు
తనకు వచ్చిన నెంతయు దైన్య మొంది
యవ్విరాటుని సభఁ జేర నరిగి నిలిచి.

ఉ. పంబిన కోపము న్సమయభంగభయంబును నగ్గలించి యు
ల్లంబు పెనంగొనంగఁ బతులం దగు సభ్యులఁ జూచుమాడ్కి రూ
క్షంబగు చూడ్కి నాద్రుపదుకన్నియ చూచి సభాజనప్రతా
నంబును మత్స్యనాథుఁడు వినంగ నెలుంగు చలింప నిట్లనున్.'

ఈ శ్లోకములను పద్యములను జూచువారికి నన్నయపద్యముయొక్క దీర్ఘ పాదములయందలి వర్ణనప్రౌఢిగా గన్పించుటయేకాక తక్కిన భాగ మును గూడ కవి యెట్లు పెంచెనో విశదమగును

శ్లోకము

శ్లో. తాం వేళాం రత్ననాగారం పాంచాలీసంగమాశయా,
మన్యమాన స్స్వసంకేత మగారం ప్రవివేశ తతః.

పద్యము

శా. సింగం బున్న గుహానికేతమునకున్ క్రోధంబున న్వచ్చు మా
తంగంబుం బురుడించుచున్ బవనపుత్రస్వీకృతంబైన యా
రంగాగారము చేర వచ్చి మదిలో రాగంబు ఘూర్ణిల్లి విం
తిం గాముం డిటఁ దేఁడె యంతకని యుద్వృత్తాంగజోన్మాదుఁడై.

ఇఁక నీ కవియొక్క కవిత్వశైలిని గనఁబరచెడి యైదారు పద్యములు మాత్రము వ్రాసి "కవిబ్రహ్మ" యని మహాకవులచేఁ గొనియాడఁబడిన యీతని చరిత్రము నింతటితో ముగించెదను —

ఉ. 'అక్కట మోసపోయి యడియాసలఁ జావకయున్నదాన ము
న్నెక్కడనే దురంతదురితోత్కటబాధలఁ బెట్టి యున్న నా
కెక్కడి దుఃఖశాంతి ? గరమే యిట యెమ్మెయిఁ గల్గనేర్చు ? మీ
ముక్కున నూర్పు గల్గ నొక మూర్ఖుచేఁ బడి న్సభాస్థలిన్.

విరాట. ఆ. ౩

శా సింగం బాఁకటిలో గుహాంతరమునం జేట్పాటుమైనుండి మా
తంగస్ఫూర్జితయూథదర్శనసముద్యత్క్రోధమై వచ్చు నో
జం గాంతారనివాసఖిన్నమతి నస్మత్పుణ్యమై వీఁడె వ
చ్చెం గుంతీసుతమధ్యముండు సమరస్థేమాభిరామాకృతిన్.

విరాట. ఆ. ౪

క. కాలుఁడు ప్రేరేఁపఁగ నిటు
ప్రేలిన యంతటనె నిన్నుఁ బెద్దఁగఁ దలఁపన్

బోలునె మాకును ? నుడుఁగుము
చాలుదు వీ వెల్ల పసులు సాధింపంగన్. ఉ ౨

శా. ఏమీ! పార్థుఁడు నీవు దండిమగలై యీ వచ్చుకౌరవ్య సం
గ్రామక్షోభము బాహుదర్పమునఁ దీర్పం బెద్ద మిట్టెక్కి మి
మ్మే మెల్ల న్వెఱఁగంది చూచెదముగా కీ సారికిం బోయిరా
భీముం డిత్తఱి రిత్తమాటలకుఁ గోపింపండుసూ పెంపఱన్.
ఉద్యో. ఆ. ౩

ఉ. ఏమిర కర్ణ! భీము నటు లేటికిఁ దిట్టి తతండు దోల సి
గ్గేమియులేక పాఱునెడ నెవ్వరు తిట్టిరి నిన్ను, గెల్పు సం
గ్రామములోనఁ దప్పిదము గల్గినయంతనె యింత గర్వ మే
లా ? మును నిన్నెఱుంగమె ? చలంబున సాత్యకి యిప్డు గెల్వఁడే ?
ద్రోణ. ౫

గీ. అంధులకు నూఁతకోలగా నకట! యొకని
నైన నిలుపక నూర్వుర నదయవృత్తి
మ్రింగి తం దెవ్వఁడేనియు మీకు నెగ్గు
లాచరింపనివాఁడు లేఁడయ్యె నయ్య ?—స్త్రీప. ఆ. ౧

ఈ పయిని జెప్పిన రెండు కావ్యములనుగాక యీకవి కవివాగ్బంధన మనెడి లక్షణగ్రంథము నొకదానిని గూడ రచియించెను. గాని దానియందు విశేషాంశము లేవియు లేవు. అందలి కడపటిపద్యము నిం దుదాహరించుచున్నాను :

కం. 'తనరం గవివాగ్బంధన
మను ఛందం బనని వెలయ హర్షముతోఁ ది
క్కన సోమయాజి చెప్పెను
జను లెల్ల నుతింప బుధుల సమ్మతిగాఁగన్—కవివాగ్బంధనము. *

[* కవివాగ్బంధనమునకు 'కవిసార్వభౌమఛందస్సు' అను నామాంతరము కలదఁట! ఇది తిక్కన కృతి కాదని విమర్శకుల యాశయము. ఇం దిరువదియేడు యతులు చెప్పఁబడినందున, ఇది నవీనకృతి కావలెను. కవిసార్వభౌముని పేరిటఁ బరఁగుటయు నియ్యది కవిబ్రహ్మచే రచింపఁబడలేదనుటను వ్యక్తము చేయుచున్నది.]

ఇతఁడు కృష్ణశతక మొకటి చెప్పె నని పేర్కొనఁగ కవి యీ పద్యము నుదాహరించుచున్నాఁడు.

మ. 'అరయన్ శంతనపుత్రుపై విదురుపై నక్రూరుపైఁ గుబ్జపై
నరుపై ద్రౌపదిపైఁ గుచేలునిపయిన్ నందవ్రజశ్రేణిపైఁ
బరఁగంగల్గు భవత్కృపారసము నాపైఁ గొంత రానిమ్ము నీ
చరణాబ్జంబులు నమ్మినాను జగదీశా కృష్ణ భక్తప్రియా!' ♦

తిక్కనసోమయాజి "విజయసేన" మను గ్రంథమును గూడ రచించెనని కొందఱు వ్రాయుచున్నారు. నే నా గ్రంథమును జూడకపోవుటచేత తిక్కనయే దానిని రచించెనో, తిక్కనయే గ్రంథకర్త యైనచో నతఁ డే తిక్కనయో, నే నిప్పుడు చెప్పఁజాలను. "విజయసేన" మను పూర్వ గ్రంథ మొకటి యున్నది. దానినుండి యప్పకవి యీ క్రింది పద్యము నుదాహరించియున్నాఁడు.

ఉ. 'వల్లభుఁ డేగు దుర్లభుఁడు వానిదెసం దగులాడి యిమ్మెయిన్
దల్లడ మందెదేల యుచితస్థితికి న్ననుఁ దావఁజూచినన్
దల్లియు బంధులోకమును దండ్రియు సేమనువా రెఱింగిరే
నుల్లమ! యిట్టు నీకుఁ దగునో తగదో పరికించి చూడుమా!'

చిలుకూరి వీరభద్రరావుగారు ఆంధ్రులచరిత్రమునం దీ క్రింది పద్యముల నుదాహరించియున్నారు

సీ. 'ఘనసార కస్తూరికాగంధముల నవ్య
గంధబంధంబులు గలపి కలిపి

♦ ['కృష్ణ! భక్తప్రియా!' అను మకుటముతో శతకమున్నట్లు కానరాదని 'ఆంధ్రకవితరంగిణి' (ద్వితీయ సంపుటము-పుట 185) లోఁ గలదు. 'కృష్ణా! దేవకీనందనా!' అను మకుటముతో మాత్రము వెన్నెలకంటి జన్నయ కృతమగు శతకము కానవచ్చుచున్నది అది 'దేవకీనందన శతకము' గా ప్రసిద్ధము.

కుసుమితవల్లికాలసితపీఘులఁ ద్రొప్పి
గని సరోగృహముల మునిఁగి మునిఁగి
సకుధికాహార్యాంగ సంగీతముం తోఁ
కన్నెతీగల కౌట కఱపి కఱపి
కుముద కుట్మలకుటీ కోరకంబులు దూఱి
యలిదంపతుల నిద్రఁ దెలిపి దెలిపి
యనుదినమ్ము నప్పురాంతికమ్మున గట్టు
వాలు వోలె విప్రవరుఁడువోలె
నట్టువోలెఁ దాను నచ్చినచెలి వోలె
మలయుచుండు మందమారుతంబు.'

సీ. మదనవశీకారమంత్రదేవత దృష్టి
గోచరమూర్తి గైకొనియెనొక్కొ
సితకరబింబనిస్రుతసుధాధార ని
తంబినీరూపంబు దాల్చెనొక్కొ
విధికామినీ శ్రేష్ఠవిజ్ఞానపరసీమ
విధి గండరింపంగ వెలసెనొక్కొ
శృంగారసవరసశ్రీవిలాసోన్నతి
సుందరాకారంబు నొందెనొక్కొ

కాక యొక వధూటికడుపునఁ బుట్టిన
భామ కేల నిట్టిరామణీయ
కంబు గలుగు ననుచుఁ గన్నియపై మహీ
పాలసుతుఁడు దృష్టి పఱపె నర్థి.

ఉ. పల్లవపుష్పసంపదలఁ బంచి వసంతుఁడు కాపురాకకై
యెల్లవనంబు సంకటము లేదఁగఁ దా రొడికంబు మీఱ న
ట్లల్లన క్రోలి క్రోలి మలయానిలుఁ డందుఁ బురాణపత్రముల్
దుల్లఁగఁజేసె నక్కియఁ బటుత్వము కాముఁడు పిచ్చలింపఁగన్.'

పయివానిలో "మదనవశీకారమంత్రదేవత" యను సీసపద్యమును కుమార సంభవటిప్పణములో విజయసేనము ద్వితీయాశ్వాసములోనిదని మానవిల్లి రామకృష్ణకవిగా రుదాహరించి యున్నారు *

నన్నయభట్టారకుఁడును తిక్కనసోమయాజియు నాంధ్రకవులలోఁ బ్రామాణికాగ్రగణ్యులే యయినను మనము వారి పుస్తకములోని సామాన్యప్రయోగములను మాత్రమే యనుసరింపవలయును గాని యతులకొఱకును ప్రాసములకొఱకును వారు వేసికొనవలసివచ్చిన యసామాన్యప్రయోగములను మన మనుసరించుట యుచితము కాదని నేను దలఁచుచున్నాను ఎట్లన నన్నయభట్టు సామాన్యముగా నందఱనియే ప్రయోగించుచు వచ్చినను నొకటి రెండు స్థలములయందు యతిస్థలమున

గీ. గురులలోనఁ బరమగురువు తల్లియ యట్టి
తల్లివచనమును విధాతకృతియు
నన్యథాకరింప నలవియే యనిన నం
దొఱకు నిట్టు లనియె ద్రుపదవిభుఁడు.

అందొ అని వాడి యున్నాఁడు. ఈ ప్రకారముగానే తిక్కనసోమయాజి సామాన్యముగా నొక్కఁడనియే ప్రయోగించుచును వచ్చిన యతిస్థానమునం దొకచోట

* [పెదపాటి జగ్గకవి తాను సమకూర్చిన 'ప్రబంధ రత్నాకరము'లో 'విజయ సేనము' లోని పద్యముల నుదాహరించి యున్నాఁడు. 'విజయసేనము' లభ్యముకాలేదు. ఇయ్యది తిక్కనకవి కృతమనుటలో ఆధారములు లేవు. అప్పకవి, కస్తూరి రంగకవి 'విజయసేనము' లోని దని యుదాహరించిన పద్యమును కూచిమంచి తిమ్మకవి చిమ్మపూఁడి అమరేశ్వరుని 'విక్రమసేనము' లోనిదిగా నుదాహరించెను. దీనింబట్టి విక్రమసేన, విజయసేనములను జెప్పుటలో తార్మారు జరుగుచున్నట్లు తెలియుచున్నది. 'విజయసేనము' లోనివని యుదాహరింపఁబడిన పద్యములు వైశ్యవర్ణనము, గణపతి స్తోత్రము, పరిఖావర్ణనము మున్నగు విషయములు కలవి కలవు వీని కర్తృత్వమును గూర్చి విమర్శకులు సందేహించుచున్నారు

క. 'పాండవులవలనఁ గీడొ
క్కొండును లే దనిప పిదకౌరవకులు ధరణీ
మండల మంతయు మ్రింగిరి
పాండునృపతిభాగమునకుఁ బాపిరి వారిన్.'

ఒక్కొఁడని వాడియున్నాఁడు నన్నయతిక్కనాదుల ప్రయోగములను మనము శిరసావహించి గ్రహింపవలసినదే యయినను మన గ్రంథముల యందు "అఁదొఱు" "ఒక్కొఁడు" మొదలయిన విశేషరూపములను వాడక "అఁదఱు" "ఒక్కఁడు" మొదలయిన సామాన్యరూపములను వాడుటయే మంచిదని నే ననుకొనియెదను.

తిక్కనసోమయాజులు మనుమసిద్ధిరాజ్య మంతరించిన తరువాత చిరకాలము జీవించి యున్నవాఁడయి సర్వజనులచే గౌరవింపఁబడుచు నుండినవాఁడే యయినను మరణకాలమునకు విశేషవిత్తవంతుఁడుగా నుండినట్టు కనఁబడఁడు అందుచేతనే యాతని కుమారుఁడు కొమ్మన్న పాటూరికరణికమును సంపాదింపవలసినవాఁ డయ్యెను

రక్కస గంగరనదేవమహారాజు రాజ్యమేలుచుండఁగా ౧౧౬౯ శాలివాహన శకము ప్లవంగసంవత్సర జ్యేష్ఠశుద్ధ త్రయోదశీ శనివార మనఁగా క్రీస్తు శకము ౧౨౪౭-వ సంవత్సరములో చెంటిరామనాయకుఁడు కడపమండలము లోని సిద్ధవటముతాలూకా జోతిగ్రామమునందలి జ్యోతినాథదేవాలయము నకు గోపురము కట్టించినట్లు దాని యావరణములో ఱాతిమీద (No. 563) శాసన మొకటి చెక్కఁబడియున్నది నిర్వచనోత్తరరామాయణములో "రంగదుదారకీర్తి యగు రక్కెస గంగని" యన్నపద్యముండుటచేత, ఈ శిలాశాసనమునుబట్టి ౧౨౪౭-వ సంవత్సరమునకు పెక్కేండ్లుతర్వాతనే నిర్వచనోత్తరరామాయణము రచియింపఁబడినట్టు స్పష్ట మగుచున్నది

[రక్కెస గంగనయు, గంగయసాహిణియు నభిన్నవ్యక్తులని శ్రీ చిలుకూరి వీరభద్రరావుగా రభిప్రాయపడినారు. నిర్వచనోత్తరరామాయణములోని 'రంగదుదారకీర్తి ——' అను పద్యమునుబట్టి వారిద్దరును విభిన్నవ్యక్తు

అనియు, పరస్పరవిరోధులనియుఁ దెలియుచున్నది. 'ఆంధ్రకవితరంగిణి' కారులును, 'తాళ్ళప్రొద్దుటూరుశాసనవ్యాసమున (భారతి సం. ౧౫ భా. ౧ పుట ౧౪౩) శ్రీ నేలటూరి వెంకటరమణయ్యగారును వీరు వేర్వేఱువ్యక్తు లనియే తెల్పియున్నారు]

గణపనారాధ్యుఁడు

['ఆంధ్రకవితరంగిణి'లో 'ఎఱ్ఱాప్రెగడ' చరిత్రమునకుముందు 'స్వరశాస్త్ర' మను మంజరీద్విపదకర్తయగు 'గణపనారాధ్యు'ని చరిత్ర మీయఁబడినది. ఈకవి క్రీ. శ. ౧౩౨౪—౧౩౪౫ నడుమ నుండినవాఁడట। ఈ కవినిగూర్చి శ్రీ నేలటూరి వేంకటరమణయ్యగారు 'భారతి' (సంపు. 12 సంచి. 1) లో ప్రకటించిన వ్యాసము ననుసరించి, యీ విషయము గ్రహింపబడినదని తత్కర్త తెలిపియున్నారు]

ఎఱ్ఱాప్రెగడ

ఎఱ్ఱాప్రెగడ యను కవి నియోగిబ్రాహ్మణుఁడు ఈతని యింటిపేరు చెదలవాడవారు; నివాసస్థలము నెల్లూరిమండలమునందలి కందుకూరితాలూకా లోని గుడ్లూరు గ్రామము; [ఎఱ్ఱాప్రెగడ గృహనామమును గూర్చియుఁ నివాసమును గూర్చియు నభిప్రాయభేదము లున్నవి. ఇతని గ్రంథములను బట్టి యీతని గృహనామమును నిర్ణయింపఁజాలము. విప్రనారాయణ చరిత్ర మును రచించిన చెదలువాడ మల్లనకవి తానెఱ్ఱాప్రగడ వంశజుఁడనని చెప్పి కొనుటచే నీతని గృహనామము 'చెదలువాడవా' రగునని కొందఱి తలంపు ఎఱ్ఱాప్రెగడ 'చెదల్వాడ నిలయుఁ' డని మల్లన చెప్పియున్నాఁడు

ఎఱ్ఱాప్రెగడ తాతయైన 'ఎఱపోతసూరి' వేఁగినాట కరాపర్తి' వృత్తిమంతుఁ డఁట; కాన నతని నివాసము 'కరాపర్తి' కావచ్చును. భారతారణ్య పర్వ శేషము చివఱి పద్యములఁబట్టి యితని నివాసము పాకనాటి యందలి గుడ్లూ రై నట్లు తెలియుచున్నది. ఈతఁడు గుడ్లూరిలో నున్నపుడే అరణ్యపర్వ శేషమును, నృసింహ పురాణమును రచించెననియుఁ, దర్వాత మల్లారెడ్డి పరిచయము సంపాదించి, అతని మూలమున నతనియన్న వేమారెడ్డి నాశ్ర యించి అద్దంకిలోఁ గొంతకాలము నివసించి, రామాయణ, హరివంశముల నచటనే రచించి యా వేమారెడ్డికే కృతిచేసె ననియు, వార్ధక్యమునఁ జెదలు వాడలో నివసించి యుండుననియు "ఆంధ్రకవితరంగిణి" లోఁ గలదు. (నాలుగవ సంపుటము-పుట 53] తండ్రి సూరన్న; తల్లి పోతమ్మ; ఈత నిది శ్రీవత్సగోత్రము. ఇతఁడు తిక్కనసోమయాజి తరువాత నించు మించుగా నేఁబది సంవత్సరముల కాలమున నుండినవాఁడు. ఇతఁడు తిక్కనసోమయాజి కవిత్వమునం దత్యంతగౌరవము కలవాఁడయి యాతని వలెనే కవిత్వము చెప్పఁ బ్రయత్నించినవాఁ డగుటచే విరాటపర్వములోఁ

దిక్కనసోమయాజి తన తండ్రి కలలో వచ్చి గ్రంథరచన చేయవలసినదని చెప్పినట్టే, తన తాత తన భావమునందు తోఁచి చెప్పినట్టు నృసింహపురాణమున నిట్లు వ్రాసియున్నాఁడు

సీ. 'ప్రజ్ఞాపవిత్రుఁ డాపస్తంబసూత్రుండు
శ్రీవత్సగోత్రుఁ డూర్జితచరిత్రుఁ
డగు బొల్లనకుఁ బోలమాంబకుఁ బుత్రుండు
వెలనాటిచోడునివలన మిగుల
మన్నన గన్న భీమనమంత్రిపౌత్రుండు
* ప్రేకమాంబామనఃప్రియుఁడు పోత
మాంబికావిభు సూరనార్యు మజ్జనకుని
బొల్లధీనిధికిని * బ్రోలనకును
జన్నకు ననుజన్ముని గన్నతండ్రి
వేఁగినాట గరాపత్తివృత్తిమంతుఁ
డనఘుఁ డెఱపోతసూరి కంసారిచరణ
కమలమధుకరపతి సారవిమలయశుఁడు.

వ. మదీయభావంబున నావిర్భావంబు నొంది సదయానంద మధురవాక్యంబుల నన్ను నిట్లని యనుగ్రహించె.

ఉ. ఉన్నతసంస్కృతాదిచతురోక్తిపదంబులఁ గావ్యకర్తవై
యెన్నికమైఁ బ్రబంధపరమేశుఁ డనంగ నరణ్యపర్వశే
షోన్నయ మంధ్రభాష సుజనోత్సవ మొప్పఁగ నిర్వహించి తౌ
నన్నయభట్టతిక్కకవినాథుల కెక్కినభక్తి పెంపునన్.

క. గిరిశపదభక్తిరసత
త్పరభావముకలిమి శంభుదాసుఁ డనంగాఁ
బరఁగినగోవిందగుణా
దరసంభృత సౌమనస్యధన్యుఁడ వెందున్. [పీఠిక 15-18]

* ప్రేరమాంబా మనఃప్రియుఁడు—అని పాఠము

♦ బోలనకును—అని పాఠము

ఈతనికాలమువరకును నన్నయభట్టు విడిచిన యారణ్యపర్వశేషము తెనిఁగింపఁబడక భారతము కొఱఁతపడి యుండుట చూచి యితఁడు తాను దానిని తెనిఁగింప నెంచియు తనపేరిట నాంధ్రీకరించినచో నన్నయభట్టారకునిఁబోలెఁ దనకు నేదో కీడు మూడునని భయపడి మిగిలిన భాగమును రాజరాజనరేంద్రున కంకితముగా నన్నయభట్టుపేరితోనే రచియించెను. భారతములో నీతఁడు రచియించినభాగములోని మొదటి పద్యము

చ. 'స్ఫురదరుణాంశురాగరుచి బొంపిరివోయి నిరస్తనీరదా
వరణములై దళత్కమలవై భవజృంభణ ముల్లసిల్ల ను
ద్ధురతరహంససారసమధువ్రతనిస్వనము ల్చెలంగఁగాఁ
గరము వెలింగె వాసరముఖంబులు శారదవేళఁ జూడఁగన్.'

అనునది. కాఁబట్టి యీ కవి రచియించిన దారణ్యపర్వములో సగముకంటె నధికముగా నుండును.

ఎఱ్ఱాప్రెగడ కవిత్వము మృదువును మధురమునయి, కదళీపాకమై, చాల వఱకు సోమయాజులకవిత్వమును పోలియుండును ఇతఁడు రచియించిన భారతభాగమునం దించుమించుగా సంస్కృతపదములును, తెలుఁగుపదములును సమానముగా నుండును ఇతని భాషాంతరమును పయి యిరువుర దానివలెనే మూలమైన సంస్కృతగ్రంథానుసారముగా నుండదు. ఈక్రింది శ్లోకములును పద్యములును కొంతవఱ కీ యంశమును తేటపఱుపవచ్చును.

సంస్కృతారణ్యపర్వము.

శ్లో. తవ వశ్యా హి సతతం పాండవాః ప్రియదర్శనే
ముఖప్రేక్షా శ్చతే సర్వే తత్త్వమేత ద్బ్రవీహి మే.
వ్రతచర్యా తపో వాస్తి స్నానమంత్రౌషధాని వా,
విద్యావీర్యం మూలవీర్యం జపహోమాగదా స్తదా.

తెలుఁగు

సీ. నీప్రియభర్తల నిర్మలవృత్తులఁ
ప్రకటతేజుల లోకపాలనిభులఁ

బార్థుల నీ వాకభంగిన వదలక
చెలువ మెబ్బంగి భజింతు దగిలి ?
యొక్కఁ డొక్కనికంటె నువిద నీ కెక్కుడు
ననురక్తు లగుట యత్యద్భుతంబు
నగుమొగంబులకావి నాతి నీదెస నెప్డుఁ
బతులకుఁ గిన్క యెప్పాటి లేదు

వ్రతము పెంపొ మంత్రౌషధవైభవంబొ
సరసనైపథ్యకర్మకౌశలమొ చతుర
విభ్రమోల్లాసరేఖయొ వెలఁది నీవి
శేషసౌభాగ్యహేతువుఁ జెపుమ నాకు.'

ఇందలి సీసపాదముల నాలిగింటను మూలములో లేని నిర్మలవృత్తులఁ బ్రకటతేజుల మొదలయిన విశేషణాదులచేత గ్రంథము విస్తారముగాఁ బెంపఁబడినను గీతపాదములయందు మూలమునందలి తపస్సు స్నానము జపము హోమము మొదలైనమాటలు విడిచిపెట్టఁబడినవి.

సంస్కృతము.

శ్లో. 'యదైవ భర్తా జానీయా న్మంత్రమూలపరాం స్త్రియమ్,
ఉద్విజేత తదైవాస్యాః సర్పా ద్వేశ్మగతా దివ.
ఉద్విగ్నస్య కుత శ్శాంతి రశాంతస్య కుతః సుఖం,
న జాతు వశగో భర్తా స్త్రియాః స్యాన్మంత్రకర్మణా.
అమిత్రప్రహితాంశ్చాపి గదాన్ పరమదారుణాన్,
మూలప్రవాదైర్హి విషం ప్రయచ్ఛంతి జిఘాంసవః.
జిహ్వయా యాని పురుష స్త్వచా వా ప్యుపసేవతే,
తత్రచూర్ణాని దత్తాని హన్యుః క్షిప్ర మసంశయః
జలోదరసమాయుక్తాః శ్విత్రిణః పలితా స్తథా,
అపుమాంసః కృతా స్త్రీభిః జడాంధబధిరా స్తథా.

పాపానుగాస్తు పాపాస్తాః పతీ నుపస్సృజం త్యుత.
స జాతు విప్రియం భర్తుః స్త్రియా కార్యం కథంచన '

తెలుఁగు

చ. అఱయక మంత్రతంత్రవివిధౌషధభంగులఁజేసి యెంతయున్
వలతురు నాథు లంట మగువా! కడుబేలతనంబు దానమున్
గలిగినప్రేమయుం బొలియుఁ గాని యొకంటను సిద్ధిఁ బొంద ద
వ్వ్రాలఁతులతోడిమన్కి యహిపొత్తుగఁ జూచు విభుం డెఱింగినన్.

చ మగువ యొనర్చువశ్యవిధి మందులు మాయలు నొందుచందమై
మగనికిఁ దెచ్చు రోగములు మానక మూకజడాదిభావముల్
మొగి నొనరించు నద్దురితముల్ తన చేసినచేతలై తుదిన్
జగమున కెక్కు నిందయును సద్గతిహానియు వచ్చు నింతికిన్.'

పీనిని చదువుటవలననే మూలగ్రంథములోని కొంత భాగము వదలి వేయఁబడినట్టు స్పష్టమగును గనుక సత్యాద్రౌపదీసంవాదము నందలి పద్యములలో నొక్కదానినిమాత్రము వ్రాసి యిఁక నీ విషయము విడిచిపెట్టెదను.

శ్లోకము

'ఏత జ్ఞానా మ్యహం కర్తుం భర్తృసంవననం మహత్,
అసత్స్త్రీణాం సమాచారం నాహం కుర్యాం న కామయే.'

పద్యము

గీ. ఇట్టి వర్తనముల నెప్పుడుఁ బాండవులకుఁ
దగిలి ప్రియము సేయఁదగితిఁ గాని
మగువ! నీవు చెప్పు మందులు మాకులు
నింద్రజాలములును నే నెఱుంగ '

ఈ కవియొక్క కవిత్వశైలి తెలియుటకయి యీ పద్యములే చాలి యున్నను. మఱియొకభాగములోని పద్యములను రెంటిని కూడ నిందు వ్రాసెదను.

ఉ. నారలు కట్టి కూర లశనంబుగ నుగ్రవనంబులో విప
ద్భారము నొంది వందురినఫల్గును నుజ్జ్వలరాజ్యవైభవో
దారుల మై కమంగొని ముదంబును బొందఁగ గాంచుకంచెవిం
పారఁగ నొందుగల్గునె కృతార్థత యెందును గౌరవేశ్వరా.

అర. వ. ఆ ౩.

ఉ. శాతవశాఖాగ్రఖండితలసన్మదకుంజరకుంభముక్తము
క్తాతతశైలకందరగుహాంతరసుప్తమృగేంద్ర కేసర
వ్రాతము వేడ్క నాచికొన వారక చేరుట గాదె క్రోధవి
ఖ్యాతమహోగ్రు భీముఁ జెనకం దలపోయుట నీకు నెమ్మెయిన్.'

అర. ఆ. ౬.

భారతమును రచించిన యీ ముగ్గురు కవులును ప్రామాణికాగ్రగణ్యులు. సర్వవిధములచేతను వీరి కవిత్వము మిక్కిలి శ్లాఘ్యమైనది. వీరిని కవిత్రయ మందురు. కవిత్రయవిరచిత మయిన యాంధ్రభారత మారంభింపఁబడిన మూఁడు వందలసంవత్సరములకు సంపూర్ణ మైనది. కవిత్రయము ప్రయోగించిన పదములనే కాని వేఱు పదములను కవులు ప్రయోగింపఁగూడదని వీరికి వెనుక కవిరాక్షసుఁడను నతఁడు తాను రచియించిన కవిరాక్షసీయ మను లక్షణగ్రంథమునందు నియమము చేసినాఁడట. అయినను తరువాతికవులు మాత్ర మీ నియమము నంతగా పాటింపలేదు.

ఎఱ్ఱాప్రెగడకు శివభక్తుఁడగుటచేత శంభుదాసుఁ డనియు, ప్రబంధధోరణిని భారతారణ్యపర్వశేషమును చమత్కారబంధురముగా రచించుటచేత ప్రబంధపరమేశ్వరుఁ డనియు, బిరుదనామములు గలవు. ఈతఁడు చేసిన యితరగ్రంథములు రామాయణము, హరివంశము, * లక్ష్మీనృసింహపురాణము. ఇందలి కడపటి పుస్తకమున కహోబలమాహాత్మ్య మని నామాంతరము.

హరివంశ మీ కవి కొండవీటిప్రభువైన † పోలయవేమారెడ్డి కంకితముచేసెను. [ఇయ్యెడ 'ఆంధ్రకవితరంగిణి' (నాలుగవ సంపుటము-పుట 97)లో నిట్లున్నది.

* లక్ష్మీనృసింహావతారమను పేరు శబ్దరత్నాకరమునఁ గలదు.

† 'పోలయ'కు బదులు 'ప్రోలయ' అని యుంకెట్ల నుండఁదగును.

'హరివంశకృతిపతి వేమారెడ్డి కాఁడనియు, నాతని మూఁడవ కుమారుఁడైన యన వేమారెడ్డి యనియుఁ గొందఱు భ్రమపడుచున్నారు ......ఆశ్వాసాంత పద్యములనుబట్టి హరివంశకృతిపతి కోమటి ప్రోలయ వేముఁడు కాని వేమారెడ్డి కుమారుఁడైన యన వేమారెడ్డి కాఁడనుట నిశ్చయము'']
అనవేమారెడ్డితండ్రియైన యీ ప్రోలయవేమారెడ్డి ప్రతాపరుద్రుని ప్రభుత్వ దినములలో నొక సేనానాయకుఁడుగా నుండి. ౧౩౨౩ వ సంవత్సరమున ప్రతాపరుద్రుఁడు తురుష్కులచేత కారాగారబద్ధుఁడుగాఁ జేయఁబడిన కొన్నిసంవత్సరముల కనఁగా ౧౩౨౮ వ సంవత్సరమునందు స్వతంత్రుఁడయి వినుకొండరాజ్యము నాక్రమించుకొని ౧౩౫౩ వ సంవత్సరమువఱకును రాజ్యముచేసెనని చెప్పఁబడియున్నది. కాని యీతని శాసనములు ౧౩౨౦ వ సంవత్సరమునుండియే కానఁబడు చున్నందున నితఁడా సంవత్సరమునందే రాజ్యపాలన మారంభించి యుండును. అందుచేత నీ ప్రోలయవేమారెడ్డి * ౧౩౨౦ వ సంవత్సరము మొదలుకొని ౧౩౫౩ వ సంవత్సరమువఱకును రాజ్యపాలనము చేసియుండవలెను. ఇతఁడు మొదట సామంతుఁడయి కాకతీయ రాజ్యావసానదశయందు స్వతంత్రరాజయి యుండును. ఈతని ప్రథమపుత్రుఁడు అనపోతారెడ్డి ౧౩౫౦ వ సంవత్సరము మొదలుకొని ౧౩౬౧ వ సంవత్సరమువఱకును. ద్వితీయపుత్రుఁడు సుప్రసిద్ధుఁడైన యనవేమారెడ్డి ౧౩౬౨ మొదలుకొని ౧౩౮౦ వఱకును రాజ్యముచేసిరి ఈ యనవేమారెడ్డి రాజమహేంద్రవరమువఱకును తెనుఁగుదేశమును జయించి ప్రసిద్ధికెక్కుటయే కాక, సంస్కృతాంధ్రములయం దసమానపాండిత్యముకలవాఁడయి యమరుకకావ్యమునకు సంస్కృతవ్యాఖ్య వ్రాసి ప్రఖ్యాతి కెక్కెను. [అమరుకకావ్యమునకు సంస్కృతవ్యాఖ్యానమగు 'శృంగారదీపిక'ను రచించిన యాతఁడీ యనవేమారెడ్డి కాఁడు. పెదకోమటి వేమారెడ్డి ఇతఁడు క్రీ. శ. 1400–1420 నడుమ నుండెను] ప్రోలయవేమారెడ్డి ౧౩౨౦ వ సంవత్సరము మొదలుకొని ౧౩౫౩ వ సంవత్సరమువఱ

[* ఇతని రాజ్యారంభకాలము ౧౩౨౮ అని 'ఆంధ్రకవితరంగిణి' (సంపుటము ౪ పుట 57]

కును రాజ్యముచేసినందున, ఇతని యాస్థానకవీశ్వరుఁడయిన యెఱ్ఱాప్రెగడ యిప్పటి కయిదువందలయేఁబది సంవత్సరములక్రిందట నున్నట్లు నిశ్చయింపవలసి యున్నది. పోలయవేమారెడ్డిపూర్వు లంత పేరుపడినవారు కారు గనుకనే యెఱ్ఱాప్రెగడ హరివంశమునందు పోలయ పయివారి నెవ్వరిని వంశవర్ణనయం దుదాహరింపలేదు. పోలయవేమారెడ్డి కద్దంకి రాజధాని యయినట్టు హరివంశములోని యీ క్రిందిపద్యమువలన విశద మగుచున్నది

గీ. 'తనకు నద్దంకి తగు రాజధానిగాఁ బ
రాక్రమంబున బహుభూము లాక్రమించి
యనుజతనుజబాంధవమిత్రజనుల కిచ్చె
నెదురె యెవ్వారు వేమమహీశ్వరునకు.'

ఎఱ్ఱాప్రెగడ హరివంశమునం దీ క్రిందిపద్యములచేత నన్నయ తిక్కన సోమయాజుల నిద్దఱిని మాత్రమే పూర్వకవులనుగా స్తుతించినాఁడు.

ఉ. 'ఉన్నతగోత్రసంభవము నూర్జితసత్వము భద్రజాతిసం
పన్నము నుద్ధతాన్యపరిభావిమదోత్కటము న్నరేంద్రపూ
జోన్నయనోచితంబు నయి యొప్పెడు నన్నయభట్టకుంజరం
బెన్న నిరంకుశోక్తిగతి నెందును గ్రాలుటఁ బ్రస్తుతించెదన్.'

మ. తనకావించినసృష్టి తక్కొరులచేతం గాదునా నే ముఖం
బునఁ దాఁ బల్కిన బల్కు లాగమములై పొల్పొందునా వాణి న
త్తను వీతం దొకరుండునాఁ జను మహత్త్వాప్తిం గవిబ్రహ్మనా
వినుతింతుం గవితిక్కయజ్వ నఖిలోర్వీదేవతాభ్యర్చితున్.

ఇతఁడు హరివంశమును రచియించుటకుముందే రామాయణమును రచించినట్లు వేమారెడ్డి కవి నుద్దేశించి యన్నట్లు చెప్పఁబడిన యీ క్రింది పద్యము వలనఁ దెలియవచ్చుచున్నది.

శా. 'నాతమ్ముండు ఘనుండు మల్లరథినీనాథుండు ని న్నాతత
శ్రీతోఢ న్నమఘేతుఁ జేసి యెలమిం జేపట్టి మా కిచ్చుటం

చేతోమోద మెలర్ప రామకథ మున్ జెప్పించి యత్యుత్తమ
ఖ్యాతిం బొందితి వింకనుం దనియ నేఁ గావ్యామృతాస్వాదనన్.'

హరివంశములోని మొదటి పద్యమునందలి "యన్నమవేమభూవిభున" కన్నదాని "నన్నయవేమభూవిభున కని భ్రమపడి యీ కవి తన హరివంశమును అనవేమభూపాలున కంకిత మొనర్చినట్టు చెప్పఁబడెనుగాని యది సరికాదు. ఎఱ్ఱాప్రెగడ యనవేమారెడ్డి నెఱుఁగునో యెఱుఁగఁడో యని సందేహింపవలసి యున్నది. మనకవి యీక్రిందిపద్యమునందు

శా. వేమక్ష్మాధిపుకూర్మిపుత్రుఁడు దయావిభ్రాజి యవ్యాజతే
జోమార్తాండుఁడు కీర్తనీయసుగుణస్తోమంబులం దేమియున్
రామస్ఫూర్తికి లొచ్చుగాక సరియై రాజిల్లె రాజార్చితుం
డాముష్యాయణుఁ డెందుఁ బోతయచమూపాగ్రేసరుం డిమ్మహిన్

ప్రోలయవేముని జ్యేష్ఠపుత్రుఁడై యనపోతారెడ్డిని, ఈ క్రిందిపద్యమునందు

క. 'దానంబునఁ గర్ణుని సరి
మానంబున పేర్మి ననుపమానుఁడు బుధస
న్మానచతురుండు మాచయ
సూనుఁడు కోమటి సమ ససులభుఁడు కరుణన్."

ప్రోలయవేమునియన్నకుమారుఁడైన కోమటిరెడ్డిని, వర్ణించినను హరివంశమునం దెక్కడను అనవేమునిపేరైన నెత్తలేదు అందుచేత హరివంశరచనాకాలమునాఁటి కనవేముఁడు పుట్టెనో లేదో, పుట్టినను మిక్కిలి పసివాఁడుగా నుండెనో, యని యూహింపవలసి యున్నది. పయిపద్యములో "మాచయసూనుఁ" డన్నచోటఁ గొన్ని ప్రతులలో "పోలయసూనుఁ"డని యున్నది. మాచయసూనుఁ డన్న పాఠమే సరియయినది. [ఈ పద్యమును జర్చించుచు 'ఆంధ్రకవితరంగిణి'లో నీక్రిందివిషయము వ్రాయఁబడినది.

'క. దానంబున .....ప్రోలయసూనుఁడు కోమటి సమస్తసులభుఁడు కరుణకా' అను కందపద్యము ముద్రిత ప్రతిలోను, కొన్ని తాళపత్ర ప్రతులలోను నట్లే యున్నది. అందు 'ప్రోలయ' అను శబ్దము పొరపాటు. ప్రోలయకుఁ గోమటి యను సూనుఁడు లేనేలేఁడు. 'ప్రోలయ' యను పదము సరికాదనియు, నచట 'మాచయ' యను పదముండవలెననియు శ్రీ వీరేశలింగము పంతులుగారు వ్రాసి యున్నారు. కాని 'మాచయ' యను పదముకూడ సరికాదనియు, నచ్చట వేమయ యను పదముండవలెననియు నాయభిప్రాయము. కవి యీ కథాసందర్భమున వేమారెడ్డి వంశమును, నాతని మాతృసంబంధులను మాత్రమే వర్ణించుచున్నాఁడు గాని వేమారెడ్డి కగ్రజుఁడయిన మాచన వంశమును జెప్పుటలేదు. ఇంతియగాక యీ కంద పద్యమునకుఁ బైన 'అతని యనుజుఁడు' అని చెప్పియుండుటచే వేమారెడ్డికి ప్రథమపుత్రుఁడైన పోతయ చమూపతికిఁ దమ్ముఁడును వేమారెడ్డికి రెండవ పుత్రుఁడు నైనవానిని బై కందపద్యములో వర్ణింపనెంచెననుట నిశ్చయము. కానిచో 'అతని యనుజుండు' అను వాక్యము నిరర్థకమగును. కావున పై పద్యములో 'ప్రోలయ' అనుటకు బదులుగా వేమారెడ్డిని సూచించు వేమయ యను మాట యుండఁదగినది.

శ్రీపంతులుగారు శ్రీనాథకవి చారిత్రమున వేమారెడ్డికి 'కోమటిరెడ్డి' యను పుత్రుఁడున్నాడని యంగీకరించుచు, 'ఎఱ్ఱాప్రెగడ హరివంశము రచించు నాఁటి కన వేమారెడ్డి మిక్కిలి పసివాఁడు. కోమటిరెడ్డి మృతుఁడయ్యెను. హరివంశమునందే యీతని పెదతండ్రి కుమారుఁ డయిన కోమటిరెడ్డి యిట్లు వర్ణింపఁబడెను. అని వ్రాసి 'దానంబునఁ గర్ణుని ...' అను పద్యము నుదాహరించుచు నందలి 'ప్రోలయ' అను పదమును 'మాచయ' అని మార్చివేసిరి .. ..హరివంశ రచనము నాఁటికి వేమారెడ్డి రెండవ కుమారుఁడైన కోమటిరెడ్డి జీవించియే యున్నాఁడు. అతఁడే పై కంద పద్యమున వర్ణింపఁబడినవాండు' (ఆంధ్రకవితరంగిణి నాలుగవ సంపుటము పుటలు 95, 96)

క. శ్రీసంభావితవక్షో
భాసురమణిహారకిరణపరిచయచతురో
ల్లాసమృదుహాసయవిరత
భూసురగృహరచితహేమ ! పోలయవేమా !'

అని పూర్వభాగము షష్ఠాశ్వాసప్రారంభమునందును,

క. 'శ్రీనందనసహసౌంద
ర్యానందితయువతిహృదయ ! యధికాభ్యుదయా
యానతజనహృద్యదయా
భూనుతజయశక్తిభీమ ! పోలయవేమా !

అని యుత్తరభాగమున నష్టమాశ్వాసప్రారంభమునందును, కవి కృతిపతిని "పోలయవేమా !" యని సంబోధించుటచేతను,

చ. కులజలరాశిచంద్రుఁడగు కోమటిపోలనయున్ నితంబినీ
తిలకము పుణ్యురాలు పతిదేవత యన్నమయుం గృతార్థతా
కలితులు ధీరు వేమవిభుఁ గానఁగఁ గాంచిన పుణ్య మెద్ది యే
కొలఁదుల నెన్ని జన్మములఁ గూర్చిరొ నాఁ బొదలున్ జనస్తుతుల్.'

అని కృత్యాదియందు వేమనను గన్నవారు పోలనయు నన్నమయునని స్పష్టముగాఁ జెప్పుటచేతను, హరివంశమును గృతి నందినవాఁడు పోలయ వేమారెడ్డియే యనుట నిశ్చయము. అంతేకాక కృత్యాదియందు నెఱ్ఱనయే కృతిపతితో నిట్లనియెను—

క. 'కావునఁ జెప్పెదఁ గళ్యా
ణావహమహనీయరచన హరివంశము స
ద్భావమున నవధరింపుము
భూవినుతగుణాభిరామ ! పోలయవేమా !'

ఇంతవఱకును బయల్పడిన శాసనాదులనుబట్టి రెడ్లప్రభుత్వకాలమును, సంబంధమును తేటపడుటకయి వారి వంశవృక్షము నిచ్చట నిచ్చు చున్నాము—

దేసటి ప్రోలయ (భార్య అన్నమ్మ)

- మాచన.
  - పెదకోమటి
    - 5 కోమటివేముఁడు (1400—1420)
      - 6. రాచవేముఁడు. (1420–1424)
- 1 వేమారెడ్డి (1320—1349)
  - 2 అనపోతుఁడు. (1350—1361)
    - 4. కమారగిరి. (1380—1400) కొండవీటిరాజ్యము
    - మల్లాంబ. భర్త కాటయవేముఁడు) రాజమహేంద్రవరరాజ్యము (1386—1400)
      - అనితల్లి (భర్త వీరభద్రారెడ్డి) (1426—50)
  - 3. అనవేముఁడు (1362—1380)
  - దొడ్డాంబ (భర్త కాటయ)
    - కాటయవేముఁడు (1386—1400) (మల్లాంబభర్త)
      - అనితల్లి.
    - అల్లాడరెడ్డి (1416–26)
      - (భర్త వీరభద్రారెడ్డి.) (1426—50)
  - వేమసాని
    - భీమలింగము.
      - భార్య వేమాంబిక అనవేమునిపౌత్రి)
- దొడ్డారెడ్డి
- అన్నారెడ్డి
- మల్లారెడ్డి

[పైఁది వంశవృక్షములో 'అనితల్లి' తల్లి మల్లాంబిక యని తెలుపఁబడినది. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రులుగారు 'శృంగార శ్రీనాథము'న కాటయవేమనను గూర్చి వ్రాయుచు 'ఈతఁడు కాటయకుఁ బుత్రుఁడు అనపోత నృపాలుని కల్లుఁడు, తల్లాంబిక, దొడ్డాంబిక, మల్లాంబిక యని యీతనికి ముగ్గురు భార్యలు తెలియవచ్చుచున్నారు తల్లాంబికయందుఁ గుమారగిరి యని కుమారుని, దొడ్డాంబిక యం దనితల్లియని కుమార్తెను గాటయ వేమన కాంచినాఁడు, మల్లాంబికకు సంతానము కలదో, లేదో తెలియదు. (పుట 58) అని తెలిపియున్నారు.]

1,2,3,4,5,6 సంఖ్యలు వేసినవారు వరుసగా రాజ్యమునకు వచ్చిన రెడ్డి రాజులు వారు రాజ్యము చేసినకాలము వారిక్రింద వేయఁబడినది. ఇందు వేయఁబడిన కాల మిప్పటివఱకు దొరకిన శాసనములనుబట్టి నిర్ణయింపఁ బడినది ముందు లభింపఁబోయెడు శాసనములను బట్టియైనను వీరి కాల మంతగా మాఱక రెండు మూఁడు సంవత్సరము లెక్కువతక్కువగా సరి పోవును గాని యంతకంటె నెక్కువ వ్యత్యాసముండదు. మూఁడవవాఁడైన యనవేమారెడ్డి రాజధానిని అద్దంకినుండి కొండవీటికి మార్చెను నాలవవాఁ డయిన కుమారగిరిరెడ్డి రాజమహేంద్రవరరాజ్యమును తనచెల్లె లయిన మల్లాంబ కరణముగా నిచ్చినందున నామెభర్తయు, మేనత్తకొడుకు నయిన కాటయవేముఁ డా రాజ్యమును 1385 మొదలుకొని 1400-వ సంవత్సరము వఱకును పాలించెను కాటయవేమునితండ్రి కాటయ కుమారగిరితండ్రి చెల్లె లయిన దొడ్డాంబను వివాహమాడెను అనవేముని మనుమరా లయిన వేమాంబికను వివాహమాడిన యల్లాడరెడ్డి కాటయవేముని దండనాథుఁడుగా నుండి రాజ్యము నాక్రమించుకొని 1413-వ సంవత్సరము మొదలుకొని 1426 వఱకును తన పేరనే రాజ్యము చేయ నారంభించెను గాని; పిమ్మట కాటయ వేమునిపుత్రిక యైన యనితల్లిని తన ద్వితీయపుత్రుఁడైన వీరభద్రారెడ్డికిఁ బెండ్లిచేసి రాజ్యము వారి కిచ్చివేసెను. కొందఱు కాటయవేమునికి కొమర గిరి యను పుత్రుఁడు పసివాఁ డనితల్లి తమ్ముఁ డొకఁ డుండెననియు, ఆతని బాల్యములో తాను మంత్రిగా నుండి యల్లాడరెడ్డి శత్రుభయము

లేకుండఁ గాపాడి యాతని పక్షమున రాజ్యము చేసె ననియు, అతఁడు మృతినొందఁగా రాజ్య మవితల్లి వశము చేసె ననియు, చెప్పుచున్నారు. స్థానికచరిత్రములలో రెడ్ల రాజ్యకాలపరిమితినిగూర్చి యీ క్రిందిపద్యము కానఁబడుచున్నది.

సీ 'పోలయవేమన్న పొలుపారఁ బన్రెండు
　　　　వత్సరంబులు గాచె వసుధ యెల్ల
అటువెన్క ముప్పది యనపోతవేమన్న
　　　　వన్నెవాసికి నెక్క వసుధ యేలె
ధర్మాత్ముఁ డనవేమధరణీకళత్రుండు
　　　　పదియునేనిట భూమి పదిలపఱిచె
ప్రజల సుఖ్యసముగఁ బదునాలు గేఁడులు
　　　　కొమరగిరి యేలెను సమయుదాఁక

నేలెఁ గోమటిపేమన యిరువదేండ్లు
రాచవేమన్న నాల్గు వర్షంబు లేలె
మించి కట్టిరి గృహరాజుమేడ కొండ
వీట నూటేండ్లు రెడ్లు భూ విదితయశులు.'

ఈ పద్యమెంతవఱకు విశ్వసింపఁదగినదో చదువరులే యోచించుకోవచ్చును. రెడ్లచరిత్రము నింతట విడిచి యిఁక మన కవిచరిత్రమునకు వత్తము.

కవియింటిపేరు చెదలువాడవారు. ఈ సంగతి యెఱ్ఱాప్రెగడ వంశజుఁడయిన చెదలువాడ మల్లన రచించిన విప్రనారాయణచరిత్రములోని యీ క్రింది పద్యమువలన స్పష్టపడుచున్నది

సీ. 'ప్రతిభతో నారణ్యపర్వశేషముఁ జెప్పెఁ
　　　　గవులకుఁ జెవులపండువులుగాఁగ
వల్మీకభవువచోవైఖరి రామాయ
　　　　ణంబు నాంధ్రప్రబంధంబుఁ జేసె

నారసింహుని పురాణమొనర్చె హరి మెచ్చి
నన్ను నెన్నఁడు చూచినాఁడ వనఁగఁ
బ్రౌఢిమై హరివంశభాగముల్ రెండును
రచియించె సభలందుఁ బ్రాజ్ఞు లెన్న
దురితహరుఁ బ్రబంధపరమేశ్వరునిఁ జెద
ల్వాడనిలయు నాదు వంశకర్త
ధన్యమూర్తి శంభుదాసు నెఱ్ఱాప్రెగ్గ
డను నుతింప బ్రహ్మకును దరంబె?'

కవియింటిపే రేర్చూరివారని పడుట యెఱ్ఱన లనేకు లుండుటచేతనే.

సీ 'భవ్యచరిత్రుఁ డాపస్తంబసూత్రుండు
శ్రీవత్సగోత్రుండు శివపదాబ్జ
సంతతధ్యానసంసక్తచిత్తుఁడు సూర
నార్యునకును బోతమాంబికకును
నందనుం డిలఁ బాకనాటిలో నీలకం
ఠేశ్వరస్థానమై యెసఁక మెసఁగు
గుడ్లూరి నెలవున గుణగరిష్ఠత నొప్పు
ధన్యుఁ డద్వైతైకతత్పరాత్ముఁ

డెఱ్ఱనార్యుండు సకలకవీంద్రవినుతుఁ
డైన నన్నయభట్టమహాకవీంద్రు
సరససారస్వతాంశప్రశస్తి తన్నుఁ
జెందుటయు సాధుహర్షణసిద్ధిఁ గోరి.'

అను భారతారణ్యపర్వశేషములోని పద్యమునందుఁ గాని.

సీ 'ప్రజ్ఞాపవిత్రుఁ డాపస్తంబసూత్రుఁడు
శ్రీవత్సగోత్రుఁ డూర్జితచరిత్రుఁ
డగు బొల్లనకుఁ బోలమాంబకుఁ బుత్రుఁడు
వెలనాటిచోడనివిభలన మిగుల్ల

ఘన్నున గన్న భీమనమంత్రిపౌత్రుండు
ప్రేకమాంబామనఃప్రియుఁడు పోత
మాంబికావిభు సూరనార్యు మజ్జనకుని
బొల్లధీనిధికివి ప్రోలనకును
జిన్ననకు ననుజన్ముని గన్నతండ్రి
వేఁగినాట గరాపర్తివృత్తిమంతుఁ
డనఘుఁ డెఱపోతసూరి కంసారిచరణ
కమలమధుకరపతి సారవిమలయశుఁడు.'

అను నృసింహపురాణములోని పద్యమునందుఁ గావి, తన గృహనామమును జెప్పక తా నాపస్తంబసూత్రుఁడ ననియు శ్రీవత్సగోత్రుఁడ ననియు శివపదాబ్జసంతతధ్యానసంసక్తచిత్తుఁడ ననియు మాత్ర మెఱ్ఱన చెప్పుకొనుట చేతను,

సీ. 'శ్రీవత్సగోత్రుండు శివభక్తియుక్తుఁ డా
పస్తంబసూత్రుఁ డపారగుణుఁడు
నేర్పూరిశాసనుం డెఱ్ఱనప్రెగ్గడ
పుత్రుండు వీరనపుణ్యమూర్తి
కాత్మజుఁ డైన గాదామాత్యునకుఁ బ్రోల
మాంబకు నందను లమితగుణులు
కసువనామాత్యుండు ఘనుఁడు వీరనమంత్రి
సింగధీమణియు నంచితచరిత్రు
లుద్భవించిరి త్రేతాగ్నులో యనంగ
సొరిది మూర్తిత్రయం బన శుద్ధకీర్తిఁ
బరఁగి రందులఁ గసువనప్రభువునకును
ముమ్మడమ్మనుసాధ్వి యిమ్ములను వెలసె.'

అను పద్యములో భాగవతషష్ఠస్కంధమును రచియించిన సింగయ శ్రీవత్స గోత్రుఁడును, శివభక్తియుక్తుఁడును నాపస్తంబసూత్రుఁడు నగు నేర్పూరి

యెఱ్ఱనప్రెగ్గడ నొక్కనిని దనపూర్వుని జెప్పి యుండుటఁ జూచి సూక్ష్మముగా విచారింపక స్థూలదృష్టిచేత నీ యెఱ్ఱనప్రెగడయే యా యెఱ్ఱన ప్రెగడ యని భ్రమపడుటవలనఁ గలిగినది. ఈ యెఱ్ఱన లిరువురును గాక మఱియొక యెఱ్ఱనకవి గూడఁ గలఁడని కొక్కోకమునందు గ్రంధకర్త తన్నుఁగూర్చి చెప్పుకొన్న యీ క్రిందిపద్యమువలనఁ దెలియుచున్నది.

సీ. 'శ్రీవత్సగోత్రప్రసిద్ధసంభూతి నా
పస్తంబసూత్రప్రశస్తఘనుఁడ
గురుదయానిధి యైన కూచనమంత్రికి
నంగనామణి ముత్తమాంబికకును
దనయుండ సత్కవీంద్రసుమాన్యచరితుండ
శివకృపాసజ్ఞానశేఖరుండ
నారూఢవిద్యాచలానంద యోగీంద్ర
శిష్యప్రచారవిశిష్టఘనుఁడ
నెఱ్ఱనామాత్యుఁడను సత్కవీంద్రహితుఁడఁ
గవిత వాక్ప్రౌఢిఁ గొక్కోకకవివరుండఁ
జతురమతితోడ రతికళాశాస్త్ర మిదియుఁ
దెనుఁగు గావింతు రసికులు వినుతి చేయ'

ఇఁకను మనము చెదలువాడ యెఱ్ఱాప్రెగడ కాలమునుగూర్చి యించుక విచారింప వలసియున్నది. ఇతఁడు తాను రచించిన రామాయణమును హరి వంశమును బోలయవేమున కంకితము చేసి యుండుటచేతను, బోలయ వేముఁడు ౧౩౨౦ మొదలుకొని (కొందఱ అనునట్లు ౧౩౨౪ మొదలుకొని) ౧౩౪౯-వ సంవత్సరమువఱకును సామంతుఁడుగానో స్వతంత్రుఁడుగానో ప్రజాపాలనము చేసి యుండుటచేతను, ఇతఁ డా కాలమున నుండె ననుటకు సందేహము లేదు. ఇతఁడు తిక్కనసోమయాజి తరువాత నిరువది ముప్పది సంవత్సరములలోపలనే యుండియున్నట్టు కనఁబడుచున్నాఁడు. "ప్రజ్ఞాపవిత్రుఁ" డన్న నృసింహపురాణపద్యమునుబట్టి చూడఁగా నీతని వంశవృక్ష మీ విధముగా నున్నది.

భీమన. (వెలనాటి చోడునివలన మన్నన గన్నవాఁడు)
|
బొల్లన
|
ఎఱపోతన.
|
బొల్లన. ప్రోలన. జన్నన. సూరన.
|
ఎఱ్ఱన. ఎఱ్ఱాప్రెగడ.)

వెలనాటిచోడుని కాలములో నున్న భీమనమంత్రికొడుకు బొల్లన; బొల్లన కొడుకు కెఱపోతన; ఎఱపోతనయొక్క కొడుకు సూరన, సూరన కొడుకు కెఱ్ఱాప్రెగడ వెలనాటిచోడునికాలమునందుండి భీమన మంత్రికిని కవియైన యెఱ్ఱాప్రెగడకును నడుమ ముగ్గురు పురుషులున్నారు ఒక్కొక్కపురుషునకుఁ గలయంతరము నలువదేసి సంవత్సరములపాటున గణించినను భీమనమంత్రి తరువాత నెఱ్ఱాప్రెగడ నూటయిరువది సంవత్సరములకు పుట్టి యుండవలెను. వెలనాటిచోడుఁడు ౧౧౪౫-మొదలుకొని ౧౧౬౩-వ సంవత్సరము వఱకును భూపరిపాలనము చేసెను. అతనిచే మన్నన గన్న భీమనయు నా కాలమునం దుండవలెను; ఒక్కొక్కఁడు తండ్రికి నలువదేసి సంవత్సరముల యీడునఁ బుట్టుచు వచ్చినచో భీమనకొడుకు బొల్లన ౧౧౯౬-వ సంవత్సరమునఁ బుట్టి యుండవలెను, తరువాత నాతనికొడు కెఱపోతన ౧౨౩౬-వ సంవత్సరమునఁ బుట్టి యుండవలెను; అటుపిమ్మట నాతని కొడుకు సూరన ౧౨౭౬-వ సంవత్సరమునందుఁ బుట్టి యుండవలెను; పిదప సూరనకొడుకు మనకవి యెఱ్ఱాప్రెగడ ౧౩౧౬-వ సంవత్సరమునందుఁ బుట్టి యుండవలెను. వెలనాటిచోడునివలన మిగుల మన్ననఁ బొందిన భీమనమంత్రి వెలనాటిచోడునికాలమునాఁటికే ముప్పది నలువది యేండ్ల ప్రాయముగలవాఁడయి యుండును గాన నాతనిపుత్రుని జననమున కటు తరువాత నలువదియేండ్లు వేయుట న్యాయము కాదు. అందుచేత నిరువదేసి సంవత్సరములు తగ్గించుచు వచ్చినచో మనకవి జననకాలము ౧౩౯౬-వ

సంవత్సర ప్రాంతములకుఁ బోవును [ఇయ్యెడ 'ఆంధ్రకవితరంగిణి' లో నీ క్రింది విధముగఁ గలదు.

'భీమనమంత్రిని గౌరవించిన చోడుఁడు మొదటి యాతఁడని శ్రీ వీరేశలింగము పంతులుగా రభిప్రాయపడిరి రెండవ చోడుఁడని నా యభిప్రాయము. ఇతనిని వీరేంద్ర చోడుఁ డందురు భీమనమంత్రి ౧౧౭౫ సంవత్సర ప్రాంతమున నీ వెలనాటి చోడునిచే గౌరవము నందెననియు, నప్పటి కాతఁడు ముప్పది సంవత్సరముల యీడుగల వాఁడనియు భావించితి మేని, భీమనమంత్రి జననము క్రీ శ. ౧౧౪౦ ప్రాంతమైయుండును తరమునకు ముప్పది మూఁడు సంవత్సరముల వంతునఁ జూచినచో, ౧౧౭౩ ప్రాంతమున బొల్లనయు ౧౨౧౦ ప్రాంతమున నెఱపోతసూరియు, ౧౨౪౫ ప్రాంతమున సూరనయు, నించుమించుగ ౧౨౮౦ వ సంవత్సరకాలమున మన యెఱ్ఱాప్రెగ్గడయు జన్మించి యుందురని దలంపవలసి యున్నది. శ్రీపంతులుగా రనినిట్లు మొదటి వెలనాటిచోడుఁ డైనచో, నీయంతర మధికమై తరమునకు ౪౫ సంవత్సరముల వ్యవధి యేర్పడి యస్వాభావిక మగును " (నాలుగవ సంపుటము. పుటలు 57, 58)]

కులోత్తుంగరాజేంద్రచోడుఁడే యిందుఁ బేర్కొనఁబడిన వెలనాటిచోడుఁడు, ఈ యంశమును నిర్ణయించుటకు మంచనకవివిరచితమైన కేయూరబాహుచరిత్రము మనకు కొంత తోడుపడుచున్నది. వెలనాటి గొంకరాజుమంత్రి నండూరి గోవిందామాత్యుఁడు, గొంకరాజుపుత్రుడైన వెలనాటిచోడుఁ డనఁ బడెడు కులోత్తుంగరాజేంద్రచోడుని మంత్రి గోవిందామాత్యుని కుమారుఁడైన కొమ్మనప్రధానుఁడు కేయూరబాహుచరిత్రము ప్రథమాశ్వాసములోని యీ క్రింది పద్యములను జూడుఁడు.

మ. 'విహితాస్థానములందుఁ జూపుఁ దగ గోవిందాభిధానప్రభుం
డహితోర్వీధరవజ్రి గొంకవిభురాజ్యాధిష్ఠియై సంధివి
గ్రహముఖ్యోచితకార్యసంఘటన వాక్ప్రౌఢత్వమున్ బాధప
న్నహనోదగ్రరిపుక్షితీశబహుసైన్యధ్వంసనాటోపముఁ. 22

కం. ధీరుం డా గోవిందన
కూరిమినందనుఁడు వెలసెఁ గొమ్మన గొంక
క్ష్మారమణున కుదయించిన
వీరుఁడు రాజేంద్రచోడవిభుప్రెగ్గడయై. 23

సీ. నవకోటిపరిమితద్రవిణ మే భూపాలు
భాండారమున నెప్డు బాయకుండు
నేకోనశతదంతు లే రాజునగరిలో
నీలమేఘంబులలీలఁ గ్రాలు
బలవేగరేఖ నల్వదివేలతురగంబు
లే నరేంద్రునిపాగ నెపుడుఁ దిరుగుఁ
బ్రతివాసరంబు వెబ్బడిమేపుల్ల నే
యేవిభుమందల నెపుడుఁ గల్గు

నట్టి యధికవిభవుఁ డగు కులోత్తుంగరా
జేంద్రచోడనృపతి కిష్టసచివ
తంత్రముఖ్యుఁ డనుఁగుమంత్రి గోవిందనం
దనుఁడు కొమ్మనప్రధానుఁ డొప్పు. 24

ఉ. ఇల వెలనాటిచోడమనుజేంద్రునమాత్యత యానవాలుగాఁ
గులతిలకంబుగా మనిన కొమ్మనప్రెగ్గడకీర్తి మూఁడుం
దెలుపఁగ నేలి తత్త్రిపురాయఁ బ్రతిష్ఠితమైన తటాక దేవతా
విజయమహాగ్రహారతతి నేఁటికి నెల్లెడఁ దాన చెప్పఁగన్ 25

ఆ కాలమునందు నియోగులు రాజునకడ మంత్రులుగా నుండుటయే కాక ఖడ్గతిక్కనవలె దండనాథులుగాఁ గూడ నుండి శత్రురాజులతో యుద్ధములు సహితము చేయుచుండిరి. ఈ కొమ్మనామాత్యునిఁగూర్చి కేయూరబాహు చరిత్రములో వ్రాయఁబడినదానిని చూడుఁడు

మ. అరుదందన్ వెలనాటిచోడమనుజేంద్రాజ్ఞాపనం బూని దు
స్తరశక్తిం జని యేకవింశతిసహస్రగ్రామసంఖ్యాకమై
ధరణిం బేర్చిన పాకనాడు నిజదోర్దండైకలగ్నంబుగాఁ
బరిపాలించె నమాత్యకొమ్మన జగత్ప్రఖ్యాతచారిత్రుఁడై. 27

క. చలముమెయిఁ గటకసామం
తుల కరిహయబహుళసేనతో నేతేఱన్
దలపడియెఁ గొమ్మసచివుఁడు
బలియుండై క్రొత్తచెర్లపరిసరభూమిన్. 28

సీ. సేలకట్టైవాటినఁ జెలఁగి రెంటిని మూటిఁ
గూడ గుఱ్ఱంబులు గుదులుగ్రుచ్చుఁ
బ్రతిమొగం బగు నరపతులకత్తళమునఁ
గడిమిమై పీఁపులు వెడలఁబొడుచు
బందంపుగొఱియలపగిది నేనుంగుల
ధారశుదిగ నసిధారఁ దునుముఁ
జిదియించుఁ బగిలించుఁ జేతులతీఁట వోఁ
వడిఁ గాండ మేసి మావతులతలలు
తల పుడికివేసి మావంతుతలలు శత్రు
రాజశిరములు ద్రొక్కించు రాఁగెఁ దిరుగ
వాగె నుబ్బెడు తన వారువంబుచేత
మహితశౌర్యుఁడు కొమ్మనామాత్యవరుఁడు 29

ఈ కొమ్మనామాత్యునికుమారుఁడైన కేతన వెలనాటిచోడునికుమారుఁడైన పృథ్వీశరాజునకు మంత్రిగా నుండెను. పృథ్వీశరాజు 1163 మొదలుకొని 1187-వ సంవత్సరమువఱకును రాజ్యపాలనము చేసెను. మంచన వీరి నిట్లు వర్ణించెను.

క. 'ఆ కొమ్మన ప్రెగ్గడసుతుఁ
డై కేతన చోడభూవరాత్మజుఁడై డై

రాక్యకరుఁ డగు పృథ్వీశమ
హీ కాంతువిమంత్రి యయ్యె నెంతయుఁ బేర్మిన్. 31

ఉ. కౌశికగోత్రభూసురశిఖామణి కేతన భూవరుండు పృ
థ్వీశనరేంద్రుమంత్రి యయి యెల్లెడఁ జాలఁ బొగడ్త కెక్కె నా
కాశనదీమరాళశివకాశసురాశనతారకేశనీ
కాశతరాధరోచిరవకాశవికాసయశోవిశాలుఁడై. 32

ఈ పృథ్వీశరాజు మనుమసిద్ధితండ్రి యైన తిక్కనృపాలునిచే రణరంగమున సంహరింపఁబడినట్టు నిర్వచనోత్తరరామాయణములోని యీ క్రింది పద్యము చెప్పుచున్నది.

ఉ. 'కేశవసన్నిభుండు పరిగీతయశోనిధి చోడతిక్కధా
త్రీశుఁడు కేవలుండె నృపు లెవ్వరి కాచరితంబు గల్గునే?
శైశవలీలనాఁడు పటుశౌర్యధురంధరబాహుఁడై న పృ
థ్వీశనరేంద్రుమస్తకము నేర్తెఱఁ గందుకకేళి సల్పఁడే?'

ఇది 1187-వ సంవత్సరమునందు జరగి యుండును. అప్పటికి మనుమసిద్ధి తండ్రి యైన తిక్కరా జిరువదియేండ్లలోపలి వయస్సువాఁ డయి యుండును. ఎఱ్ఱాప్రెగడ ౧౨౮౦-వ సంవత్సరప్రాంతములయందు జననమొంది ౧౩౫౦-వ సంవత్సరప్రాంతమువఱకును జీవించి యుండును. ప్రోలయవేముని యనంతరమున నీతఁడు జీవించి యుండిన పక్షమున వేముని పుత్రుఁడైన యనపోతనయాస్థానమున నీతఁడు కవిగా నుండక యన్యులాస్థానకవులుగా నుండుట తటస్థింపదు. అనపోతనయాస్థానమునందు వెన్నెలకంటివారు కవులుగా నుండి యాతనికిఁ బ్రబంధము లొసంగినట్టు విష్ణుపురాణములో నీ క్రిందిపద్యమునఁ జెప్పఁబడినది.

ఉ ఈ నిఖిలంబు మెచ్చ నమరేశ్వరదేవుఁడు చూడఁ గృష్ణవే
ణీనది సాక్షిగా ననికి నిల్చిన రావుతుఁ గేసభూవిభుం
గానకుఁ దోలి వెన్నడిచి కాచిన వేమనయన్నపోతభూ
జానికి పత్త్రబంధము లొసంగిన వెన్నెలగంటివారిలోన్.

అనపోతారెడ్డికి ప్రబంధముల నొసఁగిన యాతఁడు వెన్నెలకంటి సూర్యుఁడు ఈ సూర్యకవి యనపోతనయాస్థానమునం దుండి ప్రబంధములు చేయుటయే కాక యనపోతనతండ్రి యైన వేమారెడ్డిచేత నగ్రహారములు పడసినట్లు జక్కన విక్రమార్కచరిత్రములోని యీ క్రింది పద్యము తెలుపుచున్నది.

ఉ. 'వెన్నెలకంటిసూర్యుఁడు వివేకగుణాఢ్యుఁడు వేదశాస్త్రసం
పన్నుఁడు రెడ్డివేమనరపాలకుచేత మహాగ్రహారముల్
గన్న కవీంద్రకుంజరుఁ డకుంఠితతేజుఁడు పెద్దతండ్రిగా
సన్నుతి గన్న సిద్దనకు సంతతదానకళావినోదికిన్'

పోలయవేమారెడ్డియవసానదినము లయందు వెన్నెలకంటి సూర్యుఁడు తదాస్థానకవిగా నుండి యగ్రహారములను బొందుట మొదలయిన వానినిబట్టి విచారింపఁగా నెఱ్ఱాప్రెగడ వేమారెడ్డికాలములోనే పరమపదము నొందెనేమో యని యూహ కలుగుచున్నది. ఎఱ్ఱాప్రెగడ యనవేమారెడ్డి నెఱుఁగకపోవుట కూడ నీ యూహను బలపఱుచుచున్నది. ఎఱ్ఱాప్రెగ్గడకు ముఖ్యాశ్రయుఁడును, అన్న యైన వేమారెడ్డి కీకవి నిచ్చినవాఁడును, అయిన మల్లదండనాథుఁడు గూడ వేమారెడ్డి కాలములోనే లోకాంతరగతుఁ డయ్యెను తమ్ముని మరణానంతరమున వేమారెడ్డి తన ప్రియానుజన్ముఁ డైన మల్లారెడ్డికి పుణ్యముగా నమరావతీపట్టణములోని యమరేశ్వరాలయశిఖరమున స్వర్ణకలశముల నెత్తించెను. ఎఱ్ఱాప్రెగడజననమరణకాలములనుగూర్చి పైని వ్రాయఁబడినవి సంభావ్యము లైన యూహలే కాని సరిగా నిర్ధారితము లైన పరమ సిద్ధాంతములు కావు [భారతా రణ్య పర్వశేష, నృసింహపురాణ, రామాయణ, హరివంశములనేగాక యెఱ్ఱాప్రెగడ 'కవి సర్పగారుడ' మను ఛందో గ్రంథమును వ్రాసినట్లు ఆనంద రంగరాట్ఛందమునం దుదాహృతము లైన పద్యములనుబట్టి తెలియుచున్నది. కాని యట్లూహించుటకుఁ దగిన ప్రమాణములు లేవు.

ఎఱ్ఱాప్రెగడయును, తిక్కనయు సమకాలీనులనియు తిక్కన భారతమును రచింపఁ బూనుటకు ముందే ఎఱ్ఱాప్రెగడ '(నన్నయ) తద్రచనయకా' నరణ్యపర్వమును పూరించి, రాజరాజనరేంద్రుని కంకిత మిచ్చెననియు,

అరణ్యపర్వము సమగ్రముగా నుండుటచేతనే తిక్కనయు, మారనయు భారతమున మూఁడు పర్వములను నన్నయభట్టు రచించెనని చెప్పియున్నా రనియు నిటీవలఁ గొందఱు తలంచుచున్నారు. రెడ్డిరాజుల యాశ్రయము లభింపక పూర్వమే భారతారణ్యపర్వము పూరింపఁబడుటచే, దాని నెఱిఁగియే తిక్కన మూఁడు పర్వములు నన్నయ కృతములని చెప్పుటయు, తాను విరాటపర్వమునుండి తెలిఁగింపఁ బ్రారంభించుటయుఁ గుదురదు. ఎంత ప్రయత్నించినను, తిక్కన గతించిన నాఁటి కెఱ్ఱాప్రెగడ జన్మిఁచెనని చెప్పుటకును ప్రబల ప్రమాణములు లభించుట కష్టము]

ఈ కవి రచించిన భారతపద్యము లీ వఱకే యుదాహరింపఁబడి యున్నందున, తక్కిన పుస్తకములశైలికూడఁ దెలియుటకయి వానినుండి కూడ రెండేసి పద్యముల నుదాహరించుచున్నాను

ఎఱ్ఱాప్రెగడ రామాయణము

మ. చెఱకుందోటలఁ బెంచి శాలిమయసుక్షేత్రస్థలు ల్పెంచి య
క్కఱ లేకుండగఁ బూగనాగ లతికాకాంతారము ల్ప్రోచి యే
డ్తెఱ నంతం గుముదోత్పలాళి వనవాటీకోటిఁ బాటించి పై
నైఱవు ల్వోవఁ బురంబునర్దెనలఁ బ్రస్ఫీతాంబుపూర్ణస్థితిన్.

ఉ. కోఱలు నుగ్గు నుగ్గయిన క్రూరఫణీంద్రుగతిం దరంగముల్
మాఱిన భూరివారిధిక్రమంబున రాహుకరాళవక్త్రమున్
దూఱిన తీవ్రభాను క్రియ దుర్బలసైన్యతఁ బుత్రహీనతన్
గీఱి పరాభవాధిగతిఁ గీడ్పడి భూపతి నెమ్మనంబునన్.

హరివంశము

ఉ. ఏ నిటు ప్రాణరక్షకయి యెంతయుఁ బాపము చేసి గర్వపం
కానవిఘాతినై విను నుదంచితశోకపయోధి ముంచితిం

బూవిన మత్కృతం బఖిలమున్ వృథ యయ్యె విధాతచెయ్వు లె
వ్వానికి మాన్పఁగా నకట ! వచ్చునె మానుషతుచ్ఛయత్నతన్.
పూర్వ. ఆ. ౫

శా. పాపాత్ముం డగు దైత్యుచేఁ బడిన మీపాటంతయుం జెప్పఁగాఁ
గోపం బుత్కటమై మనంబునను సంక్షోభంబు ప్రాపించె మ
ద్రూపం బొంఁడొకభంగి మీకు నిటులై తోఁచెన్ భవన్మంజులా
లాపంబుల్ ప్రకృతిస్థుఁ జేసె నను నుల్లాసంబుతోఁ గ్రమ్మఱన్.
ఉ ఆ. ౪

నృసింహపురాణము

చ. సురుచిరపానపాత్రమున సుందరి యొక్క తె కేల నిండు చం
దురుఁడు ప్రకంపితాంగకముతోఁ దిలకించెఁ దదాననాంబుజ
స్ఫురితవికాసవైభవము సొంపు లడంకువ ముచ్చలింపఁ జె
చ్చెరఁ జనుదెంచి పట్టువడి చేడ్పడి భీతి వడంకుచాడ్పునన్.

చ. ఇదె చనుదెంచెఁ జైత్రుఁడని యెల్లవనంబులకుం బ్రమోదముల్
పొదలఁగ మేలివార్తఁ గొని బోరన వచ్చిన దాడికాఁడనన్
మృదువన దేవతాముఖసమీర మెదుర్కొన నుల్లసిల్లె నిం
పొదవఁగ దక్షిణానిల మనూనమనోహరఖేలనంబునన్.

ఈ నృసింహపురాణముమాత్రము నరాంకితము చేయక యెఱ్ఱాప్రెగడ యహోబలస్వామి కంకితముచేసి యున్నాఁడు. ఈ క్రింది దా పురాణము లోని మొదటి పద్యము——

ఉ. 'శ్రీకి నిరంతరంబు కడుఁ జెన్నెసలారెడు రాగలీల ను
త్సేకముఁ బొంది యొప్పు తనచిత్తము చూపెడుమాడ్కి నిత్యర
మ్యాకృతి యైన కౌస్తుభము నక్కుపయిం బచరించు నుత్తమ
శ్లోకుఁ డహోబలేశుఁ డతిలోకుఁడు లోకముఁ గాచుఁగావుతన్.

భారతమును తెనిగించిన కవుల విట్లు వరుసగాఁ జెప్పుటచేత నన్నయభట్టారకునికిని, ఎఱ్ఱాప్రెగడకును మధ్యకాలమునందు తెలుఁగు కవులెవ్వరును లే రని భ్రమింపఁగూడదు. అథర్వణాచార్యుఁడు, భీమకవి, రంగనాథుఁడు, భాస్కరుఁడు, కేతన, మారన, పెద్దన మొదలయినవారి మధ్యకాలములో ననేకు లున్నారు.* వారిని గుఱించి కూడ సంగ్రహముగా నిఁకమీఁద వ్రాయుచున్నాము.

ఎఱ్ఱాప్రెగడ తన నృసింహపురాణమునందు నహితము నన్నయతిక్కనలనే పూర్వకవులనుగాఁ జెప్పియున్నాఁడు—

ఉ. భాసురభారతార్థములభంగుల నిక్క మెఱుంగ నేరమిన్
గాసట బీసటే చదివి గాథలఁ ద్రవ్వు తెనుంగువారికిన్
వ్యాసముని ప్రణీతపరమార్థము తెల్లఁగఁ జేసినట్టి యా
శ్వాసనకల్పులం దలఁతు నాద్యుల నన్నయతిక్క నార్యులన్. (పీఠిక - 9)

* (వీరి పౌర్వాపర్యముం గూర్చి యాయా సందర్భములందు వివరింపఁబడును.)

పావులూరి - మల్లన

ఇతఁడు తెనుఁగున గణితశాస్త్రమును రచించిన మహాకవి. ఇతఁడు నియోగి బ్రాహ్మణుఁడు; శివ్వన్నపుత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; గార్గ్యగోత్రుఁడు గోదావరిమండలములోని పావులూరి * గ్రామమునకు కరణము. గద్యము లోని "పావులూరి మల్లనామాత్య విరచితంబైన దశగణితశాస్త్రంబునందు" అన్న వాక్య మితఁడు నియోగి యని తెలుపుచున్నది. తక్కిన యంశము లనేకము లీ తనిగణితములో నీ పద్యమునఁ జెప్పఁబడినవి.

క. 'ఇలఁ గమ్మనాఁటిలోపల
విలసిల్లిన పావులూరివిభుఁడను సూత్రా
కలితాపస్తంబద్విజ
కులతిలకుఁడ వినుతగార్గ్యగోత్రోద్భవుఁడన్.'

ఈ పావులూరి గణితము మహావీరాచార్యులవారి సంస్కృతగణితసార సంగ్రహమునకు బాషాంతరీకరణము. ఇందలి పద్ధతులు మాత్రమే పయి గ్రంథమునుండి తెలిఁగింపఁబడినవి గాని లెక్క లన్నియు మల్లనార్యునిచేత స్వతంత్రముగాఁ గల్పింపఁబడినవేః ఈ పావులూరి గణితము గాక ప్రతాప రుద్రుని కాలములో రచియింపఁబడిన సూత్రగణిత మొకటియు, అచ్యుత దేవరాయని కాలములో వల్లభామాత్యకవిచేఁ దెలిఁగింపఁబడిన లీలావతి గణితమును, వేంకటేశగణితమును. ఎలుగంటి పెద్దనార్యుని ప్రకీర్ణగణితమును, తెలుఁగునందుఁ గలవు.

పావులూరి మల్లన తన గ్రంధమునఁ బూర్వకవుల నెవ్వరిని స్తుతించియుండ లేదు. ఈ కవి నన్నయభట్టుతోడి సమకాలికుఁ డయినటుల కనఁబడు

[* ఇది గోదావరి మండలములోనిది కాదు; కమ్మనాఁటిలోనిది కాన, గుంటూరు జిల్లా బాపట్ల తాలూకాలోనిది. (చూ. ఆంధ్రకవితరంగిణి పు. 204)]

చున్నాఁడు. ఈ కవి తనకు రాజనరేంద్రుఁడు పిఠాపుర సమీపమున నున్న నవఖండవాడ యను గ్రామము నిచ్చినట్లుగా నీ క్రింది పద్యములయందుఁ జెప్పుకొన్నాఁడు

ఉ. శ్రీనిలయుండు శివ్వనను జిమ్మనను న్మతి సూర్యదేవునిన్
ధీనిధిఁ బోలయార్యునిని దేజమునన్ రవితుల్యులైన యా
సూనుల నల్వురం బడసె సూరిజనస్తుతసత్యభారతీ
జ్ఞానులఁ బద్మగర్భువదనంబులు నాలుగుఁబోల వారిలోన్.

ఉ. శ్రీలలనేశుఁ డాంధ్రనృపశేఖరుఁడై చను రాజరాజభూ
పాలకుచేతఁ బీఠపురిపార్శ్వమునన్ నవఖండవాడ యన్
ప్రోలు విభూతితోఁ బడసి భూరిజనస్తుతుఁడైన సత్కళా
శీలుఁడ రాజపూజితుఁడ శివ్వనపుత్రుఁడ మల్లనాఖ్యుఁడన్.

ఇందలి మొదటి పద్యము నప్పకవి తద్భవవ్యాజవిశ్రమమున కుదాహరణముగాఁ గైకొని యున్నాఁడు. దీనినిబట్టియే యితఁడు లాక్షణికకవి యని వేఱుగఁ జెప్ప నక్కఱలేకయే తెలిసికోవచ్చును. రాజనరేంద్రునికాలములోనే నన్నయభట్టు గాక యిట్టి కవిత్వమును జెప్పఁగల కవు లితరు లుండుటచేత నాంధ్రకవిత్వమునకు నన్నయభట్టారకుఁడు మొదటివాఁడు కాఁడనియు, అతనికాలమునందును నంతకుఁ బూర్వమునందును తెనుఁగుకవు లుండిరనియు, వా రట్టి కవిత్వమును జెప్పుటకుఁ గావలసిన లక్షణ గ్రంథములా వఱకే యుండిన వనియు, స్పష్ట మగుచున్నది. ఆ కాలమునందును, దత్పూర్వమునందును నుండిన తెనుఁగుకవులలోఁ దమ గ్రంథములందు మొట్టమొదట దేవతాస్తుతి నొక్క సంస్కృతశ్లోకములోఁ జేసి తరువాత దెనుఁగు పద్యముల నారంభించుట యాచారముగా నున్నట్టు కనఁబడుచున్నది. ఆ కాలమున గ్రంథములోఁ గవిస్తుతిని జేయుట లేదు; కృతిపతినిగూర్చి షష్ఠ్యంతపద్యములను జెప్పుట లేదు. ఈ యాచారము తిక్కనకాలమువఱకును వచ్చినది. తిక్కన తన నిర్వచనోత్తరరామాయణములోఁ బూర్వుల పద్ధతినే

యనుసరించినను, భారతమున నూతనమార్గమును ద్రొక్కి గ్రంథాదిని తెలుఁగు పద్యముచే వేసి కవిస్తుతియు స్వప్నగాథయు, షష్ఠ్యంతపద్యములును జేర్చినాఁడు. గతానుగతికులయి కవులందఱును బిమ్మటఁ దిక్కనచూపిన త్రోవనే నడుచుచున్నారు పావులూరిగణితమునందు మొదట నీ క్రింది శ్లోకమును, పద్యములును నున్నవి.

శ్లో॥ శ్రీకంఠం సగుణం సమస్తజగతాం కర్తార మీశం గురుమ్
భూతోయానలచంద్రసూర్యపవనవ్యోమాత్మమూర్తిం విభుమ్
నిత్యానందమయో పయో గిరిజయా సార్ధం ప్రజావృద్ధయే
మాయాయోగ ముపైతి తం శివకరం వందే శివం శ్రేయసే.

క. ప్రణమిల్లి శివుని కీర్తియ
నణిమాదిగుణాస్పదునకు నభినవస ఖ్యా
మణిదీప్తిసారసంగ్రహ
గణితసముద్రంబుఁ దఱియఁ గడఁగితిఁ బ్రీతిన్.

శా. అర్కాదిగ్రహపంచకగ్రహణకాలాన్వేషణోపాయమున్
దర్కవ్యాకరణాగమాదిబహుశాస్త్రప్రోక్తనానార్థసం
పర్కాదివ్యవహారమున్ భువనరూపద్వీపవిస్తారమున్
దర్కింపన్ గణితప్రవృత్తి వెలిగాఁ దార్కొం డెఱింగించునే?

క. కావున గణితముఁ దెనుఁగునఁ
గావింపఁగఁ గణఁగితి సుకవిమల్లుఁడ గౌ
రీవల్లభచరణసరో
జావాసితచిత్తమధుకరాత్మకుఁడ జగతిన్.

ఈ ప్రకారముగా మొదట శ్లోకముతోఁ జేయఁబడిన పూర్వగ్రంథము లిప్పటికి నన్నయకృతభారతమును, భాస్కరరామాయణమును, నిర్వచనోత్తరరామాయణమును, ఈ పావులూరిగణితమును గనఁబడుచున్నవి. ఈ పుస్తకమునుండి శైలిని జూపుట కొక పద్యము నుదాహరించుట దక్కఁ గవినిగూర్చి వ్రాయఁదగిన దేదియుఁ గనుపట్టదు.

చ. చెలికి షడంశమున్ బ్రియకు శేషములోపలఁ బంచమాంశమున్
బొలుపుగ దానిశేషమున బోదకు నాలవపాలు నిచ్చి యం
దులఁ దన పాలు దాఁ గొనియెఁ దొమ్మిదిజేనలు రాజహంస మీ
నలినమృణాల మెంత సుజనస్తుత! మా కెఱుఁగంగఁజెప్పుమా.

నే నీ కవిచరిత్రమును వ్రాసి ప్రచురించిన తరువాత కొందఱు రాజరాజ నరేంద్రుఁడు నవఖండవాడ యిచ్చినది గణితము చేసిన మల్లనకుఁ గాదనియు నాతని తాత యైన మల్లన కనియు వార్తాపత్రికలలో వ్రాసి యున్నారు అందుచే నే నీ సంవత్సరమునందు బెంగుళూరికిఁ బోవునప్పు డొక దినము చెన్నపురిలో నిలిచి ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారమునకును నాంధ్రసాహిత్య పరిషత్పుస్తకభాండాగారమునకు బోయి యం దున్న పావులూరిగణితములను జదివితిని ఆంధ్రసాహిత్య పరిషత్పుస్తకభాండా గారములోని ప్రతులలో నొకదానియందు

ఉ. 'శ్రీలలనేశుఁ డాంధ్రనృపశేఖరుఁ డై చనురాజరాజభూ
పాలకుచేతఁ బీరపురపార్శ్వమున న్నవఖండవాడ యన్
ప్రోలు విభూతితోఁ బడసె భూరిజనస్తుతుఁ డై నసత్కళా
శీలుఁడు రాజపూజితుఁడు శివ్వనపుత్రుఁడు మల్లఁ డున్నతిన్.

క. గోత్రపవిత్రుఁడు సద్గుణ
పాత్రుం డగు శివ్వనకును బతిహితశుభచా
రిత్రారుంధతి గౌరమ
ధాత్రీసతి కిరువురకును దనయుండ జగతిన్.'

అనియు, నింకొకప్రతియందు

ఉ 'శ్రీలలనేశుఁ డాంధ్రనృపశేఖరుఁడై ... .
.. . . . సివ్వనపుత్రుఁడు మల్లఁ డున్నతిన్.

ఉ. శ్రీనిలయుండు సివ్వనయుఁ జిమ్మనయుం గుణసూర్యదేవుఁడున్
ధీనిధి ప్రోలనార్యుఁడును దేజమునన్ రవితుల్యులైన యా
సూనుల నల్వురం బడసె సూరిజనస్తుతు లైన సత్యవి
జ్ఞానులు పద్మగర్భవదనంబులు నాలుగుఁబోలువారిలోన్,

క. గోత్రపవిత్రుఁడు సద్గుణ
పాత్రుఁడు శివ్వనకు మిగులఁ బతిహితశుభచా
రిత్రారుంధతిగౌరమ
ధాత్రీసతి యిద్దఱికిని దనయుఁడ జగతిన్.'

అనియు నున్నది. ఇందు మొదటి ప్రతిలోని పాఠమునుబట్టి రాజనరేంద్రునిచే నగ్రహారమును బడసినవాఁడు గణితశాస్త్రకర్త యైన పావులూరి మల్లనయే యని స్పష్టముగాఁ గానవచ్చుచున్నది. రెండవ ప్రతిలోని పాఠమును బట్టి గణితశాస్త్రకర్త యైన మల్లనతాత యగ్రహారమును బడిసినట్టు కనబఁడుచున్నది ఈ రెండు పాఠములలో మొదటిపాఠమే సరియైనదని నా యభిప్రాయము గణితశాస్త్రవేత్తయు లాక్షణికకవియు నైన మల్లనకే రాజరాజనరేంద్రుఁ డగ్రహారము నిచ్చి యుండును గాని ప్రసిద్ధుండు గాని మల్లన కూరక యిచ్చి యుండఁడు. ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారములో నున్న ప్రతులలోని పాఠము రెండవప్రతిలో నున్నట్లే యున్నది. ఎక్కువ ప్రతులలోని ట్లుండుటచేత గణితమును రచియించినకవి యగ్రహారమును సంపాదించిన మల్లనమనుమఁడే యనుకొన్నను, అగ్రహారమిచ్చినది ౧౦౩౦ వ సంవత్సరప్రాంత మయినపక్షమున నటుతరువాత ముప్పది నలువది సంవత్సరములకుఁగా ౧౦౬౦-౭౦ సంవత్సర ప్రాంతములయందు గణితశాస్త్రకర్త యాయిన పావులూరి మల్లన యుండి యుండును. *

[* 'శివ్వనపుత్రుఁడు మల్లఁడున్నతిన్' అను పాఠమే సరియైనదనియు, రాజరాజు వలన నఖండవాడఁ బడసినది గణితశాస్త్రకర్త కాక, యతని తాతయే యనియు, మనుమఁడగు మల్లన క్రీ. శ 1100 ప్రాంతము వాఁడనియు విమర్శకుల యాశయము మతియుఁ బద్యమునఁ జెప్పఁబడిన రాజరాజు, రాజనరేంద్రుఁడని చెప్పుటకుఁ దగిన యాధారములు లేవనియు, అఖండవాడ వెలనాఁటి చోడరాజగు పృథ్వీశ్వరుచే కుంతీమాధవస్వామికి సమర్పింపఁబడినట్లు క్రీ. శ 1186 లోని శాసనము వలనఁ దెలియవచ్చుచున్నదనియు, పైఁది పద్యము సరిగా నుండలేదనియు, 'తెనుఁగు కవుల చరిత్ర'లోఁ జెప్పఁబడియున్నది. (పుట. 282) మల్లన, నన్నయ కించుమించుగఁ దొంబదియేండ్ల తర్వాతి వాఁడని శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్యగారనుచున్నారు ఈ 'పావులూరి-మల్లనకవి'యుఁ దిక్కనకు ముందురావలసిన వాఁడు.]

ఈ పావులూరిమల్లన భద్రాద్రిరామశతకమును కూడ రచియించి నట్లు చెప్పుదురు గాని తండ్రులు వే ఱగుటచేత భద్రాదిరామశతకమును రచియించిన పావులూరిమల్లన వే ఱొకఁ డని తోఁచుచున్నది. ఈ మల్లనతండ్రి పేరు సివ్వన్న; రెండవ పావులూరిమల్లన తండ్రి పేరు రామన్న యని శతకములోని యీ క్రింది పద్యమునం దున్నది.

క. శ్రీమహితపావులూరిసు
ధాముఁడ రామన్నమంత్రి తనయుఁడఁ గవిసు
త్రాముఁడ మల్లనసచివుఁడ
శ్రీమద్భద్రాద్రి ధామ శ్రీరఘురామా!

నన్నెచోడకవి

* నన్నెచోడదేవుఁ డనెడి యీ కవి తెలుఁగున కుమారసంభవ మనెడు పంద్రెండాశ్వాసముల కావ్యమును రచియించెను. ఈ గ్రంథములోని మొదటి యే డాశ్వాసములను ౧౯౦౯-వ సంవత్సరమునందు బ్రహ్మశ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు మొదటిభాగము గాఁ బ్రకటించి యాంధ్ర ప్రపంచమునకు మహోపకారము చేసిరి. వా రా పుస్తకముయొక్క పీఠికలో నీ కవి కవిత్వప్రౌఢిమనుబట్టి కవిరాజ శిఖామణియనియు, దిగ్విజయమును బట్టి టెంకణాదిత్యుఁ డనియు, బిరుదములు గలవాఁ డయ్యెననియు, కావేరీ తీరమున నొరయూ రను పట్టణము రాజధానిగా గోదావరీ, సింహళమధ్య దేశము నేలె ననియు. క్రీ. శ. ౯౪౦ లోఁ బాశ్చాత్యచాళుక్యులతో యుద్ధము చేసి రణరంగమున నిహతుఁ డయ్యెననియు, వ్రాసిరి. ఈ కవి కవిరాజ శిఖామణి యన్నపేరును తానే పెట్టుకొనెను. గ్రంథాదియందే యవతారికలో నున్న యీ పద్యమును జూడుఁడు.

చ. "రవికులశేఖరుండు కవిరాజశిఖామణి కావ్యకర్త స
త్కవి భువి నన్నెచోడుఁడఁట! కావ్యము దివ్యకథం గుమారసం
భవమఁట! సత్కథాధిపతి భవ్యుఁడు జంగమమల్లికార్జునుం
డవిచలితార్థయోగధరుఁడట్టె! వినం గొనియాడఁ జాలదే?"

[ఆ-౧-౩౪]

ఇతఁ డాత్మస్తుతియందు కొంచె మిష్టము గలవాఁడు. సూర్యవంశపురాజులైన భగీరథుఁడు, రాఘవుఁడు మొదలయిన పూర్వులతోఁ దాను సమానుఁడ

* కాలమునుబట్టి నన్నెచోడకవి తిక్కనాదులకంటె ముందు రావలసినవాఁడు. కాని శ్రీ వీరేశలింగము పంతులుగారు తొలుతఁ గవిత్రయము యొక్కయుఁ, బిదప ౧౧-వ శతాబ్దివాఁడని తాము భావించిన పావులూరి మల్లనయొక్కయు చరిత్రము లను వివరించిన పిదపనే నన్నెచోడునిగూర్చి వ్రాయఁ బ్రారంభించిరి. క్రమముతప్పక భారతకవుల చరిత్రమును దెల్పఁదలఁచియే ఆయన తిక్కన, యెఱ్ఱనల చరిత్రములను ముందుగాఁ జెప్పియుండవచ్చును.

నని యీకవి తన కుమారసంభవములో నీక్రిందిపద్యమునఁ జెప్పుకొని యున్నాఁడు——

సీ. కుతలంబు నడుకొనఁ గొలకొండగా నిల్పి
శరనిధి గ్రొచ్చిరి సగరసుతులు
మిన్నులపైఁ బాఱుచున్నయేఱులఁ దెచ్చి
వారాశి నించె భగీరథుండు
గోత్రాచలము లెత్తికొని వచ్చి కడచన్న
రత్నాకరముఁగట్టె రాఘవుండు
జలధి మహీపతిమొలనూలుగాఁ జుట్టి
పాలించెఁ గరిఁగరికాలచోడు

గీ వరుస నిట్లు సూర్యవంశాధిపతు లంబు
నిధియ మేర గాఁగ నిఖిలజగము
నేలి చనినవారి కెనవచ్చు సుశ్లాఘ
ధనుఁడ, నన్నెచోడజనవిభుండ. [ఆశ్వా. ౧-౫౨]

దీనిక్రిందిపద్యములోనే తన తండ్రియైన చోడబల్లి పాకనాటి యం * దిరువది యొక్కవేయిటి కధీశుఁ డని కవియే చెప్పి యుండుటచేత నాతనికొడుకయిన నన్నెచోడుఁడును పాకనాటిలోఁ గొంతభాగమునకు ప్రభు వగుట స్పష్టము.

చ. 'అరినరపాలమౌళిదళితాంఘ్రియుగుం డయి పాకనాటియం
దిరువదియొక్కవేయిటి కధీశుఁడు నాఁ జను చోడబల్లికిం
జిరతరకీర్తి కగ్రమహిషీతిలకం బన హైహయాన్వయాం
బరశశిరేఖ యైన గుణభాసిని శ్రీసతికిం దనూజుఁడన్.'

[ఆ ౧-౫౩]

ఈ పద్యముతరువాత నున్న యీక్రింద పద్యములోనే కవి తా నొరయూరి పురాధిపుఁ డన్నకథను జెప్పుకొని యున్నాఁడు.

[* ఇయ్యది జనసంఖ్యకాని, గ్రామసంఖ్య కాదని 'ఆంధ్రకవితరంగిణి' పుట 160)]

క. 'కలుపొన్నవిరులు పెరుగం
గలుకోడిరవంబు దిశలఁ గలయఁగఁ జెలఁగన్
బొలుచు నొరయూరి కధిపతి
నలఘుపరాక్రముఁడఁ డెంకణాదిత్యుండన్.' [అ ౧-౨౪]

ఈ పద్యము మొదటినుండియు నద్భుతకల్పనముగాఁ గనఁబడుచున్నది. ఆ యూరిలో రాతిపొన్న చెట్లు పువ్వులతోఁ బెరుగుచున్నవఁట! రాతికోళ్ళు దిశలు మాఱుమ్రోయునట్లుగా కూయుచుండునఁట! ఆహా! ఏమి యా యూరి మాహాత్మ్యము!

పూర్వము చోళరాజు లెవ్వరో కావేరీతీరమున తిరుచునాపల్లికి సమీపమునం దున్న యొరయూరు రాజధానిగా రాజ్యపాలనము చేసినందునఁ దరువాతి చోళరాజశాఖలలోనివా రందఱు నొరయూరిపురాధీశ్వరుల మని చెప్పుకొనుట యాచార మయి యున్నది. ఈ యాచారము ననుసరించియే నన్నెచోడుఁడును నొరయూరి కధిపతి నని చెప్పుకొనెను. రాజ్యపరిమితినిగూర్చి పుస్తకములో నింతవఱ కాధారము లున్నవి అంతకంటె నెక్కువగాఁ జెప్పినచో దానికి బలవత్ప్రమాణము లున్నఁ గాని విశ్వాసార్హము కాదు. ఈ కవి గోదావరిసింహళమధ్య దేశము నేలె ననువారు తమ వాక్యమున కాధారములైన ప్రమాణములను జూపి ఋజువుచేయవలెను. మన కిప్పటికిఁ దెలిసినంతవఱ కా కథనము నిరాధార మయి యవిశ్వసనీయ మైనదిగాఁ గనుపట్టుచున్నది. ఈతని దిగ్విజయములును గోదావరీసింహళ మధ్యదేశ పాలనమువంటివే. ఇఁక నీ కవియొక్క కాలనిర్ణయము చేయవలసి యున్నది. ఈ కాలనిర్ణయమునకు సాధారణముగా పుస్తకములలో మూఁడు నాలు గాధారములుండును. అం దొకటి కవివంశానువర్ణనము. అది యీ పుస్తకమునందు లేదు. కవి చోడబల్లి యని తనతండ్రి నొక్కనిని జెప్పుటయే కాని తత్పూర్వుల నెవరినిఁ బేర్కొనలేదు. చోళులచరిత్రమునందు చోడబల్లు లెందఱో కనఁబడుచున్నారు. వారిలో నీతని తండ్రి యెవ్వరో యీ పుస్తకమువలనఁ దెలియదు. రెండవది కృతిపతివంశవర్ణనము. అదియు

నీ పుస్తకమునందు లేదు. జంగమమల్లికార్జునుని నొక్కనిని మాత్రమే కృతిపతినిగాఁ జెప్పెను గాని కవి తత్పూర్వుల నెవ్వరిని వర్ణించి యుండ లేదు. బల్లిచోడులవలెనే మల్లికార్జునులును ననేకు లున్నారు. వారిలో కృతిపతి యే మల్లికార్జునుఁడో చెప్పుట సులభసాధ్యము కాదు. గ్రంథ సంపాదకు లైన రామకృష్ణకవిగారు తమ పీఠికలో ముగ్గురు జంగమమల్లి కార్జునులను పేర్కొని వారిలో భృంగిరిటియవతార మగు పండితారాధ్య మల్లికార్జునుఁడు కాఁ డనియు, శైవాచారగురుపరంపరలో వానప్రస్థాశ్రమ వర్తి యగు యోగిమల్లికార్జునుఁడు కాఁ డనియు, మొదటి యిద్దఱిని నిరాకరించి మూఁడవవా డయిన కాలాముఖమల్లికార్జునుఁడు కావచ్చునని యంగీకరించిరి. మూఁడవది పూర్వకవిప్రశంస ఈ పుస్తకమునందదియుఁ గానఁబడదు. కవి వాల్మీకి, వ్యాసుఁడు, కాళిదాసుఁడు, భారవి, భాణుఁడు మొదలయిన సంస్కృతకవులను కొందఱిని ప్రశంసించి తెలుఁగుకవులను విడిచిపెట్టెను. అయినను సంస్కృతకవులను బేర్కొన్నతరువాత

క. మును మార్గకవిత లోకం
బున వెలయంగ దేశికవితఁ బుట్టించి తెనుం
గు నిలిపి రంధ్రవిషయ*ము న
జనసత్యాశ్రయుని తొట్టిచాళుక్యనృపుల్. [ఆ ౧-౨౩]

అను పద్యమును, దానితరువాత

చ. సురవరులం గ్రమంబున వచోమణి సంహతిఁ బూజచేసి మ
ద్గురుచరణారవిందములకుం దగ సమ్మతిఁజేసి కొల్చి వి
స్తరమతులం బురాణకవిసంఘము నుత్తమమార్గ తత్కవీ
శ్వరులను దేశిసత్కవుల సంస్తుతిఁ జేసి మనోముదంబునన్. [ఆ ౧ - ౨౪]

[* యం, బునఁ జనఁజాళుక్యరాజు మొదలుగాఁ బఱువుర్. అనునది సరియైన పాఠము]

అను పద్యమును పుస్తకములోఁ గానఁబడుచున్నవి. ఈ పద్యములోఁ గవి చెప్పిన దేవతాస్తుతియు, గురువందనమును, పురాణకవిప్రశంసయు, సంస్కృతసత్కవీశ్వరస్తోత్రమును పుస్తకములోఁ గానఁబడుచున్నవి కాని దేశిసత్కవుల సంస్తుతిమాత్రము కనఁబడకున్నది దేశిసత్కవులను స్తుతింపనిది స్తుతించితి నని కవి యబద్ధమువ్రాసి యుండఁడు. అందుచేత "మును మార్గకవిత" యను పద్యమునకును "సురవరులన్" అను పద్యము నకును నడుమను తెలుఁగుకవులను స్తుతించిన పద్య మొకటి యుండి యుండవలెను మాతృకను జూచి ప్రతికను వ్రాసిన లేఖకుని ప్రమాదము వలననో, మాతృకను లిఖించినవాని లోపమువలననో యా పద్యము విడిచి పెట్టఁడి యుండును. * ఆ పద్యమే యుండియుండిన యెడలఁ గవికాలము కొంతవఱకుఁ దెలిసి యుండును. ఈ కుమార సంభవమునందే దశమా శ్వాసమున పుత్రోత్సవసందర్భమున బృహస్పతి శివుని స్తుతించి చెప్పిన దారిద్ర్యవిద్రావణపద్యదశకములోని మొదటిదైన యీ పద్యమునందు రామేశ్వరకవి యొకఁడు పేర్కొనఁబడి యున్నాఁడు

శా. శ్రీరామేశకవీశ్వరాదు లెద నీశ్రీపాదము ల్భక్తితో
నారాధించి సమస్తలోకసముదాయాధీశులై రన్నసం
సారుల్ దుఃఖనివారణార్థ మభవున్ సర్వేశు లోకత్రయా
ధారున్ నిన్ మదిఁ గొల్వకున్కి యుఱవే దారిద్ర్యవిద్రావణా!'

[ఆ ౧౦ - ౬౦]

ఈ రామేశకవీశ్వరుఁడు కవికాలమునాఁటికె ప్రసిద్ధుఁ డయి యుండిన శివభక్తుఁడైన యాంధ్రకవి యయి యుండును. పయి పద్యములోఁ బ్రథమపాదమున 'కవీశ్వరాదు లెద' యనుచోటు "కవీశ్వరాదు లెద్ద",

[* పయి రెండు పద్యములకును నడుమ దేశిసత్కవుల స్తుతి రూపమగు పద్య ముండవలెనని భావింపనక్కఱలేదనియు, 'మునుమార్గకవిత' అను పద్యముననే దేశి సత్కవులునుతింపఁబడినట్లు భావింపవచ్చుననియు, ఇంతకును లభింపని పద్యమును గూర్చి యాలోచించినఁ బ్రయోజనము లేదనియు, అట్టి పద్య మొక్కటి యుండి తీరవలయునని నిశ్చయముగాఁ జెప్పుటకును తగిన యాధారములు లేవనియు 'ఆంధ్ర కవి తరంగిణి' యందుఁగలదు. [చూ. పుట. 165.]

్యని వేసి సంపాదకులు డకారమును దేలఁ బలుకవలయు నని పుట యడుగున నొక టిప్పణము వ్రాసిరి గణభంగము కలుగకుండ సాధారణ మైన 'యెద' యనురూపమును వేయక గ్రంథము పురాతన మైన దని చూపుటకుఁ దక్క నసాధారణమైన 'యెద్ద'యనురూపమును వేసి యెద్దలోని యెకారము లఘు వగు నని చూపుట కేల ప్రయాసపడ వలెను. [రామేశ్వర కవిని గూర్చి 'కవితరంగిణి' లో నిట్లు వ్రాయబడినది

[' రామేశ్వరకవి కవికాలము నాఁటికిఁ బ్రసిద్ధుఁడై యుండిన యాంధ్ర కవియై యుండును' అని శ్రీ వీరేశలింగము పంతులుగారు వ్రాసియున్నారు. ఇతఁడాంధ్రకవి యనుట కాధారములు లేవు. ఏ భాషాకవియో చెప్పఁజాలము. కుమార సంభవకావ్యమునకు విమర్శనము వ్రాసిన శ్రీపాద లక్ష్మీపతి శాస్త్రులుగారీపద్యమున రామేశ్వరకవి ప్రశంసయే లేదని యభిప్రాయపడి యున్నారు శ్రీ మల్లూరు వేంకటరామయ్యగారు భారతి (వృష-శ్రావణము) లో కాకతీయ - రెండవ బేతరాజునకును, నాతని కుమారుఁడును, దారిద్ర్యవిద్రావణ బిరుదాంచితుఁడునైన త్రిభువనమల్ల దుర్గరాజునకును గురువై, వారిచే నగ్రహారములను గైకొని, కాలాముఖశైవ పరంపరకు సంబంధించిన శ్రీశైల మల్లికార్జున మఠాచార్యుఁడుగ నుండిన రామేశ్వర పండితుఁడే పై పద్యములోఁ జెప్పిన రామేశ కవియై యుండుననియు, నన్నెచోడకవి దారిద్ర్యవిద్రావణ మకుటముతో రచించిన దశకమునకును, త్రిభువనమల్లుని దారిద్ర్య విద్రావణ బిరుదమునకును నేదియో సంబంధ ముండి యుండుననియు వ్రాసియున్నారు. రెండవ బేతరాజువలన రామేశ్వరపండితుఁడు దానమును బరిగ్రహించిన కాలము చాళుక్య విక్రమ శకము ౨౩. [శా శ ౧౦౨౦ క్రీ శ. ౧౦౯౮-౯౯ లా.] ఈ రామేశ్వరపండితుఁడు పండితుఁడే కాని కవియైనట్లాధారములు లేవు. పై పద్యములో నీ రామేశ్వరుఁడే చెప్పఁబడెననుటకును నాధారములు కనఁబడవు. [పు 175]

''మును మార్గకవిత'' యను పద్యములో మార్గకవిత యనఁగా సంస్కృత కవిత్వమనియు దేశికవిత యనఁగా దేశభాషాకవిత్వ మనియు అర్థము *

సంగీతరత్నాకరములోని యీ క్రింది శ్లోకము లీ యర్థమును స్పష్టపఱుచు చున్నవి—

శ్లో॥ గీతం వాద్యం తథా నృత్తంత్రయం సంగీత ముచ్యతే
మార్గో దేశీతి తద్ద్వేధా తత్ర మార్గ స్స ఉచ్యతే.
యో మార్గితో విరించాద్యైః ప్రయుక్తో భరతాదిభిః
దేవస్య పురత శ్శంభోః నియతోభ్యుదయప్రదః
దేశేదేశే జనానాం య ద్రుచ్యా హృదయరంజకం
గీతం చ వాదనం నృత్తం తద్దేశీ త్యభిధీయతే.

౧౯౧౭ వ సంవత్సరమునందుఁ బ్రకటింపఁబడిన తమ యాంధ్రుల చరిత్రముయొక్క ద్వితీయభాగములో శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు నన్నెచోడునిగూర్చి వ్రాయుచు "౯౭౪-౮౦ సంవత్సరప్రాంతమున నున్న యీ సత్యాశ్రయుని నన్నెచోడమహాకవి తన కుమారసంభవకావ్యమున నీ క్రింది పద్యములోఁ బేర్కొని యున్నాఁడు

క. 'మును మార్గకవిత లోకం
బున వెలయఁగ దేశికవితఁ బుట్టించి తెనుం
గు నిలిపి రంధ్రవిషయమున
జనసత్యాశ్రయునిఁ దొట్టి చాళుక్యనృపుల్' [ఆ౧-౨౩]

దీనిం బట్టి నన్నయభట్టారకుని నూ ఱే ఢ్లకుఁ బూర్వమే యాంధ్ర కవితాసతి వర్ధిల్లుచున్న దని స్పష్ట మగుచున్నది ఈ పై పద్యమునందుఁ జెప్పఁబడిన సత్యాశ్రయునకుఁ దరువాతనే నన్నెచోడుఁ డున్నవాఁ డని నిస్సంశయ ముగాఁ జెప్పవచ్చును" అని వ్రాసిరి. ఈ సత్యాశ్రయకథనమువలన

[* శ్రీ వీరేశలింగము పంతులుగా రభిప్రాయ పడినట్లే 'ఆంధ్రకవి తరంగిణి' కారులును మార్గకవిత యనఁగా సంస్కృత కవిత్వమనియు, దేశికవిత యనఁగా నాంధ్రకవిత యనియు నభిప్రాయపడి యున్నారు [చూ పుట 165] కాని యిది సరికాదు ప్రాచీన సంస్కృతి సాహిత్యమార్గము ననుసరించిన లక్షణములు కలది మార్గకవిత; దేశీయ సంప్రదాయములు కలది దేశికవిత.]

నన్నెచోడుఁడు ౧౧౦౦-వ సంవత్సరమునందు రణనిహతుఁ డయ్యె నన్న రామకృష్ణకవిగారి సిద్ధాంతము పూర్వపక్ష మయిపోయినది. అయినను రామకృష్ణకవిగారి కిటీవల లభించిన నన్నెచోడుని కుమారసంభవముయొక్క ప్రత్యంతరములో పాఠభేదము కనఁబడి వారిసిద్ధాంతమును గొంతవఱకు మరల నిలువఁ బెట్టినది. రామకృష్ణకవిగారు ౧౯౧౪ వ సంవత్సరము నందుఁ బ్రకటించిన నన్నెచోడుని కుమారసంభవముయొక్క ద్వితీయ భాగములో నీ పద్యపాఠాంతరమును "రంధ్రవిషయంబునఁ జనఁ జాళుక్య రాజు మొదలుగఁ బలువుర్" అని చూపిరి ఈ పాఠభేదమునుబట్టి పద్య మీ విధముగా మాఱుచున్నది.—

క. 'మును మార్గకవిత లోకం
బున వెలయంగ దేశికవితఁ బుట్టించి తెనుం
గును నిలిపి రంధ్రవిషయం
బునఁ జనఁ జాళుక్యరాజు మొదలుచఁ బలువుర్.'

ఈ పాఠాంతరము సత్యాశ్రయునిబాధను తొలఁగించినను ఆంధ్రపత్రిక యొక్క ౧౯౧౯ వ సంవత్సరపు సంవత్సరాదిసంచికలో బుట్టా శేషగిరి రావు పంతులుగారు వ్రాసిన యీ క్రిందియంశమును గొంత పోషించు చున్నది.—

"సత్యాశ్రయుని తొట్టి చాళుక్యనృపులు ఆంధ్రవిషయమున తెలుగుఁ దేశకవిత నిలిపి రని కవి వ్రాయుచున్నాఁడు పైనుదాహరించిన శాసన నిదర్శనములప్రకార మిందుఁ జెప్పఁబడిన సత్యాశ్రయుఁడు భారతమును రచియించుటకు నన్నయను బ్రోత్సాహపఱిచిన రాజరాజనరేంద్రుఁ డని యూహింపఁ దగు. భారతమందు సత్యాశ్రయకులతిలక యని రాజరాజ విషయమున వాడఁబడి యున్నది"

మొదటి పాఠమునుబట్టి సత్యాశ్రయకులతిలకుఁ డైన రాజరాజ నరేంద్రుండు సత్యాశ్రయుండు కాకపోవచ్చునుగాని యీ పాఠమును బట్టి

చాళుక్యరాజు నిర్బాధకముగా రాజరాజనరేంద్రుఁడు కావచ్చును. అట్లయి నచో నన్నెచోడుఁడు నన్నయభట్టునకుఁ దరువాతివాఁ డయి యుండవలెను.

నాలవది కవికాలమును నిశ్చయించుటకై ప్రధానసాధనము కవి గ్రంథము నారంభించిన సంవత్సరమునో, పూర్తిచేసిన సంవత్సరమునో పుస్తకమున వ్రాసికొనుట. ఈ కవి యదియుఁ జేసి యుండలేదు. అందుచేత మనము పుస్తకములోని సాధనసామగ్రి ననుసరించి యితరాధారములచేతనే కవికాల నిర్ణయమును జేయవలసి యున్నది.

బుఱ్ఱా శేషగిరిరావుగారు త్రిభువనమల్లచోడదేవుని కొడుకే నన్నెచోడుఁ డని వ్రాయఁగా తమ యాంధ్రులచరిత్రము ద్వితీయభాగముయొక్క యవతారికలో చిలుకూరి వీరభద్రరావుగారు

"శ్రీ బుఱ్ఱా శేషగిరిరావు ఎం-ఏ గారు పండ్రెండవ శతాబ్దముమధ్య నున్న త్రిభువనమల్లచోడదేవుని చోడబల్లిగా భావించి యతని జ్యేష్ఠపుత్రుఁడైన నన్నెచోడుఁడే నన్నెచోడకవి యని సిద్ధాంతము చేసినారు; కాని త్రిభువనమల్లుఁడు చోడబల్లి కాఁజాలఁడు. అదియునుగాక త్రిభువనమల్లునికొడుకైన నన్నెచోడునితల్లి మాబలదేవి యని శాసనములం గన్పట్టుచున్నది. కుమారసంభవమునఁ దన తల్లి శ్రీసతి యని నన్నెచోడకవి చెప్పుకొని యున్నాఁడు."

అని వ్రాసిరి. తమ యాంధ్రులచరిత్రమునందు - శాసనమును బల్లయచోడదేవుని కొడుకు కామచోడుఁ డని స్పష్టముగా ఘోషించుచుండఁగా దానికి ప్రత్యక్షవిరోధముగా చోడబల్లికిఁ బెక్కండ్రుగురు భార్యలు గల రనియు, నన్నెచోడుఁడు పెద్దభార్యకొడు కనియు, కామచోడుఁడు మరియొకభార్య యొక్క తనయుఁ డనియు, మనమూహింపవచ్చు నని నిరాధారము లైన యూహలపై నూహలను పన్ని నన్నెచోడుఁడు క్రీ. శ. ౧౧౦౬-వ సంవత్సరములోని శాసనములోఁ బేర్కొనఁబడిన బల్లయచోడదేవమహారాజుకొడు కని సిద్ధాంతము చేయ సాహసింపఁగలిగిన వీరభద్రరావుగారు త్రిభువనమల్లచోడునే బల్లిచోడునిగా భావించి యాతనిపుత్రుఁడైన నన్నె

చోడునే నన్నెచోడకవినిగాఁ జెప్పిన శేషగిరిరావుగారి సిద్ధాంతము నేల నిరాకరింపవలెను? శ్రీసతి మాబలదేవినామాంతరము కాఁగూడదా? శాసనములలో నొక్కనినే చోడపల్లి. చోడపల్లి చోడబల్లి, బల్లిచోడుఁడు, బల్లయ చోడుఁడు మొదలైన నామములతో వ్యవహరించుచుండుట మనము చూచుచుండ లేదా?

డి-48 సంఖ్యగల ౧౧౪౫-౪౬ సంవత్సరపు నెల్లూరిశాసనములో

"స్వస్తి చరణసరోరుహవిహితలోచన త్రిలోచనప్రముఖాఖిల
పృథివీశ్వర కారిత కావేరీతీర కరికాలకులరత్నప్రదీపాహితకుమా
రాంకుశ శ్రీమన్మహామండలేశ్వర బల్లిచోడమహారాజులు"

అని బల్లిచోడుని శాసనములో నున్నది. ఓ-19 సంఖ్యగల ౧౧౫౩-౫౪ వ సంవత్సరపు నెల్లూరిశాసనములో నెనిమిదేండ్లకుఁ దరువాత

"స్వస్తి చరణసరోరుహవిహితవిలోచన త్రిలోచనప్రముఖాఖిల
పృథివీశ్వర కారిత కావేరీతీర కరికాలకులరత్నప్రదీపాహితకుమా
రాంకుశ శ్రీమన్మహామండలేశ్వర త్రిభువనమల్ల దేవచోడమహారాజులు"

అని త్రిభువనమల్లచోడదేవుని శాసనములో నున్నది; డి-49 సంఖ్యగల ౧౧౬౬-౬౭ వ సంవత్సరపు నెల్లూరిశాసనములో మఱి పదుమూఁడేండ్లకుఁ దరువాత

"స్వస్తి చరణసరోరుహవిహితవిలోచన త్రిలోచన ప్రముఖాఖిల
పృథివీశ్యర కారితకావేరీతీరకలికాలకులరత్న ప్రదీపాహితకుమా
రాంకుశ శ్రీమన్మహామండలేశ్వరబల్లి చోడమహిరాజులు ..."

అని మరల బల్లిచోడుని శాసనములో నున్నది. ౧౧౪౫ వ సంవత్సరములోను, ౧౧౬౬ వ సంవత్సరములోను బల్లిచోఁడుడు రాజ్యము చేయుచుండ గా నడుమను ౧౧౫౩ వసంవత్సరమునందు త్రిభువన మల్లదేవుఁడు మఱియొకఁడు రాజ్యము చేయుట సాధారణముగా సంభవింపదు గావునను, ఒక్క యక్షరమైనను హెచ్చు తగ్గు లేక మూఁడు శాసనములలోను బిరుదావళి యొక్కటిగానే యున్నదిగావునను, ఈ శాసనములలోఁ బేర్కొనఁబడిన

బల్లిచోడుఁడును త్రిభువనమల్లచోడుఁడును ఏకపురుషుఁ డనుకొనుట సమ చితముగాఁ గనఁబడు చున్నది.

మైసూరుచోడశాసనములలో మల్లిదేవచోడుని శిలాశాసనములు రెండు కానఁబడుచున్నవి. వానిలో చళ్ళకెరెతాలూకాలోని మహాదేవపురమందలి వీరభద్రాలయముయొక్క తూర్పుగోడమీఁద నున్నది 43 సంఖ్యగల 1108 వ సంవత్సరపుది; ఓబలపురసిద్ధరామేశ్వర దేవాలయములో దక్షిణమున శిల మీఁద నున్నది 21 వ సంఖ్యగల 1147 వ సంవత్సరపుది. ఈరెంకుశాసనములును ఒక్కరిపేరివే యైనను మొదటిదానియందు శ్రీమన్మహామండలేశ్వర త్రిభువనమల్లమల్లిదేవచోళమహారా' జనియు, రెండదానియందు 'శ్రీమన్మహామండలేశ్వర జగదేకమల్ల మల్లిదేవ చోళమహారా' జనియు ఉన్నది. కారణాంతరములచేత శాసనములో నొక్కరికే వేఱువేఱు పేరు లుండవచ్చునని యు, ఈ ప్రకారముగానే త్రిభువనబల్లిచోడమహారాజును బల్లిచోడ మహారాజు నొక్కరే యగుట విరుద్ధము కాఁ జాల దనియు, చూపుట కొఱకు మాత్రమే యీ శాసనముల నుదాహరించితిని గాని వేఱుప్రయోజన ముద్దేశించి కాదు. అయినను కాలసామ్యమును, నామసామ్యమును బట్టి చూడఁగా నా త్రిభువనబల్లిచోడమహారాజును, నీ త్రిభువనమల్లచోడ మహారాజును నొక్కరే యయియుండవచ్చునేమో యని సందేహము కలుగుచున్నది. ఉభయులును సూర్యవంశజులు; కాశ్యపగోత్రజులు; కరికాలచోళకులాభరణులు. ఈ యూహ నిజమే యయి త్రిభువనబల్లిచోడ మహారాజునకు మహిసూరులో కూడ కొంత రాజ్య ముండియుండినపక్షమునను, మన నన్నెచోడకవిరాజశిఖామణి త్రిభువనబల్లిచోడ మహారాజు పుత్రుఁడే యయిన పక్షమునను, నన్నెచోడునికిఁ గన్నడభాషలో విశేష పాండిత్య ముండె ననుటకుఁ దగిన కారణ మున్నది. పూర్వోక్తములైన రెండు శాసనములలో ౪౩ వ సంఖ్య గలదానిలో క్రీ. శ. ౧౦౭౬ మొదలుకొని ౧౧౨౬ వఱకును రాజ్యపాలనము చేసిన త్రిభువనమల్లచక్రవర్తి యొక్క బిరుదావళి 'సమస్తభువనాశ్రయం .. రాజాధిరాజపరమేశ్వరం.... సత్యాశ్రయకులతిలకం' మొదలయిన విశేషణములతోఁ జెప్పఁబడినతరువాత చోడబల్లినిగూర్చి "ఒరయూర పురవరాధీశ్వర, కరికాలచోళకులాంబరద్యు

మణి, కాశ్యపగోత్రోద్భవ'' మొదలైన విశేషణములు చెప్పఁబడినవి. ఈ ప్రకారముగానే ౨౧-వ సంఖ్య గలదానిలో 1143 మొదలు 1154 వఱకు రాజ్యముచేసిన జగదేకమల్లచక్రవర్తి బిరుదులు సమస్తభువనేశ్వరాది వాక్యములతోఁ బేర్కొనఁబడినపిమ్మట చోడబల్లి యొరయూరపురవరాధీశ్వరాదిబిరుదులతోఁ జెప్పఁబడెను ఒక శాసనము త్రిభువనమల్లుని కాలములోను, రెండవ శాసనము జగదేకమల్లుని కాలములోను వ్రాయఁబడుటయే చోడబల్లియొక్క నామవ్యత్యాసమునకుఁ గారణము

నన్నెచోడుని కాలమును సరిగా నిర్ధారణము చేయుట కా కాలములో జంగమమల్లికార్జునుఁ డుండుటయు తండ్రి బల్లిచోడుఁడగుటయు, తల్లి శ్రీదేవి యగుటయు, ముఖ్యముగా మూఁడు కావలెను ఈ విషయమును నిర్ణయించుటకు 1915—16 వ సంవత్సరపు దక్షిణమండల శాసనకార్య నివేదనపత్రిక (Epigraphical Report of the Southern Circle for the year 1915—16) మనకు కొంత తోడుపడుచున్నది. నర్సారావుపేట తాలూకాలోని కొప్పరపు గ్రామము నందలి కోదండరామస్వామి దేవాలయముముందున్న నాగస్తంభముమీది ౩౭౮ వ సంఖ్య గల శిలాశాసనములో చోడబల్లియు, మల్లికార్జున యోగియుఁ జెప్పఁబడి యున్నారు శాలివాహనశకము ౧౧౩౬ అనఁగా క్రీ. శ ౧౨౧౪ జయసంవత్సర చైత్రబహుళ అమావాస్యనాఁడు సూర్యగ్రహణసమయమునందుఁ జేయఁబడిన దానములను గూర్చి యీ శాసనము చెప్పుచున్నది. అప్పుడు త్రిభువనమల్లచోడుని జ్యేష్ఠపుత్రుఁడైన కన్నరచోడదేవుఁడు రాజ్యము చేయుచుండెను త్రిభువనమల్ల చోడుని ముగ్గురు పుత్రులలో నన్నెచోడునిజ్యేష్ఠునిగాఁ గొన్నిశాసనములు చెప్పుచున్నను, మఱికొన్ని శాసనములు నన్నెచోడుని కనిష్ఠపుత్రునిగాను, కన్నరచోడుని జ్యేష్ఠపుత్రునిగాను జెప్పుచున్నవి. ఈ శాసనమునందు రాజు యొక్క వంశపరంపరాగతమంత్రియు నీశ్వరనాయకపుత్రుఁడును నయిన మారన రెండు గొప్పచెఱువులు త్రవ్వించి కొప్పరగ్రామములో సోమేశ్వ

రాలయము కట్టించి యొక తటాకము నిర్మించినట్టును రాజసమ్ముఁ డైన చోడబల్లి కొప్పురముసమీపమున నున్న బైడిపల్లిని దానము చేసినట్టును, ఈ దానములను మారనప్రార్థనముమీఁద విష్ణువర్ధనుని క్రిందియధికారి యైన మహామండలేశ్వరకడియరాజు స్థిరపఱిచినట్టును, సోమేశ్వరాలయము పాలూరునందలి కాలాముఖసన్యాసి మల్లికార్జునుని పాలనమునం దుంచఁబడినట్లును, చెప్పఁబడి యున్నది. ఈ శాసనమును బట్టి చూడఁగా బల్లిచోడుఁడు మొదలైనవారు సర్వలోకాశ్రయుఁడు గారి పేరునకైనను చాళుక్యచక్రవర్తులకు లోఁబడిన మహామండలేశ్వరు లనియు తేటపడుచున్నది. ఈ శాసనమునుబట్టి చూడఁగా నన్నెచోడుని సోదరుని కాలములో కాలాముఖమల్లికార్జునయోగి యుండినట్టును, నన్నెచోడుని నాఁడె చోడబల్లి యనబడెడు త్రిభువనబల్లిచోడుఁ డయినట్లును రెండంశములు స్థాపింపఁబడినవి. ఈ చోడబల్లికిఁ ద్రిభువనమల్లచోడబల్లి యని పేరు వచ్చుట కతఁడు త్రిభువనమల్లచాళుక్యచక్రవర్తి పాలనకాలములో నుండుట కారణమని మనము సులభముగాఁ దెలిసికొనవచ్చును. ఈ బల్లిచోడునికిఁ గామచోడబల్లి యనియు నామము గలదు. ఇఁక బల్లినిగూర్చిన మూఁడవ యంశము స్థాపింపఁబడవలెను. ఈ నన్నెచోడునితల్లి మాబలదేవి యని శాసనము చెప్పుచున్నది, శ్రీసతికి మాబలదేవి మాఱుపేరు కాఁగూడదా? కావచ్చును.

ఈ సంబంధమున 1915 16 వ సంవత్సరపు కార్యనివేదనపత్రికలోనే పేర్కొనఁబడిన 363 వ సంఖ్య గల నన్నెచోడుని శాసనమునే విచారింతము. ఈ శాసనము శకసంవత్సరము ౧౦౭౫ అనగా క్రీస్తుశకము ౧౧౫౩-వ సంవత్సరము విషువత్సంక్రాంతినాఁడు సోమేశ్వరాలయమునకుఁ జేసిన భూదానములను గూర్చినది. ఈ కాలమునందు రాజ్యమేలుచుండినవాఁడు మహామండలేశ్వరత్రిభువనమల్లదేవమహారాజాత్మజుఁ డైన నన్నెచోడుఁడు. ఈ శాసనము నరసారావుపేటతాలూకాలోని చెన్నుపల్లియగ్రహారమునందలి పరశువేదీశ్వరాలయముయొక్క యెదుట నున్న నందిస్తంభముమీఁద చెక్కఁబడి యున్నది ఈ శాసనములో నన్నెచోడునికి కన్నరచోడుఁడు

సోదరుఁడయినట్టును, మావలదేవి తల్లియైనట్టును చెప్పఁబడినది ప్రథమ శాసనమునందు చెప్పఁబడినట్లు నన్నెచోడునికి మాబలదేవి తల్లియగుట సత్యమా ? ఈ ద్వితీయశాసనమునందు జెప్పఁబడినట్లు మావలదేవి తల్లి యగుట సత్యమా ? రెండును సత్యములే. రెంటికిని శ్రీసతి యనియే యర్థము. గాలి నరసయ్యశాస్త్రి తన యింటిపేరైన గాలికి ప్రభంజన మనియు, నరసయ్య కహోబలుఁ డనియు, పర్యాయపదములు వేసికొన్నట్లే కవియు పేరునకు పర్యాయపదములు వేయుట సహజాచారముగా యున్నది.

మా + అబల-మ = శ్రీ (లక్ష్మి.) అబల = సతి (స్త్రీ) మాబల = శ్రీసతి
మా + ఆవల-మా = శ్రీ, ఆవలదేవి = (పర్వతపుత్రి) సతి, మావలదేవి = శ్రీసతి

'మాబల' యనిగాని 'మావల' యనిగాని పద్యములో వేయవలసినచో దానితుదను దేవీపదము చేర్పవలసి యుండును కవి తాను రచించిన చంపకమాలలో గణసౌలభ్యార్థము మాబలార్థబోధక మయిన శ్రీసతి పదమును ప్రయోగించి యుండును. ఇది తృప్తికరమైన సమాధానము కాకపోయినను, ఇంతకంటె మంచి యాధారము దొరకనప్పుడు దీనినే సరిపుచ్చుకొనవలెను. ఇప్పటికి దొరకిన యీ యాధారములనుబట్టి నన్నెచోడుఁడు ౧౧౫౦ కిఁ దరువాత నున్నవాఁడని యేర్పడుచున్నది. ఆ కాలమందలి మండలేశ్వరు లందఱును రాజ్యకాంక్షచేత నొండొరులతోఁ బోరాడుచు జయాపజయములను బొందుచు నుండెడివారు. ఈ యల్పయుద్ధములలో నొక్కదానియందు ౧౧౬౦ వ సంవత్సరమునందు కాకపోయినను నన్నెచోడుఁడు తరువాత నిన్నూటనలువది సంవత్సరములకయినను నిహతుఁడయి యుండును మూఢవిశ్వాసము లధికముగాఁ గల యాకాలము నందాతని మృతిని శుభాశుభగణవిధిజ్ఞు లయిన లక్షణజ్ఞులు నగణముతరువాత రగణము వేయుట కారోపించుటయు, సామాన్యజను లా మాటలను విశ్వసించుటయుఁ దటస్థించెను. అందుచేత నన్నెచోడునకుఁ దరువాత గొంతకాలమున కున్న యథర్వణాచార్యుఁడు తనఛందస్సులో నీ క్రిందిపద్యమును వేసెను

క. 'మగణమ్ముఁ గదియ రగణము
వగవక కృతిమొదట నిలుపువానికి మరణం
బగు నిక్కమండ్రు, మఱియుఁడె
యగు నని యిడితొల్లి వేంకటాదిత్యుఁ డనిన్.'

ఈ పద్యమునుబట్టి నన్నెచోడుఁడు శుభాశుభగణపరిజ్ఞానములేనివాఁడని యథర్వణునియభిప్రాయ మయినట్టు తేలుచున్నది. నన్నెచోడుఁడు తన కుమారసంభవమునందు స్రగ్ధరావృత్తములో మగణముతరువాత రగణముం డియే తీఱవలెను. ఈ నన్నెచోడకవి నన్నయభట్టారకునకును, తిక్కన సోమయాజికిని నడిమికాలమునం దున్నవాఁడు. ఇతఁడు తన పుస్తకము నందు సుకవిస్తుతియు కుకవినిందయు షష్ఠ్యంతపద్యములును వేసియు న్నాఁడు. వీనిని వేయుటలో మొదటివాఁడని యింతవఱకును తిక్కనసోమ యాజికి వచ్చిన ప్రతిష్ఠ యిప్పు డాతనినుండి తొలఁగి యీతనివి జేరు చున్నది.

[శ్రీరామకృష్ణకవిగారు కుమార సంభవమును పూర్తిగాఁ బ్రకటించిన ముప్పది మూఁడేండ్లకుఁ బిదప మద్రాసు విశ్వవిద్యాలయమువారును, శ్రీవావిళ్లవారును 'కుమారసంభవము'ను బ్రకటించియున్నారు విశ్వవిద్యా లయమువారి—ప్రచురణకు శ్రీ కోరాడ-రామకృష్ణయ్యగారి విపుల 'పీఠిక' కలదు నాఁటివఱకును ఈ కావ్యమునుగూర్చి కలిగిన చర్చల నన్నింటిని పరిశీలించి యొకరీతి సిద్ధాంతముగనే శ్రీరామకృష్ణయ్యగారు కవి కాలాదు లనుగూర్చి వివరించియున్నారు ఆ విషయము సంగ్రహముగా నిచటఁ దెలుపఁబడును.

'ఈ కవికాల నిర్ణయమునుగూర్చి పరిశీలించిన వారిలో నొకరిద్దరు తక్క తక్కిన వారందరు నన్నయ తరువాతి వాఁడని నిరూపించుటకే యత్నించిరి అందు పలువురు నన్నయతిక్కనల నడిమికాలపువాఁడై యుండునని తలంపఁగా నిటీవల 'కుమార సంభవ విమర్శనము'ను బ్రకటిం చిన శ్రీ లక్ష్మీపతి శాస్త్రులుగారు తిక్కనకుఁ గూడఁ దరువాతివాఁ డగునని

యాంతరంగికములగు కొన్ని పోలికలనుబట్టి నిర్ణయింప యత్నించిరి. ఇట్లీ కవి కాలనిర్ణయమునకు నిష్కృష్టమగు శాసనాధారము లేకపోవుటచే నాంత రంగిక నిదర్శనములనుబట్టి క్రీ శ 940 మొదలు క్రీ శ. 1300 వరకు గల నడిమి కాలమున నీతని యునికి యూగులాడు చుండవలసి వచ్చినది.

ఈ మధ్యకాలము ముఖ్యముగా మూడు తరగతులుగా విభాగింపదగియున్నది. ఒకటి నన్నయకు పూర్వమని రెండవది నన్నయకు సమకాలికము-లేదా నన్నయ తిక్కనలకు నడిమి భాగమని, మూడవది తిక్కనకు తరువాతికాల మని ఈ మూడవది – నన్నిచోడుఁడు తిక్కనకు తరువాతికాలపువాఁ డను వాదము తక్కినవానికంటె నర్వాచీనము. శాసన నిదర్శనము నిష్కృష్టమైనదిగాఁ గనఁబడనందున నాంతరంగిక నిదర్శనమగు రచనలోని పోలికలనుబట్టి విచా రింపఁగా గొన్ని విషయముల తిక్కనకేతనల భావములను, రచనలను నన్నిచోడు డనుకరించెనని శ్రీలక్ష్మీ పతిశాస్త్రిగారికి తోచుటచే నాయనయే యా మూడవ పక్షవాదమును తొలుత ప్రతిపాదించిన వారైనారు ఇంక ననేకవిధములగు పోలికలు ఇతరకవులతో సమానముగఁ గనఁబడుచుండఁగా, వారు చూపిన పోలికలైనను చోళుని రచననే వారనుకరించి యుండఁగూడదా ? యను సందే హమును నిశ్శేషముగాఁ దీర్చునవి కాకపోవుటచే తిక్కన తరువాతి వాఁ డను నర్వాచీనవాదము నంతగా మనము పాటింపవలసిన యావశ్యకత కనఁబడదు.

ఇఁక నన్నయకుఁ బూర్వుఁడనునది తొలివాదము. కవి తననుగూర్చి చెప్పికొనిన గ్రంథస్థ విషయములలో తల్లిదండ్రుల నామములు కలవు.. పురాతన శాసనములఁ బరిశోధింపఁగాఁ బెక్కండ్రు నన్నిచోడు లగపడు చున్నారు గాని వారిలోఁ గొందఱు మాత్రమే చోడబల్లియను రాజునకుఁ బుత్రులుగాఁ బేర్కొనఁబడియైన నుండిరి గాని, ఎందునను దల్లిపేరు లేనందున నిస్సందేహముగా నిర్ణయించుటకు వీలే లేకున్నదనుట వాస్తవము. నన్నిచోడుఁడు .కావేరీతీరమునందలి యొరయూరి కధిపతినని, టెంకణా దిత్యుండనని చెప్పుకొనినంత మాత్రముచేత—అతని తండ్రి చోడబల్లి పాక నాటి యం దిరువదియొక్క వేయింటి కధీశుఁడని చెప్పుచుండఁగా — నీతఁడు

అచ్చటి వాఁడును, పాకనాటి చోడ వంశము వాఁడును గాక - ఒరయూరును పాలించుచు (మగణమ్ము గదియ రగణమ్మును వేసి పద్యము చెప్పుటచే) పాశ్చాత్య చాళుక్యరాజులచే రణరంగమున నిహతుఁడైన వాఁడనుట సంభావ్యముగాఁ గనఁబడదు. ఆంతరంగిక సాక్ష్యమగు వ్యాకరణచ్ఛందో విశేషాపూర్వపద ప్రయోగములలోఁ గొన్ని నన్నయ తరువాతి కవులలోఁ గూడఁ గనఁబడుటచేత - వాని విషయమున నన్నయ యవలంబించిన దానికంటె భిన్నమగు సంప్రదాయము నవలంబించినవాఁ డనియే వ్యక్తమగుచున్నది గాని, నన్నయకుఁ బూర్వుఁడను కాలనిర్ణయమున కిది తోడ్పడునదిగాలేదు. (పీఠిక పుటలు VII-VIII)

ఇక నన్నిచోడుని నన్నయకు సమకాలికునిగా నిశ్చయించినవారిలో శ్రీ దేవరపలి (వెంకట) కృష్ణారెడ్డిగారు ముఖ్యులు. ఉద్భటుని గూఢ వస్తుమయకావ్యమునం దాదరము చూపిన నన్నిచోడునకుఁగూడ గూఢ వస్తుమయరచనయం దాదరము కలదనియు, కావుననే గ్రంథరచనాకాలమును 12-వ ఆశ్వాసమందు గూఢముగ 'ఖడ్గలత పూచెనొ నాజయజైత్రసంపదన్' అను పద్యములో జయసంవత్సర, జయమాస, జయతిథి, జయవారమైనట్లు సూచించినాఁడనియు, ఇది విక్రమయంగపద్ధతిని తిథివారనక్షత్రముల కలయికచే క్రీ. శ. 1057 సం. సరిపోవుననియు, కావున నాతఁడు నన్నయకు సమకాలికుఁ డగుననియుఁ దెలిపిరి. వీరు చూపిన లెక్కలలోఁ గూడ నొక సంవత్సరము తేడా కనఁబడుచునేయున్నది..... .. నన్నిచోడుని వాస్తవాభిప్రాయము నిది యెంతవరకు సమర్థింపగలదో తెలిసికొను నితరాధారమేమియునులేదు. ఇది యిట్లుండ నిదివరకు లభించిన శాసనములలో నీకాలపువాఁడగు నన్నిచోడుని సూచించు శాసన మేదియు బయలుపడలేదు ... .. కావున నీకవి నన్నయ తిక్కనల నడిమివాఁడనువారి వాదమే యిప్పటి కాదరణీయముగా కనఁబడుచున్నది [పుట XII]

.. చోడబల్లి పాకనాటియం దిరువదియొక్కవేయింటి కధీశుఁడేనా ? యను సందేహమున కాతని తరువాతి తరమువాఁడు, శాసనకర్తయగు మల్లిదేవ చోడున కాబిరుదమున్నప్పు డీతనికి నుండి యుండునని మన మూహింప

వచ్చును దీనినిబట్టి యీ చోడబల్లి నన్నిచోడు లిద్దరు పాకనాటిలోనివారే యనుటయైనను స్పష్టమగును. ఇక సామాన్యపుశంకల నట్టుంచి. యీ శాసనములవలన చోడబల్లికొడుకు నన్నిచోడుఁడు, ఈతని కరికాలచోడాన్వయజని తత్వము, పాకనాటిలో నునికి, ఏకవింశతి సహస్రగ్రామావనీవల్లభునితోడి సంబంధము, చోడబల్లిచే నారాధింపఁబడిన యొక కాలముఖవ్రతుఁడగు మల్లికార్జునయోగి, దారిద్ర్య విద్రావణ బిరుదముగల ప్రభువు. రామేశకవి — అను నిన్ని విషయములు గిట్టినవి కావున నీ కవి క్రీ శ 1100 ప్రాంతమువాఁడని, నన్నయ కవ్యవహిత పరముందుండి యుండునని తలంప వచ్చును' [పు XIII]

నన్నిచోడుని కాలమును గూర్చి విపులముగ విమర్శించిన పిదప 'ఆంధ్రకవి తరంగిణి' కారులు కుమార సంభవ మందలి పదప్రయోగాదులనుబట్టి నన్నిచోడుఁడు ప్రాచీనుఁడనియు, నతనిది ప్రాచీన కవిత్వమనియు నన్నయకుఁ బూర్వుఁడో, పరుఁడో నిర్ణయింపఁ జాలము' అని వ్రాసియున్నారు. [పుట 202]

ఈ విషయమున 'తెనుఁగు కవుల చరిత్ర' లో క్రింది విధముగఁ గలదు

'ఈతఁడు రాజైనను, ఈ గ్రంథమున చారిత్రకాంశములను తెలుపక పోవుట చేత నీతని కాలము వివాదములకు మూలమైనది అవి నాలుగు విధములు— 1 ఈ కవి తెనుఁగున నాదికవియని యనుకొనుచున్న నన్నయభట్టారకునకు పూర్వుఁడు అనఁగా క్రీ. శ. 940 ప్రాంతమువాఁడు. 2 నన్నయతో సమకాలికుఁడు అనఁగా 1051 సం ప్రాంతమువాఁడు. 3 నన్నయకు వెనుక నొక శతాబ్దిలోపువాఁడు. అనఁగా క్రీ. శ. 1130-1150 సం. ప్రాంతమువాఁడు. 4 తిక్కనకు తరువాతివాఁడు అనఁగా సం. 1275-1350 ప్రాంతమువాఁడు. నన్నెచోడకవి క్రీ శ సం 1130-50 ప్రాంతమువాఁడనియే నేఁడంగీకృతమైనది.'] [పుట 200]

కుమారసంభవములో నితఁడు చేసిన కుకవినింద యిది.

గీ. 'చెనసి గుణమైన దోషంబు సేయ నేర్చుఁ
గుకవి కృతులందు దోసంబు గుణము సేయ

నేరఁ, డది యట్ల దొంతులు చేరి నాయి
దోర్పనేర్చుఁ గాక దది యేమి చేర్పనేర్చు?' [అ ౧-౨౯]

ఈ పద్యమునం దితఁ డనావశ్యకముగా కుక్క యనుటకు మాఱుగా 'నాయి' యను నన్యభాషాపదమును ప్రయోగించి యున్నాఁడు. ద్రవిడభాషలోను, కన్నడభాషలోను కుక్కను నాయి యందురు. ఇట్లు తఱుచుగా కన్నడ పదముల నుపయోగించుటయు, గ్రాంధికభాషలోను వ్యావహారికభాషలోను గూడ లేని యప్రతీతపదములను వాడుటయు స్వచ్ఛమయిన యీతని కవిత్వమునకుఁ గొంత కళంకమును దెచ్చుచున్నవి. * దీనిని మనస్సునం దుంచుకొని యీ కవి నుద్దేశించియే కాఁబోలును తిక్కనసోమయాజి తన నిర్వచనోత్తర రామాయణమునందుఁ గుకవిదూషణముగా నీ క్రింది పద్యమును వేసి యున్నాఁడు.

చ. పలుకులపొందు లేక రసభంగము చేయుచుఁ ద్రాఁతపడ్డ మా
టలఁ దమనేర్పు చూపి యొకటన్ హృదయం బలరింపలేక యే
పొలమును గానియట్టి క్రమముం దగ మెచ్చుగ లోక మెల్ల న
వ్వులఁబొరయం జరించు కుకవుల్ ధర దుర్విటులట్ల చూడఁగన్.'

ఈ పద్యమునందు దుష్కవులు దుర్విటులతోఁ బోల్పఁబడి యున్నారు. కొందఱు పొగడినంత యత్యుత్తమమయినది కాకపోయినను, నన్నెచోడుని కవిత్వ మన్యభాషాపదదూషితము కానియెడల సుత్తమమయినదనియే చెప్ప వచ్చును. ఇతఁడు సంస్కృతగ్రంథములను మాత్రమేకాక కన్నడగ్రంథ ములను సహితము విశేషముగాఁ జదివి యుండుటచేత నాగ్రంథముల

[* 'వ్యాకరణమునకు లొంగని పదములు, అప్రతీతపదములు, భాషాంతరపద ములు, నీకావ్యమునందుండుట దీని ప్రాచీనతను వ్యక్తముచేయునదే! ఇట్టి ప్రయో గములవలన కవి కేమాత్రము కళంకము కలుగదు. ప్రాచీనకవుల ప్రయోగము లర్వాచీనములగు వ్యాకరణములకు లొంగకుండుట కవి కపకర్షను కల్గింపదు—' అని పండిత విమర్శకులు కొంద అభిప్రాయపడుచున్నారు.]

యందలి భావములను, పదములను గొంత చేకొనియున్నాఁడు ఈ యంశ మును స్థాపించుటకై పుస్తకసంపాదకులు చూపినవానిని మాత్రమే యొకటి రెంటి నిం దుదాహరించుచున్నాను.

క. ముదమున సత్కవి కావ్యము
నదరక విలుకానిపట్టినమ్మును బరహృ
ద్భిదమై తల యూఁపింపని
యది కావ్యమో ? వాని * పట్టినదియుం గరమే ? [౧౨-౪౧]

అనెడు ప్రథమాశ్వాసములోని యీ నలువదియొకటవ పద్యము

శ్లో॥ కిం కవే స్తస్య కావ్యేన కిం కాండేన ధనుష్మతః
పరస్య హృదయే లగ్నం న ఘూర్ణయతి యచ్ఛిరః.

అను సంస్కృతశ్లోకమునకు తెలుఁగు, పయి పద్యము పీఠికలో నున్నట్టు చేకొనఁబడినది. గ్రంథములో "నదరక" యన్నచోట "నదరఁగ" ననియు, "వానిపట్టినది" యనుచోట "మలరిపట్టినది" యనియుఁ బాఠభేదములు గల దయి యున్నది.

మహాస్రగ్ధర హరహాసాకాశగంగాత్యమలజలమరాళాబ్జ నీహారధాత్రీ
ధరకర్పూరేందుకాకోదరవరపతిదిగ్దంతిపక్షీరనీరా
కరముక్తాహారకుందోత్కర రజతశరత్కౌముదీద్యోతకీర్తి
శ్వరునాత్మారాముఁవాణీవరువరగురుసర్వజ్ఞుసజ్ఞానదూరున్.

చతుర్థాశ్వాసాంతమందలి యీ ౪౭౫ వ పద్యము

'హరహాసాకాశగంగాజలజలరుహనీహారధాత్రీ
ధరనీహారాంశుతారావనిధరశరదంభోధరక్షీరనీరా
కరతారాభారతీద్విగదనిరదనపీయూషడిండీరముక్తా
కరకుందేంద్రేభహంసోజ్జ్వలవిశదయశోవల్లభం శాంతినాథమ్.'

[* పట్టినదియున్ శరమే ?' అనునది సరియైన పాఠము]

అను కాలాముఖమఠమునకుఁ బ్రక్కనుండు జైనమఠములోని త్రైలోక్య మల్లుని క్రీ. శ. ౧౦౭౭ శాసనశ్లోకమును జూచి వ్రాయఁబడినది. జైనులు శబ్దార్థచౌర్యమునకు వెనుదీయ రని సంపాదకులు వ్రాసినను పయి శ్లోకమును రచియించిన జైనసంస్కృతకవి ముందు చేయఁబోయెడి తెలుఁగు గ్రంథమునుండి యీ శ్లోకమును దొంగిలించి యుండఁజాలఁడు.

సీ. కరలత లందంద కామపాశంబుల
నదిమి బంధించుచున్నట్లు బిగియ
నొదవఁ బేర్చిందులఁ బదనైన పూఁత లం
గమునకు వజ్రలేపములుగాఁగఁ
బులక లొండొరులమేనుల నుచ్చిపోయి ద
గ్గఱ మొల లిచ్చినకరణిగాఁగఁ
గనకంపుఁబ్రతిమలు గాఁచి యంటించిన
ట్లొడఁగూడి తనువు లొండొంటిఁ గదియ

గీ. దగఁగ నొక్కతలకు మొగములు రెండైన
పగిది దలలు మాఱుమొగము పడఁగ
గిఱి మేనుమేను * దూఱ గాఢాలింగ
నంబు చేసి రంగనయుఁ బ్రియుండు.

అను కుమారసంభవనవమాశ్వాసములోని యీ ౧౪౭వ పద్యములోని "యొక్క తలకు రెండుమొగములో యను నుత్ప్రేక్ష తక్కఁ దక్కిన భావము లన్నియుఁ గల" వని సంపాదకులు కన్నడ జగన్నాథవిజయము లోని యీక్రింది పద్యమును పూర్ణముగా నుదాహరించి యున్నారు.

మ ఉకదింపెర్మొలెబెంగెమూడె చెమర్గళ్ బల్వజ్రలేపంబొ లా
గిరె, కీల్గొట్ట బెడంగనీయె పులకం, తోళ్తోళ్గెగంటిక్కిదం
తిరె, మెమ్మెయ్యొళడంగు వంతమ రె, గాఢాలింగనంగెయ్దు న
ల్లరదేనిర్ద రొకాసిబెచ్చ తెఱదిం శ్రీసత్యభామాచ్యుతర్.

[* మేన దూఱి—పాఠాంతరము]

జగన్నాథవిజయము నన్నెచోడుని సమకాలీనుఁడైన రుద్రభట్టుచే రచియింపఁబడినది. "నన్నెచోళునియత్యపూర్వభావములు మల్లినాథపురాణ జగన్నాథవిజయాది కర్ణాటకకావ్యములలో మార్పులేక యున్నవి" అని సంపాదకులు వ్రాయుచున్నారు. ఇందుఁ బేర్కొనఁబడిన మల్లినాధపురాణము 1105-వ సంవత్సరప్రాంతములం దున్న నాగచంద్రునిచే రచియింపఁబడినది. కుమారసంభవములోని భాగములు తద్గ్రంథకర్తయగు నన్నెచోడునితో సమకాలికులును, పూర్వకాలికులును నగు తెలుఁగురాని కన్నడకవులచేఁ జేకొనఁబడిన వని చెప్పుటే యుచితమో, ఆ కవుల కాలపువాఁడును, తరువాతికాలపువాఁడునునై కన్నడమువచ్చిన నన్నెచోడుఁడే వారి కర్ణాటక కావ్యములనుండి కైకొనియె నని చెప్పుటయే యుచితమో, చదువరులే తెలిసికోఁగలరు ఇతఁడు కర్ణాటకకావ్యములలోనుండి తన కుమారసంభవము నందు సంగ్రహించిన కన్నడ పదబృందములోని కొన్నిపదముల నిందుఁ జూపుచున్నాను.

సీసపాదము. అనులేపనములు మండనములు లేకయు
భాసురాంగములింతదేసియగునె. [ఆ. ౬. పద్య. ౫౨]

ఇందలి దేసి పదము సుందరమైన యను నర్థ మిచ్చెడు కర్ణాటకపదము

క. దోస మనెగుణదవోలు
ద్భాసిసి కన్నడదళొల్దుపూర్వాచార్యర్
దేసియనె నిఱిసిఖండ
ప్రాసమనతిశయమదెందు యనియం మిక్కర్.

(కవిరాజమార్గము.)

ఈ కవిరాజమార్గకర్త 814-887-వ సంవత్సరముల మధ్యమున నున్న నృపతుంగుఁడు.

వెంచలు.

చ. ఎలమిన పూరి మేసి సెలయేఱుల నీరులు ద్రాగి మేలి వెం
చల నెలమావిఁజొంపములఁ జల్లని నీడల నిల్చి పొల్చి మం

దలు గొని నందిపోతులును దారును బేయలు సమ్మదంబునన్
గలసి రమించుధేనువులఁ గాంచిరి తద్విపినాంతరంబునన్.

[ఆ. ఉ. పద్య. ౫౦]

వెంచ లనఁగా కన్నడమున సరస్సులు.

క. వికచసరసీరుహం కో
కకులవ్యాభాసిపూగొళం తానిరెయుం
బకనికరలులితకలు షో
దకవిడిళదొళంచె వెంచెయొళ్ వసియికుమే.—గుణవర్మ.

గుణవర్మ 1050-వ సంవత్సరప్రాంతములం దుండినవాఁడు.

కొలవేళలు

సీసపాదము —మోసుల వీజనంబులు సేయుఁ గొలవేళ
లిరవుగాఁ గూర్చి చామెరలు చేయు.

[ఆ ౫. పద్య. ౧౩౯]

కొలవేళ లనఁగా కన్నడమున వట్టివేళ్ళు.

చ. 'తరుణియరావిలాసకుసుమాస్త్రనీకి సెకామతాపదిం
తరుణమృణాలమంతెగెదుపూగొళదిం పొఱ గిక్కిదండదిం
కొరగి మృణాళనాళికెగెచందనదణ్కెగెతిఱ్ఱిళిల్గెత
ర్గొరగదసూసునీర్గెకొలవేర్గొడల గుటియాగెమాడువర్ '—

(మల్లినాథపు)

మల్లినాథపురాణకర్త యైన నాగచంద్రుఁడు 1105 వ సంవత్సరప్రాంతములం దున్నవాఁడు.

కఁడవడము.

చ. బెదరుచు నంతరంగమున భీతికిఁ గండవడంబు సుట్టి ప
ళ్కెదు పొరపొచ్చెమున్ వెఱపుఁ గేనము౯ఁ ఘయ్యాలకోలినెత్తువె

ట్టైదు వడి మోవియుం గరువటిల్లెడు నీమది నింతతల్లడం
బొదవుఁడిదేమి కారణమ యుగ్మలి నాకెఱిగింపు మేర్పడన్.
[ఆ ౪. పద్య. ౫౯.]

కండవడ మనఁగా కన్నడమునందు తెలి.

క. 'తళిర్గళకండవడంగళ
తళిర్గళపాసుగళెతలిర్గళోవరిగళెకెం
దలిర్గళెళసిపెళవిఱిల్గళె
విలాసమంమెఱెవంల్లికెలరబలెయరొళ్.'—ఆదిపురాణ.

ఈ యాదిపురాణమును రచించిన యాదిపంపఁడు క్రీ శ. 940-వ సంవత్సర ప్రాంతమునం దుండినవాఁడు. ఈ యుదాహరణములనుబట్టి చూడఁగా నన్నెచోడుఁడు తన కాలపువియుఁ దన పూర్వకాలపువియు నైన కన్నడ గ్రంథములను బాగుగాఁ జదివినవాఁ డయినట్టు కనఁబడు చున్నాఁడు. ఈతఁడు వాడిన కన్నడపదము లన్నియు పూర్వకాలమునందు కర్ణాటకాంధ్ర భాషలకు రెంటికిని సామాన్యము లని మనవారు చెప్ప వత్తురు అవి పూర్వము రెండు భాషలకును సామాన్యములని యెట్లు దెలిసికోవచ్చును? ఏ పూర్వకవులు వీనిని బ్రయోగించిరి? నన్నయభట్టారకాదులు ప్రయోగింపలేదు. "బెదరుచు" నన్న పయి పద్యమునం దింకొక విశేషప్రయోగము కూడఁ గానఁబడుచున్నది. "ఒదవుటిదేమి?" యనుటకు మాఱుగా "ఒదవు డిదేమి?" యను రూపము వాడఁబడినది ఈ పుస్తకమును వ్రాసిన తంజావూరిలోని యఱవ వాంద్రకు ట డ భేదము చక్కఁగాఁ దెలియక పోవుటచేత వ్రాఁతలో నిట్టి రూపములు పడి యుండవచ్చును అట్టివి పూర్వకాలపురూపములవి భ్రాంతి చెంది ముద్రాపకులు వాని నట్టె యుంచి యుందురు. ఇట్టి రూపము లీ పుస్తకమునం దిరువది ముప్పదిచోట్ల వేయఁ బడి వానిక్రింద "ఒదవుడు—ఒదవుట" యనునట్లు టిప్పణములు వ్రాయఁ బడినవి. డకారమున్నచోట్ల టకారము వేసిన నీ యాయాస మంతయు తప్పిపోయి యుండును. ఈ యన్ని స్థలములలో డకారమును టకారము నుగా మార్పఁ గూడని స్థల మొక్కటియు లేదు. అపూర్వరూపములను

వేసినంత మాత్రముచేత క్రొత్తకవి ప్రాంతకవి కానేరఁడు. ఈ కవి భావార్థకమునందు టకారము వాడె ననుట కొక్క యుదాహరణమును కుమారసంభవమునుండి చూపెదను—

క. దొనఁగోలఁ గోలవేగం
బున నరిగొల్పుటయుఁ దిరుపుఁ బోరిఁబోరి విడుపుం
జనుటయు దనుజులఁ గొనుటయు
ననిమిషులకు నైనఁ గాంచు డరుదయ్యె ననిన్.—[ఆ.౧౨-౧౫౩]

అరిగొల్పుట, చనుట, కొనుట, అని మొదట మూఁడుచోట్ల టకారమువేసినవారు కడపట కూడ 'కాంచుట' యని టకారమును వేయక కాంచు డని డకార మేల వేయవలెనో దురూహ్యముగా నున్నది. కాంచు డరు దయ్యె ననుటకు మాఱుగా "కాంచు టరు దయ్యె" నన్నచో యతిభంగము వచ్చునా? గణభంగము వచ్చునా? ఏదియును రాదు. ఈ ప్రకారముగానే యేకాదశాశ్వాసములోని ౫౩ వ దయిన యీ పద్యమునందును

ఉ. * ఆయము లిచ్చు డాఁచిమొన కాయము వెంచుట పెక్కుమన్ననల్
సేయుట పోరికి న్మొనసి చేయుట గా మది నిశ్చయించుచున్
నాయకు కోర్కిఁదీర్పఁ ని నా యెడ్డనూఱడినట్లు తొమ్మనం
జే యిడి నిద్ర వోయిరి నిశీథి భటుల్ సమరంబు కోరుచున్.

పెంచుట, చేయుట, చేయుట, యని వరుసగా మూడుచోట్ల టకారమువేసి మొదట నొక్కచోటమాత్ర మిచ్చు డని డకార మేల వేయవలసివచ్చెను? ఇచ్చుట యన్న ఛందోలక్షణభంగము లేమైన వచ్చునా? ఇచ్చుట యన్నదే పూర్వకాలరూపముగాని యిచ్చు డన్నది కాదు. "అంతకంతకు మా పట్టణములో త్రాగుడు హెచ్చుచున్నది" అను విధమున నిప్పుడిప్పుడు త్రాగుట యనుటకు త్రాగు డని వాడుకలోనికి వచ్చినది ఈ పుస్తకములో విప్ప

[* ఆయములిచ్చుటాజి .. .. నిసిన్ సుభటుల్ - అని విశ్వవిద్యాలయ ముద్రిత ప్రతి.]

డున్నట్లు "నాయెడ్డ" యని యుంచినచో గణభంగము కలుగుచున్నది. ఎడడ, ఎద, ఎడ, ఎడ్డ, యని నాలుగు రూపము లుండఁగా నిర్బాధక మైన నడిమి రెండు రూపములలో నొకదానిని వేయక సబాధక మైన "యెడ్డ" యను రూపమును వేసి దానిక్రింద "ఇందు డకారమును దేలఁ బలుకవలయును" అని టిప్పణి మేల వ్రాయవలెను? 'నాయెద నూఱడి' యని వేసిన నేమి దోషము? ఇట్టి యసాధారణరూపములను వేసినంత మాత్రముచేత నిది యత్యంతపురాతనగ్రంథము కాఁగలుగునా? ఈ పుస్తకము యొక్క ౧౦, ౧౧ వ యాశ్వాసములలోనే యిటువంటి యెడ్డలైదు గణభంగము కలుగునట్లుగా వేయఁబడి క్రిందను "ఇందు డకారమును దేల నుచ్చరింపవలయు" లోనగు టిప్పణములు వ్రాయఁబడినవి.

పయి పద్యమునందలి 'తొమ్మనం జేయిడి నిద్ర వోయిరి' యన్నభాగ మీ కవి నన్నయభట్టారకుని భారతమును చదివి యుండెనని తెలుపుడు చేయుచున్నది.

క. 'వినుతధనుర్విద్యావిను
  తునుఁ గర్ణు సహాయుఁ బడసి కౌరవవిభుఁ డ
  ర్జునువలని భయము చెడి తొ
  మ్మనఁ జేయిడి నిద్ర వోయె ముదితాత్ముండై.'

అను నాదిపర్వములోని పద్యమును జూడుఁడు నన్నెచోడుఁడు నన్నయ భట్టు పుస్తకమును జదివె నని స్థిరపఱుచుటకు యిచ్చట మఱి రెండుదాహరణములను గూడ నిచ్చుట చాలి యుండవచ్చును

నన్నయభట్టారణ్యపర్వమున ద్వితీయాశ్వాసమునందు

క. "అఱపొఱడు కుఱుచచేతులు
  నొఱవ శరీరంబు గలిగి యొరులకుఁ జూడం
  గొఱగాకుం డియు మన్మథు
  నొఱపులఁ బడియెడు నితండు యువతీప్రియుఁడై.' [ప. ౧౩౪]

అఱపౌఁఱ దన్న యసాధారణపదమును వాడెను. దానినే నన్నెచోడుఁడును కుమారసంభవములోని ఆ. ౬-౨౭ పద్యములో

సీసపాదము. * కందుఁబండ్లుఁ బఱిగిగడ్డంబులును నఱ
పౌఁఱకు ల నంటు రూపులును గుఱుచ.

పయియట్లు ప్రయోగించెను. ఒకకవి యింకొకకవియొక్క గ్రంథమును జదివి యం దుండి యేమయిన గ్రహించినట్లు తెలిసికొనుటకు మొదటి కవి యొక్క విశేషప్రయోగములనుబట్టి తెలిసికొనవలెనే కాని సర్వకవి జన సామాన్యము లైన ప్రయోగములనుబట్టి నిశ్చయించుటకు వలను పడదు. నన్నయభట్టాదిపర్వమునందు

చ. పొలుపుగఁ బూసి కట్టి తొడి భూరివిభూతి ప్రకాశితంబుగాఁ
గలయఁగఁ దత్పరిజనులు కాంస్య మృదంగక శంఖ భేరి కా
హళ పటహధ్వనుల్ చెలఁగ నాటలుఁ బాటలు నొప్పనెల్లవా
రలు చని చేసి రర్చనలు రైవతకాద్రికి నుత్సవంబుతోఁ.

అనెడి యష్టమాశ్వాసములోని పద్యములో "తొడిగి" యని యుండవలసిన సామాన్యరూపములోని "గి" వర్ణకమును దీసివేసి "తొడి" యని విశేష ప్రయోగమును జేసెను. దీనిని జదివియే నన్నెచోడుఁడు తనకుమారసంభవము పంచమాశ్వాసములో

'కేసరరాజీవ కేయూరములు తొడి
రాజీవకర్ణపూరము లమర్చి—' [పద్యము ౨౦]

అను సీసపాదమునందు "తొడ" యని ప్రయోగించి యున్నాఁడు.

ఉ. పీండె ఖలుండు దక్షుఁ డనువీఱిఁడిపాఱుఁడు వీఁడు సర్వవ
ధ్యుం డెడసేయ కుండు శివదూషకునాలుక గోసి యుప్పు నిం
పుండు ప్రతప్తద్రవమ్ముదలఁ బూయుఁడు లోహముకాచి నోరఁ బో
యుండు దురాత్ము చర్మపట మొల్వుఁడు కన్నులు మీఁటుఁ
డుక్కఱన్—[ఆ ౨-౧౪]

[* కందుఁబండ్లుఁ బఱికి గడ్డంబులును నఱ పొఱదులునంటు రూపులునుఁ గుఱుచ — అని మద్రాసు, విశ్వవిద్యాలయ ముద్రిత ప్రతి.]

ఇత్యాదిస్థలములయందు దీర్ఘముమీఁది యరసున్నలను నిండుసున్నలనుగాఁ బ్రయోగించి యుండుటయే యీ కవియొక్క ప్రాచీనతను తెలుపుచున్నదని కొందఱనుచున్నారు.

ఉ. ఎంచినప్రేమ నీపదక మిమ్మని రుక్మిణి మున్ను వేఁడుడుం
బూంచినపూఁవు దక్కఁ బలుపోకలఁబోవుచు నుండు దేవుఁడున్
డాంచినసొమ్ము చేరె నకటా మదిఁ గోరనిసత్యభామకున్
నోంచినవారిసొమ్ము లవి నోమనివారికి వచ్చునే యిలన్.

అని పదునాల్గవశతాబ్దియందున్న నాచన-సోముఁడు సహితము దీర్ఘము మీఁది యర్ధబిందువులను పూర్ణబిందువులనుగాఁ బ్రయోగించి యుండుటచేత నిది ప్రాచీనత కొక గుఱుతు కాదు.

క్రౌంచపదము.

చంచుల నాస్వాదించుచు లేదూఁడ్లకరువు ప్రియలకు నలఁదుచు మైరో
మాంచము లోలిం గంచుకితంబై పొడమఁగ నలరుచుఁ బులినములంగ్రీ
డించుచుసంభాషించుచుఁ బ్రీతింబొలుచుచుఁ జెలఁగుచుబొలయు సముద్య
త్క్రౌంచగతుల్ వీక్షించుచు భాస్వజ్జ్వలనుఁడు శరవణ సరసికివచ్చెన్.

అను దశమాశ్వాసములోని ౩౦ వది యగు క్రౌంచపదవృత్తము నుదహరించి, "ఇందుఁ గందసీసములవలెఁ బ్రతిపాదము రెండు భాగములుగా విభజింపఁబడి కందమువలెఁ బూర్వార్ధమునఁ బ్రాసమును ద్వితీయార్ధమున విశ్రమము మాత్రమే కూర్పఁబడియె ద్వితీయప్రాసయతి మాత్రము నన్నయ, తిక్కన, కవిజనాశ్రయకారాది ప్రాచీనులు పాటించిరి కాని యప్పకవి తన్మర్మము తెలియక వదలెను ....నన్నయకాలమునకే క్రౌంచపదము వృత్తము కావునఁ బ్రథమాక్షరవిరతి ముఖ్యమని ప్రాస మున్నను రెండు విరమస్థానములు ప్రయోగించిరి. ఇది నన్నెచోడుని ప్రాచీనత కొక గొప్ప కారణము." అని సంపాదకులైన రామకృష్ణకవిగారు ద్వితీయభాగపీఠికయందు వ్రాసిరి నా

బుద్ధి కిది నన్నెచోడుని ప్రాచీనతకుఁ గారణముగాఁ గానఁబడదు గాని యాతనికిఁ గల కర్ణాటక భాషాపక్షపాతిత్వమునకుఁ గారణముగాఁ గనఁబడుచున్నది. నన్నయకాలముననే క్రౌంచపదము వృత్తమయ్యె నఁట! అయినపక్షమున యతిస్థానము లన్నియు మొదటియక్షరముతో మైత్రికలవయి యుండుట యాంధ్రభాషాకవిత్వమర్యాద ఈ మర్యాదను వదలి కర్ణాటకభాషాకవిత్వమర్యాద నవలంబించుట తెలుఁగుసంప్రదాయమునకు విరోధము. నన్నయభట్టైక్కడను దాను రచించిన భారతభాగమునందు క్రౌంచపదవృత్తమును వాడియే యుండలేదు. అందుచేత నాతని కాలమున క్రౌంచపదవృత్తము వాడుకలో లే దనుట స్పష్టము ఆతని కాలమునందును, తత్పూర్వమునందును అక్కరలు మొదలైనవి యెక్కువ వాడుకలో నున్నవి నన్నయభారతమునం దక్కరలు మిక్కిలిగా నుండుటయే కాక నన్నయకు నూఱు సంవత్సరములు పూర్వమం దుండిన యుద్ధమల్లుని శాసనములో నన్నియు మధ్యాక్కరలే యున్నవి. ఇటీవల నక్కరలు వాడుకలోనుండి తొలఁగుటయు క్రౌంచపదవృత్తము వాడుకలోనికి వచ్చుటయుఁ దటస్థించినది. నన్నెచోడుని కుమారసంభవమునం దక్కరలు లేక పోవుటయుఁ, గ్రౌంచపదవృత్తముండుటయు నతఁడు నన్నయకు మిక్కిలి తరువాతివాఁ డని స్థాపించుటకు గొప్ప కారణముగా నున్నది. కవిజనాశ్రయమునఁ జెప్పఁబడిన క్రౌంచపదలక్షణ మిది —

"పంచశరాభా! సంచితపుణ్యా! భమసభననయపరిమిత మైనన్
గ్రౌంచపదాఖ్యం బంచితమయ్యెన్ గ్రగయతివశవసుకలితముగాఁగన్"

మన నన్నెచోడకవి యీ తెలుఁగులక్షణమును పాటింపక విశ్రమవిషయమున

శీతకరోర్వీవాతశశాంకర్ యుగమితసురపురనివహదకదెయోశ్
భూతగణేశం భూశరాశాగజదొశె యతిగళుమెసెదిరె పెసరిం
నీతియుతేకేళ్ నాతిశయోక్తిక్రమదొశెనెగళ్దుదిదతిశయరచనో
పేతమశేషోర్వీతళకం క్రౌంచపద మిదతిశయపదరచనెగళిం"

అను కన్నడలక్షణము ననుసరించెను. ఇది నాగవర్మ ఛందోంబుధిలోని క్రౌంచపదలక్షణము ఈ నాగవర్మ సుమారు౧౧౪౦ వ సంవత్సరము నాటి వాఁడు. తెలుఁగులక్షణములోని కడపటి యగణమునకు బదులుగా కన్నడ లక్షణములో నగ మున్నది. కడపటి నగణములోని తుది రెండు లఘువుల నొక గురువునుగాఁ జేసినయెడల నది తెలుఁగులక్షణముతో సరిపోవును. సుప్రసిద్ధకర్ణాటకలక్షణకర్త యయిన యీ నాగవర్మ తాను వేఁగిదేశపువాఁడ నని తన ఛందోంబుధియం దీ క్రిందిపద్యములలోఁ జెప్పుకొని యున్నాఁడు—

క జగదొళగిదొందు మిగిలెనె
నెగళ్దిర్దుదు వేంగివిషయమావిషయదొళా
ప్రగణితమెనె ప త్తగ్రా
మగళొళమావేంగిపళుకరం సొగయిసుగుం   ౪

క ఆవేంగిపళువినోళ్విభు
దేవసమానంవిదగ్ధనంబుజభవనం
తావగమొళ్గుణనిధియం
తీవసుధెయొళెనిసివెణ్ణమయ్యంనెగళ్దం.   ౫.

క. వేదదొళనుగతరెనిసువ
వేదగళొళ్నిపుణనాగినెగళ్దంగంభీ
రోదోన్న తెపరివేష్టిత
మేదినియొళ్ పెణ్ణమయనకలంకగుణం.   ౬.

ఈ నన్నెచోడకవి మన వా రనుకొన్నంత పూర్వుఁడు కాకపోయినను గొంత పూర్వుఁడే యయి నన్నయభట్టునకు, తిక్కనసోమయాజికిని నడిమి కాలమునం దుండినవాఁ డయి నన్నయభట్టారకుఁడు బ్రాహ్మణకవులలో నగ్రగణ్యుఁ డయినట్టే రాజకవులలో నగ్రగణ్యుఁ డయియున్నాఁడు. ఇతఁడు ౧౧౫౦-వ సంవత్సరప్రాంతమునుండి దాదాపుగా ౧౧౬౦-౭౦-వ సంవత్సరప్రాంతమువఱకు నుండి యుండును. ఈతని కవిత్వము మొత్తముమీఁదరసవంత మయి యసాధారణధార కలదయి హృదయంగమ

మయి యున్నది ఇతఁడు నాచనసోమనాథాది మహాకవులతోఁ దులఁదూగఁ దగినవాఁడు గాని సాధారణుఁడు కాఁడు ఈతని కవిత్వమునందు క్త్వార్థక సంధులు మొదలైన కొన్నియల్పదోషము లున్నవి కాని యవి రత్నాకరము లోని నత్తగుల్లలవలె నంతగాఁ బాటింపఁదగినవి కావు. కన్నడభాషాపద సమ్మేళనము మాత్రము శ్లాఘ్యము గాదు *

సీ. పింఛాతపత్రముల్ పెనఁగి మరుద్వీథిఁ
గార్కొను నీలమేఘములు గాఁగ
వివిధభూషారత్న వివిధాంశుజాలముల్
సదమలాఖండల చాపములుగ
ఘనవీథిఁ బొలసాడు ఖచరాంగనాపాంగ
తరళాక్షరుచులు సౌదామనులుగ
సింధురోన్నతకరశీక రాసారముల్
ధారుణిఁ గురియు నాసారములుగ

ఆ వె. సంచితంబులైన పంచమహాశబ్ద
రవము లులియ మేఘరవము లెసఁగ
హరుఁడు వచ్చె రజతగిరి కుమాన్వితము గ్రొ
క్కారులీలఁ గరము గారవమున [ఆ. ౯-౧౪౧]

అను నవమాశ్వాసములోని యీ పద్యమునందు "పొలసాడు" అనియు,

చ. 'నిజవదనామితాసితమణీకచనీలవిభాతివాహన
ద్విజవరబర్హిబర్హవితతిం దొడరాడి సముల్లసిల్లన
త్యజితవిలాసలీల విజయధ్వజ మంబరవీథిఁ గుక్కుట
ధ్వజముఁ బెనంగఁ బొల్పెసఁగి వచ్చెను మహేశ్వరసూతి ప్రీతితోన్.
[ప 203]

[* అట్టివి కన్నడపదము లనుటకంటె — అప్పు డాంధ్రభాషలో వ్యవహారమున నున్న పదములే యని యనుకొనవచ్చును.]

అను ద్వాదశాశ్వాసములోని పయి పద్యమునందు "తొడరాడి' అవియు క్త్వార్ధకసంధులు గానవచ్చుచున్నవి. *

క. ఏసియు వైచియుఁబొడిచియు
వేసర కొండొరులఁ బట్టి విడువక కేశా
కేశిఁ బెనంగుచుఁ బోర మ
హాసురముగఁ బోరి రా సురాసురవీరుల్.'　　　[ప. ౧౬౮]

అను ద్వాదశాశ్వాసములోని పద్యమునందు శసప్రాసము వేయఁబడినది.

చ. 'పుడమిపుడున్ ధనాఢ్యుఁడును భూరిబలుఁడును శౌర్యవంతుఁడున్
గడుదృఢపాణిపద్ముఁడును గాక యొడంబడ దశ్వమేధ మిం
దడరఁగ జేయుఁ దన్మఖమునందులపుణ్యఫలంబు లందఁగా
నడుగడుగశ్వమేధ మనునాజిమొనం జని చావు నేగియే. [ప ౪౪]

అనెడి యేకాదశాశ్వాసపద్యములో "పుడమిపుఁడున్" అని గ్రామ్యపద ప్రయోగము చేయఁబడినది

చ. అరుణజలంబు లాడి తురగాజినవస్త్రము లర్థిఁ గట్టి భీ
కరకరిదానకర్దమము కస్తూరిగాఁగ నలంది వీరహృ
త్సరసిరుహంబు లోలి నవతంసవిభూతిగఁ దాల్చి చాల న ♦
చ్చరువుఁ బిశాచకాంతలు పిశాచములందవిలించి రొప్పులన్.
　　　[ఆ: ౧౧-౨౦౨]

అను పద్యములో నచ్చెరు వని యుండవలసినదాని నచ్చరు వని యపశబ్దము వేయఁబడినది.

ఈ కవి చేసిన గ్రంధములు రెండు అం దొకటి కుమారసంభవము, రెండవది కళావిలాసము. కాళిదాసుఁడు చేసిన కుమారసంభవము గాక యుద్భటుఁ

[* ఇట్టివి శబ్దపల్లవములైనఁ గావచ్చును. క్త్వార్థకములని యనుకొన్నను-అట్టివాని సంధిని పెక్కు రామోదించి యున్నారు.]

[♦ నచ్చరువన - పాఠము. అచ్చరువు 'ఆచ్చెరువు' నకు రూపాంతరము కాని అపశబ్దము కాదు.]

డను కవి సంస్కృతమున వేఱొక కుమారసంభవమును జేసినట్లు కవి యీ క్రిందిపద్యమునఁ జెప్పి యున్నాఁడు

క. క్రమమున నుద్భటుఁడు గవి
త్వము మెఱయఁ గుమారసంభవము సాలంకా
రము గూఢవస్తుమయకా
వ్యముగా హరులీల చెప్పి హరు మెప్పించెన్. [ఆ. ౧-౨౧]

ఈ రెండు కుమారసంభవములను జదివి కావలసినచో వానినుండి కథను గైకొనుచు తనమనసు వచ్చినట్లు మార్చి పెంచి సురుచిర వర్ణనాలంకారబంధురముగా నన్నెచోడుఁ డీ యాంధ్రకుమారసంభవమను కావ్యమును రచించెను ఇందు పండ్రెండాశ్వాసములు గలవు; ఈ పండ్రెండాశ్వాసములలోను సుమారు రెండువేల పద్యము లున్నవి ఇది తన పరమార్థవిద్యాగురు వైన జంగమ మల్లికార్జునయోగి కంకితము చేయఁబడి నది ఆశ్వాసాద్యంతపద్యములలోఁ గొన్నిచోట్ల నతఁడు శివుని కభేదముగా వర్ణింపఁబడుటయే గాక గ్రంథమధ్యమునందు సహిత మీ పద్యములలో నట్లే విరుద్ధముగా వర్ణింపఁబడెను. *

చ. 'కమలదళాక్షి చాలఁ బమకంబునఁ గూర్చునిజేశుతోడఁ జి
త్తము దనివోవఁగా బహువిధంబులఁ గూడిన హృద్గతానురా
గము వెలిఁ జేర్చెనో యన నఖక్షతచుంబనరంజితాంగవి
భ్రమగతి వచ్చి చూచె నొకభామిని జంగమమల్లికార్జునున్.

గీ. మగువ జంగమమల్లయఁ దగిలి చూచి
యంద కన్నులు మనసును నంటి యున్న
నచలభావన నిల్చెఁ దా నట్ల పరము
నభవుఁ గని జను లచలాత్ము లగుట యరుదె.'

[ఆ ౧-ప. ౬౧-౬౨]

[* జంగమమల్లికార్జునుఁడు శివున కభిన్నుఁడని తలఁచినపుడు ఇట్టివర్ణన విరుద్ధమని భావింపనక్కఱలేదు.]

పురకాంతలు శివునిఁ జూడ వచ్చెననుటకు మాఱుగా యోగియైన జంగమ మల్లయను జూడ వచ్చి రనుట కొంత యసంగతముగా నున్నదేమో! ఈ కవి శృంగారవర్ణనమునం దత్యాసక్తి కలవాఁడు ఇతఁ డష్టమాశ్వాసములో విటాభిసారికాలంజికాదుల నేఁబది పద్యములకంటె నెక్కుడుగా వర్ణించెను. కవికవిత్వశైలి తెలియుటకై యీతని గ్రంథములనుండి కొన్నిపద్యముల నుదాహరించుచున్నాను.

౧. కుమారసంభవము.

చ. అతని శరాసనంబు కనకాచల, మిక్షుశరాసనంబు నీ,
కతనికి నమ్ము పాశుపత, మంటినఁ గందెడు పువ్వుటమ్ము నీ,
కతఁడు పురాపహారి, విరహాతురపాంథజనాపహారి వీ,
వతనికి నీకు హస్తిమశకాంతర మెమ్మెయి నెన్న చూచినన్.
[ఆ. ౪-౭౨]

సీ. బాల నీవేనలి కాలోరగంబని
మలయానిలంబు నీవలన రాదు
కమలాస్య నీకనుఁగవ చకోరము లని
వెన్నెల సొరదు నీయున్నయెడకు
నబల నీయెలుఁగు పికారావ మని నీకుఁ
జూతమ్ము కొమ్ములు చూప వెఱచుఁ
జపలాక్షి నీముక్కు చంపక మనుభీతి
నలులు నీపొడ గని యలయఁ బాఱు

వనిత నీకుఁ బ్రాణవల్లభుండై మది
నొలసె శివుఁడు పాయకుండు ననియొ
పేదమరుశరములు నీదెశ రా నోడు
వీని కేల నీవు వెఱచె దమ్మ. [ఆ. ౫-౧౬౫]

ఉ. గంధగజాసురారిఁ బురకాయజకాలబల ప్రహారి ను
గ్రాంధకహారిఁ దీ వ్రగరళాయతవహ్నివిహారి దేవతా

సింధుజలౌఘధారి సురసిద్ధమునీంద్రగణోపకారి ను
ద్వంధవిదారి నోఁబలుక బ్రాహ్మణనీవధికారివే మహిన్. [ఆ ౩-౨౮]

సీ. దుగ్ధాంబునిధి నిట్టఁ దోఁచెనో యని శేషుఁ
బాన్పుగా హరి నీటఁ బవ్వడింపఁ
నొదవి సుధారస ముప్పొంగెనో యని
దేవతల్ దనివోవఁ ద్రావఁ దలఁపఁ
దొలఁకాడుమిన్నేఱు వెలివిరిసెనో యని
లీల సురాంగన లోలలాడఁ
బాదరసం బుర్విఁ బరఁగెనో యనిసిద్ధ
నికరంబు కలశముల్ నించి కొనఁగఁ

పాండురాంగుండు విశ్వరూపంబుదాల్చి
యెలసెనో యని సద్భక్తు లెలమిఁ గొలువ
నఖిలజీవుల కానంద మతిశయిల్ల
నచ్చువెన్నెల విమలమై యలరి కాసె. [ఆ. ౮-౧౧౮]

ఉ. బాలకుఁ బట్టియే సురలు బల్విడి నాపయి నెత్తి రింతయే
నేలిదమైతినే తమకు నెన్నఁడు మద్భుజవిక్రమక్రమా
భీలకరాళఖడ్గవరభీషణవేషము చూచి నేలపైఁ
గా లిడి నిల్తురే యనికిఁ గ్రమ్మఱ వత్తురె వృత్తి సొత్తురే.
[ఆ ౧౦-౭౪౯]

౨. కళావిలాసము *

సీ. పృథులవిశ్వంభరారథమున కెదురుగాఁ
బూన్పించె నెవ్వాఁడు పువ్వుఁదేరు

* ఈపద్యములు శ్రీ రామకృష్ణకవిగారి కుమారసంభవపీఠికనుండి గ్రహింపఁబడినవి. లక్షణగ్రంథములయం దుదాహరింపఁబడిన కొన్ని పద్యములె కాని పుస్తకము సమగ్రముగా నెవ్వరికిని లభింపలేదు. అందుచేత నీ యాంధ్రకళావిలాసము క్షేమేంద్రుని సంస్కృతకళావిలాసముతో నెంతవఱకు సంబంధించి యున్నదో తెలిసికొనుట శక్యముకాదు.

కాంచనాచలకార్ముకమునకు సాటిగాఁ
జేపట్టె నెవ్వాఁడు చెఱకువిల్లు
నవిరళపాశుపతాస్త్రమ్మునకు వాఁడి
మిగిలించె నెవ్వాఁడు చిగురుఁదూపు
నతులితామరదానవాదిబలంబుల
గెలిపించె నెవ్వఁ డయ్యళిబలంబు

నట్టిజగజెట్టి మన్మథుం డఖిలలోక
ములకు వెఱగొంగ జీవులమూలకంద
మతనియిలుఁ జొచ్చి వెడలనియతఁడు గలఁడె
యతనియమ్ములఁ బడకున్నయదియుఁ గలదె.

చ. తొడవులు వెట్టు సంభ్రమముతోఁ దిలకించు మడుంగు గట్టుపైఁ
బడ దడ వోప దింపెఱిఁగి పట్టుదు నేర్పులు గట్టి పెట్టుఁ బ
ల్కెడు నెడఁదొట్రుపాటొదవుఁగింకకుఁ జేగిలుమన్నమర్పుఁగాఁ
జిడుముడిఁ బొందుఁ గాంత పతిచేరినఁగూరిమి గల్గెనేనియున్.

ప్రతాపరుద్రుఁడు

ఇతఁడు ౧౧౧౭-వ సంవత్సరము మొదలుకొని ౧౧౪౦-వ సంవత్సరము వఱకును రాజ్యపాలనము చేసిన కాకతి ప్రోలరాజు పుత్రుఁడు; సుప్రసిద్ధుఁడయి తిక్కనసోమయాజికాలములో నుండి ౧౧౯౯-వ సంవత్సరమునుండి ౧౨౬౦ వఱకును ప్రజాపాలనము చేసిన గణపతిదేవుని పెదతండ్రి. ఓరుగంటి ప్రతాపరుద్రుఁ డని సాధారణముగా పిలువఁబడెడు వేఱొక ప్రతాపరుద్రుఁడు రుద్రమదేవి మనుమఁడు ౧౨౯౫ మొదలుకొని ౧౩౨౧ వ సంవత్సరమువఱకును కాకతీయరాజ్యపరిపాలనము చేసినవాఁడుండినందున భేదము తెలియుటకయి చరిత్రకారు లితనిని ప్రథమ ప్రతాపరుద్రుఁ డందురు ఈ ప్రతాపరుద్రదేవమహారాజు ౧౧౪౦-వ సంవత్సరము మొదలుకొని ౧౧౯౫-వ సంవత్సరమువఱకును నేఁబదియైదుసంవత్సరము లవిచ్ఛిన్నముగా రాజ్యపరిపాలనముచేసెను. ఇతఁ డనేకరాజులను జయించి తన రాజ్యమును నానాముఖములఁ వ్యాపింపఁజేసెను. ఇతఁడు పరాక్రమవంతుఁ డగుటయే కాక విద్యావంతుఁడుకూడ నయి తాను శైవమతస్థుఁ డగుటచేత ముఖ్యముగా శైవకవుల నాదరించుచు వచ్చెను. బసవపురాణాది వీరగ్రంథములను రచించిన పాల్కురికె సోమనాథుఁ డీతనికాలములో నుండి యీతనివలన నగ్రహారాదులను బడసెను ఈతఁడు కవులను ప్రోత్సాహపఱుచుచు వచ్చుటయే కాక తాను గూడ కర్ణాటకాంధ్రసంస్కృతభాషల యందుఁ బాండిత్యము గలవాఁ డయి విద్యావిభూషణుఁ డని పేరు వడసి స్వయముగా కవిత్వము చెప్పుటయందు సమర్థుఁ డయి యుండెను. ఇతఁడు సంస్కృతమున నీతిసార మనెడు గ్రంథమును రచించినట్లు బద్దెనకవి తన నీతిశాస్త్రముక్తావళిలో నీ క్రిందిపద్యమునఁ జెప్పెను.

చ. 'పరువడి నాంధ్రభాషఁగల బద్దెనీతియు సంస్కృతంబులోఁ
బరఁగ ప్రతాపరుద్రనరపాలునిచే రచియింపఁబడ్డ యా

నరవరు నీతిసారము వినం జదువం గడు మంచి దంచుఁ జె
చ్చెరఁ గవినీతిపద్ధతులు చేసె వినోదము బాలబోధకున్.'

నీతిశాస్త్రముక్తావళిని ముద్రించిన శ్రీయుత మానవల్లి రామకృష్ణ కవిగారు ప్రతాపరుద్రుఁడు సంస్కృతముననే కాక తెనుఁగునఁగూడ నీతిసారమును రచించినట్టు చెప్పి దానిలో నుండి పెక్కు పద్యముల నుదాహరించిరి వానిలో నుండి కొన్నిపద్యముల నెత్తి యిందు క్రిందఁ బొందుపఱుచున్నాను.

క. 'ఆపదలఁ జెందుప్రజలను
భూపతి మొదలిచ్చి మగుడఁ బ్రోవఁగఁ జనుఁ దాఁ
జేపట్టి విడువవలవదు
భూపతికిఁ గుటుంబ మనఁగ భూమియ కాదే

గీ ఎంత పొదలి యున్న నేరండమూలు జీలు
గులును దారుకృత్యములకు నగునె?
యితరు లెందఱైన నేలిక కధికులై
చేయు పనులు పూని చేయఁగలరె?

క. దూరము వ్యవసాయకులకు
భారంబు సమర్థులకును భాసురవిద్యా
పారగులకును విదేశము
వైరము ప్రియవాదులకును వసుమతిఁ గలదే?

గీ. విమతులా వెఱింగి వెఱ పేది తొడరుట
మిడుత లగ్గిమీఁదఁ బడినయట్లు
తోడు లేక యధికుఁ దొడరుట యంబుధిఁ
గలము లేక యీఁదఁ గడఁగినట్లు.

ఉ కొందఱు మేలమాడుటలుఁ గొందఱి వావులుదీర్చి పిల్చుటల్
కొందఱు ముద్దుచేయుటయుఁగొందఱి నెయ్యపుఁ జూపుచూచుటల్

కొందఱి నాత్మభావమునఁ గొందఱ మన్నన భృత్యులందు ని
ట్లందఱ నన్నిభంగుల నృపాగ్రణి వశ్యులఁ జేయఁగాఁదగున్.'

ఈ ప్రతాపరుద్రుఁడు క్రీ. శ. 1158 నుండి 1195 వఱకును రాజ్యమును బాలించెననియు, మడికి-సింగన్న 'సకలనీతి సమ్మతము' లో నీతి సారమును పేర్కొనినను, కర్తపేరు తెలుపలేదనియు, ఈ ప్రతాపరుద్రుని సంస్కృత 'నీతిసారము' ను ముద్దరాజు రామన్న తన రాఘవ పాండవీయ వ్యాఖ్యలో నుదాహరించెననియు తెనుఁగు కవుల చరిత్ర' లోఁ గలదు.]

పాలకురికి సోమనాథుఁడు

పాల్కురికి సోమనాథకవి తాను భృంగిరిటగోత్రుఁడును, గురులింగపుత్రుఁడును, * అయినట్లు 'అనుభవసారము' లో నీ క్రిందిపద్యమునఁ జెప్పుకొన్నాఁడు.

క. 'భృంగిరిటగోత్రుఁడను గురు
లింగతనూజుఁడ శివకులీనుఁడ దుర్వా్ఙ్మ
సంగవివర్జితచరితుఁడ
జంగమలింగ ప్రసాదసత్రాణుండన్.'

ఈ కవి ప్రతాపరుద్రుని కాలమునం దుండెను. ఈ కవికాలమునం దుండిన ప్రతాపరుద్రుఁడు క్రీ శ. ౧౨౯౫-వ సంవత్సరము మొదలుకొని ౧౩౨౧వ సంవత్సరమువఱకును రాజ్యము చేసిన ద్వితీయప్రతాపరుద్రుఁడు గాక ౧౧౪౦ సంవత్సరము మొదలుకొని ౧౧౯౬ వ సంవత్సరమువఱకును భూపరిపాలన మొనర్చిన ప్రథమప్రతాపరుద్రుఁడయి యున్నాఁడు. ఈ కవి సంస్కృతాంధ్రగ్రంథములను మాత్రమే గాక విశేషముగా కన్నడగ్రంథములను గూడ రచించెను. ౧౨౨౨ వ సంవత్సరమునం దుండిన కన్నడకవి యగు సోమరాజు తన యుద్భటకావ్యములో "సముదంచద్వృషభస్తవామరమహీజారామనం సోమనం" అని పాల్కురికి సోమనాథుని పూర్వకవినిగా స్తుతించి యుండుట చేతను, ౧౧౬౮ వ సంవత్సరమునందు మృతి నొందిన బసవనకు సోమన శిష్యపుత్రుఁ డగుటచేతను, ఈ నడిమి కాలమునం దుండిన పాల్కురికి సోమనాథుఁడు బసవనకు తరువాత ముప్పదేండ్ల కనఁగా ౧౧౯౫ వ సంవత్సరప్రాంతమునం దుండినట్లు చెప్పవచ్చు నని కర్ణాటక కవిచరిత్రము చెప్పుచున్నది ౧౧౯౬ వ సంవత్సరమువఱకున్ను

---

* సోమనాథుని తండ్రి విష్ణురామదేవుఁడు; తల్లి శ్రియాదేవి. ఈ సంగతి 'బసవపురాణము' ను బట్టి తెలియుచున్నది. లింగార్యుఁడీతని గురువు. తండ్రికాఁడు,

మహీపాలనము చేసి పరలోకగతుఁడైన ప్రతాపరుద్రునికాలములో నుండి యాతనిచేత నగ్రహారములు మొదలైనవి బహుమతులుగాఁ బడసెను గనుకను, తన కాలములోనే తన శిష్యపుత్రులు కూడ నుండవచ్చును గనుకను, సోమనాథుని మఱికొంతవెనుకకు జరపి ౧౧౯౦-వ సంవత్సర ప్రాంతములం దుండె నని నేను చెప్పుచున్నాను.

శ్లో॥ 'గురులింగార్యస్య దయాహస్తగర్భసముద్భవః
బసవేస్య తనయః బసవేశ్వరగోత్రకః ॥
బసవేశఋషిష్యాత్మభవో బసవకింకరః ।
శ్రీమత్పాల్కుర్కిసోమేశనామాహం సర్వవిత్తమః ॥
పండితారాధ్యచరితాలంకృతాం కృషి మారభే ।
తత ఋణు నతామాత్యసూరనామాత్యశేఖర ॥

అని పండితారాధ్యచరిత్రమునందు సోమనాథుఁడు తన్నుఁ గూర్చి చెప్పుకొని యున్నాఁడుఁ దీనినిబట్టి సోమనాథుఁడు లింగార్యుని ఛాత్రుఁ డయినట్టును; బసవేశునిపుత్రుఁ డయినట్టును గనఁబడుచున్నాఁడు మనలో గురువులును జనకులుగానే భావింపఁబడుదురు గనుక ననుభవసారమునం దా యర్థముననే చెప్పఁబడెనేమో ! భారతమునందలి యీ పద్యార్థమును జూడుఁడు.

మధ్యాక్కర

'తనర జనకుండు నన్నప్రదాతయును భయత్రాత
యును ననఁగ నింతులకు ముప్వు రొగి నయిరి గురువు;
లనఘ ! యుపనేత మఱియు నిరంతరాధ్యాపకుండు
ననఁగఁ బురుషున కియ్యేవు రనయంబు గురవు లైరి.'

కాఁబట్టి యితనికాల మిప్పటి కేడువందల యిరువది సంవత్సరము లని చెప్పవచ్చును. ఈతఁడు వీరశైవుఁడు; శైవమతగ్రంథముల ననేకము లను రచియించెను. ఈ సోమనాథకవి రచియించిన తెనుఁగు గ్రంథములలో ద్విపదరూపమున నున్న పండితారాధ్యచరితమును, బసవపురాణమును

ప్రధానములు వీనిలో బండితారాధ్యచరిత్రము శ్రీనాథుఁడును, బసవపురాణమును పిడుపర్తి సోమనార్యుఁడును, పద్యకావ్యములనుగాఁ జేసిరి

ఒకనాఁడు ప్రతాపరుద్రుఁ డోరుగల్లుపురమున శివాలయమునకుఁ బోయి నప్పుడు శైవులు మంటపముమీఁదఁ గూరుచుండి పాల్కురికి సోమనారాధ్యకృత మయిన బసవపురాణమును వినుచుండిరి. వారిని జూచి రాజది యేమని యడుగఁగా వెంట నున్న ధూర్తబ్రాహ్మణుఁ డొకఁడు "మొన్న నీ నడుమను పాల్కురికి సోమపతితుఁడు మధ్యవళ్ళు పెట్టి యల్లిన యప్రమాణ బసవద్విపదపురాణ పఠన" మని పలికెను. అందుమీఁద శివభక్తులు పోయి పొనుగూర నున్న సోమనారాధ్యున కా వృత్తాంతమును దెలుపఁగాఁ బ్రతివాదులను జయించుటకయి బయలుదేఱి యతఁ డోరుగల్లుపురమునకు శిష్యబృందముతో వచ్చెను అతనిరాక యెఱిఁగి యేకశిలానగరమునందలి బ్రాహ్మణధూర్తు లాతని నవమానించుటకయి యా యూర నుండు మత్తు లయిన మొండివాండ్రు మొదలయినవారికి విభూతిరుద్రాక్షాదులు పెట్టి శిష్యబృందమునువలె వారి కెదురుగాఁ బంపిరి. * తరువాత సోమనార్యుఁ డా పురిఁ బ్రవేశించి ప్రతిపక్షులతో వాదించి గెలిచి రాజానుగ్రహము సంపాదించి కొంతకాల మా యూర నుండి, ప్రతాపరుద్రుని మంత్రియు, సోమనార్యుని శిష్యుఁడు నగు ♦ నిందుటూరి యన్నయామాత్యునిసాహాయ్యమున దొంకిపర్తి మొదలయిన కొన్ని గ్రామములను బడసి శిష్యుల కిచ్చి, తా నాపట్టణము విడిచి కలికె మను గ్రామమునకుఁ బోయి యచ్చట శివసాయుజ్యమును బొందెను. ఈ యంశములు కొండపేటి చరిత్రము వలనను, బసవపురాణపద్యకావ్యపీఠికయందలి యీ క్రింది పద్యాదుల వలనను దెలిసికోవచ్చును.

సీ. ఒకనాఁడు శివభక్తు లోరుగంటను స్వయం
భూదేవుమండపమున వసించి

[* సోమనాథుని మహత్త్వవలన అవి యథార్థములే యయి, ఆవేషధారులా పిదప సోమనాథునికి శిష్యులైరఁట !

♦ ఇతఁ డిందులూరి-అన్నయమంత్రి.]

బసవపురాణంబు పాటించి వినువేళ
హరునిఁ గొల్వఁ బ్రతాపుఁ డచటి కేఁగి
'యా సంభ్రమం బేమి' యనుడు భక్తులు బస
వనిపురాణం బర్థి వినెద రనిన
విన నా పురాణంబువిధ మెట్లొకో యన్న
ధూర్తవిప్రుఁ డొకండు భర్తఁ జేరి

'పాలకురికిసోమపతితుఁ డీ నడుమను
పెనఁచె మధ్యవళ్ళు పెట్టి ద్విపద
యప్రమాణ మిది యనాద్యంబు పద' మన్న
నరిగె రాజు భక్తు లది యెఱింగి.

* * * * *

ఉ. వారలు వచ్చురాక పరవాదు లెఱింగియు నేవ పుట్ట నా
యూర వసించు ముక్కడుల నున్మదవృత్తుల మొండివారలన్
జేరఁగఁ బిల్చి చంద్రధరచిహ్నిత దేహులఁ జేసి యందఱన్
బోరన మీ రెదుర్కొనఁగఁ బొండని పంచిన దుండగంబునన్.'

పాల్కురికి సోమనార్యుఁడు బసవపురాణము, పండితారాధ్యచరితము, అనుభవసారము, చతుర్వేదసారసూక్తులు సోమనాథభాష్యము, రుద్రభాష్యము, బసవరగడ, గంగోత్పత్తిరగడ, సద్గురురగడ, చెన్నమల్లుసీసములు, నమస్కారగద్యము, వృషాధిపశతకము మొదలయిన గ్రంథములు రచియించినట్టు బసవపురాణపద్యకావ్యమునం దీ క్రింది పద్యమునఁ జెప్పఁబడినది.

సీ. బసవపురాణంబు పండితారాధ్యుల
చరితంబు ననుభవసార మును చ
తుర్వేదసారసూక్తులు సోమనాథభా
ష్యంబు శ్రీరుద్ర భాష్యంబు బసవ

రగడ గంగోత్పత్తిరగడ శ్రీబసవాధ్య
రగడయు సద్గురురగడ చెన్న
మల్లుసీసములు నమస్కారగద్య వృ
షాధిపశతకంబు నక్షరాంక

గద్యపద్యము ల్పంచప్రకారగద్య
యష్టకము పంచకము నుదావారణయుగ్మ
మాది యగు కృతు ల్భక్తిహితార్ధబుద్ధిఁ
జెప్పె నవి భక్తసభలలోఁ జెల్లుచుండు.

ఈ కవిగ్రంథములలో బసవపురాణము, పండితారాధ్యచరిత్రము, అనుభవ సారము తెలుఁగు, అన్యవాదకోలాహలము, బసవనపంచగద్య. సోమనాథ భాష్యము, సంస్కృతము; తక్కినవి కన్నడము *

[* సోమనాథుఁడు ౧౦ తెలుఁగు గ్రంథములను, ౧౦ సంస్కృత గ్రంథములను, ౮ కన్నడ గ్రంథములను రచించెనని 'ఆంధ్రకవి తరఁగిణి' లోఁ గలదు.

ఆంధ్ర గ్రంథములు - బసవ పురాణము, పండితారాధ్య చరిత్రము, మల్లమదేవీ పురాణము, సోమనాథ స్తవము, అనుభవసారము, చెన్నమల్లు సీసములు, వృషాధిప శతకము, చతుర్వేదసారము, బసవోదాహరణము, బసవరగడ

సంస్కృత గ్రంథములు - సోమనాథ భాష్యము, రుద్ర భాష్యము, వృషభాష్టకము, బసవోదాహరణము, అష్టోత్తర శతనామ గద్యము, నమస్కార గద్యము, పంచప్రకార గద్యము, అక్షరాంక గద్యము.

కన్నడ గ్రంథములు - బసవరగడ, బసవాధ్యరగడ, సద్గురురగడ గంగోత్పత్తిరగడ-ఇయ్యవి తెనుఁగుకృతులో, కర్ణాటకృతులో చెప్పఁజాలమని శ్రీబండారు తమ్మయ్యగారు వ్రాసిరి. రగడలు తెలుఁగు సంప్రదాయమునకు సంబంధించినవను నాశయమున, శ్రీ తమ్మయ్యగారట్లనియుండ వచ్చును.

'అక్షరాంక గద్య' నేకాక 'అక్షరాంక పద్యములనుగూడ సోమనాథుఁడు వ్రాసెననియు' 'శీల సంపాదనము, శివగణ సహస్రనామము' నను రెండు కన్నడ కృతులనుకూడ ఈతఁడు రచించెననియు, శ్రీ వేంకటరావుగారు తమ 'తెనుఁగు కవుల చరిత్ర' లో వ్రాసియున్నారు.

ఈ రచనలలో మొదటిది 'అనుభవ సార' మనియు, అది నన్నయభట్టు కవితా సంప్రదాయముల ననుసరించినదనియు, శైవకవితా సంప్రదాయము లందు లేవనియు తెల్పుచు శ్రీ వేంకటరావుగారు తర్వాతి రచనలను క్రమముగా నిట్లు నిరూపించిరి—బసవపురాణము, వృషాధిప శతకము, గద్య కృతులు, పద్య స్తుతులు, చతుర్వేద సారము, భాష్య గ్రంథములు, సంస్కృత స్తుతులు, పండితారాధ్య చరిత్రము,

సోమనాథకృత మయిన బసవద్విపదను పద్యకావ్యమును గా రచింపు మని పిడుపర్తి సోమనాథకవితో నాతని తండ్రి బసవన్న చెప్పు సందర్భమున నిట్లనెను.

సీ. విరచించె జైమిని వేదపాదస్తవం
బొకపాదమునను వేదోక్తి నిలిపి
హరభక్తి వైదికం బని శ్రుతు లిడి చెప్పెఁ
బ్రతిభ సోమేశుఁ డారాధ్యచరిత
సరవి శ్రీనాథుఁ డాచరిత పద్యప్రబం
ధము చేసె ద్విపదలు తఱుచు నిలిపి
యాతండు పద్యకావ్యము చేసె నైషధ
మంచితహర్షవాక్యములఁ బెట్టి
సోమగురువాక్యములఁ బెట్టి భీమసుకవి
గరిమ బసవపురాణంబు గణనఁజేసె
గానఁ బూర్వకావ్యము చేరుగతి రచించు
వారి కాదికావ్యోక్తులు వచ్చు నెగడు.'

ఈ భీమకవిచేసిన బసవపురాణము కన్నడభాషలో. పాల్కురికి సోమనాథ విరచిత మయిన యనుభవసారమునుండి కొన్ని పద్యములఁ జూపి, తత్కృతములయిన బసవపురాణ పండితారాధ్యచరితములనుండి శైలిని సూచించు చిన్నభాగముల నుదాహరించి, యీ కవిచరితమును ముగించు చున్నాను.

అనుభవసారము

చ. 'ముదిమ వహింప హేతువులుముప్పదియై మది నొప్పుఁ బెంపునన్
మృదుమధురోక్తు లింపడర మెచ్చులు దీటుకొనంగ నర్థసం
పద దళుకొత్త సాంగముగఁ బామరు లుల్లము పల్లవింప న
ల్లైదురుభజింప భక్తి వలదే శివభక్తి కథాప్రసంగతిన్.

చ. అవిరళలింగపూజయు, నిరంతరసద్గురుభక్తియుక్తియుఁ
సవినయజంగమార్చనయు సత్యము శౌచము సచ్చరిత్రమున్

దవిలి ప్రసాదసేవయును దా నొడఁగూర్పక వట్టిమాటలం
దవునె యుదాత్తభక్తి సుగుణాకర ! శ్రీకర ! దోషిభీకరా !

శా. దానానేకమహాతపోనిచయసద్ధర్మౌఘతీర్థాఖిల
స్థానస్తోమజపవ్రత ప్రణుతయజ్ఞవ్రాతమంత్రోక్తని
త్యానుష్ఠానవితానమున్ సలుపు పుణ్యం బంతయుం గూడ నా
ర్యానాథాంఘ్రులఁ బూన్చు పుష్పజసహస్రాంశంబునుఁబోలునే.

ద్వి. అనుచు నవ్వించుచు నవిరళభక్తి
జనితసుఖామృతవనధిఁ దేలుచును
బసవండు జంగమప్రకరంబుఁ దాను
నసలారనోలగంబై యుండె నంత
పెద్దలతేఁడు, పెన్నుద్దులమొదలు,
బుద్ధులప్రోక, విబుధనిధానంబు,
అమితవచోరాశి, సుమనోనురాగుఁ,
డమలినచిత్తుఁ, డుద్యద్గుణాన్వితుఁడు,
సకలవీణాప్రవీణకలావిదుండు,
అకలంకనాదవిద్యాపండితుండు. &c , బసవపురాణము

ద్వి. వేదవేదాంతాదివివిధపురాణ
వాదితకేవలభక్తి వర్ధనుఁడు
పండితనతపాదపద్మండు సుకవి
మండలవిబుధసమాజపూజితుఁడు
ఆరూఢకీర్తికుండగు కోటిపల్లె
యారాధ్యులందు లోకారాధ్యమూర్తి
యసమతదీయలోకారాధ్యశిష్య
విసరాగ్రగణ్యుండు వీర వ్రతుండు
చనును "రుద్రో నాత్ర సంశయ" యనఁగ
జనియించినట్టి సాక్షాద్రుద్రమూర్తి &c , పండితారాధ్య చరిత్ర.

]వివాదాస్పదములైన కవిచరిత్రములలో సోమనాథుని చరిత్ర మొకటి. ఇతని జన్మస్థానమునుగూర్చియు, కులగోత్రములనుగూర్చియు, కాలమును గూర్చియు విభిన్నాభిప్రాయములు కలిగి వాదోపవాదములు ప్రబలినవి. ఈవిషయములంగూర్చి ప్రత్యేకగ్రంథములే వెలువడినవి. వాని సారాంశము మాత్ర మిచట తెలుపఁబడును.

సోమనాథుని నివాసము తెలంగాణాయందలి 'పాల్కుఱికి' యని పెక్కురు విమర్శకు లభిప్రాయపడియున్నారు. 'పండితారాధ్యచరిత్ర'ను పరిష్కరించి, విపుల విమర్శనము వ్రాసిన శ్రీ చిలుకూరి నారాయణరావుగారు— మైసూరు రాష్ట్రములో తుముకూరు పరిసరముననున్న 'హాల్కుఱికి'యే సోమనాథుని జన్మస్థానమని తెలిపిరి. 'ఆంధ్రకవితరంగిణి' కారులు శ్రీ నారాయణరావుగారితో నేకీభవించిరి 'తెనుఁగు కవుల చరిత్ర'లో తెలంగాణాలో నేఁడు కానవచ్చు 'పాలకుర్తి'యే సోమనాథుని నివాసమగు 'పాల్కుఱికి' యని వివరింపఁబడి యున్నది.

సోమనాథుఁడు, తాను 'భృంగిరిటి' గోత్రుఁడనని చెప్పియుండెనే కాని కుల, గోత్రములను వివరింపలేదు కావున నీతఁడు బ్రాహ్మణేతరుఁడైన జంగముఁ డని శ్రీబండారు తమ్మయ్యగారు వాదించుచున్నారు. శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు మున్నగు వారీతఁడు బ్రాహ్మణుఁడని నిరూపించి యున్నారు. 'పరంపరాయాతమగు జనశ్రుతినిబట్టి యీతఁడు కౌండిన్య గోత్రజుఁడని తెలియుచున్న' దని శ్రీ వేంకటరావుగారు 'తెనుఁగు కవుల చరిత్ర' లో (పుట 324) వివరించిరి 'కులగోత్రముల ప్రసక్తి లేని వీరమాహేశ్వరాచారము స్వీకరించిన వెనుక, సోమనాథుఁడు తత్సంప్రదాయము ననుసరించి తా నీశ్వర కులజుఁడననియు, భక్తి గోత్రుఁడననియు, పార్వతీ పరమేశ్వరులు తల్లిదండ్రులనియు చెప్పుకొన్నాడు.' అని వేంకటరావుగారి యభిప్రాయము. దీనినే పెక్కురు విమర్శకులు సమ్మతించుచున్నారు

సోమనాథుఁడు తాను గురులింగ తనూజుఁడనని యనుభవసారమునఁ జెప్పియున్నను- తన తల్లిదండ్రులు రామవిష్ణుదేవుఁడు, శ్రియాదేవియని బసవ

పురాణమునఁ జెప్పుటవలన, గురులింగార్యుఁ డీతని దీక్షాగురువనియు, అందు వలననే అతనిని జనకునిగా భావించెననియుఁ జెప్పవలసి యున్నది.

ఇతని కాలమునుగూర్చియు నభిప్రాయభేదము లున్నవి. బసవపురాణమును తొలుత పరిష్కరించి, విపుల విమర్శన వ్రాసిన శ్రీ వేటూరి-ప్రభాకరశాస్త్రి గారు సోమనాథుఁడు క్రీ. శ. 1190 నాఁటికే సుప్రసిద్ధుఁ డగుటచే బసవ పురాణ మా ప్రాంతముననే రచియింపఁబడి యుండునని తెల్పియున్నారు. శ్రీ బండారు తమ్మయ్యగారు క్రీ శ. 1160–1230 మధ్యకాలమున నీతఁ డుండెనని నిశ్చయించిరి. శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు క్రీ శ. 1190–1260,70 ల మధ్యకాలమున నీతఁడుండెనని నిర్ణయించిరి. బసవపురాణ రచనాకాలము క్రీ శ 1178 అని శ్రీ దేవరపల్లి-వేంకట కృష్ణారెడ్డిగారు తమ 'నన్నెచోడకవి చరిత్ర' లోఁ దెల్పి యున్నారు ఈ కాల మించుమించుగా ఓరుగంటిని పాలించిన కాకతిప్రోలరాజు పుత్త్రుఁడు మొదటి ప్రతాపరుద్రుని కాలమునకు సరిపోవును. సోమనాథుఁడు ఆ ప్రభువర్యుని సభలోనే ప్రతి వాదులను వాదమున నోడించి వీరశైవ మతమును స్థాపించి యున్నాఁడని పలువురి యభిప్రాయము.

శ్రీ మల్లంపల్లి-సోమశేఖరశర్మగారు శాసన ప్రమాణములు నాధారముగాఁ గొని బసవపురాణ, పండితారాధ్య చరిత్రములు క్రీ॥ శ. 1290–1320 ల నడిమికాలమున రచింపఁబడినవనియు, సోమనాథుని కాలమదియే యనియుఁ దెల్పియున్నారు, ఇయ్యది రుద్రమదేవి మనుమఁ డగు ద్వితీయ ప్రతాప రుద్రుని కాలమునకు సరిపడును శ్రీ నేలటూరి-వేంకటరమణయ్యగారు శ్రీ చిలుకూరి నారాయణరావుగారు, శ్రీ సోమశేఖరశర్మగారి వాదమునే సమర్థించిరి. 'ఆంధ్రకవి తరంగిణి' కారులును, శతక వాఙ్మయ సర్వ స్వము' ను రచించిన శ్రీ వేదము-వేంకట కృష్ణశర్మగారును పయి వాదమునె యనుసరించిరి.]

రంగనాథుఁడు

రంగనాథుఁ డనునతఁడు రామాయణమును ద్విపదకావ్యమునుగా రచియించిన కవి. రంగనాథుఁడు తన గ్రంథమునం దాంధ్రకవుల నెవ్వరిని స్తుతింపక పోవుటచేత నీతఁడు నన్నయభట్టారకునికంటెను బూర్వుఁడని కొందఱు చెప్పుదురు గాని తగిన నిదర్శనములేవియుఁ గానరావు. ద్విపదరామాయణము కృత్యాదిని "కవిలోక భోజుండు" అని బుద్ధరాజున కొక్క విశేషణము వాడఁబడినది. భోజరాజు శాలివాహనశకము ౧౦౨౧-వ సంవత్సరమునం దనగా హూణశకము ౧౦౬౮-వ సంవత్సరమునం దున్నట్లొక శిలాశాసనమువలనఁ దెలియవచ్చుచున్నది. పయి విశేషణమును బట్టి భోజుఁడు కవీంద్రుల నాదరించువాఁ డని దేశవిఖ్యాతి చెందిన తరువాతనే యీ గ్రంథము రచియింపఁబడుట స్పష్టము గనుక, కవి యీ రామాయణమును పండ్రెండవ శతాబ్దమునందో తరువాతనో చేసి యుండవలెను. పదుమూడవ శతాబ్దమునందు రచియింపఁబడిన ట్లొక కథవలన నూహింపఁదగి యున్నది. ఆ కథ భాస్కరునిచరిత్రమునందుఁ దెలుపఁబడును. ఇది కృష్ణామండలములోని మనుమూరి సంస్థానమునకు ప్రభువయి యుండిన * కోన విఠ్ఠలరాజుకొమారుఁడైన బుద్ధరాజు పేరుపెట్టి యీ కవి రచించినను, జనులు బుద్ధరాజరామాయణ మని పిలువక నేటివరకును దీనిని రంగనాథరామాయణమనియే వాడుచున్నారు. కవి బుద్ధరాజున కాశ్రితుఁ డగుటయే కాక బంధు వనియుఁ జెప్పుదురు. అయినను దీని వాస్తవమును కనుఁగొనుట కాధారము లేవియు లేవు. ఒకవేళ రంగనాథుఁ డా రాజు నాస్థానవిద్వాంసుఁడగు బ్రాహ్మణుఁ డైన నై యుండవచ్చును. ఆఱువేల వియోగి యైన కోవెల గోపరాజు రంగనాథుని నియోగికవులలోఁజేర్చి యీ క్రిందిపద్యమునఁ జెప్పియున్నాఁడు.

* [గోన విఠలరాజు కాని కోన విఠలరాజు కాఁడు. కాన 'కోన' అనుచోట్ల నెల్లెడల 'గోన' అనుకొనవలెను]

చ 'అనఘు హుళక్కిభాస్కరు మహామతిఁ బిల్లలమఱ్ఱి పెద్దిరా
జును బినవీరరాజుఁ గవిసోమునిఁ దిక్కనసోమయాజిఁ గే
తనకవి రంగనాధు నుచితజ్ఞుని నెఱ్ఱన నాచిరాజుసో
మన నమరేశ్వరుం దలఁతు మత్కులచంద్రుల సత్కవీంద్రులన్.'

పూర్వలాక్షణికు లందఱును రంగనాధుని లాక్షణికకవినిగా నంగీకరించి యున్నారు. ఇప్పుడు ముద్రితమైన గ్రంథమునందుఁ గొన్ని ప్రక్షిప్తభాగములు కూడ చేరియున్నందున, అక్కడక్కడఁ గొన్ని వ్యాకరణదోషములు కానవచ్చుచున్నవి. కాని యవి కవివి కావనుట నిశ్చయము పుస్తకమునం దెక్కడను కవి పేరైనను లేకపోవుటయే కాక కాండముల యంతముల యందుఁగూడ,

ద్వి. 'అని యాంధ్రభాష భాషాధీశనిభుఁడు
వినుతకావ్యాగమవిమలమానసుఁడు
పాలితాచారుఁ డపారధీశరధి
భూలోకనిధి కోనబుద్ధభూవిభుఁడు
తమతండ్రి విఠ్ఠలధరణీశు పేరఁ
గమనీయగుణధైర్యకనకాద్రి పేర
బనిపూని యరిగండభైరవు పేర
నాచంద్రతారార్కమై యొప్పమీఱ
భూచక్రమున నతిపూజ్యమై వెలయు
నసమానలలితశబ్దార్థసంగతుల
రసికమై చెలువొందు రామాయణంబు
పరఁగ నలంకారభావనల్నిండఁ
గరమర్థి ......కాండంబు సెప్పె.'

అని కోన బుద్ధరాజు రచియించినట్టే వ్రాయఁబడియున్నది. అయినను బుద్ధరాజు తన్నును, దనకావ్యమును బొగడుకొన్నట్టున్న రీతినిబట్టి చూడఁగా పండితు లాత్మస్తుతిపరాయణులు కాఁజాలరు గనుక పుస్తకమును వేఱొకరు రచియించిరనియే యూహింపవలసి యున్నది.

రంగనాధరామాయణ మిప్పటి కేడు వందలసంవత్సరములక్రిందట రచియింపఁబడినది. కొంద ఱీ కవి కోనబుద్ధారెడ్డికాలములో దూపాడుపరగణా కథకారిగా నుండెననియు, బుద్ధారెడ్డి ప్రతాపరుద్రునికి లోఁబడిన సామంత రా జనియు, చెప్పుచున్నారు. ఆ ప్రతాపరుద్రుఁని గణపతిదేవుని తండ్రి యైనపక్షమున, ఇప్పుడు చెప్పిన కాలము సరిగానే యుండును. అట్లుగాక యా ప్రతాపరుద్రుఁడు గణపతిదేవుని మనుమఁ డనెడి పక్షమున, కవి కాలము మఱి యఱువదేండ్లు తరువాత కావలసివచ్చును. అనేక హేతువులనుబట్టి యీ గ్రంధము మొదటి ప్రతాపరుద్రుని కాలములోఁ జేయఁబడినదే యైనట్టు నిశ్చయింపఁదగి యున్నది. ఈ మొదటి ప్రతాపరుద్రుఁడు ౧౨౦౦ వ సంవత్సరప్రాంతమువఱకును రాజ్యపాలనము చేసెను. బుద్ధారెడ్డికూతుఁరైన కుప్పమాంబ తన చరమవయస్సులో నావఱకే మృతుఁడైన తన భర్తపేర బూదపూరిలో (శాకాబ్దే వసునందశంకరమితే శ్రీధాతృసంవత్సరే) శకసంవత్సరము ౧౧౯౮ కి సరియైన క్రీ. శ. ౧౨౭౬ ధాతృసంవత్సరమున లింగప్రతిష్ఠ చేసి యనేకభూదానములు చేసి శాసనము వ్రాయించెను. ఈ కుప్పమాంబ కోన బుద్ధారెడ్డి కూఁతురని చూపుటకయి యా శాసనములోని యీ క్రింది శ్లోకము నుదాహరించుచున్నాను.

'శ్రీగోనవంశనిజ శేఖరబుద్ధయాఖ్య
పుత్రీ పవిత్రచరితా భరితా గుణౌఘైః
శృంగారసారకరణిః కరణీయదక్షా
కుప్పాంబికాజని చ తస్య సతీ కళత్రమ్.'

రంగనాధరామాయణము రచియింపఁబడిన కాలమున కీమె పుట్టెనో లేదో. ఎట్లయినను రంగనాధరామాయణము ౧౨౩౦-౪౦ వ సంవత్సరప్రాంతముల యందు రచియింపఁబడి యుండును. ఇది తిక్కన యుత్తర రామాయణ రచనమున కిరువది ముప్పదియేఁడ్లుముందు. తిక్కనపితామహుఁడైన మంత్రి భాస్కరుఁడు రామాయణమును రచించుటవలనఁ గాకపోయినను రంగనాధుఁడు రామాయణమును రచించుటవలన నైనను సోమయాజి పూర్వ రామాయణమును మాని యుత్తరరామాయణమును రచియించి యుండును.

రంగనాథుని కవిత్వము మృదుమధుర పదబంధయుత మయి శబ్దార్థాలంకారసంయుతమయి యన్వయకారిన్య విరహితమయి మనోహరముగా నుండును. కవిశైలి తెలియుట కయి కొన్నిపద్యములను వ్రాసి యీతని చరిత్రము నింతటితో ముగించు చున్నాను.

ద్వి. 'నడురాత్రి యరుదెంచె నరలోకనాథ
కడు డస్సివాఁడవు కనుమోడ్తు గాక।
చలియింపకున్నవి సకలవృక్షములు,
మెలఁగవు వనభూమి మృగసమూహములు;
నెఱి విహంగంబులు నీడము ల్చేరి
మఱచియున్నవి తమ మంజులధ్వనులు;— బాలకాండము

ద్వి కోమలి కేకయకులమునఁ బుట్టి
యీ మాటలాడ నోరెట్లాడె నీకు?
అడవులపాలు కమ్మని రాముఁ ద్రోవ
నెడపక తొల్లి నీ కెగ్గేమి చేసె?
కౌసల్యకంటె నిన్ ఘనముగాఁ జూచు,
నీసేవ లొనరించు నీపంపుచేయు;
నెటువలెఁ బొమ్మంటివే దయమాలి?—అయోధ్యాకాండము

ద్వి. వ్రతములఁ గడు డస్సి వనటలఁ గ్రుస్సి
యతిదుఃఖములఁ గుంది యాత్మలోఁ గంది
విపులాశ్రువులఁ దోఁగి విరహాగ్నిఁ గ్రాఁగి
కపటవృత్తులఁ జిక్కి కడముట్ట స్రుక్కి
జీవంబుపై రోసి చెలువంబుఁ బాసి
యా విధి మది దూఱి యలసత మీఱి
చెక్కిటఁ జేయి చేర్చి చింతల కోర్చి
దిక్కు లేమిఁ దలంచి ధృతి దూర డించి

యినరశ్మి వాడిన యెలదీగపోలె
ఘనధూమయుతదీపకళికయుఁబోలె
జలదమాలికలోని శశికళవోలెఁ
బలుమంచుపొదవిన పద్మినివోలెఁ
జెలఁగి పిల్లులలోని చిలుకయుఁబోలెఁ
బులులలో నావునుబోలె దుర్వార
ఘోరరాక్షసవధూకోటిలో నున్న
నారీశిరోమణి నలినాయతాక్షి — సుందరకాండము.

ద్వి. కృతకృత్యుఁ డగు రాముకీర్తిపుష్పములు
చతురతమై వెదచల్లినయట్లు
కర మొప్పఁ జుక్కలు గాన్పించె నంతఁ
జిరకాలములసీమ శిశువులమామ
పొలుపొందు కలువలపోరానివిందు
కలసిన జక్కవకవఁ బాపుమందు
పాలవెల్లిని ద్రచ్చి పడసినవెన్న
శూలియౌదలపువ్వు చుక్కలనవ్వు
నెరిచకోరములకు నెలనెలపంట
యురవేది విరహుల నుడికించు మంట
గగనంబుతొడవు వొంగఁగుంచెపసిఁగులు
నొగి నబ్ధిఁ బొంగించు నూఱటపట్టి
హరిహరబ్రహ్మలయానందవృష్టి
సరసిజరిపుఁడైన చంద్రుఁడు పొడిచె. — యుద్ధకాండము.

[ఈ రంగనాథునిఁగూర్చియు. ద్విపదరామాయణకర్తృత్వమునుగూర్చియు వాదవివాదములు అభిప్రాయభేదములును వెలసినవి రామాయణమున రంగనాథుని పేరు లేకున్నను, అతని పేరనే వాడుకలోనున్నందున నతఁడే రామాయణకర్తయని కొందఱు విమర్శకులు నమ్ముచున్నారు. ఈ రంగ

నాథుఁడే చక్రపాణి రంగనాథుఁడు. తొలుత వైష్ణవుఁడు వైష్ణవుఁడుగా నున్నపుడే రామాయణమును రచించెను.

ఇతఁడు వీరశైవుఁడగు పాలకురికి సోమనాథునితో వాదింపఁబోయి—అతఁడీతనిం జూడ నిష్టపడకపోఁగా, సోమనాథుని కుమారుఁడగు చతుర్ముఖ బసవేశ్వరునితో వాదించి, యోడిపోయి శ్రీశైలమార్గమునఁ బోవుచు, మల్లికార్జునస్వామిని జూడకయందున కన్నులు కానరాకుండఁబోయెననియు, నీతఁ డహోబలమునకుఁబోయి నరసింహదేవుని ప్రార్థింపఁగా నాతఁడు స్వప్నమునఁ గానవచ్చి శివద్వేషము తగదని బోధించెననియు, రంగనాథుఁడు శ్రీశైలమునకుఁ బోయి దేవుని స్తుతింపఁగా నొకకన్ను వచ్చెననియు, సోమనాథుని యనుగ్రహమున రెండవకన్నుకూడ లభించెననియు నొకవదంతి కలదు. ఈకథసంగతి యెటులున్నను, ఇతఁడు సోమనాథుని సమకాలికుఁడనియు, నీతఁడే ద్విపదరామాయణకర్తయనియు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు మున్నగువా రభిప్రాయపడినారు తొలుత వైష్ణవుడై రామాయణమును రచించినను, పిదప శైవుఁడగుటలో విరోధములేదు. తెనాలి రామలింగఁడు తొలుత శైవుఁడై పిదప రామకృష్ణుఁడైన సంగతి యెల్లరకును తెల్లమేకదా। రంగనాథుఁడు శైవుఁడైన పిదప 'శివభక్తిదీపిక' యను నొక చిన్నగ్రంథమును, 'నయనగతిరగడ'లో రచించెనఁట!

చక్రపాణి రంగనాథుఁడును, రామాయణకర్త యని చెప్పఁబడు రంగనాథుఁడును విభిన్న వ్యక్తులని 'ఆంధ్రకవి తరంగిణి' కారు లభిప్రాయ పడుచున్నారు [మూఁడవ సంపుటము పుటలు 155-156] మఱియు నీ రంగనాథుఁడు 'శ్రీగిరినాథ విక్రమ' మను నాంధ్రకావ్యమును, వీరభద్ర విజయము, శరభ లీలా అను కన్నడగ్రంథములను రచించెనని చెప్పుదురని అందే కలదు. [మూఁడవ సంపుటము. పుట 156]

రంగనాథ రామాయణమును గోన బుద్ధరాజే తన తండ్రి విఠ్ఠలరాజు పేరిట వ్రాసెననియు, విఠ్ఠలుఁడే పాండురంగఁడు గాన, అతఁడు పాండురంగనాథుఁడు కావచ్చుననియు, ఆ పదమును హ్రస్వ మొనర్చినచో 'రంగ

నాథుఁ డగుననియు, అతని పేరిట రచితమైన రామాయణము 'రంగనాథ రామాయణ' మయ్యెననియు కొందఱి యభిప్రాయము. ఇది యుక్తిసహము కాదని పెక్కండ్రు తలంచుచున్నారు.

విఠ్ఠలరాజు 'రామాయణమును రచింపఁదగినవాఁ డెవ్వఁడు?' అని ప్రశ్నింపఁగా సభ్యులతని పుత్రుఁ డగు బుద్ధరాజే తగినవాఁడని చెప్పినట్లును, పిదప తండ్రి పుత్రుని రామాయణమును రచింపఁ గోరినట్లును కృత్యాదిని బట్టి తెలియుచున్నది. పుత్రుని శక్తి సామర్థ్యములు తండ్రికిఁ దెలియకుండుట వింతగానే తోఁచును. ఉత్తరకాండముమ ద్విపదగా తెలిఁగించిన బుద్ధరాజు పుత్రులు కాచవిభుఁడును, విఠ్ఠలరాజును ఇచ్చిన వంశవృక్షమునకును, రంగనాథ రామాయణము నందలి వంశవృక్షమునకును భేదము కానవచ్చుచున్నది. ఈ విషయమున నింకను పరిశోధన జరుగవలసియున్నది]

కేతన

కేతన యనెడు కవి తిక్కనసోమయాజి కాలమునం దున్నవాఁడు. ఈ యంశ మీతని యాంధ్రభాషాభూషణమందలి యీ క్రింది పద్యమువలనఁ దేటపడుచున్నది.

గీ. 'కవిత చెప్పి యుభయకవిమిత్రు మెప్పింప
నరిది బ్రహ్మ కైన నతఁడు మెచ్చఁ
బరఁగ దశకుమారచరితంబు చెప్పిన
ప్రోడ నన్ను వేఱె పొగడ నేల ?'

దీనివలన నితఁడు తిక్కనసోమయాజికాలమువాఁ డగుట స్పష్టపడినందున, ఇతఁడు పదుమూఁడవ శతాబ్దమధ్యమున ననఁగా నిప్పటికి రమారమి యాఱు వందలనలువది సంవత్సరముల క్రిందట నున్నాఁడనుట నిశ్చయము. ఇతఁ డాంధ్రభాషాభూషణమును రచించుటకు ముందు తెలుఁగునకు వ్యాకరణ మేదియు లేదనుట నన్నయభట్టారక చరితమునం దుదాహరింపఁబడిన పద్యమువలననే కాక యాంధ్రభాషాభూషణమునందలి యీ క్రింది పద్యము వలనను దేటపడుచున్నది.

ఉ. 'క్రొత్తగ నాంధ్రభాషకును గొంచక లక్షణ మిట్లు చెప్పనే
యుత్తమబుద్ధి యీతఁ డని యోరలవోవక విన్నఁజాలు మీ
రొత్తిన మీకు మాఱునకు నుత్తర మిచ్చుట చాల యెగ్గు మీ
చిత్తమునందు నన్నెరవుసేయకుఁడీ కవులార ! మ్రొక్కెదన్.

క. నేరములు కాళిదాస మ
యూరాదులకైనఁ గలుగు నొరులకు లేవే !
సారమతు లైన సుకవుల
కారుణ్యమె నేర్పుకలిమి కవిజనములకున్.'

ఈతఁడు దండివిరచిత మయిన దశకుమారచరిత్రమును తెనిఁగించుట చేతఁ బండితు లీతని 'నభినవదండి' యని పొగడిన ట్లీక్రింద నుదాహరింపఁబడెడి యాంధ్రభాషాభూషణములోని పద్యములో కవియే చెప్పుచున్నాఁడు.

క. 'వివిధకళానిపుణుఁడ నభి
నవదండి యనంగ బుధజనంబులచేతన్
భువిఁ బేరు గొన్నవాఁడను
గవిజనమిత్రుఁడను మూలఘటికాన్వయుఁడన్.'

ఈ కవియింటిపేరు పైని పేర్కొనఁబడినట్లు మూలఘటికవారు; ఈతని తండ్రిపేరు మ్రానయ్య; * ఇతఁడు శివభక్తుఁడు. ఇతఁ డాంధ్రభాషాభూష

* ఈతనితండ్రి మ్రానయ యైనట్లు విజ్ఞానేశ్వరమునందలి ప్రాయశ్చిత్తకాండములో కడపట నున్న యీ క్రింది పద్యమువలన నెఱుఁగవచ్చును.

క. 'తజ్ఞులకుఁ దెలియునట్లుగఁ
బ్రాజ్ఞులు మది మెచ్చఁ దెలుఁగుపద్యములను ద
త్వజ్ఞుఁడు మ్రానయకేతన
విజ్ఞానేశ్వరము జగతి వెలయఁగఁ జెప్పెన్.'

[ఇతని తల్లి గంగమాంబ. నివాసము వెట్టి (వెంటి, రాలు]

ధర్మశాస్త్రములను కేతనయే మొట్టమొదట తెనిఁగింప నారంభించెను. ఇటీవలి కవులు సహితము మఱి యెవ్వరును ధర్మశాస్త్రముల నాంధ్రీకరింపఁ బూనుకోలేదు. కేతనయొక్క విజ్ఞానేశ్వరములోని మఱి రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను.

చ. 'ఒకనికిఁ గూఁతు నిచ్చి తగ నుంకువ గైకొని పెండ్లిసేయ ను
త్సుకమతి నున్నచోట గుణశోభితుఁ డొక్కఁడు వచ్చె నేనియున్
బ్రకటితదోషముల్ మొదటిభర్త పయిం గలవేని తండ్రి క
న్యక గుణవంతుఁ డైన పతి కచ్చుగ నిచ్చుట ధర్మ మెమ్మెయిన్. ఆచారకాం.

ఉ. జాతర పెండ్లియుత్సవము జన్నము చేయఁ దొడంగియున్నచో
జాఁతిగ రాజమంత్రులు తపస్వులు వేల్పు లవశ్యకార్యముల్
ప్రీతి నొనర్చుచోఁ దఱిమి పిల్వఁగ నప్పను లెల్లఁ దీరఁగా
భూతలనాథుముద్ర గొనిపోయిన భృత్యులు వారిఁ దేఁదగున్. వ్యవహార.

ణమును, దశకుమారచరిత్రమును మాత్రమేకాక విజ్ఞానేశ్వరీయమును యాజ్ఞవల్క్యధర్మశాస్త్రమును గూడ తెనిఁగించెను *

అనేక లక్షణగ్రంథములు పుట్టి యున్న యీ కాలమునం దాంధ్రభాషాభూషణమంతగా నుపయుక్తము కాకపోవచ్చునుగాని యితరలక్షణగ్రంథములు లేని పూర్వకాలమునం దది పరమప్రయోజనకరముగా నుండిన దనుటకు సందేహము లేదు. ♦ కేతనకవిత్వము తిక్కనాదులకవిత్వముతో సరిరాక పోయినను సలక్షణమయి మధురమయినదిగా నున్నది. ఈతని కవిత్వశైలి తేటపడుట కయి యీతని గ్రంథమునుండి కొన్నిపద్యము లుదహరింపఁబడుచున్నవి.

౧. ఆంధ్రభాషాభూషణము.

క. 'భాషావేదులు నను విని
యా షణ్ముఖపాణినులకు నగు నీడని సం
తోషింప నాంధ్రభాషా
భూషణ మను శబ్దశాస్త్రముం గావింతున్.

[* కేతన తెనిఁగించినది యాజ్ఞవల్క్యస్మృతి యను ధర్మశాస్త్రము కాదు. ఆ స్మృతికి విజ్ఞానేశ్వరుఁడు రచించిన 'మితాక్షర' అను వ్యాఖ్య ననుసరించినది. పేరికిది విజ్ఞానేశ్వరీయమే కాని దానికిది యనువాదము కాని, అనుసరణము కాని కాదు. మితాక్షర విపులమగు గ్రంథము. కేతన పయి మితాక్షరిలోని విషయములను — జన సామాన్యమున కుపయోగి యగువానినిగూర్చి సంగ్రహముగ నొక చిన్న గ్రంథమును రచించి, దానిక 'విజ్ఞానేశ్వరీయ' మని పేరు పెట్టి యుండవచ్చును. మూలమునందు వేర్వేఱు కాండములలో నున్న విషయము లిందు తార్మాఱయి యున్నవి]

[♦ కేతన తనకుఁ బూర్వమున నున్నదియు, ద్వితీయ నాగవర్మచే 12వ శతాబ్దికిఁ బూర్వము రచింపఁబడిన 'కర్ణాటకభాషాభూషణము' ననుసరించి 'ఆంధ్రభాషాభూషణము'ను రచించెననియు, ఆ నాగవర్మ తొలుత వేంగీనగర నివాసియై యుండి, రాజకీయ కల్లోలములు కారణముగా కర్ణాటక దేశమున కేఁగెననియు, ఆంధ్ర, కర్ణాటక భాషాభూషణములు రెంటికిని చాల పోలికలు కలవనియు భాషా సాహిత్య విమర్శకులు, బహుభాషావేత్తలు నగు శ్రీ తిరుమల - రామచంద్రగారు వివరించి యున్నారు.]

క. పోఁడిగ బహువచనంబులు
వీఁ డనుటకు వీంఱ్రడు వీరు వీరలు నయ్యెన్
కాఁడునకు కాంఱ్రడు కాఱును
వాఁ డనుటకు వాంఱ్రడు వారు వారలు నయ్యెన్.

౨. దశకుమారచరిత్రము.

క. మించి మదించిన రిపుల హ
రించక సత్కీర్తి యీ మహీతల మెల్లన్
నించక దీనుల దయఁ బో
షించక ప్రఖ్యాతి కలుగునే నరనాథా।

క. నుతకీర్తి వడసి జనవ
ర్ణితులై వర్ధిల్లి దుష్టనిగ్రహశిష్ట
ప్రతిపాలకులై 'త్రిజగ
ద్ధిత' ముగ నేలంగఁదగు మహీతల మెల్లన్.

ఉ. ఆమగధేశమాళవధరాధిపు లెక్కటిఁ బోరి రాజిలోఁ
గాముఁడు శంబరుండు శశిఖండధరుండు గజాసురేంద్రుఁడున్
రాముఁడు రావణుండు సురరాజసుతుండును సింధునాథుఁడుఙా
భీముఁడు దుస్ససేనుఁడు నుపేంద్రుఁడుఁ గంసుఁడుబోరునాకృతిఙా.

౩. విజ్ఞానేశ్వరీయము

మ. సుర సేవించిన వాతివాఁడి యయినఙా సొమ్మెల్లఁ బోనాడినఙా
బురుషద్వేషిణియైన గొడ్డయిన నెప్డుం గూఁతులం గన్న మైఁ
బరపౌరోగము గల్గె నేనియును నప్పూర్వం బెడంబాసి య
ప్పురుషుండొండొకపెండ్లియాడినను నొప్పుం దప్పులేదేమియుఙా.

ఆచార.

క మాటలు నేరక పలికిన
నోటమిగాఁ గొనక కార్య మున్న నిజముఁ దాఁ
బాటించి నృపతి ధర్మం
బేటముగాఁ బాడి నిర్ణయింపఁగ వలయున్—వ్యవ.

ఉ. వ్రేకనిబండివానికిని విప్రునికిన్ బతికి న్వివాదికిన్
వ్రేఁకపుమోపువానికిని వృద్ధునికిన్ గడుఁజిన్నబిడ్డకున్
వ్రేఁకటియాడుమానిసికి వేదుఱువానికిఁ దెవ్వగొంటుకున్
దేఁకువతోఁ దొలంగునది తెల్లముగా నెదు రేగుదెంచినన్—
ప్రాయశ్చిత్త.

ఈ కవి బాణభట్టవిరచిత మయిన కాదంబరిని తెనిఁగించినట్లు కనఁబడుచున్నది. కేతనకృత మయినకాదంబరిలోని దని రంగరాడ్ఛందమునం దీ పద్య ముదాహరింపఁబడియున్నది.

గీ. 'జనవరేణ్యుఁ గాంచి సాష్టాంగ మెరఁగిన
నా విభుండు వాని లేవనెత్తి
కౌఁగిలించి వానిఁ గనుఁగొని కేయూర
కాభిధాన మొసఁగెఁ గడుముదమున'

కాదంబరిలోని వని యుదాహరింపఁబడిన పద్యములలో నొక దానియందు భాస్కరునికేతన యని యుండుటచేత కాదంబరి గ్రంథకర్త యితఁడు గాక తిక్కనసోమయాజిపెదతండ్రి యైనకేతన యని తోఁచుచున్నది. *

అభినవదండి యను నామాంతరము గల యీ కేతనకవిచేత విరచితమైన దశకుమారచరిత్రము పండ్రెండాశ్వాసముల పద్యకావ్యము నా కీ నడుమ లభించినది. ఆ గ్రంథములోని

* [కేతనమంత్రి' చరిత్రమును జూడుఁడు]

ఉ. 'శ్రీరమణీగృహాంగణము చెన్నువహింప నలంకరింపఁగాఁ
దోరణముం బ్రదీపమును దోహలియై యొడఁగూర్చెనాఁదగం
జేరి యురంబునంద తులసీవనమాలయుఁ గౌస్తుభంబు నా
స్ఫారఁగ నుల్లసిల్లు హరి యన్నమతిక్కని ధన్యుఁ జేయుతన్.

ఉ. హారికపర్దకాంచనమయాచలసానువునందు నిర్జర
స్ఫారవిలాసముం గలుగు జాహ్నవిఁ దాల్చిన శంకరుండు నీ
హారకరావతంసుఁ డణిమాదిగుణప్రదవీక్షణుండు ది
క్పూరితకీర్తిశాలి యగు కొమ్మయతిక్కనిఁ గాచుఁగావుతన్.

అను మొదటి రెండు పద్యములవలనను దశకుమారచరిత్రము తిక్కన సోమయాజి కంకితము చేయఁబడినట్లు దెలిసికోవచ్చును కవి యిష్టదేవతా వందనాదులు చేసిన తరువాత

"వ అని యిష్టదేవతా ప్రార్థనంబును సుకవిచరణారవిందాభి వందనంబు నుం జేసి నా రచియింపంబూనిన కృతి కధీశ్వరుండైన కొట్టరువు తిక్కనామాత్యునకు నిజస్థానం బగు విక్రమ సింహపురం బభి వర్ణించెద"

అని యేతత్పురవర్ణమును తత్పురాధీశ్వరుఁ డగు మనుమసిద్ధివర్ణనమును జేసి

"వ ఇట్లు కీర్తిపాత్రంబైన మనుమసిద్ధిమహీవల్లభునకుఁ గరుణారస పాత్రంబైన కొట్టరువు తిక్కనామాత్యుండు నిజకులక్రమాగతం బగు మంత్రిపదంబున వర్తిల్లుచు.

గీ అందలంబు గొడుగు లడపంబు మేల్కట్టు
చామరములు జమిలిశంఖములును
గంబగట్లు భూమి కానికగాఁగఁ బెం
పెసఁగు రాచపదవు లెల్లఁ బడసె."

అని చెప్పి తిక్కన తన్ను రావించుట లోనగు విషయముల నిట్లు చెప్పెను.

సీ. వేఁగివిషయమున వెట్టి(ంటి) రా లనుపేర
నభిరామ మగు నగ్రహారమునకు

నగ్రగణి యగువాని నఖినవదండినాఁ
బొలుపు మీఱినవానిఁ బ్రోలనార్యు
నను(గుఁదమ్ముని సంస్కృతాదిభాషాకావ్య
కర్తృత్వమున నుతి గన్నవానిఁ
గౌండిన్యగోత్రుని బండారుకేతదం
డాధీశుమఱఁది నధ్యయనపడుని
మూలఘటికాన్వవాయసముద్రపూర్ణ
హిమమయూఖుని మారయ కమలకమల
వదన యగుసంకమాంబకు * వరతనూజుఁ
గేతనార్యుని నన్ను విఖ్యాతయశుని.

వ. అత్యాదరంబున రావించి యాసనార్ఘ్యపాద్య తాంబులాంబ రాభరణ దానాద్యుపచారంబులఁబరితుష్టహృదయుం జేసి నీవు సంస్కృతాద్యనేక భాషాకావ్యరచనావిశారదుండ వగుట జగత్ప్రసిద్ధంబు గావున నొక్క కావ్యము రచియించి నన్నుఁ గృతిపతిం జేయవలయునని సగౌర వంబుగాఁ బ్రార్థించిన నేనును మత్కావ్యకన్యకకుఁ దగు వరుండగు నతని మనోరథంబు సఫలంబు గావింపఁదలంచి.

ఉ. కొమ్మయశౌరిసూనున కకుంరితకీర్తివిలాసమొందఁ గ
ద్యమ్మున దండి చెప్పిన కథాక్రమ మొప్పఁ దెనుంగుబాస గ
ద్యమ్మను బద్యముం బెరయ నంచితభావరసోదయాభిరా
మ మ్మగునట్లుగా దశకుమారచరిత్రము చెప్పఁబూనితిన్.'

ఈ దశకుమారచరిత్రకవిత్వము కవి చెప్పుకొన్నట్టు తిక్కన మెచ్చునంత రసవంతముగానే యున్నది. ఇందుండి కొన్ని పద్యము లిం దుదాహరింపఁ బడుచున్నవి.

చ. పలికిన నుల్కిపాటు మదిఁ బట్టుకొనంగ నెలుంగుదిక్కు చూ
డ్కులు పచరించి యాత్మపతి ఘోషముచందము కారణంబుగాఁ

[* కేతనతల్లి గంగమ, తండ్రి మారయ యని విజ్ఞానేశ్వరీయము వలనఁ దెలియవచ్చుచున్నది.]

దలఁకక డాయఁబోయి విదితంబుగఁ గాంచె రథంబుమీఁద ని
ర్మలమణిమండనద్యుతినిరాకృతహంసుని రాజహంసునిన్ — ఆ ౨.

ఉ. ఏపునఁ బోరుసేనలకు నెల్లను మీఱి సముల్లసద్భుజా
టోపమునై నరాతులఁ బటుప్రదరంబులఁ బాఱఁద్రోలి యా
భూపతి యగ్గమైన రథము౯ రథముం గదియించి లంఘన
ప్రాపితతద్రథుండ నయి పట్టి వెసం దెగఁజూచి యార్చితిన్ ఆ ౪.

చ. కనుఁగొనునంత నా మనసుఁ గన్నుల మన్మథుఁ డింతిపాలు చే
సిన మెలఁగంగలేక గతచేష్టుఁడ నై యదినిద్ర వోవుచో
మనమున కింతపుట్టె గరిమం బగువిభ్రమ మంగకంబు నొం
దినతఱిఁ జూచువారలకు ధీరత యెక్కుడిదంచు లోలతన్ — ఆ ౬

ఉ. అల్లుఁడ వీవు రాజ్యమున కంతకు నర్హుఁడ వీవు భూమికిం
దల్లివి తండ్రివిన్ బహువిధంబుల దాతవు నీవు మాకులం
బెల్ల సముద్ధరింప నుదయించిన పుణ్యుఁడ వీవు నీకు నే
నెల్లి మదీయపుత్రిఁ బురమెల్ల నెఱుంగఁగఁ బెండ్లిచేసెద౯. ఆ ౯.

ఉ. నీ వలవోకఁజూచి తరుణీతిలకంబుమనంబు రూపము౯
భావగతంబులై నఁ గడుఁ బ్రౌఢత చూపుట గోరి యచ్చుపా
టై వఱలంగ నున్న తెఱఁ గంతయు వ్రాసితిఁగా తలంచెద౯
దేవసమాన నా యెఱుక తెల్లమొ బొంకొ నిజంబు చెప్పుమా —
ఆ. ౧౦

శా. సైన్యంబు ల్మద మెక్కి బాహుబలముల్ శౌర్యంబులుం జూపి ని
ర్దైన్యస్ఫూర్తిఁ గడంగి ఘోరపటుశస్త్రప్రౌఢిమన్ నిష్ఠురా
నన్యోన్యాహవనోత్థితాగ్నికణరౌద్రాకారత౯ లోకసా
మాన్యాతీతమహోగ్రవిక్రమరణోన్మాదప్రకారంబులై — ఆ. ౧౨

ఈదశకుమారచరిత్రములో భారతాంధ్రీకరణవిషయమేమియుఁ జెప్పఁ కుండకపోవుటచేతఁ దిక్కన యీ గ్రంథరచననాటికి భారతము చేయ నారంభించి యుండఁడు,

బద్దెనకవి

ఆంధ్రచోడులలోనివాఁ డైన యీ బద్దెనృపాలుఁడు నీతిశాస్త్రముక్తావళి యను గ్రంథమును జేసెను. ఈ గ్రంధమును బ్రహ్మశ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు ౧౯౧౦ వ సంవత్సరమునందు పెద్ద పీఠికతోఁ బ్రచురించిరి. ఈ బద్దెననృపతి కృష్ణానదీతీరమునం దున్న దక్షిణ షట్సహస్రదేశమును పాలించిన యొక చిన్నసామంతరాజు. శ్రీరామకృష్ణకవిగా రీ బద్దెనకవిని గూర్చి "కృష్ణవేణానదీతీరదక్షిణషట్సహస్ర విషయాధీశ్వర వీరమాహేశ్వర కీర్తిసుధాకర గుణరత్నాకర వేంగిచాళుక్య మూలస్తంభ రిపుదళితసంభికుంభ బలయాంగనాగృహతోరణ నన్నన గంధవారణనామాది ప్రశస్తిసహితం శ్రీమహామండలేశ్వరబద్దచోళనరేంద్ర" మను శాసనము నుదాహరించి, దానినిబట్టి యతఁడు క్రీస్తుశకము ౧౦౭౦ వ సంవత్సరములో నుండవచ్చునని యూహించి, ఆ శాసనము "చెన్నపట్టణపు లైబ్రరీలోని చరిత్రములలోనిది గావున నమ్మఁదగినది కా" దని దానిని నిరాకరించి, ఇట్టి బిరుదులు గలవాఁడు కేవలసామంతరా జగునా? యని సందేహించిరి ఇట్లు సంశయపడవలసిన పని లేదు. మనలోని సంస్థానాధిపతుల కనేకులకుఁ దమకు గల గ్రామములకంటె బిరుదనామములే యెక్కువగా నుండును. ఉన్న రాజ్యము చిన్నదే యయినను బిరుదావళిమాత్రము పెద్దదిగానున్న రాజులనేకులు గలరు. ఈ కవికాలవిషయమున రామకృష్ణకవిగారు చేసిన యూహ సరియైనది కాదు. కవికాలము నించుమించుగాఁ దెలిసికొన దగిన యాధార మొకటి కవియొక్క నీతిశాస్త్రముక్తావళియందే కానవచ్చుచున్నది.

సీ. 'రాజనీతియు నసద్రాజలక్షణమును
మంత్రిమార్గంబు దుర్మంత్రివిధము
నధికారవిధియుఁ గార్యవిచారము నుపాయ
గతియును రాజ్యరక్షాక్రమంబు

నిల నరాజకవృత్తి హితసేవకస్థితి
దుస్సేవక క్రియ దుష్టరాజ
సేవాబలము దానశీలతామహిమ వి
వేకసంగతియును లోకనీతి

పద్ధతులు చేసి భువి నతిప్రజ్ఞ వెలయ
బద్దెనీతియుఁ గోమటి కుచునోళ్ల
కతిన దబ్బుఅపారంబు గదియఁ గవులు
తప్పు లెడలింప నెంతయు నొప్పు భువిని.'

అను మొదటిపద్యము క్రిందనే యొక ప్రతిలో రామకృష్ణకవిగారు ౩౦వ పుటలో నుదాహరించిన యీ క్రిందిపద్య మున్నది.

చ. 'పరువడి నాంధ్రభాషఁ గల బద్దెనీతియు, సంస్కృతంబులోఁ
బరఁగఁ బ్రతాపరుద్రః రపాలునిచే రచింపఁబడ్డ యా
నరవరు నీతిసారము వినం జదువం గడు మంచిదంచుఁ జె
చ్చెరఁ గవి నీతిపద్ధతులు చేసె వినోదము బాలబోధకున్.'

దీనినిబట్టి బద్దెనకవి ప్రతాపరు దునితరువాతివాఁ డని స్పష్టముగాఁ దెలియ వచ్చుచున్నది. పయి పద్యమునందుఁ బేర్కొనఁబడిన మొదటి ప్రతాప రుద్రుడు ౧౧౪౦ మొదలుకొని ౧౧౯౬ వ సంవత్సరమువఱకును రాజ్య పాలనము చేసినవాఁ డగుటచే బద్దెనరపాలుఁడు నిస్సంశయముగా క్రీస్తు శకము ౧౧౯౬ వ సంవత్సరమునకుఁ దరువాతివాఁ డయియుండవలెను. ఈ నడుమను బ్రహ్మశ్రీ జయంతి రామయ్యపంతులుగారు,రాక్షసనామ సంవత్సర భాద్రపదమాసమునందు (సెప్టెంబరు ౧౯౧౬) ప్రచురింపఁబడిన యాంధ్ర సాహిత్యపరిషత్పత్రిక నాల్గవసంపుటము ౬-వ సంచికలోఁ బ్రకటించిన రెండు శాసనములను బట్టి కవికాలము ౧౨౬౧-వ సంవత్సరప్రాంత మని స్పష్టపడినది. ఈ శాసనములు కృష్ణామండలములోని గన్నవరము తాలూకాలో కొండనాయనివర మను గ్రామమునందు బ్రహ్మేశ్వరస్వామి యాలయములో నొక రాతిపలకమీఁదఁ జెక్కఁబడి యున్నవి. ఇందలి మొదటి శిలాశాసనము

"స్వస్తి సమస్తప్రశస్తిసహితం శ్రీమన్మహామండలేశ్వరవీర నారాయణ చోడబద్దిగదేవరాజులు శకవర్షంబులు ౧౧౮౩ ణ్డగు నేంటి కర్కాటక సంక్రాంతినాండు ...."
అనునంతవఱకు నుండి తరువాత శిథిలమయినది. ఉత్తరపువైపున పడమటి వైపున నున్న రెండవ శిలాశాసనము

శ్లో. "శ్రీనాధనాభినీరేజసంభూతబ్రహ్మణః పురా
జాతా విశ్వగుణాక్షీణలక్ష్మీ రాజపరంపరా
తస్యాం బద్దిగభూపోఽభూద్వీరనారాయణాంకితః
చోడదోరయ (భూపో) స్యపుత్రో ఽగా దస్య నందనః
శ్రీశాకాబ్దే పురాష్టాదశశశిగణితే కర్కసంక్రాంతికాలే
స ప్రాదా ద్దీప మిష్టప్రద మనవరతం చోడబద్దిక్షితీశః
శ్రీమద్భ్రిహ్మేశ్వరాయాశశి రవి పరదంగోంకనాంకస్య (వే!) తే
స్తద్దీపార్థం చ వేలేటిజనపదమహీం వింశతిద్రోణసంఖ్యాం."

అని పూర్తిగా నున్నది. ఇందుఁ జెప్పఁబడిన శాలివాహనశకము ౧౧౮౩ క్రీస్తుశకము ౧౨౬౧ అగుచున్నది. "ఈశాసనములు పుట్టిన కాలమునందు కాకతీయరాజ్యము రుద్రమదేవి పాలించుచుండెను ఆమె క్రింద సామంతుడుగా నుండి బద్దెన కృష్ణాతీరమందు దొక చిన్న రాజ్యమును బాలించుచుండినట్టు కనుపట్టుచున్నది." అని రామయ్యపంతులుగారు వ్రాసి యున్నారు. *

* [శ్రీరామకృష్ణకవిగారు తెల్పిన 'రాజనీతియు, పగువడి' అను పద్యములు రెండును బద్దెన కృతములు కావనియు బాలబోధకై వేఱొక గ్రంథమును వ్రాసిన వేఱొక కవివ యు, ఆకవిని గూర్చియు, గ్రంథమును గూర్చియుఁ దెలియదనియు 'ఆంధ్రకవి తరంగిణి' కారులు వ్రాయుచున్నారు [మూఁడవ సంపుటము. పుటలు 18,19]

శ్రీరామయ్యపంతులుగారిచ్చిన శాసనములను బట్టి రామకృష్ణకవిగారిచ్చిన కాలము సరియైనది కాదని, తేలును. వీనింబట్టి బద్దెనృపాలురు తాతయు, మనుమఁడు నగుదురు. శాసనకర్త మనుమఁడగును, తాత కాఁడు. నీతిశాస్త్రముక్తావళికర్తయు, శాసనకర్తయు నభిన్నులనుట కింకను తగిన యాధారములు లభింపలేదు. తాత గ్రంథకర్తయైనచో క్రీ. శ. ౧౨౦౦ ప్రాంతమువాఁడగును; శాసనకర్తయే గ్రంథకర్త యగునేని క్రీ. శ. ౧౨౫౦ ప్రాంతమువాఁడగును.]

బద్దెన తననీతిశాస్త్రముక్తావళితుద నీక్రింది గద్యమును వేసికొనియున్నాఁడు.

గద్య. 'ఇది శ్రీలక్ష్మీవల్లభ శ్రీపాదపద్మారాధకకమలాప్తకుల పవిత్ర నన్నినగంధవారణ, రాజరాజమనోజాంకబద్దెనాఖ్యప్రణీతంబైన రాజనీతిప్రకారం బన్నది సర్వము సంపూర్ణము.'

ఈ నీతిశాస్త్రముక్తావళి, రాజనీతిపద్ధతి, అసద్రాజపద్ధతి, మంత్రిపద్ధతి, దుర్మంత్రిపద్ధతి, అధికారపద్ధతి, నియోగపద్ధతి, కార్యవిచారపద్ధతి, ఉపాయపద్ధతి, రాజ్యరక్షాపద్ధతి, అరాజకపద్ధతి, హితసేవకపద్ధతి, దుష్టసేవకపద్ధతి, దుష్టరాజసేవనపద్ధతి, దానశీలతాపద్ధతి, లోకనీతిపద్ధతి, అని పదునైదు పద్ధతులుగా భాగింపఁబడినది ఈ పద్ధతులను ముగించి కడపటఁ కవి తన పుస్తకము ని ట్లాశీర్వదిఁచుకొనెను.

ఉ. 'శ్రీవిభుఁ డైన బద్దెనృపశేఖరుచేసిన నీతిశాస్త్రము
క్తావళి శిష్టలోకహిత మయ్యెడుఁ గాపుత నాఁడునాఁటి కిం
దీవరగర్భుఁడుఁన్ శశియుఁ దిగ్మమరీచియు భూతధాత్రియున్
దేవగణంబులున్ బుధులు దిక్పతులుం గల యంతకాలమున్.'

కవి పద్యాంతములయందు వేమనవలెనే వీరనారాయణుఁడా బద్దెనరేంద్రా, ఉదారవైరోచనుఁడా, నన్నిచోడనరేంద్రా, దశదిశాభరణాంకా, నరేంద్రచతురాననుఁడా, పరభైరవా, నయతత్త్వనిధీ, రాజమనోజభూభుజా, రాజరాజమనోజా, కొమరురభీమా, భూపదిలీపా, సర్వజ్ఞనిధీ, నన్నినగంధవారణా, అను వివిధనామములతోఁ దన్నే సంబోధించుకొని యున్నాఁడు. ఈ నామములలో నన్నెచోడనరేంద్రుఁడు, నన్నియగంధవారణుఁడు, ఇత్యాదినామములు గల చోడరాజు లీతనికిఁ బూర్వులో సమకాలికులో యుండి యున్నారు. వారిలోఁ గుమారసంభవమును రచించిన నన్నెచోడుఁ డొకఁడు, విక్రమార్కచరిత్రమును కృతినందిన సిద్ధనమంత్రితాత యయిన సిద్ధనమంత్రి మంత్రిగాఁగల నన్నియ గంధ వారణుఁ డొకఁడు. ఈ పేరులు బద్దెనృపాలునికిఁ గూడఁ గలిగియున్నచో సిద్ధనమంత్రి మంత్రిగాఁ గలవాఁడయి యీ క్రిందిపద్యమునందు విక్రమార్కచరిత్రములోఁ బేర్కొనఁ బడిన నన్నియగంధవారణుఁ డీ బద్దెచోడుఁడే యయియుండును.

చ. 'వనరుహనాభు కుద్ధవుఁడు వజ్రికి జీవుఁడు వత్సధారుణీ
శునకు యుగంధరుండు దితిసూతికి దైత్యగురుండు విక్రమా
ర్కునకును భట్టి రీతి నధికుండగు నన్నయగంధవారణం
బునకుఁ బ్రధానుఁడై నుతులఁబొందెను సిద్ధనమంత్రి యిద్ధరన్.'

౧౧౫౬ వ సంవత్సరము మొదలుకొని ౧౧౬౩ వ సంవత్సరమువఱకును రాజ్యపాలనము చేసిన వెలనాటిచోడుఁ డనఁబడెడు రాజేంద్రచోడునిచే నగ్రహారాదికమును బడసిన సూరనసోమయాజికి మనుమఁడగుటచే సిద్ధనమంత్రి ౧౨౪౦-౫౦ సంవత్సరప్రాంతములనుండి యుండవలెను. అప్పుడు సిద్ధనమంత్రి ప్రభువయిన నన్నయగంధవారణుఁడును నించుమించుగా నా కాలమునందే యుండును. ఈ కాలము బద్దెనృపాలుని శాసనకాలముతో దాదాపుగా సరిపోవును. కాఁబట్టి యీ నన్నయగంధవారణుఁడే బద్దెనృపతి యేమో ! అట్లయినచో బద్దెనకు నన్నయ యను నామాంతరము కూడఁ గలిగి యుండును. అప్పు డీతఁడు చోడుఁడు గనుక నన్నె (నన్నయ) చోడుఁడనియుఁ బిలువఁబడవచ్చును. *

నీతిశాస్త్రముక్తావళిని రచించుటకుఁ బూర్వము కవి సుమతిశతకమును రచించిన ట్లీక్రిందిపద్యమునఁ జెప్పుకొనెను.

క. 'శ్రీవిభుఁడ గర్వితారి
క్ష్మావరదళనోపలబ్ధజయలక్ష్మీసం
భావితుఁడ సుమతిశతకముఁ
గావించినప్రోడఁ గావ్యకమలాసనుఁడన్.'

పైనిఁ బేర్కొనఁబడిన బిరుదావళులు గాక యీ పద్యమువలనఁ గవికి కావ్యబ్రహ్మ యన్న బిరుదవిశేష మొకటి కనఁబడుచున్నది. ఈతనికిఁ బూర్వము నందుఁ బ్రతాపరుద్రదేవుఁడు సంస్కృతమున నీతిసారమును రచియించినట్లు చెప్పఁబడెనుగదా ! దానిని ప్రతాపరుద్రదేవుఁడే తెలిఁగించెనో మఱియెవ్వరు

* [శ్రీ వీరేశలింగముపంతులుగారి యూహ సరికాదనియు, సిద్ధమంత్రి కుమారుఁడైన జన్నయమంత్రి క్రీ. శ. ౧౪౦౬-౧౪౨౨ నడుమ కర్ణాటరాజ్యమును పరిపాలించిన దేవరాజులయొద్ద నుద్యోగిగానుండినట్లు విక్రమార్కచరిత్రమునందే యుండుటంబట్టి తండ్రి, కుమారుల నడుమ ౧౬౦ సంవత్సరముల యంతర ముండదనియు 'ఆంధ్రకవి తరంగిణి' లోఁ గలదు (మూఁడవ సంపుటము పుట 25)]

తెలిఁగించిరో గాని రామకృష్ణకవిగారు పోలిక పద్యము లని నీతిసారము లోనిపద్యములను పదింటికంటె నెక్కువగా నుదాహరించి యున్నారు. వానిలోనిపద్యములను రెంటిని వానిని పోలియున్నవన్న బద్దెనీతిలోని పద్యములను రెంటిని నిచ్చట నుదాహరించు చున్నాను.

గీ. 'విమతులా పెఱింగి వెఱఁపేది తొడరుట
మిడుత లగ్గిమీఁదఁ బడినయట్లు
తోడులేక యధికుఁ దొడరుట యంబుధిఁ
గలము లేక యీఁదఁ గడఁగినట్లు' (నీతిసారము)

ఉ. వారని యల్కఁజేసి కడవం బలవంతుఁడు విగ్రహించినన్
దూరము పోవుటొండె వినతుండయి వానిన చొచ్చుటొండెఁ గా
కీరసమెత్తి కోల్మతివిహీనత నేనుఁగుతోడ లావునన్
బోరగు నెమ్మచంద మది బుద్ధియె రాజమనోజభూభుజా! (నీతిశాస్త్రముక్తావళి)

క. దూరము వ్యవసాయకులకు
భారంబు సమర్థులకును భాసురవిద్యా
పారగులకును విదేశము
వైరము ప్రియవాదులకును వసుమతిఁ గలదే' (నీతిసారము)

చ. అమరఁగ విద్య గల్గిన మహాత్మున కెద్దెస వోయినన్ స్వదే
శమ కడవన్ సమర్థున కసాధ్యమయెద్ది కడంగి చేసినన్
సమధురవాణియైన గుణశాలికి నెయ్యురె యెవ్వరున్ బటు
త్వముగలవానికిం గొలువు సద్దకురంగట బద్దెభూపతీ? (నీతిశాస్త్రముక్తావళి)

ఈ కడపటి పద్యములు రెండును

శ్లో॥ "కోఽతిభార స్సమర్థానాం కిం దూరం వ్యవసాయినాం,
కో విదేశః సవిద్యానాం కః పరః ప్రియవాదినామ్."

అను శ్లోకమునకుఁ దెనుఁగు.

బద్దెనకవి తిక్కనసోమయాజులకాలపువాఁడు. ఈతనికవిత్వము సులభమయి మృదువయి మనోహరముగా నుండును. నీతిశాస్త్రముక్తావళిలోని రెండు పద్యముల నిందుఁ బొందుపఱుచుచున్నాను.

ఉ. 'ఎత్తినకాలకాని సిరి కెన్నఁడు నిల్చినకాల నిల్వఁగాఁ
జిత్తము లేదు గాన సిరి చెందిననాఁడ పరోపకారముల్
హత్తి కడంగి చేయుఁ డెడరైనఁ బదంపడి వేఁడుకొందమన్
చిత్తమె కాని యిత్త మను చిత్తము పుట్టునె యెట్టివారికిన్ ?

ఉ. వాన సమస్తజీవుల కవశ్యము ప్రాణము ప్రాణమైన య
వ్వానయుఁ బల్మఱుం గురియవచ్చిన దిట్టుదు రెల్లవారలున్
హీనమనస్కుఁడై యొరులయిండ్లకుఁ బల్మఱుఁ బోవునేనియున్
మానిసి కట్లు వచ్చు నవమాన మనూనము మానభంగమున్.'

సుమతిశతకము

క ఎప్పుడు సంపద గలిగిన
నప్పుడు బంధువులు వత్తు రది యెట్లనినన్
దెప్పలుగఁ జెఱువు నిండినఁ
గప్పలు పదివేలు చేరుఁ గదరా సుమతీ !

క. ఎప్పటి కెయ్యది ప్రస్తుత
మప్పటి కామాటలాడి యన్యులమనసుల్
నొప్పింపక తా నొవ్వక
తప్పించుకు తిరుగువాఁడు ధన్యుఁడు సుమతీ ! *

* [ఈ పద్యములు బద్దెన రచించిన 'సుమతిశతకము' లోనివని చెప్పుటకుఁదగిన యాధారములు లేవు. ముద్రిత ప్రతిలో లేని పద్యములు కొన్ని వ్రాఁతప్రతులలోఁ గానవచ్చుచున్నవి వీనిశైలియు భిన్నముగా నున్నది.

'సుమతిశతకము' భీమనకృతి యొకటి యున్నదని తిమ్మకవి రచించిన సర్వ లక్షణ సారసంగ్రహామునుబట్టి తెలియుచున్నది అయ్యది లభింపలేదు. ఆ భీమకవి 'వేములవాడ భీమకవి' యని యనుటకును ఆధారములు లేవని 'ఆంధ్రకవి తరంగిణి.' (రెండవ సంపుటము పుట 17) ప్రస్తుతము ప్రచారములోనున్న సుమతిశతకము బద్దెన కృతికంటె విభిన్నము కావచ్చును]

నందూరి కేతనమంత్రి

కేయూరబాహుచరిత్ర కృతికర్తయగు నందూరి-గుండయమంత్రి కీతఁడన్న. మంచనకవి యీతని నొక కవిగాఁ బ్రశంసించియున్నాఁడు. ఈతని గ్రంథము లేవియో తెలియదు. కేతనకవికృతముగా కువలయాశ్వచరిత్రము ఒకటి చెప్పఁబడుచున్నది. ఆ కేతన యెవ్వరో నిర్ణయింప శక్యము కాకున్నది.

ఈ నందూరి-కేతనమంత్రి క్రీ. శ. 1300 ప్రాంతమువాఁడు.

మంచన

ఈ కవి కేయూరబాహుచరిత్ర మను నాలుగాశ్వాసముల గ్రంథమును రచించి నండూరి గుండన్నమంత్రి కంకితముచేసెను. ఈ గుండన్నమంత్రి యొక్క తాతకుతాత యైన గోవిందామాత్యుఁడు వెలనాటిగొంకరాజుమంత్రి యైనట్టును, ముత్తాత యైన కొమ్మామాత్యుఁడు గొంకరాజుకొడుకైన కులోత్తుంగరాజేంద్రచోళుఁ డను నామాంతరము గల వెలనాటిచోడుని మంత్రి యైనట్టును కేయూరబాహుచరిత్రమునం దీ పద్యములలోఁ జెప్పఁ బడినది.

శా. ప్రాగ్దేశాపరదక్షిణోత్తరదిశాభాగప్రసిద్ధక్షమా
భుగ్దర్పాంతకుఁ డేలె గొంకవిభుఁ డీ భూచక్ర మక్రూరతన్
వాగ్దేవీస్తనహారనిర్మలయశోవాల్లభ్యసంసిద్ధితో
దిగ్దంతిశ్రవణానిలోజ్జ్వలరటత్తీవ్రప్రతాపాఢ్యుఁడై.

క. ఆ విభునకుఁ బ్రెగ్గడయై
భూవలయంబున యశోవిభూషణుఁ డయ్యెన్
గోవిందనప్రధానుం
డావాసము కౌశికాన్వయంబునఁ దనరెన్.

మ. విహితాస్థానమునందుఁ జూపుఁ దగ గోవిందాభిధానప్రభుం
డహితోర్వీధరవజ్రి గొంకవిభురాజ్యాధిష్ఠుఁడై సంధివి
గ్రహముఖ్యోచితకార్యసంఘటనతంత్రప్రౌఢియున్ బాధస
న్నహనోదగ్రరిపుక్షితీశబహుసైన్యధ్వంసనాటోపమున్.

క. ధీరుఁడు తా గోవిందన
కూరిమినందనుఁడు వెలసెఁ గొమ్మన గొంక
క్ష్మారమణున కుదయించిన
వీరుఁడు రాజేంద్రచోడవిభు ప్రెగడయై.

సీ. నవకోటిపరిమితద్రవిణ మే భూపతి
భండారమున నెప్డుఁ బాయకుండు
నేకోనశతదంతు లే రాజుఘనశాల
నీలమేఘంబుల లీలఁ గ్రాలు
బలవేగరేఖ నల్వదివేలుతురగంబు
లే నరేంద్రునిపాగ నెపుడు నిలుచుఁ
బ్రతివాసరంబు డెబ్బదియేనుపుట్ల నే
యే విభుమందల నెపుఁడు గలుగు

నట్టి సమధికవిభుఁ డగు కులోత్తుంగరా
జేంద్రచోళవిభుని కిష్టుఁడైన
తంత్రముఖ్యుఁ డగుచు మంత్రిగోవిందనం
దనుఁడు కొమ్మనప్రధానుఁ డొప్పె

చ ఇల వెలనాఁటిచోడమనుజేంద్రునమాత్యత యానవాలుగాఁ
గులతిలకంబుగా మనిన కొమ్మనపెగ్గడకీర్తి మాటలన్
దెలుపఁగనేల ? తత్ప్రియఁ బ్రతిష్ఠిత మైన తటాకదేవతా
నిలయమహాగ్రహారములు నేఁడును నెల్లెడఁ దామ చెప్పఁగన్.'

వెలనాటిచోడుఁ డనెడి యీ కులోత్తుంగరాజేంద్రచోడునిశాసనములు ౧౧౫౭-వ సంవత్సరము మొదలుకొని ౧౧౭౦-వ సంవత్సరమువఱకును గానఁబడుచున్నవి. ఈ రాజేంద్రచోడుఁడే యుద్ధమునందు టెంకాణాదిత్యుఁ డైన నన్నెచోడుని సంహరించి పాకనాఁడును గైకొన్నట్టు కనఁబడుచున్నది. నన్నెచోడుఁడు కుమారసంభవములో

చ. 'అరినరపాలమౌళిదళితాంఘ్రియుగుం డయి పాకనాఁటియం
దిరువదియొక్కవేయిటి కధీశుఁడునాఁ జను చోడబల్లికిం
జిరతరకీర్తి కగ్రమహిషీతిలకం బన హైహయాన్వయాం
బరశశిరేఖ యైన గుణభాసిని శ్రీసతికిం దనూజుఁడన్.'

అని తన తండ్రియైన చోడబల్లి యిరువదియొక్క వేలయూళ్ళ గల పాక నాఁటి కధీశుఁ డని చెప్పెను. మంచన కేయూరబాహుచరిత్రమునందు రాజేంద్రచోడునిమంత్రి యైన కొమ్మనామాత్యుని వర్ణించుచు

మ. అరుదందన్ వెలనాటిచోడమనుజేంద్రాజ్ఞాపనం బూని దు
స్తరశక్తిం జని యేకవింశతిసహస్ర గ్రామసంఖ్యాకమై
ధరణిం బేర్చిన పాకనాఁడు నిజదోర్దండైకలగ్నంబుగాఁ
బరిపాలించె నమాత్యకొమ్మన జగత్ప్రఖ్యాతచారిత్రుఁడై.'

అని రాజేంద్రచోడుఁ డను నామాంతరము గల వెలనాటిచోడమనుజేశ్వరుని యాజ్ఞానుసారముగా నిరువదియొక్కవేల గ్రామములు గల పాకనాఁటి నమాత్యకొమ్మన పరిపాలించినట్లు చెప్పెను. ఈ పాకనాటి రాజ్యమును క్రొత్తగా గెలిచి రాజేంద్రచోడుఁడు దాని పాలనమున కయి కొమ్మనామాత్యుని నియమించినట్లు కనుపట్టుచున్నది. ఈ విజయము ౧౧౭౦ వ సంవత్సరప్రాంతముల దయి యుండును. ఈ కొమ్మనామాత్యుఁడు మంత్రి యగుటయే గాక రణతిక్కనవలె దండనాథుఁ డయి మహాశౌర్యవంతుఁడయి కటకసామంతులు మొదలైనవారిని రణరంగమున భంగించినట్లీ క్రిందిపద్యములవలనఁ దెలియవచ్చుచున్నది.

క. చలము మెయి, గటకసామం
తులు కరిహయబహుళసేనతో నేతేఱన్
దలపడియెఁ గొమ్మసచివుఁడు
బలియుండై క్రొత్తచెర్లపరిసరభూమిన్.

సీ. సెలకట్టెవాటునఁ జెలఁగి రెంటిని మూఁటిఁ
గూడ గుత్తింబుల గుదులు గ్రుచ్చుఁ
బ్రతిమొగంబగు నరపతుల కత్తళమునఁ
గడిమిమై వీఁపులు వెడలఁ బొడుచు
బందంపుగొటియలపగిది నేనుంగుల
ధారశుద్ధిగ నసిధారఁ దునుముఁ

జిదియించు బగిలించుఁ జేతులతీఁట వో
వడిఁ గాండ మేసి మావతులతలలు

తలపుడికి వ్రేసి మావంతుతలలు శత్రు
రాజశిరములుఁ ద్రొక్కించు రాఁగెఁ దిరుగ
వాగె నుబ్బెడు తన వారువంబుచేత
మహితశౌర్యుండు కొమ్మయామాత్యవరుఁడు.

చ. అరిగజకుంభపాటనవిహారము కొమ్మనమంత్రి సల్పుచో
నురలిన మౌక్తికవ్రజము లుర్విపయిం బొలిచెం దదీయసం
గరహతవీరదోర్గ్రహణకౌతుకసంభ్రమఖేచరీవర
స్ఫురతనుమర్దనోద్గళితభాసురహారమణీచయం బనన్.

చోళరాజులు చాళుక్యచక్రవర్తులకు లోఁబడిన సామంతమండలాధీశ్వరు లయ్యును రాజ్యకాంక్షచేత నొండొరులతోఁబోరాడిచంపుచుఁ జచ్చుచు నుండిరి. ఈవెలనాటిచోడునిపుత్త్రుఁ డైనపృథ్వీశరాజును మనుమసిద్ధి తండ్రి యైనచోడతిక్కభూపాలుఁడు చంపెను. కృతిపతితాత యగు కేతన మంత్రి పృథ్వీశరాజునకు మంత్రిగా నుండెను. ఈ పృథ్వీశరాజునే మనుమ సిద్ధిరాజుయొక్క తండ్రియైన తిక్కనృపాలుఁడు చంపినట్లు నిర్వచనోత్తర రామాయణమునం దీ పద్యమునఁ జెప్పఁబడినది.

ఉ. 'కేశవసన్నిభుండు పరిగీతయశోనిధి గూడతిక్కధా
త్రీశుఁడు కేవలుండె నృపు లెవ్వరి కావరితంబు గల్గునే
శైశవలీలనాఁడు పటుశౌర్యధురంధరబాహుఁ డైన పృ
థ్వీశనరేంద్రుమస్తకము నేర్తెఱఁ గందుకకేళి సల్పఁడే.'

తిక్కధాత్రీశ్వరుఁడు శైశవదశయందే పృథ్వీశనరేంద్రునిఁ జంపుటచే నిది పదుమూడవ శతాబ్దారంభమునందుజరిగి, తిక్కనరాజు ౧౨౫౦వ సంవత్సర ప్రాంతమువఱకును రాజ్యము చేసి యుండును. ఈ చరిత్రాంశముకూడ తిక్కనరేంద్రుని పుత్త్రుఁడైన మనుమసిద్ధికాలములో నుండిన తిక్కనసోమ

యాజి ౧౨౫౦ వ సంవత్సరమునకుఁ దరువాత నున్నాఁ డన్న సత్యమును స్థాపించుచున్నది. పృథ్వీశరాజుమంత్రి మనుమఁడైన గుండనామాత్యునకుఁ గేయూరబాహుచరిత్ర మంకితము చేయఁబడి యుండుటచే నీ కవి తిక్కన సోమయాజికాలములోనో కొన్నియేండ్లు తరువాతనో యుండవలెను. కాఁబట్టి యీ మంచనామాత్యకవి ౧౩౦౦ వ సంవత్సరప్రాంతములయం దున్నాఁడని నిశ్చయముగాఁ జెప్పవచ్చును.

ఇతఁడు రాజమహేంద్రపురనివాసి. పయిని జెప్పఁబడిన వెలనాటిచోడుఁడు లోనయిన రాజులు చాళుక్యరాజప్రతినిధులుగా రాజమహేంద్రవరము రాజధానిగా వేఁగిదేశమును బాలించినవారే ; కృతినాయకుఁడు తన్నుఁగూర్చి యన్నట్టుగా కవి యీ క్రింది పద్యమును వ్రాసికొని యున్నాఁడు

క. తన యిష్టసఖుని విద్వ
జ్జనమాన్యుని నుభయకావ్యసరణిజ్ఞున్ మం
చననామధేయు నన్నుం
గనుఁగొని యిట్లనియె వినయకౌతుక మెసఁగన్.

* * * *

క. సాయిరసము శృంగారం
బై యలవడఁ గథలు నీతులై యెడనెడ రాఁ
గేయూరబాహుచరితము
చేయుము నీ వంధ్రవాక్యశిల్పము మెఱయన్.'

ఈకేయూరబాహుచరిత్రమునందు

ఉ 'బాలరసాలసాలనవపల్లవకోమలకావ్యకన్యకన్
గూళల కిచ్చి యప్పడుపుకూడు భుజించుటకంటె సత్కవుల్
హాలికులైన నేమి మఱియంతకు నాయతిలేనినాఁడు కౌ
ద్దాలికులైన నేమి? నిజదారసుతాద్యభిరక్షణార్థమై.'

అను పద్యము ప్రథమాశ్వాసమునఁ గానఁబడుచున్నది. ఇటీవలివారు దీని కర్తృత్వమును బమ్మెరపోతరాజున కారోపించి వాడుకలో నున్న యా కథను గల్పించియుందురు. కావ్యకన్యను కూళల కియ్యఁగూడదు గాని

మంచివారి కీయవచ్చునని కవి తాత్పర్యమైనట్టు దానిక్రిందనే యున్న యీ పద్యము తెలుపుచున్నది.

క. 'అని తగనివానిదెస నా
మనసెప్పుడు రోయుఁగాన మతివర్జనవ
ర్ణనలకు మిగిలిన సుగుణుని
నినుఁ బొంది మదీయకవిత నెగడుం బుడమిన్.'

ఈకేయూరబాహుచరిత్రకవిత్వము రసవంతముగా నున్నది. ఇందుండి కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను.

చ. దలముగ నెల్లప్రొద్దును లతానివహంబుల రాలు పుప్పొడుల్
పులినతలంబులై చెలువుపూనఁగ మీఁదటఁ దేలు కేతకీ
దళములమొత్త మోడలవిధంబు నటింపఁగఁ బాఱుఁ బెద్దలై
ఫలరసవాహినుల్ పురియుపాంతవనంబులఁ గొన్నిచోటులన్. ఆ.౧

ఉ. ఎప్పటియట్ల యింతిఁ గని యేడ్తెఱ మ్రొక్కిన దానివల్లభుం
డప్పుడు దిగ్గన న్నెగసి యచ్చటఁ దోఁచిన వాఁడు దిట్టఁడై
తప్పక యన్నిదిక్కులకుఁ దా వెస మ్రొక్కి ప్రదక్షిణంబుతోఁ
జప్పుడుగాఁగ మెచ్చుచును జంద్రమరీచికి మ్రొక్కెఁ బల్మఱున్.
ఆ. ౨

మ. పగలెల్ల న్వెలి నిల్చి రాతిరి రహోభంగిన్ స్వగేహంబున
ట్టుగమీఁదన్ వసియించి భార్యపయి దృష్టుల్నిల్పి యుండంగఁ బ్రొ
ద్దగుడున్ గంజిమడుంగుపేర రజకుం డత్యాస్థ నేతెంచినన్
మృగశాబేక్షణ లోచనావరణము ల్మెల్లం దగ న్విచ్చుచున్. ఆ.౩

చ. పనిచినఁ బోయి చూడ్కులకుఁ బండు వనందగు నుత్సవంబు నిం
పెనయఁగఁ జూచి మళ్ళి తన యిక్కువకుం బెడగాఁ బథాంతరం
బున మన మూని యింటిదెసఁ బోవుట మాని విభుండు మున్నుచే
సిన యుపకారము ల్మఱచి చేడియ చింత యొనర్చె నాత్మలోన్ ఆ.౩

అథర్వణాచార్యుఁడు

అథర్వణాచార్యుని కాలమును నిర్ణయము చేయుటకుఁ గొన్నియాధారములు కనఁబడుచున్నవి. దక్షిణహిందూస్థాన ప్రాచీనలిపి శాస్త్రమును రచించిన బర్నెల్‌దొరవా రథర్వణకారికలలో నక్షరములనుగూర్చి వ్రాయఁబడిన

శ్లో. 'పంచవరాదయో వర్ణా శ్శంఖశార్ఙ్గాదిసన్నిభాః,
తిర్యగ్రేఖాయుజశ్చోర్ధ్వం దండరేఖాన్వితా అధః.
త ఏవ చ ద్వితీయా స్స్యు రూర్ధ్వరేఖాద్వికాన్వితాః,
ప్రథమా స్తు ద్వితీయాస్స్యు స్తృతీయా స్తే చతుర్థకాః.
రేఖాద్వయాధో దండేన యుక్తాస్స్యు రనునాసికాః
మిళద్దండద్వయోపేతాః ప్రథమా లిపయః స్మృతాః.

ఇత్యాది శ్లోకముల నుదాహరించి, తెలుఁగక్షరములలోఁ బైని జెప్పఁబడిన మార్పులు పంద్రెండవ శతాబ్దాంతమువఱకును గలుగనందున, అథర్వణాచార్యుఁడు పంద్రెండవ శతాబ్దాంతమునకుఁ గాని పదుమూడవ శతాబ్దారంభము నకుఁగాని పూర్వుఁడయి యుండఁజాలఁడని వ్రాసియున్నారు. ఆ గ్రంథములోనే దొరవా రింకొకచోట నథర్వణాచార్యుఁడు తన త్రిలింగశబ్దానుశాసనములో ప్రథమపరిచ్ఛేదము అయిదవ శ్లోకములోను, తృతీయపరిచ్ఛేదము పదుమూడవ శ్లోకములోను హేమచంద్రునిపే రుదాహరించినందున ౧౦౮౮-వ సంవత్సరమునఁ గాఁబోలును పుట్టి ౧౧౭౨-వ సంవత్సరమునందు మృతినొందిన హేమచంద్రుని తరువాతివాఁడని వ్రాసినారు.

అథర్వణకారిక లనఁ బడునవి యథర్వణాచార్యునిచే రచియింపఁబడినవి గాక మఱి యెవ్వరిచేతనో యొక యాధునికునిచేత నాతనిపేరు పెట్టి యిటీవల రచియింపఁబడిన వయినట్టు కనఁబడుచున్నవి. కాఁబట్టి యా కారికావళిని బట్టి యాతనికాలమును నిర్ణయించుటకు వలనుపడదు. అతఁడు మొట్ట

మొదట నొక యాంధ్రవ్యాకరణమును జేసి యటుపై నింకొక యాంధ్ర వ్యాకరణమును జేయుట తటస్థింపదు అధర్వణకారిక లనఁబడెడు వికృతి వివేకము మిక్కిలి యాధునికమని చూపుటకుఁ జాలినన్ని నిదర్శనము లా పుస్తకమునందే యున్నవి. పూర్వకవు లెవ్వరును స్త్రీవాచక తత్సమపదముల కకారాంతములకు సంధి కూర్చి యుండలేదు. ఈ నియమమును మీఱి "గంగనుకాసె" "శ్రీరంగభర్తంచు" అని యాముక్తమాల్యదయందు ౧౫౦౯ మొదలుకొని ౧౫౩౦-వ సంవత్సరమువఱకును కర్నాటకసామ్రాజ్యము నేలిన కృష్ణదేవరాయ లకారాంత తత్సమములకు మొట్టమొదట సంధిని గూర్చినవాఁడు. ఆతనికిఁ బూర్వ మెన్నఁడును లేని యీ నూతన ప్రయోగములకు "కుత్ర చిత్సంస్కృతీయో పి ప్రాణోఽప్యచ్యుతోభవేత్" అని యధర్వణకారికలయందు లక్షణము విధింపఁబడి యున్నందున కారికల కర్త ౧౫౩౦ వ సంవత్సరమునకుఁ దరువాతివాఁ డయి యుండవలెను *

* [అధర్వణకారిక లనఁబడు 'వికృతివివేకము' అధర్వణకృతిగా 'తెనుఁగు కవుల చరిత్ర' యందుఁ జెప్పఁబడినది. మఱియు 'ఇందలి (వికృతి వివేకము నందలి) లిపిశ్లోకములలో నుదాహరింపఁబడిన యక్షర విన్యాసమునుబట్టి డాక్టరు బర్నెలు (Dr Burnell) దొరవా రితనిని పంద్రెండవ శతాబ్ది నున్నవాఁడని భావించిరి ఇది సమంజసమే! నన్నయభట్టారకుని వెనుక తిక్కనకు ముందుగా భారతమును పూరించుటకుఁ బూనుకొనిన యాంధ్రకవి యధర్వణుఁడు కాని యధర్వణుని కవిత యతి సంస్కృత పదభూయిష్ఠ మగుటచేత వ్యాప్తిలోనికి రాలేదు. శైవకవితాప్రభావము వలన తిక్కన తెనుగుదనము చూపుచు రచించిన భారతము ముందఱ నధర్వణుని భారతము నిలువలేదు.' అనియుఁ గలదు. (తెనుగుకవుల చరిత్ర-పుటలు 303 304)

అధర్వణుఁడు తిక్కనకుఁ దర్వాతివాఁడనియు, నితనికాలము క్రీ శ ౧౨౫౦ ప్రాంతమని తలంపవచ్చుననియు. త్రిలింగ శబ్దానుశాసన, వికృత వివేకములను అధర్వణుఁడు రచింపలేదనియు, 'ఆంధ్రకవి తరంగిణి' లోఁ గలదు. (చూ తృతీయ భాగము-'అధర్వణాచార్యుఁడు)

అధర్వణుఁడు తొలుతఁ త్రిలింగశబ్దానుశాసనమును రచించి, పిదప వివరముగా వికృతి వివేకమును రచించెనని శ్రీ వఝ్ఝల - చిన సీతారామస్వామి శాస్త్రులుగారు 'అధర్వణ కారికావళి' పీఠికలోఁ జెప్పి యున్నారు

శ్రీ తిమ్మావఝ్ఝల కోదండరామయ్యగారు విజయ-మార్గశిర మాస 'భారతి' లో 'అధర్వణ భారతము' అను వ్యాసమున అధర్వణాచార్యుని భారతము గూర్చిన యమూల్య విషయములను జెప్పిరి ఇంతవఱకు నధర్వణుఁడు భారతములోని విరాటో

జేసెననియు, నది పరమప్రమాణ మనియుఁ జెప్పి యున్నాడు. * ఈ యకలంకుఁడు జైనపండితుఁడు. ఈతఁ డకలంకుఁ డనియు, అకలంక భట్టనియు, భట్టాకలంకుఁ డనియు, అకలంకదేవుఁ డనియు గ్రంథముల యందు వాడఁబడుచున్నాఁడు. ఇతఁడు సంస్కృత సూత్రములతో "శబ్దానుశాసన" మనుపేర కన్నడవ్యాకరణమును జేసి, దానికిఁ దానే "భాషామంజరి" యను వృత్తిని, మంజరీమకరంద" మను వ్యాఖ్యానమును జేసి యున్నాఁడు. తాము చేసిన వ్యాకరణములకు శబ్దానుశాసనము లని పేరు పెట్టుటయు వానికిఁ దామే వృత్తులను వ్యాఖ్యానములను వ్రాయుటయు మొదటినుండియు జైనపండితులలో నాచారమయి యున్నది. మొట్టమొదట సంస్కృత వ్యాకరణమును జేసిన శాకటాయనుఁ డను జైనపండితుఁడు తన వ్యాకరణమునకు 'శబ్దానుశాసన' మను పేరు పెట్టి దాని 'కమోఘ వృత్తి యను వృత్తిని జేసి యున్నాఁడు. తరువాత హేమచంద్రుఁ డను జైనపండితుఁ డెనిమిది ప్రకరణములు గల 'శబ్దశాసనము'ను సంస్కృత సూత్రములతో ౧౧౭౦-వ సంవత్సరమునందుఁ జేసెను. దానిలోని యెనిమిదవ ప్రకరణము ప్రాకృతమునుగూర్చినది. దానినే మనవారు హేమచంద్రపక్కి యని చెప్పుదురు. సంస్కృతప్రాకృతము లాంధ్రభాషకు ప్రకృతులగుటచేత నొక విధముగాఁ గొంతవఱకు సంస్కృతప్రాకృత వ్యాకరణములను తెనుఁగులక్షణములనియుఁ జెప్పవచ్చును. శబ్దాను శాసన మను పేరితో సంస్కృతసూత్రములతో వ్యాకరణమును జేసిన మూఁడవ జైనపండితుఁడు భట్టాకలంకుఁడు. ఈ కర్ణాటకశబ్దానుశాసనము నాలుగు పాదములను ఏనూటతొంబదిరెండు సూత్రములను గల దయియున్నది. ఇందలి సూత్రము లాంధ్రశబ్దచింతామణిలోని సూత్రములను బోలి యుండును. వాని స్వరూపమును జూపుటకయి యొక్క సూత్రము నిందు వృత్తి వ్యాఖ్యానములతో నిచ్చుచున్నాను.

సూత్రము ౨౪౯.—నహోల్వాలి

* [దీనిచే అకలంకుఁడు చెప్పబడెనని కాని, చెప్పబడినను కన్నడ వ్యాకరణ కర్త చెప్పఁబడెనని కాని చెప్పఁగలను పడదని కొందరందురు.]

వృత్తి—అకారాంతా చ్ఛబ్దా త్పరస్య సుపః శ్లుబ్న భవతి వోల్ ప్రత్యయే, వాల్ప్రత్యయే చ పరే.

ప్రయోగః—ఇంద్రనవోల్, ఇంద్రనవాల్; చంద్రనవోల్, చంద్రనవాల్. వోల్వాలీతికిం ఇంద్ర-బోల్, చంద్రంబోల్.

వ్యాఖ్యా—తస్య తుల్యే వోల్వాల్విితి షష్ఠ్యంతా దేతౌ ప్రత్యయౌ విధాస్యేతే తయోః పరయోః సుపః శ్లుబ్నిషిధ్యతే-తత్రానకారాంతే విభాషయా వక్ష్యమాణత్వాద యమకారాన్తఏవ నిషేధః వర్యవస్యతీత్యాహ—అకారాంతా దిత్యాది-పూర్వేణ శ్లుపః ప్రాప్తా వయ మారంభః.

అకలంకుఁడు తన శబ్దానుశాసనము నీ మంగళశ్లోకముతో ముగించెను.

శ్లో. 'మంగళం భగవానర్హాన్ మంగళం భగవాన్ జినః,
మంగళం ప్రథమాచార్యో మంగళం వృషభేశ్వరః'

అకలంకుని శబ్దానుశాసనమునుగూర్చి యింత దూర మేమేమో చెప్పియు ముఖ్యముగాఁ జెప్పవలసినదానిని చెప్పకయే యుంటిమి. అతఁడు తన గ్రంథరచనకాలమును పుస్తకముతుద నిట్లు చెప్పెను.

శ్లో. శకవర్షే రస నేత్ర బాణ శశి సంఖ్యే ద్దే తపోమాసికో
భక్శతి శ్రీసితపంచమీ గురు దినే లగ్నే ఘటే పౌష్ణ భే।
అకలంకాహ్వయయోగిశిష్యతిలకో గ్రంథం సతాం మంజరీ
మకరందాఖ్య మిదం హితం వ్యరచయం భట్టాకలంకో మునిః.

ఈ శ్లోకములో తాను మంజరీమకరందాఖ్యవ్యాఖ్యను శకవర్షములు ౧౫౨౬ (అనఁగా క్రీ శ. ౧౬౦౪) శోభకృత్సంవత్సర మాఘశుద్ధ పంచమీ గురువార రేవతీనక్షత్ర కుంభలగ్నమున ముగించినట్టు భట్టాకలంకుఁడు చెప్పెను. అకలంకుఁడు కర్ణాటకశబ్దానుశాసనమును వ్యాఖ్యతోడఁగూడ ౧౬౦౪-వ సంవత్సరమునందు ముగించినందున, దానిని చదివి తన కారికలను రచించిన వికృతివివేకకారుఁడు తరువాత నేఁబది, యఱువది సంవత్సరముల కుండి

యుండును. * ఈ కాల మహోబల పండితుని కాలముతో సరిపోవుచున్నది. ఈ కారికలవార్త నహోబలునికిఁ బూర్వమునం దున్నవా రెవ్వరు నెఱుఁగరు. పూర్వమందున్నవా రనుట యేమి? ఏకకాలమునందే యున్న యప్పకవి సహితమెఱుఁగఁడు. అప్పకవిమీఁది స్పర్ధచేతఁ దన వ్యాఖ్యాన మనఁగా నహోబలపండితీయ మనఁబడెడు కవిశిరోభూషణ మప్పకవీయ మున కంటె మిన్నగా నుండవలె నన్నయభిలాషతో నీ కారికావళిని రచించి తన వ్యాఖ్యానములోఁ జేర్చి యధర్వణాచార్యుని వని లోకమును భ్రమ పెట్టి నమ్మించి యుండె ననుటకు సందేహము లేదు. ♦ కారికల నధర్వ ణుఁడే రచియించి యుండినయెడల

'శ్రుతేఽపశబ్దే చోకే వా ప్రమాదాత్ పాణినిం స్మరేత్
ప్రాకృతే షడ్విధే చాపి వాల్మీకిం వా మహేశ్వరం
ధ్యాయే దత్రతు మామేవ స్మరే త్పండితసమ్మతః.'

ప్రమాదముచేత సంస్కృతమున నపశబ్దము నుచ్చరించినచో పాణినిని స్మరింపవలసినట్లే యాంధ్రమున నపశబ్దము నుచ్చరించినచోఁ దన్నే (యధ ర్వణునే) స్మరింపవలయు నని యింత యత్యధికముగా నాత్మశ్లాఘనను జేసి కొని యుండఁడు. ఈ కారికావళిని తాను రచియించి యుండుటచేతనే యహోబలపండితుఁడు

''యస్సారోఽ ధర్వణే గ్రంధే సోప్యత్రైవ విధీయతే
తేన తత్పక్కికాలోకలోలతా త్యజ్యతే బుధైః..'

అధర్వణుని గ్రంధములో సారభూతమైన దంతయు నిందే చేర్పఁబడి యుండుటచేత పండితు లా గ్రంధమును జూడవలె నన్న యభిలాషను విడిచిపెట్టవలయునని వ్రాసి యున్నాఁడు. గ్రంధ మంతయు నహోబల పండితీయములోనే యుండినప్పుడు వేఱుగా గ్రంథమును జూడవలెనన్న

---

* [ఇట్లనుట సరికాదనియు, అకలంకుఁడు ప్రాచీనుఁ డొకఁ డున్నాఁడనియు శ్రీ ప్రభాకరశాస్త్రి గారు 'ప్రబోధ రత్నావళి' పీఠిక లో వ్రాసియున్నారు.]

[♦ వెనుక ౯వ పుటలోఁ జెప్పినదాని కిది విరుద్ధముగా నున్నది.]

కోరిక గలవారికి గ్రంథము మఱి యెక్కడ దొరకును? ఎక్కడ వైతను కారికావళి పుస్తకరూపమున నున్నను, ప్రకటింపఁబడినను తత్కారికలన్నియు కవిశిరోభూషణమునుండి యెత్తి వ్రాయఁబడినవే గాని వేఱుకావు. నన్నయ భట్టునకుఁ బ్రథమాచార్యత్వమును, అథర్వణాచార్యునకు ద్వితీయాచార్యత్వమును, మొట్టమొదట సృజించి యాంధ్రపండిత లోకమున వ్యాపింపఁ జేసినవాఁ డహోబలపండితుఁడే యని తోఁచుచున్నది. ఈ కారికలను రచియించినవాఁడు నిజమయిన యథర్వణాచార్యుఁడు గాక పేరు మార్చుకొన్న కృత్రిమాథర్వణాచార్యుఁ డగుటచేత, పాడి వేంకటస్వామిగా రన్నట్లు మొదట గాలి నరసయ్యరూపమునుండి వాతూలాహోబలరూపమునకు మాఱి మరల "వాతూలవంశేఽవతారభూయశ్శ్రీనన్నవిద్యానహమేవ సోఽస్మి" అని తానే చెప్పుకొన్నట్లు విద్వాంసుఁడయి ప్రథమాచార్యుఁడైన యా నన్నయభట్టారకుఁడే యీ యభినవ నన్నయభట్టావతారమున ద్వితీయాచార్యుఁ డయి వికృతివివేకకర్త యయి యుండును. కారికావళీకర్తకు ప్రథమాచార్య భావన యకలంకుని శబ్దానుశాసనమును నిపుణముగా చదువుటచేత దానిలోని మంగళశ్లోకమువలనఁ గలిగెను. వికృతివివేక కారుఁడు శబ్దానుశాసనకర్తయైన యకలంకునిశిష్యుఁడైనను కాకపోయినను దన పుస్తకమున దాతవిఁ బేర్కొనుటచేతనే ౧౬౦౪ వ సంవత్సరమునకుఁ దరువాతివాఁడని నిరాక్షేపణీయసిద్ధాంత మేర్పడుచున్నది. అథర్వణునిచే రచియింపఁబడినది త్రిలింగ శబ్దానుశాసన మొక్కటియే కాని వికృతివివేకము కాదు. ఆంధ్రకౌముదీ కారుఁడు తా నథర్వణవ్యాకరణమును జదివిన ట్లీ క్రింది శ్లోకమున జెపి యున్నాఁడు.

> అథర్వణాని కావ్యాని వ్యాఖ్యాసప్తత్యాని సం విదన్
> కౌముదీ మాంధ్రశబ్దానాం సూత్రాణి చ కరోమ్యహమ్.'

దీనినిబట్టి యథర్వణాచార్యుఁడు పండ్రెండవ శతాబ్దాంతమునందో, పదుమూడవ శతాబ్దాదినో యున్నట్లు నిశ్చయముగాఁ దెలియవచ్చుచున్నది. అహోబలపండితు లితనిని ద్వితీయాచార్యుఁ డని వాడుటయు, ఇతఁడు

భారతమునందలి విరాటపర్వము మొదలుకొని తెనిఁగింపఁబూనుటయు కూడ నధర్వణాచార్యుఁడు నన్నయభట్టునకుఁ దర్వాతను దాదాపుగా తిక్కనసోమయాజికాలములోను ఉన్నట్టు చూపుచున్నవి. ఈతని ఛందస్సులో

క. 'మగణమ్ముఁ గదియ రగణము
వగవక కృతిమొదట నిలుపువానికి మరణం
బగు నిక్క మండ్రు మడియఁడె
యగు నని యిడి తొల్లి వేంకణాదిత్యుఁ డనిన్.'

అను పద్య ముండుటచేత నితఁడు నన్నెచోడునికిఁ దరువాత బహుకాలమున కుండినవాఁ డని తెలియ వచ్చుచున్నది. కాఁబట్టి యితఁ డిప్పటి కాఱునూటయేఁబది సంవత్సరముల క్రిందట నుండెను. ప్రథమాచార్యుఁ డనఁబడు నన్నయభట్టారకుని తరువాతనే యీతఁ డుండక పోయినయెడల, ఈతనిని ద్వితీయాచార్యుఁ డనుట యెట్లు తటస్థించును? నన్నయభట్టారణ్యపర్వమువఱకును తెనిఁగించిన తరువాతనే యీతఁడు భారతమాంధ్రీకరింపఁబూని యుండనియెడల, విరాటపర్వము మొదలుకొనియే తెలిఁగించుటకుఁ గారణ మేమియు నగపడదు. నన్నయభట్టారకుఁడు తన గ్రంథప్రాశస్త్యమునకయి యధర్వణభారతమును కాల్చివేసె నన్న కథ యెంతమాత్రము విశ్వాసార్హమైనదికాదు. అధర్వణాచార్యుఁడు తిక్కన కాలములో ననఁగా ౧౨౦౦వ సంవత్సరప్రాంతములం దుండినవాఁడు. అధర్వుఁడను పే రాంధ్రులలో లేదనియు, ఇది కల్పితనామమయి యుండు ననియు నొకరు వ్రాయుచున్నారు. అయిన నయి యుండవచ్చును. గాలి నరసయ్యశాస్త్రి తనపేరు బాగుగా లేదని ప్రభంజనాహోబలపండితుఁ డని పేరు పెట్టుకొన్నట్టుగానే, తల్లిదండ్రులు నాలయ్యవంటి పేరేదో పెట్టి యుండఁగా నది గౌరవావహమైనది కాదని నాలవ దధర్వవేదమయినందున పూజనీయమయిన యా పేరు పెట్టుకొని యుండనువచ్చును. లేదా యితఁడు జైనుఁడు గనుక జైనులలో నట్టిపే రుండిన నుండనువచ్చును. అధర్వణుఁ డాంధ్రమునందు తగినంత పాండిత్యము గల సంస్కృత విద్వాంసుఁడైన జైనపండితుఁడు. ఇతఁడును దిక్కనసోమయాజియు

నించుమించుగా నేకకాలమునందే నన్నయభట్టు విడిచిన భారతభాగమును దెనిఁగింప నారంభించి యుందురు. ఇతఁడు రెండు మూఁడు పర్వములను మాత్రమే తెలిఁగింపఁగలిగెను; తిక్కన పదునేనుపర్వములును జేసి గ్రంథము ముగింపఁగలిగెను. ఈతనికవిత్వము సంస్కృతసమాసపద భూయిష్ఠ మయి, సామాన్యులకు దురవగాహమయియుండెను; తిక్కన కవిత్వ మాంధ్రపదభూయిష్ఠమయి బహుజన సుఖావగాహమయి యుండెను. ఈ హేతువుచేతనే తిక్కనభారతము సర్వజనాదరణపాత్రమయి దేశమం దంతటను వ్యాపింపఁగా, నధర్వణభారతము కతిపయపండితజనైకాదరణపాత్ర మయి సర్వజనీన వ్యాప్తి గాంచక యాంధ్రదేశమున మృగ్య మయినది. అది యిప్పుడు కతిపయ పూర్వలక్షణగ్రంథములయం దుదాహరింపఁబడిన పద్యరూపమున జీవించి యుండుటయే కాని సంపూర్ణపుస్తకరూపమున నెందును గానఁబడక నామమాత్రావశిష్టమయి యున్నది.

తిక్కనసోమయాజి భారతరచనము చేయ నారంభించునప్పటి కధర్వణా చార్యుఁడు త్రిలింగశబ్దానుశాసనమును జేసి యుండలేదు. ఆ కాలమునందు దశకుమారచరిత్రమును దిక్కన కంకితముచేసిన కేతనకవి తన యాంధ్ర భాషాభూషణవ్యాకరణమునందు

క. 'మున్ను తెలుఁగునకు లక్షణ
మెన్నఁడు నెవ్వరును జెప్ప; రేఁ జెప్పెద వి
ద్వన్నికరము మది మెచ్చఁగ
నన్నయభట్టాదికవిజనంబులకరుణన్.

గీ. సంస్కృతప్రాకృతాదిలక్షణము చెప్పి
తెలుఁగునకు లక్షణము మున్ను దెలుపకునికి
కవిజనంబులనేరమి కాదు; నన్ను
ధన్యుఁ గావింపఁ దలఁచిన తలపు గాని.'

అని యా వఱ కెవ్వరును వ్యాకరణముచేసి యుండలేదని స్పష్టముగాఁ జెప్పెను. త్రిలింగశబ్దానుశాసనము మిక్కిలి పురాతనమయిన దనఁగా

నన్నయభట్టుభారతమునకంటెను బ్రాచీన మయినదని చూపుటకయి పాడి వెంకటస్వామిగా రాంధ్రపత్రికయుగాదిసంచికలోఁ దమ వ్యాసమునందు బెర్నెలుగారు చెప్పిన హేమచంద్రునిబాధ తొలంగునట్లుగా "హేమచంద్రాది మునిభిః కథితం చాంద్రలక్షణం" ఇత్యాది శ్లోకములలో హేమచంద్రుఁ డన్నది సోమచంద్రుఁ డని యుండవలెనని చెప్పిరి. హేమచంద్రుఁ డెట్లాంధ్రవ్యాకరణకర్త గాఁడో యట్లే సోమచంద్రుఁడును నాంధ్రవ్యాకరణకర్త కాఁడు. ఈ మార్పు సహితము త్రిలింగశబ్దానుశాసన మత్యంత పురాతనమని సాధించుటకుఁ బనికి రాకపోవుటయే కాక, యథర్వణాచార్యుఁడు మఱింత యర్వాచీనుఁడని చూపుటకే తోడుపడుచున్నది. జైన పండితుఁడయి సోమదేవుఁ డనఁబడెడి యీ సోమచంద్రుఁడు ౧౨౦౫-వ సంవత్సరమునందు 'శబ్దార్ణవ చంద్రిక' యను సంస్కృతవ్యాకరణమును రచియించెను. సోమచంద్రుఁ డన్న పాఠమునకంటెఁ ద్రిలింగశబ్దానుశాసనములో ననేక స్థలములయం దున్న హేమచంద్రుఁ డన్న పాఠమే సరియైనది. త్రిలింగశబ్దానుశాసనమునందు హేమచంద్రుఁడు మునిఁగా జెప్పఁబడినాఁడు; అందు విశేష మేదియు లేదు. జైనులు తమ విద్వాంసులను మునులనుగాఁ జెప్పుటయు, విద్వాంసులే తమ్ము మునులనుగాఁ జెప్పుకొనుటయు నాచారమయి యున్నది. కర్ణాటకశబ్దానుశాసనమును రచియించిన యకలంకభట్టు "భట్టాకలంకో మునిః" అని తన్నుఁగూర్చియే తన పుస్తకములోఁ జెప్పుకొనెను.

శ్లో. 'బార్హస్పత్యాని సర్వాణి । కాణ్వం వ్యాకరణం విదన్
కరో మ్యథర్వణం శబ్దం । సర్వలక్షణలక్షితం.'

అని బృహస్పతివ్యాకరణమును, కణ్వవ్యాకరణమును సర్వమును జూచి తానీ వ్యాకరణమును రచియించిన ట్లారంభములోనే యథర్వణుఁడు సెప్పుచున్నాఁడు. ద్రావిడులు తమ యఱవభాష కగస్త్యుండు వ్యాకరణము చేసెనని చెప్పుకొనునట్లే తెలుఁగువ్యాకరణములు సహితము ఋషిప్రోక్తములన్నచో భాషకు గౌరవము వచ్చునని గొప్పకు చెప్పుకొన్నవే కాని యీ వ్యాకరణము లన్నియుఁ గవీశ్వరుల మానస సృష్టిలోనివేగాని యెప్పుడును

వ్యవహారములో నుండినవి కావు. ఆంధ్ర వ్యాకరణములు చేసినవా రొక్క దేవతలును, ఋషులును మాత్రమే కారు. వారిలోఁ గవిరాక్షసునివంటి రాక్షసరాజులును గలరు. శ్రీరాములకు శత్రువైన రావణుఁడు కూడఁ దెలుఁగుభాషకు త్రేతాయుగమునందే వ్యాకరణము చేసెను.

"అనుక్తం శర్వశాస్త్రం తు। రావణీయే విలోకయేత్."

త్రిలింగశబ్దానుశాసనములో లేని విషయముల నన్నిటిని రావణవ్యాకరములోఁ జూచి తెలిసికోవలెనఁట! త్రిలింగశబ్దానుశాసన మన్నపేరు పెద్దదిగా నున్నను, దానిలోఁ జెప్పఁబడిన విషయములు మాత్ర మత్యల్పములు. ఈ కాలపు చిన్న వ్యాకరణములలో సాధారణముగాఁ జెప్పఁబడు [illegible] ములు సహితము దానియందు లేవు. ఆరంభదశలోఁ జేయఁబడిన వ్యాకర ణములలో దేనిలోను విశేషాంశము లుండవు. ఆ కాలములోనే చేయఁబడిన తిక్కన 'కవివాగ్బంధనము' మొదలైన లక్షణగ్రంధములలో సహితము విశేషాంశములు లేవు. ఆంధ్రభాషయే యెఱుఁగినట్టు కనఁబడని బృహస్ప త్యాదులు చేయని వ్యాకరణములను చేసినట్టు మన పండితులు చెప్పి రన్న విశ్వాసార్హముగా నుండునా? యని మనవారు సందేహపడవచ్చును. ఎప్పటి పండితుల మాటయో యేటికి? మన యీ కాలపు పండితులే యాంధ్రభాషావిషయమున "భౌతిక కళానిధి" లో నేమివ్రాసిరో చిత్త గింపుఁడు.

శ్లో॥ 'యుగభేదా దాంధ్రభాషాచార్యభేదః ప్రకీర్త్యతే।
కృతే సుధాయనః ప్రోక్త స్త్రేతాయాం శుకనాభకః॥ ౧
దివోదాసశ్చ శల్యాతి రింద్రమిత్ర స్తథైవ చ
భాషాచార్యా ద్వాపరే స్యుస్తి ష్యే త్వాన్నందివర్ధనః॥ ౨
తతో దేవశరాయశ్చ తస్య శిష్యో నియోగికః।
ఏతే క్రమా దాంధ్రభాషాచార్యా స్సప్తప్రకీర్తితాః॥ ౩
అథాంధ్ర భాషానామాని యుగభేదా త్ప్రచక్షతే।
ఆంధ్ర మాంధ్రేయణం చైవ మల్లకో గుహ్యాక స్తథా॥ ౪

కోసలో ద్రామిళశ్చైవ క్రౌంచో హేరంబక స్తథా।
గుహ్యకో పిరకశ్చైవ కాళింగో రౌద్ర మేవ చ॥' ౫

మనము ప్రథమాచార్యుఁడు, ద్వితీయాచార్యుఁడు నన్న మాటలకే శంకపడు చుండఁగా, కృతయుగమునందు సుధాయనుఁడు, త్రేతాయుగమునందు శుకవాభుఁడు. ద్వాపరమునందు దివోదాసుఁడు శల్యాతి యింద్రమిత్రుఁడు, కలియుగమునందు నందివర్ధనుఁడు, దేవళరాయఁడు నని యాంధ్రభాషాచార్యులు మీఁదుమిక్కిలి మఱి యేడుగు రయినారు ఆంధ్రము, ఆంధ్రేయణము, మల్లకము, గుహ్యకము, కోసలము, ద్రామిళము, క్రౌంచము, హేరంబకము, పిరకము, కాళింగము, రౌద్రము, అని యాంధ్రభాషాభేదములు ద్వాదశాదిత్యులవలెఁ బంద్రెం డయినవి

శ్లో॥ 'తిష్యే ద్వావితి యదుక్తం తచ్ఛృణుష్వ సమాహితః।
కృష్ణాగోదావరీమధ్యదేశే పాపవివర్జితే॥ ౧
దివ్యే గోకుల్యపార్శ్వస్థభార్గవక్షేత్రసన్నిధౌ।
గోదావర్యాశ్చోత్తరస్థతట గంగాముఖే స్థితామ్॥ ౨
యాం పురీం శాసతి విభు శ్శాతకర్ణి ర్మహాయశాః।
తస్యాం మాహేంద్రపుర్యాం తు విష్ణువర్ధనపుత్రకః। ౩
సర్వశాస్త్రవినీతజ్ఞో వేదవేదాంగపారగః।
సర్వభాషారహస్యజ్ఞ శాంతో దాంత స్సమాహితః॥ ౪
శాతకర్ణే ర్మహారాజ్ఞ స్సభాధ్యక్షః సుబుద్ధిమాన్।
నందివర్ధననామాభూత్త స్య శిష్యో నియోగికః॥ ౫
ఆంధ్రభాషారహస్యజ్ఞో నామ్నా దేవళరాయకః
తా వుభా వాస్థానసభాప్రదీపా వితి వర్ణితౌ॥ ౬
రాజాజ్ఞాం శిరసా ధృత్వా తావుభౌ పండితోత్తమౌ।
కలౌ యుగే ష్టపంచాశోత్తర త్రిశతవత్సరే॥ ౭
కళింగాంధ్రం చ రౌద్రాంధ్ర స్థాపయామాసతు స్స్వయం॥' Etc ,

పూర్వోక్తములైన ద్వాదశాంధ్రభాషలలో కలియుగమునందు రెండాంధ్రభాషలు పుట్టినవి. పాపరహితమైన కృష్ణాగోదావరీ మధ్యదేశమునందు దివ్యమయి గోకుల్యపార్శ్వస్థమైన భార్గవక్షేత్రమున గోదావరియొక్క యుత్తరతటమున గంగాముఖ మను ప్రదేశ ముండెను. ఆ ప్రదేశమున మహాయశుఁడైన శాతకర్ణి పాలించుచుండిన మహేంద్రపురమునందు విష్ణువర్ధనుని పుత్రుఁడును, సర్వశాస్త్రవినీతజ్ఞుఁడును, వేదవేదాంగపారగుఁడును, సర్వభాషారహస్యజ్ఞుఁడును, శాంతుఁడును, దాంతుఁడును, శాతకర్ణిమహారాజుయొక్క సభాధ్యక్షుఁడును, సమాహితుఁడు నైన నందివర్ధన నామధేయుఁ డుండెను. ఆతనికి శిష్యుఁడయి నియోగియు, నాంధ్రభాషారహస్యజ్ఞుఁడు నైన దేవళరాయఁ డుండెను. వా రుభయులును రాజాస్థానసభాప్రదీపములుగా వర్ణింపఁ బడుచుండిరి. పండితోత్తములైన వీ రిద్దఱును రాజాజ్ఞను శిరసావహించి కలియుగమున మున్నూటయేఁబదియెనిమిది సంవత్సరమునందు స్వయముగా కళింగాంధ్రమును, రౌద్రాంధ్రమును స్థాపించిరి. ఇది కలియుగాబ్దము ౩౦౫౮ అగుటచేత పూర్వోక్తమయిన వృత్తము నడచి యిప్పటికి నాలుగువేల యాఱునూట యఱువది సంవత్సరము లయినది. ఇఁక పూర్వకాలాంధ్రభాషాకవనరీతిని గూడఁ గొంచెము చిత్తగింపుఁడు. కృతయుగమున సుధా యనుఁడు స్థాపించిన భాష కాంధ్ర మని పేరు గలుగుటకుఁ గారణమును విశ్వేశ్వరభట్టాచార్యులవారు భాషాముకుర మను నాంధ్రగ్రంథమునం దిట్లు వ్రాసియున్నారఁట.

సీ. 'ఖేచరకిరణాగ్ని డగ్గిబోదరముచే
సత్యభాగుడీయిండ్ల భాసముదర
అగ్నిమిత్రుడంధకత ఘుడంగె డుమ్మిలో
కడిజగ్ధిభాస్కరుం మనసమొంది
బొరవిన జెరణినిం గడగుడి గెరగించి
గుడగనోచి భావిందు లడగదొడసె
అడుగ నా భామణి నవభవకరమొంద్రు
త్సలరించి వరుణకరగాగర్భ బవిడె

గ్రుడువించుగ్రుమ్ముల గరిమమనడై
దిఙ్ముఖము లరలించు భోగరింఢ్ల
భాసమెరయ భాసముబ్బరించె
వాని కంళుగురుడు.

(అర్థము—ఖేచరకిరణాగ్నిడగ్గి బోడరముచే=సూర్యకిరణాగ్ని వలనఁ గలిగిన యెండపిడుగులచే; సత్యభాగుడియింఢ్ల = కన్నులయొక్క? భాసము=ప్రకాశము, ఉదర = నశింపఁగా; డుమ్మిలో = భూమియందు; అగ్నిమిత్రుఁడు = అగ్నిమిత్రుఁ డనెడువాఁడు; అంధకతయుడంగె = గ్రుడ్డితనమును బొందెను; కడి = అనంతరము; భాస్కరుం=సూర్యుని; జగ్గిచే=భక్తిచేత; మననమొంది = ధ్యానముచేసి; బొరవిన = కుంభకమార్గముచే; జెరణినిం=జీవాత్మను; గడగుడిగెరగించి = సూర్యునియందర్పించి; గుడగనోచి = సూర్యప్రార్థనచేసి; భాబిందులడగదొడసె = కన్నులియ్యవేఁడుకొనెను, అడుగ = అడుగఁగా; అభామణి = ఆసూర్యుఁడు; నవభవకరమొంద్రు=చంద్రకిరణములవలె; త్సలరించి=చల్లనిస్వభావముగలవాడయి; వరుణకరగా గర్బబవిడె=సూర్యుని జలకిరణములచే గర్భముదాల్చిన మేఘమునుండి, గ్రుడవించు గ్రుమ్ములగరిమమనుడై =చల్లగ గురియు వాన చినుకులనుబోలు మనముగలవాఁడై దిఙ్ముఖములరలించు; దశదిక్కుల వ్యాపించునట్లు; భోగరింఢ్లభాసమెరయ = దంతకాంతులు ప్రకాశించుచుండఁగా; అంళుగురుడు = సూర్యుఁడు; వానికి = అగ్నిమిత్రునకు; భాసముబ్బరించె =భాష నుపదేశించెను.)

క. భాగురు భాషాప్రొమ్మన
భాగుడిబొమ్మిండ్లబిందు ల్భాసము నందెఞ్
భాబుష్పభాషవానాంధమున్
రాతీయ్యగనది నాంధ్రమనుంచు బరువడినందెన్.

(అర్థము—భాగురుభాషాప్రొమ్మన = సూర్యునిచే ననుగ్రహింపఁబడిన భాషాప్రభావముచే; భాగుడిబొమ్మిండ్లబిందుల్ = అగ్నిమిత్రునినేత్ర

బిందువులు; భాసమునొందెన్ = ప్రకాశమును బొందెను; భాబుష్ప్రభాష = సూర్యునిచేవచ్చినభాష; వాని = అగ్నిమిత్రుని; అంధమున్ = గ్రుడ్డితనమును; రాతీయ్యగ = నాశనపఱుపఁగా, అది = ఆ భాష; ఆంధ్రమనుంచు = ఆంధ్ర భాష యని; బరువడినందెన్ = ప్రసిద్ధినొందెను.)

పయి పద్యముల తాత్పర్యము—పూర్వమొకప్పు డెండ యధికమయి యగ్నిపిడుగులు పడి యగ్నిమిత్రుని కన్నులు పోయెను; అతఁడు తనకు కన్ను లియ్యవలసినదని సూర్యుని ప్రార్థింపఁగా సూర్యు డతనిభక్తికి మెచ్చి యతని కొక భాష ననుగ్రహించెను; ఆ భాషాప్రభావమువలనను, సూర్యానుగ్రహమువలనను మరల నగ్నిమిత్రున కంధత్వము పోయి కన్నులు వచ్చెను; ఆ భాష యాతని యంధతను బోగొట్టినందున దాని కాంధ్రభాష యని పేరు కలిగెను.

అధర్వణాచార్యుఁడు మొదట త్రిలింగశబ్దానుశాసన మను వ్యాకరణము నొకదానిని చేసి తరువాత వికృతివివేక మను వ్యాకరణ కారికావళిని రచించి నాఁడన్న వాడుక కలదు గాని యది సత్యముకాదు. ఈ కడపటిది యధర్వణ కృతము కానేరదు. వికృతివివేకమునం దాంధ్రశబ్దచింతామణిలో లేని లక్షణము లనేకములు చెప్పఁబడి యున్నవి. ఈ గ్రంథము సంజ్ఞాపరిచ్ఛేదము, సంధిపరిచ్ఛేదము, అజంతపరిచ్ఛేదము, హలంతపరిచ్ఛేదము, క్రియాపరిచ్ఛేదము అని యైదుభాగములుగా భాగింపఁబడి కారిక లనఁబడు మూఁడు వందల శ్లోకములను గలిగి యున్నది. ఈ కవి రచియించిన తెలుఁగుభారత మిప్పటికి మాకు దొరకనందున, కవి వంశాదులనుగూర్చి యేమియుఁ జెప్పజాలము. లక్షణగ్రంథములం దుదాహరింపఁబడిన పద్యము లను బట్టి చూడఁగా నితఁడు విరాటోద్యోగభీష్మపర్వములను రచించినట్లును, కవిత్వము రసవంతమయి సంస్కృతపదబహుళముగా నుండునట్లును తెలియ వచ్చుచున్నది. అప్పకవి విరాటపర్వములోని యీ క్రిందిపద్యముల నుదాహరించియున్నాఁడు.

గీ. ధర్మతనయ యుష్మదా-జ్ఞానిగళవిని
బద్ధమగుచుఁ జిక్కు-వడియెఁ గాక
విజయమత్తగజము విడివడ్డబో నడ్డ
పాటుగలదె విష్టపత్రయమున.

క. శ్రీకర్ణుఁ డెదురునపుడు వ
నౌకోధ్వజ మింద్రమకుట మర్జునతురగా
నీకము దివ్యశతాంగము
నా కవ్వడి కబ్బియున్న నతఁ డేమగునో.

క. ఆ కర్ణుదురాలాపము
లాకర్ణింపఁగ నసహ్యమై ద్రోణునితో
నాకనదీసుతుఁ డనియె వ
నౌకోధ్వజ మెఱుఁగ వచ్చునరుఁ జూపి తగన్.

కవిచింతామణియందు వెల్లంకి తాతంభట్టుచేత నుదాహరింపఁబడిన యీ క్రింది పద్య ముద్యోగపర్వములోని దయి యుండవలెను.

శా. తృష్ణాతంతునిబద్ధబుద్ధు లగు రాధేయాదులం గూడి శ్రీ
కృష్ణుం గేవలమర్త్యుఁగాఁ దలఁచి పట్టింపంగ నుత్సాహవ
ర్ధిష్ణుండయ్యె సుయోధనుం డకట ! ధాత్రీనాథ ! యూహింపుమా
యుష్ణీషంబునఁ గట్టవచ్చునె మదవ్యాధోగ్రశుండాలమున్.

కూచిమంచి తిమ్మకవిచే సర్వలక్షణ సారసంగ్రహమునం దుదాహరింపఁబడిన యీ క్రిందిపద్యము భీష్మపర్వాది దగుట స్పష్టము.

క. పదిదినము లయిదుప్రొద్దులు
పదఁపడి రెణ్ణాళ్ళు నొక్క- పగలున్ రేయున్

గదనంబుఁజేసి మడిసిరి
నదిసుత గురు కర్ణ శల్య నాగపురీశుల్. *

అథర్వణభారతములోని యీ క్రింది మూఁడు పద్యములును నాంధ్ర సాహిత్యపరిషత్పుస్తకభాండారములో నున్న యుదాహరణపద్యగ్రంథము నుండి కైకొనఁబడినవి.

సీ. రాజమండలపూర్ణరాజమండలవిధి
రత్నగర్భామలరత్నగర్భ
గంధర్వగంధర్వగంధర్వనగరంబు
నాగపున్నాగపున్నాగవనము
మార్గణమార్గణమార్గణపీఠము
త్తుంగభుజంగభుజంగభూమి
కాంతకాంతారాతికాంతకుంతస్థలి
వీరకుమారకుమారసరసి

యనఁగఁ బొగడు కెక్కు నలకాపురంబు దే
వేంద్రుపురము దానవేంద్రుపురముఁ
గ్రేణి సేయు లలితశోణాంశుమణిబద్ధ
గోపురంబు హస్తినాపురంబు '

మ. నతనానావనినాథయోధమకుటన్యస్తాబ్జరాగోజ్జ్వల
ద్యుతివిభ్రాజితపాదపీఠు లలనాదోశ్చామరోద్ధూతమా

---

* ఈపద్య మల్పభేదముతో నన్నయభట్టారకుని యాదిపర్వమునందును గానఁబడుచున్నది; గాని యీయర్థమే వచ్చెడి యీ క్రిందిపద్యము దానిపయినే యున్నది గాన నిది యథర్వణభారతములోనిదే యయి యుండవచ్చును.

తరల. పదిదినంబులు భీష్ముఁ డాహవభారకుండు గురుండు పం
చదివసంబులు కర్ణుఁడు న్దివసద్వయంబు దినార్ధ మం
దుదితతేజుఁడు శల్యుఁ డత్యధికోగ్రవీరగదారణం
బది దినార్ధముగాఁగ నిటు మహాభయంకరవృత్తితోన్.

రశలోలాళివినీలకుంతలుఁ బ్రభారుగ్గాముఁ గేయూరశో
భితబాహాపరిఘున్ సువర్ణధరణీభృద్ధైర్య దుర్యోధనున్.

మ. ప్రణతాశేషవసుంధరాధిపశిరస్స్రగ్గంధలుబ్ధభ్రమ
క్వణదభ్రభ్రమకృద్ద్విరేఫగణఝుంకారప్రదాబద్ధసం
స్రణవత్యుత్ప్రథితప్రవర్ధితసమస్తక్షత్రసూయాధ్వర
క్షణసింహాసనభాసితున్ దృఢధనుశ్శ్లాఘానుజున్ ధర్మజున్.

ఈ కవి తెలుఁగున ఛందస్సునుగూడ రచియించియున్నాఁడు. దాని 'కధర్వణఛంద' స్సని పేరు. దానియందలి రెండు పద్యముల నిందు క్రింద నుదాహరించుచున్నాను.

క. 'అనిలానలపంయోగం
బనఘా ! కీలాకరాళమగు పహ్నిభయం
బొనరించుఁ గర్తగృహమున
ననుమానము లేదు దీన నంద్రు కవీంద్రుల్.

క. మునుకొని పద్యముఖంబున
ననిలగణం బిడిన నాయురారోగ్యంబుల్
కొనసాగు దానిముందఱ
ననలగణం బిడినఁ బతికి నలజడి సేయుఁ.'

కాచవిభుఁడును, విట్ఠలరాజును

ఈ కవులు లిరువురును రంగనాథరామాయణమును రచియించినట్లు చెప్పఁబడు చున్న బుద్ధరాజుయొక్క పుత్రులు. వీరు పదుమూఁడవ శతాబ్దమధ్యమున నుండి యుందురు. వీ రిరువురును జేరి తమ తండ్రి యాజ్ఞ నొప్పున నుత్తరరామాయణమును ద్విపదకావ్యమునుగా రచియించినట్లు గ్రంథాదియం దున్న పీఠికవలనఁ దెలియవచ్చుచున్నది.

ద్వి. కోనకులార్ణవకువలయేశుండు
నా నొప్పు కోటగన్నక్షితీంద్రునకు *
ననఘాత్మ యగుచున్న యన్నమాంబికకుఁ
దనయుఁడు బుద్ధాభిధానుండు పనుప
నారయ మత్స్యకూర్మాదిదివ్యావ
తారంబులం దెల్లఁ దలఁచి చూడంగ
రామావతారంబు రమణీయ మగుట
రాముపావనచరిత్రము దివ్యభాష
లోకానురంజనశ్లోకబంధములఁ
జేకొని వాల్మీకి చెప్పినజాడ
మా తండ్రి బుద్ధక్ష్మానాథు పేర
నాతతనృపకైరవాప్తుని పేర
ఘనుఁడు మీసరగండకాచవిభుండు
వినుతశీలుఁడు విఠలభూపతియు
నని జనుల్ మముఁ గొనియాడంగ మేము
వినుతనూతనపదద్విపదరూపమున

* [బుద్ధరాజుతండ్రి విట్ఠలరాజని రంగనాథ రామాయణము]

ప్రాకటంబుగ నాంధ్రభాషను జెప్పఁ
గ్గైకొన్నయుత్తరకథ యెట్టి దనిన.

ఈపుస్తకముయొక్క కవనధోరణి రంగనాథరామాయణమును పోలియున్నది. కాఁబట్టి యీయుత్తరకాండమునుగూడ రంగనాథుఁడే రచియించి పూర్వకాండములకు బుద్ధరాజును కృతికర్తనుగాఁ జేసినట్టే దీనికిఁ దత్పుత్రులను గృతికర్తలనుగాఁ జేసి యుండ వచ్చునని యూహింపఁదగి యున్నది. అయినను, ఇతర నిదర్శనములు లేక యిది యిట్లని నిశ్చయింప వలను పడదు. ఈక్రింది యుదాహరణమువలనఁ బుస్తకముయొక్క కవిత్వశైలి కొంత తెలియవచ్చును.

ద్వి. అంతట రంభయు నంభోజసరసి
దంతి చొచ్చినచొప్పు తనకుఁ బాటిలినఁ
జింతాపరంపర చిత్తంబులోన
నంతకంతకు దట్టమై కడల్కొనఁగఁ
దలఁకుచుఁ గొంకుచుఁ దనలోనఁ దానె
పలుకుచుఁ బులిబాఱిఁ బడి వడిచెడిన
హరిణిచందంబున నటఁ దొట్రుపడుచుఁ
బిరిగొన్నదురవస్థఁ బ్రియుపాలి కరిగి
యడుగులఁబడి లేచి యందంద మేను
వడఁకంగ వదనంబు వంచి హారములు
పెనఁగొన గనయంబు ప్రిదులలోఁ జెరివి
కొనిన పూవులు గందఁ గ్రొమ్ముడి వీడఁ
దొంగలిఱెప్పలఁ దోఁగు బాష్పములు
తుంగ స్తనంబులఁ దొరుఁగ నట్లున్నఁ
గనుఁగొని యిది యేమి కాంత నీచంద
మనవుడు నాలేమ హస్తముల్ మొగిచి
నడుకుచు నాపల్కు నాల్కకు రాక

కడుఁదూలి గద్గదకంఠరయై పలికె
నేను నీయొద్దకు నేతేర నింద్రు
పై నెత్తిపోవుచుఁ బంక్తి కంధరుఁడు
నేనతోఁ గలధౌతశిఖరిపై విడిసి
తా నందు ననుఁ గాంచి దర్పాంధుఁ డగుచు
నేనుఁ గోడల నన నిజియంగఁ బట్టి .
నాన దూలఁగ బిట్టు నను గాసి చేసెఁ
గావున నీ తప్పుఁ గావంగఁ దగదు
నావుడు నలిగి యా నలకూబరుండు &c.

మారన

మారన యను కవి తిక్కనసోమయాజుల శిష్యుఁడు. ఇతఁడు మార్కండేయపురాణమును తెనిఁగించెను. నీతిబోధక మయి సర్వజనరంజక మయి యున్న హరిశ్చంద్రోపాఖ్యానము కథయుఁ బ్రబంధరత్నమని కొనియాడఁబడు మనుచరిత్రముకథయు మార్కండేయపురాణమునుండి తీసికొనఁబడినవే. ఇతని కవిత్వము తిక్కనసోమయాజికవిత్వమంత మధురముగా నుండదు గాని సలక్షణ మయినదిగాను మృదువుగాను, ఉండును. ఇతఁడు తన గ్రంథమును బ్రతాపరుద్రుని సేనానాయకుఁడైన నాగయగన్నమంత్రికిఁ * గృతి యిచ్చెను. కవి కృత్యాదిని కృతినాయకుని వర్ణించుచు నాతనిని గూర్చి

చ. 'ఎలమిఁ బ్రతాపరుద్రమనుజేంద్రునిచేఁ బడసెం బ్రవీణుఁడై
కొలిచియు శౌర్యలీల రిపుకోటి రణావనిఁ గీటడంచియున్
బలరిపుతుల్యవిక్రముఁడు నాగయగన్నవిభుండు తేజమున్
విలసితరాజ్యచిహ్నములు విశ్రుతలక్ష్మియు నాయకత్వమున్.'

అని చెప్పెను. ఈ కృతిపతి కేలికయైన ప్రతాపరుద్రుఁడు కాకతీయ వంశభూషణుఁడై జగత్ప్రసిద్ధుఁ డయి యుండినవాఁడు. విద్యానాధ మహాకవి యాతనిపేరనే ప్రతాపరుద్రీయ మనెడి యలంకారశాస్త్రమును జెప్పెను. ప్రతాపరుద్రుఁడు తన మాతామహి యైన రుద్రమ్మదేవియనంతరమున ౧౨౯౫ వ సంవత్సరమున రాజ్యమునకు వచ్చి ౧౩౨౩ వ సంవత్సరము వఱకును రాజ్యము చేసెను. ౧౩౨౧ వ సంవత్సరమునందు ఢిల్లీపాదుషా యొక్క సేనలు ప్రతాపరుద్రునిరాజధాని యైన యోరుగల్లుమీఁదికి దండెత్తి వచ్చి యోడిపోయినందున ౧౩౨౩ వ సంవత్సరమునందు ఢిల్లీచక్రవర్తి

* [ఇతఁడు సేనానాయకుఁడు కాని మంత్రి కాఁడనియు, సేనానాయకుఁడు మంత్రి కాఁడనియు 'ఆంధ్రకవి తరంగిణి']

మఱియొక గొప్పసేనను పంపఁగా సేనాధిపతి ఘోరయుద్ధములో ప్రతాప రుద్రుని పట్టుకొని ఢిల్లీనగరమునకుఁ గొనిపోయెను. ప్రతాపరుద్రునిమంత్రి యైన యుగంధరుఁడు తన ప్రభువును వదలించి తెచ్చిన ట్లొక విచిత్రమైన కథను చెప్పుదురు. తన ప్రభువును మహమ్మదీయులు కొనిపోయినతరువాత మంత్రియుగంధరుఁడు తా నొక మనోహరమైన పడవను కట్టించి దాని యందు రత్నఖచితములైన భూషణములు వేసికొని వాణిజ్యమునిమిత్తమై పోయినట్లుగా గంగానదిమీఁదుగా పోయి ఢిల్లీనగరము చేరి యమ్మకము నిమిత్తమై యమూల్యము లైన రత్నములు తెచ్చితి మని తన మనుష్యుల చేత పాదుషాకు చెప్పి పంపి చూచుట కయి యొక దిన మేర్పఱిచెను. ఈ ప్రకారముగాఁ జేయవలసిన యేర్పాటుల నన్నిటిని చేసి తాను పడవ దిగి పట్టణమునందు పిచ్చివానివలె తిరుగుచు, నేటి కిన్నిదినములకు ఢిల్లీచక్ర వర్తిని కారాబద్ధునిగాఁ గొని పోయెద మని యొక చిఁపిచేటతో చాటుచు, రాత్రు లూరివెలుపల నున్న యొక మఱ్ఱిచెట్టుక్రింద శుచియై వంట చేసికొని భుజించుచు, మాఱువేషముతో నటించుచుండెను. ఈ రీతిగా ప్రతిదినమును పిచ్చిగా చాటుచుండుట రాజభటులు చూచి, రాత్రు లితఁడు మఱ్ఱిచెట్టువంక పోవుచుండుట్ల చారులవలనఁ దెలిసికొని, ఒకనాఁడు పగలు గూఢముగా పోయి మఱ్ఱిచెట్టుమీఁద నెక్కి కూరుచుండి యుండిరి. అతఁడు పగలంతయు నూరంతటను జాటి యథాప్రకారము రాత్రి మఱ్ఱిచెట్టుకడకు వచ్చి శుచియై వంట చేసికొని తినుట కన్నము విస్తరిలో పడ్డించుకొన్నతరువాత నతని కావులింత యొకటి వచ్చెనఁట ! అప్పు డతఁడు వింత లేనిది యావులింత రాదనుకొని నిదానించి చూచి వెన్నెలలో చెట్టునీడనుబట్టి పయి నెవ్వరో మనుష్యు లున్నారని తెలిసికొని, పయివంకఁ జూచిన ననుమాన పడుదు రని యట్లు చేయక, వడ్డించుకొన్న యన్నముమీఁద వంటచేసిన కుండను బోర్లించి విస్తరిచుట్టును మున్మారు ప్రదక్షిణములు చేసి, ఢిల్లీచక్రవర్తిని పట్టుకొని తమ యూరు కొనిపోదుమని పెద్దకేక వేసి, తనచేతికఱ్ఱతో కుండను పగులఁగొట్టి యన్నము తినక లేచిపోయెను. భటు లంతట నతఁడు పిచ్చివాఁడని నిశ్చయము చేసికొని వెడలిపోయి చక్రవర్తి కా వార్త తెలిపి

తమతమ పనులమీఁద నుండిరి. గడువుదినమున ప్రతాపరుద్రుని తనవెంట నుంచుకొని పరిమితపరివారముతో చక్రవర్తి యొద్దకు పోవుటకు బయలుదేఱఁగా యుగంధరుఁడు చక్రవర్తి నిప్పుడే పట్టుకొని పోయెద మని చింపిచేటతో చాటుచు వెంటఁబడెను. రాజభటు లాతనిని పిచ్చివానిఁగా భావించుటచేత నాతనిమాటలను లక్ష్యముచేయక వెంట రానిచ్చిరి. అంతట నతఁడు చక్రవర్తిపరిజనులు చూడకుండ పడవ నెక్కి పయిని కూర్చుండి చక్రవర్తిని పట్టుకొని పోవుచున్నా మని చాట మొదలుపెట్టెనఁట! పాదుషా లోపల నున్న సరకులను పరీక్షించుచుఁ గొంతసేపు లోపలనుండి పయికి వచ్చి చూచునప్పటికి పడవ తమరేవున లేక బహుదూరము వచ్చినట్లు కనఁబడఁగా, అది యంతయు శత్రువుల కుతంత్రమువలన నయినదని తెలిసికొని చేయునది లేక ప్రతాపరుద్రునితో సమాధానము చేసికొని యాతని రాజ్యమును మరల నిచ్చివేసి విడుదల పొంది తాను తన రాజధానికి మరలి పోయెనఁట! ప్రతాపరుద్రునిమంత్రులలో యుగంధరుఁ డనువాఁ డెవ్వఁడును లేఁడు. యుగంధరుఁడు మిక్కిలి పూర్వకాలమునందు అత్యంత ప్రసిద్ధు డయిన యొక మంత్రి శిఖామణి. శ్రీహర్షకవిచేత సంస్కృతమున రచియింపఁబడిన "రత్నావళి" నాటికయందే యుగంధరునిసంతతివాఁడు (యౌగంధరాయణుఁడు) మంత్రిగాఁ జెప్పబడెను. మారనకవి నాగయగన్నని 'నీతి యుగంధరుఁ" డని చెప్పెను.

[యౌగంధరాయణుఁడు గొప్పరాజనీతిజ్ఞుఁడుగను, ప్రభుకార్యతత్పరుఁడుగను భాసుని (సంస్కృత) నాటకములందుఁ బ్రసిద్ధుఁడు భాసు ననుసరించియే శ్రీహర్షదేవుఁడు 'రత్నావళి'ని రచించెను యౌగంధరాయణుఁడు ప్రతాపరుద్రుని విడిపించి, ఢిల్లీచక్రవర్తిని చెఱఁగొనిన కథను శ్రీ వేదము-వేంకటరాయశాస్త్రిగారు తమ 'ప్రతాపరుద్రీయనాటకము'నఁ గూర్చినారు. ఈ వృత్తాంతము విశ్వాసార్హము కాదని విమర్శకులు చరిత్రకారులును తెలిపియున్నారు.

నాగయగన్న సేనాని ప్రతాపరుద్రుని యనంతరము మహమ్మదీయమతమును గైకొని ఢిల్లీచక్రవర్తిని సేవించినట్లును, ఆతనికి సేనానియై రాజ్యకార్యములను నిర్వహించినట్లును శ్రీ నేలటూరు-వేంకటరమణయ్యగారు తెలిపియున్నారు (భారతి-బహుధాన్య-మాఘమాసము)

'భారతి'లోఁ బ్రకటింపఁబడిన పై వ్యాసమునుబట్టి ఉలూఫ్‌ఖానా ప్రతాప రుద్రుని, నాగయగన్న సేనాని మున్నగు మఱికొందఱిని ఢిల్లీకిఁ బంపు చుండఁగా, ప్రతాపరుద్రుఁడు దారిలోనే మరణించినట్లును, సేనాని మహమ్మదీయమతమును స్వీకరించి, రాజ్యకార్యములను నిర్వహించుచు, ఒకప్పు డోరుగంటి ప్రాంతమునకు నియమితుఁడై యుండియును ప్రజల కలవరము నణఁపఁజాలక - కాపయనాయకుని ప్రతాపమున కోర్వలేక రాజ్యము నాతనికర్పించి ఢిల్లీకిఁ బాఱిపోయెననియుఁ దెలియుచున్నది]

పయికథ యెట్టి దయినను, నాగయగన్నఁడు ప్రతాపరుద్రుని కాలములోని వాఁడు గనుక మారనయు పదుమూఁడవ శతాబ్దాంతము నందును, పదు నాల్గవశతాబ్దాదియందును నున్నవాఁ డని తేలుచున్నది. కాఁబట్టి యతఁ డిప్పటి కాఱువ దల సంవత్సరముల క్రిందట నుండి యుండును. ఈ గన్నయ్యతల్లి మల్లాంబ కాకతీయగణపతికలవరి యైన మేచయనాయకుని కూఁతు రని యీ క్రిందిపద్యమునఁ జెప్పఁబడినది.

సీ. ఏ రాజు రాజుల నెల్ల జయించి మున్
                  వెట్టికిఁ బట్టె దోర్విక్రమమున
    నే రాజు సేతుసీహాద్రిమధ్యోర్వి
                  నేకపట్టణలీల నేలి ప్రాలె
    నే రాజు నిజకీర్తి నెనిమిదిదిశల ను
                  ల్లాసంబు నొందఁ నలంకరించె
    నే రాజు తనతేజ మీజగంబునకు న
                  ఖండై కవిభవంబుగా నొనర్చె

    నట్టి కాకతిగణపతిక్ష్మాధినాథు
    ననుఁగుఁదలవరి ధర్మాత్ముఁ డధికపుణ్యుఁ
    డయిన మేచయనాయకుప్రియతనూజ
    నతులశుభలక్షణస్ఫురితాంగి '

(నాగచమూవరుఁడు వరించె .. మల్లమాంబికన్)

నాగయగన్నయ్య మార్కండేయపురాణమును గొంత పొగడి కవి నుద్దేశించి యీ కోరికను కోరినట్లు గ్రంథమునఁ జెప్పఁబడి యున్నది.

ఉ. 'కావునఁ దత్పురాణము ప్రకాశితసారకథామృతం బొగిన్
ద్రావి జగజ్జనంబు లలరన్ రచియింపు తెనుంగున న్వచ
శ్శ్రీవిభవంబు పెంపు విలసిల్లఁగఁ గోవిదు లిచ్చ మెచ్చి సం
భావన చేయఁ జారుగుణభాస్వర మారయసత్కవీశ్వరా!

మారన యాంధ్రకవులలో నన్నయతిక్కనలనుమాత్ర మీక్రింది పద్యములతో స్తుతించినాఁడు.

ఉ సారకథాసుధారస మజస్రము నాగళపూరితంబుగా
నారఁగఁ గ్రోలుచున్ జనులు హర్షరసాంబుధిఁ దేలునట్లుగా
భారతసంహిత న్మును త్రిపర్వము లెవ్వఁ డొనర్చె నట్టి వి
ద్యారమణీయు నంధ్రకవితాగురు నన్నయభట్టుఁ గొల్చెదన్.

చ. ఉభయకవిత్వతత్త్వవిభవోజ్జ్వలు సద్విహితాధ్వర క్రియా
ప్రభు బుధబంధు భూరిగుణబంధుర భారతసంహిత క్రియా
విభుఁ బరతత్త్వకోవిదు నవీనపరాశరసూను సంతత
త్రిభువనకీర్తనీయయశుఁ దిక్కకవీశ్వరుఁ గొల్తు భక్తితోన్.

మారన తన యాశ్వాసాంతగద్యములయందు "శ్రీమదుభయకవిమిత్ర తిక్కనసోమయాజి ప్రసాదలబ్ధసరస్వతీపాత్ర తిక్కనామాత్యపుత్ర మారయనామధేయప్రణీతం" బని చెప్పెను * మారనశైలిని సూచించెడు నయిదాఱు పద్యములను మార్కండేయపురాణములోనివాని నిం దుదాహరించుచున్నాను

* [ఈ యాశ్వాసాంత గద్యనుబట్టి మారన తిక్కనసోమయాజి శిష్యుఁడనియు తిక్కనామాత్యుఁడను వేఱొకని పుత్రుఁడనియుఁ దెలియవచ్చుచున్నది. ఇందలి 'తిక్కనామాత్య పుత్ర' అను విశేషమునుబట్టి కొందఱు మారన తిక్కనసోమయాజి పుత్రుఁడని భ్రాంతిపడుచున్నారు. అది సరికాదు.

మారన తిక్కనగూర్చి విశేషమేమియుఁ జెప్పనందున నితనింగూర్చి యెక్కువగాఁ దెలియుట లేదు. ఇతని యితర రచన లేమియు నున్నట్లు కానఁబడదు.

ప్రతాపరుద్ర మహారాజు క్రీ. శ. ౧౨౯౫ మొదలు ౧౩౨౫ వఱకు నాంధ్రరాజ్యమును పాలించినందున. మారన కవియు, నాగయ గన్నయయు, ఆ కాలముననే యుండిరనుట నిశ్చయమని 'ఆంధ్రకవి తరంగిణి' లోఁ గలదు. (మూఁడవ సంపుటము. పుట 167]

చ. 'ఉరగముచేతఁ జచ్చిన తనూభవునిం గని శోకవేదనా
పరవశయు న్వికీర్ణకచభారయు నుద్గతబాష్పపూరయుఁ
గరతలతాడితాస్యయును గద్గదికావికలార్తనాదయున్
జరణవిపర్యయాపగతసత్వరయానయునై పొరిం బొరిన్. ఆ. ౧

చ. కనుఁగొని యాతనో గ్రనరకస్థజనంబు లెలుంగులెత్తి యో
మనుజవరేణ్య! పుణ్యగుణమండన! తావకదేహదివ్యగం
ధనిబిడమారుతంబు పరితాపభరం బడఁగించి మాకు నిం
పొనరఁగఁ జేయుచున్నయది యొక్కముహూర్తమునిల్వు వేదయన్. ఆ ౨

ఉ. ధర్మమునన్ ధనంబు సతతంబు ప్రవృద్ధముగా ధనంబునన్
ధర్మము తొంగలింప ధనధర్మవిరోధులు గాని కామభో
గోర్మల నొప్పు సంసృతిసుఖోదధిఁ దేలుచు నించుకేనియున్
గర్మవిరక్తి లేక బహుకాల మలర్కుఁడు ప్రీతి నుండఁగన్.— ఆ.౩

ఉ. వాయపురజ్జు లేల మునివల్లభ! వృద్ధుఁడ వొందెఁ గావు లేఁ
బ్రాయపువాఁడ వద్రివనరమ్యము లైన యనేకదేశముల్
ధీయుత! యల్పకాలమునఁ ద్రిమ్మర శక్యమె నీకు నెమ్మెయిన్
వేయును నేల నమ్మ నెద నీపలుకన్న మునీంద్రుఁడిట్లనున్.— ఆ.౪

ఉ ఎక్కడనుండి వచ్చె నతఁ డీతుహినాద్రికి వేడ్క నూని యే
నక్కడ నక్కుమారురుచిరాకృతి యాదట నేల చూచితిన్
మక్కువ నేల నాదుమది మన్మథుఁ దేచఁదొడంగె నా కయో!
ది క్కిఁక నెవ్వ రిచ్చట మదీయు లటంచు దురాశ యేటికిన్. ఆ.౫

చ. తనరుచు నాకమోక్షసుఖదం బగు దారపరిగ్రహంబు చే
యనికత మేమి? బంధమున కాస్పదమా యది? యంద సంతతం
బును మునిదేవపిత్రతిథిపూజ లొనర్చుచుఁ బుణ్యలోకముల్
చను గృహమేధి సర్వసుఖకారిణి వత్స! గృహస్థవృత్తి దాన్. ఆ ౬

చ. నిరుపమసచ్చరిత్రుఁడు పవిత్రుఁడు సర్వజనైకమిత్రుఁ డి
ద్ధరణజితోగ్రశత్రుఁ డతిదాంతుఁడు శాంతుఁడు సత్యవంతుఁ డా
దరనయధర్మవంతుఁడు వదాన్యుఁడు మాన్యుఁడు ధన్యుఁ డంతరం
గరహితమన్యుఁ డై కరము గారవమారఁగ నేల యేలుచున్. ఆ.౭

విన్నకోట-పెద్దన్న

విన్నకోట పెద్దన్న యనెడి కవి కావ్యాలంకారచూడామణి యను లక్షణ గ్రంథమును రచియించినవాఁడు. ఇతఁడు నియోగి బ్రాహ్మణుఁడు; గోవిందరాజుపుత్రుఁడు; కౌశికగోత్రుఁడు. ఈతని వాసస్థానము రాజమహేంద్రవరము. కావ్యాలంకారచూడామణిలో నితఁడు పురవర్ణనమున కుదాహరణముగా రాజమహేంద్రవరము నిట్లు వర్ణించియున్నాఁడు.

సీ. గంభీరపరిఘ నాగస్త్రీల కభ్రాంత
కేళీవిహారదీర్ఘిక యనంగ
నుత్తాలసాల మన్యుల కుబ్బి దివిఁ బ్రాఁకఁ
జేసినదీర్ఘనిశ్రేణి యనఁగఁ
జతురచాతుర్వర్ణ్యసంఘ మర్థులపాలి
రాజితకల్పకారామ మనఁగఁ
బ్రాంతసుస్థిత మైనభవజూటవాహిని
భుక్తిముక్తిప్రదస్ఫూర్తి యనఁగ
నెప్పుడును నొప్పురాజమహేంద్రవరము
ధరణిఁ గల్పించె నేరాజు తనదుపేర
నట్టిరాజమహేంద్రునియనుఁగుమనుమఁ
డెసఁగు జాళుక్యవిశ్వేశ్వరుండు.

[రాజమహేంద్రవరము నీకవి వర్ణించుటం బట్టి యీతని నివాసము రాజమహేంద్రవరమనియు, విశ్వేశ్వరుఁడు రాజమహేంద్ర పురాధీశ్వరుఁడనియు తోఁచవచ్చును. విశ్వేశ్వరుఁడు చాళుక్య వంశీయుఁడుగాని రాజమహేంద్రుని పౌత్రుఁడుగాని కాఁడు.]

ఇతఁడు తాను రచియించిన యలంకారశాస్త్రమును రాజమహేంద్ర పురాధీశ్వరుఁడును చళుక్యవంశసంభవుఁడును నయిన విశ్వేశ్వరమహారాజున కంకితము చేసెను. విశ్వేశ్వరుని కాలమును సరిగా నిర్ణయించుట కాధారము దొరక

లేదు గాని యీతఁడు పదునాలవ శతాబ్దారంభమున నున్న ట్లూహించుట కవకాశము కలిగియున్నది. విశ్వేశ్వరరాజు విశాఖపట్టణమండలములోని సర్వసిద్ధి కీశాన్యమూలను మూఁడుక్రోసులదూరములో నున్న పంచధారల వద్ద ధర్మలింగేశ్వరస్వామి కొకమండపమును కట్టించినాఁడు. ధర్మలింగేశ్వర స్వామివారి యాలయములోని శిలాశాసనములో మండపము కట్టిన సంవత్సరము తెలుపఁబడకపోయినను, అతని వంశవృక్ష మీ ప్రకారముగా లిఖింపఁబడినది. భీమేశ్వరుని కొడుకు విమలాదిత్యుఁడు, విమలాదిత్యునిపుత్రుఁడు రాజనరేంద్రుఁడు, రాజనరేంద్రుని సుతుఁడు కులోత్తుంగచోళుఁడు, కులోత్తుంగచోళుని తనయుఁడు విమలాదిత్యుఁడు, విమలాదిత్యుని యాత్మజుఁడు మల్లప్పదేవుఁడు, మల్లప్ప దేవునిసూనుఁ డుపేంద్రుఁడు, ఉపేంద్రుని నందనుఁడు కొప్పభూపుఁడు, కొప్పభూపునితనూజుఁడు మనమోపేంద్రుఁడు, మనమోపేంద్రుని కుమారుఁడు విశ్వేశ్వరభూపుఁడు.

దీనినిబట్టిచూడఁగా విశ్వేశ్వరరాజు రాజనరేంద్రున కేడవ మనుమఁ డైనట్టు తెలియవచ్చుచున్నది, రాజనరేంద్రుఁడు ౧౦౬౩ వ సంవత్సరము వఱకును రాజ్యము చేసినట్లు మనకుఁ దెలియును. తక్కిన విశ్వేశ్వరుని పూర్వు లాఱుగురును ఒక్కొక్కరు నలువదేసి సంవత్సరములు రాజ్యముచేసి రనుకొన్నను విశ్వేశ్వరునికాలము (పదుమూడువందల నాలుగు) ౧౩౦౪ వ సంవత్సరముకంటెఁ దరువాత నారంభము కాదు. కావ్యాలంకారచూడామణియం దీ రాజవంశము పూర్ణముగా తెలుపఁబడకపోయినను, తెలుపఁబడినంతవఱకు పయి వంశవృక్షముతో నేకీభవించుచున్నట నా పుస్తకములోని యీ క్రింది పద్యమువలనఁ దెలిసికోవచ్చును.

సీ. శ్రీకంఠచూడాగ్రశృంగారకరణ మే
రాజున కన్వయారంభగురుఁడు
చాళుక్యవంశభూషణము శ్రీవిష్ణువ
ర్ధనుఁ డే మహీకులతాతలకుఁ దాత
ధృతకుమారారామభీముండు చాళుక్య
భీముఁ డే నృపకులాబ్ధికి విధుండు

రాజమహేంద్రవరస్థాత రాజన
రేంద్రుఁ డెవ్వనితాత యే విభునకు

నంధ్రదళదానవోపేంద్రుఁ డగునుపేంద్ర
ధరణివల్లభుఁ డే రాజుతండ్రి తాత
ఘనుఁ డుపేంద్రాఖ్యుఁ డెవ్వని కన్నతండ్రి
యతఁడు విశ్వేశ్వరుఁడు లక్కమాంబసుతుఁడు

విశ్వేశ్వరరాజుకుమారుఁ డయిన యుపేంద్రునిపుత్రుఁడు నృసింహభూపుఁడు శాలివాహనశకము ౧౩౨౫వ సంవత్సరమునం దనఁగా క్రీస్తుశకము ౧౪౦౩వ సంవత్సరమునందు పంచతీర్థమునందలి ధర్మలింగేశ్వరస్వామి గుడికి గోపురము కట్టించిన ట్లొక శిలాశాసనమం దా దేవాలయములో వ్రాయఁబడి యున్నది. తాతకును, మనుమనికిని డెబ్బది సంవత్సరముల వ్యత్యాస ముండవచ్చును గనుక నృసింహ భూపతితాత యైన విశ్వేశ్వర భూపుఁ డించుమించుగా ౧౩౩౦వ సంవత్సరమువఱకు నుండి యుండును. కాఁబట్టి యీ విశ్వభూపుని యాస్థానకవి యైన విన్నకోట పెద్దన్న యిప్పటి కయిదువందలయేఁబది సంవత్సరములక్రిందట ననఁగా నెఱ్ఱాప్రెగడకంటె కొంచెము ముందుగానో యాతనికాలములోనో యున్నాఁడని నిశ్చయింప వలసి యున్నది. [ఈ 'ఆంధ్రకవులచరిత్రము'లోని కాలనిర్ణయము సరిగా లేదని శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు విభవ సం భాద్రపదమాస 'భారతి' యందు తెలుపుచు విన్నకోట పెద్దన్నను గూర్చి యీ క్రింది విధముగా వివరించినారు.

'శాసనమునుబట్టి విమలాదిత్యుని కొడుకు రాజనరేంద్రుఁడు, అతనికొడుకు కులోత్తుంగచోడకేసరి, అతనివంశమున విమలాదిత్యునికొడుకు మల్లప దేవుఁడు, ఆతనిపుత్రుఁ డుపేంద్రుఁడు, ఉపేంద్రునికొడుకు మల్లప దేవుఁడు (2), అతనికుమారుఁ డుపేంద్రుఁడు (2), అతనికుమారుఁడు

కొప్పభూపతి, కొప్పభూపతిపుత్రుఁ డుపేంద్రుఁడు (4), అతని పుత్రుఁడు మనుమోపేంద్రుఁడు, మనుమోపేంద్రునికొడుకు విశ్వేశ్వరభూపతి అని తేలుచున్నది.

శాసనమున విశ్వేశ్వరభూపతి మండపమును కట్టించిన సంవత్సరముకూడ నిట్లు తెలుపఁబడినది.

'శాకాబ్దే నవబాహు రామ శశి సం
　　ఖ్యాతే శుచౌ భాసితే
స_ప్తమ్యా మినవారభాజి మహితః
　　సంస్థాపితో మండపః,
కల్యాణోత్సవసిద్ధయే సవిభవః
　　శ్రీపంచధారాపురీ
ధర్మేశస్యచశుక్య విశ్వధరణీ
　　భర్తా విచిత్రాస్పదమ్''

'ఇందువలన విశ్వేశ్వరభూపతి మండపమును కట్టించినది నవ-బాహు-రామ-శశి సంఖ్య అనఁగా 1329 శ. సం. అని తేలుచున్నది. కావున విశ్వేశ్వర భూపతి శ సం. 1329 అనఁగా క్రీ. శ 1407 ప్రాంతమువాఁడు. క్రీ. శ 1304 నకు వంద సంవత్సరముల తరువాతివాఁడు. ఈ శాసనమునందే విశ్వేశ్వర భూపతి సర్వసిద్ధిపద్ద చిత్రభాను సంవత్సరమునకు సరియయిన శకవర్షము 1424 ప్రాంతమున శత్రువుల నోడించెనని క్రింది శ్లోకమున శ్లేషింపఁబడినది.

'గతిబాహు శ క్తి భూమితి
　　మవిగణయత్సర్వ సిద్ధిపదభగ్నం,
సతిచిత్రభానుసాక్షిణి
　　ధరణి వరాహో దధావ దాంధ్రబలమ్ ॥

గతి, బాహు, శక్తి, క్షమలకు సరియైన శకవర్షము 1324. ఈశ్లోకమునకు సరియైన తెలుగునేతయే పెద్దన కావ్యాలంకారచూడామణి యేడవయుల్లాసమున.

'చతురుపాయ-బాహు-శక్తి క్షమావళి
బాఱవిడిచి చిత్రభాను సాక్షిఁ
బాఱె సర్వసిద్ధిపదమేది ధరణీవ
రాహమునకు నోడి రాచకదుపు?'

సర్వసిద్ధిపదమేది-అనుచో పథమేది-అనియుండుట లెస్స.

అనియుండుటచేత శాసనరచయితకూడఁ బెద్దనయే యయి యుండును. కావ్యాలంకారచూడామణి నాతఁడు శా. స. 1324 న చిత్రభాను సంవత్సరమునకుఁ దరువాత రచియించి యుండును.]

ఈకవి గ్రంథములోని రెండు పద్యములనుమాత్ర మిప్పు డుదాహరించి యీతనిచరిత్రము నింతటితో విరమించెదను.

ఉ. వేడుక విశ్వనాథపృథివీవరసుందరు బిట్టు చూచి తో
డ్తోడన సిగ్గు డగ్గఱుడుఁ దొంగలిఱెప్పలకప్పులోనఁ జి
ట్టాడెడు చూడ్కి లోఁ ప్పెఁగుసుమాయుధతూణముఖంబునందు వ్రా
టాడెడు పువ్వుఁదూపులన నంగనకుం దరళంపుఁజాయలన్.

శా. శ్రీనిండారఁగ లోకరక్షకొఱకై సిద్ధించుటంజేసి ల
క్ష్మీనాథుం డగు నయ్యుపేంద్రుఁ డిపు డేచెంగాన నీ నూతన
క్ష్మానాథుం డగు విశ్వనాథునకు శృంగారాధినాథత్వ మి
ట్లీనోపుం బ్రబలుతింప నంచుఁ గవు లుత్ప్రేక్షింతు రెల్లప్పుడున్.

ఈ విన్నకోట పెద్దన ప్రద్యుమ్నచరిత్రమును రచించె నని శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు వ్రాసి, కుమారసంభవము టిప్పణములో నీ క్రింది పద్యముల నుదాహరించిరి.

సీ. మించిన గతులు సాధించి యింద్రునికి మా
ర్కొనియున్న కాల్గలకొండ లనఁగఁ
జేతనత్వంబులు చేకొని రవికిఁ గొ
మ్ములు చూపు చీఁకటిమొన లనంగఁ
జే కల్గి యలుల కనేకదానము లిడ
మెలఁగుతమాలభూమిజము లనఁగఁ
జిత్రవధోద్ధతసిద్ధులై గాడ్పుతో
మోహరించిన కారుమొగుళు లనఁగ

నెల్లచందంబులను గడు నెసఁకమెసఁగి
పొగడు నెగడును బడసి యప్పురిఁ జరించు
తమ్ముఁ జూచిన మెఱయుఁ బుణ్యమ్ము నొసఁగఁ
దావలం బైన భద్రదంతావళములు.

సీ. గజయాన మెలఁగినగతి యైనఁ బైఁ బడ
గద్దించి తర్కించి కలఁత నొందు
మానిని యల్గినమాడ్కిఁ దోఁచినఁ దేర్చ
నూకించు భావించి యొత్తలించుఁ
జపలాక్షికెమ్మోవి చవిగొన్నయట్లైనఁ
జెమరించి చర్చించి చిన్నఁబోవు
మదవతికౌఁగిలి గదిసినయట్లైనఁ
బులకించి తేటి సంచలత నొందుఁ

దన్ను మెఱసిన కోర్కులు తగులు కొలుపు
నోలిఁ దనలోన నలి నరపాలసుతుఁడు
మాన మూటాడ గంభీరమహిమ సడల
లజ్జ గడివోవ ధైర్యంబు లావు దిఁగగ.

పెద్దన ప్రద్యుమ్నచరిత్రములోని యేదో యుదాహరణగ్రంథమునం దుదాహరింపఁబడిన యీ పద్యములను జూచి పెద్దన విన్నకోట పెద్దన యని కవిగారు భ్రమపడిరేమో ! ప్రద్యుమ్నచరిత్రము పొన్నాడ పెద్దిరాజు దని యీ గ్రంథములోని రెండు పద్యము లీ క్రిందివి రెండు చోట్ల నాంధ్ర సాహిత్యపరిషత్తువారియొద్ద నున్న యుదాహరణ పుస్తకములో నుదాహ రింపఁబడినవి.

గీ. రాయుచున్న ఘనపయోధరములఁ గలిగి
నడుము లొత్తకొంత బయలయి బెడఁగు మిగిలి
చూడ నొప్పారురేఖల సొంపు మెఱసి
కోటకొమ్మ లమరు పీటికొమ్మలట్ల.

క. పురగోపురశిఖరంబులఁ
గర మరుదై పద్మరాగకలశము లమరుఁ
జరమాచరమాద్రులపై
సరిపున్నమఁ దోఁచు సూర్యచంద్రులభంగిన్.

జిమ్మపూఁడి-అమరేశ్వరుఁడు

ఇతఁడు సుప్రసిద్ధుఁడైన యాంధ్రమహాకవి. ఈ కవినిగూర్చి యిరువది యేండ్ల క్రిందట నా యాంధ్రకవులచరిత్రములో నిట్లు వ్రాసితిని. అమరేశ్వరుని గొప్పకవినిగా పూర్వకవు లనేకులు స్తుతించి యున్నారు. ఈతఁడు చేసిన గ్రంథము లేవియో తెలియరావు గాని కూచిమంచి తిమ్మకవి తన సర్వలక్షణసారసంగ్రహమునందుఁ జిమ్మపూడి యమరేశ్వరుని విక్రమ సేనములోని దని యీ క్రిందిపద్యము నుదాహరించి యున్నాఁడు.

ఆ. నీర నగ్గి యునికి యారయ విస్మయం
బనుచు బాడబాగ్నికడలి యప్పు
రంబుఁ జొచ్చె నొక్కొ రత్నాకరముమణు
లనఁగ జెలువ మమరు నాపణములు"

ఈ కవిని ప్రశంసించిన పూర్వకవుల పుస్తకములలోని పద్యములఁ గొన్నిటి నిం దుదాహరించుచున్నాను.

ఉ. నన్నయభట్టుఁ దిక్కకవినాయకు భాస్కరు రంగనాథుఁ బే
రెన్నిక కెక్కినట్టి యమరేశ్వరు నెఱ్ఱనమంత్రి నాదిగాఁ
జన్న కవీంద్రుల న్నవరసస్ఫుటవాణు లనంగ ధాత్రిలో
నున్న కవీంద్రులం దలఁతు నుల్లమెలర్పఁగ వాగ్విభూతికిన్
[అనంతామాత్యుఁడు]

ఉ. నన్నయభట్టుఁ దిక్కకవి నాచనసోముని భీమనార్యుఁ బే
రెన్నికఁ జిమ్మపూడి యమరేశ్వరు భాస్కరు శంభుదాసునిన్
సన్నుతి చేసి వాక్యసరసత్వము వీనుల కింపుమీఱ న
త్యున్నతిగా నొనర్తు నెఱయోధులు మేలనఁ గావ్య మిమ్ములన్.
[ప్రౌఢకవి మల్లన]

చ. అలఘుని శబ్దశాసనపదాంకితుఁ దిక్కనసోమయాజి ని
శ్చలమతి శంభుదాసు బుధసన్నుతు నాచనసోమనార్యుఁ జె
న్నలరిన చిమ్మపూడి యమరాధిపు భాస్కరు రంగనాధునిం
దలఁతు నపూర్వదివ్యకవితామహనీయసమగ్రచిత్తులన్.

[నూతనకవి సూరన్న]

ఉ. ఇద్ధగుణుం బ్రబంధపరమేశ్వరు నెఱ్ఱనప్రెగ్గడన్ మనః
పద్ధతి నిల్పి సూక్తిరుచిభాస్కరుఁ డైన హుళక్కిభాస్కరున్
బుద్ధి ఘటించి సంతతము పూని భజించి వచఃప్రసాదనం
సిద్ధునిఁ జిమ్మపూడి కులశేఖరు నయ్యమరేశసత్కవిన్. *

[అంగర నృసింహకవి]

ఇట్లు పదునేనవ శతాబ్దారంభమునుండియు నున్న మహాకవీశ్వరు లీతనిని సత్కవీంద్రునినిగాఁ బొగడుచు వచ్చుటచేతఁ జిమ్మపూడి యమరేశ్వరుఁడు పదునాల్గవ శతాబ్దారంభమునం దనఁగా నెఱ్ఱాప్రెగడ కాలమునందో, కొంచె మీవలనో యున్నట్లు నిశ్చయింపవచ్చును. విక్రమసేనమును సంపాదింప వలెనని నేను చిరకాలమునుండి కృషి చేయుచుంటిని. గాని నా కృషి యింతవఱకును సఫలమయినది కాదు. ఇట్లుండఁగా ౧౯౦౯ వ సంవత్స రము ఏప్రిల్ నెలలో నా మిత్రు లయిన మానవల్లి రామకృష్ణకవిగారు తాము ప్రకటించిన క్రీడాభిరామముయొక్క యాచ్ఛాదనపత్రముపైని చిమ్మ పూడి యమరేశ్వరుని విక్రమసేన మచ్చులో నున్నదని ప్రచురించుటఁ జూచి యా మహాగ్రంథము శీఘ్రకాలములోనే నా కరస్థము కాఁగలదు గదా యని యపరిమితానందము నొందితిని. వా రా సంవత్సరమునందే డిసెంబరునెలలో ప్రకటించిన నన్నెచోడుని కుమారసంభవప్రథమభాగా చ్ఛాదనపత్రముమీద సహితము విక్రమసేన మచ్చులో నున్నట్టే ముద్రింపఁ

* వినుకొండ వల్లభరాయకృతిగా శ్రీనాథుఁడు రచించినదని చెప్పఁబడుచున్న క్రీడాభిరామమున చిమ్మపూడి అమరాధిపుని ప్రశంసకలదు. కాన నితఁడు 13 వ శతాబ్దిమధ్యమున నుండియుండ వచ్చును.

బడినది. ఆ పుస్తకమును సంపాదించుటకయి నేను బహులేఖలను వ్రాసితిని గాని నేను త్వరపడినకొలఁదిని పుస్తకప్రకటన మాలస్యము కాఁజొచ్చెను. అందుచేత నేను ముద్రితప్రతిని శీఘ్రముగాఁ బొందఁగాంతు నన్న యాశను విడిచిపెట్టి నా కవిచరిత్రమున కనుకూలముగా నుండుట కయి విక్రమ సేనముయొక్క యవతారికను గ్రంథములోని కొన్ని పద్యములను వ్రాసి పంపవలసిన దని కవిగారిని వేఁడితిని. కవిగారు తమయొద్ద నున్న పుస్తకములో నవతారికభాగము లేదనియుఁ గొన్ని పద్యములను వ్రాసి పంపెద మనియు నాకుఁ బ్రత్యుత్తర మిచ్చిరి. శ్రీరామకృష్ణకవిగారి సంవత్సరము మెయి నెల ౧౦ వ తేదిని చెన్నపురిలో "అపూర్వ వాఙ్మయ పరిశోధనము" ను గూర్చి యొనర్చిన యుపన్యాసములో జగ్గన్న ప్రబంధ రత్నాకరములో నుదాహరింపఁబడిన గ్రంథములబేర్కొనుచు వానిలో విక్రమసేన మొకటిగాఁ జెప్పి, వానిలోఁ గొన్నిటిలోఁ గొన్నిభాగములు మాత్రమే తమకు లభించిన వని చెప్పుటచేత విక్రమసేనముయొక్క యవ తారికమాత్రమే కాక గ్రంథమంతయు వారికి లభింపలేదనియుఁ, బ్రబంధ రత్నాకరములో నుదాహరింపఁబడిన పద్యములు మాత్రమే వారికి లభించి యుండు ననియు నే నూహించుచున్నాను. నా యూహ సత్యము కాకపో వచ్చును. గ్రంథావతారిక గాక తక్కిన పుస్తకభాగ మంతయు వారియొద్ద నుండినపక్షమునఁ జిరకాలమిత్రులయిన కవిగారు నా ప్రార్థనము చెల్లింప కుండి యుండరు. విక్రమసేనములోని పద్యములు ముప్పదికంటె నెక్కు వగా నాంధ్రసాహిత్యపరిషద్గ్రంథాలయమువారి యుదాహరణపుస్తకములో నియ్యఁబడినవి. అం దుదాహరింపఁబడిన పద్యములను గొన్నిటి నిందు క్రిందఁ బొందుపఱుచు చున్నాను.

సీ. సారథి శతవృద్ధు చక్రంబు లొనఁగూడి
జరగవు రథమున సంఘటించి
యుదకంబుసోఁకున కోర్వనియరదంబు
చేతికి బిరుసైన రాతివిల్లు

గరితాఁకు కోర్వక గడగడ వడఁకుచు
మువ్వంకఁ బోయెడిఁ జివ్వనారి
మేపు నీరును లేక మెదలాడనోపక
వర్ణహీనము లైన వారువములు
ఇట్టి సాధనములు నీకు నెట్టులొదవె
త్రిపురముల నెట్లు గెలిచితి దేవదేవ!
యనుచు నగజాతచెలు లాడ నలరు శివుఁడు
చిత్త మిగురొత్త మమ్ము రక్షించుఁ గాత!

సీ. భట్టనారాయణభాషామహాదేవి
లబ్ధవర్ణుల కర్థలబ్ధిఁ జేయు
బాణవాగ్స్వామినీ ప్రసవమంజరి విశా
రదుల కలంకారరమను జేయు
రాజశేఖరభారతీజహ్నుకన్యక
సుకవీంద్రులకు భావశుద్ధిఁ జేయు
మాఘవాణీశీతమారుతగతి సార
మతులకు రోమోద్గమంబుఁ జేయు
నని యెఱింగి వారియడుగులు దలఁచి న
మస్కరించి దండి మా మురారి
వామనుని గుణాఢ్యు క్షేమేంద్రు నిల నలం
కారవిదులఁ దలచిఁ గారవమున.

సీ. ప్రత్యగ్రరచనాతిభాసురప్రాసాద
నిర్జితగోత్రావనీధరంబు
ప్రాకారశిఖరాగ్రబంధురమణిగణ
ద్విగుణితతారకావిభ్రమంబు
పరిఘాజలాంతరప్రతిబింబితద్రుమ
స్ఫారితపాతాళభూరుహంబు

వరపుష్పసౌరభావర్జితమధుపశూ
న్యీకృతాశావారణేంద్రగండ
మప్సరస్స్పృహణీయలీలాతిశయవి
లాసినీజననేత్రవిలాసజనిత
కుసుమశరబాణవైహార్త్య మసదృశార్ధ
నిర్జితాలక యుజ్జయినీపురంబు.

గీ. ఇట్టి పాపయి ల్కుఁదేలు మట్టి యనుచు
జనులు కనుకని పల్కెడు చందమామ
నడిమిమచ్చకు నెఱిఁగి పేరిడఁగ నేర్తు
రప్పురమున మేడలపయి నాడు సతులు.

సీ. చూపులకట్టు పూఁదూపులచేబట్టు
నబలలచూడ్కుల యాయుధములు
తాయంబునకుఁ గండుఁగోయిలఁ గూయించు
బాలలపలుకులు మూలమంత్ర
మెదిరికిఁ దేఁటుల నెదయాట లాడించు
నబలలయలకల యాప్తబలము
సవరణలకుఁ జంద్రుఁ జాలించు మగువల
మొగముల సేనకుఁ దగిన మొగము

భావభవునకు నటుగాక బలమె బలము
గాఁగఁ దిరిగెనె పెట్లచే గాసిఁబడఁడె
యనఁగ సౌందర్యసంపద లభినవముగ
వఱలుదురు తత్పురంబున వారసతులు.

క. తరుణవయస్కుల యౌవన
పరిపాకుల వృద్ధజనుల భటులను నిజనో
దరులను గురులనుగాఁ జూ
తురు పురముపతివ్రతాసతులు పుణ్యవతుల్.

ఉ. పూవులప్రోవులై చిలుకబోదలు కోయిలపిండుమందలై
తావులక్రోవులై యలివితానముగానము తానకంబులై
కావను బండఁజాలుటఁ ద్రికాలముఁ గల్గ వరంబుఁ గన్నయ
ట్లై వనరాజి పొల్పగుఁ బురాంతికభూములఁ నెల్లఁ జూడఁగన్.

చ. మరలఁగఁబోదు రిండ్లకును మా పవునంతకుఁ జేలలోపలం
దిరిగి యొకింతవంత వడదేఱెడుమోములఁ జెన్నుసేయుచుం
బిరిగొని క్రాలు దృగ్గుచులపెల్లునఁ జీఁకటి నెల్లఁ బాచినం
దెరువరు లర్థిఁ గూడఁ బఱతేరఁగఁ బామరభామినీజనుల్.

శా. దానానేకపబృంహితస్వనము గంధర్వావళీహేషిత
ధ్వానంబుల్ మృదువేదనాదమును గాంతానూపురారావముల్
గానానూనరవంబుఁ దూర్యబహుళశంఖస్ఫారశబ్దంబుఁ బె
ల్లైనీరాకరఘోషమో యనఁగ నిత్యంబుం జెలంగుం బురిన్.

గీ నూఱుక్రతువులు చేయని పాఱుటిల్లు
కోటిపడగలు లేని కిరాటగృహము
జాతిరత్నంబు గాని పాషాణకులము
వెదకి చూపిన పీటఁ బన్నిదము గలదు.

మ. కులశైలంబులలో సువర్ణగిరి, దిక్కుంభీంద్రవర్గంబులో
బలభిన్నాగము, లోకపాలకులలోఁ బర్జన్యుఁ, డుగ్రోరగం
బులలో శేషుఁడు, బెంపుగన్నకరణిం బూజ్యాధిపశ్రేణిలో
వెలసెన్ విక్రమసేనభూవిభుఁడు దోర్వీర్యప్రకాశోన్నతిన్.

చ. అదె కైలాసము దిగ్విలాసము విహాయశ్చారిణీసమ్మ ద
ప్రదవిన్యాస ముదగ్రభాసము మరుద్భామాసదాధ్యాస మ
భ్యుదయన్యాస మసన్నిరాసము మయూరోదారనిధ్వానవి
భ్యదహివ్రాతకృతప్రవాసము త్రినేత్రావాస మూర్వీశ్వరా!

సీ అరుణపుష్పావళి నగ్నిగా సంధించి
యలుల నల్లెలుగాఁగ నావహించి

దండడి వీతెంచు దక్షిణపవనంబు
భస్త్రానిలంబుగాఁ బరిఢవించి
చిలుకలుఁ బికములుఁ జేదోడు సేయఁగ
మాధవుఁ డనెడి కమ్మరి కడంగి
యంగజుం డను పతియానతిఁ బనిపూని
మొగడల న్ములుకుల మొనలు చఱచు

కొలిమి యొక్కొ యనఁగ గురియు పరాగంబు
విస్ఫులింగములుగ విరహు లులుక
నేచి పూచి యున్న యీ యశోకమహీరు
హంబుఁ గంటె మాళవాధినాథ!

శా. ముత్తా కే కుజము ల్పడల్చె మొగడ ల్కొ న్నేమహీజంబులం
దొత్తెం బువ్వులు నిండఁగాఁ బెరిఁగె నే యుర్వీజముల్ పూపలన్
మొత్తంబై విలసిల్లె నే ధరణిజంబుల్ కాయలం బండులన్
జిత్తానందముఁ జేర్చె నే క్షితిజము ల్చెల్వొందఁగాఁ జెప్పుమా.

సీ. పాంథులహృదయముల్ పల్లటంబులు సేయ
దర్పకుపనిచినదం డనంగ
విరహిమృగంబుల మరిగింపఁ దివిరెడు
కాయసంభవుని మొక్కలల మనంగఁ
గడు నల్గి చైత్రుననగారంబు ముద్రింప
మనసిజుఁ బనిచినయనుఁగు లనఁగ
సహచరుం డగు గంధవహుఁ గానఁగా మీన
కేతనుపంచినమాత లనఁగ

నభినవాకారసౌందర్యసుభగలీల
లతిశయంబుగ మెలఁగుచు నసమబాణు
పుష్పలావికాజనములు పోలె నెఱసి
కోమలాంగులు పువ్వులు గోసి రెలమి.

సీ. దక్షిణపవనంబు తమగంధమును బూని
మలయాచలముమీఁదిమరులు మాన
తివిచి పట్టినలత చివుళులచాయకుఁ
గరతలంబులకాంతి వరము లొసఁగ
కుసుమము ల్గోయుచో గోళ్ళమెఱుంగులు
తనిమొగ్గలకు గవిసెన లొనర్ప
పిలువంగఁ జెలఁగెడు పలుకులు రాజకీ
రములకు నొజ్జతనములు సేయఁ

గురులు నలులపిండు బెరయఁగ వనమయూ
రములగతులతోడ గమనలీల
ననఁగి పెనఁగి ప్రీతి వనకేళి సలిపిరి
వనజముఖులు వేడ్కఁ బనుపు చేయ.

మ. పరపై యొప్పెసలారు మానికపుసోపానంబులం బ్రజ్వల
ద్వరవజ్రోపలసైకతంబులను సౌవర్ణారవిందంబులన్
హరినీలాసితవారిజంబులను జక్రాంగాదివాఃపక్షివి
స్ఫురణం గల్గు సరోవరంబు గనియెన్ భూవల్లభుం డయ్యెడన్.

క. మొగములు విరిదమ్ములఁ గుచ
యుగములు కోకములఁ జూడ్కు లుత్పలముల మం
దగతులు హంసలఁ దోల న
రుగుగతిఁ జొచ్చిరి సతుల్ సరోవర మెలమిన్.

గీ. బలిమి రాహు సుధాంశుబింబంబు వెఱచి
పాఱఁ గడుడాసి వెనుకొనుపగిది నొక్క
యెడ సఖులఁ గూడి చెలరేఁగి యీఁదుచోట
నీలవేణియు మొగమును నెలఁత కొప్పె.

సీ. కలయంగ నలఁదిన కస్తూరి పెల్లుగ
జలమున కెల్లను గలుగఁజేసి

కుచమండలంబుల కుంకుమచర్చల్ల
నీరెల్ల జేవురుసీరు చేసి
తనులిప్తసురభిచందనకర్దమంబున
వారి నెల్లఁ బూఁగువందు చేసి
మూలలనవపుష్పమాలికావితతుల
వన మెల్లఁ బెట్టువ గొనఁగఁజేసి
యలక లలికవీధి నంటఁ గన్గవలఁ గెం
పెలయఁ గామచిహ్నలెల్లఁ జెలయ
నెలరుపాతు లమర జలకేళి చాలించి
కొలను వెడలి రింతు లలపగతుల.

గీ. కమలినీకాంత యెంతయుఁ గంది వంద
వారుణీసక్తుఁడై వసువ్యయము చేసి
యరిగినట్లు సరాగియై యంబరంబు
దొఱఁగి పశ్చిమజలధిలో నుఱికెఁ దరణి

గీ. వామనానేకపము చక్రవాళకుధర
ధాతుతటము గోరాడుచో దరులు విఱిగి
గూలుటయు మింటి కెగసినధూళి వోలెఁ
బర్వె నెఱసంజ పడమరఁ బట్టుకొనుచు.

సీ. ధర వియోగుల నెల్లఁ బరిమార్పఁ బూని హృ
ద్భవుఁడు గట్టిన వీరపట్ట మనఁగ
విరహులపై దండు వెడలుచో మదనున
కెత్తిన కెంజిపురెల్లి యనఁగ
నలిఁ బ్రోషితులమీఁదఁ గొలిపెడు మరుకరి
ఘుసృణపంకాంకితకుంభ మనఁగ
జొత్తిల్లఁ బధికులనెత్తుట దోఁగిన
శంబరద్వేషుచేతి చక్ర మనఁగఁ

దూర్పుకొండతుట్టతుదిమ్రాఁకునను వ్రేలు
గొమ్మవలుదపూవుగొలక వోలెఁ
గందు బెరసి రాగకాంతి దలిర్పంగ.
మవ్వ మొప్పఁ జందమామ వొడిచె.

శా. అలరులపాన్పులం దలిరుటాకులసెజ్జల హర్మ్యవేదికా
తలములఁ దీవెయిండ్ల సికతాశయనంబుల ము న్వియుక్తిమై
నలదురి వందుకందువుల నప్పటి కప్పటి కింపుఁ బెంపఁ గో
ర్కులు తనివారి వేడ్కపడఁ గూడిరి వేడుకతోడ దంపతుల్.

చ. పలుచని చంద్రికారసము ప్రన్ననినున్ననితేట క్రొమ్మెఱుం
గులతుదలం దలిర్చునెలగొమ్మలకాంతి పసిండినిగ్గుతోఁ
గలిపి యలంతివన్నె యిడి కాయజునిల్పిన రత్నపుత్రికఁ
నలువ సజీవిఁ జేసెనొకొ నాఁ దగు నాతివిభూతిచూడ్కికిన్.

చ. చనువున రెండు వక్త్రములు చన్నులపాల్గుడువంగ నొక్కమో
ము నగఁగఁ నొక్కయాననము ముద్దునటింపఁగ నొక్కయాస్యము
గ్గనఁగ నిదేమి పల్కు దని యాలపనంబునఁ జెక్కిలించును
బ్బున నగు షణ్ముఖుం డెలమిఁ బొంది త్రిశక్తులు మాకు నీవుతన్.

క. హరగిరి సురగిరి రోహణ
గిరు లీవినకొదమ లనఁగ గృహములు పురి న
చ్చెరు వగు నకుప్యరత్న
స్ఫురణల విలసిల్లి తగినపొడవులతోడన్.

పయి పద్యములంబట్టి చూడఁగా విక్రమసేనము మాళవదేశము నందలి యుజ్జయినీనగరమున కధిపతి యయిన విక్రమసేనునికథయై సమస్తవర్ణనలతోను నిండి యున్నశృంగారకావ్య మయినట్టు కనుపట్టుచున్నది

హుళక్కి భాస్కరుఁడు

భాస్కరుఁ డనెడి యీ కవి రామాయణము పద్యకావ్యముగా తెనిఁగింపఁ బడుటకు ముఖ్యకారకుఁడు. తిక్కనసోమయాజుల పితామహుఁడును, గుంటూరిసీమకు పాలకుఁడు నగు మంత్రి భాస్కరునిచే రామాయణ మంతయు తెనిఁగింపఁబడినదనియు, అది యే హేతువు చేతనో యొక్క యారణ్యపర్వము తప్పఁ దక్కినభాగ మంతయు నుత్సన్నము కాఁగా పిమ్మట హుళక్కిభాస్కరుఁడు మొదలయినవారు తక్కిన కాండములను మరల రచించి గ్రంథపూర్తి చేసిరనియు ఒక ప్రతీతి కలదు. ఈ రామాయణమునకు భాస్కరరామాయణ మన్న పేరు మంత్రిభాస్కరునిచేత నయినను, హుళక్కిభాస్కరునిచేత నైనను రావచ్చును; గాని, అరణ్యకాండము తక్కినకాండములవలెఁ గాక యాశ్వాసములను కలిగి యుండుటను బట్టియు దానిశైలినిబట్టియు విచారించి చూడఁగా భాస్కరరామాయణములోని యారణ్యకాండము మంత్రిభాస్కరునిచేతనే రచియింపఁబడినదేమో యని సందేహము కలుగుచున్నది. యుద్ధకాండములోని ౧౧౩౪ పద్యములను హుళక్కి భాస్కరుఁడు రచియించినను, దాని నాశ్వాసములుగా విభాగింపకుండుటయు, ఆరణ్యకాండ మంతటిలోను ౭౩౦ పద్యములకంటె నెక్కువ లేకపోయినను దానిని రెం డాశ్వాసములుగా భాగించుటయు, విచారింపఁగా నీ రెండు కాండములను రచియించినవా రొక్కరు కారనియు వేఱువేఱు భాస్కరులనియు నూహింపఁదగి యున్నది. యుద్ధకాండములోని "శ్రీయుత మూర్తియైన" యను పద్యము మొదలుకొని వేంగిరినాయనింగారి ప్రేరణమువలన నయ్యలార్యునిచే రచియింపఁబడినట్టు ప్రాచీన తాళపత్రసంపుటములలోఁ గొన్నిటిలో వ్రాయఁబడియున్నది.

ఒక్క యారణ్యకాండమునం దక్క మఱి యేకాండములోను నాశ్వాస విభాగము చేయఁబడలేదు. అంతేకాక యారణ్యకాండమునందలి ప్రథమ ద్వితీయాశ్వాసాంతపద్యములు కృతిపతినిగూర్చిన సంబోధనములు గాక

శా. 'పుణ్యుం డూర్జితశౌర్యధైర్యమహిమస్ఫూర్తిస్ఫురద్వైభవా
గణ్యుం డార్యజనానురంజితమహాకారుణ్యుఁడున్ శ్లాఘ్యసౌ
గుణ్యుండు దన్వయవార్ధిచంద్రుఁడు రిపుక్షోణీశ్వరస్థాపితా
రణ్యుం డార్తశరణ్యుఁ డుజ్జ్వలయశోరమ్యుండు సౌమ్యుండిలన్
[అరణ్య. ఆ. ౧-౫౭౧]

అనియు,

శా. వైరిక్ష్మాతలనాథపర్వతమహావజ్రాయుధున్ ఘోరదు
ర్వారాఁహఃప్రథితారిదుస్సహతమిస్రప్రస్ఫురద్భాను గం
భీరాఁభోనిధి ధీరతానిమిషభూభృన్నాథు నత్యంతవి
స్తారోదారగుణప్రసిద్ధినవరాధాపుత్రు సన్మిత్రునిన్.''
[అరణ్య ఆ. ౨-౪౩౭]

అనియు, వరుసగాఁ బ్రథమ, ద్వితీయాంతములుగా నుండుటచేతను దిక్కన కవికృతమయిన నిర్వచనోత్తరరామాయణమునందలి యాశ్వాసాంతపద్యములుకూడ నీ విధముగానే వివిధవిభక్త్యంతములుగా నుండుటచేతను షట్కాండమును భాస్కరమంత్రి రచించె ననియుఁ, బితామహునియందలి గౌరవముచేతఁ దిక్కనయుఁ దన యాశ్వాసాంతపద్యముల నాతఁడు చూపిన దారినే రచియించెననియు నూహించుచున్నారు ఎంత సయుక్తికముగా నున్నను, ఇవి యూహలేకాని సిద్ధాంతములు కానేరవు. అరణ్యకాండము సాహిణిమారని కంకిత మొనర్చుట యీ యూహలను బాధించుచున్నది. పంద్రెండవ శతాబ్దాంతమునం దుండిన మంత్రిభాస్కరుఁడు పదుమూడవ శతాబ్దాంతమునను, పదునాల్గవశతాబ్దాదియందును ప్రజాపాలనము చేసిన ప్రతాపరుద్రుని కాలములో సాహిణిమారని కంకితము చేసె ననుట పొసఁగి యుండనేరదు. కాఁబట్టి యారణ్యకాండమునుగూడ హులక్కి భాస్కరుఁడే రచియించియుండును. తిక్కనసోమయాజిని గాని యాతనివంశమును వర్ణించిన కేతనకవి గాని భాస్కరమంత్రి రామాయణమును రచించెనని చెప్పి యుండకపోవుటచేతను, పదునాల్గవ శతాబ్దాంతమువఱకు నుండిన కవులెవరును భాస్కరుని పూర్వకవినిగా స్తుతించియుండకపోవుటచేతను,

పదునేనవ శతాబ్దాంతమునుండి కవు లొక్కభాస్కరునే పూర్వకవినిగా స్తుతించుచుండుటచేతను, కవిత్వమునకుఁ బ్రసిద్ధికెక్కిన భాస్కరుఁ డొక్కఁడే యనియు, కొందఱు భాస్కరశబ్దమునకు హుళక్కిపదమును గూడఁ జేర్చుచు వచ్చుటచేత నాతఁడు హుళక్కి భాస్కరుఁడే యనియు, ఊహింపఁదగి యున్నది. అవియే నిజమైనచో భాస్కరరామాయణము పదునాల్గవ శతాబ్దాదిని రచియింపఁబడెనని చెప్పవలసి యుండును.

చ. సహజకళంకమూర్తులు కుజాతులు గూఢతరోదయప్రభా
మహిములు గోత్రవిద్విషదమాత్యులు రాత్రిచరానుకూలధీ
సహితులు మందవర్తనులు సర్పసమానులు రాజసేవక
గ్రహములు గానవయ్యె నల రాయనిభాస్కరుఁ డస్తమించినన్.

శా. రెండా నాల్కలు, సంప్రదాయకునకున్ లెక్కింపఁగా నొక్కటే
గండా మొండిశిఖండిబండలకు లెక్కల్లేని నాల్కల్గదా!
చండారాతికులాటవీదహనచంచజ్జైత్రయాత్రాలస
త్కాండా! రాయనిమంత్రిభాస్కరునికొండా! దండనాథాగ్రణీ!

శా. కాండావిర్భవభాండభూపరివృఢగ్రైవేయశైలేయ సూ
కాండాటాధిపకేతుమాతులబలాకాశస్రవంతీమరు
త్కాండాఖండలతుండిపాండురయశఃకర్పూరపేటీభవ
త్కాండా! రాయనిమంత్రిభాస్కరునికొండా! దండనాథాగ్రణీ.

వెనుకటికూర్పులం దుదాహరింపఁబడిన పయి పద్యములు మంత్రిభాస్కరుని గూర్చినవియుఁ, గొమ్మనామాత్యునిగూర్చినవియుఁగాక రాయనిభాస్కరుని గూర్చినవియు, నాతనిపుత్త్రుఁడైన కొండామాత్యునిగూర్చినవియు నయి యున్నవి. మంత్రిభాస్కరుఁ డాఱువేల నియోగి, హుళక్కి భాస్కరుఁడు కొడుకైన మల్లికార్జునభట్టు భట్టనామము కలవాఁడగుటనుబట్టి వైదిక బ్రాహ్మణుఁడని యూహింపఁదగి యున్నది. కాని విక్రమార్కచరిత్రము రచించిన యాఱువేలనియోగి యైన కోవెల గోపరాజు హుళక్కిభాస్కరుని గూడఁ దనకులమువాఁడైన నియోగికవులలోనే చేర్చియున్నాఁడు చూడుఁడు.

చ. అనఘు హుళక్కిభాస్కరు మహామతిఁ బిల్లలమఱ్ఱిపెద్దిరా
జును బినవీరరాజుఁ గవిసోమునిఁ దిక్కనసోమయాజిఁ గే
తనకవి రంగనాథు నుచితజ్ఞుని నెఱ్ఱన నాచిరాజుసో
మన నమరేశ్వరుం దలఁతు మత్కులచంద్రుల సత్కవీంద్రులన్.'

భాస్కరరామాయణ మంకితము చేయఁబడిన సాహిణిమారఁడు బుద్ధరాజు కొమారుఁ డయిన ట్లయోధ్యాకాండములోని యీ క్రిందిపద్యమువలనఁ దెలియవచ్చుచున్నది.

క. 'శ్రీరమణీరమణసుధా
ధారాళదయాకటాక్షదామస్మితదృ
క్కైరవ వితరణకరణవి
శారద! బుద్ధయకుమార! సాహిణిమారా! [అయో. ౧]

ఈ బుద్ధరాజునకు నవనాథుఁ డనియు పేరు గలదు. రంగనాథరామాయణము బుద్ధరాజు రచియించిన ట్లుండుటచేతను, భాస్కరరామాయణ మా రాజుపుత్రుఁ డయిన మారని కంకితము చేయఁబడుటచేతను సాహిణిమారఁ డా బుద్ధరాజుకొడుకే యైనపక్షమున రంగనాథరామాయణము భాస్కరరామాయణముకంటె నిరువది, ముప్పది సంవత్సరములు ముందుగా రచియింపఁ బడినదని చెప్పవలసి యుండును. సాహిణి మారఁడు గుఱ్ఱపువాఁడని చెప్పెడి కథ కేవలకల్పితము. అతఁడు రాజపుత్రుఁడు. అతఁడు క్షత్రియ కులజుఁడు కాక రెడ్డివంశపువాఁ డయినను, రాజ్యభారమును వహించినవాఁ డగుటచే రా జయ్యెను. తండ్రిజీవితకాలములో సేనాధిపతిగా నుండి, తరువాత రాజయ్యెను. ఈతనిది సాహిణివంశము, ఇతనికుమారుఁడు కుమారరుద్రదేవుఁడు ఇతఁడే రామాయణమందలి యయోధ్యాకాండమును తెనిఁగించిన కవి. అందుచేతనే గద్యమునం దీతఁడు "మారయకుమార కుమారరుద్రదేవ ప్రణీతం" బని వ్రాసికొన్నాఁడు. కోనకాటభూపతి కుమారుఁడు రుద్రరాజు, రుద్రరాజుకుమారుఁడు బుద్ధరాజు; బుద్ధరాజు కుమారుఁడు విట్ఠలరాజు, విట్ఠలరాజుకుమారుఁడు బుద్ధరాజు, మారయ సాహిణి బుద్ధరాజు కుమారుఁడే యయినను, రంగనాథరామాయణకృతికర్త

యీ బుద్ధరాజగునో, కాఁడో యని సందేహింపవలసినదిగా నున్నది. సందేహింపవలయు ననుటేల? కాలవ్యత్యాసమునుబట్టి కాఁడనియే నిస్సంశయముగాఁ జెప్పవచ్చును ఆ బుద్ధరాజే బుద్ధరాజుతాత కావచ్చును, లేదా, యాతనితో సంబంధమే లేని వేఱొక బుద్ధరాజు కావచ్చును. సాహిణి మారన్న ద్వితీయప్రతాపరుద్రునికాలములో నాతనియశ్వసేనాధ్యక్షుఁడుగా నుండి తద్రాజ్యము తురుష్కాక్రాంతమైన యనంతరమున స్వతంత్రుఁ డయి యొకదేశపాలకుఁ డయ్యెను. భాస్కరరామాయణ మా కాలమునందే రచియింపఁబడి ౧౩౭౦-వ సంవత్సర ప్రాంతమునం దీ సాహిణిమారని కంకిత మొనర్పఁబడి యుండును. సాహిణిమారన రాజయినట్లీ క్రింది హుళక్కిభాస్కరుని చాటుధారను బట్టి సులభముగాఁ దెలిసికోవచ్చును.

క అప్పు లిడునతఁడు ఘనుఁడా?
యప్పు దొసఁగి మరలఁ జెందునాతఁడు రాజా?
చెప్పఁగవలె సాహిణిమా
రప్పను దానమున ఘనుఁడు రాజు నటంచున్.

మారన్న రాజనియు, సేనాధిపతి యనియు స్థాపించు పద్యములు రామాయణములోనే యున్నవి.

క శ్రీరామాకుచయుగళీ
హారిద్రోల్లసితవక్షహరిచరణసరో
జారాధ్యుఁడు మారయధర
ణీరమణోత్తముఁడు సాహిణీతిలక మిలన్.

[అరణ్యకాండము. ఆ. ౨-౧]

శా. లాటీచందనచర్చ చోళమహిళాలావణ్యసామగ్రి క
ర్ణాటీగీతకలాసరస్వతి కళింగాంతఃపురీమల్లికా
వాటీమంజరి గౌడవామనయనావక్షోజహారాళియై
పాటింపందగు నీదుకీర్తి రథినీపాలాగ్రణీ! సాహిణీ!

[కిష్కింధాకాండము, ౧ ౨౬]

బుద్ధరాజు తన బంధుఁడైన రంగనాథునిచేత ద్విపదరామాయణము చేయించుచున్నట్లును, ఆ గ్రంథము మూఁడు వంతులు ముగింపఁబడిన వెనుక మంత్రియైన భాస్కరుని కా సంగతి దెలిసి యతఁడు రాజుతోఁ దాను రామాయణమును పద్యకావ్యమునుగాఁ జేసి కృతి యిచ్చెదనని చెప్పఁగా ముందుగాఁ జేసి తెచ్చిన గ్రంథము కృతినందెద నని రాజు చెప్పినట్లును. అందుమీఁద నతఁడు గ్రంథమును శీఘ్రముగాఁ జేయింప నెంచి తన యాశ్రితుఁడును, కవీంద్రుఁడు నైన హుళక్కి భాస్కరుని బిలిపించి చెప్పఁగా నతఁ డారణ్యకాండమును మాత్రము చెప్పక తక్కిన భాగమును తెనిఁగించి తెచ్చెద నని యొప్పుకొని పోయినట్లును. ఆరణ్యపర్వమును తెనిఁగించిన నన్నయభట్టునకు వచ్చిన దురవస్థయే యారణ్యకాండమును జేసినయెడలఁ దనకును వచ్చునని హుళక్కి భాస్కరుఁడు జడియుటచేత దానినిమాత్రము మంత్రి భాస్కరుఁడు రచియించినట్లును, హుళక్కి భాస్కరుఁ డింటికిఁ బోయి తన పుత్రుఁ డైన మల్లికార్జునభట్టుచేత బాలకాండమును, కిష్కింధాకాండమును, సుందరకాండమును, శిష్యుఁడైన కుమారరుద్రదేవునిచేత నయోధ్యాకాండంబును, మిత్రుఁడైన యయ్యలార్యునిచేత తాను రచియింపఁబూనిన యుద్ధకాండమునందలి కడపటి భాగమును జేయించి తాను యుద్ధకాండముయొక్క మొదటిభాగమును రచియించి మంత్రి భాస్కరునియొద్దకుఁ గొనిపోయి సమర్పించినట్లును, మంత్రి భాస్కరుఁడు తాను రచించిన యారణ్యకాండమునుగూడఁ జేర్చి రామాయణము నంతను రాజునొద్దకుఁ గొనిపోయినప్పుడే రంగనాథుఁడును తన ద్విపద రామాయణమునుగూడ తేఁగా రాజు కుడిచేతితో రంగనాథునిరామాయణమును, ఎడమచేతితో భాస్కరుని రామాయణమును గ్రహించినట్లును, అందుమీఁదఁ దన్ను లాఘవపఱిచినందునకయి భాస్కరునికిఁ గోపమువచ్చి, యిటువంటి రాజునకు గ్రంథమును కృతి యిచ్చుటకంటె గుఱ్ఱములను కాచువాని కీ కృతి యిచ్చుట మేలని పలుకుచు నతఁడు కొలువువిడచి లేచిపోయినట్లును. అతఁడు పోవుచుండఁగా నక్కడనుండి యా మాటలు వినుచున్న మారఁడన్న గుఱ్ఱపువాఁ డెదురుగా వచ్చి యాతనికి నమస్కరించి "స్వామీ!

సత్యసరస్వతులగు మీ రాడినమాట దాఁటగూడ" దని ప్రార్థింపఁగా భాస్కరుఁడు రామాయణమున కొతనిని కృతిపతినిగాఁ జేసినట్లును, ఒక కథ చెప్పుచున్నారు.

కాని యది సత్యముకాదు. ఇటీవలివారు "సాహిణి" యను పదమును జూచి భ్రమించి యీ కథ కల్పించియుందురు రాజు గ్రంథమును శీఘ్రముగా సాంతము చేయింపవలెనని కోరియుండుటచేత భాస్కరరామాయణ మితఁడిందఱిచేత వ్రాయఁబడియుండును. కొందఱీ సంబంధమున మంత్రి భాస్కరుని విడచి హుళక్కిభాస్కరుఁడే రంగనాథునిసాఁది పోటీకిఁ దన పుత్రమిత్రచ్ఛాత్రులచేతఁ బుస్తకమును బూర్తి చేయించెనని కథ యింకొకవిధముగా మార్చి చెప్పుదురు. అప్పుడు సహిత మీ కథ యధికవిశ్వాసార్హమైనది కాఁజాలదు, రంగనాథుఁడును, హుళక్కిభాస్కరుఁడును నేకకాలమునం దుండినవారు కారు. ఇరువురకును నడుమను నూఱు సంవత్సరము లంతరము గలదు ఒకఁడు ముత్తాత బుద్ధరాజుకాలములోనుండిన, రెండవ వాఁడు మునిమనుమనికాలములో నుండినవాఁ డగును. హుళక్కిభాస్కరుఁడు యుద్ధకాండమునందలి పూర్వభాగమును రచియించిన ట్లయ్యలార్యప్రణీతంబయిన యీ క్రిందిపద్యమువలన నెఱుఁగవచ్చును.

చ. 'అమర హుళక్కిభాస్కరమహాకవి చెప్పఁగ నున్న యుద్ధకాం
డముతరువాయి చెప్పె వికట ప్రతిభాషణుఁ డప్పనార్యస
త్తమసుతుఁ డయ్యలార్యుఁడు కృతస్థితి నార్యులు మెచ్చునట్లుగా
హిమకరతారభాస్కరమహీవలయస్థిరలక్ష్మి చేకుఱన్.'

[యుద్ధకాండము. ౨౯౮౩]

భాస్కరరామాయణము మొదట పదునాల్గవ శతాబ్దారంభమునందుఁ దెనిఁగింపఁబడియుండుటచేత భాస్కరరామాయణము పుట్టి యిప్పటి కాఱువందల సంవత్సరములు కావచ్చినది సోమదేవరాజీయమునందుఁ బ్రతాపరుద్రుఁడు కొలువుతీఱి యున్నప్పుడు దర్శింప వచ్చినవారిని వర్ణించుచో "శాకల్లి మల్లికార్జునభట్టు మొదలైన బ్రహ్మవిద్వాంసులు . నూటయేబండ్రును, హుళక్కిభాస్కరుఁడు మొదలుగాఁగల ప్రబంధ కవీశ్వరు లిన్నూఱుగురును

... అశ్వంబుల కధికారియైన సాహిణి మారనయు . కొలువఁ బేరోలగంబున సుఖోపవిష్టుండై "— అని వ్రాయఁబడియున్నది. వీ రందఱును ప్రతాపరుద్రునికాలములోనే యుండినందున, వీరు పదుమూడవ శతాబ్దాంతమునందును పదునాలవ శతాబ్దారంభమునందును నుండి యుండవలెను. సాహిణి మారని కాలములో ననఁగా ౧౨౯౫ వ సంవత్సరము మొదలుకొని ౧౩౨౦ వ సంవత్సరప్రాంతమువఱకును రాజ్యపాలనముచేసిన ద్వితీయ ప్రతాపరుద్ర చక్రవర్తికాలములోను, దరువాతను మహావిద్వాంసుఁడును మహాకవియు నయి హుళక్కిభాస్కరుఁడు మిక్కిలి ప్రసిద్ధిచెందినవాఁడు. అందుచేత నాతనికిఁ గవులును, పండితులును మిత్రు లయి యుండుటయే కాక విద్యను, గవిత్వమును నేర్చుకొనుచుండిన ఛాత్రులును పలువు రుండి యుందు రనుటకు సందేహము లేదు.

శ్రీనాధునికాలములో—ననఁగా పదునాల్గవ శతాబ్దాంతమునందును పదునైదవ శతాబ్దాదియందును నుండిన వల్లభామాత్యుఁడు * తన క్రీడాభిరామమునందు

ఉ. 'నన్నయభట్టతిక్కకవినాయకు లన్న హుళక్కిభాస్కరుం
డన్నను జిమ్మపూడి యమరాధిపుఁ డన్నను సత్కవీశ్వరుల్
నెన్నుదుటం గరాంజలులు ♦ నింతలు చేయనిరావితాపాటి తి
ప్పన్నయు నంతవాఁడె తగునా యిటుదోసపుమాట లాడఁగన్.'

అని తన కంటె నేఁబదియఱువది సంవత్సరములు పూర్వమునం దుండిన హుళక్కిభాస్కరుని నన్నయతిక్కనాదులతో సమానునిగాఁ బొగడుటయే యాతని ప్రసిద్ధిని వేయినోళ్లఁ జాటుచున్నది. అట్టి సుప్రసిద్ధకవికడ మిత్రులును బలువురు చేరి కవిత్వమును నేర్చుకొనుచుండుటయుఁ దాము చేసిన గ్రంథములను పద్యములను గురువునకుఁ జూపి దిద్దించుకొని యాతని మెప్పు పడయఁ జూచుచుండుటయు వింత కాదుగదా! భాస్కరుఁడు రామాయణరచనకుఁ బూనినప్పుడు తాము నొంతభాగమును జేసి చూపెద

[* క్రీడాభిరామము శ్రీనాథకృతియని శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రి మున్నగువారు, వల్లభరాయకృతియని శ్రీబండారు తమ్మయ్య ప్రభృతులు.

♦ 'నింతులు జేయని' అనునది సరియైన పాఠము.]

మని వేఁడఁగా మిత్రానురాగముచేతను శిష్యవాత్సల్యముచేతను వారి కోరికను నిరాకరింపక యంగీకరించుట స్వాభావికసౌజన్యసూచకముకాదా? ఈ ప్రకారముగాఁ దన పుత్త్రునకును ఛాత్త్రునకును మిత్త్రునకును భాస్కరుఁడు కొంతకొంత భాగ మిచ్చి తా నొక భాగమును బుచ్చుకొని వారు చేయుచు వచ్చినదానిని తా నప్పుడప్పుడు చదివి సంస్కరించుచు నడుమ నడుమఁ దన పద్యములను జేర్చుచు శ్లాఘ్యముగా నున్నదానిని తన పుస్తకములోని భాగముగా స్వీకరించుచు వచ్చి యుండును. ఈహేతువు చేతనే రామాయణమునకు మూఁడు కాండములు చేసిన మల్లికార్జునభట్టుపేరు రాక యొక కాండమునో, కాండమునరనో చేసిన భాస్కరునిపేరు వచ్చె ననుటకు సందేహములేదు. తండ్రికి కుమారునిపేరు ప్రసిద్ధికి వచ్చునప్పటి కంటె నెక్కువ సంతోషము వేఱొకప్పుడు కలుగదు. అందుచేతనే తన కుమారునిని మూఁడు కాండములు తన రామాయణములో నుంచుట కంగీకరించి యతఁడు కృతార్థుఁడయ్యెను. సద్గురువునకు స్వపుత్త్రునియందు వలెనే సచ్ఛాత్త్రునియందును నత్యంతప్రీతి యుండును. అందుచేతనే భాస్కరుఁడు తన ప్రియశిష్యుఁడు చేసిన కాండమును సహితము తన పుస్తకములో నుంచుట కంగీకరించి యుండును. ఈ కుమారరుద్రదేవుఁడు సామాన్య శిష్యుఁడు గాక భాస్కరమహాకవి కాశ్రయుఁడైన సాహిణి మారయ ప్రభువునకు పుత్త్రుఁడయి కూడ నుండెను. తన సుతుఁడు కవియగుటయు నాతనికవిత్వము తన కంకిత మొనర్పఁబడిన పుస్తకములో నుండుటయు రాజునకు సహితము పరమప్రీతికరముగానే యుండును.

భాస్కరుఁడు మొట్టమొదటఁ దన కుమారుఁడైన మల్లికార్జునభట్టునకు బాల కాండమును, శిష్యుఁడైన కుమారరుద్రదేవున కయోధ్యాకాండమును తెనిఁగించుట కిచ్చి తా నారణ్యకాండమును బుచ్చుకొని యుండును. తానే మొదటిదైన బాలకాండమును బుచ్చుకొని యితరులకే తరువాతి కాండముల నియ్యక తా నేల యారణ్యకాండమును బుచ్చుకోవలెనని కొంద ఱడుగ వచ్చును. వర్ధిష్ణువులయి చిరకాలము మనఁగోరెడి తరుణవయస్కులైన వారి కా కాండము నియ్యక వారి శ్రేయస్సును గోరియే యతఁడు తాను

వయస్సు చెల్లినవాఁడయి మోక్షార్థియయి యున్నవాఁ డగుటచేత నారణ్యకాండమును గైకొని యుండును. ఆ కాలమునందును సకారణముగానో యకారణముగానో భారతారణ్యపర్వమువలనే రామాయణారణ్యకాండము శుభదాయకము కా దన్న నమ్మకము సామాన్యముగా జనులలో వ్యాపించి యున్నది. పిన్నయీడువాఁడైన మల్లికార్జునభట్టెండ్లు చెల్లినవాఁడైన తండ్రికంటె నధికవేగముగా పద్యరచన చేయఁగల కవితాధార కలవాఁ డగుటచే జనకుఁ డారణ్యకాండమును ముగింపకముందే తన బాలకాండమును ముగించి తన సహపాఠియైన కుమారరుద్రదేవుని కిచ్చిన యయోధ్యాకాండమును, తండ్రి చేయుచుండిన యారణ్యకాండమును విడిచిపెట్టి కిష్కింధాకాండమును జేయ నారంభించెను. ఇంతలోపల భాస్కరుఁడు తన యారణ్యకాండమును ముగించి కొడుకు చేయుచున్న కిష్కింధాకాండముతరువాయి నందుకొని దానిని పరిసమాప్తి నొందించి సుందరకాండమును జేయ నారంభించెను. తరువాత మల్లికార్జునభట్టందుకొని సుందరకాండమును జేయుచుండఁగా మిత్రుఁడైన యయ్యలార్యుఁ డాతని యనుమతిమీఁదనే యుద్ధకాండముయొక్క యుత్తరభాగమును గైకొని రామాయణమును తుదముట్టించి యుండును *

ఈ రామాయణము పలువురచేఁ దెనిఁగింపబడిన దగుటచేత శైలియు బహువిధములుగా నుండును. అరణ్యకాండముకవిత్వము తక్కినవాని కవిత్వముకంటె రసవంతముగా నుండును. ఇందు కవిత్రయమువారి ప్రయోగములకు విరుద్ధము లయిన ప్రయోగములు కొన్ని కానఁబడుచున్నను, పూర్వలాక్షణికు లెల్లరు భాస్కరరామాయణమును ప్రామాణికగ్రంథముగా నంగీకరించి యున్నారు. వారివారి శైలులు తేటపడుటకయి యిందు క్రిందఁ గొన్ని పద్యముల నుదాహరించుచున్నాను.

[* ఈ వాక్యములన్నియు నూహాలపైనే యాధారపడియున్నవనియు, ఆ యూహాలలోఁ గొన్ని పరిశీలనముచేసి చూచునప్పుడు నిలుచునవికావనియు 'ఆంధ్రకవితరంగిణి'లోఁ గలదు.]

౧. మల్లికార్జునభట్టు.

ఉ. జంగమవల్లులో యమృతసాగరవీచులొ రత్నమూర్తులో
యంగజుమోహనాస్త్రములొ యంచితహేమశలాకలో మహీ
రంగనటత్తటిల్లతలొ రాజకళాసఖులో యనంగఁ ద
న్వంగులు వాద్యసంగతుల నాడుచుబాడుచునుండ నత్తఱిన్.

[బాలకాం. ౩౦౮]

శా. ప్రాణంబు ల్వెలతేని రామునకు నేర్పారంగ నన్నిచ్చిన
ప్రాణుండై మను, మట్లుగాక మదిలో దర్పించినం దద్రణ
క్షోణీయుక్తఖరాస్రసిక్తపటుదోస్త్రాణోగ్రబాణాసనా
క్షీణస్ఫారకఠోరఘోరశరము ల్చెండాడు నీకంఠముల్.

[సుందరకాండ. ౧౯౫]

౨. కుమారరుద్రదేవుఁడు.

ఉ. వేఁడిన వేఁడిమాట నృపవీరుఁడు సైఁపక కర్ణరంధ్రముల్
సూఁడినభంగిఁ దాకుఁటయు స్రుక్కి మనంబున నొచ్చి నిన్ను నే
నాఁడు నృపాలపుత్రి వని నమ్మి వరించితిఁగాక! యిమ్మెయిన్
నేఁ డొక కాలసర్పమయి నీ విటుచేయుట నాకుఁ దోఁచెనే?

[అయో. ౧౯]

చ. తలఁపఁగ నీ వశక్తువిధంబున నాడెదు రామచంద్ర! నీ
కొలఁది యెఱుంగఁ డీతఁ డతికుత్సితుఁడై మతిదప్పి యాలిమా
టలు విని యింతతెంపున కొడంబడెఁ దా నొక సత్యవాదియై
పలుకఁడె మొన్న నేఁడు నినుఁ బట్టముఁగట్టెద నంచు బొంకొకో.

[అయో. ౪౯]

౩. భాస్కరుఁడు.

ఉ. 'ఓరి నిశాచరాధమ! మదోద్ధతిఁ దాపసవిప్రకారముల్
వారక చేసి తా ఫల మవశ్యముఁ బొందక పోవునే? యమా

గారగతుండవై కుడువఁ గాలము నీ కిదె చేరె; నింక నా
ఘోరశరంబుల క్షమునికోర్కులు దీఱఁగ నిన్నుఁ ద్రుంచెదన్.

[అరణ్య. ఆ. ౧. ౨౩౭]

ఉ ఈ కొఱగానికార్య మిటు లెవ్వఁ డొకో యనుకూలశత్రుఁడై
నీకుఁ బ్రియంబుగాఁ బలికె నీవును నిత్తెఱఁ గాచరింపఁగా
రాక తలంచిచూడ నిది రాక్షసవంశవినాశకాలమో
కా కటుగాన నీకొనునె కాదన కీదృశ మెవ్వఁడేనియున్.

[ఆర. ఆ. ౨. ౧౪]

౪. హుళక్కిభాస్కరుఁడు.

చ చనదు మహద్విరోధ మని చక్కటి చెప్పిన నింతతప్పునన్
గనలితి! నీతిశూన్యులకుఁ గార్యము లేటికిఁ దోఁచు? నిప్డు వే
యును బనిలేదు; నీవలన నొప్పని నావచనంబు లెల్ల నీ
వనిమొన రాముచేఁ బడినయప్పు డెఱింగెదుగాక! పోయెదన్?

[యుద్ధకాండము ౧౫౪]

శా. కామక్రోధమదాతిరేకమున నేకగ్రాహివై యున్న ని
న్నేమార్గంబునఁ దెల్పవచ్చు? నధికుం డెగ్గేల సైఁచున్? బర
స్త్రీ మాయం గొనివచ్చు టేతగవు? నీచేఁగాక సాఱుంతమి
త్రామాత్యాదులు నేఁడు శాత్రవులచేనా చచ్చి రూహింపఁగన్?

[యుద్ధ ౭౭౩]

౫. అయ్యలార్యుఁడు,

శా. పాతాళంబుననుండి వచ్చెనొ, నభోభాగంబునందుండి సం
ఘాతవ్యగ్రత నేగుదెంచెనొకొ, దిక్చక్రంబునందుండి యు
ద్జాతంబై యరుదెంచెనొక్కొ యనఁగా సర్వంకషంబై తమో
జాతం బంతఁ బదార్థదర్శనవినాశస్థేమమై పేర్చినన్ [యుద్ధకాండ]

మ. మదధీనంబగు జీవితంబును మనోమానానురాగంబులున్
ద్వదధీనంబులు చేసి యన్యజనచింతాదూరనై తావకా

భ్యుదయం బెప్పుడుఁ గోరుచుండ నిట నీ వుగ్రుఁడుగాఁ బల్క న్ర
య్యెదు కంటే హృదయంబు వజ్రకఠినంబై యున్న దిప్పట్టునన్.
[యుద్ధకాండ ౨౩౪౯]

తెలుఁగుభారతమును రచియించిన కవులవలెనే రామాయణమును రచించిన కవులును మూలగ్రంథమును మిక్కిలి సంగ్రహపఱిచి కథను కూడ కొన్ని చోట్ల నిష్టానుసారముగా మార్చివేసినారు. అందుచేత సంస్కృతమున నిరువదినాలుగువేల గ్రంథముగా నున్న రామాయణము తెనుఁగున పదునేనువేల గ్రంథ మయినది. ఈ కవులు మొత్తముమీఁద గ్రంథమును సంగ్రహపఱిచినను, కొన్నిచోట్ల పెంచను సహితము పెంచిరి ఎట్లన- యుద్ధకాండమునందు మాఘకావ్యమునందలి యేడవ సర్గము చేర్పఁబడినది. గ్రంథవిస్తరభీతిచేత సంస్కృతరామాయణమునకును తెలుఁగురామా యణమునకును గల భేదము లిం దేమియు వివరింపలేదు హుళక్కిభాస్క రుని కవిత్వము మనోహరముగా నుండును. మల్లికార్జునభట్టుకవిత్వములో సంస్కృతపదములును, సమాసములు నధికముగా నున్నవి. మొత్తము మీఁద పుస్తకముశైలి యంతయు శ్లాఘనీయముగానే యున్నది. ఈ రామాయణము గాక హుళక్కిభాస్కరుఁడు దశగతు లను గ్రంథమును గూడ రచించి సాహిణిమారనికి అంకితముచేసె నని రామకృష్ణకవిగారు క్రీడాభిరామపీఠికలో వ్రాసిరి.

ఆంధ్రుల చరిత్రము ద్వితీయభాగములో శ్రీ చిలుకూరి వీరభద్రరావు గారు భాస్కరరామాయణ కర్తల నొక్కొకరినే యెత్తుకొని మల్లి కార్జునభట్టునుగూర్చి "యితఁడు సాహిణిమారన యాస్థానకవి యగు భాస్కరుని పుత్త్రుఁడే యైన, వారియాజ్ఞాప్రకారము రామాయణము రచింపఁబూనినవాఁడే యైనయెడల బాలకాండముమొదట కృతినాయకుని సంబోధింపక కాండాంతమున శివుని సంబోధించి యుండఁ డనియు, కిష్కింధాకాండాదినున్న పద్యము సాహిణిమారనసంబోధనము కాక పోవుటయే కాక కాండాంతమునందలి పద్యములు రెంటిలో నొకటి శివుని గూర్చిన సంబోధనము కలది యనియు, సుందరకాండము మొదట సాహిణి

మారని సంబోధించిన పద్య మున్నను కాండాంతమునందలి పద్యములు రెండును శివుని సంబోధించునవిగా నున్న వనియు, అందుచేత మల్లికార్జున భట్టు రచియించిన భాగములు శివుని కంకితము చేయఁబడినవి గాని సాహిణి మారన కంకితముచేయఁబడినవి కానట్టును సాహిణిమారననుగూర్చిన రెండు పద్యముల నెవ్వరో చాటువులుగాఁ జెప్పిన నిటీవలిలేఖకులు వానిని దెచ్చి వీనికి ముడిపెట్టినట్టును మల్లికార్జునభట్టు సాహిణిమారనకాలమువాఁడు కానట్టును నూహింపవలసియున్న" దనియు వ్రాసి, తరువాతఁ గుమార రుద్రదేవునిగూర్చి యతఁడు "తనభాగమును (అయోధ్యాకాండమును) సాహిణిమారని కంకితముచేసినది వాస్తవ మనుటకు సందియములేదు గాని యతఁడు భాస్కర శిష్యుఁ డన్న మాట విశ్వసింపఁదగినదిగాఁ గనుపట్ట" దనియు, "ఇంత విద్యావంతుఁడైన కుమారుఁడు కలిగి యుండియు సాహిణిమారఁ డీ రామాయణము నంతయు నీతనిచేతనే వ్రాయింపకుండుటకుం గారణంబు" లేదనియు, వ్రాసి, యటు పిమ్మట భాస్కరునిగూర్చి "అరణ్యకాండము సాహిణిమారని కంకితము చేయఁబడియున్నది గాని రచనా విధాన మంతయు నన్నెచోడ, తిక్కనాది కవివరుల రచనావిధానక్రమమును బోలియున్నది" యనియు, "ఈ కాండమున నాశ్వాసవిభాగము చేయఁబడినది. అంతియగాక యీ కాండమునందలి ప్రథమ ద్వితీయాశ్వాసాంతపద్యములు కృతిపతినిగూర్చి సంబోధనములు గాక ప్రథమ ద్వితీయాంతములుగా నున్నవి. ఇట్టి మార్గమును తదితర కాండములను రచించిన కవు లెవ్వరు నవలంబించి యుండలేదు" అనియు, వ్రాసి, అటుతరువాత నయ్యలార్యునిఁగూర్చి యతఁడు "యుద్ధకాండములో కొంత భాగము హుళక్కిభాస్కరుఁడు చెప్పెనని చెప్పెనేకాని హుళక్కిభాస్కరుఁడు తనకు మిత్రుడని యెక్కడను జెప్పి యుండలేదు. మఱియు యుద్ధకాండమునందలి పద్యములు శివుని సంబోధించునవిగా నున్నవి గనుక నితఁడు సాహిణిమారనికాలములోనివాఁడు కాఁడనుట నిశ్చయము" అనియు, వ్రాసి, కడపట రామాయణములో విశేషభాగము సాహిణిమారని మరణానంతరమే రచింపఁబడి యుండవలయును. అట్లుగాక యున్న శివునిం

గూర్చిన సంబోధనములు గల పద్యము లీ రామాయణమున నుండుటచే ప్రమేయము గానరాదు. ఎన్ని విధములుగాఁ బరిశీలించి చూచినను అరణ్యకాండము ఉక్కినభాగములకంటెఁ బూర్వము రచియింపఁబడి యుండు నని విదిత మగుచున్నది. అట్లయినయెడల ... . సాహిణిమారుఁడు రామాయణము నంతయు విడిచి ముందుగా భాస్కరమహాకవిచే నారణ్యకాండము నంకితము పొందుట కేమి హేతువో తెలియరాదు" అని వ్రాసి, భాస్కర రామాయణమునుగూర్చి యథార్థకథనము వింకను బరిశీలింపవలసియున్నదని తేల్చిరి

మల్లికార్జునభట్టు తన గద్యమునందు

"అష్టభాషాకవిమిత్రకులపవిత్ర భాస్కరసత్కవి పుత్ర మల్లికార్జునభట్ట ప్రణీతం బయిన .. "

అని స్పష్టముగా తాను భాస్కరసత్కవిపుత్త్రుఁడనని చెప్పుకొనుచుండఁగా కొడుకు తనతండ్రి కాశ్రయుఁడయి యున్న మారనకాలములో లేఁడన్న విపరీతాభిప్రాయము శ్రీవీరభద్రరావుపంతులుగారి కేల కలిగెనో దురూహ్యముగా నున్నది. మల్లికార్జునభట్టు తాను జేసిన రామాయణభాగమును రాజాజ్ఞచేతఁగాక తండ్రియిష్టమును బట్టియే చేసి యుండుటచేత స్వాభావికముగాఁ దన యిష్టదైవతమైన శివునినే సంబోధించి యున్నాఁడు. రాజునకాశ్రితుఁడును, విహితుఁడును నైన భాస్కరుఁడు రాజానుమతితో నా పద్యముల నట్టే యుంచి యుండవచ్చును. భాస్కరుఁ డాస్థానకవిగాను, మారన యశ్వసేనా నాయకుఁడుగాను ప్రతాపరుద్రునియొద్దఁ గొలువుకుదిరి యుండుట ప్రసిద్ధము. ఒక్క ముద్రితరామాయణమును మాత్రమే కాక పూర్వలిఖితపుస్తకములనుగూడ పరిశీలించినచో పూర్వోక్తములయిన యనేకాంశములు తేటపడును. చెన్నపురిలోని దొరతనమువారి ప్రాచ్యలిఖితపుస్తభాండాగారములో రామాయణములు ౭౨, ౭౩ సంఖ్యలు గలవియు, ౧౩౭ మొదలుకొని ౧౫౭ వఱకు సంఖ్యలు గలవియు, ౨౪ తాళపత్త్రీలిఖితపుస్తకములు నున్నవి కిష్కింధాకాండముచివర నొక పుస్తకములో మాత్రము భాస్కరునిగద్య మున్నది; ఇంకొక పుస్తకములో (౧౪౩)

కుమారరుద్రదేవునిగద్య మున్నది. సుందరకాండముచివరను ౭౨ సంఖ్య గల పుస్తకములో "శ్రీమదష్టమభాషాకవిమిత్ర కులపవిత్రయశస్కర భాస్కరప్రణీతంబైన" యని యున్నది. ఈ ప్రకారముగానే ౧౪౪, ౧౪౭ ౧౩౦, ౧౩౧ సంఖ్యల పుస్తకములలోను భాస్కరునిగద్యమే యున్నది. ఈ పుస్తకములలో పద్యములు సహిత మనేకములు భిన్నములుగా నున్నవి. ఈ పద్యభేదములనుబట్టి పుస్తకములో నొక్కరికంటె నెక్కువమంది హస్తము తగిలినట్టు కనఁ బడుచున్నది. మల్లికార్జునభట్టున కిదియే నూతన కవిత్వ మగుటచేతఁ దన పాండిత్యప్రకర్షమును కనఁబఱుపవలె నన్న యుద్దేశముతోఁ గాఁబోలును సాంస్కృతికదీర్ఘసమాసములు మొదలైనవానిని విశేషముగా వాడి యున్నాఁడు

రెండవదియైన యయోధ్యాకాండము మారయకుమారుఁడైన కుమారరుద్ర దేవునిచే రచియింపబడిన ట్లున్నది అతనియాశ్వాసాంతగద్య మిది.

"సకలకళావిశారద శారదాముఖముకురాయమాణ సారస్వతభట్టబాణ నిశ్శంక వీర మారయకుమార కుమారరుద్రదేవ ప్రణీతంబైన...... "

ఈ గద్యములోఁ దాను భాస్కరశిష్యుఁడనని చెప్పకపోయినను తన తండ్రి కాశ్రితకవియైన భాస్కరకవితోఁ గలిసి తన తండ్రిపేర రచియింపఁబడు చున్న రామాయణరచనలోఁ దాను పాలుగొనుచుండుటయుఁ, దన పద్యము లను భాస్కరునిచే సంస్కరింపించుకొనుచుండుటయు నాతనిశిష్యత్వమును చెప్పకయే చెప్పుచున్నవి. కొన్ని వ్రాఁత పుస్తకములలో నీ కాండాంతము నందు భాస్కరునిగద్యమే యున్నది. పద్యములును పెక్కులు భిన్నము లుగా నున్నవి. ఇది యంతయు భాస్కరునిహస్త మిందులోను దగిలి యున్నదని తెలుపుడుచేయుచున్నది. కుమారరుద్రదేవుఁడు తరుణవయ స్కుఁడైన రాజకుమారుఁ డగుటచేఁ దన స్తోత్రప్రియత్వమును నిశ్శంకవీర త్వమును గద్యములోఁ గొంత చూపుకొని యున్నాఁడు.

ఇది యుద్ధకాండములోని భాస్కరుని కడపటి పద్యము.

ఉ 'ఇంక బలీముఖుల్ బలిసి రెక్కడిరావణుఁ డేటిలంక పొం
డింకను మేఘనాథునకు రీ పెనుమంటలతోడిచిచ్చుల

భ్రంకషశాతకుంభశిఖరంబగు మోసలఁ గంటి రెట్లు నా
వంకఁ జరింప దగ్ని యవి వారివిభీషణపుణ్యగేహముల్'
[యుద్ధ ౧౮౩౩]

ఇక్కడనుండి యయ్యలార్యుని కవిత్వము. "ఇఁకమీఁద శాకల్యమల్లుభట్టు చెప్పిన కవిత్వము" అని కొన్ని వ్రాఁతప్రతులలోను, "ఈ మీఁద వేదగిరి రాయనింగారు శాకల్యమల్లుభట్టుగారి మనుమఁడు అయ్యలుభట్టుగారిచేత చెప్పించిన యుద్ధకాండశేషము" అని కొన్ని వ్రాఁత ప్రతులలోను ఉన్నది. యుద్ధకాండాంతపద్యము కొన్నిప్రతులలో

"అష్టభాషాకవిమిత్రకులపవిత్ర భాస్కరసత్కవిమిత్రాయ్యలార్య
విరచితంబైన ...... "

అనియు, కొన్నిప్రతులలో

"ఇది శ్రీశాకల్యమల్లకవివర రామనరసింహాపరజాప్ప లార్యవరనందనో భయభాషాకవితావిశారద శారదాచరణకమలఃరివరణ మానసాయ్యలార్య విరచితంబైన.... ..."

అనియు నున్నది. ఇందలి మొదటి గద్యములో నయ్యలార్యుఁడు భాస్కరుని మిత్రుఁ డనియు, రెండవ గద్యములో శాకల్యమల్లునియొక్కయు, రామనృసింహునియొక్కయు తమ్ముఁడైన యప్పలార్యుని పుత్రుఁ డనియుఁ, చెప్పఁబడెను. అయ్యలార్యుఁ డెట్లయినను భాస్కరకవికి సమ కాలీనుఁడే. ప్రతాపరుద్రునియాస్థానములో శాకల్యమల్లుభట్టు పండితుఁడు గాను, భాస్కరుఁడు కవిగాను, ఉండినందున శాకల్యమల్లుకవి తమ్మునికొడు కైన యయ్యలార్యుఁడు మల్లికార్జునభట్టు, కుమారరుద్రదేవులతోడి యీడువాఁ డయి యుండును. కవి చెప్పినదానికి ప్రత్యక్షవిరోధముగా నెవ్వడో లేఖకుఁ డెవ్వడో వేదగిరిరాయనింగారు చెప్పించి రని వ్రాసిన మాట పాటింపఁదగినది కాదు. ౧౩౦ వ సంఖ్యగల వ్రాఁతప్రతిలో గద్య యయ్యరులార్యునిదే యున్నను, "శ్రీమద్రామాయణమహాకావ్యంబున యుద్ధ కాండశేషంబునందు సర్వంబును షష్ఠాశ్వాసము" అని యున్నది. ౧౩౩-వ సంఖ్య గల వ్రాఁతప్రతియందు గద్య సహితము భాస్కరునిదే యుండి

"యుద్ధకాండంబునందు సర్వంబును షష్ఠాశ్వాసము" అని యున్నది. దీనిని బట్టి చూడఁగా భాస్కరుఁడే యుద్ధకాండంబునంతను రచించి, దాని నారణ్యకాండమునువలెనే యాశ్వాసములుగా భాగించి యుండునని తోఁచుచున్నది. అయినను యుద్ధకాండము కడపట షష్ఠాశ్వాసమని యుండుటయే కాని లోపల నాశ్వాసవిభజనము కానరాదు. దీనినంతను విచారించి చూడఁగా రామాయణ మంతయు భాస్కరునికాలములోను సాహిణిమారనకాలము లోను రచింపఁబడినదే యని విస్పష్ట మగుచున్నది రామాయణకవిత్వ మంతటిలోను మొట్టమొదట నారణ్యకాండకవిత్వమును, దానికిఁ దరువాత యుద్ధకాండకవిత్వమును మేలయినదిగాఁ గానఁబడుచున్నది.

[భాస్కరరామాయణమునందలి బాల, అరణ్య, కిష్కింధాసుందరకాండము లను మంత్రి భాస్కరుఁడును, అయోధ్యాకాండమును కుమారరుద్రదేవుఁ డును, యుద్ధకాండములోని కొంతభాగమును హుళక్కిభాస్కరుఁడును, మిగిలిన భాగము నయ్యలార్యుఁడును రచించిరనియు, బాల, కిష్కింధా, సుందరకాండములలో మల్లికార్జునభట్టు కవిత కొంత చేరియుండుటవలన కాండముల చివఱి గద్యము లాతని పేరిటనే కానవచ్చుచున్నవనియు 'ఆంధ్రకవి తరంగిణి' కారుల యభిప్రాయము బాలకాండము, అయోధ్యా కాండము, అరణ్యకాండమును మంత్రి భాస్కర విరచితములయి యుండు నని 'తెనుగుకవుల చరిత్ర' కర్తల యభిప్రాయము.

భాస్కరరామాయణములోని బాల, కిష్కింధా, సుందరకాండములను భాస్క రుని కుమారుఁడగు మల్లికార్జునభట్టు రచించినట్లు గద్యములవలనఁ దెలియవచ్చుచున్నది. ఆ కాండములలో నీతని కవిత కొంత చేరియుం డును. ఇతఁడు హుళక్కిభాస్కరుని పుత్రుఁడు ఇతఁడు తన గ్రంథభాగ ములను పరమేశ్వరాంకితములుగా నొనర్చెను. ఇతని యితర గ్రంథము లేవియు లభింపలేదు. హుళక్కిభాస్కరుని కాలము పదుమూఁడవ శతాబ్ది ద్వితీయపాదమునుండి పదునాల్గవ శతాబ్ది ప్రథమపాదము వఱకు నగుటచే మల్లికార్జునభట్టు క్రీ. శ. ౧౨౮౦ - ౧౩౩౦ నడుమనుండి యుండునని 'ఆంధ్రకవి తరంగిణి' కారుల యభిప్రాయము. (మూఁడవ సంపుటము పుట 218)

ఇందలి యయోధ్యాకాండమును రచించిన కుమారరుద్రదేవుని గ్రంథాంతర ములు కానరాలేదు. ఈతఁ డోరుగంటిని పాలించిన రుద్రదేవుని బంధువై యుండునని శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారును, కృతిపతి యగు సాహిణి మారన పుత్రుఁడని శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారును భావించిరనియు, వారియూహలు సరికావనియు 'ఆంధ్రకవితరంగిణి'లోఁ గలదు. (మూఁడవ సంపుటము-'కుమారరుద్రదేవుఁడు') ఇతఁడు 13 వ శతాబ్దిచివఱను, 14 వ శతాబ్ది తొలిపాదమునను ఉండియుండును.

యుద్ధకాండమును పూరించిన (శాకల్య) అయ్యలార్యుఁడు మల్లుభట్టు మనుమఁడు; అప్పలార్యుని నందనుఁడు; ఇతఁడు రామాయణ యుద్ధకాండ మును క్రీ. శ. ౧౩౭౦ ప్రాంతమున పూర్తిచేసియుండునని 'ఆంధ్రకవి తరంగిణి' (నాలుగవసంపుటము-పుట 154) లోఁ గలదు.]

నాచన సోముఁడు

నాచన సోముఁ డనెడి కవి యెఱ్ఱాప్రెగడ కిరువది ముప్పది సంవత్సరముల తరువాత సుప్రసిద్ధపండితకవిగా నుండినవాఁడు. ఈ కవి యెఱ్ఱాప్రెగడ వృద్ధదశలో బాలుఁడయి కొంతకాలము సమకాలీనుఁడయి యుండి యుండ వచ్చును. ఇతఁడు రచించిన హరివంశముయొక్క మొదటియాశ్వాసము లోని యవతారిక మాకు దొరకనందున కవియొక్క గోత్రాదులను చెప్పఁ జాలము. ఇతఁడు నియోగి, నాచన కొమారుఁడు. [నాచనసోముఁడు- అనుచోఁ గల 'నాచన' శబ్దము వంశనామమో, పితృనామమో స్పష్టముగాఁ దెలియుట లేదనియు, శాసనములోని 'సోమాయ నాచనాంభోధే = సోమాయ' అని యుండుటచే వంశనామమే యని యూహింప నవకాశ మున్నను, కొక్కొక కవి యెఱ్ఱన సోమన నాచన సుతుఁడని చెప్పుటచేతను, సింహాసన ద్వాత్రింశతికను రచించిన కొఱవి గోపరాజు 'నాచిరాజు సోమన' యని పేర్కొనుటచేతను, 'నాచన' యనునది తండ్రిపేరే యని నిశ్చయింప వచ్చుననియు 'ఆంధ్రకవి తరంగిణి' (నాలుగవ సంపుటము, పు 116)లోఁ జెప్పఁబడినది.] ఇతఁడు తన గ్రంథమును నెల్లూరియందలి హరిహరనాథు నకుఁ గృతి యిచ్చుటచేత నీతనినివాసస్థలము నెల్లూరిమండలములోని యేదో గ్రామమని తోఁచుచున్నది. ఎఱ్ఱాప్రెగడ చేసిన హరివంశము ప్రౌఢముగా నుండలే దన్న యభిప్రాయముతో నీతఁ డీ యుత్తరహరివంశమును రచించి నట్టు కనఁబడుచున్నది. [నాచనసోముఁడు, ఎఱ్ఱాప్రెగడవలెనే హరివంశము నందలి పూర్వోత్తరభాగములను రెండింటిని రచించెనని 'ఆంధ్రకవి తరంగిణి' కర్త, మఱికొందఱును తలంచుచున్నారు. ఇతని పూర్వహరివంశ మెచ్చటను లభింపలేదు. ఇతఁ డుత్తర హరివంశమునే రచించియుండునని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు మున్నగువారి యాశయము. సోమన పూర్వ హరివంశమునుకూడ రచించెననుటకుఁ దగిన ప్రమాణములు కావలసి యున్నది. [ఇంచుమించుగా నెఱ్ఱనయు, సోమనాథుఁడు నేకకాలీనులు గనుక, శంభుదాసునికవిత్వమునం దీత నికంత గౌరవము కలిగి యుండకపోవచ్చును.

సోమనాథునికవిత్వము మిక్కిలి ప్రౌఢముగాను, సర్వవిధముల నెఱ్ఱాప్రెగడ కవిత్వమునకంటె మేలైనదిగాను ఉన్నది. ఒక్క యెఱ్ఱాప్రెగడకవిత్వమే కాదు. భారతమును రచించిన కవిత్రయములో ననేకులకవిత్వమును గొన్ని విషయములలో సోమునికవనముతో సరి రాదని నా యభిప్రాయము *

ఇతనికవిత్వపటుత్వసంపదనుబట్టి యీతనికి సర్వజ్ఞుఁ డని బిరుదుపేరు వచ్చినది. ఆపేరున కీతఁడు తప్పక తగినవాఁడే. ఇటీవల నితనికాలమును దెలిపెడి తామ్రశాసన మొకటి దొరికినది. అది బుక్కదేవరాయల రాజ్యకాలములో నాచనసోమనకును, మఱి యైదుగురు బ్రాహ్మణులకును గలిపి రా జొకగ్రామము నగ్రహారముగా నిచ్చినప్పుడు పుట్టిన శాసనము. ఈ శాసనమునుబట్టి యితఁ డాపస్తంబసూత్రుఁడనియు, భారద్వాజగోత్రుఁ డనియు యజుశ్శాఖవాఁడనియు సకలాగమవేది యనియు నష్టాదశ పురాణార్థ విదుఁడనియు నష్టభాషాకవిత్వరచనావిశారదుఁ డనియు నాచనకులాంభోధి సోముఁ డనియుఁ దెలియవచ్చు చున్నది. ఈ శాసనము నిచ్చటఁ బూరముగా వ్రాయుచున్నాను. ఇది మైసూరురాజ్యములోని కోలారు మండనమునందలి హోబ్లీరామపురపు పటేలయిన జటావల్లభుఁ డను విప్రునినుండి గైకొనఁబడి ఎపిగ్రాఫికాకర్ణాటికాలో జీ, డీ ౪౬ వ సంఖ్యను బ్రకటింపఁబడిన తామ్రశాసనము.

శ్రీగణాధిపతయే నమః

శ్లో. నమ స్తుంగశిరశ్చుంబిచన్ద్రచామరచారవే,
త్రైలోక్యనగరారంభమూలస్తంభాయ శంభవే. ౧
అవ్యా దవ్యాహతైశ్వర్యకారణో వారణాననః
వరద స్త్రివతిమిరమిహిరో హరనందనః. ౨

* [ఎఱ్ఱాప్రెగడ కవిత్వముకంటె సోముని కవిత్వమే ప్రశస్తతరమని శ్రీబహుజనపల్లి-సీతారామాచార్యులుగారు, నడకుదుటి-వీరరాజుగారు మున్నగువారి యభిప్రాయము. ఎఱ్ఱనకవిత ప్రశస్తతరమని శ్రీరాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు మున్నగువారి యాశయము.]

శ్రీమా నాది వరాహో య శ్శ్రియం దిశతు భూయసీం,
గాఢ మాలింగితా యేన మేదినీ మోదతే సదా. ౩
అస్తి కౌస్తుభమాణిక్యకామధేనుసహోదరః,
రమానుజః కళానాథః క్షీరసాగరసంభవః ౪
ఉదభూ దన్వయే తస్య యదుర్నామ మహీపతిః,
పాలితా యత్కులీనేన వాసుదేవేన మేదినీ. ౫
తత్కులే బుక్కనామా యః కీర్తిశౌర్యవిచక్షణః,
మంగాంబికాఽభవద్రాజ్ఞీ లక్ష్మీరివ హరే ర్యథా. ౬
అభూ త్తస్య కులే శ్రీమా నభంగురగుణోదయః,
అపాత్త దురితాసంగః సంగమో నామ భూపతిః. ౭
మాలాంబికాఽభవ ద్రాజ్ఞీ తస్య రాజ్ఞః శుచిస్మితా,
దమయంతీ నళస్యేవ ఇంద్రస్యేవ యథా శచీ. ౮
ఆసన్ హరిహరః కంపో బుక్కరాయమహీపతిః.
మారపో ముద్దప శ్చేతి కుమారా స్తస్య భూపతేః. ౯
పంచానాం మధ్యగ స్తేషాం ప్రఖ్యాతో బుక్కభూపతిః,
ప్రచండవిక్రమో మధ్యే పాండవానా మివార్జునః. ౧౦

భంగాః కళింగామితశౌర్యవృత్తే
ర్వంగా విభిన్నాంగవిఘూర్ణనేత్రాః,
ఆంధ్రాశ్చ రాంధ్రాణి విశంతి యస్య
బాహాగ్రఖడ్గేన విశీర్యమాణాః.

తురుష్కా శ్శుష్కవదనాః పాండ్యభూపాః పలాయితాః,
స్వభుజార్జితవీర్యేణ తస్మి న్రాజ్యం ప్రశాసతి. ౧౨
బుక్కరాయోఽభవ చ్ఛ్రీమాన్ భుజార్జితపరాక్రమః,
మేదినీవ ప్రజా యేన స్వపుత్రా ఇవ రక్షితాః. ౧౩
రాజాధిరాజ స్తేజస్వీ యో రాజపరమేశ్వరః,
భాషాలంఘితభూపాలభుజంగమవిహంగమః. ౧౪

రాజరాజభుజంగో యః పరరాజభయంకరః.
హిందురాయసురత్రాణ ఇత్యేతై ర్బిరుదై ర్విభూషితః. ౧౫
విద్యాభిధాననగరీ విజయోన్నతిశాలినీ,
విద్యారణ్యకృతా తస్యాం రత్నసింహాసనే స్థితః. ౧౬
యస్మిన్ షోడశదానానాం ధరా భూషా పరిశోభితే,
దానాంబుధారయా తస్య వర్ధతే ధర్మపాదపః. ౧౭
అలంకృతే శకస్యాబ్దే రసభూనయనేందుభిః
తారణాబ్దే చైత్రమాసే నవమ్యాం శుక్లపక్షకే. ౧౮
పంపాయాం భాస్కరక్షేత్రే విరూపాక్షస్య సన్నిధౌ.
ఆపస్తంబాఖ్యసూత్రాయ భారద్వాజాన్వవాయినే. ౧౯
యాజుషాణాం వరేణ్యాయ సకలాగమవేదినే.
అష్టాదశపురాణానా మఖిలజ్ఞాతార్థవేదినే. ౨౦
అష్టభాషాకవిత్వశ్రీ వాణీ విజితసంపదే,
సోమాయ నాచనాంభోధేః సోమయామితతేజసే. ౨౧
గుత్తి దుర్గాభిధే రాజ్యే కోడూరాఖ్యమహీతలే,
పెన్నమాగాణి విఖ్యాతే సర్వసస్యోపశోభితే. ౨౨
కోడూరునాగమల్లాఖ్యదిన్నాభాఖ్య మపి పశ్చిమే.
గ్రామోత్త మాద్వేభమంకూరోః ప్రాచ్యాద్దిశి సమన్వితం ౨౩
ఊరచింతలనామ్నశ్చ గ్రామా ద్దక్షిణసంస్థితం.
వంగలూరోక్కడుతాళాఖ్య ముత్తరాశాముపాశ్రితం. ౨౪
పినాకినీతటే పెంచుకలదిన్నాహ్వయం పురా.
బుక్కరాయపురాఖ్యాత ప్రతినామ్నా చ శోభితం. ౨౫
నిధినిక్షేపసంయుక్తం జలపాషాణసంయుతం,
అక్షిణ్యాగామిసహితం సిద్ధసాధ్యసమన్వితం. ౨౬
అష్టభోగ మిదం సర్వస్వామ్య మాచంద్రతారకం,
సహిరణ్యపయోధారాపూర్వకం దత్తవాన్ముదా. ౨౭

శ్రీమన్నాచనసోమాఖ్యమహాకవివరోఽ వ్యధ,
రాజాన మాశిషం చైవ చిరజీవీ భవత్వితి. ౨౮

స్వయ మన్వకరోద్వృత్తిం దశోత్తరశతం కవిః,
షట్త్రింశ దత్ర భాగాః స్యు ర్యజమానాహ్వాయ స్తతః. ౨౯

భారద్వాజాన్వయే జాతః తల్లపో నామ యాజుషః,
అష్టావింశతివృత్తీనా మధిపో నాచనాత్మజః ౩౦

కాశ్యపాన్వయసంభూత అన్నదాతాధ్వరీంద్రజః,
యాజుషైకాదశాంశీ చ సర్వజ్ఞః సింగయో బుధః. ౩౧

కాశ్యపాన్వయసంభూత అన్నదాతాధ్వరీంద్రజః,
యాజుషైకాదశాంశీ చ సర్వజ్ఞః సింగయో బుధః. ౩౧

దేవణస్య సుతః శ్రీమాన్ సింగపో నామ యాజుషః,
కౌండిన్యాన్వయసంభూతో దశవృత్తీశ్వరః స్మృతః ౩౨

నాగయస్య సుతః శ్రీమాన్ వత్సయో నామ యాజుషః,
కాశ్యపాన్వయసంభూతో వృత్తిత్రయ మిహాశ్నుతే. ౩౩

శ్రీవత్సాన్వయసంభూత స్తిమ్మయస్య తనూభవః,
యాజుషో భాస్కరశ్చేతి వృత్తిద్వయ మిహాశ్నుతే. ౩౪

అస్యాగ్రహారవర్యస్య చతుస్సీమావినిర్ణయం,
సర్వేషాం సుఖబోధాయ లిఖ్యతే దేశభాషయా. ౩౫

తూర్పుకు నాగమలదిన్న - ఆసందుకు చింతకోట. అందుకు దక్షిణము రగదిలోని నల్లగుట్ట - అందుకు దక్షిణాన కప్పలవాగు మేర - అందుకు పశ్చిమానక ...అందుకు దక్షిణాన వేంపమ్రాకు. అందుకు దక్షిణాన కోడూరి రాట్లపువాల్లి అరతిపెద్దరావిమాకు నాగమల్లదిన్న - ఆసందుకు ముగ్నుడ్డపొలాన ...అమ్మిమ్రాకుమేర. అందుకు దక్షిణాన కలవిగుట్టం - అందుండి పెన్న యేటిగడ్డను ఉప్పారగోడలు-దక్షిణాన కవంగలూరును కొడతాళాను ఆసందుక పెన్నమేరశై-పడుమటికి వెలునుకూరు - ఆసందుకు యేటకలసిన కొనవాంగుమేర - పడుమటికి గడ్డమేర - అందుకు ఉత్తరాన నాయనిచింత -

అందుకు ఉత్తరాన చోటమిట్టమీది జమ్మిమాకు. అందుకు ఉత్తరావ దంటు తెరువు వేంపమాకు. అందుకు ఉత్తరాన కప్పలవాంగుగడ్డను తుమ్మమాకు- అందుకు ఉత్తరాన కాళంవాంగు మేరచేసికొని నక్కలతిప్ప - పడుమట అందుమేర చేసికొని కొండమేర - ఉత్తరానకు ఊరచింతల ఆసందుకున్న కొండమేర - మానుచింతకానసుకలశన్న.

ఇది మఖిలరాజశేఖరమధుకరఝంకారగీత మాహాత్మ్యం
శ్రీమద్బుక్కరాజేంద్రనృపతేః శాసన మచలైకపారిజాతస్య
ఆత్రేయాణాం యాజుషః కోటిదేవా
రాధ్యాచార్యస్యాంగజో మాఘమూర్తిః
చక్రే సమ్యక్సర్వశాస్త్రప్రవీణః
శ్లోకానేతాన్ మల్లనారాధ్యవర్యః. ౩౭
త్వష్ట్రైత్రితచ్ఛాసనం స్వామిశాసనేన నివిర్మితం।
శాసనాచార్యవర్యేణ నాగిదేవేన శిల్పినా. ౩౮
దానపాలనయోర్మధ్యే దానా చ్ఛ్రేయోనుపాలనం.
దానా త్స్వర్గమాప్నోతి పాలనా దచ్యుతం పదం. ౩౯
స్వదత్తా ద్ద్విగుణంపుణ్యం పరదత్తానుపాలనం.
పరదత్తాపహారేణ స్వదత్తం నిష్ఫలం భవేత్. ౪౦
సామాన్యోయం ధర్మసేతుర్నృపాణాం
కాలే కాలే పాలనీయో భవద్భిః,
సర్వా నేతాన్ భావినః పార్థివేంద్రాన్
భూయో భూయో యాచతే రామచంద్రః. ౪౧

శ్రీవిరూపాక్ష.

ఈ శాసనమునుబట్టి పెంచుకలదిన్న యను పూర్వనామము గల గ్రామము బుక్కరాయపురమను నూతననామముతో నూటపది భాగములుగాఁ జేయఁ బడి, వానిలో ౩౬ భాగములు యజుర్వేదియు భారద్వాజగోత్రుఁడు నయిన నాచనసోమునకును, ౨౮ భాగములు భారద్వాజగోత్రుఁడునునాచనపుత్రుఁ

డునైన తల్లప్పకును, ౧౧ భాగములు కాశ్యపగోత్రుఁడును అన్నదాతా ధ్వరిపుత్రుఁడు నైన సింగయ్యకును, ౧౦ భాగములు కౌండిన్యగోత్రుఁడును రేవణవిష్ణుతుఁడును నైన సింగప్పకును, ౧౩ భాగములు కాశ్యపగోత్రుఁ డును నాగయ్యపుత్రుఁడును నైన వత్సయ్యకును, ౧౨ భాగములు శ్రీవత్స గోత్రుఁడును తిమ్మయ్య పుత్రుఁడు నైన భాస్కరునికిని, గ్రామ మాఱు గురు బ్రాహ్మణుల కగ్రహారముగా నియ్యఁబడినది. ఆ యాఱుగురికిని వేఱువేఱుగా రాగిరేకులమీఁద దానశాసనములు చెక్కించి యియ్యఁబడిన ట్లున్నవి. ఈ శాసనమునకే ప్రతికగా నున్న యింకొక తామ్రశాసనము ముడియనూరిలోని వేంకటరామశాస్త్రిగారివద్దనుండి గైకొనఁబడి యెపి గ్రాఫికా కర్ణాటికాలో ఎమ్. బీ ౧౩౮ వ సంఖ్యను బ్రకటింపఁబడినది.

ఈ రెండుశాసనములును బుక్కరాయలయాజ్ఞచే తన్నియుక్తాధికారి యగు విరూపాక్షునిసంతకముతో నేకకాలమున నేకకవి (మల్లనారాధ్యకవి) చే రచియింపఁబడి యేకశిల్పి (నాగిదేవుని) చేతనే చెక్కఁబడినవే యయినను, అందందు ముఖ్యభాగములలోనే పాఠభేదములను గలిగియుండుట వింతగా నున్నది. ఒకదానిలో నాచనసోముని కియ్యఁబడిన భాగములు (36) షట్త్రింశత్తని యుండఁగా రెండవదానిలో (౨౬) షడ్వింశత్తని యున్నది. ఇరు వదియెనిమిది యని చెప్పినచో మొత్తము నూటపది భాగములకు సరిపోదు గాన (ముప్పదియాఱు) షట్త్రింశత్తని యుండుటయే సరియైనది. కవి కాలము ననఁగా దానకాలమును దెలిపెడి ముఖ్యభాగమే వ్యత్యాసము కలదిగా నున్నది. మొదటిదానిలో "రసభూనయనేందుభిః" అని యున్నపాఠము రెండవదానిలో "రసాభ్రనయనేందుభిః" అని యున్నది. దానకాలము మొదటి పాఠమునుబట్టి శాలివాహనశకము ౧౨౧౬ వ సంవత్సర మనఁగా క్రీస్తుశకము ౧౨౯౪ వ సంవత్సర మగుచున్నది, రెండవ పాఠమునుబట్టి శాలివాహనశకము ౧౨౦౬ వ సంవత్సర మగుచున్నది. ఈ రెంటిలో నే కాలమును బుక్కరాయలరాజ్యకాలములోనిది కాదు. ఆ కాలములో బుక్క రాయలురాజ్యముచేయకుండుటయేకాక యప్పటి కాతఁడు పుట్టియైన నుండఁడు. శాసనములోని వాక్యములనుబట్టి చూడఁగా బుక్కరాయలు తాను రాజ్యము

చేయుచున్న కాలములోనే నాచనసోమునికి దానముచేసినట్లు స్పష్టముగాఁ దెలియవచ్చుచున్నది. శ్రీచిలుకూరి వీరభద్రరావుగారి యాంధ్రులచరిత్ర మునుబట్టి వీరబుక్కరాయలు ౧౩౫౫ వ సంవత్సరము మొదలుకొని ౧౩౭౭ వఱకును భూపరిపాలనము చేసెను. కాఁబట్టి శాసనకాలము ౧౩౫౫ నకును ౧౩౭౭ నకును మధ్య దేదో యొక సంవత్సరమయియుండవలెను అగ్రహారదానసంవత్సరము తారణ యని శాసనము చెప్పుచున్నది. రాజ్యారంభ సంవత్సరము మన్మథ (౧౩౫౫) యు, అంత్యసంవత్సరము నల (౧౩౭౬) యు, అగుచున్నవి. ఈ మధ్య ననఁగా బుక్కరాయల రాజ్యకాలములో తారణసంవత్సరము లేనేలేదు. ఉన్నసంవత్సరములో వర్ణోచ్చారణమునుబట్టి తారణకు చేరువ సంబంధముగలది సాధారణ. ఇది బుక్కరాయల రాజ్య కాలములో నుండుటచేత శాసనసంపాదకులైన రైసుదొరగారు తమ పండితులతో నాలోచించి సాధారణసంవత్సరమునకు సరిపోవునట్లుగా "రసభూనయనేందుభిః" అన్నదానిని "కరాజనయనేందుభిః" అని సవరించి శాలివాహనశకము ౧౨౪౨ అనఁగా క్రీస్తుశకము ౧౩౨౦ వ సంవత్సరమగునట్లు చేసిరి. అప్పుడు శాసనశ్లోక మీ విధముగా మాఱుచున్నది.

"అలంకృతే శకస్యాబ్దే కరాజనయనేందుభిః
సాధారణే చైత్రమాసే నవమ్యాం శుక్లపక్షకే."

కర = ౨, అజ = ౪, నయన = ౨, ఇందు = ౧ – ౨౪౨౧ కుడినుండి యెడమకు ౧౨౪౨ శకవర్షమగుచున్నది. శాసనసంవత్సర మిదియేకావచ్చును గాని యీ యూహయే సరియైన దని నిశ్చయముగాఁజెప్పవలనుపడదు. ఈ మార్పును సూచించిన శాసనసంపాదకు లగు రైసుదొరగారు తమ యింగ్లీషు భాషాంతరములో పుట యడుగున నీక్రింది నివేదనము చేసియున్నారు.

Note :—"This is given as the Saka year rasa bhu nayana indu (=1216), the year Tarana. But This does not fall within Bukka's reign, during which there

was no Tarana. Hence Sadharana, Saka 1292 expired has been conjecturally taken "

షిమోగామండల (TI No. 154, Shimoga Dt. Ep. Carn) టీ యల్ ౧౫౪ వ సంఖ్యశాసనములో బుక్కదేవరాయలు శకవత్సరము 1268 వ్యయసంవత్సర మార్గశీర్ష శుద్ధద్వితీయనాఁడు సింహాసనమెక్కినట్టు చెప్పఁబడియుండుటచేత క్రీస్తుశకము 1346 వ సంవత్సరాంతమునుండియే యాతని పరిపాలన మారంభమయ్యెనని కొందఱు చెప్పుచున్నారు. అట్లయినను తారణసంవత్సరము కాని శకవర్షము 1216 గాని యీతని రాజ్యకాలములో రావు. ఇఁక 'రసాభ్రనయ నేందుభిః" అన్న రెండవ పాఠమును జూడుఁడు. ఇందుఁ జెప్పఁబడిన తారణసంవత్సరమును హరిహరబుక్కరాయలకాలములోనికిఁ దెప్పించుటకు శకవర్షమును 1266 నకు మార్పవలెను. అట్లు మార్చుటచే "రసాభ్ర" యని యున్నదానిని "రసర్తు"నుగా సవరించిరి. అట్లుచేసినను బుక్కరాయలకాలములోనికి రాక తారణసంవత్సరము హరిహరరాయలరాజ్యకాలములోనికి వచ్చినది. అందుచేత శాసనకాలము ౧౩౪౪ అనుటకంటె ౧౩౬౦ అనుటయే సత్యమునకు సమీపమయి యుండును. శకవర్షము 1298 (క్రీస్తు. శ. 1376) నలసంవత్సర ఫాల్గుణ బహుళపాడ్యమి భానువారమునాడు బుక్కరాయలు మృతినొందెను. బుక్కరాయనికాలములో నుండి యాతనిచే నగ్రహారమును బడసి నాచన సోమనాథుఁ డెఱ్ఱాప్రెగడకంటెఁ బూర్వుఁ డని చేసెడి వాదము విశ్వాసార్హమయినది కాదు.

[శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు సోముని ఉత్తరహరివంశపీఠికలో శాసనమునందలి 'రసాభ్రనయనేందుభిః' అనుదానిలోని 'భ్ర' ను 'ర్తు' గా సవరించి, శాసనకాలము శా. శ. ౧౨౬౬ గానిర్ణయించిరి. నాగరలిపిలో 'భ్ర, ర్తు' లకు ఎక్కువ పోలికయుండుటచే శాసనమును వ్రాసినవారుగాని పరితలుగాని పొరపాటుపడియుందురని శ్రీ శాస్త్రులుగారి యాశయము. కాఁగా నీతఁ డెఱ్ఱాప్రెగడకు సమకాలికుఁడో, కొంచెము తర్వాతివాఁడో అయియుండును. ఆంధ్రకవితరంగిణియందు నీ యాశయమే తెలుపఁబడినది.]

అందందు నెఱ్ఱాప్రెగడ హరివంశములోని పద్యము నొకదానిని సోముని హరివంశములోని పద్యము నొకదానిని తీసి పోల్చుటవలన నుభయకవుల తారతమ్యమును తేటపడ నేరదు. కవిత్వతత్త్వమును మొత్తముమీఁద విచారింపవలెను. అప్పుడుసహిత మభిప్రాయభేదముండక మానదు. ఒకరికి రుచించినది యింకొకరికి రుచింపదు. లోకోభిన్నరుచి యన్నది క్రొత్తది కాదు గదా!

ఇతఁడు హరివంశముఁగాక వసంతవిలాస మను ప్రబంధమును నొకదానిని కూడ రచియించి యున్నాఁడఁట. * దానిలోని పద్యముల మూటి నీ క్రింద నుదాహరించుచున్నాను.

క. అత్తఱి విటనాగరికులు
చిత్తమున వసంతకేళి చిగురొత్తంగా
మొత్తములు గట్టి తెచ్చిరి
ముత్తెపుఝల్లరులతోడి ఋఱ్ఱటకొమ్మల్.

క. అంజెదవుగాక నసుఁ జెం
తం జేరఁగనీక యెంతతగ్గిన మిరియా
లుం జొన్నలసరిగావే
లంజెతనమునందుఁ గొమిరెలం గెలువవాకో.

శా. ప్రాలేయప్రతివీరసేనఁ బఱపెన్ బై పై వసంతం బిలన్
గాలోన్మీలితకోరకోదరపరాగప్రౌఢకోపాగ్నియై

* ['వసంతవిలాసము' మాచయబ్రహ్మయ కంకితము చేయఁబడినదని శ్రీమానపల్లి—రామకృష్ణకవిగారు తెల్పినారు ఈ బ్రహ్మని శాసనమొకటి పల్నాడు తాలూకాలోని కారెమపూఁడిలో నున్నదని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఉత్తరహరివంశ పీఠికలో వ్రాసియున్నారు. ఈ మాచయబ్రహ్మనిమీఁద కొన్ని చాటువులు కలవు.

నాచనసోముని హారవిలాసములోని వని కస్తూరి రంగకవి రంగరాట్ఛందములోఁ గొన్ని పద్యముల నుదాహరించినాఁడు. ఈ గ్రంథము హారవిలాసముకంటె భిన్నమో అభిన్నమో ?]

హాలాపానవిహారసారమహిళాహుంకార దోస్సారమై
హేలాపల్లవహేతిఖండితమహాహేమంతసామంతమై.

ఇట్లొక పద్యమును రెండుపద్యములను జూపుటవలన నీతనికవిత్వశైలి తెలియఁజాలదు గనుక సోముని హరివంశమునందలి యుషాకన్యాపరిణయ కథలోని కొంత భాగము నిందుఁ బ్రకటించుచున్నాను. ఇతనికిఁ దిక్కన సోమయాజియందు మిక్కిలి గౌరవ ముండుట యితఁడు హరివంశము నందుఁజెప్పిన "ఇది శ్రీ మదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర బుధారాధనవిరాజి తిక్కనసోమయాజి ప్రణీతం బయిన శ్రీమహాభారతకథావంతరంబున శ్రీమత్సకలభాషాభూషణ సాహిత్యరసపోషణ సంవిధానచక్రవర్తి సంపూర్ణకీర్తి నవీనగుణసనాథ సోమనాధ ప్రణీతం బయిన" యను గద్యము వలన స్పష్టముగాఁ దెలియవచ్చుచున్నది. ఎఱ్ఱాప్రెగడకు డెబ్బది యెనుబది సంవత్సరములకుఁ దరువాత నున్న ప్రౌఢకవి మల్లన మొదలయినవా రీతనిని పూర్వకవినిగా స్తుతించినారు.

ఉ. నన్నయభట్టుఁ దిక్కకవి నాచనసోముని భీమనార్యుఁ బే
రెన్నికఁ జిమ్మపూడియమరేశ్వరు భాస్కరు శంభుదాసునిన్
సన్నుతి చేసి వాక్యసరసత్వము వీనుల కింపుమీఱ న
త్యున్నతిగా నొనర్తు నెఱయోధులు మేలనఁ గావ్య మిమ్ములన్.

అని పోతనామాత్యుని పుత్రుఁడయిన ప్రౌఢకవిమల్లన * తన రుక్మాంగద చరిత్రమునందు సోముని స్తుతించి యున్నాఁడు.

సీ. . ... నన్నపార్యవర్ణనలఁ బొగడి,

గీ. వెలయఁ దిక్కనసోమయాజుల భజించి
యెఱ్ఱనామాత్యు భాస్కరు నిచ్చ నునిచి
సుకవిసోముని నాచనసోము నెరఁగి
కవిమనోనాధు శ్రీనాధు ఘనత మెచ్చి.

---

* ఇతఁడు పోతనామాత్యుని పుత్రుఁడు కాఁడు ఇతఁడు శ్రీవత్సగోత్రుఁడు. పోతన కౌండిన్యగోత్రుఁడు. ఈ మల్లన తండ్రి పోతయమంత్రి.

అని భాగవతషష్ఠస్కంధమునందు సింగయయు సోముని పూర్వకవిగాఁ జెప్పినాఁడు. పిల్లలమఱ్ఱి పినవీరన్నయు "మా నన్నయభట్టుఁ దిక్కకవి నెఱ్ఱాప్రెగ్గడన్ సోమునిఁ" అని యెఱ్ఱాప్రెగడతరువాత సోమునిఁ జెప్పినాఁడు. వీని నన్నిటినిబట్టి విచారింపఁగా సోమకవి యెఱ్ఱాప్రెగడకుఁ దరువాతను శ్రీనాథాదులకుఁ బూర్వమునందును నుండుట స్పష్టము. కాఁబట్టి యతఁడు హూణస॥ ౧౩౬౦-౮౦ సంవత్సరప్రాంతములయం దున్నాఁడని యించుమించుగా నిశ్చయింపవచ్చును. దీనినిబట్టి విచారింపఁగా నాచన సోమనాథుఁ డిప్పటి కయిదువందలయేఁబది సంవత్సరములక్రింద నున్నట్లు తేలినది. ఈ విషయమయి పెంచి చెప్పుటకంటె హరివంశములోని పద్యములను వ్రాయుటయే చదివెడివారికి మనోహరముగా నుండవచ్చు నను తలంపుతో నట్లు చేయుచున్నాను.

మ. ఒకనాఁ డిందుధరుండుఁ బార్వతియు లీలోద్యానకేళీసరి
న్నికటానేకవిహారదేశముల దైతేయేంద్రకన్యాప్సరో
నికురుంబంబులు పారిజాతకుసుమానీకంబు పైఁ జల్ల ద
ర్పకబాణంబుల కెల్ల నెల్ల యగు సౌభాగ్యంబుతో నాడఁగన్.

వ. అట్టియెడ.

సీ. కిసలయంబులతోడఁ గెంగేలు తడవెట్టి
            విరులపై నఖకాంతి విఙ్జి రాల్చి
తేఁటిగములకు దనూలీలఁ గానుక యిచ్చి
            గుత్తులఁ బాలిండ్లు గొలిచి చూచి
చలిగాలి నిశ్వాససౌరభంబుల నాఁగి
            యళిపంక్తి కురులతో నలుక దీర్చి
పుష్పాళిఁ నెలగంధములు వియ్యమందించి
            పూఁదేనెచెమటల బుజ్జగించి
తొడలు ననఁటికంబంబులు ఘెడలుఁ ద్రోక
ద్రోఁదెలు నెలుంగులిల్లును బరపుష్టతతులు

మాటలును గీరభాషలు మక్కళించి
చిగురుఁబోఁడులు వనకేళి చేయఁ జేయ.

వ. వారిలో నొకర్తు.

మ. సహకారాధిపుఁ గౌఁగిలించుకొని వాసంతీలతాకాంత సా
రహరిద్రారసగౌరకేసరములన్ రంజిల్లు మాధ్వీకవా
ర్లహరిస్వేదముఁ జూఁడఁ బట్టపగ లేలా యింతటన్ సిగ్గు లే
దహహా! యంచు దొలంగి నవ్వెఁ జెలిమాటై ముద్దరా లయ్యెడన్.

మ. ఒక రామాతిలకంబు రత్నరుచితో నొప్పారు మందారకో
రకముం గర్ణవతంసత న్నిలుపుచున్ రాఁగా లతాసక్తచూ
చుకచేలాంచలయై మఱంగి విడు మంచున్ గేలు సాఁచెన్ ససా
యకమౌర్వీం దెగఁగొన్న మన్మథుని ప్రత్యాలీఢపాదంబులన్.

చ. ఒక చపలాక్షి లేఁజిగురుటూయెలఁ గోయిలరాచవారి ని
క్కకు నెలయింపవచ్చు కలకంఠికటాక్షము తెక్కదారు ప్రసు
కక్క పలుమాఱుఁ జూపఁ జెలికత్తెలు ముద్దులబావ పొమ్మనన్
మొకము సగంబు వాంచె మణిముద్రికలం జిఱునవ్వు గప్పుచున్.

చ. లలన లతావితానముల లత్తుకతేకులచాయ చల్లుచే
తుల నెలగొమ్మ లందికొనిఁ దోరపునవ్వులు పిక్కటిల్ల నె
చ్చెలులు చెలంగి మావిపులు చెందొవ లయ్యె ననం దడంబడన్
దలిరులఁ గోయు రాచిలుకదాఁటులుఁ దేఁటులు నాసచేయఁగన్.

సీ. సుడిగొన్నచిగురాకుజొంపంబు గెంపారఁ
దలమీఁద మల్లికాదామ మడఁచి
నిడుదతామరతూఁడు నెట్టెంబు చుట్టి పైఁ
బటికంపుఁగడియంపుభాగ మదిమి
తోన యాత్రేవఁ గెందొవతేకు హత్తించి
మెడచక్కిఁ గస్తూరి మెదిచి పూసి

పాయగొమ్మల నల్లపట్టుఁ దగిల్చి యం
      క్కొనయాకుపై వెండికోర వెట్టి
ధవళకేతకధూళి గాత్రమునఁ జఱిచి
మోఁకమామిడి కొకకొంత ద్రొక్కి నిలిచి
యొడలిలోఁ జక్కసగము నా కొసఁగు మనుడు
నద్రికన్యక తల వంచె హరుఁడు నవ్వె.

చ. నడకతెలుంగు మాటజతనంబు నపాంగవిలాసమున్ ముసుం
గిడిన తెలుంగు ముద్దుమొగ మించుకవంచిన సిగ్గుఁ బార్వతిం
దడఁబఱుపంగ నొప్పెసఁగె దర్పకవైరికి నాసపాటుగా
నడరుచుఁ జిత్రరేఖ యను నచ్చర నెచ్చెలు లిచ్చ మెచ్చఁగన్.

*   *   *   *   *

క. ఆవసథశోధనమునకు
సావాసులు వచ్చి కనిరి సౌధముపై ౧౦
భావితుఁడై దనుజసుతా
సేవితుఁడై యున్న మనుజసింహుఁ గుమారున్.

మ. కని యక్కోమలికిం గుమారునకు సంగం బంగజాయత్తమై
యునికిన్ బాణునితోడఁ జెప్పఁ జని వా రొండేమియున్ శంక లే
క నరుం డొక్కఁడు దేవ! నీనగరిలోఁ గన్యాజనాంతఃపురం
బున నున్నాఁడు భవత్సుతావిభుత నిప్పొందియ్యకొన్నాఁడవే.

ఉ. నావుడు రోషవహ్నివలనం బొగ రేఁగినభంగి మోమునం
గావిరి పర్వ నంగమునఁ గంపము నివ్వటిలంగ బాణుఁ డ
త్యావిలచిత్తుఁడై మనుజుఁ డట్టె మదీయపురంబు చొచ్చె న
చ్చేవయ కాక నానగరు చెర్చె నిసీ మగమాట లేటికిన్?

క. ఏ నీనటె నాకూఁతును
మానవుఁ డటె నగరు చొచ్చి మాకులమువకున్

హాని యొనరించెఁ గన్నులఁ
గానఁడు దలయెత్త రోఁత గాదే నాకున్.

క. మనుజాంగనలం బట్టుట
దనుజులకుం జెల్లుఁగాక దనుజాంగనలన్
మనుజులు పట్టుటకును దొర
కొనిరే బెండులు మునింగి గుండులు తేలెన్.

క. అని తన కింకరసైన్యము
ననిరుద్ధునిమీఁదఁ బనిచె నదియు భయోత్పా
దనమతిఁ బట్టుఁడు కట్టుఁడు
తునుముఁ డను నెలుంగు లడరఁ దోతెంచె వడిన్.

క. అప్పులుకుల కలుకలు మది
నుప్పర మెగయంగ నొంఁగె నుల్లాసము మై
నొప్పారఁగ బరిగోలల
నొప్పించిన భద్రగజము నూల్కొన్నగతిన్.

వ. అక్కుమారకంఠీరవుండు.

క. ఆతరుణి వలదు వల దని
భీతిం దనుఁ బట్టఁ బట్ట భీకరతరవి
ఖ్యాతరవసింహనాదుం
డై తత్సౌధంబు డిగ్గె నవుడుగఱుచుచున్.

వ. ఇట్లు డిగ్గి తదంతఃపురద్వారంబున నిలిచి దారుణతరం బగు పరిఘంబు పుచ్చుకొని,

మ. తన ఘోరధ్వనికిం గలంగఁబడు తత్సైన్యంబు దైన్యంబునం
దనుకొందం బరిఘంబు పై విసరుచున్ దుర్వారుఁడై పైపయిన్
మునుఁగంబాఱు శరాసిముద్గరగదాముఖ్యాయుధశ్రేణిచేఁ
గినియం జేసిన షేసవిన్ రవి దివిం గ్రీడించుచందంబునన్.

క. మండి పదాతులఁ గొందఱఁ
జెండాడిన నున్నవారు చెడి పాఱిరి బా
ణుం డున్నయెడకు నొడళుల
నిండను నెత్తురులు గ్రమ్మ నిట్టూర్పులతోన్.

వ. అప్పు డద్దనుజేంద్రుండు.

క. వెఱవకుఁడు వెఱవకుఁడు చిం
దఱవందఱగాకుఁ డేల ధైర్యముఁ దూలన్
మఱచితిరె కులముఁ గీర్తియుఁ
బిఱుకులగతి నింతవలదు భీరము చెడఁగన్.

ఉ. పాఱెదు ద్రోవ మీకు నలవాటుగఁ జేసిన శూరుఁ డెవ్వఁడో
మీఱి యనేకయుద్ధముల మీరు జయించుట లెల్ల నింతతోఁ
దీఱె ననుం గనుంగొనుఁడు ధీరతఁ దోడ్పడ రండు నాకునుం
బాఱుఁడు పాఱుఁ డందుఁ బరిపంథుల నాఱ్పుఁడు చాలు మీపనుల్.

వ. అని వారి నడికించియు నదలించియుఁ బొదుపుచేసి పోరికిఁ బురి
కొల్పి మఱి మహావీరులం బదివేవురఁ బదివేవురఁగా బలుతెఱంగుల
మూఁకలుచేసి ప్రమథగణంబులం గలపి పంచిన.

శా. నేలం గొందఱు మింటఁ గొందఱు గజానీకంబుఁ గీలాలము
గ్జాలంబుం బురుడింప నంచితమదోత్సాహంబు దేహంబులం
జాలం గ్రాల నిశాతహేతిలతికాసౌదామినీదామభీ
మాలంకారము భీరముం దెలుప నుద్యద్విక్రమక్రీడతోన్.

వ. వచ్చి యదల్చి నిలునిలు మని తాఁకిన.

క. ఒక్కనికిఁ బెక్కుమొనలకుఁ
దక్కక పోరగుట యరిది దానవబల మన్
గ్రిక్కిఱిసిన తిమిరమునకు
స్రుక్కక యాదవకుమారసూర్యుఁడు నిలిచెన్.

వ. ఇట్లు తన చేతిపరిఘంబు కంధరంబునం జేర్చి.

గీ. పరిఘతోమరాదులఁ దన్నుఁ బరులు వైవ
వారివారికై దువులనె వారి వైచె
మఱియుఁ దనతొంటిపరిఘం బమర్చి చేత
నాసురారాతిసేనపై నడరె నపుడు.

క. ఇరువదినాలుగువేవుర
వరభటులం గింకరుల నవారణలీలన్
బరిమార్చి పేర్చి విక్రమ
ధురంధరుం డయిన విజయదోహలి మఱియున్.

క. పలుకఁయు గరవాలముఁ గొని
పొలికలనం గెలవఁ జదలఁ బొదల మెఱుంగుల్
వల నొప్పారఁ బ్రచారం
బులు ముప్పదిరెండు నిండుమొనలకుఁ జూపెన్.

పంచమాశ్వాసము.

సోముని హరివంశములోని మఱికొన్ని పద్యములు.

ఉ. రెండుబలంబులందు నరరే యరరే యవురే యనంగ నొం
డొండఁ జెలంగు సన్నుతుల నుబ్బుచు నీయదుపీరుఁ జంపుఁ బౌం
డ్రుం డనువారు సాత్యకి కఠోరభుజాప్రతిముండు పౌండ్రభూ
మండలనాథుఁ జంపు ననుమానము లే దనువారుఁ బోరిలోన్.

శా. ఓరీ దానవధూర్త! నీదువచనోద్యోగంబు లె ల్లేగెరా
రారా యింకిట నేమి చేసెదవురా క్రౌర్యంబు శౌర్యంబు స
ద్వీరత్వంబును గల్గెనేని దనుజా! తెల్లంబుగాఁ జూపుమం
చా రాజీవవిలోచనుండు వచనవ్యాపారపారీణతన్.

చ. ఇతని కితండె సాటి యగు నీతని కీతఁడె సాటి వచ్చు ను
ద్ధతిఁ జనువెంట వింట నడిదంబున నింతటివారు లే రుమా

పతి కొకరుండు శిష్యుఁ డురుబాహుఁడు ద్రోణున కొక్కరుండు ధీ
రతముఁడు శిష్యుఁ డీ ట్లిరువురన్ రణధీరతఁ జెప్ప నేటికిన్.

చ. మఱకువ కత్తరించి మదమానములం జూఱవుచ్చి మెచ్చుఁ జా
గఱకొని క్రోధకామముల గండడఁగించి పరాపకారముం
జఱిపడఁ ద్రోచి వాచవులచట్టలు వాపి తొలంగి చిత్తముల్
జఱిఁ బడియున్న నీకు నొకచక్కటి నెక్కటి వేఁడఁ గల్గెనే!

చ. ఎఱుఁగరుగాక లోకమున కెవ్వరికైనను మేలు సేయఁగా
నొఱపగు నాశ్రమంబున పమున్నతమైన గృహస్థధర్మముం
బఱగడవైచి గోఁచిగొని పాఱిన పొల్లకు ముక్తి కల్గునే
పఱిగల నేఱినం గొలుచు పాఁతటికిం గలదే తలంపఁగన్?

చ తిరిసిన కూడు దెచ్చి నలుదిక్కుల బోడలు తిండి పెట్టఁగాఁ
బెరిఁగిన పొట్టతోడ నొకపెంటపయిం దొరవోలె నెవ్వరిన్
సరకుగొనందు పట్టుకొని చాఁగఱగొన్న బలే! యెఱుంగుఁ ద
క్కరిబలు మోపు మోచు నయగారితనం బఱ నుట్టి గట్టినన్.

చ. పెఱిగితిగాక నీవు నొకప్రెగ్గడవే సభ లుండుభంగి ము
న్నెఱుఁగనివాఁడవై బ్రమసి యెవ్వరిముందఱ నేమి మాటలో
యఱచితి వారిజంకెలకు నంతట ద్రోవడి వచ్చి తిచ్చటన్
గఱువఁగ వచ్చునే బలిమి గాడిదకుం బులితోలు గప్పినన్.

మ. అరిఁ జూచున్ హరిఁజూచు సూచకములై యందంద మందారకే
సరమాలామకరందబిందుసలిలస్యందంబు లందంబులై
దొరఁగం బయ్యెదకొం గొకింత దొలఁగం దోడ్తో శరాసారమున్
దరహాసామృతసారముం గురియుచుం దన్వంగి కేలీగతిన్.

చ. చొరని బిలంబులు న్వెదలఁ జూడని క్రంతలు గాలు రాపడం
దిరుగని త్రోవలు న్విడియ దీర్పని గొందులు నాలుబిడ్డలే
కరయని రేలు చీమ చిటుకన్నను విప్పనిమూఁటలుం బయిం
జిరుగని కోకలుం గలవె చేరిన యీ సురకోటి కచుఁతా!

చ. అరదముపై నుదగ్రుఁ డగు నంగిరునిం గని నెమ్మొగంబునం
దరహసితంబు చెన్నొసఁగ దానవసూదనుఁ డల్ల నిట్లనుణ్
మరలు మునీంద్ర! నీకు వసమా యసమాయుధకేళి కేలికిం
దరమె మదీయసాయకవితానము లిప్పుడు గోలుపుచ్చవే!

చ. తరుణుల పీరముద్దియలతాఁకునఁ జిందఱవందతైన క్రొ
న్నురువులలోన శైవలము నూలుకొనంగ నితంబపంక్తిపైఁ
బొరలు తరంగరాజి విరిపువ్వులు పీడిన కుంతలంబులణ్
బరఁగఁ బదంబులం దెఱఁగి పైఁబడ నేడ్చు విటాలికైవడిణ్.

శా. ఈ రూపంబున సంస్కృతిం దొఱఁగి మీ రెంతెంత యేచింతలణ్
జేరం గోరక యూరకున్న నిటు విచ్చేయంగఁజేయం గడున్
భారంబే విను నంతయుం గలిగెనో బాలార్కబింబంబులో
నారంగూరిన యంధకారమన నాహో! సాహసం బెట్టిదో!

శా. ఓరీ! బ్రాహ్మణధూర్త! నాయెదుట నోహో! సాహసం బెట్టిదో
వైరిం గోరి నుతించు మాట లెటుగా వచ్చెం గృతఘ్నా! యిది
న్నోరే యెవ్వరి కెవ్వ రయ్యెదరు నిన్నుం బెంచి మన్నించినన్
గారామై యిటు చేసితే తొలఁగు మింకం జాలు నీకార్యముల్.

వేములవాడ భీమకవి

* భీమకవియొక్క వాసస్థానము గోదావరిమండలములోని దాక్షారామమునకు సమీపమున నున్న వేములవాడ యను గ్రామము. ♦ ఇతని జన్మమును గుఱించి విచిత్రమైన కథ యొకటి చెప్పుచున్నారు వేములవాడ గ్రామము నందు శోమన యను నియోగిబ్రాహ్మణుఁ డొకఁ డుండెను. ఆతనిమరణానంతర మతనిభార్య నిరుపేదరాలైనను విద్యావతి యగుటచే ధనికుల యిండ్లలో పాటలును, పద్యములును చెప్పి జీవనము చేయుచుండెను. ఆమె శివరాత్రి పుణ్యకాలమునందు తనయూరిస్త్రీలతోఁ గలిసి దాక్షారామమునకు యాత్రపోయి వా రందఱును తమకు సంతానముఁ గలిగింపవలె నని భీమేశ్వరస్వామికి మ్రొక్కుకొనుచుండఁగా, తన కిఁక సంతానము గలుగఁ బోదన్న నమ్మకముతో పరిహాసార్థముగా తనకు కొడుకు పుట్టినయెడల తానును స్వామికి పుట్టెఁడు నీటితో దీపారాధనము చేయించెద నని మ్రొక్కుకొనెను. ఆమెమాటల కప్పు డచ్చట నున్న స్త్రీ లందఱును నవ్విరి. ఆమె యిల్లు చేరిన తరువాత కొంతకాలమునకు దైవ మామె కోరికను సఫలముచేసెనో యన్నట్లు వితంతువున కెట్లో విధివశముచేత గర్భము నిలిచెను. తాను భక్తితో మ్రొక్కుకొన్నందున భీమేశ్వర స్వామియే చూలు కలిగించె నని యామె యెంత చెప్పినను నమ్మక, ఆమె వా యూరివా రందఱును జాతినుండి బహిష్కరించి తమయిండ్లకు రానీకుండిరి. ఆమె కటుపిమ్మట పురుషశిశువు కలుగఁగా మిక్కిలి ప్రేమతో పెంచుచు, ఆతనికి భీమేశ్వరస్వామిపేరు పెట్టి, తానే యాతనికి చిన్నప్పటి నుండియు విద్య చెప్పుచుండెను. ఈ భీమన తాను పిల్లవాండ్రతో నాడు

* ఇతనిచరిత్ర తిక్కనచరిత్రకు ముందు రావలసినది.

♦ [భీమకవి నివాసము నిజామురాష్ట్రములోని వేములవాడ యనియు, అచటి రాజేశ్వరుఁడే భీమేశ్వరుఁడనియు శ్రీ జయంతి రామయ్యపంతులుగా రభిప్రాయపడి యున్నారు. గోదావరిమండలములోని వేములవాడయే భీమకవి నివాసమని 'ఆంధ్ర కవితరంగిణి'లోఁ జెప్పఁబడినది.] (పు. 217)

కొనఁ బోయినప్పుడు వా రతనిని "విధవకొడుకా!" యని పిలుచుచు పరిహసించుచు రాఁగా కొంత జ్ఞానము వచ్చినవాఁ డగుటచేత మనస్సులో వేదన పొంది తల్లివలన తన జన్మవృత్తాంతమును దెలిసికొని, తత్క్షణ మా గ్రామము విడిచి పోయి దాక్షారామము చేరి భీమేశ్వరస్వామి యాలయములో లింగమును కౌఁగిలించుకొని వదలక కూరుచుండెనఁట! అంతట స్వామి కా చిన్నవానియం దనుగ్రహము వచ్చి నీ "వాడినదెల్ల నాటయు, పాడినదెల్ల పాటయు నగు"నని వరమిచ్చి పంపెనఁట' ఆ బాలుఁడు మరల స్వగ్రామ మునకు వచ్చినతరువాత నొకయింట బ్రాహ్మణసమారాధనము జరుగునప్పు డచ్చటికిఁబోఁగా బ్రాహ్మణు "లీ ముండకొడుకును లోపలికి రానియ్యఁ గూడ"దని తలుపులు లోపలఁ గడియవేసిరఁట! అంతట వడ్డన లయి లోపల భోజనము లారంభముకాఁగా. భీమన తలుపులసందునుండి చూచి "మీ పప్పులు కప్పలుగాను; మీ యన్నము సున్నముగాను" అని శపించె నఁట! ఆ శాపాక్షరములు సత్యము లయి విస్తళ్ళలోని యన్నము సున్న మయి, అప్పములు కప్ప లయి దుముకు లాడసాఁగెనఁట! అప్పుడు బ్రాహ్మణు లందఱును భయపడి యది భీమనమహత్త్వ మని తెలిసికొని తలుపు తీసి, సున్నమును కప్పలను యథాపూర్వకముగా చేసినపక్షమున వాతనిని పంక్తిభోజనమునకు రానిచ్చెద మని చెప్పఁగా నతఁడు 'సున్న మన్నమును, కప్ప లప్పములును కావలె' నన్న యుత్తరక్షణమునకే యవి యట్లయ్యెనఁట! నాఁటినుండియు బ్రాహ్మణు లాతఁడు వరప్రసాది యని తెలిసికొని, ఆతని కుపనయనాది సంస్కారములు చేయించి బహిష్కారము దీసివేసి, అతనిని పంక్తిభోజనములకు రానిచ్చుచు గౌరవింపుచుండిరి.

భీమకవి సంస్కృతమున రచియించినట్లు చెప్పఁబడెడు జ్యోతిషగ్రంథమును దెనిఁగించిన యొకానొక కవి యించుమించుగా నీ కథనే తన గ్రంథావ తారికయం దీ క్రింది సీసమాలికలోఁ జెప్పియున్నాఁడు.

సీ. శ్రీకరంబై ధరఁ జెలువు గాంచినయట్టి
భీమపురంబునఁ క్షేమమీఱ

భీమేశ్వరుండును బ్రియముతో భక్తుల
కోర్కె లొసంగుచుఁ గొమరు మిగుల,
నొకనాఁడు తత్పురియువతులు కొందఱు
భక్తి భీమేశ్వరభవనమునకుఁ
బోయి పుత్రుల వేఁడ ముగ్ధత్వమున నొక్క
విధవ కుమారుని వేఁడఁ గోర
నాలేమముగ్ధత కపహాసించుచు నల
భీమేశ్వరుఁడు పుత్రుఁ బ్రీతి నొసఁగె
నా కాంత గర్భిణియై కాంచెఁ దనయుని
గలియుగాదిని బ్రేమ కడలుకొనఁగఁ
బ్రభవవర్షంబున శ్రావణమాసంబు
శుక్లపక్షంబున శోభనంబు
మీఱఁ బంచమి శుక్రవారంబునను హస్త
యందుఁ గన్యాలగ్నమందు వెలయ,
వెలిపెట్టి రక్కాంత విధవ పుత్త్రినిఁ గాంచె
నని నింద మెడఁగట్టి యఖిలజనులు
నంతఁ దత్తనయుండు నైదేండ్ల బాలుఁడై
పురి బాలకులతోడఁ బొసఁగనాడ
జను లెల్ల గోళకుం డని నిందఁజేసిన
రోషించి యాతండు దూషిత యని
రా మెత్తి తల్లిపై నేయఁబోయిన నది
భీమేశ్వరుఁడు తండ్రి వేయు మనిన
వెసఁ జని యాతని వేయ నుంకించిన
భీమేశ్వరుఁడు దయ పెద్ద గలిగి
ప్రత్యక్ష మయి, వత్స ! రమ్మని తగఁ జీఱి
పశుపక్షిమృగములఁ బ్రాణికోట్లఁ

....

....

గలిగించు శక్తియుఁ గరమొప్ప జనులకు
బిడ్డల నాయువుఁ బెంపుఁదనర
సంపద లొసఁగెడి సామర్థ్యమును మఱి
కానిది యౌనని యైనదెల్లఁ
గాదని యట్టుల కావించు బలమును
మనుఁ రాఁ గలుగునదియును దెలుపఁగఁ
బ్రావీణ్యమును నిచ్చి ప్రబలుము నీ వని
వరమిచ్చెఁ బదియాఱు వర్షములకు
నాతనికి సహాయమై సరస్వతియును
... ...
నతఁ డెట్లుచెప్పిన నట్ల చేయుచునుండె
సరిలేని కీర్తిచే జగతి వెలసి

గీ. యతఁడు చెప్పిన శాస్త్రమం దధికభక్తి
కలిగి నిజమని తలఁచినఁ గల్గు శుభము;
కోర్కులెల్లను ఫలియించు గురుతరముగ
సకలజనులకుఁ దప్పదు జగతిలోన

నాఁటనుండియు నీతఁడు కవిత్వము చెప్పికొనియే జీవనము చేయుచుండెను. తిట్టుకవిత్వమునం దీతఁడు ప్రసిద్ధుఁడు. అందుచేతనే యీతని నుద్దండకవి యనియు, కవిరాక్షసుఁ డనియు, జనులు వాడుకొనుచు వచ్చినట్టు కనుపట్టు చున్నది. ఇతఁడు గాక కవిరాక్షసుఁ డనెడు కవి వేఱొకఁ డున్నాఁడు.

భీమకవి తన్నుగూర్చి చెప్పుకొను కథ లనేకము లున్నవి. ఈతఁడు రాజ సభలకుఁ బోయినప్పుడు, తాను దాక్షారామ భీమేశ్వరునిపుత్రుఁడ ననియే చెప్పుకొనుచు వచ్చిన ట్లీ క్రిందిపద్యము వలనఁ దెలియవచ్చుచున్నది.

మ. 'ఘనుఁడన్ వేములవాడవంశజుఁడ దాక్షారామభీమేశనం
దనుఁడన్ దివ్యవిషామృతప్రకటనానాకావ్యధుర్యుండ భీ
మన నాపేరు వినంగఁ జెప్పితిఁ దెలుంగాధీశ! కస్తూరికా
ఘనసారాదిసుగంధవస్తువులు వేగం దెచ్చి లాలింపురా!'

ఈ పద్యమునందలి తెలుంగాధీశ యనుదానిని వెలుంగాధీ యని దిద్ది దానికి విమలాదిత్యుఁ డని యర్థము చెప్పుటకంటె సాహసకార్య ముండదు తెలుంగాధీశుఁ డనఁగా తెలుఁగురాయఁడు. రామవిలాసములో

క. ఆ మాచనృపతిసుతుఁడు మ
హామహుఁ డెఱపోతనక్షమాధీశ్వరుఁ డా
శ్రీమంతుసుతులు జగదభి
రాములు శ్రీతెలుఁగురాయ రామనరేంద్రుల్. *

అని గుడిమెట్టరాజగు నెఱపోతరాజుకొడుకు తెలుఁగురాయఁ డొకఁడు చెప్పఁబడి యున్నాఁడు ఈతెలుఁగురాయఁడు పదుమూడవ శతాబ్ది మధ్యమునం దుండినవాఁడు కవి యీ తెలుఁగురాయనిఁగూర్చియే యీ పద్యమును జెప్పినయెడల, ఇతఁడు తిక్కనకాలములోనో, తిక్కనకు గొంచె మీవలావలలనో యుండి యుండును. తిక్కన యీతనిని తన గ్రంథము లలోఁ బేర్కొనకుండుట కూడ నితఁడు తిక్కనకు పూర్వపువాఁడు కాఁడని తెలుపుచున్నది. పదుమూఁడవ శతాబ్దిమధ్యమున నున్న యీ తెలుఁగు రాయఁడు గాక కవులకు కస్తూరికాదానము చేయుటయందుఁ బ్రసిద్ధుఁ డయిన వేఱొక తెలుఁగురాయఁడు సాంపరాయని పుత్రుఁడు పదునాల్గవ శతాబ్దోత్త రార్థమున నుండెను. భీమన కస్తూరిని వేఁడినది యీ తెలుఁగురాయనినే యయి యుండును. "తెలుంగాధీశ" యన్న ప్రయోగము వ్యాకరణదుష్ట మగుటచేత నది 'కళింగాధీశ' యని యుండవలెనని యొకరు వ్రాయు చున్నారు. సంజ్ఞలయందును, బిరుదములయందును మనము వ్యాకరణ దోషములను బాటింపరాదు. కస్తూరికాదానమునకుఁ బ్రసిద్ధికెక్కినవాఁడు తెలుఁగురాయఁడు కాని కళింగాధీశుఁడు కాఁడు. ఈ తెలుఁగురాయనినే కస్తూరి వేఁడెడి యీక్రింది పద్యములో నీతనిఁగూర్చి శ్రీనాథుఁడును 'తెలుంగాధీశ' యనియే ప్రయోగించియున్నాఁడు.

(* ఇయ్యది పెద్దాపురప్రభువులు వత్సవాయివారి యాస్థానములోనుండిన ఏనుఁగు లక్ష్మణకవి విరచితము.)

శా. 'అక్షయ్యంబుగ సాంపరాయని తెలుంగాధీశ ' కస్తూరికా
భిక్షాదానము చేయురా సుకవిరాడ్బృందారకశ్రేణికిన్
దాక్షారామపురీవిహారవరగంధర్వాప్సరోభామినీ
వక్షోజద్వయకుంభికుంభములపై వాసించుఁ దద్వాసనల్.'

ఈ తెలుఁగురాయఁడు మరణము నొందుటచేతఁ గస్తూరికాదానము చేయువారు లే రని శ్రీనాథుఁ డీ సీసపద్యపాదమున విలపించియున్నాఁడు.

"రంభఁ గూడెఁ దెలుంగురాయరాహుత్తుండు
కస్తూరి కే రాజుఁ బ్రస్తుతింతు"

విమలాదిత్యునితండ్రి యైన దానన్నృపాలుఁడు మూఁడు సంవత్సరములు రాజ్యము చేసిన తరువాత కళింగు లాతనిని రాజ్యపదభ్రష్టునిఁ జేసి రాజ్యమును తా మాక్రమించుకొనిరి. ఆ కాలములో భీమకవి యున్నట్టును, అప్పుడు రాజ్యపాలనము చేయుచున్న కళింగగంగును తిట్టినట్టును కొందఱు చెప్పుచున్నారు. ఈ కవి యొకనాఁడు రాజసందర్శనార్థమయి పోఁగా రాజ కళింగగంగు కార్యభారములో మునిఁగియుండి యసమయమగుటచే కోపపడి "యిప్పుడు సందడిగానున్నది. సందడి తీఱినతరువాత రమ్ము" అని కేక వేసెనఁట ! అందుమీఁద భీమన యాగ్రహపడి

ఉ. వేములవాడభీమకవి వేగమె చూచి కళింగగంగు తా
సామము మాని కోపమున సందడి దీఱిన రమ్ము పొమ్మనెన్
మోమును జూడ దోష మిఁక ముప్పదిరెండు దినంబులావలన్
జామున కర్థమం దతనిసంపద శత్రులఁ జేరుఁగావుతన్.

అను పద్యమును జెప్పెనఁట ' ఈ వాక్యము శాపమయి తగులఁగా శత్రురాజు లాతనిరాజ్య మాక్రమించుకొని యాతనిని వెడలఁగొట్టిరఁట ! తరువాత నతఁడు శత్రుభీతిచేత మాఱువేషముతో నూరూరఁ దిరుగుచు నొకనాఁటిరాత్రి చీఁకటిలో భీమకవి యింటిముందరి పాఁతరగోతిలో కాలు జాఱి పడి, ఆఁత బ్రతుకు బ్రతికిన మహారాజున కిప్పు డొక్కకాలి దివ్వటి యైన లేకపోయెనే యని ఖేదపడెను అప్పుడు పాదప్రక్షాళణమున కయి వెలుపలికి వచ్చిన భీమకవి యా మాటలు విని 'నీ వెవ్వఁడ ?' వని

యడుగఁగా 'నేను వేములవాడభీమకవి చేసిన జోగి' నని యతఁడు ప్రత్యుత్తరము చెప్పెను. అందుమీఁద కవి కరుణించి

ఉ. 'వేయి గజంబు లుండఁ బదివేలతురంగము లుండ నాజిలో
రాయల గెల్చి సజ్జనగరంబునఁ బట్టము కట్టుకో వడిన్
రాయకళింగగంగ కవిరాజు భయంకరమూర్తి చూడఁ దాఁ
బోయిన మీనమాసమునఁ బున్నమ పోయిన షష్ఠినాఁటికిన్.'

అను పద్యమును మరలఁ జెప్పి య శీర్వదించెను. ఈ యాశీర్వచన ప్రభావముచేత నాతఁడు భాగవతులలోఁ గలసి సజ్జనగరమునకుఁ బోయి, అక్కడి రాజు తన శత్రువు నవమానించుటకయి 'రాజకళింగగంగు వేషము వేసెదరా?' యని భాగవతుల నడుగఁగ, వారె నొప్పుకొందని చెప్పి రాత్రి వేళ తా నా వేషము వేసికొని, వేషమునిమిత్తమని తనఖడ్గమును, గుఱ్ఱమును రాజువలనఁ బడసి యశ్వారోహణము చేసి యాటనెపమున నిజముగా రాజకళింగగంగే వచ్చె నని జను లాశ్చర్యపడ రాజును సమీపించి తన చేతిఖడ్గధారతో నాతనిశిరస్సు ఖండించి తాను సింహాసన మెక్కి కూరు చుండెను. ఈ వార్తయే నిశ్చయ మయి నచో రాజు చాళుక్యరాజులు రాజ్య పదభ్రష్టులైన కాలపువాఁడే యైన పక్షమున, విమలాదిత్యుఁ డేడు సంవత్స రములును, విమలాదిత్యునిజ్యేష్ఠభ్రాత యైన శక్తివర్మ పండ్రెండు సంవత్సరములును మరల స్వరాజ్యమును గైకొన్నతరువాత పాలనము చేసినందున భీమకవి రాజనరేంద్రుని రాజ్యకాలారంభమునందును, తత్పూర్వ మిరువది ముప్పది సంవత్సరములవఱకును, ఉండిన ట్లెంచవలసి వచ్చును. అయినను, ఆ కాలమునందు కళింగదేశము నేలిన ప్రభువులలో గంగ గనుపేరు గలవాఁ డెవ్వఁడు నున్నట్టు కనఁబడఁడు. కాఁబట్టి భీమకవి నన్నయభట్టునకుఁ బూర్వుఁడు కాఁడనుట నిశ్చయము.

ఎనిమిదవ శతాబ్దారంభము మొదలుకొని పండ్రెండవ శతాబ్దారంభము వఱకును పాలకులుగా నున్న కళింగరాజులలో "గంగ" నామము గలవాఁ డొక్కఁడు మాత్రమే కనఁబడుచున్నాఁడు. అతఁడు శాలివాహనశకము ౯౯౯ వ సంవత్సరమునం దనఁగా క్రీస్తుశకము ౧౦౭౭ వ సంవత్సరమున

రాజ్యమునకు వచ్చెను. ఈతనితల్లి చోడదేశపురాజు (రాజనరేంద్రుని కొడుకగు కులోత్తుంగచోడదేవుని) కూఁతు రయినందున, ఇతఁడు చోడగంగనియుఁ బిలువఁబడుచు వచ్చెను, నన్నయభట్టునకుఁ దరువాత కళింగరాజ్య మేలిన "గంగ" నామము గలవారిలో మొదటివానికాలమునందు భీమన యుండె ననెడు పక్షము, పయి పద్యమునం దుదాహరింపఁబడిన రాజకళింగగం గితఁడే యనవలసివచ్చును. అప్పు డీతని తండ్రిపేరు రాజరాజగుటచేత, ఆ పేరును సూచించు నిమిత్తమే కళింగగంగునకుఁ బూర్వము రాజశబ్దము చేర్పఁబడినట్లును జెప్పవలసి వచ్చును. ఈ కళింగగంగు శాలివాహనశకము ౧౦౭౧ వ సంవత్సరమునకు సరియైన క్రీస్తుశకము ౧౧౪౯వ సంవత్సరమునందు తామరశంరి యను గ్రామమును మాధవశర్మ యను బ్రాహ్మణు కిచ్చిన శ్లోక దాన శాసనమునం దున్నది. ఈ శాసనము విశాఖపట్టణమండలకరగ్రాహిచేఁ బంపఁబడి చెన్నపురి చిత్రవస్తు ప్రదర్శనశాలయం దుంచఁబడి యున్నది. ఈ కళింగగంగున కనంతవర్మదేవుఁడని నామాంతరము గలదు. ఈశాసనములోఁ జెప్పఁబడిన వంశానుక్రమమునుబట్టి కళింగగంగుని తండ్రి రాజరాజు (ఇతఁడే కులోత్తుంగచోడదేవుని కూఁతు రగు రాజసుందరిని వివాహ మాడినవాఁడు) రాజరాజు తండ్రి వజ్రహస్తుడు; ఇతఁడు ము ప్పదిసంవత్సరములు రాజ్యపాలనము చేసెను. వజ్రహస్తునితండ్రి కామార్ణవుఁడు; ఇతడు తన యన్నలలో నొకడు రెండు సంవత్సరములును, ఒకఁడు మూడు సంవత్సరములును ప్రభుత్వము చేసినతరువాత పందొమ్మిది సంవత్సరములు రాజ్యపాలన చేసెను. కామార్ణవుని తండ్రి వజ్రహస్తుఁడు; ఇతఁడు ముప్పదియైదు సంవత్సరములు రాజ్యమేలెను. వజ్రహస్తునితండ్రి కామార్ణవుఁడు; ఇతఁడు తన యన్నలును, అన్నకొడుకును ముప్పదియేడేండ్లు రాజ్యము చేసినతరువాత రాజయి యిరువదియైదు సంవత్సరములు ప్రజాపాలనము చేసెను. కామార్ణవునితండ్రి గుణార్ణవుఁడు; ఇతఁ డిరువదియేడు సంవత్సరములు భూమియేలెను. గుణార్ణవునితండ్రి కామార్ణవుఁడు. ఇతడన్నయైన వజ్రహస్తుఁడు౧౫ సంవత్సరములు దేశ మేలినతరువాత ప్రభుత్వమునకు వచ్చి పందొమ్మిదేండ్లు నేల యేలెను. కామార్ణవునితండ్రి (?) రణార్ణవుఁడు;

ఇతఁ డైదు సంవత్సరములు భూపరిపాలనము చేసెను. రణార్ణవునితండ్రి కామార్ణవుఁడు; ఇతఁ డేఁబదియేండ్లు ప్రభుత్వము చేసెను. కామార్ణవుని తండ్రి దానార్ణవుఁడు, ఇతఁడు నలువది సంవత్సరములు రాజ్యము చేసెను ఇతనిరాజ్యకాలము ౭౩౦ వ సంవత్సర ప్రాంత మయినది. ఈ కాలము మొదలుకొని ౧౦౭౭ వ సంవత్సరము వఱకును కళింగరాజ్య మేలినవారిలో గంగ గను పేరు గలవాఁడు లేనందున, భీమకవికాలములో నుండిన కళింగగంగింతకుఁ బూర్వపువాఁడు కాఁడని నిశ్చయింపక తప్పదు. ఈతనికాలము లోనే భీమకవి యుండిన పక్షమున, అతఁడు పండ్రెండవ శతాబ్దా రంభమున నున్నట్లు తెలియుగదా? ఈకాలము సాహిణిమారఁడు మొదలైనవారి కాలముతో సరిపోకున్నది. అందుచేత భీమకవి యీతనికాలములోనివాఁడు కాఁడనియు, తరువాత నున్న వేఱొక కళింగగంగు కాలములో నుండి యుండుననియు, ఎంచవలసి యున్నది.

ఇయ్యెడ శ్రీ జయంతి-రామయ్య పంతులుగారు. ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు ప్రకటించిన కవిజనాశ్రయ పీఠికలో క్రింది విషయమును వ్రాసియున్నారు

“....ఈ పద్యములలో 'గళింగగంగు' రాయకళింగగంగునని పేర్కొనబడిన రాజెవ్వడో నిర్ణయింపవలయును. ౧౧౧ వ శతాబ్దము మొదలు రమారమి యఱువది సంవత్సరములు కళింగదేశము ననంతవర్మయను నామాంతరముగల చోడకళింగగంగ దేవుడు పాలించి ట్లు శాసనముల వలన దెలియుచున్నది ....ఈ కాలమునందే రాజరాజచోడగంగను రాజు వేంగిదేశమును బాలించుచుండెను. ఈతఁడు రాజరాజ నరేంద్రుని పౌత్రుఁడు. కాఁచీపురము రాజధానిగా వేంగిచోళదేశముల నేకచ్ఛత్రముగా నేలిన కులోత్తుంగ చోళుని యగ్రపుత్రుండు. తండ్రి యాజ్ఞానుసారముగ వేఁగి దేశమును బాలించెను .... ప్రస్తుత విచారమునకు భీమకవి కాశ్రయుండైన రాజు పీఠిపురిలో నెవ్వఁడైన నొక్కటియే? కావి, కళింగ గంగను సంజ్ఞ యనంతవర్మ చోడగంగ దేవునికే యన్వర్థమగును .. .. భీమకవి యీతని రాజ్యకాలము పూర్వభాగములో నుండెననిన, ౧౨౮ శకా

బ్దమున పట్టాభిషిక్తుడైన రాజరాజునాస్థానకవియగు నన్నయభట్టు నకు రమారమి ౧౦౦ సంవత్సరముల తరువాతివాడగును. భీమకవి యనంతవర్మ రాజ్యావసానదశయం దుండెననుకొన్నచో మఱి ముప్పది, నలువది సంవత్స రముల తరువాతి వాడగును. కాని శ్రీరామమూర్తిగా రనుకొన్నట్లు నన్నయభట్టుకంటె ప్రాచీనుడుకాడు. వీరేశలింగము పంతులుగా రెంచినట్లు ౧౪-వ శతాబ్దము వాఁడగును.''

పయియంశములను బట్టి శ్రీరామయ్యపంతులుగారు రాయ కళింగగంగును రాజరాజ చోడ గంగును విభిన్న వ్యక్తులని తలంచినట్లును, ఇరువురు నభి న్నులని శ్రీ వీరేశలింగము పంతులుగారు తలంచినట్లును తెలియుచున్నది. మఱియు రాజరాజ చోడగంగు రాజరాజ నరేంద్రుని దౌహిత్రుడని శ్రీ వీరేశలింగము పంతులుగారు తలంచినట్లు తెలియుచున్నది.

సీ. వచియింతు వేములవాడభీమనభంగి
    నుద్దండలీల నొక్కొక్కమాటు
భాషింతు నన్నయభట్టుమార్గంబున
    నుభయవాక్ప్రౌఢి నొక్కొక్కమాటు
వాకొత్తు తిక్కయజ్వప్రకారము రసా
    భ్యుచితబంధముగ నొక్కొక్కమాటు
పరిఢవింతు ప్రబంధపరమేశ్వరుని రేవ
    సూక్తివైచిత్రి నొక్కొక్కమాటు

    నైషధాదిమహాప్రబంధములు పెక్కు
    చెప్పినాఁడవు మాకు నాశ్రితుఁడ వనఘ
    యిపుడు చెప్పఁదొడంగిన యీప్రబంధ
    మంకితముసేయు వీరభద్రయ్యపేర.

అను పద్యములో శ్రీనాథుఁడు చెప్పిన కవులవరుసనుబట్టి భీమకవి నన్నయ భట్టారకునికి పూర్వుఁడేమో యని భ్రమ కలుగుచున్నది. కాని యీకవి

* ఇట్లభిప్రాయ పడినవారు శ్రీ గురుజాడ శ్రీరామమూర్తి పంతులుగారు.

పండ్రెండవ శతాబ్దమధ్యమునకు లోపల లేన ట్లింతకంటెఁ ప్రబలము లయిన నిదర్శనములు కానవచ్చుచున్నవి. రాజనరేంద్రుని యనంతరమునఁ చోళులు వేఁగిదేశము నాక్రమించుకొన్నతరువాత పండ్రెండవ శతాబ్దమధ్య మునఁ దెనుఁగుదేశములోఁ గొంత భాగము రాజ్యము చేయుచుండిన చళుక్య వంశజుఁడగు చొక్కరాజుకాలమునందు భీమకవి యున్నట్లు కొందఱు చెప్పుచున్నారు. ఒకనాఁడు చొక్కరాజుద్యానవనములో మల్లెసాల స్తంభ ముమీఁదఁ గాలు చాఁచుకొని కూరుచుండి యచ్చట నున్న భీమకవినిజూచి

శా. 'ఆనీతాభ్యుపదానశృంఖలపదాభ్యాలంబిత స్తంభమా!
నేనే వేములవాడభీమకవినేనిం జిత్రకూటంబు లో
ఘానవ్యాపితపల్లవోద్భవమహాపుష్పోపగుచ్ఛంబులన్
నానాపక్వఫలప్రదాయి వగుమా నాకల్పవృక్షాకృతిన్.'

అంతట నా పందిరిగుంజ కొమ్మలతోను పత్రములతోను చిగుళ్ళతోను పుష్పములతోను ఫలములతోను పూర్వ మరణ్యములో నున్నట్లు మహా వృక్షమై యా రాజుకాలు దానిలోపల చిక్కుపడిపోయెనఁట! అక్కడ నున్నవా రందరు నా కవిశక్తి కత్యాశ్చర్యమగ్నమానసులయిరఁట! అప్పుడు రాజు తనకాలూడఁదీసికొనలేక మరల నావృక్షమును పందిరికంబమునుగాఁ జేయవలయునని భీమకవిని ప్రార్థింపగా నతఁడు

'ఉ. శంభువర ప్రసాదకవిసంఘవరేణ్యుఁడ నైన నావచో
గుంభన చేయ నెంతో యనుకూలత నొంది తనూనభావనన్
గుంభినిఁ జొక్కనామనృపకుంజరుపందిటిమల్లెసాలకున్
స్తంభమురీతి నీతనువుఁ దాలిచి యెప్పటియట్ల యుండుమా.'

అను పద్యమును జెప్పి. వృక్షమును మరల యథాపూర్వకముగా పందిరి స్తంభమునుగా మార్చివేసెనఁట! భాస్కరరామాయణమును కృతినందిన సాహిణిమారఁ డీతనికాలములోనివాఁ డగుటచే భీమకవి పండ్రెండవ శతా బ్దాంతమునను మధ్యమునను జీవించి యుండలేదనియు చొక్క నృపాలుఁడు పండ్రెండవ శతాబ్దమధ్యమునఁగాని యంతమునఁగాని యుండినవాఁడు కాఁడనియు, స్థాపించుచున్నది. అప్పకవీయమునం దుదాహరింపబడిన యీ

క్రింది భీమకవి చాటుధారాపద్యమువలన మారఁడు చొక్క నృపాలుని కాలములోనివాఁ డగుట తేటపడుచున్నది:

ఉ॥ చక్కఁదనంబుదీవి యగు సాహిణిమారఁడు మారుకైవడిన్
బొక్కిబడంగలండు చలము న్బలముంగల యా చళుక్యపుం
జొక్కనృపాలుఁ డుగ్రుఁడయి చూడ్కుల మంటలురాలఁజూచినన్
మిక్కిలి రాజశేఖరునిమీఁదికి వచ్చిన రిత్తవోవునే

ఈ సాహిణిమారఁడును, హుంకక్కిభాస్కరుఁడును గణపతిదేవునిమనుమఁడైన ప్రతాపరుద్రునికాలములో నుండినట్లు సోమదేవరాజీయమునఁ జెప్పఁబడియున్నది. ప్రతాపరుద్రునికాలములో నున్న సాహిణిమారఁడు పదుమూడవ శతాబ్దాంతమునను పదునాల్గవ శతాబ్దాదియందును నుండవలసియున్నందున, చొక్కనృపాలుఁడును, భీమకవియుఁ గూడఁ బదునాల్గవ శతాబ్దాదియం దుండినవారని నిశ్చయింపవలసియున్నది: చొక్కనృపాలు, సాహిణిమారుల విషయమున 'ఆంధ్రకవితరంగిణి'లో క్రింది రీతిని గలదు. "(ఈ చక్కదనంబురీవి) యగు పద్యము వేములవాడ భీమకవి రచించెనని యనుట కప్పకవి వ్రాఁత తప్ప మఱియొక యాధారము లేదు. ఇది భీమకవికృతమని మనము నమ్మితిమేని - భీమకవికాలములోనే యిరువురు చొక్కనృపాలురుండుట యసంభవము కావున, నీ పద్యములో జెప్పబడిన చొక్కనృపాలుఁడును పై పద్యములకు (అనీతాభ్యుపదాన-శంభువరప్రసాద అను వానికి) సంబంధించిన చొక్కనృపాలుఁడును, ఒక్కడే యనుటకు సంశయింపనక్కరలేదు, ... పశ్చిమ చాళుక్యులలోఁగాని, తూర్పు చాళుక్యులలోఁగాని నేనెఱిగి యున్నంతవరకు చొక్కనృపాల నామధారు లెవ్వరునులేరు. కాని నెల్లూరు మండలములోని గూడూరు తాలూకాలో రెడ్డిపాలెమునకు 'శివారు' గా నున్న పాండురంగము నందలి పాండురంగాలయములో నున్న శాసనములలో నొకదానియందు 'చొక్కనాయనారని', నామాంతరముగల కులోత్తుంగ చోళుని పేరితో నొక శాసనమున్నది. (నె శా. సం. ౪౩౭ వ పుట సంఖ్య ౯౭) ఈ శాసనము పూర్తిగాఁ బ్రకటింపబడక పోవుటచే నీ కులోత్తుంగ చోళుఁడెవ్వఁడో,

పూర్తిగాఁ బ్రకటింపఁబడకపోవుటచే నీకులోత్తుంగ చోళుఁడెవ్వఁడో, ఈతనికాలమెద్దియో తెలిసికొనుట కవకాశము లేకపోయినది. కులోత్తుంగ చోళులు ముగ్వురున్నారు. మొదటి యాతడు శా. శ. ౯౯౧-౧౦౩౪ మధ్యను, రెండవయాతఁడు ౧౦౫౪-౧౦౬౮ నడుమను, మూడవవాడు ౧౧౦౦-౧౧౧౮ మధ్యను రాజ్యము చేసినవారు. చొక్కనృపాలకు నకు వైరియని పైపద్యములోఁజెప్పఁబడిన సాహిణి మారఁడు ప్రతాపరుద్రుని సేనాధిపతి యని చెప్పఁబడినట్టి సాహిణి మారఁడని యెంచితిమేని యాతఁడు పైని చెప్పిన ముగ్వురుకులోత్తుంగ రాజుల కాలములోను లేక వారిలో మూఁడవయాతనికిఁ బిమ్మట దాదాపు ఎనుబది సంవత్సరములలో నున్నవాడు. కావున యీ పద్య మర్థము లేని దగు చున్నది. (చూ. ఆంధ్రకవి తరంగిణి, భా. ౧, పుటలు, 244-245)

ఇంతేగాక నన్నయభట్టారకునిచరిత్రములో జూపినట్లు భీమకవి తన కవి జనాశ్రియఛందస్సులోఁ గావ్యాలంకారచూడామణిలోని పద్యము నుదాహరించుట భీమకవి తప్పక పదునాల్గవశతాబ్దాదియం దున్నవాఁ డన్న యీ సిద్ధాంతమును స్థాపించుచున్నది. భీమన దేశసంచారము వెడలినప్పుడు తనగుఱ్ఱము గుడి మెట్టలోని పోతరాజు పొలములోఁ బడఁగా రాజు దానిని కట్టిపెట్టించి విడువకున్నమీఁదట భీమన యాతనిని తిట్టిన పద్యమని యొకటి చదువుదురు. ఆ పద్యము రెల్లూరి తిరుమలయ్య చెప్పినట్లు ప్రకవి చెప్పుచున్నాఁడు కాని యీ ప్రాంతములయం దది భీమకవికథగానే చిరకాలమునుండి పరంపరగా వచ్చుచున్నది. గుడిమెట్ట పాలించినది చాగి (సాగి) పోతరాజుగాని శ్రీపతిరాజు పోతరాజు కాఁడు. ఈపోతరాజు పెద్దాపురసంస్థానాధిపతు లగు వత్సవాయవారికి మూలపురుషుఁడు. గుడిమెట్ట యను గ్రామము కృష్ణామండలములోని నందిగామకు నైఋతిమూలను నాలుగు క్రోశముల దూరమున నున్నది. ఇది పూర్వము చోళవంశపురాజులలో నొక తెగవారికి రాజధానిగా నుండెను. ఆ కాలమునందు గుడిమెట్టకు రాజుగా నుండిన త్యాగిపోతరాజు బ్రాహ్మణులకును, దేవాలయములకును బహుమాన్యము లిచ్చెను. త్యాగిపోతరాజు శాలివాహనశకము ౧౧౭౨ అనఁగా హూణ

శకము ౧౧౯౯ వ సంవత్సరమున (విజయవాడ) బెజవాడలోని మల్లేశ్వరస్వామికి భూమి యిచ్చినట్టు కనకదుర్గగుడి స్తంభములలో నొకదాని మీఁద వ్రాయఁబడియున్నది. ఈ కాలమునం దీయనపేరు గల శిలాశాసనము లనేకములు కానవచ్చుచున్నవి. అందు ౧౨౧౨ సంవత్సరములో నొకటి యనుమంచిపల్లెలోను, ఇంకొకటి నడికూడిలోను, ౧౨౧౩లో నొకటి బెజవాడలోను, మఱి యొకటి గుడిమెట్టలోను, ౧౨౩౦ లోమూడు నవాబుపేటలోను, బహుశాసనము లున్నవి. గుడిమెట్టలోని యొకదానిలో పోతరాజు రాజేంద్రచోడుని కొడుకైనట్టున్నది. పోతరాజు త్యాగశీలుఁడని విని భీమకవి యక్కడికి పోయినప్పుడు రా జాతనిగుఱ్ఱమును కట్టిపెట్టించి విడువకపోగా,

చ. హయ మది సీత పోతవసుధాధిపుఁ డారయ రావణుఁడు ని
 శ్చయముగ నేను రాఘవుఁడ [1] సహ్యజ వారిధి మారుఁ డంజనా
 ప్రియతనయుండు [2] లచ్చన విభీషణుఁ డా గుడిమెట్ట లంక నా
 జియమునఁ బోతరక్కసునిచావును నేడవనాఁడు చూడుఁడీ

అను పద్యమును జెప్పి రాజును శిక్షించె నని పెద్దలు చెప్పెదరు. ఈ పోత రాజు పదుమూడవ శతాబ్దాదియం దుండినవాఁ డగుటచేత పదునాల్గవ శతాబ్దాదియం దుండిన భీమకవి యీతనికాలమునం దుండి యీ పద్యమును జెప్పుట సంభవింపనేరదు. గుడిమెట్ట నేలినది, శ్రీపతిరాజు పోతరాజు గాక సాగి పోతరాజే యయినను, అప్పకవి చెప్పిన ట్లీ పద్యము రెల్లూరి తిరుమలయ్య చేసినదే యయి యుండవచ్చును మఱియొక పోతరాజువిషయమయి తురగా రామకవి చెప్పిన పద్యమును, కథయును గూడ నీ ప్రాంతముల యందు వాడుకొనుచున్నారు తురగారామకవి యాచనార్థము లేటవరపు పోతరాజునింటికి పోఁగా నతఁడు కవి కేమయిన నియ్యవలసివచ్చు నని యింటనుండియు భార్యచేతఁ దన భర్త యింట లేఁ డనిపించెనఁట; ఆ జాడ కవి కనిపెట్టి యాతనిభార్యను జూచి కోపముతో

1. జాహ్నవి పాంరాతరము 2. సింగన పారాంతరము,

క. కూటికిఁ గాకులు కూసెడు
నేటావల మూఁక గూడియేడువఁదొడఁగెఁ
గాటికిఁగట్టెలు చేరెను
లేటవరపుపోతరాజు లేఁడా లేఁడా ?

అని రెట్టించి యడిగి తనదారిని బోయెనఁట! భార్య యీ సంగతి మగనితోఁ జెప్పవలెనని లోపలికిఁ బోఁగా భర్త మంచముమీఁద చచ్చిపడి యుండె నఁట! అంతట బంధువు లందఱును దుఃఖించి దహన సంస్కారమునిమిత్త మయి శవమును శ్మశానమునకుఁ దీసికొనిపోవుచుండఁగా వెంట నున్న యాతనిభార్య తనకెదురయిన కవికాళ్ళమీఁదఁ బడి తనకు పతిభిక్ష పెట్టుమని వేఁడుకోఁగా నతఁడు

క. నాఁటి రఘురాము తమ్ముఁడు
పాటిగ సంజీవిచేత బ్రతికినరీతిఁ
గాటికిఁ బో నీ కేటికి
లేఁటవరపు పోతరాజ లెమ్మా రమ్మా!

అని చెప్పి యాతనిని బ్రతికించెనఁట! తురగా రామకవియు నించుమించుగా భీమకవివంటివాఁడే.

భీమకవి పదునాల్గవ శతాబ్దాది నుండియున్నట్టు పయి నిదర్శనము లన్నిటివలనను స్పష్టమగుచున్నది. ఇప్పు డేర్పడిన యీ కవికాలమును బట్టి చూడఁగా

గీ. భారతముఁ దెనిఁగించుచుఁ దా రచించి
నట్టి రాఘవపాండవీయంబు నడఁచె,
ఛందము నడంప నీ ఫక్కి సంగ్రహించె
ననుచు భీమన యెంతయు నడఁచె దావి. [పీఠిక–44 ప

అని యప్పకవి చెప్పిన వాక్యము నిరాధార మయినట్టు స్పష్టమగుచున్నది. కవుల కాలభేదముమాట యటుండనిచ్చినను, నన్నయభట్టు భారతమును దెలిఁగింప నారంభించుటచేతఁ దా నావఱకు రచించిన రాఘవపాండవీయ మణఁగెననియు, వాగ్ధశబ్దచింతామణిని జేయుటచేతఁ దన ఛందస్సును

నడఁగిపోవు ననియు భీమన తలఁచె ననుట యుక్తివిరహితమైన వెఱ్ఱిమాట యగుట యించుక యాలోచించినవారి కెవ్వరికిని దోఁచకపోదు. భారతరాఘవార్థములు గల ద్వ్యర్థికావ్యమం దొకయర్థము గల భారతమును రచించుటచే నెట్లు నశించును? పై పద్యమునందలి యుత్తరార్థములోని యుక్తి యీ యుక్తిని సహితము మించి యున్నది ఛందము నడఁచుటకఁట! వ్యాకరణమును సంగ్రహించెనఁట! 'పృష్ఠతాడనా ద్దంతభంగ' యన్నట్లు వ్యాకరణము రచిఁచుటచేత ఛఁద స్సెట్లు నశించును? వ్యాకరణము శబ్దలక్షణము; ఛందస్సు పద్యలక్షణము. ఆంధ్రశబ్దచింతామణివలన భీమన తన ఛందస్సడుగంటు నని తలఁచుకొనుట కా యాంధ్రశబ్దచింతామణిలో రెండు శ్లోకములు దక్క ఛందోవిషయ మేమియు లేనేలేదు. ఆంధ్రశబ్దచిఁతామణిని

క. 'ఆదిని భీమకవీంద్రుఁడు
గోదావరిలోనఁ గలిపెఁ గుత్సితమున; నా
మీఁదట రాజనరేంద్ర
క్ష్మాదయితునిపట్టి దాని మహి వెలయించెన్.' [పీఠిక-51 ప

అను తన యద్భుతకల్పన కాధారముగా నుండుటకయి యీ గాథను బుద్ధిమంతుఁ డైన యప్పకవియే కల్పిఁచి యుండును గాని యాంధ్రశబ్దచింతామణిని నన్నయ రచించియు భీమన చించియు నుండరు.

భీమన చాటుధార యని యప్పకవీయములో

చ. 'గరళపుముద్ద లోహ మవగాఢమహాశనికోట్లు సమ్మెటల్
హరునయనాగ్ని కొల్మి యురగాధిపుకోఱలు పట్టుకార్లు ది
క్కరటిశిరంబు దాయి లయకాలుఁడు కమ్మరి వైరివీరసం
హరణగుణాభిరాముఁ డగు మైలమభీమనఖడ్గసృష్టికిన్.'

అను పద్య ముదాహరింపఁబడి యున్నది ఈ మైలమభీమన శాలివాహన శకము ౯౨౫ వ సంవత్సరమున నుండె నని యొకచోటను, శాలివాహన శకము ౯౭౫ వ సంవత్సరమునకు సరియైన క్రీస్తుశకము ౧౦౫౩ వ సంవత్సరమునం దుండెనని యొకచోఁటను జెప్పఁబడి, మైలమభీమనకాలములో నుండినవాఁ డయినందున భీమకవి పదునొకండవ శతాబ్దములోని వాఁ డయి

నట్లు కవిజీవితములలో వ్రాయఁబడియున్నది. * ఒకవేళ మైలము భీమన్న యందుఁ జెప్పఁబడిన కాలములోనే యుండినను పై పద్యములవల్ల వేములవాడ భీమకవి యాతనికాలమునందే యుండినవాఁ డయినట్లు నిశ్చయముగాఁ జెప్ప వలనుపడదు. మైలముభీమన సంతతివారి కోరికప్రకార మైనను భీమకవి యీ పద్యమును జెప్పి యుండవచ్చును. ఈవఱకిం దుదాహరింపఁబడిన పద్యములే కాక స్వవాదోపబలార్థముగాఁ గవి జీవితములలో నుదాహరింపఁబడిన యీ క్రిందిపద్యమును భీమకవి మైలముభీమన కాలమని చెప్పఁబడెడు కాలములో నుండె ననుట నబద్ధము చేయుచున్నది

సీ. గడియలోపలఁ దాడి కడఁగి ముత్తునియఁగాఁ
దిట్టిన మేధావిభట్టుకంటె
రెండు గడెల బ్రహ్మదండిముం డ్లన్నియు
డుల్ల దిట్టిన కవిమల్లుకంటె
మూడు గడియలకు మొనసి క త్తినగండి
పగులఁ దిట్టిన కవి నానుకంటె
నరజాములోపలఁ జెఱువునీ శ్శింకంగఁ
దిట్టిన బడబాగ్ని భట్టుకంటె
నుగ్రకోపి నేను నోపుదు శపియింపఁ
గ్రమ్మఱింప శక్తి గలదు నాకు
వట్ట్రమానఁ జిగురు పుట్టింప గిటింప
బిరుద వేములాడభీమకవిని.

ఇందలి "వేములాడ" యన్న ప్రయోగము మాత్రమేకాక, ఈ పద్యమునందు బేర్కొనఁబడిన కవులును, నీ పద్యము భీమన చెప్పినది కాదని ఘోషించుచున్నారు. ఈ పద్యములోఁ బ్రథమపాదమున మేధావిభట్టు తాళవృక్షమును ముత్తునియలుగాఁ దిట్టినట్లు చెప్పఁబడిన పద్య మిది—

క. సాళువ పెదతిమ్మమహీ
పాలవరుఁడు వీఁడె వచ్చెఁ బటుగు వ్రాయుణా

---

*కవిజీవితములు.

గేలను లేదా కొక్కటి
తాళమ ముత్తువియ లగుచు ధరపైఁ బడుమా!

ఇందుఁ జెప్పఁబడిన సాళువపెద్దతిమ్మరాజు పదునేనవ శతాబ్దములోని వాఁడగుటచే భీమకవి యీతనికిఁ దరువాతివాఁడయి యుండఁడు. ద్వితీయ పాదమున ప్రౌఢకవిమల్లన బ్రహ్మదండిముండ్లు చాలఁ దిట్టినట్లు చెప్పఁబడిన పద్య మిది

క. గుడి యన్ననృపతిఁ బొడఁగన
నడవంగాఁ గొండపల్లి నగరిపడమటన్
గుడి యెడమ మడమఁ గాడిన
చెడుముండులు బ్రహ్మదండిచెట్టున డుల్లన్.

ఈ ప్రౌఢకవిమల్లన పదునేఁను శతాబ్దాంతమునం దుండినవాఁ డగుటచేత నీతనికిఁ దరువాత భీమకవి యుండి యుండఁడు. తృతీయపాదమందలి కవి భానుఁ డెవ్వఁడో తెలియ రాలేదు. చతుర్థపాదమున బడబానలభట్టు తెలుగు రాయఁడు కట్టించిన చెఱువునీ ళ్లింకఁ దిట్టినట్లు చెప్పఁబడిన పద్య మిది

క. బడబానలభట్టారకు
కుడిచేయుంగరము రవికి గొబ్బున నర్ఘ్యం
బిడు వేళ నూడి నీలో
బడియెఁ దటాకంబ నీటఁ బాయుము వేగన్.

తెలుఁగురాయనికాలము ముందే చెప్పఁబడినందున నాతనికి దరువాతనున్న బడబానలభట్టుకాలమునకుఁ దరువాతను భీమకవి యుండియుండఁడు. అప్పక వీయములో నుదాహరింపఁబడిన పై పద్యముల నన్నిటిని జదివి నడుమను గొంత తన కవిత్వము పెట్టి వ్యాకరణజ్ఞానము చాలని యిటీవలి మహాకవి యెవ్వఁడో భీమకవిపేరు పెట్టి యీ పద్యము నల్లి యుండును. ఒకవేళ భీమకవి మైలముభీమనకాలములోనే యుండి నను. ఆ భీమన పదునా కండవశతాబ్దములోవాఁడు గాక, యాతని సంతతి వాడయిన మఱియొక మైలముభీమన కావచ్చును. శ్రీనాథకవికృతమయిన

శా. అక్షయ్యంబుగ సాంపరాయని తెలుంగాధీశ కస్తూరికా
　　భిక్షాదానము చేయురా సుకవిరాడ్బృందారకశ్రేణికిన్
　　దాక్షారామచళుక్యభీమవరగంధర్వాప్సరోభామినీ
　　వక్షోజద్వయకుంభికుంభములపై వాసించు దద్వాసనల్.'

అను పద్యములో నతనికాలమునందొక తెలుగురాయ డున్నట్లు చెప్పఁబడెను. రామవిలాసములో రామరాజపుత్రుఁ డగు మఱియొక తెనుఁగురాయఁ డీ క్రిందిపద్యములో వర్ణింపఁబడినాఁడు

'మ. అచలాధీశ్వరధీరు రేకపలిదుర్గాధ్యక్షు విద్వేషిరా
　　ట్ప్రచయోద్వేలబలావలేపతిమిరప్రద్యోతనున్ విక్రమా
　　ర్కచరిత్రోత్తమకావ్యనాయకుని వేడ్కం బ్రస్తుతింపదగున్
　　సుచరిత్రాఢ్యుని వత్సవాయతెలుఁగుక్షోణీశచూడామణిన్.

ఇరువురును కస్తూరికే ప్రసిద్ధు లయినట్లు చెప్పఁబడినను, పదునాల్గవ శతాబ్దాదిని భీమకవికాలములో నుండిన తెలుంగాధీశుఁడును, పదునైదవశతాబ్దాదిని శ్రీనాథునికాలములో నూఱు సంవత్సరములకుఁ దరువాత నుండిన తెలుంగాధీశుఁడును, ఏకపురుషుఁడుఁగా గాక వేఱువేఱు పురుషు లయి యుండవలెను. ఈ ప్రకారముగానే మైలముభీమన లనేకులుండవచ్చును. ఇది గాక కవి జీవితములోనే రణతిక్కన రణనిహతుఁడయినప్పుడు భీమకవి రణతిక్కనిభార్యను "దీర్ఘసుమంగళీభవ" యని దీవించి

　　'క. గుణములనిధాన మగు మన
　　　రణతిక్కఁడు తాఁ గళేబరంబును శిరమున్
　　　గణఁకమెయిఁ గలయ బ్రతుకును
　　　బ్రణుతాఖిలవైరిమకుటభాసితపదుఁడై'.

అను పద్యము చెప్పి మొండెమును శిరస్సును నేకముగాఁ గూర్చి బ్రతికించె నన్నకథ ద్వాత్రింశన్మంత్రులచరిత్రమునుండి గ్రహింపఁబడి, దానినిగూర్చి *"యీ కథ కేవలకల్పితమని చెప్పుట కాధారము లేవియుఁ గానరావు"అని

* కవిజీవితములు పుట 28

వ్రాయఁబడినది. భీమకవి రణతిక్కన కాలములోనే యున్నపక్షమున, ఈ వఱకుఁ జేయఁబడిన తిక్కనకాలనిర్ణయమునుబట్టి భీమన పదుమూడవ శతాబ్దమధ్యమునకుఁ బూర్వపువాఁ[illegible]డగుటచే యేర్పడును. ఆ ద్వాత్రింశన్మంత్రుల చరిత్రములోన రణతిక్కన తల్లిపేరు మైలమ్మ యనియు పెంపుడుతల్లిపేరు పోలమ్మ యనియు వ్రాయఁబడుటయే కాక "గరళపుముద్ద" అను పద్యము భీమకవి తిక్కనఖడ్గమును బ్రశంసించుచుఁ జెప్పినట్లీ విధముగా దుదాహరింపఁబడినది—

చ. గరళపుముద్ద లోహ మవగాఢమహాశనికోట్లు సమ్మెటల్
హరునయనాగ్ని కొల్మి యురగాధిపుకోఱలు పట్టుకార్లు ది
క్కరటిశిరంబు దాయి లయకారుఁడు కమ్మరి వైరివీరసం
హరణగుణాభిరాముఁడగు మైలమతిక్కనిఖడ్గసృష్టికిన్.

ఇది యెవ్వరినిగూర్చి చెప్పఁబడిన పద్యమో బుద్ధిమంతు లూహించుకొందురుగాక। భీమకవిని గూర్చి నన్నయ చెప్పెననెడు

చ. 'మతిఁ బ్రభ నీగిఁ బేర్మి సిరి మానము పెంపున భీమునిన్ బృహ
స్పతి రవిఁ గర్ణు నర్జునుఁ [illegible] సుయోధను బోల్పఁబూన నా
మతకరిఁ దీక్ష్ణ దుష్కులు సమానుషు భిక్షు ఖలాత్ము నెంచ వా
క్పతిపు శశిన్ గొమరుసామిని మేరువు నబ్ధిఁ బోల్చెదన్."

అను పద్యమును మఱి యెవ్వరిచేతనో యెవ్వరినిగూర్చియో చేయఁబడినదయి యుండును.

భీమకవి రాఘవపాండవీయమును రచించెనని పెద్దలనుకొనుటయే గాని గ్రంథము పింగళి సూరన్ననాఁటికే నామమాత్రావశేష మయినది. ఇప్పుడీతఁడు చేసిన ఛందస్సుమాత్ర మొకటి వాడుకలో నున్నది. దానికి కవిజనాశ్రయ మని పేరు. ఇతఁడు తన ఛందస్సును రేచన్న యను కోమటి కంకితము చేసి యున్నాఁడు. రేచన్న యేకాలపువాఁడో తెలిసినది కాదు. అయినను గవిజనాశ్రయములో దిన్నకోట పెద్దన కృత మయిన కావ్యాలంకారచూడామణిలోని పద్యము లుదాహరింపఁ బడి యుండుటచేత నతఁడు పదునాల్గవ

శతాబ్దాదియం దున్న ట్లెంచవలసి యున్నది. ఇతఁడు జ్యౌతిషపటలములు వ్రాసెననియు. వానియందిప్పు డున్న వారును, మున్ను చన్నవారును, ముందు పుట్టఁబోవువారును నడుగఁబోయెడు సమస్తప్రశ్నల కుత్తరములు గలవనియు కొందఱు చెప్పుదురు. కాని యవి యన్నియు జనుల మోసము చేయుటకయి వంచకులు పన్నిన తంత్రములే కాని మఱి యేవియుఁ గావు*

ఈ మహాకవి యొకనాడు తన తల్లి బ్రాహ్మణులకు నేయి వడ్డించు చుండగా నేతిచెంబుమసి కడుపుమీద నంటుకొన్నప్పుడు "అమ్మా! నీకడుపు మసి యయినది" అని చెప్పుచు, కడుపు మసియయ్యెననుట కొడుకు చచ్చెనని యర్థ మగుటచేత నా మాట తగిలి యా క్షణముననే మృతుడయ్యెనని చెప్పుచున్నారు. మఱికొందఱు వెనుకఁజెప్పిన "వేయి గజంబులుండ" నను పద్యములో "దా బోయిన మీనమాసమున బున్నమ పోయిన షష్ఠినాటికిన్" అను వాక్యము తగిలి విధవశము చేత తల్లిని నీ కడుపు మసి యయ్యెననె నని చెప్పుదురు ఈయన కవిత్వశైలి తెలియుట కయి కొన్నిపద్యములిం దుదాహరింపఁబడు చున్నవి.

ఉ. నవ్యవిలాస రమ్యనలినం బని బాలముఖాబ్జసౌరభా
భివ్యసనంబునం బరగు భృంగకులోత్తమ తద్వియోగతా
పవ్యథ బ్రాణి నిల్పదు కృపాగుణ మేర్పడఁ బ్రాహ్మణో న హం
తవ్యఁ యనంగ నొప్పు వచనస్థితి కుంద కెఱుంగ జేయుమా.
చాటుధార

చ. బిసరుహగర్భు వ్రాఁతయును విష్ణుని చక్రము వజ్రి వజ్రమున్
దెసలను రామబాణము యుధిష్ఠిరు కోపము మౌనిశాపమున్
మసకపుఁబాముకాటును గుమారుని శక్తియు గాలుదండమున్
బసుపతికంటమంటలును బండిత వాక్యము రిత్తవోవునే — చాటుధార

ఉ. మానుగ విశ్రమాక్షరసమంచితమై స్వరమూఁదినం దదీ
యానుగుణాక్షరంబు గొని యైనను జెప్పఁగ నొప్పు నీక్రియన్

* భీమకవీయప్రశ్నలక్షణము "కవిజీవితము, లలో పుటలు (22-26)నీయఁబడినది, ఇది భీమకవి కృతమైనట్లాధారములు లేవు.

భానుసహస్రభాసి వృషభాధిపుఁడన్నటు లర్థయుక్తమై
పూనినచో నఖండవళి పొల్పగు నాదికవి ప్రణీతమై,-
[కవిజనాశ్రయము]

ఉ. వారక వారకామినుల వర్తుల చారుకుచోపగూహముల్
కోరక కోరకోల్ల సితకుంజములం జిగురాకుపానుపుల్
చేరక చారు కేరళ కళింగ కుళింగనరేంద్రమందిర
ద్వారవిహారులై సిరుల నందక నందకపాణిఁ గొల్వరే.

అప్పకవీయమునం దుదాహరింపఁబడిన యీ కడపటి పద్యమును రంగ రాట్ఛందమునం దుదాహరింపఁబడిన మొదటి పద్యమును భీమన వగునో కావో విచారింపవలసి యున్నది. మన విరచిత శతకంధర రామాయణము లోని వని యీ క్రింది పద్యము లొకలక్షణ గ్రంథములో నుదాహరింపబడినవి -

క. భువిఁబుట్టి పిఁచమడఁచెను
దివిజారాతుల దినేశదీప్తు లడర రా
ఘవుఁడనుచు మునులు పొగడిరి
దివిని దివౌకసులు మిగుల దీవించి రొగిన్.

ఉ. కలఁగకుఁడీ నభశ్చరులు కంపముఁ జెందకుఁడెప్డుఁగిన్నరుల్
తలఁకకు డచ్చరల్ మునులు తత్తఱ మొందకుఁడేను వచ్చిమీ
యలజడు లెల్లఁబాపి మిము నందఱఁ గాచెద నంతవట్టుమీ
గలిబిలి మాని యుండుఁడని కైటభమర్దనుఁడోలిఁబల్కెనన్.

భీమన నృసింహపురాణములోని వని యీ క్రింది పద్యము లొక లక్షణ గ్రంథమునుండి రామకృష్ణకవిగారి చేతను తన్మిత్రులు ప్రభాకర శాస్త్రి గారిచేతను వరుసగా నుదాహరింపఁబడివి

ఉ వాండిమి నల్లసిద్ధిజనవల్లభుఁడోర్చిన రాజు భీతుఁడై
యాంధ్రను గానకుఁడ వృషభాంకము బెట్టికొనంగఁ జూచితో

నేండిది యేమి నీవనుచు నెచ్చెలులెల్లహసింప నంతలో
మూండవకంటితోడిదొర మూ ర్తి వహించిన మొక్కి రంగనల్

క. ఈ క్షితికి వచ్చి వేగమ
దాక్షారామమున వారతరుణులనృత్యం
బీక్షించి యంతకంరెను
దక్షణమున నేర్చి రంభ తగ వేర్పడగన్.

ఈ పుస్తకములను జూచి పరీక్షించిఁ గాని యివి యీకవి వగునో కావో యీ కవి యేకాలమువాడో నిర్ణయించుట కనుకూలపడవు. ఇందుదాహరింపఁబడిన నల్లసిద్ధి పంద్రెండు పదుమూడవ శతాబ్దములలోనివాడు. ఈ నడుమ నాంధ్రసాహిత్య పరిషన్మండలివారు ప్రచురింపఁబూనుకొన్న కవిజనాశ్రయము ముద్రితప్రతి యొకటి నేను జూడఁదటస్థించినది. దానిపీఠిక యింకను ముద్రింపఁబడకపోయినను తత్పుస్తకసంపాదకు లగు జయంతి రామయ్య పంతులుగారి దయవలన నేను దానిని జదువఁగలిగితిని. దానియందు వారు భీమకవికాల విషయమున నేను వ్రాసిన దానిని ఖండించి యాతని కాలము పంద్రెండవ శతాబ్దమనియు, అతడు నన్నయ భట్టారకునకు తిక్కన సోమయాజులకును నడిమి కాలములం దుండువాఁడనియు, నిర్ధారణము చేయఁబ్రయత్నించిరి. దానిని సావధానముగాఁ జదివి యాలోచించినమీఁదటఁ గూడ నా యభిప్రాయము మాఱినది కాదు. ఇప్పుడు కవిజనాశ్రయము భీమకవిరచితము కానే కాదని నాకుతోచుచున్నది. పుస్తకమునందెక్కడను భీమకవివిరచిత మని చెప్పఁబడక పోవుటయేకాక

క. 'అనవద్యకావ్యలక్షణ
మొనరఁగాఁ గవిజనాశ్రయుడు మల్లియరే
చనసుకవి కవిజనాశ్రయ
మను ఛందముఁ దెనుఁగుబాస నరుదుగఁ జెప్పెన్.'

అను పద్యమునందు మల్లయరేచఁడు దానిని రచియించినట్టు స్పష్టముగాఁ జెప్పఁబడి యున్నది. 'భీమకవివిరచిత మని యూహించుటకుఁగల యాధారములు ప్రక్షిప్తము లని రామయ్యపంతులుగారు విడిచిపెట్టినవియు, గొన్ని

ప్రాఁతప్రతులలోఁ బయి పద్యమునకుఁ బూర్వమునం దుండిననియు నైన వీక్రిందిపద్యములు

'క. పరఁగిన విమలయశోభా
సురనిరతుఁడు భీమనాగ్రసుతుఁ డఖిలకళా
పరిణతుఁ డయ్యెను భూసుర
వరుఁడు ప్రసాదోదితధ్రువశ్రీయుతుఁడై.

క. అసమానదానరవితన
యసమానోన్నతుఁడు యాచకాభరణుఁడు ప్రా
ణసమానమిత్రుఁ డీ కృతి
కి సహాయుఁడుగా నుదాత్తకీర్తిప్రీతిఁ'.

ఈ పద్యములయం దైనను గ్రంథమును భీమన చేసినట్లు చెప్పఁబడలేదు. మన యను భూసురుని యగ్రపుత్రుఁ డెవ్వఁడో గ్రంథరచనయందు శ్రావకాభరణాంకుఁ డైన రేచనకు సహాయుఁ డయినట్టున్నది. మన కొడు కయిన బ్రాహ్మణుఁ డెవ్వఁడో కవిజనాశ్రయమును తాను జేసి ధనస్వీకారము చేసి మహాధనికుఁ డైన జైనకోమటి రేచన్న చేసిన ట్టయి నను జెప్పియుండును. లేదా,పయి పద్యములయం దున్నట్టుగా గ్రంధ రచమునందు మల్లియ రేచన్నకు తోడుపడి యయిన నుండవలెను. వేతొకచోట నేను భీమనాగ్రసుతు డనగా భీమనయే యని సాధింపఁ జేసిన యర్థము తప్పు. భీమతనూజుఁ డని యింకొకచోటఁ బుస్తకమునందే యంత్యప్రాస మున కుదాహరణముగాఁ జెప్పఁబడిన యీ క్రిందిపద్యమునందున్నది.

క. 'జననుత మతనూజా!
సునయార్పితవిభవతేజ సుభగమనోజా!
వినుతవిశిష్టసమాజా!
యన నంత్యప్రాసమగు నహర్పతితేజా!'

ప్రక్షిప్త మని విడిచిపెట్టబడిన యింకొక పద్యమును రామయ్యపంతులు గారు తమ పీఠికయం దీ క్రిందిదాని నుదాహరించియున్నారు

క. వేములవాడను వెలసిన
భీమేశ్వరుకరుణ గల్గు భీమసుకవి నేఁ
గోమటిరేచనమీఁదను
నీ మహిఁ గవు లెన్న ఛంద మెలమి రచింతున్

ఈ పద్యము నిటీవలివా రెవ్వరో చేసి కవిజనాశ్రయమునఁ జేర్చి రనుటకు సందేహము లేదు. ఇట్లు కవిజనాశ్రయమును రేచన రచియించెనా? భీమన రచియించెనా? యని సందేహపడుచుండఁగా నీ నడుమను పులిమీఁద పుట్ర వచ్చినట్టుగా వీ రిరువురునుగారు-కవిజనాశ్రయమును రచించినవాఁడు గోకర్ణుఁడని యొక క్రొత్తసిద్ధాంతము వచ్చినది. దీనిని మొట్టమొదట బైలు దేఱఁదీసినవారు శ్రీమానవల్లి రామకృష్ణకవిగారు. ఈ కవిగా రాంధ్రరాజ కవు లను శీర్షికతో ౧౯౧౦వ సంవత్సరపు ఆంధ్రపత్రిక యుగాదిసంచి కలో వ్రాసి దానిలో గోకర్ణుని గూర్చి యిట్లు చెప్పియున్నారు.

''ఇతడు (గోకర్ణుఁడు) సూర్యవంశపు క్షత్రియుఁడు .... ప్రస్తుతము నైజామురాజ్యమున వనపర్తి సంస్థానమునకు సమీపమున శిధిలమయి యున్న వర్ధమానపురమున కధీశ్వరుండు.. ఇతనితండ్రి భీమన, గురువు వాగీంద్రచూడామణిఁ 1 యను జైనసమయాచార్యుఁడు. ఇతఁడే భీమకవికిఁ గర్తృత్వ మారోపింపఁబడిన కవిజనాశ్రయ మను ఛందోగ్రంధమును రచించి జగదేకమల్లునకు సేనాపతియగు రేచభూపున కంకితము చేసెను. ఈ రేచనికిఁ గవిజనాశ్రయుఁ డనియు గోకర్ణునకు శ్రావకాభరణాంకుఁ డనియు బిరుదములు గలవు. దీనిలో నాలు గాశ్వాసములును. జైనకార్య ధర్మముల ననుసరించి వాగ్దేవతాస్తుతితో, బ్రారంభింపఁబడినవి .... వేములవాడ భీమకవి రచించినది నృసింహపురాణము గాని కవిజనాశ్రయము కాదు. సంయుక్తయతిలక్షణమున, ''భాస్కరకులవిలసితవార్ధిచంద్ర గోకర్ణనృపా'' యనుటయే చాలినంత నిదర్శనము. 2

ఇప్పుడు ముద్రింపబడిన కవిజనాశ్రయమునందు సంయుక్తయతిలక్షణ మున ''స్మరసన్నిభసుభగమూర్తి మల్లియరేచా'' అని యున్నది. గాని

(1) ఇతఁడు వాదీంద్ర చూడామణి కాని వాగీంద్ర చూడామణి కాఁడు.
(2) గోకర్ణుండు వ్రాసిన ఛందస్సు కవిజనాశ్రయము కాదు. అది వేఱు

భాస్కరకులవిలసితవార్ధిచంద్ర గోకర్ణీనృపా" యని లేదు. పూర్ణమైన పద్యమిది

క. వరకృతులకు సంయుక్తా
క్షరములలో నెద్ది యైనఁ జను వడి యిడఁగా
గురుబుధజనవరదాయక
స్మరసన్నిభసుభగమూర్తి మల్లియరేచా.

ఇది రకారప్రాసములో నున్నది; రామకృష్ణకవిగా రుదాహరించినది లకార ప్రాసములో మన్నది. రామకృష్ణకవిగారు నూతనముగాఁ జేసిన యీ సిద్ధాంతమును చదివి ౧౯౧౨ వ సంవత్సరమునఁ బ్రకటింపఁబడిన తమ యాంధ్రులచరిత్రము ద్వితీయభాగములో చిలుకూరి వీరభద్రరావుగారు గోకర్ణునిగూర్చి యిట్లు వ్రాసిరి —

"భీమన సోదరుఁడైన గోకర్ణుఁడు వాగింద్రచూడామణి యను జైన సమయాచార్యుని శిష్యుఁడు వర్ధమానపురాధీశ్వరుఁడు. ఇతఁడు భీమకవికిఁ గర్తృత్వ మారోపింపఁబడిన కవిజనాశ్రయ మను ఛందోగ్రంథమును రచించి కల్యాణపురాధీశ్వరుండైన చాళుక్య జగదేక మల్లునకు సేనాపతి యగు రేచభూపాలున కంకితము చేసెను. ఈ రేచనికిఁ గవిజనాశ్రయుఁ డనియు గోకర్ణునకు శ్రావకాభరణాంఁ డనియు బిరుదనామములు గలవు. కవిజనాశ్రయములో నాలు గాశ్వాసములును జైనకావ్యధర్మముల ననుసరించి వాగ్దేవతాస్తుతితోఁ బ్రారంభింపఁబడినవి. వేములవాడ భీమకవి రచించినది నృసింహపురాణముగాని కవిజనాశ్రయము కాదు."

వీరిరువురును గోకర్ణుఁడు రచించిన గోకర్ణఛందస్సని వేఱొక ఛందస్సుండఁగా గోకర్ణుఁ డింకొకరి పేరు పెట్టి యింకొక ఛందస్సును రచించుట యావశ్యకము కా దనియు, రేచన్న భూపాలుఁడు గాక కోమటి యని "వణిగ్వంశచూడామణిః బంధుచింతామణిః శిష్టరక్షామణిః సుందరీవశ్యవిద్యామణిః రేచనాః ఖ్యావ్యసంసూచనాః" యని కవిజనాశ్రయములోనే చెప్పఁబడిన దనియు నాలోచింపరైరి. కవిజనాశ్రయము గోకర్ణవిరచితము

కాకపోవుట నిశ్చయము. తరువాత వీరభద్రరావుగారు తమ యాంధ్రుల చరిత్రములో భీమకవినిగూర్చి యిట్లు వ్రాసిరి.

"కవిజనాశ్రయము రచించినది గోకర్ణనృపాలుఁడుగాని యితఁడు గాఁడు. భీమకవినివాసస్థలము గోదావరిమండలములో గోదావరితీరమున నున్న వేములవాడ యను పుణ్యక్షేత్రము."

ఈ వేములవాడ, వీరభద్రరావుగారు చెప్పినట్లు గోదావరీమండలములోని దైనను గావచ్చును, రామయ్యపంతులుగారు చెప్పినట్టు గోలకొండదేశము లోనిదైనను గావచ్చును గాని కవిజనాశ్రయమును రచించినది వేములవాడ భీమకవి మాత్రము కాదు. కవి నివాసమైన వేములవాడ గోదావరి మండలములోని దనియే నా నమ్మకము. గోలకొండమండలములోని వేములవాడయే దాక్షారామ మని యచ్చటి స్థలపురాణములలో నుండుట భీమకవి యచ్చటివాఁడని నిరూపించుట కయి చేయఁబడిన నూతనాద్భుత కల్పనమయి యుండును. కవిజనాశ్రయకాలమును నిర్ణయింపవలె నన్నచో గ్రంథకర్తయైన రేచన్నకాలమునో యతనిగురువైన వాగీంద్ర చూడామణికాలమునో సప్రమాణముగా నిరూపింపవలెను. అంతేకాని భీమకవి వని చెప్పఁబడెడు చాటుధారలనుబట్టియాపని సాధ్యము కాదు. ఈ చాటుపద్యములలో నొకదానినిబట్టి పన్నెండవ శతాబ్దమును, ఇంకొక దానిని బట్టి పదుమూడవ శతాబ్దమను, వేఱొకదానినిబట్టి పదునాల్గవ శతాబ్దమును, మఱియొక దానిని బట్టిపదునాఱవ శతాబ్దమును నగుచున్నది. పరస్పర విరుద్ధకాలములను దెలిపెడి యీ చాటువులలో దేనిని నమ్మి కళింగగంగుని కాలమువాఁడనికాని, పోతరాజుకాలమువాఁ డనికాని, సాహిణి మారనికాలమువాఁ డనికాని, బడబానలభట్టారకాదుల యొక్కరి కాలమువాఁడని కాని, నిర్ణయింప వచ్చును? కవికాలమును నిర్ణయింపవలె నన్నచో నున్నయెడల నిర్వివాదముగా కవిదని యొప్పుకొన్న గ్రంథమును బట్టి నిశ్చయింపవలెను, ఏదోమంచి గ్రంథమును జేయక నాలుగు చాటుధారాపద్యముల నల్లినమాత్రముచేత నాతని నెవ్వరును మహాకవినిగా

భావించి స్తుతించియుండరు పదునేడవ శతాబ్దాది నుండియుఁ గవు లనేకులు తమ గ్రంథాదిని భీమకవిని పూర్వకవి స్తుతిలోఁజేర్చి యున్నారు. అందుచేత వారికి బూర్వముచం దీతఁడేదో గొప్ప గ్రంథమును జేసి యుండవలెను. పదునాల్గవ శతాబ్దాంతమువఱకును నున్న తిక్కన, యెఱ్ఱాప్రెగడ, రంగనాధుఁడు, భాస్కరుఁడు, కేతన, మారన, మంచన జక్కన, విన్నకోట పెద్దన్న, మడికిసింగన్న మొదలైనవా రెవ్వరును భీమకవిని బేర్కొనకయుండుట చేత నాతడు పదునాల్గవ శతాబ్దమునకు బూర్వపువాఁడు కాడని యూహింపఁబగి యున్నది. ఈతనిని మొట్టమొదట బేర్కొన్నవాఁడు శ్రీనాథుఁడు. అనంతామాత్యుఁడు తన భోజరాజీయములో నీ క్రింది పద్యమున భాస్కరుని, రంగనాధుని, అమరేశ్వరుని బేర్కొనియు భీమకవి పేరు చెప్పలేదు

ఉ. నన్నయ్య భట్టుఁ దిక్కకవినాయకు భాస్కరు రంగనాథుఁచే
రెన్నిక కెక్కినట్టి యమరేశ్వరు నెఱ్ఱన మంత్రి నాదిగా
జన్న కవీంద్రుల న్నవరసస్ఫుటవాణు లనంగ ధాత్రిలో
నున్న కవీంద్రులం దలఁతు నుల్ల మెలర్పఁగ వాగ్విభూతికిన్!

శ్రీనాథుని తరువాత ప్రౌఢకవి మల్లన్న తన రుక్మాంగదచరిత్రము నందు భీమకవి నీక్రింది పద్యమునస్తుతించియున్నాఁడు

ఉ. నన్నయభట్టుఁ దిక్కకవి నాచనసోముని భీమనార్యుఁబే
రెన్నికఁ జిమ్మపూడి యమరేశ్వరు భాస్కరు శంభుదాసునిన్
సన్నుతిచేసి వాక్యసరసత్వము వీనుల కింపుమీఱ న
త్యున్నతిగా నొనర్తు నెఱయోధులు మేలనఁ గావ్య మిమ్ములన్.

ఇందఱుకవుల పొగడ్త కర్హమయిన భీమనచే రచియింపఁబడిన యుద్గ్రంధ మ్మేదియో నా కింత వరకుఁదెలియరాకున్నది. నృసింహపురాణమని యొకరును, శతకంధరరామాయణ మని యొకరును, భీమకవి కృతములని చెప్పిరి కాని యట్టి వైష్ణవ గ్రంథములను వీరశైవుఁడును శివపుత్రుఁడు నైన భీమకవి రచియించి యుండునని గ్రంథములను జూచి తృప్తినొందు

వఱకు ననేను విశ్వసింపఁజాలను. నేను చూచినంతవఱకు భీమకవివిరచిత కృతినిగూర్చి నా కొక్క యాధారము కనఁబడుచున్నది. కృష్ణదేవరాయనికిఁ గొంచెము ముందున్నవాఁడయి ౧౫౦౦వ సంవత్సరప్రాంతమునందు బసవ పురాణమును పద్యకావ్యమునుగా రచించిన పిడుపర్తి సోమనాథకవి భీమకవి బసవపురాణమును రచియించె నని తన గ్రంథముయొక్క ప్రథమాశ్వాస ములో నీ క్రిందిపద్యమునందుఁ జెప్పియున్నాఁడు.

సీ. విరచించె జైమిని వేదపాద స్తవం
బొకపాదమునను వేదోక్తి నిలిపి
హరభక్తి వైదికం బని శ్రుతు లిడి చెప్పెఁ
బ్రతిభ సోమేశుఁ డారాధ్యచరిత
సరవి శ్రీనాథుఁ డా చరితి పద్యప్రబం
ధము చేసె ద్విపదలు తఱచు నిలిపి
యాతండు పద్యకావ్యము చేసె నైషధ
మంచితహర్ష వాక్యములఁ బెట్టి
సోమగురువాక్యములఁ బెట్టి భీమనుకవి
గరిమ బసవపురాణంబు గణనఁ జేసె
గానఁ బూర్వకావ్యము వేఱుగతి రచించు
వారి కాదికావ్యోక్తు లు వచ్చి నెగడు.

ఈ కవి శ్రీనాథునికిఁ దరువాత నేఁబది యఱువది సంవత్సరములకే యున్న వాఁ డగుటచేత నాకాలపు సంగతులను చక్కఁగా నెఱిఁగినవాఁడు. పాల్కురికి సోమనారాధ్యుఁడు తెలుఁగున రచించిన ద్విపదకావ్యముల రెంటిలో పండితారాధ్యచరితము నక్కడక్కడ ద్విపద లుంచుచు శ్రీనా థుఁడు పద్యకావ్యమునుగాఁ జేసె ననియు, బసవపురాణమును భీమకవి పద్యకావ్యమునుగాఁ జేసె ననియు కవి చెప్పుచున్నాఁడు. తనకుఁ బూర్వ మునందే భీమకవి బసవపురాణమును పద్యకావ్యమునుగాఁ జేసి యుండిన

యెడలఁ దాను మరల బసవపురాణమునే పద్యకావ్యమునుగా రచింపవలసిన యావశ్యక మేమి వచ్చినది? ఏమియు రాలేదు. మహాకవియైన భీమన కంటెఁ దానెక్కువ ప్రౌఢముగాను మనోహరముగాను రచియింపఁగలుగుదు నన్న నమ్మకముచేతనా? కాదు. అందుచేత భీమకవి బసవపురాణమును పద్యకావ్యమునుగాఁ రచించినది తెలుఁగుభాషలోఁ గా దనియు, వేఱొకభాషలో ననియు నిందువలనఁ దేలుచున్నది. కవి శ్రీనాథుఁ డారాధ్యచరిత్రమును బద్యకావ్యముగాఁ జేసె నని చెప్పి దానిక్రిందనే సందర్భమంతగా కళుఁబడని నైషధభాషాంతరీకరణకథనము నుగ్గడించుట భీమకవిది భాషాంతర మనియు. నైషధమునందు వలెనే ప్రతిభాషాంతరీకృత గ్రంథమునందును మూలగ్రంథవాక్యములు కొన్ని పడుట యనివార్య మనియు చూపుటకొఱకయి యున్నది. ఆ కాలమునందు భీమకవి తన భాషాంతరమునందు మూలగ్రంథవాక్యములనే కొన్నిటిని బెట్టెనని జనులు నిందించుటవలన నిట్లు వ్రాయవలసి వచ్చియుండును. భీమకవిది భాషాంతరమైనచో నది యే భాష? వైష్ణవమత గ్రంథములు సాధారణముగా నఱవములో నుండునట్లే శైవమతగ్రంథములు కన్నడములో నుండును గానఁ గర్ణాటక భాష యని వేఱుగఁ జెప్ప వలసిన పని లేదు. ఆ కాలమునందలి తెలుఁగు పండితుల కందఱికి సంస్కృత కర్ణాటకభాషలు సాధారణముగా వచ్చుచుండును. అందుచేత తెనుఁగును సహితము కర్ణాటక మనుచుండుట యప్పటప్పుడు కలదు. శ్రీనాథుఁడు భీమఖండములో నేమనెనో చూడుఁడు.

తే. 'ప్రౌఢిఁ బరికింప సంస్కృతభాష యండ్రు
పలుకునుడికారమున నాంధ్రభాష యందు
రెవ్వ రేమన్న నండ్రుగా కేలకొఱత
నాకవిత్వంబు నిజము కర్ణాటభాష *

* [తనకవి కర్ణాట భాషయని యనుట యితరుల నాక్షేపించుటకై మాత్రమని యూహింపవలెను, తనది కర్ణాటభాష యనుటకుఁ గాదు. లేదా' వినసొంపైనభాష' యని తాత్పర్య మనుకొని దాని కర్థము చెప్పవచ్చును.]

భీమకవి పాల్కురికి సోమనాథకవికృత మైన ద్విపద తెనుఁగుబసవపురాణ మును గర్ణాటకభాషలో భామినీషట్పది పద్యములలో నెనిమిదాశ్వాసముల మహాకావ్యమునుగాఁ జేసెను. ఈకవి యారాధ్య బ్రాహ్మణుఁడనియు, బసవపురాణము భీ మకవీశ్వరరగడ యను పుస్తకములను రచించె ననియు ఈతనిని సుమారు 1385 వ సంవత్సరప్రాతమునం దున్న పద్మణాంకుఁడు, 1585 వ సంవత్సరప్రాంతమునందున్న విరూపాక్షపండితుఁడు మొదలైన వీరశైవకవులు నుతించి యుండి రనియు, కర్ణాటకకవిచరితము చెప్పుచున్నది. ఆరాధ్యబ్రాహ్మణు లాంధ్రులలో తప్ప నితరులలో లేరు. భీమకవి తాను శివకవిదేవపుత్రుఁడ ననియు, ఉభయకవిత్వసమర్థుఁడ ననియు, బసవపురాణములో నీ క్రిందిపద్యమునఁ జెప్పుకొనియున్నాఁడు.

'విమల సద్గురుసేవెయలి జం।
గమభజనెయలి లింగనిష్ఠా।
సమతెయలి తనుమనధనంగళ విత్తభవభక్తి॥
సమయవార్ధి వివర్ధనోశ్వజ।
హిమగు శివకవి దేవనాత్మజ।
సుమతి భీమ నుభయ కవిత్వసమర్ధను సురుకడె'

భీమకవి తన బసవపురాణము శాలివాహనశకము 1291 కి సరియైన సౌమ్యసంవత్సర శ్రావణబహుళ దశమీ గురువారము ముగించితి నని పుస్తకాంతమున నీ క్రిందిపద్యములోఁ జెప్పికొనెను.

కోవిదరు కేళొళ్ళి తెన లుడు।
దేవనిధనయనేందు * సంఖెగ
శోవి శకవరుషం గళాగలు సౌమ్య వత్సరద॥
శ్రావణ బహుళపక్షదశమీ।

* ఉడుమదేవ (చంద్ర) =1, నిధి=9, నయన=2, ఇందు=1, అనఁగా "అంకానాం వామతో గతి" యను న్యాయమును బట్టి 1291.

జీవవార దొళాది వృషభేం
ద్రావతారద బసవచరితె సమాప్తి యాయిత్తు ॥

దీనిని బట్టి భీమకవి శకసంవత్సరము 1291 కి సరియైన క్రీస్తుశకము 1369వ సంవత్సరమున బసవపురాణమును రచించి ముగించెనని తెలియవచ్చుచున్నది గాన నితడు ౧౩౪౦-౭౦ వ సంవత్సరప్రాంతమున నుండి యుండి యున్నవాడని నిస్సందేహముగా సిద్ధాంతమగుచున్నది బసవపురాణమునందుఁ గవియే శివలెంక మంచన పండితుఁడును, గురవమల్లికార్జున పండితుడును ప్రసాదించిన "యుద్దండమతి" తో స్తుతిచేసెదనని చెప్పుకొనియుండుట చేతను, ఈతనిది యుద్దండలలిత ధారాళకవిత్వ మని యితరులు పొగడి యుండుటచేతను,

"వచియింతు వేములవాడ భీమసభంగి
నుద్దండలీల నొక్కొక్క మాట"

అని శ్రీనాథుఁ డీతనికవిత్వమును శ్లాఘించుట వింతకాదు. భీమకవి కవిత్వముయొక్క యుద్దండలీల కొంత తెలియుటకును, అతడు పాల్కురికి సోమనాథుని బసవపురాణము భాషాంతరీకరించె నని తేటపడుటకును, పయిపద్యము క్రిందిరెండు పద్యములను గూడ నిందుదాహరించుచున్నాను-

ప్రతిపక్ష సజ్జన
పక్ష సాక్షాదుక్షరాజస
దృక్ష దక్షమఖాయ మభక్షితక్ష్వేడ॥
త్రక్ష గణాసమక్ష కరుణా।
వీక్షణ జగద్రక్షణ గుణవి।
చక్షణ బసవసూక్ష్మలక్షయ రక్షి సెమ్మువను॥౧॥
ఇదుసకళ మహేశ్వరామళ।
పద పయోజ పరాగమదష

ట్పదియెనిపాల్కురికె సోమేశ్వరనకారుణ్య
ఒదవిదఖిళా ప్రపూరిత
హృదయ భీమకవి ప్రణీతా,
ఘృదయబసవపురాణకథెయొళు అష్టమాశ్వాస.

[భీమకవి కన్నడబసవపురాణమును గురించి 'ఆంధ్రకవితరంగిణి' 'లో నిట్లు వ్రాయఁబడినది 'కన్నడ బసవపురాణకర్త వేములవాడ భీమకవి యని నిస్సంశయముగాఁ జెప్పుటకు వీలు లేదని తోచుచున్నది. గ్రంథాదిని గ్రంథాంతమునను భీమకవి యని మాత్రమే చెప్పబడినది. వేములవాడ భిమకవి యని యెచ్చటను జెప్పియుండలేదు. ఈ కవి తండ్రి శివకవి దేవుఁడు. .... కన్నడ బసవపురాణ కర్త తండ్రి శివదేవుఁడని చెప్పినచో, ఈ కథకుఁ గొంత సరిపోయి యుండును. మధ్యఁకవి', శబ్దము నుపయోగించి యుండుటచే నీభిమకవి తండ్రి కవిత్వముఁ జెప్పఁ గలవాఁడయి యుండినట్లుతోఁచుచున్నది.,

'పైపద్యమును (విరచించెజై_మిని-అను పద్యమును) పిడుపర్తి-సోమ-నాధకవి, భిమకవి భాషాంతరీకరణమును సమర్థించుటకై వ్రాసినాడనుట కంటె-తన గ్రంధమునందు పాల్కురికి సోమనాధుని మూలకావ్యము నందలి వాక్యములు వచ్చిపడినను, చదువరులు తనయందు గ్రంథచౌర్యము నారోపింపకుండుటకై వ్రాసియుండెనని భావించుట సమంజస మని నాయభిప్రాయము. [పుట 224. అధస్సూచిక]

'శ్రీ వీరేశలిగము పంతులుగారు, వేములవాడ భిమకవిని, కన్నడ బసవపురాణకృతి కర్తయగు భిమకవిగా నిరూపించుట యాధారరహితమై యున్నది.' అని 'తెనుఁగుకవుల చరిత్ర' లో గలదు.

భీమకవి గ్రంథములనుగూర్చి ప్రస్తావించుచు 'తెనుగు కవుల చరిత్ర' లో 'ఈతని కృతులలో రామగోపాలచరితమను ద్వ్యర్థికావ్యము నేఁడును మఱియొక కవికృతిగా లభ్యమగు చున్నది' అని చెప్పబడినది. [పుట 288]

హరవిలాసము' భీమన కృతియైనట్లు తెల్పుచు కస్తూరి రంగకవి తన 'ఆనందరంగరాట్ఛందము' ననొక పద్యము నుదాహరించి యున్నాఁడు. ఈ భీమకవి వేములవాడభీమకవి యని చెప్పుటకుఁ దగిన యాధారములు లేవు.

"భీమన ఛందము' లోనివని రంగరాట్ఛందమున రెండు పద్యము లీయఁబడినవి. అవికవి జనాశ్రయములోఁ గానరాకున్నవి. ఛందస్సును రచించిన భీమన యొకఁడుండెనేమో?]

మడికి సింగన్న

సింగన యనెడి యీ కవి నియోగిబ్రాహ్మణుఁడు; భారద్వాజగోత్రుఁడు: గుంటూరివిభుఁడును తిక్కనసోమయాజికుమారుఁడు నయిన కొమ్మనకు దౌహిత్రుని పుత్రుఁ డయిన ట్లీతఁడు రచియించిన వాసిష్ఠ రామాయణ ములోని యీ క్రింది పద్యమువలనఁదెలియవచ్చుచున్నది.

సీ. అతడు తిక్కన సోమయాజుల పుత్రుఁడై
కొమరారు గుంటూరి కొమ్మవిభుని
పుత్రిఁజిట్టాంబిక బుధలోకకల్పక
వల్లి వివాహమై వైభవమున
భూసార మగు కోటభూమిఁ గృష్ణానది
దక్షిణతటమున ధన్యలీల
నలరు రావెల యను నగ్రహారము తన
కేకభోగంబుగా నేలుచుండి

యందుఁ గోవెల గట్టి గోవిందు సెన్న
గోపినాథు ప్రతిష్ఠయుఁ గోరిచేసి
యఖిల విభవంబులందును నతిశయిల్లె
మనుజమందారుఁ డల్లాడమంత్రి విభుఁడు.

క. ఆయ్యవతీరమణులకును
నయ్యల మంత్రీంద్రుఁడుదితుఁడై ధారుణిలో
నెయ్యెడక్కనర్థార్థులు మా
యయ్యయని పొగడఁగ నెగడె నౌదార్యమునన్

సీ॥ ఆత్రేయగోత్రపవిత్ర పేరయమంత్రి
పుత్రి సింగాంబికఁ బుణ్యసాధ్వి
వెలయ వివాహమై వేఁగిదేశంబులో

నేపారు రాజమహేంద్ర పురికి
నధిపతి తొయ్యేటి యనపోతభూపాలు*
మంత్రియై రాజ్యసంపదలఁ బొదలి
యొప్పారు గౌతమియుత్తరతటమున
మహనీయ మగు పెద్దమడికియందు
స్థిరతరారామతతులు సుక్షేత్రములును
బెక్కు లార్జించి సితకీర్తిఁ బెంపు మిగిలి
యఖిలజగదన్నదాత నా నవనిఁ బరఁగె
మధురగుణధుర్యుఁ డయ్యలమంత్రివరుఁడు.

చ. ఒనరఁగఁ దద్వధూవరు లహోబలదేవునిఁ గొల్చి తద్వరం
బున నొగి సింగనార్యుని నమోఘగుణాఢ్యు ననంతుని న్నృహీ
జనసుతు నబ్బయాంకు బుధసన్నుతిపాత్రుని నారయాహ్వయున్
గని నరసింహనామములు గారవ మారఁగఁ బెట్టి రందఱున్.

క. వారలలో నగ్రజుఁడను
వారిజదళనయనచరణవారిజసేవా
సారమతి నతులవాక్య
శ్రీరచనాచతురమతిని సింగాహ్వయుఁడన్

పైపద్యములవలన నీ కవి తిక్కనసోమయాజుల మనుమరాలి మనుమఁ డగుటయే కాక గోదావరిమండలములోని పెద్దమడికినివాసుఁ డని కూడ స్పష్టమగుచున్నది. ఈ కవి తన పద్మపురాణమునకుఁ గృతినాయకునిగాఁ జేసిన కందనమంత్రి కాకతీయగణపతికాలములో నున్న గన్నయమంత్రి మనుమని మనుమఁ డౌట కూడ కవికాలమును నిర్ణయించుట కనుకూల పడుచున్నది. గన్నయమంత్రి పుత్రుఁడు మల్లన్న. మల్లన్నపుత్రుఁడు

* [ఈ 'అనపోత భూపాలుఁడు కొంతకాల మోరుగల్లు రాజ్యమును పాలించిన కాపయనాయకునికిఁ జిన తండ్రి కుమారుఁడఁట గోదావరినది కుత్తరమున నున్న గోదావరి మండల ప్రదేశమును పాలించుటకై కాపయనాయకుఁడీతనిని నియమించెనఁట వీరు క్రీ.శ. ౧౩౭౦ వఱకుగు జీవించియున్నట్లు తెలియుచున్నదట.

గణపతి ద్వితీయపుత్రుఁడబ్బయామాత్యుఁడు. అబ్బయామాత్యుని తృతీయపుత్రుఁడు కందనమంత్రి. కందనమంత్రి తాతతాత యైన గన్నయ మంత్రి కాకతీయగణపతిదేవుని కాలములో నుండిన ట్లతనిఁగూర్చిన పద్మపురాణములోని యీ క్రింది పద్యమువలన దెలియుచున్నది.

చ. 'పరువడిఁ గాకతీయగణపక్షితినాయకునొద్ద మాన్యుఁడై
ధరణిఁ బ్రశస్తుఁడై నెగడి దానము లెల్లను జేసి భక్తిపెం
పిరవుగ గుళ్ళు గట్టి గణపేశ్వరదేవుని గోపికాధిపున్
దిరమగుచున్నలక్ష్మిని బ్రతిష్ఠలు చేసెఁ బ్రభుత్వ మేర్పడన్'

కాకతీయగణపతిరాజు ౧౨౦౦ వ సంవత్సరము మొదలుకొని ౧౨౫౦వ సంవత్సరమువఱకును రాజ్యపాలనము చేసినవాఁ డగుటచేత నాతనికి మాన్యుఁడై యుండిన గన్నయ మంత్రి ౧౨౫౦వ సంవత్సరమువఱకును జీవించి యుండె నని చెప్పవచ్చును. ఈతని సంతతి వారికి తర మొకటికి నలుబదేసి సంవత్సరములు వయోవ్యత్యాసము నేర్పఱిచినచో గన్నయ మంత్రిపుత్రుఁడైన మల్లన ౧౩౦౦-వ సంవత్సరప్రాంతమునం దుండును. మల్లన కొడుకైన గణపతి ౧౩౪౦-వ సంవత్సర ప్రాంతమునం దుండును. గణపతి కుమారుఁడైన యబ్బయ ౧౩౮౦-వ సంవత్సరము ప్రాంతమునందుండును. అబ్బయామాత్యుని నందనుఁడును పద్మపురాణకృతిపతియు నైన కందనమంత్రి ౧౪౨౦వ సంవత్సరప్రాంతమునం దుండును. మడికిసింగనార్యుఁడు తాను పద్మపురాణమును ముగించిన సంవత్సర మిదియే యని పుస్తకాంతమునం దీ పద్యమునఁ జెప్పెను.

మంగళమహాశ్రీవృత్తము

ఆకరయుగానల మృగాంకశకవత్సరములై పరఁగు శార్వరిని బుణ్య
ప్రాకటిత మార్గశిరపంచమిని బొల్చు నుడుపాలసుతవాసరమునందున్
శ్రీకరముగా మడికిసింగన తెనుంగున రచించెఁ దగ బద్మసుపురాణం
బాకమలమిత్రశశిరాంశువుగఁ గందసచివాగ్రణికి మంగళమహాశ్రీ

దీనినిబట్టి (కర=౨, యుగ=౪, అనల=౩ మృగాంక=౧) శాలివాహనశకము ౧౩౪౨వ సంవత్సరమునకు సరియైన క్రీస్తుశకము ౧౪౨౦ వ శార్వరి సంవత్సరమున మార్గశీర్ష శుద్ధపంచమీ బుధవారము నాఁడు పద్మపురాణము ముగింపఁబడె నని తెలియవచ్చుచున్నది. కృతిపతి యైన కందనామాత్యునిఁ గవి వర్ణించిన రెండు సీసపద్యముల నిం దుదాహరించుచున్నాను.

సీ. 'స్వామిభక్తుఁడు కార్యచతురుండు బహుకళా
వేది నీతిజ్ఞుఁడు విప్రహితుఁడు
సరససల్లాపుఁడు సప్తాంగరక్షణ
క్షముఁడు భావజ్ఞుఁడు సర్వసులభుఁ
డరిమంత్రభేదనపరుఁడు ధర్మాత్ముఁడు
సుందరాకారుఁడు సుజనవినుతుఁ
డురుదయాపరుఁడు నిత్యోత్సవాసక్తుండు
సద్గుణాధారుండు సౌమ్యమూర్తి
సతతగురుదేవతాపరిచారరతుఁడు
గుణసముద్రుండు కాశ్యపగోత్రజనితుఁ
డనఁగ నుతికెక్కె పెంపున నతిశయిల్లు
మువనఁద్భుతుఁడు కందనమంత్రివరుఁడు.

సీ. ఈ ధర్మచారిత్రు నే ధాత్రిఁ గాంతి యేలు
నాధాత్రిఁ గాంతి యేలు నఖిలజగము
నీ కామినీకాము నే కామినులు చూడ
రా కామినులు చూడ రన్యపురుషు
వీ యర్కసుతతుల్యు నే యర్థి గొనియాడు
నా యర్థి యొరు వేఁడ నాససేయఁ
డీ మంత్రికులచంద్రు నే మంత్రి పురణించు

నా మంత్రి విముఖాత్మఁ డఖిలమునకు
ననఁ బ్రగల్భరూపఘనదాననయమార్గ
ముల నుతింప నొప్పు మఱ్ఱిగముఱఁ
దారహారహీరధవళాంశుసమకీర్తి
కలితుఁ డౌబళార్యకందవిభుఁడు.

కృతిపతికాలము తెలిసినప్పు డాతనియేలికయైన ముప్పభరణీపాలుని కాల మిదియే యని వేఱుగఁ జెప్పవలసిన పనియే లేదు. ఈ ముప్పరాజు రామ గిరిపట్టణము రాజధానిగా గోదావరికి దక్షిణమునం దున్న సబ్బినాటి రాజ్యమును పాలించినవాఁడు. ఈ కవి యెఱ్ఱాప్రెగడకు మిక్కిలి తరు వాతివాఁ డయినను ప్రబంధపరమేశ్వరు నేల స్తుతింపలేదో తెలియదు. ఒక్క పద్మపురాణమునందు మాత్రమే కాక వాసిష్ఠరామాయణము నందును

గీ. 'వ్యాసవాల్మీకిశుకకాళిదాసబాణ
హర్షణాదుల నాఢ్యుల నాత్మ నిలిపి
సకలభాషారసజ్ఞుల సముల నన్న
పార్యతిక్కకవీంద్రుల నభినుతింతుః

అని తెలుఁగుకవులలో నన్నయతిక్కనలను మాత్రమే నుతించెను. వాసిష్ఠ రామాయణము పద్మపురాణమునకుఁ దరువాతర చియింపఁ బడిన దగుటచేత నది ౧౪౨౦. తరువాతఁ జేయఁబడినది. ఈ రెండు కావ్యములకును నడుమ సింగన్న భాగవతదశమస్కంధమును గూడఁ దెనిగించి కందనామా త్యునకే యంకిత మొనరించెను. సింగనకృత భాగవతదశమస్కంధము నాకు లభింపలేదు. * [కందనమంత్రి రాజనీతిజ్ఞుఁడే గాక కవి యని కూడఁ దెలియుచున్నది. మడికి సింగన్నయే యితని 'తారావళి' నుండి నాలుగు పద్యములను తన 'సకలనీతిసమ్మతము' నందు ఉదాహరించి యున్నాఁడు.]

* [ఇది ద్విపద కావ్యము అముద్రితము.]

అటుతరువాత నీ కవి సకల నీతిసమ్మత మను రాజనీతి గ్రంథమును సమకూర్చెనని రామకృష్ణకవిగారు చెప్పుచున్నారు. *వీని నన్నిటిని విచారించి చూడగా మడికి సింగన్న ౧౪౩౦ వ సంవత్సరమువఱకైన జీవించియుండును. ఈ కడపటి గ్రంథము పేరుదాహరింపలేదు గాని "పద్మపురాణోత్తర ఖండంబును భాగవత దశమస్కంధంబును దెనుంగున రచియించి" యని తక్కిన రెండు కావ్యములపేరులును సింగన్న వాసిష్ఠరామాయణములో నుదాహరించెను. ఇతఁడు పద్మపురాణ' దశమస్కంధములను నరాంకిత మొనర్చినను వాసిష్ఠరామాయణమునుమాత్ర మట్లుచేయక శ్రీమదహోబిల స్వామి కంకిత మొనర్చెను. వాసిష్ఠరామాయణములో నితడు మొట్టమొదట తెలుఁగు పద్యమును వేయక యాదిమకవీశ్వరాచారానుసారముగా నీ శ్లోకమును వేసెను.

> 'శ్రీమద్దివ్యమునీంద్ర చిత్తనిలయం సీతామనోనాయకం
> వల్మీకోద్భవవాక్పయోధి శశినం స్మేరాననం చిన్మయం
> నిత్యం నీరదనీలకాయ మమలం నిర్వాణసంధాయినం
> శాంతం నిత్య మనామయం శివకరం శ్రీరామచంద్రం భజే.'

ఈ యాచారమును పూర్వకవులు కొందఱు కొన్ని పుస్తకములలో ననుసరించుచు వచ్చినను నిటీవలివారు పూర్ణముగా విడిచిపెట్టినారు.

గణపతిదేవుని యాస్థానమున నుండిన కృతిపతిపూర్వుఁ డైన గన్నయ మంత్రికాలమునుండి తరమునకు నలువదేసి సంవత్సరముల చొప్పున వేసి కృతిపతియైన కందనమంత్రి కాలమును ౧౪౨౦ వ సంవత్సరమునకు దింపినట్లే కృతికర్తయైన సింగన యుండిన ౧౪౨౮-వ సంవత్సరము మొదలుకొని తరమునకు నలువదేసి సంవత్సరముల చొప్పునవేసి కృతికర్త వంశమును గణపతిదేవుని కాలములో నుండిన తిక్కన వఱకును పైకెక్కించుచు వచ్చినచో నించుమించుగా నదియు సరిపోవును. కవిసింగన్న ౧౪౨౦వ సంవత్సర ప్రాంతమునం దుండినచో నాతనితండ్రి యయ్యలుమంత్రి

* [ఈ గ్రంథమును శ్రీరామకృష్ణ కవిగారే ప్రకటించియున్నారు.]

౧౪౨౦-వ సంవత్సర ప్రాంతమున నుండును; ౧౩౮౦ వ సంవత్సర ప్రాంతమునం దుండిన యయ్యలుమంత్రితల్లి చిట్టాంబిక ౧౩౪౦-వ సంవత్సర ప్రాంతమం దుండును; చిట్టాంబిక తండ్రి కొమ్మన ౧౩౦౦-వ సంవత్సర ప్రాంతమం దుండును; కొమ్మన జనకుఁడు తిక్కన సోమయాజి ౧౨౬౦-వ సంవత్సర ప్రాంతములం దుండును. తండ్రియైన యయ్యలుమంత్రిని మంత్రిగాఁ గైకొన్న తొయ్యేటి యనపోత భూపాలుఁడు ౧౨౬౦-వ సంవత్సరము మొదలుకొని ౧౩౨౨-వ సంవత్సరము వఱకును రాజ్యము చేసెనఁట! ఇవి శకసంవత్సరములేమో! సింగకవి పద్మపురాణమునం దీక్రింది పద్యముచేత నన్నయ్యతిక్కనలను మాత్రమే స్తుతించి యున్నాఁడు-

ఉ. భారతవేదవాక్యరసభావము లజ్ఞు లెఱుంగ లేక వి
స్స్వారమనస్కులై తిరుగుచందముఁ జూచి తెనుంగుబాసఁ బెం
పార రచించి యందఱఁ గృతార్థులఁ జేసిన పుణ్యమూర్తులన్
సారమతి న్భజింతు ననిశంబును నన్నయ తిక్కనార్యులన్.

ఈ కవి భాగవతదశమస్కంధమును, పద్మపురాణోత్తరభాగమును, వాసిష్ఠ రామాయణమును, తెనిఁగించెను. నన్నయాదులకవనమందువలెనే దీర్ఘ సమాసములు లేక యీతని కవిత్వము సలక్షణ మైనదిగా నున్నది.

క. ఆ పరమేశ్వరమకుట
వ్యాపితగంగా ప్రవాహవరకవితాస
ల్లాపుఁడగు మడికి సింగనఁ
జేపట్టక కీర్తి గలదె శ్రీమంతునకున్

అను పద్మపురాణములోని పద్యమువలనను,

చ. కదిసిన నోరవోవుచును గబ్బపుదొంతుల సత్పదార్థముల్
కదుకుచు నెట్టివారిఁ బొడగన్నను గుఱ్ఱని స్నేహసౌఖ్యముల్
మదికి సహ్యమౌ శునకమార్గమునం జరియించు నోయస
త్పదకవులార! మత్కవితఁ దప్పులు పట్టక యూరకుండుడీ.

అను వాసిష్ఠరామాయణమునందలి పద్యము వలనను, కవి స్వాతిశయ భావము కలవాఁ డని తోఁచుచున్నది. కవిశైలి తెలియఁబఱచుట కయి కొన్ని పద్యములను వ్రాసియీతని చరిత్రను ముగించుచున్నాను.

౧ పద్మపురాణము:—

ఉ. వేణివిలోలనీలజలవేణి విశాలపవిత్రసైకత
శ్రోణి మరాళచక్రకులసుస్వరవాణి సరోరుహోల్లస
త్పాణి సభక్తి మజ్జనవిధావిశారదనాకలోకని
శ్రేణి మహాఘశాత్రవవిశిక్షణశాతకృపాణి యెల్లెడన్.

ఉ. ఆ తరుణీలలామకుఁ బ్రియంబుగవే చని కాంచెనా జగ
త్ప్రాతము నక్షయార్తి పరిహారతివిధానసమర్థసత్ఫల
వ్రాతము నవ్యపుష్పమకరందవిలోలుపమత్తషట్పదో
పేతము దత్తనిర్జరసమీహితజాతముఁ బారిజాతమున్.

౨. వాసిష్ఠరామాయణము

శా. ఆ రాజన్యు లుదగ్రు లుగ్రగతి నన్యోన్యప్రహారార్థులై
వీరానీకము పిచ్చలింపఁగ భుజావీర్యం బవార్యంబుగాఁ
గ్రూరాస్త్రంబుల నొండొరుం బొదివి దిక్కుల్ వ్రయ్యఁబెల్లార్చుచు
న్భోరాడంగ విదూరుఁ డీలై నపుడా భూమీశుచే భూవరా!

చ. వినుము మునినాథ! తొల్లి పదివేవురు విష్ణుల లక్ష రుద్రులన్
వనజభవాష్టకోటుల నవారణ గ్రమింగినవాఁడ నాకు నీ
యనిమిషనాయకుల్ ల[illegible], వారలనెన్న నేల? పెం
పున మిముబోటి విప్రులొ భోజనమాత్రమె నాకుఁ జూడఁగన్.

అప్పనమంత్రి

భోజమహారాజు సంస్కృతమున రచించిన 'చారుచర్య' అను వైద్యగ్రంథము నీతఁడు తెనిఁగించెను. దీనిని ముక్త్యాల సంస్థానాధీశులు ప్రకటించిరి. దీనికి శ్రీవేటూరి-ప్రభాకర శాస్త్రిగారు పీఠికను వ్రాసిరి. ఈ అప్పనమంత్రి తన్నుగూర్చి గ్రంథమునఁ దెలుపుకొని యున్నాఁడు. దానినిబట్టి యీతని వృత్తాంతము తెలియవచ్చుచున్నది. ఇఁతడు నియోగి బ్రాహ్మణుఁడు; ఆపస్తంబ సూత్రుఁడు. భారద్వాజ గోత్రుఁడు; గోవిందార్యునకును, నాగమాంబకును పుత్రుఁడు; సింగనామాత్యునికి మేనల్లుఁడు.

ఇతని 'చారుచర్య' లోని పద్యమును మడికి సింగన తన 'సకలనీతి సమ్మతము' లో నుదాహరించి యున్నందున నీతఁడు పదునాల్గవ శతాబ్దిలో నుండెనని చెప్పవచ్చును చారుచర్యలో ౨౩ పద్యములు కలవు. శైలిని బట్టి యీకవి తిక్కన, బద్దెనలకు సమకాలికుఁడై యుండునని శ్రీ ప్రభాకర శాస్త్రులుగా రభిప్రాయపడిరి.

దోనయామాత్యుఁడు

దోనయామాత్యుఁడు సస్యానందము, సర్వలోకాశ్రియమునను రెండు పద్యకావ్యములను రచించెను. ఇతనింగూర్చి శ్రీనిడుదవోలు—వేంకట రావుగారు తెలుఁగువారికి కెఱుకపఱచినారు. (చూ భారతి-వ్యయ. జ్యేష్ఠ మాససంచిక.) ఇతఁడు నియోగి బ్రాహ్మణుఁడు; ఆపస్తంబ సూత్రుఁడు, శ్రీవత్స గోత్రుఁడు; మాచిరాజునకును, రుద్రాంబకును పుత్రుఁడు.

సస్యానందము నాలుగాశ్వాసముల ప్రబంధము. ఇది శ్రీశైల మల్లికార్జున స్వామి కంకితము. కర్షకుల కుపయోగించు పెక్కు విషయములిందు గలవు. దీనిని తొలుత శ్రీతడకమళ్ల-వేంకట కృష్ణారావుగారు ౧౮౭౭ లో ముద్రించిరి. అందు కవి గోనయామాత్యుఁడని తెల్పఁబడినది. కాని ఆపేరు సరికాదు. ఇతఁడు దోనయ యన్నట్లే చాల తాళపత్రప్రతులలోఁ గలదు.

కవియే తన కాలమునుగూర్చి గ్రంథమునఁ దెల్పినాఁడు. కాని కాలమునుదెల్పు నా పద్యమునఁగల పాఠభేదములనుబట్టి సస్యానంద రచనా కాలము శా. శ. ౧౨౫౮, ౧౨౭౨, ౧౨౭౭ లలో నొకటియై యుండవలెను.

ఈతఁడు తన్ను 'ఉపేంద్రుఁడాదరింపఁగా' 'సర్వలోకాశ్రియము' ను చెప్పెనఁట: సర్వలోకాశ్రియ బిరుదము చాళుక్య ప్రభువులది ఆ గ్రంథము లభింపలేదు; కాని యందలి విషయము చాళుక్య వంశవర్ణనమై యుండవచ్చునని యూహించుచున్నారు. దోనయామాత్యుఁడు పేర్కొనిన యుపేంద్రుడు మూఁడవ యుపేంద్రదేవుఁడు కాని, నాల్గవ యుపేంద్రదేవుఁడు కాని యయి యుండవలెను. దోనయ నాదరించిన రాజు మూఁడవ యుపేంద్రుఁడని శ్రీ వేంకట రావుగారును. నాల్గవ యుపేంద్రుఁడని 'ఆంధ్రకవితరంగిణి' కర్త శ్రీ శేషయ్యగారును తలంచుచున్నారు.

పశుపతి నాగనాథుఁడు

శ్రీ వేటూరి - ప్రభాకర శాస్త్రిగారు కూర్చిన 'ప్రబంధరత్నావళి' లో నాగనాథుని విష్ణుపురాణమునుండి యొక పద్యముదాహరింపఁబడినది. నిజాము రాష్ట్రములోని ఓరుగల్లు సమీపమునఁగల యొకశాసనము ననుసరించి యితని తండ్రి పశుపతియనియు, ఇతఁడు క్రీ॥ శ॥ ౧౩౭౫ ప్రాంతము వాఁడనియు తెలియుచున్నది. చమత్కారచంద్రికను సంస్కృతమున వ్రాసిన విశ్వేశ్వర పండితున కీతఁడు శిష్యుడు. ఇతని విష్ణుపురాణము వెన్నెలకంటి సూరన్న రచనకంటె, ప్రాచీనము; కావున తొలియనువాద మనవలెను. ఇతఁడు సంస్కృతమున 'మదనవిలాస' మను భాణమునుకూడ రచించెనఁట. 'సింహాసనద్వాత్రింశతిక' ను రచించిన కొఱవి-గోపరాజు స్తుతించిన నాగరాజీ నాగనాథుఁడే యని విమర్శకుల యాశయము.

భవదరాయఁడు

ఇతని పూర్తిపేరు భాస్కరభవదూర మహీపతియఁట; సంగమ వంశీయుఁడును, విజయనగర పరిపాలకుఁడు అగు మొదటి బుక్కరాయల కుమారుఁడు. ఇతఁడు పోరుమామిళ్ళ తటాకమును త్రవ్వించెనఁట; ఇతని పద్యములు కొన్ని కానవచ్చుచున్నవి గ్రంధములు కానవచ్చుట లేదు. ప్రాచీనులలోఁ గొందఱు కవులీతనిని స్తుతించి యున్నారు ఈయంశములను శ్రీనిడుదవోలు వేంకటరావుగారు తెల్పుచున్నారు.

మొదటి బుక్కరాయల కుమారులలో భాస్కరుఁడాఱవ వాఁడు; అతఁడే యీకవి యైనచో నితనికాలము క్రీ॥ శ॥ ౧౩౪౩–౧౩౭౯ నడుమ అయియుండును.

కొఱవి సత్యనారన

ఇతఁడు నియోగి బ్రాహ్మణుఁడు; ఆపస్తంబ సూత్రుఁడు హారితస గోత్రుఁడు. అమరేశ్వరమంత్రి పౌత్రుఁడు. సింగయ, గంగమల పుత్రుఁడు. సింహాసన ద్వాత్రింశతికను రచించిన కొఱవి గోపరాజునకుఁ బినతాత, ఇతనికి భీమన' యను నామాంతరమున్నట్లును, ఇతఁడు రామాయణమును రచించినట్లును

క. రామాయణకృతి కృతియై
తామెఱయుచు నంధ్ర కవిపితామహుఁడనఁగా
భూమిని మించిన భీమన
నామంబునఁ బరఁగె సత్యనారన ఘనుఁడై.

అను గోపరాజు పద్యమువలనఁ దెలియు చున్నది; ఇతని ౧౪-వ శతాబ్ది యందుత్తరార్థమున నుండి యుండునని 'ఆంధ్రకవి తరంగిణిలో'నున్నది. (నాల్గవ సంపుటము. పుట 152)

శ్రీగిరికవి

ఈతఁడు 'నవనాథ చరిత్రము'ను పద్యకావ్యముగా రచించినట్లు గౌరన రచించిన ద్విపద నవనాథ చరిత్రమువలనఁ దెలియవచ్చు చున్నది. ఆ పద్యకావ్యము కాని. యితని గ్రంథాంతర మగు శ్రీరంగమాహాత్మ్యముగాని లభింపలేదు. ఈ కవి గౌరన కంటెఁ బ్రాచీనుఁ డగుటచే క్రీ. శ. ౧౩౦౭ - ౧౪౦౦ నడుమనుండి యుండవలెను. ఇతఁడు 'శ్రీగిరీశ!' అను మకుట ముతో నొక శతకమునుగూడ రచించెనని చెప్పుదురు. శ్రీరంగమాహాత్మ్యము చెన్నమల్లు శ్రీగిరన్న కృతియని సంకలన గ్రంథమును బట్టి తెలియు చున్నది

ప్రకాశ భారతయోగి

ఇతఁ డన వేమారెడ్డి యాస్థానమున నుండి పెక్కు సంస్కృతాంధ్ర గ్రంథ ములను రచించెనఁట! అందేదియు నిపుడు లభ్యముకాదు. ఇతఁడు రచించిన సీసపద్యములు రెండు భీమేశ్వరాలయము (దాక్షారామము) లోని శాసన ములలో నున్నవఁట! వానిని 'ఆంధ్ర కవితరంగిణి'కారు లిచ్చి యున్నారు (నాలుగవ సంపుటము - పుటలు 158. 159)

మడికి - అనంతయ్య

తనకు 'అనంతయ్య' అను తమ్ముఁ డున్నట్లు మడికి సింగన తనవాసిష్ఠ రామాయణమునఁ జెప్పి యున్నాడు. ఇతఁడు సుప్రసిద్ధమై చింతలపూడి యెల్లనకవి కృతముగాఁ జెల్లుబడి యగుచున్న విష్ణుమాయా నాటకమను ప్రబంధమునకు గర్తయని "ఆంధ్ర కవి తరంగిణి" లో విపులముగా వివరింపఁబడినది (నాలుగవ సంపుటము - మడికి - అనంతయ్య చరిత్రము) విష్ణుమాయా నాటకములోని కృత్యాది లభింపక పోవుటయు వివిధ తాళ ప్రతులలోని గద్యలు విభిన్నముగ నుండుటయు. ఏతత్కర్తృత్వము విషయమున సందేహమును గల్గించుచున్నవి ఆంధ్రకవి తరంగిణి కర్త శ్రీశేషయ్యగారు — లేఖకుల ప్రమాదమువలన నియ్యది రాధామాధవ (ఎల్లనార్య) కృతిగాఁ దెలియవచ్చుచున్నది గాని, కారణాంతరములను పరిశీలించిన దీనిని మడికి - అనంతయ్య యే రచించియుండునని అభిప్రాయ పడుచున్నారు.

జక్కయ కవి

జక్కయ్య యనెడి యీ కవి విక్రమార్క చరిత్రమును పద్యకావ్యముగా రచించెను. ఈతఁడు నియోగి బ్రాహ్మణుఁడు. ఈతని తండ్రి పేరన్న యామాత్యుఁడు, తాత పెద్దయామాత్యకవి. ఈ విక్రమార్క చరిత్రము దేవరాయని మంత్రియైన సిద్ధన్న కంకితము చేయఁబడెను. సిద్ధన్న మంత్రి కవినిగూర్చి యీప్రకారముగా నన్నట్లు కవి తన గ్రంథమునందుఁ జెప్పియున్నాఁడు :

సీస మాలిక

సంస్కృత ప్రాకృత శౌరసేన్యాదుల
ఘటికలో నొక శతకంబు, జెప్పఁ
బ్రహసన ప్రకరణ భాణాది బహువిధ
రూపంబు లందు రూఢి మెఱయఁ
జక్రచతుర్భద్ర చతురశ్ర త్ర రాధిక
క్షుద్రకావ్యంబులు పెక్కులు రచింప
నాంధ్ర కవిత్వంబునందుఁ బ్రబంధంబు
మేలుగాఁ బద్జ్ఞులు మెచ్చఁ జెప్ప
నిమ్మల నే రీతి నే ధాతువుల నేమి
రసమున నైన వర్ణనము చేయ
సరి నేక సంధాద్విసంధాత్రిసంధలఁ
దొడరినఁ బొరిఁబొరిఁ గడమఁ జదువ
నెవ్వఁ డే యవధాన మెఱుఁగు నయ్యవధాన
మున వాని కించుక ముల్లు చూప
వృత్తకందముఁ గందవృత్తంబునుం జతు

షంందంబు మొదలుగాఁ గలుగు గర్భ
కావ్యవర్గముఁ జెప్పగాఁ బ్రబంధంబు ఖ
క్రొత్తలు పుట్టించుకొని లిఖింపఁ
గా నక్షరచ్యుతకంబు మాత్రాచ్యుత
కంబు బంధచ్యుతకంబు నామ
గోప్యంబులుం గ్రియాగోప్యంబులును భావ
గోప్యంబులును జెప్ప గోష్ఠియందుఁ
బద్యంబు గీతికార్పటి నొగిఁ జదువఁగ
నెల్ల విద్యలనంచు లెఱుఁగ నేర్తు
వనుచు నెల్లూరి తిరుకాళ మనుజవిభుఁ
సమ్ముఖమ్మున సాహిత్యసరణి మెఱసి
మహిమఁ గాంచిన పెద్దయామాత్యసుకవి
మనుమఁడవు నీవు నీవంశమహిమ యొప్పు.

క. ఆడఁడు మయూరరేఖను
గాడంబాఱండు గాణగతి మన మెరియున్
బ్రోడగు పెద్దయ యన్నయ
మాడకు మాదెత్త యతని మాటలు జగతిన్.

క. అని మీ తండ్రి మహత్వము
జన వినుతరస ప్రసంగ సంగత కవితా
ఘనతేజులు కవిరాజులు
గొనియాడుదు రఖిలరాజకుంజరసభల౯.

క. చక్కన నీ వైదుష్యము
చక్కన నీ కావ్యరచనచాతుర్యంబున్
జక్కన నీ వాగ్వైఖరి
చక్కన నీ యాశమహిమ జక్కనసుకవీ!

విక్రమార్క చరిత్రమును గృతినందిన సిద్ధన్న జన్నమంత్రి పుత్రుడయి నట్టును, జన్నమంత్రి మంత్రిభాస్కరుని తమ్ముఁ డయినట్టును; కృతిపతి యొక్క వంశాభి వర్ణనమునందుఁ జెప్పబడి యున్నది. ఈ వంశాభి వర్ణన ములోనే సూరనసోమయాజి రాజేంద్రచోడునిచే నెద్దనపూడి గ్రామము నగ్రహారముగాఁ బడసినట్టును, సిద్దనమంత్రి యాతని మనుమఁ డైనట్టును ఈ క్రిందిపద్యములలోఁ జెప్పఁ బడినది....

సీ. వేదశాస్త్ర పురాణ విజ్ఞానసరణిమై
నధిగత పరమార్థుఁడై తనర్చె
నెద్దనపూడి రాజేంద్ర చోడక్షమా
రమణుచే నగ్రహారముగఁ బడసెఁ
గనకదండాందోళి కాచ్ఛత్ర చామర
ప్రముఖ సామ్రాజ్య చిహ్నముల నొప్పె
సర్వతోముఖముఖ్య సవనక్రియాప్రౌఢి
నుభయ వంశంబుల నుద్ధరించె
నన్నదానాది దానవిద్యా ఘనుండు
పరమశైవ సదాచార పారగుండు
హరితవంశాంబునిధి చంద్రుఁ డార్యనుతుఁడు
సుగుణవిభ్రాజి సూరనసోమయాజి.

క. అమ్మహితాత్ముని మనుమఁడు
సమ్మాన దయానిధాన సౌజన్యరమా
సమ్మోదితబాంధవుఁడై
యిమ్మహిలో సిద్ధమంత్రి యెన్నిక కెక్కెన్.

రాజేంద్రచోడుఁడు ౧౦౭౦-వ సంవత్సరము మొదలుకొని ౧౧౧౮-వ సంవత్సరమువఱకును రాజ్యపాలనము చేసెను సిద్ధమంత్రి కొడుకైన జన్నయమంత్రి ౧౪౦౧వ సంవత్సరము మొదలుకొని ౧౪౨౨వ సంవత్స

రము వఱకును రాజ్యపరిపాలనము చేసిన దేవరాయని కాలములో నుండెను. తాతకును మనుమనికిని నిన్నూట యేబది సంవత్సరముల వ్యత్యాస ముండుట సంభవింపనేరదు గావున నిచ్చట మనుమఁడనగా సంతతివాఁ డని యర్థము చెప్పవలెను. అందుచేత సిద్ధనమంత్రి సూరన సోమయాజికి మనుమఁడు గాక తద్వంశజుఁడయి యుండుట నిశ్చయము.

ఇచ్చట "ఆంధ్రకవితరంగిణి" యందిట్లున్నది.

[వెలనాటి చోడులలో రాజేంద్రచోడ నామధారులు పలువురున్నారు. ఇందు గడపటి యాతడు కులోత్తుంగ రాజేంద్రచోడుడు. ఇతడును మనుమసిద్ధియు సమకాలికులు. అతఁడే సూరన సోమయాజి కగ్రహార మొసగెనని తలంచితి మేని సూరనసోమయాజి క్రీ. శ. ౧౨౦౦ ప్రాంతమున నాతనిచే నగ్రహార మందెననియు నాతని మునిమనుమఁడైన జన్నమంత్రి క్రీ శ. ౧౩౦౦ ప్రాంతము నందుండెననియు నిశ్చయింపవచ్చును. ఇందు విరుద్ధమేమియు నుండదు. పంతులుగారు చూపిన వ్యత్యాసమునకు దావుండదు. మనుమఁడని వ్రాసిన దానిని వంశీయుడని దలంచ నక్కరయుండదు. (ఆంధ్రకవి తరంగిణీ-నాల్గవసంపుటము-పుటలు 219 220)

కృష్ణా! దేవకీనందనా! అను మకుటముగల శతకమునకు గర్త సిద్ధమంత్రి తండ్రి జన్నయయేయని పలువురి యభిప్రాయము. సిద్ధమంత్రి తన వంశీయుఁడని వెన్నెలకంటి వేంకటాచలకవి కృష్ణవిలాసమున జెప్పియుండుటచే జన్నయ యింటిపేరును 'వెన్నెలకంటివా'రని నిర్ణయింప వచ్చునఁట! ఇతని కాలము క్రీ శ. ౧౩౮౦ ౧౪౨౦ నడుమనుండవచ్చునట! పయి శతకము తిక్కన సోమయాజి కృతమనునొక ప్రతీతి యున్నది. కాని యది సత్య దూరమని పలువురి యభిప్రాయము.]

జన్నమంత్రియు సిద్ధనమంత్రియు గూడ దేవరాయమహారాజు వద్దమంత్రులుగా నున్నట్లు విక్రమార్కచరిత్రములోని యీ క్రింది పద్యములలోఁ జెప్పఁబడిన యున్నది.

సీ. విమలవర్తనమున వేదశాస్త్ర పురాణ
వాక్యార్థ సరణికి వన్నె పెట్టె
పరమహృద్యంబైన పద్యశతంబున
దేవకీతనయు విధేయుఁ జేసె
రసికత్వమున దేవరాయమహారాజ
కరుణాకటాక్ష వీక్షణముఁ గాంచె
కర్ణాటకటకమ్ము కలయంగ మెచ్చంగఁ
గడఁక విద్యాప్రౌఢి ఘనత కెక్కె
గురులఁ బోషించె సత్కవీశ్వరుల మంచె
ప్రజలఁ బాలించె భాగ్యసంపద వహించె
హరిత మునిముఖ్యవంశరత్నాకరేంద్ర
చంద్రుఁడై యొప్పు సిద్ధయ జన్నమంత్రి.

సీ. చిత్రగుప్తునకైనఁ జింతింప నరుదైన
గణిత విద్యా ప్రౌఢి ఘనత కెక్కె
నవరసంబులయందు నవ్యకావ్యంబులు
కవిజనంబులు మెచ్చఁగా నొనర్చె
నాణిముత్యములసోయగము మించిన వ్రాలు
వరుసతో నిరుగేల వ్రాయ నేర్చె
నాత్మయలిపియట్టు లన్యదేశంబుల
లిపులను జదువంగ నిపుణుఁ డయ్యె
దేవరాయమహారాయధీవిధేయ
మంత్రిపల్లవచామనామాత్యదత్త
చామరచ్ఛత్ర భూషాది సకలభాగ్య
చిహ్నముల నొప్పె జన్నయసిద్ధమంత్రి.

తండ్రియు కుమారుఁడును గూడ దేవరాయమహారాజువద్ద మంత్రులుగా నున్నట్లు చెప్పఁబడినందున, కుమారుఁ డయిన సిద్ధన్న యాతని

రాజ్యములోని కడపటిదశయందున్నట్టూహింపఁదగి యున్నది. దేవరాయ మహారాయలు క్రీస్తుశకము ౧౪౦౬వ సంవత్సరము మొదలుకొని ౧౪౨౨వ సంవత్సరము వఱకును కర్ణాటక రాజ్యమును పరిపాలనము చేసెను. కాబట్టి సిద్ధన్న మంత్రి యీపయి నుండక పోయినను ౧౪౨౨వ సంవత్సరమువరకు నున్నట్లు నిశ్చయము. అందుచేత విక్రమార్క చరిత్రము ౧౪౧౫వ సంవత్సరమునకును ౧౪౨౦వ సంవత్సరమునకును మధ్యకాలము నందు రచియింపఁబడిన దని నిరాక్షేపముగాఁ జెప్పవచ్చును. విష్ణుపురాణము తెనిగించిన వెన్నెలగంటి సూరన్న తాతయైన సూర్యుఁడీ సిద్ధన్న పెద్దతండ్రియైనట్టు విక్రమార్కచరిత్రలోని షష్ఠ్యంతములలో నొక టయిన యీ క్రింది పద్యమునందుఁ జెప్పఁబడి యున్నది.

ఉ. వెన్నెలగంటి సూర్యుఁడు వివేకగుణాఢ్యుఁడు వేదశాస్త్రసం
పన్నుఁడు రెడ్డివేమనరపాలకుచేత మహాగ్రహారముల్
గొన్నకవీంద్రకుంజరుఁ డకుంఠితతేజుఁడు పెద్దతండ్రిగా
సన్నుతిఁ గన్న సిద్ధనకు సంతతదానకళావినోదికిన్.

జక్కనకవి తన విక్రమార్క చరిత్రమునందు భారతమును తెనిఁగించిన కవిత్రయ మగు నన్నయభట్టారకుని, తిక్కన సోమయాజిని, ఎఱ్ఱాప్రగడను మాత్రమే యీ క్రింది పద్యములతో స్తుతించి యున్నాఁడు—

ఉ. వేయి విధంబులందుఁ బదివేవురు పెద్దలు సుప్రబంధముల్
సేయుదు రట్టి రసబంధురభావభవాభిరామధౌ
రేయులు శబ్దశాసనవరేణ్యులు నాఁగఁ బ్రసిద్ధి కెక్కరే
ధ్యేయమెడ నన్నపార్యుగతి నిద్ధరనట్టి మహాత్ముఁ గొల్చెదన్.

చ. పరువడి దేవభాషఁగల పంచమవేదము నాంధ్రభాష సు
స్థిరత రచించుచోఁ గృతిపతిత్వముఁ గోరి ఫణిసన్నుఁ డైన యా
హరిహరనాథుచేఁ బడసె నవ్యయసౌఖ్యపదంబు నెవ్వఁ డా
పురుషవరేణ్యుఁ దిక్కకవిఁ బూని నుతింతుఁ గృతార్థతోత్సవున్.

ఉ. ఈత్రయిఁ దాఁబ్ర బంధపరమేశ్వరుఁడై విరచించె శబ్దవై
చిత్రి నరణ్యపర్వమున శేషము శ్రీ నరసింహ రామచా
రిత్రములన్ బుధవ్రజగరిష్ఠత నెఱ్ఱియ శంభుదాసుఁ డా
చిత్రకవిత్వవాగ్విభవజృంభితు మెచ్చెద భక్తియుక్తితోన్.

ఈ జక్కన్న లాక్షణికుఁడైన మంచికవి. ఈతని కవిత్వము నిర్దుష్టమై మనోహరముగా నుండును. ఈ విక్రమార్క చరిత్రము నందలి కథలు సహిత మద్భుతములుగానే యుండును. కవియొక్క రచనాధోరణి తెలియుట కయి విక్రమార్కచరిత్రములోని కొన్ని పద్యముల నిందుఁ జూపుచున్నాను.

చ. అనవుడు నింతి యీయెడఁ బ్రియాసపడం బనియేమి? యంచు వే
గన మఱలు మంటఁ బుచ్చుటయె కార్యముగాఁ దలపోసి చంద్రగు
ప్తుని దగుఁరీతి వీడుకొని భూపతిపాలికిఁ బోయి పూసగ్రు
చ్చినగతిఁ గార్యనిశ్చయ మశేషము తిన్నగ విన్నవించినన్. ఆ. ౧.

ఉ ఇమ్మెయి నర్థ మెల్లను వ్యయింపఁ బురిం గలవైశ్యు లందఱున్
నెమ్మిఁ బురందరుం గదిసి నీవు వణిక్కులవర్తనంబు స
ర్వమ్మును వమ్మునం గలిపి వాలి విశృంఖలవృత్తి దానధ
ర్మమ్ములు త్యాగభోగములు మానక చేయుట నీతిమార్గమే? ఆ. ౨

ఉ రా జవివేకియై నిరపరాధు మహీసురవర్యునిన్ జగ
త్పూజితుఁ బుణ్యవర్తను విధూతనమజ్జనకల్మషున్ వధూ
వ్యాజమునన్ వృథాకుపితుఁడై వధియింపఁగఁ బంచె దీని నే
యోజఁ దొలంగఁద్రోతు గురు నుత్తము నెమ్మెయిఁ గాతు దైవమా!
ఆ. ౩.

ఉ చెప్పఁదలంచు సిగ్గు తనుఁ జెప్పఁగనీమిక సంచలించుఁ దాఁ
జెప్పెడు మాట యెవ్వరికిఁ జెప్పకుమీ యనజూచు నంతటం
జెప్పక యుండరాదు మఱి చెప్పఁగరా దని కొంకు నెమ్మెయిం

జెప్పకపోదు పొమ్మనుచుఁ జిత్తము నూల్కొనఁజేసి యిట్లనున్. ఆ ౪.

మ. భువనాధీశ్వరుదర్శనోత్సవసుఖంబుం బొంది యానందతాం
డవముం జేసెడుభంగి నా కమలషండం బొప్పె భృంగాంగనా
రవగానంబులతో సరాగదళనేత్ర శ్రీవిలాసంబుతో
నవచిత్రాభినవోర్మిహస్తఘటనానానావిలాసంబుతోన్. ఆ. ౫.

చ. కలువల గండుమీలఁ దొలుకారు మెఱుంగుల నిండువెన్నెలన్
వలపులరాజుతూపులను వారిరుహంబుల నొక్కయెత్తునన్
గెలుపు గొనంగఁ జాలు మృగనేత్రి యపాంగనిరీక్షణద్యుతుల్
బలుపుగ ధైర్యమూల మగు పా దగిలింపవె యీశ్వరాదులన్. ఆ. ౬.

చ. పలుకులనేర్పునం జెవులపండువు చేసితి వింతసేపు నా
పలుకు శిలాక్షరంబుగ శుభం బది శీఘ్రముగాఁగ నంతయుం
దెలియఁగఁ జెప్పు మింక భవదీయసమాగమనప్రసంగముల్
జలజదళాక్షి! యేమిటికిఁ జల్లకు వచ్చియు ముంత దాఁపఁగన్. ఆ. ౭.

ఉ. ఈ సుకుమారతావిభవ మీ దరహాసముఖారవింద మీ
భాసురమూర్తి యీ లసదపారకృపారసనేత్రికాంతివి
న్యాసము లెందుఁ గంటిమె ప్రియంవదుఁ డీతనియంద కాకఁ నేఁ
జేసినభాగ్య మెవ్వరును జేయరుపో యిటఁ దేగుదెంచుటన్ ఆ. ౮.

[శాకుంతల మొకటి సిద్ధనప్రెగడ కృతము సంకలన గ్రంథములలో నుదాహరింపఁబడినది. ఈసిద్ధన విక్రమార్కచరిత్ర కృతిపతియే కావచ్చునని కొందఱి యభిప్రాయము.

జక్కనకవి 'పెమ్మయ సింగధీమణి' శతకమును రచించినట్లు 'చాటు పద్య మణిమంజరి' వలనఁ దెలియవచ్చుచున్నది. ఈ పెమ్మయ సింగన్న యెవ్వఁడో తెలియదనియు. నీశతకము జక్కనకృతమగునో కాదో యింకను విమర్శింపవలెననియు 'ఆంధ్రకవి తరంగిణి' లోఁ గలదు]

అనంతామాత్యుఁడు

అనంతామాత్యుఁడు పూర్వక లో నొకఁడు. ఈతఁ డాఱు వేల నియోగి బ్రాహ్మణుఁడు. ఈతని తండ్ తిక్కన్న; తాత ముమ్మడన్న; ముత్తాత బయ్యన్న. ఈ బయ్యన్న త్రియైనట్లును, తిక్కన సోమయాజుల కాల ములో నున్నట్లును. ఈకవి భోజరాజీయము నం దీక్రింది పద్యమునఁ జెప్పి యున్నాఁడు.

చ. క్షితిఁ గ్రితు*కర్తనా పతి చేకొని పంచమవేదమైన భా
రతముఁ దెనుంగుబా భిరామముగా రచియించినట్టి యు
న్నతచరితుండు తిక్క వినాయకుఁ డాదట మెచ్చి భవ్యభా
రతిఁ యనఁ బేరు గ కవిరత్నము బయ్యనమంత్రి యల్పుఁడే.

కవిబ్రహ్మ యను తిక్క సోమయాజిచేత భవ్యభారతి యని మెప్పు నడిసినంతటి మహాకవి బ న్నచే రచియింపఁబడిన గ్రంధ మొకటి యుండిన యెడల నిప్పుడు దా పే రయినను దెలియరాకున్నది. ఈ బయ్యన కవి యగుటయే కాక దండన ుఁడు కూడ నయి యుండునని కవి యీపద్య మునఁ జెప్పెను——

చ. శరధిసుత న్వరించు జాతవిలోచనుమాడ్కి శీతభూ
ధరజఁ బరిగ్రహించు హిమధామకళాధరుపోల్కి సద్గుణా
భరణ పవిత్రమూర్తి కులపాలిక నాఁ దగు పోలమాంబికన్
బరిణయమయ్యె నెం మున బయ్యచమూపతి వైభవోన్నతిన్.

ఈకవి తన తండ్రియైన తిక న కృష్ణామండలములోని శ్రీకాకుళమున కొడయఁడైన యంధ్రవల్ల ని సేవ చేయుచుండినట్టు*ను తన తల్లి యైన

* [కర్తృతా మహిమ అని పాఠాంతరము.]
* [అనఁగా—ఆంధ్రవల్లభ విష్ణునిభక్తుఁడని యభిప్రాయము.]

మల్లమాంబ యక్కదండనాధుని పుత్రి యైనట్లును నీక్రింది పద్యములలో పయి గ్రంధమునందే చెప్పియున్నాఁడు.

సీ. విలసితం బగు కృష్ణవేణి మలాపహా
రిణి భీమరథి నా ధరిత్రియందుఁ
దనరు నదీత్రియాంతర్వేది యగు పావ
నక్షేత్రమున శోభనము లెల్ల
ధర నివాసంబగు పెరుమగూరిపురంబు
నందు విద్వజ్జనానందమైన
జీవనస్థితిచేతఁ జెన్నొంది వంశక
ర్తృత్వసంపత్తిఁ బ్రిభుత మొంది
నెమ్మిఁ బ్రత్యక్షపరమపదమ్మనంగ
నొప్పు శ్రీకాకుళంబున కొడయఁడైన
యంధ్రవల్లభహరిసేవ నలరుచుండుఁ
జెక్కుభంగుల ముమ్మడి తిక్కవిభుఁడు.

సీ. శ్రీవత్సగోత్రిబ్ధిశీతాంశుఁ డగు నక్క
దండాధినాథుఁ డీ తరుణి తండ్రి
లావణ్యగుణపుణ్యలక్షణాన్విత యైన
యక్కమాంబిక యీ లతాంగితల్లి
చిరకీర్తినిరతులు చిట్టనమంత్రియు
నయ్యలార్యుఁడు నాతిక గ్రజన్ము
లచ్యుతాంఘ్రిసరోరుహార్చనారతుఁడు త
మ్మనమంత్రి యీ యింతి యనుఁగుఁదమ్ముఁ
డనఘుఁ డగు కోటకరుణాకరార్యుఁ డుపఘ
నుండు ముదునూరి పెద్దవిభుండు నివ
ధూమణికిఁ గూర్మి గల మేనమామ యనిన
మగువ లెనయె తిక్కనమంత్రి మల్లమకును.

ఈ కవి తా మాఱుఁగు రన్నదమ్ము లయిన ట్లీ క్రిఁది పద్యములలోఁ జెప్పు కొనెను.

ఉ. భూనుతకీర్తి యుమ్మడివిభుండు మదగ్రిజుఁ డేసు వైష్ణవ
ధ్యాన సమాహితాత్ముఁడ ననంతసమాఖ్యుడ నాదుతమ్ము ల
జ్ఞానవిదూరు లక్కనయు సత్కవి చిట్టనయుఞ్ వివేక వి
ద్యానిధి రామచంద్రుఁడు నుదారుఁడు లక్ష్మణనామధేయుఁడుఞ్.

క. ఈ యార్వురు నొక్కొక్కఁడు
వేయిండ్లకు మొదలుగాఁగ వెలయుదురని కొ
దే యాఱువేలపే రిడి
రీ యన్వయమునకు నేష్య మెఱిఁగినపెద్దల్.

ఈ కవి శ్రీనాధునికాలమునం దున్నవాఁడో యాతనికంటెఁ గొంచెము పూర్వమునం దున్నవాఁడో యని తెలియవచ్చుచున్నది. [ఈతని 'రసాభరణము' చివఱఁగల 'జానొందన్-' అనుపద్యమునుబట్టిహాలాణశకము ౧౪౩౫ జనవరి ౨౫ తేదీని రసాభరణమును ధ్రువపట్టన కంకిత మిచ్చినట్లు తెలియుచున్నదనియు, అప్పటి కీతనికి ౫౦ సంవత్సరముల వయస్సుండెనని తలంపవచ్చుననియు, అది నిజమైనచో ఇతఁడు శ్రీనాధునికంటెఁ గొంచెము చిన్నవాఁడై యుండి, ఆతని కాలమున గ్రంథరచన సాగించి యుండునని చెప్పుటకు సంశయింప నక్కఱలేదనియు 'ఆంధ్రకవి తరంగిణి' కర్తల యాశయమైనట్లు తెలియుచున్నది. [చూ. అయిదవ సంపుటము పుట 260.]

'జానొందఞ్' అను పద్యములోఁ బేర్కొనబఁడిన 'ధ్రువపట్టణ' మేదియో తెలియకున్నది. ఇది గుంటూరు మండలములో కృష్ణానదీ ప్రాంతమునఁ గల ధూళిపూఁడి యను గ్రామమా? యని యూహ పొడముచున్నదని రసాభరణ పీఠికలో శ్రీకోపల్లె-శివకామేశ్వరరావుగారు తెల్పియున్నారు ధ్రువపురి కృష్ణా మండలములోని దరువూరని ఛందోదర్పణ పీఠికలో శ్రీనిడదవోలు-వెంకటరావుగారు తెల్పియున్నారు ధ్రువశబ్దము నకు 'మట్టి మోడు' అను రెండ

ర్థము లున్నందున మట్టిపూఁడి లేక మట్టివాడ లేక మోదుమూడి - అను గ్రామములలో నొకటియయి యుండవచ్చుననియు, మొత్తముపై నితఁడు కృష్ణామండల నివాసియనియు 'ఆంధ్రకవి తరంగిణి' కారుల యాశయము] ఈతనికవిత్వము రసవంతమై నిర్దుష్ట మయి మృదుపదకలిత మయి హృదయ రంజకముగా నున్నది.

ఈతఁడు రచియించిన గ్రంథములలో రసాభరణము, భోజరాజీయము, ప్రధానము లయినవి. రసాభరణము శృంగారాదిరసాదులనుగూర్చి చెప్పఁబడిన లక్షణగ్రంథము. భోజరాజీయము వింతకథలను గలిగి చమత్కారముగా నుండును. ఈతఁడు భోజరాజీయమునం దెఱ్ఱాప్రెగడవఱకును గల కవుల నీక్రింది పద్యముచేత స్తుతించి యున్నాఁడు.

ఉ. నన్నయభట్టుఁ దిక్కకవినాయకు భాస్కరు రంగనాథుఁ బే
రెన్నిక కెక్కినట్టి యమరేశ్వరు నెఱ్ఱనమంత్రి నాదిగాఁ
జన్నకవీంద్రుల న్నవరసస్ఫుటవాణు లనంగ ధాత్రిలో
నున్న కవీంద్రులం దలఁతు నుల్ల మెలర్పఁగ వాగ్విభూతికిన్.

అమరేశ్వరుని మహాకవినిగా ననేకులు పొగడి యున్నారు. కాని యాత డేకాలమునం దుండెనో, ఏ యే గ్రంథములను రచియించెనో, సరిగాఁ దెలియవచ్చినది కాదు. అమరేశ్వరకృతమైన విక్రమసేనములోని దవి యొకానొక లక్షణగ్రంథమునం దొక పద్య ముదాహరింపఁబడి యున్నది. ఇంకొక యుదాహరణ గ్రంథములో మఱికొన్ని పద్యము లుదాహరింపఁ బడినవి. అమరేశ్వరుని గ్రంథములవలెనే పూర్వకవుల గ్రంథము లనేకములు పేరు లేకుండ నశించి యుండును.

ఆంధ్రకవులలో ముగ్గురు నలుగురు మాత్రమే తమ కృతులలోఁ దా మున్న కాలమును వేసికొని యున్నారు. అట్టి కవులలో ననంతామాత్యుఁ డొకడు. ఈతఁడు రసాభరణమును శాలివాహనశకము ౧౩౫౬-వ సంవత్సరమునం దనఁగా గ్రీస్తుశకము ౧౪౩౪-వ సంవత్సరమునందు రచియించిన ట్లా పుస్తకములోని యీ దిగువ పద్యమువలనఁ దెలియవచ్చుచున్నది.

శా. జానొందన్ శకవర్షముల్ ఋతుశరజ్వాలేందులై యొప్పన
య్యానందాబ్దమునందు మాఘమునఁ గృష్ణైకాదశీభౌమయు
క్తానామామృతవేళ నీకృతి యనంతాఖ్యుండు సమ్యగ్రస
శ్రీనిండం ధరివపట్టణాధిపున కిచ్చెన్ భక్తిపూర్వంబుగన్.

కాఁబట్టి యీ కవి పదునేనవ శతాబ్దారంభమునం దుండినవాఁడు. ౧౪౩౪-వ సంవత్సరమునం దుండిన యీ కవియొక్క ముత్తాత యగు బయ్యన యీతని కన్న నూటయేఁబది సంవత్సరములకంటె నధికపూర్వుఁ డగుట పొసఁగక పోవుటచేతను, ఆ బయ్యన్న కవిత్వము చెప్పి తిక్కన సోమయాజిచే మెప్పొంది యుండుటచేతను, తిక్కనసోమయాజి హూణశకము ౧౨౯౦-వ సంవత్సర ప్రాంతమువఱకును జీవించి యున్నట్లేఁచుమించుగా నిర్ధారణ మగుచున్నది. తిక్కనసోమయాజి నన్నయభట్టారకునికాలము లోనివాఁడు కాఁడని చూపుట కింతకంటెఁ బ్రబలసాక్ష్య మేమి కావలెను? బయ్యన మొదలుకొని కవివంశమును దెలుపు భోజరాజీయములోని పద్యములను నడుమనడుమఁ గల వర్ణనాంశముల విడుచుచు నిం దుదాహరించుచున్నాను.

చ. శరధిసుత న్వరించు జలజాతవిలోచనుమాడ్కి శీతభూ
ధరజఁ బరిగ్రహించు హిమధామకళాధరుపోల్కి సద్గుణా
భరణఁ బవిత్రమూర్తిఁ గులపాలిక నాఁదగు పోలమాంబికం
బరిణయమయ్యె నెయ్యమున బయ్యచమూపతి వైభవోన్నతిన్.

చ. గుణయుతు లవ్వధూవరులకు న్జనియించిరి త్రేత రామల
క్ష్మణులయి పుట్టి ద్వాపరయుగంబుతుదిం దగ రామకృష్ణులై
గణనకు నెక్కి యీ కలియుగంబున నిట్లుదయించె లోకర
క్షణుఁ డగు విష్ణుదేవుఁ డన గంగనమంత్రియు ముమ్మడన్నయున్.

చ. కడిమిఁ గిరీటి దానమునఁ గర్ణుఁడుఁ భోగమున న్సురేంద్రుఁడె
క్కుడు విభవంబునన్ హరి యకుంఠితబుద్ధిఁ బురందరేభ్యుఁడున్
గడువగు ధీరతన్ సురనగప్రవరుం డనఁ బ్రోలమాంబ ము
మ్మడి బెడఁగొందు రూపమహిమ న్మరుముమ్మడియై జగంబునన్.

క. ఆ ముమ్మడి పెద్దిగడ శ్రీ
రాముఁడు సీతను వరించు క్రమమున సుగుణ
స్తోమాభిరామ నమితకృ
పామండిత నెఱమాంబఁ బరిణయమయ్యెన్.

క. ఆరమణీరమణులకుఁ బ్రి
భారమ్యుఁడు తిక్కవిభుఁడుఁ బ్రకటితకాంతి
స్ఫారుఁడు సింగనయు నను
వారలు పుట్టి రిలఁ బుష్పవంతులమాడ్కిన్.

చ. చిరతరశోభనుం డగు వసిష్ఠమునీశ్వరుఁడయ్యరుంధతిన్
బరిణయమై గృహస్థ గుణభాసితుఁడై వెలుఁగొందుమాడ్కిఁగా
తరపరిరక్షణానవరతవ్రతశీలుఁడు తిక్కమంత్రి శే
ఖరుఁడు వివాహమయ్యె గుణగౌరవశోభిని మల్లమాంబికన్.

మ. అరిషడ్వర్గముఁ దూలఁదోలి ధరలో నైశ్వర్యషడ్వర్గ మీ
వరుసన్ సంభవ మొందెనాఁగ సుతషడ్వర్గంబు జన్మించెఁ ద
త్పురుషస్త్రీతిలకంబులందు ఘనసంతోషంబు తద్బాంధవో
త్కరముం బొంద సమగ్రసంపద నిజాగారంబునం జెందఁగన్.'

తిక్కమంత్రికి మల్లమాంబికకును బుత్రుఁ డైన యనంతామాత్యకవి తన కవిత్వము తొంటిపెద్దలకవిత్వమువలె రుచించునో లేదో యని సంశయించుచు నీ క్రిందిపద్యముతో నొకవిధ మైన సంతుష్టిని వినయపూర్వకముగాఁ దెలిపి యున్నాఁడు

చ వెలయఁగఁ దొంటిపెద్దల కవిత్వమువోలె రుచించు నొక్కొ యేఁ
బలికెడు నూత్నకావ్యరసభావము లైనను భూమిఁ దల్లిదం
డ్రులకు నిజాగ్రసూనులపటు ప్రచురోక్తులకంటెఁ జిన్నబి
డ్డల వెడతొక్కుఁబల్కులు దృఢంబగు ముదుల నీనకుండునే ?

ఈ కవి తాను గవిత్వమును జెప్పఁబూనుటకును, నూతనమార్గమున భోజుని కథలను జెప్పఁబూనుటకును, కారణముల నీ క్రింది పద్యములలో మనోహరముగాఁ దెలిపి యున్నాఁడు.

సీ. సకలవిద్యలయందుఁ జర్చింప గవిత యు
త్కృష్టమం, డ్రది నిత్యకీర్తికొఱకు
నర్థాప్తికొఱకు నావ్యవహారలక్షణం
బెఱిఁగెడుకొఱకు ననేకవిధము
లగు నమంగళముల హరియించుకొఱకు ను
చితనిత్యసౌఖ్యసంసిద్ధికొఱకు
నొనరఁ గాంతాసమ్మితోపదేశంబునఁ
బ్రీతిమై హిత మాచరించుకొఱకు
నయ్యెఁ గానఁ బెద్దలాచరించెద రంచు
వేర్పఁకొలఁదిఁ గృతి యొనర్పఁబూని
యస్మదీయకృతికి నధిపతిఁ గావింప
నర్హుఁ డెవ్వఁడొక్కొ యని తలంచి.

సీ. నూతనం బయ్యుఁ బురాతనకృతులట్ల
సంతతశ్రవ్యమై జరగు ననియు
నాదిరాజసమానుఁ డగు భోజభూపతి
చరిత మీ కవితా ప్రసంగ మనియు
నిందుఁ జెప్పెడి కథలిన్నియు నోలిఁ బ్రి
శస్తధర్మోపదేశంబు లనియు
నఖిలజగన్నాథుఁ డగు నహోబిలనాథుఁ
డీ పుణ్యకృతికి నధీశుఁ డనియుఁ
బృథివి నెల్ల జనులు ప్రియభక్తియుక్తిఁ బా
టింతు రనియు నూఱడిల్లి యేను
బరమసౌఖ్య మైన భవదాభిముఖ్యంబు
నెమ్మిఁ బడసి యధికనిష్ఠతోడ

ఈ మహాకవియే యనంతచ్ఛందస్సను పేరం బరఁగిన యొక ఛందో
లక్షణమును గూడ రచియించి యున్నాడు.

అనంతుని కవిత్వరీతి తెలియుటకయి యీయన కృతులనుండి కొన్ని పద్య
ముల నిం దుదాహరించు చున్నాను.

భోజరాజీయము

ఉ. ఓలి గృహస్థధర్మముల నుండెడువానికి గ్రాసవాసముల్
చాలఁగఁ గల్గి పుత్త్రులుఁ గళత్రము సౌఖ్యము నొంద బంధువుల్
మేలన నార్యకోటి మది మెచ్చఁగ నుండుట యున్కి గాక యే
చాలును లేక యాచెనఁటిజాలిఁ బడం బనియేమి చెప్పుమా! ఆ. ౨

చ. ఇటు తగునయ్య విప్రుఁడ వహీనగుణాఢ్యుఁడ వీవు; నీకు నే
మిటి కిటువంటి దౌష్ట్యము? క్షమించునె మజ్జనకుండు విప్రుఁ డ
క్కటి జను లేమి యందురు? మదిఁ గాంక్షయె కల్గిన నగ్నిసాక్షిగాఁ
జిటికెన వట్టి కాక వృథ చేయుట ధర్మమె కన్యకాత్వమున్. ఆ. ౪

ఉ. తెచ్చిన నేమి సర్వజగతీభరణక్షముఁడైన యచ్యుతుం
డచ్చుగ నెల్లజీవులకు నారసి యన్నము వెట్టుచుండు నే
నిచ్చట నొంటి నున్నతటి నేల తలంపఁడు? జారరాగ్నిచే
వెచ్చుచునున్న నన్నుఁ దగవే తనకింత యుపేక్ష చేయఁగన్. ఆ. ౩

ఉ. ఆయతరీతిఁ దద్ధ్వని రసాయనమై చెవి సోఁక నప్పు డం
బే యనుచుం బ్రతిస్వనము పెల్లుగఁ జూపుచుఁ బాటి ధేనువుల్
డాయఁగఁ బోయి వేడుక నొడల్ కదలించుచు వాల మార్చుచున్
బాయక గుప్పునం గుడిచె బాలవృషంబు నిజాంశదుగ్ధముల్. ఆ. ౬

ఛందస్సు

క. కాకుస్వరయతి యగు నితఁ
డే కదలక జలధిఁ బవ్వళించె ననఁగఁ బ్ర
శ్నాకలితదీర్ఘమున నతఁ
డే కవ్వడిరథము గడిపె నిమ్ముల ననఁగన్

గీ. యరలవలు శషసహలును నాదిబిందు
యుతములై మకారవిరామయుక్తిఁ దనరు
మారుతాత్మజుఁ డరిదిసంయమి యనంగ
మదనజనకుఁడు దనుజసంహారుఁ డనఁగ.

రసాభరణము

ఉ. కైరవబంధుబంధురవికాసవిలాసము లేల? మందసం
చారత నొప్పు నమ్మలయశైలసమీరము లేల? యొప్పు నీ
కీరముపల్కు లేల? పరికింపఁగ నవ్వనలీల లేల? శృం
గారము లేల? నాకుఁ జెలి కంజదళాక్షుఁడు రాక తక్కినన్. ఆ ౩.

ఉ. మక్కువఁ బూనఁ దేనె లగు మాటలు పల్కు నహర్నిశంబు నొ
క్కొక్క నెపంబుమై నలిగి యుగ్మలికిం దమకంబు తద్దయున్
మిక్కిలి సేయు నొండొరుల మెచ్చఁగ గాఢతరప్రవీణతల్
తక్కక చూపు శౌరి మిగులం గలదే మహి నెట్టిప్రౌఢకున్. ఆ ౪

రావిపాటి తిప్పన్న

ఈ తిప్పన్ననే త్రిపురాంతకుఁ డనియుఁ జెప్పుదురు. ఈతఁడు చేసిన గ్రంథములలో త్రిపురాంతకోదాహరణము ముఖ్యమైనది. ఒక్కొక్క విభక్త్యంతమున నొక్కొక్క పద్యమును గలదయి ప్రతి పద్యము తరువాతను నొక్కొక్క కళికను దానితరువాత నొక్కొక్క యుత్కళికను గల గ్రంథ ముదాహరణమని చెప్పఁబడుచుండెను. నన్నయాదులకుఁ బూర్వమునందును తత్కాలమునందును తెలుఁగున సాధారణముగా నుదాహరణగ్రంథములే ప్రబలముగా నుండి జనులచే నాదరింపఁబడుచుండెను. నన్నయాదులు భారతాదిమహాకావ్యములను రచియింప నారంభించిన తరువాత నుదాహరణ గ్రంథములు మూలఁబడి * క్షుద్రకావ్యములుగాఁ బరిగణింపఁబడుచుండెను. అయినను త్రిపురాంతకుఁడు శేషనార్యుఁడు మొదలైనవారు కొందఱప్పుడప్పు డుదాహరణ గ్రంథములను సహితము చేయుచు వచ్చిరి. ఈ తిప్పన యుదాహరణ గ్రంథమును గాక మదనవిజయము, చంద్రతారావళి, అంబికాశతకములను కూడ విరచించెను. ఈ కవి కాల మిదియని నిర్ధారణ చేయుటకుఁ దగిన యాధారము లంతగాఁ గానరావు. అప్పకవి అప్పకవీయమున యతిప్రాస ప్రకరణ మైన మూఁడవయాశ్వాసమున ననుస్వారసంబంధయతి కుదాహరణముగా రావిపాటి తిప్పన్నచాటుధార యని యీక్రింది పద్యము నుదాహరించియున్నాఁడు.

> మ. సరి బేసైరిపుడేల భాస్కరులు? భాషానాథపుత్రా! వసుం
> ధరయం దొక్కఁడు మంత్రియయ్యె వినుకొండ న్రామయామాత్యభా
> స్కరుఁడో? యా నయినన్ సహస్రకరశాఖ ల్లే వవే యున్నవే
> తిరమై దానము చేయచో రిపుల హేతిన్ వ్రేయుచో వ్రాయుచోఁ.

ద్వాత్రింశన్మంత్రుల చరిత్రములో రాయనిభాస్కరుని కథయం దుదాహరింపఁబడిన యీ పద్యమున రామయామాత్యభాస్కరుఁ డనుటకు మాఱుగా రాయనామాత్యభాస్కరుఁడని యున్నది.

---

* [క్షుద్రకావ్యమనఁగా చిన్నకావ్యము. నీచమైన కావ్యమని యర్థము చేసికొనుట పొరపాటు.]

సీ. నిర్మించె నే మంత్రి నిరుపమప్రాకార
నవకంబుగా గోపీనాధపురము
గెలిచినాఁ డే మంత్రివిక్రమమునఁ
బ్రబలుఁడై యవనులబలము నెల్ల
నిలిపినాఁడే మంత్రి నియతవైభవమున
గోపికావల్లభుఁ గూర్మి వెలయ
పాలించె నే మంత్రి ప్రకటధర్మఖ్యాతి
మహిమ మీఱఁగ నాంధ్రమండలంబు

నతఁడు భూపాలమంత్రీంద్రసతతవినుత
ధీవిశారదుఁ డచ్యుతదేవరాయ
మాన్యహిత వర్తనుఁడు శౌర్యమహితయశుఁడు
భానుతేజుండు రాయనభాస్కరుండు.

అని కొండవీటిగోపీనాధస్వామివారి యాలయముఖద్వారశాఖయందు వ్రాయఁబడియున్న పద్యమునుబట్టి రామయభాస్కరుఁ డచ్యుత దేవరాయల కాలములో ననఁగా ౧౫౩౮-వ సంవత్సరమునకుఁ దరువాత నుండుట స్పష్టము. సరిబేసై రన్న పద్యము రామయభాస్కరుని గూర్చినది గాక ద్వాత్రింశన్మంత్రుల చరిత్రములో నున్నట్లు రాయన భాస్కరునిగూర్చిన దయిన పక్షమున

శ్లో. శాకాబ్దే వసువహ్ని వేదధరణీగణ్యేచ ధాత్రబ్దకే
వైశాఖే వినుకొండసీమని సుధీ ర్నాదెళ్ళ యప్పప్రభుః.
వాసిష్ఠాయ చ భర్తపూడి మఖిలం గ్రామం స్వనామాంకితం
ప్రాదా ద్రాయనభాస్కరాయ విదుషేష్టైశ్వర్యభోగాన్వితమ్.

అని నాదెళ్ళ యప్పయమంత్రి శాలివాహనశకము ౧౪౩౮-వ సంవత్సరమునందు అనగా క్రీస్తుశకము ౧౫౧౬-వ సంవత్సరము ధాతృవత్సర వైశాఖమాసమునందు వినుకొండ సీమలోని భర్తపూడి గ్రామమును రాయని భాస్కరపండితుని కిచ్చినట్టున్న దానశాసనమునుబట్టి యతఁడు ౧౫౧౬-వ సంవత్సర ప్రాంతములం దుండుట స్పష్టము. రావిపాటి తిప్పన్న యీ రెండు

కాలములలో నే కాలమున నుండినను. ౧౪౨౦ వ సంవత్సర ప్రాంతములయం దుండిన వల్లభామాత్యకవి యాతనిని తన క్రీడాభిరామములో నీక్రిందిపద్యములో నిట్లు చెప్పుట పొసఁగనేరదు-

ఉ నన్నయభట్టతిక్కకవినాయకు లన్న హుళిక్కిభాస్కరుం
డన్నను జిమ్మపూడి యమరాధిపుఁ డన్నను సత్కవీశ్వరుల్
నెన్నుదుటం గరాంజలులు * నిం తలుఁ జేయని రావిపాటి తి
ప్పన్నయు నంతవాఁడ తగునా యిటు దోసపుమాట లాడఁగన్.

దీనినిబట్టి యాలోచింపఁగా ౧౪౨౦ వ సంవత్సరమునకుఁ బూర్వమునందు రామయభాస్కరుఁడో రాయనిభాస్కరుఁడో యెవ్వడో యొకఁ డుండి యుండవలెను. ఆ కాలమునందు రామయభాస్కరుఁ డెవ్వఁడును లేఁడు గాని ౧౩౮౬ వ సంవత్సరము మొదలుకొని రాజమహేంద్రవర రాజ్యమును పాలించిన కాటయవేమారెడ్డికాలములో రాయనిభాస్కరుఁ డొకఁడున్నట్లీక్రింది పద్యమువలనఁ దేటపడుచున్నది.

చ 'కలయఁ బసిండిగంటమునఁ గాటయవేము సమక్షమందు స
త్ఫలముగ రాయనప్రభునిబాచఁడు వ్రాసిన వ్రాలవ్రామోఁతలుఁగా
గలుగలు గల్లుగల్లురనఁ గంటకమంత్రులగుండె లన్నియున్
జలుజలు జల్లుజల్లురనె సత్కవివర్యులు మేలు మే లనన్.'

పయి పద్యమునం దీ రాయనభాస్కరుఁ డప్పకవీయములో నుదాహృతమైన వద్యమునందువలెనే వ్రాయుటయందు సుప్రసిద్ధుఁ డయినట్టు చెప్పఁబడినందున రావిపాటి తిప్పన్న చెప్పిన సరిబేసై రన్న పద్య మీ రాయనభాస్కరునిఁగూర్చినదే యనియు నందుచేత తిప్పన్నకవి ౧౩౮౦ వ సంవత్సరప్రాంతములయందుండెననియు నింతకంటె బ్రబలప్రమాణములు దొరకు

* [నింతురు జేయని అని పాఠాంతరము.]

వఱకును మన మూహింతము. ఈ రాయనిభాస్కరుఁడు వ్రాయుటకే కాక దానముచేయుటకును రిపులను ఖడ్గముతో వ్రేయుటకును గూడఁ బ్రఖ్యాతి చెందినవాఁడు. [ఇయ్యెడ 'ఆంధ్రకవి తరంగిణి' లో నిట్లున్నది. 'ఈ చాటువు (కలయఁబసింది గంటమున-) నాధారముగాఁ గొని శ్రీ వీరేశలింగముపంతులు గారు తిప్పన చాటుధారలో వర్ణితుఁడైన రాయన భాస్కరుఁ డీతఁడే యని నిర్ణయించి త్రిపురాంతకుని కాలము క్రీ శ. ౧౩౮౦ ప్రాంతమని నిర్ణయించి నారు ఈ పద్యములోఁ గలముఁ ప్రస్తావనయేగాని కత్తివర్ణనము లేదు. అందుచేఁ ద్రిపురాంతకుని భాస్కరు డీఁతడుకాఁడు. మఱియు క్రీ శ. ౧౩౮౦ వఱకును అనవేమారెడ్డియే రాజ్యమునం దున్నవాఁడు ఆకాలములోఁ గాటయ వేముని కధికార ప్రసక్తి లేదు. ఇతఁడు అనపోతారెడ్డి కల్లుఁడు. అతని కుమారుడైన కుమారగిరిరెడ్డి రాజ్యమునకు వచ్చిన ౧౩౮౨ వ సంవత్సరము నుండియును, కుమారగిరిరెడ్డి వలన రాజమహేంద్రవర రాజ్యమును బడసిన క్రీ. శ. ౧౩౮౬ వ సంవత్సరమునకుఁ బిమ్మటను కాటయవేమన కధికార ప్రాప్తి కలిగినది. ఆపిమ్మట, తిప్పయ యీభాస్కరుని నుతించినాఁ డందు మేని త్రిపురాంతకుఁడు దాదాపుగా శ్రీనాధుని కాలమువాడగును. సమకాలిక గ్రంధము నాతఁ డాంధ్రీకరించుటయు, నాతనిని బొగడుటయు సంభ వింపదు .... ఎట్లయినను, త్రిపురాంతకుఁడు ద్వితీయప్రతాప రుద్రుని కాలమునందున్నవాఁడని తలంచుటయే యుచితమని నాయుద్దేశము" [ఆంధ్రకవి తరంగిణి నాలుగవ సంపుటము, పుటలు 41, 42] రాయని భాస్కరునిఁ గూర్చి కవులు చెప్పిన పద్యము లనేకము లున్నను జదువువారికి మనోహరముగా నుండునని వానిలోనుండి కొన్నిటి నిందు క్రిందఁ బొందు పఱుచుచున్నాను —

క. చేకొని రాయనిబాచఁడు
కాకాలు గుణించినపిన్న కాలమునాఁడే
లా కేత్వ మియ్యనేరఁడు
దాకును గొ మ్మియ్యఁ, డిట్టి దాతలు గలరే.

క. ఏ వ్రాలయినను వ్రాయును
నా వ్రాయఁడు వ్రాసెనేని నవ్వున కయినన్
నీ వ్రాసి తావ డియ్యఁడు
భావజ్ఞుఁడు రాయనార్యభాస్కరుఁ డెపుడున్.

ఉ. రాజితకీర్తిశాలి యగు రాయనిబాచ! భవద్యశంబు ది
క్పూజితమౌచు మించె సురభూధరభూధరభూధరేంద్రకాం
తాజసుగోత్రరుగ్విభురథాంగరథాంగరథాంగశేషభా
షాజలజాహితాహితతుషారతుషారతుషాంధపాళులన.

సీ. ఫణిరాజు తన శిరోమణు లర్థి కిచ్చునో
యనుచు పీష్ఠనిక్రింద డడఁగి యుండు
కైలాసకుధర మెక్కడ నిచ్చునో యని
యుగ్రుఁ డక్కడఁ గావ లుండఁబూను;
తనలోని మణుల నే తటి నిచ్చునో యని
వనధి సంతతమును వణఁకుచుండు
సురధరాధరము నెవ్వరి కిచ్చునో యని
తరణి యగ్గిరిచుట్టుఁ దిరుగుచుండు

నౌర! నీ దానవిఖ్యాతి యఖిలదిశల
మించి వర్తించె నీ కీర్తి నెంచఁదరమె?
గాఢదారిద్ర్యయామినీ కాంతిచంద్ర
భాగ్యదేవేంద్ర! రాయనభాస్కరేంద్ర!

మ. అయలక్ష్మీనిధి రాయనప్రభుని బాచామాత్యుఁ డశ్రాంతమున్
నియతిన్ బ్రాహ్మణపూజ చేయు టభివర్ణింపంగ "శక్యంబె"?
ప్రియగేహంబున హేమపంజరమునన్ బెల్లర్చతేప్రార్చ్యత
ప్రియమేధా యనుచుం బఠించు శుకశారీకిన్నరీద్వంద్వముల్.

శ్లో. కృతే యుగే బలి ర్దాతా
త్రేతాయాం రఘునందనః,
ద్వాపరే సూర్యపుత్రశ్చ,
కలౌ రాయనభాస్కరః.

ఇతఁడు ౧౨౧౦-వ సంవత్సరమునం దుండినట్లు చెప్పఁబడిన రాయని భాస్కరుని తాత యయి యుండును. ఈతని కాలమునందును దనకుఁ గొంత పూర్వమునందును నుండిన రావిపాటి తిప్పన్నకవిని సామాన్యక్షుద్రకావ్యకర్త యని జను లాతనికవిత్వమును తేలికగాఁ జూడగా నాతని ప్రేమాభిరామమును క్రీడాభిరామ మనుపేరఁ దెనిఁగించుచుండిన యభిమానముచేత వల్లభామాత్య కవి యాతనిని పూర్వకవులతో సమానుఁడుగాని సామాన్యుఁడు కాడని శ్లాఘించి యుండును. ఇట్లభిమానముచేతఁ జెప్పబడుటయే కాదు, తిప్పన కవిత్వము నిజముగానే శ్లాఘనీయముగా నున్నది.

"ఆమంత్రిశేఖరుండు రావిపాటిత్రిపురాంతకదేవుం డను కవీశ్వరుం డొనరించిన ప్రేమాభిరామనాటకమ్ము ననుసరించి క్రీడాభిరామంబను రూపకంబు తెనుంగుబాస రచియించినవాఁడు"

అని తిప్పనార్యుఁడు సంస్కృతమునఁ బ్రేమాభిరామనాటకమును రచించి నట్టును దాని ననుసరించి వల్లభామాత్యకవి తెనుఁగున గ్రీడాభిరామమును రచించినట్టును క్రీడాభిరామప్రస్తావనలోఁ జెప్పబడినది. చిన్నతినములో తిప్పనకవియో యాతని తండ్రియో కడపటి ప్రతాపరుద్రుని యంత్యదశలో నోరుగంటిపురములో నుండుటచేత నాతని రాజధాని యైన యేకశిలానగర మును బ్రేమాభిరామములో రంగమునుగాఁ గవి చేకొని యుండును. కవి కృతగ్రంథములలోనుండి కొన్ని పద్యముల నిందు బొందుపఱిచెదను.

౧ త్రిపురాంతకోదాహరణము

ఉ. శ్రీనగచక్రవర్తితుదిశృంగము చూచెద నంచు నేటికిం
బో నని శంబు మానవుల పుట్టువుఁ జావును లేనిమందు నా
చే ననుచుం బతాక యనుచేఁ దరుణాచల మెక్కి- చీరుఁ బం
చాననుఁ డిందుమౌళి త్రిపురాంతకదేవుఁడు భక్తలోకముఁ.

కళిక. మఱియు సజ్జనభక్తగృహముల మరగి తిరిగెడు కామధేనువు
కఱద లెఱుఁగక వేఁడు దీనులఁ గదియుజంగమరత్నసానువ
శైలజాముఖచంద్రరోచుల చవులఁ దవిలెడు నవచకోరము
వేలుపుందపసులతలంపుల వెల్లిగొల్పెడు నమృతపూరము
దేవతలు మువ్వురకు నవ్వలిదెస వెలుంగుచు నుండు నెక్కటి
భావవీధుల గలసి పలుకులఁ బట్టి చెప్పఁగరాని చక్కటి
ఆఱురేకుల మంత్రకుసుమమునందు వెలిఁగెడు మంచరీకము
వేఱుసేయక యోగిజనములు వెదకి పొందెడి యూర్ధ్వలోకము.

ఉత్కళిక. అడుగుఁదమ్ములఁ జొప్పువసి గని
యడరి శునకాకృతులు గయికొని
మీఱి చదువులు దవుల ముందటఁ
బాఱు క్రోడము నేసి మందట
లాడి తను మార్కొనఁగ వచ్చిన
క్రీడి కోరిన వరము లిచ్చిన
యాటవికకులసార్వభౌముఁడు
జూటభాస్వత్తుహినధాముఁడు.

ఉ. ఆఱడియాస నీరసధరాధిపలోకమునిండ్లు వాకిళుల్
దూఱుట మాని శ్రీనగము తూర్పువాకిలిఁ జొచ్చి పాపముల్
నీఱుగఁ జేసి గంధవతినీటను గ్రుంకి మనంబులోని చి
చ్చాఱఁగఁజేయు టొప్పుఁ ద్రిపురాంతకదేవునకై నమస్కృతుల్.

ఉ. పోయెదుఁ గాల మన్యగతిఁ బొందదు మోక్షము పెండికొండకుం
బోయెడు త్రోవ కెఱుఁగబోలదు మానవులార! రండు రేఁ
బ్రాయపుఁగొండ కంచు శివభక్తులలోపల నద్రిరాజక
న్యాయు పుణ్యమూర్తివలనం గడతేఱెదు జన్మఖేదముల్.

౨. చంద్రతారావళి

మ. చరమక్ష్మాధరచారుసింహముఖదంష్ట్రాకోటియో నాఁగ నం
బరశార్దూలనఖంబొ నాఁగఁ దిమిరేభప్రస్ఫురద్గర్వసం
హరణక్రూరతరాంకుశం బనఁగ నుద్యల్లీల నీరేఖ ని
త్యరుచిం బొల్పగుఁ బెంపగున్ విదియచంద్రా! రోహిణీవల్లభా!

మ. అమితధ్వాంతతమాలవల్లిలవనవ్యాపారపారీణదా
త్రమొ సౌగంధికషండకుట్మలకుటీరాజీసముద్ఘాటన
క్రమనిర్యాణధురీణకుంచికయొ నాఁగం బెంపునన్ నీ కళా
రమణీయత్వము చూడ నొప్పెసఁగుఁ జంద్రా! రోహిణీవల్లభా!

మ. రతినాథుం డను మాయజోగి చదలం ద్రైలోక్యవశ్యాంజనం
బతియత్నంబునఁ గూర్చి మౌక్తికమయం బై యున్న ప్రాంతంబునన్
మతకం బేర్పడఁ బెట్టి దాఁచెనన నీ మధ్యంబునన్ మచ్చ సం
తతముం గన్నులపండువై వెలయుఁ జంద్రా! రోహిణీవల్లభా!

౩. అంబికాశతకము

ఉ. తెప్పలఁదోరుఁదల్పు లిసిఱింతలు వాతెఱుచూపుఁగుంచియం
ద్రిప్పి తళుక్కునం దెలిచి తిన్ననిమోమునఁ గాయువెన్నెలల్
ముప్పిరిగొన్న వేడుకలు మూఁగిన సిగ్గసియాడఁ బ్రీతి నీ
వప్పరమేశుఁ జూచి తను వర్ధము గొంటి పొసంగ నంబికా!

చ. బెడఁగగు రత్నదర్పణము బేరినవెన్నెల పోసి నిచ్చలుం
దుడువక పాలసంద్రమునఁ దోఁచి సుధాకరుమేనికందు పోఁ
గడుగక నేరెటేట సితకంజము ముంపక నైజకాంతి యై
తొడరినఁ దల్లి! నీమొగముతో సరిపోల్పఁగఁ జాలు నంబికా!

ఉ. కూడెడి వెండ్రుకల్ నిడుదకూఁకటిఁ ద్రోవఁగ బొడ్డుపై వళుల్
జాడలు దోపఁ గ్రొమ్మొలకచన్నులు మించు దొలంక సిగ్గునం
జూడఁగ నేరముల్ మెఱుఁగుఁజూపుల నీవ హిమాద్రియింట నీ
వాడుట శూలికిన్ మనము వాడుట గాదె తలంప నంబికా!

౪. మ ద న వి జ య ము

ఈ క్రింది పద్యములు రెండును మదనవిజయములోని వని శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు త్రిపురాంతకోదాహరణపీఠికలో నుదాహరించిరి.

క. సతి గుణవతి యగునేనియుఁ
బతి కది రత్నంబ ప్రాణబంధువ యమృతం;
బతివయ దుర్గుణి యగునేఁ
బతి కెడపని చిచ్చు కొలుపక యది కాల్చున్.

మ. గుణమున్ సుందరరూపమున్ విభవముం గూటంబు సౌభాగ్యల
క్షణముం జారుచరిత్రమున్ వినయమున్ జాతుర్యమున్ ధర్మభూ
షణముం గల్గి పతివ్రతామహిమ మించన్ గల్గెనేఁ దత్సతీ
మణి చింతామణి, దానిఁ దాల్పఁ గలుగన్ మర్త్యుండె ధన్యుండిలన్.

శరభాంక కవి

శతకకర్తయు, లింగధారియు నగు నీకవి రెండవ ప్రతాపరుద్రచక్రవర్తి కాలమున ౧౪వ శతాబ్దమున నుండెనని తెలియుచున్నది. కాని శతకమును బట్టి చూచినచో నిది అంతకంటె నవీనముగాఁ దోఁచుచున్నదఁట! ఇందు భాషాదోషములు, లోపములును చాల కలవు.

ఇందలి పద్యములను లింగమగుంట తిమ్మకవి తన 'సులక్షణసారము' న నుదాహరించెను. ఎడపాటి యెఱ్ఱన, రాజలింగకవి యితనిని స్తుతించి యున్నారు.

కమలనాభామాత్యుఁడు

శ్రీనాథకవి సార్వభౌముఁడు తన తాత యగు కమలనాభామాత్యుఁడు గొప్ప విద్వత్కవి యని తెల్పియున్నాఁడు. ఇతఁడు క్రాల్పట్టణాధీశ్వరుఁడఁట పద్మపురాణకర్త. ఆ గ్రంథమిపుడు లభించలేదు. ఇతఁడు ద్వితీయ ప్రతాప రుద్రుని కాలమున నుండినవాఁడు కావున క్రీ. శ. 1295 - 1326 నడువ నుండవచ్చును. ఇతని మనుమఁడగు శ్రీనాథుఁడు క్రీ.శ. ౧౩౮౦ ప్రాంతమున జన్మించి యుండవచ్చునని 'ఆంధ్రకవి తరంగిణీ' కారుల యాశయము.

వినుకొండ వల్లభరాయఁడు

ఈ కవి నియోగిబ్రాహ్మణుఁడు; విశ్వామిత్రగోత్రుఁడు; తిప్పనార్య పుత్రుఁడు. ఇతఁడు క్రీడాభిరామ మనుపేర దశరూపకములలో నొకటి యయిన వీధినాటకమును దెనుఁగున రచించెను తెలుఁగున దృశ్యకావ్యమును రచించుటలో నీతఁడే మొదటివాఁడుగాఁ గనఁబడుచున్నాఁడు. తా నీ క్రీడాభిరామమును సంస్కృతమున రావిపాటి తిప్పన్నచే రచియింపఁబడిన ప్రేమాభిరామము ననుసరించి చేసినట్టు కవియే ప్రస్తావనలోఁ జెప్పుకొని యున్నాఁడు. ఇతఁ డెంతవఱకు మూలగ్రంథము ననుసరించెనో యెంతవఱకు స్వకపోల కల్పితముగా విరచించెనో తెలియరాదు. క్రీడాభిరామమునందలి వర్ణనము లనేకములు. కవి స్వకపోలకల్పితములుగాఁ జేసిన వనియే తోచుచున్నది. ఈ రూపకముయొక్క ముఖ్యరంగ మోరుఁగల్లు ఇది కాకతీయచక్రవర్తులకు రాజధానిగా నుండెను. ఈ రాజ్యము పాలించిన కాకతీయ చక్రవర్తులలోఁ గణపతివాఁడు ౧౧౯౯ వ సంవత్సరము మొదలుకొని ౧౨౬౨ వ సంవత్సరము వఱకును రాజ్యపాలనముచేసి మహమ్మదీయులచేఁ బట్టుబడి ప్రభుత్వమును గోలుపోయిన ద్వితీయ ప్రతాపరుద్రుఁడు. ఈ క్రీడాభిరామము ౧౪౨౦ వ సంవత్సర ప్రాంతమునందు రచియింపఁబడెను. ఈ కాలమునందు శ్రీనాథుఁడు కర్ణాటకదేశమునకుఁ బోయి వల్లభామాత్యుని సందర్శించి వల్లభాభ్యుదయమును * రచియించి యుండుటచేతను, క్రీడాభిరామములోని

* [శ్రీనాథుఁడు 'వల్లభాభ్యుదయము' అను గ్రంథము రచించెనని కొందఱందురు. కాని యాగ్రంథము లభింపనందున దాని కర్తృత్వమును గూర్చి గాని, యందలి విషయమును గూర్చి గాని యేమియు నిశ్చయింప సాధ్యము కాదు. ఇందు వినుకొండ వల్లభరాయల చరిత్ర మున్నదని చెప్పుటకుఁ దగిన యాధారములు లేవు. శ్రీకాళహస్తిమునందలి వల్లభ దేవుని మాహాత్మ్యమును తెలుపు వల్లభాభ్యుదయ మొకటి భట్లపెనుమర్తి-కోదండకవి కృతము కలదు.]

"కందుకకేళి సల్పెడు ప్రకారమునన్" అను పద్యమును "కుసుమం బద్దిన చీరకొంగు వాలయున్" అను పద్యమును శ్రీనాథుని వీథినాటకములోని వని యప్పకవి యుదాహరించి యుండుటచేతను, క్రీడాభిరామములోని "గార్గ్య సిద్ధాంతమతముషఃకాలకలన" "శకున మూనుట యిది బృహస్పతిమతంబు" "వ్యాసమతము మనఃప్రసాదాతిశయము" "విప్రజనవాక్య మరయంగ విష్ణు మతము" అను ౬౩ వ పద్యమునందలి ప్రథమ ద్వితీయ చతుర్థపాదములు శ్రీనాథుఁ డిటీవల రచియించిన భీమేశ్వరపురాణ తృతీయాశ్వాసములో "గార్గ్యసిద్ధాంతమత ముషఃకాలకలన, శకున మూనుటయది బృహస్పతి మతంబు, విప్రజనవాక్య మరయంగ విష్ణుమతము, సర్వసిద్ధాంత మతమభిజిత్తు సమ్మత మగు" అను ౪౧ వ పద్యమునఁ బ్రథమ ద్వితీయ తృతీయపాద ములుగా నుండుటచేతను, కొందఱు శ్రీనాథుఁడే క్రీడాభిరామమును రచించి దాని కర్తృత్వమును వల్లభరాయని కారోపించె నని చెప్పుదురు. కాని యిది సిద్ధాంతము చేయుటకుఁ దగిన యాధారములు లేవియుఁ గానరావు. అప్పకవికిఁ బూర్వమునం దున్నవారును వల్లభరాయనికిఁ జేరువకాలమునం దున్నవా రగుటచేత నాతనింగూర్చి యెక్కువగా దెలియఁదగినవారును నైన చిత్రకవి పెద్దన్న, ముద్దరాజు రామన్న, శ్రీధరుఁడు మొదలైన లక్షణగ్రంథకర్త లందఱును బూర్వోక్త పద్యద్వయమును వల్లభరాయని వనియె తమతమ లక్షణగ్రంథములయం దుదాహరించి యుండఁగా వల్లభరాయని కిన్నూఱు సంవత్సరముల వెనుక నుండిన యప్పకవి యవి శ్రీనాథుని వనుట యజ్ఞాన మూలముఁ గాక తెలిసి చెప్పుటయేఁ గాదు. వల్లభరాయని దర్శింపఁ బోయినప్పు డతఁడు క్రీడాభిరామమును రచించుచుండఁగాఁ జూచి యుండుట చేతనో, తత్పద్యరచనమునం దాతనికిఁ దోడుపడి యుండుటచేతనో శ్రీనాథుఁడు తాను తరువాత రచించిన భీమఖండమునందు సంస్కృతశ్లోకమును తెనిఁగించుచు "గార్గ్యసిద్ధాంతమత" మన్న పద్యములోఁ గొంతభాగమట్లే వేసి యుండవచ్చును. అంతమాత్రముచేతఁ బుస్తక మంతయు శ్రీనాథ విరచిత మనుట యతిసాహసము. [క్రీడాభిరామము వినుకొండ వల్లభరాయ కృతమని శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు, శ్రీ వేమూరి - విశ్వనాథశర్మ

గారు, శ్రీ బండారు - తమ్మయ్యగారు, శ్రీ శేకుమళ్ల - అచ్యుతరావుగారు మున్నగువా రభిప్రాయపడినారు. శ్రీ వేటూరి - ప్రభాకరశాస్త్రిగారు, శ్రీ కిళాంబి-రాఘవాచార్యులుగారు, శ్రీ చాగంటి - శేషయ్యగారు మున్నగువా రిది శ్రీనాథకృతమే యని విశ్వసించుచున్నారు.

ఇయ్యది శ్రీనాధకృతమే యని వివరించుచు శ్రీ ప్రభాకరశాస్త్రిగారు 'క్రీడాభిరామము' (శృంగార గ్రంథమాల) పీఠికలో వ్రాసిన కొన్ని వాక్యములు ఇచట నీయఁబడుచున్నవి.

"సులక్షణసారము, అప్పకవీయము, లక్షణదీపిక, సర్వలక్షణ సారసంగ్రహము మొదలగు లక్షణ గ్రంథములందు శ్రీనాథుని వీధినాటకము లోనివిగా నుదాహృతములయిన పద్యములీ క్రీడాభిరామమునఁ గలవు. శ్రీనాథుఁడే యీ గ్రంథమును రచించి వల్లభరాయని పేరుపెట్టఁగా గ్రంథమున వేఱు పేరున్నను, రంగనాథ రామాయణాదులవలె నీగ్రంథము కూడఁ గర్తయగు శ్రీనాథుని పేరనే లోకమునఁ బ్రచారముగాంచి యుండుటచే నప్పకవ్యాదు లట్లు చెప్పి యుండవలెను. అప్పకవ్యాదు లుదాహరించిన పద్యములు క్రీడాభిరామమున నానుపూర్వితో నున్నవి, ప్రక్షిప్తము లనఁ గుదురదు. వల్లభరాయఁడును, శ్రీనాథుఁడును సమకాలమువారు గాకపోవుదురేని, శ్రీనాథుఁ డాతని పేర గ్రంథము రచించుట యసంభవమగును. అట్టి చిక్కులేదు. శ్రీనాథుఁడును, వల్లభరాయఁడును సమకాలమువారు. వల్లభరాయని పెద్ద తండ్రి యగు లింగనమంత్రి విద్యానగరపు హరిహరరాయల మంత్రి రెండవ మూఁడవ హరిహరరాయండ్రు క్రీ. శ. 1402, 1412 వఱకు నుండిరి. లింగమంత్రి వారిలో నెవరియొద్ద మంత్రియయి యుండినను వల్లభరాయఁడు మన శ్రీనాధుని సమకాలమువాఁడే యగును..... ... ...మఱియు నీ గ్రంధమున వల్లభరాయని వాగ్వైభవ దాతృత్వాది వర్ణనము మితిమీఱి యున్నది. గ్రంధకర్తయే తానగుచో వల్లభరాయఁ డట్లా కందపద్యాష్టకమును రచించుకొని యుండఁడు. ఆ పద్యములు భీమఖండాదులలోని కృత్యవతరణికా పద్యముల పోలిక గలిగియున్నవి .. ..మఱియుఁ గృత్యవసాన పద్య

మునఁ 'గాలభైరవుఁడు కవీంద్రకాంక్షిత త్రిదశ మహీరుహమగు వల్లభ రాయనికి సమగ్ర వైభవాభ్యుదయములు కృపసేయు' నని యాశీర్వచన మున్నది. సూత్రధారోక్తిగాను, భరతోక్తిగాను నయినను గ్రంథకర్తయగు వాఁ డిట్లు చెప్పుకొనుట సరసముగాదు ఇది తానే తుమ్ముకొని, తానే శతా యుష్షని యనుకొనునట్లున్నది కవీంద్ర కాంక్షిత త్రిదశ మహీరుహము గావున వల్లభరాఁయడు విశేషధన మొసఁగి కవి యశఃకాంక్షియై యేతత్కృతి కర్తృత్వమును దనపై వేయించు కొన్నాఁడని తలఁచుట ప్రమాణదూరము కాదు. అట్టి సంప్రదాయముగూడ నాకాలమున హెచ్చుగాఁగలదు శ్రీనాథ కవి యనేక స్థలముల నిందుఁదన తక్కిన గ్రంథముల రచనములను జేర్చెను. ఆపోలిక లీగ్రంధము శ్రీనాథ కృతమేయని చెప్పకచెప్పుచున్నవి? [క్రీడాభిరామము-ఉపోద్ఘాతము-పుటలు 9-12]

క్రీడాభిరామ మనెడి యీ వీధిరూపకము పురబాహ్యాంతరప్రదేశములయందు విహరించుచు నోరుగంటినివాసు లైన గోవిందమంచనశర్మ యను బ్రాహ్మణ శిఖామణియు నాతని చెలికాఁడైన టిట్టిభసెట్టి యను వైశ్యవిట్గ్రామణి ము నొండొరులతోఁ దాము చూచుచు వచ్చిన వివిధవినోదములనుగూర్చి చేసిన సంభాషణరూపమున నున్నది. కవి యేతద్రూపకప్రస్తావనలోఁ దన తాత తాత యైన చంద్రామాత్యుఁడు బుక్కరాజుమంత్రిగా నుండిన ట్లీ క్రింది పద్యమునఁ జెప్పెను

శా. 'కర్ణాటక్షితినాథుఁ డైన పెదబుక్కక్ష్మాపదేవేంద్రున
భ్యర్ణామాత్యుని దానఖేచరునిఁ జంద్రాధీశు బంధుప్రియుణా
వర్ణించుం గవికోటి శంకరజటావాటీకటాంతర్నదీ
స్వర్ణద్యంబుతరంగరింఖణలసత్సాహిత్యసౌహిత్యయై'.

ఈ ప్రస్తావనలోనే కవి తన పినతాత యైన లింగమంత్రి ౧౩౭౭ వ సంవత్సరము మొదలుకొని రాజ్యపాలనము చేసిన హరిహరభూపాలుని కొలువులో నుండిన ట్లీ పద్యమునఁ దెలిపెను

మ. 'కనకాద్రిప్రతిమానధైర్యనిధి లింగక్ష్మావమంత్రీంద్రుతో
ననతారాతినృపాలమంత్రిజనతాహంకారతారాహిమా
ర్కునితో రూపరతీంద్రుతో హరిహరక్షోణీంద్రసామ్రాజ్యవ
ర్ధనుతో సాటి సమాన మీడు గలరా రాజన్యసైన్యాధిపుల్'.

పినతాత మాత్రమే కాక కవి తండ్రి యైన తిప్పన్న యనఁబడెడు త్రిపు రాంతకుఁడు కూడ హరిహరరాయల కొలువులోనే యుండి యాతనిరత్న భాండారాధికారి యైనట్లు ప్రస్తావనలో యీ పద్యమునఁ జెప్పఁబడెను.

సీ సత్యవ్రతాచారసత్కీర్తిగరిమలఁ
చంద్రుతోడను హరిశ్చంద్రుతోడ
నభిమానవిస్ఫూర్తి నైశ్వర్యమహిమను
రారాజుతోడ దేరాజుతోడ
సౌభాగ్యవైభవజ్ఞానసంపదలను
మారుతోడ సనత్కుమారుతోడ
లాలిత్యనిరుపమశ్లాఘావిభూతుల
భద్రుతోడను రామభద్రుతోడ
సాటి యనఁదగు ధారుణీపాలసభల
వీరహరిహరరాయపృథ్వీకళత్ర
రత్నభండారసాధికార ప్రగల్భు
మల్లికార్జునత్రిపురారిమంత్రివరుని

హరిహరరాయ రత్నభాండారాధ్యక్షుఁడును వినుకొండదుర్గపాలకుఁడు నైన గ్రంథకర్త వల్లభరాయఁడు ములికినాట మూడు గ్రామగ్రాసములతో మోపూరు పాలించుట మొదలైన విషయము లీ పద్యములలో నభివర్ణింపఁ బడినవి.

ఉ. గంధవతీప్రతీరపురఘస్మరపాదబిసప్రసూనవు
ష్పంధయచక్రవర్తి శ్రుతపర్వతదుర్గమహాప్రధానరా
ద్గంధగజంబు తిప్పన యఖండసుధీనిధి గాంచెఁ బుత్త్రులన్
బాంధవకల్పవృక్షముల బైచనవల్లభమల్లమంత్రులన్.

సీ. మూఁడుగ్రామఁగ్రాసములతోడఁ గూడంగ
మోపూరు పాలించె ముల్కినాట
నాశ్వలాయనశాఖయందు ఋగ్వేదంబు
కరతలామలకంబుగాఁ బఠించెఁ
బ్రత్యక్ష మొనరించి భైరవస్వామిచేఁ
సిద్ధసారస్వతశ్రీ వరించెఁ
గామకాయనసవిశ్వామిత్రగోత్రంబు
వంశగోత్రంబుగా వార్తకెక్కె
నెవ్వఁ డా త్రిపురాంతకాధీశ్వరునకు
రాయనవరత్నభండారరక్షకునకుఁ
బ్రియతనూజుండు చంద్రమాంబికకు సుతుఁడు
మనుజమాత్రుండె వల్లభామాత్యవరుఁడు.

క. అహరవధిసమయనృత్య
త్తుహినాంశుధరప్రచారధూతాభ్రధునీ
లహరీభ్రమఘుమఘుమములు
వహిఁ దిప్పయవల్లభన్నవాగ్వైభవముల్.

శా. సాహాచారమునన్ వివేకసరణిన్ సౌభాగ్యభాగ్యంబులన్
ధౌరంధర్యమునన్ బ్రతాపగరిమన్ దానంబునన్ సజ్జనా
ధారుం దిప్పనమంత్రి వల్లభు నమాత్యగ్రామణిం బోల్పఁగా
వేరీ మంత్రులు సింధువేష్టితమహోర్వీచక్రవాళంబునన్ ?

వల్లభరాయఁడు ౧౪౦౪ వ సంవత్సరమువఱకును కర్ణాటకరాజ్యపరిపాలనము చేసిన హరిహరరాయల రత్నభాండారాధ్యక్షుఁ డయిన తిప్పన పుత్రుఁ డగుటచేత నా సంవత్సరమున కనంతరమున నుండె ననుటకు సందేహము లేదు. అందుచేత నీ క్రీడాభిరామము ౧౪౨౦ వ సంవత్సర ప్రాంతము

నందు రచియింపఁబడె నని నిరాక్షేపముగాఁ జెప్పవచ్చును. ఈ వల్లభరాయనికవిత్వము మృదుమధురపదగుంభనము కలదయి ప్రౌఢముగా నున్నది. కాని కొన్ని చోట్లఁ గ్రీడాభిరామములోని వర్ణనము లసభ్యము లయి యశ్లీలము లయి నీతిబాహ్యము లయి యుండుటచేత స్త్రీలును, సామాన్య జనులును జదువఁదగినది కాదు జారత్వము దూష్యముగాఁ బరిగణింపఁబడక శ్లాఘ్యముగా నెంచఁబడెడు కాలమునందుఁ జేయఁబడిన గ్రంథము విషయమయి మనము కాలమును నిందింపవలసినదే కాని కవిని గర్హింప వలసిన పనిలేదు. ఈ కవియే ప్రస్తావనయందుఁ దన తాతను నాతని తమ్ములను వర్ణించుచు "వారవధూజనపుష్పభల్లు" లని వారికిఁ బ్రతిష్ఠావహమైన విశేషణము నీ క్రింది పద్యమునఁ గూర్చెను.

ఉ. మల్లనమంత్రికిం ద్రిపురమాతరశాక్షికిఁ గాంతి రోహిణీ
వల్లభు లాత్మసంభవులు వల్లభలింగనతిప్పనక్షమా
వల్లభమంత్రిశేఖరులు వారవధూజనపుష్పభల్లు లు
త్ఫుల్లయశోవిభాసితులు పుణ్యులు సింగనభైరవేంద్రులున్.

ఇఁక నీ విషయము నింతటితోఁ జాలించి వినువారి వీనుల కింపుగా నుండు పద్యములను గొన్నిఁటిని క్రీడాభిరామములోనివాని నుదాహరించుచు నీ చరిత్రమును ముగించుచున్నాను.

గీ. జనని సంస్కృతంబు సకలభాషలకును
దేశభాషలందుఁ దెలుఁగు లెస్స;
జగతిఁ దల్లికంటె సౌభాగ్యసంపద
మెచ్చు టాఁడుబిడ్డ మేలు గాదె?

మ. ద్రుతతాళంబున వీరగుంభితకథుంధుంధుం కిటాత్కారసం
గతి వాయింపుచు నాంతరాళికయతి గ్రామాభిరామంబుగా
యతిగూఢం ద్విపద ప్రబంధమున వీరానీకముం బాడె నా
కృత * ప్రత్యేకముగాఁ గుమారకులు ఫీట్కారంబునం దూలఁగన్.

* [ప్రత్యక్షరమున్-అని సరియైన పాఠము.]

మ. ఉడువీధిఁ శిఖరావలంబి యగు నాంధ్రోర్వీశు మోసాలపై
గడియారంబున మ్రోసె రెండెనిమిదుల్ ఘంటాఘణత్కారముల్
సడలెన్ భానుఁడు పశ్చిమంబునకు వైశ్యా! పూటకూటింటికిన్
గుడువం బోదమె లెక్క యిచ్చి? కడు నాఁకొన్నార మిప్పట్టునన్

ఉ. కప్పురభోగివంటకము కమ్మని గోధుమపిండివంటయున్
గుప్పెడు పంచదారయును గ్రొత్తగఁ యావునే పెస
ర్పప్పును గొమ్మ నల్లనఁటిపండ్లును నాలుగునైదు నంజులున్
లప్పలతోడఁ గ్రొంబెరుగు లక్ష్మణవజ్ఝలయింట రూకకున్.

శా. ద్వీపాంతరంబుననుండి వచ్చితివె భూదేవ! ప్రశాంతం మహా
పాపం సర్వజగత్ప్రసిద్ధసుమనోబాణాసనామ్నాయవి
ద్యోపాధ్యాయి ప్రతాపరుద్రధరణీశోపాత్తగోష్ఠీప్రతి
ష్ఠాపారీణ నెఱుంగ వయ్యెదవె మాచల్దేవి వారాంగనన్?

చ. ఉభయము భావవీధి జయ మొందిన భంగి భయం బొకింత లే
కభిముఖ మయ్యె వెన్వెనుకనై యట గొన్ని పదంబు లేగుచున్
రభసముతో దువాళిగొని భ్రగ్గునఁ దాకెఁడు చూతు నెట్టి టి
ట్టిభ! దిధిధీయనంగను గడింది యుదగ్రభము లీయురగ్రభముల్

చ. వెనుకకు మొగ్గవ్రాలి కడువిన్నను వొప్పఁగఁ దొట్టిసేళ్ళలో
మునిఁగి తదంతరస్థ మగు ముంగర ముక్కునఁ గ్రుచ్చుకొంచు లే
చెను రసనా ప్రవాళమున శీఘ్రము గ్రుచ్చెను నల్లపూసపే
రనుపమలీల నిప్పుడుచుపాయము లిట్టివి యెట్లు నెర్చెనో!

ఉ. ప్రక్కలు వంచు వంచి మునిపండ్లును బండ్లను రాచు రాచి తా
మ్మక్కిలఁ జేయుఁ జేపి తన యల్లనఁ గాళలసందుసందిలో
చక్కికి నొక్కు నొక్కి యిరచంబడ గుమ్మడిమూట గట్టి వీఁ
పెక్కి దువాళిచేసి చలి యిక్కడ నక్కడఁ బెట్టు వేకువన్.

సీ. హా! కుమారస్వామియౌపవాహ్యములార!
　　　హా! మంత్రిదేవతాస్వాములార!
హా! కాలవిజ్ఞానపాకకోవిదులార!
　　　హా! భూతభుక్తికుంభార్హులార!
హా! యహల్యాజారయతనహేతువులార!
　　　హా! బలాత్కారకామాంధులార!
హా! నిరంకుశకుహూహుంకారనిధులార!
　　　హా! కామవిజయకాహళములార!
హా! ఖగేంద్రంబులార! కల్యమున నీల్గి
పోవుచున్నారె? దేవతాభువనమునకు
మీరు రంభాతిలోత్తమామేనకాది
భోగకార్యార్థమై కోడిపుంజులార!

శ్రీనాథుఁడు

శ్రీనాథుఁ డను కవి శైవుఁ డైన పాఁకనాటి నియోగిబ్రాహ్మణుఁడు; భారద్వాజగోత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు. ఇతని తండ్రి మారయ; తల్లి భీమాంబ; తాత కమలనాభుఁడు. కమలనాభకవి పద్మపురాణసంగ్రహమును జేసిన ట్లీ కవి భీమఖండములోని యీ క్రింది పద్యముచేతఁ జెప్పుచున్నాఁడు.

మ. 'కనకక్ష్మాధరధీరు వారిధితటీక్రాల్పట్టణాధీశ్వరున్
ఘనునిం బద్మపురాణసంగ్రహకళాకావ్యప్రబంధాధిపున్
వినమత్కాకతిసార్వభౌముఁ గవితావిద్యాధరుం గొల్తు నా
యనుఁగుందాతఁ బ్రదాత శ్రీకమలనాభామాత్యచూడామణిన్'.

శ్రీనాథుఁడు పాకనాటివాఁ డగుటచేతను, తాత సముద్రతీరపట్టణమున కధికారి యయి యుండుటచేతను, నెల్లూరిసీమలోని యేదో సముద్రతీరగ్రామనివాసి యయి యుండును. క్రాల్పట్టణ మేదో క్రొత్తపట్టణము. ఒకవేళ నిజముగానే క్రొత్తపట్టణ మయి యుండవచ్చును. క్రాల్పట్టణము ప్రకాశించు పట్టణము. క్రొత్తది ప్రకాశించును గనుక క్రొత్తపట్టణ మన వచ్చును. 'వినమత్కాకతిసార్వభౌము' నని చెప్పుట చేతఁ గమలనాభామాత్యుఁడు ౧౩౨౦వ సంవత్సరప్రాంతమున కాకతి ప్రతాపరుద్రసార్వభౌముని కాలములో క్రాల్పట్టణమునకు కరణముగా నుండి యుండును.

[శ్రీనాథుఁడు కర్ణాటకుఁడనియు, అతనితాత నివాసస్థానము పశ్చిమ సముద్రతీరమునఁ గల పట్టణములలో నొకటియై యుండుననియుఁ గొందఱి యభిప్రాయము. 'శ్రీనాథుని కూరిమిసేయు మఱఁది' నని దగ్గుబల్లి - దుగ్గన చెప్పుటచే శ్రీనాథుఁడు కర్ణాటుఁ డనుట పొసఁగదు. కాల్పట్టమే కాలపట్టణమనియు, అది సల్లని పట్టణము-అనఁగా కృష్ణపట్టణమనియు, అది నెల్లూరు చేరువ నున్నదనియు శ్రీ చిలుకూరి-వీరభద్రరావుగారి యాశయము. కాల్పట్టణము - క్రాల్పట్టణమై - అదియే క్రొత్తపట్టణ మనుట సరికాదనియు,

క్రొత్తపట్టణ మేర్పడి యింకను రెండువందల యేండ్లయినను కాలేదనియు శ్రీ ప్రభాకరశాస్త్రిగారు తెల్పియున్నారు. ఆయన మతమున మచిలీపట్టణమున కుఁ దూర్పున సముద్రతీరమునఁ గల కాశీపట్టణమే కాల్పట్టణము; ఆ గ్రామము ప్రాచీన ప్రాభవమును సూచించుచున్నదఁట। శ్రీ కొమఱ్ఱాజు - వేంకటలక్ష్మణరావుగారు ఒక శాసనమునందు 'కలుపట్టణము' అను పేరు చూచి శ్రీనాథుని కాల్పట్టణ మదియే యని నిర్ణయించిరి. ఆకలుపట్టణము నేఁడు కలపటమను పేర నున్నది. అదియు కాశీపట్టణపు దరిదాఁపుననే గల దఁట; శ్రీనాథుఁడు పేర్కొనిన గ్రామ మిదియైనను గావచ్చును. ఈ యంశములు శ్రీ ప్రభాకరశాస్త్రిగారి 'శృంగార శ్రీనాథము' నఁదెల్పఁబడినవి.

శ్రీనాథుని నివాసము 'నెల్లూ' రని శ్రీ నేలటూరి - వేంకటరమణయ్యగారును, రేపల్లె తాలూకాలోని 'నల్లూ' రని శ్రీ చాగంటి-శేషయ్యగారును అభిప్రాయ పడుచున్నారు.]

కమలనాభునిఁ గాక యీ కవి భీమఖండమునందు నన్నయభట్టారకుని తిక్కనసోమయాజిని మాత్రమే యీ క్రింది పద్యములతో స్తుతించి యున్నాఁడు.

క. నెట్టుకొని కొలుతు నన్నయ
భట్టోపాధ్యాయసార్వభౌమునిఁ గవితా
పట్టాభిషిక్తు భారత
ఘట్టోల్లంఘనపటిష్ఠగాఢప్రతిభున్.

ఉ. పంచమవేదమై పరఁగు భారతసంహిత యాంధ్రభాషఁ గా
వించెఁ బదేనుపర్వములు విశ్వజగద్ధితబుద్ధి నెవ్వఁ డ
క్కాంచనగర్భతుల్యున కఖండితభక్తి నమస్కరింతు ని
ర్వంచితకీర్తివైభవవిరాజికిఁ దిక్కనసోమయాజికిన్.

కవిత్రయములో నెఱ్ఱాప్రెగడ యప్పటి కాధునికుఁ డగుటచేత నాతని నీగ్రంథమునందుఁ బొగడకపోయినను తాను రచియించిన యితర గ్రంథ ములయం దీకవి యాతనిని పేర్కొన్నాఁడు.

శ్రీనాథుఁడు కవిత్రయమునకుఁ దరువాత మిక్కిలిప్రసిద్ధుఁడైన కవి. ఇతనికి ప్రౌఢదేవరాయలు కవిసార్వభౌమబిరుద మిచ్చినట్లు శ్రీనాథవిరచితమైన యీ క్రింది చాటుపద్యమువలనఁ దెలియవచ్చుచున్నది.

సీ. దీనారటంకాలఁ దీర్థ మాడించితి
  దక్షిణాధీశు ముత్యాలశాల
పలుకుతోడై తాంధ్రభాషామహాకావ్య
  నైషధగ్రంథసందర్భమునకుఁ
బగులఁగొట్టించి తుద్భటవివాదప్రౌఢి
  గౌడడిండిమభట్టుకంచుఢక్క
చంద్రశేఖరక్రియాశక్తిరాయలయొద్దఁ
  బాదుకొల్పితి సార్వభౌమబిరుద
మెటులు మెప్పించెదో నన్ను నింకమీఁద
రావుసింగమహీపాలు ధీవిశాలు
నిండుకొలువున నెలకొనియుండి నీవు
సరససద్గుణనికురుంబ శారదాంబ.

శ్రీనాథకవి యా కాలమునం దిప్పటి వేంకటగిరిసంస్థానాధిపతులకుఁ బూర్వుఁడయి గోలకొండసీమలోని మెతుకు సంస్థానమున కధీశ్వరుఁడయి యుండిన సింగమనాయని సందర్శింపఁబోయినప్పు డా రాజు తన్నేమి తప్పు పట్టునో యన్న భీతిచేతఁ దనకుఁ బరాభవము కలుగకుండఁ జేయు మని సరస్వతిని బ్రార్థించెను. పయి పద్యమునందుఁ బేర్కొనఁబడిన సింగభూపాలుఁడు మహావిద్వాంసుడు; అందుచేత నతఁడు సర్వజ్ఞ సింగమనీఁడు (నాయఁడు) అని వ్యవహరింపఁబడుచు వచ్చెను; ఇతఁడు వేంకటగిరిసంస్థానమునకు మూలపురుషుఁ డయిన భేతాళనాయఁడను నామాంతరము గల చేవిరెడ్డికిఁ బదవ తరమువాఁడు. ఈ ప్రభువు సంస్కృతమున చమత్కారచంద్రికయను నలంకారశాస్త్రమును జేసెనందురు. దీనికి సింగభూపాలీయ మని నామాంతర

రము కలదఁట * ఈ కవి సర్వజ్ఞసింగమనాయని జూఁడఁబోవుటచేత నితఁడు పదునేనవ శతాబ్దారంభమున నున్నట్లు తేటఁబడుచున్నది. శ్రీనాథుఁడును, బమ్మెర పోతరాజును సర్వజ్ఞసింగమనాయని యాస్థానకవీశ్వరు లయినట్లు వేంకటగిరి సంస్థానవంశచరిత్రమునందు వ్రాయబడి యున్నది. కాని యీ కవు లిద్దఱును సింగభూపాలుని కాలమువారే యైనను వీరిలో నెవ్వరు నా యాస్థానకవీశ్వరులు కారు. వీరొక సారియో రెండు సారులో తదాస్థానమున కుఁ బోయి వారిపైఁ బద్యములను జెప్పి తమ కవిత్వ ప్రౌఢిమను జూపి రాజువలన బహుమానములను బొందిరి. శ్రీనాథుఁడు రెడ్ల యాస్థానకవీశ్వరుఁడు. ఈతఁ డించుమించుగాఁ దానుచేసిన గ్రంథముల నన్నిఁటిని రెడ్లకో వారి మంత్రులకో కృతి యిచ్చియున్నాఁడు ఇతఁడు రాజమహేంద్రపురమునఁ జిరకాల ముండినను కొండవీటిసీమయందుఁ బుట్టినవాఁ డని తోఁచుచున్నది ఈతనికి రెడ్లకవీశ్వరుఁ డని ప్రసిద్ధి. ఈతఁడు కొండవీటి రెడ్లకడను, రాజమహేంద్రవరపురెడ్లకడను గూడ కవీశ్వరుఁ డయి యుండి యున్నందున నీతని చరిత్రము వివరముగాఁ దెలియుటకై రెడ్లచరిత్రము నిచ్చట సంక్షేపించి చెప్పుట యనావశ్యకము కాఁజాలదు.

అనుమకొండయందు సామాన్యకర్షకుఁ డైన దొంతి యల్లాడరెడ్డి యను పంటకాపు ధర్మచింత గలవాఁ డొకఁ డుండె ననియు, అతనియింటి కొక నాఁటిరాత్రి కోమటి యొకఁడు వేమన యనువాఁడు రాఁగా నాతని నాదరించి కోమటియింట భోజనము పెట్టించి తనయింటఁ బరుండఁ దావిచ్చె. అతఁడు శయనించినప్పు డతనిమూటలో స్పర్శవేది యుండుట గ్రహించి దాని నపహరించి, దానిమూలమున మహాధనికుఁ డయ్యెననియు, చెప్పెడి కథ యొకటి గలదు. ఈ కథయే యింకొక విధముగాఁ గూడఁ జెప్పఁబడు

* [సంస్కృతమున 'చమత్కార చంద్రిక' యను నలంకార శాస్త్ర గ్రంథమును రచించినవాఁడు సింగభూపాలుని యాస్థాన విద్వాంసుఁడగు విశ్వేశ్వర పండితుఁడు; కాని సింగభూపాలుఁడు కాఁడు. దీనికి సింగభూపాలీయమను నామాంతరము లేదు. సింగభూపాలుఁడు రచించిన 'రసార్ణవసుధాకరము' అను నాట్యాలంకార గ్రంథమునకే ఆ నామాంతరము కలదు.]

చున్నది. వేమన యను వైశ్యుఁ డొకఁడు శ్రీశైలయాత్రకుఁ బోయె ననియు, అతఁ డచ్చటి మల్లికార్జునాలయమున కుత్తరమున నున్న యరణ్యములో నితరలోహములను బంగారముగా మార్పఁగల యోషధివిశేషము లున్నట్టు కనిపెట్టి యా మందుచెట్ల యాకులపసరును రెండు కుండలనిండ నింపి వానిని గొని స్వగ్రామమునకుఁ బోవుచు మార్గమధ్యమున నొకనాటి సాయంకాల మనుమకొండఁ జేరి యా రాత్రి వసించుటకు దొంతి యల్లాడ రెడ్డియింటికిఁ బోయెననియు, ధర్మాత్ముఁ డైన యా రెడ్డి యాతనివస్తువులను తన నేద్యపుపనిము ట్లున్నపాకలోఁ బెట్టనియమించి భోజనార్థమయి యా కోమటిని కోమటియింటికిఁ బంపెననియు, అతఁడు భోజనముచేసి మరల వచ్చులోపల రెడ్డి తన పనిముట్లను సరిచూచుకొనుటకయి యా పాకలోనికిఁ బోయి యందు తన నాఁగలియొక్క కఱుకోల యొకటి బంగారమువలె తళతళలాడుచుండుట చూచి యాశ్చర్యపడి చేరువకుఁ బోయి కోమటి తెచ్చుకొన్న కుండలలోని పసరొకింత దానిపైని బడుట చూచి దాని ప్రభావము వలన నా యినుపకోల సువర్ణమయి యుండునని యూహించి దానినిజమును పరీక్షించుటకై సమీపమున నున్న గడ్డపాఱ నొకదానిని గొనివచ్చి దాని నా పసరుకుండలో ముంపఁగా నదియు బంగారమయ్యె ననియు, అది చూచి సంతోషించి యా రెడ్డి పసరుతో నిండి యున్న యా రెండు కుండలను దన యింటిలోఁ బెట్టుకొని యా పాకకు నిప్పంటించె ననియు, ఇంతలోఁ గోమటి భోజనము చేసి వచ్చి యాకాశము నంటుచున్న మంటలతో బగబగ మండుచున్న యా పాకను జూచి దానిలోఁ దన పసరుకుండలు రెండును మండిపోయె నని భావించి దుఃఖించి ప్రాణమున కంటెను ధన మెక్కువగా భావించెడి యా వైశ్యశిఖామణి విత్తము పోయినతరువాతఁ దన బ్రతుకెందుకని తానును మిన్నంటి మండుచుండిన యా జ్వాలలోఁబడి ప్రాణములు విడిచెననియు, తరువాత నా కోమటి వేమయ్య పిశాచమయి యల్లాడ రెడ్డికుటుంబమును బట్టుకొని యాతనికిఁ బుట్టిన బిడ్డల నెల్లఁ జంపుచు వచ్చె ననియు, దాని కా రెడ్డి దుఃఖితుఁడయి మ్రొక్కుకొనఁగా నా కోమటి స్వప్నములో నాతనికిఁ గనఁబడి తన పేరు పెట్టినయెడల ముందు పుట్టఁ

బోయెడుకుమారుఁడు బ్రతుకు ననియు, వంశమువారికిఁ దనపేరు పెట్టుచు వచ్చినయెడల వారు మహాధనవంతులును, ప్రభువులు నయి భువనమునఁ బ్రఖ్యాతిఁగాంతు రనియు, తన మూలమున వచ్చిన ధనములో సగము ధర్మార్థముగా నుపయోగింప వలసిన దనియు చెప్పెనఁట ! అల్లాడరెడ్డి దాని కొప్పుకొని తరువాతఁ బుట్టిన తన కొమారునకు తండ్రిపేరితోఁజేర్చి కోమటి ప్రోలయ (వేమన) యని పేరు పెట్టెను. అతఁడు చిరకాలము జీవించి మహాధనికుఁ డయి తన పంటకులపురెడ్లలో వన్నె వాసి గాంచి తన ధనమును త్యాగభోగముల యందు సద్వినియోగము చేయుచు వచ్చెను. ఈ కోమటి ప్రోలయయే కొండవీటి పంటరెడ్ల వంశమునకు మూలపురుషుఁ డయ్యెను. ఆతని పుత్రులు మహాశూరు లయి ప్రతాపరుద్రునియొద్ద దండనాథు లయిరి. అల్లాడరెడ్డియింటిపేరు దొంతివా రనియు, దేసటివా రనియు కూడ నుండి యుండును. ఈతఁడు కోమటియొక్క కుండలదొంతిని సంగ్రహించుట దొంతివాఁ డయ్యెనని యొక కథ గలదు. ఈ యల్లాడరెడ్డి మిక్కిలి పాటుపడువాఁడయి విశేషధనము నార్జించి ప్రసిద్ధికెక్కి యుండును.

ఆతని కంత ధనము వచ్చినందుకుఁ గారణముగాఁ దరువాత నీకథ కల్పింపఁ బడి యుండును. కథయెట్టిదయినను ప్రోలయరెడ్డికిని నాతనిసంతతివారికిని కోమటియనియు, వేమన యనియు, నామములు వచ్చుట కేదో కారణ ముండి యుండవలెను. అల్లాడరెడ్డి స్పర్శవేదియను మందుపసరును గాక పోయినను కోమటిధనము నపహరించి యాతఁడు పిశాచమయి పట్టెనన్న భీతిచేతఁ దన కుమారునికిని, సంతతివారికిని కోమటి వేమన యనుపేరు లుంచి యుండవచ్చును.

౧. కోమటి ప్రోలయవేమారెడ్డి

రెడ్డిరాజ్యమును స్థాపించినవాఁడు కోమటిప్రోలయ ద్వితీయ పుత్త్రుఁ డయిన వేమారెడ్డి, కోమటిప్రోలయ కూడ దండనాథుఁడుగా నుండె నని చెప్పుదురు గాని యాతనికాలములో రెడ్లకు రాజ్య మేదియు లేదు. కోమటిప్రోలయకు మాచారెడ్డి, వేమారెడ్డి, దొడ్డారెడ్డి, అన్నారెడ్డి, మల్లారెడ్డి అని యేవురు

పుత్రులు. వీరిలో రెండవవాఁడయిన ప్రోలయవేమారెడ్డి మహాపరాక్రమశాలియయి ప్రతాపరుద్రుని దండనాథుఁడుగా నుండి యాతని యవసానకాలమున ౧౪౨౦-వ సంవత్సర ప్రాంతమున యవనులతోడఁ బోరాడి తురుష్కులు చేకొన్న రాజ్యమును గొంత వారినుండి మరల బలాత్కారముగాఁ గైకొని రెడ్డిరాజ్యమును స్థాపించెను. ఈ విషయ మొక శాసనములో నీ క్రింది శ్లోకములయందుఁ జెప్పఁబడినది.

శ్లో. ఉద్ధృత్య భూమిం యవనాబ్ధిమగ్నాం
సంస్థాపయంతం ప్రకృతో త్తమార్యాః
సాక్షాత్కరో మానుష దేవభాజా
మహావరాహం పరికీర్తయంతి.
శ్రీశైలగంగాతటసీమ్ని రమ్యాం
సోపానవీధీం వదధేనవేమః
యా దివ్యతి స్వర్గ మనోద్యతానాం
నిశ్రేణి రివ ప్రధితా నరాణాం.

పయి శ్లోకములలో నీ వేమభూపాలుఁడు శ్రీశైలములోని పాతాళగంగకు సోపానములు కట్టించినట్లు కూడ చెప్పబడియున్నది. ఇతఁడు బంధుజనానురాగము గలవాఁడయి తన బంధువులను, తమ్ములను కొడుకులను తన క్రింది యధికారులనుగాను, దండనాథులను గాను నియమించి వారికిఁ దాను జయించినదేశములలోఁ గొన్ని ప్రదేశము లిచ్చి యద్దంకి రాజధానిగాఁ బ్రజాపరిపాలనము చేయుచుండెను. ఈ యంశమును హరివంశములోని యీ క్రింది పద్యము తెలుపుచున్నది.

గీ. తనకు నద్దంకి తగు రాజధానిగాఁ బ
రాక్రమంబున బహుభూము లాక్రమించి
యనుజతనుజబాంధవమిత్రజనముల కిచ్చె
నెదురె యెవ్వారు వేమమహీశ్వరునకు.

వేమభూపాలుఁ డనుజులకే బహుభూము లిచ్చె నన్నప్పు డగ్రజుఁడైన మాచన్న కిచ్చినట్లు వేఱుగఁ జెప్ప నక్కఱయే లేదు. అతని కొకచిన్న సంస్థాన మిచ్చి దాని కతనిని విభునిగాఁ జేసెను. "ఆదిరాజన్యతుల్యాచారవిధ మాచవిభుఁడు పూజ్యుం డను విశ్రుతియును" అను హరివంశపద్య మీ యంశమును సూచించుచున్నది. తనకు రాజ్యమే లేనియెడల మాచన్న విభుఁ డగుటయు. నాదిరాజన్యతుల్యాచారుఁ డగుటయు సంభవింపవు గదా! మాచన్న రా జయినట్టు ఫిరంగిపురశాసనములోని యీక్రింది శ్లోకమువలన దెలియవచ్చుచున్నది.

శ్లో. మాచక్షోణిపతి ర్మహేంద్రవిభవో వేమక్షితీశాగ్రజో
　　హేమాద్రే స్సదృశో బభూవసుగుణై స్తస్య త్రయో నందనాః

ఒక కుమారునకు దండ్రిపేరు పెట్టుట మనలో సాధారణమైన యాచారము. అందుచేత మాచనయు వేమనయు తమ పుత్రులలో నొక్కరికిఁ గోమటి యని పేరు పెట్టిరి. ఈ యిద్దఱు కోమటిరెడ్లకును భేదము తెలియుటకయి మాచన్నకొడుకు పెదకోమటి యనఁబడుచుండెను. కోమటి గాక ప్రోలయవేమారెడ్డికి ననపోతుఁ డనియు, ననవేముఁ డనియు మఱి యిద్దఱు పుత్రులు కూడఁ గలిగిరి. ఎఱ్ఱాప్రెగడ హరివంశము రచించు నాఁటి కనవేమారెడ్డి మిక్కిలి పసివాఁడు; కోమటిరెడ్డి మృతుఁ డయ్యెను. తండ్రికాలములోనే యనపోతారెడ్డి దండనాథుఁ డయినట్టు హరివంశములోని యీ క్రిందిపద్యమునఁ జెప్పఁబడెను.

శా. వేమాత్మాధిపుకూర్మిపుత్త్రుఁడు దయావిభ్రాజి యవ్యాజతే
　　జోమార్తాండుఁడు కీర్తనీయగుణసంస్తోమంబులం దేమియుణా
　　ధామస్ఫూర్తికి లొచ్చుగాక సరియై రాజిల్లె రాజార్చితుం
　　డాముష్యాయణుఁ డెందుఁ బోతయచమూపాగ్రేసరుం డిమ్మహిన్.

హరివంశమునందే యీతని పెదతండ్రికుమారుఁ డయిన కోమటిరెడ్డి యిట్లు వర్ణింపఁబడెను.

క. దానంబునఁ గర్ణునిసరి
మానంబున పేర్మి ననుపమానుఁడు బుధస
న్మానచతురుండు మాచయ
సూనుఁడు కోమటి సమస్తసులభుఁడు కరుణన్.

కోమటి పోలయవేముని యొద్ద నాంధ్రకవిత్రయములోఁ గడపటివాఁడైన యెఱ్ఱాప్రెగడ యాస్థానకవీశ్వరుఁడుగా నుండి రామాయణమును, హరివంశమును నాతని కంకితముచేసెను. ప్రబంధపరమేశ్వరుఁడైన యెఱ్ఱాప్రెగడ హరివంశములోఁ గృతిపతియైన వేమారెడ్డి తల్లిదండ్రులను గూర్చి యిట్లు చెప్పెను.

చ. కులజలరాశిచంద్రుఁడగు కోమటిపోలనయు న్నితంబినీ
తిలకము పుణ్యురాలు పతిదేవత యన్నమయుం గృతార్థతా
కలితులు ధీరు వేమవిభుఁ గానఁగఁ గాంచినపుణ్య మెద్ది యే
కొలఁదుల నెన్ని జన్మములఁ గూర్చిరొనాఁ బొదలున్ జనస్తుతుల్.

ఈ పోలయవేమనృపాలుఁడు ౧౩౨౦ మొదలుకొని ౧౩౫౦ వ సంవత్సరము వఱకును రాజ్యపాలనము చేసి కాలధర్మము నొందెను. వేముని యనంతరమున సవతి పుత్రుఁడు అనపోతారెడ్డి ౧౩౫౦ వ సంవత్సరమునందు రెడ్డిసామ్రాజ్యభారమును వహించెను. ఈప్రకారముగానే మాచన ప్రభువు యొక్క మరణానంతరమున నాని పుత్రుఁడు రెడ్డిపోతనపాలుఁడును, తదనంతరమున పెద్దకోమటివేమారెడ్డియు తండ్రియొక్క చిన్నరాజ్యమునకు రాజు లయిరి

౨. అనపోతారెడ్డి

ఇతఁడు ౧౩౫౦వ సంవత్సరము మొదలుకొని ౧౩౬౧ వ సంవత్సరము వఱకును రాజ్యపాలనము చేసెను. ఈతని తోడఁబుట్టిన పడుచైన దొడ్డాంబికభర్త కాటయరెడ్డియు, ఆమె చెల్లెలు వేమాంబిక భర్త నాకయరెడ్డియు, మంత్రి దండనాయకు లయి తనకు మహో

సహాయులయి యసహాయశూరులయి రాజతంత్రము నడుపుచుండఁగా పం్రెడెండు సంవత్సరములు సత్పరిపాలనము చేసి సముద్రవ్యాపారమున కత్యంతప్రోత్సాహము కలిగించి యనపోతభూపాలుఁడు స్వర్గస్థుఁడయ్యెను. కుమారగిరిరెడ్డి యీతనికుమారుఁడు; మల్లాంబ యీతని కొమారిత. ఈ మల్లాంబిక యనపోతారెడ్డి మేనల్లుఁడయిన కాటయవేమారెడ్డికి భార్య యయ్యెను.

౩. అనవేమారెడ్డి

అనపోతారెడ్డి యనంతరమున నాతని తమ్ముఁడు అనవేమారెడ్డి రాజ య్యెను. అనపోతారెడ్డివలెనే యాతనిపెదతండ్రికొడుకు పెదకోమటిరెడ్డి కూడ మఱికొంతకాలమువఱకు లోకాంతరగతుఁ డయినందున ననవేమారెడ్డి రాజ్యకాలములోనే యతనికొడుకు వేమన తండ్రిరాజ్యమునకు వచ్చెను. అనవేమారెడికి మామిడి పెద్దనామాత్యుఁడును, వేమారెడ్డికి పెద్దనామాత్యుని తమ్ముఁడు నామామాత్యుఁడును మంత్రులయినట్టు శృంగారనైషధమునం దీ క్రింది పద్యములలోఁ జెప్పఁబడినది.

మ. అనతారాతివసుంధరారమణసప్తాంగోపహార క్రియా
ఘనసంరంభవిజృంభమాణపటుదోఃఖడ్గాద్వితీయార్జునుం
డనవేమాధిపు రాజ్యభారభరణవ్యాపారదక్షుండు పె
ద్దనమంత్రీశుఁడు మామిడన్నసుతుఁ డేతన్మాత్రుఁడే చెప్పఁ గన్

శా. స్వామిద్రోహరగండలాంఛనునకున్ సంగ్రామగాండీవికిన్
వేమక్ష్మాపతికార్యభారకలనావిఖ్యాతధీశక్తికిన్
నామామాత్యున కన్యరాజనిటలాంతర్న్యస్తభాగ్యాక్షర
స్తోమాపాకరణప్రవీణునకు మంత్రు ల్సాటియే యెవ్వరున్?

ఇందు మొదటి పద్యమునం 'దనవేమ' యని యున్నది; రెండవ పద్యము నందు వేమ యని యున్నది. 'అనవేమ' యన్న దంతయు నేకనామధేయ

ములోనిదే గాన శాసనములయందుఁ గాని పద్యములయందుఁ గాని యెక్కడ ననవేమునిఁ బేర్కొనవలసి వచ్చినను పూర్ణముగా ననవేమ యనిమే చెప్పు దురుగాని వేమ యని చెప్పరు. వేమయ లనేకు లున్నచో భేదము తెలియు టకయి పోలయవేమ, కోమటివేమ, కాటయవేమ, అల్లయవేమ అని తండ్రిపేరితోఁ జేర్చికూడఁ జెప్పుదురు. ఈ రెండవ పద్యమునందుఁజెప్పఁ బడినవేమన కోమటివేమన యనుటకు సందేహము లేదు. ఆకాలమునందు రెడ్డిరాజులలో వేఱు వేమనలు లేరు.

రెడ్డిరాజులలో అనవేమభూపాలుఁడు మిక్కిలి ప్రసిద్ధి చెందిన వాఁడు. ఈతఁడు చేసిన విశేషదానధర్మములచేతను పండితసమ్మానము చేతను నీతని కీర్తిప్రసిద్ధి వచ్చినది. ఇతఁడు సంస్కృతాంధ్రములయందు, మంచి పాండి త్యము గల రసజ్ఞుఁడు. వెన్నెలకంటిసూరన చేసిన విష్ణుపురాణములోని యీక్రిందిపద్య మీతని కీర్తి యెట్టిదో తెలుపుడుచేయును.

క. తనబ్రతుకు భూమిసురులకుఁ
దన బిరుదులు పంటవంశధరణీశులకున్
దన నయము భూమిప్రజలకు
ననవేమన యిచ్చెఁ గీర్తి నధికుం డగుచున్.

అనవేముఁడు తన రాజధానిని తనపూర్వులకు రాజధాని యయి యుండిన యద్దంకినుండి కొండవీటిదుర్గమునకు మార్చినట్టు పూర్వోదాహృతశాసనము లోని యీ శ్లోకములు తెలుపుచున్నవి.

శ్లో. తతోఽన్న వేమనృపతిః పరిపాలనకర్మణి
అపాలయ స్తస్య పుత్ర స్తదం తేంద్రవసుంధరా
కొండవీడుం రాజధానిం సతిచిత్రా మకల్పయత్
దృష్ట్వా త్వష్టాపి చిత్ర్య మభూ ద్యస్యా స్సవిస్మయః.

అనవేమమహీపాలునికి పుత్రసంతతి లేదు. ఒక్కకొమారితమాత్రముండెను. ఆమె భక్తినళ్వర చోళనృపాలపుత్రుఁ డైన భీమన్నృపాలునకు భార్య;

యయ్యెను. అనవేమభూపాలునిగూర్చి కవులు చెప్పిన పద్యములలో శ్రీటూరి ప్రభాకరశాస్త్రిగారి చాటుపద్యమణిమంజరియం దుదాహరించినవాని విందు క్రిందఁ బొందుపఱుచుచున్నాను.

క. 'కవితాకన్యకు నలుగురు
కవి జనకుఁడు భట్టు దాది గణుతింపంగా
నవరసరసికుఁడె పెనిమిటి
యవిశ్వకియె తోడఁబుట్టు వనవేమనృపా !

క. కొంచెపుజగములలోపల
నంచితముగ నీదుకీర్తి యనవేమనృపా !
మించెను గరి ముకురంబునఁ
బంచాక్షరిలోన శివుఁడు బలసినభంగిణా.

గీ. పందికొ మ్మెక్కి పెనుబాముపడగ లెక్కి
మేటితామేటివీఁ పెక్కి మెట్ట లెక్కి
విసివి వేసారి యన మవిభునిఁ జేరి
రాణివాసంబుగతి మించె రత్నగర్భఁ

క. రాకున్నఁ బిలువఁడేనియు
రాకకు ముద మంది చేర రమ్మనఁడేనిణా
ఆఁకొన్న నీయఁడేనియు
నాకొలు వటు కొల్పవలయు ననవేమనృపా !

శ్లో. అనవేమమహీపాల !
స్వస్త్యస్తు తవబాహవే
అహవే రిపుదోర్దండ
చంద్రమండలరాహవే.

ఒకానొకనియోగిబ్రాహ్మణకవి యీ శ్లోకము ననవేమమహీపాలుని పైని జెప్పి చదువఁగా నతఁడు సంతోషించి యాతని మూఁడువేల సువర్ణములు

పారితోషిక మొసఁగఁ బోయెనఁట; కవి వానిని స్వీకరింపక 'నేను నాలుగువే లియ్యఁగా మీరు మూఁడువేలే యిచ్చెదరా?' యనెనఁట. నాలుగువే లనఁగా తాను సమర్పించిన శ్లోకములో నున్న నాలుగు 'వే' యను నక్షరములని కవియభిప్రాయము. అప్పుడు రాజు నాలుగువేలే యిచ్చెద ననెనఁట; దానిపైని కవి 'నే నిచ్చినవే నా కిచ్చెదరా?' యనెనఁట; 'అట్లయిన నయిదువే లిచ్చెద' నని రాజు పలికెనఁట; 'నే నాఱువేలవాఁడను; నన్ను తక్కువపఱిచెదరా?' యని కవి వచించెనఁట. తక్కువపఱుపక 'యాఱువేలే యిచ్చెద' నని రా జనెనఁట; అందుకు కవి 'నేను పుట్టువుచేతనే యాఱువేలవాఁడనే; యిందధిక మేమున్న?' దని యడిగెనఁట; అధికము కావలసినచో రా 'జేడువేల నిచ్చెద' ననెనఁట; కవి 'యది రోదనసంఖ్య; మంచిది కా' దనెనఁట. రా జా కవి వాక్చాతుర్యమునకు మెచ్చి యెనిమిదివే లిచ్చి సంతోషపెట్టి యాతనిని బంపివేసెనఁట; ఇది వట్టికల్పనకథయే యైనను, అనవేమనృపాలుఁడు కవిత్వాభిమానము గలవాఁ డనియు మహోదాత యనియు బోధించుచున్నది.

అనవేముఁడు ౧౩౬౨ మొదలుకొని ౧౩౮౩ వ సంవత్సరమువఱకును ప్రజానురంజకుఁ డయి పరిపాలనము చేసి పరమపదము నొందినతరువాత నీతనియన్న యైన యనపోతారెడ్డికుమారుఁడు కుమారగిరి రాజ్యమునకు వచ్చెను.

౪. కుమారగిరిరెడ్డి

ఇతఁడు ౧౩౮౩-వ సంవత్సరమునకుఁ దరువాత పినతండ్రి యనంతరమున సింహాసనమునకు వచ్చెను. ఈతనికాలములోనే శ్రీనాధకవి బైలుదేఱి రాజాస్థానకవి కాకపోయినను రాజమంత్రులకును తదితరాధికారపదస్థులకును కృతు లియ్య నారంభించెను. కుమారగిరిపెదతాత మనుమఁడైన వేమారెడ్డియొక్క ప్రధమమంత్రి నామనామాత్యుఁడు మృతినొందినతరువాత నాతని యన్న కుమారుఁడు మామిడిసింగన్న కోమటివేమునకు మంత్రి యాయెను. ఈ

సింగన్న యనవేమునిమంత్రియైన పెద్దనామాత్యుని కనిష్ఠపుత్రుఁడు. శ్రీనాధుఁడు మొట్టమొదట సింగన్నయన్న యైన పెగ్గడన్నకును తరువాత సింగన్నకును, అటుతరువాత కుమారగిరి కడపటిదినములలో వాతవిసుగంధ భాండారాధ్యక్షుఁడైన యవచితిప్పయ్యసెట్టికివి కృతు లొసఁగెను. తిప్పయ్య సెట్టికి గృతి యిచ్చిన హరవిలాసములో నీ క్రిందిపద్య మున్నది.

> చ. హరిహరరాయఫేరొజిసహాసురధాణగజాధిపాదిభూ
> వరులు విజప్రభావ మభివర్ణన సేయఁ గుమారగిర్యధీ
> శ్వరుని వసంతవైభవము సర్వము నొక్కఁడ నిర్వహించు మా
> తిరుమలనాథసెట్టికిని ధీగుణశెట్టికి నెవ్వ రీడగున్ ?'

పైని పేర్కొనఁబడిన హరిహరరాయలు ద్వితీయహరిహరరాయలు; అతఁడు ౧౩౭౭ మొదలుకొని ౧౪౦౪ వ సంవత్సరమువఱకును రాజ్యపాలనము చేసెను. అందుచేత నతఁడు కుమారగిరిరాజ్యకాలమున కీవల నాఱు సంవత్సరములు నావల నాలుగు సంవత్సరములు రాజ్యముచేసెను. రెండవవాఁ డయిన ఫెరోజిసహా ౧౩౯౭ మొదలు ౧౪౨౨-వ సంవత్స రమువఱకును భూపాలనము చేసెను. అందుచేత నితఁడు కుమారగిరిరెడ్డి యొక్క రాజ్యాంతకాలములో మూఁడు సంవత్సరములుమాత్రమే రాజ్య భారము వహించియుండెను. అందుచేత హరవిలాసము ౧౩౯౭-౧౪౦౦ సంవత్సరముల మధ్యమున రచియింపఁబడి యుండవలెను. కొమరగిరి విద్యా వంతుఁడు; ప్రజాపరిపాలనముకంటె వసంతోత్సవాది వినోదములయం దెక్కువ యాసక్తిగలవాఁడు. ఇతఁడు తన రాజ్యనిర్వహణభారము నంతను తనమేనత్తకుమారుఁడును, మఱియు విద్వాంసుఁడును సమర్థుఁడును మంత్రియునైన కాటయవేమారెడ్డియం దుంచి తాను నిర్విచారుఁడయి యుండెను. ఇతఁడు తనచెల్లెలైన మల్లాంబయం దత్యంత ప్రేమకలవాఁ డగుటచేత రాజమహేంద్రవరరాజ్యము నామె కరణముగా నామెభర్తయుఁ దన కౌప్తమంత్రియుఁ బ్రాణమిత్రుఁడునైన కాటయవేమారెడ్డికి ౧౩౮౬ వ సంవత్సరమునం దిచ్చివేసెను. ఇతఁడు ౧౪౦౦ వ సంవత్సరమువఱకును రాజ్యపాలనము చేసి పరలోకగతుఁడు కాఁగా సంతానహీనుఁడైన యీతని

కొండవీటిరాజ్యముకూడ నీతని పెత్తాత మనుమఁడైన పెద్దకోమటిరెడ్డి యధీన మయ్యెను. కొందఱు కొమరగిరిరెడ్డి కొక కొమారుఁడు గలఁ డనియు, ఉన్నను కోమటివేముఁడు కొండవీటిరాజ్యమును బలవంతముగా నక్రమముగా నాక్రమించుకొనెననియుఁ జెప్పుదురు.

౫. పెదకోమటి వేముఁడు

కొమరగిరిరెడ్డిమరణానంతరమున ౧౪౦౦ వ సంవత్సరమునందు కోమటి వేమారెడ్డి కొండవీటిరాజ్యభారమును వహించినవాఁ డయి యంతటితోఁ దృప్తి నొంది యుండక రాజమహేంద్రవరరాజ్యమునుగూడ సంపాదింపవలె నని బహుసేనలతోఁ బలుమాఱు దండువెడలి కాటయవేమారెడ్డితో ఘోర యుద్ధములు చేసి విజయము నొందఁజాలక కాటయవేమారెడ్డిచేతను, నాతని దండనాథుఁ డయిన యల్లాడరెడ్డిచేతను పరాభూతుఁడయి, భగ్నమనోరథుఁ డయి వెనుకకు మరలవలసినవాఁ డయ్యెను. ఈ యుద్ధములవలన లాభ మేమియుఁ గలుగకపోవుటయే కాక బంధురాజులైన కాటయవేమాదులతో బలవద్విరోధమును కొండవీటిరాజ్యమునకు దౌర్బల్యమును మాత్రము సంప్రాప్త మయ్యెను. కోమటివేముఁడు కొండవీటిరాజ్యమునకు వచ్చిన తరువాత శ్రీనాథునిఁ దన యాస్థానమునందు విద్యాధికారినిగా నియమించెను గాని, యతఁడేమియు రాజుపేర గ్రంథములు చేసినట్టు కనఁబడదు. కోమటి వేముఁడు రచించినట్లు చెప్పఁబడెడి యమరుకవ్యాఖ్యాన మైన శృంగారదీపి కను శ్రీనాథుఁడే రచియించి దానికి రాజుపేరు పెట్టెనని చెప్పుదురు. * ఇది గాక యభినవభట్టబాణుఁ డనఁబరఁగిన వామనభట్టు వీరనారాయణ చరిత్ర మను నామాంతరము గల వేమభూపాలచరిత్రమును సంస్కృతమున వచన కావ్యముగా రచించి దానిలోఁ గోమటివేముని సర్వజ్ఞచక్రవర్తినిగాను, వేమునిపూర్వులను గొప్పచక్రవర్తులనుగాను పొగడెను. ఈ కోమటి వేమునిభార్య యైన సూరమాంబ సంతానసాగర మను తటాకమును

---

* దీని రచనలో నితఁడు శ్రీనాథుని సాహాయ్యమును పొందియుండవచ్చునని కొందఱి యాశయము.

౧౪౧౦ వ సంవత్సరమునందు త్రవ్వింపఁగా దరువాత నామె కుమారుఁడు రాచవేముఁడు దానికి నీరు వచ్చుటకయి జగనొబ్బగండ నామము గల కాలువ నొకదానిని ౧౪౧౬ వ సంవత్సరమునందు త్రవ్వించెను. పెద కోమటివేమారెడ్డి ౧౪౨౦ వ సంవత్సరమువఱకును రాజ్యపాలనము చేసి యిహలోకయాత్రను చాలించెను.

౬. రా చ వే ముఁ డు

కోమటివేముని యనంతరమున నాత నిపుత్రుఁడు రాచవేముఁడు రాజ్యమునకు వచ్చి యేదో విధముగా రాజ్యపాలనము చేసి ౧౪౨౪ వ సంవత్సరమునందు దేహము త్యజించెను. ఇతఁడు దుష్పరిపాలనముచేత జనకంటకుఁడయినందున నీతని భృత్యులలో నొకఁ డీతనిని పొడిచి చంపె నని చెప్పుదురు. ఈతనితండ్రికాలములోనే కొండవీటిరాజ్యము దుర్బల మయినందున నీతఁ డెట్లో నాలుగు సంవత్సరములు రాజ్యతంత్రము నతృప్తికరముగా నీడ్చుకొని రాఁగా తదనంతరమున రాజ్య మన్యాక్రాంతమయి తుదకు కర్ణాటులపా లయ్యెను. ఈతనితో కొండవీటిరాజ్యమంతరించెను. ఇఁక మనము రెడ్డిరాజ్యములలో రెండవది యగు రాజమహేంద్రవరరాజ్యమునకు వత్తము.

౧. కా ట య వే ముఁ డు

కాటయవేమారెడ్డి యనపోతభూపాలుని యల్లుఁడు; కొమరగిరిరెడ్డి చెల్లెలయిన మల్లాంబికభర్త కుమారగిరిరెడ్డి తనకు పుఱదిఁయు మంత్రియునైన యీ కాటయవేమునికి ౧౩౮౬-వ సంవత్సరమునందు రాజమహేంద్రవరరాజ్యము నిచ్చిన ట్లీవఱకే చెప్పఁబడెను గదా! ఇతఁ డప్పటినుండియు సమర్థతతో ప్రజాపరిపాలము చేయుచు, కొమరగిరిరెడ్డి మరణానంతరమున ౧౪౦౦-వ సంవత్సరప్రాంతమున కొండపేటి రాజ్యమునకు వచ్చిన కోమటి వేమారెడ్డి రాజమహేంద్రవర రాజ్యమపహరించుటకయి చేసిన కృషినంతను విఫలము చేసి, బహుయుద్ధములందు తన దండనాథుడును నసవేమారెడ్డి

మనుమరాలి భర్తయు నైన యల్లారెడ్డి సహాయుఁడుగా కోమటివేముని పరాజయము నొందించి యాతని సేనలను హతముచేసి రాజమహేంద్రవర రాజ్యమును నిరపాయముగా నిలుపుకొనెను. ఇతఁడు రణరంగములయందు మహావీరుఁ డగుటయే కాక సమరపాండిత్యమునకుఁ దోడు భాషాపాండిత్యమునుగూడఁ గలవాఁడయి కాళిదాసప్రణీతము లయిన శాకుంతలాది నాటకములకు సంస్కృతమున వ్యాఖ్యానములు రచించెను. ఈతనివలెనే యాతని బావ యగు కుమారగిరిరెడ్డియు సంస్కృతభాషాపాండిత్యముగల వాఁ డయి వసంతరాజీయ * మను కావ్యమును రచించెను. ఈవసంత రాజీయమునుండి కాటయవేముఁడు తన వ్యాఖ్యానములయందుఁ బ్రమాణవచనముల నెత్తి చూపెను. సంస్కృతమునందుమాత్రమే కాక యాంధ్రమునందు సహితము మంచి పాండిత్యముగలవాఁ డయి కవుల నాదరించి వారిచే శ్లాఘింపఁబడుచుండెను. ఈతనిని సంబోధించి యొక యాంధ్రకవి చెప్పిన పద్యము నొకదాని నిం దుదాహరించుచున్నాను—

క. వెలయాలు శిశువు నల్లుఁడు
నిలయేలిక యాచకుండు నేగురు ధరలోఁ
గలిమియు లేమియుఁ దలఁపరు
కలియుగమునఁ గీర్తికామ! కాటయవేమా!

కాటయవేమారెడ్డి ౧౪౧౯ వ సంవత్సరప్రాంతమునఁ గాలధర్మమునొందెను. ఈతని జీవితకాలములోనే యాతని పుత్రుఁడును హరిహరరాయని యల్లుఁడు నైన కాటయరెడ్డి మరణము నొందెను. ఈ వివాహమునుగూర్చి యల్లాడరెడ్డి కోరుమిల్లిశాసనములో నిట్లున్నది.

శ్లో. పౌత్రిం కాటయవేమయక్షితిపతేః పుత్రం చ కాటప్రభోః
దౌహిత్రం చతురర్ణవీం హరిహరక్షోణీపతే శ్శాసితుః,
తన్నామ్నా విదితాహ్వయాం హరిహరాంబాం చారు మగ్రాహయ
త్ప్రాణౌ వేమమహీశమల్లనృపతిస్సామ్రాజ్యలక్ష్మ్యా సమమ్.

* [వసంతరాజీయము నాట్యశాస్త్రముకాని కావ్యముకాదు. 'నామ్నా వసంత రాజీయం నాట్యశాస్త్రం యదద్భుతమ్.' ఇది లభించలేదు.]

మరణకాలమునకుఁ గాటయవేముని కనితల్లి యను కూఁతురును కుమారగిరి యను చిన్నకుమారుఁడును నుండిరి ["పౌత్రీం కాటయవేమయ ..." అను శ్లోకము సరిగా లేదనుచు నందలి విషయమునుగూర్చి శ్రీ ప్రభాకర శాస్త్రిగారు శృంగార శ్రీనాథమున విపులముగాఁ జర్చించిరి. శ్లోకమును బట్టి కాటయవేమునికిఁ గాటయ యను కుమారుఁడు కలఁడనియు, అతఁడు హరిహరరాయల యల్లుఁడనియు, నా కాటయ కుమార్తె హరిహరాంబయనియుఁ దెలియుచున్నది. హరిహరాంబ భర్త వీరభద్రారెడ్డి యన్నయగు వేమారెడ్డి యగుట ప్రసిద్ధము. వీరభద్రారెడ్డి కాటయవేముని కుమార్తె యగునని తల్లికి భర్త : కాఁగా, కాటయవేమారెడ్డి తన యల్లుని యన్నకుఁ దన పౌత్రి నిచ్చి వివాహ మొనర్చినట్లు తేలుచున్నది. ఇది యసంగతము. శాసనమున 'పుత్రీం కాటయవేమయక్షితిపతేః పౌత్రీంచ కాటప్రభోః' అని యుండవలెను. కాటయవేముఁడు తన కుమార్తెల నిద్దఱను, వేమవీరభద్రారెడ్ల కిచ్చి పెండ్లిచేసెను అనితల్లి, హరిహరాంబ లొక్క తల్లి కడుపునఁ బుట్టిన బిడ్డలు కానందున, వారి నన్నదమ్ముల కిచ్చి వివాహము చేయుట తప్పుకాదు. ఇట్టి వివాహము లనేకములు జరుగుచున్నవి. రాజమహేంద్రవరరాజ్యమా యల్లుండ్రిర్వురకును జెందఁదగునదనరాదు. కాటయవేమునకు రాజ్యము పిత్ర్యముకాదు. భార్యయగు దొడ్డాంబికవలననే వచ్చినది కావున, దొడ్డాంబ కుమార్తె యగు అనితల్లికిని, తద్ద్వారమున నామె భర్తకును మాత్రమే సంక్రమించినది.

ఈ విషయము శృంగార శ్రీనాథమునఁ గలదు (చూ. పుటలు 286–289.) 'ఆంధ్రకవి తరంగిణి' కర్త పయి యాశయముతో నేకీభవించలేదు. వీరు కాటయవేముఁడు హరిహరరాయల యల్లుఁడు కాఁడనుచున్నారు – వివాహమున, శ్లోకమునుబట్టి తెలియుచున్న వావులలో అసంగతములు లేవని వీరి యభిప్రాయము, (ఐదవ సంపుటము. పుటలు 84–88]

౨. అల్లాడరెడ్డి

కాటయవేమారెడ్డి మరణము నొందఁగానే యిదే సమయమని రాజమహేంద్రవరరాజ్యము నాక్రమించుకొనుటకయి కోమటివేముఁడు మరల సైన్యసన్నాహము చేసికొని దండువెడలెను. అల్లాడరెడ్డి తన సేనలతో నాతనిని మార్గమధ్యముననే యెదురుకొని రామేశ్వరమువద్ద ఘోరసంగ్రామము సలిపి యతని నోడించి సైన్యమును హతముచేసి కోమటివేమారెడ్డిని వెనుకకుఁ దఱిమివేసెను. ఈ విషయమయి కోరుమిల్లి శాసన మిట్లు చెప్పుచున్నది—

శ్లో. జిత్వానల్పవికల్పకల్పితబలం తం చాల్పభానుం రణే
మిత్రీకృత్య సమాగతంగజపతిం కర్ణాటభూపం చ తమ్,
హత్వా కోమటివేమసైన్యనికరం భూయో ఽ పి రామేశ్వరాత్
రాజ్యం రాజమహేంద్ర రాజ్య మకరో దల్లాడభూమీశ్వరః,

అల్లాడరెడ్డి యిట్లు కోమటివేముని నపజయము నొందించి తఱిమివేసి, రాజద్రోహు లయిన యితరుల నడఁచివేసి, రాజమహేంద్రవరరాజ్యమును బాలుఁడైన కుమారగిరికి మాఱుగాఁ గాఁబోలును ౧౪౧౬ వ సంవత్సరము నుండి తానే యేలసాగెను. అల్లాడభూపతి యనవేముని పుత్రికాపుత్రిక యైన వేమాంబను వివాహముచేసికొనియె ననియు, ఆమెతండ్రి భీమరా జనియు, పయిని జెప్పిన యంశమును కోరుమిల్లి శాసనములోని యీ శ్లోకము స్థాపించుచున్నది—

శ్లో. శచీవ శక్రస్య శివేవ శంభోః
పద్మేవ సా పద్మవిలోచనస్య,
వేమాంబికా చోళకులేందుభీమ
భూపాత్మజాభూ న్మహితాస్య జాయా.

అల్లాడభూపతికి వేమాంబవలన వేమారెడ్డి, వీరభద్రారెడ్డి, దొడ్డారెడ్డి అన్నారెడ్డి, అని నలుగురు కొడుకులు గలిగిరి అనితల్లి తమ్ముఁడును కాటయవేమారెడ్డి కొడుకును నయిన కొమరగిరిరెడ్డి యుక్తవయస్సు రాక

ముందే యల్లాడరెడ్డి రాజ్యము చేయుచుండఁగానే కాలగోచరుఁడై యుండును. ఈ కొమరగిరిరెడ్డి యక్కయయిన యనితల్లిని తన ద్వితీయపుత్త్రుఁడైన, వీరభద్రారెడ్డికి వివాహము చేసి యల్లాడరెడ్డి కాటయవేమారెడ్డికి వియ్యంకుఁ డయ్యెను. అల్లాడరెడ్డి యిట్లు ౧౪౨౬-వ సంవత్సరము వఱకును రాజ్యము చేసి తరువాత రాజమహేంద్రవరరాజ్యము ననితల్లి భర్త యైన వీరభద్రారెడ్డి వశము చేసెను. రాజమహేంద్రవరరాజ్యము నల్లాడరెడ్డి యేలినను, వీరభద్రారెడ్డి యేలినను, ఆతనియన్న యైన వేమారెడ్డి యేలినను, అందఱును ననితల్లి పక్షముననే యేలిరనుట స్పష్టము.

౩. అల్లాడవీరభద్రారెడ్డి

అల్లాడభూపతికి ద్వితీయపుత్త్రుఁ డైన వీరభద్రారెడ్డి ౧౪౨౬ వ సంవత్సరమున రాజమహేంద్రవర రాజ్యసింహాసనము నధిష్ఠించి భూపరిపాలనము చేయ నారంభించెను. ఈతని రాజ్యకాలములో ౧౪౩౦-వ సంవత్సరప్రాంతమున శ్రీనాథుఁ డీతనిమంత్రి యైన బెండపూఁడి యన్నామాత్యునియొద్దఁ బ్రవేశించి, తరువాత వీరభద్రారెడ్డి యాస్థానకవియయి కాశీఖండము నాతని కంకితముఁజేసి, వీరభద్రారెడ్డి రాజ్యావసానమువఱకును నచ్చటనే యుండెను. రాజమహేంద్రవరరాజ్యము ౧౪౪౩-వ సంవత్సరముఁనాటికే విజయనగరరాజులపా లయినట్లా సంవత్సరముపందలి ప్రౌఢదేవరాయల ద్రాక్షారామ శాసనమును బట్టి తేట పడుచున్నది అందుచేత వీరభద్రారెడ్డి ౧౪౪౦-వ సంవత్సరప్రాంతములవఱకు రాజ్యపాలనము చేసినట్టు కనఁబడుచున్నది. వీరభద్రారెడ్డి శాసనములుగాని, అతని యన్నయైన వేమారెడ్డి శాసనములుగాని. ౧౪౩౭-౩౮-వ సంవత్సరమునకుఁ దరువాతఁ గానరావు. వీరభద్రారెడ్డితోనే రాజమహేంద్రవరరెడ్డి రాజ్య మంతరించినది.

ఇంతవఱకును తెనుఁగుదేశమును బరిపాలించిన రెడ్ల చరిత్రమును సంక్షేపరూపమునఁ జెప్పితిని ఇఁక రెడ్ల కవీశ్వరుఁ డైన శ్రీనాథుని చరిత్రమును గొంత వివరింపవలసి యున్నది అతని జన్మస్థల మేదో, అతఁ డే కాలము నం దుండినవాఁడో, ఏ యే దేశములను దిరిగెనో, ఏ యే పుస్తకముల

నెప్పు డెప్పుడు రచించెనో, ఆతని యంత్యదినము లెట్లు చెల్లినవో సాధ్య మైనంతవఱకుఁ జెప్ప బ్రయత్నించెదను.

శ్రీనాథుఁడు పాఁకనాటిసీమవాఁ డయినట్టు భీమఖండమును కృతి నందిన బెండపూడి యన్నయమంత్రి చెప్పిన ట్లున్న యీ క్రింది సీసమువలనఁ దెలియవచ్చుచున్నది.

'సీ. వినిపించినాఁడవు వేమభూపాలున
కఖిలపురాణవిద్యాగమములు
కల్పించినాఁడవు గాఢపాకం బైన
హర్షనైషధకావ్య మాంధ్రభాష
భాషించినాఁడవు బహుదేశబుధులతో
విద్యాపరీక్షణవేళలందు
పాకనాఁటింటివాఁడవు బాంధవుఁడవు
కమలనాభుని మనుమఁడ వధికమతివి
నాకుఁ గృపసేయు మొక ప్రబంధంబు నీవు
కలితగుణగణ్య! శ్రీనాథకవివరేణ్య!

ఇప్పుడు పాఁకనాటిసీమ యే దని నిర్ణయింపవలసి యున్నది. భారతారణ్య పర్వశేషాంతమునం దెఱ్ఱాప్రెగడ తన వాసస్థానమగు కందుకూరి తాలూకా లోని గుడ్లూరును కూడ పాఁకనాఁటిసీమలోని దానినిగా నీ క్రిందిపద్యము లలోఁ జెప్పి యున్నాఁడు:—

'సీ. భవ్యచరిత్రుఁ డాప స్తంబసూత్రుండు
శ్రీవత్సగోత్రుండు శివపదాబ్జ
సంతతధ్యానసంసక్తచిత్తుఁడు సూర
నార్యునకును బోతమాంబికకును
నందనుం డిలఁ బాఁకనాటిలో నీలకం
ఠేశ్వరస్థాన మై యెసక మెసఁగు
గుడ్లూరు నెలవుగ గుణగరిష్ఠత నొప్పు
ధన్యుఁడు ధర్మైకతత్పరాత్ముఁ

డెజ్జనార్యుఁడు సకలలోకైక విదితుఁ
డైన నన్నయభట్ట మహాకవీంద్రు
సరససారస్వతాంశప్రశస్తి దన్నుఁ
జెందుటయు సాధుజనహర్ష సిద్ధి గౌరి.

క. ధీరవిచారుఁడు తత్కవి
తారీతియుఁ గొంత తోఁపఁ దద్రచనయకా
నారణ్యపర్వశేషము
పూరించెఁ గవీంద్రకర్ణపుట పేయముగాన్ ?

ఈ యిద్దఱి పద్యములను బట్టి చూడఁగా గుంటూరుమండలములోని కొండవీడు మొదలుకొని నెల్లూరిమండలములోని కందుకూరువఱకు నున్న దేశము పాఁకనాఁ డని తోచుచున్నది.

ఇతఁడు * పాఁకనాటిసీమలోని నెల్లూరిమండలమునందలి యొక సముద్రతీర గ్రామమునందు పుట్టి పెరిగినవాఁడు. ఈ పితామహుఁడు కమలనాభుఁడు మంచి పండితుఁడు; కవీశ్వరుఁడు; తెనుఁగునఁ బద్మపురాణ సంగ్రహమును జేసెనఁట! ఈతని నివాసస్థానము సముద్రతీరమందలి ♦ క్రాల్పట్టణమయినట్టు శ్రీనాథుఁడు భీమఖండములో నీ క్రింద పద్యమునందుఁ జెప్పి యున్నాఁడు.

---

* [పద్యములోని 'పాకనాఁటింటివాఁడవు' అను దానింబట్టి శ్రీనాథుఁడు పాకనాఁటి సీమలోని వాఁడని చెప్పవలను పడదనియు, అతఁడు పాకనాఁటి శాఖఁ జెందిన నియోగియనుటలో నేయని ప్రమాణము కాఁగలదనియు, 'ఇంటివాఁడవు' అనుటం బట్టియే యీ యంశము స్పష్టమగుచున్నదనియుఁ గొందఱి యభిప్రాయము. చాల మంది పండిత విమర్శకులు దీనినే యామోదించుచున్నారు.]

♦ ['వారిధితటీక్రాల్పట్టణాధీశ్వరున్' అనునెడ 'వారిధి తటీకాల్పట్టణాధీశ్వరున్' అను పాఠాంతరము కలదు, దానినే పలువు రంగీకరించిరి. ఈ 'కాల్పట్టణ' మేదో యింతవఱకును సరిగా నిశ్చయింపఁ బడలేదు. 'క్రొత్త పట్టణము' అనుటకు బదులుగా శ్రీనాథుఁడు 'క్రాల్పట్టణ' మని చెప్పియుండఁడనియు, 'క్రొత్త' కు

మ. కనకక్ష్మాధరధీరు వారిధితటీక్రాల్పట్టణాధీశ్వరున్
ఘనునిం బద్మపురాణసంగ్రహకళాకావ్యప్రబంధాధిపున్
వినమత్కాకతిసార్వభౌముఁ గవితావిద్యాధరుం గొల్తు నా
యనుఁగుందాతఁ బ్రదాత శ్రీ కమలనాభామాత్యచూడామణిన్.

ఈకాల్పట్టణ మేదో తెలియదు; ఆప్రాంతములయందుఁ బ్రసిద్ధికెక్కిన మోటుపల్లి యను రేవుపట్టణ ముండెను గాని యది యిది కాదు. మోటుపల్లికి మొగడపల్లి యని నామాంతరము గలదు శాసనములయందీ రేవుపట్టణము ముకుళపుర మని వాడఁబడినది ఆనపోతరెడ్డికాలము నందలి యొక శాసనములోని యీ క్రింది శ్లోకములను జూడుఁడు—

శ్లో. ఆహితతమః, కృశాను ర్వేమభూపాలసూనుః
స్తుతకలితమహీశాన్నాన్నపోతక్షితీశః
శాకాబ్దే గగనాష్టసూర్యగణితే తీరే మహాంభోనిధిః
ప్రఖ్యాత మ్ముకుళాహ్వయే పురవరే శ్రీసోమమంత్రీకరః

అందుచేతఁ క్రాల్పట్టణము మోటుపల్లి గాక వేతొకసముద్రతీర గ్రామమయి యుండును. ఇది యేదియో నిర్ధారణ మగువఱకును క్రాలనఁగ్రొత్త యని యర్థము చేయవచ్చును గనుకను, కడను పట్టణశబ్దమున్నది గనుకను. క్రొత్తపట్టణమునుగా భావింతము. కమలనాభుఁ డీ క్రాల్పణట్టమునకు కరణము. (వినమత్కాకతిసార్వభౌము" నని పద్యములో నుండుటచేత నితఁడు బాల్యములో ౧౩౨౦-వ సంవత్సర ప్రాంతములయందు కాకతి

'క్రాలు' పర్యాయపదము కాదనియుఁ జాలమంది యభిప్రాయపడుచున్నారు. కృష్ణా మండలమునందలి 'కాళీపట్టణమే' కాల్పట్టణమై యుండునని యభిప్రాయపడిరి. ఈ కాల్పట్టణము' కలపటమై యుండునని శ్రీ కొమఱ్ఱాజు-వేంకట లక్ష్మణరావుగారి యభిప్రాయము. గుంటూరుజిల్లా, రేపల్లె తాలూకాలోనున్న నల్లూరే (నల్ల + ఊరు = కాలపట్టణము-కాల్పట్టణము) శ్రీనాథుని నివాసమైన ట్లాంధ్రకవి తరంగిణి కర్తల యాశయము. [చూ. ఐదవ సంపుటము పుట. 6.] నెల్లూరు శ్రీనాథుని నివాసము కానగునని శ్రీ నేలటూరి వేంకటరమణయ్యగారి యాశయము. [చూ. భారతి - ఆంగీరస - మాఘసంచిక]

ప్రతాపరుద్రమహారాజులకాలములో నుండి యాతనిచే సన్మానింపఁబడి యున్నవాఁ డనుటకు సందేహము లేదు. అతఁడా గ్రామకరణ మగుటచే నాతని పుత్రుఁడును శ్రీనాథునితండ్రియు నగు మారయయు నా గ్రామము నందే యుండి కరణీకపువృత్తిచేసి జీవనముచేయుచు నుండి యుండవచ్చును. శ్రీనాథుడు తన తాతను గూర్చియే కాని యే పుస్తకమునందును తండ్రిని గూర్చి యంతగాఁ జెప్పి యుండలేదు. అతఁ డొకవేళ నిజముగా పండిత పుత్రుఁడేయేమో! తాతయే శ్రీనాథునికిఁ జిన్నప్పుడు విద్యయుఁ గవిత్వ మును నేర్పియుండును. భీమఖండకృతిపతి కమలనాభుని నెఱిఁగి యుండి నట్లు చెప్పుటచేత నతఁడు ౧౩౭౦-వ సంవత్సరమువఱకైన బ్రతికి యుండ వచ్చును. అప్పటికి శ్రీనాథునికి తప్పక పదునేను సంవత్సరములకు తక్కువకాని యీ డుండును. దానినిబట్టి శ్రీనాథుడు ౧౩౫౫-వ సంవత్సర ప్రాంతమున జనన మొంది యుండును. శ్రీనాథుఁడు తన పదునాఱవ సంవ త్సరప్రాంతముననే గ్రంథరచనమున కారంభించె ననుటకు సందేహములేదు.

"చిన్నారిపొన్నారిచిఱుతకూకటినాఁడు
రచియించితి మరుత్తరాట్చరిత్ర."

అను కాశీఖండములోని పద్య మీ యంశమునకు సాక్ష్యమిచ్చుచున్నది. కాఁబట్టి యీతఁ డీ మరుత్తరాట్చరిత్రమును పదునెనిమిదేండ్లలోపల నింటి కడ నున్నప్పుడే రచియించి యుండును. కాబట్టి మరుత్తరాట్చరిత్రము ౧౩౭౩-వ సంవత్సరప్రాంతమున రచించె నని చెప్పవచ్చును. నా కీ పుస్త కము లభింపనందున శైలి యెట్లున్నదో యందు వ్యాకరణాదిదోషము లేమయిన నుండినవో యది యెవ్వరికైన నంకితము చేయబడినదో లేదో చెప్పఁజాలను. ఈతఁడు చేసిన రెండవ గ్రంథము పల్నాటి వీరచరిత్రము నందలి బాలునికథ. ఇదియు నింటికడ నున్నప్పుడే స్వగ్రామమునందలి పల్నాటివీరుల కులమువారి ప్రోత్సాహముచేత నీతనిచేత రచియింపఁబడి యుండును. ఈ పుస్తకరచనమువలన శ్రీనాథునకుఁ గొంత ధనలాభము

కలిగి యుండును పల్నాటివీరచరిత్రము ద్విపదకావ్యము. ఇది ౧౩౧౪-వ సంవత్సరప్రాంతములయందు రచియింపబడి యుండును. పల్నాటివీరుల చరిత్రద్విపద నోరుగంటిపురములో నాడినట్లు ౧౪౨౦-వ సంవత్సరప్రాంతములందు వల్లభరాయనిచే రచియింపఁబడిన క్రీడాభిరామమునం దిట్లు చెప్పబడినది.

గీ. .... విప్రుఁ డీక్షించెఁ బలనాటి వీరపురుష
పరమదైవతశివలింగభవనవాటి.

మ. ద్రుతతాళంబున....................
యతిగూడం ద్విపద ప్రబంధమున వీరానీకముం బాడె నొ
క్కఁత ప్రత్యేకముగాఁ గుమారకులు ఫీట్కారంబుసన్ దూలఁగన్.

గీ. .... పడఁతి పల్నాటివీరులఁ బాడు నపుడు. *

[పల్నాటి వీరచరిత్రము ద్విపదకావ్యము, ప్రస్తుతము ప్రచారములోనున్నది మంజరీఛందమున నున్నది. ఇది యసమగ్రము. ఇది శ్రీనాధుని రచన కాదని కొందఱిమతము. ఆంధ్రకవి తరంగిణీకారులు నట్లే తలఁచియున్నారు. కాని కొన్ని భాగములలో శ్రీనాథుని పోకడలు, కొన్నింట శ్రీనాధుని రచన యనఁదగిన రచన కానవచ్చుచున్నట్లు కొందఱు తలంచుచున్నారు శ్రీనాధుఁడు, కొండయ్య. మల్లయ్య అనువారు వీరచరిత్ర గ్రంధకర్తలుగాఁ దెలియవచ్చుచున్నారనియు, శ్రీనాధుని ద్విపదకావ్యమును జూచి మిగిలిన యిర్వురును గ్రంథరచనము చేసియుందురనియును శ్రీ. సి. పి. బ్రౌనుదొర గారును, శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు నభిప్రాయపడినారు.

మఱియు నియ్యది శ్రీనాథుని చిన్ననాఁటి రచనగా శ్రీ ప్రభాకరశాస్త్రిగారు తలఁపలేదు. రాజావలంబనము పోయినపిదప-అనఁగా-కొండవీటి పతనము నకుఁ దర్వాత శ్రీనాధుఁడు 'పల్నాటిప్రాంతములను బర్యటించునప్పుడు,

* క్రీడాభిరామకర్తృత్వముఁగూర్చి వల్లభరాయని చరిత్రమున వివరింపఁబడినది.

అక్కడి ప్రజల ప్రార్థనముచేతఁగాని, దేశచరిత్రాభిమానముచేతఁగాని ఈ చరిత్రమును రచించి యుండునని శ్రీ శాస్త్రులుగారి యాశయము. [చూ. శృంగార శ్రీనాథము. పుట. పుట 240]

ఈ పుస్తకమువలనఁ గలిగిన ప్రోత్సాహమునుబట్టి శ్రీనాథుఁడు గొప్పవారికిఁ గృతు లిచ్చి ధనార్జనము చేయవచ్చు నన్న యాశ గలవాఁడయి స్వగ్రామము విడిచి స్వస్థలమునకు మిక్కిలి సమీపమున నున్న యొక చిన్న సంస్థానమునకుఁ బోయెను. ఆ సంస్థానమున కప్పు డధిపతి పెద్ద కోమటి వేముఁడు. అప్పు డాతని ముఖ్యపట్టణము దువ్వూరో, యేదోయయి యుండును. ఎంతటి విద్వాంసుల కయినను రాజమంత్రి యొక్కయు, తదితరోద్యోగులయొక్కయు నను గ్రహము లేక రాజదర్శన మగుటయు, రాజానుగ్రహమునకుఁ బాత్రుఁ డగుటయు సంభవింపనేరవు. అందుచేత శ్రీనాథుఁడు పెద్దకోమటివేమనమంత్రి యైన మామిడి సింగన్న యైన ప్రెగడన్న నాశ్రయించి యాతనికిఁ బండితారాధ్యచరిత్ర మంకిత మొనర్చెను. అప్పటి కీ పెద్దకోమటివేమన్న యొక చిన్నసంస్థానాధిపతి యయి కొమర, గిరిరెడ్డి రాజ్యకాలములో నుండినవాఁడు. పెద్దకోమటి వేమభూపాలుఁడు రెడ్డిరాజ్యసంస్థాపకుఁడైన ప్రోలయవేమారెడ్డియన్న యైన మాచన్నయొక్క రెండవ కుమారుని కుమారుఁడు. మాచన్నయొక్క ప్రథమపుత్రుఁడు రెడ్డిపోతన నృపాలుడు; ద్వితీయ పుత్రుఁడు పెద్దకోమటి భూపాలుఁడు; తృతీయపుత్రుఁడు నాగనరపాలుఁడు. ఈ యంశమును శృంగారదీపికలోని యీ శ్లోకము తెలుపుచున్నది.

శ్లో. మాచక్షోణిపతిర్మహేంద్రవిభవో వేమక్షితీశాగ్రజో
హేమాద్రేస్సదృశో బభూవ సుగుణై స్తస్య త్రయో నందనాః
కీర్త్యా జాగ్రతి రెడ్డిపోతనృపతి శ్శ్రీకోమటీంద్ర స్తతో
నాగక్ష్మాపతి రిత్యవాత్తవపుషో ధర్మార్థకామా ఇవ.

మాచన్నయొక్క చిన్న సంస్థానమునకు తండ్రి యనంతరమున నాతని పెద్ద కొడుకు రెడ్డిపోతభూపాలుఁడు రా జయ్యెను; రెడ్డిపోతభూపాలుని యనం

తకముననాతనితమ్ముఁడు పెద్దకోమటి రా జయ్యెను. ఇతఁ డన వేమ భూపాలుని రాజ్యకాలములోనే మృతినొందఁగా ననవేమభూపాలుని చివర దినములలోనే పెద్దకోమటివేమభూపాలుఁడు తన తండ్రి రాజ్యమునకు వచ్చెను. అనవేమభూపాలునకు మామిడి సింగన్నతండ్రి పెద్దనామాత్యుఁడు మంత్రిగా నుండినట్టును, వేమభూపాలునకు పెద్దనామాత్యుని తమ్ముఁ డైన నామామాత్యుఁడు మంత్రిగా నుండినట్టును, శ్రీనాథుని శృంగారనైషధములో నున్న రెండు పద్యములును పయి నింతకుముందే యుదాహరింపఁబడెను.

కుమారగిరిరాజ్యకాలమునం దే హేతువుచేతనో తండ్రి యనంతరమున మంత్రిత్వము లభింపకపోఁగా మామిడి సింగన్న తన పినతండ్రి యనంతరమున వేమనృపాలునకు మంత్రి యయ్యెను. కుమారగిరిరెడ్డి రాజ్యకాలములోనే శ్రీనాథుఁడు మొట్టమొదట తన పండితారాధ్యచరిత్రమును ప్రెగ్గడన్న కంకితము చేసెను. ఈ విషయమును శ్రీనాథుని గూర్చి మామిడి సింగన్న యన్నట్లున్న నైషధములోని యీ క్రింది పద్యము వ్యక్తపఱచుచున్నది.

క. జగము నుతింపఁగఁ జెప్పితి
ప్రెగడయ్యకు నా యనుంగుపెద్దనకుఁ గృతుల్
నిగమార్థసారసంగ్రహ
మగు నా యారాధ్యచరిత మాదిగఁ బెక్కుల్.

దీనినిబట్టి చూడఁగా నొక్క యారాధ్యచరిత్రమునే గాక యితరపుస్తకములను గూడ మఱికొన్నిటిఁ బ్రెగడయ్య కంకితమొనర్చినట్టు కనుపట్టుచున్నది. శాలివాహనసప్తశతి గూడ నీతనికే యంకితము చేయఁబడినదేమో !

"నూనూగుమీసాలనూత్నయౌవనమున
శాలివాహన సప్తశతి నొడివితి"

అని కనిదే చెప్పుకొని యుండుటచేత నిరువదిరెండేండ్ల ప్రాయమున నేనగా ౧౩౭౮-వ సంవత్సరప్రాంతమున శాలివాహనసప్తశతి రచియింపఁబడి యుండును ఆటు తరువాత రెండు మూఁడేండ్లు కనఁగా ౧౩౮౦-వ సంవత్సర ప్రాంతమున శ్రీనాథుని కిరువదియైదేండ్లుండి నప్పుడు పండితారాధ్య చరిత్రము రచింపఁబడి యుండును, శ్రీనాథుని ప్రసిద్ధి యంతయు నైషధ కావ్యరచనమునుండి యారంభమైనది. అంతకుఁ బూర్వపు గ్రంథము లన్నియు నించుమించుగా నామమాత్రావశిష్టము లయినవి. ఒక్క పల్నాటి వీరచరిత్రములోని కొంతభాగము మాత్రము కనఁబడుచున్నది. అవి నామ మాత్రావశిష్టములయినను కాకపోయినను నాకు మాత్రము దొరకలేదు. శ్రీనాధుని సప్తశతిలోని దని యే గ్రంథములోనుండియో యెత్తి శ్రీమావ వల్లి రామకృష్ణకవిగారీ పద్యము నుదాహరించి యున్నారు.

ఉ. వారణసేయ దావగొనవా నవవారిజమందుఁ దేఁటి క్రొ
వ్వారుచు నుంట నీ వెఱుఁగవా? ప్రియ! హా తెలిగంటిగంటి కె
వ్వారికిఁ గెంపు రాదె? తగవా మగవారల దూఱ నీ విభుం
డారసి నీనిజం బెఱుఁగునంతకు నంతకు నోర్వు నెచ్చెలీ. *

నైషధమునుగూర్చి శ్రీనాధుడే తన కాశీఖండమునందు

"పంతరించితి నిండుజవ్వనంబునయందు
హర్షనైషథకావ్య మాంధ్రభాష"

నని సంపూర్ణయౌవనదశయందు రచించినట్టు చెప్పెను. కాఁబట్టి శ్రీనాథుఁడు తాను ముప్పది సంవత్సరముల వయస్సులో నున్నప్పు డనఁగా ౧౩౮౬-వ సంవత్సరప్రాంతమున నైషధమును రచించి యుండును. ఇది పెద్దకోమటి వేమన్న చిన్నసంస్థానాధిపతిగా నున్న కాలములోనే యాతనిమంత్రి యైన

* [ఇయ్యది శాలివాహన సప్తశతిలోనిదనియే పలువురి విశ్వాసము. పెదకోమటి వేమభూపాలుఁ డీ గ్రంథమునుజూచి యుండవచ్చునని శ్రీప్రభాకరశాస్త్రిలుగారి యభిప్రాయము.]

మామిడిసింగన్న ప్రేరణముచేత తదంకితముగా రచింపఁబడినది. ఈ వేమన్న పెద్దకోమటివేమన్న కాఁ డని కొందఱు భ్రమపడి యేమేమో వ్రాసిరి కాని యతఁడు పెదకోమటివేమన్న యనుటకు గ్రంథములోనేకొన్ని నిదర్శనము లున్నవి

క. శ్రీమహిత పెద్దకోమటి
వేమక్షితిపాలరాజ్యవిభవకళార
క్షామణికి సింగసచివ
గ్రామణికిం బాండ్యరాయగజకేసరికిన్.

షష్ఠ్యంతపద్యములలో ని ట్లుం డుటయే కాక పుస్తకాంతమున ఫల శ్రుతిలో.

" భారద్వాజగోత్రుండు ను నాప స్తంబ సూత్రుండును
నుభయకులపవిత్రుండును మామిడి పెద్దనామాత్య
పుత్రుండును పెద్దకోమటివేమభూపాలకరుణాపా
త్రుండును నైన వినయవివేకసాహి త్యసింగనామాత్య
పుణ్యశ్లోకుండు. "

అని స్పష్టముగా పెదకోమటివేమభూపాలుఁడని చెప్పఁబడి యున్నది. నైష ధమును ముద్రించినవారు షష్ఠ్యంతపద్యారంభమును "శ్రీమహితు పెద్ద కొమరుఁడు" అని యర్థము లేకుండునట్లు సవరించి పద్యమును పాడుచేసిరి. నైషధకావ్యకృతిపతి యైన మామిడిసింగనామాత్యుఁడు వేమనృపాలుని మంత్రి యైనట్లు కవి యీ క్రింది విధముగఁ జెప్పియున్నాఁడు.

'సీ. తనకృపాణము సముద్ధతవైరిశుద్ధాంత
తాటంకముల కెగ్గుఁ దలఁపుచుండఁ
దనబాహుపీఠంబు ధరణీభృత్కుమారాహి
సామజంబులకు విశ్రాంతి యొసఁగఁ

దనకీ_ర్తిన_ర్తకి ఘనతర బ్రహ్మాండ
భవనభూముల గొండ్లి ఁ బరిఢవిల్ల ఁ
దనదానమహిమ సంతానచింతారత్న
జీమూతసురభుల సిగ్గు వఱుపఁ
బరఁగు శ్రీవేమమండలేశ్వరునిమంత్రి
యహితదుర్మంత్రివదనముద్రావతార
శాసనుఁడు రాయవేశ్యాభుజంగబిరుద
మంత్రి పెద్దయసింగనామాత్యవరుఁడు.

కవి పయి పద్యమునందుఁ బెదకోమటివేమనృపాలుని మండలేశ్వరుఁడని చెప్పుటచేత నైషధగ్రంథరచనకాలమునాఁటి కతడు రెడ్డిసామ్రాజ్య పట్టభద్రుఁడు కాలేదనియు, రెడ్డిరాజ్యములోప మండలేశ్వరుఁడుగానే యుండె ననియుఁ దెల్ల మగుచున్నది. కృతిపతి తన్నుద్దేశించి పలికినట్లుగా శ్రీనాథుఁడు నైషధావతారికలో నీ క్రింది పద్యమును వేసియున్నాఁడు.

శా. బ్రాహ్మీదత్తవరప్రసాదుఁడ వుదుప్రజ్ఞావిశేషోదయా
జిహ్మస్వాంతుఁడ వీశ్వరార్చనకళాశీలుండ వధ్యర్థిత
బ్రహ్మాండాదిమహాపురాణచయతాత్పర్యార్థనిర్ధారిత
బ్రహ్మజ్ఞానకళానిధానమవు నీభాగ్యంబు సామాన్యమే?

క. జగము నుతింపఁగఁ జెప్పితి
ప్రెగడయ్యకు నాయనుంగుపెద్దనకుఁ గృతుల్
నిగమార్థసారసంగ్రహ
మగునాయారాధ్యచరితమాదిగఁ బెక్కుల్.

* * * *

గీ. భట్టహర్షుండు ప్రౌఢవాక్పాటవమున
నెద్ది రచియించి బుధలోకహితముఁ బొందె
నట్టి నైషధసత్కావ్య మాంధ్రభాష
ననఘ ! యొనరింపు నాపేర నంకితముగ.

ఆంధ్రనైషధకావ్యాంతమునందు శ్రీనాథుఁడు

"నైషధశృంగారకావ్యం బాంధ్రభాషావిశేషంబున వశేషమనీషి హృదయంగమంబుగా శబ్దంబు ననుసరించియు నభిప్రాయంబు గురించియు భావం బుపలక్షించియు రసంబుఁ బోషించియు నలంకారంబు భూషించియు నౌచిత్యం బాదరించియు ననౌచిత్యంబు పరిహరించియు మాతృకానుసారంబునఁ జెప్పఁబడిన యీ భాషానైషధ కావ్యంబు"

అని తానుజేసిన భాషాంతరీకరణమునుగూర్చి చెప్పుకొనెను. తావనౌచిత్యంబు పరిహరించితి నని కవి చెప్పుకొన్నను, నశ్లీలములును ననౌచిత్యములు నయిన యీ క్రింది పద్యములవంటివానిని వేయక మానలేదు.

ఉ. అవ్వలిదిక్కు మోమయి ప్రియంబున నొండులతోడ ముచ్చటల్
త్రవ్వుచు నొక్కకోమలి పరాకున నుండఁగ ధూర్తుఁ డొక్కరుం
డివ్వల వచ్చి వంచనమెయిన్ నునుమించుమెఱుంగుటద్దమున్
నవ్వుచుఁ బట్టె దానిచరణంబులకు న్నడుమైన మేదినిన్.

అ కాలమునం దిట్టి వనౌచిత్యములుగా భావింపఁబడ కుండెనేమో !
నైషధమును తెనిఁగించుటలో శ్రీనాథుఁడు సంస్కృతము నత్యధికముగా నుపయోగించి బహుస్థలములలో సాంస్కృతికదీర్ఘసమాసములతో నింపి యున్నాఁడు.

"శ్లో. సువర్ణదండైకసితాతపత్రితజ్వలత్ప్రతాపావళికీర్తిమండలః."—
ప్రథమసర్గము. శ్లో ౨. అను భాగము.

సీ. "తపనీయదండైకధవళాతపత్రితోద్దండతేజఃకీర్తిమండలుండు"

అని తెనిఁగింపఁబడినది. ఇందు "సువర్ణ" యనుటకు "తపనీయ" యనియు, "సిత" యనుటకు "ధవళ" యనియు, సంస్కృతపదములకు సంస్కృతపర్యాయపదములు వేసి గణయతిప్రాసముల కనుకూలముగా దీర్ఘసమాసమును జేయుట తప్పఁ దెలిగించిన దేదియులేదు. కడపట "కీర్తి మండలః" అనుదానిని "కీర్తిమండలుం" డని తెనుఁగువిభక్తితోఁ గూర్చుట మాత్రమే యిం దున్న తెలుఁగు.

శ్లో. సరశీః పరిశీలితుం మయా
గమికర్మీకృతనైకనీవృతా,
అతిథిత్వ మనాయి సా దృశోః
సదసత్సంశయగోచరోదరీ.—సర్గ. ౪. శ్లో. ౪౦.

అనుదానిలోని గమికర్మీకృతత్వాదిభాగమును

మ. "గమికర్మీకృతనైకనీవృతుఁడనై కంటిన్ విదర్భంబునన్"

అని మార్పేమియుఁ జేయక యుదను విభక్తిప్రత్యయమైన డువర్ణకమును మాత్రము చేర్చి తనుఁ గనిపించెను.

శ్లో. మందాక్షమందాక్షరముద్రముక్త్వా
తస్యాం సమాకుంచితవాచి హంసః,
తచ్ఛంసితే కించన సంశయాళు
ర్గిరా ముఖాంభోజ మయం యుయోజ.—సర్గ. ౩ శ్లో. ౭౧.

అనుదానిలోని మందాక్షేత్యాదిప్రథమచరణమును

గీ. "రమణి మందాక్షమందాక్షరంబు గాఁగ"

అని తెనిఁగించెను. ఇందును మూలములోని పదములలో మార్పేమియు లేక తెలుఁ గగుటకు కడను బువర్ణకము చేర్పఁబడెను. ఇటువంటి వనేక ములు గలవు. ఇట్టి భాషాంతరములను జూచి యా కాలపు విద్వాంసులు శ్రీనాథునితో "నీడూలును మూలునుదీసికొని మా నైషధమును మామీఁదఁ బాఱవేయుము" అని పరిహాసముగాఁ బలికి రని యొక కథ చెప్పుచున్నారు. దానికి బహుస్థలములయందు సంస్కృత విభక్తికి మాఱుగా తెలుఁగువిభక్తి ప్రత్యయములైన డుములనుజేర్చుట తప్ప వేఱుభాషాంతరము లేదని తాత్పర్యము. తెనుఁగున గమనార్థకమైన సకర్మకక్రియ లేనప్పుడు "గమి కర్మీకృతనైకనీవృతుఁడనై" యనుటకంటె "అనేక దేశములను దిరిగిన వాఁడనై" యను నర్థ మిచ్చెడు వేఱొక వాక్యమును వాడుటయే సముచిత మని తోఁచుచున్నది. ఇట్టి భాషాంతరములు సంస్కృతపాండిత్యము గల విద్వాంసులకే కాని సామాన్యాంధ్రభాషాజ్ఞానము గలవారికి బోధపడవు. కొన్నిచోట్ల భాషాంతర మెట్లున్నను మొత్తముమీఁద నైషధాంధ్రీకరణము సర్వజనశ్లాఘాపాత్రముగా నున్నదనుటకు సందేహము లేదు.

శ్లో. విజ్ఞాపనీయా న గిరో మదర్థాః
 క్రుధా కదుష్ణే హృది నైషధస్య ?
 పిత్తేనదూనే రసనే సితాపి
 తిక్తాయతే హంసకులావతంస !

గీ. అధికరోషకషాయితస్వాంతుఁడైన
 నరపతికి విన్నవింపకు నా యవస్థ
 పైత్యదోషోదయంబునఁ బరుస దైన
 జిహ్వకును బంచదారయుఁ జేఁదుగాదె !

ఇత్యాదిస్థలములలో భాషాంతర మెంతో మనోహరముగా నున్నది. గుణ విశేషము కలిగియున్న దగుటచేతనే యాంధ్రనైషధ మాంధ్ర పంచకావ్య ములలో నొక్కటిగాఁ బరిగణింపఁబడుటయే కాక వానిలో నగ్రగణ్యముగా భావింపఁబడుచున్నది. ఈ నైషధకావ్యరచనవలన శ్రీనాథున కాంధ్రకవు లలో నత్యంత ప్రసిద్ధి కలిగినది. ఎంతటి ప్రసిద్ధి కలిగినను శ్రీనాథున కింతే వఱకు రాజాస్థానములలోఁ బ్రవేశము కలిగినదికాదు. ధనార్జనమున కయి పెదకోమటివేమనృపాలుని సంస్థానమునకుఁ బోయి యతని మంత్రులు మొదలైనవారి నాశ్రయించినట్టే శ్రీనాథుఁడు స్వస్థలమును విడిచి వచ్చి యారంభ దశలోనే రెడ్డిరాజ్యమునకుఁ బ్రధాననగరమయిన కొండవీటికిఁ బోయి కుమారగిరిరెడ్డియొక్క మంత్రులు మొదలయినవారి నాశ్రయించి యుండును గాని యచ్చటివా రీతని కచ్చటఁ బ్రవేశము కలుగనీయలేదు. * ఉభయు లును శైవమతస్థు లగుటచేతనో, మఱి యే హేతువుచేతనో యట్టి ప్రయా ణములయందు శ్రీనాథునకు కుమారగిరిభూపాలుని సుగంధభాండాగారాధ్యక్షుఁ డయి కోటీశ్వరుఁడుగా నుండిన యవచి తిప్పయసెట్టితోడి మైత్రి కలిగినది. అందుచేతనే శ్రీనాథుఁడు తిప్పయసెట్టికి బాలసఖుఁ డయ్యెను. అప్పటికి శ్రీనాథుఁ డిరువది యిరువదియైదు సంవత్సరముల బాలుఁడే యయినను తిప్పయ్యసెట్టి యాతనికంటె మిక్కిలి పెద్దవాఁ డయి యుండును. కొండ వీటియందు తప్ప శ్రీనాథున కవచి తిప్పయ సెట్టితోడిమైత్రి కలుగుటకు నవకాశము వేఱొకచోటఁ గానఁబడదు. శ్రీనాథుఁడు నైషధరచనానంతర మునఁ దన బాలసఖుఁ డయిన తిప్పయసెట్టిని జూచి సమ్మానమును బొందు టకు మరలఁ గొండవీటికిఁ బోయెను. అప్పుడు శ్రీనాథుఁడు ధనస్వీకారము చేసి హరవిలాసమును రచించి తిప్పయసెట్టి కంకిత మొనర్చెను

హరవిలాస మేదాశ్వాసముల గ్రంథము. నైషధకావ్యరచనా నంతరమున నెల్లవారును దానిని సంస్కృతపదభూయిష్ఠముగాను, దీర్ఘసంస్కృతసమాస బహుళముగాను నుండిన దని నిందింపఁగా నా నిందను బాపుకొనుటకయి

* [కుమారగిరి కాలమున శ్రీనాథుఁ డిర్వదియేండ్ల లోపు వయస్సువాఁడయి యుండుట వలననే యాస్థానమునఁ బ్రవేశము కల్గలేదని కొందఱి యభిప్రాయము.]

శ్రీనాథుఁడు హరవిలాసము నాంధ్రపదభూయిష్ఠముగాను, విశేషదీర్ఘ సంస్కృత సమాసవిరహితముగానుజేసెను శ్రీనాథుని గ్రంథము లన్నిటిలో నిది కడపటి దని కొందఱు వ్రాసిరి గాని యది సరి గాదు. ఇది తప్పక కొమరగిరిరెడ్డికాలములోనే రచియింపఁ బడినది. దీనికృతిపతి యైన కోమటి యవచి తిప్పయ్యసెట్టి కొమరగిరి భూపాలునికాలములో నుండి యాతనికి సుగంధద్రవ్యంబులు తెప్పించి యిచ్చువాఁ డనియు, తిప్పయ్యసెట్టి కవి నుద్దేశించి తనకు శైవప్రబంధ మొకటి యంకితము చేయుమని యడిగె ననియు, హరవిలాసములోని యీ క్రింది గద్యపద్యములు స్పష్టముగాఁ జెప్పుచున్నవి. "గద్యము .. .. కొమరగిరి వసంతనృపాలునివలన నాందో ళికాఛత్ర చామరతురంగాది రాజ్యచిహ్నములు వడసి యమ్మహారాజునకుఁ బ్రతిసంవత్సరోత్సవంబునకుం దగిన కస్తూరికుంకుమ ఘనసార సంకుమ దహిమాంబుకాలాగురుగంధసారప్రభృతిసుగంధ ద్రవ్యంబు లొడగూర్చియుఁ జీనిసింహళతవాయిహురుమంజిజలలోగి [illegible] ద్వీపాంతరాకరంబు లగు ధనకనకవస్తువాహనమాణిక్యగాణిక్యంబులు తెప్పించియు, గవినైగమిక వాదివాంశికవైతాళికాదు లగు నర్థిజనంబులకు నర్థంబులు గుప్పించియు ధీరుండును నుదారుండును గంభీరుండును [illegible] దాచారుఁడును నన విఖ్యాతిఁ గాంచిన యవచిదేవయతిప్ప ప్రభుం డొ[illegible]నాఁ డాస్థానమండపంబున సుఖోపవిష్టుం డయి.

సీ. కమలనాభునిపౌత్త్రుఁ గవితామహీ రాజ
భద్రాసనారూఢుఁ బరమపుణ్యుఁ
బౌత్రు నాపస్తంబసూత్రు భారద్వాజ
గోత్రు సజ్జనమిత్రుఁ గులపవిత్రు
భీమాంబికామారనామాత్యనందను
నఖిలపురాణవిద్యాప్రవీణు
నధ్వర్యు వేదశాఖాతిథినిష్ణాతు
నంధ్రభాషానైషధాబ్జభవుని

నుభయభాషాకవిత్వ ప్రయోగకుశలు
బాలసఖు గారవించి తాత్పర్య మొప్ప
నవచిదేవయత్రిపురారి యక్షరాజు
హితమితోక్తుల వెలయంగ బిట్టు లనియె.

క. కంటిని విశుద్ధసంతతి
వింటిఁ బురాణములు పెక్కు విశ్వము పొగడన్
మంటి బహువత్సరంబులు
గొంటి యశోధనము సుకవికోటి నుతింపన్. [పీఠిక-౯,౯]

....

గీ ఆగమజ్ఞాననిధివి శాస్త్రార్థనిధివి
బహుపురాణజ్ఞుఁడవు సత్కవనకవివి
బాలసఖుఁడవు శైవప్రబంధ మొకటి
యవధరింపుము నాపేర నంకితముగ.'' [పీఠిక-౧౨]

పయి వాక్యములవలన తిప్పయసెట్టిపై కొమరగిరిభూపాలునకు కస్తూరిఘనసారాదులు సమకూర్చువాఁ డయినట్టును. ఏండ్లు చెల్లినవాఁ డయి నట్టును, కవిబాలసఖుఁ డయినట్టును కనుపట్టుచున్నది. ఇందలి మొదటి రెండంశముల విషయములోను సందేహము లేదు. తిప్పయసెట్టితండ్రి దేవయ్యసెట్టి ౧౩౨౦ మొదలుకొని ౧౩౪౦ వఱకును రాజ్యము చేసిన ప్రోలయవేమారెడ్డికాలములో నుండినవాఁ డగుటచేతను, ప్రోలయ వేమారెడ్డికొడుకు కొడుకైన కొమరగిరిరెడ్డికాలములో తిప్పయసెట్టి యుండుటచేతను, తిప్పయసెట్టి కుమారగిరిభూపాలుని తండ్రి యైన యనపోతభూపాలునియీడువాఁ డయి యుండవలెను. అప్పుడు తిప్పయసెట్టికుమారులే కొమరగిరిరెడ్డి యీడువారయి యుండవలెను. అందుచేత తిప్పయసెట్టి కప్పటి కఱువది సంవత్సరముల వయస్సుండి యుండవలెను. అంతేకాక తృతీయాశ్వాసారంభములోని

యీ పద్యము తిప్పయసెట్టికూడ ప్రోలయనేమారెడ్డి కాలములోనుండినట్టు తెలుపుచున్నది.

క. శ్రీపర్వతసోపాన
స్థాపకవేమక్షితీశసామ్రాజ్యశ్రీ
వ్యాపారిముఖ్య ! యన్వయ
దీపక ! యలకాధిరాజ ! దేవయతిప్పా !

ప్రోలయవేమారెడ్డికాలములోనే తిప్పయ్యసెట్టి వ్యాపారిముఖ్యుఁ డయినందున నప్పటి కిరువది సంవత్సరములవాఁ డయిన యిుండి, కుమారగిరిరెడ్డి రాజ్యారంభకాలమునకే యేఁబది సంవత్సరములవాఁడయి, హరవిలాసరచన కాలమునకే యఱువదేండ్లు దాటినవాఁ డయి యుండవలెను. హరవిలాసము ౧౪౪౦-వ సంవత్సర ప్రాంతమున తిప్పయసెట్టి కంకితము చేయఁబడిన దని చెప్పెడి బుద్ధిమంతుల యభిప్రాయ ప్రకారము తిప్పయసెట్టికి నూటపది యేండ్లు దాఁటినతరువాత శ్రీనాథుఁడు హరవిలాసము నంకితము చేసెనని యేర్పడును గనుక నది గొప్ప యసంగతము. కాఁబట్టి హరవిలాసము కుమారగిరిభూపాలుఁడు జీవించియుండఁగానే ౧౪౦౦-వ సంవత్సరమునకు లోపలనే తిప్పయసెట్టి కంకితము చేయఁబడుట నిశ్చయము. అప్పటికె తిప్పయసెట్టికి దాదాపుగా డెబ్బదిసంవత్సరములయియా డుండును. ౧౩౬౦-వ సంవత్సరమునకు లోపల జననమొందని శ్రీనాథుఁడు వృద్ధుఁ డైన తిప్పయ సెట్టికి వాలసఖుఁ డెట్లగును ? ఇద్దఱును సమానవయస్కులు కాకపోవుట నిశ్చయము. తిప్పయసెట్టి వృద్ధుఁడే ! శ్రీనాథుఁడు బాలుఁ డయి యుండి నప్పుడు సఖ్యము కలుగుటచేతనే తిప్పయసెట్టికి శ్రీనాథుఁడు బాలసఖుఁ డయ్యెను గాని యుభయులును బాలు రయి యుండినప్పుడు కలిగిన మైత్రి చేతఁ గాదు. పయి సీసపద్యములో

"ఆంధ్రభాషానైషధాబ్జభవుని"

అని యున్నందున, హరవిలాసము నైషధమునకుఁ దరువాత రచింపఁబడె ననుటకు సందేహము లేదు ఇఁక హరవిలాసమును రచించిన కాలమును

సరిగా నిర్ధారణము చేయుటకుఁ బ్రయత్నింతము. కవి తిప్పయ్యసెట్టితమ్ముఁడైన తిరుమలనాధసెట్టిని వర్ణించుచు నీ రీతిని జెప్పెను.

చ. 'హరిహరరాయ ఫేరొజసహాసురధాణ గజాధిపాదిభూ
వరులు నిజప్రభావ మభివర్ణన చేయఁ గుమారగిర్యధీ
శ్వరుని వసంతవైభవము సర్వము నొక్కఁడ నిర్వహించు మా
తిరుమలనాథసెట్టికివి ధీగుణభట్టికి నెవ్వఁ డీ డగుఁ ? [పీఠిక-౨౪]

ఈ పద్యమునందు హరిహరరాయలు, ఫేరొజిసహా, మొదలయినవారు మెచ్చునట్లుగా కుమారగిరిభూకాంతుని వసంతోత్సవ వైభవమును తిరుమలనాథసెట్టి యొక్కఁడే నిర్వహించుచుండినట్లు చెప్పఁబడినది. కాఁబట్టి హరవిలాసము రచియించునప్పటికి సమకాలీనులైన యీ ముగ్గురు రాజులును జీవించి యుండుట స్పష్టము. ఈ ముప్వురిలో (రెండవ) హరిహరరాయలు ౧౩౭౭ మొదలుకొని ౧౪౦౪-వ సంవత్సరమువఱకును రాజ్యపాలనము చేసెను; ఫేరోజిసహా ౧౩౯౭ మొదలుకొని ౧౪౨౨-వ సంవత్సరమువఱకును రాజ్యపాలనము చేసెను; కుమారగిరిభూపాలుఁడు ౧౩౮౩ మొదలుకొని ౧౪౦౦-వ సంవత్సరము వఱకును రాజ్యపాలనము చేసెను. అందుచేత నీ ముగ్గురును నుండి రాజ్యపాలనము చేయుచుండిన కాలము ౧౩౯౭, ౧౩౯౮, ౧౩౯౯. ౧౪౦౦ సంవత్సరములు. కాఁబట్టి ౧౩౯౭ నకును ౧౪౦౦ లకును నడిమి కాలములో ననఁగా ౧౪౦౦ వ సంవత్సర ప్రాంతమున హరవిలాసము రచియింపఁబడెను. అప్పటికి శ్రీనాధునికి ముప్పదినాలుగు. ముప్పదియైదు సంవత్సరముల వయస్సుండును. కవి ధనలాభముకొఱకు కృతిపతిని "తిప్పప్రభుఁ" డనియు, "ఆస్థానమండపంబున సుఖోపవిష్టుండై" యనియు, అతిశయోక్తులతో నెంతయెక్కువగా వర్ణించినను, తిప్పయసెట్టి సముద్రవ్యాపారమును జేయుచు, కుమారగిరికి వలెనే యితర రాజులకును కస్తూరీకుంకుమాది సుగంధద్రవ్యములను, చీనాంబరాదులను హయరత్నాదులను విదేశములనుండి తెప్పించి విక్రయించుచు పెద్ద యంగడి పెట్టిన లక్షాధికారి యైన పెద్దకోమటియే గాని మహారాజు కాఁడు. ప్రథమాశ్వాసాంతమునందలి

క. కొమరగిరివసంతనృపా
గమకవివరగంధసారకస్తూరీకుం
కుమకర్పూరహిమాంభ
స్సముదంచితబహుసుగంధిశాలాధ్యక్షా !' [అ. ౧. ప. ౩౦]

అన్న పద్యములోని సంబోధనము తిప్పయసెట్టి కుమారగిరినిమిత్తము తెప్పించిన కర్పూరములు గంధసారములు కస్తూరిని విక్రయించు గొప్ప సుగంధద్రవ్యముల పాణిశాలలు బెట్టినవాఁడని చెప్పుచున్నది. అఱువదేండ్లు దాఁటిన ముసలివాఁడైన తిప్పయసెట్టిని ద్వితీయాశ్వాసాంతమున "లలనాజనతాఝషలక్ష్మ, భా !" స్త్రీజనములకు మన్మథతుల్యుఁడా ! యనియు, సప్తమాశ్వాసాంతమున "కామినీహృద్యమూర్తీ !" యనియు, పంచమాశ్వాసాంతమున 'సమరఫల్గుణా' యనియు, సప్తమాశ్వాసాంతమున 'సంగరపార్థ' యనియు, షష్ఠ్యంతములలో "వాణీసఖముఖముఖరితవీణా నిక్వాణనిభకవిత్వఫణితికి" అనియు స్తుతి చేసిన యతిశయోక్తుల నటుండ నిచ్చినను ఆ కాలమునందలి యాంధ్రవణిజులు విదేశవాసులతోను, ద్వీపాంతరఖండాంతరవాసులతోను సముద్రవ్యాపారమును విశేషముగా జరుపుచుండిన ట్లీ క్రింది పద్యములు సహస్రముఖముల ఘోషించుచున్నవి.

* సీ. పంజాబుకర్పూరపాదపంబులు దెచ్చి
జలనోగిబంగారుమొలక తెచ్చి
సింహళంబున గంధసింధురంబులు తెచ్చి
హురుమంజిబలు తేజిహరులు తెచ్చి
గోవసంశుద్ధపంకుమదద్రవము తెచ్చి
యాపగనాణిముత్యాలు తెచ్చి
చోటంగిఁ గస్తూరికాటంకములు తెచ్చి
చీనచీనాంబరశ్రేణి తెచ్చి

* [పంజాబు-పాఠాంతరము. మఱియు 'తెచ్చి' అనుచోటనెల్ల 'తెచ్చె' అను భూతకాలికక్రియ యే కొన్నిటఁ గలదు.]

జగదగోపాలరాయవేశ్యాభుజంగ
పల్లవాదిత్యభూదానపరశురామ
కొమరగిరిరాజదేవేంద్రుకూర్మిహితుఁడు
జాణజగజెట్టి దేవయచామిసెట్టి.

గీ. తమ్ము లిద్దఱుఁ దనయాజ్ఞ తల ధరించి
యన్నిదీవులఁ దెచ్చులాభార్థకోటి
యర్థులకు నిచ్చి కీర్తి బేహారమాడు
నవచిత్రిపురాంతకుండు వంశాబ్ధివిధుఁడు

మ. తరుణా*చీనితవాయిగోవరమణాస్థానంబులం జందనా
గరుకర్పూరహిమాంబుకుంకుమరజఃకస్తూరికాద్రవ్యముల్
శరధిం * గప్పిలిజోగులజా విరివిగా సామాన్లఁ దెప్పించు నే
నేర్పరియో వైశ్యకులోత్తముం డవచితిప్పం డల్పుడేయిమ్మహిన్.
[పీఠిక. ౨౬-౨౭]

ఇటువంటి యోడలవ్యాపారియైన తిప్పయసెట్టి కిద్దఱు తమ్ములును, ముగ్గురు కొడుకులు నుండిన ట్లీ పద్యమునఁ జెప్పఁబడినది.

ఉ. ధీచతురు ల్సహోదరులు తిర్మలసెట్టియుఁ జామిసెట్టియున్
మాచన విశ్వనాథ చినమల్లకుమారులు వీర లాత్మజుల్
శ్రీచెలువంబు గైకొనినచేడియ యన్నమదేవి భార్యగా
గోచరమే నుతింప నయకోవిదునిఁద్రిపురాంతకాధిపున్ ?
[పీఠిక-౩౧]

* [సీరి అని పాఠాంతరము. * గప్పలి జోగువల్లి వలికాసమ్మాన్లం దెప్పించు నేర్పరియై అని పాఠాంతరము.]

[హారవిలాస రచన కుమారగిరిరెడ్డి కాలమునందే జరిగియుండునని కొందఱి తలంపు; కాని చాలమంది విద్వద్విమర్శకులు దాని నంగీకరించలేదు. కొండ వీటి రాజ్యము పతనమైన పిదప శ్రీనాథుఁడు దేశములఁ దిరుగుచు, కంచికిఁ బోయి యుండెననియు, అప్పుడచటనున్న తన బాలసఖుని (తిప్పయసెట్టి) కోరిక పయిని హారవిలాసమును రచించి, యతని కంకిత మిచ్చి, సమ్మానముపొందెననియు. కాఁగా హారవిలాసము శృంగారనైషధ, భీమఖండములు రచింపఁబడిన పిదప – కాశీఖండరచనమునకుఁ బూర్వము రచింపఁబడి యుండు ననియు శ్రీ ప్రభాకరశాస్త్రిలుగారు వివరించిరి. హారవిలాసరచనమునాఁటికి అవచి తిప్పయసెట్టి బాలసఖుఁడగు శ్రీనాథుఁడు వృద్ధుఁడే యనియు, శ్రీనాథునికంటెను గూడఁ దిప్పయసెట్టి 'మతీవృద్ధుఁ డనియు శ్రీశాస్త్రిగారు హారవిలాస పీఠికలోఁ దెల్పియున్నారు. [చూ. ఆనందముద్రణాలయము వారి హారవిలాసము – పీఠిక-4.] ఏతద్రచనా కాలమునాఁటికి శ్రీనాథునికి నలువది, నలువదియైదు సంవత్సరముల ప్రాయమును, తిప్పయకేఁబది యేఁబదియైదు సంవత్సరముల వయసును నుండియుండునని 'ఆంధ్రకవి తరంగిణి' యందుఁ గలదు. [చూ. సంపుటము. 5. పుట. 53]

భాగవతముదశమస్కంధము శ్రీకృష్ణునిలీలలను దెలుపునట్లుగానే యీహార విలాసము హారునివిలాసములను దెలుపుచున్నది. ఇందలి శివవిలాసము లలో మొదటిది చిఱుతొండనంబి చరితమును గూర్చినది. శైవాచారపరాయణుఁడైన చిఱుతొండనంబి కృతిపతి యైన తిప్పయసెట్టివంశమునకు మూలపురుషుఁ డైన ట్లీ గ్రంథమునఁ జెప్పఁబడినది. వీరశైవశిఖామణి యైన చిఱుతొండనంబి యను వైశ్యరత్నము నిత్యమును దవపంక్తిని జంగమప్రమథులు లేక భుజించెడువాఁడు కాఁడఁట ! ఒకసారి యిరువది రెండుదినము లేకవృష్టి గురిసి తనవాస స్థానమైన కాంచీనగరమునందు సహ పంక్తిని గుడుచుటకు జంగమ మాహేశ్వరుఁ డొక్కఁడును దొరకకపోఁగా వ్రతభంగము కలుగకుండుట కయి చిఱుతొండనంబి యూరంతయు వెదకుచుఁ బోయి పోయి తుద కూరిబైట నున్న యొక పాడుదేవాలయ

ములో భార్యయైన గ్రుడ్డిముసలియవ్వతో నుండిన వృద్ధుఁడై క్షయవ్యాధి పీడితశరీరుఁడైన జంగమమాహేశ్వరుఁ డొక్కఁడు కానఁబడెనఁట ! చిఱుతొండనంబి యాతనిని దనతోడి సహభోజనమునకుఁ బిలువఁగా నతఁడు క్రొత్తగా నుపనీతుఁ డయి పదియేండ్ల యీడుగల కుమారునిఁ దల్లిచే చంపి వండి వడ్డించెడు గృహస్థునిపంక్తిని గాని భుజియింప రా ననెనఁట ! దుష్కరమగు నా కోరికను జెల్లించుటకు చిఱుతొండనంబియు నాతని దేవి యైన తిరువెంగనాంచియు నొప్పుకొని యా ముసలిజంగమును సకళత్రముగా స్వగృహమునకుఁ గొనిపోయి యావఱకే తాను జంగమమాహేశ్వరున కాహార మగుటకు సంతోషపూర్వకముగా నంగీకరించి యుండిన సిరియాలుని పాఠశాలనుండి కొని వచ్చి యుపనీతునిఁజేసి తల్లియైన తిరువెంగనాంచియే యా బాలుని తఱిగి వండి మగనిపంక్తిని గూరుచుండిన యా ముసలి జంగమునకు వడ్డించెనఁట. అప్పు డా జంగము చిఱుతొండనంబియొక్క కొడు కొకఁడుకూడఁ గూరుచుండక యపుత్రకుని పంక్తిని భుజింపనొల్ల ననెనఁట ! దానికి * చిఱుతొండనంబి తనకు సిరియాలుఁ డేకపుత్రుఁ డగుటచేత వేఱొక పుత్రుఁడు లేఁడని విన్నవింపఁగా వానినే తల్లిచేతఁ బిలిపింపు మని యా వృద్ధమాహేశ్వరుఁ డాజ్ఞాపించెనఁట ! తదాజ్ఞానుసారముగాఁ దల్లియైన తిరువెంగనాంచి 'సిరియాలా' యని కేకవేయఁగా నందఱు నాశ్చర్యసంతోషమగ్నమానసు లగునట్లుగా మృతినొందిన సిరియాలుఁడే కసుగందని శరీరముతో బ్రతికి వచ్చెనఁట ! ఆ ముసలిజంగమును ముసలియవ్వయు నా వీరశైవ దంపతీపుత్రులయొక్క భక్తిని నిశ్చలశైవాచారానురక్తిని పరీక్షించుటకయి కైలాసమునుండి కపటవేషముతో భూమి కవతరించి వచ్చిన పార్వతీపరమేశ్వరులఁట ! పార్వతీపరమేశ్వరు లా కుటుంబముయొక్క శైవాచారపరాయణత్వమునకు మెచ్చి కడపట వారికి ముగ్గురకు మాత్రమే కాక కాంచీపురములో నుండిన వారియాప్తబంధువులైన వైశ్యుల కందఱికిని గూడ కైలాసనివాసప్రాప్తి ననుగ్రహించిరఁట !

* [తనకుఁ బుత్రుఁడున్నాఁడనియు, వాఁడెక్కడికో పోయెననియు, వంటకములు చల్లారకమున్నే భుజింపవలెననియు, చిఱుతొండనంబి కోరినట్లు హరవిలాసములోఁ గలదు.]

కవికల్పన కొంత యున్నను హరవిలాసములోని శివలీల లన్నియు శ్రీనాథుని యితర గ్రంథములవలెనే సంస్కృతమునుండి భాషాంతరీకరింపఁ బడినవే. శ్రీనాథుఁ డా వఱకు వాడుకలో లేని పదములను నన్యదేశభాషా పదములను హరవిలాసములోఁ బ్రయోగించుట కారంభించెను. "తరుణా చీనితవాయి" యన్న పద్యములో 'సామాను' లని ప్రయోగించుట కనిపెట్టి యున్నారుగదా! ఈ క్రింది పద్యమున 'ఖుసిమీఱ' సని వాడి యున్నాఁడు.

మ. ఖుసి 1 మీఱన్ సురథాణి నిండుకొలువై కూర్చున్నచో నీక రా
ట్వ్యసనంబున్ నుతియించురా యవచి తిప్పా! చంద్రసారంగనా
భిసముత్పాదితతాళవృంతపవన ప్రేంఖోలనప్రక్రియా
వనరోదంచితసారసౌరభరసవ్యాలంబరోలంబముల్ [పీఠిక-22]

హరవిలాసము రచియింపఁబడినతరువాత నత్యల్పకాలములోనే కుమారగిరి నరపాలుఁడు పరలోకగతుఁ డయ్యెను. అతని యనంతరమునఁ బెదకోమటి వేమభూపాలుఁడే కొండవీటిరాజ్యమున కంతకును బ్రభువయి ౧౪౦౦-వ సంవత్సరములోఁ దనమంత్రియైన మామిడిసింగనామాత్య సహితముగావచ్చి కొండవీటియందుఁ బ్రవేశించెను. అటుతరువాతఁ గొంతకాలమునకు సింగనా మాత్యుని యనుగ్రహమువలన శ్రీనాథునకుఁ మొదట రాజస్థానప్రవేశము కలిగెను. శ్రీనాథుఁడు వేమనృపాలుని యాస్థానమునందు విద్యాధికారిగా నియమింపఁబడినందున నప్పటినుండి స్థిరముగా కొండవీటినివాసుఁడయ్యెను.

ఈ పెదకోమటివేమభూపాలునియొద్ద శ్రీనాథుఁ డాంధ్రకవిగాను, పార్వతీ పరిణయమును రచించిన వామనభట్టు సంస్కృతకవిగాను, ఉండిరి వామన భట్టు సంస్కృతమున వేమభూపాలీయ మను పేర నీతని గూర్చియే యొక వచనకావ్యమును రచించెను. వేమభూపాలీయమునందు వామనభట్టీతనిని సర్వజ్ఞచక్రవర్తినిగాను, ఈతని పూర్వులను మహాచక్రవర్తులనుగాను పొగడెను. వేమభూపాలునకు దాను గ్రంథభర్త యగుటకంటె గ్రంథకర్త

1. మీఁదన్-పాఠాంతరము.

యగుటయం దెక్కువ యిష్టము కలిగి యుండినట్లు కనుపట్టుచున్నది. వేమభూపాలుఁడు సంస్కృతాంధ్రములయందు మంచి పాండిత్యము కలవాఁడయినట్లు చెప్పుచున్నారు. అమరుక మను శృంగారకావ్యమునకు సంస్కృతమున శృంగారదీపిక యను వ్యాఖ్యానము నీతఁడు రచించెను ఈ గ్రంథరచనమునందు శ్రీనాథ వామనభట్టు లీతని సహాయులుగా నుండినట్టు కొందఱును. శ్రీనాథుఁడే గ్రంథము నంతను వేమభూపాలుని పేరు పెట్టి రచించెనని కొందఱును చెప్పుచున్నారు. శ్రీనాథుని శాసనములలో శ్లోకములే భేద మించుకయు లేక సరిగా నిందుఁ గనఁబడుచున్నందున శ్రీనాథుఁడే శృంగారదీపికను రచించి యుండును. *ఫిరంగిపురశాసనము ౧౪౧౦-వ సంవత్సరమునందు శ్రీనాథునిచే రచింపఁబడినది. ఇది గుంటూరుమండలములోని సత్తెనపల్లితాలూకా యందలి ఫిరంగిపుర గ్రామమున శ్రీ వీరభద్రస్వామివారి యాలయమున కెదుట నున్న శిలాస్తంభముమీఁదఁ జెక్కఁబడినందున నీ శిలాశాసనము ఫిరంగిపురశాసన మనఁబడును. ఇది ధరణికోటకు ప్రభువయిన గన్నమనాయని కూఁతురును వేమభూపాలుని భార్యయును నైనసూరాంబ త్రవ్వించిన సంతానసాగర మను చెఱువుమ శకసంవత్సరము ౧౩౩౧ విరోధిసంవత్సర ఫాల్గుణబహుళ ద్వితీయా శుక్రవారమునఁ బ్రతిష్ఠచేయు సందర్భమున శ్రీనాథునిచే రచియింపఁబడినది. ఈ సంతానసాగర ప్రతిష్ఠాతిథి క్రీస్తుశకము ౧౪౧౦-వ సంవత్సరము ఫిబ్రవరినెల ౨౧-వ తేదీ యగును. ఈ శాసనము నిందు క్రిందఁ బూర్ణముగాఁ బ్రకటించుచున్నాను.

పడమటిపైపు.

శ్లో. కళ్యాణం జగతాం తనోతు స విభుః కాదంబినీమేచకః
క్రీడాక్రోడతనుః పయోధిపయసో విశ్వంభరా ముద్వహన్,
ధారాపేతఫణావివ ర్తనవశా న్మోదాయ య స్యాభవన్

* [ఈ గ్రంథమును రచించుటలో శ్రీనాథుఁడు సాయపడి యుండునని పలువురి యభిప్రాయము]

నిర్యత్నా భుజగేంద్రమౌళిమణిభి ర్నీరాజనప్రక్రియా. ౧

తమో హరేతాం తవ పుష్యవంతౌ రాకాసు పూర్వాపరశైలభాజౌ,
రథాంగలీలా మివ దర్శయంతౌ పురా పురారేః పృథివీరథస్య. ౨

మానుషాకారకిమ్మీర స్తంబేరమవపు ర్మహాః,
ఉన్నిద్రయతు భద్రాణి రుద్రాణీ యేన సుప్రజాః, ౩

యన్మౌళౌ నిహితం చిరాయ నిగమైర్ధ్యేయం చ య ద్యోగిభి
ర్యల్లక్ష్మీ మృదుపాణిపద్మయుగళీసంవాహనై ర్లాలితం,
జాతా యత్ర వియన్నదీ త్రిజగతీసంతాపనిర్వాపణీ
తస్మా త్కంసభిదః పదా దుదభవ ద్వర్ణో గుణార్ణోనిధిః. ౪

తత్రాభవత్స ప్తమచక్రవర్తీ వేమక్షితీశో జగరక్షపాలః,
ఏకాదశేతి ప్రతిభాతి శంకా యేనావతారాః పరమస్య పుంసః. ౫

రాజ్యం వేమ న్స చిర మకరో త్ప్రాజ్యదానై కతానో
భూమీదేవై ర్భువ మురుభుజో భుక్తశేషా మభుఙ్క్త,
శ్రీశైలాగ్రా త్ప్రభవతి పథి ప్రాప్తపాతాళగంగే
సోపానాని ప్రమథపదపి మారురుక్షు శ్చకార. ౬

మాచక్షోణిపతి ర్మహేంద్రమహిమా వేమక్షితీశాగ్రజో
రామాద్యై స్సదృశో బభూవ సుగుణై స్తస్య త్రయో నందనాః,
కీర్త్యా జాగ్రతి రెడ్డిపోతనృపతిః శ్రీకోమటేంద్ర స్తతో
నాగమ్మాపతి రి త్యుపాత్తవపుషో ధర్మార్థకామా ఇవ. ౭

అసూత పుత్రం పెదకోమటీంద్రో విశ్రాణనే కర్ణ మసూత పుత్రం,
వేమాభిధానం సుగుణైకతానం పాథోనిధిర్నాథమివౌషధీనాం. ౮

ధాటీదుందుభిభాంకృతిం కలయ నిర్ఘాతరావం రిపూన్
నామాని ద్రుత మర్జునస్య జపతో య స్యాజి గాండీవినః,
సంగ్రామోపపదాని తాని భవతాం రక్షాకృతే సర్వదా
వర్ణ్యంతామితి బోధయం త్యకళీజా ధీయంత్రినో మంత్రిణః ౯

శ్రీశైలే స్థిరమూలతా ముహుర్గతా వృద్ధిం కుమారాచలే
పంచారామతలే ప్రతాపసుషమా సింహాచలేంద్రే తతః,
శ్రీకూర్మే పురుషోత్తమే కుసుమితా సద్ధర్మకీర్త్యోర్లతా
కాశ్యాం విశ్వపతేః పురః ఫలవతీ నిత్యోపహారోచితం.

అభిమన్యుకరగ్రాహ్యాముత్తరాం ఖడ్గపుత్రికాం,
నర్తయత్యాహవే రంగే యః సంగ్రామధనంజయః. ౧

అశ్రాంతం గృహరాజసౌధనివసల్లక్ష్మీకరాభ్యంతర
క్రీడాంభోరుహతాలవృంతనటనప్రస్తావవిస్తారితః,
వాయుః కేసరవాసనాసురభితో యస్యార్థిచింతామణే
ర్ధారాగాహమతి దానకేళిజనితం స్వేదాంభసాం జాలకం. ౨

సప్తసంతానవత్యాసీ ద్యేవ సర్వంసహేత్యలం,
స్పర్ధయేవ ధృతాః కీర్త్యా గర్భే లోకా శ్చతుర్దశ. ౩

రాజ్ఞస్తస్య మహాదేవీ రాజమాంబేతి విశ్రుతా,
రత్నసింహాసనస్యార్ధే రాజతే సూరమాంబికా. ౪

శాకాబ్దే శశిరామరామధరణీసంఖ్యే విరోధ్యాహ్వయే
వర్షే ఫాల్గుననామ్ని మాసి బహుళే పక్షే ద్వితీయాతిథౌ,
దేవీ సా పెదకోమటీశ్వరభువః శ్రీవేమపృథ్వీపతేః
శ్రీసంతానపయోనిధేః కృతవతీ సమ్యక్ప్రతిష్ఠావిధిం. ౧

లీలాలీఢతరంగశీకరకణం రాకావిభావర్యంకుణా
హేరంబేణ మదోష్మశాంతివిధయే హేలావగాఢం ముహుః
రాజీవాసనరథ్యహంసపరిషచ్చంచూపుటీవర్ధిత
స్వచ్ఛాంభోజమృణాళికాకిసలయచ్ఛేదం యదీయం పయః. ౨

ఘోంటాకంటకరోరగర్భకుహళీపాళీమధూళీరస
స్రోతస్సారభటీకమానమధులిడ్ఝంకారకోలాహలైః,
వాచాలాని వనాని యస్య సవిధే సోఽయం సుధానిధి
శ్రీసంతానసముద్ర ఏష పయసాం రాశి ర్జయ త్యద్భుతః. ౩

వైడూర్యరత్నశకలామల వారిపూరే
మంత్రం క్షమత్ర భగవా న్మధుకైటభారిః,
అంగీచకార గజతా మవనచ్ఛలేన
సాకీనకచ్ఛపవరాహమహావతారాన్

శ్రీమహాభారతే. ౧౮

దేవా మనుష్యాః పితరో గంధర్వోరగరాక్షసాః,
స్థావరాణి చ భూతాని సంశ్రయంతి జలాశయం. ౧౯
తటాకే యస్య గావస్తు పిబంతి తృషితాం జలం,
మృగపక్షి మనుష్యాశ్చ సో౽శ్వమేధఫలం లభేత్, ౨౦
ఆస్ఫోటయంతి పితరః ప్రనృత్యంతి పితామహాః,
అపి నః సకులే జాతో య స్తటాకం కరిష్యతి. ౨౧
విద్యాధికారీ శ్రీనాథో వీరశ్రీవేమభూపతేః,
అకరో దాకరో వాచాం నిర్మలం ధర్మశాసనం. ౨౨

సీ. శాకాబ్దములు సహస్రమును మున్నూటము
ప్పదియొక్కఁడును నైన భవ్యసంఖ్య
వఱలు విరోధిసంవత్సరంబున ఫాల్గు
నంబున బహుళపక్షంబు విదియ
శుక్రవారంబున శుభముహూర్తంబున
శ్రీధాన్యవాటీపురాధిపతియుఁ
గృష్ణవేణ్ణాజలక్రీడావినోదుండు
నగు గన్నభూపాలుననుఁగుఁబుత్రి
వీరనారాయణుఁడు వేమవిభునిదేవి
భూరిసద్గుణనికురుంబ సూరమాంబ
జగము వినుతింప సంతానసాగరాఖ్య
వరతటాక ప్రతిష్ఠోత్సవం బొనర్చె. ౨౩

సీ. జాహ్నవీయమునాది సకలపావననదీ
విమలతీర్థాంభః పవిత్రితంబు
సవిధదేశస్థాయి శివమౌళిబాలేందు
కామినీసంఫుల్లకైరవంబు
బహుమహాపరివాహపాథోభరధ్వన
ఘుమఘుమాయితదిశాగోళకంబు
జలసారణీసేకసంవర్ధితానేక
వనివినీతాధ్వగాధ్వశ్రమంబు
బలవదురుమత్స్యకచ్ఛపఢుళికుళీర
తిమితిమింగిల విక్రమాక్రమవిహార
తరళతరతుంగభంగకదంబచుంబి
తాభ్రవీథి సంతానమహాపయోధి. ౨౪

సీ. కపటసూకర మైన కైటభాసురవైరి
ఖురపుటంబులఁ బరిక్షుణ్ణ మయ్యె
రఘుకులోద్వహధనుర్యంత్రముక్తము లైన
చిచ్చుటమ్ములవేఁడిఁ జేవ దఱిగెఁ
గుంభసంభవుని హస్తాంభోరుహంబున
నాపోసనం బయి హ్రాస మొందెఁ
బాషాణముల నచ్ఛభల్లగోలాంగూల
కపియూథములచేతఁ గట్టుపడియె
వనధి యే భంగి సరివచ్చు ననఁగ వచ్చు
నారసాతలగంభీరవారి యగుచు
నపగతాపాయ మగుచు శోభాఢ్య మగుచు
ననుపమం బైన సంతానవనధితోడ. ౨౫

శ్రీనాథవిరచిత మైన రెండవ శాసనము ఫిరంగిపురమున కంటియున్న యమీనాబాదు గ్రామసమీపమునందున్న యొక గుట్టమీఁద జెక్కఁబడియున్న శిలాశాసనము. అందుచేత దీని నమీనాబాదుశాసనమందురు. ఈ శాసనము సంతానసాగరమను పూర్వోక్తతటాకమునకు నీరు వచ్చుటకయి జగనొబ్బ గండకాలువ యనుపేరితో ౧౩౩౭-వ శకవర్షమునకు సరియైన మన్మథ సంవత్సర మాఘశుద్ధపూర్ణిమనాఁడు సూరాంబయొక్కయుఁ, బెదకోమటి వేమభూపాలునియొక్కయు కుమారుఁడైన రాచవేమారెడ్డి త్రవ్వించి ప్రతిష్ఠించిన సందర్భమునఁ జెక్కింపఁబడినది. ఈకాలువ త్రవ్వించిన కాలము క్రీస్తుశకము ౧౪౧౬ అగును. ఈ కాలమునాటికి గోమటివేమారెడ్డి జీవించియే యుండెను. అతఁడు జీవించియుండఁగానే యీ కాలువ యేల కొడుకు పేరఁ ద్రవ్వింపఁబడెనో తెలియకున్నది. ఆ సంవత్సరమునఁ గాటయవేమారెడ్డి మృతినొందఁగా రాజమహేంద్రవరరాజ్యము నాక్రమించుటకయి పెద్ద కోమటివేమభూపాలుఁడు దండెత్తి పోయినప్పుడు కొండవీటి పాలనమునకు రాజవేమారెడ్డిని నియమించి యుండును. పెదకోమటివేమభూపాలుఁడు రాజమహేంద్రవరరాజ్యసంపాదన ప్రయత్నమునందు లబ్ధమనోరథుఁడు గాక యల్లాడరెడ్డిచేత నపజితుఁడయి, హతశేషసైన్యముతో నిజరాజధానిని మరలవలసినవాఁ డయ్యెను. కొండవీటిరెడ్డిరాజులకు జగనొబ్బగండబిరుద ముండెను దానికి జగదేకవీరుఁ డని యర్థము. అందుచేతనే కాలువకు జగనొబ్బగండకాలువ యని పేరు పెట్టఁబడెను. శ్రీనాథకవివిరచిత మయిన యీ శాసనము నిందు క్రిందఁ బొందుపఱుచుచున్నాను.

సీ. శాకాబ్దములు సహస్రంబును మున్నూట
 ముప్పదియేడును నొప్పుమిగుల
మహనీయమైన మన్మథవత్సరంబున
 మాఘమాసమునపూర్ణిమాదినమున
హేమాద్రిదానచింతామణి యరిరాయ
 బసవశంకరుఁ డాజిఫల్గుణుండు

సమదారిరాయవేశ్యాభుజంగుండు వే
మయరాచవేమనక్ష్మావరుండు
తల్లి సూరాంబచే సముత్పన్ను మగుచుఁ
బరఁగు సంతానవార్ధికి వరుసగాఁగ
నొలయు గిరివాహినుల జగనొబ్బగండ
కాలువ ఘటించె నాతారకంబుగాఁగ. "శ్రీనాథకృతి"

ఈ రెండుశాసనములకును నడిమికాలములో శ్రీనాథునిచే రచియింపఁబడిన తామ్రశాసన మొకటి కనఁబడుచున్నది. దాని నాలపాడుశాసనమందురు. అది ౧౪౧౩-వ సంవత్సరమున రచియింపఁబడినది. ఆ తామ్రశాసనము నిందు క్రిందఁ బొందుపఱుచుచున్నాను

శ్లో. కళ్యాణం జగతాం తనోతు స విధుః కాదంబినీమేచకః
క్రీడాక్రోడతనుః పయోధిపయసో విశ్వంభరా ముద్వహన్,
భారాపేతఫణావివ ర్తనవశా న్మోదాయ యస్యాభవ
న్నిర్వృత్నా భుజగేంద్రమౌళిమణిభి ర్నీరాజనప్రక్రియా. ౧

లీలాద్యూతజితాం కళాధరకళాం మౌళౌ దృఢం కీలితా
మాహర్తుం యుగ మున్నమయ్య భుజయో ర్విశ్లేషయంత్యా మిథః,
పార్వత్యాః కుచకుంభపార్శ్వయుగళే సప్రేమలోలేక్షణః,
కాలక్షేపణ మిందుమోచనవిధౌ కాంక్షన్ శివః పాతు నః. ౨

భవతు భవతాం ఫలాప్త్యై కల్పలతా కాపి కరటిరాజముఖీ,
మధురసుధారసధారామధులవలలితేందుమంజరీమంజుః. ౩

తమో హరేతాం తవ పుష్పవంతౌ
ధ్గాకాసు పూర్వాపరశైలభాజౌ,

రథాంగలీలా మివ దర్శయంతౌ
పురా పురారేః పృథివీరథస్య.

య న్మౌళౌ నిహితం చిరాయ నిగమై ర్ధ్యేయం చ య ద్యోగిభిః
య ల్లక్ష్మీమృదుపాణిపద్మయుగళీసంవాహనై ర్లాలితం,
జాతా యత్ర వియన్నదీ త్రిజగతీసంతాపనిర్వాపణీ
తస్మా త్కంసభిదః పదా దుదభవ ద్వర్ణో గుణార్ణోనిధిః. ౫

తస్మా దభూత్ ప్రోలయవేమనామా
శ్రీశైలసోపానవిధానశాలీ,
హేమాద్రికల్పోదితదానదక్షో
నిస్సీమభూదాననిరూఢకీర్తిః. ౬

వేమక్షితీశో వృష మేకపాదం
ఖంజప్రచారం కలికాలదోషాత్,
దత్తాగ్రహారద్విజవేదశక్త్యా
పదక్రమై రస్ఖలితం చకార. ౭

మాచక్షోణిపతి ర్మహేంద్రమహిమా వేమక్షితీశాగ్రజో
రామాద్యై స్సదృశో బభూవ సుగుణై స్తస్య త్రయో నందనాః
కీర్త్యా జాగ్రతి రెడ్డిపోతనృపతిః శ్రీకోమటీంద్ర స్తతో
నాగక్ష్మాపతి రి త్యుపాత్తవపుషో ధర్మార్థకామా ఇవ ౮

వేమాధిపో మాచవిభు శ్చ నందనౌ
శ్రీకోమటీంద్రస్య గుణైకసంశ్రయౌ.
భూలోక మేకోదరజన్మనా చ యౌ
భూయోఽవతీర్ణా వివ రామలక్ష్మణౌ. ౯

చూడామణి ర్నృపాణాం దుర్మదపరిపంథిశిఖరిదంభోళిః,
సర్వజ్ఞచక్రవర్తీ పెదకోమటివేమభూపతి ర్జయతి. ౧౦

సోఽయం వేమమహీపాలో భూపాలపరమేశ్వరః,

భూదానవీరమూర్ధన్యో ధీరోదాత్తగుణోత్తరః ౧౧

శ్రీశాకాబ్దే పయోరాశిరామరామేందుసమ్మితే,
నందనే మాసి మాఘాఖ్యే శివరాత్ర్యాం రవిగ్రహే ౧౨

పితుః పితామహో యస్య మహాసీయయశోనిధిః,
మాధవో నామ మేధావీ విశ్వవిద్యావిహారభూః. ౧౩

పితామహో మహావిద్వాన్ యస్య శ్రీగుండయాభిదః,
వేదాదీనాం విశుద్ధానాం విద్యానాం జన్మమందిరం. ౧౪

శాపానుగ్రహదక్షో లక్ష్మీనరసింహమంత్రసంసిద్ధః,
సకలకవిసార్వభౌమో మాధవభట్టః పితా యస్య ౧౫

శ్రీవిశ్వేశ్వరవిదుషే భారద్వాజాన్వయావతంసాయ,
స్మయవిరహితాయ తస్మై విద్యావినయాన్వితాయ పుణ్యాయ. ౧౬

ప్రదాత్త్రిలింగవిషయే వెలనాండౌ మనోరమే,
తుంగభద్రాతరంగిణ్యాః ప్రాక్తీరే పర్యవస్థితం. ౧౭

ఆలపాడు రితి ఖ్యాతం గ్రామ మాచంద్రతారకం,
సాష్టైశ్వర్యం హృష్టభోగం ధారాపూర్వం ధరాధిపః. ౧౮

ఈదానశాసనము శాలివాహనశకము ౧౩౩౪ నందనసంవత్సర మాఘమాసము శివరాత్రినాఁ డనఁగా ౧౪౧౩-వ సంవత్సరము జనేవరు నెల ౩౧ వ తేదీని భారద్వాజగోత్రుఁ డైన విశ్వేశ్వరపండితునకు వెలనాటిసీమలో తుంగభద్రా తీరమునం దుండిన యాలపాడు గ్రామము నగ్రహారముగా నిచ్చిన సందర్భమున వ్రాయఁబడినది. పయి మూఁడు శాసనములును గాక శ్రీనాథవిరచిత మైనది పొన్నుపల్లి శాసనమనఁబడెడి యింకొక తామ్రశాసనము కూడఁ

గావించఁబడుచున్నది. పొన్నుపల్లి గ్రామము గుంటూరు మండలమునందలి రేపల్లెతాలూకాలోనిది. ఈ శాసనములోని మొదటి పది శ్లోకములును సరిగా ఇలపాడుశాసనములో నుండినవే.

శ్లో. యత్కీర్తిగానసమయే ఫణిసుందరీణా
మాలోకితుం చ ముఖరాగ మనంగమూలం,
శ్రోతుం చ గీతరచనాం యుగప న్న దక్షో
నాగాధిపో న సహతే నయనశ్రుతిత్వం. ౧౧

అను పదునొకండవ శ్లోకము క్రొత్తది. పండ్రెండవ శ్లోకము వెనుకటి శాసనములో నుండినదే దాని తరువాతి శ్లోకములు ప్రత్యేకముగా నీ శాసనముతో సంబంధించినవి.

శ్లో. సోఽయం వేమమహీపాలో భూపాలపరమేశ్వరః,
భూదానవీరమూర్ధన్యో ధీరోదాత్తగుణోత్తరః. ౧౨

ఖరామరామేందుమితే శాకాబ్దే సర్వధారిణే,
ఉపరక్తే సహస్రాంశౌ మాసే చాశ్వయుజాహ్వయే. ౧౩

నప్త్రే శ్రీపేర్యపేళ్ళస్య కళ్యాణగుణశాలినః,
ఆకర్తృకాణాం సాంగానాం సుధ్యానాం వచసా న్నిధేః. ౧౪

శ్రీభట్టభాస్కరార్యస్య పౌత్రాయ బ్రహ్మవాదినే,
అష్టాదశానాం విద్యానాం మఖ్వాన్యస్య మహౌవసోః. ౧౫

పుత్రాయ విర్లయార్యస్య వేదవేదాంగవేదినః
ఆయుర్వేదం చ సాష్టాంగం నిర్నిరోద మఖీతినః. ౧౬

ఫణిరాజమహాభాష్యఫక్కికాపరమేష్ఠినే,
కర్మబ్రహ్మపరామర్శమీమాంసామాంసలాత్మనే, ౧౭

కణభుగ్గ్రంథితగ్రంథసింధుమంథానభూభృ
అక్షపాదమతప్రేక్షపక్షిణీకృతచేతసే, ౧౮

తస్మై కాశ్యపగోత్రాయ సింగనార్యాయ ధీమతే,
శాంతాయ శివభక్తాయ యజురామ్నాయవేదినే, ౧౯

ప్రాదాత్త్రిలింగవిషయే వెల్నాడో ర్ధిపసీమని,
కృష్ణవేణ్యా స్తరంగిణ్యాః ప్రతీరే పర్యవస్థితం. ౨౦

పొన్నుపల్ల్యాహ్వాయం గ్రామం నిధానం సర్వసంపదాం,
సాష్టైశ్వర్యం సాష్టభోగం ధారాపూర్వం ధరాధిపః. ౨౧

అస్య గ్రామస్య చిహ్నాని దేశభాషయా లిఖ్యంతే

... .

శ్రీనాథభట్టశాసనాచార్య దక్షిణ భాగం వకటి.

* * * *

శ్లో. విద్యాధికారీ శ్రీనాథో వీరశ్రీవేమభూపతేః,
అకరో దాకరో వాచాం నిర్మలం ధర్మశాసనం.

ఈ శాసనము శాకాబ్దములు ౧౩౩౦ సర్వధారిసంవత్సరాశ్వయుజ మాసము నందు సంభవించిన సూర్యోపరాగసమయమున ననఁగా క్రీస్తు శకము ౧౪౦౮-న సంవత్సరములో వైద్యశిఖామణియు, మహావిద్వాంసుఁడు నైన సింగరార్యునకు వెల్నాటిసీమలో కృష్ణాతీరమునం దుండిన పొన్నుపల్లి గ్రామమును దాన మిచ్చిన సందర్భమున వ్రాయఁబడినది. "శ్రీనాథభట్ట శాసనాచార్య దక్షిణ-భాగం వకటి" అని శాసనాంతమునం దుండినందున శ్రీనాధున కీగ్రామములో నొకభాగ మియ్యఁబడినట్టు కనుపట్టుచున్నది. పూర్వోదాహృతములైన యీ నాలుగు శాసనములలో నీ పొన్నుపల్లి శాస

నమే మొట్టమొదటిది. దీనినిబట్టి శ్రీనాథుఁడు ౧౪౦౮-వ సంవత్సరమునకుఁ బూర్వమునందే విద్యాధికారిగా నియమింపబడినట్టు స్పష్టపడుచున్నది.

ఈ నాలుగు శాసనములను దప్ప శ్రీనాథుఁడు పెదకోమటి వేమారెడ్డి కొండవీటిరాజ్యపరిపాలనము చేసిన యిరువది సంవత్సరములలోను వేఱు గ్రంథ మేదియుఁ జేసినట్టు కానఁబడదు. చేసినచో శృంగారదీపికనుగూడ చేసియుండవచ్చును. అమరుకవ్యాఖ్య యైన శృంగారదీపికలోని మొదటి తొమ్మిది శ్లోకములు ని ట్లున్నవి.

౧. శ్లో. విశంకటకటస్థలీగళదమందదానస్ఫుహా
భ్రమద్భ్రమరకాకలీకలితనిత్యకర్ణోత్సవమ్,
ప్రణమ్రజనమస్తక ప్రకటడిండిమాడంబరం
ముఖే గజ ముపాస్మహే వపుషి మానుషం దైవతమ్.

౨. అన్యోన్యమేళనవశాత్ ప్రథమం ప్రవృద్ధం
మధ్యే మనా గ్వ్యవహితం చ కుతోఽపి హేతోః,
ప్రాప్తం దశా మథ మనోరథలాభయోగ్యాం
పాయాచ్చిరం రతిమనోభవయో స్సుఖం వః.

౩. రాజ్యం వేమ స్స చిర మకరోత్ ప్రాజ్యహేమాద్రిదానో
భూమీదేవై ర్భువమురుభుజో భుక్తశేషా మభుంక్త,
శ్రీశైలాగ్రాత్ ప్రభవతి పథి ప్రాప్తసాతాళగంగా
సోపానాని ప్రమథపదవీ మారురుక్షు శ్చకార.

౪. మాచక్షోణిపతి ర్మహేంద్రవిభవో వేమక్షితీశాగ్రజో
హేమాద్రే స్సదృశో బభూవ సుగుణై స్తస్య త్రయో నందనాః.
కీర్త్యా జాగ్రతి రెడ్డిపోతనృపతిశ్శ్రీకోమటీంద్ర స్తతో
నాగక్ష్మాపతి రి త్యుపాత్తవపుషో ధర్మార్థకామా ఇవ.

౫. వేమాధిపో మాచవిభుశ్చ నందనౌ
శ్రీకోమటీంద్రస్య గుణై కసంశ్రయౌ ?
భూలోక మేకోదరజన్మవాంఛయా
భూఽయో వతీర్ణావివ రామలక్ష్మణౌ,
౬. స వేమభూప స్సకలాసు విద్యా స్వతి ప్రగల్భో జగనబ్బగండః,
కవిదాస్థానగతః కవీనాం కావ్యామృతాస్వాదనతత్పరోఽభూత్.
౭. అమరుకకవినా రచితాం శృంగారరసాత్మికాం శతశ్లోకీమ్,
శ్రుత్వా వికసితచేతా స్తదభిప్రాయం ప్రకాశతాం నేతుమ్
౮. మూలశ్లోకాన్ సమాహృత్య ప్రక్షిప్తా స్పరిహృత్య చ,
విధత్తే విదుషామిష్టాం టీకాం శృంగారదీపికామ్
౯. అవతారోఽథ సంబంధోఽభిప్రాయో భావలక్షణమ్,
నాయికా తదవస్థా శ్చ నాయక శ్చ తథా రసః
౧౦. అంగాని కైశికీవృత్తే రలంకార స్తతః క్రమాత్,
ఇ త్యేతాని ప్రవక్ష్యంతే యథాసంభవ మంజసా.
పుస్తకాంతమునం దీ గద్య మున్నది.

'ఇతి శ్రీవీరనారాయణ సకలవిద్యావిశారద పెద్దకోమటివేమభూపాల విరచితా శృంగారదీపికాఖ్యా అమరుకవ్యాఖ్యా సమాప్తా.'

ఈ శృంగారదీపికయందలి ౪, ౫ పద్యములు శ్రీనాథుని శాసనములలోనివి, ఈ పుస్తకము శ్రీనాథకృత మనుట కీ రెండు శ్లోకములే యాధారములు. ౧౪౦౦-వ సంవత్సరము మొదలుకొని ౧౪౨౦-వ సంవత్సరమువఱకును మహాకవి యైన శ్రీనాథుఁ డొక్క గ్రంథమునైనను జేయక యూరకుండఁ జాలఁడు. ఇట్లు వ్యర్థపుచ్చఁబడిన దనుకొన్న కాల మిరువది సంవత్సరములే యననేల ? ఇరువదినాలుగు సంవత్సరములు కావచ్చును. శ్రీనాథుడు విద్యాధికారిగా నున్న కాలము పెదకోమటివేమన రాజ్యకాలము మాత్రమే

కాక యాతని కుమారుఁడైన రాచవేమనరాజ్యకాలముకూడ నయి యున్నది. ౧౪౦౦-వ సంవత్సరము మొదలుకొని ౧౪౨౦-వ సంవత్సరమువఱకును పెదకోమటివేమనయు, ౧౪౨౦ నుండి నాలుగు సంవత్సరములు రాచవేమనయు భూమిపాలనము చేసిరని కొందఱును, రాచవేమని నాలుగు సంవత్సరములును ౧౪౨౪-వఱకును గాక తండ్రి రాజ్యకాలమని చెప్పఁబడెడి దానిలోఁ గడపటి నాలుగుసంవత్సరములే యయి ౧౪౨౦-వ సంవత్సరము వఱకు మాత్రమే యనియు ౧౪౨౦-వ సంవత్సర ప్రాంతమునందే కొండవీటిరెడ్డిరాజ్యము కర్ణాటప్రభువుల పాలయ్యెనని కొందఱును శాసనసంశోధకులు చెప్పుచున్నారు. ఎట్లయినను వింశతిదీర్ఘసంవత్సరములు నిరర్గళకవితాధార గల కవిచేతి లేఖినియు ననల్పకల్పనసమర్థమైన బుద్ధియు స్వసామర్థ్యమును మఱచి యస్వాభావికనిద్రను వహించుట సంభావ్యము కాదు. అందుచేత శ్రీనాథుఁ డీ కాలములో నేదో మహాగ్రంథమును రచించుచుండియుండవలెను. ఆ మహాగ్రంథము శివరాత్రిమాహాత్మ్య మని తోఁచుచున్నది. * శ్రీనాథుఁడు దీనిని తన ప్రభువైన పెదకోమటివేమవిభున కంకితము చేయవలె ననియె యుద్దేశించి యుండును. కాని యింతలోపల కొండవీటిరాజ్యమన్యాక్రాంత మగుటయుఁ, దనకాశ్రయులైన వేమనృపాలసింగనామాత్యాదులు పరలోకగతు లగుటయుఁ దటస్థించినందున శ్రీనాథమహాకవి రాజధానియైన కొండవీటియందు నిలువనాధారము లేక తన గ్రంథపరికరములతో నావీడు విడిచి దేశాంతరగమనోన్ముఖుఁడయి ౧౪౨౦-వసంవత్సర ప్రాంతముల

---

* [శివరాత్రిమాహాత్మ్యము శ్రీనాథుని కడపటి రచనయైయుండునని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారు, ఆంధ్రకవి తరంగిణీ కర్తయుఁ దలంచుచున్నారు. శ్రీనాథమహాకవి పెదకోమటి వేమారెడ్డి యాస్థానమున విద్యాధికారిగానున్న కాలములో గ్రంథరచనము సాగించి యుండకపోవచ్చుననియు, గ్రంథములను రచింపవలెనను నియమము లేదనియు, శ్రీనాథుఁడు తనకావశ్యకమని తోఁచినపుడే గ్రంథరచనకుఁ గడంగుచుండెననియు, జీవనము నిర్విచారముగ సాగిపోవుచుండుటచే గ్రంథరచనం గూర్చిన యాలోచనయే యతనికి లేకుండెనని యూహింపవచ్చుననియుఁ గొందఱి యాశయము. పెదకోమటి వేమారెడ్డికి సంస్కృతముపై నెక్కువ వ్యామోహముండుటయు నిందులకు హేతువైనఁ గావచ్చునని కొందఱి యూహ.]

యందు ముందుగా స్వార్థమును తీర్థముగలిసివచ్చునట్లుగా శ్రీశైలయాత్రకు వెడలెను. దక్షిణహిందూస్థానములో వైష్ణవులకు విష్ణుస్థల మయిన చిత్తూరు మండలములోని తిరుమల యెట్లు ముఖ్యస్థలమో, యట్లే శైవులకు శివస్థల మయిన కర్నూలు మండలములోని శ్రీశైలము ముఖ్యస్థలము ఒకటి సంస్కృతముగాను, రెండవది యచ్చతెనుగుగాను నున్నను శ్రీశైలము తిరుమల యను రెండు పదములకు నర్థ మొక్కటియే. రెంటికిని పవిత్రమైన పర్వతమని యర్థము శ్రీశైలస్థలాధిదేవతలు మల్లికార్జునుఁడును భ్రమరాంబయు నయి యున్నారు. అట్టి పుణ్యస్థలమయిన శ్రీశైలదివ్యక్షేత్రమునకు కొండవీటిరెడ్డిరాజ్యనాశనానంతరమున శ్రీనాథుఁడు యాత్రకుఁ బోయి దేవతా దర్శనముఁ జేయుటయేకాక యచ్చట మఠాధికారు లయి యుండిన జంగమ గురుపీఠమువారి దర్శనము చేసి వారి యనుగ్రహమునకుఁ బాత్రుఁడయి తాను రచించిన శివరాత్రి మాహాత్మ్యమును ముమ్మయపుత్రుడైన శాంతయ్య కంకిత మొనర్చెను. ఈ శివరాత్రిమాహాత్మ్యమును ఆంధ్రసాహిత్య పరిషత్తు వారు సంపాదించి తమ గ్రంథాలయమునందుంచియున్నారు. వారియొద్ద నున్న తాళపత్రపుస్తకము పురాతనమయి కొంతవఱకు భూజనామకక్రిముల కాహారమయి మిక్కిలి శిథిలమయి యున్నది. ఆ పుస్తకములోని మొదటి పద్యములోని మొదటి పాదమే మొదలు చెడి యిట్లున్నది.

శా. .... వాత్రిశతోరస్స్థలీ
నాగాధీశవిశిష్టసంస్తవలసన్నాళీకపాదద్వయ
ప్రాగల్భ్యం బగు శంకరుండు మనుచుం బ్రత్యక్షమై యెప్పుడున్
యోగీంద్రాఖ్యుని ముమ్మడీంద్రసుతు నయ్యుద్యుక్తశాంతాత్మునిన్.

శివరాత్రిమాహాత్మ్యములోని రెండవ పద్య మిది—

శా. శ్రీరామారమణుం డశేషజగతీక్షేమంకర ప్రక్రియా
ధౌరాయత్తమనస్కుఁ డార్యజనసంభావ్యుండు భవ్యాత్ముఁడై
గారా మారఁగ నొమ్మమాంబికసుతున్ గౌరీశభక్తాగ్రణిన్
ధీరున్ ముమ్మయశాంతునిన్ మనుచు సంధీర్ఘాయురర్థాఢ్యుఁగన్,

"స్వస్తిశ్రీపర్వత స్వయంభూశ్రీలింగచక్రవర్తి శ్రీమల్లికార్జున శ్రీమహాదేవుని ముఖమండపంబున సుఖాసీను లయి———————— బలసి యుండ శ్రీశాంతభిక్షావృత్తియతీశ్వరుఁడు శివకథావిధానంబులఁ బ్రొద్దులు పుచ్చుచుఁ దన మూలభృత్యుండగు పువ్వుల ముమ్మడేవయ్య శాంతునిం గనుంగొని నీపేరన... కవిత్వంబున నీకథ యుపన్యసింప నగునన మహాప్రసాదం బని సత్కవిసార్వభౌముఁడగు శ్రీనాథకవివరేణ్యుని "కృపావిశేషంబున" నీ శివరాత్రి మాహాత్మ్యము చెప్పఁబడె నని పుస్తకమునందు వ్రాయఁబడినది. శ్రీశాంతభిక్షావృత్తియతీశ్వరుని మూలభృత్యుఁడగు పువ్వులశాంతయ్య కీ కృతి యియ్యఁబడినట్లు పయి వాక్యములవలన విదితమగుచున్నది కృతిపతి యైన శాంతయ్యతండ్రి ముమ్మడి దేవయ్య; తల్లి యొమ్మమాంబ. వీ రిరువురు శివరాత్రిమాహాత్మ్యమునందిట్లు వర్ణింపఁబడిరి.

సీ పంచాక్షరీమంత్రపారిజాతోద్భూత
　　　　ఫలము లే గురువుసంభాషణములు
వీరశైవాచారవిమలమార్గానూన
　　　　శాశ్వతం బే గురుస్వామిమహిమ
నిఖిలదేవాధీశనివహ ప్రమేయక
　　　　పాత్ర మే గురుమూర్తి పాదయుగళి
శంకరపూజాప్రశస్తదీక్షాజనా
　　　　హ్లాద మే గురువుహస్తాంబుజాత
మనఁగఁ బండితచెనమల్లికార్జునునకు
బౌత్రరత్నంబు సెట్టియప్రభుసుతుండు
మారమాంబాతనూజుండు మహితయశుఁడు
వెలయు ముమ్మడిదేవయ వినుతకీర్తి.

సీ. పరమపాతివ్రత్యభావంబు తలఁపంగ
　　　　గౌరి కాఁబోలు నీ కాంత తలఁప
సకలసంపత్ప్రాప్తిచాతుర్యమహిమల
　　　　నిందిర కాఁబోలు నిందువదన

సకలవిద్యాప్రౌఢి సడిసన్న గరిమల
భారతి కాఁబోలు భామ యెపుడు
సర్వలక్షణసంపన్నతోన్నతి
నింద్రాణి కాఁబోలు నిగురుబోఁడి
యనఁగ నిద్ధాత్రి నేప్రొద్దు నతిశయిల్లెఁ
బరఁగ ముమ్మిడిదేవయ్యభామ జగతిఁ
గామితార్థకసంధానకల్పవల్లి
యుజ్జ్వలద్గుణనికురుంబ యొమ్మమాంబ.

అటు తర్వాత నీ దంపతుల పుత్రుఁడు కృతిపతియైన శాంతయ్య యిట్లభి వర్ణింపఁబడెను.

సీ. పరవాదిమత్తేభపంచాననాఖ్యుండు
పరవాదిమండూకపన్నగుండు
పరవాదినవమేఘపవమానధీరుండు
పరవాదిసాగరబాడబుండు
పరవాదికుక్షిస్థలభాసురదంభోళి
పరవాదికేంధనపావకుండు
పరవాదిచయతమఃపటలోగ్రభానుండు
పరవాదిభోగిసుపర్ణుఁ డనఁగఁ
జటులజైనకోలాహలసమరబిరుద
ఘనుఁడు సంగ్రామపార్థుండు వినుతయశుఁడు
శుభుఁడు ముమ్మిడిదేవయ్యసుతుఁ డనంగ
వెలసె శాంతయ్య విక్రమవీరవరుఁడు.

గీ వేఁడెఁ గవిసార్వభౌముని విమలచరితు
స్కాందపౌరాణికము లైన కథలలోన
ఘనత శివరాత్రిచరితంబు తెనుఁగు గాఁగఁ
గరుణజేయుము శ్రీనాథకవివరేణ్య.

వ. అనవుడు నమ్మహీసురాగ్రగణ్యుండు కమలనాభామాత్యపౌత్రుండు మారయామాత్యపుత్రుండు శ్రీనాథకవివరేణ్యుండు సంతుష్టమానసుండై శాంతస్వామి యొసంగిన కర్పూరతాంబూలజాంబూనదా భరణంబుల నంగీకరించి స్కాందపురాణంబున నీశానసంహితఁ ... .. జెప్పంబడ్డ ... శివరాత్రిమాహాత్మ్యంబు ... ."

* * * *

క. వరముమ్మయశాంతునకున్
బరమపరజ్ఞాననిధికిఁ బావనమతికిన్
నిరుపమవిక్రమయశునకుఁ
గరుణారసపూరితాత్మకవితాంగునకున్.

వ అభ్యుదయపరంపరాభివృద్ధియు సత్యధర్మక్రియావృద్ధియు నగునట్లష్టాదశ వర్ణనాగర్భంబుగా నత్యాశ్చర్యకరంబై యుండ నా రచియింపంబూనిన కథానిధానంబు ——————— నా నేర్చిన విధంబున రచియించెద".

అని శ్రీనాథుఁడు గ్రంథావతారికయందుఁ జెప్పెను. ఆ వఱకుఁ దాను గోమటివేమనృపాలుని జీవితకాలములోనే రచియించుచుండిన గ్రంథమునే యవశిష్టమును ముగించి యవతారికను వ్రాసి యాశ్వాసాద్యంత పద్యములను జేసి శ్రీశైలయాత్రాసమయమునం దర్థసంభావనమును బడసి శ్రీనాథుఁ డీ శివరాత్రిమాహాత్మ్యమహాకావ్యమును మహాధనసంపన్నుఁడైన ముమ్మడి శాంతయ్య కంకిత మొనర్చినట్లు తోఁచుచున్నది ఈ గ్రంథము ౧౪౨౪ సంవత్సర ప్రాంతమునందు సంపూర్తి చేయఁబడి యుండును.

ఇట్లు శ్రీశైలయాత్రవలన తీర్థమును స్వార్థమును గలిసి వచ్చి యభిమతార్థ సిద్ధి యయినతరువాత శ్రీనాథుఁ డక్కడనుండి వెలువడి ధనాగమ్యసమ్మాన సముపార్జనార్థమయి స్థలాంతరాన్వేషణము చేసికొనవలసినవాఁ డయ్యెను.

ఎంతటి సమర్థుడయినను రాజాశ్రయము లేనిచోట చిరకాలము నిలిచిన యెడల ధనాగమముగాని గౌరవముగాని తగినంత యుండదు. అందుచేత నాతఁ డిప్పుడు రాజాశ్రయము లభింపఁగల స్థల మేదో యొకటి చూచుకొని యచ్చటికిఁ బోవలెను. దేశాభిమానముచేత స్వస్థలమయిన కొండవీటిసీమకు మరలఁ బోఁ దలఁచినచో నా దేశము శత్రుభూకాంతక్రాంతమయి రాజులేని భూమియైనది. ఇఁక నప్పుడు ప్రబలమయి యుండిన రెండవ రెడ్డిరాజ్యమైన రాజమహేంద్రవరమునకుఁ బోవలె నన్నచో దానిని పాలించుచుండిన రెడ్డి రాజులు తన కేలికయయి యుండిన పెదకోమటి వేమభూపాలునితోఁ బోరాడి కష్టములపాలయిన యాతని గర్భశత్రువు లయి యుండిరి. ఒకవేళ సాహసముచేసి పోయినను వారు తమ శత్రురాజుయొక్క కవీశ్వరు నాదరించి గౌరవింతు రనుట యసంభావ్యము. ఈ హేతువులచేత శ్రీనాథుఁ డా కాలము నందు మహాబలిష్ఠమయి యుండిన కర్ణాటరాజధానికిఁ బోవలసినవాఁడయ్యెను. కర్ణాటకరాజ్య మా కాలమునందు ప్రౌఢదేవరాయలచేతఁ బాలింపఁబడు చుండెను. అతఁడు ౧౪౨౩-వ సంవత్సరమునందు సింహాసనమెక్కి ౧౪౪౮-వ సంవత్సరమువఱకును రాజ్యపరిపాలనము చేసెను.

శ్రీనాథకవీంద్రుఁడు కర్ణాటరాజ్యరాజధానికిఁ బోయినప్పుడు డాతని కొక పట్టున రాజదర్శనము లభించినది కాదు. సాధారణముగా పండితు లన్యోన్య మాత్సర్యము గలవా రగుటచేత క్రొత్తగా విదేశమునుండివచ్చిన విద్వాంసు నకు భగీరథ ప్రయత్నముమీఁదఁ గాని రాజసందర్శనము కానియ్యరు. రాజ సేవకుల నాశ్రయించి ముందుగా వారిని సంతోషపెట్టి, వారి యనుగ్రహ మును సంపాదించువఱకును వారు సహిత మభినవాగతుల కనేకములైన ప్రతిబంధములను గల్పించుచుందురు. అందుచేత శ్రీనాథుఁడు రాజసందర్శన మగుటకు ముందా పురమునందు పూఁటకూటి యిండ్లలో వేళగాని వేళలో నపాత్రపు భోజనములు చేయుచు నోట మెతుకులు పడఁగానే యంగిలు తొడిగి, కుళ్ళాయులు పెట్టి తెల్లబట్టలు కట్టి ప్రతిదినమును రాజాస్థానమునకుఁ బోయి రాజసేవకుల ననుసరించుచు బహుదినములు పరదేశములు కష్టపడ

వలసినవాఁ డయ్యెను ఆ సమయములో పినుఁగుచెంది కవిచెప్పిన పద్యము చూడుఁడు

శా. కుళ్ళాయి పెట్టితిఁ గోక చుట్టితి మహాకూర్పాసముం దొడ్గితిన్
వెల్లుల్లిం దిలపిష్టము న్మెసవితిన్ విశ్వస్త వడ్డింపఁగాఁ
జల్లా యంబలి ద్రావితిన్ రుచుల దోసం బంచుఁ బో నాడితిన్
దల్లీ! కన్నడరాజ్యలక్ష్మి! దయలేదా? నేను శ్రీనాథుఁడన్.

పయి పద్యములో "తల్లీ! కన్నడరాజ్యలక్ష్మి!" యని కర్ణాటకదేశము సంబోధింపఁబడి యుండుటనుబట్టి శ్రీనాథుఁడు కర్ణాటదేశస్థుఁడని యొకానొకరు విషయవిచారము చేయక వ్రాసిరి; గాని యది గ్రాహ్యము కాదు. శ్రీనాథుడెప్పుడును దాను పాకనాఁటి సీమవాఁడ * ననియు, కొండవీటివాసుఁడ ననియు, జెప్పుకొనుచుండెను కర్ణాటకరాజధానియందు రాజసందర్శనము కాకముందో, ప్రథమసందర్శన సమయమునందో మీ వాసస్థల మేది? యని యడుగఁగా శ్రీనాథుఁడు కొండవీ డని యీ క్రింది పద్యముతోఁ జెప్పినట్లు చెప్పుదురు.

'సీ. పరరాజ్యపరదుర్గపరవైభవశ్రీలఁ
గొనకొని విడనాడు కొండవీడు
పరిపంథిరాజన్యబలముల బంధించు
కొమరు మించినబోడు కొండవీడు
ముగురురాజులకును మోహంబు పుట్టించు
గుఱుతైన యుక్కిత్రాడు కొండవీడు
చటులవిక్రమకళాసాహసం బొనరించు
కుటిలాత్ములకుఁ గాడు కొండవీడు

* [శ్రీనాథుఁడు పాకనాఁటింటివాఁడు కాని, పాకనాటిసీమవాఁడు కాఁడని విమర్శకుల యభిప్రాయము.]

జవనఘోటకసామంతసరసవీర
భటనటానేకహాటక ప్రకటగంధ
సింధురారావమోహనశ్రీలఁ దనరు
కూర్మి నమరావతికి జోడు కొండవీడు

ఈ పద్యము కర్ణాటకరాజదర్శనార్థ మరిగినప్పుడు చెప్పఁబడినది కాకపోయి నను శ్రీనాథునిచేఁ జెప్పఁబడిన దగుటకు సందేహములేదు. బహుదినములు విజయనగరములోఁ బ్రవాసాయాసము ననుభవించిన తరువాత తుదకు శ్రీనాథునకు రాజ♦సందర్శనమయి బహూకరణము జరిగినది రాజదర్శనము క్రీడాభిరామకర్త యైన వినుకొండవల్లభరాయని నాశ్రయించి నాతని కంకిత ముగా వల్లభాభ్యుదయమును జేయుటవలన నాతని మూలమున లభించిన దని చెప్పుదురు. వల్లభాభ్యుదయమును నేను జూడలేదు. శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు క్రీడాభిరామ పీఠికలో "శ్రీనాథుని వల్లభాభ్యుదయ ములోఁ గృష్ణాతీరమున నుండు శ్రీకాకుళస్వామితిరునాళ్ళలో జరుగు నసభ్య ములు దీనికంటెఁ బచ్చిగా నున్నవి ... . మఱియు వల్లభాభ్యుదయ మున నాంధ్రవల్లభుని తిరునాళ్ళలోని విధవాదుర్వర్తనములు శ్రీనాథుఁడు విశదముగా వర్ణించి యున్నాఁడు...... ... ... శ్రీనాథుఁడు శ్రీకాకుళాధీ శ్వరుఁడగు తెలుఁగురాయని దర్శించి యని కంకితముగా వల్లభాభ్యుదయము చెప్పెనుగదా!" అని వ్రాసి యున్నారు. ఈ వాక్యములనుబట్టి చూఁడగా వల్లభాభ్యుదయము శ్రీకాకుళాంధ్రదేవుని యుత్సవములలో నడచుచుండెడు విశ్వస్త్రాదుల దుర్వర్తనాది వర్ణములనుగలది యనియు, అది యాంధ్రవిష్ణు దేవునికే యంకిత మొనర్పఁబడిన దనియుఁ దెలియవచ్చుచున్నది *

♦ [ఈ విషయ మిదివరకే చర్చింపఁబడినది.]

* [వల్లభాభ్యుదయ మింతవఱకును లభింపలేదు. అది శ్రీనాథకవికృత మని కొంద ఱందురు. అది శ్రీనాథుని వల్లభాభ్యుదయములోనిదిగా నొక పద్యము పెదపాటి జగన్నాథకవి 'ప్రబంధరత్నావళి' లో నుదాహరింపఁబడినది. వల్లభాభ్యుదయకర్త వేఱై యుండవచ్చునఁట! క్రీడాభిరామముకాక శ్రీనాథుని వీధినాటకమ్మని మఱి యొక పుస్తకము ప్రచారములో నున్నది అదియే వల్లభాభ్యుదయమని కొందఱ అందురు. అది శ్రీనాథకృతమనుటకుఁ దగిన యాధారములు లేవు]

ఎవరి యనుగ్రహమువలననైన నేమి? శ్రీనాథునకు రాయల సందర్శన లాభము కలుగుటయేకాక తదాస్థానమునందు విశేషవిద్వాంస విజయలాభమును, తద్బిరుదాంకసంపాదనలాభమును, కనకాభిషేకలాభమును గూడఁ గలిగినవి లాభములు రాఁదొడఁగినప్పుడు లాభములమీఁదనే లాభములు వచ్చును పదా! రాయల సంస్థానమునందు శ్రీనాథ మహాకవికి తదాస్థాన విద్వాంసుఁ డగు డిండిమకవిసార్వభౌమ బిరుదాంకితునితో నుద్భట వివాద మొకటి సంప్రాప్త మయ్యెను. మహారాజాశ్రయము గల యా విద్వాంసుఁడు స్వవిజయనిశ్చయాహంకారముచేతను, విద్యాగర్వముచేతను దన్నాతఁ డోడించినయెడల తన విజయడిండిమమును ఒగులగొట్టించుకొని తన కవి సార్వభౌమ బిరుదము నిచ్చివేయుదునని పంతములు పలికి యుండును. తా నొకటి తలఁచిన దైవ మొకటి తలఁచును గదా! వివాద మే విషయము లోనో దెలియదు గాని యిరువురకును నడచిన యుద్భటవివాదములో శ్రీవాణీప్రసాదలబ్ధసకలవిద్యా సనాథుఁ డగు శ్రీనాథుఁడే విజయమునొంది యా గౌడడిండిమభట్టు కంచుఢక్కను బగులఁగొట్టించి యాతని కవిసార్వభౌమ బిరుదమును లాగుకొన సమర్థుఁ డయ్యెను. ఈ కవిసార్వభౌమ బిరుదసమార్జనమునకు మన కవిరాజునకు చంద్రశేఖర క్రియాశక్తి తోడయి నట్టు చెప్పుదురు "చంద్రశేఖర క్రియాశక్తి రాయలయొద్దఁ బాముకొల్పితి సార్వభౌమ బిరుద" మని శ్రీనాథుఁడే పయి సీసపద్యపాతమునందుఁ జెప్పెను. "శ్రీనాథుఁడు సాళ్వగుండ నరసింహరాయల కాలములో నుండి నట్లును, తదాస్థానమునకుం బోయి డిండిమభట్టు నోడఁగొట్టినట్లును తెలియు చున్నది. గోకఁ జుట్టితి ... ...తల్లీ! కన్నడరాజ్యలక్ష్మి! దయలేదా నేను శ్రీనాథుఁడన్" అని చెప్పినది నరసింగరాయల యాస్థానమునందే! డిండిమ కవిని శ్రీనాథుఁ డోడించెను గదా! 'పగులఁ గొట్టించి తుద్భటవివాదప్రౌఢి గౌడడిండిమభట్టుకంచుఢక్క' అనునది నిక్కమే. ఈ డిండిముఁడే జైమిని భారతముఁ గృతినందిన సాళ్వగుండ నరసింహరాజు విజయములను వర్ణించుచు సాళువాభ్యుదయ మను సంస్కృతకావ్యమును రచించెను.

———————————————— చంద్రశేఖరుఁ డను

నియోగిపుంగవుఁడు నరసింగరాయల మంత్రి యని సాళువాభ్యుదయమున నున్నది. కావున 'చంద్రశేఖర క్రియాశక్తి రాయలయొద్దఁ బాదుకొల్పిన కవిసార్వభౌమబిరుదు' అనునది స్పష్టముగా నర్థ మగుచున్నది. ఈ నరసింహ రాయలు క్రీ. శ. ౧౪౫౦ లో నున్నట్లు తెలియుచున్నది." అని రామకృష్ణ కవిగారు క్రీడాభిరామ పీఠికలో వ్రాసి యున్నారు. సాళువగుండ నరసింహ రాయలు ౧౪౫౦ వ సంవత్సరమునకు పైని ౧౪౮౦-౯౦ సంవత్సర ప్రాంతములయం దుండినవాఁ డగుటచేతను, శ్రీనాథకవి ౧౪౫౦-వ సంవత్స రమునకు ముందే ౧౪౪౦-౪౫ సంవత్సర ప్రాంతములయందే మృతి నొందియుండుటచేతను, ఈ కవిసార్వభౌమబిరుదసమార్జనకథ ౧౪౩౫-వ సంవత్సర ప్రాంతమున రచింపఁబడిన కాశీఖండరచనమునకుఁ బూర్వమునందే నడచి యుండుట చేతను, శ్రీనాథుఁడు సాళువగుండ నరసింహరాయల యాస్థాన ములో నుండిన డిండిమభట్టుతో వాదము చేసి జయించుట సంభవింపనేరదు. కాఁబట్టి శ్రీనాథునిచే నోడఁగొట్టఁబడిన డిండిమభట్టు వేఱొకఁ డయి యుండ వలెను. ఇప్పుడు డిండిమభట్టు లెందఱున్నారను ప్రశ్న వచ్చును ఆ పేరు గలవారు ముగ్గురు నలుగు రున్నట్లు తెలియవచ్చుచున్నది

యోగానంద ప్రహసనమునందు తత్కర్తయైన యరుణగిరినాథుఁడు తన మాతామహుఁడు "బ్రహ్మాండభాండ పిచండమండలిత విజయడిండిమచండిమః" డనియు, "డిండిమప్రభుః" డనియు, చెప్పి యున్నాఁడు. అందుచేత మొట్టమొదట విజయడిండిమమును సంపాదించినవాఁ డష్టభాషాకవితా సామ్రాజ్యాభిషిక్తుఁడైన యీ డిండిమభట్ట కవిసార్వభౌముఁడే యనియు, ఆతని దౌహిత్రుఁడయిన యరుణగిరినాథునకు డిండిమకవిసార్వభౌమత్వము లభించుట తాతవలననే యనియు, విశద మగుచున్నది. "శ్రీకంఠాగమపారంగతుఁడై విజయడిండిమము నార్జించిన మాతామహునియొద్ద నుండియే యీ యోగానందప్రహసన కర్తకు డిండిమకవిసార్వభౌమబిరుదమును, విజయ డిండిమమును లభించినవి" అని శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారు కమ కనకాభిషేకమునందుఁ దెలిపి యున్నారు ఈ ప్రథమడిండిమభట్టు ౧౩౭౦-వ సంవత్సరమునందు జనన మొంది ౧౪౩౦-వ సంవత్సరము వఱకును

నూఱేండ్లు జీవించెనని చెప్పఁబడెడు వేదాంతదేశికులవారితో సమకాలీనుఁడు వైష్ణవమతప్రచారకుఁడైన వేదాంతదేశికులకును, శైవమత ప్రచారకుఁ డైన డిండిమభట్టునకును మతవిషయమున ననేకవాదములు జరిగినట్టును వారు వాదప్రతివాదసందర్భమున నొండొరుల నాక్షేపించుచు వచ్చినట్టును, తెలిపెడు కథలును, శ్లోకములును దక్షిణదేశమునందు వ్యాపించియున్నవి. ౧౩౬౦-౭౦ సంవత్సరప్రాంతములయం దుండిన యీ ప్రథమ డిండిమ భట్టును,౧౩౬౦-వ సంవత్సరమునకుఁ దరువాతఁగాని పుట్టని శ్రీనాథుఁడు వాదములో నోడించె ననుట పొసఁగనేరదు. ఇఁక శ్రీనాథునితో వాదించి యపజయము నొందిన డిండిమభట్టు రెండవడిండిమభట్టో మూఁడవడిండిమ భట్టో యయి యుండవలెను.

రెండివ డిండిమభట్టుపే రరుణగిరినాథుఁడు. ఇతఁడు సంస్కృతమున యోగా నందప్రహసనమును రచించెను. ఆ ప్రహసనమునం దతఁడు తన్నుఁగూర్చి "శ్రీ డిండిమకవిసార్వభౌమ ఇతి ప్రథితబిరుదాంకనామధేయః, సరస్వతీ ప్రసాదలబ్ధ కవితాసనాథః, శ్రీమానరుణగిరినాథః తేన కృతేన యోగానంద నామ్నా ప్రహసనేన సభానియోగ మనుతిష్ఠామి" అని వ్రాసికొని యున్నాఁడు. డిండిమకవిసార్వభౌమబిరుదాంకుఁడును, సరస్వతీ ప్రసాదలబ్ధ కవితాసనాథుఁడును నైన యరుణగిరినాథుఁడు తన యోగానందప్రహసములో భరతవాక్యముగా "దీర్ఘాయు ర్దేవరాయోదదతు వసుమతీచక్రమాచంద్ర తారమ్ అని దేవరాయని నాశీర్వదించి యున్నాఁడు. ఈ కవి వర్ణించిన దేవరాయఁడు విజయనగరాధీశ్వరుఁడైన ప్రౌఢదేవరాయలని యితరదృష్టాం తములవల్లఁ దేలుచున్నది. ఈ ప్రౌఢదేవరాయలు ౧౪౨౩-వ సంవత్స రము మొదలుకొని ౧౪౪౭-వ సంవత్సరమువఱకును కర్ణాటకరాజ్యపరిపాల నము చేసెను. ఈతని కాలములో శ్రీనాథుఁ డుండె ననుటకు సందేహము లేదు. శ్రీనాథుఁ డుద్భటవివాదప్రౌఢిచేత నోడించి కంచుఢక్క పగులఁ గొట్టించినది తప్పక యరుణగిరినాథనామము గల యీ రెండవ డిండిమ భట్టునే. ఇతఁడు ప్రౌఢదేవరాయని రాజ్యకాలములో నుండినవాఁ డగుటచేత నీతనిని శ్రీనాథుఁ డోడించుట ౧౪౨౩-వ సంవత్సరమునకుఁ దరువాత నయి

యుండవలెను. ౧౪౨౬-వ సంవత్సరప్రాంతమున నని తోఁచుచున్నది. ప్రౌఢదేవరాయలు దేవరాయనామధేయము గల కర్ణాటకరాజులలో రెండవ వాఁడు మొదటివాఁడు ప్రౌఢదేవరాయని తండ్రి యైన దేవరాయ మహా రాజు. అతఁడు ౧౪౦౬-వ సంవత్సరము మొదలుకొని ౧౪౨౨-వ సంవత్సరమువఱకును కర్ణాటరాజ్య మేలెను. ఈతని కాలమునందు సహితము శ్రీనాథకవి యుండెనుగాని యతఁ డీయనరాజుకాలములో కొండవీటి నగరమును విడిచి దేశసంచారము చేయ నారంభింపలేదు. అంతేకాక గౌడడిండిమ భట్టుసహిత మీయనరాజ్యావసానదశయందు నుండక యీతని కొడుకైన ప్రౌఢదేవరాయని యేలుబడిలోనే తదాస్థానకవియయి యుండినవాఁడు. ఈ గౌడడిండిమభట్టుయొక్క కవిసార్వభౌమ బిరుదమును లాగుకొని శ్రీనాథుని కిప్పించుటలో సహాయుఁడయినవాఁడు సాళువగుండనరసింహ రాయని మంత్రిగా నుండిన చంద్రశేఖరుఁడు కానేరఁడు ప్రౌఢదేవరాయని యాస్థానములో మఱియొక చంద్రశేఖరుఁడుండి యుండవచ్చును చంద్ర శేఖరక్రియాశక్తి యన్నచోట చంద్రభూషక్రియాశక్తి యని పాఠాంతరము గలదు. ఈ చంద్రభూషక్రియాశక్తిపాఠమే సరియైన దైనపక్షమున, ౧౩౪౦-వ సంవత్సరమునందు శ్రీవీరబుక్కరాయలరాజ్యకాలములో వ్రాయ బడిన కొండూరు శాసనములో

శ్లో. శ్రీచంద్రభూషణాచార్యపదపంకజయో స్తథా,
గ్రామం కొండూరునామానం బుక్కక్ష్మాపతి రార్పయత్.

అని రాజగురు వైన చంద్రభూషాచార్యుని పేరు కనఁబడుచున్నది గాని ప్రౌఢదేవరాయనికాలములో చంద్రభూషుని పే రెక్కడను వినఁబడదు. ఈ చంద్రభూషుఁడు "యతీంద్రస్య క్రియాశక్తిగురోః ప్రీతయే శ్రీచంద్ర భూషణాచార్యః" అని పై శాసనములోనే యుండుటనుబట్టి క్రియాశక్తి యతీంద్రునిశిష్యుఁ డగుట స్పష్టము. క్రియాశక్తిపీఠ మా కాలమునందు శంకరాచార్యపీఠమువంటి శైవమతపీఠమై కర్ణాటకరాజులకు గురుపీఠమయి యుండెను ఆ పీఠాధికారి విరూపాక్షాదిశంకరమఠములకువలెనే యతీంద్రుఁ

డుగా నుండెను. అయినను వీరబుక్కరాయలనాటి చంద్రభూషాచార్యుఁడు గాని, క్రియాశక్తియతీంద్రుఁడుగాని ప్రౌఢదేవరాయలకాలములో నున్న శ్రీనాధునికవిసార్వభౌమ బిరుదముతో సంబంధించి యుండుట పొసఁగ నేరదు. క్రియాశక్తి మఱశిష్యుఁడయి శాసనములోని చంద్రభూషాచార్యునికి మనుమఁడైన మఱియొక చంద్రభూషాచార్యుఁడు రాజగురువయి ప్రౌఢదేవరాయనికాలములో నుండిన నుండవచ్చును. మధురావిజయకృతికర్త్రియు, బుక్కరాయని కోడలును, కంపరాయనిరాణియు నైన గంగాంబ తన మధురావిజయ మను వీరకంపరాయ చరిత్రలో క్రియాశక్తి నిట్లు స్తుతించెను.

శ్లో॥ అసాధారణసాదృశ్యం విలసత్సర్వమంగళమ్
క్రియాశక్తిగురుం వందే త్రిలోచనమి వాపరమ్.

౧౩౭౭ మొదలు ౧౪౦౪-వ సంవత్సరమువఱకును రాజ్యము చేసిన ద్వితీయ హరిహరరాయనిపుత్రుఁ డిమ్మడి బుక్కరాయని మైసూరుదాన శాసనములో కులగురు వయిన కాశీవిలాసక్రియాశక్తి పేర్కొనఁబడెను.

శ్లో॥ శ్రీమత్కాశీవిలాసాఖ్యక్రియాశక్తీశసేవినా
శ్రీమత్త్ర్యంబక పాదాబ్జసేవానిష్ణాతచేతసా.

మన చరిత్రాంశమునకు చంద్రభూషుని కథ గాని చంద్రశేఖరునికథగాని యంతగా ప్రధాన మయినది కాదు. మన శ్రీనాధునిచే నోడగొట్టఁబడి కవిసార్వభౌమ బిరుదమును గోలుపోయిన వాఁడు రెండవ డిండిమకవిసార్వభౌముఁడయిన యరుణగిరినాధుఁ డనుట నిశ్చయము విజయుడి డిమమును. కవిసార్వభౌమబిరుదాంకమును స్వయముగా సంపాదించుకొన్నవి గాక మాతామహునివలన సంక్రమించినవే యయినను, అరుణగిరినాధుఁ డసామాన్య పాండిత్యమును నిరుపమానకవితా సామర్థ్యమును గలవాఁ డయినందునను సంశయము లేదు. ఇతఁడు యోగానంద ప్రహసనాది కావ్యములను రచియించి ప్రసిద్ధి కెక్కిన ట్టీవఱకే చెప్పబడెను

ఇఁక మూఁడవ డిండిమకవిసార్వభౌముని గూర్చి విచారింతము. ఇతఁడు ద్వితీయడిండిమకవిసార్వభౌముఁ డయిన యరుణగిరినాథుని పుత్త్రుఁడు; రాజనాథదేశికనామధేయుఁడు, తండ్రివలనను, తండ్రి తాతవలనను సంక్రమించిన డిండిమకవిసార్వభౌమబిరుదమును వహించినవాఁడు; మహావిద్వాంసుఁడయి సాళువాభ్యుదయాది గ్రంథములను రచించినవాఁడు. ౧౪౭౦-వ సంవత్సర ప్రాంతమున విద్యానగరరాజ్యమును వశపఱుచుకొని పరిపాలించిన సాళువగుండనరసింహరాయని కాలములోను, తరువాతఁ * కృష్ణదేవరాయల తండ్రి యైన వీరనరసింహరాయనికాలములోను మూఁడవడిండిమకవిసార్వభౌముఁ డైన రాజనాథదేశికుఁ డాస్థానకవిగా నుండి ప్రసిద్ధికెక్కెను. ఇతఁడు సాళువగుండ నరసింహరాయని విజయములను వర్ణించుచు సంస్కృతమున సాళువాభ్యుదయ మను పదునాలుగు సరములు గల కావ్యమును జేసెను. ఈ కావ్యమునం దితఁడు తా నష్టదిగ్విజయపటహీకృత బిరుద డిండమాడం బరుఁడ ననియు డిండిమకవిసార్వభౌముఁడ ననియుఁ జెప్పుకొనెను. ఈ బిరుదము లీ వంశమువారికి పితృపితామహపారంపర్యముగా నడచుచున్నట్టు కనఁబడుచున్నవి. ఈ తృతీయ డిండిమకవిసార్వభౌముఁడు వీరనరసింహదేవరాయనికాలములోఁ గూడ నుండినట్టు కుమారధూర్జటికవి కృతి మయిన కృష్ణరాజవిజయములోని యీ క్రింది పద్యములు తెలుపుచున్నవి.

మ. రమణీయాంధ్రతరంగిణీఘుమఘుమారావార్థగంభీరవా
 క్క్రమజంఝానిలధూతదుష్కవిమహాగర్వాభ్రసంఘుండు ది
 గ్గమణీమౌక్తికహారబంధురయశోరాజద్గుణాఢ్యుండు డిం
 డిమపుంభావసరస్వతీంద్రుఁ డనియెన్ రీఫం బ్రకాశించుచున్.

* * * *

* [కృష్ణదేవరాయల తండ్రి నరసరాయలు కాని వీరనరసింహరాయలు కాఁడు; వీరనరసింహరాయలు కృష్ణరాయల యన్న.]

మ. అని యా డిండిమసార్వభౌమకవి ప్రఖ్యాతంబుగాఁ దత్పురా
తనవృత్తాంతము నెల్ల దెల్పినఁ జమత్కారంబు వీక్షించి యా
జననాథాగ్రణియుఁ సభాసదులు నుత్సాహంబునం బొంది కాం
చనభూషాదు లొసంగి రెంతయు దయాసంరంభధౌరేయులై.

పయిపద్యమునందుఁ బేర్కొనఁబడిన జననాథాగ్రణి వీరనరసింహరాయలు. ఇట్లు ౧౪౯౦-వ సంవత్సరప్రాంతములయం దుండినడిండిమకవి సార్వభౌముఁడు శ్రీనాథునిచే జయింపఁబడినవాఁడు కాఁజాలఁడు. శ్రీనాథుఁడు ద్వితీయడిండిమకవిసార్వభౌముని నుద్దండవివాద ప్రౌఢిచే నోడించి యతని కంచుఢక్కను బగులగొట్టించి యాతని కవిసార్వభౌమబిరుదమును స్వవశము చేసికొన్నట్లు చెప్పఁబడినను, తరువాత నాతనిసంతతివారు సహితము వంశాగతమైన విజయడిండిమమును ధరించుచు కవిసార్వభౌమ బిరుదమును వహించుచునే యుండిరి. ఈ మువ్వురు డిండిమకవిసార్వభౌములలోను ప్రథముఁడు ౧౩౭౦ సంవత్సరప్రాంతమునందును, ద్వితీయుఁడు ౧౪౨౦ సంవత్సరప్రాంతమునందును, తృతీయుఁడు ౧౪౭౦ సంవత్సరప్రాంతమునందును, ఉండినవారగుటచేత మన శ్రీనాథకవి జయించినవాఁడు ద్వితీయ డిండిమకవి సార్వభౌముఁడే కాని తక్కిన యిద్దఱును కా రని సిద్ధాంతమగుచున్నది. ఈ డిండిమభట్టుయొక్క కవిసార్వభౌమబిరుదమును స్వాధీనము చేసికొన్నను, గొంతకాలమువఱకు దాని నుపయోగించుట కే హేతువు చేతనో శ్రీనాథుఁడు సందేహించుచుండెను.

[శ్రీనాథుఁడు వాదమున నోడించినది రెండవడిండిమభట్టునేయనియు, డిండిమభట్టబిరుదము వంశపారంపర్యముగావచ్చుచున్నదేయనియు నందఱు నంగీకరించుచున్నారు. కాని యీ డిండిమభట్టు మొదటి దేవరాయలకాలముననుండెనని కొందఱును, రెండవ దేవరాయలకాలమున నుండెనని కొందఱును దలఁచుచున్నారు. డాక్టరు నేలటూరి వేంకటరమణయ్యగారీతఁడు మొదటి

దేవరాయల యాస్థానమున నుండెననుచున్నారు 'ఆంధ్రకవితరంగిణి' కారులు డాక్టరుగారి మతమునే యంగీకరించుచున్నారు - శ్రీబండారు - తమ్మయ్య గారు, శ్రీవేటూరి - ప్రభాకరశాస్త్రిగారు మున్నగువారు రెండవ దేవరాయల కాలముననే రెండవ డిండిమభట్టుండినట్లు తలంచియున్నారు. శ్రీ నల్లంపల్లి - సోమశేఖరశర్మగారును తమయభిప్రాయముతో నేకీభవించినట్లు శ్రీతమ్మయ్య గారు తెల్పినారఁట !]

తమ యాస్థాకవి కిట్లు విద్యావివాదములో పరాభవము జరిగిన తరువాత విజయశాలి యైన శ్రీనాధసుకవిరాజమౌళికి దీనారములతోను, టంకముల తోను తమ ముత్యాలశాలలో కనకాభిషేకము చేయించి సత్కరించి రాయల వా రాతనిని బంపివేసిరి. దీనారములును, టంకములును రాయలకాలములో వాడుకలో నున్న బంగారునాణెములు, బంగారునాణెముల నెట్లు జలమునువలె శిరస్సుపైఁ గ్రుమ్మరించి స్నానము చేయించినప్పు డవి బహుసహస్రములు కాకపోయినను సహస్రమునకు దక్కువ కాకుండ నైన నుండవచ్చును. డిండిమకవి సార్వభౌమునకు సభలో నవమానమును, తత్ప్రతిపక్షికి బహు మానమును జరిగిన యనంతరమున సహితము డిండిమభట్టును, తత్పుత్రుడును పూర్వగౌరవముతోను, పూర్వబిరుదావళితోను పూర్వవిజయడిండిమల తోను, రాయల యాస్థానకవీశ్వరులుగాను, విద్వాంసులుగాను యథాపూర్వ ముగా నుండినట్లే కనఁబడుచున్నది. శ్రీనాధున కిట్లు స్వర్ణాభిషేక సమ్మా నము జరిగినది రాయల యాస్థానమునందుఁ గాదనియు, నొకానొక దక్షిణ దేశాధీశునిసభలో ననియు

" దీనారటంకాలఁ దీర్థ మాడించితి
దక్షిణాధీశు ముత్యాలశాల"

అని యుండుటనుబట్టి యొకొనొకరు వ్రాసి యున్నారు. ఆ కాలమునందు కర్ణాటకరాజులను దక్షిణాధీశ్వరు లనియు వ్యవహరించుచుండెడువారు. ఈ

స్వర్ణస్నానసత్కారము జరిగినది కర్ణాటమహారాజసంస్థానమునందే యని శ్రీనాథకృతమైన, కాశీఖండములోని యీ కృతిపతి సంబోధనపద్యము విస్పష్ట పఱుచుచున్నది.

శా. కర్ణాటక్షితినాథమౌక్తికసభాగారాంతసంకల్పిత
స్వర్ణస్నానజగత్ప్రసిద్ధకవిరాట్సంస్తుత్యచారిత్ర ! దు
గ్ధార్ణోరాశిగభీర ! ప్రాహ్ణముఖమధ్యాహ్నాపరాహ్ణార్చితా
పర్ణావల్లభ ! రాజశేఖరమణీ ! పంటాన్వయగ్రామణీ !

అంతట శ్రీనాథుఁడు రాయలకొలువు వీడ్కొని బహుధనకనకసంచయముతో మరల యశోధనార్జనముకొఱకు దేశసంచారమునకు బైలుదేఱెను. ఈ సంచారములలో నితఁడాంధ్రవల్లభుని మైలారురెడ్డినాయకుని; సర్వజ్ఞసింగమ నాయనిని సందర్శించి సత్కారముఁ బడసెనని చెప్పుదురు. ఆంధ్రవల్లభుఁడు దక్షిణమున కాంచీనగరాధీశ్వరుఁడుగానుండిన సంపరాయని (శంభురాయని) కుమారుఁడైన తెలుఁగురాయఁడు. వీరబుక్కరాయల (౧౩౫౫-౭౭) కుమారుఁడైన కంపరాయలు తండ్రి యాజ్ఞనుసారముగా మధురాసుర త్రాణుని జయించుటకయి దక్షిణదిగ్విజయయాత్ర వెడలినప్పుడు త్రోవలో కాంచీపురము రాజధానిగా రాజ్యమేలుచుండిన సంపరాయని తన సేనాపతి యైన సాళువమంగుని సాహాయ్యముచేత జయించి కాంచీపురమును దన ముఖ్యపట్టణముగాఁ జేసికొనెను. మధురావిజయమునందు దీ క్రింది శ్లోకములలో

శ్లో. "అంతర్బింబితచంపేంద్రా కంపేంద్ర స్యాసిపుత్రికా,
అప్సరోభ్యః పతిం దాతు మంతర్వత్నీ కిలాభవత్.
అథ వంచితతత్ఖడ్గప్రహారః కంపభూపతిః,
అకరో దసినా చంప మమరేంద్రపురాతిథిమ్."

గంగాదేవి తన భర్త పౌరుషమును వర్ణించెడి యుత్సాహముతో కంపరాజు చంపరాయని (సంపరాయని) తన ఖడ్గధారతో ఖండించి చంపెనని గొప్ప

చెప్పెనను, పరాజితుఁ డయిన చంపరాజు స్వర్గాతిథి గాక బ్రతికియుండి మధురాసురత్రాణుని జయించుటలో కంపభూపతికి సహాయుఁడు పహిత మయ్యెను. కంపరాజు సేనాధిపతియు, నిరుపమాన పరాక్రమశాలియునైన సాళువమంగరాజు సంపరాయనిరాజ్యములోఁ గొంతభాగ మతనికి మరల నిప్పించి యాతనిని మిత్రునిఁగాఁ జేసి సంపరాయస్థాపనాచార్యుఁడని పేరు పొందెను. జైమినిభారతములో పిల్లలమఱ్ఱి పినవీరభద్రుఁడు సాళువ మంగును వర్ణించుచు నీ యంశము నీ క్రిందిపద్యములలోఁజెప్పియున్నాఁడు.

సీ. 'దురములో దక్షిణసురతాను నెదిరించి
కొనివచ్చి సంపరాయనికి నిచ్చి
సామ్రాజ్యమున నిల్పి సంపరాయస్థాప
నాచార్యబిరుదవిఖ్యాతి గాంచె
శ్రీరంగవిభుఁ బ్రతిష్ఠించి యర్వదివేలు
మాడ లద్దేవునమ్మడికి నొసఁగె
మధురాసురత్రాణు మడియించి పరపక్షి
సాళువబిరుదంబు జగతి నెరపె
గబ్బితనమునఁ దేజిమొగంబు గట్టి
తఱిమి నగరంపుగవకులు విఱుగఁ ద్రోలి
తాను వ్రేసిన గొరు నుద్దవిడిఁ దెచ్చె
సాహసంబున నుప్పొంగు సాళ్వమంగు.'

ఈ ప్రకారముగా సంపరాయని సామంతరాజునుగా రాజ్యమునఁడు మరల నిలిపిన కాలము ౧౩౭౦-వ సంవత్సరప్రాంతము స్వరాజ్యమునందు పునస్సం స్థాపితుఁడయి సంపరాయఁడు ౧౪౦౦ సంవత్సర ప్రాంతమువఱకును రాజ్య భారమును వహించి యుండును. అనంతరమున సంపరాయని పుత్రుఁడయిన తెలుగుఁరాయఁడు రాజ్యమునకు వచ్చి ౧౪౩౫-వ సంవత్సరప్రాంతమువఱ కును రాజ్యపాలనము చేసి యుండును. ఈ తెలుఁగురాయఁడు ౧౪౨౮ సంవత్సరమునందు సింహాచలయాత్ర చేసి యచ్చట నృసింహస్వామివారి దేవాలయములో నీ క్రింది శాసనము వ్రాయించెను.

"స్వస్తిశ్రీశకవర్షంబులు ౧౩౪౦ అగు నేఁటి ప్లవసంవత్సరఫాల్గుణకృష్ణ ౭ గురువారానను కన్నడదేసమందుల సంఋరాయనికొడుకు తెలుంగు రాయఁడు తనకు అభీష్టార్థసిద్ధిగాను శ్రీనరసింగనాధునికి నిత్యమును సన్నిధిని వెలుంగను అఖండదీపాలు రెండు సమర్పించెను."

శ్రీనాథుఁ డీతనిని ౧౪౨౪-వ సంవత్సర ప్రాంతమునందు దర్శనము చేసి యుండును ఈతని రాజ్యప్రదేశ మేదో సరిగా తెలిసినది కాదు; గాని

శా. ధాటీఘోటకరత్నఘట్టనమిళద్రాఘిష్ఠకళ్యాణఘం
టాటంకారవిలు ఠలుంఠితమహోన్మత్తాహితక్షోణిభృ
త్కోటీరాంకితకుంభినీధరసముత్కూటాటవీరూటక
ర్ణాటాంధ్రాధిపసాంపరాయనితెలుఁగా! నీకు బ్రహ్మాయువౌ

అను శ్రీనాధుని పద్యమునుబట్టి చూడఁగా కర్ణాటాంధ్రదేశమధ్యస్థమయిన యేదో యరణ్యప్రాంతరాజ్య మయినట్టు కనపట్టుచున్నది. ఈ తెలుఁగు రాయఁడు కవులకు కస్తూరిదానము చేయుటలోఁ బ్రసిద్ధుఁడు. శ్రీనాధుని యీ క్రిందిపద్య మీ యంశమును తెలుపుచున్నది.

శా. అక్షయ్యం బగు సాంపరాయనితెనుంగాధీశ కస్తూరికా
భిక్షాదానము చేయురా సుకవిరాడ్బృందారకస్వామికిన్
దాక్షారామపురీవిహారవరగంధర్వాప్సరోభామినీ
వక్షోజద్వయకుంభికుంభములపై వాసించు దద్వాసనల్.

శ్రీనాధకవీంద్రుఁ డీ పద్యము జెప్పునప్పటికే తాను దాక్షారామమునకుఁ బోవ నుద్దేశించుకొన్నట్టు కనుపట్టుచున్నది [శ్రీనాధునిచేఁ బ్రస్తుతింపఁబడిన తెలుఁగురాయనిఁగూర్చి శ్రీ ప్రభాకరశాస్త్రిఁగారి 'శృంగార శ్రీనాధమున నిట్లున్నది.

'భీమఖండరచనము తర్వాత, దాక్షారామసమాయోగము గల్గినయాపయి క్రీ. 1435-1440 ప్రాంతమున మన శ్రీనాధునకు మేదినీమీసరగండకటారి

సాళువ సంబురాయని కొడుకగు తెలుంగురాయని యాశ్రయ మేర్పడినది. ఈతని శాసనము శక 1350 నాఁటి దొకటి సింహాచలముమీఁదఁ గలదు.

——— —— ——— నెల్లూరు మండలముననే యాత్మకూరు తాలూకాలోఁ దెలుంగురాయని పురమను గ్రామము గలదు. అది యీ తెలుంగురాయని పేర నేర్పడినదే కావచ్చును. కృష్ణాతీరమున శ్రీకాకుళగ్రామముతోఁ జేరి తెలుఁగురాయని పాలెమను పల్లెయొకటికలదు. కాని, యది శ్రీకాకుళాంధ్ర నాయకస్వామిపేర నేర్పడినదికాని, యీ తెలుఁగురాయనికి సంబంధించినది కాదు. ఈతని కీ నామము గూడ నా శ్రీకాకుళాంధ్రనాయకుని పేరునుబట్టి వచ్చినదే యగునని నేను తలంచుచున్నాఁడను. ఆ కాలమున నీ తెలుఁగు రాయ లనుపేరు పలువురు పెట్టుకొనుచు వచ్చిరి. శ్రీకాకుళాంధ్రనాయక స్వామి యుత్సవాదులప్పుడు ప్రఖ్యాతముగాజరుగుచుండెడివి. శ్రీకాకుళాంధ్ర నాయకస్వామికిఁ దెలుఁగు రాయఁ డని కూడఁ బేరుండుట తెలియక కొందరీ సంబురాయనికొడుకు తెలుంగురాయఁడు శ్రీకాకుళమునేలినరాజని వ్రాసిరి. ఈ తెలుంగురాయఁడు శ్రీకాకుళమునేలినవాఁ డనుటకు నాధారము మేమియుఁ గానరాదు. అట్లుంట ప్రామాదికమే! ఈ తెలుంగురాయఁడు రాజ్యమెక్కడ యేలెనో ప్రఖ్యాతముగాలేదు. విద్యానగరాధీశ్వరునిక్రింద సేనానాయకుఁడుగా నుండినట్టున్నాఁడు బాపట్ల తాలూకా నూతులపాడుగ్రామమున నీ తెలుంగు రాయని పుత్త్రుఁడు తిరుమలరాయని శాసనములు శా, 1466 నాఁటివి కలవు. తెలుఁగురాయని తండ్రియగు సంబురాయఁడు శా. 1348 నను, నాతని కొడు కగు తిరుమలరాయని శాసనము శా. క. 1466 నను నుండుటచేఁ దెలుఁగు రాయఁడు శా 13·8 తర్వాత 13 95 దాక నున్నట్లును, సింహాచలశాసనము నాఁటి కాతఁ డిర్వది యేండ్లకులోపడిన వయస్సువాఁ డయినట్లును తలఁపఁ దగును. అతఁ డిప్పటికిఁ బ్రఖ్యాతుఁడుగాక, తండ్రిచాటువాఁ డగుటచేతనే యా శాసనమందు 'కన్నడదేశమందలి సంబురాయని కొడుకు తెలుంగు రాయండు' అని పేర్కొనవలసెను. ఆతని శాసనము శా. ·364 నాఁటిది నూతులపాడు గ్రామమునందున్నది.

విజయనగరాధీశ్వరుఁడగు ప్రౌఢదేవరాయనికి లోఁబడిన యీ తెలుఁగు రాయఁ డాతని దండయాత్రలో సింహాద్రిదాఁక వెళ్లినట్లు శ్రీ చిలుకూరి వీరభద్రరావుపంతులుగారు తలంచుచున్నారు. అది సంగతముగా నున్నది శ్రీనాథుఁ డీ తెలుఁగురాయని నా సందర్భముననేని, తర్వాతనేని సందర్శించి యుండవచ్చును' [శృంగార శ్రీనాథము-పుటలు 153 - 155]

తెలుఁగురాయనివలన సంభావనమును బడసి శ్రీనాథుఁ డక్కడనుండి వెడలి మహావిద్వాంసుఁడయి సర్వజ్ఞనామము వహించి రాచకొండసంస్థానము నకు ప్రభువుగా నుండిన సర్వజ్ఞసింగమనీని సందర్శించి సత్కారముఁ బొందుటకయి తదాస్థానమునకుఁ బోయెను. శ్రీనాథుఁడు రాజదర్శనము చేయుటకు ముం దక్కడఁగూడఁ దనకు విజయము కలిగింపవలెనని తన యిష్టదేవత యయిన సరస్వతి నీక్రింది పద్యముతో వేఁడుకొనెనని చెప్పుదురు.

సీ. " దీనారటంకాలఁ దీర్థ మాడించితి
దక్షిణాధీశు ముత్యాలశాల
పలుకుతోడై తాంధ్రభాషామహాకావ్య
నైషధగ్రంథసందర్భమునకుఁ
బగులఁగొట్టించి తుద్భటవివాద ప్రౌఢి
గౌడడిండిమభట్టుకంచుఢక్క
చంద్రశేఖరక్రియాశక్తి రాయలయొద్దఁ
బాదుకొల్పితి సార్వభౌమబిరుద
మెటులు మెప్పించెదో నన్ను నింకమీఁద
రావుసింగమహీపాలు ధీవిశాలు
నిండుకొలువున నెలకొని యుండినీవు
సరససద్గుణనికురుంబ ! శారదాంబ !

ప్రౌఢదేవరాయాంధ్రవల్లభాదుల మహాసంస్థానములకుఁ బోయి వారలచే మెప్పొందిన కవిసార్వభౌముఁ డీ సింగమనాయని చిన్న సంస్థానమునకుఁ

బోయి యచ్చటఁ దనకు పరాభవము కలుగకుండఁ జేయుమని శారదను వేఁడి యుండునా ? యని కొందఱీ విషయమున సంశయపడుచున్నారు. దేవరాయాదులు మహారాజు లయినను, వారు పండితజనపరివేష్టితులే గాని స్వయముగా పండితులుగారు; ఇఁక నీ సింగమనాయఁ డన్ననో చిన్నసంస్థానాధిపతి యైనను పండితులవలనఁ గృతులనందుటయేకాక, తానును స్వయముగా కావ్యవిరచనసామర్థ్యముగలవాఁ డయి బహుశాస్త్రములయందుఁ బ్రవీణుఁడయి సర్వజ్ఞబిరుదమును వహించినవాఁడు. అటువంటివానియొద్దఁ దన పాండిత్యమును జూపుటకుఁ బోవునప్పు డెంతటి విద్వాంసుఁడై నను కొంచెము జంకి, తనకు విజయ మియ్యవలసినదని తన యిష్టదైవతమును ముందుగాఁ బ్రార్థించుట యసహజమగునా ? శ్రీనాథునకు సరస్వతి యిష్టదేవతయగుట నైషధమునందు గృతినాయకుఁడైన మామిడి సింగనామాత్యుఁడు తన్ను బిలిపించి పలికినట్లు చెప్పఁబడిన యీ శార్దూలములు ఘోషించుచున్నవి.

శా. 'భారద్వాజపవిత్రగోత్రుని శుభాపస్తంబసత్సూత్రు వి
ద్యారాజీవభవుండు మారయరుఁ బుణ్యాచార భీమాంబకుం
గారామైన తనూజు నన్ననఘు శ్రీనాథాఖ్యునిం బిల్చి స
త్కారం బొప్పఁగ గారవించి పలికె న్గంభీరవా క్ప్రౌఢిమన్.

శా. బ్రాహ్మీదత్తవరప్రసాదుఁడ వుదగ్రప్రజ్ఞావిశేషోదయా
జిహ్మస్వాంతుఁడ వీశ్వరార్చనకళాశీలుండ వభ్యర్హిత
బ్రహ్మాండాదిమహాపురాణచయతాత్పర్యార్థనిర్ధారిత
బ్రహ్మజ్ఞానకళానిధానమవు నీభాగ్యంబు సామాన్యమే ?'

సర్వజ్ఞబిరుదము రావువంశమూలపురుషుఁడైన బేతాళనాయని కేడవతరమువాఁ డయిన సింగభూపాలునికే గాని పదవతరమువాఁ డయిన యీ సింగమనాయనికి లే దనియు, రసార్ణవసుధాకరాది గ్రంథములను రచించినవాఁ డతఁడే కాని యితఁడు కాఁ డనియు, కాలవ్యత్యాసమునుబట్టి సింగభూ

పాలీయాది గ్రంధకర్త యయిన సర్వజ్ఞసింగమనాయనికాలములొ శ్రీనాధుం డుండి యుండంజాలండనియు, అందుచేత నీ మహాకవి యీ సింగభూపాలుని యొద్ద నపజయము సంభవించునేమో యని భయపడవలసిన పని యుండ దనియు, కాంబట్టి శ్రీనాధుండు సర్వజ్ఞసింగమనాయని యాస్థానమునకుం బోయెననుటయే యసత్యమనియు, కొందఱు వాదించుచున్నారు. ఆ విష యము నిచ్చట నించుక విమర్శింతము.

బేతాళనాయనికి నేడవ తరమువాండు సర్వజ్ఞసింగమనాయం డగుటకు సందే హము లేదు; రసార్ణవసుధాకరాదిసంస్కృతిగ్రంథములను రచించినవాం డతండే యగుటకును సందేహము లెదు. శ్రీనాథపోతనార్యు లాతని కాలపు వారు కాకపోవుటయు, నందుచేత నాతని యాస్థానమునం దుండకపోవుటయు నిశ్చయమే! అంతమాత్రముచేత బదవ తరమువాండైన సింగమనాయండు విద్వాంసుండును సర్వజ్ఞ బిరుదాంకితుండును గాం డన్న సిద్ధాంత మేర్పడ నేరదు. ఇద్దఱును విద్వాంసులుకావచ్చును; ఇద్దఱును సర్వజ్ఞబిరుదాంచితులు కావచ్చును; ఇద్దఱును గ్రంధకర్తలు కావచ్చును. ఇద్దఱును కృతిపతులు కావచ్చును. వేదాంతదేశికులు సుభాషితనీవి లోనగు గ్రంథములను బంపిన వాండును, వైష్ణవగ్రంథకర్తలు తమ వ్యాఖ్యానములలో సర్వజ్ఞ బిరుద నామముతోం బేర్కొనినవాండును బేతాళనాయని యేడవ తరమువాండయిన మొదటి సింగమనాయండే యయి యుండును అయినను పదవతరమువాం డయిన సింగమనాయండును సర్వజ్ఞబిరుదాంకుండే! ప్రౌఢదేవరాయని కాల ములో నుండిన యీ సర్వజ్ఞసింగమనాయని యాస్థానమునకే శ్రీనాథకవి సార్వభౌముండును, బమ్మెరపోతనామాత్యుండును పోయి యాతనిపయిని పద్యములను జెప్పి బహుమానములను బడసిరి. ఈ విషయము వెల్గోటివారి వంశచరిత్రములో నీ క్రింది పద్యమునం జెప్పంబడినది.

సీ. క్షితిలోన సర్వజ్ఞసింగభూపాలుండు
బలవైరిసన్నుతపౌరుషుండు

లలి కావ్యనాటకాలంకారచతురుఁడు
సకలశాస్త్రార్థవిశారదుండు
వలనొప్ప సింగభూపాలీయనామక
గ్రంథంబు రచియించెఁ గౌతుకమున
మును భాగవతమును దెనుఁగు చేసినయట్టి
బమ్మెరపోతన బావమఱఁది
తనకుఁ జెప్పిన భోగినీదండకమును
వెలయ శ్రీనాథనామకవిప్రవరుఁడు
కోరి చెప్పిన పద్యము ల్గొని ముదాప్తిఁ
బెంపుతో వారి మన్నించి పేరువడసె.

ఉభయసింగభూపాలురనుగూర్చియు, సింగభూపాలీయములు చేయఁబడినవి కాని రెంటికిని మిక్కిలి భేదమున్నది—మొదటిది రసార్ణవ సుధాకరము; * రెండవది చమత్కారచంద్రిక. మొదటిది సింగభూపాల రచితము; రెండవది సింగభూపాలాంకితము. రెండును నలంకారవిషయకములే; చమత్కార చంద్రిక యనఁబడెడు రెండవ సింగభూపాలీయము విశ్వేశ్వరకవిచంద్రునిచే రచియింపఁబడినది. అందలి లక్షణముల లక్ష్యములు నరసభూపాలుని పేరఁ జెప్పబడినట్లే సింగభూపాలుని పేరఁ జెప్పఁబడినవి. కవి యీ గ్రంథమునకు సింగభూపాలకీర్తిసుధాసారశీతలనామాంతర * ముంచెను. అందలి విలాసాంత గద్యమును జూడుఁడు.

"ఇతి సరససాహిత్యచాతురీధురీణ విశ్వేశ్వరకవిచంద్ర
ప్రణీతాయాం శ్రీసింగభూపాలకీర్తిసుధాసారశీతలాయాం
చమత్కారచంద్రికాయాం అష్టమో విలాసః."

---

*[రసార్ణవసుధాకరము సింగభూపాల విరచితము కాదేమో యని శ్రీ ప్రభాకరశాస్త్రిలు గారు సందేహించుచున్నారు. చమత్కారచంద్రికకు సింగభూపాలీయ మను పేరు అప్రసిద్ధము.]

* ఇది నామాంతరమైనట్లు తోఁచదు. చమత్కారచంద్రిక కిది విశేషణము.

రసార్ణవసుధాకరము మూఁడుల్లాసములను గలది; చమత్కారచంద్రిక యెనిమిది విలాసములను గలది. చమత్కారచంద్రికలోని రెండు శ్లోకముల నిం దుదాహరించుచున్నాను.

శ్లో. కృతి రభిమతకృతిచతురా యది చతురోదాంతనయగుణోదారా,
ఇతి లక్షణకృతిరత్నం రచయే సింగనృపగుణోదాహరణం.

శ్లో. లోకే రాఘవపాండవాద్భుతకథాగ్రంథానుసంథాయినౌ
తౌ గ్రంథా విన తన్మునిప్రణిహితౌ శ్రీసింగభూపాశ్రయః,
యాయా దాదరణీయతాం కృతధియాం గ్రంధోఽయ మస్మత్కృతీ
నాహం యద్యపి తాదృశోస్మ్యయ మసౌ రాజా హి తాదృగ్గుణః.

చమత్కారచంద్రిక సింగభూపాలకృతము గాక యన్యకృత మయినందున పయి సీసపద్యములోని మూడవ చరణమునందలి 'రచియించె' నను దానిని గృతి సందెనని మార్చిన పక్షమున సింగభూపాలుని కది సరిపోవును. విల్సనుదొరగారు తమ పుస్తకవివరణపట్టికలో ౨౨-వ సంఖ్య గల యీ చమత్కారచంద్రికనుగూర్చి "విశ్వేశ్వరకవిచే రాజమహేంద్రవరముజిల్లాలోని పిఠాపురపుజమీదారీయొక్క చిన్నరాజైన సింహభూపాలునియొక్క పద్యస్తవరూపచరిత్రము ౧౬-వ సంఖ్యచూడుము. (A poetical and panegyrical account of *Sinha Bhupala*, a petty *Raja* of the Zimindari of *Pithapur*, in the Rajahmundry district, by *Visweswara kavi*. See No 16" అని వ్రాసి యున్నారు ౧౬-వ సంఖ్యగల ప్రసంగరత్నావళినిగూర్చి చెప్పుచు దానిలో "౭౭-వ ప్రకరణము విక్రమాదిత్యుఁడు మొదలుకొని మొట్టమొదట కనకగిరిలో చిన్నరాజయి యుండి తన యధికారమును రాజమహేంద్రమండలములోని యొక భాగముపైకి వ్యాపింపఁజేసి పిఠాపురమునో, పెద్దాపురమునో తన రాజధానిని జేసికొన్న సింహభూపుఁడనెడు సర్వజ్ఞసింహనాయఁడు వఱకును గల ప్రసిద్ధరాజులయొక్క సంక్షిప్తచరిత్రములను కలిగి యున్నది. (The 77th chapter contains short accounts of celebrated Princes from *Vikramaditya* to *Sinha Bhupah* or *Sarvajan Sinha Nayudu* a petty prince originally of *Kanaka-*

giri who extended his power over part of the *Raja-mahendri* district and *Pithapur* or *Peddapur* his capital)" అని వ్రాసియున్నారు. దొరగారు రావు సింగ భూపాలుఁ డన్న పేరు చూచి పిఠాపురములో రావువారు సంస్థానాధిపతులుగా నుండుటను బట్టి రాజమహేంద్రమండలమని భ్రమపడి యుందురు దేశికులవారి 'సుభాషితనీవి' వ్యాఖ్యోపోద్ఘాతములో "రాజమహేంద్రవరనగరస్థితసర్వజ్ఞ సింగక్షమావల్లభేన" అని యేల వ్రాయఁబడెనో తెలియరాకున్నది ఈ రెంటినిబట్టి కాఁబోలును వెలుగోటివారి వంశచరిత్రమును వ్రాసినవా రుపో ద్ఘాతములో

"తొమ్మిదవ తరమువాఁడైన లింగమనాయఁడు సింహాద్రి మొదలగు సబ్బి నాటిరాజ్యము నాక్రమించి యేలినట్లును మఱియొక శాఖాంతరమునందు ౧౦వ తరమువాఁడైన యనపోతనాయఁడు రాజమహేంద్రవరమురెడ్లను గొట్టి యా దేశము నేలినవాఁ డనియు, వంశావళిలో వారి చరిత్రములలో వ్రాయఁ బడి యున్నది .. . . లింగమనాయఁడు అనపోతానాయఁడుగార్ల చరిత్రములలో వీరు సింహాద్రి రాజమహేంద్రవరము మొదలగు రాజ్యముల నాక్రమించినారనియు..... ..... కాఁబట్టి నిజముగ తొమ్మిదవతరమువా రా దేశముల నాక్రమించి యేలి తమ పుత్రాదుల నచట నిలిపి యుండవలెను" అని వ్రాసి యున్నారు

[రసార్ణవసుధాకర కర్తయగు సింగభూపాలుఁడును, శ్రీనాథాదులచే దర్శింపఁ బడిన సింగభూపాలుఁడును భిన్నులనియు, రసార్ణవసుధాకరకర్తకు సర్వజ్ఞ బిరుదము లేదనియు, అతని మనుమఁడును, శ్రీనాథునికాలపువాఁడునగు సింగభూపాలునికే సర్వజ్ఞబిరుదము కలదనియు శ్రీ ప్రభాకరశాస్త్రిలుగారి యాశయము. [శృంగార శ్రీనాథము పుట 211] వెలుగోటివారి వంశ చరిత్రలో వీరిరువురికిని సర్వజ్ఞబిరుదమున్నట్లు చెప్పఁబడినది. శ్రీనాథుఁడు కాంచినది మొదటి సర్వజ్ఞసింగభూపతియే యని 'ఆంధ్రకవి తరంగిణి' లో నున్నది (ఐదవ సంపుటము పుట.) 44] డాక్టరు గిడుగు - వేంకటసీతా పతిగారు రసార్ణవసుధాకర నూతనముద్రణపీఠికలో రసార్ణవసుధాకరకర్తను శ్రీనాథుఁడు చూచినట్లు చెప్పియున్నారు]

ఈ సింగభూపాలుని రాజ్యము రాజమహేంద్ర మండలములోని కొంత భాగము వఱకును కొంతకాలము వ్యాపించినను వ్యాపింపకపోయినను సర్వజ్ఞబిరుద మీతనికిఁగూడ నుండినది. ఈ బిరుదము రెండు విధముల రావచ్చును. ఒకవిధమునఁ దాను స్వసామర్థ్యముచేత సంపాదించు కొన్నదైనను కావచ్చును; డిండిమకవి సార్వభౌములకువలె పూర్వుల నుండి వచ్చినదైనను కావచ్చును ఎట్లు వచ్చినను పదవతరమువాఁడైన యీ సింగభూపాలుఁడు పాండిత్యప్రభావముచేతను పండితజనసమాదరణ చేతను కావ్యప్రియత్వముచేతను సర్వజ్ఞనామమున కర్హుఁడయినట్టు కనుపట్టు చున్నాఁడు శ్రీనాథుఁ డీ రావు సర్వజ్ఞసింగభూపాలుని యాస్థానమునకుఁ బోయి యుండిన కాలములో

క. సర్వజ్ఞనామధేయము
శర్వునకే రావుసింగజనపాలునకే
యుర్విం జెల్లును నితరుని
సర్వజ్ఞం డనుట కుక్క సామజ మనుటే.

అని రాజునుగూర్చి చెప్పెను ఈ పద్యవిషయమయి యిటీవలివా రొక వింతకథను గల్పించియున్నారు పెదకోమటి వేమభూపాలుని యాస్థానములో నుండఁగానే శ్రీనాథుఁడు సింగభూపాలునికడకుఁ బోయి యీ పద్యముచే నాతనిని స్తుతించి మరల స్వస్థానమునకు రాఁగా, వేమభూపాలుఁ డిట్లు చెప్పితి వేమని యడుగఁగా, అదిస్తుతి కాదనియు 'సర్వజ్ఞ నామధేయ మొక్క శర్వునకే కాని సింగభూపాలునికే యుర్విని జెల్లు ?' నని చేసిన పరిహాసమనియు, సమాధానము చెప్పి కవి తన ప్రభువును సంతోషపెట్టెనఁట. వేమభూపాలుని మరణానంతరమునందే శ్రీనాథుఁడు సింగభూపాలుని యాస్థానమునకుఁ బోయినవాఁ డగుటచేతఁ దరువాతి ప్రబుద్ధులచే నీ కథ కల్పింపఁబడుట స్పష్టము శ్రీనాథుఁ డీ పండిత ప్రభువునొద్దకుఁబోయి సమ్మానముఁ బొందినది ౧౪౨౫-వ సంవత్సరప్రాంతము.

తరువాత శ్రీనాథుఁడు మైలారురెడ్డి మొదలైన సామంత సంస్థానప్రభువును గూడ సందర్శించి యర్హసంభావనలు పొంది దేశసంచారము ముగింపవలసిన వాఁ డయ్యెను. ఈ సంచారమును ముగింపకముందే శ్రీనాథుఁడు ధాన్యవాటీ పురమునకో, దారిలో కృష్ణాగోదావరీ మధ్యాంతర్వేదిసీమకో పోయి యచ్చటి యప్పటి సంస్థానాధిపతియైన దంతులూరి గన్నభూపాలునికడఁ గొంతకాల ముండి యాతనికి ధనంజయవిజయ మంకితము చేసినట్టు కనఁబడుచున్నది. ధనంజయవిజయ మెక్కడను గానరాలేదు గాని యీ విషయము గోదావరి మండలములో నుండిన దంతులూరి బాపనృపాలుని పేరట నూఱు సంవత్సరముల క్రిందట రచియింపఁబడిన మూర్తిత్రయోపాఖ్యానమువలనఁ దెలియ వచ్చుచున్నది. బాపరాజు గోదావరీమండలములో నుండినను నాతనివంశ మూలపురుషుఁడైన హరిసీమకృష్ణుఁడు ధాన్యవాటీపుర ప్రభువయినట్టు మూర్తిత్రయోపాఖ్యానములోని యీ క్రింది పద్యమువలనఁ దెలియవచ్చు చున్నది.

మ. కురియించెన్ బహుధాన్యవర్ష మఖిలక్షోణీప్రదేశంబునన్
హరియించెన్ విమతాంధకారములు బాహాగ్రాసిసూర్యప్రభన్
సిరి మించెన్ నృపవర్యు లెంచ ఘనుఁడై శ్రీధాన్యవాటీపురీ
చిరసామ్రాజ్యమానమాశ్రయమహాసింహాసనాసీనుఁడై.

ఈ హరిసీమకృష్ణునికులమునందు భీమరాజు జనించెనఁట ; ఆ భీమరాజు కొడుకు గన్ననరపతి. ఈ గన్ననరపతిని వర్ణించుచు గ్రంథకర్త

సీ. అహితదుర్గాధ్యక్షు లందఱు భయ మంద
గ్రీడికైవడి నిల్చెఁ దాడినాడ
నక్షత్రదానవిద్యాక్షేత్రములచేతఁ
బ్రతి యెవ్వరును లేక ప్రతిభఁ గాంచెఁ
దనకీర్తి దశదిగంతరగీయమానమై
కనుపట్టె ధర్మమార్గంబు నెఱపె
శ్రీనాథసుకవీంద్రుచే ధనంజయవిజ
యం బను సత్కావ్య మంది వెలసె

నృపతిమాత్రుండె విజపాదసీరజాత
ఘటితకోటీరవైరిభూకాంతమాన
సాంతరభయాపహారి శ్రీదంతులూరి
గన్నభూపాలమౌళి దోర్గర్వశాలి.

అని యతఁడు శ్రీనాథకవీంద్రునిచే ధనంజయవిజయకావ్యము నందెనని చెప్పెను. అప్పటికి గన్ననరపాలుఁడు ధాన్యవాటీపురములోనే యుండెనో తరువాత నాతని సంతతివారు నివాసముగా నేర్పఱుచుకొన్న కృష్ణాగోదావరీ మధ్యసీమకు వచ్చి యుండెనో తెలియదు.

ఇంతటితోఁ జూడఁ దగిన సంస్థానము లన్నియు నయిపోయినవి. పోయిన సంస్థానమునకే మరలఁ బోయిన కార్యము లేదు. ఇఁక నెక్కడనైనను మహదాశ్రయము సంపాదించి యక్కడ స్థిరపడవలెను. అట్టి యాశ్రయ మేదియా యని విచారింపఁగా నప్పటి కనుకూల మయినది రాజమహేంద్ర వరములో రెడ్లసంస్థాన మొక్కటి కనఁబడిన ట్లున్నది.

ఇప్పుడు తన కడపటి పేలిక యైన పెద్దకోమటి వేమనకు గర్భశత్రువుగా నుండిన యల్లాడరెడ్డి మొదలైనవా రంతరించి వారి పుత్రులు రెడ్డిసంస్థానము నకు ప్రభువు లయిరి. అంతకంటెను ముఖ్యముగా తాతనాటినుండియుఁ దన కుటుంబము నెఱిఁగినవాఁడును, బంధువుఁడునైన బెండపూడి యన్నామాత్యుఁడు రాజమహేంద్రప్రభువులైన వేమవీరభద్రారెడ్లకడ మంత్రిగా నుండుట తటస్థించెను. అందుచేత శ్రీనాథుఁడు ౧౪౨౨-౨౩-వ సంవత్సర ప్రాంతమునందు రాజమహేంద్రవరమునకు వచ్చి యన్నయామాత్యు నాశ్ర యించి తదనుగ్రహమునకుఁ బాత్రు డయ్యెను. అల్లాడరెడ్డి ౧౪౨౩-వ సంవత్సరమువఱకును రాజమహేంద్రరాజ్యపాలనము చేసి యుండుటచేతను, తదనంతరమున రాజ్యభారమును వహించిన వేమవీరభద్రరెడ్ల రాజ్యకాలము లోనే శ్రీనాథుఁడు వారిమంత్రియైన బెండపూడి యన్నామాత్యునికడకు వచ్చుటచేతను, అతఁడు రాజమహేంద్రవరమునకు వచ్చుట ౧౪౨౩-వ

సంవత్సరమునకుఁ బూర్వమయి యుండదు. అప్పుడు శ్రీనాథుని ముఖ్యోద్దేశము బెండపూడి యన్నామాత్యునాశ్రయించి తన్మూలమునఁ దనపూర్వపు ప్రభు వయిన పెదకోమటివేమారెడ్డి శత్రు వయిన యల్లాడరెడ్డి పుత్రుల యనుగ్రహమును సంపాదించి సాధ్యమయినంత శీఘ్రముగా వారి యాస్థానమునఁ బ్రవేశించి యచ్చట స్థిరపడుట. ఈ యభీష్టసిద్ధికయి యతడు మొట్టమొదట నన్నామాత్యునిఁ బొగడి యతని దయను సంపాదింపవలెను; తరువాత వేమవీరభద్రారెడ్లను బొగడి వారివయకుఁ బాత్రుఁడు కావలెను. ఈ రెండు పనులను నెఱవేఱుటకయి యతఁడు భీమేశ్వరపురాణమును తొందరతొందరగా రచియించి దానిని శివభక్తుఁడైన యన్నయమంత్రి కంకిత మొనర్చెను. ఇతఁడు నైషధమహాకావ్యము నాంధ్రీకరించి పెదకోమటివేముని మంత్రియైన మామిడిసింగన్నమంత్రి కంకిత మొనర్చినప్పుడు

సీ. తన కృపాణము సముద్ధతవైరిశుద్ధాంత
                    తాటంకముల కెగ్గు దలఁచుచుండఁ
    దన బాహుపీఠంబు ధరణీభృత్కూర్మ రాహి
                    సామజంబులకు విశ్రాంతి యొసఁగఁ
    దన కీర్తినర్తకి ఘనతరబ్రహ్మాండ
                    భవనభూముల గొండ్లిఁ బరిఢవిల్లఁ
    దన దానమహిమ సంతానచింతారత్న
                    జీమూతసురభుల సిగ్గుపఱుపఁ
    బరఁగు శ్రీవేమమండలేశ్వరునిమంత్రి
    యహితదుర్మంత్రివదనముద్రావతార
    శాసనుఁడు రాయవేశ్యాభుజంగబిరుద
    మంత్రిపెద్దనసింగనామాత్యవరుఁడు.

అనియొక్క పద్యములో వేమభూపాలునిమంత్రి యైనట్లు చెప్పి తరువాత కృతిపతివంశాభివర్ణనము చేసెను. ఈ ప్రకారముగానే యీ భీమఖండమును బెండపూడి యన్నయమంత్రికిఁ గృతి యిచ్చునప్పుడు

సీ. ఏమంత్రికిఁ దైవ మిందుశేఖరుఁడు ద
క్షారామభీమేశుఁ డఖిలకర్త
యేమంత్రియేలిక యిక్ష్వాకుమాంధాతృ
రామసన్నిభుఁ డైనవేమనృపతి
యేమంత్రిసితకీర్తి యేడువారాసుల
కడకొండయవలిచీఁకటికి గొంగ
యేమంత్రిసౌభాగ్య మిగురుఁ గైదువజోదు
లాలిత్యలీలకు మేలుబంతి
యతఁడు కర్ణాటలాటబోటాంగవంగ
కురుకుకురుకుంతలావంతి ఘూర్జరాది
నృపసభాస్థానబుధసన్నుతీయసుగుణ
మండనుఁడు బెండపూడన్న మంత్రివరుఁడు.

అని యొక్క పద్యములో వేమభూపాలుని మంత్రి యైనట్టు చెప్పి. యంతటితో నిలువక తరువాత ననావశ్యకముగా తదనుగ్రహసంపాదనార్థముగా వేమభూపాలుని వంశాభివర్ణనమును నడుమఁ బెట్టి

సీ. పాతాళభువనాధిపతికి శేషాహికిఁ
బ్రియులతో మసకానఁ బెనఁగఁగలిగె
దిక్సింధురములకు దివ్యవాహినిలోనఁ
దేఁటిరాయిడి మానఁ దేలనౌదవె
నుర్వీధరములకు నుదధిలోఁ గాఁపున్న
కులముసాములయిండ్లఁ గడువనబ్బెఁ
గుహనాకిటికి లక్ష్మికుచకుంభములమీఁది
కుంకుమంబున నుసు ల్గొనఁగఁగూడె
రామవేశ్యాభుజంగ వీరప్రతాప
భాసి యల్లాడవిభువీరభద్రనృపతి
సర్వసర్వంసహాచక్ర సర్వభరము
పృథుభుజావీరమున సంభరించుటయును.

గొనగు పద్యములలో వీరభద్రారెడ్డిని, తదగ్రజుఁడైన వేమారెడ్డిని యథే
ష్ఠముగా స్తుతించెను. అన్నయమంత్రి తన్నుఁ బిలిపించి

సీ. వినిపించినాఁడవు వేమభూపాలున
కఖిలపురాణవిద్యాగమములు
కల్పించినాఁడవు గాఢపాకంబైన
హర్షనైషధకావ్య మాంధ్రభాష
భాషించినాఁడవు బహుదేశబుధులతో
విద్యాపరీక్షణ వేళలందు
వెదచల్లినాఁడవు విశదకీర్తిస్ఫూర్తి
కర్పూరములు దిశాంగణములందుఁ
బాకనాటింటివాఁడవు బాంధవుఁడవు
కమలనాభునిమనుమఁడ వమలమతివి
నాకుఁ గృపచేయు మొక ప్రబంధంబు నీవు
కలితగుణగణ్య ! శ్రీనాథకవివరేణ్య !

అని వేఁడఁగా,

సీ. ధారాసురత్రాణధాటీసమారంభ
గర్వపాథోరాశికలశజులకు
సప్తమాడియరాజరుఘాడియక్ష్మాపాల
వందితశ్రీపాదవనరుహులకు
సింహాద్రిపర్యంతసీమాంధ్రమేదినీ
మండలీపాలనాఖండలులకు
హరిదంతదంతిదంతావళీలిఖ్యమా
నానేకజయశాసనాక్షరులకు

వీరభద్రదేశవేమపృథ్వీధవులకు
సముఁగుమంత్రి మహాప్రధానాగ్రగణ్యు
బెండపూడన్న జగనొబ్బగండబిరుద
సచివదేవేంద్రుఁ గృతి కధీశ్వరునిఁ జేసి.

భీమేశ్వరపురాణమును రచించినట్టు కవి చెప్పుకొని యున్నాఁడు. పయివాని లోని మొదటి సీసపద్యముయొక్క నాలవచరణమువలనఁ గవి తా నావఱకే దేశాంగణములు తిరిగి కీర్తి నొందినట్లును, రెండవ సీసపద్యములోని మూడవ చరణమువలన వీరభద్రారెడ్డిరాజ్యము సింహాచలము పర్యంతమును వ్యాపించి యుండినట్టును దెలియవచ్చుచున్నది.

ఈకవికి విష్ణుకథలకంటె శివకథలమీఁద నాదర మత్యధికము. అందుచేత నీతడు భీమఖండములో సర్వపురకథయు, శ్రీకూర్మకథయు రెండు సర్గము లలో నున్నను వానిని దెవిగించుటలో నొక్క పద్యముతోను పద్యపాదము తోను సరిపెట్టెను. ఈతఁడు భీమఖండమును జేయుటలో ౩-వ సర్గము నందలి

శ్లో. అహో కి మేత న్మే బ్రూహి వైవర్ణ్యం వదనే తవ,
దృశ్యతే నేత్రయో ర్దైన్యం మానసవ్యథయానఘ ॥
కశ్చి న్న జాతో వాగ్వాదః లోలార్కేణ సమం తవ,
ఢుంఠీ విఘ్నేశ్వరః కశ్చిత్ న త్వాం ధిక్కృతవా నుషా.
కశ్చి త్త్వం క్షుధితః కాలే విశాలాక్ష్యా న వంచితః,
న కశ్చి త్త్వ య్యనుచితం భైరవేణ కృతం ముధా.
కథం త్యక్తం త్వయా గంగావాహినీసైకతస్థలం,
కథం తత్పరమం స్థానం వ్యసృజ త్కోశపంచకం.
కథం త్వంముక్త్వా న్నాప్యా మవిముక్తవసుంధరాం,
కథం విశ్వేశ్వరం దేవం సతా ముజ్ఝితవాన్ ధనం.

ఈ శ్లోకములను

గీ. ఆననమునందు వైవర్ణ్య మగ్గలించెఁ
గనుఁగవయందు దైన్యంబు గానఁబడియె
నార్తి యేదేని యొకటి నీయంతరంగ
మూని యున్నది యిది యెట్టు లొక్కొ యనఘ ।

సీ. లోలార్కునకు నీకు లోలోన నేమేని
పోటు పుట్టదు గదా మాటమాట
వెనకయ్య శ్రీడుంఠివిఘ్నేశ్వరస్వామి
ధిక్కరింపఁడు గదా తెగువ నిన్ను
నాఁకొన్న నిన్ను మధ్యాహ్నకాలంబున
నరయకుండదు గదా యన్నపూర్ణ
నెపమేమియును లేక నీయెడాటమ్మునఁ
బాటి తప్పఁడు గదా భైరవుండు
ఎట్టు పాసితి మిన్నేటి యిసుకతిప్ప
నెట్టు పాసితి వాస్థలం బేనుక్రోసు
లెట్టు పాసితి యవిముక్త హట్టభూమి
యెట్టు పాసితి విశ్వేశు నిందుధరుని. ''

అని మూలానుసారముగా నెంతో మనోహరముగా తెనిగించినట్లే కొన్ని స్థలములయందు మూలము ననుసరించియే యాంధ్రీకరించినను బహుస్థలముల యందు మూలము నతిక్రమించి తన యిష్టానుసారముగా

శ్లో. 'సప్తగోదావరతట క్రీడాసక్తస్య శీకరైః,
గజాస్యస్య కరోన్ముక్తైః క్లిన్నమార్తాండమండలమ్.'

(సప్తగోదావరతటమున క్రీడాసక్తుఁడయి యున్న గజాననునియొక్క తుండమ్ముచేత వెగఁజిమ్మఁబడిన శీకరములచేత నార్ద్రమైన సూర్యబింబమును గల్గిన) ఆనుదానిని,

"వేదండవదనశుండాకాండచుళికితోన్ముక్తసప్త
గోదావరసలిలధారాఝుణత్కారబృంహిత
బ్రహ్మాండగోళంబు"

అనియు,

శ్లో. సత్సమాగమ మన్నామకథాశ్రవణ యోగతః,
పాపక్షయో భవేద్దేవి! మనుష్యాణాం కలౌ యుగే

(దేవీ! సత్సమాగమమువలనను. నా నామకథాశ్రవణమువలనను కలియుగమునందు మనుష్యులకు పాపక్షయ మగును) అనుదానిని

"పాపంబు లోకభంగిఁ బ్రక్షయం బందిన
నామీఁద దృఢభక్తి నాఁటుకొనును"

అనియు, మూలమునకు భిన్నముగా భాషాంతరీకరించుటయే కాక యొకానొక చోట "సమర్థ స్స హి దేవరాట్" అనుదానిని "సంతతము దేవవేశ్యాభుజంగుఁ డతఁడు" అప్పట్లు సభ్యముగానున్నదాని ననభ్యముగాను తెనిఁగించుచు వచ్చి యున్నాఁడు. ఈ కడపటిదానిమూలమును. దాని భాషాంతరమును జూడుఁడు.

శ్లో. కాలకూటోపసంహారీ, త్రిపురాసురమర్దనః,
నిగ్రహానుగ్రహప్రౌఢః సమర్థ స్స హి దేవరాట్.

గీ కాలకూటోపసంహారకారి యతఁడు
త్రిపురదైత్యాధిపతుల మర్దించె నతఁడు
నిగ్రహానుగ్రహప్రౌఢనిపుణుఁ డతఁడు
సంతతము దేవవేశ్యాభుజంగుఁ డతఁడు.

"దృఢసమర్థుండు చూ దేవదేవుఁ డతడు" అను రీతి నేదో యొక విధముగా మూలానుసారముగాఁ దెనిఁగింపక దేవతావర్ణనలోఁగూడ స్వకపోలకల్పిత

ముగా శృంగారమును జొప్పించుట కవియొక్క శృంగారనాయక నపుణత్వ మును వెల్లడించుచున్నది. శ్రీనాథుఁడు స్త్రీలోలుఁడని లోకములో బలమైన వాడుకయు, తదనుగుణములైన కథలును, పారంపర్యముగ వచ్చుచున్నవి. ఈ పద్యమే కాక గ్రంథములోని యితరపద్యములు సహిత మనేకము లాతని శృంగారనాయికాప్రియత్వమును దెలుపుచున్నవి. భీమేశ్వరపురాణమును మొట్టమొదట ప్రకటించినవారు తమపీఠికలో "పంచారామవధూటీ। పంచాస్త్రవిహారకేళిపాంచాలునకున్" అన్న షష్ఠ్యంతభాగము నుదాహరించి, ఇది యాకృతిపతికేనిఁ బంచారామవాసులగు పుణ్యాంగనలకేని గౌరవజనకంబుగ మాకుఁ దోఁచదు" అని వ్రాసి యున్నారు. ఇది గాక పుస్తకములో దీనిని మించిన పద్యము లున్నవి.

శా. కాంచీకంకణతారహారకటకగ్రైవేయభూషావళుల్
లంచం బిత్తురు దూతికాతతికి లీలన్ బెండపూఁ డన్ననిఁ
బంచాస్త్రోపముఁ దారతార కవయం బ్రార్థించి లోలోపలన్
బంచారామములందుఁ * బల్లెలఁ బురిం బ్రౌఢేందుబింబాననల్,

పంచారామములందు, పల్లెలలోను పట్టములోను గల ప్రౌఢస్త్రీలు తాము తామే బెండపూడి యన్నయను గవయుటకు కాంచీకంకణాదులైన భూషణములను తారుపుకత్తెలకు లంచము లిత్తురఁట! అత్యంత శివభక్తుఁడైన బెండపూడిఁ యన్నయ్య నిజముగానే జారుఁడయినను శాశ్వతముగా నుండదగిన యాతఁడు కృతిపతిగాఁ గల గ్రంథములలో నిట్లుండుట సిగ్గుల చేటు కాదా? ఈ విషయమున శివునకే గతి లేనప్పుడు శివభక్తునిమాట చెప్పనేటికి?

మ. ఎనయరగల్గిన కూర్మ శృంగిరిటేఁగానీ దుండిఁ గానీ నికుం
భునిఁ గానీ కేయిదండ పట్టుకొని సంభోగేచ్ఛ నంతఃపురాం
గనలం గన్నుమొఱంగి యప్పురములోనం గన్నెకాఁదారి ప్రౌ
ఢ్దున భీమేశుఁడు సానివాడ కరుగున్ ధూర్తప్రకారంబునన్.

* [బల్లెలఁ బురిన్ - అనునది సరియైన పాఠము.]

చీఁకటిపడఁగానే భీమేశ్వరస్వామి దాక్షారామములో భృంగిరిటినో మఱి యొకరినో కైదండగొని యంతఃపురస్త్రీలను టక్కువెట్టి సంభోగేచ్ఛతో సానివీధి కరుగునఁట। దీని పయి పద్యములో "దక్షపురిసానికూఁతులఁ దవిలినాఁడు। విశ్వలోకకుటుంబి భీమేశ్వరుండు" అని చెప్పఁబడినది. దీని క్రింది పద్యములో

క. పదునాల్గు మహాయుగముల
ముదుకగు భీమేశ్వరునకు మొగచాలై యుం
డదు సానిపెండ్లి యెప్పుడు
నది దాక్షారామమహిమ మగునో కాదో।

దాక్షారామముయొక్క యీమహిమ యద్భుతమైనది. ఈ మహిమ శ్రీనాథుని కాలమునకే తగినది. ఆ కాలమునందు జారత్వము తప్పుగా గణింపఁబడక పోవుటయే కాక యది కలిగి యుండుటయే ప్రతిష్ఠావహముగాను, పురుషుల కది వర్ణనీయమైన గుణవిశేషము గాను తలఁపబడుచుండునట్లు శ్రీనాథమహా కవివర్ణనలవలనఁ గనఁబడుచున్నది శ్రీనాథుఁడు కథారంభమునకు ముందు భీమఖండమునందు దాక్షారామపురవర్ణనము చేయుచు నా పురములో సానులు తప్ప బ్రహ్మక్షత్రియవైశ్యశూద్రు లెవ్వరును లేనట్టుగా నొక్క సానులను మాత్రమే యత్యధికముగా బహుపద్యములలో నభివర్ణించెను. సప్తగోదావరము "దేవగంధర్వాప్సరోవధూటీస్తనస్థానకశ్రీగంధధవళితం" బఁట। ఇందుఁ బేర్కొనఁబడిన గంధర్వాప్సరోవధూటులు సానివారు. వారి నెప్పుడు వర్ణించినను శ్రీనాథుఁడు వారి గౌరవమునకు కొఱఁతరాకుండునట్లుగా సాధారణముగా నిటువంటి పదములనే వారియెడఁ బ్రయోగించుచుండును. అట్టి దొక్క పద్యము మాత్రము భీమఖండములోని దుదాహరించెదను.

మ. మొరయించున్ వరుఁ డిక్షుచాప మనిశంబుం దక్షవాటీమహా
పురమధ్యంబున ముజ్జగంబు గెలువం బుత్తెంచులీలం బురం
దరవిశ్రాణితదేవతాభువనగంధర్వాప్సరోభామినీ
చరణాంభోరుహనూపురస్వనములన్ జంఝకించు ఝుంకారముల్.

''గంధర్వాప్సరోభామినీ'' శబ్దసామ్యముచేతఁ దెలుఁగురాయనిఁ గస్తూరి వేఁడిన పద్యము నిచ్చట మరల నుదాహరింప బుద్ధి పుట్టుచున్నది

శా. అక్షయ్యంబగు సాంపరాయని తెనుంగాధీశ ! కస్తూరికా
భిక్షాదానము చేయురా సుకవిరాడ్బృందారకస్వామికిన్
దాక్షారామపురీవిహారపర ''గంధర్వాప్సరోభామినీ''
వక్షోజద్వయకుంభికుంభములపై వాసించు నవ్వాసనల్.

ఇది దెలుఁగురాయని కస్తూరి వేడిన పద్యము. ఈ కస్తూరికాభిక్షాదాన మెవ్వరికి? సుకవిరాడ్బృందారకస్వామికి సుకవిరాడ్బృందారకస్వామి యెవ్వరు ? సుకవిరాజేంద్రుఁ డయిన శ్రీనాథకవి కోరబడిన కస్తూరికాఁ దాన మెట్లు సార్థకమగును ? దాక్షారామపురీ విహారపరగంధర్వాప్సరోభామినీ వక్షోజద్వయకుంభికుంభములపై వాసించుటచేత. ఈ గంధర్వాప్సరోభామిను లెవ్వరు ? సానివారు : ఈ పద్యము సాధారణముగా ''సుకవిరాడ్బృందారకశ్రేణికిన్'' అని చదువఁబడుచున్నది గాని యది సరియైన పాఠముగాదు; శ్రీనాథుఁడు కస్తూరి వేఁడిన సందర్భమునఁ బొసఁగదు. దీనినిబట్టి శ్రీనాథునకును దాక్షారామగంధర్వాప్సరోభామినులకును గల సంబంధ మేదో బుద్ధిమంతులు సులభముగా నూహించి గ్రహింపవచ్చును. మానవల్లి రామకృష్ణకవిగారు తమ క్రీడారామపీఠికలో ''నక్షయ్యంబుగ'' అను పద్యము నుదాహరించి యా సందర్భమున ''దీనిచే శ్రీనాథునకు దాక్షారామవేశ్యలతో సంబంధముగల దని వేఱుగఁ జెప్పనక్కఱలేదు వీథినాటకములోని చిన్నిపోతియే శ్రీనాథునకుఁ గూర్చు మగువయో యని సందియము కలుగుచున్నది.'' అని వ్రాసిరి.

సీ. అలకాపురంబున నంగారపర్ణుఁ డన్
గంధర్వపతికన్య కమలపాణి
యా దివ్యగంధర్వి కపరావతారంబు
మధుమావతోర్గంటిమండలమున

నా సుందరాంగి దాక్షారామమునఁ బుట్టి
భువనమోహిని చిన్నిపోతి యనఁగ—

[క్రీడాభిరామము.]

ఈ భీమేశ్వరపురాణము శృంగారనైషధమువలెనే సంస్కృతపద భూయిష్ఠముగా నున్నను చక్కని లోకోక్తులతోను, భాషీయములతోను నిండియుండి మంచి కవిత్వశైలిని నేర్చుకొనఁగోరువారి కనుకరణీయములైన రచనావిశేషములతోడఁ గూడి రసికజనహృదయంగమముగా నున్నది.
ఎక్కడనుండి యైనఁ గ్రొత్తగా నొక కవీశ్వరుఁడు గాని పండితుఁడు గాని తమపట్టణమునకు వచ్చినప్పు డచ్చటి పండితులు మత్సరగ్రస్తులయి యా నూతనవిద్వాంసుని నాక్షేపించుటయుఁ బరాభవింపఁ జూచుటయు సామాన్యములే కదా! శ్రీనాథకవి కర్ణాటకదేశమునుండి రాఁగానే రాజమహేంద్రపురమునందలి పండితులు శ్రీనాథుని కవిత్వమంతయు సంస్కృతభాషయే యనియు, మాటల చమత్కారముచేతఁ దెలుఁగుభాషలాగునఁ గనఁబడుచున్నను నిజముగా కర్ణాట భాషాధోరణియే యనియు, ఆక్షేపింపఁ జొచ్చిరి. ఈ యాక్షేపణములను మనస్సునం దుంచుకొనియే శ్రీనాథుఁడు రాజమహేంద్రపురపండితులమీఁది కోపముచేత కుకవిదూషణ మను నెపముచేత భీమఖండములో నీ క్రింది పద్యములను వేసెను—

గీ. బోధ మల్పంబు గర్వ మభ్యున్నతంబు
శాంతి నిప్పచ్చరంబు మచ్చరము ఘనము
కూపమండూకములఁబోలెఁ గొంచె మెఱిఁగి
పండితంమన్యులైన వైతండికులకు.

గీ. నికటమున నుండి శ్రుతిపుటనిష్ఠురముగ
నడరి కాకులు బిట్టు పెద్దఱచినప్పు
డుదధి రాయంచ యూరక యుంట లెస్స
పైఁప రాకున్న నెందేనిఁ జనుట యొప్పు

గీ. ప్రౌఢిఁ బరికింప సంస్కృతభాష యండ్రు
పలుకునుడికారమున నాంధ్రభాష యందు
రెవ్వ రేమన్న నండ్రుగా * కేమి కొఱఁత?
నాకవిత్వంబు నిజము కర్ణాటభాష!

ఈ కడపటి పద్యములోనివి. తన్నితరు లాక్షేపించునప్పుడు సమాధానముగాఁ జెప్పఁ బడిన పరిహాసగర్భితములైన మాటలేకాని తన కవిత్వము కర్ణాటభాష యని శ్రీనాథుని యభిప్రాయ మెంతమాత్రమును గాదు. ఇట్లన్యాపదేశముగా దూషించుటయే కాక రాజమహేంద్రపండితులను శ్రీనాథుఁడు బహుపద్యములయం దాక్షేపించి యున్నాఁడు—

శా. ... .
.... వి
ద్వాంసుల్ రాజమహేంద్రపట్టణమునన్ ధర్మాసనంబుండి ప్ర
ధ్వంసాభావము ప్రాగభావము మనుచుం దర్కింతు రశ్రాంతమున్.

మ. శ్రుతిశాస్త్రస్మృతు లభ్యసించుకొని విప్రుం డంత నానాధ్వర
వ్రతుడై పోయి కనున్ బురందరపురారామద్రుమానల్పక
ల్పతరుప్రాంతలతాకుడుంగసుఖసుప్తప్రాప్తరంభాంగనా
ప్రతిరోమాంకురపాటనక్రమకళాపాండిత్యశౌండీర్యముల్.

వ. "కీర్తివిహారఘంటాపథం బైన పంటమహాన్వయంబునఁ బాఁకనాటి దేశంబున భద్రపీఠంబున నధివసించిన —— —————— పోలయవే

* నాకేమి – అని పాఠాంతరము

[శ్రీనాథుఁడు తన కవిత్వము సంస్కృతము, తెలుఁగుకాదు; కర్ణాటభాషయని యాక్షేపణరూపముగఁ జెప్పినను 'చెవికింపగు మధురమైన భాష (కర్ణ + అట + భాష)' యని సూచించెననుట స్పష్టము. 'ఎవ్వరేమన్న నండ్రుగా కేమికొఱఁత? అనునదియు పయి యర్థమును సమర్థింపఁగలదు.]

మాన్నపోతాన్న వేమకుమారగిరీశ్వరాదుల ———————— సంబంధ బాంధవ్యంబున వసుంధరాభారధౌరంధర్యంబు నంది——— ——— ఆల్లాడభూవల్లభుండు రాజమహేంద్రంబు రాజధానిగా సింహాద్రి పర్యంతంబు— ————విశ్వవిశ్వంభరాభువనమండలంబుఁ దదనంతరంబ.

గీ. రాజరఘురాము లల్లాడరమణసుతులు
ధాత్రిఁ బాలింతు రాచంద్రతారకముగ
వేమభూవల్లభుండును వీరవిభుఁడు
నన్నదమ్ములు హలియును హరియుఁ బోలె.

ఉ. తమ్ముని వీరభద్రవసుధాధిపు విక్రమవీరభద్రునిన్
నమ్మదలీల రాజ్యభరణస్థితిఁ బట్టముఁగట్టి బహూద
ర్పమ్మున వేమభూవరుఁడు వ్రాసె జగద్విజయప్రశస్తివ
ర్ణమ్ములు దిగ్ధురంధరసురద్విపకుంభవిషాణమండలిన్.''

అను భీమపురాణములోని గద్యపద్యములవలన నల్లాడభూపతి కొండవీటి రెడ్డిరాజులతోడి సంబంధబాంధవ్యమువలన రాజ్యలాభమును బొందిన ట్లగపడుచున్నది గాని యా బాంధవ్య మెట్టిదోమాత్ర మీ పురాణమువలన బోధపడదు. కొండవీటిరెడ్డిరాజులతోడి బాంధవ్యమువలన రాజమహేంద్రవరరాజ్యము కాటయవేమారెడ్డికి లభించిన విధము కొంతకాలముక్రిందట చింతామణిలోఁ బ్రకటింపఁబడిన యీ క్రింది మల్లాంబిక (కాటయ వేముని భార్య) యొక్క తొత్తరమూడిదానశాసనమువలనఁ దేటపడుచున్నది.

శ్లో. తత్ర పంటకులం నామ ప్రసూతం బహుశాఖిని,
తరావివ ఫలం రమ్యం వృత్తం సరస ముజ్జ్వలం,
తత్రాసీ ద్వేమభూపాలః కులే విబుధరంజకః,
పయోధావివ సంతానో రాజరత్నోద్భవాకరే,
శ్రీమాన్వేమమహీపతి స్స విదధే పాతాళగంగాతటే
శ్రీశైలే జగనొబ్బగండబిరుద స్సోపానవీధీం శుభాం,

యాసౌ దీవ్యతి దివ్యసీమ నగరారోహోద్యతానాం నృణాం
నిశ్రేణిః పరికల్పితేన నితరా మాబ్రహ్మకల్పస్థిరా.
యస్మిన్నిస్సీమభూదాన ఖ్యాతి సౌభాగ్యశాలిని,
ద్విజైర్న బహుమన్యంతే బలిభౌవనభార్గవాః.
మహాసేనో మహాదేవో దివారాతికులాంతకః
అనపోతమహీపతౌ ధరిత్రీం పరితో బిభ్రతి పన్నగేంద్రముఖ్యాః,
చిరముచ్ఛ్వసితాలఘూకృతే స్వేభరణే జీవసమస్య సంస్తువంతి.
తస్యానుజ స్సుజన నోఽస్తి వసంతరాయో
వీరాన్న వేమనృపతిః క్షురికాసహాయః,
యస్మిన్మహీ మవతి సార్థ మభూ చ్చిరాయుః
నామావనే సుమనసాం బహుశో వదాన్యే.
హేమాద్రిదాననిరతే యస్మిన్ననవేమభూపతౌ ముదితాన్,
అవలోక్య భూమిదేవాన్ దేవాః స్పృహంతి భూమివాసాయ.
యస్మిన్ కిరతి వసంతే దిశిదిశి కామోత్సవేషు కర్పూరం,
అధివాసితపరిధానానుభవజ్ఞోఽభూ చ్చిరాయ గిరిశోఽపి.
కుమారగిరిభూపోఽభూ దనపోతవిభోస్సుతః
జయతో వాసవస్యేవ ప్రద్యుమ్న ఇవ శార్ఙ్గిణః.
కొండవీడు రితి ఖ్యాతే పురే స్థిత్వా కులాగతే,
కుమారగిరిభూపోఽయం చిరం భూమి మపాలయత్.
తులాపురుషరత్నస్య శ్రీకుమారగిరేః కుతః,
తులాపురుషముఖ్యాని మహాదానాని యోఽతనోత్,
ఆసీదమాత్యరత్నం కాటయవేమప్రభు స్తస్య.
అతిసురగురుభార్గవమతి రతిభార్గవవిజయవిఖ్యాతిః
సింహాసనే నిధాయాసౌ కుమారగిరిభూవరం,
అతేజయ న్మహాతేజా శ్రీకృష్ణ ఇవ ధర్మజం.
కుమారగిరిభూనాథో యస్మై విక్రమతోషితః
ప్రాదాత్ ప్రాచీభువం రాజమహేంద్రనగరీముఖాం,

నప్తా కాటమహీభుజో గుణగణోదారస్య మారప్రభోః
పౌత్రః కాటయవేమభూమిరమణః శ్రీవేమపృథ్వీపతేః.
దౌహిత్రఃపునరన్నపోతనృపతే ర్ధాత్రీశచూడామణే
ర్జామాతా జయతి క్షితిం చిరమవన్ దొడ్డాంబికానందనః
కాటయవేమకటాక్షే ప్రభవతి సదయే చ నిర్దయే చ తదా,
గజపతిముఖనృపతీనాం చిత్రం ముక్తాతపత్రతా భవతి.
భూపాలాన్నమయన్ ప్రజాన్నియమయన్ కాంతాజనం కామయన్
భూదేవాన్ రమయ న్నరీన్విరమయన్ మిత్రాణి విశ్రామయన్.
కీర్తింవిభ్రమయ న్నఘాని శమయఞ్ ధర్మం సమాయామయన్
సోఽయం వేమమహీపతి ర్విజయతే కాటావనీశాత్మజః
అభూత్కాటయవేమస్య జాయా మల్లాంబికా సతీ,
అశేషగుణసంపూర్ణ పాతివ్రత్యధురంధరా.
రాజద్రాజమహేంద్రనామనగరే గోదావరీతీరగం
మార్కండేయశివాలయం పతిహితా మల్లాంబికా ధార్మికా,
కృత్వా శుద్ధసువర్ణరత్నఖచితం బ్రహ్మప్రతిష్ఠాస్తదా
సత్రాణ్యధ్వని చ ప్రసాది జయతేఽనేకాన్తటాకానపి,
శ్రీశాకే గుణ రామవిశ్వ గణితే కార్తిక్యహేబ్దే ఖరే
ప్రాదాత్కాటయవేమయస్య వనితా మల్లాంబికా నామతః,
గ్రామం మల్లవరం నృసింహవిదుషే కాణ్వద్విజాయాదరా
దాచంద్రార్క ముదర్కలాలసమతే సైన్యైశ్వర్యభోగాష్టకం.
కోనదేశేఽగ్రహారో యం భాతి మల్లవరాభిధః ।
తీరే చ వృద్ధగౌతమ్యాః పుణ్యే ముక్తీశ్వరాంతికే.

ఈ శాసనమునుబట్టి పంటకులమునందు శ్రీశైలమునకు మెట్లు కట్టించిన వేమభూపాలుఁ డుదయించినట్టును, ఆతని కనపోతభూపాలుఁడును, అనవేమ భూపాలుఁడును పుట్టినట్టును, అనపోతభూపాలుని కుమారుఁడయిన కుమార గిరిభూపాలుఁడు కొండవీటిరాజ్య మేలుచుఁ దన తోఁబుట్టువగు మల్లాంబి

కకు భర్తయుఁ దనకు మంత్రియు నగు కాటయవేమభూపాలునకు రాజమహేంద్రవరము మొదలుగాఁ గల తూర్పుదేశము నిచ్చినట్టును, ఆ మల్లాంబ రాజమహేంద్రవరమున మార్కండేయ శివాలయమును గట్టించి శాలివాహనశకము ౧౩౩౩-వ సంవత్సరమునకు సరియైన క్రీస్తుశకము ౧౪౨౦ ఖరనామసంవత్సర కార్తికశుద్ధపూర్ణిమనాఁడు కోనసీమలోని మల్లవరమును నృసింహశాస్త్రికి దానము చేసినట్టును, తెలియవచ్చుచున్నది.

భీమఖండము ౧౪౩౦-వ సంవత్సరప్రాంతమునం దనఁగాఁ గవి కఱువది సంవత్సరములు దాఁటిన తరువాతనే చేయఁబడినది. ఈ గ్రంథరచనము చేసినతరువాతఁ గాని శ్రీనాథుఁడు తన కవిసార్వభౌమ బిరుదాంకాదికథల నంత బహిరంగముగాఁ జెప్పుకొన నారంభింపలేదు. భీమఖండము తుది గద్యమునందు "సుకవిజనవిధేయ సకలవిద్యాసనాథ శ్రీనాథనామధేయ ప్రణీతం" బని మాత్రమే వేసికొనియెను. తాను కవిసార్వభౌముఁడ నని భీమఖండములో మఱి యెక్కడను జెప్పుకొనలేదు. ఈ భీమేశ్వరపురాణ రచనముచేత శ్రీనాథునకు రాజాశ్రయము లభించి సంపూర్ణమనోరథసిద్ధి కలిగెను. అతఁ డప్పటినుండియు రాజానుగ్రహమునకుఁ బాత్రుఁడయి వేమవీరభద్రారెడ్ల యాస్థానకవి యయి మహాగౌరవపదము ననుభవింపఁ దొడఁగెను. తరువాత శీఘ్రకాలములోనే శ్రీనాథమహాకవి కాశీఖండమును తెనిఁగించి దానికి వీరభద్రారెడ్డిని కృతిపతిని జేసి రాజసమ్మానమును బడసెను. కాశీఖండము ౧౪౩౫-వ సంవత్సరప్రాంతమునందు రచియింపఁబడి యుండును. కవి కప్పటికి దాదాపుగా డెబ్బది సంవత్సరములప్రాయముండును తన గ్రంథరచనమునుగూర్చి శ్రీనాథుఁడు కాశీఖండములో నిట్లు చెప్పుకొనెను—

సీ. చిన్నారిపొన్నారి చిఱుతకూకటినాఁడు
రచియించితి మరుత్తరాట్చరిత్ర
నూనూఁగుమీసాల నూత్నయౌవనమున
శాలివాహనసప్తశతి నొడివితి

సంతరించితి విండుజవ్వనంబునయందు
హర్షనైషధకావ్య మాంధ్రభాషఁ
బ్రౌఢనిర్భరవయఃపరిపాకమునఁ గొని
యాడితి భీమనాయకునిమహిమఁ

బ్రాయ మింతకు మిగులఁ గై వ్రాలకుండఁ
గాశికాఖండ మను మహాగ్రంధ మేను
దెనుఁగుఁజేసెదఁ గర్ణాటదేశకటక
పద్మవనహేళి శ్రీనాధభట్టసుకవి.

ఈ పద్యమునందు 'కర్ణాటదేశకటకపద్మవనహేళి' యని తనకు విశేషణము వేసికొని తాను గర్ణాటరాజ్యరాజధానియందు విద్యావిజయము నొంది యచ్చటిపండితులను సంతోషపెట్టితినని సూచించియున్నాఁడు 'కర్ణాటదేశ కటకపద్మవనహేళి' యనఁగా కర్ణాటదేశరాజధాని యనెడు పద్మరాజికి సూర్యుఁ డని యర్థము సూర్యుఁ డెట్లు పద్మవనము నలరించునో, యట్లే తానును కర్ణాటకకటకవాసు లైన బుధబృందము నలరించినవాఁడ నని కవి యభిప్రాయము ఇట్లు రాజాశ్రయబలమున ధైర్యమును వహించి కాశీఖండమునందు తన యాశ్వాసాంతగద్యమున వెనుకటిగద్యములోని 'సకలవిద్యాసనాథ'కు మాఱుగా కవిసార్వభౌమవిశేషణమును దన పేరునకు ముందుఁ బెట్టి 'సుకవిజనవిధేయ కవిసార్వభౌమ శ్రీనాధనామధేయప్రణీతం' బని బహిరంగముగాఁ దాను కవిసార్వభౌముఁడ నని చెప్పుకొన సాహసించెను. అంతేకాక సప్తమాశ్వాసాంతపద్యములలో నొకదానియందుఁ గృతిపతిని సంబోధించుచు

గ. కర్ణాటక్షితిపాలమౌక్తికసభాగారాంతరాకల్పిత
స్వర్ణస్నానజగత్ప్రసిద్ధకవిరాట్సంస్తుత్యచారిత్ర ! దు
ర్గార్ణోరాశిగభీర ! ప్రాఘ్ణముఖమధ్యాహ్నపరాహ్ణార్చితా
పర్ణావల్లభ ! రాజశేఖరమణీ ! పంటాన్వయగ్రామణీ !

అని తాను కర్ణాటాధీశ్వరుని ముత్యాలశాలలోఁ గనకాభిషేకగౌరవమును బొందినకథను గూడ నిశ్శంకముగాఁ జెప్పుకొనెను. దీనిఁబట్టి కొందఱు భీమఖండమును రచించినతరువాతను కాశీఖండమును రచియింపకముందును శ్రీనాథుఁడు కర్ణాటకదేశమునకుఁ బోయి యచ్చటఁ దన పాండిత్యప్రకర్షము చేత డిండిమభట్టు నోడించి కవిసార్వభౌమ బిరుదమును కనకాభిషేకమును గాంచె నని చెప్పుదురు గాని శ్రీనాథమహాకవి రాజమహేంద్రవరమున స్థిరపడినతరువాత దేశాంతరగమనముచేయుట కావశ్యకముకాని యవకాశము కాని కానరాదు. *

అల్లాడరెడ్డి పోలయవేమాదులగు కొండవీటిరెడ్లతోడి సంబంధబాంధవ్యంబున వసుంధరాభారధౌరంధర్యంబు నొందె నని చెప్పఁబడుటయే కాని భీమఖండములో నా బంధుత్వ మెట్టిదో వివరింపఁబడలేదు. కాశీఖండములోని యీ క్రింది పద్యమువలన నల్లాడభూపతి యనవేమారెడ్డిపౌత్రి యైన వేమాంబను వివాహమాడి వేమవీరభద్రాదిపుత్రులను బడసినట్లు బాంధవముమాత్రము తేటపడుచున్నది.

మ. అనవేమక్షితిపాలపౌత్రి యగు వేమాంబామహాదేవికిన్
ఘనుఁ డయ్యల్లడభూమిపాలునకు సంగ్రామస్థలీగాండివుల్
తనయు ల్వేమవిభుండు వీరవసుధాధ్యక్షుండు దొడ్డప్రభుం
డును నన్నయ్యయు బాహువిక్రమకళాటోపప్రతాపోద్ధతుల్.

* [భీమఖండమును రచించిన వెంటనే శ్రీనాథునకు వేమ, వీరభద్రారెడ్ల యాశ్రయము లభింపలేదనియు, వారికిఁ గొండవీటిరెడ్లయెడఁ గల స్పర్ధకొంత తదాశ్రితుఁడగు శ్రీనాథునియెడఁగూడ నుండెననియు, పిదప శ్రీనాథుఁడు ప్రౌఢదేవరాయలు, సర్వజ్ఞసింగభూపాలుఁడు మున్నగువారి యాస్థానములకరిగి, కనకాభిషేకాది సత్కారములను పొందినపిదప నతనియెడ వారికి విశేషగౌరవ మేర్పడి శ్రీనాథు నాస్థానకవీశ్వరునిగా గ్రహించిరనియు శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారి యభిప్రాయము. [చూ. శృంగారశ్రీనాథము - పుటలు 216, 217.]

అల్లాడరెడ్డి వేమాంబికను వివాహ మాడుటచేత వరణముగా రాజమహేంద్రవరరాజ్యమును బడసెనేమో యని పయి పద్యమువలన భ్రమ కలుగవచ్చును గాని పూర్వోదాహృతమయిన మల్లాంబికయొక్క తొత్తరమూడి శాసనమువలన రాజమహేంద్రవరరాజ్య మల్లాడరెడ్డికింగాక కాటయవేమారెడ్డికి వచ్చినట్టు స్పష్ట మయి భ్రమ కొంతవఱకు నివారణ మగుచున్నది. అయినను దానివలన నా రాజ్య మల్లాడిరెడ్డికిని దత్సంతతివారికిని నెట్లు వచ్చెనో తెలియరాదు. ఈ యంశమును మఱికొన్ని నూతనాంశములును వీరభద్రారెడ్డిభార్య యైన యనితల్లియొక్క కలువచేఱు శాసనమువలనం దెలియవచ్చుచున్నవి. కాఁబట్టి యా శాసనమును చరిత్రాంశములతో సంబంధించినంతవఱకు నిం దుదాహరించుచున్నాను.

శ్లో. కాకత్యాః పరశక్తేః కృపయా కూశ్మాండవల్లికా కాచిత్,
పుత్ర మసూత తదేత త్కుల మనఘం కాకతీయసంజ్ఞ మభూత్ ౨౧

పితర్యుపరతే తద్వ దరక్ష దఖిలాం క్షితిం,
వీరరుద్రమదేవీతి దుహితా గుణైః. ౨౨

అథ సా రుద్రమదేవీ ప్రతాపరుద్రే హృతారిన్నృపభద్రే.
దౌహిత్రే సుచరిత్రే సర్వా మూర్వీం నిధాయ ముదితవతీ. ౨౩

* * * *

వరాహవ ద్వారిధివారిమగ్నాం ధరా మశేషాం యవనోదరస్థాం,
సముద్ధరన్ ప్రోలయనాయకేంద్ర స్తతః ప్రతిష్ఠాపయతి
[స్మ తద్వత్ ౨౯

స్వర్గాతిథౌ ప్రోలయభూమిపాలే విశ్వేశ్వరాజ్ఞా మధిగమ్య గత్వా.
అపాలయత్కాపయనాయకేంద్ర స్తదీయరాజ్యం తరణిప్రతాపః,
అథ పంచోత్తరసప్తతినాయకసంసేవ్యమానపదపద్మః,
కాపావనీశ్వరః శ్రీవిశ్వేశ్వరకరుణయా క్షితి మరక్షత్. ౩౦
తురుష్కై ర్యే సమాక్రాంతా స్తే చాన్యే కాపభూభుజా,
అగ్రహారాః పున ర్దత్త్వా భూయో భువ మభూషయన్. ౩౧

విశ్వేశ్వరాయ వివిధాం ప్రవివిధాయ సేవాం
యాతే విభౌ దివి చ తత్పదసేవనాయ,
తై ర్న్యాయతైః స్వనగరాణ్యధిగమ్య సర్వై
స్సంరక్షితా గతవిరోధకథైః స్వదేశాః. ౩౨
తేషాం వేమనరేశ్వరః క్షితిభుజాం ధర్మాత్మనా మగ్రణీ
శ్శశ్వ ద్భారతదివ్యపూరుషకథాధౌతాంతరంగ స్సుధీః,
శ్రీమత్పంటకులోద్భవ శ్శివపదద్వంద్వైకసేవాపరో
విప్రాశీర్వచనోన్నతో జితరిపుస్స్ఫూర్జత్ప్రతాపోదయః. ౩౩
ప్రాప్యైతపాతాళగంగాయా మర్పితా వేమభూభుజా,
సా సోపానావళీ చిత్రం స్వర్గంగా మప్యధిరోహిణీ ౩౪
పుత్రా ధాత్రీపతే స్తస్య త్రిమూర్తయ ఇవత్రయః,
అన్నపోతాన్నమాచాన్నవేమనామవిభూషణాః. ౩౫
అన్నపోతవిభోః పుత్రః కుమారగిరి రున్నతః,
శివావానతయా భాతి భూభృత్కులశిరోమణిః. ౩౬
అస్తి ప్రశస్తగుణభూ రరిజిద్భుజశ్రీః
కీర్తిప్రియో జగతి కాటయవేమభూపః,
భక్త్యై కుమారగిరిభూమిపతే ర్య ఆప్త
త్సోన్వగ్రజానుజసుహృత్సచివాసిరూపః. ౩౭
శ్రీమత్కాటయభూపతే ర్భుజభృతో నప్తా ప్రతాపోన్నతేః
పౌత్రో మారమహీశ్వరస్య తనయ శ్శ్రీకాటయోర్వీవిభోః
జామాతా ప్రభు రన్నపోతనృపతే ర్వేమక్షమాధీశ్వరో
యస్యాసీ త్స కుమారగిర్యధిపతి స్స్యాలః పతి ర్దైవతం. ౩౮
మాలా మమ్లానపుష్పా మివ శిరసి వహన్యస్య భూభర్తు రాజ్ఞా
ముర్వీం ఖర్వీకృతారిక్షితిపతి రఖిలా మప్రతీపప్రతాపః,
జిత్వా సామ్రాజ్యలక్ష్మీమనుపమవిభవాం జృంభయ న్సంభృతశ్రీ
కీర్తి స్సేవాపరో భూ త్కొమరగిరివిభోః కాటయాధీశవేమః. ౩౯

వేమవిభుర్లక్ష్మీవా నంగీకృతసర్వమంగళో జిష్ణుః,
ప్రద్యుమ్నం శక్తిధరం జయంత మయతి స్మ సుతకుమారగిరిం. ౪౦
జాతమాత్రేణ జాతో సౌ సర్వసర్వంసహేశ్వరః,
ఆదిగర్భేశ్వరః ఖ్యాతః కుమారగిరిభూపతిః. ౪౧
యస్యా వేమనృపాలో జనకో దొడ్డాంబికా తు జనయిత్రీ,
సా దీవ్య త్యనితల్లీ సమూర్తి రివ దేవభూమిదేవశ్రీః. ౪౨
వేమక్షితీశతిలకేఽథ కథావశేషే
భర్తా కుమారగిరి రస్య సుతో భువోఽభూత్,
పశ్చా ద్ధరాధిపతిభావజుగుప్సయేవ
స్వస్థాన ఏవ స కుమారగిరీశ్వరోఽపి ౪౩
అథ వేమేశ్వరబంధు ర్విలసతి భువనప్రశస్తసింధుః,
దొడ్డయయల్లనరేంద్రః ప్రథితమహాసమరకేళినిస్తంద్రః. ౪౪
స్వామిద్రోహపరాయణకునృపతిజలరాశిజలనిమగ్నధరాం,
దొడ్డయయల్లనరేంద్రో హరి రివ సౌకర్యత స్సముద్ధృతవాన్. ౪౫
దురితరహితచిత్తో దొడ్డయాల్లాడభూపో
భువ మరిజనవశ్యాం భూయసాహృత్య దోష్ణా,
విమలగుణయుతాయాం వేమభూపాత్మజాయా
మవసురసుధాయా మన్నితల్యాం న్యధత్త. ౪౬
భూలోకభాగ్యోదితకల్పవల్లీ శిష్టాశ్రితానిష్టవిభేదభల్లీ,
పవిత్రచారిత్రవధూమతల్లీ వేమక్షితీశస్య సుతాన్నితల్లీ, ౪౭
తస్యాః పతిః పతి రశేషమహీపతీనాం
వేమాంబికాల్లయనృపాలవరేణ్యసూనుః ?
శ్రీవీరభద్ర ఇతి సర్వగుణైకభద్రః
కీర్తిప్రతాపతులితేశ్వరవీరభద్రః ౪౮
తస్యాగ్రజో జయతి వేమయభూతలేంద్ర
శ్రీ కామినీవివిధచారువిలాససాంద్రః
అన్వానఖిల సముపాశ్రితరామచంద్రః

ప్రత్యర్థివంశకమలాకరపూర్ణ చంద్రః. ౪౯
వినతనరపాలపాళీకనదురుమౌళిస్రగుదితగంధపాదాబ్జా
అనితల్లీ పతిదైవా ఘనసచివీభూతభావుకా భువ మవతి. ౫౦
శాకే శరయుగవిశ్వే వై శాఖే మాసి భువ మవ త్యనితల్లీ.
సురవిప్రపక్షేత్రకరం మార్కండేయేశసన్నిధౌ త్యక్తవతీ. ౫౧

....

శాకాబ్దే శరవేదరామశశభృత్సంఖ్యే శుభే శోభకృ
ద్వర్షే శ్రావణకృష్ణవిష్ణుదివసే శ్రీకల్వచేఱుం శుభం.
గ్రామం దత్తవతీ సతీ పరహితాచార్యా శైలాధిప
శ్రీరామేశ్వరసన్నిధౌ పతిహితశ్రీ రన్నతల్ల్యంబికా. ౬౮
గ్రామస్య కలువచేఱో రన్నవరాఖ్యాం విధాయ నిజనామ్నా.
పరహితభిషజే ప్రాదా దనితల్లీ గ్రామ మష్టభూతియుతం.' ౬౯

ఈ శాసనము శాలివాహనశకము ౧౩౪౫ శోభకృత్సంవత్సర శ్రావణ బహుళ ఏకాదశినా డనఁగా క్రీస్తుశకము ౧౪౨౩-వ సంవత్సరమునందు కలువచేఱుగ్రామమును అన్నవర మనుస్వనామముతో ననితల్లి పరహితాచార్యుఁ డను వైద్యశిఖామణి కగ్రహారముగా నిచ్చిన సందర్భమున వ్రాయఁబడినది. ఈ శాసనమునుబట్టి రాజమహేంద్రవరరాజ్యము కాటయ వేమారెడ్డి యనంతరమున నాతఁడు పుత్రహీనుఁడైన తరువాత నాతనిపుత్రిక యైన యనితల్లికి వచ్చినట్టును, ఆమె పేరనే మొదట మామయయిన యల్లాడరెడ్డియు, పిమ్మట బావయైన వేమారెడ్డియు రాజ్యపాలనము చేసినట్టును, స్పష్టపడుచున్నది. రాజమహేంద్రవరరాజ్యము ననితల్లిపక్షమునఁ దన జీవితకాలములో నల్లాడరెడ్డి ౧౪౧౬-వ సంవత్సరము మొదలుకొని ౧౪౨౬-వ సంవత్సరమువఱకును పాలనము చేసెను. ఈతని పాలన కాలములోనే ౧౪౨౩-వ సంవత్సరమున ననితల్లి పేర దానశాసన ముండుట యుతఁ డామెప్రతినిధిగానే భూపరిపాలన మొనర్చినట్లు స్పష్టముగాఁ దెలియు

వచ్చుచున్నది. ౧౪౨౮-వ సంవత్సరము మొదలుకొని భర్తయైనవీరభద్రారెడ్డియు బావయైన వేమారెడ్డియు రాజ్యమేలుట యనితల్లిపక్షముననే యని వేఱుగఁ జెప్పవలసినపనియే లేదు. కాశీఖండమునందు రాజ్య మనితల్లి దే యని కాని, యనితల్లిమూలమున వచ్చిన దని కాని యెక్కడను జెప్పక

సీ. త్రైలోక్యవిజయాభిధంబైన సౌధంబు
చంద్రశాలా ప్రదేశంబునందు
సచివసైన్యాధీశసామంతనృపవర
సీమంతినీజనశ్రేణి గొలువ
శాస్త్రమీమాంసయు సాహిత్యగోష్ఠియు
విద్వత్కవీంద్రులు విస్తరింపఁ
గర్పూరకస్తూరికాసంకుమదగంధ
సారసౌరభము దిక్పూరితముగ

నిజభుజావిక్రమంబున నిఖిలదిశలు
గెలిచి తను రాజ్యపీఠ మెక్కించినట్టి
యన్న వేమేశ్వరునియంక మాశ్రయించి
నిండుకొలువుండెఁ గన్నులపండువుగను.

అని యొకచోటను,

సీ. ధరియింప నేర్చిరి దర్భ పెట్టెడుచ్రేళ్ల
లీల మాణిక్యాంగుళీయకములు
కల్పింప నేర్చిరి గంగమట్టియమీఁదఁ
గస్తూరికాపుండ్రకములు నొసల
సవరింప నేర్చిరి జన్నిదంబుల ప్రోలఁ
దారహారములు ముత్యాలసరులు
చెరువంగ నేర్చిరి శిఖల నెన్నడుములఁ
గమ్మని క్రొత్త చెంగల్వవిరులు

ధామముల వెండిపైఁడియుఁ దడఁబడంగ
బ్రాహ్మణోత్తము లగ్రహారములయందు
వేమభూపాలుఁ డనుజన్ము వీరభద్రు
ధాత్రి నేలింప గౌతమీతటమునందు.

అని యింకొకచోటను. అల్లాడభూపతి యగ్రపుత్రుడైన వేమభూపాలుఁడు నిజభుజావిక్రమమున నిఖిలదిశలు గెలిచి రాజ్యపీఠ మెక్కించి యనుజన్ముఁడైన వీరభద్రుని ధాత్రి నేలించెనని మాత్రము శ్రీనాథుఁడు చెప్పియున్నాఁడు భీమఖండమునందు వేమవీరభద్రవరపాలురరాజ్యము సింహాద్రివఱకు మాత్రమే వ్యాపించిన దని చెప్పఁబడినను కాశీఖండమునందు

ఉ. ప్రాకటవిక్రమస్ఫురణ రాజమహేంద్రము రాజధానిగా
నేకసితాతపత్రమున నేలెను వీరనృపాలుఁ డుత్తమ
శ్లోకుఁడు వేమశౌరియనుజుండు సమున్నతవైభవాఢ్యుఁడై
చీఁకటియుం గళింగయును జిల్కసముద్రము సింహశైలమున్.

అని వీరభద్రారెడ్డిరాజ్యము చిల్కసముద్రమువఱకును వ్యాపించినట్లు చెప్పఁబడినందున పయి సీసపద్యములోఁ జెప్పఁబడినట్లు వేమారెడ్డి తమ్ముని పక్షమున సింహాద్రిమొదలుకొని చిల్కసముద్రమువఱకును గల రాజ్యమును నిజముగానే గెలిచి తమ్మునికిచ్చి యుండును. వీరభద్రారెడ్డికా రాజ్యము భార్య యైన యనితల్లిమూలమునఁ గాక తండ్రిమూలముననే వచ్చినదనెడుపక్షమున నల్లాడరెడ్డికి జ్యేష్ఠపుత్త్రుఁ డుండగా ద్వితీయ పుత్రునకే వచ్చుటకుఁ గారణముండదు. తన ప్రభువునకు భార్యమూలమునఁ బ్రభుత్వము వచ్చిన దనుట గౌరవలోపమని భావించి శ్రీనాథుఁ డీ సత్యమును మఱుఁగుపఱిచి యుండును. రాజ్యలాభక్రమమును జెప్పకపోయినను కవి యనితల్లి వీరభద్రుని యిల్లాలగుటను మాత్రము చెప్ప విడువక యీ క్రింది పద్యములలో వర్ణించెను.

ఉ. రాజశశాంకశేఖరుఁడు రాజకిరీటవతంస మష్టది
గ్రాజమనోభయంకరుఁడు రాజుబదేవర రాజరాజు శ్రీ

రాజమహేంద్రధరాభువనరాజ్యరమారమణీమనోహరుం
డాజిఁ గిరీటి కీర్తి నిధి యల్లయవీరనరేంద్రుఁ డున్నతిన్.

మ. మనుతుల్యుం డగు కాటభూవరుని వేమక్ష్మాతలాధీశునం
దనఁ బాణిగ్రహణంబు చేసెఁ బ్రియమొందన్ వీరభద్రేశ్వరుం
డనితల్లిన్ వనితామతల్లి నుదయాస్త్రాదీంద్రసీమావనీ
ఘనసామ్రాజ్యసమర్థసుప్రథిమ సాక్షాదిందిరాదేవతన్.

గీ. అట్టి యనితల్లి పుణ్యగుణాభిరామ
దనకుఁ బట్టంపుదేవిగా ధన్యలీల
వసుధ యెల్ల నేకాతపవారణముగ
నేలు నల్లయవీరభద్రేశ్వరుండు.

ఈ కవి యనితల్లివలన రాజ్యప్రాప్తి యయిన కథను విడిచినను, కృతిపతి తన్నుఁగూర్చి చెప్పినను, తాను కృతిపతినిగూర్చి చెప్పినను దాక్షారామాప్సరసలను మాత్రము విడిచినవాఁడు కాఁడు.

శా. ఈ క్షోణి న్నినుఁబోలు సత్కవులు లే రీనేఁటికాలంబునన్
దాక్షారామచళుక్యభీమవరగంధర్వాప్సరోభామినీ
వక్షోజద్వయగంధసారఘుసృణద్వైరాజ్యభారంబు న
ధ్యక్షించున్ గవిసార్వభౌమ ! భవదీయప్రౌఢసాహిత్యముల్.

శా. పారావారపరీతవిశ్వవసుధాభారోద్ధతిప్రక్రియా
ధౌరంధర్య ! సరోరుహేక్షణ ! సమిద్గాండీవకోదండ ! దా
క్షారామప్రమదాకరోరకుచకుంభాభోగసంకల్పిత

౭౦

స్తూరీస్థానకముద్రితస్థగితవక్షోవీథికాభ్యంతరా !

ఈ వీరభద్రారెడ్డి తన రాజ్యపరిపాలనకాలములో చుట్టుపట్ల నున్న కర్ణాటక కటకతురుష్కరాజులతో పరమమైత్రి కలిగినవాఁ డయి యుండినట్టు ద్వితీయాశ్వాసాంతమునందలి యీ క్రింది పద్యమువలన కనఁబడుచున్నది.

మ. బలవద్బారహదొంతిమన్నెధరణీపాలావరోధాంగనా
విలసన్మంగళసూత్రరక్షణకళావిఖ్యాతకారుణ్య ! యు
త్కలకర్ణాటతురుష్కరాట్ప్రమమిత్రా ! కుండలస్వామికుం
డలపూజాపరతంత్రధీవిభవ ! పంటక్ష్మాపచూడామణీ !

అనితల్లి శాసనమువల్ల కాటయవేమునకు కుమారగిరిచెల్లెలయిన మల్లాంబ గాక దొడ్డాంబ యను వేఱొకభార్య యుండినట్టును, అనితల్లి దొడ్డాంబిక కూఁతు రయినట్లును దెలియవచ్చుచున్నది. తన సవతితల్లియు, కొండవీటి వారి యాడుఁబడుచును నైన మల్లాంబ తనపేర మల్లవరగ్రామమును బ్రాహ్మణుల కగ్రహారముగా నిచ్చి తొత్తరమూడిశాసనము వ్రాయించి నట్లే యీ యనితల్లి తనపేర నన్నవంమును వైద్యున కగ్రహారముగా నిచ్చి కలువచేఱుశాసనమును వ్రాయించెను. మల్లాంబ కట్టించిన మార్కండే యాలయములోనే యనితల్లి మార్కండేయశివసన్నిధిని ౧౪౨౩-వ సంవత్సరమునందు దేవబ్రాహ్మణక్షేత్రములమీఁది పన్నును తీసివేసెను. *

* [ఇయ్యెడ 'ఆంధ్రకవితరంగిణి' లో నిట్లున్నది. అని తల్లి భర్తయైన వీరభద్రా రెడ్డి తండ్రి యల్లాడభూపతి, స్వామిద్రోహపరాయణులగు వైరి నృపతులనెడి జలరాశిలో మునిఁగిపోయిన భూమిని శ్రీహరివలె నుద్ధరించినాఁడనియు, దురిత రహితచిత్తుఁడైన యాతఁడు శత్రువశమునుండి తప్పించి యా రాజ్యాధికారమును గాపయవేమభూపతి కుమార్తెయైన యనితల్లియం దుంచినాఁడనియుఁ, గలువచేఱు శాసనమునందలి ౧౨-౧౫ శ్లోకములలోఁ జెప్పియుండుటచే, ననితల్లి కీ రాజమ హేంద్రవరరాజ్యము తల్లిమూలకముగా వచ్చియున్నదని భావింపవలయునని శ్రీనాథచారిత్రమునందు శ్రీవీరేశలింగము పంతులుగారు వ్రాసియు, నందే యొక తావున దొడ్డాంబిక యనితల్లికి సవతితల్లి యనియు, సవతితల్లినుండి యా రాజ్య మామెకు సంక్రమించినదనియుఁ జెప్పియున్నారు. రాజమహేంద్రవరరాజ్యమని తల్లిదనుట నిశ్చయమే కాని, యది యెవరిమూలమున వచ్చిన దనుటలోనే వివాద మున్నది. ఆ రాజ్యమును కొమరగిరిరెడ్డి కాటయవేమున కిచ్చెనని తొత్తరమూడి శాసనముచున్నది. అది సత్యమైనచో నా వేమారెడ్డి కనితల్లితప్ప యప్పటికి వేఱు సంతానము లేదు. కావునను, ఆ రాజ్యమున కుత్తరాధికారిణి అనితల్లితప్ప మఱియొకరు లేనందునను, అల్లాడరెడ్డి యా రాజ్యభారము ననితల్లియం దుంచి, తన యుదారాశయమును గనుపఱచి యుండును, (సంపుటము. 5 పుటలు. 71, 72)]

కలువచేఱు శాసనమువలనఁ దెలియవచ్చిన విశేషాంశములలో నొకటి యేకశిలానగరరాజ్యపరిపాలనము చేసిన రుద్రమదేవి గణపతి దేవుని దేవి గాక కూఁతురని స్థిరపడుట. ౧౨౬౦-వ సంవత్సరమువఱకును దేశపరిపాలనము చేసిన గణపతిదేవుని యనంతరమున నాతని రాజ్యమునకు వచ్చి ౧౨౬౨ మొదలుకొని ౧౨౯౬-వ సంవత్సరము వఱకును ప్రజారంజకముగా నోరుగంటిసామ్రాజ్యము నేలిన రుద్రమదేవి గణపతిదేవుని భార్య యని యేలాగునో యొక వాడుక కలిగినది తరువాతఁ గొంతకాలమున కామెమనుమఁడైన ప్రతాపరుద్రునిపైని విద్యానాథకవిచేఁ జెప్పఁబడిన ప్రతాపరుద్రీయమునకు మఱికొంత కాలమునకు వ్యాఖ్య చేసిన కుమారస్వామిసోమయాజి యట్లో భ్రమపడి మూలవిరుద్ధముగా "పురా కిల కాకతికులసంభూతే, గణపతినామ్ని మహారాజే దుహితృమాత్రసంతానే కదాచి ద్దైవయోగేన కాలపరిపాక ముపేయుషి తన్మహిషీ రుద్రదేవీ నామ రాజ్ఞీ బహూని వర్షాణి తద్రాజ్య మకంటకం పరిపాల్య పరిణతా సతీ దౌహిత్రే ప్రతాపరుద్రే రాజ్యధురాం నిదధే" అని పూర్వము కాకతికులసంభూతుడైన గణపతిమహారాజు పుత్రికామాత్రసంతానము కలవాఁడయి దైవయోగముచేత కాలధర్మము నొందఁగా, నాతనిభార్య రుద్రమదేవి బహుసంవత్సరములు రాజ్యము నకంటకముగాఁ బరిపాలించి వృద్ధురాలయి రాజ్యభారమును దౌహిత్రుఁడైన ప్రతాపరుద్రునియందుంచె నని వ్రాసెను. ఈ భ్రమ యెంతకాలమునకో వ్యాఖ్య చేసిన కుమారస్వామిసోమయాజికి మాత్రమే కాక రుద్రమదేవి రాజ్యకాలములోనే హిందూదేశయాత్ర చేసిన మార్కోపోలో యను ఇటలీ దేశీయునకును గలిగెను. అతఁడు తన యాత్రచరిత్రములలో రుద్రమదేవి వెనుకటిరాజురాణి యని వ్రాసెను. దీనిని జూచి తరువాతి చరిత్రకారులనేకులు రుద్రమదేవిని గణపతిదేవుని దేవినిగాఁ జెప్పుచు వచ్చిరి. రుద్రమదేవియొక్క వృద్ధదశలో నామె రాజ్యమునకువచ్చి యామె దౌహిత్రుఁడైన ప్రతాపరుద్రునిపైని. జెప్పఁబడిన ప్రతాపరుద్రీయనామకాలంకారశాస్త్రములో గణపతిదేవుఁడు తనకు పుత్రిక కలుగఁగా నామెను పుత్రప్రతినిధిగా భావించి రుద్రనామము పెట్టెననియు, తదనంతరమునం దామె రాజ్యభారమును

వహించి బహుకాలము మహీపాలనము నిర్వహించి కడపట నా భారము నామె దౌహిత్రుఁడైన ప్రతాపరుద్రునియందుఁ బెట్టెననియు, చెప్పఁబడినది వీరరుద్రమదేవి గణపతిదేవుని దుహిత యనియు, ఆ రుద్రమదేవి రాజ్యమును సుచరిత్రుఁడైన దౌహిత్రునకుఁ ప్రతాపరుద్రున కిచ్చెననియు, ఈ శాసనము ఘోషించుచున్నది. కాకతి యనుదేవతదయచేత నొక గుమ్మడి తీగ కొక కుమారుఁడు కలిగెనఁట! ఆ గుమ్మడితీగకొడుకుయొక్క వంశము కాకతీయవంశ మయ్యెనఁట! గణపతిదేవ మహారాజాదులు తద్వంశ సంభవులఁట!

ప్రతాపరుద్రుని యంత్యదశలో యవనాక్రాంతమయిన యాంధ్రరాజ్యమును పోలయనాయకుఁ డుద్ధరించె ననియు, ఆతనియనంతరమున కాపయనాయకుఁడు కొంతకాలము రాజ్యముచేసి కాలధర్మము నొందఁగా నాతనిని గొలుచుచుండిన డెబ్బదియైదుగురు నాయకులు త్రిలింగదేశమును తమలో విభజించుకొని వేఱువేఱుభాగముల నేలుచుండిరనియు, వారిలో పంటకులోద్భవుఁడయి పాతాళగంగకు సోపానములు కట్టించిన వేమారెడ్డి ప్రముఖుఁ డనియు, చెప్పుట యీ శాసనములోని యింకొక విశేషము పోలయ యవనాక్రాంతమైన యాంధ్రదేశమును తురుష్కులచేతులలో నుండి యుద్ధరించినట్టును, ఆతనియనంతరమునఁ గాపయనాయకుఁ డాంధ్రదేశరాజ్యమును వహించినట్టును, దీనికిఁ బూర్వమునం దుండిన యే శాసనములోను జెప్పబడలేదు. త్రిలింగదేశము యవనాక్రాంతమయిన సన్నిహితకాలములయందు వ్రాయఁబడిన యన్నిశాసనములును, పుస్తకములును తురుష్కులనుండి యాంధ్రరాష్ట్రము నుద్ధరించినవాఁడు ప్రోలయవేముఁడనియు, అతఁడే శ్రీశైలమున పాతాళగంగకు సోపానములు కట్టించినవాఁ డనియు, ఏకముఖముగా ఘోషించుచున్నవి నూట యిరువది సంవత్సరములకుఁ దరువాత వ్రాయబడిన యీ శాసనములోఁ జెప్పింపబడిన యీ నూతనకథ విశ్వాసార్హమయినదిగా కనఁబడదు. యవనులు త్రిలింగరాజ్యము నాక్రమించుట ప్రతాపరుద్రుని రాజ్యావసానదశలో ౧౩౨౦-వ సంవత్సరప్రాంతముల

యందు-ఆ రాజ్యమును తురుష్కులనుండి యుద్ధరించుట యటుతరువాత జరిగి యుండవలెను. పోలయవేముని శాసనము లించుమించుగా ౧౩౨౦-వ సంవత్సరమునుండియుఁ గానఁబడుచున్నందున, ఆ సంవత్సర ప్రాంతమునందే యాతని యాంధ్రదేశపరిపాలనకాల మారంభమయి యుండవలెను పోలయనాయకుఁడు త్రిలింగదేశమును ముష్కర తురుష్కహస్తములనుండి విడిపించి కొంతకాల మేలుటయు, తదనంతరమునందు కాపయనాయకుఁ డా రాజ్యభారమును వహించి కొంతకాల మేలి స్వర్గస్థుఁడగుటయు, అతనితరువాత పోలయవేముఁడు ప్రభుత్వమునకు వచ్చుటయు, అంతయు నొక్క సంవత్సరములోపల జరిగెననుట యసంభావ్యము గాన, నిది కల్పితకథ యయి యుండవలెను ఇందుఁ బేర్కొనఁబడిన పోలయనాయకుఁడు పోలయవేముని తండ్రియే యయి, వేముఁడు ప్రోలయయనంతరముననో కాపయయనంతరముననో రాజ్యమునకు వచ్చుట నిజమయి యుండినయెడల ప్రోలయవేమారెడ్డికే యంకితము చేయఁబడిన హరివంశమునం దెఱ్ఱాప్రెగడ యీ యంశము నించుకయైన సూచించియుండఁడా? శ్రీనాథవిరచితములయిన గ్రంథములలో నెల్ల కాశీఖండమే కడపటి దయినట్టు కనఁబడుచున్నది. ఇది రచియించునప్పటి కీ కవికి డెబ్బది సంవత్సరములుండెను. దీనియందు కవితాపటిమ యెంతమాత్రమును కొఱవడక బహుకావ్యరచనచేత నాఁటితేఱినదానివలెనే చూపట్టుచున్నది. కాశీఖండరచనానంతరమున నల్పకాలములోనే రాజమహేంద్రవరపు రెడ్డిరాజ్యమునకు సహితము వినాశము సంభవించెను.

శ్రీనాథుఁడు లాక్షణికుఁ డయిన గొప్పకవి. ఇతని కవిత్వము సంస్కృతపదభూయిష్ఠమయి రసవంతమయి యుండును మొత్తముమీద నీతనిశైలి సులభమైనది కాదు ఇతఁడు రచియించిన గ్రంథము లన్నిటిలోను నైషధము శృంగారరసప్రధానమై ప్రౌఢముగా నుండును. దీని నాంధ్రకావ్యపంచకములోఁ బ్రధానమైనదానినిఁగాఁ జెప్పుదురు.

ఇతఁడు శివభక్తుఁడు యౌవనదశయందు శృంగారనాయకుఁ డయి స్త్రీలోలుఁడై తిరిగెనని చెప్పుదురు. అది యెంత నిజమో కాని వయసు

ముదిరినతరువాత శివభక్తుఁ డయి యుండెనని యాతఁడు రచియించిన గ్రంథములే సహస్రముఖముల ఘోషించుచున్నవి ఆ కాలమునందు భక్తికిని నీతికిని నంతగా సంబంధ మున్నట్లు కనఁబడదు ఒకఁ డఖండ శివభక్తుఁడును గావచ్చును, జారశిరోమణి యయి యఖండవేశ్యాభక్తుఁడును గావచ్చును.

ఇతఁడు మరుద్రాజచరిత్రము, పండితారాధ్యచరిత్రము, శాలివాహనసప్తశతి, నైషధము, భీమపురాణము, కాశీఖండము, శివరాత్రిమాహాత్మ్యము, హరవిలాసము, అను గ్రంథములను జేసెను. వీనిలో పండితారాధ్యచరిత్రమును వేమారెడ్డి సేనానాయకుఁడైన మామిడిప్రెగ్గడయ్యకును, నైషధము నాతని తమ్ముఁడైన మంత్రి సింగనకును, భీమేశ్వరఖండమును వీరభద్రరెడ్డి మంత్రియైన బెండపూడి యన్నయ్యకును, కాశీఖండమును వీరభద్రరెడ్డికిని, అంకితము చేసెను

శ్రీనాథుఁడు వీధినాటక మనబడెడి యొక యపాత్రపు గ్రంథమును గూడఁ జేసెనని చెప్పుదురుగాని యిప్పుడు ప్రకటింపఁబడియున్న యీ పేరిటి చిన్నపుస్తక మాతనిచే పుస్తకరూపమున రచియింపఁబడినది కాదు. అందు శ్రీనాథవిరచితములయిన పద్యములు కొన్ని యున్న వనుటకు సందేహము లేదు. కాశీఖండాదిగ్రంథములలోని పద్యములను గొన్నిఁటిని శ్రీనాథుఁడు దేశసంచారము చేసినప్పు డక్కడక్కడఁ జెప్పిన పద్యములను గొన్నిఁటిని ఏర్చికూర్చి వానికిఁ దోడుగా నసమర్థు లయిన దుష్కవులు చెప్పిన బూతు పద్యములను జేర్చి వీధినాటకమను పేరు పెట్టి యేఁబది యఱువది పద్యములు గల చిన్నపుస్తకము నొకదానిని పలువురు ప్రకటించియున్నారు అందలి పద్యములలో ననేకములు నీతిబాహ్యములుగాను, అసభ్యములు, నశ్లీలములు నగు నవాచ్యములుగాను, ఉన్నవి. దుర్నీతిపోషకములైన యీ యనుచిత పద్యరచనమును శ్రీనాథకవి కారోపించుట యాతని కపకీర్తి కలిగించుట. శ్రీనాథుడు తాను వీధినాటకమును జేసినట్టే గ్రంథములోను జెప్పుకొనలేదు. శ్రీనాథుని భీమేశ్వరపురాణాదులవలన నతఁ డఖండశివపూజాధురంధరుఁడని తెలియవచ్చుచున్నది. అటువంటి శివభక్తాగ్రేసరుఁడు తన యిష్టదైవతము

లయిన పార్వతీపరమేశ్వరులను గూర్చి యిటువంటి దూష్యపద్యములను జెప్పి యుండునా? కాళేశ్వరి యనఁబరఁగిన పార్వతీదేవిని గూర్చిన పద్య మిది.

చ. గొఱియల మేఁకపోతులను గొమ్ముపొటేళ్ళను గావుఁగొందు వీ,
వరయఁగ సందెకాడఁ దగ వత్తు నటంచు భవచ్ఛిరంబుపైఁ
గర మిడి పోయినట్టి తిలఘాతుకురాలితదీయ
సెఱుకఁగలేవు నీవు నొకభీకరమూర్తివె కాళికేశ్వరీ!

ఒకానొక తిలఘాతుకురాలు వ్యభిచారార్థము సందెకడ వచ్చెద నని కాళికాదేవి నెత్తిమీఁద చేయిపెట్టి బాసచేసి పోయె నఁట! అట్టి ఘోరప్రమాణము చేసియు నట్టి సత్కార్యమునిమిత్త మా తెలికది తానన్నవేళకు రాకుండె నఁట! అందుమీఁద భక్తుఁ డలిగి నీవు గొఱ్ఱెలు మొదలయిన జంతువులను బలిగొనుటయే కాని నీ శిరస్సుపైని జేయివేసి వచ్చెద నని బాసచేసి రాక పోయిన తిలఘాతుకురాలిరోమములు పీఁకఁగలిగితివా? యని మృదువచనములతో పార్వతిదేవి నడుగుచున్నాఁడు! ఇట్టి యర్థమును శివభక్తాగ్రేసరుఁడైన శ్రీనాధునకే కాదు భక్తిహీనుఁడైన సామాన్యహీనమానవున కారోపించుట సహిత మవమానకరమే. అనర్థదాయకమైన యర్థము నటుండనిచ్చి యిఁక నీ పద్యమునందలి పదసౌష్ఠవసౌభాగ్యమును విచారింతము. సందెకడ నని యుండవలసినదానికి సందెకాడనని యున్నది తిలఘాతుకురాలి తదీయశ ములనుచోట సమాసమధ్యమునందున్న తదీయ కర్థములేదు, శ....ము లన్నపదమునకు పామరజనవ్యవహారములోనే కాని సంస్కృతమునఁ గవి యుద్దేశించిన యర్థము లేదు. ఈ పద్యమే శ్రీనాథుని దనెడు పక్షమున నాతనికి శబ్దజ్ఞానము లేదు, వ్యర్థపదప్రయోగశంకిలేదు, అశ్లీలభయము లేదు. రేఫశకటరేఫజ్ఞానము లేదు అని చెప్పవలసి వచ్చును ఈ పద్యమునఁ బ్రాసస్థానములైన గొఱియలలో నిది శకటరేఫము; అరయఁగలో నిది రేఫము ఈ పుస్తకములోని పార్వతీనాధుఁ డయి గరళకంఠుఁ డనఁబరఁగెడు పరమేశ్వరునిఁ గూర్చిన పద్య మిది.

గీ. కాలకంధర! యీశాన! గరళకంఠ!
విసము మెసవినఁ గలుగునక్కసటు వోవఁ
గొమ్మ మేడూరికమ్మచకోరనేత్ర
పననతొనవంటితలము చుంబనము గొనుము.

ఇందు గరళము తిన్నచేఁదు పోవునట్లుగా మేడూరికమ్మపడుచుయొక్క తియ్యనిగోప్యాంగమును నాకు మని భక్తాగ్రగణ్యుండు శివునికి హితబోధ చేయుచున్నాఁడు. మాంసము తినువాఁ డయినను, ఎమ్ముకలను మెడను గట్టుకొని తిరుగఁడు కదా! శ్రీనాథుఁడు జారుఁడే యైనను తన యిష్టదైవత ములనుగూర్చి యిటువంటి దూష్యములయిన బూతులఁ బ్రయోగింప సాహసించునా! ఈ పుస్తకమునిండను 'గొంతుకూర్చొని' 'భాగోతుల బుచ్చిగానికి' 'కుల్లాయెట్టితి' అని వ్యాకరణదుష్టములైన గ్రామ్యపద ప్రయోగములు కానఁబడుచున్నవి. కూరుచుండి, భాగవతులు, పెట్టితి, అనుటకు మాఱుగా సకలలక్షణవేత్తయైన శ్రీనాథుఁడు కూర్చొని, భాగోతులు, ఎట్టితి, అని యపలక్షణప్రయోగములు చేయునా? ఇందలి కడపటిదైన 'యెట్టితి' యనుచోట 'పెట్టితి' యని పెట్టి, 'కుళ్ళాయ' కు 'కుళ్ళా' యన్న రూపాంతర మున్నందున సాధు ప్రయోగముగాఁ జేయవచ్చును.

లయగ్రాహి. బంగరపుచెక్కులఁ జెలంగు చవుకట్టులమె
ఱుంగు బలుచుక్కలపయిం గినిసి జంగల్,
చంగునఁ గొనన్ సరిగ రంగు గలకుట్టుపస
కంగులఁ గడల్కొసన యంగిపయి దోర
త్నాంగదము కుంకుమతరంగముల గుప్ప జిగి
పొంగుబురుసాపని బెడంగు గల కుళ్ళా,
నింగికిఁ దళత్తళ లొసంగ నతఁ డంత నృప
పుంగవుహజారమునకుంగదలి వచ్చెన్. అ. ౨

అని రాజవాహనవిజయప్రయోగము.

శ్రీనాథుని వీథినాటక మని ప్రకటింపఁబడినదానికి వీథీరూపకలక్షణమే ఁట్టదు. వీధిలక్షణము ధనంజయవిరచితమైన దశరూపకము నం దిట్లు చెప్పఁబడినది.

శ్లో. వీధీ తు కైశికీ వృత్త్యౌ సంధ్యంగాంకై స్తు భాణవత్.
రస స్సూచ్య స్తు శృంగారః స్పృశే దపి రసాంతరమ్. ౬౨
యుక్తా ప్రస్తావనాఖ్యాతై రంగై రుద్ఘాత్యకాదిభిః,
ఏవం వీధీ విధాతవ్యా ద్వ్యేకపాత్రప్రయోజితా. ౬౩

దీనివలన వీధి కైశికీవృత్తియందు రచియింపఁబడి, భాణమునందువలె సంధ్యంగాంకములను గల దయి, అధికముగా శృంగారరసమును కొంచెముగా నితరరసములను గలిగి, ఉద్ఘాత్యకాద్యంగములతో ప్రస్తావనను గలిగి, పాత్రముల నొకటి రెంటిని గల దయి యుండవలెనని యేర్పడుచున్నది. విశ్వనాధవికృతమైన సాహిత్యదర్పణమునందు వీధిలక్షణ మీ క్రింది రీతిని వివరింపఁబడి యున్నది.

శ్లో. వీథ్యా మేకో భవే దంకః కశ్చి దేకోఽత్ర కల్ప్యతే,
ఆకాశభాషితై రుక్తై శ్చిత్రాం ప్రత్యుక్తి మాశ్రితః
సూచయే ద్భూరిశృంగారం కించి దన్యాన్ రసా నపి,
ముఖనిర్వహణే సంధౌ అర్థప్రకృత యోఖిలాః.
అస్యా స్త్రయోదశాంగాని నిర్దిశంతి మనీషిణః,
ఉద్ఘాత్యకావలగితే ప్రపంచ స్త్రిగతం ఛలమ్.
వాక్కేళ్యధిబలే గండ మవస్యందిత నాళికే.
అసత్ప్రలాప వ్యాహార మృదవాని చ తాని తు.

ఏకాంకసంయుత మయి, ఆకాశభాషితములచేత చిత్రప్రత్యుక్తులాడుపాత్ర మును గల దయి; విస్తారముగా శృంగారమును కొంచెముగా నన్యరసములను ముఖనిర్వహణసంధులను గల దయి. ఉద్ఘాత్యకము, అవలగితము, ప్రపంచము, త్రిగతము ఛలము వాక్కేళి, అధిబలము, గండము, అవస్యందితము, నాళికము, అసత్ప్రలావము, వ్యాహారము, మృదవము

అనుత్రయోదశాంగసహిత మయి వీథి యుండవలె నని సాహిత్యదర్పణము విధించుచున్నది.

"వీధ్యాం కల్పిత మితివృత్తం ధీరోద్ధతో నాయకః"

అని ప్రతాపరుద్రీయము వీధియం దితివృత్తము కల్పితముగాను ధీరోద్ధతుఁడు నాయకుఁడు గాను ఉండవలెనని విధించుచున్నది నాయిక పరకీయగా నుండవలెననుట లోనుగాగల యితర లక్షణముల నితరలక్షణగ్రంథములు బోధించుచున్నవి ఈ పేర్కొనఁబడిన లక్షణములేవియు నీ యల్పకావ్యము నందు లేవు. ఇందు నాయకుఁడు లేఁడు; నాయిక లేదు. ప్రస్తావన లేదు, పాత్రములు లేవు, సంధులు లేవు, ఇతివృత్తము లేదు; వీథి కుండవలసిన యంగము లేవియు లేవు. ఈ పుస్తకము వలన శ్రీనాథమహాకవి దశరూపక జ్ఞానములేని యపండితుఁడని యాతని కపయశము కలుగుచున్నది ఇందులో నున్న శృంగారమంతయు నశ్లీలమయి జారత్వవిషయమైన బూతుప్రసంగము, శృంగారనాయకుఁ డిందు శ్రీనాథమహాకవియే.

గీ. చెమటచేఁ దిరునామంబు చెమ్మగిల్ల
హాళిగాఁ జేత విడియంబుఁ గీలుకొలిపి
రంగపురిరాజవీధిఁ గానంగ నయ్యె
నాదుమదిఁ గోర్కె లూర వైష్ణవవధూటి.

ఈ యసభ్యగ్రంథముయొక్క కర్తృత్వము నూరక యారోపించి మనవారు కొందఱు శ్రీనాథుని ముంపదలఁచుకొన్న దుర్యశఃపంకమునుండి యతఁడిది శ్రీనాథకవికృతము కాదని సిద్ధాంత మయినప్పుడే లేచి బైలఁబడి గట్టెక్కి కృతార్థుఁడు కాఁగలుగును *

మాకు దొరకిన శ్రీనాథవిరచితములయిన గ్రంథములనుండి కొన్ని పద్యముల నుదాహరించి యీ కవిచరిత్రము నింతటితో ముగించుచున్నాము.

* [శ్రీనాథ రచితమైన 'వీథినాటకము' కానరాదు కర్తృత్వము కల్పితము కావచ్చును. కాని యిందలి పద్యములు చాల వఱకును శ్రీనాథునివి చేరియుండ వచ్చునని కొందఱి యభిప్రాయము]

౧. శృంగారనైషధము—

చ. అటు తగునే సురేశ్వరునియంతటివాఁ డఖిలాప్సరోఽంగనా
విటుఁ డొక మర్త్యభామినికి వేడుకచేయుచు నున్నవాఁడు, వి
స్ఫుటబహురత్నభూషణవిభూషితు లయ్యెడు రాచవారికిన్
గటకట! యారకూటకటకంబు రుచించునొ కాక యొక్కెడన్.

ఉ నీ చరితంబు చూడ నతినిష్ఠుర మయ్యెడు లోకపాలదు
ర్వాచికసూచికాంకురపరంపర దూర్చెదు మాటిమాటికిన్
నా చెవులందు; నీకుఁ దగునా యిటు చేయఁగఁ దప్పు దన్న బా
ధాచరణంబు నైజమెకదా తలపోయఁ గృతాంతదూతకున్.

చ. అడిగితి నొక్కనాఁడు కమలాసనుతేరికి వారువంబనై
నడచుచు నుర్విలో నిషధనాథున కెవ్వతెయొక్కొ భార్య య
య్యెడు నని చక్రఘోషమున నించుక యించుక కాని యంత యే
ర్పడ విన నైతి పే వనుచుఁ బల్కిన చందము తోఁచె మానినీ

ఉ నైషధుఁ డంతరంగమున నవ్వుచు నుండు విరోధు లాడు దు
ర్భాషణముల్ వినిన్ వినని భంగిన యట్టిప విద్విషన్మృషా
దోషగుణాధిరోపణ మదోషతఁ దెల్పుచు నుండుఁ గానఁ ద
ద్దూషణ మెప్డు విన్నఁ బరితోషము నొందు మనీషి యాత్మలోన్.

శా లాలామూత్రపురీషచర్మజలకీలాలాత్మిక ల్కాంతలం
చేలా రోఁతలు పుట్ట నాడుదురు యోగీంద్రుల్? వృథాలాపముల్
లాలామూత్రపురీషచర్మజలకీలాలాత్మలో? తా రహో
ప్రాలేయాంబుపటీరపంకఘనసారక్షోదదివ్యాంగులో?

౨. భీమఖండము—

ఉ. జాదరజాదరంబు మృదుచర్చితగీతులు వారుణీరసా
స్వాదమదాతిరేకములఁ జంద్రిక గాయఁగ దక్షవాటికా
వేదులమీఁదటం గనకవీణలు మీటుచు బాడి రచ్చరల్
మోద మెలర్పఁగా భువనమోహనవిగ్రహు భీమనాథునిన్.

శా. రక్షోనాయకులార! నిర్జరవరవ్రాతంబుచేతన్ సుధా
భిక్షాపాత్రము వోయె నంచు మదిలో బెగ్గిల్లఁగా నేటికిన్?
రక్షార్థంబు భజింప రాదె యభవుం ద్రైలోక్య కుక్షింభరున్
దాక్షారామపురాధినాథుని సుధాధామార్ధచూడామణిన్?

గీ. పువ్వు ముడిచిన పురవీథిభూమియందుఁ
గట్టె మోవంగ వలసిన కారణమున
వీరభద్రునిచే దైన్యవృత్తి నొందె
దక్షుఁ డట్టి మహాధ్వరస్థానమునను.

మ. జగతీమౌళి వతంసభూషణము విశ్వఖ్యాతముం గాశికా
నగరంబుం బెడఁబాసి నీకును జగన్మాన్యైకచారిత్ర యీ
చిగురుంబోడికి నాకునుం గటకటా! చేడ్పాటు వాటిల్లెనే
ముగురిం గూర్చిన ముండదైవమునకు న్మోమాట లేదే సుమీ!

శా. కాశీస్థాన నివాసులన్ యతుల భిక్షావృత్తులం గాంచి పా
రాశర్యుం డెటఁ బోయె నంచు నడుగన్ బ్రహ్మవిహీనాత్మకుం
డా శౌర్యం డెటఁ బోయెనో యెఱుఁగమయ్యా మీరు పోపొండు వి
శ్వేశద్రోహి నెఱుంగ నేమిపని? వాఁ డెచ్చోటికిం బోయెనో?

౩. కా శీ ఖం డ ము—

చ. కొసరి వసంతకాలమునఁ గోయిల క్రోల్చినభంగి నేడ్చె న
ళినరుహనేత్ర కొండచటిఁ బెద్దయెలుంగున వెక్కివెక్కి వె
క్కసమగు మన్యువేగమునఁ గాటుకకన్నులనీరు సోనలై
యుసిరికకాయలంతలు పయోధరముల్ దిగఁబాఱుచుండఁగన్.

ఉ. ఎట్టు పురాణము ల్పదియు నెన్మిదిఁ జెప్పితి వెట్టు వేదముల్
గట్టితి వేర్పఱించి నుడికారముసొం పెసలార భారతం
బెట్టు రచించి తీవు? ఋషి వె ట్టయి? తొక్కదినంబుమాత్రలోఁ
బొట్టకు లేక తిట్టెదవు పుణ్యగుణంబులరాశిఁ గాశికన్.

చ. బిసరుహపత్రలోచన ! కృపీటములందు మునింగి యాడవే
మొసళులు మీలు కర్కటకముల్ గమఠంబులు ? వాని కబ్బునే
యసదృశమైన తీర్థఫల ? మట్టి విధంబు సుమీ తలంప మా
నసమగు తీర్థ మాడవిజనంబులకుం బహుబాహ్యతీర్థముల్.

చ. విడువక నీవు పట్టణమువీధుల వీధుల వెఱ్ఱివాఁడవై
చెడుగులఁ గూడి ధౌర్త్యములు చేయ మహీరమణుం డెఱింగెనే
న్విడుచును; సోమయాజి మనువృత్తులు చేకొను నెల్ల వెంటలన్
జెడుదుము గాదె నీకతనఁ జీరయుఁ గూడును లేక పుత్త్రికా !

శా. ఆకంఠంబుగ నీవు మాధుకరభిక్షాన్నంబు భక్షింపఁగా
లేకున్నం గడు నంగలార్చెదవు; మేలే ? లెస్స ! శాంతుండవే ?
నీకంటె న్మతిహీనులే కిటకటా ! నీవారముష్టింపచుల్
శాకాహారులు కందభోజులు శిలోంఛప్రక్రముల్ తాపసుల్ ?

౪. శివరాత్రిమాహాత్మ్యము —

శా. ఏలా వచ్చెదు ? డాయ నెవ్వఁడవు ? నీ వెచ్చోటికిం బోయె దీ
వేలా మ్రొక్కవు నాకు ? గర్వ మిఁక నెంతో నోర్వకుండుం జుమీ !
త్రైలోక్యాధిపతిన్ సురాసురశిరోరత్నప్రభామండలీ
వ్యాలీఢాంఘ్రిశిరోరుహుండ విడు గర్వారంభసంరంభమున్. ౧

మ. జవ మేపారి మురారిపద్మజభుజాచక్రీభవచ్ఛార్ఙ్గగాం
డివకోదండవినిర్గతప్రబలసందీప్తాస్త్రసంఘాతముల్
భువనక్రోడము నిండి భానుకిరణంబుల్ దూఱనీకుండఁగన్
బవలుం బర్వె మహాంధకారములు పైపై సూచినిర్భేద్యముల్.

శా. ఆ వింధ్యాచల మేలు మేటి శబరాధ్యక్షుండు హేమాంగదుం
డా వార్ధిద్వితయద్వయావధిగ, జక్రాధీశ్వరు ల్గొల్వ నా
నా వేదండఘటాకపోలతలముక్తచ్ఛిద్రానధారాజల
ప్లావప్రక్రమసంవిశుద్ధబహుళప్రస్ఫూర్తిమత్కీర్తి యై. ౨

ఉ. సంపదపేరి కట్టఁడిపిశాచము సోఁకిన మానవుండు పూ
జింపఁ డభీష్టదేవత భజింపఁడు సజ్జను లైనవారి మ
న్నింపఁడు మిత్ర బంధుల గణింపఁడు ధర్మరహస్యము ల్విచా
రింపఁడు (మేలు మాన్యుల) భజింపఁ డహంకరణంబు పెంపునన్.

చ. అరుణగభస్తిబింబ ముదయాద్రిపయిం గనుపట్టె గిన్నెలోఁ
బెరుగును వంటకంబు వడపిందియలుం గుడువంగఁ బెట్టు ని
ర్భరకరుణాధురీణ యగు ప్రాణముప్రాణము తల్లి యున్నదే?
హరహర! యెవ్వ రింకఁ గడుపారఁగఁ బెట్టెద రీప్సితాన్నముల్?

మ. వసుధానిర్జరుఁడున్ మహాసరసిలో వార్వీచులం దేలెఁ ద్రా
వె సుధాసన్నిభమైన వారితటవృద్ధిస్వజావళిచ్ఛాయలన్
వసియించెన్ లహరీసమీరమున సద్యశ్శాంతిఁ బోకారిచెన్
బిసకాండంబుల మేన గుంజె వలువ ల్నిర్మోకసంకాశముల్. ఆ ౩

చ. కలఁగఁగఁబాఱె నాతనియఘంబులు పంచహృషీకసంభవం
బులు బహుకాలసంకలితముల్ దవవహ్ని చిటచ్చిటధ్వనిం
గలఁగఁగఁబాఱు పక్షులప్రకారమునన్ దొలుజాముపూజకై
కలపటహమ్ము ధమ్మనుచు గర్భనిగేహమునందు మ్రోసినన్.

చ. కమలవనాళి కాకణిశకంటకకోటులచేతఁ జూడ్కి కిం
పలవడిచెన్ ధరిత్రి తుహినాగమవేళఁ దటాకసారణిన్
సలిలము పాఱి పండిన యజాంగలసీమము లెన్ని యన్నిటన్
దలముగ సీతుపేర్మి గరుదాల్చిన భావము ప్రస్ఫుటంబుగన్. ఆ ౪

౨. హ ర వి లా స ము—

చ. వికవిక నవ్వె యక్కపటవిప్రకుమారుఁడు మేలులెస్స! వా
నికినయి రాగబంధమును నిల్పె మదిం దరళాయతాక్షి మీ
సకియ వివాహవేళఁ బురశాసనుపాణి పరిగ్రహించుచో
ఝొకమున బుస్సుమంచు నహిమ్రెగ్గిన నెట్లు భయంబునొందునో,

ఉ. మంచిగ మేనయత్తలు సమాదరణం బడరంగఁబెట్టి పు
త్త్రెంచిన మంచికజ్జములు తేనియ నేతను దోఁచి తోఁచి భ
క్షించుచుఁ దల్లిఁ దండ్రిఁ దన చిన్నికరాంగుళి వంచివంచి యూ
రించుచు నాడె మిన్న గమిరేడుకుమారకుఁడింటిముంగటన్.

ఉ. వెగ్గలమైన మోపు గడు వీఁకునఁ నెత్తగఁబోయి ముందటన్
గ్రొగ్గతిలంబడెం జెమట మోమునఁ గ్రమ్మఁగఁదా ద్విజోత్తముం
డగ్గణముఖ్యుతోడ నొకఁడై సరియాచకులన్ భరింపఁ దా
దిగ్గన వచ్చె శంకరుఁడు దెప్పరమైన వడిం జెమర్చుచున్. ఆ ౧

శా. అయ్యార్యాద్భవవంశసంభవుని నేకామ్రాదినాథాంబికా
శయ్యామందిరనిర్మలాత్మకుని భిక్షావృత్తిజంగం బొకం
డొయ్యం జేరఁగ వచ్చి మా శివుని నేఁ డోలార్చెదంగాని తే
వయ్యా! యిక్షురసంబు తూమెఁ డనుచుం బ్రార్థించి నేమించినన్

చ. ముసురుదినంబులందు మన మోసలపంచయరుంగుమీఁదటన్
భసితవిభూషణుల్ పరమపావనమూర్తులు శైవసంహితా
భ్యసనపరాయణుల్ గిరిశభక్తు లనేకులు నిండి యుంద్రు నేఁ
డసితసరోరుహాక్షి! యొకఁడైనను లేఁ డిది యేమిచోద్యమో?

ఉ. మాటలు వేయు నేమిటి? మంగళలక్షణలక్ష్మి యైన యీ
జోటికి భర్త గాఁగలఁడు సోమకిరీటుఁడు సర్వదేవతా
కోటికిరీటకోటిపరికుంచితభవ్యమణిద్యుతిస్ఫుటా
పాటలపాదపీఠుఁ డగు పట్టి కృతార్థుఁడ వైతి భూధరా! ఆ ౩

ఉ. కమ్మని యూర్పుగాడుపులగందము గ్రోలఁగ వచ్చి యోష్ఠబిం
బమ్ముసమీపదేశమునఁ బాయక యాడెడి తేఁటిఁ దోలెఁ బ
ద్మమ్మున మాటిమాటికి సమంచితసంభ్రమలోలదృష్టియై
యమ్మదిరాక్షి చారుదరహాసవికస్వరగండపాళియై ఆ ౩

చ. అరుదగు నీ తపంబునకు నమ్ముదుపోయితి నేలుకొమ్ము నీ
వరుఁడ నంచు శూలి ప్రియవాక్యములం దగ గౌరవించినన్
ధరణిధరేంద్రనందన యుదగ్రతపోమహనీయవేదనా
భర మఖిలంబు వీడ్కొలిపి భావమునం బరితోష మొందుచున్.

మ. అని దేవర్షి బహుప్రకారమధురవ్యాహారసందర్భముం
బనిగొంచుండఁగఁ దంద్రిపార్శ్వమున సద్భావంబు లజ్జాభరం
బును మౌగ్ధ్యంబును దోఁప నమ్రవదనాంభోజాతయై గౌరి య
ల్లన లెక్కించుచునుండెఁ బాణి నవలీలాపద్మపత్త్రంబులన్. ఆ ౪

ఉ. ఎంచి నుతింప శక్యమె యహీశ్వరునంతటివానికైన ర
త్నాంచితరోచిరుద్గమనిరస్తరవీందుమరీచిజాలమున్
గాంచనకందరాయవనికాయుతవారిధరాంతరాళని
ర్వంచిత దేవతామిధునవాంచితమూలము శీతశైలమున్. ఆ ౫

శా. అయా వేళల మౌనిభార్యలు గృహవ్యాపారలీలాభవ
త్కాయక్లేశము లుజ్జగింతురు లసత్కర్పూరరంభాతరు
చ్ఛాయన్ శీతలచంద్రకాంతమణిపాషాణప్రదేశంబులన్
వాయుప్రేరణఁ బచ్చకప్పురము పైవర్షింప నక్కోనలోన్. ఆ ౫

మ. వికటభ్రూకుటిఫాలభాగుఁడును ఘర్మస్వేదాంబుపూర్ణాఖిలాం
గకుఁడుం బాటలగండమండలుఁడునై కల్పాంత సంహారరు
ద్రకఠోరాకృత దుర్నిరీక్షుఁ డగుచుం దట్టించి దుర్వాసుఁ డు
గ్రకటాక్షంబున నింద్రుఁ జూచి పలికెన్ గాఢాగ్రహవ్యగ్రతన్. ఆ ౬

చ. జలధరమంతమై కరటిచందము గైకొని సూకరాకృతిన్
నిలిచి పికంబుతో దొరసి నేరెడుపండును బోలుపుట్టువై
కలశపయోధిమంధనముఖంబునఁ బుట్టిన యమ్మహాహలా
హలము క్రమంబునన్ శివుని హస్తసరోరుహ మెక్కె వింతయై.

ఉ. చక్కనివాఁడ వెంతయును జల్లనివాఁడవు భాగ్యరేఖఁ బే
రెక్కినవాఁడ వీ విపిన మెక్కడ? సుకుమారతాగుణం
బెక్కడ? ఘోరవీరతప మీ యెలప్రాయమునందుఁ జేయు నే
యక్కట! యెవ్వఁడైన సుకృతాత్ముఁడ వీ వొకరుండు తక్కఁగన్.

చ. అతులితధైర్యశౌర్యమహిమాద్భుతసాహసులై మహోగ్రతా
ప్రతతనిశాతనిష్కృపకృపాణవిదారితదేహులై రణ
క్షితిఁ బడి వత్తురై దుపది చేయక నాకయి యట్టి నన్ను నీ
ఇతరులఁబోలెఁ గైకొనక యెంచెద విప్పుడు పాండునందనా. ఆ ౩

౨౦. పల్నాటివీరచరిత్రము

ద్వి॥ పేరె బాలుఁడు గాని బిరుదుమగండఁ
బగవారిఁ గొట్టని బాలత్వ మేల?
తలిదండ్రులను బ్రోవ దనయుఁడె కర్త
మానాభిమానముల్ మగఁటిమి మించఁ
బ్రబలింపఁగలవారు బాలురె సుమ్ము!
బాలురె పెద్దలు బల్లిదు ల్వారె
బాలురకే బుద్ధి పరికించి చూడఁ
బెద్దలు మతి చెడి పిఱికిపాఱుదురు
పాంచభౌతికదేహపటిమ క్షీణించు
ధైర్యంబు తగ్గు నుత్సాహంబు లుడుగు
వయసు మీఱినవేళ వచ్చునా బలిమి?
కీర్తికైనను నపకీర్తికి నైన
బాలురపై నుండు భార మంతయును. ౧

* * * *

ద్వి. కుటిలాత్మురాల! నీ గుణములు తెలిసె
మఱుమాయచేఁ జిక్కి మానము ధనము
నీపాలు చేసితి నేఁ గాన నైతిఁ
గామాంధకారంబు కష్టపువిద్య
నీతి మాలినచర్య నేటికిఁ దెలిసె
ఇంటిలో భోజనం బిచ్చుకు రాక
పరులయెంగిలి కాసపడితిని నేను.

* * * *

వారకాంతలరీతి వర్ణింపరాదు
బిడ్డ కొసంగక ప్రియురాలి కీక
చీమలు గూర్చినచెలువునఁ గూర్చి

ధనవంతు లగువారి ధనమెల్ల దోఁచి
ముంజికాంద్రను జేసి మురిప మడంప
వ్యర్థులై విటవృత్తి వసుమతిమీఁదఁ
బోయిరి ప్రతికెడుపొందిక లేక.

* * * * *

ద్విపద. నినుఁబాసి భువిమీఁదఁ నిల్వ నోపుదుమె
వనజాక్షి! నీవెంట వత్తు మటంచు
నెరి బ్రాహ్మపుత్రుఁడు నీవిధి యనుచుఁ
గరియాన లిరువంకఁ గదిసి చల్లఁగను
భామ లందఱు గూడి పలుదెఱంగులను
గోమలిచరణంబు కొంత గై సేయఁ
జిలికికప్పిన మూర్ఛ తెలిసి శీఘ్రముగఁ
దలవంచి తనకాలు తప్పక చూచి
యిది యేరి బంగరం బింతచక్కనిది
యిది యెవ్వరిదె యమ్మ యీవులవెండి &c

* * * * *

ఘనుఁడైన శ్రీనాథకవిరాజరాజు
చెన్నునికృపచేతఁ జిత్త ముప్పొంగి
బాలుని విక్రమప్రౌఢి యంతయును
విరచించె జనులకు విశదంబుగాను.

శ్రీనాథుఁడు పల్నాటివీరచరిత్రమును రచియించిన తరువాతనో **రచియింపక ముందో** యొకసారి పల్నాటిసీమకుఁ బోయినట్టు తెలియవచ్చుచున్నది. **అప్పు డాతఁడు** స్వానుభవముచుబట్టి చెప్పిన పద్యములఁ గొన్నిటి **నుదాహరించుచున్నాను.**

క. రసికుఁడు పోవఁడు పల్నా
డెసఁగంగా రంభ యైన నేకులు వడుకున్
వసుదేశుఁ డైన దున్నును
గుసుమాస్త్రుిండైన జొన్నకూడే కుడుచున్.

ఉ. అంగడి యూరలేదు వరియన్నము లేదు. కవిత్వ మేమి లే
దంగన లింపుగారు ప్రియమైన వనంబులు లేవు నీటికై
భంగపడంగఁ * దోడ్పడు కృపాపరు లెవ్వరు లేరు దాత లె
న్నంగను సున్న; గానఁ బలనాటికి మాటికిఁ బోవ నేటికిన్ ?

ఉ. దోసెఁడుకొంపలోఁ బసుల త్రొక్కిడి మంచము దూడరేణమున్
పాసిన వంటకంబు పసిబాలురశౌచము విస్తరాకులన్
మాసిన గుడ్డలున్ దలకుమాసిన ముండలు వంటకుండలున్
రాసెఁడు కట్టెలుం దలపరామపురోహితునింటికృత్యముల్.

గీ. చిన్న చిన్న రాళ్ళు చిల్లరదేవళ్లు
నాగులేటినీళ్లు నాఁపరాళ్లు
సజ్జజొన్నగూళ్లు సర్పంబులును దేళ్లు
పల్లెనాటిసీమపల్లెటూళ్లు.

క. జొన్నకలి జొన్నయంబలి
జొన్నన్నము జొన్నపిసరు జొన్నలె తప్పన్
సన్నన్నము సున్నసుమీ
పన్నుగఁ బల్నాటిసీమప్రజలకు నెల్లన్.

క. గరళము మ్రింగితి నంచున్
బురహర ! గర్వింపఁబోకు పోపోపో నీ
బిరు దింకఁ గాన వచ్చెడు
మెరసెడి రేనాటిజొన్న మెతుకులు తినుమీ !

ఈ కవిచేతనే రచియింపఁబడిన నందనందనచరిత్రములోని దన్న పద్యము నొక లక్షణగ్రంథమునందుఁ జదువుటయే కాని నాకు గ్రంథము లభించినది కాదు పేరునుబట్టి చూడగా శ్రీనాథుఁ డట్టి గ్రంథమును రచియించి యుండునని తోఁచును. భీమఖండాదిశైవపురాణములలోనే విష్ణుకథ వచ్చి

* [బాల్పడు — పాఠాంతరము.]

నప్పుడు విడిచిపెట్టిన మహానుభావుఁడు కేవలకృష్ణకథ యైన నందనందన చరిత్రమును రచించి యుండునా? * శ్రీనాథుఁడు తన కాశ్రయులైన వేమారెడ్డియు, వీరభద్రారెడ్డియు మరణము నొందినతరువాతఁగూడఁ గొంత కాలము బ్రతికి యుండెను. ఆ కాలమునం దతఁడు కృష్ణాతీరమునందు బొడ్డుపల్లె యను నొక గ్రామము గుత్తచేసి నదీప్రవాహమువలన సస్యము పోఁగా గుత్తధనము రాజునకుఁ గట్టలేక వారిచేత బహువిధములయిన బాధలను పొంది తుదకు మిక్కిలి బీదతన మనుభవించెను. ఈ సంగతులను మెకన్జీదొరవారు సేకరించిన స్థానికచరిత్రములలో నుదాహరింపఁబడిన శ్రీనాథకృతములైన యీ క్రింది పద్యములవలన నెఱుఁగవచ్చును.

సీ. కవిరాజు కంఠంబుఁ గౌఁగిలించెనుగదా
        పురవీధి నెదురెండ పొగడదండ
    సార్వభౌముని భుజాస్తంభ మెక్కెనుగదా
        నగరివాకిట నుండు నల్లగుండు
    ఆంధ్రనైషధకర్తయంఘ్రియుగ్మంబునఁ
        దగిలియుండెనుగదా నిగళయుగము
    వీరభద్రారెడ్డివిద్వాంసుముంజేత
        వియ్య మందెనుగదా వెదురుగొడియ
    కృష్ణవేణమ్మ కొనిపోయె నింత ఫలము
    బిలబిలాక్షులు తినిపోయెఁ దిలలుఁ బెసలు
    బొడ్డుపల్లెను గొడ్డేటి మోసపోతి
    నెట్లు చెల్లింతు టంకంబు లేడునూర్లు.

* [శ్రీనాథుఁడు నందనందనచరిత్రమును రచియించి యుండలేదని శ్రీ ప్రభాకర శాస్త్రిగారును, ఆంధ్రకవితరంగిణికారులును కూడ వ్రాసియున్నారు.]

'పురవీథి నెదురెండ పొగడదండ—' అను నెడల పొగడదండకు బదులుగా 'బొగడదండ' అని యుండవలయుననియు, ఇనుపబొగడలతోఁగూడిన దండయే శిక్షాసాధనమగును గాని 'పొగడదండ' శిక్షాసాధనము కాఁజాలదనియు నిర్ణయింపఁ బడియున్నది. దీనిని సహృదయులందఱు నంగీకరించి యున్నారు.

[చూ. భారతి - డిసెంబరు 1936]

సీ. కాశికావిశ్వేశుఁ గలిసె వీరారెడ్డి
రత్నాంబరంబు లేరాయఁ డిచ్చుఁ
గైలాసగిరిఁ బండె మైలారువిభుఁ డేఁగి
దినవెచ్చ మేరాజు తీర్పఁగలఁడు?
రంభఁ గూడెఁ దెనుంగురాయరాహుత్తుండు
కస్తూరి కేరాజుఁ బ్రస్తుతింతు?
స్వర్గస్థుఁ డయ్యె విస్సనమంత్రి మఱి హేమ
పాత్రాన్న మెవ్వనిపంక్తిఁగలదు?

భాస్కరుఁడు మున్నె దేవునిపాలి కరిగెఁ
గలియుగంబున నిఁక నుండఁ గష్ట మనుచు
దివిజకవివరుగుండియల్ దిగ్గు రనఁగ
నరుగుచున్నాఁడు శ్రీనాథుఁ డమరపురికి.

అవసానదశయం దిట్టి కష్టముల కెల్లను గారణము యౌవనదశయందుఁ గామవశముచేత స్వేచ్ఛగా విహరించి దేహమును ధనమును జెడఁగొట్టుకొన్న పాపఫలము తక్క వేఱొక్కటి గాఁ రాదు. నే నీవాక్యమును వ్రాసినందునకుఁ గినుక వహించి చిలుకూరి వీరభద్రరావుగారు తమ యాంధ్రుల చరిత్ర మూఁడవ భాగములో "కామోద్రేకము కలిగించు విధమున మిక్కిలి పచ్చిగా స్త్రీవర్ణనములఁ గావించి రసికజనమనోరంజనము గావించెడు కవులను, లోకములోని విటపురుషుల దుర్వర్తనముల హాస్యప్రబంధరూపముననుప్రహసనరూపమునను వెల్లడించెడు కవులను, కామపరవశు లనియు వ్యభిచారులైన మహాపాపులనియు .. చెప్పవలసి వచ్చునుగదా!" అని ద్వేషబుద్ధితో దురభిమానపూరితములైన యుక్తిరహితదూషణభాషణములను వ్రాసియున్నారు ఇట్టి వాక్యరత్నము లుపేక్షణీయములు రసికజనమనోరంజనము సర్వకళాశాలవారిచే ప్రథమశాస్త్రపరీక్ష (F. A.) కును, శాస్త్రోపాధ్యాయపరీక్ష M A) కును పఠనీయగ్రంథముగా నిర్ణయింపబడె

ననియు, అందలి శృంగారము శ్రీనాథుని దాక్షారామాప్సరోభామాదులదానివలె జారస్త్రీపురుషసంబంధ మయినది గాక యనింద్యమైన భార్యాభర్తృసంబంధ మయినదనియు, ప్రహసనములలోని విటపురుషదుర్వర్తనప్రకటనము వీథి నాటకములోనిదానివలె దుర్ణయపోషణమునకుఁ గాక దుర్ణయశోషణము నకును నీతిభంజనమునకుఁగాక దుర్నీతిభంజనమునకును ఉద్దేశింపఁబడె ననియు, మా మిత్రు లెఱుఁగుదురుగాక! శ్రీనాథునిపై మోపఁబడిన దోషము స్త్రీవర్ణనములు చేసినందునకును, విటపురుషుల దుర్వర్తనముల వెల్లడించినందునకును గాదు; స్త్రీలోలుఁడయి వయఃకాలమున విచ్చలవిడిగాఁ దిరిగి కాయమును, ధననికాయమును జెడఁగొట్టుకొని కష్టపడవలసి వృద్ధ దశను దెచ్చుకొన్నందునకు. శ్రీనాథుఁడు వేశ్యాప్రియుఁడని యాతనిని గూర్చి వ్రాసినవా రందఱును నైకకంఠ్యముతోఁ జెప్పుచున్నారు. వేశ్యలపొందు ధనైకలభ్యమని యెల్లవారును నెఱుఁగుదురు. శ్రీనాథుడు మహారాజులయొద్ద నాస్థానకవి యయి యపరిమితధనము నార్జించుటయే కాక, వివిధ దేశాధీశుల సభల కరిగి కనకాభిషేకాదులను బొందిన మహానుభావుఁడు. కనకాభిషేకము సామాన్య మయినది కాదు. జలమువలె శిరస్సుపైని కనకకలశములతో సువర్ణముద్రలతో స్నానము చేయించిన ధనమే బహుసహస్రరూప్యముల గలదయి యుండును. కనకాభిషేకము చేసిన మహారాజు కవిశిరోమణిశిరస్సు పయిని గ్రుమ్మరింపఁబడిన సువర్ణసహస్రములను కవి కియ్యక తాను మరలఁ గైకొని యుండఁడు. రసికశిఖామణి యయినకవి కియ్యఁబడిన యటువంటి ధనరాశి వేశ్యల వలలలోఁ దగులుకొన్నప్పు డల్పకాలములో నదృశ్యమగుట వింతకాదు. వేశ్యల యింటిబంటులైన లక్షాధికారులు నిమిషములో భిక్షాధికారు లగుచుండుట మనము లోకములో నాలోకించు చుండలేదా? పండితుడు చేసినను, పామరుఁడు చేసినను దోషము దోషమే! పండితుఁడు చేసినది యొప్పిదమును, పామరుఁడు చేసినది తప్పిదమును గానేరదు. శ్రీనాథుని కవితాచమత్కారమును నాంధ్రసారస్వతమునకుఁ జేసిన మహోపకారమును మెచ్చి యానందించువారిలో నెవ్వరికి నేను దీసిపోవువాఁడను గాను అయినను సత్యము నపేక్షించియు బుధజనాభి

వృద్ధిని గాంక్షించియు, నిష్టములేకయే పెద్దలనుగూర్చిన యప్రియమైన సత్యమును బలుకవలసినవాఁడ నైతిని. విద్యావివేకసంపన్నులైనవారు నన్ను మన్నింతురుగాక! *

---

* [శ్రీనాథమహాకవి తన యవసానదశలోఁ గష్టపడుటకు శ్రీ వీరేశలింగము పంతులుగారు చెప్పిన కారణము సరియైనది కాదనియు, ద్రవ్యమును నిలువచేయు తలంపాతనికి లేకుండుటయే కారణమనియుఁ బలువురి యభిప్రాయము, శ్రీ ప్రభాకర శాస్త్రిగారును, శ్రీ చాగంటి శేషయ్యగారును శ్రీ వీరేశలింగముపంతులుగారి యభిప్రాయము సరికాదని తెలిపియున్నారు.]

బమ్మెర పోతరాజు

ఈ కవి శాలివాహనశకము ౧౩౦౦-వ సంవత్సరమునం దనఁగా హూణ శకము ౧౩౭౮ వ సంవత్సరమునందు జనన మొందినట్లు తెలుఁగు భాగవతమును ముద్రించినవారు పీఠికయందు వ్రాసియున్నారు. కాని యది సరియైన సంవత్సరమని తోచదు. పోతన మఱి యిరువది సంవత్సరముల తరువాత ననఁగా హూణశకము ౧౪౦౦ వ సంవత్సర ప్రాంతమున జనన మొంది యుండును. ఈతని నివాసస్థలము నైజాము రాజ్యములోని ఓరుగల్లు ఇదియే భాగవతమునం దేకశిలానగర మని చెప్పఁబడి యున్నది. ప్రథమమున భాగవతమును ముద్రింపించినవారు బమ్మెర పోతనార్యుని వాసస్థలము కడపమండలములోని యొంటిమెట్ట యనియు, అదియే భాగవతమునందుఁ బేర్కొనఁబడిన యేకశిలానగర మనియు, అతని చరిత్రమును దెలుపు పురాతనగ్రంథ మేదియో తమకు లభించినదనియు, పీఠికలో వ్రాసియుండుటచేత గతానుగతికు లయి జనులా కథనే మొన్నమొన్నటివఱకు నమ్ముచు వచ్చిరి. ఇటీవల విమర్శకులు కొందఱు సత్యమును శోధించి పోతనామాత్యుని వాసస్థాన మోరుగల్లు గాని యొంటిమెట్ట కా దని సహేతుకముగా లోకమునకు వెల్లడించుటచేత మహాజను లిప్పుడు కన్నులు తెఱచి తమ తొంటి ప్రమాదమును దెలిసికొని పూర్వాభిప్రాయమును మార్చుకొనుచున్నారు. అయినను స్థలాభిమానముచేతఁ గొంద ఱిప్పటికిని పోతన జనన భూమి కడపమండలమే యని వాదించువా రందందుఁ గనఁబడు చున్నారు. అందుచేత నట్టివారి భ్రాంతినివారణార్థముగా బమ్మెర పోతననివాస మోరుగల్లని స్థాపించుటకుఁ దగిన హేతువులను గొన్నింటి నిందుఁ జూపుచున్నాను. ఇంటిపేరునుబట్టి పోతనపితృపితామహాదుల వాసస్థానము బమ్మెర యను గ్రామమయినట్టు సులభముగా తెలిసికోవచ్చును. అతఁ డా గ్రామములోనే పుట్టినవాఁ డయినను, ఓరుగల్లు రాజనివాస మయిన మహాపట్టణ మయి యుండుటచేత భాగవతరచన కాలమున కక్కడఁ జేరి యుండును. ఈ బమ్మెర గ్రామ మోరుగంటిని రమారమి మూఁడామడల దూరములో నల్లగొండమండలమునం దున్నది. బమ్మెర యను పేరుగల యూ రేదియు

నొంటిమెట్టచేరువను గాని తుదకుఁ గడపమండలములో నెక్కడనైనను గాని లేదు. అందుచేత భాగవతమునందుఁ జెప్పఁబడిన యేకశిలానగరము నైజామురాజ్యములోని యోరుగల్లే కాని కడపమండలములోని యొంటిమెట్ట కాదని యూహింపవచ్చును. భాగవతముద్రితపుస్తకములలో షష్ఠస్కంధ మేర్చూరి సింగనయు, నేకాదశ ద్వాదశస్కంధములు వెలిగందలనారయయుఁ దెలిఁగించినట్లున్నది. సింగనగృహనామ మయిన యేర్చూరు గోలకొండదేశములోని నల్లగొండమండలములోను, నారయగృహనామ మయిన వెలిగందల కరీంనగరమండలములోను. రెండును బమ్మెరకు సమీపమున నిప్పటి నిజామురాజ్యములోనే యున్నవి. భాగవతము నాంధ్రీకరించిన పోతనామాత్యునియొక్కయు, శిథిల మయిన షష్ఠస్కంధమును పూరించిన సింగనయొక్కయు, ఏకాదశ ద్వాదశస్కంధములను దెనిఁగించిన పోతన శిష్యుఁడైన నారయ యొక్కయు. ఊళ్ళు మూఁడును పూర్వ మోరుగల్లు రాజధానిగాఁ గర్ణాటరాజ్యములోనివే యగుట చేత పోతన చెప్పిన యేకశిలానగర మోరుగల్లే యని యించుమించుగా నిశ్చయింపవచ్చును. ఓరుగ ల్లిప్పటి కర్ణాటరాజ్యములోనిది. కర్ణాటభాషలో "ఓరు" అనగా "ఒక్క" "కల్లు" అనఁగా "రాయి" అని యర్థము ఒకరాయి యని యర్థ మిచ్చెడి ఓరుగల్లునకు సమానార్థక మయిన సంస్కృతపద మేకశిల, అందుచేత నేకశిలానగర మనఁగా నోరుగల్లుపుర మనుట స్పష్టము. ఒంటిమెట్ట యెప్పుడును నేకశిలానగరము కాఁజాలదు. మెట్ట యనుదానికి శైల మర్థ మగును గాని శిల యర్థము కాదు ఒంటిమెట్టయన్నచో నేకశైలగ్రామము కావచ్చును గాని యేకశిలానగరము గాదు. అది గాక యొంటిమెట్ట యొక చిన్నగ్రామమే గాని యెప్పుడును నోరుగంటివలె నగరమయినది కాదు. ఒంటిమెట్టకుఁ బూర్వకాలమునందుఁ గాని మఱి యేకాలమునందు గాని వ్యవహారమునందును గ్రంథములయందును గూడ నేకశిలానగర మన్న పేరు లేదు. ఇఁక నోరుగంటి కన్ననో భాగవతరచనమునకుఁ బూర్వమునందు సహితము "రాజన్నేకశిలానగరాధీశ" అని విద్యానాథుఁడు ప్రతాపరుద్రీయమునందు చెప్పినట్లుగా నేకశిలానగర వ్యవహార ముండినది దీనిని బట్టి యేక

శిలానగరము సుప్రసిద్ధమయిన యోరుగల్లే గాని యప్రసిద్ధమయిన యొంటి మెట్ట గాదని నిస్సందేహముగా సిద్ధాంత మగుచున్నది శబ్దార్థము నటుండ నిచ్చి యింక వాస్తవార్థమునకు వత్తము.

బమ్మెర పోతనార్యుఁడు తాను భాగవతంబు రచింపఁ బూనుటకుఁ గారణము నాగ్రంథములోనే యీ క్రింది వాక్యములలోఁ దెలిపియున్నాఁడు.

"మదీయపూర్వజన్మసహస్రసంచితతపఃఫలంబున శ్రీమన్నారాయణకథా ప్రపంచవిరచనాకుతూహలుండనై యొక్క రాకానిశాకాలంబున సోమోపరాగంబు రాక గనుంగొని సజ్జనానుమతంబున నభ్రంకష శుభ్రసముత్తుంగభంగ యగుగంగకుం జని క్రుంకులిడి వెడలి మహనీయమంజులపులినప్రదేశంబున మహేశ్వరధ్యానంబు సేయుచుఁ గించిదున్మీలితలోచనుండనయి యున్నయెడ........మెఱుఁగు చెంగట నున్న మేఘంబుకైవడి ... . .. విపులభద్రమూర్తియైన రాజముఖ్యుఁ డొక్కరుఁడు నా కన్నుఁగవకు నెదురఁ గానఁబడియె. ఏను నారాజశేఖరుం దేఱిచూచి భాషింపయత్నంబు సేయునెడ నతండు నే రామభద్రుండ మన్నామాంకితంబుగా శ్రీమహాభాగవతంబుఁ దెలుఁగుచేయుము, నీకు భవబంధంబులు తెగునని యానతిచ్చి తిరోహితుం డయిన సమున్మీలితనయనుండనయి వెఱఁగుపడి చిత్తంబున.... .
ఇట్లు భాసిల్లెడు శ్రీమహాభాగవతపురాణపారిజాతపాదపసమాశ్రయంబున హరికరుణావిశేషంబునఁ గృతార్థత్వంబు సిద్ధించె నని బుద్ధి నెఱింగి లేచి మరలి కొన్నిదినంబుల కేకశిలానగరంబునకుం జనుదెంచి యందు గురువృద్ధబుధబంధునానుజ్ఞాతుండనై" ఇతఁడు మొదటినుండియు శైవుఁ డయి యుండియు నొక చంద్రగ్రహణసమయమునందు గంగాస్నానమునకుఁ బోయినప్పు డక్కడ నాకస్మికముగా స్వప్నమున రామభద్రుండు ప్రత్యక్షమయి తన్నామాంకితముగా శ్రీ మహాభాగవతమును దెలుఁగుచేయు మని యానతిచ్చుటచేత భాగవతరచనము నకుఁ బూనెను. ఇతఁడు చంద్రగ్రహణస్నానమునకుఁ బోయినగంగ యీతని నివాసగ్రామమునకు సమీపముగా నుండి యుండవలెను. సాధారణముగా భాగీరథిని గంగ యందురు; గౌతమిని

సహితము గంగయనుట గలదు. ఇట్లు రెండు గంగలకును భేదము తెలి యుట కయి యుత్తరమున నున్న గంగను (భాగీరథిని) ఉత్తరగంగ యనియు, దక్షిణమున నున్న గంగను (గోదావరి యనఁబడెడు గౌతమిని) దక్షిణగంగ యనియు వ్యవహరింతురు. పోతన్న స్నానార్థము పోయినది యిం దే గంగ యయి యుండును? కొన్ని దినముల ప్రయాణములో నుండక బహుదూరమున నా కాలమునఁ గొన్నిమాసముల ప్రయాణములో నుండినదగుటచేత నుత్తరగంగ యయి యుండదు. అది తప్పక కొన్ని దినముల ప్రయాణములో నున్న దక్షిణగంగ యనఁబడెడు గోదావరి యగు టకు సందేహము లేదు. ఒంటిమెట్టకు సమీపమున గోదావరీనది లేకుండు టయు గోదావరీనది యోరుగంటికి సమీపముననే యుండుటయు విచారింపఁగా, బమ్మెరపోతనామాత్యుని వాసస్థానమైన యేకశిలానగర మోరుగల్లే కాని యొంటిమెట్టకా దని నిశ్చయ మగుచున్నది. గోదావరికి గంగ యన్న పేరు లోకవ్యవహారమునందు మాత్రమేకాక పూర్వకాలమునుండియు గ్రంథము లయందుసహిత ముండిన ట్లీక్రింది నిదర్శనములవలన దెలిసికొనవచ్చును.

౧. "దక్షిణగంగ నాఁ దద్దయు నొప్పిన గోదావరియు జగదాదియైన" అని భారతాదిపర్వమున నన్నయ భట్టారకుఁ డర్జునుని తీర్థయాత్రాసంబంధమున గోదావరిని దక్షిణగంగ యని చెప్పెను.

౨. సీ. ఉండు నే వీట మార్కండేయముని నాథ
సజ్జలింగ మనంగ శాసనుండు
ప్రవహించు నే వీటిపశ్చిమప్రాకార
మొరసి గంగమ్మ సాగరముకొమ్మ
యావిర్భవించినాఁ డే వీటికోటలో
బలభేది మదనగోపాలమూర్తి
పాలించు నే వీటిప్రాగుదక్కోణంబు
నుమప్రోది శ్రీమల్లగూరిశక్తి

ప్రబలధారాసురత్రాణభద్రజాతి
కరిఘటాసైన్యదుస్సాధకనకలోహ
గోపురద్వాఃకవాటప్రదీపిత మతి
సాంద్రవిభవంబు రాజమహేంద్రపురము.

అని శ్రీనాథుఁడు పోతనామాత్యుని కాలమునందే కాశీఖండములో రాజమహేంద్రపురమును వర్ణించుచుఁ బయి పద్యములో గోదావరిని గంగ యని చెప్పియున్నాఁడు

౩. సీ. గంభీరపరిఖనాగస్త్రీల కశ్రాంత
కేళీవిహారదీర్ఘిక యనంగ
నుత్తాలసాలమన్యుల కుబ్బి దివిఁ బ్రాఁకఁ
జేసిన దీర్ఘనిశ్రేణి యనఁగ
చతురచాతుర్వర్ణ్యసంఘ మర్థులపాలి
రాజితకల్పకారామ మనఁగఁ
బ్రాంతసుస్థిత యైన భవజూటవాహిని
ముక్తిభక్తిప్రదస్ఫూర్తి యనఁగ

నెప్పుడును నొప్పు రాజమహేంద్రవరము
ధరణిఁ గల్పించె నే రాజు తనదుపేర
నట్టి రాజమహేంద్రుని యనుఁగుమనుమఁ
డెసఁగుఁ జాళుక్యవిశ్వనరేశ్వరుండు.

అని నన్నయకుఁ దరువాతను శ్రీనాథునికిఁ బూర్వమునందును నుండిన విన్నకోట పెద్దన్న కావ్యాలంకారచూడమణిలో రాజమహేంద్రవరవర్ణనమున గోదావరిని "భవజూటవాహిని (గంగ)" యని చెప్పి యున్నాఁడు.
ఆ ప్రాంతములయందు గంగ యని వ్యవహరింపబడెడు గోదావరి యేకశిలానగరమునకు నాలుగయిదు దినముల ప్రయాణములో పదియామడల దూరమున నున్నది. ఆ పుణ్యనదీ ప్రవాహమునందు స్నానముచేయువా

రక్కడనుండి యీ నదీతీరమున నున్న మంథెనకుఁ బోవుదురు.

పోతనామాత్యుఁడు తన కవిత్వారంభదశలో గోలుకొండసీమలోని రాచకొండ దుర్గాధీశ్వరుఁడైన (రేచర్ల) రావు సింగభూపాలుని ప్రేరణముచేత రచియించిన భోగినీదండకము కూడ నీ మహాకవి యోరుగల్లు ప్రాంతములవాఁ డని దృఢీకరించుచున్నది. ఇతఁ డీ దండకమును ౧౪౩౦-వ సంవత్సరప్రాంతమున నిరువదియైదేండ్లలోపలి వయస్సులోఁ జేసియున్నట్టు కనఁబడుచున్నది. పోతన ౧౪౦౫-వ సంవత్సరప్రాంతమున జనన మొంది ౧౪౬౦-౧౪౮౦ సంవత్సరములవఱకును జీవించి యుండును. ఈతని కాలమును నిర్ణయించుటకు వేంకటగిరిసంస్థానమునకు మూలపురుషుఁడైన భేతాళనాయనికిఁ బదవతరమువాఁడయి ౧౪౨౩ మొదలుకొని ౧౪౪౬-వ సంవత్సరమువఱకును కర్ణాటరాజ్యపరిపాలనము చేసిన ప్రౌఢదేవరాయల కాలములో నుండిన సింగభూపాలునికథ మాత్రమే కాక పోతనామాత్యుని మునిమనుమలగు కేసనమల్లనకవులచేత రచియింపఁబడిన "దాక్షాయణీవివాహము" కూడ కొంత తోడుపడుచున్నది. ఈ దాక్షాయణీవివాహము గురుజాల మల్లనసోమయాజి కంకితము చేయఁబడినది. కవులు కృతిపతియైన మల్లనసోమయాజి తమ్ముఁ బిలిపించినట్లీ క్రింది పద్యమునఁ జెప్పుకొని యున్నారు.

సీ. శ్రీరామలింగాంఘ్రిసేవావరప్రౌఢిఁ
గవితాచమత్కృతు ల్గాంచువారి
నెప్పుల బమ్మయను పేరఁబరఁగు ప్రౌఢస
రస్వతికిని గన్న ప్రజ్ఞవారి
కౌండిన్యగోత్ర విఖ్యాతి బమ్మెరభవ్య
వంశాఢ్యులై సిరి వఱలువారి
నివటూరి ముక్తి నాగేశసద్గురుభక్తి
నాదిమశైవు లైనట్టివారి
కేసకవిమల్లకవినామకీర్తి పరుల
మమ్ముఁ బిలిపించి మన్నించి మదిఁ దలంచి

ఘనత నుచితాసనంబుల నునిచి వేడ్క-
వినయనయవాక్యములచేత నెనయఁ బలికె

ఈ పద్యమునుబట్టి పోతనయు నాతనిసంతతివారును పరమశైవులని స్పష్ట మగుచున్నది. గోలకొండదేశములో వాడుకలో నున్న యీ క్రింది పాట యీ యంశమును మఱింత స్థిరపఱుచుచున్నది.

"పాలకుర్తినిలయా సోమలింగా పాదములకు శరణు॥"
వురవుగ బమ్మెరపోతరాజుకు మీరు కోరిన వరములు
కృపచేసినా రఁట "పాలకుర్తినిలయా" &c.

దాక్షాయణీపరిణయకృతికర్తలు తమ గ్రంథములోఁ గవిస్తుతి నిట్లు చేసి యున్నారు

చ నెరి గుఱిగల్లు నన్నయమనీషినిఁ దిక్కన శంభుదాసునిన్
బరువడి మత్పితామహుని బమ్మెరపోతన భాస్కరాహ్వయున్
వరకవిసార్వభౌముని నవారితభక్తి నుతింతు మెప్పుడున్
గురుకరుణాఢ్యు లంధ్రకవికుంజరులం దగ భూతి శోభిలన్.

పయి పద్యములోఁ గవులు బమ్మెర పోతనామాత్యునిఁ దమ పితామహుఁ డని చెప్పుకొన్నను నాశ్వాసాంతగద్యములనుబట్టి యతఁడు ప్రపితామహుఁ డయినట్టు తెలియవచ్చుచున్నది

"ఇది శ్రీమద్భవానీశంకరపర్వతాలగురుప్రసాదాసాదితసారస్వత బమ్మెరకుల పవిత్ర కౌండిన్యమునిగోత్ర పోతయామాత్యపౌత్ర మల్లయామాత్య పుత్ర సంస్కృతాంధ్ర భాషాచమత్కారకవితాధురీణతాబుధవిధేయ ప్రౌఢ సరస్వతికవినామధేయవరతనూభవ కేసనక విమల్లనకవి ప్రణీతంబైన దాక్షాయణీవివాహం బను మహాప్రబంధంబునందు"

పయి గద్యమునుబట్టి బమ్మెర పోతనామాత్యుని కుమారుఁడు మల్లయ; మల్లయామాత్యుని కుమారుఁడు ప్రౌఢసరస్వతి; ప్రౌఢసరస్వతికుమారులు కేసనమల్లనలు ఇంతమాత్రము తెలియుటచేత పోతనకాలమును నిర్ణయిం చుట కాధారము కానరాలేదు, దాక్షాయణీవివాహకృతిపతియైన మల్లనసోషు

యాజిమనుమనిమనుమఁడైన పేరమంత్రికి శివరామాభ్యుదయనామకద్వ్యర్థి కావ్యకర్తయైన పోడూరి పెదరామకవి శాలివాహనశకము ౧౬౫౭ అనగా హూణశకము ౧౭౩౫ ధాతసంవత్సరాశ్వయుజశుద్ధ దశమీ సోమవారము నాఁటి కొంక తాటాకుల ప్రతిని దాక్షాయణీవివాహమును వ్రాసియిచ్చి దాని యడుగున నీ క్రింది సీసపద్యము వ్రాసెను.

సీ. ధాతాశ్వయుజకృష్ణదశమీందువారంబు
 వఱకు దాక్షాయణీపరిణయంబు
తత్కృతినాథుఁడై తనరిన గురుజాల
 చినమల్లసోమయాజికిఁ దనూజుఁ
డగు లింగఘనసుతుఁడు డైనట్టి యజ్ఞన
 త్వఘనకుఁ దనయుఁడౌ పార్వతీశ్వ
రునకుఁ దిమ్మమకుఁ బుత్రు డయి షోడశమహా
 దానము లప్తసంతానములును
జేసి వంశవర్ధనుఁ డయి సిరులవెలయు
పేరమంత్రీశ్వరునకుఁ బోడూరిపెద్ద
రాముఁ డెనుబది సంవత్సరములనాఁటి
ప్రతి విమర్శించి వ్రాసిచ్చెఁ బక్షమునకు.

పోడూరి పెదరామహస్త లిఖితమైన యీ పురాతనతాళపత్రపుస్తకమును సంపాదించి యీ నడుమను నాకు బాలాంత్రపు వేంకటరావుగా రిచ్చిరి దీనినిబట్టి చూడఁగా దాక్షాయణీవివాహకృతిపతియైన మల్లనసోమయాజి కుమారుఁడు లింగన్న; లింగన్నకుమారుఁడు యజ్ఞన్న; యజ్ఞన్నకుమారుఁడు పార్వతీశ్వరుఁడు, పార్వతీశ్వరునికుమారుఁడు పేరమంత్రి. ఈ పేరమంత్రి ౧౭౩౫-వ సంవత్సరమునం దుండెను. పోతనమునిమనుమనికాలములో నుండిన మల్లనసోమయాజికిని, పేరమంత్రికిని నడుమ నాలుగు పురుషాంతరములును, మల్లనసోమయాజికిని పోతనకును నడుమ మూఁడు పురుషాంతరములును మొత్తము ౧౭౩౫-వ సంవత్సరమునం దుండిన గురజాల పేరమంత్రికిని బమ్మెరపోతనామాత్యునికిని నడుమ నేడు పురుషాంతరములు

గడిచినందున నొక్కొక్కతరమునకు నలుబదేసి సంవత్సరముల చొప్పునఁ జూచినచో నేడు నలుబదు లిన్నూటయెను బదిసంవత్సరములు ౧౯౩౫ నుండి తీసివేయఁగా ౧౪౩౫-వ సంవత్సరప్రాంతమువఱకును బమ్మెర పోతనార్యుఁడు జీవించి యుండవలెను. ఇందులోనుండి పది పదునేను సంవత్సరములు త్రోసివేసినను పోతన ౧౪౨౫-వ సంవత్సరము వఱకైనను జీవించి యుండవలెను అతఁడఱు వదిసంవత్సరములు జీవించె ననుకొన్నచోఁ బోతనజన్మ దినము ౧౪౦౦ సంవత్సరప్రాంతమునందయి యుండును. ప్రౌఢసరస్వతి యను బిరుదందిన కేసనకవి (పోతనమనుమఁడు) యొక్క దౌహిత్రుఁడు అజ్జరపు పేరయలింగము తెలుఁగున నొడయనంబివిలాస మను కావ్యమును జేసెను ఈతనితండ్రి కేసన; తల్లి లక్కమ్మ; కొడుకు మల్లన. ఇతఁడు కౌండిన్యగోత్రుఁడు; నియోగిబ్రాహ్మణుఁడు, ఇతనికి శ్రీనాధకవి బావమఱఁది యనిచెప్పుదురు. పోతన శ్రీనాధునిమఱఁది యైనను, కాకపోయినను వీరిరువురును గొంతవఱ కేకకాలమువా రయి యుండిరనుటకు సందేహము లేదు. *

* [బమ్మెర-పోతన శ్రీనాధుని సమకాలీనుఁడని శ్రీవేటూరి-ప్రభాకరశాస్త్రి మున్నగువారు తెల్పియున్నారు. 'ఆంధ్రకవి తరంగిణి' కారులు పోతన శ్రీనాధుని సమకాలికుఁడు కాఁడనుచున్నారు. పోతనామాత్యుండు శ్రీనాధుని బావమఱఁది కాఁడనియు, 'బాలరసాలసాల నవపల్లవ-' ఇత్యాది పద్యము పోతన చెప్పినది కాదని వారి యాశయము. పోతనకును, పేరమంత్రికిని నడుమ నాలుతరములున్న వనియు. శ్రీ వీరేశలింగం పంతులు గారేడు తరములున్నవనుట సరికాదనియు, తరమునకు 30 లేక 33 సంవత్సరములు లెక్కింపవలసి యుండగా పంతులుగారు నలువది సంవత్సరములు లెక్కించుట సరికాదనియు నందుఁ దెలుపఁబడినది. (చూ, ఆంధ్రకవి తరంగిణి-ఆఱవసంపుటము. పుట 173)

మఱియు పోతన రసార్ణవసుధాకర్త యగు సింగభూపాలుని కాలములోని వాఁడు కాఁడనియు సర్వజ్ఞ బిరుదాంచి తుఁడయి, పదవ తరమువాఁడగు సింగ భూపాలుని కాలమున నుండిన వాఁడనియు శ్రీ ప్రభాకర శాస్త్రిలుగారుమున్నగువారి యభిప్రాయము.

పోతన గ్రంథమును సింగభూపాలుఁడు పాతిపెట్టించెనను వదంతి నమ్మరాద నియు, విద్వాంసుఁడు, ఉదారుఁడునగు నాప్రభు వట్టి పనిచేసి యుండఁడనియు, కూచిమంచి తిమ్మకవి లోకమునందలి వాడుక ననుసరించి యట్లు వ్రాసి యుండవచ్చు ననియు, వెలిగందల నారయ మున్నగు వారిరచనలు కేవల శిథిల భాగపూరకములు కాక భాగవత శేష పూరకములే యనియు విద్వజ్జనుల యాశయము.]

పోతన శ్రీనాధునికంటె నిరువది ముప్పదియేండ్లు చిన్నవాఁడు. వేంకటగిరి ప్రభువులకుఁ బూర్వుఁడయి యా కాలమునందు రాచకొండదుర్గాధీశ్వరుఁడయి యుండినసర్వజ్ఞసింగమనాయఁడు భాగవతమును దన కంకితము చేయుమని కోఁరగా బమ్మెర పోతరాజు నిరాకరించె నన్న కథకూడఁ బయి కాలమును స్థాపించుచున్నది. కాఁబట్టి పోతరాజు హూణశకము ౧౪౩౫ వ సంవత్సరము వఱకును జీవించి యుండును అంతకాలము జీవించియున్న పక్షమున మరణకాలమునం దతనికి డెబ్బదియైదు సంవత్సరముల ప్రాయ మయి యుండును. ఏ హేతువు చేతనో బమ్మెర పోతరాజవిరచిత మైన యాంధ్రభాగవతము విశేషభాగము నశింపఁగా వెలిగందల నారయ, గంగన మొదలైనవారాయా భాగములను పూరించినారు. కాని గ్రంథ మట్లు నశించుటకు కారణమిదియే యని నిశ్చయించుటకుఁ దగిన ప్రబలాధారము లేవియుఁ గానరావు. బమ్మెర పోతరాజు వ్యాసవిరచితభాగవతపురాణము నాంధ్రీకరించె నన్న వార్తను సర్వజ్ఞసింగమనాయఁడు విని యా కవిని తన యాస్థానమునకు రప్పించి గ్రంథమును కృతి యిమ్మని యడిగెననియు, అతఁడు తన గ్రంథమును నరాంకితము చేయనని రాజుప్రార్థన నంగీకరింపకపోఁగా రాజు రోషముతో నాతని గ్రంథమును భూమిలో గోయి తీయించి పాతిపెట్టించె ననియు, శ్రీరామమూర్తి యా రాజుభార్యయొక్క స్వప్నములో వచ్చి భర్తను వేఁడుకొని భాగవతపురాణము లోకములో వ్యాపింపజేయ నియ్యకొల్పుమని యామెతోఁ జెప్పి పోయెననియు, ఆమె తన స్వప్నవృత్తాంతమును భర్తకు విన్నవించి పాతిపెట్టిన పుస్తకమును పయికి తీయింపఁగా నందలి తాళపత్రములు పురుగులు తిని బహుభాగములు శిథిలమయి పోయి యుండెననియు, పిమ్మట గంగనాదికవులు చెడిపోయిన భాగములనెల్లఁ బూరించి రనియు, కొందఱు చెప్పుచున్నారు. లక్షణసారసంగ్రహమునందుఁ

గూచిమంచి తిమ్మకవి చెప్పిన యీ క్రింది పద్య మీ కథ కుపబలముగా నున్నది.

సీ. ఘనుఁడు పోతనమంత్రి మును భాగవతము ర
చించి చక్రికి సమర్పించునెడల
సర్వజ్ఞసింగయక్ష్మావరుం డది తన
కిమ్మని వేఁడఁగా నీయకున్న
నలిగి యా పుస్తకం బవనిఁ బాతించినఁ
జివికి యం దొకకొంత శిథిల మయ్యెఁ
గ్రమ్మర నది వెలిగందల నారప
రాజును మఱి బొప్పరాజు గంగ
రాజు మొదలగు కవివరుల్ తేజ మెసఁగఁ
జెప్పి రా గ్రంథములయందె తప్పు లొదవెఁ
గాని పోతన కవీంద్రుని కవితయందు
లక్షణం బెందుఁ దప్పునా ? దక్షహరణ ;

వేంకటగిరిరాజు లయిన వెలుగోటివారికి మూలపురుషుఁడైన బేతాళరెడ్డి కేడవతరమువాఁడైన సింగమనాయనికే కాని పదవతరముఁవాడైన యీ సింగమనాయనికి సర్వజ్ఞబిరుదము లే దని కొంద ఱనుచున్నారు. పోతరాజు భాగవతమును రచించి దానినెవ్వరికిని జూపక పదిలముగా దేవతార్చన పెట్టెలోఁ బెట్టిఁ పూజించుచుండినట్లును, అవసానకాలమునం దఁతడు తన కుమారునిఁ బిలిచి తా నార్జించిన యీ ధనమును కాపాడుమని చెప్పి కాల ధర్మము నొందినట్లును, తదనంతరమున కుమారుఁడు దానిని విప్పి శోధిం పఁగా బాణ మను పురుగుచే గ్రంథపత్రములు తినబఁడి యున్నందున వెలి గందల నారయాదుల సాహాయ్యమున గ్రంథమును పూరింపించినట్లును, మఱికొందఱు చెప్పుచున్నారు. ఈ కడపటి వృత్తాంతమే కొంత మార్పుతో భాగవత పీఠికయందును వ్రాయఁబడి యున్నది. అందుఁ బోతనామాత్యుని పుత్రుండు కూడ నీపైతృకధనమును ముట్టక కాపాడి తనయవసాన కాలము నందు వెలిగందల నారయకు జెప్పఁగా నతఁ డనంతర మా గ్రంథమును

విప్పి చదివి భ్రష్టములైన భాగములను పూరించెనని చెప్పఁబడి యున్నది. ప్రౌఢకవి మల్లనయే పోతనామాత్యునిపుత్రుఁ డయిన పక్షమున మహాకవి యైన యతఁడు తండ్రి రచియించిన పుస్తకమును విప్పియైనఁ జూడకుండె ననుట యంత విశ్వాసార్హముగా నుండదు. పోతరాజునకు మల్లన యను కుమారుఁడు గలఁడు ఆ మల్లనయే ప్రౌఢకవి మల్లన యనుటనుగూర్చి యింకను విచారింపవలసి యున్నది. ఏది యెట్లయినను పోతరాజకృతభాగ వతము కొంతవఱకు ప్రభ్రష్టమగుటయు దాని నీ గంగనాదులు పూరించు టయు మాత్రము వాస్తవము.

పోతన సంస్కృతాంధ్రములను తాను గురుముఖమునఁ జదువక స్వయంకృషి వలననే యనర్గళమైన యుభయభాషాపాండిత్యమును సంపాదించిన వాఁడు. ఈ యొక్క యంశమే యీ కవియొక్క ప్రతిభావిశేషమును వేయినోళ్ళఁ జాటుచున్నది. గురుముఖమున విద్య యభ్యసింపకపోవుట చేతనే యితఁడు గద్యమునందు "సహజపాండిత్య" యని వేసికొన్నాఁడు. సహజ పాండిత్యుఁ డగుటచేత నీతని కవిత్వమునం దక్కడక్కడఁ గొన్ని వ్యాక రణాదిదోషములు కానవచ్చుచున్నవి. కాని కవిత్వముమాత్రము నిరుపమాన మయి నదయి సర్వజనశ్లాఘాపాత్రముగా నున్నది. పోతన చిన్నతనములో గోవులను మేపుకొనుటకై గ్రామసమీపమున నున్న యడవికిఁ బోయి నప్పుడు చిదానందుఁ డను యోగి యాతనికి రామమంత్రము నుపదేశించి నట్లును, దానినిబట్టియే సమస్తవిద్యలును నిరవద్యకవిత్వమును వచ్చినట్లును కొందఱు చెప్పుచున్నారు. అయినను "శ్రీపరమేశ్వరకరుణా కలిత కవితా విచిత్ర" యను భాగవతగద్యమునుబట్టియు వీరభద్రవిజయమునుబట్టియు విచారించి చూడఁగా శివప్రసాదమువలన నీతనికిఁ గవిత్వ మలవడుట కవి యభిప్రాయ మయినట్లు స్పష్ట మగుచున్నది. శ్రీరామమూర్తి భాగవత మును తెనిఁగింపవలసినదని చెప్పినట్లు స్వప్నము రాఁగా నితఁడు శ్రీరా మాంకితముగా భాగవతపురాణమును తెనిఁగించెను.

ఈ కవి ధనికుఁడుగాక రాజుల నాశ్రయింపక కృషికర్మచేఁ గాలము గడుపు చుండెను. ఇతనిఁ మహత్త్వాదులనుగుఱించి యిటీవలివా రనేకకథలను

గల్పించినారు. వానిలోఁ గొన్నిటి నిందుఁ జెప్పుచున్నాను. పోతనామాత్యుని బావయైన శ్రీనాథుఁడు భాగవతమును తనయేలికయైన కర్ణాటప్రభున కంకిత తము చేయింపవలెనని పల్లకిమీఁద నోరుగంటికి వచ్చి, ఊరిబయలి పొల ములో పోతన యరక కట్టించి కుమారునిచేత దున్నించుచుండఁగాఁ దన మహత్త్వమును వారికి జూపనెంచి పల్లకి మోచుచున్న బోయీల నొక ప్రక్కబొంగు వదలివేయుఁ డని యాజ్ఞాపించెనఁట ! మోచువారు లేకయే పల్లకి నడుచుచుండుట చూచి పోతన పుత్త్రుఁడయిన మల్లన తండ్రితోఁ జెప్పఁగా నతఁడు నాగలికాడికిఁ గట్టిన యొక దున్నపోతును విప్పుమని యాజ్ఞాపించెనఁట ! ఒకప్రక్క దున్నపోతు లేకయే యరక సాగుచుండుట చూచి శ్రీనాథుఁడు రెండవదండిని కూడ విడువుఁడని బోయీల కాజ్ఞాపించి పల్లకిని నడిపింపుచుండఁగా పోతన రెండవప్రక్కనున్న దున్నపోతునుకూడ విప్పించి నాగలి సాగునట్లు చేసెనఁట ! అటుపిమ్మట శ్రీనాథుఁడు పోతనను సమీపించి 'హాలికులు సుఖముగా నున్నారా?' యని పరిహాస పూర్వకము గా కుశలప్రశ్నము చేయఁగా నతఁడు

ఉ. బాలరసాలసాలనవపల్లవకోమలకావ్యకన్యకన్
గూళల కిచ్చి యప్పడుపుకూడు భుజించుటకంటె సత్కవుల్
హాలికులైన నేమి? గహనాంతరసీమలఁ గందమూలకౌ
ద్దాలికులైన నేమి నిజదారసుతోదరపోషణార్థమై ?

అని ప్రత్యుత్తరము చెప్పెనఁట ! అందుకు శ్రీనాథుఁడు మనసులో లజ్జ పడియు పైకి తోఁపనీయక ముఖమున లేని వికాసము తెచ్చుకొని బావ మఱఁదుల మేలమున కాడిన మాటకుఁ గోపగింపఁజెల్లునా? యని సమా ధానపఱిచెనఁట ! తరువాత మల్లన ముందుగా నింటికిఁ బోయి భోజన పదా ర్థముల నిమిత్తమై ప్రయత్నము చేసి లభ్యములు కాక విచారముతో నూరి వెంటఁ దిరుగుచుండఁగా విష్ణుమూర్తి పోతనరూపమున వచ్చి పంచభక్ష్య పరమాన్నములతో విందు చేయుటకు తగిన సమస్త పదార్థముల నిచ్చి

పోయెనఁట! భోజనము లయిన పిమ్మట శ్రీనాథుఁడు పోతనయొక్క దారిద్ర్యవిషయమును ప్రస్తావించి భాగవతము * నొక రాజునకో ధనికునకో యంకితము చేయున ట్లొడఁబఱచుటకయి ప్రయత్నించు చున్నప్పుడు సరస్వతి యెదుట నిలిచి కన్నీరు పెట్టుకొనుచున్న ట్లాతనికిఁ బొడకట్టఁగా పోతన

ఉ. కాటుకకంటినీరు చనుకట్టుపయిం బడ నేల యేడ్చెదో
కైటభదైత్యమర్దనునిగాదిలికోడల! యో మదంబ యో
హాటకగర్భురాణి! నిను నాఁకటికిం గొనిపోయి యల్లక
ర్ణాటకిరాటకీచకుల కమ్మఁ ద్రిశుద్ధిగ నమ్ము భారతీ!

అని సరస్వతి నూఱార్చెనఁట. ఈ పద్యములోఁ గర్ణాటకిరాటకీచకులని చెప్పుట శ్రీనాథుఁడు తన గ్రంథములను రాజులకును, కోమటులకును, దుష్టులకును, ధనమున కాశించి యమ్ముకొనె నని యాతని నాక్షేపించుట యని కొంద ఱభిప్రాయపడుచున్నారు. ఆ కాలమునం దాంధ్రరాజులను కర్ణాటరాజు లని చెప్పుచు వచ్చిరి. అందుచేతనే శ్రీనాథుఁడు భీమఖండమునందు

గీ. ప్రౌఢి పరికింప సంస్కృతభాష యండ్రు
పలుకు నుడికారమున నాంధ్రభాష యందు
రెవ్వ రేమన్న నండ్రు నా కేలకొఱఁత?
నా కవిత్వంబు నిజము కర్ణాటభాష.

అని తన తెనుఁగుకవిత్వమును గర్ణాటభాషగాఁ జెప్పియుండెనఁట! ఇట్లు చెప్పుటకు వేఱు కారణము గలదు. అంతట శ్రీనాథుఁడు విఫల ప్రయత్నుఁడై మరలఁ దన యూరు చేరెనఁట! పోతన తన గ్రంథమును నరాంకితము చేయకపోవుటను గొప్పగా భాగవతమునం దీ క్రింది పద్యముచేతఁ జెప్పుకొన్నాఁడు.

* శ్రీనాథుఁడు భాగవతమును సర్వజ్ఞ సింగభూపాలున కంకితమీయ వలె నని పోతనను గోరినట్లు కొందరు చెప్పుదురు.

ఉ. ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులున్
సొమ్ములుఁ గొన్ని పుచ్చుకొని సొక్కి శరీరము వాసి కాలుచే
సమ్మెట ప్రేటులం బడక సమ్మతి శ్రీహరి కిచ్చి చెప్పె నీ
బమ్మెరపోతరా జొకఁడు భాగవతంబు జగద్ధితంబుగన్.

పోతరాజు తృతీయస్కంధమును తెనిఁగించునప్పుడు విష్ణుమూర్తి శ్వేత వరాహరూపమున నాతనివాకిటఁ బరుండుచు వచ్చెననియు, భాగవతము తన కంకితము చేయనన్నాఁ డన్న కోపముచేత కవిని బాధించి కట్టి తెచ్చుటకై పంపిన కర్ణాటాధీశ్వరుని భటులను పాఱఁదోలె ననియు, మఱియొక కథ చెప్పుదురు పోతరా జష్టమస్కంధములోని గజేంద్రమోక్షకథను వ్రాయుచు "అలవైకుంఠపురంబులో నగరిలో నామూల" యనువఱ కొక పద్యమును వ్రాసి పైభాగము తోఁచక చింతిల్లుచు వెలుపలికిఁ బోయినప్పుడు విష్ణువు వచ్చి "సౌధంబుదాపల" యని వ్రాసి పోయె ననియు, ఇంకొక కథ చెప్పుదురు భాగవతమును రచియించునప్పుడు కవి చెప్పిన సంగతి యెల్లను ప్రత్యక్షముగా జరుగుచు వచ్చెననియు, రుక్మిణీకల్యాణమును రచించుచు "దేవకీసుతుకోర్కి తీగలు వీడంగ" నను పద్యములో 'బాలకమరె' యను భాగమును జెప్పునప్పు డాతని కుమార్తె కుంపటిలోఁబడి కమరిపోయె ననియు, "పద్మనయనువలనఁ బ్రమదంబు నిండారె" నను భాగమును జెప్పఁగానే మరల లేచి యథాప్రకారముగా నా చిన్నది సుఖముగా నుండె ననియు వేఱొకకథ చెప్పుదురు. చెప్పఁబూనినచో నిటువంటి కథల కంతముండదు. అయినను మఱియొక చిన్నకథను మాత్రము వ్రాసి వీని నింతటితో పరిసమాప్తి నొందించెదను పోతన గజేంద్రునికథఁ జెప్పుచు గజేంద్రుఁడు ప్రాణసంశయదశలో నున్నప్పుడు శ్రీమహావిష్ణువు

మ. సిరికిం జెప్పఁడు శంఖచక్రయుగముం జేదోయి సంధింపఁ డే
పరివారంబును జీరఁ డభ్రగపతిం బన్నింపఁ డాకర్ణికాం
తరధమ్మిల్లము చక్క నొత్తఁడు వివాదప్రోద్ధత శ్రీకుచో
పరిచేలాంచలమైన వీడఁడు గజప్రాణావనోత్సాహియై

అని వ్రాయఁగాఁ జూచి శ్రీనాథుఁడు విష్ణుమూర్తి మకరమును జంపి భక్తుని ప్రాణములఁ గాపాడఁబోవునప్పుడు 'చక్రాద్యాయుధములను వెంటఁగొనక కఱువఁబోయెనా ? గిల్లఁబోయెనా ? లేక వేడుకచూడఁ బోయెనా?' యని యాక్షేపించె ననియు, పోతన యప్పు డేమియుఁ బ్రత్యుత్తరము చెప్పక భోజనకాలమునందుఁ దన కేదో పని యున్నదని చెప్పి ముందుగా లేచి పోయి శ్రీనాథునికొమారు నెక్కడనో దాఁచి వచ్చి నూతిలోఁ పెద్దఱాయి వేసి శ్రీనాథునికొమారుఁడు నూతిలోఁ బడెనని కేక వేసెననియు, శ్రీనాథుఁడా కేక విని తాను తినుచున్న పెరుగన్నమును విడిచి యెంగిలిచేతితో పరుగెత్తుకొనివచ్చి విచారముతో నూతిలో తొంగి చూచుచుండఁగాఁ జూచి బావా ! త్రాళ్ళును. నిచ్చెనయు దిగు మనుష్యులును లేక నూతిచుట్టును గంతులువేయ వచ్చినావా ? వేడుక చూడ వచ్చినావా ?' యని యడిగి, 'నీకున్న పుత్రవాత్సల్య మిప్పు డెట్లు పరికరములమాట విచారింపనీక నిన్ను పరుగెత్తించినదో, విష్ణుమూర్తికున్న భక్తవాత్సల్య మట్టే యాతనిని పరికరములమాట విచారింపనీక పరుగెత్తునట్లు చేసిన' దనియు, 'కావలసినప్పుడు పరికరము లన్నియు వెనుక వచ్చు' ననియు, ప్రత్యుత్తరము చెప్పెనఁట.

పోతనకవిత్వమునందుఁ గొన్ని లక్షణవిరుద్ధములైన ప్రయోగము లుండుట చేత వెల్లంకి తాతంభట్టు మొదలయిన పూర్వలాక్షణికులు దానిని సలక్షణ గ్రంథముగా నంగీకరించినవారు కారు అట్లంగీకరింపకపోవుటకుఁ గారణము రేఫఱకారములకు యతిప్రాసములందు మైత్రి యుండుట యని వా రెక్కడను జెప్పి యుండలేదు రేఫఱ కారములకు మైత్రి యుండఁగూఁడ దని నన్నయభట్టారకాదుల యభిప్రాయ మగునా ? యనియు సంశయింపవలసి యున్నది. నన్నయభట్టు రేఫములనుగాఁ బ్రయోగించినవానినిఁ గొన్నిఁటిని శకటరేఫములనుగాను శకటరేఫములనుగాఁ బ్రయోగించినవానిని గొన్నిఁటిని రేఫములనుగాను తిక్కన ప్రయోగించి యున్నాఁడు అయినను రేఫశకట రేఫముల విషయమయి పెనఁగులాడువారు వాని కన్నిఁటికిని ద్విరూపములు కల వని చెప్పుదురు అట్లనిన పక్షమున రేఫములకును ఱాలకును మైత్రి లేదను తమవాదము పడిపోవు నన్న భీతిచేత పన్నిన * పన్నుగడ కాని

* (ఇది పన్నుగడయో, భాషాతత్త్వ పరిశీలన దృష్టితోఁ జేయబడినదో విమర్శకులు నిర్ణయింపఁ దగుదురు.)

యిది మఱియొకటి కాదు ఒకపదమునందలి యొక అక్షరము రేఫమును శకట రేఫము నగు ననుటవలనఁ బ్రాసమైత్రి కూడ దను వాదమునకే దౌర్బల్యము కలిగించునని నా యభిప్రాయము ఒకపదమునందలి రేఫము అకారముగా మాఱు నప్పుడు ప్రత్యేకముగా రేఫఅకారములకు మైత్రి కలిగియున్న నేమి బాధ కలుగునో నే నూహింపఁజాలకున్నాను. తెలుఁగుపదములం దివిటాలని నిర్ధారణ చేయుటకు వారి కేమి యాధారములున్నవో మొట్టమొదట నాకుఁ దెలియకున్నవి. కవిత్రయమువారి ప్రయోగములందు సంస్కృతపదములతో యతిప్రాసములయందుఁ జేసినవాని నన్నిఁటిని శకటరేఫములనుగా నిర్ణయించి యున్నారు రేఫములను గలిగియుండియుఁ దెలుఁగుపదములు యతి ప్రాసములయందు భారతాదులలో సంస్కృతపదముతోఁ జేరక యుండరాదా? "నాన్యేషాం వైధర్మ్యం లఘ్వలఘూనాం రయోస్తు నిత్యం స్యాత్" అని వాగనుశాసనుఁడు చెప్పియుండుటచేత లఘ్వలఘురేఫములకు మైత్రి కూడ దందురేమో! ఆంధ్రశబ్దచింతామణి నన్నయభట్టు చెప్పిన దయి యుండదని యాతని చరిత్రమునందు నిదర్శనపూర్వకముగాఁ జూపఁబడి యున్నది కాఁబట్టి రేఫఱకారవైరము నన్నయభట్టుమతము కాదని సందేహింప వలసి యున్నది. ఈ భేద మావశ్యక మని చెప్పిన బాలసరస్వతి సహిత మీ భేదమును గనిపెట్టలేక తన చంద్రికాపరిణయమునందు రేఫఱకారములకుఁ బ్రాసమైత్రి చేసియున్నాఁడు రేఫఱకారమైత్రి కూడదని పూర్వకాలము నందుఁ గొందఱిమత మైనను, కూడుననియు పలువురమతమై యున్నది. భారతాదుల నామూలాగ్రముగాఁ బరిశోధించి యుభయభాషలయందును సర్వతోముఖపాండిత్యము గలవారైన బమ్మెరపోతన పిల్లలమఱ్ఱి పినవీర భద్రుఁడు, పింగళి సూరన, అల్లసాని పెద్దన, మొదలయిన తొంటికవు లనేకులు రేఫఱకారమైత్రి నంగీకరించినపక్షమువారు

క. న ణ లను రెండక్షరముల
కును వడిఁ బ్రాసంబుఁ బెట్టుకొనవచ్చుఁ గృతిన్,
విను ర ఱ ల కట్ల పెట్టఁ
జను ల ళ ల కభేద మరయ సర్వజ్ఞనిధీ!

అని కవిజనాశ్రయమునందు రేఫఱకారములకు మైత్రి చెప్పఁబడి యున్నది. రేఫఱకారములు ప్రాసలయందు మైత్రిఁ జెందగూడకున్నను యతులయందుఁ జెందవచ్చు నని కొందఱి యభిప్రాయము.

గీ. చఛజఝులకును మొదలియూష్మములు మూడు
సరసవడి నిల్పఁగా నేకజాతియైన
బండిఱాకు రేఫము వడి కుండరాదె?
ప్రాసవర్ణంబులకుఁ గూర్పరాదు గాని.

అని శారదాదర్పణమునందుఁ జెప్పఁబడి యున్నది. కాని యిటీవలివారంద ఱును రేఫఱకారమైత్రి నన్నయభట్టమతము కా దని భ్రమించి రేఫఱకార మైత్రిని దూషించి యా మత మవలంబించినవారిని కుకవులని దూషించి యున్నారు అట్లు దూషించినవారిలో నొకఁ డయిన కాకు నూర్యప్పకవి రేఫఱకారముల ప్రాముఖ్యమును స్థాపింప నెంచి భాగవతమును బూర్వలాక్షి ణికులు లాక్షణికగ్రంథమునుగా నంగీకరింపకపోయినందుకు రేఫఱకారములు ప్రాసలయందు మైత్రి చెందుట యొక్కటియే కారణ మని యీ క్రింది పద్యముచేతఁ జెప్పియున్నాఁడు

ఉ. బమ్మెరపోతరాజకృత భాగవతంబు సలక్షణంబు కా
కిమ్మహి నేమిటం గొదవ? యెంతయు నారసిచూడఁగాను రే
ఫమ్ములు ఱాలునుం గలిసి ప్రాసము లైన కతంబునం గదా
యిమ్ముల నాదిలాక్షణికు లెల్లను మాని రుదాహరింపఁగన్.

ఇట్లు రేఫఱకారముల నిమిత్తమయి యింతగాఁ బెనఁగులాడిన యప్పకవియే తన కా భేదము తెలియక వానికి యతిప్రాసములయందు మైత్రికూర్చి తానును తా నభివర్ణించిన కుకవిసమూహములోనే చేరినందున కోగినాల రంగనాథకవీశ్వరుఁడు ద్విరేఫ దర్పణమునం దుదాహరించిన యప్పకవి పద్యముల రెంటిని మాత్ర మిందుఁ జూపుచున్నాను.

క. కేరుచు నొయ్యన డగ్గఱ
జేరుచు నురుముష్టిహతికిఁ జిక్కక వేగం
దాఱు చహంకృతిఁ గ్రమ్మఱ
దూఱు చధోక్షజుఁడు మల్లుఁ ద్రుంచె ననంగన్.

మ. పురిటింటం బసిబిడ్డచందమున వాపోవంగ నాఁ డాత్మలో
మురువొప్ప న్విషదుగ్ధయుక్తకుచయై ముద్దాడు రాకాసి గు
ర్తెఱిఁ గిష్టంబుగఁ బాలు ద్రావు మిషచే నిర్వైన కాలంబునం
ధరణిం గూల్చిన నందపుత్త్రువలనం దార్కొణ ధర్మస్థితుల్.

ఇట్లొక్కయప్పకవి మాత్రమే గాక రేఫఱకారములకు యతిప్రాసమైత్రి కూర్చిన యితర మహాకవుల పద్యములను గూడ సర్వలక్షణసారసంగ్రహమునందుఁ గూచిమంచి తిమ్మకవి చూపినవానిలోఁ గొన్నిటి నిందుదాహరించుచున్నాను.

౧. అల్లసాని పెద్దన మనుచరిత్రమునందు—

శా. శ్రేణుల్గట్టి నభోంతరాళమునఁ బాఱెం బక్షు లుష్ణాంశుపా
షాణవ్రాతము కోష్ణమయ్యె మృగతృష్ణావార్ధు లింకెం జపా
శోణం బయ్యెఁ బతంగబింబము దిశాస్తోమంబు శోభాదరి
ద్రాణం బయ్యె సరోజషండములు నిద్రాణంబు లయ్యెం గడున్.

౨. కృష్ణరాయలు. ఆముక్తమాల్యదయందు—

మ. ఇలకు న్వ్రేఁగగుఁ బండు తీరవనపుంద్రేక్షుచ్ఛటల్ తీపు ల
గ్గలమై వ్రాల నురుస్వనంబు లెసఁగఁగాఁ ద్రిప్పు రాట్నంపుగుం
డ్రలునాఁ దేనెకొలంకులం బొరలి పాఱన్విచ్చుపంకేరుహం
బుల నాడెం దొలుసంజఁ దేటివలయంబు ల్తారఝుంకారముల్.

౩. పింగళి సూరన్న ప్రభావతీప్రద్యుమ్నమునందు—

క. గ్రక్కునఁ జని వాలుదునో
చెక్కులఁ గట్టుకొని దివిజరిపుమేడలపై
నక్కొమ్మఁ జూచు టెపు డెపు
డొక్కొ ? యనునంత తమక మున్నది మదిలోన్.

౪. అయ్యలరాజు రామభద్రుఁడు రామాభ్యుదయమునందు—

ఉ. సైరిభవారిభద్విరదశాస- ఖడ్గఖరాధిరూఢులై
తారలు బూరగొమ్ములును దప్పెటలుం బటహంబులుం బదు
ల్వాలులు వేలు మ్రోయఁ గవను ల్వడి హత్తి యుత్తర
ద్వారకవంకఁ దాఁ కిరువంకలఁ బోఁజులు దీర్చి రయ్యెడన్.

౫. పిల్లలమఱ్ఱి పినవీరన్న-జైమినిభారతమునందు—

ఉ. తూరపు తెల్లవాఱుటయుఁ దోడనె మంగళపాఠకస్తుతుల్
మీఱఁ దదీయరాగముల మేల్కొని కాల్యసముచితక్రియల్
దీఱిచి పాండుపుత్ర వసుదేవసుతుల్ ప్రమదంబు మోములం
దేరఁగ పేడ్కతో నరుగుదెంచి సభాస్థలి నిల్చి రయ్యెడన్.

౬. సంకుసాల నృసింహకవి-కవికర్ణరసాయనమందు—

గీ వనధి సర్వంకషంబయ్యు వలయుపనికి
తేపులనెకాని దొరసాని రీతిదనరి
విశ్వరూపకుఁడయ్యు శ్రీ విభుఁడు కూర్మ
రూపమున సేవ్యుఁడగు నారురుషులకును.

తిమ్మకవి చూపినట్లు రేఫఱకారములు మైత్రి చేసిన మహాకవు లింతమంది యుండఁగా వీరినందఱిని లాక్షణికులనుగా నంగీకరించి వీరి పద్యముల నుదాహరించిన యప్పకవియొక్క బమ్మెర పోతరాజునుమాత్రము రేఫఱకారములకు యతిప్రాసములయందు పొత్తుగలిపె నన్న హేతువు చేత నేల నిరాకరింపవలయునో యూహించుట మానసగోచరము కాకున్నది. ద్విరేఫ భేద విషయమున నిప్పటివారు పూర్వపువారిని మించినారు. పూర్వులలోఁ గొందఱు తద్భవమున శకటరేఫము లే దన్నారు తాతంభట్టు కవిలోక చింతామణియందు "అచ్చతెనుఁగులను దీర్ఘముల మీఁద బండఱాను లేదు పద్మనాభ!" యని చెప్పియున్నాఁడు. ఇప్పటివా రన్నిచోట్లను బండిఱాలు కని పెట్టినారు.

గీ. అరయ గురురేఫ హల్లుతోఁ బెరసినపుడు
ప్రాసముల విశ్రమముల రేఫములతోడఁ
గలసి యుండును సుకవిపుంగవుల కృతుల
జగదవనసూత్ర! గిరితనూజాకళత్ర! *

అని తిమ్మకవి సార్వభౌముఁడు లక్షణము వ్రాసి యీ క్రింది పద్యములను లక్ష్యములనుగాఁ జూపియున్నాఁడు.

ఉ. నూఱ్వురు నొక్కచందము మనోగతి సైరణ చేసి నన్ను నా
సర్వకులంబు నుత్తమయశంబున నుంచితి రమ్మలార మీ
కుర్విని సాటియే యబల లొండులు దేవతలుం బటుక్షమా
నిర్వహణం బొనర్చుటకు నేరరు మర్త్యులఁ జెప్పనేటికి —
ఎఱ్ఱాప్రెగడ రామాయణము.

క. కాఱ్చిచ్చు గవిసి మృగముల
నేర్చుకరణి నేఁడు భీష్ముఁ డేచినకడిమిం
బేర్చి మనభిముఁ బొదవె శ
రార్చుల నవ్వీరుఁ గన్నులారఁగఁ గంటే		భీష్మపర్వము.

క. చెలఁగి పటుసింహనాదం
బులు అంకెలుగాఁగ వారు పొలిచిరి వృషభం
బుల క్రియ నొండొరులకు మా
ఱ్మలయుచుఁ దాకుచు నుదాత్తరభసోజ్జ్వలులై		ద్రోణపర్వము.

మనవారు కొందఱిప్పుడు సంయోగమునందు అకారము రేఫముగా మాఱునని చెప్పుచున్నారు మఱికొందఱు భారతమునందుగూడ.

* (వేఱొక హల్లుతోఁ గూడినపుడు శకటరేఫము లఘురేఫమే యగునని యాధునిక లాక్షణికుల యాశయము.)

క. తెంపును బెంపును గదుర ని
లింపులు వెఱఁ గంది చూడ రిపుసైన్యములం
గంపింపఁ దమబలంబులు
అంపిలి బిట్టార్వ సింధురాజుం దాఁకెన్.

ఇత్యాది స్థలములలో గురులఘురేఫముల మైత్రి యంగీకరింపఁబడినదని చెప్పుచున్నారు. ఒకవేళ నిప్పటివా రెవ్వరయిన అంపిలుశబ్దమునకు ద్విరూపములు గలవని చెప్ప వత్తురేమో ! ఈ ద్వైరూప్యమువలని ప్రయోజన మేమో నాకుఁ దెలియరాకున్నది. కవిత్రయమువా రొక్కపదములోని యొక అక్షరమునే యొకప్పుడు రేఫముగాను, మఱియొకప్పుడు శకటరేఫముగాను బ్రయోగించుటచేతనే వారి కా భేదమంత సమ్మతము కాదని స్పష్టపడుచుండలేదా ? అప్పకవి లోనైనవా ద్విరూపములను నడుమఁ దెచ్చిపెట్టినారు మఱియొక హల్లుతోఁ జేరి యున్నప్పుడు బండిఱా రేఫముతో యతిప్రాసలయందు మైత్రి చెందుచుండఁగా, రేఫము సవర్ణములు గాని ఋకారముతోను, లకారముతోను మహాకవి ప్రయోగములందు యతిప్రాసల మైత్రిని బొందుచుండఁగా సవర్ణమయిన బండిఱాతో నేల మైత్రిచెందరాదో తెలియరాదు. అనావశ్యకము లయిన నిర్బంధములను దీసివేసి భాషను సుసాధ్యముచేయుట పరమప్రయోజనకర మగుటచేతను, రేఫ ఱకారభేదము వలన భాష కొక ప్రయోజనము కలుగకుండుటచేతను, పూర్వకవు లనేకులు వానిమైత్రి కంగీకరించి యుండుటచేతను, మన పండితులు దుర్గ్రాహ్యమయిన యీ భేదమును పాటింపక భాషచిక్కు కొంత వదల్ప సమ్మతింతురని నమ్ముచున్నాను. పదములు రేఫభేదమును గలిగియున్నచో నర్థభేదము కూడఁ గలిగియుండు నందురేమో, మన లక్షణవేత్తలు చేసిన నిర్ణయమును బట్టియే యెన్ని పదములు సమానార్థములు గలవై యుభయరేఫములుగా నుండలేదు ? అర్థభేదమును నిర్ణయించుటకు ప్రకరణసాహచర్యాదులు సాధనములు గాని వ్రాయఁబడిన రూపము కాదు.

రేఫ ఱకారముల ప్రాసమైత్రిని బట్టి పూర్వలాక్షణికులు భాగవతమును నిరాకరింపలేదనియు, వారు దాని నుదాహరింపకపోవుట కితరదోషములే

కారణమనియు నా యభిప్రాయము. కొందఱు భాగవతమున తప్పుల కుప్పగాఁ నెంచఁగా మఱికొందఱు భాగవతమునందు దోషములే లేవని సాధింపఁ జూచుచున్నారు ఈ కడపటితెగవారిలో కూచిమంచి తిమ్మకవి సర్వలక్షణసారసంగ్రహమునందు

సీ. అఖిలవేదాంతవిద్యారహస్యవిదుండు
　　　　సహజపాండిత్యవిశారదుండు
మత్తక్షితీశాధమస్తోత్రవిముఖుండు
　　　　శంభుపదాబ్జపూజారతుండు
పటుతరకవితావిభాసితప్రముఖుండు
　　　　సకలాంధ్రలక్షణచక్రవర్తి
రఘుకులేశనిదేశరచితమహాభాగ
　　　　వతపురాణుఁడు పుణ్యవర్ధనుండు

బుధజనహితుండు బమ్మెర పోతసుకవి
యెన్న రేఫఱకారంబు లెఱుఁగఁ డనుచు
నజ్ఞు లొకకొంద ఱాడుదు, రామహాత్ము
కవిత కెందును లోపంబు గలుగ దథవ!

అని వ్రాసి, "పోతరాజు చెప్పినవి ప్రథమస్కంధమును, ద్వితీయస్కంధము కొంతయు షష్ఠస్కంధము. సప్తమాష్టమ నవమస్కంధములును, దశమ పూర్వభాగంబు కొంతయు నున్న" దని చెప్పి. యీ భాగములలో రేఫఱ కారఘుల మైత్రి లేనందున కుదాహరణము లిచ్చి యున్నాఁడు. అంతేకాక వెలిగందల నారయాదుల కవిత్వమునందు రేఫ ఱకారమైత్రి యున్నందుకు ద్వితీయస్కంధము నుండియు, తృతీయస్కంధమునుండియు చతుర్దస్కంధ మునుండియు, పంచమస్కంధమునుండియు, దశమోత్తరభాగమునుండియు పద్యముల నుదాహరించి యున్నాఁడు. ముద్రింపఁబడిన భాగవతమునందలి షష్ఠస్కంధకృత్యాదినిబట్టియు. నాశ్వాసాంతగద్యములనుబట్టియుఁ జూడఁగా

షష్ఠస్కంధము సింగయకవిచేఁ జెప్పఁబడినట్టు స్పష్టముగాఁ దెలియవచ్చు చున్నది. ద్వితీయతృతీయచతుర్థస్కంధములు పోతనార్యవిరచితము లయినట్టే కనఁబడుచున్నవి. అయినను మన మే భాగము పోతనకవి విరచితమో యే భాగము తచ్ఛిష్యవిరచితమో యే యే పద్యములు శిష్యజన పూరితములో యేవి యెవరి దోషములో దృఢముగా నిర్ధారణము చేయఁజాలము. పూర్వ లాక్షణికు లందఱు నంగీకరింపని పోతనకవిత్వమునందుఁ బొత్తిగా దోష ములే లేవని సాధింపఁ జూచుటకంటె భాగవతమునకు తరువాత రచించిన * వీరభద్రవిజయమునందుఁ గూడఁ గొన్ని దోషములు కనుపట్టుచుండుటచేత పోతనకృతభాగవతమునందును గొన్ని దోషములున్న వని యొప్పుకొనుటయే న్యాయము. షోడశకళాపరిపూర్ణ మయిన చంద్రబింబమునందుఁ గొంచెము కళంకమున్నట్టుగా సర్వజనసమాదరణీయమయిన యీతని కవితాసుధా సముద్రమునందుఁ గొన్ని నెఱసు లున్నను, దాని కొఱత కొఱఁత గలుగఁ బోదు.

పోతనకవిత్వము భక్తిరసప్రధాన ప్రధానమయినది; పదలాలిత్యము గల దయి, యమకాదిశబ్దాలంకారభూయిష్ఠమయి, శ్రావ్యముగా నుండును. ఇతఁడు భారతమును రచించిన కవులవలెఁ గాక తన భాగవతమును మూల గ్రంథమునకంటెఁ బెంచి వ్రాసెను మూలమైన సంస్కృతభాగవత గ్రంథ సంఖ్య యిరువది వేలుగా నున్నను, ఇతఁడు రచించిన తెలుఁగుభాగవతము ముప్పదివేల గ్రంథము కలదిగా నున్నది.

భగవద్గుణవర్ణనాదులు వచ్చినప్పుడు తనభక్తి తేటపడునట్లుగా స్వకపోల కల్పితవర్ణనలు గూర్చియు, భాగవతములో లేని విష్ణుపురాణాదులలోని కథ లను జేర్చియు, కొన్ని స్థలములలో గ్రంథమును బెంచినను తక్కిన భాగ మంతయు విషయభేదము లేక వ్యాసవిరచిత మూలగ్రంథమునకు టీకవలె నుండును. భాగవతములో లేని సత్యభామయుద్ధాదులు విష్ణుపురాణమునుండి గ్రహింపఁబడినవి.

---

* [భాగవత రచనకు ముందే వీరభద్రవిజయము రచింపఁబడి యుండునని విమర్శ కుల యాశయము.]

తెలుఁగు పురాణములలో భాగవతము మిక్కిలి జనసమ్మతమైన పుస్తకము. అందలి రుక్మిణీకల్యాణము, గజేంద్రమోక్షము మొదలైన కథలను సమస్త జనులును జదువుదురు. ఈ కవి భాగవతము రచించిన తరువాత వీరభద్ర విజయమను మఱియొక గ్రంథమును రచించెను. భాగవత చతుర్థస్కంధము నందలి దక్షయజ్ఞకథలో "అనయంబు లుప్తక్రియాకలాపుఁడు మానహీనుఁడు మర్యాదలేనివాఁడు మత్తప్రచారుఁడు కృత్తిప్రియుఁడు" అనియు, "వసుధ నెవ్వారు ధూర్జటి వ్రతులువారు వారి కనుకూలు రగుచు రెవ్వారు వార లట్టి సచ్ఛాస్త్రపరిపంథులైనవారు నవనిఁ బాషండులయ్యెద" రనియు శివదూషణము విశేషముగాఁ జేయఁబడి యుండుటచేఁ, దత్పాపపరిహారార్థమయి వీరభద్రవిజయమును జేసిన ట్లా పుస్తకములోని యీ క్రింది పద్యమునందుఁ జెప్పఁబడి యున్నది

ఉ. 'భాగవతప్రబంధ మతిభాసురత న్రచియించి దక్షకృ
ద్యాగకథాప్రసంగమున నల్పవచస్కుఁడనైతిఁ, దన్నిమి
త్తాగమవక్తృదోషపరిహారతకై యజనైకశైవశా
స్త్రాగమవీరభద్రవిజయంబు రచించెద వేడ్కతోడుతన్.'

['భాగవతప్రబంధ' మను నీ పద్యము కొన్ని తాళప్రతులలో మాత్రమే కలదు; విలేఖకు లెవరో యీ పద్యమును రచించి యందుఁ జేర్చియుందురు కావున నీ పద్యమును విడిచివేసి, పోతనామాత్యుండే వీరభద్రవిజయకర్త యనియు, భాగవతమునకు ముందు దీనిని రచించెననియు నిశ్చయింపవలసి యున్నది' (ఆంధ్రకవి తరంగిణి ఆఱవ సంపుటము. పుటలు 192. 193)

వీరభద్రవిజయముంగూర్చి యందే యిట్లు చెప్పబడియున్నది.

"ఇప్పుడు ముద్రితమైయున్న వీరభద్ర విజయమందలి నాల్గవ యాశ్వాసవ పోతనామాత్య విరచితము కాదనియు, నెవరో రచించినభాగము నిందెవ్వరో చేర్చిరనియు శ్రీ మానవల్లి-రామకృష్ణకవిగారు భారతి పత్రికలో (పుష్పాంజలి - రక్తాక్షి - ఆషాఢము) నీ క్రింది విధముగా వ్రాసి యున్నారు

'నాల్గవ యాశ్వాసములోని పద్యములు కొంచెము నీరసములుగా నున్నవి. ఇది యేమని యాలోచించుచుండ వీరభద్రవిజయము తాటియాకుల ప్రతి యొకటి లభించె. దానిఁ బరికించి చూడ నాల్గవ యాశ్వాసము ముద్రితపార ముకంటె సర్వదాభిన్నమయి శివపార్వతీకైలాసవిహారవర్ణనమును కుమార జననమును, దారకాసురసంహారమును దెలుపు కథాభాగము విస్తరించు నదిగా నున్నది. నూతనముగా లభించిన యీభాగమునను పూర్వాశ్వాసము లలో వలెనే మహర్షులకు వాయుదేవుఁ డీ కథ చెప్పినట్లున్నది. ఆశ్వాసాం తమునఁ గొన్ని పత్రములు లేనందున నీ భాగము పోతనకృత మగునా? కాదా? యనునంశము స్పష్టముగాఁ జెప్పుటకు వీలులేకపోయినను. గవిత్వ ధోరణి ననుసరించియుఁ గథానుస్యూతత్వమును జూచియు నిదిపై మూఁడా శ్వాసములకు సంబంధించి యేకకవికృతమని తోచుచున్నది. ముద్రితమగు భాగము పరకవిపూరితమగుటచేఁ గాఁబోలు నుత్పలమాలతోఁ బ్రారంభింప బడియె. .... "

శ్రీకవిగారి యొద్దనున్న తాళపత్రప్రతిని నేను జూచుట తటస్థింపలేదు ముద్రితప్రతిలోని నాల్గవ యాశ్వాసమునకు బదులుగా నీ తాళపత్రప్రతియం దున్న గ్రంథము నాల్గవ యాశ్వాసముగా నుండఁదగుననియు. ముద్రిత ప్రతియందలి నాల్గవ యాశ్వాస మైదవయాశ్వాసము గాఁదగుననియు నిశ్చ యింపవలసి యున్నది. అట్లు కాదేని గ్రంథమునకు వీరభద్రవిజయమను పేరు సార్ధకముగాకపోఁగాఁ గుమారసంభవమని పేరుపెట్టవలసియుండును. ముద్రిత ప్రతియందలి నాల్గవ యాశ్వాసమును దీసివైచినచోఁ దక్కిన గ్రంథములో వీరభద్రప్రశంసయే యుండదు ముద్రితప్రతి నాల్గవ యాశ్వా సములోని పద్యములు నీరసములుగా నున్నవని శ్రీకవిగా రనుచున్నారు. కాని నా కట్లు తోఁచుటలేదు. భాగవతములోని కవిత్వమునుబట్టి చూచినప్పు డిది కొంత నీరసముగాఁ గనుపట్టినను, వీరభద్రవిజయమందలి తక్కిన భాగములతోఁ బోల్చి చూచినప్పుడిది నీరసముగాఁ గాన్పింపదు."]

[కవితరంగిణి సం. 6, పుటలు. 193, 194]

ఈ కవియొక్కయు భాగవతమును పూరించిన యితరకవులయొక్కయు శైలి తెలియుటకయి కొన్ని పద్యము లుదాహరించి యీ చరిత్రమును ముగించుచున్నాను.

౧. బమ్మెరపోతరాజు - భాగవతము.

ఉ. త్రిప్పకుమన్న మా మతము దీర్ఘములైన త్రివర్గపారముల్
దప్పకుమన్న నేఁడు మన దైత్యవరేణ్యునిమ్రోల మేము మున్
జెప్పినరీతిఁగాని మఱిచెప్పకుమన్న విరోధిశాస్త్రముల్
విప్పకుమన్న దుష్టమగు విష్ణుచరిత్ర కథార్థజాలముల్ - సప్తమ
స్కంధము.

ఉ. పుణ్యుఁడు రామచంద్రుఁ డటుపోయి ముదంబునఁ గాంచె దండకా
రణ్యముఁ దాపసోత్తమశరణ్యము నుద్ధతబర్హిబర్హలా
వణ్యము గౌతమీవిమలవాఃకణపర్యటన ప్రభూతసా
ద్గుణ్యము నుల్లసత్తరునికుంజవరేణ్యము నగ్రగణ్యమున్.
నవమస్కంధము.

వీరభద్ర విజయము

శా ఏరా దక్ష! యదక్షమానస! వృథా యీ దూషణం బేలరా?
యోరీ! పాపము లెల్లఁ బో విడువురా యుగ్రాక్షుఁ జేపట్టురా
వైరం బొప్పదురా శివుం దలఁపురా వర్ణింపురా రాజితోం
కారాత్మ్కుం డగు నీలకంఠుఁ దెగడంగా రాదురా దుర్మతీ! ఆ. ౧.

శా. వీరాంభోనిధి నేఁడు మీ యలుకకు న్వీరెంతవారయ్య స
త్కారుణ్యంబునఁ గాతుగాక యని యా కష్టాత్ములం బోరిలోఁ
గారింపం గబళింప నీ ప్రమథుఁ డొక్కండైనఁ జాలండె దు
శ్చారు ల్దివ్యులు వీరి నెన్నక మదిన్ సైరించి రక్షింపవే. ఆ. ౪

౨. గంగన - పంచమస్కంధము.

మ. పటుతాటంకరథాంగయుగ్మమునకుం బల్మాఱు భీతిల్లుచున్
నటనం బందెడు కన్నుమీనములలో నాపన్నలీలామహో
త్కటభృంగావళితో ద్విజావళిలసత్కాంతి న్విడంబించు మా
రటకాసారముఁబోలి నెమ్మొగము దా రంజిల్లు నత్యున్నతిన్.

మ. ధనవంతుండగు మానవుండు గడఁకన్ ధర్మోపకారంబులన్
ఘనతం జేయకయుండెనేని యమలోకంబందు సూచీముఖం
బను నా దుర్గతిఁబట్టి త్రోచి యిది కాపై యున్నభూతం బటం
చును పాశంబులఁ బట్టి కట్టి వడితో నొప్పింతు రత్యుగ్రులై. ఆ. ౨.

౩. ఏర్చూరిసింగన, షష్ఠస్కంధము.

మ. కనియెన్ బ్రాహ్మణుఁ డంత్యకాలమున వీకన్ రోషనిష్ఠ్యూతలం
ఘనపీనోష్ఠవికాసవక్త్రవిలసద్గర్వేక్షణోపేతులన్
జనసంత్రాసకరోద్యతాయతసుపాశశ్రేణికాహేతులన్
హననవ్యాప్తివిభీతులన్ మువుర నాత్మానేతలన్ దూతలన్.

ఉ. నెట్టనఁ బాపకర్మమున నేరమి చేసితి రేమి చెప్ప మీ
పుట్టిననాఁటనుండియును బుద్ధులు చెప్పి జగంబు లేలఁగాఁ
బట్టము కట్టి పెంచిన కృపానిధి బ్రహ్మకళావిధిజ్ఞుఁ జే
పట్టక గుట్టు జాఱి సిరిపట్టునఁ దొట్టిన పొట్టక్రొవ్వునన్.

౪. వెలిగందలనారయ, ఏకాదశ ద్వాదశస్కంధములు.

ఉ. మూఁకలు గూడి యాదవులు ముందటఁ బెట్టుక యార్చి నవ్వుచున్
బోకలఁ బోవుచున్ మునిసమూహము కొయ్యన సాగి మ్రొక్కుచున్
బ్రాకట మైన యీ సుపతిభారపుగర్భమునందుఁ బుత్రుఁడో
యేకతమందు బాలకియొ యేర్పడఁ జెప్పు డటన్న నుగ్రులై.

ఏకాదశస్కంధము

చ. మృతియును జీవనంబు నివి మేదినిలోపల జీవకోటికిన్
సతతము సంభవించు; సహజం బిది చోరహుతాశసర్పసం

హాతులను దప్పి నాఁకటను బంచత నొందెడునట్టి జీవుఁడున్
వెతలను బూర్వకర్మభవవేదన లొందుచుఁ గుందు నెప్పుఁడున్.

ద్వాదశస్కంధము.

బమ్మెరపోతరాజు నైజామురాజ్యములోని రాచకొండసంస్థానమునకు ప్రభు వగు సర్వజ్ఞసింగమనాయని యాస్థానమునకుఁ బోయి యాతని యిష్టాను సారముగాఁ గవిత్వము చెప్పినందునకుఁ బోతరాజప్రణీతమయిన భోగినీ దండకము సాక్ష్య మిచ్చుచున్నది. ఈ దండకము సర్వజ్ఞ సింగమనాయఁడుంచుకొన్న వేశ్యవిషయమయి చెప్పఁబడినది. దాని కవిత్వ మించు మించుగా భాగవతమును బోలి యుండును. ఈ సర్వజ్ఞ సింగమనాయఁడు ౧౪౨౨ వ సంవత్సరము మొదలుకొని ౧౪౪౭ వ సంవత్సరమువఱకును విజయనగరాధీశ్వరుఁడుగా నున్న ప్రౌఢదేవరాయనితో సమకాలికుఁడు. భోగినీదండకములోని కొంతభాగము నిందు వ్రాయుచున్నాను—

కామానలజ్వాలల న్వేఁగి చింతాభరభ్రాంతయై యున్న యింతిం
బరీక్షించి తన్మాత మాయాపరాభూతజామాత మిథ్యానయోపేత
విజ్ఞాతనానావశీకారమంత్రౌషధవ్రాత లోకైకవిఖ్యాత వారాం
గనాధర్మశిక్షాధిసంఖ్యాత సమ్మోహితానేక రాజన్యసంఘాత వా
చాలతాబద్ధనానామహాభూత యేతెంచి కూతుఁన్ బరీక్షించి నీతి
న్విచారించి బుద్ధి న్వివేకించి బాలన్ మిళత్కుంతలవ్రాతఫాలన్
గరాంభోజరాజత్కపోలన్ సమందోష్ణనిశ్వాసతాలన్ విపర్యస్త
సన్యాసచేలన్ మహాందోళనప్రేంఖితస్వర్ణడోలన్ మృగేంద్రావ
లగ్నన్ దయావృష్టిమగ్నన్ మనోజాగ్నిభగ్నన్ .. ..
విలోకించి లోనం బరాయత్తమై చిత్తజాతాసిధారాచలచ్చిత్తయై
విన్నయై ఖిన్నయై భిన్నమై యున్న భావంబుభావించి నెయ్యంబు గావించి
బాలాజితత్వంబు మేలా విచారింపవేలా వినోదింపనేలా వయోధర్మ
మున్ రిత్తగాఁ బుచ్చు నీవృత్తికి న్మెత్తురే వత్తురే కాముకుల్

డాయఁ గాయంబు విద్యున్నికాయోపమేయంబు ప్రాయంబు
ధారాధరచ్ఛాయ మెన్నే నుపాయంబులన్ విత్త మాయత్తముం
జేయుమా రిక్థవారంబు వేరంబు గా దీ విచారంబు వంశానుచారంబు
సంసారసారంబు లాభాధికారంబు........

దండకము తుద నీక్రింది పద్యము చేర్పఁబడి యున్నది—

ఉ. పండితకీర్తనీయుఁడగు బమ్మెర పోతన యాసుధాంశుమా
ర్తాండకులాచలాంబునిధితారకమై విలసిల్ల భోగినీ
దండకము రచించె బహుదానవిహర్తకు రావు సింగభూ
మండలభర్తకు న్విమతమానవనాథమదాపహర్తకున్.

చిలుకూరి వీరభద్రరావుగారు ౧౯౧౬ వ సంవత్సరమునందుఁ ప్రకటించిన యాంధ్రుల చరిత్రము మూఁడవభాగమునందు "ఈ పై నుదాహరింపఁబడిన పద్యము బమ్మెరపోతన రచించినది గాక మఱియొకరు రచించినట్లు "పండితకీర్తనీయుఁ డగు బమ్మెరపోతన" యని ప్రథమ పురుషములో నుడివిన పలుకే సాక్ష్య మిచ్చుచున్నది. పండితకీర్తనీయుఁడ నని బమ్మెర పోతనవంటి భక్తాగ్రేసరుఁడగు కవి యాత్మ శ్లాఘనీయమగు విశేషణము వ్రాసికొనునా ? యని సంశయింపఁదగి యున్నది" అని వ్రాసిరి. భోగినీ దండకము బమ్మెర పోతరాజకృతము కా దని చూపఁదలఁచినవారయి తమ యభిప్రాయమును సాధించుట కయి వీరభద్రరావుగారు రెండు హేతువులను జూపిరి. వానిలో నొకటి పద్యములో బమ్మెర పోతన యని ప్రథమ పురుషములో నుడువుట, రెండవది పండితకీర్తనీయుఁడని యాత్మశ్లాఘన ముండుట. ఈ రెండును హేతువు లని చెప్పఁదగినవే కావు. కంఠోక్తిగాఁ జెప్పఁబడిన యంశమును కా దని కొట్టివేయుటకు నమోఘములైన ప్రబల హేతువు లుండవలెను గాని దుర్బలములయిన హేత్వాభాసములు పనికిరావు. కవులు తమ్ముఁగూర్చి ప్రథమపురుషములోఁ జెప్పుకొనుట సర్వసాధారణ మని భాషాజ్ఞానము గల బాలురకు సహితము తెలియును. ఈ క్రింది యుదాహరణములను జూడుఁడు

సీ. తనకులబ్రాహ్మణు................నిత్యసత్యవచను, మత్యమరాధిపా
　　చార్యు సుజను నన్నపార్యుఁ జూచి''

అని భారతాదిపర్వములో నన్నయభట్టారకుఁడు తన్నుఁగూర్చి 'నన్నపార్యు' నని ప్రథమపురుషములోఁ జెప్పుకొనలేదా ?

''ఎఱ్ఱనార్యుండు..........అరణ్యపర్వశేషము పూరించెఁ గవీంద్ర కర్ణపుట పేయముగాఁ''

అని భారతారణ్యపర్వాంతమున నెఱ్ఱాప్రెగడ తన్నుఁగూర్చి ''యెఱ్ఱనార్యుఁడు పూరించె'' నని ప్రథమపురుషములోఁ జెప్పుకోలేదా ? ఎవ్వరెవ్వరినో చెప్ప నేటికి ? బమ్మెరపోతన్ననే చూతము.

ఉ. ''ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులుఁ
　　సొమ్ములు కొన్ని పుచ్చుకొని సొక్కి శరీరము వాసి కాలుచే
　　సమ్మెటప్రేటులం బడక సమ్మతి శ్రీహరి కిచ్చి చెప్పె నీ
　　బమ్మెరపోతరా జొకఁడు భాగవతంబు జగద్ధితంబుగఁ.''

అని భాగవతప్రథమస్కంధములో బమ్మెర పోతనామాత్యుఁడే తన్నుఁ గూర్చి ''బమ్మెరపోతరా'' జని ప్రథమపురుషములోఁ జెప్పుకొనలేదా ? బమ్మెరపోతరా జని ప్రథమపురుషములోఁ నుడువుటచేత భాగవతము పోతన రచించినది గాక మఱియొకరు చెప్పినదని చెప్పి కంఠోక్తిగాఁ జెప్పఁబడిన దాని నంతను వీరభద్రరావుగారు కొట్టివేయుదురా ?

ఇఁకఁ బండితకీర్తనీయుఁ డన్నదానిలోఁ గలదన్న యాత్మశ్లాఘయు నిటువంటి దుర్బలమైన హేతువే. భోగినీదండకములోని రచనభాగవత రచనమువలెనే పండితశ్లాఘాపాత్రముగా నుండలేదా ? ఉన్న దానిని జెప్పు కొనుట సత్యమే యగును గాని యాత్మస్తుతి కానేరదు. ఒకవేళ నిందుఁ గొంచెము స్తుతి యున్నదనుకొన్నను పయి పద్యములో ''నిత్యసత్యవచను మత్యమరాధిపాచార్యు'' నని నన్నయభట్టు చేసికొన్నదానిలో నిది యెన్నవ పాలు ? ''కవీంద్రకర్ణపుటపేయముగా'' నని యెఱ్ఱాప్రెగడ చెప్పుకొన్న దానిలో నింతమాత్రపు స్తుతి లేదా ? పోతరాజు చెప్పిన పద్యములోనే

"శ్రీహరి కిచ్చి చెప్పె నీబమ్మెర పోత రాజొకఁడు భాగవతంబు జగద్ధితంబుగ" ననుచోట నించుక యాత్మ స్తుతియు, "ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి" యనుచోట నించుక పరనిందయు, కనఁబడుచుండలేదా ?

బమ్మెర పోతరాజువంటి భక్తాగ్రేసరుఁ డొకరా జుంచుకొన్న వేశ్యనుగూర్చి దండకము చెప్పునా ? యన్నది మూఁడవ హేతువు ! ఈ దండకము చెప్పు నాటికి పోతన్న భక్తాగ్రేసరుఁడు కాఁడు. చంద్రోపరాగపర్వదినమున గంగాస్నానమునకుఁ బోయినప్పుడు రామభద్రుఁడు స్వప్నములో సాక్షాత్కరించి శ్రీమద్భాగవతమును దెనిఁగింప నియోగించినతరువాత నీతనివిష్ణుభక్తి యారంభ మైనది. తోడనే యితఁడు భాగవతరచన కుపక్రమించెను.

పోతన బాల్యమునుండియు విశేషవిత్తవంతుఁడు కాకపోవుటచేతను, సహజపాండిత్యము గలవాఁ డగుటచేతను, నిరుపమానకవిత్వ నైపుణి గలవాఁ డగుటచేతను, రాజాశ్రయమును సంపాదించి తన పాండిత్యమును ప్రకటించి విత్త మార్జించి పేరుపొందవలెనన్న యపేక్షతో మహావిద్వాంసుఁడని పేరొంది సమీపరాజ్యపదస్థుఁడై యున్న సింగమనాయని దర్శించుటకయి యౌవనారంభదశలోఁ బోయి యుండును ఆ ప్రభువు తన ప్రియురాలిపైని దండకమును జెప్పి నీ కవననైపుణిని జూపుమని నియమించినప్పుడు యువజనస్వాభావికదౌర్బల్యముచేతనో, దాక్షిణ్యముచేతనో పాండిత్యప్రకటనాభిలాషచేతనో రాజు కోరిక చెల్లించి యుండును.

భోగినీదండకము పోతనవిరచితము కా దని చెప్పుటయే మనస్సులో నా కిష్ట మయినను భాగవతకవిత్వముతో భోగినీదండకకవిత్వమును బోల్చి చూచి నప్పుడు నా మనస్సట్లు వ్రాయుట కొప్పినది కాదు మొట్టమొదట భోగినీదండకమును ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారములోఁ జూచినప్పుడు నా కత్యాశ్చర్యము కలిగినది. అవఱ కెవ్వరైనను పోతన్న భోగినీదండకమును జేసె నని చెప్పుచు వచ్చినప్పుడు నేను వారిని నమ్మక యబద్ధమని నిరాకరించుచు వచ్చితిని. దండకమును ప్రత్యక్షముగా జూచినతరువాతను దాని కవిత్వము పోతనదే యని దృఢముగా తోఁచినతరువాతను పరు లాతని

పేరు పెట్టి కల్పించి యుందురని నమ్ముటకుఁ దగిన హేతువులు కనఁబడక పోవుటచేతను నేను సత్యమని నమ్మినదానిని నా కవులచరిత్రములోఁ బ్రకటింపవలసినవాఁడనైతిని. నా పుస్తకము ప్రకటింపఁబడఁగానే యప్పుడు ప్రభుత్వము చేయుచుండి యిప్పుడు కీర్తిశేషులైన వేంకటగిరిరాజుగారు సర్వజ్ఞ సింగమనాయఁడు వేశ్యాగమనదోషదూషితుఁడు గాని యకళంక చరిత్రుఁడయిన విద్వాంసుఁడనియు, నట్టి మహనీయునిపయిని వేశ్యా సంపర్కదోషమారోపించుట తమ కవమానకరమనియు నాపేర వ్రాసిరి. ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారములో నున్న భోగినీదండకమును దెప్పించి చూచి యీ విషయమునఁ దృప్తిపొందవలసినదని నేను బదులు వ్రాసితిని. అందుపైని వారు తమ పురాతనగ్రంథములను వెదకింపఁగాఁ వానిలోఁ దమ యాస్థానమునందే యీ గ్రంథము దొరకినదని కొంతకాలమునకు మరల వ్రాసిరి. ఎటువంటి మహానుభావులకును నవస్థాభేదము లుండును. ప్రథమావస్థలోని దోషములు తదనంతరావస్థలయందు నివారణము లగును. ప్రథమదశలోని యనుభవమునుబట్టి కడచిన ప్రమాదమునకు పశ్చాత్తప్తుఁడయి పోతనార్యుఁడు ముందు రాజాస్థానములకుఁ బోఁగూడదనియు, రాజులకుఁ గృతులియ్యఁగూడదనియు నియమము చేసికొని యుండును. కర్ణాట రాజులచేత నెప్పుడయిన నవమానితుఁడయి పోతన్న రాజులను ద్వేషించువాఁడయియు నుండవచ్చును. భ్రమప్రమాదములు మనుష్యస్వభావము లగుటచేత నెటువంటి విద్వాంసులకును నొకానొకప్పుడు ప్రమాదము సంభవింపవచ్చును. అటువంటిది పూర్ణచంద్రునిలోని కళంకమువలె మహనీయుల కీర్తిచంద్రికకు మాలిన్యము తీసికొని రాఁజాలదు.

శేషాద్రిరమణకవులు కృష్ణాపత్రికలో నెల్లూట్ల నారాయణకవిని గూర్చి వ్రాయునప్పుడును, తత్పూర్వమున, నెల్లూట్ల నృసింహరావుగారిని గూర్చి వ్రాసినప్పుడును వారు బమ్మెర పోతరాజువంశమువారని వ్రాసి యున్నారు. ఈ కథ యెంతమాత్రమును విశ్వాసార్హమయినది కాదు. బమ్మెర పోతనామాత్యుని సంతతివారు ఆఱువేలనియోగిశాఖవారు, నెల్లూట్ల వారు గోలకొండ

వ్యాపారిశాఖవారు; బమ్మెరవారు శైవులు; నెల్లుట్లవారు వైష్ణవులు. పదునాఱవ శతాబ్దమునకుఁ గడపటిభాగముననో, పదునేడవశతాబ్దారంభముననో యుండిన నారాయణకవిపూర్వులు మొదట రాజభండారమువా రయి తరువాత నెల్లుట్లవా రయిరఁట ! ౧౬౩౬ వ సంవత్సరప్రాంతమునం దుండిన యజ్జరపు పేరయ లింగము (ఒడయనంబివిలాసకర్త) బమ్మెర పోతరాజునకు నాలవతరమువాఁ డయిన కేసనకవి యొక్కకూఁతు రైన యెల్లమను వివాహమాడుటచేతఁ బోతన సంతతివారు పదునేడవ శతాబ్దారంభమునందుఁ గూడ నెల్లుట్లవారుగా మాఱక బమ్మెరవారుగానే యుండిరనియు, శైవులతో సంబంధములు చేసికొనుచుండిరనియు నొడయనంబివిలాసములోని యీ క్రింది పద్యము వలన స్పష్టముగాఁ గనఁబడుచున్నది —

ఉ. బమ్మెరవంశమందునను బ్రౌఢసరస్వతిపద్దు గాంచి తా
నెమ్మె దలిర్పఁ గేసనకవీశ్వరుఁ డప్పమనామసాధ్వియం
దిమ్మహిఁ గూర్మిఁ గన్న సుత యెల్లమయందును దేరయాఖ్యుఁడ౯
సమ్మతిఁ గంటి వీరనరసమ్మను గంగనమంత్రియుగ్మమున్.

బమ్మెరపోతనామాత్యుఁడు భాగవతరచనాప్రారంభకాలముననే బమ్మెరను విడిచి యేకశిలానగరమును జేరెను. బమ్మెరవారికిని నెల్లుట్లవారికిని కౌండిన్యగోత్రసామ్య మొక్కటి దక్క వేఱు సంబంధ మేదియు లేదు. పదునాఱవ శతాబ్దాంతమునందు బమ్మెరప్రౌఢసరస్వతిపుత్రుఁడు కేసన్న రచియించిన హైమవతీవివాహోవతారికవలన సహిత మీ యంశములు దేటతెల్ల మగును.

నిశ్శంక కొమ్మన్న

ఈ కవి శివలీలావిలాసమును రచించెను. ఈ గ్రంథములోని మొదటి రెండాశ్వాసములు మాత్రమే శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి యొద్ద నున్నవి. అందు మొదటి రెండవ పత్రములు లేవు: మిగిలిన పత్రములు సహితము మిక్కిలి శిథిలము లయి యున్నవి. ఈ కవిచే శివలీలా విలాసము వేమవీరభద్రారెడ్ల తమ్ముఁడును నల్లాడరెడ్డి పుత్రుఁడును నయిన దొడ్డారెడ్డి కంకితము చేయఁబడినది. పుస్తకావతారికయం దల్లాడరెడ్డి పెదకోమటి వేమారెడ్డిని, గజపతిని జయించినట్టు చెప్పఁబడినది. కాటయవేముని యనంతరమున రాజమహేంద్రవర రెడ్డిరాజ్యము నాక్రమించుకోవలెనని యావల కొండవీటిరాజయిన పెదకోమటివేమారెడ్డియు నీవల కటకాధీశ్వరుఁ డైన గజపతియుఁ బ్రయత్నించిరి. కాని వా రల్లాడరెడ్డియొక్క నిరంతర జాగరూకతవలనను పరాక్రమమువలనను విఫలప్రయత్ను లయి పరాజితులై వెనుక మరలవలసిన వా రయిరి. వీరభద్రారెడ్డి రాజయిన తరువాత నాతని యగ్రజుఁడైన వేమారెడ్డియు ననుజుఁడయిన దొడ్డారెడ్డియు మహాబాహుపరాక్రమశాలు లయి శత్రురాజులతో యుద్ధములు చేసి సోదరుని రాజ్యమును పెంపుచెందించిరి. ఈ యిరువురి పరాక్రమములును కాశీఖండము నం దిట్లు వర్ణింపఁబడెను

మ. కొనియెం గంచుకముల్ సముద్భటనటద్ఘోటీభటప్రౌఢిఁగై
కొనియె న్వేడుక జీడికోట యహితక్షోణీశు లల్లాడఁ జే
కొనియె న్నాకవరంబు వీఁక మదవద్ఘోరారిసంహారియై
ఘనుఁ డల్లాడమహీశు వేమన నిరాఘాటైకధాటీగతిన్.

శా. ఔరా! యల్లయరెడ్డి దొడ్డవసుధాధ్యక్షుండు ధాటీచమూ
భేరీభాంకృతిఘోర ఘోషమున నిర్భేదించె నొడ్డాది శృం
గారంకోటయు లోఁతగ_డ్డయును నుద్ఘాటించె నత్యుద్ధతిన్
* క్షీరాంభోధితటంబున న్నిలిపె దిక్సీమాజయ_స్తంభముల్.

వీరి తండ్రి యైన యల్లాడరెడ్డి భీమనరపాలకునిపుత్రియైన వేమాంబికను వివాహ మాడినట్లు శివలీలావిలాసములో నీ క్రింది పద్యమునఁ జెప్పఁబడినది

మ. భరితశ్రీనిధి యమ్మహీరమణుఁ డొప్పన్ జోళభ_క్తిక్షితీ
శ్వరసూనుండగు భీమలింగమనుజేశ శ్రేష్ఠసత్పుత్రి భా
స్వరకారుణ్యదశాజనావనవిధాసంధాత్రి వేమాంబికన్
పరిణయించెం బతిభ_క్తిగౌరవదృఢవ్యాపారసత్యాంబికన్.

ఈ వేమాంబ యనవేమారెడ్డి దౌహిత్రి. అల్లాడభూపాలపుత్రుల కీ రాజ్యము పితృపితామహపరంపరాగత మయినది గాక వీరభద్రారెడ్డి భార్య (కాటయ వేమునిపుత్రి) యైన యని తల్లి మూలముననే లభించినదైనను

ఉ. తమ్ముని వీరభద్రవసుధాధిపు విక్రమవీరభద్రునిన్
సమ్మదలీల రాజ్యభరణస్థితిఁ బట్టముగట్టి బాహువ
ర్వమ్మున వేమభూవరుఁడు వ్రాసె జగద్విజయప్రశ_స్తివ
ర్ణమ్ములు దిగ్గురంధర యురద్విపకుంభవిషాణమండలిన్.

అని భీమేశ్వరపురాణములోఁ జెప్పినట్లే

ఉ. తేజ మెలర్ప నవ్వసుమతీధవశేఖరుఁడొప్పు సర్వధా
త్రీజనరక్షణక్రమధురీణుని దమ్ముని వీరభీమణిన్
రాజమహేంద్రనామనగరంబునఁ బట్టము గట్టె నంచిత
శ్రీజయకీ_ర్తిసౌరభవిశేషవిజృంభితదిక్సమేతుఁడై.

* [కీరంభోధితటంబునన్—సరియైన పాఠము. కీరాంభోధి యనఁగా చిల్కాసముద్రము.]

అని శివలీలావిలాసములోను, వేమభూపాలుఁడు తమ్ముఁడైన వీరభద్రుని దయదలఁచి సింహాసనముపైనిఁ గూర్చుండఁ బెట్టినట్టు చెప్పఁబడినది. శివలీలావిలాసములోని యాశ్వాసాంతగద్య మిట్లున్నది

"ఇది శ్రీమదష్టభాషాకవితాప్రవీణ బుధజనస్తుత్య నిశ్శంక కొమ్మనా మాత్యప్రణీతంబయిన శివలీలావిలాసంబునందు"

శివలీలావిలాసము ౧౪౩౫ వ సంవత్సరప్రాంతమునందు రచియింపఁబడి యుండును. అందుచేత నిశ్శంక కొమ్మనామాత్యకవి ౧౪౩౦ వ సంవత్సరము మొదలుకొని ౧౪౫౦ వ సంవత్సరప్రాంతమువఱకును కవియై యుండి యుండును. ఈ కవిచేఁ రచియింపఁబడినవీర మాహేశ్వరములోనివని యనేక పద్యము లాంధ్రపరిషత్పత్రికవారి యుదాహరణగ్రంధమునం దుదాహ రింపఁబడి యున్నవి. ఈ శివలీలావిలాసమునకే వీరమాహేశ్వరమన్నది నామాంతరమో, యది వేఱు గ్రంథమో తెలియరాదు. గ్రంథము దొరకు వఱకును వీరమాహేశ్వరము ప్రత్యేకగ్రంథ మనియే భావింతము. కృతిపతి వంశజులు కొండవీటిరెడ్డివంశజులవలెనే దేసటివారు. ఇరువురును పంట కులమువా రయి దాయాదు లయి యుందురు. శివలీలావిలాసములో వీరు దేసటివా రయిన ట్లీ పద్యములోఁ జెప్పఁబడినది

ఉ. అందు జనించి మించిరి సమగ్రనిరూఢిఁ గ్రమక్రమంబువన్
మందరధీరు లాగతసమస్త (విచా) రులు సంతతప్రజా
నందనకార్యకారులు గుణస్ఫుటహారులు ధర్మరక్షణా
మందవిచారు లంగజితమారులు దేసటు లత్యుదారులై.

కొమ్మనామాత్యుని కవిత్వ మనర్గళధార కలదయి బుధజనమనోరంజకముగా నుండును. శైలి తెలియుటకయి యీతని గ్రంధములలోని పద్యములఁ గొన్నిటిని నిం దుదాహరించుచున్నాను

ఉ. శ్రీవిభుసెజ్జ మేదినికిఁ జెల్వగు పుట్టము దివ్యనవ్యర
త్నావళిమన్కిపట్టు దివిజారులదుర్గము వాహినీపతుల్
భావముగట్టురావు బడబాజ్వలనంబున (వంటయిల్లు) నాఁ
గా విలసిల్లు నా వనధిగాధమహత్త్వము చెప్ప నొప్పగున్.

చ. వరయశుఁ డింకఁ గల్గుఁ గురువంశమునన్ జనమేజయుండు నాఁ
బరఁగి బరీక్షితాత్మజుఁడు పాయక యాతఁడు సర్పయాగ ము
ద్ధురమతిఁ జేయునప్పు డతిదుస్సహతద్దహనార్చులందు నో
దరహితపుత్రపౌత్రసహితంబుగ ద్రమ్మగ్గుఁడు మీర లందఱున్.

ఉ. అశ్వముజాడ గానక భయంపడి యా సగరాత్మనందనుల్
నిశ్వసనాహుతిన్ వదననీరజము ల్గమలంగ మొత్తమై
యాశ్వనురూపయానమున నక్కడ కక్కడ కేఁగి యేఁగి యీ
విశ్వవసుంధరాస్థితి గవేషణ చేసిరి పెక్కుభంగులన్.

ఉ. తన్మదిరాక్షివిభ్రమము దక్కక కన్నులఁ గ్రోలఁ జొచ్చెఁ బ్రే
మ న్మరుచే బిట్టదరి మానస మాకుల మయ్యె నిట్లు గ
న్నున్న మనసున్ వశంబులయి నూల్కొనమిన్ బహిరంతరంబులన్
దన్మఱచెం గరం బజుఁడు దందడి వేడ్కలు సందడింపఁగన్.

పయి పద్యములు శివలీలావిలాసములోనివి. ఈ క్రింది పద్యములు వీర మాహేశ్వరములోని వని యుదాహరింపఁబడినవి

సీ. పులుఁగురాయఁడు తమ్మికొలఁకులచెలికాని
బండిబోయనితోడిపాలివాఁడు
పన్నగస్త్రీలకుఁ బాలిండ్లపనవాస
మగడింప నోపిన మగలమగఁడు
దంభోళి కొకయీఁకఁ దాఁకు కానిక చేసి
యమృతంబుఁ దెచ్చిన యవఘళుండు

వినతముద్దులపట్టి వనధిచెంగట బోయ
పగకు నాఁకలి గొన్నభవ్యబలుఁడు
పక్షములు దాల్చి వచ్చిన పసిఁడికొండ
యట్లు విలసిల్లుమేటి వాహనము గాఁగ
నడచె హతశేషదైవసైన్యములు దాను
నసురకులమర్దనుండు జనార్దనుండు.

సీ. తల్లిదండ్రులతోడితగు లొల్ల కుండియుఁ
దల్లిదండ్రులతోడి తగులు వలచి
కందర్పుమీఁది యక్కటికంబు చెల్లియుఁ
గందర్పుమీఁదియక్కటిక మొదవి
సంసారకేళిప్రసక్తి వోఁ దట్టియు
సంసారకేళిప్రసక్తి కలిగి
సగుణవిశేషయోజనము లభించియు
సగుణవిశేషయోజనము మరిగి
సగము పురుషుండు కంజాక్షి సగము గాఁగ
నర్ధనారీశ్వరాకృతి ననువుపఱిచి
హరుఁడు తల్లింగమధ్యంబునందు నుండి
హరివిరించుల కంతఁ బ్రత్యక్ష మయ్యె.

శా. ఆజ్ఞాసిద్ధికరంబు ముక్తిదము చిత్తానందసంధాయి శై
వజ్ఞానాంకురశిష్టబీజము ప్రభావప్రౌఢసంచిత్కళా
జిజ్ఞాసావిభవప్రదాయకము లక్ష్మీకారణం బూర్జితో
పజ్ఞామూలము భక్తలోకమునకుం బంచాక్షరం బిమ్మహిన్.

సీ. కమలజాండంబులు కందుకంబులు చేసి
యొండండ తాటింప నోపువారు
విలయవహ్నులఁ బట్టి వెస దండలుగఁ గ్రుచ్చి
యురమున ధరియింప నోపువారు

శివిరి సంహారభైరవుసైనఁ బొలివోవ
నొకమాత్ర వసి మాల్ప నోపువారు
కాలచక్రక్రియాఘటనంబు ద్రిప్పి యొం
డొకలాగు గావింప నోపువారు

ప్రమథవీరులు వివిధరూపములతోడ
హసన..........ద్యలఘుగతులు
వెలయఁ గోటానకోటులు గొలిచి వచ్చి
రతఁడు హరుఁ గొల్వ నేతెంచునవసరమున.

సీ. కఱకుచీఁకటులమూఁకల నుగ్గు నూచగ
నుఱిచి నూఱక త్రాగు నెఱతనంబు
పొట్టేటిరాయనిబొళయంబు గదలించి
వాహ్యాళి గదలెడి వైభవంబు
క్రతుభాగములు తెచ్చి కైతప్పు గాకుండ
వేల్పుల కందించు వెరవుసొంపు
మూఁడుమూర్తులు దాల్చి మురువుతో జన్నంపు
వేదిపైఁ గొలువుండు విభ్రమంబు

నీక చెల్లు నొరుల నీతోడిసాటికిఁ
బేరుగ్రుచ్చి యెన్న లేరు జగతి
వశమె నిన్నుఁ బొగడ స్వాహావధూకుచా
భ్యున్నతప్రకాశ ! యో హుతాశ !

వెలిగందల నారయ

ఇతఁ డాంధ్రమహాభాగవతమునందలి యేకాదశ, ద్వాదశ స్కంధములను, దశమస్కంధోత్తరభాగములోని చివఱిభాగమును రచించెను. స్కంధముల చివఱి గద్యలనుబట్టి యితఁడు పోతనామాత్యుని శిష్యుఁడైనట్లు తెలియు చున్నది. ఇతఁడు దశమస్కంధోత్తరభాగము చివఱి గద్యలో మాత్రము తన గురువునందలి గౌరవముచే, పోతనామాత్యుఁడే వ్రాసినట్లు చెప్పెను.

భాగవతమును పూర్తిగా పోతన రచించెననియు. నందలి భాగములు కొన్ని శిథిలము లుకాఁగా, నారయాదులు పూరించిరనియుఁ గొంద అందురు. అది సరికాదు. పోతన విడిచిన భాగమునే యీతఁడు రచించెనని తెలియుచున్నది. హరిభట్టు రచించిన పద్యములు కొన్ని యీతని ఏకాదశ, ద్వాదశస్కంధము లలోఁ గానవచ్చుచున్నవి. లేఖకుల ప్రమాదమున నవి యిందు చేరి యుండును.

సదానందయోగి

ఇతనిం గూర్చి 'ఆంధ్ర కవితరంగిణి' లోఁ గొంత వ్రాయబడిఁ యున్నది. దానిని బట్టి యీతఁడు నవ్యతంభోగి 'శ్రీ సదానందయోగి' అను మకుటముతో నొక శతకమును వ్రాసినట్లును, ఇతఁడు ఫణిభట్టునకు గురువై యుండ వచ్చునని యూహింపవీలున్నట్లును తెలియుచున్నది. శతకకవుల చరిత్ర వ్రాసిన శ్రీ వంగూరి సుబ్బారావుగారు నిట్లే యూహించినారు।

గంగనార్యుఁడు

ఈ కవి భాగవతమునందలి పంచమస్కంధము నాంధ్రీకరించెను. ఇతఁడు తన గ్రంథభాగమును శ్రీకృష్ణున కంకితము చేసెను. ఆశ్వాసాంతగద్యలలో 'ఇది శ్రీ సకల సుకవిజనానందకర బొప్ప నామాత్యపుత్ర గంగనార్య ప్రణీతంబైన-' అని మాత్రము చెప్పియుండుటచే నితనిం గూర్చిన విశేషము లేమియును దెలియరాకున్నవి. ఇతఁడు పోతన, నారయలకుఁ దర్వాతి వాఁడనియు, ఏర్చూరి సింగన సమకాలికుఁడనియు, నిజాం రాష్ట్ర నివాసి యనియు 'ఆంధ్ర కవితరంగిణి' లోఁ గలదు. [సం. 6 పుట 21]
పంచమస్కంధమును దాను పూర్తిగా వ్రాసినట్లు గంగనార్యుఁడు చెప్పి కొనినను, పంచమాశ్వాసమునఁ బోతనామాత్యుని కవిత చాలగా నున్నదని 'ఆంధ్ర కవితరంగిణి' కారు లభిప్రాయపడుచున్నారు.

(సం. 6 పుట. 212)

శ్రీధరుఁడు

శ్రీధరుఁ డొక ఛందస్సును రచించినట్లు తెలియుచున్నది. లక్షణగ్రంథము లలో శ్రీధర ఛ్ఛందస్సులోని పద్యములు, దీని ప్రస్తావన కానవచ్చుచున్నవి. అప్పకవి శ్రీధరుని బేర్కొనుటచే నితఁ డప్పకవికంటెఁ బూర్వుఁడనవలెను. శ్రీధరఛ్ఛందస్సునకు పిన్నయ సోమభూపాలుఁడు కృతిపతియని యొక పద్యము వలనఁ దెలియవచ్చుచున్నది. గౌరన తన లక్షణదీపికలో శ్రీధర ఛ్ఛందస్సునుండి యుదాహరించినట్లొక వ్రాఁతప్రతి వలనఁ దెలియవచ్చు చున్నది. అది వాస్తవమైనచో నితఁడు 14 శతాబ్ది చివర నుండెనని తలంప వచ్చును. లేదా 15 శతాబ్దిలో నుత్తరార్థమున నుండెనని యనుకొనవచ్చును.

కృష్ణమాచార్యుఁడు

వైష్ణవభక్తాగ్రగణ్యుఁడగు నీకవి సింహాచలక్షేత్ర నివాసి; సింహగిరి వరాహ నరసింహస్వామి పేర పెక్కు సంకీర్తనములను, వచనముల నీతఁడు రచించెను. ఇతఁడు ప్రథమాంధ్ర వచనకవి. ఇతఁడు రెండవ ప్రతాపరుద్ర చక్రవర్తి కాలమున నుండెనఁట ; పదునైదవ శతాబ్దిలో నుండిన శ్రీ తాళ్లపాక అన్నమయ్యగారీతనిని పేర్కొనియుండుటచే నితఁడు ౧౪వ శతాబ్దిలో నుండెననుట సత్యము. కృష్ణమాచార్యుని సింహగిరి నరహరి వచనములు ప్రసిద్ధములు. ఈ కవిని గూర్చి శ్రీ నిడదవోలు వేంకటరావుగారు పార్థివ-భాద్రపద భారతిలో వివరముగాఁ దెల్పియున్నారు. ఈతఁడు రచించిన ప్రసిద్ధమైన 'జో అచ్యుతానంద ! జోజో ! ముకుందా !' అను లాలిపాటను శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్యగారు 1948 సెప్టెంబరు 8వ తేదీ ఆంధ్ర వారపత్రికలోఁ బ్రకటించి యున్నారు.

అయ్యలరాజు తిప్పయ్య

ఈ కవి అయ్యలరాజు రామభద్ర కవికిఁ బ్రపితామహుఁడని యనుచున్నారు. ఇతఁడు (ఒంటిమెట్ట) రఘువీర శతకమును రచించెను. ఈ కవి గృహ నామము రాయకవివారైనట్లు తెలియుచున్నది. ఈతఁడు కర్ణాటక మండలాధిపతి యొద్ద ఆస్థానకవిగా నుండినట్లు శతకమునందలి యొక పద్యము వలన దేలుచున్నది. ఆ ప్రభువు సంగమవంశములోనివాఁడైన రెండవ దేవరాయలై యుండునని 'ఆంధ్ర కవితరంగిణి' (సం. 6 పుట. 13) లోఁ గలదు.

ఏర్చూరి సింగన

ఇతఁడు భాగవతమునందలి షష్ఠస్కంధమును రచించి శ్రీకృష్ణున కంకిత మొనర్చెను. ఇతఁడు తన వంశమునకు మూలపురుషుఁ డేర్చూరి యెఱ్ఱన ప్రెగ్గడ యని చెప్పికొన్నాఁడు. ఇతఁడు కవిత్రయములోని యెఱ్ఱాప్రెగ్గడ కంటె భిన్నుఁడు. ఏర్చూరి యెఱ్ఱనకవిగాఁ బ్రసిద్ధుఁడు కాఁడు. షష్ఠ స్కంధమునంతను ఇతఁడు రచింపలేదనియు, పోతన రచింపఁగా శిథిలమైన షష్ఠస్కంధభాగములను పూరించెననియుఁ గొందఱు తలంచుచున్నారు. కొన్ని పద్యములు పోతన పద్యములవంటి వెందుఁ గానవచ్చుచున్నవి.

సింగనకవి కువలయాశ్వచరిత్రమను ప్రబంధమును గూడ వ్రాసెనని తెలియుచున్నది. అందలి పద్యములు కొన్ని పెదపాటి జగ్గన్న ప్రబంధ రత్నాకరమునఁ గానవచ్చుచున్నవి. కువలయాశ్వచరిత్రము లభింపలేదు.

పిడుపర్తి బసవన - 1

ఇతఁడు పాలకురికి సోమనాథుని శిష్యుఁడైన శివరాత్రి కొప్పయ్యయ్యకు మనుమని మనుమఁడు ఇతఁడు క్రీ.శ. 1420 ప్రాంతమున జన్మించెనట. గురుదీక్షా బోధ, పిల్లనైనారు కథ, బ్రహ్మోత్తరఖండము మున్నగునవి. యీతని రచనలు. పద్యబసవపురాణకర్తయగు సోమనాథుని కీతఁడు తండ్రి. ఇతని ప్రోత్సాహముననే సోమనాథుఁడు పద్యబసవపురాణమును రచించెనట

తాళ్లపాక అన్నయాచార్యులు

ఈతఁడు నందవరీక బ్రాహ్మణుఁడు; తిరుపతి నివాసి, శ్రీ వేంకటేశ్వరస్వామి భక్తుఁడు; ఇతనికి అన్నమాచార్యుఁడు; అన్నమయ్య, అన్నమయ్యంగారు అను పేర్లు ప్రసిద్ధములు. ఇతఁడు వైష్ణవమును పుచ్చుకొనెను. ఇతఁడు పెక్కు సంకీర్తనములను, శృంగారమంజరి, శృంగారలక్షణము, వేంకటేశ్వర శతకము మున్నగు గ్రంథములనురచించెను. ఈ శతకమునుండి పద్యములను పెదపాటిజగన్నాథకవి తన ప్రబంధరత్నాకరమున నుదాహరించి యున్నాఁడు. ఈతఁడు క్రీ. శ ౧౪౦౮ వ సం. న జన్మించి, ౯౫ సంవత్సరముల ప్రాయమున క్రీ. శ. ౧౫౦౩ లోఁ గీర్తిశేషుఁడయ్యెనని తెలియవచ్చుచున్నది.
ఇతని నివాసము తొలుత కడపమండలములోని రాజంపేట తాలూకాయందలి తాళ్లపాక గ్రామమనియు, ఆ గ్రామమును బట్టియే వీరి గృహనామ మేర్పడినదనియుఁ జెప్పుదురు.

రేవణూరి తిరుమల కొండయాచార్యుఁడు

ఇతఁడు తాళ్లపాక అన్నయాచార్యుల కల్లుఁడు. శకుంతలా పరిణయకర్త రేవణూరి వేంకటాచార్యుల తండ్రి. శకుంతలా పరిణయగద్యను బట్టియే యితఁడు రామచంద్రోపాఖ్యానమను ప్రబంధమును వ్రాసినట్లు తెలియుచున్నది. ఆ గ్రంథ మిప్పుడు లభించలేదు.

పిడుపర్తి నిమ్మనాథుడు

ఇతనికి నిమ్మయార్యుఁడనునది నామాంతరము ఇతని తండ్రి పినసోమయ్య. పద్యబసవపురాణకర్త పిడుపర్తి సోమనాథున కితఁడు పెదతాత మనుమఁడు. ఇతనిని సోమనాథుఁడు తన పద్యబసవపురాణమునఁ బ్రశంసించి యున్నాఁడు. ఇతని రచనలేమో తెలియలేదు. ఇతఁడు 1390-1440 మధ్య నున్నవాఁడు. 'నిజలింగ చిక్కయ్యకథ' యీతని రచన యని ప్రాచ్యలిఖితపుస్తక భాండాగార పుస్తకపట్టికలోఁ గలదు. కాని యా నిమ్మనాథుఁడు పర్వత లింగయ్య పుత్రుఁడు; కావున నతఁడు వేఱు

ప్రోలుగంటి చెన్నశౌరి

ఇతఁడు ప్రౌఢరాయల వద్ద దండాధికారిగా నుండిన తిప్పనకుఁ బ్రపౌత్రుఁడు; నాగశౌరి దేవమాంబలకుఁ బుత్రుఁడు; ఇతని గ్రంథము లేవియు లభింప లేదు. హరిభట్టు రచించిన నృసింహపురాణములో నీతని ప్రశంస కలదు. దానిం బట్టి యీతఁడు నరసింహపురాణమును ద్విపదకావ్యముగను, బాలభారత మును వచనకావ్యముగను సౌభరిచరిత్రమును యక్షగానముగను రచించినట్లు తెలియుచున్నది. ఈ కవి పదునైదవశతాబ్దియం దుత్తరార్ధమున నుండెనని చెప్పవచ్చును.

[పయి కవులం గూర్చిన చరిత్రములకు 'ఆంధ్ర కవితరంగిణి' ఆధారము.]

గౌరన మంత్రి

ఈ కవి హరిశ్చంద్రోపాఖ్యానమును నవనాథచరిత్రమును ద్విపదకావ్యములనుగా రచించెను. ఇతఁడు హరిశ్చంద్రోపాఖ్యానమునందుఁ దన్నుఁగూర్చి యిట్లు చెప్పుకొనియెను.

ద్వి. సింగనమాధవక్షితిపాలమణికి
మంగళమూర్తికి మంత్రియై జగతిఁ
బొగడొందు పెద్దనపోతరాజునకుఁ
దగిన తమ్ముఁడు యశోధనుఁ డెల్లమంత్రి
చెట్ట పట్టంగ నోచినభాగ్యవతికిఁ
జుట్టాలసురభికి సుందరీమణికి
ఘనుఁడు వల్లభమంత్రి గంగాంబ గోరి
కనిన పోచంబకు గారాబుసుతుఁడ
ధరణి నమాత్యరత్నంబనఁబరఁగు
ధరణిమంత్రికిఁ గూర్మితమ్ముఁడ ఘనుఁడ
భూతనాయకపాదపూజాభిరతుఁడ
గౌతమగోత్రుండ గౌరనాహ్వయుఁడ.
సరససాహిత్యలక్షణ * విచక్షణుఁడ
బిరుదవిఖ్యాతిచేఁ బెం పొందువాఁడ

ఇచ్చట నెల్లమంత్రికిని పోచాంబకును బుత్రుఁ డయినట్లు చెప్పఁబడినను పుస్తకాంతమునందు

---

* [చక్రవర్తి — అని పాఠాంతరము, అదియే సరియైనది.]

మతిమంతుఁ డయ్యలమంత్రిపుంగవుని
సుతుఁడు గౌరనమంత్రి సుకవిశేఖరుఁడు
కవు లెన్న నుత్తరకథ రచియించె.

అని యయ్యలమంత్రిసుతుఁ డయినట్లు చెప్పఁబడి యున్నది. అయ్యల యని పొరపాటున నెల్లనకు మాఱుగా పడియుండును. మొదట నున్న దాని నయ్యల యని దిద్దుటకు వలనుపడదు. ఎల్లనామము రెండు చోట్లను సరిపడును. [గౌరనమంత్రి తండ్రి అయ్యలు మంత్రి; కాని, ఎల్లమంత్రి కాఁడు. 'యశోధనుఁ డెల్లమంత్రి' యనుచోట 'యశోధనుఁ డయ్యమంత్రి' అని యుండదగును. లక్షణదీపికయందలి 'ఆసీత్తస్యమహామాత్యః స్వామి కార్యధురంధరః, పోతరాజ ఇతి ఖ్యాతో రాజనీతివిశారదః॥ మంత్రి చూడా మణే స్తస్య సోదరస్యాయ్యలు ప్రభోః గౌరనార్య ఇతిఖ్యాత స్తనయో నయ కోవిదః।' అను శ్లోకములను బట్టియు నీయంశమే తెలియుచున్నది. '....శ్రీమదయ్యలు మంత్రిశేఖర రత్నాకర రాకాసుధాకర శ్రీగౌర నామాత్య విరచితాయాం ..' అను లక్షణదీపికాపరిచ్ఛేదాంతగద్యయు గౌరనతండ్రి అయ్యలుమంత్రి యనియే తెల్పుచున్నది.] ఈ ద్విపదకావ్యమును మొట్ట మొదట ముద్రింపించిన బ్రౌణ్‌దొరవారు కవి ౧౬౦౦ వ సంవత్సరప్రాంత మునం దుండినట్లభిప్రాయపడిరి. తన పెదతండ్రియైన పెద్దనపోతరాజు సింగనమాధవక్షితిపాలునిమంత్రి యైనట్టు కవి చెప్పెను గాని యీ పుస్తక మునుబట్టి యీ మాధవక్షితిపాలుఁ డెవ్వఁడో యే కాలమునం దుండినవాఁడో తెలియదు. ఈ కవియే సంస్కృతమున 'లక్షణదీపిక' యను ఛందశ్శాస్త్రము నొకదానిని రచియించెను. దానియందీ మాధవక్షితిపాలుని గూర్చి యీ క్రింది శ్లోకములోఁ గొంత వివరముగాఁ జెప్పెను.

శ్లో. అస్తి ప్రశస్తావనిపాలమౌళిరత్నావళీరంజితపాదపీఠః,
రేచర్లవంశార్ణవపూర్ణచంద్రో మహాబల స్సింగయమాధవేంద్రః.

పయి శ్లోకమునందు రేచర్లగోత్రము చెప్పఁబడి యుండుటచేత నీ మాధవ క్షితిపాలుఁడు బేతాళరెడ్డి కెనిమిదవ తరమువాఁ డయిన రావు సింగయ

మాధవనృపాలుఁడని తేటపడుచున్నది ఈ మాధవనృపాలునికి పెద్దన సుతుఁడైన పోతరాజు మంత్రి యైనట్టు వెలుగోటి వంశచరిత్రమునం దుదాహరింపఁబడిన యొక శిలాశాసనములోని యీ క్రిందిశ్లోకముల వలనఁ దెలియవచ్చుచున్నది.

శ్లో. శ్రీమతో మాధవేంద్రస్య రాజ్యాంగైకధురంధరః,
మంత్రీ పోత నామాసీత్ సర్వశాస్త్రవిశారదః
య స్యామాత్యశిఖామణేః కవివరస్తోత్రైః క్షపాత్రీకృతాం
మత్వా వాక్పతి రిద్ధనీతి సుభగాం వాగ్వైఖరీం లజ్జతే,
సోఽయం పెద్దనమంత్రి వర్యతనయః శ్రీపోతరాజోఽన్వహం
దేవస్యాస్య మహోపకారరచనాం సమ్య జ్ఞ్మదాచీకరత్.

రాచకొండ కీశాన్యమూలను రెండు క్రోసుల దూరములోనున్న నాగార గ్రామమునందలి మాధవనృపాలుని భార్య శాసనములో

శ్లో. శాకాఖ్యే నిధివార్ధిరామశశిగేఽప్యబ్దే ప్లవఁగే శుభే
మానే ప్యాశ్వయుజే రఘూద్వహపదే యోరాఘవీయాహ్వయామ్,
టీకా మర్థపటుప్రబోధఘటనా మాణిక్యపుష్పాంజలిం
కృత్వాఽరాజతి రావు మాధవనృపో రామాయణస్య శ్రియే.

అని శాలివాహనశకము ౧౩౪౯ ప్లవంగసంవత్సరాశ్వయుజమాసమువ నఁగా క్రీస్తుశకము ౧౪౨౭వ సంవత్సరమునందు రావు మాధవనరపాలుఁడు శ్రీమద్రామాయణమునకు రాఘవీయమను టీకను జేసెనని చెప్పఁబడినది. ౧౪౨౭ వ సంవత్సరమునం దుండిన రావు మాధవనృపాలుని మంత్రిగా నుండిన పోతరాజుతమ్మునికుమారుఁడైన మన గౌరనకవి ౧౪౪౦-౫౦ వ సంవత్సరప్రాంతములం దుండి యుండవలెను. అందుచేత గౌరనమంత్రి శ్రీనాథకవి యొక్క యంత్యకాలములోను, తదనంతరమునను నుండినందుకు సందేహము లేదు. [గౌరన పేర్కొనిన రావు సింగయ మాధవభూపాలునిఁ గూర్చి యభిప్రాయభేదము లున్నవి. ఇతఁడు బేతాళరెడ్డి కెనిమిదవ తరము వాఁడని శ్రీ వీరేశలింగమువంతులుగా రభిప్రాయపడినారు. శ్రీనాథుఁడు

పేర్కొనిన సర్వజ్ఞ సింగభూపాలుని కుమారుఁడనియు, అందువలన గౌరన కాలము 15 వ శతాబ్దిపూర్వార్ధమనియు 'నవనాథచరిత్ర' పీఠికలో శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారు చెప్పియున్నారు. ఈ మాధవనృపాలుఁడు గౌరన పెదతండ్రి మంత్రిత్వమును నెఱపిన మాధవనృపాలునకుఁ బితామహుఁడని శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు భైరవకవికృత 'శ్రీరంగమాహాత్మ్యము' పీఠికలోఁ దెల్పియున్నారు. వెలుగోటివంశ చరిత్రమునం దుదాహరింపఁబడిన (ఉమామహేశ్వర) శాసనమునందలి 'శాకాఖ్యే' అను శ్లోకమునఁ బేర్కొనఁ బడిన మాధవనృపాలుఁడు తాతయు, నాగారవు మాధవనృపాలుఁడు మనుమఁడు నగుదురనియుఁ ఉమామహేశ్వర శాసనకర్తయగు మాధవ నృపాలుని యొద్దనే పోతరాజు క్రీ శ ౧౩౭౭ ప్రాంతమున మంత్రిగా నున్నందున, నాతని తమ్ముని కుమారుఁడగు గౌరనమంత్రి ౧౩౮౫ మొదలు ౧౪౪౫ వఱకు నుండి యుండునని విశ్వయింపఁదగియున్నదని శ్రీ చాగంటి శేషయ్యగారు [ఆంధ్ర కవితరంగిణి' లో [సంపుటము 4, పుటలు 252, 261] తెలిపియున్నారు.]

గౌరనమంత్రి చేసిన రెండు ద్విపదకావ్యములలోను హరిశ్చంద్రోపాఖ్యాన మొకటి యైన ట్లీవఱకే చెప్పఁబడెను గదా? హరిశ్చంద్రుని కథ వేదముల నాఁటినుండియు సుప్రసిద్ధమయి యీ భరతఖండమునం దంతటను పండితులు మొదలుకొని పామరులవఱకును వ్యాపించి యున్నది ఈ కథ సంస్కృత మున మార్కండేయపురాణములోను, స్కాందపురాణములోను జెప్పఁబడి యున్నది. కథ కొంతవఱకు రెండు పురాణములలోను సమానముగానే యున్నను గొన్నిచోట్లఁ జరిత్రాంశములలో మాత్రమేకాక పేరులయందు సహితము భేదించి యున్నది మార్కండేయపురాణములో హరిశ్చంద్రుని భార్య పేరు శైబ్య యని యున్నది; స్కాందపురాణములో చంద్రమతి యని యున్నది. మార్కండేయపురాణములో హరిశ్చంద్రుఁడు భార్యాసహితముగా మృతపుత్రుని చితిలోఁ బడి చావఁబోవుచుండగా దేవతలు ప్రత్యక్షమయిన ట్లున్నది; స్కాందపురాణములో హరిశ్చంద్రుఁడు భార్య శిరస్సును చేతి ఖడ్గముతో నఱకఁబోవుచుండఁగా దేవతలు ప్రత్యక్షమయిన ట్లున్నది.

౧. శ్లో. స్వపత్న్యా శైబ్యయా సార్థం బాలకేనాత్మజేన చ,
ప్రవజతో సర్వతో రుధ్వా పంథానం ప్రాహతం మునిః

[మార్కండేయపురాణము]

"వ. ఇట్లు వర్జితాశేషవిభూషణుండై తరువల్కలంబులు ధరియించి
యన్నరేంద్రుఁడుశైబ్యయైన ధర్మపత్నియుం దనయుండును దాను
నిలు వెడలు సమయంబున నమ్మునికుంజరుం డతవి కడ్డంబు
వచ్చి".   [మారనకృతాంధ్రమార్కండేయపురాణము]

౨. శ్లో. శ్రుత్వా రాజా తదావాదీ దేవమస్తు శుచివ్రతేః
తతః కృత్వా చితాం రాజా చారోప్య తనయం స్వకమ్,
భార్యయా సహిత శ్చాసౌ బద్ధాంజలిపుట స్తదా,
చింతయన్పరమాత్మాన మీశం నారాయణం హరిమ్.

[మార్కండేయపురాణము]

క. అనవుఁడు నొడఁబడి విభుఁ డిం
ధనములు సొదగా నొనర్చి దానిపయిఁ దనూ
జుని నిడి భార్యయుఁ దనపిఱుఁ
దన నిలువం గేలు మొగిచి తత్పరమతియై.

....

క. నారాయణుఁ బీతాంబరు
శ్రీరమణీరమణు భక్తచింతామణి దు
ర్వార విపద్ద్విపకుంభవి
దారణనిపుణాభిధానదై వతసింహుణా.

సీ. తలఁచుచునున్న యా ధరణీశునొద్దకు
ధర్ముండు మొదలుగాఁ దక్షణంబ
....వచ్చి రపుడు.

[మారయకృతమార్కండేయపురాణము]

౧. శ్లో. భార్యాం చంద్రమతీం ప్రాహ దుస్స్వప్నపరిపీడితః
మయి నిద్రాముపగతే దుస్స్వప్న స్సమజాయత.

[స్కాందపురాణము]

౨. శ్లో. తతో రామ మహేష్వాసో నిశితేన వరాసినా,
జఘాన తచ్ఛిర స్త్రీవ్రం పశ్యతాం త్రిదివౌకసాం.
పున రాదాయ తం ఖడ్గం తచ్ఛిరః ఛేత్తుముద్యతః,
తస్యాశ్శిరసి తత్ఖడ్గః పపాత సుమదామవత్,
తత్రాంతరే సర్వదేవా హాహేతిప్రియవాదినః.
తత్రాగత్య ముదావిష్టా స్తత్కరం జగృహు స్తతః.

[స్కాందపురాణము]

ఈ రెండు కథలలో మార్కండేయపురాణములోనిది యుత్తరహిందూస్థానములోను, పశ్చిమ హిందూస్థానములోను వ్యాపించి యున్నది. స్కాందపురాణములోనిది దక్షిణహిందూస్థానములో వ్యాపించి యున్నది. ఈ స్కాందపురాణములోని హరిశ్చంద్రకథనే మొట్టమొదట గౌరనకవి ద్విపదకావ్యముగాఁ దెనిగించెను. తరువాత శంకరకవి, శరభకవి, మల్లారెడ్డి మొదలైనవారు దీనిని పద్యకావ్యములనుగా జేసిరి. గౌరనకవి ద్విపదకావ్యము మృదుమధురపదసంఘటిత మయి లోకోక్తిస్వభావోక్తి సంయుతమయి ప్రౌఢమయి హృదయంగమముగా నున్నది. ఈతని భాషాంతరీకరణకౌశలమును తదితరకవులకు నితనికిం గల తారతమ్యమును దెలుపుటకయి రెండు, మూఁడుదాహరణము లిచ్చుచున్నాను.

౧. ద్వి ఓజ దధ్యాజ్యశాల్యోదనమాంస
భోజనంబులు పరిపూర్తిగా మెసఁగి
మత్తులై వర్తిల్లు మానవేశ్వరులు
సత్తుగా బొంకుట సత్య మెయ్యెడను;
జనపతుఁ లే యూరు? సత్య మే యూరు?
వినఁగూడ దీ మాట విడువుము చాలు. [గౌరనమంత్రి]

శ్లో. శాల్యన్నం సఘృతాపూపం భక్షయిత్వా వద త్యసౌ,
నిర్వాహ్య మేవ వక్తవ్యం సభాయాం దేవసత్తమ,
క్వ రాజానః పాపకృత్యాః ? క్వసత్యం దేవదుర్లభమ్ [స్కాందము.]

ఉ. ఒత్తుగ మాంసము న్మడుగుటోగిరమున్ ఘృతశర్కరాదులున్
గుత్తుకబంటిగా మెసఁగి క్రొవ్వి వధూరతితంత్రలీలలన్
మత్తిలి దేహము ల్మఱచి మాటికి బొంకు నృపాలకోటికిన్
సత్తు దలంప నెక్కడిది ? సంయమి నీ కిటు పల్కఁ బాడియే.
[శంకరకవి.]

ఉ మోదముతో నిరంతర మపూపఘృతప్లుత శాకమాంసశా
ల్యోదనము ల్భుజించి వివిధోరువధూరతితంత్రలీలచే
మాదృశు లెవ్వ రంచుఁ గడు మత్తిలి యున్న నరేంద్రకోటికిన్
బాదుకొనంగ నేర్చునె శుభప్రదసత్యవిశేషచిహ్నముల్ ? [శరభకవి.]

౨ ద్వి. ఆటదానికి వశమమ్మ యీ మేటి
కోటలు దాటి యీగోడలు దాటి
తాళంబు లెడలించి తలుపులు దెఱచి
కేళిమై రొప్పు జాగిలముల మొఱఁగి
దాది వాకట్టి భూతలనాథుపట్టి
నాదట నీరీతి నత్తొత్తి చంప ? [గౌరనమంత్రి.]

శ్లో. మానుషీ చే త్కథం కుర్యా దియం ప్రాకారలంఘనం ?
కథం గచ్ఛతి భూపాలసదనం జనరక్షితం
ఆయుధైః కీలకైః ర్వ్యాప్తాన్ కవాటపిహితాన్ బహూన్,
ఉత్పాట్యాంతఃపురం గత్వా కథం పుత్రం హనిష్యతి. [స్కాందము.]

మ. జలజాతాక్షికి శక్యమే మనముసం జర్చింప నిర్భీతిఁ గో
టలు లంఘించి కవాటము ల్దెఱచి చండస్ఫూర్తిమై నుండు కు
క్కల వాకట్టి నృపావరోధగృహభాగంబు ల్ప్రవేశించి ని
శ్చలత న్సాహసలీల రాకొమరు నాశ్చర్యంబుగాఁ జంపఁగన్. [శంకరకవి

౩ ద్వి అంతుగా నాబోతు అంకె వేసినను
గంతులు దక్కునే కంఠీరవంబు ?
కల్లజంజాటంబు కౌశిక ! యిచటఁ
జెల్లదుసుమ్ము వసిష్ఠుఁ డుండంగ
నురగకంకణుతోడ నూరజోగులను
సరిచేసి యెన్నినచందాన నీవు
సమితసత్యవ్రతుండగు హరిశ్చంద్రు
సమముగా నృపపిశాచముల లెక్కింతు. [గౌరన.]

చ. క్రమ మెఱుఁగంగలేక ఫణికంకణుతోడుత నూరజోగులన్
సమముగఁ జూచిన ట్లమితసత్యచరిత్రు జగత్పవిత్రు దు
ర్దమరిపురాజికాననవిదాహసముజ్జ్వలవీతిహోత్రు స
ద్విమలవిచిత్రగాత్రుఁ బృథివీజనచారుసరోజమిత్రునిన్.

క. నిరతప్రతాపజితభా
స్కరుఁడు హరిశ్చంద్రసుగుణసాంద్రునితోడన్
గురు తెఱుఁగలేని కతమున
సరిచూతురె నృపపిశాచపఘమునెల్లన్. [శరభకవి.]

౪. ద్వి. నీ వొకండవె కావు నినువంటి మునులు
వేవురు గూడి వేవేలచందముల
మాయలు పన్నిన మరులుకొల్పినను
పాయని యిడుమలపాలు చేసినను
జననుతుఁడగు హరిశ్చంద్రభూవిభుఁడు
మనసున వాక్కున మఱి చేతలందుఁ
గలలోన నైనను ....
........తా నాడినమాట బొంకండు. [గౌరన.]

ఉ. భూతలమందుఁ జేరి నినుఁబోలు మునిప్రవరుల్ సహస్రసం
ఖ్యాతశతాయుతంబు లధికంబుగ మాయలు పన్ని దుఃఖసం
జాతమనస్కుఁ జేసిన నిజంబుగ నెమ్మది నిల్వఁ దెన్న ని
ర్ధూతకళంకుఁ డాతఁ డసృతోక్తులు దాఁ గలలోన నేనియుః. [శరభకవి]

౩. ద్వి. వరుస నిక్ష్వాకుభూవరునాఁటనుండి
పరిణామ మెసఁగ మీ పదములచెంతఁ
జల్లగా మహి చెల్లచనువులు మాకుఁ
జెల్లగా నుంటిమి, చెల్లఁబో నేఁడు
మదిలోన నిటు దయమాలి కుంద్ఁగ
వదలక యీ మునివ్యాఘ్రుఁబువాతఁ
బొదివి త్రోచెదు పశుపుంజంబువోలె

* * * *

గజిబిజి నొంది యిక్కడఁ దల్లి లేని
ప్రజలమై బాములఁ బడఁజాల మేము. [గౌరన.]

మ. అలఘుప్రాభవ ! మమ్ము మీర లిది పర్యంతంబు సత్ప్రేమచేఁ
దలిఁదండ్రిన్ మఱపించి పెంచి పటులోద్యత్క్రోధివై నేఁడు బె
బ్బులివాతం బడఁద్రోచి పోవఁదగునే ? భూనాథ ! మానేర మే
వలనం జూచితి ? వైనఁ గావఁ దగదే వర్ణింప ముమ్మాటికిః.

[శంకరకవి.]

౪. ద్వి. అనఘాత్మ ! నీకోమలాంఘ్రిపద్మమ్ము
ఘనవజ్రమకుటసంగత మైనయట్టి
నా మస్తకంబు మిన్నక సోఁకి నొచ్చె
నేమి త పొందవె నాయెడఁ జెప్పుమనిన
గిటగిట పండ్లను గీటి కౌశికుఁడు
చిటచిట మిడుగుర్లు చెదర వీక్షించి
తలపోయ నొక పాదతల మన నేల ?
కలయంగ నిఖిలాంగకంబులు నొచ్చె. [గౌరన.]

చ. అనఘచరిత్ర! మీ మృదుపదాబ్జము మామకరత్నయుక్త కాం
చనమకుటంబుతో నొరసి చాలఁగ నొప్పి వహించె; నే నొన
ర్చిన యపరాధ మేది యిటు చేయఁగ? నానతియిండు నావుడున్
మునికులముఖ్యు డిట్లనియె మో మరుణాంబుజకాంతి నీనఁగన్.

క. ఒకపాద మనఁగ నేటికి?
సకలాంగంబులును నొచ్చె సాహసవృత్తిన్
మొకమోడక నీచేసిన
సకుటిలకృత్యముల మాకుఁ జర్చింపఁగన్. [శంకరకవి]

శ్లో. పీడితో య స్మహాభాగ! పాద స్తే నీరజోపమః,
కరినోజ్జ్వలపాషాణ కిరీటే వినియోజితః,
తత స్తం ప్రాహ కుపితో విశ్వామిత్రో మహాతపాః,
న మే ఖిన్నం పాదమాత్రం సర్వాంగం త్వద్విచేష్టితైః

[స్కాందము]

గౌరనకవి రచియించిన రెండవ ద్విపదకావ్యము నవనాధచరిత్రము ఈ శివ కథలలోని మూడవ యాశ్వాసములోని ముఖ్యకధ ఒక బ్రాహ్మణుఁడు సౌందర్యవతియు, యౌవనవతియు నైన రాజపుత్రిని గామించి మాయోపాయముచేత నామెను దక్కించుకోఁ దలఁచి యా రాజపుత్రి రాజమందిరమునం దుండుటవలన రాజ్యమును, రాజవంశమును నిర్మూలమగుననియు, ఆ యాపద తొలగించుటకయి యామెను స్వర్ణరత్నాభరణపూర్ణమయిన యొక మందసయం దుంచి తలుపుమూసి దాని నొక తెప్పమీదఁ బెట్టి నదీప్రవాహములో విడువవలయుననియు, చెప్పి రాజును నమ్మించి యొప్పించి, రాజా ప్రకారముగాఁ జేసినపిమ్మట నేటివాలునఁ బడి కొట్టుకొని పోయెడి పెట్టెను బట్టుకొని యొడ్డునఁ బెట్టి మఱుఁగుస్థలములోఁ బదిల పఱుపుఁడని ముందుగానే శిష్యులను నియమించి యుంచెను జ్యోతిషఫలము నం దగాధవిశ్వాసము గల యా రాజశిఖామణి విప్రవాక్యమును వేదవాక్య

ముగా విశ్వసించి తన కన్నకూఁతురును ప్రజాహితార్థముగా మందసలోఁ బెట్టి దుఃఖముతో నేటినీటఁ ద్రోయింపఁగాఁ బ్రవాహవేగమునఁ గొట్టుకొని పోవుచున్న యా పెట్టెను పరిసరారణ్యమునందు వేఁటాడి డస్సి దప్పితీర్చు కొనుటకయి యేటియొడ్డునకు వచ్చిన యొక రాజకుమారుఁ డొడ్డునకుఁ బట్టించి తలుపులు తెఱచి దానిలో రెండవ రతీదేవివలెఁ బ్రకాశించుచున్న యా రాచకన్నెను చూచి వలచి తద్వృత్తాంత మడిగి తెలిసికొని స్వర్ణాలంకార సహితముగా గాంధర్వవివాహమున నామెను పరిణయమయి యా మందసలోఁ దాను వేటాడి పట్టుకొన్న భల్లూకము నొకదానిని బెట్టి తలుపులు వేయించి యథాపూర్వముగా మందసను నదీప్రవాహమునఁ ద్రోపించెను. పెట్టె నెదురు చూచుచు నేటియొడ్డున దిగువను వేచియున్న శిష్యులు తమవంకకు వచ్చు చున్న పెట్టెను దరికి లాగి యొక సురక్షితస్థలమునఁ జేర్చి గురువురాకకు బ్రతీక్షించుచుండఁగా, వింతలో సంధ్యాసమయమున బ్రాహ్మణుఁ డక్కడకు వచ్చి చూచి సంతోషించి శిష్యులను శ్లాఘించి శిష్యులకు వేఱు పనులు కల్పించి వారి నందఱిని సాగనంపి తా నొంటిగా మందసను తెఱచునప్పటి కందులో నున్న యెలుఁగుగొడ్డాతనిమీఁదఁ బడి కఱచి కండ లూడఁదీసెను. ఈ కథలోనిభాగము లక్కడక్కడివి కొన్ని యిం దుదాహరింపఁబడుచున్నవి.

ద్వి. చెడితిరా నిఁక నేమి చేయుదుఁ జనుచుఁ
గడుపును బిసుకుచుఁ గటకటా ! యనుచు
నిలిచినచో నొక నిమిషార్ధమైన
నిలువనోపక కూడు నీళ్ళను బాసి
కడుజాలిఁ బొందుచుఁ గన్నులలోన
వడి తేలు కుట్టినవానిచందమున
వెడఁగురీతిని కడు వేదనఁ జాల
నడరుచు నొక యుపాయమును జింతించి.

*　*　*　*

విను వినకుండుము వివరించుకొనుము
కొనకుండు మనుచును గుటిలాత్ముఁ డతని
చెవి డాసి కూఁతురుచేవ్రాఁతఫలము
వివరించి చూచితి విను మీ కుమారి
నీయింట నుండిన నీవు నీప్రజలు
నీయేలు దేశంబు నిర్మూల మగుదు
రన విని భీతితో నతఁ డాడుమాట
తనకు నంతకుమున్న తార్కాణ యగుట
తలపోసి యక్కటా! తల్లి పెంచినది
యెలమి నీబాలిక నేగతి విడువ
నొడఁబడు బుద్ధి నీయువిదయె నాకుఁ
గొడు కైనఁ గూఁ తైనఁ గూర్మి నెక్కొన్న.

* * * *

వెఱతుము నీమాట వేరెడుఁ గడవ
నెఱిఁగింపు మీ పాప నేమి చేసెడిది?
నావుడు సిద్ధించె నాకోరి కనుచు
భావంబులోపలఁ బ్రమదంబు నొంది
యాతఁ డిట్లనె వసుధాధిప! మిగుల
చాతురిగా మందసంబును జేసి
యా లోన మణికనకాంబరాభరణ
జాలంబుతోడ నీ చపలాక్షి నునిచి
తలుపులు వదలించి తగుతెప్పఁమీదఁ
బొలుపొంద నునిచి యుప్పొంగుపెన్నీట
వెసఁ బాఱవిడిచిన వేవేగ శుభము
లెసఁగు మీకెల్లను నెలనాగభాగ్య

....

నృపతి యాకన్యపాణిగ్రహణంబు
విపులసమ్మదమున వెలయఁ గావించి
మనమార మొదల నమ్మందస మున్న
ఘనమైన వస్తువుల్ గైకొని యందుఁ
బూని తా నంతకు మున్ను వేటాడి
బోనిలోఁ దెచ్చిన భూరిభల్లుకముఁ
జొరఁగొట్టి తలుపు లచ్చులు వదలించి
తిరముగాఁ దొల్లిటి తెప్పపై నునిచి
యేటఁ బో విడిచి యా యింతిఁ దోడ్కొనుచు
ఘోటకభటదంతికోటులతోడఁ
దనపురి కేఁగెను దదనంతరంబ
యనువునఁ జనుచున్న యా మందసంబు
వడుగులు గని యుబ్బి వడిఁ గుప్పిగంతు
లిడుచు నొండొరుల బల్విడిఁ గేక లిడుచుఁ
గొట్టి అంకెలు వేసికొనుచుఁ జెలంగి
పట్టి మందసఁ దెచ్చి పరఁగ నయ్యేటి
పొంత ప్రబ్బినప్రబ్బపొదలలో నునిచి
సంతసం బెసఁగ నొజ్జలరాక కెదురు
చూచుచునుండ నచ్చోటను విప్రుఁ
డే చేటుపాటుఁ దా నెఱుఁగక దక్క
రాచకూఁతురు మనోరథసిద్ధి యెసఁగె
నాచపలాక్షిఁ జయ్యనఁ బొందకున్న
నేచిన యీ మనం బె ట్లాపవచ్చు ?

....

చలమున బ్రహ్మరాక్షసుఁడనై నిన్నుఁ
బొలియింప కిఁక నెటుఁ బోవనీ న్నమ్మ

మలయజగంధి నాపాటకు మాఱు
పలుకవు సక్కిళ్ల పడియెనో చెవుడు
తొడరెనో పెనుముద్ద దురిగిరో నోర
నెడదవ్వులను మాట లేల మా కనుచు
వెలుపల దోవతి వేసి లోపలికిఁ
దలయెత్తి మోకాళ్ళ తడపుచుఁ జొచ్చె.

....

నలుపారు నెలుఁగుతిన్ననితోఁకఁ జూచి
ప్రీతిమై రాకొమారితవేణి యనుచుఁ
జేతఁబిగ్గరఁబట్టి చేరఁ దిప్పుటయు
గొటగొట గోంట్రించి కోఱ లొండొంటిఁ
గటకటఁ దాఁకింప గర్భంబు గలఁగి
హా తాత! హా మాత! యనుచు మోచేతు
లూఁతగా వెనుకకు నొరిగి వెలికలఁ
బడి పాఱుకొని గుండె బలువిడి నడిచి
పడఁగ నెఱుంగని బాతశింపఁగను
నత్తఱి విప్రుపై నదరంట నుఱికి
క్రొత్తనెత్తురు లొత్తఁ గ్రొవ్వాడిగోళ్ళ
జిల్లులు వోవంగ శిరమును నురము
గుల్లలతిత్తిగాఁ గొట్టియు మెడయుఁ
జరణయుగంబుఁ గక్షములు నురంబుఁ
గరములు జిగిబిగిగా నొగిలించి
విడిచె నంతటితోడ విటశిఖామణికి
నడఁగెఁ దొల్లిటివిషయపువేధ లెల్లఁ;
గెరలి భల్లూక మీ క్రియఁ దన్నుఁ గఱువ
హరిహరి! గోవింద! యయ్యరో యనుచుఁ

దఱియంగఁబడియె నంతయుఁ బోలఁ జూచి
మఱి వచ్చి వడుగులు మందసఁ గదిసి
వగచుచుఁ జేరి మీవంటి పెద్దలకుఁ
దగిలె నీదురవస్థ దైవయోగమున. *

* [గౌరనమంత్రి సారంగధర చరిత్రమను ద్విపద కావ్యమును రచించెనని కొందఱు తలంచుచున్నారు. సారంగధరుని కథ నవనాథ చరిత్రమునందే వచ్చుచున్నది. దానిని జూచియే కొందఱు గౌరన సారంగధర చరిత్రను ప్రత్యేకముగా వ్రాసినట్లు భ్రాంతిపడి యుండవచ్చును]

దగ్గుపల్లి దుగ్గయ్య

ఈ కవి భారతానుశాసనికపర్వములోఁ జెప్పఁబడిన కథ ననుసరించి * నాచికేతూపాఖ్యానమును రచియించి యనంతామాత్య గంగన కంకితము చేసెను. దుగ్గయకవి శ్రీనాథమహాకవిశిష్యుఁడును, మఱియు నయి యుండెను; శ్రీనాధుని భార్యతమ్ముఁ డనియు నాతనియొద్దనే యుండి చిన్న తనమునందు విద్యాభ్యాసము చేసెననియు తోఁచుచున్నది. ♦ నాచికేతూపాఖ్యానాశ్వాసాంతగద్య మి ట్లున్నది.

గద్య ఇది శ్రీమత్కమలనాభపౌత్ర మారయామాత్యపుత్రకవిసార్వ
భౌమ సకలవిద్యాసనాథ శ్రీనాధమహాకవీంద్ర ప్రసాదలబ్ధకవి
తావిశేష దగ్గుపల్లి తిప్పనార్య ప్రియతనూజ దుగ్గననామధేయ
ప్రణీతంబైన నాసికేతూపాఖ్యానంబను మహాప్రబంధంబునందు
&c

కృతిపతి కవి నుద్దేశించి యిట్లనియెను.

క హితమతివి సకలవిద్యా
చతురుండవు చాటుపద్యజాలంబుల నా
కతులితకీర్తులు కలిగిం
చితి దుగ్గనకవివరేణ్యా! శివకారుణ్యా!

---

* [దుగ్గయకవి గ్రంథము 'నాసికేతోపాఖ్యానము' గాఁ బ్రసిద్ధము.]

♦ [దుగ్గయకవి నివాసమైన దగ్గుపల్లి యేదియో నిశ్చయింపఁ జాలమనియు, కృష్ణాజిల్లా. బందరు తాలూకాలోను, గుంటూరు జిల్లా తెనాలి తాలూకాలోను కూడ దగ్గుపల్లి కలదఁట! బాపట్ల తాలూకాలోఁ గల దగ్గు బాడయినను, ఇతని నివాసము కావచ్చునఁట! (ఆంధ్రకవి తరంగిణి సం, 6 పుట 101)]

సీ. సంస్కృత ప్రాకృతశౌరసేనీముఖ్య
భాషాపరిజ్ఞానపాటవంబు
పన్నగపతిసార్వభౌమభాషితమహా
భాష్యవిద్యాసమభ్యాసబలము
నక్షపాదకణాదపక్షిలోదీరిత
న్యాయకళాకౌశలాతిశయము
శ్రుతిపురాణాగమస్మృతిసాంఖ్యసిద్ధాంత
కలనవ్యుత్పత్తిగౌరవంబు

పూర్వకవిముఖ్యవిరచితాపూర్వకావ్య
భావరససుధాచర్వణప్రౌఢతయును
గందళింపంగఁ గాశికాఖండనైష
ధప్రముఖవివిధప్రబంధము లొనర్చి.

సీ. కవిసార్వభౌముఁడై కర్ణాటవిభుచేతఁ
గనకరత్నాభిషేకములు గనిన
శ్రీనాథసుకవి కూరిమిచేయు మఱఁదివి
దుగ్గయకవిరాజ! దగ్గుపల్లి
తిప్పనార్యునకు సతీమణి యెఱ్ఱమ
కునుఁ దనూజుఁడవు పోతనకు నెఱ్ఱ
నామాత్యవరునకు ననుఁగుఁదమ్ముండవు
శాండిల్యగోత్రుఁడౌ సరసమతివి

చెప్పనేర్తువు కృతులు సుస్థిరముగాఁగఁ
గాన నీవు రచింపంగఁ గడఁగియున్న
నాసికేతుచరిత్రంబు నాదు పేర
నంకితము సేయు కవిరాజ! యాదరింప.

ఉ. మా పినతండ్రి గంగయయమాత్యశిఖామణి తత్తనూభవుం
డై పెనుపొందు దేవసచివాగ్రణి కిచ్చితి వంధ్రభాషఁ గాం
చీపురనాథు దివ్యకథ చిత్రతరంబుగ విస్తరించి నీ
వోపుదు వార్యహృద్యమధురోక్తుల సత్కృతు లొప్పఁ జెప్పఁగన్.

ఇతఁడు తన విద్యాగురువును, బావయు నైన శ్రీనాథునిపాండిత్య ప్రభావ మును వర్ణించుచు నాతఁడు కర్ణాటవిభునిచేత కనకరత్నాభిషేకమును పొందిన వృత్తాంతమును గూడఁ జెప్పి యున్నాఁడు. కవి దగ్గుపల్లి తిప్పనార్యునకును నెల్లమకును పుత్రుఁడు; శాండిల్యగోత్రుఁడు; పోతనకును నెల్లనకును దమ్ముఁడు ఈ గ్రంథమును రచియించుటకు ముందే యీ కవి కాంచీపుర మాహాత్మ్యమును రచియించి కృతిపతి పినతండ్రి కుమారుఁ డైన దేవయా మాత్యున కంకిత మొనర్చెను. కృతిపతియైన చెందలూరి గంగామాత్యుఁడు మాధవవర్మవంశమువాఁడైన తమ్మరాజుయొక్క కుమారుడగు బసవ నృపాలున కాప్తసచివుఁ డైన ట్లీ క్రింది పద్యమునఁ జెప్పఁబడెను.

సీ. చతురంగబలము విజయవాడదుర్గాంబ
వరమునఁ బడసి దుర్వారలీల
జగతీస్థలం బెల్ల సాధించి జయశాస
నములు దిగ్దంతిదంతముల సలిపి
పేదబాలునకుఁగాఁ బ్రియసుతమోహంబు
పట్టక బెజవాడపాడి నిలిపి
కలయంగఁ బురమునఁ గాంచనవర్షంబు
గురియించి దేవతాకోటి పొగడ

వసుధ నెగడిన మాధవవర్మవంశ
వర్ధనుండగు తమ్మభూవరుని బసవ
పార్థివున కాప్తుఁడై కృపాపాత్రుఁ డగుచు
ఘనత మెఱసె ననంతయగంగవిభుఁడు.

విశాఖపట్టణమండలములోని విజయనగరసంస్థానాధిపతులగు పూసపాటివారు తా మీ మాధవవర్మసంతతివార మని చెప్పుకొందురు. కృతిపతియైన గంగామాత్యు డొకనాడు కొలువుండి

"క. సరసులు సుకవీంద్రులుఁ దను
బరివేష్టింపంగఁ గావ్యబంధురగోష్ఠి
పరుఁ డగుచు నుండి యస్మ
త్సరసవచోవైఖరుల హృదయమునఁ దలఁచెన్

వ. తలఁచి యప్పుడు పరమానందంబున సామాజికులం జూచి యిట్లనియె

చ. శ్రుతుల విహారదేశములు సుస్థిరవాక్యపదప్రమాణశా
స్త్రతతులయిక్క లాగమపురాణచయమ్ముల కేళిసద్మముల్
స్మృతులనివాసముల్ కవిసమీహితసత్కవితాగుణప్రసా
దితములు దగ్గుపల్లికవితిప్పయదుగ్గని గద్యపద్యముల్."

అన్నట్లు కవి కృత్యాదిని జెప్పెను. దుగ్గన శ్రీనాథునికాలములో బాల కవియయి యాతని యనంతరముననే కాంచీమాహాత్మ్యమును, నాచికేతూపాఖ్యానమును జేసినట్టు కనఁబడుచున్నాఁడు. కృతిపతికాలమును బట్టి విచారింపఁగా నీకవి ౧౪౫౦ వ సంవత్సరప్రాంతమువఱకు నుండి కావ్యరచనము చేయుచుండిన ట్టూహింపఁదగి యున్నది. నంది మల్లయ్యయు, ఘంటసింగయ్యయుఁ గలిసి తాము రచించిన ప్రబోధచంద్రోదయ పద్యకావ్యము నీ గంగయామాత్యునకే యంకితము చేసిరి. అటు తరువాత నీ కవులే తమ వరాహపురాణమును ౧౪౦౩ వ సంవత్సర ప్రాంతమునందు రాజ్యపాలనము చేయుచుండిన కృష్ణదేవరాయని తండ్రియైన నరసింహదేవరాయనికిఁ గృతి యిచ్చిరి. గంగయామాత్యుఁడు సాళువ నరసింహరాయని కాలములో నుండక తత్పూర్వమునందే యుండినవాఁ డనుకొన్నను ౧౪౫౦ వ సంవత్సరప్రాంతమువఱకైన నుండి యుండవలెను. ఆ వఱకే కాంచీపురమాహాత్మ్యమును రచియించి తరువాతనే నాచికేతూపాఖ్యానమును రచియించి

యుండుటచేత నీ కడపటి పుస్తకము ౧౪౮౦వ సంవత్సరప్రాంతముల యందు రచియింపఁబడి యుండును. నాచికేతూపాఖ్యానములోని మొదటి మూడాశ్వాసములు మాత్రమే యిప్పుడు కనఁబడుచున్నవి గాని సంపూర్ణ గ్రంథ మెక్కడను లభింపకున్నది. ఈతఁడు రచియించిన కాంచీపుర మాహాత్మ్యమును జదువఁగల భాగ్యము నాకు లభింపలేదు.*

దుగ్గనకవిత్వము సలక్షణమయి సరసమయి సకలజనాదరణీయముగా నున్నది. ఈతని కవిత్వశైలి తెలియుటకయి యీతని పుస్తకములలోని కొన్నిపద్యముల నిం దుదాహరించు చున్నాను

మ. మకరందంబులఁ దొప్పఁదోఁగి వికచన్మందారమాకంద చం
పకసౌరభ్యముఁ బూని లేఁజిగురుజొంపంబు ల్కొగిం జొచ్చి పా
యక మందానిలుఁ డెందుఁ గ్రుమ్మఱుఁ దపోవ్యాప్తిశ్రమత్తాపసీ
సకలాంగోదితఘర్మవారికణికాజాలంబు నింకించుచున్. ఆ ౧.

ఉ. ము న్నొకనాఁటిరాత్రి కనుమూసినచోఁ గల వచ్చి వేడుకన్
నన్ను దృఢోపగూహనమునం గరఁగించి మొఱంగి చన్న యా
పిన్నది గాదె యీ యువతి పెక్కువ నొందిన దిప్డు నాఁటికిం
గన్నియ గానఁ బ్రాయ మిది గామి నెఱుంగఁగరాదు గ్రక్కునన్.

ఉ. కోమలి వింటివే యతఁడు కూరిమిపుత్త్రుఁడు నాకు మున్ను పెం
దామరమొగ్గలోన విదితంబుగ దాచినయట్టి తేజమున్
మామక మించుకేని యనుమానము లే దిది తథ్య మిమ్మెయిన్
దామరసప్రసూతిచెయిదంబులు వట్రిలె నిట్టిచందముల్.

చ. జిలిబిలిముద్దుచేఁతలకు సిగ్గులవిగ్గులు వన్నెవెట్ట వే
నలి యరవీడుచుండఁ జరణంబులు తొట్రిలఁ గ్రాలుఁగన్నులం
దొలఁకెడు మందహాసములు తొంగలిఱెప్పలలోన డాఁగఁగా
నలికులవేణి యోసరిలె నల్లన పయ్యెద నోసరించుచున్.

* [కాంచీపురమాహాత్మ్యమింతవఱకును లభింప లేదు.]

ఉ. సౌహృద మొప్పఁగా గురుని సమ్మతి నాథుఁడు వేలిపింప వై
వాహిక వహ్నికీలముల వామవిలోచన లీల వేల్చులా
జాహుతి చూడ నొప్పెసఁగె నప్డు కళాధరఖండభృజ్జటా
వ్యూహములోపలం దొరుగుచుండెడు వేలుపుటేటికై వడిన్.

ఆంధ్రపరిషత్పుస్తకభాండాగారములోని యుదాహరణగ్రంథములో దగ్గుపల్లి దుగ్గన శివకంచిమాహాత్మ్యములోనిదని యీ క్రింది పద్య ముదాహరింపఁబడినది.

సీ. బంధూక మెఱమించెఁ బరువయ్యె గేదంగి
కడిమి పుష్పిత మయ్యె గ్రంథి పూచె
నర్జునం బలరారె నరవిందములు గ్రుస్సె
భూస్థలి నేరులు పుక్కిలించె
గండూపదము లుబ్బెఁ గలఁగె హంసచయంబు
నటియించెఁ గప్పలు నమిలి చెలఁగె
చాతకంబులు మించె సాగరం బెదయించె
హరిగోపములతోడ నాటె వేళ్ళు

మత్తభృంగములకుఁ దేనె రిత్త యయ్యె
గండుఁగోయిలకూఁతలు కట్టువడియె
చూలుకొనె స్వాతి కొక్కెరజూటిఁ బొదవె
విష్ణునకు నిద్రవోయెడువేళ యయ్యె.

ఆ పుస్తకమునందే విష్ణుకంచిమాహాత్మ్యమును ఆంధ్రకవి రామయ్యచెప్పినట్టిందులోనిపద్యము లుదాహరింపఁబడినవి.*

* [శివకాంచీమాహాత్మ్యములోని వేఱొక సీసపద్యము కూడ శ్రీ ప్రభాకర శాస్త్రిగారు కూర్చిన 'ప్రబంధ రత్నావళి' లోఁ గలదు.]

భైరవకవి

ఈ కవి శ్రీరంగమహత్త్వమును, రత్నశాస్త్రమును, కవిగజాంకుశమును జేసెను. వీనిలో శ్రీరంగమాహాత్మ్యము ప్రధానమైనది. ఈ గ్రంథము చాగయామాత్యుని పుత్రుఁడైన రాఘవమంత్రి కంకితము చేయఁబడినది. రామామాత్యుఁ డని నామాంతరము గల యీ రాఘవమంత్రి మాధ్వుఁడని తోచుచున్నది. ఇతఁ డే కాలమునందుండెనో యే రాజుమంత్రియో పుస్తకమువలనఁ దెలియరాదు. అయినను కృతిపతి యన్న విఠ్ఠలేశ్వరుఁ డీ విధముగా వర్ణింపఁబడెను.

సీ. చండదిగ్వేదండకాండధూర్వహమహీ
మండలోద్ధరణసమర్థ మగుచు
దుర్వారవైరిపంధిసర్వసంపద్గర్వ
నిర్వాపణక్రియానిపుణ మగుచు
వేదాదివిద్యావినోదవిద్వజ్జనా
మోదాతిశయసముత్పాది యగుచు
జంభజిన్మదకుంభికుంభినసాధీశ
శంభుభూభృద్ద్యుతిస్వచ్ఛ మగుచుఁ
బరఁగు నే మంత్రిభుజబలప్రకటశౌర్య
దానసత్కీర్తు లప్రతిమానమహిమ
నాతఁ డిమ్మడిసైపఖానాధరాజ్య
భారధుర్యుఁడు విఠ్ఠల ప్రభువరుండు.

ఇం దిమ్మడి యనియు, సైపఖా ననియు, రెండు పేరు లుదాహరింపఁబడి యున్నవి. ఈ రెంటిలో నిమ్మడి యనునది ప్రౌఢ దేవరాయని నామాంతరము. ఇమ్మడిదేవరాయ లనఁబడెడు ప్రౌఢదేవరాయలు ౧౪౨౩ మొదలుకొని ౧౪౪౫ వ సంవత్సరమువఱకును రాజ్యపాలనము చేసెను. ఈ విఠ్ఠల

ప్రభుఁ డిమ్మడికి సామంతుఁడుగా నుండిన సైఫఖానునొద్దనో యిమ్మడిసైఫఖాను లిద్దఱియొద్దనో కొలువుండి రాజ్యభారమును తీర్చుచుండి యుండును. * అందుచేత విర్ధలప్రభుని తమ్ముఁడైన రాఘవమంత్రి ౧౪౫౦-౬౦ సంవత్సర ప్రాంతములయం దుండెనని యూహింపవలసి యున్నది. చతుర్థాశ్వాసాంతమునందలి యీ క్రింది పద్యమువలనఁ గృతిపతి సైఫఖానునొద్దనే కొలు వుండినట్లు తోఁచుచున్నది.

శా. ఖాటీవిభ్రమజృంభమాణనిజయోధవ్యూహబాహాధను
ర్జ్యాటంకారవిశంకటధ్వనివిశేషధ్వస్తనిస్తంద్రక
ర్ణాటోదీర్ణబలార్ణ వార్భటితురంగారోహహోదారలీ
లాటోపార్కతనూజ చాగవిభురామామాత్యచూడామణీ.

కృతిపతి యైన రాఘవమంత్రి సభామండపంబునఁ గొలువుండి తన్నుఁ బిలిపించి "శ్రీరంగమహాత్మ్యంబు మదంకితంబుగా నాంధ్రభాషాకౌశలంబు పచరించి రచియింపవలయు నని యభ్యర్థించి" నట్లు చెప్పుచోఁ గవి తన్నిట్లు చెప్పుకొనెను.

మ. కృతవిద్యాఖరశీపరిశ్రమకళాకేళీవిలాసున్ జన
స్తుతచారిత్రుని గౌతమాన్వయపవిత్రుణ్ గౌరనామాత్యస
త్పుత్రుఁ గళ్యాణకవిత్వలక్షణసమర్థున్ సూక్తిముక్తాఫలా
తతకాంతిస్ఫుటచంద్రికోల్లసితవిద్వత్కైరవుణ్ భైరవున్.

అని తాను గౌతమగోత్రుఁడననియు. గౌరనామాత్యపుత్రుడననియుఁ జెప్పుకొని యుండుటచేత భైరవకవి హరిశ్చంద్ర నవనాథచరిత్రములను రచించిన

* ['చండదిగ్వేదండ___' అను పద్యములోని 'ఇమ్మడి సైఫఖానాధిరాజ్య' అనుచోటఁ గల 'ఇమ్మడి' పదము ఇమ్మడి దేవరాయలనెడు ప్రౌఢదేవరాయలను తెల్పదనియు, ఇమ్మడి సైఫఖానన రెండవ సైఫఖానని యర్థమనియు 'ఆంధ్రకవి తరంగిణి' లోఁ జెప్పఁబడినది. (సం. 5. పుట 219)]

గౌరనమంత్రిపుత్రుఁ డేమో యని యూహ కలుగుచున్నది. గౌరనమంత్రి గౌతమగోత్రుఁ డగుటయు, ప్రౌఢదేవరాయలకాలములో నుండుటయు నీ యూహను మఱింత బలపఱుచుచున్నవి గాని నిజముగా తనతండ్రి గొప్ప కవీశ్వరుఁడై యుండినపక్షమున భైరవకవి యా విషయమును దనగ్రంథమునందుఁ జెప్పఁడా యని సందేహము పొడముచున్నది. ఈ సందేహము మాట యటుండఁగా గౌరనామాత్యుఁడు భైరవామాత్యునికుమారుఁ డనుట కొక గొప్ప యాక్షేపణ కనఁబడుచున్నది. భైరవుఁడు కవిగజాంకుశమును రచించెను గదా! గౌరనమంత్రి తాను రచించిన లక్షణదీపికలో కవిగజాంకుశములోని పద్యముల నుదాహరించెను తండ్రి తాను జేసిన గ్రంథములో కుమారుఁడు ముందు చేయఁబోయెడు గ్రంధములోని పద్యముల నుదాహరించుట సంభావ్యము కాదుగదా? అందుచేత లక్షణదీపికలో నుదాహరింపఁబడిన కవిగజాంకుశము భైరవునిది గాక మఱియెవ్వరిదైనఁ బూర్వకవిదయి యైన నుండవలెను; లేదా, గౌరనమంత్రి కీ భైరవుఁడు కుమారుఁడైనఁ గాకుండవలెను. లక్షణదీపికలో నుదాహరింపఁబడిన కవిగజాంకుశ మిది గాక యెప్పటిదో పూర్వపుదనియు, వివిధదేశములనుండి సంపాదించిన తమ యొద్ది నాలుగు (భైరవకవికృత) కవిగజాంకుశప్రతులలోను లక్షణదీపికలో నుదాహృతములైన పద్యములు లేవనియు శ్రీమానవల్లి రామకృష్ణకవిగారు చెప్పుచున్నారు. అల్పకాలములోనే కవిగజాంకుశనామము గల గ్రంథములు రెండు పుట్టె ననుటయు, నంత నమ్మఁదగినదిగా లేదు దీనికి సమాధానముగా నొకటి కవిగజాంకుశ మనియు నింకొకటి కవిరాడ్గజాంకుశ మనియుఁ జెప్పుదురు ఇది యంతతృప్తికరమయిన హేతువు గాదు. అయినను గౌరనభైరవకవుల కాల మించుమించుగా సరిపోవుచున్నది గనుకను, ఇరువురును గౌతమగోత్రులే యగుటచేతను. భైరవకవితండ్రి యెవ్వరో గౌరనయే యగుటచేతను ప్రమాణాంతరములవలన నన్యథా సిద్ధాంత మగువఱ

కును భైరవకవితండ్రి హరిశ్చంద్రోపాఖ్యానాదులు రచించిన గౌరన మంత్రియే యని యంగీకరింతము.*

'ఇది శ్రీమద్భ్రమరాంబావరప్రసాదలబ్ధసిద్ధసారస్వతగౌరన" అని శ్రీరంగ మాహాత్మ్యమునందును,

క. భ్రమరాంబికామహావర
సముదితనిరవద్యహృద్యసాహిత్యకళా
క్రమవిమల ప్రతిభాసం
క్రమణుఁడ మతిశాలి యైనగౌరనసుతుఁడన్.

అని రత్నశాస్త్రమునందును,

క. శ్రీమత్పరమశివానన
తామరసవికాసలీలఁ దనరినభ్రమరాం
బామధుమత్తభ్రమరిక
నామానససరసిరుహమునన్ వసియించున్.

అని కవిగజాంకుశమునందును, భ్రమరాంబావరప్రసాదమువలనఁ దనకుఁ గవిత్వసంపద గలిగినట్లు కవి చెప్పుకొని యున్నాఁడు. ఈతని కవిత్వము పీఠికయందు పొగడినంత యుత్తమమైనది కాకున్నను గంగాప్రవాహము వలె ననర్గళధార కల దయి, యుభయభాషాపాండిత్యాతిశయసంసూచకమయి

* [భైరవకవి హరిశ్చంద్ర, నవనాథచరిత్రముల కర్తయైన గౌరనపుత్రుఁడని యూహించుటకుఁ జాలినన్ని యవకాశము లున్నను, కవిగజాంకుశములోని పద్యములు లక్షణదీపికయం దుదాహరింపఁబడుటచే, - కుమారుని పద్యములు తండ్రి యుదాహరించుట అసంభావ్యము గాన - ఇర్వురును తండ్రి, కుమారులని తలఁచుట కుదరదని కొందఱి యాశయము. లక్షణదీపికలో 'కవిగజాంకుశము' లోని పద్యము లుదాహరింపఁబడుట వాస్తవమే! అయినను, గుణగ్రాహియగు తండ్రి కుమారుని గ్రంథము నుండి యుదాహరించుటయు, కుమారుఁడు చిన్నతనముననే రచయిత యగుటయు నసంభావ్యములు కానేఅవని తోఁచుచున్నది. ఇట్టి పద్ధతి సంస్కృత వాఙ్మయము నను గానవచ్చుచున్నది]

హృదయంగమముగా నున్నది రత్నశాస్త్రమగస్త్యుఁడు సంస్కృతమున రచించిన మణిలక్షణమునకుఁ దెనుఁగని యీ పద్యమువలనఁ దెలియవచ్చు చున్నది.

క. తన్నుఁ బ్రియమార వేఁడిన
మున్ను మునీంద్రుల కగస్త్యముని చెప్పిన యా
సన్నుతమణిలక్షణములు
చెన్నుగఁ గ్రోడీకరించి చెప్పెదఁ దెలియన్

ఈతని గ్రంథములలో నొక్కొక్కదానినుండి రెండేసి పద్యముల నిందుదాహరించుచున్నాను.

1. శ్రీరంగమాహాత్మ్యము.

చ. తలపులు నిక్క నిక్కపుముదమ్ములఁ దమ్ముల సంచలించు ప
య్యలులకు లోఁగి లోఁ గినుకనందెద నందెద వేల చంపకా
వలి వలి నున్న మొగ్గ లనివారణ వారణయాన కోయు మిం
పలరఁగ దానఁ దేఁటి రస మానదు మానదు లేఁతపూవులన్.

ఉ. ధీరులు దోషదూరులు సుధీజనసంస్తవనీయసద్గుణో
దారు లుదారు లాహవజితప్రతివీరు లపూర్వనిత్యశృం
గారులు శూరు లుజ్ఝితవికారులు వార్ధిగభీరు లంగనా
మారులు శక్తినిర్జితకుమారులు రాజకుమారు లప్పురిన్.

2. రత్నశాస్త్రము.

ఉ. నీరదము ల్దిగంతముల నిండి తటిద్ధ్వనగర్జితంబు లిం
పార మహోగ్రవృష్టి కురియం బ్రభవించు నితాంతకాంతితో
నారయఁ గుక్కుటాండసమమై పడు ముత్యము లంతరిక్షసం
చారులు పట్టుకొందురు వెసన్ వసుధం బడకుండ నేర్పునన్.

ఉ. చేత ధరింప మానవులచెంతను జేరవు భూతకోటు లే
రీతిని దుష్టవిద్య లొనరించిన నెక్కవు క్రూరజీవముల్
ఘాతము సేయలేవు సతిగర్భము మోప సుఖప్రసూతి యౌ
నాతతఖ్యాతితోఁ బ్రతిదినంబును బ్రీతి యొసర్చుఁ గేతువుల్.

3. కవిగజాంకుశము.

క. ఒదుగుచు లక్షణ మెఱుఁగక
గొందుకుచు బ్రాసంబు వడియుఁ గూడక మీఁదుల్
వెదకుచుఁ బదసంధులు చెడ
నదుకుచు వెడకవిత చెప్పునతఁడుం గవియే?

క. కమలహితుఁ డున్న నక్ష
త్రము మొదలుగ నేడు దోషతమములు నడుగున్
ప్రమదప్రదములు పంద్రెం
డమరఁగ నశుభములు తొమ్మి దగుఁ బద్యాదిన్.

పిల్లలమఱ్ఱి - పినవీరన్న

పిల్లలమఱ్ఱి పినవీరన్న యనెడి యీ కవి నియోగిబ్రాహ్మణుఁడు; గాద యామాత్యునకును, నాగాంబకును పుత్రుఁడు; పెదవీరన్నతమ్ముఁడు; భారతీ తీర్థుల శిష్యుఁడు; నిరుపమానమైన కవిత్వధార గలవాఁడు. ఇతఁడు తాను రచియించిన జైమినిభారతాశ్వమేధపర్వమునకు సాళువగుండ నృసింహనృపాలుని నాయకునిఁగాఁ జేసెను. అతఁడు కృష్ణదేవరాయల పూర్వులయిన బుక్కరాజాదుల సంతతివాఁ డయినట్టును, బళ్ళారిమండలములోని యానేగొంది సంస్థానమును పాలించుచుండినట్లును తెలియవచ్చుచున్నది. సాళువ గుండరా జొకఁడు హూణశకము ౧౩౫౦వ సంవత్సరము మొదలుకొని ౧౩౫౩వ సంవత్సరమువఱకును రాజ్యపాలనము చేసినట్టును, రెండవ సాళువ గుండరాజు ౧౪౨౧వ సంవత్సరము మొదలుకొని ౧౪౨౮వ సంవత్సరమువఱకును రాజ్యము చేసినట్టును బళ్ళారిమండలచరిత్ర సంగ్రహమువలనఁ దెలియవచ్చుచున్నది. ఈ కడపటఁ జెప్పఁబడిన సాళువ గుండరాజునకు జైమినిభారతము కృతి నందిన నరసింహభూపాలుఁడు పుత్రుఁడైనట్టు కానఁబడుచున్నది గనుక, పిల్లలమఱ్ఱి పినవీరన్న ౧౪౨౮వ సంవత్సరమునకుఁ దరువాతనే యున్నట్టు స్పష్ట మగుచున్నది. సాళువ గుండనరసింహరాజు ౧౪౬౫ మొదలుకొని ౧౪౮౫వ సంవత్సరము వఱకును రాజ్యముచేసిన విరూపాక్షరాయని సేనానాయకుఁడుగానుండి ౧౪౮౫వ సంవత్సరమునం దాతనిరాజ్యము నాక్రమించుకొని ౧౪౮౭వ సంవత్సరము వఱకో ౧౪౯౩వ సంవత్సరమువఱకో స్వతంత్రముగా రాజ్యముచేసెనని చరిత్రకారులు చెప్పుచున్నారు ౧౪౮౭వ సంవత్సరము మొదలుకొని * తుళువ నరసింగరాయని శాసనములు కనఁబడుచున్నందున నప్పటితోనే యీతని రాజ్యసమాప్తి యయి యుండును. సాళువ నరసింహరాజు పూర్వులు సహితము బుక్కరాజాది కర్ణాటాధీశ్వరుల దండనాథులయి

* [ఇతఁడు నరసరాజనియే ప్రసిద్ధుఁడు.]

యుండి ప్రభుదత్తసంస్థానపరిపాలకులయి యుండిరి. పిల్లలమఱ్ఱి పినవీరన్న ౧౪౭౦ వ సంవత్సర ప్రాంతమున జైమినిభారతము నీతని కంకితముచేసి యుండును వరాహపురాణమునందలి యవతారికనుబట్టి సాళువ గుండ నరసింహునికాలము స్పష్టముగాఁ దెలియవచ్చుచున్నది కృష్ణదేవరాయల తాత యైన యీశ్వరరాజీనరసింహనృపాలునియొద్ద దండనాథుఁడుగా నున్న ట్లా పురాణపీఠికయందుఁ జెప్పఁబడినందున, సాళువ గుండ నరసింహరాజును తదాస్థానకవీశ్వరుఁ డయిన పిల్లలమఱ్ఱి పినవీరభద్రుఁడును క్రీస్తుశకము ౧౪౫౦-౭౦ వ సంవత్సరప్రాంతముల యందున్న ట్లేర్పడుచున్నది. ఈ కవికాలమును నిర్ణయించుట కొక విధమైన యాధార మింకొకటి కానఁబడు చున్నది. శ్రీనాథుఁడు రాజమహేంద్రపురెడ్ల యాస్థానములోఁ జేరకమునుపు సాంపరాయని కుమారుఁ డయిన తెలుఁగురాయనివద్దకుఁ బోయి కస్తూరి వేఁడిన ట్లీ క్రిందపద్యము తెలుపుచున్నదిగదా?

శా. అతియ్యంబుగ సాంపరాయని తెలుంగాధీశ కస్తూరికా
　భిక్షాదానము చేయురా సుకవిరాడ్బృందారకస్వామికిన్
　దాక్షారామపురీవిహారవరగంధర్వాప్సరోభామినీ
　వక్షోజద్వయకుంభికుంభములపై వాసించుఁ దద్వాసనల్.

ఈ తెలుఁగురాయనితండ్రి యగు సాంపరాయనికి జైమినిభారతకృతిపతియగు నృసింహరాజుయొక్క ముత్తాత యగు సాళువమంగరాజు రాజ్యప్రతిష్ఠాప నము చేసినట్లు జైమినిభారతములో నీ క్రింది పద్యమునఁ జెప్పఁబడినది.

సీ. దురములో దక్షిణసురతాను నెదిరించి
　　　కొనివచ్చి సాంపరాయనికి నిచ్చి
　స్రామాజ్యమున నిల్పి సాంపరాయస్థాప
　　　నాచార్యబిరుదవిఖ్యాతి గాంచె
　శ్రీరంగవిభుఁ బ్రతిష్ఠించి యర్వదివేల
　　　మాడ లద్దేవు నుమ్మడికి నొసఁగె
　మధురాసురత్రాణు మడియించి పరపక్షి
　　　సాళువబిరుదంబు జగతి నెరపె

గర్వితనమునఁ దేజి మొగంబు గట్టి
తఱిమి నగరంపుగవఁకులు విఱుగఁద్రోలి
తాను ద్రేసిన గౌరు నుద్దవిడిఁ దెచ్చె
సాహసంబున నవ్వొంగు సాళ్వమంగు.

ఈ సాళ్వమంగు వీరబుక్కరాయని పుత్రుఁ డైన కంపరాయఁడు తండ్రి యాజ్ఞానుసారముగా ౧౩౬౭వ సంవత్సర ప్రాంతమున దక్షిణదిగ్విజయ యాత్ర వెడలినప్పుడు సేనానాయకుఁడుగా నుండెను. నృసింహరాజుయొక్క ముత్తాతచే రాజ్యమున నిలుపఁబడిన సాంపరాయఁడు నృసింహరాజుతాత కాలములోఁగూడ రాజ్య మేలి యుండును అప్పు డాతని పుత్రుఁడగు తెలుగుఁరాయఁ డీ నృసింహరాజుయొక్క తండ్రి తాతల కాలములో నుండి యుండుటకు సందేహ ముండదు. యౌవనదశలోఁ దెలుఁగురాయనివద్దకుఁ బోయి కవిత్వము చెప్పి యాతనిని మెప్పించిన శ్రీనాథుఁడు నృసింహరాజు యొక్క తండ్రికాలములోనే కాక కొంతవఱ కీనృసింహరాజుయొక్క రాజ్య కాలములోఁ గూడ నుండి యుండును. కాఁబట్టి కృతిభర్త యైన యీ సాళువ నృసింహరాజును. కృతికర్త యైన పినవీరన్నయు శ్రీనాథుని యంత్యకాలమునోను. తదనంతరకాలములోను జీవించియుండిన ట్లిందువలనఁ దేలుచున్నది. ఈ మహాకవి ౧౪౭౦వ సంవత్సరప్రాంతమువఱకును జీవించి యుండవచ్చును గనుక, శ్రీనాథకవి వార్ధకదశలో నున్నప్పు డితఁడు యౌవనదశయం దుండి యుండును. దానినిబట్టి చూడఁగా శ్రీనాథుఁడు తా నాంధ్రీకరించిన నైషధమును గొనిపోయి యిప్పుడు జను లనుకొనునట్లు కవిజనాగ్ర గణ్యుఁడని యభినవముగాఁ బే రొందుచుండిన మహావిద్వాంసుఁ డయిన పినవీరన్నకుఁ జూపి యుండును పినవీరభద్రుని జీవితకాలములోనే శ్రీనాథుఁ డాతనికిఁ బూర్వకవి యయినందున శృంగారశాకుంతలకృతిపతి యయిన వెన్నమంత్రి "సీ. శ్రీనాథభట్టభాషావిగుంభంబుల పరిమళంబులఁ గూడఁ బఱవ నేర్చు" నని పినవీరనకవిత్వమును శ్లాఘించెను. ఈ వీర భద్రకవి యీ కాలమునందు మిక్కిలి సుప్రసిద్ధుఁ డయినట్లు నరసింహ

రాజుతో నాతని యాస్థానమునందలి పండితు లన్నట్లు జైమినిభారతము నందుఁ జెప్పఁబడిన యీ క్రింది పద్యమువలనఁ దెలియవచ్చుచున్నది.

క. తాతయుఁ దండ్రియు నగ్ర
భ్రాతయునుం దాను భువనభాసురకృతిని
ర్మాతలు పిల్లలమఱ్ఱివి
ఖ్యాతునిఁ బినవీరుఁ బోలఁగలరే సుకవుల్.

సీ. అమృతాంశుమండలం బాలవాలముగాఁగ
మొలచె నొక్కటి జగన్మోహనముగఁ
జిగురించె విలయసింధు గతకైతవడింభ
శయనీయవరపలాశములతోడఁ
బితృదేవతలకు నంచితసత్రశాలయై
చెట్టు గట్టెను గయాక్షేత్రసీమ
నిలువ నీ డయ్యె నిందీవరప్రియకళా
కోటీరునకు భోగికుండలునకు

మఱ్ఱిమాత్రంబె పిల్లలమఱ్ఱి పేరు
పేరువలెఁ గాదు శారదాపీఠకంబు
వారిలోపలఁ బినవీరువాక్యసరణి
సరసులకు నెల్లఁ గర్ణరసాయనంబు

శ్రీనాథాదులకుఁ దరువాతి కాలములో నుండిన వెల్లంకితాతంభట్టను లాక్షణి కుఁడు తన కవిలోకచింతామణియందుఁ బినవీరనపద్యముల నుదాహరించుట కూడ నీ మహాకవి యించుమించుగా శ్రీనాథాదుల కాలమువాఁ డనుటను స్థాపించుచున్నది. కాఁబట్టి యిప్పటి కితఁడు నాలుగు వందల నలువది సంవత్సరములక్రిందట నున్నవాఁడని చెప్పవచ్చును

ఈ కవిమహిమలనుగూర్చి కొన్ని కథలు చెప్పుదురు. ఈతని యన్న నిష్ఠా పరుఁ డయి జపతపములయందుఁ గాలక్షేపము చేయుచుండఁగా నితఁడు

స్నానసంధ్యాదులు లేక నోట మెతుకులు పడుటయే తడవుగాఁ బోయి వేశ్యలయింటఁ గూరుచుండుచు వచ్చెననియు, అన్నగారు జపసమయము నందు దన భార్య కాభరణములు చేయించుట కాలోచించుచుండఁగా, తమ్ముఁ డది గ్రహించి యాతనికోసర మెవరో వచ్చి 'మీ యన్నగా రేమి చేయు చున్నా' రని యడిగినప్పుడు 'మా యన్నగారు భార్య కాభరణములు చేయిం చుటకయి యాలోచించు చున్నాఁ'డని యుత్తర మిచ్చె ననియుఁ జెప్పుదురు. అంతేకాక రాజు జైమినిభారతమును జేయుటకై పినవీరభద్రున కాజ్ఞ యిచ్చి పంపునప్పు డతఁడు గడువులోపల సావకాశముగాఁ బుస్తకము రచి యింపక యుపేక్ష చేసి యహోరాత్రములు భోగభామినుల యింట కాల క్షేపము చేయుచు వచ్చె ననియు, మితిదినమునాఁటికి గ్రంథమును జేసి సమర్పింపనియెడల రాజుచేత మాటవచ్చునని యన్నగా రెన్నివిధముల హితోపదేశము చేసినను, లక్ష్యముచేయక యాతని మాటలు పెడచెవులఁ బెట్టి యథేష్టముగాఁ దిరుగుచు వచ్చె ననియు, పుస్తకము ముగింపవలసిన దినము తే పనఁగా నాఁటిరాత్రి తనగది యలికించి లోపల దీపము పెట్టించి పెందలకడ భోజనము చేసి గదిలోఁ బ్రవేశించి తలుపు లోపల వేసికొనఁ గానే పదిమంది చేరి లోపల పుస్తకము వ్రాయుచున్నట్లు గంటముచప్పుడు వినఁబడె ననియు, అద్భుతజనకమయిన యా చప్పుడు విని మనసు పట్టలేక పెదవీరన్న తలుపుసందునుండి తొంగి చూడఁగా సర్వాభరణభూషితురాలై దీపము వెలుతురున శరవేగముగ వ్రాయుచున్న యొకస్త్రీ బావగారు చూచు చున్నారని చివాలున లేచి తొలఁగిపోయెననియు, అటుపిమ్మటఁ బుస్తక మునఁ గొంచెము భాగము మిగులఁగాఁ బినవీరన్న దానిని పూర్తిచేసి మఱు నాఁడు రాజసభకుఁ గొనిపోయె ననియు, అతఁడు "వాణి నారాణి" యని పంతము పలుకఁగాఁ గొలువులోనివారు సహింపక యాతని నిరాకరించి నప్పుడు వాణి నవరత్నఖచితము లయిన కంకణములు గదల తనహస్తము తెరలోనుండి పయికిఁ జాఁపి చూపి యాతనిమాట సత్యమని యశరీర వాక్కునఁ బలికె ననియుఁ జెప్పుదురు అతఁ డాశుధారగా కవిత్వము చెప్పఁ గలవాఁ డనియు, వాణి యతనికి వశ్య యనియు, చూపుటకై యీ కథ

కల్పింపఁ బడినది. ఈ కవి తనకు భారతీతీర్థగురుకృపావిశేషముచేతఁ గవిత్వము వచ్చినట్లు జైమినిభారతమునం దీ పద్యముచేతఁ జెప్పినాఁడు.

సీ. పరగంగ మల్లమాంబాకుమారునకు సో
మకులాంబునిధిపూర్ణ మావిధునకు
భరతకీర్తికిఁ దులాపురుషాదిదానాంబు
జంబాలితాస్థానసాధునకును
బరరాజభీకరధరణీవరాహాంక
కాత్రేయగోత్రపవిత్రునకును
గుండయనరసింహమండలేశ్వరునకు
నభ్యుదయపరంపరాభివృద్ధి
కరముగా భారతీతీర్థగురుకృపాస
మృద్ధసారస్వతుఁడు సత్కవీంద్రసఖుఁడు
శుకవిమల్లకషోల్లసత్కులిశహస్త
పల్లవుఁడు చెప్పెఁ బినవీరభద్రసుకవి.

ఈ కవి యనేక గ్రంథములను రచించెను గాని వానిలో నీ జైమినిభారతము గాక శృంగారశాకుంతల మొక్కటిమాత్రమే యిప్పుడు కానఁబడుచున్నది. కవి యా వఱకుఁ జెప్పిన గ్రంథములు శృంగారశాకుంతలములోఁ గృతిపతి కవిని గూర్చి చెప్పిన యీ క్రింది పద్యమునఁ బేర్కొనఁబడినవి.

సీ. రచియించినాఁడవు రమణీయవాగ్రీతి
* నవతారదర్పణం బభినవముగఁ
బలికినాఁడవు తేటపడఁజేసి నారదీ
యము సత్కవిశ్రేణి యాదరింపఁ
జెప్పినాఁడవు శేముషీవిశేషంబున
మాఘమాహాత్మ్యంబు మంజుఫణితిఁ

* [కొందఱు 'నవరస దర్పణం' బను పాఠమును గ్రహించిరి. కాని యా పాఠము సరియైనది కాదు]

గావించినాఁడవు ఘనబుద్ధి మానసో
ల్లాససారము సముల్లసితశయ్య
భారతీతీర్థయతిసార్వభౌమగురుకృ
పాతిశయలబ్ధకవితావిభూతి గలిగి
గౌరవము గాంచినాఁడవు కవులచేత
విపులచాటూక్తినిర్ణిద్ర ! వీరభద్ర !

ఈ పద్యమును జూచియే కాఁబోలును నిన్నూఱేండ్లకుఁ దరువాత సీమంతినీ కళ్యాణ మను సోమవార వ్రతకథను రచియించిన యీ తనివంశపువాఁ డగు సోమనామాత్యుఁడు పినవీరభద్రుని పుస్తకములను గూర్చి తన కావ్యములో నీక్రింది పద్యమును జెప్పెను.

సీ. అవతారదర్పణం బన్న కావ్యముఁ జేసె
నారూఢి నారదీయంబు పలికె
మహనీయమగు మాఘమాహాత్మ్యము రచించె
శాకుంతలముఁ జెప్పె సరసఫణితి
నొక్కరాతిరియందు నొనరించె మధురవా
క్ప్రౌఢిచే జైమినిభారతంబు
లలితమౌ మానసోల్లాససారం బన్న
కబ్బంబు భాషించె నబ్బురముగ
మఱియు బహురూపకావ్యనిర్మాణనిపుణుఁ
డగుచు నుతిఁగాంచె సకలదిగంతరములఁ
గుకవిజనగర్వతిమిరసంకోచకృత్ప్ర
భాతరవి యైన పినవీరభద్రసుకవి

ఇందులోని యొక్కరాత్రిలో జైమినిభారతము రచియించె ననుట మొదలయినవి వాడుకలోనున్న కట్టుకథల ననుసరించి వ్రాయఁబడి యుండును. ఈ కవియే తన పుస్తకమునందుఁ బినవీరభద్రునితండ్రియైన గాదిరాజు చిరకాలము సంతానము లేనివాఁ డయి కడపట వీరభద్ర ప్రసాదము వలన

ఇరువురు కవలబిడ్డలను గాంచి, వారికి వీరభద్రనామములు పెట్టెనవియు, వారిలోఁ బెదవీరభద్రుఁడు కర్ణాటరాజుల మంత్రి యయ్యె ననియుఁ, పిన వీరభద్రుఁడు కవి యయ్యెననియు నీక్రిందిపద్యములలోఁ జెప్పెను

క. ఆ గాదిరాజువనిత మ
హాగుణవతి పరమసాధ్వి యన విశ్రుతయౌ
నాగాంబ రూపలీలా
భోగాఢ్యులఁ గవలవారిఁ బుత్రులఁ గాంచెన్.

సీ. అతిలాలితాకారు లాకుమారులు పెద
వీరభద్రుఁడు పినవీరభద్రుఁ
ద న్న నామములచే నధిక ప్రసిద్ధులై
యభివృద్ధి గాంచి రనంతరమునఁ
బెదవీరభద్రుడు పృథ్వీ ధీనుతకార్య
దక్షుఁడై కర్ణాటధరణి కరిగి
వాసిగా రాయసింహాసనమున నుండి
యధికులౌ రాయదాయాదులకును

మఱియు డెబ్బదివేల సామంతులకును
దానె యధికారియై మహాస్థానులందు
సకలమంత్రి వరేణ్యులు సన్నుతింప
భూనుతంబైన కీర్తివిస్ఫూర్తిఁ గనియె

సీ. మహనీయపిల్లలమఱ్ఱివంశభవుండు
గాదిరాజసుతుండు ఘనయశుండు
వీరేశ్వరుని యవతారమై యిలలోన
జను లెన్నఁదగిన సౌజన్యశాలి

పినవీరభద్రుఁడు పిన్నప్రాయమునంద
యఖిలశాస్త్రంబులు నభ్యసించి
కాళిదాసాదిసత్కవులకు హెచ్చుగా
బహుకావ్యవిరచనప్రౌఢిఁ గాంచె

వాణి యిల్లాలుగాఁ గవిశ్రేణి కెల్లఁ
బృథుతరాశ్చర్యకరమైన బిరుదు పూనె
తుహినగిరిరాజరామసేతువులనడుమ
నితని కెనయైన కవివరుం డెందుఁ గలఁడు

పూర్వోదాహృతపద్యములోఁ జెప్పఁబడిన యవతారదర్పణము, నారదీయము, మాఘమాహాత్మ్యము, మానసోల్లాసపారము, అను నాలుగు పుస్తకములును గాక పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి "పురుషార్థసుధానిధి" యను వేఱొక పుస్తకమును గూడ రచియించిన ట్టాంధ్రసాహిత్యపరిషత్తువారి పుస్తక భాండాగారములో నున్న యుదాహరణగ్రంథమునం దుదాహరింపఁబడిన యీ క్రింది పద్యములవలనఁ దెలియవచ్చుచున్నది.

సీ. కాళకర్పూరనీకాశగా భావింపఁ
గవితానిరూఢి ప్రఖ్యాతి నెసఁగు
యావకారుణదేహయష్టిగాఁ జింతింప
మదకుంభియానల మరులుగొలుపు
నీలజీమూతసన్నిభగా విలోకింప
సకలమాయాప్రపంచంబు నడచు
కనకచంపకదామగౌరిగా శీలింప
నంహస్సమూహంబు సంహరించు

శంభుదేవి విశాలాక్షి సదనుకంప
యోగిజనసేవ్య యోగపయోదశంప
శ్రీకరకటాక్షలేశరక్షితనిలింప
ముజ్జగంబును మొలపించు మూలదుంప

సీ. భర్గభట్టారకపర్యాయమూర్తికి
షాణ్మాతురుని కూర్మిజనకునకును
మేషరాజము నెక్కి మేటిరౌతున కసు
రాధీశు పౌరుగుదిశాధిపతికి
హరిణవాహనుని నెయ్యపుసంగడీనికి
సామిధేనీప్రియస్వాంతునకును
యాయజూకులయి డ్లయనుఁగుజుట్టమునకు
స్వాహాస్వధాప్రాణవల్లభునకు
దండములు పెట్టెదము మోడ్చెదము కరములు
సేవ యొనరించెదము మహిమ్మఁ గావు బ్రోవు
యాగవేదికి విచ్చేయు మారగింపఁ
బ్రథమజన్ములయింటి కల్పద్రుమంబ.

శృంగారశాకుంతలము నెల్లూరు మండలములో బిట్రగుంటకు సమీపము నం దున్న సోమరాజుపల్లినివాసుఁడును, భూస్వామియు, ధనసంపన్నుఁడు నైన చిల్లరవెన్నమంత్రి యనఁబడెడు నియోగికి భువన కంకితముచేయఁబడెను. శాకుంతలములో సోమరాజుపల్లి యిట్లు వర్ణింపఁబడెను.

సీ. లవణాబ్ధివేలహేలాకాంచి యగు నంధ్ర
ధరణీమండలికి ముత్యాలజల్లి
సంగ్రామపార్థరాజన్యరాజశ్రీకిఁ
బెంపుమీఱిన జగజంపువెల్లి
దాతలు సముదంచిత ప్రసూనములుగాఁ
గామితార్థములిచ్చు కల్పవల్లి
యఱువదినాల్గు విద్యలకు నపూర్వషం
టాపథంబైన పట్టణమతల్లి
పంటనృపకౌస్తుభములకుఁ బాలవెల్లి
కదనజయలక్ష్మితొలుచూచు గన్నతల్లి
విపులభుజగర్వదర్పితవిమతరాజ
రాజహృద్భల్లి ధర సోమరాజుపల్లి.

పైతామహంబైన సోమరాజుపల్లియం దుండిన

సీ. సకలభూపాలకాస్థానసౌధంబుల
వర్ణింతు రే మంత్రివాగ్విభూతి
సంతానసురధేనుచింతామణులపెంపు
దట్టించు నే మంత్రిదానమహిమ
యాశాంతదంతిదంతాఘాటములమీఁద
విహరించు నే మంత్రివిమలకీర్తి
సుకవిగాయకబహుస్తుతిఘోషణంబున
నలరు నే మంత్రిగేహాంగణంబు
వాఁడు కౌండిన్యగోత్రాభివర్ధనుండు
మదవదరివైన్యపతిమానమర్దనుండు
నాగయామాత్యతనయుండు నయవిశేష
విజితసురమంత్రి చిల్లర వెన్నమంత్రి.

కవినిగూర్చి

సీ. నన్నపార్యుఁడు ప్రబంధప్రౌఢవాసనా
సంపత్తిసొంపు పుట్టింప నేర్చుఁ
దిక్కనయజ్వవాగ్భక్తికామోదంబు
చెలువు కర్ణముల వాసింప నేర్చు
నాచిరాజుని సోమువాచామహత్త్వంబు
సౌరభంబులు వెదచల్ల నేర్చు
శ్రీనాథభట్టుభాషానిగుంభంబుల
పరిమళంబులఁ గూడఁ బఱవ నేర్చు
మహితగుణశాలి పిల్లలమఱ్ఱి వీర
నార్యుఁ డా యింటఁ బైతామహం బగుచును
వెలయుచున్నది నేఁడు కవిత్వలక్ష్మి
యఖిలసత్కవినికరంబు లాదరింప.

అని విచారించి, కవిని బిలిపించి సంబోధించి

గీ. కలదు చాలంగఁ బ్రేమ నీవలన నాకు
వేడ్క నడిగెదఁ గవులెల్ల వేడ్కపడఁగ
షట్సహస్రకులోద్భవసచివులందు
సుకృతిగాఁ జేయు నా కొక సుకృతిఁ జేసి.

....

సీ. సరసపువ్వులుగ మాలకరి పెక్కు తెఱఁగుల
విరుల నెత్తులుగఁ గావించునట్లు
కర్పూరకస్తూరికావస్తువితతిచే
శ్రీఖండచర్చ వాసించునట్లు
ఒడికంబుగా గందవొడికి నానాసూన
పరిమళంబులు గూడఁ బఱచినట్లు
సరఘలు వివిధపుష్పమరందలవములు
గొనివచ్చి తేనియఁ గూర్చినట్లు
భారతప్రోక్తకథ మూలకారణముగఁ
గాళిదాసుని నాటకక్రమము కొంత
తావకోక్తికి నభినవశ్రీ వహింపఁ
గూర్మిఁ గృతిచేయు నాకు శాకుంతలంబు.

అని ప్రార్థించెను. "వినుతక్ష్మాపాలకామాత్యవేదండానీకమృగేంద్ర" అని ప్రథమాశ్వాసాంతపద్యమునను. "శీతశైలాబ్ధివేలామధ్యక్షితిపాలమంత్రిమకుటాలంకారహీరాంకురా" అనియు. "సదాస్వామికార్య ప్రియచారనీతిక్రియా" అనియు తృతీయాశ్వాసాంతపద్యములయందును, కృతిపతియైన వెన్నమంత్రి సమస్త రాజమంత్రులను మించినట్టును. స్వామిహితకార్య తత్పరుఁడైనట్టును కవి యెంత వర్ణించినను వెన్నయామాత్యుఁడే రాజున కమాత్యుఁడో, యెక్కడను జెప్పలేదు. ఈ కృతిపతినిబట్టి రెండవ కృతిపతి

యైన సాళువ గుండనృసింహరాజునుబట్టి తెలియవచ్చినట్టు కవికాలనిర్ణయాదులైన చరిత్రాంశము లేవియుఁ దెలియరావు. ఈ నరసింహరాజు కృతిభర్త యగుటయే కాక కృతికర్తసహితమయి సంస్కృతమున రామాభ్యుదయమను గ్రంథమును జేసెను. శ్రీనాథుని కాలములో నుండిన గౌడడిండిమకవిసార్వభౌమబిరుదాంకితుని కుమారుఁ డగు రాజనాథుఁ డను తృతీయడిండిమకవిసార్వభౌముఁ డీ సాళువగుండ నరసింహునినాయకునిగాఁ జేసి సంస్కృతమున సాళువాభ్యుదయ మను కావ్యమును జేసెను. ఈ సాళువ నరసింహరాజు మహాప్రసిద్ధుఁ డగుటచేత నాతనిమీఁదఁ గవు లనేకులు పద్యములు చెప్పిరి. అట్టి పద్యములలో రెంటి నిం దుదాహరించెదను

సీ. దినదినంబును నెల్లడవిరాజులఁ బోషించుఁ
  గైరవబంధుఁ డే కార్యకాంక్ష?
అప్పటప్పటికి లోకాంధకారము మాన్చు
  నినుఁ డేమి లాభంబు నిచ్చగించి?
సచరాచరంబైన జగతి యెల్ల భరించు
  ఫణిపతి యే ఫలప్రాప్తిఁ జూచి?
అదనున వర్షించి యఖిలజీవులఁ బ్రోచు
  జలధరం బే ప్రయోజనముఁ గోరి?

పరహితం బాత్మహిత మని పరమపుణ్యు
లన్యు లొనరించు మేలు తా మాసపడరు
సకలదిగ్భాగ్యోదయ! కరారి సాళువాంక
గుండభూపాలనరసింహమండలేంద్ర!

సీ. బంగారునకు సౌరభము జనించినయట్టు
  కులజుఁ డుత్తమగుణకలితుఁ డేని;
కస్తూరి నికరంపుఁగాంతిఁ జెందినయట్టు
  లుత్తమోత్తముఁడు శ్రీ నొందెనేని;
భావింపఁ జెఱకునఁ బండుపండినయట్టు
  నెఱదాత ప్రియవచోనిరతుఁ డేని;

అలరుగంధపుద్రుమాన నలరు పూచినయట్టు
శ్రీమంతునకు గీర్తి చెందెనేని;
దివ్యగుణసాంద్ర! సకలవైభవసురేంద్ర!
సహజదానశిబీంద్ర! భాషాఫణీంద్ర!
సాళువక్షోణిపతివంశజలధిచంద్ర!
గుండభూపాలనరసింహమండలేంద్ర!

ఇతనికవిత్వ మనర్గళధారగాఁ బ్రవహించుచు, నాతికఠినమయి రసపుష్టి కలిగి యుండును కవిత్వశయ్య బోధపడుటకయి కొన్ని పద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి

౧ జైమినిభారతము.

ఉ. కాఁక నెదిర్చి సంగరముఖంబున హెచ్చిన రాజవంశముల్
గూఁకటివేళ్ళతోఁ బెఱికి గోత్రవధంబును జేసినట్టి యా
ప్రేఁకపుఁగీడు గాక ప్రజ వేఁచఁ దలంచిన గోరుచుట్టుపై
రోఁకటిపోటుచందముగ రోసి జను ల్మనుఁ జూచి తిట్టరే.

ఉ. క్రమ్మెడు చిమ్మచీఁకటులు కార్కొను మార్కొనుచోఁ బరస్పరా
స్యమ్ములు గానరాక విరసమ్ముగఁ గైకొనునట్టి సాంపరా
యమ్మునఁ జెంగలించి లవుఁ డన్నకుఁ దోడయి దీప్తబాణజా
లమ్ముల నంధకారపటల మ్మఖిలమ్ము ఖిలమ్ము చేయుచున్.

ఉ. పట్టిన కార్య మీశ్వరుఁడు పట్టి పెనంగినఁ జేరనీక చే
పట్టుట రాజధర్మ మని పల్కెడునీతిఁ దొఱంగి కీర్తికిం
బట్టగు సాహసంబు నిజబాహుబలంబును వీటఁబుచ్చి యీ
పట్టిన వాహముం దిరుగఁ బంపిన నవ్వరె తోడిభూపతుల్.

మ. నను నే మన్నఁ గొఱంత లేదు సభలోనం బుణ్యచారిత్ర మ
జ్జననిం దప్పఁగ నాడి తీ నికృతికిన్ సైరింపఁగా నేర నా
వినయం బింతకుఁ దెచ్చెఁ జాలుఁ బలుకు ల్వేయేల నే క్షత్రియుం
డనో వైశ్యుండనో చూడుమంచు మగిడెన్ సంగ్రామసంరంభియై

౨. శకుంతలాపరిణయము.

మ. జననం బొందితి దుగ్ధవారినిధి నా సర్వేశుజూటంబుపై
జను లేప్రొద్దుఁ బ్రశంస సేయ నవతంసం బైతి నీప్రాభవం
బునకుం బాంధజనాపకారి యగు నా పూవిల్తునిం గూడి వా
రని దుష్కీర్తిగఁ దిట్టులం బడకు చంద్రా! రోహిణీవల్లభా!

మ. నవలావణ్యపయోధిఁ జిత్తమను మంథానాద్రికిం జంద్రికా
పవనాశిం దరిత్రాడుగాఁ బెనఁచి యబ్జాతాసనుం దేర్చినన్
రవళిం గోకిలకీరముల్గరువ నా రత్నాకరంబందు ను
ద్భవముం బొందిన లక్ష్మి గావలయు నప్పద్మాక్షి వీక్షింపఁగన్.

చ. కొనకొని తావి మూర్కొనని క్రొవ్విరి యెయ్యెడ వజ్రసూచి రా
యని రతనంబు జిహ్వ చవియానని తేనియ గోరు మోపి గి
ల్లని చిగురాకు లాలితవిలాసనికేతనభూలతాంగి తా
ననుభవకర్త యే ఘనుఁడొ యా విధి యత్నమెఱుంగ నెవ్వఁడున్.

ఉ. నాపయిఁ గూర్మి తద్గురుజనంబులపై నిడి మౌనికన్యకా
స్థాపితవృత్తి బంధువనితాతతియందు ఘటించి యిష్టస
ల్లాపములందు నిచ్చటుఁ దలంపక నిచ్చలుఁ బ్రాణనాథ నే
వాపరతంత్రవై యెటులు వన్నియఁ దెచ్చెదొ నాకుఁ బుత్రికా!*

---

* [పినవీరన నివాసము నెల్లూరు జిల్లా బిట్రగుంట సమీపమందలి సోమరాజు పల్లెగాఁ దోఁచినను, నిజాము రాష్ట్రమునందలి పిల్లలమఱ్ఱియే నివాసమై యుండవచ్చునని శ్రీ చాగంటి శేషయ్యగారు తెల్పుచున్నారు. ఇతఁడు నియోగియనియు, భారద్వాజ గోత్రుఁడనియు శ్రీ శేషయ్యగారు నిర్ణయించి యున్నారు. (ఆంధ్రకవి తరంగిణి, సం. 6, పినవీరన్న చరిత్ర) శ్రీ సాళ్వ నరసింహరాయని పేర నవరత్నములు, రాజ్యాంగ పద్ధతులు రచింపఁ బడినవని, వానికర్త పినవీరన్న కావచ్చునని శ్రీ ప్రభాకర శాస్త్రిగారు వ్రాసినారు.]

నంది మల్లయ్య, ఘంట సింగయ్య

ఈ యిరువురు కవులును కలిసియే గ్రంథములను జేయుచు వచ్చిరి వీరు చేసిన గ్రంథములలో ప్రధానములైనవి ప్రబోధచంద్రోదయమును, వరాహ పురాణమును. వీనిలో ప్రబోధచంద్రోదయము ననంతామాత్యుని పుత్రుఁడైన గంగయ్యమంత్రికిని, వరాహపురాణమును కృష్ణదేవరాయలతండ్రి యైన నృసింహరాజునకును, వీ రంకితము చేసిరి. ఈ యిరువురు కవులలో మొదటివాడయిన నంది మల్లయ్యకు రెండవ కవియైన ఘంట సింగయ్య మేనల్లుడు. ఘంటసింగయ్యకు మలయమారుతకవి యని బిరుదాంకము గలదు. వీ రిరువురకును గల బంధుత్వాదులు ప్రబోధచంద్రోదయములోని యీ క్రింది పద్యమువలనఁ దెలియ వచ్చుచున్నవి.

సీ. కలరు కౌశికగోత్రకలశాంబురాశిసం
దారంబు సంగీతనంది నంది
సింగమంత్రికిఁ బుణ్యశీల ప్రోలమ్మకు
నాత్మసంభవుఁడు మల్లయమనీషి
యతనిమేనల్లుఁ డంచితభరద్వాజగో
త్రారామచైత్రోదయంబు ఘంట
నాగధీమణికిఁ బుణ్యచరిత్ర యమ్మలాం
బకుఁ గూర్మితనయుండు మలయమారు

తాహ్వయుఁడు సింగనార్యుడు నమృతవాక్కు-
లీశ్వరారాధకులు శాంతు లిలఁ బ్రసిద్ధు
లుభయభాషల నేర్పరు లుపమరులు న
మర్థు లీ కృతిరాజనిర్మాణమునకు.

వీరు తమ యాశ్వాసాంతగద్యములలోఁ గూడ నుభయనామములను జేర్చుకొని

"ఇది శ్రీమదుమామహేశ్వర వరప్రసాదలబ్ధసారస్వతాభినంది నంది
సింగయామాత్యపుత్ర మల్లయమనీషితల్లజ మలయమారుతాభిధాన
ఘంట నాగయప్రధానతనూభవ సింగయకవిపుంగవ ప్రణీతంబయిన"

అని వ్రాసికొని యున్నారు పీ రిరువురును షట్సహస్రనియోగిబ్రాహ్మ ణులు. వీరిలో మొదటివాఁ డయిన నందిమల్లయ్య కౌశికగోత్రుఁడు; ఆప స్తంబసూత్రుఁడు; దక్షిణామూర్తి గురుశిష్యుఁడు. రెండవవాడయిన ఘంట సింగయ్య భరద్వాజగోత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; అఘోరశివశిష్యుఁడు. ఈ యంశములనే కవులు తమ వరాహపురాణమునం దిట్లు చెప్పుకొనిరి.

సీ. అపుడు సభావేదికాగ్రస్థితులమైన
మమ్ము వాగీశ్వరీమంత్ర రాజ
సిద్ధిపారగులఁ గౌశిక భరద్వాజగో
త్రుల మహాదేవాంఘ్రిజలజభక్తి
పరతంత్రమతుల నాపస్తంబసూత్రుల
గురుదక్షిణామూర్త్యఘోరశివుల
శిష్యుల నతిశాంతచిత్తులఁ దనకు నా
శ్రితుల భాషాద్వయకృతినిరూఢ
శేముషీభూషణుల నందిసింగనార్య
తనయుమల్లయకవికులోత్తముని. ఘంట
నాగధీమణికూర్మినందనుని మలయ
మారుతాంకితు సింగయమంత్రిఁ జూచి.

ప్రబోధచంద్రోదయకృతిపతి యైన యనంతామాత్యగంగయ్య తమ్మ రాజ పుత్త్రుఁ డయిన వీరబసవనృపాలునకు మంత్రియయి మన్ననలఁ బొందిన ట్లీ క్రింది పద్యమునఁ జెప్పఁబడినది.

సీ. మాధవవర్మభూమండలేశ్వరవంశ
జలధికి నే రాజు చందమామ
యే రా జుదయశైల మెలమి విభేదించె

గపటాహితమదాంధకార పతంగ
గజపతిసురధాణిగడిదుర్గముల కెల్ల
నే రాజు వజ్రంపుబోరుతలాపు
మహిమచే నే రాజు మఱపించె నలభగీ
రథపృథుమాంధాతృరఘురమణుల

నట్టి గుణశాలి తమ్మరాయనికుమార
వీరబసవపక్ష్మాచక్రవిభునిచేత
మన్ననలఁ గాంచి మించిన మహితుఁ డితఁడు
మనుజమాత్రుండె గంగయామాత్యవరుఁడు.

గంగయామాత్యుని ప్రభువయిన బసవన్నపాలుఁడు కొండపీటిరాజ్యమును గజపతు లాక్రమించుకొన్నతరువాత వారిగడిదుర్గముల కధ్యక్షుఁడయి పదునైదవ శతాబ్దోత్తరభాగమున నుండిన సామంతరాజు. బసవమహీశుని సచివుఁడైన గంగయామాత్యుఁడు ప్రబోధచంద్రోదయము కృతినందకముందే దగ్గుపల్లి దుగ్గయ్యచేత రచియింపఁబడిన నాచికేతూపాఖ్యానమును గృతి నందెను. ప్రబోధచంద్రోదయముయొక్క చతుర్థాశ్వాసాంతమునందలి కృతిపతిసంబోధనమయిన యీ క్రింది పద్యము వలన నీయంశము తేటపడుచున్నది.

క. ప్రఖ్యాతనాచికేతూ
పాఖ్యానమహాప్రబంధపరిమళితసుధీ
వ్యాఖ్యానశ్రవణోదిత
సౌఖ్యా! సంఘటితచిత్తశంకరసఖ్యా!

౧౪౬౫ వ సంవత్సరప్రాంతమునందు శ్రీనాథుని ముద్దుమఱఁది యైన దుగ్గకవిచేత నాచికేతూపాఖ్యాన మీతని కంకితము చేయఁబడెను. అటు తరువాత ౧౪౭౦-౭౫ సంవత్సరప్రాంతమున నీ జంటకవులు ప్రబోధ చంద్రోదయము నీతని కంకిత మొనర్చిరి. [ప్రబోధచంద్రోదయరచనా కాలముం గూర్చి "ఆంధ్రకవి తరంగిణి" (సం. 6 పుట 131) లో నిట్లున్నది.

కృతిపతియైన గంగనామాత్యుని ప్రభువగు బసవనృపాలుఁడు దూబగుంట నారాయణకవి చేతఁ బంచతంత్రమును కృతినందియుండెను. బసవనృపాలుని కాలమును శాసనసహాయమునఁ దెలిసికొని నారాయణకవి చారిత్రమున నిర్ణయించి యున్నారము. దానిని బట్టి నాచికేతూపాఖ్యాన రచనాకాలము క్రీ. శ. ౧౪౬౦ ప్రాంతమని దుగ్గయకవి చారిత్రమునఁ జెప్పియుంటిని. ఈ ప్రబోధచంద్రోదయముకూడ నించుమించుగ ౧౪౮౦ ప్రాంతమున రచింపఁబడి యుండును '] పెసరువాయాన్వయవంశాబ్ధి చంద్రుఁడైన మన గంగయామాత్యుఁడు ముందు జైమినిభారతకృతిపతియైన సాళువ నృసింహనృపాలుని సచివుఁడై యుండినట్టు ప్రబోధచంద్రోదయద్వితీయాశ్వాసాదిపద్యమువలన నెఱుఁగవచ్చును.

క. శ్రీకరవీక్షణ ! దాన
శ్రీకర ! నరసింహనృపవశీకర నయవి
ద్యాకరణ ! చతుర్దశవి
ద్యాకర ధీరంగమతి ! యనంతయగంగా !

[పయి పద్యమునుబట్టి గంగయామాత్యుఁడు కొంతకాలము సాళువ నృసింహనృపాలుని సచివుఁడైనట్లు చెప్పుటకు వలను పడదనియు, 'నరసింహ నృపవశీకర నయవిద్యాకరణ' అను విశేషణముచే నృసింహరాయలను జీవగ్రాహముగాఁ బట్టించు గంగనామాత్యుని నయవిద్యాకరణ మహత్త్వమే వ్యక్తమగుచున్నదనియు, గంగనామాత్యుఁడుదయగిరి దుర్గాధిపతి యగు పురుషోత్తమ గజపతికి సామంతుఁడగు బసవనృపాలుని మంత్రియై యుండి తన ప్రభువుతోఁబాటు పురుషోత్తమ గజపతికి సాళువ నృసింహనృపాలునిఁ బట్టుకొనుటలో మిక్కిలి సాయపడి యుండుననియును శ్రీచాగంటి శేషయ్యగారి యభిప్రాయము. శ్రీ ఉకుమళ్ళ అచ్యుతరావుగారును శ్రీ వీరేశలింగము పంతులుగారి యభిప్రాయముతో నేకీభవించలేదు]

ప్రబోధచంద్రోదయ కర్తలు కొంతకాలము పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవిశిఖామణితో సమకాలీనులు. వీరు తమ ద్వితీయగ్రంథమైన వరాహపురాణమును కృష్ణదేవరాయలతండ్రి యైన తుళువ నరసింహరాయని కంకిత

మొనర్చిరి [ఈ నరసింహరాయఁడు "నరసింహ విజయపురాణము, వరలక్ష్మీ కల్యాణము" అను రెండు గ్రంథములను కృతినందెననియు, ఆ కవులెవ్వరో ఆ గ్రంథములనుగూర్చిన విశేషము లేమియో తెలియరాలేదనియు, నరసింహ విజయ పురాణములను నరసింహరాయల విజయగాథలే వర్ణింపఁబడి యుండవచ్చుననియును 'ఆంధ్రకవి తరంగిణి' లోఁ జెప్పఁబడి యున్నది. (సం. 6 పుట 121)] ఈ యీశ్వర నరసింహరా జప్పటికి రాజుగాక జైమినిభారతకృతిపతియైన సాళువ గుండనృసింహరాయని దండనాథుఁడుగా నుండెను. ఈశ్వరనరసింహరాయలు ౧౪౮౭ వ సంవత్సరమునందు కర్ణాట రాజ్యాధీశ్వరు డయ్యెను. అతఁడు రాజు కాకముందే వరాహపురాణ మతని కంకిత మొనర్పఁబడినందున ౧౪౮౭ వ పంవత్సరమునకుఁ బూర్వమునం దనఁగా ౧౪౮౦-౮౫ సంవత్సరప్రాంతములయందు పరాహపురాణము రచియింపఁబడి యుండును, కవు లీ క్రింది సీసపద్యభాగమున శ్రీనాథునిఁ గూడఁ బూర్వకవులలోఁజేర్చి పొగడిరి

గీ. నన్నపాచార్యునకు వందనంబు చేసి
తిక్కయజ్వకు మ్రొక్కి కీర్తితములైన
శంభుదాసుని వాగ్విలాసములు నెమ్మ
నంబులోపల నిలిపి శ్రీనాథుఁ బొగడి.

కృతిపతి యయిన నరసింహరాయఁడు నిండుకొలు వుండి తమ్ముఁ జూచి వరాహపురాణమును తన కంకితము చేయుఁ డని కోరినట్లుగా కవు లీ క్రింది పద్యములలోఁ జెప్పి యున్నారు.

సీ. అష్టభాషాకవిత్వాబ్జసంభవులైన
సుకవిపుంగవులు సంస్తుతులు చేయ
సంకీర్ణరాగరంజకులైన గాణల
గములు గీతప్రబంధములు పాడ
కలకంకణక్వాణకరసరోరుహలైన

రమణులు వింజామరములు వీవ
వరబలాధికులైన శరణాగతారాతి
సామంతు లుభయపార్శ్వములఁ గొలువ

కూర్మితనయుఁడు నరసయ్య గుణనిధాన
మంతికంబున సేవింప నలఁదికొన్న
సురభికాశ్మీరగంధంబు సోడుముట్ట
నుండెఁ బేరోలగము నయనోత్సవముగ.

* * * *

క మీ రిరువురు నెప్పుడును శ
రీరప్రాణములక్రియఁ జరింతురు మిగులం
గూరిమిఁ గృతిఁ బ్రతిపద్యముఁ
జారుగతిం జెప్పఁగలరు చాటువుగాఁగన్.

క. కావున మీరు దలంచిన
శ్రీవారాహంబు మంచికృతి మా పేరం
గావింపుఁ డనుచు సుముఖుం
డై వీడ్యముఁ గప్పురంబు నర్పించుటయున్.

ఇందలి మొదటి సీసపద్యమువలన నరసింహరాయని కొడుకైన (వీర) నరసింహరాయఁ డప్పటికే పెద్దవాఁడయి సభలో జనకుని సమీపమున నుండి నట్టు తెలియవచ్చుచున్నది.

ఈ కవులు వరాహపురాణమునందు గృతిపతియైన నరసింహరాయని ప్రభు వగు సాళువనృసింహరాజుయొక్క వంశాభివర్ణనము చేయుచు, చంద్రవంశ పురాజయిన గుండరాజునకు సాళువ మంగరాజును, సాళువ మంగరాజునకు గౌతరాజును, గౌతరాజునకు గుండరాజును, గుండరాజునకు జైమినిభారత మును కృతి నందిన నరసింహరాజును పుట్టినట్టును, ఆ నృసింహరాజువద్ద

వరాహపురాణమునకుఁ గృతీశ్వరుఁ డైన నరసింగరాజుతండ్రి యైన యీశ్వరరాజు సేనానాయకుఁ డయి యుండినట్టును, వీరిని తుళువాన్వయ మయినట్టును, చెప్పి యున్నారు. ఈ నృసింహరాజునే నరసింగరాయఁ డనియు, పుస్తకములయందు వాడుదురు ఈ యంశమును దెలుపు పద్యాదులలోఁ గొన్నిటిని వరాహపురాణమునుండి యిం దెత్తి చూపుచున్నాను.

సీ. తుహినాంశువంశపాథోరాశిమాణిక్య
మష్టదిగ్రాజభయంకరుండు
కర్ణాటరాజ్యరక్షణదక్షబాహాసి
వరవసంతత్యాగవైభవుండు
శివరాత్రిసమయసంశీలతాగుణశాలి
ధరణీసుపర్వనిస్తారకుండు
విరచితాతులతులాపురుషదానవిభూతి
సమదరాయకటారిసాళువంబు
గుండవిభు నారసింహమండలేశ్వ
రుండు గణుతింప రాజమాత్రుండు గాఁడు
కిన్నరస్త్రీసమూహగేగీయమాన
వర్తనంబులు గల చక్రవర్తి గాని.

....

వ. అట్టి నరసింగరాజరత్నంబుచేత మన్నన వడసి సైన్యనాయకపట్టభద్రత్వంబున నిర్నిద్రవిజయలక్ష్మీమహత్వంబున మదవదభియాతిభయదసత్వంబున దీర్ఘాయురైశ్వర్యధుర్యుండైన యీశ్వరనాయకునకుఁ బ్రియతనూభవుండు, నరసవసుధాధ్యక్షుండు నిర్వంచి తాను బ్రగహంబునం బరిగ్రహించిన యిమ్మహాప్రబంధంబునకు శృంగారవిభూషణంబుగా తదీయవంశావతారంబు.

సీ. ఉదయాద్రి భేదించె హుత్తరి నిర్జించె
గండికోటపురంబుఁ గదలఁ ద్రవ్వెఁ

బెనుగొండ సాధించె బెంగుళూరు హరించెఁ
గోవెల గుంటూరు గుంటుపఱిచెఁ
గుందాణి విదళించె గొడుగుచింత జయించె
బాగూరు పంచము పాడుచేసె
నరుగొండ పెకలించె నామూరు మర్దించె
సీరంగపట్నంబు బారిసమరె
రాయచౌహత్తిమల్లధరావరాహ
మోహనమురారి బర్బరబాహుసాళ్వ
నారసింహప్రతాపసన్నహనుఁ డగుచుఁ
విశ్వహితకారి తిమ్మరయ యీశ్వరుండు.

.. ..

గీ. ఇట్లు తుళువాన్వయాగ్రణి యీశ్వరుండు
పూర్వజన్మతపఃఫలంబునఁ గులంబు
ధన్యత వహింపఁ గన్నపుత్రకులలోనఁ
బ్రభుత గైకొనె నరసింహపార్థివుండు.

... .

సీ. చర్చించి చూచిన సరసజ్ఞతాపటు
ప్రౌఢిమ మరువంబుపరిమళంబు
పరికించి చూచిన నిరుపమత్యాగల
క్ష్మీవిలాసము దేవతావరంబు
భావించి చూచిన బహుమానసమ్యగ్ద
యావిశేషోక్తి శిలాక్షరంబు
తర్కించి చూచిన ధర్మసంపాదన
క్రీడావివేకంబు తోడుసీడ
దుర్మదారాతిహరణచాతుర్యధైర్య
వీర్యగాంభీర్యగుణములు వెన్నతోడఁ
బెట్టినవి సాటి చెప్పుట యెట్టు నృపుల
నీశ్వరప్రభునరసపృథ్వీశ్వరునకు.

పైని జెప్పఁబడిన తిమ్మయయీశ్వరరాజు సాళ్వగుండ నరసింహరాజునకు సేనానాయకుఁ డగుటయేకాక దాయాదుఁడు కూడ నయి యుండుటచేత నుభయుల యనంతరమును నీశ్వరరాజుపుత్రుఁడును, సాళ్వగుండ నృసింహరాయని యప్పటిసేనాధిపతియు నైన బలవంతుఁడగు తుళువ నరసింహరాయఁడు సంతానహీనుఁడయి కాలధర్మము నొందిన తన ప్రభువుయొక్క రాజ్యభారమును వహించినట్టు తోఁచుచున్నది. [సాళువ, తుళువవంశములు వేర్వేఱు వంశములనియు, సాళువ వంశీయులు చంద్రవంశ క్షత్రియులు, తుళువ వంశీయులు శూద్రులనియును 'ఆంధ్రకవి తరంగిణి' కారుల యభిప్రాయము (సం. 6 పుట 12)

సాళువ నరసింహరాయలు సంతానహీనుఁడయి కాలధర్మము నొందలేదనియు అతని కిద్దఱో, ముగ్గురో కుమారు లుండిరనియుఁ గొందఱభిప్రాయపడుచున్నారు. ఈ సాళువ నరసింగరాయల కిరువురు కుమారులనియు, వారిరువురు యుక్తవయసు రానివా రగుటచే నరసింహరాయలు తన యవసాన కాలమున వారిని తన దండాధిపతియు సమర్థుఁడు నగు తుళువ నరసనాయకున కప్పగించి వీరిని జాగ్రతగఁ గాపాడి వారికి యుక్తవయసు వచ్చిన పిమ్మట రాజ్యమును, ధనమును వారి స్వాధీనము చేయుమని వేఁడుకొనెననియు, నందుఁ బెద్దవానిని తిమ్మరసు అను నాతఁడు చంపెననియు, నందుచే రెండవ వానిని సింహాసన మెక్కించి నరసనాయకుఁడు రాజ్యభారమును దాను వహించి నడపెననియు న్యూనిజు అను పాశ్చాత్య చరిత్రకారుఁడు వ్రాసియుండెననియుఁ జెప్పుచున్నారు .... తిమ్మరాజు అను పేరుగల శత్రురాజు (పెద్దవానిని) చంపియుండెననియు నభిప్రాయ పడిరి. ఇదియే సత్యమై యుండును తుళువ నరస నాయకుఁడే యతనిని జంపించెనని యొక యపవాదము కూడ కలదు. ఈ యపవాదమునకు భయపడి నరస నాయకుఁడు విశేష సమర్థుఁ డయ్యును, నిజముగాఁ గర్ణాట రాజ్య సింహాసనమును నధిష్ఠింపఁ గోరికయు, శక్తియుఁ గలవాఁ డయ్యును, నరసింగరాయల కుమారుని సింహాసన మెక్కించి, నామ మాత్రమున కాతనిని రాజుగా నుంచి తానే సర్వాధికారియై రాజ్యము చేయుచుండెను కొన్ని

శాసనములలో సాళువ వంశ బిరుదములు తాను ధరించుటయు, దానే రాజు నవి ప్రకటింప యత్నించుటయుఁ జూడ నరస నాయకుని రాజ్యకాంక్షయు, స్వాతంత్ర్యా భిలాషయు స్పష్టమగును కాని లోకాపవాదమునకు భయ పడియో, తన ప్రభువున కవసాన కాలమున, జేసిన వాగ్దానము నిలుపుకొన వలయు ననియో, నరసింగరాయల కుమారునిఁ దాను జీవించి యున్నంత కాలము కర్ణాట రాజ్యాధిపతిగా నంగీకరించెనను మాట మాత్రము యథా ర్థము. ('ఆంధ్రకవి తరంగిణి' సం. 6 పుటలు 123, 124)]

వరాహపురాణమును కృతినందిన నరసింహరాయని కాలము మనకుఁ దెలి యును గనుక, ఇంచుమించుగా నీ కవుల కాలమును దెలియును. కృష్ణదేవ రాయల తండ్రియైన యీ నరసింహదేవరాయలు క్రీస్తుశకము ౧౪౮౭ వ సంవత్సరము మొదలుకొని ౧౫౦౮ వ సంవత్సరమువఱకును రాజ్యపాల నము చేసినట్లు శిలాశాసనాదులవలనఁ దెలియవచ్చుచున్నది కంచిలో నున్న దేవాలయములలో నొకదానిమీఁద శాలివాహనశకము ౧౪౦౯-వ సంవత్స రమునం దనఁగా హూణశకము ౧౪౮౭ వ సంవత్సరమునందు నరసింహ దేవరాయలు భూదానము చేసిన ట్లొక శిలాశాసనమువలనఁ దేటపడుచున్నది. ఇంతకుఁ బూర్వమునం దీతని పేరు శిలాశాసనాదులలో నెక్కడను ఉదా హరింపఁబడి యున్నట్లు కానఁబడదు అందుచేత నితఁ డా సంవత్సమునందే రాజ్యమునకు వచ్చిన ట్లూహింపఁబడుచున్నది. అనంతపురమండలములో పెన్నేటి యొడ్డున నున్న రామపురమునందలి రామేశ్వరస్వామియాలయపు గోడ మీఁద నరసింహదేవరాయలు శాలివాహనశకము ౧౪౨౯-వ సంవత్స రమునకు సరియైన క్రీస్తుశకము ౧౪౯౭-వ సంవత్సరమునందు రాజ్యము చేయుచుండినట్టు శిలాదానశాసన మొక్కటియున్నది. ఈ ప్రకారముగా నీతనిదానశాసనములు ౧౫౦౮-వ సంవత్సరమువఱకును గానఁబడుచున్నవి. ఆ మఱుసటి సంవత్సరమునందు కృష్ణదేవరాయలరాజ్యా రంభమైనది. ఈ నరసింహరాయని యనంతరమున నాతనిజ్యేష్ఠ పుత్త్రుఁడు వీరనరసింహరాయఁ డైదు సంవత్సరములు రాజ్యముచేసి ౧౫౦౮-వ సంవత్సరమునందు మృతి నొందెననియు, అందుచేత కృష్ణదేవరాయల తండ్రి నరసింహరాయలు

౧౫౦౩-వ సంవత్సరమువఱకే రాజ్యపాలనము చేసె ననియు, తండ్రికొడుకుల పేరు లొక్కటియే యగుటచేత శాసనపరిశోధకు లిద్దఱు నొక్కరే యని భ్రమపడిరనియు, కొందఱు చెప్పుచున్నారు. సత్య మిదే. కృష్ణదేవరాయలు జనకుని యనంతరమునఁ గాక యగ్రజుఁ డైన వీరనరసింహరాయుని యనంతరముననే రాజ్యమునకు వచ్చినట్లు మనుచరిత్రలోని యీక్రింది పద్యములు తెలుపుచున్నవి.

క. వీరనృసింహుఁడు నిజభుజ
 దారుణకరవాలపరుషధారాహతవై
 రారి యగుచు నేకాతప
 వారణముగ నేలె ధర నవారణమహిమన్.

క. అ విభు ననంతరంబ ధ
 రావలయముఁ దాల్చెఁ గృష్ణరాయఁడు చిన్నా
 దేవియు శుభమతి తిరుమల
 దేవియునుం దనకుఁ గూర్చుదేవేరులుగన్.

కాఁబట్టి నరసింహదేవరాయలకాలములో నున్న యీ కవులు హూణశకము ౧౪౮౦ వ సంవత్సరమునకును ౧౪౮౫-వ సంవత్సరమునకును మధ్యకాలమునందు వరాహపురాణమును రచియించి యున్నారు. ప్రబోధచంద్రోదయము నంతకుముందే ౧౪౭౦-౭౫ ప్రాంతములందు రచించిరి. వరాహపురాణము కృతి నందు నాఁటి కింకను నరసింహరాయఁడు సాళువ గుండ నరసింహరాయని దండనాథుఁడుగానే యుండినట్లు కృతినాయకుని సంబోధించిన వరాహపురాణములోని యీ క్రింది యాశ్వాసాంతపద్యములు తెలుపుచున్నవి.

క. తుళువకులజలధికల్పక
 సాళ్వశ్రీనారసింహజనపాలస్వ
 ర్థాళ్విబకంఠీరవ ! మణి
 గాల్వతులాకోటిరుచివికస్వరచరణా !   ఆ ౪.

క. బుధవినుత ! సాళ్వనరసిం
గధరాధవదండనాథ ! కొంతాపంచా
యుధ ! సుమనస్తరుసుమనో
మధురసమధురిమధురీణమంజులఫణితీ ! ఆ ౬.

క. ధరణినుత దేవకీపుర
వరనిలయశ్రీగిరీశవనసంపన్నే
శ్వరవిభుతనయా ! సాళువ
నరసింహనృపాలదండనాయకతిలకా ! ఆ ౧౧.

ఈ యిరువురు కవులును గ్రంథరచన చేసినట్లు చెప్పఁబడియున్నను వీరిలో మలయమారుతకవి యనఁబడెడు ఘంట సింగన్నయే ప్రసిద్ధుఁడైన మంచి కవి యైనట్టు గ్రంథాంతరములవలనఁ దెలియవచ్చుచున్నది. ఈ సింగన్న తండ్రిపేరు నాగయ్య; తల్లి పేరమ్మలాంబ; పారిజాతాపహరణమును రచియించిన నందితిమ్మకవి యీ మలయమారుతకవికి మేనల్లుఁడు నంది మల్లయతండ్రిపేరు సింగన్న. తల్లిపేరు పోతమాంబ సాధారణముగా ముక్కుతిమ్మన్న యనఁబడెడు నందితిమ్మకవి యీ మల్లయకవికి మనుమఁడని చెప్పుదురు. కాని పారిజాతాపహరణమునందు కవి తన వంశమును జెప్పుచో నీ క్రింది పద్యమునం దా సంగతిచెప్పి యుండలేదు.

సీ. కౌశికగోత్రవిఖ్యాతుఁ డాపస్తంబ
సూత్రుఁ డార్వేలపవిత్రకులుఁడు
నంది సింగామాత్యునకును దిమ్మాంబకుఁ
దనయుండు సకలవిద్యావివేక
చతురుండు మలయమారుతకవీంద్రునకు మే
నల్లుఁడు కృష్ణరాయక్షితీశ
కరుణాసమాలబ్ధఘనచతురంతయా
నమహాగ్రహారసన్మానయుతుఁడు
తిమ్మయార్యుండు శివపరాధీనమతి య
ఘోరశివగురుశిష్యుండు పారిజాత

హరణమను కావ్యమొనరించె నంధ్రభాష
నాదివాకరతారాసుధాకరముగ

మల్లయసింగయకవులలో నెవ్వరికవిత్వ మేదో యుభయుల రచనలకును గల తారతమ్యమెట్టిదో నిర్ణయించుట కాధారము లేవియుఁ గానరావు. అక్కడక్కడఁ గొన్ని యపూర్వప్రయోగములు గానంబడుచున్నను మొత్తముమీఁద కవనము రసవంతముగాను, నాతికఠినముగాను, శ్రావ్యముగాను ఉన్నది. కవిత్వరీతి తెలియుటకయి కొన్ని పద్యముల నిందుదాహరించుచున్నాను.

ప్రబోధచంద్రోదయము.

మత్తకోకిల

ఏను మున్నొకనాఁడు పద్మజునింటి కేఁగినఁ గొల్వులో
మౌను లెల్లరు లేచి రప్పుడు మమ్ముఁ జూచి పితామహుం
డానవెట్టి ప్రియంబు చెప్పుచు నంబుగోమయమార్జితం
బైనయట్టి నిజోరుపీఠికయందు నిల్పఁడె నావుడున్. ఆ ౨.

మత్తకోకిల.

ఓరి భిక్షుక! చెప్పురా నిను నొక్క శాస్త్రరహస్య మేఁ
జేరి వేఁడెద నన్న బౌద్ధుఁడు చిట్టుముట్టు పటంచు నో
రోరి జైనపిశాచ! నగ్నుఁడ! యోరి దుష్కులభాండ! నీ
కూరకేటికి శాస్త్రగర్వము లోరి కాఋలు మానురా. ఆ ౩.

ఉ. మెత్తని దుప్పటంబులను మెత్తిన కస్తురికప్పురంబులన్
ముత్తెవుఁబేరులన్ సురభిపూరితపుష్పములన్ వృథా వెలిన్
హత్తిన వేడ్కఁజూతు రహహా! మతిహీనులు లో నెఱుంగ కీ
భిత్తరివారనారు లను పేరిట జంగమనారకంబులన్. ఆ. ౪.

మ. ధన ముద్యన్నిధనంబు దేహము విపత్సంతానగేహంబు భా
మ నితాంతంబు ననర్థసీమ విషయోన్మాదంబు ఖేదంబు గ
న్గొన లోకంబున శోక మిట్టిదెఱింగి నూల్కొలేరు ప్రాణు ల్కటా!
యనవద్యాత్మసమేధమానసుఖపథ్యాహృద్యసంచారముల్. ఆ ౫.

వరాహపురాణము

ఉ. చూచె నృపాలునెమ్మొగము చూపు సరోజగతాళిసన్నిభం
బై చరియింపఁ జూచి హృద[illegible]రూధివిభేదనార్థమై
చూచె నిజార్చితాంగజునిఁ జూపు మహీవిభు నేయనిచ్చ నా
రాచముకై వడిఁగా మెఱయ రాజకుమారిక ఘర్మవారియై. ఆ. ౩.

చ. అతివిశదప్రభావిలసనాస్పదమైన పదాంగుళీనఖ
ప్రతతి వెలుంగు నా హిమధరాధరపుత్రికిఁ బద్మనేత్రకుఁగా
గతజననంబునం దమకు గాదిలిసోదరి గాన భక్తితో
సతతముఁ గొల్వ దక్షతనుజాతలు తారలు వచ్చెనో యనన్ ఆ. ౨.

ఉ. కమ్మని తేనియల్ తఱచు కాలువలై ప్రవహింప మీఁద ఝం
ఝుమ్మని మ్రోయు తుమ్మెదలజొంపము మళ్ళకు నీళ్ళు కట్టుచో
బమ్మినవేడ్కఁ బాడు వనపాలకబాలకదంబకంబుచం
దమ్మున నొప్పు నప్పురము నాలుగువంకలఁ బువ్వుతోఁటలన్ ఆ. ౪.

ఉ. ఆ లలనావతంసముల నమ్మనులం గని జారరానల
క్ష్వేళభరంబు నేత్రములఁ జీఁకటి గొల్పఁగ నాట లేల యీ
యాలతు లేటికిం జెవుల నంతకుపల్కులు వోవ నిన్నియుం
జాలును దుఃఖితే మనసి సర్వ మసహ్యమటం చెఱుంగవే! ఆ ౧౨.

నందిమల్లన్న ఘంటసింగన్న కవులు మదనసేనము, షష్ఠస్కంధము, భారతము, బలరామవిజయము చేసిరని యొకరు వ్రాసియున్నారు. మలయమారుత సింగన్నకవుల షష్ఠములోనిదని శ్రీమానవల్లి రామకృష్ణకవిగారు కుమారసంభవటిప్పణములో నీ క్రింది పద్యము నుదాహరించి యున్నారు—

సీ
వారిధిశయనుఁ జేయారఁ బూజింపని ఖలుఁ బట్టి పెడకేలు గట్టి తెండు; హరి
మందిరమున కత్యాదరుఁడై నడవని హీనాత్ముఁ గాల్పట్టి యీడ్చి తెండు; వలవదు
భయంబు వారెంతవారలైన నట్టివారలు మన కగ్గమైనవారు; వారు నిరయం
బునకుఁ గాఁపు వచ్చువారలనుచు బుద్ధిగఁ జెప్పె మార్తాండసుతుఁడు;

దూబగుంట నారాయణకవి

ఇతఁడు పంచతంత్రమును పద్యకావ్యమునుగా రచియించి తమ్మభూపాలుని పుత్రుఁడైన బసవభూపాలుని కంకితము చేసెను కృతిపతి పిలిపించి తన్నుఁ గూర్చి పలుకుట మొదలైన విషయములను పుస్తకములో కవి యిట్లు చెప్పుకొని యున్నాడు.

చ. హరిహరభక్తు నార్యనుతు నాంధ్రకవిత్వవిశారదు న్మహే
శ్వరవరమాననీయుఁ గులవర్ధను శాంతుఁ బ్రబంధవాచకా
భరణము నాగమాంబికకు బ్రహ్మయమంత్రికి నాత్మసంభవుఁ
సరసుని దూబగుంటపురశాసను నారయనామధేయునిన్.

క. తలఁపించి హితులు చెప్పఁగఁ
బిలిపించి కవిత్వగోష్ఠిఁ బ్రియ మెసఁగంగాఁ
బలుకుచు నితాంతకాంతిం
దళుకొత్తంగ నంకురించు దరహాసమునన్.

క. తన ముఖచంద్రమరీచులు
జననయనచకోరపఙ్క్తులకు సాంద్రానందం
బొనరింప వేడ్క నన్నుం
గనుఁగొని యిట్లనియె వినయగౌరవ మెసంగన్.

చ. సురుచిరమైన నీ కవిత సూరిసభాంతరయోగ్యతామనో
హరసరసార్థగుంభనల నందము గావున నారనార్య సు
స్థిరమతిఁ గీర్తి నన్నొరయఁ జేసి సమస్తజగత్ప్రసిద్ధిమైఁ
బరఁగుచునుండ మాకొక ప్రబంధ మొనర్పు ప్రియం బెలర్పఁగన్.

గీ. పంచతంత్రి యనఁగ నంచితగీర్వాణ
భాషనున్న చెప్పఁబడినయట్టి
కావ్యమాంధ్ర భాషఁ గర్ణామృతంబుగాఁ
గూర్పవలయు నీదునేర్పు మెఱయ.

కృతిపతితియింటిపే రేమో యే కాలమునం దుండినవాఁడో యీ గ్రంథమునుబట్టి తెలియరాలేదు; గాని యితరగ్రంథములనుబట్టి తెలియవచ్చుచున్నవి కృతిపతి యయిన బసవక్షితీశ్వరుఁడు శ్రీరాముని కుమారుఁడగు కుశునివంశమువాఁడగు మాధవవర్మసంతతివాఁ డయినట్లు చెప్పి. కవి మాధవవర్మ నిట్లు వర్ణించి యున్నాఁడు—

చ. మును బెజవాడ దుర్గమున మగ్గుతనంబున మెచ్చఁజేసెఁ బెం
పున రథదంతివాజిభటభూరిబలంబులచేఁ గళింగభూ
జనపతిఁ ద్రుంచి చేవఁ దన సంతతికై మహిఁ బాదినిల్పి గ్ర
మ్మనఁ జిరకీర్తులం గనిన మాధవవర్మనిజాన్వయంబునన్.

పూసపాటివారు మొదలైన యీ ప్రాంతములయందలి క్షత్రియసంస్థానాధిపతు లందఱును దా మీ మాధవవర్మ సంతతివార మనియే చెప్పుకొనుచున్నారు. ఈ మాధవవర్మవంశమునందు కొమ్మావనీశుఁడు పుట్టినట్టును, అతని కబ్బలదేవుఁ డుద్భవించినట్టును, అతనికి సింగభూపాలుఁ డుదయించినట్టును, అతనికి తమ్మరాజు కలిగినట్టును, అతనికిఁ గృతిపతి యైన బసవధరాధి నాథుఁడు జనియించినట్టును చెప్పఁబడి

మ. మనుమార్గుఁడగు తమ్మభూపతికి దేమాజాంబకుం బుత్రుఁడై
జనియించెన్ బసవేంద్రుఁ డర్థిజన భాస్వత్కల్ప భూజాతమై
వనితామన్మథుఁడై వివేకనిధియై వారాశిగాంభీర్యుఁడై
యనతారాతి మహాంధకారపటలీహంస ప్రతాపాఢ్యుఁడై

సీ. రమణీయదానధారాప్రవాహంబులు
పాథోధి కలితవిజృంభణముగాఁగ
నిరుపమాన ప్రభానిర్మలసితకీర్తి
త్రిభువనసాంద్రచంద్రికలు గాఁగ
నతులవిక్రమబలోద్యత్ప్రతాపస్ఫూర్తి
పరులకు నుగ్రాతపంబుగాఁగ
సమధికశృంగార సౌందర్యరేఖ దాఁ
ధరణీలతావసంతంబుగాఁగ

రామరఘురంతిసగరధర్మజదిలీప
భోజసర్వజ్ఞపోమేళరాజసరణి
ధాత్రిఁ బాలించెఁదమ్మభూధవసుతుండు
శాశ్వతంబుగ బసవభూమీశ్వరుండు

ఇత్యాది పద్యములతో గ్రంధమునందుఁ గృతిపతి వర్ణింపఁబడెను. నెల్లూరి మండలములోని యుదయగిరియందు * కుంటమరాజు వల్లభయ్య కుమారుఁడు తమ్మరాజు ౧౪౬౦ వ సంవత్సరమున గోపాలకృష్ణదేవాలయము కట్టించినట్టొక శిలాశాసనమువలనఁ దెలియవచ్చుచున్నది ఈ తమ్మరాజే మనకృతిపతితండ్రియైన తమ్మరాజని తోఁచుచున్నది. అతఁడే యితఁ డయినపక్షమునఁ బసవనృపాలుని యింటిపేరు కుంటమరాజు వారనియు బసవనృపాలునికా-ము ౧౪౭౦-౮౦ సంవత్సరప్రాంతమనియు స్పష్టమగుచున్నది. ఈ బసవనృపాలునిమంత్రి యనంతయ గంగామాత్యుఁడు

గీ వసుధ నెగడిన మాధవవర్మవంశ
వర్ధనుండగు తమ్మభూవరునిబసవ
పార్థివున కాప్తుఁడై కృపాపాత్రుఁడగుచు
ఘనత మెరసె ననంతయగంగవిభుఁడు.

అని దగ్గుపల్లి దుగ్గనకవి రచియించి గంగనామాత్యున కంకితముచేసిన నాచికేతూపాఖ్యానమునందుఁ జెప్పఁబడినది ఈ దుగ్గనకవి శ్రీనాథ మహాకవి మఱఁది యగుటచేత నాచికేతూపాఖ్యానకర్తయు, భర్తయు పదునైదవ శతాబ్ది యుత్తరార్థమున నుండి యుండవలెను. ఈ యనంతయ గంగామాత్యునకే ౧౪౮౦-౯౦ సంవత్సరప్రాంతము నందుండిన నరసింహరాయనికి వరాహపురాణ మంకిత మొనర్చిన నంది మల్లన ఘంట సింగన కవులు ప్రబోధచంద్రోదయము నంకితము చేసిరి. ప్రబోధ చంద్రోదయమునందు

[* కంఠమరాజని ఆంధ్రకవి తరంగిణి. (సం. 4 పుట 91) వీరు పూసపాటివారని శ్రీ శేషమళ్ళ అచ్యుతరావుగారు]

గీ. అట్టి గుణశాలి తమ్మరాయనికుమార
వీరబసవక్షమాచక్రవిభునిచేత
మన్ననలు గాంచి మించిన మహితుఁ డితఁడు
మనుజమాత్రుండె గంగయామాత్య వరుఁడు.

అవి చెప్పఁబడినది. ౧౪౬౦-మొదలు ౧౪౯౦-వ సంవత్సరమువఱకు నుండిన యనంతయామాత్యుని కొత్తప్రభువైన తమ్మయ బసవభూపాలుఁడు ౧౪౭౦-౮౦ సంవత్సరప్రాంతములయందు దప్పక యుండినవాఁడు. అందుచేత తమ్మయ బసవభూపాలునికి పంచతంత్రము నంకితమొనర్చిన దూబగుంట నారాయణకవి ౧౪౭౦-౮౦-వ సంవత్సర ప్రాంతములయం దుండె ననుటకు సందేహములేదు. నారాయణకవి దూబగుంటకరణము; * అపస్తంభసూత్రుఁడు; మైత్రావరుణగోత్రుఁడు, బ్రహ్మయామాత్య పుత్రుఁడు; ఆఱువేలనియోగికులపవిత్రుఁడు. ఈతని పంచతంత్రము వేంకటనాథుని పంచతంత్రమంతటి రసపుష్టి కలది కాకపోయినను, సలక్షణమయి చక్కని లోకోక్తులతోను మృదువులయిన తెలుఁగుపదములతోను నిండి తేనెలొలుకునదిగా నున్నది. ఈతని పంచతంత్రమునుండి కొన్ని పద్యముల నిందు దాహరించుచున్నాను

చ. శరనిధి దాఁట నావయును సంతమసం బడఁగింప దీపముల్
వరకరిశిక్ష కంకుశము వాయువుఁ గూర్పఁగఁ దాళవృంతముల్
వెరవునఁ జేసె బ్రహ్మ పదివేలవిధంబుల మూర్ఖచిత్తవి
స్ఫురణ మడంపలేక తలపోయుచు నిప్పుడు నున్నవాఁ డొగిన్
మిత్రభేదము.

[* నారాయణకవి యింటిపేరు 'దూబగుంటవా'రని చెప్పుట కవకాశములేదనియు, 'హరిహరభక్త-' నను పద్యమునుబట్టి 'వాచకాభరణము'గాని, 'ప్రబంధ వాచకాభరణము' అని కాని యింటిపేరై యుండవచ్చుననియు, ఒకవేళ 'ప్రబంధ వాచకాభరణము' కవివిశేషణమైనఁ గావచ్చుననియు, 'ఆంధ్రకవి తరంగిణి' (సం. 6 పుట 86]

చ. మిగుల హితుండు నావలన మేలును బొందె నితండు నాయెడం
నెగఁడని ధూర్తు నమ్మి చెడుఁ దెల్లము సజ్జనశబ్ద మాత్రమే
నెగడును గాని యిప్పు డవనిన్ సుజనుం డనువానిఁ గాన ని
మ్ముగ ధనలేశమాత్రమున మోహనిబద్ధము లోకమంతయున్

సుహృల్లాభము.

చ. అతులితసత్త్వతాపమహిమాస్పదుఁడైన విరోధి దూరసం
స్థితుఁ డగునేనిఁ దద్విపులతేజముఁ దా నడఁగించు; నల్పుఁడా
యతశితశస్త్రహస్తుండయి యౌదలదగ్గఱ నుండె నేనియున్
జతురుఁడు గాఁడు వైరిజన సంహరణంబునకు న్నిజంబు గజా.

సంధివిగ్రహము.

ఉ. గుండియ పుచ్చి పెట్టుకొని కొమ్మపయిఁ బదిలంబు చేసి నే
నుండుదు నట్టిభారమున కోర్వక యెప్పుడు; నేఁడు నే నభా
గ్యుండను నీకు నక్కఱకుఁ గూర్చిన సొమ్మని మున్నెఱింగి తే
కుండుటఁజేసి యేమని ప్రియోక్తులు పల్కుదు? నేమి చేయుదున్.

లబ్ధనాశనము.

ఉ. అక్కఱలెల్లఁ దీఱవు నృపాగ్రణికిం బొడచూపకున్న నా
కిక్కడ వెన్నపాపనికి నెవ్వరు కాఁ పిఁక వేళ దప్పెఁబో
నక్కడనే ప్రయోజనము లబ్బు మనంబున మానవుండు దా
నొక్కటి చింత చేయ విధి యొక్కటి వేఱ తలంచు నక్కటా. *

అసంప్రేక్ష్యకారిత్వము.

[* శైచరాజు. వెంకటనాథుఁడు శిష్టు కృష్ణమూర్తిశాస్త్రి; భానుకవిఖాడ పంచతంత్రమును పద్యకావ్యములుగా వ్రాసినట్టు తెలియుచున్నది.]

వెన్నెలకంటి-సూరన్న

ఈ కవి విష్ణుపురాణమును తెనిఁగించెను. ఇతఁడించుమించుగా పదునేనవ శతాబ్దాంతము నందుండినట్లు తోఁచుచున్నది. విక్రమార్క చరిత్రమును కృతినందిన సిద్ధన్న మంత్రికి పెద్దతండ్రి యయిన వెన్నెలకంటి సూరయ్యా యనుకవి యొకఁడు వేమారెడ్డికాలములో నున్నట్లు విక్రమార్క చరిత్రము లోని యీ క్రిందిపద్యమువలనఁ దెలియవచ్చుచున్నది.

ఉ. వెన్నెలకంటి సూర్యుఁడు వివేకగుణాఢ్యుఁడు వేదశాస్త్రసం
పన్నుఁడు రెడ్డివేమనరపాలకుచేత మహాగ్రహారముల్
గొన్న కవీంద్రకుంజరుఁ డకుంఠితతేజుఁడు పెద్దతండ్రిగా
సన్నుతిఁగన్న సిద్ధనకు సంతత దానకళా వినోదికిన్.

ఇందుఁ జెప్పఁబడిన రెడ్డివేముఁడు ప్రోలయ వేముఁడు. విష్ణుపురాణమునందు కవిచే నీ కవిని గూర్చియే యీ క్రింది పద్యమునందు వ్రాయఁబడి యున్నది.

ఉ. ఈ నిఖిలంబు మెచ్చ నమరేశ్వరదేవుఁడు చూడఁ గృష్ణవే
ణీనది సాక్షిగా ననికి నిల్చిన రావుతుఁ గేసభూవిభుం
గానకుఁ దోలి వెన్నడిచి కాచిన వేమయయన్న పోతభూ
జానికి సత్త్వబంధము లొసంగిన వెన్నెలగంటివారిలోన్.

ఈ రెండు పద్యములలోను వర్ణింపఁబడిన వెన్నెలగంటి యతఁ డొక్కఁడే యనుటకు సందేహము లేదు మొదటి పద్యములో "వేమనరపాలకుచేత మహాగ్రహారముల్ గొన్నకవీంద్రకుంజరుఁ" డనియు, రెండవపద్యములో "వేమయ యన్నపోతభూజానికి సత్త్వబంధము లొసంగిన వెన్నెలగంటివా" రనియుఁ జెప్పఁబడి యున్నను, వేమారెడ్డియు, నాతని పుత్రుఁడైన యన పోతరెడ్డియు నేకకాలమునందే యుండినందున వెన్నెలకంటి సూరయ్య

చంద్రికౌత్సుకుల కిద్దఱిని ప్రబంధము లంకితముచేసి బహుమానములొంది యుండవచ్చును. అంతేకాక యనపోతరెడ్డి దండనాథుఁడుగా నుండి తండ్రి జీవితకాలములోనే ప్రసిద్ధి చెందియుండెనని యెఱ్ఱాప్రెగడ హరివంశము నందు స్పష్టముగాఁ జెప్పఁబడి యున్నది. వేమారెడ్డి హూణశకము ౧౩౨౦-వ సంవత్సరము మొదలుకొని ౧౩౪౯-వ సంవత్సరము వఱకును. ఆతని పుత్త్రుఁడైన వేమయయనపోతారెడ్డి ౧౩౫౦-వ సంవత్సరము మొదలుకొని ౧౩౭౧-వ సంవత్సరమువఱకును, రాజ్యము చేసినందున వారి యాస్థానము నందుండిన కవి వెన్నెలకంటి సూరన్న యా కాలమునందే నిస్సంశయముగా నుండినవాఁడు, ఈ కవి రచియించి యనపోతరెడ్డి కంకితముచేసిన ప్రబంధములేవో తెలిసినవి కావు. మనలో సాధారణముగా తాత పేరు మనుమనికి పెట్టుచుండుట యాచారమయినందున, విష్ణుపురాణమును రచించిన యీ సూరన్న పయి సూరన్నకు మనుమఁడో, మనుమని మనుమఁడో యయి యుండవలెను, ఈ కవి తాను అనపోతరెడ్డికి ప్రబంధము లొసంగిన వెన్నెలకంటివారి వంశజుఁడ ననియు; వెన్నెలకంటి సూర్యుని మనుమఁడ ననియు, వేఱువేఱుగాఁ జెప్పుకొనుటచేత నీతఁడు వేమారెడ్డి కాలములో నున్న సూరన్నకు మనుమని మనుమఁడగుట స్పష్టము. కవి మొదటిసూరన్న కయిదవతరము వాఁడగుటచే నిరువురకును నూఱు సంవత్సరములకంటె నెక్కువ వ్యత్యాసముండి యుండవలెను. కాబట్టి యీ కవి ౧౪౭౦-వ సంవత్సరమునకు ౧౪౮౦-వ సంవత్సరమునకును నడిమికాలములో నుండినట్లు నిశ్చయింపవలసియున్నది. * [ఇయ్యెడ 'ఆంధ్రకవితరంగిణి' లో (సం. 8 పుట 213, 214) నిట్లున్నది- 'పంతులుగారు వ్రాసిన యీ యంశము లన్నియు నూహాజనితములేకాని, యొక యాధారమునను సరించి వ్రాసినవికావు, పంతులుగారి యూహ సత్యమైనను కావచ్చును, అట్లు కాక వారిరువురును వేఱువేఱు వ్యక్తులైనను కావచ్చునని. విష్ణుపురాణకర్త అనపోతారెడ్డికి సత్ప్రబంధము లొసంగిన వెన్నెలకంటివారని మాత్రమే చెప్పెను. కాని వేమారెడ్డియొద్ద నగ్రహారములను గైకొనిన సంగతినిగూర్చి

యేమియుఁ జెప్పలేదు. వారొక్కరేయైనను, నిర్వురైనను విష్ణుపురాణ కర్తయైన సూరనార్యునికి తాతగాని, యాతని తాతగాని పై పద్యముల లోని సూర్యులలో నెవఁడును గాఁడు. వీరు వారికంటె భిన్నులు; .... ఒకప్పుడీ సూరన యాతని వంశ పరంపరలోనివాఁడు కాక వెన్నెలకంటి వారని గృహనామము గల మఱియొక వంశీయుఁడై నఁగావచ్చును. .... (పుటలు 216, 217) వేమారెడ్డి, అనపోతారెడ్డి ప్రభువుల కాలములో నున్న వెన్నెలకంటి సూర్యునిఁబట్టి కాలనిర్ణయముచేయుచు, గురుజాడ శ్రీరామ మూర్తి పంతులుగారు కవికాలము క్రీ. శ. 1378-1428 అనియును, వీరేశ లింగము పంతులుగారు 1460-1480 అనియును నిర్ణయించియున్నారు. కాని, ఆ నిర్ణయము సరియైనదికాదు. .... (పుట 221) ఈ సూరనార్యుఁడు పదునారవ శతాబ్దియందున్న వాఁడని స్పష్టము.]

ఈ కవి విష్ణుపురాణమునందు తన్నుఁగూర్చి చెప్పుకొన్న పద్యము నిం దుదాహరించుచున్నాను.

సీ. భవ్యచరిత్రు నాపస్తంబమునిసూత్రు
  శుద్ధసారస్వతస్తోత్రపాత్రు
హరితగోత్రపవిత్రు నాంధ్రభాషాకావ్య
  రచనాభినయవిశారదుఁ బ్రబంధ
కర్తను వెన్నెలకంటి సూర్యునిమను
  మనిఁ జెఱుకూరి యమరయమంత్రి
సత్పుత్త్రు నాశువిస్తారవిచిత్రమా
  ధుర్యకవిత్వచాతుర్యశీలు

నిజకులాచారమార్గైకనిపుణుఁ బరమ
సాత్త్వికోదయహృదయ వైష్ణవపురాణ
వేది సారస్యవిద్యాప్రవీణు సుకవి
మాననీయుని సూరనామాత్యవరుని.

ఈ విష్ణుపురాణ మలసాని పెద్దన్న ప్రబంధరచనకు దారితీయుటకుఁ గొంత కాలము ముందుగా పదునైదవ శతాబ్దాంతమునఁ జేయఁబడినది గా నున్నది. ఈ కవి శ్రీనాథాదులను దన పుస్తకమునందుఁ బూర్వకవులను గా స్తుతింపక.

ఉ. మున్నిటికాళిదాసకవిముఖ్యులకుం బ్రణమిల్లి వారిలో
నెన్నికగాఁ బ్రబంధపరమేశ్వరుఁ దిక్కనసోమయాజినిన్
నన్నయభట్టు భాస్కరుని నాచనసోముని రంగనాథునిన్
వెన్నెలగంటిసూర్యుఁ బదివేలవిధంబుల గొల్చి భక్తితోన్.

అని వెన్నెలగంటి సూర్యునికాలమువఱకు నున్నకవులను మాత్రమే స్తుతించినను. ఇతఁడు శ్రీనాథాదుల కాలమునకుఁ దరువాతివాఁ డయినట్లు విష్ణుపురాణకృతిపతియైన రావూరి రాఘవరెడ్డి కృతు లందిన తన పూర్వులను గూర్చి చెప్పిన యీక్రింది పద్యమువలన తేటపడుచున్నది.

క. అనవేమమండలేశ్వరుఁ
డును నళ్ళయవీరభద్రుఁడును మొదలుగఁ గ
ల్గినతొంటిరెడ్డిరాజులు
ఘనకీర్తులు గనిరి కృతిముఖంబున ననుచున్.

శ్రీనాథునిచేఁ గాశీఖండము కృతినంది ౧౪౩౫ వ సంవత్సరప్రాంతములం దుండిన వీరభద్రరెడ్డిని తన పూర్వులలో నొకనిగా కృతిపతియైన రాఘవ రెడ్డి చెప్పుటచేత విష్ణుపురాణము రచియింపఁబడినకాల మటు తరువాత నేఁబది యఱువది సంవత్సరములయిన నయి యుండవచ్చును. కృతిపతియైన రాఘవరెడ్డి యనవేమారెడ్డి వంశజుఁడని చెప్ప నుద్దేశించిన పద్యము లీ విష్ణు పురాణములోఁ గొన్ని కలవు.

ఆ. అట్టి పంటకులమునందు నేడవ చక్ర
వర్తి యన్నవేమవసుమతీశుఁ
డుద్భవించి కీర్తియును సత్ప్రతాపంబు
నెసఁగ భూమి యెల్ల నేలుచుండె.

క. తన బ్రతుకు భూమిసురులకుఁ
దన బిరుదులు పంటవంశధరణీశులకున్
దన నయము భూమి ప్రజలకు
ననవేమన యిచ్చెఁ గీర్తి నధికుం డగుచున్.

ఈ పద్యములతరువాత సంబంధ మేమియుఁ దెలుపకయే లింగారెడ్డి తేఁబడి తదాదిగా కృతిపతియైన రాఘవరెడ్డివఱకును వంశము చెప్పఁబడినది. కృతిపతిని సంబోధించెడి చతుర్థాశ్వాసాంతమునందలి యీ క్రింది పద్యమునందు బసవయరాఘవరెడ్డి సరిగా ననవేమభూపాలుని వంశమువాఁడనియే చెప్పఁబడినది.

మ. అనవేమక్షితిపాన్వయోత్తమ ! సముద్యద్వైభవోపేంద్ర ! కాం
చనభూమీధరధైర్య ! శాశ్వతయశస్సంపన్న ! దైతేయశా
సనపూజాపరతంత్ర ! నామితరిపుక్ష్మాపాలకోటీర ! కాం
తనవప్రాభవ ! సత్కవీంద్రకవితాతాత్పర్య ! శౌర్యోన్నతా !

కృతిపతియైన రాఘవరెడ్డిపైని జెప్పఁబడినట్లన వేమక్షితిపాన్వయుఁడే యగునని పక్షమున, అనవేముఁడు పురుషసంతానము లేనివాఁ డగుటచేత నాతనిపుత్రసంతతివాఁడు గాక దుహితృసంతతివాఁడయి యుండవలెను. లేదా యనవేముని పినతండ్రి సంతతిలోనివాఁడయి జ్ఞాతివర్గమునఁ జేరిన వాఁడయి యుండును. కృతిపతిజనకుఁడైన తిమ్మయబసవరెడ్డియుఁ దరువాత నీరాఘవరెడ్డియు ప్రౌఢదేవరాజాదులగు కర్ణాటకచక్రవర్తులచేత నుదయగిరి రాజ్యపరిపాలకులుగా నియమింపఁబడి చిన్న సంస్థానమునకు ప్రభువులయి యుండినట్టు కనుపట్టుచున్నది.

క. వారలలోపల బసవ
క్ష్మారమణుఁడు పేరుపెంపుగల మన్నీఁడై
భూరిప్రతాపజయల
క్ష్మీరతుఁడై వెలసె నుదయగిరిరాజ్యమునన్.

సీ. కటకాధిపతియైన గజపతిరాజుచేఁ
ప్రతిలేనిపల్లకిపదవి నొందె
మహిమచేఁ గర్ణాటమండలాధిపుచేత
గడలేని రాజ్యభాగములు గాంచెఁ
బ్రౌఢపౌరుషమున రాజిల్లి మెఱయఁగా
మలకవజీర్ల కుమ్మరికఁ జేసెఁ
దెలుగాణభూములఁగల మన్నెవారిచే
బలవంతమునను గప్పములు గొనియెఁ
జాటుధాటీనిరాఘాట ఘోటకావ
ళీఖురోద్ధూతనిబిడధూళీవిలిప్త
మండితాశాంగనాకుచమండలుండు
బాహుబలశాలి తమ్మయబసవవిభుఁడు.

రాఘవరెడ్డి విష్ణుపురాణషష్ఠాశ్వాసాంతపద్యములలో నొకదానిలో నిట్లు సంబోధింపఁబడెను.

ఉ. చాటుతరప్రబంధకవిసన్నుత ! సంగరపార్థ ! ధీరతా
హాటకశైల ! నిత్యవినయప్రతిభావిభవాఢ్య ! భూమిభృ
త్కూటగుహావహిద్ధ నృపకుంజర ! సంగడిరక్ష ! క
ర్ణాటనరేంద్రదత్త సముదంచితశాశ్వతరాజ్యవైభవా !

ఈ రావూరి రాఘవరెడ్డికి గుడ్లూరు రాజధానిగా నుండిన ట్లీ క్రింది పద్యములోఁ జెప్పఁబడినది.

సీ. గౌరీసమేతుఁడై గరిమతో నే వీట
నేపాఱు నీలకంఠేశ్వరుండు
వారాశికన్యతో వర్తించు నే వీట
గిరిభేదిసుతుఁడైన కేశవుండు
యోగినీసహితయై యొప్పారు నే వీటఁ

బసిఁడిపోలేరమ్మ భవునికొమ్మ
పాపవినాశయై ప్రవహించు నే పీట
మన్నేఱు మిన్నేటిమారటగుచుఁ
గుంజరములు వేయి కొలువంగ నే పీటఁ
గొడగుచక్రవర్తి పుడమి యేలె
నట్టి రాజధానియై యొప్పు గుడ్లూరి
నొనర నేలుచుండి యొక్కనాఁడు.

సీ. వేదాంతవిదులైన విద్వాంసు లొకవంక
నుభయభాషాకవు లొక్కవంక
సకలాప్తబాంధవ సంబంధు లొకవంక
నుద్భటులన్నె కొమారు లొక్కవంక
నీతికోవిదులైన నెఱమంత్రు లొకవంక
నుద్దండరణశూరు లొక్కవంక
సంగీతసాహిత్యసర్వజ్ఞు లొకవంక
జొక్కంపుభరతజ్ఞు లొక్కవంక

రాజురాజులు పంచిన రాయబారు
లొక్కవంక విలాసిను లొక్కవంక
బలసికొలువంగ నతులవైభవముతోడ
రమణఁ గొలువుండి బసవయరాఘవుండు.

ఈ పద్యములపయి గద్యమునందు రాఘవరెడ్డి "రావూరిపురాధీశ్వరుఁ" డని చెప్పఁబడినది. రావూరు గుంటూరునకును, కొండవీటికిని మధ్యను గుంటూరుమండలమునం దున్నది. గుడ్లూరు నెల్లూరుమండలములో పాక నాటిసీమలోని కందుకూరుతాలూకాలో నున్నది.

కృతికర్తయైన వెన్నెలగంటి సూరన్నకవి యించుమించుగా ౧౫౬౦-౭౦వ సంవత్సర ప్రాంతములయందు విష్ణుపురాణమును జేసెనని చెప్పవచ్చును.

ఈ కవికాలమును నిర్ణయించుటకు విష్ణుపురాణమునందింకొక చిన్నయాధారముకూడఁ గానఁబడుచున్నది కృతిపతియైన రాఘవరెడ్డికి తిరుమల తాతాచార్యులమనుమఁడైన సింగరాచార్యుఁడు గురు వయినట్లీ క్రింది పద్యమునందుఁ జెప్పఁబడియున్నది.

సీ. వేదాంతవిద్యావివేకి షడ్దర్శన
పారంగతుఁడు పరాపరరహస్య
వేది బహ్మాండాదివివిధపురాణజ్ఞుఁ
డసమాన ధర్మశాస్త్రాభినేత
కుశలుండు పరమార్థకోవిదు డఖిలాధ్వ
రక్రియానిపుణుఁ డవక్రకావ్య
నాటకాలంకారనానాకళాభిజ్ఞుఁ
డుభయభాషాకవితోజ్జ్వలుండు
పరమవైష్ణవమార్గతత్పరుఁడు కీర్తి
ధనుఁడు తిరుమలతాతయ్యమనుమఁడైన
సింగరాచార్యు గురువుఁగా సేవచేసి
రమణఁ జెలువొందె బసవయరాఘవుఁడు.

ఈ పద్యములో రాఘవరెడ్డి తిరుమలతాతాచార్యుని మనుమఁడైన సింగరాచార్యునికి శిష్యుఁడని చెప్పంబడినను షష్ఠ్యంతపద్యములలో నొక్కటియైన యీ పద్యమునందు సరిగా తిరుమలతాతాచార్యుని శిష్యుఁడేయని చెప్పఁబడెను

క. తిరుమలతాతయదేశిక
వరశిష్యున కనుపమేయవైదుష్యునకున్
బరభూపాల తమస్సం
హరణాదిత్యునకుఁ బల్లవాదిత్యునకున్.

రాఘవరెడ్డి బాల్యమున వృద్ధుఁడైన తిరుమల తాతాచార్యునకును తదనంతరమునఁ దత్పౌత్రుఁడైన సింగరాచార్యునకును గూడ శిష్యుఁ డయి యుండ

వచ్చును ఇది యిట్లుండఁగా గశాపూర్ణోదయమునందు నంద్యాల కృష్ణ రాజునుగూర్చి చెప్పఁబడిన షష్ఠ్యంతపద్యములలో

క. విశ్రుతతిరుమలతాతా
ర్యశ్రేష్ఠాన్వయసుదర్శనాచార్యతనూ
జశ్రీనివాసగురుచర
ణాశ్రయణసమార్జితాఖిలాభ్యుదయునకున్.

అని పింగళిసూరన్న ౧౫౭౦ వ సంవత్సర ప్రాంతములయందుండిన కృష్ణ రాజునకు తిరుమల తాతాచార్యవంశజుఁడయిన సుదర్శనాచార్య పుత్రుఁడగు శ్రీనివాసాచార్యుఁడు గురువయినట్లు చెప్పుటచేత సరిగా తిరుమల తాతా చార్యునకును, నాతని మనుమఁడైన సింగరాచార్యునకును శిష్యుఁడైన రాఘవరెడ్డి యంతకుఁ బూర్వము డెబ్బది యెనుఁబది సంవత్సరములు పూర్వుఁడయి యుండవలెను పయిని జెప్పఁబడిన రెండు మూఁడు హేతు వులను మొత్తముమీఁద విమర్శించి చూడఁగా విష్ణుపురాణకర్తయగు వెన్నెలకంటి సూరన్న హూణశకము ౧౪౮౦-౯౦ సంవత్సర ప్రాంతము లం దున్నవాఁడని నిరాక్షేపముగా నిరూపింప వచ్చును.

వెన్నెలకంటి సూరన్న నియోగిబ్రాహ్మణుఁడు; అమరమంత్రి కుమారుఁడు. ఈతని కవిత్వము మృదుమధురపదభూయిష్ఠమయి ద్రాక్షాపాకమయి యనర్గళధార కలిగి ప్రవహించుచున్నది. ఇతనిది సలక్షణమయిన మంచి కవిత్వము. ఈతనికవనధోరణిఁ జూఁపుటకయి కొన్ని పద్యములవిష్ణుపురాణ ములోనివాని నిం దుదాహరించుచున్నాను

ఉ. ఆపద లెల్ల మాన్చి సుఖమైన పదంబులఁ బూన్చి యాత్మసం
తాపము లెల్లఁ బుచ్చి విదితంబగు సంపద లిచ్చి భక్తులం
దేవయుఁబోలె దుఃఖజలధిం బడకుండఁగఁ దేల్చి ప్రోవ ల
క్ష్మీపతి యున్నవాఁడు మదిఁ జింత దొలంగుము పాకశాసనా. ఆ. ౧.

ఉ. అందని పంటి కేమిటికి నఱ్ఱు నిగిడ్చెదు ? విష్ణుఁడున్న యా
కందువ చందమా మగుటకల్ వినుమి పని కట్టిపెట్టి నా
డెందములోని యుమ్మలిక డిందుపడం జనుదెమ్ము పోవ మిం
పొంద సమస్తభోగ్యములఁ బొందెదు తండ్రికి వేడ్కచేయఁగన్. ఆ. ౨.

చ. ఎనిమిది మాసముల్ రవి మహీవలయంబునఁ గల్గుతోయమున్
తన కిరణంబులందుఁ గొని తక్కిన మాసచతుష్టయంబునన్
ఘనతరవృష్టిరూపములుగా జలము ల్గురియింప లోక మె
ల్లను బరితృప్తిఁ బొందును జలంబును సన్నముఁ గల్గి పెంపుతోన్.

మ. పరకాంత న్మదిలోన నైనఁ దలఁపం బాపంబు దుఃఖంబునున్
బరివాదంబును నొంది ఘోరనరకప్రాప్తవ్యథల్ పెక్కు వ
త్సరముల్ చెందుదు, రట్టి యన్యవనితా సంభోగదోషంబు దా
నరనాథోత్తమ! యింత యంత యని యెన్న న్వచ్చునే యేరికిన్;

ఉ. కారుమెఱుంగులో మెలపు గైకొన నేర్చిన పైఁడిబొమ్మలో
మారునిదీపములో కలికిమాటలచంద్రికలో చెలంగుశృం
గారరసాధిదేవతలొ కమ్మని క్రొవ్విరితీగెలో యనన్
వారిజపత్రలోచనలు వచ్చిరి మోహవిలాసమూర్తులై. ఆ. ౫.

ఉ. కాయజుచేత గాసిపడి గౌతముభార్యకుఁ బోయి కొక్కొరో
కో యని కోఁడికూఁత లొగిఁ గూసి మునీంద్రునిచేత శప్తుఁడై
పోయిన వజ్రి మెటిదొరపోతె బృహస్పతిపత్నికై ననున్
రోయఁగ నాడ నేల తన రోఁతలు లోకమువారు నవ్వఁగన్ ఆ. ౬.

ఉ. ఈ యవివేకపుంబనుల కెల్లఁ దొడంగితి వొప్ప దింత య
న్యాయము గాలిపోయెడు దురాగతముల్ విని పాపబుద్ధి న
య్యో! యిటువంటి ముద్దులసహోదరి ముందల పట్టి యీడ్చి కో
కో యని కూయఁగాఁ గుతిక కోసిన లోకమువారు తిట్టరే?- ఆ. ౩

మ. మదిరాపానముచేత నొక్కసతి తా మత్తిల్లి వేరొక్కతెన్
హృదయేశుండని కౌఁగిలించె; నది దానిం బ్రాణనాథుం డటం
చొదవన్ గమ్మని మోవి యిచ్చె, నటు లన్యోన్యప్రవృత్తక్రియల్
ముదిత ల్కొందఱు చూచి నవ్వి సరసంబు ల్పల్కి రత్యంతమున్

ఫ ణి భ ట్టు

ఈ కవి పరతత్త్వరసాయనమను నైదాశ్వాసముల వేదాంత గ్రంథమును రచించెను ఇందు ప్రథమాశ్వాసమున కర్మయోగప్రకారము, ద్వితీయాశ్వాసమున ననాత్మవివేకము, తృతీయాశ్వాసమున నాత్మవివేకము, చతుర్థాశ్వాసమున యోగత్రయలక్షణము, పంచమాశ్వాసమున రాజయోగప్రకారము చెప్పఁబడినవి శ్రీ మహాభారతమునందు భీష్ముఁడు ధర్మరాజున కుపదేశించినట్లున్న హరసనత్కుమారసంవాదమునే తాను ప్రబంధరూపముగా రచించినట్లు కవి చెప్పెను గాని భారతమునందలి హరసనత్కుమారసంవాదములోనిందలి యుపదేశములు గానరావు. ఈ కవి సకలవేదాంత సిద్ధాంతమైన యద్వయ బ్రహ్మవిద్యారహస్యమును తన కుపదేశించిన సదానందయతి కీ కావ్యము నంకిత మొనర్చెను, సదానందయోగి తన గృహమునకు విచ్చేసి తనవలన నర్ఘ్య పాద్యాదిసంపూజనముల నొంది తనకు వేదాంతోపదేశము చేసినట్లు కవి చెప్పుకొన్నాఁడు.

గీ. ఏ మునీంద్రుని కరుణామయేక్షణంబు
లాశ్రితాఘౌఘరోగరసాయనంబు
లాతఁ డలరసదానందయతి యనంగ
నవనిఁ బేరు పొందు భువనత్రయంబుఁ బొగడ

....

గీ. తనదుసల్లాపరుచి పార్శ్వ జనులశ్రుతుల
దప్పి దీర్పంగ వేంచేసెఁ దగ మదీయ
మందిరంబున కల సదానందమౌని
విభుఁడు మత్పూర్వభవపుణ్య' భవమునను.

ఈకవి తన వంశము నిట్లు చెప్పుకొనెను——

క. శ్రీకరకవిత్వవిద్యా
సాకల్యం బఖిలశాస్త్ర చతురము నిగమ

వ్యాకీర్ణ మీశ్వరాన్వయ
మాకల్ప యశోభిరామ మై ధర వెలయున్.

ఈ శ్రోత్రియవంశమునందు

సీ. సురుచిరాపస్తంబసూత్రుఁ డీశ్వరవంశ
　　పాత్రుఁడు గార్గ్యసగోత్రుఁ డఖిల
వేదశాస్త్రపురాణవిఖ్యాతుఁ డభినవ
　　వ్యాసుండు సద్యశోభాసురుండు
ఫణిపతిభట్టనఁ బ్రఖ్యాతుఁ డతనికి
　　లక్ష్మమ్మ యను శుభలక్షణాంగి
పరమపాతివ్రత్యగరిమచే గిరిజాత
　　యన నుతిగన్న యయ్యతివ పత్ని

....　　....　　....　　....

క. ఆ దంపతులకుఁ బుట్టెను
మేదిని వెలుఁగొందు విబుధమిత్రుం డనఁగా
వేదవిదుం డీశ్వరభ
ట్టాదరమున నరణులందు నగ్నియపోలెన్.

గీ. విద్యలకు బ్రహ్మ ప్రావీణ్యవిభవమునకు
విష్ణుఁ డమలత కీశుండు వేదవిత్త్వ
మున కల వసిష్ఠుఁ డగు జ్ఞానమునకు గురుఁడు
వక్తృత కహీశుఁ డీశ్వరభట్టు జగతి

గీ. అతని కొసఁగెను దోర్దండచతురుఁ డనఘుఁ
డమలవాధూలగోత్ర తిరుమలభట్టుఁ
డఖిలవిదుఁ డల లక్ష్మమ్మ యందుఁ గనిన
కన్య రామమ్మ నధికసౌజన్య నెలమి

క. ఆ మిధునమునకుఁ బుట్టితి
మేము త్రిమూర్తులను బోలె నిల ముచ్చర ము
ద్దామయశుఁడు కొండయ శో
భామణి నారాయణయ్య ఫణితిప నేనున్.

పయి పద్యములయం దీశ్వరాన్వయమున నాపస్తంబసూత్రుఁడును గార్గ్య సగోత్రుఁడును నయిన ఫణిభట్టు పుట్టినట్టును, తద్వంశమున జనించిన యీశ్వరభట్టునకును తత్పత్నియైన రామమ్మకును తానును తనయన్నలైన కొండుభట్టును నారాయణభట్టును జనన మొందినట్టును కవియైన ఫణిభట్టు చెప్పుకొనెను. పుస్తకమునం దాశ్వాసాంతగద్య మిట్లున్నది.

"ఇది శ్రీమదద్వయబ్రహ్మవిద్యారహస్యావబోధననిపుణతాధురీణ సాక్షాన్మహేశ్వర శ్రీసదానందసద్గురురాయపట్టభద్రకరుణాతరంగిణీ రంగత్తుంగాభంగతరంగహిందోళిత హంసడింభాయమానేశ్వరా న్వయసంభూతేశ్వరభట్టతనూజ ఫణిభట్టప్రణీతంబైన పరతత్త్వరసా యనంబను మహాకావ్యంబునందు ...పంచమాశ్వాసము"

కృతికర్తవంశానువర్ణనమునుబట్టి గాని కృతిభర్తవర్ణనమునుబట్టి గాని కవికాలమును నిర్ణయించుటకు నాధార మేదియుఁ గానరాలేదు. అందఱు నీతఁడు పూర్వకవి యనుచున్నారు గనుక కాఁ డనుటకుఁ దగినకారణ మేదియుఁ గనఁబడనందున నేనును నీతనిఁ బూర్వకవిగానే పరిగణించెదను. శ్రీమానవల్లి రామకృష్ణకవిగారు ముద్రింపించి ప్రకటించిన పరతత్త్వరసాయనము యొక్క పీఠికలో వారు కవికాలనిర్ణయమును జేసి యుందురన్న భ్రమతోనేనా పుస్తకమును సంపాదించుటకు బహు ప్రయత్నములు చేసితిని గాని యింతవఱకునునా కృషి సఫలముకాలేదు. *

* రామకృష్ణకవిగారు ౧౯౧౦ వ సంవత్సరము ఏప్రియల్ నెలలో ప్రకటించిన నీతిశాస్త్రముక్తావళియొక్క యాచ్ఛాదనపత్రముపైని దీనివెల మూఁడణాలయినట్టు ప్రచురించిరి; ౧౯౧౨ వ సంవత్సరము జూన్ నెలలో ప్రకటించిన శ్రీరంగమహాత్త్వము తుదిపుస్తకప్రకటనములో పరతత్త్వరసాయనము యొక్క వెలను మూఁడణాల నుండి పండ్రెం డణాలకు పెంపుచేసిరి, తరువాత ౧౯౧౪ వ సంవత్సరము ఆగష్టు నెలలో ప్రకటించిన నన్నెచోడుని కుమారసంభవము ద్వితీయభాగముయొక్క యాచ్ఛాదనపత్రముపైని దానివెల పండ్రెండణాల నట్టే యుంచిరి. పరతత్త్వ రసాయన సంపాదకులు గాని, ముద్రాపకులు గాని, ముద్రితగ్రంథమును గాని తమ యొద్ద నుంచుకొన్నవారుగాని నాకొక ప్రతిని వి-పీగాఁ బంపి నా కృతజ్ఞతకుఁ బాత్రు లగుదురు గాక !

కవికాలనిర్ణయమునకు గ్రంథములోని యీ కవిస్తుతిపద్యమే ముఖ్యాధార మని చెప్పుచున్నారు.

సీ. ప్రథమకవిత్వహేవాకిని వాల్మీకి
 భారతాదికథావిభాసు వ్యాసుఁ
గావ్యత్రయీప్రవికాసుఁ గాళిదాసు
 హరికథాదళితమహాఘు మాఘు
వివిధప్రబంధవాగ్విశ్రాణు బాణుని
 సారార్థవిజ్ఞానధీరుఁ జోరు
నఖిలవిద్యామనోహరు మయూరుని
 సన్నుతకవివర్యు నన్న పార్యుఁ

దిక్కయజ్వాదిపూర్వ ప్రథితకవుల ను
తించి యేతత్కవీంద్రుల నెంచి భావి
కావ్యకరుల బహూక్రియాకలన నుంచి
పూని చేసెదనొక కృతి పుణ్యనియతి.

దీని నాధారము చేసికొని కవి నన్నయతిక్కనలను మాత్రమే స్తుతించి నందున మిక్కిలి ప్రాచీనకవి యనియు, తిక్కయజ్వాదిపూర్వప్రథిత కవులనుటచేతఁ దిక్కనాదులకుఁ దరువాతఁ గొంతకాలమున కుండెననియు చెప్పుదురు కర్తృకాలమును నిర్ణయించుట కిట్టివే యాధారములైనయెడల తమ పుస్తకములలోఁ గవిస్తుతులను జేయని వారందఱును నన్నయాదు లకే పూర్వు లని చెప్పవలసి వచ్చును. * ఫణిభట్టారకుని కవిత్వము

♦ [పరతత్త్వ రసాయనమున బమ్మెర పోతురాజురొక్క పోలికలు కానవచ్చు చుండుటచే ఫణిభట్టు పదునేనవ శతాబ్ది చివఱనుండి యుండవచ్చునని, దాని ముద్రిత ప్రతి పీఠికలో శ్రీపాద లక్ష్మీపతి శాస్త్రిగారు తెలిపియున్నారు]

మొత్తముమీఁద రసవంతమయి పండితజనశ్లాఘాపాత్రముగా నున్నది. ఈతవిశైలి తెలియుటకయి పరతత్త్వరసాయనములోని పద్యములఁ గొన్నిటి నిందు క్రింద నుదాహరించుచున్నాను.

మ చిరమై నిర్మలమై మహావిభవమై చిన్మాత్రమై సత్యమై
పరమై సంతతసంయమీశ్వరమనఃప్రత్యక్షమై నిత్యమై
దురితారణ్యదవార్చియై మదిని భక్తుల్గోరునర్థంబునై.
స్థిరభావంబునఁ దోఁచు బ్రహ్మము మదిన్ సేవింతుదత్త్వార్థినై.

చ. అవికలభక్తి నెవ్వని మహాత్ములు చిత్తములందుఁ జేర్చి బా
హ్యవిరతిఁ బూని సత్కృతి సమర్పణ లొప్పఁగ నర్థిఁ జేయుచుం
దవిలి సమాధియోగములఁ దత్పరులై భజియించి మృత్యుపా
శవిరహులై సుఖింతు రనిశఁబును నా హరి కేను మ్రొక్కెదన్.

మత్తకోకిల

పాయరాని యపాయమున్ బహుపంకహేయ మమేయదో
షాయనంబు విషాదసంహత మంతికస్థితమృత్యు వీ
కాయ మేమి నిజంబు? నమ్మఁగఁ గాదు దీనిని బంచలం
బేయెడన్ సతమంద్రు బుద్ధివిహీనచిత్తులు మూఢతన్ — అ ౨.

చ. మదమున దుర్జనుం డితరుమాన మెఱుంగక నిందసేయుఁ బెం
పు దఱుఁగు కిల్బిషక్రియలఁ బూని యొనర్చును సాధుసేవకుం
గుదురఁడు సద్గుణాళి మదిఁ గూరఁడు దుర్విషయాభిలాషలం
బొదలెడిఁ గాని సద్గురుసుబోధితమార్గము నంటఁ డెన్నఁడున్

ఉ ఓ మహితాత్మ! నీకరుణ నుజ్జ్వలమైన వివేక మాత్మయై
మామకచిత్తసన్నిహితమంజులమై మది గల్గ దేఱ లోఁ
దామసవృత్తి మానె హరితత్పరమౌచు మనంబు గోరెడిన్.
నీ మహనీయవాత్సలభినిర్గతదేవమహత్త్వతత్త్వముల్ ఆ. ౩,

చ. అలయక నాసికాగ్రమున నంటఁగఁ జూపులు గూర్చి ధ్యానమం
డలగత చిత్ప్రకాశ మచటం గని చిత్తము తద్గతంబుగా
విలిపి నిరంకుశక్రమవినిర్గతవాయునిరోధనంబునం
దొలఁగక యోగి పొందుఁ బరితోషమహామృతవార్ధి మగ్నతన్.

మ. అతితేజోమహనీయు నాత్మహృదయాభ్యంతస్థు నీశున్ మని
శ్చితబుద్ధిం గురుబోధచే నెఱింగి పూజింపందగుం గానిచో
హితబుద్ధిం దృఢలోహమృచ్ఛిలల నూహింపగ నొంటన్ మనో
హితమూర్తిన్ రచియించి పూజ లిడు టౌ నెన్నంగ నీశార్చనల్.

మ. పరమబ్రహ్మమె సద్గురుం డగుఁజుమీ భావింప నెట్లన్న దు
స్తరమాయాంధులలో నొకం డెఱిఁగి తత్పాదాశ్రయుండైనచోఁ
గరుణ న్వానికి నొక్కయుక్తినె మహాకల్పంబులంబోని దే
హరతిం ద్రోసి భవంబుఁ ద్రుంచి ఘనమోహచ్ఛేదముం జేసెడిన్.

చ. ఇది యది యిందు నం దపుడు నిప్పుడు నా నెడలేక పట్టుటల్
వదలుట లేమి లేక తన వర్తన లేరి కెఱుంగనీక పెం
పొదవు వినోదలీలల మహోత్సవము ల్వెలయించుచుండఁగా
సదమలమూర్తి పూర్వభవసంచితపుణ్యసమాధి పూర్ణుఁడై. అ. ౫

చ. అనఘ! యనేకజన్మసముపార్జితమైన వివేకసంపదం
గననగుఁ గాని యీనెఱి వికల్పమతిం బహువేదశాస్త్రముల్
పనివడి యారయన్ మదికిఁ బట్టగునే సుకరంపుఁదెల్వి దా
దినకరుఁబోలె సద్గురుఁడు తెల్పనఁగాక యవిద్యఁ ద్రోయుచున్.

ఉ. నే నను నాకు నే నన ననిత్యశరీరము తోఁచు భ్రాంతిచే
నే ననునేన నే ననిన నిర్మితనిత్యత గల్గుగావునన్
నే ననుదాని కాది యగునేగద! యాత్మన దానిఁ గన్గొనన్
బూని యొనర్చుయోగమునఁ బొందఁగవచ్చు సమాధిసౌఖ్యమున్;

మనుమంచిభట్టు

ఈ కవి హయలక్షణసారమను నైదాశ్వాసముల గ్రంథమును రచించి కుమార కంపభూపాలున కంకితము చేసెను. ఇతఁ డాశ్వాసముల కధికారము లని పేరు పెట్టెను. ఈ గ్రంథమునందు గుఱ్ఱముల మంచి చెడుగులును, వాని రోగలక్షణములును, రోగచికిత్సలును ఆవర్తవిశేషములును, గతిస్వరవివరణములును చెప్పఁబడినవి ఇవి యన్నియు శాలిహోత్రునిసంస్కృతహయలక్షణానుసారముగాఁ జెప్పఁబడినట్టు కవి యీ క్రింది పద్యమునఁ దెలిపి యున్నాఁడు.

చ. అనఘుఁడు శాలిహోత్రుఁడు హయంబులకు న్మును చెప్పినట్టి యా
యనుపమలక్షణంబులు పయఃపరిమాణము రోమజంబులుం
దెనుఁగున నెల్లవారలకుఁ దేటపడన్ రచియింతు సత్కవుల్
విని కొనియాడ దానగుణవిశ్రుత ! కంపయమేదినీశ్వరా !

ఈ గ్రంథము మూఁడధికారములును నాలవయధికారములో నిరువదియైదు పద్యములును గల తప్పులతడిక యొకటి ముద్రింపఁబడియున్నది. గ్రంథాది నుండి పంచమాశ్వాసమున ౧౦౩ పద్యములవఱకును గల ప్రతి యొకటి చెన్నపురిలో దొరతనమువారి ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారమునందున్నది. ఈ రెండు ప్రతులలోను గూడ గ్రంథావతారికలేదు. అందుచేతఁ గృతిపతి కాలమునుగాని కృతికర్తకాలమునుగాని నిర్ణయించుటకుఁ గలఁ యాధారములు గ్రంథములో నంతగాఁ గానరావు.

క. క్రోడావర్తతురంగము
వేడుక నెక్కంగఁ గోరువెఱ్ఱికి నూఱుం
మూడుట విక్రమ మని ము
న్నాడిరి హయశాస్త్రవేదు లౌబళకంపా !

ఇత్యాది పద్యములలోఁ గృతిపతి యౌబళనిపుత్రుఁ డయినట్టు చెప్పబడెను. కృతిపతియైన కంపనరపాలుఁడు సాళువవంశజుఁడే యయినను గొన్నిస్థలము

లలో 'చాళుక్యచూడామణిః' అని చళుక్యవంశజుఁడయినట్టు సంబోధింపఁబడెను ఇతఁడు చళుక్య రాజుంకడ దండనాథుఁడయినందున ఈకంపమహీపాలునకు సాళువవంశమువారికిఁ గల బిరుదము లన్నియు నున్నందునను చళుక్య వంశజులబిరుదము లంతగా లేనందునను కంపనృపాలుఁడు సాళువ వంశజుఁడే యని నిశ్చయింపవలసియున్నది * జైమినిభారతమునందు

గీ ఔర ! మీసరగండకటారిసాళ్వ !
పంచఘంటానినాదాదిభయదబిరుద !
కాహళారావసంపాతకంపితారి
దీప్తిబలసీరి ! సాళువతిప్పశౌరి !

అని సాళువ తిప్పరాజును

క. ధరణీవరాహునకు బ ! ర్బరబాహునకు .. ...

క. ...భీకరచౌహత్తిమల్లబిరుదాంకునకున్.

క మీసరగండనికిఁ గటా ! రీసాళువమునకు ..

అని సాళువ గుండ నరసింహరాజునకును, మీసరగండ కటారిసాళ్వ, ధరణీవరాహ, బర్బరబాహ, చౌహత్తిమల్ల, మొదలైన బిరుదము లుపయోగింపఁబడినవి ఈ క్రింది పద్యములలో నించుమించుగా నీ బిరుదములే కృతిపతియైన కంపభూపతికిని ప్రయోగింపఁబడినవి.

గీ ఇట్లు చెప్పినపాటిని నెల్లసుఖ్య
విలిచె సేవియుఁ దమతముఫలము నిచ్చు
నట్లు గాకుండు నం దల్ప మధికమైనఁ
జండభుజబల ! మీసరగండ ! కంప ! ఆ. ౨.

* [సాళ్వ వంశీయులు చాళుక్యులనుట సరిపడకున్నది ఈ విషయమై పరిశోధన జరుగవలెను.]

క. ఘోటంబుల సుళ్ళుండిన
ఘోటంబులు పతుల మీఱి కుశలము నడంచున్
పాటించుచుండి నడచుచు
టించిరి శాస్త్రవిదులు బర్బరబాహో! అ ౩.

గీ. అశ్వరత్నంబుమును వెళ్ళు హ యమునడిమి
పళ్ళు తురగముకడపటి పళ్ళకడను
క్రమముతో నవమాదివర్షములమూట
హరిణ విలసిల్లు రాయచౌహాత్త మల్ల! ఆ. ౪

క నిరుపమతేజోవిభవా
కరమునం గడు నొప్పుమీఱు గంధర్వము దాఁ
బరికింప నింద్రసత్త్వము
ధరణీరమణీయబాహా! ధరణివరాహా!

ప్రభువుల బిరుదములను దండనాధులైన పాలకులును వహించుట యాచార మయినందుకు సాళువ గుండరాజాదుల బిరుదములను వారిదండనాథులైన తుళువనరసింహరాజాదులు వహించినట్టుగా వర్ణింపఁబడిన వరాహపురాణములోని యీక్రింది వాక్యములే సాక్ష్యమిచ్చుచున్నవి.

వ చాళుక్యనారాయణుండును .. .. బర్బరబాహుండును నగు నరస వసుధాధీశ్వరుండు,

గీ. రాయచౌహాత్తమల్ల ధరావరాహ!
మోహనమురారి! బర్బరబాహు సాళ్వ!
నారసింహ ప్రతాపసన్నాహనుఁ డగుచు
విశ్వహితకారి తిమ్మయయీశ్వరుండు

ఈ కడపటి వాక్యములోని బిరుదములు సాళ్వనరసింహరాజువే యన్ననన వచ్చును. ఇందలి మోహనమురారిబిరుదము మూఁడవ యధికారమునందు కంపభూపాలుని విషయమునను వాడఁబడినది.

కాన నండదోషంబులు గానవచ్చు
హరుల నేలంగవలదు మోహనమురారి.

ఈ కంపనృపతి దండనాయకుఁ డైన ట్లీక్రింది పద్యమువలన దెలిసికో వచ్చును.

క. కకుదంబున నలికంబునఁ
క్రిదికమున సంధులను సుళ్ళు తిరమై యున్నన్
బ్రకటితదోషం బగు నిది
నకులాదులమతము దండనాయకతిలకా! ఆ ౧.

ఈ కంపభూపాలుఁడు దక్షిణమధురాపుర విజయయాత్రకయి ౧౩౬౫ వ సంవత్సర ప్రాంతమునఁ బంపఁబడినట్లు మధురవిజయములోఁ జెప్పఁబడిన కంపభూపాలుఁడు కాఁడు ఆ కంపభూపాలుని తండ్రి వీరబుక్కరాయలు; ఈ కంపభూపాలుని తండ్రి యౌబళరాయఁడు ఆ కాలమునందు సాళువ వంశమున నౌబళభూపాలుఁ డొకఁ డుండెను సాళ్వ మంగ నృపాలున కగ్ర భ్రాతయు, గుండభూపాలునకు ద్వితీయపుత్రుఁడును వీరయౌబళుఁ డయినట్లు జైమినిభారతములోని యీ క్రింది పద్యము తెలుపుచున్నది.

మ జననం బందిరి గుండభూవిభునకున్ సంధాకబంధారిగా
తనయుల్ శ్రీనిధి వీరయౌబళుఁడు నుద్యత్కీర్తి మాదయ్యయున్
ఘనతేజోనిధి గుండబమ్మఁడును సంగ్రామస్థలీపార్థస
జ్జనమందారులు సాళ్వమంగనృపుఁడున్ సావిత్రిమంగాంకుఁడున్.

కృతిపతియైన కంపపృథ్వీపతి యీ యౌబళుని కొడు కయినను, కావచ్చును; లేదా, మనుమనికొడు కయినను కావచ్చును. కొడుకేయైన పక్షమునఁ గృతి పతియుఁ గవియు, పదునాల్గవ శతాబ్దాంతమున నుందురు; కాకున్నయెడల పదునైదవ శతాబ్దాంతమున నుందురు ఇది యూహయే కాని నిశ్చయ మని ఫలనుపడదు మనుమంచిభట్టారకు నందఱును పూర్వకవులలోనివాఁ డను

చున్నారు. * ఈకవి బ్రాహ్మణుఁడు; భైరవాచార్యుని పుత్రుఁడు. ఈతని యాశ్వాసాంతగద్య మిట్లున్నది

'ఇది సకలసుకవిజనసంస్తూయమానకవితాచాతురీధురీణ నిఖిలభాషా ప్రవీణ భైరవాచార్యపుత్ర పరమపవిత్ర మనుమంచిభట్ట ప్రణీతం బైన హయలక్షణవిలాసంబునందు'

ఈతని కవిత్వము చక్కఁగానే యున్నది కాని యేహేతువుచేతనో లక్షణ విరుద్ధము లయినప్రయోగము లనేకములు కానఁబడుచున్నవి. కవిత్వరీతిని దెలుపుటకయి హయలక్షణవిలాసములోని పద్యములఁ గొన్నింటి నిం దుదాహరించుచున్నాను.

ఉ. దూరము పోవునప్పుడును దుర్దమశత్రునృపాలసైన్యముం
బోరుల గెల్చునప్పుడును బొంకముగా మృగయావినోదవి
ద్యారతిఁ దేలునప్పుడు నరాధిపకోటికి వాజులట్ల పెం
పార జయాదికారణము లారసి చూడఁగఁ గల్గ నేర్చునే? ఆ ౧.

చ. అరయఁగ సర్వలక్షణసమంచితమైన తురంగరత్న మే
నరునిగృహంబునం దొక దినంబుననుం దగురీతి నుండు నా
పరమపవిత్ర గేహమునఁ బాయక నిల్చుర మా వధూటి శ్రీ
ధరునియురస్థలింబలె ముదం బెసలారఁ బ్రసన్నచిత్తయై. ఆ. ౧.

చ. తిరముగ రోచమానమును దేవమణిం దగఁ గూడి యున్నయ
త్తురగము పూర్వభాగకృతదోషము లన్నియుఁ ద్రెంచు, నెంచఁగాఁ
బరఁగినయట్టి మేఖలిక పశ్చిమభాగము దోషరాసులన్
బోరిఁబోరిఁ ద్రుంచుమాడ్కి మఱి భూవరగర్వముఁ దక్క నన్నిటిన్,

* [కర్నూలుజిల్లా పెద్దచింతకుంట శాసనమును బట్టియు, తిరుపతియందున్న కంపభూపతి శాసనమును బట్టియు మనుమంచిభట్టు కాలము క్రీ॥ శ॥ 1442 – 1459 ప్రాంతమని నిశ్చితమగుచున్నదని శ్రీ నిడుదవోలు-వేంకటరావుగారు తెల్పుచున్నారు (చూ. భారతి – విరోధి – ఆషాఢము)]

ఉ. తిన్నని కుక్షిమూలములఁ దేరిన రంధ్రయుగంబు క్రిందటన్
ద్రన్నని దీప్తితోడ నుపరంధ్రము లుండు తురంగజాతికిన్
బన్నుగ గండపార్శ్వములఁ బైకొని వన్నెలు నిల్చుఁ జూడఁగా
సన్నుతచాళుకీతిలక! సాళువకంపనృపాలమన్మధా! - ఆ. ౪.

మ. హరిరత్నంబున కుత్తమాంగభుజమధ్యస్థానసంప్రాప్తమై
కర మొప్పారును గ్రీవ గ్రీవకముపై గండంబుపై-?
సరికేశాళిశిరంబుసంధి వెనుకం జె న్నొందుఁ గేశాంతముల్-?
సరసోదారకుమారకంపనృపతీ! చాళుక్యచూడామణీ! - ఆ. ౩.

చ. కవ లగుచున్ హయంబులు తగన్ జనియించినవానియిల్లు దా
నవనితలంబుమీఁదఁ జటులానలరోచులఁ జూచి చూచి వా
చవి గొనుఁ గానఁ దక్కిన విచారము చేయక దేవతామహీ
దివిజుల కిచ్చు టొప్పు నని ధీరులు చెప్పిరి శాస్త్రపద్ధతిన్. ఆ ౪.

శా. వేణుక్రౌంచమృదంగదుందుభిలసద్వేదండనాగోల్లస
ద్వీణావారిదమంజునాదములకు న్వాయ్యంబులై యొప్పు ని
క్వాణంబు ల్గల వాజి యిచ్చు బతికిం గళ్యాణముల్ కంపన
క్షోణీపాలక! సుప్రతాప! శుభముల్ స్తోత్రైక పాత్రంబుగన్. ఆ. ౪.

చ తులసియు వావిలాకు కరుదూపము శుంఠియుఁ దెల్లనైనయా
వలు వస యుప్పు మాగడియు వారకయొక్కటియున్ సమంబుగాఁ
దుల నిడి యావుపంచితముతో మృదు వారఁగ వత్తిఁ జేసి వా
జులగుదమూత్రరంధ్రములఁ జొన్పిన శూలలు మాను భూవరా!

కేతనమంత్రి

ఇతడు బాణభట్టకృతమైన కాదంబరి కావ్యమును తెనుఁగున రచియించెను. కేతనకృత మయిన కాదఁబరిలోని దని రంగరాడ్ఛందమునందీ పద్యముదాహరింపఁబడి యున్నది

ఆ వె. జనవరేణ్యుఁ గాంచి సాష్టాంగ మెరఁగిన
నా విభుండు వాని లేవనెత్తి
కౌఁగిలించి వానిఁ గనుఁగొని కేయూర
కాభిధాన మొసఁగెఁ గడుముదమున.

ఈకేతనకవి దశకుమార చరిత్రమును రచియించిన కేతనకవి కాఁడనియు, భాస్కరుని కేతన యనియు కొట్టరువుకేతన యనియు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారును శ్రీ మానపల్లి రామకృష్ణకవిగారును వ్రాయుచున్నారు. ఈ పుస్తకము నాకు లభింపలేదు. ఇదియే నిజమయిన పక్షమున కేతనకవి తిక్కనసోమయాజికిఁ బెదతండ్రి యయి యుండవలెను. అప్పు డతని కాలము ౧౨౨౦-౫౦ ప్రాంతము లగును కేతనప్రెగడ విరచితమైన కాందబరిలోని దని యుదాహరణ గ్రంథములో నీక్రిందిపద్య ముదాహరింపబడినది *

సీ దీనిలోపలఁ గొన్నిదినము లుండిన నుష్ణ
కరుఁడైన నట శీతకరుఁడు గాఁడె
దీనిపెం పెఱిఁగినఁ దా నంబురాశిలోఁ
గాదని జలశాయి కాఁవు రాఁడె
దీని తియ్యనినీరు దివిజులు త్రాగి చూ
చినఁ దమయమృతంబు చేఁదు గాదె
దీనితోయము తలపై నల్కినంతనె
పాపాత్ములును మోక్షపరులు గారె

* పెదపాటి జగ్గన కూర్చిన 'ప్రబంధరత్నాకరము'న నిది యుదాహృతము

యనుచుఁ గొలని యిట్టియతిశీతలత్వంబుఁ
బరపుఁ బెంపుఁ దీపుఁ బావనతయుఁ
గడుమునంబుఁ బొంగఁగా వాజి బడివాగె
త్రాపఁ దిగిచికొనుచుఁ దఱియఁ జొచ్చె *

ఈ యుదాహృత గ్రంథములోనే కేతన పెగడ కువలయాశ్వచరిత్రము
లోని దని యీ పద్య ముదాహరింపఁబడినది

ఉ కోటతసర్పుఁ జూడ్కుల కగోచర మయ్యెను దేరిమీఁద బ
ల్మాటున నేగుచోటఁ దగులం బడమిన్ రవిమండలంబు నీ
పాటిదయన్ తలంపునకుఁ బట్టగు చున్నది గాక దీనికిం
బాటి యనంగ గుజ్జనఁగఁ బట్టవె యయ్యుదయాస్తశైలముల్. ♦

♦ ♦ ♦

* [మూలఘటిక కేతనవ్రాసిన 'దశకుమార చరిత్రము'నుబట్టి, యీ కేతన తిక్కన తాతయగు మంత్రి భాస్కరుని పెద్దకుమారుఁడనియు, తిక్కనకుఁ బెదతండ్రి యనియుఁ దెలియుచున్నది. భాస్కరుని కేశనయేకొట్టరువు కేతన.ఇతని మనుమఁడు వేలోక కేతన కలఁడు. అతఁడు కవిగా ప్రసిద్ధిలేదు]

♦ [కువలయాశ్వ చరిత్రమును రచించిన కేతన తిక్కన పెదతండ్రికంటెను, దశకుమార చరిత్ర కర్తకంటెను భిన్నుఁడు ఇతఁడు నండూరి కేతనయో, వేలోకఁడో యయి యుండవచ్చునని 'ఆంధ్రకవి తరంగిణి' కర్త యభిప్రాయము.] (చూ రెండవ సంపుటము పుట 134)

[కాదంబరీ కావ్యరచన క్రీ.శ. 1260 ప్రాంతమునకు ముందుగానే జరిగియుండు నని 'తెనుఁగు కవులచరిత్ర' లోఁ గలదు. (పుట 286)]

ఈ కవి యొక లక్షణగ్రంథమును, విక్రమార్క చరిత్రమును రచియించె
నని చెప్పుచున్నారు ఈ గ్రంథములు నాకు లభింపలేదు. ఈతఁడు సంస్కృ
తమున నిఘంటువులు రచియించెను, ఇతని పదమంజరియం దీ శ్లోకమున్నది

శ్లో. లక్ష్మీరుద్బద్ధనృపాలేన యం ప్రాప్తా కవిభల్లటమ్
తేన కావ్యదృశా ప్రోక్తా సప్రాసా పదమంజరీ

దీనినిబట్టి యితఁడు బుద్ధనృపాలుని కాలములో నఁగా ౧౨౩౦ వ సంవత్సర ప్రాంతముల రంగనాథరామాయణకాలములో నుండినట్లు తెలియవచ్చుచున్నది.*

"శ్రీమద్దాక్షారామభీమనాథవరప్రసాదలబ్ధసకలభాషాకవితాని
ర్వాహకకవిభల్లటవిరచితా గణమంజరీ సమాప్తా"

అని యాతని గణమంజరి కడపట నున్నందున నితఁడు గోదావరీమండలములోనివాఁడనియు, తన పుస్తకములను దాక్షారామ భీమేశ్వరస్వామి కంకితము చేసెనవియు తెలిసికొనవచ్చును ఈ క్రిందిపద్యము కవిభల్లటుని విక్రమార్క చరిత్రములోని దఁట.

ఆ. వె. చెప్పకున్న నీవు జీవంబు విడుతువు
జెప్పినపుడు తనకు జీవహాని
చెప్పి మున్న నీకు జీవంబు విడిచెద
నీవు చన్న వెనుక నిలువలేను.

[* ఈ బుద్ధరాజు గోన బుద్ధరాజని చెప్పుట కాధారములు లేవు. కొండ పడమటి బుద్ధరాజని 'తెనుఁగు కలవుచరిత్ర' (పుట 306)

'ఆంధ్రకవి తరంగిణి' కారులు కవి భల్లటుని గూర్చిన విద్వాంసుల యభిప్రాయములను విపులముగఁ జర్చించి - చివర కితని గ్రంథములను గూర్చియు, కాలమును గూర్చియు నేమియు నిశ్చయింపక విడిచిరి.]

[ఈ కవినిగూర్చి 'తెనుఁగుకవుల చరిత్ర' లో నిట్లున్నది-"తెలుగున ప్రాచీన కవుల నామములను పరిశీలించిన నవి కొన్ని ప్రసిద్ధసంస్కృత కవుల నామములని తెలియఁదగి యున్నది. అవి బిరుదములైనను - బిరుదనామముతో వ్యవహార ముండుటవలన నా యా వ్యక్తుల నిజనామములు మఱుగుపడి యున్నవి.........వారిలో నీ కవిభల్లటుఁడు నొకఁడు. ఈతఁడు సంస్కృతమున భల్లట శతకమును రచించి కాశ్మీర దేశమున ప్రఖ్యాతికెక్కిన కవిభల్లటుని పేర వెలసినవాఁడు. తెలుఁగు భల్లటకవి శూద్రకరాజ చరిత్రమును, బేతాళ పంచవింశతిని రచించినట్లు లక్షణగ్రంథములు చెప్పుచున్నవి. ఈతఁడే రచించిన 'పదమంజరి' యను సంస్కృత గ్రంథమునుబట్టి యీతని కాలము 1060-70 ప్రాంతమని చెప్పవచ్చును.] (పుట. 306.)

కవిరాక్షసుఁడు

ఇతఁడును దాక్షారామ నివాసుఁడే. ఇతఁడు కవిభల్లటునివలెనే నన్నయభట్టునకును తిక్కన సోమయాజికిని నడిమికాలమునం దుండినవాఁడు. ఇతఁడే వేములవాడ భీమకవి యని కొందఱనిరి గాని యీత డాతఁడు గాక కవిరాక్షసీయమును రచించిన వేఱొకకవియయి యున్నాఁడు. ఈతని గూర్చి యప్పకవి యీ క్రిందికధను వ్రాసెను.

ఉ. ఆదిని శబ్దశాసన మహాకవి చెప్పినభారతంబులో
నేది వచింపఁగాఁబడియె నెందును దానినె కాని సూత్రసం
పాదనలేమిచేఁ దెలుఁగుఁబల్కు మఱొక్కటి కూర్చి చెప్పఁగా
రా దని దాక్షవాటికవిరాక్షసుఁడే నియమంబు చేసినన్.

క. ఆ మూడు పర్వములలో
నామాన్యుఁడు నుడువుతెనుఁగు లరసికొని కృతుల్
తాము రచించిరి తిక్కను
ధీమణి మొదలైనతొంటితెలుఁగు కవీంద్రుల్.

కవి రాక్షసుని యాదినారాయణచరిత్రములోని దని యొకానొక లక్షణ గ్రంథములో నీక్రింది పద్య ముదాహరింపఁబడినది.

ఉ. శ్రీయుతలోచనోజ్జ్వలమరీచులు భానుమరీచివిస్ఫుర
త్తోయజకాంతితోడ దులఁ దూఁగెడుపచ్చనిపట్టు గట్టియ
త్యాయతశంఖచక్రరుచిరాసిగదాధరుఁ డేఁగుఁదెంచె నా
రాయణుఁ డార్తరక్షణపరాయణుఁ డాకరిరాజుపాలికిన్.

[కవిరాక్షసుఁడనునది బిరుదమువలెఁ గానవచ్చుచున్నది. ఆంధ్రమునందే కాక సంస్కృతమున నొక కవిరాక్షసుఁడున్నాడు. అతఁడు 'షదర్ధ నిర్ణయ'

మను సంస్కృత నిఘంటువు నొకదానిని వ్రాసి యున్నాఁడు. ఆంధ్రకవి కంటె నీఁతడు భిన్నుఁడు.

రంగరాట్ఛందములో 'కవిరాక్షసీయము' లో నిదిగాఁ జెప్పఁబడిన పద్యము అనంతుని ఛందము (ఛందోదర్పణము) లో ననంతునిదిగాఁ గాన వచ్చు చున్నది ఇతని గ్రంథములు లభ్యములు కాకుండుట నెట్లు నిశ్చయించుటకు వలనుకాకున్నది.

వెన్నెలకంటి జన్నయ్య రచనగాఁ బ్రసిద్ధమైన 'దేవకీ నందన శతకము' లోని యొక పద్యమునుబట్టి యది 'కవిరక్షః శ్రేష్ఠ ప్రణీత' మనియు పదివేల పద్యములలో నేర్చి నూటపది పద్యములీశతకముగా నర్పించెననియుఁ దెలియు చున్నది కాని యీపద్యము ప్రక్షిప్తమని తలఁపఁబడుచున్నది.]

ఆంధ్రకవుల చరిత్రము.

ద్వితీయ భాగము

మధ్యకాలపు కవులు

By

K. VEERESALINGAM

వెల : ౨౦—[illegible]—0

విషయ సూచిక

		పుట
1.	కృష్ణదేవరాయలు	1
2.	అల్లసాని పెద్దన్న	37
3.	నంది తిమ్మన్న	50
4.	ధూర్జటి కవి	59
5.	మాదయ్యగారి మల్లన్న	64
6.	తాళ్ళపాక చిన్నన్న	69
7.	సంకుసాల నృసింహకవి	70
8.	కాసె సర్వప్ప	74
9.	భాస్కర పంతులు	76
10.	భైచరాజు వెంకటనాధకవి	77
11.	అయ్యలరాజు రామభద్రుడు	80
12.	వెల్లంకి తాతంభట్టు	87
13.	కుమ్మరి మొల్ల	88
14.	పిడుపర్తి సోమనాధుడు	91
15.	పిడుపర్తి బసవకవి	94
16.	కోట శివరామయ్య	95
17.	కుమార ధూర్జటి	96
18.	దోనూరి కోనేరుకవి	100
19.	పింగళి సూరనార్యుడు	105
20.	అద్దంకి గంగాధరకవి	117
21.	పొన్నికంటి తెలగన్న	122
22.	రామరాజ భూషణుడు	125
23.	మల్లారెడ్డి	144
24.	రామరాజు రంగప్పరాజు	147
25.	మట్ల అనంతభూపాలుడు	150
26.	ఎర్రన	154
27.	శంకర కవి	159
28.	కంచి వీరశరభకవి	162

	పుట
29. తెనాలి రామకృష్ణుడు	164
30. తిమ్మరాజు	185
31. తాళ్ళపాక తిరువెంగళనాథుడు	187
32. రాయసము వేంకటపతి	189
33. తరిగొప్పుల మల్లన	191
34. చరిగొండ ధర్మన్న	192
35. సారంగు తమ్మయ్య	196
36. తురగా రామకవి	204
37. చెన్నమరాజు చెన్నమరాజు	209
38. తెనాలి అన్నయ్య	210
39. సవరము చిననారాయణ నాయకుడు	215
40. దామెర వేంకటపతి	217
41. చిత్రకవి పెద్దన్న	219
42. యాదవామాత్య కవి	220
43. కంసాలి రుద్రయ్య	223
44. ఎలకూచి బాలసరస్వతి	230
45. ముద్దరాజు రామన్న	233
46. చిత్రకవి అనంతకవి	233
47. లింగముగుంట రామకవి	234
48. లింగమగుంట తిమ్మన్న	236
49. వెలగపూడి వెంగనార్యుడు	239
50. రెంటూరి రంగరాజు	240
51. సింహాద్రి వేంకటాచార్యుడు	242
52. చేమకూర వేంకటకవి	243
53. రాజలింగకవి	252
54. చిత్రకవి రమణకవి	254
55. అందుగుల వెంకయ్య	258
56. కాకునూరి అప్పకవి	261
పేర్లుతెలియని ఇతరకవుల గ్రంథాలు	265

ఆంధ్రకవుల చరిత్రము

మధ్యకవులు

కృష్ణదేవరాయలు

ఇతఁ డాముక్తమాల్యద యను నామాంతరముగల విష్ణుచిత్తీయ మనుప్రబంధమును రచించిన మహాకవి. ఇతఁడు కవీశ్వరుఁ డయి విద్వన్మహాకవుల నాదరించుట వలననేకాక మహారాజయి యనేక దేశములను జయించుటవలనఁగూడ సుప్రసిద్ధుఁ డయినవాఁడు. దక్షిణహిందూ దేశమును పాలించినరాజులలో నింతదేశమును జయించి యేలినవాఁడును, ఇంత ప్రసిద్ధి కెక్కినవాఁడును, మఱియెవ్వఁడును లేఁడు. కాఁబట్టి యీతని చరిత్రమును వ్రాయుటకుముం దీతని పూర్వచరిత్రమునుగూడ సంక్షేపముగాఁ గొంతవ్రాయుట యుచితమని తోఁచుచున్నది. ఈతని రాజధాని బళ్ళారిమండలములోని యానెగొందికి సమీపమున తుంగభద్రాతీరమునం దున్న విజయనగరము. ఈవిజయనగరమునకు విద్యానగరమనియు నామాంతరము గలదు. ఈపట్టణము విద్యారణ్యస్వామి యని మహాప్రసిద్ధిగన్న మాధవాచార్యులవారి యాజ్ఞచేతఁ గట్టఁబడినది. ఈమాధవాచార్యు లాకాలమునందు బుక్కరాజువద్ద మంత్రిగా నుండెను. కంపభూపతి కుమారుఁడైన బుక్కరాజు క్రీస్తుశకము ౧౩౪౦ సంవత్సరము మొదలుకొని ౧౩౭౯ వ సంవత్సరమువఱకును రాజ్యము చేసెను. ఈరాజు హూణశకము ౧౩౩౬ వ సంవత్సరము మొదలుకొని ౧౩౫౦ వ సంవత్సరము వఱకునుగూడ తనయన్నయైన హరిహరరాజుతోఁ గలిసి రాజ్యము చేసెననియు, ఆకాలమునందుఁగూడ మాధవాచార్యుఁడే వారికి మంత్రియనియు, వారికిరాజ్యము మాధవాచార్యుని

వలననే వచ్చెననియు, కొందఱందురుగాని యది యెంతవఱకు సత్యమో తెలియదు. బుక్కభూపాలుని తండ్రియైన సంగ (కంప) రాజొకచిన్న సంస్థానాధిపతియైయుండి, మహమ్మదీయులు దండెత్తివచ్చి హిందూ రాజ్యమును నాశనముచేసి యోరుగంటి ప్రతాపరుద్రుని చెఱగొనిపో యిన కాలములో తనరాజ్యమును పోఁగొట్టుకొని యుండును. కొంద ఱతఁడు గొల్లవాఁడని చెప్పుదురు. కాని యాతని పూర్వస్థితిని నిర్ధార ణము చేయుటకుఁ దగినయాధారము లేవియు నిప్పుడు కానరావు. ఈ హరిహర బుక్కరాజులు సహితము ప్రతాపరుద్రుని యవసానదశయం దాతని సేనలో దండనాథులుగా నుండిరని యొకానొకరు వ్రాసి యున్నారు. ఏదియెట్లున్నను వీ రారంభదశలో రాజ్యహీనులయియుండి తమ ధైర్యసాహసముల వలనను తమ కులగురువైన మాధవాచార్యుని బుద్ధిబలమువలనను రాజ్యము సంపాదించి, స్వతంత్రులై మాధవాచా ర్యుని మంత్రిగాఁ జేసికొని యాతని యాలోచన ననుసరించి వర్తించు చుండినట్టుమాత్రము నిశ్చయముగా తెలియవచ్చుచున్నది. మాధవా చార్యులు తానొక దేవత నుపాసించి యా దేవతను బ్రత్యక్షము చేసికొని యామెవరముచేత బుక్కభూపాలునకు రాజ్యమిప్పించెనని కొందఱును, లక్ష్మీకటాక్షమునుబొంది సన్నిహితురాలయిన లక్ష్మీదేవిని త నైశ్వర్య వంతునిగాఁ జేయుమని కోరినప్పు డామె యాతని కాజన్మమునందు లక్ష్మి లభింపదని చెప్పఁగా జన్మాంతరతుల్యమైన సన్న్యాసమును స్వీకరించి వైభ వములను బొందెనని కొందఱును వ్రాసియున్నారు. ఇవి యిటీవలివారి బుద్ధికల్పితములు. ఇటువంటి కథలను కల్పించుటలో హిందువులకుఁ గల సామర్థ్యము మఱియెవ్వరికిని గానఁబడదు. మాధవాచార్యులకుఁ బూర్వ మునందు శంకరాచార్య పీఠమునకు వచ్చిన యతీశ్వరు లాదిశంకరుని వలెను, ఇతర సన్న్యాసులవలెను పాదచారులయి భిక్షాటనము చేయుచు, శిష్యపరంపరకు తత్త్వబోధను జేయుచువచ్చిరి. ఈ మాధవాచార్యుఁడు

బుక్కరాజువద్ద మంత్రిగానుండి సమస్తవైభవముల ననుభవింపుచు సన్యసించినవాఁడగుటచేతఁ దాను సన్యాసియయ్యును తొంటివిభవములను విడువఁజాలనివాఁడయి జనులకుఁ దనయందుఁ గల గౌరవాధిక్యము వలనను, రాజానుగ్రహము వలనను, గజాశ్వాందోళనాది సమస్తరాజ చిహ్నములను ధరించి, పీఠాధిపతుల కిట్టి యైశ్వర్యచిహ్నము లుండవచ్చునని నిబంధనముచేసి సమర్థించుకొనెను. ఏనుఁగులతోను, గుఱ్ఱములతోను, వాద్యములతోను పల్లకులలోనెక్కి సర్వసంగపరిత్యాగు లయిన సన్యాసులు మహారాజ వైభవముతో సంచరించుట దేవతావరాయత్తమని సాధించుటకై మనవారీ లక్ష్మీకథను తరువాతఁ గల్పించియుందురు. సన్యాసాశ్రమమును స్వీకరించినప్పుడు మాధవాచార్యులవారు విద్యారణ్యు లన్న నామమును స్వీకరించిరి. వీరికాలమునుండియే జగద్గురువు లనుకొనెడు స్మార్తాచార్యపీఠస్థు లయినయతుల కందలకును గజాశ్వాదులును వాద్యములును పెండ్లిపల్లకులును పరంపరగా వచ్చుచున్నవి. ఈ మాధవాచార్యులవారు గొప్ప విద్వాంసులు. ఆదిశంకరుల తరువాత శంకరాచార్య పీఠమునకు వచ్చినవారిలో మాధవాచార్యులకుఁ బూర్వమునందుఁగాని పరమునందుఁగాని యింతటిపండితులు మఱియెవ్వరును లేరు. ఈయన పరాశరమాధవీయ మనుపేర పరాశరస్మృతి కొక్క గొప్ప వ్యాఖ్యానమును; కాలమాధవీయ మనునొక కాలనిర్ణయగ్రంథమును, శంకరవిజయమును, విద్యారణ్యమని ప్రసిద్ధిగన్న వేదభాష్యమును, నూటయెనిమిది యుపనిషత్తుల కొకవ్యాఖ్యానమును, సర్వదర్శన సంగ్రహమును, మాధవనిదానమును రచియించెను. రాఁబోయెడు విజయనగర రాజుల చరిత్రమును దివ్యజ్ఞానముచేత ముందుగానే తెలుపుచు నీ మహావిద్వాంసునిచే రచియింపఁబడిన దన్న కాలజ్ఞానమను పుస్తక మొకటి కలదు గాని యది విజయనగర సంస్థానము క్షీణించినతరువాత రచింపఁబడిన యాధునికగ్రంథ మయియుండును. మాధవాచార్యులవారు తుంగ

భద్రాతీరమునందున్న పంపానగరమునందు జన్మించిరి; వీరు బుక్కభూపా లునికి కులగురువులు; భారద్వాజసగోత్రులయిన తెలుఁగు బ్రాహ్మణులు; ఈయన తండ్రి మాయణుఁడు; అన్న సాయణుఁడు. అన్నయందును తండ్రియందునుగల గౌరవముచేత మాధవాచార్యుల వేదభాష్యములలోఁ గొన్నిటికి వారిపేరులు పెట్టెను. మాధవాచార్యులు తొంబదిసంవత్సరముల ప్రాయమున సిద్ధిపొందిరఁట; ఈయన ౧౩౮౭ వ సంవత్సరమునందు బుక్కరాజుమంత్రి యైయుండిన ట్లొక తామ్రశాసనమువలనఁ దెలియవచ్చుచున్నది. మాధవీయాదిగ్రంథములలో మాధవాచార్యులవారు తమవంశమును దెలుపుచు వ్రాసిన రెండు శ్లోకముల నిందుఁ జూపుచున్నాను—

శ్లో॥ యస్య బోధాయనంసూత్రం శాఖాయస్యచయాజుషీ
భారద్వాజకులంయస్య సర్వజ్ఞ స్సహిమాధవః
శ్రీమతీయస్యజననీ సుకీర్తి ర్మాయణః పితా
సాయణోభోగ నాథశ్చ మనోబుద్ధిసహోదరౌ.

బుక్కరాజుతరువాత నాతనికి కామాక్షీదేవివలనఁ బుట్టినహరిహరనాథుఁడు ౧౩౭౯ వ సంవత్సరము మొదలుకొని ౧౪౦౧ వ సంవత్సరమువఱకును రాజ్యము చేసెను. ఈ హరిహరరాజునకు మల్లాదేవివలనఁ గలిగిన పుత్రుఁడైన వీరప్రౌఢదేవరాయలు ౧౪౧౨ వ సంవత్సరము వఱకును, ఆతనిపుత్రుఁడైన విజయభూపతి ౧౪౧౮ వ సంవత్సరము వఱకును, ఆతనికుమారుఁడైన దేవరాయలు ౧౪౨౨ వ సంవత్సరము మొదలుకొని ౧౪౪౭ వ సంవత్సరమువఱకును రాజ్యము చేసినట్లు శిలాతామ్రశాసనములవలనఁ దెలియవచ్చుచున్నది. కాని వీ రేయేసంవత్సరములయందు సింహాసన మెక్కిరో యేయేసంవత్సరములయందు పరమపదమును బొందిరో నిశ్చయముగాఁ దెలియదు. బుక్కరాజు

కాలమునుండియు వీరికి మహమ్మదీయులతో యుద్ధములు జరుగుచు వచ్చెను. ౧౩౬౪ వ సంవత్సరమునందు మొట్టమొదట బుక్కరాజు మహమ్మదీయులను యుద్ధములో జయించెను. ఆతని పుత్రుఁడైన హరిహరరాజును మహమ్మదీయులతో యుద్ధము చేసి ౧౩౮౦ వ సంవత్సరమునందు తురుష్కులను గోవానగరమునుండి వెడలఁగొట్టెను. ఈ హరిహరరాజు హిందూదేవాలయముల కనేకములకు భూదానములు చేసెను. హరిహరరాజుయొక్క కడపటిదినములలో సాళువగుండరాజు మంత్రిగా నుండెను. గుండరాజు జైమినిభారతము కృతినందిన సాళువనృసింహరాజుతండ్రి. గుండరాజు మంత్రిగాను దండనాథుఁడుగాను ఉండి కొంత రాజ్యమును సంపాదించెను. తదనంతర మాతనిపుత్రుఁడు సాళువనృసింహరాజు దేవరాయలు సంతానములేక మృతుఁడగుటవలననో మఱియేలాగుననో కర్ణాటకరాజ్యము నాక్రమించుకొనెను. నరసింహరాజునకు తిమ్మరాజను పేరుగల జ్యేష్ఠభ్రాత యొకఁడు గలఁడు. అతఁడే యీశ్వరరాజు తండ్రియైన సాళువతిమ్మరాజని తోఁచుచున్నది. సాళువనృసింహరాజు భూదానములు మొదలయిన దానము లనేకములు చేసెను. ఇతఁడు చిత్తూరిమండలములోని వందవాసినగరమునకు పడమట నామడదూరములో నున్న వెల్లము గ్రామములోని దేవాలయమునకు శాలివాహనశకము ౧౩౯౧ వ సంవత్సరమునం దనఁగా హూణశకము ౧౪౬౯ వ సంవత్సరమునందుఁ గొంతభూమి యిచ్చెను; ఈతని రాజ్యకాలములోనే చిత్తూరిమండలములోని యావ్వూరుగ్రామములోని శివాలయమున కొకరిచేత శాలివాహనశకము ౧౩౯౩ వ సంవత్సరమునకు సరియైన క్రీస్తుశకము ౧౪౭౧ వ సంవత్సరమునందుఁ గొంతభూమి యియ్యఁబడినది. ఈ నృసింహరాజు కాలమున తిమ్మరాజు పుత్రుఁడైన యీశ్వరరాజు దండనాథుఁడుగా నున్నట్లు వరాహపురాణ పీఠికవలనఁ దెలియవచ్చుచున్నది. ఈ నృసింహరాజు మరణానంతర మీశ్వరరాజుపుత్రుఁ

డయిన నరసింహరాజు రాజ్యమునకు వచ్చెను. ఇతఁడు ౧౪౮౭వ సంవత్సరము వఱకును రాజ్యము చేసినట్లు శాసనములవలనఁ దెలియవచ్చుచున్నది. కొందఱితఁడు ౧౫౦౫ వ సంవత్సరమువఱకు మాత్రమే రాజ్యపరిపాలనము చేసె ననియు, ఆసంవత్సరము మొదలుకొని యాతని జ్యేష్టపుత్రుఁ డయిన వీరనృసింహరాయలు పరిపాలనము చేసెననియు చెప్పుచున్నారు. ఇదియే నిజమై యుండవచ్చును. పేరొక్కటియే యై యుండుటచేత శాసనములను పరీక్షించినవారు కొడుకునుగూడ తండ్రినిగా భ్రమించియుందురు. ౧౫౦౯ వ సంవత్సరమునందు కృష్ణదేవరాయల ప్రభుత్వ మారంభమైనది. కృష్ణదేవరాయలు రాజ్యమునకు రాకముం దాతని యన్నయైన వీరనృసింహరాయలు కొంతకాలము రాజ్యము చేసినట్లు కృష్ణదేవరాయల కంకితము చేయఁబడిన గ్రంథముల యం దెల్లను జెప్పఁబడియున్నది:—

క. వీరనృసింహుఁడు నిజభుజ
దారుణకరవాలపరుషధారాహతవీ
రారియగుచు నేకాతప
వారణముగ నేలె ధర నవారణమహిమన్.

క. ఆవిభు ననంతరంబ ధ
రావలయముఁ దాల్చెఁ గృష్ణరాయఁడు చిన్నా
దేవియు శుభమతి తిరుమల
దేవియునుం దనకుఁ గూర్చుదేవేరులుగన్—మనుచరిత్రము.

క. వారలలోఁ దిప్పాంబకు
మారుఁడు పరిపంథికంధిమంథాచలమై
వీరనరసింహరాయఁడు
వారాశిపరీతభూమివలయం బేలెన్.

శా. వీరశ్రీనరసింహశౌరి పిదపన్ విశ్వక్షమామండలీ
ధౌరంధర్యమున న్ఘనంబు ముద మంద న్నాగమాంబాసుతుం
డారూఢోన్నతిఁ గృష్ణరాయఁడు విభుండై రాజ్యసింహాసనం
బారోహించె విరోధులు న్గహనశైలారోహముం జేయఁగన్.—

పారిజాతాపహరణము

శిలాతామ్రశాసనాదులవలనఁ దెలియవచ్చెడు వయివిధమునఁగాక యీ వంశవిషయ మయి పలువురు పలువిధముల పరస్పరవిరుద్ధముగా వ్రాసియున్నారు. అందొక విధము నిందుక్రిందఁ గనఁబఱిచెదను.—

	మొదలు — వఱకు
హరిహరరాయలు	1336—1350
బుక్కరాయలు	1350—1379
హరిహరరాయలు	1379—1401
విజయబుక్కరాయలు	1401—1418
వల్లబుక్కరాయలు	1418—1434
గౌడదేవరాయలు	1434—1454
రాజశేఖరరాయలు	1454—1455
విజయభూపతి	1455—1456
ప్రౌఢదేవరాజు	1456—1477
వీరప్రతాపరాయలు	1477—1481
మల్లికార్జునరాయలు	1481—1487
రామచంద్రరాయలు	1487—1488
విరూపాక్షరాయలు	1488—1490
నరసింహరాయలు	1490—1495
నరసరాయలు	1495—1504
వీరనరసింహరాయలు	1504—1509
కృష్ణదేవరాయలు	1509—1530

ఈ పట్టిక యొక్కటియే చాలవఱకు శిలాతామ్రశాసనముల లోని కాలము ననుసరించి యున్నది.

కృష్ణదేవరాయలు జన్మించినదినముగాని సంవత్సరముగాని సరిగాఁ దెలియదు. కృష్ణరాయలజనన మొకరు ౧౪౬౫ వ సంవత్సరమునం దనియు, ఇంకొకరు ౧౪౮౭ వ సంవత్సరమునందనియు వ్రాసియున్నారు గాని యందేది సత్యమయినదియు నిశ్చయించుట కాధారము లేవియు దొరకలేదు. ఇతఁడు శాలివాహనశకము ౧౩౮౭ వ సంవత్సరమునం దనఁగా క్రీస్తుశకము ౧౪౬౫ వికృతిసంవత్సర పుష్యబహుళ ద్వాదశీ శుక్రవారమునాఁడు పుట్టినట్టు తెలిపెడి యీక్రిందిపద్య మొకటి వాడుకలో నున్నది:—

ఉ. అందలి శాలివాహనశకాబ్దము లద్రివసుత్రిసోముల౯
వందిత మైనయవ్వికృతివత్సరమందలి పుష్యమాసమం
దుం దగుకృష్ణపక్షమున నుండెడిద్వాదశి శుక్రవాసరం
బం దుదయించెఁ గృష్ణుఁడు శుభాన్వితుఁ డానరసింహమూ ర్తికిన్.

ఇది యెంతవఱకు విశ్వసింపఁదగినదో బుద్ధిమంతులగువా రాలోచించుకొందురుగాక! అయినను, ఇది మొదటివారు చెప్పినకాలముతో సరిపోవుచున్నందున దీని నధికవిశ్వాసార్హముగా నెంచవచ్చును. ౧౮౨౯ వ సంవత్సరములో కావలి వెంకటరామస్వామిగారు కలకత్తానగరమునందుఁ బ్రచురించిన దక్షిణహిందూదేశకవుల చరిత్రములో కృష్ణరాయలు తన నలువదవయేట శాలివాహనశకాబ్దములు ౧౪౪౬ వ సంవత్సరమునం దనఁగా క్రీస్తుశకము ౧౫౨౪ వ సంవత్సరమునందు మృతినొందినట్టు వ్రాసియున్నారు. దీనినిబట్టిచూడఁగా నీ రాయలవారు హూణశకము ౧౪౮౪ వ సంవత్సరమునఁ బుట్టినట్టేర్పడుచున్నది. అల్లసాని పెద్దన్న చెప్పినట్టు చాటుధారగా వచ్చుచున్న యీక్రింది పద్యములనుబట్టికూడ కృష్ణదేవరాయల మృతికాల మించుమించుగా దీనితో సరిపోవుచున్నది.

ఉ. బోరన యాచకప్రతతి భూరివిపద్దశ నొందుచుండఁగా
నారయ శాలివాహనశకాబ్దము లద్రియుగాబ్ధిసోములం
దారణవత్సరంబున నిదాఘదినంబున జ్యేష్ఠశుద్ధ ష
ష్ఠీరవివాసరంబున నృసింహుని కృష్ణుఁడు చేరె స్వర్గముల్
ద్వారక నున్నకృష్ణుఁ డవతారసమాప్తము నొందు కైవడిన్.

ఈపద్యమునుబట్టి శకాబ్దములు ౧౪౪౭ టికి సరియయినహూణ శకము ౧౫౨౪ వ సంవత్సరమునఁ గృష్ణరాయ లంతరించినట్లు కానఁబడుచున్నను, ౧౫౩౦ వ సంవత్సరమువఱకు నాతని దానశాసనములు విస్తారముగా నున్నందున శాసనములను బరీక్షించిన యిప్పటి వారతఁడు ౧౫౩౦ వ సంవత్సరమునందే మృతినొందెనని నిశ్చయించియున్నారు. ౧౫౨౬, ౧౫౨౮, ౧౫౨౯ వ సంవత్సరములయం దచ్యుతదేవరాయల దానశాసనములు సహితము రెండుమూడు కానవచ్చుచున్నను, అవి కృష్ణరాయల జీవితకాలములోనే చేయఁబడినవి కావచ్చును. కృష్ణదేవ రాయలతండ్రియైన నరసింహరాయనికి తిప్పాంబ యనియు, నాగమాంబ యనియు, ఇద్దఱు భార్యలు గలరు. ఆ యిరువురలో తిప్పాంబ పట్టపురాణియనియు, నాగమాంబ భోగకాంతయనియు, చెప్పుదురు. కొన్ని శాసనములయందుఁగూడ నిట్లే కానఁబడుచున్నది. ఆయిద్దఱు భార్యలలో తిప్పాంబకు వీరనృసింహరాయలును, నాగమాంబకు కృష్ణ దేవరాయలును పుట్టిరి. నరసింహదేవరాయల కోబమాంబ యని యింకొక భార్య యున్నట్టును, ఆమె కచ్యుతదేవరాయలు పుత్త్రుఁ డయినట్టును, శాలివాహనశకము ౧౪౫౯ వ సంవత్సరమునకు సరియైన హూణాబ్దము ౧౫౩౭ హేవిళంబి సంవత్సరమున చిత్తూరిమండలము లోని నారాయణపురము నొక బ్రాహ్మణునికి దాన మిచ్చుచు నచ్యుత దేవరాయలు వ్రాసియిచ్చిన తామ్రశాసనములోని యీక్రింది వాక్య ములవలనఁ దెలియవచ్చుచున్నది:-

తిప్పాజీ నాగలాదేవ్యో కౌసల్యా శ్రీసుమిత్రయోః
జాతౌ వీరనృసింహేంద్ర కృష్ణరాయ మహీపతిః
అస్మాదోబాంబికాదేవ్యా మచ్యుతేంద్రోపి భూపతిః.

కృష్ణదేవరాయలతండ్రి నరసింహరాజే మధుర శ్రీరంగపట్టణము మొదలయినవానిని జయించి తద్దేశముల నాక్రమించినట్లు పారిజాతాపహరణములోని యీక్రిందిపద్యమువలనఁ దేటపడుచున్నది—

సీ. కుంతలేశ్వరుఁడు చిక్కుపడంగవిద్యాపురంబుఁ గైకొని నిజప్రౌఢి నెఱపెఁ
బారసీకునకు దుర్భరమానవత్వంబుఁ దొలఁగించె మానవదుర్గసీమఁ
జోళవల్లభునకసురవధూమధురాధరములిచ్చిమధురాపురంబుగొనియె
శ్రీరంగ పట్టణసీమ ఖడ్గనటీవినోదంబు హూణనేంద్రునకుఁ జూపె
నతఁడు నుతికెక్కె రామసేత్వంతరాళ
కలితషోడశ దానవిఖ్యాతయశుఁడు
మండలీకర మేఘమార్తాండబిరుదుఁ
డీశ్వరాధిపు నరసపృథ్వీశ్వరుండు.

౧౪౨౮ వ సంవత్సరమునకు సరియైన శాలివాహనశకము ౧౪౩౦ శుక్లసంవత్సర వైశాఖమాసమునందు సింహాసనమునకు వచ్చువఱకును గల కృష్ణరాయనిచరిత్రము విశ్వాసార్హమైన దేదియు తెలియదు. వీర నృసింహరాయునిపై నిజాపు ప్రేమముకంటెఁ దండ్రి కృష్ణరాయనియెడ నధికప్రేమమును జూపుచు వచ్చెననియు, అదిచూచి సహింపలేక వీర నృసింహరాయని తల్లి తన సపత్నీపుత్రుని జంపింపఁ బ్రయత్నింపఁగా మంత్రియైన తిమ్మరుసు సాజాడఁ గనిపెట్టి యాతని దాఁచి ప్రాణమును రక్షించి కాపాడెననియు, తరువాతఁ గొంతకాలమునకు నృసింహదేవ రాయ లుబ్బుజబ్బుచేత బాధపడుచుఁ బ్రాణావసానకాలమునందుఁ గొడుకులను బిలిచి తనవ్రేలియుంగరమును దీసికొన్నవాఁడు రాజ్యార్హుఁ డని

చెప్పినప్పుడు తక్కినవారు తీయుట కుపాయముతోఁచక యూరకుండఁగాఁ గృష్ణరాయలు తనచేతిఖడ్గముతో జనకునివ్రేలు నఱికి యుంగరమును గైకొనెననియు, అతని సాహసమునకు మెచ్చి తండ్రి యాతనినే పట్టాభిషిక్తుని జేయ నియమించి దేహావియోగమును బొందెననియు కథలు చెప్పుదురు. నరసింహరాయని యనంతరమున జ్యేష్ఠుఁడయిన వీరనృసింహరాయఁడే రాజ్యమునకు వచ్చినట్లు కృష్ణరాయని కంకితము చేయఁబడిన మనుచరిత్రాది గ్రంథములే చెప్పుచున్నందున, ఈ కడపటిసంగతి సత్యమయి యుండదు. కృష్ణదేవరాయఁడు సింహాసనమునకు వచ్చిన శీఘ్రకాలములోనే యుద్ధయాత్రచేసి తన రాజ్యమును నానాముఖముల వ్యాపింపఁజేసెను. దానీపుత్రుఁ డగుటచేత నాతనికి సత్కులీనులగు రాజులెవ్వరును గన్య నియ్యనందున సింహాసన మెక్కినప్పటికి వివాహము కాలేదు. కృష్ణరాయలు ౧౫౧౩ వ సంవత్సరమునందు దక్షిణ దిగ్విజయయాత్రకు బయలువెడలి మహిసూరు దేశములోని యుమ్మటూరు, శివసముద్రము, శ్రీరంగపట్టణము లోఁబఱుచుకొని గంగవంశరాజులను జయింపఁగా, తరువాత మహిసూరుదేశమంతయు స్వాధీనమయినది. ఈ దేశమును జయించినసంగతి పారిజాతాపహరణములోని ద్వితీయాశ్వాసాంతమందలి యీ క్రిందిపద్యమునందు సూచింపఁబడినది:—

శా. సమ్మర్దక్షమధీనిబంధనవిధాసంక్రందనాచార్య శూ
రమ్మన్యాచలవజ్రపాత జగతీరక్షాంబుజాక్ష శర
ణ్యమ్మార్గస్థకళాస్య రాజ్యపమ సహ్యాద్రిపోద్భవాతీరభా
గుమ్మత్తూరి శివంసముద్రపుర వప్రోన్మూలనాడంబరా.

ఆ సంవత్సరమునందే కృష్ణదేవరాయలు నెల్లూరిమండలములోని యుదయగిరిమీఁదికి దండెత్తి, దాని కధికారిగానున్న వీరభద్రపాత్రుని పినతండ్రియైన ప్రహరేశ్వరపాత్రుని జయించి యాదుర్గమును సాధించెను. అటుతరువాతఁ గృష్ణరాయల మంత్రియైన యప్పాజీ యను నామాంత

రము గల తిమ్మరుసు (సాళువతిమ్మరాజు) నెల్లూరిమండలములోని కనిగిరి (కనకగిరి) కి రాజయినట్టియు, ఓరుగంటి ప్రతాపరుద్రుని సంతతివారిలోఁ గడపటివాఁ డయినట్టియు వీరరుద్రగజపతి కాతనికొమార్తెను గృష్ణరాయల కిచ్చి వివాహము చేయుమని సందేశము పంపెను. ఆతఁడు హీనకులుఁడైన కృష్ణరాయనికిఁ దనపుత్రిక నియ్యనని స్పష్టముగాఁ జెప్పి యటువంటి బలవంతునితో విరోధము పెట్టుకొనుటకు సాహసింపఁజాలక, కొమార్తె నిచ్చెద నని చెప్పి రాయలను మంత్రిసహితముగా రప్పించి, అంతఃపురము చొచ్చినప్పుడు రాజుప్రాణములు గొనఁ బ్రయత్నించెను. కోటలోఁ బ్రవేశించిన తరువాత మంత్రియైన తిమ్మరు సీమోసమును గనిపెట్టి రాజుప్రాణములు కాపాడుటకై తాను రాజువేషమును వేసికొని కృష్ణరాయనికి సేవకవేషమువేసి తన వెంటఁగొనిపోయెను. కాని కృష్ణరాయనిచేతివ్రేలినున్న ముద్రయుంగరమునుబట్టి యతఁడేరాజని యంతఃపురములోనివా రానవాలు పట్టిరి. ప్రాణోపద్రవము సంభవింపనున్న యా సమయమునందు ధీమంతుఁడైన మంత్రియుపాయమువలన రాజు తానును మంత్రియు నెట్లో ప్రాణములు దక్కించుకొని పాఱిపోయి స్వదేశమును జేరినతోడనే సేనలనుగూర్చి కనిగిరిమీఁద దండెత్తివచ్చి వీరరుద్రునిరాజ్యమును, అతనిపుత్రికయైన చిన్నాదేవినిగైకొని, ద్రోహియైన యాతనిఁ జంపక కుటుంబసహితముగా వింధ్యపర్వత ప్రాంతములకుఁ బాఱఁద్రోలెను. వీరరుద్రునిశుద్ధాంతస్త్రీలు వింధ్యపర్వతము పాలైన సంగతిని మనుచరిత్రమునం దల్లసాని పెద్దన యీరీతిగా వర్ణించి యున్నాఁడు :—

మ. ధరకెంధూళులు కృష్ణరాయలచమూధాటీగతి న్వింధ్యగ
హ్వరము ల్దూఱఁగఁ జూచి తారచటఁ గాపై యుండుటం జాల న
చ్చెరువై యెట్టనివింతచీఁకటులు వచ్చెం జూడరే యంచు వే.
సారిదింజూతురు వీరరుద్రగజరాట్ఛుద్ధాంతముగ్ధాంగనల్.

కృష్ణరాయలు ౧౫౧౫ వ సంవత్సరమునందు పూర్వదిగ్విజయ యాత్ర వెడలి, ఆ సంవత్సరమునందె కొండవీడు, బెల్లముకొండ, బెజవాడ, కొండపల్లి, రాజమహేంద్రవరము మొదలయిన ప్రదేశములను జయించి, ౧౫౧౬ వ సంవత్సరమునందు విశాఖపట్టణమండలములోని భీమునిపట్టణమున కయిదుక్రోసులదూరములో నున్న పోట్నూరివద్ద రాతిజయస్తంభమును వేయించి, ఆ మండలములోని వీరవల్లి తాలూకాలోని వడ్డాది జయించి, ఉత్కలదేశములోని కటకపురమువఱకును బోయి కటకపురమును గాల్పఁగా, కళింగదేశాధిపతియై యోఢ్రదేశమును బాలించుచుండిన ప్రతాపరుద్రదేవుఁడు తనకుమార్తెయైన తిరుమలదేవిని రాజున కిచ్చి వివాహముచేసి సంధి చేసికొనెను. అందుచేతఁ గృష్ణదేవరాయలు రాజమహేంద్రవరమువఱకును గల కళింగదేశమును మరలఁ బ్రతాపరుద్రదేవుని కిచ్చివేసి, ౧౫౧౬ వ సంవత్సరాంతమున కాంచీపురము ప్రవేశించెను. ఈతని ప్రథమభార్యయైన చిన్నాదేవికి అన్నపూర్ణాదేవియనియు నామాంతరముగలదు. ఈతనికిఁ దిరుమలదేవియు నన్నపూర్ణాదేవియు నిద్దఱుభార్యలగుటను గృష్ణదేవరాయలు-తాను విష్ణుచిత్తీయమునం దిట్లు తెలిపియున్నాఁడు.—

క. ఆవిభు ననంతరంబ ధ
రావలయముఁ బూని తీవు రహిమైఁ దిరుమ
ల్దేవియును నన్నపూర్ణా
దేవియుఁ గమలాబ్జముఖులు దేవేరులుగన్.

ఈతఁడు పూర్వదిగ్విజయయాత్రలో సింహాచలమును దర్శించి నప్పుడు భార్యాసహితముగాఁ జేసినదానమునుగూర్చి సింహాచలదేవాలయములో నేడవస్తంభముమీఁదఁ జెక్కించిన యీ క్రిందియంశమును విశాఖపట్టణమండలచరిత్రమునుండి తీసికొనుచున్నాను.—

"శుభమస్తు శ్రీమన్ మహారాజాధిరాజ పరమేశ్వర మూరు రాయరగండ ఆదిరాయ విజయభాషాగీత ప్రవర రాయరగండ యవన రాజ్యసంస్థాపనాచార్య శ్రీవీరప్రతాపకృష్ణదేవమహారాజులువిజయనగరాన సింహాసనస్థుడై పూర్వదిగ్విజయయాత్రకు విచ్చేసి ఉదయగిరి, కొండవీడు, కొండపల్లి, రాజమహేంద్రవరము మొదలయిన దుర్గాలు సాధించి సింహాద్రికి విచ్చేసి స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహనశక వర్షంబులు ౧౪౩౮ అగు నేటి ధాత సం॥ చైత్ర బ ౧౨ స్థిరవారాన సింహాద్రినాథు దర్శించి తమతల్లి నాగాదేవమ్మగారికిన్ని తమతండ్రి నరసరాయునిగారికిన్ని పుణ్యముగాను దేవునికి సమర్పించిన కంఠమాల ౧-కి ముత్యాలు ౯౯౧ వజ్రమాణిక్యాల కడియాలజోడు ౧-టి శంఖచక్రాల పతకం ౧-న్ని పయిడిపళ్ళెం ౧-న్ని తూకాలు గ ౪౪౨౯౨ కానిమాడలు గ ౨౦౦౦ తమ దేవి చిన్నాదేవమ్మగారిచేతను సమర్పించిన పతకం ౧-కి గ ౫౦౦ తిరుమలదేవమ్మగారిచేతను సమర్పించిన పతకం ౧-కి గ ౫౦౦ యింత మట్టుకు సమర్పించిన ధర్మశాసనము."

కృష్ణరాయలవిజయములనుగూర్చి పారిజాతాపహరణమునందును, మను చరిత్రమునందును జెప్పఁబడిన కొన్ని పద్యముల నిం దుదహరించుచున్నాను.—

చ. మునుకొని కొండవీటికడ మూఢత రుద్రుఁడు కృష్ణనందను
న్మనసిజునిన్ జయించె నది మానుషమే నరసేంద్రు కృష్ణరా
యనృపతి కొండవీటికడ నాహవభూమిఁ బ్రతాపరుద్రనం
దనుఁ డగువీరభద్రుఁ గిరుణాఘుతిఁ గాచె జగత్ప్రసిద్ధిగన్.

చ. నెలకొని కృష్ణరాయధరణీవిభుఁ డుత్కలభూమిపాలుతోఁ
గలన నెదిర్చి హస్తికరకాండతతుల్మసకంపుఁబాములై
మలసినచోటఁ గూడిన సమగ్రయశోవసనంబు గప్పి తా
వలవఁగఁ జేసె భూసతిని వశ్యవిధిజ్ఞుఁడుగాన నేర్పునన్.

సీ. ఉదయాద్రి వేగనత్యుద్ధతి సాధించె వినుకొండ మాటమాత్రన హరించెఁ
గూటము ల్సెదరంగఁ గొండవీడు గలంచె బెల్లముకొండ యచ్చెల్ల జెఱిచె
వేలుపుకొండ నుద్వృత్తి భంగము సేసి జల్లిపల్లె సమగ్రశక్తిఁ గూల్చె
గినుక మీఱ ననంతగిరి క్రిందుపడఁ జేసె గంబంబుమెట్టు గ్రక్కునఁ గదల్చె
బలనికాయము కాలుముట్టల నడంచుఁ
గటకమును నింక ననుచు నుత్కలమహీశుఁ
డనుదినమ్మును వెఱచు నెవ్వనికి నతఁడు
రాజమాత్రుండె శ్రీకృష్ణరాయవిభుఁడు :—పారిజాతాపహరణము.

సీ. తొలుదొల్త నుదయాద్రిశిలఁ దాఁ కితీండ్రించు నసిలోహమున వెచ్చనయి జనించె
మఱికొండవీ డెక్కి మార్కొని నలియైనయలకసవాపాత్రు నంటిరాఁజె
నటసాగి జమ్మిలోయఁబడి వేగదహించెఁ గోనబిట్టేర్చెఁ గొట్టానఁదగిలెఁ
గనకగిరిస్ఫూర్తిఁ గరఁచె గౌతమిఁ గ్రాఁచె నవులనాపొట్నూరు రవులుకొనియె
మాడెములు వ్రేల్చె నొడ్డాది మసియొనర్చెఁ
గటకపురిఁ గాల్చె గజరాజు గలఁగిపఱవఁ
దోఁకచిచ్చన నార యుద్ధురతఁ గృష్ణ
రాయబాహుప్రతాపజాగ్రన్మహాగ్ని.

చ. అభిరతిఁ గృష్ణరాయఁడు జయాంకములన్ లిఖియించి తాళస
న్నిభముగఁ బొట్టునూరికడ నిల్పినకంబము సింహభూధర
ప్రభు తిరునాళ్ళకుం దిగుసురప్రకరంబు కళింగమేదినీ
విభు నపకీర్తికజ్జలము వేమఱుఁ బెట్టి పఠించు నిచ్చలున్ :-మనుచరిత్రము.

పూర్వదిగ్విజయయాత్ర చేసి వచ్చినతరువాత మూఁడుసంవత్సరములవఱకును కృష్ణదేవరాయలు యుద్ధము లేమియుఁ జేసినట్టు కానఁబడదు. అతఁ డాకాలమునందంతటను విద్యావ్యాసంగమునందు ప్రొద్దు

పుచ్చుచుండెను. అల్లసానిపెద్దన తనస్వారోచిషమను చరిత్రమును, నంది తిమ్మన తనపారిజాతాపహరణమును, ౧౫౧౬ వ సంవత్సరమునకు తరువాతను ౧౫౨౦వ సంవత్సరమునకు లోపలను కృష్ణదేవరాయనికంకితము చేసిరి. ౧౫౧౮ వ సంవత్సరాంతమునందు బీజపురమహమ్మదీయులతో యుద్ధము చేసి, ౧౫౨౦ వ సంవత్సరమునందు సుల్తానయినయేడిల్ ఖానుని జయించెను. ఈయుద్ధవార్త పూర్వోక్తములైన రెండుగ్రంథములయందు నుదహరింపఁబడకపోవుటచేత నవి యీ యుద్ధమునకుఁ బూర్వమునందే రచియింపఁబడినట్లు నిశ్చయింపవలసియున్నది. అయినను గృష్ణదేవరాయలే తన యాముక్తమాల్యదయం దీయుద్ధవృత్తాంతము నీక్రింది పద్యముచేఁ జెప్పియున్నాఁడు :—

మ. అలుక స్ఫోటకధట్టికాఖురపుటీహల్యస్థురాసానివు
చ్చలువోఁ దున్ని చలచ్చమూగజమదాసారప్లుతిన్ గీర్తిపు
ష్కలసస్యం బిడి యేకధాటి బళిరా కట్టించితో దృష్టి కే
దులఖానోగ్రకపాలమర్దఘహరిద్భూజాంగలశ్రేణికన్.

పయిపద్యమునుబట్టి యాముక్తమాల్యద ౧౫౨౦ వ సంవత్సరమునకుఁ దరువాత రచియింపఁబడిన ట్లేర్పడుచున్నది. ఓరుగల్లు, గోలకొండ మొదలయిన సంస్థానములనుగూడ జయించి యితఁడు తనరాజ్యమును దక్షిణహిందూస్థానమునం దంతటను వ్యాపింపఁజేసెను. ఈదక్షిణదేశమును పాలించినరాజులలో నింతగొప్పరాజ్యమేలినరాజు మఱియెవ్వఁడును లేఁడు. ఒడ్డిరాజు లయిన గజపతులను, తురుష్కరాజు లయిన యశ్వపతులను, తెలుఁగురాజు లయిననరపతులను, జయించుటచేత నీతనికి మూరురాయరగండఁడని బిరుదు కలిగినది. ఇటువంటి బిరుదములనేకము లీయనకుఁ గలవుగాని యవి యన్నియు నిందు వివరించుట యనావశ్యకము. ఈతఁడు శ్రీరంగపట్టణము, మధుర, త్రిరుచనాపల్లి, మళయాళము మొదలయిన దేశములను పాలించుటకు తెలుఁగునాయకు

లను పాలకులనుగా నేర్పఱిచెను. ఈతఁడే తుంగభద్రానదికి విజయనగర మువద్ద వంతెన కట్టెను. ఈతనికి తిమ్మరుసు మంత్రిగా నుండెనుగాని యతఁడు రాజునకంటె మూఁడు సంవత్సరములు ముందుగా మృతి నొందెను.

ఈకృష్ణదేవరాయలది తుళువవంశము. ఇంటిపేరు సాళువవారు; పూర్వ లావఱకు వసియించిన గ్రామనామములనుబట్టి సంపెటవా రనియు, సెలగోలవా రనియు కూడ గృహనామము గలదు. ఈకడపటి రెండుపేరులును కరణములు వ్రాసియుంచిన కొండవీటికవిలె చరిత్ర మునం దుదాహరింపఁబడి యున్నవి. ఇంతవఱకును రాజుయొక్క విజ యములనుగూర్చి సంక్షేపముగా వ్రాసియున్నాను. ఇఁక నీతనిపాండిత్య ప్రభావాదులనుగూర్చి కొంత వ్రాయవలసి యున్నది. పూర్వకాలము నందు భోజరాజు సంస్కృతభాష నాదరించినట్లే యితఁ డాంధ్రభాష నాదరించి కవులను సమ్మానించి గ్రంథరచన చేయించుటచేత నీతని కాంధ్రభోజుఁడని బిరుదనామము గలిగినది. ఇతఁడు కవుల నాదరించి కావ్యములు చేయించుటయే కాక తానుగూడ విద్వాంసుఁడై సంస్కృ తాంధ్రములయందు గ్రంథములను రచియించుటకు సమర్థుఁ డయియుం డెను. ఈతఁడు సంస్కృతమునందుఁ బెక్కుగ్రంథములు రచించినట్లు విష్ణుచిత్తీయమునందలి యీపద్యమునందుఁ జెప్పఁబడియున్నది.—

సీ. పలికి తుత్ప్రేక్షోపమల జాతిపెంపెక్క రసికులౌనన మదాలసచరిత్ర
భావధ్వనివ్యంగ్యసేవధిగాఁగఁ జెప్పితివి సత్యావధూప్రీణనంబు
శ్రుతిపురాణోపసంహిత లేర్చి కూర్చితి సకలకథాసారసంగ్రహంబు
శ్రోత్రఘుచ్ఛటలు విచ్చగరచించితిసూక్తినైపుణిజ్ఞానచింతామణికృతి
మఱియు రసమంజరీముఖ్యమధురకావ్య
రచనమెప్పించుకొంటి గీర్వాణభాష

సంధ్రభాష యసాధ్యంబె యందు నొక్క
కృతి వినిర్మింపు మిఁక మాకుఁ బ్రియముగాఁగ.

అయినను కృష్ణదేవరాయలు రచియించిన యీసంస్కృత గ్రంథము లేవియు నిప్పుడు గానరాకున్నవి. సంస్కృతముమాట యెటున్నను కవులను బ్రోత్సాహపఱిచి కావ్యములను చేయించియు తాను జేసియు తెలుఁగుభాష కీయన మహోపకారము చేసి యున్నాఁడు. ప్రబంధరచనము క్రొత్తగా నీ కృష్ణదేవరాయల కాలమునందే యారంభ మైనది. అంతకుఁ బూర్వమునందున్న కవులు సంస్కృతమునుంచి యితి హాసములను బురాణములనుమాత్రము తెనిఁగించుచు వచ్చిరి. వారిలోఁ గేతన యనుకవి యాజ్ఞవల్క్యధర్మశాస్త్రమును, దండివిరచితమైన దశకు మారచరిత్రమును, శ్రీనాథుఁడనుకవి శ్రీహర్షవిరచితమైన నైషధకావ్య మును పద్యకావ్యములనుగాఁ దెలిఁగించిరి. బాణవిరచితమైన కాదంబరి యాంధ్రీకరింపఁబడినట్టు కానఁబడుచున్నదిగాని కొన్ని లక్షణగ్రంథముల యందుదాహరింపఁబడిన పద్యములుతక్క గ్రంథ మెక్కడను పూర్ణముగా దొరకకున్నది.

ఏది యెట్లున్నను గృష్ణదేవరాయనికిఁ బూర్వకాలమునందలికవులు రచించిన యాంధ్రగ్రంథములన్నియు సంస్కృతమునుండి చేసిన భాషాంతరములే కాని స్వబుద్ధికల్పితముగా రచించిన నూతనగ్రంథ మొక్క టియుఁ గానరాదు. తెలుఁగునందు నూతనముగా బ్రబంధరచనచేసి తరు వాతివారికి దారిచూపినవాఁడు కృష్ణదేవరాయని యాస్థానకవియైన యల్లసాని పెద్దనామాత్యుఁడు. ఆతఁడు రచియించిన మొదటిప్రబంధము స్వారోచిషమనుసంభవమను మనుచరిత్రము. ఈ గ్రంథమునందలి కథ మార్కండేయ పురాణమునుండి గ్రహింపఁబడినది. మొట్టమొదట నీ మనుచరిత్రమును ప్రబంధరూపమున రచింపఁబట్టియే పెద్దనార్యున కాంధ్రకవితాపితామహుఁ డను బిరుదనామము కలిగినది.

కృష్ణదేవరాయలకు సంస్కృతాంధ్రములయం దసాధారణపాండిత్యము గలిగియుండుట నాతఁడు రచియించిన యాముక్తమాల్యదయే సహస్రముఖముల ఘోషించుచున్నది. ఆముక్తమాల్యద కృష్ణరాయకృతము కాదనియు దానిని తదాస్థానకవియైన పెద్దనార్యుఁడు రచించి పుస్తకమునఁ దనప్రభువునకుఁ గర్తృత్వమును నారోపించెననియు వాడుక కలదుగాని యదియంతగా విశ్వసనీయముగాదు. కృష్ణదేవరాయ లల్లసాని పెద్దనను, రామరాజభూషణుని, ప్రబంధములను రచించి తెమ్మని యాజ్ఞాపించెననియు, తదాజ్ఞానుసారముగా వారిరువురును గ్రంథరచనచేసి తమప్రబంధములను దీసికొనిరాఁగాఁ జూచి రాజు వసుచరిత్రమునకంటె మనుచరిత్రము లేఁతపాకమునఁ బడినదని యభిప్రాయము తెలిపెననియు, అందుమీఁద పెద్దన "యాముక్త మాల్యద" యనుపేర విష్ణుచిత్తుని చరిత్రమును రచియించి తీసికొనిరాఁగా విష్ణుచిత్తీయము ముదురుపాకముగా నున్నదనియె ననియు, చెప్పుదురుగాని యిదియంతయు నిటీవలివారి స్వకపోలకల్పితము. వసుచరిత్రమును రచియించిన రామరాజభూషణుఁడు కృష్ణదేవరాయని కాలమునం దుండెనో లేఁడో యని సందేహింపవలసి యున్నది. ఉండినపక్షమున నతఁ డాకాలమునఁ జిన్నవయసువాఁడయి యుండవచ్చును. ఆముక్తమాల్యదయు మనుచరిత్రమును రచియింపఁబడినతరువాత నేఁబదియేండ్లకుఁగాని రామరాజభూషణుఁడు వసుచరిత్రమును రచియింపలేదు. కాఁబట్టి పయికథ యెంతమాత్రమును నమ్మఁదగినదికాదు. ఆముక్తమాల్యదకును, మనుచరిత్రమునకును శైలియందు విశేషభేద ముండుటచేతను, ఆముక్తమాల్యద వ్యాకరణదోషయుక్తమయినదిగా నుండుటచేతను, ఆరెండుపుస్తకములు నేకకవిచే రచియింపఁబడినవి కావని నిశ్చయముగాఁ జెప్పవచ్చును. పెద్దనకవిత్వములో లేనియికారసంధులును, తత్సమశబ్దములం దకారసంధులును, క్త్వార్థకసంధులును, ఆముక్తమాల్యదయందుఁ గానఁబడుచున్నవి అందుఁ

గొన్నిటి నిందుఁ క్రిందఁ జూపుచున్నాను :—

ఇ కా ర సం ధు లు.

౧-గీ. నిం గిటు త్రిశంకుకతన మాతంగవాటి
యయ్యె నిఁక నుండఁదగదని యవనికరిగి
నట్టి నక్షత్రతారాగ్రహాళియనఁగఁ
గాంతనవరత్నరాసు లంగళ్ళఁ బొలుచు. ఆ ౨.

ఇందు మొదటిపాదమునందు “నింగి + ఇటు = నింగిటు” అని ప్రయోగింపఁబడినది.

౨-చ. హాతల నొనర్చె మోహితల నల్ల యయోముఖి నాపుల స్య భూ
సుతను విరూపలౌట నసుచో ముసలిక్ బెదనిట్టతాడువం
టతివ రమించెఁ దా ముసలి యయ్యు రహస్మఁబుగుజ్జప్రేష్యకై
ధృతిచెడి యుగ్రసేనునకుఁ బ్రేష్యత నొందియు దిద్ది షోలఁడే. ఆ-౫

ఇందు మూడవపాదమునందు “నిట్టతాడువంటి + అతివ = నిట్టతాడువంటతివ” అని ప్రయోగింపఁబడినది.

తత్సమములం దకారసంధులు.

౧-చ. అడుగుననుండియుం బదిలమై చద లంటెడుకోటనొప్పు ప్రో
ల్చెడనికడంక దంచెనవుచేతులఁ గం గనుకాసె దూలఁగా
నడుమనె యున్కిఁజేసి యల నాకపురి న్నరికై పెనంగి లా
వెడలఁగఁ బట్టి వేయుటకు నెత్తె ననం జను మల్లుపోరునన్. ఆ-౩

ఇచ్చట రెండవచరణమున “గంగ + అను = గంగను” అని ప్రయోగింపఁబడినది.

౨-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు మ[illegible]ంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికత్తె సగ మొత్తుచు ఱెక్కవిదిర్చు మున్నుగా
వడఁకుటెకాక చేష్టుడిగెవత్తను పక్షులుజానువుల్ చొరన్. ఆ-౮

ఇచట నాలవచరణమందు "చేష్ట + ఉడిగె=చేష్టుడిగె"అని ప్రయోగింపఁబడినది.

3-శా. అబ్రహ్మణ్యము లోనవై చుకొనె నన్యాయంబున న్మాతృసం
దాబ్రహ్మాదులమేర నిల్పియుఁ బ్రభుత్వం బూఁదియుం ద్రోఁతురే
యీబ్రక్కం ద్విజుఁ జూడరయ్య సభవా రీరంగభ ర్త్రంచు దుః
ఖాబ్రాళింబడి బాష్పకంఠుఁడు సముద్యద్రోషలాలుండునై. ఆ-ఉ

ఇచట మూఁడవచరణమున "రంగభ ర్త + అంచు=రంగభ ర్త్రంచు" అని ప్రయోగింపఁబడినది.

౧సీ. కొంగవాల్నలుకులంగుళులఁబట్టుకజబ్బలంటఁగుట్టిడవెజ్జునరయువారు
తలఁబడ్డ గుదియదెబ్బలఁబొఁతమసియిడియంబలిగంజిండ్లనడుగువారు
తమసేగిఁజెప్ప లో దయమీఱ వినిచీరఁజిం చిచ్చువారి దీవించువారు
నోలఁబడ్డ చెపమునఁ గలలేపసిరిఁజెప్పి చుట్టలపై దాడి వెట్టువారు
నైనపాంథులచేతఁ గ్రందైనయూళ్ల
జాడగా నిటఁ దెచ్చి యిన్నిడడించి
వారు నీ రానఁబోవనో వ్వారిమగిడి
వచ్చునాలోన నీరూపువచ్చెనాకు. ఆ-ఉ

ఇచ్చట మూఁడవపాదమునందు "చించి + ఇచ్చు = చించిచ్చు" అని ప్రయోగింపఁబడినది. మఱియు నీపద్యమునందే మొదటిచరణమున "పట్టుకొని" యనుటకు "పట్టుక" యనియు, రెండవచరణమందు "గంజి + ఇండ్ల =గంజిండ్ల" నపియు వ్యాకరణావిరుద్ధములయిన ప్రయోగము లున్నవి. ఈవిధముగానే,

శా. ఎట్లా యిట్లగునయ్యవల్క- దయలే కీనాళ్లు నీకూడె యీ
పొట్టంబెట్టి మహాఘలబ్ధిఁ దనువుం బోషించి యెన్నాళ్లకే
నెట్టే నొక్క తపస్వి యొక్కవ్రతి రాఁడే చూఁడఁడే తత్కృపకా
బుట్టు న్నీగెద దీని నా నొద్దవి యోపుణ్యాత్మ యెట్లంటివే —ఆ ఉ.

"పుట్టుక్నీగెద" (పుట్టుక్ + ఈగెద) మొదలయిన వ్యాకరణ విరుద్ధము లైన ప్రయోగములు మఱి కొన్నియందుఁ గానవచ్చుచున్నవి. కాఁబట్టి యీ యాముక్తమాల్యద సర్వలక్షణవేత్త యయిన యల్లసాని పెద్దన విరచితము కాదనుట స్పష్టము. అంతేకాక యీపుస్తకము పెద్దనకవనమువలె మృదువైనదియు, నల్లికగలదియుఁగాక కటుపద భూయిష్టముగా నున్నందునను పెద్దనార్యకృతము కాదని నిశ్చయింపవలసి యున్నది. అయినను కృత్యాద్యవస్థయందు వంశావళిలో పెద్దన ప్రణీత మయిన మనుచరిత్రములోని పద్యములే యిందుఁ గానఁబడుచున్నందున రెంటికిని గృతికర్త లొక్కరేయని యూహింపవలసి యుండునని కొందఱందురుగాని యాయూహ సరియైనది కాదు. వంశావళిలో కృష్ణదేవరాయని జయములును గుణవర్ణనలు మాత్రమే యధికముగా నున్నందున, ఆత్మస్తుతిని దన పద్యములతోఁ జేసికొనుట కిష్టములేనివాడయి కృష్ణదేవరాయలు ప్రథమపురుషములను మధ్యమపురుషములనుగా మార్చి వేంకటేశ్వరుఁడు తన్నుఁగూర్చి పలికినట్లుగా మనుచరిత్రములోని పద్యములనే తన యాముక్తమాల్యదయందు వేసికొనియుండును. అయినను విష్ణుచిత్తీయమునందు ముఖ్యముగా నయిదవ యాఱవ యాశ్వాసములయందు పెద్దనపద్యములవంటి "యల్లిక జిగిబిగి" గల పద్యములును పెక్కులు కానఁబడుచున్నందునఁ గృష్ణదేవరాయలు తన యాస్థానకవీశ్వరులైనవారి సాహాయ్యమును స్వగ్రంథరచనమునందుఁ బొందియుండును. ఒక్కసాహాయ్యమే యననేల? ఆ యిరువురుకవులును ముఖ్యముగా నాంధ్రకవితాపితామహుఁ డని పేరొందిన యల్లసాని పెద్దనయు రచించిన పద్యములే పెక్కులాముక్తమాల్యదయం దున్నట్లు కానఁబడుచున్నవి. అంతమాత్రముచేత గ్రంథకర్తృత్వమును వారి కారోపించుట వలనుపడదు. గ్రంథమును రాజేచేయఁగా తదాస్థానకవులు కొన్ని పద్యములను మార్చియు, కొన్ని పద్యములను తమవిచేర్చియు నుందురు. కృతి

కర్త కృష్ణదేవరాయలనుట కాశ్వాసాంతమునందును కృత్యాదియందును జెప్పఁబడుటమాత్రమే కాక "పలికితు శ్లేషోపమల" నిత్యాది పద్యములో నుదాహరింపఁబడిన తద్రచిత గ్రంథనామములును తత్కర్తృత్వమును స్థాపించుచున్నవి.

ఈ కృష్ణరాయలు కవిత్వమునందు సమర్థుఁడని యాతనికాలమునం దాముక్తమాల్యదను రచించుటకుముందే యాతని యాస్థాన కవులు చెప్పియుండుటకూడ విష్ణుచిత్తీయము కృష్ణరాయకృత మగుటను స్థిరీకరించుచున్నది. ఈరాజు కవిత్వమునందు నిపుణుఁడనుటను సూచించుచు రాజునుగూర్చి "కవితాప్రావీణ్యఫణీశ" యను విశేషణము నుపయోగించిన పారిజాతాపహరణములోని నంది తిమ్మనార్యుని పద్యము నొకదాని నిందు క్రిందఁ బొందుపఱుచుచున్నాను:—

క. శ్రీ వేంకటగిరివల్లభ
సేవాపరతంత్రహృదయ చిన్నమదేవీ
జీవితనాయక కవితా
ప్రావీణ్యఫణీశ కృష్ణరాయమహీశా. ఆ ర.

అక్కడక్కడ వ్యాకరణ స్ఖాలిత్యము లున్నను కటువుగానున్నను మొత్తముమీఁద విష్ణుచిత్తీయముయొక్క కవిత్వము మిక్కిలి ప్రౌఢము గాను, అర్థగాంభీర్యము కలదిగాను, అలంకార బహుళమయి స్వభావ వర్ణనలు కలదిగాను ఉన్నది. అందుచేతనే రేఫ శకటరేఫములనిమిత్తమయి పెనఁగులాడిన యప్పకవివంటివాఁడు సహితము యతిప్రాసముల యందు ద్విరేఫమైత్రి నంగీకరించిన యీ కవిగ్రంథమును గుణబాహుళ్యమును బట్టి లాక్షణికమైనదానినిగా నంగీకరించి తన లక్షణగ్రంథమునం దాముక్తమాల్యదనుండి పద్యములను లక్ష్యములనుగాఁ దీసికొని యున్నాఁడు.

తాను బూర్వము దిగ్విజయయాత్రకు వెడలి బెజవాడయందుఁ గొన్నిదినములుండి కృష్ణామండలములోని శ్రీకాకుళమునందలి యాంధ్ర విష్ణుదేవుని సేవింపఁబోయిన హరివాసరమునాఁటి యాదేవుఁడు స్వప్నములోఁ దోఁచి వేంకటేశ్వరుని కంకితముగాఁ దెనుఁగుగ్రంథమును జేయు మనఁగా విష్ణుచిత్తీయమును రచియించినట్లు కవి తద్గ్రంథమునం దీక్రింది వచనములతోఁ జెప్పియున్నాఁడు.

“...కళింగదేశవిజిగీషామనీషం దండెత్తిపోయి విజయవాటిం గొన్నివాసరంబులుండి శ్రీకాకుళనికేతనుండగు నాంధ్రమధుమథను సేవింపంబోయి హరివాసరోపవాసం బచ్చటఁ గావింప నప్పుణ్యరాత్ర చతుర్థయామంబున.

* * * * *

తే. తెలుఁగదేలయన్న దేశంబు తెలుఁగేను
దెలుఁగువల్లభుండఁ దెలుఁగొకండ
యెల్లనృపులుఁ గొలువ నెఱుఁగనే బాసాడి
దేశభాషలందుఁ దెలుఁగు లెస్స.

క. అంకితమో యన నీ కల
వేంకటపతి యిష్టమైన వేల్పగుటఁ దదీ
యాంకితము చేయు మొక్కొక
సంకేతము కా కతఁడె రసజ్ఞుఁ గానే.

కళింగదేశ విజయయాత్ర కయి వెడలి విజయవాటి (బెజవాడ) కి వచ్చినది హూణశకము ౧౫౧౫ వ సంవత్సర మగుటచేత రాజీగ్రంథము నాసంవత్సరమునందుఁ జేయనుద్దేశించి ప్రారంభించియుండును. అయినను నుదహరించిన యుపోద్ఘాతములోని “అలుకన్ ఘోటక” ఇత్యాది పద్యమునందు వర్ణింపఁబడిన (౧౫౨౦ వ సంవత్సరమునందు జరిగిన) యేడిల్లా

నని జయించినవర్ణన మిందుండుటనుబట్టి యీ గ్రంథము ౧౫౨౦ వ సంవత్సరమువఱకును ముగింపఁబడలేదు. ఈ పుస్తకమునందలి పద్యములు మొత్తముమీఁద శ్రుతికటువులుగా నున్నను, పెక్కు పద్యము లర్థగాంభీర్యము కలవిగా నుండుటయే కాక మృదుమధురపదగుంభితములై కూడ నున్నవి. కవియొక్క ప్రౌఢిమయు కవనసైపుణ్యమును తెలియుటకయి కొన్ని పద్యముల నిందుదాహరించుచున్నాను :—

మ. శయపూజాంబుజము ల్ఘటిం దడఁబడం జన్దోయి లేఁగౌనుపై
దయఁదప్ప న్బసుపాడి పాగడపుఁబాదం బొప్పఁ జెంగల్వడి
గ్గియనీ రచ్యుతమజ్జనార్థము కటిం గీలించి దివ్యప్రబం
ధయుగాస్య ల్ద్రవిడాంగన ల్నడుతు రుద్యానంబులోఁ ద్రోవలన్. ఆ-౧

చ. బలసిన హాల్లకచ్ఛటలపైఁ దమజుంజురుముంగ్లు రాయఁగాఁ
గలమములుండుఁ బండియొఱుగంబడి నీ రెసలింపఁ దృష్ణలోఁ
దలకొన వంగి మున్ జలముఁద్రావెడు క్రిందటి వేళ్ళు మీఁదట
న్నిలిపి మరందమానుకరణి న్నికటోపవనాసిలాహతిన్. ఆ-౧

మ. తరుణు ల్లలిరెయొఅ న్గుచంబు లునుపం దచ్ఛైత్యము ల్దీములై
పెరరేపం జనుదెంచెఁగాక రవిదీప్తిం గ్రుంకి పాతాళగ
హ్వరముం దూఱినవాని నీయదుకుద్రాళ్ళా తెచ్చునా దీర్ఘత
చ్ఛిరకృష్టిం గనునట్టిశైత్య మలరించె న్స్నాతులం దత్తటిన్. ఆ-౨

మ. గృహసమ్మార్జనమో జలాహరణమో శృంగారపల్యంకికా
వహనంబో వనమాలికాకరణమో వాల్లభ్యలభ్యధ్వజ
గ్రహణంబో వ్యజనాతపత్రధృతియో ప్రాగీపికారోపమో
నృహరీ వాదము లేల లేరె యితరు ల్నీలీలకుం బాత్రముల్

ఉ. నావుడు వార లమ్మనుజనాధున కిట్లని రుబ్బి [illegible]
దైవము గల్గె వేగ గురుదక్షిణగాఁ [illegible]

ర్వీవలయంబు బశేషమును వేడుము భూవర మమ్ము నందఱం
బ్రోవుము బాంధవాప్తజనపోషణకం బెను ధర్మ మున్నదే. ఆ-3

ఉ. హెచ్చినమైత్రిఁ బద్మినుల కెల్ల ఘనాత్యయకారకుండు సా
మ్మచ్చుపడంగఁ జేయుటకునై యలక్రౌంచనగంబు పేరిక
మ్మచ్చున నీడ్చు శర్వగిరియందలి వెండిశలాకపిండు నా
వచ్చి మరాళమాలికలు వ్రాలెఁ గొలంకులఁ జక్రఝంకృతిన్. ఆ-8

సీ. వాతెఱ తొంటికై వడి మాట లాడదు
కుటిలవృత్తి వహించెఁ గుంతలంబు
లక్షులు సిరులురా నరచూడ్కిఁ గనుఁగొనె
నాడించె బొమగొని యాననంబు
సనుగొమ లెన్నఁగయ వక్ష మువేక్షఁ గడకొత్తెఁ
బాణిపాదము లెఱ్ఱవాఱఁదొడఁగె
సారెకు మధ్యంబు దారిద్ర్యముల చెప్పె
జోచ్ఛ్వర్వ కిటు లోఁగఁజొచ్చె మేను
వట్టిగాంభీర్య మొక్కఁడు వెట్టుకొనియె
నాభి నానాఁటి కీగతి నాఁటిపొందు
చవుకయైనట్టి యిచ్చటఁ జనదు నిలువ
ననుచు జాఱెనకరణి బాల్యంబు జాఱె. ఆ. ౫

శా. సైరంధ్రు ల్వయి కెత్తి కజ్జలముఁ బక్ష్మశ్రేణికం దీర్చ వా
లారుంగన్నుల మీఁదుఁ జూచుతఱి ఘాచాంచచ్చతుర్థీనిశా
స్ఫారేందుం గనె వక్త్రి మక్కనుటఁగా పర్వేందుఁ డాత్మప్రభా
చోరుండుండఁగఁదన్నుఁదద్గతవిభాచోరంబనుఁ లోకముల్ : ఆ. ౫.

చ. విను మొకమాట రాత్రిచర వేగిర మేటికి నిన్నయింతు రే
యనిమిషులైన భాజనగతాన్నము నేనిఁక నెందుఁబోమెద

న్వైనఁగక ప్రాణరక్షణ ముపేక్షయొనర్చుట పాప మిందు కై
కనలకు నాకు మేనియెడఁ గాంక్షయు లేదిదివో పుటేయుఁడున్:-అ. ౬.

ఉ. బాసలు బండికంఠ్లు మఱి ప్రాణభయంబున లక్షచేసినం
గ్రాసము కృచ్ఛలబ్ధ ముడుగ న్వశమే యిది నీకచెల్లె నో
భూసురవంశ్య పుణ్యజన పుణ్యజనాంకము తావకీనమే
పో సముకూరెడిం గులముపోత్తున దైత్యుల కెల్ల నంకతన్:-ఆ. ౬.

ఆముక్తమాల్యదనుబట్టియే కృష్ణదేవరాయలు విష్ణుభక్తుఁడనియు వైష్ణవ శిష్యుఁడనియు వేఱుగఁ జెప్ప నక్కఱలేకయే తెలిసికొనవచ్చును. అతఁడు విష్ణుభక్తుఁడైనను వైష్ణవశిష్యాగ్రేసరుఁ డైనను, ఇతరదేవతల యందుఁగాని యితరమతములవారియందుఁ గాని వైషమ్యము లేనివాఁడయి యుండెను. ఈ రాయలవారు విష్ణుదేవాలయములకు మాత్రమేకాక శివాలయములు మొదలైన వానికిఁగూడ భూదానములు చేసియున్నాఁడు. వైష్ణవమతాభిమానులను మాత్రమేకాక యితరమతావలంబులైన విద్వాంసులనుగూడ నాదరించియున్నాఁడు. ఆతని యాస్థానములో నల్లసానిపెద్దన మొదలైన వైష్ణవమత పక్షపాతులైన కవులుమాత్రమేకాక, స్మార్తుఁడై శివభక్తుఁడైన నందితిమ్మనార్యుఁడును, కేవల శైవులైన ధూర్జటియు, మాదనగారి మల్లన్నయు మొదలైన కవులునుకూడసమ్మానమును బొందియున్నారు. అష్టదిగ్గజములని పేరొందిన యెనమండ్రు తెలుగుఁకవు లీరాజుయొక్క యాస్థానమునందుండి ప్రసిద్ధినొందిరని చెప్పుదురు. అల్లసానిపెద్దన్న, నందితిమ్మన్న, అయ్యలరాజు రామభద్రుఁడు, ధూర్జటి, మాదయ్యగారిమల్లన్న, పింగళిసూరన్న, రామరాజభూషణుఁడు, తెనాలిరామకృష్ణుఁడు, అనెడి యెనమండ్రును అష్టదిగ్గజము లని వాడుకగలదు. కాని యింకుఁ జెప్పఁబడినవారిలోఁ గడపటి ముగ్గురును గృష్ణదేవరాయని కాలమునందున్నారో లేరో యని సందేహింపవలసి

యున్నది. మొదటి యైదుగురునుమాత్ర మాకాలమునం దున్నట్లు కొన్ని గ్రంథనిదర్శనములు కనఁబడుచున్నవి. వారిలో నల్లసాని పెద్దనార్యుఁడు తాను రచియించిన మనుచరిత్రమును, నందితిమ్మన్న తాను రచియించిన పారిజాతాపహరణమును, కృష్ణదేవరాయని కంకితములు చేసిరి. అయ్యల రాజు రామభద్రుఁడు కృష్ణదేవరాయుల కాలమునందు మిక్కిలి చిన్న వాఁడై క్రొత్తఁగాఁ గవిత్వముచెప్పుట కారంభించినవాఁడు. ఇతఁడు కృష్ణరాయలు జీవించియుండఁగాఁ నాతని యాజ్ఞాప్రకారముగా సకల కథాసారసంగ్రహము నారంభించి తరువాత ముగించెనుగాని యది రామాభ్యుదయమువలె నంత ప్రౌఢముగా నుండక వ్యాకరణదోషములు కలదిగా నున్నది. రామభద్రకవి తన్నుఁ గృష్ణరాయలు కోరుటచేత సకలకథాసారసంగ్రహమును జేసితినని వ్రాసియున్న భాగము నా గ్రంథ మునుండి యిందుదాహరించుచున్నాను :—

సీ. చినుకుపూనల నొనర్చినబిత్తరపుదండ దండాలుగల వేల్పుతపసికొండ
కొండాటములను జక్కులుపన్ను జడదారి దారిగట్టులరాయు చీరుటలుగు
అలుగుడింటికి వెన్నుఁ డిలకుఁ దెచ్చినచెట్టు చెట్టుగట్టుఁగఁజేయు
చెలువతోడు
తోడుచేడెలనేలుదొరకునుదోఁబుట్టు పుట్టులిబ్బుల జేనిపొందుగాఁడు
గాడుపూరిని గాంచిన కన్నతల్లి । తల్లిబిడ్డలఁ బెండ్లాడు గొల్లమనికి
మనికితముదీర్చువిలుకానిఁజెనకువిందు।విందుసీకీర్తినరసింహవిభునికృష్ణ

వ. ఇట్లు కీర్తివిస్తారధురంధరుండగు కృష్ణరాయ నరపాలాఖండలుండు నన్నుఁ బిలిచి శ్రీమచ్ఛీతారమణ చరణకమల పరిచరణాయమాన మానసుండవు బహువిధ కవితా చమత్కారధుర్యుండవు సకల పురాణేతిహాస ప్రబంధరచనాదక్షుండవు మన్మనోరథకార్య నిర్వాహకుండవు నగుటంజేసి పురాతనమహాకవి విరచిత ప్రబంధంబు లన్వే

మించి భగవద్భక్తినిష్ఠాగరిష్ఠులగు రాజశ్రేష్ఠుల వృత్తంబులు ప్రసిద్ధంబు లగునట్లుఁగాఁ బ్రశస్తకథలు విన్యస్తంబులుగా సమకూర్చి సాహిత్యలక్షణచిత్ర కవిత్వప్రభావంబు లొక్కొక్కచోటఁ గనంబడ రచియింపవలయునని ప్రార్థించి మఱియు నిట్లనియె.

చ. అఱవెతగుబ్బ దన్వలె బయల్పడనీకయు ఘూర్జనారంగనా
గుఱుకుచయుగ్మమున్వలె నిగూఢముగాకయు నాంధ్రదేశపుం
గరితచనుంగవన్వలె నొకానొకయించుక గానిపించినన్
సరసులు మెత్తు రక్కవిత జాణలకుం గడురంజకం బగున్.

వ. కావున నతిమధుర రసాయన ద్రాక్షాపాకంబుగా శృంగారరసయుక్తం బగునట్లు సకలకథాసార సంగ్రహంబు గ్రంథవిస్తారంబు కాకుండు నట్లుగా రచియింపు మని యుపన్యసించిన సంతోషామృతతరంగితాంత రంగుండ నగుచున్న సమయంబున.''

రాజశేఖర చరిత్రమును రచియించిన మాదయగారిమల్లన్న కృష్ణదేవరాయల కాలములో నుండి యీ రాజు గోలకొండ బిజాపురపు తురక సంస్థానములను జయించినప్పు డాతని కీర్తిని వర్ణించినట్లు కుమారధూర్జటి కృష్ణరాయవిజయమునం దీక్రింది పద్యములతోఁ జెప్పియున్నాఁడు :—

గీ. అటులు జయలక్ష్మిఁ గైకొని యరులకరుల
హరుల ధనపంక్తులను దనపరము చేసి
వెలయు శ్రీకృష్ణరాయల విభవగరిమ
గాంచి కన్నులపండువుగాఁగ నపుడు.

గీ. సరససాహిత్యరచనవిస్ఫురణ మెఱయ
సారమధురోక్తి మాదయగారి మల్ల
నార్యుఁ డలయల్లసాని పెద్దార్యవరుఁడు
ముక్కుతిమ్మన మొదలైన ముఖ్యకవులు.

క. వినిపించిరపుడు వారికిఁ
గనకాంబరభూషణములు ఘనత నొసఁగి యా
జనవరుఁ డప్పాజిఁ గనుం
గొని యిట్టని పలికె నపుడు కుతుకం బలరన్. ఆ. 3

ఈకుమారధూర్జటికవియే కాళహస్తి మాహాత్మ్యమును రచియించి తనపెదతాత యైన ధూర్జటికవి కృష్ణదేవరాయలసభలోఁ బ్రసిద్ధి పొందినట్లు కృష్ణరాయవిజయములో నీక్రింది పద్యముచేతఁ జెప్పియున్నాఁడు—

చ. స్తుతమతి యైనయంధ్రకవి ధూర్జటిపల్కుల కేలగల్గెనో
యతులిత మాధురీమహిమ నా మును మీ పెదతాత చాల స
న్నుతిగనెఁ గృష్ణరాయలమనోజ్ఞసభ న్నిను మీవు నట్ల మ
త్కృతబహుమానవై ఖరులఁ గీర్తివహింపుము ధాత్రిలోపలన్ - ఆ. ౧

[అష్టమహిషీకళ్యాణమును ద్విపదకావ్యముగా రచించిన తాళ్ళపాక చిన్నన్న యనుకవి కూడ కృష్ణదేవరాయని కాలములో నున్నట్లు కొండవీటిచరిత్రములో కృష్ణరాయల దానములనుగూర్చి చెప్పిన యీ క్రిందివాక్యమువలనఁ దెలియవచ్చుచున్నది.]—

"వినుకొండసీమలో మిన్నికల్లు తాళ్ళపాక చిన్నయ్యగారి కగ్రహార మిచ్చెను."

"అద్దంకిసీమలో వలపర్ల అను గ్రామము తాళ్ళపాక చిన్నయ్యగారి కిచ్చెను."

వీరుగాక తక్కినకవులు కృష్ణదేవరాయల యాస్థానమునందుఁగాని యాతనికాలమునందుగాని యున్నట్లు తోఁచదు. రామరాజభూషణాదులు కృష్ణరాయల యాస్థానమునం దున్నట్లనేక కథలు కానఁబడుచున్నవి కాని యితరనిదర్శనములు లేక యవి విశ్వసింపఁదగినవి కావు.

ఆయా కవుల కాలమును గూర్చియు వారివారి విషయమయి చెప్పఁబడు కథలనుగూర్చియు నాయాకవుల చరిత్రములయందుఁ వ్రాయఁబడును. ఆముక్తమాల్యదయందును, మనుచరిత్రమునందును గల యేకరీతి పద్యములనుగూర్చి సహిత మిచ్చట విస్తరించి వ్రాయుట యనావశ్యకము. అయినను దృష్టాంతము చూపుటకయి యొక్క పద్యమునుమాత్ర మిం దుదాహరించుచున్నాను:—

సీ. నీలమేఘముడాలు డీలుసేయఁగఁజాలు
మెఱుఁగుఁజామనచాయ మేనితోడ
నరవిందములకచ్చు లడఁగించుజిగి హెచ్చు
నాయితంబగు కన్నుదోయితోడఁ
బులుఁగురాయని చట్టుపలవన్నె నొరవట్టు
హాంబట్టుజిలుఁగు రెంటెంబుతోడ
నుదయార్కబింబంబు నొఱపువిడంబంబు
దొరలంగ నాడుకౌస్తుభముతోడ
జయజయధ్వని మాళి నంజలులుచేర్చు
శర్వ శతధృతి శతమన్యు శమన శరధి
పాలకై లబిలాది దేవాళితోడ
నెదుటఁ బ్రత్యక్ష మయ్యె లక్ష్మీశ్వరుండు:—

మనుచరిత్ర. ఆ. ౬.

మనుచరిత్రముయొక్క యాఱవయాశ్వాసమునందు స్వారోచిష మనువు విష్ణునిగూర్చి తపస్సు చేయఁగా నతఁడు ప్రత్యక్ష మయినట్టు జెప్పఁబడిన పయిపద్యమునే దీర్ఘపాదముల నేమియు మార్పక యెత్తు గీతమునుమాత్ర మీక్రిందిరీతిగా మార్చి యాముక్తమాల్యద ప్రథమా శ్వాసమునందుఁ గృష్ణదేవరాయఁడు తనకు శ్రీకాకుళాంధ్రదేవుఁడు ప్రత్యక్షమయినట్లు చెప్పినఘట్టమునందు వేసికొనియున్నాఁడు:—

సీ. నీలమేఘముడాలు..............కౌస్తుభముతోడఁ

గీ. దమ్మికే లుండఁ బెఱకేల దండయిచ్చు
లేము లుడిపెడు లేఁజూపులేమతోడఁ
దోల్కుఁ దయఁదెల్పు చిఱునవ్వుతోడఁ గలఁద
దంధ్రజలజాక్షుఁ డిట్లని యానతిచ్చె :—

ఆముక్తమాల్యద. ఆ ౧.

కృష్ణరాయలను గూర్చి బహుకవులు చాటుపద్యము లనేకములు కూర్చియున్నారు గాని గ్రంథవిస్తారభీతిచేత వానినన్నిటి నిందు వ్రాయక రెండుమూడు పద్యములనుమాత్రము చూపుచున్నాను :—

౧-శా. శ్రీలీలాత్మజ కృష్ణరాయ సమరోర్వి న్నీదువైరిక్షమా
పాలుర్వేఁగి హయాధిరూఢు లగుచుం బాఱన్ ఘనీశాఖిశా
ఖాల్నగాయతకేశపాశు లయి యూఁగన్ గేకిసల్గొట్టి యు
య్యాలో జొంపము లంచుఁ బాడుదురు భిల్లాంభోజపత్త్రేక్షణల్.

౨-చ. పెనిమిటి చేయుపుణ్యజనపీడనవృత్తియుఁ దండ్రిభంగమున్
దనయు ననంగభావమును దమ్మునికార్శ్యముఁ జూచి రోసి స
జ్జనపరిరక్షు శౌర్యనిధిఁ జారుశరీరుఁ గళాప్రపూర్ణు న
వ్వనధికన్య చేరె జితవైరినికాయుని గృష్ణరాయనిన్.

3-చ. కాయమువంగి తా ముదిసెఁగన్నులునుం బొరగప్పెఁ గాలు పే
దాయె నటంచు రోసి నరసాధిపనందన కృష్ణరాయ యీ
భూయువతీలలామ నినుఁ బొందిన నాదిభుజంగభర్తకున్
బాయనిచింతచేతఁ దలప్రాణము తోఁకకు రాకయుండునే ?

ఈకడపటి పద్యముయొక్క కర్తృత్వమును తెనాలిరామకృష్ణున కారోపింతురు. రాజు మాత్రమే కాక కృష్ణరాయని కొమార్తెలును సంగీతసాహిత్యములయందు నిపుణురాండ్రనియు, (రామరాజుభార్యయైన

మోహనాంగి యనునామె "మారీచిపరిణయ" మను నైదాశ్వాసముల శృంగారప్రబంధము రచియించెననియు, ఒకరు వ్రాసియున్నారు గాని మా కాగ్రంథము లభింపకపోవుటచేత నిది యిట్లని నిశ్చయింపఁ జాలకున్నాము.) కృష్ణరాయని యల్లుఁడయిన రామరాజు భార్యపేరు మోహనాంగి యైనట్టు నైతము గానఁబడదు. (అయినను మోహనాంగి యను పేరు తిరుమలాంబకు నామాంతరమయి యుండవచ్చును.)

(మంత్రియైన తిమ్మరుసుయొక్క బుద్ధిబలముచేతను మంత్రశక్తి చేతను కృష్ణదేవరాయని కధికవిఖ్యాతి కలిగెనని చెప్పెదరు.) ఇంటిపేరు సాళువవారయిన ట్లనేక శిలాతామ్రశాసనములవలనను కృష్ణరాజవిజయమువలనను దెలియవచ్చుచున్నందున, ఈమంత్రిశిఖామణి క్షత్రియుఁడై నట్లు కొందఱు తలంచుచున్నారు. అయినను కృష్ణామండలములోని కొండకాపూరి దేవాలయములోని యొక శిలాదానశాసనములో మాత్ర మాతనిపేరు సాళువతిమ్మరుసయ్యంగారని వ్రాయఁబడియున్నది. అయ్యంగారని యుండుటనుబట్టి కొంద ఱాతఁడు బ్రాహ్మణుఁడని భ్రమపడినను, ("సాళువ" యనెడి యింటి పేరునుబట్టియు నితరనిదర్శనములనుబట్టియు నతఁడు బ్రాహ్మణుఁడు కాఁడనియు "అయ్యంగా" రని గౌరవార్థముగా నుపయోగింపఁబడెననియు నిశ్చయింపవలసియున్నదని స్యూయల్ దొరవారు వ్రాసియున్నారు. మాదయ్యగారి మల్లన్న యీమంత్రిశిఖామణి యల్లుఁ డగునప్పామాత్యున కంకిత మొనర్చిన రాజశేఖరచరిత్రమువలన నితఁడు బ్రాహ్మణుఁడే యనియు నాఱువేలనియోగి యనియు నిస్సందేహముగాఁ దెలియవచ్చుచున్నది. (ఈసాళువతిమ్మరాజు కృష్ణరాయని తండ్రి యైన నరసింహరాజుతమ్ముఁడని కొందఱు చెప్పిరి. ఈసంగతి యథార్థము కాకపోయినను, అతఁడు నృసింహరాయని యొద్ద మంత్రిగా నుండెను. ఈర్ష్యచేత నృసింహరాయని పట్టమహిషి సవతికొడుకైన కృష్ణదేవరాయనిఁ జంపింప యత్నించినప్పు డాతనిని దనయొద్ద నుంచు

కొని కాపాడిన దీసాళువ తిమ్మరుసే. ఈహేతువునుబట్టియే కృష్ణదేవ రాయలు తిమ్మరుసు నప్పాజీ యని పిలుచుచుండుటయు సుప్రసిద్ధము. ఈమంత్రిశిరోమణి ౧౫౧౫ వ సంవత్సరమునందు రాజు కొండవీటి మీఁదికి దండెత్తినప్పుడు తాను సేనాపతిగానుండి సేనలను నడిపి కొండ వీటిదుర్గమును జయించెను. ఈతఁడు కృష్ణదేవరాయలకంటె మూఁడు సంవత్సరములు ముందుగా ననఁగా హూణశకము ౧౫౨౭ వ సంవత్స రమునందు మృతినొందెను. (తిమ్మరుసు బ్రాహ్మణుఁడనియు చిన్నతన ములో మిక్కిలి బీదవాఁడయి విద్యలేక తిరుగుచుండెననియు చెప్పెడు కథ యొకటి కొంతకాలమునుండి పరంపరగా వచ్చుచున్నది) ఆకథ యొక్క సత్యమెట్టి దయినను వినువారికి వినోదకరముగా నుండునని యెంచి యిందు సంగ్రహముగా వ్రాయుచున్నాను:—

"తిమ్మరుసు నియోగిబ్రాహ్మణుఁడు. ఈతఁడు బాల్యమునందే తల్లిదండ్రులను బోఁగొట్టుకొని నిరాధారుఁడై చదువును సంధ్యయు లేక తిరుపతి సమీపమున పసులఁగాచి బ్రతుకుచు, పిమ్మట గుత్తికిఁబోయి యచ్చటఁ బుల్లెలుకట్టి కొంతకాలము జీవించి, తరువాత చంద్రగిరిలోఁ గొంతకాలము మాధుకరవృత్తిచే దినములుపుచ్చి, అనంతరము పెను గొండలో సత్రములో నుద్యోగము సంపాదించి తద్దుర్గాధీశ్వరుని తాంబూలపుతిత్తులు మోచి తదనుగ్రహమువలనఁ గ్రమక్రమముగా వృద్ధినొంది గొప్పయుద్యోగములు సంపాదించి, కడపట తనబుద్ధిబలము వలన మంత్రిపదమును బొందెను. ఇతఁడు చిన్నతనములో తిరుపతి సమీపమునఁ బసులను గాచుచు బడలి యొకనాఁటి మధ్యాహ్నసమ యమున నొకచెట్టునీడను విశ్రమించెను. అంతట సూర్యుఁడు పశ్చిమ మున వ్రాలుటచే సూర్యకిరణము లాతని మీఁదఁబడినను మెలఁకువ రాక యతఁడు మైమఱచి గాఢనిద్రను బొందుచుండుట చూచి యొక కృష్ణసర్పము చేరవచ్చి తనఫణమువిచ్చి యాచిన్నవాని ముఖమున

కెంప సోఁకకుండ గొడుగువలె నడ్డముపెట్టెను. ఈయద్భుతచర్య నప్పుడు దారిపట్టిపోవుచున్న బట్టుమూర్తి యనుబట్రాజు చూచి యీతఁడు శీఘ్రకాలములోనే మహైశ్వర్యవంతుఁడు కాఁగలఁడని తెలిసికొని, సమీపమునకుఁ బోఁగా సర్పమాతనిని విడిచి పాఱిపోయెను. ఆబట్రాజు తరువాత నాచిన్నవాఁడు మేల్కొనువఱకును వేచియుండి లేచినతరువాత "అయ్యా! నీ కచిరకాలములోనే గొప్పయైశ్వర్యము పట్టును. అప్పుడు నన్ను మఱచిపోకుము" అని చెప్పి సెలవుగైకొని స్వగ్రామమునకుఁ బోయెను. అటుపిమ్మట తిమ్మరుసు పయిని జెప్పినరీతిని క్రమక్రమముగా వృద్ధినొంది విద్యాబుద్ధులు సంపాదించి కొంతకాలమునకు మంత్రిపదము నొందెను. అప్పుడు బట్టుమూర్తి తిమ్మరుసుదర్శనార్థముపోయి యతఁడు తగినంత యాదరముచూపి గౌరవింపక యుపేక్షించుటచూచి,

శా. గుత్తిం బుల్లెలు కుట్టి, చంద్రగిరిలోఁ గూడెత్తి, పెన్గొండలో
హాత్తిన్నత్రమునందు వేఁడి, బలుదుర్గాధీశు తాంబూలపుం
దిత్తుల్మోసి, పదస్థులైన ఘనులన్ దీవించ

అనునంతవఱకుఁ బద్యము చెప్పునప్పటికి భయపడి తిమ్మరుసు తనకుఁ గృష్ణదేవరాయలు పట్టాభిషేకమహోత్సవసమయమునం దిచ్చిన పచ్చలపతకమును బట్టుమూర్తి మెడనువేసెను. అదియందుకొని యాబట్టు తక్కిన పద్యభాగము నీరీతిని బూరించెను—

......దీవించెదన్

మత్తారాతియమాతి నాగమసుతు న్మంత్రీశ్వరుం దిమ్మనన్.

అని చదివి యప్పుడే యీ క్రింది పద్యమును గూడఁ జెప్పెను:—

క. అయ్యా వనిపించుకొంటివి । నెయ్యంబునఁ గృష్ణరాయనృపపుంగవుచే
నయ్యా నీసరియేరీ । తియ్యనివిలుకాఁడవయ్య తిమ్మరుసయ్యా.

అట్లు గారుత్మతహారమును బట్టున కిచ్చుటచే నాప్రధానచంద్రుఁడు "బట్టుమూర్తికిఁ గిన్క-రెట్టింపఁ బచ్చలహార మర్పించెఁ దిమ్మరుసుమౌళి" యని ప్రసిద్ధిఁగాంచెను.

(ఈతనికిని బట్టుమూర్తికినిగల కాలవ్యత్యాసమునుబట్టి కూడఁ బయికథ విశ్వాసార్హ మయినదికాదు. కృష్ణదేవరాయనికిఁ బుత్రసంతానము లేనట్టే యనేక స్థలములయందుఁ జెప్పఁబడియున్నది. అచ్యుత దేవరాయలే కృష్ణదేవరాయని పుత్రుఁడని యొక చోటను, సదాశివదేవరాయలు కృష్ణదేవరాయని పుత్రుఁడని యొకచోటను, చెప్పఁబడెను. గాని వానిసత్యమునుగూర్చి యింకను సందేహింపవలసియున్నది.) కృష్ణదేవరాయని మరణకాలమునం దాతని కిద్దఱుకొమార్తె లుండిరి. వారి కప్పటికి వివాహముకాలేదు. తరువాత తిరుమలదేవికొమార్తెను రామరాజును చిన్నాదేవికొమార్తెను దధనుజుఁడైన తిరుమలదేవరాయఁడును పరిణయమైరి. ఇట్లు కర్ణాటరాజ్యమును మహోచ్చదశయందుంచి కృష్ణదేవరాయలు శుక్ల సంవత్సర వైశాఖమాసము మొదలుకొని వికృతిసంవత్సరము వఱకును ఇరువదియొక్క సంవత్సరములు రాజ్యముచేసి శాలివాహనశకము ౧౪౫౦ వ సంవత్సరమునందుఁ గీర్తిశేషుఁడయ్యెను. అచ్యుతదేవరాయ లా సంవత్సరమున రాజ్యమునకువచ్చి, పండ్రెండుసంవత్సరములు పరిపాలనముచేసి, తిరుచునపల్లి మొదలైన దేశములను జయించి పరలోకగతుఁడయ్యెను.

2. అల్లసాని పెద్దన్న

అల్లసాని పెద్దనార్యుఁడు నందవరీక నియోగిబ్రాహ్మణుఁడు; చొక్కనామాత్యుని పుత్రుఁడు; బళ్లారి ప్రాంతములయందున్న దూపాడు పరగణాలోని దోరాలగ్రామ మీతని జన్మస్థలము; కృష్ణదేవరాయల యాస్థానకవీశ్వరులలోనెల్ల నితఁడు ముఖ్యుఁడు. ఈతఁడు కృష్ణదేవరాయల యనంతరమునఁగూడ కొంతకాలము జీవించియుండుటచేత, ఇంచుమించుగా ౧౫౩౫ వ సంవత్సరము వఱకును బ్రతికియుండెనని చెప్పవచ్చును. కృష్ణరాయలు మృతి నొందినతరువాత నీతఁడు చెప్పిన జాలిని పుట్టించెడి యీ క్రింది పద్యమీతఁడు రాయలయనంతరమున జీవించియున్నట్లు తెలుపుచున్నది :—

సీ. ఎదురైనచోఁ దన మదకరీంద్రము డిగ్గి
కేలూఁత యొసఁగి యెక్కించుకొనియె
మనుచరిత్రం బందుకొనువేళఁ బుర మేఁగఁ
బల్లకి తనకేలఁ బట్టియెత్తె
బిరుదైన కవిగండపెండేరమున కీవె
తగు దని తానె పాదమునఁ దొడిగెఁ
గోకటగ్రామాద్యనేకాగ్రహారము
లడిగినసీమలయందు నిచ్చె
నాంధ్రకవితాపితామహ యల్లసాని
పెద్దనకవీంద్ర యని నన్నుఁ బిలుచునట్టి
కృష్ణరాయలతో దివి కేఁగలేక
బ్రతికియుండితి జీవచ్ఛవంబ నగుచు.

అంతేకాక కృష్ణదేవరాయలు లోకాంతరగతుఁడు కాఁగానే కటకమునుండి గజపతి దండెత్తివచ్చినట్లును, అల్లసాని పెద్దన యీ క్రింది

పద్యమును వ్రాసిపంపఁగా నతఁడు సిగ్గుపడి మరలిపోయినట్టును జెప్పు చున్నారు :—

సీ. రాయరావుతుగండరాచయేనుఁగువచ్చి
యూరట్లకోటఁ గోరాడునాఁడు
సంపెటనరపాలసార్వభౌముఁడువచ్చి
సింహాద్రి జయశిలఁ జేర్చునాఁడు
సెలగోలుసింహంబు చేరి ధిక్కృతిఁ గంచు
తల్పులఁ గరుల డీకొల్పునాఁడు
ఘనతరనిర్భరగండపెండెర మిచ్చి
కూఁతు రాయలకును గూర్చునాఁడు
నోడ తెఱుంగవొ చచ్చితో యుర్వి లేవొ
చేరఁజాలక తల చెడి జీర్ణమైతొ
కన్నడం బెట్లుచొచ్చెదు గజపతీంద్ర
తెఱచినిలుకుక్క చొచ్చిన తెఱఁగుతోఁప.

ఈ కవి రాజునొద్ద మిక్కిలి గౌరవముపొందినవాఁ డయి, రాజు చెప్పుమన్నప్పుడు గాక తనయిష్టమువచ్చినప్పుడు మాత్రమే కవిత్వము చెప్పు స్వాతంత్ర్యము గలవాఁడనియు, రాజొకనాఁడు కృతి చెప్పుమని వేడఁగా నతఁడు చెప్పక యీ క్రిందిపద్యమును జెప్పెననియు వాడుక గలదు :—

చ. నిరుపమాతిస్థలంబు రమణీప్రియదూతిక తెచ్చియిచ్చుక
ప్పురవిడె మాత్మకింపయినభోజన ముయ్యెలమంచ మొప్పత
ప్పరయురసజ్ఞు లూహ తెలియంగలలేఖకపాఠకోత్తముల్
దొరకినఁగాక యూరక కృతుల్ రచియింపుమటన్న శక్యమే ?

ఈ కవియే కవిత్వ ముంఁడవలసిన రీతినిగూర్చి యీ క్రింది పద్యమును గూర్చెనని చెప్పుదురు :—

చ. ఘనతరఘూర్జరీకుచయుగక్రియ గూఢముగాక ద్రావిడీ
స్తనగతిఁ దేటగాక యరచాటగునాంధ్రవధూటిచొక్కపుం
జనుఁగవలీల గూఢతయుఁ జాటుతనంబును లేక యుండఁ జె
ప్పినయదెపో కవిత్వ మసిపించు నగిం చటుగాక యుండినన్.

ఈపద్యము వేంకటనాథకవికృత మగు పంచతంత్రమునందుఁ గానఁబడుచున్నది. పెద్దనార్యుఁడు సంస్కృతాంధ్రములయం దసమాన సాహిత్యము గలవాఁడు. ఇతఁ డొకనాఁడు కృష్ణదేవరాయలయాస్థానములో సకలకవీశ్వరులు నుండఁగా రాజు కోరికమీఁద నుభయభాషాపాండిత్యము వెల్లడి యగునట్లుగా నొక యుత్పలమాలిక నాశుకవిత్వముగాఁ జెప్పి సభవారినందఱిని మెప్పించి కాలికి బిరుదండె వేసికొన్నవాఁడు. రాజు కవిగండపెండేరమును బసిఁడిపళ్లెరమున నునిచి, సంస్కృతాంధ్రములందు సమానముగా కవిత్వము చెప్పఁగలవారు దీనిని ధరింప నర్హులని పలికినప్పుడు పెద్దనార్యుఁడు లేచి యీక్రింది యుత్పలమాలికను జదువఁగా రాజు మెచ్చి తానే యీకవిగండపెండేరమును కవిపాదమునఁ దొడిగెనఁట—

ఉ. పూఁతమెఱుంగులుం బసరుపూపబెడంగులుఁ జూపునట్టివా
కైతలు జగ్గుసగ్గు వెనగావలెఁ గమ్మనఁ గమ్మనన్వలెన్
రాతిరియున్ బవల్ మఱపురాఁ హాయల్ చెలియారజాపుని
ద్దాతరితీపులంబలెను దారసిలన్వలె లోఁదలంచినన్
ఖాతిగఁ బైకొనన్వలెను బైదలి గుత్తుకలోనిపల్లటీ
కూఁత లనన్వలెన్ సొగసుకోర్కులు రావలె నాలకించినన్
జేతికొలందిఁ గౌఁగిటను జేర్చినఁ గన్నియచిన్నిపొన్నిమే
ల్మాఁతలచన్నదోయివలె ముచ్చట గావలెఁ బట్టిచూచినన్
డాతొడనున్న మిన్నులమిటారపుముద్దులగుమ్మ కమ్మనౌ
వాతెఱదొండపండువలె వాచవిగావలెఁ బంట నూఁదినన్

గాతలఁ దమ్మిచూలిదొరకై వసపుంజవరాలి సిబ్బెపు
న్మో-తెలియబ్బురంపుజిగినిబ్బరపుబ్బగుగబ్బిగుబ్బపొం
బూఁతలనున్నకాయసరిపోఁడిమి కిన్నెరమెట్లబంతి సం
గాతపు సన్నబంతి బయకారపుఁ గన్నడగౌళవంతుకా
సాతత తానతానల పసం దివుటాడెడు గోటమీటు బల్
ప్రోఁతలునుం బలెక హారువు మొల్లముగావలె నచ్చతెన్గు లీ
రీతిగ సంస్కృతం బుపచరించినపట్టున భారతీవధూ
టీ తపనీయ గర్భనికటీభవదానన పర్వసాహితీ
ఖ్యాతికనాటకప్రకరభారతభారత సమ్మతప్రభా
శీతనగాత్మజా గిరిశశేఖర శీతమయూఖరేఖికా
పాతసుధాప్రపూర బహుభంగ ఘుమంఘుమ ఘుంఘుమార్భటీ
జాతకతాళయుగ్మ లయసంగతి మంచువిపంచికామృదం
గాతత తేహిత తహిత హాధిత దంధణు ధాణుదింధిమి
వ్రాత నయానుకూలపద వారకుహూద్వహ హారికింకిణీ
నూతన ఘుల్లులాచరణ నూపుర ఝాంళఝుళీమరంద సం
ఘాతవియద్ధునీ చకచకద్వికచోత్పల సారసంగ్రహో
ద్యాతకుమారగంధవహ హారిసుగంధ విలాసయుక్తమై
చేతము చల్లఁజేయవలె జిల్లునఁ జల్లవలె న్మనోహర
ద్యోతక గోస్తనీఫల మధుద్రవ గోఘృత పాయసప్రసా
రాతి రసప్రసార రుచిరప్రతిమంబుగ సారెసారెకున్.

పెద్దనార్యుఁడు హరికథాసారము, స్వారోచిషమనుచరిత్రము మొదలైన పెక్కుగ్రంథములను రచియించెను. వానిలోనెల్ల మనుచరిత్రము మిక్కిలి ప్రసిద్ధమై యెల్లయెడల వ్యాపించి యున్నది. ఈయనకుం బూర్వమునం దున్నకవు లెవ్వరును స్వకల్పనమును విశేషముగాఁ జేర్చి ప్రబంధములను రచియించి యుండలేదు. వారు పురాణేతిహాసాదులను

మాత్రము తెనిఁగించిరి. ఈతఁడే మార్కండేయ పురాణమునుండి స్వారో చిష మనుసంభవ కథను గైకొని పెంచి స్వకపోలకల్పనతో మొట్ట మొదట మనుచరిత్రమును ప్రబంధరూపమున రచియించిన కవి యగుట చేత నీతని కాంధ్రకవితాపితామహుఁ డన్న బిరుదనామము కలిగినది. ఈతనికాలము మొదలుకొని రామరాజభూషణుఁడు వసుచరిత్రము చేయు నఱకును గల కవులందఱును జాలవఱకుఁ దమ ప్రబంధములను మను చరిత్రరీతినే చేసిరి. (ఈ కవి జన్మముచేత స్మార్తుఁడే యయినను, నడుమ వైష్ణవము పుచ్చుకొని వైష్ణవాగ్రేసరుఁడయి విష్ణ్వాలయములకు భూదా నాదులను జేసెను. ఈ విషయమే మెకంజీ దొరవారు సంపాదించి యుంచిన రాజకీయప్రాగ్దేశపుస్తక భాండాగారమునందలి వ్రాఁతపుస్తక ములయందుఁ దెలుపఁబడియున్నది. అందున్న కోకటాగ్రహారమును గూర్చిన యంశము నిందు క్రింద వ్రాయుచున్నాను—

"అల్లసాని పెద్దయ్యంగారు బ్రాహ్మణుఁడు, నందవరీకుఁడు, చొక్కరాజుగారి కొమారుఁడు. కోకటగ్రామమును శ్రీకృష్ణదేవరా యలవారీ కవీశ్వరుని కియ్యఁగా, అతఁడు వైష్ణవము పుచ్చుకొని యీ గ్రామము శ్రీవైష్ణవుల కగ్రహారము చేసియిచ్చెను. అప్పుడు దానికి పెట్టినక్రొత్తపేరు శఠగోపపురము. ఈ కవి శాలివాహనశకవర్ష ములు ౧౪౩౦ బహుధాన్యసంవత్సర వైశాఖశుద్ధ ౧౫ లు నాఁడు ఈ గ్రామమునందుండు సకలేశ్వరస్వామికి నైవేద్య దీపారాధనలకై రెండు పుట్లచేను ధారపోసియిచ్చి సదరు దేవాలయములో శిలాశాస నము వేయించినాఁడు. పయిసంవత్సరము కార్తికశుద్ధ ౧౨ శి నాఁడు చన్న కేశవస్వామికి నాలుగున్నర పుట్లభూమి ధారపోసి శాసనము వేయిం చినాఁడు......కృష్ణదేవరాయలతర్వాత సదాశివదేవరాయల కాలము లోను, రామరాయలకాలములోను, నంద్యాలరాజైన మట్లఅనంతరాజు కాలములోను కోకటాగ్రహారము బ్రాహ్మణులకుఁ జెల్లెను."

ఈకవి కోకటాగ్రహారమునకు శఠగోపపురమని పేరు పెట్టుటయే కాక తన మనుచరిత్రములోను హరికథాసారములోనుగూడ శఠగోప యతిని దనగురువునుగా స్తుతించి యున్నాఁడు—

క. కొలుతు న్మద్గురు విద్యా
నిలయుం గరుణాకటాక్ష నిబిడజ్యోత్స్నా
దళితాశ్రితజనదురిత
చ్ఛలగాఢధ్వాంతసమితి శఠగోపయతిన్.

మనుచరిత్ర.

క. శఠగోపయతికి శఠతరు
కుఠారకోపమమతికిని గురుమతహృత్క
ర్మఠనిరతికిఁ జతురాగమ
పఠనాయతనియతికి నజపాసంభృతికిన్.

హరికథాసారము.

లక్షణగ్రంథములయం దక్కడక్కడ నుదాహరింపఁబడిన పద్యములు లభించుటయేకాని హరికథాసారము పూర్ణముగా దొరికినదికాదు. హరికథాసారములోని యీరెండు పద్యములును రంగరాట్ఛందస్సునం దుదాహరింపఁబడి యున్నవి—

క. అంబరముపగుల నార్చి ప్ర
లంబాసురుఁ డాగ్రహము వెలయఁ గదిరినవే
ళం బలరాముఁడు చేముస
లంబున వానితలఁ ద్రుంచె లావు మెఱయఁగన్.

హరికథాసారము. ఆ. ౪.

క. తెంపరివై మది యింత చ
లింపక యనిలోనఁ దెగియె నెవ్వఁ డతఁడు నై
లింప సభ నుండు ననుడుఁ బ
దంపడి యాచార్యుతోడఁ దా నిట్లనియెన్.

హరికథాసారము.

ఈకవియే మొట్టమొదటఁ దెలుఁగు గ్రంథములలో తురక మాటలు లోనగు నన్యభాషాపదములను స్వేచ్ఛముగాఁ బ్రయోగింప నారంభించినాఁడు. ఆంధ్రకవితాపితామహుని యీక్రింది చాటుపద్యములోఁ దురుష్కభాషావాక్యమే వేయఁబడినది.

మ. సమరక్షోణిని గృష్ణరాయలభుజాశాతాసిచేఁ బడ్డ దు
ర్దమదోర్దండపుళిందకోటియవనవ్రాతంబు సప్తాశ్వ మా
ర్గమునం గాంచి శబాసహాహా హరిహారంగాఖూబు ఖోడాకి తే
తుముకీబాయిల బాయిదేమలికియందు ర్మింటికేం బోవుచుఁ.

ఈతని జూచి యాకాలమునందలి యితరకవులును దమచాటు పద్యములలోను గ్రంథములలోను యవనభాషావాక్యాదులను జొప్పించిరి. అట్టివారిలో నొక్కఁడగు నందితిమ్మన్న యొకచాటుపద్యములో-

శా. రాయగ్రామణి కృష్ణరాయ భవదుగ్రక్రూరఖడ్గాహిచేఁ
గాయం బూడ్చి కళింగదేశనృపతుల్ కానిర్ఝురీపోషణీ
మాయాభీకుముటూకులోటుకుహూటూ మాయాపటా జాహరే
మాయాగ్గేయ మడే యటంద్రు దివి రంభాజారునిన్ యతునిన్.

అని చెప్పియున్నాఁడు. ఈలాగుననే పెద్దనార్యుఁడు గ్రంథములలో నన్యభాషాపదములను బ్రయోగించినందుకు మనుచరిత్రలోని యీక్రిందిపద్యమును దృష్టాంతముగాఁ జూపవచ్చును—

సీ. పచ్చనిహూరుమంజిపనివాగెపక్కెర పారసిపల్లంబు పట్టమయము
రాణ నొప్పారు పై రాణంబుసింగిణి తళుకులకోరీలతరకసంబు
మిహీ పసిండిపరుంజు మొహదాకెలంకుల రావుగుజ్జరివన్నె కేవడంబు
డాకెలంకునసిరాజీకరాచురకత్తి కుఱుఁగటఁ గ్రొవ్వాడి గొఱకలపొది
పీలికుంచె తలాటంబు పేరొజంబు
మణులమొగముట్టుఁ బన్ని సాహిణిమొకండు

కర్తయెదుటికిఁ గొనివచ్చె గంధవాహ
బాంధవం బగునమ్మహాసైంధవంబు.

మనుచరిత్రము. ఆ. ౪.

ఈయనను జూచి యాకాలపువాఁ డయిన ధూర్జటికవియుఁ దన కాళహస్తి మాహాత్మ్యమునం దీక్రిందిరీతి పద్యములం దన్యభాషాపదములు చేర్చి కూర్చినాఁడు—

సీ. బిజమాడుదేవర నిజకృపామహిమఁ జెన్నారుచాయిల్లు బిడారునీకు
నాకునీపాదార్చనముసేయనడలింగమూర్తి చేకుతెవచ్చిమూర్తమాడి
యొడయచిత్తేశ నాయునికి నీమజ్జనమాడు శివార్చన మాడుబేకు
విచ్చేయుఁ డిది బూదివీడియం బందుకో జంగమస్వామి నాసదనమునకు
నోగిరంబులు మంచిమే లోగిరమున
నావటించెదఁ బదుఁడు మీ రారగింపఁ
బ్రతిదినంబును జంగమార్చనము లేక
దనువు వడనొల్ల రూపకందర్ప యనఁగ.

కాళహస్తిమాహాత్మ్యము.

ఈయన మనుచరిత్రమునుగూర్చి వ్రాయుచు నొకరు "కొన్ని యెడల నైషధమార్కండేయ పురాణములయందలి వాక్యములకును నిందలి వాక్యములకును నుంతయేనియు భేదమగపడక" యున్నదని యించుక దోషారోపణము చేసియున్నారు. మార్కండేయ పురాణమునందు విపులముగాఁ జెప్పఁబడిన స్వారోచిషమను సంభవకథనే గ్రహించి మారన తెనిఁగించిన యాపురాణమును జదివియే పెద్దన మనుచరిత్రమును రచియించినందున నందలి కొన్ని వాక్యము లిందుఁ బడియున్నవి. అంతేకాక యాకవి శ్రీనాథుని కవిత్వమునం దత్యాదరము కలవాఁడయి యున్నట్లీతని గ్రంథపఠనమువలన స్పష్టముగాఁ గానవచ్చుచున్నది. మొట్ట మొదట తెనుఁగు కవిత్వమునందు సాంస్కృతిక దీర్ఘసమాసములను

విస్తారముగా నుపయోగించినవాఁడు శ్రీనాథుఁడు. ఆతని కవనరచనయం దత్యాదరము కలవాఁడయి పెద్దన యాతని గ్రంథములను బలుమాఱు చదివి యొక్క చతుర్థాశ్వాసమునుదక్కఁ దక్కినపుస్తకము నంతను ఆతనివలెనే సంస్కృతపద భూయిష్ఠముగా రచియించి యుండుటచేత శ్రీనాథుఁ డుపయోగించిన వాక్యములును గొన్ని మనుచరిత్రమునందుఁ బడినవి. అంతమాత్రముచేత నీతనియందు గ్రంథచౌర్యము నారోపించుట న్యాయముకాదు. ఈతఁ డొక్కఁడు మాత్రమేకాక యిటీవలి కవులనేకులు కొన్నిచోట్ల పూర్వకవుల వాక్యములను దమకబ్బములయందుఁ జొప్పించియున్నారు. మఱియు నల్లసాని పెద్దనార్యుఁడు శ్రీనాథుని నైషధమునుండి కొన్ని వాక్యములను గ్రహించుటయేకాక యాతని పద్యములను జదివి యారీతి పద్యములనే పెక్కింటిని మనుచరిత్రమునందుఁ గూర్చియున్నాఁడు. అందుకు నిదర్శనముగా నొకటి రెండుపద్యముల నిందుఁ జూపుచున్నాను :—

సీ. నలినసంభవువాహనమువారువంబులు
　　　　కులముసాములు మాకుఁ గువలయాక్షి
చదలేటి బంగారుజలరుహంబులతూండ్లు
　　　　భోజనంబులు మాకుఁ బువ్వుఁబోఁడి
సత్యలోకముదాఁక సకలలోకంబులు
　　　　నాటపట్టులు మాకు నబ్జవదన
మధురాక్షరము లైనమామాటల వినంగ
　　　　నమృతాంధసులు యోగ్యు లనుపమాంగి
భారతీదేవి ముంజేతి పలుకుచిలుక
సమదగజయాన సద్బ్రహ్మచారి మాకు
వేదశాస్త్ర పురాణాదివిద్య లెల్లఁ
దరుణి నీయాన ఘంటాపథంబు మాకు—

శృంగారనైషధము. ఆ. ౨.

సీ. చిన్ని వెన్నెలకందు వెన్నుఁదన్నిసుధాబ్ధిఁ
బొడమినచెలువ తోఁబుట్టు మాకు
రహిపుట్ట జంత్రగాత్రముల ఠా ల్గరఁగించు
విమలగాంధర్వంబు విద్య మాకు
వనవిల్తుశాస్త్రంబు మినుకు లావర్తించు
పని వెన్నతోడఁ బెట్టినది మాకు
హయమేధ రాజసూయము లనఁ బేర్పడ్డ
సవనతంత్రంబు లుంకువలు మాకు
గనకనగసీమఁ గల్పవృక్షములనీడఁ
బచ్చరాగట్టుగమి రచ్చపట్టుమాకుఁ
పద్మసంభవ వైకుంఠ భర్గసభలు
సాముగరిడీలు మాకు గోత్రామరేంద్ర—

మనుచరిత్రము. ఆ. ౨.

ఉ. వానిఁ బ్రశంసచేయఁ దగు వాఁడు కృతార్థతముండు వానిచే
నీనిఖిలంబు పావన మహీనకృపావిభవం బెలర్ప నె
వ్వానిగృహాంగణంబునకు వచ్చినత్రోవరజంబులందు నీ
మానితపాదయుగ్మక మమర్చుఁ బ్రఫుల్లసరోజదామమున్—

నైషధ. ఆ. ౩.

ఉ. వానిది భాగ్యవైభవము వానిది పుణ్యవిశేష మెమ్మెయిన్
వాని దవంధ్యజీవనము వానిదె జన్మము వేరుసేయ కె
వ్వానిగృహాంతరంబున భవాదృశయోగిజనంబు పావన
స్నానవిధాన్నపానముల సంతస మొందుచుఁ బోవు నిచ్చలున్—

మను. ఆ. ౧.

ఇట్టివాని నింకను బెక్కులు చూపవచ్చును. పెద్దన చెప్పిన పద్యములను గొన్నిటిని తెనాలి రామలింగకవి యాక్షేపించినట్లు కొన్ని

కథలు గలవుగాని యవి విశ్వాసార్హములు గావు. అయినను దీనిం జదువు వారికి వినోదకరముగా నుండవచ్చునని యెంచి యందొక పద్యమును దానిమీఁది యాక్షేపణమును నిందుదాహరించు చున్నాను :—

క. కలనాఁటిధనము లక్కుఱ। గలనాఁటికి దాఁచఁ గమలగర్భునివశమా
నెలనడిమినాఁటివెన్నెల। యలవడునే గాదెఁబోయ నమవసనిసికిన్.

అనుపద్యమును పెద్దన రచియింపఁగా నందలి "యమవసనిసి" యన్నప్రయోగము నవ ప్రయోగమునుగా భావించి రామకృష్ణకవి యప భ్రంశపదములతోఁ గూడిన యీ క్రిందిపద్యముచేత నాతని నాక్షేపించి యున్నాఁడని చెప్పుచున్నారు :—

క. ఎమిటిని సెపితివి కపితము
బ్రమపడి వెఱిపుచ్చకాయ వడిఁ దిని సెపితో
యుమెతక్కుయ దిని సెపితొ
యమవసనిసి యన్నమాట యలసని పెదనా.

"అమవసనిసి" యన్నమాట తప్పు కాకపోవుటచేతను, రామ కృష్ణకవి యలసానిపెద్దన కాలములో నున్నవాఁడు కాకపోవుటచేతను. ఈకథ కేవలకల్పితమే కాని యిందు సత్య మెంతమాత్రమును లేదు. కృష్ణదేవరాయల యాస్థానమునకు వచ్చిన విద్వత్కవీశ్వరులను బరీక్షించు టకయి యాంధ్రకవితాపితామహుఁడె నియమింపఁబడుచు వచ్చెననియు, అతఁడావచ్చిన కవీశ్వరులకు నానావిధము లయిన సమస్యలనిచ్చి వారు పూరించిన పద్యపూరణములనుబట్టి వారి సామర్థ్యమునను నిర్ణయించుచు వచ్చెననియు జనశ్రుతి గలదు. ఒకనాఁడు రాధామాధవుఁ డనుకవి తదాస్థానమునకు వచ్చినప్పుడు పరీక్షార్థముగా పెద్దన్న 'నగరు' 'తగరు' 'త్రాగరు' 'వగరు' అను పదములు ప్రాసస్థానములందుంచి రామాయణ పరముగాఁ బద్యమును గూర్పుమనఁగా నాకవి యిట్లు చెప్పెనఁట :—

చ. నగరు పగాయె నింక విపినంబుల కేగుఁడు రాజ్యకాంక్షకుం
దగరు కుమారులార యని తల్లి వగ ల్మిగులంగఁ దోఁపఁగాఁ
దొగరున రక్షఁగట్టి మదిఁ దోఁచక గద్గదఖిన్నకంఠయై
వగరుచుచున్నఁ జూచి రఘువంశవరేణ్యుఁడు తల్లి కిట్లనున్.

అని చెప్పఁగా సంతోషించి యీప్రాసములతోనే భారత భాగవతపరముగాఁగూడఁ బద్యములను రచింపు మని యడుగఁగా నాకవీశ్వరుఁడు వరుసగా నీక్రింది రెండు పద్యములను జెప్పి తనప్రావీణ్యమును జూపెనఁట.—

చ. తొగరుచి కన్నుదోయిఁ గడుఁదోఁచఁగఁ గర్ణుఁడు భీమసేనుపైఁ
దగరు ధరాధరంబుపయిఁ దాఁకినభంగిని దాఁకి నొచ్చి తా
వగరుచుచున్ వెసం బరుగువాఱిన నచ్చటిరాజలోకముల్
నగరు సుయోధనాజ్ఞ మది నాటుటఁజేసి ధరాతలేశ్వరా.

చ. వగరుపుమాత్రమే వరుఁడు వశ్యుఁడుకాఁడు సఖీనఖత్వ మె
న్న గరుడవాహనుండు మము నాఁ డటు డించుటయెల్ల నుద్ధవా
తగ రని కాక మోహపులతాతనువైన విడంగఁ జూతురే
తొగరుచి యోషధీశునకుఁ దోఁపఁగఁజేయునె వీడనాడఁగన్.

అల్లసానిపెద్దన్నది ప్రౌఢశైలి; కవిత్వము సలక్షణముగాను మధురముగాను నుండును. ఈవిషయమునే కృష్ణరాయలు "కృతి రచింపుము మాకు శిరీషకుసుమపేశల సుధామయోక్తులఁ బెద్దనార్య" యన్న వాక్యము బోధించుచున్నది. మనుచరిత్రము శృంగారరస ప్రధానమయినదిగా నున్నది. ఆగ్రంథము సాధారణముగా సంస్కృతపద భూయిష్ఠముగా నున్నను, కొన్నిచోట్ల మనోహరముగా సంస్కృతాంధ్రపదములు రెండును సమానముగాఁ గలిసినదిగాను నాలవయాశ్వాసము కేవలాంధ్రపదభూయిష్ఠమైనదిగాను నున్నది. ఈతని కవిత్వమునందలి పదవాక్యజటిలత్వము నుబట్టి "యల్లసానివాని యల్లిక బిగియును" అను

ప్రసిద్ధి వచ్చినది. ఈయన కవితారీతిని దెలుపుట కయి మనుచరిత్రము నుండి కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను.—

చ. అటఁజని కాంచె భూమిసురుఁ డంబరచుంబిశిరస్సరజ్ఝరీ
పటలముహుర్ముహుర్లుఠదభంగతరంగమృదంగనిస్వన
స్ఫుటనటనానుకూలపరిఫుల్ల కలాపకలాపిజాలముఁ
గటకచరత్కరేణుకరకంపితసాలము శీతశైలమున్. ఆ. ౨.

మ. అకలంకౌషధసత్త్వముం దెలియ మాయా ద్వారకావంతి కా
శి కురుక్షేత్ర గయా ప్రయాగముల నే సేవింప కుద్దండ గం
డక వేదండ వరాహ వాహరిపు ఖడ్గవ్యాఘ్రము మిమ్మంచుఁ గొం
డకు రాఁజెల్లునె బుద్ధిజాడ్యజనితోన్మాదుల్గదా శ్రోత్రియుల్. ఆ. ౨.

ఉ. ఎక్కడియూరు కాల్నిలువ కింటికిఁ బోయెదనంచుఁ బల్కె దీ
వక్కడి మౌనికుటీరనిలయంబులకు న్నరిరాక పోయెనే
యిక్కడిరత్నకందరము లిక్కడినందనచందనోత్కరం
బిక్కడి గాంగసైకతము లిక్కడియాలవలీనికుంజముల్. ఆ. ౨.

ఉ. చేసితిజన్నముల్ తపముఁ జేసితి నంటి దయావిహీనతం
జేసినపుణ్యము ల్ఫలముఁ జెందునె పుణ్యము లెన్ని యేనియుం
జేసినవాని సద్గతియె చేకుఱు భూతదయార్ద్రబుద్ధి నో
భూసురవర్య యింత తలపోయవు నీచను వేల చెప్పుమా. ఆ. ౨.

ఉ. ఎంతతపంబు చేసి జనియించినవాఁడొకొ మర్త్యభామినుల్
కాంతుఁ డవజ్ఞఁ జేసినను గాయముఁ బాయుదు రే నమర్త్యనై
చింతలవంతలం జివికి సిగ్గరితి న్మృతిలేనినాఁడుచె
ల్వింతయు శూన్యగేహమున కెత్తినదీపిక యయ్యె నక్కటా. ఆ. 3.

ఉ. ఓయి దయావిహీనమతి యూరక యీపసిబిడ్డఁ గొట్టఁగాఁ
జే యెటులాడె నీకు నిది చేసిన దేమి వృథాశపింతురే

బోయవె యాఁడుతోఁడునను బుట్టవె శాపనిమిత్తమే తపం
బీయెడ నున్న శాంతిపరు లేమనువా రిఁక నీచరిత్రకున్. ఆ. ౪.

శా. తండ్రీ నాకు ననుగ్రహింపఁగదె వైద్యం బంచుఁ బ్రార్థించినన్
గండ్రల్గా నటు లాడి ధిక్కృతులఁ బోకాల్మంటి వోహో మదిం
దీండ్ర ల్గల్గినవారి కేకరణి నేని న్విద్య రాకుండునే
గుండ్రా డాఁచినఁ బెండ్లియేమిటికిఁ జక్కం గష్టముష్టింపచా. ఆ.౫.

శా. నీవైశిష్ట్యము లిట్టుల న్మొఱయునే నీకంటె నేఁ దక్కువే
యీవే కన్యక నీవుగాక మఱి మద్వృత్తాన్వయాచారముల్
నీవా పేర్కొనుపాటివాఁడ విటఁ గానీ నిల్తుఁ గాకేమి పో
పో విప్రాధమ సన్నుఁబోల నిఁక నల్పు ల్లేరు దంభవ్రతా. ఆ. ౬.

---

3. నంది తిమ్మన్న

ఈకవి కృష్ణదేవరాయని యాస్థానమునం దుండి ప్రసిద్ధిగన్న వారిలో నొకఁడు. ఇతఁడాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబ సూత్రుఁడు; కౌశికగోత్రుఁడు; నంది సింగన్నకును తిమ్మాంబకును పుత్రుఁడు; వరాహపురాణాది గ్రంథములను రచించి ప్రఖ్యాతి కెక్కిన మలయమారుతకవికి మేనల్లుఁడు. ఈతఁడు శివభక్తుఁడు. అఘోర శివ గురుని శిష్యుఁడు. ఈకవిని సాధారణముగా ముక్కుతిమ్మన యని వాడుదురు.

శా. నానాసూనవితానవాసనల నానందించుసారంగ మే
లా నన్నొల్లదటంచు గంధఫలి బల్కానం దపం బంది యో
షానాసాకృతిఁ దాల్చి సర్వసుమనస్సౌరభ్యసంవాసియై
పూనెం బ్రేక్షణమాలికామధుకరీపుంజంబు నిర్వంకలన్.

అను ముక్కునువర్ణించిన యీ పద్యమును తిమ్మకవి రచియించె ననియు, ఈపద్య చమత్కృతిని జూచి మెచ్చి రామరాజభూషణుఁడు నాలుగువేల వరాలిచ్చి కొని తన వసుచరిత్రమునందు వేసికొనియె నినయు, ముక్కువిూఁది యీ పద్యమును రచించుటచేతనే యీ కవిని ముక్కుతిమ్మన్న యని యెల్లవారును వాడుచు వచ్చిరనియు, లోక ప్రవాదము కలదు. కాని యిదియుఁ గవులను గూర్చి మనవారు సాధార ణముగాఁ జెప్పుకొను కల్పనాకథలలోఁ జేరినదేకాని నిజమయినది కాదు. మొట్టమొదట రామరాజభూషణుఁ డీకవికాలములో లేనేలేఁడు, ఒకవేళ నున్నాఁడనుకొన్నను వసుచరిత్రమువంటి మహాప్రబంధమును రచియింపఁ గలిగిన కవిగ్రామణి యింతమాత్రపు కల్పనను నాసికా వర్ణనముఁగూర్చి చేయలేకపోయెననుట పరిహాసాస్పదము. కాఁబట్టి యీ కథ యణుమాత్ర మును విశ్వాసపాత్ర మయినదిగాదు. కాకపోయినయెడల నందివారని యింటిపేరుగల యీ కవిని ముక్కుతిమ్మన్న యని జనులేలపిలుతురని కొందఱడుగవచ్చును. ఈ కవికి ముక్కు పెద్దదనియు, అందుచేత నీతని నెల్లవారును ముక్కుతిమ్మన్న యని పిలుచుచు వచ్చిరనియు, ఇంకొక వాడుకగూడఁ గలదు. ఈతనిని ముక్కుతిమ్మన్నయని యాడుట కిదియే నిజమయిన కారణము కావచ్చును. ఈతనిపలుకులు ముద్దులు గులుకు చుండుటచేత నిటీవలివారు "ముక్కుతిమ్మనార్యు ముద్దుపలుకు" అని గ్రంథములయందీతని మృదుపదరచనను శ్లాఘించియున్నారు. తిమ్మన కృతమయిన పారిజాతాపహరణము మృదుమధుర పదములతో రసిక జనహృదయరంజకముగాఁ గూర్పఁబడినది.

అల్లసానిపెద్దన నొక్కనివిడిచినపక్షమునఁ గృష్ణదేవరాయ లీతని నే యెల్ల కవులకంటె నధికముగా గౌరవించుచు వచ్చెనని చెప్పవచ్చును. పెద్దనకృతమైన మనుచరిత్రమువలెనే తిమ్మనకృతమైన పారిజాతాపహరణ ప్రబంధమును గృష్ణదేవరాయునికే యంకితము చేయబడినది. ఇంచు

మించుగాఁ బారిజాతాపహరణము మనుచరిత్రము రచియింపఁబడిన కాలమునందే రచియింపఁబడిన దగుటచేత హూణశకము ౧౫౨౦ వ సంవత్సరమునకుఁ బూర్వముననే పారిజాతాపహరణము ముగింపఁబడినది. తదనంతరమీకవి కొన్ని సంవత్సరములుమాత్రము బ్రతికి కృష్ణదేవరాయఁడు జీవించియుండఁగానే మృతినొందెను. కాఁబట్టి యితఁడు దాదాపుగా ౧౫౨౮ వ సంవత్సరమువఱకును జీవించియుండెనని చెప్పవచ్చును. ఈ కవియొక్క జన్మస్థలము గణపవరమని యొకరు వ్రాసియున్నారుగాని దానిసత్యమును నిర్ధారణము చేయుటకుఁ దగినయాధారమేదియుఁ గానరాదు. మఱియు నీతనిని కృష్ణదేవరాయనిభార్య తన పుట్టినింటి యరణపుఁ గవినిగాఁ దెచ్చెనని చెప్పుదురుగాని యదియు పుక్కిటి పురాణమే. ఈతని పూర్వులు మొదటినుండియు రాయలవారి పూర్వుల వద్దనే విద్వత్కవులుగా నుండి వారికిఁ గృతు లిచ్చుచు వచ్చినట్లు గ్రంథ నిదర్శనములు గలవు. తిమ్మన పూర్వుఁడైన నందిమల్లనయు, మేనమామయైన మలయమారుతకవియుఁ గృష్ణదేవరాయల తండ్రియైన నరసరాయల యాస్థానమునందుండి యిద్దఱును గలిసి వరాహపురాణమునుఁ దెనిఁగించి నరసరాజును దానికిఁ గృతిపతినిజేసిరి. తిమ్మకవి తన పారిజాతాపహరణమునఁ బ్రథమాశ్వాసములోఁ గృష్ణుఁడు పారిజాతపుష్పమును రుక్మిణి కిచ్చుటవలన వచ్చిన కోపమును దీర్చుటకై సత్యభామకు మ్రొక్కెననియు, మ్రొక్కఁగా నాపడఁతి యెడమకాలితో నాతనితల దన్నెననియు, అందుల కాతఁడలుగక ముండ్లవంటి తనగగుర్పొడిచిన తలవెండ్రుకలు సోఁకి కాలు నొచ్చెనని యా ప్రియభార్య నూఱార్చెననియు, ఆమె యంతటితోను బ్రసన్నురాలుగాక నాథుని నిష్ఠురోక్తు లాడెననియు, ముద్దులు గులుకు పలుకులతో నీ క్రింది పద్యములయందుఁ జెప్పెను :—

ఉ. పాటలగంధి చిత్తమునఁ బాటిలుకోపభరంబుఁ దీర్ప నె
ప్పాటను బాటుగామి మృదుపల్లవకోమలతత్పదద్వయీ
పాటలకాంతి మౌళిమణిపఙ్క్తికి వన్నియవెట్ట నాజగ
న్నాటకసూత్రధారి యదునందనుఁ డర్మిలి మ్రొక్కె మ్రొక్కినన్.

మ. జలజాతాసనవాసవాదిసుర పూజాభాజనంబై తన
ర్చులతాంతాయుధుకన్నతండ్రిశిర మచ్చో వామపాదంబునన్
దొలఁగం ద్రోచె లతాంగి యట్లయగు నాథుల్నేరముల్సేయఁ బే
రలుకం జెందినయట్టికాంత లుచితవ్యాపారముల్నేర్తురే?

క. కోపనపదహతిఁ గుహనా
గోపాలుఁడు గాంచి మెయి గగుర్పొడవఁగ ను
ద్దీపితమన్మథరాజ్య
ప్రాపితుఁడై పలికెఁ గూర్మి బయలుపడంగన్.

చ. నను భవదీయదాసుని మనంబున నెయ్యపుఁగిన్కఁ బూని తా
చినయది నాకు మన్ననయె చెల్వగు నీపదపల్లవంబు మ
త్తనుపులకాగ్రకంటకవితానము తాఁకిన నొచ్చు నంచు నే
ననియెద నల్క మానవుగదా యిఁకనైన నరాళకుంతలా.

చ. అన విని మానినీతిలక మప్పుడు మేయరదోఁప నిక్కి వీ
డినకచపంక్తిఁ బల్మఱు ముడి న్వడఁద్రోఁపుచుఁ బైచెఱంగు గ్ర
క్కునఁ జనుదోయిఁ జేర్చుచు మొగంబున లేఁజెమ రంకురింప జం
కెన నెఱచూపుచూచి పలికెం జళితాధరపల్లవాగ్రయై.

ఉ. ఈనయగారవుంబ్రియము లీపస లీమొగమిచ్చుమాట లే
లా నిను నమ్మియుండినఫలం బిదె తోడనె కల్గె నీకు నీ
యాన సుమీ ననుం జెనకి యాఁడివెట్టిన నవ్వువారలం
గాన వెఱుంగునే పసులకాపరి భావజమర్మకర్మముల్.

ఉ. ఇంకిటు నిన్ను నమ్మి నను నేమిటికిం గెరలించె దెంతయుం
బొంకముగాని యీవలని బొంకులు మాచవిగావు రుక్మిణీ
పంకజపత్రనేత్రకును బ్రాణపదంబులుగాన వల్లవీ
కింకర చాలుఁజాలు నడకింపకు నింపకు లేనిసూరుముల్.

ఉ. గట్టివచేఁతలుం బసలుఁ గల్లఁదనంబులు నీవు పుట్టఁగాఁ
బుట్టిన వెందు లేనిపలుఁబోకలమాయలు నీకు వెన్నతోఁ
బెట్టినవో యెఱింగియును బేలతనంబున నిన్ను నమ్మి నా
గుట్టును దేజము న్మిగులఁ గోల్పడిపోయితి నేమిచేయుదున్.

చ. మునిపతివచ్చి పూవొసఁగి మోదముతోడ భవత్ప్రియాంగనన్
వినుతి యొనర్పఁగా వినినవీనుల మాచవిగాని మాటలున్
వినవలసెంగదా యిపుడు నీ విటవచ్చుట పారిజాతవా
సనఁ బ్రకటించి నాకు నెకసక్కెము చేయనకాదె చెప్పుమా.

క. మానంబె తోడవు సతులకు
మానమె ప్రాణాధికంబు మాన మఖిలస
న్మానములకు మూలం బగు
మానరహిత మైనబ్రదుకు మానిని కేలా?

ఈపద్యములను విన్నపిమ్మట లోకమున భార్యాభర్తలలో నిట్టి వినోదము జరుగుట స్వాభావికము కాదని యెంచి రాజిది స్వభావవిరుద్ధమని పలికెనఁట! కవి యప్పు డేమియుఁ బ్రత్యుత్తర మియ్యక యూరకుండెనఁట! అటుపిమ్మటఁ గొన్నిదినములకే రాజు ప్రణయకలహము సంభవించినప్పుడు భార్యవలనఁ దనకు నిట్టిగౌరవమే సంప్రాప్తముకాఁగా కామావేశపరవశుఁ డయి యానందించి వెంటనే సభకు వచ్చి పుస్తకములో నెల్ల నీభాగమే మిగుల స్వభావసిద్ధముగా నున్నదని శ్లాఘించెనఁట! ఈకథనే కొంద ఱింకొకవిధముగా మార్చి పొలయలుకలో

నోడలు తెలియక భార్య తనశిరస్సును వామపాదముతో నలంకరింపఁగా గోపించి రాజు భార్యతో సహశయ్యాసంభాషణములు మానివేసె నఁయు, కవి యీసంగతి తెలిసికొని యీదంపతులను మరలఁ గలుపు టకై యీగ్రంథమును జేసి వినిపింపఁగా రాజు బుద్ధి తెచ్చుకొని కృష్ణు నంతటివానికే యట్టి యవస్థ తటస్థించినప్పుడు తన కేమిలెక్క యని మరల భార్యతోఁ గూడె ననియు చెప్పుచున్నారు.

ఈకవియొక్క దాతృత్వమునుగూర్చి యొక కథగలదు. ఇతఁడు పారిజాతాపహరణమును రాజున కంకితము చేసినప్పుడు రాజు చతురంత యానమహాగ్రహారములును మణికుండలములును బహుమానము చేసెను. ఆయమూల్యమణికుండలములను ధరించి తిమ్మన వాకిటఁ గూరుచుండి యుండఁగా నొకబట్టు వచ్చి యాతని కవనమై పుణి నిట్లు స్తుతించెనఁట !

క. మాకొలఁది జానపదులకె । నీకవితాశివి ? యబ్బునే కూపనట
ద్భేకములకు గగనధునీ । శీకరములచెమ్మ ? నంది సింగయతిమ్మా !

స్తుతింపఁగానే యతఁడు తనయొద్ద నప్పుడు మఱేఁయు నమూల్య వస్తువు లేకపోవుటచేత వెంటనే తనచెవి నున్నయమూల్యరత్నకుండల మొకటి యాబట్టుకవి కిచ్చెనఁట! మఱునాఁడు తిమ్మకవి యొంటిచెవి కుండలముతోనే రాజాస్థానమునకుఁ బోయి యుండఁగా నచ్చటి కాబట్టు కవియు వచ్చెనఁట! అప్పుడు ప్రస్తావవశమున రా జాకుండలదానవృత్తాం తమును బట్టు చెప్పినపద్యమును విని,

క. మాకొలఁది జానపదులకె । నీకవితాశివి ? యబ్బునే కూపనట
ద్భేకములకు నాకధునీ । శీకరములచెమ్మ ? నంది సింగయతిమ్మా!

అని 'గగన' యనుటకు మాఱుగా 'నాక' యని యుండినచో మరింతసరసముగా నుండునని సెల విచ్చెనఁట ! అప్పు డాపద్దెమునకు వన్నె దెచ్చితిరని చెప్పి తన చెవికుండలమును బట్టుకవియు, తనచెవికుండల

మును తిమ్మకవియు, రాజుముందఱఁ బెట్టి సమర్పించిరఁట! రాజు వారి యౌదార్యమునకును సరసత్వమునకును మెచ్చి యిరువురకును నర్హ బహుమతులుచేసి సత్కరించి పంపెనఁట!

రాయల యాస్థానమునందుఁ గొంతకాల మొకబట్టుకవి ప్రబలుఁడుగా నుండి యితరకవులను సరకుగొనక యవమానించుచుండఁగా పెద్దనాది కవులందఱును గూడి యొకనాడుఁ దిమ్మకవి వాకిటఁ గూరుచుండి యాలోచించుచుండిరనియు, అప్పుడాబట్టు మార్గమునఁ బోవుచు వారిని జూచి వారికి వినఁబడునట్లుగాఁ దనభటుఁడైన మాధవునితో

క. వాకిటికావలి తిమ్మని । వాకిటికవికోటి మాధవా కిటికోటే

అనిపలికి పరిహాసించెననియు, అదివిని కుపితుఁడయి యాంధ్ర కవితా పితామహుఁడైన యల్లసాని పెద్దన

క. ప్రాకృత సంస్కృత ఘుర్జుర । మూకీకృతకుకవితుంగముస్తాతతికిన్
వాకిటికావలి తిమ్మన । వాకిటికవికోటి మాధవా కిటికోటే.

అని పద్యమును బూరింపఁగా బట్టుకవి సిగ్గువడి తలవంచుకొని పోయెననియు ఒక కథను జెప్పుచున్నారు. వాకిటికావలి తిమ్మన నంది తిమ్మన కాఁడనియు అతఁడు రాజునొద్ద సేనాధిపతిగానుండి దుర్గసంరక్షణము చేయుచుండు మఱియొక తిమ్మనయనియు, అతఁడొకనాఁడు రాజభవనమువాకిట రాజిచ్చిన యమూల్యవస్త్రమును గప్పుకొని కావలి కాచుచుండఁగా రాజదర్శనార్థము లోపలికిఁ బోవుటకయి యచ్చటి కల్లసాని పెద్దనయు, ముక్కుతిమ్మనయు, బట్టుమూర్తియు, తెనాలి రామకృష్ణుఁడును వచ్చి యాతనిజూచి వారిలోఁ బెద్దన మొదట

క. వాకిటి కావలితిమ్మా

అని పద్యము నారంభించి లోపలికిఁ బోయెననియు, అటుపిమ్మట నందితిమ్మన

ప్రాకటముగ సుకవివరులపాలిటి సొమ్మా

అని రెండవచరణమును పూరించి లోనికిఁ జనియెననియు, తరువాత భట్టుమూర్తి

సీ కీదె పద్యము గొమ్మా

అనిపలికి లోపలి కరిగెననియు, కడపట వికటకవియైన రామకృష్ణుఁడు

నా కీపచ్చడమెచాలు నయమున నిమ్మా.

అని పద్యము పూర్తిచేయఁగా నతఁడు వెంటనే తనపచ్చడమును రామకృష్ణునిమీఁద వైచెననియు, రాజావారతని సాహసౌదార్యములకు మెచ్చి గొప్ప బహుమానమిచ్చెననియు ఇంకొకకథను జెప్పుచున్నారు. ఇటువంటి కథలనేకము లున్నవి. ఒకనాఁడు రాయలవారాస్థానమునఁ గొలువుండి తన పార్శ్వములనున్న తిమ్మన్నను పెద్దన్నను భట్టుమూర్తిని జూచి వరుసఁగా తామరాకులోని నీటిబొట్టును కుక్కుటమును వరాహమును దిరస్కరించుచుఁ బద్యములను జెప్పుఁడని వేఁడఁగా వా రాశుకవిత్వముగా నీమూఁడు పద్యములను జెప్పిరఁట :—

ఉ. స్థానవిశేషమాత్రమునఁ దామరపాకున నీటిబొట్టు నీ
బూసిక మౌక్తికంబనుచుఁ బోల్చినమాత్రనె గర్వ మేటికిన్
మానవతీశిఖామణులమాలికలందును గూర్పవత్తువో
కానుక లియ్యవత్తువో వికాసముఁ దెత్తువో మేలు దెత్తువో :—

ముక్కుతిమ్మన.

శా. రంతుల్మానుము కుక్కుటాధమ దరిద్రక్షుద్రశూద్రాంగణ
ప్రాంతో లూఖలమూలతండులకణగ్రాసంబుచేఁ గ్రొవ్వి దు
ర్దాంతాఖిలవిశేషభీషణధణాంతర్మాంససంతోషిత
స్వాంతుండైన ఖగేంద్రుకట్టెదుట నీజంఝాటము ల్సాఁగునే—

పెద్దన్న.

ఉ. తక్కక నేల ముట్టెగొని త్రవ్వఁగనేర్తు నటంచుఁ దాఁకు తా
నొక్కరెజాతియంచు మద మొందకు బుద్ధిని వెట్టిపంది నీ
వెక్కడ యాదిఘోణియన నెక్కడ యద్రిసముద్రదుర్గధా
త్ర్యాకులతలంబు నొక్కయరపంటనె మింటికినెత్త నేర్తువే-

బట్టుమూర్తి.

ఈ తిమ్మకవి కవిత్వము శ్రుతికటువుగాక యర్థగాంభీర్యమును పదలాలిత్యమును గలదయి సలక్షణ మయినదిగా నున్నది. ఈయన శయ్యాలాలిత్యమును జూపుటకుఁ బూర్వోదాహృతము లైన పద్యములే చాలియున్నను పారిజాతాపహరణములోని మఱికొన్ని పద్యములను గూడ నిందుఁ బొందుపఱుచుచున్నాను :—

చ. అతులమహానుభావ మని యవ్విరిఁ దానొకపెద్ద చేసి య
చ్యుతునకు నిచ్చకం బొదవ నూడిద యిచ్చిన నిచ్చెఁగాక తా
నతఁడు ప్రియంబు గల్గునెడ కర్పణచేసినఁ జేసెఁగాక యా
మతకరివేలుపుందపసి మమ్ముఁ దలంపఁగనేల యచ్చటన్- ఆ. ౧.

ఉ. ఓచెలి శౌరి కిచ్చెనఁట యొక్క లతాంతముఁ దెచ్చి నారదుం
డాచపలాక్షి కిచ్చెనఁట యాతఁడు నవ్విరి యిట్టిమాట లా
హా చెవుల న్వినంబడియుఁ బ్రాణము దాల్చెద మేన నింతగా
నోచితి నింక నెట్టివి కనుంగొని నెమ్మయి నున్నదాననో- ఆ. ౧.

చ. అరదము నెక్కి కేతనపటాంచలచంచల మైనతాల్మితోఁ
దురగజవంబు ము న్నడవఁ ద్రోచి కడంగెడుతత్తరంబుతోఁ
దిరిగెడుబండికండ్లపగిదిన్ భ్రమియించు మనంబుతోడ నా
హరి చనుదెంచె సత్యసముదంచితకాంచనసౌధవీథికిన్- ఆ. ౧.

మ. ఎలదేఁటుల్ తమువాలుఁగన్గవలపై నిందీవరభ్రాంతిచే
మెలఁగం జేరలఁ గప్పుకో నలవిగామిం జీఁదఱం జెంది యి

చ్చులఁ గాంక్షించిరి నిర్నిమేషజలజాస్య ల్మానుషత్వంబు ల
య్యళిభీతి న్ముకుళీకృతాక్షి యగుసత్యాకాంత నీక్షించుచున్. ఆ.౩

ఉ. తానటు పారిజాతవసుధారుహముం గొనిపోవువాఁడు క
న్గానఁడు యాదవుం డనుచుఁ గన్నులువేయును జేవురింప వై
శ్వానర ధర్మ దైత్యవర వారిధి పానిల యక్షనాయ కే
శానులదిక్కు చూచి కులిశంబు కరంబునఁ బూన్చి పట్టినన్. ఆ.౩.

ఉ. సొమ్మన నెద్ది యే ననఁగ సొమ్మున కెవ్వఁడు కర్త వీవు నీ
సొమ్మఖిలప్రపంచమును సూరకులంబు నలంకరించు నీ
వమ్మహి నుండు నంతకు ననన్యకురాపము పారిజాతభూ
జమ్మును నుండు నన్న వికసన్ముఖుఁడై హరి వీడుకొల్పుచున్. ఆ.౫

---

4. ధూర్జటి కవి

ఇతఁడు పాకనాఁటి యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; భరద్వాజగోత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు: కాళహస్తిపుర నిలయుఁడు; శివభక్తుఁడు. ఈతఁడు కృష్ణదేవరాయలకాలములో నున్నందున దాదాపుగా ౧౫౨౦ - 30 వ సంవత్సర ప్రాంతములం దున్నవాఁడని చెప్పవచ్చును. ఇతఁడు కాళహస్తిమహాత్మ్యమను నాలుగాశ్వాసములుగల పుస్తకమును, కాళహస్తీశ్వర శతకమును రచించి కాళహస్తీశ్వరున కంకితముచేసెను. ఈయన కవనము సలక్షణ మయి మిక్కిలి మధురముగా నుండును. ఈతని కవిత్వ మాధుర్యమున కాశ్చర్యపడి కృష్ణదేవరాయ లొకనాఁడు సభలోఁ గూరుచుండి తన యాస్థానకవులకు

చ. స్తుతమతి యైనయాంధ్రకవి ధూర్జటిపల్కులఁ కేల కల్గెనో
యతులిత మాధురీమహిమ—

అని సమస్య యిచ్చినట్లును వారిలో నొకరీ క్రిందిరీతిని సమస్యా పూరణము చేసినట్లును చెప్పుచున్నారు :

చ. స్తుతమతి యైనయాంధ్రకవిధూర్జటిపల్కుల కేల గల్గెనో
యతులిత మాధురీమహిమ ? హా తెలిసెన్ భువనైకమోహనో
ద్ధత సుకుమారవార వనితాజనతా ఘనతాపహారి సం
తత మధురాధరోదితసుధారసధారలు గ్రోలుటంజుమీ.

ఈ పయిపద్యమునుబట్టి చూడఁగా ధూర్జటికవి సంతత వేశ్యాప్రియుఁడయిన రసికపురుషుఁ డయినట్టు కనుపట్టుచున్నాఁడు. అట్టి యఖండ శివ పూజాధురంధరుఁడైన భక్తాగ్రేసరుని నట్టి జారత్వదోష మేల విడువకుండెనో యూహింపఁజాలకున్నాము. మనదేశముయొక్క దౌర్భాగ్యము చేతఁ జిరకాలమునుండి యిచ్చట విశుద్ధచరిత్రము మతమునుండి విడిపోయినది. ఎట్టి దుశ్చరిత్రముగలవాఁ డయినను విభూతి, రుద్రాక్షలు మొదలయిన బాహ్యచిహ్నములను ధరించినమాత్రమున భక్తాగ్రేసరుఁడుగాఁ బరిగణింపఁబడుచున్నాఁడు. అయినను క్రమముగా నిప్పుడిప్పుడు మతమునకు సత్ప్రవర్తన మావశ్యకమన్న సత్యము జనుల మనస్సులలో నాటుకొనుచున్నందున కొంతయు సంతసిల్లవలసి యున్నది. ఈ మహాకవియొక్క కవితాధార తెలియుటకయి కాళహస్తిమహాత్మ్యములోని కొన్ని పద్యముల నిం దుదహరించుచున్నాను:-

చ. అమితములైనజంతువుల కక్కడ నుత్తమ మధ్య మాధమ
త్వము లరయంగఁ గాన మపవర్గరమాసతిఁ బెండ్లియాడుచోఁ
సమతయెకాని తత్పురముసాటిగ నన్యపురంబు లెన్నఁగా
నమరు నటన్న నాస్తిమశికాంతర మంతియ వాసి చూచినన్. ఆ ౧

చ. పరిచితబంధనైపుణి నపారకళానుభవప్రసక్తి నా
దరసవివేకసంపద సహాశుకవాక్యసుధానుభూతి మో
హరహితవృత్తిఁ బ్రస్ఫురదనంగరహస్య విచారబుద్ధి న
వ్వారమునఁ గామినీజనులు పొల్తురు యోగిజనంబుపోలికన్. ఆ. ౧

శా. ఆ వేళం బురపల్లవప్రకరనేత్రానందబాష్పాంబుధా
రావర్షాగమచంచలాలతిక దుర్వారప్రసూనాస్త్రతే
జోవైశ్వానరసామిధేని రశనాసూత్రస్థితస్వర్ణవే
ణీవిన్యస్తకపర్ది యొక్క కలకంఠీరత్న మేతెంచుచున్. ఆ. ౧

మ. ప్రణతుల్ చేయుచుఁ గాంచెఁ గుంభజుఁడు లోపాముద్రతోఁ గూడి ద
క్షిణకైలాసము నంబికాహరకృత శ్రీపాదుకాన్యాసమున్
మణిమంత్రౌషధవాసమున్ భవమహామాయావిపర్యాసమున్
గణనాతీత నటీవిలాసము సమగ్రశ్రీసముల్లాసమున్. ఆ. ౧

చ. పులులు కురంగముల్ కరటిపోతము లేసులు మన్నుఁబిళ్ళు దు
ప్పులు కణుఁతుల్ కిటుల్ చెవులపోతులు కొర్నవగండ్లు భల్లుకం
బులు చమరీమృగంబు లెనుబోతులు కస్తురిపిల్లు లాదిగాఁ
గల మృగరాజిఁ బెక్కువిహంగంబులఁ గానుక లంపెఁ దండ్రికిన్-ఆ.3.

౫. మాదయ్యగారి మల్లన్న

ఈతఁడుకూడ కృష్ణరాయని కాలములో నున్న లక్షణికుఁడయిన కవులలో నొకఁడు. (ఆవఱకు మల్లన్నయని మఱియొక కవి యుండి యుండుటచేత నీతని తండ్రి పేరితోఁగూడఁ జేర్చి మాదయ్యగారి మల్లన్న యని చెప్పుదురు.) ఇతఁడు శైవబ్రాహ్మణుఁడు. కొండవీటి పురమందుండినవాఁడు. ఈతనికిఁ బూర్వమునందుండి (యేకాదశీమాహాత్మ్య మనునామాంతరము గల రుక్మాంగదచరిత్రమును రచియించిన మల్లన్న ప్రౌఢకవి మల్లన్న యనఁబడును) మాదయ్యగారి మల్లన్న రాజశేఖరచరిత్రమను మూడాశ్వాసముల గ్రంథమును యౌవనారంభదశయందే రచియించెనఁట! ఈరాజశేఖరచరిత్రము నాదిండ్ల యప్పయామాత్యున కంకితము చేయఁబడినది. ఈకవి కృష్ణరాయల యనంతరము గూడ జీవించియుండుటచేత నించుమించుగా శాలివాహనశకము ౧౫౮౦ వ సంవత్సరప్రాంతమువఱకును బ్రతికియుండెనని చెప్పవచ్చును. ఈతని కవిత్వము మృదుమధుర పదగుంభనము కలదయి మనోహరముగా నున్నది. ఈ కవి చరిత్రమునుగూర్చి మఱియేమియుఁ దెలియకపోవుటచేత రాజశేఖర చరిత్రమునుండి కొన్ని పద్యముల నుదాహరించుచు విరమించుచున్నాను:—

ఉ. చొచ్చినఁ బోకుపోకు మనుచున్ నృపకేసరి తేరు డిగ్గి నీ
వెచ్చటి కేగిన న్వీడుతునే పటుబాణపరంపరాహతిన్
బచ్చడి చేయువాఁడ నని ఫాలనటద్భ్రుకుటీకరాళుఁడై
యిచ్చ నొకింతయేని చలియింపక తద్బిలవీథి దూఱఁగన్—ఆ. ౨.

ఉ. సాహసికాగ్రగామి నృపసత్తముఁ డట్లు తదీయ ఘోరమా
యాహమికల్ హరింపుచు నిరంకుశ విక్రమకేళిఁ జూప ను

త్సాహము తక్కి యాత్మపురిచక్కటి నొప్పెడుకాళికా
గేహముచొచ్చి తద్దనుజకీటము పాటిలుభీతి పెంపునన్—ఆ. ౨.

మ. కలమాన్నంబు ఘృతంబుఁ బాయసము శాకవ్రాతము ల్పిండివం
టలుఁ బా ల్తేనియ జున్ను వెన్నయిడి నూనా లుక్కెర ల్చక్కెరల్
ఫలము ల్పానకము ల్రసాయనము లంబ ళ్పూరుఁ బిం డ్లూరుఁగా
యలు బజ్జు ల్దధిపిండఖండములు నం దావిర్భవించె న్వెసన్— ఆ. ౨.

శా. కేళీకాంచనసౌధవీథికలచక్కిం దొట్లలోఁ బెట్టి యో
ప్రాలేయాచలకన్య కాధనకృపాపారంగతా నిద్రవో
వే లావణ్యపయోనిధీ యనుచు నావిర్భూతమోదంబుతో
జోలల్పాడుదు రక్కుమారకునకున్ శుద్ధాంత కాంతామణుల్ - ఆ. ౨

ఉ. రాహువుఁగాను నిన్నరగఁ రాచినశూలినిగాను సీతను
ద్రోహముచేసినట్టియలరోహిణితండ్రినిగాను దజ్జగ
న్మోహిని నీలనీలకచ ముద్దులచక్కెరబొమ్మఁ గూర్ప క
య్యో హరిణాంశ తావకమయూఖముఖంబుల నేచ నేటికిన్—ఆ. ౨.

వెనుకటి కూర్పులయందుఁ బయివిధమునఁ బ్రకటించినతరువాత, ఈటీవల నాకు రాజశేఖరచరిత్రము సమగ్ర మయిన ప్రతియొకటి దొరకినది. అందలి యాశ్వాసాద్యంతముల యందుండిన ఈ క్రిందిపద్యములను బట్టి కృతిపతి యింటిపేరు నాదిండ్లవారనియు, పేరప్పామాత్యుఁ డనియు, అతఁ డాఱువేల నియోగిబ్రాహ్మణుఁ డనియు, కృష్ణమాంబా కుమారుఁ డనియు, మంత్రియు దండనాథుఁడు ననియు, తెలియవచ్చుచున్నది.—

శా. వైరించప్రతిభావదావదవచోవైయాత్య సాతత్యస
త్యారూఢస్థితిపాండవాగ్రజ మహీయస్స్వచ్ఛకీర్తిచ్ఛటా
పారావారనిమగ్నశత్రుగణ శుంభత్పూర్వ భూభృద్ధిశా
నారీమన్మథ బంధురక్షణచణా నాదిండ్లవంశాగ్రణీ—ఆ. ౧.

మాలిని. హరిచరణపయోజధ్యానసంధానమార్గా
స్థిరమతిగుణధారా శిష్టలోకప్రచారా
సురసురభివితీర్ణి స్తోత్రపాత్రప్రకారా
గిరిచరదరివీరా కృష్ణమాంబాకుమారా! — ఆ. ౧.

క. శ్రీరమణీరమణీయుని । హారాయితనూత్నరోచనాంభోజయుగా
దోరమితికీర్తినిరసిత । తారకుభృత్కాశ యప్పదండాధీశా — ఆ. ౨.

సుగంధి. పారదప్రభావిభాసిభద్రకీర్తివాహినీ
పూర దానధూళదివ్యభూజకామధేను ధు
ర్వార యాజివేళవైరివార్ధిపూర్ణచంద్రమా
సాగబుద్ధిజాలనీతశత్రుభూమిభృద్భ్రమా — ఆ. ౨.

క. శ్రీచక్రచారుకుచయుగ । సూచకగాఢోపగూహసూచితపులక
ప్రాచుర్య తత్త్వతత్పర । యాచకసంస్తుత్య మంత్రియప్పామాత్యా.—

ఈ యప్పామాత్యుఁడు కృష్ణదేవరాయని మంత్రియైన తిమ్మరుసున కల్లుఁడు. మాదయ్యగారి మల్లన్న తా నఘోరశివశిష్యుఁడయిన ట్లాశ్వాసాంతగద్యమున నిట్లు తెలిపికొనియున్నాఁడు :-

"ఇది శ్రీమదఘోరశివాచార్యగురు కరుణావిశేషలబ్ధ సారసారస్వత మాదయామాత్యపుత్ర మల్లయనామధేయ ప్రణీతంబైన రాజశేఖర చరిత్రంబను మహాప్రబంధంబునందు సర్వంబును దృతీయాశ్వాసము."

ఈ యప్పామాత్యుఁడు కవిని,

ఉ. శంకరపాదసేవ నవశంవదమానస పంకజాత ని
శ్శంకవచోవిలాస రుచిసారవినిర్జితపూర్ణపూర్ణిమా
శాంక దురక్షరాన నభయంకర శౌనకగోత్రపాత్ర య
య్యంకిపురాగ్రహారవిభవాకర మాదయమల్లసత్కవీ.

అని సంబోధించి యుండుటచేత మల్లన శౌనకగోత్రసంజాతుఁ డనియు, అయ్యంకిపురాగ్రహారస్వామి యనియు తెలియవచ్చుచున్నది. అయ్యంకి

కృష్ణామండలములోని చల్లపల్లిసంస్థానములో మచిలీబందరునకు పడమా లుగు మైళ్ళదూరములో నున్నది. దీనినిబట్టి కవి కృష్ణామండలములోని వాఁడగుట స్పష్టము. ఈకవిశ్రేష్ఠుఁడు కృత్యాదియందు

గీ. సరసనంస్కృతపుష్పగుచ్ఛప్రభూత
మగు తెనుంగను నెత్తావి కఖిలదిశలఁ
దరుణపమానమగు కవిత్రయవిశేష
చతురవాచానిరూఢి కంజలి యొనర్చి

అని పూర్వకవిస్తుతి చేసి

క. చెప్పఁదగుఁ గవిత రసముల్
చిప్పిల నప్పప్ప బళిబళీ యన లేదా
యెప్పుడుఁ జేయకయుండుట
యొప్పుఁజుమీ సుకవి కెంతయుచితజ్ఞుఁడొకో.

శా. గాఢార్థప్రతిపాదనక్రమకళాకౌశల్యము ల్లేక వా
చాఢక్కార్భటితోడఁ దామ తము మర్ధ్యాయించుఁ గైవారముల్
ప్రౌఢిం జేయుచుఁ బ్రాజ్ఞుల న్నగుచు గర్వగ్రంథులై యుండు న
మ్మూఢస్వాంతుల మెచ్చకుండుటయె సమ్మోదంబు మాబోంట్లకున్.

సుకవియగువాఁడు కవిత్వముఁ జెప్పినచో రసము లుప్పతిల్లు నట్లుగాఁ జెప్పవలయును లేదా యూరకుండవలయు ననియుఁ జెప్పి కేవల వాగాడంబరమును జూపువారియెడఁ దిరస్కృతినిజూపెను. కవి కృతిపతి మామగారును కృష్ణదేవరాయనిమంత్రియు నయిన తిమ్మరుసును వర్ణించి, అప్పామాత్యుఁడు తిమ్మరుసు కూఁతురైన తిరుమలాంబను పెండ్లియైన వార్త నీక్రిందిపద్యములలోఁ జెప్పెను—

సీ. ఏమంత్రిమణి నిజస్వామికార్యక్రియాతత్పరమానసోత్సాహశాలి
యేమంత్రిమణి మిత్రహితబాంధవాశ్రితప్రకరరక్షణకళాప్రౌఢబుద్ధి
యేమంత్రిమణి వచోహేలాతినైర్మల్యశీతలతాధూతశీతరోచి

యేమంత్రిమణి సుధాధామశాంభవధామధామళధళ్యసుతుల్యధవళకీర్తి
యట్టి మంత్రికులోత్తంస మహితనృపతి
పటలమకుటాగ్రఘటితపత్పద్మయుగళి
సకలకర్ణాటరక్షావిచక్షణుండు
దీనసురశాఖి సాళువతిమ్మమంత్రి.

గీ. అమ్మహామంత్రి కతనియర్థాంగలక్ష్మి
సకలపుణ్యాంగనాజనశ్లాఘనీయ
లక్ష్మమాంబకు నుదయించి లలినిమెఱయు
తిరుమలాంబికఁ బెండ్లియై తేజరిల్లె.

కృతిపతియొక్క తమ్ముఁడైన గోపనయు గుత్తిదుర్గమునకు దండనాథుఁడయి యుండినట్లు కవి యీక్రిందిపద్యమునఁ జెప్పియున్నాఁడు—

ఉ. ప్రాపితరాజ్యుడై భవ నిరాకృతిపాకవిరోధియైన యా
గోపనమంత్రి ధర్మధనగోపనసమ్మతిగుత్తిదుర్గల
క్ష్మీపరిపాలనక్రమసమిద్ధభుజాబలశాలి రూపరే
ఖాపరమత్స్యలాంఛనుఁ డయావహకార్యధురంధరుం డిలన్.

కృతిపతియైన నాదెళ్లయప్పామాత్యుని ముత్తాతతమ్ముఁడైన చిట్టిగంగన్న కృష్ణదేవరాయని తాతయగు నీశ్వరరాజునకుఁ బ్రభువుగా నుండినట్టియు జైమినిభారతకృతిపతి యయినట్టియు సాళువనారసింహరాజునొద్ద మంత్రిగానున్నట్లు చెప్పిన యీక్రింది పద్యము కవికాలనిర్ణయమునకుఁ దోడుపడునదియే యయినను దీనిసాహాయ్య మక్కఱలేకయే కృతిపతి తిమ్మరుసుజామాత యగుటచేతనే కవికాలము మనకుఁ దెలియ వచ్చినది—

ఉ. సాళువనారసింహమనుజప్రభుకార్యకళాధురంధరుం
డై లవణాబ్ధివేష్టితధరాధిపదుర్మతమంత్రమంత్రిశుం

డాలవితానకేసరి యనంగ ననంగసమానరూపరే
ఖాలలితాంగుఁ డట్టిచిటిగంగన యొప్పు గుణానుషంగుఁడై.

రాజశేఖర చరిత్రమునందలి పద్యములు మృదుమధురవాగ్గుంభనము కలవయి ముద్దుపలుకులచే వీనులకు విందు గొలుపుచున్నవి. రాజశేఖర చరిత్రమునుండి యీవఱ కుదాహరింపఁబడిన పద్యములన్నియు ద్వితీయాశ్వాసములోనివే యైనందున మఱికొన్ని పద్యముల నిందుదాహరించుచున్నాను :—

ఉ. చందురువంటి నెమ్మొగము చక్కటిదూలఁగఁ బుట్టువెండ్రుకల్
కెందలిరాకుఁ బాదములఁ గీల్కొనఁ జేసినయట్టిచిన్నిపైఁ
దండెలు గల్లుగల్లుమన నాడుచు నల్లన జేరవచ్చి నా
ముందఱ నాడ నెన్నఁడొకో ముద్దియ ముద్దుఁగుమారుఁ గాంచుటల్ — ఆ. ౧

శా. రాజచ్చంద్రశిలాతలాంతరలతారమ్యప్రదేశంబులన్
గాజుంగుప్పెలలోనియచ్ఛతరగంగావారి నోలార్చి యా
రాజున్ దేవులు మంత్రపూతముగ హేరాళంపుఁ బూసుత్తులం
బూజ ల్సేయుదు రిచ్చలం జెలఁగి ముప్పూటం బురారాతికిన్ — ఆ. ౧

ఉ. పాలిక మేలుకొల్పి నరపాలశిఖామణి వింటివే విసీ
లాలక నిన్నరేయి యొకయచ్చెరు వాశ్రితపారిజాత మ
బ్బాలశశాంకమౌళి మనపాలిటికొంగుపసిండి మందమం
దాలసలీల వచ్చె దరహాసవిభాసిముఖారవిందుఁడై — ఆ. ౧

ఉ. ముంపటి రాజ్యగర్వమున ముందఱఁగానవుగాక ధాత్రిఁ బా
లింపరొ తొంటిరాజులు దిలీపముఖుల్ మునికోటికూఁత లా
లింపరొ నోంపరో మదవిలీఢకఠోరనిశాటఝాటముల్
నింపరొ దిక్కటాహముల నిర్మలకీర్తిసుధాంశుచంద్రికల్ — ఆ. ౨

శా. ఓరోరీ కలగంటివో భ్రమసితో యుగ్రాహవాటోపదు
ర్వారప్రక్రమమామకీనభుజగర్వం బెన్నరో కాక నా

పే రెవ్వారు నెఱుంగరో యకట నిర్భీతి న్నరుం డెవ్వఁడేన్
జేరన్వచ్చునె నన్ను బెబ్బులిపయిం జీంబోతునుం బంచునే— ఆ.౨

ఉ. రమ్ము నృపాల నీదగుపరాక్రమకేళికిఁ జాలమెచ్చి మా
యమ్మ భవాని సంయమికులాగ్రణికూరిమిబిడ్డ నిచ్చి రాఁ
బొమ్మన వచ్చితిన్ శిఖరిపుత్రికసేవకురాల నాదుగే
హమ్మున నున్న యప్పడుచు నప్పనచేసెద నంచుఁ బల్కినన్—ఆ.౨

ఉ. ప్రన్ననిపాదముల్ చిలుకపాటినఁ గందెడు మేనుదీఁగెయున్
వెన్నెలవారునెమ్మొగము నిద్దపుముద్దుమెఱుంగుజెక్కులున్
గ్రొన్నెలవంటి నెన్నుదురుఁ గోమలబాహుమృణాళయుగ్మమున్
గన్నులఁగట్టినట్లు పొడగానఁగనయ్యెడు నాకు నెచ్చెలీ— ఆ. ౨

చ. అగునగునయ్య యచ్చెలియ యట్టిద యెంత నుతింప నంతకున్
దగుఁదగు మర్త్యలోకవనితావినుతాంగి యానన
ద్విగుణితచంద్రమండల తదీయసితాతకటాక్షపాతముల్
తగిలిన మారుఁ డెవ్వరి హళాహళిసేయఁడు వాఁడితూపులన్- ఆ 3

మ. కులనిర్మూలనకారణంబు ప్రతిభాకుట్టాక ముద్వేగకో
పలతాదోహద మాజవంజవసుఖప్రత్యూహ మాత్మవ్యథా
జ్వలనజ్వాలిక కామినీనయనవీక్షాపాతసంరోధి ని
త్యలఘుత్వాశ్రయభూమి లేమి యది యాహా యేమి గావింపదే-ఆ 3

ఉ. రాములు కేళికాననధరాస్థలికిన్ మును క్రీడసల్ప రా
రో మనసారఁ గమ్మనివిరుల్ తమనేర్పులఁ గోసికొంచుఁ బో
రో మదవృత్తి నీగతి మరుల్గొని పోరినవారిఁ గాన మొం
డేమనువారమమ్మ తరళేక్షణ ప్రాఁతఫలం బిటుండఁగన్ —ఆ. 3

చ. కలితసుధారసంబు దొలఁకన్ సరసప్రియభాషణంబులం
బలికిన శీతకాలమగుఁ బల్లవపాదములెత్తి లీలమై

మొలఁగ వసంతకాలమగు మించుఁగనుంగవఁ దేటఁజూచినన్
దలఁకొను శారుకాలమగుఁ దస్వవిలాసవిచిత్ర మెన్నఁగన్—ఆ. 3

శా. డాకేల న్నిజకన్యకామణులకంఠశ్రేణిఁ గీలించి వీ
ణాకంజాతము లాత్మపాదనఖరేఖం దార్చి సంగీతవి
ద్యాకౌశల్యము గానరా మతికి నాహ్లాదంబు సంధిల్ల గౌ
రీకళ్యాణముఁ బాడిరప్పుడు పురంధ్రీరత్నము ల్వేడుకన్—ఆ. 3

---

6. తాళ్ళపాక చిన్నన్న

(అష్టమహిషీకళ్యాణ మనుద్విపదకావ్యమును రచియించిన యీ కవి కృష్ణదేవరాయల కాలమునందున్నవాఁడు.)

గీ. చిన్నన్న ద్విపద కెరఁగును
బన్నుగఁ బెదతిరుమలయ్య పదముల కెరఁగున్
మిన్నంది మొరసె నరసిం
గన్నకవిత్వంబు పద్యగద్యశ్రేణిన్.

అని యప్పకవి తెనాలిరామకృష్ణమ్మ చెప్పినట్లుగా నుదాహరించిన పద్యమువలన నితఁడు ద్విపదను నిర్దుష్టముగాను మనోహరముగాను రచించినట్లు కనుపట్టుచున్నది. లక్షణగ్రంథములయం దుదాహరింపఁబడిన చిన్నముక్కలు దక్క నీతనిపుస్తకము నాకు లభింపలేదు. ఈక్రింది రెండు పంక్తులు నప్పకవీయమునం దుదాహరింపఁబడియున్నవి.

ఇంతుల మేల్బంతి యిడిన సేవంతి
బంతి చేదోయి నుపాయన మిచ్చి —అష్టమహిషీకళ్యాణము.

రంగరాట్ఛందమునం దీక్రిందిపంక్తు లుదాహరింపఁబడినవి—

ఉన్నాఁడు తడవుగా నున్నాఁ డతండు
మన్నాఁడు మమ్ముఁ దెమ్మన్నాఁ డటన్న.—అష్టమహిషీకళ్యాణము.

---

7. సంకుసాల నృసింహకవి

(ఇతఁడు కవికర్ణరసాయన మను మాంధాతృచరిత్రమును రచియించిన మహాకవి. ఈ కవి కృష్ణదేవరాయనికాలమునం దుండె ననుటనుగూర్చి యొకకథ గలదు.) దానినిచ్చట సంక్షేపించి చెప్పుచున్నాను. పెద్దన్న మనుచరిత్రమును రచించినతరువాత నృసింహకవి కష్టపడి కవికర్ణరసాయనమును జేసి, దానిని కృష్ణదేవరాయని కంకితము చేయఁదలఁచి, విజయనగరమునకువచ్చి తదాస్థానకవియైన పెద్దన్నను దర్శించి, తనగ్రంథము నామూలాగ్రముగా నాతనికి వినిపించి, రాజదర్శనము చేయింపవలెనని వేఁడెనఁట! ఆంధ్రకవితాపితామహుఁ డాగ్రంథచమత్కారమున కద్భుతపడి, అట్టిగ్రంథమును రాజునకుఁ జూపినయెడలఁ దన మనుచరిత్రముమీఁది గౌరవము తగ్గునని యెంచి, ఈర్ష్యచేత నాతనికి రాజదర్శనము కానియ్యక 'యిదిగో, అదిగో' అని చిరకాలము గడపి యూరక పంపివేసెనఁట! అతఁడు రాజాస్థానమున లాభప్రాప్తి లేకపోఁగా మీఁదు మిక్కిలి తనవెంటఁ దెచ్చుకొన్న కాసుపైసములను సహితము వ్యయపెట్టుకొని, దినభుక్తి జరగక తనపుస్తకములోని కొన్ని పద్యములను విక్రయింపవలసినవాఁ డయి, తుదకు విసిగి రాజులను దూషించుచు లేచిపోయి తనగ్రంథమును శ్రీరంగనాథున కంకితముచేసి కృతార్థుఁ డయ్యెనఁట! అప్పుడు విక్రయింపఁబడిన పద్యములలో నొకటి రెండెట్లో కృష్ణదేవరాయల కూఁతురైన మోహనాంగిచేతిలోఁ బడెనఁట! (కృష్ణరాయనికి మహావిదుషియైన మోహనాంగి యనుకూఁతురు గల దనియు, ఆమె యనుపమానసాహిత్యము కలదయి మారీచిపరిణయ మనుశృంగారప్రబంధమును రచియించె ననియు, రామరాజుభార్య యనియు కొందఱు వ్రాసియున్నారు. ఆగ్రంథము నాకు లభించినది కాదు. రామరాజు భార్యపేరు తిరుమలాంబ. అయినను తిరుమలాంబకు

మోహనాంగి యనునామాంతర ముండిన నుండియుండవచ్చును. ఆచిన్నది యొక్కనాఁడు తండ్రితో చతురంగ మాడుచు, తనబలము లోని బంటొకటి మంత్రియొక్కయు, నేనుఁగుయొక్కయు పగచేత తొలఁగవలసి వచ్చినప్పుడు "ఉద్ధతుల మధ్యమునఁ బేద కుండఁదరమె" యని చదివెనఁట! అదివిని రాజు పద్యమంతయుఁ జదువుమని పుత్త్రి నడుగఁగా నామె కవికర్ణరసాయనములోని మూఁడవయాశ్వాసమునందలి యీపద్యము నిట్లు చదివెనఁట—

గీ. ఒత్తుకొనివచ్చుకటికుచోద్వృత్తిఁ జూచి
తరుణితనుమధ్య మెచటికో తలఁగిపోయె
నుండె నేనియుఁ గనఁబడ కున్నె యహహా!
యుద్ధతులమధ్యమునఁ బేద కుండఁదరమె?

అప్పుడు రాజాపద్యముయొక్క చమత్కృతి కానందించి యెక్కడిదని యడిగి తెలిసికొని పెద్దన్నచేసినమోసము నెఱిఁగి ఖేద పడెనఁట!

రాజసంస్థానమునందుఁ దనకుఁ గలిగినయనాదరణచేత కుపితుఁ డయియే నృసింహకవి తనమాంధాతృచరిత్రమునం దీక్రింది రాజదూషణ పద్యమును జొప్పించెనని చెప్పుదురు—

సీ. ఆందోళికలయందు నంతరచరులై నసదికృతాకృతులపిశాచజనులు
పరకరాళంబులై ప్రార్థింపఁ గనుఁగొనక వాయెత్తకుండుజీవచ్ఛవములు
వాలవీజనములఁ గ్రాలుచు నీఁగకు నంటీనిఖరవర్తులాండసములు
వేత్రపరంపరావిలకంటకావృతిఁ జేరఁ బోరానిబర్బూరతరులు
శంఖనాగస్వరస్వరశ్రవణసమద
విస్ఫుటచ్ఛత్రవిస్ఫారితస్ఫటాక
విష్టవిషవైద్యవశవర్తి దుష్టఫణులు
ప్రభుదురాత్ములసెవ్వాఁడు ప్రస్తుతించు.

అయినను పయికథ యిటీవలివారిచేత నెవ్వరిచేతనో కల్పింపఁబడినట్లు తోఁచుచున్నది. (ఆంధ్రకవితాపితామహుఁ డైన యల్లసాని పెద్దన్న యంత యసూయాగ్రస్తుఁ డగుటకుఁ దగినకారణ మేదియుఁ గానరాదు.) కవికర్ణరసాయనము మొత్తముమీఁద మంచిదే యయినను, పెద్దనార్యకృత మయిన మనుచరిత్రముకంటె నేవిషయమునందును గుణాతిశయము గలదికాదు.

గీ. యతి విటుఁడుగాకపోవు టె ట్లస్మదీయ
కావ్యశృంగారవర్ణ నాకర్ణనమున ?
విటుఁడు యతిగాకపోరాదు వెస మదీయ
కావ్యవైరాగ్యవర్ణనాకర్ణనమున.

అని నృసింహకవి తన కవిత్వసామర్థ్యమును గూర్చి గ్రంథాదియందాత్మస్తుతి చేసికొని యున్నాఁడు. మఱియుఁ దక్కిన కవుల వలెఁగాక కుకవిదూషణమును బెక్కుపద్యములతోఁ జేసియున్నాఁడు. కాఁబట్టి యితఁడు స్వాతిశయభావము గలవాఁ డయినట్టు కనుపట్టుచున్నాఁడు. ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడయినను భట్టపరాశరాచార్యుల శిష్యుఁడై వైష్ణవమతమునం దధికాభిమానము కలవాఁడై యుండెను. మాంధాతృచరిత్రము విశేషభాగము దీర్ఘసమాస సంస్కృతపదభూయిష్ఠముగా నున్నను బహుస్థలములయందు తెలుఁగుపదములతోను చక్కని లోకోక్తులతోను గూడఁ గూడియున్నది. చేసినవర్ణనము లనేకములు హృదయాహ్లాదకరములుగా నున్నవి. కవిత్వమునం దక్కడక్కడఁ గవిత్రయము వారి ప్రయోగములకు విరుద్ధములైన ప్రయోగములు కానఁబడుచున్నవి. ఈ కవియొక్క కవననైపుణిని జూపుటకయి కవికర్ణరసాయనములోని కొన్ని పద్యముల నిందుదాహరించుచున్నాను:—

శా. వేణీలోచన లాత్మవక్త్రరుచిచే నేణాంకసౌభాగ్య మ
క్షీణప్రౌఢి హరింప సౌధపరిసంకీర్ణేంద్రనీలోపల

శ్రేణీనిర్మలకుట్టిమంబులపయిన్ శీతాంశుఁడంబేదయై
ప్రాణాచారము పడ్డయట్ల ప్రతిబింబవ్యాప్తి చూడందగున్ — ఆ. ౧

ఉ. గర్భమునిల్చి కుక్షి యధికంబుగఁ గానఁగవచ్చి ప్రక్కలన్
దుర్భరతీవ్రవేదనలఁ దూలుచు సోలుచు నేల వ్రాలఁగా
నర్భకుఁ డొక్కఁ డయ్యెనకులాగ్రణిగర్భ మగల్చికొంచు నా
విర్భవ మొందె భూజనులు విస్మయమగ్నులుగాఁగ నయ్యెడన్ — ఆ౧

క. కా కేమి తన్నుఁ దిట్టెనె?
కోకిల తన కేమి ధనము కో కొమ్మనెనే?
లోకము పగ యగుఁ బరుసని
వాకునఁ జుట్ట మగు మధురవాక్యమువలనన్.

ఉ. ప్రోడవుగాన నీ పలుకు పోలదు కాదనరాదుగాక యీ
వీడినతాపవేదనల వేఁగెడుచెన్నటిమేనఁ బ్రాణముల్
కూడి వసింపనోర్వ వివిగో చనుచున్నవి యేల వ్రీడయుం
గ్రీడయు నాకు హారమును గీరముఁ జూతము గీతముం జెలీ — ఆ. 3

మ. పటికి న్నార్చినలీలఁ జందనముఁ బైఁబైఁబూయ నంగారక
చ్ఛటలం గాచు తెఱంగునం జిగురుసెజ్జం బొర్లఁగా నప్పుట
ప్పటికిం జేరఁగనిల్చిన ట్లొడలిపైఁ బన్నీరు చల్లంగ ను
త్కటమయ్యెం బెనుకాక బంగరుసలాకంబోలు నబ్బాలకున్ — ఆ.3

గీ. త్రొట్రుకొను నడ్గులును వెడద్రొక్కుపలుకు
లుల్లముల సి గ్గెఱుంగమియును ఘటించి,
జవ్వనులకును మరల శైశవముఁ దెచ్చె
వారుణియు నెట్టిసిద్ధౌషధీరసంబొ — ఆ. ౪

ఉ. లజ్జకుఁ బాపు శీలముఁ గులంబు వడి న్వెడిపించు సూనృతం
బుజ్జనసేయఁ జేయు మొగమోటమిఁ దూలుచుఁ బాతకంబులన్

మజ్జన మూర్చు నార్చు నభిమానము రోఁతల కియ్యకొల్పు నీ
ముజ్జగ మైనఁ ద్రిప్పు దుదిముట్టదు తా ధనకాంక్ష యేరికిన్- ఆ. ౫

ఉ. ఏకడఁ జొచ్చునో సుకృత మెచ్చటడాఁగునో తృప్తి యెప్పుడో
పోకడ శాంతి కెం దడఁగిపోవునొ సౌఖ్యము మాన మేమియౌ
నో కృప యెట్లు మాయ మగునో యశ మేగహనంబుదూఱునో
లోకమునం దెఱుంగ మొకలోభ మెదిర్చినమాత్రఁ జిత్రమై- ఆ.౫

ఉ. ఖండసుధాకరాలికలు గాఢవిరక్తిఁ దపస్విశిష్యులై
యుండిరి పూవుదప్పటకు నుల్లము రోసి రతీశుఁ డిక్షుకో
దండముఁ బుష్పబాణములతండముఁ బాఱఁగవైచి చేతులన్
దండమునుం గమండలువుఁ దాలిచి మస్కరి గాకయుండునే- ఆ.౬

---

8. కాసె సర్వప్ప

(ఇతఁడు సిద్ధేశ్వరచరిత్ర మనునామాంతరముగల ప్రతాపచరిత్రమును ద్విపదకావ్యముగా రచించెను. ఈకవికాల మెప్పుడో నిశ్చయముగాఁ దెలియదుగాని యితని గ్రంథము మిక్కిలి పురాతన మైనదనుటకు సందేహములేదు. ఇతఁడు ప్రతాపరుద్రుని యనంతరమునఁ గొంతకాల మయినతరువాత నుండినవాఁడు) ఈతని కవిత్వమునందు లక్షణవిరుద్ధము లైనప్రయోగము లనేకములు గానఁబడుచున్నను, చరిత్రముగా నీగ్రంథము మిక్కిలి యుపయుక్త మయినది. ఈతని గ్రంథమునుండియే కూచిమంచి జగ్గకవి తనసోమదేవరాజీయమునందు విశేషభాగమును గ్రహించి యున్నాఁడు. తిక్కన సోమయాజి చరిత్రమునందీగ్రంథములోనుండి కొంతభాగ. ముదాహరింపఁబడినందున, ఇందుండి యిప్పుడు గొన్నిపంక్తులు మాత్రమే గ్రహింపఁబడును.

ద్వి. గణప్రసాదతఁ గలిగినసుతుని
గణపతినామంబు ఘనముగాఁ బెట్టి
తూర్పుదేశం బేగి తూర్పురాజులను
నేర్పుతో సాధించి యోర్పుమీఱంగఁ
బాండుదేశాధీశు బాహుబలాఢ్యుఁ
గాండంబులనుగొని గం డడఁగించి
చండవిక్రమకళాసారదుర్వార
పాండిత్య ధనురస్త్రభద్రుఁ డారుద్రు డిట.

*　　　*　　　*　　　*

ఇది శ్రీసకలవిద్వదిభపాదకమల
సదమలసేవన సభ్యసంస్మరణ
భాసురసాధుభావనగుణానూన
భూసురాశీర్వాద పూజనీయుండు
కాసె మల్లనమంత్రి ఘనకుమారుండు
వాసిగాఁ జెప్పె సర్వప్పనుతఁడు.

9. భాస్కర పంతులు

ఈకవి కన్యకాపురాణమనెడి యెనిమిదాశ్వాసముల పద్యకావ్యమును రచించెను. రాజరాజనరేంద్రుని తండ్రియైన విష్ణువర్ధనమహారాజు గోదావరీమండలములోని పెనుగొండలోనుండిన కుసుమసెట్టియను కోమటియొక్క కొమార్తెను కామించి యామెను తన కిమ్మని యడుగఁగా తండ్రి యియ్యనన్నట్టును, అందుమీఁద విష్ణువర్ధనుఁ డాకన్యను బలాత్కారముచేత గ్రహించుటకుఁ బ్రయత్నింపఁగా కుసుమసెట్టియు కూఁతురును నూటరెండు గోత్రముల యితరవైశ్యులును నగ్నిహోత్రములోఁబడి మృతులయినట్టును, కోమట్లలో నూఱుకుటుంబములు పడమటకును, ఎనుబది కుటుంబములు తూర్పునకును, ఇన్నూఱు కుటుంబములు దక్షిణమునకును, నూటముప్పది కుటుంబములుత్తరమునకును పాఱిపోయినట్టును, కన్యకాశాపముచేత విష్ణువర్ధనుఁడు శిరస్సు వ్రక్కలయి చావఁగా నాతనిపుత్త్రుఁ డయిన రాజనరేంద్రుఁడు వైశ్యులను శాంతపఱిచి కుసుమసెట్టి కొడుకైన విరూపాక్షుని పదునెనిమిదిపట్టణముల కధికారినిజేసి మిగిలిన కోమట్లను పెనుగొండలో నుండునట్లు చేసినట్టును ఇందుఁ జెప్పఁబడినది. ఇప్పటికిని పెనుగొండ కోమట్లకు ముఖ్యస్థలము. అక్కడ కన్యకాపరమేశ్వరిపేర దేవాలయము కట్టఁబడి వైశ్యులచే మిక్కిలి గౌరవముతో చూడఁబడుచున్నది. గ్రంథకర్తయైన భాస్కరపంతు లనుబ్రాహ్మణుఁడు పెనుగొండ, కొండవీడు, రాజమహేంద్రవరము మొదలయిన ప్రదేశములయందుండిన కోమట్లకు గురువయియుండి కన్యకాపురాణమును రచించి, వైశ్యులవిషయమయి కొన్ని కట్టుపాట్లుచేసి, నూటరెండు గోత్రములవారి నాకట్టుఁబాట్లకు లోఁబఱిచి, తత్కట్టుపాట్లను మీఱినవారిని వర్ణభ్రష్టులనుగా బహిష్కరించి తనకు వశ్యులయినవారికిఁ దా నాచార్యుఁడును పురోహితుఁడును

నయ్యెను. గ్రంథసామగ్రి తక్కువగుటచేత నీతనికాలమిదియని నాకిప్పుడు నిశ్చయముగాఁ దెలియక పోయినను, ఇతఁడు పదునాఱవశతాబ్దమునకు బూర్వుఁడని తెలియవచ్చుచున్నది.) ఈతని కన్యకాపురాణమునుండి రెండు పద్యముల నిం దుదాహరించుచున్నాను.—

ఉ. అంతట నింగితజ్ఞుఁ డగునాకుసుమాఖ్యుఁడు నాదరంబునన్
గాంతను జూచి పల్కె ననుకంప దలిర్పఁగ నీమనంబునన్
జింత వహించి యిట్లునికి చెప్పుము నీకు మనోరథార్థముల్
సంతసమంద నిత్తును విచారము మానుము దైన్య మేటికిన్. ఆ. ౫.

చ. జలనిధి మేరదప్పిన నిశాకరబింబము త్రోవదప్పినన్
బలువిడి ధాత్రి క్రుంగినను భాస్కరుఁ డిట్లుదయింపకుండినన్
గులగిరి సంచలించినను గూర్మము భూమి భరింప కుండినన్
బలికిన బొంక నేరరు కృపాసధులై తగువైశ్యు లెప్పుడున్. ఆ. ౭.

---

10. బైచరాజు వేంకటనాథకవి

(ఇతఁడు పంచతంత్రమును పద్యకావ్యమునుగా రచియించెను. ఈ కవి క్షత్రియుఁడు ఈతని తాతయైన బైచరాజునుబట్టి యీ కవి కీయింటిపేరు కలిగినట్లు తోఁచుచున్నది.) కవి తనవంశకర్తయైన బైచరాజు నిట్లు వర్ణించియున్నాఁడు :—

ఉ. ధీరత రాజవంశజలధిం బ్రభవించె మహావిరోధిసం
హారవిహారి సాళ్వబిరుదాంకుఁడు బైచనృపాలుఁ డద్ధరి
త్రీరమణీమనోహరునితీవ్రయశస్స్ఫురితికిన్ హరాద్రినీ
హారవసుంధరాధరము లయ్యె సమగ్రవిహారశైలముల్.

ఈ కవికాలమును సరిగా నిర్ణయించుటకుఁ దగిన యాధారము లేవియు దొరికినవికావు. తమనిఘంటువునందు బ్రౌన్ దొరవారితఁడు ౧౫౦౦ వ సంవత్సరప్రాంతముల యందుండినట్లు వ్రాసియున్నారు. ఇందుకు విరుద్ధములైన ప్రమాణములు కనఁబడు వఱకును మన మాకాలమునే సిద్ధాంతముగా గ్రహింపవచ్చును. ఈ వేంకటనాథుఁడు పూర్వకవి వర్ణనము నీక్రిందిపద్యమునఁ జేసియునాఁడు—

మ. హృదయబ్రహ్మరథం బతిప్రియతమం బెక్కింతుఁ జేతోమరు
త్సదనాస్థానికిఁ దెత్తు మానసనభస్సంచారిఁ గావింతు హృ
ద్విదితక్షీరసముద్రఖేలనమునం దేలింతు నుత్కృష్టవ
స్తుకులం బ్రాజ్ఞులఁ దిక్కయజ్వ నమరేశున్ సోము శ్రీనాథునిన్.

ఇందు శ్రీనాథుఁడు పేర్కొనఁబడియుండుటచేతఁ గవి ౧౪౫౦ వ సంవత్సరమునకుఁ బూర్వపువాఁడు కాఁడనుట నిశ్చయము. కవి కత పెదతండ్రినిగూర్చి "లింగక్షోణిపాలుండు యవనసైంధవకాననానలుండు" అని వ్రాసియున్నందున నతఁడు మహమ్మదీయులకును హిందువులకును దక్షిణహిందూస్థానములో యుద్ధములు జరుగుచున్న కాలములో నుండి యుండవలెను. ఇతఁడు తన గ్రంథమును హరిహరనాథున కంకితముచేసి, ఆ విషయమున నిట్లు వ్రాసికొనియున్నాఁడు——

క. ఏచనవు గలదు హరిహర । సాచివ్యము నొంద నన్యజనులకు మది నా
లోచింపఁ దిక్కయజ్వకు । నాచనసోమునకు మఱియు నాకుం దక్కన్.

హరిహరనాథునకుఁ గృతియిచ్చుటచే నితఁడు నెల్లూరిమండలములోనివాఁడని తోఁచుచున్నది. అప్పకవిగాని మఱి యేయితర లక్షణకర్తగాని యీతనిపద్యములను లక్ష్యములనుగాఁ జేకొనియుండ లేదు. ఆహేతువునుబట్టి యితఁడాధునికుఁడని యూహించుటకంటె నీతని గ్రంథమునందు లక్షణవిరుద్ధములయిన ప్రయోగము లుండుటచేత నుదహ

రింప మూసిరని తలఁచుట మేలు. ఇతఁడు కవిత్వ మెట్లుండవలెనో యీ క్రిందిపద్యమునఁ దెలిపియున్నాఁడు—

చ. ఘనతరఘూర్జరీకుచయుగక్రియ గూఢముగాక ద్రావిడీ
స్తనగతిఁ దేటగాక యరచాటగునాంధ్రవధూటిచొక్కపుం
జనుఁగవఁబోలి తేటయును జాటుదనంబును గాకయుండఁ జె
ప్పినయదెపో కవిత్వ మసిపించు నగిం చటుగాకయుండినన్.

వ్యాకరణదోషము లనేకము లున్నను మొత్తముమీఁద నీతని కవిత్వము వయినిజెప్పినట్లే యుండి ప్రౌఢమయి హృదయాహ్లాదజనక ముగా నున్నది. పర్వతరాజపుత్రుఁడయిన యీ వేంకటనాథకవి పంచ తంత్రములోని కొన్ని పద్యముల నిందుదాహరించుచున్నాను—

చ. పలికినమాట నిల్వఁ డెడపందడపం జెడనాడు వచ్చుమె
చ్చుల దిగమ్రింగుఁ దొల్తొలుతఁ జూచినచూపులఁ జూడఁ డేర్పడం
జులకదనం బొనర్చు నెరసుల్ఘటియించు నదల్చివైచుఁ గే
వలనృపసంశ్రయంబు పగవారలకున్వల దివ్వసుంధరన్—

మిత్రభేదము.

చ. ఇట ననుడించి యేమిగత మేగెను చెప్పఁగదన్న యెట్టులె
క్కటిని జరింతు నన్ను తృటికాలము నిన్నెడఁబాసియున్కి దు
ర్ఘటముగదన్న నాకడను గల్గిన యీధృతి యెందుఁ బోయె ని
ప్పటికి విచిత్ర మన్న విధి భద్రవిరోధిగదన్న యెన్నఁగన్—

సుహృల్లాభము.

చ. సురియ కరంబునం గొనక శూరుఁడు నీతికళావిలాసభా
సురుఁడు వధించు వైరి విరసున్ దవుదవ్వులఁ జెంత నుండియున్
సురియ ధరించియున్ మగువచొప్పున నేమియుఁ జేయలేఁడు త
న్నెరలఁగఁజేయు మానవ నికృష్టుఁడు మాటలు వేయునేటికిన్—

సం. విగ్ర.

ఉ. చెప్పిన నంతరంగమున సింగఁడుబూరఁడునై ప్రియంబు సాం
పుప్పతిలంగఁ బల్కెనది యోయి కృతఘ్నుఁడ నీవు కావె యు
ప్పుప్ప సుహృత్తముం డయినయాయన నింటికిఁ దెచ్చి వెల్వ నే
చొప్పునఁ గొల్తు రట్లు పరిశుద్ధసపర్యలఁ గొల్చు టొప్ప దే—

లబ్ధనాశము.

ఉ. నావిని బ్రాహ్మణుండనియె నన్నుఁ బ్రయత్నమెలర్పఁ బట్టికిం
గావలిపెట్టి పుట్టినిలు గాల్పఁగ నీ వటుపోవ నేను నా
లో వివరంబుమాలి మృగలోచన ముంగిస నే కిశోరర
క్షావిధి కొప్ప నేర్పఱచి జాఱితి మందిరబాహ్యభూమికిన్—

అసంప్రేక్ష్యకారిత్వము.

---

11. అయ్యలరాజు రామభద్రుఁడు

ఈకవి యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; తిప్పయార్యుని ప్రపౌత్రుఁడు; పర్వతన్నపౌత్రుఁడు; అక్కయార్యుని పుత్రుఁడు. ఈతఁడు కడపమండలములోని యొంటిమెట్ట గ్రామములోఁ బుట్టి పెరిఁగినవాఁడు; పరవస్తు ముమ్మడి వరదాచార్యునకు శిష్యుఁడయి వైష్ణవమతాభిమాన మును గలిగియుండినవాఁడు. ఇతఁ డొంటిమెట్టలో నున్నకాలములో నచ్చటి పీరరాఘవస్వామిమీఁద నొకశతకమును జేసెను. ఇతఁడు మొట్ట మొదటఁ గృష్ణదేవరాయల యంతిమదశలో విజయనగరములోఁ బ్రవే శించి కృష్ణదేవరాయనిచేతఁ దద్విరచితమయిన సకలకథాసారసంగ్రహ మును తెనిఁగింపఁ గోరఁబడెను. కాని గ్రంథపూర్తి కాకముందే కృష్ణ దేవరాయలు పరమపదము నొందినందున రామభద్రకవి గ్రంథము నాతని కంకితము చేయక యవతారికయందుఁ గృష్ణదేవరాయల ప్రార్థన చేతఁ దానాగ్రంథమును రచించితినని మాత్రము వ్రాసెను. ఈసకల

కథాసారసంగ్రహము శ్రీరామ పురూరవశ్చరిత్రాదులనుగల తొమ్మిది యాశ్వాసముల గ్రంథముగా నున్నది. ఈగ్రంథమునందును రామభద్ర కవి సూక్ష్మబుద్ధి గలవాఁడని యూహించుటకుఁ దగినమార్గము లనేకములు గానఁబడుచున్నను, కవిత్వము ప్రౌఢముగాక వ్యాకరణదుష్టమయి బాలవిరచిత మని సూచించుచున్నది. ౧౫౩౦ వ సంవత్సరమున కొకటి రెండేండ్లముం దీకవి గ్రంథరచన కారంభించినట్లు తోఁచుచున్నది. ఈకవి సకల కథాసారసంగ్రహముయొక్క యవతారికయందుఁ దాను గ్రంథరచన చేయఁబూనుటనుగూర్చి యీక్రిందిపద్యమును వ్రాసి యున్నాఁడు—

ఉ. నన్నయ తిక్కనాదికవినాథులు చెప్పినయట్లు చెప్పలే
కున్నఁ దదుత్తరాంధ్రకవు లూరకయుండిరె తోఁచినట్లు ని
త్యోన్నతబుద్ధిఁ గబ్బములు యోజ రచింపక యందు జ్ఞానసం
పన్నులకావ్యముల్ హరిసమర్పణమై చెలువొందు నెందునున్.

ఈబాలకావ్యమయిన సకలకథాసారసంగ్రహమునుగూర్చి యిందు విస్తరించి వ్రాయక యంఁదలి పద్యములను మాత్రము రెంటిమూటి నిందుదాహరించుచున్నాను—

సీ. కానకకన్న సత్పూనుండు నేఁటికిఁ
గానకకన్న సత్పూనుఁ డయ్యెఁ
బుణ్యజనోత్కర్ణ పురుషుండు నేఁటికిఁ
బుణ్యజనోత్కర్ణ పురుషుఁ డయ్యె
ద్విజముఖ్యులనుగూడితిరుగుబాలుఁడు నేఁడు
ద్విజముఖ్యులనుగూడి తిరుగుటయ్యె
గోత్రపావనుఁ డైనకోమరుండు నేఁటికి
గోత్రపావనుఁ డైనకోమరుఁ డయ్యె

మత్తగజదానధారార్ద్రిమార్గములను
దరులనీడల నెప్పుడుఁ దిరుగువాఁడు
మత్తగజచానధారార్ద్రిమార్గములను
దరులనీడల నెప్పుడుఁ దిరుగుటయ్యె.

చ. చదువు వివేకమూల మని సద్గురుసన్నిధి ధర్మశాస్త్రముల్
చదివి సుధాకరుండు నిజసద్గురుపత్నిని దా రమించుటన్
జదు వవివేకమూలమయి సంభవ మయ్యె నదేమనందు నా
మదనమహత్త్వ మెన్న నసమానపరాక్రమ మెన్నిభంగులన్.

చ. వినుతనిజాంఘ్రుల న్విడిచిపెట్టక పట్టుక నేలప్రాలి లే
వనిగయుకు న్నరుండు బలుబాసల నమ్మిక లిచ్చి యాదరం
బునఁ గరమంది లేవనిడి భూతదయాంచితమానసోన్నతిన్
దనరినయాత్మవంశకథనంబు వచించిన లేచె వాఁడొగిన్.

సకలకథాసారసంగ్రహమును ముగింపకమునుపే కృష్ణదేవరాయలు మృతినొందినందున, ఆదరించుప్రభువులు లేక బీదవాడయిన రామభద్రకవి యందందుఁ దిరిగి గుత్తియప్పలరాజు మొదలైనవారి నాశ్రయించి వారిమీఁదఁ జాటుపద్యములను జెప్పుచుఁ గొంతకాలము జీవనముచేసి, కడపటఁ గృష్ణదేవరాయని యల్లుఁడయిన రామరాజుయొక్క మేనల్లుఁడగు గొబ్బూరి నరసరాజువద్దఁ జేరి తాను తరువాత రచియించిన రామాభ్యుదయము నారాజున కంకితము చేసెను. ఈకవి గుత్తియప్పలరాజుపయిని జెప్పిన చాటుపద్య మొకటి యిందు క్రిందఁ బొందుపఱుచుచున్నాను—

రాజమనోజా! విద్యా! భోజా! దీనార్థికల్పభూజా! రిపుసం
భాజా! వైభవవిజితబిడౌజా! రవితేజ! గుత్తి యప్పలరాజా!

ఈకవి చిరకాలము జీవించి బహుసంతానవంతుఁడయి దారిద్ర్యముచేత బాధపడినవాఁడు. ఈతని సంతానాధిక్యమునుబట్టి యితనిని

జనులు పిల్లల రామభద్రయ్య యనియు పిలిచెడువాడుక గలదు. ఇతఁడు కృష్ణదేవరాయని యాస్థానకవి యన్న పేరే కాని యీతనికాల మంతయు నించుమించుగా నారాయనియనంతరముననే గడపఁబడినది. ఇతఁడు కొంతకాలము పింగళి సూరన్నకును, తరువాత రామరాజ భూషణునకును సమకాలికుఁడుగానుండి కృష్ణదేవరాయల మరణానంతర మున నించుమించుగా నలుబది యేబది సంవత్సరములు బ్రదికి ౧౫౭౦వ సంవత్సరప్రాంతమునందు మృతినొందెను. ఈతఁడు చేసినగ్రంథము రామాభ్యుదయము ముఖ్య మయినది. ఇది మిక్కిలి ప్రౌఢమయిన కవితాధోరణి కలదయి, పదగుంభనమునందు పాండురంగ మహాత్మ్యమును బోలి యమకానుప్రాసములను గలదిగానున్నది. ఈకవి ప్రారంభదశ యందుఁ గృష్ణదేవరాయల దర్శనార్థముగా విజయనగరము వచ్చినప్పు డూరిబయల రామరాజభూషణునిశిష్యు లొకపద్యమును గుర్వాజ్ఞాను సారముగాఁ జెప్పఁబూని కుదురక యాలోచించుచున్నట్లును, వారు చలిచేత వడఁకుచు నచ్చటకు రాఁ దటస్థించిన యీ కవికి చలిమంట వేసి కప్పుకొన బట్ట నిచ్చి యతనిచేత

సీ. మోహోపదేశ తమోముద్రితము లైన
        కనుదమ్ముల హిమాంబు లునుపరాదు
    శ్రమబిందుతారకాగమఖిన్నకుచకోక
        ములఁ జంద్రనామంబు దలఁపరాదు
    శీర్యదాశావృంత శిథిలతాసులతాంత
        మసియాడ వీవన ల్విసరరాదు
    పటుతాపపుటపాక పరిహీణతను హేమ
        మింకఁ బల్లవపుటా ర్చిడఁగరాదు
    లలన కానంగకీలికీలాకలాప
    సంతతాలీఢ హృదయపాత్రాంతరాళ

పూరితస్నేహపూరంబు పొంగిపొరలఁ
జల్లనిపటీరసలిలంబు చల్లరాదు.

అనుపద్యమును చేయించి తాము రచియించిన పద్యముగాఁ జెప్పి తమగురువునకు సమర్పించినట్లును, రామరాజభూషణు డాపద్యముయొక్క చమత్కృతికిసంతోసించి దానిని తనవసుచరిత్రమునందు వేసికొన్నట్లును, ఒక పుక్కిటపురాణము కలదు గాని యది యెంతమాత్రమును విశ్వాసపాత్ర మయినదికాదు. కృష్ణదేవరాయలకాలములో రామరాజభూషణుఁడు కవిత్వమును జెప్పుట కారంభించినట్లే కనఁబడక పోవుటచేత నాతని కప్పటికే శిష్యబృంద మున్నదన్నవార్త యసందర్భ మగుటను బట్టియు, వసుచరిత్రము కృష్ణదేవరాయల యనంతరమున ముప్పదియైదు సంవత్సరములవఱకును బ్రకటింపఁబడక పోవుటచేత నంతటి మహాప్రౌఢగ్రంథమును రచియించిన రామరాజభూషణుఁ డొక్కపద్యమును రచించుట కశక్తుఁ డయి యంతకాలమునకు తరువాత నితరకవియొక్క పద్యమును దనదిగాఁ దనపుస్తకమునందుఁ జేర్చుకొనె ననుటకంటె హాస్యాస్పద మయినమాట వేఱొకటి లేకపోవుటనుబట్టియు, ఈగ్రంథచౌర్యకథ కల్పననిపుణులదేకాని కవిది కాదనుట స్పష్టము.

రామభద్రకవియొక్క కవితాపటిమనుజూచి రామరామభూషణుఁడు మాత్సర్యగ్రస్తుఁ డయి యతఁడుచేసిన రామాభ్యుదయము యొక్క ద్వితీయాశ్వాసములోని "సింహ నఖాంకురచ్ఛిన్నే" త్యాది పద్యమునుజదివినప్పుడు 'పృథుల షడ్జస్వరోద్గీతభిల్లపల్లవాధరాగీతికాకర్ణనాతిభీతిపరవశాత్మపటీరకోటరకుటీరలీనఫణి' యనుచో వీణానాదమునకు ఫణులు బెదరుట స్వభావవిరుద్ధమని తప్పుపట్టె ననియు, దానిపయిని రామభద్రకవి నెమలియొక్క షడ్జస్వరముచేతఁ బాములు భయపడుట స్వభావసిద్ధమే యని సమాధానముచెప్పి యాతని గర్వ

భంగము చేసె ననియు, మఱియొకకథ చెప్పుదురు. కొంచెము మంచి గ్రంథమును రచించిన కవికెల్ల నతని యిష్టదేవతయో సరస్వతియో వచ్చి గ్రంథరచనము చేసిపెట్టినట్లుగా మనలోఁ జెప్పుకొనెడు వాడుక ప్రకారముగా రామభద్రకవికిని రాజునొద్ద దా నాఱునెలలలో గ్రంథమును జేసి తెచ్చెదనని ప్రతిజ్ఞనుపట్టి తేలేక పోయినప్పుడు మితిపెట్టిన కడపటి దినమురాత్రి యాతని యిష్టదైవమయిన శ్రీరాముఁడే రామాభ్యుదయమును జేసిపెట్టి కవియొక్క మానము కాపాడెనని జనప్రతీతి యొకటికలదు. సకలకథాసారసంగ్రహమునందున్న రీతి పద్యములలో ననేకము లీరామాభ్యుదయమునందుఁ గానఁబడుచున్నవి. వానిలోనొక్క దాని నిం దుదాహరించుచున్నాను—

సీ. కానకకన్న సంతానంబుగావునఁ
గానకకన్న సంతానమయ్యె,
నరయ గోత్రనిధానమై తోఁచుగావున
నరయ గోత్రనిధానమయ్యె నేఁడు,
ద్విజకులాదరణవర్ధిష్ణుండు గావున
ద్విజకులాదరణవర్ధిష్ణుఁ డయ్యె,
వివిధాగమాంతసంవేద్యుండు గావున
వివిధాగమాంతసంవేద్యుఁ డయ్యె

గీ. కటకటా దాశరథి సముత్కటకరీంద్ర
కటకలితదానధారార్ద్రకటకమార్గ
గామి యెట్లుచరించు నుత్కటకరీంద్ర
కటకలితదానధారార్ద్రకటకతతుల.

ఈకవి రేఫ శకటరేఫములభేదమును పాటింపక యతిప్రాసము లందు యథేచ్ఛముగా మైత్రి కలుగఁజేసినవాఁడు. ఈతని కవిత్వరీతి దెలుపుట కయి రామాభ్యుదయములోని కొన్ని పద్యముల నిందు వ్రాయుచున్నాను—

చ. ప్రమద మెలర్ప నుగ్రమృగబాధ హరింపఁగ వేఁటమై నర
ణ్యమునకు రా నఘుం బొదవె నక్కట! ధర్మముఁ జాలుఁ గుక్కఁబ
ట్టు మనుట యెంచి విల్లటు తటుక్కన ధారుణి వైచి సారమే
యముల మరల్పఁ బంచె మృగయాక్రియ మాని విభుండు ఖిన్నుఁడై.

అ. ౨.

ఉ. అక్కట! కోసలక్షితివరాత్మజ కానకకన్నముద్దు లేఁ
జక్కసిమించిరాకొమరుఁజందురుఁ డెక్కడ? యధ్వరావనం
బెక్కడ? దైత్యసంహరణ మెక్కడ? ఘోరవనాంతరశ్రమం
బెక్కడ? యెట్టు లంపుమనియె న్మని? నో రెటులాడె నింతకున్?

అ. ౪.

ఉ. వింధ్య మధిత్యకాకటకవిస్ఫుటపాదపపుష్పగుచ్ఛసౌ
గంధ్యము హేమధాతునయకల్పితసంధ్యము బద్ధమేరుసా
గంధ్యము చండకేసరనికాయనిరాకృతభద్రదంతిద
ర్పాంధ్యముఁ గ్రుంగఁద్రొక్కితి మహాగుణభూషణ సత్యభాషణా.

అ. ౫.

ఉ. చూచుటలే దశోకవనిఁ జొచ్చి యటుంజని చూచెదంగదా!
యాచపలాక్షి మజ్జనని యచ్చటనుండినయేని లెస్స లే
దా చతురాననుండు మొదలైన సుపర్వు లెఱుంగఁ జిచ్చులో
వైచెదఁగాక యీయొడలు వానరవీరులమ్రోల వైతునే?

అ. ౬.

12. వెల్లంకి తాతంభట్టు.

(ఇతఁడు కవిచింతామణి యనులక్షణగ్రంథమును జేసిన గొప్ప కవి.) ఈతఁడు వైదికబ్రాహ్మణుఁడు; ఈతని తండ్రి యబ్బయ్య; తల్లి యెఱ్ఱమ్మ. ఈకవి కృష్ణరాయని రాజ్యారంభకాలమునం దుండిన వాఁడు. కొంద ఱీతఁడు కృష్ణదేవరాయని కాలమునకుఁ బూర్వమునందే యుండెనని చెప్పుదురుగాని యితఁడు తనకవిచింతామణిలో నైషధము, భోగినీదండకము, జైమినిభారతము మొదలగు గ్రంథములనుండి యుదాహరణములు గైకొని యుండుటచేతను, జైమినిభారతమును రచించిన పిల్లలమఱ్ఱి పినవీరన్న కృష్ణదేవరాయని తండ్రితాతలకాలములోనే యున్నవాఁ డగుటచేతను, తాతంభట్టు- (కృష్ణరాయనికాలమునకుఁ బూర్వమునం దుండినవాఁ డయినట్టు తోఁచదు) ఇతఁడు కవిచింతామణి యందు వ్యాకరణమును, ఛందస్సును, కావ్యలక్షణమునుగూడఁ గొంత వఱకుఁ జెప్పియున్నాఁడు. ఈలక్షణవేత్త కవిచింతామణియందుఁ దన్నుఁ గూర్చి వేసికొన్నపద్యము నిం దుదాహరించుచున్నాను.—

సీ. శుచి యెఱ్ఱమాగర్భశుక్తిముక్తామణి యబ్బధీమణిసూనుఁ డనఘబుద్ధి,
పావనవశితశాలావతగోత్రుఁ డహార్యధైర్యుండు రామార్యుతమ్ముఁ,
దష్టభాషాప్రక్రియాలబ్ధవర్ణుండు సన్నుతసాహిత్యచక్రవర్తి,
యనవద్యసర్వవిద్యాపారదృశ్వుండు విద్వజ్జనవ్రాతవిశ్రుతుండు,

సకలహరిదంతరాళవిశ్రాంతవిశద
కార్తికచంద్రికాయతకీర్తి కాంతి
హరినిభుం డాస్యవాణీవిహారవసతి
తామసోల్లంఘి వెల్లంకితాతసుకవి.

ఈతఁడు రచియించినది లక్షణగ్రంథమగుటచేఁ గవిత్వనైపుణినిగూర్చి

వ్రాయుట యుచితముకాదు. అయినను గవిత్వరీతిఁ దెలుపుట కయి
కవిచింతామణినుండి రెండుపద్యముల నిందుదాహరించుచున్నాను—

క. ఆది బురాణాగమములు
వేదంబులు నోరఁగాయవేయక నుడువన్,
వాఁడేలా కవివరులకు
మేదిని నెవ్వారు సాటి మించినగరిమన్.

శా. నిన్నాడింపఁగవచ్చు గోపతనయుల్ నెయ్యంబున న్వేదిపై
నున్నా రీకడఁగొమ్ము జోగులు కరాళోన్మత్తులై వచ్చెదర్
వెన్నా మీఁగడయున్ ఫలం బొసఁగెదన్ వేగంబె రా రమ్ము మా
యన్నా యంచును వ్రేతపెట్టు హరి యా యమ్మా నగు న్నాఁటికిన్.

---

13. కుమ్మర మొల్ల.

రామాయణమును తెనుఁగున రచియించిన యీ మొల్ల యాతుకూరి కేసనసెట్టికూఁతురు. ఈమె తనపుస్తకమునం దెక్కడను దన వంశమునుగూర్చి చెప్పుకొనకపోయినను, ఈమె కులాలవంశజాతయని పరంపరగా వాడుకవచ్చుచున్నది. ఈమె నివాసగ్రామము పడుగుపాడనియు, ఈమెయు తిక్కన సోమయాజులు భారతమును దెనిఁగించినప్పుడు లేఖకుఁడుగానుండిన కుమ్మరగురునాథుఁడును సోమయాజుల తండ్రియైనకొమ్మనకు రంగప్ప యనుకుంభకారునిపుత్రివలన జన్మించిరనియు, కొందఱు వ్రాసియున్నారుకాని యీవ్రాఁత నిరాధారమయినది. ఈ మొల్ల తిక్కనసోమయాజికాలములోనే యుండిన దయిన పక్షమున,

"స్తుతగుణోద్దాము నాచన సోము భీము
నవ్యమంజులవాగ్ధుర్యు నన్నపార్యు
రసికుఁ డైనట్టి శ్రీనాథు రంగనాథు"

అని తనరామాయణమందలి కవిస్తుతిలోఁ దిక్కనసోమయాజి కించుమించుగా నిన్నూఱుసంవత్సరములతరువాత నున్న శ్రీనాథుని స్తుతించుట సంభవింపనేరదు. కాఁబట్టి మొల్ల శ్రీనాథునికాలమునకుఁ దరువాత నున్నదనుటకు సందేహము లేదు. ఈమె కృష్ణదేవరాయల కాలములోని యల్లసాని పెద్దనాదుల నెవ్వరిని స్తుతియించి యుండక పోవుటచేత మొల్ల యాకాలమున కెంతో తరువాతిది కాదనియు స్పష్ట పడుచున్నది. ఈమె కృష్ణదేవరాయలకాలములోనే యున్నట్టు కథ లనేకములున్నవి. మొల్ల యాకాలమునందలిది కాదని సంశయించుటకు హేతువులేమియు గానరానందునను, ఆకాలపుకవులను స్తుతింపనందునను, ఆమె కృష్ణదేవరాయలకాలమందే యున్నదని నిశ్చయింపవలసి యున్నది. ఇప్పుడున్న తెలుఁగుగ్రంథములను బట్టిచూడఁగా, ఆంధ్ర కావ్యములను జేసినస్త్రీలలోనెల్ల నీమెయే ప్రాచీనురాలుగాఁ గానఁబడు చున్నది. ఈమె తన రామాయణములో,

"... ... ...గోప
వరపుశ్రీకంఠమల్లేశువరముచేత
నెఱిఁ గవిత్వంబు చెప్పంగ నేర్చినాను"

అని చెప్పుకొనుటచేత నీమె నివాసస్థలము నెల్లూరిమండలము లోని గోపవర మని తెలియవచ్చుచున్నది. ఈమె కవిత్వమునుజూచి తెనాలిరామకృష్ణుఁ డింటిపేరును గూర్చి యడిగి యాక్షేపించిన ట్లొక కథ కలదుగాని యది యిం దుదాహరింపఁదగినదికాదు. అక్కడక్కడఁ గొన్నివ్యాకరణదోషము లున్నను మొత్తముమీఁద నీమెకవిత్వము మిక్కిలి మృదువయి మధుర మయి రసవంతముగా నున్నది. ఈరామా

యణమును గొంతకాలముక్రిందటివఱకును వీధిబడులలో బాలురకు పాఠమునుగాఁ జెప్పుచుండిరి. ఇది పురుషులుచెప్పినగ్రంథములలో ననేకములకంటె మనోజ్ఞమై ప్రౌఢమై యున్నది. మొల్ల రామాయణము నందలి కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. రాజులు కాంతియందు, రతిరాజులు రూపమునందు వాహినీ
రాజులు దానమందు, మృగరాజులు విక్రమకేళియందు, గో
రాజులు భోగమందు, దినరాజులు సంతతతేజమందు, రా
రాజులు మానమందు, నగరంబున రాజకుమారు లందఱున్.

బాలకాండ.

చ. సుడిగొని రాముపాదములు సోఁకినధూళి వహించి రాయి యే
ర్పడ నొకకాంత యయ్యెనఁట పన్నగ నీతనిపాదరేణు వి
య్యెడ వడినోడసోఁక నిది యె ట్లగునోయని సంశయాత్ముఁడై
కడిగె గుహుండు రాముపదకంజయుగంబు భయంబు పెంపునన్.

అయోధా

చ. చించెద దైత్యసంఘములఁ జంధలు ఖండలు చేసి బ్రహ్మ బా
ధించెద లోకపాలకులఁ ద్రెళ్ళఁగ నేసెద భూతలంబు గ్ర
క్కించెద శైలజాలములఁ గీటడఁగించెద భూమినందనన్
గాంచెదఁ దల్లడిల్లకుము కంజహితాన్వయవార్ధిచంద్రమా.

అరణ్యకాం.

ఉ. సాలముపొంత నిల్చి రఘుసత్తముఁ డమ్మరివోసి శబ్దవి
న్మాలముగాఁగ విద్దివిచి ముష్టియు దృష్టియుఁగూర్చి గోత్రభృ
త్కూలము వజ్రపాతహతిఁ గూలువిధంబునఁ గూలనేసె న
వ్వాలిఁ బ్రతాపశాలి మృదువందనశీలి సురాలి మెచ్చఁగన్.

కిష్కింధాకాం.

శా. వీరాలాపము లాడ నేల వినుమీ విశ్వప్రకాశంబుగాఁ
బారావారముఁ గట్టి రాఘవుఁడు కోపస్ఫూర్తి దీపింపఁగా
ఘోరాజి న్నినుడాసి లావుకలిమిన్ గోటీరయుక్తంబుగాఁ
గ్రూరాస్త్రంబుల మస్తముల్ దునిమి భుక్తుల్సెట్టు భూతాళికిన్.
సుందరకాం.

మ. అనఘుం డుజ్జ్వలచాపదండమున బ్రహ్మాస్త్రంబుసంధించి యొ
య్యనఁ గర్ణాంతముగాఁ గడుం దివిచి ప్రత్యాలీఢపాదస్థుఁడై
దనుజాధీశ్వరుబాహుమధ్యము వడిం దాఁకంగ లక్ష్యంబుగాఁ
గొని బిట్టేసె నదల్చి తీవ్రతరమౌకోపంబు దీపింపఁగన్.
యుద్ధకాం.

14. పిడుపర్తి సోమనాథుఁడు

ఇతఁడు శైవబ్రాహ్మణుఁడు; పిడుపర్తి బసవనారాధ్యుని పుత్రుడు. ఇతఁడు పాల్కురికి సోమనాథుఁడు రచియించిన ద్విపద బసవపురాణమును తెనుఁగున నేడాశ్వాసముల పద్యకావ్యముగా రచియించెను. పాల్కురికి సోమనాథుఁడు రచియించిన పండితారాధ్యచరిత్రము మొదలయిన గ్రంథములను శ్రీనాథాదు లీకవికిఁ బూర్వమునందుఁ బద్యకావ్యములనుగాఁ జేసిన ట్లీబసవపురాణపీఠికయం దీకవి యీక్రింది పద్యముచేఁ జెప్పియున్నాఁడు.—

సీ. విరచించె జైమిని వేదపాదస్తవం బొకపాదమున వేదయుక్తి నిలిపి
హరభక్తి వైదికం బని శ్రుతు లిడి చెప్పెఁ బ్రతిభ సోమేశుఁ
డారాధ్యచరిత

సరవి శ్రీనాథుఁ డాచరిత పద్యప్రబంధముచేసె ద్విపదలు తఱుచునిలిపి
యాతండె పద్యకావ్యముచేసె నైధష మంచితహర్ష వాక్యములఁ బెట్టి
సోమగురువాక్యములు పెట్టి భీమసుకవి
గరిమ బసవపురాణంబు గణనఁజేసెఁ
గానఁ బూర్వకావ్యము వేఱుగతిరచించు
వారి కాదికావ్యోక్తులు వచ్చునెగడు.

"సోమగురువాక్యములుపెట్టి భీమసుకవి...బసవపురాణంబు... చేసె" నన్న పయివాక్యమునుబట్టి వేములవాడ భీమకవి నన్నయభట్టారకుని కాలములోనివాఁడుగాక పాల్కురికి సోమనారాధ్యున కెంతో తరువాత నుండినవాఁ డయినట్టు విస్పష్టమగుచున్నది. ప్రతాపరుద్రునికాలములో ప్రతాపరుద్రుని మంత్రులలో నొకఁడును తన శిష్యుఁడును నయిన యింౘుటూరి యన్నదండనాథుని సాహాయ్యముచేత పాల్కురికి సోమనార్యుఁడు గ్రంథకర్త పూర్వులకు దోకిపర్తియను నగ్రహారమిప్పించెను. ఈయగ్రహారమునకుఁ దరువాత భంగము కలుగఁగా గ్రంథకర్తయొక్క ముత్తాతయైన సోమనారాధ్యుఁడు ప్రౌఢదేవరాయని రాజ్యకాలములో దానిని మరల సంపాదించెను. ఈసంగతి బసవపురాణములో నీక్రింది పద్యమునందు జెప్పఁబడినది.

క. ఆదిన్ బ్రతాపుఁ డిచ్చిన
యాదోకిపురంబు నడుమ నంకిలి పడినన్
మోదమునఁ బ్రౌఢరాయము
హీదయితునినలనఁ దెచ్చె నెల్లరు నెఱుఁగన్.

కృతికర్తయైన సోమనాథునితండ్రి బసవయ్య, బసవయ్యతండ్రి దేవయ్య, దేవయ్యతండ్రి సోమనాథుఁడు. కాఁబట్టి ప్రౌఢదేవరాయని రాజ్యకాలములో దోకిపర్తి యగ్రహారమును మరల సంపాదించిన

యీ సోమనాథుఁడు కవికి ముత్తాత. ప్రౌఢదేవరాయఁడు హూణశకము ౧౪౨౨ వ సంవత్సరము మొదలుకొని ౧౪౪౭ వ సంవత్సరమువఱకును రాజ్యము చేసినందున, అతని రాజ్యకాలములో నుండిన సోమనాథుని మునిమనుమఁడు తరువాత నలువది డెబ్బది సంవత్సరముల కుండి యుండును. కాఁబట్టి యీ కవి ౧౫౧౦ వ సంవత్సరప్రాంతములఁ గృష్ణ దేవరాయని రాజ్యారంభకాలములో నున్నాఁడని చెప్పవచ్చును. బసవ పురాణకథానాయకుఁడైన బసవేశ్వరుఁడు శ్రీశైలమునకు పశ్చిమమున నుండు హింగుళేశ్వరాగ్రహారమునందు వాసము చేయుచుండిన శివభక్తుఁ డయిన మండంగి మాదిరాజను బ్రాహ్మణుని పుత్రుఁడు. ఇతఁడు శివుని వాహనమైన నందియొక్క యంశముచేత భూమిమీఁద నవతరించెనని శైవులు నమ్ముచున్నారు. తల్లిదండ్రు లీతని కుపనయనము చేయఁ బోయినప్పుడు చేసికోక తాను శివునిఁదప్ప వేఱొకని గురువునుగా నంగీక రింపనని నిరాకరించెను. ఇతఁడు పెద్దవాఁడయిన తరువాత పదునొకండవ శతాబ్దమునందు కళ్యాణపురాధీశ్వరుఁడుగా నున్న బిజ్జలరాజునొద్దఁ జేరి యాతని దండనాయకుని కూఁతునయిన గంగాంబను వివాహము చేసి కొని కడపట బిజ్జలరాజునకు మంత్రియయ్యెను. ఈతఁడే యీ దక్షిణ హిందూస్థానమునందు వీరశైవమతోద్ధారణము చేసినవాఁడు. ఈతని మేనల్లుఁడయిన చెన్నబసవన్న కూడ వీరశైవమును దేశమునందంతటను వ్యాపింపఁజేసెను. బసవపురాణమునందు బసవేశ్వరుని మహిమ లనేక ములు చెప్పఁబడియున్నవి.

సోమనాథకవియొక్క కవిత్వరీతిఁ జూపుటకయి కొన్ని పద్యముల నిందుదాహరించుచున్నాను :—

ఉ. ఖండశశాంకశేఖరు నఖండమహత్త్వమె కాని యాత్మ వే
ఱొండు దలంపఁ డెన్నఁడు పయోజభవాన్వయదుగ్ధవార్ధిచం

ద్రుంషు దురత్యయోరుభవదోషవిదూరమనఃప్రచారుఁడై
మంషఁగి మాదిరాజు గుణమండితవందితుఁ డొప్పు నప్పురిన్ — ఆ. ౧

ఉ. పట్టకు పట్ట కింక **వృషభం** బది **మాటలు** చెల్లినప్పుడే
పెట్టితి లింగముద్ర యవె బీరము తప్పఁగఁ బట్టి తేనియున్
గొట్టుమునీశిరంబు ధరఁగూలఁగ మాబసవన్నయాన చే
పట్టులఁ గాచుచెల్ల శివభక్తులకుఙ్ బిరుదంబుగావునన్ — ఆ. ౫

శా. ఆనందాశ్రుపయోధి సిట్టవొడువన్ హర్షోత్కరోమాంచన
శ్రీ నెమ్మేసికి భూషణంబుగ లసద్గ్రీవోద్గమద్గద్గద
ధ్వానమ్ముల్ గురుకర్ణసత్వములుగాఁ దాత్పర్యముఙ్ భక్తియున్
లోనన్ గీల్కొసయున్న యాత్మసుతు నాలోకించి మై పెంచుచుఙ్ — ఆ. ౭

---

15. పిడుపర్తి బసవకవి

ఇతఁడు శైవబ్రాహ్మణుఁడు. బసవపురాణమును పద్య కావ్యముగా రచియించిన సోమనాథుని తమ్ముఁడయిన పాలనార్యుని పుత్రుఁడు. కాఁబట్టి యీ కవియు నించుమించుగా సోమనాథుని కాలమునందే యున్నవాఁడగుటచేత ౧౧౯౦ వ సంవత్సరప్రాంతమునం దున్నవాఁడని చెప్పవచ్చును. ఇతఁడు పాల్కురికి సోమనాథుఁడు రచియించిన ప్రభులింగలీలను తెనుఁగున నైదాశ్వాసముల పద్యకావ్యమునుగా రచించెను. ఈ ప్రభు లింగలీలయందు బసవేశ్వరునికిని బసవేశ్వరుని మేనల్లుఁడయిన చెన్నబసవన్నకును గురువయిన యల్లమప్రభుఁడను జంగముదేవరయొక్క కథ చెప్పఁబడియున్నది. పిడుపర్తి బసవకవియొక్క కవనవిధము తెలియుటకై ప్రభులింగలీలనుండి రెండుమూడు పద్యముల నుదాహరించుచున్నాను.—

ఉ. ఊరును నిల్లుఁ బల్లియలు నొల్లక సల్లలితాంతరంగులై
ఘోరతరాటవిన్ ఘననికుంజములన్ సెలయేళ్ళచెంత శృం
గారవంబులన్ భయదగహ్వరసీమఁ దపంబుఁ జేసి పెం
పారుమహామునీశ్వరులయాత్మలుఁ దత్తఱ మందె నత్తఱిన్. ఆ. ౧.

ఉ. చిత్తసరోజ మిష్టమునఁ జేరిచి చూపులు ప్రాణలింగమున్
హత్తఁగఁ జేసి భావమున కంచితతృప్తి యొసంగి సంగముల్
రిత్తలు చేసి యెందును జరింపఁగ నేరిచి తేని నీవ య
త్యుత్తమలింగమూర్తి వివి యొప్పుగఁ జేకొను సిద్ధరామనా. ఆ. ౩.

మ. బసవయ్యా భవదీయమందిరమునన్ భక్తిన్ సదాభోజనం
బసలారంగ నొనర్చుజంగమము లాత్యాసక్తి నాఁకంటిచే
విసువంగా నికనేల తామసము లీవిన్ వారిఁ దోడ్తెచ్చి మీ
రసమానస్థితి నారగింపఁ గదరయ్యా హాయిగా నేఁటికిన్. ఆ. ౪.

---

16. కోట శివరామయ్య

ఈకవి సానందోపాఖ్యాన మను నాలుగాశ్వాసముల పద్యకావ్యము రచించెను. ఇతఁడు శూద్రుఁడు; కౌశికగోత్రుఁడు; కోట బాపనయ్య పుత్రుఁడు; కాళహస్తిపుర నివాసుఁడు. ఇతఁడు తాను కృష్ణదేవరాయలకాలములో నున్నధూర్జటికవి శిష్యుఁడ నని గ్రంథములో జెప్పుకొని యుండుటచేత ౧౫౨౫ - ౧౫౫౦ వ సంవత్సరములకు మధ్య నుండియుండును. సానందోపాఖ్యానమునందు లక్షణవిరుద్ధము లైన ప్రయోగములు కొన్ని కానఁబడుచున్నవి. కవిత్వము మృదువుగానే యున్నది. ఈ గ్రంథమునందలి రెండు మూడు పద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. గారెలు బూరె లిడ్డెనలుఁ గమ్మనిదోసెలుఁ జక్కిలంబులున్
జారులుఁ గూరలున్ ఫలరసంబులుఁ దేనెలుఁ బానకంబులున్
సారెలుఁ బాయసాన్నములుఁ జక్కెర లప్పడంబులున్
బేరిననేతులుం జెఱకుబిళ్ళలుఁ జల్లనినీరుమజ్జిగల్. ఆ. ౧.

ఉ. పాపము చేయవద్దనుచుఁ బల్మఱుఁ బెద్దలు చెప్పిన న్మహా
కోపముమీఱ వారియెడఁ గుత్తుకబంటివిషంబు గ్రక్కుచున్
బాపము గీప మేడది నెపం బిడి జీవము దాఁటిపోయి యే
దాపున నెందుఁ బోవునో నిదాన మెఱుంగ రివేటిబోధనల్. ఆ. ౨.

మ. జమువెంటం బురవీధులం జనుచు భాస్వత్పట్టణశ్రీవినో
దము లీక్షింపుచుఁ జూడఁజూడ మఱియుం దండోపతండంబులై
భ్రమ కల్పించుపురీవిశేషములకుం బ్రాజ్యాద్భుతానీతుఁడై
యమునిం గన్గొని పల్కె సంయమి మరందానందసాంద్రోక్తులన్. ఆ. 3.

---

17. కుమార ధూర్జటి

ఈకవికి నిజ మయినపేరు వేంకటార్యుఁడు. ఇతఁడు పాకనాఁటి నియోగిబ్రాహ్మణుఁడు, కాళియామాత్యుని పుత్రుఁడు; ధూర్జటికవి పౌత్రుఁడు. ఈకవి యాకుపీటిరా జయిన చినవేంకటాద్రియొక్క కోరిక మీఁదఁ గృష్ణరాజవిజయ మనుపేర కృష్ణదేవరాయల చరిత్రమును శ్రీరామాంకితముగా రచియించెను. ఈతని కవిత్వము మిక్కిలి రసవంతమైనది. ఇతఁడు కృష్ణరాజవిజయ మనెడి యీనాలుగాశ్వాసముల గ్రంథమును మాత్రమే కాక సావిత్రీచరిత్రము, ఇందుమతీవివాహము మొదలయిన గ్రంథములును గూడఁ జేసినట్టు తెలియవచ్చుచున్నది. కృష్ణరాజవిజ

యమునందలి యీక్రింది కవిస్తుతి పద్యమువలననే యీకవియొక్క ప్రౌఢిమ తేటపడుచున్నది—

సీ. వాక్ఛాసనుం డగువాని నిక్కంబుగా నల్లబ్రహ్మదేవుఁ డేయని నుతింతుఁ
గుండలీంద్రసమాఖ్యుఁ గొమరొందుకవిచంద్రు ననువొంద శేషాహి యని తలంతు
శ్రీనాథవిఖ్యాతిఁ జెన్నొందుబుధవర్యుఁ బురుషోత్తముఁ డటంచుఁ బుజ్జగింతు
ధూర్జటిప్రౌఢిచే నూర్జితుం డగువాని సాక్షాచ్ఛివుండని సంస్మరింతు
నవని మఱియును వెలసిన యాంధ్రకవుల
నాధునిక పూర్వకవుల యశోధనికుల
సారసాహిత్యసౌహిత్యసరణి వెలయ
వర్ణన లొనర్తు రమణీయవాక్యములను.

ఈకవి తన్నుఁగూర్చి కృష్ణరాజవిజయమునం దీక్రిందిరీతిగాఁ జెప్పుకొన్నాఁడు—

సీ. నను భరద్వాజగోత్రుని సదాపస్తంబసూత్రుని బాంధవస్తోత్రపాత్రుఁ
బాక నాఁ టార్వేలవంశప్రసిద్ధుని ధూర్జటిపౌత్రు బంధురచరిత్రు
సద్గురుకారుణ్యసంప్రాప్తవిద్యావిహారుని శ్రీకాళహస్తినిలయ
చిత్ప్రసూనాంబికాశ్రీకరానుగ్రహాసాదితకవితారసజ్ఞహృదయు
సారరచనాధురీణుఁ గుమారధూర్జ
టిప్రధానాగ్రగణ్యుఁ బటీరహీర
మహితసత్కీర్తిఁ గాళియామాత్యపుత్రు
వేంకటార్యుని బిలిపించి వేడ్క ననియె.

క. బాలుఁడ వయ్యును విద్యా । శీలుఁడవు గభీరమధురశృంగారకళా
లాలితచాతుర్య కవి । త్వాలోచననిపుణ వేంకటామాత్యమణీ.

ఉ. చిత్రముగాఁగఁ బిన్నపుడె చెప్పితివౌ రసము ల్పెలంగ సా
విత్రిచరిత్రముక్ మిగుల వేడుక నిందుమతీవివాహమున్

స్తోత్ర మొనర్ప నద్భుత మగుసూక్తిగతిన్ రచియించితోఁ గదా
ధాత్రిఁ బ్రసిద్ధిఁగాంచితివి ధన్యుఁడ వౌర కుమారధూర్జటీ.

*   *   *   *   *

చ. తెలుఁగునఁ జెప్ప నేర్చినసుధీజను లెల్ల సెబాసు ధూర్జటీ
బళి యనఁ దళ్కుఁగుళ్కువగఁ బాటిలు తేటతెనుంగుమాటలన్
మెలఁకువగాంచు బెళ్కుఁజిగిమించఁ బ్రబంధములన్ ఘటించితౌ
పలుకులముద్దరాలిమిహిబంగరుటందెరవల్ చెలంగఁగన్.

*   *   *   *   *

క. మాకరుణకుఁ బాత్రుండవు। ప్రాకటగతిఁ బద్యకావ్యఫణితిం జెపుమా
శ్రీకృష్ణరాయచరితము । నీకవితాప్రౌఢి సుకవినికరము మెచ్చన్.

శ్రీకృష్ణరాజవిజయములోని యీక్రిందిపద్యమునుబట్టి చూడఁగాఁ గృష్ణదేవరాయల పట్టాభిషేకమహోత్సవమునాఁటి కార్వేటి బుక్కరాజు జీవించియున్నట్టే కనఁబడుచున్నది.—

సీ. చక్కెరవిలుకాని చక్కఁదనముగల్గి చొక్కమా నార్వేటి బుక్కరాజు,
సాకల్యముగఁ గీర్తి సర్వదిక్తటులందుఁ బ్రాకటస్థితిమించు నౌకువారు,
కంటకరాజన్య గర్వంబు లడఁగించి లీలచే మించునంద్యాలవారు,
ఘాటీశిరాఘాట ఘోటీహతవిరోధికోటులై వెలయు వెల్గోటివారు.
చండతరశౌర్యు లగు పెమ్మసానివారు
బూదహాళివారు మొదలైనభూమిపతులు
గొలువఁ బట్టాభిషిక్తుఁడై చెలువుమీఱె
రమ్యగుణపాళి శ్రీకృష్ణరాయమౌళి.

ఈ కవియొక్క తాత కృష్ణదేవరాయుని యాస్థానమునం దున్నవాఁడగుటచేతను కృష్ణరాజవిజయమును జెప్పినప్పటి కితఁడు బాలుఁడని చెప్పఁబడియుండుటచేతను కృష్ణరాజవిజయము ౧౫౫౦ వ సంవత్సర

ప్రాంతమునందు రచియింపఁబడి యుండును. ఈ కవియు ౧౫౬౦-౭౦ సంవత్సరముల వఱకు జీవించియుండునని యూహింపఁదగియున్నది. ఈతని కవిత్వము మృదుమధుర వాక్యరచనాధురీణమయి కర్ణరసాయనముగా నుండును. ఈతని కవనధోరణిని దెలుపుటకుఁ గృష్ణరాయ విజయములోని రెండుమూడు పద్యము లిందుదహరింపఁబడుచున్నవి—

ఉ. తీవిగ నౌకువారును గడిందిరహిన్ వెలుగోటివార లా
రావెలవారుఁ గూడుకొని రాత్రిపగల్ చతురంగసేనతో
నేవగఁ జూచినన్ దివియ నెంతయు శక్యముగాని నుర్గమా
భూవరమౌళి గాంచి యొకపూఁటనె తీసెదనంచు నుగ్రుఁడై.

శా. ఔరా చూచితిగాదె రాయలబలం బౌరౌర యేనుంగు ల
య్యారే యీ చతురంగసంఘము లహాహా మన్నెవారల్ బళీ
ధీరుల్ రాజకుమారు లంచు మది నెంతేనద్భుతం బొందుచున్
ఘోరన్ శక్యమె యీనృపాలమణితో భూరిస్థిరప్రౌఢిమన్—ఆ. 3

మ. చెలువల్ త్రోడ్కొనిరా మణీఖచితమంజీరధ్వను ల్మ్రోంచఁగాఁ
దళుకుం జెక్కు మెఱుంగుటద్దములపైఁ దాటంకరత్నద్యుతుల్
వెలయం దా గజరాజపుత్రి యగుతీవిం దెల్పుచందాన వ
చ్చె లతాంగీమణి మందమందగతులన్ శృంగార ముప్పొంగఁగన్-ఆ. ౨

18. దోనూరి కోనేరుకవి

ఈ కోనేరుకవి తెలుఁగున బాలభాగవతమును రచియించెను. ఇతఁడు నియోగి బ్రాహ్మణుఁడు; శ్రీవత్సగోత్రుఁడు; ఆశ్వలాయన సూత్రుఁడు; దోనూరి నాగయ్యమంత్రి పుత్రుఁడు. కవి తనవృత్తాంతమును బాలభాగవతములోని యీ క్రిందిపద్యమునందుఁ జెప్పుకొని యున్నాఁడు :—

సీ. శ్రీమదహోబిలశ్రీనృసింహసమగ్రకరుణావిశేషప్రకాశమహితు
భాసురసంస్కృతప్రాకృతాదికశాస్త్ర భాషాకవిత్వ సౌభాగ్యనిపుణు
జనవర్ణితాశ్వలాయనసూత్రపావను శ్రీవత్సగోత్రాబ్ధిశిశిరకరుని
సారస్యవినుతు దోనూరి నాగయమంత్రిపుత్రుఁడనైనట్టి బుణ్యచరితుఁ
జతురభూనాయకాస్థాన సకలసుజన
వందితుని నన్నుఁ గోనేరు నాథసుకవి
నర్థిఁ బిలిపించి సత్కార మాచరించి
పలికె నిట్లని గంభీరభాషణముల.

ఇట్లు కవిని బిలిపించి గ్రంథరచన చేయుమన్నది తిరుమలరాజు. ఈ తిరుమలరాజు వసుచరిత్రము కృతినందినయతఁడుగాక యాతని పెద్ద తండ్రి కుమారుఁడయిన మఱియొక తిరుమలరాజు. బాలభాగవతమునందుఁ జెప్పఁబడిన వంశానుక్రమమునుబట్టి యార్వీటి బుక్కరాజునకు తిమ్మరాజనియు, కొండరాజనియు, శ్రీరంగరాజనియు ముగ్గురు కొమాళ్లు గలరు. వారిలో నగ్రజుఁ డయిన తిమ్మరాజునకు భార్యయైన గోపమాంబ వలన తిరుమలరాజనియు, విఠలరాజనియు, చినతిమ్మరాజనియు, పాప తిమ్మరాజనియు, నలుగురు పుత్రులు గలిగిరి. వీరిలో జ్యేష్ఠుఁడయిన తిరుమలరాజు కాలమునం దీ బాలభాగవతము రచింపఁబడినది. ఈ తిరుమల రాజు తండ్రియగు తిమ్మరాజునకు తమ్ముఁడయిన శ్రీరంగరాజునకు కోన

రాజు, తిమ్మరాజు, రామరాజు, తిరుమలరాజు, వేంకటరాజు అని యైదుగురు కొడుకులు. వీరిలో మూడవవాఁడైన రామరాజు కృష్ణదేవ రాయల యల్లుఁడు. ఈ రామరాజువద్దనే వసుచరిత్రమును రచించిన రామరాజభూషణుఁడు మొదట ఆస్థానకవీశ్వరుఁడుగానుండి యాతని మరణానంతర మతని తమ్ముఁడైన తిరుమలదేవరాయనికి వసుచరిత్రము నంకితము చేసెను. దీనినిబట్టి చూడఁగా శ్రీరంగరాయని పుత్రులైన రామరాజ తిరుమలదేవరాజులును, తిమ్మరాజుపుత్రుఁడైన తిరుమలరాజును పినతండ్రి పెదతండ్రి పుత్రు లగుటచేత సమకాలికులని యేర్పడు చున్నది. వీరిలో రామరాజు క్రీస్తుశకము ౧౫౪౨ వ సంవత్సరము మొదలుకొని ౧౫౬౫ వ సంవత్సరము వఱకును రాజ్యము చేసి యా సంవత్సరమునందు తాలికోటయుద్ధములో మృతుఁడగుటచేతను, ఆతనితమ్ముఁడైన తిరుమలదేవరాయలు ౧౫౬౫ వ సంవత్సరము మొదలుకొని ౧౫౭౩ వ సంవత్సరము వఱకును రాజ్యము చేసియుండుటచేతను, బాల భాగవతమును చేయించిన తిరుమలరాజుసహిత మించుమించుగా ౧౫౫౦ వ సంవత్సరప్రాంతమునం దనఁగా పదునాఱవశతాబ్ద మధ్యమునం దుండియున్నాఁ డనుట స్పష్టము. కడపమండలములోని కడప పట్టణము నకు పశ్చిమోత్తర దిగ్భాగమునందు ౧౬ మైళ్ళ దూరములోనున్న యెఱ్ఱగుడిపాడు గ్రామములోని విష్ణ్వాలయములోని శాలివాహనశకము ౧౪౭౩ వ సంవత్సరమునం దనఁగా హూణశకము ౧౫౫౧ వ సంవత్సరమునందు తిమ్మరాజు కుమారుఁడయిన తిరుమలరాజు దానము చేసి నట్టున్న శిలాశాసనముకూడ ఈ యంశమును స్థాపించుచున్నది. అయినను బళ్ళారిమండలములోని విజయనగరమునందలి హజారరాముని దేవాలయములో ముఖద్వారముయొక్క దక్షిణపు గోడమీఁద తిమ్మరాజు కుమారుఁ డయిన తిర్మలరాజు శాలివాహనశకము ౧౪౪౨ వ సంవత్సరమునందు దానముచేసినట్టు శిలాశాసన మొకటి కానఁబడుచున్నది.

దీనినిబట్టి చూడఁగా నితఁడు రామరాజు పెదతండ్రికుమారుఁ డగుటచేత రామరాజుకంటె పెద్దవాఁ డయినట్టును, సామంత రాజయిన యీ తిమ్మ రాజు ముందుగా మృతుఁడగుటచేత నాతని కుమారుఁ డయిన తిరుమల రాజు రామరాజుకంటె పదిసంవత్సరములు ముందుగానే రాజ్యమునకు వచ్చినట్టును, ఊహింపఁదగియున్నది. అందుచేత నీ తిరుమలరాజు క్రీస్తు శకము ౧౫౨౦వ సంవత్సరము మొదలుకొని ౧౫౫౧ వఱకును రాజ్యముచేసినట్టు రూఢిగా చెప్పవచ్చును. కాఁబట్టి దోనూరి కోనేరు నాథ కవియు పదునాఱవ శతాబ్దముయొక్క పూర్వార్థమునందే యుండి, తిరుమలరాజుయొక్క రాజ్యారంభదశలోనే బాలభాగవతమును రచి యించి యుండును. బాలభాగవతము తిరుమలరాజుయొక్క ప్రేరణచేతనే రచియింపఁబడినను, అది తిరుమలరాజున కంకితము చేయఁబడక యాతని ప్రార్థనమీఁద మృతుఁ డయిన యాతనితండ్రి తిమ్మరాజున కంకితము చేయఁబడినది. తెలుఁగు పుస్తకములయందును తామ్రశాసనాదుల యందును తిమ్మరాజునకు తిరుమలరాజనియు, తిరుమలరాజునకు తిమ్మ రాజనియు యథేచ్ఛముగా పర్యాయపదములవలె వాడఁబడినవి. సంస్కృత పండితులయిన పురాణవిద్వాంసు లొకరు రాచూరికోటలో నొక గుమ్మ మునకు దక్షిణముగా గోడలోఁగూర్చిన సుమారు నలువదియొక్క యడుగుల పొడుగును మూడడుగుల వెడల్పును గల రాతిపలకమీఁద చెక్కిన తెలుఁగు శాసనములో:

"శ్రీమతు మీసరగండగోత్ర గంగయ్యరెడ్డివారు పెద్దమానపురము నందు సుఖసంకథావినోదంబున పృథివీరాజ్యము చేయుచుండగాను తద్రాజ్య రత్నామణి అయిన శ్రీనారాయణదేవ దివ్యశ్రీపాదపద్మా రాధక సకలజన ప్రతిపాలక పరబలసాధక సకలదయాసాధక పుణ్య గుణసనాథ విఠ్ఠలనాథ భూనాథుండు ఆదావాని తుంబికి మాగుద హోలువదుర్గాలు సాధించి తదనంతరంబు రాచూరి పట్టణ పట్టసాభి

ముఖుండై సుఖసంకథావినోదంబున పృథివీరాజ్యము సేయుచునుండి శకవర్షంబులు ౧౨౧౬ అగు జయసంవత్సర మార్గశిర శుద్ధ దశమి రవివాసరంబునందు స్వరాష్ట్ర సమస్త ప్రజారక్షణార్థము గిరిదుర్గము రచియించెను."

అని కాకతీయప్రభువుల కాలములో శాలివాహన శకము ౧౨౧౬ వ సంవత్సరమునం దనఁగా క్రీస్తుశకము ౧౨౯౪ వ సంవత్సరమునందు గోత్రా గంగయ్యయు నొకానొక విఠ్ఠలరాజును ఉన్నట్లు చెప్పఁబడి యుండుటచేతను.

ఉ. "బొంకనిధర్మజుం డనుగఁబోవనిపన్నగశాయి యాజిలోఁ
గొంకనియర్జునుండు కలకుందులు లేనిశశాంకు డెన్నఁడుం
గ్రుంకనిభానుఁ డన్యసతిఁ గోరనిజిష్ణుఁ డనంగఁబొల్చు ధ
ర్మాంకుఁడు విఠ్ఠలక్షితివరాగ్రణి మానధనాగ్రగణ్యుఁడై

మ. తనకు న్నెచ్చెలి యైనక్రీడిపయి నంతర్మోహబంధంబు పో
వనివాఁడై హరి విఠ్ఠలేశ్వరుఁడు తద్వంశంబునన్ సంపదల్
తనర న్నల్వదియేవత్సరంబు లగునంతం దిమ్మభూపాలనం
దనుఁడై విఠ్ఠలరాజమూర్తి పాలిచెన్ ధర్మావనోద్యోగితన్"

ఇత్యాది పద్యములతో బాలభాగవతమునం దొకవిఠ్ఠలరాజు వర్ణింపఁబడియుండుటచేతను, ఆవిఠ్ఠలరాజే యీవిఠ్ఠలరాజని భ్రమించి యీకవియు విఠ్ఠలరాజును పదునాల్గవశతాబ్దారంభమునం దున్నట్లు వ్రాసియున్నారు. కాని వారు వివరించినకాలము సరియైనది కాదు. కాకతీయప్రభువులకాలములో నున్న విఠ్ఠలరాజు వేఱొకఁడు కాని యీతఁడు కాఁడు. అతఁ డొకవేళ రంగనాథరామాయణకృతికర్తయగు కోనబుద్ధరాజుతండ్రియైన విఠ్ఠలరాజయిన నయియుండవచ్చును. కోనేరు కవి తనబాలభాగవతమునందు పదునేనవశతాబ్దారంభమం దున్న శ్రీనా

ఘునిఁ బూర్వకవినిగా స్తుతించియున్నాఁడు. కోనేరుకవియు విఠ్ఠలనాథుఁడును పదునాల్గవ శతాబ్దారంభముననే యుండినపక్షమున తరువాత నూఱుసంవత్సరములకు పయిగా పదునేనవశతాబ్దములో నున్నశ్రీనాథునిఁ బూర్వకవినిగా పరిగణించుట సంభవించి యుండదుగదా? కాఁబట్టి యీకవి పదునాఱవశతాబ్దమధ్యమునం దున్నాఁ డనుటయే విశ్వసనీయము. ఈతనికవిత్వ మనర్గళధార గలిగి హృదయరంజకముగానే కానఁబడుచున్నది. ఇప్పుడు బాలభాగవతములోని రెండుపద్యములనుమాత్ర మిం దుదాహరించుచున్నాను—

చ. కలియును రాజచిహ్నములు గ్రక్కున మాని భయోపతాపదు
  ర్బలుఁ డయి తత్పదాబ్జములపై నిజహస్తము చేర్చి, దేవ! నీ
  లలితకృపాణపుత్రిక ధళద్ధళితం బగుచున్న యంతలోఁ
  జలమఱియుఁ ఘుళఘుళితసంగత మయ్యె మదీయచిత్తమున్. ఆ.౧

ఉ. మాన్యుల మమ్మెఱుంగ కవమానముచేతకు దుష్టజన్మతా
  దైన్యము కల్గె మాకు ననుతాపము నొందకుఁ డీర లింక నే
  మన్యము నొల్ల మేమియును నచ్యుతుఁ గ్రమ్మఱఁ జేరగల్గు సా
  జన్య మనుగ్రహింపుఁ డని సారెకుఁ బ్రార్థనసేయ నత్తఱిన్. ఆ. ౨.

19. పింగళి సూరనార్యుఁడు

పింగళిసూరన్న నియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; గౌతమగోత్రుఁడు. ఈతనితాత సూరన్న; తండ్రి యమరన్న; తల్లి యబ్బమ్మ; అమలన్న, ఎఱ్ఱన్న తమ్ములు. విష్ణుపురాణమును రచియించిన వెన్నెలగంటి సూరన్న తరువాత నున్నందున, ఈతనిని పింగలి (వెనుకటి) సూరన్న యందురని యొకానొకరు చెప్పిరిగాని యది సరిగాదు. పింగలి యనునది ఈకవియొక్క గృహనామము. ఈతనిపూర్వులును పింగలివారనియే చెప్పఁబడుచు వచ్చిరి. పింగలియనునది కృష్ణామండలములోని యొకయూరు. కాఁబట్టి యీగ్రామనామమునుబట్టి నే యీకవివంశమువారి కిటువంటిపేరు గలిగినది. ఈకవి ప్రభావతీప్రద్యుమునందు తనవంశమునకు మూలపురుషుఁ డయిన గోంకనామాత్యుని వర్ణించుచు, ఆతనిని పింగళిపురాంకునిగా నీక్రిందిపద్యమునందుఁ జెప్పియున్నాఁడు—

క. ఆగౌతమగోత్రంబున
నాగమనిధి పుట్టె గోంక నామాత్యుఁడు స
ద్భోగక్షేత్రస్వామ్యస
మాగతిఁ బింగళిపురాంకుఁడై యతఁ డొప్పెన్.

ఈపింగళి గోంకనామాత్యుఁడే పేకియనుదానిని దాసినిగా నేలె నట్లీగ్రంథములోని యీక్రిందిపద్యమునఁ జెప్పఁబడినది—

ఉ. పేర్వెలయుంగ నాఘనుఁడు పింగలి గోంకబుధోత్తముండు గం
ధర్వ నొకర్తుఁ బేకియనుదానిని దాసిగ నేలె యోగితా
గుర్వనుభావుఁడై నెఱపె గోపకుమారునిఖడ్గవర్ణనన్
బర్వపునిండువెన్నెలలపై నెఱిచూపెడుకీర్తిసంపదన్.

ఈపింగళివారి పేకికథను జను లీప్రాంతములయం దిప్పుడుసహితము వాడుకగా చెప్పుకొనుచున్నారు. పింగళి గోంకనామాత్యుఁడొకనాఁ డరణ్యములో సంచరించుచుండఁగా, ఆతని కొకసుందరమయిన పూస దొరకినదఁట. అతఁ డాపూసను దెచ్చి తనపెట్టెలోవేసి దాఁచెనఁట. ఆదినమునందే పేకి యనుపేరితో నొకతెవచ్చి వారియింట దాసిగా కుదిరి మిక్కిలి విశ్వాసముతో పనులుచేయ మొదలుపెట్టెనఁట. ఇట్లు కొంతకాలము జరగిన తరువాత గోంకనామాత్యునిభార్య గర్భవతియై ప్రసవసమయము సమీపించినప్పు డాపురుటింటిలో పేకిని కావలిపెట్టిరనియు, అది యాకావలియున్నదినములలో నొకనాఁటిరాత్రి తాను శయనించినస్థలమునుండి లేవకనే నాలుకను దీర్ఘముగాచాచి దాసితో దీప మెగసనఁద్రోచెననియు, అదిచూచి యాతని భార్య భయపడి జరగిన వృత్తాంతమును మఱునాఁడు భర్తతో చెప్పెననియు, అందుమీఁద వారు దాని నేలాగుననైన వదల్చుకోవలెనని యెటువంటి యసాధ్యములయినపనులు చెప్పినను పేకి వానినెల్ల నిమిషములో నిర్వహించుచు వచ్చెననియు, అందుమీఁద వారు దానిని వదల్చుకొను సాధనములేక కాశికిపోయి గంగ తెమ్మని దానిని దూరదేశమునకుఁ బంపి యది యింట లేనిసమయమందు సమస్తసామగ్రితోను పొరుగూరికి లేచిపోయిరనియు, ఇంతలో పేకి కాశినుండి గంగతీసికొనివచ్చి యింటివారు పొరుగూరికి పోవునప్పు డింట దిగవిడిచిపోయిన నలువు రెత్తలేని పెద్దరాతిరుబ్బురోటిని నెత్తిమీఁద పెట్టుకొని యిది మఱచి వచ్చితిరని పొరుగూరికి పోయి వారికి చేర్చినదనియు, అప్పుడు గోంకనామాత్యుఁడు నీవు మమ్మెట్లు విడిచెదవని దానిని మంచిమాటలతో నడుగఁగా నాఁడరణ్యములో దొరికిన పూస నిచ్చివేసినయెడల పోయెదనని యది చెప్పెననియు అంతట దానియభిమతమునుదీర్చి వారు దానిని పంపి వేసిరనియు, కథ చెప్పుచున్నారు.

ఈకవి పూర్వులు మొట్టమొదట కృష్ణామండలములోనివా రయినను, తరువాత దక్షిణదేశమునకు బోఁగా కృష్ణదేవరాయని యనంతరమునందు విజయనగరరాజ్యము చెడి యనేకులైన చిన్నచిన్న రాజుల యధీనమయి యున్నకాలములో నితఁడు కందనూలు (కర్నూలు) మండలములోని యాకువీడు, నంద్యాల, మొదలగుసంస్థానములలో జేరినట్టు కానఁబడుచున్నది. ఈతఁడు కృష్ణదేవరాయనియొక్క యాస్థానకవీశ్వరు లయిన యష్టదిగ్గజములలో నొక్కఁడని కొందఱు చెప్పుదురు గాని యీకవి యాకాలమునందుఁగాని యాస్థానమునందుఁగాని యున్నట్టు నిదర్శనము లేవియుఁ గానరావు. ఈసూరకవి పదునాఱవశతాబ్దమధ్యమునం దున్న ట్లూహించుట కనేకనిదర్శనములు కనఁబడుచున్నవి. ఈకవిరచించిన కళాపూర్ణోదయము నంద్యాల సంస్థానాధిపతియైన కృష్ణరాజున కంకితము చేయఁబడినది. ఈకృష్ణరా జార్వీటిబుక్కరాజుయొక్క యాఱవ సంతతి వాఁ డయినట్లు కళాపూర్ణోదయములోని కృతిపతియొక్క వంశానువర్ణనమువలన స్పష్టముగా గానఁబడుచున్నది. ఆర్వీటి బుక్కరాజుయొక్క పెద్దకుమారుఁడు సింగరాజు; అతని పుత్త్రుఁడు నరసింగరాజు; అతని పుత్త్రుఁడు నారపరాజు; అతని పుత్త్రుఁడు నరసింగరాజు; అతనిపుత్త్రుఁడు కళాపూర్ణోదయము కృతినందిన కృష్ణరాజు. ఆర్వీటి బుక్కరాజు క్రీస్తుశకము ౧౪23 వ సంవత్సరము మొదలుకొని ౧౪౮౧ వ సంవత్సరము వఱకును రాజ్యము చేసెను. అటుతరువాత వచ్చిన యతని సంతతివారు నలుగురు నొక్కొక్క రిరువదేసి సంవత్సరము లుండి రనుకొన్నపక్షమున, ఈకృష్ణరాజు క్రీస్తుశకము ౧౫౬౦ వ సంవత్సరప్రాంతముల నున్న ట్లొంచవలసి యున్నది. ఈకృష్ణరాజు విజయనగరమును సదాశివదేవ రాయలు పాలించుచుండిన కాలములో నంద్యాల రాజయి యున్నట్టు కానఁబడుచున్నది. కృష్ణదేవరాయల యనంతరమున ౧౫3౦ వ సంవత్సరమున రాజ్యమునకు వచ్చిన యచ్యుతదేవరాయఁడు ౧౫౪౨ వ సంవ

త్సరమునందు మృతినొందెను. ఆకాలమునందు సదాశివదేవరాయఁడు పసివాఁ డయినందున సకలము తిమ్మయ రాజ్యమును దానాక్రమించుకొని కృష్ణదేవరాయల యల్లుఁ డయిన రామరాజును రామరాజు తమ్ముఁ డయిన తిరుమలదేవరాయని బట్టి చెఱలోఁ బెట్టవలెనని ప్రయత్నింపఁగా వారిద్దఱును పెనుగొండకు పాఱిపోయి యక్కడఁ గొంతసైన్యమును గూర్చుకొని తరువాత కందనూలురాజు మొదలయినవారి సాహాయ్యమును బొంది విజయనగరము మీఁదికి దండెత్తివచ్చి సకలము తిమ్మయ నోడించి చంపి ౧౫౪౨ వ సంవత్సరమునకు సరియైన శుభకృత్ సంవత్సర జ్యేష్ఠమాసమునందు బాలుఁ డయిన సదాశివరాయని సింహాసన మెక్కించిరి. ఈకార్యమువలనఁ రామరాజు సదాశివరాజ్యసంస్థాపకుఁడని పేరుపొంది, పేరునకు సదాశివరాయఁడే రాజయినను నిజమైన యధికారమునంతను దానే వహించి రాజ్యపరిపాలనము చేయుచుండి ౧౫౬౫ వ సంవత్సరమునందు మహమ్మదీయరాష్ట్రముల వారిసేనతో తాలికోటవద్ద జరగిన యుద్ధమునందుఁ జంపఁబడెను. అప్పుడు మహమ్మదీయప్రభువులు విజయనగరమునందుఁ బ్రవేశించి యనేక క్రూరకృత్యములను జరపి రాజ్యమంతయు పాడుచేసి తమలోఁ దమకు సంభవించిన కలహమువలన రాజ్యమును పూర్ణముగా నాక్రమించుకొనక వెడలిపోయిరి. తరువాత నయిదు సంవత్సరములవఱకు రాజ్య మించుమించుగా నరాజకము కాఁగా నీలోపల ౧౫౬౭ వ సంవత్సరప్రాంతమున సదాశివరాయఁడు స్వర్గస్థుఁ డయ్యెను. ఆసంవత్సరమునందే తిరుమలదేవరాయఁడు విజయనగరమును విడిచి పెనుగొండఁజేరి తానురాజునని ప్రకటించి ప్రమోదూతసంవత్సరములో ననఁగా ౧౫౬౮ వ సంవత్సరమున పెనుగొండరాజ్యమునందు స్థిరపడి ౧౫౭౨ వ సంవత్సరమునందు లోకాంతరగతుఁ డయ్యెను. ౧౫౭౨ వ సంవత్సరమునకు సరియైన ఆంగిరస సంవత్సర వైశాఖశుద్ధదశమినాఁ డాతనిపుత్రుఁ డయిన శ్రీరంగరాయలు

రాజ్యమునకు వచ్చి ౧౫౮౫ వ సంవత్సరమువఱకును రాజ్యముచేసి స్వర్గస్థుఁ డయ్యెను. ౧౫౮౫ వ సంవత్సరమునకు సరియైన పార్థివసంవత్సర మాఖశుద్ధదశమినాఁ డాతని తమ్ముఁ డైన వేంకటరాయఁడు సింహాసనమునకు వచ్చినతోడనే తనరాజధానిని పెనుగొండనుండి చంద్రగిరికి మార్చి ౧౬౧౪ వ సంవత్సరమువఱకును రాజ్యముచేసి సంతానహీనుఁ డయి పరమపదమును బొందెను. నంద్యాల రాజైన కృష్ణరాజు సదాశివదేవరాయని కాలములోనివాఁడై యుండును, అతని రాజ్యకాలము ౧౫౬౪ వ సంవత్సరమునకు లోపల నారంభమై యుండును. కాఁబట్టి పింగళి సూరన్న నంద్యాలసంస్థానమునందుండి కృష్ణరాజునకుఁ గళాపూర్ణోదయము నంకితముచేసిన కాల మించుమించుగా ౧౫౬౦ వ సంవత్సరప్రాంత మని చెప్పవచ్చును. ఈసదాశివదేవరాయఁ డచ్యుతదేవరాయని కుమారుఁ డయినట్టు కొన్ని శిలాతామ్రశాసనములయందు జెప్పఁబడినదిగాని కృష్ణామండలములోని సత్తెనపల్లెతాలూకాలో దొరకిన శాలివాహనశకము ౧౪౮౧ సిద్ధార్థిసంవత్సరమునకు సరియైన హూణశకము ౧౫౬౦ వ సంవత్సరపు సదాశివరాయల తామ్రశాసనములో నతఁడు రంగరాజునకును తిమ్మాంబకును బుత్రుఁ డయినట్టును రామరాజునకు మఱఁదియైనట్టును ఈక్రింది శ్లోకముచేఁ జెప్పఁబడినది:—

"తిమ్మాంబావరగర్భమౌక్తికమణీ రంగక్షితీంద్రాత్మజః
అత్రాలంకరణేన పాలితమహాకర్ణాటరాజ్యశ్రియా
శౌర్యౌదార్యదయావతా స్వభగినీభర్త్రా జగత్త్రాయిణా
రామాఖ్యప్రభుణా ప్యమాత్యతిలకైః క్లుప్తాభిషేకక్రమః"

ఈ శ్లోకమునందలి రంగక్షితీంద్రుఁడన్నది ప్రమాదజనితమేమో! నంద్యాలకృష్ణరాజు వేంకటపతిరాయల రాజ్యారంభదశలోను జీవించి

యున్నాఁడఁట. అందుచేత నతఁడు ౧౫౭౫ వ సంవత్సరమునకుఁ దరువాతకూడ నల్పకాలము రాజ్యమేలియుండును.

మఱియును కళాపూర్ణోదయములో కృష్ణరాజు తాతయైన నారపరాజును వర్ణించుచో నతఁడు కుతుబ్‌మల్కును కొండవీటివద్ద నోడించినట్లీక్రింది పద్యమునందుఁ జెప్పఁబడినది.

చ. వదలక యుత్కలేంద్రుని సవాయి బరీదు నడంచుదుర్జయున్
గుదుపనమల్కుఁ దల్లడిలఁగొట్టె మహాద్భుతసంగరంబులో
నెదిరిచి కొండవీటికడ నెవ్వరు సాటి విచిత్రశౌర్యసం
పదపస నారసింహవిభుపట్టికి నారనృపాలమౌళికిన్.

గోలకొండయందు కుతుబ్‌షావంశరాజ్య సంస్థాపకుఁ డయిన యీ కుతుబ్‌మల్కు క్రీస్తుశకము ౧౫౧౨ వ సంవత్సరము మొదలుకొని ౧౫౪౩ వ సంవత్సరమువఱకును గోలకొండయందు రాజ్యముచేసెను. కృష్ణదేవరాయని కాలములో కొండవీటివద్ద జరగిన యీ యుద్ధము ౧౫౧౫ వ సంవత్సరమునందగుటచేత నాతనితో యుద్ధముచేసిన నారపరాజు మనుమఁడయిన కృష్ణరాజటుతరువాత ముప్పది నలువది సంవత్సరములైన పిమ్మట రాజ్యము చేసెననుట సత్యమునకు దూరమయి యుండదు. కాఁబట్టి దీనినిబట్టియు సూరకవి ౧౫౬౦ వ సంవత్సరప్రాంతముల యందున్నట్లు నిశ్చయింపవలసియున్నది. ఈ విషయమునే రాఘవపాండవీయములోని కృతిపతివంశానువర్ణనము నుండియు నొకవిధముగా నూహింపవచ్చును. రాఘవపాండవీయము కర్నూలు మండలములోని యాకువీటి సంస్థానాధిపతియైన పెదవెంకటాద్రి కంకితము చేయఁబడినది. ఆకువీడు కోవిలకుంటకు పడమట నాలుగుకోసులదూరములో తుంగభద్రాతీరమునం దున్నది. అందు విరూపాక్షస్వామి దేవాలయమున్నది. ఈ వేంకటాద్రియొక్క తాతయైన యిమ్మరాజు రాజమహేంద్రవరమును జయించినట్లీ క్రిందిపద్యమువలనఁ దెలియవచ్చుచున్నది:-

క. రాజమహేంద్రవరాధిపు
రీ జైత్రవిచిత్రములఁ బరిభ్రాజితుఁ డై
యాజిఘనుం డా యిమ్మ మ
హీజాని ప్రసిద్ధిఁగాంచె నెంతయు మహిమన్.

రాఘవపాండవీయ కృతిపతితాత యయిన యీ యిమ్మరాజును, కళాపూర్ణోదయ కృతిపతితాతయైన నారపరాజును, కృష్ణదేవరాయని కాలములో నాతనికి లోఁబడిన సామంతరాజు లయి యుండి, ఆతనితోఁ గలిసి సేనాధిపతులుగా మహమ్మదీయులు మొదలయిన వారితో యుద్ధముచేసిరని తెలియవచ్చుచున్నది. కృష్ణదేవరాయనికి సహాయులుగా నున్నవారిని వర్ణించిన కృష్ణరాజవిజయములోని యీ క్రిందిపద్య మీ సంగతిని కొంత స్థాపించుచున్నది:-

సీ. కోటలు దుర్గముల్ గొనుచు దోఃపటుబలధాటిచే మించు నార్వీటివారు
కంటకాహితకంఠలుంటనోద్ధతలీల దంటలై తగు తొరగంటివారు
నిర్భరంబుగ శత్రునికరంబు నడఁగించి ధీరులై మించు గొబ్బూరివారు
చాలదోర్బలలీల నరదారిసంఘంబుఁ దూలించి వెలయు నంద్యాలవారు
నాదిగాఁ గల్గు రాజులు మేదురగతిఁ
దుళువదొరలును బోయలు దురుసుగాఁగ
బ్రతిదినంబును ఘోరమౌ రణ మొనర్ప
నిలిచి పోరాడె గజపతి బలము లపుడు.

౧౫౧౫ వ సంవత్సరమునందు కృష్ణదేవరాయలు రాజమహేంద్రవరమును జయించెను. కాఁబట్టి యిమ్మరాజా కాలమునం దాతనితో నుండియుండును. దీనినిబట్టి చూచినను సూరనార్యుని కాలము పయిని చెప్పఁబడినదే యయి యుండవలెను. ఈ యాకువీటిరాజులు విజయనగర రాజులకు లోఁబడినవా రయినందుకు నిదర్శనముగా రాఘవపాండవీయములో నుపోద్ఘాతములో నీ క్రిందివాక్యము కానబడుచున్నది:

క. వడిగలతనాన సీగిని
విడిముడిపసఁ బ్రాభవమున విజయనగరిలోఁ
గడు నెన్న నేర్పుఁగల మేల్
నడకలఁ బెదవేంకటాద్రి నరవరుఁ డొప్పున్.

ఈ పద్యమునుబట్టి విజయనగరరాజ్యము చెడకముందనగా ౧౫౬౪ వ సంవత్సరమునకుఁ బూర్వమే రాఘవపాండవీయము రచియింపఁబడిన దగుట నిశ్చయము.

(కృష్ణదేవరాయని కాలములోనున్న ధూర్జటికవియొక్క మనుమఁడయిన కుమారధూర్జటి కృష్ణరాజవిజయమును రచించెను.) అతఁడు కృష్ణరాజవిజయములోని యీ రెండవపద్యమునందు,

సీ. జగదధిష్ఠానభాస్వజ్జ్యోతి యగువాఁడు
బ్రహ్మాదులదరు దురాయివాఁడు
చలిగట్టురాపట్టి సామేనఁ గలవాఁడు
చిఱునవ్వువెన్నెలల్ చిలుకువాఁడు
వాఁడువీఁడనక యెవ్వనినైనఁ బ్రోచువాఁ
డఖిలదైవతగురుండైనవాఁడు
లీలమై శూలంబు కేలఁ బూనినవాఁడు
నలమేనిదొరతూపు గలుగువాఁడు
కలితపంపాతటంబున నిలుచువాఁడు
శ్రీవిరూపాక్షశివుఁడు రక్షించు నెప్పు
డఖిలసద్గుణమణిపేటి యాకువీటి
చిన్నవేంకటరాయని చెలువుమీఱ.

అని వర్ణించిన యీ చినవేంకటరాయఁడు రాఘవపాండవీయములో వర్ణింపబడిన కృతిపతి తమ్ముఁడయిన చినవేంకటాద్రియే యయినపక్షమున, ఈ పద్యమును పయికాలమును స్థిరపఱుచుచున్నది.

పింగళిసూరన్న కృష్ణదేవరాయనికాలములో నుండెనని యొకా నొక రనుచున్నారు. ఆర్వీటి బుక్కరాజు ముమ్మనుమఁడైన యళియ రామరాజే ౧౫౬౮ వ సంవత్సరమువఱకు నుండినప్పుడు బుక్కరాజు ముమ్మనుమని మనుమఁడయి కళాపూర్ణోదయ కృతిపతియైన నంద్యాల కృష్ణరా జంతకుఁబూర్వమునం దుండెననుట పొసఁగనేర నందున వారిమాట విశ్వాసార్హమయినది కాదు. ఇతఁడు ౧౫౬౦ వ సంవత్సరమునకు లోపలనుండుట తటస్థింపదు.

గ్రంథస్థములైన యీ నిదర్శనము లటుండఁగా మఱియొక కట్టు కథకూడ వాడుకలో నున్నది. ఈ సూరనార్యుఁ డల్లసాని పెద్దన్న మనుమ రాలిభర్త యనియు, చిన్నతనములో నితఁడు చదువులేక మూఢుఁడై తిరుగుచుండుటచూచి యితనినిమాత్రమే కాక యీతని భార్యను సహి తము మూఢభర్త దొరకెనని యెల్లవారును పరిహాసింపుచువచ్చిరనియు, అందుమీఁద సూరనకు రోషమువచ్చి దేశాంతరముపోయి చదువుకొని పండితుఁడై వచ్చి రాఘవపాండవీయమును చేయ నారంభించెననియు, అప్పుడా చిన్నది తనభర్తను వెంటఁబెట్టుకొని తాతగారియొద్దకుఁ బోయి నీ మనుమఁడు రాఘవపాండవీయమును జేయుచున్నాఁడని చెప్పఁగా నతఁ డందులోని పద్యము నొకదానిని చదువుమని యడిగెననియు, అందు మీఁద సూరన,

"తలఁపం జొప్పడి యొప్పె నప్పుడు"

అని పద్యమును జదువ నారంభింపఁగానే యల్లసానిపెద్దన్న 'యింత లోనే నాలుగువిఱుపులా' యని యాక్షేపించె ననియు, తరువాత సూరన పై భాగము నందుకొని,

"..............తదుద్యజ్జైత్రయాత్రాసము
త్కలికారింఖదసంఖ్యసంఖ్యజయవత్కంఖాణరింఖావిశ్రృం

ఖలసంఘాతధరాపరాగపటలాక్రాంతంబు మిన్నే రవ
ద్గళభేరీరవనిర్దళద్గగనరేఖా లేపశంకాకృతిన్.

అని చదువఁగా మెచ్చుకొనెననియు చెప్పుదురు. ఈ కథ యెట్టిదై నను సూరన కృష్ణదేవరాయని తరువాతికాలపువాఁడైనట్టు స్థిరపడుచున్నది. అల్లసాని పెద్దన కృష్ణదేవరాయని యనంతరమం దనఁగా ౧౫౩౦ వ సంవత్సరమునకు తరువాతకూడ జీవించియున్నందున, సూరనార్యుఁ డల్లసాని పెద్దన్న మనుమరాలి మగఁడయినను కావచ్చును. కళాపూర్ణోదయమును రచింపకపూర్వమునం దీకవి యాకువీటిరాజుల వద్ద మొట్టమొదటనుండి రాఘవపాండవీయమును జేసి వారి కంకితము చేయుటచే రాఘవపాండవీయము నీకవి ౧౫౫౦ వ సంవత్సర ప్రాంతములయందు మంచి పడుచుతనములో రచియించియుండును. ఇంతకుఁ బూర్వపుదైన గారుడపురాణము బాలకవిత్వ మగుటచే నశించినదేమో! తిక్కన సోమయాజికి తరువాత నింత ప్రౌఢముగా కవిత్వము చెప్పిన తెనుఁగుకవి మఱియొకఁడు లేఁడు. ఈ సూరన కావ్యరచనయందు సర్వతోముఖ చాతుర్యము కలవాఁడు. ఈతని కవిత్వము మృదుపదగుంభితమై ద్రాక్షాపాకముగా నుండును. ప్రభావతీ ప్రద్యుమ్నములోని యీ క్రింది పద్యమువలన నితఁడు గరుడపురాణమును, రాఘవ పాండవీయమును, కళాపూర్ణోదయమును, ప్రభావతీ ప్రద్యుమ్నమును, మఱికొన్ని గ్రంథములును రచించినట్లు కానఁబడుచున్నది.

మ. జనముల్ మెచ్చఁగ మున్రచించితి సదంచద్వైఖరిన్ గారుడం
బును శ్రీరాఘవ పాండవీయముఁ గళాపూర్ణోదయంబున్ మరిన్
దెనుఁగుంగబ్బము లెన్ని యేనియును మత్పిత్రాదివంశాభివ
ర్ణన లేమిం బరితుష్టి నాకవి యొనర్పంజాల వత్యంబునన్.

ఇందు పేర్కొనఁబడినవానిలో గారుడపురాణము మాత్రము మాకు లభించినది కాదు. రాఘవపాండవీయము శ్లిష్టార్థములు లేకుండ

మృదుమధుర సులభపదములతో రామాయణభారతార్థములు వచ్చు నట్లుగా రచియింపబడిన శ్లేషకావ్యమును రచియించుట మఱియొకరికి సాధ్యముకాదు. ఈగ్రంథముయొక్క ప్రౌఢిమను కృష్ణరాజు మెచ్చు కొన్నట్లుగా కవియే కళాపూర్ణోదయమునం దిట్లు చెప్పియున్నాఁడు—

మ. ఇటము న్నారదసంహితాదికృతు లీవింపొందఁగాఁ బెక్కొన
ర్చుట విన్నారము చెప్పనేల యవి సంస్తుత్యోభయశ్లేషసం
ఘటనన్ రాఘవపాండవీయకృతి శక్యంబే రచింపంగ నీ
చ్చట నెవ్వారికి నీకె చెల్లె నది భాషాకావ్యముం జేయఁగన్.

కళాపూర్ణోదయము విచిత్ర మయినకల్పితకథను గలదై తెలుఁగు గ్రంథములలో నిరుపమానముగా నున్నది. సంస్కృతనాటకములలో మాత్ర మిటువంటి కథాచమత్కారము కానఁబడుచున్నదిగాని తెలుఁగులో నెక్కడను నింతవింతయైన కల్పితకథ మఱియొకటి కానరాదు. ఇది నాతికఠినమై మృదుమధురశైలి గలదై యున్నది. ప్రభావతీప్రద్యుమ్నము చక్కని స్వభావోక్తులను గలదయి లలితఘటితమై కథాచమత్కృతి గలిగి చదువువారికి కర్ణరసాయనముగా నుండెడు ప్రౌఢకావ్యము. ఈతఁడు రచియించినపుస్తకములలో నిది కడపటి దగుటచేఁ గవి దీనిని ౧౫౭౦ వ సంవత్సరప్రాంతములయందు రచియించి యుండును. ఈకాలమునకే యీతఁడు వయసుమీఱినవాఁ డగుట చేతఁ దరువాత శీఘ్రకాలములోనే కీర్తిశేషుఁ డయి యుండవచ్చును. ఈతని కవిత్వశైలి తెలియుటకై పైపుస్తకములనుండి రెండేసిపద్యముల నిం దుదాహరించుచున్నాను.

రాఘవపాండవీయము

ఉ. హారిమృగవ్యనవ్యవిహితాదరుఁ డాధరణీతలేశుఁ డ
ధ్వారచితశ్రమాకలితుఁడై కడుమెచ్చు సురాపగాజలా

సారసపూగమూర్ఘ్నితమసారససారససారసౌరభో
దీరణకారణంబు నతిధీరసమీరకిశోరవారముల్. ఆ. ౧.

చ. అలవి యెఱుంగలేక యితరాంగనలంబలె నన్నునిమ్మెయిం
గలఁచుట యుక్తమే యొదవుఁగాక భవత్కృతదుష్టచేష్టితం
బులకు ఫలంబు నేఁ డొకటి పూర్ణముగా నుపభోగ్యమై కడుం
జలమున నెందు నీమగతనంబు కడంకల రూపుమాలుటల్. ఆ. 3.

కళాపూర్ణోదయము

శా. అమ్మా నీపలుకెల్ల నెంతయు నిజంబై యిష్ట గాన్పించె నే
నిమ్మాయావిప్రకార మి ట్లగుట యూహింపంగలే కొక్కయ
ర్థమ్ముల్ నీనికృపం గడింతునని యత్యంతాశ ప్రేరేపఁగా
నిమ్మాడ్కిం దెగివచ్చితిం దెరువులే దీపాటు దప్పింపఁగన్. ఆ. ౪.

చ. అన నిఁక నేమిచెప్పుదు జనాధిప యాయతిముఖ్యుఁ డంత నె
మ్మనమును బట్టలేక ప్రతిమన్ బిగియారఁ గవుంగిలించె నిం
పొనరఁగ లేచివచ్చి కడ నొక్కమఱుంగున నష్టు సుగ్రహుం
డునికి యెఱుంగమిన్ నగియె నుండగలే కతఁడుం గిళాకికన్. ఆ. ౮.

ప్రభావతీప్రద్యుమ్నము.

ఉ. పాడిదొఱంగజన్మె యొకపట్టునఁ గొల్చెదనంచు నెంతమా
టాడితి సర్వదైవతకులాధిప యోడలబంట్లువచ్చు బం
ట్లోడలవచ్చు నొండొరుల కొక్కొకచో ననువాదుటాలకుం
గూడుట యిష్టబంధులకుఁ గ్రొత్తయె యిత్తఱి నింతయేటికిన్. ఆ.౧

ఉ. వట్టిమఱుంగువెట్టి నొడువం బనిలే దదియెల్ల భేరిజో
కొట్టుటగాక నిన్ గెలువఁగూడునె మాటల నీవుకంటె న
న్నట్టిశుభాంగుఁ డీరమణి యూసల కాస్పద మిప్పు డాతనిన్
గట్టిగ నన్వయాదికథనంబుగఁ దెల్పి యనుగ్రహింపవే. ఆ. 3.

పింగళిసూరన్న గిరిజాకళ్యాణములోని దని యీక్రిందిపద్యము రంగరాట్ఛందస్సునలో నుదాహరింపఁబడి యున్నదిగాని యీపుస్తకము నాకు లభించలేదు.

క. కోపాటోపంబున ధర • జీపాలకచంద్రముఁడు మునిశిఖామణులన్
శ్రోపించిన వారు దురా • లాపము లాడుచును బోయి రాసమయమునన్.

20. అద్దంకి గంగాధరకవి.

ఈ గంగాధరకవి నియోగిబ్రాహ్మణుఁడు; వీరనామాత్యుని పుత్రుఁడు. (ఇతఁడు గోలకొండనవాబైన మల్కిభరాము (ఇబ్రహీమ్ మల్కు) వద్ద నాస్థానకవీశ్వరుఁడుగా నుండెను.) యయాతిచరిత్రమును రచియించిన పొన్నికంటి తెలగనార్యుఁడుగాక తనగ్రంథమును మహమ్మదీయుల కంకితముచేసిన తెలుఁగుకవి యీతఁ డొక్కఁడే యైనట్టు కానఁబడుచున్నాఁడు. ఈకవి రచియించిన గ్రంథములలో ముఖ్యమైనది తపతీసంవరణ మను శృంగారప్రబంధము. ఈగ్రంథమునందు కృతినాయకుఁడైనమల్కిభరా మీక్రింది రీతిని వర్ణింపఁబడెను.—

సీ. సకలవేదపురాణశాస్త్రపారగులైన
యొంటరివిద్వాంసు లొక్కచోట
సష్టభాషలయందు సాంధ్యంబు లేకుండు
హరాంతకారికవీంద్రు లొక్కవంక
గజపతి నరపతి కూర్మభర్త లంపిన
యొడికంపురాయబా రొక్కదండ
మేరుమందరముల మించఁగల్గినమన్నె
యులు దండనాథు లొక్కొక్కయెడలఁ
జేరికొల్వ భద్రాసనాసీనుఁ డగుచు
రమ్యగుణహారి మల్కిభరామశౌరి
భారతశ్రీరమయసింధుబంధమధ్య
లలిత పుణ్యకథాసుధాలహరిఁ దేలి.

దక్షిణహిందూస్థానమునందు భామినీవంశీయతురుష్క రాష్ట్రావసానదశయందు స్వతంత్రులయిన యయిదుగురు మహమ్మదీయ ప్రభువులలో నొకఁడయి గోలకొండ రాజ్యసంస్థాపకుఁడయి క్రీస్తుశకము ౧౫౧౨వ సంవత్సరము మొదలు ౧౫౪౩ సం॥ వఱకును రాజ్యముచేసిన కుతుబ్ షా కీయిబ్రహీము చతుర్థ పుత్రుఁడు. గోలకొండ రాజ్యస్థాపకుఁడయిన కుతుబ్ షా హిందువులను మాత్రమే కాక మహమ్మదీయులను సహిత మనేకులను జయించి తన రాజ్యమును వ్యాపింపఁజేసెను. అతని విజయములను గూర్చి తపతీసంవరణములోని యీ క్రింది పద్యము కొంత వివరించుచున్నది—

సీ. పడమటను సవాయి బసవనిఁ గాఁజేసి
యచటఁ గొయ్యాలకొండ నావరించె
దమదిమల్లాఖాను దక్షిణంబునఁ గొట్టి
హరియించెఁ బానుగల్లాదిగిరుల
నుత్తరంబునఁ బరీదోడి పాఱఁగఁదోలి
మెతుకుదుర్గం బాక్రమించి మించెఁ
బ్రథమదిక్కున నొడ్డె పాత్రసామంతుల
ధట్టించి కంబముమెట్టు గొనియె
నతనిఁ బొగడంగఁ దగదె యాచతురనీతి
రూఢిగిరిదుర్గలుంఠనప్రౌఢతేజు
వాహశిఖరాధిరోహ రేవంతమూర్తి
కుతుబుశాహి నిజస్వామి పాలు గుణవిశాలు.

అయినను కృష్ణదేవరాయలు క్రీస్తుశకము ౧౫౧౬వ సంవత్సరమునందు తెలుఁగుదేశమంతయు జయించి, ఓఢ్రరాజులయిన గజపతుల కొమార్తెను తాను వివాహ మాడుటచేత తత్సంబంధమునుబట్టి రాజమహేంద్రవరము ప్రధాన నగరముగాఁగల యాంధ్రదేశమునంతను గజ

పతులకిచ్చెను. కాని కృష్ణదేవరాయల మరణానంతరమున కుతుబ్‌షా కొండపల్లివద్ద జరిగిన యుద్ధములో హిందువుల నోడించి కృష్ణా గోదావరీ మధ్యరాష్ట్రమునంతను నాక్రమించుకొనెను. ఈ యంశము నే పూర్వోక్తగ్రంథములోని

"కటకేశ్వరునిఁ దోలి కైవసంబుగఁజేసెఁ
గొండంతజయముత్రోఁ గొండపల్లి."

అను సీసపాదము చెప్పుచున్నది. కుతుబ్‌షాయొక్క యనంతరమునందాతని ద్వితీయపుత్రుఁడైన జామ్‌షీదు రాజ్యమునకు వచ్చి క్రీస్తుశకము ౧౫౪౩ వ సంవత్సరము మొదలుకొని ౧౫౫౦ వ సంవత్సరము వఱకును రాజ్యముచేసెను. ఇతఁడు మహాక్రూరుఁడు, రాజ్యాశచేత తన యన్నగారి నేత్రములను తీయించివేసి యాతని నంధునిగాఁ జేసిన పాపాత్ముఁడు. ఈతని దుష్టస్వభావము నెఱిఁగి భయపడి పాఱిపోయి యిభరామ్‌షా తనయన్నగారి మరణమువఱకును విజయనగరమునందు కృష్ణదేవరాయని యల్లుఁడైన రామరాజుయొక్క సంరక్షణమునందుండెను. ఇతఁడక్కడనున్న కాలములోనే రామరాజభూషణుఁడు మొదలయిన కవులతోడి సహవాసముచేత సంస్కృతాంధ్ర సాహిత్యమును సంపాదించి, కవిత్వమునం దభిరుచిగలవాఁడయి క్రీస్తుశకము ౧౫౫౦ వ సంవత్సరమునందు తాను రాజ్యమునకు వచ్చినది మొదలుకొని యాంధ్రకవుల నాదరించి పెక్కుకృతుల నొందెను. ఇతఁడు తన రాజ్యకాలములో హిందువులతో మైత్రిగలవాఁడయి హిందూరాజులను వారివారి కవీశ్వరులతోడఁ గూడ తన యాస్థానమునకుఁ బిలిపించి తఱుచుగా పండితగోష్ఠిని కాలము గడుపుచువచ్చెను. ఈతఁడొక్కసారి తన యాస్థానమునకు పెమ్మసాని తిమ్మనాయనిని, అనంతపురపు హండెయప్పయను, మట్ల అనంతరాజును, బంగారేచమనాయనిని, పేరమల్లారెడ్డిని, పిలిపించి వారివారి కవీశ్వరులు వారివారిని స్తుతించిన పద్యములను వినుచుండఁగా కావువాఁ

డయిన మల్లారెడ్డి కవీశ్వరుఁడు చెప్పిన యీ క్రింది పద్యమునకు రాజులందఱును గోపించి యుద్ధసన్నద్ధులయినప్పుడు మల్కిభరామువారిని వారించి శాంతపఱిచినట్టొక పుస్తకమున వ్రాయఁబడియున్నది.—

చ. బలరిపుభోగ కృష్ణనరపాలుని పేరకుమారమల్ల మీ
కలితయశఃప్రభావములు కన్గొనలే కలకట్టుమన్నె మూఁ
కలు తల లొల్లరో బిరుదుగద్దియముల్ చదివించుకొంచు రా
కొలఁదిమెఱుంగఁజాల కలకుక్కలు చుక్కలఁజూచి కూయవే.

పయిని జెప్పిన యితరరాజుల కవులు చెప్పినపద్యములుకూడ నింపుగా నుండవచ్చును గాన వాటిని వరుసగా నిందు క్రిందఁ బొందుపఱుచుచున్నాను.—

ఉ. చాలుగుఱాలు మూళిగడిసంగడిరాజులు గొల్వరంపహో
పాలమహోగ్రఫాలదహనాక్షునియంతటిధాటివాఁడు నా
యేలిక వేంకటాద్రిధరణీశునితిమ్మఁడు పెమ్మసానిభూ
పాలుఁడు హెచ్చు ధాత్రిఁ గలపార్థివు లెల్లను లొచ్చు వీనికిన్.

ఉ. మట్టకశాఁడు బెట్టురికి మన్నెకుమారుల సీమ ధూళిగాఁ
గొట్టకమానఁడేగద యకుంఠితసింహతలాధిరాయఁ డీ
పెట్టినదండుఁ దీఁడు రణభీష్ముఁడు పాండియయప్పశౌరికిం
బెట్టుఁడు వేగ దండములు బింకము లేటికి శత్రుభూపతుల్.

ఉ. కొద్దిపరాఁడు దిండుఱికి కోటులుకొమ్మలు గొన్నశూరుఁ డా
గద్దఱిగబ్బిరాచపులి గండరబాలుఁడు మల్లనంతుఁ డే
ప్రొద్దును వైరిభూభుజులపొంక మడంపనె పుట్టినాఁడు మీ
పెద్దఱికాలు సాగ వికఁ బ్రేలకుఁడీ గడిమన్నెభూపతుల్.

ఉ. ఒక్కనఁ గొండతోఁ దగరు డీకొని తాఁకినజోక గాక యీ
బిక్కపకీరుమన్నెపరిబేసిదొరల్ మొన లందు నిల్వ నా

నిక్కము బంగరేచనృప నీవు రణస్థలి మోహరించినన్
బక్కన లోకముల్ పగిలిపాఱవె కూలవె దిగ్గజంబులున్.

ఈ యిభరామమల్కు (ఇబ్రహీమ్ మల్కు) క్రీస్తుశకము ౧౫౬౭ వ సంవత్సరమునందు రాజమహేంద్రవరమువఱకు దండెత్తి వచ్చి దానిని జయించి శ్రీకాకుళము వఱకునుగల కళింగదేశమునంతను స్వాధీనము చేసికొనెను. ఇతఁడు హూణశకము ౧౫౫౦ వ సంవత్సరము మొదలుకొని ౧౫౮౧ వ సంవత్సరము వఱకును రాజ్యము చేసినందున, ఈతని యాస్థానకవియైన గంగాధరకవియు నాకాలమునందే యున్న వాఁడు. ఈకవికృత మయిన తపతీసంవరణము సరసమయిన దయి మంచి కల్పనలఁగలిగి దాదాపుగా వసుచరిత్రమునుబోలి వఱలుచున్నది. ఈతని కవిత్వధోరణిని దెల్పుటకై తపతీసంవరణములోనుండి రెండు పద్యముల నిందుఁ జూపుచున్నాను.—

ఉ. అక్కమలాక్షి హస్తములయందము నేమనివిన్నవింతు నే
నొక్కొకవేళ నక్కనలరోష్ఠిసమీపమునందునున్నచోఁ
జొక్కపుఁదమ్మిపూవు లనుచుం దరుణభ్రమరాళి వ్రాలుఁ బెం
పెక్కినపల్లవంబు లనుచిల్క లనుచిల్కల గండుగోయిలల్. ఆ. ౨.

మ. చివురుందామరపాకులన్ సలలితశ్రీఖండపంకంబులన్
నవనీహారజలాభిషేచనములన్ నాళీకనాళీమృణా
ళవితానంబుల మౌక్తికగ్రథితమాల్యశ్రేణులన్ బాలప
ల్లవతల్పంబుల శీతలక్రియలు చాలం జేసి రయ్యింతికిన్. ఆ. 3.

21. పొన్నికంటి తెలగన్న

ఈ తెలగనార్యుఁ డచ్చతెనుఁగు గ్రంథములు చేసినవారిలో మొదటివాఁడు. ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; భావనార్యుని పుత్రుఁడు. అచ్చతెనుఁగునందు గ్రంథములు రచియించుట మిక్కిలి కష్టము. ఈకవికిఁ బూర్వమునం దెవ్వరును శుద్ధాంధ్రభాషలో ప్రబంధములు చేయుటకు ప్రయత్నించినవారైనను లేరు. ఇట్టిగ్రంథరచన కితఁడు మొట్టమొదటివాఁడే యయినను, ఈకవి రచియించిన యయాతి చరిత్రము సర్వవిధములచేతను కూచిమంచి తిమ్మకవి రచియించిన యచ్చతెలుఁగు పుస్తకములకంటె శ్రేష్ఠతరముగా నున్నదని నాయభిప్రాయము. ఈయనకుఁ బూర్వమునం దుండినకవులు కొందఱు తమ కృతులలో నక్కడక్కడ నొక్కొక్క యచ్చతెలుఁగు పద్యమును వేయుచు వచ్చిరి. అట్టివానిని జూచియే జను లత్యాశ్చర్యపడుచుండిరి. ఈయంశము కృతిపతి యన్నట్లుగా యయాతి చరిత్రముయొక్క పీఠికయం దీక్రిందిపద్యముతోఁ జెప్పఁబడినది.—

ఉ. అచ్చతెనుంగుపద్దె మొక టైనను గబ్బములోనఁ నుండినన్
హెచ్చని యాడు చుందు రదియెన్నుచుఁ బెద్దలు పొత్తమెల్లని
ట్లచ్చతెనుంగున న్నొడువ నందులచంద మెఱుంగువారు నీ
మెచ్చరొ యబ్బురం బనరొ మేలనరో కొనియాడరో నినుఁ.

ఈకవి తనగ్రంథము నమీనుఖానునకు కృతి యిచ్చెను. ఈ యయాతిచరిత్రముగాక యింకొక తెలుఁగు గ్రంథము మాత్రము మహామ్మదీయప్రభువున కంకితము చేయఁబడెను. (అమీనుఖాను ఇభరాముశాయొద్ద కొలువున్నట్టు యయాతి చరిత్రములోని యీక్రిందిపద్యము వలనఁ దెలియవచ్చుచున్నది.—)

సీ. తెలిని సింగంపుగద్దియలరా తెఱగంటిదొరలెల్ల మోడ్పుచేతులనె కొల్వఁ
బూని నేఁబదియూఱుమానిసి నెలవులపుడమితేం డ్లాడిగంబులకుఁజొరగ
శ్రీని మున్నీటిలో దీవు లన్నియు నేలుమన్నీలు మెట్టదామరల కెరఁగఁ
దనతేజు సుడిగట్టువెనుక చీఁకటి నెల్ల విరియించు తమ్ములమిందుగాఁగ
వెలయు మలికిభరాముశాఁ గొలిచిమనుచు
కలనఁ దనచెయ్యి మీఁదుగాఁ గడిమిమెఱసి
మేలుసిరు లందునట్టి యమీనుఖాన
యొడయఁ డొకనాఁడు నిండుపేరోలగమున.

(ఇబ్రహీమునే మనవారు గ్రంథములలో నిభరామని వాడి యున్నారు. ఈతనిపేరనే కృష్ణామండలములో నిభరామపురమను నొకయూరు కట్టఁబడినది. ఈతని పూర్ణమైన పేరు ఇబ్రహీమ్ కుతుబ్ షా. ఇతఁడు కుతుబ్ షా వంశీయులయిన గోలకొండనవాబులలో మూఁడవవాఁడు. ఈతని తండ్రిపేరు జామ్షీద్ కులికుతుబ్ షా. ఇతఁడు క్రీస్తుశకము ౧౫౫౦ వ సంవత్సరము మొదలుకొని ౧౫౮౧ వ సంవత్సరము వఱకును రాజ్యము చేసెను.) కాఁబట్టి గ్రంథకర్త యయిన తెలగనార్యుఁడును ఈకాలములోనే యున్నట్టు స్పష్టమగుచున్నది. యయాతి చరిత్రములోని యీక్రింది పద్యములో నమీనుఖానుని కొడుకయిన ఫాజిలఖాన్ విజయనగరపురాజైన శ్రీరంగరాయని గోలకొండకుఁ దీసికొనివచ్చి మైత్రిచేసినట్టు చెప్పఁబడి యున్నది.—

చ. కని తను రాజు లెన్నుకొనఁగాఁ బెనుపౌఁజులతో సిరంగరా
యనికడ కేగి మాటలనె యాయనఁ దేటిచి తెచ్చి మల్కుకున్
మనుకువ నంటుచేసి యొరిమం దగ మెచ్చులుగొన్న మేటి నే
మని పొగడంగవచ్చు నవునౌ సెఁక ఫాజిలఖానరాయనిన్.

ఇందువల్ల శ్రీరంగరాయని రాజ్యకాలములో యయాతిచరిత్రము రచియింపఁబడినట్టు స్పష్టమగుచున్నది. తిరుమలదేవరాయని పుత్రుఁడైన

శ్రీరంగరాయఁడు క్రీస్తుశకము ౧౫౭౪ వ సంవత్సరము మొదలుకొని ౧౫౮౫ వ సంవత్సరమువఱకును రాజ్యము చేసినట్టు కానఁబడుచున్నది. శ్రీరంగరాయలు రాజ్యమునకు వచ్చినతరువాతను, ఇబ్రహీమ్‌షా మరణము పొందకమునుపును, యయాతిచరిత్రము రచియింపఁబడి యున్నందున, ౧౫౭౪ వ సంవత్సరమునకును ౧౫౮౧ వ సంవత్సరమునకును నడుమకాలమునందు యయాతిచరిత్రము రచియింపఁబడినట్టు నిశ్చయముగాఁ దెలియవచ్చుచున్నది. ఈ కవియొక్క శైలి మొదలైనవి మిక్కిలి చక్కఁగా నున్నవని యీవఱకే చెప్పియున్నాను. శైలి తెలియుటకయి యయాతిచరిత్రములోని రెండు పద్యముల నిందుదాహరించుచున్నాను—

ఉ. చిన్నవుగాన నీవు కడుఁ బ్రేముడి ముంగిటిలోనఁ దిమ్మరన్
పిన్నబలెం దలంపఁబడు నీ విటనిల్చిన పెక్కుతేండ్లు మా
కన్నను వాచు నీ మొగము గానక యెప్పుడుఁ జూడ కున్న నా
యన్న యిదేటి కీతమక మారసిచూచిన వింతవాడవే—ఆ. 3

ఉ. తొంగలిపువ్వుఁదేనియలఁ దూఁకొని మత్తిలి తుమ్మెదల్ పయిన్
బొంగుచు వ్రాల నొప్పెనఁగఁ బూచినపొన్నఁ గడంగి కాంచి మున్
గ్రుంగినయావిసంబు వెస మీఁదికిఁ బిచ్చిలువేఁడికంటియూ
జంగ మటంచు మ్రొక్కె నొకచాన నెలంతలు చూచి నవ్వఁగన్—ఆ. ౪

22. రామరాజ భూషణుఁడు

రామరాజభూషణుఁడు వసుచరిత్రమను శృంగారప్రబంధమును రచియించిన మహాకవి. (రామరాజభూషణుఁడనునది రామరాజుయొక్క యాస్థానమం దుండుటచేత వచ్చిన బిరుదునామమనియు నిజమయిన పేరు బట్టుమూర్తి యనియు చెప్పుదురు.) ఇతని జన్మభూమి బట్టుపల్లెయను గ్రామము. ఈ గ్రామమును కృష్ణదేవరాయలు కవిత్వమునందుఁ బ్రవీణులై ప్రబంధాంకమువారని బిరుదుపొందిన యీతని పూర్వులగు బట్టురాజుల కిచ్చెను. ఈబట్టుపల్లె బళ్ళారిమండలములోని పాలమండలమునకు సమీపమున నున్నదని యొకరును, కడపమండలములోని పులివెందల తాలూకాలో నున్నదని యొకరును వ్రాసియున్నారు. ఈ కవి కృష్ణదేవరాయల కాలములోఁ బుట్టి యుండవచ్చును గాని యాతని యాస్థానమునందలి యష్టదిగ్గజము లనఁబడు కవులలో నొకఁడుమాత్రము కాఁడు. ఇతఁడు మొట్టమొదట ౧౫౪౨ వ సంవత్సరము మొదలుకొని ౧౫౬౫ వ సంవత్సరమువఱకును సదాశివరాయల పేర విజయనగరములో రాజ్యముచేసిన కృష్ణదేవరాయల యల్లుఁడయిన రామరాజుయొక్క యంతిమదశలో నతని యాస్థానమునందుఁ బ్రవేశించి యాతని మీఁదఁ గొన్ని చాటుప్రబంధములను చేసి రామరాజుభూషణుఁడని బిరుదు పేరొందెను. కాఁబట్టి యీతని కవిత్వము ౧౫౬౦ వ సంవత్సర ప్రాంతములయం దారంభ మయినదని చెప్పవచ్చును. ఈతఁడు రామరాజుయొక్క జీవితకాలములోనే యాతనిమీఁద కృతులు చెప్పినట్టు వసుచరిత్ర కృతినాయకుఁడయిన తిరుమలదేవరాయలు కవినిగూర్చి పలికిన యీ క్రింది పద్యమువలనఁ దెలియవచ్చుచున్నది.

శా. శ్రీరామక్షితిపున్మదగ్రజు జయశ్రీలోలు నానాకళా
పారీణున్ బహుసంస్కృతాంధ్రకృతులం బల్మారు మెప్పించి త

త్కారుణ్యంబున రత్నహారహయవేదండాగ్రహారాది స
త్కారం బందితి రామభూషణకవీ ధన్యుండ వీవన్నిటన్—ఆ. ౧

ఈ పద్యమునందుఁ జెప్పఁబడినతఁడు కృష్ణదేవరాయని యల్లుఁడయిన యార్వీటి రామరాజు. కృష్ణదేవరాయని యల్లుఁడయినందున నీతనికి నళియరామరాజని సాధారణముగా వాడుకకలదు. ఈతఁడు కృష్ణదేవరాయని యల్లుఁడయి సదాశివరాయని రాజ్యభారమును వహించిన సంగతి రామాభ్యుదయములోని యవతారికయందీక్రింది పద్యమునఁ జెప్పఁబడినది—

ఉ. ఆపటుకీర్తి రామవసుధాధిపచంద్రుఁడు కృష్ణరాయధా
త్రీపతిసార్వభౌమదుహితృప్రియుఁడై వితతప్రతాపసం
తాపితశత్రుఁడై యలసదాశివరాయనిరంతరాయవి
ద్యాపురరాజ్యలక్ష్మికి విధానము దా నయి మించె నెంతయున్.

ఈ రామరాజు వివాహము చేసికొన్న కృష్ణదేవరాయని కూఁతురి పేరు తిరుమలాంబ. ఆమెవలన నీతనికి కృష్ణరాజు, పెదతిమ్మరాజు అని యిద్దఱుపుత్రులు కలిగిరి. ఈ సంగతి నరపతి విజయమునందీక్రింది పద్యములలోఁ జెప్పఁబడినది—

గీ. అనఘుఁడౌ వైరసేని భీమాధిపేంద్రు
పట్టి దమయంతిఁ జేపట్టినట్టిరీతి
రామభూపాలకుఁడు కృష్ణరాయతనయ
యగుతిరుమలాంబ నుద్వాహమయ్యె వేడ్క.

చ. శతమఖునిం బులోమజను శంకరుని న్గిరిపుత్రి శంబరా
హితు రతిదేవిఁ బోలుచు నహీనసుఖానుభవాప్తి రామభూ
పతియును దిర్మలాంబయును భానుసమానునిఁ గృష్ణసాధ్యు నం
చితగుణుఁ బెద్దతిమ్మనృపశేఖరుఁ గాంచిరి హర్షమొప్పఁగన్.

రామరాజుయొక్క యనంతరమున మాతామహార్జితమయిన విద్యానగరరాజ్యమునకు రావలసినవాఁడు కృష్ణరాయని దౌహిత్రుఁ డయిన కృష్ణరాజే యయినను, రామరాజు తమ్ములయిన తిరుమలదేవ రాయలును వేంకటపతిరాయలును బలవంతు లయి యాతనికిఁ దక్క నియ్యక యారాజ్యమును తామే యాక్రమించుకొని యేలసాగిరి.

మూర్తి యనియు రామరాజభూషణుఁ డనియు నిద్దఱు వేఱు వేఱుకవు లనియు నందు మూర్తికవి నరసభూపాలీయమును, రామరాజ భూషణకవి వసుచరిత్ర, హరిశ్చంద్ర నలోపాఖ్యానములను రచియించి రనియు కొందఱును, ఇద్దఱు నొక్కరే యనియు మూర్తి యనునది నిజ మయినపేరనియు రామరాజభూషణుఁ డన్నది రామరాజుయొక్క సభ కలంకారముగా నుండుటచేత వచ్చిన బిరుదుపే రనియు నతఁడు సూరప రాజున కౌరసపుత్రుఁ డయి తదగ్రజుఁ డయిన వేంకటరాయభూషణునకు స్వీకృతపుత్రుఁ డనియు మఱి కొందఱును జెప్పుచున్నారు. "శ్రీరామ చంద్రచరణారవిందవందన పవననందనప్రసాద సమాసాదిత సంస్కృ తాంధ్రభాషాసామ్రాజ్య సర్వంకష చతుర్విధకవితా నిర్వాహకసాహిత్య రసపోషణ రామరాజభూషణప్రణీతం" బని వసుచరిత్రములోని గద్య మొకవిధముగాను "శ్రీహనుమత్ప్రసాదలబ్ధకవితాసార సారస్వతాలం కార నిరంకుశప్రతిభాబంధుర ప్రబంధపఠన రచనాధురంధర ప్రబంధాంక వేంకటరాయభూషణపుత్ర తిమ్మరాజపౌత్ర సకలభాషావిశేష నిరుప మావధాన శారదామూర్తి మూర్తిప్రణీతం" బని నరసభూపాలీయము లోని గద్య మింకొకవిధముగాను నుండుటను బట్టియు, హరిశ్చంద్ర నలోపాఖ్యానములో "ప్రబంధాంక సింగరాజ తిమ్మరాజ ప్రియతనూజ ధీర సూరపాత్మజుఁడ రామనృపభూషణాఖ్య సుకవి" ననియు నరస భూపాలీయములో "ప్రబంధాంక సింగరాజసుత తిమ్మరాజపుత్ర ప్రసిద్ధ సరస వేంకటరాయభూషణసుపుత్రు నను బుధవిధేయు శుభమూర్తి

నామధేయు" ననియు తంత్రులను వేఱువేఱుగాఁ జెప్పుటనుబట్టియు, వేఱువేఱు కవులయినట్టు పయికిఁ గానవచ్చుచున్నను గొన్ని హేతువులను బట్టి రెండవపక్షమువారు చెప్పెడి యంశములుకూడ సావధానముగా విచారింపవలసినవిగా నున్నవి. ఉభయపక్షములవారును జెప్పెడుయుక్తులను జక్కఁగా గ్రహింపఁగలుగుట కయి వంశక్రమమును దెల్పెడు పూర్వోక్తము లయిన రెండు పద్యములను పూర్ణముగా నిం దుదాహరించుట యావశ్యకమని తోఁచి యట్లు చేయుచున్నాను. మొట్టమొదట పుస్తకములను జదివినప్పు డిరువురుకవులను వేఱువేఱనియే నేనును నభిప్రాయపడినను రెండవవారి యుక్తులను విన్నపిమ్మట నామనస్సునకుఁ గొంత సందేహము కలిగినందున, ఈతన్నిర్ణయమును దీసిని జదువువారికి విడిచిపెట్టి గ్రంథసౌలభ్యము నిమిత్త మిం దుభయుల నొక్కరినిగానే భావించి వ్రాసెదను. ఇరువురును భిన్ను లయినను కాకపోయినను చరిత్రభాగమునందు వేఱువేఱుగా వ్రాయవలసిన యంశము లేవియుఁ గానఁబడవు.

౧. సీ. శతలేఖినీపద్యసంధానధౌరేయు ఘటికాశతగ్రంథకరణధుర్యు
నాశుప్రబంధబంధాభిజ్ఞు నోష్ఠ్యనిరోష్ఠ్యజ్ఞు నచలజిహ్వోక్తినిపుణుఁ
దత్సమభాషావితానజ్ఞు బహుపద్యసాధితవ్యస్తాక్షరీధురీణు
నేకసంథోచితశ్లోకభాషాకృత్యచతురు నోష్ట్యనిరోష్ట్యసంకరజ్ఞు

నమితయమకాశుధీప్రబంధాంకసింగ
రాజసుత తిమ్మరాజపుత్ర ప్రసిద్ధ
సరస వేంకటరాయభూషణసుపుత్రు
నను బుధవిధేయ శుభమూర్తినామధేయు. నరసభూపాలీయము.

౨. సీ. వనధిలంఘనకృపావర్ధితోభయకవితాకళారత్నరత్నాకరుండ
సకలకర్ణాటరక్షాధురంధరరామవిభుదత్తశుభచిహ్నవిభవయుతుఁడ

వసుచరిత్రాదికావ్యప్రీతబహునృపప్రాపితానేకరత్నప్లవుండ
శాశ్వతశ్రీవేంకటేశ్వరానుగ్రహానిరుపాధికైశ్వర్యనిత్యయశుఁడ
శ్రీకరమహాప్రబంధాంక సింగరాజ
తిమ్మరాజప్రియతనూజ ధీరసూర
పాత్మజుఁడ రామనృపభూషణాఖ్య సుకవి
నంకితమొనర్తు నీకావ్య మనఘభక్తి.-హరిశ్చంద్రనలోపాఖ్యానము

మ. నను శ్రీరామపదారవిందభజనానందుఁ జగత్ప్రాణినం
దనకారుణ్యకటాక్షలబ్ధకవితాధారసుధారాశి సం
జనితైకైకదినప్రబంధఘటికాసద్యశ్శ్లత గ్రంథక
ల్పను సంగీతకళారహస్యనిధిఁ బిల్పించి పల్కెం గృపన్.-వసుచరిత్ర

పయిపద్యములలో నుపయోగింపఁబడిన విశేషణములు కొన్ని భిన్నములుగా నున్నను పరస్పరవిరుద్ధము లయిన వేవియు లేనందున వానినిబట్టి గ్రంథకర్తలు భిన్నులని సాధించుట కాధార మేదియు లేదు. రెండు గ్రంథములను జేసినవా రాంజనేయ ప్రసాదలబ్ధ కవిత్వవైభవుల మని వ్రాసికొనుటచేతను, రెండు కవిత్వములు నేకరీతినే యుండుటచేతను, ఆదినుండియు నిప్పటివఱకును బట్టుమూర్తియే వసుచరిత్రము రచియించెనని జనశ్రుతి వచ్చుచుండుటచేతను, కవికిఁ దరువాత నల్పకాలములోనే వసుచరిత్రమునకు వ్యాఖ్యానము చేసినవారు కొందఱు బట్టుమూర్తి తాను రచించిన నానారసభాసురమగు ప్రబంధమునందలి వివిధాలంకారములకు లక్షణగ్రంథముగ నుండునట్లు నరసభూపాలీయమను నలంకార గ్రంథమును రచియించెనని వ్రాసియుండుటచేత, తద్గ్రంథత్రయకర్త యొక్కఁడే యై యుండునేమో యని యెట్టివారికిని సందేహము కలుగకమానదు. ఇఁక పైపద్యములలోని యంశములనుబట్టి విచారింపవలెను. నరసభూపాలీయకృతికర్త పేరందలి గద్యమునుబట్టి

మూర్తియనుట స్పష్టము. దానికి బట్టు మొదలయిన పదములను వేనిని జేర్చినను, అవి కులనామములో బిరుదనామములో యయి యుండును. కావ్యాలంకారసంగ్రహ మనఁబడెడు నరసభూపాలీయములోని పూర్వోదాహృతమయిన పద్యములో "శుభమూర్తినామధేయు" నని 'శుభ' విశేషణ మొకటి గానఁబడుచున్నది. ఈ శుభవిశేషణ మెట్లు వచ్చినది, ఎవ్వరికిఁ జెందినది, అన్న విషయము నాలోచింపవలయును. పూర్వోదాహృత మయిన హరిశ్చంద్రనలోపాఖ్యానములోని పద్యములో రామభూషణకవి "రామవిభుదత్త 'శుభ' చిహ్న విభవయుతుఁడ" నని వ్రాసికొని యున్నాఁడు. కాఁబట్టి దీనినిబట్టి చూడఁగా శుభబిరుదమును రామరాజిచ్చెననియు, రామరాజభూషణనామము గలవానికిది చెందుననియు, విస్పష్టమగుచున్నది. నరసభూపాలీయ కృతికర్త తనకు శుభ విశేషణమును వేసికొనుటయు, హరిశ్చంద్ర నలోపాఖ్యాన కృతికర్త తనకు రామరాజు శుభ చిహ్న మిచ్చెనని చెప్పుకొనుటయు, ఈ రెంటిని గూర్చి చిరకాలమునుండి పరంపరగావచ్చుచున్న జనప్రతీతితోఁ జేర్చి విచారించినపక్షమున నారెండు గ్రంథములను రచించినవా రొక్కరేయని చూపుట కది యొక ప్రబలసాక్ష్యముగాఁ గనఁబడుచున్నది. రామరాజభూషణపదము బిరుదనామమే యైనపక్షమున, పైపుస్తకములయందలి నామవ్యత్యాసములనుబట్టి కవులు వేఱనిచెప్పుట కవకాశ ముండదు. రామరాజభూషణపదము బిరుదుపేరుగాక పేరేయై యుండినయెడల నది యంతటను నేకరూపముగా నుండునే కాని పై పద్య గద్యములయం దున్నట్లొకచోట 'రామరాజభూషణ' యనియు, ఇంకొకచోట 'రామభూషణ' యనియు, వేఱొకచోట 'రామనృపభూషణ' యనియు నుండదని యొక యుక్తి చెప్పుదురుగాని యదియంత ప్రబల యుక్తి కాదు. కట్టకడపటఁ జేసిన హరిశ్చంద్ర నలోపాఖ్యానములో "వసుచరిత్రాదికావ్య" "బహు నృపప్రాపితానేకరత్న" పదములను ప్రయోగించుటచే నాదిపద ప్రయో

గముచేత రెంటికినడుమ నతఁడు చేసినకావ్య మింకొకటి యుండవలసి నందున నదియే నరసభూపాలీయమనియు, బహుపదప్రయోగముచేత నిద్దఱికంటె నెక్కువరాజు లుండవలసినందున వారే రామరాజు తిరుమలరాజు నరసరాజు ననియు, మూఁడుగ్రంథములను రచించినవాఁ డొక్కఁడేయనుట కిరుకాకయుక్తి నిసి జెప్పుచున్నారు. ఈ యుక్తి యెంత యాదరణీయమో బుద్ధిమంతులు తమలోఁ దాము నిర్ణయించుకోవలెను. ఈకవి తన జనకపితను పాలకపితనుగూడ సంతోషపెట్టుటకయి యొక పుస్తకమునందు కన్నతండ్రిపేరు వేసెననియు, ఒకపుస్తకమునందు పెంచుకొన్న తండ్రిపేరు వేసెననియు, ఒకపుస్తకమునం దెవ్వరిపేరును వేయక విడిచెననియుఁ జెప్పుచు, ఆయాపుస్తకములయం దుపయోగింపఁ బడిన పదములే యొకఁడు జనకపితయనియు నొకఁడు పాలకపితయనియు సూచించుచున్నవని చెప్పుచున్నారు. హరిశ్చంద్ర నలోపాఖ్యానములోని "సూరపాత్మజుఁడ" నను వాక్యమువలన సూరపరాజున కౌరసుఁడని యాత్మజ శబ్దము దృఢపఱుచు చున్నదనియు, నరసభూపాలీయములోని "వేంకటరాయభూషణ సుపుత్రు" నను వచనమువలన వేంకటరాయ భూషణునకు దత్తుఁడని సుపుత్రశబ్దము దృఢపఱుచుచున్నదనియు వాదించుచున్నారు. ఈ యర్థములయం దాత్మజశబ్దమునకుఁ దనవలనఁ బుట్టిన వాఁడుకాని దత్తుఁడు కాఁడనియు, సుపుత్రశబ్దమునకు పున్నామనరకము నుండి రక్షించు దత్తుఁడుకాని కన్నవాఁడు కాఁడనియు గ్రహింపవలెను. ఈ యంశముల కనుకూలముగానుండు కథలు కొన్నికలవుగాని గ్రంథ విస్తారభీతిచే వానిని విడుచుచున్నాను.

వసుచరిత్ర కర్తయు నరసభూపాలీయకృతికర్తయు నొక్కఁడేమో యని నాకు సందేహము కలిగించుటకుఁ గారణములయిన యంశములను మఱికొన్నిటిఁగూడ నిప్పు డిందుఁ జేర్చుచున్నాను. వీనిని పయినిజెప్పిన వానితోఁ జేర్చి చదివి బుద్ధిమంతులు తమ యిచ్చవచ్చిన సిద్ధాంతము చేసికొనవచ్చును.

౧. గీ. తా రచించిన వసుచరిత్రమునఁ గన్న
తండ్రి సూరన వెలయించి తలఁపఁ డయ్యె
నన్ను మన శారదామూర్తి నాఫలంబె
దత్తుఁ డగువానిఁ జేపట్టెఁదరమె నాకు.

అను చాటుధారాపద మొకటి రామరాజభూషణుఁడు తన వసుచరిత్రములో జనకపితయైన సూరపరాజు పేరుదాహరించి తన్నుఁ బేర్కొనకపోవుటచేత పాలకపితయైన వేంకటరాయభూషణునిచేఁ జెప్పఁబడినదని వాడుకలోనున్నది.

౨. చతుర్భుజాభిషేకము, యావనచరిత్రము, గంగాగౌరీసంవాదము అను ప్రబంధములను రచించి ప్రసిద్ధుడయి వసుచరిత్రమునకు వ్యాఖ్యానముచేసిన సోమనాథకవి గ్రంథాదిపీఠికలో నిట్లు వ్రాసియున్నాఁడు—

శా. ఈరీతిం గవితావితానవృతగౌరీశానమౌళిస్థలో
దారోద్దేశుఁడ నై ననాకు వెస విద్యావంతు లెల్లన్మనో
హారప్రక్రియ మూర్తిచేత రచితంబై విశ్రుతంబౌ వసు
క్ష్మారాట్చిత్రచరిత్రటీక కయి యుత్సాహంబు పుట్టించినన్.

ఉ. కారణజన్ముఁడై కవినికాయము మెచ్చఁగఁ గావ్యకర్తయై
భూరికళాకలాపుఁ డయి పొల్పువహించెడు బట్టుమూర్తిచే
నీరితమై సుఖారవదహీనపదాస్పద మైనయావసు
క్ష్మారమణప్రవృత్తము సుసాధ్యముకాదు తలంచిచూడగన్.

అని యిందలి మొదటిపద్యములో వసుచరిత్రము "మూర్తి" చేత రచితమనియు, రెండవపద్యములో "బట్టుమూర్తిచే నీరిత" మైనదనియు, వ్యాఖ్యాత చెప్పియున్నాఁడు. ఈ వ్యాఖ్యాత యేకాలమునందుండినవాఁడో సరిగా తెలియదుగాని, అప్పటి కవికిని నహోబలపతికిని దరువాత నల్ప్యాల్పకాలములోనె పదునేడవశతాబ్దాంతమున నున్నట్లు తెలియ

వచ్చుచున్నది. పూర్వకాలమునందే యితఁడిట్లు వ్రాయుటనుగూర్చి యేమిచెప్పెదరు? ఇతఁడు సావధానముగా గ్రంథమును బరిశీలించి ప్రతి వాదులు తమ వాదమున కనుకూలములుగా నుదాహరించెడు గద్య పద్యముల కన్నిటికిని బ్రతిపదార్థమును వ్రాసి విమర్శించినవాఁడేకదా?

3. అనేక గ్రంథములను జేసిన గొప్పకవులు సమానవర్ణనలు వచ్చెడుపట్టున తాము మొదట రచియించినగ్రంథములలోనుండి పద్యము లను జేకొని యావశ్యకములైన మార్పులను జేసి తరువాత రచియిం చెడుగ్రంథములలో జేర్చుకొనెడి యాచారముగలదు. తిక్కనసోమయాజి తననిర్వచనోత్తరరామాయణములో మూడవయాశ్వాసమున,

చ. గుణమున లస్తకంబునను గోటియుగంబునఁ గేలఁ దార భీ
షణముగ నుప్పతిల్లి రభసంబున రేఁగినమాడ్కిఁ దీవ్రమా
ర్గణనికరంబులొక్కట నరాతిబలంబులఁ గప్ప శార్ఙ్గని
క్వణనము రోదసీకుహరకర్పరముం బగిలింప నుగ్రతన్.

అని రచియించినపద్యమునే విరాటపర్వములో నయిదవయాశ్వా సమునఁ గొంచెము మార్పుచేసి యీక్రిందిరీతిగాఁ బ్రయోగించు చున్నాఁడు—

చ. గుణమున లస్తకంబునను గోటియుగంబునఁ గేలఁ జాల భీ
షణముగ నుప్పతిల్లి రభసంబునఁ రేఁగినమాడ్కిఁ దీవ్రమా
ర్గణనికరంబు లొక్కట నరాతిబలంబులఁగప్ప గాండివ
క్వణనము రోదసీకుహరకర్పరముం బగిలింప నుగ్రతన్.

ఇందు "తార" యనునది "చాల" గను "శారఙ్గనిక్వణ మనునది "గాండివ క్వణనము" గాను, మార్పఁబడినవి. మఱియు సోమయాజులు,

మ. కలగెం దోయధిస్తకంబు గిరివర్గం బెల్ల నూటాడె సం
చలతంబొందె వసుంధరావలయ మాశాచక్ర మల్లాడెఁ గొం

దల మందెం ద్రిప శేంద్రుపట్టణము పాతాళంబు ఘూర్ణిల్లె నా
కుల మయ్యెం గ్రహ తారకాకులము సంక్షోభించె నవ్వేధయున్.

అనుపద్యమును మార్పుచేయకయే నిర్వచనోత్తరరామాయణ ములో నైదవయాశ్వాసములోను విరాటపర్వములో నాలవయాశ్వాస ములోనుగూడ వేసియున్నాఁడు. ఈ ప్రకారముగానే వసుచరిత్రము ప్రథమాశ్వాసములోని,

శా. రామస్తోమవరుదానతోయ తటినీవ్రాతంబు కల్లోలినీ
స్వామిం జెంద యశంబు మేఘములఁ బర్వం గల్గువర్షాశర
త్సామానాధికరణ్యలబ్ధి కచటం చక్రాయుధుం డొందు ని
ద్రాముద్రానుగతప్రబోధములఁ జిత్రం బేక కాలంబునన్.

అనుపద్యము కొంతవఱకు మార్పఁబడి నరసభూపాలీయము ద్వితీయాశ్వాసములో,

శా. ఆమోదంబున శ్రీనృసింహవిభుదానాంభోనదు ల్సాగర
స్వామిం జెంద యశంబు మేఘములఁ బర్వం గల్గువర్షాశర
త్సామానాధికరణ్యశంక నచటం దామోదరుం డొందు ని
ద్రాముద్రానుగతప్రబోధములఁ జిత్రం బేక కాలంబునన్.

అని ప్రయోగింపఁబడియున్నది. ఇద్దఱు నేకకవులయినం దక్క నిట్టిప్రయోగముల నెట్లు సాధువుగా సాధింపవచ్చును? ఈగ్రంథద్వయకర్త యొక్కఁడు కాఁ డనెడుపక్షమున, ఈమహాకవులను గ్రంథచౌర్యము చేసెడి యల్పకవులలోఁ బరిగణింపవలసివచ్చును. ఈవిధముగానే వసు చరిత్రము ప్రథమాశ్వాసములోని,

శా. ఆమంచాకిని మౌళిఁ బూని నను నర్ధాంగీకృతం జేసితౌ
నౌ మే లేమ్మలని యార్య యల్గఁ బ్రణతుండై తత్పదాంభోజయో
గామర్షంబున గంగయు న్మొరయఁ జూడాభోగసమ్యక్క్రియా
సామర్థ్యంబున నేఁడుశంభుఁడు కృతిస్వామిం గృపం బ్రోవుతన్.

అను శివస్తుతిపద్యార్థమును గొంచెము మార్చి యధికసారస్యము గలిగించి,

శా. గంగం దాల్చితి వుత్తమాంగమున నన్ గైకోలు కావించి త
ర్ధాంగీకారమనం బురంధ్రి నిను వామాంగంబునం దాల్ప నే
శృంగారోన్నతిఁ జూపు మంచు గిరిజన్ శీర్షాపగాబింబిత
స్వాంగానందితఁ జేయు శంభుఁడు నృసింహాధీశ్వరుం బ్రోవుతన్.

అని నరసభూపాలీయములోఁ గవి ప్రయోగించియున్నాఁడు. మొదటిపద్యములోని కొన్ని పదముల శ్లేషార్థముల నటుండనిచ్చినయెడల, ఉభయపద్యములలోను గంగను శిరస్సునఁ దాల్చి నన్నర్ధాంగీకృతను జేసితివని పార్వతి కుపితురాలు కాఁగా శివుఁ డామె కోపమును దీర్చుటకయి పాదములఁబడె నన్నయర్థము సామాన్యముగాఁ జెప్పఁబడినది. వీనిలో మొదటిపద్యమున శివుఁడు పార్వతికిఁ గోపశాంతి చేయలేక పోవుటయే కాక గంగకుఁగూడ కోపము తెప్పించి యామెను వేఁడుకో వలసినవాఁ డయ్యెను. రెండవపద్యమున గంగాప్రతిబింబితస్వరూపమును బార్వతికిఁ జూపి తా నామెనుఁగూడ నుత్తమాంగముననే ధరించి భ్రమ కలిగించి శివుఁ డామెను శాంతచిత్తురాలిని జేయఁగలిగెను. ఈ రెండు కావ్యములకు నొక్కరినే కర్తలనుగాఁ జెప్పకపోయినపక్షమునఁ వారి యందుఁ బదార్థచౌర్య మారోపింపవలసి వచ్చును.

౪. రామరాజభూషణుని కాలములోనే యుండి యాకాలము లోనే మనుమల నెత్తిన వేంకటపతిరాయల విద్యాగురువగు మండ రామానుజాచార్యుని ముమ్మనుమని మనుమఁడగు లక్ష్మీనరసింహాచార్యులు తాను రచించిన యాంధ్రకౌముదియందు,

"ముప్రత్యయాభావస్య అల్లసాని పెద్దనార్యశిష్యేణ బట్టుమూర్తి మహాకవినా విరచితే వసుచరిత్రే-"

ము ప్రత్యయాభావమున పెద్దనార్యశిష్యుఁడైన బట్టుమూర్తి మహాకవిచేత రచితమైన వసుచరిత్రమునందని వ్రాసి,

"సీ. రాజహంసలుగాని రాజహంసలుగారు

సరసకళాసారసారరుచుల"

అను వసుచరిత్రలోని యీసీసపాదమును లక్ష్యమునుగాఁ జూపి యున్నాఁడు. బట్టుమూర్తికి నూఱుసంవత్సరములలోపలనే యిట్లు గ్రంథస్థము చేసినవ్రాఁతను నిరాకరించుటకు ప్రబలప్రమాణము కావలసి యుండునుగదా?

౫. అప్పకవీయములో నుదాహరింపఁబడి యించుమించు రామ రాజభూషణునికాలములోనే రచియింపఁబడిన లక్షణదీపికలో ౪౧౯ వ పద్యము తరువాత,

"మంజీర శబ్దమునకు బట్టుమూర్తి వసుచరిత్ర మొదటిపద్యము ప్రథమచరణమున హల్లునకుఁ బ్రయోగము-"

అని వ్రాయఁబడి,

"శా. శ్రీభూపుత్రివివాహవేళ నిజమంజీరాగ్రరత్నస్థలీ. &c.

ఇత్యాది వసుచరిత్రపద్య ముదాహరింపఁబడియున్నది. సరికాల మువారికూడ సుప్రసిద్ధుఁడైన రామరాజభూషణుని బట్టుమూర్తియని భ్రమించుట పొసఁగ నేరదు గాన నిరువురు నొక్కరేయనుట యధిక విశ్వసనీయము.

ఈరామభూషణకవి మొట్టమొదట రచియించిన కావ్యము వసు చరిత్రము. ఈప్రబంధముతో సరిరాఁదగిన శ్లేషకావ్యము తెనుఁగున మఱియొకటి లేదు. ఇందలివర్ణనలు మిక్కిలి మనోహరము లయి యున్నవి; పదములకూర్పు మిక్కిలి సుందరముగా నున్నది. శబ్దార్థా లంకారము లాహ్లాదకరముగానున్నవి; రసభావాదులు యథాయోగ్య ములుగా నున్నవి. ఈగ్రంథము రచియింపఁబడినతరువాత నేఁటివఱ

కును ప్రబంధములను జేయఁబూనినకవు లెల్లరు వసుచరిత్రమును ప్రతి రూపముగాఁ జేకొని దాని ననుసరించి తమగ్రంథములను రచియించు చున్నారు. ఈవసుచరిత్రము హూణశకము ౧౫౭౦ వ సంవత్సరమునకుఁ దరువాతనే రచియింపఁబడినది. వసుచరిత్ర కృతిపతియైన తిరుమలదేవ రాయఁడు ౧౫౬౭ వ సంవత్సరమునందు తనరాజధానిని పెనుగొండకు మార్చెను. ఈతఁడు పెనుగొండను రాజధానిగాఁ జేసికొన్నతరువాత మహమ్మదీయులతో జరిగిన యుద్ధవార్త వసుచరిత్రలోని యీపద్యము నందుఁ జెప్పఁబడియున్నది—

చ. తిరుమలరాయశేఖరుసిధీరచమూభటరాజ యాజి భీ
కరయవనేశ్వరప్రహితఖానబలంబులఁ జక్కు సేయ ని
ద్ధరఁ బెనుగొండకొండలు మదద్విపచర్మకపాలమాలికా
పరికరభూషితంబు లయి బల్విడిఁ గాంచె గిరీశభావముల్.

తిరుమలదేవరాయలు తనజ్యేష్ఠపుత్రుఁ డయిన రఘునాథరాజు మృతుఁడయినతరువాత ద్వితీయపుత్రుఁ డయిన శ్రీరంగరాజును యువ రాజునుజేసి రాజ్యభారము నాతనిమీఁదమోపిన కథగూడ సూచనగా నీపుస్తకమునందుఁ జెప్పఁబడియున్నది—

చ. హరిపదభక్తిశీలుఁడగు నారఘునాథనృపాలుకూర్మిసో
దరుఁడు సిరంగరాయవసుధావరుఁ డాత్మగుణప్రమోదవ
త్తిరుమలరాయశేఖరవితీర్ణ మహాయువరాజపట్టబం
ధురుఁడయి సర్వభూభువనధూర్వహశక్తివహించు నెంతయున్.

తిరుమలదేవరాయఁ డవసానదశలో తనరాజ్యభారము నంతను కొడుకులమీఁద వదలివేసినతరువాత మూఁడవకొడు కయిన వేంకటపతి రాజు అలీ ఆడిల్‌షాతో యుద్ధము చేసి పరాజితుఁడయి ౧౫౭౭ వ సంవత్సరమునందు రాజధానిని పెనుగొండనుండి చంద్రగిరికి మరల మార్చెను. వేంకటపతిరాజోడిపోయినసంగతిని జెప్పకపోయినను కవి

వసుచరిత్రములోని యీ క్రిందిపద్యములో వేంకటపతి రాజధానిని చంద్రగిరికి మార్చినసంగతి సూచించియున్నాఁడు——

మ. హరుఁ డాతారకశైలమధ్యమున నధ్యాసీనుఁడై రాజశే
ఖరవిఖ్యాతి వహించుఁ జందగిరిదుర్గంబందు శ్రీవేంకటే
శ్వరుఁ డొప్పెన్, బహురాజశేఖరసదాసంసేవ్యుఁడై యారయ
ద్ధర బంటులికవాసి తద్గిరులకున్ దద్వల్లభశ్రీలకున్.

ఈపద్యముల నన్నిటిని బట్టి చూడఁగా వసుచరిత్రము ౧౫౭౭ వ సంవత్సరము తిరువాతనే ముగింపఁబడినట్టు స్పష్ట మగుచున్నది. తిరుమలరాయఁ డేసంవత్సరమునందు మృతిఁబొందెనో స్పష్టముగాఁ దెలియదుగాని ౧౫౭౪ వ సంవత్సరమువఱకును నాతఁ డిచ్చిన దానశాసనములు కనఁబడుచున్నవి; ౧౫౭౪వ సంవత్సరము మొదలుకొని ౧౫౮౫వ సంవత్సరమువఱకును అతని రెండవకొడుకయిన శ్రీరంగరాజు దానశాసనములును, ౧౫౮౫వ సంవత్సరము మొదలుకొని ౧౬౧౪వ సంవత్సరమువఱకును మూఁడవకొడు కయిన వేంకటపతియొక్క దానశాసనములును గానవచ్చుచున్నవి. తిరుమలదేవరాయఁడు ౧౫౭౪వ సంవత్సరమునకుఁ దరువాత రాజ్యభారమునంతను పూర్ణముగా కొడుకుల కప్పగించి తాను విద్వద్గోష్ఠితో ప్రొద్దుపుచ్చుచుండియుండవచ్చును. ౧౫౭౭వ సంవత్సరమునందు ఆలీఅడిల్‌షా తిరుమలదేవరాయని పెనుగొండనుండి చంద్రగిరికి పాఱఁదోలినట్టు మహమ్మదీయులు వ్రాసినచరిత్రమునందున్నది. దీనినిబట్టిచూడఁగా తిరుమలదేవరాయఁడు ౧౫౭౭ వ సంవత్సరమునకుఁ దరువాతకూడఁ గొంతకాలము జీవించియున్నట్టు తోఁచుచున్నది. రామరాజభూషణుఁడు తిరుమలరాయనికి వసుచరిత్రము నంకితము చేయునపుడు తెనాలిరామకృష్ణుఁ డక్కడకు వచ్చి "శ్రీభూపుత్రి" యని మొదటిపద్యమును జదువ నారంభింపఁగానే పకపకనవ్వి యీకృతి చదువుటతోనే శ్రీపోయెనని గేలిచేసె ననియు, అదియెట్లని సభవా రడు

గగాఁ నతఁడు చేతిలో బూడిద వేసికొని యందు శ్రీ యనునక్షరమును వ్రాసి చేయి నోటిదగ్గఱగాఁ బెట్టుకొని బిగ్గరగా శ్రీభూపుత్రి యను (భూ) ద్వితీయాక్షర మొత్తి చదువఁగానే యాగాలిచేత చేతిలో వ్రాసిన శ్రీ యెగిరిపోవుట చూపె ననియు, అందుమీఁద రాజు కృతి నందక నిరాకరించెననియు పసికిమాలిన కథయొకటి చెప్పుదురు. ఈప్రకారముగానే రామరాజభూషణుడు 'నానాసూనవితానవాసన'లన్న పద్యమును నందితిమ్మన్నయొద్దను "మోహాపదేశ తమోముద్రితములైన" యను పద్యము నయ్యలరాజు రామభద్రుని యొద్దను కొని తన వసుచరిత్రము నందు వేసికొనెనని కొందఱు కొన్నికథలు కల్పించి యున్నారుగాని యవి యన్నియు నవిశ్వసనీయములే. అటువంటి యుద్గ్రంథమును జేయఁ గలిగిన మహాకవి రెండు సామాన్యపదములను జేయలేక యితరులవలన దొంగిలించి తనవిగాఁ దన గ్రంథమునందు వేసికొనెనని చెప్పుటకంటెఁ బరిహాసాస్పద మయిన మాట మఱియొకటి యుండదు.

రామరాజభూషణుఁ డొకనాఁడు సభలో రాజాజ్ఞమీఁద కవీశ్వరులకు "కుంజరయూధంబు దోమకుత్తుకఁ జొచ్చెన్" అని సమస్య యియ్యఁగా తెనాలిరామకృష్ణుఁడు

క. గంజాయి త్రాగి తురకల
సంజాతులఁ గూడి కల్లు చవిగొన్నావా?
లంజెలకొడుకా! యెక్కడఁ
గుంజరయూధంబు దోమకుత్తుకఁ జొచ్చెన్?

అని పూరించె ననియు, అదియే రాజు తాసిచ్చినట్లు భావించి పూరింపుమని యడుగఁగా

క. రంజన చెడి పాండవు లరి
భంజనులై విరటుఁగొల్వఁ బాల్పడి రకటా!

సంజయ! విధి నేమందును ?
గుంజరయూథంబు దోమకుత్తుకఁ జొచ్చెన్.

అని పూరించెననియు, రాజాతని సమయోచితబుద్ధికి సంతోషించి బహుమాన మిచ్చెననియు చెప్పుదురు. తెనాలిరామకృష్ణుఁడు రామరాజభూషణునియొక్క కడపటి దినములలో నున్నవాఁడగుటచేత నిది సత్య మయినను కావచ్చును.

నరసభూపాలీయము రచియించినకవి యెవ్వరయినను కృతిపతి రామరాజ తిరుమలదేవరాయలకు మేనల్లుఁడయిన నరసరాజు. ఈనరసరాజుయొక్క మాతామహుఁడయిన శ్రీరంగరాజునకు కోనరాజు, తిమ్మరాజు, రామరాజు, తిరుమలరాజు, వేంకటపతి, అని యయిదుగురు కొడుకులును, లక్కమాంబ, ఓబమాంబ, కోనమాంబ అని ముగ్గురు కూఁతులును ఉండిరి. ఆ కొమార్తెలలో లక్కమాంబ కుమారుఁడయిన నరసరాజు కావ్యాలంకార సంగ్రహమను నరసభూపాలీయమును కృతి నొందెను; ఓబమాంబ కుమారుఁడయిన గొబ్బూరి నరసరాజు రామాభ్యుదయమును కృతినందెను; కోనమాంబ కుమారుఁడయిన తిమ్మరాజు పరమయోగివిలాసమును రచియించెను. వీనిలో నరసభూపాలీయము ప్రతాపరుద్రీయమునకు తెలుఁగు. నాటక ప్రకరణమును మాత్రము విడిచి ప్రతాపరుద్రీయములోని లక్షణభాగమునంతను కవి తెనిఁగించినను లక్ష్యములను నరసభూపాలునిపేరఁ గ్రొత్తగా రచించెను.

రామరాజభూషణుఁడు సాహిత్యమునందు మాత్రమే కాక సంగీతమునందును మిగుల ప్రావీణ్యము గలవాఁడు. ఈతఁడు రచియించిన కృతులు కొన్ని యక్కడక్కడ నేఁటివఱకును పాడఁబడుచున్నవి. ఒకవేళ వసుచరిత్రములో తిరుమలదేవరాయఁడు కవిగూర్చి "బహు సంస్కృతాంధ్రకృతులం బల్మాఱు మెప్పించితి" వన్న కృతులివియే యయి యుండునేమో !

కవులిప్పటివలెనే పూర్వకాలమునందును విద్యామత్సరము కల వారయి యొండొరులతో వివాదములు పెట్టుకొనుచుండినట్లు కనఁబడు చున్నది. ఇట్టి యసూయాపరత్వము రామరాజభూషణునివద్ద సహితము బొత్తిగా లేకపోలేదు. ఇతఁడొకసారి యయ్యలరాజు రామభద్రకవి కవిత్వమునందు తప్పుపట్టఁబోయి యవమానము నొందెనఁట. రామభద్ర కవి విరచితమైన రామాభ్యుదయమునందు తప్పుచూపెదనని పంతము పట్టి, తప్పు చూపలేకపోయినయెడల తలఁమీఁద తా నాతనిచేఁ దన్ను తినెదనని రాజసభలో రామరాజభూషణుఁ డొప్పుకొనెనఁట. అంతట మధ్య వర్తుల సమక్షమునందు గ్రంథపఠన మారంభించి చదువుచుండఁగా ద్వితీయాశ్వాసారంభములోని

సీ. సింహనఖాంకురచ్ఛిన్నవారణకుంభజనితముక్తాఫలశర్కరిలము
సమదసూకరపరస్పరభీకరాఘాతశిథిలదంష్ట్రాచూర్ణసికతిలంబు
గంధసింధురఘటాకటకటాహస్రవద్బంధురదానాంబుపంకిలంబు
దవగంధవహబంధుదహ్యమానానేకకాశికాగురుధూపగంధిలంబు

పృథులషడ్జస్వరోద్గీతభిల్లపల్ల
వాధరాగీతికాకర్ణనాతిభీతి
పరవశాత్మపటీరకోటరకటీర
లీనఫణియగు నక్కాన కాన నయ్యె.

అను పద్యముకడకు వచ్చునప్పటికి రామరాజభూషణుఁడు రామభద్రకవిని వారించి "శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గానరసం ఫణిః" యనున్యాయముచేత సంగీతమునకు సర్పము లానందింపవలసియుండఁగా భయపడి పటీరతరు కోటరములలో దాఁగినట్లు చెప్పితివిగాన నిది దోషమని యాక్షేపించెనఁట. దానికి రామభద్రకవి తాను కేవల సంగీతము నకు భీతిల్లినట్లు చెప్పక షడ్జస్వరముతో పాడఁబడినగీతికకు పాములు

భయపడినట్లు చెప్పితినియు. "షడ్జం మయూరో వదతి" యని యుండుటచేత షడ్జస్వరోద్గీతమైన గీతమును విని నెమలికూతయని పాములు భయపడి పాఱి తొఱ్ఱలుదూఱుట స్వభావమేయనియు, సమాధానమును చెప్పెనఁట. సభవారా యాక్షేపణ సమాధానములు విని రామరాజభూషణుఁడే యోడెనని నిర్ధారణము చేసిరఁట! అంతట పట్టిన ప్రతిజ్ఞ ననుసరించి రామభద్రకవి రామరాజభూషణుని శిరోవేష్టనము తీయించి క్రిందఁ బెట్టించి సభలో నాతనితల దన్నెనఁట! కొందఱాతని తలకు మాఱుగా శిరోవేష్టమునే తన్నెనని చెప్పుదురు. ఈ కథ యిప్పుడు క్రొత్తగా వచ్చినదిగాక యప్పకవికాలమునాఁటికే యున్నందున దీని యందుఁ గొంత సత్యమున్నదని యూహింపవలసియున్నది. అప్పకవి పూర్వకవివర్ణనము చేయుచు తన గ్రంథములో

"రామరాజవిభూషణరత్నఖచిత
చారుమస్తకలాపాపహారివాక్య
గౌరవము పెక్కుభంగుల గణనచేసి"

అని రామరాజభూషణునియొక్క కిరీటమును దీయించినవాఁడని రామభద్రకవికి విశేషణముగాఁ జెప్పినాఁడు.

హరిశ్చంద్రనలోపాఖ్యానమును రచించునప్పటికి రామరాజభూషణుఁడు వృద్ధుఁడయినాఁడు. అప్పటికే విద్యానగరసంస్థాన మంతయు పూర్ణముగా నశించిపోయినది. పింగళి సూరనార్యుఁడు రాఘవపాండవీయమును జేసినతరువాత రామరాజభూషణుఁడు హరిశ్చంద్రనలోపాఖ్యానమును రచియించెను. ఈ రెండుగ్రంథములలోని గుణదోషము లెట్టివైనను రాఘవపాండవీయమునకు వచ్చిన ప్రసిద్ధి యీ గ్రంథమునకు రాలేదు. రామరాజభూషణుఁ డీ ద్వ్యర్థికావ్యమును శ్రీరామాంకితము చేసెను. ఈకృతి పదునాఱవ శతాబ్దాంతమునందు రచియింపఁబడినట్లు

కనఁబడుచున్నది. కాఁబట్టి రామరాజభూషణుఁడు ౧౫౫౦ వ సంవత్సరము మొదలుకొని ౧౫౯౦ వ సంవత్సరమువఱకును గ్రంథరచన చేయుచున్నట్లు చెప్పవచ్చును పూర్వోక్తములయిన మూఁడు గ్రంథముల నుండియుఁ గొన్ని పద్యముల నిందుదాహరించుచున్నాను.—

వసుచరిత్రము

మ. సతియూరుద్యుతిఁ జెందఁబూని నిజకుచ్ఛర్మాపనోదక్రియా
రతిఁ బాథోలవపూర్తిత్రోదరములై రంభేభహస్తంబు లు
న్నతటిన్ పీడ మరుద్విభూతిఁ గదళిం ద్వాగ్దోష మాచంచలో
ద్ధతశుండాతతిఁ బాయ దయ్యె నదె పోతద్వైరమూలం బిలన్. ఆ. ౨

శా. రాజీవాక్షుల నేచు పాతకివి చంద్రా! రాజవా నీవు? నీ
రాజత్వంబునఁ జక్రముల్ మనియెనో? రంజిల్లి సత్సంతతుల్
తేజం బందెనో? డిందెనో యహిభయోద్రేకంబు? తాఁ జెల్లరే!
రాజై పుట్టుట రశ్మిమాత్రఫలమే? రా జౌట దోషార్థమే? ఆ ౪.

హరిశ్చంద్ర నలోపాఖ్యానము.

ఉ. కమ్మనిపువ్వుఁదేనియలఁ గాఁక లడంచుఁ బ్రవాళతాళవృం
తమ్ముల సేద దేర్చు విరతావులచల్వలు గ్రమ్మమంచిపూ
దుమ్ములఁ బూజసల్పుఁ బ్రతతు ల్వరమంజులతాధిరాజ్యయో
గమ్మునఁ బొల్చు నాసుగుణకల్పకవల్లి వనిం జరింపఁగన్. ఆ. ౩.

చ. కుదురుమెఱుంగునిబ్బరగుబ్బలపై నయనాంబుపూరముల్
చెదరఁగ నేల యేడ్చెదవు చెల్వ దురంతవిషాదవేదనా
విదళితమానసాబ్జవయి వే తగు నాయువు శాశ్వతంబె సం
పదలు స్థిరంబులే విధివిపాకము దాఁట, దరంబె యేరికిన్. ఆ. ౫.

నరస భూపాలీయము.

మ. బలితంబై నమనోజబాణహతిచేఁ బల్మాఱు నిల్పోపలే
కలినీలాలకప్రాణము ల్వెడలి నేత్రాంభోజమార్గంబునన్

గలయంబ్రాఁకుచువచ్చి యన్నెలవున౯ గన్నీటియే అడ్డమై
నిలుప న్నిల్చె నృసింహభూరమణ మన్నింపంగఁ బాఁడింతటన్. ఆ. ౨

ఉ. చందనశైలసానువులఁ జాలఁ జెలంగుభుజంగబాలికా
బృందము శ్రీనృసింహవిభుఁ బేర్కొనిపాడఁ దదీయగానని
ష్యందము లానువేడ్క బెరయంగఁ గురంగతురంగ మేగమి౯
మందగతిప్రసంగములు మానవు దక్షిణగంధవాహముల్. ఆ. ౫.

---

23. మల్లారెడ్డి.

ఇతఁడు రచియించిన షట్చక్రవర్తులచరిత్ర మను నెనిమిదాశ్వాసముల పురాతనగ్రంథ మొకటి నాయొద్దనున్నది. దీనిని తాళపత్రముల మీఁద వ్రాసినవా రేహేతువుచేతనో కృత్యాదిపద్యములను వదలివేసి షష్ఠ్యంతములు మొదలుకొని వ్రాసియున్నారు. ఈపుస్తకమునందలి యాశ్వాసాంతగద్య మిట్లున్నది.

"ఇది శ్రీమద్బిక్కనవోలిపట్టణ ప్రసిద్ధ సరస్తటావలంబ సిద్ధరామేశ్వర వరప్రసాద సమాసాదిత సంస్కృతాంధ్రభాషాకవిరతాసపోషణ విశేషతా చమత్కార గురుభక్తివిహార రాచుర్ల గోత్ర పవిత్ర కాచభూపాలపుత్ర బుధవిధేయ మల్లారెడ్డి నామధేయ ప్రణీతంబైన షట్చక్రవర్తి చరిత్రంబను మహాప్రబంధంబునందు—ఆశ్వాసము."

ఈమల్లారెడ్డి యిభరామసి మనపుస్తకములలోఁ జెప్పఁబడిన యిబ్రహీము గోలకొండ నవాబుగా నున్నకాలములో నుండి యొకసారి యాతని యాస్థానమునకు దనయాస్థానకవీశ్వరునితోడఁగూడఁ బోయి నప్పుడు,

చ. బలరిపుభోగ కాచనరపాలునిపెద్దకుమార మల్ల నీ
కలితయశఃప్రభావములు కన్గొనలే కలకట్టు మన్నెమూఁ
కలు తల లొల్లరో బిరుసుగద్దియము ల్చదివించుకొందురా
కొలఁది మెఱుంగఁజాల కలకుక్కలు చుక్కలఁజూచి కూయవే.

అను పద్యమును దనకవిచేత చదివించుకొనఁగా రాజులందఱును గోపించి యుద్ధసన్నద్ధులయియున్నప్పుడు మల్కిభరాము వారినివారించి ప్రశాంతులను జేసెనని యీవఱకే గంగాధరకవిచరిత్రమునందు వ్రాసియున్నాను. దీనినిబట్టి యీకవి యిబ్రహీము కాలములో నున్నట్లు తెలియవచ్చుచున్నది. ఇబ్రహీము క్రీస్తుశకము ౧౫౫౦ వ సంవత్సరము మొదలుకొని ౧౫౮౧ వ సంవత్సరము వఱకును గోలకొండరాజ్యమును పాలించెను. "కుమారమల్ల" యని పయిపద్యములోఁ జెప్పఁబడి యుండుటచేత మల్లారెడ్డి యిబ్రహీముకాలములో కౌమారదశయందుండి ౧౬౦౦ వ సంవత్సరప్రాంతముల వఱకును జీవించియున్నట్లూహింపవలసియున్నది. ఈమల్లారెడ్డి కాపుకులజుఁడు; కాచరాజుపుత్త్రుఁడు; గోదావరిమండలములోని బిక్కనవోలుసంస్థానప్రభువు. ఇతఁడు రాజమహేంద్రవరమును పాలించిన వీరభద్రరెడ్డి మొదలైనరెడ్లసంబంధుఁడని తోఁచుచున్నది. ఈతనికవిత్వము రసవంతమయి సలక్షణముగా నున్నది. ఈతని షట్చక్రవర్తిచరిత్రమునుండి కొన్నిపద్యముల నిందుదాహరించుచున్నాను—

సీ. గోపుర గోపుర గోపురప్రతిమంబు
కల్పద్రు కల్పద్రుగౌరవంబు
మానవ మానవ మానవాభిశయంబు
మణిజాల మణిజాలమంజిమంబు
సారంగ సారంగ సారంగనయనంబు
సుమనోబ్జ సుమనోబ్జశోభితంబు

బహుళధామ బహుళధామ బహుళధామచిత్రంబు
ఘనసార ఘనసారగంధిలంబు
భవ్యకాసార కాసారబంధురంబు
జవనసైంధవ సైంధవసంకులంబు
బహుళకేతన కేతనభస్థలంబు
నై విజృంభించె సిరి నయోధ్యాపురంబు. ఆ. ౧.

ఉ. రాజవు నీవు సద్గతి తెఱంగు లెఱింగి బుధానురాగివై
యాజరుచిం జెలంగి సముదంచితవిష్ణుపదానువర్తి వి
భ్రాజితసత్కళానిధివి రశ్మి యొకానొకవేళ సండినన్
హా జనపాలకా కువలయం బడలన్ గృశియించు టొప్పునే. ఆ. 3.

చ. అతను వియోగతాపము నిజాంగమునం దగ నిండియుండఁగా
నతివ సతృష్ణయై నలకథామృత మెంతయుఁ గ్రోలె నందునన్
మిత మెడల న్వెసన్ జ్వరము మించె నటంచును దత్సఖీభిష
గ్వితతులు దానికిం దగుచికిత్సలు చేయఁ దొడంగి రత్తఱిన్. ఆ. ౪.

సీ. గోరక్షణము చేయుశౌరి యుండుటఁ జేసి
గోరక్షణము చేయుకోర్కె మెఱసె
బుధులఁబ్రోచెడు చతుర్భుజుఁ డుండుటను జేసి
బుధులఁ బ్రోచుచునుండు బుద్ధిమించె
సత్యానురక్తుఁ డౌచక్రి యుండుటఁ జేసి
సత్యానురక్తుఁడై చాల వెలసె
బలభద్రయుతుఁడు శ్రీపతి యుండుటను జేసి
బలభద్రయుక్తుఁడై ప్రజ్ఞ మీఱె
నోడలఁ బురుషోత్తముఁడు పూనియుంటఁ జేసి
తాను బురుషోత్తముం డన ధాత్రి నొప్పె

భవ్యలక్ష్మీవిలాసవిభ్రమము లలరు
చక్రధరమూర్తి పురుకుత్సచక్రవర్తి. ఆ. ౬.

చ. ఘనములదర్పణంబు లిభకర్ణతలాగ్రము లెండమావు ల
వ్వనధితరంగము ల్సిరులు, వాయువుముందఱ నిడ్డదీపముల్
వనములబుద్బుదంబులు జలంబులపై లిఖయించువర్ణముల్
తనువులు, రాకుమార పరితాపము వల్వదు నీమనంబునన్. ఆ. ౭.

చ. సరసులఁ దేలి పుష్పవనసంతతిపైఁ గడుఁద్రాలి సుస్తబం
భరములఁ దోలి చారుశుకపంక్తుల నేలి ప్రసూనగంధ మా
దరమునఁ గ్రోలి పుష్పితలతాతరు లెక్కుచు సోలి మెల్లఁగా
జరగఁగఁజొచ్చె దక్షిణపుఁజల్లనిగాలి వయాళిపెంపునన్. ఆ. ౮.

---

24. రామరాజు రంగప్పరాజు.

ఈక్షత్రియకవి సాంబోపాఖ్యాన మనెడి యైదాశ్వాసములప్రబంధమును రచించి శ్రీరంగనాయకున కంకితము చేసెను. ఈకవి కృష్ణదేవరాయనియల్లుఁడైన రామరాజునకుఁ బెదతండ్రికొడుకు కోనేటి తిమ్మరాజున కాశ్రితుఁడై యుండినవాఁడు. కాఁబట్టి కవి ౧౫౫౦వ సంవత్సరప్రాంతములం దుండినవాఁ డని నిశ్చయముగాఁ జెప్పవచ్చును. కోనేటితిమ్మరాజునకును రామరాజునకును తాత యగు నార్వీటిరాచరాజును, కృష్ణదేవరాయనియల్లుఁ డగురామరాజును, కవి తనసాంబోపాఖ్యానమునం దిట్లు వర్ణించియున్నాఁడు—

ఉ. పోరుల నారుపేటిపురబుక్కయరామనృపాలుఁ డాగ్రహో
దారత వాలు పూనిన సదాగతికంపితజీర్ణపర్ణలీ
లారభటిన్ విరోధిమహిళాంగవిభూషణరాజిరాలు దై
వారుఁ బ్రతాపపల్లవశుభప్రభ వర్ధిలుఁ గీర్తిపుష్పముల్

మ. దివిజేంద్రాభుఁడు కృష్ణరాయధరణీదేవేంద్రుజామాత శ్రీ
ధవపాదాంబుజభంభరం బమరు మేధావేధ రామప్ప శా
త్రవకంఠాంతరరక్తశీకరసమిద్ధారోర్మిసిద్ధౌతఖ
డ్గవనీకీర్తిలతాంతగంధిలహరిత్కాంతాకచాభోగుఁ డై

క్షత్రియవంశజుఁ డైన యీకవి యాపస్తంబసూత్రుఁడు; ఆత్రేయ గోత్రుఁడు; తిరుమల శ్రీనివాసాచార్యశిష్యుఁడు. ఈతనిది సలక్షణమై నిరర్గళధార గల మంచికవిత్వము. కవనరీతి తెలియుట కయి సాంబోపాఖ్యానములోనిపద్యములఁ గొన్నిటి నిం దుదాహరించుచున్నాను—

చ. పరమజ్ఞానిహృదంతరాళమణిదీపంబుల్ నమన్నాగకి
న్నరనక్తంచరనాకనాయకశిరోనాళీకరాగప్రభాం
కురనీరాజితముల్ నిజాంఘ్రితలముల్ గోపాలబాలుండు ని
ల్పె రటద్గోఖురధూళిధోరణుల నాబృందావనక్షోణులన్. ఆ. ౧.

ఉ. పల్లవవల్లభుండు చెలువ ల్జలమాడఁగఁ దత్కటీతటీ
పల్లవముల్ హరించి తనుఁ బ్రార్థనచేసిన నీక నవ్వు నా
పల్లతిశాలవిత్రమయి పాండవపత్నికి నెట్టు లిచ్చెనో
చుల్లరవెట్టుప్రల్లదపుజూదరి సిగ్గుపడం జటావళిన్. ఆ. ౧.

శా. ఆనియమంబు నాయమము నాదమ మాశమ మానిరంతర
ధ్యానవిధాన మాబహువిధాసనబంధవిదగ్ధభావ మా
మానస మెందుచున్ జననిమట్టును గుట్టును మాను దౌసనం
గాఁ నతఁ డొప్పు భక్తికలికాకిలికించితబోధమాధురిన్. ఆ. ౨.

ఉ. నడి గాకుండఁగ నుగ్రసేననృపు భిక్షావృత్తిఁ బట్టంబునం
దిడి కంసార్జితరత్నకోటులు మహాహేమంబు లాందోళికల్
పడఁతు ల్పర్వతసన్నిభేభములు ఝంపాసంపతద్వాహముల్
నడపించెం దనయింటి కీ వెలుఁగవే నారాయణుం డుద్ధవా. ఆ. ౧.

చ. కళలు భజింప వచ్చు శశికాంతివిధంబున నేగు దెంచె నా
యెలుఁగుల తేనియాజ్ఞఁ గమలేక్షణుసన్నిధికిన్ సఖీజనా
వళి భజియింప జాంబవతి వజ్రమయాభరణౌఘశింజితం
బులు పదవమ్ము నీ వనుచు బుజ్జవ మారఁగ బల్కునట్లుగన్. ఆ.౨.

ఉ. భోజనపాత్ర మొక్కటి యపూర్వము పర్వతధారి కిచ్చెనం
భోజభవప్రసూతి యది భోజనవేళఁ దలంచుభోజ్యముల్
యోజనసేయఁజాలు నది యోజనమాత్రవిసారికాంతివి
భ్రాజితగారుడాశ్మవిసరస్థగితంబు విషాపహారియున్. ఆ. 3.

మ. అమృతస్యందము కందళింప దరహాసాంకురముల్ లోచనా
గ్రములం దాండవ మాడఁ జంద్రధరుఁ డాకంజాక్షు నీక్షించి యో
కమలాక్షా పరురీతి నీవు వ్రతదీక్షన్ దూతచర్యాసము
ద్యమముం జూపుదు వయ్య యెయ్యెడ సుహృద్భావంబె
యాచందముల్. ఆ. ౪.

చ. కమలసహస్రము న్నయనకాంతి యొనర్పఁగ ఫాలబింబముల్
గుముదహితాయుతంబు నొడఁగూర్పఁ బెనంగు మృగాక్షిమోముతో
గమలవుఁ జంద్రుఁ బోల్చుకవిగాథల కెయ్యది మేర యుత్తమో
త్తము నధము న్సమాన మనఁ దారదె బుద్ధి యవజ్ఞం జేరదే.ఆ.౪.

చ. అనుచుం జెగ్గిలి కుందునంగనల నయ్యబ్జాక్షి వీక్షించి యో
యనుఁగున్నెచ్చెలులార మీరలు సరోజాలి న్మనోజాతుఁ గ్రొ
న్ననలం జిల్కలఁ గోకిలప్రతతి నింద న్సేయఁగా నేల నా
తనువే నిత్యము ప్రాణ మేమి ధ్రువమే తర్కింపుఁడీ యాదెసన్. ఆ.౫

ఉ. కౌరవనాథ నేఁ గలుగఁగాఁ గలశీతనయుండు గల్గఁగాఁ
బౌరుషసింహమూర్తు లగుబాహ్లికముఖ్యులు కల్గియుండఁగా
నూరక కుందెదేటికిది యోధులచందమె శీరసాధనున్
వారణచేసి సాంబు నని వ్రాలిచి లక్షణఁ దెత్తుఁ గ్రమ్మఱన్. ఆ. ౫.

---

25. మల్ల అనంతభూపాలుఁడు.

ఈక్షత్రియకవి కాకుస్థవిజయ మనెడి యైదాశ్వాసముల ప్రబంధమును రచియించి తనతండ్రి యైన యెల్లభూపాలున కంకితముచేసెను. తనతండ్రి సభాసీనుఁడయి యభినవాంధ్రకవితాపితామహుఁ డైనయుప్పుగుండూరిపురి వేంకటకవినిజూచి శాశ్వతమగు ధర్మ మెద్దియని యడుగఁగా నక్కవికంఠీరవుఁ డిట్లనియెనని తనకృత్యాదిని వ్రాసికొని యున్నాఁడు—

ఉ. కోనయయెల్ల వైరినృపకుంజరభంజన కంజదళాక్షసే
వానిరవద్య యాద్యజనవల్లభనీతిసార యా
రా నవఖండరాజరసనాంచలరంగముల న్నటింపఁ ద
న్మానసగర్వపుం దెరఁ దెమల్చి యమర్చితి కీర్తినర్తకిన్.

శా. ధారాపాతము వాసినప్పుడ ఘనత్వం బేర్పడున్ జంద్రహా
సారూఢి న్వెలసిల్లుచున్నపుడ శైత్యం బెల్లఁ గాన్పించు రా
నీరాజద్భుజఖడ్గరాజ మభివర్ణింప న్వశంబే మహో
గ్రారిధ్వంసక మల్ల కోనవిభు నెల్లా రాజకంఠీరవా.

గీ. అమితచారిత్ర పుణ్యమార్గములు గలవు
పెక్కులయ్యును సత్కీర్తి కెక్కునవియు
సప్తసంతానములు నందు శాశ్వతంబు
కావ్య మందుము సత్కవి కలిగె నీకు.

క. మహి నీపుత్రుఁ డనంతుఁడ
బహుమహిమం జెప్ప నేర్చు భవమౌళిధునీ
లహరీఘుమఘుమితవచో
మహితముగా నల్ల శౌర్యమాయాభిల్లా.

*　*　*　*

ఈకవి పూర్వులలో వరదరాజను నతఁడు కృష్ణదేవరాయని కల్లుఁడై నట్లు కవి యీక్రిందిపద్యమునఁ జెప్పియున్నాఁడు—

చ. వనజదళాక్షుశంకరులు వార్ధికి నద్రికిఁ బోలె గృష్ణరా
యనికి నమంగుటల్లుఁ డటులై తనరుణ్ వరదక్షమాధవుం
డనిమిష వాహినీమునిగజాశ్వమహీరుహధేనుభీమవా
హనమకుటావతంసకుధరాభరణాదికహేతుకీర్తియై.

కవి తనతండ్రిని,

ఉ. ఎక్కడఁ గాన మెల్ల ధరణీశ్వరుహేతి కరాతి భీతిమై
నెక్కనిధారుణీధరము లేగపదుర్గదిగంతరాళమున్
ద్రొక్కనికాననాంతరముఁ దోఁగనిదివ్యనదీప్రవాహదంబులుణ్.
ద్రొక్కనితాలునుం దిననిమూలపలాశిపలాశజాలముణ్.

ఇత్యాది పద్యములలో వర్ణించిన వర్ణనను బట్టి యతఁడు క్షత్రియుఁడగుటయే కాక భూపాలుఁడనియు దెలియవచ్చుచున్నది. తండ్రిమాత్రమే కాక కుమారుఁడైన యనంతభూపాలుఁడును గోలకొండ నవాబయిన యిబ్రహీముషాకాలములో రాజ్యపరిపాలనము చేయుచుండినట్లు చరిత్ర నిదర్శనములు కనఁబడుచున్నవి. కాఁబట్టి కవి ౧౫౫౦-౬౦ వ సంవత్సర ప్రాంతములయం దుండినవాఁ డయినట్టు తెలియవచ్చుచున్నది. ఈకవి సూర్యవంశజుఁడు; రంగాంబాపుత్రుఁడు; తిరుమల తోళప్పాచార్య

శిష్యుఁడు. ఈతనికవిత్వము నిర్దుష్టమయి హృదయంగమముగానున్నది. కాకుస్థవిజయములోని కొన్నిపద్యముల నిందు బొందుపఱుచుచున్నాను.-

ఉ. మనుతనయుండు నంతట సమాధిసమాపనవేళ్ళయైన లో
చనములు విచ్చి ముందటఁ బ్రసన్నపరిస్ఫుటబింబ మొప్ప ని
ల్చిననెల నిల్వుటద్దమువలెన్ మెఱయంగ మరుండు మాధవుం
డును నునుగాడ్పు మేనులకు నోచఁగ నచ్చర లాట లాడఁగన్. ఆ-౧

చ. కలువలవిందునత్తమును గమ్మకొలంకులగాడ్పుఁ గ్రుంకుఁ జె
ల్వాలజడల్ వసంతువనవాసముఁ గ్రొవ్విరికత్తికోఁతల్
వెలసిన నాదుమాధుకరవృత్తి విశిష్టగుణంబు నెంచియో
చెలిమియుఁ బ్రేమయుం బొదలఁజేసె మహాముని యాతిథేయముల్.
ఆ. ౨.

ఉ. నీ విదియెక్కి పద్మభవనిర్జరనాథులఁ జూడ నెప్పుడుం
బోవుచు వచ్చుచుండి పనిఫుట్టిన వేల్పుల పాలఁగల్గి చే
చేవయొకింత చూపు మని చెప్పి తిరోహితుఁ డయ్యె నయ్యెడన్
దైవతలోకశిల్పి యరదం బటువెట్టి మహాద్భుతంబుగన్. ఆ. ౨.

చ. పుడమికి నీవు రాజ వయి పుట్టితివెన్నఁడు నాఁటనుండియున్
గొడవలు గట్టిపెట్టి నినుఁ గొల్చిరి రాజులు కన్నదోయికిన్
బడలికగాక యేకలహపారణ గట్టునఁ ద్రేచెదన్ వ్యథం
దడవులఁబట్టి చూడనికతంబున మాసెఁజుమయ్య వీణయున్. ఆ-౨

ఉ. వేల్పులకంటె మున్నసురవీరులఁ మేము సృజించుటెంచి స
కల్పము మాప్రసన్నతకుఁగా నొనరించితి నన్న వీవచః
కల్పన కర్థ మేమి యలకయ్యము మాకు ననిష్టమంచునో
యల్పులఁ ద్రుంచి లోకములమాపదఁ దీర్చితి వింతయొప్పదే. ఆ-౩

ఉ. వచ్చిన నిచ్చటన్ నోమ్మలచి వచ్చితిరే యన నోల లాడుచున్
వచ్చితి మమ్మ యేము నొకవారిరుహాకరవీధి నీజటా

భృచ్ఛుతుఁడానఁడు మొలపింపఁగఁ దమ్ములతోడఁబుట్టి మా
కిచ్చె సుగంధగంధి పదహీరకిరీటము లబ్జనామముల్. ఆ. ౩.

చ. అడవుల నీవు దాల్చునడియాలపుసొమ్ము లటుండఁగాని మా
తొడవులు వెట్టుమంచుఁ గృపతో మణిమంజులభూష లాదిగా
నుడుగర లిచ్చిన న్వెఱచు చొయ్యన నంది యతండు సైఁచుమీ
విడువనితప్పు నేఁడు వెతఁబెట్టక మానితి వేఁటకానుకల్. ఆ. ౪.

ఉ. ఎల్లరుఁ దృప్తులైన నొకయించుకసే పట విశ్రమించి రా
గిల్లినమూఁకతోడఁ దమకింపనియానముతోడ భిల్లరా
డ్వల్లభలక్ష్మితోడ వనవల్లభుతోడ జయంబుతోడ భూ
వల్లభనందనుండు హయవల్గన మొప్పఁగ వచ్చె వీటికిన్. ఆ. ౪.

ఉ. ఆరభసంబునప్డు కఠినాదులచేఁ దలలేని బొందులన్
జూరెఁ గడంక లూరెనని చూపఱు మెచ్చుల మీఱఁబోయి రా
సూరెల మున్ను కన్నడినసూటిన వామభుజాభుజాదులన్
బీరముసూపి త్రెళ్లె నవి భీమమహోక్షఖురాహతంబులై. ఆ. ౫.

ఉ. అక్కడఁజూడు నిన్న రొయుడయం డరదీఱెను దల్లిదండ్రితో
నక్కట నేఁడు కల్యకఠినాదులలోపల నొక్కఁడేనియున్
ద్రిక్కకపోయెనే యనుక దేఱెన తావకశౌర్యవార్ధియం
దుక్కివులై రె వేల్పులోకఁ డూఱటగా నిఁక నేమిచెప్పుదున్. ఆ.౫

26. ఎఱ్ఱన

ఈకవి కొక్కోకమును, సకలనీతికథానిధానమును తెనుఁగునఁ బద్యకావ్యములఁగా రచియించెను. కొక్కోకమునకు రతిరహస్యమని నామాంతరము. దీని కవిత్వము హృద్యముగానేయున్నను నీతిమంతులు చదువఁ దగినగ్రంథముకాదు. ఈగ్రంథము కుంటముక్కల మల్లయామాత్యున కంకితము చేయఁబడినది. శైలిని జూపుటకయి కొక్కోకములోని రెండు పద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. పెనిమిటిభాగ్యరేఖ గుణబృందము లేనరులైన ముందటన్
వినుతులు చేయ సౌఖ్యమొదవించును నాథునియందు మిత్రులం
గనుఁగొని సంతసిల్లుఁ గలకంఠిగుణంబులుచూడఁ జూచి చ
య్యనఁ దెలియంగవచ్చు మదనాంకురభావముఁ జూడకుండినన్. ఆ-౧

చ. తరుణులు పుష్పకోమలులు తత్తఱపాటున నేమిచేసినన్
విరసము పుట్టుఁ గావున వివేకమునం బురుషుండు తత్సఖీ
పరిచితభంగి రాగరసబంధురుఁడై యెట నేప్రయోజనం
బరమణి కిష్టమౌనదియె పూర్వముగా నెడఁబాటుచేయుచున్. ఆ-౨

ఈకవి యుండిన కాలమువిషయమై మన మిప్పుడు కొంచెము విచారింపవలసి యున్నది. కవి కృతిపతియగు భైరవమల్లామాత్యుని వర్ణించుచు—

సీ. హరిపదధ్యానతత్పరుఁడు చండలమహాలక్ష్మీప్రసాదైకలబ్ధవరుఁడు
రహిఁ గజపతిమహారాయ లిచ్చినసమంచితమహాపాత్రప్రసిద్ధయశుఁడు
నాజమాఖానరాయనిచేతనొడయుఁడై వినుకొండదుర్గ మేలినఘనుండు
కృతివననిక్షేపపృథుతటాకాలయతనయాదిసప్తసంతానఘనుఁడు

మునిపరాశరసగోత్రసంజనితుఁ డార్య
సేవ్యతిరువేంగళాచార్యశిష్యుఁ డనఘు
మంత్రి పెరుమాళ్ళకొమ్మయమనుమ డోబ
మంత్రి తెలగయ భైరవమల్లమంత్రి.

అని యతఁడు జమాఖానునిచేతఁ బ్రభువుగాఁ జేయఁబడినట్లు చెప్పియున్నాఁడు. ఈ జమాఖాను పదునాలవ శతాబ్దమధ్యమునం దుండినట్లు తెలియవచ్చుచున్నది. కవికాలమును నిర్ణయించుట కీగ్రంథములో నింకొకయాధారముకూడఁ గానవచ్చుచున్నది. ఇతఁడు పూర్వకవులను వర్ణించుచు,

సీ. * * * *
* * * *

ఆ. "రావిపాటి తిప్పరాజాదిముఖ్యశ్రీం
గారకవుల నెల్ల గారవించి"

అని రావిపాటి తిప్పరాజును పేర్కొనియున్నాఁడు. ఈరావిపాటి తిప్పరాజు—

మ. సరిబేసై రిపు డేల భాస్కరులు భాషానాథపుత్రా వసుం
ధరయం దొక్కఁడు మంత్రియయ్యె వినుకొండన్ రామయామాత్యభా
స్కరుఁడా యా నతఁడే సహస్రకరశాఖ ల్లే వవే యున్నవే
తిరమై దానముఁ జేయుచో రిపుల హేతి న్వ్రేయుచో వ్రాయుచో.

పయిపద్యమును రామయామాత్యభాస్కరునిమీఁదఁ జెప్పిన ట్లప్పకవీయములో నుదాహరింపఁబడియున్నది. ఈరామయభాస్కరుఁ డచ్యుతదేవరాయని కాలములో నుండినట్లు కొండవీటిలోని గోపీనాథస్వామివారి దేవాలయద్వారశాఖయందు వ్రాయఁబడియున్న యీక్రింది పద్యమువలన స్పష్టముగాఁ దెలియవచ్చుచున్నది—

సీ. నిర్మించె నేమంత్రి నిరుపమప్రాకారనవకంబుగా గోపినాథపురము
గెలిచినాఁడేమంత్రి లలితవిక్రమమునఁ బ్రబలుఁడై యవనులబలము నెల్ల
నిలిపినాఁ డేమంత్రి నియతవైభవమున గోపికావల్లభుఁ గూర్మి వెలయఁ
బాలించె నేమంత్రి ప్రకటధర్మఖ్యాతి మహిమమీఱఁగ నాంధ్ర
మండలంబు

నతఁడు భూపాలమంత్రీంద్రసతతవినుత
ధీవిశారదుఁ డచ్యుతదేవరాయ
మాన్యహితవర్తనుఁడు శౌర్యమహితయశుఁడు
భానుతేజుండు రామయభాస్కరుండు.

దీనినిబట్టి రావిపాటి తిప్పరాజు ౧౫౪౦ వ సంవత్సరప్రాంతముల యం దుండెననుట స్పష్టము. ఈరావిపాటి తిప్పరాజును స్తోత్రముచేసిన యెఱ్ఱనకవి యాతనికాలమునందో తరువాతనో యుండియుండవలెను. కొక్కోకమును రచించిన కొన్ని సంవత్సరముల కీయెఱ్ఱనకవి సకలనీతి కథానిధానమును రచించి కొక్కోక కృతిపతియైన మల్లామాత్యుని యన్నకొడుకగు కుంటముక్కల పినభైరవామాత్యున కంకితముచేసి నందునఁ గవి ౧౫౫౦-౬౦ సంవత్సరప్రాంతములయం దుండెనిన చెప్ప వచ్చును. సకలనీతికథానిధానములోఁ గృతిపతి కవినిగూర్చి చెప్పిన ట్లున్న యీక్రింది పద్యములు పయియంశమును తెలుపుడు చేయు చున్నవి—

సీ. శ్రీవత్సగోత్రవారిధిపూర్ణశీతాంశుఁ డగుకూచమంత్రికి నాత్మజుఁడవు
వివిధాష్టభాషాకవిత్వవాచాప్రౌఢిఁ బూర్వకవీంద్రులఁ బోలినాఁడ
వఖిలపురాణేతిహాసకావ్యస్మృతిచయము రచించినచారుమతివి
మాపినతండ్రియామల్లమంత్రికిని గొక్కోకంబు చెప్పినకోవిదుఁడవు
రసికు లభినుతిచేతఁ బురాణసార। మనుపమంబుగ నా కిచ్చినట్టిప్రోడ
వట్లుగావున నొకటి నిన్నడుగఁదలఁచి।యిచ్చటికి బిల్వబంచితి నెఱ్ఱనార్య.

క. భావమునఁ దోఁచెఁ గలియుగ । పావనభూపాలకథలు బంధురకావ్య
శ్రీ వెలయ నాంధ్రభాషను । గావింపఁగవలయు సుప్రకాశిత నాకున్.

పయిపద్యములనుబట్టి యితఁడు పురాణసారమను గ్రంథమును గూడ రచించినట్లు కనఁబడుచున్నదిగాని యీ గ్రంథము దొరకలేదు.

చ. వినుతియొనర్తు నాంధ్రసుకవీంద్రుల నన్నయభట్టుఁ దిక్కయ
జ్వను నమరేశ్వరుం జెదలువాడమహాత్ముని మారనార్యు నా
చనసుతుసోము భాస్కరుని జక్కయనుం గవిసార్వభౌమునిన్
వనరుహపుత్రసన్నిభుల వర్ణితకావ్యకళావిధిజ్ఞులన్.

అని కవి తన సకలనీతికథానిధానములో శ్రీనాథుని వఱకును గల కవులనేస్తుతించి యున్నాఁడు. "చంద్రశేఖర క్రియాశక్తి రాయలయొద్దఁ బాదుకొల్పితి సార్వభౌమ బిరుద" మని యుండుటనుబట్టి యీ పద్యమునందుఁ జేర్కొనఁబడిన కవిసార్వభౌముఁడు శ్రీనాథుఁడనుటకు సందేహము లేదు. ఇంచుమించుగా సమకాలికులగుటచేఁ గాబోలు నల్లసాని పెద్దనాదుల నితఁడిందుఁ జేర్కొనలేదు.

సీ. ప్రభవించె నేవీటఁ బర్వతాగ్రంబున నరిగెరీశ్వరుఁడు శ్రీనాయకుండు
వసియించె నేవీట వర్ణితసాలాంతరమున మూలస్థానరాజమౌళి
యుదయించె నేవీట నుత్తరాశాతట్భూషణీకృతనింబ పుట్టలాంబ
వరియించె నేవీట వలదిశాకోణంబునందు గుబ్బటలమైలారమూర్తి
వినుతిగాంచె నేవీటను విప్రరాజ । వైశ్యశూద్రాదిబహువిధవర్ణ సమితి
యట్టి పురరత్నమొప్పు భవ్యాంబుజాత।మండితామరతరువల్లి కొండపల్లి

క. ఇటువంటి కొండపల్లీ । పుటభేదనమంత్రిముకుటభూషణ మరిరా
ట్కటకవిభేదనఘటనో । ద్భటుండు కుంటముకుల పినఫైరవుఁడొప్పున్.

ఇత్యాది పద్యములనుబట్టి సకలనీతికథానిధానకృతిపతి కొండపల్లి కధికారియైనట్టు కనఁబడుచున్నాఁడు. ఇట్లాక కృతిపతి వినుకొండకును

మఱియొక కృతిపతి కొండపల్లికిని ప్రభువగుటచేత నీకవి కృష్ణామండలములోని కొండవీటిసీమవాఁ డయినట్టు స్పష్టపడుచున్నది. కొక్కోకమునందు కవి తన్నుగూర్చి యిట్లు వ్రాసికొనియున్నాఁడు—

సీ. శ్రీవత్సగోత్రప్రసిద్ధసంభూతి నాపస్తంబసూత్రప్రశస్తఘనుఁడ
గురుదయానిధి యైనకూచనమంత్రికి నంగనామణి ముత్తమాంబికకును
దనయుండ సత్కవీంద్రసుమాన్యచరితుండ శివకృపాసుజ్ఞానశేఖరుండ
నారూఢవిద్యాచలానందయోగీంద్రశిష్టప్రచారవిశిష్టఘనుఁడ
నెల్లనామాత్యుఁడను సత్కవీంద్రహితుఁడఁ
గలితవాక్ప్రౌఢిఁ గొక్కోకకవివరుండఁ
జతురమతితోడ రతికళాశాస్త్ర మిదియుఁ
దెనుఁగు గావింతు రసికులు వినుతిచేయ.

ఈ కవి యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; శ్రీవత్సగోత్రుఁడు; కూచనామాత్య పుత్రుఁడు. ఇతఁడు తా నష్టభాషాకవితాప్రవీణుఁ డయినట్టును నవఘంటసురత్రాణ బిరుదాంకితుఁ డయినట్టును, గ్రంథమునం జెప్పుకొనియున్నాఁడు. ఈతని కవిత్వము మనోహర మైనదని యీవఱకే చెప్పియున్నానుగదా. ఇప్పుడీతని సకలనీతి కథానిధానమునుండి నాలుగు పద్యముల నిందుదాహరించుచున్నాను.—

శా. ధారాపట్టణ మేలు భోజుఁడు మహోదారుండు వాహ్యాళిగా
నారణ్యంబున కేగి వచ్చునెడ బ్రహ్మప్రాప్తభూసూవనా
శారంభస్థలిచేరువం జనఁగ సైన్యవ్రాతముం జూచి యు
ప్పాఱుం డిట్లనె జొన్నచొచ్చి వలెనా భక్షింపుఁడీ బియ్యముల్.—౧

ఉ. ఊరక యేలయుండ మన మోశుకరత్నమ యస్మదీయసం
చారవినోదము ల్గలిసి సల్పుద మన్నఁ దొలంగు చేర కో
కీరమ పూరుషు ల్బహుళకిల్బిషచారు లసత్యభాషణుల్
క్రూరులు వారితోడ నొడగూడి మనంగలరే వధూమణుల్.—౨

చ. అధిపతి నంచు గ్రద్ద మిము నందఱ నీనగవింధ్యవాసకున్
వధ యొనరించి మాంసము లవారణగా బలిపెట్టఁజూచె మీ
రధములువోలెనుంటఁ దగదన్న ఖగంబులుపల్కె మమ్ము నీ
విధమునఁ బాపఁగాఁదలఁచి వీడఁగనాడుట మీకు ధర్మమే.—ఆ. 3

ఉ. అంతట రాగమంజరి గృహంబున సీధురసంబు గ్రోలి నే
కాంతమ యప్పురంబు చిఱుగ్రంతల నేగఁ దలారిమానుసుల్
చెంతల డాసి పట్టుకొని చేతుల దంపిన నన్నుమిన్న యా
ప్రాంతమునందుఁ ద్రెళ్ళి కెళవారయుదూతికఁ గాంచె నాదటన్.-ఆ౪

---

27. శంకరకవి

ఈకవి హరిశ్చంద్రోపాఖ్యానమును పద్యకావ్యమునుగా రచించెను. ఈకావ్యమును నెల్లూరికావ్య మనియు, కవిని నెల్లూరి శంకరకవి యనియు, బ్రౌన్‌దొరగారు వ్రాసిరికాని యావ్రాఁత నిరాధారమైనది. కవి గోదావరిమండలములోనివాఁడు; కృతి నాయకుఁడైన యీడూరి యెల్లనయు గోదావరీమండలములోనివాఁ డయి యీడూరి కరణమును కార్యాలనువాసస్థుఁడు నయియుండెను. ఈయంశములను కవి తనపుస్తకమునం దిట్లు చెప్పినాఁడు.—

గీ. మతి వితర్కింపఁ గేవలమంత్రిమాత్రుఁ
డే ధనంజయబాహుశౌర్యాధికుండు
సత్యవర్తనుఁ డీడూరిశాసనుండు
హితవచోహరి బాచయయెల్లశౌరి.

వ. అమ్మంత్రినిధానంబునకు నిజస్థానంబు.

మ. అరవిందాసనవాసవాద్యమరలోకారాధ్యకర్కోటకే
శ్వరకారుణ్యసదాభిరక్షితము భాస్వద్దీప్తిమదూర్భాసురో
త్కరనిత్యశ్రుతిపాఠనిస్స్వన ముదాత్తశ్రీ నజస్రంబు ని
ద్ధరణిం బేర్కొన నొప్పుఁ గార్కొలను గోదావర్యుపాంతంబునన్.

ఒక్క కృతిపతిమాత్రమేకాక కృతిపతియొక్క తాతముత్తాతలును గోదావరిమండలములోనే పుట్టి పెరిఁగి యక్కడనే సంబంధబాంధవ్యములను జేసికొనుచుండిరి. కవి కృతిపతియొక్క ముత్తాతను వర్ణించుచు నతఁడు గోదావరిమండలములోని యుండి గ్రామములో సంబంధము చేసికొన్నట్లీక్రిందిపద్యమునఁ జెప్పినాఁడు.—

చ. ప్రెగడనమంత్రి బంధుజనబృందము పేర్కొన నుండిశాసనుం
డగుమతిశాలివీరసచివాగ్రణిపుత్రికఁ దిప్పమాంబికన్
దగుమహిమ న్వివాహ మయి ధన్యచరిత్రులఁ గాంచెఁ బుత్రులన్
జగదభివర్ణనీయుల విశాలయశోవిభవాభిరాములన్.

ఈడూరికరణమునకుఁ గృతి యిచ్చినకవియు తద్గ్రామపరిసరమున నివసించువాఁడే యై యుండవలెనుగాని యెక్కడనుండియో నెల్లూరినుండి వెదకుకొనుచు వచ్చినవాఁడయి యుండఁడు. కవి తన గ్రంథములోనే తానాయెల్లనార్యునికి బంధుఁడును విధేయుఁడు నయినట్లును తన్నతఁడింటికిఁ బిలిపించి హరిశ్చంద్ర చరిత్రమును దన కంకితము చేయుమని కోరినట్లును చెప్పిన పద్యములలో నొకటి యిందు వ్రాయుచున్నాను.—

మ. నను గౌండిన్యమునీంద్రగోత్రజు సుధాంధస్సింధుకల్లోలతు
ల్యనిరాఘాటవచోధురంధరుని దేచామాత్యసత్పుత్రుఁ బా
వనచారిత్రు శశాంకమౌళిపదసేవాలబ్ధసాహిత్యస
ద్ధనునిన్ బంధు విధేయు శంకరకవిన్ దాక్షిణ్యపుణ్యాధికున్.

కృతిపతియుఁ గృతికర్తయు నిరువురునుగూడ నాఱువేలనియోగులు. వారిరువురును కుతుబ్షా గోలకొండ నవాబుగా నున్నకాల

ములో నున్నట్లు కవికృతినాయకుని గూర్చి పంచమాశ్వాసాంతమున సంబోధించిన యీ పద్యమువలనఁ దెలియవచ్చుచున్నది—

క. అలఘుప్రతాపకుతుబన । మలకేంద్రకృపాసమగ్రమహిమాన్విత కా
రొక్కలనిగ్రామనికేతన । జనసీమారక్షణైకచాతుర్యనిధీ.

ఈకుతుబనమలకేంద్రుఁడు సాధారణముగా నిభరామని చెప్పబడెడి యిబ్రహీము కుమారుఁడయినమహమ్మదు కుతుబ్‌షా. ఇతఁడు క్రీస్తుశకము ౧౫౮౧వ సంవత్సరము మొదలుకొని ౧౬౧౧వ సంవత్సరమువఱకును గోలకొండలో రాజ్యము చేసినందున, కవియు నప్పుడే యుండి పదునాఱవశతాబ్దాంతముననో పదునేడవశతాబ్దాదియందో యీపుస్తకమును జేసియుండును. శంకరకవివిరచితమైన హరిశ్చంద్రోపాఖ్యానము మృదుమధురపాకము గలదయి రసవంతమయి సహృదయాహ్లాదకరముగా నుండును. ఇందలి పద్యముల నొక్కొక్కయాశ్వాసమునుండి యొక్కొక్కదాని నిం దుదాహరించెదను—

శా. ఆకర్ణింపుము పాకశాసన సుపర్వానీకసంసేవ్య భూ
లోకాధీశ్వరుఁ డగణ్యపుణ్యుఁడు కృపాలోలాత్మకుం డర్థిర
త్నాకల్పద్రుమ మద్రిధీరుఁడు హరిశ్చంద్రాభిధానుండు ధా
త్రీకాంతుం డొకఁ డొప్పు సూనృతవచశ్శ్రీవైభవోపేతుఁడై. ఆ. ౧.

చ. మును ధర యేలి చన్ననృపముఖ్యు లనేకులు చర్చచేసినన్
జనవర వారిలోన విలసన్మతిపారగు లెవ్వరైన సొం
పునఁ దమవెంట ముంటి మొనమోపఁగఁజాలినయంత మేరయున్
గొని చనిరే ధరాతలము గొంకకుమీ యిల దానమిచ్చుచోన్.ఆ.౨

సీ. పరమపావనతేజ పావక సదయాత్మ హరిణాంకమౌళిపర్యాయకాయ
యనఘపాతివ్రత్యమున మనోవాక్కాయకర్మవిస్ఫూర్తిచే ధర్మనిరతిఁ
బూని చరించితినేని మత్ప్రాణేశ్వరుండు సూనృతవచోరాశి మెఱసి
భూనుతకీర్తివిభూతిశోభితుఁడేని శీతలాకృతి వహానిశిమ్యునకును

విశదవాత్సల్యమున మున్ను కుశలమొసఁగి
పిదపఁ గౌశికఋణము సంప్రీతిఁదీర్పఁ
గూడునట్లుగఁ జేసితివిటఁ గొడుకుఁ గరుణ
నరసి రక్షింపవయ్య జోహారునీకు.

శా. ఏణీలోచన నానిమిత్తమున నీ కీపాటు పాటిల్లెనే
క్షోణీనాథులరాణివాసములు చక్షుఃకౌతుకాపాదిని
శ్రేణీలాలితహర్మ్యవాటికలలోఁ గ్రీడావిశేషంబులన్
బ్రాణేశాన్వితలై నిరంతరసుఖప్రౌఢిన్ వినోదింపఁగన్. ఆ. ౪

మ. అకటా చేకొనుఁ నేలనుం దగఁడె సప్తాంభోధివేష్టితభవ
త్సకలద్వీపకలాపభూపమకుటాంచత్పద్మరాగోజ్జ్వల
ప్రకటానర్ఘళనిర్గళత్కిరణశుంభత్పాదుఁడై నట్టిరా
జకుమారుం డని యేడ్చి గన్నుఁగవ నశ్రుల్ గ్రాల్వలై పాఱఁగన్.
ఆ. ౫.

---

28. కంచి వీరశరభకవి.

ఈకవియు శంకరకవివలెనే హరిశ్చంద్రోపాఖ్యానము నయిదాశ్వాసములపద్యకావ్యముగా రచియించెను. కవి శైవబ్రాహ్మణుఁడు; కాశ్యపగోత్రుఁడు; శోభనాద్రీశునకును పండితారాధ్యుల వీరనారాధ్యుని పుత్త్రియగు గురవమాంబకును బుత్త్రుఁడు. ఈయిరువురుకవులు నించుమించు నేకకాలమునందే తమకావ్యములను రచియించినట్లు తోఁచుచున్నది. ఇందు శంకరకవిపుస్తకమునకంటె నేఁబదిపద్యము లధికముగా నున్నవి. ఒకరు వ్రాయుచున్నకథ నొకరెఱుఁగక యిరువురుకవులును గౌరనమంత్రికృతమైన ద్విపదకావ్యము ననుసరించి తమ పద్యకావ్య

ములను జేసి యుండవచ్చును. ఒకవేళ సేయిూటిలో నీకరు రెండవ వాని కావ్యమును జూచి తరువాతఁ దనపుస్తకమును జేసియు నుండ వచ్చును. ఈయంశమును దీసిం జనువువారు నిర్ధారణ చేసికొనఁ లెలు గుట కయి యించుమించుగా శంకరకవిగ్రంథములోనుండి యుదాహ రించిన పద్యముల యర్థమునిచ్చెడు పద్యములనే యిందుదాహరించు చున్నాను—

చ. ఉరుతరసత్యవాక్యవినయోచితభూరిగుణప్రసిద్ధికిన్
నరపతు లేమిలెక్క పదునాలుగులోకములందుఁ జూడ గి
న్నరసురయక్షకింపురుషనాయకులం దొకఁ డైన లేఁడు ని
ర్భరమహితప్రభావమునఁ బన్నిద మిత్తుఁ బురారిసన్నిధిన్. ఆ. ౧.

ఉ. మానవనాథ యీకొలఁత మాటలఁ దీఱదు గాధిసూనుఁ డీ
పూనికఁ దప్పఁ డింకఁ గొనిపోయిరె మున్ను ధరిత్రి చేరెఁడం
తైన నరేంద్రముఖ్యులు దివాకరవంశపయోధిచంద్ర నీ
మానితవాగ్వదాన్యమహిమం బెడబాయ టదేమి చూడఁగన్.
ఆ. ౨.

చ. ధృతిమెఱయంగ నే నిటు పతివ్రత నేని, ధరిత్రిమీఁద మ
త్పతిఘనసత్యవాక్యనయభాసురుఁ డేని కృశాన నీ విదే
హితమతి శీతలాకృతి వహించి ధరామరవర్య భూవిభున్
సుతుఁ డగులోహితాస్యు దయఁజూచి మునీంద్రుబుణంబుదీర్పుమా.
ఆ. ౨.

ఉ. ఏమనవచ్చు మున్ను ధరయేలినరాజులదేవులెల్ల స
త్కామవినోదవైభవసుఖప్రదలై వసియింప, నిన్ను బల్
బాములఁ గప్పి కాఱడవిపాలుగఁ ద్రిప్పి కృతఘ్నబుద్ధిచే
నీనుము దప్పి యుమ్మకొన నేరుపు గల్గె లతాంగి యేమనన్. ఆ. ౪.

శా. సప్తద్వీపసముద్రముద్రితమహాసర్వంసహాచక్రసం
 ప్రాప్తశ్రీకమనీయలక్షణజగత్రాణవిద్యాసత్యవ్రతో
 ద్దీప్తప్రాభవుఁ డైనరాజసుతుఁ డర్థిన్ దైన్యభావోదయ
 వ్యాప్తిన్ బెట్టెఁడు నేల కైనఁ దగఁ డే యంచు న్విలాపించుచున్.

ఆ. శ.

29. తెనాలి రామకృష్ణుఁడు.

ఈతనికి మొట్టమొదట రామలింగ మని పేరనియు, ఆపేరుతో నితఁడు శివభక్తిపరాయణుఁ డయి లింగపురాణమును తెనిఁగించెననియు, చెప్పుదురు గాని యిది యెంతవఱకు నిజమో తెలియదు. ఈతనిచే నాంధ్రీకరింపఁబడినదన్న లింగపురాణ మిప్పు డెక్కడను గానఁబడదు. అప్పకవి మొదలగువారు రచించిన లక్షణగ్రంథములలో నందలిపద్య మొక్కటియు నుదాహరింపఁబడి యుండకపోవుటచే పూర్వకాలము నందుసహితమట్టి గ్రంథ మున్నట్టు తోఁచదు. ఈకవి మొట్టమొదట శివభక్తుఁ డయినను విష్ణుభక్తులగు చంద్రగిరిరాజులను సంతోషపెట్టుట కయి తరువాత విష్ణుభక్తుఁ డయి వైష్ణవులను గురువులనుగాఁ గైకొనె ననియుఁ గూడ జెప్పుదురు. ఈకథ సత్యమైనను గావచ్చును. ఇతఁడు రచియించినట్టు చెప్పెడు చాటుపద్యములలోఁ గొన్నిటిలో నీతనిపేరు రామలింగమని కానఁబడుచున్నది. అందొకపద్యము నిం దుదాహరించుచున్నాను—

ఉ. లింగనిషిద్ధుఁ గల్వలచెలింగని, మేచకకంధరుం ద్రిశూ
 లింగని సంగతాళి లవలింగని, కర్దమదూషిత న్మృణా
 లింగని, కృష్ణచేలుని హలింగని నీలకచన్ విధాత్రునా
 లింగని, రామలింగకవిలింగనికీర్తి హసించుదిక్కులన్.

కూర్మపురాణమునందు రాజలింగకవి కవిస్తుతిచేయుచు "రంగనాథుని రామలింగకవిని" అని రామలింగనామమునే వాడియున్నాఁడు. *రామకృష్ణకవి కృష్ణామండలములోని తెనాలిగ్రామమునందు శాలివాహనశకము ౧౩౭౪ వ సంవత్సరమున ననఁగా క్రీస్తుశకము ౧౪౫౨ వ సంవత్సరమున జనన మొందెననియు, ఈతనియింటిపే రీశ్వరప్రెగడవారనియు, పయికాలమును సూచించెడి యీతని జన్మపత్రికవలన నితఁడు మంచిలగ్నమునఁ బుట్టినట్లు కానవచ్చుచున్నదనియు, అఱువదిసంవత్సరములక్రిందట తమదక్షిణహిందూస్థానకవిచరిత్రమునందు కావలి వేంకటరామస్వామిగారు వ్రాసియున్నారు. అయినను మన కీతనికాలమును గూర్చి యిప్పుడు దొరకిన నిదర్శనములనుబట్టి చూడఁగా పూర్వోక్తకాలము సరియైనదని నమ్ముటకు వలనుపడదు. రామకృష్ణకవి దని చెప్పఁబడెడు జన్మపత్ర మిటీవలివారిచేత సృష్టింపఁబడిన దయి యుండవలెను. అటుగాక యితఁడు పయిని జెప్పఁబడిన సంవత్సరమునందే జన్మించి యుండినపక్షమున, ఈకవి కృష్ణదేవరాయలు సింహాసనమునకు వచ్చునప్పటికే దాదాపుగా నేఁబదియేండ్లప్రాయము గలవాఁ డయి యుండవలెను. రామకృష్ణకవి యప్పయదీక్షితులవారితోను తిరుమల తాతాచార్యులతోను సమకాలికుఁ డయి చంద్రగిరిరాజగు వేంకటపతిరాయల ప్రభుత్వకాలములో నుండినవాఁ డయినట్లు కొన్నినిదర్శనములు కనఁబడుచున్నవి. ఈవేంకటపతిరాయలు వసుచరిత్రమును కృతినందిన తిరుమలదేవరాయల యనంతరమున తనరాజధానిని విజయనగరమునుండి చంద్రగిరికి మార్చుకొని క్రీస్తుశకము ౧౫౮౫ వ సంవత్సరము మొదలుకొని ౧౬౧౪ వ సంవత్సరమువఱకును రాజ్యము చేసినవాఁడు. కృష్ణరాయని మరణానంతరమున నేఁబదియైదుసంవత్సరములకు రాజ్యమునకు వచ్చిన వేంకటపతిరాజుయొక్క రాజ్యకాలములోనున్న రామకృష్ణకవి నిజముగా నొకవేళ కృష్ణదేవరాయలకాలములోఁగూడ నుండుటయే తట

స్థించినపక్షమున, అతఁ డప్పుడు బాలుఁ డయియుండవలెనుగాని జన్మపత్త్రమునందుఁ జెప్పఁబడినప్రకారము వయసుమీఱినవాఁ డయియుండఁ జాలఁడు. కాఁబట్టి యీజన్మపత్త్రి మెంతమాత్రమును విశ్వాసపాత్ర మయినది కాదు. ఈకాలవ్యత్యాసమును సరిపఱుచుట కయి కొందఱు అప్పయ్యదీక్షితులవారుకూడ కృష్ణదేవరాయలకాలమునాఁటివారే యని చెప్పుచున్నారు. అప్పయ్యదీక్షితులవారు మిక్కిలి వృద్ధు లగువఱకును జీవించినవా రగుటచేత బాల్యమున కృష్ణరాయని దినములలో నుండిన నుండవచ్చునుగాని యీసంస్కృత విద్వత్కవి వేంకటపతిరాయల యాస్థానమునందే యుండి ప్రసిద్ధుఁ డయినవాఁడు. ఈదీక్షితులవారు కాంచీపురమునకు నలుబది మైళ్ళదూరములో నున్న యడెపోల మను నగ్రహారమున నీశ్వరాంశచేత నారాయణదీక్షితులకు పుత్త్రుఁడయి పుట్టె ననియు, ఇతఁడు తనపంద్రెండవసంవత్సరమునాఁటికే వేదాధ్యయనము చేసి "శివార్చనచంద్రిక" "శివతత్త్వవివేకము," "శివమణిదీపిక" "ఆత్మార్పణము" మొదలయిన శైవగ్రంథము లనేకములు చేసెననియు, వాదమునందు వేంకటపతిరాయలసంస్థానమున రాజగురువయిన తాతాచార్యుల నోడించి రాజసమ్మానము పొందెననియు కావేరీతీరమునందనేక యాగములుచేసి యవసానదశయందు కాశీవాసము చేయవలెనని యఱువది యేండ్లు నిండినతరువాత ప్రయాణ మయిపోవుచుండఁగా త్రోవలో చిదంబరపురనివాసు లాతనిపోనీయక తమయూర నుండునట్లు ప్రార్థించి నిలిపినందున నపరకాశి యగు చిదంబరమునందుండి యందే దేహవియోగము నొందెననియు అతఁడు నూటికంటె నెక్కువపుస్తకములు రచించె ననియు చెప్పుదురు. ఇప్పు డీమహాకవి రచించినగ్రంథము లనేకములు నశించినవి. కువలయానందమనెడి యలంకారశాస్త్రము సుప్రసిద్ధమయి సర్వదేశములయందును వ్యాపించియున్నది. తనతండ్రికిఁ గలిగిన గెలుపులను వర్ణించుచు నీలకంఠవిజయమును సంస్కృతగ్రంథమును జేసిన

యయ్యాదీక్షితు లప్పయదీక్షితులవారికి మేనల్లుఁడయి మధురరాజగు తిరుమలనాయకునియొద్ద మంత్రిగా నుండినందునను, ఈతిరుమలనాయకుఁడు మధురాపురము రాజధానిగా హూణశకము ౧౬౨౩ మొదలు కొని ౧౬౫౯వ సంవత్సరమువఱకును పాండ్యదేశమును పాలించినందునను, ఆ కాలమునందుండిన యయ్యాదీక్షితుల మేనమామయైన యప్పయ్యదీక్షితులవారు నూఱుసంవత్సరములక్రిందట కృష్ణదేవరాయలసభయందుండిరనుట నమ్మఁదగినదికాదు. అందుచేత దీక్షితులవారితోడిసమకాలికుఁడయిన రామకృష్ణకవియు కృష్ణరాయని యాస్థానమునందుండలేదనుట నిశ్చయము.

రామకృష్ణునిగూర్చి తాతాచార్యులవారితో సంబంధించినకథలనేకములు చెప్పుచున్నారుగాన, దీక్షితులవారి చరిత్రమువలెనే యాచార్యులవారిచరిత్రమును మనకథతో నంతగా సంబంధించినది కాకపోయినను తాతాచార్యులవారినిగూర్చికూడ నిచ్చటఁ గొంచెము వ్రాయుచున్నాను. ఈయనజన్మస్థలము కాంచీపురము; ఈతఁడు గొప్పవిద్వాంసుఁడును, సంస్కృతకవియు, ధర్మాత్ముఁడును అయి యుండెను. అప్పయ్యదీక్షితులవారు శివాంశచేత పుట్టిరని చెప్పినట్లే యితఁడు విష్ణ్వంశచేతఁ గలిగెనని జనులు వాడుకొందురు. ఇఁడు తనధనముతో బీదలకనేకవివాహములు చేయించినందున వీరివంశనామము తిరుమలవారయినను తరువాత కన్యాదానమువారని మాఱినది. ఈతఁడు గీర్వాణభాషలో "సాత్త్విక బ్రహ్మవిద్యావిలాసము" అనుగ్రంథమును జేసెను. ఇతఁడు చంద్రగిరిరాజులకు వంశగురువయి తఱుచుగా కాంచీనగరము నుండి చంద్రగిరికిఁబోయి వేంకటపతిరాయలసంస్థానమునందు వసించుటచేత, ఈయన కక్కడ రామకృష్ణకవితోడి సంబంధము కలుగుచు వచ్చెను. ఈ తాతాచార్యులు మొట్టమొదట రామరాజుయొక్క రాజ్యాంతదశలోఁ గన్నులెత్తి, వైష్ణవమతమునం దత్యంతాభినివేశము

గలవాఁడయి తనశిష్యులయిన రాజులబలముచేత బలవంతముగా జనులను బట్టి చంక్రాంకణాదులు చేయుచువచ్చెను. అందుచేతనే "తాతాచార్యులవారిముద్ర భుజము తప్పినను వీపుతప్పదు" అనుసామెత నేఁటివఱకును వచ్చుచున్నది.

రామకృష్ణకవియొక్క కాలమును స్థిరపఱచుటకుఁ దగిన యాధారములు కొన్ని తద్విరచితమైన పాండురంగమాహాత్మ్యమునందే కనఁబడుచున్నవి. కవి యీక్రిందిపద్యమునందు కృతిపతియైన విరూరి వేదాద్రియొక్క గురువునుగా కందాళ యప్పలాచార్యులవారిని వర్ణించి యున్నాఁడు—

సీ. వేదమార్గప్రతిష్ఠాదైవతజ్యేష్ఠుఁ డభ్యస్తషడ్దర్శనార్థరాశి
యతిరాజరచితభాష్యగ్రంథనిర్ణేత యఖిలపురాణేతిహాసకర్త
బంధురదివ్యప్రబంధానుసంధాత పంచసంస్కారప్రపంచచణుఁడు
వాధూలమునిచంద్రవంశవర్ధనమూర్తి సకలదేశాచార్యనికరగురువు
పట్టమేనుంగు శ్రీరంగపతికి నణ్ణ
గారిగర్భాంబురాశిసీహారరశ్మి
సారసాహిత్యసర్వస్వశయ్యపేటి
యాళవందారు కందాళయప్పగారు.

నై జయంతీవిలాసమును రచియించిన సారంగు తమ్మయకవియు నీకందాళ యప్పలాచార్యులవారినే తనగురువునుగా విప్రనారాయణ చరిత్రము యొక్క ప్రథమాశ్వాసమునం దీక్రిందిపద్యముచేతఁ జెప్పియున్నాఁడు—

క. వందారు దాసజనతా
మందారు న్వేదశాస్త్రమహితప్రజ్ఞా
బృందారకగురు మద్గురుఁ
గందాళాప్పలగురుఁ జగద్ధితుఁ గొలుతున్.

పయిపద్యద్వయమునుబట్టి చూడఁగా రామకృష్ణకవియు తిమ్మకవియు సమకాలీను లగుట స్పష్ట మగుచున్నది. వీరిలో తిమ్మకవి తన నైజయంతీవిలాసమునందు తాను గోలకొండ కరణ మయినట్లును తనకాలమునందా దేశమును మహమ్మదుశాహి పాలముచేయుచుండినట్లును ప్రథమాశ్వాసములో నీక్రిందిపద్యమునఁ జెప్పియున్నాఁడు—

చ. ఇనసమతేజులౌ నృపుల నెల్ల మహమ్మదుశాహి యేలు నీ
యెనుబదినాల్గుదుర్గముల నేలినయేలిక గోలకొండ త
ద్ఘనపగరస్థలిన్ గరణికం బొనరించును దమ్మమంత్రి యా
జనపతి రమ్ము పొ మ్మనఁ బ్రజ ల్జయపెట్ట గృహస్థు లౌననన్.

ఈమహమ్మదుశాహి నవాబుగానుండి గోలకొండరాజ్యమును క్రీస్తుశకము ౧౫౮౧ వ సంవత్సరము మొదలుకొని ౧౬౧౧ వ సంవత్సరమువఱకును పాలించినందున్న, ఈతని కాలమునందున్న తిమ్మకవియు నాకాలమునందే జీవించియుండెను. తిమ్మకవితోడి సమకాలికుఁ డయిన రామకృష్ణకవియు నించుమించుగా నీకాలమునందే యనఁగా పదునాఱవ శతాబ్దాంతమునందును పదునేడవ శతాబ్దాదియందు నుండెననుటకు సందేహము లేదు. కవియొక్క కాలనిర్ణయము చేయుటకు పాండురంగమాహాత్మ్యమునం దింకొకయాధారముకూడ కనఁబడుచున్నది. పాండురంగమాహాత్మ్యమును కృతి నందిన విరూరి వేదాద్రి యొక చిన్నజాగీరుదారయిన పెదసంగమరాజువద్ద ప్రధానిగా నుండెను. ఈవిషయము పాండురంగమాహాత్మ్యమునం దిట్లు చెప్పఁబడినది—

సీ. తనకులాచారవర్తన వైష్ణవాచారపర్యాయముల కొజ్జబంతియనఁగఁ
దనసూనృతముపురాతనసత్యసంధులయున్నతికిఁ బునఃప్రతిష్ఠితముగాఁగఁ
దనబుద్ధి నీతిశాస్త్రరహస్యములు తెల్లముగఁ దెల్పువ్యాఖ్యానముద్ర గాఁగఁ
దనప్రాయుగంటంబు మొనవాఁడి విశ్వంభరాప్రజలకుఁ బ్రాణరక్షగాఁగ

వెలయు మంగయగురువభూవిభుని పెద్ద
సంగభూపాలమణి బ్రాయసప్రవర్తి
ప్రియయుతుం డైనరామానుజయసుతుండు
భద్రచారి విహారి వేదాద్రిశౌరి.

కృతినాయకుఁ డైనవేదాద్రికి ప్రభువగుసంగరాజుయొక్క తండ్రి గురువరాజు సదాశివదేవరాయని రాజ్యకాలములో నుండి యాతని వలన శాలివాహనశకము ౧౪౬౫ వ సంవత్సరమునం దనఁగా హూణ శకము ౧౫౪౩ వ సంవత్సరమునందు దేవుని నిమిత్తము నాలుగుగ్రామ ములు సంపాదించినట్లు మెకెంజీదొరవారు సమకూర్చి చెన్నపురిలో ప్రాగ్దేశలిఖితపుస్తకనిలయమునం దుంచిన స్థానికచరిత్రమువలనఁ దెలియ వచ్చుచున్నది. మంగయకొడుకైన గురువరాజును మంగయతమ్మునిగాఁ జెప్పిన యాచరిత్ర మెంత నమ్మవచ్చునో యాలోచనీయముగా నున్నది. ఈకాలమును బట్టిచూచినను గురువరాజుకొడుకయిన సంగభూపా లుఁడు పదునాఱవ శతాబ్దముయొక్క కడపటి భాగమునందు రాజ్యము చేసినట్లు యూహింపఁదగియున్నది. అతని యాశ్రితుఁ డగుటచేత రామ కృష్ణకవియు ౧౫౬౦-౭౦ సంవత్సరప్రాంతమునుండి కవియై యుండ వచ్చును. కవి పాండురంగమహాత్మ్యమును వేదాద్రి కంకితము చేయు నప్పటికే వేదాద్రికి కొడుకులు మొదలయినవారు కలిగియున్నట్లీపద్యము వలనఁ దెలియవచ్చుచున్నది.

క. సోదరులు సుతులు సతులును
వేదోదితమార్గచర్య వినయము నయముల్
శ్రీదాంపత్యము నెసఁగఁగ
వేదాద్రిమహాప్రధాని వెలయుం గృతులన్.

రెట్టమతమును రచియించిన యయ్యలరాజు అయ్యలభాస్కరుల కాలమునుబట్టి చూడఁగా రామకృష్ణుఁ డింకను దరువాతివాఁడని తెలి

యవచ్చుచున్నది. పాండురంగ మాహాత్మ్యకృతిపతియగు విరూరి వేదాద్రి కాశ్రయుఁడగు పెదసంగభూపాలుని మేనల్లునికి రెట్టమతము నంకితమొన ర్చిన యాకవులు తమకాలము నీక్రిందిపద్యముచేఁ దెలిపికొనియున్నారు—

సీ. కలియుగప్రథమభాగమునాల్గువేలయెన్మిదిసూర్లపై నిడెబ్బదియునొకటి
శాలివాహనశకసమలిలవేయునాన్నూటతొంబదిరెండు యాఘిగాఁగఁ
బ్రభవాదిగతములు పరఁగ నిర్వాదియనాఁడు నేండ్లయ్యె నెంతయు
నెన్నబుధులు
అట్టికాలంబున నయ్యల భాస్కర కవివర్యు లలరాజకమలహితుని
యాజ్ఞఁబూరోక్త రెట్టమతాఖ్యకావ్య
మునునొనర్చిరి యాచంద్రముగను కీర్తి
వక్తృశ్రోతలకునుగల్గ వసుధమీఁద
నలయహోబల నృహరికి నర్పణముగ.

సంగభూపాలుని యనుగ్రహమువలన వేదాద్రిసంపదల నొందినట్లు

గీ. గుణుతుగలరాజు మంగయ గురువరాజు
పుత్రుఁ బెదసంగభూపాలుశత్రుజైత్రు
భానుసమతేజు విద్యావధానభోజుఁ
గొల్చి వేదాద్రి సిత్యలక్ష్ములఁ దలిర్చు.

ఇత్యాది పాండురంగమాహాత్మ్యములోని పద్యములు చెప్పు చున్నవి. పెదసంగభూపాలుఁడు గురువరాజుయొక్క త్రిమ్మంద్రుపుత్రు లలో జ్యేష్ఠుఁడు. ఈతని తమ్ములనామము లాగ్రంథమునందుఁ జెప్పఁబడి యుండకపోవుటచేత గ్రంథరచనకాలమునకు వారు బాలురనియు సంగ భూపాలుఁడు యౌవనదశయం దుండినవాఁ డనియు స్ఫురించుచున్నది. పెదసంగభూపాలుని తమ్ములనుగూర్చి రెట్టమతములోఁ గృతిపతియొక్క తండ్రి యగుపెదతిమ్మరాజును వర్ణించుసందర్భమున నిట్లు చెప్పఁబడినది—

గీ. అట్టి పెదతిమ్మరాజు ధైర్యాద్రిరాజు
మంగవిభుగుర్వశౌరియనుఁగుఁగూఁతు
నంగనాశిరోమణిఁ బాపసంగమాఖ్యఁ
బ్రేమవరియించె విభవాభిరాముఁ డగుచు.

క. గుణనిధి యగుతత్కన్యా
మణిజనకుఁ బోధజనకు మంజులభాషా
ఫణివరు రణవిజయార్జును
బ్రణుతింపఁ దరంబె గురువపార్థివవర్యున్.

సీ. పృథులవిక్రమశాలి పెదసంగనృపతియు సత్యసంధుఁడు చినసంగరాజు
ధర్మగుణాఢ్యుండు తమ్మభూపాలుండురు చిరకీర్తిధనుండు రుద్రఘనుఁడు
ప్రధనాంగణకిరీటి బసవనరేంద్రుండుస్థిరభాగ్యనిధి పెదచిట్టఘనుఁడు
సింధుగాంభీర్యుండు చినచిట్టవర్యుండు సతతధన్యుఁడు పొట్టిసంగశౌరి
కలితతేజుండు పాపసంగప్రభుండు
ననఁగ బరఁగినతొమ్మండ్రు తనయవరులఁ
గాంచి విజయసంశీలుఁడై మించె నౌర
మంగరాజన్యగురువసమ్రాడ్వరుండు.

క. ఆగురువరాజవరునకుఁ। ద్యాగసముద్రునకు నల్లుఁడయి వెలసె ధరా
భాగధురంధరతను నా। భాగుఁడు పెదతిమ్మరాజు ప్రజలు నుతింపన్.

కృతిపతితల్లియు మంగయగురువరాజుకూఁతురు నైన పాపసంగమాంబ పెదసంగభూపాలాదులగు తొమ్మండ్రకును జెల్లె లయియుండవచ్చును. అట్లయినచో నీమె సంగభూపాలునికంటె నిరువది యిరువదియైదేండ్లు చిన్నది కావచ్చును. కృతిపతియైన వేంకటరాజీమెయేడుగురుపుత్రులలో మూఁడవవాఁడు. కాఁబట్టి యితఁడు తల్లి కించుమించుగా నిరువదియైదుసంవత్సరముల ప్రాయమునందు జనించి యుండవచ్చును. అందుచే నీవేంకటరాజు తనమేనమామ యగు పెదసంగ

భూపాలునికంటె నేఁబదియేండ్లు చిన్నవాఁ డగుట యసంభవము కానేరదు. రెట్టమతమునందు కృతిపతియొక్క విక్రమధురంధరులైన వేఁడుగురు కొడుకులు వర్ణింపఁబడుటయేకాక కృతిపతియొక్క కొడగొట్టు తమ్మునిపుత్రులుసహిత మేవురు బాహుబలశాలులయి నట్లు వర్ణింపఁబడియున్నారు. అందుచేత నతఁడీగ్రంథమును గృతినందినకాలమున కనఁగా ౧౫౭౦ వ సంవత్సరమునాఁటికి మిక్కిలిఁ వృద్ధుఁ డయి యుండవలెను. అతని కప్పు డెనుబదిసంవత్సరములవయ స్సుండె ననుకొందము. అట్లను కొన్నను పాండురంగమాహాత్మ్యము రచియింపఁబడినకాలము ౧౫౫౦ వ సంవత్సరమునకంటెఁ బూర్వమయి యుండదు. అప్పటికి రామకృష్ణుఁడు వృద్ధుఁ డనుకొన్నను, అతఁడు కృష్ణదేవరాయల యాస్థానమునందలి కవుల నాక్షేపించె నన్న కథలన్నియు నసత్యకల్పనములనుట స్పష్టము. అయినను మన మీకవులకాలముసుగూర్చి యింకను విచారింపవలసి యున్నది.

ఈరామకృష్ణకవి యాజ్ఞవల్క్య బ్రాహ్మణుఁడు; కౌండిన్యస గోత్రుఁడు; తండ్రి రామయ్య; తల్లి లక్ష్మమ్మ. తాను తెనాల్యగ్రహార నిర్ణేత యయినట్లును, ఆశుకవిత్వాదులయందు మేటియైనట్లును, కృతిపతి తన్నుద్దేశించి పలికినట్లుగా కవియే పాండురంగమహాత్మ్యమునం దీక్రింది పద్యములతోఁ జెప్పుకొనియున్నాఁడు—

క. నను రామకృష్ణకవిఁ గవి
జనసహకారావళీవసంతోత్సవసూ
త్రనిధిఁ బిలిపించి యర్హా
సనమునఁ గూర్చుండఁ బనిచి చతురత ననియెన్.

సీ. పలుదెఱంగులకావ్యనవసుధాధారలఘునుఁడనాశువునందుఁగరము మేటి
వఖిలభూమీపాలకాస్థానకమలాకరోచ్ఛ్రయతరుణసూర్యోదయుఁడవు

శైవవైష్ణవపురాణావళి నానార్థరచనాపటిమైకరమ్యమతివి
లౌకికవైదికలక్షణచాతుర్యధైర్యప్రభావాఢ్యకార్యచణుఁడ
వాంధ్రభూమీకుచాగ్రహారాభ మైన
శ్రీతెనాల్యగ్రహారనిశ్చేత వగ్ర
శాఖికాకోకిలమ వీవు సరసకవివి
రమ్యగుణకృష్ణ రామయరామకృష్ణ

క. కౌండిన్యసగోత్రుఁడ వా
ఖండలగురునిభుఁడ వఖిలకావ్యరససుధా
మండనకుండలుఁడవు భూ
మండలవినుతుఁడవు లక్ష్మమావరతనయా.

క. యశముఁ గలిగించు నీమృదు
విశదోక్తులఁ బౌండరీకవిభుచరితఁ జతు
ర్దశభువనవినుతముగ శుభ
వశగతి నాపేర నుమువు వరతత్త్వనిధీ.

ఉ. స్కాందపురాణనీరనిధికౌస్తుభమై ప్రభవించు దేవకీ
నందనుసత్కథోద్యమము నవ్యకవిత్వకళాకలాపమున్
కుందనమున్ ఘటించి కడుఁగ్రొత్తగు సొమ్మొనరించి విష్ణుసే
వం దిలకించునప్పరమవైష్ణవకోటి నలంకరింపుమా.

మ. ఉదయం బస్తనగంబు సేతువు హిమవ్యూహంబునుం జుట్టిరా
విదితంబై నమహోన్నతాంధ్రకవితావిద్యాబలప్రౌఢి నీ
కెదు రేరీ సరసార్థబోధఘటనాహేలాపరిష్కార శా
రద నీరూపము రామకృష్ణకవిచంద్రా సాంద్రకీర్తీశ్వరా!

ఈపద్యములనుబట్టి చూడఁగా కవి కొంతవఱ కాత్మశ్లాఘాప్రియు డని తోఁచక మానదు. ఇతఁ డెంతప్రౌఢకవియైనను స్వోత్కర్షప్రకట

నము నింతగాఁ జేసికొనక నమ్రతనుజూపినచో నధికశ్లాఘాపాత్రుఁడయి యుండును. ఈతనినివాసస్థలము కృష్ణామండలములోని తెనాలియగ్రహారము; ఇతనిపూర్వులు కాపుర ముండినచోటు తెనాలికి రెండుక్రోసుల దూరములోనున్న గార్లపాడు గ్రామమనియు, ఇతఁడు తననివాసము నచ్చటనుండి తెనాలిగ్రామమునకు మార్చుకొనెననియు నొకరు వ్రాసియున్నారు. ఇతఁడు చిన్నతనములో బట్టుపల్లెయను గ్రామమునందుండు బట్రాజులతో సాంగత్యముచేసి, వారిచెలిమిచేత సంస్కృతాంధ్రసాహిత్యమును కవిత్వకౌశలమును సంపాదించి బుద్ధిబలముచేత ప్రబంధకవీశ్వరుఁడయి వన్నెకెక్కెనఁట. ఇతఁడు రచియించిన పుస్తకము పాండురంగమహాత్మ్య మను స్థలపురాణము. ఇందుఁ గొన్నివర్ణనలు విలక్షణముగానుండును. "పాండురంగ విభుని పదగుంభనంబును" అన్నట్లితనికవిత్వము పదములకూర్పుచేత మేలిమి గన్నది. అందు నిరర్థక పదము లెక్కడనోకాని కానఁబడవు.

క. అటు లేనియుఁ జెప్పెద నీ
పొటిపొటితలపోఁత లెల్లఁ బోవ నడువు మా
రట ముడుగు నెమ్మనము నొ
క్కటిగా నొనరించి గట్టిగా విను మధిపా.

ఇత్యాదిపద్యములలోఁ గట్టిగా లోనగుపదము లొకానొకటి యక్కడక్కడ వ్యర్థములుగాఁ దోఁచినను మొత్తముమీఁదఁ బదసందర్భమితనికిఁ గుదిరినట్లు మఱియొకకవికిఁ గుదిరిన దని చెప్ప వలనుపడదు. ఈపాండురంగమాహాత్మ్యమునకే పాండురంగవిజయమని నామాంతరము గలదు. ఇదిగాక పాండురంగవిజయమని రామకృష్ణకవివిరచితగ్రంథము వేఱొకటియున్నదని కొంద ఱందురుగాని యామాట పాటింపఁ దగినది కాదు. ఈకవికి తరువాత నల్పకాలములోనే యున్నయప్పకవి లోనుగాఁ గలలాక్షణికు లొక్కరును పాండురంగవిజయ మున్నదనిచెప్పి దాని

లోనుండి యొక్కపద్యమునైన నుదాహరించియుండ లేదు. ఇప్పుడు పాండురంగవిజయములోనివని యందందుఁ జదువఁబడెడు పద్యములలో ననేకము లితరగ్రంథములలోనివిగాను కొన్ని యప్రౌఢకవికల్పితములుగాను గానఁబడుచున్నవి. ఎట్లనఁగా,

సీ. భుజగలోకాధీశభోగతల్పశయాన హరిరూపధర మహాపురుష యనుచు
నతులాబ్జమకుటవర్ణితపాదరాజీవ రామార్చనీయ శ్రీరంగ యనుచు
మారీచమదభంగ మహితవాయవ్యాస్త్రశరదనిద్రితనేత్రశౌరి యనుచు
సముద్రగవర్షావసరయోగనిద్రాణ కరిరాజవరద శ్రీకాంత యనుచుఁ
దలఁకు నులుకును నలుకు బెగ్గిలుచుఁ బలుకు
సఖులనయనస్వరశిరోజచరణకలన
పవనకందర్పఘనహంసజవనతురగ
భటనటప్రియసముదాయపటిమదోఁప.

ఈపద్యము పాండురంగవిజయములోనిదని సర్వసాధారణముగాఁ జదువుదురు. నిజము విచారింపఁగా నిది పైడిమఱ్ఱి వేంకటపతికృతచంద్రాంగదచరిత్రమునందలి చతుర్థాశ్వాసములోనిది. ఇట్లే

గీ. అరుణపల్లవరుచిఁబోలు నాపదంబు
లాపదంబులఁబోలు నయ్యాలకజాత
మలకజాతముఁబోలు నిత్యసుఖలీల
నిత్యసుఖలీలఁబోలు నన్నెలఁతనడుము.

అను నీపద్యము పాండురంగవిజయములోని దని కొందఱు చెప్పుచున్నను, ఇది సింహాద్రి వేంకటాచార్య విరచితమైనచమత్కారమంజరిలోఁ గనఁబడుచున్నది. ఈప్రకారముగానే పాండురంగవిజయములోనివని చదువఁబడెడు మఱికొన్ని పద్యము లితరప్రబంధములోనివిగాఁ గనఁబడుచున్నవి. తాను ప్రబంధరూపముగాఁ బాండురంగమహాత్మ్యములోఁ జెప్పినకథనే స్వీకరించి యాకవియే మరలపాండురంగవిజయమని మఱి

యొకప్రబంధము జేయవలసిన యావశ్యకముసహితము ముండదుగాన పాండురంగవిజయమని వేఱొకప్రబంధ మున్న దన్నవార్త కల్లయని నిశ్చయింపవలసి యున్నది. ఇతఁడు నిరోష్ఠ్యరామాయణము మొదలయిన చిత్రకావ్యములను రచియించెనని యొకప్రవాదము కలదుగాని యదియు నిజమయి యుండదు. ఇతఁడు వికటకవి యనియు, అనేకుల ననేకవిధముల వంచించె ననియు, పెక్కు కథలు చెప్పుదురుగాని పాండురంగమాహాత్మ్యము నంతటి భక్త్యావేశముతో రచియించిన 'వైష్ణవభక్తాగ్రేసరుఁడు పామరజనైకాదరణీయములైన తుచ్ఛకార్యములకు లోనగునా' యని సందేహింపవలసియున్నది. ఈ దేశములో పామరజనులు కవులు రసికులను చూపుట కయి వారికి వేశ్యాగమనదోషాదు లారోపించుట చిరకాలమునుండి యాచార మయి యున్నది. ఇతఁడు వికటకవియని చూపుట కయి యితఁడు రచియించిన పుస్తక మొక్కటియు లేదు.

"శప్పవిజయంబు చెప్పెదఁ జిత్తగింపు
మేకదంతుండు నీకిచ్చు నింతబొచ్చు."

ఇత్యాదు లగుయతిభ్రంశదోషాదులను గలిగిన పనికిమాలిన బూతుపుస్తకము నొకదాని నెవ్వరో మహాత్ములు "శప్పవిజయ" మనెడి యపాత్రపు పేరితో రచియించి దాని కర్తృత్వమును రామకృష్ణున కారోపించిరిగాని యం దొకపద్యము నైనను జదివినవారి కాపాడుపుస్తకమునందుఁ జూపినయహంభావమునుబట్టి యితఁ డితరకవులగ్రంథముల నాక్షేపించి పద్యములు చెప్పెనన్నంతవఱకు నమ్మవచ్చును.

ఈరామకృష్ణకవికి మొట్టమొదట రాజాస్థానమునందుఁ బ్రవేశము కలుగకపోయినను రాజపురుషుల నాశ్రయించి వారిమీద పద్యములు చెప్పి వారిమూలమున కడపట రాజానుగ్రహము సంపాదించుకొనెనఁట! అట్లయ్యు నితఁడు సాధుస్వభావము కలవాఁడు కానందునను, పరుల వంచించుటయందును పరిహసించుటయందును ఆసక్తి కలవాఁడయినందు

నను, ఏవో కొంతెుపనులు చేయుచువచ్చి పలుమాఱు రాజుల యాగ్రహమునకు పాత్రుఁ డగుచు వచ్చెనఁట! ఇందుఁ గొంతసత్య ముండక పోదు. అట్లుకానియెడల నితఁడు తనగ్రంథములను పేరుగలరాజుల కెవ్వరికి నంకితము చేయక యొకబ్రాయసగాని కంకితము చేయుట తటస్థించి యుండదు. మహమ్మదీయుల దాడిచేత పేరుగల హిందూరాజ్యములు నశింపఁగా ధనసంపన్నుఁడుగాని రామకృష్ణకవి స్వకుటుంబపోషణార్థమయి ధనస్వీకారముచేసి తనగ్రంథమును సంగరాజుజాగీరులోని విరూరికరణమున కంకితము చేసినను చేసియుండవచ్చును. కృతిపతి యయిన వేదాద్రికి వాసస్థానముగా నుండినవిరూరు నెల్లూరుమండలములో పినాకినీనదికి వంతెనగట్టఁదలఁచిన సంగమునకు రెండు క్రోసులదూరమున నున్నది.

రామకృష్ణుఁడు చేసినయపరాధములను దెలిపెడుకథలలో నొకటిరెంటి నిం దుదాహరించుచున్నాను—

ఒకప్పుఁ డితఁడు రాజగురు వయినతాతాచార్యులవిషయమున చెప్పరాని మహాపరాధమును జేసినందున, రాజు దురాగ్రహాగ్రస్తుఁడై యీతనిని తలవఱకు భూమిలో పాతిపెట్టి యేనుఁగుచేత తల త్రొక్కింపుఁడని రాజభటుల కాజ్ఞ యిచ్చెనఁట. రాజభటు లాతనిని గొనిపోయి యూరిబయలను కంఠములోఁతు మంటిలో పాతిపెట్టి, త్రొక్కించుటకొఱకేనుఁగును దీసికొనివచ్చుటకై వెళ్ళిరఁట. ఈలోపల గూనిచాకలివాఁ డొకఁ డామార్గమునఁ బోవుచు రామకృష్ణుని జూచి యిది యేమని యడుగఁగా, అతఁడు తనకు సంభవించిన గూను పోఁగొట్టుకొనుట కయి వైద్యులయాజ్ఞచొప్పునఁ దా నీచికిత్సను జేయించుకొనుచున్నా ననియు గూను పోయినదో లేదో పయికితీసి చూడవలసిన దనియు వానితోఁ జెప్పెనఁట. వాఁ డాప్రకారముగాఁ జేసి యాతనికి గూను లేకుండుట కద్భుతబడి తన కాచికిత్స చేయుమని కోరఁగా, రామకృష్ణుఁడు వానిని

పాలిపెట్టి తాను పలాయితుఁ డయ్యెనఁట. అటుతరువాత రాజభటు లేనుఁగును గొనివచ్చి దానిచేత చాకలవానితల త్రొక్కించిరఁట. రాజభటులు పోయి తాము రామకృష్ణుని జంపినమాట రాజుతో విన్నవించిన తరువాత రామకృష్ణుఁడు రాజసభకుఁ బోయి సభవారందఱు విస్మయ పడునట్లుగా రాజసందర్శనము చేసి తనయం దీశ్వరుఁ డనుగ్రహించి చచ్చినవానిని మరల బ్రతికించి పంపెనని రాజునకు నమ్మకము పుట్టునట్లుగాఁ జెప్పి నమ్మించి రాజువలన నూఱుతప్పులు క్షమించునట్లు వరము పొందెనఁట.

ఇంకొకసారి రామకృష్ణుఁడు తాతాచార్యులను మోసముచేసి తన్ను మూఁపుమీఁద నెక్కించుకొని రాజమందిరము చేరువనుండి మోసుకొనిపోవునట్లొడఁబఱిచె ననియు, ఆచార్యులవా రాతనిని మోసుకొని రాజవీధిలోఁ నడచుచుండఁగా రాజు మేడమీఁదనుండి చూచి కోపించి పయివానిని తన్ని యీడ్చుకొనిరండని తనభటులకాజ్ఞ యిచ్చెననియు, రామకృష్ణుఁ డామాటలువిని చివాలున తాను క్రింద కుఱికి గురువర్యులపాదములమీఁదఁ బడి తానుచేసిన భాగవతాపచారము క్షమింప వేడుకొని పాప పరిహారార్థముగా నాతనిని తనవీఁపు మీఁద నెక్కించుకొని మోచెదనని చెప్పి యొప్పించి తాతాచార్యులను భుజములపయి నెక్కించుకొని నడుచుచుండఁగా రాజభటులువచ్చి పయినున్నగురునే తన్ని రాజసన్నిధి కీడ్చుకొని పోయిరనియు, అందుమీఁద రాజునకు మఱింత యాగ్రహమువచ్చి గురుద్రోహియైన యాఖలుని వెంటనే శిరశ్ఛేదము చేయుఁడని భటుల కాజ్ఞయొసఁగె ననియు, రాజభటుల కతఁడు లంచమిచ్చి తన్నువిడిచిపెట్టి యొకమేనుజంపి దాని నెత్తురు గొనిపోయి రాజునకు జూపునట్లు వారి నొడఁబఱిచెననియు, రాజు కోపముతీఱి బ్రహ్మహత్య చేయించినందునకుఁ బశ్చాత్తాపపడుచున్న కాలములోఁ దాను బ్రహ్మరాక్షసుఁ డయినట్లు వేషమువేసి రాజును

జడిపించి తరువాత నిజమును జెప్పి రాజుచే మన్నింపఁబడి బహుమాన ముల నందెననియు మఱియొక కథగలదు.

ఇట్లే యితఁ డనేకకవులను విద్వాంసులనుగూడ నాక్షేపించినట్లు పెక్కుకథలుగలవు. అవి యెంతవఱకు సత్యములో చెప్పఁజాలము. అయినను వానిలోఁ గొన్ని సత్యములు కావనియు నటీవలివారిచే గల్పింపఁబడినవనియు మనము సులభముగా నూహింపవచ్చును. తాను రచియించినపాండురంగమాహాత్మ్యకృతికి నాయకుఁడగు వేదాద్రియొక్క గురువైన కందాళ అప్పలాచార్యులువారు సభకు వచ్చునప్పుడు వ్యాకరణశాస్త్రమునందలి యాయనపాండిత్యప్రకర్షమును శ్లాఘించుచు నొకశిష్యుఁడు,

శ్లో. "అపశబ్దభయం నాస్తి। అప్పలాచార్యసన్నిధౌ"

అని చెప్పఁగా రామకృష్ణుఁడు,

"అనాచారభయం నాస్తి। తిష్ఠన్మూత్రస్యసన్నిధౌ"

అని శ్లోకపూర్తిచేసి పరిహాసించెనని చెప్పుదురు. దీనిని తెనిఁగించినచో శిష్యుఁడు చేసిన శ్లోకముయొక్క పూర్వార్థము

గీ. "అప్పలాచార్యసన్నిధియందు (వీస
మంతయిన) నపశబ్దభయంబు లేదు"

అనియు, దానిని పూరించిన రామకృష్ణునియొక్క యుత్తరార్థము

"నిలిచి మూత్రవిసర్జన సలుపువాని
వద్దఁ (గూడ) ననాచారభయము లేదు"

అనియు నగును. శబ్దశాస్త్ర పాండిత్యమునుబట్టి యెట్టి యప శబ్దము నైన సుశబ్దమునుగా సాధింపఁగల సామర్థ్యముగల తనగురువు వద్ద నెవ్వరును నపశబ్దమునకు భయపడవలసిన యక్కఱలేదని యర్థము వచ్చునట్లు శిష్యుఁడు శ్లాఘించినప్పుడు నిలుచుండి మూత్రము విడుచు

వానివద్ద ననాచారభయ మెట్లక్కఱ లేదో యట్లే శంకరుఁడైన యీ యాచార్యునివద్ద నపశబ్దభయ మక్కఱలేదని విపరీతార్థము వచ్చునట్లు శ్లోకము పూరించి యాక్షేపించి వైష్ణవభక్తాగ్రేసరుఁడైన రామకృష్ణుఁడు భాగవతాపచారము చేయునని నమ్మఁదగియుండ లేదు.

"కలనాఁటిధనము లక్కఱగలనాఁటికి" అను పెద్దనపద్యముపై రామకృష్ణకవి యాక్షేపణ చేసె నన్నకథ కల్పితమని యీవఱకే యల్లసాని పెద్దన చరిత్రమునందుఁ జెప్పియున్నాముగదా ? ఆప్రకారముగానే రామకృష్ణకవి ముక్కు తిమ్మనార్యునియెడఁ గూడ నొకయపరాధము చేసెననియు, తిమ్మన యలిగి పండ్లూడఁదన్నఁగా మఱునాఁడు రామకృష్ణకవి దుప్పికొమ్ముతో నూడినపల్లమర్చుకొని కృష్ణరాయలసభకు వచ్చి కూరుచుండ రామభూషణకవి యెఱిఁగి రాజు "రవిగానని చోఁ గవి గాంచునే కదా" యన్న సమస్య నిచ్చినప్పుడు

ఉ. ఆరవి వీరభద్రునిపదాహతి డుల్లినబోసినోటికిన్
నేరఁడు, రామకృష్ణకవి నేరిచెఁబో మనముక్కుతిమ్మరాట్
క్రూరపదాహతిం బడినకొక్కిరిపంటికి దుప్పికొమ్ము ప
ల్గా రచియింప ; నౌర ! రవిగాననిచోఁ గవి గాంచునేకదా.

అని పూరించి యతని నవమానపఱిచెననియు, చెప్పెడికథ కూడ రామకృష్ణకవి ముక్కు తిమ్మనకాలములో నుండినవాఁడు కాకపోవుటచేత నిటీవలి బుద్ధిమంతులచేఁ గల్పింపఁబడినదనియే నిశ్చయింపవలసియున్నది. ఇతఁడు రామరాజభూషణునితో సమకాలికుఁడే యయినను, రామరాజభూషణుని వసుచరిత్రములోని "శ్రీ భూపుత్త్రి" యను పద్యముమీఁద రామకృష్ణుఁడు చేసెనన్న యాక్షేపణము పండితులు చేయఁదగినది కానందున దానిని సహితము సత్యమని నమ్ముట కాధారము కనఁబడదు. ఇతఁడు రామరాజభూషణుని కవిత్వము నాక్షేపించుచు,

క. చీపరపాపరతీఁగలఁ । జేఁపలబు ట్టల్లినట్లు చెప్పెదు నీయా
కాపుకవిత్వపుమాటలు । బాపనకవివరుసచెవికిఁ బ్రమదం బిడునే?

అని చెప్పెనఁట. నిజముగా రామకృష్ణకవియే చెప్పిన దయిన యెడల నీర్ష్యచేతనే చెప్పినదనవచ్చును. ఒకానొకకవి రాయలయాస్థానమునకు వచ్చినప్పుడు

క. తువ్వఁట బాబా, తలపై
పువ్వఁట జాబిల్లి, వల్వ బూదఁట, చేఁదే
బువ్వఁట, చూడఁగను హాళి
క్కవ్వఁట, యరయంగ నట్టిహరునకు జేజే.

అను పద్యమునుజెప్పి తాటాకుమీఁద వ్రాయుమని యిందలి 'తువ్వ' 'హాళుక్కి' అను పదములను వికారముగాఁ జదివి రామకృష్ణుఁ డాకవిని పరాభవించి పంపెనని చెప్పుదురు. ఈకథ కేవలపామరజనైకాదరణీయము. అప్పకవీయమునం దుదాహరింపఁబడిన రామకృష్ణకవి యొక్క చాటుపద్యముల రెంటిలోను,

క. బసవనకుఁ బుట్టినప్పుడె
పసరము గోవిందరాజు పసరం బైనన్
గస వేటికిఁ దినఁ డనఁగాఁ
గసవుం దిను శత్రు లాజిఁ గదిసినవేళన్.

అను పద్యమువలన నతఁడు పరులను దూషించుస్వభావము కలవాఁ డయినట్లు కనఁబడుచున్నను,

క. చిన్నన్న ద్విపద కెరఁగును
బన్నుగఁ బెదతిరుమలయ్య పదమున కెరఁగున్
మిన్నంది మొరసె నరసిం
గన్నకవిత్వంబు పద్యగద్యశ్రేణిన్.

అను పద్యమువలన నతఁ డితరులకవిత్వమందలి గుణములను గ్రహించి శ్లాఘించు గుణగ్రహణపారీణుఁ డనియు స్పష్టపడుచున్నది.

తెనాలి రామకృష్ణుని యిందుధరోపాఖ్యానములోనిదని,

మ. ఒకనాఁ డిందుధరుండుఁ బార్వతియు లీలోద్యానకేళీసరి
న్నికటానేకవనప్రదేశముల దైతేయేంద్రకన్యాప్సరో
నికురుంబంబులు పారిజాతకుసుమానీకంబు పైఁ జల్లఁ ద
ర్పకబాణంబుల కెల్ల నెల్లయగుసౌభాగ్యంబు శోభిల్లఁగన్.

అనెడి యీపద్యము రంగరాట్ఛందమునం దుదాహరింపఁబడి యున్నది. అప్పకవి యీపద్యమునే యాదిపురాణములోనిదని యుదాహరించి యున్నాఁడు. ఆదిపురాణమును, ఇందుధరోపాఖ్యానమును వేఱు వేఱు గ్రంథములో, ఒక్క గ్రంథమునకె రెండును వేఱువేఱు పేరులో, మా కాగ్రంథములు లభింపకపోవుటచేత మే మిప్పుడు చెప్పఁజాలము. ఈపద్యము సోముని హరివంశములోనున్నది. కాఁబట్టి యిది పై రెండు గ్రంథములలోను దేనిలోనిదియుఁ గానట్టు తోఁచుచున్నది. ఈకవి యొక్క పాండురంగమాహాత్మ్యములోని కొన్నిపద్యముల నుదాహరించి యీతని చరిత్రము నింకటితో ముగించుచున్నాము :—

మ. బొమలెక్కించిన విల్లువంచు నునుఁజూపుల్బంచలాంచల
క్రమరేఖ న్నిగిడింప శాతవిశిఖౌఘంబుల్ మెయిన్నించు నె
య్యమునన్ బల్కఁగ నల్కమీఱి చటులజ్యాఘోషముం జేయు న
య్యుమప్రాపొంది రతీశ్వరుండు హరు బిట్టోడింప నుట్టాడుచున్. ఆ-౧

చ. హరిహయదేశికాభుఁ డగునమ్మహిదైవతమౌళియందు బం
గరువునకున్ మృగీమదసుగంధము సంధిలుభాతి నంబుజో
దరచరణారవిందనతతస్మృతిలోలుప మైనబుద్ధియున్
బరిణతి గాంచెసంపదలపై మఱియుం జనియించు సంపదల్. ఆ-౨

శా. ప్రారంభించినవేదపాఠమునకుం బ్రత్యూహమానంచునో
యేరా తమ్ముఁడ నన్నుఁ జూడఁ జనుదే వెన్నాళ్ళనోయుండి చ
క్షూరాజీవయుగంబు వాచె నినుఁ గన్గోకున్కి మీబావయున్
నీరాక న్మదిఁ గోరుఁ జంద్రుపొడుపున్ నీరాకరంబుంబలెన్. ఆ-3

మ. వలనా యేటికి నాశ్రయించి మునఁగా నాసీరమున్ నీరమున్
దలవెత్త్రే పచరింపనేటికి సమిద్ధానంబు దానంబున
చ్ఛలమా యేటికి నెత్తిఁ గట్టుకొనఁగా సన్న్యాసము న్న్యాసమున్
గలిఁ దేఁజాలు మదీయభక్తిరుచి భక్తశ్రేణి కశ్రాంతమున్. ఆ-8

సీ. నిలువున నొలిపించె విలువంగడము నెల్లశరములయాయంబుఁ
బోరయుటుడిపెఁ
దగశబ్దమాత్రపాత్రముచేసె గుణలత్రమూఁకునఁ గట్టించెమాలబలముఁ
గంచుకివశము గావించెసేనానాథుఁ గట్టించె సహచరుఁ గటికియొండఁ
బ్రతిపక్షభావసంగతుఁడనిహితుఁజూచె వరకేతసముకీర్తిభరముఙులిపె
ధర్మనిర్మలబుద్ధి సుశర్మఁ గదిసి
గెలువఁగా లేక చని కోపగించి మదనుఁ
డురక తనవార లతనికి నోడు మనిరె ?
పతికిఁ గీడాట బంట్లపాపంబు గాదె ?

30. తిమ్మరాజు

ఈకవి రాజవంశజుఁడు; ఓబలరాజు కొడుకు; అనంతరాజు మనుమఁడు. మంగళగిరి శ్రీనృసింహస్వామి కంకితము చేసి పరమయోగివిలాస మనెడి యైదాశ్వాసముల పద్యకావ్యమును రచించెను. ఈపద్యకావ్యము నితఁడు వెంగళనాథుఁడుచేసిన ద్విపదకావ్యమును జూచియైనను జేసియుండవచ్చును; లేదా స్వతంత్రముగా నైనను జేసియుండవచ్చును. ఇరువురుకవులును నించుమించుగా సమకాలీను లయినందున, ఎవ్వరే గ్రంథమును ముందుగాఁ జేసిరో నిర్ధారణము చేయుటకు శక్యము కాదు.

శా. శ్రీరంజిల్లఁగఁ బానకం బనిశమున్ సేవింపఁగాఁ దద్గుణం
బారూఢిం బొలుపొందెనో యనఁగ యోగానందమాధుర్యల
క్ష్మీరమ్యాకృతి నొప్పుమంగళగిరి శ్రీమన్నృసింహుండు స
త్కారుణ్యామృతవృష్టిచేఁ దనుపు నిత్యంబుం బ్రపన్నావళిన్.

ఇది పరమయోగివిలాసములోని ప్రథమపద్యము. ఈకవిత్వము సర్వవిధములచేతను ద్విపదకావ్యమునకంటె శ్రేష్ఠతరముగా నున్నది. ఈకవి కృష్ణదేవరాయనియల్లుఁ డైనయళియరామరాజునకు దోడఁబుట్టిన పడుచైనకోనమాంబకు కుమారుఁ డైనందున, వసుచరిత్రము కృతి నందిన తిరుమలదేవరాయనికిని మేనల్లుఁడే. ఆకాలమునం దితఁడు కృష్ణామండలములోని కొండవీటిసీమకు పరిపాలకుఁడుగా నుండెను. కవి తాను రామరాజాదులకు మేనల్లుఁ డయినట్లును, కొండవీటికి ప్రభు వయినట్లును, పరమయోగివిలాసములోని యీక్రిందిపద్యములోఁ జెప్పుకొన్నాఁడు—

సీ. ఏరాజుమత్తాత భూరిసామ్రాజ్యలక్ష్మీధురీణభుజుండు సిద్ధనృపతి
యేనరాధిపుతాత నానార్థిసంతానసంతానశాఖి యనంతశౌరి

యేగుణాఢ్యునితండ్రిభోగ వైభవసూత్రసుత్రాముఁ డోబలక్షోణిభర్త
యేవిభుం డళియరామభూవిభు తిరుమలప్రభువేంకటేంద్రుల భాగినేయుఁ
డట్టితిమ్మభూవరుఁ డాజిహతతురుష్క-
రక్తశోణనదీకృతప్రబలసలిల
వితతకృష్ణానదీకుఁ డూర్జితుఁడు కోన
మాంబసుతుఁడు శ్రీరంగరాజానుజుండు.

మ. సకలశ్రీయుతకొండవీటినగరీసామ్రాజ్యధౌరేయతా
ధికతన్ మీఱుచు నొక్కనాఁ డచలభక్తిస్ఫూర్తి శ్రీవైష్ణవ
ప్రకరంబు న్భజియింపుచున్ హరికథాప్రస్తావనన్ దివ్యయో
గికథల్ వించుఁ దదర్థకావ్యరచనాకేళీసమాసక్తుఁడై.

ఉ. ఉన్నతి మీఱఁగాఁ బరమయోగివిలాసము పేరికావ్యము
ద్యన్నవభావబంధురరసాన్వయసన్నుతశబ్దశుద్ధిసం
పన్నత నిట్లు సిద్ధనరపాలునియోబళతిమ్మభూవరుం
డెన్నికఁ జేయఁ బూని మది నెంతయు సంతస మొందు ధన్యతన్.

పయిపద్యములనుబట్టి యీకవి కావ్యాలంకారసంగ్రహాదులకృతిభర్తలగునరసభూపాలాదులతోను, కృతికర్తలగు రామరాజభూషణాదులతోను, సమకాలికుఁ డగుట స్పష్టమగుచున్నది. కాఁబట్టి యీ తిమ్మరాజు ౧౫౭౦వ సంవత్సరము మొదలుకొల ౧౬౦౦వ సంవత్సరప్రాంతములవఱకును ప్రసిద్ధుఁ డయియుండవచ్చును. ఈకవి కవిత్వమునం దసమాన మయినప్రజ్ఞఁ గలవాఁడు; ఇతఁడు రచియించిన పరమయోగివిలాసమును నద్భుతములైన చరిత్రములను కలిగియున్నది. పరమయోగివిలాసములోని యీక్రిందిపద్యములవలన కవిత్వప్రౌఢిమ కొంత తేటపడవచ్చును—

ఉ. రెండవమౌనిపుంగవుఁడు భ్రేమసమాహ్వయు డైనప్రమ్మిదన్
నిండఁగఁ భక్తియన్ చమురు నించి హృదబ్జము వత్తిగాఁగ ను

ద్ధంకతరప్రబోధసముదంచితదీపము సర్వలోకనా
థుం డగుచక్రికిం బ్రియముతోడ సమర్పణ చేసె నయ్యెడన్. అ. ౧.

ఉ. ఇంతులఁగూడి చిట్టకము లిట్లొనరింపఁగ నించు కేసియున్
వింత తెలుంగు లేక ధరణీధరముంబలె నున్న యాదృఢ
స్వాంతునిఁ జూచి యాపతిమచక్కిలిగింతలుపోలెఁ గంటిచే
యెంతయు రిత్తపోయె మనయిందఱిచేష్టలు నంచు నవ్వుచున్. అ. ౨.

ఉ. దేవుఁడొ మానియో యని మదిం దలఁపోఁతలు నాకె కాని నిన్
వేవురు వేయిచందముల నిందయొనర్చెద రిష్టు మూఁగయున్
పావులనోరు నీయెడమపాదతలంబునఁ దన్నినట్లుగా.
నీవొక యింతయూఁవురని యేడ్వఁగదన్న కుమారరత్నమా. ఆ. ౨.

---

31. తాళ్ళపాక తిరువెంగళనాథుఁడు

ఇతఁడు నందవరీకబ్రాహ్మణుఁడు; ఆశ్వలాయనసూత్రుఁడు; భరద్వాజగోత్రుఁడు. ఈకవి పరమయోగివిలాస మనుపేర నాళ్వారుల చరిత్రమును ద్విపదకావ్యముగా నెనిమిదాశ్వాసములగ్రంథమును రచించెను. ఈగ్రంథరచనునుబట్టియే యితఁడు విష్ణుభక్తుఁడని స్పష్టమగుచున్నది. ఇతఁడు తాళ్లపాక యన్నయార్యుని మనుమఁడును, తిరుమలార్యునిపుత్రుఁడును అయినట్టు గ్రంథారంభమునందలి యీక్రిందివాక్యములవలనఁ దెలియవచ్చుచున్నది—

ద్వి. హరిసేవ కాశ్వలాయనసూత్ర నంద
వరవంసభవ భరద్వాజగోత్ర
పావనశ్రీతాళ్ళ పాకాన్నయార్య

ధీవిశారదసూను తిరుమలాచార్య
వినుతనందనుఁ దిరువేంగళనాథు.

ఈకవితాత యైనయన్నయార్యుఁడు కృష్ణదేవరాయని కాలములో నుండి కొన్ని యగ్రహారముల నందెను. కవి తనకు వేంకటాద్రిరాయలుం కుండలములు వేసినట్లు తనగ్రంథములోని యెనిమిదవయాశ్వాసాంతమునం దీవాక్యములచేఁ జెప్పుకొన్నాఁడు—

ద్వి. అతిలోకమతికి శేషాచలరాజ
పతికిఁ బరాముఖ్య భక్తసంతతికి
సంకీర్తనంబుగను శ్రీహరిభక్తనికర
పంకజార్యము తాళ్ళపాకాన్నయార్య
తనయ తిమ్మార్య నందన రత్నకుంభ
దనపమ శ్రీవేంకటాద్రీశ దత్త
మకరకుండలయుగ్మ మండితకర్ణ—

ఈకవికి మకరకుండలములు వేసిన వేంకటాద్రి వసుచరిత్రము కృతి నందిన తిరుమలదేవరాయని తమ్ముఁడని తోఁచుచున్నది. అట్లే యైన పక్షమునఁ గవి ౧౫౭౦ వ సంవత్సరప్రాంతములయం దుండెను. అట్లు గాక యతఁడు తిరుమలదేవరాయని కొడుకైన వేంకటాద్రి యైనపక్షమున, అతఁడు ౧౫౮౬వ సంవత్సరము మొదలుకొని ౧౬౧౪ వ సంవత్సరమువఱకును రాజ్యముచేసినందున కవియు నాకాలమువాఁడే యయి యుండవలెను. కవియొక్క కవిత్వరీతి తెలియుటకయి ద్వితీయాశ్వాసమునుండి కొంచెముభాగ ముదాహరించుచున్నాను—

ద్వి. భానుకోటిస్ఫూర్తిఁ బ్రహాసించుచున్న
మానసనందనుఁ గాంచి మది సంతసించి
పిల్లగా దోరి జాబిల్లి గాఁబోలుఁ
జల్లనివెన్నెలఁ జల్లుచున్నాఁడు;

అనుచు నబ్బాలు చెప్పార్వ కెంతయును
గనుఁగొని వేడుకకడలి నోలాడి
యానందబాష్పంబు లాననాబ్జంబు
పైనుండి దిగఁవార మై గరుపారఁ
జెన్నిధిఁ గన్నట్టిపేదచందమున
నున్నతోన్నతుఁడై నయోగినందనునిఁ
దనయులుఁ లేని యాదరమున నెత్తి
కొని కూర్మితోడ నక్కునఁ జేర్చి వేడ్కఁ
గొనకొని యావేత్రకుంజంబు వెడలి
తనవార లెల్ల నెంతయుఁ జోద్యపడఁగ
మునిపుత్రుఁగొని పురంబున కేగుదెంచి
తనయాలిచేతి కెంతయుఁ బ్రేమ నొసఁగె.

---

32. రాయసము వేంకటపతి

ఇతఁడాఱువేల నియోగి; అక్కనామాత్యుని కుమారుఁడు. ఈకవి తన వంశమువారిని వర్ణించుచు తమది వసిష్ఠగోత్ర మయినట్లీ క్రిందిపద్యమునందుఁజెప్పెను—

శా. శ్రీల న్మించి సమస్తధీకలనచేఁ జెన్నొందు నార్వేలవం
శాలంకారకరుల్ వసిష్ఠమునిగోత్రాంకుల్ బుధు ల్దీనర
క్షాలీలం బొగ డొంది రందు వెలసెన్ సన్మాని భానప్ప ది
గ్జాలోద్వేలవిశాలకీర్తుల సుధీసందోహమందారమై.

ఇతఁడు లక్ష్మీవిలాసమనెడి యైదాశ్వాసముల ప్రబంధమును రచించెను. "రసికజనహృదయంగమ సంగీతసాహిత్యకళాధౌరంధర్య" అని గద్యమునఁ జెప్పుకొన్నదానినిబట్టి యీకవి సాహిత్యమునందు మాత్రమేకాక సంగీతమునందును సమర్థుఁడైనట్టు కనఁబడుచున్నాఁడు.

ఇతఁడు శ్రీరంగరాయని యాస్థానమునందుండి యాతనివలన నగ్రహార రత్నాభరణాదులను బొందినట్టు లక్ష్మీవిలాసములోని యీక్రిందిపద్యములవలన విదితమగుచున్నది.—

మ. అలఘుప్రాభవభవ్యుఁ డాకుతపశాహామేయసైన్యంబు న
గల్గిక న్నాహులచేత గెల్చి బిరుదుల్ గైకొన్న శ్రీరంగరా
యలచిత్తం బిగురింప రాయసము వ్రాయం జాలి తౌనా సుధీ
తిలకా యక్కయమంత్రి వేంకటపతీ దీవ్యత్కళావాక్పతీ.

ఉ. వ్రాయుచు రాజ్యవైభవధురంధరభూతి దలిర్పఁ గీర్తిఖా
రేయసిరంగరాయమహీభృన్మణిరాయస మగ్రహారహై
మాయతరత్నభూషలు నృపార్ఘ్యులు వర్తనలియ్య నుబ్బుచున్
వేయననేమి రాయసము వేంకటమంత్రియనన్ యశస్వియై.

ఈశ్రీరంగరాయలు వసుచరిత్రను కృతినందిన తిరుమలదేవరాయని కుమారుఁడు. ఇతఁడు ౧౫౭౨వ సంవత్సరము మొదలుకొని ౧౫౮౫వ సంవత్సరము వఱకును రాజ్యముచేసినందున, కవియు నాకాలమునందే యుండినవాఁడు. లక్ష్మీవిలాసము సలక్షణమై మృదుమధురరచనను గలిగి యున్నది. కవితాశైలిఁ జూపుట కయి గ్రంథమునుండి రెండు పద్యముల నుదాహరించుచున్నాను.—

చ. తనదువిలాసహాసములఁ దాలిమి దూలఁగ రాగసాగరం
బునఁ బలువాఱు మారుదెస మున్గుచుఁ దేలుచు నిచ్చ మెచ్చఁగా
మునుకొని వారిత్రో భువనమోహిని యాకుహనావియచ్చరాం
గన పలికెం బికస్వరశికస్వరసుస్వరభాస్వరంబుగన్. ఆ. ౨.

మ. హరికిం బట్టపురాణి వీవ యని కళ్యాణైకవాక్యస్తుతుల్
పరఁగం బుణ్యనదీనదోదకములం బట్టాభిషేకంబు చే
సిరినా నుజ్జ్వలహేమకుంభములచేఁ జేత న్సుగంధాంబువుల్
హరిమధ్య ల్తగ నించి నించి జలకం బాడించి రబ్జాలయన్. ఆ. ౫.

33. తరిగొప్పుల మల్లన

ఈకవి చంద్రభానుచరిత్రమనెడి యైదాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; దత్తాత్రేయయోగీంద్రుని శిష్యుఁడు; దత్తనామాత్యుని తమ్ముఁడు. ఈతఁడు లాక్షణికకవి; కవిత్వము రసవంతముగా నుండును. ఈకవి వసుచరిత్రమును కృతినందిన తిరుమలదేవరాయని పుత్రుఁడగు వేంకటపతిరాయల కాలములో నుండినట్లు చంద్రభానుచరిత్రములోని యీక్రిందియెత్తుగీతములోఁ జెప్పినాఁడు—

సీ. ... ...

అనుచు బుధులెన్నవలయు రాజాధిరాజ
రాజపరమేశ సకలకర్ణాటకాంధ్ర
రాజ్యధౌరేయ తిరుమలరాజతనయ
చంద్రుఁ డగువేంకటపతిక్షితీంద్రమణికి.

ఈవేంకటపతిరాయలు ౧౫౮౫వ సంవత్సరము మొదలుకొని ౧౬౧౪ వ వఱకును రాజ్యముచేసినవాఁ డయినందున, కవియు నాకాలమునం దుండినవాఁడే. తాలికోట యుద్ధమయినతరువాత తండ్రియైన తిరుమలదేవరాయఁడు తనరాజధానిని విజయనగరమునుండి పెనుగొండకు మార్చుకొన్నట్లే కొమారుఁ డైన యీవేంకటపతిరాయఁడును తనరాజధానిని పెనుగొండనుండి చంద్రగిరికి మార్చుకొనెను. ఈకవి కవితారచనను సూచించెడుపద్యములను రెంటిమూటి నిందుఁ బొందుపఱుచుచున్నాను —

ఉ. అంత దిగంతదంతురలతాంతనిశాంతనితాంతకాంతవ
స్వంతికతాంతపాంథజనతాంతరసంతతకృంతనప్రథా

త్యంతసమంతవిస్ఫురదుదంత పరంతపకాంతిసంతతి
క్రాంతదురంతకుంతరతికాంతము పొల్చె వసంత మెంతయున్. ఆ. 3.

ఉ. త త్తఱపాటుతోడఁ గనుఁదమ్ములడాలు దిగంతరంబులన్
జి త్తరు నింప లేఁబయిఁటచేల కుచంబులపొంత జాఱ నా
బి త్తరి ప్రూనుపాటొదవఁ బిమ్మటితో నొకకొంతఁ గొంకి లోఁ
జి త్తము మట్టుపెట్టుకొని చేరి సహోదరుదండ నిల్వఁగన్. ఆ. ౪.

ఉ. ధరణితలేంద్రనందనవిధంబునఁ గనుంగొనఁ గోరి మున్ను కి
న్నరవరుఁ డిచ్చినట్టి భువనస్తుతమైనయదృశ్యవిద్య న
య్యిరువురు గు ప్తమూర్తు లయి యింకసహోదరమందిరంబునన్
దరలకయుండి రట్టియెడఁ దన్వియుఁ జేరఁగ వచ్చి యచ్చటన్.
ఆ. ౫.

---

34. చరిగొండ ధర్మన్న

ఈకవి నియోగిబ్రాహ్మణుఁడు; ఆప స్తంబసూత్రుఁడు; కౌండిన్య గోత్రుఁడు; తిమ్మయపుత్రుఁడు. ఇతఁడు చిత్రభారత మనెడియెనిమి దాశ్వాసములగ్రంథమును జేసి దాని నిమ్మలపల్లి పెద్దనామాత్యున కంకి తముచేసెను. చిత్రభారతమునందు కవి తన్నుఁగూర్చి యిట్లు చెప్పు కొన్నాఁడు—

సీ. కౌండిన్యగోత్రదుగ్ధసముద్రచంద్రు నాప స్తంబసూత్రశోభనగరిష్ఠు
సర్వవిద్యాభిజ్ఞుఁ జరిగొండతిమ్మనామాత్యాగ్రణికిమాదమకునుఁగూర్మి
నందను నతిశాంతు నారాయణధ్యానతత్వజ్ఞు శ్రీరంగధామసదృశ
భట్టపరాశరప్రభురంగగురుపాదసీరేజబంభరు నిర్మలాత్ము

ధర్మనాహ్వయు సత్కవితాధురీణు
దాంతు శతలేఖినీసురత్రాణబిరుద
కలితు నను వేడ్కఁ బిలిపించి కరుణమీఱఁ
దేనియలుగుల్క నిట్లని యానతిచ్చె.

మ. శతలేఖిన్యవధానపద్యరచనాసంధానసురత్రాణచి
హ్నితనామా చరికొండధర్మసుకవీ నీవాగ్విలాసంబు లా
శితికంఠోజ్జ్వలజూటకోటరకుటీశీతాంశు రేఖాసుధా
న్వితగంగాకనకాబ్జనిర్భరరసావిర్భూతమాధుర్యముల్.

గీ. కావున విచిత్రగతి నలంకారసరణి
మీఱ రసములు చిప్పిల మెప్పు లొసఁగఁ
దెనుఁగు గావింపు నాపేర ననఘసుకవి
ధీరు లరుదందఁగాఁ జిత్రభారతంబు.

పై పద్యములనుబట్టి వైష్ణవభక్తుఁడనియు, శతలేఖినీసురత్రాణబిరుదము గలవాఁడై శతలేఖిన్యవధానపద్యరచనయందు సమర్థుఁ డనియు, తెలియుచున్నది. కృతిపతియైన పెద్దనమంత్రి మాదనకుమారుఁడు; నియోగిబ్రాహ్మణుఁడు; కాశ్యపగోత్రుఁడు. అతఁడు మానభూనాథుని మంత్రియైన ట్లీక్రిందిపద్యములలోఁ జెప్పబడియున్నది—

సీ. అనువత్సరంబుబ్రాహ్మణులకు గోసహస్రము లిచ్చు నృగనరేశ్వరునిరీతి
కంధులనెనయుపాకాలచెర్వాదిగాఁదగు చెఱువులు నిల్పు సగరుకరణి
దీవ్యత్ప్రతాపుఁడై దిగ్విజయంబు గావించు మాంధాతృభూవిభునిలీల
దేవభూదేవతార్థిశ్రేణి కగ్రహారము లిచ్చుభార్గవరాముపగిది
నిందుశేఖరపాదారవిందయుగళ
భావనాపరుఁ డంగనాపంచబాణుఁ
డతులధైర్యాభిభూతహిమాచలుండు
మానభూనాథ చిత్తాబ్జభానుఁ డతఁడు.

శా. ఆరాజేంద్రశిఖావతంసనిజబాహాయుక్తవిశ్వంభరా
ధౌరేయుండు విరోధిమంత్రిముఖముద్రాదక్షుఁ డుద్యద్దయా
పారీణుండు పటీరతారకసుధాపాణింధమశ్రీయశో
హారుం డిమ్మలపల్లి మాదవిభు పెద్దామాత్యుఁ డుల్లాసిమై.

ఈమానభూనాథుఁ డెవ్వరో గ్రంథమువలన స్పష్టపడదుగాని యెనిమిదవయాశ్వాసాదియందలి యీక్రింది కృతిపతిసంబోధనపద్యము వలన నతఁడు శ్రీరంగరాయని రాజ్యకాలములోని యొక మండలేశ్వరుఁ డని యూహింపఁదగియున్నది—

క. శ్రీరంగరాజసేవా। పారంగతహృదయ! కమలభవ వంశపయః
పారావార సుధాకర! మారసమానావతార! మాదయపెద్దా!

మొదటి శ్రీరంగరాజు విజయనగరసంస్థానమును ౧౫౭౪వ సంవత్సరము మొదలుకొని ౧౫౮౫వ సంవత్సరము వఱకును పాలించెను. రెండవ శ్రీరంగరాజు ౧౬౧౪ వ సంవత్సరమునకు తరువాత రాజ్యమునకు వచ్చెను. ఈకవి యీ యిరువురు రాజులలో నొకరికాలమునం దుండినందున, పదునాఱవశతాబ్దముయొక్క యంతమునందో పదునేడవ శతాబ్దముయొక్క యాదియందో యుండియుండుటకు సందేహము లేదు. ఇదిగాక కవియొక్క కాలమును నిర్ణయించుటకు గ్రంథమునందే యింకొక యాధారము కనఁబడుచున్నది. కృతినాయకునివంశమును వర్ణించుచు కందాళ అప్పలాచార్యులు కృతిపతియొక్క తండ్రికిని పెదతండ్రికిని గురువైన ట్లీక్రిందిపద్యములోఁ జెప్పియున్నాఁడు—

శా. వందారువ్రజదోషమేఘపవనున్ వారాశిగంభీరు నా
నందాత్మున్ హరిపాదభక్తు నఖిలామ్నాయజ్ఞు విశ్వంభరా
మందారక్షితిజాతమున్ నిగమసన్మార్గప్రతిష్ఠాపరున్
గందాళప్పగురున్ వివేకనిధి లోకఖ్యాతు వర్ణించుచున్.

క. ఆదేశికపదకమలము
లాదరమున హృదయవీధి ననవరతంబున్
మోదమున నిలిపి శ్రీలల
నాధవునిఁ గొలుతురు నారనయు మాదనయున్.

ఈపద్యములనుబట్టి యీచిత్రభారతకృతిపతియు పాండురంగ మాహాత్మ్య కృతిపతి కాలములోనివాఁ డయిన శ్లోకగురుశిష్యత్వము వలనఁ దేటపడుచున్నందున, ఈధర్మకవి యించుమించుగా తెనాలిరామ కృష్ణునికాలపువాఁడే. కందాళ అప్పలాచార్యులుగారు చిత్రభారత కృతిపతితండ్రికి గురువై నందున, ధర్మకవి రామకృష్ణకవికిఁ గొన్నిసంవత్స రములుతరువాత నుండిన నుండవచ్చును. చిత్రభారతకవిత్వ మనర్గళ మయిన ధారకలదయి సలక్షణముగా నున్నది. ఈకవియొక్క చరిత్ర మునుగూర్చి యిప్పుడు చెప్పినదానికంటె నధిక మేమియుఁ దెలియ రానందున, చిత్రభారతమునుండి కొన్నిపద్యముల నుదాహరించుటతోనే తృప్తినొందవలసి యున్నది.

చ. అనిమిషనాధుఁ డమ్మునితపోనలకీలల నబ్ధి యింకినన్
దనకు విపత్తుఁడై యచట దాఁగినయాహిమవన్నగాత్మజున్
గినిసి విపక్షుఁ జేయ గమకించి ప్రచేతనునింట నిర్గమం
బని చెడువిల్లనంగ నపరాశ సురేశ్వరచాప మొప్పెడున్. ఆ. ౨.

సీ. ప్రవహించుశృంగారరసపూర మమ్ముని మేనికి జలకంబుగా నొనర్చి
తళతళత్కాంతిచేఁ దనరెడుదరహాసచంద్రికావితతి వస్త్రముగ నొసఁగి
మువ్వంపుదేనియల్ చివ్వన నిడువాక్యములు ప్రసూనములుగాఁ బూజచేసి
చొక్కంపునిడువాలుఁజూపుమెఱుంగులుపొసఁగనీరాజనంబులుగఁజేసి
యమృతరసములు చిప్పిలునధరబింబ
మదన నైవేద్యముగను నియ్యఁగఁ దలంచి

యడుగుఁదమ్ముల కెరఁగి నెయ్యంబుతోడ
రంభ యిట్లను సంభ్రమారంభ యగుచు—ఆ. ౩.

ఉ. హారము భారమై మణిగణాకరబంధురసౌధరంగసం
చారము దూరమై తనువుసంగతి నొప్పెడుచందనాదిశృం
గారము క్రూరమై చెలియకై వడి నెమ్మెయినర్చివట్టిరా
కీరము వైరమై నిగిడెఁ గేసరిమధ్యకు నొక్కపెట్టునన్. ఆ. ౪.

శా. ఏమేమీ హరి శూరుఁడంటి నిజమా నే యాజరాసంధుఁ డు
ద్దామప్రక్రియఁ జుట్టుకొన్నఁ బురమున్ దర్పంబు డించెన్ సమి
త్సీమం దా యవనుండు త్రోల గుహఁ జొచ్చెం జూడఁగా నిన్నఁగా
దా ముంజేతులకంకణంబులకు నద్దం బేల యక్రూరకా. ఆ. ౬.

మ. హరితో నీధరణీవరాగ్రణికినై యాయోధనక్రీడకున్
బురికొంటి న్వడి నేఁడు మేనులు తృణంబుల్గా విచారించి వీ
రరసోద్రిక్తమనస్కులై మెఱయువార ల్నిల్వఁ డాత్మన్ శరీ
రరతిం జెందినభూవరుల్ చనుఁడు పుత్రభ్రాతృసంయుక్తులై. ఆ. ౭.

---

35. సారంగు తమ్మయ్య

ఈప్రాంతములయందు సారంగువారు సాధారణముగా మాధ్వులుగా నున్నారు. ఈకవి తనవంశమును వర్ణించుచు,

ఉ. తమ్మనయంబుఁ బ్రోచుటకు ధారుణిబంధులు బంధుపారిజా
తమ్మన రామభక్తిఁ గలతార్కికు లెల్లను వీనిదార చి
త్తమ్మన జూపులం దనిసి ధార్మికు లీతని దెంతమంచివృ
త్తమ్మన నాగిరిప్రభునితమ్మన మించె నుదంచితస్థితిన్.

గీ. తమ్మమంత్రి గాంచెఁ దిమ్మాయియందు నం
దనుల శౌర్యసింహు నారసింహుఁ
జతురబుద్ధిచంద్రు సత్కళాగుణచంద్రు
గిరిచమూవరేంద్రుఁ గీర్తిసాంద్రు.

తనతాతను రామభక్తునిగాఁ జెప్పుటచేతను, ఆతనిభార్యను తిమ్మాయియని చెప్పుటచేతను కూడ నితఁడు మాధ్వవంశజుఁ డేమో యని యూహింపఁ దగియున్నను,

క. సారమతి యానృసింహుఁడు
వారాశిగభీరుఁ డతులవైభవమున గౌ
రీరమణి నీశుఁ డుంబలె
నారూఢాన్వయ వరించె నక్కమసాధ్విన్.

అని తనతల్లిదండ్రులను పార్వతీపరమేశ్వరులతోఁ బోల్చుట చేతను తనపూర్వుల కమాత్యాదిపదములను జేర్చుచు వచ్చుటచేతను కవి నియోగిబ్రాహ్మణుఁడని తోఁచుచున్నది. ఇతఁ డాపస్తంబ సూత్రుఁడు; భారద్వాజగోత్రుఁడు; నరసింహామంత్రిపుత్రుఁడు; సారంగు తమ్మయామాత్యపౌత్రుఁడు. ఈకవి వైజయంతీవిలాస మనునాలుగా శ్వాసముల పద్యకావ్యమును రచించెను. ఇందు విప్రనారాయణుఁ డనెడి యాళ్వారుచరిత్రము వర్ణింపఁబడినందున, దీనికి విప్రనారాయణ చరిత్రమనియు నామాంతరము గలదు. ఈవిప్రనారాయణునికే తొండర డిప్పొడియాళ్వా రని యఱవపేరు. ఈపుస్తకమునందలి కవిత్వము మనో హరముగానే యుండునుగాని యందందు కవిత్రయమువారి ప్రయోగ ములకు విరుద్ధములయిన ప్రయోగములు కానఁబడుచున్నవి. కథయు మిక్కిలి యింపుగా నుండును. విప్రనారాయణుఁడను వైష్ణవబ్రహ్మ చారి కావేరీతీరమునందు శ్రీరంగక్షేత్రమునందు వసించుచు మాధుకర

వృత్తిచే జీవించుచు భక్తితో శ్రీరంగనాయకునకు తులసిమాలల నర్పించుచు కాలము గడపుచుండెను.

శా. స్వాధ్యాయంబుఁ బఠించు సాంగకముగా సంధ్యాద్యనుష్ఠానముల్
విధ్యుక్తక్రియ నాచరించుఁ దటితో వేల్చుం బ్రపూతాత్ముఁడై
మధ్యేరంగశయానమూర్తి కిడు సమ్యద్భక్తిఁ దోమాలికల్
మధ్యాహ్నంబునఁ గుక్షి భిక్షఁ దనుపు న్మాధూకరప్రక్రియన్.

ఇట్లుండఁగా మధురవాణియు, దేవదేవియు నను వేశ్య లక్కచెలియం డ్రిద్ద ఱాతనిని దేవాలయములోఁ జూచి యాతనినిష్ఠ కద్భుతపడి భక్తితో మ్రొక్కఁగా నతఁడు వారిమ్రొక్కు గైకొనకపోయెను. అప్పుడు దేవదేవి యలిగి యప్పతో,

ఉ. మ్రొక్కిన నెవ్వరే మనఁడు; మో మటువెట్టుక చక్కఁబోయె; నీ
దిక్కును జూడఁడాయెఁ; నొకదీవనమాటయు నాడఁడాయె; వీఁ
డెక్కడి వైష్ణవుండు? మన మేటికి మ్రొక్కితిమమ్మ? యక్కటా!
నిక్కిని వెఱ్ఱిబుద్ధి యయి సిద్ధురపోయినవానికాళ్ళకున్.

అని యతని నిరాకరించి పలికెను. మధురవాణి చెల్లెలి నూరార్చుచు,

ఉ. చూచిన నేమి? నీవలను చూడకయుండిన నేమి? పూజ్యులం
జూచిన భక్తి మ్రొక్కుటయె శోభన; మీతఁడు బ్రాహ్మణుండు; ధా
త్రీచరులందు బ్రాహ్మణుఁడు దేవుఁడు; దేవుఁడు నీవు మ్రొక్కినన్
జూచునొ? పల్కునో? యటుల సుమ్మితఁడున్ సరసీరుహాననా!

అని శాంతచిత్తను జేసి యతనివైరాగ్యమును గొంత ప్రశంసించెను. అప్పు డప్పమాట లంగీకరింపక,

చ. ప్రకటజితేంద్రియుల్ ధరఁ బరాశరకౌశికులంతవారు స్త్రీ
లకు వశు, లంతకంటె మిగులన్ దృఢమా మగకచ్చు బిగ్గఁ గ
ట్టుకొనఁగ నీతఁ డెంత? శుకుఁడో? హనుమంతుఁడొ? భీష్ముఁడో? వినా
యకుఁడొ? తలంచుకో సరసిజాయతలోచన నమ్మనంబునన్.

క. ఈనిష్ఠ లింతతారస । మైనం దాఁ కానెసూ! సదాచారి యటం
టే, నబ్బినదాఁకనె యగు,। మానిజనవిడంబనములు మన మెఱుఁగనివే?

క. ఇటువంటయ్యాలె కారా
చిటుకు మనకయుండ సందెచీఁకటి వేళ౯
ఘటచేటీవిటులై యీ
కటకంబునఁ దిరుగువారు? కంజదళాక్షీ!

* * * * *

గీ. నిర్జితేంద్రియుండు సద్ధాపరుం డంచు
నప్ప సారెసారెఁ జెప్పెదీవు;
వీనిఁ బ్రతినచెఱిచి విటుఁజేసి తెచ్చినఁ
గలదె పందె మసినఁ గాంతపలికె.

* * * * *

క. నీ వీవైష్ణవు విటునిం । గావించిన, లంజెతనపుగడ నే విడుతున్;
గావింప లేకయుండిన । నీవు న్విడిచెదవె యనిన నెలఁతుక యొప్పె౯.

చెల్లెలాపీరవైష్ణవుని విటుఁ జేయవచ్చు ననియు, అప్ప యతని నట్లు చేసినయెడల తాను వేశ్యావృత్తిని విడిచెద ననియు వివాదపడిన మీఁదట దేవదేవి తా నా వైష్ణవబ్రహ్మచారిని విటునిజేసి యిఁటికిఁ దేలేకపోయినపక్షమునఁ దాను వేశ్యావృత్తిని విడిచెదనని పంతము పలికి తనరత్నాభరణములను, కస్తూరీతిలకమునుదీసి తులసిపూసలపేరులును తిరుమణినామములును వేసి సానివేషముఁ బాసి దాసరిసాని యయి తిన్నఁగా విప్రనారాయణుఁ డున్న యారామమునకుఁ బోయి యాతనికి నమస్కారము చేసి, హేయభాజనమయిన వేశ్యావృత్తిపై విరక్తి పొడమినట్టు నటించి,

గీ. * * హేయభాజన మెన్నిట నెన్నిచూడ
వేశ్యజన్మంబు జన్మమే విప్రవర్య

* * * *

ఉ. ఒక్కనిఁ బిల్వనంపి, మఱియొక్కనిచేతఁ బసిండిపట్టి, వే
ఱొక్కనియింటి కేగుచు, మఱొక్కని నానడుచక్కి నొక్కచోఁ
బొక్కికలంచి చూడ భ్రమఁబొంది విటుల్తెలియంగ లేరుగా
కెక్కడిసత్య మేడవల పెక్కడినేహము వారకాంతకున్?

గీ. అనఘ వేశ్యావిడంబవర్తనము లెన్న
నిసుకపాతఱ యీజ్ఞోలి యేల త్రవ్వ?
నప్పుడుపుఁగూటిపై నసహ్యత జనించి
నామనసు రోసినట్టిచందంబు వినుము.

* * * *

గీ. వారసతులైన ఋూసీమవారివలెనె
మోడిమూనిసి నైన నేగోడు నెఱుఁగ;
జిహ్వ నాల్గచ్చరాలు నేర్చినకతానఁ
బడుపుఁగూటికి మనసు గొల్పక నిశైతి.

అని వేశ్యావృత్తిని నిందించుచు తియ్యనిమాటలుచెప్పి యాతని చెంతఁ జేరి పరిచర్యచేయుచు దాస్యమిషమున మెల్లమెల్లఁగా నాతని యుల్లము కలంపఁ జొచ్చెను. ఇట్లు కొంతకాలము దాసురాలిపొత్తు గలుగునప్పటికి,

శా. ఆవిప్రోత్తమువజ్రపంజరనిభంబై నిశ్చలంబైన స
ద్భావం బంగనసాహచర్యగుణసంపర్కంబునన్ లోహమై,
గ్రావంబై, దృఢధారువై, తరుణవృక్షంబై ఫలప్రాయమై,
పూవై, తన్మకరందమై, కరఁగె బోఁబోఁ నీళ్ళకుం బల్చనై.

విప్రనారాయణుని వజ్రకఠినమైన హృదయము దినదినక్రమమునఁ గరఁగి నీటికంటెను బలుచనై దేవదేవిమనస్సులో నైక్యమయ్యెను. అంతట గురువే దాసురాలికి దాసుఁడయి పరిచర్యచేయ నపేక్షించి వేఁడు కొనఁగా మొట్టమొదట నాటక్కరివారాంగన,

గీ. నిడుదపట్టె తిరుమణియె వైష్ణవముగాని
మీఱ లాడుమాటతీరు చూడ
ననఘ నొసలు బత్తుఁడును నోరుత్తోడేల
టన్నరీతి తోఁచుచున్న దిపుడు.

అని నీతులు చెప్పియు,

క. ఓసతి భగవత్సేవకు । వాసి గణింపంగ భాగవతసేవయ; త
ద్దాసులకైంకర్యముఁ గృపఁ । జేసిన రంగేశ్వరునకుఁ జేయుటెసుమ్మీ.

అని యాతనిచేత బతిమాలించుకొని భాగవత కైంకర్యము నంగీకరించి, తుద కాతని నింటిబంటునుజేసి తనయింటికే గొనివచ్చి పందెము గెలిచెను. ఇట్లావైష్ణవవటుని విటునిజేసి తెచ్చి యిల్లు చేర్చిన తరువాత వేశ్యమాత తగులుకొని

క. నవమదనునైన మెచ్చవు; । తవిలితి వీయటువ; బోడితలకు వలచితో?
ధవళాక్షి। వీనిప్రేలుం । జెవులకు వలచితివొ? పిల్లసిగకు వలచితో?

అని కూఁతునకు బుద్ధిచెప్ప మొదలుపెట్టెను. తాను పట్టినప్రతిజ్ఞ నెఱవేఱినందున,

క. పెదయప్పయు నేనును బ
న్నిదమాడినపనికి నీతనిం దెచ్చితి నా
కొదవ యిఁటదీఱె నిఁక నీ
కొదవయె యున్నదనఁ దల్లి కూఁతునకనియెన్.

కూఁతురును తల్లిమాటలకు సంతోషించి క్రొత్తయల్లుని నిల్లు వెడలింపఁ దల్లిం బురికొల్పెను. ఆసన్నగైకొని వేశ్యమాత నూతన జామాతను జేరి,

సీ. నీపట్టెతిరుమణి నీతిరుచూర్ణంబు గణికకు వెండిబంగారులౌనె?
నీపుట్టగోచియు నీకావివేష్టముల్ వారకాంతకుఁ బట్టుచీరలౌనె?

నీముష్టిగూడయు నీతులసిసరులు వేశ్యకుఁ బండుగవేఁట లౌనె?
నీవేదశాస్త్రముల్ నీజపసంధ్యలు లంజెసానికిఁ బాఁజులగము లౌనె?
పెట్టనోపితివా యెప్పటట్టె యుండు
పెట్టలేకున్న విచ్చేయు పెండలకడ
మొదల రోయింతులకు నొక్కముడుపె కాక
నీసదాచార మేలయ్య! దాసరయ్య!

అని కసరి సాగనంపఁగా నాభాగవతోత్తముఁడు వేశ్యాగృహము విడిచి తనకుటీరముచేరి తనహృదయేశ్వరిని తలఁచి చింతిల్లుచు,

గీ. అతివ వైష్ణవమతరహస్యములఁ జాలఁ
బరిచయము గన్నయట్టిప్రసన్నురాలు
శూద్రసంపర్కమున కేల చొచ్చుమరల?
నిచ్చటికి నెంతప్రొద్దైన వచ్చుఁగాక.

అని ప్రియురాలి గుణసంపత్తిని బ్రశంసించి యడియాసపడుచు,

గీ. తనకు నేమిత్రవ్వి తలకెత్తిరమరు లీ
యుర్విమనుజు లేమి యొసఁగరైరి?
సంగివారసతుల నిర్మాతృకలఁ జేసి
పుడమి మాతృభూతముల సృజించె.

అని భూలోకమున వేశ్యలకు తల్లులను సృష్టించినందునకు బ్రహ్మదేవుని నిందించుచు పరితపింపఁజొచ్చెను. వేశ్యాసంపర్కరమువలన నెట్టి దృఢమనస్కులకును ననర్థములు వచ్చునని చూపుటకయి యింతవఱకుఁ గల్పింపఁబడినకథ నీతిబోధకముగానే యున్నదికాని తరువాతి కథ మాత్రము నీతిబాహ్యముగా నున్నది. భక్తుఁ డట్లు పరితపించుట చూచి భక్తజనార్తిహరుఁ డగు రంగేశుఁడు శిష్యరూపము ధరించి

క. సారమణిఖచిత మగు బం
గారపుఁదనగిన్నె వారకామిని కొసఁగన్

శ్రీరంగదివ్యధామవి
హారుఁడు స్వయమర్థచోరుఁడై కొనిపోయెన్.

తనగుడిలోని బంగారపుగిన్నెను గొనిపోయి తనగురు వగు విప్రనారాయణుఁడు పంపినట్లుగా వేశ్యమాతకు సమర్పించి తనభక్తునకు మరల వేశ్యతోడిపొత్తు సమకూర్చెనఁట!

చ. సతతము బ్రహ్మరుద్రసురసంయమిముఖ్యుల నాత్మమాయ మో
హితులుగఁ జేయుసామి వెలయింతిని మోహితఁ జేయలేక ప్రా
కృతజనునట్లు తాను దనగిన్నెనొసంగెను బంటుకోసమై
మతకరివేశ్యమాతవెడమాయ లజేయులు విష్ణుమాయకున్.

వేశ్యమాయలు విష్ణుమాయనుసహితము మించినవఁట! దేవాలయములోని స్వర్ణపాత్రము మాయమగుటకన్కొని జియ్యరు రాజభటుల కెఱిఁగించి, వారు వేశ్యయింట గిన్నెపట్టుకొని విప్రనారాయణుని చోరునిగా దండింపఁ జేయుటకయి కొనివచ్చినప్పు డాతని గుడివెడల నడవఁ బోవుచుండఁగా, శ్రీరంగేశుఁడు సాక్షాత్కరించి భక్తప్రమోదసంధానముకొఱకు తానే గిన్నెను వేశ్య కిచ్చితినని చెప్పి రాజభటులు పట్టుకొన్న స్వర్ణపాత్రమును మరల వేశ్యకిప్పించి భక్తునకు బ్రహ్మరథము పట్టించి జీవన్ముక్తి యొసంగెనఁట!

గీ. బ్రహ్మసభయెల్ల భక్తి నప్పరమవైష్ణ
వోత్తముని బ్రహ్మరథమున నునిచి పట్ట
ణమున నేగించి రధికసంభ్రమముమీఱ
జియ్య ముందఱికొమ్మునఁజేరి మోవ.

ఆహా! ఏమి యీబ్రాహ్మణోత్తముని భాగ్యము!

ఉ. చోరుఁ డనంగ రా దొరులసొమ్ములు ముచ్చిలినం బ్రపన్నునిన్
జారుఁ డనంగ రాదు పెలుచం బరకాంతలఁ గూడినన్, దురా

చారుఁ డనంగ రాద యనిశంబును వేశ్యలతో రమించినన్,
బోరున మీఱ రాతనికిఁ బూనఁడు బ్రహ్మరథంబు వైష్ణవుల్.

ఇటువంటి సిద్ధాంతములే మన దేశములో నీతికిని మతమునకును గూడ నమిత మైన చెఱుపును గలుగఁజేయుచున్నవి. నీతిని విడిచినమత మెప్పుడును దేవునికి ప్రీతికరము కానేరదు. వైజయంతీ విలాసములోని,

చ. ఇనసమతేజులౌనృపులనెల్ల మహమ్మదుశాహియేలు నీ
యెనుబదినాల్గుదుర్గముల నేలినయేలిక గోలకొండఁ ద
ద్ఘననగరస్థలిం గరణికం బొనరించుచుఁ దమ్మమంత్రి యా
జనపతి రమ్ము పొమ్మనఁ బ్రజ ల్జయవెట్ట గృహస్థు లౌననన్

అను పద్యమునుబట్టి యీతిమ్మకవి మహమ్మదుశాహి గోల కొండ నవాబుగా నుండిన ౧౫౮౧ వ సంవత్సరమునకును ౧౬౧౧ వ సంవత్సరమునకును మధ్యకాలములో వైజయంతీవిలాసమును రచి యించిన ట్లీవఱకే తెనాలి రామకృష్ణకవి చరిత్రమునందుఁ దెలుపఁబడి నది. పయిపద్యములవలననే కవియొక్క కవిత్వరీతి తేటపడునుగనుక వేఱుగఁ బద్యముల నుదాహరింపవలసిన యావశ్యకము లేదు.

---

36. తురగా రామకవి

ఈకవి యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు. ఇతఁడు నూఱు నూటయేఁబది సంవత్సరముల క్రిందట నుండినట్టును, అడిదము సూరకవి తోడి సమకాలికుఁ డయినట్టును ఎల్లవారును వాడుచున్నారు. వేముల వాడ భీమకవికిఁ దరువాతఁ దిట్టుకవిత్వమునం దీతనితో సమానుఁడు మఱియొకఁడు లేఁడు. భీమకవివలెనే యితఁ డాడినమాట యెల్ల నగుచు వచ్చెననియు, అందుచే నెల్లవారు నీతనికి జడియుచు వచ్చిరనియు,

చూపుట కనేక కథలు కల్పింపఁబడినవి. అందుఁ గొన్నిటి నిం దుదాహ రించుచున్నాను—

౧. ఈకవి లేటవరపు పోతురాజను క్షత్రియుని యింటికిఁ బోఁగా నతఁడు కవి కేమయిన నియ్యవలసివచ్చునని యింటనుండియు లేఁడని పించెనఁట అప్పుడు రామకవి,

క. కూటికిఁ గాకులు వెడలెడు। నేటావల మూఁకచేరి యేడువఁదొడఁగెన్
గాటికిఁ గట్టెలు చేరెను। లేటవరపు పోతరాజు లేఁడా లేఁడా?

అని ప్రశ్న వేయునప్పటికిఁ బోతురాజు మృతుఁడయ్యెనఁట! దహన నిమిత్తమయి బంధువు లింటినుండి శవమును గొనిపోవనున్నప్పు డాతనిభార్యవచ్చి కవికాళ్లమీఁదఁ బడి పతిభిక్ష పెట్టుమని వేఁడు కోఁగాఁ గరుణించి,

క. మేటి రఘురాముతమ్ముఁడు। పాటిగ సంజీవిచేత బ్రతికినరీతిఁ
గాటికిఁ బో నీ కేటికి। లేటవరపు పోతురాజ లెమ్మా రమ్మా.

అని కవి పిలువఁగానే మరల బ్రతికిలేచి పోతురాజు కట్టెకు మీఁదనుండి దిగివచ్చెనఁట!

౨. ఈకవి బావయైన తల్లాప్రగడ సూర్యప్రకాశరావు ఉంగు టూరను స్వగ్రామమునం దొక పెద్దయిల్లు కట్టించి, దానిని జూపుట కయి కవిని లోపలికిఁ దీసికొనిపోయి యొకగదిలో విడిచి బావమఱఁది పరియాచకమున కయి తాను మఱియొకచోట దాఁగియుండెనఁట. కవి యాయింటఁ దిరిగి తిరిగి దారి కనుఁగొనలేక విసిగి,

గీ. అంగణము లెన్ని కేళీగృహంబు లెన్ని
రోడుబిళ్లలయిండ్లెన్ని మేడ లెన్ని
కట్టెఁ గాకేమి సూర్యప్రకాశరాయఁ
డుంగుటూ రిండ్ల రాకాసు లుండవచ్చు.

అనఁగానే కావుకావని యఱచుచు నింట నేమూలఁజూచినను దామే యయి పట్టపగలు పిశాచములు సంచరింపఁ జొచ్చెనఁట.

3. పెద్దాపురపు సంస్థానాధీశ్వరులయిన శ్రీవత్సవాయి తిమ్మగజపతిమహారాజుగారి దర్శనార్థము పోయినప్పుడు రాజు కవికి దర్శనమియ్యకపోఁగాఁ గోపించి,

క. ఉద్దిర శ్రీభూనీళలు । ముద్దియ లాహారికిఁ గలరు మువురందులలోఁ
బెద్దమ్మ నాట్య మాడును । దిద్దిమ్మని వత్సవాయితిమ్మనియింటన్.

అని శపింపఁగానే రాజు రాజ్యమును బోఁగొట్టుకొని దరిద్రుఁ డయ్యెనఁట !

4. రామకవి యిల్లు కట్టించుకొనునప్పుడు దారిని బోవువారి నందఱిని బిలిచి తనగోడకిటుక లందింపని నియమించుచుండెనఁట! ఒకనాఁ డాదారిని అడిదము సూరకవి పోవుచున్నప్పు డాతనిని బిలిచి తక్కినవారి నడిగినట్లే యతనిని గొన్ని యిటుక లందిచ్చి పొమ్మని యడుగఁగా నతఁడు కోపించి రామకవి యని యెఱుఁగక,

"సూరకవితిట్టు కంసాలిసుత్తెపెట్టు"

అని పలికి పోఁ బోయెనఁట! రామకవి యామాట విని కన్ను లెఱ్ఱచేసి బిగ్గఱగా,

"రామకవిబొబ్బ పెద్దపిరంగిదెబ్బ"

అని కేకవేసెనఁట. అంతట సూరకవి యతఁడు రామకవి యని తెలిసికొని కొన్నియిటుక లందిచ్చి మఱి వెడలిపోయెనఁట!

ఇవి యన్నియుఁ గేవల కల్పితకథ లయి యుండవచ్చును. ఇటువంటి మహామహిమగలవాఁ డన్న వేములవాఁడభీమకవి కోమటిపేరఁ గృతిచేసి స్తుతించినట్లే యీరామకవియుఁ గంసాలిపేరఁ గృతిచేసి స్తుతులు చేసెను. ఈతఁడును నయ్యంకి బాలసరస్వతి యను మఱియొక కవియు గలిసి రచియించిన నాగరఖండమనెడి యైదాశ్వాసముల గ్రంథమొకటి

కానఁబడుచున్నది. ఈయిద్దఱుకవులును దమగ్రంథముయొక్క యాశ్వాసాంతగద్యము నీప్రకారముగా వ్రాసికొనియున్నారు—

"ఇది శ్రీమద్దుర్గాదక్షిణామూర్తివరప్రసాదాసాదితసారస్వత తురగా రామకవి వరాయ్యంకి బాలసరస్వతినామధేయ ప్రణీతంబైన శ్రీస్కాందంబను మహాపురాణమునందు సనత్కుమారసంహితను నాగరఖండము"

ఈనాగరఖండము ధవళేశ్వరపు మార్కండేయుఁడను స్వర్ణకారకులజుని కంకితము చేయఁబడినది. ఈవిశ్వకర్మవంశజుఁడు బెజవాడకుఁ బ్రభువుగా నుండిన ట్లీక్రిందిపద్యమువల్లఁ దెల్లమగుచున్నది—

మ. రజతాగం బొకరాజమౌళికి వినిర్మాణంబు గావించి యి
చ్చె జగంబెన్నఁగ విశ్వకర్మ మును దాఁ జిత్రంబు గా దిప్పు డీ
బెజవాడప్రభుఁ డియ్య నెంతయును గల్పించున్ ధరిత్రిన్ మహా
రజతస్వర్ణగృహంబు లెప్పుడు బుధవ్రాతంబు మోదింపఁగన్.

ఈధవళేశ్వరపుమార్కండుఁడు మహమ్మదు కుతుపషాహీ కాలములో నుండినట్లు నాగరఖండముయొక్క యవతారికలో నీక్రిందిపద్యమునఁ జెప్పఁబడిది—

క. అతఁడు ప్రసిద్ధి వహించెన్
క్షితినగరజపతుల గెల్చి చెలఁగి జయశ్రీ
సతిఁ జేకొనిన మహమ్మదు
కుతుపశహాచంద్రునకును గుడిభుజమనఁగన్.

దీనినిబట్టి చూడఁగాఁ గవి పదునాఱవశతాబ్దాంతమునందో పదునేడవశతాబ్దారంభమునందో యుండినట్టును, కవినిగూర్చి చెప్పెడికథలన్నియు నబద్ధము లయినట్టును కనఁబడుచున్నది. మహమ్మదుకుతుబుషాహి క్రీస్తుశకము ౧౫౮౧వ సంవత్సరము మొదలుకొని ౧౬౧౧ వ సంవత్సరమువఱకును గోలకొండనవాబుగానుండి రాజ్యము చేసెను.

కుతుబ్ షాహీ వంశము ౧౬౮౭వ సంవత్సరముతోనే నశించినది. నాగర ఖండమునందుఁ గొన్ని వ్యాకరణవిరుద్ధములగు ప్రయోగము లున్నను మొత్తముమీఁదఁ గవిత్వము హృద్యముగానే యున్నది. నాగరఖండము నుండి కొన్నిపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి —

ఉ. ప్రీతియొనర్ప నగ్గిరి నిరీక్షయొనర్ప దరీసరత్ప్రివం
తీతటజాతరూపధరణీరమణీయమణీసమగ్రమై
స్ఫీతసుధాంబుపూరసరసీరుహశీకరశీతలానిలా
న్వీతవిహారదేవతరుణీహరిణీకరిణీసమూహమై. ఆ. ౧.

ఉ. ఆదికి నాదికారణ మహర్పతికోటిసమానతేజుఁడు
త్పాదితసర్వలోకుఁడును బ్రహ్మమునై తగు విశ్వకర్మ నా
నాదివిజాళిలోన భువనంబుల నెల్లను హేతుకార్యక
ర్త్రాదులు తానయై తగు యథార్థమునుమ్ము మయూరవాహనా.
ఆ. ౨.

ఉ. ఇచ్చిన నైదుసాధనము లింపుగ నైదుగురున్ ధరించి యు
ద్యచ్చరిత ప్రశస్తయజనాదిరతుల్ శివతత్వబోధులై
యచ్చెరు వందఁ జేసిరి సమస్తజగంబులఁ దత్క్షణంబునన్
హెచ్చినయాత్మవర్తనల నెన్నికగాఁగ సరోజబాంధవా. ఆ. 3.

చ. కమలజుకంటె మున్ను శశిఖండశిఖామణికంటెమున్ను శ్రీ
రమణునికంటెమున్నుగ విరాజిలు బోధకుఁడై నయట్టిబ్ర
హ్మముగ మహానుభావుఁడని యాత్మవివేకముచే నెఱుంగుమా
యమితపువిశ్వకర్మను మహాత్ముని లోకకృతిప్రవీణునిన్. ఆ. ౪.

చ. కడఁకఁ గనుంగొనంగఁ దొలుకారుమెఱుంగులు గ్రుమ్మరింపఁగా
నడుగిడ గల్లుగల్లు మను హంసకనాదము హంసరావమున్
దడఁబడఁ బద్మరాగసముదాయముదాపున నేపు చూపి యె
ల్లెడలఁ బద్మాగరాగరుచు లీనఁగ వచ్చెను గౌరి వేడుకన్. ఆ. ౫.

37. చెన్నమరాజు చెన్నమరాజు

ఈకవి చారుచంద్రోదయ మనెడి యైదాశ్వాసముల ప్రబంధమును జేసెను. ఇతఁడు నందవరీక నియోగిబ్రాహ్మణుఁడు; ఆత్రేయగోత్రుఁడు; శేషయామాత్యపుత్రుఁడు. ఈకవి తాను పెమ్మసాని తిమ్మరాజునకాశ్రితుఁ డయినట్టు చెప్పి తిమ్మరాజు శ్రీరంగనాయనికిని వేంకటపతిరాయనికిని మంత్రియైన ట్లాకపద్యములో నీక్రిందివాక్యముతోఁ జెప్పియున్నాఁడు—

సీ. శ్రీరంగరాయ ధాత్రీతలాధ్యక్షు దక్షిణభుజాదండమై చెలఁగినాఁడు.

*　　*　　*　　*

రమణ వేంకటపతిరాయేంద్రుఁడు నుతింపఁ బటుకార్యదక్షుఁడై
ప్రబలినాఁడు

ఈకవి తనముత్తాతయైనలక్ష్మీపతి శ్రీనాథకవికి శిష్యుఁడై నట్లీక్రింది పద్యములలోఁ దెలిపియున్నాఁడు—

క. సన్నుత కవిత్వవిద్యా। భ్యున్నతి శ్రీనాథసుకవిపుంగవుకరుణన్
జెన్నమరున్ లక్ష్మీపతి। చెన్నమరాజప్రధానశేఖరుఁ డెలమిన్.

కవి శ్రీరంగరాయ వేంకటపతిరాయల కాలములోనున్నవాఁ డగుటచేత క్రీస్తుశకము ౧౫౭౪-౧౬౧౪ సంవత్సరములమధ్యను ప్రబలియున్నవాఁడు. కవియొక్క కవిత్వరీతి తెలియుటకై చారుచంద్రోదయములోనిపద్యముల రెంటిని నిం నుదాహరించుచున్నాను.

ఉ. ఎల్లి యవశ్యమున్ వనికి నేగి మహోగ్రతపం బొనర్చి సం
పల్లలనామనోహరుకృపన్ వరలాభము గాంచివత్తు నీ
యుల్లమునం బ్రమోదము సముల్లసితంబుగ నిందు నిల్వు మో
పల్లవపాణి యంచుఁ బ్రియభాషల భూవిభుఁ డాదరించినన్.

శా. తావు ల్గులెక్కడు మేనుతీవకుఁ బరీతాపంబు గావించునీ
జీవంజీవమనోజ్ఞమూర్తి యకటా శీతాంశువా కాదు శో
భావై రూప్యమునన్ జనభ్రమదమా భస్మానృతానంగతే
జోవైశ్వానరవిస్ఫులింగమునుమీ చూడన్ దిశానాయకా.

---

38. తెనాలి అన్నయ్య

ఈకవి సుదక్షిణాపరిణయమనెడి మైదాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు తెనాలిపురనివాసుఁడు; శైవాచార సంపన్నుఁడు; రామపండితపుత్రుఁడు.

శా. శ్రీలీలాహరినీలపీఠరుచిరశ్రీవత్ససంపన్నవ
క్షోలాలిత్యుఁడు వేంకటేశుఁడు కృపం గోనేటిరామక్షమా
పాలస్వామిసమస్తరాజ్యభరణోపాయాధికున్ హృద్యవి
ద్యాలోలున్ బులిజాలరామవిభుసోమామాత్యునిం బ్రోచుతన్.

సుదక్షిణాపరిణయములోని యీప్రథమపద్యమునుబట్టియే యీకావ్యము కోనేటి రామరాజు మంత్రియైన పులిజాల సోమామాత్యున కంకితము చేయఁబడినట్టు తెలిసికోవచ్చును. ఆసోమామాత్యుఁ డొకనాఁడు సభాసీనుఁడయి తన్ను రావించి కృతిఁ వేఁడిన ట్లీక్రిందిపద్యములోఁ గవి చెప్పుకొనియున్నాఁడు—

మ. కవులున్ గాణలు జాణలార్యులు హితుల్ కాంతాసమూహంబులు
త్సవలీలం దనుఁ గొల్వ నిండుకొలువై సత్కావ్యగోష్ఠీవిశే
షవినోదైకపరాయణత్వమును రాజ్యశ్రీవిహారంబుఁ బ్రా
జ్యవివేకంబుఁ దనర్ప రామవిభుసోమామాత్యుఁడత్యున్నతిన్.

గీ. నవ్యసుగుణాభిరామ తెనాలిరామ
పండితాగ్రణిసత్పుత్రు భవ్యమిత్రు
హారపదాంభోజసౌముఖ్యు నన్నపాఖ్యు
నన్నుఁ బిలిపించి యాదరోన్నతి వహించి.

చ. పలుకులకల్కి కప్పురపుఁబల్కులు చల్లినరీతిఁ బండువె
న్నెలతళుకుల్ విభుండు హావణించినమించున శంబరారి చెం
గలువలతూపుకోపుల ముఖాముఖిఁ జూపినయేపునం గృతుల్
పలుకఁగ నేర్తు పూర్వకవిపద్ధతి రామయయన్న సత్కవీ.

గీ. సరససాహిత్యసాహిత్యపరత నీవు
పరిఢవించుసుదక్షిణాపరిణయంబు
కీర్తి విలసిల్ల మాకు నంకితము సేయు
తేట యగువాగ్విలాసంబు కోటిసేయు.

ఇఁక దీనినిబట్టి కృతికర్తయొక్క కాలనిర్ణయము చేయవలసి యున్నది. కృతిపతియొక్క కాలము తెలియునేని, కవియొక్క కాలమును దెలియును. కృతినాథుని ప్రభువైన రామరాజుయొక్క వంశము గ్రంథమునం దీవిధమునఁ జెప్పఁబడినది—

గీ. చంద్రవంశాబ్ధిపూర్ణిమాచంద్రుఁ డారు
వీటి బుక్కయరామభూవిభునిసుతుఁడు
తిమ్మరాజేంద్రుఁ డన్వయదీపకుండు
కనియెఁ బినకొండభూపాలు ననఘశీలు.

చ. కులనిధి యానృపాలకుఁడు కోనమదేవి వరించి కాంచెఁ జే
కొలఁది నరాతులం దునుముకోనెటితిమ్మనరేంద్రు భూమిభృ
త్తిలకముఁ జిన్నతిమ్మవిభు ధీరసుధానిధి నప్పరాజు ని
ర్దళితవిరోధిభూవరకురంగుని రంగనృపావతంసమున్.

ఇట్లా ర్వేటి బుక్కరాజుకొడుకు రామరా జయినట్టును, రామరాజుకొడుకు తిమ్మరా జయినట్టును, తిమ్మరాజుకొడుకు చినకొండరా జయినట్టును, చినకొండరాజుకొడుకు కోనేటి తిమ్మరా జయినట్టును, చెప్పఁబడెను. ఈకోనేటి తిమ్మరాజు కొడుకయిన రామరాజువద్దనే కృతిపతియైన సోమామాత్యుఁడు మంత్రిగానుండెను. పయిని జెప్పిన వంశావళినిబట్టి విచారింపఁగాఁ గృష్ణదేవరాయని యల్లుఁ డయిన రామరాజున కీరామరాజు పెదతండ్రికొడుకునకు మనుమఁ డయినట్టు స్పష్టమగుచున్నది. అళియ రామరాజు ౧౫౬౫వ సంవత్సరమువఱకును జీవించి యాకాలముననే మనుమల నెత్తినవాఁ డగుటచేత నాతని పెదతండ్రికొడుకును నప్పటికే యెదిగినమనుమలు గలవాఁ డయి యుండవచ్చును. కాఁబట్టి విమర్శించిచూడఁగా సుదక్షిణాపరిణయకృతీశ్వరుని ప్రభువు పదిసంవత్సరము లీవలావలగా ౧౫౭౦ వ సంవత్సరప్రాంతములయం దుండెనని తేలుచున్నది. ఇదియే కవికాలము. ఈకవికిఁ గందాళ శ్రీరంగాచార్యులు గురు వయిన ట్లీక్రిందిపద్యమువలనఁ దెలియవచ్చుచున్నది—

క. కందాళ భావనార్యుల । నందను శ్రీరంగగురుని నతబుధరక్షా
మందారంబు నుతింతును । మందారమరందబిందుమధురారభటిన్.

సుదక్షిణాపరిణయకవిత్వము సలక్షణమయి కర్ణరసాయనముగా నున్నది! కవిత్వమాధుర్యము తేటపడుటకయి కొన్నిపద్యము లిందుదాహరింపఁబడుచున్నవి—

చ. పలుకఁగ నేర్చుచిత్రములు పాడఁగ నేర్చినపుష్పవల్లికల్
మెలఁగఁగ నేర్చురత్నములు మెల్లన నవ్వఁగ నేర్చుచంచలల్
నిలుకడ నేర్చువెన్నెలలు నెయ్యముతియ్యము నేర్చుపైఁడిబొం
దళుకు లనం జెలంగుదురు తామరసేక్షణ లప్పురంబునన్. ఆ. ౧.

చ. ఏనొకవింతయే రఘుకులేశ్వర యాదిమవిష్ణుమూర్తివై
యీనిఖిలావనీతలము నేలెడు నిన్ గనుఁగొంటి నేఁడుగా
నానియమంబు నాజపము నాతపమున్ ఫలియించె భక్తిస
న్మానధురంధరత్వమున నా జననాయక యిట్లుపల్కుటల్. ఆ. ౧.

ఉ. విప్రకులావతంస వినవే యనుమానము మాని పుత్రకుం
డప్రతిమప్రభావనిధి యన్వయదీపకుఁ డుద్భవిల్లు న
వ్యప్రచురాంగకాంతిభరయా వనలక్ష్మియు నిన్నుఁ జెందు ని
త్యప్రమదంబు చేకుఱుమహౌషధ మొక్కటి నీకు నిచ్చెదన్. ఆ.౨.

చ. నృపవర నిన్ను మీఁ దెఱుఁగ నేరక వేఁడితిఁ గాక చంచలా
చపలము లైన రాజ్యసుఖసంపదలన్ మదినమ్మి కీర్తియుం
గృపయు వివేకమున్ నయముఁ గేవలధర్మపరత్వమున్ సదా
కపటమతిం దొఱంగుమహికాంతుల కేడ పరోపకారముల్. ఆ-౨

మ. జలకంబుం దగఁ గూర్చి నెన్నుదుట రక్షాకాంక్షఁ బాదాంగుళీ
స్థలమృత్స్నాతిలకంబు దీర్చి రుచులం దట్టాడువజ్రంపుటు
య్యాలపైఁ బొత్తుల నుంచి యోకుధరకన్యాధీశదివ్యాంశపే
శలమూర్తీ నిదురింపవే యను సుతుం జంద్రాస్య జోకొట్టుచున్. ఆ-౩

ఉ. వాడినమోముతోడఁ గయివాలినచూపులతోడ దీనతం
గూడినపల్కుతోడ నెఱిగూడనిగందపుఁబూఁతతోడఁ గీ
లూడినయందెతోడ బిగియూడినతాలిమితోడ వచ్చెఁ గ
గ్గాడియుఁబోలెఁ గామగవిగాడిగలయ్య నృపాలుపీటికిన్. ఆ. 3.

ఉ. విన్నఁదనం బిదేమి నెఱిపీడినచిత్త మిదేమి వేయుక్రా
ల్గన్నులవాఁ డిదేమి శరఘాతల నెత్తు రిదేమి వెంబడిం
గిన్నరసిద్ధకింపురుషఖేచరవీరులురా రిదేమి మీ
యున్నవిధం బిదేమి నిఖిలోన్నతశాసన పాకశాసనా. ఆ. 3.

ఉ. భానుమతీకుమారకుఁడు పల్కు మహేంద్రునిఁ దేవ యె
వ్వానికి గెల్వ నోటమియు వచ్చు నొకానొక వేళ దీనికై
దీనత యింత యేటికి మదీయభుజాగ్ర ధనుర్విముక్తనా
నాసిశితాస్త్రపాతముల నాకుల నే నవలీలఁ గాచెదన్. ఆ. ౩.

ఉ. మేలు బళీ చతుర్ముఖుఁడు మిక్కిలి నేర్పరి యెట్టులన్న నీ
బాలిక మాదిలీపనరపాలకు దేవిగ నిశ్చయించె ల
క్ష్మీలలనేశునాభిసరసీరుహమందిరవర్తి యైనవాఁ
డేల యొనర్చు వేదజడుఁ డేనియు నీడుకురానిచేఁతలన్. ఆ. ౪.

చ. కుడిచెవిఁ జేరి మంచుమలకూరిమియల్లుఁడు తారకంబు మున్
నొడువునఁ గూర్చి పల్కుచు వినోదము సల్పఁగ సేదదేఱి చె
ట్టుపెఁచినఁ జేటెఁడన్ని నిటలాంబకమూర్తులు కానవచ్చు నా
మడ పరుగెత్తె నేల యఘమర్దనసిద్ధయు మైనకాళికన్. ఆ. ౪.

శా. ఏణాంకోపలసౌధవీథికలపై నింపొంది చిత్రంబుగా
వీణల్ కేల ధరించి రాగలహరీతస్ఫూర్తిమైఁ జొక్కుచున్
జాణల్ సాధ్యకుమారు లాగమవిధానస్నిగ్ధగానంబులన్
ద్రాణ ల్మీఱఁగ నాలపించెదరు చిత్తప్రీతిమై వింటిరే. ఆ. ౫.

మ. కమలామందమరందబిందుకణికాకల్లోలడోలావిలో
లమరాళీగరుదంచలత్పవనబాలక్రీడనప్రోల్లస
త్కుముదామోదిపరాగవాసితదిశాకుంభీంద్రగండస్థలీ
సముదాయం బలరున్ నృపాల యొకకాసారంబు దూరంబునన్. ఆ-౬

39. సవరము చిననారాయణనాయకుఁడు

ఈకవి కువలయాశ్వచరిత్ర మనెడి యైదాశ్వాసముల ప్రబంధమును రచియించి, తిమ్మనరపాలపుత్త్రుఁడయిన నారాయణభూపాలుని కంకితము చేసెను. ఈకవి తాను క్షత్రియుఁడ ననియు, రాయభూపాలుని పుత్త్రుఁడ ననియు చెప్పికొనియున్నాఁడు. ఈతఁడు రాయభూపాలునకుఁ దిరుమలాంబవలన గలిగిన ట్లీక్రిందిపద్యమువలన దెలియవచ్చుచున్నది.—

మ. అతఁ డాతిమ్మమయందు వేంకటనృపాధ్యక్షున్ రిపుచ్ఛేదనో
ద్ధతు రంగాధిపుఁ దిర్మలాంబవలనన్ ధర్మాత్ము గోపాలు ను
న్నతకీర్తిం జిననారనాఖ్యుఁ దగు నన్నున్ గస్తురీంద్రున్ సమం
చితకీర్తిన్ రఘునాథుఁ దిమ్మవిభుఁ గాంచెన్ సజ్జనాధారులన్.

కృతిపతి యైన నారాయణభూపాలుఁడు శ్రీరంగరాజ వేంకటపతి రాయలకు సహాయుఁ డయియుండినట్లు చెప్పఁబడినందున గవి ౧౫౮౦ వ సంవత్సరప్రాంతములయం దుండినట్లు కానవచ్చుచున్నాఁడు. మఱియు గృతినాయకుఁడైన నారనరనాథుఁడు మట్ల యనంతభూపాలుని కాలములో నుండిన ట్లీక్రింది పద్యమునందుఁ జెప్పబడినందునను, కవి పదునాఱవశతాబ్దాంతమునం దుండినట్లు నిర్ధారణము చేయవచ్చును.—

సీ. తనమాటి చెంజికా తంజాపురీ మధురాధినాథులకు నెయ్యంబు నెఱపఁ
దనసిరి గోలకొండనరేంద్రముఖధరాధవపద్మబంధు లౌదల వహింపఁ
దనకీర్తిమట్లనంతనృపాలముఖ్యగోత్రామరేంద్రులు కొనియాడికొనఁగఁ
దనదానగుణము గోదావరీతీరభూనిర్జరేశ్వరులు వర్ణించుకొనఁగ
వెల్గయు వేదండగండనిర్గళదవర్గ
ళమదధారాధునీనాథకుముదబంధు
కార్యకృద్డిండిమారావధుర్యసైన్యుఁ
డతఁడు ప్రభుమాత్రుఁడే నారనాధి నేత.

ఈకవి కాశ్యపగోత్రుఁడు; శఠగోపతాపసేంద్ర శిష్యుఁడు. ఈతని కవిత్వము సలక్షణమయి వినసొంపుగా నుండును. ఈతని కువలయాశ్వ చరిత్రములోని కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. మిటిమిటి యెండవేఁడి బలిమిం దెలిదమ్ముల తేకుసందులం
జిటుకుమనంగఁ గూడి నివసించి తదగ్రమరంద మప్పట
ప్పటికిని మూతిముట్టి పయిపై నది చల్లఁబడంగ బ్రొద్దుగ్రుం
కుట గని యంతటం బొదలుఁ గోడెమిటారపుఁదేఁటు లత్తఱిన్. ఆ. ౧

చ. మునివనితల్ శచీముఖతమోనిభవేణులకుం బతివ్రతా
జనతతిఁ దెల్పుచోఁ బరవిచారముగాఁగను వేల్పుటొజ్జజ
వ్వని మొగ మవ్వలం జొనుప వారలు నవ్వుదు రామె సిగ్గుపెం
పునఁ దలవంచుఁ జందురుఁడు పొంగఁగ నయ్యయియోగవేళలన్. ఆ. ౨

చ. తలఁపున నెంత మోహపరితాపముగల్గిన దాఁచుకొందురో
యలయిక లేక నీకరణి నంగడిఁబెట్టుదురో వధూటికల్
పలుకవు నిన్నువంటికులభామలఁ గానమె వారి కాత్మనా
థులపయి బాళిలేదొ తమిదొట్టినపట్టున మట్టుపెట్టరో. ఆ. ౩.

మ. అతఁ డచ్చోఁ దురగంబు నెక్కి హృదయాబ్జాపూర్ణమోదార్ణవాం
చితుఁడై వారల వెన్క నుంచుకొని యక్షీణైక్యమాణిక్యదీ
ధితిజాతామృతరుగ్వితాన మగుదై తేయాధినాథాయత
యతనం బల్లన నిర్గమించి పురబాహ్యక్షోణి కేతెంచుచున్. ఆ. ౪.

చ. వెలుపలిరచ్చ నొక్కయెడ వేలుపుసానికి వన్నెకాఁడికిన్
గలహము కల్గెనేని గుఱికానితనంబున వచ్చి రోసపుం
బలుకుల వాదు రేఁచి సిగపట్లకు డగ్గఱఁజేసి క్రొవ్వునం
గలకల నవ్వువాఁడు చవుకట్లసియాడ రుమాలువీడఁగన్. ఆ. ౫.

40. దామెర వేంకటపతి

ఈకవి పద్మనాయకకులజుఁడైన శూద్రుఁడు; ఈపద్మనాయక కులమువారి నీదేశమునందు వెలమలని వాడుదురు. ఈకవితాత సంస్థానాధిపతియై వేంకటగిరిసంస్థానాధిపతులైన వెలుగోటివారితో సంబంధబాంధవ్యములను జేసినవాఁడు. ఈకవి తన మేనత్తయైన వేంకటాంబను వెలుగోటి యాచమనాయనికుమారుఁ డయిన కస్తురిరంగనాయని కిచ్చినట్టును ఆదంపతులకు యాచమనాయఁడు పుత్రుఁడైనట్టును చెప్పి యాతనిని తనబహుళాశ్వచరిత్రమునం దిట్లు వర్ణించినాఁడు-

సీ. ఉత్తరమల్లూరియొద్ద దావలుపాపవిభుని గొట్టిననాఁటివిజయకలన
చెంగలుపట్టు వీక్షించి లగ్గలుపట్టి యాక్రమించిననాఁటివిక్రమంబు
పాళెముకోటవెల్పల నాజి యతిరాజు జరగజేసిననాఁటిశౌర్యపటిమ
తిరుమలఁజేరి ధాత్రినిమన్నె రాజులఁ బాఱఁదోలిననాఁటిబాహుబలము
మున్నెతోపూర జగ్గరాణ్ముఖుల నొంచి
మధురదొరఁ జెంజిమన్నీని మద మడంచి
తిరుచనాపల్లిదొరఁ దోలుతేజము గల
మేటి వెలుగోటియాచని సాటిగలరె!

కవియొక్క మేనత్తభర్తయైన కస్తురి రంగనాయఁడు గోలకొండ మహామ్మదీయులను కొండవీడు వినుకొండ ప్రభువులను గెలిచి, ౧౫౭౯వ సంవత్సరమునందు చంద్రగిరియందున్న విజయనగరపు రాజులపక్షమున యుద్ధముచేసి వారిశత్రుల నోడించెను. కవియొక్క మేనత్తకొడుకయిన యాచనాయఁడు చెంగల్పట్టుమండలములోని మధురాంతకముతో వాసముచేసి విజయనగరాధిపతియైన వేంకటపతిరాయలవలన పెరమాడి సీమను బహుమానమందెను; అంతేకాక యితఁడు ౧౬౦౧వ సంవత్సరమునందు శత్రువులతో యుద్ధముచేసి వారి నోడించెను; ఆవఱకు పరులపాలైన వేంకటగిరిని మరల స్వాధీనము చేసికొనెను. కవియు

సీతనికాలములోనివాఁడే యయినందున నతఁడు పదునాఱవశతాబ్దాంతమునందును పదునేడవశతాబ్దాదియందును నుండినవాఁడు. ఈకవి తాను బహుళాశ్వచరిత్రమును జేయకమునుపు కృష్ణకథ నొకదానిని జేసి దానిని రామభద్రున కంకితము చేసినట్లు బహుళాశ్వచరిత్రములో రామభద్రుఁడు తన్నుద్దేశించినట్లీ క్రిందిపద్యములోఁ జెప్పుకొన్నాఁడు.

ఉ. దామెర వేంకటప్రభువతంసుని వేంకటభూప మాపయిన్
శ్రీమెఱయంగఁ గృష్ణకథ చెప్పితి విప్పుడు నీదుతండ్రియున్
మామకభర్తుఁ డాతనికి మాకును భేదము లేదుగాన నీ
వామహిమాఢ్యు పేర బహుళాశ్వచరిత్రము చెప్పు మెప్పుగన్.

ఈబహుళాశ్వచరిత్ర మయిదాశ్వాసములు కలదయి రసవంతమయి సలక్షణమయినదిగా నున్నది. అందుండి రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. తటములఁ జుట్టుకొన్న బిగిదన్నినక్రొన్ననపొన్నగున్నలన్
జిటపొటమంచు మంచుజడి చిల్కెడిగొజ్జఁగికిన్ రసాలపున్
జిటిపొటిత్రేనెవానలకుఁ జేసినకాల్వలతేటనీటిప
ల్లటముల నిక్కు నక్కొలఁకులచ్చికి మెచ్చిరి వచ్చినెచ్చెలుల్.

ఆ. ౨.

ఉ. రామునిఁ జూచి కామునిశరంబుల గాసిలి చేష్టదక్కి కాం
తామణి యుండెనోర్తు రఘునందనపాదరజంబుచేత మున్
గోమలిరేఖ జాతి కొడఁగూడెనో లేదో యటంచు నెంచి లీ
లామహితాంగ మొందఁగ శిలామయరూపము దాల్చెనో యనన్.

ఆ. ౪.

41. చిత్రకవి పెద్దన్న

ఇతఁ డాఱువేలనియోగి; భారద్వాజగోత్రుఁడు. ఇతఁడు పదు నాఱవశతాబ్దాంతమునం దుండినవాఁడు. ఇతని కొడుకైన యనంతకవి యిందుమతీపరిణయమును, మనుమఁడైన రమణకవి సాంబవిలాసమును రచించిరి. ఇతఁడు సర్వలక్షణసారసంగ్రహమను నామాంతరముగల లక్షణసారసంగ్రహమును రచించినట్లు,

సీ.   *   *   *   లక్షణసారసంగ్ర
    హం బొనరించి యుద్యత్కీర్తిఁ బ్రఖ్యాతుఁడగు చిత్రకవి పెద్దనార్య
    సుతుఁడ"

అని యాతనికుమారుఁడైన యనంతకవియు,

సీ. "సర్వలక్షణసారసంగ్రహం బొనరించి తనరె మాతాత పెద్దనకవీంద్రుఁ"

డని యాతని పౌత్రుఁడైన రమణకవియు చెప్పియున్నారు. ఈలక్షణసారసంగ్రహము నాకు లభింపకపోయినను, యప్పకవీయమున గ్రహింపఁబడిన రెండుపద్యముల నిచ్చట ఉదాహరించుచున్నాను—

గీ. మహిమ నెక్కటివళులన మరవఅలలు
    రహిని దమతమ కయి యేఁగు రమ్యచరిత
    వనధిగంభీర సద్గుణవాసయనఁగ
    భంజితాసురసముదాయ యాంజనేయ.

చ. ఎఱుఁగవుగాక భోగముల కెల్లను నెచ్చెలి జవ్వనంబ యి
    త్తఱి నుడివోవకుండ నుచితంబుగ జక్కవదోయిఁ బోలి క్రి
    క్కిఱిసినచిన్నిచన్నుఁగవ యింపెసలారఁగ నాదుచిత్త మన్
    వఱలుసరోవరంబున నవారణఁ గేళి యొనర్చు కోమలీ.

42. యాదవామాత్యకవి

ఇతఁడు చంద్రహాసవిలాస మను కావ్యమును పూర్వోత్తరభాగములుగా రచియించెను. ఈతనికాల మెప్పుడో తెలియలేదుగాని లక్షణశిరోమణి యనునామాంతరము గలయాదవామాత్యఛందములోని,

సీ. రగణము శంఖమనఁగనొప్పమూడవజామునఁబవడపుఁజాయకుజుఁడు
గ్రహముగావేల్పు హిరణ్యరేతుఁడుగాఁగఁ దార కృత్తికగాఁగఁ
దగరురాశి
గా మేషయోనిగా గణమాసురంబుగా శృంగారరసముగా స్థిరఫలంబు
భయముగా గౌశికభద్రగోత్రమున నెజ్జసిమేన నృపకులమున జనించె
బంధుజనగేయ సత్కవిభాగధేయ
రమ్యచారిత్ర వేంకటరాజపౌత్ర
వర్ణితోదార బాపన్నవరకుమార
మదనసౌందర్య యాదవామాత్యవర్య.

ఇత్యాదిపద్యములనేకములు సులక్షణసారములో నుదాహరింపఁబడి యుండుటచేత నీయాదవామాత్యకవి ౧౬౨౦ వ సంవత్సరమునకుఁ బూర్వపువాఁడనిమాత్రము నిశ్చయముగాఁ జెప్పవచ్చును. ఇష్టదైవముత న్నుద్దేశించి పలికినట్లుగాఁ గవి చంద్రహాసవిలాసములో నిట్లు వ్రాసికొనియున్నాఁడు—

సీ. ఇట్లనిపల్కె మహీసురాన్వయమున వాసి కెక్కినభరద్వాజమౌని
గోత్రసంభవులందుఁగొమరొప్పభానప్పవంశంబునకుఁజాలవన్నె తెచ్చి
నట్టి తిమ్మకవీంద్రు నన్వయంబునఁబుట్టి మహి మించు నారపమంత్రి
పుత్రుఁ
డగు వేంకటాద్రి కిల్లాలైన కొండాంబతనయుఁ డాబాపన్నతమ్ములైన

ఘనులు కృష్ణయ వీరనల్ కవియోఁ జెన్న
మాంబ యనుసాధ్వియందు ని న్నాదరమునఁ
దలఁప రామన్న నీపినతండ్రికొడుకు
మదనసౌందర్య యాదవామాత్యవర్య.

ఈకవియొక్క వినయశౌశీల్యాదులు కవిస్తుతి మొదలైన యీ కృత్యాదిపద్యములవలనఁ దేటపడుచున్నవి—

సీ. వాల్మీకి ముఖ్యగీర్వాణకవీంద్రులకును నన్నపార్యాది తెలుఁగుకవుల
కును శుభంబు లొసంగు మని భద్రగిరిరామభద్రునిఁ గడుభక్తిఁ బ్రస్తుతించి
కవివరుల్నామీఁదఁ గలదయచేతను గబ్బంబు చెప్పఁగాఁగలనటంచు
భావించి నే నీప్రబంధంబు గల్పింపఁదలఁచినాఁడను సతతంబు నియతి
శారదాదేవిఁ బ్రార్థించి గారవమున
వరముఁ గైకొని మీ రంప వచ్చి వాణి
నాదుజిహ్వాంచలంబునఁ బాదుకొనిన
ధైర్యమునఁ బల్కెదను గవివర్యులార।

గీ. పెంపుమీఱ వేల్పుఁ బెద్దలు పూజింప। బాలుఁడట్లు చేయుభంగిగాను
మీరు కవితఁ జెప్పినారని నే నిట్టి। చర్య గొనరితిఁ గవివర్యులార!

క. కదళీపాకముగాఁ బెం। పొదవఁగ నీ ప్రబంధ మొగి రచియింతున్
గొదవలు మిక్కిలి గల్గిన। సదయతఁ దగ దిద్దవలయు సత్కవివర్యుల్.

గీ. లేకయుండినఁ జదు వేమిలేనివాని
కిట్టి సద్బుద్ధి జనియించు టెందుఁ గలదు
నిచ్చనిచ్చలు మీ రంప వచ్చి వాణి
పొసఁగ నన్నిట్లు పలికింపఁ బూనెఁ గాక.

గీ. నన్నుఁ బోలినకవి గల్గకున్న ధాత్రి
వరకవీంద్రులన్ వే రెట్లు వచ్చు మీకుఁ

చిన్న లుండుటచేఁగాదె పెద్ద లనుచుఁ
దెలియఁగలుగుట యార్యులు తెలిసికొనుట.

ఉ. నేరిచి యాదుపుత్రులును నేరక పల్కినసందనుండునన్
గూరిమితల్లి కొక్కటియగుం దలపోయఁగ వాగ్వధూటికిన్
మీరలు నేను నొక్కటియె మీరువచించినకావ్యమండలిం
జేరి మదీయవాక్యములఁ జేరకపోవునె యంచు నెంచుచున్.

పై పద్యములలో భద్రాద్రిరాముని బేర్కొని యుండుటవలనఁ గవి గోదావరీమండలములోనివాఁడని తేటపడుచున్నది. ఈకవి యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; భారద్వాజగోత్రుఁడు; వేంకటరాజ పౌత్రుఁడు; బాపనార్యపుత్రుఁడు. ఇతఁడు కృతు లందుట మొదలైన వానినిబట్టి చూడఁగా నితఁ డున్నతపదమునం దుండినట్లు తోఁచు చున్నది. ఇతఁడు గ్రంథాదిని కేవలాంధ్రపద్యము చెప్పక నన్నయాదుల వలె సంస్కృతభాషతో నీక్రిందిపద్యమును వేసియున్నాఁడు—

చ. శ్రితజనరక్షణాయ సరసీరుహపత్రవిలోచనాయ వి
శ్రుతశుభకీర్తనాయ రవిసూనుసఖాయ మఖావనాయ సం
తతసుగుణాకరాయ వసుధాతనయాపరితోషణాయ నే
విత్పవనాత్మజాయ రఘువీరవరాయ నమోనమోనమః.

ఈతనికవిత్వము కవి తాను జెప్పుకొనినట్లు కదళీపాకముతోఁ దేనె లొలుకుముద్దుపలుకులతో వినువారి చెవులకుఁ జవులు గొలుపుచు హృదయంగమముగానున్నది. కవనభంగిని జూపుటకయి చంద్రహాసవిలాసములోని నాలుగుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. బంగరుమేడలం జలువపందిరులన్ నెలరాతితిన్నెలన్
రంగగుమేలిమిద్దియల రచ్చలవంతుల నాట్యశాలలన్
సింగపుమోము లొక్కయెడఁ జెక్కినచక్కనిగోపురంబులన్
బొంగుచు నప్పురీవరము పొల్పు వహించు ధరాతలంబునన్. పూర్వభా.

ఉ. తప్పక చూచు నుగ్గనుచు దాదులు పల్కినఁ గేరినవ్వు మా
యప్పగొ నిద్ర పొమ్మనిన నల్లన బారలు చాఁచుఁ జేతులం
జప్పటిచేయఁ జేరి విను సారెకు నత్తయటంచుఁ బల్కు నా
యొప్పులబాలుఁ డంత ముద మొందుచుఁ దల్లియుఁ దండ్రి కన్గొనన్.
పూర్వ.

చ. కమలదళాక్ష నీవు నసుఁగానక తక్కిన నిప్పు డిందిరా
రమణికి విన్నవింతు ననురాగము తండ్రికిఁ గల్గకున్నచోఁ
దమి నిజపుత్రులందు దయ తల్లికిఁ గల్గక పోవ దంతటం
గమల మదర్థమె కినుక గాంచును నీపయిఁ జాటిచెప్పితిన్—పూర్వ.

ఉ. లేమలమీఁది ప్రేమ లవలేశము వీడవు దానధర్మముల్
నేమముతో నొనర్పఁగను లెక్క యొనర్పవు శ్రీరమాధవున్
బ్రేమముతోఁ దలంపఁగను రేయిఁబగళ్ళను బూన వూరకే
పామర మొందు చీ వితరపద్ధతి గోరెదవేమి కామమా.—ఉత్తరభా.

---

43. కంసాలి రుద్రయ్య

కృష్ణదేవరాయనికాలములోఁ గంసాలిభద్రయ్యయని యొకస్వర్ణకారకవి యుండెననియు, అతఁడు రాయలయాస్థానమునందుండిన యష్టదిగ్గజములలో నొకఁడనియు కొందఱు వ్రాసియున్నారు. అతఁడు సరసమనోరంజనమను ప్రబంధము రచియించెనని కొందఱు చెప్పుదురుగాని యాగ్రంథ మిప్పు డెక్కడను గానరాకున్నది. సరసజనమనోరంజనములోనిదని బ్రౌన్‌దొరవారి ఛందస్సునం దీక్రిందిపద్య ముదాహరింపఁబడి యున్నది—

ఉ. ఎన్నఁడు నేరిచెన్ బెళుకు లీచెలికన్నులు, కారుకమ్ముల
న్నన్న కురుల్, పిఱుందు బటువై పటువై ఖరిగైకొనెంగదే,

మొన్నఁగదమ్మ పిన్న మొనమొల్కలు నేఁ డివె ముద్దులాడిలేఁ
జన్నులు గొప్పలై పయింటసందున దాఁగుడుమూఁత లాడెడున్.

ఈపద్యమును రాయలవారియాస్థానములోఁ జదివినప్పుడు రామకృష్ణకవి మొల్కయని ప్రయోగించినందు కాక్షేపించెననియు, అందుమీఁద నొకరు దానికి సమాధానముగా నీక్రిందిపద్యమును జెప్పిరనియు, బ్రౌన్ దొరవారు సంపాదించి చెన్నపురిరాజధానిలోని ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమున కిచ్చిన చాటుపద్యమంజరిలో వ్రాయఁబడియున్నది—

చ. వెలగకు వెల్గ యంచు సరవిన్ జలికొండ నృసింహుఁ డాడఁగా,
మొలకకు మొల్క యంచుఁ గవిముఖ్యుఁడు భద్రయపల్కదోసమా?
బళిబళి! మంచిమాటయె ప్రబంధమునా జలరాశి దానిలో
పల నెరసు ల్గణింతురె యపారములౌ మణు లెల్ల నుండఁగన్?

చలికొండనృసింహుఁడు వెలగకు వెల్గ యనియు, అగసాలె రుద్రయ యనునాతఁడు మొలకకు మొల్క యనియు, అపప్రయోగములు చేసిరని యప్పకవి చెప్పి యీపయిపద్యము వినకొండలో గుంటుపల్లెభాస్కరునివద్దఁ గందుకూరి రుద్రయ్యగారు చెప్పినట్లీక్రిందిపద్యములలో వ్రాసియున్నాఁడు—

చ. కొలఁదిగ మున్ను చెప్పెఁ జలికొండ నృసింహుఁడు వెల్గయంచు నీ
వల నగసాల రుద్రపనువాఁడును మొల్క లటంచుఁ గూరిచెం
దెలియక కొంద ఱిట్లు వికృతిం బదమధ్యమునన్ లకార రే
ఫలతలపై యకారమును బాపుదు రార్యులు నవ్వునట్లుగన్.

వ. ఇందులకు వినకొండలో గుంటుపల్లె భాస్కరయ్యగారి సమ్ముఖమందుఁ గందుకూరి రుద్రయ్యగారు చెప్పినపద్యము.

చ. వెలగకు వెల్గ యంచు సరవిం జలికొండ నృసింహుఁ డాడఁగా
మొలకకు మొల్క యంచుఁ గవిముఖ్యుఁ డురుద్రయ పల్క దోసమే?

బళిబళి మంచిమాటయె ప్రబంధమునా జలరాశి యందులో
పల నెరసు ల్గ్రహింతురె యపారములౌ మణు లెల్ల నుండఁగన్.

అప్పకవీయము. పంచమాశ్వాసము.

దీనినిబట్టి చూడఁగా సరసమనోరంజనములోని దన్న పయి పద్యము భద్రయ చెప్పినదిగాక రుద్రయ చెప్పినదనియు, అతఁడు కృష్ణదేవరాయలకాలములోఁగాక గుంటుపల్లె భాస్కరునికాలములో నుండె ననియు స్పష్టబడుచున్నది. కాఁబట్టి కృష్ణదేవరాయనికాలములో భద్రయ్య యనుకవి యున్నాఁడో లేఁడో యనికూడ సంశయింపవలసి యున్నది. పయినిజెప్పిన లిఖితపుస్తకభాండాగారములోని చాటుపద్యములలోనే సరసమనోరంజనములోని దయినట్లుగా నీక్రిందిపద్యముకూడ వ్రాయఁబడియున్నది—

సీ. కొప్పునఁ జుట్టినగొజ్జంగివిరిదండ నటనతో వీఁపున నాట్యమాడ,
బటువైనముత్యాలపాపట విరజాజితీరుగాఁ జెంపల దిమురుగట్ట,
ధగధగద్ధగలచేఁ దనరుకెంపునతాళి సరులతోఁ బెనఁగొని చౌకళింప,
గబ్బిగుబ్బలమీఁది కస్తూరిచెమటల గరఁగివాసనలచేఁ గ్రమ్ముకొనఁగ.
వింతమాటలతేటల విభునిఁ గూడి
కాంత రతికేళి మిక్కిలి గారవింప
దప్పి తీఱంగ నధరామృతము లొసంగి
చంద్రబింబాస్య మగలాగు సలిపె నపుడు.

ఇతఁడు నిరంకుశోపాఖ్యాన మను నాలుగాశ్వాసముల ప్రబంధమును సుగ్రీవవిజయమనుయక్షగానమును రచియించెను. ఈగ్రంథమును బట్టి చూడఁగాఁ గృష్ణదేవరాయనికాలములో భద్రయ్య యనుకవి లేఁడనియు భద్రయ్య యనఁబడినకవి యప్పకవి చెప్పినట్లుగా గుంటుపల్లి భాస్కరునికాలములోనుండిన రుద్రయ్యయేయనియు స్పష్టపడుచున్నది. ఈగుంటుపల్లి భాస్కరుఁడు పదునేడవశతాబ్దారంభమునం దుండిన

వాఁడు. సునందాపరిణయమునందు గుంటుపల్లి భాస్కరుఁ డిట్లు వర్ణింపఁబడి యున్నాఁడు.

సీ. స్థిరతరప్రజ్ఞావిశేషాతినిష్ఠాతిరస్కృతనిర్జరరాజ్గురుండు
అసదృశమంత్రయోగాతివశీకృతసన్మంత్రదేవతాసముదయుండు
నిరుపమశ్రుతిశిరూక్తనిర్ణీతసన్మార్గవర్ణోచితాచారవర్తనుండు
ఘనతరపాణినీగ్రంథార్థశోధనసందర్భసన్మనీషాన్వితుండు
సత్యభామాహరిశ్చంద్రజనవిభుండు
సలలితౌదార్యనిర్జితజలధరుండు
ఎల్లమాంబాసతీప్రాణవల్లభుండు
గుంటుపల్లి భాస్కరుఁడు సత్కులవరుండు.

దీనినిబట్టి కంసాలిరుద్రయకవి కృష్ణదేవరాయనికాలములో లేక, ౧౬౨౦వ సంవత్సరప్రాంతములయం దుండినట్లు తేలుచున్నది. నిరంకుశోపాఖ్యానములోని,

శా. శ్రీభాషారమణావిమృష్టపదరాజీవోత్తమాంగాగ్రుఁ డా
ర్యాభామాపరిణీత సర్వజగదారాధ్యుండు మూర్తిత్రయీ
శోభాకందము కందుకూరినగరీసోమేశ్వరస్వామి లో
కాభీష్టంబు లొసంగుఁగాతఁ గరుణాయత్తైకచిత్తంబునన్.

ఈ మొదటిపద్యమునుబట్టి కవి తనగ్రంథమును కందుకూరి సోమేశ్వరస్వామి కంకితముచేసినట్లు తెలిసికోవచ్చును. ఈకావ్యమును శివుని కంకితము చేసెదనని కవి యీక్రిందిపద్యములో మనోహరముగాఁ జెప్పి యున్నాఁడు—

ఉ. కోమలవర్ణధామయును గోవిదసంస్తవనీయలక్షణ
స్తోమపదాభిరామయును శుంభదలంకరణప్రసాధన
స్థేమయు సప్రతర్క్యగుణసీమయు నైనమదీయకావ్యక
న్యామణి నిచ్చి మంచుమలయల్లుని నల్లునిగా నొనర్చెదన్.

కవి కంసాలియగుటచే ననేకు లాక్షేపించుచువచ్చుటచేతఁ గాఁ బోలు రుద్రయ్య తనకృతిలో నీపద్యమును వేసియున్నాఁడు—

ఉ. శుష్కవచశ్శిలాతతుల సూటిగఁ జూచి మహాకవిశ్రవ
శ్శష్కులికావిదారణము సల్పఁగ నేర్చినజాణలార మీ
ముష్కరతానమున్నతికి మ్రొక్కెద నాయెడఁ జూపరాకుఁడీ
దుష్కవులార సాధుజనదూషణభూషణభూషితాత్ములై.

ఈకవి స్వర్ణకారుఁడు; పెదలింగన్న పుత్రుఁడు. ఈకవిత్వము మృదుమధురపదభూష్టయిమై సలక్షణమయి వినువారివీనులకు విందు చేయునదిగా నున్నది. ఈతని కవిత్వరచనాకౌశలమును జూపుటకయి నిరంకుశోపాఖ్యానములోని కొన్నిపద్యముల నిందుఁ బొందుపఱచు చున్నాను—

ఉ. అడిగిన నేమి దోషమె సమస్తధరాతలనాథ కోరికల్
నుడువుల నున్నవే మనసులోపలఁగాక రతిప్రసంగముల్
తడవనియంతమాత్రనె విదారితమోహుఁడె యావిచారముల్
విడువుము వాగ్విశేషమును విశ్రుతవేషము మోక్షహేతువే. ఆ. ౧.

ఉ. ఏమిజపంబు చేసి రొకొ యేమితపం బొనరించి రొక్కొ యే
మేమిసపర్య లార్యతతి కిచ్చిరొకో జగదేకపూజ్యులై
తాముఁ దనూజరత్నములుఁ దామరతంపరలై చెలంగువా
రీమహిఁ దొల్లి యంచు నుతియించి మహీసురుఁ డాత్మలోపలన్.
ఆ. ౧.

ఉ. అత్తవు సర్వలక్షణసమగ్రగుణాఢ్యవు నన్నుఁ దిట్టనున్
మొత్తనెకాని నీకొడుకుమూఢత మానుప వేలవాఁడు గో
త్రొత్తులమారియై గృహముత్రొక్కక యొక్కకదానిఁ బూనికన్
గుత్తకు నంచు నుంచుకొని కోకలు రూకలు జోక నియ్యఁగన్.
ఆ. ౨.

44. ఎలకూచి బాలసరస్వతి

ఈకవి పదునేడవశతాబ్దారంభమునం దుండి మహామహోపాధ్యాయబిరుదము నందినవాఁడయి పాండిత్యముచేత మిక్కిలి ప్రసిద్ధి కెక్కినవాఁడు.

క. ఆలోకనుతుఁడు మున్నటి
కీలకసమ నామతంగగిరికడ నొసఁగెన్
బాలసరస్వతులకు నతఁ
డోలిఁ దెనుఁగుటీక వాని కొప్పుగఁ జేసెన్.

అని యప్పకవి చెప్పుటనుబట్టి యితఁ డాంధ్రశబ్దచింతామణికి తెనుఁగుటీకను ౧౬౦౦ వ సంవత్సరమునందు చేసినట్టు కనఁబడుచున్నది. ఈకవి కట్టకడపట రచించిన రాఘవయాదవపాండవీయమునందు తాను చేసినగ్రంథములనుగూర్చియు తన్నుఁగూర్చియు నిట్లు చెప్పుకొనుచున్నాఁడు.

సీ. కవిసమీహితరంగకౌముదీనామనాటకవిధానప్రతిష్ఠాఘనుండ
సారసారస్యసచ్చంద్రికాపరిణయప్రముఖశతాగ్రప్రబంధకర్త
నంధ్రచింతామణివ్యాఖ్యానభాషావివరణాదిబహుతంత్రకరణచణుఁడ
వేదశాస్త్రపురాణవివిధసంగీతసాహిత్యాదివిద్యోపబృంహణుండ
ననఘకౌండిన్యగోత్రుఁడ హరిపదాబ్జ
భక్తిశీలుఁడ నెలకూచి భైరవార్య
కృష్ణదేవతనూజుఁడ నేవిచిత్ర
కావ్య మొక్కటి నిర్మింపఁగాఁ దొడంగి.

శా. మెండై నట్టి విచిత్రవైఖరులచే మీఁదౌమహాకావ్యముల్
దండిం బొల్చియె చేసి రాదిములు తత్కావ్యాధికశ్లాఘమై

నుండ గ్రాఘవకృష్ణపాండవకథాయు క్తప్రబంధంబు వా
క్పాండిత్యం బలరార శ్లేషరచనై కప్రౌఢి నేఁ జేసెదన్.

ఇతఁడు రచియించిన యీరాఘవయాదవపాండవీయము మూఁడర్థములు గలది. ఇట్లు త్ర్యర్థికావ్యములను రచియించినవారిలో నితఁడే మొదటివాఁడు! పూర్వోదాహృతమయినసీసపద్యమువలన నితఁడు రంగకౌముదియనునాటకమును, చంద్రికాపరిణయమను ప్రబంధమును, ఆంధ్రశబ్దచింతామణివ్యాఖ్యానము, భాషావివరణము నను లక్షణగ్రంథములను రాఘవయాదవపాండవీయ మనుత్ర్యర్థికావ్యమును రచియించినట్లు కనఁబడుచున్నది. ఇతఁ డాంధ్రశబ్దచింతామణికి వ్యాఖ్యానముమాత్రమే చేసినట్లు పయిపద్యమునఁ జెప్పబడినను మూలగ్రంథమునుగూడ నితఁడే చేసి గౌరవముకలుగుటకయి దానికర్తృత్వమును నన్నయభట్టున కారోపణచేసినట్లనేక హేతువులచేత నిశ్చయింపఁ దగియున్నది. ఈవిషయమునుగూర్చి నన్నయభట్టారకునిచరిత్రమునందుఁ గొంత వివరముగా వ్రాసియున్నాను. నన్నయభట్టునకు శబ్దశాసనుఁ డన్నబిరు దీశబ్దశాస్త్రనిర్మాణముచేతఁ గలిగినదని కొందఱు భ్రమపడుచున్నారుగాని యది సరికాదు. నన్నయభట్టారకుఁడు మొట్టమొదట లక్షణప్రాయమైన సత్కావ్యమును రచియించి యితరకవులకు కావ్యరచనకు దారిచూపుటచేత నాతనికి వాగనుశాసనుఁ డన్నబిరుదము వచ్చినదేకాని వ్యాకరణనిర్మాణముచేత రాలేదు.

"భట్టార బాలసరస్వతికవి మహోపాధ్యాయుఁడు" తానురచియించిన చంద్రికాపరిణయమును పత్తియాల జమీన్‌దారుఁడగు జూపల్లి వేంకటాద్రి కంకితముచేసెను. ఈపత్తియాల బెజవాడకు రెండామడల దూరమున నిజామురాష్ట్రములో నున్నది. ఈకవిని కాకునూర్యప్పకవి చూచియుండవచ్చును. చంద్రికాపరిణయము కృతినాయకునితండ్రి.

జూపల్లి లింగన్న. ఈలింగన్నను రంగరాజు లింగన్నగూఢముగాఁ దిట్టిన యీక్రిందిచాటుపద్యము నప్పకవి యుదాహరించియున్నాఁడు—

క. రవికోటిధామమయమై
నవకాంచనయుతము నగుచు నానాఁటి కొగిన్
భువిని శివాన్వితమగు నీ
భవనము జూపల్లి లింగ భవగుణసంగా.

చంద్రికాపరిణయమునందు కాశిరాజకూఁతురైన చంద్రికను భీముఁడు వివాహమాడినకథ వర్ణింపఁబడినది. ఇతఁడు పదునేడవశతాబ్దారంభమునుండి ౧౬౩౦-౪౦ సంవత్సరములవఱకును పండితకవిగా పేరుపడియుండవచ్చును. ఈతని రెండు తెలుఁగుకావ్యములనుండియు రెండేసిపద్యముల నిం దుదాహరించుచున్నాను.

చంద్రికాపరిణయము

ఉ. జంగమరోహణాద్రిసదృశంబులు తత్పురిఁ గల్గుభద్రపా
రంగవరేణ్యము ల్పయికి హస్తము లించుకసాఁచి యవ్వియ
ద్గాంగఝురంబు పీల్చి మరి తద్వమధుప్రకరంబు దప్పిపా
యంగ నొసంగు రంగుగ నిజాఖ్యవహించినచాతకాలికిన్.

ఉ. అంతట రుక్మబాహువసుధాధిపనందన యొక్కనాఁడు శు
ద్ధాంతగృహంబు వెల్వడి విహారగతిం జనుదెంచె నెచ్చెలుల్
చెంతలఁ గొల్వఁ జంచదళిశింజితరంజితకుంజమంజుల
ప్రాంతగిళత్ఫలానవరతాంగజఘోటికిఁ బుష్పవాటికిన్.

రాఘవ యాదవ పాండవీయము

ఉ. బోరన సద్గుణంగడచి పో నెడయీక చరించుమంచు న
వ్వారిధిగాఁ దలంచి పురివాడలకుం దిగఁబోలు గేహసం
స్కారకధూపధూమములిమంబున మబ్బు దివాంతవేళల
న్వారవధూటు లందుఁ గలవాలు మెఱుంగులువో గణింపఁగన్.

ఉ. పాయక భ్రాతృయుక్తుఁడయి భవ్యసుఖంబులు గాంచుచు న్జగ
ద్గేయయశుం డతండు పరఁగె న్మహిదైవతపూజలం బితృ
వ్యాయతతర్పణక్రియల నంచితధర్మము విస్తరిల్లఁగాఁ
జేయుచు భూరినిష్ఠ మహిషీయుతుఁడై మమఖాళి సల్పుచున్.

45. ముద్దరాజు రామన్న

ఇతఁడు కవిసంజీవని యనులక్షణగ్రంథమును రచించెను; మఱియు నితఁడు రాఘవపాండవీయమునకు వ్యాఖ్యానమునుగూడఁ జేసెను. ఇతఁడు నందవరీకనియోగిబ్రాహ్మణుఁడు; గణపయామాత్యుని కుమారుఁడు. ఇతఁడు పదునాఱవశతాబ్దాంతమునం దున్నట్లు తెలియవచ్చుచున్నది. ఈకవి "శ్రీమన్మదనగోపాలకృపాకటాక్ష సంప్రాప్తసారసారస్వత సంపదానంద" యని గద్యమునందు వ్రాసికొన్నను లక్షణగ్రంథమును బట్టి కవిత్వపటుత్వనిర్ణయము చేయబూనుట యుచితముకాదు. ఇతఁడించుమించుగా లింగముగుంట తిమ్మకవితోడి సమకాలికుఁ డగుటచే నీకవిలోకసంజీవనినుండి యతఁడు తనసులక్షణసారములో నేమియుఁ గైకొనలేదు.

46. చిత్రకవి అనంతకవి

ఇతఁడాఱువేలనియోగి. రామరాజభూషణుఁ డొనర్చిన హరిశ్చంద్రనలోపాఖ్యానమునకు వ్యాఖ్యానము చేయుటయేకాక యీకవి యిందుమతీపరిణయ మనుప్రబంధమును రచించెను. ఇతఁడు ౧౬౨౦వ సంవత్సరప్రాంతములందు కవిగాఁ బ్రసిద్ధికెక్కినాఁడు. ఇతఁడు చిత్రకవి పెద్దనార్యునిపుత్రుఁడు; భారద్వాజగోత్రుఁడు. ఈకవి తన్నుగూర్చి తన హరిశ్చంద్రనలోపాఖ్యానములో నిట్లు చెప్పకొన్నాఁడు.

సీ. శ్రీహనుమద్వర శ్రీలబ్ధసుకవిత్వచతురుండ లక్షణసారసంగ్ర
హం బొనరించి యుద్వ్యత్కీర్తిఁ బ్రఖ్యాతుఁ డగుచిత్రకవి పెద్దనార్య
సుతుఁడ
విష్ణుచిత్తీయాదివివిధకావ్యార్థముల్ తెలిసి వక్కాణించుధీరసుతుఁడ
గండికోటాఖ్యదుర్గస్థలాద్యక్షుఁడై పృథివి వంతుకు నెక్కు పెమ్మసాని
చిన్నతిమ్మక్షమాపాలశేఖరుండు
గారవింపఁగ బహుమానగౌరవముగ
మనినధన్యుండ సభ్యసమ్మతగుణైక
గరిమ వెలయు ననంతాఖ్య కవివరుండ.

ఈవ్యాఖ్యానమును చేయునప్పటికిఁ గవి యిందుమతీపరిణయ మును జేయలేదు. ఇతఁడు చేసిన యిందుమతీపరిణయము నాకు లభించి నదికాదు. కవికాశ్రయుఁడైన పెమ్మసాని చినతిమ్మరాజుయొక్కయన్న పెదతిమ్మరాజు ౧౬౧౪వ సంవత్సరమువఱకును రాజ్యముచేసిన వేంకట పతిరాయనికి మంత్రిగా నుండెను.

47. లింగముగుంట రామకవి

ఈకవి చతుర్వాటికామాహాత్మ్య మను నైదాశ్వాసములస్థల పురాణమును రచియించెను. ఇతఁడు మత్స్యపురాణము వామనపురా ణము మొదలయిన గ్రంథములను రచియించిన ట్లీతని తమ్ముఁడైన లింగ ముగుంట తిమ్మకవి తనసులక్షణసారమందు వ్రాసెను గాని యాగ్రంథ ములు నాకు లభింపలేదు. ఈకవి తెనాలిరామకృష్ణునితోడి సమకాలి కుఁడు. రామకృష్ణుని గురువైన భట్టరు చిక్కాచార్యులు తనకు గురు వైనట్లు కవి యీపద్యమున వ్రాసికొని యున్నాఁడు—

క. గురురాయభట్టభద్రుని
నరిహరు శ్రీరంగనాయకాంశభవున్ భ
ట్టరు చిక్కాచార్యుని మ
ద్గురుఁ దలఁచుచు నడుగులకు నతు ల్గావింతున్.

ఇతఁడు ౧౬౨౦ - ౩౦ సంవత్సరప్రాంతములయం దుండినవాఁడు. ఈరామకవి తన చతుర్వాటికా మహాత్మ్యములో,

సీ. శ్రీవల్లభోపేంద్రదేవేంద్రజనకకశ్యపఋషిగోత్రాబ్ధిచంద్రుఁ డగుచు
వృద్ధకుండికపొంత వెలయులింగముగుంట నేకభోగముగాఁగ నేలినట్టి
చెన్నయామాత్యుని శ్రీరామమంత్రినందనుఁ డన్నపకును దద్ధర్మపత్ని
కమ్మలమ్మకు సుతుఁడనుసంభవుండుతిమ్మనకుగాదనకుఁగస్వనకుఁ బెద్ద
భవ్యభాగీరథీసతీప్రాణవిభుఁడు
ఘనులు బస్వన రామ లక్ష్మణులతండ్రి
మహితవిద్యుండు మత్పితామహుఁడు నైన
సర్వకవిసార్వభౌముని సన్నుతింతు.

తనపితామహుఁడును గవి యైనట్లు స్తుతించి యున్నాఁడు. ఇతఁడు యాజ్ఞవల్క్య నియోగిబ్రాహ్మణుఁడు; కాశ్యపగోత్రుఁడు; లక్ష్మయామాత్యపుత్రుఁడు. ఈతని కవిత్వము నిర్దుష్టమయి రసవంత ముగా నున్నది. చతుర్వాటికామాహాత్మ్యములోని కొన్ని పద్యము లిందుఁ బొందుపఱుపఁబడుచున్నవి—

ఉ. చీటికిమాటికిన్ సకలసీమలఁ గ్రుమ్మరుచున్ శ్రమంబునన్
బాటిల నేల దర్శనవిపాటితకల్మషకోటికిం జతు
ర్వాటికి నేగి రామున కవశ్యము మ్రొక్కుచు ముక్తికామినిన్
జేటికఁజేయఁగా వలదె సిద్ధమనోరథుఁడై నరుం డిలన్. ఆ. ౧.

మ. తలఁపం బూర్వభవంబునం దెచట నేదానంబు లీఁగంటినో
విలసద్భావులు దానపాత్రులు మహావిద్యానిధుల్ మీరు ముం

గలి కేతెంచితి రీప్సితార్థములు వీఁక నీ్మకు నర్పించి మీ
వలనన్ దీవన లందినన్ భువనము ల్వర్ణింపవే కావునన్. ఆ. ౨.

శా. ఉద్వేలప్రళయాబ్ధులో యనఁగ నత్యుద్రేకమానంబులై
విద్విడ్వర్యునిఁ గుంభసంభవు మహావీర్యాభవద్ధైర్యున్ మనం
బుద్విగ్నంబుగఁ బట్టి కట్టుటకు నిట్లొక్కుమ్మడిన్ డాయ భా
స్వద్విఖ్యాతుల నాత్మసైన్యముల హస్తంబెత్తి మాన్చె న్వడిన్. ఆ. ౩

చ. ఇవిరెఁ గొలంకు లాపగలు నింకుచుఁ గాల్నడ లయ్యె వేండ్రమై
పవనము వీచె భూజములపత్రముఁ లన్నియు నూడె జీవజం
తువులు తపించె లోకులకుఁ దోఁచె విదాహము లక్కడక్కడన్
దవము జనించె శైలములఁ దాసె తనంతట మండువేసవిన్. ఆ. ౪.

చ. వరద శరణ్య నీవు వనవాసము చేయుచు నేఁగుదెంచి నా
చరణము లంటి మ్రొక్కినఁ బ్రసన్నతఁ గైకొని ధన్య నిన్ను భూ
వరుఁ డని యుంటిఁగాని పరవస్తు వటంచు నెఱుంగనైతి నా
యెఱుఁగమి సైఁపవే తెలియనెవ్వఁడ నీఘనమాయ నచ్యుతా. ఆ. ౫.

---

48. లింగమగుంట తిమ్మన్న

ఈకవి సులక్షణసార మను గ్రంథమును రచియించెను. ఇతఁడు యాజ్ఞవల్క్యబ్రాహ్మణుఁడు; కాశ్యపగోత్రుఁడు; లక్ష్మయ్యకును తిమ్మాంబకును పుత్రుఁడు. ఈకవి యించుమించుగా తెనాలిరామకృష్ణ కవితో సమకాలికుఁడు. ఇతఁడు తనకు భట్టరు చిక్కాచార్యుఁడు గురువైన ట్లీక్రిందిపద్యమున వ్రాసికొని యున్నాఁడు—

సీ. శ్రీవైష్ణవహితుండఁ జిక్కయభట్టరుశిష్యుఁడఁ గవితావిశేషశేష
తులితసర్వార్యపౌత్రుఁడ లక్ష్మణయకుఁ దిమ్మాంబకుఁ సుతుఁడఁ
బెద్దనకు మార

నకు రామకవివరునకు ననుజన్ముఁడ నారామకవి చెప్పినట్టిమహిత
మత్స్యపురాణ వామనపురాణాది సత్కవితలకెల్ల లేఖకుఁడ వృద్ధ
కుండికాతీరలింగమకుంటనామ
పట్టణస్థితికుఁడ సౌభాగ్యయుతుఁడ
నాదిశాఖాప్రవర్తన నమరువాఁడఁ
గార్శ్యపసగోత్రుఁడను దిమ్మకవిని నేను.

ఇందుఁ జెప్పఁబడిన భట్టరు చిక్కాచార్యులే తనకు గురువై నట్లు తెనాలి రామకృష్ణకవియు పాండురంగమహాత్మ్యమున నీక్రిందిపద్యమునఁ జెప్పికొని యున్నాఁడు—

క. వాక్కాంతాశ్రయభట్టరు । చిక్కాచార్యులమహాత్ముశ్రీగురుమూర్తిన్
నిక్కపుభక్తి భజించెద । నిక్కావ్యకళాకలాప మీడేఱుటకున్.

రామకృష్ణునితోడి సమకాలీనుఁ డగుటచేత లింగమగుంట తిమ్మకవి ౧౫౭౦ వ సంవత్సర ప్రాంతములం దున్నవాఁడు. ఇతఁడు వృద్ధదశలో కాకునూరి యప్పకవికాలములో సహిత ముండియుండవచ్చును. ఇతఁడు బహులక్షణగ్రంథములను శోధించినవాఁడు. అప్పకవి యుదాహరించిన పెక్కు పద్యములు లీసులక్షణసారమునందును గానఁబడు చున్నవి. "గడియలోపల మూఁడుకంద్రికలై త్రాడు ధరఁ గూలఁదిట్టె మేధావిభట్టు" ఇత్యాదిసీసపద్యములను దానిక్రింద నప్పకవీయములో నుదాహరింపఁబడిన "సాళువ పెదతిమ్మమహీపాలుఁ" డిత్యాది సమస్త పద్యములును సులక్షణసారమునందుఁ గానవచ్చుటయేకాక శరభాంకుఁడు పద్యము మొదల చకారమును, ౯వ చోట హకారమును, ౧౧వ చోట కకారమునుంచి ఢిల్లీపట్టణమును దిట్టిన చాటుధారయని యీక్రిందిపద్య మొకటి యధికముగా నుదాహరింపఁబడి యున్నది—

ఉ. చాపముగా నహార్యమును జక్రిని బాణముగాఁగ నారిగాఁ
బాపదొరం బొనర్చి తలఁపం ద్రిపురంబులఁ గాల్పవే మహా

దీపితతీవ్రకోపమున దేవత లెల్ల నుతింప నాఁటివిల్
పాపపుఢిల్లి మీఁదఁ జెఱఁ బాపఁగఁ జే శరభాంకలింగమా.

తిమ్మకవి సులక్షణసారమునఁ దన్నుఁ గూర్చియుఁ దనప్రజ్ఞాది కమునుగూర్చియు నిట్లు చెప్పుచున్నాఁడు—

క. లక్షణశాస్త్రము లెల్లఁ బరీక్షించుటఁ గొంతకొంత యెఱిఁగినవాఁడఁ
లాక్షణికానుగ్రహత సు । లక్షణసారం బొనర్తు లక్ష్యము లమరన్.

గీ. గొంద ఱెంచులక్షణమును గొంద ఱెంచ
రందఱును నెంచినవికొన్ని యవియు నవియు
దొరయఁగాఁ గూర్చి కవిసమ్మతులను వ్రాయు
దొకటి కొకటికి సంస్కృతాంధ్రోక్తు లెనయ.

గీ. గ్రంథసామగ్రి గలుగుటఁ బ్రతిపదమున
కన్నిలక్షణములువ్రాయ దనిన నంకు
గ్రంథవిస్తార మగుఁగానఁ గవితసూత్ర
మెన్నిటను దేలిపడు నన్ని విన్నవింతు.

ఈకవియన్నయయిన రామకవిచేసిన మత్స్యవామనపురాణములు నాకు లభింపలేదు. ఈకవిచే నుదాహరింపఁబడిన శూద్రకరాజచరిత్రము, అనిరుద్ధచరిత్రము, ఆదినారాయణచరిత్రము మొదలయిన తెలుఁగుకావ్యములునహిత మిప్పుడు కొన్నిగానరావు. ఇప్పుడు ముద్రితమైయున్న సులక్షణసారమునకును నాయొద్దనున్న యముద్రితపుస్తకమునకునుమిక్కిలి వ్యత్యాసము కనఁబడుచున్నది. కవిసర్పగారుడము, శ్రీధరఛందస్సు, కవిగజాంకుశము, వాదాంగదచూడామణి, ఆంధ్రశబ్దచింతామణి, సర్వలక్షణశిరోమణి, సర్వలక్షణసారసంగ్రహము, గోకర్ణఛందస్సు, ఉత్తమగండఛందస్సు, భీమనఛందస్సు, అథర్వణఛందస్సు, అనంతఛందస్సు, కావ్యచింతామణి, కావ్యాలంకారచూడామణి, ఛందోదర్పణము, ఆంధ్రభాషాభూషణము అను తెనుఁగులక్షణగ్రంథములనుండి యీసుల

క్షణసారమునం దనేకలక్షణములు చేకొనఁబడినవి. కవిత్వరీతిని జూపుట కయి లక్షణగ్రంథములనుండి పద్యములను జేకొనుట న్యాయము కాక పోయినను సులక్షణసారమునుండి రెండుపద్యముల నిం దుదాహరించు చున్నాను—

మ. వినుమీరీతియటంచుఁ గావ్యకరుఁడై వెల్లంకి తాతప్ప చె
ప్పినసూత్రంబులు కల్లగాఁ గనఁబడెఁ వీక్షింప నెట్లన్నచో
మునుదీర్ఘంబులపై అకారములకే పూర్ణస్థితిప్రజ్ఞగా
దనియెఁ లింగమగుంట తిమ్మకవి నేఁ దర్కింతు నిష్పట్టునన్.

చ. అనుచు నదేమొకో మును రయంబున లక్షణసారసంగ్రహం
బెనయ వచించెఁ జిత్రకవిపెద్దన లెస్సవుపోథు పోథ్ర శ
బ్దనయతగానరో వినరొ దద్ఘను లెంతయు ధన్యు లయ్యు మే
ల్గన భ్రమ గాంతు రాత్మల నొకానొకచోటఁ బరాకు గ్రమ్మఁగన్

49. వెలగపూడి వెంగనార్యుఁడు

(ఇతఁడు శ్రీలీలాశుకయోగివిరచితమైన కృష్ణకర్ణామృతమును మూడాశ్వాసముల గ్రంథముగాఁ దెనిఁగించెను. ఈకవి యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; పెద్దనామాత్యునిపుత్రుఁడు. ఇతఁడేకాలమునం దుండినవాఁడో నిశ్చయముగాఁ దెలియదుగాని యాతని కృష్ణకర్ణామృతములోని పద్యమొకటి సులక్షణసారమునం దుదాహరింపఁబడి యుండుటచేత నితఁడు ౧౬౩౦వ సంవత్సరమునకుఁ బూర్వమునం దుండెనని మాత్రము తెలియును.) ఈతనికవిత్వము నిర్దుష్టమయి శ్రావ్యముగా నున్నది. కృష్ణకర్ణామృతములోని పద్యముల మూటి నిందుఁ జూపుచున్నాను—

శా. బాలు న్మంజులతాలవాలచపలాపాంగోల్ల సల్లీలునిం
గాళిందీపులినాంగణప్రణయశృంగారైకఖేలున్ శుభ
శ్రీలోలుం గరుణావలోకనసుధాశీలున్ వినీలప్రభా
జాలుం గొల్చెద రామణీయకరసస్వారాజ్యపాలు న్మదిన్. ఆ. ౧.

చ. ఉదరము నింపఁగోరి ఖలు లుండెడితావులు చేరి వారికె
ట్టైకుటు నశంక నిన్ను నటియింపఁగఁజేసినపాతకంబులన్
సదయత నోర్వఁగావలెఁ బ్రసన్నమతిన్ నను గన్నతల్లి శా
రద యదువంశనాయకుని ప్రస్తుతి నిమ్కృతి నే నొనర్చెదన్. ఆ. ౨.

ఉ. చల్లనివాని నవ్వు వెదజల్లెడువాని దయారసంబు జొ
బ్బిల్లెడువానిఁ గెంపుజిగిపెంపు చెలంగెడుమోవివానిఁ సం
ఫుల్లసరోజనేత్రములఁ బొల్చినవానిఁ బయోధివీచికా
వేల్లితనీలనీరదనపీనతనుద్యుతివానిఁ గాంచెదన్.—ఆ. ౩.

50. రెంటూరి రంగరాజు

ఇతఁడు భానుమతీపరిణయమను నాలుగాశ్వాసములప్రబంధమును రచియించి వేంకటగిరిప్రభువగు వెలుగోటి రామభూపాలున కంకితము చేసెను. ఈకవి యాఱువేలనియోగిబ్రాహ్మణుఁడు; శ్రీవత్సగోత్రుఁడు; చినగంగనామాత్యపుత్రుఁడు. కృతిపతి తన్నుఁగూర్చి పలికినట్టుగా కవి తనశక్తిసామర్థ్యాదులను భానుమతీపరిణయమునం దిట్లు తెలుపుకొని యున్నాఁడు—

సీ. వ్యస్తాక్షరీధుర్యవిస్తీర్ణభావంబు క్రమకసంఖ్యాఖ్యానకౌశలంబు
నారోహణావరోహణలేఖనప్రౌఢి యగ్రపద్యగ్రహణాభిరక్తి
యనవలోకితశారికాభిఖేలనరీతి వరసమస్యాపూర్తివైభవంబు
సముదగ్రవీక్షితచతురంగబలకేళి కావిలాసము నేకకాలమునను

యలరఁ బ్రకటింపనేర్తు వష్టావధాన। కలితశతలేఖినీపద్యగద్యశక్తి
సాటిమీఱితి వాంధ్రకర్ణాటచోళ।రాజసభలను రెంటూరి రంగరాజ.

గోలకొండ మహమ్మదీయులను, కొండవీటి వినుకొండప్రభువులను జయించి ౧౫౭౯వ సంవత్సరమునందు విజయనగరరాజులపక్షమునఁ బోరాడి విపక్షరాజబృందము నోడించిన కస్తురి రంగనాయనికిఁ గృతిపతియైనరాయభూపతి పెదతండ్రికుమారుఁడు. భానుమతీపరిణయము కృతి నందునప్పటికి రాయన్నపాలునికి యుక్తవయస్సువచ్చిన కొమరులుండుటచేత గ్రంథరచనచేసినకాలము ౧౬౨౦వ సంవత్సరప్రాంతమని చెప్పవచ్చును.

చ. అనుపమభద్రలీల వెలమాన్వయవార్ధిఁ బ్రతాపలక్ష్మితో
నెనసినరాయశౌరి జగదేకవదాన్యశిఖావతంస మా
ననుచు నుతించుమేమియరు దావిభుఁ డిచ్చినభూరిసంపదన్
ధనదులు రాజులున్ ఘనులుఁ దా రగుచు న్నిఖిలార్థు లుండఁగన్.

ఇత్యాదిపద్యములతోఁ గవి కృతిపతిని బహువిధముల వర్ణించి యున్నాఁడు. ఈతని కవనము ద్రాక్షాపాకమయి మనోహరముగా నున్నది. శైలిని జూపుటకయి భానుమతీపరిణయములోని కొన్నిపద్యముల నిందుఁ జూపుచున్నాను.

ఉ. తీరినజాతినీలములతిన్నెలపైఁ బ్రతిబింబితంబులౌ
తారకసౌధమౌక్తికవితానము లొప్పఁగఁ జూచి బాలికల్
చారుమృగీమదం బలఁది చక్కనికప్రపుమ్రుగ్గు లిప్పు డి
చ్చో రచియించినారనుచు నూటిగ నాత్మఁ దలంతు రప్పురిన్. ఆ.౧

చ. సుమముల వ్రాలివ్రాలి పరిశుద్ధవసంతకళా ప్రమత్తరం
గములను దేలితేలి యతికాంతసుధామధురోల్లసన్మరం
దము చవి గ్రోలిగ్రోలి నవదక్షిణగంధవహానుకూలసం
భ్రమమున సోలిసోలి మదబంభరము ల్విహరించు వామనిన్. ఆ.౨

ఉ. అలరెఁ జకోరముల్ ప్రియసుతాత్రాబ్జముఖమణిదృక్చకోరముల్
కలఁగె సరోజముల్ మదనకంపితపాంథమనస్సరోజముల్
చెలఁగెను ఘూకచక్రములు ధూర్తగుణోజ్జ్వలజారచక్రముల్
నలిఁగవిరోధినూత్నకిరణంబులు కొన్ని దివిం దలిర్పఁగన్. ఆ. ౩.

చ. అతిముదమొప్ప ధర్మతనయాదులు చూచిరి కేకికోకిల
ప్రతతివతంసహంసమదబంభరడింభరఝాంకనాదమం
డితబహుగంధబంధురపటీరతటీనమమాణగోపికా
ధృతమణిదీపికానికరతేజము రైవతకాద్రిరాజమున్. ఆ. ౪.

---

51. సింహాద్రి వేంకటాచార్యుఁడు

ఈకవి లక్షణావివాహమనునామాంతరముగల చమత్కారమంజరిని రచించెను. చమత్కారమంజరి మూఁడాశ్వాసముల ప్రబంధము. ఈకవి శ్రీవైష్ణవుఁడు; చెన్నకేశవాచార్యులపౌత్రుఁడు; తిరుమలాచార్యులపుత్రుఁడు; గౌతమగోత్రుఁడు. "భద్రాచలస్వామి రామచంద్రుఁడౌనర నాడెందమున నిండియుండుఁగాత" అని భద్రాచలరామస్వామి నిష్టదైవతముగా స్తుతియించి యుండుటచేత కవి గోదావరిమండలములోని వాఁడని తోఁచుచున్నది. ఇతఁడు తనగ్రంథమును వైష్ణవమతోద్ధారకుఁడైన రామానుజాచార్యున కంకితము చేసెను. అప్పకవికిఁ బూర్వికులయిన లాక్షణికు లెవ్వరు నీతనిగ్రంథమును పేర్కొనకపోవుట నితఁడు ౧౭౩౦-౪౦ వ సంవత్సరప్రాంతములయందుండెనని యూహింపఁదగియున్నది. అక్కడక్కడఁ గొన్ని వ్యాకరణదోషము లున్నను, ఈతని కవిత్వము మొత్తముమీఁద ప్రౌఢముగానే యున్నది. చమత్కారమంజరినుండి రెండు మూఁడు పద్యముల నిం దుదాహరించుచున్నాను—

గీ. అరుణపల్లవములఁబోలు నాపదంబు
లాపదంబులఁ బోలును నలకజాత
మలకజాతముఁబోలు నిత్యముఖలీల
నిత్యముఖలీలఁబోలు నన్నెలఁతనడుము.

మ. బిసవుంగుబ్బలు గాంచి మాను నలజంబీరంబు బీరంబు క్రొం
జిగిమోము ల్గని సిగ్గున న్వదలు రాజీవంబు జీవంబు విం
తగ భ్రూరేఖలుచూచి భీతి నిడుఁ గోదండంబు దండంబు త
జ్జగతీమోహనమ్రోల నున్నచెలులం జర్చింపఁగా శక్యమే. ఆ. ౨.

శా. జోక స్వేదోత్కని చుక్కరేఁగెను జుమీ శుభ్రాంశుబింబప్రభో
త్సేకంబు ల్తఱిఁగెం జుమీ కడకువచ్చెం జుమ్మి యీరేయి చిం
తాకాలుష్యము లేల బాల మదిలో ధైర్యం బవార్యంబుగాఁ
గోకోయన్గతిఁ గుక్కుటంబు లఱచెం గోకోవిరావార్భటిన్. ఆ. 3.

---

52. చేమకూర వేంకటకవి

ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు. లక్ష్మణామాత్యుని తనూభవుఁడు. ఈకవి సారంగధరచరిత్రము, విజయవిలాసము అను పద్యకావ్యములను జేసి తంజాపురీవల్లభుఁడైన రఘునాథరాజున కంకితము చేసెను. విజయవిలాసమునకు సుభద్రాపరిణయమని నామాంతరము గలదు. కృష్ణదేవరాయ లించుమించుగా దక్షిణహిందూదేశమునంతను జయించిన కథ నీవఱకే మాచదువరులు తెలిసికొని యున్నారు. ఆరాయల యనంతరమున తంజావూరు, మధుర, మొదలయిన ద్రావిడరాజ్యములు పాలించుటకయి తెలుఁగునాయకులు నియమింపఁబడిరి. తంజాపురిరాజ్యమునకు చెవ్వరాజు పాలకుఁడుగా నియమింపఁబడెను.

గీ. ఠీవి నచ్యుతరాయలదేవియైన
తిరుమలాంబకుఁ జెలియలై తేజరిల్లు

మూర్తిమూంబను బెండ్లియై కీర్తి వెలసెఁ
జెవ్వవిభుఁడు మహోన్నతశ్రీ చెలంగ.

అను విజయవిలాసములోని పద్యమునుబట్టి యీ చెవ్వరాజు విజయనగరాధీశ్వరుఁడైన యచ్యుతదేవరాయనికిఁ దోడియల్లుఁ డయినట్టు కనఁబడుచున్నాఁడు. అయినను వేంకటకవి చెవ్వరాజు మనుమఁడై నకృతిపతి యగు రఘునాథరాజు నాశీర్వదించుచు,

మ. ప్రకటశ్రీహరియంఘ్రిఁ బుట్టి, హరుమూర్ధం బెక్కి యింపార మ
స్తకముం జేర్కొన నెక్కుడేవి సహజోపంచత్కులోత్పన్న నా
యకరత్నం బని యచ్యుతేంద్రరఘునాథాధీశ్వరస్వామికిన్
సకలైశ్వర్యములు న్నిజేశువలనం దాఁ గల్గఁగాఁ జేయుతన్.

శూద్రుఁగా వర్ణించినందున శూద్రకులసంజాతుఁ డగు చెవ్వ రాజునకును క్షత్రియవంశ జాతుఁ డగు నచ్యుతదేవరాయనికిని బంధుత్వ మెండునా యని సందేహము తోఁచుచున్నది. మొట్టమొదట కృష్ణదేవ రాయలే యుత్తమక్షత్రియుఁడు గాక దాసీపుత్రుఁ డయినట్టు వాడిక గలిగియున్నదిగదా! క్షత్రియుఁడైన నరసింహరాజునకు దాసియు శూద్రయు నగు నాగాంబకుబుట్టిన కృష్ణదేవరాయనికి మొట్టమొదట క్షత్రియులెవ్వరును గన్య నియ్యనందున, అతఁడు శూద్రజాతి స్త్రీని గాంధర్వవిధిచే వివాహమాడి యచ్యుతదేవరాయని పుత్రునిగాఁ బడసి యుండవచ్చును. అందుచేత నాయచ్యుతదేవరాయఁడు శూద్రకన్యనే పెండ్లిచేసికొనియు నుండవచ్చును. పెక్కు శాసనములలో నచ్యుతదేవ రాయఁడు కృష్ణదేవరాయనికి కుమారుఁ డైనట్టు చెప్పఁబడినను, శాలి వాహనశకము ౧౪౫౯ హేవిళంబి సంవత్సరమున నచ్యుతదేవరాయ లొక బ్రాహ్మణునకి నారాయణపురము నగ్రహారమునుగా నిచ్చిన దాన శాసనములో,

శ్లో. తిప్పాజీ నాగలాదేవ్యోః కౌసల్యాశ్రీసుమిత్రయోః

జాతౌ వీరనృసింహేంద్ర కృష్ణరాయ మహీపతిః
అస్మాదోబాంబికాదేవ్యా మచ్యుతేంద్రోపి భూపతి.

అను శ్లోకములయందు నరసింహారాజునకు తిప్పాంబయందు వీర నృసింహరాయఁడును, నాగలాంబయందు కృష్ణదేవరాయఁడును, ఓబాంబ యందచ్యుతదేవరాయఁడును కలిగినట్లు చెప్పఁబడి కృష్ణదేవరాయని కతఁడు తమ్ముఁ డయినట్టు చెప్పఁబడియున్నది. ఈబంధుత్వ మింకను విచారణీయము. ఒకవేళఁ బయిశ్లోకములలోఁ జెప్పఁబడినదే నిజమయి నను, నాగమ్మవలెనే యోబమ్మయు శూద్రజాతయైన భోగభార్యయై యుండవచ్చును. ఈవిచారము నటుండనిచ్చి యిఁకఁ గథాంశమునకు వత్తము.

క. ఆమూర్త్యంబకు నఖిల మ
హీమండలవినుతుఁ డచ్యుతేంద్రుఁడు సుగణో
ద్దాముఁడు జనియించెను త
ద్భూమీపతి రంగధాముపూజన్మించెక్.

* * * *

క. ఆపుణ్యఫలంబున నె ద । యాపాథోరాశియైన యాయచ్యుతభూ
మీపతికిక్ రఘునాథ । క్ష్మాపాలకుఁ డుదయమయ్యె జైవాతృకుఁడై.

చెవ్వరాజున కచ్యుతరాజును, అచ్యుతరాజునకుఁ గృతినాయకుఁ డయినరఘునాథరాజును బుట్టి తంజాపురరాజ్యము పాలించిరి. విజయ విలాసములోని యీక్రిందిపద్యములవలన రఘునాథరాజు రసికజనాగ్ర గణ్యుఁ డయినట్లును, విద్యలయం దసమానుఁ డయినట్టును తెలియ వచ్చుచున్నది—

గీ. నన్ను నడిపినయధికసన్మాన మెంచి
యఖిలవిద్యావిశారదుఁ డగుటఁగాంచి

యువని నింతటిరా జెప్పఁజని నుతించి
కృతి యొసఁగఁ గీర్తికలదని మతిఁదలంచి.

మ. కలిగెంగా తఁ సమ్ముఖంబనియు సత్కారంబుతాఁజేయ నౌ
దల నెంతే శిరసావహింతురనియుం దాఁగాక వేతెందు సా
ధులకున్ దిక్కనియుక్ దయన్మనుపురీతుల్గాక శక్యంబె వి
ద్యల మెప్పింపఁగ నచ్యుతేంద్ర రఘునాథస్వామి నెవ్వారికిన్?

రసికావతంసుఁడైన కృతిపతి తన కంకితము చేయఁబడిన శారంగధరచరిత్రమునంతను విని యందు శోకరస మత్యద్భుతముగా వర్ణింపఁబడుటచూచి యది నిజముగా నేడిచినట్టే యున్నదని పలికెననియు, ఆపయిని గవి తనశక్తినంతను జూపి ప్రతిపద్య రసాస్పదముగా విజయవిలాసమును జేసి తీసికొనివచ్చి వినిపింపఁగా నతని యింటిపేరును బట్టి శ్లేషించి చేమకూర మంచిపాకమునఁ బడెనని మెచ్చుకొనెననియు చెప్పుదురు. అచ్చతెలుఁగుపదములను పొందికగాఁ గూర్చి కవనము చెప్పనేర్పీకవికిఁ గుదిరినట్లు మఱియొకకవికిఁ గుదిరినదని చెప్ప వలను పడదు. అందుచేతనే కృతిపతి,

క. ప్రతిపద్యమునందుఁ జమ | త్కృతి గలుగఁగఁ జెప్పనేర్తు వెల్లయెడలనై
కృతపాఠము బాఢముగా | క్షితిలో నీమార్గ మెవరికిని రాదుసుమీ.

అని కవిని శ్లాఘించి యున్నాఁడు. పింగళి సూరనార్యుని ప్రభావతీప్రద్యుమ్నమునకుఁ దరువాత విజయవిలాసమే సర్వవిధములచేతను తెలుఁగులో శ్లాఘ్యకావ్యముగా నున్నది. జాతీయాదిచమత్కృతినిబట్టి విజయవిలాసమే శ్లాఘ్యతర మయినదనియు ననేకు లభిప్రాయపడు చున్నారు.

ఉ. తారసవృత్తిమై ప్రతిపదంబును జాతియు వార్తయుం జమ
త్కారము నర్థగౌరవముఁగల్గ ననేకకృతుల్ ప్రసన్నగం

ఘోరగతి న్వచింపఁ బహు సంచినచో నిఁకఁ శక్తు లెవ్వర
చారు రఘునాథభూపరసికాగ్రణికిం జెవిసోఁకఁ జెప్పఁగన్ ?

అని కవియే తన్నుఁగూర్చి తనకవిత్వమునందువలె జాతీయముఁ జమత్కారము నర్థగౌరవముఁ గలుగునట్లుగా నింకొక్కరు చెప్పలేరని చెప్పికొనియున్నాఁడు. ఈకవి తనగ్రంథములయందు రేఫ శకటరేఫములకు యతిప్రాసమైత్రి కూర్చుటయేగాక. ఇకారసంధులు, క్త్వార్థక సంధులు, మొదలయిన పూర్వలాక్షణికసమ్మతములుకాని ప్రయోగము లనేకములు చేసియున్నాఁడు.

ఉ. కోపమొకింతలేదు బుధకోటికిఁ గొంగుపసిండి సత్యమా
రూపము తారతమ్యము లెఱుంగు స్వతంత్రుఁడు సూనృతప్రియా
టోపములేని నిశ్చలుఁ డిటుల్ కృతలక్షణుఁడై చెలంగఁగా
ద్వాపరలక్షణుం డనఁగవచ్చునొకో యలధర్మనందనున్. విజయవిలాసము.

ఈపద్యమునందలి రెండవచరణములో రాకును బండిఱాకును యతికూర్చినాఁడు.

గీ. అరుగఁ గొంకెడు కన్నియ తెఱఁగుఁ గాంచి, విజయవిలాసము.

మ. ఖరభానుప్రియసూనుఁ డెప్పుడు నినుంగారించునేకా విభుం
డఱచేలోపలి నిమ్మపంటివలె నత్యాసక్తి మన్నింప సౌ
ఖ్యరసైకస్థితినుండి కావరమునం గన్గాన కాపత్పరం
పర రాఁ గ్రుళ్ళెదవేల యావిధిఁ దరింప న్నీతరంబే మహిన్. సారంగధ.

ఇత్యాది స్థలములయందు రేఫఱకారములకుఁ బ్రాసమైత్రి కూర్చినాఁడు.

క. సైకము నడుము విలాసర
సైకము నెమ్మోము దీనిమృదుమధురోక్తుల్
పైకముఁ దెగడు న్నవలా
పైకములో నెల్ల మేలుబంతిది బళిరా. విజయవిలాసము.

చ. పడి నరపాలుభోగసతిపావులు నాకుఁబనేమి యంట వం
గడమునకెల్ల బొట్టనినఁ గా దటు నేనలపిన్న నాఁడె యే
ర్పడితెసటన్న బోవునె స్వభావము తల్లివినాకు నేక్రియం
బడతుఁక నీవు వానిచెడ మందు మహింగలదమ్మయొందునున్.

సారంగధరచరిత్ర.

ఇందు మొదటిపద్యములో (మేలుబంతి + ఇది =) మేలుబంతిది యనియు, రెండవపద్యములో (పని + ఏమి =) పనేమనియు, ఇకారసంధులను గూర్చినాఁడు.

చ. అనవిని పాపపూపజవరా లెదలోఁపలఁ బాపలేక యూ
తని తెలిముష్ఠానె మొగ్గముఁ దప్పక తేటమిటారికల్కిచూ
పుసఁ పనివారఁజూచి నృపపుంగవ యన్నిటజాణ వ్వారకే
యనవలసంటిగా కెఱుఁగవా యొకమాటనె మర్మకర్మముల్.

విజయవిలాసము.

ఉ. కానకుఁ గొంచుబోయిపుడు కాళ్ళను జేతులుఁ గోయుఁడంచు లో
నూనినకిన్క రాజు ముదుటుంగర మిచ్చెను మాకు బుద్ధి యే
మానతియిండు మీారనిన నట్టులెచేయుఁడు కొంకనేల రా
జాన నతిక్రమింపఁ దగునాయని యాదృఢచిత్తుఁ డాడినన్. సారంగధ.

ఇత్యాది స్థలములయందు (వలసి + అంటి =) వలసంటియనియు, (పోయి + ఇపుడు =) పోయిపు డనియు, క్త్వార్థతునకు సంధి కలిపినాఁడు.

చ. చందనగంధి నెన్నుదురు చంద్రురులో సగపాలు బాల ము
ద్దుం దెలిచూపు లంగజునితూపులలోపల మేలురంబు లిం
దిందిరవేణిమోవి యలతేనియలో నికరంబుతేట యే
మందము మందయానముఖమందము మీాఱు నవారవిందమున్.

విజయవిలాసము.

ముఖమందమని యీపద్యమునందును, రాజానయని పయిపద్య మునందును షష్ఠీతత్పురుషమునం దుత్తున కచ్చు పరంబగునప్పుడు నుగా

గమముచచ్చి 'ముఖమునందము' 'రాజునాన' యని యుండవలసిన దానికి మాఱుగా నగాగమము పోఁగొట్టి ప్రయోగించినాఁడు.

మ. అని బాహాపరిరంభ సంభ్రమరసాయత్తైకచిత్తంబునం
దను వీక్షింప నెఱింగి యందియలమ్రోఁతం గేకినున్ రా పక్షి
జను ఫేత్తెంచి రటంచు వే మొఱఁగి హా స్తంబు న్విడంజేసె నే
ర్పునఁ దప్పించుకపోవ భూవరుఁ డనుం బూబోఁడికిం గ్రమ్మఱన్—
విజయవి.

సీ. నిలుచుండి చంకఁ జేతుల పెట్టుక కిరీటములు గలరాజులు కొలువుచేయ-
సారం.

ఇందు 'తప్పించుకొని' 'పెట్టుకొని' యని యుండవలసినచోట్ల కొనునకు మాఱుగా కవర్ణకము ప్రయోగించినాఁడు.

సీ. చెంతఁ గూర్చుండని చేఁజూపఁ గూరుచుం
డెదవుగా కూరకుండెదవు సుమ్ము. విజయవి.

అచ్చు పరమగునపుడు ప్రార్థనార్థక మధ్యమపురుష మువర్ణకము నకు లోపము రాఁగూడకపోయినను 'గూర్చుండు' అని మువర్ణలోపము కలిగించి ప్రయోగించినాఁడు.

ఉ. ఓనృప నాకుఁ జూడ నటయుక్మలి నీసుతునిక్ మనోహరా
మానవిలాసుఁ జూచి నిలు పోపక పట్టిన లోనుగామి నెం
తే నెగు లూని వానిఁ బొలియింపఁగ మాయలు పన్ని నిట్లు కొం
డేనకు ధర్మరా జలుగు నిక్కముగా మిముఁ జెప్ప నేటికిన్—సారంగధ.

తెలుఁగులందుఁ గొన్ని యెడల ఉలనలు పరమగునపుడు మువర్ణము లోపించి పూర్వమందున్న యకారమునకు మాత్రమే దీర్ఘము రావలసియుండఁగా నిచటఁ గొండెమునకని యుండవలసిన దానికి మాఱుగా నెకారమునకు దీర్ఘముపెట్టి కొండేనకని ప్రయోగించినాఁడు.

ఇట్లు లఘ్వలఘు రేఫములకు యతిప్రాసములయందు మైత్రి

కల్పించినను, పూర్వ కవిప్రయోగములకు విరుద్ధములయిన ప్రయోగ గములు చేసినను, లింగముగుంట తిమ్మన్న, అప్పకవి, కూచిమంచి తిమ్మన్న మొదలయిన లక్షణవేత్తలీ వేంకటకవిని లాక్షణికకవినిగా నంగీకరించి తమ లక్షణ గ్రంథములయందీతని గ్రంథములనుండి పద్యముల నుదాహరించియున్నారు. ఇప్పటివారు కవిత్వసారస్యమును విచారింపక గ్రంథములయందు రేఫద్వయప్రాస విశ్రమమైత్రియో యేదో వ్యాకరణదోషమో యున్నదన్న హేతువుచేత రసవంతములైన యుత్తమ గ్రంథములను సహిత మగ్రాహ్యములని నిరాకరించుచున్నందున, అట్లు చేయుట యుక్తము కాదనియు ఛందోవ్యాకరణదోషములు లేని రస హీనములగు గ్రంథములకంటె ఛందోవ్యాకరణదోషములను గలవయినను రసవంతములయిన గ్రంథములే యధికాదరణీయము లనియు జూపుటకయి యీ కవివిషయమున నింతదూరము వ్రాసినాఁడను. కవిత్వమునం దక్కడక్కడఁ గొన్ని నెరసులున్నను జాతీయములతోను సామెతలతోను నిండియుండి యర్థగౌరవము కలదయి రసవంతమయి యున్నందున చేమకూర వేంకటకవి కవిత్వము సర్వజనాదరణీయమయినదని తలఁచుచున్నాను. ఈ కవి యించుమించుగా పదునేడవ శతాబ్దముయొక్క మధ్యభాగమునందున్నట్లు తెలియవచ్చుచున్నది. కృతిపతియైన రఘునాథ రాజుయొక్క కుమారుఁడగు విజయరాఘవరాజు ౧౬౭౪ వ సంవత్సరమునందు మధురాపురము రాజధానిగాఁగల పాండ్యదేశపురాజగు చొక్కలింగనాయకునితో యుద్ధముచేసి నిహతుఁడయ్యెను. అతనితోఁ గృతిపతివంశ మంతరించినది. దీనినిబట్టి విజయవిలాసమును సారంగధర చరిత్రమును ౧౬౩౦-౪౦ సంవత్సర ప్రాంతములయందు రచియింపఁబడినట్లు కనఁబడుచున్నవి. మూఁడేసి యాశ్వాసములుగా రచియింపఁబడిన యీ పుస్తకద్వయము నుండియుఁ గొన్ని పద్యముల నుదాహరించుచు నీ కవిచరిత్రము నింతటితోఁ బరిసమాప్తి నొందించుచున్నాను—

విజయవిలాసము.

చ. క్షితిపతయి వక్త్రమౌఁకులు చిగిర్చి వసంతుఁడు తా రసోపగుం
భితపదవాసనల్ నెఱప మెచ్చక చంద్రుఁడు మిన్న నం బ్రస
న్నతయును సౌకుమార్యముఁ గనంబడ తా ల్గరఁగఁగఁ జేసె నే
గతి రచియించి రేని సమకాలము వారల కెంచ్చ రేకదా—ఆ. ౧.

ఉ. కోమలి యీగతి న్మదిఁ దగుల్పడఁ బల్కిన నవ్వి పర్జర
గ్రామణిసూను మీ రెచటఁ గంటిరొ యంటివి కన్నమాత్రమే
యేమని చెప్పవచ్చు నొకయించుక భేదము లేక యాయనే
మేమయియున్నవారముసుమీ వికచాంబుజపత్రలోచనా—ఆ. ౨

చ. శివుఁ డిటు రమ్మటంచు దయచేసినచోఁ దల కెక్కె తుగ్రవై
భవమునఁ జూచుచో నణఁగుఁబట్టితి వేమనవచ్చు నీగుణం
బవునవు నందినన్ సిగయు నందకయున్నను గాళ్ళుఁ బట్టుకొం
దువు హరిణాంక వేళకొలఁదు ల్గద నీనడక ల్దలంపఁగన్.—ఆ. 3

సారంగధర చరిత్రము.

ఉ. చక్కిలిగింతపెట్టినను సారెఁ గిలాగిల నవ్వుచున్ బయిం
బక్కఁబడంగఁ జక్కనికుమారుని మక్కువమీఱ నెప్పురాఁ
జెక్కిలిమీఁటి యెత్తి యెదఁ జేరిచి ముచ్చట దీరునట్లుగా
నక్కట ముద్దులాడవలదా వలదా యిటువంటిభాగ్యముల్— ఆ.౧

ఉ. ఆతరలాక్షి డెందమున నారట మొందుచు నేమిచేయుదున్
రాతికిఁ దోడుపోయినది రాసుతు డెందము మెత్తగాదు దా
దాతికి వచ్చియుండ సిరికిఁ దాలిమి చెల్లునె మారుఁ డంటిమా
ఘాతుకుఁ డోడ్వరాదు సముఖంబున నేటికి రాయబారముల్—ఆ.౨

ఉ. కందుఁ గదయ్య నీమురువు కన్నులపండువుగాఁగ నంటినం
గందుఁ గదయ్య నీతనువు కౌతుక మొప్పఁగ నీదు ప్రావు నేఁ
గందుఁ గదయ్య యంచు నినుఁగన్న సపత్ని సహింప దందుఁ బో
కందుఁ గదయ్య యేల వినవైతివి నావచనంబు పుత్రకా—ఆ. 3

53. రాజలింగకవి

ఈ కవి కూర్మపురాణ మనెడి యాఱాశ్వాసముల గ్రంథమును తన కాప్తుఁడైన చెఱుకు లక్ష్మణామాత్యుని ప్రేరణముచేత రచియించెను. ఈ లక్ష్మణామాత్యుఁ డేవరిమంత్రియో చెప్పఁబడలేదు గాని పురకప్రభువుల కొలువులో నున్నట్టు క్రింది పద్యమువలనఁ దెలియవచ్చుచున్నది.

సీ. సకలనృపకార్యరచనావిచక్షణత్వ
మధిగమించి యమీరుల ననుసరించి
సప్తసంతానములఁ బ్రశస్తముగ నిలిపెఁ
నతనికతఁడెఁ సమానుఁడీక్షితితలమున.

కొరవుల్లి గ్రామనివాసుఁ డగు చెఱుకు లక్ష్మణామాత్యుఁడు తన్నుఁ గూర్చి యీవిధముగాఁ బలికినట్లు కవి వ్రాసికొనియున్నాఁడు,-

ఉ. శ్రీగిరినాథపాదసరసీరుహచింతను వీరశైవశా
స్త్రాగమమార్గనిర్ణయరిరంసు నిరంతరధీజనౌఘసం
యోగమనస్కు నుత్తమగుణోచితసంగ్రహధర్మవర్తనా
భోగుని రాజలింగకవిపుంగవు మంజులభాషు నన్నెగిక్.

క. వినయంబున రావించియుఁ । గనకవిభూషణము లంశుకంబులు వీడ్యం
బనురక్తినొసఁగి నాతో । ననియె న్మధురోక్తి లక్ష్మణామాత్యుఁడొగిన్.

క. నీ వతిధన్యుఁడ వాగమ
శైవపురాణార్థసారసంగ్రహుఁడ వటుల్
గావునఁ గూర్మపురాణము
భూవిదితముగాఁగ నాంధ్రమునఁ జెప్పఁదగున్.

ఈలక్ష్మణామాత్యుఁడు తనకు సఖుఁడైనట్లు కవి యీ గ్రంథమునం దిట్లు చెప్పికొని యున్నాఁడు-

చ. అతనికి మేలువాఁడనయి యాప్తుఁడనై సచివుండనై మహా

హితమతిమై సభుంజనము లెల్లపుడుం జెడఁబోవుకొంచీ సం
తతమును మృదూక్తులన్ శివకథాకథనంబులఁ బ్రొద్దుపుచ్చుచున్
గుతకముతో వసించెదనకుంతితన్మతిఁ గవు లచ్చితింపఁగన్.

ఈపద్యములవలననే కవి వీరశైవుఁడగుట స్పష్టమగుచున్నది. ఇతఁడు వసిష్ఠగోత్రుఁడు; ఆశ్వలాయనసూత్రుఁడు; సర్వేశ్వరారాధ్య పుత్రుఁడు. ఈకవి తనగ్రంథమునందు "రంగనాథుని రామలింగకవిని సూరపరాజును గౌరనామాత్యు" నని రామకృష్ణుని స్తుతించుటచేత రామకృష్ణకవికిఁ దరువాతను కూర్మపురాణమునుండి యప్పకవి పద్యము నొకదాని నుదాహరించి యుండుటచేత నప్పకవికిఁ బూర్వమునందును, ఉన్నట్టు తేటపడుచున్నది. అందుచేతఁ గవి హూణశకము ౧౬౩౦ వ సంవత్సరప్రాంతములయం దున్నట్టు నిశ్చయింపవలసి యున్నది. ఈతనిది మిక్కిలి సరసమైన కవిత్వమని కూర్మపురాణములోని యీక్రింది పద్యములవలననే తెలియవచ్చును —

ఉ. భంబుగదే నఖావళి నభంబుగదే నడుము న్మదద్విరే
భంబుగదే కచంబు దిగిభంబుగదే నడతీరు హేమకుం
భంబుగదే కుచంబు కరభంబుగదే తొడ పూర్ణచంద్రికా
భంబుగదే స్మితం బురుశుభంబుగదే వచనంబు బోటికిన్. ఆ. 3.

చ. దురితవినాశనం బమరదుర్లభ మవ్యయ ముత్తమంబు నై
వఱలెడుయోగసంగతి నవశ్యము జ్ఞానముచేతను న్మహే
శ్వరుఁడు కనంబడున్ బరమశాంతి యనూదినమాధియు క్రమా
వరశివయోగమార్గమున వర్తిల మోక్షము కల్గుఁ గావునన్. ఆ. ౫.

ఉ. శాంతులు నీతిపారగులు సభ్యు లహింసకు లప్రమత్తు లా
గంతుకు లాహితాగ్ను లుపకారులు కోవిదు లప్రతిగ్రహుల్
దాంతులు పావనుల్ పరమధార్మికు లాశ్రితు లీశ్వరార్చన
స్వాంతులు సత్యవాదు లనవద్యులు పంక్తికి యోగ్యులారయన్.

54. చిత్రకవి రమణకవి

ఈకవి సాంబవిలాసమను ప్రబంధమును రచియించి వేంకటేశ్వరుని కంకితముచేసెను. ఇతఁడు ౧౬౩౦ వ సంవత్సరప్రాంతములం దున్నట్లు తెలియవచ్చుచున్నది. ఇతని తండ్రియైన యనంతకవి రామరాజభూషణకృతమైన హరిశ్చంద్రనలోపాఖ్యానమునకు వ్యాఖ్య చేసినందున, అతఁడు పదునేడవశతాబ్దారంభమున నుండుట స్పష్టము. సాంబవిలాసములోని పద్యముల నప్పకవి లక్ష్యములనుగాఁ జేకొని యుండుటచేత రమణకవి తప్పక తనసాంబవిలాసమును ౧౬౫౦ వ సంవత్సరమునకుఁ గొంతకాలము పూర్వమే చేసియుండవలెను. కవి తన్నుద్దేశించి యీక్రింది వాక్యములను తనపుస్తకములోఁ జెప్పుకొన్నాఁడు—

ఉ. శ్రీరమణాఖ్య సత్కవికులోత్తమ! మామకమంజులాహ్వయ
శ్రీరమణీయ! నీవిపుడు చేయఁగఁ బూనినసాంబలక్షణా
సారసదృగ్వివాహకథ సన్మతి మాకిపు డంకితంబుగాఁ
గూరుపు నీకుఁ గల్గు జయగుర్వచలాయురభీష్టవస్తువుల్.

సీ. సర్వలక్షణసారసంగ్రహం బొనరించి
తనరె మాతాత పెద్దనకవీంద్రుఁ
డలహరిశ్చంద్రనలాధిశ సత్కథా
శ్లేషసత్కృతికిఁ బ్రసిద్ధిగాఁగఁ
గవిహితుం డౌచు వ్యాఖ్యానంబు నొనరించి
మరియు నిందుమతీసుపరిణయంబు
మొదలైనసత్కావ్యములు చేసి రహిఁగాంచె
నరయ మాతండ్రి యనంతసుకవి
చిత్రకవిమంజులాన్వయక్షీరవార్ధి
చంద్రమూర్తివి సద్బుద్ధిశాలి వీవు

రమణసత్కవి నీవొనర్పంగఁబూను
కృతివతంసంబు నతని కంకిత మొనర్పు.

సాంబవిలాసమునందు దుర్యోధనపుత్రియైన లక్ష్మణాకన్యను కృష్ణుని కొడుకైన సాంబునికిచ్చి వివాహము చేసినకథ చెప్పఁబడినది. ఇది సలక్షణమైన గ్రంథము. ఇందుండి రెండుమూడు పద్యముల నిం దుదాహరించుచున్నాను.

చ. కొడవలిచేత బొస్సు తగఁగోసి గడానిపసిండిచేటలో
నిడి నులివెచ్చనీట నొడ లెంతయు నారిచి మేలిచల్వపా
వడఁ దడిబొత్తి ఫాలమున బొట్టుగ నున్న నికాపుదృష్టిబో
ట్టిడి రహి దీవన ల్పలికి హెచ్చుగ నారతు లిచ్చి క్రచ్చుఱన్. ఆ-౧

ఉ. జాంబవతీతనూజుఁ డలసాంబుఁడు బాల్యమునందు మందహా
సం బనుభవ్యచంద్రిక నజస్రము మాతృమనోంబుజాతహా
ర్దాంబుధిఁ బొంగజేయుచు నుదంచితనై జకుమారచంద్రభా
వంబు యథార్థమై తనర వర్తిలు సత్కళలం జెలంగుచున్. ఆ. ౧.

మ. ఒక భిల్లాగ్రణి వెంబడించి తనపై నుత్సాహ మొప్పంగ వ
చ్చు కఠోరాధికగర్వధూర్వహతరక్షుశ్రేష్ఠమున్ సాంబభూ
పకరీంద్రంబు నుతింప మేలితళుకుం బల్వాడియాందంపునుం
జికటారింబడఁగూల్చి యార్భటు లొనర్చెంబేర్చి శౌర్యంబునన్. ఆ-౧

ఈకవి భారద్వాజగోత్రుఁడు; కాత్యాయనసూత్రుఁడు; ఓబళాంబాపుత్రుఁడు. ఇతనిచే రచింపఁబడిన రామాయణ మొకటిగూడఁ గానఁబడుచున్నది. దాని కితఁడు "విద్వత్కవికర్ణరసాయనసకలవర్ణనాపూర్ణరామాయణము" అని పేరు పెట్టెను. ఈరామాయణములోని గద్యమునుబట్టి కవి యభిమన్యువిలాసము, కుమారగురువిలాసములోనగు గ్రంథములనుగూడ రచించినట్లు తెలియవచ్చుచున్నది. ఈరామా

యణములోనివి ప్రతికాండమునుండియు రెండేసి పద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. బిరుసులజల్లులున్ బురుఁగుఁబిల్లులపిల్లలు నల్లసద్దితిం
బరఁగెడు మేలిమూలికలవల్లులు పిక్షణపర్వకారిబం
ధురమృగరాణ్మతల్లులు వినూత్నతరంబులు గొల్లలై తగన్
సరవిని గానఁబిచ్చి మహిజానికి నిట్లని రంతయుం దగన్.

బాలకాండము.

శా. దేహం బస్థిర మెల్లవారలకు ధాత్రీభాగమం దేల యి
ట్లూహాపోహలు చేయ నీతనికి ను న్నుత్సాహియై యిత్తునం
దాహాపల్కితి విస్రబ్ధములు పెక్కాడంగ యుక్తంబులో
నా హేమాంగము దీని నమ్మి యిటు లేలా దబ్బఱ ల్పల్కఁగన్.

బాలకాండము.

మ. భరతుం డెవ్వఁడు కైక యెవ్వతె ధరాపాలుండు తా నేమి త
ద్వరయుగ్మం బన నేది నాఁ శితతీవ్రస్ఫారఖడ్గంబుచే
భరతుం ద్రుంచి ధరాస్థలంబునకు నిన్ బట్టంబు నేఁ గట్టెదన్
ధరణీమండలి నెల్లమానవులు మోదం బూని కీర్తింపఁగన్.

అయోధ్యాకాండము.

మ. నిను మన్నించి మదాత్మజున్ రఘువరున్ నేనిట్లు కోల్పోయితిన్
నినుఁ బెండ్లాడి సమస్తభూమిజనము ల్నీచాత్ముఁ డీతం డనం
గ నవేలంబగుసంద వత్తిలితిఁ గైకా సూర్యవంశంబు నీ
దునిమిత్తంబున నెన్నిభంగులఁ జెడెన్ దోషంబు నిన్ జూడఁగన్.

అయోధ్యాకాండము.

ఉ. ఉత్తములైనరాజవరు లుద్ధురబాణకృపాణచాపముల్
హత్తి ధరించు టెల్ల సభయాత్మకులై శరణన్నవారి ను
ద్వృత్తరలీలఁ గావఁగ రణాంగణమం దెదిరించినట్టియు
న్మత్తరిపుప్రకాండముల మర్దనచేయఁగఁ గాదె యెన్నఁగన్.

అరణ్యకాండము.

ఉ. ఆచెలువంపుజొక్కపుటొయారము లాజిగిప్రాయ మాఘన
శ్రీచణరూప మాతళుకుఁ జెక్కులచక్కఁదనంబు లామహా
ధీచతురత్వ మాపలుకుఁ దేనియ లాగమనంబు లావిభా
ప్రాచురి యెక్కడం గనుట పల్కుట వింటయు లేదు రావణా.

ఆరణ్యకాండము.

శా. నీకున్ శత్రుఁడఁ గాను భవద్రిపులతో నే సఖ్యముం జేయ నే
జోక న్నీకపకారిగా నకట యిచ్చోఁ జాలనిర్హేతుకం
బై కన్నట్టిరుష న్నను న్నిశితతీవ్రామోఘబాణంబుచే
వే కూల్పంగ నిమిత్త మేమి యిది దోర్వీర్యంబె శ్రీరాఘవా.

కిష్కింధాకాండము.

ఉ. అంగదుఁ గాంచి యోతనయ యాత్మ వగం దురపిల్లఁ బోకు ని
న్నుం గడు నాదుమాఱుగఁ గనుంగొను నీరవిపుత్త్రుఁ డిమ్మహో
త్తుంగభుజప్రతాపనిధితో నెడఁబాయక యుండినన్ జయా
భంగురభోగభాగ్యములఁ బ్రస్తుతి కెక్కి రహింతు వన్నిటన్.

కిష్కింధాకాండము.

ఉ. బంగరుమేలినిగ్గు గలపర్వతమోయన నైజగాత్ర ము
త్తుంగముగాఁగఁ బెంచి మఱిత్రోడనె పాశము లెల్ల నూడ్చి సా
రంగపరంపరం గదుము రాజితసాహససింహమో యనన్
బొంగుచు వెంటవచ్చుదితిపుత్త్రులఁ బోవఁగఁ దోలి రోషియై.

సుందరకాండము.

ఉ. రామకరాగ్రముద్రిక ధరాసుతచేతి కొసంగి రాఘవ
క్షేమము తెల్పియాజనని కేవలశోకము మాన్పి లంక వా
లామితహవ్యభుక్శిఖల నంతయు దగ్ధము చేసి సీతచూ
డామణిఁ గొంచువచ్చితివి దటాలున నిప్పు డటంచుఁ బల్కినన్.

సుందరకాండము.

శా. కామాదుల్ గడు నీమదిం బెనగొనంగా నాదు సీతీరిత
శ్రీమద్వాక్యము నీకుఁ బథ్య మగునే శ్రీరామభీమాగ్నికీ
లామేయాంబకరాజి నీతలలు నుగ్గాడంగ నావేళలన్
నామాట ల్మది నీకుఁ బథ్య మగు నన్నన్ రావణుం డుగ్రుఁడై.

యుద్ధకాండము.

ఉ. సర్వసురౌఘముల్ నను భుజాబలము ల్విడనాడి కొల్చు టా
సర్వవికుంఠు విష్ణుఁడు నిజంబుగ నాతఁ డెఱుంగఁడే మహా
గర్వితవిష్ణుఁ డొక్కరుఁడె కాఁ డల బ్రహ్మ యెదిర్చె నేని నే
నొర్వక యుగ్రబాణముల కొక్కట నాహుతి చేసి ప్రేల్చెదన్.

యుద్ధకాండము.

---

౫౫. అందుగుల వెంకయ్య

ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; అందుగుల సూరన్నకొమారుఁడు. ఈకవి కృష్ణదేవరాయల యల్లుఁ డయిన రామరాజుతమ్ముఁడగు తిరుమలదేవరాయని మనుమని మనుమఁ డగు కోదండరామరాజు కాలములోనుండి యాతనిపేర రామరాజీయ మను నామాంతరముగల నరపతివిజయమను గ్రంథమును జేసెను. ఈగ్రంథమునందు రామరాజు పూర్వులయిన నరపతులచరిత్రమును విశేషముగా రామరాజుయొక్క చరిత్రమును జెప్పఁబడియున్నది. రామరాజు ౧౫౬౫ వ సంవత్సరమున తాళికోట యుద్ధములో మహమ్మదీయులచేతఁ జంపఁబడెను. తదనంతరము మూడుతరములు గడచిన తరువాత నీగ్రంథము రచియింపఁబడిన దగుటచేత, ఇది ౧౬౫౦ వ సంవత్సరప్రాంతమున రచియింపఁబడినట్లు చెప్పవచ్చును. రామరాజు గుత్తి, పెనుగొండ, గండికోట, కందనూలు,

ఆదవేని మొదలయిన ప్రదేశములు గెలిచిన ట్లీక్రిందిపద్యమునఁ జెప్పఁబడినది—

గీ. సకలవిభు తిమ్మరాజుసేనలను ద్రుంచి
గుత్తి పెనుగొండ మఱిగండికోట కంద
నూలుపుర మూదవే నవలీల గెలిచి
తొలుఁదొలుత రామనృపతి దోర్బలము మెఱసి.

ఈపుస్తకమునం దీరామరాజు నిజాముల వలన నహమదాబాదు గొనుట మొదలయిన మహమ్మదీయులతోడి యుద్ధములు కొన్ని వర్ణింపఁబడినవి. ఈరామరాజు పేరునకు సదాశివదేవరాయని మంత్రి యని వ్యవహరింపఁబడినను, సింహాసనమునకు వచ్చినప్పుడు సదాశివ రాయలు బాలుఁడగుటచేతను కర్ణాటకరాజ్యము నచ్యుతదేవరాయల యనంతరమున నాక్రమించుకొన్న సకలము తిమ్మరాజును బాఱఁదోలి సదాశివదేవరాయల రాజ్యమును స్థాపించినవాఁడగుటచేతను క్రీస్తుశకము ౧౫౪౨వ సంవత్సరము మొదలుకొని ౧౫౬౫వ సంవత్సరము వఱకును నితఁడే రాజ్యపరిపాలనము చేసెను. ఇతఁడు సలకము తిమ్మయను గెలిచిన కథను సూచించు నితనిప్రతాపము నరపతివిజయమునం దీక్రిందిరీతిని వర్ణింపఁబడినది—

చ. ఎలమిని రామరాజవసుధేశుప్రతాప మవార్యమై మహిన్
జెలువుగ నింపఁబర్విశశిశేఖరదివ్యమహాశితాశుగ
జ్వలనశిఖాసముత్కరముచందము నందమునొందె నెంతయున్
సకలయ తిమ్మయప్రముఖశత్రుపురంబుల నెల్ల నారయన్.

ఈరామరాజుతండ్రియైన శ్రీరంగరాజు కృష్ణదేవరాయల తండ్రియైన నృసింహరాజునకు కర్ణాటకరాజ్యమును నిలుపుటలో సహాయుఁడుగా నుండినట్లు కానఁబడుచున్నది. ఈశ్రీరంగరాజుయొక్క శౌర్యము నరపతివిజయములో నీక్రింది పద్యమున వర్ణింపఁబడినది—

సీ. కమువిజాపురవరకామినీ గర్భముల్ భేదించు నెవ్వానిభేరిరవము
దామిడిఁ బోయి నిజాముపట్టణముల ధూళిగాఁ జేయు నేదారబలంబు
గోలకొండవజీర్లకోటలకాయముల్ చించు నేరాజేంద్రుచేతికత్తి
సకలభూపాలకాస్థానసన్నుతిఁ గాంచి వెలయు నేశూరునివిజయలక్ష్మి
యతఁడు కేవలనృపతియే యఘవిదూర
చర్యుఁ డాశ్రితరక్షావిచక్షణుండు
జీర్ణకర్ణాటభూపునర్జీవనుఁడు
రమ్యగుణశాలి శ్రీరంగరాయమౌళి.

ఈనరపతివిజయము కవిత్వముకంటెఁ జరిత్రమును జెప్పుటయం దెక్కువ ప్రసిద్ధమైనదైనను, కవిత్వముకూడ రసహీన మయినదికాదు. కవిత్వరీతిని దెలుపుటకయి రామరాజీయములోని రెండు పద్యముల నిందుదాహరించుచున్నాను—

ఉ. ఇమ్మహిసోమదేవమనుజేంద్రుప్రతాపము నిండి దిక్కులం
బమ్మినఁ జూతపోతనవపల్లవబింబఫలారుణాంబుజా
తమ్ము లటంచుఁ గోకిలకదంబము కీరచయంబు చంచరీ
కమ్ములు క్రమ్ముచుండు నొడికంబుగ భ్రాంతివహించి పల్మఱున్.

చ. అతివిభవంబునన్ దితిసుతాహితరాజు మహాపరాక్రమో
న్నతి మృగరాజు సోయగమున న్నలరాజు సమస్తధర్మప
ద్ధతి నలధర్మరాజు పటుధైర్యమునన్ గిరిరాజు వాక్ప్రశ
స్తత ఫణిరాజు నిర్దళితశాత్రవరా జగుబుక్కరాజులన్.

56. కాకునూరి అప్పకవి

ఇతఁడు వైదికబ్రాహ్మణుఁడు, పదునేడవ శతాబ్దమధ్యమునం దుండిన లక్షణవేత్త. ఈకవి యాంధ్రశబ్దచింతామణి యనుపేరిట సాధారణముగా నప్పకవీయ మని వాడఁబడెడు లక్షణగ్రంథమును పద్యకావ్యమునుగా రచించెను. ఇతఁ డెనిమిదాశ్వాసముల గ్రంథమును జేయునట్లు ప్రతిజ్ఞ చేసినను, అయిదాశ్వాసములు మాత్రమే యెల్లయెడలఁ గానఁబడుచున్నవి. తక్కిన యాశ్వాసములు చేయకమునుపే యితఁడు మృతినొంది యుండవచ్చును. ఈయప్పకవీయమునందు ఛందోవిషయము సమగ్రముగా నున్నను, వ్యాకరణవిషయ మత్యల్పముగా నున్నది. ఇప్పు డున్నభాగములో సంజ్ఞా సంధి పరిచ్ఛేదములు మాత్రమే తెనిఁగింపఁబడినవి. ఇతఁడు బహుగ్రంథములు శోధించినవాఁడే యయినను, పూర్వగ్రంథములనుండి యితఁ డుదాహరించిన పద్యములన్నియు దాదాపుగా లింగమగుంట తిమ్మన్న మొదలయినవా రితనికి ముందు చేసినలక్షణగ్రంథములలోఁ గానఁబడుచున్నవి. ఇతఁడు తనకాలపువారయినకవుల గ్రంథములనుండి విశేషముగాఁ బద్యములను జేకొని యున్నాఁడు. ప్రక్రియాకౌముదియు నాంధ్రశబ్దచింతామణియు నని నామాంతరములు గలనన్నయభట్టీయము బాలసరస్వతికాలమువఱకు నెవ్వరు నెఱుఁగరు. అది నన్నయభట్టారకవిరచితమనియు, వేములవాడ భీమకవి దానిని గోదావరిలో గలుపఁగా నేనూఱుసంవత్సరములయిన తరువాత సారంగధరుఁడు దానిని దెచ్చి బాలసరస్వతి కిచ్చెననియు అప్పకవి కలగనెనఁట! అటు తరువాత నొకబ్రాహ్మణుఁడు దానిని తనకుఁ దెచ్చి యీఁగా తెనిఁగింప నారంభించెనఁట! ఈగ్రంథారంభమునకుఁ బూర్వమునం దప్పకవి యేదో తెలుఁగున ఘనకావ్యము చేయ సంకల్పముపూనిన ట్లీక్రింది పద్యములవలన దెలియవచ్చుచున్నది—

క. అని యిష్టదేవతాస్తుతి
యును సకలకవీంద్రులనుతియును గురునతియున్
వినయమున సలిపి తెలుఁగున
ఘనకావ్యం బొకటి సేయఁగాఁ దలఁచుతఱిన్.

సీ. ధాత రెండవపరార్థమున నాదిదినంబుపగట వరాహకల్పంబునందు
మహితవైవస్వతమనువేళ దేశంబు లర్థింపనైన మహాయుగమునఁ
గలిసమయంబున దొలిచరణంబున మానితంబగుచాంద్రమాసమునను
శాలివాహనశకమున గజ శైల శర సుధాకిరణులసంఖ్యనడవ
నంగజాబ్దంబునను దక్షిణాయనమున। జలధరర్తువు మొదటిమాసంబునందు
బహుళమున దేవకికిఁ జక్రపాణిపుట్టి। నట్టియష్టమి చనుదేరనధికభక్తి.

*　　*　　*　　*　　*

క. కల్పోక్తమార్గమున సం। కల్పము గావించి గోపికావిభుపూజల్
సల్పిమది నతనిపదములు। నిల్పి పురాణార్థగోష్ఠి నిశ గడపునెడన్.

గీ. నుదుటఁ గస్తూరి తిలకంబు పౌదలువాఁడు
తలఁచిచూచిన నాకులదైవ మగుచుఁ
బొలుచు నాకులదైవంబుఁ బోలువాఁడు
నిలిచె నొకరుఁడు నాదుముంగలను గలను.

ఇష్టదేవతావందనాదులును గురుదేవతాస్తుతియుఁ జేసి తెనుఁగున ఘనకావ్యమొకటి చేయ నుద్యమించి శాలివాహనశకము ౧౫౭౮వ దగు మన్మథనామసంవత్సర శ్రావణ బహుళాష్టమినాఁడు సంకల్పముచేసి కామెపల్లెదేవాలయములో రాత్రి పురాణగోష్ఠిని గడపుచుండఁగా శ్రీకృష్ణుఁడు కలలోవచ్చి యాంధ్రశబ్దచింతామణి నశించిన కథ చెప్పి—

చ. రమణను సత్కవీంద్రులు పురాణచయం బితిహాసపంక్తి కా
వ్యములును దొల్లియొన నిపుడైనను ముంగలనైన దీని సూ

త్రములను దక్క వేఱొకవిధంబున నాంధ్రముఁ జేయఁజాలమిన్
క్షమఁ దెనిఁగింపు దీన నవి సర్వముఁ జేయుఫలంబు నీ కగుఁగా.

దానిని తెనిఁగింప నానతిచ్చెనఁట! శ్రీకృష్ణుఁడు స్వప్నదర్శన మిచ్చుటకుఁ బూర్వమే గ్రంథమును జేయ సంకల్పించెనో చెప్పలేము. ప్రక్రియాకౌముది యనఁబడెడి యీ యాంధ్రశబ్దచింతామణి బాలసర స్వతి కృతమనియు దానికి గౌరవము కలుగుటకయి యీ కథ కల్పింపఁ బడినదనియు నే నీవఱకే చూపియున్నాను. పయి పద్యములనుబట్టి యీ పుస్తకము శాలివాహనశకము ౧౫౭౮ వ సంవత్సరమునందనఁగా క్రీస్తుశకము ౧౬౫౬ వ సంవత్సరము నందారంభింపఁబడి ౧౬౬౦ వ సంవత్సరప్రాంతమున కింతవఱకుఁ జేయఁబడియుండును. అప్పటికప్పకవి కవసానకాలము తటస్థించినందున గ్రంథము సమాప్తినొంది యుండక పోవచ్చును.

సీ. జగతి నాపస్తంబశాఖోక్తషట్కర్మపద్ధతిఖండనిబంధనంబు
కాలబాలార్ణవాఖ్యజ్యోతిషగ్రంథసంహితానుశ్లోకసంగ్రహంబు
శ్రీమదనంత ప్రసిద్ధమహావ్రతకల్పకథాంధ్రోక్తి కావ్యరచన
శ్రీనగాధీశసుశ్లేషనింద్యాస్తుతిభావగర్భితసీసపద్యశతము
లలితకవిల్పకాఖ్యానలక్షణంబు । మహితసాధ్వీజనౌఘధర్మద్విపదము
నంబికావాదనామకయక్షగాన । కృతియుఁ జేసితి నాకునూరికులయప్ప.

అను పద్యమువలన నప్పకవి యీ గ్రంథమును రచించుటకుఁ బూర్వము కొన్ని సంస్కృతాంధ్ర గ్రంథములను రచించినట్లు తెలియ వచ్చుచున్నది గాని యిప్పుడా గ్రంథములు లభించుట యరుదు. ఈతని కవిత్వము సుగమమైన మృదుమధురపాకము గలదిగానున్నది. అప్పకవికిఁ బూర్వమునందు రకార ఱకారములకు యతిప్రాసమైత్రి కలదు లేదను నభిప్రాయభేద మున్నను, "నాన్యేషాంవై ధర్మ్యం లఘ్వలఘూనాం

రయోస్తు నిత్యం స్యాత్" అన్నది బాలసరస్వతి సూత్రమనుకోక వాగను శాసనసూత్రమని భ్రమపడి

గీ. చెల్లునని మున్ను భీమన చెప్పెననుచుఁ
గలుపుదురు రేఫములును ఱకారములును
దుష్టకవు లవి యొకటైనఁ దొంటిపెద్ద
లందఱును నేల విభజింతు రని తెలియరు.

అని రేఫఱకారములకు యతిప్రాసమైత్రిఁకూర్చువారు దుష్టకవు లని యప్పకవి దూషించి యున్నాఁడు. రకారద్వయమైత్రిని నిషేధించిన బాలసరస్వతియే తద్భేదము గ్రహింపలేక చంద్రికాపరిణయములోని యీ క్రింది పద్యమునందు రేఫఱకారములకు విశ్రమము కూర్చెనాఁడని కూచిమంచి తిమ్మకవి వ్రాసియున్నాఁడు—

ఉ. అక్కమలేక్షణ న్నవినయంబుగఁ గాంచుము నానుమాటుగా
మ్రొక్కుము నేమమా భువనమోహిని నీకనిపల్కు మారిచేఁ
జిక్కితి వేగఁ బ్రోవుమని చెప్పుము పొమ్మికఁ దేటిరాయ నీ
చక్కలమాటున న్ననుభరించి లభింపుము కీర్తిపుణ్యముల్—

చంద్రికాప.

రేఫరకారమైత్రికి సమ్మతింపనివారవి రెండును నేకాక్షరమే యందురా? భిన్నాక్షరము లందురా? ఏకాక్షరమేయయి లఘ్వలఘు రూపములుమాత్రమే యయినయెడల, యలవల లఘ్వలఘు రూపములవలెనే వీనికిఁ గూడ మైత్రి యేల యుండరాదు? భిన్నాక్షరము లనెడు పక్షమున, రయోస్తు నిత్యం స్యాత్తనుచోటనేకశేషవృత్తి యెట్లు కుదురును? అవి యొకటైనఁ దొంటిపెద్దలేల విభజింతురని యప్పకవి యడిగిన ప్రశ్నమునకు యలవల నేల విభజించిరో యాహేతువుచేతనే యని చెప్పుటయే తగిన యుత్తరమగును.

చరిత్రము తెలియని యితరకవుల గ్రంథములు

అప్పకవీయాది లక్షణగ్రంథములలో నుదాహరింపఁబడిన గ్రంథము లిప్పుడనేకములు గానరాకున్నవి; కొన్ని గ్రంథములపేరులు తెలిసినను గ్రంథకర్తలపేరులు సహితము తెలియరాకున్నవి. (అమరేశ్వరుని గొప్ప కవినిగా పూర్వకవులనేకులు స్తుతించియున్నారు. ఈతఁడు చేసిన గ్రంథము లేవియో తెలియరావుగాని కూచిమంచి తిమ్మకవి తన సర్వలక్షణసార సంగ్రహమునందుఁ జిమ్మపూడి యమరేశ్వరుని విక్రమసేనము లోనిదని యీ క్రిందిపద్యము నుదాహరించియున్నాఁడు)—

సీ. నీర నగ్గియునికి యారయ విస్మయం
బనుచు బాడబాగ్నికడలి యుప్పు
రంబుఁజొచ్చెనొక్కొ రత్నాకరముమఁఖ
లసఁగ జెలువ మమరునాషణములు.

ఈ ప్రకారముగానే హూణశకము ౧౬౨౦ వ సంవత్సరమునకుఁ బూర్వమునందున్నట్టు నిశ్చయముగా తెలిసిన కొందఱుకవుల గ్రంథనామములు తెలిసినను, నాకాగ్రంథము లిప్పుడు లభింపనందున గ్రంథకర్తల చరిత్రమును గూర్చికాని వా రుండినకాలమును గూర్చికాని నేనిప్పుడేమియు వ్రాయుటకు శక్తుఁడను గాకున్నాను. గ్రంథకర్తల నామములు సహిత మనేకములు తెలియరాలేదు. తెలిసినవారు నాకావిషయమును తెలుపుదురన్న యపేక్షతోను, ఇతరు లట్టి గ్రంథసంపాదనమునకయి కృషిచేయుదురన్న విశ్వాసముతోను, ఆ గ్రంథముల పేరులను మాత్ర మిందుఁజెప్పి వానిలోనుండి దొరికిన పద్యముల నుదాహరించుచున్నాను—

౧. కవులషష్ఠము—ఇది యెవ్వరు చేసినదో తెలియలేదు. పుస్తకముయొక్క పేరునుబట్టి యిది యనేక కవులుచేరి చేసినట్లూహింపఁదగియున్నది. "తృతీయవర్గసరళమునకు రాచమల్లువారి షష్ఠస్కంధ

ములోఁ బ్రయోగ"మని యప్పకవి వ్రాసియుండుటచే (నిది రాచమల్లు వారను నింటిపేరుగల కవులచే రచియింపఁబడినట్టు స్పష్టమగుచున్నది. ఆకవు లన్నదమ్ములయి యుండవచ్చును.)

శా. శ్రీరామామణి సీత నాథునియురస్సీమ న్నిజచ్ఛాయఁ గ
న్నారం గన్గొని యాత్మ నన్యవనితాశ్లేష్యం బూనఁ దత్కంధరన్
హారం బున్చుచు నింకఁ జూడుమనఁ గా నాటం ద్రపం జెందఁ జే
ల్వారుగా రాముఁడు ప్రోచుఁగాత మిఁకఁ దమ్మామాధీశుతిమ్మాధిపున్.

శా. చండాంశుప్రభ చిక్కతిమ్మయతనూజా తిమ్మ విధ్వస్తపా
షండం బైనత్రిలింగభాగవతషష్ఠస్కంధకావ్యంబు నీ
కుం డక్కెం జతురాననత్వగుణయుక్తు ల్మీఱ వాణీమనో
భాండారోద్ధత చూరకారబిరుదప్రఖ్యాతి సార్థంబుగన్.

అని కవిసంశయవిచ్ఛేదములోను, సర్వలక్షణసారసంగ్రహము లోను గవులషష్ఠమునుండి యుదాహరింపఁబడిన పద్యములనుబట్టి యీగ్రంథము తిమ్మయపుత్రుఁడయిన తిమ్మయ కంకితము చేయఁబడి నట్టు తెలియుచున్నది. ఈతిమ్మయ యచ్యుతదేవరాయని మంత్రులలో నొకఁ డయిన ట్లొకానొకరు వ్రాసియున్నారు. అదియే నిజమైనపక్షమున బమ్మెరపోతరాజకృతభాగవతము శిథిలముకాఁగా పోయినభాగములలో నొకటియైన యీషష్ఠస్కంధమును ౧౫౩౦ - ౪౨ సంవత్సరముల మధ్యను రాచమల్లువారు చేసియుందురు. దీనియందు శృంగారరస మధికముగా వర్ణింపఁబడినందున దీనికే శృంగారషష్ఠమని నామాంతరము కలిగియున్నట్టు కనఁబడుచున్నది. అప్పకవ్యాదులుదాహరించిన శృంగారషష్ఠములోని కొన్నిపద్యముల నిందుఁ బొందుపఱుచుచున్నాను —

గీ. తల్లియును దండ్రి దైవంబు తలఁప గురుఁడ
కాఁడె? యితఁ డేమిచేసినఁ గనలఁ దగునె?

నాస్తికాధమ యోరి యన్యాయవృత్తి
నాస్తికత్వం గురోః పరమ్మనఁగ వినవె. (అప్పకవి)

మ. పదము ల్తొట్రిలఁ గానుఁదీఁగ చలియింపం గేశము ల్తూలఁ బ
య్యెద వక్షోరుహపాళిఁ జేరఁ గనుదోయిన్ బాష్పము ల్గ్రమ్మ గ
ద్గదకంఠమ్మున వాక్యము ల్తడఁబడఁ దద్దేహముం జొచ్చి యా
సుదతీరత్నము కాంచె బాలుని మనశ్శోకానలజ్వాలునిన్. (తిమ్మన్న)

చ. వయసునఁ బిన్నవాఁడ సభివంద్యుఁడ నౌదునె మీకునంచు సం
శయ మొనరించె దేని మునిసత్తము కార్యములందునాగమా
ధ్యయనములందు మంత్రములయందుఁ గనిష్ఠుఁడ యేని పెద్ద ని
శ్చయ మిది వానియం దఖిలసన్నుత మైనవిద్య గల్గినన్.
(అ. సూరన్న)

౨. శ్రీరంగమహాత్మ్యము - ఇది భైరవకవిప్రణీతము. కవిగజాంకుశమును రచియించిన భైరవకవి యితఁడేయయి యుండవచ్చును—

చ. పరిచరుగాఁగ నేలె నిరపాయచరిత్రునిఁ బాపకానన
స్ఫురదురుపీతిహోత్రుని సముజ్జ్వలమేరుసమానగాత్రునిన్
బరమపవిత్రునినిన్ మునిసుపర్వవరస్తుతిపాత్రునిన్ మనో
హరఫలశేముషీకబళితాంబుజమిత్రుని వాయుపుత్రునిన్.
(అప్పకవి)

ఉ. గందపుఁగొండనెత్తములకందున నేలకితీవయిండ్లలోఁ
గెందలిరాకుపాన్పున సుఖించి నితాంతరతిశ్రమంబునం
జెందినచెంచుగుబ్బెతలచెక్కులఁ జిమ్ము జవాదివాసనల్
విందులుచేయుచు న్మెలఁగు వేకువఁ గోమలగంధవాహముల్.
(లిం. తిమ్మన్న)

ఉ. ఆకులవృత్తి రాఘవశరాగ్రమునందుఁ దృణాగ్రలగ్నసీ
రాకృతి వార్ధి నిల్చుట దశాననుఁ డీల్గుట మిథ్యగాదె వా

లీఁకథలు చెప్పుకున్నఁ గృతిలేనినరేశ్వరవర్తనంబు ర
త్నాకరవేష్టితావని వినంబడఁ దాతఁడు మేరు వెత్తినన్.

(కూ. తిమ్మన్న)

౩. త్రైశంకోపాఖ్యానము — దీనిని సింగరన్న రచియించినట్లప్పకవి చెప్పుచున్నాఁడు. ఇందు హరిశ్చంద్రునికథ చెప్పఁబడి యుండవలెను —

క. ఝషకేతువిద్విషునకుఁ గి
ల్బిషపర్వతవృషునకమృతవిషనిధిజామా
త్రిషునకు ఋషిపూజితునకు
విషమాక్షున కింద్రముఖదివిజపక్షునకున్.

క. ఢుంకేరభైరవుని సితి
కంఠు విశాలాక్షి దండకరు జాహ్నవి వై
కుంఠపతి గుహాలుని లోలా
ర్కుం శేవలుమీఱ భూవరుఁడు పొడగనియెన్.

౪. శమంతకమణి చరిత్రము — ఇది వణుకూరి గుర్వారాజుచేఁ జేయఁబడినదని యప్పకవి వ్రాయుచున్నాఁడు —

ఉ. కాయవచోమనస్స్థలనకల్పితదోషము లెల్లఁ బాయఁగా
నాయెదలోన నిత్యము సనాతనధర్మముఁ బూని యర్మిలిం
బాయకకొల్తు రామనరపాలనిరంతరసౌఖ్యదాయి సీ
తాయి సమస్తశోభనవిధాయి మహాఫలసిద్ధిదాయి గన్.

౫. శశిబిందు చరిత్రము —

క. నాకౌకసులైనను నీ
ఛాకను నిల్చెదరె కటకటా మముబోంట్లన్
జేకొని సంరక్షింపక
నీకిటు లుచితంబె యురవణింప నరేంద్రా.

క. నూవుంబూవును సంపెగ
పూవుగెలిచి బిరుదుముత్తెపుంజల్లి దగం
దా వైచె నవఁగ ముంగర
త్రో వనరుహనేత్రనాస తుల లే కొప్పున్.

౬. ✓చారుదేష్ణచరిత్రము—

గీ. అచ్చరలు నందనంబునఁ బెచ్చుకొనుసు
రాగసుమములు హర్మ్యవాతాయనముల
చెంతఁ గాలూఁచి తత్పురస్త్రీల కొసఁగి
వేఁడికొనిపోవుదురు కప్రపిడియములు.

క. ఈలలన వేలుపుంజవ | రాలో యచ్చరయొ కిన్నరవధూమణియో
వ్యాళాంగనయో కా కీ | భూలోకస్త్రీల కిట్టిపొంకము కలదే ?

౭. ✓భేతాళపంచవింశతి—

ఉ. చోరగ్రాహగజాంకుశంబు నలినీశుంభన్మదేభంబు ది
జ్నారీమూర్తికదర్పణంబు రజనీకాంతామనోహారి వి
స్ఫారాంభోధితరంగకారి గిరిజాప్రాణేశభాస్వజ్జటా
శ్రీరమ్యాభరణంబు చంద్రుఁ డుదయించెన్ సుప్రభాభాసియై.

ఉ. ఆవిధవాశిరోమణి రయంబునఁ బోయి రహస్యవేళఁ బ
ద్మావతిఁ గాంచి రాజసుతుఁ డాడినమాటలు విన్నవింప ల
జ్జావతి దానిఁ జూచి ఘనసారకరంబుల గంధపాళికల్
వావిరి వ్రేసినన్ జరఠవారిజలోచన వచ్చె ఖిన్నతన్.

౮. ✓చమత్కారరామాయణము—

క. ఓశశిముఖి లోపాము
ద్రేశుఁడు కలశభవుఁ డుండు నిట నతఁడు తపో
రాశి మహాత్ముఁడు మును పా
పోశనముగఁ గొనియె సాగరాంబువు లెల్లన్.

క. నిన్నుఁ జెఱఁగొన్న హైహయు
కన్నన్ వీర్యాధికుఁడగు భార్గవు లీ
ల న్నిర్జించినరాముని
కన్నను శూరుండు ముజ్జగంబులఁ గలఁడే ?

౯. శేషధర్మములు—

క. పెట్టఁడు నారకమార్గం
బెట్టి మహాక్రూరకర్మఁ జేసియుఁ దుద ని
ట్టట్టనక నెమ్మనంబున
నెట్టన వారిఁ దలఁచఁ గలిగెనేని మహాత్మా.

౧౦. విజయసేనము—

ఉ. వల్లభుఁ డేగు దుర్లభుఁడు వానిదెసం దగు లూఁది యిమ్మెయిన్
దల్లడ మందెదేల యుచితస్థితికిన్ ననుఁ బాసఁజూచినన్
దల్లియు బంధులోకమును దండ్రియు నేమనువా రెఱింగరే
మల్లమ యిట్లు నీకుఁ దగునో తగదో పరికించి చూడుమా.

౧౧. దేవీవిజయము—

గీ. వాక్శ్రీనేత్రాంగనాశచీశక్తు లధిక
సంభ్రమంబునఁ గుంభనికుంభదైత్య
హంత్రిఁ బూజింపుదురు త్రయీమంత్రములను
స్తోత్రములుచేసి మంగళారాత్రికలిడి.

౧౨. మధుసేనము—

క. పోనుద్యోగము చేసిన । ప్రాణంబా యింకనీకుఁ బాథేయం బీ
మానినిమందస్మితమధు । రాననచంద్రికలు గ్రోల నరుగుము పిదపన్.

౧౩. అనిరుద్ధచరిత్రము — కనపర్తి యబ్బయామాత్యప్రణీత మయిన యీపేరుగల యాధునిక ప్రబంధ మొకటి కలదుగాని యీక్రింది పద్యము పూర్వగ్రంథములోనిది—

చ. నెలవుల నువ్వుతిల్లి సరినిక్కి మొనల్తల లెత్తి క్రొవ్వి లో
బలిసి సమంబులై బిగిసి వట్రువలై మెఱుఁ గెక్కి చక్కనై
కెలఁకులఁ బిక్కటిల్లి చెలికిం గడునొప్పఁ గుచంబు లొప్పుకు
ప్పలుగను మన్మథుండు సరి వాఁలగఁ ద్రాసునఁ దూఁచెనోయనన్.

౧౪. శూద్రకరాజచరిత్రము—

మ. సమదేభారి మసంగిపై నుఱికినన్ శంకించి భూపాలుఁ డో
లము గన్నం గని దాని శూద్రకుఁడు లీలం ద్రుంచె నె నప్పు డ
త్యమలోద్యత్ప్రసవార్థినై కుసుమగంధఘ్రాణలుబ్ధభ్రమ
ద్భ్రమరభ్రాజితపాటలీవిటపమధ్యస్థుండనై చూచితిన్.

౧౫. ఆదినారాయణచరిత్రము—

ఉ. శ్రీయుతలోచనోజ్జ్వలమరీచులు భానుమరీచివిస్ఫుర
త్తోయజకాంతితోఁ దులఁదూఁగెడుపచ్చనిపట్టు గట్టి య
త్యాయతశంఖచక్రరుచిరాసిగదాధరుఁ డేఁగుదెంచె నా
రాయణుఁ డార్తరక్షణపరాయణుఁ డాకరిరాజుపాలికిన్.

౧౬. పంచబాణవిలాసము—

క. చిత్తంబుల రంజిల్లుచు
ముత్తైదువ లపుడు గదిసి పూవిల్తునకున్
బిత్తరికిఁ బలుదెఱంగుల
నెత్తిరి హారతులు పౌరులెల్లఁ జెలంగన్.

౧౭. పద్యుమ్నోపాఖ్యానము—

క. పంచశరుం డపు డని చా
లించి మహాప్రధనభూమి నీక్షించి మదో
దంచితుఁడై శంఖము పూ
రించెం గులగిరులు దిక్కరివ్రజ మదరన్.

ఆంధ్రకవుల చరిత్రము.

తృతీయ భాగము

ఆధునిక కవులు

By

K. VEERESALINGAM

వెల రు. 3—8—0

రాజమహేంద్రవరము
ఆవంతీ ప్రెస్ నందు ముద్రింపబడినది.
జనవరి, 1950

విషయసూచిక.

		పుట
1.	హరిభట్టు	1
2.	ఒడ్డెపూడి పెద్దయ్య	6
3.	కాకమాని మూర్తి	9
4.	కామేశ్వర కవి	14
5.	వెణుతురుపల్లి విశ్వనాథకవి	17
6.	నూతనకవి సూరన్న	18
7.	సముఖ వేంకటకృష్ణప్పనాయకుడు	22
8.	రోసనూరి వేంకటపతి	23
9.	పైడిపఱ్ఱి వేంకటపతి	27
10.	వెలగపూడి కృష్ణయ్య	29
11.	శేషము వేంకటపతి	32
12.	కూచిమంచి తిమ్మకవి	39
13.	వక్కలంక వీరభద్రకవి	56
14.	కూచిమంచి జగ్గకవి	61
15.	కొవలె గోపరాజు	67
16.	కొడిచెర్ల శ్రీనివాసకవి	69
17.	పట్టమట్ట సోమనాథకవి	70
18.	దివి రమణకవి	72
19.	కోడూరి వేంకటాచలకవి	73
20.	ఏనుగు లక్ష్మణకవి	77
21.	నెల్లూరి వీరరాఘవకవి	89
22.	నంజరాజు	92
23.	కోటి వెంకనార్యుడు	94
24.	అడిదము సూరకవి	95
25.	మంగళగిరి ఆనందకవి	111
26.	కనుపర్తి అబ్బయామాత్యుడు	114
27.	కాణాద పెద్దనసోమయాజి	119

		పుట
28.	కుందుర్తి వేంకటాచలకవి	123
29.	ఈదురుపల్లి భవానిశంకరుడు	126
30.	ధూర్జటి వేంకటరాయకవి	128
31.	అయ్యల రాజు – అయ్యల భాస్కరకవులు	131
32.	అజ్జరపు పేరయలింగము	134
33.	మరింగంటి సింగరాచార్యులు	139
34.	అనంతరాజు జన్నయకవి	141
35.	ముద్దు పళని	142
36.	కంకంటి పాపరాజు	144
37.	పుష్పగిరి తిమ్మన్న	148
38.	ధరణిదేవుల రామమంత్రి	151
39.	దిట్టకవి నారాయణకవి	154
40.	అత్తలూరి పాపకవి	166
41.	కస్తూరి రంగకవి	170
42.	ఆలూరి కుప్పనకవి	171
43.	పింగళి ఎల్లనార్యుడు	175
44.	చింతకుంట కోదండరామకవి	179
45.	కైప మాయనకవి	180
46.	వెలిదండ్ల వేంకటపతి	182
47.	పట్టమెట్ట సరస్వతిసోమయాజి	183
48.	అవుధూరి కిచ్చయ్య	185
49.	తకెళ్లపాటి లింగన్న	187
50.	గుడిపాటి కోదండపతి	189
51.	మల్లవరపు వాలేశ్వరుడు	192
52.	చింతలపల్లి వీరరాఘవుడు	194
53.	రేచర్ల మాధవరాయకవి	196
54.	అవియాది గణపతిదేవుడు	197
55.	వేంకటాచార్యుడు	198

		పుట
56.	లింగకవి — గంగకవి	200
57.	అంగర నృశింహకవి	201
58.	సిరిప్రెగడ ధర్మనామాత్యుడు	204
59.	గణపవరపు వేంకటకవి	207
60.	వేముగంటి దత్తోజీపండితుడు	215
61.	గుడారు వేంకటదాసకవి	217
62.	కామనూరి కృష్ణయ్య	218
63.	వేంకటాచార్యుడు	219
64.	మల్లంపల్లి నాగభూషణకవి	219
65.	చిత్రకవి సింగరాచార్యుడు	221
66.	రేవుణూరి వేంకటార్యుడు	225
67.	పోచిరాజు వీరన్న	227
68.	అయ్యలరాజు నారాయణకవి	230
69.	వెణుతుర్ల వడ్డికవి	232
70.	కొత్తలంక మృత్యుంజయుడు	233
71.	తిరుమలబుక్కపట్టణపు వేంకటాచార్యుడు	236
72.	కటికనేని రామయకవి	237
73.	కొండమడుగు పురుషోత్తమకవి	239
74.	నాగులూరి శేషనారాధ్యుడు	240
75.	వీణెము లక్ష్మీపతి	241
76.	వేమనారాధ్యుల సంగమేశ్వరారాధ్యుడు	242
77.	ములపాక బుచ్చన్నశాస్త్రి	243
78.	పాలవేకరి కదిరీపతి	245
79.	మాధవమంత్రి	246
80.	గోపాలుని సింగయ్య	247
81.	గూళికల్లు వేంకటరమణకవి	248
82.	కృష్ణకవి	249
83.	వల్లూరి నరశింహకవి	252

	పుట
84. గొంతేటి సూరన్న	253
85. బేతపూడి కృష్ణయ్య	254
86. బసవరాజు నాగేంద్రకవి	255
87. మాచవరపు పాపనామాత్యుడు	256
88. కృష్ణదాసకవి	258
89. చెన్నూరి శోభనాద్రి	259
90. కోటీశ్వరుడు	260
91. చల్లపిల్ల నరసకవి	261
92. అయ్యగారి వీరభద్రకవి	263
93. ఘట్టుప్రభువు	265
94. ముప్పిరాల సుబ్బరాయకవి	267
95. ప్రయాగ కామేశ్వరకవి	269
96. అనంతనార్యుడు	269
97. భైరవకవి	270
98. అనమగుర్తి రంగయ్య	271
99. తామరపల్లి తిమ్మయ్య	272
100. నారన సూరన	273
101. పోడూరి పెదరామామాత్యుడు	274
102. రామావర్ఝుల కొండుభట్టు	276
103. మారయకవి	278
104. పరశురామపంతుల లింగమూర్తి	278
105. పరశురామపంతుల రామమూర్తి	280
106. వేగినాటి కొండనార్యుడు	282
107. వాసుదేవయోగి	283
108. కానాల నరశింహకవి	284
109. రామనామాత్యుడు	286
110. పోచవ	286

		పుట
111.	పెనుపల్లె బాపనామాత్యుడు	287
112.	చదువుల సోమలింగయ్య	288
113.	శ్రీధరమల్లె వేంకటస్వామి	289
114.	ఓరుగంటి సోమశేఖరకవి	291
115.	ముడుంబి వేంకటాచార్యుడు	292
116.	అక్కెనపల్లి నృశింహకవి	293
117.	పైడిపాటి వేంకటనృశింహకవి	295
118.	కొటికెలపూడి వేంకటకృష్ణకవి	297
119.	కాకరపర్తి కృష్ణకవి	299
120.	కృష్ణయ్య	301
121.	తరిగొండ వెంకమ్మ	302
122.	పిండిప్రోలి లక్ష్మణకవి	307
123.	అల్లమరాజు రామకృష్ణకవి	312
124.	కాకరపర్తి బుచ్చిపాత్రకవి	315
125.	శిష్టు కృష్ణమూర్తికవి	317
126.	మంత్రిప్రగడ సూర్యప్రకాశకవి	323
127.	ఫక్కి వేంకటనరసయ్య	325
128.	వేల్పూరి వేంకటేశ్వరకవి	326
129.	తిరుమలబుక్కపట్టణపు చినతాతాచార్యులు	329
130.	మాడభూషి నృశింహాచార్యుడు	330
131.	కోటమరాజు నాగయ	330
132.	కరాలపాటి రంగయకవి	332
333.	దాసురాజు లక్ష్మీనారాయణ	334
334.	త్యాగరాజ మొదలి	335
335.	ఓగిరాల జగన్నాధకవి	337
336.	వడకుదుటి రామనకవి	338
137.	మాడభూషి వెంకటాచార్యకవి	341
138.	పెనుమత్స బుచ్చిరాజు	343

ఆంధ్రకవులచరిత్రము

ఆధునికకవులు

1. హరిభట్టు

ఈకవి మత్స్యపురాణమును వరాహపురాణమును తెనిఁగించెను. ఇతని నివాసస్థానము కంబముమెట్టు; ఇది బెజవాడ కాజామడలదూరములో నున్నది. ఇతఁడు తన వరాహపురాణమునందు కంబముమెట్టు గ్రామము నీప్రకారముగా వర్ణించియున్నాఁడు——

సీ. వరుణానదిస్ఫీతి నేపురమునఁ బ్రవహించెఁ బావనసలిలసంపన్న మగుచు
దీపించె నేపురి గోపికామానసాస్పదవర్తి చెన్నగోపాలమూర్తి
భాసిల్లె నేవీటఁ బ్రహ్లాదభక్తివిశ్రాణి కొండనృసింహశార్ఙ్గపాణి
యేపట్టణంబునఁ జూపట్టె హితపద్మహేళి వీరేశబాలేందుమౌళి
చతురచతురంగబలరత్నసౌధయూథ । సాలగోపురతోరణసకలవర్ణ
పౌరవారాంగనాజనప్రముఖవస్తు । మేదురం బట్టికంబముమెట్టపురము.

కవి వైదికబ్రాహ్మణుఁడు; భారద్వాజసగోత్రుఁడు; రామపండితుని పుత్రుఁడు. ఇతఁడు మొదట వరాహపురాణము గొలిపాక యెఱ్ఱనామాత్యుని కంకితము జేసెను.

మ. సన తెంతుం గొలిపాక యెఱ్ఱనికిఁ దేజశ్శౌర్యగాంభీర్య స
త్త్వవిభూత్యుక్తి ధనుర్జయోన్నతి యశస్త్యాగక్రియాశాంతులన్
సవితర్కా సాత్యకి సింధు సీరి సురశాస్తృ సూతు సేనాని సైం
ధవనిర్భేదను సోము సౌమ్యరుచి సంతానంబు సప్తాధిపున్.

ఇత్యాది పద్యములచేత గుణితక్రమమునఁ గవి కృతినాయకుని నెంతగా నభివర్ణించినను,

క. శ్రీమహిత స్తంభాచల । నామసముద్దామపట్టణస్థలగణక
గ్రామణికి బంధుహితర । క్షామణికిఁ గవీంద్రపంకజనభోమణికిన్.

అను షష్ఠ్యంతపద్యమువలన నతఁ డాయూరికి కరణమయినట్టు స్పష్టపడుచున్నది. ఇట్టి నాయకగ్రామణి తన్నుఁ బిలిపించి—

మ. అమృతప్రాయవచోవిశేషరచనాహంభావపుంభావవా
గ్రమణీమూర్తివి వేదశాస్త్రవివిధగ్రంథార్థనిర్ణీతి నే
కముఖబ్రహ్మవు యాజుషప్రకటశాఖాధర్మధుర్యుండ వ
ర్యమతేజుండవు రామనార్యహరిభట్టా సత్యవిగ్రామణీ.

గీ. అష్టఘంటావధానవిశిష్టబిరుద
నీవు రచియింపఁ దలఁచిన నిరుపమార్థ
రమ్య మగు నీవరాహపురాణకావ్య
మంకితముచేయు నాపేర నభిమతముగ.

అని పలికినట్లు కవి వ్రాసికొనియున్నాఁడు. పయిపద్యమునందే గాక యాశ్వాసాంత గద్యమునందును "అష్టఘంటావధానపరమేశ్వర బిరుదవిఖ్యాత" యని కవి వ్రాసికొనెను గాని యీబిరుద మెవ్వరిచే నియ్యఁబడినదో తెలియఁబడదు. అయినను కవిత్వము మాత్రము పయి పద్యమునందుఁ జెప్పఁబడిన రీతిగా నమృతప్రాయముగానే యున్నది. ఇతఁడు తానాప స్తంబసూత్రుఁ డయినట్టును తిమ్మాంబ పుత్రుఁ డయి నట్టును మత్స్యపురాణములోని క్రింది పద్యమునఁ జెప్పుకొన్నాఁడు—

శా. భారద్వాజసగోత్రసంభవుఁడ నాప స్తంబుఁడన్ దిమ్మకాం
బారాజద్వరగర్భసంభవుఁడ రామక్ష్మాసురానేకజ
న్మారూఢాధిక పుణ్యలబ్ధహరి నామాంకా ప్తసంస్తుత్యుఁడన్
శ్రీరామావరపాదపద్మయుగళీ చింతాసమాయుక్తుఁడన్.

ఇతఁడు మొదట రచించిన వరాహపురాణమును నరాంకితముచేసి యట్లు చేయుట పాపకార్యమని తలఁచి తత్పాపపరిహారార్థముగా మత్స్యపు

పురాణమును శ్రీరంగాంకితముచేసి యాం దీక్రిందిపద్యమును బొందు పఱిచెను—

సీ. ఆయురారోగ్యనిత్యైశ్వర్యములు గల్గి
విభవంబుతో ధాత్రి వెలయుకొఱకు
ధనమునకై నరాధముల సన్నుతిచేయఁ
బొడమినపాపము ల్చెడుటకొఱకు
హృదయంబు లక్ష్మీశపదపంకజములందు
నిశ్చలవృత్తిఁతో నిలచుకొఱకు
రౌరవాదులఁ బాసి రయమున వైకుంఠ
సదనంబునకు వేడ్కఁ జనుకొఱకుఁ
బరమవైష్ణవజను లెల్లఁ బ్రస్తుతింప
మత్కృతం బయి హరికథామాన్య మగుచు
నుత్తమం బగువిష్ణుధర్మోత్తరంబు
రంగనాథున కర్పింతు రమణ మెఱసి.

కవికాలమును నిర్ణయించుటకీ పుస్తకములు రెంటిలోను నాకాధారము లేవియు గానరాలేదు. అక్కడక్కడఁ గొన్ని యల్పదోషములున్నను మొత్తముమీఁద నిర్దుష్టమని చెప్పఁదగిన గ్రంథరచనను బట్టియు శైలినిబట్టియు చూడఁగా నీపుస్తకములు చిరకాలము క్రిందటనే రచియింపఁబడినవయినట్టు తోఁచుచున్నది. "అష్టఘంటావధాన" యని రెండు పుస్తకములయందును గనఁబడుచున్నది. గంటమను తెలుఁగుశబ్దమునకుఁ బ్రకృతియయి లేఖినియని యర్థమిచ్చెడు "ఘంట" శబ్దము సంస్కృతమున నున్నదేమో! అప్పకవి యీగ్రంథములనుండి లక్ష్యములను జేకొనకపోవుటచేత నీకవి యతనికిఁ దరువాత నున్నాఁడేమో యని యూహ కలుగుచున్నది. కాఁబట్టి తగిన యాధారములు దొరకువఱకును మన మిప్పటికీ కవికాలము క్రీస్తుశకము ౧౬౬౦

సంవత్సర ప్రాంతమని భావింతము. తెలియనివిషయముల నూహించి పెంచి వ్రాయుటకంటె కవికృతగ్రంథములనుండి కొన్నిపద్యముల నుదాహరించి యింతటితో విరమించుట యుక్తమని యెంచి యట్లు చేయుచున్నాను.

వరాహపురాణము.

ఉ. మిక్కిలి శీతలాంబువులు మేనికిఁ గీడు మహోష్ణవారిచేఁ
బొక్కు శరీర మీ యుభయముం దొరలించిన నింపొనర్చు ని
ట్లొక్కనయంబ యొండె భయ మొండె నొనర్పక తద్ద్వయంబుఁ దా
నిక్కు వెఱింగి చూపు మనుజేంద్రునకు న్సుఖ మొందు రందఱున్. -ఆ౧

మ. సమరాజేంద్రునిఁగూర్చి సామము భుజాశౌర్యాధికుంగూర్చి దా
నము దీనం గలయంగ నేరనిమహీనాథాగ్రణింగూర్చి భే
దము శక్తిత్రయహీనుఁగూర్చి కడిమిం దండంబుఁ గావింప యు
క్తము భూపాలున కాత్మరాజ్యపరిరక్షాకార్యనిస్తంద్రతన్ —ఆ.౨

శా. వేదార్థంబులు వేఱుగాఁ దెలిసి దుర్విజ్ఞాను లాత్మేశ్వరా
భేదధ్యానసమేతులై తుది భవత్ప్రీత్యర్థమై కర్మముల్
మోదం బొప్పఁగఁ జేయనేరక మహామోహాంధులై యుందు రం
తాదివ్యాప్తివిహీనసంసృతిసముద్రాంతర్నిమగ్నాత్ములై —ఆ. 3

ఉ. దేహవినాశమూల మగు తీవ్రవిషావృతమైనయట్టి యా
బాహువుఁ ద్రెంచి మేను నిలుపందగు నందురుగాన సోదరీ
స్నేహము చేయు టొప్ప దని చెల్లెలిముండల పట్టి యాజగ
ద్ద్రోహి గళంబుఁ ద్రెంచుటకు దొరసి యెత్తినఁ జూచి యత్తఱిన్ -ఆ౪

చ. ఘనతరకష్టలోభిఁ దనుకంబునఁ జంపెడునంతయల్క నె
మ్మనమునఁ బుట్టె నేని విషమారణ కర్మకృపాణముఖ్యసా
ధనములు గూర్చ నేల ప్రమదంబున దగ్గఱి కాసు వీస మి
మ్మనుటయె చాలు వారి నిమిషార్థమున న్మృతి నొందఁ జేయగన్ -ఆ౫

మత్స్యపురాణము.

చ. చదివితి వేదశాస్త్రములు సాంగపదస్వరవర్ణరూఢి నం
దొదవిన మార్గముల్ వివిధయోజ్యములై విలసిల్లు వానిలో
నెదిరిన కర్మకాండమున హింసము జ్ఞానమునందు గర్మము౯
వదలక పల్కుచుండును ప్రవాహముల న్విపరీతవృత్తులై.—ఆ. ౧

చ. తిరిగితిఁ గాననంబు లతితృష్ణఁ జలింపక తద్వనంబుల౯
దొరకవు కందమూలములు తోయజనాభుపయాజ్ఞఁ గాక యి
ప్పురమున నన్నపూర్ణ పరిపూరిణయై విహరింపుచుండఁగాఁ
గఱవగునే తదన్నము లకాలమున న్మనమందిరంబున౯—ఆ. ౨

చ. విప్రగు నీచకర్మపదవిం జనువారికి మంత్రతంత్రముల్
తప్పినఁ బ్రత్యవాయములు తార్కొనివచ్చుటె కాని దానలే
దప్పరమేశుఁ జొందెడుప్రయత్నము నే నిటనీకు వేడుకం
జెప్పెద గుప్తమార్గమునఁ జేయుము తత్క్రియ భూసురోత్తమా-ఆ ౩

మ. రమణీబంధుజనాప్తుల న్విడిచి తద్రాజ్యంబు వర్జించి దు
ర్దమకామాదులఁ జెందనీక హృదయస్థైర్యంబున న్మించి నీ
వమితోద్యద్గుణకీర్తనామృతముచే నాస్వాదముకుండవై
విమలాంతఃకరణుండవై నను నే వీక్షించితిం బుత్రకా—ఆ. ౪

మ. హరి సంగీతవినోదలోలుఁ డగుచో నత్యంతశీఘ్రంబున౯
వరగానంబుల నాత్మసద్గుణకథావర్ణంబులై నట్టిగీ
తరసంబుల్ రసనం జవిం గొనెడుమర్త్యశ్రేణి కిష్టార్థముల్
పరిపూర్ణంబులుగా నొసంగును దయాపారీణుఁడై. వేడుక౯—ఆ. ౫

2. ఒడ్డెపూడి పెద్దయ్య

ఈ కవి వాయుపురాణమును తెనిఁగించి, పురుషోత్తమపట్టణనివాసుఁడయిన దాసరి చిన్నగంగయ్య యను కమ్మచౌదరి కంకితము చేసెను. పురుషోత్తమపట్టణము కొండపల్లెకుఁ బ్రాగ్భాగమున నున్నట్లును, దానిని వీరపురుషోత్తమ గజపతి తన పేరఁ గట్టించినట్లును గవి చెప్పియున్నాఁడు. వీరపురుషోత్తమగజపతి కొండవీటి కధిపతిగా నుండి క్రీస్తుశకము ౧౪౭౦ వ సంవత్సరము మొదలుకొని ౧౪౯౭ వ సంవత్సరము వఱకును రాజ్యపాలనము చేసెను. ఈతని తరువాత రాజ్యమునకు వచ్చిన యితని మనుమఁడైన వీరభద్రగజపతిని ౧౫౧౫ వ సంవత్సరమునందు కృష్ణదేవరాయలు జయించి కొండవీటిని స్వాధీనము చేసికొనెను. దీనినిబట్టి వాయుపురాణము కృష్ణదేవరాయని కాలమున కనంతరముననే రచియింపఁబడినట్లు తెలిసినదికాని యెప్పుడు చేయఁబడినదో తెలియదు. అప్పకవి యీ పురాణమునుండి పద్యముల నుదాహరించియుండక పోవుట మొదలయిన కొన్ని హేతువులనుబట్టి హరిభట్టకవికాలమువలెనే యీ కవికాలమును ౧౭౭౦ వ సంవత్సరప్రాంతమని యూహింపఁ దగియున్నది. ఈ యిద్దఱుకవులును కవిత్రయమని ప్రసిద్ధిగన్న నన్నయ తిక్కన శంభుదాసులనుదక్క నితరాంధ్రకవులను దమ గ్రంథముల యందుఁ జేర్కొనియుండలేదు. కవికృతినాయకుఁడయిన చినగంగయ్య కొలువునఁ గూర్చుండి తన్నుఁగూర్చియు సభికులనుగూర్చియుఁ బలికిన వాక్యముల నిట్లు చెప్పియున్నాఁడు—

సీ. అతులితశాస్త్రేతిహాసంబు లొకవంక నొకవంక దండనాయకగణంబు
తతచతుర్విధవేదతత్త్వజ్ఞు లొకవంక నొకవంక నిపుణశాబ్దిక చయంబు
ప్రకటితప్రౌఢతార్కికబృంద మొకవంక నొకవంకఁ జతురవాక్సుకవినికర
మకళంకపౌరాణికకదంబ మొకవంక నొకవంక జ్యోతిషప్రకరవేత్త

లోకఁచో బంధునిచయంబు లోకయొక స
మగ్రసామంతవిసరంబు మహిమఁ గొలువఁ
గొలువుకూటంబు నందుండి కలితవచన
గౌరవముమీఱ సభికులఁ గాంచి పలికె.

❋ ❋ ❋ ❋

చ. వినతసమస్తభూభుజుని వేంకటమంత్రికిఁ బేరమాంబకున్
దనయునిఁ బుణ్యవర్తనుని దానగుణాన్వితు నారసింహహృ
ద్వనరుహచంచరీకు ననివార్యవచోరచనావిశారదున్
నను బినయొడ్డెపూడి పురనాధునిఁ పెద్దకవీంద్రచంద్రునిన్.

త్రోటకము—వినయంబునఁ గన్గొని వేడుక ని
ట్లనియెన్ సుకవీంద్ర మురారికథల్
వినినంత నభీష్టనవీనఫలం
బనయంబును గల్గు జనావళికిన్.

❋ ❋ ❋ ❋

ఉ. పంకజగర్భదారకటిభాగవిభాసితభర్మమేఖలా
కింకిణికావిరావములఁ గేరి తదీయకరాగ్రవిస్ఫుర
త్కంకణనిక్వణంకనినదంబు నగున్ బినయొడ్డెపూడిమా
వేంకటమంత్రిపెద్దన నవీనవిలాసవచోనిగుంభనల్.

ఈ కవి నియోగిబ్రాహ్మణుఁడు; కాశ్యపగోత్రుఁడు; వేంకటమంత్రి పుత్రుఁడు; ఒడ్డెపూడి గ్రామమునకు కరణము. ఇతఁడు వాయుపురాణము లోనికొంతభాగమును మాత్రమే తెనిగించినట్టు కనబడుచున్నది. ఈతని కవిత్వమునం దక్కడక్కడఁ గొన్ని దోషములున్నను మొత్తముమీఁద కవిత్వము రసవంతముగానేయున్నది. వాయుపురాణమునుండి కొన్ని పద్యముల నిందుదాహరించుచున్నాను—

మ. కరకోచ్చారితమై ఘనాఘనబృహద్గర్జారవోపేతమై
వరవిద్యుల్లతికాతతిప్రబలమై వాస్తోష్పతీష్వాసబం
ధురమై సర్వదిశాభిభాగములు నస్తోకాంబుపూర్ణంబుగాఁ
గురిసె న్వర్షము నీరజవ్రజము సంక్షోభింప భీమంబుగన్—ఆ. ౧

ఉ. పొంగినవేడ్కచే నతఁ డపూర్వముగా విహరించుచుండి యా
చెంగటఁ గాంచె దివ్యసరసీరుహశోభితమత్తభృంగ ను
త్తుంగతరంగఁ దోయపరిశోషనికీర్ణ బలాకచక్రచ
క్రాంగ నభంగగంగ నికటాగతసంయమిసంగ నెంతయున్—ఆ. ౨

మ. కనుదూరంబున నుండి మేను వడఁకంగాఁ బాదముల్ తొట్రిలన్
వడచేఁ జిక్కి హరీ యటంచును గృహద్వారంబుఁ జేరంగ నే
నిడఁగాఁ బంచితి నీరసాన్న మతఁడున్ హేయంబుగాఁ జూడకే
కుడిచెం దత్కలుషంబు చేయుకతనన్ ఘోరాటవీభూములన్—ఆ. ౩

మ. మునిసంఘంబులు మ్రొక్కఁ దామరలు సమ్మోదంబున న్నిక్కఁ గో
కనికాయంబుల కింపు లెక్కఁ గుముదౌఘంబుల్ రుచు ల్దక్క నో
ర్వనిగర్వంబులు మాలి జాలిఁబడి జీవంజీవముల్ స్రుక్కఁ దూ
ర్పున మార్తాండుఁడు గానిపించె భువనంబుల్ రంజిలం జేయుచున్—ఆ. ౪

ఉ. ఇంద్రుఁడ నీవు దుఃఖపడ నేటికిఁ గౌశికమౌని చేయు ని
స్తంద్రతపంబు మాన్పుటకు శక్యము గాదననేల ధీరతన్
రుంద్రమతి న్సుఖింపుము నిరూఢిగ నే నిదె చక్కఁ జేసెదన్
జంద్రముఖీవిలోకనసుసంగతిఁ జొక్కరె యెట్టివారలున్—ఆ. ౫

3. కాకమాని మూర్తి

ఈ కవి కాకమానికులజుఁడైన బ్రాహ్మణుఁడు; కౌండిన్యస గోత్రుఁడు; రామలింగభట్టుపుత్రుఁడు. ఇతఁడు పాంచాలీపరిణయము, రాజవాహనవిజయము అను రెండు ప్రబంధములను రచియించెను. రాజవాహనవిజయములోని యీ క్రింది పద్యమునుబట్టి యీ కవి యింటి పేరు పెన్నావారని తెలియవచ్చుచున్నది—

సీ. గుణధన్యుఁ గౌండిన్యగోత్రు నాపస్తంబసూత్రుని వెలనాఁటిశుభచరిత్రుఁ
గాకమానీమహాగ్రామాబ్జమిత్రుఁ బెన్నాకలశాబ్ధితారాకళత్రు
సరసవిద్వత్కవి సార్వభౌముని రామబుధసంభవునకుఁ బ్రబోధసుధికిఁ
బౌత్రుని బినరామభట్టాగ్రజన్ముఁడై తనరు శ్రీరామలింగనకుఁ దిమ్మ
మాంబికకుఁ బుత్రుఁ సూర్యనారాయణద్వ
యైకసహజన్ము నుభయభాషాకవిత్వ
తత్వనిధి నన్ను మూర్తివిద్వత్కవీంద్రు
హర్షమునఁ జూచి యిట్లని యానతిచ్చె.

ఇతఁడు తనగ్రంథములను నరాంకితములఁ జేయక రాజవాహనవిజయమును శ్రీవేంకటేశ్వరులకును, పాంచాలీపరిణయమును శ్రీరంగపతికిని, అర్పించినందునఁ గృతిపతులను బట్టి కవికాలమును నిర్ణయించుట కాధారములేదు. ఇఁకఁ గవిస్తుతిలోనైనను పాంచాలీపరిణయమునం దితఁ డితరాంధ్రకవులను బేరుకొనక తనముత్తాతయు తాతయునైన గామపండితుని ప్రబోధపండితుని మాత్ర మీపద్యమునందు పేరులు పెట్టి నుతించియున్నాఁడు—

చ. ప్రబలమతి న్నుతింతుఁ బ్రతిభాకృతిభాషితభారతీశులన్
గబళితసర్వదర్శనులఁ గావ్యచమత్కృతికాళిదాసులన్
నిబిడతపోవిలాసులఁ దృణీకృతవాదులఁ గాకమాని రా
మబుధవిధున్ బ్రబోధసుధి మత్ప్రపితామహునిన్ బితామహున్.

రాజవాహనవిజయమునందు పీఠిరిగాక యీపద్యమునందుఁ గవి త్రయమునగూడఁ జేర్కొని యున్నాఁడు—

ఉ. శ్రీరఘురామకావ్యకృతశిష్టవిధిజ్ఞుఁ బరాశరాత్మజుం
భారవిఁ గాళిదాసు శివభద్రు మురారి మయూరు బిల్హణుం
జోరుని మల్హణాదిసురసూక్తి కవీంద్రులఁ గొల్చి యెంచెదన్
భారతకర్తృతాచణుల నన్నయఁ దిక్కన నెఱ్ఱనార్యునిన్.

ఇతఁ డన్యకవుల నెవ్వరిని గొనియాడకపోయినను వసుచరిత్రకర్త యైన బట్టుమూర్తికిఁ దరువాతివాఁ డయినందుకు సందేహములేదు. వసుచరిత్రకర్త మూర్తి యన్నమాట వినఁబడఁగానే మూర్తి నరస భూపాలీయకర్తగాని వసుచరిత్రకర్త కాఁ డనియు, ఉభయగ్రంథకర్తలు బట్టువంశజులయి యేకకాలవారగుటచేఁ బూర్వకాలమునుండియుఁ బండితపామర సాధారణముగా వసుచరిత్రకారుఁడు బట్టుమూర్తి యన్న భ్రమ యంధ పరంపరగా వచ్చుచున్నదనియు, కొందఱు చెప్పవత్తురు. ఒక్కకాలమునం దిద్దఱు కవులుండి వారిలో నొక్కఁడు సుప్రసిద్ధుఁడును రెండవవాఁ డప్రసిద్ధుఁడును నయినప్పుడు సుప్రసిద్ధునిపే రడఁగిపోయి యప్రసిద్ధునిపేరు పైకివచ్చుట యెన్నఁడును సంభవింపనేరదుగాన, అధిక ప్రసిద్ధుఁ డయిన రామరాజభూషణునిపే రడుగంటి యాతని గ్రంథ కర్తృత్వము బట్టుమూర్తిమీఁదఁ బడెననుట• యుక్తియుక్తముకాదు. ఒకవేళ భ్రమకలిగెను పక్షమున, నరసభూపాలీయకర్త రామరాజ భూషణుఁడని కలుగవలెను. అప్రస్తుతమైన యీయంశము నటుండనిచ్చి కార్యాంశమునకు వత్తము. అనేకు లీకవిని బట్టుమూర్తినిగా భ్రమించి యితని పాంచాలీపరిణయములోని యీక్రిందిపద్యమును—

గీ. అల్లసానివానియల్లిక బిగిసొంపు। ముక్కుతిమ్మనార్యు ముద్దుఁబలుకుఁ
బాండురంగసుకవి పద్యంబుహొరువును। గాకమానిరాయ నీకె కలదు.

బట్టుమూర్తినిగూర్చి రామకృష్ణకవి పలికినట్లు చెప్పుచున్నారు. ఇది నామసామ్యమునుబట్టి కలిగిన భ్రమగాని వేఱుకాదు. మఱియు నీపద్యమునుబట్టి యీకవి తెనాలి రామకృష్ణునికాలమునకుఁ దరువాతి వాఁడనుట స్పష్టమగుచున్నది. పయిపద్యములో శ్రీరంగేశుఁడు తన కవిత్వమునుగూర్చి యట్లు పలికినట్లు చెప్పుకొనుటయే కాక రాజవాహన విజయములో సరస్వతిని ప్రార్థించునప్పుడుకూడ నిట్లు చెప్పియున్నాఁడు.

ఉ. చోరు నలంక్రియావిహృతిసొంపు మయూరునిసౌకుమార్యమున్
భారవికాంతిసంపదయు బాణుగుణాఢ్యతర ప్రయోగ మా
దారి మురారికోమలపదంబు ప్రసాదముఁ గల్గునట్లుగా
భారతి యిచ్చుఁగాతఁ బ్రతిభారతి మత్కృతికిం జమత్కృతిన్.

ఈతని కవిత్వమునం దీకవి పొగడుకొన్నంత యాధిక్యము లేక పోయినను, రసవంతమయి సలక్షణమయి యమకాది శబ్దార్థాలంకార యుక్తమయి కవితారచన యనర్గళధారగా ప్రవహించుచున్నది. గ్రంథములం దన్యదేశ్యపదములును పూర్వలాక్షణిక సమ్మతములుకాని ప్రయోగములును గొన్నియందందుఁ గానఁబడుచున్నవి. కవి ౧౬౨౦ వ సంవత్సరప్రాంతములయందుండి యుండియుండును. కాకమానిమూర్తి బహుళాశ్వచరిత్రములోనివని కొన్నిపద్యములు రంగరాట్ఛందమునందును సర్వలక్షణ సారసంగ్రహమునందును ఉదాహరింపఁబడియున్నవి కాని యితఁడు రచియించిన బహుళాశ్వచరిత్రము నాకు లభింపలేదు. ఈమూర్తికవి రాజవాహనవిజయములో చంద్రగిరి హనుమంతుని స్తుతించి యుండుటచేత నీతని వాసస్థానమైన కాకమానిగ్రామము చంద్రగిరి సమీపమున నుండియుండును. కవిత్వరీతిని దెలుపుట కీతని గ్రంథముల నుండి కొన్నిపద్యముల నుదాహరించుచున్నాను—.

రాజవాహన విజయము.

శా. ధాటీఘోటఖురాగ్రనిర్దళితగోత్రాధూళికాగంధచూ
ర్ణాటోపాతిపరిస్ఫురత్కఠినసర్వాశావధూటీకుచా
ఘాటచ్ఛాయదరాగశాటికసమాఖ్యావిక్రమప్రక్రమా
త్యాటీకాహితరాజహంసుఁ డగు నాహా రాజహంసుం డిలన్. — ఆ. ౧.

ఉ. మీసపుమొక్కనిక్కునకు మిక్కిలిత్రొక్కరివాన కుంతలా
ళీసురపాలనీలమణిలీలకుఁ గ్రొన్ననుసాన విభ్రమ
శ్రీ సరసీరుహంబు మదసింధురసప్రసవంబు సూనబా
ణాసతపఃఫలం బపుడు యౌవన మబ్బెఁ గుమారమౌళికిన్ — ఆ. ౨

శా. పూవుందోఁట యొయారి చేరి బలితంపుంజందురాతిన్నెలం
బూవుందేనియ సోనవాన చొతుకు లొప్పైచు గొజ్జంగిపూ
పై వాటు ల్గలదాసనంపుఁగనిమల్ పన్నీటిమున్నీటి బల్
త్రోవం గట్టినపచ్చమెట్టికలపైఁ దోడ్తోడఁ గ్రీడింపఁగన్ — ఆ. 3.

ఉ. తాలిమిదూలి తూలి చెలి దర్పకుఁ డప్పుడె వంచుతమ్మిపూ
వాలికతూపు క్రొంజెమటవానకుఁ గారణ మైననిద్దపుం
గోలమెఱుంగొ యాననచకోరహితాగతరశ్మియౌర యో
లోలమృగాక్షి నాఁడయిఁ దళుక్కనఁ జూచినచూపు బాపురే. ఆ-౪

మ. కటకంబు ల్గలయుత్కటద్విపఘటల్ ఘంటాపథప్రస్ఫుట
త్కటకంబు ల్మొరయంగఁ జక్కఁజన వాద్యధ్వానశక్తిన్ మహా
కటకంబుల్ ప్రతివాద మీన విభవోత్కంఠన్ దిశాభూమిభృ
త్కటకంబు ల్గన రాజు చేరఁ జనియెం దన్మందిరాళిందమున్. ఆ. ౫.

పాంచాలీపరిణయము.

ఉ. ఏయెఁ గఠోరమార్గణము లివ్వలి కవ్వలి కద్రి దూయఁగా
వ్రేయుధరాస్థలిన్ సబిడివెంటనె గాంగఝరంబు లేవఁగాఁ

జేయును సగ్గుసూఁచములు చెట్టునుజట్టును గొట్టి బిట్టుగా
నాయనలాయనప్రభవుఁ డాయన యౌవనగర్వసంపదన్. ఆ. ౧.

ఉ. ఎంతటివన్నెఁ దెచ్చె గుడి చేసి యితండు ద్విజన్మజాతికిన్
వింత యటంచు రాజుల గణింపక తిట్టుచు గేలి గొట్టుచున్
గంతులు వైచుచుం దలకుఁ గట్టినచెంగగవైచి పట్టుచున్
గొంతులురాయఁగోయనుచుఁ గూఁతలు పెట్టిరి గ్రామ్యభూసురుల్. ఆ. ౨

ఉ. ముందటఁ గాంచె దిగ్రమణముఖ్యుఁడు వారుణవేషభూషణున్
మంథరకంధరాకనకమందిరమధ్యవితర్దిమందపా
రందరనీలకందరధురంధరసింధురవైరిపీఠవా
సేందుకళాకలాపు హృదయేశ్వరితోడుత నెత్తమాడఁగన్. ఆ. ౩.

శా. నీకేవచ్చు సువాలయున్ ధవళ మింతీ యల్లోనేరేళ్లు గా
రీకళ్యాణము లంచు నింటికడ నేరీతి స్వజృంభింతువే
వాకీ విచ్చుట నంచు సిద్దఋసతు ల్వ్యాక్యోపవాక్యంబులన్
గాకై ముందలషట్లకుం దొడఁగి రాకల్యాణవేదిస్థలిన్. ఆ. ౪.

శా. ఆఁడుంగాన్పుచు గంటకన్న సతి గొడ్రా లౌటయే మేలు నూ
తేఁడు ల్పెంచినఁ గూఁతు రేమి సతమా యీవియ్యము ల్కోడలిన్
గాఁడంబల్కినఁ దాళఁగావల సెఁగా కాఁగానితిట్లాడికల్
నేఁ డీతండ్రియుఁ దల్లి వంగడము కానీ పంచుకోనాయెఁగా. ఆ. ౫.

4. కామేశ్వరకవి

ఇతఁడు సత్యభామాసాంత్వనము నాలుగాశ్వాసముల శృంగారప్రబంధమును రచియించి, మధురనాయకుఁడైన ముద్దలగిరి నృపాలున కంకితముచేసెను. ఈమధుర శ్రీకృష్ణుని జన్మస్థల మయిన మధురాపురముగాక పాండ్యమండలమునకు రాజధానియైన దక్షిణ మధుర యైన ట్లీక్రిందిపద్యమువలనఁ దెలిసికొనవచ్చును—

క. లక్షణలక్షితకమలా । వీక్షణపుంఖానుపుంఖవిభవోన్మేషా
నుక్షణతతవిశ్రుతియై । దక్షిణమధురాపురంబు తనరు ధరిత్రిన్.

కృష్ణదేవరాయని యనంతరముఁ దెలుఁగు నాయకులు పాండ్యమండలమును జిరకాలము పాలించిరి. ఈకవి యాకాలమునందు మధురాపురమును బాలించుచున్న ముద్దళగిరిరాజు సభలోఁ గూరుచుండి తన్నుఁ గూర్చి యిట్లు పలికిన ట్లీపద్యములలోఁ జెప్పినాఁడు—

శా. ఆరీతిన్ సభ ముద్దుళగ్గిరిధరాధ్యక్షుండు కొల్వుండి తా
హేరాళంబుగ నయ్యెడ న్నడుచుసాహిత్యప్రసంగంబు గం
భీరప్రౌఢిమ వించు న న్బిలిచి నెమ్మిం బల్కె పీణాకన
న్నారీపాణిసువర్ణకంకణఝుణత్కారానుకారోక్తులన్.

చ. అనువుగ రుక్మిణీపరిణయంబును మున్ హావణించి యార్యులౌ
ననఁ దనియించినావు మము నప్రతిమంబుగ నవ్యకావ్య మిం,
పున రచియింపుమీ సొగసుపోఁడిమి మీఱఁగ సత్యభామసాం
త్వనమును గప్పురంపుఁజలువం గెలువం దిరుకామసత్కవీ.

క. కాకులవలె సింటింటను । గాకవు లున్నారు హంసకైవడి భువిలో
శ్రీకామ నీకె తగురా । యేకడ నుడిపాలు నీరు నేర్పఱుపంగన్.

క. ఏ భాషనైనఁ గృతిపతి । శోభనములు చెందు నీదుసూక్తులవలనన్
నీ భాగ్య మసదృశము గా । రీభవకరుణానివేశ శ్రీకామేశా.

ఈ ముద్దళగరి తన సవతియన్నగారయిన చొక్కనాథుఁడు స్త్రీలోలుఁడయి రాజ్యభారమును తమ్మునిమీఁదఁ బెట్టి తంజావూరిలో నున్న కాలములో యువరాజుగా రాజ్యముచేసెను. చొక్కనాథుఁడు క్రీస్తుశకము ౧౬౬౦ వ సంవత్సరము మొదలుకొని ౧౬౮౨ వ సంవత్సరము వఱకును రాజ్యము చేసెను. కవి యీ ముద్దళగరినే రాజునుగా వర్ణించినను, ఆతని వర్ణనలోఁగల యీ క్రింది పద్యమునుబట్టి యన్న యుండగానే యతఁడు రాజ్యభారము వహించినట్టు స్పష్టమగుచున్నది—

ఉ. అన్నయు దమ్ము లీకరణి నందఱు నొద్దికయై యశోరమల్
చెన్ను వహింప రాముకృపచేఁ దనుఁ జెందినరాజ్యసంపద
భ్యున్నతభోగభాగ్యుఁడయి యుర్విని సర్వనృపాలకోటిలో
నెన్నిక కెక్కె ముద్దళగరీంద్రుఁడు తాను మహోన్నతస్థితిన్.

ఈ ముద్దళగరి ౧౬౭౬ వ సంవత్సరప్రాంతమునఁ దానే రాజ్యము నాక్రమించుకొని సంవత్సరకాలము స్వతంత్రముగాఁ దనపేరనే పాలనము చేసెను గాని యింతలో చొక్కనాథుఁడు వచ్చి దేశము మరల స్వాధీనము చేసికొనెను. చొక్కనాథుఁడును, ముద్దళగరియు, మఱిముగ్గురును ౧౬౨౩ వ సంవత్సరము మొదలుకొని ౧౬౫౯ వ సంవత్సరము వఱకును రాజ్యముచేసి ప్రసిద్ధికెక్కిన తిరుమలనాయకుని కొమాళ్ళు. ఇందుఁ దెలుపఁబడిన చరిత్రమునుబట్టి కవి యీ గ్రంథమును ౧౬౭౫ వ సంవత్సర ప్రాంతమునందు రచియించినట్టు తెలియవచ్చుచున్నది. ఇతఁడు రుక్మిణీపరిణయమును గూడ రచియించినట్టు చెప్పఁబడినదిగాని యాపుస్తకము నాకు లభింపలేదు. "దక్షిణసింహాసనాధ్యక్ష తిరుమలక్ష్మాకాంత కరుణాకటాక్షలక్షిత స్వచ్ఛముక్తాగుళుచ్ఛసితచ్ఛత్ర చామరకళాచికా కనకాందోళికా విరాజోపచార" యని యాశ్వాసాంత గద్యమునఁ జెప్పుకొని యుండుటచేతఁ గవి తిరుమలనాయకుని కాలమునందు సహితముండి ౧౬౫౦ వ సంవత్సరప్రాంతములనుండి కవిత్వమునందుఁ బ్రసిద్ధి

నొందియుండును. ఈ గద్యమునందే యితఁడు "శ్రీకాళహస్తీశ్వర చరణారవింద మిళిందాయమాన జ్ఞానప్రసూనాంబికా కృపాలంబ విజృంభమాణ సారసారస్వత సుధాతరంగ" యని చెప్పుకొనుటచే నితఁడు కాళహస్తినివాసుఁడయి మధురనాయకుల యాదరమువలన మధురసంస్థానమును జేరినట్టు కనఁబడుచున్నది. విజయవిలాసమువలెనే యిదియు శుద్ధద్రవిడదేశమునందుఁ జేయఁబడిన ప్రబంధము. ఇవిగాక యఱవదేశమునందుఁ జేయఁబడిన తెనుఁగుకావ్యము లింకను పెక్కులు గలవు. "వల్లకీవాదన ధురీణ వర్ణగీతాది గాంధర్వస్వరసవీనకల్పనాప్రవీణ" యనియు గద్యమునందు కవి వ్రాసికొన్నాఁడు. అందుచేత నితఁడు సాహిత్యమునందు మాత్రమే కాక సంగీతమునందును బ్రవీణుఁడని విశదమగుచున్నది. ఈ కవి యింటిపేరు లింగనమఖివారు ; తండ్రిపేరు నాగనామాత్యుఁడు ; తల్లిపేరు కామామ్బ. ఈతని కవిత్వము ప్రౌఢమయినది. సత్యభామాసాంత్వనమునుండి కొన్ని పద్యముల నిందుదాహరించుచున్నాను.—

ఉ. ఆపురమందుఁ గెంపుఁజగియుండపుఁగోట పయోధికన్యకుఁ
బ్రాపయి తిమ్మిపోలికను భాసిలెఁ గొమ్మలు జేసు లట్లు చా
లై పరఁగెం దళంతరగళత్స్నవమౌక్తికలీల నర్ఘ్యపే
చీప్రృషుశీకరమ్ము లెగసెన్ హరి సేసలు చల్లు కైవడిన్.

ఉ. తావులవెంబడిం గదలి తాఁగొనెఁ దేఁటులు తేఁటిజేక్కులం
బోవక నాటెఁ బుప్పొడియుఁ బుప్పొడితోఁ దగెఁ బూవుసోన యా
పూవులసోనతో మిసులఁ బొల్చెను గల్పతరుప్రసూనమా
ధ్వీవిసరంబు నావెనుక వీచెను బల్లసి కమ్మతెమ్మెరల్—ఆ. ౧

ఉ. చూడక చూచినట్లు తమి పోలుచు సొక్కుచు మోహ ముంచి మా
టాడక యాడినట్లు కలయం గమకించి మదిం గణించి యా
చేడియతోడిలోక మయి చింతిలి కార్యము నెంచ కుండుటల్
పాడియె తెల్పుమా యవితపాండవ కాళియమౌళితాండవా—ఆ. ౩

శా. భాసిల్లె న్నిజసోదరేందుసుభగంభావక్రియావిష్ణుసో
ల్లాసోద్గారముకుందదారకృతలీలాస్యసారస్యభ్రూ
గీసంగీతతరంగితాబ్జరుచిభంగీజాతరంగోల్ల స
త్కాసారాబ్ధితరంగజాలము శరత్కాలం బవేలంబుగన్ — ఆ. ౭

౫. వెణుతురుబల్లి విశ్వనాథకవి

ఇతఁడు శేషధర్మములను బద్యకావ్యమునుగా రచియించి పెద్దాపురసంస్థానాధీశ్వరుఁడయిన వత్సవాయతిమ్మనృపాలుని కంకితము చేసెను. ఇతఁ డారువేలనియోగి బ్రాహ్మణుఁడు. ఈతని తండ్రిపేరు వేంకటామాత్యుఁడు. ఇతఁడు ౧౬౦౦ వ సంవత్సరప్రాంతముల యం దుండినవాఁడు. ఈకృతిపతినిగూర్చియు కృతికర్తనుగూర్చియు నేనుఁగు లక్ష్మణకవి చరిత్రమునందుఁ గొంత తెలుపఁబడి యున్నది. ఇతనిది సలక్షణమయిన మంచికవిత్వము. ఈతని శేషధర్మములనుండి రెండు పద్యము లిందుఁ గైకొనఁబడుచున్నవి—

శా. మాయావిప్రుల కాద్విజుండు కడిగెన్ బాదాంబుజద్వంద్వముల్
చేయారం గుసుమాక్షతాదులను బూజించెం గాత్రము ల్వైచె న
ట్లాయాపాత్రములందు నన్నము లిడెన్ నారంభుఁ డానంతలో
నాయింద్రుండు గృహస్థుఁ జూచిపలికెన్ సాక్షేపపూర్వంబుగన్. ఆ-౧

ఉ. కాలినయిన్పగుండ్ల ముఖగహ్వరభాగములందుఁ గ్రుక్కుచున్
సోలుపు లేర్పడ న్నెఱుఁగుసూదులఁ గ్రుచ్చుచుం దలల్
నేలకుఁ జేర్చి పాదములు నింగికి నెత్తుచుఁ బెక్కుజాడలన్
గాలభటుల్వెతల్గుడుపఁగాఁ బడియుందురు రంతమీఁదటన్. ఆ. 3.

6. నూతనకవి సూరన్న

ఈకవి సకలజనాభిరామ మను నామాంతరముగల ధనాభిరామ మను మూఁడాశ్వాసముల పద్యకావ్యమును రచించెను. ఇతఁడు నియోగి బ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; కాశ్యపగోత్రుఁడు; తిప్పయామాత్యపుత్రుఁడు. కవి తన్నుఁగూర్చి యిట్లు చెప్పుకొనుచున్నాఁడు—

సీ. విస్ఫీతవైభవా పస్తంబసూత్రుండఁ గాశ్యపగోత్ర విఖ్యాతయశుఁడ
ఘనతననంతసేనుని మల్లనామాత్యపౌత్రుఁడఁ దిప్పయప్రభుసుతుండఁ
బార్వతీశుభగర్భ పాథోనిధానసంధానశశిత్తుండ మానధనుఁడ
సత్కావ్యపారీణ సారస్యసంలబ్ధవిస్తారమతి గలవిమలయశుఁడ
భద్రవైభవశ్రీవీరభద్రలబ్ధ । జనితచాతుర్యకావ్యలక్షణవిచిత్ర
విపులవాచాసమగ్రసంవిద్ధమతిని।సూరనామాత్యనామకసుకవివరుఁడ.

కవి తనగ్రంథమున వ్రాసికొన్న యీక్రింది పద్యమునుబట్టి తాను దిక్కన సోమయాజి సంతతివాఁడనని చెప్పుకోఁదలఁచినట్లు కనుపట్టుచున్నది—

చ. అనువుగ భారతాంబునిధి యవ్వలికిం దెగనెట్టి యందులో
ఘనకవితామృతంబు చవి గాంచిన తిక్కన సోమయాజిపా
వనతరమైనయట్టికులవర్ధనుఁడై మహిఁ పేరుగల్గు నూ
తనకవి సూరనార్యుఁడను ధర్మగుణాంచితపాలనీయుఁడన్.

ఈకవి తన కావ్యమును దాక్షారామభీమేశ్వరుని కంకితము చేయుటచేత నితఁడు గోదావరీమండలములోనివాఁ డయినట్లు కనఁబడుచున్నాఁడు. ఈతఁ డేకాలపువాఁడో తెలియరాలేదుగాని పూర్వకవులను మధ్యకవులను మాత్రము స్తుతించి చిమ్మపూడి యమరేశ్వరుని—

చ. అలఘుని శబ్దశాసనపదాంకితుఁ దిక్కనసోమయాజి ని
ర్మలమతి శంభుదాసు బుధసన్నుతు నాచనసోమనార్యుఁ జె

న్నలరిన చిమ్మపూడి యమరాధిపు భాస్కరు రంగనాథునిం
దలఁతు నపూర్వదివ్యకవితామహనీయసమగ్రచిత్తులన్.

అని కవిస్తుతిలోఁ జేర్కొనియుండుటచేతను, ఇంతమంది పూర్వ కవులను జెప్పి మధ్యకవులలో నొక్కనిని జెప్పకపోవుటచేతను, ఇతఁడు మధ్యకవులలోఁ జేరినవాఁడేమో యని సందేహము కలుగుచున్నది. అయినను స్వతంత్రములైన యితరాధారములు లేక మధ్యకవులను జేర్కొనక పోయినంతమాత్రమున నితఁడు మధ్యకవి యని నిశ్చయించుటకు వలనుపడదు. కాని యితఁ డిన్నూఱుసంవత్సరముల క్రిందటివాఁ డని యైనను జెప్పవచ్చునని తోఁచుచున్నది. ఈతఁడు రచియించిన ధనాభిరామము కథ కొంతవఱకు మనోహరముగా నున్నది. ఇంద్రసభామందిరమునందు మన్మథునికిని కుబేరునికిని రూప మెక్కువ యనియు ధన మెక్కువ యనియు వివాదము సంభవించి వారితగవు మాటలతో తెగనందున—

చ. తరమిడి యిన్నిమాటలు వృథాపని లేక సమస్తవైభవో
త్కర మగుదాక్షవాటిపురి గల్గు ధరాస్థలిలోనఁ బోయి నీ
నిరుపమరూపసంపదయు నేరుపుఁ జూపుము నేను వచ్చి యా
పురవరసీమఁ జూపెదను భూరిధనంబున నామహత్త్వమున్.

అని కుబేరుఁడు మన్మథునిజూచి, 'మాటలతోఁ బ్రయోజనము లేదు. మన మిద్దఱమును భూమిమీఁద దాక్షారామములోఁ బుట్టుదము. అక్కడ నీవు మొట్టమొదట నీసౌందర్యమును నేర్పునుజూపుము. తరువాత నేను వచ్చి నాధనమహిమను జూపెదను. అప్పుడు మనయిద్దఱిలో నెవ్వరు బలవత్తరులో తేటపడి రూపమహిమ యెక్కువయినదియు ధనమహిమ యెక్కువైనదియు వెల్లడియగును' అని పలుకఁగా మన్మథుఁ డాతని యాహ్వాన మంగీకరించి పూర్వకాలమునుండియు వేశ్యలచేఁ బ్రసిద్ధమయిన నదాక్షవాటికకుఁ బోయి యందుఁ దన రూపవిశేష

మును జూపఁగా నాట్యమునకయి భీమేశ్వరస్వామి యాలయమునకుఁ బోయిన సుగుణావతి యను పణ్యాయువతి యాతనిని గాంచి కామించి యింటికిఁబోయి యాతనిం దనయింటికిఁ దోడితెమ్మని తన చెలికత్తెను వేఁడుకోఁగా నావయస్య—

ఉ. అక్కట వాసివన్నె గలయట్టికులంబునఁ బుట్టి రూపుచే
నెక్కుడు భాగ్యసంపదల నెన్నిక కెక్కినదాన వింతలో
నెక్కడివానికి న్వలచి తెయ్యదొ వానికులంబు విన్న వా
రొక్కట నవ్వరే విడువు ముత్పలలోచన నీకు మ్రొక్కెదన్.

ఉ. నిచ్చలు నిండి వల్లభులు నీకడ గానఁగ లేక కానుకల్
తెచ్చి తమంతఁ గ్రందుకొని తేమఁవ మోసలఁ గాచుచుండఁగాఁ
జెచ్చెరవారలన్ ఘనము చేయక డాయక యూరకున్నచో
నొచ్చెముకాదె నీకును బయోరుహలోచన యిప్పురంబునన్.

చ. కలికితనంబుమీఱఁగ వికారముతోడ మనోజకేళి ని
చ్చలుఁ దమకంబుపుట్టి విటసంఘము తెచ్చియొసంగునీమహో
జ్జ్వలమణిభూషణాదిఘనవస్తువు లొందుట కీర్తిగాక తా
వలచుట వంతమూ ధరణి వారవధూమణికిం దలోదరీ.

అని యపారధనము నిచ్చెడు విటు లనేకు లుండఁగా ధనమియ్య జాలని క్రొత్తవానిని కేవలరూపసంపదను జూచి వలచుట వారకాంతకు ధర్మముకాదని బుద్ధి చెప్పియుఁ గార్యము గానక తుదకు మన్మథుని దానియింటికిఁ దెచ్చి యప్పగించెను. సుగుణావతియు మన్మథుఁడును గొంతకాల మీప్రకారముగా సుఖ మనుభవించుచుండఁగా, కుబేరుఁడు యోగివేషమునవచ్చి భీమేశ్వరస్వామి యాలయమునఁ జేరి యచ్చటికి వచ్చెడు వేశ్యలకెల్లను ధనమును చీరలును కొల్లఁగా నొసఁగసాఁగెను. అంత సుగుణవతి తల్లియు నొకనాఁ డచ్చటికిఁ బోయి యాతఁ డిచ్చిన ధనకనకాంబరములను దెచ్చి కూఁతునకుఁ జూపి బోధించి మతివిఱిచి

రూపవంతుఁ డయిన మారుని విడనాడి విత్తవంతుఁడైన కుబేరునిఁ గూడున ట్లాగుణవతి నొడఁబఱిచెను. అంతట మన్మథుఁ డోడి పోయి దేవాలయముచేరి భీమేశ్వరస్వామిని బ్రార్థింపఁగా నతఁడు సాక్షాత్కరించి. యొకప్పుడు ధనమును మఱొకప్పుడు రూపమును విజయము నొందినను మొత్తముమీఁద ధనసౌందర్యములు రెండును సమానములే యని తెలియఁబలికి వారిరువురిని సమాధానపఱిచి వారి స్థానములకు వారిని బంపివేసెను. ఈపుస్తకము చిన్నదే యయినను, కవిత్వము హృద్యముగానే యున్నది. తెలిసి జూపుటకై ధనాభిరామమునుండి రెండు పద్యముల నిం దుదాహరించుచున్నాను.

చ. మదనునిగాఁ దలంతు రిల మానిను లెల్లను, సత్కవీశ్వరుల్
పదపడి కర్ణుఁ డీతఁడని ప్రస్తుతిచేయుదు రాత్మఁగోపలన్
మదవదరాతివర్గములు మానుగఁ గవ్వడి యండ్రు, భూజనుల్
మది దిననాథుఁ డందురు,సమస్తము ద్రవ్యముఖంబు చూచినన్.ఆ.౧

మ. కమనీయంబుగ నాడఁ బాడఁ జదువంగా నేర్చు వీణాది వా
ద్యములన్నైపుణి సొంపుమీఱఁగఁ గళాస్థానాంగతంత్రంబులన్
సుమనస్స్ఫూర్తిమనోజకేళి విటులం జొక్కింపఁగా నేర్చు వి
భ్రమసౌందర్యముల న్వహించు సరిచెప్పన్ లేరు నాపుత్రికిన్. ఆ.3.

7. సముఖ వేంకటకృష్ణప్పనాయకుఁడు

ఈకవి యహల్యాసంక్రందన మను మూఁడాశ్వాసముల ప్రబంధమును రచించెను. ఇతఁడు శూద్రకులజుఁడు; సముఖ మీనాక్షీనాయకుని తనూజుఁడు. "శ్రీమత్పాండ్య మండలాధీశ్వర విజయరంగచొక్కనాథ మహీనాథ కరుణాకటాక్ష సంపాదిత గజతురంగమాందోళికా ఛత్ర చామరవిజయ దోహళకాహళభూరిభేరీ బిరుదధ్వజప్రముఖ సకలసంపత్పారంపరీసమేత" అని యాశ్వాసాంత గద్యమునందుఁ జెప్పుకొనుట చేత కవి మధురాధినాథుఁ డయినవిజయరంగ చొక్కనాథునికాలములో నున్నవాఁ డనుట స్పష్టము. ఈవిజయరంగ చొక్కనాథుఁడు క్రీస్తు శకము ౧౭౦౪ వ సంవత్సరము మొదలుకొని ౧౭౩౧ వ సంవత్సరము వఱకును పాండ్యమండలాధీశ్వరుఁడుగా నుండెను. కాఁబట్టి కవియు ౧౭౦౦ సంవత్సరప్రాంతములనుండి యున్నవాఁడే. ఇతఁడు జైమినిభారతమును వచనకావ్యమునుగా రచించినట్లహల్యాసంక్రందనములోని యీక్రింది పద్యమువలన తెలియవచ్చుచున్నది—

గీ. సముఖమీనాక్షినృపగర్భవిమలజలధి
చంద్ర వేంకటకృష్ణేంద్ర శౌర్యసాంద్ర
మునుపు జైమినిభారత మనఘ వచన
కావ్య మొనరించినట్టి సత్కవివి కావె.

ఈ కాలమునందే మంచికవులచేత తెలుఁగున వచనకావ్యము లారంభింపఁబడినట్టు వినఁబడుచున్నవి కాని యా వచనకావ్యము లిప్పుడు కానరావు. తారాశశాంకమును రచించిన శేషము వేంకటపతి యీకవి కాలమునం దుండినవాఁడు. కవి తాను "పురోహితభృత్యామాత్య సామాజిక బంధువర్గంబులు కొలువంగూరుచుండి యుభయభాషాకవితా

విశేషుండై శేషము వేంకటపతికవీంద్రుం డాస్థసభుండు గానఁ బిలిపించి” నవు డతఁడు క్రిందిపద్యమును జెప్పెనఁట—

చ. నల నాసత్య వసంతులం గెలుచుసౌందర్యంబు ధైర్యంబు దో
ర్బలముఁ స్వామిహితానువృత్తినయముఁ బ్రాభవంబు విద్యయున్
వెలయన్ బాల్యమునందె నీవు మధురోర్వీనాథు మెప్పింపవా
బళిరా వేంకటకృష్ణభూవరమణీ బాహాఫణిగ్రామణీ.

అహల్యాసంక్రందనములోని రెండుపద్యముల నిం నుదాహరించుచున్నాను—

ఉ. బంటుతనంబు లాడుకొని పాఱఁగ రావణుచేతిపెట్టునన్
గంటికి నీరు గ్రమ్మఁ గలఁకంబడి పాఱెను నీకుతండ్రి నీ
యింటను లేదు పౌరుష మొకింతయు బీరములేల చేతివా
లంటకు కోడెకాఁడ చుటు కంటఁగ వెంటనె చెంపకొట్టెదన్. ఆ. ౧

ఉ. ఆతఁడె నాలతాంగిని మహాగ్రహదృష్టిని జూచియోసి నీ
చేతిజలంబు లంట నిఁకఁ జెల్లునె యెంతటిజాతవే బలా
రాతిని గూడి తీ విపుడు రాతిరిజామునఁ గావ్రునన్ బలా
రాతిశరీర మంత మని రాజముఖిన్ సునఖున్ శపింపఁగన్. ఆ. 3.

---

8. రోసనూరి వేంకటపతి

ఈకవి విష్ణుమాయావిలాస మను మూఁడాశ్వాసముల పద్యకావ్యమును రచియించి దానిని వేంకటగిరిసంస్థానప్రభువయిన శ్రీవెలుగోటి బంగరు యాచమనాయని కంకితము చేసెను. ఇతఁడు నియోగి బ్రాహ్మణుఁడు; లింగనామాత్యుని పౌత్రుఁడు; గంగనమంత్రి పుత్రుఁడు; కాశ్యపగోత్రుఁడు. కృతిపతి తండ్రియైన కుమారయాచ భూపాలుఁడు తనకు “తిక్కయజ్వ” యను బిరుదము నిచ్చినట్లు కవి యీపద్యమునఁ జెప్పుకొన్నాఁడు—

మ. నను శ్రీభూపతిలింగపాదభజనానందున్ గుమారేచ భూ
జనపాలాగ్రణి తిక్కయజ్వయనుచుం జాలంగఁ బేరిచ్చి ప్రో
చినఁ బెంపొందినరోసనూరికులునన్ శ్రీవేంకటాఖ్యుం గృపా
ఘనగంభీరశుభైకదృష్టి వెలయుంగాఁ జూచి సల్కెం దగన్.

కృతినాయకుఁడైన బంగరుయాచమనాయఁడు ఔరంగజేబు ఢిల్లీచక్రవర్తిగానున్న కాలములో ౧౬౯౬ వ సంవత్సరమునందు వెల్లూరినబాబగు జుల్ఫగారుచేఁ జంపఁబడినందున ఈపుస్తకము ౧౬౯౦ వ సంవత్సరప్రాంతములయందు రచియింపఁబడిన దని చెప్పవచ్చును. (వేంకటగిరిసంస్థానప్రభువు లనేకులు తెలుఁగుభాషయం దభిమానము గలవారయి కవులను బ్రోత్సాహపరిచి తా మనేక ప్రబంధములకుఁ గృతిపతులయిరి. వీరు పద్మనాయకవంశజు లయినవెలమలు. ఈసంస్థానమును స్థాపించిన మూలపురుషుఁడు బేతాళనాయఁ డనుబిరుదనామము గల చెవిరెడ్డి. ఇతఁడు చేయూరి పోలిరెడ్డికుమారుఁడు. ఇతఁడు తన నివాసస్థల మైన యనుమగల్లు గ్రామమున రేచర్ల యాచఁడు (రేచఁడు) అను మాలవానిచేత దనపొలమును దున్నించుచుండఁగా నాగటికఱ్ఱున కొకరాగిశాసనము తగిలెను. దానిని జదివిచూడఁగా నందు "నాగభైరవపొలము" అనెడి యాచోట తొమ్మిదిలక్షలధనము భూస్థాపితమయి యున్నదనియు, నరబలి యిచ్చినపక్షమున బలియిచ్చినవానికాధనము దక్కుననియు, వ్రాయఁబడియుండెను. అతఁ డప్పు డేమి చేయుటకును దోఁచనివాఁ డయి యేచనితో నాలోచింపఁగా, వాఁడా స్థలమునందుఁ దనయింటిపేర నొక గ్రామము కట్టించి తనయింటిపేరును గోత్రముగా బెట్టుకొని వంశమునందుఁ బుట్టినపురుషుల కెల్లను దనపేరు పెట్టుచు వివాహము చేయవలసి వచ్చినప్పుడెల్ల ముందుగా దనకులజులలో నొక్కనికి వివాహముచేయుచు వచ్చుట కంగీకరించినపక్షమునఁ దాను బలియగుట కొప్పుకొనెద నని రెడ్డితోఁ జెప్పెను. చెవిరెడ్డియు

వాఁడు కోరిన నియమముల కన్నిటికి నొప్పుకొని యప్పుడే వాని నాపొలమునకు బలిపెట్టి సానిశేషమును స్వాధీనము చేసికొనెను. తరువాత నతఁ డాక్షేత్రమున రేచర్ల యనుగ్రామమును గట్టించి, తనగోత్రమును రేచర్లవారని మార్చుకొని, ఆయూరు విడిచి పిల్లలమఱ్ఱి యను గ్రామముచేరి యాచోటు నివాసముగా జేసికొనెను. ఈగ్రామమునం దితఁ డొకనాఁడు రాత్రి చీఁకటి పడువఱకును పొలములో బనిచేసి యింటికి వచ్చుచుండగా దారిలో నురుములతోను మెఱుపులతోను గొప్పవాన వచ్చెను. ఆవానలో నతఁ డొక మఱ్ఱిచెట్టుక్రిందికిఁ బోయి నిలువఁబడియుండఁగా, చెట్టుమీఁదినుండి యొకభూతము దిగివచ్చిన ట్లాతనిదృష్టికిఁ గనఁబడెనఁట! అతఁ డెంతమాత్రమును జడియక చేత ఖడ్గము ధరించి యెదురుగా నడువఁగా, అతని ధైర్యసాహసములకు మెచ్చి యాబేతాళుఁడు చెవిరెడ్డియు నాతని సంతతివారును శౌర్యసామ్రాజ్యైశ్వర్యవంతు లగుదురనియు శత్రువులతోడి యుద్ధములలో నెల్లడాను దోడ్పడి వారికి జయము కలిగింతుననియుఁ బలికిన ట్లాతని చెవులకు వినఁబడెనఁట! బేతాళుఁ డాతనికి బ్రత్యక్షమయి వరములిచ్చెనన్న వార్త దేశమునం దంతటను వ్యాపించి యచిరకాలములోనే కాకతీయ ప్రభువయిన గణపతిరాజు చెవినిసోఁకఁగా, అతఁ డాచెవిరెడ్డిని తనరాజధాని యైన యొరంగల్లు నగరమునకు రప్పించి లక్షహూణాయలునచ్చు గ్రామములిచ్చి తనవద్ద సేనాపతినిగా నియమించి "పిల్లలమఱ్ఱి బేతాళ నాయఁడు" అన్న బిరుదుపే రిచ్చి గౌరవించెను. ఇది ౧౨౧౦ వ సంవత్సరప్రాంతమయి యుండును.

ఈతఁడు చేసిన నియమముల ననుసరించి యీతనివంశమువారు నేటివఱకును యాచనామమునుగూడ దమపుత్రుల నామమునకుఁ జేర్చుచు, తమయింట వివాహము జరపుటకు ముందుగా నొక మాలవానికి బెండ్లిచేయుచు, పూర్వమర్యాదను జెల్లించుచున్నారు. చెవిరెడ్డి

యొక్క ద్వితీయపుత్రుఁ డయిన ప్రసాదాదిత్యనాయఁడు గణపతిరాజు యొక్క మరణానంతరమునం దాతనిభార్యకును బుత్రికకును సహాయుఁడయి యుండి రాజ్య మన్యాక్రాంతము కాకుండఁ గాపాడి కాకతిరాయ రాజ్యప్రతిష్ఠాపనాచార్యుఁడని బిరుదందెను. చెవిరెడ్డి యింటిపేరు రావువారు. ఈరావువారు మొదట నోరుగల్లురాజ్యమున నేయుండి పేరొందినను, తరువాత దమపౌరుషమువలన నన్యభూము లాక్రమించుకొని సంస్థానప్రభువులయిరి.) ఈవంశమువారిలో నొకఁ డగు తిరుమలనాయఁడు కృష్ణదేవరాయల రాజ్యకాలములో వెలుగోటిరాజ్యమును సంపాదించి వెలుగోడుపట్టణము తనకు రాజధానిగాఁ జేసికొన్నందున, ఆతనివంశము నారప్పటినుండియు వెలుగోటివా రనఁబడుచున్నారు. విష్ణుమాయావిలాసకృతిపతియొక్క తాతయైన పెద్దయాచమనాయఁ డావఱ కన్యాక్రాంతమయిన వేంకటగిరిపురమును మరల స్వాధీనపఱచుకొని దానిని స్వరాజధానిని జేసికొనఁగా నాటినుండియుఁ దత్సంతతివారి కదియే రాజధానిగా నున్నది. చెవిరెడ్డి వంశజులలోనొక్కఁడగు సర్వజ్ఞ సింగమనాయఁడు బమ్మెర పోతనామాత్యునివలన నుద్దండభోగినీదండకమును శ్రీనాథునివలనఁ గొన్నికృతులను బొందుటయేగాక తాను పండితుఁడయి సింగభూపాలీయ మను నలంకారశాస్త్రము మొదలగు సంస్కృతగ్రంథములను సహితము రచించెను. ఆతని వంశజులలో నొకఁ డగు రాయపనాయఁడు ౧౬౨౦ వ సంవత్సరప్రాంతములయందు భానుమతీపరిణయము కృతినందెను. ఈవెలుగోటివా రిప్పటికిని తెనుఁగుకవుల నాదరించుచున్నారు. కవిత్వరీతి తేటపడుటకయి విష్ణుమాయావిలాసములోని రెండు పద్యములఁ జూపుచున్నాను—

చ. ఇటువలెనేమి యీపయన మిప్పుడు మీ రఖిలేశ మాయలన్
బటువగు విష్ణుఁడం చనెదుపల్కులు సిద్ధము సుందరీక్రియా

కుటిలకచరోచిరమైన హారి గొబ్బునఁ జూచితి చేసి మీకు నా
కట్టడఁ జపలత్వ మైనతటి గౌరవ మె ట్లగునో తలంపుఁడీ. ఆ. ౧.

చ. వనయువతీవసంతులవివాహమహోత్సవవేళ నెమ్మదిం
దనరు కుతూహలంబున లతాలలనల్కరపల్లవంబులన్
ఘనముగ సేసవెట్టుటకుఁగా ధరియించిన మౌక్తికంబులో
యన విలసిల్లె నెల్లెడ సుమాసుకుమారకకోరకావళుల్. ఆ. ౩.

---

9. పైఁడిమఱ్ఱి వేంకటపతి

ఈకవి చంద్రాంగదచరిత్ర మనెడి యాఱాశ్వాసముల ప్రబంధమును రచించి యున్నాఁడు. ఈతని కవిత్వము మిక్కిలి ప్రౌఢ మయి రసవంతమయి పూర్వకవుల రచనఁబోలి హృదయాహ్లాదకర మయి నదిగా నున్నది. ఇతఁడు తన గ్రంథమును శ్రీరామాంకితము చేసియుంటచే కృతిపతినిబట్టి యీతని కాలనిర్ణయము చేయుట కాధారము కనఁబడ లేదు. ఉన్నయాధారమంతయు కృతికర్త తనవంశవర్ణనము చేసికొన్న యీక్రింది పద్య మయియున్నది——

సీ. సకలసత్కవిపూజ్యసుకవిత్వసామ్రాజ్యనిర్వాహకుఁడు పెద్దపర్వతన్న
వివిధభాషావార్యవిరచనాచాతుర్యసర్వంకషుఁడు బోడిపర్వతన్న
వరపద్యదాకార వాచాచమత్కారనిరుపమమతిశాలి తిరుమలన్న
యవధానకృతిగర్భ కవితాచ్ఛసందర్భ కీర్తితప్రజ్ఞుఁడు కేశవన్న
దనకు నన్నలుగాఁగను దనరుకృష్ణ
రాయభూషణకులరామరాజతనయ
కేశవాత్మజ పర్వతాధీశు వేంక
టాద్రి నిదె కావ్య మేనిత్తు నంకితముగ.

ఇందలి పేరులనుబట్టియు కవికాల మిదియని నిశ్చయించుట కాధారము దొరకలేదు. ఇందు 'కృష్ణరాయభూషణ' యను పదముండుటనుబట్టి కర్నల్ మెకంజీవారిగారు సంపాదించిన లిఖితపుస్తకముల పట్టికలో కవి కృష్ణదేవరాయని కాలములోనివాఁ డని చెప్పఁబడి యున్నది. ఇటీవల బ్రౌన్ దొరగారు తమ నిఘంటువునం దీకవి యాధునికుఁడని వ్రాసి యున్నారు. పయి పద్యములో నున్న కృష్ణరాయభూషణశబ్ద మాకవికి కృష్ణదేవరాయని యాస్థానమున కలంకారముగా నుండుటచేత నే వచ్చినను ఈకవి కృష్ణరాయభూషణుని వంశజుఁ డగురామరాజుకొడుకైన కేశవార్యుని పుత్రుఁడగు పర్వతాఖ్యునిసుతుఁడగు వేంకటపతి యగుటచే కృష్ణదేవరాయని యనంతరమున పెక్కుతరములు గడచిన తరువాత నున్నవాఁడగుట స్పష్టము. అప్పకవి యీచంద్రాంగదచరిత్రములోని పద్యముల నుదాహరించి యుండకపోవుటచేత నీకవి ౧౬౫౦ వ సంవత్సరమునకు దరువాతివాఁ డనియు నూహింపఁ దగియున్నాఁడు. అందుచేత కవి ౧౭౦౦ వ సంవత్సరప్రాంతములయం దున్నవాఁడని తోఁచుచున్నది. చంద్రాంగదచరిత్రమునుండి కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. అప్పచు లాడుచుఁ నగవు లాడుచు బారలు సాఁచిసాఁచి మా
యప్పలు వచ్చి రంచు సకియ ల్గనుదమ్ములు మోడ్చి పిల్వఁగా
నుప్పున దప్పుతప్పు టడుగుల్ నడలం గొమరుండు పైఁబడుం
దప్పక చూచుతల్లికిని దండ్రికి ముచ్చట తీఱునట్లుగన్—ఆ. ౨

మ. హరిమైరోలం గడుపోటుబంట నయి గర్వాలాపము ల్మున్ను స
త్వరతం బల్కితిఁ గొన్ని నోరికాలఁదుల్ తథ్యంబు నేఁ డన్నియుం
బరఁగం బందకుఁ జెప్పుసాధనగతిన్ బాటిల్లె వ్యర్థంబులై
సురలోకంబున కేఁగు కైట్లు సవయస్కు ల్సన్నల న్నవ్వఁగన్—ఆ. ౩

సీ. భుజగలోకాధీశ భోగతల్పశయాన హారిహూపధరమహాపురుష యనుచు
సత్తులార్థమకుటవర్ణితపాదరాజీవ రామార్చనీయ శ్రీరంగ యనుచు
మారీచమదభంగ మహితవాయవ్యాస్త్రశరదనిద్రితనేత్ర శౌరి యనుచు
సముదగ్రవర్షావసరయోగనిద్రాణ కరిరాజవరద శ్రీకాంత యనుచుఁ
దలఁతు నుతుకును నలుకు నెగ్గిలుచుఁ బలుకు
పక్షులనయనస్వరశిరోజచరణకలన
పవనకంధరఘనహంసజవనతురగ
భటనటప్రియసముదాయఘటితమోదప—ఆ. ౪

ఉ. ఓరిమృగాంక నాజడకు నోడినరాహువు కిన్క నంకమున్
పేర విసంబు నీయొడలఁ జేరఁగఁ గోరలకొద్ది నొక్కెఁ దు
ర్వారపిజత్వదీయకరవారవిషంబుల నొంచసాఁగెఁ బె
న్వైరముఁ బూని యిప్పు డిది నీదగుచేతఁగఁ జూడ కెమ్మొయిన్. ఆ-౫

---

10. వెలగపూడి కృష్ణయ్య

ఈ కవి భానుమద్విజయమనెడి యైదాశ్వాసముల ప్రబంధము రచియించెను. మఱియు నితఁడు మాలతీమాధవీయము, గౌళికా శాస్త్రము, చతుర్విధకందశతకము అను పద్యకావ్యములను, వేదాంత సారసంగ్రహ మను వచనకావ్యమును, రచించినట్లు భానుమద్విజయము లోని యీ క్రింది పద్యములోఁ గవి చెప్పికొనియున్నాఁడు—

సీ. మహిలోనమాలతీమాధవీయ మనంగ శృంగారకావ్య మొసంగఁజేసి
గౌళికాశాస్త్రంబు కడులోకహితముగా నెనయనేకాశ్వాసమున రచించి
పరిఢవిల్లఁగఁ గందపద్యపుశతకంబు నాల్గుయోగంబుల ననువుపఱిచి
సన్నుతవేదాంతసారసంగ్రహశాస్త్ర మమరంగ వచనకావ్యం బొనర్చి

చాటుకృతులను మఱికొన్ని సంఘటించి
మామకాంకిత మొనరించి మంచిపుణ్య
శాలియనఁగీర్తికెక్కెను సత్కవీంద్ర
మధురవాక్సాంద్రకృష్ణయామాత్యచంద్ర.

పూర్వ మీతని వంశపువారు గాంగేయోపాఖ్యానము, సుమంత్రో దయము, ఆంధ్రకర్ణామృతము, వజ్రభుకోపాఖ్యానము, సేతుమాహాత్మ్యము, దత్తాత్రేయచరిత్రము, మర్యాద రామసచివచరిత్రము, మొదలగు గ్రంథములను రచియించి యుండినట్టును గవి యీ క్రింది పద్యములతోఁ జెప్పియున్నాఁడు—

క. భూనుత గాంగేయోపా। ఖ్యానసుమంత్రోదయాంధ్రకర్ణామృతముల్
మానిత వజ్రసుకోపా। ఖ్యానము సుభహేతు సేతుమాహాత్మ్యంబున్.

క. దత్తాత్రేయచరిత్రన్ । సత్తగు మర్యాదరామసచివచరిత్రన్
బత్తరపుఁ గృతులు చేసిన । యుత్తమకవు లెల్ల మీకులోద్భవులగుటన్.

ఈ కవి యారువేల నియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబ సూత్రుఁడు; లోహితసగోత్రుఁడు; వెల్లపూడి నారసింహార్యపౌత్రుఁడు; నరహరిమంత్రి పుత్రుఁడు. ఈ కవి పాండ్యమండలాధీశ్వరుఁడైన విజయ రంగ చొక్కభూపాలుని దండనాథుఁడగు సాంబయామాత్యుని పుత్రుఁ డగు గోవిందయామాత్యునికి మేనమఱఁదియైనట్లీక్రింది పద్యమునఁ జెప్పు కొన్నాఁడు—

సీ. పాండ్యభూమండలాఖండలుండైన విజయరంగ చొక్కభూజాని కాప్త
మండనుండగు సాంబదండనాథాగ్రణితనయులలో మేటిదండి యగుచు
సంగీతసాహిత్యసంస్కృతాంధ్రకవిత్వపరసజ్ఞుఁడై మేనమఱఁదియగుచుఁ
గొమరొప్పుచుండెడుగోవిందయామాత్యుఁడనుపమవిద్యాధికాగ్ర్య
సభను

నింకుకొలు వుండె నపుడు నేదంటఁ జేరి
సారసల్లాపముల మీఱి చతురమతిని
దక్షిణామూర్తికృపను బ్రత్యక్షమగుచుఁ
గృతిపతిత్వంబుఁ గోరుసంగతిని దెలుప.

ఇందుఁ బేర్కొనబడిన విజయరంగ చొక్కభూపాలుండు దక్షిణ మధురాపురము రాజధానిగా పాండ్యమండలమును క్రీస్తుశకము ౧౭౦౪వ సంవత్సరము మొదలుకొని ౧౭౩౧ వ సంవత్సరమువఱకును పాలించిన ట్లీవఱకే చెప్పఁబడెనుగదా? అందుచేత నీకృష్ణకవియు నాకాలపువాఁడే యని వేఱుగఁ జెప్పనక్కఱలేకయే తెలిసికోవచ్చును. కవి సాంబదండ నాధుని వర్ణించుచు—

సీ. సరిజేటిమూర్కాటిసాదులాఖానుతో ఘటియించె నెవ్వాఁడు ఘనత మీఱఁ
బేర్మిదంజాపూరి పేషువాయానందరావును నెవ్వాఁడు రహి నడంచె
మయిసూరినంజరాజయగారిప్రియవాక్యసంధికి నెవ్వాఁడు శక్తి దాల్చె
* * * నగుపళాగి శ్రీపళపన సాంబశౌరి.

అని యతఁ డార్కాటినవాబగు సాదతల్లాఖాను మొదలగువారి నోర్చినట్లు చెప్పియున్నాఁడు. ఈసదతల్లాఖాఁ ౧౭౦౦ వ సంవత్సరము మొదలుకొని ౧౭౩౨ వ సంవత్సరమువఱకును నవాబుగానుండి యార్కాటురాజ్యము చేసెను. కాఁబట్టి కవి ౧౭౨౦ వ సంవత్సర ప్రాంతమునందు మధురాపురములో భానుమద్విజయమును రచియించి యుండును. ఈతనికవిత్వము రసవంతమైనది. కవితాధోరణి తెలియుటకై భానుమద్విజయములోని రెండు పద్యముల నిందుదాహరించుచున్నాను-

ఉ. ఏమియు లేనిమానులె యహీనమతిభ్రమ లందుచుండఁగా
భూమిపతిత్వ మొందినప్రభుల్ వ్యసనంబులఁ గాంచుటబ్రమే?

హేమయిన న్సుమేరుధృతి నేర్పడఁబూని సమస్తకార్యముల్
తాము వహించిచూడమిని ధాత్రి యరాజక మౌను భూవరా. ఆ-౨

మ. గిరులం బాఱడిమేఘముల్ల్గగ వసిం గీలొక్కన్నకన్నీరు లా
గురువక్షోరుహ తారహారములతోఁ గూడం బ్రకాశింప నా
ధరణీశాంగన దుస్సహాత్మగతసంతాపంబుచే నేడ్చె భా
స్వరవాసంతపికీస్వరాకలితవాచామాధురీవైఖరిన్. ఆ. ౮.

11. శేషము వేంకటపతి

ఇతఁడు శశాంకవిజయ మనెడి యైదాశ్వాసముల శృంగారప్రబంధమునుజేసి వంగలసీనయార్యున కంకితము చేసెను. శశాంకవిజయమునకు తారాశశాంకమని నామాంతరము గలదు. ఇందుఁ జంద్రుఁడు బృహస్పతివద్ద విద్యాభ్యాసమునకయి చేరి గురుపత్నియగు తార నింటి నుండి లేవఁదీసినకథ మిక్కిలి పచ్చిగా వర్ణింపఁబడినది. ఈశేషము వేంకటపతి నియోగిబ్రాహ్మణుఁడని తోఁచుచున్నది. ఇతఁడు కందాళ రామానుజాచార్యుని శిష్యుఁడు; కృష్ణయార్యుని కుమారుఁడు. కృతి నాయకుఁడు తన్నుఁ బిలిపించి పలికినట్లు చెప్పఁబడిన యీక్రింది పద్యములలో కృతిపరంపరలు చేసినట్టు కవి చెప్పుకొనుటయే కాని యొక్కగ్రంథమునైనను జేకొనియుండలేదు.—

క. నను రంగేశ్వరపదయుగ । ఘనతరభజనానిరూఢకవితాసామ్రా
జ్యుని శేషముకృష్ణసుధీ । తనయునిఁ బిలిపించి పలికె దయదైవారన్.

చ. అసదృశభక్తి సద్గురుకటాక్షముఁ గాంచి సముచితాత్మతన్
బిసరుహమాకరందరసపేశలకౌశలవత్ప్రసూక్తులన్
రసికుల కింపుగాఁ గృతిపరంపరలన్ రచియించి కీర్తిచే
నెసఁగితివయ్య వేంకటపతీ బళి శేషమువంశసత్కృతీ.

ఈకవి పాండ్యమండలాధీశ్వరుఁడైన విజయరంగ చొక్కనాథుల కాలములో నున్నట్లీపరకే సముఖ కృష్ణప్పనాయకునిగూర్చి వ్రాయునప్పుడే చెప్పఁబడెనుగదా! కవియు తారాశశాంక కృతినాయకుఁడైన వంగల సీనయార్యుని వర్ణించుచు, అఖండమండిత మహీమండలమండనాయమాన పాండ్యమధురాధరాఖండల శ్రీవిజయరంగచొక్కనాథ మహీనాథ కృపాకటాక్ష వీక్షణానుక్షణ వర్ధమాన.....నిఖిల సంపత్సంపరాకంపితనిలింపనాయకుండని యతనికొక విశేషణమును బ్రయోగించి యున్నాఁడు. మఱియు ద్వితీయాశ్వాసారంభమున

క. శ్రీవిజయరంగచొక్క । క్ష్మావిజయ గురుప్రసాదసంపన్నిత్యా
శ్రీవరదాచార్యమణీ । శ్రీవరదాస్యైకకృత్య సీనామాత్యా.

అని కృతిపతిని సంబోధించియున్నాఁడు. దీనినిబట్టి కవి విజయరంగచొక్కనాథుని కాలములో మధురలో నుండుట నిశ్చయమగుటచేతను, ఆరాజు ౧౭౦౪ వ సంవత్సరము మొదలుకొని ౧౭౩౦ వ సంవత్సరమువరకును రాజ్యముచేసినవాఁడగుటచేతను, శేషము వేంకటపతి యాకాలమునందున్నట్లు స్పష్టమగుచున్నది. అక్కడక్కడ క్త్వార్థకసంధి మొదలయిన కొన్ని లక్షణదోషము లున్నను, కవిత్వము మొత్తము మీఁద ద్రాక్షాపాకమయి మిగుల రసవంతమయియున్నది. చక్కెరమెత్తిన విషమువలె నీతిమాలిన యీకథ మనోహరములయిన తేటమాటలతో నింపుగా చెప్పఁబడినందున, అనేకులయిన యౌవనపురుషుల నాకర్షించి పాడుచేయుచున్నది. దుర్నీతిని వర్ణించునప్పు డీకవి తన యసమ్మతిని దెలుపు వాక్యముల నెక్కడను బ్రయోగింపక, "లోకములోనఁ గొందఱబలల్........తాటాకులలోన వ్రాసిరి పరాంగనఁగూడినఁ బాపమంచు" "ఎన్నిపువ్వులకేఁ వ్రాలను తేఁటి యట్లమగవాఁడనువానికి దోసమున్నదే?" యిత్యాది వాక్యరత్నములచేత వలపుగలచోటఁ గలయుటయే పరమార్థమన్నట్టు తెలిపి పామరులను భ్రమింపఁజేసి యున్నాఁడు.

రంకును మంచిదని సాధించుటకు సహితము మనవారికి పురాణముల నుండి దృష్టాంతములు తండోపతండములుగా దొరకుననుట కీక్రిందిపద్యమును నిదర్శనముగాఁ జూపవచ్చును.—

సీ. కన్నకూఁతు రటంచు నెన్నక భారతీతరుణిఁ గూడఁడె నీపితామహుండు
మేనత్త యనుమేరమీఱి రాధికఁ గ్రోడ నెనయఁడే నిన్ననీయనఁగుబావ
వదినెయంచు నొకింత వావి లేకయె జ్యేష్ఠునెలఁతఁ ద్రోఁ బొందఁడే
నీగురుండు
మునిపత్నియనక హల్యనుబట్టఁడే నీదుసహపాఠి యగుపాకశాసనుండు
యిట్టిమీవారినడతలు కట్టిపెట్టి
యమ్మనే చెల్ల న్యాయంబు లాడెదౌర !
కడకు నీఱంకు నీవెఱుంగనివితాన
దూఱెదవు నన్నుఁ జలపోరి దోసకారి !

"మున్నలదారుకావనస్త్రీలు గిరీశునిం గలియరే? వ్రజభామలు శౌరిఁగూడరే? మాలలనాశిరోమణుల కందును సందును నేమిచెప్పుమా" యఁట! ఆహా! ఏమి యీదేవత్వలక్షణము! దేవత్వమున కెప్పుడును శుద్ధచరిత్రమే లక్షణముగా నుండవలయును గదా? నీతిమాలి యన్యకాంతలఁ గలయుటకంటె నాసురకృత్యము మఱియేముండును?

ఉ. ఎంచఁగరానిమోహమున నే నిటు పిన్నటనాఁటనుండియున్
బెంచితిఁ బెద్దఁజేసితిని బేర్మిగఁ బ్రాయము వచ్చినంతనే
యెంచక మాటలాడె దిపు డిన్నిప్రియోక్తుల కిమ్ముపుట్టెఁగా ?
మంచిది నిన్నుఁగూడుటకు మాకు స్వతంత్రత లేకపోయెనే ?

గురుపత్ని శిష్యునిఁ బిన్ననాఁటనుండియుఁ బెంచి పెద్దవానిని జేసెనఁట! అందుచేత నామె కాతనిఁగూడుటకు స్వాతంత్ర్యము గలదఁట! ఏమి యీదుర్నీతి! దుర్నీతి యింతకంటెను దూరముపోవుట నంభవింపనేర్చునా? కృతయుగమునం దైనను కలియుగమునం దైనను

జారత్వ మెప్పుడును మొదలంట నశింపదు. కృతయుగపు తారలును చంద్రులును మన యీకలియుగమందును గలరు. అయినను మన యీపాడు కలియుగమునందుమాత్ర మిల్లువిడిచి లేచిపోయినదానిని మగని కిప్పించుటకయి పెద్దమనుష్యులుపోయి జారుని బతిమాలుటయు, మగని కిప్పించిన యీఅంకుటాలికి సంతానము కలిగినప్పుడు జారపురుషుఁడువచ్చి పుట్టినబిడ్డ కయి యింటిమగనితో తగవులాడుటయు లేవు. ఇవి కృతయుగధర్మములు కాఁబోలును! దూరపుకొండలు నునుపయి నట్లు వెనుకటివారి యకృత్యములు కంటికి మిఱుఁగుకాఁగా మనవారు పూర్వకాలమును పొగడుచుందురు. బ్రహ్మదేవుని యంతటివాఁడువచ్చి భార్యను గోలుపోయి దుఃఖించుచున్న బృహస్పతికి తారను మరల నిమ్మని చంద్రుని ప్రార్థించెనఁట!

చ. అని పరమేష్ఠి పల్కుటయు నట్లనకా కని చంద్రుఁ డయ్యెడన్
ఘనతరగర్భభార నఖకాంతివిసర్జితతారఁ దారఁ దా
ననునయనోక్తులం బెలిపి యంపినతోడనె దివ్యతూర్యని
స్వనములు మ్రోసె మింట విరివానలు పర్వెను జంట జంటగన్.

బ్రహ్మదేవుని ప్రార్థన నంగీకరించి చంద్రుఁడు గర్భవతియైయున్న గురుని భార్యను గురుని కియ్యఁగానే, తమగురునిల్లు కూలఁద్రోచి యింతటి ఘనకార్యమును జేసినందున కాతనిమీఁద సిగ్గులేక సురలు విరులవాన గురిసిరఁట!

చ. అమరులతోడ నప్పు డని రబ్జభవుండు భవుండు నగ్గురుం
బ్రమదము మీఱఁగాఁ బిలిచి మావచనంబునఁ దారఁ జెందుమీ
రమణి కశుద్ధిలే దమృతరశ్మిని బొందుటచేత దాన నీ
కొమ పరిశుద్ధిఁ గాంచెఁ గయికొమ్మనఁ గొమ్మ గురుండు చేకొనెన్.

దేవతలును బ్రహ్మరుద్రులును గురునిఁ బిలిచి వ్యభిచారదోషము లేకపోవుటయేకాక యమృతరశ్మిని బొందుటచేతఁ దార పరిశుద్ధురా లయ్యెనని చెప్పి యొప్పగించిరఁట.

ఉ. తత్సమయంబునన్ శశి ముదంబున నచ్చటి కేగుదెంచి పు
త్రోత్సవ మాచరింప విని యుద్ధతితో గురుఁ డందువచ్చి య
స్మత్సుతుఁ డీబుధుం డిట నిశాకర రాఁ గత మేమి నీకన
న్మత్సరబుద్ధి వానికిఁ బునఃకలహంబు జనించె నయ్యెడన్.

ఆపతివ్రతాతిలకమునకు పుత్రుఁడు పుట్టఁగానేవచ్చి చంద్రుఁడు పుత్రోత్సవ మాచరించి నప్పుడు గురు శిష్యులకు పునఃకలహము జనించెనఁట!

క. నావిని యజుఁ డోహోహో
మీవాదము చాలుఁ గుముదమిత్రునిపుత్రుం
డీవత్స మితనిఁ జంద్రుని
కీ విమ్మా వలదు విరస మిఁక నాంగిరసా.

అని బ్రహ్మదేవుఁ డింటిమగనికి బుద్ధిచెప్పి శిశువును తేరమగని కిప్పించి వివాదము తీర్చెనఁట! ఈవిషయమునే చెప్పుచుఁ గాశీఖండములో

గీ. చదివె గురునొద్ద ధర్మశాస్త్రంబుఁ దొలుతఁ
బరమవిశ్వాసతాత్పర్యభక్తి గరిమఁ
జదివెఁ జంద్రుఁడు కామశాస్త్రంబుపిదపఁ
దలిరుపాన్పున ననురక్తిఁ దారయొద్ద.

సీ. భువనైకధన్విచేఁబుష్పాయుధునిచేతఁబ్రసవాస్త్రమున నేటుపడనివాఁడు
నతిగాఢమైన క్రోధాంధకారంబునఁ గన్నుల నంధుండు గానివాఁడు
నిర్నిబంధనలోభనిద్రాభరంబుఁ బారవశ్యంబుచేఁ బడనివాఁడు
లక్ష్మీకటాక్షవిలాసదుర్మదమున మనములోపల నన్నుకొననివాఁడు

తేఁడు భూపతి గలిగెనే న్వాఁడు నృపుఁడె
విశ్వధాత్రీజనులపాలివేల్పు గాక
బాహ్యశత్రులఁ బరిహరింపంగవచ్చు
నంతరరులను వర్జింప నలవికాదు.

ఈవిధముగా శ్రీనాథుఁడు చెప్పినరీతి ప్రౌఢవాక్యములుగాని, పురూరవశ్చరిత్రములో—

క. పాపపరాఙ్ముఖతాపతి । దీపాంకుర మానెలంతదీర్ఘశ్వసితా
టోపమరుద్ధతి నడఁగినఁ । బ్రాపితమోహాంధకారబంధురుఁ డయ్యెన్.

సీ. లలనానితంబమండలముపై నుత్పల
దళములు రచియింపఁ దలఁచుఁగాని
తరుణి కెమ్మోవిమీఁదఁ బ్రవాళమణిసొంపు
గులుకఁగా ఘటియింపఁదలఁచుఁగాని
జలజాక్షికుచకుంభములమీఁఁద శశికప్పు
తంబుఁ దా నొనరింపఁదలఁచుగాని
మృగరాజమధ్య నెమ్మేను లతావేష్టి
తంబునఁ బెనఁగొనఁ దలఁచుగాని
తలఁపఁ డెప్పుడు గురువనితా సమాగ
మాగతాత్యుష్ణదురితదవానలంబు
దుస్సహంబని కటకటా తొగలఁజేఁడు
కలుగదుగదా వివేకంబు కాముకులకు ?

సీ. సకియకౌనుఁ దలంచి సన్మార్గ మనుఁగాని
యింతిదుర్మార్గత నెంచఁడయ్యెఁ
జెలువచన్గవఁ దలంచి సువృత్త మనుఁగాని
తరుణికువృత్తంబుఁ దలఁపఁడయ్యె
నతివమోముఁదలంచి యకళంక మనుఁగాని

తేత్రావకళంకంబుఁ దెలియఁడయ్యె
సుదతినవ్వుఁ దలంచి శుచి యనుఁగాని య
వ్వేలుఁదుకయశుచి భావింపఁడయ్యె
గురువువంటిమహాత్ముఁ డిక్కరణిఁ దరుణి
చక్కఁదనమేగుణంబుగ సంస్మరించుఁ
గాని వ్యభిచారదోషంబుఁ గాంచఁడయ్యె
నజ్ఞుఁడనఁ బ్రాజ్ఞుఁడన నెవ్వఁడవనినింక ?

ఈవిధముగా నబ్బయామాత్యుఁడు చెప్పినరీతి నీతిబోధకవాక్యములుగాని, తారాశశాంకమున లేవు. కవియొక్క రచనను దెల్పుపద్యములు కొన్ని యుదాహరించుచున్నాను—

చ. హతబహుకిల్బిషంబగుప్రయాగము యోగముదావహంబు సాం
ద్రతముగ నందు నిందిరకుఁ బట్టనఁ బట్టణమున్ సృజింపుమా
యతులితశిల్పశక్తిఁగొని యంచసి యంచ నిరూఢి నెక్కి యం
చితగతి ధాత సేసె జపసిద్ధులు సిద్ధులు త న్భజింపఁగన్.—అ ౧.

చ. అలనలినారి పొల్చి నిజయానవేళస్వకీయబింబలీ
లలు తననెమ్మొగంబునఁ గళంకరుచు ల్నునుమీసకట్టునన్
వలదు దయారుణద్యుతులు వాతెఱ వెన్నెలడాలు లేఁతన
వ్వులనమృతంబుపల్కులనుబూనెనునాఁగమనోహరాంగుఁడై..-అ.౨

ఉ. చందురుఁడుం బురంధరనిశాతశరాహతిఁ గంది నివ్వెఱం
జెందఁగ నింద్రుఁ డిట్లను శశీ వినురా వినరానిపాతకం
బందినవాని కార్తి యరుదా గురుదారకృతాపరాధమే
ధం దిగఁద్రోచి చేసితి వృథా విబుధావళితో విరోధమున్.—ఆ.౫.

12. కూచిమంచి తిమ్మకవి

ఈకవి యనర్గళమయిన కవితాధార గలవాఁడు; బహుగ్రంథములను రచియించినవాఁడు; ఇన్నిగ్రంథములను సలక్షణమయిన మృదుమధురపాకమున రచించినకవి యాధునికులలో మరియెవ్వఁడును లేఁడు. ఈ కవి యాఱువేలనియోగిబ్రాహ్మణుఁడు; కౌండిన్యగోత్రుఁడు; బయ్యనామాత్యుని ప్రపౌత్రుఁడు; తిమ్మయార్యుని పౌత్రుఁడు; గంగనామాత్యుని పుత్రుఁడు. ఈయనకు లచ్చమాంబతల్లి; జగ్గన్న, సింగన్న, నరసన్న, పితృవ్యులు; వీరమ్మ, పాపమ్మ, మేనత్తలు; సింగన, జగ్గన, సూరన, తమ్ములు; గొట్టిముక్కల రామయామాత్యుని కూఁతురైన బుచ్చమ్మ భార్య. ఈవిషయములను రుక్మిణీపరిణయములోని యీ క్రిందిపద్యము తెలుపుడు చేయుచున్నది—

సీ. గురుతరకౌండిన్యగోత్రవిఖ్యాతుండు బయ్యనమాత్యుఁ డేభవ్యుతాత
నిరతాన్న దానవర్ణితయశస్సాంద్రుండు తిమ్మనసచివుఁ డేధీరుతండ్రి
ఘనులుజగ్గనయుసింగనమంత్రియునరసన్నయు నేమంత్రియనుఁగుదమ్ము
లలరఁ దిమ్మకవి సింగన్న జగ్గనయును సూరన యేధన్యుసుతవరేణ్యు
లొనర వీరమ్మ పాప మేఘనునిసహజ
లతిపతివ్రత లక్ష్మి యేచతురురాణి
యట్టి శ్రీకూచిమంచి వంశాబ్ధిచంద్రు
మజ్జనకు నలగంగనామాత్యుఁ దలఁతు.

ఈమధ్యను ముద్రింపఁబడిన రుక్మిణీపరిణయములో నీపద్యములోని నాలవపాదమున సింగన్న యనుటకు మారుగా రాజన్నయని యున్నది కాని యది యచ్చుతప్పని తలఁచెదను. తిమ్మకవికి సింగన్నయు జగ్గనయు సూరనయునేకాని రాజన్నయను తమ్ముఁడు లేనట్టతఁడు రచించిన పుస్తకము లన్నింటివలనను తెలియవచ్చుచున్నది. అందు సింహాచలమాహా

త్యములోఁ గవి తనవంశవర్ణనము చేయుచుఁ బెద్దతమ్ముఁడగు సింగన్ననుగూర్చి చెప్పిన పద్యముల నీఁదుదాహరించుచున్నాను—

క. నాతమ్ములు సింగనయును
ఖ్యాతయశుఁడు జగ్గనయును ఘనతరసుగుణ
వ్రాతాంకుఁడు సూరనయును
భీతారిసమూహు లగుచు వెలసిరి సిరులన్.

సీ. వక్రించుచందంబు వదలక మూఢత నలరెడు సురమంత్రి నపహసించి
సానులంగూడి యింపూని బుధేంద్రుని గననోడు నచలపుంగవుని నెంచి
శుక్రదూరుఁడై చరించుచు రెండునాలుకల్ గలిగియుండెడి భోగికులునిఁ దెగడి
భంగంబు నొంది మేపట్టున నడలెడు రత్నాధివాసుఁ దిరస్కరించి
ప్రజ్ఞచే గౌరవమున వాక్పాటవమున
భూరిగాంభీర్యమున జనుల్ పొగడ నెగడెఁ
గూచి మంచ్యన్వయాంభోధికుముదహితుఁడు
శిష్టహితతంత్రిగంగయసింగమంత్రి.

కవియొక్క జన్మసంవత్సర మేదో తెలియదుగాని యితఁడు రచియించిన గ్రంథములలో నెల్లను మొదటిదగు రుక్మిణీపరిణయము—

ఉ. ఆరయ శాలివాహనశకాబ్దము లద్రిగుణాంగచంద్రులం
జేరగుమన్మథాబ్దమునఁ బ్రేమఁ బ్రబంధ మొనర్చి మీకిటుల్
చేరికతో సమర్పణము చేసితి మీకృతి యాతమిస్రహృ
త్కైరవమిత్రతారకముగా భువిఁ జెల్వగుఁగాత శంకరా.

అను పద్యముబట్టి శాలివాహనశకము ౧౬౩౭ వ సంవత్సరము మన్మథాబ్దమునకు సరియైన హూణశకము ౧౭౧౫ వ సంవత్సరమునందు జేయఁబడిన దగుట నిశ్చయమయినందున, కవి యప్పటి కిరువదియైదు సంవత్సరముల ప్రాయమువాఁ డయినపక్షమున ౧౬౧౭ వ సంవత్సర

ప్రాంతమునఁ బుట్టినవాఁడై యుండవచ్చును. అచ్చతెలుఁగు రామాయణములోని—

గీ. మునుపు మాకీవె భల్లాణుఁ డనెడిజేని
కతయురుక్మిణి పెండ్లికతయుబొబ్బ
మెకపుగుబ్బలికతయు మేల్మిలీల
పెండ్లికతయును గబ్బముల్ పేర్మిఁగూర్చి-

అను పద్యమునుబట్టి భల్లాణరాజచరిత్రము రుక్మిణీపరిణయము కంటె ముందుగా రచియింపఁబడినట్లు భ్రమ కలుగునుగాని నిజ మారయఁగా రుక్మిణీపరిణయమును రచించిన తరువాతనే కవి రాజశేఖర విలాసమను నామాంతరముగల భల్లాణచరిత్రమును రచించి నట్లు పెక్కు నిదర్శనములవలన స్పష్టమగుచున్నది. రుక్మిణీపరిణయమునందుఁ గవి తా నావఱకు గ్రంథము లేవియుఁ జేసియున్నట్లు చెప్పుకొనలేదు. కవిచేత రచియింపఁబడిన మూఁడవగ్రంథమగు సింహాచలమాహాత్మ్యము నందు—

గీ. ప్రతిభ మీఱంగ రుక్మిణీపరిణయంబుఁ
గలుషహరమగు రాజశేఖరవిలాస
మును మఱియుఁ జాలదండకములును శతక
ములును రచియించి కృతులు శంభునకు నిడితి.

అని కవి రుక్మిణీపరిణయమునే మొదటఁ జెప్పియున్నాఁడు. లక్షణసారసంగ్రహము, రసికజన మనోభిరామము మొదలయిన గ్రంథము లన్నిటిలోనుగూడ కవి మొట్టమొదట రుక్మిణీపరిణయమునే పేర్కొని యున్నాడు. కవి యేహేతువుచేతనో రుక్మిణీపరిణయము చేసినతరువాత జేసిన యచ్చతెలుఁగురామాయణము నీలాసుందరీపరిణయము లోనుగా గలపుస్తకములలోఁ దా నాపుస్తకములను జేసి ముగించినకాలమును వేసికొనలేదు.

తిమ్మకవి గోదావరీమండలములోని పిఠాపురసంస్థానములోని చైన కందరాడ గ్రామమునకు కరణము. ఇతఁడు కందరాడగ్రామవాసుఁ డయినట్లు లక్షణసారసంగ్రహములోని యీక్రిందిపద్యమువలనఁ దెలియ వచ్చుచున్నది—

సీ. కౌండిన్యగోత్రవిఖ్యాతుండఁ గూచిమంచ్యన్వయాంభోధినీహారకరుఁడ
గంగనమంత్రిశేఖరునకుఁ బరమపావనియగులచ్చమాంబకును సుతుఁడ
వెరవొప్ప రుక్మిణీపరిణయంబును సింహశైలమాహాత్మ్యంబునీల పెండ్లి
కథయును రాజశేఖరవిలాసమునచ్చ తెనుఁగురామాయణంబును మొదలగు
కృతులు రచియించి పార్వతీపతికి భక్తి
తోడ నర్పన మొనఁగినవాఁడఁ గంద
రాడపురసంస్థితుండఁ గడుఁబ్రోడ నేను
దిమ్మకవిచంద్రుఁడను జగద్విదితయశుఁడ.

ఈయన గ్రంథములుచేయ నారంభించిన కాలమునందు పీఠికాపురసంస్థానమునకు రావు మాధవరాయనృపతి ప్రభువుగా నుండెను. ఈవిషయము రుక్మిణీపరిణయములోని యీపద్యమువలనఁ దెలియవచ్చుచున్నది—

సీ. చక్రవాళాహార్యజలధితుల్యోన్నతప్రాకారపరిఖావిరాజితంబు
సాంద్రముక్తాసౌధచంద్రశాలానేకభర్మనిర్మితహర్మ్యశర్మదంబు
కరిసైంధవాందోళికాధేనుధనధాన్యవనదేవగృహసరోవర్ణితంబు
విమలచాతుర్వర్ణ్యవిద్వత్కవిశ్రేష్ఠ భటనటామాత్యవిస్ఫారితంబు
రాజమహేంద్రవరముఖ్యరాజ్యభూరి
భారసంభరణాక్రాంతభాసమాన
రావు మాధవనృపపరిరక్షితంబు
భోగనికరంబు పీఠికాపురవరంబు.

ఈరావు మాధవనృపతియే కొన్నిగ్రంథములు రచించిన యనంతరమునఁ గవికిఁ గవిసార్వభౌమబిరుదము నిచ్చినట్లు రసికజనమనోభిరామములోని యీక్రింది పద్యమువలనఁ గనఁబడుచున్నది—

సీ. నిఖిలవిద్యాభ్యాసనిపుణుఁడు మత్సహోదరుఁ డగుజగ్గనకృతవితనయులు
ఘనులుతిమ్మనయుసింగనయును లేఖకపాఠకులై కృతుల్ప్రబలఁజేయఁ
బేర్మిఁగాంచినవాఁడఁ బీఠపురప్రాజ్యరాజ్యాధిపత్యవిరాజమాన
భూరివైభవుఁడు నద్భుతపరాక్రముఁడును దానకళాధురంధరుఁడునైన
రావు నీలాద్రిమాధవరాయనృపతి
చేతఁ గవిసార్వభౌమ విఖ్యాతబిరుద
మందినఘనుండఁ దిమ్మయాహ్వయుఁడ నేను
విమలతరభక్తి మదిలోనవిస్తరిల్ల.

కవి పీఠికాపురసంస్థానములో నుండినవాఁడయినను తనగ్రంథములు వేనిని నరాంకితము చేయక యిష్టదేవతయైన కుక్కుటేశ్వరస్వామికే యంకితము చేసియున్నాఁడు. ఇతఁడు రుక్మిణీపరిణయమును రాజశేఖరవిలాసమును జేసినతరువాత రాజు తనకొక గ్రంథము నంకితముచేయ నడిగినట్లును కవి యట్లుచేయ నిష్టములేనివాఁ డయినట్లును సింహాచలమాహాత్మ్యములోని యీపద్యమువలన నూహింపఁదగియున్నది—

క. నృపులకుఁ గావ్యం బొసఁగిన
నపవర్గం బిడఁగఁగలరొ యటుగాకున్నన్
ద్విపతురగభూషణాంబర
తపనీయాదికముచేతఁ దనుపంగలరో.

సీ. ద్విజపుంగవులకుఁ బ్రవేశింపఁగారాని
పృథుగృహాంతరములఁ బ్రేమనుండి
కృతియంతధర్మపద్ధతు లెవ్వి యెఱుఁగక
ధరణిపై నడువఁ బాదములు లేక

దుష్క్రియల్ చేయుమంత్రులు చెప్పినటులె మీ
అకనటింపుచుద్విజిహ్వకలుగలిగి
వితతంబుగా వక్రగతులచేఁ బాదలుచుఁ
బూని యేప్రొద్దును బుస్సు రనుచు
గాఢరోషవిషానలోద్గారిఘోర
వక్త్రములుగల్గి దుర్మదవర్తు లగుచుఁ
జెలఁగుచుండెను భోగిరాజులభజనపఁ
గుటిలతరబుద్ధి నెవ్వాఁడు కోరఁగలఁడు ?

*   *   *   *

క. ఘనిపూని తుచ్ఛభోగం । బునకై కొఅగానిజనులఁ బొగడుటయెల్లన్
గనుఁగొన నిహపరదూరం।బని తలచిఁ వినిర్చలాంతరంగుఁడ నగుచున్.

ఈయన శివభక్తుఁడయి తాను జేసిన గ్రంథముల నన్నిటిని పిఠాపురమునందలి కుక్కుటేశ్వరస్వామికే యంకితము చేసినను, ఒక్క సర్పపురమాహాత్మ్యమును మాత్రము రాజానుగ్రహము నపేక్షించి కాఁబోలును కవిసార్వభౌమబిరుద మందినతరువాత సర్పవరమందలి భావనారాయణస్వామి కంకితముచేసెను. ఈ సర్పవరము పిఠాపురపు రాజుల గురువులగు వైష్ణవస్వాములకు నివాసస్థలమయి పీఠికాపురము నకు సమీపమున నున్నది. కవిమాత్రము సర్పపురమాహాత్మ్యములో భావనారాయణస్వామి తనకు స్వప్నమున సాక్షాత్కరించి యిట్లానతిచ్చి నట్లు చెప్పికొనియున్నాఁడు—

సీ. ప్రౌఢిమై రుక్మిణీపరిణయంబును సింహశైలమాహాత్మ్యంబు నీలపెండ్లి
కథయును రాజశేఖరవిలాసంబును నచ్చతెనుఁగురామాయణంబు
సారంగధరనరేశ్వరచరితంబు సప్తార్ణవసంగమాహాత్మ్యకంబు
రసికజనమనోభిరామంబు లక్షణసారసంగ్రహము నింపారఁ గూర్చి

కృతులు శంభుని కిడినసుకృతివినీవు
ప్రతిభ మెఱయంగ నొక్కసత్కృతియొనర్చి
మాకు నర్పణచేయు నెమ్మదిదలిర్పఁ
తిమ్మకవిచంద్ర ముదితసుధీకులేంద్ర.

తనకు మాహేశ్వరాచారవృత్తి నుపదేశించిన శైవుఁడగు బెందులూరి లింగనారాధ్యుని

క. చిరభక్తిం బొగడెద మ। ద్గురునాథుం బెందులూరికులపావనునిన్
గరుణానిధి నపరాంతక। హారమూర్తిని ఘనుని లింగనారాధ్యమణిన్.

ఇత్యాది బహుపద్యములతో బహుగ్రంథములయందు స్తుతించి శివభక్తుఁడయినను, కవి తాను కేవల శివమతస్థుఁడుగాక శివకేశవులకు భేదము లేదని భావించెడి యద్వైతమతస్థుఁడయియుండెను. కవి తాను కట్టకడపట రచియించిన శివలీలావిలాసములో నిందు క్రిందఁ బొందుపఱిచిన పద్యమునందుఁ దాను జేసినపుస్తకముల నన్నిటిని జేర్చొని యున్నాఁడు—

సీ. ప్రతిభమైరుక్మిణీపరిణయంబును సింహశైలమాహాత్మ్యంబు నీలపెండ్లి
కతయును రాజశేఖరవిలాసంబును నచ్చతెనుంగురామాయణంబు
సారంగధరనృపచరితంబు సాగరసంగమాహాత్మ్యంబు రంగుమీఱ
రసికజనమనోభిరామంబు లక్షణసారసంగ్రహంబును సర్వపురస
మంచితక్షేత్రకథనంబు మఱియుఁబెక్క
శతకదండకసత్కృతుల్ ప్రతిభఁగూర్చి
యుల్లమలరారఁ బార్వతీవల్లభునకు
భక్తి నర్పణ చేసినభవ్యమతిని.

ఈ గ్రంథములలో సారంగధర చరిత్రమును సాగరసంగమాహాత్మ్యమును నాకు లభింపలేదు. అవి చిన్న గ్రంథములని కవివంశములోని వారొకరు నాతోడఁ జెప్పియున్నారు. ఈ కవి కవిత్వములో నచ్చతెనుఁగు

పదము లధికముగా నుండును. కష్టపడి మొట్టమొదట యౌవనకాలము నందు శృంగార ప్రధానముగా రచియించిన దగుటచే రుక్మిణీపరిణయము నందే కవి యెక్కువ ప్రౌఢిమను జూపియున్నాఁడు. కవికృతములయిన బహుగ్రంథములు పురాణపాకమున రచియింపఁబడినవి. శ్లేషములును శబ్దాలంకారములును విశేషముగా నుండినను, కవిత్వమునందద్భుత కల్పన లంతగాఁ గానఁబడవు. మొట్టమొదట రచియింపఁబడిన గ్రంథములలో నదంత స్త్రీవాచకపదసంఘములు లోనుగాఁగల కొన్ని దోషములు కనఁబడుచున్నను, అటుపిమ్మటఁ జేసిన గ్రంథములు నిర్దుష్టములుగా నున్నవి. కవి యితరగ్రంథములను రచియించిన కాలపరిమితినిబట్టి విచారింపఁగా, ౧౭౧౫ వ సంవత్సరమునందు ముగింపఁబడిన రుక్మిణీపరిణయము ౧౭౧౦ వ సంవత్సరమునందారంభింపఁబడి సంవత్సరమున కొక్కొక్క యాశ్వాసము చొప్పున నయిదాశ్వాసములు నయిదు సంవత్సరములలో రచియింపఁబడెనని చెప్పుట సత్యమున కంతదూరముగా నుండదు. కవన మారంభించి యొకటిరెండు శతకములను జేసి గ్రంథరచనకుఁ బూనునప్పటికిఁ గవికిరువది సంవత్సరముల ప్రాయముండుననుటయు నంతగా తప్పు కానేరదు. కవి తరువాత రచియించిన రెండవ గ్రంథమగు రాజశేఖర విలాసము మూఁడాశ్వాసములును మూఁడు సంవత్సరములలోఁ జేసినపక్షమున, ఆ పుస్తకమును ౧౭౧౮ వ సంవత్సరమున ముగించియుండవచ్చును. మూఁడవగ్రంథమగు సింహాచల మహాత్మ్యమయిదాశ్వాసములు నయిదు సంవత్సరములలోఁ జేసినయెడల, ఆ స్థలపురాణము ౧౭౨౩ వ సంవత్సరమునందు ముగింపఁబడియుండును. కవిచే రచింపఁబడిన గ్రంథములలో నాలవదియు నచ్చతెలుఁగు కావ్యములలో మొదటిదియునైన నీలాసుందరీ పరిణయము మూఁడాశ్వాసములును మూఁడు సంవత్సరములలో రచియింపఁబడినచో, అది ౧౭౨౬ వ సంవత్సరమునందు ముగింపఁబడియుండును. అయిదవగ్రంథమగు నచ్చతెనుఁగు

రామాయణ మారుకాండములు నాలుసంవత్సరములలోఁ గూర్పఁబడిన పక్షమున, అది ౧౭౩౨ వ సంవత్సరమునందు సమాప్తి నొంది యుండును. ఈ యచ్చ తెనుఁగుఁ గావ్యముల రచనచేతఁ గవి కభినవ వాగనుశాసనబిరుదము వచ్చెనని చెప్పుదురు. ఆఱవ గ్రంథము సారంగధర చరిత్రమును రెండుసంవత్సరములలోఁ జేసెనేని, అది ౧౭౩౪ వ సంవత్సరములో పూర్తియయియుండును. ఏడవది యగు సాగరసంగమమాహాత్మ్యము రెండుసంవత్సరములలోఁ జేయఁబడినయెడల, ౧౭౩౬ వ సంవత్సరమున సంపూర్ణమయి యుండును. ఎనిమిదవగ్రంథము లక్షణసారసంగ్రహము

గీ. శాలివాహనశక వర్షసంఖ్యకరర
సాంగ శశిసంజ్ఞ నలరు రౌద్ర్యబ్దమునను
భాద్రపదశుక్ల పంచమివఱకుఁ బూర్ణ
మయ్యె నీకృతి నీపేర నగసుతేశ.

అని శాలివాహనశకము ౧౬౬౨ వ సంవత్సరమునకు సరియైన క్రీస్తుశకము ౧౭౪౦ వ సంవత్సరమునందు ముగింపఁబడినదని కవియే చెప్పియున్నాఁడు. మూఁడాశ్వాసములుగల యీలక్షణగ్రంథమును రచియించుటకుఁ గవికి ౧౭౩౬ వ సంవత్సరము మొదలుకొని నాలుగు సంవత్సరములు పట్టియుండును. చంద్రపాలెములోనున్న యీకవివంశమువారి యింటఁ గలపుస్తకములను వెదకింపఁగా నందు భారతాదులును లక్షణవిషయకగ్రంథములును దక్క విశేషగ్రంథము లేవియుఁ గానఁబడ నందునను, లక్షణసారసంగ్రహములో లక్ష్యములుగాఁ జూపఁబడిన ప్రబంధాదులలోని పద్యములు చాలవఱకితరపూర్వలక్షణగ్రంథములలో నున్నవే యగుటచేతను, కవి యీగ్రంథరచనమునందు భారత రామాయణములను మఱికొన్ని ప్రబంధములను మాత్రమే శోధించు

నట్టు తోఁచుచున్నది. అందుచేత గ్రంథపరిసమాప్తికి నాలుగు సంవత్సరములు చాలును.

గీ. తెలుఁగు కు మున్న లక్షణంబులు మహాక
వీశ్వరుల్ పెక్కు రచియించి యిడి రిఁకేల
పూర్వ మెనన్నఁ బ్రాఢిమకొఱకునాకుఁ
దెలిసిన తెఱంగుఁ దగఁగొంత తెలియఁబఱుతు.

అని కవి లక్షణసారసంగ్రహమునఁ బూర్వలక్షణగ్రంథములలో లేని నూతనవిషయములను గొన్నిటిని జేర్చినట్లు చెప్పియున్నాడు. కొన్ని విషయములను కవి క్రొత్తగా శోధించి చేర్చెననుటకు సందేహములేదు. శొమ్మిదవగ్రంథమగు రసికజనమనోభిరామ మనెడి యాఱాశ్వాసముల ప్రబంధమును రచించుటకు కవికి ౧౬౮౦ వ సంవత్సరము మొదలుకొని ౧౬౯౦ వ సంవత్సరమువఱకును పదిసంవత్సరములు పట్టినది.

సీ. * * రసికజనమనోభిరామం బనెడుపేరఁ దెనుఁగున శాలివా
హానశకాబ్దములఁ గరగిరిరసభూసంఖ్యఁ దద్దయువఱలు
ప్రమోదూతవత్సరమున నీ ప్రబంధంబు రచియించి
నీకొసఁగితి.

అని కవి రసికజనమనోభిరామమును దాను శాలివాహనశకము ౧౬౮౭ వ సంవత్సరమునకు సరియైన ౧౬౯౦ వ సంవత్సరమున రచియించినట్లు చెప్పెను. ఈ కవి యీ గ్రంథమును బహుపుస్తకములు శ్రమచేసి తన ప్రౌఢిమ నంతయు జూపి వసుచరిత్రమువలె నుండవలెనని దాని ననుసరించి చేసెను. అందుచేతనే కవి యీ గ్రంథాదియందు—

సీ. బహుపురాణములుఁ బ్రబంధములు లక్షణశాస్త్రములు వివిధకోశములు నాటకము లలంకారశాస్త్రములును శోధించి ప్రౌఢిమై నేతత్ప్రబంధ మేనొనర్చెద * * * * * *

అని వ్రాసికొనియున్నాఁడు. అయినను వసుచరిత్రమునందుఁగల ప్రౌఢిమలోను సారస్యములోను శతాంశమైనను రసికజనమనోభిరామము నకు రాలేదు. అన్యోన్య తారతమ్యము తేటపడుటకయి యుభయ గ్రంథములనుండియు సమానవిషయములను దెలుపు పద్యములను గొన్నిటి నింకఁ జూపెదను. వసుచరిత్రములో గిరికాదేవిని కూర్చుట కయి రాజుచేతఁ బంపబడిన దూతి పోయి సఖీజనమధ్యమున నున్న కన్నియను జూచి సమయోచితసరసాలాపములతో ముచ్చటించి యామె చెలికత్తెల చేతనే—

ఉ. ఇన్నగరాజుఁ జూడ వసుధేశ్వరుఁ డెన్నఁడు వచ్చు వచ్చి యీ
   క్రొన్ననతీవజొంపములకోనకు నెన్నఁడు డిగ్గు డిగ్గి యీ
   కన్నియఁ గన్నులారఁ గుతుకంబున నెన్నఁడు గాంచుఁ గాంచి తా
   నెన్నఁడు గారవించుఁ జెలు లెన్నఁడు కాంతు రభీష్టసంపదల్.

రాజు నిమిత్తమయి ప్రార్థించునట్లుచేసి నేర్పుతో కార్యసంఘట నము చేయుఁగా, రసికజనమనోభిరామములో బ్రియురాలి నిమిత్తమయి రాజుచేఁ బంపబడినదూతి యామె కడకుఁబోయి—

చ. పలుకులు వేయు నేఁటి కిఁక భావభవప్రతిమానుఁ డైనయా
   చెలువునితోడుతం జెలిమి చేకుఱ కున్న నయారె నీమెయిం
   గల యెలజవ్వనం బడవిగాచిన వెన్నెలసుమ్ము ముద్దులేఁ
   జిలుకలకొల్కి నాపలుకు చిత్తమునం దలపోసిచూడుమా.

అని చెప్పి యామెచేత,

చ. అవునవు మంచిప్రోడవె బళా యళు కించుక లేక మానినీ
   నివహసభాగ్రభాగమున నిల్చి వినం గొఱగానివాక్యముల్
   తవిలి వచింపఁ జాగితివి తాళుదు మే మతిరోక్క_డైన దూ
   తవు నిను నేమియుం బలుక ధర్మమె మ్ము కాదనె యేంటి మిత్తజిత్.

అని చీవాట్లుతిని తనప్రభువువద్దకు మరలి వచ్చెను.

చ. కటకట మమ్ము నొక్కత్రుటికాలముఁ బాయనిదాన వొంటిమై
నెటువలె వచ్చి తమ్మ చెలి యిచ్చటిక్రేవకుఁదేనెవాక లీ
వెటువలె నీఁది తమ్మ తెరు వెల్లను బుప్పొడి నీపదాంబుజం
బెటువలె నొచ్చె నమ్మ తరుణీ తగు నమ్మకడింది చైదముల్ — వసుచ.

ఉ. కొమ్మరొ ముమ్మరంపువెతఁ గుందుచు నిల్లెడఁబాసి యిమ్మెయిన్
మమ్ములఁజేసి యొంటిగ వనంబున కేటికి వచ్చితమ్మ నె
త్తమ్ములఁగేరునీమృదుపదంబులు కందెఁ గదమ్మ మేలు మే
లమ్మకచెల్ల నీబలుగయాళితనమ్ములు చెప్పఁ జిత్రముల్ — రసికజ.

ఈ పుస్తకమునందు స్త్రీవర్ణనములు మొదలయినవి వెట్టిగాఁ జేయఁబడినవి. ఈ శృంగార ప్రబంధమును రచియించిన కొంతకాలమునకుఁ గవి వీధినిబడి పోవుచుండఁగా నొక వేశ్య చూచి రసికజనమనోభిరామమును జదివియున్న దగుటచే నందలి రసికముద్ర కానందించి వలచి వచ్చి పైఁబడి కవిని కౌఁగిలించుకొనఁగా నతఁడు పెడమొగము పెట్టెననియు, అందుపయి నా సరసురాలు

చ. చతురులలోన నెంతయును జాణ వటంచును నేను కౌఁగిలిం
చితి నిటు మాఱుమో మిడఁగఁ జెల్లునె యోరసికాగ్రగణ్య

అని యాశుకవిత్వము చేసి యడుగఁగా,

అద్భుతమగునట్టి బంగరపుబొంగరపుంగవఁబోలునీకుచ
ద్వితయము ఱొమ్ము నాటియలవీఁపునదూసెనటంచుఁజూచితిన్.

అని కవి పద్యముపూరించి యుత్తరమిచ్చెననియు, చెప్పు వాడుక యొకటి కొంతకాలమునుండి కలదుగాని యిదియు రసికత్వమునకెల్లను జారత్వమే ముఖ్యమని భావించెడి యపూర్వ పండితులచే నితర కవుల యందారోపింపఁబడినరీతి యసత్యకల్పనమే యనుటకు సందేహములేదు. రుక్మిణీపరిణయమును ముగించునాటికిఁ గవి కిరువదియైదు సంవత్సరము

లున్నచో నిప్పటి కాతని కిరువది సంవత్సరములు దాటియుండవలెను. కులవృత్తిదోషముచే నెంత సిగ్గువిడిచినదయినను పట్టపగలు పట్టణవీథిలో నడుచుచున్న ముసలి రసికుని బయిటబడి పడుచు పడుపుపడంతి యెల్లరుఁ జూచుచుండఁ గౌఁగిలించుకొన్నదనుటకంటెఁ బరిహాసాస్పదమయిన విరుద్ధపు మాట మఱొకటి యుండదు. పదనదియగు మూడాశ్వాసములు గల సర్వపురమాహాత్మ్యము తరువాత నాలుగు సంవత్సరములలో ౧౭౫౨ వ సంవత్సరమునందు ముగింపఁబడినది.

పదునొకండవదియు కట్టకడపటిదియు నగు శివలీలావిలాసమను రెండాశ్వాసముల గ్రంథము మఱి రెండేండ్లకు

గీ. శాలివాహ శకవర్ష సంఖ్య వసున
గాంగశశిసంజ్ఞ నలరుధాతాబ్దమునను
దగరచించిన యీకృతి ధరణియందు
నాసుధాకరతారార్కమగుచునుండు.

శాలివాహనశకము ౧౬౭౮ వ సంవత్సరమునకు సరియైన ౧౭౫౬ వ సంవత్సరమున రచియింపఁబడినది. అటుతరువాతఁ గవిచే రచియింపఁబడిన గ్రంథము లేవియుఁ గానరావు. ఆరంభదశలో రచియింపఁబడిన కుక్కుటేశ్వరశతకము మొదలయిన కొన్ని శతకములను దండకములును గలవు. శివలీలావిలాసము ముగిసిన యల్పకాలములోనే కవి పరలోకగతుఁడయ్యెను. కాఁబట్టి యతఁడు ౧౭౫౭ వ సంవత్సరమునందు మృతినొందెనని యించుమించుగా నిశ్చయముగానే చెప్పవచ్చును. అందుచేతఁ గవి దాదాపుగా డెబ్బది సంవత్సరములు జీవించి సుమారు నలువదియైదు సంవత్సరములు గ్రంథరచనయందుఁ గడిపినట్టు స్పష్టమగుచున్నది. ఈ కవికి సంతతిలేదఁట. ఈ కవియొక్క కడపటికాలములో నింగ్లీషువారికిని ఫ్రెంచివారికిని యుద్ధములు జరగినందున కందరాడ మీఁదుగా రాకపోకలు చేయుచువచ్చిన సేనలదాడికి వెఱచి

యా గ్రామము విడిచి చంద్రమపాలెము నివాసముగా నేర్పఱచుకొనెను. ఈ కవివంశమువారిప్పటికిని చంద్రమపాలెములోనే యున్నారు. ఆంధ్ర నామసంగ్రహముచేసిన పైడిపాటి లక్ష్మణకవి, కన్నప్పచరిత్రము చేసిన కంచిరాజు సూరయ్య, శివజ్ఞానదీపికనుజేసిన కవిలోకబ్రహ్మ, ఇందుమతీ కళ్యాణముచేసిన యంగర బసవయ్య, ద్వాదశరాజచరిత్రచేసిన కట్టవరపు చిట్టమరాజు, ద్విపద (రుక్మాంగదచరిత్రముచేసిన రామయ భాస్కరుడు) మొదలగు కవు లీకవికిఁ బూర్వమునందుండినట్లు లక్షణసారసంగ్రహములో నియ్యఁబడిన లక్ష్యములవలనఁ దెలియవచ్చుచున్నది. కవియొక్క శైలిని జూపెడు పద్యములఁ గొన్నిటి నిందుదాహరించుచున్నాను—

రుక్మిణీ పరిణయము.

ఉ. సారము ముద్దుఁబల్కు ఘనసారము నిద్దపుమేనితావి కా
సారము నాభిరంధ్రము విసారము తేటమిటారిచూపు శ్రీ
కారము కర్ణయుగ్మము చొకారము నవ్వు మొగంబు పట్వదా
కారము కొప్పు సన్మధువికారము మోవి వధూలలామకున్. ఆ. ౨.

ఉ. కౌను చలింప నిద్దపు మొగంబునఁ జెమ్మటముంప గంకణ
ధ్వానము లింపునింపఁ గరతాళగతు ల్పచరింప హారముల్
పూనినటింప నూర్పుసోలపు న్వలితెమ్మెర లంకురింపఁగాఁ
జానయొకర్తు రుక్మిణికి సంపఁగినూనెఁ దలంటు నేర్పునన్. ఆ. ౫.

రాజశేఖరవిలాసము.

శా. ఏరాభూవర మాకఁ గాంచనతురంగేభాంబరాందోళికా
భూరిస్యందనహర్మ్యమందిరోపవనసద్భూషామణి శ్రేణులున్
బేరెన్నందగుపల్లెలుం బదుపులుం లెక్కింప కర్థంబులున్
ఈరా కోరికతీఱ మీఱ కిఁక నీవెంతేనియుం ధీరతన్. ఆ. ౧.

ఉ. అయ్యెడఁ జెల్లమాంబ విభునానతిఁ గైకొని వాఁడిచూపు లొ
య్యొయ్యనమీఱ లేనగవు లొప్పఁగఁ జెక్కులఁబాఱ సిగ్గుమైఁ
బయ్యెదజాఱ ముద్దునునుబల్కులు చెల్వలరార నవ్విటుం
జయ్యనఁ జేరి మ్రొక్కి నెఱజాణగు చెల్ల నెఱింగి రంగుగన్. ఆ-3

సింహాశైల మాహాత్మ్యము.

మ. వలపుంగొజ్జఁగినీటిశీతలహరీవార్బిందువు ల్చిమ్ముచున్
గలయం గప్పురపుందుమారము మొయిన్ గాటంబుగాఁ గప్పుచున్
బలవద్దర్పకబాణపంక్తులక్రియన్ బైపై విరు ల్గుప్పుచున్
జెలఁగె న్మందసమీరణుండు దితిజశ్రేష్ఠాగ్రభాగంబునన్. ఆ. ౨.

ఉ. అక్కట! దైత్యనాయకుఁ డహర్నిశయుం దనయాత్మ నెంతయున్
మక్కువమీఱ ని న్మనుచుమాట దలంపక తద్విపక్షునిన్
బెక్కుఁదెఱంగులం గసఁగి పేర్కొనఁ జూచెదు చిన్నవాఁడ వీ
వెక్కడ? తత్త్వ మెక్కడ? సహింపఁడుసుమ్మునిశాచరార్భకా. ఆ-3

నీలాసుందరీ పరిణయము.

ఉ. మినుకుఁగడానిబంగరపుమేడల తోరణగండ్ల వెంట రే
ల్చనియెడిరిక్కమొత్తమును జక్కఁగఁ జూచి మెఱుంగుబోంట్లు ని
చ్చలు పిడికిళ్ళఁబట్టి యవి జాఱిచనం దమగోళ్ళు చుక్కలం
చును నడనిల్చి చేవదలి చూచుచు నబ్బురపోదురందులన్. ఆ. ౧.

ఉ. కన్నులవింటివాఁడ తిగకన్నులదేవరతోఁడఁబోరి మున్
బన్నము నొంది మేఁదొఱఁగుపట్టున నెక్కడ డాఁగిపోయె నీ
మన్నెఱికంబు? నేఁడు కొఱమాలినకోయిలచిల్కమూఁకలన్
బన్నుగఁ గూడి చేడియల బాములఁ బెట్టెదు పోటుబంటవై. ఆ.3.

అచ్చతెలుఁగు రామాయణము.

ఉ. కాయను మేటితప్పు కొడుకాయను నిద్దపుఁబూఁతమావిమో
కాయనుఁ బంజరంపుఁజిలుకాయను నబ్రపుఁబోయగంపుఁబ్రో

కాయనుఁ బల్కవేమి యలుకాయనుఁ బంతముతీఱెనోటు కై
కాయనుసేర యిట్లు దుడుకాయనుఁ మాయఁగఁ గోరికాయనన్.
అయోధ్యా.

చ. జగములతల్లియై పుడమి జవ్వనిగాదిలిపట్టియైనయి
మ్మగుదలమిన్నఁ దెచ్చితిని మోస మెఱుంగక నీకు నెవ్వరుం
దగ దిదియంచుఁ దెల్పఁ గలదంటలు గల్గమిఁజేసి యిట్టికి
డగపడె నింకనైన విడనాడక రామునిఁ బ్రాపుఁ జేరుమీ. సుందర.

లక్షణసారసంగ్రహము.

చ. కరములు దోయిలించి కుతుకంబున నిచ్చలుఁ బ్రస్తుతింతు భా
స్వరగుణవంతునిన్ సకలసత్కవిజాలవసీవసంతునిన్
జిరకరుణానిశాంతుని విశిష్టజనావనతావిశాంతునిన్
సురతరుమంజరీనిభయకోహరిదంతుని నేకదంతునిన్. ఆ. ౧.

మ. ఘనకారుణ్యకటాక్ష రాక్షసచమూగంధేభహర్యక్ష స
జ్జనసంరక్షణదీక్ష పాలితసరోజాతాక్ష శక్రాంబుజా
సనముఖ్యామరపక్ష దక్షసవనాంచత్క్రోధతామ్రాక్ష యా
చనకప్రాంగణకల్పవృక్ష రిపుశిక్షాదక్ష మోక్షప్రదా. ఆ. ౨.

రసికజనమనోభిరామము.

మ. తరుమూలంబులపొంతఁ బొంచి సచివోత్తంసంబు వీక్షించె భా
స్వరకార్తస్వరవిగ్రహన్ సమదచంచచ్చంచరీకాలకన్
శరదిందుప్రతిమానచారువదనన్ జక్రస్తని న్విస్ఫుర
త్సరసీజాతదళాయతాక్షి నొకకాంతాలోకచూడామణిన్. ఆ. ౨.

మ. సవనాదిక్రియల న్సుధాంధులను మెచ్చంజేసి ధన్యాత్ములై
నవిశేషజ్ఞుల కబ్బఁగాక యకటా నా కేటికింగల్గు ని
ష్ప్రవచాతీతవిలాసవిభ్రమకళాభారిప్రభాంచన్మరు
ద్ధవళాక్షీమధురాధరాధరసుధాధారాసరిద్ధోరణుల్. ఆ. ౫.

సర్పపుర మాహాత్మ్యము.

మ. సరసీనిర్మలనీరబిందుకణముల్ సమ్యగ్గ్రహింబూని వి
స్ఫురదారామలతాంతసౌరభరజఃపుంజంబుఁ గైకొంచు ని
ర్భరమందానిలశాబకప్రకరముల్ ఘల్మాఖు సక్కోఁడనోఁ
దిరుగుం బాంథజనశ్రమాపహరణోద్వృత్తిం బ్రకాశించుచున్. ఆ-౩

ఉ. నీకరుణావిలోకమున నిల్పినచోఁ గులహీనుఁడున్ హయా
నేకపహేమచామరమణీరమణీయవిభూషణాదికా
స్తోకవిభూతి చెంది పరిశుద్ధకులుం డన మించు లేఁచో
నాకనివాసుఁడున్ వెతల నందుఁగదమ్మ జగత్కుటుంబినీ. ఆ. 3.

శివలీలావిలాసము.

ఉ. అంగదముద్రికావలయహారలలాటిక లెమ్మె నెమ్మెయిన్
రంగులు గుల్కఁ గ్రొందగటునాణెపుఁ బావడ సొంపునింప మే
ల్బంగరుగిల్కుటందియలు బాళిగ నంఘ్రులఘుల్ఘుల్లనన్
గంగ యనుంగులం గలసి కౌతుకలీలలఁ గ్రీడ సేయుచున్. ఆ. ౧.

ఉ. కన్నులుమూయుఁ బుల్కిపడి గ్రక్కునదిక్కులురోయు నూరకే
సన్నలుచేయుఁ బైవలువ చయ్యననవ్వలఁద్రోయు నింటిపై
వెన్నెలగాయుచందురుని వేఁడికిఁ దాఁ బెడఁబాయు నద్దిరా
చిన్నెలజంగమప్రభునిచిత్తవికారము లెన్నఁ జిత్రముల్. ఆ. ౨.

13. వక్కలంక వీరభద్రకవి

ఈకవి కూచిమంచి తిమ్మకవి జగ్గకవుల కాలములోనే పిఠాపురమునందుండి మిక్కిలి ప్రసిద్ధిగన్నవాఁడు. కూచిమంచి తిమ్మకవివలెనే యితఁడును దెందులూరి లింగనారాధ్యుని శిష్యుఁడయి తన వాసవదత్తా పరిణయమునం దాతని నిట్లు స్తుతించి యున్నాఁడు—

సీ. అంభోధివలయితకుంభినీజననుతదంభశాంభవకళాజృంభితములు
నందివాహపదారవిందవిశ్వాసమరందసంపాదనేందిందిరములు
స్వేక్షణాదరణారాధ్యక్షలక్ష్మీప్రదానక్షమసామ్రాజ్యదక్షిణములు
ఊహాపదాత్మబోధాహతస్వాంతసందేహాలీలాపశ్యతోహరములు
ధీరతాగుణమణిహారి దెందులూరి
లింగగురువరసత్కృపాపాంగవీక్ష
ణములు సతతంబు శుభనిదానంబులౌచు
శిష్టజనముల దయను రక్షించుఁగాత!

ఈకవి గౌరీకళ్యాణ మను నామముతోఁ గాళిదాసకృతమయిన కుమారసంభవమును దెలిగించుటయేకాక సుబంధకవి విరచితమయిన వాసవదత్తను వాసవదత్తాపరిణయమను పేరితో నాంధ్రీకరించి దానిని పీఠికాపురాధీశ్వరుఁడయిన రావు మాధవరాయనింగారి కంకితము చేసెను. పద్మనాయకకులసంభవుఁడైన శ్రీరామచంద్ర మాధవరాయనృపాలుఁడు తన్ను 'బిలిపించి వాపవదత్తను దెనిఁగింపనడిగిన కథను కపి వాసవపత్తా పరిణయమునం దిట్లు చెప్పికొనియున్నాడు—

శా. శ్రీమచ్చంద్రకళాకిరీటపదరాజీవద్వయీభావనా
సామర్థ్యోదితవాక్ప్రపంచఘటనాచాతుర్యవిద్వజ్జన
స్తోమానందదశేముషీనిజవిలాసు న్వక్కలంకాన్వయున్
శ్రేమాద్యాప్పను వీరభద్రుని ననుం బిల్పించి యుప్పొంగుచున్.

క. తాతలతరమునఁనుండియు । నీతనిజనకుండు మనకు హితుఁడు కవీంద్రుం
డీతనిచేతం గృతి వి । ఖ్యాతిగఁ గైకొందు ననుచు హర్షం బొదవన్.

గీ. సవినయంబున సముచితాసనమునందు
నంతికంబునఁ గూర్చుండ నాజ్ఞ యొసఁగి
మందహాసాంచితముఖారవిందుఁ డగుచు
నతిదయాస్ఫూర్తి నిట్లని యానతిచ్చె.

క. శ్రీవెలయ నుభయభాషల । నీవలెఁగృతిఁజేయఁగలరె నేఁటికవీంద్రుల్
భూవిశ్రుతకవితావి । ర్భావయశస్సాంద్ర వీరభద్రకవీంద్రా.

సీ. మీతాత లోకవిఖ్యాతభాషాఖిలశేషాహియాచంద్రశేఖరుండు
మీతండ్రి చాటువాగాతతచిత్రప్రబంధకల్పనశాలి భాస్కరుండు
మీతల్లి తండ్రి పురాతనసత్కవినాథుల కెన విశ్వనాథసుకవి
మీ మేనమామ సుత్రాముఁడై భవ్యుఁడుసద్యఃకృతిమతి వేంకటాద్రిసుకవి
చదువకయె శ్రీసతీశప్రసాదగరిమ
బాల్యముననను గుమారసంభవము తెనుఁగు
చేసి కవు లెంచఁ బ్రఖ్యాతిఁ జెంది తీవు
కలరె నీసము లాధునికులు కవీంద్ర.

ఉ. అత్యలఘుక్రియానిపుణుఁడై ధరణీతల మేలు విక్రమా
దిత్యసభాంతరంబునఁ బ్రతిష్ఠితుఁడై ఘనధీసమగ్రతన్
సత్యవతీతనూభవునిజాడఁ బ్రసిద్ధికి నెక్కి నవ్యసా
హిత్యమునన్ సుబంధుసుకవీంద్రుఁడు ప్రస్తుతిఁగన్నవాఁడిలన్.

గీ. ఘనతరమనీష నమ్మహాకవివరుండు
ప్రతిపదశ్లేషగద్యప్రబంధ మత్యు
దారతను జెప్పె వాసవదత్తయనఁగ
నార్యులాకథ కడుచోద్య మనిరి సభను.

మ. స్తవనీయంబగు తత్కథాక్రమము భాషాయోషిదంఘ్రిస్ఫుర
న్నవమంజీరనినాదమేదురనితాంత ప్రౌఢవాగ్గుంభనన్
భవదీయోక్తుల నాంధ్రకావ్యముగ వైదర్భిగతిం గూర్పు త
త్కవినవ్యోక్తులు కొన్ని నీకవితకుం గైదండ గావింపఁగన్.

క. వరమతి వాసవదత్తా । పరిణయమును జెప్పి యీప్రబంధము విద్వ
త్పరిగణ్యంబుగ మాకుం । ధిరముగ నంకితముచేయు ధీరవిచారా.

భర్తృహరియొక్క సుభాషితరత్నావళిని దెనిఁగించిన యేనుఁగు లక్ష్మణకవి మొదలైన వారీకవితో సమకాలికులు. సమకాలమునం దున్న కవులు కూచిమంచి తిమ్మకవిని బొగడక యీతనిని బొగడుటచే దిమ్మకవి కవిత్వముకంటె నీతనికవిత్వమునం దప్పటివారి కధికాదరమున్నట్లు స్పష్టమగుచున్నది. ఏనుఁగు లక్ష్మణకవి తనరామవిలాసమునందుఁ బూర్వకవులను స్తుతిచేసిన పిమ్మట—

గీ. దిట్టకవి విశ్వనాథుఁ బ్రార్థించికొలుతు
నతనినందనుఁ డగువేంకటాద్రికవికి
వాక్యపూజలు గావింతు వక్కలంక
వీరభద్రుని భావింతు గౌరవమున.

అని యీవీరభద్రకవిని బేర్కొని యున్నాఁడు. ఆకాలమునం దుండిన యాదరపల్లి భవాని శంకరకవియుఁ దాను దెనిఁగించిన ధర్మ ఖండములో—

మ. హరితుల్యుం డగురావుమాధవ నృపాలాగ్రేసరుం గావ్యచా
తురి మెప్పించి తదీయసత్కృప సిరు ల్తోరంబుగాఁ బొంది బం
ధురతేజుండగు వక్కలంకకులపాథోరాశిరాకాసుధా
కిరణుండై తగు వీరభద్రసుకవిం గీర్తింతు నా నెచ్చెలిన్.

అని వీరభద్రకవిని బ్రశంసించి యున్నాఁడు. సమానకాలమువా రిట్లు మెచ్చుటచేతనే యీకవి యసమానకవిత్వప్రౌఢిమ గలవాఁడని తేట

పడుచున్నది. ఈవీరభద్రకవి యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; భారద్వాజగోత్రుఁడు; భాస్కరకవి పుత్రుఁడు; చంద్రశేఖరకవి పౌత్రుఁడు; దిట్టకవి విశ్వనాథకవి దౌహిత్రుఁడు. ఈతనితల్లి జగ్గాంబ; మేనమామ దిట్టకవి వేంకటాద్రికవి. ఈకవి తండ్రితాతలనుండియుఁ బిఠాపురసంస్థానమునం దుండినవాఁడు. తండ్రి తరమువారును తల్లి తరమువారునుగూడ సత్కవీశ్వరులు. ఈకవి మాతామహుఁడైనఁ విశ్వనాథకవి పెద్దాపురసంస్థానస్థాపకుఁడయిన శ్రీవత్సవాయ ముసలి తిమ్మరాజుగారికిఁ దాను రచించిన శేషధర్మప్రబంధము నంకితము చేసెను. శేషధర్మరత్నాకరమనుపేరితో నీగ్రంథమునే రాజమహేంద్ర నివాసుఁడగు కొండయ కొడుకగు శ్రీనివాసకవియు రచియించెను. వీరభద్రకవి ౧౭౫౦ వ సంవత్సరప్రాంతమువఱకును జీవించియుండవచ్చును. ఇతఁడు తనవార్ధకదశలో పిఠాపురమును విడిచి వృద్ధగౌతమీతీరమునందున్న ముమ్మిడివరము ప్రవేశించి సన్న్యాసాశ్రమమును స్వీకరించి యక్కడనే సిద్ధిపొందెనఁట. ఈకవి విరచితగ్రంథములనుండి కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

వాసవదత్తాపరిణయము.

శా. భల్లూకంబులఁ జూచితే తిమిరసంపల్లాలితాంగప్రభో
ద్యల్లీలన్ ఘననీలనీలఘనసఖ్యం బెప్పుడుం జేయఁగా
వల్లీవేల్లితవామలూరువులక్రేవం గొంటుజంటేఁగలం
దెల్లం గుయ్యిడఁ దేనియ ల్గొనెడు భూమీశా విచిత్రంబుగన్. ఆ-౩.

శా. ప్రచ్ఛాయస్థలపల్లవాస్తరణనిద్రాయోగ్యముల్ పాటలీ
గుచ్ఛాకల్పములు స్మనోజ్ఞతరముల్ కూలంకషాభ్యంతర
స్వచ్ఛాంభఃపరిషేచనార్ద్రములు పశ్చాద్భాగసౌభాగ్యముల్
స్వచ్ఛందస్థితి గ్రీష్మవాసరము లెంచం జాల మించెం ధరన్. ఆ. ౩.

కుమారసంభవము.

చ. **హరుఁ** డక్షిలేశుఁ డవ్వనరుహాక్షితపఃప్రతిఘాతిహేతువై
పరఁగినతత్సపర్యలకు భావమునం గడుమెచ్చి యొప్పెఁ దా
నరయ వికారకారణము లంటిన నిశ్చలతం దనర్చు నె
వ్వరిహృదయారవిందములు వారలె ధీవరు లెంచిచూడఁగన్. ఆ.౧

చ. మలయవసుంధరాధరసమాగతబంధురగంధవాహరా
జుల నెదిరించుచున్ వివిధనూనగుళుచ్ఛరజఃపరంపరల్
కలయఁగఁ జూపు లడ్డుకోనఁగాఁ గను గానక దర్ప మేర్పడన్
జెలఁగి మృగంబు లవ్విపినసీమ నటించె మధూదయోన్నతిన్. ఆ.౨

ఉ. అన్ను తలంచు రూపము హితాళి తలంచుఁ గులంబు తల్లి దా
నెన్ను సువస్తువుల్ వరుల నేర్చుతఱిన్ బురవైరి నెంచినన్
గన్నులు మూఁడు పుట్టుటయె కానఁగరాదు దిగంబరుండునుం
జిన్నము సొమ్ము లేదు తెలిసెం దగఁ డాతఁడు నీకు మానినీ. ఆ. 3.

ఉ. క్రొత్తలుచేసి గేహములు గోవజవాజిని బచ్చికస్తురిన్
మెత్తిరి గోడ లందుపయి నిద్దపుఁజాయలపాలసున్నముల్
చిత్తరువుల్ లిఖించిరి విచిత్రగతి న్నయనోత్సవంబుగా
నత్తఱి నుత్తముల్ ప్రతిగృహంబున శోభనశోభ సంధిలన్. ఆ. ౪.

14. కూచిమంచి జగ్గకవి

ఇతఁడు సుప్రసిద్ధుఁ డయిన తిమ్మకవి సార్వభౌముని రెండవ తమ్ముఁడు. ఈతని జన్మసంవత్సర మేదో తెలియదుగాని తిమ్మకవికంటె నాలుగయిదుసంవత్సరములు చిన్నవాఁడయి యుండవలసినందున, ఇతఁడు ౧౭౦౦ వ సంవత్సర ప్రాంతమునందు పుట్టిన ట్టూహింపఁదగియున్నది. ఈజగ్గకవి యిరువది సంవత్సరముల ప్రాయము వచ్చువఱకును చదు వెఱుఁగక యల్లరిమూఁకతో దిరుగుచు కాలము గడపెననియు అప్పుడు వివాహితుఁడయి యత్తవారియింటికి మనుగుడుపునకు బోయి మామ గారు తనకుఁ బరమశుంఠ యైనయల్లుఁడు దొరకినందున కనుతాపపడఁగా రోషముచేత దేశాంతరమునకు లేచిపోయి పండ్రెండు సంవత్సరములు విద్యాభ్యాసముచేసి పండితుఁ డయి కవిత్వము చెప్ప నారంభించెననియు, పుక్కిటపురాణ మొకటి కలదుగాని యిది కేవల కల్పితకథయని తోఁచుచున్నది. ఈకథనుబట్టి యీకవికి కవిత్వము చెప్పనారంభించు కాలమునాఁటికి ముప్పదిమూడు సంవత్సరముల ప్రాయ మయి యుండ వలెను. కూచిమంచి తిమ్మకవి తాను ముప్పదిసంవత్సరముల ప్రాయ మునఁ జేయ నారంభించిన సింహశైలమాహాత్మ్యమునందు దనపెద్దతమ్ముఁ డైనసింగన్నను వర్ణించినతరువాత రెండవతమ్ముఁడైన యీజగ్గకవిని గూర్చి యిట్లు వ్రాసియున్నాఁడు—

క. అతని యనుజన్ముఁ డతులిత
   మతియుతుఁడు సమస్త రాజమాన్యుఁడు సుగుణా
   న్వితుఁడు సముంచితకవితా
   చతురుఁడు జగ్గప్రధానచంద్రుఁడు తనరున్.

క. భోటకలాటకిరాటవ
   రాటమరాటాంగవంగరాజనవబా

ర్ఘూటనిరాఘూటనటా
చ్చాటుకవిత్వాంకుఁ డరయ జగ్గన ధరణిన్.

సీ. నిరతంబునుడివోనిసిరినిరవొందియుఁ దవుటినిప్పటిమెక్కుఁ దలఁపఁడేని
సదమలాచారప్రశస్తి గాంచియువర్ణములు సంకరంబుగాఁ గలఁపఁడేని
ఖలజనసంశితిఁ గావింపుచుండియుఁ బతితుల నెపుడుఁ జేపట్టఁడేని
యురుపుణ్యావర్తియయ్యును బాడబాశ్రయసీమ నిల్లుగను వసింపఁడేని
యలజగన్నాయకుఁడు పాటియనఁగఁబోలు
భోగమున నిర్మలాచారమున విశిష్ట
రక్షణంబునఁ బుణ్యమార్గమున నరయ
గంగనామాత్యు జగ్గయఘనునిత్రోడ.

ఈపయిపద్యములు రచియింపఁబడిన కాలమునకు జగ్గకవి యించుమించుగా నిరువదియైదు సంవత్సరముల యీడుగలవాఁడయి యుండును. ఇరువదియైదేండ్ల ప్రాయమునాఁటి కన్నిదేశములు తిరిగి రాజసభలలోఁ బ్రసిద్ధిగాంచఁ గలుగుటకు కవి యిరువదియేండ్ల వయస్సునకు లోపలనే పండితుఁడయి కవనచాతురి గలవాఁడయియుండవలెను. అందుచేత జగ్గకవి యిరువది సంవత్సరముల ప్రాయము వచ్చువఱకును నక్షరజ్ఞానము లేనివాఁడని చెప్పెడికథ నమ్మఁదగినదికాదు. ఈకవి తనవివాహానంతరమున ధనార్జనము నిమిత్తమును పాండిత్యప్రకాశనము నిమిత్తమును బహుదేశాటనముచేసి రాజస్థానములలో మెప్పొంది సత్కారమును బొందుట వాస్తవమే యైనను, "భోటకలాటకిరాటవరాటమరాటాంగవంగ" యని ప్రాసనిమిత్తమయి వేయఁబడిన దేశసంచారము కొంత యతిశయోక్తియై యుండవచ్చును. ఇతఁడు దేశాటనముచేసి వచ్చిన తరువాతను దత్తపూర్వమునను, జానకీపరిణయమును, ద్విపద రాధాకృష్ణచరిత్రమును, చాటుప్రబంధములును, సుభద్రాపరిణయమును, చంద్రరేఖావిలాపమును, సోమదేవరాజీయమును రచియించెను. చంద్ర

రేఖావిలాపములోని యీక్రింది పద్యమున వర్ణింపఁబడిన వరుసనుబట్టి విచారింపఁగా నితఁడు దేశసంచారముచేసి రాజాస్థానములయందు రాజులమీఁద చాటు ప్రబంధములు చేయుటకుముందే జానకీపరిణయ మును రాధాకృష్ణచరిత్రమును రచించినట్లు తోఁచుచున్నది—

సీ. రచియించితివి విమున్న రసికులౌనని మెచ్చ సురుచిరజానకీపరిణయంబు
వచియించితివి కవివ్రాతము ల్పొగడంగ ద్విపదరాధాకృష్ణదివ్యచరిత
ముచ్చరించితివి విద్వచ్ఛ్రేయంబు నుతింపఁ జాటుప్రబంధముల్ శతకములును
వర్ణించితివి యిరువదిరెండువర్ణనల్ రాణించఁగా సుభద్రావిహావా
మాంధ్రలక్షణలక్ష్యంబు లరసినావు
భూరిరాజన్యసంసత్పుపూజితుఁడవు
బళిర నీభాగ్యమహిమ చెప్పంగఁదరమె
జగ్గకవిరాజచంద్ర వాచాఫణీంద్ర.

ఇతఁడు చంద్రరేఖావిలాపమును విజయనగరసంస్థానాధిపతులగు శ్రీ పూసపాటి విజయరామరాజుగారి చెల్లెలి పెనిమిటియగు చింతలపాటి నీలాద్రిరాజుమీఁది కోపముచేతఁ జేసెను. ఇది బూతుపుస్తకమగుటచే నిందలిపద్యము లుదాహరింపఁ దగియుండలేదు. "అర్ణవవేష్టితాఖిల మహామహీమండలిలోని బూతులం । బూర్ణుఁడ" నని కవియే చెప్పు కొనుటచే నీతఁడు తిట్టుకవిత్వమునం దసమానపాండిత్యముకలవాఁ డయి నట్టు స్పష్టమగుచున్నది. జగ్గకవి ధనసంపాదనము నిమిత్తమయి విజయ నగరమునకుఁ బోయి రాజు బావయైన నీలాద్రిరాజు నాశ్రయింపఁగా నతఁడు తానుంచుకొన్న వేశ్యను నాయికఁగా జేసి తనమీఁద ప్రబం ధము చేయుమని కోరెనఁట ! ధనాశచేత నట్టిప్రబంధరచన కొప్పుకొని కవి చంద్రరేఖావిలాస మను శృంగారకావ్యమును జేసెనఁట ! అటు తరువాతఁ దాను సంస్కృతకావ్యమును రచించి యిచ్చెదనని చెప్పి

రాజుమతి మరలించిన యాడిమల్ల వేంకటశాస్త్రి ప్రోత్సాహముచేత నీలాద్రిరాజు జగ్గకవికి తగినబహుమానముచేసి సత్కరింపక తిరస్కారమును జూపెనఁట! అందుపైని ముంగోపియైన యీధూర్తకవితాను రచియించిన చంద్రరేఖావిలాసమును చింపివేసి చంద్రరేఖావిలాపమను పేరిట నిష్పటి బూతుగ్రంథమును జేసెనఁట! ఇందలి కవివర్ణనలో సహితము సాధుకవులను విడిచి యిట్లు తిట్టుకవిత్వము చెప్పినకవులనే వేర్కొని యున్నాఁడు—

క. భీమకవి రామలింగని । శ్రీమంతుండైన వెలుంగు శ్రీనాథకవిన్
రామకవిముఖ్యులను బ్రో । ద్దామగతిం జిత్తవీధిఁ దలఁచి కడంగన్.

ఈపుస్తకములోని మొదటిపద్య మిట్లున్నది—

శా. శ్రీకంఠుండు భుజంగభూషణుఁడు భస్మీభూతపంచాస్త్రుఁడ
స్తోకాటోపబలప్రతాపపురరక్షోదక్షుసంశిక్షణుం
డాకాశోజ్జ్వలకేశపాశుఁడు త్రిశూలాంకుండు రుద్రుండు దా
వీఁకం డింతలపాటనీలనృపతి న్వీక్షించు నేత్రత్రయిన్.

ఈపుస్తకమునుజేసి జగ్గకవి నిజాంరాజ్యమునకుఁబోయి హైదరాబాదునగరమునందుఁ గల తురకదొరల నాశ్రయించి వారిమీఁద పద్యములుచెప్పి తన్మూలమున నవాబుయొక్క దయను సంపాదించి, నిజాము ప్రభుత్వమునకు లోఁబడిన సామంతరాజ్యమైన విజయనగరమునకు ప్రభువగు శ్రీవిజయరామరాజుగారివద్దకుఁ దనగ్రంథమును నీలాద్రిరాజు సమ్ముఖమున సభలోఁ జదివించి వినునట్లు నవాబువద్దనుండి యుత్తరువు తెచ్చి యట్లు చదివెనని చెప్పుదురు. ఇతఁడు గ్రంథమునందు నీలాద్రిరాజు నెంత దూషించినను, తత్పత్నియగు నరసమాంబను దూషింపక యాపతివ్రత నిట్లు భూషించెను—

క. ఖలుఁడైన నీలనృపుఁ డీ । యిలపై నిన్నాళ్ళు బ్రతుకనే నరసాంబా
గళకలితకనకమయ మం । గళసూత్రోత్కృష్టమహిమఁగాక కుమారా.

ఈజగ్గకవియు నించుమించుగా నన్న జీవించినంతకాలము జీవించి నట్లు కనఁబడుచున్నది. అందుచేత నితఁడు ౧౭౦౦ వ సంవత్సర ప్రాంతము మొదలుకొని ౧౭౬౦ వ సంవత్సరప్రాంతమువఱకును జీవించి యుండినవాఁడని చెప్పవచ్చును. ఈతఁడు రచియించిన గ్రంథములలో నాలుగాశ్వాసములు గల సుభద్రాపరిణయము మనోహరముగా గనఁబడు చున్నది. ఆపుస్తకమునందు జగన్నాయకస్వామినిగూర్చి వ్రాయఁబడిన మొదటిపద్య మిట్లున్నది.

ఉ. శ్రీయలరన్ సుభద్రయును సీరియుఁ బార్శ్వముల న్మెలంగ న
త్యాయతలీల నీలకుధరాగ్రమునందు వసించి నిచ్చలుం
బాయక భక్తకోటి కనపాయశుభంబు లొసంగు శ్రీజగ
న్నాయకదేవదేవుఁ డభినంద్యకృపామతి మమ్ముఁ బ్రోవుతన్.—అ. ౧.

సుభద్రాపరిణయమునం దితఁడు

గీ. నన్నపార్యుని దిక్కన నాచిరాజు
సోము నమరేశు శ్రీనాథు భీమకవిని
రంగనాథునిఁ బోతనఁ బ్రాజ్ఞవరుని
శంభుదాసుని భాస్కరు సంస్తుతింతు.

అని కవిస్తుతిచేసి తనయన్నయగు తిమ్మకవినిట్లు పొగడి యున్నాఁడు—

సీ. కౌండిన్యగోత్రవిఖ్యాతునిఁ గూచిమంచ్యన్వయాంభోధినీహారకరుని
గంగనమంత్రిశేఖరునకు నంగనామణి యగులచ్చమాంబకును సుతుని
బహుకావ్యనిర్మాణబంధురప్రతిభునిఁ గుక్కుటేశ్వరకృపాంకూరలబ్ధ
సత్కవితామహాసామ్రాజ్యధౌరంధరేయుని బుధజనప్రియచరితుని
చెందులూరి లింగనారాధ్య దేశికేంద్ర
దత్తమాహేశ్వరాచారవృత్తిరతునిఁ
గందరాడఘనగ్రామమందిరుని మ
దగ్రజునిఁ దిమ్మకవిరాజు నభినుతింతు.

ఇతఁడు తనగ్రంథములను జగన్నాథస్వామి కంకితము చేసెను. ఈకవిచేరచియింపఁబడిన జానకీపరిణయము మొదలయినగ్రంథములునాకు లభించినవి కావు. ఇతఁడు కాకతిప్రతాపరుద్రవంశజుఁ డయిన మందపాటి నారాయణరాజుయొక్క ప్రేరణముచేతఁ బ్రతాపరుద్రవంశమును వర్ణించుచు సోమదేవరాజీయమను మూఁడాశ్వాసముల గ్రంథమొకటి రచియించెను. కవియొక్క కవితానైపుణిని జూపుటకై కొన్నిపద్యముల నిందుదాహరించుచున్నాను—

సుభద్రాపరిణయము.

చ. సురుచిరలీలఁ గన్గొనియె శోభనదివ్యసరోజమాలికా
పరిమళలాభలోభమదబంభరడింభరవామమంగ దు
ర్భరదురితౌఘభంగ నతిభాస్వరగాఢతరంగ రంగదీ
శ్వరమకుటాగ్రరంగ శుభసంగను గంగఁ దగంగఁ జెంగటన్. ఆ. ౨.

ఉ. ఆరమణీలలామము లుదంచితలీలలఁ గాంచి రొక్క కా
సారము సారసౌరభవిశంకటసారసపుండరీకక
ల్హారమరందపానపరిలంపటమాద్యదళీంద్రసాంద్రఝం
కారము కోకహంస బకకచ్ఛపమీనఝుళీకుళీరమున్. ఆ. 3.

శా. కారంబయ్యె నితంబినీమణి కలంకారంబుఁ రోలంబఝం
కారంబుల్ సమదోగ్రకోకిలకుహూకారంబుఁ జంద్రోద్ధతా
కారంబుల్ గుసుమాస్త్రచాపగుణటంకారంబు రాయంచక్రేం
కారంబుల్ శుకశారికానికరహుంకారంబు ఘోరంబుగన్. ఆ.౫.

చ. తళుకుఁబిసాళివాలుఁగనుదమ్ముల లోకించుక విప్పి కన్యకా
తిలకము కాంచె నీలమణిదీధితిజాలమనోజ్ఞ గాత్రునిన్
బలవదరాతిజైత్రునిఁ గృపాపరిపూరిత నేత్రునిన్ సమూ
కలితవిలాసచైత్రుని జగన్నుతిపాత్రునిఁ బాండుపుత్రునిన్. ఆ. ౬.

సోమదేవరాజీయము.

శా. అన్నా యెక్కడ నుంటి వొక్కఁడవు రేనాహా మహైశ్వర్య మీ
వెన్నన్ బాలుఁడ విట్టు లుంట నిహితంబే రేయి నల్జాములన్
నిన్నుం గానక కుందుచుంటిమిగదా నిక్కంబు మాప్రాణముల్
కన్నార న్నినుఁ జూడకున్న నిలువంగా నేర్చునే లేశమున్. ఆ. ౧.

ఉ. వింటిరె మీర లిప్పు డొకవింత కువాళపుబండివాండ్రు మొ
న్నంటినిశార్థభాగమున నాచి మహేశగృహంబు చొచ్చి రా
బంటులతె నిన్న రేయి మనపట్టణభూసురవర్యుఁ గొట్టి వా
రింటిపదార్థ మెల్ల హరియించి రనాయక మయ్యె రాజ్యమున్. ఆ. ౨

---

15. కొవల గోపరాజు

ఈకవి యాఱువేలనియోగిబ్రాహ్మణుఁడు ; హారితసగోత్రుఁడు ; గోపరాజు పౌత్రుఁడు ; కసవరాజునకును కామాంబికకును పుత్రుఁడు. ఇతఁడు సింహాసనద్వాత్రింశతిక యనుపేరవిక్రమార్కునికథలను పండ్రెండాశ్వాసముల పద్యకావ్యముగా రచియించెను. ఈద్వాత్రింశత్సాలభంజికల కథలను రచించుటనుగూర్చి కవి యిట్లు వ్రాయుచున్నాఁడు—

క. అప్పరమేశ్వరుకరుణన్। గుప్పలుగొనువిక్రమార్కు గుణములకొఱకై
చెప్పెద రసభావంబులు। మిప్పిరిగొనునట్లు కథలు ముప్పదిరెండున్.

ఈకవివంశమునకు మూలపురుషుఁడైన పెన్నయామాత్యుఁడు

సీ. కలుషమండలికభేకఫణీంద్రుఁడన రాయగజగంధవారణఖ్యాతి మెఱసి

* * * *

నెగడె నందవోలు నెలవుగా భూసుర। వంశసాగరామృతాంశుమూర్తి
చక్రవర్తి మాన్యసౌజన్యధుర్యుండు। విక్రమార్కునిఘనుఁడు పెన్నవిభుఁడు.

అనుపద్యమునుబట్టి నందవోలురాజులయొద్ద మంత్రిగానుండి బిరుదముల నందినట్టు కనుపట్టుచున్నాఁడు. ఇతఁడు పదునాలవ శతాబ్ద మధ్యమునందుండి యుండవచ్చును. కాఁబట్టి యీపెన్నయామాత్యున కేడవపురుషుఁడైన కవి తరువాత నూటయేఁబది సంవత్సరముల కనఁగా పదునేడవశతాబ్దాంతమునం దుండి యుండును. కవితండ్రియైన కసవరాజు వేముగల్లు పురాధీశ్వరుఁ డయిన మల్లరాజు మంత్రియైనట్టు,

శా. రాణిం మల్లనకీర్తిచంద్రికలు సర్వం బొంగి మధ్యాశ్రిత
క్షోణీభృద్ఘనసర్గమై గుణమణిస్తోమంబుల న్నిండి యీ
క్షోణిం శ్రీపురుషోత్తమాశ్రయమునై శోభిల్లి దానామృత
శ్రేణిం ద్యాగసముద్రనామము వహించెన్ వేముగ ల్లిమ్మహిన్.

ఇత్యాది పద్యములవలనఁ దెలియవచ్చుచున్నది. కాని యీమల్ల నృపాలుఁ డెవ్వఁడో యేకాలమునందుండినవాఁడో యింకను విచారింపవలసియున్నది. ఎట్లయినను గవి యించుమించుగా నిన్నూఱుసంవత్సరములక్రిందటివాఁ డగుటకు సందేహము లేదు. ఈ విక్రమార్కచరిత్రములోని గద్యమునందు

"ఇది రాయగజగంధవారణ వైరిమండలీకఫణీంద్ర వీరఘోట్టవిభాళాదిబిరుద ప్రకటచారిత్ర కొవలె పెన్నయామాత్యపౌత్ర హారితసగోత్ర పవిత్ర సకలసుకవిమిత్ర కసవరాజతనూజ గోపరాజ విరచితంబైన......"

అని పెన్నయామాత్యుఁడు తనకు తాతయైనట్లు చెప్పుకొనెను గాని వంశవర్ణనమువలన కవి కేడవపురుషుఁడైనట్టు స్పష్టమగుచున్నది. ఈద్వాత్రింశత్సాలభంజికాకథల కవిత్వము విక్రమార్కచరిత్రమును రచించిన జక్కనకవిత్వమునకుఁ జాలకపోయినను మొత్తముమీఁదఁ జక్కనిదిగానే యున్నది. ఈపుస్తకములోని రెండుపద్యము లిందుఁ బొందుపఱుపఁబడుచున్నవి—

ఉ. అన్నలొ రమ్ములొ చెలులొ యాత్మజులో చనువారు పేరికై
మిన్నక చావనేల యిది మేలె భువిఁ బలిభోజికయ్యె నా
యున్నెడ విశ్వసింప నొరునొద్దకుఁ జేరఁ బ్రమాద మౌనుఁ గ
న్నన్న నెఱింగి యొండెడకుఁ జాగుఁడు ప్రాణము తీపి చూచితే. ఆ.౮

ఉ. దేవసమాన నిన్ను వినుతించుట వాంఛితసిద్ధి భూమిలో
నేవసుధేశు నీయెదుట నెన్నఁగవచ్చు మదీయజిహ్వ ల
జ్జావశమై చలింప దిఁక సద్గుణముం దగ సద్గుణాఢ్య ప్ర
స్తావన చేయ నేరనియతం డతిమూర్ఖుఁడుగానఁ జెప్పెదన్. ఆ.౧౧

---

16. కొడిచెర్ల శ్రీనివాసకవి

ఇతఁడు శేషధర్మరత్నాకర మనియెడి యాఱాశ్వాసముల పద్యకావ్యమును రచియించెను. ఈగ్రంథము శేషధర్మములనియు వాడుదురు. ఈకవి యాత్రేయగోత్రుఁడు. కొండయభవానిపుత్రుఁడు. రాజమహేంద్రపుర నివాసుఁడు. ఇతఁ డిన్నూఱుసంవత్సరములకు ముందుండినవాఁడు. ఇతఁ డొకవేళఁ బదునేడవశతాబ్దమధ్యమునందుండి మధ్యకవులలోఁ జేర వలసినవాఁ డేమో! పుస్తకములోని

> 'ఇది నవరసానుబంధ బంధురప్రబంధ నిబంధనా చాతురీ ధురీణ సకలకళాప్రవీణాత్రేయగోత్రపవిత్ర కొడిచెర్ల కొండయభవాని పుత్ర ఐవరగండ బిరుదప్రచండ మంత్రిమార్తాండ సమస్త సద్గుణావాస శ్రీనివాసప్రణీతంబైన హరివంశమునందలి శేషధర్మసారంబను మహాప్రబంధంబునందు.'

అను గద్యమునుబట్టి చూడఁగా నితఁడు మంత్రిశిఖామణియై బిరుదముల నందినట్లును, అత్యంతాధునికుఁడు కానట్లును, కనఁబడుచున్నాఁడు. ఈతని

కవిత్వము ప్రౌఢమయి రసికజనహృదయంగమముగా నున్నది. ఈతని శేషధర్మములనుండి కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. నెలకొని సంగమంబున జనించును గామము కామవృద్ధిచేఁ
దలకొనుఁ గ్రోధ మట్టిజెడిదంబగుక్రోధమునం దనర్చు మో
హాలతిక మోహవృత్తి నుదయం బగు విస్మృతి విస్మృతిం జనుఁ
దలఁపఁగ బుద్ధి బుద్ధి చనినన్ మతితాఁ జెడు మానవుం డిలన్. ఆ.౧.

ఉ. మేఁడియు సీరముఁ భుజముమీఁద భరించుచుఁ బోతునెద్దుతోఁ
గూడఁగఁ గాఁడిఁబూన్చి ములికోల కరంబునఁ బట్టి పగ్గపుం
ద్రాడును మోకువారెనయుఁ దాలిచి ముందట వెళ్ళఁ జుంగువ్రే
లాడఁగఁ గాసె కట్టుకొని యక్కుటిలాత్మకుఁ డేఁగెఁ జేనికిన్. ఆ.౩.

ఉ. రామ కృపాభిరామ రిపురాక్షస వీరవిరామ సాహసో
ద్దామ లసద్గుణప్రకరధామ సమస్తనృపాలలోకసు
త్రామ విభాకరాన్వయసుధాసరిదీశ్వరసోమ సద్గుణా
రామ నిను న్నుతింప నల రాజకళాధరుఁడైన నోపునే. ఆ. ౪.

---

17. పట్టమట్ట సోమనాధకవి

ఇతఁడు స్కాందపురాణములోని నూతనసంహితను నేడాశ్వాసముల గ్రంథముగాఁ దెనిఁగించెను. ఈకవి యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు. హారితసగోత్రుఁడు; వేంకటామాత్యపుత్రుఁడు. ఇతఁడు తనగ్రంథమును బిక్కనవోలి కామారెడ్డి కంకితముచేసెను. ఈగ్రంథము రచియింపఁబడినకాల మిప్పటి కిన్నూఱుసంవత్సరములకంటె నెక్కువయినట్టు తోఁచుచున్నది. కృతిపతియైన కొమినేని కామారెడ్డి యెప్పుడుండిన

వాఁడో తెలిసినదికాదు. కృతికర్త గోదావరిమండలములోనివాఁడు. సూతసంహిత కవిత్వము సలక్షణమయినదిగానున్నది. కవిత్వధోరణిని వెలువుటకయి సూతసంహితలోని పద్యములు కొన్ని యిందుదాహరింపఁ బడుచున్నవి—

ఉ. మున్న పురాణపూరుషుఁడు ముఖ్యుఁడు విష్ణుఁడు శంభుమాయ పై
కొన్న విమోహితుండయి యకుంఠితగర్వ మెలర్ప నేన యీ
యన్నిజగంబులుం బొదివి యాసినకర్తను బేరుకొన్న నా
కన్న ఘనుండు నాసముఁడు గన్గొన నెవ్వఁడు శాశ్వతంబుగన్. ఆ. ౧

ఉ. పాపము లట్లు కొన్ని యెడఁబాసిన రోగము లెల్ల మాని యు
ద్దీపితసత్త్వుఁడై దృఢమతిన్ శశిపర్ణుఁడు తన్మతైకర
తౌపరతంత్రవృత్తిఁ దృణకాష్ఠఫలోదకశాకమూలనా
నాపరిచర్యలన్ దినదినంబు గురుం భజియించు నెంతయున్. ఆ. 3.

చ. సరవి నబోధమూలమగు సంసృతివృక్షము మూలనాశనం
బురుగతిఁ జేయ మంత్రరచితోదక పుష్పముఖార్చనంబు లే
సరణిసి జాల వాత్మరతి జ్ఞానమె ముఖ్యశివార్చ యాబహి
ర్విరచితపూజనంబు లవివేకులు స్థూలము లందు రజ్ఞతన్. ఆ. ౫.

ఉ. అట్టిమ హేశ్వరుం దెలిపి యవ్యయధామము నొందవచ్చు నే
పట్టునఁ గర్మకోటి నది ప్రాప్తముకాదు సమస్తయజ్ఞముల్
నెట్టన భూరిసంసరణనీరధి దాఁటఁగ మంటియోడ లౌ
నెట్టును మృత్యువున్ జరయు నేచును కేవలకర్మతంత్రులన్. ఆ. ౭.

18. దివి రమణకవి

ఇతఁడు వాసిరెడ్డి రామలింగప్రభుని ప్రేరణముచేత శృంగారధామ మను రెండాశ్వాసముల ప్రబంధమునుజేసి నృసింహస్వామి కంకితము చేసెను. కవి తన్నుఁ గృతిచేయఁ బ్రేరేపించిన రామలింగప్రభునిఁ దన ప్రబంధమునం దిట్లు వర్ణించియున్నాఁడు—

సీ. ఏధన్యువంశేశుఁ డెలమి సమానాధువరమున నభివృద్ధివంతుఁ డయ్యె
నేమేటికూటస్థుఁ డెసఁగ వేమనృపాలుప్రీతిచే భువి వాసిరెడ్డి యయ్యె
నేమహాత్మునితండ్రి యెంచెఁ గుతుబుశానృపాలుచే గజాందోళికంబు
లేయయ్యయగ్రజుఁ డెలమి శాత్రవవీరగజరాజసింహతఁ గలన నమరె
నతనివంశజుఁ డతనికూటస్థజాతుఁ
డతనిసత్పుత్రుఁ డాతనితమ్ముఁ డగుచు
నమరె బహుగుణరత్నరత్నాకరుండు
కదనవిజయుండు రామలింగప్రభుండు.

ఈపయిపద్యమునుబట్టియే యీకవి నిర్దుష్టముగాఁ గవిత్వము చెప్పలేనివాఁడగుట స్పష్టమగుచున్నది. అభివృద్ధిమంతుఁడనుట కభివృద్ధి వంతుఁడనియు, అందుననుట కెందెననియుఁ బ్రయోగించినను మొత్తము మీఁద గవిత్వము రసహీనమైనదికాదు. కృష్ణామండలములోని యమరావతీ సంస్థానప్రభువుల ప్రేరణమునుబట్టి పుస్తకమును రచించుటయు మంగళగిరి నృసింహుని కంకితముచేయుటయు విచారింపఁగా నీకవికృష్ణామండలములోనివాఁడనుట తేలుచున్నది. కుతుబుశాను బేర్కొని యుండుటచేతఁ గవి పదునేడవశతాబ్దమధ్యమునం దుండిన ట్లూహింపఁ దగియున్నది. శృంగారధామమునుండి రెండుపద్యము లిం దుదాహరింపఁ బడుచున్నవి—

చ. అలికులవేణికిం బ్రియుఁ డనంగనృపాలుఁడు దాడిచేసి యీ
వలనికి నేఁట రేపటనె వాసిగ రాఁగలఁడంచు బాల్యముల్
గళవళమంది చింతిలఁగఁ గన్పడెఁ దన్ముఖరాజచిహ్నముల్
కలికి వయఃప్రకాశగుణకాంతియు బాల్యవయస్సుసంధిగన్. ఆ. ౧.

మ. సరి నీ వాయెదిరింటి కేఁగఁ గని యేఁ జాలించి యున్నంతలో
నరయం దత్ఫల మేమి మున్నటిమదీయార్థంబు మాకిచ్చి యే
సరణింబోయినఁ బొమ్మటంచు వడిఁ జంచచ్చిత్తయై వేశ్య త
త్కరయుగ్మాంచితకంకణంబు లొగిఁ దాఁ గాంక్షించి తీసెన్వెసన్. ఆ-౨

19. కోదూరి వేంకటాచలకవి

ఈకవి స్కాందపురాణములోని శివరహస్యఖండమును తెనిఁగించెను. (ఈతనికి బాలసరస్వతియను బిరుదాంకముగలదు.) ఈతఁ డాఱువేలనియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; కాశ్యపగోత్రుఁడు; ఎల్లనామాత్యపౌత్రుఁడు; శంకరామాత్య పుత్రుఁడు. ఈశివరహస్యఖండము శ్రీ ముసురు ముళువాగళుప్రభుని కంకితము చేయఁబడినది. ఇతఁడు బళ్లారిప్రాంతములయందుండిన లింగబలిప్రభువని తోఁచుచున్నది. కృతిపతియొక్క పూర్వులలో నొకనిని వర్ణించుచు—

క. ధరణీస్థలి నాపరశివ । చరణోద్భవులందు సకలసామ్రాజ్యరమా
భరణుఁడు వీరనృపాలుఁడు। వరభింగకగోత్రుఁ డగుచు వర్ధిల్లెఁగడున్.

అని కవి యతనిని శివపాదోద్భవకులజునిఁగాఁ జెప్పినందునఁ దద్వంశము శైవశూద్రవర్ణమని చెప్పవచ్చును. (కృతిపతియొక్క పితామహుని మాతామహుఁడైన చిక్కరాజను నామాంతరముగల ముళువాగళునృపాలు నీక్రిందిపద్యములలో మధురాపురీశ్వరుని జయించినట్టును శ్రీవేంకటపతిరాయలకాలములో నుండినట్టును కవి వర్ణించియున్నాఁడు.)

మ. ప్రకటారాతివిదారితార్గళభుజాప్రావీణ్య మింపార వా
రక యెంతే మధురాపురీవిభుని దర్పం బెల్ల వారించి భూ
రికృపాణోద్ధతిచేత వేంకటపతిశ్రీరాయసన్మాన్యుఁడై
చికరాజాఖ్య వహించె భాసురజయశ్రీధుర్యుఁడై వేడుకన్.

క. ఆముళువాగళునృపతి ధ । రామండలిఁ గీర్తి గాంచె రాజత్కార్యో
ద్దామబలావార్యజయ । స్తోమము హైశ్వర్యధుర్య శూలాన్వితుఁడై.

సీ. ఏధన్యునిర్మలబోధాంతరంగంబు రంగంబు పార్వతీరమణిపతికి
నేనరేశ్వరుకరాన్వితచంద్రహాసంబు హాసంబుఁ జేయు వజ్రాయుధంబు
నేరసజ్ఞునికీర్తి శారదామోదంబుమోదంబుహరిదంతములకుఁ గూర్చు
నేసుధీపతిభాషాసుధాసారంబు సారంబు బుధజనశ్రవణములకు
నతఁడు చెలువొందు హాటకాహార్యధైర్య
సహితుఁ డనివార్యశౌర్యమాంసలభుజుండు
దానగాంభీర్యసౌందర్యమాననీయ
సుప్రభావుండు మళువాగళుప్రభుండు.

ఈపద్యములవలనఁ గృతిపతిపూర్వులు విజయనగర సంస్థానాధీశ్వరుల సేనాపతులయియుండి ప్రభుత్వము సంపాదించిరని మాత్రమే కాక కవికాలమును సహితము నిర్ణయింపవచ్చును. వేంకటపతిరాయలు ౧౫౮౬ వ సంవత్సరము మొదలుకొని ౧౬౧౪ వ సంవత్సరమువఱకును రాజ్యము చేసినవాఁడగుటచేత నాతనికి నాలుగుతరముల తరువాత నున్నకృతిపతియుఁ గృతికర్తయు ౧౭౦౦ వ సంవత్సరప్రాంతములయందున్నట్టు నిశ్చయముగాఁ జెప్పవచ్చును. ఇంతేకాక యాంధ్రకవిస్తుతిలోని యీక్రిందిపద్యములో బింగళి సూరన్నను బూర్వకవినిగా నభివర్ణించుటనుబట్టికూడ నవి యాధునికుఁ డని చెప్పవచ్చును—

సీ. చతురాస్యుఁడనఁగనుజగతివాగనుశాసనప్రౌఢిఁ జెలువందునన్నపార్యుఁ
గుండలీంద్రుఁ డన నఖండమేధాస్ఫూర్తి నలరారు తిక్కనయజ్వమణిని

నచ్యుతైకసమాఖ్య నంచితవరధార ప్రకటించు శ్రీనాథసుకవివరుని
సన్మార్గు లన సుప్రసాదత్రేజంబులఁ బరిఢవిల్లెడు సోమభాస్కరులను
భూరిసత్కళాద్విజరాజుఁ బోతరాజు
శుభమనోరథుఁ బింగళి సూరవిభుని
మఱియు నాంధ్రోక్తి విశ్వనిర్మాణపటిమ
ఘటితకమలోదయులను మహాకవుల నెంతు.

ఈక్రింది పద్యములలోఁ గవి కృతిపతియొక్క తాతయగు పొట్టి లింగభూపాలునిని తండ్రి యగు లింగభూపాలునిని బహువిధముల వర్ణించి యున్నాఁడు—

సీ. ఘనమార్గవర్తనుల్ గానివిరోధుల ఘనమార్గవర్తను ల్గాఁగఁజేసె
గరిదానమహిమంబు గాంచనిమతుల కరిదానమహిమంబుగాంచఁజేసె
మిత్రపద్ధతిదప్పి మెలఁగెడువైరుల మిత్రపద్ధతిఁ జెంది మెఱయఁజేసె
నెలమిఁ బాదములాశ్రయింపనిరిపులను నెలమి బాదములాశ్రయింపఁజేసె
ననుచు మెచ్చుచు జయరమావనజనయన
యాజి నెవ్వానిభుజపీఠి నాశ్రయించె
నతని నుతియింపఁదరమె నహార్యధైర్య
ధైర్యకుని పొట్టిలింగభూపాలవర్యు.

* * * *

సీ. ధరణి రాజులుగాని ధరణిరాజులుగారు దీటుదారక్షమాదివ్యరుచుల
నిన కేసరులుగాని యిన కేసరులుగారు ప్రతిప్రభావాటోపపటుబలముల
నల నరేంద్రులుగాని నలనరేంద్రులుగారు పురుషు భాసురవచోభోగములను
గోత్రేశ్వరులుగానిగోత్రేశ్వరులుగారు సరిధైర్యబంధురైశ్వర్యములను
నతని కనిమెన్న ధారుణీపతులు దిశల
వెలసె నెవ్వాఁడు ప్రఖ్యాతి విస్తరిల్ల

నతఁడు చెలువొందె రాయవేశ్యాభుజంగ
జయబిరుదశాలి లింగభూజానిమాళి.

ఉ. లింగనృపాలపుత్రుఁ డగులింగనృపాలుని శుభ్రకీర్తిశో
లింగని శారదాభ్రపటలింగని నాకధునీతరంగపా
ళింగని నీలచేలునిహాలింగని మానసవిస్ఫురన్మరా
ళింగని పద్మగర్భునిచెలింగని సారె హసించు నెంతయున్

ఈవఱ కుదాహరింపఁబడిన పద్యములచేతనే యితఁడు ప్రౌఢకవి యనియు నిరర్గళకవితాధార గలవాఁడనియుఁ దెలియ నయి యున్నను శివరహస్యఖండములోని కొన్ని పద్యములఁగూడ నిం దుదాహరించు చున్నాను—

సంభవకాండము.

ఉ. తేనియవాఁక యిచ్చటను దిన్నఁగ రాఁగదవే మృగీమదం
బీనెలతాలబోదె లిఱు నిచ్చటజాఱెదుసుమ్ము కోకిలో
ద్గానము లిందు వింటె కలకంఠి యటంచు సఖీజనావళుల్
మానుగ హెచ్చరింప నసమానమహామహిమాభిరామమై. ఆ. ౧.

మ. పలితస్వచ్ఛశిరోజము ల్దనరఁగా బల్జీర్ణమౌ మేనునన్
వళులున్ వ్రేలఁగఁ గంపమంద శిరమున్ వక్త్రంబు నిర్దంతమై
వెలయున్ భూరిజరాతిభారమున గర్వీభూతుఁడై సారె ప్ర
స్ఖలదంఘ్రిద్వయ మొప్ప గద్దదిక మించన్ వృద్ధవిప్రాకృతిన్. ఆ. ౨.

ఉ. పోయెద నుండెదన్ సమరము న్రచియించెద నాయథేచ్ఛ నే
లా యిటు లాడఁ దావకబలంబుఁ జలంబును లావుఁ జేవయున్
వేయివిధంబులం బలుక వేమఱు నాకు జనించు హాస మో
హో యిదిచాలుఁ జాలు వినుమోరి వచించెద దానవాధమా. ఆ-౫

20. ఏనుఁగు లక్ష్మణకవి

ఈకవి బహుగ్రంథములుచేసి ప్రసిద్ధి కెక్కినవాఁడు. ఈతఁడు చేసినగ్రంథములలో రామవిలాసప్రబంధము కడపటిదిగాఁ గనఁబడు చున్నది. ఈప్రబంధము పెద్దాపురసంస్థానముం దుండిన శ్రీవత్సవాయ గోపరాజున కంకితము చేయఁబడినది. ఈ గోపరాజు తన్నుఁగూర్చి పలికి నట్లు కవి తన రామవిలాసములో నీపద్యములఁ జెప్పుకొన్నాఁడు—

సీ. సురుచిరాపస్తంబసూత్రు వాధూలసగోత్రు సద్వినయాదిగుణసమేతు
నేనుఁగు లక్ష్మకవీంద్రుసపౌత్రుని శ్రీమాచిరాజు నృసింహమంత్రి
దౌహిత్రుభూవరాస్థానపూజ్యుఁడుతిమ్మమంత్రికిఁ బేరమాంబకునుపుత్రు
ధన్యు ననంతాభిధానానుజుని వీరభద్రున కగ్రజు భాగ్యవంతు
లలితకవితాకళాధుర్యు లక్ష్మణార్యు
నన్ను బిలిపించి యుచితాసనమున నుంచి
చాలఁ గరుణించి తనముఖాబ్జమున మంద
హాస మమరంగ నిట్లని యానతిచ్చె.

సీ. సృజియించినాఁడవు సేతురామేశ్వరమహిమంబు పాండిత్యమహిమ మెఱయఁ
గల్పించినాఁడవుఘనులెన్నజాహ్నవీమాహాత్మ్యకృతిసుధామధురఫణితి
నిర్మించినాఁడవు నిర్జరభాషచే శతకంబు భాస్కరస్వామి కెలమి
రచియించినాఁడవు రుచిరంబుగా సుభాషితరత్నమాలిక శివునిపేర
రమ్యవిశ్వేశ్వరోదాహరణ నృసింహ
దండకాదిస్తుతిప్రబంధములు గూర్చి
సములలో నుత్తమఖ్యాతి నమరినావు
లలితగుణధుర్య యేనుఁగు లక్ష్మణార్య.

గీ. వారిజాసననారీముఖారవింద
సారసౌరభఘన ఘనసారసాంద్ర
వీటికాబంధురసుగంధవిభవమధుర
లలితవాగ్ధుర్య యేనుఁగు లక్ష్మణార్య.

గీ. ధీరులు నుతింప నెప్పుడు మీఱుసేయు
భాసురం బగురామవిలాసకావ్య
మంకితము చేయు మావీర నచలనీర
ధరణి నాచంద్రతారకస్థిరముగాఁగ.

పై పద్యములవలన నితఁడు రామేశ్వరమాహాత్మ్యము, గంగా మాహాత్మ్యము, గీర్వాణసూర్యశతకము, సుభాషితరత్నావళి, విశ్వేశ్వరోదాహరణనృసింహదండకాదిస్తుతులు, రామవిలాసము చేసినట్టు తెలియవచ్చుచున్నది. మఱియు నితఁడు విశ్వామిత్రచరిత్రమను మఱియొక గ్రంథమునుగూడ రచించినట్లు సుభాషితరత్నావళి యవతారిక లోని యీక్రింది పద్యమువలనఁ గానవచ్చుచున్నది—

క. రామేశ్వరమహిమము వి । శ్వామిత్రచరిత్ర సూర్యశతకంబును గం
గామాహాత్మ్యము మొదలగు।శ్రీమత్కృతిరత్నములు రచించితిమఱియున్

ఆఱువేల నియోగియైన యీకవి యాపస్తంబసూత్రుఁడు; వాధూలసగోత్రుఁడు; తిమ్మకవి పుత్రుఁడు; లక్ష్మణకవిపౌత్రుఁడు; మాచిరాజు నృసింహుని దౌహిత్రుఁడు. ఈతని తల్లిపేరు పేరమాంబ; అన్నయనంతకవి; తమ్ముఁడు వీరభద్రుఁడు. ఈకవి వంశమునకు మూల పురుషుఁడు పైడిపాటి సింగన్న. ఈకవి పూర్వులయింటిపేరు పైఁడిపాటి వారఁ రయినను సింగన్నవంశజులలో నొకడగు జలపాలామాత్యుఁడు పెద్దాపుర సంస్థానాధీశ్వరుఁ డగు గజపతిరాజుచే నేనుఁగును బహుమాన మందుటచే నప్పటి నుండియు నేనుఁగువారని మాఱినది. ఈయంశమే సుభాషితరత్నావళ్యవతారికలో నిట్లు చెప్పఁబడినది—

సీ. పరమేష్ఠితుల్యప్రభావుండు వాధూలుఁ డనుఋషీంద్రుం డొప్పు
నసఘమూర్తి
యమ్మునినాథువంశమ్మున క్షీరాంబునిధి సుధాకరుఁడు జన్మించినట్లు
ప్రభవించి శ్రీపైఁడిపాటి సింగనమంత్రి వంశాగ్రగణ్యుఁడై వఱలు నతని
మహిమసంతానక్రమమునను జలపాలసచివుఁ డొప్పె బలారిసచివసముఁడు
గజపతిక్షితిభర్తచే గజముతోడ
నగ్రహారము లతఁడు పరిగ్రహించె
నెలమి నేనుఁగువారన్న యింటిపేరు
గలిగె నతనికి గజలాభగరిమవలన.

గీ. ఈడ్యగజపతిదత్తసోమేశ్వరాగ్ర
హారశాసనుఁడై మహోదారభాగ్య
మహిమ గలిగినజలపాలమంత్రిమణికి
గరికిరాజు జనించె విఖ్యాతయశుఁడు.

ఈకవియొక్క పూర్వీకులు చిరకాలమునుండి పెద్దాపురసంస్థానమున నుద్యోగములలో నుండుచు వచ్చిరి. వారిలో గొందఱు కవులు సహిత ముండిరి. పయి పద్యమునఁ జెప్పఁబడిన గరికిరాజునకు మనుమఁడును కవికి బితామహుఁడును పెద్దాడగ్రామమునకు కరణము నయిన యేనుఁగు లక్ష్మణకవి పెద్దాపురసంస్థానమునం దుండి వత్సవాయవంశజు లయిన యచ్చుటిరాజుల కనేకకృతు లంకితము చేసెను. ముందుగాఁ గవి తనతాతనుగూర్చి సుభాషితరత్నావళిలో చెప్పినపద్యములనుమాత్ర ముదాహరించి యతఁడు రచించిన గ్రంథనామములను కృతిపతులనామములను రామవిలాస కృతిపతిని గూర్చి చెప్పినపద్యము ముందు వివరించెదను—

ఉ. సారదయారసద్రుహిణసారథికిన్ గరురాజమంత్రికిన్
జేరమయందు నందనుఁడు పేర్మిజనించె విలాససంపదన్

మారుఁడు విక్రమంబునఁ గుమారుఁడు లక్ష్మణశౌరి భూరిశో
భారవి సాహితీవిజితభారవి ధీరవిచారవిశ్రుతిన్.

ఉ. దండి మనోజ్ఞశబ్దకవితాస్ఫురిచే నుపమాసమృద్ధిచే
రెండవకాళిదాసు, రసరీతితరంగితసూ.క్తిఁ గుండలిం
ద్రుం డని ధీరులెంచఁగఁ గృతుల్ రచియించిన ధన్యునిన్ మహా
పండితమాన్యు నెన్నఁదగు భాజితసూర్యుని లక్ష్మణార్యునిన్.

గీ. కృతు లొసఁగి వత్సవయతిమ్మనృపతిచేతఁ
దురగమణిభూషణాంబరాందోళికాది
పూజఁ గైకొని పెద్దాడపురవరాను
శాసనుం డయి లక్ష్మణశౌరి తనరె.

కవియొక్క యన్నయైన యనంతార్యుఁడు గౌరీపరిణయకావ్యము రచించినట్లు సుభాషితరత్నావళిలోనే యీక్రింది పద్యమునఁ జెప్పబడినది—

క. గౌరీపరిణయకావ్యము । సూరీంద్రులు మెచ్చఁజెప్పి శుంభత్కవితా
పారీణబిరుద మందిన । భూరియశోఘనుఁ డనంతంబుధవరుఁ డలరున్.

లక్ష్మణకవి రచియించిన రామవిలాసమునుబట్టి యితనికాలమును దెలిసికొనవచ్చును. ఇతఁడు కూచిమంచితిమ్మకవికి బంధువయినను కాక పోయినను అతనితో సమకాలికుఁడయినందుకు సందేహము లేదు.

క. హాటకగర్భవలీ । లాటనచలితాంఘ్రినూపురారావశ్రీ
పాటచ్చరములు తేనియ । తేటలు మాకూచిమంచి తిమ్మయమాటల్.

అను కూచిమంచి తిమ్మకవినిగూర్చిన పద్యమీతఁడు చెప్పినదైన నయియుండవచ్చును. రామవిలాసము వత్సవాయ గోపరాజున కంకితము చేయఁబడినది. కవి కృతినాయకుని

సీ. తనమహౌదార్యంబుతనమహాధైర్యంబుకరణిజీమూతలాఘువ మొనర్పఁ
దనవినిర్మలకీర్తి తనవిక్రమస్ఫూర్తి పగిదిఁ బద్మాహితోపమ వహింపఁ

దనువిద్యాభూతి తనరూపవిఖ్యాతిఁ గనుఁలోఁబ్రభవగరిమ మీఱఁ
దనకార్ముకప్రౌఢి తనప్రతాపసిరూఢిభాతి ధనంజయప్రథిమఁ బూన
ధరణి నుతికెక్కె నిజభుజాదండమండ
లాగ్రదర్శనచకితమత్తారినృపుఁడు
వత్సవాయసింహాద్రిభూవరసుతుండు
ప్రణుతగుణశాలి గోపభూపాలమౌళి.

సీ. శారదనీరదనారదపారదహారదస్ఫూర్తి నవఘళించి
శరదిందుకరకుంద శరబృందవరచందనహరిచందనకాంతిలహరి మీఱి
హరికాంతహరికుంతహరిదంతకరిదంతవిధుకాంతపృథుకాంతవిభవ మించి
పురవైరిధరసీరిగిరిదారిహరిశౌరిచరణనిర్ఝరవారిసురుచి గేరి
పాండురాఖండనిజకీర్తిమండలంబు
పుండరీకభవాండంబు నిండిమెఱయఁ
బ్రాభవము గాంచె సింహాద్రిరాజసుతుఁడు
ప్రణుతగుణశాలి గోపభూపాలమౌళి.

ఇత్యాది పద్యములతో నెంతవర్ణించినను, ఈగోపరాజు పెద్దాపురసంస్థానాధీశ్వరుఁడుగాక తత్సంస్థానాధిపతియగు తిమ్మజగపతిమహారాజుగారి కాప్తబంధువయి గౌరవము నొందినవాఁడుగా నుండెను. అప్పుడు ప్రభువుగా నుండిన జగపతిమహారాజుల పుత్రుఁడగు తిమ్మజగపతిమహారాజుగారు ౧౭౫౯ వ సంవత్సరము మొదలుకొని ౧౭౬౭ వ సంవత్సరమువఱకును రాజ్యపాలనముచేసిరి. ఈయన సింహాసనమునకు వచ్చినది ప్రమాదిసంవత్సర పుష్యశుద్ధదశమి. గతదినమునం దీయన తండ్రిగారగు రాయజగపతిరాజుగారు శ్రీపూసపాటి యానందగజపతిరాజుగారితో ఉండూరువద్ద జరిగిన యుద్ధములో హతులైరి. ఆంగీరస సం॥ కార్తికశుద్ధ ప్రథమదినమున జనన మొందినందున, జనకుని మరణము నాఁటి కీయనకు వయస్సెనిమిదిసంవత్సరములు. ఈయన నలువదియైదు

సంవత్సరములు జీవించి పింగళ సంవత్స రాశ్వయుజబహుళ పంచమి నాఁడు పరలోకగతులైనారు. ఈయనకాలమునందుండి యీయనను బహుపద్యములతో స్తుతించిన వారగుటచే నేనుఁగు లక్ష్మణకవిగారు ౧౭౭౦—౮౦ సంవత్సరములవఱకును జీవించి యున్నట్టు కనఁబడుచున్నది. అందుచేత నీకవి కూచిమంచి తిమ్మకవి మరణానంతరమున నిరువది యేండ్లు జీవించి యుండవచ్చును. పెద్దాపురపురాజులగు వత్సవాయ వారు తాము మొదటినుండియు విద్వాంసు లయి విద్వత్కవుల నాదరించు చుండినట్లు వారివంశచరిత్రమువలన విస్పష్టమగుచున్నది. ఈవంశపువారి మూలపురుషుఁడు సూర్యవంశ్యుఁడయి కృష్ణామండలములోని గుడిమెట్ట రాజధానిగాఁ గల చాగి పోత రాజైనట్టు రామవిలాసములోని యీ క్రింది పద్యమువలనఁ దెలియవచ్చుచున్నది—

గీ. సహ్యజాతీరమునకు భూషణ మనంగ
సిరుల కిరవగు గుడిమెట్టపురము తనకు
రాజధానిగ సత్కళాభోజరాజు
చాగిపోతక్షమాభర్త జగతి నేలె.

ఈసాగిపోతరాజుయొక్క శాసనములు గుడిమెట్టలోను బెజవాడ లోను ౧౨౩౦ వ సంవత్సరమువఱకును గానఁబడుచున్నవి. ఈతని యింటిపేరు సాగివారే యైనను, ఈతని వంశమువారిలో నొకఁడగు రామనృపాలుఁడు—

"తగవత్సవాయాఖ్యనగరంబు నిజనివాసముచేసి నదికారణముగసాగి
వంశమునకువత్సవాయనామములోకసుప్రసిద్ధమగుచుసొంపుగాంచె"

తననివాసమును వత్సవాయనగరమునకు మార్చినందున గృహ నామము వత్సవాయవా రయినది. వీరి వంశజులలో నొకరగు (పేర రాజసుతు లయిన) ముసలి తిమ్మరాజుగారు ౧౭౫౫ వ సంవత్సరము నకు సరియైన యానందసంవత్సర భాద్రపద బహుళసప్తమినాఁడు పెద్దా

పురసంస్థానమును సంపాదించి ౧౭౨౬ వ సంవత్సరమునకు సరియైనపరాభవసంవత్సర మార్గశిరబహుళ ద్వితీయవఱకు నేఁబదిరెండు సంవత్సరముల రెండుమాసముల యిరువదియైదుదినములు రాజ్యముచేసి లోకాంతరగతు లయిరి. దిట్టకవి విశ్వనాథకవి విరచిత మైన శేషధర్మములను గృతినందిన దీయనయని రామవిలాసములోని యీపద్యము తెలుపుచున్నది—

సీ. బిరుదాంక పురిని సుస్థిరముగా నిర్మించెఁ బాలమున్నీటినిబోలుచెఱువు
తిరుపతివల్మీకగిరిఁ బూలపల్లెను ఫలవృక్షవనములు పలిపెఁజాల
నృహరిగేహతటాకనిక్షేపవనములు కొమరుగాఁ బెద్దాపురమునను నిచె
విశ్వనాథకవీంద్రవిరచితశేషధర్మప్రబంధము సాదరముగ నందె
విప్రవంశప్రతిష్టలు వెలయఁజేసెఁ
బుత్రులను గాంచె నీతిని బుడమి యేలె
వత్సవాయాన్వయమునకు వన్నెఁదెచ్చె
హెచ్చి పేరయతిమ్మధాత్రీశ్వరుఁడు.

ఈతిమ్మరాజుగారు డెబ్బదియాఱు సంవత్సరములు బ్రతికి కాలధర్మము నొందఁగా, శ్రీముఖసంవత్సర కార్తికశుద్ధ పంచమినాడు జనన మొందిన యీయనపుత్రుఁడు రాయపరాజుగారు ౧౭౨౬ వ సంవత్సరమునందు తండ్రి పోఁగానే రాజ్యపరిపాలన మారంభించి నలువదిరెండు సంవత్సరములు రాజ్యముచేసి ౭౫ ఏండ్లు బ్రతికి ౧౭౬౮ వ సంవత్సరమునకు సరియైన సర్వధారి సంవత్సర మాఘశుద్ధ సప్తమినాఁడు పరమపదప్రాప్తి నొందిరి. ఈయన హరిభక్తిసుధోదయ మనుకృతినందిన ట్లీక్రింది పద్యము చెప్పుచున్నది—

సీ. శ్రీరామునకుఁ గట్టమూరనుగట్టించె గుళ్లు మంటపములు గోపురములు
గంభీరజలతటాకంబు త్రవ్వించె గృహాస్థపురంబున సుస్థిరముగఁ

బొలుపుగా వాల్మీకిపురికాంధ్రకోటను ఫలభూజవాటిక ల్పదిలపఱిచెఁ
బ్రకటవ్యమగుహరిభక్తిసుధోదయంబనుమహాకృతిరత్నమందుకొనియెఁ
బేరుగలుగు మహాత్మ్యముబేగు నదిమి
మెచ్చఁగాఁ దగినఘమీలు తెచ్చుకొనియెఁ
బగతు రగువారినుండియు ల్దిగులుకొనఁగఁ
దిమ్మనృపరాయపక్షమాధీశ్వరుండు.

ఈయన యనంతరమందు పింగళసంవత్స రాశ్వయుజ శుద్ధసప్తమి నాఁడు జన్మించిన యీ యనపుత్రుడు సార్వభౌమ తిమ్మరాజుగారు సింహాసనమునకు వచ్చి ముప్పదితొమ్మిది సంవత్సరములు ప్రజాపరిపాలనముచేసి డెబ్బదవయేట ౧౬౭౮ వ సంవత్సరమునకు సరియైన విభవ సంవత్సర ఫాల్గుణబహుళ త్రయోదశినాఁడు దేహావియోగమునొందిరి. మన కవి తాతయైన యేనుఁగు లక్ష్మణకవిగా రీయనకాలమునందే యుండి యీమహారాజునకుఁ దాను రచించిన ద్రౌపదీపరిణయము నంకితము చేసిన ట్లీక్రింది పద్యములవలనఁ దెల్లమగుచున్నది—

సీ. రాజులుమెచ్చఁ బర్లాకోట సాధించి నరహరదేవు దుర్నయ మడంచెఁ
గుదురైనభావిణికోట లగ్గలుపట్టి యొంటుకో టంతయు నుర్విఁగలపె
దుగరాజు మొదలైనదొరలనుభంగించెవిశ్వంభరునియుద్ధనిహతుఁజేసెఁ
దగఁబూసపాటి సీతారామభూపాలుఁడభినుతింపఁగ విజయంబుగాంచె
సరిసమతుయువనాధీశు నురగపతిని
గయ్యమున గెల్చె లోకవిఖ్యాతి చెందె
వత్సవాయాన్వయమునకు వన్నె తెచ్చె
రాయపనృపాలు శ్రీతిమ్మరాజమౌళి.

చ. హరిహరపద్మజాంశభవుఁడై తగు నేనుఁగు లక్ష్మణార్యుచే
సురుచిరశబ్దభావరసశుంభదలంకృతిమాధురీమనో

హారమగు ద్రౌపదీపరిణయం బను నుత్తమకావ్య మంచె సు
స్థిర మగుకీర్తి సొం పెసఁగఁ దిమ్మనృపాలుఁడు ధర్మపద్ధతిన్.

ఈయేనుఁగు లక్ష్మణకవియే ధ్రువచరిత్రమును వేంకటరాజపుత్రుఁడగు జగ్గరాజునకును, తులామాహాత్మ్యమును కస్తురిరంగరాజపుత్రుఁడగు జగన్నాథరాజునకును, వత్సవాయకులజు లయిన రాజబంధువుల కంకితము చేసిన ట్లీక్రింది పద్యములవలనఁ దెలియవచ్చుచున్నవి—

చ. కవికులసార్వభౌముఁ డనఁగాఁదగు లక్ష్మణార్యుచే
ధ్రువచరిత్రప్రబంధము బుధు ల్వినుతింపఁగ నంది యాగసు
గ్భవనమహాసుఖానుభవకారణ మైనయశంబు గాంచె వా
సవనిభవుండు వత్సవయ జగ్గనృపాలుఁడు సద్గుణోన్నతిన్.

ఉ. హేమనగేంద్రధీరుఁడగు నేనుఁగు లక్ష్మణసత్కవీంద్రుఁడు
ద్దామసుధామయోక్తి వితతం బగునట్లు రచించినట్టి తు
ల్యామహిమప్రబంధము గుణాఢ్యులు మెచ్చఁ బరిగ్రహించెఁ బ్ర
జ్ఞామహితుండు జగ్గనృపచంద్రముఁడు శాశ్వతకీర్తి నందిలన్.

ఈతిమ్మరాజుగారి యనంతరమునం దాయన తమ్ముఁడైన బలభద్రరాజుగారి కుమారులు రాయపరాజుగారు ౧౬౮౮ వ సంవత్సరమునందు రాజ్యమునకువచ్చి యిరువదియాఱు సంవత్సరములు భూపరిపాలనముఁ జేసి నలువదేండ్లు ప్రాయమున ౧౭౨౮ సంవత్సరమునకు సరియైన మన్మథ సంవత్సర జ్యేష్ఠశుద్ధ చతుర్థినాఁడు పరమపదము నొందిరి. ఈయన తండ్రి యగు బలభద్రరాజుగారు తాము కవులయి రామశతకమును జెప్పుటయే కాక కిరాతార్జునీయకృతినందిన ట్లీపద్యము తెలుపుడు చేయుచున్నది—

చ. అమితఖ్యాతికి మూలమైనకృతిఁ దా నందెన్ గిరాతార్జునీ
యము శ్రీరాములపేరఁ బద్యశతకం బారూఢి నిర్మించె భో
జమహీజానిగతిన్ బ్రసిద్ధిగఁ బయె సాహిత్యపారజ్ఞుఁడై
రమణన్ శ్రీబలభద్రరాజు ప్రజలన్ రక్షించె ధర్మస్థితిన్.

తరువాత రాయపరాజుగారి కుమారుఁడు తిమ్మరాజుగారు రాజ్యమునకు వచ్చి దాదాపుగా నిరువది సంవత్సరములు పాలనముచేసి ముప్పది సంవత్సరముల ప్రాయముననే ౧౭౩౪ వ సంవత్సరమునకు సరియైన రాక్షససంవత్సర చైత్రశుద్ధ ద్వాదశినాఁడు పరమపదమునొందిరి. తదనంతర మాయన పుత్త్రుఁడు శ్రీరాయజగపతిరాజుగారు రాజుగాఁ జేయఁబడి యిరువది సంవత్సరముల యెనిమిది నెలలు రాజ్యపాలనముచేసి యుండూరువద్ద శ్రీపూసపాటి యానందగజపతిరాజుగారితో జరిగిన యుద్ధములో నిరువదియైదు సంవత్సరముల యీడుననే ౧౭౫౯ వ సంవత్సరమునకు సరియైన ప్రమాదిసంవత్సర పుష్యశుద్ధ నవమినాఁడు రణ నిహతులయిరి. ఈయన పిమ్మటనే యేనుఁగు లక్ష్మణకవిగారి కాశ్రయుఁడయి యుండిన (రాయ జగపతిరాజుగారి పుత్త్రుఁడయిన) తిమ్మజగపతి గారు రాజ్యమునకు వచ్చి ౧౭౯౭ వ సంవత్సరమువఱకును ప్రభుత్వము చేసి స్వర్గస్థులయిరి. పయిని వివరించిన చరిత్రమునుబట్టి పెద్దాపురసంస్థానాధిపతు లందఱు నించుమించుగాఁ దాము కవులయ్యును కవుల నాదరించి కృతులందినవారయ్యును ఉండిరని తెలియవచ్చుచున్నది. ఏనుఁగు లక్ష్మణకవి తిమ్మజగపతిరాజు తండ్రియగు రాయజగపతి మహారాజుగారి కాలములో సహిత ముండినట్లు తద్రచితమైన యీచాటుపద్యము పలుకుచున్నది.

ఉ. ఆయతవత్సవాయకులాంబుధిపూర్ణనిశాపతీ జగ
ద్గేయశుభాకృతీ! విదితకీర్తిసతీ కమనీయయౌవన
ప్రాయనలాకృతీ సతతవైభవనిర్జితపూర్వదిక్పతీ
ధీయుతవాక్పతీ జగపతీ నృపతీ సుకృతీ మహోన్నతీ.

ఈజగపతిరాజుగారు కవిత్వమునందు నిపుణులయి పెక్కుపదములు శతకములు దండకములు మొదలగునవి భద్రాద్రిరామునిమీఁదఁ జెప్పినట్లు రామవిలాసములోని యీపద్య ముద్ఘోషించుచున్నది—

చ. పదములు కీర్తనల్ రుచిరపద్యశతంబులు రాగమాలికల్
మృదుపదదండకంబులు సమిద్ధగతిన్ రచియించి కామిత
ప్రదునకు భద్రశైలరఘుభర్తకుఁ గానుకగా నొసంగె నా
త్రిదశులు మెచ్చఁగా జగపతిప్రభుచంద్రుఁడు భక్తి పెంపునన్.

ఏనుఁగు లక్ష్మణకవికృతములయిన గ్రంథములలో సుభాషితరత్నావళియు రామవిలాసమును మాత్రము నాకు లభించినవి. ఇందు మొదటి పుస్తకము భర్తృహరియొక్క సంస్కృతగ్రంథమునుండి తెనిఁగింపఁబడినను, గొంచెమయినను విరసముగా నుండక మూలానుసారముగాను నిర్దుష్టముగాను, రసవంతముగాను, హృదయరంజకముగాను ఉన్నది. స్వస్థల మయిన పెద్దాడ గ్రామమునందలి సోమశంకరస్వామి తనహృదయమున సాక్షాత్కరించి సుభాషితరత్నావళిని దెలిఁగింపు మన్నట్లు కవి యీపద్యమునఁ జెప్పుకొన్నాఁడు—

సీ. కలధౌతగిరియును గలధౌతగిరియును విల్లుగాఁ బొడవైనయిల్లుగాఁగ
గమలాహితుండును గమలాహితుండును శరముగా లలితశేఖరముగాఁగ
బద్మోద్భవుండును బద్మాక్షభవుండును సాదిగా మెయిఁదాల్చుబూదిగాఁగ
బవనప్రియుండును బవనప్రియుండును సొమ్ముగా ఫాలనేత్రమ్ముగాఁగ
గ్రాలుపెనువేల్పు ముమ్మొనవాలుదాల్పు
జగములకుఁ ఱేఁడు ధనదునిసంగడీఁడు
హరుఁడు పెద్దాడ సోమశంకరుఁడు హృదయ
సరసిజంబున నాకు సాక్షాత్కరించె.

రామవిలాసములోని యవతారికనుండి యన్నిపద్యముల నుదాహరించిన తరువాతఁ గవిత్వము నిర్దుష్టముగాను మృదుమధురవాగ్గుంభనలు కలదిగాను ఉండునని వేఱుగఁ జెప్పనక్కఱలేదు. పూర్వోక్తము

లయిన గ్రంథద్వయమునుండియుఁ గొన్ని పద్యముల నుదాహరించి కవి చరిత్రము నింతటితో ముగించుచున్నాను—

సుభాషిత రత్నావళి.

చ. నతులగుచు న్మహోన్నతిఁ దనర్చుచు నన్యగుణోక్తిచే గుణో
న్నతిఁ బ్రకటించుచుం బరజనప్రియకార్యసమర్థతం సమం
చితనిజకార్యసంగ్రహము చేయుచు నిష్ఠురవాదులం క్షమా
ధృతి నిరసించుచున్ బరఁగుధీరులు పూజ్యులుగారె యేరికిన్.

నీతిశతకము.

చ. అతివలఁజూచి వీ రబలలంచు వచింపుమహాకవీంద్రు లు
ద్ధతవిపరీతవాదు లిది దబ్బఱగాదు విలాసినీసమం
చితతరళాక్షిపాతములచే గెలువంబడి రింద్రముఖ్యులుం
ధృతి నటువంటివా రబల లేగతి నైరి తలంచిచూడఁగన్.

శృంగారశతకము.

చ. కడువెఱపించుచు న్మదిమి గద్దఱిబెబ్బులిమాడ్కి నున్న దె
క్కడుపగదాయలంబలెఁ దెగుళ్లుశరీరము నొందుచున్న వె
ప్పుడొ చను భిన్నకుంభజలముంబలె నాయువు నిట్టులయ్యుఁ దా
రుఁడుగక మానవు ల్దురితమోలి నొనర్చుచు నున్నవా రహో.

వైరాగ్యశతకము.

రామవిలాసము.

ఉ. వాసవనీలనీలము లవారితవిభ్రమశీలముల్ మరం
దాసవలోలముల్ యువభయానకసూనకదంబపుంద్రకాం
డాసనముక్తలోహగుళికాళికరాళము లంజనప్రభా
భాసురభృంగజాలములు బంధురవృత్తిఁ జరించెఁ గానలన్. ఆ-౧

శా. రామా రాజలలామ యోగిహృదయారామా మహాభోజసు
త్రామా నాకొక ముద్దుపెట్టుదువు రారాయంచుఁ గౌసల్య సు

ప్రేమం బిల్చిన మువ్వ లందియలు గంభీరంబుగా మ్రోయఁగా
శ్రీమంతుం డట రావిరేక మెఱయం జేరంగవచ్చుం గృష్ణ. ఆ-౨

చ. కటుభట ఘోషగర్జితము ఖాడ్గికపాణినటత్కృపాణరు
క్తటిమదయంబు చిత్రఘటితధ్వజపంక్తిసురేంద్రచాప ము
ద్భటదివిషత్ప్రితాపరవిబాధక ముగ్రనిశాటవాహినీ
పటుఘనబృంద మయ్యెడ నభంబునఁ బర్వె నసృక్ప్రవర్షమై. ఆ-3

ఉ. చంపకపుష్పవాసనలసార మెఱింగినషట్పదంబు లీ
సొంపగుకన్నెపెన్నెరులు చూచితిరే చెలులార యంచు భా
షింపుచుఁ గింకిణీవలయశింజిత మొప్పఁ దలంటె వేడుకన్
సంపఁగినూనెచేత నొకశారదచంద్రనిభాస్య సీతకున్. ఆ-ర

ఉ. ఇందుమెలంగుభృంగములు నిచ్చటికీరమయూరిశారికా
బృందము లిందుగట్టు సురభిప్రసవంబులు సాధనంబులై
ముందులభించినన్ హరునిఁ బూనిజయింపఁడె మారుఁ డంచు నె
న్నందగి రాముకేళిభవనప్రమదావనవాటి వాటిలున్. ఆ-౫

---

21. నెల్లూరి వీరరాఘవకవి

ఇతఁడు యాదవరాఘవపాండవీయమను నాలుగాశ్వాసముల త్ర్యర్థికావ్యమును రచియించెను. ఇందు శ్రీకృష్ణునియొక్కయు శ్రీరామునియొక్కయు పాండవులయొక్కయు కథలు ప్రతిపద్యమునకును మూడర్థములు వచ్చునట్లుగాఁ జెప్పఁబడినవి. వర్ణనాంశముల యందు మాత్రము కొన్ని యేకార్థపద్యము లుండును. ఈకవి యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు. ఈతని పూర్వుల యింటిపేరు మొదట దేశరాజు వారయినను నెల్లూరియందు వాసము చేయుచుండుటచే నెల్లూరివారని మాఱినది. ఈతఁడు శాణ్యవగోత్రుఁ; ఆపస్తంబసూత్రుఁడు; వేంకటపతి

పుత్రుఁడు. ఈతఁడు తనతాతతాతయైన కొండనమంత్రిని దనగ్రంథమునం దిట్లు వర్ణించియున్నాఁడు—

సీ. ఎవ్వనితండ్రిపే రిల దేశరాజువారన నింటిపేరు మున్నమరఁ దెచ్చె
నెవ్వనిసద్విద్య హెచ్చుగా వీణవా రన నింటిపేరు మ న్నమరఁగూర్చె
నెవ్వనికొమరుఁ డీయిలఁబెద్దవేంకటపతిరాయలకు దళవాయియయ్యె
నెవ్వఁడు గీతసాహిత్యవిద్యలనేర్చి దిగ్విజయంబునఁ దేజరిల్లె
నెవ్వఁడు ఘవిణమలహారియు ధవళశంఖ
మాదిగా బిరుదులనెల్ల నంది మించెఁ
బ్రౌఢరాజులచే నిమ్మపండనంగ
నతఁడు నుతికెక్కెఁ గొండలాహ్వయుఁడుజగతి.

తిరుమలదేవరాయనిపుత్రుఁ డయిన యీపెదవేంకటపతిరాయలు ౧౬౧౪ వ సంవత్సరమువఱకును రాజ్యముచేసెను. కవియొక్క ప్రపితామహుఁ డాతనికాలములో నున్నందున, నాలుగుతరముల తరువాతివాఁ డయినకవి ౧౭౧౪ వ సంవత్సరప్రాంతములయందుండి యుండవలెను. కవి తనశక్తిసామర్థ్యాదులనుగూర్చి యాదవరాఘవపాండవీయావతారికయం దిట్లు వ్రాసికొనియున్నాఁడు—

సీ. సకలమంత్రరహస్యశాస్త్రసర్వంకషప్రజ్ఞాధికస్ఫూర్తిఁ బరిఢవిల్లి
నిఖిలయోగరహస్యనిరుపమస్థితివిధోరురాజయోగాభ్యాస రక్తిమీఱి
యాగమాంతరహస్యభాగోపనిషదర్థసర్వస్వవిజ్ఞానసార మెఱిఁగి
నాటకాలంకారనానావిధవిశేషరసభావభేదము ల్పొసఁగఁ దెలిసి
శబ్దముఖ్యశాస్త్రసదసద్వివేకత । స్మృతిపురాణవాస్తురతిరహస్య
గణితతురగరత్నగజపరిజ్ఞానత । నమరు వీరరాఘవాఖ్యకవిని.

క. నానావిధావధానము । లానృపనీతియును భరతమాహాత్మ్యాదుల్
మానుగనిచ్ఛాలిపియుఁ । మానితముగఁ గల్గఁ గోపంబునుమఱియున్.

క. ప్రాకృతముఖషడ్భాషల।వ్యాకరణంబులును దెలుఁగువ్యాకరణంబుల్
ప్రాకటసాముద్రికమును । వీఁక౯ జ్యోతిషముఁ జాపవిద్యావిధమున్.

క. సాంగముగఁ దెలిసి మును యో । గాంగీకారమతినిశ్చలానుభవాప్తిన్
బొంగియు నియోగవృత్తిఁ బొ।సంగి చెలంగితిని సారసాహిత్యనిధిన్.

సీ. శతలేఖినీపద్యసంధానచాతురి ఘటికాశతగ్రంథకరణపటిమ
ఆశుప్రబంధబంధాదిక్రియారూఢి సంకరోష్ఠ్యనిరోష్ఠ్యచాటుకలన
విస్తరణమాధుర్యవివిధచిత్రస్ఫూర్తి పాదమాత్రప్రతిపాదఘటన
వ్యస్తాక్షరవిమిశ్రబహుపద్యగుంభన మచలజిహ్వాదికప్రచురరచన
బహుజనమనోంతరస్థిరబహువిధార్థ
బహుసమస్యాప్రపూర్తియు బహువిభేద
సకలవిషమసమస్యాదిసంవిధాన
మమరఁగూర్తును నెఱిరాఘవాఖ్యకవిని.

క. పంచాశచ్చాటుకథా । చంచత్కృతులను రచించి సత్కవిపూజా
సంచితకీర్తిని దగు సా । ధ్వంచితుఁడను వీరరాఘవాఖ్యనియోగిన్.

చ. అవునవఁ గావ్యపంక్తి పదియర్థములన్ రచియింపనేర్తు స
త్కవులదయన్ శిరీషకవితామృదుతామహితార్యవైఖరిన్
భువి నటులైన సత్కథల మూటినొనర్తును బాలబోధకై
తివిరి బహుత్వమందు నలత్రిత్వము పర్యవసాన మాటచేన్.

కవి తాను జెప్పుకొన్నట్లు స్వసామర్థ్యము నంతను జూపి పది యర్థముల గ్రంథము రచియింపక మూఁడర్థములదానినే రచియించినను, ఇట్టి గ్రంథములయందు నిఘంటువులు వెదకి పదములనేర్చి కూర్చినశిల్ప ప్రౌఢిమయేకాని యర్థచమత్కారము కాని భావగౌరవముకాని రస పుష్టికాని పుట్టదు. యాదవరాఘవపాండవీయములోని కొన్నిపద్యము లిందు క్రిందఁ జూపఁబడుచున్నవి—

శా. వారిం దెచ్చిన వంశహానియును దుర్వ్యాపారబాధాగతుల్
చేరన్ రా విటుసేయుమూవిధి యిదే సేవింతు వీక్షింపు మా

త్స్మరూఢవ్యథఁ బాపు నాహృదయశల్యం బౌయ్యనం బాపవే
స్వారాజ్యస్థితి నిల్పఁజేయఁగల భవ్యస్వీకృతింబోమెదన్. ఆ-౧

మ. అసురారాతిభవాతిభీతికలకంసారంభతన్ బాలకా
ర్యసుహృద్వృత్తి మెలంగఁ దెల్పఁగను విశ్వామిత్రమానీశుమా
నస ముప్పొంగ నఘాదులేగ యజనానందక్రియల్ పెంప మా
నిసమాజంబులు నిండ్లలో నిలువఁ బూనెం గామచారోన్నతుల్. ఆ-౨

ఉ. కౌతుకమాత్మ నేర్పడఁ దగన్ జనకేశమహాబలాప్తిని
ఖ్యాతచరిత్రు సింహబలుఁ గన్గొని యీవిధ మెల్లఁ దెల్పి సం
ప్రీతిగ రాము నీకడకు వేగమె తెత్తునటంచుఁ దత్సమా
హుతి సుదృక్శిరోమణిఁ దముక్తిని గైకొనిపోయి యచ్చటన్. ఆ-3

చ. హరివిభుఁ డంతకీర్తి మతసాంబసమాఖ్యుఁడు వైరికర్ణభీ
కరనిజనాముఁ డాబలముఁ గావఁగఁ బూని తదగ్రయాయియై
మరిదమి వేగ నచ్చటి కమందధృతిన్ జని యాగలంకలోఁ
జొరఁబడి కాల్ప సైన్యములఁ జూర్ణముచేసెను దాఁ దదున్నతిన్. ఆ-౪

---

22. నంజరాజు

(ఈకవి హాలాస్యమాహాత్మ్య మను డెబ్బదిరెండధ్యాయముల వచనకావ్యమును రచియించెను.) ఈగ్రంథమున నధ్యాయాద్యంతముల యందుఁ బద్యములుగలవు. కవి వంశవర్ణనమును బద్యములతోనే చేయఁబడినది. (ఈకవి మహీశూరరాజగు దొడ్డమహీపాలుని పౌత్రుఁడు; వీరరాజభూపాలుని పుత్రుఁడు. ఈదొడ్డభూపాలుఁడు ౧౬౭౦ వ సం॥ర ప్రాంతములయందుండినవాఁడు. కవి తానును దనయన్నయు మహీశూర రాజ్య సేనాధిపతులయినట్టు చెప్పుకొనియున్నాఁడు. కవి యన్నయగు దేవభూవిభుఁ డిట్లు వర్ణింపఁబడెను.—

శా. దీనత్రాణపరాయణుం డగుచు నెంతేవిశ్రుతుం డైనయా
సేనాధీశ్వర దేవభూవిభుఁడు కాశింఖానమాద్యన్మలా
ఖానాద్యుద్భటయావనాధిపుల సంగ్రామంబునం గూల్చి ఢి
ల్లీనాథాదుల కెల్ల నచ్చెరువు గొల్పెం ధారుణీమండలిన్.

౧౭౩౧ వ సంవత్సరమునందు మైసూరురాజగు చామరాజును సింహాసనవిహీనునిజేసి చెఱసాలయందుఁ బెట్టించినవాఁడు దళవాయి యైన యీ దేవభూవిభుఁడే. కవి ౧౭౩౦ వ సంవత్సర ప్రాంతములయం దుండినవాఁడు. ఇతఁడు క్షత్రియవంశజుఁడు; భారద్వాజగోత్రుఁడు; ఋక్శాఖవాఁడు. ఈహాలాస్యమాహాత్మ్యము దక్షిణమధురాపురీమాహాత్మ్యమును దెలిపెడి శైవగ్రంథము. ఇందలికథ స్కాందపురాణమునుండి గైకొనఁబడినది. పదునెనిమిదవ శతాబ్దారంభమున మధురలోను, మైసూరులోను దెనుఁగునఁ గొన్నివచనకావ్యములు చేయఁబడినవి. ఈ హాలాస్యమహాత్మ్యముయొక్క రచన సలక్షణమయి నాతికఠినముగా నున్నది. ఆ కాలపు వచనరచనయొక్కరీతిని జూపుటకయి హాలాస్యమాహాత్మ్యములోని కొన్ని పంక్తుల నిందుఁ బ్రదర్శించుచున్నాను.

"వ. రూపలావణ్యభాగ్యమువల్లనో యనుమైనగోత్రంబు గలవాఁడనియో విద్యంజూచియో సుందరేశ్వరుం డనుబుద్ధిచేతనో లేక భ్రాంతిచేతనో నేను నేను బిడ్డనిచ్చుట యనుచుం బలికి యాబ్రహ్మచారిం గులగోత్రంబు లడుగ నతండు తనగోత్రంబును సూత్రంబును నక్షత్రంబును నూర్ధ్వపుండ్రంబును గ్రమంబుగా విస్మితుండై యెఱింగించుటయు నబ్బాంధవులు కులగోత్రవ్యత్యాసంబులు లేకుండుటకు సంతసించి యూర్ధ్వపుండ్రధారణంబున కొక్కింతఖేదంబుఁ జెంది యనేకిమ్ములగు గుణమ్ములయం దొకదోషంబు గలిగియుండినంగాని యడంగునని నిశ్చయించినవారై వివాహంబు లొనరింప నవ్వివాహాతుండై శ్వర్యయుక్తుం డగుటంజేసి పుత్రిక కధికంబుగా ద్రవ్యం

చూసంగ నయ్యుర్వీసురనందనుండు సంతుష్టుండై యాధనం బంతయుం గైకొని పత్నీసమేతంబుగాఁ బెక్కండ్రు బంధువులతోడఁ గూడుకొనియున్న తల్లిదండ్రుల సమీపంబునకుం జనుదేర దేశాంతరంబున కరిగి వివాహంబు చేసికొని భార్యతోడం జనుదెంచిన కుమారుం గాంచి తండ్రియుం దదీయబాంధవులు నత్యంతసంతోషం బెనసిరి ఓc."

౨౨ అధ్యాయము.

---

23. కోటి వెంకనార్యుఁడు

(ఇతఁడు "ఆంధ్రభాషార్ణవము" అను పేరు గల మంచి యచ్చ తెలుఁగు నిఘంటువును పద్యములుగాఁ జేసెను. దీనితో సమానమైన యచ్చతెనుఁగు నిఘంటుంటువు మఱియొకటి లేదు. ఈకవి ఈపుస్తకమును శ్రీవిజయరఘునాథునిపుత్రుఁడైన రఘునాథరాజు ప్రేరణముచేతఁ జేసి యాతని కంకితముచేసెను) ఈరఘునాథరాజు రామనాథసేతుపతి యయిన విజయ రఘునాథరాజు కుమారుఁడని తోఁచుచున్నది. అట్లయిన పక్షమున రఘునాథరాజు ౧౭౩౮ వ సంవత్సరము మొదలు ౧౭౪౭ వ సంవత్సరమువఱకును రాజ్యము చేసినందునఁ గవియు నాకాలమునం దుండి యుండవలెను. కవి గద్యమునందుఁ దనబిరుదావళి నీప్రకారముగా వ్రాసికొనియున్నాఁడు—

"ఇది శ్రీమత్పరమేశ్వరకరుణాకటాక్షసంప్రాప్త సర్వజ్ఞత్వాది కతిపయగుణస్వసామ్యతదితరసకలగుణనిరాప మ్యాసేతు హిమాచలఖ్యాత మహోద్దండకవిబిరుదప్రశస్త సీతారామార్యవర్య తనూజాత శౌర్యధైర్యస్థైర్యాది సకలగుణచిరత్నరత్నాకర కోటి సమాఖ్యవంశసుధాపయోధిరాకాశశాంక ఘంటికాతురంగ నీలాత

పత్ర హనుమద్ధ్వజ మకరకేతన దివాదీప సవవిధభేరికాది నిఖిల బిరుదాంక బృహదంబికా కటాక్షసంజాతసామ్రాజ్యధురంధర విమలయశోబంధుర కర్ణాటపాండ్యచోళమహీపాలాదిసంస్తూయమాన శ్రీరాయరఘునాథమహీనాధసభాంకణ బిరుదాయమానార్యనుతచర్య వెంకనార్యప్రణీతం బైన ఉc."

కవితాధోరణిని జూపుటకయి నిఘంటువునుండి పద్యముల నుదాహరించుట యుచితము కాదుకావునc గృతిపతిని వర్ణించిన పద్యము నొకదాని నిం దుదాహరించుచున్నాను.—

ఉ. శ్రీరఘునాథరాయ నృపశేఖర నీదుకరాసి భీమకా
ళోరగతుల్య మౌటను రణోర్విని దుర్మదమత్తచిత్తులౌ
వీరులప్రాణవాయువులc బీల్చుట యుక్తమి దెంతవింత య
య్యారె సముద్రమయ్యు నిసుమంతయు భంగము గాంచదెప్పుడున్.

24. అడిదము సూరకవి

ఈకవి నియోగిబ్రాహ్మణుcడు; అడిదము బాలభాస్కరుని పుత్రుcడు. ఈయడిదము బాలభాస్కరుcడు శుద్ధాంధ్రరామాయణమును రచించినట్లు కవిజనరంజనములో సూరకవి వేసికొన్న—

"శుద్ధాంధ్రరామాయణ ఘటనవైదుషీధురంధ రాడిదము బాలభాస్కరతనూభవ"

అను గద్యమువలనను, కవి సంశయవిచ్ఛేదములో బాలభాస్కరుని శుద్ధాంధ్రరామాయణములోని దని యుదాహరించిన

"నిగి డిరువై పుల న్వేడల నేటయినీటగునీటికోట"

అను చంపకమాలికాపాదమువలనను దెలియవచ్చుచున్నదిగాని యీశుద్ధాంధ్రరామాయణ మిప్పు డెచ్చటను గానరాదు. ఈసూరకవి

తాను జేసినగ్రంథముల నన్నిటిని రామచంద్రపుర రామలింగేశ్వరుని కంకితము చేసెను. ఇతఁడు చేసినగ్రంథములలో నెల్లఁ జంద్రమతీపరిణయ మనునామాంతరముగల కవిజనరంజనము మిక్కిలి మనోహరమైనది. ఇది మూఁడాశ్వాసములు గల చిన్నప్రబంధమైనను, దీనియందలి గుణ సంపదనుబట్టి పండితులు దీనిని పిల్ల వసుచరిత్ర మని వాడుచున్నారు. ఇతఁడు చేసిన యితరగ్రంథములు రామలింగేశ్వరశతకము, కవి సంశయ విచ్ఛేదము, ఆంధ్రచంద్రాలోకము, ఆంధ్రనామశేషము, అనునవి. కవి సంశయవిచ్ఛేద మనునది మూఁడాశ్వాసముల చిన్నలక్షణ గ్రంథము. ఆంధ్రనామశేషము పైడిపాటి లక్ష్మణకవికృతమైన యాంధ్రనామసంగ్రహములో లేని యచ్చతెలుఁగుపదముల నేర్చి కూర్చినపద్యరూప మగు చిన్న నిఘంటువు. కవి తనగ్రంథముల నన్నిటిని దేవాంకితము చేయుట చేత వానినిబట్టి కవికాలమును నిర్ణయించుట శక్యము కాదు. ఇతనిచే రచియింపఁబడిన గ్రంథములనుబట్టి కవి గోదావరి మండలములో నివాఁడయినట్టు కనఁబడుచున్నాఁడుగాని యితఁడు విజయనగరసంస్థానములో శ్రీ పూసపాటి విజయరామరాజుగారి కాలములో నుండినట్టు తద్రచితము లయిన చాటుపద్యములు మొదలయినవానివలనఁ దెలియవచ్చుచున్నది. విజయనగరసంస్థానప్రభువులలో విజయరామరాజు లిద్దఱున్నందున నితఁ డేవిజయరామరాజు కాలములో నుండినవాఁడో నిశ్చయింప శక్యము కాకున్నది. పెద్దాపురములో వత్సవాయ తిమ్మజగపతి మహారాజుగారు రాజ్యముచేయుచున్నకాలములో నీకవి తనప్రభువువెంట పెద్దాపురసంస్థానకు వచ్చి రాజు లందఱును సభచేసి కూరుచుండియుండగా—

ఉ. రాజు కళంకమూర్తి రతిరాజు శరీరవిహీనుఁ డంబికా
రాజు దిగంబరుండు మృగరాజు గుహాంతరసీమవర్తి వి
భ్రాజితపూసపాడ్విజయరామనృపాలుఁడె రాజుగాక యీ
రాజులు రాజులే పెనుతరాజులు గాక ధరాతలంబునన్.

అను పద్యమును సభలో నాసీనులయియున్న రాజులవంకఁ జూచుచు లేచి చదివెననియు, అందుమీఁద నిందలి కపటవాక్యము తమ్ముద్దేశించి పలికినట్లు భావించి రాజులందఱును కవిని గోపదృష్టితోఁ జూచుచు లేవఁబోఁగా నతఁడు జంకక పద్యార్థమును జెప్పి "యీరాజులనఁగాఁ" పై చరణములయందుఁ జెప్పఁబడినరాజు మొదలయినవారని స్పష్టపరచి రోషముడిపి వారిని శాంతచిత్తులను జేసెననియు చెప్పుచున్నారు. ఏనుఁగు లక్ష్మణకవిగారి నాదరించిన యీవత్సవాయతిమ్మజగపతిమహారాజుగారు ౧౭౫౭ వ సంవత్సరము మొదలుకొని ౧౭౯౭ వ సంవత్సరమువఱకును రాజ్యముచేసిరి. ఈయనకాలములో నుండినవారు రెండవ విజయరామరాజుగారే. ఈయన విజయనగరరాజ్యమునకు వచ్చినదియు తిమ్మజగపతి మహారాజుగారు పెద్దాపురరాజ్యమునకు వచ్చిన సంవత్సరములోనే. ఈవిజయరామరాజుగారు ౧౭౫౭ వ సంవత్సరము మొదలుకొని ౧౭౯౪ వ సంవత్సరమువఱకును రాజ్యపాలనము చేసిరి. ఈ రాజులిద్దఱును సింహాసన మెక్కినప్పటికి యుక్తవయస్కులుకాని బాలురు. వీరిలో తిమ్మజగపతి మహారాజులుగా రప్పటి కేడుసంవత్సరముల ప్రాయమువారు; విజయరామరాజుగారు పండ్రెండు సంవత్సరముల ప్రాయమువారు. నిజాము ౧౭౬౦ వ సంవత్సరమున రాజమహేంద్రవరము వచ్చినప్పుడు వీరినిద్దఱిని గొనిపోయి దర్శనముచేయింపఁగా నతఁడు వీరిద్దఱిని వారివారి సంస్థానములకు రాజులనుగా నంగీకరించెను. మొదటి విజయరామరాజుగారు బొబ్బిలియుద్ధమున ౧౭౫౭ వ సంవత్సరముననే మృతులయినందున, తిమ్మజగపతి మహారాజుగారి కాలములో నుండినయతఁ డతఁడయి యుండఁడు. సింహాసనమునకు వచ్చినప్పటికి వీరిద్దఱును బాలురయినందున వీరు తమ యాస్థానకవులతోఁ గలిసి పెద్దాపురమున సమావేశమగుట తరువాత నిరువది సంవత్సరముల కనఁగా ౧౭౭౭ వ సంవత్సర ప్రాంతమందయియుండును. అందుచేత

సూరకవి ౧౭౮౦ వ సంవత్సరమువఱకైనను జీవించియుండవచ్చును. ఇతఁడు పెద్దవిజయరామరాజుగారి కాలములోఁగూడ బాల్యావస్థలో నుండి యుండును. కవి కాశ్రయుఁడైన విజయరామరాజుగారిని గూర్చియు వారి సంస్థానమునుగూర్చియు నిందుఁ గొంత వివరించుట యనుచితము కానేరదు.

(ఓరుగంటియందుండిన కాకతీయరాజులు చెప్పుకొనునట్టుగానే యీ పూసపాటివారును తాము సూర్యవంశజుఁడైన మాధవవర్మ సంతతి వారమని చెప్పుకొందురు. కొండపల్లి సర్కారులోని పూసపాడను గ్రామనివాసముచేత వీరికి పూసపాటివారని యింటిపేరు గలిగినది.) ఓరుగంటిసంస్థానము ప్రతాపరుద్రునితోఁ నశించినవెనుక వత్సవాయవారు పూసపాటివారు మొదలయినవారు మహమ్మదీయులకు లోఁబడిరి. రఘునాథరాజను మాఱుపేరుగల పూసపాటి తిమ్మరాజుగారు గోలకొండలో సరదారుగానుండి శ్రీకాకుళమునకువచ్చి, శ్రీకాకుళమునకు ఫౌజుదారుగా నుండిన షేర్ మహమ్మదుఖాన్ వలన ౧౬౫౨ వ సంవత్సరమున కూలిమి భోగాపురపుతాలూకాలను గుత్తకు పుచ్చుకొని పాలనముచేయ నారంభించెను. ఈయనపుత్రుఁడయిన సీతారామచంద్రరాజుగారు మఱికొన్ని తాలూకాలనుకూడ కవులునకు పుచ్చుకొని, పర్లాకిమిడి సంస్థానాధిపతియైన గజపతిదేవుతో మైత్రిసంపాదించి, ౧౨౫ గుఱ్ఱపు రౌతులతోను ౨౫౦ కాల్బలములతోను పొట్నూరు జయించి కళింగరాజని పేరువడసి యాయూరు నివాస మేర్పఱుచుకొని ప్రబలుఁడయియుండెను. ఈయన యనంతరమున నానందరాజుగారు పరిపాలనమునకు వచ్చిరి. ఈయన పుత్రులు విజయరామరాజుగారు బహుప్రసిద్ధపురుషులు. ఈయన మన్నెదొరలను గెలిచి వారి దేశము లాక్రమించుకొని మన్నెసుల్తాను బిరుదంది, పొట్నూరునుండి తనపేరట విజయనగరమను పేరఁబరఁగిన యూరికి రాజధానిని మార్చుకొని, ౧౭౧౨ వ సంవత్సరమునకు సరియైన

విజయసంవత్సర విజయదశమీ జయవారమునాఁడు కోటకట్టుటకు శంకు స్థాపనము చేసెను. ౧౭౫౩ వ సంవత్సరమున నిజాము కొండపల్లి యేలూరు రాజమహేంద్రవరము శ్రీకాకుళము సర్కారులను ఫ్రెంచి వారికిచ్చెను. అప్పుడు విజయరామరాజుగారు శ్రీకాకుళమునకు నాయి బయిన జాఫరల్లీతోఁ జేరి దేశము ఫ్రెంచివారికి స్వాధీనము కాకుండు నట్లు చేయుటకయి ప్రయత్నించెను గాని, వారు రాజమహేంద్రవరము శ్రీకాకుళపు సర్కారులను తక్కువశిస్తుకు కవులున కిచ్చెదమన్నందున జాఫరల్లీని విడిచి ఫ్రెంచివారితోఁ జేరెను. తరువాత సర్కారులలోని రాజులందఱును ఫ్రెంచివారికి లోఁబడక తిరుగఁబడినప్పుడు సహిత మీయన వారియెడల విశ్వాసముగలవాఁడయి యుండి ౧౭౫౪ వ సంవ త్సరమున ఫ్రెంచి సేనానాయకుఁడయిన బుస్సీకి కావలసిన ధనమును రహస్యముగాఁ బంపెను. తరువాత బుస్సీ సేనలతో దేశమును స్వాధీ నము చేసికొనుటకు కళింగదేశమునకు వచ్చినప్పుడీయన బొబ్బిలివారి తోటి తన పూర్వవైరమును సాధించుకొనుటకయి బుస్సీని పురికొల్పి యుద్ధము చేయునట్లుచేసి తానుగూడ సేనలతోఁబోయి ౧౭౫౭ వ వత్స రము జనేవరు నెల ౨౪ వ తేదిని తాండ్రపాపయ్యచే పొడువఁబడి పరమపదము నొందెను. తరువాత విజయరామరాజుగారి పితృవ్యపుత్రుఁ డయిన యానంద గజపతిరాజుగారు సింహాసనమునకు వచ్చి, బుస్సీ విజయరామరాజుగారి యెడలఁ జూపిన యాదరమును తనయెడలఁ జూపక పోవుటచేత మనసులో ద్వేషము పెట్టుకొని బుస్సీ విశాఖపట్టణము మొదలయిన స్థానముల నన్నిటిని స్వాధీనముచేసికొని పై యధికారుల యుత్తరవు ననుసరించి యీ దేశమును విడిచి కర్ణాటకమునకు వెడలి పోఁగానే సేనలను గూర్చుకొనిపోయి విశాఖపట్టణమును పట్టుకొని దాని నింగ్లీషువారికి వశపఱిచెదనని యుత్తరములువ్రాసి ౧౭౫౮ వ సంవత్స రమున వారితో స్నేహము చేసికొనెను. తరువాత నతఁడు ఫ్రెంచివారి

నుత్తరపుసర్కారులనుండి తఱిమివేయు ప్రయత్నములో నింగ్లీషువారితోఁ జేరి, దొరికినకొల్లలోఁ దనకు భాగమిచ్చునట్లును జయించిన దేశములో నదీ సముద్రతీరపట్టణములును వాని చుట్టుపట్లఁగల దేశమును దక్క మిగిలిన భాగమును దన పాలనములో నుంచునట్లును యుద్ధవ్యయముల క్రింద తాను నెల కేఁబదివేలరూపాయల చొప్పున నిచ్చునట్లును ఏర్పఱుచుకొని, కర్నల్ ఫోర్డుగారిచే నడుపఁబడుచుండిన యింగ్లీషుసేనతోఁ దనసేనను జేర్చి దండయాత్ర వెడలెను. అవలకే ఫ్రెంచిసేనానాయకుఁడయిన కన్ఫ్లాన్సుగా రానందగజపతిరాజుగారిని శిక్షించుటకయి దండయాత్రవెడలి యింగ్లీషుసేన యాయనతోఁ జేరినదని విని రాజమహేంద్రవరమున నిలిచిపోయెను. కర్నల్ ఫోర్డుగా రానందరాజుగారు వెంట రాఁగా రాజమహేంద్రవరమునకు వచ్చి ఫ్రెంచిసేనాధిపతియైన కన్ఫ్లాన్సుగారి నక్కడనుండి పాఱఁద్రోలి, మచిలీబందరునకుఁ బోయి దానిని స్వాధీనపఱుచుకొనెను. దండువెడలియున్న యింగ్లీషువారిని జయించుటకై నిజాము సలాబత్ జంగు మచిలీబందరుకు ౧౫ మైళ్ళ దూరము వఱకును వచ్చి వారిని జయించుట సాధ్యముకాదని తెలిసికొని ౧౭౫౯ వ సంవత్సరము మెయినెల ౧౪ వ తేదిని సంధిచేసికొని మచిలీబందరు సర్కారును కొండవీడు నైజాముపట్టణము సర్కారులును ఇగ్లీషువారి కిచ్చివేసి, ఆనందగజపతిరాజుగారు ఫ్రెంచివారి కియ్యఁబడిన దేశమునుండి గ్రహించిన సొమ్ము విషయమయి తగవుపెట్టక విడిచిపెట్టి వారితండ్రి తాతలనుండి వా రనుభవించుచుండిన దేశమును వా రనుభవించుట కంగీకరించెను. ఈ యొడంబడిక యయినతరువాత స్వదేశమునకు వచ్చుచు త్రోవలో రాజమహేంద్రవరమున నానందగజపతిరాజుగారు స్ఫోటకముచేత కాలధర్మమునొందిరి. అప్పుడాయన భార్య లిద్దఱును సహగమనము చేసిరఁట! తర్వాత బొబ్బిలిలో మృతులయిన విజయరామరాజుగారిభార్య చంద్రమ్మగారు సన్నిహితజ్ఞాతియైన పూస

పాటి రామభద్రరాజుగారి ద్వితీయభార్య పుత్రుఁడయిన పం్రెండు సంవత్సరముల ప్రాయముగల వేంకటపతిరాజను చిన్నవానిని పెంచుకొని, ఆచిన్నవాని పేరు విజయరామరాజుగా మార్చి యాయనను పట్టాభిషిక్తుని జేసెను. ఈవిజయరామరాజు బాలుఁడయినందున రాజ్యాధికారము నంతను సవతియన్నగారగు సీతారామరాజుగారు వహించి, తమ్మునకు యుక్తవయస్సు వచ్చినతరువాతసహిత మధికారమునంతను తానే చెల్లించుచువచ్చెను. ఈవిజయరామరాజుగారి కాలములోనే మనకవి యుండినది. ఆకాలమునందు విజయనగరమువారు నిజాముకు కట్టుపన్ను రెండులక్షల తొంబదివేల యేఁబదితొమ్మిదిరూపాయలు. అయినను దేశ మస్వస్థస్థితిలో నున్నందున నిజాము తనకు రావలసిన కప్పమును తిన్నఁగాఁ గైకొనశక్తుఁడుగాక పెక్కంఢ్లూర కుండుచు వచ్చెను. ఈహేతువుచేతను, సీతారామరాజుగారు బలవంతులయి తమసేనలతో చిల్లరసంస్థానాధిపతుల నదిమి కప్పములు గొనుచుండుటచేతను, విజయనగరరాజ్య మాకాలమునం దించుమించుగా స్వతంత్రరాష్ట్రమువలెనే యుండెను. ఈసీతారామరాజుగారు బొబ్బిలి రాజయిన చిన్నరంగారావుగారిని పట్టుకొని విజయనగరములో చెరసాలయం దుంచెను; పర్లాకిమిడి రాజగు నారాయణదేవు జగన్నాథయాత్ర పోవుట సందుచేసికొని యతని రాజ్యముమీఁద దండెత్తి యాత్రనుండి తిరిగి వచ్చిన యాతని నరసన్నపేటవద్ద నోడించి యిప్పటి గంజాముమండలములో విశేషభాగమును విజయనగరరాజ్యములోఁ జేర్చెను. తన తమ్ముని వెంటఁగొని దండయాత్రవెడలి సీతారామరాజుగారు మొగలితుర్రు వఱకును వచ్చి స్థానికపాలకుఁడైన నబాబు బక్షీఅబ్జమాఖానును జయించి కొంతకాలము రాజమహేంద్రవరము సర్కారునుసహిత మాక్రమించినట్టు చెప్పుదురు. ఇట్లింకను పెక్కు విజయములను బొంది మహోన్నతదశయం దుండిన యీకాలములోనే యింగ్లీషువారు

నిజాముువలనఁ బొందిన సనదుప్రకారముగా నుత్తరపుసర్కారుల లోఁదము యధికారమును జెల్లించుట కారంభించిరి. ఇంగ్లీషుకంపెనీవారితో జేసికొన్న యొడంబడికనుబట్టి సంవత్సరమునకు మూఁడులక్షల రూపాయలు పేష్కష్ చెల్లించుటకును పర్లాకిమిడి రాజయిన నారాయణదేవుపలనఁ గైకొన్న రాజ్యమును విడిచిపెట్టుటకును విజయనగరము వారొప్పుకొనిరి. ఇట్లు కొంతకాలము జరిగిన తరువాత విజయనగర సంస్థానమునకు లోఁబడియున్న కొండ జమీందారు లందఱును విజయనగరము వారిమీఁద తిరుగఁబడి స్వతంత్రులగుటకుఁ బ్రయత్నించిరి. కాని సీతారామరాజుగా రన్నిటికిని దగినవాఁ డయినందున నింగ్లీషుసేనలను సహాయపఱుచుకొని యాకొండ సంస్థానాధిపతుల నొక్కొక్కరినే జయించి కొందరిదేశములను తమరాజ్యములోఁ గలుపుకొనియు కొందఱిని విజయనగరమునఁ జెఱసాలలోఁ బెట్టియు నందఱిని సాధించెను. ఈకలహములో ఆంద్ర, పాలకొండ జమీన్‌దారులు మాత్రము చేర లేదు. సీతారామరాజుగారిట్లు పరరాజులను జయించుటయేకాక తురకదొరలు మసీదుల కిచ్చిన భూములను పూర్వరాజులు బ్రాహ్మణుల కిచ్చిన మాన్యములనుగూడ లాగుకొని ప్రజలను సహితము క్షోభపెట్ట నారంభించెను. ఈయనపెట్టుబాధలే సూరకవిని రామలింగేశశతకము చెప్పునట్లు చేసినవి. ఆకాలపు ప్రభువులయందు కవి కెట్టియభిప్రాయముండినదో కొంతవఱకు క్రిందిరీతి పద్యములు వెల్లడిచేయవచ్చును —

సీ. పదుఁగురు కోఁతివెంబడి సంచరింపరే వాహకుల్ లేరె శవంబులకును
గంగిరెద్దుకు లేవె ఘనతూర్యరావముల్ కల్గి గల్గదె వారకామినులకుఁ
బులిగోవుఁజంపినక్కలనుబోషింపదేస్థూలకాయము లేదెమున్నలకును
బుష్పిపంటికి లేదె పుట్టంబుఁ జుట్టుట వేణుధరుఁ డెద్దువెంట రాఁడె
న్యాయపద్ధతినడువనియవనిపతికి
నెన్నిచిన్నెలు గలిగిన నెందుకొఱకు

నంత్యమునఁజూడవలయునాయయ్యసుఖము
రామలింగేశ రామచంద్రపురవాస.

సీ. కడువింత యగుస్థూలకాయంబు గల్గుట
చిత్రభూషాంబరస్థితిని గనుట
తూర్యరావంబులతోఁజను టెంచుట
వాలవీజనసమావాప్తి గనుట
శృంగవేత్రోద్ధతిఁ జేరరాకుండుట
చూపఱు పదఁగురు చుట్టుకొనుట
స్వనియంతవాక్యంబు విని తలయూఁచుట
మౌనముద్ర వహించి మతము గనుట
గంగిరెద్దుకు మూర్ఖభూకాంతునకును
భేదమించుకయును గనిపించ దట్టి
ప్రభువు వేఁడిన నక్కఱవిపటిమ చెడదె
రామలింగేశ రామచంద్రపురవాస.

సీ. మాన్యంబు లియ్య సమర్థుఁడొక్కఁడు లేఁడు
మాన్యముల్చెఱుప సామంతులంద
ఱెండినయూళ్ళగో డెఱిఁగింపఁ డెవ్వఁడుఁ
బండినయూళ్ళెన్నఁ బ్రభువులంద
ఱితఁడు పేద యటంచు నెఱిఁగింపఁడెవ్వఁడుఁ
గలవారిసిరి యెన్నఁ గలరు దొరలు
తనయాలిచీఁకటితప్పెన్న డెవ్వఁడు
పరకాంతఱంకెన్నఁ బెద్ద లంద
ఱిట్టిదుష్టుల కధికార మిచ్చినట్టి
రాజు ననవలెఁగాక దుర్జయుల ననఁగ
నేమిపనియున్న దిఁక సత్కవీంద్రులకును
రామలింగేశ రామచంద్రపురనివాస.

ఇట్లుండఁగా సంస్థానమునం దుండినరాచవారందఱు నొకటిగాఁజేరి ౧౭౭౫వ సంవత్సరమునందు మంత్రిత్వమునుమాని రాజకార్యసంబంధము వదలుకొనునట్లు సీతారామరాజుగారిని నిర్బంధపఱిచిరి. తనపుత్రుఁడయిన నరసింహగజపతిరాజును స్వీకారముచేసికొని విజయరామరాజుగారు మరణానంతరమున సింహాసన మాతని కిచ్చునట్లు తమ్ముని నొడఁబఱిచి యాయన తాను మంత్రిత్వమును విడుచుట కంగీకరించెను.

విజయనగరమువారు చెల్లింపవలసిన మొత్తమును నిర్ణయించుటకయి కంపెనీవారి చెన్నపురిపరిపాలకుఁడు విజయరామరాజుగారిని చెన్నపురి రమ్మనికోరెను. కోరినప్రకారముగా విజయరామరాజుగారు చెన్నపురికిఁబోక ప్రయాణవ్యయములకు తనచేత సొమ్ములేదనియు, తన యన్నయైన సీతారామరాజుగారు తన్ను నాశనముచేయుటకయి తంత్రములు పన్నుచుండిన యీకాలములోఁ దాను రాజధానినివిడిచి దూరముగాఁబోవుట యుచితము కాదనియు, విశాఖపట్టణములోని యధికారుల సమక్షమునఁ దాను వారు విధించెడు న్యాయమైనకప్పమున కంగీకరించెదననియు, చెప్పి తప్పించుకొనెను. అంతట చెన్నపురిపరిపాలకుఁడు సీతారామరాజుగారిని చెన్నపురికి రమ్మనికోరఁగానే యతఁడు తక్షణమేపోయి యక్కడివారిని వశపఱచుకొని రాజకార్యములు చక్కఁబఱుచుకొని, విజయనగరసంస్థానమునకు తన్ను దివానుగా నేర్పాటుచేయించుకొని తన పుత్రుని స్వీకారమును స్థిరపఱిపించుకొని, మరలవచ్చెను. ఈయేర్పాటులవలన విజయరామరాజుగారు పేరునకురాజుగానుండినను నిజమయిన యధికారమంతయు సీతారామరాజుగారి చేతిలోనే చిక్కెను. ఈవిషయమయి విజయరామరాజుగారు కంపెనీవారికి మొరబెట్టుకోఁగా పెట్టుకోఁగా తుదకు వారాయనను దివానుపనినుండి తొలఁగించి విజయనగరము విడుచునట్లుత్తరువు చేసిరి. అందుపైని సీతారామరాజుగారు విజయనగరము విడిచి సింహాచలము నివాసముగా నేర్పఱుచుకొని యక్కడ కొంత

కాలముండి, తరువాత మరల తమ్ముని మంచిమాటలాడి ౧౭౯౦ వ సంవత్సరమునం దొకసారియు ౧౭౯౨ వ సంవత్సరమునం దొకసారియు మరల సంస్థానములో దివానుగాఁ బ్రవేశించి, కడపటిసారి కంపెనీవారిచే చెన్నపురికిఁ బోవునట్లుత్తరువుచేయఁబడి నెలకయిదువేలరూపాయల యుపకారవేతనముమీఁద ౧౭౯౩ వ సంవత్సరమునం దక్కడకుపోయి చేరెను. సీతారామరాజుగారి దుష్పరిపాలనము మొదలైన కారణములచేత విజయరామరాజుగారు ఋణములపాలగుటయేకాక కంపెనీవారికి కట్టవలసిన కప్పమును సరిగా కట్టలేక యారులక్షల యిరువదియైదువేల రూపాయలవరకు బాకీపడిరి. అందుచేత కంపెనీవారు సంస్థానమును తమపాలనమునకుఁ దీసికొని, విజయరామరాజుగారిని స్వరాజ్యమువిడిచి మచిలీబందరులో వాసము చేయునట్లుత్తరువుచేసి, ఆయనకు ముప్పదివేలరూపాయ లొక్కసారిగా నొక్కమిచ్చెదమనియు నెలకు రు ౧౨౦౦ లు వ్యయముల కిచ్చెదమనియుఁ జెప్పిరి. ఆయన స్వదేశమును విడుచుట కిష్టములేనివారయి బందరుపురమునకుఁ బోవుమార్గమున బైలుదేరి యయిదారుక్రోసుల దూరముపోయి యక్కడనుండి పనివారలతో వెనుకఁదిరిగి పద్మనాభమునకుఁ బోయి యక్కడనుండి తాను ప్రయాణము చేయలేకపోవుటకు సాకులు వ్రాయనారంభించెను. విజయరామరాజుగా రక్కడనున్న కాలములో రాచవారును నాలుగువేల సైనికులునుబోయి యాయనను జేరిరి. కంపెనీవారి కీసంగతి తెలియఁగానే యిరువదినాలుగుగంటలకాలము గడువిచ్చి యాలోపల నతఁడు బందరుమార్గమున బైలుదేరనిపక్షమున, బలాత్కారముగాఁ బంపవలసిందని విశాఖపట్టణములోనున్న సేనానాయకునకుత్తరువుచేసిరి. పయివారి యుత్తరువును దెలియఁబఱిచి యింగ్లీషు సేనాధిపతియైన ప్రెండర్గాష్టుగారు కొంతసేన (౭౫౦ భటుల)తో పద్మనాభమునకుఁ బోయిరి. ౧౭౯౪ వ సంవత్సరము జూలయినెల ౧౦ వ తేదీ యుదయమున నింగ్లీషుసేనాధిపతి పద్మనాభపుకొండను జేరునప్పటికి, విజయ

రామరాజుగారును బంధువులయిన రాచవారును ఖడ్గపాణులయి లోఁబడక యుద్ధముచేసి వీరమరణమునొందుటకు నిశ్చయించుకొని యందరును పద్మనాభస్వామి ప్రసాదమునుస్వీకరించి యుద్ధోన్ముఖులయి నిలిచియుండిరి. నాఁడు సూర్యోదయకాలమున నింగ్లీషుసేనలకును రాజుగారి సేనలకును ముప్పావుగంటసేపు ఘోరయుద్ధము జరగినది. అంతట రాజుగారి సేనలన్నియు చెల్లాచెదరయి పారిపోయినవి. రణరంగమునకుఁబోయి చూడఁగా రణనిహతులయి వీరశయనము నొందినవారిశరీరము లక్కడ మున్నూటతొమ్మిది కనఁబడినవి. రణభూమినలంకరించిన మున్నూటతొమ్మిదింటిలో నిన్నూటయెనుబది రాచవారిదేహములు. రణరంగమధ్యమునఁ బడియుండిన విజయరామరాజుగారి శవముచుట్టును కోటకట్టినట్లుగా సంస్థానములో నున్నతస్థితిలో నుండిన యుత్తమక్షత్రియుల శవములు నలువది గుండుదెబ్బలతోఁ బడియుండెను. ఇట్లు మరణమునొందినవారుగాక పారిపోయినవారిలో నెందరికిగాయములుతగిలినవో తెలియలేదు. ఇంగ్లీషుసైనికులలో మృతులయినవారు పదుముగ్గురు; గాయపడినవారరువదియొక్కరు. ముప్పదియేడేండ్లక్రిందట బొబ్బిలికోటముందు పెద్ద విజయరామరాజుగారు హతులయినట్లే మనకవీంద్రునికాలములో నుండిన యీ చిన్నవిజయరామరాజుగారు పద్మనాభపుకొండయందు నిహతులయిరి. మనకవికాలముతో సంబంధించినచరిత్రమింతే. తండ్రిమరణమును విని యప్పటి కెనిమిదిసంవత్సరముల ప్రాయమువాఁడయిన నారాయణబాబుగారు తల్లితోడఁగూడ కొండదేశమునకుపారిపోయిరి. కాని, కంపెనీవారాయనను పిలిపించి దొరతనమిచ్చిరి. ఆయన పంద్రెడులక్షలవరకును ఋణముచేసి ౧౮౦౭ వ సంవత్సరమునందు తనకు సంవత్సరమున కెనుబదివేలరూపాయలిచ్చు పద్ధతిమీఁద రాజ్యపాలనము నింగ్లీషువారి కప్పగింపఁగా వారు ౧౮౨౨ వ సంవత్సరమునాఁటి కప్పులన్నియుఁ దీర్చి రాజ్యము నాయనకు మరలనిచ్చిరి. నారాయణబాబుగారు మరల నేడు

లక్షలరూపాయలప్పుచేసి తనకు సంవత్సరమునకు లక్షరూపాయలిచ్చు పద్ధతిమీఁద ౧౮౨౭ వ సంవత్సరములో రాజ్యమును మరల నింగ్లీషు వారియధీనముచేసి కాశీయాత్రపోయి యక్కడనే వాసముచేసి ౧౮౪౫వ సంవత్సరమున దేహము చాలించిరి. మరణకాలమున కాయన యప్పు ౧౧ లక్షలకుఁ బెరిగినది. పండ్రెండు సంవత్సరముల ప్రాయముగల నారాయణబాబుగారి కుమారుఁడగు విజయరామ గజపతిరాజుగారికి రాజ్యమిచ్చి ఆయన కాశీనగరమును విడిచివచ్చుట కిష్టము లేనివారుగా నుండినను ౧౮౪౮ వ సంవత్సరమునం దాయనను విజయనగరమునకు రప్పించిరి. ఋణముల నన్నిటిని దీర్చి ౧౮౫౨ వ సంవత్సరములో రు ౨౧౨౭౨౮ ల రొక్కముతో నింగ్లీషువారాయనకు రాజ్యమొప్పగించిరి. ఈ విజయరామగజపతిరాజుగా రాంగ్లేయోపాధ్యాయుల శిక్షచేఁ బ్రవీణులయి సత్పరిపాలన చేయుచు బాలికాపాఠశాలలు మొదలయిన జనోపయుక్తములగు ధర్మకార్యములకొఱకు ధనమును సద్వినియోగపఱచుచు వచ్చిరి. విశాఖపట్టణములోని వైద్యశాలకు ముప్పదివేల రూపాయల నిచ్చినందున, దొరతనమువారాయనకు ౧౮౬౪ వ సంవత్సరములో "మహారాజా" యన్న బిరుదిచ్చిరి. ఈయన ౧౮౭౯ వ సం॥రమున స్వర్గస్థులుకాఁగా ౧౮౫౦ వ సంవత్సరమునందు జనించిన యీయనపుత్రు లానందగజపతిరాజుగా రప్పటినుండి విజయనగరపరిపాలకులుగా నున్నారు. దొరతనమువా రీయనకును ౧౮౭౭ వ సంవత్సరమున "మహారాజా" యన్నబిరుదము నిచ్చిరి.

నూరకవికి రేవయను గ్రామమున చెరువుగట్టుక్రింద నొకమాన్యముండెననియు, ఆగ్రామమును గుత్తచేసిన దంతులూరి యన్నమరాజు కవిమాన్యమునకు చెరువునీరు పెట్టుకోనీకపోఁగా, అతఁడు ప్రభువునకు మొఱ్ఱపెట్టుకొనియు కార్యముగానక తుదకు చెఱువులో నిలుచుండి

యీ క్రింది నాలుగు సీసపద్యములును జెప్పఁగానే చెఱువు నాలుగు వైపులను గండితెగి నీరాతని పొలముమీఁద పాఱెననియుఁ జెప్పెదరు-

సీ. బ్రహ్మాండభాండసంపత్తి కుక్షినిగల్గు పద్మనాభునిపదాబ్జమునఁ బుట్టి
సకలరత్నాకరస్థానమై యుప్పొంగునంబుధీశునిచరణంబు ద్రొక్కి
పరమతత్త్వజ్ఞుఁడై పరఁగుశంతనుమహీరమణువామాంకభాగమునఁ జేరి
యఖిలలోకాధ్యక్షుఁడై మించివిహరించుశివుజటాజూటాగ్రసీమనిలిచి
తనరు నీవంటిధన్య కుత్తమముగాదు
పూసపాటి మహాస్థానభూమియందుఁ
గాలుద్రొక్కంగ నోడుఁ జండాలుఁడైన
గదలు మిటమాని దివిజగంగాభవాని.

సీ. ఆదిభిక్షుం డీతఁడనిరోసి విడియాకుగొనివచ్చి యిటనిల్వఁగోరితొక్కొ
జగడాలచీలివై సవతితోఁ బోరాడి వీఁగివచ్చి యిచట డాఁగితొక్కొ
నిర్జరాంగనలెల్ల నీఱంకు వెలిపుచ్చ దూబవై యిచ్చోటదూఱితొక్కొ
బీదబాపలఁగష్టపెట్టుటకై మిన్నుదొలఁగి యిచ్చోటను నిలిచితొక్కొ
వలదు ద్విజభూమిఁ గాల్నిల్ప వరుసగాదు
రవ్వ నీకేల తగ దంబురాశికరుగు
నాతియతఁడెకాఁడటె పిన్ననాఁటి మగఁడు
కదలుమిటమాని దివిజగంగాభవాని.

సీ. భావింప నిలు వెల్ల భంగంబులేకాని
భంగము ల్తొలఁగు చెప్పటికి లేదు
తిరుగుచో వంకరతిరుగు డింతియకాని
తిన్నగాఁదిరుగుట యెన్న డెఱుఁగ
మునసి రేయిపగల్లు మొరయుచుండుటెకాని
మొరయకూరకయుంట యెఱుఁగ మెపుడు
పాలకల్మినిరోసి పల్చనగుటేకాని
పలుచనిగతి మాని మెలఁగు టెఱుఁగ

మనుచు నీలోన నీవై నయవగుణంబు
లరసి లజ్జించి దివి నుండ కరుగుదెంచి
నిలువునీరైన నీవింక నిలిచి పోక
కదలు మిటమాని దివిజ గంగాభవాని.

సీ. కృతకాద్రు లాయెనా క్రీలోగ్రఫణిఫణానేకస్ఫూర్త్యున్నవల్మీకచయము
విరిదోఁట లాయెనా కలుకకంటకకంటకాంకురవిస్ఫూర్తితోయచయము
పువుఁబాన్పు లాయెనా నవమంజులశ్వేతలవణాలవాలపఙ్క్తి చవుటినేల
బొమ్మరిండ్లాయెనా భూరిభేకాండజాధారమై తనరు కేదారచయము
నీకు విహరింప వసతులై నివ్వటిలెనె
చిన్నపొలములు బ్రాహ్మణక్షేత్రమునకు
ఘాతుకత్వంబు చేయుముష్కరులు గలరె
కదలుమిటమాని దివిజగంగాభవాని.

ఈసూరకవి విషయమున నింక దెలిసినసంగతు లతఁడు సమకాలికులగు కవులతోఁ బెట్టుకొన్న వివాదములును, కవు లొండొరులను దిట్టుకొన్న పద్యములును దక్క మఱి యేమియుఁ గానరావు. కాఁబట్టి యాకథలను విడిచి కవికృతగ్రంథములనుండి కొన్ని పద్యములనుమాత్ర మిం దుదాహరించుచున్నాను.—

కవిజనరంజనము.

మ. అమరద్వీపవతీపయోవిహరణప్రాంచత్సురస్త్రీల వ
జ్రమయాభ్రంకషమంటపాగ్రముల నిచ్చల్ క్రీడఁగావించుత
ద్రమణీవారము వేఱ నేరుపఱుపన్ రా దంచుఁగా దివ్యరా
జముఖీపాళికిఁ దమ్మిచూలి యనిమేషత్వంబు గావించుటల్. ఆ-౧

శా. శయ్యాదంభమున న్మురాంతకుఁడు భూషాకైతవస్ఫూర్తిచే
నయ్యార్యారమణుండు దాల్చిరి భుజంగాధీశులన్ నీయసా
హాయ్యప్రస్ఫుటధాటి కోర్వ కనుచో నజ్జాస్యలా మోర్చుపా
రయ్యా గంధసమీర ప్రోవఁగదవయ్యా యీకురంగేక్షణన్. ఆ-౨

మ. అలమన్ మైఁ బులకాంకురాళి దరహాసాంకూరము ల్కన్గవం
దొలఁకన్ ముత్యపుటొంట్లు గండయుగళిం దూఁగన్ గనత్కంకణం
బులు మ్రోయన్ భుజమధ్యసీమ రతసంపుందాలి తార్మాఅుగాఁ
దలఁబ్రాల్వోసెలతాంగియాదలషయిన్ ధాత్రీశుఁ డత్యాదృతిన్. ఆ. 3

ఆంధ్రచంద్రాలోకము.

గీ. అక్రమాతిశయోక్తి ప్రఖ్యాతికెక్క
హేతుకార్యంబులకు సహావృత్తిగలుగ-
జ్యాపరీరంభ కైకడకుత వహించె
నీశరంబులు నీశత్రునృపులతోడ.

క. ఏపారుఁ గృతులఁ బ్రతివ
స్తూపమ వాక్యములురెంటి కొగి సమత తగన్-
తాపమున నలరు సూరుఁడు
చాపంబున శూరుఁ డొనరు జగతినక్రియన్.

రామలింగేశశతకమునందలి పద్యము లీవఱకే కొన్ని యుదాహరింపఁబడినవి. లక్షణగ్రంథము లగుటచే నాంధ్రనామశేష కవిసంశయ విచ్ఛేదములనుండి కవితాధోరణిని జూపుటకుఁ బద్యముల నుదాహరించుట యుచితము కాకపోయినను, అందుండియు నొక్కొక్క చిన్న పద్యమును గైకొనుచున్నాను-

క. వెన్నునఁగ బీజమంజరి। వెన్నునఁ జరమాంగమునకు వెలయునుబేరై
కన్ను లనం బర్వంబులు। కన్నులనగ లోచనములు కంఠేకాలా.

ఆంధ్రనామశేష.

గీ. ఎఱుకగలవారె యనుచోట నెఱుకగలరె
యిట్టివారెయనెడిచోట నిట్టిరెయగుఁ
జేయఁగలవారెయనుచోట జేయఁగలరె
యనుచు లోకప్రసిద్ధోక్తి యగునుశర్వ.

కవిసంశయవిచ్ఛేదము.

25. మంగళగిరి ఆనందకవి

ఈకవి వేదాంతరసాయనమనెడు నాలుగాశ్వాసముల పద్యకావ్యమును రచియించి దానిని నిడిమామిళ్ల దాసయామాత్యుని కంకితము చేసెను. కవి క్రైస్తవమత మవలంబించిన నియోగిబ్రాహ్మణుఁడు. ఈతఁడు తిమ్మయామాత్యుని పుత్రుఁడు; ఆత్రేయగోత్రుఁడు; కవి కృతిపతి తన్నుఁగూర్చి పలికినవిధము నిట్లు చెప్పుకొన్నాఁడు —

సీ. ఒకవంక నిగమాగమోజ్జ్వలాతిశయార్థవిధివాదకౌశలద్విజనికాయ
మొకచాయ న్యాయశాస్త్రోదాత్తవాక్యప్రసంగకృద్విద్వత్ప్రజావితాన
మొకట్రేవ సంస్కృతప్రకటాంధ్రభాషాకవిత్వప్రవీణకవిప్రకాండ
మొకచెంత సప్తస్వరోద్గీతగీతికావైచిత్రివిస్ఫురద్వైణికౌఘ
ముల్లసిల వజ్రకౌక్షేయకోపమాన
వైభవస్ఫూర్తి నొక శుభవాసరమున
మహితగుణశాలి దాసయామాత్యమౌళి
ప్రమదముప్పొంగఁ బేరోలగముననుండి.

మ. నను సర్వేశపదాంబుజద్వయనితాంతధ్యానపారీణు భూ
రినయోపేతచరిత్రు మంగళగిరి శ్రీవంశవారాశిపూ
ర్ణనిశానాథు సుధీజనాభిహితు నానందాఖ్యు సద్గ్రంథక
ల్పను సాహిత్యకళావిశారదుని బిల్వించి పల్కెం గృపన్.

చ. తరుముఖసప్తసంతతు లుదారత నెచ్చట నిల్ప నచ్చటన్
బరఁగు సమస్తదిక్కులకుఁ బ్రాఁక గుభావరసానుకూలవా
గ్గరిమఁ దనర్చు సత్కృతిముఖంబున వానికిఁ దారకేందు
భాస్కరులు గలంతకాల మనిశంబుఁ గరంబుఁ బ్రసిద్ధి చెల్వగున్.

ఇతఁడు లాక్షణికాగ్రగణ్యుఁ డయిన ప్రబంధకవి. పేరునుబట్టి తోఁచున ట్లిది వేదాంతగ్రంథముగాక మతస్థాపకుఁడయిన యేసుక్రీస్తు

యొక్క చరిత్రముగా నున్నది. ఈపుస్తకము నిర్దుష్టమయి మృదుమధుర మైన ప్రబంధపాకమునఁ జేయఁబడియున్నది. ఇందలి వర్ణన లేవిషయము నను బూర్వప్రబంధములలోని వర్ణనలకుఁ దీసిపోవు. బ్రౌన్‌దొరగా రీకావ్యము ౧౭౦౦ వ సంవత్సరప్రాంతమున రచియింపఁబడినట్టు చెప్పిరి. కాని, కవి కృతిపతి యయిన దాసామాత్యునిసోదరుఁడగు రాజప్పను వర్ణించుచో—

మ. మదిరాక్షీమదనుండు రాజపమహామంత్రీంద్రుఁ డుద్యన్మహా
మ్మదలీఖాను కృపానులబ్ధమదవన్మాతంగమాణిక్యహా
రదుకూలాదికసత్కృతిం ద్రిదశవర్యస్ఫారసామ్రాజ్యల
క్ష్మిఁ దనర్చె న్బుధకోటి పేర్కొనఁగఁ బుణ్యైర్వృష్టిణాఢ్యాసియై.

అనుపద్యములో నతఁడు కర్ణాటకపు నబాబగు మహామ్మదల్లీ చేత సత్కారమును బొందినట్లు చెప్పియుండుటచేతను, ఈమహామ్మదల్లీ ౧౭౪౯ వ సంవత్సరమునఁగాని సింహాసనమునకు వచ్చి యుండకపోవుట చేతను, వేదాంతరసాయనము ౧౭౫౦ వ సంవత్సరమునకు తరువాతనే రచియింపఁబడినదని నిశ్చయింపవలయును. ఈకవి కూచిమంచి తిమ్మకవి మొదలయినవారి కాలములోనే కృష్ణామండలమున నుండినవాఁడు. కృతి నాయకుఁడు బందరుపురములో నధికారము చేసిన ట్లీ క్రిందిపద్యము వలనఁ దెలియవచ్చుచున్నది.

మ. ప్రకటారాతిచమూభయానకఘనప్రాకారఖేయంబులన్
సుకరశ్రీఁ దగుబందరాఖ్యనగరిన్ సొంపొందుదీవార్థిక
ల్పకభూజం బన దాసమంత్రి రుచిశుంభద్రత్నజాంబూనదా
దికవస్తుప్రకరాన్వితాయతనుఁడై ధీరుల్ ప్రశంసింపఁగన్.

వేదాంతరసాయనకృతికర్తయు కృతిభర్తయు నిరువురును శ్రీవైష్ణవ మతప్రవిష్టులైన నియోగి బ్రాహ్మణులు. వేదాంతరసాయనముయొక్క

యొక్కొక్క యాశ్వాసమునుండి యొక్కొక్క పద్యము నిం దుదాహ
రించుచున్నాను—

చ. జగదుపకారకారకవిశాలసమస్తపదార్థకల్పకుం
డగునతని౯ బరాత్పరు మహామహు సర్వశుభస్వభావు మ్రొ
క్కఁగఁ దగుఁగాక యాతఁడిలఁ గల్గఁగఁ జేసినవానిపూజ స
ల్పఁగ దురితంబు లంటునని పల్కుట యొప్పు నసంశయంబుగన్. ఆ-౧

చ. ఘనతరపాపపుణ్యముఖకార్యసమాచరణస్వతంత్రతన్
గొనినమనంబు మానవునకుం బొసఁగం దగు లేనిచో జగం
బున సుకృతాఘము ల్నరక మోక్షపదంబులు గల్గవం చనం
జను నుచితజ్ఞ సంతతి నసంశయవాక్యవిజృంభణంబునన్. ఆ-౨

చ. చని సెలయేటి మొత్తములఁ జందనశైలమరుద్విలోల కాం
చనకురువిందచందనరసాలముఖద్రుమసమీపగోస్తనీ
ఘనతరకాయమానములఁ గ్రప్పుదిన్నియలన్ లతానికే
తనముల సంచరింపుచు నతండు పరాత్పరచింతనంబునన్. ఆ-3

ఉ. వారలవార్యకౌతుకనివాసమనోంబుజులై జగజ్జనా
ధారు నయప్రచారు సముదారుని నమ్మురియాకుమారునిన్
భారపుస్లీవమ్రానున విపద్దశలం బొరయించినట్టిని
ష్కారణవైరులన్ సరకుగాఁ గొన కించుక యెల్లదిక్కులన్. ఆ-౪

26. కనుపర్తి అబ్బయామాత్యుఁడు

ఈకవి యాఱువేలనియోగిబ్రాహ్మణుఁడు; రాయన మంత్రి పుత్త్రుఁడు; కౌండిన్యగోత్రుఁడు. ఈతనితల్లి నరసమాంబ; అన్న యోగానందము. ఈకవి యనిరుద్ధచరిత్రము, కవిరాజమనోరంజనము అను రెండు ప్రబంధములను రచియించెను. ఇందు మొదట రచియింపఁబడిన యనిరుద్ధచరిత్రములో—

ఉ. నిండుమనంబు సత్యమును నీతియు శాంతియుఁ గల్గి కీర్తిమం
తుం డయి భోగభాగ్యములతోఁ జెలువొందుచుఁ గొండవీటిభూ
మండలనాయకుల్ మిగుల మన్ననచేయఁగఁ బెంపుమీఱె స
త్పండితుఁ డబ్బమంత్రి కనుపర్తి పురాన్వయవార్ధిపూర్ణచం
ద్రుం డని లోకు లందఱు నెఱుంగుటకు న్నుతిచేయ నేటికిన్.

అని కవి తనతాతయైన యబ్బయ్య కొండవీటిరాజుల మన్నన నొందినట్లు వ్రాసికొనెను గాని యాతని కాలమునాటికిఁ గొండవీటి రాజ్యము తురుష్కులయధీన మయినది. ఈహేతువుచేతఁ గాబోలును కవి కవిరాజమనోరంజనములో—

చ. సుగుణకదంబ మెల్ల నొకచోటనె కాపుర మున్నయట్లుగా
నగునని వేయినోళ్లఁ గొనియాడుచు భూజను లెంచ ధన్యుఁడై
తగు కనుపర్తియబ్బనకుఁ దత్ప్రియసాధ్వికి లచ్చమాంబకున్
పొగడిక కెక్కి రిద్దఱుసుపుత్త్రులు రాయన నిమ్మనాహ్వయుల్.

ఉ. వేయనవచ్చుఁగాక సులువే యనపాయవదాన్యవై భవం
బాయనవద్యబుద్ధి తగు నాయనకే యనఁ గీర్తిచంద్రికల్
గాయ నయస్వగీతికలు గాయనశీలురు పాడ నొప్పు మా
రాయనమంత్రి మేలు బళి రాయన సూరిజనాభివంద్యుఁడై.

అను పద్యములయందుఁ దనతండ్రి తాతలు కొండవీటిరాజుల

యొద్ద నున్నట్లు చెప్పక తనతాతకు ముత్తాతయైన బసవామాత్యుఁడు మాత్రమే కొండవీటిరాజులమంత్రియైన ట్లీక్రింది పద్యమునఁ జెప్పెను-

శా. శ్రీపేర్మిన్ శశివోలె బ్రహ్మకులవార్ధిం బుట్టి కౌండిన్యగో
త్రాపస్తంబపవిత్రసూత్రకలితుండై రామసింహాసనా
ఖ్యోపేతస్ఫుట కొండవీటిపురరాజ్యోర్వీశ్వరు ల్మంత్రిగాఁ
జేపట్టన్ బసవప్రధానుఁ డిల మించెన్ భాగ్యసంపన్నుఁడై.

కవియొక్క తండ్రి తాతలు కొండవీటిసీమలోని కనుపఱ్ఱుగ్రామమునకు కరణములని తోఁచుచున్నది.\ కవికి మంగళగిరిలోనున్న పానకాలరాయఁ డిష్టదైవతము. మంగళగిరి కృష్ణామండలములో గుంటూరునకు సమీపమున నున్నది. అబ్బయామాత్యుఁడు పదునెనిమిదవ శతాబ్ద మధ్యమున నుండినవాఁడు. ఇతఁడు ౧౭౮౦ వ సంవత్సరప్రాంతమువఱకును జీవించి యుండవచ్చును. ఇతఁ డాశతాబ్దమునం దుండిన ప్రబంధకవీశ్వరు లందఱిలోను మిక్కిలి ప్రౌఢుఁడు. వసుచరిత్రమునకుఁ దరువాత నీతని కవిరాజమనోరంజనముతో సరిపోఁగఁదగిన ప్రబంధము లొకటి రెంటికంటె నెక్కువగా లేవు. కవిరాజమనోరంజనములోని యీక్రింది పద్యమువలనఁ గవి సాహిత్యమునందు మాత్రమే కాక సంగీతమునందును బ్రవీణుఁ డయినట్లు కనఁబడుచున్నాడు—

క. శ్రీమంగళగిరి నరసిం । హామే యకృపావిజృంభితాద్భుతకవితా
శ్రీమంతుఁడఁ గానకళా । ధీమంతుఁడ దేవతాస్తుతివ్రతపరుఁడన్.

కవిరాజమనోరంజనమునకుఁ బురూరవశ్చరిత్రమని నామాంతరముగలదు. బాల్యమునందు రచియింపఁబడినదగుటచే ననిరుద్ధచరిత్రము పురూరవశ్చరిత్ర మంత ప్రౌఢముగా లేదు. ఈరెండు పుస్తకములనుండియు గొన్నిపద్యముల నుదాహరించుటకన్నఁ గవి విషయమున వ్రాయఁదగిన విశేషాంశము లేవియుఁ గానబడవు.

అనిరుద్ధచరిత్రము.

చ. విచికిలగంధియున్ విభుఁడు వేడుకతోఁ దెర రెండువైపులన్
రుచిరకటాక్షపంక్తులమెఱుంగులు నిండఁగ నిల్చి రయ్యెడన్
బ్రచురతరానురాగరసబంధురతం దెరచీర దూరి పా
ఱుచుహృదయాబ్జముల్ మొగమెఱుంగనిచుట్టఱికంబుసేయఁగన్. ఆ-౧

ఉ. కన్నులఱెప్ప లాఁగనివికాసపుఁజూపును మౌనముద్రతో
నున్నమొగంబు నిశ్చలత నొప్పుశరీరముఁగాఁ బటంబుపై
నున్నతలీల వ్రాసినప్రియుం గని సొక్కునఁ దాను నట్లయై
చిన్నెలు దక్కియుండె సఖి చేసినజంత్రపుబొమ్మకైవడిన్. ఆ-౨

ఉ. మీసముతీరుఁజూచి జిగిమేని పటుత్వముఁజూచి మోములో
హాసముఁజూచి చేతులయొయారముఁజూచి మనోజ్ఞరూపరే
ఖాసమలీలఁజూచి యహహా యనుచుం దలయూఁచి ముందు తా
వ్రాసినభావ మెంచి తల వంచుకొనెం జలజాక్షి సిగ్గునన్. ఆ-3

చ. అనవుడు మందహాసముఖుఁడై హరి నీభుజశక్తి నీవె నె
మ్మనమున లజ్జలేక పలుమాఱును మెచ్చుకొనంగ నీతియే
యని మొన నిల్చినప్పుడు నిరర్థక మీవెడమాట లేల నాఁ
కొని భుజియింపఁబోవుచును గూరలమే లడుగంగ నేటికిన్. ఆ-౪

ఉ. భూసురవేదనాదములఁ బుణ్యసతీజనమంజులోక్తులన్
భాసురనృత్తగీతరసబంధురరావములం బురీవనీ
వాసశుకానులాపముల వారణబృంహితవాజిహేషలన్
శ్రీసముదంచితం బగుచుఁ జెల్వు వహించెఁ బురంబు నవ్యమై. ఆ-౫

కవిరాజమనోరంజనము.

చ. కొడుకులు గల్గుదాఁక నొక కొన్నిదినంబులు చింత నందనుల్
పొడమిన నాయువు న్బలము బుద్ధియుఁ జాలఁగల్గఁగా
సుడుగనిచింత కల్గి తను నోలభజింపనిచింత తండ్రికె
ప్పుడుఁ గడుచింత సేయుదురు పుత్రులు శత్రులుగాక మిత్రులే. ఆ-౧

సీ. ధర నల్పులకుఁ బ్రభుత్వంబు వచ్చిన మనుష్యుల వికారపుఁజూడ్కిఁ జూచినట్లు
పల్లవు లుద్ది లేమఁబడి యింటిచాయరా మొగిలఁ జెల్లులు మూల్గినట్లు
పరదేశియతిలోభపరుని యింటికిఁ బోవఁ జెగిక్రోఁతి వలెను గద్దించినట్లు
వంతువాసికి హీనవైశ్యులు తమలోన నేకంబుగాఁ గలహించినట్లు
తెరలి యొండొక్కటిసి రూక్షదృష్టిఁ జూచు
గొఱగొఱను మూల్గు గద్దించుఁ దఱిమి తఱిమి
కవిసి కలహించి ఘోకృతి కలకలముగ
జాగిలమ్ములు రోషభీషణము లగుచు. ఆ. ౨

చ. కర మనురక్తిఁ గొమ్మ కరకంజమునం దిడి మీఁకుఁ బాలుఁ జ
క్కెరలును బెట్టి పెంచి పలికింపుచు మాటలు నేర్పినందుకా
విరసపుఁగూఁతల న్మిగుల వేదన గొల్పెద రింతి కీయ్యెడన్
గురువుకు బొమ్మవెట్టితిరి క్రూరవిచారమ కీరవారమా. ఆ. 3.

ఉ. నిప్పులురాలు గ్రీష్మమున నిక్కనగాడ్పులు వార్షికంబునన్
జప్పుడుసేయు కే మరలసాఁగెఁ బ్రతీచికిఁ బ్రాచినుండి తా
రప్పటిపోంగుచేఁ బ్రజల నాపదఁ బెట్టి నిజాధికారముల్
దప్పినఁ జిన్నబోయి మరలం జనుచుండురుగాదె దుష్ప్రభుల్.

చ. మలయజగంధి తాళపరిమాణమనోహరరాగగీతికా
కలనినదంబు జంత్రమున గాత్రమునన్ జెలఁగింపు నింపుచే
శిలలు ద్రవించెఁ జిత్రములు జీవకళల్ ధరియించె దారువుల్
పొలుపుగ నంకురించె మృగముల్మదిఁ జొక్కు వహించె నెంతయున్.-ఆ.౪

మ. తగునే రాజకుమార మన్మథ మనస్తాపంబుచే నింత నె
వ్వగలం బొందఁగ ధైర్యశాలివిగదా వారాంగనా స్నేహమో
హగుణంబు ల్చపలాయతాయతము లెంతైన న్నతం బేలగున్
నగరే లోకులు నీమనం బిటులు మగ్నంబైన రాగాంబుధిన్——ఆ.౫.

27. కొఱాద పెద్దనసోమయాజి

ఈ కవి నిజాము రాజ్యములోని గద్వాలసంస్థానాధిపతియైన ముష్టిపల్లి సోమభూపాలుని ప్రేరణముచేత ముకుందవిలాసమును, అధ్యాత్మ రామాయణమును రచియించెను. ఇతఁడు నందవరీక నియోగిబ్రాహ్మణుఁడు; ఆశ్వలాయనసూత్రుఁడు; ఆత్రేయ గోత్రుఁడు; తిమ్మనార్య పుత్రుఁడు. సోమభూపాలుఁడు తన్నుఁగూర్చి పలికినట్లు కవి చెప్పుకొన్న ముకుందవిలాసములోని యీ క్రిందిపద్యములలో "శేషశైలేశలీల" అను నామముతో అపంచవర్గీయ చిత్రకృతి మొదలయినవానినిగూడఁ దాను రచించినట్లు చెప్పెను గాని యవి యిప్పుడు కానరావు.—

సీ. ననునందవరపురాన్వయపయోనిధిచంద్రుఁ గొఱాదవంశవిఖ్యాతిసాంద్రు
నాశ్వలాయనసూత్రు నాత్రేయమునిగోత్రు సకలవిద్వత్కృతవిప్రవరమిత్రు
ప్రౌఢలక్ష్మీపతిపండితసోదర్యు బాహటగ్రంథానుభావధుర్యు
వేదశాస్త్రపురాణవివిధమర్మధురీణు వరచతుర్విధకవిత్వప్రవీణు
భోజచంపూప్రబంధార్థబోధనాను
బంధగీర్వాణటీకానిబంధనాది
పేశలవచోరచనచర్యు పెద్దనార్యుఁ
గాంచి దయమించి పలికె సగౌరవముగ.

గీ. కాదివర్ణంబు లిరువదియైదువిడిచి। చేసితి వపంచవర్గీయచిత్రకృతిని
శేషశైలేశ లీలాఖ్యచే నెసంగ। యాదిమితవర్ణనియతి శక్యంబుజగతి?

ఉ. శ్రీరమణీ యతర్క సురపురీనగరీసగరీ యదేశభూ
భారధురీణుఁ డాబహిరిపామనృపాలు సభాంతరంబునన్.
మారమణాంకితంబులుగను మత్స్యపురాణ మొనర్పఁ బూనవే
పారసుధాప్రసారవిలసత్కృతి నాంధ్రవచశ్చమత్కృతిన్

ఈ కవి సంస్కృతాంధ్రములయందు బహుసమర్థుఁడు. ఈతని గ్రంథములలో నున్నన్ని శబ్దాలంకారములును చిత్రబంధకవిత్వ పద్యములును మఱి యేకవిగ్రంథములోను లేవు. ఈతనికవనము రసవంతమయి కవిజన హృదయరంజకముగా నుండును. తన కవిత్వమును గూర్చి వెన్నెలకంటి వేంకటపతి యీ క్రిందిపద్యమును జెప్పినట్లు కవి తన యధ్యాత్మ రామాయణమునందు వ్రాసికొనియున్నాఁడు—

ఉ. ఇద్దఱుకోడు నన్నకవి మెచ్చిన, తిక్కన సోమయాజి దా
నుద్దగు వారికిన్, ముగురి కొక్కఁడె దీటగు నల్లసాని మా
పెద్దన, వారికోడుతను బేరువహించిన శ్రీకణాదముం
బెద్దనసోమయాజి విను పెద్దనఁ బోల్చుఁ గవిత్వసంపదన్.

ఇట్లితరులు పొగడనట్లు చెప్పుటయేకాక కవి తానును తన ముకుందవిలాసము నిట్లు పొగడుకొన్నాఁడు—

గీ. ఇంక సకలహితము నిచ్చు మున్విష్ణుచి
త్తీయతుల్యమౌ మదీయకవిత
యుదుటఁజేవఁ దొలువనులిబోలు నళిమోము
మృదువుగాదె విరులమీఁద వ్రాలి?

క. కుందవిలాసముతావి ము
కుందవిలాసము సదాముకుందవిలాసం
బిందువిలాసమును సుధా
బిందువిలాసము హసించుఁ బేశలఫణితిన్.

ఈకవి కాలముగాని కృతిపతి యనఁదగు పెదసోమనృపాలుని కాలముగాని నిశ్చయముగాఁ దెలియలేదు. అయినను

ఉ. నన్నయభట్టు భీమన ననంతు నధర్వణుఁ దిక్కహోత్రి నె
ఱ్ఱన్నను సోము భాస్కరుని నయ్యలు నైషధకావ్యకర్తఁ బో

తన్నను బిన్నపేరుని౯ జినన్నను సూరప రామభద్రుఁ బె
ద్దన్నను దిమ్మనార్యు గరుడాంకుని మూర్తి సుకీర్తి నెంచెదన్.

అని బట్టుమూర్తివఱకును గలకవుల నీకవి పొగడి యుండుటచేత నీతఁడు పదునాఱవ శతాబ్దాంతమునకును పదునేడవ శతాబ్దాదికిని దరువాత నుండినవాఁ డయినట్టు స్పష్టమగుచున్నది. ముష్టిపల్లి సోమనృపాలుని తాత మొదలయినవారు మహమ్మదీయులతో యుద్ధముచేసి వారిపజయించుట మొదలయిన సంగతులు చెప్పఁబడి యుండుటచేత నితఁడు పదుఁనేడవ శతాబ్దాంతమునందో పదునెనిమిదవ శతాబ్దారంభమునందో యున్న ట్లూహింపఁ దగియున్నది. గద్వాలసంస్థానమునందున్న మామిత్రులకొకరికిఁ గవికాలవిషయమునుగూర్చి వ్రాయఁగా ౧౭౫౦ సంవత్సర ప్రాంతములయందుండినట్లు తెలిపి యున్నారు. ఇందలి కవిస్తుతిలోఁ జెప్పఁబడిన యయ్యలు రెట్టమతమును జేసినతఁడే యయినపక్షమునఁ గవి ౧౭౭౦ వ సంవత్సరమునకుఁ దరువాతఁగూడ నున్నట్టు చెప్పవలసి యుండును. ముకుందవిలాసమునకు భద్రాపరిణయ మని నామాంతరము గలదు. కవికృతములయిన రెండు గ్రంథములనుండియుఁ గొన్నిపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

ముకుందవిలాసము.

ఉ. ఆటలు పాటలుం గలుగునందపుగందపుఁగూటవాటముల్
కోటలు పేటలుం బసిఁడిగోడలు మేడలుఁ గల్గవిందురా
చోటులు నీటులుం గులుకుచుక్కను జుక్కను నిండుఁజెల్వపుం
బోటులమేటులం దగినపొన్నలచెన్నులు గల్గువీటిలోన్. ఆ-౧

ఉ. చేరలఁగొల్వవచ్చు దయచిప్పిలు గొప్పకుగొప్పకన్నులుౕ
మూరలఁగొల్వవచ్చుఁ గడుముచ్చట లిచ్చువెడదండవక్షముౕ
బారలఁగొల్వవచ్చుఁ గచపాళి బళీ హరికి న్నవిూపపున్
మేరలఁగొల్వవచ్చు నిఁక మే లిత్కఁ డీగతిఁ బ్రీతిఁ జేసినౕ. ఆ-౨

ఉ. కౌనునకౌనభంబుసరి కావిజగావిలసిల్లువ్రోవికిం
పానఁగఁ బానకంబు సమ మానన మాననవిల్తు మేనమా
మే సనమేననం గనకమేనన మీననఁగన్గవందగున్
వేనలి వేనలిన్విరుల వేయుఁజువే యువతీమతల్లికిన్. ఆ-౩

మ. తనరన్ వ్యాకరణజ్ఞుఁ దంౘియచుచుం దర్కజ్ఞునిన్ భ్రాతయం
చును మీమాంసకునిన్ నపుంసకుఁ డటంచు న్వీడి దూరంబునం
గని యస్పృశ్యునిఁబోలె ఛాందసుని వేడ్కం గావ్యలీలారస
జ్ఞు నిజేచ్ఛం గవితావధూమణి వరించున్ భావగర్భంబునన్. ఆ-౪

అధ్యాత్మరామాయణము.

సీ. సంసారదావాగ్నిసంతప్తులకు సుధాస్తోమవర్షనియుక్తి రామభక్తి
తాపత్రయామయతాపపీడితులకు రమ్యభేషజయుక్తి రామభక్తి
పంచమహాపాపపటలసర్పములకు రచితగారుడశక్తి రామభక్తి
భవవిపద్వారాశిపాతభీతులకును బ్రబలతరీయుక్తి రామభక్తి
ప్రేమబోధితగురుసూక్తి రామభక్తి। కామితాత్మజనాసక్తి రామభక్తి
శ్రీమదురుసంపదనురక్తి రామభక్తి। సామరస్యోదితవిముక్తి రామభక్తి. బాల.

చ. సొరిదిఁ గళత్రపుత్రపితృసోదరబాంధవముఖ్యసంగమం
బరయ నదీప్రవాహపతితాగతకాష్ఠములట్ల కూడుచున్
బరిపరివిడు నైజము ప్రపాగతజంతులఁబోలి మోహముం
బొరయక యుండఁగావలయుఁ బోవుచును న్నెడవచ్చుచున్నెడన్. అయోధ్యా.

ఉ. అంతట దైత్యకాంతుఁడు సురాదివిరోధి సరోధిదాటి య
త్యంతవిభాకలంకను శుభాంకను లంక నశోకకాననా
భ్యంతరసీమలో నిలిపె నాసురకాంతలు కాచియుండఁగా
సంతతపూత సాధుగుణజాతను న్యాక్షితజాత నెంతయున్. అరణ్య.

ఉ. అంచలుపాఱెఁ గేకులకు నాటలుగేరె ఘనంబు లూరెఁ గ్రొ
మ్మించులుకూరె శీతలసమీరమువారె మరుండు చేరి ము
న్మించుగ జాతిబాణతతి మాఱె నటం బధికాళిధైర్యముల్
గ్రించుకజాఱె మాఱె నలగ్రీష్మము మీఱె జలాగమం బిలన్.

కిష్కింధా.

చ. కమలవిరోధి, కామజయకారి కిరద్యుతికీర్తనీయుఁడున్
కుముదహితుండు కూటమృగగోప్తకృతాంకుఁడు క్లృప్తసత్కళా
క్రముఁడును కేశవేక్షణము కై రవిణీశుఁడు కోకభేదనా
గమనుఁడు కౌముదీకరుఁడు కంధిభవుం డుదయించెఁ దూర్పునన్.

సుందర.

ఉ. దానవనాశనార్థముగఁ దత్సతిఁ దెచ్చితి వీవు నస్మహా
మానము నామిషం బనుతమి న్విషపిండము గ్రోలిసోలు నె
ట్లానెఱి నామహీసుతసమాహరణం బొనఁగూడె మీఁదటన్
గా నగునట్టికార్య మదికానగుచున్నది దానవాగ్రణీ. యుద్ధకాండ.

మ. శ్రవణానందకరంబు సుందరముగా షడ్జాదిసప్తస్వరా
ర్జవమున్ జాతిగతుల్ త్రికాలకలితస్థానత్రయీపూర్ణ మా
ర్గవిధుల్ తోఁపఁగ వల్లకీచతురతన్ రంజిల్ల గాంధర్వసా
రవిదుల్గాన మొనర్చి రాకుశలవుల్ రామాయణం బాసభన్. ఉత్తర.

28. కుందుర్తి వేంకటాచలకవి

ఈకవి మిత్రవిందాపరిణయమనెడి నాలాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడారువేల నియోగి బ్రాహ్మణుఁడు, ఆపస్తంబసూత్రుఁడు; శాండిల్యగోత్రుఁడు; రామనామాత్యపుత్రుఁడు. ఈతని తాతయైన గోవిందామాత్యుఁడు ౧౬౧౦ వ సంవత్సర ప్రాంతములయందు రాజ్యముచేసిన వీరవేంకటపతిరాయలవద్ద నుండి, భారతీపరిణయమను కావ్యమునుజేసి యాతనిని మెప్పించినట్లు కవి యీ క్రింది పద్యమునఁ జెప్పియున్నాఁడు—

ఉ. పటుతరగోస్తనీమధురపాకసమంచితమై రసోర్మిప
ర్యటమగుభారతీపరిణయం బనుకావ్య మొసంగి వీరవేం
కటపతిరాయలం దనిపి కాంచె మణీకనకాభిషేక ము
త్కటగతి నమ్మహామతి సుఖస్థితిశోభి యశోభిరాముఁడై.

ఈకవికాలమునాఁటికి విజయనగర సంస్థానప్రభువులు మిక్కిలి హీనదశకు వచ్చినందునఁ గవి ఈ రాజ్యమునువిడిచి పాండ్యమండలమును జేరి మధురలో నుండినట్టు తెలియవచ్చుచున్నది. గ్రంథావతారికలోఁ దాను పాండ్యమండలాధీశ్వరుఁడయిన విజయరంగ చొక్కనాథునిఁ గవిత్వము చెప్పి మెప్పించినట్లు కవియే యీ క్రింది పద్యములలో వ్రాసికొని యున్నాఁడు—

సీ. చదివినా వేమేమి చదువయోగ్యంబులో
యవియెల్ల నిస్సంశయంబుగాఁగ
వచనకావ్యములుగా రచియించినావు భా
రతభాగవతములు రామకథయు
ఘటియించినావు ద్రాక్షాపాకముగ బహు
నాటకంబులు నమున్నతిఁ జెలంగఁ

జాటించినావు దిక్కోటరంబుల. బుధ
కోటిమెచ్చ నపారచాటుకృతులు
నర్థగుంభసముజ్జృంభితాశుమధుర
చిత్రవిస్తరకవితా ప్రసిద్ధి నీకు
సహజమేకద పాండ్యభూజానిసభఁగ
ఘాశుకవియనఁగీర్తిఁ జెన్నలరినావు.

చ. కవిజనకల్పకం బఖిలకావ్యరసజ్ఞుఁ డఖండపాండ్యభూ
ధవుఁడు మహానుభావుఁ డతిధార్మికుఁ డర్యగవబ్రధారి యై
న విజయరంగచొక్కనరనాథుఁడు నీ కవితాసమగ్రవై
భవములు మెచ్చి నీ కొసఁగె భర్మ మణీశిబికాదిసంపదల్.

పయిపద్యములనుబట్టి యితఁడు కొన్ని నాటకములను మాత్రమే కాక భారత భాగవత రామాయణములను వచనకావ్యములుగాఁ గూడ రచియించినట్టు విశదమగుచున్నది. ఇతఁడు మాత్రమేకాక యితని కాలమునందుండిన యితరకవులనేకులు కూడఁ దాము వచనకావ్యములను రచియించినట్టు తమ ప్రబంధములలో వ్రాసికొనియున్నారు. ఈ వచనకావ్యము లన్నియు మాకు దొరకకపోయినను, ఈ కాలములో రచియింపఁబడిన వచనకావ్య మొకటిమాత్రము మాకు లభించినది. ఆ వచనకావ్యమునుగూర్చియుఁ దత్కర్తనుగూర్చియు నింతకుముందే కొంత వ్రాయఁబడెను. పయి నుదహరింపఁబడిన వానిలోని కడపటిపద్యమునుబట్టి కవికాలము సహితము స్పష్టమగుచున్నది. విజయరంగ చొక్కనాథుఁడు ౧౭౦౪ వ సంవత్సరము మొదలుకొని ౧౭౩౧ వ సంవత్సరమువఱకును రాజ్యముచేసి విద్వాంసుఁడై యాంధ్రకావ్యరచనను బ్రోత్సాహము చేసినవాఁడగుటచేతను, అతని కాలములోనే కవి యనేక గ్రంథములనుజేసి తర్వాత మిత్రవిందాపరిణయమును జేసియుండుటచేతను, ఇతఁడు హూణశకము ౧౭౪౦ వ సంవత్సర ప్రాంతమువఱకును జీవించి

యున్నట్టు తెల్లమగుచున్నది. కొంతకాలమునుండి యీతని పూర్వకవు లాచరించుచు వచ్చిన యీయాచారమును మానక యీ కవియు రంగ నాథుఁడు తనకు స్వప్నమున సాక్షాత్కరించినట్లే క్రింది పద్యమున వ్రాసి కొనియున్నాఁడు—

సీ. నీలమేఘముడాలు చాలునించఁగఁజాలు
మేనువాఁడు జగంబు లీనువాఁడు
వేల్పురాతాతల్పు విప్పుటందమదల్పు
బొమ్మువాఁడు కళాభరమ్ము వాఁడు
వెలలేనిబంగారు వేవన్నెరంగారు
చేలవాఁడు మనోజ్ఞలీలవాఁడు
కడకంట సొంపారుకరుణారసముమీఱు
చూపువాఁడు భవంబుఁబాపువాఁడు
హీరకటకకిరీటకేయూరతార
హారమంజీరచాకచక్యములవాఁడు
కలనొకానొకపురుషుఁ డుత్కలికదొలుకఁ
బ్రేమ నాప్రొల వేకువజామువేళ.

గ్రంథమునం దక్కడక్కడ లక్షణవిరుద్ధములైన ప్రయోగము లనేకము లుండుటచేత నీతఁడు లాక్షణికకవి కాకపోయినను, మొత్తము మీఁద నీతనికవిత్వము రసవంతముగానే యున్నది. మిత్రవిందాపరిణ యములోని రెండుమూఁడు పద్యముల నిందుదాహరించుచున్నాము—

చ. అని వనితోక్తియుక్తిగతి నవ్వని జవ్వనిగుంపు సొంపుఁ జే
కొని తనివార సౌరభము గ్రోలుచు సోలుచు మిన్నగన్న క్రొ
న్నన లనవద్యహృద్య కల నన్నని కన్గొని తావిమాని పెం
పొనరిన మేరఁ గేరుచు లూకొని తూకొనినంత వింతగన్. ఆ...

ఉ. సారస మా మొగంబు జితసారస. మాగమనంబు నాభికా
సారసమాభ మాకచమసారసమాజము మేఘ మాసుధా
సారసమావృతంబు నుడి సారసమానము తన్నుతంబ మా
సారసమాననీయసువిసారసమాయత మాదృగబ్జముల్. ఆ. ౪.

చ. కనియె నుదారుఁ జారుతరకౌస్తుభహారు సుమేరుధీరు జీ
వనదశరీరు దుర్గమయవార్ధిగభీరు దురాపసారులో
చనసుఖదావతారు ఖలశైలశతారు నఘౌఘదూరు స
ద్వినుతయశోవిహారు వసుదేవకుమారు నతాబ్జసూరునిన్. ఆ. ౬.

---

29. ఈదురుపల్లి భవానిశంకరుఁడు

ఈ కవి ధర్మఖండమును దెనిఁగించెను. ఇతఁడు కూచిమంచి తిమ్మ కవితోను వక్కలంక వీరభద్రకవితోను సమకాలికుఁడయినందున, ఇతఁడును పదునెనిమిదవ శతాబ్దారంభమునుండి ౧౭౫౦ వ సంవత్సర ప్రాంతములవఱకును జీవించియుండును. ఈ కవి తన ధర్మఖండమున వక్కలంక వీరభద్రకవినిగూర్చి వ్రాసిన "హరిశౌర్యుండగు" నను పద్య మీ వఱకే యుదాహరింపఁబడియున్నది. దిట్టకవి వేంకటరాయకవి తన విద్యాగురువైనట్లు కవి ధర్మఖండమున నీ క్రింది పద్యముచేఁ జెప్పుకొని యున్నాఁడు—

ఉ. శ్రీమయవాగ్విలాసుఁడు నశేషలిపిప్రవణుండు భూరిశో
భామహనీయమూర్తియుఁ బ్రబంధనిబంధనబంధురక్రియా
భామహితోరుసూత్రుఁడు నృపాలకపూజ్యుఁడు నంచుఁ దన్బుధుల్
వేమఱు నెంచ దిట్టకవి వేంకటరాయకవీంద్రుఁ డొప్పగున్.

ఈ కవి యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; భారద్వాజ గోత్రుఁడు, శంకరామాత్య పుత్రుఁడు. కవి తాను శృంగారమంజరి యను

కావ్యమును గూడ రచించినట్లీక్రింది పద్యమునఁ జెప్పికొనెను గాని నా గ్రంథము లభింపలేదు—

సీ. ధాత్రి భారద్వాజగోత్రపవిత్రుఁడై సురుచిరాపస్తంబసూత్రుఁ డగుచు
నిరతాన్నదానాభిరతుఁడౌ నీకరుపలి నరసమాత్యుపౌత్రవరుని
సంతతపూజితశంకరుం డగుశంకరామాత్యమౌళికి నాత్మభవుఁడ
బ్రాజ్ఞుని సచ్చమాంబాగర్భశుక్తిముక్తామణి నీశ్వరధ్యాననిరతు
భవ్యశృంగారమంజరీకావ్యరత్న
మంధ్రభాష నొనర్చినయనఘచరితు
శంభునిభుఁడైనయివటూరి శంభుశిష్యు
నను భవానీశనాముఁ గన్గొనుచుఁ బలికె.

ఈ కవి రచియించిన గ్రంథము సమగ్రముగా దొరకలేదు గాని దొరకినంతవఱకుఁ గవనము రసవంతమయి మధురమయి నిర్దుష్టముగా నున్నది. ధర్మఖండమునుండి రెండుమూఁడు పద్యముల నిందుదాహరించుచున్నాను—

చ. అనవిని వానిఁజూచి మునులారయఁ బుత్రకళత్రరక్తుఁడై
యనయముఁ గ్రూరవృత్తిమెయి నర్థము నీవు గడించె దేని నీ
ఘనతరమైనకిల్బిషనికాయము భాగమువారు కొందఱో
కొనరొ యెఱుంగఁ జెప్పు మనికుంటితలీల నటించుఁ బల్కినన్.

చ. హరి భజియింపనైతి లలనావయహామితవర్ణనాప్తి న
స్థిరమతి నర్థిలోభరతిఁ జేయఁగనైతిఁ బరోపకార మి
ద్ధర శరతాదయాకలితతాగుణము ల్సహజంబు లయ్యె నె
ట్లరయుదు నీయపారకలుషాబ్ధికిఁ దారణయానపాత్రమున్.

చ. ఫలితతరుల్ ద్విజాతులకు భక్తి నొనంగుటయుం గతోదక
స్థలములఁ బ్రాణిలోకము హితంబునకై సరసీతటాకముల్
నిలుపుటయున్ మహాత్ములకు నెంజిలి దీర్చుటయున్ దలంప నీ
యలఘుసుకర్మపంక్తులు తదవ్యయమార్గసుఖైకహేతువుల్.

30. ధూర్జటి వేంకటరాయకవి

ఇతఁడు రత్నావళీపరిణయ మనెడు నాలుగాశ్వాసముల ప్రబంధమును రచించి చేకూరి రామస్వామిమంత్రి కంకితము చేసెను. ఈకవి కాళహస్తిమహాత్మ్యమును రచియించి కృష్ణదేవరాయల కాలములో నుండిన ధూర్జటికవి వంశమువాఁడు; ఇతఁడు తన గ్రంథమునందు ధూర్జటి నిట్లు స్తుతించి యున్నాఁడు—

మ. పటుగంగాలహరీతరంగసముదంచత్ప్రౌఢతాంచత్కళా
ఘటనున్ బాదవినమ్రకృష్ణవరరాడ్గంభీరకోటీరవి
స్ఫుటరత్నద్యుతిపాటలీకృతపదాంభోజాతు సర్వజ్ఞ ధూ
ర్జటిని౦ గొల్చెద నస్మదీయకులకర్తన్ భక్తి రంజిల్లఁగన్.

ఈధూర్జటిపౌత్రుఁడయినవేంకటపతి కృష్ణరాజవిజయమును జేసెను. ఈవేంకటపతి కుమారుఁడును కవితండ్రియు నైన లింగరాజు కాళహస్తిరాజుల ప్రేరణముచేత మఱియొక పెద్దకాళహస్తి మహాత్మ్యమును రచియించెను. రత్నావళీపరిణయమునఁ గవి తన తండ్రినిగూర్చి యిట్లు వ్రాసియున్నాఁడు—

మ. ఘనగౌరీశకటాక్షలబ్ధకవితాగాంభీర్యసంతుష్టభూ
జనరాడ్దత్తసువర్ణచేలమణిభూషాగ్రామపల్యంకికా
ఘనదంతావళఘోటకాదిబహుసత్కారప్రతిష్ఠాత్ము న
జ్జనకున్ ధూర్జటి లింగరాజకవిరాజశ్రేష్ఠుఁ గీర్తించెదన్.

ఈకవి పాకనాఁటి యారాధ్యులనియోగి బ్రాహ్మణుఁడు; భారద్వాజ గోత్రుఁడు. ఇతఁడు తన్నుఁగూర్చి చెప్పుకొనుచుఁ దానింతకుమున్ను నామలింగశాసన మనఁబడెడి యమరమునంతను పద్యకావ్యముగా రచించిన ట్లీక్రింది పద్యములలోఁ దెలిపియున్నాఁడు—

చ. స్థిరముగఁ గాళహస్తిగిరిజేశవరాగతసంస్కృతాంధ్రముం
    బరకవనంబు వ్యాకరణనాటక కావ్యవిచక్షణత్వముల్
    గరిమవహింప భూవరశిఖామణు లెన్నఁ జెలంగి తౌర బం
    ధురతనుకాంతిబాలరవి ధూర్జటి వేంకటరాయసత్కవీ.

మ. అమరం బంతయుఁ బద్యకావ్యముగ భవ్యంబై నయయ్యాంధ్రభా
    ష మహాపండితసత్కవిప్రజము మెచ్చన్ సాహితీకౌశల
    క్రమ మొప్పన్ దృఢభక్తితోడుతను శ్రీరామాంకితంబై తగన్
    రమణీయంబుగఁ జేసినాఁడవు బళీ ప్రఖ్యాతివాటిల్లఁగన్.

ఈకవి కాలనిర్ణయమునుగూర్చి కొంచెము విచారింపవలసి యున్నది. ఈతనితండ్రియైన లింగకవి తానురచియించిన పంచదశాశ్వాసముల కాళహస్తిమహాత్మ్యమును కాళహస్తి రాజయిన దామెర్ల యక్కప్పనాయని పుత్రుఁడగు వేంకటపతిరాయని కంకితముచేసి యున్నాఁడు. అక్కప్పనాయని పుత్రుఁడయిన వేంకటపతినాయఁడు పదునేడవ శతాబ్దారంభమున నుండినవాఁడు. దీనినిబట్టి చూడఁగా కవి ౧౬౫౦ వ సంవత్సరప్రాంతమునం దుండినట్టు నిశ్చయింపవలసి యున్నది. అయినను మన మిప్పుడు నిర్ధారణముచేసిన యీకాలమున కొకబాధకము కనఁబడుచున్నవి. కవితండ్రియైన లింగకవి తన కాళహస్తి మహాత్మ్యమునందు—

సీ. శ్రీకాళహస్తీశసేవనాన్వితచిత్త చిత్తజాకర లక్ష్మీవిహార
    రమణీయశీల భారద్వాజగోత్రపవిత్ర యాపస్తంబసూత్రమహిత
    ధూర్జటివంశపాథోధిచంద్ర కుమారధూర్జటినామ విస్ఫూర్జితాంక
    స్తుతమతి వేంకటపతితనూభవ లింగరాజకులేంద్ర ధైర్యాచలేంద్ర.

అను సీసపద్యములోఁ దాను కృష్ణవిజయము నొనర్చిన కుమార ధూర్జటికిఁ బుత్రుఁ డయినట్టు వ్రాసికొనియున్నాఁడు. ఈకుమారధూర్జటి తాను కృష్ణదేవరాయలకాలములోనుండి కాళహస్తిమాహాత్మ్యమును

రచించిన ధూర్జటికవికి మనుమఁ డైనట్టు తనకృష్ణరాజవిజయమున వ్రాసికొని యున్నాఁడు. ౧౫౨౦ వ సంవత్సరప్రాంతమునందుఁ గృష్ణదేవరాయలకాలములో నుండిన ధూర్జటికవి మనుమని కొడుకగు లింగకవి ౧౭౩౦ వ సంవత్సరప్రాంతమునం దక్కరాజు వేంకటపతి కాలములో ననఁగా నిన్నూఱుసంవత్సరములకుఁ దరువాత నుండుట పొసఁగనేరదు. కాఁబట్టి కుమారధూర్జటికి ధూర్జటి సరిగా తాతగాక తాతవరుసవాఁడయియుండవచ్చును. అందుచేతనే కాఁబోలుఁ గుమారధూర్జటియే యొకచోట ధూర్జటిని దనపెదతాతనుగాఁ జెప్పుకొన్నాఁడు. ఈలింగకవియుఁ దనతండ్రిని ధూర్జటి మనుమనిగాఁ జెప్పక 'ధూర్జటివంశపాథోధిచంద్ర' యని తద్వంశజునిగా మాత్రము చెప్పినాఁడు. కుమారధూర్జటి చినవేంకటాద్రీశ్వరుని యాజ్ఞాప్రకారముగాఁ దాను కృష్ణరాజవిజయము చేసితినని చెప్పుకొన్న చినవేంకటాద్రి నరపతి కృష్ణరాజవిజయకృతిపతి యగు కోదండరామరాజుయొక్క రెండవకుమారుఁడగు చినవేంకటాద్రియైనచో నీకాలనిర్ణయ మించుమించుగా సరిపోవును. రత్నావళీ పరిణయకర్తయగు వేంకటపతి కవిత్వము ప్రౌఢ మయి హృద్యముగా నున్నది. కవిత్వరీతిని జూపుటకయి కొన్ని పద్యము లిందు క్రిందఁ బొందుపఱుపఁ బడుచున్నవి.

మ. మెఱుఁగుంబోఁడులు పీటసౌధచరలై మిన్నేటిబంగారుతా
మరపువ్వుల్ గ్రహియింపఁబోవ మదశుంభద్భంభరశ్రేణి త
త్తరుణీవక్త్రవితానముం గదియభీతస్వాంతలై కాంతలం
తరయప్రౌఢిఁ గవాటము ల్మొగుతు రుద్యన్ముగ్ధభావంబునన్. ఆ-౧

ఉ. ధన్యుఁడ వీవు సుమ్మని ముదమ్మునఁబల్కి సమస్తదేవమూ
ర్ధన్యుఁ డదృశ్యుఁ డైన మది రంజిలఁగా వసుభూతి యంత సౌ
జన్యసమేత యైననిజజాయయుఁ దాను సమస్తభోగస
న్మాన్యము నైజమందిర మమందగతిం జని చేరెఁ సూరిమిన్. ఆ-౨

చ. ఘనతరలక్షణప్రతిభ గాంచిన రాజనటుండు బద్మినీ
జనములఁ గుందఁజేసి యనిశంబు ద్విజప్రతతిం గలంపఁగాఁ
దఁరు మహాప్రతాపమహితస్థితిఁ గాంచుచు వచ్చునట్టి న
య్యినకరమండలాగ్రహతి నెంతయు వెల్వెలనై చెలంగవే. ఆ.౩

మ. చెలి రత్నేశ్వరు నొక్కనాఁ డిటువలెన్ సేవించి మోహాంబుధిన్
లలఁ ల్మగ్నుడు వెంటనంట నిజలీలామందిరాంచద్దిశా
స్థలిఁబోవన్ గ్రహియించె రక్కసుఁడు దోస్సారంబు మించంగ బె
బ్బులిచేఁ జిక్కు కురంగుల ట్లతివ లింపు ల్దక్కి భీతిల్లగన్. ఆ.౪

---

31. అయ్యల రాజు - అయ్యల భాస్కరకవులు

అయ్యలరాజవంశసంభవు లయిన యయ్యలకవియు భాస్కర కవియుఁ జేరి కాలస్వరూపాదులను దెలిపెడి రెట్టమత మనుగ్రంథమును కన్నడభాషనుండి యైదాశ్వాసముల పద్యకావ్యమునుగా దెనిఁగించిరి. ఈకవు లిరువురును క్రీస్తుశకము ౧౭౭౦ వ సంవత్సరమునం దీపుస్తకమును దెలిఁగించినట్లుగా గ్రంథాంతమునందలి యీక్రింది పద్యమువలనఁ దెలియవచ్చుచున్నది—

సీ. కలియుగప్రథమభాగమునాల్గు వేలయెన్మిదినూర్లపై నిఱెబ్బదియునొకటి
శాలివాహనశక సము లిల వేయునార్నూట తొంబదిరెండు రూఢిగాఁగఁ
బ్రభవాదిగతములు పరఁగ సిర్వాదిమూఁడు నేండ్లయ్యె నెంతయు
నెన్న బుధులు
అట్టికాలంబున నయ్యలభాస్కర కవివర్యు లలరాజకమలహితుని
యాజ్ఞఁ బూర్వోక్త రెట్టమతాఖ్యకావ్య
మును నొనర్చిరి యాచంద్రముగను గీర్తి

వక్తృశ్రోతలకునుగల్గ వసుధమీఁద
నల యహోబలనృహరికి నర్పణముగ.

కవు లీగ్రంథమును కొండ్రాజు పెదతిమ్మరాజునకుఁ బుత్రుఁడును మంగయ గుర్వరాజునకు దౌహిత్రుఁడును నయినవేంకటరాజున కంకితముచేసిరి. ఈవేంకటరాజు కర్నూలుమండలములోని యెఱ్ఱపాలెము నకుఁ బాలకుఁడును అహోబలక్షేత్ర ధర్మకర్తయు నయినట్టును, అతఁడు కవులను బిలిపించి రెట్టమతమును దెనిఁగింపఁ బ్రార్థించినట్టును ఈపద్యములలోఁ జెప్పఁబడి యున్నది—

సీ. శ్రీమదహోబిలస్వామి మహారాజ్యరక్షకుం డగుచు నేరాజువెలయు
నభిరామకామందకాఖ్యసత్కావ్యరత్నమునకు నేరాజు నాథుఁడయ్యె
జానకీనాయకచరణసంసేవనప్రౌఢిచే నేరాజు ప్రబలు సిరుల
నెరయూరిపురవరాధీశాదిబహుబిరుదాంకుఁడై యేరాజుయశముగాంచె
నతఁడు కొండ్రాజు తిమ్మభూపతివరేణ్యు
తనయ పెదతిమ్మరాయవతంసగర్భ
వార్థిచంద్రుండు సత్కులవర్ధనుండు
సతతవిభవుండు వేంకటస్వామివిభుండు.

క. ఒకనాఁడు నిఖిలకోవిద । సుకవిహితామాత్యబంధుసుతవీరభట
ప్రకరముకొలువఁగఁ గొలువుండి కథాప్రస్తావ మాత్మనివ్వటిలంగన్.

గీ. రాయకవినైన యయ్యలరాజవంశ్యు
ననఘుఁబిననయక్కవిభుపుత్రునయ్యలాఖ్యు
నాగఘనుసూను భాస్కరనామధేయుఁ
గరుణ దళుకొత్త రావించి గారవించి.

వ. తత్కాలోచితప్రసంగంబున నిట్లనియె.

గీ. ఘనతనుజ్ఞాననిధి రెట్టఘనుఁడు మున్ను
చెలఁగఁ గన్నడభాషను జెప్పినట్టి

శాస్త్రమంతయు నేను నీజనులుం బాగడం
దెనుఁగుభాష నొనర్చెంగఁ దివురుఁడీరు.

ఈపుస్తకమునుబట్టి యీకవుల కాలమును నిర్ణయించుటకు మాత్రమే కాక తెనాలి రామకృష్ణుని కాలమును కనుఁగొనుటకు సహితము కొంతయాధారము కానవచ్చుచున్నది.

రెట్టమతమును దెనిఁగించిన యీకవుల యింటిపే రయ్యలరాజువారు. వీరిలో నొకఁడు పినయక్కయామాత్యపుత్త్రుఁ డయిన యయ్యలకవి; రెండవయతఁడు నాగయామాత్యపుత్త్రుఁ డయిన భాస్కరకవి. ఈకవుల కిద్దఱికి నెట్టిబంధుత్వమున్నదో తెలియరాదుగాని వీరన్నదమ్ముల బిడ్డలని తోఁచుచున్నది. వీరి పూర్వులలో నొకఁడైన తిప్పనార్యుఁడొంటిమెట్ట రఘువీరశతక నిర్మాణ కర్తయుఁడయి రాయల యాస్థానకవిగా నుండెను; ఆతని మునిమనుమఁ డయిన రామభద్రకవి రామాభ్యుదయమును రచియించెను. ఈకవుల కవిత్వము నిర్దుష్ట మయినది కాదు. ఈపుస్తకముగాక కామందకమునుగూడఁ గృతిపతి గృతినందెనఁట. కవనరీతిని దెలుపుటకయి రెట్టమతమునుండి కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. పూవులు నక్షతంబులును బొందుగ దోయిటఁదాల్చి వానకై
భావములోన మానవుఁడు ప్రశ్నయొనర్చఁగఁ బక్షి యయ్యెడన్
వావిరి జేసిఁ గాఁ బలుక వారితవృష్టియుఁ గల్గునంచు గో
త్రావలయంబునందుఁ గవిరాజ నుతింపఁగ వేంకటాధిపా. ఆ-౧

ఉ. పాటెడు బండిభ్రమోఁతగతి బందులు చెల్వగరొప్పుకీతి వే
సారక గార్దభం బఱచుజాడను ఘంటలనాదుకై వడిన్
వారక త్రోముకుండలరవంబుగతిన్ స్తనితంబు పర్వినన్
ధారుణి వాన లే దనియె ధన్యుఁడు రెట్టఁడు ప్రాజ్ఞులెన్నఁగన్. ఆ-౨

చ. అమరగురుండు లగ్నమునయందు వసింపఁగ విత్తుటల్ చతు
ర్థమున మెలంగఁ బైరు తఱితప్పకయుండుట సప్తమంబునం
దమరఁగ వేగ నాపయిరు లాయతపెట్టుట మంచి దెంతయున్
విమలగుణాఢ్య తిమ్మపృథివీపతి వేంకటరాజశేఖరా. ఆ-3

చ. రవితనయుండు రోహిణికరంబున నుండిన చైత్రకంబునన్
దవనము హెచ్చు మర్త్యులకుఁ దద్దయు నుబ్బసఁగుం బెవుళ్లు సం
భవిలును గౌతమీనదిని బంటలు రాజిలు నన్యభూములన్
ధ్రువముగ వాన లే దనియెఁ బోడశతనంబున రెట్టఁ డిమ్మహిన్. ఆ-౪

మ. బుధుఁ డబ్దాధిపుఁ డైన వానకురియున్ భూమండలిన్ రత్నధా
న్యధరల్ శ్రీలు ఘటిల్లు రాజుల ప్రజ లమ్మన్నింతు రెందున్ సమ
స్తధరామర్త్యులకున్ శుభం బొదవుఁ గాంతాశ్రేణిపైఁ గూర్మి య
త్యధికం బాయువకోటికి న్వినుము ధన్యా వేంకటక్ష్మాధిపా. అ-౫

---

32. అజ్జరపు పేరయలింగము

ఒడయనంబివిలాస మనెడి స్థలపురాణగాథను దెనుఁగున నాశ్వాసముల గ్రంథముగా రచియించిన యీకవి శైవుఁడైన యారువేల నియోగిబ్రాహ్మణుఁడు. ఇతఁడు పదునెనిమిదవ శతాబ్దమధ్యమునం దనఁగా నిప్పటికి నూటయేఁబది సంవత్సరములక్రిందట నుండినట్టు కనుపట్టుచున్నాఁడు. ఒడయనంబివిలాసముయొక్క యవతారికయందున్న—

ఉ. బమ్మెరవంశమందునను బ్రౌఢసరస్వతి పద్దుగాంచి తా
నెమ్మె దలిర్పఁ గేసనకవీశ్వరు లప్పమనామసాధ్వియం
దిమ్మహిఁ గూర్మిఁ గన్నసుత యెల్లమయందును బేరయాఖ్యుఁడ
న్నమ్మతిఁ గంటి వీరనరసమ్మను గంగనమంత్రి యుగ్మమున్.

అను పద్యమునుజూచి భ్రమించి యొక రీకవీశ్వరుఁడు బమ్మెర పోతరాజుగారి బావమఱఁదియని వ్రాసియున్నారుగాని యాయంశ మంతవిశ్వాసార్హమయినదిగాఁ దోఁచదు. (పయిపద్యము నాయొద్దనున్న వ్రాఁతపుస్తకమునం దిట్లున్నను ముద్రితప్రతిలోఁ దప్పుల కుప్పఁగా నచ్చొత్తింపఁబడి యున్నది. ఇందుఁ జెప్పఁబడిన కేసనకవీంద్రుఁడు బమ్మెర పోతనామాత్యుని తండ్రియైన కేసన కాఁడు. తనతండ్రి కవీశ్వరుఁ డయినట్టు పోతన భాగవతమునఁ జెప్పుకొనియుండలేదు; తనకన్న యొకఁ డుండినట్టు చెప్పుకొననేకాని తోఁబుట్టినవారున్నట్టును జెప్పుకొని యుండలేదు. అంతేకాక, "తనకు లక్కమాంబ ధర్మగేహినిగాఁగ" అని పోతన తనతల్లి లక్కమ యైనట్టు చెప్పుకొన్నాఁడు. ఈకేసన్నభార్య లక్కమాంబగాక యప్పమయైనట్టు కవియే వ్రాసియున్నాఁడు. అయినను గవి మామగారు పోతనామాత్యుని తండ్రియైన కేసన యని సమర్థించుటకయి యొకరు పద్యములోని "కేసన కవీశ్వరు లప్పమనామసాధ్వి" యన్నభాగమును "కేసనకవీంద్రుఁడు లక్కమసాధ్వి"నని దిద్దుటకయి సహితము ప్రయత్నము చేసినారు. ఈకవికి బమ్మెర పోతనామాత్యునివంటి కవిశ్రేష్ఠుఁడే బావయయి యుండినపక్షమున, అతఁ డాబంధుత్వమును దెలుపుకొనక యుండఁడు. కవి యీగ్రంథమును వ్రాయునప్పటి కితని మనుమఁడుకూడ పెద్దవాఁ డయియున్నందున, ఆకాలమునకుఁ బోతన కవిత్వ మారంభింపని పిన్నవయసువాఁ డగుటచే నాతని జెప్పను లేదని చెప్పుటకును సహిత మవకాశము లేదు.) ఈకవి తనవంశమూలపురుషుఁ డైనకొండన గజపతియైన వీరనృపాలునిచే గోదావరిమండలములోని యజ్జరపుగ్రామము నగ్రహారమునుగాఁ బడసిన ట్లీక్రిందిపద్యమునఁ జెప్పియున్నాఁడు.—

శా. శ్రీరంజిల్లఁ జెలంగుచున్న గజరాట్సింహాసనాధ్యక్షుసన్
ధారాళంబుగ వేదశాస్త్రబహువిద్యాప్రౌఢి మెప్పించి యా

వీరాగ్రేసరుఁ డియ్యెఁ గొండన మహావిఖ్యాతిగా గౌతమీ
తీరక్షోణిని వజ్జరంబనఁగఁ దాఁ దెచ్చెన్మహాగ్రామమున్.

ఇందుఁ జెప్పఁబడిన వీరాగ్రేసరుఁడు—

మ. ధర కెంధూళులు కృష్ణరాయలచమూధాటీగతి న్వింధ్యగ
హ్వారము ల్దూఱఁగఁ జూచి తా రచటఁ గాపై యుండుటం జాల న
చ్చెరువై యెత్తని వింతచీఁకటులు వచ్చెం జూడ రేయంచు వే
సారిదిం జూతురు వీరరుద్రగజరాట్పుత్రాంతమున్దాఁగనల్.

అని మనుచరిత్రమునందుఁ గృష్ణరాయనిచే నోడింపఁబడినట్లు చెప్పఁబడిన వీరరుద్రగజపతియేమో యని యూహాపుట్టుచున్నది. ఆయూహయే నిజమయినచోఁ గవివంశమునకు మూలపురుషుఁడయిన కొండన పదునాఱవశతాబ్దాదియం దుండియుండవలెను. కవి కొండన కేడవపురుషుఁ డయినందున నొక్కొక్క పురుషునికి ముప్పదేసి సంవత్సరముల చొప్పునఁ జూచినచో నీపేరయకవి ౧౭౨౦ వ సంవత్సరప్రాంతములయం దుండియుండును. పలివెల మొదలయిన గ్రామములయం దిటీవలఁ జేరినవేశ్యలను వర్ణించి యుండుటచేతను, పదునేడవశతాబ్దము నందలి కవుల గ్రంథములలోని పద్యములను జూచి యటువంటిపద్యములను జేసియుండుటచేతను, మఱికొన్ని కారణములచేతను పేరయకవి పదునెనిమిదవ శతాబ్దమువాఁడని నిశ్చయముగాఁ జెప్పవచ్చును.

చ. మొదలను బద్మసూతి నవమోహినులౌ తెలుగంటికొమ్మలన్
ముదమునఁ దా సృజించి సుమనోహరమూర్తుల దక్షవాటికా
సుదతులఁ దానొనర్చి యట సొంపునఁ బల్వెల వారకాంతలన్
గదలక తా సృజించెఁ గరకౌశల మొప్పుచునుండ మానినీ.

అని పలివెల వారకాంతలు వర్ణింపఁబడిరి. పదునేడవ శతాబ్దారంభమున సారంగు తిమ్మనవైజయంతీవిలాసమున—

ఉ. ఒక్కనిఁ బిల్వనంపి, మఱియొక్కనిచేతఁ బసిండిపట్టి, వే
ఱొక్కటియింటి కేగుచు, మఱొక్కని నానఁడుచక్కి నొక్కచోఁ
బొక్కి కలంచి చూడ భ్రమఁ బొంది విటుల్తెలియంగలేరుగా
కెక్కడిసత్య మేడవల పెక్కడినేమము వారకాంతకున్ ?

అని వ్రాసిన పద్యము ననుసరించి యీపేరయకవి,

ఉ. ఒక్కని డాయరమ్మని మఱొక్కనిఁ గన్గొని ముచ్చటించి వే
ఱొక్కనిఁ బొంది రొక్కము మఱొక్కనిచేఁ గొని వేశ్యవారికిన్
ఎక్కడుప్రేమ లుండ వలపించుట ధర్మముగాక యయ్యయో
యొక్కనియందె తా వలచియుండుట న్యాయమె వారకాంతకున్.

అని వ్రాసియున్నాఁడు. ఈయొడయనంబివిలాస మనుస్థలపురాణము విప్రనారాయణ చరిత్రమునుజూచి దానిని మించునట్లుగా కల్పింపఁబడిన కథయే యయినను, ఇందలికథ వైజయంతీవిలాసములోని కథకంటెను నెక్కువ నీతిబాహ్యమైనదిగా నున్నది. కవిత్వమునం దంతటి సారస్యమును నిందుఁ గానరాదు. ఇందుఁ దండ్రియే యొడయనంబికి వలసినంత ధనమిచ్చి యది వేశ్యపాలుచేసి దానినెప్పుడును విడువవలదని కొడుకునకు బుద్ధిచెప్పెను—

చ. నగవుదలిర్చుమోమున ఘనం బగువేడుక నివ్వటిల్లఁగా
నగపతిధైర్యు నయ్యొడయనంబిని గాంచి బుధేంద్రుఁ డిట్లనున్
బగలును రేయి నిమ్మగువఁ బాయకయుండు మటంచు నీకు నిం
పుగ నిరతవ్యయంబునకుఁ బొందుగ నిచ్చెదమాఱునిష్కముల్.

ఇందుఁ బాతివ్రత్యముకంటె వేశ్యావృత్తియే మేలయినదని ఈశ్వరుఁడే బోధచేసెను—

సీ. సర్వస్థలంబుల సరస మాడఁగరాదు వలసినప్పుడు రతిఁ గలియరాదు

* * * *

ధాత్రిపై దంపతులకెల్లఁ దలిరుబోఁడి

* * * *

సీ. మగనిచే బాధలు మామచేఁ బీడలు నత్తచే నాడిక లరయ లేవు
మఱఁదులచేఁ గొట్లుమఱఁదండ్రచేఁదిట్లు వదినెల నరిపోట్లు బావపోట్లు
బంధుల కగపడు బాధ లింతయు లేవు
* * * *
కావునను వేశ్యతనువొంద * *
నిహముఁ బరమును దగఁ గల్గు నిందువదన. *

ఇందు వేశ్యవాటికలో అంకని పలికినవారి నందఱినిబట్టి యముఁడు దండించునని చెప్పఁబడినది—

ఉ. పంకజపత్రనేత్ర విను పల్లెలలోపల వేశ్యవాటిలో
అంకని యెవ్వఁడేఁబలుకు రంగుగ వానినిబట్టి మీఁద ని
శ్శంకను సారిదూత లురుచంద్రక తారకితోరశూలబా
ణాంకవిశాలతోమరమహత్తరహేతులఁ గ్రుంతు రెంతయున్.

ఇఁక జగత్తున దుర్నీతి యింతకంటెను బయికిఁబోవుట సాధ్యమగునా? ఈపుస్తకమునందు దుర్నీతి పారమును కడముట్టినదని యేచెప్పవచ్చును. - భక్తుల మహిమలను జూపెడి యిటువంటిపుస్తకములే లోకమున కనంతమయిన చెఱుపును గలిగించుచున్నవి. ఈస్థలపురాణమునం దీశ్వరుఁడు బోగముదాని చంటిలోనే ప్రత్యక్షమయినట్టు చెప్పఁబడినది.

ఈపేరయకవి భారద్వాజసగోత్రుఁడు; కొండనకును బాపమాంబకును బుత్రుఁడు. అక్కడక్కడ వ్యాకరణదుష్టములైన ప్రయోగములనేకములు కానఁబడుచున్నను మొత్తముమీఁద నీతని కవనచాతురి శ్లాఘ్యమైనదిగానే యున్నది. ఒడయనంబివిలాసమునుండి మఱి మూఁడు పద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. ఎక్కి మహేశుఁ డప్పురము నెక్కవమీఁఱినఫాలదృష్టిచే
నొక్కటిగాఁగఁ జూచుచు మహోజ్జ్వలమూర్తిఁ బసిండికొండఁ దా.

నెక్కఁగఁ బెట్టి దేవత లహీనగుణుండని సన్నుతింపఁగాఁ
వెక్కరిదైత్యులం దునుము తత్సమయంబున శంభుకన్నులన్. ఆ-౨

చ. ప్రియతనయామణీ! చనవు ప్రీతిసి జెప్పిన బాపనయ్యనున్
నయముగ నాటపాటల ఘనంబుగ నేర్పినగాయకోత్తమున్
జయముగ సత్కవిత్వమును జక్కఁగ నేర్పినసత్కవీంద్రునిన్
నయమునఁ బారితోషికము నం దనియించితి వ్యర్థ మయ్యెఁగా. ఆ-౭

ఉ. కమ్మనిగోఘృతమ్ము తెఱగంటికి నర్పితమైన యన్నమున్
దిమ్మనము ప్రసావక్షులుఁ దేనెతొనల్ బహుశాకపాకముల్
కమ్మనిపిండివంటలును గాంచనవర్ణము గల్గునుప్పు మో
దమ్ముగ వారలుం గుడిచి తద్దయు సన్నుతిచేసి రందఱున్. ఆ-౬

---

33. మరింగంటి సింగరాచార్యులు

ఈకవి దశరథరాజనందనచరిత్ర యనెడు నిరోష్ఠ్యరామాయణమును రచియించెను. ఇతఁడు శ్రీవైష్ణవబ్రాహ్మణుఁడు; మౌద్గల్యగోత్రుఁడు; తిరుమలాచార్యపౌత్రుఁడు; వేంకటాచార్యపుత్రుఁడు. ఈకవి తా నేకైకదినప్రబంధరచనాధురీణుఁడననియు, ఆంధ్రభాషా నిరోష్ఠ్యాది వింశతిప్రబంధనిర్మాణుఁడ ననియు, వ్రాసికొనెను గాని యితఁడు రచియించిన యితరగ్రంథము లేవియు నిప్పుడు గానరావు. ఇతఁడు నూటయేఁబదిసంవత్సరముల క్రిందటనుండిన ట్లితని వంశమువారు చెప్పుచున్నారు. ఈకవి వాసస్థలము దేవరకొండసీమ. ఈతని కవిత్వము సలక్షణమై హృదయంగమముగా నున్నది. దశరథరాజనందనచరిత్రములోని కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. కరిఘట లేల చిత్రగణికాచ్ఛట లేల హిరణ్యశాటికా
హారిధనధాన్యరత్నఘటితాచ్ఛదలంక్రియ లేల నద్రిశల్
స్థిరగతి నేలఁగాఁ దగినతే జది యేల యనేకచర్యలన్
సిరిగలయట్టిసంతతిని జెందిన యాయొడ లెస్స లన్నిటన్. ఆ-౧

చ. అనఘచరిత్ర నిన్గని జయక్రియఁ జెందితిఁగాన దాఁచకే
కనకకిరీటహారకరకంకణచిత్రకరత్నచేలచం
దనచేటికారజతదంతిశతాంగహయాదికాంతు లె
ల్ల నడిగినంతనే తనియు లాలన నిచ్చెదఁ గీర్తి హెచ్చఁగన్. ఆ ౨

చ. అని తృణలీలగాఁ దెలియనాడి తదాజ్ఞ ధరించి తాటకా
తనయనిశాచరాగ్రణి సదాగతి ధిక్కరణాచ్ఛశీఘ్రమున
ర్తన ఘటియిల్లఁగాఁగదలి దండకకాననధాత్రి చేరఁగాఁ
జని ఖరహంతఁగాంచి దృఢసాహసహర్షరసాతిశాలియై. ఆ-3

మ. అగజాజాని ననేకకంధరలచే నర్చించి జన్యస్థలిన్
దిగధీశాదితినందనచ్ఛటల నర్థిన్ గెల్చి శంకించకే
తెగి కైలాసగిరిం దృణాకృతిగ నెత్తెంగాన నీతం డహో
జగదారాధ్యత హెచ్చనేరఁడె సదాచారక్రియం జెందినన్. ఆ-౪

మ. గద కేలన్ ధరియించి చండతరనిర్ఘాతాట్టహాసక్రియల్
చదలంటం జరణాగ్రఘట్టనల నాశ ల్లల్లడిల్లంగఁ దీ
క్ష్ణదశన్ దీర్ఘదృగంచలాగ్నికణసంక్రాంతిం జలించంగ నా
త్రిదశాలిం గని కీశసేన యధికార్తిన్ డాఁగె నాయాయొడన్. ఆ-౫

34. అనంతరాజు జన్నయకవి

ఇతఁడు రామకథాభిరామమను పదియాశ్వాసముల మహాకావ్యమును రచియించెను. ఈకవి నియోగిబ్రాహ్మణుఁడు; జన్నమంత్రి పౌత్రుఁడు; అమ్మయామాత్యపుత్రుఁడు. ఇతఁడేకాలమునందుండిన వాఁడో తెలియరాలేదు గాని నూటయేఁబదియేండ్ల క్రిందటివాఁడయి యుండవచ్చును. ఈపుస్తకమునందలికథ శ్రీరామచరిత్రమనుట దీనినామముచేతనే తెల్లమగుచున్నది. ఈతనికవిత్వము నాతికఠినమయి మృదుపదగుంభితమయి కర్ణరసాయనముగా నున్నది. రామకథాభిరామములోని రెండుమూఁడు పద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

చ. శ్రుతులకు భూషణంబు లగుచుం బరమానుభవంబు గల్గు నీ
శ్రుతులకు నెల్లలోకములఁ జూచిన సామ్యము లేదు మాధురీ
గతుల సుధారసంబు చిలుకన్ ఘనమోహనసుస్వరైక సం
గతుల మహాద్భుతంబు గులుకన్ విలసిల్లెఁ బ్రయోగపాఠముల్. ఆ-౧

మ. వికచాంభోరుహచారులోచనకుఁ బర్వెం గాంతిమీఱన్ లలా
టికముక్తాఫలభాసురంబగుచు సూటిం దన్ముఖేందూపచా
రకలాపాచరణంబుపొంటె నుడుపారం జేరునక్షత్రమా
లికచందంబున నందమై కచతమోలీలా ప్రతారాకృతిన్. ఆ-3

చ. దరము హరించి యాశ్రితవితానముఁ గాచున భేద్యవజ్రపం
జరము విపన్నదీనజనసంఘముఁ బ్రోచుసమీప మేరుభూ
ధరము మహార్తలోకపరితాపమడంచుసుధావిధానసా
గరము కరంబు రామవిభుకారుణికత్వమహత్త్వ మెన్నఁడున్. ఆ-౯

35. ముద్దుపళని

ముద్దుపళని పద్యకావ్యములు చేసిన స్త్రీలలో నొకతె. మొల్ల రచించిన రామాయణమునుగూర్చి రెండవభాగమునందే తెలుపఁబడినది. మోహనాంగి యను నామె మారీచిపరిణయమును రచియించినట్లు చెప్పుటయేకాని పుస్తకము లభింపలేదు. మొదటఁ బద్యకావ్యములను రచించినవా రిరువురును కులాంగనలు; ఈముద్దుపళని వేశ్యాంగన. ఇది రాధికాసాంత్వనమను నాలుగాశ్వాసముల శృంగారప్రబంధమును రచించెను. దీని తల్లిపేరు ముత్యాలు. అది తంజావూరుసంస్థాన ప్రభువయిన ప్రతాపసింహుని యుంపుడుకత్తె యయినట్లు "చోళసింహాసనాధ్యక్ష ప్రతాపసింహ మహారాజ బహూకృతానేకచామీకరాంబరాభరణ ముత్యాలుగర్భశుక్తి ముక్తాయమాన" యని రాధికాసాంత్వనముయొక్క గద్యములో వ్రాయఁబడిన దానినిబట్టి యూహింపఁదగి యున్నది. ఈరాధికాసాంత్వనమునకే యిళాదేవీయమని నామాంతరముగలదు. ప్రతాపసింహుఁడనెడి ఈమహారాష్ట్రప్రభువు ౧౭౬౩ వ సంవత్సరమునందు మృతినొందెను. కాఁబట్టి యీముద్దుపళని ౧౭౬౦ వ సంవత్సర ప్రాంతమునందు తంజావూరులో నుండెను. ఇది సంగీతసాహిత్యభరత శాస్త్రములలోఁ బ్రవీణురాలయినట్టు తానే చెప్పుకొన్నది. దీనికవిత్వము నాతికఠినమయి మృదువుగా నుండినందునకు సందేహములేదు; దీనికి మంచి సంస్కృతాంధ్రసాహిత్యమును గలదు. అందందు తప్పులున్నవి కాని యట్టితప్పులు పురుషకవిత్వమునందు సహిత మనేకగ్రంథములలోఁ గానఁబడుచున్నవి. అయినను గ్రంథములోని భాగము లనేకములు స్త్రీలు వినఁదగినవియు స్త్రీనోటినుండి రాఁదగినవియుఁగాక దూష్యములయి యున్నవి. ఇది జారత్వమే కులవృత్తిగాఁగల వేశ్యయగుటచేత స్త్రీజన స్వాభావికమయిన సిగ్గును విడిచి శృంగారరస మనుపేర సంభోగాదివర్ణ

నములను పుస్తకమునిండ మిక్కిలి పచ్చిగాఁ జేసినది. అయినను స్త్రీ కవిత్వమని తెలిపెదను,

గీ. తనదుమ ట్టొంత తా నెంత తానె యింత
చేయఁజూచిన నే నెంత చేయరాదు
వేలువాచిన రోలంతవిరివియైన
రోలువాచిన నది యెంతమేలు గనునొ.

గీ. కుట్టఁ దేలు కట్టుకున్నఁ గుమ్మరబూచి
త్రోసిరాజటంచుఁ దోఁచెఁ జెలియ
దానివేలుదీసి దానికన్నుపొడిచి
నటులు చేయకున్న నగునె చిలుక.

గీ. తగరు కొండమీఁద దాఁకఁ గోరినదారి
నెదిరిఁ దన్నుఁ జెలియ కింతపలికె
నెంతమీనువచ్చి యెంతమీనును మ్రింగెఁ
గానఁ ద్రుల్లి నెద్దె గంతమోచు.

గీ. కాని పదరకు మీఁకమీఁద దాని మొగము
కనఁగవలదని శౌరికిఁ గట్టుపెట్టి
బింకములు కూల నఱకాలఁ బెట్టి నేల
రాయ కున్నను నాపేరు రాధగాదు.

గీ. లేనిపట్టింపు లెల్లను బూని చాన
నేనె యెదురై నఁగాసి యింతైనఁ జూడ
దల్పునకుఁ గల్మివచ్చిన నర్ధరాత్రి
గొడుగు తెమ్మన్నకతగాను గోమలాంగి.

ఇత్యాది లోకోక్తులును జాతీయములును గలపద్యము లంతము లేకపోలేదు. రాధికాసాంత్వనమునుండి మఱికొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను—

మ. యమునాతీరవిహార హారసదృశోద్యత్కీర్తిసంభార భా
రమణీయాకృతిమార మారసికతాప్రావీణ్యసంసార సా
రమరందోక్తివిచార చారణమదప్రఖ్యాతవిస్తార తా
రమహీభృత్సమధీర ధీరమునివారాధార రాధారతా. ఆ ౧.

ఉ. ఈయెడఁ గాయము న్విడిచి యేఁగెద నంచు విచార మొందలే
దా యదుసార్వభౌమునికి నాముకవైరికిఁ గాని కాయమై
పోయినఁ బోవ కున్ననిలఁ బుణ్యమొ పాపమొ గుడ్డికన్నుదా
మూయక యున్ననేమి మఱి మూసిననేమి తలంచిచూడఁగన్. ఆ. ౩.

చ. మొలకనవమాటలం గలుగుమేలము లచ్చట గచ్చు లిచ్చటన్
దలఁపులు దాఁచిపైని బలుతప్పులు నాపయి నేస్తమూడఁబే
రలుక మఱీఁడఁ గూర్మివగ లక్కడ నిక్కడ టక్కు లద్దిరా
తెలియఁగవచ్చె నీనడత తెల్లము వింటిమి ప్రాణనాయకా. ఆ. ౪.

---

36. కంకంటి పాపరాజు

ఈకవి యాఱువేలనియోగిబ్రాహ్మణుఁడు. ఇతఁడు తనయుత్తర రామాయణమునం దాఱువేలవారి నిట్లు వర్ణించుచున్నాఁడు—

సీ. అఖిలరాజాధిరాజాస్థానజనహృద్యవిద్యావిహారు లార్వేలవారు
కల్పకబలికర్ణకలశార్ణవోదీర్ణవితరణోదారు లార్వేలవారు
సజ్జనస్తవనీయసతతనిర్వ్యాజపరోపకారు లార్వేలవారు
ఘనదుర్ఘటస్వామికార్యనిర్వహణప్రవీణతాధారు లార్వేలవార
విమతగర్వాపహారు లార్వేలవార
లట్టియార్వేలవారిలో నలఘుకీర్తి
నెలయు శ్రీవత్సగోత్రారవిందహేళి
మహితగుణశాలి వల్లభామాత్యమౌళి.

కవి శ్రీవత్సగోత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; అప్పయామాత్య పుత్రుఁడు. ఈతని తల్లి నరసాంబ; తమ్ముఁడు నరసింహుఁడు. ఈతని వాసస్థానము నెల్లూరు మండలము. అక్కడక్కడఁ గొన్నివ్యాకరణ దోషము లున్నను మొత్తముమీఁద నీతని కవిత్వము మిక్కిలి రసవంత మయినది. ఇతఁ డుత్తరరామాయణమును బురాణశైలినిమాని ప్రబంధ పాకమునఁ జెప్పినవాఁడు. పూర్వ ముత్తరరామాయణము తిక్కనసోమ యాజిచేఁ దెలిఁగింపఁబడినను దాను గ్రొత్తఁగా మరలఁ దెలిఁగించుటకు రామకథ యగుటయే కారణమని కవి యీక్రిందిపద్యమునఁ జెప్పెను—

మ. వరుసం దిక్కనయజ్వనిర్వచనకావ్యంబై తగంజేసె ను
త్తరరామాయణ మందున న్మతి ప్రబంధం బూని నిర్మించుటే
సరసత్వం బని ప్రాజ్ఞులార నిరసించ బోకుఁడీ రాఘవే
శ్వరుచారిత్రము లెంద ఱెన్నిగతుల న్వర్ణించినం గ్రాలవే?

కవి యుత్తరరామాయణమును రచించుటకుముందు విష్ణుమాయావిలాసమను యక్షగానమును రచించినట్లు తన్నుఁగూర్చి యిష్టదైవము పలికినరీతిగా నీక్రింది పద్యమునఁ జెప్పుకొన్నాఁడు—

గీ. శ్రీవెలయ మున్ను విష్ణుమాయావిలాస
యక్షగానంబు మాకె సమర్పణముగఁ
జేసి తదియాదిగామేము నీసుధాను
సారివాక్కులఁ జొక్కియున్నార మనఘ.

ఉత్తరరామాయణము కంకంటి పాపరాజు చెప్పినట్లున్నను నిజముగాఁ బుష్పగిరి తిమ్మన్న రచియించి యాతనిపేరు పెట్టెనని వాడుక గలదు. ఈతని కవిత్వమునకును, బుష్పగిరి తిమ్మనకవిత్వమునకును భేద మున్నందున, ఈలోకప్రవాదము సరియైనదిగా నుండదు. పుష్పగిరి తిమ్మన్న గొప్పకవి యగుటచేతను, పాపరాజునకు మిత్రుఁడును సహాధ్యాయుఁడు నయియుండుటచేతను, కావ్యరచనయందుఁ గొంత తోడ్పడి

యుండుటచేతను ఇట్టిప్రవాదము కలిగి యుండవచ్చును. పుస్తకరచన యందుఁ బుష్పగిరి తిమ్మన్న తనకు తోడ్పడినట్లు కవియే యీక్రింది పద్యములలోఁ జెప్పియున్నాడు-

మ. హనుమద్దివ్యపదారవిందమకరందానందనేందిందిరా
త్ముఁ డనేకాంధ్రకృతిప్రకల్పనసమర్థుం బుష్పగిర్యప్పనా
ర్యునిసత్పుత్రునిఁ దిమ్మనాఖ్యకవిచంద్రుఁ న్మత్సహాశ్రోతఁ బ్రౌ
ఢ్యుననే పిల్వఁగఁబంచి కన్నకల సంతోషంబునం జెప్పినన్.

మ. అతఁ డానందముఁ జెంది నన్నుఁగని యన్నా జాళువాపైఁడికిన్
గృతవర్ణాంచితరత్న మబ్బినటు లయ్యె న్నీవు వాక్ప్రౌఢిమం
గృతి సేయంగఁదొడంగు రామకథకుం గృష్ణుండు రా జౌటఁ బ్ర
స్తుతి గావింపఁగ నాకు శక్యమె భవత్పుణ్యప్రభావోన్నతుల్.

గీ. అని కిరీటికి శౌరి తోడైనయట్లు
లమ్మహాకవిసాహాయ్య మాచరింపఁ
గృతి నొనర్పఁగఁజూచినవాఁను మొదట
నెంతు మద్వంశవిధమది యెట్టు లనిన.

కంకంటి పాపరాజు ప్రళయకావేరిపట్టణములో నమీనుగా లౌక్యాధికారమునం దుండినవాఁడు. ఆకాలమునందే యీయనవద్దఁ బుష్పగిరి తిమ్మన్న కొంతఋణముచేసి యాయప్పు తీర్పలేక యీపుస్తకము నాదానిక్రిందఁ జేసి యియ్యఁగా, ౧౭౯౦ వ సంవత్సరప్రాంతమున నుత్తరరామాయణమును పాపరాజు తనపేరిటఁ బ్రచురించెనని చెప్పుచున్నారు. కవి యిప్పటికి నూఱుసంవత్సరములక్రిందట నుండినవాఁడు. కవిత్వశైలి తెలియుటకయి యుత్తరరామాయణమునుండి కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను-

మ. పలుమాఱుం దనువేఁడురామనిభుఁ బ్రాటింప నుత్తుంగభం
గలసత్తోయభుజంగ సంఘఫణభంగప్రౌఢరంగత్తిమిం

గిలవాలప్రహతప్రవాళశకలాకీర్ణారుణార్ణఃప్రభా
కలనం దేజము చూపె వార్ధి జడధుల్ గైకొందురే ధీరులన్. ఆ. ౧.

ఉ. ఓయినిశాచరప్రవర యొప్పుగ నిప్పుడు పల్కునీరణ
న్యాయము లెందుఁబోయె సురనాథులఁదోలెడువేళఁ జాలుఁ జా
ల్న్యాయముచేతఁగాదె జయ మందుట మీరు జగం బెఱుంగదే
న్యాయము మేము దప్ప మొకనాఁటి కదెట్లనవిన్ము తెల్పెదన్. ఆ-౨

ఉ. తమ్ముఁడ వంచు నీకొకహితం బెఱిఁగింపఁగ దూతఁబంచినన్
వమ్ముగరించి నాపలుకు వానినిజంపి ననున్ జయింపరే
ద్రిమ్మరిగుంపుతోడ న[illegible]దెంచితి నిన్ననసేల నీకు డెం
దమ్మున మేలుగాఁదలచునన్న యనందగుఁగాక దుర్మతీ! ఆ. ౩.

మ. పలుతావు ల్వెదచల్లుతెమ్మెరలపై పైడాయ రేరాజువె
న్నెలగాయన్ మధుపాళిమ్రోయఁ గలకంఠీపాళికూయన్ మరు
ల్లలనగ్లానముచేయ నొంటి నిశివేళం దోఁటలో నైందవో
పలవేది న్వసియించుపాంథుని స్మరాపస్మారము ల్పేరవే? ఆ. ౪.

చ. కిలకిలనవ్వి యచ్చెలి సఖీమణులంగని యమ్మలార విం
తలు కనుఁగొంటిరే యిదిగొ తానఁట యిక్కడ నున్నవారితోఁ
కలహ మొనర్ప వచ్చెనఁట కాదనిపట్టిన పీఁడు చేతిలో
పలికిని లేఁడు నేఁడు బహుభంగులఁ బ్రేలెడు నంచుఁ జూపినన్.ఆ-౫

ఉ. మాటలఁ దాటకాంతకుఁడు మాటికిఁ దేనియ లొల్క వేఁడినన్
బోటలగంధిసిగ్గు ప్రతిభాషితచాతురి నడ్డగింపఁగా
గాటపుఁగాంక్షయన్ తరువుకత్తె మదిం ద్వరసేయ నల్లనన్
మీటినమ్రోయువీణవలె మించు నెలుంగున భర్తతో ననున్. ఆ.౬.

ఉ. ఈవెడబుద్ధి నీకెజనియించెనొ యేజడుఁడైనఁ దెల్పెనో
హా విధిద్రోయు నీకు వశమా లవణాసురుబారిఁబడ్డవా

రీవఱ కెవ్వరైన మనిరే యిఁక సూర్యుఁబ్రహ్మ లాఁగినన్
జావక పోదువోటు కొనసాగునె నీవిలువిద్య లిచ్చుటన్. ఆ. ౭.

చ. వలసినభోజనాభరణవస్త్రధనాదులఁ జెంది తృప్తులై
పలుమఱుఁ జాలుఁజాలు నని పల్కెడువారలె కాని మాకుఁ గా
వలయు నొసంగుమం చనెడువారల మందున కైనఁ గాన మా
స్థలమున జానకీవిభునిజన్నమువైభవ మెన్న శక్యమే. ఆ. ౮.

---

37. పుష్పగిరి తిమ్మన్న

ఈకవి సమీరకుమారవిజయ మనెడి యేడాశ్వాసముల కావ్యమును రచియించి, భర్తృహరి నీతిశతకమును తెనిఁగించెను. ఇతఁ డుత్తరరామాయణమును రచియించిన కంకంటి పాపరాజుతో సమకాలికుఁడు. ఇతఁడు రచియించిన సమీరకుమారవిజయ ముత్తరరామాయణ మంత మధురముగా లేదు. భర్తృహరినీతిశతకము సహిత మేనుఁగు లక్ష్మణకవి తెనిఁగించినదానికి చాలదు. కవి సంస్కృతాంధ్రములయం దసమానపాండిత్యము కలవాఁడే యయినను, కవనమం దక్కడక్కడ లక్షణవిరుద్ధములయిన ప్రయోగములు కానఁబడుచున్నవి. ఈకవి నివాసస్థలము నెల్లూరిమండలములోని మోడేగుంట యయినట్లు నెల్లూరిమండలచరిత్ర సంగ్రహమునందు వ్రాయఁబడియున్నది. ఇతఁ డాశ్వలాయనసూత్రుఁడు; విశ్వామిత్రగోత్రుఁడు; అప్పనార్యునిపుత్రుఁడు. ఇతఁడు సమీరకుమారవిజయమునందు తన్నుఁగూర్చి యిట్లు చెప్పుకొన్నాఁడు—

సీ. శ్రీహనూమత్పాదసేవాగతాధ్యాత్మ తత్త్వకవిత్వమహత్త్వవిదుఁడ
నాశ్వలాయనసూత్రహారివిశ్వామిత్రగోత్రాబ్ధిచంద్రుఁడఁ గుశలమతిని
అలపుష్పగిరియప్పనార్యున కౌబళాంబకును సుపుత్రుండ బ్రహ్మవేత్త
యైన వేంకటకృష్ణసూగ్రణికిని వేంకటాఖ్యకవీంద్రున కవరజుండ

సరసగుణయుక్తుండ వరకవిఁ దిమ్మనా
హ్వాయుఁడ నేను జననమంది మనుట
కెల్ల ఫలముగల్గఁ గృతి యొక్కటిరచింప
నూహ సేయుచున్న నొక్కనాఁడు.

కవి పదునెనిమిదవ శతాబ్దమధ్యము మొదలుకొని ౧౭౮౦ వ సంవత్సరమువఱకును కవిత్వరచన చేసియుండవచ్చును. ఉత్తరరామాయణముయొక్క కర్తృత్వము నారోపించి నట్లే దశకుమారచరిత్రము యొక్క కర్తృత్వముకూడఁ గొందఱు ఈకవి కారోపింతురు గాని యా యారోపణము కేవల నిరాధారముగా గనఁబడుచున్నది. ఈతని పుస్తకములనుండి కొన్నిపద్యము లుదాహరింపఁబడుచున్నవి—

భర్తృహరి నీతిశతకము.

చ. మతిఁగలజాడ్యము ల్దొలఁచు, మాటల సత్యము గూర్చు మాన ము
న్నతి నెనయించుఁ బాపములు నాశమొనర్చు, మనంబునం బ్రస
న్నత గదియించు, దిక్కులఘనంబుగఁ గీర్తులు నించు, సాధుసం
గతి యిఁక నేవిశేషములు గల్గఁగఁజేయదు మర్త్యకోటికిన్.

ఉ. నీతు లెఱుంగువారు తమ నింద ఘటించిన నెంచినన్, మహా
భూతులు పాయకున్న నవిపోయినఁ, జావపుడైనఁ గల్పసం
ఘాతవిరామకాలములఁ గల్గిన గల్గఁగా కొకప్పుడున్
నీతిపథంబునం జెదర నేరరు ధైర్యరమాధురంధరుల్.

సమీరకుమారవిజయము.

ఉ. ఆరజనీచరాగ్రణిలయావసరాసితనీరదాకృతిన్
దారుణ రాఁ గనుంగొని యథాయథలై సుర లద్రిరాడ్గుహాల్
దూఱెడువారు నిచ్చ విధి దూఱెడువారుఁ గవీంద్రు వెన్కకున్
జేరెడువారుఁ గావుమని చీరెడువారునునై తలంకఁగన్. ఆ.౧

ఉ. ఎమ్మెయు జవ్వనంబుఁ గలయింతి పతిం బెడఁబాసి యొంటిగాఁ
ద్రిమ్మరుచోట గర్భము ధరించినదన్నను గన్నవిన్నవా
రెమ్మెయిఁ గల్ల లేమిగణియింతురొ యెంతురొ బంధుకోటిలో
నమ్మికచెల్ల నానియమ మాగడ మాయె సికేమిచేయుదున్. ఆ.౨.

చ. రమణుఁ డొసంగె నుంగరము రామ కనుంగొను మన్నమాత్ర మే
ను మఱచి సాక్షి యొక్కటఁ గనుంగొనుచుండితిఁగాని తత్ప్రమో
దమునకు నాదికారణ మితం డని సిగ్గన నైతి నెచ్చటన్
బ్రమద లెఱుంగ నేర్తురె కృపాళు గొనర్చిన మేలు మారుతీ. ఆ. 3.

ఉ. జ్ఞాతవిచార మయ్యెఁగద యేనును నీ వనుభేదయుక్తి నీ
స్వాంతమునందు వర్తిలుట నన్యుఁడు నేనను చింత యెంతప
ర్యంతము జంతుసంతతిహృదంతమునందు వసించు నంతప
ర్యంతము జన్మమృత్యువుల కంతము లేదు సమీరనందనా. ఆ. ౪.

ఉ. రావణుగీవణుఁ సమరరంగమునం గుదియించినట్లు నా
లావున కోహటింపక నిలం గలవే రఘురామ వేత్తవే
యీవెడక్రోఁతి నెక్కొని యేటికివచ్చితి వింతదూర మ
య్యో విజయంబుచెందఁగలఁడో టుశతాస్యుఁగడంగి రుద్రుఁడున్. ఆ-౫

ఉ. హీనాధిక్యము లెంచి పంచితివొ నన్నేమాడ్కిఁ బొమ్మంటి వా
హీనాత్ముం గపిమాత్రుఁ బిల్చుటకుఁ బోనీ యొక్కవేగంబునం
దైనన్ నాకు సమానుఁడే పలుకరేలా నీవె యిట్లాడఁగా
నేనా కా దనువాఁడ నం చపలుపక్షీంద్రు న్నిరీక్షించుచున్. ఆ. ౬.

శా. అన్నా నే ముదివాఁడ లేవ వడిలే దందెందొ నీవేగఁగా
సన్నాహంబున వచ్చినాఁడవుగదా జాగేల నీకేల నీ
సన్నంబైన మదీయపుచ్ఛ మొకపార్శ్వంబందుఁ బొందించి పొ
మ్మన్నన్ దన్మహిమం బెఱుంగ కుదితాహంకారపంకాత్ముఁడై. ఆ-౭

38. ధరణిదేవుల రామమంత్రి

ఈకవీంద్రుఁడు నూఱుసంవత్సరములక్రిందట దశావతారచరిత్ర మను పదియాశ్వాసముల గ్రంథమును రచియించెను. ఇతఁడు బ్రాహ్మణుఁడు; తిమ్మయామాత్యుని పౌత్రుఁడు; ధరణిదేవుల నాగయామాత్యునకును పణియమ్మకును పుత్రుఁడు. అందందుఁ గొన్నివ్యాకరణదోషము లున్నను, ఈతని కవిత్వము రసవంతమయి హృదయరంజకముగా నుండును. కవియే తన్ను సంస్కృతాంధ్రభాషా ప్రవీణునిగాను దినైక ప్రబంధవిరచనదక్షునిగాను,

క. నను సంస్కృతాంధ్రభాషా
వినుతు దినైకప్రబంధవిరచనదక్షుఁ
గనుఁగొని యిట్లనిపలికెన్
వినయంబు నయంబు హెచ్చ విబుధులు మెచ్చన్.

అను పద్యములోఁ జెప్పుకొని, తన్నష్టభాషాకవిత్వ తత్త్వసంవేదినిగా కృతిపతి పొగడినట్లీక్రింది పద్యములోఁ జెప్పుకొన్నాఁడు—

సీ. శ్రీరామకరుణారసారూఢ సంస్కృతప్రాకృతాద్యష్ట భాషాకవిత్వ
తత్త్వసంవేదివి ధరణిదేవుల తిమ్మయామాత్యపౌత్రుండ వన్నదాన
ముఖ్యనానాదానముదితభూసురచంద్ర నాగప్రధానేంద్ర నందనుఁడవు
పణియమాంబాగర్భపాథోధిచంద్రుఁడ వాత్మవిద్రఘునాయకాద్యనుజుఁడ
వాప్తుఁడవుగాన వేఁడెద నందముగను
గృష్ణునిదశావతారముల్ గృతి యొనర్చి
యంకితముసేయు నాకుఁ బ్రఖ్యాతి నీకు
మహితగుణసాంద్ర రామయామాత్యచంద్ర.

కవి తన దశావతారచరిత్రము నాఱువేలనియోగి యగు మగదల కృష్ణమంత్రీంద్రున కంకితముచేసి యాతఁడు విద్యానిధి యైనట్లు,

ఉ. నారదమౌని! యేమి? సురనాథ! విశేషములేమి? వింటిరో
సారసగర్భుచెంగటను శారద లేదఁట! యొకు సిల్చెనో?
యారసిచూడుఁ డాముగదలాన్వయదుగ్ధపయోధిచంద్రమం
దారము కృష్ణమంత్రి రసనాస్థలినిల్చెను, యుక్తమే కదా!

ఇత్యాది పద్యములలో నభివర్ణించి యున్నాఁడు. కృతిపతియైన కృష్ణమంత్రి గతశతాబ్దాంతమునందు నెల్లూరిమండలములోని ప్రళయకావేరిపట్టణమునం దోలాందావారి ద్విభాషిగా నుండెను. కంకంటివారి యుత్తరరామాయణమువలెనే యీదశావతారచరిత్రమును పుష్పగిరి తిమ్మన్నచే రచియింపఁబడినదని కొందఱు చెప్పుచున్నారు గాని కవులిద్దఱు నేకకాలమునం దొక్కదేశములో నుండుటదక్క వారిమాట కాధారలేశమును గానరాదు. దశావతారచరిత్రకవిత్వము పుష్పగిరి తిమ్మన్నదైన సమీరకుమారవిజయకవిత్వమునకంటె మృదుతరముగాను మధురతరముగాను కనఁబడుచుండుటచే దశావతారచరిత్రరచనలోఁ బుష్పగిరి తిమ్మన్న కేమియు సంబంధములేదని నిశ్చయముగాఁ జెప్పవచ్చును. దశావతారచరిత్రములోని పద్యములఁ గొన్నిటి నిం దుదాహరించుచున్నాను—

శా. ఆవార్త న్విని కోపించి దైత్యపతి రోషావేశ ముప్పొంగ నా
హా వేదంబుల యాగభాగము లమర్త్యశ్రేణికే కాని మా
కేవంకం బనిలేకయుండునటుగా నేర్పాటు గావించెఁ గా
నీ వేగంబ హరించి తచ్ఛ్రుతుల భగ్నీభూతము ల్చేసెదన్. ఆ. ౧.

ఉ. కన్నులు బ్రహ్మకెం డొసఁగఁ గానఁగ లేవని గౌతముండు తాఁ
గన్నులు వే యొసంగె నధికంబుగ నప్డు మదాంధకార సం
ఛన్నము లౌటచేఁ దెలియఁజాలవు తన్మదకారణంబు నిం
క న్నినుఁగూడనీయ కుపకారము చేసెదఁ జూడు వాసవా. ఆ-౨

ఉ. వీరుఁడ వంచు నిన్నుఁ బదివేలవిధంబులఁ బ్రస్తుతించుచున్
వారిధిభర్త తెల్పివిని వచ్చితి మెచ్చెద నేఁడుచూపు నీ
వీరతఁ గాండిశీకపదవీరతవృత్తిని మోరతోపునన్
జాఱెదనన్నుఁ బో విడఁచు స్వర్ణవిలోచనుఁడంచు నుగ్రుఁడై. ఆ. ౩.

చ. గెలిచితి సర్వదేవతలఁ గేశవుఁ డొక్కఁడె తక్క నాతనిన్
గెలిచినఁగాని యీగెలుపు గెల్పుటకా దది యెట్టు లంటిరేఁ
దొలుత వరాహమై యనుజుఁ ద్రుంచు టెఱుంగదె సూడుదీర్పఁగాఁ
గలుగనిగెల్పదేల బరగౌరవ మేటికి శౌర్య మేటికిన్. ఆ-౪

ఉ. ముక్కున గవ్వ కట్టినను ముందుగ నీడిచి తెమ్మటంచు మా
రక్కసిఱేఁడు పంచె వినురా దివిజర్షభ యింక నట్టిటున్
దిక్కులుచూచిన న్విడువ దేవర వైనను నీకువెక్క నే
మ్రొక్కెదఁగాని రమ్మనుచు ముందలఁ బట్టఁగడంగ నుద్ధతిన్. ఆ-౫

శా. ఔరా విప్రుఁడనంచు నన్ జలకసేయ న్వచ్చితే మంచిదే
రారమ్మా ధను వూని నీదయిఁక్షాత్రం బేను వీక్షించెదన్
శూరత్వంబులు మీకెయంచు నజుఁ డెవ్వో ముద్ర గావించెనే
లేరా బ్రాహ్మణశూరు లింకిటను గల్పింతున్ననుం జూడుమా. ఆ-౬

శా. ఔనా నే వెలయాలనా యిటులు నీ వాడన్ బళా చాలుఁ బో
పో నవ్వే రెవరైన విన్న నిట నేర్పు ల్మానఁగా వచ్చితో
నానాథుం డిదివిన్నయంతఁ దనకు న్నాకు న్మహాహాని రా
దా నావంటికులాంగనామణికి న్యాయం బౌనె యీమార్గముల్. ఆ-౭

మ. ఎలనాగా ! తలయెత్తి చూడఁగదె వీ రెవ్వారు వీ రేమికా
వలెనే యంచని యమ్మలక్కలట త్రోవన్ వేఁడ నీపైఁడిచా
యలచే మించునతండు నామఱఁదియా నం చంటతన్ సిగ్గుచేఁ
దలవంచు న్మహిళాకన్య వారలదె యాతం డెవ్వరంచు న్నగన్. ఆ.౮

ఉ. ఓయిగురాకుబోఁడి ! కనవో వినవో యిదియేమిచెల్ల నీ
ప్రాయపుఁదోయజాక్షులెడబాయ రొకప్పుడు ప్రాణనాథులం
బ్రాయము రిత్తఁబుత్తురకె పల్కవె నీమది నున్న యట్టియా
నాయకుఁ దెల్పవే త్రిదశనాయకుఁ గోరినఁ దెచ్చికూర్చెదన్. ఆ-౯

శా. రంభాభోగముఁగోరి యాగముల కర్థం బెల్ల వెచ్చించు టా
యంభోదమ్ములఁజూచి చెర్వుజల మాద్యంతంబు చల్లించుటల్
సంభోగేచ్ఛ జనించెనేని మఱి వేశ్యారత్నము ల్లేరొకో
సంభోగింపఁగరాదె కానరు జనుల్ జ్ఞానంబు సామాన్యమే. ఆ-౧౦

39. దిట్టకవి నారాయణకవి

ఇతఁడాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; కాశ్యపగోత్రుఁడు; పాపరాజకవిపుత్రుఁడు. ఇతఁడు రంగరాయచరిత్రమును ప్రబంధమునుజేసి దానిని కృష్ణామండలములోని నర్సారావుపేట జమీందారగు మల్రాజు రామారాయనింగారి కంకితముచేసెను. ఈగ్రంథము ౧౭౯౦ వ సంవత్సర ప్రాంతములయందు రచియింపఁబడినట్లు తెలియవచ్చుచున్నది. ఈ పుస్తకము ౧౭౫౭ వ సంవత్సరమున బొబ్బిలికోటవద్ద శ్రీరావు రంగారాయఁడుగారికిని ఫ్రెంచిసేనానాయకుఁడగు బుస్సీగారితో నచ్చుటికేగిన పూసపాటి విజయరామరాజుగారికిని జరిగినయుద్ధము భారతయుద్ధమువలె వర్ణింపఁబడినది. బొబ్బిలికోటవద్ద జరిగిన యుద్ధక్రమములు బొబ్బిలి సంస్థాన చరిత్రమును కథా సందర్భమున నిందు కొంత వివరించుచున్నాను.

బొబ్బిలిసంస్థాన స్థాపకుఁడయిన పెద్దారాయనింగారును విజయనగర రాజ్యసంస్థాపకుఁడయిన పూసపాటి తమ్మిరాజుగారివరినే ౧౬౫౨వ సంవత్సరమునందు శ్రీకాకుళపు సర్కారు ఫౌజుదారగు షెర్ మహామదుఖాను యొక్క ప్రాపుచేత నక్కడకు వచ్చెను. పెద్దారాయనింగారు

మహాశూరుఁడయి రంగవాఁక యనుచోట జరిగినయుద్ధములో శత్రువుల సంహారించి షెర్ మహమ్మదుఖాన్ యొక్క పుత్రుని ప్రాణములు రక్షించినందున, షెర్ మహమ్మదాయనకు రాజాముహుండా కవులున కిచ్చి రంగరావని బిరుదునిచ్చెను. రంగరావను బిరుదనామము నొందిన యీ పెద్దారాయనింగారు పద్మనాయకవంశజులయిన వెలమదొరలలోని వాఁడు. ఈయనయు వేంకటగిరి సంస్థానప్రభువులును పిఠాపుర సంస్థాన ప్రభువులును ఏకవంశములోనివారే. రాజామును కౌలునకుఁ బుచ్చుకొన్నతరువాత పెద్దారాయనింగారు క్రొత్తగా నొకపేటను కోటను గట్టి దానికి తన యుపకర్త పేరిట బెబ్బులియని నామకరణము చేసెను. షెర్ మహమ్మదులోని "షెర్" అను పదమునకు బెబ్బులియని యర్థము. బెబ్బులి యనునదే కొంతకాలమునకు బొబ్బిలిగా మాఱినదఁట! అప్పటి నుండియు క్షత్రియులయిన విజయనగరము వారికిని వెలమవారయిన బొబ్బిలివారికిని వైర మారంభమయ్యెనని చెప్పుదురు.

మన ప్రస్తుతచరిత్రారంభకాలమున ౧౭౫౬ వ సంవత్సరమునందుత్తరసర్కారులు ఫ్రెంచివారి కియ్యఁబడఁగానే ఫ్రెంచిసేనాధ్యక్షుఁడగు బుస్సీదొరగారు రాజమహేంద్ర శ్రీకాకుళ సర్కారులను విజయనగర సంస్థానాధిపతులగు విజయరామరాజుగారికి కౌలునకిచ్చుట కంగీకరించెను; అట్లు జరిగెడుపక్షమునఁ దనస్థితికి భంగము కలుగునని దూరాలోచన చేతఁ దెలిసికొన్నవాఁడయి యప్పటి బొబ్బిలి ప్రభువుగారగు రంగారావుగారు రాజ్యము ఫ్రెంచివారియధీనము కాకుండఁజేయుటకయి యితర సంస్థానాధిపతులతోఁ జేరి కృషిచేసెను. ఈ కృషికి శ్రీకాకుళపు నవాబగు జాఫరల్లీఖాన్ యొక్క ప్రోత్సాహముసహితము విశేషముగా నుండెను. తిరుగఁబడిన జమీందారుల నదిమి కప్పములు గొనుటకయి బుస్సీగారు ౧౭౫౬ వ సంవత్సరము నవంబరు నెల ౧౬ తేదిని ౫౦౦ యూరపియనులతోను ౪౦౦౦ సిపాయిలతోను హైదరాబాదునుండి బైలుదేఱి

డిశంబరు ౧౯ వ తేదికి రాజమహేంద్రవరము వచ్చి చేరెను. విజయరామరాజుగారు పదివేల స్వసేనతోను, ఇతరరాజులతోను వచ్చి యచట బుస్సీని చేరెను. తనదేశములోనుండి విజయనగర రాజ్యములోనికిఁ బాఱెడు కొండకాలువలను మళ్ళించి బొబ్బిలి రంగారావుగారి కాపులు తమ భూములకుఁ బెట్టుకొన్నందునను, దేశస్వభావమునుబట్టి బొబ్బిలి వారిని సాధించుట సుసాధ్యము కాకపోయినందునను, విజయరామరాజుగారు మనస్సులో బొబ్బిలిరంగారావుగారిపై ద్వేషము వహించి యాయనను శిక్షించుటకయి బుస్సీని తన యావచ్ఛక్తిని వినియోగించి బహువిధముల ప్రోత్సాహపఱిచి పురికొల్పెను. అందుమీఁద బుస్సీగారు బొబ్బిలిరాజ్యమును విడువవలసినదనియు, దానికి బదులుగా నధికవైశాల్యమును మూల్యమునుగల దేశ మియ్యఁబడుననియు రంగారావుగారికి వ్రాసిరి. రంగారావుగారు పితృపితామహాగత మయిన బొబ్బిలిరాజ్యమును విడుచుట కంగీకరింపక పోవుటయేకాక తక్కిన సంస్థానాధిపతుల తోడిపాటుగా రాజమహేంద్రవరమునకు వచ్చి యాతనిని సందర్శింపక పోయెను. రాజమహేంద్రవరమున బుస్సీని దర్శించుటకయి విజయరామరాజుగారు మొదలగు సమస్త రాజులును వచ్చినప్పుడు రంగరావుగారు రాకుండుట లోనుగాఁగల కథను గవి యిట్లు చెప్పినాఁడు.

ఉ. రాజమహేంద్రపట్టణవిరాజదుదారతలంబున న్సము
త్తేజితమైన గౌతమనదీతటసీమను గోటిలింగవి
భ్రాజితమైన యొక్కనవపాదపమంజులనిష్కుటస్థలీ
రాజితలీలఁజేరి శిబిరంబు వడి న్విడియించె వేడుకన్.

* * * *

ఉ. కారుణికత్వ మేర్పడ సికాకుల పున్సరకారులో జమీ
దారుల రామరాజవసుధావలయేశ్వరముఖ్యుల న్ముదం

బారఁగఁ బిల్వఁబంపుమని హైదరుజంగున కాసతీయుఁ ద
చ్చారువచఃక్రమంబునను సత్వరుఁడై పిలిపించె వారలన్.

ఉ. పాయనివేడ్క విద్విషదపాయకరాయతబాహుశౌర్యు లా
పాయకరాయఁడుం గిడిడిపట్టణపుంభూషితైశ్వర్యుఁడు నా
రాయణదేవుఁడున్ నరసరాజు మఱిం గొలుగొండ మన్నెపున్
రాయఁడు నాదిగాఁగలధరావరు లంపఱు వచ్చి రత్తఱిన్.

గీ. ఉద్ధతులమూల్క సందర్శనోత్సుకత్వ
మాత్మఁ జిట్టాడ నాడాడ నలరుమన్నె
దొరలువచ్చిరి మానుషద్రోహప్రసంగ
కలితుఁడగురంగరాయఁడొక్కరుఁడుదక్క.

సీ. నిజభుజాదండ నిర్నిద్రకోదండంబు గాండీవకార్ముకక్రమముఁ జూపఁ
జరమభాగస్ఫుటచ్ఛటులతూణీరముల్ కవదొనసొంపు సంఘటిలఁజేయ
నాసీరముఖరనానాశంఖికధ్వనుల్ దేవదత్తరవోద్వృత్తిఁ దెలుప
సూరెలఁ బరతెంచుజులుమతీ తేజీలు ధవళాశ్వములమస్తు ద్రస్తరింపఁ
గలియుగార్జునుఁడౌర యీ ఘనుఁడటంచుఁ
దను జగజ్జన మెన్న నుద్ధతులమూల్క
వీక్షణాపేక్ష నేతెంచె విజయరామ
రాజరాజన్యలోకమార్తాండమూర్తి.

*   *   *   *

చ. నలువదివేలకాల్బలము నాలుగువేలతురంగమంబులున్
నలువదియేఁబదేనుఁగు లనంతములై నశతఘ్నికాచయం
బులు నొకవేయిలొట్టియ లపూర్వవిభావిభవంబు దెల్పుచున్
గొలువ పరాసుతేనిఁ గనుఁగోఁ జనుదెంచెను రా జతిత్వరన్.

ఇట్లీ కావ్యమునందు విజయరామరాజుగారు నలువదివేల కాల్బల ముతో వచ్చినట్లు చెప్పఁబడినను, ఆయనవెంట నిజముగా వచ్చినసేన

పదివేలని చరిత్రకారుఁడైన యార్మెనొరగారు వ్రాసియున్నారు. ఇట్లుండఁగా రంగారావుగారి యనుమతిమీఁదనే బుస్సీదొరగారు కొందఱు సిపాయిలను బొబ్బిలిరాజ్యముమీఁదుగా మఱియొకచోటికిఁ బోవుటకుఁ బంపిరి. విజయరామరాజుగారి తంత్రమువలననో రంగారావు గారి బుద్ధిపూర్వకమయిన యేర్పాటువలననో పంపఁబడిన సిపాయీలు త్రోవలో బొబ్బిలి భటులచే నెదిరింపఁడి ముప్పదిప్రాణములను గోలు పోయి మరలి రావలసినవారైరి. ఈయవమానము విజయరామరాజు గారి ప్రోత్సాహమునకు తోడుపడఁగా, బుస్సీగారు రంగారావుగారిని శిక్షించి వారిని కుటుంబసహితముగా బొబ్బిలినుండి వెడలఁదోలుటకు నిశ్చయించుకొనెను. ఇన్నూఁటయేఁబండ్రు గుఱ్ఱపు రౌతులును నాలుగు ఫిరంగులును గల ౭౫౦ యూరపియనులతోను, విజయరామరాజుగారి భటులును సిపాయీలును గలిసిన ౧౧౦౦౦ స్వదేశీయపదాతిబలము తోను బుస్సీగారు బొబ్బిలికోటమీఁదికి దండువెడలిరి. బొబ్బిలికోట యిన్నూరుగజముల వైశాల్యముగలిగి నలుచదరముగా నుండెను. నాలుగు మూలలను నాలుగు గుండ్రని బురుజులుండెను. వెలుపలిగోడల యెత్తు ఇరువదిరెండడుగు లయినను, లోపలిబురుజులయెత్తు పండ్రెండడుగు లే యుండెను. పయిని గోడల వెడల్పును పండ్రెండడుగులుండెను. ఇట్టి మట్టికోటయొద్దకుఁబోయి బుస్సీగారు తన సేనలను నాలుగుభాగములు చేసి యొక్కొక్కభాగమున కొక్కొక్క ఫిరంగినిచ్చి నాలుగుభాగము లను నాలుగు బురుజులను సాధింప నియమించెను. ౧౭౫౭ వ సంవత్స రము జనేవరు నెల ౨౪ వ తేదీని ప్రాతఃకాలముననే యుద్ధ మారంభ మయినది. శత్రువులు కోట బురుజులమీఁద ఫిరంగులు కాల్పనారంభింపఁ గానే, కోట లోపలివా రగ్నిభయముచేత బురుజులమీఁది కప్పుతీసి వేసిరి. ఉదయమున జాము ప్రొద్దెక్కువఱకు బురుజుల గోడలలో విశేష భాగము కంతలుపడినవి. అప్పుడు శత్రువులయొక్క నాలుగుభాగములు

నొక్కసారిగా నిచ్చెనలు గైకొని లగ్గలు పట్టుటకయి కోటగోడను సమీపించి గంటవఱకును బ్రయత్నించిరికాని కోటను రక్షించుచున్న భటులయొక్క శౌర్యమువలన నొక్కరయినను కోటగోడమీఁది కెక్క లేకపోయిరి. కోటలోపలివారు స్త్రీలుఁగూడ వేయింటికి లోపుగానే యుండిరఁట. కోటగోడల కెగఁబ్రాఁక బ్రయత్నించినవా రనేకులు గాయములతోఁ గ్రిందఁబడిరి. ఈయంశమును కవి యిట్లు వర్ణించుచున్నాఁడు—

ఉ. తగ్గపరాసుమండల ముదగ్రతమై బిరుదు ల్వచించుచున్
లగ్గల కెక్క రా బురుజులం దగుమన్నెకుమారసైన్యముల్
వెగ్గలమైన కోపమున వెన్కొనుచు న్నురుమాఁడువీఁకచే
నగ్గలికం దుపాకులఁ గిలార్చుచు నేయుచు రోయుచు న్వడిన్.

సీ. పొంగులురాఁగాఁగిపారలునూనియముంచిగరగలవంచియక్కఱగఁబ్లి
జిగురుటంబలివేఁడి దిగుపాఱజాఱఁగా గుండలకొలఁదిగాఁ గ్రుమ్మరించి
వసియూర్చుదారుయంత్రసముత్కరంబులు మేనులుచ్చిచనంగమీఁటివైచి
యొండొంటిఁదోఁడుగాగుండియలొదలల్గుఱిచేసిత్రుంపఁగాఁగుండ్లుదోలిపి
బిరుసుల దెరల్చిక్రొంబొగల్గురియనిసుప
గొట్టములదాల్చి మొద్దుటెగములఁగ్రుచ్చి
చిచ్చుబుడ్లవగల్చి నిస్త్రింశతతులఁ
బొడిచి పడఁద్రోచిరానేనఁ గడిమిత్రొక్కఁగ.

లగ్గలెక్కి కోటపట్టుటకు శక్యముకాకపోఁగా నంతట నాప్రయత్నముమాని శత్రువులు వెనుకకు మరలి మరల కోటమీఁద ఫిరంగులను గాల్వనారంభించిరి. అట్లు ప్రయోగింపఁబడిన ఫిరంగిగుండ్లు నొకచోటఁ గవి యీవిధముగా వర్ణించెను—

సీ. తట్టికోటయగల్చిదారుణోష్మలుగ్రమ్మ వంతదారుడాసి ప్రాలునవియు
నినుపతల్పుల ఘుణిల్లునఁదాఁకి పిటీఁదికి రవళిమైవచ్చిబిట్టవియునవియు

ద్వారబంధపుఁగమ్మిదూఱి యవ్వలికంట దుస్సిపాఱఁగ నోడి .
డొల్లునవియు
గుఱితప్పిపఱతెంచికోటముంగలిహస్తినఖపుదుమ్ములరేఁచినక్షునవియు
నగుచునొండొండెడ నెడయీక యంటిత్రూఁగి
బంతులాడినపగిది గుభాల్గుభాలు
నినదభయదార్భటులశతఘ్నిప్రయుక్త
తాళఫలసన్నిభాయస గోళతతులు.

ఈఫిరంగిప్రేట్లచేత కోటగోడ మఱింత పడిపోయి శత్రువుల కెక్కువ యానుకూల్యమును కలిగించినది. అయినను కోటగోడలు పగులుటచేత కోట కావలివారి ధైర్యకంచుకము పగులక వారినిమఱింత తెంపరులనుగాఁ జేసినది. కోటకావలిభటులు తమప్రాణముల కాశపడక తమగుహాలను కాపాడుకొను బెబ్బులులవలెఁ బోరాడిరి. ఫిరంగిగుండ్లు చిత్తజల్లులుగాఁ గురియుచున్నను వెనుతీయక వీరభటులు శత్రువులు కోటగోడల కెగఁ బ్రాఁకఁగానే యీటెలతోఁ గ్రుమ్మి క్రిందఁబడఁ ద్రోయవలెనన్న నిశ్చయముతో నిశ్చలులై కాలుగదల్పక బురుజుల మీఁద నిలువఁబడిరి. ఆగ్నేయాస్త్రముల నపహసించెడు శతఘ్నికా ప్రయోగములముందఱ కేవల భుజవీర్య మేమి పనికివచ్చును? క్రింద నున్న సైనికులు గుఱిచూచి తుపాకులు కాల్చి బురుజులమీఁద నున్న వారి ననేకులను రూపుమాపిరి. స్వదేశ సైనికులయం దీవఱ కెన్నఁడు నేయుద్ధమునను గనియుండని యిటువంటి యసమాన ధైర్యసాహసముల కద్భుతపడి శత్రువులు సహితము పలుమాఱు వారి కభయప్రదానము చేసిరిగాని యావీరభటులు శత్రువుల వాక్యములను తిరస్కారపూర్వకముగా నిరాకరించి తమదేహములలోఁ బ్రాణము లుండఁగాఁ దమ తావు విడువమని యక్కడనే సుస్థిరులై పర్వతమువలె నిలువఁబడిరి. అప్పటికి మధ్యాహ్నము రెండుగంట లయినను శత్రువులలో

నొక్కరును కోటనోడ నెక్కలేకపోయిరి. అందుచేత శత్రువులు కొంత సేపు యుద్ధము నిలుపవలసినవారైరి. అప్పుడు రంగారావుగారు శత్రువులతోఁ బోరాడి గెలువఁగలనన్నయాశ వదలుకొని తనవారిని బిలిచి యాలోచించి యంతఃపురస్త్రీలు శత్రువులచేతులోఁబడి మానమునోలుపోకుండ కాపాడవలెనని నిశ్చయించి శిశుసహితముగా వారినందఱిని సంహరించుటకయి కొందఱిని నియమించెను. వారప్పుడే చేతులలో బాకులతోను బల్లెములతోను గదలిపోయి యంతఃపురము వాకిట గడ్డినించి గృహముల కగ్నితగిలించి ఘోరసంఘాత మరణమునుండి తప్పించుకొని ప్రాణములఁ దక్కించుకొనఁ బాఱుతెంచిన శిశువులను సహితము పుత్రులనక దయాపాత్రులనక క్రూరులై పొడిచి చంపిరి. ఈదారుణ కృత్యమును గవి యిట్లు చెప్పియున్నాఁడు—

క. చెలికాని వంశసంభవు । నలఘుతరస్థైర్యు ననిచె నవరోధవధూ
కులకంఠనాళకృంతన । కలనాదారుణవిధానకలనత నెత్తెఱఁగా.

తే. అతఁడు నభిమానరక్షణార్థప్రచార
దారుణాకార సాహసౌద్ధత్యమమర
నంతిపురి కేగ మొఱసె దిగంతరములు
ధరణి వడవడవడఁకె భూతలము బెగడె.

తే. రామమణిరాణి తనకుమారాగ్రయాయి
నపుడ కొండొకదాదికి నప్పగించెఁ
గోటవెడలించి బ్రతికించుకొమ్మటంచు
నట్లు కావించెనా దాయియడలువోడమ.

* * * *

క. ఘననిశితఖడ్గధారన్ । మొనకొని చెలికానివంశమూర్ధన్యుఁడు పెం
పున వడివడి నంతఃపుర । వనితాజనతాతిచిత్రవధవిధి నడిపెన్.

తే. తక్కఁగల యట్టియభిమానధనులువెలమ
లోక్కనూటిండ్లవా రనలోగ్రశస్త్ర
నిహతులై రంగనాశిశుసహితు లగుచుఁ
దద్విదారణమెంతని తలఁప వచ్చు.

దురభిమానజనితమైన వధూశిశుసంహారక్రూరకార్యము ముగియఁగానే ప్రాణములకు తెగించి వారందఱును మరల యుద్ధోత్సాహముతో వచ్చి తమస్థానముల నిలిచిరి. నాలుగు భాగములలో నొకభాగమునకు నాయకుఁడైన లాదొరగారు దూరమునుండి యగ్నిదాహమునుజూచి లోపలి కావలిసేనలు పలుచనగుట కనిపెట్టి యీలోపల లగ్గలు పట్టుటకయి మరలవచ్చెను. నిచ్చెనలతో పయికెక్కఁ బ్రయత్నించినవా రనేకులు నిహతులయి క్రిందఁగూలుచు వచ్చినను గొందఱు శూరు లొక్క బురుజుపై నెక్కి నిలువగలిగిరి. వారి వెంబడినె మఱి కొందఱును కోట గోడల కెగఁబ్రాకి బురుజు చేరిరి. రంగారావుగారు శత్రువులను బాఱఁద్రోలి యాబురుజు రక్షింపవలెనన్న యాశతో హతశేషులైన భటులతో వచ్చుచు నొకగుండుదెబ్బతో నేలఁగూలి వీరశయనము నొందెను. ఆయనపాటువలనఁ గలిగిన సక్రోధశోకోద్రేకముతో లోపలనున్న వీరభటబంధువర్గమంతయు పగదీర్చుకోవలెనన్న దృఢనిశ్చయముతో తక్కిన బురుజాలను విడిచి యక్కడకు వచ్చిచేరెను. అంతట తక్కిన శత్రుసేనాభాగములు మూడును వరుసగ నాయాబురుజులనుజేరి యరక్షితము లయియున్న యామూడు బురుజుల ననాయాసముగా సాధించి లోపలఁ బ్రవేశించెను. ఇట్లు లెక్కకు మిక్కిలిగా శత్రుసేనలు నానాముఖముల వచ్చి చుట్టు ముట్టినను లోపలనుండి కోటను సంరక్షించుచున్న వీరభటులలో నొక్కఁడైనను బాఱిపోవుటకుఁగాని శత్రువులకు లోఁబడి శరణు చొచ్చుటకుఁ గాని ప్రయత్నింపలేదు. ప్రతిభటుఁడును వీరరసము మూర్తీభవించినట్లాయుధపాణియై శత్రున కభిముఖముగా

నడిచి శత్రువును పొడిచి తాను పడిపోవుచు వచ్చెను; గాయపడి భూమి మీఁద నొరిగినతరువాత సహితము ప్రాణములు పోఁదిలోనుండి వెడలు వఱకును దనచేతిలోని ఖడ్గముతో దాపునకు వచ్చిన శత్రువును నఱకవలెనన్న ప్రయత్నమును మానలేదు. ఇది కావ్యమునందుఁ గవి చేసిన వర్ణనముగాక యింగ్లీషు చరిత్రకారుఁడు వ్రాసిన సత్యాంశమగుటచేత బొబ్బిలికోటలోని రణశూరులు చూపిన విచిత్రపౌరుష మత్యంత శ్లాఘాపాత్ర మయిన దనుటకు సందేహములేదు. ఇట్టి వీరవధ కొంత సేపటి కెల్లను సంపూర్ణ మయిపోయెను. కోటలో జరిగిన ప్రాణనాశన మునకుఁ గరఁగినహృదయులయిన శత్రువులు సహితము జాలిపడుచు విచారించుచున్న యీసమయమునందు గుంపులోనుండి వృద్ధుఁ డొకఁ డొక బాలునిఁ జంకఁ బెట్టుకొని తిన్నగా లాడ్దొర యున్నచోటికి వచ్చి "ఈశిశువు రంగారావు కుమారుఁడు. తండ్రి యభీష్టమునకు విరుద్ధముగా నేనీబాలకుని ప్రాణములను గాపాడితిని" అని పలుకుచు, ఆసేనా నాయకునకు బాలు నొప్పగించెను. లాడ్దొర యప్పుడే యాబాలకుని బుస్సీదొర యొద్దకుఁ బంపఁగా, అతఁ డాశిశువును వృద్ధుని తనసేనాని వేశమునందుంచి యాదరించి యాశిశువుయొక్క సంరక్షణభారమును తాను వహించి శత్రుభయమువలన శిశువును గాపాడుటకయి తగిన కావలివారిని నియమించి యప్పుడే యాశిశువును బొబ్బిలిరాజ్యమున కభిషిక్తునిఁ జేయుచు లేఖ్యములు వ్రాయించెను.

నాఁటి రాత్రియు మరుసటిదినములు రెండును గాయములు తగిలిన భటులయొక్క చికిత్సలు మొదలయిన పనులతోఁ గడచెను. మూఁడవనాఁ డర్ధరాత్రమునందు విజయరామరాజుగారుండిన పటమందిరములో గొప్ప సంక్షోభ మొకటి పుట్టెను. రంగారావుగారు విహతులయిన దినమునం దాయన నమ్మిన వీరభటులు నలుగురు కోటలో నేమూలనో దాఁగియుండి చీకటి పడినతరువాత కోటదాటిపోయి

విజయరామరాజుగారి శిబిరముల వెనుకనున్న యడవిఁ జొచ్చి చేరువ పొదలలో దాఁగియుండిరి. సమయము నిరీక్షించుచు వా రక్కడ రెండు దినము లుండి మూడవనాఁటి రాత్రి స్కంధావారము సద్దణఁగిన తరువాత నిశీథసమయమునందు వారిలో నిద్దఱు పొదలలోనుండి వెడలివచ్చి కావలివాండ్రను మోసపుచ్చి గూఢముగా విజయరామరాజుగారు నిద్రించుచుండిన పటకుటీరములో వెనుకవైపునుండి ప్రవేశించి యిద్దఱు నొక్కసారిగా తమబాకులతో పొడిచి విజయరామరాజుగారి వక్షస్థలమును గంతలు చేసిరి. మొదటి పోటుతో మేలుకొని విజయరామరాజుగారు మూల్గఁగానే వెలుపలినుండి కావలిభటుఁడు వచ్చి తుపాకితో కాల్చెనుగాని గుఱితప్పిపోయెను. ఇంతలో నితరభటులును వచ్చి వెంటనే యాహంతకులను జంపి ముక్కముక్కలుగా నఱికివేసిరిగాని యీలోపలనే వారు విజయరామరాజుగారిని ముప్పదిరెండుచోట్లఁ బొడిచిరి. ఇట్లు విజయరామరాజుగారిని జంపినతఁడు తాండ్రపాపయ్య యని కవి యిట్లు చెప్పియున్నాఁడు—

గీ. కదిసి పైఁబడి యొకకేల నదిమిపట్టి
వాఁడివాలున వక్షఃకవాటపాట
నంబుఁ గావించె నతని యానాభికుహర
విదళితాంత్రవ్రజంబులు వెలికినుఱుక.

* * * *

మ. అపు డాతాండ్రకులాభిమాననిధి యాహా రాజదేవేంద్ర నీ
విపులప్రాభవశక్తి నీనిఖిలపృథ్వీభారధౌరేయతా
నిపుణత్వంబును భాగ్యముల్ వృథ చనన్ నీచేయుదుశ్చేష్ట ని
ట్లుపభోగింపఁగనయ్యె నిట్టివెతయం చుద్వృత్తి వర్తిల్లఁగన్.

గీ. తాండ్రపాపయ్యపలుపు ధౌర్త్యంబువలన
క్షత్రవర్యుండుపులివాటికండయయ్యె

ననేడు రౌద్రప్పుట్టె నంత నయ్యవనినాథు
బలము లాత్తరవంబునఁగలయ జర్వె.
సీ. తనచావు సర్వసిద్ధంబుగా మదిఁగోరి
సాహసకృత్యకీనై చన్నవానిఁ
దని సేలికవిరోధిదర్పంబుమాపుట
పరమార్థమని నేఁటుకఁటు మవానిఁ
దనపడినట్టిబన్నముల కిక్కార్యంబు
ఫలరూపమని యాత్మఁదలఁచువానిఁ
దనకులస్వాములందఱు మెచ్చుకొన నోర్చి
పగదీర్చుకొన్న సంభ్రమమువానిఁ
దాంధ్రకులజుని బొదివిరి దారుణముగ
ఘోరయుద్ధంబుసలిపి యవ్వీరవర్యుఁ
జదిమివై చిరి కతెననిస్త్రీఁశతతుల
నతనిసహచరయుగళసంగతముగాఁగ.

ఇట్లు మొదటవచ్చిన యిద్దఱు దమ ప్రాన్కాని సాధింపలేక పోయిన పక్షమున, పొదలలో దాఁగియుండిన తక్కిన యిద్దఱునువచ్చి విజయరామరాజుగారి ప్రాణములుగొని తమ స్వామిఋణము తీర్చుకొనుటకు శపథము చేసికొనిరఁట! విజయరామరాజుగారు భృత్యులకై దండగొనక నడువలేనంత స్థూలకాయులని చరిత్రకారుఁడు వ్రాయుచున్నాఁడు. యుద్ధములోఁ బ్రాణము దక్కించుకొన్న రంగారావుగారి తమ్ముఁడు వెంగళ్రావుగారు భద్రాచలమునకు పాఱిపోయి, ఆనందరాజుగారు బందరు వెళ్ళి యున్నప్పుడు ౧౭౫౯వ సంవత్సరమున మరలివచ్చి తనకుటుంబము నెడల విశ్వాసముగల ఫ్రెంచిసేనను గూర్చుకొని రాజాముకోటను స్వాధీనము చేసికొనెను. వెంగళ్రావుగారు మూడుసంవత్సరములు ప్రభుత్వముచేసి మృతినొందఁగ, ఇంతకుముందొక వృద్ధునిచే ప్రాణరక్షణము

చేయఁబడినట్లు చెప్పఁబడిన గోపాలవేంకటరావుగారను చిన్న రంగారావుగారు రాజ్యమునకువచ్చి నాల్గుసంవత్సరములు పాలనము చేసిన తరువాత ౧౭౭౯ వ సంవత్సరమున సీతారామరాజుగారాయనను చెఱసాలలోఁ బెట్టించిరి. ఆయన ౧౭౯౦ వ సం॥రమునందందుండి తప్పించుకొని నిజాము రాజ్యమునకు పాఱిపోఁగా, ౧౭౯౪ వ సంవత్సరమునం దింగ్లీషువా రాయనను బిలిపించి పూర్వుల బొబ్బిలిరాజ్యమంతయు మరల నిచ్చిరి.

ఈ నారాయణకవియొక్క కవిత్వమునందు లక్షణదోషములు కొన్ని యందందుఁ గానఁబడుచున్నను కవనము రసవంతమయినది. ఈ ప్రబంధమునందు వీరరస మించుమించుగా భారతమునఁ దిక్కన సోమయాజిచే వర్ణింపఁబడినట్లు వర్ణింపఁబడినది.

---

40. అత్తలూరి పాపకవి

ఈ కవి చెన్నబసవపురాణమను నయిదాశ్వాసముల పద్యకావ్యమును రచియించి మా పూర్వులలో నొకరయిన కందుకూరి యమృతలింగముగారి కంకితము చేసెను. మా పూర్వులు మహామ్మదీయ ప్రభుత్వములో "దేశపాండ్యా" లయి ఘనతను బొంది పెక్కు కావ్యములను కృతులనంది కవుల నాదరించియున్నారు. పూర్వము కృతిపతులయిన వారిని గూర్చిన కొన్ని పద్యముల నీపుస్తకమునుండి యిందుదాహరించుచున్నాను.

ఉ. ఆతతకీర్తికై కువలయాశ్వచరిత్రకృతిన్ గ్రహించిప్ర
స్ఫీతము లైన కొత్తపలి యేలెటిపా డనునగ్రహారముల్
ఖ్యాతిగఁజేసి బంధులకు గ్రాసనమృద్ధు లొసంగి శాంభవ
వ్రాతము గోర్కు లిచ్చి విభవంబున మల్లనమంత్రి వర్ధిలెన్.

కందుకూరి మల్లికార్జునమంత్రి కువలయాశ్వచరిత్రము కృతినందిన తరువాత.

సీ. మహితపంచాక్షరీమాహాత్మ్యమును గృతి
యందిత్రైలోక్యవిఖ్యాతిఁ గాంచె
సతిభక్తి శ్రీశైలమునందు మానులు మెచ్చ
సంవత్సరము నివాసంబు చేసె
నిష్టాగరిష్ఠుఁడై నేఁడునాఁడనక య
సంఖ్యమాహేశ్వరార్చన మొనర్చె
హితుల రక్షించి యహితుల శిక్షించి భూ
పతుల వశ్యులఁజేసి చతురుఁడయ్యె
నితని కెనయైనమంత్రులీక్షితితలమునఁ
గలరెయని సర్వజనములుఁ బలుక నెగడె
గండపెండార మల్లికార్జుననందనుండు
సంగరగుహుండు వీరేశలింగవిభుఁడు.

వీరేశలింగమంత్రి పంచాక్షరీమహాత్మ్యము కృతినందెను. అటు తరువాత

సీ. నారదప్రభ మించి నారదప్రభ నెంచి యమరినకీర్తిదానములవాఁడు
చిత్రభానునిమీఱి చిత్రభానునిగేరి పరఁగుశుచిప్రతాపములఁవాడు
భీముపేర్మినిగెల్చి భీముపేర్మినగల్చి వఱలినభూతిసత్వములవాఁడు
ధర్మగర్మముఁద్రోచిధర్మగర్వముఁబాచి తగుశివభక్తిసత్యములవాఁడు
జగతిఁ జెలువొందె నుదయాస్తశైలసేతు
శీతనగమధ్యరాట్సభాసీనవిబుధ
వినుతసుగుణుఁడుమల్లికార్జునసుతుండు
మహితధృతిశాలిబసవరాణ్మంత్రివరాళి.

క. ఘనముగ నైతముపూడియు
మినుమించిలిపాడు సిరులు మించంగ నొసం

గెను గురుచరవరులకు బస
వనిత్తో నెనయైనమ్మంత్రి వసుధఁగలఁడే.

క. తన మేనయల్లుఁ డావృతి । వినయుం డగుబుద్ధిరాజు వీరనచేతఁ
గొనె సత్యవతీపరిణయ । మనుకృతి శ్రీబసవమంత్రి యతిసంప్రీతిన్.

కందుకూరి బసవరాజుగారు సత్యవతీపరిణయమును గృతినందిరి. అటుపిమ్మటఁ గందుకూరి యమృతలింగముగారి చెన్నబసవపురాణమును గృతినందిరి. కృతిపతియొక్క పెదతండ్రియైన సాళువపతి

గీ. సుగుణు లగుమల్లికార్జునసుతులలోన
నాలుగవనందనుండగుసాళువపతి
సంతతాత్మీయహృదయపద్మాంతరాళ
సంచరత్సాళువపతి ప్రశస్తిగాంచె.

శా. ఢిల్లీనాయకుచేత దంతిహయశాటీముఖ్యవస్తువ్రజం
బెల్లం గైకొని కాశికాప్రముఖగౌరీశావను ల్గాంచి ని
త్యోల్లాసంబున శంకరార్చనలు దివ్యక్షేత్రముల్ గావించి సం
ఫుల్లాంభోరుహలోచనామదనుఁడై పూర్వప్రభ న్వర్ధిలెన్.

అని ఢిల్లీనాయకునిచేత బహుమానము లందినట్లు చెప్పఁబడి యుండుటచేతను, ఢిల్లీరాజ్యము నశించి నూఱుసంవత్సరములకంటె నధికకాలమగుటచేతను, కృతిపతియు కృతికర్తయు నుండినకాలము నూఱుసంవత్సరములకుఁ బూర్వమని చెప్పవచ్చును. ఈ గ్రంథమునకుఁ గథానాయకుఁడయిన చెన్నబసవన్న వీరశైవమతమును స్థాపించి కళ్యాణ నగరమునందు బిజ్జలరాజునకు మంత్రియైయుండి యాతనివధించిన బసవేశ్వరునకు మేనల్లుఁడు. బసవేశ్వరుఁడు తన యధికారబలముచేత శైవమతమును వ్యాపింపఁ జేసినను చెన్నబసవన్నయే యధికమతాభినివేశము కలవాఁడయి మతవ్యాపనమునకు ముఖ్యకారకుఁడయి యుండినవాఁడు. బసవేశ్వరుఁడు శ్రీశైలమునకు సమీపమునయున్న యొక గ్రామములో

బ్రాహ్మణదంపతులకుఁ బుట్టి యుపనయన సంస్కారము చేసికొనక శివ భక్తుఁడయి లింగమును కట్టుకొనెడి యాచారమును మొదట నేర్పఱిచెను. ఈ చెన్నబసవపురాణములో నక్కడక్కడ లక్షణవిరుద్ధము లయిన ప్రయోగములు కానఁబడుచున్నను, కవి మిక్కిలి ప్రౌఢుఁడయి హృద్యముగా పద్యరచనను జేసియున్నాఁడు. కవిత్రాత యక్కరాజు; తండ్రి శ్రీగిరిమంత్రి. ఈతనిది కౌశికగోత్రము. చెన్నబసవపురాణలోని కొన్ని పద్యము లిందుదాహరింపఁబడుచున్నవి.—

చ. కనుఁగవఁ గెంపునింప నలుకన్ బసవేశుఁడుఁజూచి బిజ్జలుం
డనియెఁ బ్రధానశేఖరుఁడవై నుతిగాంచుట వన్నె కెక్కె యి
ట్లనుచితవృత్తికిం దగిలి యగ్రజ చీఁకటితప్పు సైపఁ గూ
డునె కులశీలమానములు డొంకిచనన్ ధరణీతలంబునన్. ఆ-౧

ఉ. ఎక్కడనుండివచ్చెనొకొ యీ ముదిజంగము వానిపూయలోఁ
జిక్కె తరాలనుండి యొకచీమకుఁ బోవఁగనీక దాఁచు నా
చక్కనిపిండి నన్నదిమి సర్వముఁ బెట్టఁగఁబంచె నింక నే
నెక్కరణి న్వసింతు మరు లెత్తి వ్యయం బొనరించు సానితోన్. ఆ-౨

మ. ఇతఁడా శ్రీగిరిమల్లికార్జునుఁడు సామీ లెస్సబాగాయె నీ
మతిలో నేమితలంచి దైవ మని సంభావించి కావింపఁ జూ
చితి నే వెఱ్ఱినిగాను వేలు పని దర్శింపంగ నాత్తోడనా
చతురత్వంబులు చాలు దేవు నిఁక దాఁచంబోక కావింపవే. ఆ-౩

చ. అతులనదీప్రవాహమున నాడది యీడది రెండుకాష్ఠముల్
జతపడి కొంతదవ్వరిగి లంక తటాలున నడ్డమైన నా
జత విడి యొక్క టోగు నటుసాగక యొక్కటి నిల్చుఁ గావునన్
వెత కుడువంగ నేల నను వీడె నతండని నెమ్మనంబునన్. ఆ-౪

ఉ. నిద్దురలేచి యాఘనుఁడు నీలగళున్ స్మరియించు వేళ నా
పెద్దయ సంచరించుపడిసేనుల సోఁకిన నావుదూడయో

మొద్దొ యటంచుఁ దాసియని యే డ్తెఱ ముమ్మఱుఁబల్క నాతఁడీ
ప్రొద్దుటి కబ్బె నాకు గురుబోధితమంత్ర మటంచు నాత్మలోన్. ఆ-౫

---

41. కస్తూరి-రంగకవి

ఈకవి లక్షణచూడామణియను నామాంతరముగల రంగరాట్ఛం దస్సును రచియించుటయేకాక సాంబనిఘంటువు, కృష్ణార్జునసంవాదమ నెడి యైదాశ్వాసముల కావ్యమునుగూడ రచియించెను. ఇతఁడార్వేల నియోగిబ్రాహ్మణుఁడు; ఈతనితండ్రి వేంకటకృష్ణయామాత్యుఁడు; తల్లి కామాక్షమ్మ. ఇతఁడు ౧౭౫౦ వ సంవత్సరప్రాంతములయందు తంజావూరి సంస్థానమం దుండినవాఁడు. శంకరవిజయమును రచియించిన యాంధ్ర కాళిదాసు తా నీకవికి శిష్యుఁడయినట్టు తన గ్రంథమునందు వ్రాసికొనియున్నాఁడు. కస్తూరిరంగకవి విరచితమైన రంగరాట్ఛందములో ననేకాపూర్వగ్రంథములనుండి పెక్కు పద్యములు లక్ష్యములుగాఁజూపఁ బడియున్నవి. ఆయాకవులకు కర్తృత్వమారోపింపఁబడిన యాగ్రంథ ములు కొన్ని యెంతవఱకు సత్యమైనవో యింకను విచారింపవలసి యున్నది. ఇతఁడు మంచికవి. ఈతని కవిత్వనైపుణి దెలుపుటకయి కృష్ణా ర్జున సంవాదములో నొక్కొక్క యాశ్వాసమునుండి యొక్కొక్క పద్యము నిందుదాహరించుచున్నాను.

ఉ. తమ్ములబ్రాలి పుష్పరసధారలఁగ్రోలి సుగంధగంధవా
హమ్ములఁ గ్రాలి తేనియలయందపువాఁకలఁదేలి పువ్వుజొం
పమ్ములసోలి కింశుకసుమమ్ములవ్రేలి ప్రియాళి నేలి ఝం
ఝుమ్మని క్రమ్మి తుమ్మెదలు చొప్పడుచున్నవి కాననంబునన్. ఆ-౧

ఉ. హా విధి యెంతచేసె నహహా యిపు డెంతటిమాట వింటి నా
హా విపరీతదుర్దశల నందితి హా యిఁకమీఁదఁ నన్ను సం

భావనచేసి ప్రోవఁగలవా రెవరం చని యూగయుండు నెం
తే వెతఁ జెంది కన్నుఁగవ నీ రొలుకం బలవించి వెంజియున్. ఆ-౨

మ. అతివ లోకాండజు పద్దఁజేరి యిదియేమమ్మా మహారాజుగా
సుతుఁ డుం డుండఁగ పాకెసారెకు నిట్టుల్ శోకింపుట ల్మీకు సం
గతి కాదమ్మ సహించవమ్మ గయునిం గాంతేయు లెల్లన్నయో
న్నతి రక్షించిరి నమ్మవమ్మ యని నానాకీతులం బెల్పుచున్. ఆ-౩

శా. యుష్మత్సాంద్రచమూసమూహభుజగరోద్వ్యగ్రాంధ కారంబునన్
గ్రీష్మోద్యత్సమయప్రచండకరసంకీర్ణార్కసంకాశమ
ద్భీష్మాస్త్రంబుల నేసి మాన్చి తుది నీబీరంబు వారించెదన్
భీష్మాచార్య యొకింత నిల్వుమని గంభీరాట్టహాసోగ్రుఁడై. ఆ-౪

చ. తరణి సుధాకరుల్ గతులు తప్పఁ గులాచలము ల్వడంక ది
క్కరులు చలింప సర్వసురకాండము లంబరవీధి భీతిచే
నొరగఁ బయోధు లింకఁగ మహోద్ధతి మంటలు గ్రక్కుకొంచుఁ దీ
వరముగఁ గ్రీడిపైసి ఘనవైష్ణవసాయక మేగుదెంచినన్. ఆ-౫

---

42. ఆలూరి కుప్పనకవి

ఈకవి యానందగిరికృతమైన శంకరవిజయము నాఱాశ్వాసముల పద్యకావ్యమునుగా రచియించెను. ఇతఁడు వైదికబ్రాహ్మణుఁడు; వేంకటగిరిపౌత్రుఁడు; వేంకటేశ్వరార్యునకును నరసమాంబకును పుత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; కాశ్యపగోత్రుఁడు.

క. ఘనుఁ డగుతుళజేంద్రుఁడు దయ। దనరఁగ నీ కాంధ్రకాళిదాసాభిధ మ
న్ననగా నొసంగెనఁట నీ। యనుపమసాహిత్యమున కహో యెన గలదే?

అని కవి తనకు తంజావూరుమహారాజగు తుళజేంద్రుఁ డాంధ్రకాళిదాసను బిరుదిచ్చినట్లు చెప్పుకొనియున్నాఁడు. ఈతుళజేంద్రమహారాజు

ప్రతాపసింహమహారాజు పుత్రుఁడు. క్రీస్తుశకము ౧౭౮౦ వ సంవత్సరము మొదలుకొని ౧౭౯౬ వ సంవత్సరము వరకును తండ్రి రాజ్యమునుచేసి మృతినొందఁగా, తుళజేంద్రు డీకడపటి సంవత్సరమున సింహాసనమెక్కి ౧౭౮౭ వ సంవత్సరమునందు మృతినొందెను. ఈమహారాష్ట్ర ప్రభువు చేత నాంధ్రకాళిదాస బిరుదాభిదాన మందిన మనకవి నూరు నూట యిరువది సంవత్సరములక్రిందట నుండినవాఁడు. ఇతఁడు చెన్నపట్టణ ములో నుండిన నియోగుల ప్రార్థనమీఁద దాసీశంకరవిజయమును వెనిఁగించినట్లుకవి యిట్లువ్రాయుచున్నాడు.

సీ. శ్రీపార్వతీశలక్ష్మీశసేవాసముపార్జితమహనీయభాగ్యయుతులు
ఘటనాఘటనసముత్కటమనీషాతిచమత్క్రియాధోరణీమంజుమతులు
నతులితసామదానాద్యుపాయైకవిచక్షణాక్షీణశాశ్వతచరితులు
హితపురోహితనిజాశ్రితబాంధవావనామాననిస్తులితాన్నదానరతులు
కలితయజనాదిమహితషట్కర్మనిరతు
లగణితజగన్నుతాద్భుతసుగుణతతులు
సారలౌకికవైదికాచారభృతులు
చతురచెన్నపురీచరత్సచివతతులు.

* * * *

క. నను శ్రీనృసింహపాదా। ర్చనజపితలసత్కవిత్వచాతుర్యగుణా
ఢ్యుని నాంధ్రకాళిదాసా। ఖ్యునిఁబిల్వఁగఁబంచిపల్కిరున్నతకరుణన్.

సీ. లీలఁ బంచనదీస్థలీపురాణము తెలిఁగించితి వాహూఢకీర్తిమెఱయఁ
బరఁగు రామాయణభాగవతంబులు యక్షగానములుచేసి తద్భుతముగఁ
గరమొప్ప పరమభాగవతచరిత్రయన్ కృతియొనరించితున్నతిఁ బలిర్పఁ
జెలివొంకు నిందుమతీపరిణయ నామకృతి రచియించితి వతులగరిమ
గురుతరోజ్జ్వలసరణితో సురకథాసు
ధారసాభిధకావ్యముదారఫణితి

గా రచించితి వెనలేని గద్యపద్య
తతుల లెక్కింపఁదరమె త్వత్కృతులుజగతి.

* * * *

వ. కావున జగద్గురుండై విశేషించి మనకు గురుండైన యాచార్యునివిజయంబు......నొకరించి మాకెంజెల్లుకి సత్యానందం బొనఁగూర్చుమని యాశీర్వచన రూపంబుగా నిర్దేశించి పలికి యనేకరీతుల సత్కరించిన............

సీ. కార్యఖడ్గకవిత్వకరణికచాతురి యిలఁ బరికింప మీ యింట్లబిరుదు
సలలితయజనాదిషట్కర్మనిరతులు ఖ్యాతిరంజిల్లు మీ జాతిబిరుదు
ధైర్యదాతృత్వౌచితజ్ఞతాదిగుణైకసరణి మీసాంగత్యసహజబిరుద
మనుగతంబగుపాలనానూనచాతుర్యమమరుమీభవ్యగోత్రములబిరుద
మట్టిమీరలు నాపట్ల నతులకృపను
గురువిజయమిట్లు తెలిఁగింపఁగోరుకొనుటఁ
గలిగె నిలమీఁద యోగంబుసిలువరముగ
సారెకునియోగ మెంతని సన్నుతింతు?

పయిపద్యములలోఁ జెప్పఁబడినదానినిబట్టి కవి యాశంకరవిజయమునుగాక యాంధ్రకృతులను మఱియుఁ బెక్కింటిని రచించినట్లు కనుపట్టుచున్నది. రంగరాట్ఛందస్సును రచించిన కస్తూరి రంగకవి తనకు విద్యాగురు వయినట్లు చెప్పి కవి గ్రంథాదియందాతని నిట్లు స్తుతించియున్నాఁడు—

సీ. భారతి కేవిప్రవర్యునిజిహ్వ నిత్యముగ వసించునాస్థానవాటి
వాణీవధూటి కెవ్వానినుస్వలుకులు ధరియించినట్టిసుత్యములచాలు
శారద కేసుధీస్వామిచేతోవీథి యమరినరత్నసింహాసనంబు
పలుకులవెలఁది కేభాగ్యునిగృహంబు నెట్టుగా వసియించు పుట్టినిల్లు

నలువచెలువకు నెవ్వఁ డెన్నఁదగుపుత్రుఁ
డట్టికస్తూరిరంగార్యు నచలధైర్యు
నార్యనుతచర్యు మద్గురువర్యు నెంచి
ప్రణుతిగావింతుఁబలుమాఱుఁబస్తుతింతు.

మొత్తముమీఁద నీ యాంధ్రకాళిదాసునికవనము సరసమైనదని చెప్పవచ్చును. శంకర విజయములోని కొన్ని పద్యముల నిందుదాహరించు చున్నాను—

శా. ప్రాచుర్యం బగుతావకీనకథితప్రఖ్యాతసంశుద్ధ వే
దాచారంబులు మాని తప్తతనులై యాయాకుచిహ్నంబులన్
వైచిత్ర్యంబుగఁ దాల్చి విప్రముఖులో వారెల్ల నత్యంతమి
థ్యాచారంబున సంచరించెదరు దర్పారూఢులై యీశ్వరా. ఆ-౧

చ. అనయము నైజధర్మములయందుఁ జలింపక మిత్రశత్రుభా
వనల స్వపక్ష మంచుఁ బరపక్ష మటంచుఁ దలంప కెంతయున్
ఘనసమబుద్ధిమీఱఁ గలఁకంగొన కెవ్వరి నొవ్వనీయకే
పనుపడి స్వస్థచిత్తుఁ డగువాఁడుసుమీ హరిభక్తుడెంతయున్. ఆ-౩

మ. నను నీభక్తుఁ డటంచు నెంచ కిల విన్నాణంబుగా నిట్లొన
ర్చినయజ్ఞానుల నేమిపల్క నిఁక నీచిత్తంబు నా భాగ్య మో
యనుకంపానిధి నిన్ను నమ్మితిని నెయ్యంబొప్ప నీవేళ నీ
యనలార్తిం దొలఁగించి ప్రోవుము నృసింహా దీనకల్పద్రుమా. ఆ-౬

43. పింగళి ఎల్లనార్యుఁడు

ఈ కవి సర్వేశ్వరమాహాత్మ్యమను నామాంతరముగల తోభ్య చరిత్రమును రచియించెను. తోభ్యచరిత్రము నాలుగాశ్వాసములుగల క్రైస్తవగ్రంథము. "ఇది శ్రీమదివ్వటూరి శరభనారాధ్య సద్గురుప్రసాదలబ్ధాష్టవిధకవిత్వప్రవీణ" అని గద్యమునందు వ్రాసికొనుటచేతను,

సీ. భక్తిమై రేణుకప్రముఖోత్తము నుతించి
మాయదేవాహ్వయుమహిమ పొగడి
చెలఁగి యథావాక్యముల నన్నమయగారి
భజియించి మ్రొక్కెడి పాలకురికి
సోమన్నగారిఁ బ్రస్తుతిచేసి ప్రియమంది
శివదేవముఖనవకవుల నెంచి
గణపతిదేవుని ఘనతసన్నుతిచేసి
వేమనఁ గీర్తించి విమలమతిని
వ్యాసవాల్మీకికాళిదాసాదిఘనుల
నన్నపార్యునిఁ దిక్కనయజ్వ నెఱ్ఱ
ప్రెగడ ధూర్జటిఁ బోతన భీమకవిని
జెలఁగి శ్రీనాథముఖకవిశ్రేణిఁ దలఁచి.

అని శివభక్తులను ముఖ్యముగా నుతించి యుండుటచేతను, ఈ కవి శైవుఁడయిన నియోగి బ్రాహ్మణుఁడని యూహింపఁదగి యున్నాఁడు. ఇతఁడు క్రైస్తవుఁడుగాక శైవబ్రాహ్మణుఁడే యైనపక్షమున, క్రైస్తవమతగ్రంథ మేల చేసెనో తెలియకున్నది. ఇతఁడు క్రైస్తవమతావలంబనముచేతఁగాని, ధనాపేక్షచేతఁగాని యీ గ్రంథమును రచించి యుండును. కవి భారద్వాజగోత్రుఁడు; పింగళి నాగయామాత్యపుత్రుఁడు. ఇతఁడు కృష్ణామండలములోని కొండవీటిసీమయందుండిన నియోగి

బ్రాహ్మణుఁడు. ఈ కవి తుమ్మరాయపరెడ్డి ప్రేరణముచేత నీ గ్రంథమును రచియించెను. ఈ సందర్భమునఁ గవికృత్యాదిని వ్రాసిన పద్యములఁ గొన్నిటి నిందుదాహరించుచున్నాను—

చ. తనర విదర్భసీమ కవతంస మనందగుకొండవీటి కిం
ద్రుని దెస రాజ్యలక్ష్మికి నిరూఢనివాస మనంగ భక్తవా
డనుపుర మొప్పు నుర్వరకు హారమణిస్థితిఁ బొల్చి సజ్జనుల్
ధనకనకాంబరామలసదావిభవోన్నతిఁ జెంది వర్ధిలన్.

వ. ఆ పట్టణంబున కధీశ్వరుండు.

సీ. తనకీర్తికామినుల్ దశదిశాభాగరంగస్థలంబుల నాట్యగతులు నెఱపఁ
దనశౌర్యవహ్ని దుర్దమభయంకరశత్రుధరణీశ్వరాటవుల్ దరికొనంగఁ
దనదానధారానితంబినీరత్నము లబ్ధినాయకులతో ననఁగి పెనఁగఁ
దనకరుణారసఘనతరాపధ మఖిలార్థిదారిద్ర్యామయంబు లడఁప
ఘనతఁ జెన్నొందుజగనొబ్బగండబిరుద
భూషణుఁడుతుమ్మవంశాబ్ధిపూర్ణచంద్రుఁ
డలఘుచరితుఁ డనంతాధిపాత్మజుండు
రమ్యరుచిహేళి రాయపరెడ్డిమౌళి.

వ. ఒక్కనాఁ డమాత్యపురోహిత విద్వత్కవీంద్రతార్కిక మీమాంసిక వందిమాగధ సుహృద్బంధు సేనాధీశ్వరసహితంబుగా నాస్థానమంటపంబున గీతవాద్యనృత్య వినోదలీలాకౌతూహలమానసుండై యుచితాసనంబున సుఖాసీనుండై

గీ. అనుఁగుఁదమ్ముఁడు పాపన్న వినయగరిమ
నాత్మధర్మప్రవర్తన ననుకరింపఁ
బరఁగ ధరమంత్రిపోత్తురిపాపనార్యుఁ
డెలమివిద్యాప్రసంగములఁ దెలుపుచుండ.

మ. ఘన శ్రీసద్గురుచిత్కళేక్షణమహాసంధానుసంధానపా
వన కారుణ్యకటాక్షలబ్ధవరగీర్వాణాంధ్రభాషాకవి
త్వనిరోష్ఠ్యక్రమచిత్రలక్షణచమత్కారప్రబంధాళుక
ల్పనునిన్ బింగళి యెల్ల నార్యమణిఁ బిల్వంబంచి సత్కృపన్.

చ. ప్రణుతయశోవిశాలుఁ డెవ్వ భాసురశబ్దనిగుంభ నాదిల
క్షణములఁ జిత్రవైఖరుల సర్వనృపాలసభాంతరంబులన్
గణుతికి నెక్కినీకవితఁ గర్ణరసాయన మౌచు నిప్పురీ
గణకవితానమందు నతిగౌరవ మందితి వెంచిచూడఁగన్.

* * * *

శా. కొండారెడ్డిఘనుండు శౌర్యకటిమన్ గొట్టె న్మరాటీల ను
ద్దండుం డన్న యతండు మాకు సుకవీంద్రశ్రేణిఁ బ్రోచున్ సిరుల్
నిండన్ దామెర వేంకటాధిపుఁడు మన్నించంగఁ బామూరిలో
నుండు న్నిన్ను బహూకరింపఁగలఁ డేయుద్యత్కృతిశ్రేష్ఠతన్.

వ. ......మున్ను మజ్జనకాగ్రజుండును గొండారెడ్డికి జనకుండును నగు
నోబళరెడ్డి భూకాంతునకుం దదీయాచార్యుండగు సంజీవనాథస్వామి
పరాపరవిజ్ఞానమార్గోపదేశ ప్రసంగవశంబున నిత్యం బైనసత్యాధ్య
యనవిధానప్రవర్తకుం డైనతోభ్యుఁడను నొక్కమహాపురుషునిదివ్య
చరిత్రంబు గలసర్వేశ్వరమాహాత్మ్యంబు చిత్రంబుగా ముఖవచనం
బులం దేటపఱిచి సంక్షేపరూపంబైనవాక్యగ్రంథంబొసంగె. దీనిం బరి
శీలించి సర్వేశ్వరున కంకితంబుగాఁ దెనుంగున మృదువచన రచనా
గౌరవం బేర్పడఁ బ్రబంధంబుగా నిర్మింపవలయు............

పయిదానినిబట్టి యీకవి యాతకుమున్ను వచనకావ్యముగా రచియింపఁబడినదానినిబట్టి యీపద్యకావ్యమును రచించినట్టు తెలియవచ్చుటయేకాక యితఁడు దామెర వేంకటాధిపునికాలములో నుండినట్టు కూడ స్పష్ట మగుచున్నది. బహుళాశ్వచరిత్రమును రచియించిన దామెర

వేంకటాధిపుఁడు పదునేడవశతాబ్దారంభమునం దుండినవాఁడు. ఇతఁడతఁడుగాక యాతనిమనుమఁ డయినను, కవి పదునేడవశతాబ్దమధ్యమునం దున్నట్లేర్పడుచున్నది. దీనినిబట్టి చూడఁగా నీత్రోభ్యచరిత్రము వేదాంతరసాయనమునకంటెఁ బూర్వమున రచియింపఁబడినట్టు కానఁబడుచున్నది. ఈకవి కవిత్వము మృదుమధురపాకము గలదయి హృద్యముగా నున్నది. కవనపటిమ తెలియుట కయి త్రోభ్యచరిత్రమునుండి కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

మ. ఇల కంపించినఁ దారకల్ చెదరినన్ హేమాచలం బెంతయున్
దలక్రిందైనను భానుఁ డస్తగిరిమీఁదం దోఁచినన్ దిగ్గజా
వలి యల్లాడిన వార్ధు లింకిన మనోవాక్కాయకర్మంబులన్
బలుకంబూనఁ డసత్య మెన్నిటికి మానం డాత్మధర్మస్థితిన్. ఆ. ౧.

మ. అకటా చేరెడుకూలిబియ్యమునకై యత్యంతనిత్యాన్నదా
నకళావైభవలక్ష్మికిన్ నిలయమౌ నాతల్లిహస్తాబ్జ మిం
తకృశీభావము నొంది క్రిందుపడఁగా నాగుండె యెంత్తే వికా
వికలై ప్రీలక నిల్చియుండెఁ గఠినోర్వీభృద్విపత్కాసియై. ఆ. ౨.

ఉ. బాలుఁడు వీని నింతకును బాముల నొందఁగనీక పెంచితిన్
దాళఁగఁజాలఁ డాఁకలికి దప్పికి వేళ యతిక్రమించినన్
మే లొనరింపఁ గై కొనిన మిమ్ముఁక నేమనివేఁడుకొందు నా
జాలి దొఱంగు నెట్లు మునిసత్తమ సత్కృప నానతీయవే. ఆ. 3.

ఉ. సంతసమంది యప్పుడ వెసన్ మగుడం జని ప్రాణనాథ యా
వంతయుఁ జింతలేదు భవదాత్మజ మున్నుగ లేచి పాదుకల్
కాంతునిమ్రోల నిడ్డ నెనకంబుగఁ దల్పము డిగ్గు నారతీ
కాంతునిబోలు నాఘనుని గన్నులపండువుగాఁగ జూచితిన్. ఆ. ౪.

44. చింతకుంట కోదండరామకవి

ఈకవి సునందాపరిణయమును నామాంతరముగల ప్రదీపచరిత్రము నైదాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు నందవరీక నియోగి బ్రాహ్మణుఁడు, అక్కనమంత్రిపుత్రుఁడు. కవి తన వంశజులలో సుప్రసిద్ధుఁడయి యుండిన రాయనభాస్కరు నిట్లు వర్ణించియున్నాఁడు—

సీ. ఘనతరౌదార్యదీక్షాకల్పితానల్పకరనిబద్ధసువర్ణకంకణుండు
ఆసేతుశీతనగాంతరరాట్సభామధ్యవిశ్రుతకీర్తిమండలుండు
కొండపల్లి వినకొండ దుర్గద్వయీదేశప్రజావనధీయుతుండు
సకలావనీపక సంతానయాచితవస్తుప్రదానప్రవర్తనుండు
అన్నవేమమహీశదత్తాగ్రహార ।
మదకలాందోళికాశ్వసన్మణివిశేష ।
భూషణాద్యష్టభూతివిభూషితుండు ।
భానుతేజుండు రాయనభాస్కరుండు.

ఈకవి ౧౭౫౦ వ సంవత్సర ప్రాంతమునం దుండినవాఁడు. ఈతని కవిత్వము మొత్తముమీఁద రసవంతమయి హృద్యముగానే యున్నది. సునందాపరిణయములోని కొన్ని పద్యము లిం దుదాహరింపఁబడు చున్నవి—

శా. సేవార్థాగతకామినీనికరకాంచీకింకిణీకంకణా
రావంబు ల్వివిధోరువాద్యపటలీరమ్యధ్వనుల్ భవ్యభూ
దేవాగ్రేసరగానసంయుతములై దిక్కుల్తగ న్నిండఁగా
దేవాగారము లొప్పు నప్పురమునన్ దేదీప్యమానంబులై. ఆ. ౧.

ఉ. ఇమ్మెయిఁ బెట్టుచాయ లవియెన్నఁగ నేటికి నైజకాంతిచే
నిమ్మదిరాక్షి మోముసరి యిచ్చట నెచ్చట లేదు చూడ నీ
నెమ్మది సంశయం బయిన నిక్కము చేసెద నిప్పు డాన నా
తమ్ములమీఁదఁ బెట్టుకొనెదన్ ద్విజరాజుకుఁ జేయిసాఁచెదన్. ఆ. ౨.

ఉ. కుంజరయాన కాంచె నవకోరకనూనపరీతమంజరీ
మంజులపుంజరంజితసమంజసభవ్యనికుంజసంభ్రమ
ద్గుంజదమందషట్పదణకోటిరవాంచితసద్దిగంతమున్
గంజముఖీవిలాససఖకాంతనిశాంతము నవ్వనాంతమున్. ఆ. ౩.

ఉ. అన్నవులార నావలపు నంగడిఁబెట్టకు రమ్మ చాలు మీ
మన్నన లింక నన్నుఁ బలుమాఱును వేఁడకు రమ్మ ప్రాణముల్
గ్రొన్ననవింటిదేవతకుఁ గొంకక యిచ్చెద నమ్మవాసి నే
మున్న రవంత పోవిడుట మోసమువచ్చెఁగదమ్మ బుద్ధికిన్. ఆ. ౪.

ఉ. సంతమసంబుపోక నవసారసలక్ష్మికిఁ బోక యామినీ
కాంతుఁగాక కోకకుళకంబులజోక యులూకపంక్తికిన్
జింతలమూఁక పద్మలకుఁ జెన్నగుఢాక ప్రభాతకాలపున్
వింతకురాక శోణరుచి విన్నగఁబ్రాఁకి చెలంగె దిక్కులన్. ఆ. ౫.

45. కైప మాయనకవి

ఇతఁ డుషాకళ్యాణ మనఁబడెడి యైదాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఈతఁడు వైదికబ్రాహ్మణుఁడు; మహాదేవశాస్త్రికిని కామాక్షికిని బుత్రుఁడు. ఈకవి యుషాకళ్యాణమునందుఁ దనజనకుని నిట్లు స్తుతించెను—

క. కామాహంకృతిహరణుఁడు
కామాక్షీధవుఁడు విబుధగణవినుతగుణ
స్తోముఁడు సర్వజ్ఞుఁడు ని
స్సీమయశోధనుఁడు వృషవిశేషప్రియుఁడున్.

సీ. చిద్విలాసకళానిధిశేఖరుండు
శ్రీమహాదేవుఁ డాశ్రితశ్రీకరుండు

కైపకులవార్ధి చంద్రలింగనకవీంద్ర
పుత్రుడై యొప్పె నాకవిపుణ్యమేమొ.

సీ. ఆమహాదేవు నప్రమేయప్రభావు
ధర్మవర్ధను ననుఁగన్నతండ్రి నాత్మఁ
దలఁచి తద్దివ్యపదపద్మములను గొలుతు
నఖిలనతులను బుధులవినుతతతులను.

ఈకవి నూఱుసంవత్సరములకుఁ బూర్వపువాఁ డగుటకు సందేహ ముండదు. ఇతఁడు తనపుస్తకమునిండను శబ్దాలంకారములను విశేషముగా సమకూర్చెనుగాని పుస్తకమునందు వ్యాకరణదుష్టములైన ప్రయోగము లనేకములు కానఁబడుచున్నవి. ఈశృంగార ప్రబంధము కొంతవఱకు రసపుష్టికలదిగానే యున్నది. ఉషాకళ్యాణమునుండి కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను—

మ. త్రిజగన్మోహనదీపమో బహుజయశ్రీపూర్ణనిక్షేపమో
యజనైపుణ్యకలాపమో తపనచంద్రాగ్నిత్రయీరూపమో
ద్విజముఖ్యస్తుతలగ్నమం దొకమహాతేజంబు తద్భీష్మకా
త్మజగర్భంబున నుద్భవించెను సమస్తానందసంధాయియై. ఆ. ౧.

ఉ. భంబులు గోళ్ళు పల్లవనిభంబులు కాళ్ళు మనోజకాహళా
భంబులు జంఘ లౌర కరభంబులు సక్థులు శాతకుంభకుం
భంబు లురోజముల్ దరనభంబులు కఠవలగ్నముల్ ద్విరే
ఫంబులు కుంతలంబులు శుభంబు లుషాసతిలక్షణంబులుౕ. ఆ. ౨.

చ. అతఁడును మారుదారుణశిరావళిహావళి కోర్వలేమి నో
సుతనుమణీ మనీష నిటు సోలుచు వ్రాలుచుఁ దూలనేల నీ
వితరపుఁజింతఁ దక్కి నతి కెక్కిన హేలల నోలలాడుమా
దృతముగఁ జేతుఁగాకితముఁ జెల్వము పల్వముబల్లము వ్పటల్ ఆ.3

ఉ. ఇయ్యెడఁ దియ్యమావిచిగు రెంతయు వింతగఁ దేనె లొల్కుచున్
సయ్యనఁజాలుమేలుజిగిచాలునఁ గ్రాలు ననూనవైఖరిన్
దొయ్యలి తావకాధరముతో సరికా దవునంచు సందియం
బయ్యెడిఁ దారతమ్య మరయంజను నీ నునుమోవి నియ్యవే. ఆ.౪.

ఉ. నాకులఁ బూర్వనాకుల వినంబడ నట్టివిధంబు లొప్పఁ దన్
దాఁకుచు మిన్నుఁ బ్రాఁకుచును దద్దయు యుద్ధముసల్పుతన్మదో
ద్రేకులఁ దమ్మితేకులవలెన్ హాలకోటి కలంకరించి పె
ల్లాఁకలిగొన్న రోకలికి నాహుతిఁ జేసెను సీరి పోరిలోన్. ఆ. ౫.

---

46. వెలిదండ్ల వేంకటపతి

ఇతఁడు రాధామాధవసంవాద మను మూఁడాశ్వాసముల ప్రబంధమును రచియించి ప్రళయకావేరి నివాసుఁడగు మగదలరామదాసున కంకిత మొనర్చెను. ఈకవి తిరువేంగళాచార్యపుత్రుఁడు. కృతిపతియగు మగదల రామదాసామాత్యుఁడు గతశతాబ్దమధ్యమునకుఁ దరువాత నుండినవాఁడయినందునఁ గవి యిప్పటికి నూఱుసంవత్సరములక్రిందట నుండినవాఁడు. ఈతనికవిత్వము మనోహరముగానే యుండును. రాధామాధవసంవాదములోని మూఁడుపద్యముల నిందుఁ బొందుపఱుచుచున్నాను—

చ. పసుచులత్రోడ నాడఁ బసిబాలుఁడవా వలదన్న మాన వా
గడములు కొన్ని నేర్చితివి కల్లరి వైతివి కొల్లకాఁడవై
దుడుకులు చేయఁజాగితివి దొంగిలఁజొచ్చితి వేమిచెప్పినన్
వడిగఁ బరాకుచేసికొని వాకిటి కేగెదు పిల్వఁ బిల్వఁగన్. ఆ. ౧.

ఉ. ఏవగవారుచేసిన సహించి తనంతటివారిఁ జేయుచున్
దైవము దాత తల్లియును దండ్రియుఁ దానయి ప్రోవఁగా జగ
త్పావనమూర్తియౌ తనకుఁ బావనమే తనుఁగన్న దేవకీ
దేవిని దన్నుఁగన్నవసుదేవుని నాపదఁ బాచి ప్రోచుటల్. ఆ. ౨.

ఉ. ఒక్కతె భ్రాంతిచేఁ బొరల నొక్కఁడు మానుషఁబూఁటకాఁపె నే
నెక్కడిదాన నీవు మును పెక్కడివాఁడవు నాకు నీకు నే
మక్కఱ వెక్కసైన నొక రాడెడుపల్కులు నేన పల్కెదఁ
గ్రుక్కఁగ నాయెఁబోయె నవి కొన్నిదినాలుఋణానుబంధముల్. ఆ-3

---

47. పట్టమెట్ట. సరస్వతి సోమయాజి

ఇతఁడు పృథుచరిత్ర మను ప్రబంధమును రచియించి దాక్షారామ భీమేశ్వరున కంకితముచేసెను. ఈకవి యాఱువేలనియోగిబ్రాహ్మణుఁడు; హారితసగోత్రుఁడు; పోతనామాత్యపౌత్రుఁడు; పెద్దనార్యపుత్రుఁడు; శివలంక గౌరనార్యునిశిష్యుఁడు. ఈశ్వరుఁడు స్వప్నమున సాక్షాత్కరించి తన్నుఁగూర్చి యిట్లు పలికెనని కవి గ్రంథాదిని చెప్పుకొని యున్నాఁడు—

సీ. నవఘంటసురతాణినామధేయమువాఁడు తాత, వెల్వలపల్లి పోతరాజు
కవిశేఖరుం డనఁగ విధూర్జటి యనంగఁ బెనుపొందుటనకుండు పెద్దిరాజు
సవనదీక్షామహేశ్వరుఁడు శ్రీరఘునాథ సోమయాజి నిజాగ్రజుండు
గురుఁడు

తల్లి పాతివ్రత్యధర్మబుద్ధికదంబ కారుణ్యజగదంబ పేరమాంబ
నీకు మద్వారలబ్ధవాణీప్రసాద
మంగళవచంబు సకలవిద్యాస్థలములఁ

బట్ట మొట్టాంక వెల్వలఁ లివృషాంక
సోమయాజి సరస్వతీసోమయాజి.

ఉ. శైవులలోపలం బరమశైవుఁడు వేదపురాణవాణిచే
దైవగురుండు నీగురుఁడు ధన్యుఁడు శ్రీశివలంకవారిలో
దేవనిభుండు భక్తి శివదేవుఁడు గౌరయగారు తత్కృపఁ
బావనకీర్తిఁ గాంచితివి బాలసరస్వతి దీక్షితాగ్రణీ.

ఈకవి కవిత్వము శబ్దార్థాలంకార భూయిష్ఠమయిమృదుమధుర పదఘటితంబయిసలక్షణమయి హృదయకర్ణ రంజకముగా నున్నది. ఈతని పృథుచరిత్రమునందలి శబ్దాలంకారరీతిని జూపుటకయి యొకపద్యము నిందుఁ బొందుపఱుచుచున్నాను—

సీ. హస్తకంకణములు హస్తకంకణములు పదసంపదధికసంపద లొసంగ
మఖజాతవేదంబు ముఖజాతవేదంబు స్వర్గాపవర్గరాజ్యము లొసంగఁ
గళ్యాణతత్వంబు కళ్యాణతత్వంబు సగుణనిర్గుణవృత్తిచయ మొసంగ
సత్యానుకూల్యంబు సత్యానుకూల్యంబు సాధ్వీశ్వరత్వంబుసంఘటింపఁ
బరఁగుదైవతకులశిరః ప్రకటకుసుమ
మంజుమకరందధారాసమంజసాంఘ్రి
పద్మసన్నిధిసన్నిధిప్రభవవిభవ
శాశ్వతశ్రీకరుండు సర్వేశ్వరుండు.

ఈకవి గోదావరీ మండలములోనివాఁడనుట వేఱుగఁ జెప్పనక్కఱలేకయే కృతిదాక్షారామభీమేశ్వరుని కంకితము చేయఁబడుటచేతనే తెలిసికొనవచ్చును. ఇతఁడు నూఱుసంవత్సరములకుఁ బూర్వమునందుండినవాఁడు. ఇతని పృథుచరిత్రములోనికొన్నిపద్యముల నిందుదాహరించుచున్నాను—

చ. మలయుఁ బురంబునన్ నిరుపమానవిమానసమానధామకో
మలలలనామనోరమసమాగమభోగమదాంతతాంతతా

జలకలికానికారముఖసారసగంధసుగంధసారముల్
మలయమరుత్కిశోరములు మారవిహారకరప్రచారముల్. ఆ. ౧.

శా. చూపుంజూపును వియ్యమయ్యె సతికిన్ క్షోణీతలస్వామికిన్
దూపుందూపును వియ్యమయ్యె రతికిన్ దోర్దర్పరతిస్వామికిన్
జూపాభ్యాసము చూడఁడీ సభ మహాచాతుర్య మన్నట్లు త
ద్రూపాభిపారిప్లవచేష్ట లొప్పెఁ దమిచూపుల్ వ్రీడముల్లింపఁగన్. ఆ. ౨.

చ. కదలిరి పాత్రకోత్తములు గాముకులుం గవులు న్మహాకవుల్
మెదలిరి సత్ప్రియాణమతి మిశ్రితమిశ్రితతుల్ నిజాశ్రితుల్
పొదలిరి వాంఛితార్థపరిపూర్ణసువర్ణసువర్ణసంతతుల్
తదనుమతిం బురంబులకుఁ దత్పరదత్పరతత్పరాగతిన్. ఆ. 3.

చ. అలసితి రమ్మలార కుసుమాపచయం బొనరించి దండ మీ
యలయిక లేనఁడంతు నని యంబురుహాకరలక్ష్మిపంపు నె
చ్చెలు లనఁ జెల్వలం దరలిచెన్ జలజోత్పలపత్రవాసనా
లలితమదాళినీకలకలంబుల శీతలవాతపోతముల్. ఆ. ర.

---

48. అవుడూరి కిచ్చయ్య

ఈకవి కాళిదాసప్రణీత మయిన రఘువంశమహాకావ్యమును పది యాశ్వాసముల గ్రంథముగా రచియించెను. కిచ్చయ్య నియోగిబ్రాహ్మణుఁడు; గురువయామాత్యుని పుత్త్రుఁడు; హారితసగోత్రుఁడు; చెన్నకృష్ణశాస్త్రిశిష్యుఁడు. ఇతఁడు నూఱు నూటయేఁబదిసంవత్సరములక్రింద టనుండినట్టు తెలియవచ్చుచున్నది. ఆంధ్రరఘువంశకావ్యము సంస్కృతకావ్యమంత మనోహరముగా లేకపోయినను మొత్తముమీఁదరసవంతముగానే యున్నది. కవిత్వశైలి తెలియుటకయి రఘువంశమునుండి రెండుమూఁడుపద్యముల నిందు బొందుపరుచుచున్నాను—

ఉ. ఉన్నతమ ర్త్యలభ్యపద మొందెదనన్మతి నూర్ధ్వబాహుఁడై
యున్న సగర్వఖర్వమనుజో త్తముకై వడి మందబుద్ధి నై
కొన్నవరుండు సాధుకవికుంజరకీర్తి వహించ నెంచినన్
సన్నుతిచేయఁబోవుదురొకో సత్కవులైనసమస్తభూజనుల్. ఆ. ౧.

చ. పొలఁతిరో! విన్ము ముత్తియపుఁబూసలఁబోలెడుబాష్పవారిబిం
దులఁ బరిపంధిధాత్రిపవధూస్తనపాళిని బ్రస్తరించునీ
కలితమహాజిఁ డైనమహికాంతునిచేత సమర్పితంబులై
యలరె గృహీతసూత్రకములై తగుమౌక్తికతారహారముల్. ఆ.౪.

మ. తనపై విశ్వసనంబు పంక్తిముఖధూర్తస్వాంబునన్మన్పచెం
దనియీభూజను లియ్యెడన్ నిజచరిత్రంబందు విశ్వాస మొం
దినమీయాజ్ఞఁ బరిగ్రహింతుఁ దనయా ప్రింగాంచి శోభిల్లు న
జ్జనకక్ష్మావిభుకూర్మిపుత్రినని కౌసల్యాతనూజుం డనన్. ఆ. ౮.

ఈకవి రఘువంశముగాక మాధవాభ్యుదయ మను మఱియొక ప్రబంధమునుగూడ రచియించెను. ఈక్రింది రెండుపద్యములును మాధవాభ్యుదయములోనివి--

ఉ. అంతట నొక్కనాఁడు చతురాస్యుఁడు వేదచయంబుఁగానమిన్
వంతదురంతచింత బలవంతము పంతముసంతసిల్ల శ్రీ
కాంతనితాంతకాంతశతకంజయుగంబు మదిన్ ఘటించి య
శ్రాంతభయైకభక్తిఁ గరసారసముల్ముకుళించి యిట్లనున్.

శా. త్రుంతున్ సోమకు నుద్ధరింతు నిగమస్తోమంబు లంచున్ రమా
కాంతుం డొందె సువర్ణసంఘటితజాగ్రత్పుష్పవర్షీకృతా
తాంతోత్తాలకరాళవాలహతి ఘూతప్రాదిసీశాస్పృష
త్స్వాతానాహతివిస్ఫుతత్పురతరూద్యన్మీనమీనాకృతిన్. ఆ. ౧.

49. తక్కెళ్లపాటి లింగన్న

ఆధునికుఁడైన యీకవియొక్క కాల మెప్పుడో నిశ్చయముగాఁ దెలియలేదుగాని యితఁ డించుమించుగా నూఱు నూటయేఁబదిసంవత్సరములక్రిందట నుండినట్లూహించఁదగియున్నది. నూఱుసంవత్సరములక్రిందట రచియింపఁబడిన లక్షణ గ్రంథములలోఁ సహిత మీతనిగ్రంథములలో నుండి లక్ష్యములుగాఁ గైకొనఁబడిన పద్యములు కానరావు. అట్లు కైకొనఁబడకపోవుట కీతనికవనము లక్షణవిరుద్ధముగా నుండుటయే కారణమయి యుండవచ్చును. కవి తాను రచియించిన గ్రంథములపేళ్ళను త్తరహరిశ్చంద్రకథలోని యీక్రింది పద్యమునఁ జెప్పికొనియున్నాఁడు—

సీ. తగ రచించితిని మదనమోహినీవిలా
సంబు మెప్పుగ యౌవనంబునందు
భక్తిసూర్యతనయాపరిణయం బనెడు ప్ర
బంధంబుఁ జెప్పితిఁ బ్రౌఢిమమున
నావెన్క విద్యుత్ప్రభావిలాసము వేడ్క
ఘటియించితిని యక్షగానరీతి
నటుపది నేండ్లప్రాయమున నుత్తరహరి
శ్చంద్రాఖ్యకథ యిది పారమతిని
వేంకటేశ్వర శ్రీరామవిభుల కెలమి
నంకితంబుగ మునుచెప్పినట్టికృతుల
రీతి నిది కృష్ణునకు సమర్పించి యిప్పు
డిలను ధన్యుండనైతి నార్యులు నుతింప.

వీనిలో మదనమోహినీవిలాసమును, సూర్యతనయాపరిణయమును, ఉత్తర హరిశ్చంద్రకథయు, పద్యకావ్యములనియు, విద్యుత్ప్రభావిలాసము యక్షగానమనియు, పైపద్యమువలననే తెలియవచ్చుచున్నవి.

ఈకవి నియోగిబ్రాహ్మణుఁడు; హరితసగోత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; చిట్టియ్య పౌత్రుఁడు; వేంకటపతిపుత్రుఁడు. ఈతని తల్లిపేరు సూరమ్మ. ఇతనిది రసవంతమైన ప్రౌఢకవిత్వము కాదు; యౌవనకాలమున రచియించిన గ్రంథములలోనే కాక యిరువదియేండ్లు వచ్చినతరువాత రచియించిన యుత్తర హరిశ్చంద్రకథలో సహితము లక్షణవిరుద్ధము లయినప్రయోగము లనేకములు కానఁబడుచున్నవి. ఈతనిగ్రంథములలోని రెండేసిపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి.

మదనమోహినీ విలాసము.

ఉ. అక్కట మానివర్యుఁ డమరాధిపుతోఁ బలుకంగ నూరకే
గ్రుక్కున నుండలేక ప్రతికూలుఁడనై పరుషంబువల్కి నే
నిక్కడి కేలవచ్చితి సహింపఁగరాని వియోగవహ్నిచేఁ
బొక్కఁగనేల దేవవిటపుంగవు లీతకు నవ్వకుందు రే.

ఉ. కమ్మనివింటిజోయ రొకడికంబుగ సంజమెఱుంగుటగ్గి చే
బమ్ముక కోకదంపతులపై వడిఁ బుప్పొడిమందు కాల్వఁగాఁ
గమ్మితుపాకినాళమున దారున వెల్వడునుక్కుగుండ్లనా
దొమ్మిగఁ జిమ్మరేఁగె నలతుమ్మెద లెల్లసరోవరంబులన్.

సూర్యతనయా పరిణయము.

ఉ. ఒచ్చెము లేనిరూపమహిమోన్నతి యీసతికే తగుంగదా
యచ్చున నొత్తినట్లు వెలయున్ లిఖియింపఁగ నీకెచెల్లుఁగా
కిచ్చెలువన్ వరింపఁగలఁడే యొకఁ డెందును నన్నుఁగన్న యీ
పచ్చవిశాటివాఁడె తగుఁ బంకజలోచనఁ బెండ్లియాడఁగన్. ఆ.౨.

చ. హరి యలధర్మసూతిపురి నప్పటి కుండెను వింటిరే రమా
వరుఁ డిటువచ్చునో యనుచు వారక చూచితి యిన్నినాళ్ళు నేఁ
డరుదుగ నొక్కమాట విననయ్యె ముకుందుఁడు వేఁటవచ్చె నీ
గ్గిరవరసూనుతోడనని సత్యమొ లే కదియుక్తి మృషోక్తియో. ఆ.౫.

ఉత్తరహరిశ్చంద్ర కథ.

చ. జలరుహబాంధవాన్వయనిశాధవ! యోనరనాథ! నేఁడుగా
ఫలితము లయ్యె మా క్రతుజపవ్రతహోమతపఃప్రభావముల్
కలఁగి మహాపద ల్గడచి కాంతయు మీరును బుత్రరత్నముం
వలనుగ సర్వరాజ్యవిభవంబు వహింపఁగఁ జూడఁగాంచుటన్.

మ. సకియా! యేను త్రిశంకసూనుఁడ హరిశ్చంద్రుండు నాపేరు పా
యక సైన్యావళితోడ ఘోరమృగయావ్యాసక్తచిత్తుండనై
ప్రకటారణ్యగిరీంద్రసానువులు చేర న్వచ్చి వర్తించుచో
నొకక్రోడం బలయించి చిక్కకరుదే నొక్కంతఁ దీవ్రంబుగన్.

---

50. గుడిపాటి కోదండపతి

ఈకవి శృంగారరసమంజరి యనుపేర భానుమిశ్రవిరచిత మైన రసమంజరిని మూఁడు గుచ్ఛములనుగాఁ దెనిఁగించెను. ఈగ్రంథము శృంగారనాయికానాయకలక్షణములను దెలుపునది. కవి నందవరీక నియోగిబ్రాహ్మణుఁడు. పూర్వకాలమునందు నందుఁడను చంద్రవంశపు రాజొకఁడు కర్ణాటకదేశమును పాలించుచుండెనఁట. అతఁడు స్వీయ మహిమచేత "యోగవాగ" ముల నెక్కి రహస్యముగా బోయి ప్రతిదిన మును కాశికాపురములో గంగాస్నానమును జేసి వచ్చుచుండెనఁట! ఈరహస్యము నతని భార్య కనిపెట్టి యొకనాఁడు తన్నుగూడ వెంటఁ గొనిపొమ్మని భర్తను నిర్బంధ పెట్టెనఁట. అతఁ డామె నిర్బంధమును మానుపుకోలేక భార్యను వెంటఁ గొనిపోఁగా, కాశీపురమును జేరిన తరు వాత నామె బహిష్ఠ యయ్యెనఁట. అందుచేత యోగవాగములు మయిలనోఁకి నడవక పోయినందున నతఁడు స్వపురమును జేరుట కుపా

యము త్రోఁపక పరితపించి గంగాతీరమునందున్న బ్రాహ్మణులను ప్రార్థింపఁగా వారు తమకుఁ గర్ణాటక రాజ్యమునందు వృత్తుల నొసఁగు నట్లు చాముడేశ్వరీసన్నిధానమునం దాతనిచేతఁ బ్రమాణము చేయించు కొని స్నానము చేయించి యాతని భార్య నప్పుడే తమమంత్రప్రభావము చేత శుద్ధురాలినిజేసి యోగవాగములను నడిపించి యారాజదంపతులను స్వరాజధానికిఁ బంపివేసిరఁట. అటు తరువాతఁ గొన్ని సంవత్సరములకు కాశీదేశమున క్షామము సంభవింపఁగా నాశ్వలాయనసూత్రు లయిన యాబ్రాహ్మణు లేనూఱు కుటుంబములవారు వైలుదేఱి పదుమూఁడు గోత్రములవారు నందుని రాజధానికి వచ్చిరఁట! అప్పుడు రాజు తాను జీవనములు కల్పించెదనన్న బ్రాహ్మణులు వీరేయని చూపుటకై సాక్షు లను దేవలయునని కోరఁగా వారు కాశికాపురమునుండి చాముడేశ్వరీ మహాదేవినే గొనివచ్చి యామెచే సాక్ష్యమిప్పించిరఁట! అంతట రాజు వారిమహిమ కద్భుతపడి తనపేర నందవరమను గ్రామము గట్టించి వారి కగ్రహారముగా నిచ్చెనఁట. నందవరమునందుండిన బ్రాహ్మణులగు టచే వీరు నందవరీకు లనఁబడుదురు. వీరినే కరణకమ్మలనియు జెప్పు దురు. ఈ యోగవాగములకథ యెట్టి దయినను, వీరు క్షామము సంభ వించినప్పు డార్యావర్తమునుండి దక్షిణహిందూస్థానమునకు వచ్చి తెలుఁగుదేశములో వృత్తులను సంపాదించుకొన్న విషయములో సందేహ ముండదు. ఈతెగ బ్రాహ్మణు లిప్పుడు కృష్ణా కర్నూలు బళ్లారి మండ లములలో నధికముగా వ్యాపించి యున్నారు. వీరిలో నల్లసాని పెద్దన, రాయని భాస్కరుఁడు మొదలయినవారు మహాప్రసిద్ధులు. కవి మూఁడవ గుచ్ఛముయొక్క కడపటఁ దన్నుఁగూర్చి యిట్లు వ్రాసికొని యున్నాఁడు—

సీ. శ్రీకరనందవరీకాగ్రగణ్యుండు వహివిూఱు గుడిపాటివంశభవుఁడు
బిరుదుగా నవఖండసురతాని పేరంది మహితుఁడౌ వేంగళమంత్రిపాత్రుఁ

దతులితుఁడౌ రంగయామాత్యతనయుండు వీరమాంబానందవృద్ధికరుఁడు
సింగన్న వెంగళ శ్రీనిధు లనుజులై భాసిల్లు కోదండపతిఘనుండు
సరసకవితాచమత్కారసార్వభౌముఁ
డవని శ్రీరంగధామదయాశ్రయుండు
నెలమి రసమంజరిని రచియించె నందు
సరవిగాఁ దృతీయగుచ్ఛంబు తనరు.

ఈపద్యమునుబట్టి కవి వేంగళమంత్రి పౌత్రుఁడనియు, రంగయామాత్యునకును వీరమాంబకును బుత్రుఁడనియుఁ దెలియవచ్చుచున్నది. ఇతఁ డాశ్వలాయనసూత్రుఁడు; భారద్వాజగోత్రుఁడు. ఈతఁ డేకాలమునం దుండినవాఁడో నిశ్చయముగాఁ దెలియదు. ఇన్నూఱుసంవత్సరముల క్రిందటనుండి యుండునేమో! ఈతని కవిత్వమునందుఁ గొన్నిదోషము లున్నను గవిత్వము రసవంతమయినదే. రసమంజరిలోని యొక్కొక్క గుచ్ఛమునుండి యొక్కొక్క పద్యము నిం దుదాహరించుచున్నాను—

చ. జలదము నాథులం గురియఁజాలెనె నీళ్లనె చిమ్ముఁ, బచ్చికల్
కలయఁగ నించెఁగా గికులు కాంతుల నీనెనె, యెల్ల వృక్షముల్
ఫలము లొసంగుఁ గాని పతిపంక్తుల నిచ్చెనె, నిర్దయాత్మ హా
కులటకుఁగాఁగ నేమి యొనఁగూర్పఁగ నేర్చితి వంబుజాననా. గు. ౧.

చ. పదరుచు నీవిటూరికిని బైనము వోయెద నన్నమాత్రలో
నదటున మేను చిక్క వలయంబులు జాఱెను నీది యుంగరం
బదిర యొసంగినం గరమునందు ధరించెదఁ గంకణంబుగాఁ
జెదరక యిష్టమంచు వెలచేడియ దోఁచు నెటున్విటుం బటుక్. గు. ౨.

చ. ప్రతిఫలితామృతాంశువును భామముఖంబని యెంచి నాయకుం
డతులితకేలిమీఱఁ బరిహాసముచేసిన నింతయేనియుఁ
బ్రతివచనంబు లేమిఁగని పైదలి మానముఁ జెందె నంచుఁ దా
నతిపులకాంకితంబయిన హస్తముచేఁ దసవుం బ్రియుంబునక్. గు. 3.

51. మల్లవరపు వాలేశ్వరుఁడు.

ఇతఁడు భళ్ళాణచరిత్ర మను నైదాశ్వాసముల ప్రబంధమును రచించెను. సింధుకటక రాజయిన భళ్ళాణుఁడు జంగము లడిగినదెల్ల నిచ్చుచు భక్తి చూపుచుండెనఁట! అతని భక్తిని పరీక్షింపవలె నని శివుఁ డొకనాఁడు జంగమువేషముతో తనకుఁ బతివ్రత యగు యువతి కావలె నని యడుగఁగా, రాజు తన పట్టణమునం దట్టి స్త్రీ దొరకనందున దన భార్య యగు చెల్లమ్మనే యా జంగమున కర్పించెనఁట! శయనగృహ మున కేగినప్పుడా జంగ మామెనంట సందేహపడుచుండఁగా, చెల్లమ్మయే ముందుకుఁ బోయి యా యతిథిని గౌఁగిలించుకొనునప్పటి కతఁడు మూఁడు నేత్రముల శిశు వయ్యెనఁట! అంతట నా దంపతు లతఁడు శివుఁడని తెలిసి కొని యారాధింపఁగా, ఈశ్వరుఁడు నిజస్వరూపముతో సాక్షాత్కరించి వారికి ముక్తి నిచ్చెనఁట!

వాలేశ్వరుఁడు పాక నాఁటి నియోగి యగు శైవబ్రాహ్మణుఁడు; గౌతమస గోత్రుఁడు; పోలయామాత్య పుత్రుఁడు. ఇతఁడు తన గ్రంథ మును మల్లవరపు నాగేశ్వరస్వామి కంకితము చేసెను. కవి తన్నుఁగూర్చి భళ్ళాణచరిత్రమునం దిట్లు చెప్పుకొని యున్నాఁడు—

సీ. అనఁ బాడఁ జదువఁ జెప్పను నేర్పు సర్వజ్ఞభోజుండు మా తాత పోతరాజు
బహుపురాణజ్ఞుండు బాంధవాశ్రితకల్పభూజంబు మా తండ్రి పోలమంత్రి
పరమశాంతుఁడు కృపాపాథోధి మా పినతండ్రి విరూపాక్షదండనాథుఁ
డఖిలవిద్యానిధి యర్థార్థితతిఁ బ్రోచుదాత మత్సుతుఁడు సదాశివుండు
నే వితర్కింప పరకవితావిసేవ
వదనుఁడను బ్రాఁకనాఁ డింటివాఁడ శుద్ధ
శైవుఁడను గౌతమసగోత్రసంభవుండ
నెంచఁదగు మల్లవరపు వాలేశ్వరుండ.

* * * *

మత్తకోకిల. సన్నుతం బగునట్టివేల్పు ప్రసన్నుఁడై మముఁ బ్రోవగా
విన్నకోటవిలాతిలోఁ గడువేడ్క మల్లవరంబునన్
బన్నగేశ్వరసుప్రతిష్ఠను భక్తరక్షణ చేయుచున్.
వన్నెమీఱఁగ నాగలింగ మనన్ వసించు మహోదయున్.

ఈకవి నివాసస్థలము కృష్ణామండలమునందలి విన్నకోటసీమలోని మల్లవర మయినట్లు పయిపద్యమువలననే విస్పష్ట మగుచున్నది. కవి యెప్పటివాఁడో నిశ్చయముగా తెలియరాదుగాని యిన్నూఱుసంవత్సరములక్రిందటివాఁడయినట్లు కనుపట్టుచున్నాఁడు. భళ్ళాణచరిత్రములోనివి రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

మ. భువి రుద్రాక్షను నెవ్వ రేని మది శంభుం డంచు భావించుచున్
జెవులన్ వక్షమునన్ శిరస్స్థలమునన్ జేదోయిఁ గంఠంబునన్
వివరింపంగ ధరింతు రాజనులకున్ వీక్షింపఁగా సాటిలే
రు విరించ్యంబుజనాభకిన్నరమరుద్యక్షేంద్రలోకంబులన్. ఆ. ౨.

ఉ. కప్పురవీడెమున్ నొసటఁ గస్తురిబొట్టును జెంద్రకావియా
దుప్పటివల్లెవాటు కలదో మఱి లేదో యనంగఁ జాల మైఁ
జిప్పిలు భూతిలేపనముఁ జేతను సన్నపుగౌరిబెత్త మా
యొప్పులకుప్పరూపును మహోన్నతియు న్విలసిల్లఁ జెల్వుగన్. ఆ. ౪

52. చింతలపల్లి వీరరాఘవుఁడు

ఈకవి మధురవాణీవిలాస మనెడి యైదాశ్వాసముల ప్రబంధమును రచియించి శ్రీవేంకటేశ్వరస్వామి కంకితముచేసెను. కవి నియోగిబ్రాహ్మణుఁడు; ఆశ్వలాయన సూత్రుఁడు; వీరరాఘవ పౌత్రుఁడు; వేంకటార్య పుత్రుఁడు. కవి తన్నుఁగూర్చి మిత్రు లన్నట్లుగాఁ దనగ్రంథమునం దీక్రిందిపద్యములను జెప్పికొనెను—

శా. సాహిత్యంబుఁ గవిత్వమున్ వివిధశాస్త్రప్రజ్ఞ సత్కర్మతా
సాహిత్యంబును దత్త్వబోధమును బ్రిస్కంధాత్మక జ్యోతిషం
బూహాచాతురి దేవభక్తియును నీకొప్పున్ స్వభావంబులై
యాహా చింతలపల్లి రాఘవకవీ యాధిక్యంప వీ వస్సటక్.

మ. అవధానంబు లనేకములొనరిచి రాజాస్థానముల్ చేరి వా
దవిధిన్ ధీరుఁడవై చతుర్విధకవిత్వప్రౌఢిమ ల్చూపి భూ
ధవదత్తద్విపఘోటకాదిబహుసత్కారంబు గైకొన్నమి
న్నవు నీ కబ్రమె వేంకటేశ్వరుఁడు స్వప్నంబుం బ్రసాదించుటల్.

*   *   *   *

సీ. జాములో శతకంబు సంధించి కంకణాదులఁ గొంటి వలరాయ
దుర్గమునను
బహుళావధానముల్ పఱపి నాలుగునగల్ తేజి నందితి మల్లధీరువల్ల
వాగ్ధాటిసంప్రీతి దిగ్ధరాధిపదత్తవస్తువాహనములవార్తఁ గంటి
కూపవాపీతటాకోపవనులఁ జేసి స్థిరకీర్తి చెందితి వురుతరముగ
సకలభూపాలసంస్థానశంసనీయ। నిజచతుర్విధకవితాభినేయపాండి
తీసమాఢ్యాక నాపూర్ణదిక్ప్రదేశ। వీరరాఘవ నీసరి విబుధు లేరి?

పయిపద్యములయందుఁ జెప్పఁబడినవన్నియు నిజములయిన పక్షమున, కవి యసమానపాండిత్యమును గవిత్వకౌశలమును గలవాఁ

డయినందుకు సందియముండదు. కడపటిపద్యమునందుఁ జెప్పఁబడిన మల్లధీరుఁ డెవఁడో యింకను విచారింపవలసియున్నది. కవి తుంగభద్రాప్రాంతప్రదేశములయం దుండినవాఁడు. ఈతనికాలమేదో స్పష్టముగాఁ దెలియరాదుగాని యీతఁడు పదునెన్మిదవశతాబ్దమధ్యమునం దుండిన ట్లూహింపఁదగియున్నది. కవిపూర్వులలో సహితము కొందఱు విద్వత్కవులుండినట్లు మధురవాణీవిలాసములోని యీక్రిందిపద్యములు తెలుపుచున్నవి—

సీ. ఏధన్యుహారితత్త్వబోధాప్తి కలపుష్పగిరిదుర్గ త్రోటైనవరము సాక్షి
యేవాగ్మిసుకుమారతావృత్తికిని బినాకినిచెంత సేవింపుచునికి సాక్షి
యేమాన్యునైశ్వర్యసామాన్యతకు రాజ్యకృతిశిరోభూషణ
క్ష్మాతియె సాక్షి
యేగ్రంథకారివంశాగ్రియతకు ఘనప్రభుమానితం బైనబ్రతుకు సాక్షి
యట్టిఘనుఁ డేకులంబునఁ బుట్టె వారి
కలిమికపితయొకా వర మడిగికొనియె
నట్టిచింతలపల్లివంశాగ్రయాయి
పల్లకిపదస్థుఁడై మించు నెల్లసుకవి.

మ. చతురుండై యవధానము ల్సలిపి దేశాయీలు మెచ్చఁగా మహో
న్నతుఁడై యప్పకవీశ్వరుండు గిరియానారీవతంసంబునం
దతివిద్యానిధి సాహితీనిపుణు రాజాస్థానసంపూజ్యు నం
చితవాగ్ధాటిఁ బ్రబంధకర్తఁ గవిసంజీవాఖ్యుఁ బుత్రుం గనెన్.

ఈకవి సంజీవాఖ్యుఁడు చంద్రాంగదోపాఖ్యానమును ప్రబంధమును రచియించెను. వీరరాఘవకవియొక్క కవిత్వము ప్రౌఢమైనది. ఈతని మధురవాణీవిలాసమునుండి రెండుపద్యము లిందుక్రింద నుదాహరింపఁబడుచున్నవి—

శా. కాసారస్థితిఁ బూని నీచులకు యోగ్యంబై విషప్రాయమై
గాసి న్మ్రాకొనుకంటకబుల నిజాంగం బెల్ల సచ్ఛిద్రమై
యేసూత్రంబున బల్మినేని బిస మాహేలావతీబాహుశా
ఖాసామ్యం బెటువొందు నో నిజ మథఃపాతిన్ సిరు ల్బొందునే. ఆ-౨

చ. వలనగుపుష్పమంజరులు బంగరుతీఁగెలు ముత్యపున్సరుల్
వెలయు పునుంగుతావు లిడ వెన్నెలకుప్పలుఁబోలె రాజభో
గులు నగుసవ్విలాసినులు కోట్నమునం దటు వట్టిధాన్యముల్
సొలసి సువాలు పాడుచును సుంకులు నించిరి మించి రమ్యతన్. ఆ-౫

53. రేచర్ల మాధవరాయకవి

ఈకవి చంద్రికాపరిణయ మనెడి యాఱాశ్వాసములప్రబంధమును రచియించెను. ఇతఁడు పద్మనాయకకులజుఁడు; సురభి మల్లక్ష్మాపాల పుత్రుఁడు. ఈచంద్రికా పరిణయములోనికథ బాలసరస్వతికృతమైన చంద్రికాపరిణయములోనిదానికంటె వేఱయినది. ఇందు కథానాయకురాలగు చంద్రిక పాంచాలరాజకూఁతురు. ఈకవి నూటయేఁబదిసంవత్సరములక్రిందట నుండియుండవచ్చును. ఈకవి కవిత్వము తెలియుటకయి చంద్రికాపరిణయములోని రెండుపద్యముల నిందుఁ జూపుచున్నాను—

శా. వింతే మన్మథ మత్ప్రభుత్వమున కుర్విం బుట్టువిఘ్నావళిన్
గెంటం దార్చుచు మామకాత్మహితభంగి న్మించు నీ వుండుటల్
కంటంగానక బ్రహ్మభావముకడుం గాంక్షించి యొక్కండు పెన్
గొంటుం దాపసుఁ డెచ్చినాఁ డిలఁ దపఃకుల్యాధ్వసంచారియై. ఆ-౨

చ. పలుచనివారికిం బొడమి భాసురపుణ్యజనాహితాత్మునిం
గలసి చెలంగ నొప్ప దని కల్మివెలంది తలంచి ధాత్రి ని
య్యలఘునకున్ జనించె సముదంచిత పుణ్యజనాప్తు నొక్కరా
జు లలి వరింపఁగోరియని పొంపుగ నెంచిరి కొంద ఱాత్మలన్. ఆ-౪

54. అనియాది గణపతిదేవుఁడు

ఇతఁడు శివయోగసార మను గ్రంథమును రచియించెను. ఈవేదాంతగ్రంథము పూర్వోత్తరభాగములు గలదయి, భాగ మొకటికి నాలుగేసి యాశ్వాసములుగలదిగా నున్నది. ఈకవి నియోగిబ్రాహ్మణుఁడు; మూలనామాత్యుని పుత్రుఁడు. ఈతనికవిత్వము ప్రౌఢమయి హృద్యముగానున్నది. ఈతఁడే కాలపువాఁడో సరిగా తెలియదుగాని యిన్నూఱుసంవత్సరములకుముందే యుండినవాఁడయిన ట్లూహింపఁదగియున్నాఁడు. శివయోగసారమునుండి కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాము—

పూర్వ భాగము.

చ. ప్రమదముతో నొకింతయినఁ బాత్రున కీగి మహాఫలం బగున్
భ్రమసి యపారవిత్తము లపాత్రున కిచ్చినఁ గీడు పొందు ఘూ ✓
సము నొసఁగంగ దుగ్ధములఁ జాలఁగ ధేనువు లిచ్చు నట్టిదు
గ్ధములొసఁగన్ విసంబొలుకుఁగాదె భుజంగమయూథమిమ్మహిన్. ఆ ౧

ఉ. ఈక్రియ గర్భ మేర్పడిన నెంతయు భీతి జనింపుచుండఁ జిం
తాకులచిత్తయై కటకటా యిదియేమినిమిత్తమో కదా
నాకని కన్నుఁదమ్ముల ఘనమ్ముగ బాష్పము లేగుదేరఁగా
శోకభరాబ్ధిలో మునిఁగి సుందరి కోకిలవాణి యేడ్వఁగన్. ఆ. ౨.

మ. మెనయన్ జీవనచింతఁ బొట్టుపొరలై యేప్రొద్దువర్తించు నీ
చునియందుం గలశీలసూనృతగుణస్తోమంబు లిట్లున్నియున్
దనరం బక్వముకానికుంభమున యత్నంబార నిండంగఁ బో
సినవార్వారముభంగి నాశ మగుఁ జర్చింపంగ దేహంబుతోన్. ఆ-3

ఉత్తర భాగము.

శా. శాంతాకారుని నాత్మసంస్థితు శివున్ సత్కాంతిసంపన్ను న
శ్రాంతంబుం దమయాత్మలో సుజను లారాధింతు రాయీశు న

య్యంతర్యాగవిహీను లల్పమతు లుద్యద్బాహ్యకర్మైకవి
భ్రాంతుల్బాహ్యమునందుఁగొల్తురధికప్రాయాసముంబొందుచున్. ఆ-౧

శా. దేహం బస్థిరమౌటఁ గన్గొని మదోద్రేకంబునం బొంద కా
దేహంబు న్మనమున్ ధనంబు నతిభక్తిన్ సద్గురుస్వామికిన్
నీహారాద్రిసుతామనోహరునకున్ నిత్యంబు సద్భక్తియు
క్తాహీనాత్ములకున్ వివేకులకు వా రర్పింతు రెల్లప్పుడున్. ఆ.౨.

మ. గుహలోన న్వసియించునొండెఁ దిరుగున్ క్షోణీతలంబందు ని
స్పృహవృత్తిన్ వివిధక్రియాకుశలుఁడై పెంపొందుఁ గాదేని ప్ర
త్యహము న్నిష్క్రియుఁడై ననా నిజసమాధ్యాసక్తచిత్తుండు స
ర్వహితైకస్థితిఁ బెక్కుచేష్టలమరన్ వర్తించు స్వేచ్ఛాగతిన్. ఆ. ౪.

ఉ. బోరన భేదవాదములు పుణ్యము పాపము సంశయంబు శా
రీరమునన్ బ్రవృత్తులఁ బరిభ్రమఁ దృష్ణను బాసి యెవ్వఁడే
ధారుణి నిర్గుణం బయినతత్వముఁ ద్రోవఁ జరించుచుండు నా
ధీరున కేలగల్గును మదిం దలఁప న్విధియు న్నిషేధమున్. ఆ. ౪.

---

55. వేంకటాచార్యుఁడు

ఈకవి ముక్తిచింతామణి యనుపేర జగన్నాధమాహాత్మ్యమును నాలుగాశ్వాసములగ్రంథమునుగా రచియించెను. ఈకవి వైష్ణవబ్రాహ్మణుఁడు; యతిరాజకుల పెరుమాళ్ళాచార్యుల కుమారుఁడు.

"ఇట్లు గురుపరంపరానుసంధానపూర్వకంబుగా శ్రీజగన్నాయకుని కంకితంబుగా ముక్తిచింతామణిప్రబంధం తెనుంగు చేయుమని రాజమహేంద్రవరాధ్యక్షపద్మనాయకాగ్రేసర కోన తిమ్మరాయకృత కనకాంబరాభరణానులేపనపూర్వకసమర్చన ప్రేరితుండనై"

అని. కవి వ్రాసికొనియుండుటనుబట్టి రాజమహేంద్రపుర ప్రభువైన కోన తిమ్మరాజు ప్రేరణముచేత నీ గ్రంథము చేయఁబడినట్లు తెలియవచ్చుచున్నది. ఈ గ్రంథ మిన్నూఱు సంవత్సరములకు ముందే చేయఁబడినదేమో! జగన్నాథమాహాత్మ్యకవిత్వము రసవంతముగానే యున్నది. ఇందుండి కొన్ని పద్యములఁ జూపుచున్నాను—

శా. ధర్మాధర్మవిచారము ల్విహితసంధ్యాపూర్వయజ్ఞాది స
త్కర్మంబుల్ నిరతాన్నదాన నియతుల్ కాలానుగుణ్యక్రియల్
మర్మం బీపురుషోత్తమస్థలములో మర్త్యాళి కెల్లన్ భవ
న్నిర్మాల్యగ్రహణం బటంటి రిఁక నీసత్క్రియల్ వ్యర్థమే. ఆ. ౧.

ఉ. నిద్దురరాఁ బరుండుటయె నిక్కపుమ్రొక్కగు నిద్రయోగమౌఁ
దద్దయు వ్యర్థహింస క్రతుధర్మ మగున్ నిరతాన్నసృష్టమౌ
చద్ది మహాప్రసాద మగు సన్నుతియౌను నిరర్థకోక్తియే
ప్రొద్దును నిత్యవాసు లగుపుణ్యులకుం బురుషోత్తమంబునన్. ఆ-౨

ఉ. హీనుఁడు ముట్టినాఁ డనుచు నెంచి మదీయమహాప్రసాదమున్
దా నుపభుక్తియోగ్య మని తత్పరబుద్ధిఁ బరిగ్రహింపకే
మానిన సద్విజుండు హృతమంగళుఁడై భవరోగభారియై
న్యూనతఁ జెంది పంచమనియోగమునందు వసించు నెప్పుడున్. ఆ-3

మ. జలజాక్షుండు రథంబుపైఁ గదలఁ దచ్ఛాయాసమాక్రాంతుఁడై
ఖలుఁడైనన్ ఘనపాపము ల్దలఁగు సాకాంక్షన్ దదుద్వజ్జవా
కలనోద్భూతరజోభరాంకితుఁడు వాక్కాయాంతరాఘంబులన్
గెలుచుం దత్సురసింధుమజ్జనఫలోన్నిద్రప్రభావుం డగున్. ఆ. ౪.

56. లింగకవి, గంగకవి

ఈయిరువురుకవులునుజేరి సీతావిజయ మనునామాంతరము గల శతముఖరామాయణమును రచించిరి. ఈయిరువురుకవులు వేదాద్రిపుర నివాసులు. వీరిలో నీలకంఠోపాసకుఁ డయిన లింగకవి తాను రచియించిన మొదటి మూఁడాశ్వాసములును చిన్నారెడ్డిపుత్రుఁ డగు పోచనృపాలున కంకితము చేసెను; నృసింహోపాసకుఁడగు గంగకవి తాను రచియించిన నాలవయాశ్వాసమును భోగనృపాలుని కంకితముచేసెను. ఈయిరువురకవిత్వమును మొత్తముమీఁద రసవంతమయి నిర్దుష్టమయి హృదయంగమముగా నున్నది. ఈకవు లిన్నూఱుసంవత్సరములక్రిందట నుండినట్టు తెలియవచ్చుచున్నది. వీరి కవనధోరణి తెలియుటకయి శతముఖరామాయణములోని పద్యములొక్కొక్క యాశ్వాసమునుండి యొక్కొకటి యిం దుదాహరింపఁబడుచున్నది—

చ. శతముఖనామధేయుఁ డొకచండనిశాచరలోకనాథుఁ డు
గ్రత నలపంక్తికంఠఘటకర్ణపురందరజిత్ప్రహస్త లీ
క్షితిఁ బడుటంతయుఁ హితులచే విని రామునిమీఁద నాదటన్
ఘృతయుతపావకుండుబలెఁ గీలలు గ్రక్కుచుమండెఁ గ్రక్కునన్. ఆ-౧

ఉ. రాముని బంక్తికంధరవిరాముని నీలపయోదకోమల
శ్యాముని మానిహృత్కుముదసంచయసోముని సత్యభాషణ
స్తోముని సార్వభౌముని విశుద్ధసుకీర్తిగుణాభిరామునిన్
ధీమణి యైనభానుజుఁడు దిగ్గనఁ గాంచి ముదంబు చేకొనెన్. ఆ. ౨.

శా. ఏరా యోరివనేచరాధమ భయంబింతైననున్ లేక ప్రా
కారంబు ల్వెసదాఁటి తెట్లు మఱి వీఁకందాఁటి దుర్భీషణా
కారం బొప్పఁగవచ్చి తెట్లు తగవల్క న్వచ్చి నాముందటన్
ధీరత్వంబున నిల్చి తెట్టు లిది చింతింప న్మహాశ్చర్యమా. ఆ. 3.

ఉ. రాయనుఁ బోకుమంటిఁగదరాయను నిన్నిఁక బాసి యోర్వలే
రాయను హా శతద్వయఁకరాయను మమ్మిఁక బాధపెట్టవే
రాయను నీతనూజుఁ గనరాయను నెక్కడఁగందురా కుమా
రాయను నల్గ నేల వినురాయను హా శతకంధరాయనున్. ఆ. ర.

57. అంగర నృసింహకవి

ఇతఁడు రాజరాజాభిషేక మను నైదాశ్వాసముల ప్రబంధమును రచియించి, కొప్పుల వల్లభూవరున కంకితము చేసెను. ఈకవి రామకృష్ణ భట్టారకుని కుమారుఁడు. ఈకవి యేకాలపువాఁడో నిశ్చయముగాఁ దెలియరాలేదు. ఇతఁ డల్లసాని పెద్దనాదులను బేర్కొనక శ్రీనాధునివఱకును గలకవులనుమాత్రమే కవిస్తుతిలోఁ జెప్పియుండుటచేతను మధ్యకవులుమాత్రమే పేర్కొన్న చిమ్మపూడి యమరేశ్వరుని సంస్తుతించి యుండుటచేతను నృసింహకవి మధ్యకవులలోనివాఁ డేమోయని సందేహముకలుగుచున్నది. ఇతఁడు చేసినకవి స్తుతిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

క. భారతఘట్టోల్లఘున । పారీణకళాధురీణబంధురధారా
ధీరప్రబంధగంధ । ర్వారూఢుని భట్టనన్నపార్యునిఁ దలఁతున్.

ఉ. అంజలిచేతుఁ బద్మజనిశాంతకరాంతనిరంతరోల్బణ
న్మంజులవల్లకీమధురమంద్రనినాదసముల్లసద్ధ్వని
వ్యంజకవాణ్నిగుంభనసమంచితనూతనసృష్టిచాతురీ
రంజితసత్కవీంద్రబుధరాజికిఁ దిక్కనసోమయాజికిన్.

ఉ. ఇద్ధగుణుం బ్రబంధపరమేశ్వరు నెఱ్ఱనప్రెగ్గడన్ మనంగ
పద్ధతి నిల్పి సూక్తిరుచిభాస్కరుఁడై నహుళిక్కి భాస్కరున్

బుద్ధి ఘటించి సంతతము పూనిభజింతు వచఃప్రసాదనం
సిద్ధునిఁ జిమ్మపూడి కులశేఖరు నయ్యమరేశ సత్కవిన్.

క. పాథోధిపయోభర ని। ర్మాథచలద్ధుమఘుమాయమానలహరికా
పాథేయదాయిసూక్తి స। నాథున్ శ్రీనాథు నెమ్మనంబునఁగొలుతున్

ఈగ్రంథ మొకవేళ మధ్యకవులకాలములోని దైయైనను దీనియందు లక్షణవిరుద్ధములైన ప్రయోగములు కొన్ని కానఁబడుచుండుటచేత నప్ప కవీయాదులు తమలక్షణగ్రంథములలో నిందలిపద్యముల నుదాహరింపక పోయియుండవచ్చును. కృతిపతినిబట్టి సహితము కవియొక్క కాల నిర్ణయమును జేయుట కిప్పు డాధారములు దొరకలేదు. కృతినాయకు నకు కొత్తాపురము రాజధానియైన ట్లీక్రిందిపద్యమునఁ జెప్పఁబడినది—

సీ. కుదు రయ్యె నేవీటికోటలోపల వైశ్యసుప్రతిష్ఠితుఁ డైనశూలపాణి
పాయలేఁ డేవీటిపర్యంతవనవాటి మిండరాయఁడు లక్ష్మీధవుండు
నిండారు నేవీట నెండకాలమునందు జలజాకరం బైనసాగరంబు
చదు రొందు నేవీట సార్వకాలిక ఫలస్ఫురితంబు వేడంగి పాఁకతోఁట
సురపురంబునకైన నబ్బురము లగుచు।విఱ్ఱవీఁగుచునుండు నేవీటిసిరులు
వసుమతీపాదపద్మసంవళితరత్న। నూపురంబగునట్టి కొత్తాపురంబు

ఈకొత్తాపురము విశాఖపట్టణమండలములోని కొట్టాము గ్రామ మేమో! ఈపురాధిపతియయిన కృతిపతి శూద్రకులసంజాతుఁడు.

సీ. మూర్ధాభిషిక్తులముకుటంబు లేరాజుపాదపీఠికకు సోపానపంక్తి
చతురబ్ధివలయితక్షితితలం బేరాజుబాహుదండమునకు బాహుదండ
భువనంబు లేలుకప్పురగంధి యేరాజులీలాకటాక్షపాళికకు నీడ
రజనికాంతజయంతరతికాంతు లేరాజురూపరేఖకుఁ బ్రతిరూపకంబు
లతఁడు పట్టుతలాటకేళాదిరాయ। రాజదేవేంద్రరాజాధిరాజచంద్ర
గాయిగోవాళజగనొబ్బగండబిరుద। శాలి కొప్పుల వల్లభూపాలమౌళి.

మ. భరియించెం జతురర్ణవీవృతమహాభారంబు దోశ్శీకరన్
విరియించెన్ విమతాంధకారము సముద్వేలప్రతాపోన్నతిన్
గురియించెన్ ధనధాన్యరాశి కవిరాట్కోటీనివాసంబులన్
వరియించెన్ వరకీర్తికాంతఁ దనరన్ వల్లక్షితీశుం డిలన్.

ఇత్యాదిపద్యములలో బిరుదాంకములతో వర్ణింపఁబడి యుండుట చేతఁ గృతిపతి కవిచెప్పిన ట్లఖండభూమండలాధిపతి కాకపోయినను చిన్న సంస్థానాధిపతియైనట్టు కనుపట్టుచున్నాఁడు. స్పష్టముగాఁ దెలియువఱకును గవికాలము నిప్పుడు పదునాలువందలయేఁబదికి దరువాతికాల మనుకొందము. ఈకవిత్వమునందు లక్షణదోషము లనేకములు గలవు. ఇతఁడు ప్రబంధములోని యీమొదటిపద్యములోనే వ్రాయుటయని యుండవలసినదానికి వ్రాసుట యని ప్రయోగించినాఁడు—

ఉ. శ్రీసతి చన్నుఁగ్రేవలను జెక్కుల నొక్కటఁ బత్రభంగముల్
వ్రాసుటకున్ విరించి నిటలంబుల నొక్కట భాగ్యవర్ణముల్
వ్రాసుటకున్ జతుర్భుజవిలాసము పూనినవేల్పు సత్కృపో
ల్లాస మెలర్ప బ్రోచు శుభలక్షణుఁ గొప్పుల వల్లభూవరున్.

ఇట్లు కొన్నిదోషములు కానఁబడుచున్నను మొత్తముమీఁదఁ గవిత్వము రసవంతముగానేయున్నది. రాజరాజాభిషేకములోని కొన్ని పద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

చ. పనివడి చెప్ప నేల శిశుపాలునివిక్రమచేష్టితంబు లా
తనిపనిపూని దానవపదాతులు వచ్చిరి వీరె వారె యం
చనిశము జెప్పవెట్టక సురావళి దిక్కులు చూచుచుండఁగా
ననిమిషనామ మొక్కటియు నర్థము దప్పకయుండె నిప్పుడున్. ఆ.౧.

ఉ. ఆగయు విన్నమాత్రమున నైనను జూచినమాత్ర నైన నె
వ్వారిమనంబులం బ్రణయవాసితమై యనురాగకందళం

చీరిక లెత్తఁ గారణ మొకించుక లేకయుఁ బూర్వజన్మ సం
స్కారవిశేషమం ద్రదది వికస్వరమై కొనసాగు సర్వరన్. ఆ. ౨.

చ. అమృతసరోవరంబుగ హిమాంశునిమూర్తి కరంగి లోనిచి
హ్నము వికచోత్పలప్రకరమై చెలువొందిన నందులోన సం
భ్రమమున నీఁదు లాడి జడిమంబున నంగము లూను నేని యా
హిమమున నించు కేని శమియించునొకో మదనాస్త్రవేదనల్. ఆ-3

శా. శుద్ధాంతఃకరణైకయోగ్య మగుచుఁ జోభిల్లునస్మద్వచో
రాద్ధాంతం బిదీ యిచ్చగింపక వృథా ప్రజ్ఞాపరిజ్ఞానస
న్నద్ధు లొక్కొందఱు కేవలంబుగ వితండావాదులై తారసం
బద్ధోక్తుల్వచియించి రేని మదమార్ప న్వారి ఖండించెదన్. ఆ. ౪.

మ. మహిలో నీ కిటమున్న నేము విమతమ్మన్యత్వము ల్పానుటల్
సహియింపం దగునంచు నిప్పుడు వినుఁ విజ్ఞాపింప మా కేటికిన్
గుహనానాటకసూత్రధార భువి నీక్రొవ్వాడిమాయావిధుల్
బహురూపంబులుపన్నఁగాఁదిరుగరే బ్రహ్మేంద్రచంద్రార్కులున్ ఆ-౫

---

58. సిరిప్రెగడ ధర్మనామాత్యుఁడు

ఈకవి నలచరిత్రము నాలాశ్వాసములపద్యకావ్యమునుగా రచి
యించి, శ్రీవేంకటేశ్వరుల కంకితము చేసెను. ఇతఁడు నియోగిబ్రాహ్మ
ణుఁడు; హరితసగోత్రుఁడు; తిప్పయామాత్యపుత్రుఁడు. ఇతఁడు నలచరి
త్రములోఁ దనదండ్రి నిట్లు వర్ణించియున్నాఁడు—

ఉ. సూరినుతుండు తిప్పనయశోజలజాక్షికిఁ గ్రీడ సల్పఁగా
మేరుధనుర్ధరాచలము మేడ సుధాజలరాశి కేళికా
సారము పువ్వుఁదోఁట దివిషద్ధరణీరుహసంచయంబు నీ
హారమహీధరంబు కృతకాద్రియు నై విలసిల్లు నెప్పుడున్.

తనతండ్రి యిందు రిసీమలోనివాఁడనియు, ఈ క్రిందిపద్యములలోఁ దనమేనమామ పేరూరి నివాసుఁడనియు, కవి చెప్పుకొనుటచేత నీతఁడు గోదావరీ కృష్ణామండలములలోనివాఁడని తోఁచుచున్నది—

సీ. తన కేశవుఁడు ప్రపితామహుం డగు లోహి
తసగోత్రుఁ డల పుల్లదండనాథుఁ
డెసఁగు నేశవుతాత యసదృశోన్నతి పుట్ట
మాంబాధవుఁడుతిమ్మనాహ్వయుండు
పెనిచె నేశవుతండ్రి తనకీర్తిలత లాశ
లంటఁ బెంపగు తిమ్మయప్రభుండు
వెలయు నేశవుతల్లి విమలపతివ్రత
వివిధసద్గుణశీల వెంగళాంబ
యతఁడు తుమురుగోటివరవంశాబ్ధివిధుఁడు
సతతపేరూరి కేశవస్వామ్యధీన
మానసస్థితిఁబరఁగు నామేనమామ
మతినిగురుసన్నిభుఁడు ధర్మమంత్రివిభుఁడు.

చ. విను మనఘాత్మ ధర్మసుకవీ భవదీయవచోవిలాసముల్
ఘనకవిహృద్వికాసములుగా వె చమత్కృతిమీఱ నీవు నే
ర్చినగతి నిప్పు డానలచరిత్రము వేంకటశైలరాణ్నివా
సునకు సమర్పణంబుగను శోభనలీల రచింపు పెంపుగన్.

ఈకవికాల మేదో నిర్ణయించుటకుఁ బుస్తకమునం దాధారము లేవియుఁ గానరాలేదు. ఇతఁడు శ్రీనాథుని వర్ణించియుండుటచేతఁ బూర్వకవి కాఁడనుట నిశ్చయము. ఇతఁడాధునికుఁడయి యిన్నూఱుసంవత్సరములక్రిందట నుండియుండును. ఈతని కవిత్వము మొత్తముమీఁద నిర్దుష్టమయి యింపుగా నున్నది. నలచరిత్రములోనిపద్యములఁగొన్నిటి నిందు క్రిందఁ బొందుపఱుచుచున్నాను.

ఉ. ధారుణి వీరసేనవసుధావరువా లటువాల వీరు లా
పారసమిత్రుఁ దాఁటి తనసన్నిధిఁ జేరినవారి కెల్ల జం
భారి యిడన్ సురద్రుకుసుమావళియే యుడివోయె నన్నచో
నౌర గణింపఁగాఁ దరమె యాఘనుఁ డోర్చినశత్రుసంఘముల్. ఆ-౧

శా. లీల న్నీలపుఱాలమేడకడ లాలిం గేలిమై నుంచి జో
జోలక్ష్మీశకటాక్షవీక్షణయుతా జోజోశుభాకార జో
జోలావణ్యరమాకుమార యనుచుం జోకొట్టుచుం బాడి ర
న్నాళీకేక్షణ లాన్నృపాలసుతు వీణాకోకిలాలాపలై. ఆ. ౨.

ఉ. వెన్నెల చందమామకును వెన్నెలకుం దగఁ జందమామయున్
సన్నుతలీల నంద మగుచందమునన్ ధరణీతలేశ యా
కన్నియ నీకు వేడ్క నలకన్నియ కీవును జోడుగూడ నేఁ
గన్నులఁ జూతు నే మొయని కాంక్షయొనర్చెద నెమ్మనంబునన్ ఆ-౩

ఉ. అర్థి ఫలప్రదాయక గుణాకర నైషధసార్వభౌమ కా
ర్యార్థుల మైన మమ్ములఁ గృతార్థులఁ జేయఁగదయ్య సర్వశా
స్త్రార్థము లెందు నీ వెఱుఁగనట్టివి లేవకదా పరోపకారా
ర్థమిదంశరీర మను టాత్మఁ దలంచఁగదయ్య ధీనిధీ. ఆ. ౪.

శా. నీతిం జూడు నరేంద్ర మీనతతుల న్మీనంబులే మ్రింగుటల్
ఘాతక్రీడఁ గుఠారకాష్ఠ మిల వృక్షవ్రాతముం ద్రుంచుటల్
జ్ఞాతిత్వంబునఁ గాదె జ్ఞాతు లెచటన్ సామాన్యులే చెల్లఁబో
జ్ఞాతిచ్ఛేదన లేనకిమ్మనెడు శాస్త్రంబుం బరీక్షింపవే. ఆ. ౫.

మ. లలనా ప్రాణసమాన వై నసిను నేలాపాయ దే నన్న నీ
వలుకే నమ్మి భవత్పదాంబుజసమీపక్షోణి నిద్రింపఁగాఁ
గలితవ్యాళమృగాదిజంతుభయదోగ్రం బై నయీకాననలో
పల న న్వీడఁగనాడి పో నధిప నీపాదంబు లెట్లాడెనో. ఆ. ౬.

59. గణపవరపు వేంకటకవి

ఇతఁడు శ్రీప్రబంధరాజవేంకటేశ్వరవిజయవిలాసమనెడి యేకాశ్వాసప్రబంధమును రచియించెను. ఇది యేకాశ్వాసగ్రంథమేయయినను, ఇందలి పద్యముల సంఖ్యమాత్రము నాలుగాశ్వాసముల గ్రంథములో సామాన్యముగానుండుదానికంటెఁ దక్కువగాలేదు. ఈకవి నందవరీక నియోగిబ్రాహ్మణుఁడు; ఆశ్వలాయనసూత్రుఁడు; వసిష్ఠగోత్రుఁడు; అప్పయామాత్యపుత్రుఁడు. ఇతఁడు కృష్ణామండలములోని కామెపల్లె సీమయందలి గణపవరగ్రామవాసుఁడు. ఇతఁడు పల్నాటిలోనివాఁ డగుటచేతనే స్వానుభవముచేతను గాఁబోలును 'పలనాటి గొల్లలపాటజాతి' యని యచ్చటిగొల్లల పాటను నిరసించియున్నాఁడు. ఇతఁడు మిక్కిలి యాధునికుఁడే యయినను, ఇతని కాల మిదియనిమాత్రము సరిగాఁ దెలియదు. ఇతఁడును దనకు వేంకటేశ్వరుఁడు స్వప్నమున సాక్షాత్కరించి తన్నుఁ గూర్చి పలికినట్లు చెప్పుకొన్నపద్యములలోని యీక్రిందిపద్యమువలన నితఁడు పదునాఱవశతాబ్దాంతమునకు లోపలివాఁడుకాఁడని స్పష్టమగుచున్నది—

సీ. అల నన్నకోట పెద్దనలక్షణజ్ఞత శబ్దశాసనకవి శబ్దశుద్ధి
ప్రాబంధికపరమేశ్వరు నర్థమహిమంబు భయకవిమిత్రునిపదలలితత
శ్రీనాథువార్తాప్రసిద్ధి నాచనసోముభూరికాఠిన్యంబు పోతరాజు
యమకవిధము మల్లయమనీషిచిత్రంబు పింగళి సూరకవివరు శ్లేష
నాంధ్రకవితాపితామహునల్లికబిగి
ముక్కుతిమ్మనతేటయు భూషణునియ
లంకృతియు నీకె కలదొ తలంపలక్ష
ణకవి యప్పయ వేంకటసుకవిచంద్ర.

ఈపద్యమునుబట్టిమాత్రమే కాక యితఁ డవతారికయందుఁ దన్నుఁ గూర్చి చెప్పుకొన్న యితరభాగములనుబట్టికూడ విచారింపఁగా స్వాతిశయమును జెప్పుకొన్న యాంధ్రకవులలో నెల్ల నితఁ డగ్రగణ్యుఁ డయినట్టు కనఁబడుచున్నాఁడు. పయిపద్యమునందుఁ బదునాఱవ శతాబ్దాంతమందున్న పింగళి సూరనార్యునిని (రామరాజ) భూషణుని బేర్కొనుట చేత నీతఁడు పదునేఁడవశతాబ్దమునకు లోపలివాఁడు కాఁడనుటకు సందేహము లేదు. మఱియొకచోట నితఁడు తన గ్రంథమునందు "లక్షణ సారసంగ్రహ సరస్వతీవిలాస సాహిత్య చింతామణి సత్కవిజనసంజీవని" యని లక్షణసారసంగ్రహమును కవిసంజీవనిని బేర్కొని యున్నాఁడు. ఇందలి లక్షణసారసంగ్రహము చిత్రకవి పెద్దన్న రచియించినదైనపక్షమునఁ గవి పదునేడవ శతాబ్దారంభమునకుఁ బదునెనిమిదవశతాబ్ద మధ్యమునకుఁ దరువాతివాఁడును అగును. ఈగణపవరపు వేంకటకవి తనకుఁబూర్వులయిన కవుల కావ్యములలోనుండి గ్రంథచౌర్యమును విశేషముగాఁ జేసినవాఁడయినందున, ఆలక్షణసారసంగ్రహము కూచిమంచి తిమ్మకవిదే యైన పక్షమునఁ దిమ్మకవి గ్రంథములనుండియు చౌర్యము చేసినాఁ డని చూపుటకుఁ దగిననిదర్శనములు లేకపోలేదు. ఇరువుర కవులగ్రంథములలోని యీపద్యములను జూడుఁడు—

సీ. బింబోష్ఠియని నీవు పెరఁగరాకు శుకంబ
 సాంకవగంధి యీపంకజాక్షి
పంకజాక్షి యటంచుఁ బదరకు త్రేఁటి చం
 పకజాలనాస యీపల్లవాంఘ్రి
పల్లవాంఘ్రి యటంచు బాధింపకు పికంబ
 రామాంగి యీబిసప్రచయబాహ

బిసబాహ యని రాసు వెసనంచ జలద శి
రోరుహ యీ మహిరోమరాజి
యహిపరోమాళి యంచు డాయకుము నెమ్మి
కార్ముకభ్రూలతిక యీ చొకారపుఁ జెలి
యనుచు శుకభృంగ పరభృత హంస నీల
కంఠ నికురుంబములఁ దద్దకనలి పలికె.

అని తిమ్మకవి తన రసికజనమనోభిరామములోని చతుర్థాశ్వాసమునఁ జెప్పియుండఁగా గణపవరపు వేంకటకవి

సీ. చక్రస్తని యటంచు జగడించకు శశాంక
గురుతమోవేణి యీకుందరదన
మధురాధర యటంచు మట్టుమీఱకు తేఁటి
చంపకనాస యీజలజవదన
బిసబాహ యని మాఱు మసలకు రాయంచ
జలధరచికుర యీకలువకంటి
పల్లవకర యని త్రుళ్ళకు కోయిల
శ్రీరామమూర్తి యీకీరవాణి
వదన కుంతల యాడ సుస్వర సఖిత్వ
మెనసియుండుటకతన మీ కితవొనర్చు
ననుచు నళి చంద్ర పరభృత హంసములకు
భయము నయమునఁ దెలియఁగఁబలికె మఱియు.

అని చెప్పియున్నాఁడు. ఈయుభయులలో నెవ్వఁడు పూర్వుఁడో యాతని పద్యమును జూచి రెండవవాడు తనపద్యమునైనను వ్రాసికొని యుండవలెను, లేదా యిరువురుగూడఁ బూర్వమున్న యిటువంటి పద్యమును మఱియొకదానినిజూచియైనను వ్రాసికొనియుండవలెను. వేంకట కవి గ్రంథచౌర్యము చేయువాఁడగుట తెలియుటకయి నరసభూపాలీయ

మునుండియు వేంకటేశ్వరవిలాసమునుండియునొక్కొక్క చిన్న పద్యము నిం దుదాహరించుచున్నాము—

క. ఔరా యోబనృపాలకు
మారా మను మదనసమరమాధుర్యుఁడవై
ధీరా నృసింహ కూడితి
మారామను మదనసమరమాధుర్యుఁడవై.

అని యీపద్యము కావ్యాలంకారసంగ్రహములో పాదయమకము నకు లక్ష్యముగా నీయఁబడియుండఁగా, వేంకటకవి.

క. ఔరా మాధవయజ్వకు
మారా మను మదనసమరమాధుర్యుఁడవై
ధీరా విటార్య యేలితి
మారామను మదనసమరమాధుర్యుఁడవై.

అని పైపద్యమునే పేరులుమాత్రముమార్చి పంచదశవర్ణయుక్త పాదయమకమని తన పుస్తకములో వేసికొనియున్నాఁడు. ఈకవి వేంక టేశ్వరుఁడు తన్నుద్దేశించి పలికినట్లు కొన్నిటిని, తానే చెప్పుకొన్నట్లు కొన్నిటిని, ఇతరులు తన్ను మెచ్చి పొగడినట్లు కొన్నిటిని, స్వరచితము లైన గ్రంథముల నామములను జెప్పుకొనియున్నాఁడు. ఇట్లు చెప్పుకొనఁ బడిన తారావళులు, యమశతకము, శృంగారరసమంజరి, కృష్ణమల్లకథ, బాలరామాయణ ద్విపదము, చాటుపద్యములు, లింగనిర్ణయము, ఆంధ్ర ప్రతాప రుద్రీయము, ఆంధ్రరసమంజరి, ఆంధ్రనిఘంటువు, ఆంధ్రకౌ ముది, గణయతి ప్రాసలక్షణ సీసమాలిక, ఆంధ్రప్రయోగరత్నాకరము, రేఫ ఱకారనిర్ణయము, షట్ప్రత్యయ ప్రస్తారసరణి, ఇరువదాఱు ఛంద ముల వచనము, అలంకారసారము, పరమభాగవతచరిత్ర, ఆంధ్రద్విరూప కోశము, కల్పితకల్పలత, ఆంధ్రవసంత తిలకభాణము, కఠిన ప్రాసశత కము, ఆంధ్రప్రక్రియాకౌముది, జాంబవతీవిలాసము, చండవిద్యావతీ

దండకము, చక్రవాళతారావళి, పురాణసారము, ప్రబంధరాజ వేంకటేశ్వరవిజయ విలాసము, అను గ్రంథములలో రెండుమూడుతక్క శేషించినవన్నియు నామమాత్రా వశిష్టములయినవి. అట్లగుటకుఁ గారణము లేకపోలేదు. ఈకవి తానుజేసినపుస్తకములు లోకమునకుపయోగపడవలెనన్న యుద్దేశముతోఁగాక తనసర్వతోముఖ పాండిత్య ప్రకర్షమును లోకమునకుఁ బ్రకటింపవలెనన్న యుద్దేశముతో విశేషభాగము చేసినందున నీతనిపుస్తకముల కిట్టిగతి పట్టియుండును.

సంస్కృతములోనున్న జ్ఞానధనమును జనులకు వెదచల్లవలెనన్న పరమార్థచింతతో మొట్టమొదట నన్నయభట్టారకాదులగు మహాకవులు పదునొకండవశతాబ్దారంభమునుండి సులభశయ్యను సంస్కృతగ్రంథములఁ దెనిఁగింపఁదొడఁగిరి. ఈభాషాంతరీకరణకార్యము పదునేనవశతాబ్దాంతమువఱకును నవిచ్ఛిన్నముగా జరగుచువచ్చెనుగాని యిట్లు భాషాంతరీకరణమునకుఁ బూనుకొన్నవారిలోఁ గడపటివా రగు శ్రీనాథాదులు తమపూర్వులకన్నఁ దాము ఘనులనిపించుకోవలెనన్న చింతచేతనో మఱి యేహేతువుచేతనో సంస్కృతపదభూయిష్ఠము లైనదీర్ఘసమాసములతో నింపి రసమును జెఱుపక పోయినను తమగ్రంథములు బహుజనులకు దుర్గ్రాహ్య మైనకఠినశైలిని జేసిరి. ఇట్లాకాలములో భారత భాగవతరామాయణాదిముఖ్యగ్రంథము లన్నియుఁ దెలిఁగింపఁబడఁగా, అటుతరువాతఁ బదునాఱవశతాబ్దారంభమునం దల్లసాని పెద్దనాదు లొక క్రొత్తత్రోవఁద్రొక్కి కేవలభాషాంతరములు కాకుండఁ బురాణములలోని కథలను గైకొని స్వకపోలకల్పితములైన వర్ణనలను జేర్చి పెంచి శ్రీనాథాదులశయ్యనవలంబించి సరవంతముగా ప్రబంధములను జేయ నారంభించిరి. ఈపని నూఱు నూటయేఁబదిసంవత్సరముల వఱకును జరగుచురాఁగా, ౧౬౫౦వ సంవత్సరములోపల బహుమార్గముల నూతనప్రబంధము లనేకములు తెలుఁగునఁ జేయఁబడినవి. అంత

టితో నూతనసృష్టి బహుతరముగా నంతరింపఁగా, ఈవలివారు వసుచరిత్రమును మాతృకనుగాఁ గొని దానికి పాఠాంతరములో యనునట్లు పూర్వవర్ణనములనే తలలుమార్చి ప్రయోగించుచు వెనుకటిప్రబంధముల ననుకరించి తమప్రబంధముల నల్లఁజొచ్చిరి. చేసినదానినే పేరులుమార్చి మరలఁ జేయుచుండుటచేత నూతనార్థకల్పనలనుజేయుట దుష్కరమయి నందున నిటీవలివారిలోఁ గొందఱు మహాపురుషులాయర్థలోపమును పదాటోపముతోఁ బూరింపఁబ్రయత్నించిరి. పూర్వపువా రక్కడక్కడ సముచితముగా శబ్దాలంకారములను జేర్చుచు వచ్చినను భాషావధూటికిఁ బ్రాణ మైనయర్థసారస్యమును జెడఁగొట్టకుండిరి. ఇటీవలివారర్థ సారస్యమునంతగాఁ బాటింపక నిఘంటువులవెదకి పదములేరికూర్చి బంధించి తమ సరస్వతిని హృదయాకర్షకముగాఁ గాకపోయినను కర్ణరంజకముగా నైనను జేయఁబాటుపడిరి. ఇట్టివారిలో నెన్నికగన్న కొందఱు బంధాసుల నతిమాత్రముగాఁజేర్చి యర్థసారస్యమును బూర్ణముగాఁ జెఱిచి యవయవములు విఱిచి తమభాషావధూటిని విరూపినిజేసి శవప్రాయను జేసిరి. మన యీ వేంకటేశ్వరవిలాసకృతికర్తయు బలరామచరిత్ర కృతికర్తయైన గుడారు వేంకటదాసకవియుఁ గొంతవఱకీకడపటి తెగలోఁ జేరినవారు. ఒకఁడు తనపుస్తకమునకుఁ బ్రబంధరాజవేంకటేశ్వరవిజయవిలాస మని పేరు పెట్టుకొనఁగా నింకొకఁడు తనపుస్తకమునకుఁ బ్రబంధరాజశిరోభూషణ ప్రకృష్ట బలరామచరిత్రమని పేరుపెట్టుకొనెను. వేంకటదాసకవి

"నిరోష్ఠ్యమత్తేభవిక్రీడిత శార్దూలోత్పలమాలా తోటక మత్తకోకిల లయగ్రాహిమణిగణనికర పంచచామరస్రగ్విణీప్రమితాక్షర మణిభూషణ ద్రుతవిలంబిత కవికంఠభూషణ వినయస్వభూతాదృష్టహర్షణి రథోత్థతాంబురుహ కవిరాజవిరాజిత గణసమకదండకార్యాగీత సీస ప్కొఎన కంద శ్లోకచూర్ణికా వచనకైవార గద్య కలికోత్కలికామంజ

రీద్విపద ధవళసువ్వాలశోభనారాత్రిక నానారగడభేదసప్తత్రాశైలా మహార్ణవమిలాలిశారదద్వాత్రింశద్రాగ నానావిధవిచిత్ర నాగబంధ పుష్పమాలికా బంధసంయుక్తకల్పిత కల్పవల్లీ చంపకమాలికా వృత్తము."

అని పేరుపెట్టి యొక పద్యములో ననేకబంధ గర్భవృత్తముల నిమిడింపఁగా, మన యీవేంకటకవి దీనిని మించునట్లుగా,

"బహువిధచిత్రకంకణ బంధద్విగుణితసీసచరణచతుష్టయగర్భిత ద్విపదకందద్వయ సమవృత్తచౌపదయుగళాటవెలఁది తేటగీతి మదనవిలసిత తురంగవృత్త బహువిధతాళవృత్తాష్టక ధవళశోభనగానారాత్రికగాన జంపెత్రిపుటార్ధచంద్రిక సువ్వాలలాలిపదైలామంజరి సమతాడిండిమతాళ వృత్తమణిగణనికర తురగవల్గన రగడోదాహరణసంబుద్ధి కిళికోత్కళి కార్ధాహిరీ రాగదళ ముఖారిరాగాటకతాళదళ కాంభోదిరాగ రూపక తాళదళకాంభోదిరాగ సమపద కన్నడరాగ సాంగత్య కొరవంజిదళ రేవగుప్తిరాగ సమపద సావేరిరాగైకతాళదళ బిలహరిరాగాటతాళ సమపద పుష్పమాలికాబంధ గోమూత్రికాబంధ శార్ఙ్గబంధ షోడశదళపద్మబంధ పాదుకాబంధ నవరంగబంధ ఖడ్గబంధ గుచ్ఛబంధ ఛత్రబంధ చామర బంధ గదాబంధ చక్రబంధ నాగబంధ రథబంధ శంఖబంధ మృదంగ బంధ పాదభ్రమకబంధ పాదార్ధ భ్రమకవింశతిబంధ భేదకందానుష్టుప్ శ్లోకాంతర్గత చతుర్భద్ర నవరంగ సర్వతోభద్రాందోళికాబంధ యుక్తాను లోమవిలోమ కందభాషాశేషకందకందాటవెలఁది గర్భితాంత్య తేటగీతి యుక్తచౌషష్టిభేదచిత్రసీసము"

అని పేరు పెట్టి యొకపద్యములోనే బహుబంధ గర్భవృత్తముల నిమిడ్చెను. కవి మిక్కిలి కష్టపడి పయిని జెప్పఁబడినరీతి గర్భబంధకవిత్వమును, ఏకాక్షర నిఘంటులను వెదకి—

క. కైకోకీకాకకుకై । కోకాకాకింకకూకి కూకకుకోకీ
కాకుకకు కేకకేకిక । కూకో కోకూక్కక కింక కోకై కోకా.

అనురీతి నేకాక్షరములతోడి చిత్రకవిత్వమును, ఒక్కదానిలో నేయితరపు నక్షరములోను లేనంత యమితముగాఁ జెప్పి తనశిల్పివ్యాపార కౌశలము నెంత చూపినను, కాళ్లతో నడచి గమ్యస్థానమును చేరు సామాన్యమార్గము విడిచి యడ్డముగా భూమిమీఁదఁబడి కడుపుతో దొర్లి ప్రయాసపడి గమ్యస్థానమునుజేరి యసాధారణప్రౌఢిమను జూపిన బుద్ధిమంతుని శక్తిని మెచ్చుకొనునట్లే యిట్టి కవితాచమత్కృతులు మెచ్చుకొనఁ దగియుండునుగాని యంతకంటె నెక్కువ శ్లాఘనాపాత్రములుగావు. నవరసరసికు లెప్పుడును హృదయాహ్లాదకరముగా నర్థకల్పనము చేసియు కర్ణరసాయనముగా మృదుమధురవాగ్గుంభనలతో భావములఁగూర్చియు మానసోద్దీపకముగా నీతి బోధన మొనర్చియు వర్ణనలు చేయఁగలిగిన కవినిమాత్రమే మెచ్చుకొందురుగాని కావ్యదోషములకు లక్ష్యము లగునట్లుగా నర్థగౌరవముఁ జెఱచి పదముల విఱిచి పద్యములలోఁ బద్యములను దూర్చినవానిని మెచ్చుకోరు. ఈ వేంకటకవివర్యుని కవనమునందు వ్యాకరణదుష్టములయిన ప్రయోగము లనేకములు కానఁబడుచున్నవి. ఈకవికాల మేదో సరిగాఁ దెలియ రాకపోయినను, ఈతని గ్రంథములోని సలాము సాహెబు ఫిరంగి తుపాకి మొదలగు పదప్రయోగములీతఁ డాధునికుఁడని ఘోషించుచున్నవి. బంధగర్భచిత్రకవిత్వముల కొఱకై శ్రమపడి కూర్చిన భాగములను విడిచినపక్షమున, ఈతని కవిత్వము మొత్తముమీఁద రసవంతమయి పదలాలిత్యము కలదయి మనోహరముగానే యున్నది. ప్రబంధరాజ వేంకటేశ్వరవిజయవిలాసములోని కొన్ని పద్యముల నిందుఁ బ్రదర్శించుచున్నాము—

చ. తగునె నృపాలకన్యలకు దవ్వులనవ్వుల పువ్వులాటలీ
వగలఁ జరింప నిందుఁ దగవా మగువా మగవార లుండఁగా

మగుడి పురంబుఁజేరఁ జనుమా వినుమా యనుమాన మేల నీ
సొగసు విలాస మందమును సొంపును నింపును బెంపుమీఱఁగన్.

ఉ. వ్రేలిమి వ్రేల్పఁ డెప్పుడును వ్రేల్చు మొగంబు వధూలలామకై
చాలుగ సంధ్యవార్చఁడు త్రిసంధ్యలవార్చును వంటవార్పు లా
బాలికయింటఁ దండ్రి సలుపం గననొల్లఁడు దేవపూజ యే
వేళల లంజెతల్లి యిలువేలుపుమాత కిడుం బ్రణామముల్.

చ. అడిగినఁ దెచ్చువాఁడొ కడునందమునం గననైనవాఁడొ మే
ల్నడవడికాఁడొ పీటఁ దగునాయకమై చరియించువాఁడొ చే
విడిముడికల్గువాఁడొ తలవెండ్రుక లందఱు రాకుమారకుల్
ముడుపులు వానగాఁగురియ ముట్టువు కారణమేమి కూఁతురా.

శా. ఏమీ పల్కవు నేను బిల్వ దయ లేదే నీకు నాయయ్య ని
న్నేమంటిన్ సుకుమార నాయెడను దప్పేదీ కుమారాగ్రణీ
నామీఁదన్ జల మేలరా తనయ నన్మన్నించరా పెన్నిధీ
నీముద్దుల్గననోచినానుగద తండ్రీ నీతిపారంగతా.

60. వేముగంటి దత్తోజీపండితుఁడు

ఈకవి ప్రస్థానత్రయములో నొకటియైన భగవద్గీతా యోగశాస్త్రమును బద్యకావ్యముగాఁ దెనిఁగించెను. ఇతఁడు హారితసగోత్రుఁడు; నాగమాంబకును నాగోజీపండితునకును బుత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; మాధ్వమతస్థుఁ డని తోఁచుచున్నది. ఈయనకాలము మొదలయిన వానినిగూర్చి యేమియు నిశ్చయముగాఁ దెలియదు. ఇతఁడు నూఱుసంవత్సరముల లోపలివాఁడు కాఁడు. కృష్ణార్జునసంవాదమను నామాంతరము గల యీయోగశాస్త్రములోని కొన్నిపద్యముల నిందుదాహరించుచున్నాను—

ఉ. కోకలు జీర్ణమై చనఁగ గొబ్బున వానిఁ బరిత్యజించి తా
శ్రీకరనూత్నవస్త్రములఁ జెల్వుగఁ దాల్చినభంగి దేహి సు
శ్లోకుఁడు జీర్ణదేహములశోభకు రోసిన జీవమూర్తి యీ
లోకపుగోమలాంగముల లోలతఁ దాల్చును భద్రమూర్తియై. అ-౨

ఉ. సల్లలితంపుఁగర్మములు సాంద్రయశోనిధి సద్విరక్తిచే
నొల్లక సన్యసించి పటుయోగసుఖంబుఁ జెందుచుండుఁ దా
నెల్లెడ జీవుఁ బోలి కడుహేయపుఁదొమ్మిదితూంట్లమేనిలోఁ
ద్రుళ్లుచుఁ జేయనొల్లఁడుప్రహర్షముతోనియమింపఁడన్యులన్. అ-౬

ఉ. వేదములన్ మఖంబులను విశ్రుతదానతపంబులన్ సము
త్పాదితమైనపుణ్యము నధఃకరణం బొనరించుయోగి య
య్యాదిమపూరుషోత్తమునిజార్థము నెమ్మది సంగ్రహించి ని
ర్వేదన లేక యార్యమగు విష్ణుపదంబును జెందు నర్జునా. అ. ౮.

ఉ. ఇంద్రియసౌఖ్యసంపదల నేమియుఁ గోరక వీతరాగుఁడై
సాంద్రయశుండహంక్రియలచక్కటిఁ బోవక దూరవర్తియై
యింద్రజ మేనికిన్ జరయు మృత్యువు జన్మము వ్యాధులున్ విని
స్తంద్రత దుఃఖదోషములు, జాలఁగఁగల్గుటెఱుంగఁగాఁదగున్. అ-౧౩

ఉ. కామము రాగముం బలముఁ గల్గి యహంకృతి దంభయుక్తుఁడై
యేమనుజుండు శాస్త్రవిధి నెంతయుఁ దుచ్ఛముగాఁ దలంపుచున్
భూమికి భీకరం బయినభూరితపం బొనరింపుచుండు నా
పామరు నాసురక్రియలఁ బర్వినవానిఁగ నిశ్చయింపుమా. అ. ౧౭.

61. గుడారు వేంకటదాసకవి

ఈకవి బలరామచరిత్రమని సామాన్యముగా వాడఁబడు ప్రబంధరాజశిరోభూషణ ప్రకృష్ట బలరామచరిత్ర యను నాఱాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు బలిజవంశజుఁడు; పైడిపాలగోత్రుఁడు; ఈతని తండ్రి గురవేంద్రుఁడు; తల్లి రంగమాంబ. ఇతఁ డాధునిక కవియే యయినను, కాలనిర్ణయము చేయుట కాధారము లేవియుఁ గానరాలేదు. ఇతఁడు నూటయేఁబది సంవత్సరములక్రిందట నుండెనేమో! ఈతని కవిత్వము ప్రౌఢమైనది. బలరామచరిత్రమునుండి రెండుపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

శా. నీరేజాక్షికి హారమౌక్తికతతుల్ నీలంబులై తైలముల్
జాలంగాఁ బగడంబులై పిదప వజ్రాకారము ల్పూని వి
స్తారస్వేదకణంబులం దడిసి సున్నం బయ్యె నాదుర్దమ
స్మారస్ఫారశరాగ్ని హైమపట మచ్ఛచ్ఛాయమై తోఁచినన్. ఆ-3

ఉ. వారిధిధీరమానసుఁ డవారితతేజుఁడు నై జరాజకం
ఠీరవభావభీతహారిణీభవదున్మదవైరివీరుఁ డు
ద్దారుణమార్గణప్రకరదైన్యవిదారణదానదక్షుఁ డీ
భూరమణాగ్రణిం గనుము పుష్కరనేత్ర విదూరకాహ్వయున్. ఆ.౫.

62. కామనూరి కృష్ణయ్య

ఇతఁ డిందుమతీపరిణయ మనెడి యైదాశ్వాసముల ప్రబంధమును రచించెను. రఘువంశములోని యజమహారాజుచరిత్ర నీప్రబంధరూపమునఁ జేసినట్లు కవియే యీపద్యమునఁ జెప్పియున్నాఁడు—

సీ. కాళిదాసకవిశ్రేష్ఠకల్పితంబు
భవ్యచరితంబు రఘువంశకావ్య మందు
నజునికథయాంధ్రభాషచేనలఘుమతిని
గృతిరచింపఁబూనితినలంకృతులుచెలఁగ.

ఈకవి నందవరీక బ్రాహ్మణుఁడు; గోవిందయామాత్య నందనుఁడు. ఇతఁడు నూటయేఁబదిసంవత్సరములనాఁటివాఁడయి యుండునేమో. ఈతనికవిత్వము మనోహరమైనదే. ఇందుమతీపరిణయములోని రెండు పద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. అందు దిలీపభూపతనుజాగ్రణి దేశము మేలుబంతి మ
ధ్యందినపంకజాప్తనిభుఁ డాధరణీశుఁడె మేటి తత్సుతుం
డిందు వసంత చిత్తజ సురేశ్వరసూనులకన్న మిన్న వా
నందముఁ జెప్పఁ జూప వశమా యసమానపరాక్రమక్రమా. ఆ. ౧.

ఉ. అన్నకు మ్రొక్కి తత్కరుణ నాయితపెట్టినదంతపుంబనిం
జెన్నలరారుపల్లకి వసించి చొకాటపుఁదేటకెంపురా
కన్నెమెఱుంగుఁగేలఁ బూనఁగఁగ ధరించె మధూకదామ మ
త్యున్నతమంగళప్రకటతూర్యరవంబులు మిన్నుముట్టఁగన్. ఆ. ౪.

63. వేంకటాచార్యుఁడు

ఈకవి భద్రరాజపుత్రచరిత్రమను నైదాశ్వాసముల ప్రబంధమును రచియించెను. కళాపూర్ణోదయమునందువలెనే యిందలికథలును కవిచే నూతనముగాఁ గల్పింపఁబడినవి; కాని కవిత్వ మంతప్రౌఢమయినది కాదు. ఇందలికథలను బోలిన కథ లనేకములు కొన్నివైష్ణవగ్రంథములలోఁ గానఁబడుచున్నవి. ఈకవి వైష్ణవబ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; ఆత్రేయసగోత్రుఁడు; శ్రీనివాసాచార్యపుత్రుఁడు. ఇతఁడు నూటయేఁబది సంవత్సరములక్రిందట నుండినవాఁ డయినట్లు చెప్పుచున్నారు. భద్రరాజపుత్రచరిత్రమునుండి రెండు పద్యముల నిందుఁ జూపుచున్నాను—

శా. ఏనుం జెప్పినభంగిఁ జేసితివె కాశీశుండు ప్రత్యక్షుఁడై
తా నిన్మెచ్చితిఁ గోర్కె వేఁడుమనెనే ధన్యుండనైతిం గృపన్
నానాసౌఖ్యశుభాకరంబుఁ బుత్రు న్నాకిమ్ము యంచే శివుం
డానందించి యొసంగెనే వరము నీ వబ్భంగిఁ జేకొంటివే. ఆ. ౧.

ఉ. ఎవ్వరు నావిధంబు జలజేక్షణకుం దెలిపించి మేలు లో
నివ్వటిలం గరంగ పని నేర్పుదలిర్పఁగఁ దెచ్చి కూర్చి యీ
నెవ్వగఁ బాపువారె తమి నిల్వఁగఁగూడదు మేనఁ బ్రాణముల్
రవ్వడిఁ బోవుచున్నయవి రాదు భరింపఁగ నేమిచేయుదున్. ఆ. ౫.

---

64. మల్లంపల్లి నాగభూషణకవి.

ఇతఁడు బసవవిజయమను మూఁడాశ్వాసముల గ్రంథమును రచియించెను. ఇతఁడు వీరశైవమతస్థాపకుఁడైన బసవేశ్వరుని చరిత్రమును మాత్రమేకాక బసవచరిత్రాదులను రచియించిన పాలకురికి సోమనాథాదులనుగూర్చియు నిత్యాదిపద్యములలో వ్రాసియున్నాఁడు—

క. వీరప్రతాపరుద్రుఁడు । ధారుణిలోఁ గలుగుప్రజల ధర్మాత్ముండై
యారూఢి వెలయ నేలుచు । గారవమున నున్నయట్టికాలమునందున్.

సీ. ఫాలాక్షభక్తుండు భవపరిత్యాగి సముంచితభూతిరుద్రాక్షధారి
పంచాక్షరీమంత్ర పఠనపారీణుఁడు విమలఘనవ్రతవీరయశుఁడు
కావ్యకళాశాస్త్రకామితప్రవణుండు శాఖాగ్నిఫలపత్రజలము లైన
భవిచేతఁ జేకొనం డవి విననోపఁడు భాతిమీఱంగను బాలకురికి
సోమనాథుఁ డనఁగ సురలు ప్రస్తుతిచేయ
సకల శాస్త్రములను జదివిచూచి
ప్రకటితముగ శివుని భక్తి యధికమని
బసవదేవుమహిమ ప్రబలఁజేసె.

ఈ కవి శైవబ్రాహ్మణుఁడు, హారితసగోత్రుఁడు; త్రిపురాంతకారాధ్యపుత్రుఁడు; ఇతఁడు నూటయేఁబది సంవత్సరములక్రిందట నుండినట్లు తెలియవచ్చుచున్నది. ఈతని కవిత్వమంత మంచిది కాక, వ్యాకరణవిరుద్ధములైన ప్రయోగములతోఁ గూడియున్నది. ఈతని బసవ విజయములోనివి రెండు పద్యము లిందుఁ బ్రదర్శింపఁబడుచున్నవి—

చ. బసవపురాణకావ్యమును బ్రాభవ మొప్పఁగఁ బద్యగద్యలక్
భాసఁగఁగ నాంధ్రకావ్యములు బుద్ధిని దా రచియించి చెప్పఁగాఁ
బసిగొని భూసురుల్ వినియుఁ బాయక గుంపులు కూడి రాజుతో
మసలకపోయి పాల్కురికిమాన్యుఁడు సోమన చేయుశాస్త్రముల్. ఆ.౧

చ. అధములు మీరు బ్రాహ్మణులై యందఱుఁ జూడఁగ నొక్కచాకి యీ
పథమున వేదవాక్యములు పాడి పదంబుల మిమ్ము నందఱున్
బధిరులఁ జేసెఁగాని సరిపాల్పడి మీ రొకరైన వారితో
నెదుటను నిల్చి సంహితల నేర్పడఁ జెప్పఁగఁజాల రందఱున్. ఆ.౧.

65. చిత్రకవి సింగరార్యుఁడు

ఈ కవి బిల్హణీయమను మూఁడాశ్వాసముల ప్రబంధమును రచియించి శ్రీరామాంకిత చేసెను. ఈకవి యాఱువేలనియోగిబ్రాహ్మణుఁడు. ఈతని యనంతరమున నీతని పుత్రుఁడగు నారసింహకవి తనతండ్రి రచియించిన గ్రంథమును దెచ్చి పండి పెద్ది కృష్ణస్వామి కిచ్చి యాతనివలన ధనస్వీకారము చేసినట్లును, వా రిద్దఱును గలిసి కృత్యాదియందలి కొన్ని పద్యములను గద్యములనుమార్చి గ్రంథమును గృష్ణస్వామి రచియించినట్లు దిద్దినట్లును జెప్పుచున్నారు. ఆ కొన్ని పద్యములను మార్చుటలోఁ గూడఁ గృష్ణస్వామికి నారసింహకవి సాహాయ్యమున్నదని తెలుపుటకుఁ గాఁబోలును బిల్హణీయమున నీ క్రిందిపద్యము వేయఁబడి యున్నది—

క. ము న్నింద్రతనూభవునకు। వెన్నుఁడు సహాయ మైనవిధమున సేనా
సన్నుతసద్గుణగణసం। పన్నుం డగుకవివరాధిపసహాయమునన్.

గ్రంథమునందుఁ బండి పెద్ది కృష్ణస్వామియే గ్రంథరచన చేసినట్లు చెప్పఁబడియున్నను నిజముగాఁ గృతికర్త సింగరయ్యయే యగుటకు నిదర్శనము ప్రథమాశ్వాసాంతమునందుండిన యీక్రింది చక్రబంధమునందుఁ గానఁబడుచున్నది—

శా. ధన్యా సింహభచంద్రకీర్తి వరవిద్యాపండితార్యక్రమా
గణ్యా గర్వధనంజయా శివదముక్తాకృత్ప్రిగంకప్రభూ
జన్యారాజితభూరిశాత్రవసుభృజ్జావిద్రమావిక్రమా
మాన్యారాధన త్యాగభోగజయధామా నవ్యభాగోత్తమా.

ఈకావ్యము నూటయేఁబదిసంవత్సరములకుఁ బూర్వము రచియింపఁబడినట్లు తెలియవచ్చుచున్నది. ఇందలికథ మనోహరముగాను కవనము రసవంతముగాను గొంతవఱకున్నను దారాశశాంకమువలెనే యిదియు నీతిబాహ్యమైనందునఁ జదువఁ దగినదికాదు. మదనాభిరాముఁ

డనురాజు రూపయావనవతియగు యామినీపూర్ణతిలకకు సంగీతసాహిత్యములు చెప్పింపఁదలఁచి, సమస్తవిద్యలయందును సమర్థుఁడయిన బిల్హణుఁడను సంస్కృతకవీంద్రుని రావించి, అతఁడును రూపయావనసంపన్నుఁడయినందునఁ దనకూఁతు నాతనికడ నొంటిగానుంచి చదివించుట కిష్టము లేనివాఁడయి మంత్రితో నాలోచింపఁగా నతఁడు

మ. ఒకచిత్రవ్రత మున్న దిర్వురకు రాజోత్తంస సిద్ధంబుగా
నకలంకాకృతి యైననీతనయ జాత్యంధు న్విలోకింప దా
సుకవీంద్రుండును గుష్ఠగాత్రి నెపుడుం జూడ న్మదిం గోరఁ డిం
దుకు నేమో వచియుంచు టే నెఱిఁగియుండున్మన్నుత తాత్పర్యమున్.

మ. కవిరాజాగ్రణి పుట్టుగ్రుడ్డనుచు నీకంజాక్షికిం జెప్పి యా
కవికిన్ మీసుత కుష్ఠగాత్రియని వేడ్కం దెల్పి యవ్వారికిన్
భువి నన్యోన్యవిలోకనక్రియలు నేర్పుల్మీఱఁ గాకుండున
ట్లు విచారించెద నొక్కయుక్తి వినుఁ డిట్లున్ రాజదేవర్షభా.

అని రాజపుత్రి తాను జాత్యంధునిముఖముఁ జూడనని నియమముపట్టియున్నందున నామెతో నావిద్వాంసుఁడు పుట్టుగ్రుడ్డివాఁడని చెప్పియు బిల్హణుఁడు కుష్ఠగాత్రిని జూడనని నియమముచేసికొనియున్నందున నాతనితో రాజపుత్రి కుష్ఠగాత్రియనిచెప్పియు నిరువురకు నన్యోన్యముఖావలోకనము లేకుండ నడుమ తెర వేసి చదివింప వచ్చునని యుపాయము చెప్పెను. రాజాయుపాయమునకు సంతోషించి తనకొమారితతోను విద్వాంసునితోను నమ్మఁబలికి వారి నొడఁబఱిచి యిరువురిమధ్యను తెరవేయించి కూఁతునాతనివద్దఁ జదివింప నారంభించెను. కుశాగ్రమతియైన యామినీపూర్ణతిలక యాతనివలన సంగీతసాహిత్యాదివిద్యల నభ్యసించి యల్పకాలములోనే కవిత్వముచెప్ప నేర్చుకొనెను. ఇట్లు కొంతకాలము జరుగఁగా నొకనాఁటిరాత్రి క్రొత్తగా నుదయించిన పూర్ణచందునిజూచి కవి.

చ. జలనిధిపంక్తి మంచు మఱి చాయయుఁ జిహ్నము లేడిపిల్ల కం
దళితసురేంద్రనీలమణిధామ మటంచు వచింతు రంద ఱీ
కలువలతేనియందుఁ గలకందును నే ననుకొందు రాత్రియం
దలవడ మ్రింగినట్టితమ మంతరసంస్థ మటంచు నెంతయున్.

ఇత్యాదివాక్యములతోఁ జంద్రవర్ణనము చేయఁజొచ్చెను. ఆవ
ర్ణన నాలకించి యామినీ పూర్ణతిలక

శా. అంధుం డెక్కడ చంద్రుఁ డెక్కడ తదీయంబైన యావర్ణనా
బంధం బెక్కడ యిట్టివింత గలదే భావింప నెచ్చోటనై
నం ధాత్రీంద్రుఁడు మాకు నిర్వురకు నందంబొప్ప నన్యోన్యహృ
త్సంధానం బగు నంచుఁ జేసె నిటులం జర్చింప వేఁడున్నదే.

పుట్టుగుడ్డివాఁ డెక్కడ? చంద్రవర్ణనముచేయు టెక్కడ? రాజు
మాకిరువురకు నన్యోన్యసంధానము కలుగకుండ నీమము కల్పించెఁగాబో
లునని తలఁచి, వ్రతభంగమయినను గానిమ్మని సాహసముచేసి తెరదీసి
చూచెను.

ఉ. ఆకడ బిల్హణాఖ్యకవి యత్తఱిఁ దామరసారిఁ గూర్చి యెం
తో కళ యుప్పతిల్ల వినుతు ల్పచరింపుచునుండి యంతలోఁ
బ్రాకటబద్ధకాండపటిపై రమణీమణిమోముఁ జూచి య
స్తోకమహోదయాద్రిపయిఁ దోచిన చంద్రునిఁ బోల్చి యిట్లనుꣳ.

ఆయావనపురుషుఁడు పండువెన్నెలఁ గాయుచుండఁగా సంపూర్ణ
పూర్ణిమాచంద్రబింబమును మీఱిన నిండుజవ్వనియొక్క ముఖచంద్రబిం
బము నొంటిగాఁ జూచిన తరువాత జరగినపని చెప్పనక్కఱయే లేదు.
ఇట్లుకొంతకాలము రాజపుత్రియుఁ గవీశ్వరుఁడును యథేష్టావిహారముల
నానందించుచుండఁగాఁ దెలిసి కావలివారు రాజునకు విన్నవింపగా
నతఁడు కూఁతుం జేరఁబిలిచి.

ఉ. కోరిన రాకుమారకునకుం బ్రియమారఁగ నిన్ను నిచ్చి యెం
తో రహిమీఱి సౌఖ్యమున నుండెదనంచుఁ దలంచియున్న నా
కోరిక లెల్లఁ బోఁగలఁచి కొంకుఁ గలంకము లేక మత్కులం
బారఁగ దుర్యశంబు మహి నందఁగఁ జేసితివమ్మ బాలికా.

అని కోపముతో బిల్హణుని శిరశ్ఛేదము చేయ నియమించెను. రాజభటుల లాతనిని వధ్యస్థలమున కీడ్చుకొనిపోవుచున్నారని విని రాజపుత్రి యిట్లు విలపింపఁ జొచ్చెనట—

మ. అరవిందంబులరీతిఁ జెన్నలరునీహ స్తంబు లెట్లోర్చె ము
ప్పురిగాఁ బెన్చిన కాలపాశమునకున్ ముగ్ధాంగనాగానభ
వ్యరసోత్కర్షము లైననీశ్రుతియుగం బత్యుద్ధతోద్ఘోషకిం
కరనాదార్భటి కెట్లుతాళె మదనాకారా మనోనాయకా!

కవియును దన ప్రాణాపాయమును బాటింపక త్రోవపొడుగునను దన ప్రియురాలిని దలఁచుకొని యీమెపయి నీరీతిని బద్యములు చెప్ప నారంభించెను—

ఉ. హా కమలాయతాక్షి చెలి హా సరసీరుహకుట్మల స్తనీ
హా కమనీయగాత్రి సతి హా నవమోహిని హా వధూమణీ
హా కనకాంగి నేను విడనాడితి నంచుఁ దలంచెదీవు నీ
లోకమునందు జీవునకు లోలతగాక స్వతంత్రమున్న దే?

కవి తలవరులు తన శిరమును ఖండింపఁబోవునప్పుడొక పద్యము వ్రాసి రాజునకంపఁగా నతఁడది చదువుకొని కవిని క్షమించి, బిల్హణునికిని తన పుత్రికకును గల యన్యోన్యానురాగమును విచారించి, తన కూఁతు నాతనికిచ్చి వివాహముచేసెను.

మ. పొలుపొందన్ ద్విజరాజశేఖరునకున్ భూభృద్వతంసంబు ని
శ్చలభావోన్నతిఁ గన్య నిచ్చుపగిదిన్ శైలనాకముఖ్యంబుగాఁ
బొలుపొందన్ ద్విజరాజశేఖరునకున్ భూభృద్వతంసంబు ని
శ్చలభావోన్నతిఁ గన్య నిచ్చె సుమనస్సంతానము ల్మెచ్చఁగన్.

66. రేవణూరి వేంకటార్యుఁడు

ఇతఁడు శకుంతలాపరిణయమను మూఁడాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు నందవరీక వైదిక బ్రాహ్మణుఁడు; శ్రీవత్స గోత్రుఁడు; తిరుమల కొండయార్యపుత్రుఁడు. ఈతఁడు తన శకుంతలా పరిణయము నొకానొక రాజున కంకితముచేయ నుద్దేశించియుండఁగా నొక కరణము విఘ్నమాచరించినట్టును, అందుచేతఁ దనకృతిని వేంకటేశ్వరుని కంకిత మొనర్చినట్టును, గవి యీ క్రింది వాక్యములలో వ్రాసికొని యున్నాఁడు—

వ. అపూర్వపూర్వకవిసుపర్వానుగ్రహంబునఁ బుణ్యగుణకథాశ్రవణకుతూహలిక బుధసదానుబంధంబగు నొక్క ప్రబంధంబు సరససుమనోనుబంధంబుగా నిర్మింపం బూని యున్న సమయంబున నతిప్రభావసంపన్నుం డగు కశ్చిత్ప్రభుండు—

శా. శ్రీవత్సాన్వయు రేవణూరికులజున్ శ్రీపాదరేణుప్రభా
సౌవర్ణ్యస్ఫుటకావ్యకల్పకకవిన్ సంకీర్తనాచార్యపు
త్రీవంశోత్తము నందవైదికబుధాదిప్రోక్తవృత్తిస్వయం
భావుకున్ దిరుమల కొండయార్యసుతు శుంభద్వేంకటాభిఖ్యునిన్.

క. పిలువంబంచి యెదుర్కొని । మిలమిల నలఘుప్రభానమిద్ధాస్థాన
స్థలిఁ జాఁగిలి మ్రొక్కి వటీ । కలితసుఖాసీనుఁ జేసి కలకల నగుచున్.

చ. కనుఁగొని చంద్రికాభిసుముఖప్రదనందవరాగ్రహారపా
వన ఘన పెద్దిభట్టకులవార్ధినిశాకర నీవు శ్రీనివా
సుని యలమేలుమంగకృపఁ జొక్కిన దిక్కరి వాంధ్రభూమిరా
ణ్ణివనుతసభాస్థలీవనవనీవపికంబవు కాకలీకృతిన్.

శా. సల్లాలిత్యభవత్కవిత్వపటిమాసందర్భవైదర్భికా
సల్లాపంబులు మామకీనసుకులస్వామీంద్ర కీలాద్రి రా

ణ్మల్లేశుఁడును మెచ్చ నొక్కకృతి నిర్మాణంబు గావింపుమా
నుల్లీఫుల్లసుమోల్లసన్మధురఝరీమాధుర్యకౌదార్యతన్.

మ. అని హేమాంబరరత్నభూషణసుగంధాలంకృతుం జేసి స
ద్ఘనసారస్ఫుటవీటికాదు లొసఁగన్ గైకొంచు వాణీవధూ
వనజాతాంఘ్రియుగులద్ఘలన్నటనజిహ్వాస్థానవాగ్గోస్తనీ
జనితానందమరందకందళనదీజంఘాలవేలాస్యుఁడై.

వ. అమ్మహాకవివరుండును దదీయవంశావతారసర్గయవర్ణనానుపూర్వంబుగాఁ దత్ప్రబంధబంధురానల్పకల్పనంబొనరించి తత్సముచితకృతికన్యాకరణంబునకు నవకరణంబుగా నుపకరణంబగు నొక్కకరణంబు కృతఘ్నుండై విఘంబుచేసిన......శ్రీ వేంకటరమణునకు...... దండప్రణామ పుష్పాంజలి ప్రపూర్ణభర సమర్పణంబుగా సమర్పించెద.

ఇంత చెప్పినవాఁడు కశ్చిత్ప్రభుండనక యాప్రభుఁ డెవ్వఁడో పేర్కొనియుండిన పక్షమునఁ గవికాలనిర్ణయమున కనుకూలపడియుండునేమో! అయినను కవి తన శకుంతలాపరిణయమునందుఁ జేసిన యీకవివర్ణనమునుబట్టి యితఁ డాధునికుఁడగుట స్పష్టమగుచున్నది—

మ. పరఁగన్ భారతకల్పనారతులు శబ్దస్ఫూర్తి సంధింప ని
ర్భరవృత్తిన్ బరమేశపోతఘను లాలంకారము ల్గూర్పఁ జూ
పరులై నట్టి పితామహాద్యులు నుతు ల్పాటింప వర్తించు నీ
సరసాంధ్రోక్తివధూటి కేను సుమనస్సంపూర్తి గావించెదన్.

ఈకవి నూఱు నూటయేఁబదిసంవత్సరములక్రిందట నుండియుండవచ్చును. ఇతఁడు శబ్దాలంకారములనిమిత్త మమితముగాఁ బాటుపడి గ్రంథమునందు వ్యాకరణదుష్టములైన ప్రయోగముల ననేకములను జేసియున్నాఁడు. వసుచరిత్రములోని కల్పనలనుబోలిన కల్పనల ననేకములఁ జేసినను మొత్తముమీఁద నీతని కవిత్వము శబ్దాలంకారభూయిష్ఠమయి హృద్యముగా నున్నది. ఇతఁడు తాను రామచంద్రోపాఖ్యానమను మఱి

యొకగ్రంథమును జేసినట్లు చెప్పుకొనెనుగాని యాగ్రంథము దొరకలేదు. ఈతని కవితారీతిని జూపుటకై శకుంతలాపరిణయములోని కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. సింగము లెన్న నీరలకు సిద్ధముగా మొలబంటి మత్తమా
తంగశిరస్తటంబులు పదంపడి ఱొమ్ములబంటి యంచు సా
రంగచయంబు లెల్లను సరాసరిగా నెదిరింపలేక మా
వంగడపున్వ్యథామణుల వాలికచూపులకున్ భయంపడున్. ఆ. ౧.

ఉ. శ్రేణులుగట్టి మౌనిజనశీర్ష జటాచ్ఛట లుద్గమింప న
క్షీణవిరాగయోగములు చెందును బల్లవరాజకోటికిన్
స్థాణులకున్ సరాగగుణసారతరాంకురలబ్ధి గల్గు పూ
బోణులమేని వాసనలు పొర్లినమాత్రఁ దదాశ్రమంబునన్. ఆ. ౨.

ఉ. వారని ప్రేమ నేగి కొటు వా రనినన్ విని మారునిద్దపున్
వారుప మైనయక్కలికి వారు వనంబునకున్ ఫలంబుల
వ్వారిగఁ దేరఁగాఁ జనిరి వారిఁ గనుంగొను గారవంబునన్
మీ రరుదేరఁగాఁ దెలిసి మీఱరు వారిటువత్తు రింతకున్. ఆ. ౩.

---

67. పోచిరాజు వీరన్న

ఈ కవి తాను కృష్ణార్జున సంవాదము, పంచకావ్యములు, విభూతి మహాత్మ్యము, మార్కండేయ చరితము, మనువంశపురాణము, ముక్తదేవుకథ, ఆనందలహరి, సౌందర్యలహరి, సుభాషితము, అను గ్రంథములను రచియించినట్లు భల్లాణచరిత్రమున నీ క్రింది పద్యములలోఁ జెప్పుకొన్నాఁడు—

సీ. పదునాలు గగునేట మొదటఁ గృష్ణార్జున
సంవాదము ప్రబంధసరణియయ్యెఁ
బదునెన్మిదగునేటఁ బంచకావ్యము లాంధ్ర
పద్యకావ్యములుగాఁ బరిఢవిల్లె
నిరువది రెండగునేట విభూతిమా
హాత్మ్యంబు ద్విపదకావ్యముగ నొప్పె
నిరువదియాఱగునేట మార్కండేయ
చరితంబు రచితమై సంఘటిల్లె
ముప్పదగునేట మనువంశ ముఖ్యనృపపు
రాణము ప్రకల్పితంబయి ప్రకటమయ్యె
ముప్పదాఱగునేట శ్రీముక్తదేవు
కథ కథితమయ్యె నాచేతఁ గౌశలమున.

గీ. సంస్కృతంబై శంకరాచార్య విరచి
తంబు లానందలహరి సౌందర్యలహరి
భర్తృహరికృతమైన సుభాషితమును
శతకములుగాఁగ మత్పరికల్పితములయ్యె.

ఇందుఁ జెప్పఁబడినవానిలో నీపుస్తకముగాక మాకు మనువంశపురాణ మొక్కటిమాత్రము లభించినది. భల్లాణచరిత్రమును గవి బందరుపురములో నుండిన చిత్రకార (ముచ్చి) కులస్థుఁడయిన దాము మొగ్గన్న కంకితముచేసెను. బందరుపురమును చిత్రకారకులమును వర్ణించిన పద్యముల రెంటి నిందుఁ బొందుపఱిచెదను.

సీ. శ్రీకంఠవైకుంఠసేవావికుంఠ వందారుమందిరము బందారుపురము
నిరతోత్సవైశ్వర్యనికరాభిభూత బృందారకపురము బందారుపురము
సంతతాయాత యాచకజనవ్రాత మందారభాసురము బందారుపురము
సకలవర్ణాశ్రమాచార సంపత్సమందారతిభరము బందారుపురము

శిల్పినర్తక వర్తక చిత్రకార । సూత్రకారాదివివిధవిచిత్రకృత్య
దానధర్మపరప్రజోత్కర చకోర । కారవిందారికరము బృందారపురము.

ఉ. ఆపురి నుంద్రు దాముకులజాఢ్యులు వార్తికసంప్రదాయులు
ద్దీపితకీర్తిశాలు రతిధిప్రియశీలురు శూలిపాదపూ
జాపరతంత్రమంత్రగుణశాలు లఘూటవికీలు లక్ష్మా ధ
ర్మప్రకృతిస్వభావమతియుక్తులు చిత్రవిధానశక్తులున్.

మనువంశపురాణము బెజవాడ మల్లేశ్వరస్వామి కంకితము చేయఁబడినది. దీనికి ఖండకపాలాఖ్యానమని నామాంతరము. కవి నియోగి బ్రాహ్మణుఁడు; తండ్రి వీరభద్రుఁడు; తల్లి మూర్తిమాంబ; నివాసస్థలము కృష్ణామండలములోని కొలకలూరు. ఇతఁడు కౌండిన్యగోత్రుఁడు. ఇతఁడు నూఱుసంవత్సరముల క్రిందటివాఁడయి యుండవచ్చును. ఈతనికవనధోరణి యీ క్రింది పద్యములవలనఁ దెలిసికోవచ్చును—

భల్లాణ చరిత్రము.

చ. కలువలసొంపు దాఱె భుజగంబులు పుట్టల దూఱెఁ దారకా
వళి రుచి జాఱెఁ జక్కవలవంతలు దీఱెఁ జకోరకవ్రజం
బులసుఖ మాఱె దమ్ములకు మోదము లూరె నిశాకరద్యుతుల్
వెలవెలఁబాఱెఁ బూర్వుదెస వెల్లడిగాఁ దెలవాఱె నయ్యెడన్. ఆ-౧

ఉ. ఇంటికిఁ దోడితెచ్చి యువనీశ్వరుఁ డవ్విటకూపుఁ డైనము
క్కంటిని బీరసంగతునిగా నొనరించి సపర్యసల్పి నే
జంటకు మాఱుఁగా దలఁచి జాజులు నించినసెజ్జఁ జేర్చి వా
ల్గంటినిజూచి పల్కెఁ గుతుకంబు మనంబునఁ దొంగలింపఁగన్. ఆ-3

మనువంశపురాణము.

మ. ఖల! దుష్టాత్మ! మనుప్రభూత! బుధధిక్కారంబుఁ గావించి తీ
విల నీయన్వయ మింతనుండి వసుధాధీశత్వనిర్ముక్తమై

తిలఘాతవ్యవహారలక్షణముల్తో దీనత్వముం బూని ని
ష్కళమై యుండెడుఁ గాత సర్వజనము ల్గర్హింప హైన్యంబునన్. ఆ-౨

శా. భూనాథోత్తమ! మేదినీసురధనంబు ల్గోరఁగాఁ గూడ దీ
ధేనూత్తంసము యజ్ఞకార్యముల కాదిద్రవ్యమౌఁ గావునన్
దీనిం బట్టఁగరాదు మీ రఖిలధాత్రీపాలకుల్ ధర్మని
ష్ఠానై పుణ్యులు మీ రెఱుంగనికథాసంఘం బిలం గల్గునే. ఆ-౪

---

68. అయ్యలరాజు నారాయణకవి.

ఈకవి హంసవింశతికథల నయిదాశ్వాసముల పద్యకావ్యముగా రచియించెను. హంసవింశతియందు శెట్టిమతమును రచియించిన కవు లీపద్యమునఁ జెప్పఁబడియున్నారు—

ఉ. అయ్యలరాజుఁ దిప్పసచివాగ్రణిఁ బర్వతరాజు రామభ
ద్రయ్యను భాస్కరాగ్రణిఁ బ్రధానవరుం డగుకొండధీరునిన్
జయ్యనఁ దిమ్మయప్రభుని సత్కవితారచనాఢ్యులై నమా
యయ్యలరాజువంశజుల నాదికవీంద్రుల సన్నుతించెదన్.

౧౭౬౫వ సంవత్సరమునందుండిన కవులను చెప్పియుండుటచేత నితఁడా కాలమునకుఁ దరువాత నుండినవాఁ డనుటస్పష్టము. ఇతఁ డిప్పటికి నూఱుసంవత్సరముల క్రిందట ౧౭౦౦ సంవత్సరప్రాంతములయందుండియుండును. పై పద్యమునఁ జెప్పఁబడిన యయ్యలరాజవంశజుల యినకవులలోఁ బర్వతరాజును గొండయ్యయుఁ దిమ్మయ్యయుఁ జేసిన గ్రంథము లేవియో తెలియరావు. ఈకవితండ్రి సూరనార్యుఁడు; తల్లి కొండమాంబ; గోత్రము కౌండిన్యసగోత్రము. ఈతనికవిత్వములో లక్షణ విరుద్ధము లయిన ప్రయోగము లనేకములు గలవుగాని మొత్తముమీఁదఁ

గవిత్వము ప్రౌఢమును రసవంత మయినదిగా నున్నది. ఈపుస్తకమునం దన్యదేశ్యము లనేకములు వాడఁబడియున్నవి. ఈతఁడు నానాజాతులవారిని వర్ణించవలసివచ్చినప్పుడు మిక్కిలి కష్టపడి వారివారికుచితము లయిన యుపకరణాదులనామముల నన్నిటిని సంగ్రహించి వివరించియున్నాఁడు. ఈకథయొక్క ముఖ్యోద్దేశము

ఉ. ము న్నలరావణాదుల నముద్ధతి సాధ్వులఁగోరి యేమిసౌ
ఖ్యోన్నతిఁ జెంది రల్లగుట నుర్వి జనావళు లన్యకాంతలన్
బన్నగఁ గోరరాదు కడుఁబాతక మంచుఁ దలంచి యింతిపై
నున్నమనంబు ద్రిప్పకని యథోచితపద్ధతి నుండె భూవరా.

అన్న ట్లొకపురుషునిమనస్సు నన్యకాంతనుండి విముఖముచేయుటయే యయినను, పుస్తకమునిండ అంకుపోయి బొంకాడి తప్పించుకొన్న యుపాయములే వర్ణింపఁబడియుండుటచేత నిది దుర్నీతిబోధకమయి నీతిపరులకుఁ బఠనయోగ్యము కానిదయియున్నది. ఈపుస్తకమునుండి కొన్నిపద్యము లిందుదాహరింపఁబడుచున్నవి—

శా. పన్నీట న్నయనంబు లొత్తెఁ దనువుం బాటీరపంకంబుతోఁ
జెన్నారం బద నిచ్చి గీఱి సిగ వేసెం దాయెతు ల్పుట్టె జీన్
సొన్నాపట్టెరుమాలు గట్టె జలతార్పుట్టంచుడాల్మించుమేల్
మిన్నా సన్నపుదుప్పటంబు వగపాళిం గప్పెసొంపారఁగన్. ఆ-౧

చ. కమటము కట్లసంచి యొరగల్లును గత్తెర సుత్తె చీరముల్
ధమనియుఁ శ్రావణంబు మొలత్రాసును బట్టెడ నీరుకారు శా
ణము పటకారు మూస బలునాణెపరీక్షలమచ్చు నాదిగా
నమరఁగ భద్రకారకసమాహ్వయుఁ డొక్కరుఁడుండునప్పురిన్. ఆ-౨

శా. పున్నాగంబును గెల్వఁజాలు రుచిరాంభోజాస్యవేణీరుచుల్
పున్నాగంబును నవ్వనోపు నెఱయన్ లోలాక్షియానంబులుం

బున్నాగంబును గేరిమీఱి మెఱయుం బూఁబోఁడినూగారుడాల్
పున్నాగంబును మించు నాభిచెలువంబున్ సారెవర్ణింపఁగన్. ఆ-3

మ. చతురోపాయసమర్థుఁ డప్రతికళాచాతుర్యధుర్యుండు వి
శ్రుతకార్యజ్ఞుఁడు రాజనీతిపదదక్షుం డింగితజ్ఞానుఁ డ
ద్భుతశక్తిత్రయపారగుండు గుణసంపూర్ణప్రభావుండు సం
తతభూపాదరణీయుఁడొక్కరుఁడమాత్యశ్రేష్ఠుఁ డుండుం బురిన్. ఆ-౪

---

69. వెణుతుర్ల వడ్డికవి

ఇతఁడు శృంగారరసాలవాల మనుపేరుగల మూఁడాశ్వాసముల యలంకారశాస్త్రమును రచియించెను. ఇతఁడు ప్రథమశాఖ బ్రాహ్మణుఁడయినట్టును రామభక్తుఁడయినట్లును శృంగారరసాలవాలములోని యీ క్రింది పద్యమువలనఁ దెలియవచ్చుచున్నది—

ఉ. శ్రీరఘువీరభక్తిరససింధువిహారుఁడ శుక్లయాజుషా
చారుఁడ దేశికాంఘ్రిపరిచారుఁడ నే వెణుతుర్లవంశవి-
స్తారుఁడ వడ్డినామ కవిసత్తముఁడన్ రఘువర్యుపేర శృం
గారరసాలవాల మను కావ్య మొనర్తు జగద్ధితంబుగన్.

ఈ కవి కౌండిన్యసగోత్రుఁడు; వేంగనార్యపౌత్రుఁడు; మంగళగిరి పుత్రుఁడు. ఈతనికాలమేమో తెలియరాలేదుగాని కవిత్వము రసవంతమయినదిగాఁ గనుపట్టుచున్నది. శృంగారరసాలవాలములోని పద్యముల రెంటి నిందుఁ జూపుచున్నాను—

ఉ. నందనముల్ హసింపఁగలకోమలి కోమలదేహవల్లి పెం
గందళితంబు లయ్యె సితకాంతులు సంతత మమ్మొకుందు నిం
పొంద మనంబులోన నిడియున్న మనోభవుఁడంచు నాతనిన్
గ్రందుగనేయు పుష్పశరగాఢరుచుల్పయిఁ దోఁచెనో యనన్. ఆ-౧

ఉ. ఆసలు బోన లిచ్చి కపటాత్మనఖు ల్పొదరిల్లు చేరగాఁ
దీసిన నందు నిందుముఖి తెల్లమిగా హరి లేమిఁజూచి వి
శ్వాసముతోఁ డుత న్మరలివచ్చునెపన్ మరలింప దచ్చటన్
భాసిలు చంచరీకములబారు గనుంగొను దృష్టిపెంపునన్. ఆ. 3.

---

70. కొత్తలంక మృత్యుంజయుఁడు

ఈకవి బృహన్నారదీయము, ధరాత్మజాపరిణయము, నిరోష్ఠ్యనల చరిత్ర, అనుపద్యకావ్యములను రచియించెను. ఇతఁడు శివబ్రాహ్మణుఁడు. శివాలయములలో నర్చకులుగానుండెడి యీతెగబ్రాహ్మణుల నీప్రాంతములయందు శివలవాండ్రని వాడుదురు. ఈతని నివాసస్థలము గోదావరీ మండలములోఁ గౌశికీతీరమందున్న కొమరగిరిగ్రామము. ఈకవి బోధాయనసూత్రుఁడు; భారద్వాజగోత్రుఁడు; విశ్వనాథపుత్రుఁడు. ఈతఁడించుమించుగా నూఱుసంవత్సరములక్రిందట నుండినవాఁడు. ఈతని మనిమనుమ లిప్పటికిని గోడి యను గ్రామములో జీవించియున్నట్టు వినుచున్నాము. ఈతని కవిత్వము హృద్యమయి సలక్షణముగా నుండును. ఇతఁడు రచియించిన పుస్తకములలో బృహన్నారదీయపురాణ మాఱాశ్వాసముల గ్రంథము; ధరాత్మజాపరిణయము నాలుగాశ్వాసములద్వ్యర్థికావ్యము; నిరోష్ఠ్య నలచరిత్ర యైదాశ్వాసముల చిత్రకావ్యము. ఈ కావ్యములలో ధరాత్మజాపరిణయమును కవి తన కాశ్రయుఁడైన యల్లూరి యప్పలరా జనుక్షత్రియుఁడు రచియించిన ట్లవతారికలోఁ

ఉ. ఎల్లజగంబులం గరుణ నేలెడువేలుపు నిందిరామనో
వల్లభు నాశ్రయించి యనవద్యతదీయకృపావిభూతి భూ
వల్లభసత్సభావిబుధవర్ణ్యకవిత్వవిరూఢిఁ గన్న శ్రీ
యల్లురి వంశసంభవుఁడ నప్పనృపాలక నామధేయుఁడన్.

ఇత్యాదిపద్యములచేఁ జెప్పినను, ఆశ్వాసాంత గద్యమునఁ దనపేరే వేసికొనియున్నాఁడు. ఈప్రాంతములయందలి క్షత్రియులు సామాన్య ముగాఁ దాము మాధవవర్మసంతతివారమని చెప్పుకొనునట్లే యీయ య్యూరివారును మాధవవర్మసంతతివారే యయినట్లు ధరాత్మజాపరిణయ మునందు వంశకర్తగా మాధవవర్మ యిట్లు వర్ణింపఁబడెను—

ఉ. మాధవవర్మ నాఁగ నొకమానవభర్త జనించి విస్ఫుర
ద్బోధసమగ్రుఁడై కనకదుర్గను శ్రీజయవాటికాపురీ
సౌధవిహారిణిం గొలిచి చక్కఁగ దత్కరుణారసంబుచే
నీధర హేమవృష్టిఁ గురియించె నతిస్థిరకీర్తి మీఱఁగన్

కవినిగూర్చి వ్రాయఁదగిన విశేషము లంతగాఁ దెలియనందున, పూర్వోక్తగ్రంథములనుండి కొన్ని పద్యముల నుదాహరించి విరమించు చున్నాము—

బృహన్నారదీయము.

చ. హృదయమున న్వివేక మొకయించుక లేనిదురాత్మునింటిసం
పదలు శరన్నదీజలముభంగి నశించు ననూయ యాత్మలోఁ
బొదలినవానిసంపదలు పోఁడిమిఁ దక్కును మారుతంబుతోఁ
గదియుతుపానలంబుక్రియఁ గంజభవాత్మజ యాలకింపవే. ఆ. ౨.

ఉ. ధ్యానవిహీనుఁ డయ్యు ననయంబు జితేంద్రియవర్గుఁ డయ్యెనా
యానరుఁ డెన్నఁడుం జెడనిపుట్టినపదంబున నుండు నిశ్చల
ధ్యానసమేతుఁ డింద్రియజయుం బొకయించుక లేకయున్నఁ ద
ద్ధ్యానము నిష్ఫలం బగు నతండును మూఢుఁ డనం బ్రవర్తిలున్. ఆ. ౧

ధరాత్మజాపరిణయము.

ఉ. అనఘు వసిష్ఠముఖ్యులనిమునులు సద్విబుధౌఘముఁ గూడి యమ్మహా
వనివిభుఁ బూర్ణభూతిభవు వర్ణితతేజునిఁ జూచువేడుకం

జని విలసిల్లుతద్విపులసంజనితభ్రమదాన్వితాధికా
ననసుమమం గనుంగొని మనంబున నుబ్బుచుఁ బల్కె రీగతిన్. ఆ-౨

ఉ. ఆగ్రహబుద్ధిచేత విషయంబు లశేషముగా జయించి లో
కాగ్రియబాహుశౌర్యగతి యాగవిహింపకుఁడై తనర్చు న
య్యుగ్రునిమీఁద శాతశర మొక్కటి వేయఁగ సమ్మతింపుమా
నిగ్రహభూతవైరిగణ నీదగు పట్టిఁకార్యసిద్ధికిన్. ఆ. 3.

ఉ. అచ్చట నచ్చట న్వెలఁయునచ్చపుఁబచ్చలతోరణంబులన్
రచ్చల హెచ్చులై నవెలరాలయరంగులరంగుల న్సదా
లచ్చికి నాటప ట్టయినలచ్చనము ల్పరికించి చూచుచో
న్నొచ్చము లేనియచ్చెరువు నొందఁగఁజేసెఁ బురంబువారికిన్. ఆ-౪

నిరోష్ఠ్య నలచరిత్ర.

ఉ. అల్లలితాంగి చంచలకటాక్షనిశాతశరాళి నేయఁగాఁ
గల్లరి యైనచిత్తజుఁడిగాసిఁ దలంకితిఁ ద్రాసరీతి సం
ధిల్లఁగఁ గీరసంతతికి దీనత గాంచితి రాకరాకకే
జల్లని తల్లడిల్లితిని జల్లనిగాలికి సంచలించితిన్. ఆ. ౨.

ఉ. చంచలరీతిగా నధికచంచలతం గనినట్టియిందిరా
చాచలనేత్ర నెల్లెడ నచంచలఁగా నెడఁదం దలంచి యా
చించినయర్థిరాజి నిరసించిననిగ్గతకీర్తి కెంత చిం
తించిన నక్కటా తగినవిష్కృతి కల్గఁగ నేరదేగదా. ఆ. 3.

చ. అలిగినయుత్తటిం గలఁక నందక సారదయానిరీక్షచే
నలరఁగఁ జేసినత్తటి నహంకృతిఁ జెందక ధాత్రిరీతి ని
శ్చలత నిజేశసన్నిధిని సంతతహర్షనిశాంతచిత యై
చెలఁగెడికన్య ధన్యగతిచే నలరాడెడి సారసాననా. ఆ. ౫.

అంతర్వేది నృసింహస్వామి కంకితము చేయఁబడిన యానిరోష్ఠ్య నలచరిత్రము కొన్ని వ్రాఁత ప్రతులలో—

"ఇది శ్రీమద్భవానీశ్వర శాశ్వత కృపాపాత్ర క్రొత్తలంక విశ్వనాథ పండితపుత్ర సకలసుకవి జనానుగ్రహసహాయ మృత్యుంజయనామ ధేయప్రణీతంబైన నలరాజచరిత్రము"

అను గద్యమునకు మాఱుగా

"ఇది శ్రీమ దంతర్వేది లక్ష్మీనృసింహస్వామి చరణారవిందైక రుద్ర రాజాన్వయాభరణ ధనంజయగోత్రపవిత్ర కూనన్నృపాలపుత్ర నిరర్గళ కవితావిలాస సంతోషితాశేష విద్వత్కవిరాజ తిరుమలరాజ ప్రణీతంబైన నలరాజచరిత్రము"

అను గద్యము కానఁబడుచున్నది. మృత్యుంజయకవి యీగ్రంథముయొక్క కర్తృత్వమును ధనస్వీకారముచేత రుద్రరాజు తిరుమల రాజునం దారోపించి యుండును.

---

71. తిరుమలబుక్కపట్టణపు వేంకటాచార్యుఁడు

ధరాత్మజాపరిణయ మనుపేర మృత్యుంజయకవి రచించిన ప్రబంధమువంటి దానినే యీకవి "యచలాత్మజాపరిణయము" అను నామము గల మూఁడాశ్వాసముల ద్వ్యర్థిప్రబంధము నొకదానిని రచియించి యున్నాఁడు. ధరాత్మజాపరిణయముకంటె నచలాత్మజాపరిణయము ప్రౌఢతరముగా నున్నది. ఈగ్రంథకర్త మిక్కిలి సమర్థుఁడు. ఇతఁ డాశ్వాసాంత గద్యమునందుఁ దన్నుఁగూర్చి యిట్లు వ్రాసికొనియున్నాఁడు—

"ఇది సర్వతంత్ర స్వతంత్ర సకలభాషావిశేష కవితాధురంధర ప్రతినవప్రబంధపరమేశ్వర శ్లేషయమక చక్రవర్తిబిరుదాంక తిరుమల-బుక్కపట్టణ శ్రీనివాస తాతాచార్యతనయ శ్రీమదణ్ణయాచార్య దీక్షితసుత పితృవ్య శ్రీనివాసాచార్య కృపాకటాక్షలబ్ధ

సకలపాండిత్య తర్కాలంకార వాగీశ్వర బిరుదాంక వేంకటా
చార్య ప్రణీతంబైన యచలాత్మజాపరిణయము."

ఈ వైష్ణవకవిగ్రామణి యేకాలపువాఁడో తెలియరాలేదుగాని మిక్కిలి యాధునికుఁడుకాఁడని తోఁచుచున్నది. అచలాత్మజా పరిణయములోని రెండు పద్యము లిందుక్రిందఁ బొందుపఱుపఁబడుచున్నవి—

ఉ. చల్లనివాఁడు పాదములచాయలఁ జేరిన నెల్లవారికిన్
గొల్లలుగాఁగ నూర్మికలుఁ గొబ్బున హంసకకంకణంబులున్
జల్లెడువాఁడు వాహినులసంఘటనం బ్రతికూలవర్తన
త్తుల్లకభూమిభృత్కులముఁ గ్రుంగఁగఁజేయునతండు మేదినిన్. ఆ-౧

ఉ. రాజకుమారశేఖరుఁడు రమ్యత నందిపయి న్వినోదమున్
రాజిల నార్యసంగతి యనంతసుఖాశ్రయ మంచు నెంచుచున్
దాఁ జనుదెంచెఁ దాపసహితస్థితి నవ్వల నివ్వల న్వనీ
రాజుల నుల్లసిల్లుమృగరాజులు తన్గని విస్మయింపడన్. ఆ-3.

72. కటికనేని రామయకవి

కువలయానందమని సాధారణముగా వాడఁబడెడి యలంకార శాస్త్రమును కువలయానందప్రకాశ మనుపేరితోఁ దెనిఁగించిన యీకవి చెఱుకునూళ్ళగోత్రుఁడు; సూరనకును బుచ్చమకును బుత్రుఁడు. కవి తనది పద్మనాయకకులమగుట యీక్రిందిపద్యముచే నిట్లుచెప్పియున్నాఁడు.

సీ. సకలజగజ్జనస్వర్గసోపానోర్మిగంగ యెచ్చట సీఘ్రగతి జనించె
పతిశాపజాశ్మతాపతితసతీశుద్ధభావకృద్రజ మెందుఁ బరిఢవిల్లె
సనకాదినిఖిలసన్మునిమనఃషట్పదములు మధుకరంబులమాడ్కి మలయునెచట
బలిబంధనోత్క్షేపకలితాబ్జజాండరోచులు కేసరాభ నెచ్చోటఁ గనియె
నట్టి నారాయణాంఘ్రిపద్మాంతరమునఁ
బుట్టినట్టి కులంబులఁ బూర్ణమహిమ

నాయకత్వముఁ గనుటచే నవ్యగరిమఁ
బ్రకటమయ్యెను పద్మనాయకకులంబు.

ఈ కవి కాలమేదో యెక్కడనుండినవాఁడో తెలియరాలేదు. ఆతఁడు నూఱు నూటయేఁబది యేండ్లక్రిందట నుండియుండవచ్చును—

గీ. సరసుఁ డకలంకవంశాబ్ధిచంద్రుఁ డనఘుఁ
డైన రంగార్యువర్యు సాహాయ్యమునను
గువలయానంద మిలను దెన్గున రచింపఁ
గడఁగితిని దుష్కరంబైన కార్యమునకు.

అను పద్యమునందుఁ గవి తానీగ్రంథమును రంగార్యుని తోడ్పాటుచేత రచించినట్లు చెప్పుకొనియున్నాఁడు. కవిత్వనైపుణి తెలియుటకయి కువలయానందప్రకాశముయొక్క మూఁడుఘట్టముల నుండియు మూఁడు పద్యము లిందుక్రింద నుదాహరింపఁబడుచున్నవి—

చ. అబలలయందుఁ గాంచనమునందు భ్రమి న్విధి కల్గఁజేసె నా
యబలలయందుఁ గాంచనమునందును భ్రాంతి దొఱంగి నిష్ఠచేఁ
బ్రబలినవాఁడు చూడఁగ నరాకృతిఁ దాల్చి చెలంగుచున్నయ
న్నిబిడపరాక్రమక్రమవినిద్రుఁడు కేవలరుద్రుఁడే ధరన్. ఘ ౧.

చ. ధనికులమోము గన్గొనవు దబ్బఱ లాడవు వారి గర్వదు
ర్వినయవచస్తతు ల్వినవు వేమఱు వారల డాయఁబోవు క
న్నసఁదిసెడిచ్చు నూతనతృణంబుల నిద్దురరాఁగ నిద్దుర
గొనియెద వెందు నేమి వ్రతగోష్ఠిని జల్పితొ తెల్పు మేణమా. ఘ-౨

చ. ధృతిని మధువ్రతంబులు నిజేష్టమధుప్రపయైన పద్మసం
తతి ముకుళింపఁజేసె వెసఁదా నిశఁ డంచుఁ దలంచి పంకజా
హింతతబింబముల్ బలిమి నేర్చి వడిం గడు నాక్రమించి యం
చితముగ మేన నంకమునుచేసె నిజం బిది యెన్నభంగులన్. ఘ-3.

73. కొండమడుగు పురుషోత్తమకవి

ఈ కవి సానందగణేశ్వర మను మూడాశ్వాసముల గ్రంథమును రచించెను. పుస్తకము దీబగుంట వీరేశ్వరస్వామి కంకితము చేయఁబడినను, కవి తన గ్రంథమును కుంజేటి బుచ్చయ్య యను కోమటియొక్క ప్రార్థన మీఁద రచియించి యందుఁ గోమటి నీవిధముగా వర్ణించెను—

శా. సాలంకాయనమౌని పూర్వమున భాస్వద్దివ్యతేజోధనుం
డాలీలానిధివంశసంభవులలో నత్యుజ్జ్వలోదారవా
గ్జాలు రస్యర్థనుల్ కుబేరసదృశుల్ సౌభాగ్యభాగ్యోదయుల్
మే లింపొందిన వైశ్యవర్యులు గాంభీర్యామితౌదార్యులున్.

కవి నియోగిబ్రాహ్మణుఁడు; భారద్వాజగోత్రుఁడు; గిరియప్ప నందనుఁడు. కవి తన కయ్యలూరు మొదలయిన యగ్రహారము లుండి నట్టు వ్రాసికొనియున్నాఁడు. ఈతని కాలము సరిగా తెలియదు. నూఱు సంవత్సరముల క్రిందటివాఁడయి యుండును. సానందగణేశ్వరములోని రెండుపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి.

ఉ. ఇంటికి నేగుదెంచి తనయింతిని గాంచి ప్రపంచవృత్తి గై
కొంటకుఁ బూంచి రత్నరుచికుండలమండితగండ యైనవా
ల్గంటికి శంభుఁ డిచ్చినవరంబు కరం బనురక్తిఁ దెల్పిక
న్గొంటి భయంబుఁ దక్కి మఱి గోమలికాముని లీల నేలెదన్. ఆ-౧

ఉ. మీనము లెల్లలం గడిమి మ్రింగుచు గాలములందు డిందు నెం
దేని పరాంగనారతికి దీకొనియే మిటు లైతి మింతె కా
దా నలినాయతేక్షణలయబ్రపుగుబ్బల గోరు లుంచఁగా
సోనగ నల్లవా రినుపసూదుల గ్రుచ్చిరి మచ్చరంబునన్. ఆ. 3.

---

74. నాగులూరి శేషనారాధ్యుఁడు.

ఈకవి శ్రీపర్వతపురాణమనెడి యాఱాశ్వాసముల గ్రంథమును రచియించెను. ఈపుస్తకమునకు శ్రీశైలమాహాత్మ్యమని నామాంతరము గలదు. ఇతఁడు గ్రంథాదిని తెలుఁగు నిట్లు పొగడియున్నాఁడు—

చ. జనని సమస్తభాషలకు సంస్కృతభాష ధరాతలంబునన్
ఘనలలితార్థగౌరవవికాసి తెనుంగభిరమ్య మంతకున్
గనుఁగొనఁ జూతబీజమునకంటెను గోమల పత్రపుష్పశో
భనమృదుపల్లవాభినవబాలరసాలము సొంపు నింపదే.

ఆధునికుఁడే యయినను గవి యేకాలమునం దుండినవాఁడో సరిగా తెలియదు. ఇతఁడు నూటయేఁబదిసంవత్సరములక్రిందట నుండియుండవచ్చును. ఈతనికవిత్వము సరసమయినది. శైలిని జూపుటకయి శ్రీపర్వతపురాణమునుండి రెండుపద్యముల నిందుదాహరించుచున్నాను—

ఉ. శ్రీనగకంధరంబున వసించి చరించుపుళిందబృందముల్
భూనుతభోగమోక్షములఁ బొందఁగఁ జూచి నిలింపసంఘముల్
శ్రీనిలయాభిరామ మగుశ్రీగిరిమీఁదఁ జరింతు రిట్లు య
మ్మానితనాకసౌఖ్యమహిమంబుల నెల్లఁ దృణీకరింపుచున్. ఆ. 3.

శా. పాటింపందగు ముజ్జగంబులఁ బుగ్రప్రత్యర్థిజూటాటవీ
కోటీకోటరపావనామరధునీఘూర్ణోత్తరంగావళీ
వ్యాటీకాయతవేణికానికరసమ్యక్ప్రౌఢ్యాలో యచ్ఛటా
చాటుత్వంబు వహించుశ్రీనగముపైఁ జంచజ్జలశ్రేణికల్. ఆ ౫.

75. వీణెము లక్ష్మీపతి

ఇతఁడభిమన్యు పరిణయమనెడి యైదాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు సృష్టికరణవంశజాతుఁడు. వీణెము కృష్ణరాజునకును రంగమాంబకును జనియించినవాఁడు. ఇతఁ డభిమన్యుపరిణయములోఁ దన్నుఁగూర్చి యిట్లు చెప్పుకొనుచున్నాఁడు.

ఉ. మాగధవంశసంభవుఁడ మానితవీణెకులావతంసుఁడన్
భోగబిడౌజుఁ డార్యజనపూజిత వేంకటకృష్ణరాజునన్
బాగుగ రంగమాంబకును నౌరసపుత్త్రుఁడ లక్ష్మణాఖ్యుఁడన్
శ్రీగలుగన్ రచించెదను నే నభిమన్యుచరిత్ర వేడుకన్.

ఇతఁ డెప్పు డెక్కడనున్నవాఁడో తెలియరాలేదు. దాదాపుగా నితఁడు నూఱుసంవత్సరముల క్రిందటివాఁడయి యుండును. ఈతనికవిత్వ మంత మంచిదికాదు. అందు ఛందోవ్యాకరణదోషము లనేకములు కానఁబడుచున్నవి. అభిమన్యుపరిణయములోని రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. పన్నినవీరయోధులను బాహుబలంబున నుగ్గుసేయు సం
పన్నుఁడ వార్యసత్వుఁడవు పాండవపౌత్త్రుఁడ వై ననిన్నునున్
జిన్నెల పువ్వులు న్నరులుఁ జెన్నుగఁ గూర్పను నేరనట్టియీ
కన్నియ లెట్లు నీమనసు కాంక్ష కరంగఁగఁ జేయువారలో. ఆ. ౧.

ఉ. నారదమౌనిమాట మది నమ్మితి నేఁడది కానిచందమై
దూరము నోట కానఁబడెఁ దూర్యరవాదులఁ జుట్టపక్కముల్
వారును నీ రెదుర్కొనుచు వచ్చుటకియ్యది వేళ పోవుచు
న్నారిఁక విఘ్నము ల్గలవె నన్నిట దైవము మోసపుచ్చునే. ఆ. ౪.

76. సోమనారాధ్యుల సంగమేశ్వరారాధ్యుఁడు

శైవుఁడయిన యీకవి యహల్యాసంక్రందనవిలాసమను నెడి యైదాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఒక యెత్తుగీతములో

గీ. అట్టిసాహసవిక్రమార్కాంకుఁడైన
వాసిరెడ్డ్యన్వయాంభోధివరవిధుండు
చంద్రమౌళిక్షమాపాలజనవిభుండు
కొలువుదీరి మహోత్సవాకుంఠగరిమ.

అని కవి వాసిరెడ్డి చంద్రమౌళిప్రభువు తన్నుఁబిలిపించి వేఁడఁగా తా నహల్యాసంక్రందనవిలాసము నారాజమౌళి కంకితము చేసినట్లు చెప్పెను. ఈవాసిరెడ్డిచంద్రమౌళి కృష్ణామండలములోని యమరావతీపురమును బరిపాలించిన కమ్మవంశజుఁడు. ఇతఁడు సుప్రసిద్ధుఁడయిన వాసిరెడ్డి వేంకటాద్రినాయని సోదరపుత్రుఁడు. ఈకవి కవిత్వము ప్రౌఢమయినదికాని యిందు వ్యాకరణదుష్టములైన ప్రయోగము లనేకములు కానఁబడుచున్నవి. ఈగ్రంథము నూఱుసంవత్సరములక్రిందట రచియింపఁబడినది. అహల్యాసంక్రందనవిలాసమునుండి రెండుపద్యముల నిందుదాహరించుచున్నాను—

మ. పరకాంతారతిదోష మంచు మది సంభావింపఁడో యన్యు లె
వ్వరు గన్నం దను నిందసేతు రనుభావం బెంతయుం బూనఁడో
నరుఁ డొక్కింత యెఱింగనేని సిలుగు ల్వాటిల్లునం చెన్నఁడో
పరమామోదమె కాని యింద్రునకుఁ బాపభ్రాంతి లే దేమియున్. ఆ-3

చ. సరిసరి! నిన్నువంటి నెఱజాణలు పుట్టరె? వార లెల్ల నీ
కరణిఁ దలంతురే? చిఱుతకార్యము లిచ్చటఁ జెల్లునే? యహో
వరమపతివ్రతైనమునిభామినితో నెకసక్కె మేమి? నీ
గరిమము గానవచ్చె నిది కాదనరో వినరో బుధాగ్రణుల్. ఆ. ౨.

77. ములపాక బుచ్చన్నశాస్త్రి

ఈకవి వేంకటేశ్వరమాహాత్మ్యమును పద్యకావ్యమును రచియింయించెను. ఇతఁడు కోనసీమ ద్రావిడబ్రాహ్మణుఁడు. ఈబ్రాహ్మణులనే యారామద్రావిడు లనియు, పేరూరి యఱవ లనియు, వాడుదురు. వీరు మొట్టమొదట నఱవవారే యయినను జిరకాలము క్రిందటనే యాయాంధ్రదేశమునకు వచ్చి తోఁట దొడ్లను సంపాదించి యిచ్చటనే నిలిచిపోయినవారగుటచే నఱవభాషను మఱచిపోయి యించుమించుగాఁ దెనుఁగు భాషనే స్వభాషనుగాఁ జేసికొనియున్నారు. వీరు తెనుఁగున గ్రంథరచన చేయుటయే యీవిషయమును దెలుపుచున్నది. ఈకవి కోదండరాముని పుత్రుఁడు; భార్గవ గోత్రుఁడు; గుఁడ్లూరియం దుండినవాఁడు. ఇతఁడు తనపూర్వులను గూర్చియు, తన్నుఁగూర్చియు, వేంకటేశ్వరమాహాత్మ్యమునం దిట్లు చెప్పియున్నాఁడు—

సీ. అనుపమకోనసీమాభిధాన ద్రావిడాన్వయంబునను విఖ్యాతిమీఱ
ములపాకవా రనుముఖ్యాన్వవాయులు కాశ్యప భార్గవ కౌశి కాత్రి
గోత్రజు ల్గల రందు గురుతరభార్గవగోత్ర సంజాతుఁడై కొమరుమీఱె
వేంకటపతి వాని కుంకుమమీఱ వెంగాంబికయందు సుబ్బాభిధాన
విబుధవరుఁ డుద్భవించె నవ్విమలమతికి
బుచ్చమాంబికయందు సంపూర్ణ చంద్ర
మండలమురీతి సత్కళామండనుండు
రహిఁ జనించెను గోదండరామవిభుఁడు.

* * * *

సీ. మల్లవంశోద్భవక్ష్మాపాలపాలిత గుండ్లూరిపురి నుండు గురుయశోండ
నాంధ్రగీర్వాణభాషాష్టభాషాకవిత్వాభి నిర్మాణమహాత్వవిదుఁడ,

గాశికావిశ్వేశకరుణాకటాక్షాభిభాషితబహుళప్రబంధచయుఁడ
హితనాటకాంతసాహిత్యనిత్యాభ్యస్తసకలపురాణార్థసారవిదుఁడ
సాంద్రములపాక విద్వత్కవీంద్రవంశ
వార్ధిచంద్రుండ సర్వసర్వంసహాభి
విశ్రుత కుకవికులగోత్రవిపులపవి
శాతపవినైన బుచ్చనశాస్త్రికవిని.

ఇతనికాలము తెలియదు. ఇతఁడు నూఱుసంవత్సరముల పయి వాఁడయియుండును. వేంకటేశ్వరమాహాత్మ్యమునుండి మఱి రెండుపద్య ముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. సంగతిమీఱ మీఱచరణసారస మందు జనించినట్టి యా
గంగకు దక్షిణంబున నగాధతరం బగుదక్షిణాబ్ధిక
రంగగు నుత్తరంపుదెస రాజిలుపూర్వసముద్రపశ్చిమా
శం గన నొక్క తా వమరు సారతరోన్నతదండకాటవిన్. ఆ. ౧.

చ. గిరిజయు నీవు నెల్లపుడుఁ గిన్నర పన్నగ సిద్ధ సాధ్య భూ
సుర నరసంఘము ల్గొలువ సొంపు దలిర్పఁగ జేరి యాసరో
వరతటసీమనుండుఁ డభివర్ణన కెక్కు భవత్సమాఖ్య ని
గ్గిరియు సరోవరంబు ననఁ గేవలమోదముతో హరుం డనుజ్ ఆ-౧

78. పాలవేకరి కదిరీపతి

ఈకవి శుకసప్తతియను కావ్యమును రచియించెను. ఈతని కవిత్వము హృద్యముగానే యున్నది కాని పుస్తకమంతయు దొరకలేదు. దొరకిన రెండాశ్వాసములనుబట్టి చూడఁగా నితఁడు ప్రౌఢకవి యగుటకు సందేహ మగపడదు. "ఇది శ్రీమత్కదిరీ నృసింహ కరుణాకటాక్ష వీక్షణ సమాగత కవితాధార పాలవేకరికుల కలశాంభోనిధి సుధాకర తాడిగోళ్ళ కరియమాణిక్య నృపహర్యక్షపౌత్ర పవిత్రచరిత్ర కదిరిధరామండలాఖండ పుత్ర విద్వత్కవిరసానుసంధాయక కదిరీపతినాయక ప్రణీతంబైన" ఇత్యాది గద్యమునుబట్టి చూడఁగా కవి నాయకకుంజుఁడయినట్టును, కరియమాణిక్యనృపపౌత్రుఁ డయినట్టును కదిరిరాజపుత్రుఁ డయినట్టును దెలియవచ్చుచున్నది. కవి నెల్లూరిమండలములోనివాఁడు. ఇతఁడు తనగ్రంథమును శ్రీరామాంకితము చేసెను. ఈతనికాల మేదో తెలియరాలేదు గాని యితఁ డాధునికుఁ డగుటకు సందేహములేదు. శుకసప్తతినుండి రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. అలజయకేతనుండు రుచిరాంగతిరస్కృతమీనకేతనుం
డెలమి మదిం దలిర్ప దయ నేలికయుం దలిదండ్రు లయ్యెడన్
దలఁచినకార్యభాగ ముచితజ్ఞులచే విని నీతికార్యవ
ర్తు లగునియోగిపుంగవులతోడ రహస్య మొనర్చి యిల్లనున్. ఆ-౧

మ. అకట దోసతోఁట యిదియైనఁ దదీయఫలంబు లమ్మ యీ
డొక్కయు పాకఁ గోరితిఁ గడు న్నడురేయిని వచ్చి యెవ్వరో
మక్కువలేక నాకడుపుమంటయుఁ బుచ్చుకొనంగఁ బ్లాని యీ
చక్కెరవంటిపండ్లు తినసాగిరటంచుఁ గృశించు నెంతయున్.

79. మాధవమంత్రి

ఇతఁడు భగవద్గీతలను నాలుగాశ్వాసముల పద్యకావ్యమునుగా రచియించెను. ఇతఁడు గోదావరీమండలములోని నియోగిబ్రాహ్మణుఁడు. గిరిమనమంత్రి పుత్రుఁడు; కిడాంబి వేంకటాచార్యుల శిష్యుఁడు. ఈతని గ్రంథమునందు లక్షణవిరుద్ధములైన ప్రయోగము లనేకములు గానఁబడు చున్నవి. అయిన నితఁడు తనగ్రంథమునందు దత్తోజీ పండితవిరచిత మయిన భగవద్గీతలలోకంటె వృత్తముల నధికముగా వేసియున్నాఁడు. ఇతఁడు తనకృతిని భద్రాద్రిరాముని కంకితము చేసెను. ఈతని పుస్తకము నుండి రెండుమూడు పద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి–

మ. ధరఁ బాలిశ్యుక లోభకాంక్షయుతుఁడై ధాత్రీశుల న్మిత్రులన్
గురురాజీక్రితఁ జంపఁగాఁ దలఁచి తాఁ గ్రూరాత్ముఁడై యున్నచోఁ
బొరిగొన్నన్ దురితంబు చెంకు విను మీపొత్త్రోల్ల నాకేల య
స్థిర మీకాయము దీనికై కులజులం ద్రెళ్ళింపఁగాఁ బాడిగో? ఆ-౧

శా. విద్వన్ముఖ్యుఁడు కర్మపుంజములు తా విధ్యుక్త మార్గంబుచే
మద్వాక్యంబులరీతి సల్పుచును నాత్మం గాంచి యవ్వేళలన్
హృద్వాసంబున మోహ ముప్పతిల వర్తించు న్మమత్వాది రా
గద్వేషంబులు లేక యోగి సమతన్ గంభీరుఁడై ఫల్గునా. ఆ. ౨.

చ. పరులు నుతింపఁ జాలు నని పల్కుఁచుఁ జిత్తములం దలంచి సు
స్థిర మగుబుద్ధి లేక ఫలసిద్ధిని గాంక్ష యొనర్చి దంభులై
యిరవగునట్టిజ్ఞానమున కెంతొవిరోధము చేయునట్టి యా
నరు లొనరించు యజ్ఞము ఘనంబుగ రాజసయజ్ఞ మర్జునా. ఆ. ౪.

80. గోపాలుని సింగయ్య

ఈకవి భారవికృతమైన కిరాతార్జునీయ మను సంస్కృతకావ్యమును నయిదాశ్వాసముల గ్రంథముగాఁ దెనిఁగించెను. ఇతఁడు నియోగి బ్రాహ్మణుఁడు; మౌద్గల్యగోత్రుఁడు; భాస్కరామాత్యపౌత్రుఁడు; వీరనమంత్రి పుత్రుఁడు. ఈకవి కర్నూలు మండలములోనివాఁడు. ఇతఁడు తనగ్రంథమును శ్రీమదహోబల లక్ష్మీనృసింహస్వామి కంకితము చేసెను. ఈకవిపుత్రుఁ డెనుబదిసంవత్సరములక్రిందట జీవించియుండెను. కాఁబట్టి కవి నూఱుసంవత్సరములక్రిందటివాఁడు. ఈతని కవిత్వము రసవంతమయి సలక్షణ మయినదిగా నున్నది. కిరాతార్జునీయకావ్యములోని కొన్నిపద్యముల నిందుఁ బొందుపఱుచుచున్నాను—

చ. కొలిచినభృత్యకోటి ననుకూలత నొప్పెడు మిత్రులట్ల మి
త్రుల మఱి బంధువర్గములతో సరిగాఁ గను బంధుజాలమున్
వెలయఁ గృతాధిపత్యమున విశ్రుతవర్తనుఁబోలె నాదరం
బలరఁగఁ దన్మయుం డగుచు నారయు లెస్సగ నంతతంబునున్. ఆ. ౧.

ఉ. భానుకరప్రసారపరభాగతలస్ఫురదింద్రనీలసం
తానవిరాజమానరజతస్ఫటికాంచితకుడ్యదీధితుల్
మానుగ నెంచిచూడ దినమధ్యమునందును గౌముదీభ్రమన్
భూనుత మాటిమాటికిని బుట్టఁగఁ జేసెడుఁ జూడు మిగ్గిరిన్. ఆ. ౨.

ఉ. కొప్పులు వీడఁగా నడిచి గ్రొజ్జఁగిదండలు జాఱఁగొట్టియున్
గప్పురగందము ల్చెదరఁగా వెసఁ దాఁకియుఁ బెక్కునేరముల్
తప్పక యిగ్గతి న్నలిపి తత్సతు లందలిభీతిచేఁబలెన్
దెప్పర మైనకంపమునఁ దేలుచునుండెను వీచు లత్తఱిన్. ఆ. 3.

మ. అటులైన న్మఱియేమియన్న వినుమీ యారాజు నీప్రాణసం
కట వేళను వచ్చి సూకరముఁ దా ఖండించి రక్షించె ని

న్నటుగానం బరమాప్తుఁ డంచు మదిలో హర్షించి వైరింప కొ
క్కటిమైయుండు కృతజ్ఞతానిలయు లౌఁగా ధర సజ్జనుల్. ఆ. ౪

మ. జయవాంఛ ల్విడనాడుచుం బఱచునా సైన్యంబులం జూచినన్
దయపుట్టె న్మదిలోన నర్జునునకుం దర్కింప నట్లైకదా
భయులై చిక్కిననీచశత్రుల దయం బాటించి రక్షించినన్
నయముం గీర్తి మహాత్ములౌ నరుల కెన్నంగావె యుద్ధంబులన్. ఆ. ౫

---

81. గూళికల్లు వేంకటరమణకవి

ఇతఁడు కనకరంజితశిఖామణిపరిణయమను విక్రమార్కునిగూర్చిన యాఱాశ్వాసములపద్యకావ్యమును రచియించెను. ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; వేంకటమాత్యునకును రంగమాంబకును కుమారుఁడు. ఇతఁడు హరివంశమునుగూడఁ దెనిఁగించినట్లు కవినిగూర్చి వేంకటేశ్వరుఁ డనినట్లున్న కనకరంజితశిఖామణీపరిణయములోని. యీ క్రిందిపద్యము వలనఁ దెలియవచ్చుచున్నది—

సీ. నీయిష్టదైవంబ నినుఁబ్రోచుచుండెడు శ్రీవేంకటేశుండ నీ వెఱుంగు
మోవత్స యిపుడు నీభావంబు తెలిసివచ్చితి గూళికల్లవంశశేఖరుఁడవు
వేంకటామాత్యుఁడై వెలయుమంత్రికిఁజిక్కలేటివంశజయౌవధూటిరంగ
మాంబకుజనియించిమాపేరుగొన్న వేంకటరమణుఁడవుస్తవివి మాకు
మునుపు హరివంశ మంతయుఁ దెనుఁగు చేసి
యంకిత మొనర్చితివి విక్రమార్కచరిత
మిఁకఁ బ్రబంధ మొనర్చి మాకిమ్ము సిరులు
శుభము లొసఁగెదనని పల్కె సుముఖుఁ డగుచు.

ఈ వేంకటరమణకవి నూటుసంవత్సరములక్రిందట నుండినవాఁడు ఈతని కవిత్వము రసవంత మయినదే. కనకరంజితశిఖామణీపరిణయము లోని రెరిఁపద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. అంత నితాంతనూమకతపోగ్ని దహింపఁ బురంబుతో మహీ
కాంతుఁడు మిత్రబాంధవసకాయముతోఁ బరిదగ్ధుఁ డైన ని
శ్చింతయు ఘోరకాననము వృద్ధి వహించె మదీయజీవముల్
చింతిని మ స్తకాంతరముఁ జెందుట నేదరి గానకుండెదన్. ఆ-౧.

చ. తెలిపినవారు రంజిలుచు దేవర దేవరకు న్వరంబు ని
ర్మలమతి నిచ్చెఁ గావునఁ గుమారుని మారునివంటివాని న
ర్మిలి గలవాని సర్వజనమిత్రుని మిత్రునిమాడ్కి సత్ప్రితా
పలసితుఁ గాంచి యొప్పము శుభంబుల భంబులఁజేనిచాడ్పునన్. ఆ-౫

---

82. కృష్ణకవి

ఇతఁడు శకుంతలాపరిణయ మనెడి మూడాశ్వాసముల ప్రబంధ మును రచించెను. ఈకవి మైత్రేయసగోత్రుఁడు; నారసింహార్యునిపుత్రుఁడు కవి తన యింటిపే రేదో తా నేతెగ బ్రాహ్మణుఁడో చెప్పకొలేదుగాని శకుంతలాపరిణయ ప్రథమాశ్వాసములోని యీ క్రింది పద్యములనుబట్టి చూడఁగ నితఁడు వైష్ణవుఁ డై నట్లూహింపఁదగి యున్నది—

మ. నను రామానుజపాదపద్మయుగళీనవ్యావ్యయధ్యానపా
వనహృద్భాగవతావతంసపదసేవాసక్తచిత్తుఁన్ మరు
త్తనయారాధనచారులబ్ధ కవితాధారున్ సదారూఢభా
వన నాస్థానకవిన్ నిజాశ్రితునిఁ బిల్వంబంచి పల్కెం గృపన్.

క. పాత్రుఁడవై మైత్రేయస। గోత్రుఁడవై నారసింహగురువర్యునకున్
బుత్రుఁడవై వెలయుదు వీ। ధాత్రిన్ మాపనుపు సేయఁదగుఁ గృష్ణకవీ.

ఈ గ్రంథము చిలుమూమిళ్ళ ప్పాపయ్య యను కమ్మనాయని ప్రేరణమువలన రచియింపఁబడినది. కవి నూఱుసంవత్సరముల క్రిందటివాఁడు. ఈ గ్రంథము పిల్లవసుచరిత్ర మని దాక్షిణాత్యులు కొందఱనుచున్నారు గాని యీ ప్రాంతములయందు దీని కట్టిప్రసిద్ధి లేదు. అబ్బనామాత్య విరచితమైన కవిరాజమనోరంజనమును, సూరకవి ప్రణీతమైన కవిజనరంజనమును, పిల్లవసుచరిత్రమని యిచ్చటివారు చెప్పుదురు. ఈ గ్రంథకవిత్వము శ్లాఘ్యమైనదే యైనను, పిల్లవసుచరిత్రమని చెప్పఁదగినంత శ్రేష్ఠముగా లేదు. ఈ కవి యనేక పద్యములను వసుచరిత్రాది ప్రబంధములనుజూచి వానిలోని పద్యములవలె రచియించి యున్నాఁడు. ఇందుకు నిదర్శనముగా వసుచరిత్రములోని పద్యము నొకదానిని శకుంతలాపరిణయములోని పద్యము నొకదానిని చూపుచున్నాను—

ఉ. కొండఁట విల్లు వేవలలకుండలిరాజఁట నారి యమ్మనం
తుండటఁ బై టిపల్లియలఁ దున్నినవాఁడఁట యొండురెండు భ
గ్గుం డిది నింకుపౌరుష మోకో యని గెల్వవె ముజ్జగంబు లు
ద్దండత నొక్క తుంటవిలు దాలిచి యుంటినఁ గందుతూపులన్. వసుచ

ఉ. తుంటఁట కార్ముకంబు కరదొట్టిన తేంట్లఁట వింటినారి చే
నంటినవాడుతూపు లఁట యప్పులపాలఁట కేతనంబు వా
గంటిపులుంగు గుఱ్ఱమఁట కాయము లేదఁట నీకు లోకముల్
కొంకెతనంబున న్గెలిచికో లిది యచ్చెరియంబు మన్మథా. శకుంత.

ఇందప్రశస్తంబులగుప్రయోగంబులును గొన్ని కానఁబడుచున్నవి.

క. ఆఖేటమునకు ధాత్రీ। లేఖర్షభుఁ డనుమతింప లేలెం డనుచున్
శ్లాఖించుచుఁ బడవాళుల। లాఖవమునఁ బనిచి రగ్గలంబుగ వారల్.

ఇందు శ్లాఖించు 'లాఖవము' అను పదము లపప్రయోగములైనను గావలెను, ఖఘుల కొండొంటికిఁ గూర్చిన యప్రశస్తప్రాసము లైనను గావలెను. ఈ పుస్తకములోని మంచిభాగము లనేకములు కాళిదాసుని

యభిజ్ఞానశాకుంతల నాటకమునుండి తెనిఁగింపఁబడినవి. అభిజ్ఞాన శాకుంతలములోని మనోహరములైన నాలుగు శ్లోకములలో రెంటిని గవి యీ క్రిందిరీతిని దెనిఁగించియున్నాఁడు—

చ. కనుఁగవ బాష్పపూరములు గ్రమ్మెడు గద్గదకణ్ఠమై యెలుం
గనువున రాదు నా హృదయ మాకులమయ్యెడు మేను గ్రాన్పడుం.
బెనిచినవాని కింతవగఁ బిమ్మటిఁ గ్రమ్మెడుఁ గన్నవారలుం
దనయను బంపలేక పరితాపభరంబున నెట్లు సైతురో.

మ. గురు శుశ్రూషలు సేయుమీ సవతులన్ గూర్మి న్విలోకింపుమీ
పరివారమ్ములఁ బ్రోవుమీ సిరుల గర్వస్ఫూర్తిఁ గైకోకుమీ
పురుషుం దూఱకుమీ సతుల్ నడచు నేర్పు ల్నీకు సూచించితిన్
ధరణీ లోకమతల్లి చేకొనవె మాతల్లీ మదీయోక్తులన్.

ఇట్లున్నను మొత్తముమీఁదఁ గవిత్వము ప్రౌఢమనియే చెప్పవచ్చును. కవిత్వప్రౌఢిమ తెలియుటకయి శకుంతలా పరిణయములోని రెండుపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

ఉ. మోద మొనర్చెఁ బుష్పొడుల ముగ్గులపై నొఱపైన ముగ్గులన్
దేదఁగి పూలబెక్కెములఁ గెందలిరాకుల తోరణంబులన్
బ్రోది వహించు పక్వఫలపుంజములన్ శుకకోకిలాళి స
న్నాదములన్ నికుంజభవనంబుల నీలనృపాలసూతికిన్. ఆ. ౧.

శా. పాథఃపూరంబులు పల్కె నేల నృపతీ పన్నీరకర్పూరక
ర్పూరస్ఫారపటీరసౌరభపయఃపూరంబె జంద్రాతపం
బారామానిలసేవనంబు మున్ను మీ రక్శాంతమునుం గాంతురా
హారాళంబుగఁ బుత్రగాత్రమిళనం బెట్లుండునో చూడుఁడీ. ఆ. 3.

83. వల్లూరి నరసింహకవి

ఇతఁడు నాగ్నజితీపరిణయమను మూఁడాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఈకవి యాపస్తంబసూత్రుఁడు; కౌండిన్యగోత్రుఁడు; హనుమత్కవిపుత్రుఁడు; ఆఱువేల నియోగికులపవిత్రుఁడు; నూఱుసంవత్సరములక్రిందటివాఁడని తోఁచుచున్నది. ఈతనికవిత్వము రసికజన హృదయాహ్లాదకరముగా నున్నది. కవితాపటిమ తెలియుటకై నాగ్నజితీపరిణయములోని మూఁడుపద్యములనెత్తి చూపుచున్నాను—

చ. తనయునిముద్దుపల్కు చెవిఁ దార్కొన సంతసమందుచున్నత
జ్జనకునిరీతి మామకవచఃప్రకరంబు వినంగఁగోరి మీ
రెనసినవేడ్క నిట్లు సెలవిచ్చుట నాయెడఁగూర్మిఁగాదె మీ
పనుపున విన్నవించెదను బద్మదళాక్షుశుభప్రసంగముల్. ఆ. ౧.

ఉ. వందుర నేల యిట్లు మగువా తగనా నగువాన జూడ కీ
యందటిలోనఁ జెప్పవుగదా పగదాయగదా యటంచు నగ్
గందు రటంచు నిట్లు యుడుగక్ నుడుగం దొడఁగందలంచి నీ
కందువ లింక మారు కొఱగాదఱగా లెఱగాను నెచ్చెలీ. ఆ. ౨.

ఉ. కోసలుఁ డాత్మ నే నృపులకున్ వృషభంబులఁ బట్టరామికిన్
గాసిలి వీనిఁ బట్టుకొని కట్టినవానికిఁ గన్య నిత్తు నే
బాస యొనర్చినాఁడ నని పల్కితి నింకిటుఁ దప్పి తేని పెన్
దోసము వచ్చు నీకొమరెతో జతగూర్పఁగ నెవ్వఁ డబ్బునో. ఆ. 3.

84. గొంతేటి సూరన్న

ఇతఁడు కృష్ణాభ్యుదయ మనెడి యైదాశ్వాసములపద్యకావ్యమును రచించెను. ఈకవి తన్నుఁగూర్చి కృతిపతి యైనబొల్లాప్రెగడ కామమంత్రి పలికినట్లుగా గ్రంథాదియం దీపద్యమును వ్రాసికొనియున్నాఁడు—

మ. ననుఁ గొంతేటిలసత్కులుం డెలిమియానన్ దాను వీక్షించిసూ
 రన నీ వక్కజ మైనసత్కవివి యార్యశ్రేణు లగ్గింప భ
 క్తిని గృష్ణాభ్యుదయప్రబంధము జగద్దేయప్రమేయంబుగా
 నొనరం జెప్పుము మెప్పులుప్పతిల సద్యోగానురాగంబునన్.

ఈకవి నియోగిబ్రాహ్మణుఁడు; భారద్వాజగోత్రుఁడు; కామయామాత్యపౌత్రుఁడు; కాశిరాజపుత్రుఁడు. ఈతనికవిత్వ మంతశ్రేష్ఠ మయినదని చెప్పఁదగినదికాదు. ఇతఁడు నూఱుసంవత్సరములక్రిందట నుండినవాఁడు. కృష్ణాభ్యుదయములోని రెండుపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

ఉ. దేవకిగర్భగోళమున దేవశరణ్యుఁ డగణ్యపుణ్యనం
 భావితభద్రమూర్తి యగుపంకజనాభుఁడు భవ్యలాభుఁడై
 శ్రీవెలయం బ్రవిష్టత వసించె జగజ్జనరక్షణక్షమన్
 భావభవాబ్జభూప్రభవభావుకుఁ డయ్యును ధీవికాసతన్. ఆ. ౨.

చ. పదముల వ్రాలి బాలకునిపై దయసేయుము తప్పు చేసితిన్
 సదమలచిత్స్వరూప యదుసత్తమ యుత్తమ మైననీకథా
 భ్యుదయము గోరి నీదు పదపుష్కరము ల్గనవచ్చినాఁడ నా
 కొదవలు దీర్ప దేవతలకున్ సిరిగూర్పఁ దనర్పనీవెకా. ఆ. ౪.

85. బెతపూడి కృష్ణయ్య

ఈకవి జానకీరాఘవ మను నయిదాశ్వాసముల ప్రబంధమును రచియించి దానిని కమ్మప్రభు వయిన యడపా నారప్ప కంకితము చేసెను. ఈపుస్తకమునుగాక కవి యలమేలుమంగావివాహము, పండితమనోభిరామము, అనుగ్రంథములను రచించిన ట్లవతారికలోని యీక్రిందిపద్యము వలనఁ దెలియవచ్చుచున్నది—

సీ. మఱి శ్రీమదలమేలుమంగావివాహంబు
శ్రీజగన్నాయ కార్పితము చేసె
రహిఁ బండితమనోభిరామశృంగారకా
వ్యము ధవళాద్రిరాయనికి నొసఁగెఁ
బహుకల్పనానల్పబంధురోక్తులతోడ
రచియించె జానకీరాఘవంబుఁ
బ్రాకటప్రసాదపంచాక్షరీమంత్ర
జపపరాధీనరసజ్ఞుఁ డితఁడు
హరికథలెకావ్యములుచేసెనాంధ్రభాష
యందుమద్భక్తుఁడితనిచెనొందుకావ్య
రత్న మైనట్టిజానకీరాఘవంబు
శ్రీకరం బగు నారధాత్రీతలేంద్ర

ఈకవి శ్రీవత్సగోత్రుఁ డైన యువేలనియోగి. ఈతనికవిత్వము సరసముగానే యున్నది. ఇతఁడు నూఱుసంవత్సరములక్రిందటివాఁడయియుండును. జానకీరాఘవమునుండి రెండుపద్యము లిం దుదాహృతము లగుచున్నవి—

చ. పృథులకుచప్రకారములు బింబఫలాధరసద్రుచుల్ సుధా
మధురపికానులాపములు మత్తమయూరవిహారముల్ శుభ
గ్రథనవినీలవద్భ్రమరకంబులు కప్రపుఁజెక్కులున్ వనీ
మధుకరవేణికల్ దనరు మాధవుఁ డం దనురాగ మూనఁగన్. ఆ. ర.

శా. ఆకోదండము రామభద్రుడు సముద్యల్లీల నీక్షించి తాఁ
గై కోఁ జూచి ప్రదక్షిణంబుగ భుజాగర్వంబుతో వచ్చి పూ
జాకల్పంబుగ దానిఁ బుచ్చుకొని నిస్సారంబుగా నంతఁ దా
నాకర్ణాంతముగాఁగఁ దీసి విఱిచెన్ హరిప్రభావంబునన్. ఆ. ౫.

86. బసవరాజు నాగేంద్రకవి

ఇతఁ డానందసుందరీచాతుర్యవిలాస మను మూఁడాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఈకవి యాఱువేలనియోగి; పాపనామాత్యుని కుమారుఁడు. ఇతఁడు సుమారు నూఱుసంవత్సరములక్రిందట నుండియుండును. ఆనందసుందరీచాతుర్యవిలాసమునుండి రెండుమూఁడు పద్యములను గవి కవిత్వకౌశలమును జూపుటకయి యిందుఁ బొందుపఱుచుచున్నాను—

ఉ. క్షోణిప యాతఁ డక్కధరకూటశిఖాంతరమందుఁ గాంచె న
క్షీణజలోచ్చలన్మదజశీకరబంధురసింధురార్భక
శ్రేణిని హంసకోకబకచిత్రితరమ్యవిశాలసైకత
శ్రేణిని దీర్ఘవేణిని బశుప్రభురాణినిఁ గృష్ణవేణినిన్. ఆ. ౨.

ఉ. భూనుతయాతఁ డక్కమలపూరములోపలఁ గాంచె నుల్లస
ద్భానుసహస్రరమ్యమణిభాసితభోగవిభూషు నాననో
న్మానితకైటభారిగుణమంజరసౌఖ్యనిరస్తదోషు నం
భోనిధికాననాకలితభూధరబాహువిశేషు శేషునిన్. ఆ. ౨.

ఉ. దైన్యముదక్కి చాపశరదారుణఖడ్గము లూనపట్టి య
న్యోన్యవధాశచేఁ బెనఁగునప్పుడు చూడు మురారిశక్తి న
త్యున్నతిఁ దద్బలంబు నధికోజ్జ్వలయోధులు పిచ్చలింపఁగా
జన్యమునందుఁ గూల్చెదను జక్రిని శుక్రుఁడు తల్లడిల్లఁగన్. ఆ ౩.

87. మాచవరపు పాపనామాత్యుఁడు

(ఇతఁడు నందవరీకచరిత్రమను రెండాశ్వాసముల గ్రంథమును రచియించెను. ఈ నందవరీకులచరిత్ర మీాపత్రికే యింకు వ్రాయఁబడినది. కవి నందవరీక నియోగిబ్రాహ్మణుఁడు; శ్రీవత్సగోత్రుఁడు; వేంకటాచల మంత్రిపుత్రుఁడు. ఇతఁడు తన వాసస్థలాదులనుగూర్చి యిట్లు చెప్పుకొని యున్నాఁడు—

సీ. శ్రీమించు వినుకొండసీమలో నల్ల య
నంతవరం బనునగర మొకటి
కొమరొప్పు బెల్లముకొండ దేశంబున
మానితంబై యొప్పు మాచవరము
గ్రామద్వయంబునఁ గాణాచి యేకభో
గముమీాఱ వెలసిన ఘనయశుండు
పెద్దనామాత్యుండు ప్రియురాలు జ్ఞానాంబ
వారికి జనియించె వరసుతుండు
పాపనాహ్వయుఁ డనఁ బ్రఖ్యాతుఁడై యొప్పు
నాతనిభార్య శ్రీయచ్చమాంబ
వారికి ముగురుపుట్టిరి వరుస సుతులు
ముదముతోడుత వసుధఁ ద్రిమూర్తు లనఁగ
నగ్రజుఁడు వేంకటాచలం బనెడుపేరఁ
బ్రణుతి కెక్కెను విభవసౌభాగ్యగరిమ.

క. ఆతనిదేవి పతివ్రత । సీత నరుంధతినిబోలి సృష్టిని వెలసెన్
జేతోమోదంబున సం । ప్రీతిని శ్రీకొండమాంబ ప్రియము జనింపన్.

ఉ. శ్రీపరమేశుసత్కరుణ శ్రీవిలసిల్లఁగ వారికిన్ సము
ద్దీపతచారుమూర్తు లతిధీయుతు లిద్దఱుపుత్రు లందులోఁ

బ్రాహ్మణ నగ్రజుండ నయి భాసిలి సత్యము దేవభక్తియున్
బ్రాపుగనమ్మి సద్గురుసపాదములే గతియంచు నున్నడన్.

(నందవరము లిప్తు డనేకములు కానఁబడుచున్నవి. పూర్వకాలమునందు నందుఁ డేలినట్టియు నందవరీకుల కియ్యఁబడినట్టియు నందవరము కర్నూలుమండలములోనిదయినట్లు కవి యీ క్రింది పద్యమున వర్ణించి యున్నాఁడు—)

సీ. అందమై విలసిల్లుఁ గందనోల్సీమలో నందవరం బనునగర మొకటి
తత్పట్టణంబు సౌందర్యంబుఁ గొనియాడఁ జిత్ర మెవ్వరికి విచిత్రమరయ
సుందరంబగుచు సంక్రందనపురిఁబోలి యిందిరాదేవికి మందిరముగఁ
గడురమ్యమై చాలఁ గర మొప్పుచుండును గూపతటాకములొక్క
మరుమిగులఁ
బంకజాకరవిలసిత పద్మనికర । మధుర మకరందరసపానమత్తమధుప
నరసఝంకృతసంగీత సంకులంబు।నగుచు రంజిల్లు మిక్కిలియవనియందు

పయిపద్యములోని యనావశ్యకములయిన పదముల ప్రయోగము నుబట్టియే యీ కవిత్వ మంత మంచిది కాదని చదువరు లెఱుఁగవచ్చు. ఇతఁడు నూఱు నూటయేఁబది సంవత్సరముల క్రిందటివాఁడేమో! నందవరీక చరిత్రము రెండాశ్వాసములనుండియు రెండేసిపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

మ. దివమం దెల్లను రాజ్యభారముఁ దగం దీర్పన్ ధురీణాత్ములం
దవలీలం జని జాహ్నవీసలిలమం దారూఢిగా స్నానమున్
సవిశేషంబుగఁ జేయుచున్ నిరత మీచందంబునన్ రాజ్యముం
గవుఁ డంహోరహితప్రభావతనుఁడై గాంభీర్య మింపొందఁగన్. ఆ-౧

ఉ. ఒక్క మహానుభావుఁ డిటవచ్చి దయారస మొప్పతిల్లనల్
దిక్కుల దివ్యతేజములు దీటుకొనంగడు సత్ప్రభావుఁడై

మక్కువ యోగవాగ మనుమంత్రము నా కుపదేశ మిచ్చి తాఁ
జక్కఁగ నిచ్చి పాదుకల సంభ్రమ మొప్పఁగ నేగె నంతటన్. ఆ-౧
ఉ. నందవరంబు మాకును ఘనంబుగ నచ్చుట ధారపోసె ద
త్సుందరిఁ దాను గూడుకొని శుభ్రతరం బగుజాహ్నవీజలం
బందుఁల గాన వచ్చితిమి యాతనితోడుతఁ దెల్పి వేగ మా
కుం దగఁ జెప్పుమన్న ననుకూలత నచ్చెరియంబు తోఁపఁగన్. ఆ-౨.
ఉ. భూసురకోటి వచ్చుటకు భూపతి యాత్మఁ గలంగి దానముం
జేసితి మున్ను వీరల కజేయులు గావునఁ దప్పినన్ విప
ర్యాసముఁ బ్రత్యవాయమును రాఁగల దిచ్చిన విత్తహీనమా
మోసమువచ్చెనెట్లనుచు మోమొకయించుక వంచెనంతలోన్. ఆ-౨.

88. కృష్ణదాసకవి

ఇతఁడు రాధాకృష్ణవిలాస మనుపేర జయదేవ విరచితమైన గీత గోవిందమును మూడాశ్వాసముల కావ్యమునుగా రచియించెను. ఈతని తండ్రి వేంకటదాసుఁడు. ఈతఁడు శూద్రకులజుఁడని తోఁచుచున్నది. అయినను కవిత్వము హృద్యముగానే యున్నది. రాధాకృష్ణవిలాసము లోని మూఁడు పద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. అలఘుభుజాబలంబులు నొయారము లయ్యసమానసాహసం
బులు నెర వైనసాదనలు పోటరిపంతము లేకవీరతల్
చలమరితెంపులున్ జవవిలంఘనముల్ విలసన్నియుద్ధతుల్
కలిగినకాల్బలంబు కటకంబున డంబున నొప్పు నెప్పుడున్. ఆ-౧.
ఉ. కూరిమిచేయు దిక్పతులకోరిక లీరికి లెత్త రావణో
ధారశిరంబులం దునిమి దద్దిశలన్ బలిపెట్టి సర్వభూ

భార మడంచి మానిజనభావనల న్వహరించినట్టి దు
ర్వారబలాభిరామ ధృతరాఘవరూప నినున్ భుజించెదన్. ఆ-౨.

ఉ. ధ్యానముచేతఁ జూచెద సుధానిధితోఁ బ్రతివచ్చునట్టిరా
ధానన మిద్ధకోపజనితారుణమై కడు వంకలై బొమల్
పైనమరంగ శోణకమలంబునఁ ద్రిమ్మరు చంచరీక సం
తానరమద్విలాసములు తార్కొనియుండక మానవేర్చునే. ఆ-3.

89. చెన్నూరి శోభనాద్రి

ఇతఁడు బిల్హణునికథను శృంగారసుధాసముద్రపూర్ణచంద్రోదయ మనుపేరను నాలుగాశ్వాసముల ప్రబంధమునుగా రచించి గుమ్మడవు పాపనృపతి కంకితముచేసెను. కృతిపతిగాని కృతికర్తగాని యెప్పు డుండిన వారో తెలిసినది కాదు. కృతిపతి పద్మనాయకకులసంభవుఁడయి గుళ్ళపాటి పురాధీశ్వరుఁ డయిన జగన్నప్రభుని కుమారుఁడు; కృతికర్త యారువేల నియోగియైన చెన్నూరి రామచంద్రుని కుమారుఁడు. కవిత్వము ప్రౌఢముగా నున్నది. శృంగారసుధాసముద్ర పూర్ణచంద్రోదయ మనెడి యామినీపూర్ణతిలకకథనుండి రెండుమూఁడుపద్యముల నిందుదాహరించు చున్నాను—

చ. చక్కనివాఁడు మాటలకు జాణ కళాగమసాహితీచణుం
డక్కట బిల్హణుం డితనియందము చూచిన మందయాన ల
మ్మక్కయటంచు భర్తలను మాని పయింబయివచ్చి నిచ్చలుం
జొక్కకయుండురే రతులఁ జొప్పగునే మన కీతఁ డుండినన్. ఆ. ౨.

ఉ. అంధుఁడు బిల్హణుండు తనయా తెరచాటున నుండి నీవు స
ద్గ్రంథము లన్నియుం జదువఁగావలె నీతఁడు బుద్ధిదూతవా
తంధయసార్వభౌముఁ డని తండ్రి విధించిన నమ్మియుంటి జా
త్యంధుఁడవేని యాతఁడు సుధాంశునిఁ గాంచనుశక్తుఁ డెట్టులో? ఆ-3

మ. తనయూ రాజకుమారుల న్విడిచి విద్వాంసున్ గ్రహింపంగ నీ
మన సెట్లొప్పెను రాజకన్యవుగదా మర్యాదయా నా ధరన్
వినవే పెద్దలు చెప్పుచుందురుగదా విద్వత్సుదారిద్ర్యతా
యని తద్వాక్యము వ్యర్థమయ్యెనుగదా హా యేమిచేయుందగున్.

---

90. కోటీశ్వరుఁడు

ఈకవి భోజకన్యాపరిణయమనెడి మైదాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఈతనిది రసవంతమైన కవిత్వమే కాని యందందు వ్యాకరణవిరుద్ధము లయిన ప్రయోగములు కానఁబడుచున్నవి. భోజకన్యాపరిణయమునందు రుక్మిణికిఁ గృష్ణునితోడి వివాహకథ చెప్పఁబడియున్నది. కవి నియోగిబ్రాహ్మణుఁడు; చక్రప్పకును మంగమ్మకును నందనుఁడు. ఈతనికాలము మొదలయినవానినిగూర్చి యేమియుఁ దెలియదు. ఇతఁడు నూటయేఁబదిసంవత్సరముల క్రిందట నుండియుండవచ్చును. ఈతని ప్రబంధములోని యొక్కొక్క యాశ్వాసమునుండి యొక్కొక్క పద్యము నిందుఁ బ్రదర్శించుచున్నాను—

ఉ. కోమలియూరు చందనము కుంకుముతోడనుగూర్చి యంత న
త్తామరసాక్షుమై నలఁదఁ దద్దయు నొప్పె మనోహరాకృతిన్
సోముఁడు నీరజాప్తుఁడును జూడ్కులయందు వసించియుండుటన్
గాముదిఁగూడి యాతపము క్రమ్మువెలంగనునంద మొందుచున్. ఆ-౧

మ. జనభీతిప్రదఘోషపంకజననస్థారాయశశ్శ్రీప్రసి
వనరాశిం దప మొంది శంఖముకలస్వానామృతౌఘంబు శో
భనరేఖాత్రయభాసురంబు నయి తద్బాహ్యాగ్రళత్వంబు న్నొం
దిన ముక్తావళి తద్భవత్వమునవే చెందెన్ హారవామాకృతిన్. ఆ-౨

మ. అన నజ్జాస్య యనున్ వయస్యలకు నీయజ్జాక్షిఁ గైసేయుమం
చని నే సొమ్ములపెట్టె తెచ్చి మణిభూషానేకము ల్వానఁబో
యిన నొండేనియుఁ బాటిగామిఁ జెలి యేమే చెల్ల నాసొమ్ము లే
వని ఖండించునుగాని నేర దెఱుఁగన్ స్వప్రాప్తకారోప్యవస్థతిన్. ఆ 3

శా. భద్రేభంబులఁగూల్చుసింహముగతిన్ బ్రత్యర్థిభూపాలురన్
రౌద్రోల్లాసవిలాసము ల్మెఱయఁ బోరన్ గెల్చి నానాదిగ
న్ముద్రశ్రీలకు సాటపట్టగుచుఁ బొల్చు న్వాసవుండోయనన్
మద్రాధీశుఁ డితండు చూచితివె శ్రీమద్రాజబింబాననా. ఆ. ౪.

చ. సురవరదత్తమండనవిశోభితుఁడై హరి యిట్లు రుక్మిణీ
వరిణయకాంక్షనుండుటయు భానుఁడు కన్గొని తాను నట్లయా
హరికి ననర్ఘరత్నముల నర్పణ చేయఁదలంచియోయనన్
బరువడిఁ బశ్చిమాంబునిధిపారమున న్నిలిచెన్ ద్వారాధృతిన్. ఆ ౫

---

91. చల్లపిళ్ల నరసకవి

ఇతఁడు యామినీపూర్ణతిలకావిలాసమనుపేరితో బిల్హణచరిత్రము నాలాశ్వాసముల శృంగారకావ్యమునుగా రచియించినకవి. ఈతని కావ్యము పూర్వోక్తమయిన బిల్హణీయమునకంటె మిక్కిలి రమణీయముగా నుండును. ఈ కవి వైదిక బ్రాహ్మణుఁడు; ఆపస్తంబ సూత్రుఁడు; భారద్వాజసగోత్రుఁడు; కామకవి పుత్రుఁడు. ఈ కవి తాను కొంతకాలము క్రిందట మృతుఁడయిన పిఠాపురపు రాజుగారి పితామహుఁడగు శ్రీరావు నీలాద్రిరాయనింగారి కాలములోఁ దదాస్థానములోని కేడియమను గ్రామమునం దుండినట్టు యామినీపూర్ణతిలకావిలాసములో నీ క్రింది షద్యమునఁ జెప్పికొనియున్నాఁడు—

సీ. త్రిభువనపూతకృతిక్రియగల్గు గౌతమీతీరవిస్తీర్ణధాత్రీప్రసిద్ధ
తరమైన కంకణపురవరసంస్థానభూతిఁ జెందినవాఁడ భూసురుండ
శ్రీరామనామమంత్రారాధనపరుండ సకలవిద్వన్మహాజనహితుండఁ
బూజ్యతరప్రాజ్యరాజ్యసత్పీఠికాపురవరసామ్రాజ్యపరివృఢుండు
విమల రేచర్లగోత్రపవిత్రమూర్తి। రావు వేంకటనీలాద్రిరాయనృపతి
చేత సత్కృతినొంది ప్రసిద్ధినొందినట్టి నరసయనామవిఖ్యాతయశుఁడ.

కడియ మనెడి యీ గ్రామము రాజమహేంద్రవరమునకు మూఁడు క్రోసుల దూరమున కాకినాడకాలువయొడ్డున నున్నది. శ్రీ రావు వేంకట నీలాద్రిరాయనింగారు నూఱుసంవత్సరములక్రిందట నుండినవారై నందున నాతని కాలములో నుండిన కవియు దాదాపుగా నూఱుసంవత్సరముల క్రిందటివాఁడు. ఈయన కవిత్వము రసవంతమయి ప్రౌఢముగా నున్నది. ఈయన కవనరీతిని దెలుపుటకయి యామినీపూర్ణతిలకావిలాసములోని కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. నిరుపమసాహసాతిశయనిర్భరదుర్భరవైరివీరసం
హారణరణోత్సవోచితవిహారమహారథికప్రదత్తస
త్పరిణయకార్యధుర్యతరధాణధణంధణనాదఘంటికా
నురమితనిర్జరీజనమనోరథముల్ రథము ల్పురంబునన్. ఆ-౧.

చ. ఘనకబరీస్తనాకృతులు కంధరమై ధరమై రమైక్యమై
చను నొగిఁ గంఠవక్త్రములు సాదరమా దరమా రమాకమా
దినుసుగ వాఙ్ముఖాంగములు తేనెలతో నెలతో లత్రో క్తిత్రో
నెనయగు నాభిజంఘగతి హేమకరిన్ మకరిన్ గరి న్నగున్. ఆ-౨.

ఉ. అమ్మకచెల్ల! చెల్ల నగు నల్లికజెల్లికపూటలాడి చి
త్రమ్ములు పన్ని నన్నిటులు దారిచి మీ రిపు డంద ఱొక్కటై
గమ్మని గేలిసేయ నొడిగట్టితి రమ్మ పనేమి మాటలన్
నమ్మఁగరాదు మిమ్మనుచు నర్మిలి వేఱొకతీరు మీఱెనన్. ఆ-౩.

చ. కలువ లెసంగఁ దామరలు కంది ముడుంగ దెస ల్వెలుంగ వె
న్నెలలు చెలంగ జక్కవలు నెక్కొని సేగి మునుంగఁ జీఁకటుల్
బలిమి నడంగ వేకొమరుఁ బ్రాయపువారల డెంద మందమై
పాలు పలరంగ వారినిధిఁ బొంగఁగఁ జేయుచు రాజు రాజిలెన్. ఆ. ౪.

శా. స్వామీ నేరము లేదు నావలన నీసర్వంబు నీకృత్రిమ
స్తోమంబు న్నను భ్రాంతి ముంప సమయాస్ఫూర్తిన్ మదీయానన
క్షేమాలోకనబద్ధకాండపటరాజిం గూర్చి తౌఁగాదె మ
త్ప్రేమానందకరాశియగ్రహణకారి ప్రాప్తిగా మున్నుగన్. ఆ. ౫.

ఉ. రాముశరప్రయోగము సురప్రభువజ్రము చక్రిచక్రమున్
ధామనిధిప్రియాత్మజునిదండము కామరిపుత్రిశూలముల్
భూమి నొకప్డు రిత్త యయిపోయినఁ బోవుఁగాక యీకవి
స్వాములవాక్ప్రయోగమును బ్రహ్మకు నైనఁ దరంబె త్రిప్పఁగన్.

---

92. అయ్యగారి వీరభద్రకవి

ఈకవి రాఘవ యాదవ పాండవీయ మను మూఁడాఖ్యానముల త్ర్యర్థికావ్యమును రచియించెను. ఈతఁడు ఆఱువేలనియోగి యైనశైవుఁడు; కౌండిన్య గోత్రుఁడు; సోమనారాధ్య పుత్రుఁడు. ఈతఁ డేకాలమునం దుండినవాఁడో నిశ్చయముగాఁ దెలియరాదు. ఇతఁడు నూఱు నూట యేఁబదిసంవత్సరములక్రిందట నుండియుండవచ్చును. మూఁడర్థములు గల పద్యమునుబట్టి కవననైపుణి యిట్టిదని చెప్పుటకు వలనుపడదు. ఇట్టికవిత్వ రచనయే కష్టము. అయినను గవి యవతారికలోఁ జెప్పిన—

ఉ. హారి కిరీంద్రవిగ్రహవిహారికి నాశ్రితబృందదుఃఖసం
హారికి ధూతదేవవివహారికిఁ గౌస్తుభసజ్జ్వలన్మణీ

హారికి హ స్తపద్మగమహారికి సాగరబాలికామనో
హారికి వాహనస్఩ణవహారికి శౌరికిఁ గేలు మోడ్చెదన్.

సీ. నిండుచందురుఁడాలు నీటు నేలఁగఁ జాలు
మొగముపైఁ జిఱునవ్వు మొలకలోదవఁ
చెలిము త్రైములమించు శ్రేటనూటాడించు
నెలకూనయును దలఁ దళుకు లీనఁ
గోదమతుమ్మెదబారు నదలించితనరారు
కడచూపు లక్కుటికంబు నించ
జోడులేదని తెల్పు సొగసుకుత్తుకనల్పు
మేవన్నెలకు వింతమిసిమి నొసఁగ
నలువ మొదలైనవారు తన్గొలిచిరాఁగ
గిబ్బ బాబాపయుంబొల్చి యబ్బురముగ
నెలమి చెన్నారఁగా వాకిఁగలనుగానఁ
బడియెముక్కంటికన్నులపండువుగను.

ఇత్యాదిపద్యములనుబట్టి చూడఁగా నితఁ డాంధ్రగీర్వాణపద బహుళముగా మంచికవిత్వము చెప్పఁగలవాఁ డని యే త్తోఁచుచున్నది. ఈతని గ్రంథములోనివి కొన్ని పద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి.

శా. నానారత్నవిభూషితాఖిలజనానందదానుసంధాయిశృం
గానూనంబులు చారుగంధసుమనఃప్రాచన్మహాపాదపా
ళీనవ్యంబులు సద్వ్రపాభిరతముల్ లీలార్థగోత్రాళు లెం
త్తో నేత్రోత్సవదంబు లౌదుఁ జెలువొందుందత్పురంబందునన్. ఆ-౧

ఉ. ప్రాంచితరీతి రాముఁడు పరాశరజాతుఁడు కృష్ణమూర్తి దా
మించినవేడ్క నంప జడిమిాఱఁగఁ బెంచి విరాధరాజితో
దంచదనూనలీలల నుదాత్తముగా యవనాభ్రమున్నతు
ల్లాంచుచు నింద్రకీలధరలాలితదీపినటెందు భాసిలన్. ఆ. ౨,

ఉ. రాముని ధర్మరాజు రణరంగవిరాజితు నచ్యుతప్రభుః
నీమది మర్త్యగాఁ దలఁచి నీతివిహీనతఁ బోరఁబోకుమీ
సామము మేలు తద్విభుఁడు శస్త్రబలంబున మేటి భూమిలోఁ
గామిని రత్నయుక్తముగఁ గ్రక్కున నిచ్చి కులంబుఁ బ్రోవుమా. ఆ-3

---

93. ఘట్టుప్రభువు

ఇతఁడు సురాభాండేశ్వరము, కుచేలోపాఖ్యానము, యాజ్ఞవల్క్యచరిత్రము, అను మూఁడుపద్యకావ్యములను రచియించెను. ఇతఁడెల్లామాత్యునిపుత్రుఁడు. ఈకవి యాజ్ఞవల్క్య నియోగిబ్రాహ్మణుఁడయినట్టు కనఁబడుచున్నాఁడు. ఇతఁడు కుచేలోపాఖ్యానములోఁ దన్నుఁగూర్చి యిట్లు వ్రాసికొనియున్నాఁడు—

సీ. భ్రమరాంబికావరప్రభవదివ్యకవిత్వ
విద్యాప్రవీణత వెలసినాఁడ
ఘటికాశతగ్రంథఘటనాసమంచిత
చాతుర్యమహిమకుఁ జాలినాఁడఁ
బ్రాఢిమ నేకైకపత్రమాసమహాప్ర
బంధ కల్పనశక్తిఁ బ్రబలినాఁడ
మఱియు నాశువు చిత్రమాధుర్యవాక్య ప్ర
గల్భనంబున నుతు లొందినాఁడ
శ్రీకుధరమల్లిఖార్జున శ్రీపదాబ్జ
మత్తభృంగాయమానసన్మానసుండ
సత్కవీశ్వర కరుణాప్రసాదవశుఁడ
ఘట్టుప్రభునామధేయ విఖ్యాతయశుఁడ.

ఈ కవి నెల్లూరిమండలము గోసివాఁడయినట్టును, అప్పటి కెనుబది సంవత్సరములక్రిందట నుండినట్టును, నెల్లూరిమండల చరిత్రమునందు వ్రాయఁబడియున్నది. కాఁబట్టి కవి యిప్పటికి నూఱుసంవత్సరములక్రిందట నుండినవాఁడు. ఈతనికవిత్వ మంతగా నిర్దుష్టమయినదియు ప్రౌఢ మయినదియుఁ గాకపోయినను, మంచి లోకోక్తులతోను న్యాయముల తోను నిండియుండి ద్రాక్షాపాకమునఁ జదువువారి కింపుగానుండును. ఈతఁడు రచియించిన యాజ్ఞవల్క్యచరిత్రము ప్రస్తుతమున నావద్ద లేదు. దక్కిన గ్రంథములనుండి కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

కుచేలోపాఖ్యానము.

శా. చిత్రం బెన్నఁగఁ జిన్ననాఁడె తనయుల్ శిక్షానుగుణ్యాల్ తుదన్
బాత్రుల్గా రతిదండకార్యములకున్ బ్రాయంపువారైన ని
ద్ధాత్రిం జుట్టములట్ల చూపవలదా తండ్రుల్ ప్రజాజాతులున్
బుత్రం మిత్రవదాచరే త్తనుచు నేప్రొద్దున్ శ్రుతుల్ చాటఁగన్. ఆ-౧.

ఉ. కామితవస్తుజాతములు గల్గి దయాపరులైన పుణ్యులన్
బ్రామత నిచ్చి పుచ్చుకొనుభావమునం దలపోయఁ డెంతయున్
గ్రామము క్రొత్తదైనఁ దన కర్మము క్రొత్తయె పెక్కుమాటలిం
కేమి యదృష్టహీనునకు నెచ్చటి కేఁగినఁ గల్గునే సిరుల్. ఆ-౨.

ఉ. అన్నము లేకయుండిన లయంబగు దేహము రక్తమాంసముల్
సున్నగు నింద్రియస్ఫురణ స్రుక్కు మదాతిశయంబున దూరమౌ
నన్నులమిాఁది ప్రేమ చెడు నచ్యుత నీపయి నిల్చుమానసం
బెన్నటికైన జ్ఞానులకు హెచ్చు దరిద్రతసాటి యే సిరుల్. ఆ-౩.

సురాభాండేశ్వరము.

చ. తవిలినమోహపాశమున దైన్యముఁ బూని మనోవ్యథం గడుం
దివురుచు విన్ననై యవనిదేవుఁడు ప్రార్థనచేసి మ్రొక్కఁగా

నువిదయుఁ జేరికిఁ గొనక యూరక యేగెను నిర్దయాత్మయై
శివశివ మిక్కిలిం గఠినచిత్తులుగారె లతాంగు లిమ్మహిన్.

చ. పరమవివేకశీలుఁడవు బాపఁడ వుత్తమవంశజుండ వీ
వెఱుఁగవె యొండ్ల భామినుల నీగతిఁ గోరుట ధర్మమే మహా
దురితము లైనపట్లఁ గడుదూరముగా నెడలించి మోహముల్
మఱచుట ధర్మ మండ్రు మతిమంతులు వేదపురాణసమ్మతిన్

---

94. ముప్పరాల సుబ్బరాయకవి

ఇతఁడు కృష్ణాభ్యుదయమనెడి యైదాశ్వాసముల ప్రబంధమును రచియించి, చక్కిలాల వేఙ్కయామాత్యున కంకితముచేసెను. ఆగ్రంథమునఁ గవి తన్నుఁ గూర్చి యిట్లు చెప్పుకొనియున్నాఁడు.

మ. నను శ్రీనాథకథాసుధారససరిన్నాథాగ్రఘోషాంబుగా
హానదూరీకృతసర్వకల్మషు హయాస్యానుగ్రహ ప్రాప్తసా
రనిరాఘాటసితాంతశోభికవితారాజ్యాప్వతున్ సత్సుధీ
జనసంతానవిధేయుఁ జూచి పలికెన్ సంతోష ముప్పొంగఁగన్.

సీ. అతిశయోత్ప్రేక్షోపమాద్యలంకారముల్
దొలఁకంగ ముద్దులు గులుకఁ ఫణితిఁ
బద్యకావ్యముగాఁగఁ బ్రద్యుమ్నచరితంబు
రసికు లౌననఁగను రచనచేసి
తలరుచు ద్విపదగా వెలయ సావిత్రిచ
రిత్ర యొనర్చితి చిత్రలీల
భద్రాద్రిఁ దగు రామభద్రునిపై నొక్క
శతకంబుఁ జేసితి చతురఫణితి
నేయెడ నరస్తుతులు నీవు సేయవైన
భ్రాతృవాత్సల్యమెనఁగఁ బ్రబంధ మొకటి

చెప్పినా కంకితంబుగఁ జేయుమిపుడు
సుకవినుతగుణసముదాయ సుబ్బరాయ

పయిపద్యములనుబట్టి యీకవి ప్రద్యుమ్నచరిత్రమును సావిత్రీ చరిత్రమును భద్రాద్రి రామశతకమునుగూడ రచియించినట్టు తెలియ వచ్చుచున్నది. ఈకవి యెప్పటివాఁడో తెలియరాలేదుగాని నూఱుసం వత్సరములకంటెఁ బూర్వపువాఁడు. ఈతని కవనము మృదువయి మధు రముగా నున్నది. కృష్ణాభ్యుదయములోని కొన్నిపద్యముల నిం దుదా హరించుచున్నాను—

ఉ. సంకుమదాదిగంధయుతసారసమీరము మీఱివీవఁగాఁ
గంకణఝుంకృతు ల్వెలయఁగా సురసుందరు లొయ్య నొయ్యనన్
బొంకముమీఱ నూఁపఁగను భోగికులాధిపుడోలికన్ రమా
పంకజగంధిఁ గూడుకొని బంధురహర్ష తరంగితాత్ముఁడై. ఆ. ౨.

చ. విను చెలి జోడుకోడెలగు వేఁడివెలుంగును రేవెలుంగునున్
వనజదళాయతాక్షునకు వారిగుహాసనుఁ డిం పొనర్పఁగాఁ
గనుఁగవఁజేయ నాసయనుకాంచనపుష్పము నాశ్రయించి వా
రనిశము పుష్పవంతు లనునాఖ్య వహించిరి ముజ్జగంబులన్. ఆ. 3.

ఉ. మారుశరాళికిన్ మలయమారుతపాళికి మంజులాళికిన్
మీఱుమరాళికిన్ జిగురుమెక్కెడునీలిగయాళికిన్ శశాం
కోరుకరాగ్రకేలికి మయూరకదంబము కేళికిన్ సితాం
భోరుహనేత్ర కుంది తలపోయఁదొడంగె మనంబులోపలన్. ఆ. ౪.

చ. కొనిమొద రుక్మిణీసతిని గోపవధూవిటుఁ డడ్డమైన మా
ర్కొనిమొద మచ్చుజాబల మకుంఠితమైతగ నెల్లిమీఱె క
న్గొనిమొద రంచు బంధుజనకోటికిఁ దెల్పుచుఁ జైద్యుఁ డంతటన్
గని మొదరైనవారు నగఁ గ్రక్కునవచ్చె నృపాలువీటికిన్. ఆ. ౫.

95. ప్రయాగ కామేశ్వరకవి

ఇతఁడు గోపాలలీలాసుధాలహరి యను మూఁడాశ్వాసముల ప్రబంధమును రచియించి రామతీర్థస్వామి కంకితము చేసెను. ఈకవి విశాఖపట్టణమండలపువాఁడు; వైదికబ్రాహ్మణుఁడు; కౌశికగోత్రుఁడు; నారసింహపౌత్రుఁడు; సర్వేశ్వరపుత్రుఁడు. ఇతఁడు నూఱు సం॥ రములక్రిందట నుండినవాఁడు. కవిత్వము మంచిదేయైనను శృంగారవర్ణనము నితఁడు మిక్కిలి పచ్చిగాఁ జేసినందునఁ బుస్తక మిప్పటివారు చదువుట కంతగా యోగ్యమయినదికాదు. ఈప్రబంధమునుండి రెండుపద్యముల నుదాహరించుచున్నాను—

ఉ. దుండగ మేలచేసెదవు తోయజపాయక దండనిల్చి కో
దండము డించి మాచెలికిదండము పెట్టుము రెండుకన్నులన్
నిండిననీరు దోయిటను నించి శపించుఁ దదశ్రువారి నీ
దండనచేయుఫాలశిఖతండ్రిసుమీ కడుశిక్ష చేయఁగన్. ఆ. ౨.

మ. యమునాతోయము దోయిటంగొని సముద్యల్లీల వేఱొక్కభా
మముఖాబ్జంబునఁ జల్ల నానెలఁతయు న్మార్మోమ గావించుచో
దుమికెం దుమ్మెదచాలుఫుల్లనవపాథోజంబుపై నాఁగ శ
క్రమణీరోచులనీనుకొప్పు విడి వేగం గ్రమ్మెఁ దద్వక్త్రముల్. ఆ.3.

---

96. అనంతనార్యుఁడు

ఈకవి గాధేయోపాఖ్యానమను నేకాశ్వాసశృంగారప్రబంధమును రచియించి కామాంబకును జిన్నప్రభునకును బుత్రుఁడగు కృష్ణభూపాలుని కంకితము చేసెను. ఇతఁడు తాళపలింపకవికుమారుఁడు. ఈ కవినిగూర్చియు నీతని కాలమునుగూర్చియు మఱేమియుఁ దెలియరాలేదు. ఇతఁడు నూఱేండ్లకు లోపలివాఁడుకాఁడు. ఈతని కవిత్వము హృద్యమయి యన

పద్యమయియున్నది. కవితామాధుర్యమునుజూపుటకై గాధేయోపాఖ్యానములోని పద్యముల రెంటి నిందుక్రిందఁ బొందుపఱుచుచున్నాను—

ఉ. మానక యింతవంత దరమా సురమాన్యపదంబుగన్న మ
న్నీని కిదేల వట్టివగ నీకృపచే వగ నేవగ న్జగ
న్మాన్యత తత్తపోమహిమ మానుప నాదువిలాసమోపు నీ
పూనికమోపు నాపయినిమోపు వెత న్విడుమోపురందరా.

చ. చిలుకలకు న్వచోగురుతఁ జెంకుచు సప్తవిధస్వరంబులన్
బలుమఱుఁ దేనియ ల్గులుకఁ బాడెడు నీలలితాంగిఁజూచి లో
కులు మఱి కీరవాణియును గోకిలవాణియనంగఁ దోన చి
ల్కలు మఱి రామరామయనుఁ గన్నులఁ గెంపు వహించుఁ గోవిలల్.

97. భైరవకవి

(ఇతఁడు రత్నశాస్త్రమును దెనుఁగునఁ బద్యకావ్యమునుగా రచియించెను. ఇతఁడు గౌరనసుతుఁడు. ఇతఁడు భ్రమరాంబికా వరప్రసాదముచేతఁ దనకుఁ గవిత్వము వచ్చినట్లీ క్రిందిపద్యములలోఁ జెప్పుకొనియుండుటచేత కర్నూలుమండలములోనివాఁ డయినట్టు తోఁచుచున్నది.)

క. తన్నుఁ బ్రియమూర వేఁడిన|మున్నుమునీంద్రులకగస్త్యముని చెప్పినయా
సన్నుతమణిలక్షణములు|చెన్నుగఁ గ్రోడీకరించి చెప్పెదఁ దెలియన్.

క. భ్రమరాంబికామహేశ్వర|సముచితనిరవద్యహృద్యసాహిత్యకళా
క్రమవిమలప్రతిభాసం|క్రముఁడ మతిశాలినైఁగౌరనసుతుఁడన్.

"భైరవుఁడ నుభయభాషాపరీణుఁడ" నని కవియే తన సంస్కృతాంధ్రభాషాద్వయపాండిత్యము కలదని చెప్పుకొనెను. ఈతని కవిత్వము మొత్తముమీఁద చక్కఁగానే యున్నది. రత్నశాస్త్రములోని రెండు పద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి.

ఉ. నీరదము ల్దిగంతములనిండి తటిద్ఘనగర్జితంబు లిం
పార యహోగ్రవృష్టి కురియం బ్రభవించు నింతాతకాంతితో
నారయఁ గుక్కుటాండసమమైపడుముత్యము లంతరిక్షసం
చారులు పట్టుకొందురు వెసన్ వసుధం బడకుండ నేర్పునన్.

ఉ. చేత ధరింప మానవులచెంతను జేరవు భూతకోటు లే
రీతిని దుష్టవిద్య లొనరించిన నెక్కుడు క్రూరజీవముల్
ఘాతలు సేయలేవు సతిగర్భమువోప సుఖప్రసూతియా
నాతత భాతితోఁ బ్రతిదినంబును బ్రీతి యొనర్చుఁ గేతువున్.

---

98. అనమగుర్తి రంగయ్య

ఇతఁడు యాదవగిరిమాహాత్మ్య మనెడి యైదాశ్వాసముల పద్య కావ్యమును రచియించెను. ఇతఁడు నందవరీక నియోగిబ్రాహ్మణుఁడు; తిమ్మయామాత్య తనూభవుఁడు. ఈకవి తనగ్రంథమును రావూరి వేంగామాత్యున కంకితముచేసెను. కవియెప్పటివాఁడో సరిగా తెలియదుగాని నూఱుసంవత్సరములకుఁ బూర్వపువాఁ డనుటకు సందేహము లేదు. ఈ తనికవిత్వము శ్రావ్యముగానే యున్నది. యాదవగిరి మాహాత్మ్యములోని రెండుమూడుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. పిడుగులఁబోలు నెండసెగఁ బెట్టినపైరులు వాడిపోయినన్
మడిమడిఁ దప్ప కేతములు నాటుచు బావులు త్రవ్వి కారుపై
రిడి యొకకొన్నిబాన లటు లెత్తుచు గొడ్డులదూలి సారె నీ
రెడలినఁ జూచి యొక్కతడి యిత్తురు హాలికు లశ్రుధారలన్. ఆ-3

చ. బెళఁకులు నేర్చెఁ జూపు తిరిపెల్లు లవారిగఁజల్లె మేనిడాల్
కెలఁకులఁ జూడఁజూడఁ బెరిఁగెం జనుఁబూపలు నిగ్గుదేరెఁ జె

క్కిలికవ సన్ననూలువడికె నన్నడు మొక్కడనుండివచ్చెనో
చెలు లోకనాఁడు నేరుపనిసిగ్గు వధూటికి నాఁడునాటికిన్. ఆ. ౪.
ఉ. వాలికచాగుప్రేఁగుజడ వారిపయింబడి తేలియాడుచున్
వ్రాలఁగ, నీలహంస మది వారిరుహంబని డాయ, నొక్క ప్రో
యాలి మెఱుంగుమోముమరె నవ్వుల నివ్వల రాహు కేతువుల్
బాళిని డాయ వారియెడఁబర్వినపర్వసుధాంశుఁడో యనన్. ఆ. ౫.

99. తామరపల్లి తిమ్మయ్య

ఇతఁడు శేషధర్మము నెడి యైదాశ్వాసముల పద్యకావ్యమును రచియించి శ్రీరామాంకితముచేసెను. ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; శరణయామాత్యునిపుత్రుఁడు. ఇతఁడుండినకాలమేదో తెలియదు. నూఱు సంవత్సరములక్రిందట నుండియుండును. ఇతనికావ్యమునం దపప్రయోగములు కొన్ని గలవుగాని కవిత్వము మొత్తముమీఁద చక్కనిధారకలదయి శ్రావ్యముగా నుండును. ఈతనిశేషధర్మములలోని కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. తోడికులాంగన ల్మణులతోఁ గనకంబులతోడ వెండితో
వాడలవాడలన్ సిరికి వన్నెలు వెట్టుచు నాథపుత్రులం
గూడి సుఖింపఁగా మనము కూటికిఁ గూరకుఁ జిక్కి బిడ్డల
ల్లాడఁగ నెల్లకాలము మహాత్మకనుంగొనుచుండ శక్యమే. ఆ. ౧.
మ. మును పోషించినపుత్రమిత్రవనితాముఖ్యుల్ స్వకర్మంబులం
జని యొందేఁ జన వారికై జపతపస్స్వాధ్యాయము ల్మాని దు
ర్జనులం గూడి పరాపకారనియతిం బ్రాభుత్వము ల్చూప నా
పెనుపాపంబున గర్భవేదనలు పై పెట్లయ్యొ నెట్లేగుదున్. ఆ. 3.

ఉ. అక్కడనున్న యాపశుమృగాదులు తావకపాదపద్మముల్
దిక్కని ముక్తికామినికి దీవన లిచ్చు సుపర్వు లింతయున్
నిక్కము యుగ్గిరీంద్రమున నిల్వఁగవచ్చును బుణ్యశాలికిన్
గక్కసమా మహాదురితకర్మలకున్ వసియింప నిచ్చటన్. ఆ. ౫.

---

100. నారన సూరన

ఇతఁడు వనమాలివిలాసము నను కావ్యమునుజేసి, కొండూరి యక్కదండనాథున కంకితముచేసెను. నావద్దనున్న యీ గ్రంథముయొక్క ప్రతి యసమగ్రమయినది; అవతారిక లేదు. కృతిపతిమంత్రియు దండనాథుఁడు నయి యజ్ఞముచేసిన నియోగిబ్రాహ్మణుఁడు. కవి నారనామాత్యుని కుమారుఁడైన నియోగివిప్రుఁడు. ఇతఁ డాధునికుఁ డని చెప్పుటకుఁ దక్కఁ గవికాల నిర్ధారణముచేయుటకుఁ బుస్తకమునం దాధారమేదియుఁ జిక్కలేదు. ఈతని కవిత్వము సలక్షణమయి మృదువుగానున్నది. వనమాలివిలాసములోని కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. గొజ్జఁగినీరుపోసి సమకూర్చినచందనవారిఁ దోఁచి లా
మజ్జకతాళవృంతముల మాటికిఁ ద్రిప్పఁగ రాలుశీకరం
బజ్జలజాక్షుచెక్కిళుల యందుఁ దనర్చె ముఖేందుసుజ్వరం
బుజ్జనచేయఁ గూడఁబడియున్న యుడుప్రకరంబుచాడ్పునన్. ఆ-౧.

చ. మెఱయు కపోలపాళికలమీఁదఁ జలన్మణికుండలద్యుతుల్
గిఱికొన ఫాలభాగమునఁ గించి దుదంచితరత్నంబులై
నెఱికురు లింపుచేయఁ గమనీయవిలోచన లూఁచి రాదలల్
కొఱలి భవద్యశోమహిమ కోమలి మాటికిఁ జెప్పుచుండఁగన్. ఆ-౨

చ. కలమధురంబులైన కలకంఠివచోరచనానిగుంభనం
బులు విని సిగ్గునం బలుకుపూనిక లెల్లను బోవడించి మూఁ

గంటవలె నోళ్లు మూసికొని కాననసీమలఁ జేరియున్న కో
కిలముల బుజ్జగించి పలికించు మధూదయ మాత్మసంగతిన్. - ఆ-౩.
ఉ. తొల్లియు మోసపోయితివె తోయరుహానన పెక్కుమాటలో
చెల్ల మదీయధౌర్త్యములచేత నె యిప్పుడు నమ్మకొనె నీ
యుల్లము సారె నెత్తు లిడుచున్నది యాక్రియ నాడుమంచు నా
కల్లతనంబు లింతటివిగాఁ దలపోయ నరాళకుంతలా. ఆ-౮.

---

101. బోడూరి పెదరామామాత్యుఁడు

ఇతఁ డాఱువేలనియోగిబ్రాహ్మణుఁడు; భారద్వాజగోత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; శివరామమంత్రికిని సీతమాంబకును బుత్రుఁడు. ఇతఁడు శివరామాభ్యుదయ మను ద్వ్యర్థికావ్యమును రచించెను. ఇతఁ డీ గ్రంథమును గురజాల పేరయార్యుని ప్రేరణమునఁ జేసెను. కవి కృతిపేరకుని తన గ్రంథమునందు—

సీ. ఏమంత్రికులపూర్వుఁ డిలఁ జనుత్తారభారత మందె శ్రీరంగరాజునాముఁ
డేమంత్రిముత్తాత యామల్లయజ్వ దాక్షాయణీపరిణయగ్రంథమందె
నేమంత్రితాత యజ్ఞపామాత్యుఁ డొనరించెప్రసంతానముల్ సరవితోడ
నేమంత్రిపిత పార్వతీశ్వరుఁ డాదిమదాతయై పద్యగద్యంబు లందె
నట్టి గురుజాలకులకలశాబ్ధివిధుఁడు
రసికుఁ డివటూరి మల్లనారాధ్యశిష్యుఁ
డభవపూజాధురంధరుఁ డైన పేర
ఘనుఁడు సాంఖ్యాయనసగోత్రుఁ డెనయు సిరుల.

ఇట్లు వర్ణించి, అతఁడు తన్నుఁగూర్చి పలికినట్లుగా నీ క్రింది పద్యములను జెప్పికొనియున్నాఁడు—

సీ. అనఘభారద్వాజమునిగోత్రజాతు నాపస్తంబసూత్రుఁ బ్రశస్తచరితు
ఘనుని-బోడూరి వేంకటమంత్రివరునప్తమహితధీబాపయమంత్రిపౌత్రు

శివరామమంత్రికి సీతమాంబకు సూనులై మించు బాపార్యరామరామ
ఘనులు ముగ్వురిలోన గణన కెక్కిన పెదరామకవీంద్రు శ్రీరమ్యచరితుఁ
జిత్రయమకాంధ్రసంస్కృతశ్లేషకవిత
రచనసేయంగ నేర్చి భారతికరుణను
రాజవిద్వత్సభలయందుఁ బూజితుఁ డగు
నన్నుఁ బిలిపించి పలికెఁ బ్రసన్న ఫణితి.

సీ. నీవంశపూర్వధీనిధి కొండకవి చెప్పె భార్గవాభ్యుదయప్రబంధ మెలమి
నీయన్న బాపమంత్రి రచించె నొగినుషాకన్యకాపరిణయకావ్య మెసఁగ
నీతమ్ముఁ డసమునందె నిరోష్ఠ్యజానకీకళ్యాణకృతి రామకవివరుండు
నీవు ప్రౌఢోక్తిని నిర్మించినావు కౌసల్యాపరిణయాది సరసకృతుల
మఱి యుదాహరణాది చమత్కృతులను
సంస్కృతాంధ్రకవితఁ జెప్పఁజాలినట్టి
ప్రౌఢసత్కవి వీవె ధరాతలమున
గలితగుణగణ్య పెదరామకవివరేణ్య.

ఈపెదరామకవి సంస్కృతాంధ్రకవులను స్తుతించినపిమ్మట శ్లేషకావ్యములకు మార్గదర్శియైన పింగళి సూరనామాత్యునిటు పొగడియున్నాఁడు.

ఉ. శ్లిష్టకవిత్వవైఖరివిచిత్రత రాఘవపాండవీయము
త్కృష్టముగా రచించి జగదేకనుతు ల్గని ధాత్రిలో నవ
స్రష్ట యనంగఁ బద్మభవసన్నిభుఁ డైనమహాకవీశ్వరా
భీష్టదమప్రభావుఁ డగుపింగళిసూరకవీంద్రుఁ గొల్చెదన్.

కావ్యప్రేరకుఁడైన గురుజాల వేరయార్యుని యభీష్టప్రకారముగా నీగ్రంథమును గోదావరిమండలములోని యాచంటగ్రామమునందలి రామలింగేశ్వరస్వామి కంకితము చేయుటచేతనే కవి గోదావరిమండలములోనివాఁడగుట స్పష్టమగుచున్నది. ఈతనికాలము నిశ్చయముగాఁ దెలియ

రాదుగాని యితఁడు నూఱుసంవత్సరముల క్రిందటివాఁడని తోఁచుచున్నది. ఈతనికవిత్వధార యనర్గళమయి మృదువుగానున్నది. కవితాధోరణి తేటపడుటకయి శివరామాభ్యుదయములోని రెండుపద్యము లిందు దాహరింపఁబడుచున్నవి—

చ. తరమె నుతింపఁగా నగణితస్ఫురితాంకతఁ దద్ధరాధినే
తరసికుఁడౌ ననంత వసుధారథుఁ డుగ్రపురారి భీముఁడు
ర్వర నుతి కెక్కుమించె వృషవాహసమాఖ్యుఁ డహీనసద్గుణో
త్కరవరుఁ డాజిభీకరనితాంతపరాక్రమశాలి యౌ ననన్. ఆ. ౧.

మ. అలరన్ దత్సుకుమారభాసురసహాయంబొప్పఁగా దారకో
జ్జ్వలనామాహితదానకాంక్ష విబుధాంచద్భర్తయాదాన నా
కులసత్సంతతిఁ జూడవచ్చె నమితాత్యుం డింపుమీఱంగ మం
జులతారామమహాధ్వరాజితవరాంశు ల్గల్గునప్వీటికిన్. ఆ. ౨.

---

102. రామావర్ఝుల కొండుభట్టు

ఈకవి కపిలగోసంవాద మనుపేర నధ్యాత్మవిద్యాప్రతిపాదకమగు నాలాశ్వాసముల పద్యకావ్యమునురచియించి యహోబిలనృసింహస్వామి కంకితముచేసెను. ఇతఁడు వైదికబ్రాహ్మణుఁడు; హారితసగోత్రుడు; నరసావధానికిని అక్కమకును పుత్రుఁడు. ఇతఁడించుమించుగా నూఱుసంవత్సరములక్రిందటి వాఁడని తోఁచుచున్నది. ఈతని కవిత్వము మృదువయి నాతికఠినమయి శ్రావ్యముగానున్నది. కపిలగోసంవాదములోని యొక్కొక్క యాశ్వాసమునందలి పద్యము నొక్కొక్కదాని నిం దుదాహరించుచున్నాను—

ఉ. ద్వైతముచే ననిత్యసుతదారధనాద్యఖిలైహికోత్సవ
వ్రాతములందు దైవతనివాసపుఖంబులయందు లోలుఁడై

పాతరలాడువారల కపారత నిత్యసుఖాబ్ధిదేల నే
భాతి లభించు సద్గురుకృపామహిమం బొడకూడ దేనియుఙ్. ఆ ౧

శా. ఔనా మీమదులం దసూయ యనసూయాదేవిపైఁ బూన మే
మానాతిం జెనకంగఁ జాలుదుమె మీయాలాపము ల్గార్వరా
దైనం బోమెద ముందు నేమగునొ యం చాదేవదేవో త్తముల్
గానంబోయిరి యమ్మునీంద్రుసతికిఙ్ గాపట్యవేషంబులన్. ఆ. ౨

శా. వేదాంతార్థసముజ్జ్వలాగ్ని భవసద్విజ్ఞానదీపంబుఁ దా
నాదిఙ్మానసముం గరంగఁగ సముద్యల్లీలమైఁబూని స
మ్మోదం బొప్పఁగ హృద్గృహాంతరవసన్మోహాంధకారంబు వి
చ్ఛేదంబై చనఁజొచ్చియందుఁగలయన్ శేషాహిభూషున్ బరున్ ఆ-3

ఉ. అపరమేశ్వరుండు సకలాంతరబాహ్యములందు నెల్లఁ దా
వ్యాపకుఁ డౌట లింగతనువందును బింబితుఁ డయ్యె నంతుచే
రూపరి జీవుఁడై మిగులరూఢిని గర్తను భో క్తనంచు సం
తాపము నొందుచుండుఁ దనుఁ దాఁ గనలేమిని నెల్లభంగులన్. ఆ-౪.

మ. ప్రతిబింబంబు లనంగ దుర్విషయమృష్టిజ్ఞాదిదుర్వాసనల్
సతతంబున్ మదిలోనఁ బాదుకొన నిశ్చాంచల్యముం బొంద నీ
కితరభ్రాంతులఁ ద్రిప్పుచున్ శ్రవణవాగిత్యాదిసంసర్గసం
గతులం బర్వికొనంగలేనియవియా౯ఁ గౌటిల్యమాలిన్యముల్. ఆ-౫.

చ. చక్కెర పుచ్చకాయవలె సంతనగా నొనరించియుంచ నం
దెక్కడనైనఁ జేదు గలదే విను మాత్మయఖండరూపమై
పిక్కటిలంగ వే ఱొకటి భేదము తోఁచునె యెట్లుచూడఁ దా
నొక్కటియొక్కటే నిజము నొక్కటి యన్నదియు న్విచిత్రమే. ఆ-౬.

103. మారయకవి

ఇతఁడు మైరావణచరిత్రమును పద్యకావ్యముగా రచియించెను. ఈ కవి నియోగిబ్రాహ్మణుఁడు; సర్వయామాత్యునికుమారుఁడు. అక్కడక్కడ వ్యాకరణదోషములు కానఁబడుచున్నను మొత్తముమీఁద నీతని కవిత్వము మృదువయి మనోహరముగా నున్నది. కవనధోరణి తేటపడుటకయి మైరావణచరిత్రములోని రెండుమూడు పద్యముల నిం దుదాహరించుచున్నాను.—

ఉ. చెప్పఁగరానిమాయల విచిత్రపురూపులు దాల్చి యింక వాఁ
డెప్పుడువచ్చునో యిటకు నేమటియుండినఁ గార్యమంతయుం
దప్పునుగాన రాఘవులు తద్దయుఁ గాంచువిధంబు గొబ్బునన్
జొప్పడఁ జెప్పుఁడీ తెలియ సూనృతవర్తనులార నావుడున్. ఆ-౧.

ఉ. మారుని మోహనాంబకమునూడ్కొని బ్రాణము లైదు నున్నబం
గారపుబొమ్మరీతిఁ దొలుకారుమెఱుంగులప్రోకభంగి శృం
గారరసంబునం దొలఁకఁగట్టిన పువ్వులమొత్తురీతి న
న్నీ రజగంధివచ్చి తగ నిల్చెను బ్రీతిని భర్తముందటన్. ఆ-౧.

చ. దనుజ దురాత్మ నీకు నిఁకఁ దస్కరవృత్తినిజొచ్చి మాయలన్
దినకరవంశ్యులం దొడరి తెచ్చినపద్ధతిఁ బోవరాదు నా
ఘనతరవాలరోమమునఁ గట్టి జగంబులు మెచ్చ నిన్ను న
య్యనిమిషులెల్ల భీతి నిట కడ్డమువచ్చినఁ గావఁ జంపెదన్. ఆ-౨.

---

104. పరశురామపంతుల లింగమూర్తి

ఈకవి సీతారామాంజనేయమనెడు మూఁడాశ్వాసముల వేదాంత గ్రంథమును రచియించెను. ఈతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; రామమంత్రికిని తిమ్మాంబకును బుత్రుఁడు; మహాదేవయోగి శిష్యుఁడు. ఈగ్రంథము

ప్రథమాశ్వాసము తారకయోగమును గూర్చియు, ద్వితీయాశ్వాసము సాంఖ్యయోగమునుగూర్చియు, తృతీయాశ్వాసము రాజయోగ మనఁబడెడి యమనస్కయోగమునుగూర్చియు, తెలుపును. ఈ సీతారామాంజనేయ సంవాదము బహుజనులచేఁ జదువఁబడెడు జనప్రియమైన పుస్తకముగా నున్నది. కవిత్వము నిర్దుష్టమయి హృద్యముగా నున్నది. ఈకవి తన పాండిత్య ప్రకటనమునకయి యిట్టి వేదాంతగ్రంథమునందు సహితమేకాక్షరద్వ్యక్షర పద్యములను జొప్పించియున్నాఁడు. ఇతఁడు నూఱు సంవత్సరములకుఁ బూర్వమునం దుండినట్లు తెలియవచ్చుచున్నది. సీతారామాంజనేయ సంవాదమునుండి కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. ప్రాపుగ రామనామము నిరంతరమున్ భజియించువారికిం
బాపము లేదటంచుఁ బెనుపామును బట్టఁగవచ్చు నగ్నిసం
దీపితలోహఖండము నతిత్వరితంబుగ మ్రింగవచ్చు బ
లోపము పెంచు పెద్దపులికోఱలు దీయఁగవచ్చునిద్ధరన్. ఆ-౧.

ఉ. నమ్మ మనమ్ములో ననుదినమ్ము వెలుంగుచిదాత్మసత్ప్రభా
వమ్మె నిజమ్మ నేను నిధనమ్మును సంజననమ్ము రూపవ
ర్ణమ్ములుఁ గర్తృకార్యకరణమ్ములు వర్ణగుణాశ్రమాభిమా
నమ్ములు నాకు లే వనుఘనమ్మగు నా వచనమ్ము నెమ్మదిన్. ఆ-౨.

శా. గానంబు న్నటనంబుఁ దాళగతులం గావించున్ జారు వి
ద్యానైపుణ్యముఁ జూపుచున్ శిరముమీఁదం గల్గు పెందొంతరల్
బూనం గైకొను నాట్యశీలువిగతిన్ బుంఖానుపుంఖోజ్జ్వల
న్నానార్థానుభవజ్ఞుఁడయ్యు బుధుఁడానందాత్ముఁ గాంచున్మదిన్. ఆ-3.

105. పరశురామపంతుల రామమూర్తి

ఈ కవి శుకచరిత్రమనెడి యైదాశ్వాసముల వేదాంత గ్రంథమును రచియించెను. ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; సీతారామాంజనేయ సంవాదమును రచియించిన లింగమూర్తిపుత్రుఁడును శిష్యుఁడును; ఈతని తల్లి లింగాంబ. కవి తనతండ్రినిగూర్చియు దన్నుఁగూర్చియు నిట్లు చెప్పుకొనియున్నాఁడు—

సీ. ఆత్మభూతుఁడుగాని యాత్మభూతుఁడుగాఁడు
నిగమాగమాంతార్థ నియతిదోఁప
బురుషోత్తముఁడుగాని పురుషోత్తముఁడుకాఁడు
సజ్జనానుగ్రహాసరణి మెఱయ
మృత్యుంజయుఁడుగాని మృత్యుంజయుఁడుకాఁడు
సర్వప్రపంచోపశమన మమర
నమృతసిద్ధుఁడుగాని యమృతసిద్ధుఁడుగాఁడు
ఘనరసనిధిసమంథనము దనర
ననుచుఁ దా వ్యతిరేకాన్వయప్రసిద్ధి
నలరి ప్రత్యక్షముగ నజుఁ డచ్యుతుండు
నభవుఁడమరేంద్రుఁడై యొప్పెనవనితఁడె
లింగమూర్తియునాగురులింగమూర్తి.

గీ. అమ్మహాలింగమూర్తి లింగాంబికాకు
మారుఁడఁ దదీయసేవానుమతుఁడఁ బరశు
రామపంతులకులకంజరాజికర్య
మాకృతినిబొల్చు రామనామకుఁడ నేను.

ఇతఁడు నూఱుసంవత్సరములక్రిందటివాఁ డయినట్టు తోఁచుచున్నది. ఇతఁడు రచియించినది వేదాంతగ్రంథ మయినను కవిత్వము

106. వేగినాటి కొండనార్యుఁడు

ఈకవి వివేకసింధువనెడి ఐదాశ్వాసముల వేదాంతగ్రంథమును రచించెను. ఇతఁడు వేగినాటి నియోగిబ్రాహ్మణుఁడు; శ్రీవత్సగోత్రుఁడు. మొట్టమొదట నీవివేక సింధువును నాంధ్రవచనకావ్యమునుగా రచియించిన ముకుందయోగిని కవి యీక్రింది పద్యమున స్తుతించియున్నాఁడు—

మ. వినుతింపన్ భవరోగవైద్య మగునీవేదాంత శాస్త్రంబు పా
వనమైయుండఁ బ్రవీణతన్ వచనకావ్యం బొప్పఁగాఁ జేసి స
జ్జనులం బ్రోచినపుణ్యమూర్తి విమలస్వాంతుండు విజ్ఞానశా
సనుఁడైనట్టిముకుందమౌనికి నమస్కారంబు గావించెదన్.

ఈకవియు నూఱేండ్ల క్రిందట నుండియుండవచ్చును. శుకచరిత్రమునందు వలెనే యీవివేకసింధువునందును వ్యాకరణ విరుద్ధములైన ప్రయోగములు కొన్ని కనఁబడుచున్నను మొత్తముమీఁద కవిత్వము మృదువయి శ్రావ్యముగానున్నది. కవనరీతి తేటపడుటకయి వివేకసింధువునుండి కొన్నిపద్యము లిం దుదాహరింపఁ బడుచున్నవి—

చ. కడువడిఁ గర్మమార్గ మనుకాఱడవిం బడి విభ్రమించుచున్
జడమతి నింద్రియార్థఫలసంచితతిక్తకషాయసారముల్
దడఁబడఁ గ్రోలి దుర్వ్యసనదాహమునన్ వెత నొంది సుక్కి మీ
యడుగులు గాంచితిన్ ననుఁ గృపామృతమానఁగనిచ్చి ప్రోవవే. ఆ ౧

మ. వడిగాఁదీసి ధనుర్ధరుండు విడువం బాణంబు నెందాఁక న
వ్వడిగల్గున్ శర మంతదాఁక నడుచున్ వమ్మైన యచ్చోటనే
పడుఁ బ్రారబ్ధపుఁగర్మవేగమున నాపర్యంతమున్ దేహముల్
పడ వావేగము తూలినం బడును జూ భగ్నంబులై మేదినిన్. ఆ-౨

మ. సమతన్ మేఘుఁడు వారిధారలు మహిన్ సంప్రీతి వర్షింపఁ బ
ల్లములై యుండినచోట్ల నీరు నిలుచున్ రక్షింపఁగాబండపై

దుముకున్నిగము నిల్వ దల్లఁగుట నెందుం బాత్ర మూహించి యు
త్తమునందుం దగ బ్రహ్మవిద్య నిలుపన్ ధర్మంబు చింతింపఁగన్. ఆ-౩.
మ. తనువుల్ స్వప్నమనోరథంబులక్రియన్ దండోపతంపంబులై
యనయంబుం బొడచూపుఁ బోవు నివి కర్మాధీనసంప్రాప్తముల్
ఎనయ న్నాకును వీనితోఁ దగులు లే దెల్లప్పుడున్ నే ఘనుం
డను నిత్యుండ నిరామయుండ విమలుండన్ సాక్షిచైతన్యుఁడన్. ఆ-౪
ఉ. అప్పుడు పుట్టినట్టిశిశువందును జవ్వనియై మిటారియై
యొప్పులకుప్పయైన వికచోత్పలలోచనయందు వార్ధకం
బుప్పతిలంగ నున్నముదియుగ్మలియందును నిర్వికారుఁడై
చెప్పెడి దేమి యెందు సమచిత్తుఁడు షండుఁ డెంచిచూడఁగన్. ఆ-౫

107. వాసుదేవయోగి

ఈ కవి జీవప్రబోధమనెడు నాలుగాశ్వాసముల వేదాంతగ్రంథమును రచియించెను. యోగశాస్త్రములనుపేర రచియింపఁబడిన వేదాంతిగ్రంథములలో ననేకములకంటె నిందలి కవిత్వము సలక్షణమయి హృదయంగమముగా నున్నది. కవి యేకాలపువాఁడో తెలియదుగాని నూఱు సంవత్సరముల పయివాఁ డని తోఁచుచున్నది. జీవప్రబోధములోని రెండు పద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. అనవిని జీవుఁ డిట్లను బ్రయత్నముఁ బ్రాప్యపదంబు లేక తా
ననయము ఖండమై జగములందును గారణకార్యరూపతం
బెనఁగొనియున్న యాత్మ కొకపిండపదంబుఁ బ్రయత్నసాధన
బును వనఁ గల్గునే యనుచు బుద్ధికిఁ దోఁచెడి వీనిఁ జెప్పవే. ఆ-౩.
ఉ. అంధతమఃప్రకృత్యనుగతాత్ముల శుద్ధశరీరశుద్ధిచే
బంధవిముక్తి గోరి కరిభంగిని నీట మునుంగ దేహాదు
ర్గంధము వాయుఁగాక భవకర్మనిబంధవిముక్తి కల్గునే
బంధురరాగదోషములఁ బాసిన శుద్ధతఁ గాక జీవుఁడా. ఆ-౪.

108. కానాల నరసింహకవి

ఈ కవి హరివంశములోని యాశ్చర్యపర్వమునందలి శేషధర్మముల నెనిమిదాశ్వాసముల పద్యకావ్యమునుగా రచియించెను. ఈతఁడు నందవరీక నియోగిబ్రాహ్మణుఁడు; వాసిష్ఠగోత్రుఁడు; వేంకటేశయామాత్య పుత్రుఁడు; ఈతని వాసస్థలము తటికొండగ్రామము; ఇతఁడు తన శేషధర్మగ్రంథమును తటికొండ నృసింహస్వామి కంకితము చేసెను. ఈతనికాల మేదియో తెలియరాలేదు. ఇతఁడు తన గ్రంథమునందు—

"గీ. ఆంధ్రవిద్వజ్జనాచార్యు నన్నపార్యు
సుజనగుణమానసోత్పలసోము సోము
సురుచిరాలంకృతిభ్రాజి సోమయాజి
సత్కవిసనాథు శ్రీనాథు సన్నుతింతు."

అని యాంధ్రకవులను వర్ణించుచోఁ దమనందవరీకులలో సుప్రసిద్ధులైన పెద్దనాదికవులనుసహితము వర్ణించియుండలేదు. ఇంతమాత్రముచేత నితఁడు పెద్దనాదికవులకంటెఁ బూర్వుఁడనికాని వారితోడి సమకాలికుఁడనికాని చెప్ప వలనుపడదు. ఇతఁ డించుమించుగా నూఱు నూటయేఁబది సంవత్సరములక్రిందట నుండి యుండవచ్చును. అక్కడక్కడఁ గొన్ని విలక్షణములైన ప్రయోగము లున్నను కవిత్వము మొత్తముమీఁద మృదువయి నిరర్గళధార కలదిగా నున్నది. ఈతని శేషధర్మములలోనుండి కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను.

చ. పటుతర మేఘమండలవిభాసితసౌధచయోపరిస్థితో
త్కటవరహేమకుంభసముదాయధగద్ధగితోరుకాంతివి
స్ఫుటచపలాకృతి న్మెఱయుఁజూడఁగ వచ్చినవారలెల్ల ని
చ్చటఁ గలచంచలల్ కడునచంచల లంచుభ్రమింతురెంతయున్. ఆ-౧

చ. ఘనవిషజంతుపూరిత మగాధము కూపము దీనిఁజూడు నీ
వొనరఁగఁ గూఁతు నియ్యవు తిలోదక మియ్యవు గాన దాన మా

తనువులు జీర్ణతం బౌరసె దారుణరూప సమేతకూపమం
దును బడియున్నవార మతిదుఃఖసమాకులతన్ మహాత్మకా. ఆ-౨

శా. దారాపత్యయుతుం డకించనుఁడు విద్వాంసుండు వేదాంతమా
ర్గారూఢుండును వృత్తిహీనుఁడును నిత్యానందుఁడున్ శ్రోత్రియుం
డై రాజిల్లిన బ్రాహ్మణోత్తమున కత్యానందులై జీవనం
బీరే దాతలు పొందరే సుగతు లుర్వీశా ధరామండలిన్. ఆ-3

ఉ. నీసము లెందఱో శమనునిం గనఁబోయిరి నీకుఁజూవురా
దాసకుఁ బుట్టినిల్లయి మహాకలుషంబు లొనర్చి సభ్యులన్
మోసముచేసి నేఁ డిటులుమూల్గినఁ బోవునె తత్ఫలంబు నిన్
బాసినఁ గల్గు మా కఖిలభాగ్యము లేగుము కాలుప్రోలికిన్. ఆ-౪

మ. అనుచున్ దూతి మహీవరా సుతకళత్రార్థంబుగాఁ బాపచిం
తన లర్థార్జనఁజేసి వారి నిరవందం బ్రోతు రంతంబునన్
దనవెంటం జనుదెంతురే కడపటన్ దా నొక్కఁడే పోవుటల్
గనియున్ మోహాలతానిబద్ధు లగుచున్ గానంగలే రింతయున్ ఆ-౫

మ. సతియుం దానును బుత్రపౌత్రయుతుఁడై సంప్రాప్తసర్వేష్టుఁడై
యతిసంతోషముమీఱఁగా మెలఁగి దేహాంతంబునన్ లోకపా
లతతుల్ పూజ లొనర్ప సర్వసుఖసంప్రాప్తుండునై క్రమ్మఱన్
క్షితిపైఁ బుట్టెను జక్రవర్తి యగుచున్ జైత్రోముదంబొప్పఁగన్. ఆ-౬

చ. పొలుపగు కాంచనంబుఁ దిలపుష్పము నచ్చెలి నాసికోపమం
బలరఁగవచ్చి దానిసమ మాటకుఁజాలక యూర్ధ్వదృష్టిఁ గొ
మ్మలఁ దలక్రిందుగాఁ దపము మానుగఁజేసి ఫలించువేళ మే
నులు విడిచెన్ నలంగఁడె ఘనుండయినన్ బలవద్విరోధియై. ఆ-౭

ఉ. నీవును దీపదానములు నెమ్మిగఁ జేయుము దాన మోక్షమున్
శ్రీవరుఁ డిచ్చుజ్ఞానమును జేకుఱు జ్ఞానముచేత మోక్షమున్
భూవర నీకుఁ గల్గు హరిపూజ లొనర్పుము కార్తికంబునం
దీవిలేతిహాసము మహిన్ వినువారికిఁ గల్గుసౌఖ్యముల్. ఆ ౮

109. రామనామాత్యుఁడు

ఈకవి గయోపాఖ్యాన మనెడి రెండాశ్వాసముల ప్రబంధమును మును రచియించెను. ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; తిమ్మనమంత్రి పుత్రుఁడు. గయోపాఖ్యానమునకు కృష్ణార్జున సంవాదమని నామాంతరము గలదు. ఈతఁడు నూఱుసంవత్సరముల క్రిందటివాఁడయి యుండ వచ్చును. ఇతఁడు తనగ్రంథమును శ్రీమదహోబిల నృసింహస్వామి కంకితము చేసెను. ఈతని గ్రంథమునందు లక్షణవిరుద్ధములైన ప్రయోగములనేకము లున్నను, మొత్తముమీఁద కవిత్వము సరసముగానేయున్నది. గయోపాఖ్యానములోని పద్యములు రెండిందు క్రిందఁ జేర్పబడుచున్నవి.

ఉ. వారిజనాభ నీవనుప నాసవనందనుఁ డున్న చోటికిన్
జేరి హిమాద్రిధైర్యునకుఁ జెప్పితి బుద్ధులు పెక్కురీతులన్
భూరిదయాబ్ధి యాఘనునిబుద్ధికి నేమని యెంచిచూప నీ
ధారుణిఁ బాండవేయులకు దాపునుదండయు నీవెకా హరీ. ఆ. ౧.

ఉ. ఏమని చెప్పవచ్చు నళి యీబలపార్థుల బాహువీర్యముల్?
రామునిసాటి వత్తురు శరాసనవిద్యను వీరిధైర్యముల్
హేమమహీధరంబునకు నెక్కువ వీరలతోడ మార్కొనన్
సోమధరుండు వాసవుఁడు సూర్యకులోద్భవుఁడైన నోర్తురే. ఆ. ౨.

---

110. పోచన

ఈకవి చంద్రాభ్యుదయ మను ప్రబంధమును. రచియించెను. ఇతఁడు వైదిక బ్రాహ్మణుఁడు. ఈతనితండ్రి నృసింహసోమయాజి. ఈ చంద్రాభ్యుదయము అమ్మనమంత్రి కుమారుఁడగు చిన్నయామాత్యున కంకితము చేయఁబడినది. ఈకవికాల మేదో తెలియరాలేదు. ఇతఁడు నూఱుసంవత్సరములకంటెఁ బూర్వమునందుండినట్లు తోఁచుచున్నది. ఈప్రబంధము శబ్దాలంకారములతోనిండి శ్రావ్యముగా నున్నది. చంద్రా

భ్యుదయములోని పద్యములు రెండిందుఁ గ్రిందఁ బొందుపఱుపఁబడు చున్నవి—

చ. తిమిరపుజవ్వనంబున నతీతసతీతనువృత్త మైనచి
త్రముతమి పౌరవారవనితా జనతాజనితానురాగయో
గమున మునింగి దర్పకవికారము ఘోరముగా ఘటింపన
క్కొమరుమిటారిబారిపడి కుంతితనృత్తిఁ గ్రమక్రమంబునన్. ఆ. ౧.

చ. అన విని గుండె జల్లుమన నవ్వనితామణి యమ్మచెల్ల యీ
యన మదనాతురత్వమని యాత్మఁదలంచి తలంచి సాధ్వసం
బును వెఱఁగుం దడంబడఁగఁ బొంపిరి నిట్లను భర్తతోడ నీ
య్యనువునమిమ్ముఁబ్రోవఁగమహాత్మయొరుల్ మనకెవ్వరియ్యెడన్ ఆ. ౨

111. పెనుపల్లె బాపనామాత్యుఁడు

ఈకవి సీతావిజయమను నేకాశ్వాసప్రబంధమును రచించెను. ఇతఁడు నియోగి బ్రాహ్మణుఁడు; కోనయామాత్యపుత్రుఁడు. ఈతని కవిత్వమునందు లక్షణవిరుద్ధములైన ప్రయోగము లక్కడక్కడఁ గానఁబడుచున్నవి. కవనరీతి తెలియుటకయి సీతావిజయమునుండి రెండు పద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

ఉ. పాల శిలాసనుండు శివపూజ యొనర్చుచు నుండి యంతలో
వాలమువార్త కర్ణములయందు వినంబడ నుల్కియుగ్రుఁడై
చాలును దేవపూజయని చారులఁ గన్గొని యేమి మత్పురీ
జాలఁగ సందడు ల్గలుగుచందము తోఁచెను జెప్పుఁ డంతయున్.

ఉ. భూరిరయంబునం దొడరి భూసుత కన్నుల నెఱ్ఱచేసి యో
రోరిశతాస్య త్రుంగి తని యొక్కటి బాణసహస్రకోటి తా
నారజనీచరేంద్రు తనువందును గ్రుచ్చిన నెత్తు రొల్కఁగాఁ
బోరుచు వాఁడు నొప్పెసఁగెఁ బూచిన మోదుగుచెట్టుకైవడిన్.

112. చదువుల సోమలింగయ్య

ఈ కవి మదనసాయక విలాసమనెడి యైదాశ్వాసముల శృంగార ప్రబంధమును రచియించి శ్రీశైలమల్లికార్జునున కంకితముచేసెను. ఇతఁడు శైవబ్రాహ్మణుఁడు; గారుత్మతద్యుతిగోత్రుఁడు. వేంకటాచలమయారాధ్యునకును అన్నపూర్ణమకును పుత్రుఁడు. ఇతఁడేకాలపువాఁడో సరిగాఁ దెలియరాదు. ఇతఁ డించుమించుగా నూఱుసంవత్సరములక్రిందట నుండియుండును. ఈతని కవిత్వము మృదుమధురపాకమున వెలయుచున్నను నిర్దుష్టమైనది కాదు. ఒక్కొక్క యాశ్వాసమునుండియొక్కొక్కటిచొప్పున నిందుక్రింద నుదాహరింపఁబడిన పద్యములనుబట్టి కవియొక్క కవిత్వరీతి కొంతవఱకు తేటపడవచ్చును—

చ. చని శశికాంత సంఘటితచారుసువర్ణవికారసౌధమం
దును నెనలేని గద్దెపయి దోరముగాఁ గొలువుండి సాధుస
జ్జనపరివారయుక్తుఁడయి సత్యముఁ దప్పక మూఁడులోకముల్
తనదుయశంబు గప్పఁగను దద్దయు రాజ్యము చేయుచుండఁగన్. ఆ-౧

చ. అని దరిఁజేరి బాలకుని నక్కునఁ జేరిచి చెక్కుదోయి ము
ద్దొనరిచి చుంచు దువ్వుచు మృదూక్తులు పల్కి కడింద్రపేమ నె
మ్మనమున నల్లిబిల్లికల మాటికి నల్లుకొనంగ నక్కుమా
రునిముఖచంద్రదర్శనవిలోచనకై రవుఁ డొచు నయ్యెడన్. ఆ. ౨.

చ. తెలివాలురుమంజిమున్తెములు తీరుగనిల్చిన క్రేవఁ జక్కనౌ
బలువగు కెంపుగుంపుల శుభస్థితకాంతులు చల్లుమేలుక
మ్మలకు నివాళులిచ్చు కనుమచ్చికలున్ జెలువొందఁ దాని పు
వ్వులసర మొక్కకేల నిడి యొప్పుగ నప్పురి కేఁగుచుండఁగన్. ఆ-3.

ఉ. ఉల్లము చల్లగాఁ గనినయొప్పులకుప్పపయిన్ సుమాస్త్రముల్
పెల్లుగ నేసినట్టికడుపెద్దవు నీ కొకలక్ష్యమా నవో

త్ఫుల్లసరోజలోచనలపాంక మడంచుట మన్మథా ధరన్
తల్లికి ముక్కుఁగోసి పినతల్లికిఁ గమ్మ లొసంగనేర్తురే. ఆ-౮.

ఉ. మారుపిగేరు వీని సుకుమారశరీరము నవ్యచంద్రికా
సారముతీరు హాసము సుసారసనారము లౌర కన్నులిం
పారెడు గండుతుమ్మెదలబారులనేల్కురు లౌర వీనిసిం
గారము నీరజాసనునికైన మదిం దలఁపంగ శక్యమే. ఆ-౧౧.

---

113. శ్రీధరమల్లె వేంకటస్వామి

ఇతఁడు బ్రహ్మోత్తరఖండము నయిదాశ్వాసముల పద్యకావ్యమునుగాఁ దెనిఁగించెను. ఇతఁడు బడగలనాటి కన్నడవంశజుఁడు; ఆశ్వలాయనసూత్రుఁడు; భారద్వాజగోత్రుఁడు; అయ్యనార్యతనూజుఁడు. కవి యీ గ్రంథమును జ్యోతిరామనాదుల ప్రేరణముచే రచియించి, సిద్ధవటమునకు సమీపముననున్న యంబాపురమందలి పార్థివేశ్వరస్వామి కంకితము చేసెను. ప్రేరకులయిన రామనయు లక్ష్మీనారాయణుఁడును జెంగల్వరాయఁడును దన్నుఁగూర్చి పలికినట్లుగాఁ గవి యీ క్రిందిపద్యములలోఁ జెప్పుకొన్నాఁడు—

శా. శ్రీమద్వేంకటరామనామునిఁ గవిశ్రేష్ఠున్ రమావల్లభ
ప్రేమాపాంగవిశేషలబ్ధకవితాభివ్యక్తసూక్త్యన్వితుం
గామారిస్తవభక్తియుక్తు విలసద్గాంభీర్యధైర్యాఢ్యు న
న్నామోదంబునఁ జూచి పల్కిరి సముద్యత్కౌతుకం బొప్పఁగన్.

*　　*　　*　　*　　*

క. ఖండేందుధరప్రియ మా। ఖండలభాగ్యప్రదంబు కల్మషలతికా
ఖండన మగుబ్రహ్మోత్తర।ఖండమురచియింపుపద్యకావ్యముగాఁగన్.

ఈ కవి యీ బ్రహ్మోత్తరఖండమును రచియించి యెనుబదిసంవత్సరము లయినట్లు గ్రంథాంతమునందలి యీక్రింది పద్యమునుబట్టి తెలియ వచ్చుచున్నది—

సీ. శరవర్షగణనంబు శైలరామమునీందుపరిమితంబై ధాత్రిఁబరఁగుచుండు
యువనామసంవత్సరోపేత కార్తికమాసరాజిత పౌర్ణమాసియందు
ధన్యులు విష్ణువర్ధనసగోత్రులుజ్యోతిసుబ్బన్నపుత్రులు సుగుణమణులు
రామన్నలక్ష్మినారాయణచెంగల్వరాయఁడు ననముప్ప రమలయశులు
చిత్తమున భక్తి వెలయ బ్రహ్మోత్తరాఖ్య
ఖండ మాంధ్రప్రబంధంబుగా ఘటించి
యెలమి సంబాపురపుఁ బార్థివేశ్వరునకు
భాసురముగ సమర్పణఁ జేసి రపుడు.

పయిపద్యమునుబట్టి శాలివాహనశకము ౧౭౩౭వ సంవత్సరము నందనఁగా క్రీస్తుశకము ౧౮౧౫వ సంవత్సరమునం దీగ్రంథము రచియింపఁ బడినట్లు స్పష్టముగాఁ దెలియవచ్చుచున్నది. ఈగ్రంథమునం దక్కడ క్కడఁ గొన్నివ్యాకరణదోషము లున్నను మొత్తముమీఁదఁ బుస్తకము హృదయరంజకముగానేయున్నది. బ్రహ్మోత్తర ఖండములోని పద్యములు కొన్ని యిం దుదాహరింపఁబడుచున్నవి—

ఉ. ఓమునిసార్వభౌమ మహిమోజ్జ్వల మీ రిట కేఁగుదెంచుటన్
నామది సంతసం బొదవె నాదుగృహంబు పవిత్ర మయ్యె మ
త్కామితము ల్ఫలించెఁ గడుధన్యుఁడ మాన్యుఁడ నైతి నంచు నా
భూమివిభుండు పల్కుచును బూజలొనర్చె మహాముదంబునన్ ఆ-౧

శా. ఆరాజేంద్రుఁడు కంఠసూత్రరహితన్ వ్యక్తాంజనాపాంగి శృం
గారప్రాభవహీనగాత్రి గళితగ్రైవేయహారాదికన్
దూరీభూతశుభాంగరాగతిలకన్ దుర్వారశోకార్దితన్
సారాచారపరాయణం గనియె నాసాధ్వి న్విచిత్రంబుగన్. ఆ. ౩.

మ. రణదుద్యన్మణిదీప్యమానకనకగ్రైవేయకోటీరకం
కణహారాంగదనూపురాదుల నలంకారంబు గావించిరా
క్షణమాత్రంబునఁ బాయఁద్రోచి కడువేడ్కన్ లక్ష్మిలు రుద్రాక్షభూ
షణము ల్దాల్తురు వారలిర్వురు మహోత్సాహంబుదీపింపఁగన్. ఆ-౪

114. ఓరుగంటి సోమశేఖరకవి

ఈకవి రామకృష్ణార్జున రూపనారాయణీయమను నాలుగాశ్వాసములత్ర్యర్థి కావ్యమును రచియించి శ్రీపూసపాటి నారాయణరాజుగారి కంకితము చేసెను. పుస్తకముయొక్క పేరుచేతనే యిందు రాఘవయాదవపాండవార్థము లిమిడియున్నవని తెల్లమగుచున్నది. ఈకవి వైదిక బ్రాహ్మణుఁడు; కౌండిన్యసగోత్ర సంభూతుఁడు. ఇతఁడు సంస్కృతాంధ్రములయందు చక్కని వైదుష్యము కలవాఁడయి కవితారచనయం దత్యంత సామర్థ్యము గలవాఁడుగా నుండెను. ఇతఁడు నూఱుసంవత్సరముల లోపలివాఁడు. ఈతని త్ర్యర్థికావ్యములోనివి కొన్ని పద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

శా. సంభూతాతివిభూతి దర్శనకళాసంపన్నుఁ డారాజు స
ద్గాంభీర్యాంబుధి యెలె సర్వధరణిన్ గాంగేయచాపోరుసం
రంభప్రాభిసహాయుఁడై విమరసారన్యాయమార్గంబుతో
శుంభత్కీర్తి మహోత్పలప్రియకులస్ఫూర్తుల్ విజృంభింపఁగన్. ఆ-౧

ఉ. సంతస మొప్పఁ దోఁచెను వసంతము మంజులకోకిలస్వనా
క్రాంతము కోరక ప్రకర కాంతము బంభరగానశోభితా
శాంతము సర్వమంగళనిశాంతము మోచితమానమానినీ
స్వాంతము ధూతసత్పథికశాంతము ఫుల్లలతాంతతాంతమై. ఆ. ౨.

చ. సుజనకృత స్తవా జనకసూక్తి యలంఘ్య మదెన్ని చూడఁదా
నిజము సమక్షమందుఁ దగనిన్ను సనూర్థపుగాఁ దలంచి తత్
ధ్వజము నుతింపఁ బంచుపని వారకచేయ సుధర్మసంస్థితిన్
గుజనులు స్రుక్క శ్రీహరిని గొల్చినవాఁడనయంబు నెమ్మదిన్. ఆ. 3.

శా. కళ్యాణీభవదర్పితో గ్రవరసత్కారుణ్యాతతిన్ సద్విపత్
కళ్యాణీధరవిన్నువన్యవసతీకాండప్రభూల్లంఘనా
కళ్యాణాతిశయంబు నాకు నిచటన్ గల్గెన్ని రాఘూటమై
కళ్యాణాంబరకాంతుఁజేయుమ్యకృపన్ గాంభీర్యధీమోక్కదన్. ఆ. ౪.

---

115. ముడుంబి వేంకటాచార్యుఁడు

ఈకవి రసప్రదీపికయనెడు మూడాశ్వాసముల వైద్యగ్రంథమును జేసెను. ఇతఁడు శ్రీవైష్ణవుఁడు; శ్రీవత్సగోత్రుఁడు; వేదాంతాచార్యపుత్రుఁడు. ఇతఁడు గోదావరీమండలములో నూఱుసంవత్సరములకు లోపలనుండినవాఁడు. కవిత్వమునందుఁ గొన్ని స్ఖాలిత్యములు గలవు. రసప్రదీపికలోని రెండుమూఁడుపద్యముల నిందుదాహరించుచున్నాను—

ఉ. పారదగంధకంబు లొకభాగము నాలుగుభాగముల్ నవా
సారము కుప్పెఁబెట్టి పదిజాములు వండినఁ గెంపుసొంపుతో
ధారుణిఁ బుట్టు సిందురము దారత నడ్డిగమెత్తు నిచ్చినన్
బోరన రోగపుంజములఁ బోవహరించు నమోఘవీర్యమై. ఆ ౧.

చ. ఘృతమునఁ గొండపిప్పలి మిరెంబులతోడుత నభ్రకంపు సం
తతమును జిన్నమెత్తు గొన దారుణమౌ కఫవాతపిత్తసం
యుతగ్రహణీక్షయంబుల వియుక్తప్రమేహగుదాంకురంబులన్
గతముగఁజేసి దీపనము గల్గఁగఁజేయు నమోఘవీర్యమై. ఆ-౨.

ఉ. మంచి సువర్ణభస్మము క్రమంబునఁ గొన్నను రాజయక్ష్మముల్
సంచితకర్మజంబులగు సర్వరుజంబుల భూతవేధలన్
ద్రుంచి యమోఘవీర్యమయి దోర్బలముల్ ఘనకాంతి తేజము
త్యంచితబుద్ధిమార్గము చిరాయు వొసంగును మాసచంద్రమా. ఆ-3.

---

116. అక్కెనపల్లి నృసింహకవి

ఈ కవి యాదిలక్ష్మీవిలాసము, వల్లభాంబాపరిణయము, ఓఘవతీపరిణయము, అను మూడు ప్రబంధములను రచియించెను. వీనిలో నోఘవతీపరిణయము శ్రీగోడే జగ్గారాయనింగారి పుత్రులగు శ్రీసూర్యప్రకాశ రాయనింగారి కంకితముచేయఁబడి తత్సోదరపుత్రులగు శ్రీమహారాజా గోడే నారాయణగజపతిరాయనింగారిచే ముద్రింపింపఁబడినది. ఈగ్రంథము శాలివాహనశకము ౧౭౩౯ వ సంవత్సరమునందు రచింపఁబడినట్లు గ్రంథాంతమందలి యీ సీసపద్యమువలనఁ దెలియవచ్చుచున్నది—

సీ. శాలివాహనశకసంవత్సరంబు లజాగ్నిభూధరతుషారాంశులైన
యీశ్వరాబ్దంబున నెసఁగు వైశాఖమాసంబున శుక్లపక్షమున మూర్తి
శశిసంఖ్య భౌమవాసరమున శుభవేళ నక్కెనేపలి నృసింహకవి యోఘ
వతిపెండ్లికథ సమున్నతిమీఱ జెడి గోడెజగ్గారాయసూర్యప్రకాశరాయ
మణికిరాజ్యాయురారోగ్యమహితపుత్ర
పౌత్రనికరాభివృద్ధిగా భవ్యబుద్ధిఁ
గృతి యొసంగెను దద్యశం బతిశయిల్లి
జగతి నాచంద్రతారార్కముగఁ జెలంగ.

ఇతఁడు కృష్ణామండలములోని యెల్లముంద నివాసుఁ డయినను తన యాదిలక్ష్మీవిలాసమును గోదావరీమండలములోని యంతర్వేది

నృసింహస్వామి కంకితము చేసెను. ఆదిలక్ష్మీవిలాసము నాలుగాశ్వాసములుగల ప్రౌఢకావ్యము. వల్లభాంబాపరిణయ మను విఘ్నేశ్వరుని పెండ్లికథ మూడాశ్వాసముల ప్రబంధము. ఇది పులిపాక సీతయామాత్యపుత్రుఁ డయిన రామమంత్రి కంకితము చేయఁబడినది. ఈ కవి నియోగి బ్రాహ్మణుఁడు; కౌండిన్యగోత్రుఁడు; జోగయామాత్య పుత్రుఁడు. ఈకవి నూఱుసంవత్సరములకు లోపలివాఁడు. ఈతని కవిత్వము రసవంతముగా నున్నది. ఈతని పుస్తకములోని యీ క్రింది పద్యములవలన నీతని కవితాధోరణిని గొంత తెలిసికొనవచ్చును—

ఆదిలక్ష్మీవిలాసము.

ఉ. మాయలు నింద్రజాలములు మా కవి క్రొత్తలుగావు మామనో
నాయక యిప్పు డీవు రతినాయకసాయకభిన్నకాయనై
పాయని మోహమందుననుఁ బన్నుగఁ గౌఁగిటఁగూర్చి యొయ్యనన్
శ్రీయుతసౌఖ్యవైఖరులుచేరఁ దలంపులుదీఱఁ గూడుమా. ఆ-౧.

ఉ. ఎక్కడిగొల్లవాఁడ విది యెక్కడిజాణతనంబు దొంగవౌ
టెక్కడిపౌరుషంబు మది నింత తలంపక ప్రాలుమాలినన్
దక్కెనె నీకుఁ గోక లవి తక్కకయిమ్మిఁకఁ గామవలివే
యక్కలతోడ నీసరసి నాడఁగఁ జీరలు దొంగిలింతువే. ఆ-౨.

ఉ. వారిజనేత్ర మీచరణవారిజముల్ హృదయాంబుజంబునన్
గూరిమినిల్పి యెల్లపుడుఁ గొల్చురమాసతియంచు రుక్మిముం
దారయలేక చైద్యునకు నంగన నిచ్చెదనన్నమాట బ
ల్నారసమట్ల కర్ణమున నాఁట ననుం గృపఁ గాంచి యిట్లనెన్. ఆ-౪.

వల్లభాంబాపరిణయము.

చ. అరయఁగ సిద్ధసాధ్యగరుడామరకిన్నరనాగయక్షకిం
పురుషులయిండ్లలో నెలమిఁ బుట్టెదఁ జేనెడుపొట్ట మీ గణే

శ్వరునకుఁ బెద్ద దేల యనిశంబును బొట్టిగ బ్రహ్మచారియై
పరఁగెడిమేటికిన్ గతెనభావులతో నిల వియ్య మేటికిన్. ఆ-౨.

చ. ముద ముదవించు ముచ్చటల ముంచును గంధముఁ బెంచుసౌఖ్యము
ల్గనరఁగ నించు నించువిలుగొంచుఁ జరించువజీరుశాస్త్రసం
పద గడియించు నిత్యురసపద్ధతుల న్నిరసించు మించు ని
మ్మదిరయటంచు నెంచుచు నుమానుగ గ్రావ్విరిమించు బోండ్లాగిన్. ఆ-౨

ఓఘవతీపరిణయము.

ఉ. మేలగుమేలు గూర్చుటకు మీ రరుదెంచితి రంటివౌబళీ
చాలు భవన్మనోరథము చక్కఁ లభించుఫలం బటంచు నా
లోలవిశాలనేత్ర మొదలోఁ గలతియ్యనివిల్తు నొయ్యనన్
మేలుకొనంగఁజేసి యెలమిం జని సంయమిరాజు సయ్యనన్. ఆ. ౧.

ఉ. అంతట నేర్చె విద్య లిసుమంత కొఱంత యలంతలేక భూ
కాంతునిముద్దుపట్టి యుజుకాంతయె యంచుసమ స్తసజ్జనుల్
వింతగ సంతసించి తను వేయివిధంబుల సన్నుతింప న
త్యంతకళావినోదమహిమాతిశయంబు శయంబుఁ జేరఁగాన్. ఆ. ౪.

---

117. పైఁడిపాటి వేంకటనృసింహకవి

ఈకవి నృసింహవిలాస మను మూడాశ్వాసముల గ్రంథమును రచియించెను. ఈతఁడు డాకువేలనియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; శరమర్షణగోత్రుఁడు; లక్ష్మీపతికిని వేంకమాంబకును బుత్రుఁడు. ఈతఁడు నెల్లూరిమండలములోని పైఁడిపాటి గ్రామనివాసుఁ డయి గ్రామచతుష్టయమునందు స్థావరజీవనము కలవాఁ డయినట్లు నృసింహవిలాసములోని యీక్రిందివచనమువలనఁ దెలియవచ్చుచున్నది—

సీ. క్షితితలంబున నొప్పు కృష్ణాపినాకినీదివ్యనదీమధ్యదేశభూమిఁ
గడఁ బూర్వవార్థికిఁ బడమట యోజనదూరమై తగుఁ గందుకూరు
మఱియు
నదియె సీమానామమైయొప్పు నాకందుకూరికిఁ దనరు వాయవ్యదిశను
బాలేట దానికిఁ బౌలస్త్యదిశఁ బైఁడిపా డొప్పు దానికిఁ బశ్చిమమున
నెగడుఁ జతుకుపాడు సీబ్రూతి వేంపాడుఁ
జెలఁగు గాద్బమూల నిలవరయన
నమరుపురచతుష్టయం బిస తృణకాష్ఠ
జలసమృద్ధి సిరుల నలరుచుండు.
గీ. గ్రహణవేళ గోపరాజు రామన గోల
కొండప్రభువుచేతఁ గొనినదాన
మహిమ దుష్టమతుల మడియించి స్థావర
జీవనములు ద్విజులఁ జేర్చె మున్ను
వ. తదీయానుగ్రహాలబ్ధం బైనయేతద్గ్రామచతుష్టయ స్థావరజీవనజీవితు
లయిన మదీయవంశజులు &c.

ఈకవియొక్క కాలమేదియో కానరాదుగాని యితఁ డాధునికుఁ డయినట్టు తెలియవచ్చుచున్నది. నృసింహవిలాసములోని రెండుపద్యము లిందుక్రిందఁ బొందుపఱుపఁబడుచున్నవి—

మ. శశి పక్షక్షయ మెన్ని యక్షయకళాసంప్రాప్తికిన్ ధాతృహృ
ద్వశుఁడై దీని సృజించుకాలమున వక్త్రిం బయ్యెనో తా మహ
ర్నిశ మూర్ధ్వస్థితి నుంట రోసి తొలఁగెన్ రేఱేఁ డటంచుం దదం
ఘ్రిశయాక్రాంతనఖాకృతిం బొలిచెనో క్రిందై క్వచిత్తాకరల్. ఆ-౨
శా. పోరా వేఁటకు వేఁటకాండ్రు గహనంబు ల్గ్రిమ్మరన్? గ్రమ్మఱన్
రారా రాతిరి కైన? వా రలసులై రాకున్న నారాత్రికై
యీరీతిం దపియించుబోంట్లు కలరే యెందైనఁ? జంద్రాస్యలా
ఘోరారణ్యముఁ జొచ్చి చూడఁగలరే గోవిందు రేజాములన్. ఆ-3

118. కొటికెలపూడి వేంకటకృష్ణకవి

ఇతఁడు శ్వేతాచలమాహాత్మ్యమను మూఁడాశ్వాసముల గ్రంథమును రచియించి, బొబ్బిలిపురాధీశ్వరుఁ డగు రాయణప్ప రంగరాజున కంకితము జేసెను. ఈకవి వైదికబ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; హారితసగోత్రుఁడు; శివరామపౌత్రుఁడు; వేంకటరామపుత్రుఁడు. కృతిపతి తన్నుఁగూర్చి పలికినట్లు కవి తనగ్రంథములో నిట్లు వ్రాసికొని యున్నాఁడు—

మ. నను శ్రీమజ్జనకాత్మజాధిపపదన్యాసప్రఫుల్లాంతరం
గుని వాణీకరుణాకటాక్షకలనాంకూరత్సుధామాధురీ
వినుతాంచత్కవితాప్రతోషితమహావిద్వత్కవిగ్రామణిన్
ఘనకార్తాంతికతాండిలేయుఁ గడువేడ్కం బిల్చి తా నిట్లనెన్.

చ. హితులు మదన్వవాయజుల కెల్ల బురోహితు లార్యలోకపా
లితకవితాప్రకల్పితదిలీపచరిత్రముఖోజ్జ్వలత్ప్రబం
ధతతులు హారికాగ్రణు లుదారగుణాన్వితచిత్తు లస్మదా
శ్రితులు సమస్తసూరినుతశేముషు లెన్నఁదరంబె మిమ్ములన్.

సీ. ధీరత మేఘసందేశంబు తెనిఁగించి ప్రీతి దిలీపచరిత్ర మనెడు
గొప్పప్రబంధంబుఁ జెప్పి శ్రీరాముల కర్పించితివి మున్ను నేర్పుమీఱఁ
గార్తాంతికులు మెచ్చఁగా శ్రీపతిగ్రంథగతినిమామకజాతకము లిఖించి
మా కొసంగితి విప్పు డేకాగ్రచిత్తత నంచితంబుగఁ దెనింగించుచున్న
కూర్మమాహాత్మ్య మొసఁగుము కూర్మిమాకు
రమ్యచారిత్ర వేంకటరామపుత్ర
కీర్తిదౌదార్య వేంకటకృష్ణమార్య
యనుచు బహుమతిచేయ నాహ్లాదమునను

కృతిపతిపూర్వులు సర్వజ్ఞసింగమనాయని సంతతివారయిన రావు కులజులయినట్టును, వారిలో లింగప రంగనాయఁడు బొబ్బిలిసంస్థానమును స్థాపించినట్లును, కవి యీ క్రింది పద్యములలోఁ జెప్పియున్నాఁడు—

మ. హరిపాదంబునఁ బద్మనాయకులు గంగాస్వీతులై యుద్భవిం
చిరి తత్పాదజులం దతిప్రబలులై శ్రీరావువంశ్యోత్తలం
గిరి తద్రావు కులీనులం దలరె గాంగేయస్తుతౌదార్యశౌ
ర్యరసోపేతుఁడు రాజశేఖరుఁడు సర్వజ్ఞుండు సర్వజ్ఞుఁడై.

క. ఆలలితాన్వయసంభవుఁ। డై లింగపరంగరాయఁ డలరె నిజభుజా
భీలాసిదళితరిపునృప। ఫాలాస్థూలస్ఫురత్కపాలుం డగుచున్.

క. బెబ్బులి రిపునృపు లసియెడు । గిబ్బల కితఁ డంచు జనులుకీర్తింపఁగఁ దా
బొబ్బిలిపట్టణ మేలెడు । నిబ్బరుఁడగు లింగపావనీవరుఁ డెలమిన్.

బొబ్బిలి చినరంగారాయనికి దత్తపుత్రుఁడును గృతిపతియునైన రాయణప్ప రంగారాయనింగారు ౧౭౦౧ వ సంవత్సరము మొదలు ౧౭౩౦ వ సంవత్సరము వఱకును రాజ్యపాలనము చేసినందునఁ దదాస్థాన కవియైన యీ వేంకటకృష్ణకవి యిప్పటికి డెబ్బదిసంవత్సరములకుముందే యీగ్రంథమును రచియించినట్లు చెప్పవచ్చును. ఈయన కవిత్వమునందు లక్షణదోషములు కొన్ని యున్నను కవనము మృదువయి మధురముగా నున్నది. శ్వేతాచలమహాత్మ్యములోని కొన్నిపద్యము లిం దుదాహరింపఁ బడుచున్నవి—

శా. ఆమాటల్విని భూవిభుండు నిజభార్యన్ సద్వ్రతాసక్తిచేఁ
శ్రీమన్మాధవభక్తికిన్ బొగడి ధాత్రిన్ మూఢచిత్తుండనై
భామారత్నముపాటిబుద్ధి గణుతింపం బూనఁగాలేక యీ
సోమార్కం బపకీర్తిపా లయితినంచున్ లోన జింతిల్లుచున్. ఆ.౧.

ఉ. వేరొకభూవరాత్మజుఁడు విద్రుమగుచ్ఛము రత్నకంకణో
దారకరారవిందమునఁ దాల్చె లతాంగి నను న్వరించినన్

భూరిశుభక్రమాకలన బోటిపదాంబుజ మీఁ తెలుంగునం
గూరిమిఁ త్రోడఁ బట్టుకొనఁ గోరెదనంచును డెల్పుకై వడిన్. ఆ-౨.

శా. జంబాలుం డనుమాని కొన్నిదినముల్ జాయాన్వితుండై తను
ర్వ్యం బుణ్యస్థితినుండి గర్భవతినారిం బాసి స్వర్గంబు చే
రంబోవంగ శవీసమీపమున గర్భస్థార్భకుం బెట్టి నె
య్యం బొప్పారఁగఁ జేసెఁ దత్తరుణి దా నగ్నిప్రవేశంబొగిన్. ఆ-3.

---

119. కాకరపర్తి కృష్ణకవి

ఈ కవి శశిరేఖాపరిణయము, ముఖలింగక్షేత్ర మాహాత్మ్యము అను కావ్యములను జేసెను. ఇతఁడు వైదికబ్రాహ్మణుఁడు; తిరుపతి పాత్రకవికిని సీతమాంబకును తనూజుఁడు. ఈపాత్రకవి సత్యభామాకృష్ణ సంవాదాది గ్రంథములను రచియించి శ్రీమహారాజా గోడే నారాయణ గజపతిరాయనింగారి పూర్వుఁడైన జగ్గారాయనింగారివలన నగ్రహారాదులను బడసెనఁట. ఈ కృష్ణకవి విశాఖపట్టణ మండలములోనివాఁడు. ప్రపౌత్రుఁ డిప్పుడు జీవించియుండుటచే నితఁడు నూఱుసంవత్సరముల లోపలివాఁడు. ఈయనకవిత్వము దోషరహితమయి హృదయంగమముగా నున్నది. కవికృతపుస్తకద్వయము నుండియు రెండేసిపద్యముల నుదాహరించుచున్నాను-

ముఖలింగక్షేత్ర మాహాత్మ్యము.

చ. అరుదుగ సర్వలోకనిచయం బతివేలఘనాంధకారభీ
కరవిపదబ్ధిలోఁ బడ నకారణవైరమునన్ వనూజ్జ్వల
త్తరణిముఖప్రచారములు తప్పఁగఁజేయుచు నన్నిదిక్కులన్
బెరిఁగెను వింధ్యభూధరము వీతమహాంబునిధీ తపోనిధీ. ఆ-౧.

ఉ. ఈనగవైభవాతిశయ మెన్నఁగ శక్యమె ధాతకైన జాం
బూనదరౌప్యరత్నముఖభూరిమనోహరవస్తువిస్ఫుర
త్స్థానుచరన్మరుద్దనుజచారణకిన్నరసిద్ధసాధ్యసం
తానసమృద్ధి నొప్పు వితతంబగు మేరునగంబుకైవడిన్. ఆ-3.

శ శి రే ఖా ప రి ణ య ము.

ఉ. మానుల నెట్లు ప్రోచితివొ మానసవీధిఁ దలంపఁ బాపముల్
మానకథా త్రరాష్ట్రుఁ డవమానమునుం దగఁజేయుచుండెఁ గృ
ష్ణానను గావవే యనెడునాపలు కిప్పు డొకించుకైన నీ
వీనుల సోఁకకుండు టిదివింత జనార్దన కంసమర్దనా. ఆ ౧.

చ. అనవిని వానితోడ విజయాత్మజుఁ డిట్లనియెన్ దురాత్మ యీ
వనమును గుత్తగొంటివిర వచ్చినవారి నెఱుంగ కీవు పొ
మ్మనుటకు నీవె యీజగతియందును విక్రమశాలివా మదం
బున నిటుపల్కఁగాఁ దగదు పొమ్మిపుడూరక వైర మేటికిన్. ఆ-౨.

పయిపుస్తకముగాక కోసపల్లి నివాసుఁడగు వేంకటరంగకవి రచితమైన దొకటియు, అప్పప్పయను భట్టరాజ రచితమైన దొకటియు, శశిరేఖాపరిణయ మనుపేర రెండాధునికప్రబంధములు ముద్రింపఁబడి యున్నవి. వానినుండియు రెండేసి పద్యముల నిం దుదాహరించెదను—

వేంకటరంగకృత శశిరేఖాపరిణయము.

శా. శుద్ధాంతంబున భైరవార్చనకళాశుద్ధిన్ జరాసంధుఁ డు
ద్యద్ధైర్యంబున నిత్య మొక్కొనృపుఁ గ్రోధావేశసంభూతస
ద్బుద్ధిం బట్టి కరుక్కరుక్కనఁగఁ దోడ్తో శీర్షముం ద్రుంచి శ
శ్వద్ధాత్రిం బలి యిచ్చుచుండె విలసద్బాహాబలోదగ్రుఁడై. ఆ. ౧.

ఉ. అందఱికంటె ముందుగనె హాయిగ మజ్జనభోజనంబు లం
దందు నొనర్చి సాత్యకిసహాయముగా వసుదేవ దేవకీ

నందను లవ్విధంబు దళనాయకకోటి కెఱుంగఁ జేసి జల్
దుందుభికాహళాదిపటుతూర్యరవంబులు భోరుకల్గఁగన్. ఆ. 3.

అప్పప్పకృత శశిరేఖాపరిణయము.

ఉ. అన్నలు మాటలాడుసమయంబున లేచి సుభద్ర ప్రీతితో
నన్నయశాలి యైనముసలాయుధుఁ గన్గొని నీవుఱాదియున్
నన్నిటఁ బంపుచుండి పరిణామము వేఁడె భవత్కుమారియా
కన్నియ మత్సుతాగ్రణికిఁ గారుణికోత్తమ పెండ్లి చేయవే. ఆ. ౧.

ఉ. పోరున ధార్తరాష్ట్రులను భూరిమదం బడఁగించి పిమ్మటన్
సీరిని మిక్కిలిన్ భయముఁ జెందఁగఁ జేసిననీపరాక్రమం
బౌర నుతింప వ్యాళపతి కైనను శక్యము గాదటంచు నా
మారుతిపుత్రునిం బొగడి మక్కువతోడఁ గిరీటి యంతటన్. ఆ-౪

---

120. కృష్ణయ్య

ఈకవి పార్వతీపరమేశ్వరపరిణయ మనెడి మూడాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఈతఁడు స్మార్తబ్రాహ్మణుఁడు; భారద్వాజ గోత్రుఁడు; చంద్రసూర్యపుత్రుఁడు. ఈతని వాసస్థలము పినాకినీతీరము నందలి కామలాపురము. ఈతఁడుండినకాల మేదియో తెలియరాదుగాని యితఁడేఁబది యఱువదియేండ్లక్రిందట నుండిన ట్లూహింపఁదగియున్నది. ఈతని కవిత్వమునందుఁ గొన్ని వ్యాకరణ దోషములు గలవుగాని మొత్తముమీఁదఁ గవిత్వము శ్రావ్యమయి కొంతవఱకు శ్లాఘ్యముగానే యున్నది. పార్వతీపరమేశ్వరపరిణయములోని పద్యములఁ గొన్నిటి నిం దుదాహరించుచున్నాను—

ఉ. ఆపురిఁ గాంచి నిర్జరు లహర్నిశముల్ మదిలోన నెన్నుచున్
గాపుర మున్న నాకమునకంటెను మేలని చూచువేడుకన్

దాపునఁ జేరిరో యనఁగఁ దత్పురసౌధసమీపవర్తులై
గోపవిభుంతులో నగను గొల్చినరీతిగ నుందు రాస్థలిన్. ఆ. ౧.

ఉ. ఈవిధి వచ్చువిప్రుఁగని యీశ్వరుఁ డర్ఘ్యమొసంగి యిట్లనున్
భూవినుతార్య మీధరను భూమిసురుల్ సుఖులై చరింతురా
మీవనమందుఁ బుష్పములు మేలగుకాయలు పండ్లు పత్రముల్
కావలెనన్నఁ గల్గుఁగద కారణ మేమిట రా విధాత్మజా. ఆ. ౨.

. పంచశరూఁడు నిల్లనుచుఁ బల్కె విరించికి సమ్మదంబుగా
మించులమించుశంకరునిమేనిరుచు ల్గన నాకు శక్యమే
మంచిది యేమియైన నీక మద్దళముల్ గొలువంగ నేగెదన్
వంచనలేక న న్నిలను వర్తిలఁజూడుఁడు పోయివచ్చెదన్. ఆ. 3.

121. తరిగొండ వెంకమ్మ

ఈమె మంచి విద్వాంసురాలు. ఈమె చేసినపుస్తకములు తరిగొండ నృసింహస్వామి కంకితము చేయఁబడినవి. తరిగొండ కడపమండలములో వాయిల్పాడునకు నాలుగుమైళ్ళదూరములో నున్నది. ఈమెరచియించిన గ్రంథములలో రాజయోగసార మను ద్విపదకావ్యమును వేంకటాచలమాహాత్మ్యమను పద్యకావ్యమును ముద్రింపఁబడియున్నవి. ఈమె తాను భాగవతము ద్వాదశస్కంధములను ద్విపదకావ్యముగా రచియించినట్లు వేంకటాచలమాహాత్మ్యములోని యీ క్రిందిపద్యములోఁ జెప్పుకొన్నది.

సీ. దారునిర్మితవీణ నారూఢిఁ బల్కించు గాయక పురుషునికరణి గాను
బురుషోత్తముఁడు దయాపూర్ణుఁడై నాజిహ్వాయందుఁ దావసియించి యరుదుగాను
బలికించుఁ గావున భాగవతపురాణ మనఁగ నే ద్విపదకావ్యంబుగాను
ద్వాదశస్కంధము ల్తగఁజెప్పి హరికిసమర్పించి శ్రీవేంకటాద్రిమహిమ

మతనిపై రమ్యపద్యకావ్యంబు చేసి
శ్రీనివాసునకే సమర్పింపనుంటి
నీఁగ త్రోయధిఁ దాటఁబోయినవిధమున
నాస్వతంత్రత కిల బుధు ల్నవ్విపోరె.

ఈ పుస్తకములోని—

క. అల కాశినుండి వెలువడి। వలనుగ మాకొలఁకు నందవరపురమందే
నెలకొనికులదైవతమై।యలరుచుమమ్మేలుచౌడమాంబనుగొలుతున్.

అను పద్యమునుబట్టిచూడఁగా నీమె నందవరీక బ్రాహ్మణస్త్రీ యైనట్టు తెలియనచ్చుచున్నది. ఈమె తనభర్తయొక్క నామగోత్రములను జెప్పకొనక "వసిష్ఠగోత్రపవిత్ర కృష్ణయామాత్య తనూభవ" యని తాను కృష్ణయామాత్యుని కూఁతురయినట్టుమాత్రము చెప్పకొనుటచేత నీమె బాలవితంతువయి తన కాలమును వేదాంతగ్రంథపఠనాదులయందుఁ గడపిన ట్లూహింపఁ దగియున్నది. ఈమె ౧౭౮౦ వ సంవత్సరమునందు జీవించి యుండినట్లు బ్రౌన్‌దొరగారు తమ నిఘంటువునందు వ్రాసి యున్నారు. కాఁబట్టి యీమె యేఁబదిసంవత్సరములక్రిందట నుండినట్లు తెలియవచ్చుచున్నది. ఈమెకుఁ బూర్వమునం దుండినబ్రాహ్మణస్త్రీలు రచియించిన పద్యకావ్యము లేవియు నిప్పుడు కానరావు. ఈమెకవిత్వమునందల్పదోషము లక్కడక్కడఁ గానవచ్చుచున్నను మొత్తముమీఁద కవన మతికఠినముగాక మృదుమధురరచనను గలదయియున్నది. వారాంగన యయిన ముద్దుపళనివలె శృంగారవర్ణనమని యవాచ్యములు పలుకక కులాంగన కుచితమయినరీతిగానే వర్ణించుచు వచ్చుటయే కాక శృంగార వాక్యములు వచించుటసహితము తన కనిష్టమని సూచించుటకయి శృంగారరసాధిదైవతమయిన కృష్ణుని నిట్లు నుతించియున్నది—

శా. శృంగారాకృతితోడ వచ్చి పదముల్ శృంగారసారంబుతో
డం గూఢంబుగఁ జెప్ప నీవనఁగ నట్లేఁ జెప్పలే నన్న నా

ముంగోపంబునఁ జూచి లేచి యట నే మ్రొక్కంగ మన్నించి త
చ్ఛృంగారోక్తులు తానె పల్కికొను నా శ్రీకృష్ణు సేవించెదన్.

ఈ పద్యమునుబట్టిచూడఁగా నీమె తాను బుస్తకమునం దక్కడక్కడ సందర్భోచితముగా రచించిన శృంగారపద్యములుకూడఁ దనవిగాక కృతిపతి విరచితములే యని లోకమునకుఁ జూప నుద్దేశించినట్టు కనఁబడుచున్నది. ఈమె కవిత్వరీతిని దెలుపుటకయి కొన్ని పద్యము లిందు దాహరింపఁబడుచున్నవి—

వేంకటాచలమాహాత్మ్యము.

ఉ. రామనృపాల ఘోరతరరావణశౌర్యవిఫాల భవ్యసు
త్రామసురార్యయోగిజనతాపసపాల కృపాలవాల శ్రీ
భూమిసుతాత్మలోల పరిపూర్ణసుకీర్తివిశాల వానర
స్తోమముతోడ వచ్చి మిముఁజూచి కృతార్థుల మైతి మిద్ధరన్. ఆ-౧

ఉ. ఇంతట యోగపూరుషుఁడు హెచ్చఁడు తగ్గఁడు సంతతంబునే
కాంతమున న్వసించుఁ దనయందుఁ బరాత్మను జూచుచుండు వి
భ్రాంతులు తన్నుఁ దిట్టినను గ్రమ్మఱ వారిని దాను దిట్టఁ డీ
శాంతుఁడు రాజయోగి ఘనసద్గురుఁ డంచు వచింపఁగాఁ దగున్. ఆ-3.

చ. అడవికి వేటఁబోయి విపులాద్భుతఘోరమృగాళి నచ్చటన్
బొడగని భీతి నొందితివొ భూతము సోఁకెనొ లేక తాళ్ళపై
వడి చెడజాతి మ్రొగ్గితివొ వాగులలోఁబడి లేచివచ్చితో
కొడుక నిజంబుఁ జెప్పు మిఁక గొబ్బున నొక్కచికిత్స చేసెదన్. ఆ-౪.

ఉ. ఆకురవంజి యిట్లనియె నాపకు రమ్మని పిల్వవచ్చినా
రాఁకొనినాఁడు బిడ్డఁ డిపు డమ్మల నక్కల నేడనైన నే
జోకఁగఁజేరి వారలకు సోదె నిజంబుగఁ జెప్పకుండినన్
నాకడుపెట్లు నిండు నని నవ్వుచుఁ బల్కుచు మూల్గి యిట్లనెన్. ఆ-౫.

రాజయోగసారము.

ద్విపద. కాయ మస్థిరమని కానంగలేక
పాయక సంసారబద్ధులై మమత
వదలక కామార్థవాంఛితు లగుచు
మదమత్తు లగుచు దుర్మార్గత నొంది
మదిలోన నబ్బి కామక్రోధలోభ
మదమోహమత్సరా ల్మాటికిఁ బెంచి
సంపదగలిగిన సామర్థ్య మనుచు
సొంపుమీఱిన తుచ్ఛసుఖ మిచ్ఛగించి
కామాంధులై తమగతి గానలేక
భామలవలలోనఁ బడి లేవలేక
తఱిగని యీషణత్రయవార్ధిలోను
మఱిమఱి మునుఁగుచు మమత రెట్టింప
నాలుబిడ్డలకని యర్థంబుఁ గూర్చి
కాలంబు నూరకే గడపుచునుండి
యంతకాలము వచ్చినప్పుడు యముసిఁ
జింతఁజేయుచు హింసచేఁ గందికుంది
కూపంబులోఁ బడి కొన్నినాళ్లుండి
పాపాత్ములగుచుఁ బ్రపంచంబునందుఁ
బుట్టుచుఁ గిట్టుచుఁ బొరలుచుండెదరు.

ఈతఱిగొండ వెంకమ్మకుఁ దరువాతఁ దెలుఁగులోఁ బద్యకావ్యములను రచియించిన స్త్రీ లెవ్వరును గానఁబడరుగాని శతకములు రచించినవారు కొంద ఱందందుఁ గనఁబడుచున్నారు. ఇట్లు శతకములు రచియించిన స్త్రీలలో శ్రీరాజా గోడేనారాయణ గజపతిరాయనింగారి

మేనత్తయగు మదిన సుభద్రయ్యమ్మగా రగ్రగణ్యురాలుగాఁ గానవచ్చు చున్నది. ఆమె ౧౭౮౧వ సంవత్సరమునందు జననమొంది యించుమించుగా తరిగొండ వేంకమాంబతో సమకాలికురాలుగా నుండినది. ఈమె రచియించిన శ్రీరామదండకము, రఘునాయకశతకము, కేశవశతకము, కృష్ణశతకము, రాఘవరామశతకము మొదలయినశతకము లొక్కసంపుటముగా నీనడుమను బ్రకటింపఁబడినవి. ఈమె కవనకౌశలమును జూపుటకయి రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. శ్రీరమణీకళత్ర సరసీరుహనేత్ర జగత్పవిత్ర స
త్సారసబృందమిత్ర సురసన్నుతిపాత్ర నరేంద్రపుత్ర శృం
గారసమగ్రగాత్ర జనకర్మవిదారణకృచ్చరిత్ర శ్రీ
నారదమౌనిగీతచరణా రఘునాయక దీనపోషకా.

ఉ. మన్నన దప్పియున్నయెడ మక్కువగల్గినవారి నేనియున్
దిన్నఁగ మందలించినను దెల్లముగా మది నొవ్వకుండునే
యన్నరు ధార్తరాష్ట్రునకు నాదరమొప్ప హితోపదేశ మి
ట్లెన్నఁగఁజేసి యావిదురుఁ డేమిఫలంబును జెందెఁ గేశవా.

ఇప్పుడు తెలుఁగుదేశమునం దంతటను బాలికాపాఠశాలలు స్థాపింపఁబడి స్త్రీవిద్య ప్రబలుచున్నందున మంచిగ్రంథములను రచింపఁగల కులకాంతలు శీఘ్రకాలములోనే బైలుదేఱుదురుగాక!

122. పిండిప్రోలి లక్ష్మణకవి

ఇతఁడు లంకావిజయమనఁబడెడు రెండాశ్వాసముల ద్వ్యర్థి కావ్యమునుజేసెను. ఇతఁడాఱువేలనియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబ సూత్రుఁడు; భారద్వాజగోత్రుఁడు; గోపాలామాత్యపుత్త్రుఁడు. ఈకవి గోదావరిమండలములోని రామచంద్రపురమునకు సమీపముననున్న కుయ్యేరను గ్రామమునకు కరణము. ఈగ్రామమును గుత్తచేసిన రావు ధర్మారాయఁడను పద్మనాయకకులజుఁ డీకవియొక్క లంకనేల మూడు పందుములపహరింపఁగాఁ గోపావేశముచేత యౌవనమునం దితఁడు ధర్మారావును రావణాసురునితోఁ బోల్చుచుఁ దనక్షేత్రాపహరణకథను రామాయణపరముగా శ్లేషార్థము వచ్చునట్లు రచియించెను. ఇతఁడు తిట్టు కవిత్వమునకుఁ బేరుపడినవాఁడు. ఈవిషయమును గూర్చి లంకావిజయమునఁ గవియే యిట్లు వ్రాసికొనియున్నాఁడు—

క. తెలియవిను రామకవ్యా । దులు సూరకవిప్రముఖపృథుప్రతిభావం
తులు భీమ శ్రీనాథు । ల్వొలయఁగ నాకరణిఁ దిట్టలే రూఢమతిన్.

ఇతఁ డిట్లు యౌవనదశయందుమాత్రమే కాక వార్ధకమువచ్చి యవసానదశ సమీపించువఱకునుగూడ నల్పములైన యైహికలాభముల నిమిత్తము పరులను దూషించుచు భూషించుచుఁ బద్యములను జెప్పి కాలము గడపుచుండెను. ఈలంకావిజయమునకు రావణదమ్మీయమని నామాంతరము. కవి సమర్థుఁడైనను రాఘవపాండవీయాదులవలె రావణదమ్మీయ మంతప్రౌఢముగా లేదు. కవి గ్రంథమునందు రామాయణకథ కనుకూలముగాఁ దనకథను మార్చుకొనుచు నల్పసంఖ్యగల రెండర్థముల పదములతోనే గ్రంథమునంతయు బూరించినాఁడు. ఈగ్రంథములోని—

క. లేదమ్మా కష్టము నీ। కేదమ్మా నేగి భీతి ఘృణ నీ వొందన్
రాదమ్మా యింక మిన్నక। పోదమ్మా యుక్తినిజముపోలుపుగదమ్మా.

గీ. ఏడుపంధు ములోకంబు లెఱుఁగ లంక
నేలకాల పరక్షేత్రాప్తి మేలుగాదు
పేర్మినాభూమిజాతసంప్రీతితోడ
వీడు మదియె సౌఖ్యము లిచ్చు వేయునేల.

ఉ. ప్రాజ్ఞత నెవ్విధంబునను రాముననంగఁ దగుసాటి రావు స
ర్వజ్ఞ నృసింహుఁ డాయనసువంశమునన్ జనియించి పెద్దదు
ష్ప్రాజ్ఞుఁడ వీవు కానకు విచారము లన్నియుమాని ధర్మగో
ష్ఠిజ్ఞులు మెచ్చుచొప్పు కని సీతను వే విడుమంత మే లగున్.

గీ. జ్యేష్ఠుఁడా లక్ష్మణాగ్రజక్షేత్ర మీవు
వదలకుండిన మోసంబు వచ్చునింకఁ
జండనిర్భీకవనచారిపిండిప్రోలి
కవికులవరుతోరిపుత ముఖ్యముగ వలదు.

ఇత్యాదిపద్యముల ననేకులు మెచ్చుకొనుచున్నారు. లక్ష్మణకవి లంకావిజయమును క్రీస్తుశకము ౧౭౭౭ వ సంవత్సరమునందుఁ జేయ నారంభించెను. అప్పటి కితని కిరువదియైదుసంవత్సరములప్రాయ ముండిన పక్షమునఁ గవి ౧౭౫౦ వ సంవత్సరప్రాంతములయందు జనన మొంది యుండవలెను. ఈతఁడు ౧౮౪౦ వ సంవత్సరప్రాంతమువఱకును సజీవుఁ డయి యున్నందున నించుమించుగా డెబ్బదియేండ్లు బ్రతికియుండెననుటకు సందేహములేదు. ఇదియొక్కటితప్ప నితఁడు రచియించిన గ్రంథము వేఱేదియు లేదు.

మ. అరయ స్వర్ణనఁజేతుఁ దారకపదవ్యాక్రాంతవర్తిన్ గురున్
స్ఫురదుత్తుంగబలాతిరేకకలుషీభూతారిజీవున్ ఘనాం

గిరి సాఖ్యాతు బుధౌఘపూజితపదుం క్షేమంకరాంచ త్తపో
భరసంతోషితసర్వమానిధిమణున్ వాచస్పతి న్నార్యనిన్.

ఈపద్యములో వాచస్పతినార్యని ననియుండవలసినదానికి వచస్పతిన్నార్యనని యు,

చ. అని తలపోయుచో నల ప్రజాపతి చేసినమేర దప్పకం
బనివడి నద్రిచారు లసమానమహారుణధామయుక్తితో
డన పరవాహినీశనికటంబున కేగ నరివ్రజంబుచే
యు నతను సంగరంబునకు నోపక పాఱెను జోళ్ళువీడఁగన్.

ఈపద్యములోఁ దప్పక యని యుండవలసినదానికిఁ దప్పక ననియు, నందందుఁ గొన్ని వ్యాకరణదుష్టములయిన ప్రయోగములున్నను మొత్తముమీఁదఁ గవిత్వము సలక్షణమయి మృదుమధురపదఘటిత మయియున్నది. ఈతని రచనాకౌశలమును జూపుటకయి లంకావిజయములోని మఱిరెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. తమ్ములు నీదుపల్కులు హితమ్ములుగాఁ గొనిచేయ నార్యజా
తమ్ములు నీసుసద్గుణశతమ్ములు సంస్తుతిచేయఁ బక్షపా
తమ్ములు లేక న్యాయకలితమ్ములుగాఁ గ్రియలొప్ప సర్వభూ
తమ్ములు విశ్వసింప సుకృతమ్ములు వర్ధిలునట్లు చేయుమీ. ఆ. ౧.

ఉ. తమ్ములు సద్గృహమ్ములు సుతప్రకరమ్ములు సొమ్ము లిష్టవ
ర్గమ్ములు వైభవమ్ములు జగమ్ములఁ గ్రమ్మఁగ నెమ్మి నుండి పా
ప మ్మనిశ మ్మొనర్చుటనెపమ్మగఁ గీ డగు నాదుపల్కు వే
దమ్మని రూఢినమ్మ విహితమ్మఁ గులమ్మబలమ్మునిమ్మగున్. ఆ-౨

ఈకవికాలములో సంస్కృతాంధ్రభాషాపాండిత్యమునందును సంగీతసాహిత్యముల యందును సుప్రసిద్ధుఁడయిన శిష్టు కృష్ణమూర్తినామక విద్వత్కవి యొకఁ డుండెను. అతనికిఁ దన కున్నంతపాండిత్యము తెలుఁగునందే కాని సంస్కృతమునందు లేదని లక్ష్మణకవియెడల ననాదరభావము

కలిగియుండెను. ఆయనకుఁగల గర్వమును తనయెడలఁ గలతిరస్కార భావమును గనిపెట్టి యీలక్ష్మణకవి యెట్లయిన నాతని గర్వభంగము చేయవలెనని సమయము వేచియుండెను. ఇట్లుండఁగాఁ గృష్ణమూర్తికవి తాను రచించిన సర్వకామదాపరిణయమను ప్రబంధమును రామచంద్ర పుర సంస్థానాధిపతియైన కాకర్లపూడి రామచంద్రరాజుగారి తమ్ముఁడైన జగన్నాథరాజున కంకితముచేయుటకయి కాజలూరు గ్రామమునకుఁ బోవుట తటస్థించెను. ఆపుస్తకమును జదివించి విద్వత్కవిసమ్ముఖమున వినుటకు నిర్ణయింపఁబడిన దినమునందు లక్ష్మణకవి యనాహూతుఁడ య్యును సభకుఁబోయి కృష్ణమూర్తికవిని బదుగురిలోఁ బరాభవింపవలె నన్నదృఢ నిశ్చయముతోఁ గూరుచుండియుండెను. సర్వకామదాపరిణ యములోని—

చ. తరణి శశాంకు లాభరణదంభమున న్వదనాక్షికై తవాం
బుగుడసిత్రోత్పలాగ్రమున ముద్దియ కుంతలదేశ మాక్రమిం
చి రొకఫలంబు గాన నగుఁ జివ్వనుచుం బరహాపయుక్తి ని
బ్బరముగ నంతసాంతముగ బ్రహ్మ యొనర్చినసీమపొల్పగున్.

అనుపద్యమును జదివినప్పుడు లక్ష్మణకవి విని తలయూఁచి నవ్వి యిందలి నాయిక నేత్రాక్షియయిన యవలక్షణరాశియనియు, కన్నులు నల్లగలువలనిచెప్పి వానిపైని సూర్యచంద్రులున్నట్లు చెప్పుటచేత నొక కన్ను సూర్యకాంతిచే ముకుళించు కలువయై గ్రుడ్డిది కావలెననియు, ఆభరణదంభమునవచ్చి సూర్యచంద్రులు కుంతలదేశ మాక్రమింపఁగా నిరువురకును దగవురాకుండ బ్రహ్మ సరిహద్దేర్పాటుచేసినట్టుగా పాపట యున్నదని వర్ణించుటచే సూర్యచంద్రుల నలంకరించినపిమ్మటఁ బాపటఁ దీయుదురో ముందుగా పాపటదీసి తరువాతనే సూర్యచంద్రుల నలంక రింతురో యీకవి తెలియనివాఁడనియు, ఇటువంటియాక్షేపణము లనేక ములుచేసెను. ఇవి సరళములైన సదాక్షేపములు కాకపోయినను సభకు

వచ్చినవా రనేకు లాయాక్షేపములకు హర్షించి చప్పటులు కొట్టినందు నను, జగన్నాథరాజుగా రాకృతినంకుట క్లిష్టపడసందునను, కృష్ణమూర్తి కవిగా రవమానితులయి సభనుండి లేచిపోవలసినవారయిరి.

లక్ష్మణకవి యితరులమీఁదఁ బద్యములను జెప్పుచు వివాహాదు లకుఁబోయి కవీశ్వర సంభావములను గొనుచు ధనార్జనము చేయుచుం డెను. ఇతఁడు తన మేనల్లుఁడగు చింతలూరి మంగన్నకు విరోధముగా వ్యాజ్యము తీర్పు చెప్పినందునకయి యప్పటి పండిత సదరమీనగు శంకర మంచి యనంతశాస్త్రిని శ్లేషార్థముతోఁ దిట్టినపద్యములలో నొకదానిని, ఆవ్యాజ్యము నుపర్యభియోగము తెచ్చినప్పు డాకాలమునందు రాజమ హేంద్రవరమున మండలన్యాయాధిపతిగా నుండి తెలుఁగు నిఘంటువులను జేసిన బ్రౌనుదొరగారిమీఁదఁ జేసినపద్యములలో నొకదానినిమాత్ర ముదాహరించి యీతనినిగూర్చి యింతటితో విరమించెదను.—

మ. అవురా శంకర మంచివాఁడవె యనంతాఖ్యుండవై తీర్పెఱుం
గవు మంగన్నరఁజేసి నీవు బుధమార్గభ్రష్టతన్ జోగిరా
గవరా లంది పినాకినిం బశుపతీకల్లోలునిం బట్టి స
త్యవధూసత్వము దాసియం దిడితి వాశాయత్తు లిట్లేకదా.

ఉ. పస్పసచేసె నాబ్రతుకు పండితుఁ డిం కెటునిల్తు నంచు నే
నిస్పృహవృత్తి నుండఁగను నిన్నటిరేఁ గలలోనఁ గోర్టువా
రిస్పిసియాలుపట్టి రిఁక నేర్పడ న్యాయముతీరు మంచు ధై
ర్యాస్పదసూక్తిఁ బల్కినటులైన మిముం గొడగానవచ్చితిన్.

123. అల్లమరాజు రామకృష్ణకవి

ఈ కవి కవిచకోరచంద్రోదయ మనెడు నాలుగాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁ డారామ ద్రావిడబ్రాహ్మణుఁడు; రంగానాథార్యపుత్రుఁడు; హారితసగోత్రుఁడు. తన గ్రంథమును దాక్షారామ భీమేశ్వరుని కంకితముచేయుటచేతనే కవి గోదావరీమండలములోనివాఁడగుట స్పష్టమగుచున్నది. తన్నుఁగూర్చి భీమేశ్వరుఁ డిట్లన్నట్టు కవి తన కవిచకోరచంద్రోదయమునందుఁ జెప్పుకొనియున్నాఁడు.

సీ. అమరఁగ వైనతేయవిజయంబును సత్యభామావిలాసంబు భాసురముగ
గౌతమీమాహాత్మ్యకథయును ద్రౌపదీపరిణయ మలసుశోభావివాహ
మసమానహనుమదాఖ్యానంబును సుకవిజనమనోరంజనం బనెడు కావ్య
మవనిలో రచియించినట్టి ప్రోడవు నీవుగావున నీవాక్యకలితలలిత
మాధురిమఁ గ్రోలుచుండె నామానసంబు
తనివిదీఱదు నా భక్తుఁడనుచు నిన్ను
నెన్నుటలుగాదు కాని నీకన్న ధరణిఁ
గలరె కవితాసుధాధార లొలుకఁబలుక.

పయి పద్యమునుబట్టి కవి వైనతేయవిజయము, సత్యభామావిలాసము, గౌతమీ మాహాత్మ్యము, ద్రౌపదీ పరిణయము, సుశోభావివాహము, హనుమదాఖ్యానము, సుకవిజనమనోరంజనము అనుకావ్యములనుగూడ రచియించినట్లు తెలియవచ్చుచున్నది. ఈతని కవిత్వము నిర్దుష్టము కాకపోయినను ప్రౌఢమయి హృదయాహ్లాదకరముగా నున్నది. ఇతఁ డెనుబదిసంవత్సరముల క్రిందట నుండినవాఁడు. కవి యీకవిచకోరచంద్రోదయమును శాలివాహనశకము ౧౭౫౭ వ సంవత్సరమునకు సరియైన మన్మథాబ్దమునం దనఁగా క్రీస్తుశకము ౧౮౩౫వ సంవత్సరమునందు రచియించినట్లు గ్రంథాంతమున వ్రాసికొనియున్నాఁడు. ఈ కావ్యమునందలివి కొన్నిపద్యము లిం దుదాహరింపఁ బడుచున్నవి.

ఉ. భారము నొప్పు పుష్పఫలభారవినమ్రమహీజరాజశో
భారమణీయసానుచరభవ్యనభశ్చరభామినీవిపం
చీరవమాధురీకలితజృంభితగానఘుమంఘుమార్భటీ
పూరితనూత్న రత్నయుతభూరిదరిం గనియెన్ మహాగిరిన్ ఆ-౧.

ఉ. మారుని మీఱు వీనిసుకుమారము మారమణీసహోదరున్
గూరిమి నోముమోము తళుకు ల్బలుకుల్ నెఱజాణవైఖరిన్
గేరు నయారె నిర్జరులుఁ గిన్నరులు న్నరు లెన్న వీనిసొ
య్యారమె చూడ నింపగు జయంతు జయింతు నటన్న రీతులన్. ఆ-౨

కవిచకోరచంద్రోదయమునకుఁ దరువాతఁ గవి రచియించిన గ్రంథములు కొన్ని నా కిటీవల లభించినవి. ఇతఁడు రచియించిన యితర గ్రంథములు—మదాలసా పరిణయము, శంతనువిలాసము, అధ్యాత్మ రామాయణము, అచ్చ తెలుఁగు భాగవతము, రామకృష్ణీయము. ఇంవలి కడపటి పుస్తకము ఆంధ్రశబ్దచింతామణికి వ్యాఖ్యానము. ఈరామకృష్ణీయములోని యీ క్రింది పద్యమువలన నీతని నివాసస్థానము పిఠాపురము నకు సమీపముననున్న చేఁబ్రోలుగ్రామ మయినట్టు తెలియవచ్చుచున్నది.

సీ. సిరిమించు శ్రీపీఠపురసమీపంబునఁ బరఁగు చేఁబ్రోల్పురవాసి నగుచు
నల్లమరాజాన్వయాగ్రణి యగు రంగధామార్యవర్యుని తనయుఁడనయి
యెల్లపార్యాగ్రణి కెనయఁబౌత్రుండనై రామకృష్ణకవియన్ నామమెలమి
బూని శ్రీదక్షవాటీనికేతనుఁడైన భీమేశు కరుణచేఁ బెంపు నొంది
సకలజనులకుఁ దెలిసెడి సరణిగాఁగ
నన్నపార్యుఁ డొనర్చినయట్టి సూత్ర
ములను దెలిఁగింతు సూక్ష్మభంగులను బాల
బోధమగునట్లు సుకవు లుప్పొంగుచుండ.

ఈకవి కాలముచేసి యేఁబదిసంవత్సరములు దాఁటినవి. ఈతఁడు శంతనువిలాసమును శాలివాహనశకము ౧౭౬౩ వ సంవత్సరమునకు సరి

మైన క్రీస్తుశకము ౧౮౪౧వ సంవత్సరమునందు ముగించినట్లా పుస్తకాంతమందలి యీ పద్యములవలనఁ దెలియవచ్చుచున్నది.

సీ. అవనిలో శాలివాహనశకాబ్దము లగ్నిశాస్త్రశైలశశాంకసంఖ్యనెన్నఁ
ప్లవనామవత్సర ప్రథితకార్తికశుద్ధసప్తమీ భౌమవాసరమువఱకు
సిరిమించు శ్రీపీఠపురసమీపంబునఁ బోలుపొందుచేఁబ్రోలుపురనివాసుఁ
డలరునల్లమరాజకులరత్నమునురంగధామార్యసుతుఁడునౌరామకృష్ణ
కవివరుఁడు దక్షవాటికాగారవాసుఁడైన భీమేశు సత్కృపానూనగరిమ
శంతనువిలాసమురచించె సరసఫణితిఁనఖిలసత్కవిబృందంబులౌననంగ.

ఈ కవికృతములైన గ్రంథములలోని పద్యములు కొన్ని యిందుదాహరింపఁబడుచున్నవి—

మదాలసాపరిణయము.

ఉ. న్యాయముగా దయో లలన నవ్వెడనాడిచనంగఁ గోయిలల్
గోయనికూయఁ జందురుఁడు గొంకక వెన్నెలఁగాయ మారుఁడున్
సాయక జాలమేయఁ గడుషట్పదముల్ రొదసేయ నే నిసుం
బాయఁగఁజాలఁజాలనను బాలకవుంగిటఁ జేర్చిపోవవే.

అచ్చతెలుఁగు భాగవతము.

సీ. కూఁకటిమూలడాల్గొన బెల్లనదలించి జమిలిముక్కాలిరాసంతు నొంచి
కైగల్గుమొకపుమూఁకలనెల్ల నగిమించి కారుమబ్బుల నెఱసౌరుకుంచి
చిచ్చుకన్దొరయత్తి హెచ్చువన్నెఁగలంచి విప్పుగన్ దొరరాల చొప్పుద్రుంచి
చీఁకటిమ్రాఁకులగెలువ మెల్లను డించి కాటుకములవన్నెఁగీ టడంచి
పొగల తెగల జగాజిగి మిగులపంచి
దండితెక్కలికాండ్లకు మింటగిండ్ల
కింపుగా మబ్బు మసిచల్లునింపు దోఁప
నెల్లకడలందు నంతంత నిరులు గవిసె.

శంతను విలాసము.

చ. పగలును రేయి పద్మకులబాంధవసోములు తత్పురంబునన్
దగుమణివప్రముం గడిసి తారటుపోవఁగలేక యోరగా
నొగినిరువంకలం జనుచు నొప్పుగ నుత్తరదక్షిణాయనా
ఖ్యగతిఁ జెలంగి రెంతయు నఖండవిలాసము తోఁచుచుండఁగన్. ఆ-౧

ఉ. హారము (?) సైచదాయె మణిహారములుం బొడియయ్యె నేఁడు నీ
హారముఁబోలి నాదు వ్యవహారము లెంతయు డిందె మేనిక
ల్హారము లెండె బల్లయవిహారమునన్ మరుఁ డేఁచసాఁగె నా
హారమణీలలామ యిఁకనైన ననున్ దయ నేలుకోఁగదే. ఆ-౫.

124. కాకరపర్తి బుచ్చిపాత్రకవి

ఈ కవి సత్యవతీపరిణయ మనెడి యైదాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు వైదికబ్రాహ్మణుఁడు; కాశ్యపగోత్రోద్భవుఁడు; ముఖలింగక్షేత్ర మహాత్మ్యాది కావ్యములను రచియించిన కృష్ణకవి పుత్రుఁడు. ఈ కవియొక్క మనుమఁడును సోదరపుత్రుఁడును జీవించి యుండుటచేఁ గవి యేఁబది యఱువదిసంవత్సరములక్రిందట నుండినవాఁ డనుట స్పష్టము. కవి కథాంశమును రచియించి గ్రంథమును శ్రీరాజా (మహారాజా) గోడే నారాయణ గజపతిరాయనింగారి జనకున కంకితము చేయఁ దలంచెనుగాని యతఁడు కృత్యాదిపద్యములను, ఆశ్వాసాద్యంత పద్యములను రచియింపకయే మృతినొందెను. అటుతరువాత శ్రీమహారాజా గోడే నారాయణ గజపతిరాయనింగారి కోరికపయిని కవికి పారంపర్యమున సోదరపుత్రులగు వేంకటశాస్త్రిగారును పౌత్రులగు సీతారామశాస్త్రిగారును గ్రంథోపోద్ఘాతమును, ఆశ్వాసాద్యంత పద్యములను పూరించి కృతిని ౧౮౯౭ వ సంవత్సరమునందు శ్రీరాజా గోడే నారాయణ గజపతిరాయనింగారి కంకితము చేసిరి. వీరిచేఁ గృత్యాదియందు రాజాగారి

వంశాభివర్ణనము విశేషముగాఁ జేయఁబడినది. సత్యవతీచరిత్రమునందలి కవిత్వము నిర్దుష్టమయి హృద్యముగానున్నది. కవనమార్గమును జూపుట కయి సత్యవతీపరిణయములోని కొన్ని పద్యముల నిం దుదాహరించు చున్నాను—

చ. ఇలఁ గలకోటలన్ గెలిచి యెన్నిక కెక్కుఁ బురీలలామకో
జ్జ్వలమణివప్రమం చరసి వారిజసూతి తదంఘ్రిసీమఁ బ
చ్చలచెలువంపుటందియల సద్బిరుదాంకము సంఘటించెనా
నలరు నమేయశైవలయుతాంబుకదంబముఖేయ మప్పురిన్. ఆ ౧.

చ. పరమతపోధనప్రవరు భవ్యగుణప్రకరుం దపఃకృశాం
గరుచిరు భస్మభాసురు నఖర్వతటిత్పటలోజ్జ్వలజ్జటా
భరు మృగకృత్తికాదరు సుపాణిధృతాక్షసరుం గమండలు
స్ఫురితకరుం గనుంగొనియె శోభితదండధరుం బరాశరున్. ఆ-౨.

చ. సమధికరాజ్యలక్ష్మి యనుచందనవల్లిక జాహ్నవేయదు
ర్దమఫణిరాజు చేరనివిధం బొనరింపఁగఁ జాలినట్టి మం
త్రముల తెఱంగుఁ జూపఁగను బ్రౌఢి వహించెనవేని రాజకా
ర్యము ఫలియించు మంత్రివర రాజహిత ప్రతిపాదనాదరా. ఆ-౩.

ఉ. ఎల్లెడలందుఁ జీకటుల హెచ్చులు చెల్లెఁ బయోధివృద్ధి పా
టిల్లెఁ జకోరభుక్తులు ఘటిల్లె వియోగిహృదంతరంబు భే
దిల్లె రథాంగదంపతుల తేజము డొల్లె రతీశునాజ్ఞ వ
ర్తిల్లెను జంద్రికాప్రతతి దిక్తరుకోటులవల్లె నయ్యెడన్. ఆ-౪.

మ. అవనీనాయకు లందఱు న్వినుఁడు గుర్వర్థానుసంధానగౌ
రవమొప్పన్ సమయస్థితిన్ సలిపితిన్ బ్రవ్యక్తమౌనట్లు స
త్యవతీదేవికి నుద్భవించినసుతుం డర్హుండు ప్రస్ఫారకౌ
రవరాజ్యంబు భరింపఁగా సకలగోత్రావల్లభు ల్గొల్వఁగన్. ఆ. ౫.

125. శిష్టు కృష్ణమూర్తికవి

ఇతఁడు సర్వకామదాపరిణయము మొదలయిన యాంధ్రకావ్యములను రచియించినకవి. ఇతఁడు వైదికబ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; వాసిష్ఠగోత్రుఁడు; సర్వశాస్త్రిపుత్రుఁడు. సంవత్సరము సరిగా తెలియదుగాని యితఁడు గోదావరిమండలమునందలి రామచంద్రపురము తాలూకాలోని గొల్లపాలెమనుగ్రామమున ౧౭౯౦వ సంవత్సరము నకును ౧౮౦౦వ సంవత్సరమునకు మధ్యకాలములో జననమొందెను. ఈతనికి రెండుసంవత్సరములప్రాయము వచ్చినప్పుడు స్వగ్రామమువిడిచి తండ్రి కుటుంబసహితముగా రామచంద్రపురమునకు లేచివచ్చి యక్కడ నిల్లు కట్టుకొని స్థిరముగా కాపుర మేర్పఱుచుకొనెను. ఈబాలుఁడు కొంతకాలము రామచంద్రపురములోఁ జదువుకొని తరువాత అయినవిల్లి గ్రామమునకుఁ బోయి బులుసు అచ్చయ్యగారివద్దఁ గావ్యనాటకాదు లభ్యసించితరువాత నింకొకరివద్ద వ్యాకరణాలంకార శాస్త్రముల నభ్యసించి మరల రామచంద్రపురము వచ్చునప్పటికీతనికి సంస్కృతాంధ్రములయం దనర్గళపాండిత్యమును కవననైపుణియుఁ గలుగుటయేకాక సంగీతమునందును నిరుపమాన సామర్థ్యము కుదిరెను. ఆశుకవిత్వమును జెప్పుటలోను గర్ణరసాయనముగాఁ బురాణమును జదువుటలోను కృష్ణమూర్తిగారిని మించినవా రాకాలములో మఱియెవ్వరును లేరు. ఇతఁడు పురాణము చెప్పునప్పుడు పుస్తకమునుచూచి చదువుచున్నను పయికథలు దడవుకొనక తన కవిత్వముతో రసవంతముగాఁ జదువ సామర్థ్యము గలవాఁడఁట! ఈయనశక్తిసంపదను జూచి రామచంద్రపురపు జమీందారగు కాకర్లపూడి రామచంద్రరాజుగారును తదనుజుఁడగు జగన్నాథరాజుగారును కృష్ణమూర్తిగారి నాదరించి. తమసంస్థానములో నుంచుకొనిరి. ఆయిరువురిలో జగన్నాథరాజుగారికిఁ గవియం దధికానురాగము.

వీరిరువురికంటెను కాకర్లపూడి వేంకటకృష్ణరాజుగారికి కృష్ణమూర్తిగారి యం దెక్కువదయ యగుటచేత నాతఁడీవిద్వత్కవి కయినవల్లిగ్రామములో పదిపుట్లభూమి దానము చేసెను. అయినను నీటియాధారము లేకపోవుటచేత భూమి లాకాలమునం దిప్పటివలెఁ బండకుండెను. ఇట్లు కృష్ణమూర్తిగారు తనకు నలువదియైదు సంవత్సరములయినవచ్చువఱకును రామచంద్రపురములో నుండెను. ఈకాలములో రామచంద్రపురము తాలూకాలోని కుయ్యేరు గ్రామములో సిండిప్రోలి లక్ష్మణకవి యను సుప్రసిద్ధాంధ్రకవియుండెను. పండితులో కవులో యిద్ద ఱొక్కచోట నుండినప్పుడు పరస్పరస్పర్థ లేకుండుట మనలో నరుదు. లక్ష్మణకవి యావఱకే రావణదమ్మీయమును రచియించి వయస్సునందుఁ గృష్ణమూర్తిగారికంటె నిరువదియేండ్లు పెద్దవాఁడయి యాంధ్రకవిత్వమునం దాఱితేఱినప్రౌఢుఁడు. తన కున్నంతసంస్కృతపాండిత్యము లేదని యాతని నధిక్షేపించి కృష్ణమూర్తికవి పిఱ్ఱువీఁగుచుండెను; తనవలె నాంధ్రకవిత్వము చెప్పనేరఁడని యాతని నాక్షేపించి లక్ష్మణకవి తృణీకరించుచుండెను. కృష్ణమూర్తికవి పాండిత్య మెంత యెక్కువ కలవాఁడైనను లౌకికజ్ఞాన మధికముగా లేని శుద్ధశ్రోత్రియశిఖామణి; లక్ష్మణకవి యల్పపాండిత్యము కలవాఁడేయైనను లోకానుభవమును యుక్తిచమత్కారమును నధికముగాఁ గల లౌకికశిరోరత్నము. అట్లగుటచే నిరువురుఁ దారసించినప్పు డెల్ల లక్ష్మణకవియే మేలుచేయి యగుచుండెను. ఈవైరకారణమునుబట్టియే కాజలూరిలో సర్వకామదాపరిణయ పఠనకాలమునందుఁ గృష్ణమూర్తిగారికిఁ బరాభవము సంభవించెను. అట్లు శృంగభంగము నొంది యాయవమానమును సహింపలేక తరువాత నల్పకాలములోనె కృష్ణమూర్తిగారు రామచంద్రపురమును విడిచి వెడలిపోయిరి. జ్యేష్ఠుఁడగు రామచంద్రరాజుగారుండఁగా స్వరాజధానిలో ననుజుఁ డగుజగన్నాధరాజు కృతినందుట యనుచితమని యాసభ కాజలూరిలో జరపఁబడెను.

కృష్ణమూర్తికవి సేతుయాత్రకుఁ బోయి వచ్చుచుండఁగా నాతని ప్రఖ్యాతిని విని కాళహస్తిప్రభు వగు దామెర వేంకటపతిరాయనింగారాయనను తమసంస్థానమునం దుండవలసినదని వేఁడుకొన్నందున కృష్ణమూర్తిగారక్కడఁ బదునాలుసంవత్సరములుండిరి. కవి నాదరించిన యీవేంకటపతిరాయనింగారు గోదావరీమండలమునందే జననమొందినవారయి కాళహస్తి రాజపత్ని చేత స్వీకరింపఁబడిన దత్తపుత్రుఁడై ౧౮౩౮వ సంవత్సరము మొదలుకొని ౧౮౮౧వ సంవత్సరమువఱకును రాజ్యముచేసెను. కాళహస్తి సంస్థానములో నీయనకు నెల కఱువదిరూపాయలు జీతమేర్పఱుపఁబడెను. కాళహస్తికి వెళ్ళకపూర్వమో వెళ్ళి వచ్చినతరువాతనో కాకినాడలో నైదుసంవత్సరములు గోదావరీమండల కరగ్రాహివద్ద సిరస్తాదారుగానుండిన తుళసింగసెట్టిగారియింటఁ బురాణము చెప్పుచుండి యాయనప్రోత్సాహముచేత శ్రీనీతిశాస్త్రమనెడి యేకాశ్వాసగ్రంథమును రచియించెను. ఆగ్రంథమునందుఁ గవి తుళసింగసెట్టి నిట్లు వర్ణించెను—

సీ. శార్ఙ్గభృచ్చరణాంబుజనిసేవ యొనరించు సజ్జనసంతతి సత్కరించు
నాశ్రితకోటి సమ్యగ్గతి నలరించు నాత్మబంధుజనాళి నాదరించు
సరళనీతిపథానుషంగాప్తి విహరించుఁ బరిజనాసత్కృతిఁ బరిహరించు
నగణితానుపమానసుగుణలీలఁ జరించు నార్యగుణయాప్తుల ననుసరించు
ననుయశంబున ననిశంబు ఘనతఁ బ్రబలు
నట్టి తుళసింగసెట్టి నన్నఖిలబుధుల
మ్రోలనుతియించి యోకృష్ణమూర్తిసుకవి
సంఘటింపుము శ్రీనీతిశాస్త్రమనుచు.

ఈయన కవిత్వరీతిని దెలుపుటకయి మఱి రెండుపద్యము లీశ్రీనీతిశాస్త్రములోనివి యిం దుదాహరించుచున్నాను—

ఉ. మన్ననచేయు నుబ్బ నవమానముచేయఁగ స్రుక్కకే పతిం
జెన్నలరంగఁ గొల్చుచు విశిష్టతమాత్మకులప్రతిష్ఠ సం
పన్నము చేయుచుం దనదు బంధులచేతఁ బొగడ్తఁగన్న య
య్యన్నులమిన్నచే జగము లన్నియు నిల్చు నటంచు నెంచెదన్.

ఉ. ఎచ్చటనో ప్రయాసపడి యేమయినం బతి తెచ్చి వేశ్యతో
నిచ్చినఁ గొంచె మేనియు మహీయముగా మది నెంచి బాంధవు
ల్మెచ్చఁగ నొచ్చె మించుకయు లేనిసమగ్రగుణంబు పెంపునన్
హెచ్చఁగఁజేయు భర్తృయశ మిట్టిసతి న్వినుతింతు రందఱున్.

ఈ పుస్తకముగాక యోతక్కవికృతమైన వేంకటాచల మాహాత్మ్య మొకటికూడ ముద్రింపఁబడి యున్నదిగాని దానిరచన కవియొక్క ప్రఖ్యాతికిఁ దగినంత శ్రేష్ఠముగాఁ గనఁబడలేదు. కాళహస్తిలోఁ బ్రవేశించిన కొంతకాలమునకే కవిచే రచియింపఁబడిన వీక్షారణ్యమాహాత్మ్యముకూడ శ్రీతుళసింగసెట్టికే యంకిత మొనర్పఁబడినందునఁ గాళహస్తి పోకముందే యాతనివద్ద నుండెనేమో యని సందేహముకలుగుచున్నది. కాళహస్తిలో నున్నకాలమున నీకవిపుత్రుఁడయిన సర్వశాస్త్రి యమరుకమును సంస్కృతమునుండి తెనిఁగించి కాళహస్తిసంస్థానాధీశ్వరుని కంకితము చేసెను. ఈయమరుకములోని రెండుమూడు పద్యముల నిం దుదాహరించుట కేవలాప్రస్తుతప్రశంస కాకపోవచ్చునని యట్లుచేయ సాహసించుచున్నాను.

శా. శ్రీమీఱం దగు కాళహస్తినగరీసీమంబు ధామంబుగా
సేమం బాశ్రితకోటి కీఁవగు ప్రశస్తింబొల్చు నాసామియా
సామిరాకృత భూమి భృద్వరతనూజాకామి సేమంబుతో
శ్రీమద్దామెర వేంకటేంద్రులకు వాసింగూర్చు నిష్టార్థముల్.

చ. అవునవుఁ దెల్లమయ్యె వృథయాపలుమాటలిఁకేమి సామి నీ

కివురని నీదుప్రేమరస మిట్లగునేని స్వభావచంచలం
బవు హాతజీవితంబు చనునంతన మా కొకబాధ కల్గునే.
చ. మును మన కించుకంతయును మూర్తివిభేదము గానలేదు నె
మ్మనమున మీఁదం బ్రియమానమున్వము గల్గెఁ బరస్పరంబు న
య్యె నిపుడు నీకు భర్తృపద మేనును భార్యయనంగ నైతి జీ
వనగతవజ్రకర్కశము బాటిలె నిట్టిఫలంబు నేఁటికిన్.

ఈకృష్ణమూర్తికవి కాళహస్తిలో నున్నప్పుడు చేయఁబడిన ప్రధాన గ్రంథ మింకొకటి గలదు. ఆ కాలములో నీయనకును చెన్నపురి శాస్త్ర పాఠశాలలో నాంధ్రపండితుఁడైన పరవస్తు చిన్నయసూరిగారికిని సిద్ధాంత కౌముదిలోని సూత్రవిచారము కొంత నడచెను. మన పండితులు సాధారణముగా మత్సరగ్రస్తులగుట సుప్రసిద్ధమేగదా? అట్టివారీర్ష్యచేతఁ దమకు లాభము లేకపోయినను బరులకు నష్టము కలుగుటయే తమ యభీష్టసిద్ధిగా భావించి కొన్నిసమయములయందుఁ బరుల కీర్తికి భంగము కలిగింపఁజూతురు. అంతకుఁబూర్వము కొంతకాలముక్రిందటఁ జిన్నయసూరి బాలవ్యాకరణమును రచియించెను. దానితో సరిపోల్పఁదగిన యాంధ్రవ్యాకరణ మావఱకు వేఱొకటి లేదు. ఇట్లుండఁగాఁ గృష్ణమూర్తిగారిచేఁ జేయఁబడిన వ్యాఖ్యానముతోఁ గూడిన హారికారిక లనఁబడెడి యాంధ్రవ్యాకరణ సూత్రగ్రంథ మొకటి యటుతరువాత నల్పకాలమునకు వెలువడెను. అదియే హారిభట్టకృతమై యథర్వణాదులచేఁ బేర్కొనఁబడిన కారికావళి యైనపక్షమునఁ జిన్నయసూరి తన వ్యాకరణములోని సూత్రములనన్నిటిని హారికృతగ్రంథమునుండి దొంగిలించి తనపేరిటఁ బ్రకటించినట్లు స్పష్టమగును. అయినను మూలగ్రంథములోఁ జూపఁబడిన లక్ష్యములు కొన్ని యథర్వణాచార్యుల కివలి యాధునిక గ్రంథములలోనివగుటచేత వ్యాఖ్యానమునుమాత్రమేకాక మూలగ్రంథమునుసహితము కృష్ణమూర్తిగారే రచియించిరేమోయని పలువురు సందేహపడుచున్నారు.

అట్టి గ్రంథమును రచియింపఁగల సామర్థ్య మావిద్వత్కవికిఁ గలదనుటకు సందేహము లేదు. ఈయన యిటువంటి గ్రంథకల్పనముచేయ సంశయ పడువారుకారు. చూపుటకయి చరమదశయందు మాడుగల్లులో నున్నపు డొక్కరాత్రిలోఁ జేసిన ట్టీయన కారోపింపఁబడిన యశ్వశాస్త్రకథ కొంత తోడుపడుచున్నది.

కృష్ణమూర్తికవిగారు కాశీనుండి స్వదేశమునకువచ్చి శ్రీరాజా గంగాధర రామారావుగారి కడ్డ పిఠాపుర సంస్థానములోఁ బ్రవేశించుట కయి నాలుగయిదు మాసము లచటనుండి కృషిచేసిరిగాని ప్రయత్నము సఫలమయినదికాదు. శ్రీరాజాగారే నూఱురూపాయలును జోడుశాలువలు నిచ్చి యాయనకు సెలవిచ్చిరి. తరువాత నాతఁడు తనకుమారుని యత్త వారియూ రయిన జగ్గమ్మపేట గ్రామమునకుఁ బోయి యక్కడఁ గొంతకాలముండి తత్సంస్థానాధిపతి ననుసరించెను. పీఠికాపుర సంస్థానాధిపతియయిన శ్రీరాజా రావు నీలాద్రిమాధవరాయనింగారి భోగ భార్యాపుత్త్రుఁడును జగ్గమపేట సంస్థానాధిపతియునగు శ్రీరాజారావు వేంక టరాయఁడుగా రాయనకు సంవత్సరమున కినూఱురూపాయలు వచ్చు మాన్యమును రెండుశాలువలు నిచ్చి సత్కరించిరికాని నెలజీత మేర్పఱచి తమ యాస్థానపండితునిగాఁ జేకొనలేదు. తరువాత నీకవి యైనవల్లిగ్రామములోఁ గొంతకాలము వసించి యక్కడనుండి శ్రీజగన్నాథయాత్రకుఁ బోయి పురుషోత్తమక్షేత్రమును సేవించి మరల వచ్చునప్పుడు త్రోవలో మాడుగల్లుసంస్థానమునకుఁ బోయి తత్సంస్థానాధిపతియగు శ్రీకృష్ణభూపతి గారిని సందర్శించెను. ఆయన విద్వత్కవుల నాదరించు రసికాగ్రగణ్యుఁ డగుటచేత వేయిరూపాయలువచ్చు భూము లిచ్చి కృష్ణమూర్తిగారిని తమ సంస్థానములో నుంచుకొనెను. ఈకవి మాడుగల్లు ప్రవేశించిన తరు వాతఁ దానుజేసినజగన్నాథయాత్రనుగూర్చి నీలశైలనాథీయ మనుపేర సంస్కృతములో నొకగ్రంథమును రచించెను. రెండుసంవత్సరము లాసం

స్థానములోనుండి కృష్ణమూర్తిగారు ౧౮౭౦ వ సంవత్సరమునకుఁ దరువాత నెనుబదియేండ్ల ప్రాయమున నక్కడనే కాలధర్మము నొందెను. ఈయన సంస్కృతమున యక్షోల్లాస మనుకావ్యమును, వల్లవీ పల్లవోల్లాసము, మదనాభ్యుదయము నను భాణములను, రామాయణకథను జెప్పు కంకణబంధమును, హారికారికలను, నీలశైలనాథీయమును, ఆంధ్రమున సర్వకామదాపరిణయమును, వేంకటాచలమాహాత్మ్యమును, పీఠారణ్యమాహాత్మ్యమును, పంచతంత్రమును, వసుచరిత్ర వ్యాఖ్యానమును, రచియించెను.

---

126. మంత్రిప్రగడ సూర్యప్రకాశకవి

ఈకవి మాడుగొల్లు సంస్థానమున కృష్ణభూపతిగారి యాస్థానకవిగానుండి, కృష్ణార్జున చరిత్రమును రెండాశ్వాసముల ద్వ్యర్థికావ్యమును సీతారామచరిత్ర మనెడి యాఱాశ్వాసముల ప్రబంధమును భీమలింగశతకమును రచియించెను. ఈయన యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; శరభరాజామాత్యపుత్రుఁడు. ఈయన నలువదిసంవత్సరములక్రిందటఁ గాలధర్మమునొందెను. ఈయన కవిత్వము మృదుమధుర పదగుంభితమయి మనోరంజకముగా నుండును. కవితారచనను జూపుటకయి యీకవి గ్రంథములలోనివి కొన్ని పద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

కృష్ణార్జున చరిత్రము.

మ. రమణీ నీగుణరూపసంపదకు లో రంజిల్లి గోపాలకుం
డమితారాతివిదారితామరసపత్రాక్షుండు కాంత్యుజ్జ్వల
త్కమనీయాకృతి రాజదర్జునసమాఖ్యాశాలి ధీరుండు బా
సుమనోరత్నము నీయధీన మగుచున్ శోభిల్ల జేసెంజుమీ. ఆ. ౧.

చ. కుతలమునందు భాగ్యమునకుం దగుకార్యము చేయునంత వి
శ్రుతయశయౌ సుభద్ర కరిసూదనవిక్రముఁ డైనగోపరా
ట్సుతునకు సమ్మతంబుగ విశుద్ధగుణాకర భూరిపుణ్యక
వ్రత మొగిఁజేయఁగాఁదగువివాహమహోత్సవమానసంబ్రజల్ ఆ-౨

సీ తా రా మ చ రి త్ర ము

శా. ధాత్రాదిక్రతుభుగ్వరుల్ ఘనతపోధారేయుమహా నీదుచా
రిత్రం బెన్న నశక్తులే జడుఁడ వర్ణింప న్సమర్థుఁడనే
పుత్రీభూతసరస్వతీధవసితాంభోజాక్షరుద్రుండ వో
యత్రీ యత్రివిగాక నీకు సరియే యన్యాగ్రజన్మాగ్రణుల్. ఆ. ౩.

చ. కనకకురంగ మేల వనిఁ గన్పడెఁ గ్రక్కున దానిఁదేరఁ బో
మ్మని పతి నేలపల్కితి నహమ్మతి నారఘుభర్త దానివెం
టను జన నేల యగ్రజుని డాయఁగ లక్ష్మణు నేలపంచితిక్
జనవరుఁ బాసి యే నిచటఁ జావఁగ నిన్నిపొసంగె దైవమా. ఆ-౪

చ. నను శర ణొందినన్ దనుజనాయకు రావణునైనఁ బ్రోతు నీ
తనిఁ గరుణించుటెంత శపథం బిదిగావున మీర లేగి చ
య్యనఁ గొనిరండు వీని కభయంబు నొసంగితినన్న భానునం
దనుఁడు కృపాంబురాశియగుదాశరథిం గని పల్కె నమ్రుఁడై. ఆ ౬

భీ మ లిం గ శ త క ము.

క. తత్పురుషబహువ్రీహుల । సత్పురుషులు రామదాసశబ్దార్థ మిలక్
ద్వత్పరముగఁ జెప్పుదురు జ । గత్పావన భీమలింగ కలుషవిభంగా.

క. ఏసురవరులం దైనక్ । నీసామర్థ్యంబు గలదె నిఖిలాధీశా
దాసీకృత జననీకృత । కౌసల్యా భీమలింగ కలుషవిభంగా.

127. ఫక్కి వేంకట నరసయ్య

ఈ కవి శకుంతలాపరిణయ మనెడి మూడాశ్వాసముల ప్రబంధ మును రచియించెను. ఇతఁడు సృష్టికరణవంశజుఁడు; భరద్వాజగోత్రుడు; నారాయణమంత్రి పుత్త్రుఁడు. ఇతఁడు విశాఖపట్టణములోని క్రైస్తవో న్నత పాఠశాలయం దాంధ్రోపాధ్యాయుఁడై యుండెను. ఈ కవి యీ శకుంతలా పరిణయము నలువది సంవత్సరముల క్రిందట ననఁగా ౧౮౬౬వ సంవత్సరమునందు ముగించెను. ఇతఁడు అమరపదకల్పద్రుమము, నారా యణ స్తవము, మదనసాయకాపరిణయము, కవిదర్పణచ్ఛందము, నారా యణశతకము, కుమారీశతకము అను గ్రంథములనుగూడ రచియించెను. ఈతని కవిత్వము సలక్షణమయి మనోహరముగానున్నది. శకుంతలాపరిణ యములోని కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను—

మ. తనరన్ బున్నమరేలఁ దత్పురవరోద్యత్సౌధసంచారికల్
వనజారిన్ ఘనసారఖండమని కేలంబట్టి దీపాగ్రసీ
మను ధూపక్రియఁ జూపఁ గంది చెలులం బ్రార్థింపఁగా వీడినన్
జనిరెమెన్ వాసికిసాఁటనుండి కలిగెం జంద్రాఖ్యయుం జిహ్నమున్. ఆ-౧

చ. తొలకరికాదు మిం చనఁగఁ దోయజబాంధవుఁ డస్తమింపలే
దలజలజారిరేఖయన నంతటనంతట నాడుచుండె మే
ల్తళుకుకడానిబొమ్మయనఁ దావులపూవులదీవెయోయన న్
గిలకిల చిల్కపల్కులనొగిం బదపద్యము లుగ్గడించునే? ఆ-౨.

చ. సరిసరి పొమ్ము బాల యొక చక్కని బాలునిఁజూపి వీఁడు నీ
వరసుతుఁ డేనురాణి నని నావిరిఁజెప్పఁ దొడంగుచుంటి వీ
దొరలును మంత్రులున్ ఘనబుధుల్ ననుఁ బాయకయుందు వెప్డు నీ
రెఱుఁగనిరీతిగా నడవి నెన్నఁడు నిన్నుఁ బరిగ్రహించితిన్? ఆ-౩.

128. వేల్పూరి వేంకటేశ్వరకవి

ఇతఁడు గోవ్యాఘ్రచరిత్రమును, విచిత్రరామాయణమును పద్య కావ్యములుగా రచియించెను. ఈతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; మౌద్గల్య గోత్రుఁడు; బ్రహ్మనామాత్య పుత్రుఁడు. ఈతని నివాసస్థలము విశాఖ పట్టణ మండలములోని విజయనగర సంస్థానమునందలి రావివల్సయను గ్రామము. కవి ౧౮౫౧ వ సంవత్సరమున స్వర్గస్థుఁ డయినందున, దాదాపుగా నిప్పటి కేఁబదిసంవత్సరములక్రిందట నుండినవాఁడు. అక్కడక్కడ వ్యాకరణవిరుద్ధములైన ప్రయోగములు కానఁబడుచున్నను, మొత్తముమీఁద నీతని కవిత్వము మృదువయి శ్రావ్యముగానున్నది. కవికృతములైన రెండు కృతులనుండియుఁ గొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను.

గోవ్యాఘ్రచరిత్రము.

చ. మధుకరపంక్తిఝుంకృతులు మత్తమయూరనిశాతషడ్జముల్
పృథుతరకోకిలధ్వనులుఁ బెంపలరారు శుకప్రసంగముల్
శిథిలముగాని శారికలచిందఱవందఱచే వనాళిఁ బెం
పొదవఁగ నొప్పెఁ బుష్పమధురోజ్జ్వలసత్ఫలసంకులంబులై.

ఉ. సంతతి లేక డెందమునఁ జాలఁగ డస్సి వ్రతోపవాసముల్
సంతత మేనొనర్చి కడుసంతస మొప్పఁగ వేల్పుఱేండ్ల మ
త్యాంతమునందు నిల్పి హిమశైలసుతేశ్వరు నిందుమౌళి న
త్యంతసుభక్తిఁ గొల్చి సుతు నంచితవాంఛ ఫలించఁగాంచితిన్.

విచిత్రరామాయణము.

ఉ. మామ యిదేటిమాట వినుమా మనమాఱడిఁజెందె నింక నా
సామిపదంబులాన కొనసాగదు తొల్లిటిభంగి దానవ
గ్రామణియింట నున్నజనక ప్రభుకూఁతురి నేలుకొంట కా
రాముని కొప్పె నొప్ప దనరాదు ప్రభుత్వముగల్గువారలన్. ఆ-౧.

ఉ. పుట్టి జగంబులోనఁగల భూసురుల న్మునులన్ నృపాలురన్
బట్టి వధించి వజ్రధరుపాలికి నేగి సుపర్వకోటులం
గొట్టి సమస్తలోకములకున్ ములుసూపె నతండు నారదుం
డట్టితఱి న్వికుంఠపురమందు మురారిని జేరి యిట్లనెన్. ఆ-౨.

చ. కళుకులు దేరుబల్మిసిమికాంచనరత్నమయూఖముల్ దిశా
వలయముఁ బర్వ నచ్చరలు వైభవలీల నటింపఁ గిన్నరుల్
బలసి రథంబు చుట్టును సభక్తిని గొల్వ సిరోజబాంధవ్రం
డిల కరుదెంచెనో యన ధనేశుఁడు రాఁగ వియన్నిరీక్షుఁడై. ఆ-౩.

ఉ. ఇచ్చి నృపాలుఁ డిట్లనె మునీశ్వర నీ కెదురాడి నిల్వనా
చిచ్చరకంటిసామికిని జెల్లదు నేనన నెంత యీసుతుల్
సచ్చరితుల్ సురారు లతిసాహసు లాహవకోవిదుల్ కడుం
గుచ్చితు లస్త్రశస్త్రముల గోప్య మెఱింగినవారింతు రెప్పుడున్. ఆ-౪

మ. ఎదిరిం దన్ను నెఱుంగలేక మదిలో నెవ్వాఁడు సన్నిట్లు బె
ట్టిదుఁడై నాసయు పీనులుం దునిమె కాఠిన్యంబున న్మున్ను నేఁ
జెదరంజేసిన దేవదైత్యవరులం జింతింపఁగ్రో చూడు మా
కదనక్షోణిస్థలిఁ గూల్తు వానిఁ దెలియంగాఁ బల్కు వేనోదరీ. ఆ. ౫.

మ. శరసంధాన మొనర్చు ప్రౌఢిమము లక్ష్యం బూహగావించు నే
ర్పురు బాహాబలవిక్రమంబు సమరోద్యోగంబు సవ్యాపస
వ్యరిపుక్షీణమహాస్త్రపాతములు రౌద్రాకారముం గన్న నా
పౌరుషం బో వెఱపొందు నీశుఁ డయినంబుద్రానిజంబింతయున్ ఆ-౬.

ఈవిచిత్రరామాయణము గోపీనాథరచితాంధ్రవచనకావ్యము
ననుసరించి యీకవిచేఁ బద్యరూపమునఁ జేయఁబడినది. ఈవచనకావ్యము
ననుసరించియే యిటీవల గోదావరీమండలస్థ వెలగతుఱ్ఱుగ్రామనివాసియు
నాపస్తంబసూత్రుఁడును శ్రీవత్సగోత్రుఁడును సుబ్రహ్మణ్యేశ్వర సూ
పుత్రుఁడును నగు నరసింహదేవర వేంకటశాస్త్రియును వైదిక కవియు

నొక పద్యకావ్యమును రచియించియున్నాఁడు. ఈవద్దమానకవిచే రచియింపఁబడిన విచిత్రరామాయణమునందును వ్యాకరణదుష్టము లైన ప్రయోగములనేకములు కానఁబడుచున్నను మొత్తముమీఁద నీతనిగ్రంథము మొదటిగ్రంథమునకంటె నధిక రసవంతముగానున్నది. ఇందలిపద్యములనుగూడఁ గొన్నిటి నుదాహరించుచున్నాను—

ఉ. రామ విరాజమానరిపురాజకిరీటమణిప్రభాసుమ
స్తోమ సుపూజితాంఘ్రి యఘసూదనతారకనామ నీరద
శ్యామ సురేంద్రవందితవిశాలపరాక్రమ కీర్తికామినీ
కామ కఠోరరాత్రిచరకాండవిఖండనభండనప్రియా. బాల.

ఉ. తెల్లనిమేనివానిఁ గడుతియ్యనిమాటలవానిఁ గప్పుడాల్
చల్లెడుగొంతువాని బులిచాఅల్లొలు బుజాలపైని రా
జిల్లఁగజేయువాని దెపచీరెలనూనినవాని నెత్తిపైఁ
జల్లనివెల్గుఁ దాలిచినసామిని జూచియహింద్రుఁడెంతయున్. అయో

ఉ. ఓసి యభాగ్యురాల పడియుండక యింట నిటేలవచ్చినా
వే సకలంబుఁబోయె నినుఁ బెండిలియాడినపూఁటనుండి నే
గ్రాసివి నీవు వేశ్మమునఁ బాదము పెట్టితి వంతకంతకుం
గా సాక లైన బట్టకొనఁ గట్టఁగలే దిఁక లేచిపోఁగదే—అరణ్య.

శా. ఆకంఠీరవనాదము న్విని మహాహంకారసంయుక్తుఁడై
నాకేశాత్మజుఁ డాహవంబునకు సన్నాహంబుతో నేగి నే
నాకయ్యంబున నింద్రపుత్రకసహాయార్థంబు శాఖామృగా
నీకంబు ల్గొలువంగ వెంటజనితిన్ స్నేహంబుపెంపొందఁగన్. కిష్కింధ

ఉ. ఎవ్వఁడవోరి యేమిపని కిచ్చటవచ్చితి నిల్వునిల్వు నీ
క్రొవ్వడఁగించి ప్రొద్దుకొమరుండువసించిన కొంకి కంపెదన్
మవ్వపుదెబ్బఁ జూడు మని మారుతివక్షమునందు మోఁదె నీ
వెవ్వతెవంచు గ్రుద్ది పడనీడ్చె సమీరసుతుండు రక్కసిన్—సుందర.

శా. ఏమీ దానవవీరులార యమవహ్నీంద్రాదులన్ గెల్చు సం
గ్రామోత్సాహము లెందుఁబోయెఁ బటుదర్పం బేటికిన్
మీమీయిమ్ముల కేగియుంటి రిదియేమీ వైరిక్షేత్రంబు మీ
సామర్థ్యంబును విక్రమక్రమరణోత్సాహంబులం జెల్పఁగన్— యుష్ఠ.

---

129. తిరుమలబుక్కపట్టణపు చినతాతాచార్యుఁడు

ఈకవి వడ్లమన్నాటి వెంకప్ప సోమయాజులగారి ప్రేరణముచేత విశ్వగుణాదర్శమును పద్యకావ్యమునుగాఁ దెనిఁగించెను. ఇతఁడు శ్రీనివాసాచార్యునిపౌత్రుఁడు; వేంకటాచార్యునిపుత్రుఁడు. ఇతఁడు నలువదియేఁబదియేండ్లక్రిందట కృష్ణామండలములో నుండినవాఁడు. కృతిప్రేరకుఁడైన వడ్లమన్నాటి వెంకప్పసోమయాజులగారి యజ్ఞమూలముననే కృష్ణామండలములోని వైదికనియోగిబృందముంగో రెండుకక్షలేర్పడినవి. ఈ కవియొక్క కవిత్వమునందుఁ గొన్ని వ్యాకరణదుష్టములైన ప్రయోగము లున్నను మొత్తముమీఁద కవనరచన సరసముగా నున్నదనియే చెప్పవచ్చును. ఆంధ్రవిశ్వగుణాదర్శములోని రెండుపద్యములిం దుదాహరింపఁబడుచున్నవి—

చ. ఘనవన భూముల న్మెలఁగి కన్నము వేసి గృహాళివిత్తముం
గొని చనువారి దొంగ లనఁగూడును పోషకు లైనవారిలె
క్కను గడుబొంకుపుచ్చి తదఖర్వధనంబులు దొంగిలింతు రీ
గణకులె దొంగ లీగణసకర్ములనే భజియింతు రీజనుల్.

చ. సురభితమాలముం గుసుమశోభితసాలము వీక్షణార్హబం
ధురతిలకాతిసాలము విధూతమహాదురితౌఘమూలముం
సరసరసాలముం బనసజాలము మాధవకేళిలోలముం
బరమగుణాలవాలమును బాయక చూడుము శేషశైలమున్.

130. మాడభూషి నృసింహాచార్యుఁడు

ఈకవి పల్లవీపల్లవోల్లాస మను మూడాశ్వాసముల ప్రబంధమును నూజవీడు సంస్థానాధిపతి యగు శ్రీశోభనాద్రి అప్పారావుగారి ప్రేరణము వలన రచియించెను. ఇతఁడు శ్రీవైష్ణవ బ్రాహ్మణుఁడు; నైధ్రువకాశ్యపగోత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; వేదాంతాచార్యులపుత్రుఁడు. ఈకవి యిరువది ముప్పదిసంవత్సరములక్రిందట నుండినవాఁడు. ఈయనకవిత్వము సలక్షణమయి నాతికఠినమయి శ్రావ్యముగానున్నది. పల్లవీపల్లవోల్లాసములోని రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. తనయులు పెక్కుగల్గినను దన్వికిఁ బుత్రిక పుట్టకున్న ని
త్తనువు నిరర్థకం బని మొదం దలపోయుదు రింతు లంచుఁ దా
మనమునఁ గొంతసేపు నృపమాని చింత యొనర్చి యేమిసా
ధనమునఁ గన్యకావదనదర్శనజన్యముదంబు గల్గునో. ఆ. ౧.

ఉ. పాండుతనూభవుండు తనబాంధవు లత్తఱి సంతసిల్లఁగా
గాండివ మేత్తెఱందిగిచి కల్పకృశానుసమానుఁడై లస
త్కాండముల న్నిగిడ్చి నృపకాండములం దెగటార్చి పేర్చి త
త్కాండమునకా ముదం బెసఁగ దద్దయునొత్తెను దేవదత్తముకా. ఆ. 3

---

131. కోటమరాజు నాగయ

ఈకవి యధ్యాత్మరామాయణమును పద్యకావ్యమునుగా రచియించెను. ఇతఁ డారువేలనియోగిబ్రాహ్మణుఁడు; కాశ్యపగోత్రుఁడు; భాస్కరమంత్రికిని శాయాంబకును బుత్రుఁడు. ఇతఁడు కృష్ణామండలములో ముప్పది నలువదిసంవత్సరములక్రిందట నుండినవాఁడు. కాఁణాదము పెద్దనకవికృతమైన యధ్యాత్మరామాయణమువలె కవిత్వమంత

ప్రౌఢముగా నుండకపోయినను మొత్తముమీఁద హృద్యమయి నిర్దుష్టమయియున్నది. అధ్యాత్మరామాయణములోని కొన్నిపద్యము లిందుఁ జూపఁబడుచున్నవి—

ఉ. ధరణీదేవ భవత్తపోమహిమ చోద్యం బయ్యె నిన్మెచ్చితిన్
వర మే నిచ్చెద హైహయుం దునిమి గర్వగ్రస్తులౌ రాజులన్
ధరణిం బేరడఁగించి కశ్యపున కీధాత్రీతలం బిచ్చి శాం
తరుచిందాల్చుమదాశనొందిపితృహత్యాత్తాపంబువారింపఁగన్ - బాలకాం

ఉ. రామ త్రిలోకవిశ్రుతు విరాధు నెఱుంగవె మద్భయంబునన్
వేములు మాను లీవనము వీడి పలాయితులైరి నీవు మీ
సేమము గోరెదేని యిట సీతను డించి నిరాయుధుండవై
భూమినదృశ్యవై ఖరినిబొమ్మురయమ్మునఁదమ్మునితోడుతన్ - అర॥కాం

ఉ. ఏనెఱిఁగించి నంతటనె యిమ్మకరాలయ మెంత దాటి లం
కానగరంబుఁ దుత్తుమురుగా నొనరింపఁగఁ జాలుఁ గార్ముక
జ్యాసినదప్రముక్తశరజాలములన్ రఘుసత్తముండు నీ
పైని మనంబుపెట్టి యొకపండును దెమ్మనఁడారగింపఁగన్ - సుందరకాం

మ. మునివర్యుల్ విజయోస్తుతే యనఁగ సమ్మోదంబుతో నేగి య
న్న నియోగించినభంగి నాలవణునిం జక్కాడి నిర్భీతిమై
జను లెల్లన్ వసియించుపట్టణము లిచ్చంజేసి తద్రాజ్యపా
లన నై పుణ్యముతోడ నిం పెసఁగెఁ గళ్యాణీభవానీసతీ. ఉత్తరకాం

132 కరాలపాటి రంగయకవి

ఈకవి భూతపురీమాహాత్మ్యము, కవిజనమనోహరము అను రెండు పద్యకావ్యములను రచియించెను. ఇతఁడు వైష్ణవ వైశ్యకుల సంజాతుఁడు. ఇతఁడు ౧౮౧౪ వ సంవత్సరమున జననమొంది ౧౮౭౬వ సంవత్సరమునందుఁ బరమపదము నొందెను. ఇతఁడు చెన్నపురిలోఁ గొంతకాలము పచ్చయప్పగారి పాఠశాలయందును గొంతకాలము రాజధానీ శాస్త్రపాఠశాలయందును నాంధ్రపండితుఁడుగానుండెను. మొట్టమొదట నాంధ్రభారత భాగవత రామాయణములను లేఖకప్రమాదజనితదోష రహితములుగాఁ బరిష్కరించి ముద్రింపించిన దితఁడే. ఇతఁడు తనతండ్రిని రామకవియని పేర్కొనుటయేకాక తనతాతయైన నారాయణసూరికూడ కావ్యరచన మొనర్చి కర్ణాటరాజులను మెప్పించినట్లు భూతపురీమాహాత్మ్యమునం దీక్రిందిపద్యముతోఁ జెప్పియున్నాఁడు-

ఉ. నాయక వేమహామహునిభవ్యవచోగరిమం బశేషభూ
 నాయకగోష్ఠిసత్కవిజనంబులచే ననిశంబు వర్ణితం
 బై యరవద్యతం బరఁగు నాగుణశాలి కరాలపాటి నా
 రాయణసూరిమౌళి దనరారె సుధీజనపద్మహేళియై.

మ. సకలార్య స్తవనీయభవ్యకవితాసంప్రీతకర్ణాటభూ
 పకులాధీశ్వరదత్తమత్తగజశశ్వద్దానధారాసము
 త్సుకరోలంబకదంబఝాంకరణవచ్చుంభద్గృహప్రాంగణుం
 డకలంకాశయుఁ డమ్మహాకవికులాఢ్యుండు సామాన్యుఁడే.

ఈకవి భూతపురీమహాత్మ్యములో మూడాశ్వాసములు రచియించు నప్పటికే యవసానకాలము సంప్రాప్తమయినందున గ్రంథము ముగియలేదు. ఈతని కవిత్వము నిర్దుష్టమయి మృదుమధురపదభూయిష్ఠమై రసవంతముగానున్నది. అయినను వ్యతిరేకార్థకముమాత్రము గ్రంథమునం

దక్కడక్కడ ద్రుతప్రకృతికముగాఁ బ్రయోగింపఁబడి యున్నది. శైలి తేటపడుటకయి యీతని గ్రంథములనుండి కొన్నిపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి.

కవిజనమనోహరము.

ఉ. పోయెఁగదే ననుం గడచి పోటరియై యదె వాఁడు రారె రా
రేయని వారిఁ దానును సమిద్ధరయంబున వెంటనంటి య
గ్గాయకపుంగవుం గదిసి గట్టిగఁ బట్టుకొనుండు నెమ్మెయిం
ద్రోయఁగ లేక చిక్కువడె దుష్టనిశాటుల నోర్వ శక్యమే.

ఉ. అక్కటికంబు లేని దనుజాన్వయజాతుఁడ వయ్యు నాఁకటన్
స్రుక్కుచు ధార్మికత్వము విశుద్ధమనోగతిఁ బాయలేక న
న్నిక్కడు ప్రీతితోననిచి తీయుపకారము నీసుశీలముం
దక్కొరులందుఁ గల్గునె బుధప్రియవర్తన నీకుఁదక్కఁగన్.

భూతపురీమాహాత్మ్యము.

ఉ. జారులు లేరు పేరుకొనఁ జారులకాని యనారతం బనా
చారులు లేరు తత్త్వసువిచారులకాని సరోషభీషణా
కారులు లేరు నిచ్చ లుపకారుల కాని విమర్శచేయఁగాఁ
బౌరులలోన నమ్మనుజపాలధరా పరిపాలనంబునన్. ఆ-౧.

ఉ. ఈశ గిరీశ నేరమి సహింపుము డింపుము రోష మప్రతీ
కాశము నీమహత్త్వ మెఱుఁగం దగువారము కాము సత్కృపా
పేశలదృష్టిఁ గన్గొను మపేతకళంకులఁ జేయుమయ్య లో
కేశ శరణ్యదీనులము హీనుల మెంతటివార మల్పకున్. ఆ-౨.

ఉ. అమ్మునివర్యుభార్య వినయమ్మును భయమ్మును బ్రియమ్ము నెప్పుడున్
నెమ్మది సందడింప మగనిం బరిచర్యలఁ దృప్తుఁ జేయుచున్
సమ్మద మారఁగా నతిథిసంఘముఁ దన్పుచు దేవతావితా
నమ్ముల భక్తిఁగొల్చుచు గుణమ్ములు సాధుగణమ్ములెన్నఁగన్. ఆ-3.

133. దామరాజు లక్ష్మినారాయణ

ఇతఁడు బృందావనవిహార మనెడి మూఁడాశ్వాసముల పద్యకావ్యమును రచియించెను. ఇతఁ డాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; శ్రీవత్స గోత్రుఁడు; శివరామామాత్యపుత్రుఁడు. ఇతఁడు తన బృందావనవిహారమును మల్కాపురములోని సీతారామస్వామి కంకిత మొనర్చెను. ఇతఁడు తరువాత గోదావరిమండలములోని యేలూరునకు వచ్చి యచ్చట నివాస మేర్పఱుచుకొన్నట్టు తెలియవచ్చుచున్నది. ఈతనిసంతతివారు మూఁడు తరములనుండి యేలూరునం దున్నారు. ఇతఁ డఱువదిసంవత్సరముల క్రిందట నుండినవాఁడు. ఈతని కవిత్వమునందు వ్యాకరణదోషము లనేకములు గానవచ్చుచున్నను, మొత్తముమీఁదఁ గవిత్వము మృదువుగాను మనోహరముగానునున్నది. బృందావనవిహారములోని రెండుమూఁడు పద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. ధారుణిలోనఁ జూచి విశదంబుగ నెంచిన స్త్రీల కందముల్
చారుగుణప్రధానములు చక్కఁదనంబున కేమిలెక్క యా
నారసగంధికిన్ మిగులఁ జక్కఁదనంబుకు భూషణంబుగా
మీఱె లసద్గుణావళియు మించుగ సొంపుగ నెన్నిభంగులన్. ఆ-౧.

మ. కులగోత్రంబుల లేక నిర్మలముగా గూఢీకృచాధిక్యని
స్తులమాధుర్యనిరూపదీపకలితస్థూలైకతాసద్గుణో
జ్జ్వలులై జన్మములంచుఁ బూనుకొని కృష్ణస్వామి రాముండు గో
ల్లలకుం జేతురు చేయరానిపనులన్ లజ్జించెదం జెప్పఁగన్. ఆ-౨.

చ. మొఱ లిడువారిమొఱ్ఱ లవి ముందుగ వింటిను వెంటనుండు నా
కఱమఱ లేదు వారియెడ న్యాయముగా విహరింతు నెంతుఁ ద
త్తఱమున వారియాపదలు దాటఁగఁజేయుదుఁ దత్క్షణంబునన్
మఱవక నన్నుఁ గొల్చుటకు మాటుగనుండెద నింతె చూడరే.ఆ-3.

134. త్యాగరాజ మొదలి

ఇతఁడు శుద్ధద్రావిడియైనను దెనుఁగుభాషయం దత్యంతాభిమానము గలవాఁడయి యాంధ్రభాషయందుఁ జక్కని పాండిత్యము సంపాదించి పెక్కుగ్రంథములను జేసినవాఁడు. ఇతఁడు చేసినగ్రంథములలో విద్వత్కర్ణామృతమను నామాంతరముగల సుబ్రహ్మణ్యవిజయమనెడి యైదాశ్వాసముల ప్రబంధము ప్రధానమయినది. ఈకవిచే రచియింపఁబడిన పుస్తకములలో ఛందోగత్నాకరమను చిన్న ఛందస్సుకూడ ముద్రింపఁబడియున్నది. ఇతఁడు ౧౮౩౦ వ సంవత్సరప్రాంతమునందు జననమొంది యిరువదియైదు సంవత్సరములక్రిందటఁ గాలధర్మమునొందెను. ఇతఁడు నారాయణమొదలారి కుమారుఁడు. ఈగ్రంథరచనకాలమునందితఁడు ఇంజనీరింగు డిపార్టుమెంటులో అసిస్టాంటు ఓవరుసీయరుగానుండెను. ఇతఁడు తాను మొట్టమొదట నాంధ్రభాషాభ్యాసముం జేయుటనుగూర్చి యిట్లు వ్రాసికొనియున్నాఁడు—

"బాల్యంబునఁ బ్రథమం బాంధ్రభాష నభ్యసించుటమనోదర్పణపారదంబుగదా? నాలుగేఁడులు నిండినతోడనే లసదుచ్చారణసస్యవృద్ధిఁగోరు మానవహాలికులు జిహ్వావలజంబునకు హాలంబుగా నెంచు నాంధ్రభాష నాకు బ్రథమముం దభ్యాసమయ్యె. సమధికోచ్చారణలేని ద్రవిడదేశస్థులలో నొకండ నయ్యు నాకలవారికిఁ గల లేమి లేమియయ్యె. సంస్కృత ద్రావిడ హూణప్రముఖభాషలనాయాసలభ్యంబులయ్యె."

ఇతఁడు తన చిన్నపొత్తములకు సహితము పెద్దపేరులుపెట్టి యాత్మస్తుతిని గొంతయధికముగాఁ జేసికొన్నను, మొత్తముమీఁద నీతని కవిత్వము సలక్షణమయి హృద్యముగా నున్నది. కవితారచనను జూపుటకయి సుబ్రహ్మణ్యవిజయములోని కొన్ని పద్యములిం దుదాహరింపఁబడుచున్నవి—

మ. భువనంబు ల్జడమయ్యె భంగతతులం బొందెం బురవ్రాత మొం
దవనత్వంబులు లేక చిక్కెమును ముఖ్యావాసముల్ జంతుసం
ఘవిభ ల్వారిత మయ్యె లోకరమవీఁక స్వంక రయ్యె న్నవైం
దవభూషా యికనైనఁ గర్బురకులోద్భూతిమాయించవే. ఆ. ౧

ఉ. నెమ్మది యల్కఁ గొంత భయనీతిని వల్దనిపల్క మేనిపైఁ
గ్రమ్మెడిపుల్క లోల్క భయరాగముచిల్క మరుండు దైవకా
ర్యము దలంచి మోహనశరంబు కరంబునఁ బూని యిక్షుచా
పమ్మున నుంచివైవఁ దెగువం దివియంగ హరుండు వేసుకన్ ఆ. ౨.

చ. తన కపరాధసంచయశతం బొనరించిన నోర్చుఁగాని తాఁ
దననతపాళి నేర్చినమదస్మయయుక్తుని నాప్తుఁడైనఁ దు
న్మ నతఁడు గాన దేవతలు పొందినవా రతనిం దదీయులన్
సనయతఁగూడి తద్వినతిసల్పి సుఖింపుము దానవేశ్వరా. ఆ. ౩.

ఉ. తారల నెన్నవచ్చు నలదైత్యబలేశుల నెన్నరాదు కాం
తారతృణాళి నెన్నసగుఁ దచ్చతురంగబలంబు నెన్నరా
దార పయోధియుం దిసుక నారసి యెన్నఁగవచ్చుఁ దద్బలో
దారమహాయుధాంబకకదంబము నెన్నఁగరాదు బ్రహ్మకున్. ఆ. ౪.

మ. ఘనమాయావులు నిత్యచంచలులు నిష్కాముల్ స్వకార్యానుకూ
లనవోపాయవిధిజ్ఞు లస్థిరమృషాలాపుల్ కృపాశూన్యు లెం
దునుఁ బుంవర్యులు దేవదేవు లెపుడున్ దుర్వారసంపత్సమూ
ర్తిని తాంతాంధులు పల్క నేల మగవారి న్నమ్మఁగా వచ్చునే.ఆ.౫.

135. ఓగిరాల జగన్నాధకవి

ఈకవి సుమనోమనోభిరంజన మనుపేర నైదుల్లాసముల ప్రబంధమును రచియించెను. ఈతఁడాఱువేలనియోగిబ్రాహ్మణుఁడు; గోదావరీమండలములోని నీలపల్లిగ్రామ నివాసుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; భారద్వాజగోత్రుఁడు; వేంకటేశ్వరామాత్యపుత్రుఁడు. ఇతఁడు తనచరమదశయందు కాకినాడపురమునుండి సుధీరంజనియను మాసపత్రిక కధిపతియయి సుమారు పదునేనుసంవత్సరములక్రిందట లోకాంతర గతుఁడయ్యెను. ఈయనయు నీయన పెదతండ్రికుమారుఁడైన రంగనాథకవియు మఱికొందఱును సుప్రసిద్ధులైన శ్రీమంత్రిప్రెగడ వేంకటరామపంతులవారియొద్ద లక్షణ గ్రంథములను జదివి మంచికవీశ్వరులైరి. శ్రీమదోగిరాల రంగనాథకవినిగూర్చి యీజగన్నాథకవి తన సుమనోమనోభిరంజనమునం దిట్లు వ్రాసియున్నాఁడు—

గీ. వారిలో రంగనాథుండు పండితోప
లాల్యమానవీనకల్యాణకల్ప
వల్లికాముఖ్యరసవత్ప్రబంధరాజ
కల్పనాదక్షుఁడై ఘనఖ్యాతి మెఱసె.

ఈరంగనాథకవి జగన్నాధకవికంటెను సమర్థతరుఁడనియు నధిక లక్షణవేత్తయనియుఁ బేరువడసినను, ఇతఁడు చేసినగ్రంథము లేవియు ముద్రింపఁబడకుండుట శోచనీయముగా నున్నది. ఏతత్కవికృతమయిన ద్విరేఫదర్పణ మిప్పు డముద్రితగ్రంథచింతామణి యందు ప్రకటింపఁబడుచున్నది.

జగన్నాథకవి తన ప్రబంధమును ౧౮౭౯ వ సంవత్సరమునందు ముద్రింపించినను, ఆవలికతఁడు ముప్పదిరెండుసంవత్సరముల క్రిందటనే దానిని ముగించియుండెను. ౧౮౭౮వ సంవత్సరమున నేను పాఠశాలలోఁ

జరుపుకొనుచుండిన కాలములో సుమనోమనోభిరంజనములోని మొదటి మూడాశ్వాసములను వ్రాసికొనియున్నాను. అయినను కవి యీమువ్వది సంవత్సరములలోను గ్రంథమునకు మెఱుఁగుపెట్టి సంస్కరించి యొక్కువ వన్నె తెచ్చెను. ఈ గ్రంథమును సర్వకలాశాలాధ్యక్షులు పట్టపరీక్షకుఁ బఠనీయ గ్రంథమునుగా ననేకపర్యాయములు నిర్ణయించి యుండుటచేతనే దాని ప్రాశస్త్యము వెల్లడి యగుచున్నది. కవిత్వము రసవంతమయి నిర్దుష్టమయి యనర్గళధార కలదిగా నున్నది. కవనరీతి తెలియుటకయి సుమనోమనోభిరంజనములోని పద్యములఁ గొన్నిటి నిం దుదాహరించు చున్నాను.

మ. నిరతాన్యోన్యమనస్సముద్భవసపత్నీవైరమూలానసో
దరతిన్ గొబ్బునఁ జిత్రభానునకుఁ జిత్రత్వాహితారాత్ఛాయికిన్
సరవిన్ స్వస్తితుల న్వచించుకొన నిచ్చెంబోవు మార్తాండజాం
బరశైవాలినులో యనందగుఁ బురద్వార్ణీలహీరప్రభల్. ఉ ౧.

చ. చందురునందుఁ గల్గురుచి సంపెగతావియుఁ బారిజాత మా
రందమునందుఁ గూరిచి హిరణ్యపరాగచయంబు చల్లుచున్
బొందుగ మేళవించి మెఱుపుంజళుకుల్ పయిఁబూసి యాశతా
నందుఁడు నేర్పుమీఱ జతనంబుగఁ జేయఁగఁబోలు నాసతిన్. ఉ-౨.

చ. చిలుకతాలుపూవజీరనుకృషీవలుఁ డంగనచిత్తవప్రమున్
జలజకలంబలాంగలములన్ దళనం బొనరించి కృష్ణను
జ్జ్వలగుణబీజ మంటి యతిబంధురరాగరసంబునింపఁ గో
మలసుమనోరథాంకుర మమందముగా జనియించి మిండెమున్. ఉ-౩.

చ. అరిదరపాణియాననమునం దవదాతమృదూర్ధ్వపుండ్రకాం
తరవరవర్ణినీమృదులనవ్యపరాగవిధీయమానసుం
దరతరచిత్రకద్యుతి గనంగ మసారమణీధరాధరో
పంశరదభ్రమధ్యతలభాసితటిల్లతరీతి నొప్పెడున్. ఉల్లాస-౪.

చ. కలువలరాచఱాదొనలు గాఁగొనువెన్నెలచేఁ గరంగఁగాఁ
దొలఁకు జలప్రవాహములు తోరపుఁ గ్రొవ్విరి తేనెసోనలం
గలయుచు సర్వతోముఖముగా నిలఁ బర్వుచు గానఁ గాశీ
తలగుణసౌరభంబులకుఁ దావలమై తనరారు మాధవా. ఉ-౫.

---

136. నడకుదుటి రామనకవి

ఇతఁడు ప్రభులింగలీలను, హరిమీడేస్తవము, ఆత్మానాత్మవివేక చూడామణి అను సంస్కృతగ్రంథములను దెనుఁగునఁ బద్యకావ్యములనుగా రచియించెను. ఇతఁ డాఱువేలనియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబ సూత్రుఁడు; కౌశికగోత్రుఁడు; లక్ష్మీనృసింహుఁడను నామాంతరముగల బుచ్చనామాత్యునిపుత్రుఁడు. ఈకవి ౧౭౨౧ వ సంవత్సరమునందు జనన మొంది ౧౭౭౮ వ సంవత్సరమున లోకాంతరగతుఁ డయ్యెను. ఇతఁడు మొట్టమొదట గోదావరీమండలమునందలి రామచంద్రపురము తాలూకా లోని శహాపుర గ్రామమునకు కరణముగానుండి, పెద్దాపురమునకుఁ జేరువ నున్న తిరుపతిగ్రామముయొక్క కరిణీకమును ఆగ్రామమునందలి భూము లును దన యత్తవారివిగాఁగా శహాపుర కరణికమును దన జ్ఞాతులకు వదలివేసి ౧౭౬౩ వ సంవత్సరమున సకుటుంబముగాఁ దిరుపతిగ్రామమునఁ బ్రవేశించెను. ఇతఁడు రచియించిన గ్రంథములలోఁ బ్రభులింగలీల పాల్కు రికి సోమనాథుని ద్విపదకావ్యానుసారముగా నైదాశ్వాసముల పద్య కావ్యముగా రచియింపఁబడినది. తక్కినవి రెండును శంకరాచార్యుల వారి సంస్కృతగ్రంథములనుండి యాంధ్రీకరింపఁబడినవి. ఇందు వివేక చూడామణియైదాశ్వాసములగ్రంథము. ప్రభులింగలీల ౧౭౫౫ వ సంవ త్సరప్రాంతమునందును, హరిమీడేస్తవము ౧౭౬౫ వ సంవత్సరమునం దును రచియింపఁబడినట్టు కవివంశమువారు చెప్పుచున్నారు. వివేకచూ

డామణి శాలివాహనశకము ౧౭౭౫ వ సంవత్సరమునం దనఁగా హూణ శకము ౧౮౫౩ వ సంవత్సరమున రచియింపఁబడినట్టు కవియే గ్రంథమునం దీపద్యమునఁ జెప్పుకొనియున్నాఁడు—

గీ. శాలివాహనశకమధ్యసాగరగ్ర
హర్షి శశిసంఖ్యవత్సరాభ్యర్హితంబు
నగు ప్రజోత్పత్తివత్సరంబందు మాఘ
పూర్ణిమకు గ్రంథకల్పనపూర్తి యయ్యె.

ఈతని కవిత్వమునం దక్కడక్కడఁ గొన్ని వ్యాకరణవిరుద్ధములైన ప్రయోగము లున్నను మొత్తముమీఁద శైలి రసవంత మయియున్నది. ఇతనికవిత్వరీతి తెలియుట కయి యొక్కొక్కగ్రంథమునుండి రెండేసి పద్యముల నిం దుదాహరించుచున్నాను—

ప్ర భు లిం గ లీ ల.

ఉ. నే నొకమాట పల్కెదను నీ వటుచేసి మదిష్ట మిచ్చి నీ
దానిఁగఁ జేసికొమ్మవితథప్రథవాఙ్యుఁడవై చెలంగు కా
దేని భవత్ప్రతిజ్ఞ జగదీశ్వర పొల్లగు దానఁ బాతకం
బే నినుఁ జెందుఁగాని వినుమీ ననుఁ బొందఁగ లేవు నావుడున్. ఆ-౨.

శా. ఆవిజ్ఞాపన మాలకించి దయతో నాయయ్యవా రింటికిన్
దా విచ్చేయ నమాత్యవర్యులు మహాధర్మానుషక్తుల్ శమ
ప్రావీణ్యుల్ బలవన్న చెన్నబసవప్రఖ్యాతనాముల్ దగన్
సేవ ల్చేయుచు వెంబడిం జనిరి తుష్టిం జెందు భావంబులన్. ఆ-౩.

హ రి మి శ్ర స్త వ ము.

శా. దేహాదివ్యతిరిక్తుఁ డాత్మయని వేతృత్వంబు గైకొన్న నా
త్మోహార్హాత్మకబ్రహ్మముల్ తెలివియున్ దీపించుచున్నన్ ధరన్
దేహుల్ లొందఱు ముక్తి లేక చెడి రింతేకాక యాత్మత్వధీ
దేహాద్యాకృతినుండి వెండియును సందేహంబు లేకుండఁగన్.

శా. ఏవిజ్ఞా శిఖాస్వరూపు రవివహ్న్యిందూపలబ్ధిస్థలిన్
భావింప్యస్నిభహృద్విభాంతు నుతిసత్పాత్రున్ సమస్తార్థ్య సం
సేవ ల్భక్తినొనర్చి యాత్మగతు నీజీవత్వముం దేమహా
భావు ల్చూతురొ వాని సంస్మృతితమోభానుం హరిం గొల్చెదన్.

ఆత్మానాత్మవివేకచూడామణి.

చ. నియమయమాదియోగపరినిష్ఠితహృత్పరిభావితంబు ధీం
ద్రియవిగతానుభావితము దివ్యము నింద్యషడూర్మిహీన మ
వ్యయ మనవద్యభూతివిషయాగమ మెయ్యది యట్టిబ్రహ్మమీ
వయితివి డెందమం దరయుమంచు వచించె రఘూద్వహోత్తమా. ఆ-3

మ. పుటపాకంబునఁ గాంచనం బతులమై పూర్వద్యుతిం జెందునే
ట్లటులే ధ్యానముచే గుణత్రయమలత్యాగంబుగాఁగం బరి
స్ఫుటసచ్చిత్సుఖనిత్యదివ్యనిజసంపూర్ణ ప్రభం బొందు ను
త్కటుఁడై కోవిదుఁ డంచుఁ జెప్పె మతిసీతాదృక్చకోరాత్రిజా. ఆ-ర.

---

137. మాడభూషి వేంకటాచార్యకవి

ఈవిద్వత్కవి భరతాభ్యుదయ మనెడి నాలుగాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు శ్రీవైష్ణవబ్రాహ్మణుఁడు; నైధ్రువ కాశ్యపాన్వయుఁడు; నృసింహాచార్య నందనుఁడు. ఇతఁడు సంస్కృతాంధ్రములయం దత్యంతపాండిత్యము గలవాఁడయి, శతలేఖినీపద్యసంధాన సామర్థ్యమును అష్టావధాన నైపుణియు వ్యస్తాక్షరీకౌశలమును గలవాఁడయి యుండెను. ఈ కవి గోదావరీమండలములోని పెంటపాడు గ్రామవాసియై కృష్ణామండలములోని నూజవీడు సంస్థానమునందు చిరకాలముండి విద్వానభినవ పండితరాయాది బిరుదాంకములు నందినవాఁడు.

చిన్నతనమునం దీయన ధారణాశక్తి యత్యద్భుతమైనదిగా నుండెను. అప్పు డితఁడు ద్విసంధాగ్రాహియగుటయేకాక రెండుమూఁడులు చదివినపద్యమును తలక్రిందుగా నొప్పగించుటకును నెనిమిదిభాషలలో వ్యస్తాక్షరి చెప్పుటకును సమర్థుఁడయి యుండెను. ఈయన రెండుసంవత్సరముల క్రిందట వైకుంఠపదస్థుఁ డయ్యెను. ఈయన కవిత్వము నిర్దుష్టమయి మధురమై శ్రావ్యముగానున్నది. కవిత్వరీతి భరతాభ్యుదయములోని యీ క్రిందిపద్యములవలనఁ గొంతవఱకు తేటపడవచ్చును.

చ. పిలిచిన నుత్తరం బిడదు పిల్వఁ బదే యిదేవత్తువంచుఁ దాఁ
బలుకును బల్కరించు చెలిపై నలుగుఁ నలుదిక్కు లారితోఁ
బలుమఱుఁజూచు మస్తకము వంచు వెసం దలయూఁచు నాశకుం
తల ధరణీపురందరగతస్వాంతమానసపర్వవృత్తియై. ఆ-౧.

చ. చానలు గాంచి రొక్కెడ సపారమసారమణిశ్రేణికసో
పానపరంపరాసితవిభాపటలంబు తదంతరుల్ల స
త్సూనలతాప్రదత్తనవదోహదధూమవిలీలఁ దోఁప సు
శ్రీనెఱారు చారుసరసీరుహధామశిరోలలామమున్. ఆ-౨.

ఉ. కాంచితె సూత యీమృగము గంఠముఁ ద్రిప్పి రథంబు సారెకుం
గాంచుచుఁ బోవుచున్విశిఖఘాతభయంబునఁ బూర్వకాయముల్
వంచి సగంబు మేసినతృణంబు శ్రమంబునఁ నేలవ్రాలఁగా
నించుక మూర్ఛఁ జాల దివి నేగెడు నందక గంతువేయుచున్. ఆ-౩.

చ. వనితలు పుట్టినింట బహువర్షము లుండఁగరాదు భర్తతో
నునికియె యుత్తమం బది యటుండఁగనిమ్ము సమస్తరాజశో
భనమకుటార్చితాంఘ్రి యగు పార్థివశేఖరు ధర్మపత్నివ
య్యు నిటులు బీదరాలివలె నుండఁగ నేల సతీశిరోమణీ. ఆ-౪.

138. పెనుమచ్చ బుచ్చిరాజు

ఈకవి పరతత్త్వప్రకాశిక యనెడి యెనిమిదాశ్వాసముల వేదాంత గ్రంథమును రచియించెను. ఇతఁడు క్షత్రియుఁడు; ధనంజయగోత్రుఁడు; వేంకటపతిరాజకుమారుఁడు. ఈ కవి తాను కర్లపాలెము గ్రామనివాసుఁ డయినట్లును, సూర్యవంశపు రాజయినట్లును వ్రాసికొనియున్నాఁడు. భాగవతములోని కపిల దేవహూతి సంవాద మాధారముగా నీ గ్రంథము పెంచి వ్రాయఁబడినది. ఇతఁడు తొంబదిసంవత్సరములు జీవించి కొన్ని యేండ్లక్రిందటనే కాలధర్మమునొందినట్లు తెలియవచ్చుచున్నది. అక్కడక్కడ లక్షణవిరుద్ధములైన ప్రయోగములు పెక్కులున్నను, కవిత్వము చక్కఁగానే యున్నదని చెప్పవచ్చును. పరతత్త్వప్రకాశికలోని రెండు పద్యము లిందుక్రిందఁ బొందుపఱుపఁ బడుచున్నవి—

ఉ. కోరి భుజింపఁగాఁ దగినకోవిదు నాత్మవివేకశీలసం
చారు వికారదూరు శ్రుతిశాస్త్రపరీవృతనిశ్చ యూర్థస
త్సారమరందబిందువిలసన్మధుపానవికాసభాసురుఁ
ధారుణి సర్వసంశయవిదారుని ధీరుని సద్గురూత్తమున్. ఆ-3.

చ. మనసు సుషుప్తి నొక్కవడి మానుగ ముగ్గిఁ జేయుకార్యముల్
కనఁబడ వేమియున్ మనసు క్రమ్మఱ మేల్కని యాతఁ డాతఁడుఁ
మన మనుచుండఁగాఁ గల సమస్తముఁ దోఁచు మనోవినాశమై
తనరినఁ జిత్తమింద్రియసదాగతులున్ లయ మౌను దానితోన్. ఆ-2.

139. మండపాక పార్వతీశ్వరకవి

ఈ విద్వత్కవి శతకములు మొదలైనవి యెనుబది గ్రంథములవఱకును రచియించినను, ఈయనచే రచియింపఁబడి ముద్రింపఁబడియున్న గ్రంథములలో శ్రీరాధాకృష్ణ సంవాదమను నాలుగాశ్వాసముల ప్రబంధము ప్రధానమైనదిగానున్నది. ఈయన వైదికబ్రాహ్మణుఁడు; పారాశరగోత్రుఁడు; కామేశ్వరపండితపుత్రుఁడు. ఈకవియొక్క తండ్రితాతలుకూడ కవీశ్వరు లయినట్టు రాధాకృష్ణసంవాదమునందు కవి యీక్రింది పద్యమునఁ జెప్పియున్నాఁడు.

సీ. శ్రీమీఱ నుభయభాషామిశ్రసత్కృతుల్
　　　　తదర్జ్ఞు లెన్న మదంకితములు చేసి
యశముఁ గాంచినపేర యమనీషిమణికిఁ బౌ
　　　　త్రత్వంబుఁ గార్తికవ్రత మహత్త్వ
శివమహాత్మ్యాద్యనేక విధప్రబంధంబు
　　　　లొనరించి సత్కవివినుతిఁ గనిన
పారాశరసగోత్రపావనుం డగుమండ
　　　　పాక కామేశ్వరపండితునకు
మహితపుత్రత్వమును గాంచి బహువిచిత్ర
చిత్రిశతిముఖ్యసత్కృతుల్ చెప్పి మెప్పు
వడసితివి గద కులకీర్తి వర్ధిలంగ
సరసగుణసాంద్ర పార్వతీశ్వరకవీంద్ర.

ఈ కవి విశాఖపట్టణమండలములోని బొబ్బిలిసంస్థానమం దాస్థానకవీశ్వరులలో నొకఁడుగా నుండినవాఁడు. ఈ పార్వతీశ్వర శాస్త్రిగారు ౧౮౩౩ వ సంవత్సరమునందు జననమొంది ౧౮౯౭ వ సంవత్సర మధ్యమున పరమపదమునొందిరి. ఈ కవి సంస్కృతాంధ్రములయందు మంచి పాండిత్యము గలవాఁడయి మృదుమధుర నిరర్గళధారతోఁ జతుర్విధ కవి

త్వమును జెప్పుచు వచ్చుటయేకాక వినయ సౌశీల్యాది గుణసంపత్తిగల వాఁడయి యుండెను. పూర్వోక్తమయిన రాధాకృష్ణసంవాదము రావు వారను నామాంతరముగల వెలుగోటివార నెడి గృహనామముచే వెలయు శ్రీ వేంకటగిరి సంస్థానాధిపతుల వంశానుక్రమమును వర్ణించెడు గ్రంథము. శతకములును, దండకములును గాక యీకవి రచియించిన గ్రంథములలో కాంచీపురమాహాత్మ్యము, అమరుకకావ్యము, ప్రబంధసంబంధనిబంధన గ్రంథము, శ్రీకృష్ణాభ్యుదయము, కొంతపెద్దవి. ఇప్పుడీయన గ్రంథములలో నొక్క రాధాకృష్ణసంవాదమునుండి మాత్రము కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

శా. సాంగోపాంగముగా సతం డఖిలవిద్యల్ నేర్చినాఁ డోర్చినాఁ
డంగీకారము నింతఁ ట్టు మృదుచర్యం బేర్చినాఁ డేర్చినాఁ
డంగారప్రభ మాత్రపంక్తి నరిసైన్యారణ్యా మి ట్లయ్యు నే
సాంగత్యంబుననో వృథాకపటభాషం దీర్చినాఁ డత్తఱిన్. ఆ-౧.

ఉ. వ్రాయఁడు లెక్క లొక్కటికి రంగపురంగ మొఱుంగుపూఁతలన్
బూయఁడు భిత్తిభాగముల ముఖ్యవిధానములందు మందతం
బాయఁడు బాంధవాసులకు వారికిఁ జేయుఁగలట్టి సత్కృతుల్
చేయఁడు వేఱె మీ కిపుడు చెప్పఁగ నేటికి మీ రెఱుంగరే. ఆ-౨.

మ. తినభూలోకధురంధరత్వ మిపు డీశ్వరాజగోపాలకృ
ష్ణనరేంద్రుండు వహించె నాకభర మైనం బూనుడుంగాక యం
చు నృపానుజ్ఞను గోరవచ్చి ఫణీశుండో తదేకేచ్ఛ వ
చ్చినప్రాక్కచ్ఛపమో యనం దనరెఁ దచ్ఛ్వేతాతపత్రంబటన్. ఆ-౩

ఉ. తత్సురభర్తృ ఘట్టికతమ్మునఁ బ్రాభవ మొందివోలె నం
దుత్సవ మయ్యె నింక సుర లుండఁగ నేటికిఁ బోం డటంచు నం
చత్సుమధన్వ్వనింగ సరుజాడ గనంబడఁ దామ్రచూడముల్
తత్సమయంబునన్ మొరసెఁ దామరసప్రతిమానలోచనా. ఆ-౪.

140. సత్యవోలు భగవత్కవి

ఈకవి ఆఱువేల నియోగిబ్రాహ్మణుఁడు జనార్దనామాత్య పుత్రుఁడు; భారద్వాజగోత్రుఁడు. ఈతఁడు గోదావరీమండలములో నించు మించుగా నూటయేఁబది సంవత్సరములక్రిందట నుండినవాఁడు. ఇతఁ డేనుఁగు లక్ష్మణకవి మొదలగువారికి సమకాలీనుఁ డని చెప్పుదురు. ఈకవి రచియించినగ్రంథములలో రుక్మిణీపరిణయమనెడు నాలుగాశ్వాసముల ప్రబంధము ప్రధాన మయినది. తాను నూఱుశతకములను జేసినట్లు కవియే తనగ్రంథమునం దిట్లు చెప్పుకొనియున్నాఁడు—

క. ధీరత శతశతకంబులుఁ । దారావళులున్ దశావతారావళులున్
జారూదాహరణంబులు । శ్రీరాజితదండకములుఁ జెప్పినవాఁడన్.

ఇతఁడు చెప్పిన రుక్మిణీపరిణయములోని దశావతారపద్యములు తెలుఁగుదేశములోఁ బలువురచేఁ జదువఁబడుచున్నవి. కవిత్వమునం దల్పదోషములు కొన్ని యున్నను మొత్తముమీఁద నీతనికవనము మృదుమధురపదగుంభిత మయి రసవంత మయి శ్రావ్యముగా నున్నది. రుక్మిణీపరిణయములోని యీక్రిందిపద్యములు కవియొక్క సామర్థ్యమును తేటపఱుచును—

ఉ. ఏసతి నాత్మలోఁ దలఁప నెల్లజగంబుల జంతుకోటి కా
యాసము లేక కల్గు సరసాన్నము లాసతి యవ్విదర్భసిం
హాసనవాసియింట శిశు వౌట నొసంగిరి పాయసాన్నము
ల్లాసముమీఱ నాఱవనెలన్ నెలఁతల్ ద్విజబంధుకోటితోన్. ఆ. ౧.

ఉ. శ్రీకరమూర్తి వై నినుఁ జేరి భజింపఁ దలంపుచుండుటన్
నీకృపఁ గోరుచుండు టది నేరము గాదు సమస్తదేవతా
నీకము చూడ మున్ను సిరి నీదగుపేరెదఁ జేరఁగోరదే
నాకడనే జనించెను ఘనాఘనధామసమూహమోహముల్. ఆ. ౨.

చ. అరయుచు రుక్మిముఖ్యనిఖిలాధిపు లాధిపురోగరోగని
ర్భరుల తెఱంగునన్ బొరిగొని క్రమ్మఱ ముమ్మర మైనధైర్యవి
స్ఫురణ మెలర్ప దర్పయుతశూరత ఘోరతరాస్త్రశస్త్రభీ
కరకరులై సముజ్జ్వలితగర్జితగర్జితభూతజాతులై. ఆ. ౩.

సీ. జమదగ్నిగర్భవాసమునఁ బుట్టి వివిధవిద్యాతపోధనుర్విద్యల కధి
పతివై ప్రబలి యిదం బ్రాహ్మ్య మిదం క్షాత్ర మని మునిరాజచిహ్నముల శాప
చాపనైపుణిఁ జూపి పాపభూపతుల శరాసికఠోరకుఠారధార
నస్రధారాప్రవాహములుగా శతధా సహస్రధా ఖండించి యానదులను
దర్పణము భూమిభూదేవతార్పణమును
జేసినపరశురామునవేషి వని నిను భ
జింతువైకుంఠనాథలక్ష్మీసనాథ
రక్షణపరాయణుండ నారాయణుండ. ఆ. ౪.

---

141. గురురాజకవి

ఈకవి శైవధర్మములను తొమ్మిదాశ్వాసముల గ్రంథమును రచియించి బళ్ళారిమండలములోని జోహారాపురాధిపతి యైన సంజీవి రెడ్డిగారి కంకితము చేసెను. ఇతఁ డిరువది ముప్పదిసంవత్సరముల క్రిందట నుండినవాఁడు. కవిత్వము నిర్దుష్ట మని చెప్పుటకువలను పడకపోయినను మొత్తముమీఁదఁ బుస్తకము రసవంతముగా నున్నదని చెప్పవచ్చును. కవికృతము లయినకావ్యాదులనుగూర్చి కృతిపతి పలికినట్లుగా గ్రంథమునందీక్రిందిపద్యములు చెప్పఁబడినవి—

గీ. అలఘుతరభద్ర పడకండ్లకులసముద్ర
వరకుముదమిత్ర శుభభరద్వాజగోత్ర

విపులదాక్షిణ్య సౌజన్యవినయధన్య
కావ్యనైపుణ్య గురురాజకవివరేణ్య.

సీ. ప్రతిపద్యయమకచిత్రశ్లేష పద్మావతీపరిణయనామదివ్యనాట
కంబు నెంతయుఁ దాదృశం బగురుక్మిణీపరిణయాభిధగద్యపద్యకృతిని
గుణయుతాలంకారమణిమాలికను రాఘవేంద్రాష్టకంబుఁ బ్రాసైకతగను
జాటుధారాసహస్రంబులఁ గావించి యనిరుద్ధచరితాహ్వయాంధ్రనాట
కంబు నొనరించి తెనుఁగించి కలితభర్తృ
హరిశతకముల మృదులకర్ణాటకృతుల
సలిపి భారుణీపాలాదిసభలలోన
గరము బహుమతు లందితి ఘనుఁడ వీవు.

కవియొక్క కవనరీతి తెలియుటకై శేషధర్మములనుండి రెండు పద్యముల నింకుదాహరించుచున్నాను.—

శా. సత్యంబే పిత మాత భ్రాత మిగులన్ సత్యంబె సంభోక్తయున్
సత్యంబే తగుపాపహంతయు నౌఘన్ సత్యంబె శ్రీధారియున్
సత్యంబే జగతిన్ సుహృత్తు సుఖమున్ సత్యంబె బాంధవ్యమున్
సత్యంబే యని చెప్పుచుండు రెపుడున్ సంఖ్యావదగ్రేసరుల్. ఆ-3.

ఉ. నాసవవంద్య నీకిదియె వందన మంబుజలోచనా చతు
ర్మాసములందు నే రతిని మానసచాపలము ద్యజించి బ
ల్వాసిగ సద్వ్రతంబు నిఁక వారక మీఱి యహర్నిశం బొగిన్
జేసెద నీకృపన్ విహగశేఖరకేతన శ్రీనికేతనా. ఆ-౫.

142. అల్లమరాజు సుబ్రహ్మణ్యకవి

ఈ కవి యల్లమరాజు రామకృష్ణకవి తమ్ముఁడు. ఈతఁడు చేసిన గ్రంథములలో శ్రీ బచ్చు రామేశనామక వైశ్యశిఖామణి కంకితముచేయఁబడిన శ్రీకృష్ణకల్యాణ మనెడి మూడాశ్వాసముల ప్రబంధ మొకటి యచ్చుపడి యున్నది. ఈ గ్రంథములోఁ గృతిపతి కవిచేఁ జేయఁబడిన పుస్తకములను బేర్కొన్నట్లీ క్రింది పద్యమునఁ జెప్పఁబడినది—

సీ. ప్రత్యక్షరశ్లేషపద్యాళి నూర్గుల కృష్ణభూపతిసభఁ గీర్తిఁ గంటి
రహి మణిధ్వజచరిత మొనర్చి యెన్నమలరామనదొరచేతభూమిఁ గొంటి
రసవదలంకారవసతియై చతురిమఁ బ్రబలఁ గూర్చితివి భద్రాపరిణయ
మమరంగఁ దెనిఁగించితాత్మబోధము సారమగుప్రశ్నోత్తరరత్నమాల
శేషధర్మోత్తిహాసవిశేష మంధ్రభాషగనొనర్చి యుడుతల పాపయనచి
వప్రతిష్ఠితలింగమపరి రాము విభున కర్పించితివి పుణ్యాభిభవ మొసఁగ.

ఈ కవి వాసస్థలము గోదావరీమండలములోఁ బిఠాపురమునకు సమీపమున నున్న చేబ్రో లను గ్రామము. ఈతఁడు ద్రావిడ బ్రాహ్మణుఁడు; హారితసగోత్రుఁడు; రంగనాథార్యపుత్రుఁడు. ఈకవి వృద్ధదశలోఁ గొన్ని సంవత్సరముల క్రిందట లోకాంతరగతుఁ డయ్యెను. ఈతనికవిత్వము నిర్దుష్టమయి మనోహరముగా నుండును. కవిత్వప్రౌఢిమ తెలియుటకయి శ్రీకృష్ణకల్యాణములోని కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను.

చ. చెలిమినిగాదె క్రొత్తలు వచించెదవో యదువంశనాథ నీ
యలఘుభుజాబలస్థితులమా మనుబోటుల మీవు లేనిచోఁ
జెలువుఁడు లేనియింతులటు చింతిలుచుందుము నీవు చెంగటన్
వెలసిన నింద్రునితోడఁ దగువేల్పులరీతి సుఖింతు మెంతయున్. ఆ-౧.

మ. చనునే కృష్ణ భయప్రకంపితులమై శస్త్రాదుల న్వీడి యా
తనితో సంధికి నేగుటల్ మనకు శుద్ధక్షత్రవంశంబునన్

జననం బందియు నాత్మబాహుబలమున్ శౌర్యంబుఁ గోల్పుచ్చి భీ
తి నొరుం గూడుట రాజధర్మ మగునే ధీరు ల్వినన్నాత్తురే. ఆ-౨.

ఉ. ముద్దుల మాటఁగట్టు నగునెమ్మొముహారాంగు తరంగపాళికిన్
హద్దులుదిద్దు ముత్తరులఁనుందము కుందమిళిందబృందమున్
సద్దణఁగించిమించు రదనంబుల చక్కఁదనంబు వేణిడా
లద్దిర యుద్ది దీని కిదియా నిధియా గుణరత్నరాజికిన్. ఆ-3.

---

143. గోపీనాథము వేంకటకవి

ఈ కవి వైదికబ్రాహ్మణుఁడు; నెల్లూరిమండలములోని కావలి తాలూకాలోని లక్ష్మీపుర గ్రామవాసి. ఇతఁడు శ్రీ వేంకటగిరి సంస్థానమునం దాస్థానకవీశ్వరుఁడుగా నుండి ప్రసిద్ధి కెక్కినవాఁడు. ఈకాలపుఁ గవులలో నితఁడు బహుమహాగ్రంథములను రచియించినవాఁడు. భాస్కరరామాయణాదులు వాల్మీకివిరచిత మూలగ్రంథానుసారముగా నుండలేదని మూలగ్రంథములో నున్నదానికంటె నెక్కువకాని తక్కువకాని లేకుండునట్లు సరిగా వాల్మీకిరామాయణ మంతయు నితఁడు పద్యకావ్యముగాఁ జేసెను. మఱియు నితఁడు బ్రహ్మకైవర్త పురాణములోని కృష్ణజన్మఖండము నెనిమిదాశ్వాసముల పద్యకావ్యముగాను, మాఘుకవి కృత మయిన శిశుపాలవధను నాలుగాశ్వాసముల పద్యకావ్యముగాను, శ్రీ భగవద్గీతాశాస్త్రమును, దెనుఁగున రచియించి మెప్పించి వేంకటగిరి సంస్థానాధీశ్వరులచే నొక యగ్రహారమును బడసెను. ఇతఁడు మిక్కిలి వృద్ధుఁడయి కొన్నియేండ్లక్రిందటఁ బరమపదము నొందెను. ఈతని కవిత్వము మొత్తముమీఁద సలక్షణ మయి నాతికఠినమయి హృద్యముగా నున్నది. ఈయన గ్రంథములలోని కొన్నిపద్యము లిం దుదాహరింపఁ బడుచున్నవి.

రా మా య ణ ము.

చ. ఘనగుణశాలి ప్రాణమునకంటెఁ బ్రియుం డగురామచంద్రునిన్
జననుతు నొంటిఁ బంపి నిమిషం బయినన్ మనఁజాల వంశవ
ర్ధనుఁ డగునట్టి యీతలిరుఁ బ్రాయపుముద్దులకుఱ్ఱఁ డేల నీ
యనుమతి నేన వచ్చెద సురారులఁ జంపి మఖంబు గావఁగన్. బా॥కాం.

ఉ. చంద్రునివంటి నెమ్మొగము చాఁగెడుకన్నులు వృత్తదంష్ట్రముల్
సుందరపల్లవాధరము సొగసరు ల్మణికుండలప్రభా
బంధురకర్ణయుగ్మమును బాఱెడుచేతులుఁ గల్గురాము నిం
పొందఁగఁ జూడకున్న నిలుపోపఁ దరంబె సుమంత్ర యిత్తఱిన్. అయో.

చ. యినకిరణాళికిం జొరవ యీక సదాగతిరాకకైనఁ బ
ల్చనపడ కర్థి సైకతముఁ జల్లిన రాలఁగనీక దట్టమై
దనుజవిముక్తకాండములఁ దట్టుచు దిక్కుల రామకాండముల్
సునిసితభంగి నిండుటయుఁ జూచి సురల్వెఱఁగందిరయ్యెడన్. అరణ్యా.

ఉ. భూవరవర్య యెవ్వని సముద్ధతిఁ జాపుటకై కడంగి సు
గ్రీవునితోడ నెయ్య మొనరించి తదీప్సితసిద్ధిఁ గోరి న
న్నీవిధిఁ బంపి తట్టిదనుజేంద్రుని రావణుఁ గీటడంచి నీ
దేవిని నెందుడాఁచినను దెచ్చియోనంగనెయొక్క ప్రేల్మిడిన్. కిష్కింధా

ఉ. ఓరి దురాత్మ యిందు బుధు లుండరొ యుండిన నీవు వారలం
జేరవొ సాధువాక్యములు చేకొన నొల్లవొ శిక్షలేమి నా
చారవిహీనమై సకలసజ్జనగర్హిత మయ్యె నీమతం
బారయ నీకతంబున నిశాటకులంబు చెడు న్నిజంబుగన్. సుందరకాం.

మ. మరియున్ రావణి సాయకంబులు ధనుర్మౌర్విం దగంగూర్చి బ
ల్గరులాడం దెగనిండఁదీసి వెస వక్షం బుచ్చిపో నేసినన్
గురుబాణక్షతజాతరక్తకలితాంగుండై సుమిత్రాసుతుం
డరయం బొల్చె విధూమవహ్నిగతిఁ బుష్పాఢ్యద్రుమప్రక్రియన్.
యుద్ధకాం.

కృష్ణజన్మ ఖండము.

చ. సలలితశుద్ధతోయములు చారుమణీదళపద్మకైరవో
త్పలములు గంధలుబ్ధకసుగానమధువ్రతగీతనాదముల్
కలరవచక్రకుక్కుటమరాళమనోహరమంజుశబ్దముల్
గలిగి మనోజ్ఞసంపదలఁ గ్రాలు విశాలసరోవరం బొగిన్. ఆ. ౩.

మ. పరికింపం గడు దుర్లభం బవనిలోఁ బ్రాణేశ కాంతామణీ
పురుషప్రేమగుణాతిరిక్త మనిశంబుం బూతచారిత్రయున్
స్మరసారజ్ఞయు సాధ్వియున్ రసికయున్ జాతుర్యసంయుక్తయౌ
తరుణీరత్న మెఱుంగు సత్పురుషుఁడున్ దథ్యంబు చింతింపఁగన్. ఆ. ౮

శిశుపాలవధము.

శా. సామర్థ్యంబున మాఱులేనిబల మన్యాయం బవ్విధి న్నీతిమ
ద్యామర్యాద నెఱింగి పోవుబల మన్యం బిట్టి లీరెంటికిన్
నేమం బేర్పడ భూరితేజమునకుం జీఁకట్లకుం బోలె బ
ల్సామానాధికరణ్య మెట్లు గలుగున్ జర్చింప లోకంబునన్. ఆ. ౧.

చ. అలఘుధనుష్ప్రభావము గుణాతిమహత్త్వము ముష్టిశక్తియో
యిలయు దిగంతముల్ గగన మీనుచు నున్నవో నేమిచిత్రమో
తెలియఁగరాదు శౌరిసముదీర్ణశరంబులు చిత్రజల్లుల
ట్లలవడ నొక్కరీతిఁ గురియం దొడఁగెన్ ధ్వనిపూర్వకంబుగన్. ఆ. ౪.

భగవద్గీత

ఉ. మెండుగ వృష్టికాలమున మిన్నక పాఱునదీప్రవాహముల్
నిండి చలింపకున్న యలనీరధిఁ జేరినమాడ్కి నెవ్వనిం
దండిగ సర్వకామములు తప్పక చేరు నతండు శాంతుఁడై
యుండు సకాముఁడై ననరుఁ డొందఁడు శాంతిని బాండునందనా.

చ. అలయక యోగు లీతనిఁ బ్రయత్నము సేయుచు నాత్మయందు ని
శ్చలముగ నున్నవానిఁగ [illegible] రజ్ఞులైనని
శ్చలమతిహీను [illegible] జాలఁ బ్రయత్నము చేసియున్ సము
జ్జ్వలుఁ డగునీశ్వ[illegible] తెలియఁ జాలరు భార[illegible] మింతయున్.

ఆంధ్రకవుల చరిత్రము.

మూడవభాగము

ఆధునిక కవులు

కీ. శే. కందుకూరి వీరేశలింగం పంతులుగారు.

ప్రకాశకులు.

హితకారిణీ సమాజము.

రాజమండ్రి.

వెల రు. 3[illegible]-0

కీర్తిశేషులైన రావుబహద్దూరు

కందుకూరి వీరేశలింగం పంతులుగారి గ్రంథములు.

ప్రహసనములు

మొదటి సంపుటము

1. అపూర్వబ్రహ్మచర్య ప్రహసనము
2. విచిత్రవివాహ ప్రహసనము
3. మహాబధిర ప్రహసనము
4. పునర్మరణ ప్రహసనము
5. బలత్కారగానవినోద ప్రహసనము
6. కలహప్రియా ప్రహసనము
7. మహామహోపాధ్యాయప్రహసనము
8. యోగనిద్రాప్రహసనం
9. మహావంచక ప్రహసనం
10. అసహాయశూర ప్ర॥
11. కలిపురుషశనైశ్చర విలాసము
12. వేశ్యాప్రియా ప్ర॥
13. కౌతుకవర్ధని
14. వినోదతరంగిణి
15. హాస్యసంజీవిని మొదటిభాగము
16. ,, రెండవభాగము
17. ,, మూడవభాగము

నాటకములు

రెండవ సంపుటము

1. బ్రహ్మవివాహము
2. వ్యవహారధర్మబోధిని
3. తిర్యగ్విద్వన్మహాసభ (మూషకాసురవిజయం)
4. మహారణ్యపురాధిపత్యము
5. ప్రహ్లాదనాటకము
6. సత్యహరిశ్చంద్ర నాటకము
7. దక్షిణగోగ్రహణము
8. వివేకదీపిక

భాషాంతరీకృతనాటకములు

మూడవ సంపుటము

1. చమత్కార రత్నావళి
2. రాగమంజరి
3. కళ్యాణకల్పవల్లి
4. అభిజ్ఞాన శాకుంతలము
5. రత్నావళి
6. మాలవికాగ్నిమిత్రము
7. ప్రబోధచంద్రోదయము
8. వెనీసువర్తక చరిత్రము

వచన ప్రబంధములు

పద్యకావ్యములు

నాల్గవ సంపుటము

1. సత్యరాజా పూర్వదేశ యాత్రలు (1, 2 భాగములు)
2. రాజశేఖర చరిత్రము
3. శుద్ధాంధ్రనిరోష్ఠ్యనిర్వచన నైషధము
4. రసికజనమనోరంజనము
5. శుద్ధాంధ్రభారత సంగ్రహము
6. అభాగ్యోపాఖ్యానము
7. పథికవిలాసము
8. జాన్ గిల్పిన్
9. నీతిదీపిక

స్త్రీల కుపయోగించు కథలు

అయిదవ సంపుటము

1. సత్యవతీచరిత్ర
2. చంద్రమతీచరిత్ర
3. సత్యసంజీవిని
4. చమత్కార రత్నావళి

ఆంధ్రకవుల చరిత్రము.

తృతీయ భాగము

ఆధునిక కవులు

By

K. VEERESALINGAM

వెల రు. 3-8-0

రాజమహేంద్రవరము
అవంతీ ప్రెస్ నందు, ముద్రింపబడినది.
జనవరి, 1950

విషయసూచిక.

		పుట
1.	హరిభట్టు	1
2.	ఒడ్డెపూడి పెద్దయ్య	6
3.	కాకమాని మూర్తి	9
4.	కామేశ్వర కవి	14
5.	వెణుతురుపల్లి విశ్వనాధకవి	17
6.	నూతనకవి సూరన్న	18
7.	సముఖ వేంకటకృష్ణప్పనాయకుడు	22
8.	రోసనూరి వేంకటపతి	23
9.	పైడిపఱ్ఱి వేంకటపతి	27
10.	వెలగపూడి కృష్ణయ్య	29
11	శేషము వేంకటపతి	32
12.	కూచిమంచి తిమ్మకవి	39
13.	వక్కలంక వీరభద్రకవి	56
14.	కూచిమంచి జగ్గకవి	61
15.	కొవలె గోపరాజు	67
16.	కొడిచెర్ల శ్రీనివాసకవి	69
17.	పట్టమట్ట సోమనాధకవి	70
18.	దివి రమణకవి	72
19.	కోడూరి వేంకటాచలకవి	73
20.	ఏనుగు లక్ష్మణకవి	77
21.	నెల్లూరి వీరరాఘవకవి	89.
22.	నంజరాజు	92
23	కోటి వెంకనార్యుడు	94
24.	అడిదము సూరకవి	95
25.	మంగళగిరి ఆనందకవి	111
26.	కనుపర్తి అబ్బయామాత్యుడు	114
27.	కాణాద పెద్దనసోమయాజి	118

		పుట
28.	కుందుర్తి వేంకటాచలకవి	123
29.	ఈదురుపల్లి భవానిశంకరుడు	126
30.	ధూర్జటి వేంకటరాయకవి	128
31.	అయ్యల రాజు — అయ్యల భాస్కరకవులు	131
32.	అజ్జరపు పేరయలింగము	134
33.	మరింగంటి సింగరాచార్యులు	139
34.	అనంతరాజు జన్నయకవి	141
35.	ముద్దు పళని	142
36.	కంకంటి పాపరాజు	144
37.	పుష్పగిరి తిమ్మన్న	148
38.	ధరణిదేవుల రామమంత్రి	151
39.	దిట్టకవి నారాయణకవి	154
40.	అత్తలూరి పాపకవి	166
41.	కస్తూరి రంగకవి	170
42.	ఆలూరి కుప్పుఱకవి	171
43.	పింగళి ఎల్లనార్యుడు	175
44.	చింతకుంట కోదండరామకవి	179
45.	కైప మాయనకవి	180
46.	వెలిదండ్ల వేంకటపతి	182
47.	పట్టమెట్ట సరస్వతిసోమయాజి	183
48.	అవుదూరి కిచ్చయ్య	185
49.	తకెళ్లపాటి లింగన్న	187
50.	గుడిపాటి కోదండపతి	189
51.	మల్లవరపు వాలేశ్వరుడు	192
52.	చింతలపల్లి వీరరాఘవుడు	194
53.	శేచర్ల మాధవరాయకవి	196
54.	అవియాది గణపతిదేవుడు	197
55.	వేంకటాచార్యుడు	198

		పుట
56.	లింగకవి — గంగకవి	200
57.	అంగర నృశింహకవి	201
58.	సిరిప్రెగడ ధర్మనామాత్యుడు	204
59.	గణపవరపు వేంకటకవి	207
60.	వేముగంటి దత్తోజీపండితుడు	215
61.	గుడారు వేంకటదాసకవి	217
62.	కామనూరి కృష్ణయ్య	218
63.	వేంకటాచార్యుడు	219
64.	మల్లంపల్లి నాగభూషణకవి	219
65.	చిత్రకవి సింగరాచార్యుడు	221
66.	రేవుణూరి వేంకటార్యుడు	225
67.	పోచిరాజు వీరన్న	227
68.	అయ్యలరాజు నారాయణకవి	230
69.	వెణుతుర్ల వడ్డికవి	232
70.	కొత్తలంక మృత్యుంజయుడు	233
71.	తిరుమలబుక్కపట్టణపు వేంకటాచార్యుడు	236
72.	కటికనేని రామయకవి	237
73.	కొండమడుగు పురుషోత్తమకవి	239
74.	వాగులూరి శేషనారాధ్యుడు	240
75.	వీజెము లక్ష్మపతి	241
76.	వేమనారాధ్యుల సంగమేశ్వరారాధ్యుడు	242
77.	ములపాక బుచ్చన్నశాస్త్రి	243
78.	పాలవేకరి కదిరీపతి	245
79.	మాధవమంత్రి	246
80.	గోపాలుని సింగయ్య	247
81.	గూశికల్లు వేంకటరమణకవి	248
82.	కృష్ణకవి	249
83.	వల్లూరి నరశింహకవి	252

		పుట
84.	గొంతేటి సూరన్న	253
85.	బేతపూడి కృష్ణయ్య	254
86.	బసవరాజు నాగేంద్రకవి	255
87.	మాచవరపు పాపనామాత్యుడు	256
88.	కృష్ణదాసకవి	258
89.	చెన్నూరి శోభనాద్రి	259
90.	కోటీశ్వరుడు	260
91.	చల్లపిళ్ల నరసకవి	261
92.	అయ్యగారి వీరభద్రకవి	263
93.	ఘట్టుప్రభువు	265
94.	ముప్పిరాల సుబ్బరాయకవి	267
95.	ప్రయాగ కామేశ్వరకవి	269
96	అనంతనార్యుడు	269
97.	భైరవకవి	270
98.	అనమగుర్తి రంగయ్య	271
99.	తామరపల్లి తిమ్మయ్య	272
100.	నారన సూరన	273
101.	పోడూరి పెదరామామాత్యుడు	274
102.	రామావర్ఝుల కొండుభట్టు	276
103.	మారయకవి	278
104.	పరశురామపంతుల లింగమూర్తి	278
105.	పరశురామపంతుల రామమూర్తి	280
106.	వేగినాటి కొండనార్యుడు	282
107.	వాసుదేవయోగి	283
108.	కానాల నరశింహకవి	284
109.	రామనామాత్యుడు	286
110	శోభన	286

		పుట
111.	పెనుపల్లె బాపనామాత్యుడు	287
112.	చదువుల సోమలింగయ్య	288
113.	శ్రీధరమల్లె వేంకటస్వామి	289
114.	ఓరుగంటి సోమశేఖరకవి	291
115.	ముడుంబి వేంకటాచార్యుడు	292
116.	అక్కెనపల్లి నృశింహకవి	293
117.	పైడిపాటి వేంకటనృశింహకవి	295
118.	కొటికెలపూడి వేంకటకృష్ణకవి	297
119.	కాకరపర్తి కృష్ణకవి	299
120.	కృష్ణయ్య	301
121.	తరిగొండ వెంకమ్మ	302
122.	పిండిప్రోలి లక్ష్మణకవి	307
123.	అల్లమరాజు రామకృష్ణకవి	312
124.	కాకరపర్తి బుచ్చిపాత్రకవి	315
125.	శిష్టు కృష్ణమూర్తికవి	317
126.	మంత్రిప్రగడ సూర్యప్రకాశకవి	323
127.	ఫక్కి వేంకటనరసయ్య	325
128.	వేల్పూరి వేంకటేశ్వరకవి	326
129.	తిరుమలబుక్కపట్టణపు చినతాతాచార్యులు	329
130.	మాడభూషి నృశింహాచార్యుడు	330
131.	కోటమరాజు నాగయ	330
132.	కరాలపాటి రంగయకవి	332
333.	దామరాజు లక్ష్మీనారాయణ	334
334.	త్యాగరాజ మొదలి	335
335.	ఓగిరాల జగన్నాధకవి	337
336.	వడకుదుటి రామనకవి	338
137.	మాడభూషి వెంకటాచార్యకవి	341
138.	పెనుమత్స బుచ్చిరాజు	343

		పుట
139.	మండపాక పార్వతీశ్వరకవి	344
140.	సత్యవోలు భగవత్కవి	346
141.	గురురాజకవి	347
142.	అల్లమరాజు సుబ్రహ్మణ్యకవి	349
143.	గోపీనాధము వేంకటకవి	350

ఆంధ్రకవుల చరిత్రము.

ఆధునిక కవులు

1. హరిభట్టు

ఈకవి మత్స్యపురాణమును వరాహపురాణమును తెనిఁగించెను. ఇతని నివాసస్థానము కంబముమెట్టు; ఇది బెజవాడ కాటామడలదూరములో నున్నది. ఇతఁడు తన వరాహపురాణమునందు కంబముమెట్టు గ్రామము నీప్రకారముగా వర్ణించియున్నాఁడు—

సీ. వరుణదిగ్వీధి నేపురముఁ బ్రవహించెఁ బావనసలిలసంపన్న మున్న
దీపించె నేపురి గోపికామానసాస్పదవర్తి చెన్నగోపాలమూర్తి
భాసిల్లె నేవీటఁ బ్రహ్లాదభక్తివిశ్రాణి కొండనృసింహశార్ఙ్గపాణి
యేపట్టణంబునఁ జూపట్టె హితపద్మహేళి వీరేశబాలేందుమౌళి
చతురచతురంగబలరత్నసౌధయూథ । సాలగోపురతోరణసకలవర్ణ
పౌరవారాంగనాజనప్రముఖవస్తు । మేదురం బట్టికంబముమెట్టపురము.

కవి వైదికబ్రాహ్మణుఁడు; భారద్వాజసగోత్రుఁడు; రామపండితుని పుత్రుఁడు. ఇతఁడు మొదట వరాహపురాణము కొలిపాక యెఱ్ఱనామాత్యుని కంకితము జేసెను.

మ. నవ కాంతుం గొలిపాక యెఱ్ఱనికిఁ దేజశ్శౌర్యగాంభీర్య స
త్వవిభుత్వోక్తి ధనుర్జయోన్నతి యశస్త్యాగక్రియాశాంతులన్
సవితృ సాత్యకి సింధు సీరి సురశాస్తృ సూతు సేనాని సైం
ధవనిర్భేదను సోము సౌమ్యరుచి సంతానంబు సప్యాధిపున్.

ఇత్యాది పద్యములచేత గుణితక్రమమునఁ గవి కృతినాయకుని నెంతగా నభివర్ణించినను;

క. శ్రీమహిత స్తంభాచల । నామసముద్దామపట్టణస్థలగణక
గ్రామణికి బంధుహితర । క్షామణికిఁ గవీంద్రపంకజనభోమణికిన్.

అను షష్ఠ్యంతపద్యమువలన నతఁడాయూరికి కరణమయినట్టు స్పష్టపడుచున్నది. ఇట్టి నాయకగ్రామణి తన్నుఁ బిలిపించి—

మ. అమృతప్రాయవచోవిశేషరచనాహంభావపుంభావవా
గ్రమణీమూర్తివి వేదశాస్త్రవివిధగ్రంథార్థనిర్ణీతి నే
కముఖబ్రహ్మవు యాజుషప్రకటశాఖాధర్మధుర్యుండ వ
ర్యమతేజుండవు రామనార్యహరిభట్టా సత్కవిగ్రామణీ.

గీ. అష్టఘంటావధానవిశిష్టబిరుద
నీవు రచియింపఁ దలఁచిన నిరుపమార్థ
రమ్య మగు నీవరాహపురాణకావ్య
మంకితముచేయు నాపేర నభిమతముగ.

అని పలికినట్లు కవి వ్రాసికొనియున్నాఁడు. పయిపద్యమునందే గాక యాశ్వాసాంత గద్యమునందును "అష్టఘంటావధానపరమేశ్వర బిరుదవిఖ్యాత" యని కవి వ్రాసికొనెను గాని యీబిరుద మెవ్వరిచే నియ్యఁబడినదో తెలియఁబడదు. అయినను కవిత్వము మాత్రము పయి పద్యమునందుఁ జెప్పఁబడిన రీతిగా నమృతప్రాయముగానే యున్నది. ఇతఁడు తానాపస్తంబసూత్రుఁ డయినట్టును తిమ్మాంబ పుత్రుఁ డయి నట్టును మత్స్యపురాణములో నీక్రింది పద్యమునఁ జెప్పుకొన్నాఁడు—

శా. భారద్వాజసగోత్రసంభవుఁడ నాపస్తంబుఁడన్ దిమ్మకాం
బారాజద్వరగర్భసంభవుఁడ రామక్ష్మాసురానేకజ
న్మారూఢాధిక పుణ్యలబ్ధహరి నామాంకాప్తసంస్తుత్యుఁడన్
శ్రీరామావరపాదపద్మయుగళీ చింతాసమాయుక్తుఁడన్.

ఇతఁడు మొదట రచించిన వరాహపురాణమును నరాంకితముచేసి యట్లు చేయుట పాపకార్యమని తలచి తత్పాపపరిహారార్థముగా మత్స్యపు

పురాణమును శ్రీరంగాంకితముచేసి యం దీక్రిందిపద్యమును బొందుపఱిచెను:—

సీ. ఆయురారోగ్యనిత్యైశ్వర్యములు గల్గి
విభవంబుతో ధాత్రి వెలయుకొఱకు
ధనమునకై నరాధముల సన్నుతిచేయఁ
బొడమినపాపము ల్చెడుటకొఱకు
హృదయంబు లక్ష్మీశపదపంకజములందు
నిశ్చలవృత్తితో నిలుచుకొఱకు
రౌరవాదులఁ బాసి రయమున వైకుంఠ
సదనంబునకు వేడ్కఁ జనుటకొఱకుఁ
బరమవైష్ణవజనులెల్లఁ బ్రస్తుతింప
మత్కృతం బయి హరికథామాన్య మగుచు
నుత్తమం బగువిష్ణుధర్మోత్తరంబు
రంగనాథున కర్పింతు రమణ మెఱసి.

కవికాలమును నిర్ణయించుటకీ పుస్తకములు రెంటిలోను నాకాధారము లేవియు గానరాలేదు. అక్కడక్కడఁ గొన్ని యల్పదోషములున్నను మొత్తముమీఁద నిర్దుష్టమని చెప్పఁదగిన గ్రంథరచనను బట్టియు శైలినిబట్టియు చూడఁగా నీపుస్తకములు చిరకాలము క్రిందటనే రచియింపఁబడినవయినట్లు తోఁచుచున్నది. "అష్టఘంటావధాన" యని రెండు పుస్తకములయందును గనఁబడుచున్నది. గంటమను తెలుఁగుశబ్దమునకుఁ బ్రకృతియయి లేఖినియని యర్థమిచ్చెడు "ఘంట" శబ్దము సంస్కృతమున నున్నదేమో! అప్పకవి యీగ్రంథములనుండి లక్ష్యములను జేకొనకపోవుటచేత నీకవి యతనికిఁ దరువాత నున్నాఁడేమో యని యూహ కలుగుచున్నది. కాఁబట్టి తగిన యాధారములు దొరకువఱకును మన మిప్పటికీ కవికాలము క్రీస్తుశకము ౧౬౬౦

సంవత్సర ప్రాంతమని భావింతము. తెలియనివిషయముల నూహించి పెంచి వ్రాయుటకంటె కవికృతగ్రంథములనుండి కొన్నిపద్యముల నుదాహరించి యింతటితో విరమించుట యుక్తమని యెంచి యట్లు చేయుచున్నాను.

వ రా హ పు రా ణ ము.

ఉ. మిక్కిలి శీతలాంబువులు మేసికిఁ గీడు మహోష్ణవారిచేఁ
బొక్కు శరీర మీ యుభయముం దొరలించిన నింపొనర్చు ని
ట్లొక్కనయంబ యొండె భయ మొండె నొనర్పక తద్ద్వయంబుఁ దా
నిక్కు వెలింగి చూపు మనుజేంద్రునకు న్వశు లౌదు రందఱుఁ-ఆ౧

మ. సమరాజేంద్రునిఁగూర్చి సామము భుజాశౌర్యాధికుంగూర్చి దా
నము దీనం గలయంగనేరనిమహీనాథాగ్రణింగూర్చి భే
దము శక్తిత్రయహీనుఁగూర్చి కడిమిం దండంబుఁ గావింప యు
క్తము భూపాలున కాత్మరాజ్యపరిరక్షాకార్యని స్తంద్రతన్-ఆ.౨

శా. వేదార్థంబులు వేఱుగాఁ దెలిసి దుర్విజ్ఞాను లాత్మేశ్వరా
భేదధ్యానసమేకులై తుది భవిత్రీత్యర్థమై కర్మముల్
మోదం బొప్పఁగఁ జేయనేరక మహామోహాంధులై యుందు రం
తాదివ్యాప్తి విహీనసంసృతిసముద్రాంతర్నిమగ్నాత్ములై —ఆ. 3

ఉ. దేహవినాశమూల మగు తీవ్రవిషావృత మైనయట్టి యా
బాహువుఁ ద్రెంచి మేను నిలుపందగు నందురుగాన సోదరీ
స్నేహము చేయు టొప్ప దని చెల్లెలిముందల వట్టి యాజగ
ద్ద్రోహి గళంబుఁ ద్రెంచుటకు దొరసి యెత్తినఁ జూచి యుత్తతిన్-ఆ౪

చ. ఘనతరకష్టలోభిఁ దమకంబునఁ జంపెదునంతయుల్క నె
మ్మనమునఁ బుట్టె నేని విషమారణ కర్మకృపాణముఖ్యసా
ధనములు గూర్ప నేల ప్రమదంబున డగ్గఱి కాసు వీస మి
మ్మనుటయె చాలు వారి నిమిషార్థమున న్మృతి నొందఁ జేయగన్-ఆ౫

మత్స్యపురాణము.

చ. చదివితి వేదశాస్త్రములు సాంగపదస్వరవర్ణరూఢి నం
దొదవిన మార్గముల్ వివిధయోజ్యములై విలసిల్లు వానిలో
నెదిరిన కర్మకాండమున హింసము జ్ఞానమునందుఁ గర్మమున్
వదలక పల్కుచుండును బ్రవాహముల న్విపరీతవృత్తులై.—ఆ. ౧

చ. తిరిగితిఁ గాననంబు లతితృష్ణఁ జలింపక తద్వనంబులన్
దొరకవు కందమూలములు తోయజనాభునియాజ్ఞఁగాక యి
ప్పురమున నన్నపూర్ణ పరిపూరితయై విహరింపుచుండఁగాఁ
గఱవగునే తదన్నము లకాలమున న్మనమందిరంబునన్—ఆ. ౨

చ. విప్రగు నీచకర్మపదవిం జనువారికి మంత్రతంత్రముల్
తప్పినఁ బ్రత్యవాయములు తాఁకానివచ్చుటెకాని దానలే
దప్పరమేశుఁ జొందెడుప్రయత్నము నే నిటనీకు వేడుకం
జెప్పెద గుప్తమార్గమునఁ జేయుము తత్క్రియ భూసురోత్తమా.—ఆ. ౩

మ. రమణీబంధుజనాప్తుల న్విడిచి తద్రాజ్యంబు వర్జించి దు
ర్దమకామాదులఁ జెందనీక హృదయస్థైర్యంబున న్నించి నీ
వమితోద్యద్గుణకీర్తనామృతముచే నాహ్లాదముత్తుండవై
విమలాంతఃకరణుండ వైననిను నే వీక్షించితిం బుత్రకా.—ఆ. ౪

మ. హరి సంగీతవినోదలోలుఁ డగుచో నత్యంతశీఘ్రంబునన్
వరగానంబుల నాత్మసద్గుణకథావర్ణంబులై యట్టిగీ
తరసంబుల్ రసనం జవిం గొనెడుమర్త్యశ్రేణి కిష్టార్థముల్
పరిపూర్ణంబులుగా నొసంగును దయాపారీణుఁడై వేడుకన్.—ఆ. ౫

2. ఒడ్డెపూడి పెద్దయ్య

ఈ కవి వాయుపురాణమును తెనిఁగించి, పురుషోత్తమపట్టణ నివాసుఁడయిన దాసరి చిన్నగంగయ్య యను కమ్మచౌదరి కంకితము చేసెను. పురుషోత్తమపట్టణము కొండపల్లెకుఁ బ్రాగ్భాగమున నున్నట్టును, దానిని వీరపురుషోత్తమ గజపతి తనపేరఁ గట్టించినట్టును గవి చెప్పియున్నాఁడు. వీరపురుషోత్తమగజపతి కొండవీటి కధిపతిగా నుండి క్రీస్తుశకము ౧౪౩౦ వ సంవత్సరము మొదలుకొని ౧౪౬౭ వ సంవత్సరము వఱకును రాజ్యపాలనము చేసెను. ఈతని తరువాత రాజ్యమునకు వచ్చిన యితని మనుమఁడైన వీరభద్రగజపతిని ౧౫౧౫ వ సంవత్సరమునందు కృష్ణదేవరాయలు జయించి కొండవీటిని స్వాధీనము చేసికొనెను. దీనినిబట్టి వాయుపురాణము కృష్ణదేవరాయని కాలమున కనంతరముననే రచియింపఁబడినట్టు తెలిసినదికాని యెప్పుడు చేయఁబడినదో తెలియదు. అప్పకవి యీ పురాణమునుండి పద్యముల నుదాహరించియుండక పోవుట మొదలయిన కొన్ని హేతువులనుబట్టి హరిభట్టకవికాలమువలెనే యీ కవికాలమును ౧౫౬౦ వ సంవత్సరప్రాంతమని యూహింపఁ దగియున్నది. ఈ యిద్దఱుకవులును కవిత్రయమని ప్రసిద్ధిగన్న నన్నయ తిక్కన శంభుదాసులనుదక్క నితరాంధ్రకవులను దమ గ్రంథములయందుఁ బేర్కొనియుండలేదు. కవికృతినాయకుఁడయిన చినగంగయ్య కొలువునఁ గూర్చుండి తన్నుఁగూర్చియు సభికులనుగూర్చియుఁ బలికిన వాక్యముల నిట్లు చెప్పియున్నాఁడు—

సీ. అతులితశాస్త్రేతిహాసంబు లొకవంక నొకవంక దండనాయకగణంబు
తతచతుర్విధవేదతత్వజ్ఞు లొకవంక నొకవంక నిపుణశాబ్దిక చయంబు
ప్రకటితప్రౌఢతార్కికబృంద మొకవంకనొకవంకఁజతురవాక్సుకవినికర
మకళంకపౌరాణికకదంబ మొకవంక నొకవంక జ్యోతిషప్రకరవేత్త

లోక్కచో బంధునిచయంబు లోక్కయెడ స
మగ్రసామంతవిసరంబు మహిమఁ గొలువఁ
గొలువుకూటంబు నందుండి కలితవచన
గౌరవముమీఱ సభికులఁ గాంచి పలికె.

* * * *

చ. వినతసమస్తభూభుజుని వేంకటమంత్రికిఁ బేరమాంబకున్
దనయుఁ బుణ్యావర్తుని దానగుణాన్వితు నారసింహహ్వా
ప్వనరుహచంచరీకు ననివార్యవచోరచనావిశారదున్
నను బినయొడ్డెపూడి పురనాథునిఁ పెద్దకవీంద్రచంద్రునిన్.

త్రోటకము—వినయంబునఁ గన్గొని వేడుక ని
ట్లనియెన్ సుకవీంద్ర మురారికథల్
వినినంత నభీష్టనవీనఫలం
బనయంబును గల్గు జనావళికిన్.

* * * *

ఉ. పంకజగర్భదారకటిభాగవిభాసితభర్మమేఖలా
కింకిణికావిరావములఁ గేరి తదీయకరాగ్రపిస్ఫుర
త్కంకణనిష్కళంకనినదంబు నగున్ బినయొడ్డెపూడిమా
వేంకటమంత్రిపెద్దన నవీనవిలాసవచోనిగుంభనల్.

ఈ కవి నియోగిబ్రాహ్మణుఁడు; కాశ్యపగోత్రుఁడు; వేంకటమంత్రి పుత్రుఁడు; ఒడ్డెపూడి గ్రామమునకు కరణము. ఇతఁడు వాయుపురాణము లోనికొంతభాగమును మాత్రమే తెనిగించినట్టు కనబడుచున్నది. ఈతని కవిత్వమునం దక్కడక్కడఁ గొన్ని దోషములున్నను మొత్తముమీఁద కవిత్వము రసవంతముగానేయున్నది. వాయుపురాణమునుండి కొన్ని పద్యముల నిందుదాహరించుచున్నాను—

మ. కరకోచ్చారితమై ఘనాఘనబృహద్గర్జారవోపేతమై
వరవిద్యుల్లతికాతతిప్రబలమై వాతోప్పతీవ్రాసబం
ధురమై సర్వదిశాభిభాగములు నస్తోకాంబుపూర్ణంబుగాఁ
గురిసె న్వర్షము నీరజవ్రజము సంక్షోభింప భీమంబుగన్—ఆ. ౧

ఉ. పొంగినవేడ్కచే నతఁ డపూర్వముగా విహరించుచుండి యా
చెంగటఁ గాంచె దివ్యసరసీరుహశోభితమ త్తభృంగ ను
త్తుంగతరంగఁ దోయపరిత్యోపనికీర్ణ బలాకచక్రచ
క్రాంగ నభంగగంగ నికటాగతసంయమిసంగ నెంతయున్—ఆ. ౨

మ. కడుదూరంబున నుండి మేను వడఁకంగాఁ బాదముల్ తొట్రిలన్
వడచేఁ జిక్కి హరీ యటంచును గృహద్వారంబుఁ జేరంగ నే
నిడఁగాఁ బంచితి నీరసాన్న మతఁడున్ హేయంబుగాఁ జూడకే
కుడిచెం దక్కలుషంబు చేయుకతనన్ ఘోరాటవీభూములన్—ఆ. 3

మ. మునిసంఘంబులు మ్రొక్కఁ దామరలు సమ్మోదంబున న్నిక్కఁ గో
కనికాయంబుల కింపు లెక్కఁ గుముదౌఘంబుల్ రుచు ల్దక్క నో
ర్వనిగర్వంబులు దూలి జాలిఁబడి జీవంజీవముల్ స్రుక్కఁ దూ
ర్పున మార్తాండుఁడు గానిపించె భువనంబుల్ రంజిలం జేయుచున్-ఆ. ౪

ఉ. ఇంద్రుఁడ నీవు దుఃఖపడ నేటికిఁ గౌశికవాని చేయుని
స్తంద్రతపంబు మాన్పుటకు శక్యము గాదననేల ధీరతన్
రుంద్రమతి న్సుఖింపుము నిరూఢిగ నే నిదె చక్కఁ జేసెదన్
జంద్రముఖీవిలోకనసుసంగతిఁ జొక్కరె యెట్టివారలున్—ఆ. ౫

3. కాకమాని మూర్తి

ఈ కవి కాకమానికులజుఁడైన బ్రాహ్మణుఁడు; కౌండిన్యస గోత్రుఁడు; రామలింగ భట్టుపుత్రుఁడు. ఇతఁడు పాంచాలీపరిణయము, రాజవాహనవిజయము అను రెండు ప్రబంధములను రచియించెను. రాజవాహనవిజయములోని యీ క్రింది పద్యమునుబట్టి యీ కవి యింటి పేరు పెన్నావారస తెలియవచ్చుచున్నది—

సీ. గుణధన్యుఁ గౌండిన్యగోత్రు నాపస్తంబసూత్రుని వెలనాఁటిశుభచరిత్రుఁ
గాకమానీమహాగ్రామాబ్జమిత్రుఁ బెన్నాకలశాబ్ధితారాకళత్రు
సరసవిద్వత్కవి సార్వభౌముని రామబుధసంభవునకుఁ బ్రబోధసుధికిఁ
బాత్రుని బినరామభట్టాగ్రజన్ముఁడై తనరు శ్రీరామలింగనకుఁ దిమ్మ
మాంబికకుఁ బుత్రుఁ సూర్యనారాయణద్వ
యైకసహజన్ము నుభయభాషాకవిత్వ
తత్వనిధిఁ నన్ను మూర్తివిద్వత్కవీంద్రు
హర్షమునఁ జూచి యిట్లని యానతిచ్చె.

ఇతఁడు తనగ్రంథములను నరాంకితములఁ జేయక రాజవాహనవిజయమును శ్రీవేంకటేశ్వరులకును, పాంచాలీపరిణయమును శ్రీరంగపతికిని, అర్పించినందునఁ గృతిపతులను బట్టి కవికాలమును నిర్ణయించుట కాధారములేదు. ఇఁకఁ గవిస్తుతిలోనైనను పాంచాలీపరిణయమునం దితఁ డితరాంధ్రకవులను బేర్కొనక తనముత్తాతయు తాతయునైన గామపండితుని ప్రబోధపండితుని మాత్ర మీపద్యమునందు పేరులు పెట్టి నుతించియున్నాఁడు—

చ. ప్రబలమతి న్నుతింతుఁ బ్రతిభాకృతిభాషితభారతీశులన్
గబళితసర్వదర్శనులఁ గావ్యచమత్కృతికాళిదాసులన్
నిబిడతపోవిలాసులఁ దృణీకృతవాదులఁ గాకమాని రా
మబుధవిధున్ బ్రబోధసుధి మత్ప్రపితామహునిన్ బితామహున్.

రాజవాహనవిజయమునందు వీరినిగాక యీపద్యమునందుఁ గవి త్రయమునగూడఁ బేర్కొని యున్నాఁడు—

ఉ. శ్రీరఘురామకావ్యకృతశిష్టవిధిజ్ఞుఁ బరాశరాత్మజున్
భారవిఁ గాళిదాసు శివభద్రు మురారి మయూరు బిల్హణున్
జోరుని మల్హణాదిసురసూక్తి కవీంద్రులఁ గొల్చి యెంచెదన్
భారతకర్తృతాచణుల నన్నయఁ దిక్కన నెఱ్ఱనార్యులన్.

ఇతఁ డన్యకవుల నెవ్వరిని గొనియాడకపోయినను వసుచరిత్రకర్త యైన బట్టుమూర్తికిఁ దరువాతివాఁ డయినందుకు సందేహము లేదు. వసుచరిత్రకర్త మూర్తి యన్నమాట వినఁబడఁగానే మూర్తి నరసభూపాలీయకర్తగాని వసుచరిత్రకర్త కాఁ డనియు, ఉభయగ్రంథకర్తలు బట్టువంశజులయి యేకకాలవా రగుటచేఁ బూర్వకాలమునుండియుఁ బండితపామర సాధారణముగా వసుచరిత్రకారుఁడు బట్టుమూర్తి యన్న భ్రమ యంధ పరంపరగా వచ్చుచున్నదనియు, కొందఱు చెప్పవత్తురు. ఒక్కకాలమునం దిద్దఱు కవులుండి వారిలో నొక్కఁడు సుప్రసిద్ధుఁడును రెండవవాఁ డప్రసిద్ధుఁడును నయినప్పుడు సుప్రసిద్ధునిపే రడఁగిపోయి యప్రసిద్ధునిపేరు పైకివచ్చుట యెన్నఁడును సంభవింపనేరదుగాన, అధిక ప్రసిద్ధుఁ డయిన రామరాజభూషణునిపే రడుగంటి యాతని గ్రంథ కర్తృత్వము బట్టుమూర్తిమీఁదఁ బడెననుట యుక్తియుక్తము కాదు. ఒకవేళ భ్రమకలిగెను పక్షమున, నరసభూపాలీయకర్త రామరాజ భూషణుఁడని కలుగవలెను. అప్రస్తుతమైన యీయంశము నటుండనిచ్చి కార్యాంశమునకు వత్తము. అనేకు లీకవిని బట్టుమూర్తినిగా భ్రమించి యితని పాంచాలీపరిణయములోని యీక్రిందిపద్యమును—

గీ. అల్లసానివానియల్లిక బిగిసొంపు । ముక్కుతిమ్మనార్యు ముద్దుఁబలుకుఁ
బాండురంగసుకవి పద్యంబుహారువును । గాకమానిరాయ నీకె కలవు.

బట్టుమూర్తినిగూర్చి రామకృష్ణకవి పలికినట్టు చెప్పుచున్నారు. ఇది నామసామ్యమునుబట్టి కలిగిన భ్రమగాని వేఱుకాదు. మఱియు నీపద్యమునుబట్టి యీకవి తెనాలి రామకృష్ణునికాలమునకుఁ దరువాతి వాఁడనుట స్పష్టమగుచున్నది. పయిపద్యములో శ్రీరంగేశుఁడు తన కవిత్వమునుగూర్చి యట్లు పలికినట్లు చెప్పుకొనుటయే కాక రాజవాహన విజయములో సరస్వతిని బ్రార్థించునప్పుడుకూడ నిట్లు చెప్పియున్నాఁడు.

ఉ. చోరు సలంక్రియాకవిత సొంపు మయూరునిసౌకుమార్యమున్
భారవికాంతిసంపదయు బాణుగుణాఢ్యతర ప్రయోగ మా
దారి మురారికోమలపదంబుప్రసాదముఁ గల్గునట్లుగా
భారతి యిచ్చుఁగాతఁ బ్రతిభారతి మత్కృతికిం జమత్కృతిన్.

ఈతని కవిత్వమునం దీకవి పొగడుకొన్నంత యాధిక్యము లేక పోయినను, రసవంతమయి సలక్షణమయి యమకాది శబ్దార్థాలంకార యుక్తమయి కవితారచన యనర్గళధారగా ప్రవహించుచున్నది. గ్రంథములం దన్యదేశ్యపదములును పూర్వలాక్షణిక సమ్మతములుకాని ప్రయోగములును గొన్ని యందందుఁ గానఁబడుచున్నవి. కవి ౧౬౭౦ వ సంవత్సరప్రాంతములయందుండి యుండియుండును. కాకమానిమూర్తి బహుళాశ్వచరిత్రములోనివని కొన్ని పద్యములు రంగరాట్ఛందమునం దును సర్వలక్షణ సారసంగ్రహమునందును ఉదాహరింపఁబడియున్నవి కాని యితఁడు రచియించిన బహుళాశ్వచరిత్రము నాకు లభింపలేదు. ఈమూర్తికవి రాజవాహనవిజయములో చంద్రగిరి హనుమంతుని స్తుతించి యుండుటచేత నీతని వాసస్థానమైన కాకమానిగ్రామము చంద్రగిరి సమీపమున నుండియుండును. కవిత్వరీతిని దెలుపుట కీతని గ్రంథముల నుండి కొన్ని పద్యముల నుదాహరించుచున్నాను—

రాజవాహన విజయము.

శా. ధాటీఘోటఖురాగ్రనిర్దళితగోత్రాధూళికాగంధచూ
ర్ణాటోపాతిపరిస్ఫురత్కఠినసర్వాశావధూటీకుచా
ఘాటచ్ఛాయదరాగశాటికసమాఖ్యావిక్రమప్రక్రమా
త్యాటీకాహితరాజహంసుఁ డగు నాహా రాజహంసుం డిలన్ - ఆ. ౧.

ఉ. మీసపుమొక్కనిక్కునకు మిక్కిలిత్రొక్కరివాన కుంతలా
ళీసురపాలనీలమణిలీలకుఁ గ్రొన్ననుసోన విభ్రమ
శ్రీ సరసీరుహంబు మదసింధురసప్రసవంబు సూనబా
ణాసతపఃఫలం బపుడు యౌవన మబ్బెఁ గుమారమౌళికిన్ — ఆ. ౨

శా. పూవుంబోఁట యొయారి చేరి బలితంపుంజందురాతిన్నెలం
బూవుందేనియ సోనవాన చొత్తుకు లొప్పై చు గొజ్జాగిపూ
పై వాటు ల్గలదాసనంపుఁగనిమల్ పన్నీటిమున్నీటి బల్
త్రోవం గట్టినపచ్చమెట్టికలపైఁ దోడ్తోడఁ గ్రీడింపఁగన్ —— ఆ. 3.

ఉ. తాలిమిదూలి తూలి చెలి దర్పకుఁ డప్పుడె వంచుతమ్మిపూ
వాలికతూపు క్రొంజెమటవానకుఁ గారణ మైననిద్దపుం
గోలమెఱుంగొ యాననచకోరహితాగతరశ్మియోరయో
లోలమృగాక్షి నాపయిఁ దళుక్కనఁ జూచినచూపు బాపురే. ఆ-౪

మ. కటకంబు ల్గలయుత్కటద్విపఘటల్ ఘంటాపథప్రస్ఫుట
త్కటకంబు ల్మొరయంగఁ జక్కఁజన వాద్యధ్వానశక్తిన్ మహా
కటకంబుల్ ప్రతివాద మీన విభవోత్కంఠన్ దిశాభూమిభృ
త్కటకంబు ల్గన రాజు చేరఁ జని యెం దన్మందిరాళిందమున్. ఆ. ౫.

పాంచాలీపరిణయము.

ఉ. ఏయఁ గఠోరమార్గణము లివ్వలి కవ్వలి కద్రి దూయఁగా
ప్రేయుధరాస్థలిన్ సబిడివెంటనె గాంగఝరంబు లేవఁగాఁ

జేయును నగ్గురూఁచములు చెట్టునుజట్టును గొట్టి బిట్టుగా
నాయనలాయనప్రభువుఁ డాయన యౌవనగర్వసంపదన్. ఆ. ౧.

ఉ. ఎంతటివన్నెఁ దెచ్చె గుడి చేసి యితండు ద్విజన్మజాతికిన్
వింత యటంచు రాజుల గణింపక తిట్టుచు గేలి గొట్టుచున్
గంతులు వైచుచుం దలకుఁ గట్టినచెంగగవైచి పట్టుచున్
గొంతులురాయఁగోయనుచుఁగూఁతలుపెట్టిరిగ్రామ్యభూసురుల్. ఆ-౨

ఉ. ముందటఁ గాంచె దిగ్రమణముఖ్యుఁడు వారుణవేషభాషణున్
మంథరకంధరాకనకమందిరమధ్యవితర్దిమండపా
రందరనీలకందరధురంధరసింధురవైరిపీఠవా
సేందుకళాకలాపు హృదయేశ్వరితోడుత నృత్తమాడఁగన్. ఆ. 3.

శా. నీకేవచ్చు సువాలయున్ ధవళ మింతీ యల్లొనేరెల్లు గా
రీకళ్యాణము లంచు నింటికడ నేరీతి స్వజృంభింతువే
వాకీ విచ్చుట నంచు సిద్ధఋసతు ల్వాక్యోపవాక్యంబులన్
గాకై ముందలపట్లకుం దొడఁగి రాకల్యాణవేదిస్థలిన్. ఆ. ౪.

శా. ఆఁడుంగాన్పుచు గంటకన్న నతి గొడ్డా తాటయే మేలు నూ
త్రేఁడు ల్పెంచిన గూఁతు రేమి సతమా యీవియ్యము లోఁబడలిన్
గాఁడంబల్కినఁ దాళఁగానల సెఁగా కాఁగానితిట్లాడికల్
నేఁ డీతండ్రియుఁ దల్లి వంగడము కానీ పంచుకోనాయెఁగా. ఆ. ౫.

4. కామేశ్వరకవి

ఇతఁడు సత్యభామాసాంత్వనమను నాలుగాశ్వాసముల శృంగారప్రబంధమును రచియించి, మధురనాయకుఁడైన ముద్దలగరి నృపాలున కంకితముచేసెను. ఈమధుర శ్రీకృష్ణుని జన్మస్థల మయిన మథురాపురముగాక పాండ్యమండలమునకు రాజధానియైన దక్షిణ మధుర యైన ట్లీక్రిందిపద్యమువలనఁ దెలిసికొనవచ్చును—

క. లక్షణలక్షితకమలా । వీక్షణపుంఖానుపుంఖవిభవోన్మేషా
నుక్షణతతవిశ్రుతియై । దక్షిణమధురాపురంబు తనరు ధరిత్రిన్.

కృష్ణదేవరాయని యనంతరముఁ దెలుఁగు నాయకులు పాండ్యమండలమును జిరకాలము పాలించిరి. ఈకవి యాకాలమునందు మధురాపురమును బాలించుచున్న ముద్దళగిరిరాజు సభలోఁ గూరుచుండి తన్నుఁగూర్చి యిట్లు పలికెనట్లీపద్యములలోఁ జెప్పినాఁడు—

శా. ఆరీతిన్ సభ ముద్దళగ్గిరిధరాధ్యక్షుండు కొల్వుండి తా
హేరాళంబుగ నయ్యెడ న్నడచుసాహిత్యప్రసంగంబు గం
భీరప్రౌఢిమ వించు న న్బిలిచి నెమ్మిం బల్కె వీణాకన
ద్గౌరీపాణిసువర్ణకంకణ ఝణత్కారానుకారోక్తులన్.

చ. అనువుగ రుక్మిణీపరిణయంబును మున్ హవణించి యార్యులౌ
ననఁ దనియించినావు మము నప్రతిమంబుగ నవ్యకావ్య మిం
పున రచియింపుమీ సొగసుపోఁడిమి మీఱఁగ సత్యభామసాం
త్వనమును గప్పురంపుఁజలువం గెలువం దిరుకామసత్కవీ.

క. కాకులవలె నింటింటను । గాకవు లున్నారు హంసకైవడి భువిలో
శ్రీకామ నీకె తగురా । యేకడ నుడిపాలు నీరు నేర్పఱుపంగన్.

క. ఏ భాష నైన నీకృతిపతి । శోభనములు చెందు నీదుసూక్తులవలనన్
నీ భాగ్య మసదృశము గా । రీభవకరుణానివేశ శ్రీకామేశా.

ఈ ముద్దళగిరి తన సవతియన్నగారయిన చొక్కనాథుఁడు స్త్రీలోలుఁడయి రాజ్యభారమును తమ్మునిమీఁదఁ బెట్టి తంజాపూరిలో నున్న కాలములో యువరాజుగా రాజ్యముచేసెను. చొక్కనాథుఁడు క్రీస్తుశకము ౧౬౬౦ వ సంవత్సరము మొదలుకొని ౧౬౮౨ వ సంవత్సరము వఱకును రాజ్యము చేసెను. కవి యీ ముద్దళగిరినే రాజునుగా వర్ణించినను, ఆతని వర్ణనలోఁగల యీ క్రింది పద్యమునుబట్టి యన్న యుండగానే యతఁడు రాజ్యభారము వహించినట్టు స్పష్టమగుచున్నది—

ఉ. అన్నయు దమ్ము లీకరణి నందఱు నొద్దికయై యశోరమల్
చెన్ను వహింప రాముకృపచేఁ దనుఁ జెందినరాజ్యసంపద
భ్యున్నతభోగభాగ్యుఁడఁగు యుర్విని సర్వనృపాలకోటిలో
నెన్నిక కెక్కె ముద్దళగిరీంద్రుఁడు తాను మహోన్నతస్థితిన్.

ఈ ముద్దళగిరి ౧౬౭౬ వ సంవత్సరప్రాంతమునఁ దానే రాజ్యము నాక్రమించుకొని సంవత్సరకాలము స్వతంత్రముగాఁ దనపేరనే పాలనము చేసెను గాని యింతలో చొక్కనాథుఁడు వచ్చి దేశము మరల స్వాధీనము చేసికొనెను. చొక్కనాథుఁడును, ముద్దళగిరియు, మఱిముగ్గురును ౧౬౨౩ వ సంవత్సరము మొదలుకొని ౧౬౫౯ వ సంవత్సరమువఱకును రాజ్యముచేసి ప్రసిద్ధికెక్కిన తిరుమలనాయకుని కొమాళ్ళు. ఇందుఁ దెలుపఁబడిన చరిత్రమునుబట్టి కవి యీ గ్రంథమును ౧౬౪౫ వ సంవత్సర ప్రాంతమునందు రచియించినట్టు తెలియవచ్చుచున్నది. ఇతఁడు రుక్మిణీపరిణయమును గూడ రచియించినట్టు చెప్పఁబడినదిగాని యీపుస్తకము నాకు లభింపలేదు. "దక్షిణసింహాసనాధ్యక్ష తిరుమలక్ష్మాకాంత కరుణాకటాక్షలక్షిత స్వచ్ఛముక్తాగుళుచ్ఛసితచ్ఛత్ర చామరకళాచికా కనకాందోళికా విరాజోపచార" యని యాశ్వాసాంత గద్యమునఁ జెప్పుకొని యుండుటచేతఁ గవి తిరుమలనాయకుని కాలమునందు సహితముండి ౧౬౫౦ వ సంవత్సరప్రాంతములనుండి కవిత్వమునందుఁ బ్రసిద్ధి

నొందియుండును. ఈ గద్యమునందే యితఁడు "శ్రీకాళహస్తీశ్వర చరణారవింద మిళిందాయమాన జ్ఞానప్రసూనాంబికా కృపాలంబ విజృంభమాణ సారసారస్వత సుధాతరంగ" యని చెప్పుకొనుటచే నితఁడు కాళహస్తినివాసుఁడయి మధురనాయకుల యాదరమువలన మధురసంస్థానమును జేరినట్లు కనఁబడుచున్నది. విజయవిలాసమువలెనే యిదియు శుద్ధద్రవిడదేశమునందుఁ జేయఁబడిన ప్రబంధము. ఇవిగాక యఱవదేశమునందుఁ జేయఁబడిన తెనుఁగుకావ్యము లింకను బెక్కులు గలవు. "వల్లకీవాదన ధురీణ వర్ణగీతాది గాంధర్వస్వరసవీనకల్పనాప్రవీణ" యనియు గద్యమునందు కవి వ్రాసికొన్నాఁడు. అందుచేత నితఁడు సాహిత్యమునందు మాత్రమే కాక సంగీతమునందును బ్రవీణుఁడని విశదమగుచున్నది. ఈ కవి యింటిపేరు లింగనముఖివారు; తండ్రిపేరు నాగనామాత్యుఁడు; తల్లిపేరు కామామాత్యాంబ. ఈతని కవిత్వము ప్రౌఢమయినది. సత్యభామాసాంత్వనమునుండి కొన్ని పద్యముల నిందుదాహరించుచున్నాను.—

ఉ. ఆపురమందుఁ గెంపుజగియందపుఁగోట పయోధికన్యకుం
బ్రాపయి తిమ్మిపోలికను భాసిలెఁ గొమ్మలు తేకు లట్లు చా
లై పరఁగెం దతంతరగళత్ప్లవమౌక్తికలీల నబ్ధివీ
చీపృథుశీకరమ్ము లెగసెన్ హరి సేసలు చల్లు కైవడిన్.

ఉ. తావులవెంబడిం గదలి తార్కొనెఁ దేఁటులు త్రేఁటిపేర్కలం
బోవక నాఁటెఁ బుప్పొడియుఁ బుప్పొడితోఁ దగెఁ బూవుసోన యా
పూవులసోనతో మిగులఁ బొల్చెను గల్పతరుప్రసూనమా
ధ్వీవిసరంబు నావెనుక వీచెను బల్లసి కమ్మతెమ్మెరల్—ఆ. ౨

ఉ. చూడక చూచినట్లు తమి పోలుచు సొక్కుచు మోహ ముంచి మా
టాడక యాడినట్లు కలయం గమకించి మదిం గణించి యా
చేడియతోడిలోక మయి చింతిలి కార్యము నెంచ కుండుటల్
పాడియె తెల్పుమా యవితపాండవ కాళియమౌళితాండవా—ఆ. 3

శా. భాసిల్లె న్నిజసోదరేందుసుభగంభావక్రియావీక్షణో
ల్లాసోదారముకుందదారకృతలీలాస్యసారస్యభృం
గీసంగీతతరంగితాబ్జరుచిభంగీజాతరంగోల్ల స
త్కాసారాబ్ధితరంగజాలము శరత్కాలం బవేలంబుగన్ — ఆ. ౪

---

౫. వెలుతురుబల్లి విశ్వనాథకవి

ఇతఁడు శేషధర్మములను బద్యకావ్యముగా రచియించి పెద్దాపురసంస్థానాధీశ్వరుఁడయిన వత్సవాయతిమ్మనృపాలుని కంకితము చేసెను. ఇతఁడాఱువేలనియోగి బ్రాహ్మణుఁడు. ఈతని తండ్రిపేరు వేంకటామాత్యుఁడు. ఇతఁడు ౧౭౦౦ వ సంవత్సరప్రాంతముల యందుండినవాఁడు. ఈకృతిపతిసగూర్చియు కృతికర్తనుగూర్చియు నేనుఁగు లక్ష్మణకవి చరిత్రమునందుఁ గొంత తెలుపఁబడి యున్నది. ఇతనిది సలక్షణమయిన మంచికవిత్వము. ఈతని శేషధర్మములనుండి రెండు పద్యము లిందుఁ గైకొనఁబడుచున్నవి:—

శా. మాయామిప్రుల కాద్విజుండు కడిగెన్ బాదాంబుజద్వంద్వముల్
చేయారం గుసుమాక్షతాదులను బూజించెం గాత్రము లైవ్యచె న
ట్లామా పాత్రములందు నన్నము లిడెన్ నారంభుఁ డానంతలో
నాయింద్రుండు గృహస్థుఁ జూచిపలికెన్ సాక్షేపపూర్వంబుగన్. ఆ-౧

ఉ. కాలినయిన్పగుండ్ల ముఖగహ్వరభాగములందుఁ గ్రుక్కుచున్
సోలుపు లేర్పడ న్మెఱుఁగుసూదులఁ గ్రుచ్చుచుం దలల్
నేలకుఁ జేర్చి పాదములు నింగికి నెత్తుమఁ బెక్కుజాడలన్
గాలభటుల్వెతల్గుడుపఁగాఁ బడియుండుదు రంతమీఁదటన్. ఆ. 3.

---

6. నూతనకవి సూరన్న

ఈకవి సకలజనాభిరామ మను నామాంతరముగల ధనాభిరామ మను మూడాశ్వాసముల పద్యకావ్యమును రచించెను. ఇతఁడు నియోగి బ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; కాశ్యపగోత్రుఁడు; తిప్పయామాత్యపుత్రుఁడు. కవి తన్నుఁగూర్చి యిట్లు చెప్పుకొనుచున్నాఁడు:—

సీ. వి స్తీర్ణ వైభ వాప స్తంబసూత్రుండఁ గాశ్యపగోత్ర విఖ్యాతయశుఁడ
ఘనతననంతసేనుని మల్లయామాత్యపౌత్రుఁడఁ దిప్పయాప్రభుసుతుండఁ
బార్వతీశుభగర్భపాథోనిధానసంధానశశిత్తుండ మానధనుఁడ
సత్కావ్యపారీణ సారస్వసంలబ్ధవిస్తారమతి గలవిమలయశుఁడ
భద్రవైభవశ్రీవీరభద్రలబ్ధ । జనితచాతుర్యకావ్యలక్షణవిచిత్ర
విపులవాచాసమగ్రసంవిద్ధమతిని।సూరనామాత్యనామకసుకవివరుఁడ.

కవి తనగ్రంథమున వ్రాసికొన్న యీక్రింది పద్యమునుబట్టి తాను తిక్కన సోమయాజి సంతతివాఁడనని చెప్పుకోఁదలఁచినట్లు కనుపట్టుచున్నది—

చ. అనువుగ భారతాంబుసిధి యవ్వలికిం దెగనెట్టి యందులో
ఘనకవితామృతంబు చవి గాంచిన తిక్కన సోమయాజిపా
వనతర మైనయట్టికులవర్ధనుఁడై మహిఁ పేరుగల్గు నూ
తనకవి సూరనార్యుఁడను ధర్మగుణాంచితపాలనీయుఁడన్.

ఈకవి తన కావ్యమును దాక్షారామభీమేశ్వరుని కంకితము చేయుటచేత నితఁడు గోదావరీ మండలములోనివాఁ డయినట్లు కనఁబడుచున్నాడు. ఈతఁ డేకాలపువాఁడో తెలియరాలేదుగాని పూర్వకవులను మధ్యకవులను మాత్రము స్తుతించి చిమ్మపూడి యమరేశ్వరుని—

చ. అలఘుని శబ్దశాసనపదాంకితుఁ దిక్కనసోమయాజి ని
శ్చలమతి శంభుదాసు బుధసన్నుతు నాచనసోమనార్యుఁ జె

న్నలరిన చిమ్మపూడి యమరాధిపు భాస్కరు రంగనాథునిం
దలంతు నపూర్వదివ్యకవితామహనీయసమగ్రచిత్తులన్.

అని కవిస్తుతిలోఁ జేర్కొనియుండుటచేతను, ఇంతమంది పూర్వకవులను జెప్పి మధ్యకవులలో నొక్కనిని జెప్పకపోవుటచేతను, ఇతఁడు మధ్యకవులలోఁ జేరినవాఁడేమో యని సందేహము కలుగుచున్నది. అయినను స్వతంత్రములైన యితరాధారములు లేక మధ్యకవులను జేర్కొనక పోయినంతమాత్రమున నితఁడు మధ్యకవి యని నిశ్చయించుటకు వలనుపడదు. కాని యితఁడు డిన్నూఱు సంవత్సరముల క్రిందటివాఁడని యైనను జెప్పవచ్చునని తోఁచుచున్నది. ఈతఁడు రచియించిన ధనాభిరామము కథ కొంతవఱకు మనోహరముగా నున్నది. ఇంద్రసభామందిరమునందు మన్మథునికిని కుబేరునికిని రూప మెక్కువ యనియు ధన మెక్కువ యనియు వివాదము సంభవించి వారితగవు మాటలతో తెగనందున—

చ. తరమిడి యిన్నిమాటలు వృథాపని లేకు సమస్తవైభవో
త్కర మగుదాక్షవాటిపురి గల్గు ధరాస్థలిలోనఁ బోయి నీ
నిరుపమరూపసంపదయు నేరుపుఁ జూపుము నేను వచ్చి యా
పురవరసీమఁ జూపెదను భూరిధనంబున నామహత్త్వమున్.

అని కుబేరుఁడు మన్మథునిజూచి, 'మాటలచేఁ బ్రయోజనము లేదు. మన మిద్దఱమును భూమిమీఁద దాక్షారామములోఁ బుట్టుదము. అక్కడ నీవు మొట్టమొదట నీసౌందర్యమును నేర్పునుజూపుము. తరువాత నేను వచ్చి నాధనమహిమను జూపెదను. అప్పుడు మనయిద్దఱిలో నెవ్వరు బలవత్తరులో తేటపడి రూపమహిమ యెక్కువయినదియు ధనమహిమ యెక్కువైనదియు వెల్లడియగును' అని పలుకఁగా మన్మథుఁ డాతని యాహ్వాన మంగీకరించి పూర్వకాలమునుండియు వేశ్యలచేఁ బ్రసిద్ధమయిన నదాక్షవాటికకుఁ బోయి యందుఁ దన రూపవిశేష

చును జూచుచుండఁగా నాట్యమునకయి భీమేశ్వరస్వామి యాలయమునకుఁ బోయిన సుగుణావతి యను పణ్యాయువతి యాతనిని గాంచి కామించి యింటికిఁబోయి యాతనిం దనయింటికిఁ దోడితెమ్మని తన చెలికత్తెను వేఁడుకోఁగా నావయస్య—

ఉ. అక్కట వానివన్నె గలయట్టికులంబునఁ బుట్టి రూపుచే
నెక్కుడు భాగ్యసంపదల నెన్నిక కెక్కినదాన వింతలో
నెక్కడివానికి న్వలచి తెయ్యదొ వానికులంబు విన్న వా
రొక్కట నవ్వరే విటవు ముత్పలలోచన నీకు మ్రొక్కెదన్.

ఉ. నిచ్చలు నిండి వల్లభులు నీకడ గానుగ లేక కానుకల్
తెచ్చి తమంతఁ గ్రిందుకొని తేకువ మోసలఁ గాచుచుండఁగాఁ
జెచ్చెరవారలన్ ఘనము చేయక డాయక యూరికన్నచో
నొచ్చెము కాదె నీకును బయోరుహలోచన యిప్పురంబునన్.

చ. కలికితనంబుమీరఁగ వికారముతోడ మనోజకేళి ని
చ్చలుఁ దమకంబుపుట్టి విటసంఘము తెచ్చియొసంగునీమహో
జ్జ్వలమణిభూషణాదిఘనవస్తువు లొందుట కీర్తిగాక తా
వలచుట పంతమా ధరణి వారవధూమణికిం దలోదరీ.

అని యపారధనము నిచ్చెడు విటు లనేకు లుండఁగా ధనమియ్య జాలని క్రొత్తవానిని కేవలరూపసంపదను జూచి వలచుట వారకాంతకు ధర్మముకాదని బుద్ధి చెప్పియుఁ గార్యము గానక తుదకు మన్మథుని దానియింటికిఁ దెచ్చి యప్పగించెను. సుగుణావతియు మన్మథుఁడును గొంతకాల మీప్రకారముగా సుఖ మనుభవించుచుండఁగా, కుబేరుఁడు యోగివేషమునవచ్చి భీమేశ్వరస్వామి యాలయమునఁ జేరి యచ్చటికి వచ్చెడు వేశ్యలకెల్లను ధనమును చీరలును కొల్లఁగా నొసఁగసాఁగెను. అంత సుగుణావతి తల్లియు నొకనాఁ డచ్చటికిఁ బోయి యాతఁ డిచ్చిన ధనకనకాంబరములను దెచ్చి కూఁతునకుఁ జూపి బోధించి మతిమరలించి

రూపవంతుఁడయిన నారదుని నెడనాడి విత్తవంతుఁడైన కుబేరునిఁ గూడుమని త్లొనరణవతి నొసఁగఁజేసెను. అంతట మన్మథుఁడు దోడి పోయి దేవాలయముచేరి భీమేశ్వరస్వామిని ప్రార్థింపఁగా నతఁడు సాక్షాత్కరించి. యొకప్పుడు ధనమును మఱొకప్పుడు రూపమును విజయము నొందినను మొత్తముమీఁద ధనసౌందర్యములు రెండును సమానములే యని తెలియఁజెప్పి వారిరువురిని సమాధానపఱచి వారి స్థానములకు నారిని బంపివేసెను. ఈపుస్తకము చిన్నదే యయినను, కవిత్వము హృద్యముగానే యున్నది. శైలిని జూపుటకై ధనాభిరామమునుండి రెండు పద్యములఁ గిం దుదాహరించుచున్నాను.

చ. మదనునిగాఁ దలంతు రిల మానిను లెల్లను, సత్కవీశ్వరుల్
పదపడి కర్ణుఁ డీతఁడని ప్రస్తుతిచేయుదు రాత్మఁ గోపలన్
మదవదరాతివర్గములు మానుగఁ గవ్వడి యంద్రు, భూజనుల్
మది దిననాథుఁ డందురు, సమస్తము ద్రవ్యముఖంబు చూచినన్. ఆ ౧

మ. కమనీయంబుగ నాడఁ బాడఁ జదువంగా నేర్చు వీణాది వా
ద్యములన్నైపుణి సొంపుమీఱఁగఁ గళాస్థానాంగతంత్రంబులన్
సుమనస్స్త్రీమనోజకేళి విటులం జొక్కింపఁగా నేర్చు వి
భ్రమసౌందర్యముల న్వహించు సరిచెప్పన్ లేరు నాపుత్రికిన్. ఆ.3.

7. సముఖ వేంకటకృష్ణప్పనాయకుఁడు

ఈకవి యహల్యాసంక్రందన మను మూఁడాశ్వాసముల ప్రబంధమును రచించెను. ఇతఁడు శూద్రకులజుఁడు; సముఖ మీనాక్షీనాయకుని తనూజుఁడు. "శ్రీమత్పాండ్య మండలాధీశ్వర విజయరంగచొక్కనాథ మహీనాథ కరుణాకటాక్ష సంపాదిత గజతురంగమాందోళికా చ్ఛత్ర చామరవిజయ ఢక్కాకాహళభూరిభేరీ బిరుదధ్వజప్రముఖ సకలసంపత్పరంపరీసమేత" అని యాశ్వాసాంత గద్యమునందుఁ జెప్పుకొనుటచేత కవి మధురాధినాథుఁ డయినవిజయరంగ చొక్కనాథునికాలములో నున్నవాఁ డగుట స్పష్టము. ఈవిజయరంగ చొక్కనాథుఁడు క్రీస్తుశకము ౧౭౦౪ వ సంవత్సరము మొదలుకొని ౧౭౩౧ వ సంవత్సరము వఱకును పాండ్యమండలాధీశ్వరుఁడుగా నుండెను. కాఁబట్టి కవియు ౧౭౦౦ సంవత్సరప్రాంతములనుండి యున్నవాఁడే. ఇతఁడు జైమినిభారతమును వచనకావ్యమునుగా రచించినట్లహల్యాసంక్రందనములోని యీక్రింది పద్యమువలన తెలియవచ్చుచున్నది—

గీ. సముఖమీనాక్షినృపగర్భవిమలజలధి
చంద్ర వేంకటకృష్ణేంద్ర శౌర్యసాంద్ర
మునుపు జైమినిభారత మనఘ వచన
కావ్య మొనరించినట్టి సత్కవివి గావె.

ఈ కాలమునందే మంచికవులచేత తెలుఁగున వచనకావ్యము లారంభింపఁబడినట్టు వినఁబడుచున్నవి కాని యా వచనకావ్యము లిప్పుడు కానరావు. తారాశశాంకమును రచించిన శేషము వేంకటపతి యీకవి కాలమునం దుండినవాఁడు. కవితాను "పురోహితభృత్యామాత్య సామాజిక బంధువర్గంబులు కొలువంగూరుచుండి యుభయభాషాకవితా

విశేషుండై శేషము వేంకటపతికవీంద్రుం డాప్తసఖుండు గానఁ బిలిపించి" నవు డతఁడీక్రిందిపద్యమును జెప్పెనఁట—

చ. నల నానత్య వసంతులం గెలుచుసౌందర్యంబు ధైర్యంబు దో
ర్బలముఁ బ్స్వామిహితానువృత్తిదయయుఁ బ్రౌఢత్వము న్విద్యయున్
వెలయఁ బాల్యమునందె నీవు మధురోర్వీనాథు మెప్పింపవా
బళిరా వేంకటకృష్ణభూవరమణీ బాషాఘణిగ్రామణీ.

అహల్యాసంక్రందనములోని రెండుపద్యముల నిం నుదాహరించుచున్నాను—

ఉ. బంటుతనంబు లాడుకొని పాఱగు రావణుచేతిపెట్టునన్
గంటికి నీరు గ్రమ్మఁ గలఁకంబడి పాఱెను నీకుతండ్రి నీ
యీటంను లేదు పౌరుష మొకింతయు బీరములేల చేతివా
లంటకు కోడెకాఁడ చులుకంటఁగ వేటని చెంపగొట్టెదన్. ఆ ౧

ఉ. ఆతటి నాలతాంగిని మహోగ్రహదృష్టిని జూచియోసి నీ
చేతిజలంబు లంట నిఁకఁ జెల్లునె యెంతటిజంతవే బలా
రాతినిగూడి తీ విపుడు రాతిరిజామునఁ గావునన్ బలా
రాతిశరీర మందు మని రాజముఖిన్ మునఖన్ శపింపఁగన్. ఆ. 3.

---

8. రోసనూరి వేంకటపతి

ఈకవి విష్ణుమాయావిలాస మను మూడాశ్వాసముల పద్యకావ్యమును రచియించి దానిని వేంకటగిరిసంస్థానప్రభువయిన శ్రీవెలుగోటి బంగరు యాచమనాయుని కంకితము చేసెను. ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; లింగనామాత్యుని పౌత్రుఁడు; గంగనమంత్రి పుత్రుఁడు; కాశ్యపగోత్రుఁడు. కృతిపతి తండ్రియైన కుమారయాచ భూపాలుఁడు తనకు "తిక్కయజ్వ" యను బిరుదము నిచ్చినట్లు కవి యీపద్యమునఁ జెప్పుకొన్నాఁడు—

మ. నను శ్రీభూపతిలింగపాదభజనానందున్ గుమారేచ భూ
జనపాలాగ్రణి తిక్కయజ్వయనుదుం జాలంగఁ బేరిచ్చి ప్రో
చినఁ బెంపొందినరోసనూరికులునిన్ శ్రీవేంకటాఖ్యుం గృపా
ఘనగంభీరశుభైకదృష్టి వెలయుంగాఁ జూచి పల్కెం దగన్.

కృతినాయకుఁడైన బంగరుయాచమనాయఁడు ఔరంగజేబు ఢిల్లీచక్రవర్తిగానున్న కాలములో ౧౬౯౪వ సంవత్సరమునందు వెల్లూరినబాబాజుల్ఫగారుచేఁ జంపఁబడినందున ఈపుస్తకము ౧౬౯౦వ సంవత్సరప్రాంతములయందు రచియింపఁబడిన దని చెప్పవచ్చును. వేంకటగిరిసంస్థానప్రభువు లనేకులు తెలుఁగుభాషయం దభిమానము గలవారయి కవులను బ్రోత్సాహపరిచి తా మనేక ప్రబంధములకుఁ గృతిపతులయిరి. వీరు పద్మనాయకవంశజు లయిన వెలమలు. ఈసంస్థానమును స్థాపించిన మూలపురుషుఁడు బేతాళనాయఁ డనుబిరుదనామము గల చెవిరెడ్డి. ఇతఁడు చేయూరి పోలిరెడ్డికుమారుఁడు. ఇతఁడు తన నివాసస్థల మైన యనుమగల్లు గ్రామమున రేచర్ల యాచఁడు (? చఁడు) అను మాలవానిచేత దనపొలమును గృషిచేయించుచుండఁగా నాగటికఱ్ఱున కొకరాగిశాసనము తగిలెను. దానిని జదివిచూడఁగా నందు "నాగభైరవపొలము" అనెడి యాచోటు నిక్షేపాదిలక్షలధనము భూస్థాపిత మయి యున్నదనియు, నరబలి యిచ్చినపక్షమున బలియిచ్చినవానికి నాధనము దక్కుననియు, వ్రాయఁబడియుండెను. అతఁ డప్పు డేమి చేయుటకును దోఁచనివాఁ డయి యాచనితో నాలోచింపఁగా, వాఁడా స్థలమునందుఁ దనయింటిపేర నొక గ్రామము కట్టించి తనయింటిపేరును గోత్రముగా బెట్టుకొని వంశమునందుఁ బుట్టినపురుషుల కెల్లను దనపేరు పెట్టుచు వివాహము చేయవలసి వచ్చినప్పుడెల్ల ముందుగా దనకులజులలో నొక్కనికి వివాహముచేయుచు వచ్చుట కంగీకరించినపక్షమునఁ దాను బలియగుట కొప్పుకొనెద నని రెడ్డితోఁ జెప్పెను. చెవిరెడ్డియు

వాఁడు కోరిన నియమముల కన్నిటికి నొప్పుకొని [illegible] నాఁ నాపొలమునకు బలిపెట్టి ధననిక్షేపమును స్వాధీనము చేసికొ[illegible]. తరువాత నతఁ డాక్షేత్రమున రేచెర్ల యనుగ్రామమును గట్టించి, తనగోత్రమును రేచర్లవారని మార్చుకొని, ఆయూరు విడిచి పిల్లలమఱ్ఱి యను గ్రామముచేరి యాగ్రామము నివాసముగా జేసికొనెను. ఈగ్రామమునం దితఁ డొకనాఁడు రాత్రి చీఁకటి పడువఱకును పొలములో బనిచేసి యింటికి వచ్చుచుండఁగా దారిలో నురుములతోను మెఱుపులతోను గొప్పవాన వచ్చెను. ఆవానలో నతఁ డొక మఱ్ఱిచెట్టుక్రిందికిఁ బోయి నిలువఁబడియుండఁగా, చెట్టుమీఁదనుండి యొకభూతము దిగివచ్చి యతనిదృష్టికిఁ గనఁబడెనఁట! అతఁ డెంతమాత్రమును జడియక చేతి ఖడ్గము ధరించి యెదురుగా నడువఁగా, అతని ధైర్యసాహసములకు మెచ్చి యాబేతాళుఁడు చెవిరెడ్డియు నాతని సంతతివారును శౌర్యసామ్రాజ్యైశ్వర్యవంతు లగుదురనియు శత్రువులతోడి యుద్ధములలో నెల్లఁ దాను దోడ్పడి వారికి జయము కలిగింతుననియుఁ బలికిన ట్లాతని చెవులకు వినఁబడెనఁట! బేతాళుఁ డాతనికి బ్రత్యక్షమయి వరములిచ్చెనన్న వార్త దేశమునం దంతటను వ్యాపించి యచిరకాలములోనే కాకతీయ ప్రభువయిన గణపతిరాజు చెవిసోఁకఁగా, అతఁ డాచెవిరెడ్డిని తనరాజధాని యైన యోరంగల్లు నగరమునకు రప్పించి లక్షవరహాయలువచ్చు గ్రామములిచ్చి తనవద్ద సేనాపతినిగా నియమించి "పిల్లలమఱ్ఱి బేతాళ నాయఁడు" అన్న బిరుదుపేరిచ్చి గౌరవించెను. ఇది ౧౨౫౦ వ సంవత్సరప్రాంతమయి యుండును.

ఈతఁడు చేసిన నియమముల ననుసరించి యీతనివంశమువారు నేటివఱకును యాచనామమునుగూడ దమపుత్రుల నామమునకుఁ జేర్చుచు, తమయింట వివాహము జరపుటకు ముందుగా నొక మాలవానికి బెండ్లిచేయుచు, పూర్వమర్యాదను జెల్లించుచున్నారు. చెవిరెడ్డి

యొక్క ద్వితీయపుత్రుఁడయిన ప్రసాదాదిత్యనాయఁడు గణపతిరాజు యొక్క మరణానంతరమునం దాతనిభార్యకును బుత్రికకును సహాయుఁడయి యుండి రాజ్య మన్యాక్రాంతము కాకుండఁ గాపాడి కాకతిరాయ రాజ్యప్రతిష్ఠాపనాచార్యుఁడని బిరుదందెను. చెవిరెడ్డి యింటిపేరు రావు వారు. ఈరావువారు మొదట నోరుగల్లురాజ్యమున నేయుండి పేరొంది నను, తరువాత దమపౌరుషమువలన నన్యభూముల నాక్రమించుకొని సంస్థానప్రభువులయిరి. ఈవంశమువారిలో నొకఁడగు తిరుమలనాయఁడు కృష్ణదేవరాయల రాజ్యకాలములో వెలుగోటిరాజ్యమును సంపాదించి వెలుగోడుపట్టణము తనకు రాజధానిగాఁ జేసికొన్నందున, ఆతనివంశము నా రప్పటినుండియు వెలుగోటివా రనఁబడుచున్నారు. విష్ణుమాయా విలాసకృతిపతియొక్క తాతయైన పెద్దయాచమనాయఁ డావల కన్యాక్రాంతమయిన వేంకటగిరిపురమును మరల స్వాధీనపఱచుకొని దానిని స్వరాజధానిని జేసికొనఁగా నాటినుండియుఁ దత్సంతతివారి కదియే రాజధానిగా నున్నది. చెవిరెడ్డి వంశజులలోనొక్కఁడగు సర్వజ్ఞ సింగమనాయఁడు బమ్మెర పోతనామాత్యునివలన నుద్దండభోగినీదండకమును శ్రీనాథునివలన గొన్నికృతులను బొందుటయేగాక తాను పండితుఁడయి సింగభూపాలీయ మను నలంకారశాస్త్రము మొదలగు సంస్కృతగ్రంథములను సహితము రచించెను. ఆతని వంశజులలో నొకఁడగు రాయపనాయఁడు ౧౬౨౦ వ సంవత్సరప్రాంతములయందు భానుమతీపరిణయము కృతినందెను. ఈవెలుగోటివా రిప్పటికిని తెనుఁగుకవుల నాదరించుచున్నారు. కవిత్వరీతి తేటపడుటకయి విష్ణుమాయావిలాసములోని రెండు పద్యములఁ జూపుచున్నాను—

చ. ఇటువలెనేమి యాపయన మిప్పుడు మీ రఖిలేశ మాయలన్
బటువగు విష్ణుఁడం చనెడుపల్కులు సిద్ధము సుందరీక్రియా

కుటిలశిరోజియైన హరి గొబ్బునఁ జూచితి రేని మీకు నో
కట్టఁ జపలత్వ మైనతటి గౌరవ మె ట్లగునో తలంపుఁడీ. ఆ. ౧.

చ. వనయుతతీవసంతులవివాహమహోత్సవవేళ నెమ్మదిం
దనరు కుహూకుహూలంబున లతాలలనల్కరపల్లవంబులన్
ఘనముగ నేసవెట్టుటకుఁగా ధరియించిన మౌక్తికంబులో
యన విలసిల్లె నెల్లెడ మహాసుకుమారకకోరకావళుల్. ఆ. ౩.

---

9. పైఁడిమఱ్ఱి వేంకటపతి

ఈకవి చంద్రాంగదచరిత్ర మనెడి యాఱాశ్వాసముల ప్రబంధమును రచించి యున్నాఁడు. ఈతని కవిత్వము మిక్కిలి ప్రౌఢ మయి రసవంతమయి పూర్వకవుల రచనవంటిది హృదయాహ్లాదకర మయి నదిగా నున్నది. ఇతఁడు తన గ్రంథమును శ్రీరామాంకితము చేసియుంటచే గృతిపతినిబట్టి యాతని కాలనిర్ణయము చేయుట కాధారము కనఁబడ లేదు. ఉన్నయాధారమంతయు కృతికర్త తనవంశవర్ణనము చేసికొన్న యీక్రింది పద్య మయియున్నది—

సీ. సకలసత్కవిపూజ్యసుకవిత్వసామ్రాజ్యనిర్వాహకుఁడు పెద్ద పర్వతన్న
వివిధభాషావార్యవిరచనాచాతుర్యసర్వంకషుఁడు బోడిపర్వతన్న
వరపద్యదాకార వాచాచమత్కారనిరుపమమతిశాలి తిరుమలన్న
యవధానకృతిగర్భ కవితాచ్ఛసందర్భ కీర్తిప్రపజ్ఞుండు కేశవన్న
దనకు నన్నలుగాఁగను దనరుకృష్ణ
రాయభూషణకులరామరాజతనయ
కేశవాత్మజ పర్వతాధీశు వేంక
టాద్రి నిదె కావ్య మేనిత్తు నంకితముగ.

ఇందలి పేరులనుబట్టియు కవికాల మిదియని నిశ్చయించుట కాధారము దొరకలేదు. ఇందు 'కృష్ణరాయభూషణ' యను పదముండు టనుబట్టి కర్నల్ మెకంజీదొరగారు సంపాదించిన లిఖితపుస్తకముల పట్టికలో కవి కృష్ణదేవరాయని కాలములోనివాఁ డని చెప్పఁబడి యున్నది. ఇటీవల బ్రౌన్ దొరగారు తమ నిఘంటువునం దీకవి యాధునికుఁడని వ్రాసి యున్నారు. పయి పద్యములో నున్న కృష్ణరాయభూషణశబ్ద మాకవికి కృష్ణదేవరాయని యాస్థానమున కలంకారముగా నుండుటచేతనే వచ్చినను ఈకవి కృష్ణరాయభూషణుని వంశజుఁ డగురామరాజుకొడుకైన కేశవార్యుని పౌత్రుఁ డగు సర్వతోముఖ్యునిసుతుఁ డగు వేంకటపతి యగుటచే గృష్ణదేవరాయని యనంతరమున బెక్కుతరములు గడచిన తరువాత నున్నవాఁడగుట స్పష్టము. అప్పకవి యీచంద్రాంగదచరిత్రములోని పద్యముల నుదాహరించి యుండకపోవుటచేత నీకవి ౧౬౫౦ వ సంవత్సరమునకు దరువాతివాఁ డనియు నూహింపఁ దగియున్నాఁడు. అందుచేత కవి ౧౭౦౦ వ సంవత్సరప్రాంతమునందుం డున్నవాఁడని తోఁచుచున్నది. చంద్రాంగదచరిత్రమునుండి కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. అప్పలు లాడుచున్ నగవు లాడుచు బారలు సాఁచిసాఁచి మా
యప్పలు వచ్చి రంచు సకియ ల్గనుదమ్ములు మోడ్చి పిల్వఁగా
గుప్పునఁ దప్పుతప్పు టడుగుల్ నడలం గొమరుండు పైఁబడుం
దప్పక చూచుతల్లికిని దండ్రికి ముచ్చట తీఱునట్లుగన్—ఆ. ౨

మ. హరిమ్రోలం గడుపోటుబంట నయి గర్వాలాపము ల్మున్ను స
త్వరతం బల్కితిఁ గొన్ని నోరికొలఁదుల్ తథ్యంబు నేఁ డన్నియున్
బరఁగం బందనఁ జెప్పుసాధనగతిన్ బాటిల్లె వ్యర్థంబులై
సురలోకంబున కేగు టెట్లు సవయస్కు ల్పన్నుల న్నవ్వఁగన్—ఆ. 3

సీ. భుజగలోకాధీశ భోగతల్పశయాన హరిరూపధరమహాపురుష యనుచు
నతులాఢ్యమకుటవర్ణితపాదరాజీవ రామార్చనీయ శ్రీరంగ యనుచు
మారీచమదభంగమహితవాయవ్యాస్త్రశరదనిద్రితనేత్ర శౌరి యనుచు
సముదగ్రనష్టావసర యోగనిద్రాణ కరిరాజవరద శ్రీకాంత యనుచుఁ
దలఁచు నుబుకును నలుకు గ్రెగ్గిలుచుఁబలుకు
సఖులపయనస్వరశిరోజచరణకలన
పవనకందర్పఘనహంసజవనతురగ
భటనప్రియసముదాయఘటితనగోప—ఆ. ౪

ఉ. ఓరిమృగాంక నాజడకు నోడినదాహరువు కిన్క— నంకమున్
వేర విసంబు నీయొడలఁ జేరఁగఁ గోరలకొద్ది నొక్కి దు
ర్వారవిజత్వదీయకరవారవిషంబుల నొంచసాఁగెఁ బె
న్వేరముఁ బూని యిప్పు డిది నీదగుచేతఁగఁ జూడ కెమ్మొగిన్. ఆ-౫

---

10. వెలగపూడి కృష్ణయ్య

ఈ కవి భానుమద్విజయమనెడి యైదాశ్వాసముల ప్రబంధము రచియించెను. మఱియు నితఁడు మాలతీమాధవీయము, గౌళికా శాస్త్రము, చతుర్విధకందశతకము అను పద్యకావ్యములను, వేదాంత సారసంగ్రహ మను వచనకావ్యమును, రచించినట్లు భానుమద్విజయము లోని యీ క్రింది పద్యములోఁ గవి చెప్పుకొనియున్నాఁడు—

సీ. మహిలోనమాలతీమాధవీయ మనంగ శృంగారకావ్య మొనంగఁజేసి
గౌళికాశాస్త్రంబుకడులోకహితముగా నెనయనేకాశ్వాసమున రచించి
పరిఢవిల్లఁగఁ గందపద్యపుశతకంబు నాల్గుయోగంబుల ననువుపఱిచి
సన్నుతవేదాంతసారసంగ్రహశాస్త్ర మమరంగ వచనకావ్యం బొనర్చి

చాటుకృతులను మఱికొన్ని సంఘటించి
మామకాంకిత మొనరించి మంచిపుణ్య
శాలియనఁగీర్తిగాంచె కొన్న సత్కవీంద్ర
మధురవాక్సాంద్రకృష్ణయామాత్యచంద్ర.

పూర్వమీతని వంశపువారు గాంగేయోపాఖ్యానము, సుమంతో దయము, ఆంధ్రకర్ణామృతము, వజ్రభుజోపాఖ్యానము, సేతుమాహాత్మ్యము, దత్తాత్రేయచరిత్రము, మర్యాద రామసచివచరిత్రము, మొదలగు గ్రంథములను రచియించి యుండినట్టును గవి యీ క్రింది పద్యములం జెప్పియున్నాఁడు—

క. భూనుత గాంగేయోపా । ఖ్యానసుమంత్రోదయాంధ్రకర్ణామృతముల్
మానిత వజ్రభుజోపా। ఖ్యానము సుభహేతుసేతుమాహాత్మ్యంబున్.

క. దత్తాత్రేయచరిత్రన్ । సత్తగు మర్యాదరామసచివచరిత్రన్
బిత్తరపుఁ గృతులు చేసిన। యుత్తమకవు లెల్లమీకులోద్భవులగుటన్.

ఈ కవి యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబ సూత్రుఁడు; లోహితసగోత్రుఁడు; వెల్లపూడి నారసింహార్యపౌత్రుఁడు; నరహరిమంత్రి పుత్రుఁడు. ఈ కవి పాండ్యమండలాధీశ్వరుఁడైన విజయరంగ చొక్కభూపాలుని దండనాథుఁడగు సాంబయామాత్యుని పుత్రుఁడగు గోవిందయామాత్యునికి మేనమఱఁదియైనట్లీక్రింది పద్యమునఁ జెప్పుకొన్నాఁడు—

సీ. పాండ్యభూమండలాఖండలుండైన విజయరంగ చొక్కభూజాని కాష్ఠ
మండనుండగు సాంబదండనాథాగ్రణితనయులలో మేటిదండి యగుచు
సంగీతసాహిత్యసంస్కృతాంధ్రకవిత్వసరసజ్ఞుఁడై మేనమఱఁదియగుచుఁ
గొమరొప్పుచుండెడుగోవిందయామాత్యుఁడనుపమవిద్యాధికార్య

సభను

నిండుకొలు వుండె నపుడు నేదండఁ జేరి
సారసల్లాపముల మీఱి చతురమతిని
దక్షిణామూర్తికృపను బ్రత్యక్షమగుచుఁ
గృతిపతిత్వంబుఁ గోరుసంగతిని దెలుప.

ఇందుఁ జేర్కొనబడిన విజయరంగ చొక్కభూపాలుండు దక్షిణ మధురాపురము రాజధానిగా పాండ్యమండలమును క్రీస్తుశకము ౧౭౦౪వ సంవత్సరము మొదలుకొని ౧౭౩౧ వ సంవత్సరమువఱకును పాలించిన ట్లీవఱకే చెప్పఁబడెనుగదా? అందుచేత నీకృష్ణకవియు నాకాలపువాఁడే యని వేఱుగఁ జెప్పనక్కఱలేకయే తెలిసికొవచ్చును. కవి సాంబదండ నాథుని వర్ణించుచు—

సీ. సరిజేటి యార్కాటిసాదులాఖానుతో ఘటియించె నెవ్వాఁడు ఘనత మీఱఁ
బేర్మిదంజావూరి పేషువాయానందరావును నెవ్వాఁడు రహి నడంచె
మయిసూరినంజరాజయగారిప్రియవాక్యసంధికి నెవ్వాఁడు శక్తి దాల్చె
* * * సకుపఝారి శ్రీదళవసాంబశౌరి.

అని యతఁ డార్కాటివాఁడగు సాదతల్లాఖాను మొదలగువారి నోర్చినట్లు చెప్పియున్నాఁడు. ఈసదతల్లాఖాఁ ౧౭౦౦ వ సంవత్సరము మొదలుకొని ౧౭౩౨ వ సంవత్సరమువఱకును నవాబుగానుండి యార్కాటురాజ్యము చేసెను. కాఁబట్టి కవి ౧౭౨౦ వ సంవత్సర ప్రాంతమునందు మధురాపురములో భానుమద్విజయమును రచియించి యుండును. ఈతనికవిత్వము రసవంతమైనది. కవితాధోరణి తెలియుటకై భానుమద్విజయములోని రెండు పద్యముల నిందుదాహరించుచున్నాను-

ఉ. ఏమియు లేనివారలె యహీనమతిభ్రమ లందుచుండఁగా
భూమిపతిత్వ మొందినప్రభుల్ వ్యసనంబులఁ గాంచుటబ్రమే?

గ్రామయిన నున్నమేరుధృతి నేర్పడఁబూని సమస్తశౌర్యవంతుల్
త్రాము వహించిచూడమిని ధాత్రి యరాజక మౌను భూవరా. ఆ-౨

మ. గిరులం బాఱెడిమేఘులుల్లగ వడిం గీలొల్కునక్కన్నెఱ లా
గురువక్షోరుహతారహారములతోఁ గూడం బ్రకాశింప నా
ధరణీశాంగన దుస్సహాత్మగతసంతాపంబుచే నేర్చె భా
స్వరవాసంతపికీస్వరాకలితవాచామాధురీవైఖరిన్. ఆ. ౪.

---

11. శేషము వేంకటపతి

ఇతఁడు శశాంకవిజయ మనెడి యైదాశ్వాసముల శృంగారప్రబంధమును జేసి వంగలసీతయార్యున కంకితము చేసెను. శశాంకవిజయము నకు తారాశశాంకమని నామాంతరమును గలదు. ఇందుఁ జంద్రుఁడు బృహస్పతివద్ద విద్యాభ్యాసమునకయి చేరి గురుపత్నియగు తార నింటి నుండి లేవఁదీసినకథ మిక్కిలి పచ్చిగా వర్ణింపఁబడినది. ఈశేషము వేంకటపతి నియోగి బ్రాహ్మణుఁడని తోఁచుచున్నది. ఇతఁడు కందాళ రామానుజాచార్యుని శిష్యుఁడు; కృష్ణయార్యుని కుమారుఁడు. కృతి నాయకుఁడు తన్నుఁ బిలిపించి పలికినట్లు చెప్పఁబడిన యీక్రింది పద్యము లలో కృతిపరంపరలు చేసినట్లు కవి చెప్పుకొనుటయేకాని యొక్కగ్రంథ మునైనను బేర్కొనియుండలేదు.—

క. నను రంగేశ్వరపదయుగ । ఘనతరభజనానిరూఢకవితాసామ్రా
జ్యుని శేషముకృష్ణసుధీ । తనయునిఁ బిలిపించి పలికె దయదైవారన్.

చ. అసదృశభక్తి సద్గురుకటాక్షముఁగాంచి సమంచితాత్మశ
బ్దసరుహామాకరందరసపేశలకౌశలవన్మృదూక్తులన్
రసికుల కింపుగాఁ గృతిపరంపరలన్ రచియించి కీర్తిచే
నెసఁగితివయ్య వేంకటపతీ బళి శేషమువంశసత్కృతీ.

ఈకవి పాండ్యమండలాధీశ్వరుఁడైన విజయరంగ చొక్కనాథుల కాలములో నున్నట్లీపరకే సముఖ కృష్ణప్పనాయకునిగూర్చి వ్రాయున ప్పుడే చెప్పఁబడెనుగదా! కవియు తారాశశాంక కృతినాయకుఁడైన వంగల సీనయార్యుని వర్ణించుచు, అఖండమండిత మహీమండలమండనా యమానపాండ్యమధురాధరాఖండల శ్రీవిజయరంగచొక్కనాథ మహీ నాథ కృపాకటాక్ష వీక్షణానుక్షణ వర్ధమాన......నిఖిల సంపత్సరం పరాకంపితనిలింపనాయకుండని యతనికొక విశేషణమును బ్రయోగించి యున్నాఁడు. మఱియు ద్వితీయాశ్వాసారంభమున

క. శ్రీవిజయరంగచొక్క । క్ష్మావిజయ గురుప్రసాదసంపన్నిత్యా
శ్రీవరదాచార్యమణీ । శ్రీవరదాస్త్యైకకృత్య సీనామాత్యా.

అని కృతిపతిని సంబోధించియున్నాఁడు. దీనినిబట్టి కవి విజయ రంగచొక్కనాథుని కాలములో మధురలో నుండుట నిశ్చయమగుట చేతను, ఆరాజు ౧౭౦౪ వ సంవత్సరము మొదలుకొని ౧౭౩౧ వ సంవ త్సరమువరకును రాజ్యముచేసినవాఁడగుటచేతను, శేషము వేంకటపతి యాకాలమునందున్నట్లు స్పష్టమగుచున్నది. అక్కడక్కడ స్వార్థకసంధి మొదలయిన కొన్ని లక్షణదోషము లున్నను, కవిత్వము మొత్తము మీఁద ద్రాక్షాపాకమయి మిగుల రసవంతమయియున్నది. చక్కెరమెత్తిన విషమువలె నీతిమాలిన యీ కథ మనోహరములయిన తేటమాటలతో నింపుగా చెప్పఁబడినందున, అనేకులయిన యౌవనపురుషుల నాకర్షించి పాడుచేయుచున్నది. దుర్నీతిని వర్ణించునప్పు డీకవి తన యసమ్మతిని దెలుపు వాక్యముల నెక్కడను బ్రయోగింపక, "లోకములోనఁ గొంద ఱబలుల్........తాటాకులలోన వ్రాసిరి పరాంగనఁగూడినఁ బాప మంచు" "ఎన్నిపువ్వులఁ బ్రాలను తేఁటి యట్లుమగవాఁడనువానికి దోస మున్నదే?" యిత్యాది వాక్యరత్నములచేత వలపుగలచోటఁ గలయు టయే పరమార్థమన్నట్టు తెలిపి పాఠకులను భ్రమింపఁజేసి యున్నాఁడు.

రంభను మంచిదని సాధించుటకు సహితము మనవారికి పురాణముల నుండి దృష్టాంతములు తండోపతండములుగా దొరకుననుట క్రిందిపద్యమును నిదర్శనముగాఁ జూపవచ్చును—

సీ. కన్నకూఁతు రటంచు నెన్నక భారతీతరుణిఁ గూడఁడె నీపితామహుండు
మేనత్త యనుమేరమీఱి రాధికతోడ నెనయఁడే నిన్న నీయనుఁగుబావ
వదినెయంచు నొకింత వావి లేకయె జ్యేష్ఠునెలఁతతోఁ బొందఁడే
నీగురుండు
మునిపత్ని యనక హల్యను బట్టఁడే నీదుసహపాఠి యగుపాకశాసనుండు
యిట్టిమీవారివడతలు కట్టిపెట్టి
యమ్మ నేచెల్ల న్యాయంబు లాడెదౌర!
కచకు నీటెంకు నీవెఱుంగనివితాన
దూఱెదవు నన్నుఁ జలపారి దోసకారి!

"మున్నలదారుకావనస్త్రీలు గిరీశునిం గలియరే? వ్రజభామలు శౌరిఁ గూడరే? మేలలనాశిరోమణుల కందును సిందును నేమిచెప్పుమా" యఁట! ఆహా! ఏమి యీదేవత్వలక్షణము! దేవత్వమున కెప్పుడును శుద్ధచరిత్రమే లక్షణముగా నుండవలయును గదా? నీతిమాలి యన్యకాంతలఁ గలయుటకంటె నాసురకృత్యము మఱియేముండును?

ఉ. ఎంచఁగరాసమోహమున నే నిటు పిన్నటనాఁటనుండియున్
బెంచితిఁ బెద్దఁజేసితిని బేర్మిగఁ బ్రాయము వచ్చినంతనే
యెంచక మాటలాడెదవు డిన్నప్రియోక్తుల కిమ్ముపుట్టెఁగా?
మంచిది నిన్నుఁగూడుటకు మాకు స్వతంత్రత లేకపోయెనే?

గురుపత్ని శిష్యునిఁ బిన్ననాఁటనుండియుఁ బెంచి పెద్దవానిని జేసెనఁట! అందుచేత నామె కాతనిఁగూడుటకు స్వాతంత్ర్యము గలదఁట! ఏమి యీదుర్నీతి! దుర్నీతి యింతకంటెను దూరముపోవుట సంభవింపనేర్చునా? కృతయుగమునం దైనను కలియుగమునం దైనను

జారత్వ మెప్పుడును మొదలంట నశింపదు. కృతయుగపు తారలును చంద్రులును మన యీకలియుగమందును గలరు. అయినను మన యీపాడు కలియుగమునందుమాత్ర మిల్లువిడిచి లేచిపోయినదానిని మగని కిప్పించుటకయి పెద్దమనుష్యులుపోయి జారుని బతిమాలుటయు, మగని కిప్పించిన యీఅంకుటాలికి సంతానము కలిగినప్పుడు జారపురుషుఁడువచ్చి పుట్టినబిడ్డ కయి యింటిమగనితో తగవులాడుటయు లేవు. ఇవి కృతయుగధర్మములు కాఁబోలును! దూరపుకొండలు నునుపయినట్లు వెనుకటివారి యకృత్యములు కంటికి ముఱుఁగుకాఁగా మనవారు పూర్వకాలమును పొగడుచుందురు. బ్రహ్మదేవుని యంతటివాఁడువచ్చి భార్యను గోలుపోయి దుఃఖించుచున్న బృహస్పతికి తారను మరల నిమ్మని చంద్రుని ప్రార్థించెనఁట!

చ. అని పరమేష్ఠి పల్కుటయు నట్లనకా కస చంద్రుఁ డయ్యెడన్
ఘనతరగర్భభార నఖకాంతిభినిర్జితతారఁ దారఁ దా
ననునయనోక్తులం దెలిపి యంపినతోడనె దివ్యతూర్యని
స్వనములు మ్రోసె మింట విరివానలు పర్వెను జంట జంటగన్.

బ్రహ్మదేవుని ప్రార్థన నంగీకరించి చంద్రుఁడు గర్భవతియైయున్న గురుని భార్యను గురుని కియ్యఁగానే, తమగురునిల్లు కూలఁద్రోచి యింతటి ఘనకార్యము జేసినందున కాతనిమీఁద సిగ్గులేక సురలు విరులవాన గురిసిరఁట!

చ. అమరులతోడ నప్పు డని రబ్జభవుండు భవుండు నగ్గురుం
బ్రమదము మీఱఁగాఁ బిలిచి మావచనంబునఁ దారఁ జెందుమీ
రమణి కశుద్ధిలే దమృతరశ్మిని బొందుటచేత దాన నీ
కోమ పరిశుద్ధిఁ గాంచెఁ గయికొమ్మనఁ గొమ్మ గురుండు చేకొనెన్.

దేవతలును బ్రహ్మరుద్రులును గురునిఁ బిలిచి వ్యభిచారదోషము లేకపోవుటయేకాక యమృతరశ్మిని బొందుటచేతఁ దార పరిశుద్ధురాలయ్యెనని చెప్పి యొప్పగించిరఁట.

ఉ. తత్సమయంబునన్ శశి ముదంబున నచ్చటి కేఁగుదెంచి పు
త్రోత్సవ మాచరింప విని యుద్ధతితో గురుఁ డందువచ్చి య
స్మత్సుతుఁ డీబుధుం డిట నిశాకర రాఁ గత మేమి నీకన
న్మత్సరబుద్ధి వానికిఁ బునఃకలహంబు జనించె నయ్యెడన్.

ఆపతివ్రతాతిలకమునకు పుత్రుఁడు పుట్టఁగానేవచ్చి చంద్రుఁడు పుత్రోత్సవ మాచరించి నప్పుడు గురు శిష్యులకు పునఃకలహము జనించెనఁట !

క. నావిని యజుఁ డోహోహో
యీవాదము చాలుఁ గుముదమిత్రునిపుత్రుం
డీవత్స మితనిఁ జంద్రుని
కి విమ్మా వలదు విరస మిఁక నాంగిరసా.

అని బ్రహ్మదేవుఁ డింటిమగనికి బుద్ధిచెప్పి శిశువును తేరమగని కిప్పించి వివాదము తీర్చెనఁట! ఈవిషయమునే చెప్పుచుఁ గాశీఖండములో

గీ. చదివె గురునొద్ద ధర్మశాస్త్రంబుఁ దొలుతఁ
బరమవిశ్వాసతాత్పర్యభక్తిగరిమఁ
జదివెఁ జంద్రుఁడు కామశాస్త్రంబుపిదపఁ
దలిరుపాన్పున ననురక్తిఁ దారయొద్ద.

సీ. భువనైకధన్విచేఁబుష్పాయుధునిచేతఁ బ్రసవాస్త్రమున నేటుపడనివాఁడు
నతిగాఢమైన క్రోధాంధకారంబునఁ గన్నుల నంధుండు గానివాఁడు
నిర్నిబంధనలోభనిద్రాభరంబుఁ బారవశ్యంబుచేఁ బడసివాఁడు
లక్ష్మీకటాక్షవిలాసదుర్మదమున మనములోపల నన్నుకొననివాఁడు

లేఁడు భూపతి గలిగెనే న్వాఁడు నృపుఁడె
విశ్వధాత్రీజనులపాలివేల్పు గాక
బాహ్యశత్రులఁ బరిహరింపంగవచ్చు
నంతరరులను వర్జింప నలవికాదు.

ఈవిధముగా శ్రీనాథుఁడు చెప్పినరీతి ప్రౌఢవాక్యములుగాని, పురూరవశ్చరిత్రములో—

క. పాపపరాఙ్ముఖతాపతి । దీపాంకుర మానెలంతదీర్ఘశ్వసితా
టోపమరుద్ధతి నడఁగినఁ । బ్రాపితమోహాంధకారబంధురుఁ డయ్యెన్.

సీ. లలనానితంబమండలముపై నుత్పల
దళములు రచియింపఁ దలఁచుఁగాని
తరుణి కెమ్మోవిమీఁదఁ బ్రవాళమణిసొంపు
గులుకఁగా ఘటియింపఁదలఁచుఁగాని
జలజాక్షి కుచకుంభములమీఁద శశికప్లు
తంబుఁ దా నొనరింపఁదలఁచుగాని
మృగరాజమధ్య నెమ్మేను లతావేష్టి
తంబునఁ బెనఁగొనఁ దలఁచుగాని
తలఁపఁ డెప్పుడు గురువనితా సమాగ
మాగతాత్యుష్ణదురితదవానలంబు
దుస్సహాంబని కటకటా తొగలఁడేఁడు
కలుగదుగదా వివేకంబు కాముకులకు ?

సీ. సకియకొనుఁ దలంచి సన్మార్గ మనుఁగాని
యింతిదుర్మార్గత నెంచఁడయ్యెఁ
జెలువచన్గవఁ దలంచి సువృత్త మనుఁగాని
తరుణీకువృత్తంబుఁ దలఁపఁడయ్యె
నతివమోముఁదలంచి యకళంక మనుఁగాని

తెఱవకళంకంబుఁ దెలియఁడయ్యె
సుదతినవ్వుఁ దలంచి శుచి యనఁగాని యు
వ్వెలఁదుకయశుచి భావింపఁడయ్యె
గురువువంటిమహాత్ముఁ డిక్కరణిఁ దరుణి
చక్కఁదనమేగుణంబుగ సంస్మరించుఁ
గాని వ్యభిచారదోషంబుఁ గాంచఁడయ్యె
నజ్ఞుఁడనఁ బ్రాజ్ఞుఁడన నెవ్వఁడవనినింక ?

ఈవిధముగా నబ్బయామాత్యుఁడు చెప్పినరీతి నీతిబోధకవాక్యములుగాని, తారాశశాంకమున లేవు. కవియొక్క రచనను దెల్పుపద్యములు కొన్ని యుదాహరించుచున్నాను—

చ. హాతబహుకిల్బిషంబగుప్రయాగము యాగముదావహంబు సాం
ప్రతముగ నందు నిందిరకుఁ బట్టనఁ బట్టణముల్ సృజింపుమా
యతులితశిల్పశక్తిగొని యంచసి యంచ నిరూఢి నెక్కి యం
చితగతి ధాత యేగె జపసిద్ధులు సిద్ధులు త న్నభజింపఁగన్.—ఆ ౧.

చ. అలనలినారి పొల్చె నిజయౌవనవేళస్వకీయబింబలీ
లలు తననెమ్మొగంబునఁ గళంకరుచు ల్నునుమీసకట్టునన్
వలదు దయారుణద్యుతులు వాతెఱ వెన్నెలడాలు లేఁతన
వ్వులనమృతంబుపల్కులనుబూ నెనునాఁగమనోహరాంగుఁడై .-అ.౨

ఉ. చంపురుఁడుం బురందరనిశాతశరాహతిఁ గంది నివ్వెఱం
జెందఁగ నింద్రుఁ డిట్లను శశీ వినురా వినరానిపాతకం
బందినవాని కార్తి యరుదా గురుదార కృతాపరాధమే
ధం దిగఁద్రోచి చేసితి వృథా విబుధావళితో విరోధమున్.—ఆ.౫.

12. కూచిమంచి తిమ్మకవి

ఈకవి యనర్గళమయిన కవితాధార గలవాఁడు; బహుగ్రంథము లను రచియించినవాఁడు; ఇన్నిగ్రంథములను సలక్షణమయిన మృదుమధురపాకమున రచించినకవి యాధునికులలో మరియెవ్వఁడును లేఁడు. ఈ కవి యాఱువేలనియోగిబ్రాహ్మణుఁడు; కౌండిన్యగోత్రుఁడు; బయ్యనామాత్యుని ప్రపౌత్రుఁడు; తిమ్మయామాత్యుని పౌత్రుఁడు; గంగనామాత్యుని పుత్రుఁడు. ఈయనకు లచ్చమాంబతల్లి; జగ్గన్న, సింగన్న, నరసన్న, పితృవ్యులు; వీరమ్మ, పాపమ్మ, మేనత్తలు; సింగన, జగ్గన, సూరన, తమ్ములు; గోత్రెముక్కల రామయామాత్యుని కూఁతురైన బుచ్చమ్మ భార్య. ఈవిషయములను రుక్మిణీపరిణయములోని యీ క్రిందిపద్యము తెలుపుడు చేయుచున్నది—

సీ. గురుతరకౌండిన్యగోత్రవిఖ్యాతుండు బయ్యనమాత్యుఁ డేఁభవ్యతాత
నిరతాన్న దానవర్ణితయశస్సాంద్రుండు తిమ్మనసచివుఁ డేఁదీరుతండ్రి
ఘనులుజగ్గనయుసింగనమంత్రియునరసన్నయు నేమంత్రియనుఁగుదమ్ము
లలరఁ దిమ్మకవి సింగన్న జగ్గనయును సూరన యేధన్యుసుతవరేణ్యు
లొనర వీరమ్మ పాప మేఘనునిసహజ
లతిపతివ్రత లక్ష్మి యేచతురురాణి
యట్టి శ్రీకూచిమంచి వంశాబ్ధిచంద్రు
మజ్జనకు నలగంగనామాత్యుఁ దలఁతు.

ఈమధ్యను ముద్రింపఁబడిన రుక్మిణీపరిణయములో నీపద్యములోని నాలవపాదమున సింగన్న యనుటకు మారుగా రాజన్నయని యున్నది కాని యది యచ్చుతప్పని తలఁచెదను. తిమ్మకవికి సింగన్నయు జగ్గనయు సూరనయు నేకాని రాజన్నయను తమ్ముఁడు లేనట్టతఁడు రచించిన పుస్తకము లన్నింటివలనను దెలియవచ్చుచున్నది. అందు సింహాచలమాహా

త్స్యములోఁ గవి తనవంశవర్ణనము చేయుచుఁ బెద్దతమ్ముఁడగు సింగ న్ననుగూర్చి చెప్పిన పద్యముల నిందుదాహరించుచున్నాను—

క. నాతమ్ములు సింగనయును
ఖ్యాతయశుఁడు జగ్గనయును ఘనతరసుగుణ
వ్రాతాంకుఁడు సూరనయును
భీతారిసమూహు లగుచు వెలసిరి సిరులన్.

సీ. వక్రించుచందంబు వదలక మూఢత నలరెడు సురమంత్రి నపహసించి
సానులంగూడి యింపూని బుధేంద్రుని గననోడు నచలపుంగవుని నెంచి
శ్రుతిదూరుఁడై చరించుచు రెండునాలుకల్ గలిగియుండెడి భోగికులుని దెగడి
భంగంబు నొంది యేపట్టున నడలెడు రత్నాధివాసుఁ దిరస్కరించి
ప్రజ్ఞచే గౌరవమున వాక్పాటవమున
భూరిగాంభీర్యమున జనుల్ పొగడ నెగడెఁ
గూచిమంచ్యన్వయాంభోధికుముదహితుఁడు
శిష్టహితతంత్రిగంగయసింగమంత్రి.

కవియొక్క జన్మసంవత్సర మేదో తెలియదుగాని యితఁడు రచి యించిన గ్రంథములలో నెల్లను మొదటిదగు రుక్మిణీపరిణయము—

ఉ. ఆరయ శాలివాహనశకాబ్దము లద్రిగుణాంగచంద్రులం
బేరగుమన్మథాబ్దమునఁ బ్రేమఁ బ్రబంధ మొనర్చి మీకటుల్
చేరికతో సమర్పణము చేసితి మీకృతి యాతిమిత్రసహ్యా
త్రైకరవమిత్రతారకముగా భువిఁ జెల్వగుఁగాత శంకరా.

అను పద్యముబట్టి శాలివాహనశకము ౧౬౩౭ వ సంవత్సరము మన్మథాబ్దమునకు సరియైన హూణశకము ౧౭౧౫ వ సంవత్సరమునందు జేయఁబడిన దగుట నిశ్చయమయినందున, కవి యప్పటి కిరువదియైదు సంవత్సరముల ప్రాయమువాఁ డయినపక్షమున ౧౬౯౦ వ సంవత్సర

ప్రాంతమునఁ బుట్టినవాఁడై యుండవచ్చును. అచ్చ తెలుఁగు రామాయణములోని—

గీ. మునుపు మాకీవె భళ్ళాణుఁ డనెడితేని
కతయురుక్మిణి పెండిలికతయుబొబ్బ
మెకపుఁగుబ్బలికతయు మేల్మిఱనీల
పెండ్లికతయును గబ్బముల్ పేర్మిఁగూర్చి-

అను పద్యమునుబట్టి భళ్ళాణరాజచరిత్రము రుక్మిణీపరిణయము కంటె ముందుగా రచియింపఁబడినట్లు భ్రమ కలుగునుగాని నిజ మారయఁగా రుక్మిణీపరిణయమును రచించిన తరువాతనే కవి రాజశేఖర విలాసమను నామాంతరముగల భళ్ళాణచరిత్రమును రచించి నట్లు పెక్కు నిదర్శనములవలన స్పష్టమగుచున్నది. రుక్మిణీపరిణయమునందుఁ గవి తా నావఱకు గ్రంథము లేవియుఁ జేసియున్నట్టు చెప్పుకొనలేదు. కవిచేత రచియింపఁబడిన మూఁడవగ్రంథమగు సింహాచలమాహాత్మ్యము నందు——

గీ. ప్రతిభమీఱంగ రుక్మిణీపరిణయంబుఁ
గలుషహారమగు రాజశేఖరవిలాస
మును మఱియుఁ జాలదండకములును శతక
ములును రచియించి కృతులు శంభునకు నిడితి.

అని కవి రుక్మిణీపరిణయమునే మొదటఁ జెప్పియున్నాఁడు. లక్షణసారసంగ్రహము, రసికజన మనోభిరామము మొదలయిన గ్రంథము లన్నిటిలోనుగూడ కవి మొట్టమొదట రుక్మిణీపరిణయమునే పేర్కొని యున్నాడు. కవి యేహేతువుచేతనో రుక్మిణీపరిణయము చేసినతరువాత జేసిన యచ్చ తెలుఁగురామాయణము నీలాసుందరీపరిణయము లోనుగా గలపుస్తకములలోఁ దా నాపుస్తకములను జేసి ముగించినకాలమును వేసికొనలేదు.

తిమ్మకవి గోదావరీమండలములోని పిఠాపురసంస్థానములోని దైన కందరాడ గ్రామమునకు కరణము. ఇతఁడు కందరాడగ్రామవాసుఁ డయినట్లు లక్షణసారసంగ్రహములోని యీక్రిందిపద్యమునవలనఁ దెలియ వచ్చుచున్నది—

సీ. కౌండిన్యగోత్రవిఖ్యాతుఁడఁ గూచిమంచ్యన్వయాంభోధినీహారకరుఁడ
గంగనమంత్రిశేఖరునకుఁ బరమపావనియగులచ్చమాంబకును సుతుఁడ
వెరవొప్ప రుక్మిణీపరిణయంబును సింహశైలమాహాత్మ్యంబునీల పెండ్లి
కథయును రాజశేఖరవిలాసమునచ్చ తెనుఁగురామాయణంబును మొదలగు

కృతులు రచియించి పార్వతీపతికి భక్తి
తోడ నప్పన మొసఁగినవాఁడఁ గంద
రాడపురసంస్థితుఁడఁ గడుఁ బ్రోడ నేను
దిమ్మకవిచంద్రుఁడను జగద్విదితయశుఁడ.

ఈయన గ్రంథములుచేయ నారంభించిన కాలమునందు పీఠికాపురసంస్థానమునకు రావు మాధవరాయనృపతి ప్రభువుగా నుండెను. ఈవిషయము రుక్మిణీపరిణయములోని యీపద్యమువలనఁ దెలియవచ్చుచున్నది—

సీ. చక్రవాళాహార్యజలధితులోన్నతప్రాకారపరిఖావిరాజితంబు
సాంద్రముక్తాసౌధచంద్రశాలానేకభర్మనిర్మితహర్మ్యశర్మదంబు
కరిసైంధవాందోళికాధేనుధనధాన్యవనదేవగృహసరోవర్ణితంబు
విమలచాతుర్వర్ణ్యవిద్వత్కవిశ్రేష్ఠభటనటామాత్యవిస్ఫారితంబు
రాజమహేంద్రవరదుర్గరాజ్యభోగి
భారసంభరణాక్రాంతభాసమాన
రావు మాధవనృపపరిరక్షితంబు
భోగనికరంబు పీఠికాపురవరంబు.

ఈరావు మాధవనృపతియే కొన్నిగ్రంథములు రచించిన యనంత రమునఁ గవికిఁ గవిసార్వభౌమబిరుదము నిచ్చినట్లు రసికజనమనోభిరామములోని యీక్రింది పద్యమువలనఁ గనఁబడుచున్నది—

సీ. నిఖిలవిద్యాభ్యాసనిపుణుఁడు మత్సహోదరుఁ డగుజగ్గనత్రవితనయులు
ఘనులుతిమ్మనయుసింగనయును లేఖకపాఠకులై కృతుల్వ్రాయఁజేయఁ
బేర్మిఁగాంచినవాఁడఁ బీఠపురప్రాజ్యరాజ్యాధిపత్యవిరాజమాన
భూరివై భవుఁడు నద్భుతపరాక్రముఁడును దానకళాధురంధరుఁడునై స
రావు నీలాద్రిమాధవరాయనృపతి
చేతఁ గవిసార్వభౌమ విఖ్యాతబిరుద
మందినఘనుండఁ దిమ్మయాహ్వయుఁడ నేను
విమలతరభక్తి మదిలోనవిస్తరిల్ల.

కవి పీఠికాపురసంస్థానములో నుండినవాఁడయినను తనగ్రంథములు వేనిని నరాంకితము చేయక యిష్టదేవతయైన కుక్కుటేశ్వరస్వామికే యంకితము చేసియున్నాఁడు. ఇతఁడు రుక్మిణీపరిణయమును రాజశేఖర విలాసమును జేసినతరువాత రాజు తనకొక గ్రంథము నంకితముచేయ నడిగినట్లును కవి యట్లుచేయ నిష్టములేనివాఁ డయినట్లును సింహాచల మాహాత్మ్యములోని యీపద్యమువలన నూహింపఁదగియున్నది—

క. నృపులకుఁ గావ్యం బొసఁగిన
నపవర్గం బిడఁగఁగలరొ యటుగాకున్నన్
ద్వీపతురగభూషణాంబర
తపనీయాదికముచేతఁ దనుపంగలరో.

సీ. ద్విజపుంగవులకుఁ బ్రవేశింపఁగారాని
పృథుగృహాంతరములఁ బ్రేమనుండి
కృతియంతధర్మపద్ధతు లెవ్వి యెఱుఁగక
ధరణిపై నడువఁ బాదములు లేక

దుష్క్రియల్ చేయుమంత్రులు చెప్పినటులె మీా
అకనటింపుచుద్విజిహ్వకలుగలిగి
వితతంబుగా వక్రగతులచేఁ బొదలుచుఁ
బూని యెప్రొద్దును బుస్సు రనుచు
గాఢరోషవిషానలోద్గారిఘోర
వక్త్రములుగల్గి దుర్మదవర్తు లగుచుఁ
జెలఁగుచుండెను భోగిరాజులభజనపఁ
గుటిలతరబుద్ధి నెవ్వాఁడు కోరఁగలఁడు ?

* * * *

క. పనిపూని తుచ్ఛభోగం। బునకై కొఱగానిజనులఁ బొగడుటయెల్లన్
గనుఁగొన నిహపరదూరం।బని తలఁచి వినిర్మలాంతరంగుఁడ నగుచున్.

ఈయన శివభక్తుఁడయి తాను జేసిన గ్రంథముల నన్నిటిని పిఠాపురమునందలి కుక్కుటేశ్వరస్వామికే యంకితము చేసినను, ఒక్క సర్వపురమాహాత్మ్యమును మాత్రము రాజానుగ్రహము నపేక్షించి కాఁబోలును కవిసార్వభౌమబిరుద మందినతరువాత సర్వవరమందలి భావనారాయణస్వామి కంకితముచేసెను. ఈ సర్వవరము పిఠాపురపు రాజుల గురువులగు వైష్ణవస్వాములకు నివాసస్థలమయి పీఠికాపురము నకు సమీాపమున నున్నది. కవిమాత్రము సర్వపురమాహాత్మ్యములో భావనారాయణస్వామి తనకు స్వప్నమున సాక్షాత్కరించి యిట్లానతిచ్చి నట్లు చెప్పికొనియున్నాఁడు—

సీ. ప్రౌఢిమై రుక్మిణీపరిణయంబును సింహశైలమాహాత్మ్యంబు నీలపెండ్లి
కథయును రాజశేఖరవిలాసంబును నచ్చతెనుంగురామాయణంబు
సారంగధరనరేశ్వరచరితంబు సప్తార్ణవసంగమాహాత్మ్యకంబు
రసికజనమనోభిరామంబు లక్షణసారసంగ్రహము నింపారఁ గూర్చి

కృతులు శంభుని కిడినసుకృతివినీవు
ప్రతిభ మెఱయంగ నొక్కసత్కృతియొనర్చి
మాకు నర్పణచేయు మెమ్మదిదలిర్పఁ
తిమ్మకవిచంద్ర ముదితసుధీకు లేంద్ర.

తనకు మాహేశ్వరాచారవృత్తి నుపదేశించిన శైవుఁడగు దెందు
లూరి లింగనారాధ్యుని

క. చిరభక్తిం బొగడెద మ । ద్గురునాథుం దెందులూరికులపావనునిన్
గరుణానిధి నపరాంతక । హరమూర్తిని ఘనుని లింగనారాధ్యమణిన్.

ఇత్యాది బహుపద్యములతో బహుగ్రంథములయందు స్తుతించి
శివభక్తుఁ డయినను, కవి తాను కేవల శివమతస్థుఁడుగాక శివకేశవులకు
భేదము లేదని భావించెడి యద్వైతమతస్థుఁడయియుండెను. కవి తాను
కట్టకడపట రచియించిన శివలీలావిలాసములో నిందు క్రిందఁ బొందుపఱి
చిన పద్యమునందుఁ దాను జేసినపుస్తకముల నన్నిటిని బేర్కొని
యున్నాఁడు—

సీ. ప్రతిభ మైరుక్మిణీపరిణయంబును సింహశైలమాహాత్మ్యంబు నీలపెండ్లి
కతయును రాజశేఖరవిలాసంబును నచ్చతెనుంగురామాయణంబు
సారంగధరనృపచరితంబు సాగరసంగమాహాత్మ్యంబు రంగుమీఱ
రసికజనమనోభిరామంబు లక్షణసారసంగ్రహమును సర్వపురస
మంచితక్షేత్రకథనంబు మఱియుఁబెక్కు
శతకదండకసత్కృతుల్ ప్రతిభఁగూర్చి
యుల్లమలరారఁ బార్వతీవల్లభునకు
భక్తి నర్పణ చేసినభవ్యమతిని.

ఈ గ్రంథములలో సారంగధర చరిత్రమును సాగరసంగమాహా
త్మ్యమును నాకు లభింపలేదు. అవి చిన్న గ్రంథములని కవివంశములోని
వారొకరు నాతోడఁ జెప్పియున్నారు. ఈ కవి కవిత్వములో నచ్చతెనుఁగు

పదము లధికముగా నుండును. కష్టపడి మొట్టమొదట యౌవనకాలము నందు శృంగార ప్రధానముగా రచియించిన దగుటచే రుక్మిణీపరిణయము నందే కవి యెక్కువ ప్రౌఢిమను జూపియున్నాఁడు. కవికృతములయిన బహుగ్రంథములు పురాణపాకమున రచియింపఁబడినవి. శ్లేషములును శబ్దాలంకారములును విశేషముగా నుండినను, కవిత్వమునందద్భుత కల్పన లంతఁగాఁ గానఁబడవు. మొట్టమొదట రచియింపఁబడిన గ్రంథము లలో నదంత స్త్రీవాచకపదసంధులు లోనుగాఁగల కొన్ని దోషములు కనఁబడుచున్నను, అటుపిమ్మటఁ జేసిన గ్రంథములు నిర్దుష్టములుగా నున్నవి. కవి యితరగ్రంథములను రచియించిన కాలపరిమితినిబట్టి విచా రింపఁగా, ౧౭౧౫ వ సంవత్సరమునందు ముగింపఁబడిన రుక్మిణీపరిణ యము ౧౭౧౦ వ సంవత్సరమునందారంభింపఁబడి సంవత్సరమున కొక్కొక్కయాశ్వాసము చొప్పున నయిదాశ్వాసములు నయిదు సంవ త్సరములలో రచియింపఁబడెనని చెప్పుట సత్యమున కంతదూరముగా నుండదు. కవన మారంభించి యొకటిరెండు శతకములను జేసి గ్రంథ రచనకుఁ బూనునప్పటికిఁ గవికిరువది సంవత్సరముల ప్రాయముండునను టయు నంతగా తప్పు కానేరదు. కవి తరువాత రచియించిన రెండవ గ్రంథమగు రాజశేఖర విలాసము మూడాశ్వాసములును మూఁడు సంవ త్సరములలోఁ జేసినపక్షమున, ఆ పుస్తకమును ౧౭౧౮ వ సంవత్సర మున ముగించియుండవచ్చును. మూఁడవగ్రంథమగు సింహాచల మాహాత్మ్య మయిదాశ్వాసములు నయిదు సంవత్సరములలోఁ జేసినయెడల, ఆ స్థల పురాణము ౧౭౨౩ వ సంవత్సరమునందు ముగింపఁబడియుండును. కవిచే రచింపఁబడిన గ్రంథములలో నాలవదియు నచ్చతెలుఁగు కావ్యములలో మొదటిదియునైన నీలాసుందరీ పరిణయము మూఁడాశ్వాసములును మూఁడు సంవత్సరములలో రచియింపఁబడినచో, అది ౧౭౨౬ వ సంవ త్సరమునందు ముగింపఁబడియుండును. అయిదవగ్రంథమగు నచ్చతెనుఁగు

రామాయణ మాఱుకాండములు నాలుసంవత్సరములలోఁ గూర్పఁబడిన పక్షమున, అది ౧౭౩౨ వ సంవత్సరమునందు సమాప్తి నొంది యుండును. ఈ యచ్చ తెనుఁగుఁ గావ్యముల రచనచేతఁ గవి కభినవ వాగనుశాసనబిరుదము వచ్చెనని చెప్పుదురు. ఆఱవ గ్రంథమగు సారంగధర చరిత్రమును రెండుసంవత్సరములలోఁ జేసెనేని, అది ౧౭౩౪ వ సంవత్సరములో పూర్తియయియుండును. ఏడవది యగు సాగరసంగమామాహాత్మ్యము రెండుసంవత్సరములలోఁ జేయఁబడినయెడల, ౧౭౩౬ వ సంవత్సరమున సంపూర్ణమయి యుండును. ఎనిమిదవగ్రంథమగు లక్షణసార సంగ్రహము

గీ. శాలివాహనశక వర్షసంఖ్యకరర
సాంగశశిసంజ్ఞ సలరు రౌద్ర్యబ్దమునను
భాద్రపదశుక్లపంచమివఱకుఁ బూర్ణ
మయ్యె నీకృతి నీపేర నగసుతేశ.

అని శాలివాహనశకము ౧౬౬౨ వ సంవత్సరమునకు సరియైన క్రీస్తుశకము ౧౭౪౦ వ సంవత్సరమునందు ముగింపఁబడినదని కవియే చెప్పియున్నాఁడు. మూఁడాశ్వాసములుగల యీలక్షణగ్రంథమును రచియించుటకుఁ గవికి ౧౭౩౬ వ సంవత్సరము మొదలుకొని నాలుగు సంవత్సరములు పట్టియుండును. చంద్రపాలెములోనున్న యీకవివంశమువారి యింటఁ గలపుస్తకములను వెదకించఁగా నందు భారతాదులును లక్షణవిషయకగ్రంథములునుదక్క విశేషగ్రంథము లేవియుఁ గానఁబడ నందునను, లక్షణసారసంగ్రహములో లక్ష్యములుగాఁ జూపఁబడిన ప్రబంధాదులలోని పద్యములు చాలవఱ కితరపూర్వలక్షణగ్రంథములలో నున్నవే యగుటచేతను, కవి యీగ్రంథరచనమునందు భారత రామాయణములను మఱికొన్ని ప్రబంధములను మాత్రమే శోధించు

నట్టు తోఁచుచున్నది. అందుచేత గ్రంథపరిసమాప్తికి నాలుగు సంవత్సరములు చాలును.

గీ. తెలుఁగుకు మున్న లక్షణంబులు మహాక
వీశ్వరుల్ పెక్కు రచియించి యిడి రిఁకేల
కూర్పవలెనన్నఁ బ్రౌఢిమకొఱకునాకుఁ
దెలిసి తెలుంగుఁ దగఁగొంత తెలియఁబఱుతు.

అని కవి లక్షణసారసంగ్రహమునఁ బూర్వలక్షణగ్రంథములలో లేని నూతనవిషయములను గొన్నిటిని జేర్చినట్లు చెప్పియున్నాడు. కొన్ని విషయములను కవి క్రొత్తగా శోధించి చేర్చెననుటకు సందేహములేదు. రెండవగ్రంథమగు రసికజనమనోభిరామ మనెడి యాఱాశ్వాసముల ప్రబంధమును రచించుటకు కవికి ౧౭౪౦ వ సంవత్సరము మొదలుకొని ౧౭౫౦ వ సంవత్సరమువఱకును పదిసంవత్సరములు పట్టినది.

సీ. * * రసికజనమనోభిరామం బనెడు పేరఁ దెనుఁగున శాలివా
హనశకాబ్దములఁ గరగిరిరసభూసంఖ్యఁ దద్దయువఱలు
ప్రమోదూతవత్సరమున నీప్రబంధంబు రచియించి
నీకొసఁగితి.

అని కవి రసికజనమనోభిరామమును దాను శాలివాహనశకము ౧౬౭౭ వ సంవత్సరమునకు సరియైన ౧౭౫౦ వ సంవత్సరమున రచియించినట్లు చెప్పెను. ఈ కవి యీగ్రంథమును బహుపుస్తకములు శ్రమచేసి తన ప్రౌఢిమ నంతను జూపి వసుచరిత్రమువలె నుండవలెనని దాని ననుసరించి చేసెను. అందుచేతనే కవి యీగ్రంథాదియందు—

సీ. బహుపురాణములుప్రబంధములక్షణశాస్త్రములువివిధకోశములునాట
కము లలంకారశాస్త్రములును శోధించి ప్రౌఢిమై నేతత్ప్రబంధ మేనొ
నర్చెద * * * * * *

అని వ్రాసికొనియున్నాఁడు. అయినను వసుచరిత్రమునందుఁగల ప్రౌఢిమలోను సారస్యములోను శతాంశమైనను రసికజనమనోభిరామము నకు రాలేదు. అన్యోన్య తారతమ్యము తేటపడుటకయి యుభయ గ్రంథములనుండియు సమానవిషయములను దెలుపు పద్యములను గొన్నిటి నింకఁ జూపెదను. వసుచరిత్రములో గిరికాదేవిని గూర్చుట కయి రాజుచేతఁ బంపబడిన దూత పోయి సఖీజనమధ్యమున నున్న కన్నియను జూచి సమయోచితసరసాలాపములతో ముచ్చటించి యామె చెలికత్తెల చేతనే—

ఉ. ఇన్నగరాజుఁ జూడ వసుధేశ్వరుఁ డెన్నఁడు వచ్చు వచ్చి యీ
క్రొన్ననతీవజొంపములకోనకు నెన్నఁడు డిగ్గు డిగ్గి యా
కన్నియఁ గన్నులారఁ గుతుకంబున నెన్నఁడు గాంచుఁ గాంచి తా
నెన్నఁడు గారవించుఁ జెలు లెన్నఁడు గాంతు రభీష్టసంపదల్.

రాజు నిమిత్తమయి ప్రార్థించునట్లుచేసి నేర్పుతో కార్యసంఘట నము చేయుఁగా, రసికజనమనోభిరామములో బ్రియురాలి నిమిత్తమయి రాజుచేఁ బంపబడినదూత యామె కడకుఁబోయి—

చ. పలుకులు వేయు నేఁటికిఁక భావభవప్రతిమానుఁడైన యా
చెలువునితోడుతం జెలిమి చేకుఱ కున్న నయారె నీమెయిం
గల యెలజవ్వనం బడవిగాచిన వెన్నెలసుమ్ము ముద్దులేఁ
జిలుకలకొల్కి నాపలుకు చిత్తమునం దలపోసిచూడుమా.

అని చెప్పి యామెచేత,

చ. అవునవు మంచిప్రోడవె బళా యళు కించుక లేక మానినీ
నివహసభాగ్రభాగమున నిల్చి వినం గొఱగానివాక్యముల్
తవిలి వచింపఁ జాగితివి తాళుదు మే మఱియొక్కఁడైన దూ
తవు నిను నేమియుం బలుక ధర్మము కాదని యుంటి మిత్తఱిన్.

అని చీవాట్లుతిని తనప్రభువువద్దకు మరలి వచ్చెను.

చ. కటకట యమ్మ నొక్కత్రుటికాలముఁ బాయనిదాన నొంటిమై
నెటువలె వచ్చితమ్మ చెలి యిచ్చటి కేకపుఁదేనెవాక లీ
వెటువలె నీఁది తమ్మ తెరువెల్లను బుష్పొడి నీపదాంబుజం
బెటువలె నోర్చె నమ్మ తరుణీ తగునమ్మకడిందిచైదముల్ — వసుచ.

ఉ. కొమ్మరొ యుమ్మరంపువెతఁ గుందుచు నిల్లెడఁబాసి యిమ్మెయిన్
మమ్ముఁ ఋచేసి యొంటిగ వనంబున కేటికి వచ్చితమ్మ నె
త్తమ్ములగేరునీమృదుపదంబులు కందెఁ గదమ్మ మేలు మే
లమ్మక చెల్ల నీబలుగయాళితనమ్ములు చెప్పఁ జిత్రముల్ — రసికజ.

ఈ పుస్తకమునందు స్త్రీ వర్ణనములు మొదలయినవి వెట్టిగాఁ జేయఁబడినవి. ఈ శృంగార ప్రబంధమును రచియించిన కొంతకాలము నకుఁ గవి వీధినిబడి పోవుచుండఁగా నొక వేశ్య చూచి రసికజనమనోభి రామమును జదివియున్న దగుటచే సంగతి రసికముద్ర కానందించి వలచి వచ్చి పైఁబడి కవిని కౌఁగిలించుకొనఁగా నతఁడు పెడమొగము పెట్టె ననియు, అందుపయి నా సరసురాలు

చ. చతురులలోన నెంతయును జాణ వటంచును నేను గౌఁగిలిం
చితి నిటు మాఱుమోమిడఁగఁ జెల్లునె యోరసికాగ్రగణ్య

అని యాశుకవిత్వము చేసి యడుగఁగా,

అద్భుతమగునట్టి బంగరపుబొంగరపుంగవఁబోలునీకుచ
ద్వితయము ఱొమ్ము నాటియలవిఁపునదూసెనటంచుఁజూచితిన్.

అని కవి పద్యముపూరించి యుత్తరమిచ్చెననియు, చెప్పు వాడుక యొకటి కొంతకాలమునుండి కలదుగాని యిదియు రసికత్వమున కెల్లను జారత్వమే ముఖ్యమని భావించెడి యపూర్వ పండితులచే నితర కవుల యందారోపింపఁబడినరీతి యసత్యకల్పనమే యనుటకు సందేహము లేదు. రుక్మిణీపరిణయమును ముగించునాటికిఁ గవి కిరువదిరైదు సంవత్సరము

లున్నచో నిప్పటి కాతని కరువది సంవత్సరములు దాటియుండవలెను. కులవృత్తిదోషముచే నెంత సిగ్గువిడిచినదయినను పట్టపగలు నట్టనడివీధిలో నడుచుచున్న ముసలి రసికుని బయిఁబడి పడుచు పడుపుపడఁతి యెల్లరుఁ జూచుచుండఁ గౌఁగిలించుకొన్నదనుటకంటెఁ బరిహాసాస్పదమయిన విరుద్ధపు మాట మఱొకటి యుండదు. పదవదియగు మూఁడాశ్వాసములు గల సర్వపురమాహాత్మ్యము తరువాత నాలుగు సంవత్సరములలో ౧౭౪౮ వ సంవత్సరమునందు ముగింపఁబడినది.

పదునొకండవదియు కట్టకడపటిదియు నగు శివలీలావిలాసమను రెండాశ్వాసముల గ్రంథము మఱి రెండేండ్లకు

గీ. శాలివాహ శకవర్ష సంఖ్య వసున
గాంగశశిసంజ్ఞ నలరుధాతాబ్దమునను
దగరచించిన యీకృతి ధరణియందు
నాసుధాకరతారార్కమగుచునుఁడు.

శాలివాహనశకము ౧౬౬౮ వ సంవత్సరమునకు సరియైన ౧౭౪౬ వ సంవత్సరమున రచియింపఁబడినది. అటుతరువాతఁ గవిచే రచియింపఁబడిన గ్రంథము లేవియుఁ గానరావు. ఆరంభదశలో రచియింపఁబడిన కుక్కుటేశ్వరశతకము మొదలయిన కొన్ని శతకములను దండకములును గలవు. శివలీలావిలాసము ముగిసిన యల్పకాలములోనే కవి పరలోకగతుఁడయ్యెను. కాఁబట్టి యతఁడు ౧౭౫౭ వ సంవత్సరమునందు మృతినొందెనని యించుమించుగా నిశ్చయముగానే చెప్పవచ్చును. అందుచేతఁ గవి దాదాపుగా డెబ్బది సంవత్సరములు జీవించి సుమారు నలువదియైదు సంవత్సరములు గ్రంథరచనయందుఁ గడిపినట్టు స్పష్టమగుచున్నది. ఈ కవికి సంతతిలేదఁట. ఈ కవియొక్క కడపటికాలములో నింగ్లీషువారికిని ఫ్రెంచివారికిని యుద్ధములు జరగినందున కందరాపమీఁదుగా రాకపోకలు చేయుచువచ్చిన సేనలదాడికి వెఱచి

యా గ్రామము విడిచి చంద్రమపాలెము నివాసముగా నేర్పఱచుకొనెను. ఈ కవివంశమువారిప్పటికిని చంద్రమపాలెములోనే యున్నారు. ఆంధ్ర నామసంగ్రహముచేసిన పైడిపాటి లక్ష్మణకవి, కన్నప్పచరిత్రము చేసిన కంచిరాజు సూరయ్య, శివజ్ఞానదీపికనుజేసిన కవిలోకబ్రహ్మ, ఇందుమతీ కళ్యాణముచేసిన యంగర బసవయ్య, ద్వాదశ రాజచరిత్రచేసిన కట్టవరపు చిట్టమరాజు, ద్విపద రుక్మాంగదచరిత్రముచేసిన రామయ భాస్కరుఁడు మొదలగు కవు లీకవికిఁ బూర్వమునందుండినట్లు లక్షణసారసంగ్రహ ములో నియ్యఁబడిన లక్ష్యములవలనఁ దెలియవచ్చుచున్నది. కవి యొక్క శైలిని జూపెడు పద్యములఁ గొన్నిటి నిందుదాహరించు చున్నాను—

రుక్మిణీ పరిణయము.

ఉ. సారము ముద్దుఁబల్కు ఘనసారము సిద్దపుమేనితావి కా
సారము నాభిరంధ్రము విసారము తేటమిటారిచూపు శ్రీ
కారము కర్ణయుగ్మము చొకారము నవ్వుమొగంబు షట్పదా
కారము కొప్పు సన్మధువికారము మోవి వధూలలామకున్. ఆ. ౨.

ఉ. కౌను చలింప సిద్దపుమొగంబునఁ జెమ్మటముంప గంకణ
ధ్వానము లింపునింపఁ గరతాళగతు ల్పచరింప హారముల్
పూనినటింప నూర్పుసోలపు న్వలితెమ్మెర లంకురింపఁగాఁ
జానయొకర్తు రుక్మిణికి సంపఁగినూనెఁ దలంటు నేర్పునన్. ఆ. ౫.

రాజశేఖరవిలాసము.

శా. ఏరాభూవర మాకుఁ గాంచనతురంగేభాంబరాందోళికా
భూరిస్యందనమందిరోపవనసద్భూషామణి శ్రేణులున్
బేరెన్నందగుపల్లెలుం బడుపులుక్ లెక్కింప కర్థంబులున్
ఈరా కోరికతీఱ మీఱ కీక నీవెంతేనియుక్ ధీరతన్. ఆ. ౧.

ఉ. అయ్యెడఁ జెల్లమాంబ విభునానతి గైకొని వాఁడిచూపు లో
య్యొయ్యనమీఱ లేనగవు లొప్పఁగఁ జెక్కులఁ బొఱ డీపి మైఁ
బయ్యెదజాఱ ముద్దునునుబల్కులు చెల్వలరార నవ్వెటుం
జయ్యనఁ జేరి మ్రొక్కె నెఱజాణగు జెల్ల నెఱింగి రంగుగన్. ఆ-3

సింహశైల మాహాత్మ్యము.

మ. వలపుం గొజ్జఁగినీటిశీతలహరీవార్బిందువు ల్చిమ్ముచున్
గలయం గప్పురపుందుమారము మెయిన్ గాటంబుగాఁ గప్పుచున్
బలవద్దర్పకబాణపంక్తులక్రియన్ బైపై విరు ల్గుప్పుచున్
జెలఁగె న్మందసమీరణుండు దితిజశ్రేష్ఠాగ్రభాగంబునన్. అ. ౨.

ఉ. అక్కట! దైత్యనాయకుఁ డహర్నిశయుం దనయాత్మ నెంతయున్
మక్కువమీఱ నిన్ననుచుమాట దలంపక తద్విపక్షునిన్
బెక్కుఁదెఱంగులం గడఁగి పేర్కొనఁజూచెదు చిన్నవాఁడ వీ
వెక్కడ? తత్త్వ మెక్కడ? సహింపఁడుసుమ్ము నిశాచరార్భకా. ఆ-3

నీలాసుందరీ పరిణయము.

ఉ. మినుకుఁగడానిబంగరపుమేడల తోరణగండ్ల వెంట రే
ల్చనియెడిరిక్కమొత్తమును జక్కఁగఁ జూచి మెఱుంగుబోండ్లు ని
చ్చలు పిడికిళ్ళఁబట్టి యవి జాఱిచనం దమగోళ్ళు చుక్కలం
చును నెడనిల్చి చేవదలి చూచుచు నబ్బురపోదురందులన్. ఆ. ౧.

ఉ. కన్నులవింటివాఁడ తిగకన్నులదేవరతోఁడఁబోరి ముక్
బన్నము నొంది మేఁదొఱఁగుపట్టున నెక్కడ డాఁగిపోయె నీ
మన్నెఱికంబు? నేఁడు కొఱమాలినకోయిలచిల్కమూఁకలన్
బన్నుగఁ గూడి చేడియల బాములఁ బెట్టెదు పోటుబంటవై. ఆ.3.

అచ్చతెలుఁగు రామాయణము.

ఉ. కాయను మేటితప్పు కొడుకాయను సిద్దపుఁబూఁతమావిమో
కాయనుఁ బంజరంపుఁజిలుకాయను నబ్రపుబోయగంపుఁబ్రో

కాయనుఁ బల్కవేమి యలుకాయనుఁ బంతముతీఱెనోటు కై
కాయనునేర యిట్లు దుమకాయనుఁ మాయఁగఁ గోరికాయమున్.

అయోధ్యా.

చ. జగములతల్లియై పుడమి జవ్వనిగాదిలిపట్టియైనయి
మ్మగుదలమిన్నఁ దెచ్చితిని మోస మెఱుంగక నీకు నెవ్వరుం
దగ దిదియుంచుఁ బెల్వఁ గలదంటలు గల్గమిఁజేసి యిట్టికిం
డగపడె నింకనైన విడనాడక రాముని ప్రాపుఁ జేరుమీ. సుందర.

లక్షణసారసంగ్రహము.

చ. కరములు దోయిలించి కుతుకంబున నిచ్చలుఁ బ్రస్తుతింతు భా
స్వరగుణవంతునిన్ సకలసత్కవిజాలవశీవసంతునిం
జిరకరుణానిశాంతుని విశిష్టజనావనతావిశాంతునిం
సురతరుమంజరీనిభయశోహరిదంతుని నేకదంతునిన్. ఆ. ౧.

మ. ఘనకారుణ్యకటాక్ష రాక్షసచమూగంధేభహర్యక్ష స
జ్జనసంరక్షణదీక్ష పాలితసరోజాతాక్ష శక్రాంబుజా
సనముఖ్యామరపక్ష దక్షసవనాంచత్ప్రోద్ధతామ్రాక్ష యా
చనకప్రాంగణకల్పవృక్ష రిపుశిక్షాదక్ష మోక్షప్రదా. ఆ. ౨.

రసికజనమనోభిరామము.

మ. తరుమూలంబులపొంతఁ బొంచి సచివోత్తంసంబు వీక్షించె భా
స్వరకార్తస్వరవిగ్రహన్ సమదచంచచ్చంచరీకాలకన్
శరదిందుప్రతిమానచారువదనన్ జక్రస్తని న్విస్ఫుర
త్సరసీజాతదళాయతాక్షి నొకకాంతాలోకచూడామణిన్. ఆ. ౨.

మ. నవనాదిక్రియల న్సుధాంధులను మెచ్చంజేసి ధన్యాత్ములై
నవిశేషజ్ఞుల కబ్బఁగాక యకటా నా కేటికిం గల్గు ని
స్స్తవనాతీతవిలాసవిభ్రమకళాభారిప్రభాంచన్మరు
ద్ధవళాక్షీమధురాధరాధరసుధాధారాసరిద్ధోరణుల్. ఆ. ౫.

సర్పపుర మాహాత్మ్యము.

మ. సరసీనిర్మలనీరబిందుకణముల్ సమ్యగ్గతింబూని వి
స్ఫురదారామలతాంతసౌరభరజఃపుంజంబుఁ గైకొంచు ని
ర్భరమందానిలశాబకప్రకరముల్ పల్మాఱు నక్కోనలోఁ
దిరుగుం బాంథజనశ్రమాపహరణోద్వృత్తిం బ్రకాశింపుచున్. ఆ-౨

ఉ. నీకరుణావిలోకమున నిల్పినచోఁ గులహీనుఁడుం హయా
నేకపహేమచామరమణీరమణీయవిభూషణాదికా
స్తోకవిభూతి చెంది పరిశుద్ధకులుం డన మించు లేనిచో
నాకనివాసుఁడున్ వెతల నందుఁగదమ్మ జగత్కుటుంబినీ. ఆ. 3.

శివలీలావిలాసము.

ఉ. అంగదముద్రికావలయహారలలాటిక లెమ్మె నెమ్మెయిన్
రంగులు గుల్కఁ గ్రొందగటునాడెపుఁబావడ సొంపునింప మే
ల్బంగరుగిల్కుటందియలు బాళిగ నంఘ్రులఘుల్ఘుల్లనన్
గంగ యమునుంగులం గలసి కౌతుకలీలలఁ గ్రీడ సేయుచున్. ఆ. ౧.

ఉ. కన్నులుమూయుఁ గ్రుళ్ళిపడి గ్రక్కునదిక్కులురోయు నూరకే
సన్నలుచేయుఁ బై వలువ చయ్యననవ్వలఁద్రోయు మింటిపై
వెన్నెలగాయుచంద్రుని వేఁడికిఁ దాఁ బెడఁబాయు నద్దిరా
చిన్నెలజంగమప్రభునిచిత్తవికారము లెన్నఁజిత్రముల్. ఆ. ౨.

13. వక్కలంక వీరభద్రకవి

ఈకవి కూచిమంచి తిమ్మకవి జగ్గకవుల కాలములోనే పీఠాపుర మునందుండి మిక్కిలి ప్రసిద్ధిగన్నవాఁడు. కూచిమంచి తిమ్మకవివలెనే యితఁడును దెందులూరి లింగనారాధ్యుని శిష్యుఁడయి తన వాసవదత్తా పరిణయమునం దాతని నిట్లు స్తుతించి యున్నాఁడు—

సీ. అంభోధివలయితకుంభినీజననుతదంభశాంభవకళాజృంభితములు
నందివాహపదారవిందవిశ్వాసమరందసంపాదనేందిందిరములు
స్వేక్షణాదరనరాధ్యక్షలక్ష్మప్రదానక్షమసామ్రాజ్యదక్షిణములు
ఊహాఘదాత్మబోధాహతస్వాంతసందేహాలీలాపశ్యతోహరములు
ధీరతాగుణమణిహారి దెందులూరి
లింగగురువరసత్కృపాపాంగవీక్ష
ణములు సతతంబు శుభసిదానంబులొాచు
శిష్టజనముల దయను రక్షించుఁగాత!

ఈకవి గౌరీకల్యాణ మను నామముతోఁ గాళిదాసకృతమయిన కుమారసంభవమును దెలిగించుటయేకాక సుబంధకవి విరచితమయిన వాసవదత్తను వాసవదత్తాపరిణయమను పేరితో నాంధ్రీకరించి దానిని పీఠికాపురాధీశ్వరుఁడయిన రావు మాధవరాయసింగారి కంకితము చేసెను. పద్మనాయకకులసంభవుఁడైన శ్రీరామచంద్ర మాధవరాయనృపాలుఁడు తన్ను బిలిపించి వాసవదత్తను దెనిఁగింపనడిగిన కథను కవి వాసవదత్తా పరిణయమునం దిట్లు చెప్పికొనియున్నాఁడు—

శా. శ్రీమచ్చంద్రకళాకిరీటపదరాజీవద్వయీభావనా
సామర్థ్యోదితవాక్ప్రపంచఘటనాచాతుర్యవిద్వజ్జన
స్తోమానందదశేముషీనిజవిలాసు న్వక్కలంకాన్వయున్
బ్రేమన్ దాయ్యప్పను వీరభద్రుని ననుం బిల్పించి యుప్పొంగుచున్.

క. తాతలతరమునుండియు । నీతనిజనకుండు మనకు హితుఁడు కవీంద్రుం
డీతనిచేతం గృతి వి । ఖ్యాతిగఁ గైకొందు ననుచు హర్షం బొదవన్.

గీ. సవినయంబున సముచితాసనమునందు
నంతికంబునఁ గూర్చుండ నాజ్ఞ యొసఁగి
మందహాసాంచితముఖారవిందుఁ డగుచు
నతిదయాస్ఫూర్తి నిట్లని యానతిచ్చె.

క. శ్రీవెలయ నుభయభాషల । నీవలెఁ గృతిఁ జేయఁగలరె నేఁటికవీంద్రుల్
భూవిశ్రుతకవితావి । ర్భావయశస్సాంద్ర వీరభద్రకవీంద్రా.

సీ. మీతాత లోకవిఖ్యాతభాషాఖిల శేషాహి యాచంద్రశేఖరుండు
మీతండ్రి చాటువాగాతతచిత్రప్రబంధకల్పనశాలి భాస్కరుండు
మీతల్లితండ్రి పురాతనసత్కవినాథుల కెన విశ్వనాథసుకవి
మీ మేనమామ సుత్రామవైభవుఁడుసద్యఃకృతిమతి వేంకటాద్రిసుకవి
చదువకయె శ్రీసతీశప్రసాదగరిమ
బాల్యమునను గుమారసంభవము తెనుఁగు
చేసి కవు లెంచఁ బ్రఖ్యాతిఁ జెంది తీవు
కలరె నీసము లాధునికులు కవీంద్ర.

ఉ. అత్యలఘుక్రియానిపుణుఁడై ధరణీతల మేలు విక్రమా
దిత్యసభాంతరంబునఁ బ్రతిష్ఠితుఁడై ఘనధీసమగ్రతన్
సత్యవతీతనూభవునిజాడఁ బ్రసిద్ధికి నెక్కి నవ్యసా
హిత్యమునన్ సుబంధుసుకవీంద్రుఁడు ప్రస్తుతిఁగన్నవాఁడిలన్.

గీ. ఘనతరమనీష నమ్మహాకవివరుండు
ప్రతిపదశ్లేషగద్యప్రబంధ మత్యు
దారతను జెప్పె వాసవదత్తయనఁగ
నార్యులాకథ కడుచోద్య మనిరి సభను.

మ. స్తవనీయుంబగు తత్కథాక్రమము భాషాయోషిదంఘ్రిస్ఫుర
న్నవమంజీరనినాదమేదురనితాంత ప్రౌఢవాగ్గుంభనన్
భవదీయోక్తుల నాంధ్రకావ్యముగ వైదర్భీగతిం గూర్పు త
త్కవినవ్యోక్తులు కొన్ని నీకవితకుం గైదండ గావింపఁగన్.

క. వరమతి వాసవదత్తా । పరిణయమును జెప్పి యీప్రబంధము విద్వ
త్పరిగణ్యంబుగ మాకుం । దిరముగ నంకితముచేయు ధీరవిచారా.

భర్తృహరియొక్క సుభాషితరత్నావళిని దెనిఁగించిన యేనుఁగు లక్ష్మణకవి మొదలైన వారీకవితో సమకాలికులు. సమకాలమునం దున్న కవులు కూచిమంచి తిమ్మకవిని బొగడక యీతనిని బొగడుటచే దిమ్మకవి కవిత్వముకంటె నీతనికవిత్వమునం దప్పటివారి కధికాదరమున్నట్లు స్పష్టమగుచున్నది. ఏనుఁగు లక్ష్మణకవి తనరామవిలాసమునందుఁ బూర్వకవులను స్తుతిచేసిన పిమ్మట—

గీ. దిట్టకవి విశ్వనాథుఁ బ్రార్థించికొలుతు
నతనినందనుఁ డగువేంకటాద్రికవికి
వాక్యపూజలు గావింతు వక్కలంక
వీరభద్రుని భావింతు గౌరవమున.

అని యీవీరభద్రకవిని బేర్కొని యున్నాఁడు. ఆకాలమునం దుండిన యీదరపల్లి భవాని శంకరకవియుఁ దాను దెనిఁగించిన ధర్మ ఖండములో—

మ. హరితుల్యుం డగురావుమాధవ నృపాలాగ్రేసరుఁ గావ్యచా
తురి మెప్పించి తదీయసత్కృప సిరుల్ తోరంబుగాఁ బొంది బం
ధురతేజుండగు వక్కలంకకులపాథోరాశిరాకాసుధా
కిరణుండై తగు వీరభద్రసుకవిం గీర్తింతు నా నెచ్చెలిన్.

అని వీరభద్రకవిని బ్రశంసించి యున్నాఁడు. సమానకాలమువా రిట్లు మెచ్చుటచేతనే యీకవి యసమానకవిత్వప్రౌఢిమ గలవాఁడని తేట

పడుచున్నది. ఈవీరభద్రకవి యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; భార ద్వాజగోత్రుఁడు; భాస్కరకవి పుత్రుఁడు; చంద్రశేఖరకవి పౌత్రుఁడు; దిట్టకవి విశ్వనాథకవి దౌహిత్రుఁడు. ఈతనితల్లి జగ్గాంబ; మేనమామ దిట్టకవి వేంకటాద్రికవి. ఈకవి తండ్రితాతలనుండియుఁ బిఠాపురసంస్థాన మునం దుండినవాఁడు. తండ్రి తరమువారును తల్లి తరమువారునుగూడ సత్కవీశ్వరులు. ఈకవి మాతామహుఁడైనఁ విశ్వనాథకవి పెద్దాపుర సంస్థానస్థాపకుఁడయిన శ్రీవత్సవాయ ముసలి తిమ్మరాజుగారికిఁ దాను రచించిన శేషధర్మప్రబంధము నంకితము చేసెను. శేషధర్మరత్నాకర మనుపేరితో నీగ్రంథమునే రాజమహేంద్ర నివాసుఁడగు కొండయ కొడు కగు శ్రీనివాసకవియు రచియించెను. వీరభద్రకవి ౧౭౫౦ వ సంవత్సర ప్రాంతమునఁ ఉండును జీవించియుండవచ్చును. ఇతఁడు తనవార్ధకదశలో పిఠాపురమును విడిచి వృద్ధగౌతమీతీరమునందున్న ముమ్మిడివరము ప్రవేశించి సన్యాసాశ్రమమును స్వీకరించి యక్కడనే సిద్ధిపొందెనఁట. ఈకవి విరచితగ్రంథములనుండి కొన్నిపద్యముల నిం దుదాహరించు చున్నాను—

వాసవదత్తాపరిణయము.

శా. భల్లూకంబులఁ జూచితే తిమిరసంపల్లాలితాంగప్రభో
ద్యల్లీలన్ ఘననీలనీలఘనసఖ్యం బెప్పుడుం జేయఁగా
వల్లీవేల్లితవామలూరువులఁ గేవం గొంటుజుంటీఁగలం
దెల్లం గుయ్యిడఁ దేనియ ల్గొనెడు భూమీశా విచిత్రంబుగన్. ఆ-౬

శా. ప్రచ్ఛాయస్థలపల్లవాస్తరణనిద్రాయోగ్యముల్ పాటలీ
గుచ్ఛాకల్పమరుత్మనోజ్ఞతరముల్ కూలంకషాభ్యంతర
స్వచ్ఛాంభఃపరిషేచనార్హములు పశ్చాద్భాగసౌభాగ్యముల్
స్వచ్ఛందస్థితి గ్రీష్మవాసరము లెంచం జాల మించెం ధరన్. ఆ. 3.

కుమారసంభవము.

చ. హరుఁ డఖిలేశుఁ డవ్వనరుహాక్షితపః ప్రతిఘాతిహేతువై
పరఁగినతత్సపర్యలకు భావమునం గడుమెచ్చి యొప్పెఁ దా
నరయ వికారకారణము లంటిన నిశ్చలతం దనర్చు నె
వ్వరిహృదయారవిందములు వారలె ధీవరు లెంచిచూడఁగన్. ఆ-౧

చ. మలయవసుంధరాధరసమాగతబంధురగంధవాహరా
జుల నెదిరించుచున్ వివిధసూనగుళుచ్ఛరజఃపరంపరల్
కలయఁగఁ జూపు లడ్డుకొనఁగాఁ గను గానక దర్ప మేర్పడన్
జెలఁగి మృగంబు లవ్విపినసీమ నటించె మధూదయోన్నతిన్. ఆ-౨

ఉ. అన్ను తలంచు రూపము హితాళి తలంచుఁ గులంబు తల్లి దా
నెన్ను సువస్తువుల్ వరుల నేర్పుతఱిన్ బురవైరి నెంచినన్
గన్నులు మూడు పుట్టుటయె కానఁగరాదు దిగంబరుండునుం
జిన్నముసొమ్ము లేదు తెలిసెం దగఁ డాతఁడు నీకు మానినీ. ఆ. 3.

ఉ. క్రొత్తలుచేసి గేహములు గోవజవాజిని బచ్చికస్తురిన్
మెత్తిరి గోడ లందుపయి నిద్దపుఁజాయలపాలసున్నముల్
చిత్తరువుల్ లిఖించిరి విచిత్రగతి న్నయనోత్సవంబుగా
నత్తఱి నుత్తముల్ ప్రతిగృహంబున శోభనశోభ సంధిలన్. ఆ. ౪.

---

14. కూచిమంచి జగ్గకవి

ఇతడు సుప్రసిద్ధుఁ డయిన తిమ్మకవి సార్వభౌముని రెండవ తమ్ముఁడు. ఈతని జన్మసంవత్సర మేదో తెలియదుగాని తిమ్మకవికంటె నాలుగయిదుసంవత్సరములు చిన్నవాఁడయి యుండవలసినందున, ఇతఁడు ౧౭౦౦ వ సంవత్సర ప్రాంతమునందు పుట్టిన ట్టూహింపఁదగియున్నది. ఈజగ్గకవి యిరువది సంవత్సరముల ప్రాయము వచ్చువఱకును చదు వెఱుఁగక యల్లరిమూఁకతో దిరుగుచు కాలము గడపెననియు అప్పుడు వివాహితుఁడయి యత్తవారియింటికి మనుగుడుపునకు బోయి మామ గారు తనకుఁ బరమశుంఠ యైనయల్లుఁడు దొరకినందున కనుతాపపడఁగా రోషముచేత దేశాంతరమునకు లేచిపోయి పండ్రెండు సంవత్సరములు విద్యాభ్యాసముచేసి పండితుఁ డయి కవిత్వము చెప్ప నారంభించెననియు, పుక్కిటపురాణ మొకటి కలదుగాని యిది కేవల కల్పితకథయని తోఁచుచున్నది. ఈకథనుబట్టి యీకవికి కవిత్వము చెప్పనారంభించు కాలమునాఁటికి ముప్పదిమూఁడు సంవత్సరముల ప్రాయ మయి యుండ వలెను. కూచిమంచి తిమ్మకవి తాను ముప్పదిసంవత్సరముల ప్రాయ మునఁ జేయ నారంభించిన సింహశైలమాహాత్మ్యమునందు దనపెద్దతమ్ముఁ డైనసింగన్నను వర్ణించినతరువాత రెండవతమ్ముఁడైన యీజగ్గకవిని గూర్చి యిట్లు వ్రాసియున్నాఁడు—

క. అతని యనుజన్ముఁ డతులిత
మతియుతుఁడు సమస్త రాజమాన్యుఁడు సుగుణా
న్వితుఁడు సమంచితకవితా
చతురుఁడు జగ్గప్రధానచంద్రుఁడు తనరున్.

క. ఘోటకలాటకిరాటవ
రాటమరాటాంగవంగరాజన్యసభా

ఝూంటనిరాఘూటనట
చ్చాటుకవిత్వాంకుఁ డరయ జగ్గన ధరణిన్.

సీ. సిరతంబునుడివోనిసిరినిరవొందియుఁ దవుటినిప్పటిమొక్కఁ దలఁపఁడేని
సదమలాచారప్రశస్తి గాంచియువర్ణములు సంకరంబుగాఁ గలఁపఁడేని
ఖలజనసంశితిఁ గావింపుచుండియుఁ బతితుల నెపుడుఁ జేపట్టఁ డేని
యురుపుణ్యవర్తియయ్యును బాడబాశ్రయసీమ నిల్లుగను వసింపఁడేని
యులజగన్నాయకుఁడు సాటియనఁగఁబోలు
భోగమున నిర్మలాచారమున విశిష్ట
రక్షణంబునఁ బుణ్యమార్గమున నరయ
గంగనామాత్యు జగ్గయఘనునిత్రోడ.

ఈపయిపద్యములు రచియింపఁబడిన కాలమునకు జగ్గకవి యించుమించుగా నిరువదియైదు సంవత్సరముల యీడుగలవాఁడయి యుండును. ఇరువదియైదేండ్ల ప్రాయమునాఁటి కన్ని దేశములు తిరిగి రాజసభలలోఁ బ్రసిద్ధిగాంచఁ గలుగుటకు కవి యిరువదియేండ్ల వయస్సునకు లోపలనే పండితుఁడయి కవనచాతురి గలవాఁడయియుండవలెను. అందుచేత జగ్గకవి యిరువది సంవత్సరముల ప్రాయము వచ్చువఱకును నక్షరజ్ఞానము లేనివాఁడని చెప్పెడికథ నమ్మఁదగినది కాదు. ఈకవి తనవివాహానంతరమున ధనార్జనము నిమిత్తమును పాండిత్యప్రకాశనము నిమిత్తమును బహుదేశాటనముచేసి రాజాస్థానములలో మెప్పొంది సత్కారమును బొందుట వాస్తవమే యైనను, "భోటకలాటకిరాటవరాటమరాటాంగవంగ" యని ప్రాసనిమిత్తమయి వేయఁబడిన దేశసంచారము కొంత యతిశయోక్తియై యుండవచ్చును. ఇతఁడు దేశాటనముచేసి వచ్చిన తరువాతను దత్పూర్వమునను, జానకీపరిణయమును, ద్విపద రాధాకృష్ణచరిత్రమును, చాటుప్రబంధములును, సుభద్రాపరిణయమును, చంద్రరేఖావిలాపమును, సోమదేవరాజీయమును రచియించెను. చంద్ర

రేఖావిలాపములోని యీక్రింది పద్యమున వర్ణింపఁబడిన వరుసనుబట్టి విచారింపఁగా నితఁడు దేశసంచారముచేసి రాజాస్థానములయందు రాజులమీఁద చాటుప్రబంధములు చేయుటకుముందే జానకీపరిణయమును రాధాకృష్ణచరిత్రమును రచించినట్లు తోఁచుచున్నది—

సీ. రచియించితివి మున్ను రసికు లౌనని మెచ్చ సురుచిరజానకీపరిణయంబు
వచియించితివి కవివ్రాతము ల్పొగడంగ ద్విపదరాధాకృష్ణదివ్యచరిత
ముచ్చరించితివి విద్వచ్చ్చయంబు నుతింపఁ జాటుప్రబంధముల్ శతకములును
వర్ణించితివి యిరువదిరెండువర్ణనల్ రాణించఁగా సుభద్రావివాహ
మాంధ్రలక్షణలక్ష్యంబు లరసినావు
భూరిరాజన్యసంసత్ప్రపూజితుఁడవు
బళిర నీభాగ్యమహిమ చెప్పంగఁదరమె
జగ్గకవిరాజచంద్ర వాచాఫణీంద్ర.

ఇతఁ డీచంద్రరేఖావిలాపమును విజయనగరసంస్థానాధిపతులగు శ్రీ పూసపాటి విజయరామరాజుగారి చెల్లెలి పెనిమిటియగు చింతలపాటి నీలాద్రిరాజుమీఁది కోపముచేతఁ జేసెను. ఇది బూతుపుస్తకమగుటచే నిందలిపద్యము లుదాహరింపఁ దగియుండలేదు. "అర్ణవవేష్టితాఖిల మహామహీమండలిలోని బూతులం । బూర్ణుఁడ" నని కవియే చెప్పుకొనుటచే నీతఁడు తిట్టుకవిత్వమునం దసమానపాండిత్యముకలవాఁ డయినట్లు స్పష్టమగుచున్నది. జగ్గకవి ధనసంపాదనము నిమిత్తమయి విజయనగరమునకుఁ బోయి రాజు బావయైన నీలాద్రిరాజు నాశ్రయింపఁగా నతఁడు తానుంచుకొన్న వేశ్యను నాయికఁగా జేసి తనమీఁద ప్రబంధము చేయుమని కోరెనఁట! ధనాశచేత నట్టిప్రబంధరచన కొప్పుకొని కవి చంద్రరేఖావిలాస మను శృంగారకావ్యమును జేసెనఁట! అటు తరువాతఁ దాను సంస్కృతకావ్యమును రచించి యిచ్చెదనని చెప్పి

రాజమతి మరలించిన యాడిమల్ల వేంకటశాస్త్రి ప్రోత్సాహముచేత నీలాద్రిరాజు జగ్గకవికి తగినబహుమానముచేసి సత్కరింపక తిరస్కారమును జూపెనఁట! అందుపైని ముంగోపియైన యాధూర్తకవి తాను రచియించిన చంద్రరేఖావిలాసమును చింపివేసి చంద్రరేఖావిలాపమను పేరిట నిప్పటి బూతుగ్రంథమును జేసెనఁట! ఇందలి కవివర్ణనలో సహితము సాధుకవులను విడిచి యిట్లు తిట్టుకవిత్వము చెప్పినకవులనే పేర్కొని యున్నాఁడు—

క. భీమకవి రామలింగని । శ్రీమంతుండైన వెలుంగు శ్రీనాథకవిన్
రామకవిముఖ్యులను బ్రో । ద్దామగతిం జిత్తవీథిఁ దలఁచి కడంగన్.

ఈపుస్తకములోని మొదటిపద్య మిట్లున్నది—

శా. శ్రీకంఠుండు భుజంగభూషణుఁడు భస్మీభూతపంచాస్త్రుఁ డ
స్తోకాటోపబలప్రతాపపురరక్షోదక్షసంశిక్షణుం
డాకాశోజ్జ్వలకేశపాశుఁడు త్రిశూలాంకుండు రుద్రుండు దా
వీఁకం డింతలపాటనీలనృపతి న్వీక్షించు నేత్రత్రయిన్.

ఈపుస్తకమునుజేసి జగ్గకవి నిజాంరాజ్యమునకుఁబోయి హైదరాబాదునగరమునందుఁ గల తురకదొరల నాశ్రయించి వారిమీద పద్యములుచెప్పి తన్ముఖమున నవాబుయొక్క దయను సంపాదించి, నిజాము ప్రభుత్వమునకు లోఁబడిన సామంతరాజ్యమైన విజయనగరమునకు ప్రభువగు శ్రీవిజయరామరాజుగారివద్దకుఁ దనగ్రంథమును నీలాద్రిరాజు సమ్ముఖమున సభలోఁ జదివించి వినునట్లు నవాబువద్దనుండి యుత్తరువు తెచ్చి యట్లు చదివెనని చెప్పుదురు. ఇతఁడు గ్రంథమునందు నీలాద్రిరాజు నెంత దూషించినను, తత్పత్నియగు నరసమాంబను దూషింపక యాపతివ్రత నిట్లు భూషించెను—

క. ఖలుఁడైన నీలనృపుఁ డీ । యిలపై నిన్నాళ్ళు బ్రతుకునే నరసాంబా
గళకలితకనకమయ మం । గళసూత్రోత్కృష్టమహిమఁ గాక కుమారా.

ఈజగ్గకవియు నించుమించుగా నన్న జీవించినంతకాలము జీవించి నట్లు కనఁబడుచున్నది. అందుచేత నితఁడు ౧౭౦౦ వ సంవత్సర ప్రాంతము మొదలుకొని ౧౭౬౦ వ సంవత్సరప్రాంతమువఱకును జీవించి యుండినవాఁడని జెప్పవచ్చును. ఈతఁడు రచియించిన గ్రంథములలో నాలాశ్వాసములు గల సుభద్రాపరిణయము మనోహరముగా గనఁబడు చున్నది. ఆపుస్తకమునందు జగన్నాయకస్వామినిగూర్చి వ్రాయఁబడిన మొదటిపద్య మిట్లున్నది.

ఉ. శ్రీయలరన్ సుభద్రయును సీరియుఁ బార్శ్వముల న్మెలంగ న
త్యాయతలీల నీలకుధరాగ్రమునందు వసించి నిచ్చలుం
బాయక భక్తకోటి కనపాయశుభంబు లొసంగు శ్రీజగ
న్నాయకదేవదేవుఁ డభినందృకృపామతి మమ్ముఁ బ్రోవుతన్.—ఆ. ౧.

సుభద్రాపరిణయమునం దితఁడు

గీ. నన్నపార్యుని తిక్కన నాచిరాజు
సోము నమరేశు శ్రీనాథు భీమకవిని
రంగనాథునిఁ బోతనఁ బ్రాజ్ఞవరుని
శంభుదాసుని భాస్కరు సంస్తుతింతు.

అని కవిస్తుతిచేసి తనయన్నయగు తిమ్మకవినిట్లు పొగడి యున్నాఁడు—

సీ. కౌండిన్యగోత్రవిఖ్యాతునిఁ గూచిమంచ్యన్వయాంభోధినీహారకరుని
గంగనమంత్రిశేఖరునకు నంగనామణి యగులచ్చమాంబకును సుతుని
బహుకావ్యనిర్మాణబంధురప్రతిభునిఁ గుక్కుటేశ్వరకృపాంకూరలబ్ధ
సత్కవితామహాసామ్రాజ్యభారధౌరేయుని బుధజనప్రియచరితుని
వెందులూరి లింగనారాధ్య దేశికేంద్ర
దత్తమాహేశ్వరాచారవృత్తిరతునిఁ
గందరాడఘనగ్రామమందిరుని మ
దగ్రజునిఁ దిమ్మకవిరాజు నభినుతింతు.

ఇతఁడు తనగ్రంథములను జగన్నాథస్వామి కంకితము చేసెను. ఈకవిచేత రచియింపఁబడిన జానకీపరిణయము మొదలయినగ్రంథములు నాకు లభించినవి కావు. ఇతఁడు కాకతిప్రతాపరుద్రవంశజుఁ డయిన మందపాటి నారాయణరాజుయొక్క ప్రేరణముచేతఁ బ్రతాపరుద్రవంశమును వర్ణించుచు సోమదేవరాజీయమను మూఁడాశ్వాసముల గ్రంథ మొకటి రచియించెను. కవియొక్క కవితానైపుణిని జూపుటకై కొన్నిపద్యముల నిందుదాహరించుచున్నాను—

సుభద్రాపరిణయము.

చ. సురుచిరలీలఁ గన్గొనియె శోభనదివ్యసరోజమాలికా
పరిమళలాభలోభమదబంభరడింభరవామమంగ దు
ర్భరదురితౌఘభంగ నతిభాస్వరగాఢతరంగ రంగదీ
శ్వరమకుటాగ్రగంగ శుభసంగను గంగఁ దగంగఁ జెంగటన్. ఆ. ౨.

ఉ. ఆరమణీలలామము లుదంచితలీలలఁ గాంచి రొక్క కా
సారము సారసౌరభవిశంకటసారసపుండరీకక
ల్హారమరందపానపరిలంపటమాద్యదళీంద్రసాంద్రఝుం
కారము కోకహంస బకకచ్ఛపమీనఘుళీకుళీరముల్. ఆ. 3.

శా. కారంబయ్యె నితంబినీమణి కలంకారంబుఁ రోలంబఝుం
కారంబుల్ సమదోగ్రకోకిలకుహూకారంబుఁ జంద్రోద్ధతా
కారంబుల్ గుసుమాస్త్రచాపగుణటంకారంబు రాయాంచత్కేం
కారంబుల్ శుకశారికానికరహుంకారంబు ఘోరంబుగన్. ఆ.౫.

చ. తళుకుఁబిసాళివాలుఁగనుదమ్ముల లోకించుక విప్పి కన్యకా
తిలకము కాంచె నీలమణిదీధితిజాలమనోజ్ఞ గాత్రునిన్
బలవదరాతిజైత్రునిఁ గృపాపరిపూరిత నేత్రునిన్ నమూ
కలితవిలాసచైత్రుని జగన్నుతిపాత్రునిఁ బాండుపుత్రునిన్. ఆ. ౬.

సోమదేవరాజీయము.

శా. అన్నా యెక్కడనుంటి వొక్కఁడవు రేయాహా మహైశ్వర్య మీ
వెన్నన్ బాలుఁడ విట్టు లుంట విహితంబే రేయి నల్లాములన్
నిన్నుం గానక కుందుచుంటిమిగదా నిక్కంబు మాప్రాణముల్
కన్నార న్నినుఁ జూడకున్న నిలువంగా నేర్చునే శేషముల్. ఆ. ౧.

ఉ. వింటిరె మీర లిప్పు డొకవింత కువాళపుబండివాండ్రు మొ
న్నంటినిశార్ధభాగమున నాచి మహేశగృహంబు చొచ్చి రా
బంటులె నిన్న రేయి మనపట్టణభూసురవర్యుఁ గొట్టి వా
రింటిపదార్థ మెల్ల హరియించి రనాయక మయ్యె రాజ్యముల్. ఆ. ౨

---

15. కొవలె గోపరాజు

ఈకవి యాఱువేలనియోగిబ్రాహ్మణుఁడు ; హారితసగోత్రుఁడు ; గోపరాజు పౌత్రుఁడు ; కసవరాజునకును కామాంబికకును పుత్రుఁడు. ఇతఁడు సింహాసనద్వాత్రింశతిక యనుపేరవిక్రమార్కునికథలను పండ్రెండాశ్వాసముల పద్యకావ్యముగా రచియించెను. ఈద్వాత్రింశత్సాలభంజికల కథలను రచించుటనుగూర్చి కవి యిట్లు వ్రాయుచున్నాఁడు—

క. అప్పరమేశ్వరుకరుణన్। గుప్పలుగొనువిక్రమార్క గుణములకొలఁకై
చెప్పెద రసభావంబులు। మ్నిప్పిరిగొనునట్లు కథలు ముప్పదిరెండున్.

ఈకవివంశమునకు మూలపురుషుఁడైన పెన్నయామాత్యుఁడు

సీ. కలుషమండలికభేకఫణీంద్రుఁడన రాయగజగంధవారణఖ్యాతి మెఱసి

*　　*　　*　　*

నెగడె నందవోలు నెలవుగా భూసుర। వంశసాగరామృతాంశుమూర్తి
చక్రవర్తి మాన్యసౌజన్యధుర్యుండు। విక్రమార్కునిభుఁడు పెన్నవిభుఁడు.

ఈ పద్యమునుబట్టి నందవోలురాజులయొద్ద మంత్రిగానుండి బిరుదముల నందినట్టు కనుపట్టుచున్నాఁడు. ఇతఁడు పదునాలవ శతాబ్ద మధ్యమునం దుండి యుండవచ్చును. కాఁబట్టి యీ పెన్నయామాత్యున కేడవపురుషుఁడైన కవి తరువాత నూటయేఁబది సంవత్సరముల కనఁగా పదునేడవశతాబ్దాంతమునం దుండి యుండును. కవితండ్రియైన కసవరాజు వేముగల్లు పురాధీశ్వరుఁ డయిన మల్లరాజు మంత్రియైనట్టు,

శా. రాణన్ మల్లనకీర్తిచంద్రికలు పర్వం బొంగి మధ్యాశ్రిత
క్షోణీభృద్ఘనదుర్గమై గుణమణిస్తోమంబుల న్నిండి యీ
క్షోణిన్ శ్రీపురుషోత్తమాశ్రయమునై శోభిల్లి దానామృత
శ్రేణిన్ ద్యాగసముద్రనామము వహించెన్ వేముగల్లిమ్మహిన్.

ఇత్యాది పద్యములవలనఁ దెలియవచ్చుచున్నది. కాని యీ మల్లనృపాలుఁ డెవ్వఁడో యేకాలమునం దుండినవాఁడో యింకను విచారింప వలసియున్నది. ఎట్లయినను గవి యించుమించుగా నిన్నూఱుసంవత్సరములక్రిందటివాఁ డగుటకు సందేహము లేదు. ఈ విక్రమార్కచరిత్రములోని గద్యమునందు

"ఇది రాయగజగంధవారణ వైరిమండలీకఫణీంద్ర వీరఘోట్టవిభాళాదిబిరుద ప్రకటచారిత్ర కొవలె పెన్నయామాత్యపౌత్ర హరితసగోత్ర పవిత్ర సకలసుకవిమిత్ర కసవరాజతనూజ గోపరాజ విరచితంబైన......"

అని పెన్నయామాత్యుఁడు తనకు తాతయైనట్లు చెప్పకొనెను గాని వంశవర్ణనమువలన కవి కేడవపురుషుఁడైనట్టు స్పష్టమగుచున్నది. ఈద్వాత్రింశత్సాలభంజికాకథల కవిత్వము విక్రమార్కచరిత్రమును రచించిన జక్కనకవిత్వమునకుఁ జాలకపోయినను మొత్తముమీఁదఁ జక్కనిదిగానే యున్నది. ఈపుస్తకములోని రెండుపద్యము లిందుఁ బొందుపఱుపఁబడుచున్నవి__

ఉ. అన్నలొ రమ్ములో చెలులొ యాత్మజులో చనువారు వీరికై
మిన్నక చావనేల యిది మేలె భువిన్ బలిభోజికయ్యె నా
యున్నెడ విశ్వసింప నొరునొద్దకుఁ జేరఁ బ్రమాద మానుఁ గ
న్నన్న నెఱింగి యొండెడకుఁ జాగుఁడు ప్రాణము తీపి చూచితే. ఆ.౪

ఉ. దేవసమాన నిన్ను వినుతించుట వాంఛితసిద్ధి భూమిలో
నేవసుధేశు నీయెదుట నెన్నఁగవచ్చు మదీయజిహ్వా ల
జ్జావశమై చలింప దిఁక సద్గుణముం దగ సద్గుణాఢ్య ప్ర
స్తావన చేయ నేరనియతం డతిమూర్ఖుఁడుగానఁ జెప్పెదన్. ఆ.౧౧

---

16. కొడిచెర్ల శ్రీనివాసకవి

ఇతఁడు శేషధర్మరత్నాకర మనియెడి యాఱాశ్వాసముల పద్య కావ్యమును రచియించెను. ఈగ్రంథము శేషధర్మములనియు వాడుదురు. ఈకవి యాత్రేయగోత్రుఁడు. కొండయభవానిపుత్రుఁడు. రాజమహేంద్ర పుర నివాసుఁడు. ఇతఁ డిన్నూఱుసంవత్సరములకు ముందుండినవాఁడు. ఇతఁ డొకవేళఁ బదునేడవశతాబ్దమధ్యమునందుండి మధ్యకవులలోఁ జేర వలసినవాఁ డేమో! పుస్తకములోని

> 'ఇది నవరసానుబంధ బంధురప్రబంధ నిబంధనా చాతురీ ధురీణ సకలకళాప్రవీణాత్రేయగోత్రపవిత్ర కొడిచెర్ల కొండయభవాని పుత్ర ఐవరగండ బిరుదప్రచండ మంత్రిమార్తాండ సమస్త సద్గుణా వాస శ్రీనివాసప్రణీతంబైన హరివంశమునందలి శేషధర్మసారం బను మహాప్రబంధంబునందు.'

అను గద్యమునుబట్టి చూడఁగా నితఁడు మంత్రిశిఖామణియై బిరుదముల నందినట్లును, అత్యంతాధునికుఁడు కానట్లును, కనఁబడుచున్నాఁడు. ఈతని

కవిత్వము ప్రౌఢమయి రసికజనహృదయంగమముగా నున్నది. ఈతని శేషధర్మములనుండి కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. నెలకొని సంగమంబున జనించును గామము కామవృద్ధిచేఁ
దలకొనుఁ గ్రోధ మట్టిబెడిదంబగుక్రోధమునం దనర్చు మో
హాలతిక మోహవృత్తి నుదయం బగు విస్మృతి విస్మృతిం జనుఁ
దలఁపఁగ బుద్ధి బుద్ధి చనినన్ మఱితాఁ జెడు మానవుం డిలన్. ఆ.౧.

ఉ. మేఁడియు సీరముం భుజముమీఁద భరించుచుఁ బోతునెద్దుతోఁ
గూడఁగఁ గాఁడి బూన్చి మునికోల కరంబునఁ బట్టి పగ్గముం
ద్రాఁడును మోకువారెనయుఁ దాలిచి ముందట వెక్కఁ జుంగుఁ బ్రే
లాడఁగఁ గాసె కట్టుకొని యక్కుటిలాత్మకుఁ డేఁగెఁ జేనికిన్. ఆ.3.

ఉ. రామ కృపాభిరామ రిపురాక్షస వీరవిరామ సాహసో
ద్దామ లసద్గుణప్రకరధామ సమస్తనృపాలలోకసు
త్రామ వినాకరాన్వయసుధాసరిదీశ్వరసోమ సద్గుణా
రామ నిను న్నుతింప నల రాజకళాధరుఁడైన నోపునే. ఆ. ౫.

---

17. పట్టమట్ట సోమనాధకవి

ఇతఁడు స్కాందపురాణములోని సూతసంహితను నేడాశ్వాసముల గ్రంథముగాఁ దెనిఁగించెను. ఈకవి యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు. హరితసగోత్రుఁడు; వేంకటామాత్యపుత్రుఁడు. ఇతఁడు తనగ్రంథమును బిక్కనవోలి కామారెడ్డి కంకితముచేసెను. ఈగ్రంథము రచియింపఁబడినకాల మిప్పటికి నన్నూఱుసంవత్సరములకంటె నెక్కువయి నట్టు తోఁచుచున్నది. కృతిపతియైన కొమిసేని కామారెడ్డి యెప్పుడుండిన

వాఁడో తెలిసినదికాదు. కృతికర్త గోదావరిమండలములోనివాఁడు. సూతసంహిత కవిత్వము సలక్షణమునయినదిగానున్నది. కవితాధోరణిని దెలుపుటకయి సూతసంహితలోని పద్యములు కొన్ని యిందుదాహరింప బడుచున్నవి—

ఉ. మున్ను పురాణపూరుషుఁడు ముఖ్యుఁడు విష్ణుఁడు శంభుమాయ పై
కొన్న విమోహితుండయి యకుంఠితగర్వ మెలర్ప నేన యీ
యన్నిజగంబులుం బొదివి యాసినకర్తను బేరుకొన్న నా
కన్న ఘనుండు నాసముఁడు గన్గొన నెవ్వఁడు శాశ్వతంబుగన్. ఆ.౧

ఉ. పాపము లట్లు కొన్ని యెడఁబాసిన రోగము లెల్ల మాని యు
ద్దీపితసత్త్వుఁడై దృఢమతిన్ శశివర్ణుఁడు తన్మహైశర
తాపరతంత్రవృత్తిఁ దృణకాష్ఠఫలోదకశాకమూలనా
నాపరిచర్యలన్ దినదినంబు గురున్ భజియించు నెంతయున్. ఆ. ౩.

చ. సరవి నబోధమూలమగు సంసృతివృక్షము మూలనాశనం
బుఱుగతిఁ జేయ మంత్రరచితోదక పుష్పముఖార్చనంబు లే
సరణిని జాల నాత్మరతి జ్ఞానమె ముఖ్యశివార్చ యాబహి
ర్విరచితపూజనంబు లవివేకులు స్థూలము లందు రజ్ఞతన్. ఆ. ౫.

ఉ. అట్టిమహేశ్వరుం దెలిపి యవ్యయధామము నొందవచ్చు నే
పట్టునఁ గర్మకోటి నది ప్రాప్తముకాదు సమస్తయజ్ఞముల్
నెట్టన భూరిసంసరణనీరధి దాఁటఁగ మంటిమోడ లా
నెట్టును మృత్యువున్ జరయు నేచును గేవలకర్మతంత్రులన్. ఆ. ౬.

18. దివి రమణకవి

ఇతఁడు వాసిరెడ్డి రామలింగప్రభుని ప్రేరణముచేత శృంగారధామ మను రెండాశ్వాసముల ప్రబంధమునుజేసి నృసింహస్వామి కంకితము చేసెను. కవి తన్నుఁ గృతిచేయఁ బ్రేరేపించిన రామలింగప్రభునిఁ దన ప్రబంధమునం దిట్లు వర్ణించియున్నాఁడు—

సీ. ఏధన్యవంశేశుఁ డెలమి సమారాధువరమున నభివృద్ధివంతుఁ డయ్యె
నేమేటికూటస్థుఁ డెన్నఁగ వేమనృపాలుప్రీతిచే భువి వాసిరెడ్డి యయ్యె
నేమహాత్మునితండ్రి యొందెఁ గుతుబుశానృపాలుచే గజాందోళికంబు
లేయయ్యయగ్రజుఁ డెలమి శాత్రవవీరగజరాజసింహతఁ గలన నమరె
నతనివంశజుఁ డతనికూటస్థజాతుఁ
డతనిసత్పుత్రుఁ డాతనితమ్ముఁ డగుచు
నమరె బహుగుణరత్నరత్నాకరుండు
కదనవిజయుండు రామలింగప్రభుండు.

ఈపయిపద్యమునుబట్టియే యీకవి నిర్దుష్టముగాఁ గవిత్వము చెప్పలేనివాఁడగుట స్పష్టమగుచున్నది. అభివృద్ధిమంతుఁడనుట కభివృద్ధి వంతుఁడనియు, అందుననుట కెందెననియుఁ బ్రయోగించినను మొత్తము మీఁద గవిత్వము రసహీనమైనదికాదు. కృష్ణామండలములోని యమ రావతీ సంస్థానప్రభువుల ప్రేరణమునుబట్టి పుస్తకమును రచించుటయు మంగళగిరి నృసింహుని కంకితముచేయుటయు విచారింపఁగా నీకవికృష్ణా మండలములోనివాఁడనుట తేలుచున్నది. కుతుబుశాను పేర్కొని యుండుటచేతఁ గవి పదునేడవశతాబ్దమధ్యమునం దుండిన ట్లూహింపఁ దగియున్నది. శృంగారధామమునుండి రెండుపద్యము లిం దుదాహరింపఁ బడుచున్నవి—

చ. అలికులవేణికిం బ్రియుఁ డనంగనృపాలుఁడు దాడిచేసి యీ
వలనికి నేఁట రేపటనె వాసిగ రాఁగలఁడంచు బాల్యముల్
గళవళమంది చింతిలఁగఁ గన్పడెఁ దన్ముఖరాజచిహ్నముల్
కలికి వయఃప్రకాశగుణకాంతియు బాల్యవయస్సుసంధిగన్. ఆ. ౧.
మ. సరి నీ వాయెదిరింటి కేగఁ గని యేఁ జాలించి యున్నంతలో
నరయం దత్స్థల మేమి మున్నటిమదీయార్థంబు మాకిచ్చి యే
సరణిం బోయినఁ బొమ్మటంచు వడిఁ జంచచ్చిత్తయై వేశ్య త
త్కరయుగ్మాంచితకంకణంబు లొగిఁ దాఁ గాంక్షించి తీసెన్వెసన్. ఆ-౨

---

19. కోడూరి వేంకటాచలకవి

ఈకవి స్కాందపురాణములోని శివరహస్యఖండమును తెనిఁగించెను. ఈతనికి బాలసరస్వతియను బిరుదాంకముగలదు. ఈతఁ డారువేలనియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; కాశ్యపగోత్రుఁడు; ఎల్లనామాత్యపౌత్రుఁడు; శంకరామాత్య పుత్రుఁడు. ఈశివరహస్యఖండము శ్రీ ముసురు ముళువాగళుప్రభుని కంకితము చేయఁబడినది. ఇతఁడు బళ్లారిప్రాంతములయందుండిన లింగబలిప్రభువని తోఁచుచున్నది. కృతిపతియొక్క పూర్వులలో నొకనిని వర్ణించుచు—

క. ధరణీస్థలి నాపరశివ। చరణోద్భవులందు సకలసామ్రాజ్యరమా
భరణుఁడు వీరనృపాలుఁడు। వరభింగకగోత్రుఁ డగుచు వర్ధిల్లెఁగడున్.

అని కవి యతనిని శివపాదోద్భవకులజునిఁగాఁ జెప్పినందునఁ దద్వంశము శైవశూద్రవర్ణమని చెప్పవచ్చును. కృతిపతియొక్క పితామహుని మాతామహుఁడైన చిక్కరాజను నామాంతరముగల ముళువాగళునృపాలు నీక్రిందిబద్యములలో మధురాపురీశ్వరుని జయించినట్టును శ్రీవేంకటపతిరాయులకాలములో నుండినట్టును కవి వర్ణించియున్నాఁడు-

మ. ప్రకటారాతివిదారితార్గళభుజాప్రావీణ్య మింపార వా
రక యెంతే మధురాపురీవిభుని దర్పం బెల్ల వారించి భూ
రికృపాణోద్ధతిచేత వేంకటపతిశ్రీరాయసన్మాన్యుఁడై
చికరాజాఖ్య వహించె భాసురజయశ్రీధుర్యుఁడై వేడుకన్.

క. ఆముళువాగళునృపతి ధ । రాముండలిఁ గీర్తి గాంచె రాజత్కార్యో
ద్దామబలావార్యజయ । స్తోమము హైశ్వర్యధుర్య శూలాన్వితుఁడై.

సీ. ఏధన్యునిర్మలబోధాంతరంగంబు రంగంబు పార్వతీరమణిపతికి
నేనరేశ్వరుకరాన్వితచంద్రహాసంబు హాసంబుఁ జేయు వజ్రాయుధంబు
నేరసజ్ఞునికీర్తి శారదామోదంబుమోదంబుహారిదంతములకుఁ గూర్చు
నేసుధీపతుభాషాసుధాసారంబు సారంబు బుధజనశ్రవణములకు
నతఁడు చెలువొందు హాటకాహార్యధైర్య
సహితుఁ డనివార్యశౌర్యమాంసలభుజుండు
దానగాంభీర్యసౌందర్యమాననీయ
సుప్రభావుండు మళువాగళుప్రభుండు.

ఈపద్యములవలనఁ గృతిపతిపూర్వులు విజయనగర సంస్థానాధీశ్వరుల సేనాపతులయియుండి ప్రభుత్వము సంపాదించిరని మాత్రమేకాక కవికాలమును సహితము నిర్ణయింపవచ్చును. వేంకటపతిరాయలు ౧౫౮౬ వ సంవత్సరము మొదలుకొని ౧౬౧౪ వ సంవత్సరమువఱకును రాజ్యము చేసినవాఁడగుటచేత నాతనికి నాలుగుతరముల తరువాత నున్నకృతిపతియుఁ గృతికర్తయు ౧౭౦౦ వ సంవత్సరప్రాంతములయం దున్నట్టు నిశ్చయముగాఁ జెప్పవచ్చును. ఇంతేకాక యాంధ్రకవిస్తుతిలోని యీక్రిందిపద్యములో బింగళి సూరన్నను బూర్వకవినిగా నభివర్ణించుటనుబట్టికూడ గవి యాధునికుఁ డని చెప్పవచ్చును—

సీ. చతురాస్యుఁడనఁగనుజగతివాగనుశాసనప్రౌఢిఁజెలువందునన్నపార్యుఁ
గుండలీంద్రుఁ డన నఖండమేధాస్ఫూర్తి నలరారు తిక్కనయజ్వమణిని

నచ్యుతైక సమాఖ్య నంచితవరధార ప్రకటించు శ్రీనాధసుకవివరుని
సన్మార్గు లన సుప్రసాద తేజంబులఁ బరిఢవిల్లెడు సోమభాస్కర్లులను
భూరిసత్కళాద్విజరాజుఁ బోతరాజు
శుభమనోరథుఁ బింగళి సూరవిభుని
మఱియు నాంధ్రోక్తి విశ్వనిర్మాణపటిమ
ఘటితకమలోదయులనుమహాకవుల నెంతు.

ఈక్రింది పద్యములలోఁ గవి కృతిపతియొక్క తాతయగు పొట్టి లింగభూపాలునిని తండ్రి యగు లింగభూపాలునిని బహువిధముల వర్ణించి యున్నాఁడు—

సీ. ఘనమార్గవర్తనుల్ గానివిరోధుల ఘనమార్గవర్తను ల్గాఁగఁజేసె
గరిదానమహిమంబు గాంచనిమతుల కరిదానమహిమంబుగాంచఁజేసె
మిత్రపద్ధతిదప్పి మెలఁగెడువైరుల మిత్రపద్ధతిఁ జెంది మెఱయఁజేసె
నెలమిఁ బాదములాశ్రయింపనిరిపులను నెలమి బాదములాశ్రయింపఁజేసె
ననుచు మెచ్చుచు జయురమావనజనయన
యూజి నెవ్వానిభుజపీఠి నాశ్రయించె
నతని నుతియింపఁదరమె నహార్యధైర్య
ధైర్యుని పొట్టిలింగభూపాలవర్యు.

* * * *

సీ. ధరణి రాజులుగాని ధరణిరాజులుగారు దీటుదారక్షమాదివ్యరుచుల
నినకేసరులుగాని యినకేసరులుగారు ప్రతిప్రభావాటోపపటుబలముల
నల నరేంద్రులుగాని నలనరేంద్రులుగారు పురుడు భాసురవచో
భోగములను
గోత్రేశ్వరులుగానిగోత్రేశ్వరులుగారు సరిధైర్యబంధురైశ్వర్యములను
నతని కనియెన్న ధారుణీపతులు దిశల
వెలసె నెవ్వాఁడు ప్రఖ్యాతి విస్తరిల్ల

నతఁడు చెలువొందె రాయవేశ్యాభుజంగ
జయబిరుదశాలి లింగభూజానిమౌళి.

ఉ. లింగనృపాలపుత్రుఁ డగులింగనృపాలుని శుభ్రకీర్తిశో
లింగని శారదాభ్రపటలింగని నాకధునీతరంగపా
ళింగని నీలచేలునిహాలింగని మానసవిస్ఫురన్మరా
ళింగని పద్మగర్భునిచెలింగని సారె హసించు నెంతయున్

ఈవఱ కుదాహరింపఁబడిన పద్యములచేతనే యితఁడు ప్రౌఢకవి యనియు నిరర్గళకవితాధార గలవాఁడనియుఁ దెలియ నయి యున్నను శివరహస్యఖండములోని కొన్ని పద్యములఁగూడ నిం దుదాహరించు చున్నాను—

సంభవకాండము.

ఉ. తేనియవాఁక యిచ్చటను దిన్నెఁగ రాఁగదవే మృగీమదం
బీనెలతాలబోదె లిఁక నిచ్చటజాతెదుసుమ్ము కోకిలో
ద్గానము లిందు వింటె కలకంఠి యటంచు సఖీజనావళుల్
మానుగ హెచ్చరింప నసమానమహామహిమాభిరామయై. ఆ. ౧.

మ. పలితస్వచ్ఛశిరోజము ల్దనరఁగా జీర్ణమై మేనునన్
వళులున్ ప్రేలఁగఁ గంపమంద శిరమున్ వక్త్రంబు నిర్దంతమై
వెలయున్ భూరిజరాతిభారమున గర్వీభూతుఁడై సారె ప్ర
స్ఖలదంఘ్రిద్వయ మొప్ప గద్గదిక మించన్ వృద్ధవిప్రాకృతిన్. ఆ. ౨.

ఉ. పోయెద నుండెదన్ సమరము న్రచియించెద నాయధేచ్ఛ నే
లా యిటు లాడఁ దావకబలంబుఁ జలంబును లావుఁ జేవయున్
వేయువిధంబులం బలుక వేమఱు నాకు జనించు హాస మో
హో యిదిచాలుఁ జాలు వినుమోరి వచించెద దానవాధమా. ఆ-౫

20. ఏనుఁగు లక్ష్మణకవి

ఈకవి బహుగ్రంథములుచేసి ప్రసిద్ధి కెక్కినవాఁడు. ఈతఁడు చేసినగ్రంథములలో రామవిలాసప్రబంధము కడపటిదిగాఁ గనఁబడు చున్నది. ఈప్రబంధము పెద్దాపురసంస్థానమం దుండిన శ్రీవత్సవాయ గోపరాజున కంకితము చేయఁబడినది. ఈ గోపరాజు తన్నుఁగూర్చి పలికి నట్లు కవి తన రామవిలాసములో నీపద్యములఁ జెప్పుకొన్నాఁడు—

సీ. సురుచిరాపస్తంబసూత్రు వాధూలసగోత్రు సద్వినయాదిగుణసమేతు
నేనుఁగు లక్ష్మకవీంద్రునిపౌత్రుని శ్రీమాచిరాజు నృసింహమంత్రి
దౌహిత్రుభూవరాస్థానపూజ్యుఁడుతిమ్మమంత్రికిఁ బేరమాంబకునుపుత్రు
ధన్యు ననంతాభిధానానుజుని వీరభద్రున కగ్రజు భాగ్యవంతు
లలితకవితాకళాధుర్యు లక్ష్మణార్యు
నన్ను బిలిపించి యుచితాసనమున నుంచి
చాలఁ గరుణించి తనముఖాబ్జమున మంద
హాస మమరంగ నిట్లని యానతిచ్చె.

సీ. సృజియించినాఁడవు సేతురామేశ్వరమహిమంబు పాండిత్యమహిమ మెఱయఁ
గల్పించినాఁడవుఘనులెన్న జాహ్నవీమాహాత్మ్యకృతిసుధామధురఫణితి
నిర్మించినాఁడవు నిర్జరభాషచే శతకంబు భాస్కరస్వామి కెలమి
రచియించినాఁడవు రుచిరంబుగా సుభాషితరత్నమాలిక శివునిపేర
రమ్యవిశ్వేశ్వరోదాహరణ నృసింహ
దండకాదిస్తుతిప్రబంధములు గూర్చి
సములలో నుత్తమఖ్యాతి నమరినావు
లలితగుణధుర్య యేనుఁగు లక్ష్మణార్య.

గీ. వారిజాసననారీముఖారవింద
సారసౌరభఘన ఘనసారసాంద్ర
వీటికాబంధురసుగంధవిభవమధుర
లలితవాగ్ధుర్య యేనుఁగు లక్ష్మణార్య.

గీ. ధీరులు నుతింప నిప్పుడు మీరుసేయు
భాసురం బగురామవిలాసకావ్య
మంకితము చేయు మాపేర నచలధీర
ధరణి నాచంద్రతారకస్థిరముగాఁగ.

పై పద్యములవలన నితఁడు రామేశ్వరమాహాత్మ్యము, గంగా మాహాత్మ్యము, గీర్వాణసూర్యశతకము, సుభాషితరత్నావళి, విశ్వేశ్వ రోదాహరణనృసింహదండకాదిస్తుతులు, రామవిలాసము చేసినట్టు తెలియవచ్చుచున్నది. మఱియు నితఁడు విశ్వామిత్రచరిత్రమను మఱి యొక గ్రంథమునుగూడ రచించినట్లు సుభాషితరత్నావళి యవతారిక లోని యీక్రింది పద్యమువలనఁ గానవచ్చుచున్నది—

క. రామేశ్వరమహిమము వి । శ్వామిత్రచరిత్ర సూర్యశతకంబును గం
గామాహాత్మ్యము మొదలగు। శ్రీమత్కృతిరత్నములు రచించితి మఱియున్

ఆఱువేల నియోగియైన యీకవి యాపస్తంబసూత్రుఁడు; వాధూలసగోత్రుఁడు; తిమ్మకవి పుత్రుఁడు; లక్ష్మణకవిపౌత్రుఁడు; మాచిరాజు నృసింహుని దౌహిత్రుఁడు. ఈతని తల్లి పేరు పేరమాంబ; అన్నయనంతకవి; తమ్ముఁడు వీరభద్రుఁడు. ఈకవి వంశమునకు మూల పురుషుఁడు పైడిపాటి సింగన్న. ఈకవి పూర్వులయింటిపేరు పైఁడిపాటి వాఁ రయినను సింగన్నవంశజులలో నొకఁడగు జలపాలామాత్యుఁడు పెద్దాపుర సంస్థానాధీశ్వరుఁ డగు గజపతిరాజుచే నేనుఁగును బహుమాన మందుటచే నప్పటి నుండియు నేనుఁగువారని మాఱినది. ఈయంశమే సుభాషితరత్నావళ్యవతారికలో నిట్లు చెప్పఁబడినది—

సీ. పరమేష్ఠితుల్యప్రభావుండు వాధూలుఁ డనుబుషీంద్రుం డొప్పు
నసఘమూర్తి
యమ్మునినాథువంశమ్మున క్షీరాంబునిధి సుధాకరుఁడు జన్మించినట్లు
ప్రభవించి శ్రీపైఁడిపాటి సింగనమంత్రి వంశాగ్రగణ్యుఁడై వఱలు నతని
మహిమసంతానక్రమమున నుజలపాలసచివుఁడొప్పె జలారిసచివసముఁడు
గజపతిక్షితిభర్తచే గజముతోడ
నగ్రహారము లతఁడు పరిగ్రహించె
నెలమి నేనుఁగువారన్న యింటిపేరు
గలిగె నతనికి గజలాభగరిమవలన.

గీ. ఈడ్యగజపతిదత్తసోమేశ్వరాగ్ర
హారశాసనుఁడై మహోదారభాగ్య
మహిమ గలిగినజలపాలమంత్రిమణికి
గరికిరాజు జనించె విఖ్యాతయశుఁడు.

ఈకవియొక్క పూర్వీకులు చిరకాలమునుండి పెద్దాపురసంస్థానమున నుద్యోగములలో నుండుచు వచ్చిరి. వారిలో గొందఱు కవులు సహిత ముండిరి. పయి పద్యమునఁ బేర్కొనఁబడిన గరికిరాజునకు మనుమఁడును కవికి బితామహుఁడును పెద్దాడగ్రామమునకు కరణము నయిన యేనుఁగు లక్ష్మణకవి పెద్దాపురసంస్థానమునం దుండి వత్సవాయవంశజులయిన యచ్చుటిరాజుల కనేకకృతు లంకితము చేసెను. ముందుగాఁ గవి తనతాతనుగూర్చి సుభాషితరత్నావళిలో చెప్పినపద్యములనుమాత్ర ముదాహరించి యతఁడు రచించిన గ్రంథనామములను కృతిపతులనామములను రామవిలాస కృతిపతిని గూర్చి చెప్పునప్పుడు ముందు వివరించెదను—

ఉ. సారదయారసద్రుహిణసారథికిన్ గురురాజమంత్రికిన్
బేరమయందు నందనుఁడు పేర్మిజనించె విలాససంపదన్

మారుఁడు విక్రమంబునఁ గుమారుఁడు లక్ష్మణశౌరి భూరిశో
భారవి సాహితీవిజితభారవి ధీరవిచారవిశ్రుతిన్.

ఉ. దండి మనోజ్ఞశబ్దకవితాధురిచే నుపమాసమృద్ధిచే
రెండవకాళిదాసు రసరీతితరంగితసూక్తిఁ గుండలీం
ద్రుం డని ధీరు లెంచఁగఁ గృతుల్ రచియించిన ధన్యునిన్ మహా
పండితమాన్యు నెన్నఁదగు భాజితసూర్యుని లక్ష్మణార్యునిన్.

గీ. కృతు లొసఁగి వత్సవయతిమ్మనృపతిచేతఁ
దురగమణిభూషణాంబరాందోళికాది
పూజఁ గైకొని పెద్దాడపురవరాను
శాసనుం డయి లక్ష్మణశౌరి తనరె.

కవియొక్క యన్నయైన యనంతార్యుఁడు గౌరీపరిణయకావ్యము రచించినట్లు సుభాషితరత్నావళిలోనే యీక్రింది పద్యమునఁ జెప్పబడినది—

క. గౌరీపరిణయకావ్యము । సూరీంద్రులు మెచ్చఁజెప్పి శుంభత్కవితా
పారీణబిరుద మందెను । భూరియశోఘనుఁ డనంతబుధవరుఁ డలరున్.

లక్ష్మణకవి రచియించిన రామవిలాసమునుబట్టి యితనికాలమును తెలిసికొనవచ్చును. ఇతఁడు కూచిమంచితిమ్మకవికి బంధువయినను కాక పోయినను అతనితో సమకాలికుఁడయినందుకు సందేహము లేదు.

క. హాటకగర్భవలీ । లాటనచలితాంఘ్రినూపురారావశ్రీ
పాటచ్చరములు తేనియ । తేటలు మాకూచిమంచి తిమ్మయమాటల్.

అను కూచిమంచి త్రిమ్మకవినిగూర్చిన పద్యమితఁడు చెప్పినదైన నయియుండవచ్చును. రామవిలాసము వత్సవాయ గోపరాజున కంకితము చేయఁబడినది. కవి కృతినాయకుని

సీ. తనమహౌదార్యంబుతనమహాధైర్యంబుకరణిజీమూతలాఘువ మొనర్పఁ
దనవినిర్మలకీర్తి తనవిక్రమస్ఫూర్తి పగిదిఁ బద్మాహితోపమ వహింపఁ

దనువిద్యాభూతి తనరూపవిఖ్యాతిగతిఁ గమలోద్భవగరిమ మీఱఁ
దనకార్ముకప్రౌఢి తనప్రతాపసిరూఢిభాతి ధనంజయప్రథిమఁ బూన
ధరణి నుతికెక్క నిజభుజాదండమండ
లాగ్రదర్శనచకితమత్తారినృపుఁడు
వత్సవాయసింహాద్రిభూవరసుతుండు
ప్రణుతగుణశాలి గోపభూపాలమౌళి.

సీ. శారదనీరదనారదపారదహారదస్ఫూర్తి నవఘుళించి
శరదిందుకరకుంద శరబృందవరచందనహరిచందనకాంతిలహరి మీఱి
హరికాంతహరికుంతహరిదంతకరిదంతవిధుకాంతపృథుకాంతవిభవహాసించి
పురవైరిధరసీరిగిరిదారిహరిశౌరిచరణనిర్ఝరవారిసురుచి గేరి
పాండురాఖండనిజకీర్తిమండలంబు
పుండరీకభవాండంబు నిండి మెఱయఁ
బ్రాభవము గాంచె సింహాద్రిరాజసుతుఁడు
ప్రణుతగుణశాలి గోపభూపాలమౌళి.

ఇత్యాది పద్యములతో నెంతవర్ణించినను, ఈగోపరాజు పెద్దాపురసంస్థానాధీశ్వరుఁడుగాక తత్సంస్థానాధిపతియగు తిమ్మజగపతిమహారాజుగారి కాప్తబంధు వయి గౌరవము నొందినవాఁడుగా నుండెను. అప్పుడు ప్రభువుగా నుండిన జగపతిమహారాజుల పుత్రుఁడగు తిమ్మజగపతిమహారాజుగారు ౧౭౫౯ వ సంవత్సరము మొదలుకొని ౧౭౯౭ వ సంవత్సరమువఱకును రాజ్యపాలనముచేసిరి. ఈయన సింహాసనమునకు వచ్చినది ప్రమాదిసంవత్సర పుష్యశుద్ధదశమి. గతదినమునం దీయన తండ్రిగారగు రాయజగపతిరాజుగారు శ్రీపూసపాటి యానందగజపతిరాజుగారితో ఉండూరువద్ద జరిగిన యుద్ధములో హతులైరి. ఆంగీరస సం॥ర కార్తికశుద్ధప్రథమదినమున జనన మొందినందున, జనకుని మరణము నాఁటి కీయనకు వయస్సెనిమిదిసంవత్సరములు. ఈయన నలువదియైదు

సంవత్సరములు జీవించి పింగళ సంవత్స రాశ్వయుజబహుళ పంచమి నాఁడు పరలోకగతులైనారు. ఈయనకాలమునందుండి యీయనను బహుపద్యములతో స్తుతించిన వారగుటచే నేనుఁగు లక్ష్మణకవిగారు ౧౭౭౦-వ సంవత్సరములవఱకును జీవించి యున్నట్టు కనఁబడుచున్నది. అందుచేత నీకవి కూచిమంచి తిమ్మకవి మరణానంతరమున నిరువది యేండ్లు జీవించి యుండవచ్చును. పెద్దాపురపురాజులగు వత్సవాయ వారు తాము మొదటినుండియు విద్వాంసులయి విద్వత్కవుల నాదరించు చుండినట్లు వారివంశచరిత్రమువలన విస్పష్టమగుచున్నది. ఈవంశపువారి మూలపురుషుఁడు సూర్యవంశ్యుఁడయి కృష్ణామండలములోని గుడిమెట్ట రాజధానిగాఁ గల చాగి పోత రాజైనట్టు రామవిలాసములోని యీ క్రింది పద్యమువలనఁ దెలియవచ్చుచున్నది—

సీ. సహ్యజాతీరమునకు భూషణ మనంగ
సిరుల కిరవగు గుడిమెట్టపురము తనకు
రాజధానిగ సత్కళాభోజరాజు
చాగిపోతక్షమాభర్త జగతి యేలె.

ఈసాగిపోతరాజుయొక్క శాసనములు గుడిమెట్టలోను బెజవాడ లోను ౧౨౩౦ వ సంవత్సరమువఱకును గానఁబడుచున్నవి. ఈతని యింటిపేరు సాగివారే యైనను, ఈతని వంశమువారిలో నొకఁడగు రామనృపాలుఁడు—

"భగవత్సవాయాఖ్యనగరంబు నిజనివాసముచేసి నదికారణముగసాగి వంశమునకువత్సవాయనామములోకప్రసిద్ధమగుచుసొంపుగాంచె"

తననివాసమును వత్సవాయనగరమునకు మార్చినందున గృహ నామము వత్సవాయవా రయినది. వీరి వంశజులలో నొక రగు (పేర రాజసుతు లయిన) ముసలి తిమ్మరాజుగారు ౧౬౫౫ వ సంవత్సరము నకు సరియైన యానందసంవత్సర భాద్రపద బహుళసప్తమినాఁడు పెద్దా

పురసంస్థానమును సంపాదించి ౧౫౦౭ వ సంవత్సరమునకు సరియైనపరాభవసంవత్సర మార్గశిరబహుళ ద్వితీయవఱకు నేఁబదిరెండు సంవత్సరముల రెండుమాసముల యిరువదియైదుదినములు రాజ్యముచేసి లోకాంతరగతు లయిరి. దిట్టకవి విశ్వనాథకవి విరచిత మైన శేషధర్మములను గృతినందిన దీయనయని రామవిలాసములోని యీపద్యము తెలుపుచున్నది—

సీ. బిరుదాంక పురిని సుస్థిరముగా నిర్మించెఁ బాలమున్నీటినిబోలుచెఱువు
తిరుపతివల్మీకగిరిఁ జూలపల్లెను ఫలవృక్షవనములు నిలిపెఁ జాల
నృహరిగేహతటాకనిక్షేపవనములు కొమరుగాఁ బెద్దాపురమునను పెచె
విశ్వనాథకవీంద్రవిరచితశేషధర్మప్రబంధము సాదరముగ నందె
విప్రవంశప్రతిష్ఠలు వెలయఁజేసెఁ
బుత్రులను గాంచె నీతిని బుడమి యేలె
వత్సవాయాన్వయమునకు వన్నెఁదెచ్చె
మెచ్చి పేరయతిమ్మధాత్రీశ్వరుండు.

ఈతిమ్మరాజుగారు డెబ్బదియాఱు సంవత్సరములు బ్రతికి కాలధర్మము నొందఁగా, శ్రీముఖసంవత్సర కార్తికశుద్ధ పంచమినాఁడు జననమొందిన యీయనపుత్రుఁడు రాయపరాజుగారు ౧౫౦౭ వ సంవత్సరమునందు తండ్రి పోఁగానే రాజ్యపరిపాలన మారంభించి నలువదిరెండు సంవత్సరములు రాజ్యముచేసి ౭౫ ఏండ్లు బ్రతికి ౧౫౪౯ వ సంవత్సరమునకు సరియైన సర్వధారి సంవత్సర మాఘశుద్ధ సప్తమినాఁడు పరమపదప్రాప్తి నొందిరి. ఈయన హరిభక్తిసుధోదయ మనుకృతినందిన ట్లీక్రింది పద్యము చెప్పుచున్నది—

సీ. శ్రీరామునకుఁ గట్టమూరనుగట్టించె గుళ్లు మంటపములు గోపురములు
గంభీరజలతటాకంబు త్రవ్వించె గృహస్థపురంబున సుస్థిరముగఁ

బొలుపుగా వాల్మీకిపురికాండ్రకోటను ఫలభూజవాటిక ల్పదిలపఱిచెఁ
ప్రాప్తవ్యమగుహరిభక్తిసుధోదయంబనుమహాకృతిరత్నమందుకొనియెఁ
పేరుగలుగు మహమ్మదుబేగు నదిమి
మెచ్చఁగాఁ దగినఢమీలు తెచ్చుకొనియెఁ
బగతు రగువారినుండియ ల్దిగులుకొనఁగఁ
దిమ్మనృపరాయక్షమాధీశ్వరుండు.

ఈయన యనంతరమందు పింగళసంవత్స రాశ్వయుజ శుద్ధసప్తమి నాఁడు జన్మించిన యీయనపుత్రుడు సార్వభౌమ తిమ్మరాజుగారు సింహాసనమునకు వచ్చి ముప్పదితొమ్మిది సంవత్సరములు ప్రజాపరిపాలనముచేసి డెబ్బదవయేట ౧౬౮౭ వ సంవత్సరమునకు సరియైన విభవ సంవత్సర ఫాల్గుణబహుళ త్రయోదశినాఁడు దేహావియోగమునొందిరి. మన కవి తాతయైన యేనుఁగు లక్ష్మణకవిగా రీయనకాలమునందే యుండి యీమహారాజునకుఁ దాను రచించిన ద్రౌపదీపరిణయము నంకితము చేసిన ట్లీక్రింది పద్యములవలనఁ దెల్లమగుచున్నది——

సీ. రాజులుమెచ్చఁ బర్లాకోట సాధించి నరహరదేవు దుర్ణయ మడంచెఁ
గుదురై నభావిణికోట లగ్గలుపట్టి యొందుకో టంతయు నుర్విఁగలపె
దుగరాజుమొదలైనదొరలనుభంగించెవిశ్వంభరునియుద్ధసహాతుఁజేసెఁ
దగఁబూసపాటి సీతారామభూపాలుఁడభినుతింపఁగ విజయంబుగాంచె
సరిసమతుయవనాధీశు నురగపతిని
గయ్యమున గెల్చె లోకవిఖ్యాతి చెందె
వత్సవాయాన్వయమునకు వన్నె తెచ్చె
రాయపనృపాలు శ్రీతిమ్మరాజమౌళి.

చ. హరిహరపద్మజాంశభవుఁడై తగు నేనుఁగు లక్ష్మణార్యుచే
సురుచిరశబ్దభావరసశుంభదలంకృతిమాధురీమనో

హారమగు ద్రౌపదీపరిణయం బను నుత్తమకావ్య మందె సు
స్థిర మగుకీర్తి సొం పెసఁగఁ దిమ్మనృపాలుఁడు ధర్మపద్ధతిన్.

ఈయేనుఁగు లక్ష్మణకవియే ధ్రువచరిత్రమును వేంకటరాజపుత్రుఁడగు జగ్గరాజునకును, తులామాహాత్మ్యమును కస్తురిరంగరాజపుత్రుఁడగు జగన్నాథరాజునకును, వత్సవాయకులజు లయిన రాజబంధువుల కంకితము చేసిన ట్లీక్రింది పద్యములవలనఁ దెలియవచ్చుచున్నవి—

చ. కవికులసార్వభౌముఁ డనఁగాఁదగు లక్ష్మణార్యుచే
ధ్రువచరితప్రబంధము బుధు ల్వినుతింపఁగ నంది యాగభు
గ్భవనమహాసుఖానుభవకారణ మైనయశంబు గాంచె వా
సవనిభవుండు వత్సవయ జగ్గనృపాలుఁడు సద్గుణోన్నతిన్.

ఉ. హేమనగేంద్రధీరుఁ డగు నేనుఁగు లక్ష్మణసత్కవీంద్రుఁ డు
ద్దామసుధామయోక్తి వితతం బగునట్లు రచించినట్టి తు
ల్యామహిమప్రబంధము గుణాఢ్యులు మెచ్చఁ బరిగ్రహించెఁ బ్ర
జ్ఞామహితుండు జగ్గనృపచంద్రుఁడు శాశ్వతకీర్తి నందిలన్.

ఈతిమ్మరాజుగారి యనంతరమునం దాయన తమ్ముఁడైన బలభద్రరాజుగారి కుమారులు రాయపరాజుగారు ౧౬౮౭ వ సంవత్సరమునందు రాజ్యమునకువచ్చి యిరువదియారు సంవత్సరములు భూపరిపాలనమును చేసి నలువదేండ్లు ప్రాయమున ౧౭౧౩ సంవత్సరమునకు సరియైన మన్మథ సంవత్సర జ్యేష్ఠశుద్ధ చతుర్థినాఁడు పరమపదమునొందిరి. ఈయన తండ్రియగు బలభద్రరాజుగారు తాము కవులయి రామశతకమును జెప్పుటయే కాక కిరాతార్జునీయకృతినందిన ట్లీపద్యము తెలుపుడు చేయుచున్నది—

చ. అమితఖ్యాతికి మూలమైనకృతిఁ దా నందెన్ గిరాతార్జునీ
యము శ్రీరాములపేరఁ బద్యశతకం బారూఢి నిర్మించె భో
జమహీజానిగతిన్ బ్రసిద్ధిగ నెసె సాహిత్యపారజ్ఞుఁడై
రమణన్ శ్రీబలభద్రరాజు ప్రజలన్ రక్షించె ధర్మస్థితిన్.

తరువాత రాయపరాజుగారి కుమారుఁడు తిమ్మరాజుగారు రాజ్యమునకు వచ్చి దాదాపుగా నిరువది సంవత్సరములు పాలనముచేసి ముప్పది సంవత్సరముల ప్రాయముననే ౧౭౩౪ వ సంవత్సరమునకు సరియైన రాక్షససంవత్సర చైత్రశుద్ధ ద్వాదశినాఁడు పరమపదమునొందిరి. తదనంతర మాయన పుత్రుఁడు శ్రీరాయజగపతిరాజుగారు రాజుగాఁ జేయఁబడి యిరువది సంవత్సరముల యెనిమిది నెలలు రాజ్యపాలనముచేసి యుండూరువద్ద శ్రీపూసపాటి యానందగజపతిరాజుగారితో జరిగిన యుద్ధములో నిరువదియైదు సంవత్సరముల యీడుననే ౧౭౫౫ వ సంవత్సరమునకు సరియైన ప్రమాదిసంవత్సర పుష్యశుద్ధ నవమినాఁడు రణనిహతులయిరి. ఈయన పిమ్మటనే యేనుఁగు లక్ష్మణకవిగారి కాశ్రయుఁడయి యుండిన (రాయ జగపతిరాజుగారి పుత్రుఁడయిన) తిమ్మజగపతిగారు రాజ్యమునకు వచ్చి ౧౭౯౭ వ సంవత్సరమువఱకును ప్రభుత్వము చేసి స్వర్గస్థులయిరి. పయిని వివరించిన చరిత్రమునుబట్టి పెద్దాపురసంస్థానాధిపతు లందఱు నించుమించుగాఁ దాము కవులయ్యును కవుల నాదరించి కృతులందినవారయ్యును ఉండిరని తెలియవచ్చుచున్నది. ఏనుఁగు లక్ష్మణకవి తిమ్మజగపతిరాజు తండ్రియగు రాయజగపతి మహారాజుగారి కాలములో సహిత ముండినట్లు తద్రచితమైన యీచాటుపద్యము పలుకుచున్నది.

ఉ. ఆయతవత్సవాయకులాంబుధిపూర్ణ నిశాపతీ జగ
ద్గేయశుభాకృతీ ! విదితకీర్తిసతీ కమనీయయౌవన
ప్రాయనలాకృతీ సతతవైభవనిర్జితపూర్వదిక్పతీ
ధీయుతవాక్పతీ జగపతీ నృపతీ సుకృతీ మహోన్నతీ.

ఈజగపతిరాజుగారు కవిత్వమునందు నిపుణులయి పెక్కుపదములు శతకములు దండకములు మొదలగునవి భద్రాద్రిరామునిమీఁదఁ జెప్పినట్లు రామవిలాసములోని యీపద్య ముద్ఘోషించుచున్నది—

చ. పదములు కీర్తనల్ రుచిరపద్యశతంబులు రాగమాలికల్
మృదుపదదండకంబులు సమిద్ధగతిన్ రచియించి కామిత
ప్రదునకు భద్రశైలరఘుభర్తకుఁ గానుకగా నొసంగె నా
త్రిదశులు మెచ్చఁగా జగపతిప్రభుచంద్రుఁడు భక్తి పెంపునన్.

ఏనుఁగు లక్ష్మణకవికృతములయిన గ్రంథములలో సుభాషితరత్నావళియు రామవిలాసమును మాత్రము నాకు లభించినవి. ఇందు మొదటి పుస్తకము భర్తృహరియొక్క సంస్కృతగ్రంథమునుండి తెనిఁగింపఁబడినను, గొంచెమయినను విరసముగా నుండక మూలానుసారముగాను నిర్దుష్టముగాను, రసవంతముగాను, హృదయరంజకముగాను ఉన్నది. స్వస్థల మయిన పెద్దాడ గ్రామమునందలి సోమశంకరస్వామి తనహృదయమున సాక్షాత్కరించి సుభాషితరత్నావళిని దెలిఁగింపు మన్నట్లు కవి యీపద్యమునఁ జెప్పుకొన్నాఁడు—

సీ. కలధౌతగిరియును గలధౌతగిరియును విల్లుగాఁ బాదవైనయిల్లుగాఁగఁ
గమలాహితుండునుగమలాహితుండునుశశముగాలలితశేఖరముగాఁగఁ
బద్మోద్భవుండును బద్మోద్భవుండును సాదిగా మెయిఁదాల్చుబూది గాఁగఁ
బవనప్రియుండును బవనప్రియుండును సొమ్ముగా ఫాలనేత్రమ్ముగాఁగఁ
గ్రాలుపెనువేల్పు మ్రుమ్మనవాలుదాల్పు
జగములకుఱేఁడు ధనదునిసంగడీఁడు
హరుఁడు పెద్దాడ సోమశంకరుఁడు హృదయ
సరసిజంబున నాకు సాక్షాత్కరించె.

రామవిలాసములోని యవతారికనుండి యన్నిపద్యముల నుదాహరించిన తరువాతఁ గవిత్వము నిర్దుష్టముగాను మృదుమధురవాగ్గుంభనలు కలదిగాను ఉండునని వేఱుగఁ జెప్పనక్కరలేదు. పూర్వోక్తము

లయిన గ్రంథద్వయమునుండియుఁ గొన్నిపద్యముల నుదాహరించి కవి చరిత్రము నింతటితో ముగించుచున్నాను —

సుభాషిత రత్నావళి.

చ. నతులగుచు న్మహోన్నతిఁ దనర్చుచు నన్యగుణోక్తిచే గుణో
న్నతిఁ బ్రకటించుచుం బరజనప్రియకార్యసమర్థతం సమం
చితనిజకార్యసంగ్రహము చేయుచు నిష్ఠురవాదులం క్షమా
ధృతి నిరసించుచున్ బరఁగుధీరులు పూజ్యులుగారె యేరికిన్.

నీతిశతకము.

చ. అతివలఁజూచి పీ రబలలంచు వదించుమహాకవీంద్రు లు
ద్ధతవిపరీతవాదు లిది దబ్బఱగాదు విలాసినీసమం
చితతరశాక్షిపాతములచే గెలువంబడి రింద్రముఖ్యులుం
ధృతి నటువంటివా రబల లేగతి నైరి తలంచిచూడఁగన్.

శృంగారశతకము.

చ. కడువెఱపించుచు న్మదిమి గద్దఱిబెబ్బులిమాడ్కి నున్న దె
క్కుడుపగదాయలంబలెఁ దెగుల్లుశరీరము నొందుచున్న వె
వ్వడొ చను భిన్నకుంభజలముంబలె నాయువు నిట్టులయ్యుఁ దా
రుడుగక మానవు ల్దురితమోలి నొనర్చుచు నున్నవా రహో.

వైరాగ్యశతకము.

రామవిలాసము.

ఉ. వాసవనీలనీలము లవారితవిభ్రమశీలముల్ మరం
దాసవలోలముల్ యువభయానకసూనకదంబపుండ్రకాం
డాసనముక్తలోహగుళికాళికరాశము లంజనప్రభా
భాసురభృంగజాలములు బంధురవృత్తిఁ జరించెఁ గానలం. ఆ-౧

శా. రామా రాజలలామ యోగిహృదయారామా మహాభోజసు
త్రామా నాకొక ముద్దుపెట్టుదువు రారాయంచుఁ గౌసల్య సు

ప్రేమం బిల్చిన మువ్వ లందియలు గంభీరంబుగా మ్రోయఁగా
శ్రీమంతుం డట రావిరేక మెఱయం జేరంగవచ్చుం గృపన్. ఆ-౨

చ. కటుభట ఘోషగర్జితము ఖాడ్గికపాణినటత్కృపాణరు
క్తటిదుదయంబు చిత్రఘటితధ్వజపంక్తిసురేంద్రచాప ము
ద్భటదివిషత్ప్రతాపరవిబాధక ముగ్రనిశాటవాహినీ
పటుఘనబృంద మయ్యెడ నభంబునఁ బర్వె నసృక్ప్రవర్షమై. ఆ-౩

ఉ. చంపకపుష్పవాసనలసార మెఱింగినషట్పదంబు లీ
సొంపగుకన్నెపెన్నెరులు చూచితిరే చెలులార యంచు భా
షింపుచుఁ గింకిణీవలయశింజిత మొప్పఁ దలంచె వేడుకన్
సంపఁగినూనెచేత నొకశారదచంద్రనిభాస్య సీతకున్. ఆ-౪

ఉ. ఇందు మెలంగుభృంగములు నిచ్చటికీరమయూరిశారికా
బృందము లింపుగట్టు సురభిప్రసవంబులు సాధనంబులై
ముందులభించినన్ హరునిఁ బూనిజయింపఁడె మారుఁ డంచు నె
న్నందగి రాముకేళిభవనప్రమదావనవాటి వాటిలున్. ఆ-౫

21. నెల్లూరి వీరరాఘవకవి

ఇతఁడు యాదవరాఘవపాండవీయమను నాలుగాశ్వాసముల త్ర్యర్థికావ్యమును రచియించెను. ఇందు శ్రీకృష్ణునియొక్కయు శ్రీరామునియొక్కయు పాండవులయొక్కయు కథలు ప్రతిపద్యమునకును మూఁడర్థములు వచ్చునట్లుగాఁ జెప్పఁబడినవి. వర్ణనాంశముల యందు మాత్రము కొన్ని యేకార్థపద్యము లుండును. ఈకవి యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు. ఈతని పూర్వుల యింటిపేరు మొదట దేశరాజు వారయినను నెల్లూరియందు వాసము చేయుచుండుటచే నెల్లూరివారని మాఱినది. ఈతఁడు కాశ్యపగోత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; వేంకటపతి

పుత్రుఁడు. ఈతఁడు తనతాతతాతయైన కొండనమంత్రిని దనగ్రంథమునం దిట్లు వర్ణించియున్నాఁడు—

సీ. ఎవ్వనితండ్రిపే రిల దేశరాజువారన నింటిపేరు మున్నమరఁ దెచ్చె
నెవ్వనిసద్విద్య హెచ్చుగా వీణవా రన నింటిపేరు ము న్నమరఁగూర్చె
నెవ్వనికొమరుఁ డీయిలఁబెద్దవేంకటపతిరాయలకు దళవాయియయ్యె
నెవ్వఁడు గీతసాహిత్యవిద్యలనేర్చి దిగ్విజయంబునఁ దేజరిల్లె
నెవ్వఁడు ధవిణమలహారియు ధవళశంఖ
మాదిగా బిరుదులనెల్ల నంది మించెఁ
బ్రౌఢరాజులచే నిమ్మపండనంగ
నతఁడు నుతికెక్కెఁ గొండలాహ్వయుఁడుజగతి.

తిరుమలదేవరాయనిపుత్రుఁ డయిన యీపెదవేంకటపతిరాయలు ౧౬౧౪ వ సంవత్సరమువఱకును రాజ్యముచేసెను. కవియొక్క ప్రపితామహుఁ డాతనికాలములో నున్నందున, నాలుగుతరముల తరువాతివాఁ డయినకవి ౧౭౧౪ వ సంవత్సరప్రాంతములయందుండి యుండవలెను. కవి తనశక్తి సామర్థ్యాదులనుగూర్చి యాదవరాఘవపాండవీయావతారిక యం దిట్లు వ్రాసికొనియున్నాఁడు—

సీ. సకలమంత్రరహస్యశాస్త్రసర్వంకషప్రజ్ఞాధికస్ఫూర్తిఁ బరిఢవిల్లి
నిఖిలయోగరహస్యనిరుపమత్రివిధోరురాజయోగాభ్యాస రక్తిమీఱి
యాగమాంతరహస్యభాగోపనిషదర్థసర్వస్వవిజ్ఞానసార మెఱిఁగి
నాటకాలంకారనానావిధవిశేషరసభావభేదము ల్వాసిఁగఁ దెలిసి
శబ్దముఖ్యశాస్త్రసదసద్వివేకత । స్మృతిపురాణవాస్తురతిరహస్య
గణితతురగరత్నగజపరిజ్ఞానత । నమరు వీరరాఘవాఖ్యకవిని.

క. నానావిధావధానము । లానృపనీతియును భరతమాహాత్మ్యాదుల్
మానుగనిచ్ఛాలిపియుఁ । మానితముగఁ గల్గుఁ గోపంబునుమఱియున్.

క. ప్రాకృతముఖషడ్భాషల। వ్యాకరణంబులును దెలుఁగువ్యాకరణంబుల్
ప్రాకటసాముద్రికమును । వీఁకఁ జ్యోతిషముఁ జాపవిద్యావిధమున్.

క. సాంగముగఁ దెలిసి మును యో । గాంగీకారమతినిశ్చలానుభవాప్తిన్
బొంగియు నియోగవృత్తిఁ బొసంగి చెలంగితిని సారసాహిత్యనిధిన్.

సీ. శతలేఖినీపద్యసంధానచాతురి ఘటికాశతగ్రంథకరణపటిమ
ఆశుప్రబంధబంధాదిక్రియారూఢి సంకరోష్ఠ్యనిరోష్ఠ్యచాటుకలన
విస్తరణమాధుర్యవివిధచిత్రస్ఫూర్తి పాదమాత్రప్రతిపాదఘటన
వ్యస్తాక్షరవిమిశ్రబహుపద్యగుంభన మచలజిహ్వాదికప్రచురరచన
బహుజనమనోంతరస్థిరబహువిధార్థ
బహుసమస్యాప్రపూర్తియు బహువిభేద
సకలవిషమసమస్యాదిసంవిధాన
మమరఁగూర్తును నెఱిరాఘవాఖ్యకవిని.

క. పంచాశచ్చాటుకథా । చంచత్కృతులను రచించి సత్కవిపూజా
సంచితకీర్తిసి దగు సా । ధ్వంచితుఁడను వీరరాఘవాఖ్యనియోగిన్.

చ. అవునన గావ్యపంక్తి పదియర్థములన్ రచియింపనేర్తు స
త్కవులదయన్ శిరీషకవితామృదుతామహితార్యవైఖరిన్
భువి నటులైన సత్కథల మాటినొనర్తును బాలబోధకై
తివిరి బహుత్వమందు నలత్రిత్వము పర్యవసాన మాటచేన్.

కవి తాను జెప్పుకొన్నట్లు స్వసామర్థ్యము నంతను జూపి పది యర్థముల గ్రంథమును రచియింపక మూడర్థములదానినే రచియించినను, ఇట్టి గ్రంథములయందు నిఘంటువులు వెదకి పదముల నేర్చి కూర్చినశిల్ప ప్రౌఢిమయే కాని యర్థచమత్కారము కాని భావగౌరవము కాని రస పుష్టి కాని పుట్టదు. యాదవరాఘవపాండవీయములోని కొన్నిపద్యము లిందు క్రిందఁ జూపఁబడుచున్నవి—

శా. వారిం దెచ్చిన వంశహానియును దుర్వ్యాపారబాధాగతుల్
చేరన్ రా విటుసేయుమావిధి యిదే సేవింతు వీక్షింపు మా

త్స్మరూఢవ్యథఁ బాపు నాహృదయశల్యం బో యన్యం బాపవే
స్వారాజ్యస్థితి నిల్పఁజేయఁగల భవ్యస్వీకృతింబోయెదన్. ఆ-౧

మ. అసురారాతిభవాతిభీతికలకంసారంభతన్ బాలకా
ర్యసుహృద్వృత్తి మెలంగఁ దెల్పఁగను విశ్వామిత్రమౌనీశుమా
నస ముప్పొంగ నఘాదుశేగ యజనానందక్రియల్ పెంప మా
నిసమాజంబులు నిండ్లలో నిలువఁ బూనెం గామచారోన్నతుల్. ఆ-౨

ఉ. కౌతుకమాత్మ నేర్పడఁ దగన్ జనకీశమహాబలాప్తిని
ఖ్యాతచరిత్రు సింహబలుఁ గన్గొని యీవిధ మెల్లఁ దెల్పి సం
ప్రీతిగ రాము నీకడకు వేగమె తెత్తునటంచుఁ దత్సమా
హుతి సుదృక్శిరోమణిఁ దదుక్తిని గైకొనిపోయి యచ్చటన్. ఆ-3

చ. హరివిభుఁ డంతకీర్తి మతసాంబసమాఖ్యుఁడు వైరికర్ణభీ
కరనిజనాముఁ డాబలముఁ గావఁగఁబూని తదగ్రయాయియై
మరిదమి వేగ నచ్చటి కమందధృతిన్ జని యాగలంకలోఁ
జొరఁబడికాల్ప సైన్యములఁ జూర్ణముచేసెను దాఁ దదున్నతిన్ ఆ ర

---

22. నంజరాజు

ఈకవి హాలాస్యమాహాత్మ్య మను డెబ్బదిరెండధ్యాయముల వచనకావ్యమును రచియించెను. ఈగ్రంథమున నధ్యాయాద్యంతముల యందుఁ బద్యములుగలవు. కవి వంశవర్ణనమును బద్యములతోనే చేయఁబడినది. ఈకవి మహిశూరరాజగు దొడ్డమహీపాలుని పౌత్రుఁడు; వీరరాజభూపాలుని పుత్రుఁడు. ఈదొడ్డభూపాలుఁడు ౧౬౭౦ వ సం॥ర ప్రాంతములయందుండినవాఁడు. కవి తానును దనయన్నయు మహీశూర రాజ్య సేనాధిపతులయినట్టు చెప్పుకొనియున్నాఁడు. కవి యన్నయగు దేవభూవిభుఁ డిట్టు వర్ణింపఁబడెను.—

శా. దీనత్రాణపరాయణుం డగుచు నెంతేవిశ్రుతుం డైనయా
సేనాధీశ్వరదేవభూవిభుఁడు కాశీంఖానమాద్యున్మలా
ఖానాద్యుద్భటయావనాధిపుల సంగ్రామంబునం గూల్చి ఢి
ల్లీనాథాదుల కెల్ల నచ్చెరువు గొల్పెం ధారుణీమండలిన్.

౧౭౩౧ వ సంవత్సరమునందు మైసూరురాజగు చామరాజును సింహాసనవిహీనునిజేసి చెఱసాలయందుఁ బెట్టించినవాఁడు దళవాయి యైన యీదేవభూవిభుఁడే. కవి ౧౭౩౦ వ సంవత్సర ప్రాంతములయం దుండినవాఁడు. ఇతఁడు క్షత్రియవంశజుఁడు; భారద్వాజగోత్రుఁడు; ఋక్శాఖవాఁడు. ఈహాలాస్యమాహాత్మ్యము దక్షిణమధురాపురీమాహాత్మ్యమును దెలిపెడి శైవగ్రంథము. ఇందలికథ స్కాందపురాణమునుండి గైకొనఁబడినది. పదునెనిమిదవ శతాబ్దారంభమున మధురలోను, మైసూరులోను దెనుఁగునఁ గొన్నివచనకావ్యములు చేయఁబడినవి. ఈ హాలాస్యమహాత్మ్యముయొక్క రచన సలక్షణమయి నాతికఠినముగా నున్నది. ఆకాలపు వచనరచనయొక్క రీతిని జూపుటకయి హాలాస్య మాహాత్మ్యములోని కొన్నిపంక్తుల నిందుఁ బ్రదర్శించుచున్నాను.

“వ. రూపలావణ్యభాగ్యమువల్లనో యనువైనగోత్రంబు గలవాఁడనియో విద్యంజూచియో సుందరేశ్వరుం డనుబుద్ధిచేతనో లేక భ్రాంతి చేతనో నేనునేను బిడ్డనిచ్చుట యనుచుం బలికి యాబ్రహ్మచారిం గులగోత్రంబు లడుగ నతండు తనగోత్రంబును సూత్రంబును నక్షత్రంబును నూర్ధ్వపుండ్రంబును గ్రమంబుగా విస్మితుండై యెఱింగించుటయు నబ్బాంధవులు కులగోత్రవ్యత్యాసంబులు లేకుండుటకు సంతసించి యూర్ధ్వపుండ్రధారణంబున కొక్కింతఖేదంబుఁ జెంది యనేకిమ్ముల గుణమ్ములయం దొకదోషంబు గలిగియుండినంగాని యడంగునని నిశ్చయించినవారై వివాహంబు లొనరింప నవ్విహాపాకుండైశ్వర్యయుక్తుం డగుటంజేసి పుత్రిక కధికంబుగా ద్రవ్యం

బొసంగ నయ్యుర్వీసురనందనుండు సంతుష్టుండై యాధనం బంత యుం గైకొని పత్నీసమేతంబుగాఁ బెక్కండ్రు బంధువులతోడఁ గూడుకొనియున్న తల్లిదండ్రుల సమీపంబునకుం జనుదేర దేశాంత రంబున కరిగి వివాహంబు చేసికొని భార్యతోడం జనుదెంచిన కుమారుం గాంచి తండ్రియుం దదీయబాంధవులు నత్యంతసంతోషం బెనసిరి ఓc."

౨౯ అధ్యాయము.

---

23. కోటి వెంకనార్యుఁడు

ఇతఁడు "ఆంధ్రభాషార్ణవము" అను పేరు గల మంచి యచ్చ తెలుఁగు నిఘంటువును పద్యములుగాఁ జేసెను. దీనితో సమానమైన యచ్చతెనుఁగు నిఘంటువు మఱియొకటిలేదు. ఈకవి ఈపుస్తకమును శ్రీవిజయరఘునాథునిపుత్రుఁడైన రఘునాథరాజు ప్రేరణముచేతఁ జేసి యాతని కంకితముచేసెను. ఈరఘునాథరాజు రామనాథసేతుపతి యయిన విజయ రఘునాథరాజు కుమారుఁడని తోచుచున్నది. అట్లయిన పక్షమున రఘునాథరాజు ౧౭౩౪ వ సంవత్సరము మొదలు ౧౭౪౭ వ సంవత్స రమువఱకును రాజ్యము చేసినందునఁ గవియు నాకాలమునం దుండి యుండవలెను. కవి గద్యమునందుఁ దనబిరుదావళి నీప్రకారముగా వ్రాసి కొనియున్నాఁడు—

"ఇది శ్రీమత్పరమేశ్వరకరుణాకటాక్షసంప్రాప్త సర్వజ్ఞత్వాది కతి పయగుణస్వసామ్యతదితరసకలగుణనిరూప మ్యాసేతు హిమా చలఖ్యాత మహోద్దండకవిబిరుదప్రశస్త సీతారామార్యవర్య తనూజాత శౌర్యధైర్యస్థైర్యాది సకలగుణచిరత్నరత్నాకర కోటి సమాఖ్యవంశసుధాపయోధిరాకాశశాంక ఘంటికాతురంగ నీలాత

షత్ర హనుమద్ధ్వజ మకరకేతన దివాదీప నవవిధభేరికాది నిఖిల బిరుదాంక బృహదంబికా కటాక్షసంజాతసామ్రాజ్యధురంధర విమలయశోబంధుర కర్ణాటపాండ్యచోళమహీపాలాదిసంస్తూయమాన శ్రీరాయరఘునాధమహీనాధసభాంకణ బిరుదాయమానార్యనుతచర్య వెంకనార్యప్రణీతంబైన &c.”

కవితాధోరణిని జూపుటకయి నిఘంటువునుండి పద్యముల నుదాహరించుట యుచితము కాదుకావునఁ గృతిపతిని వర్ణించిన పద్యము నొకదాని సిం దుదాహరించుచున్నాను.—

ఉ. శ్రీరఘునాధరాయ నృపశేఖర నీదుకరాసి భీమకా
ళోరగతుల్య మౌటను రణోర్విని దుర్మదమత్తచిత్తులౌ
వీరులప్రాణవాయువులఁ బీల్చుట యుక్తమి దెంతవింత యు
య్యారె సముద్రమయ్యు నిసుమంతయు భంగము గాంచదెప్పుడున్.

24. అడిదము సూరకవి

ఈకవి నియోగిబ్రాహ్మణుఁడు; అడిదము బాలభాస్కరుని పుత్రుఁడు. ఈయడిదము బాలభాస్కరుఁడు శుద్ధాంధ్రరామాయణమును రచించినట్లు కవిజనరంజనములో సూరకవి వేసికొన్న—

“శుద్ధాంధ్రరామాయణ ఘటనవైదుషీధురంధ రాడిదము
బాలభాస్కరతనూభవ”

అను గద్యమువలనను, కవి సంశయవిచ్ఛేదములో బాలభాస్కరుని శుద్ధాంధ్రరామాయణములోని దని యుదాహరించిన

“నిగిడిరువైపుల న్వాడల నేటయినీటగునీటికోట”

అను చంపకమాలికాపాదమువలనను దెలియవచ్చుచున్నదిగాని యీశుద్ధాంధ్రరామాయణ మిప్పు డెచ్చటను గానరాదు. ఈసూరకవి

తాను జేసినగ్రంథముల నన్నిటిని రామచంద్రపుర రామలింగేశ్వరుని కంకితము చేసెను. ఇతఁడు చేసినగ్రంథములలో నెల్లఁ జంద్రమతీపరిణయ మనునామాంతరముగల కవిజనరంజనము మిక్కిలి మనోహరమైనది. ఇది మూఁడాశ్వాసములు గల చిన్నప్రబంధమైనను, దీనియందలి గుణసంపదనుబట్టి పండితులు దీనిని పిల్ల వసుచరిత్ర మని వాడుచున్నారు. ఇతఁడు చేసిన యితరగ్రంథములు రామలింగేశ్వరశతకము, కవి సంశయవిచ్ఛేదము, ఆంధ్రచంద్రాలోకము, ఆంధ్రనామశేషము, అనునవి. కవి సంశయవిచ్ఛేద మనునది మూఁడాశ్వాసముల చిన్నలక్షణ గ్రంథము. ఆంధ్రనామశేషము పైడిపాటి లక్ష్మణకవికృతమైన యాంధ్రనామసంగ్రహములో లేని యచ్చతెలుఁగుపదముల నేర్చి కూర్చినపద్యరూప మగు చిన్న నిఘంటువు. కవి తనగ్రంథముల నన్నిటిని దేవాంకితము చేయుట చేత వానినిబట్టి కవికాలమును నిర్ణయించుట శక్యముకాదు. ఇతనిచే రచియింపఁబడిన గ్రంథములనుబట్టి కవి గోదావరి మండలములోనివాఁడయినట్టు కనఁబడుచున్నాఁడుగాని యితఁడు విజయనగరసంస్థానములో శ్రీ పూసపాటి విజయరామరాజుగారి కాలములో నుండినట్టు తద్రచితములయిన చాటుపద్యములు మొదలయినవానివలనఁ దెలియవచ్చుచున్నది. విజయనగరసంస్థానప్రభువులలో విజయరామరాజు లిద్దఱున్నందున నితఁడేవిజయరామరాజు కాలములో నుండినవాఁడో నిశ్చయింప శక్యము కాకున్నది. పెద్దాపురములో వత్సవాయ తిమ్మజగపతి మహారాజుగారు రాజ్యముచేయుచున్న కాలములో నీకవి తనప్రభువువెంట పెద్దాపురసంస్థానకు వచ్చి రాజు లందఱును సభచేసి కూరుచుండియుండఁగా—

ఉ. రాజు కళంకమూర్తి రతిరాజు శరీరవిహీనుఁ డంబికా
రాజు దిగంబరుండు మృగరాజు గుహాంతరసీమవర్తి వి
భ్రాజితపూసపాడ్విజయరామనృపాలుఁడె రాజుగాక యీ
రాజులు రాజులే పెనుతరాజులు గాక ధరాతలంబునన్.

అను పద్యమును సభలో నాసీనులయియున్న రాజులవంకఁ జూచుచు లేచి చదివెననియు, అందుమీఁద నిందలి కడపటివాక్యము తమ్ముద్దేశించి పలికినట్లు భావించి రాజులందఱును కవిని గోపదృష్టితోఁ జూచుచు లేవఁబోఁగా నతఁడు జంకక పద్యార్థమును జెప్పి "యీరాజులనఁగాఁ" పై చరణములయందుఁ జెప్పఁబడినరాజు మొదలయినవారని స్పష్టపరచి రోషముడిపి వారిని శాంతచిత్తులను జేసెననియు చెప్పుచున్నారు. ఏనుఁగు లక్ష్మణకవిగారి నాదరించిన యీవత్సవాయతిమ్మజగపతిమహారాజుగారు ౧౭౫౯ వ సంవత్సరము మొదలుకొని ౧౭౯౭ వ సంవత్సరమువఱకును రాజ్యముచేసిరి. ఈయనకాలములో నుండినవారు రెండవ విజయరామరాజుగారే. ఈయన విజయనగరరాజ్యమునకు వచ్చినదియు తిమ్మజగపతి మహారాజుగారు పెద్దాపురరాజ్యమునకు వచ్చిన సంవత్సరములోనే. ఈవిజయరామరాజుగారు ౧౭౫౯ వ సంవత్సరము మొదలుకొని ౧౭౯౪ వ సంవత్సరమువఱకును రాజ్యపాలనము చేసిరి. ఈ రాజులిద్దఱును సింహాసన మెక్కినప్పటికి యుక్తవయస్సురాని బాలురు. వీరిలో తిమ్మజగపతి మహారాజులుగా రప్పటి కేడుసంవత్సరముల ప్రాయమువారు; విజయరామరాజుగారు పండ్రెండు సంవత్సరముల ప్రాయమువారు. నిజాము ౧౭౬౦ వ సంవత్సరమున రాజమహేంద్రవరము వచ్చినప్పుడు వీరిద్దఱిని గొనిపోయి దర్శనముచేయింపఁగా నతఁడు వీరిద్దఱిని వారివారి సంస్థానములకు రాజులనుగా నంగీకరించెను. మొదటి విజయరామరాజుగారు బొబ్బిలియుద్ధమున ౧౭౫౭ వ సంవత్సరముననే మృతులయినందున, తిమ్మజగపతి మహారాజుగారి కాలములో నుండినయతఁ డతఁడయి యుండఁడు. సింహాసనమునకు వచ్చునప్పటికి వీరిద్దఱును బాలురయినందున వీరు తమ యాస్థానకవులతోఁ గలిసి పెద్దాపురమున సమావేశమగుట తరువాత నిరువది సంవత్సరములకనఁగా ౧౭౭౭ వ సంవత్సర ప్రాంతమందయియుండును. అందుచేత

సూరకవి ౧౭౮౦ వ సంవత్సరమువఱకైనను జీవించియుండవచ్చును. ఇతఁడు పెద్దవిజయరామరాజుగారి కాలములోఁగూడ బాల్యావస్థలో నుండి యుండును. కవి కాశ్రయుఁడైన విజయరామరాజుగారిని గూర్చియు వారి సంస్థానమునుగూర్చియు నిందుఁ గొంత వివరించుట యనుచితము కానేరదు.

ఓరుగంటియందుండిన కాకతీయరాజులు చెప్పుకొనునట్టుగానే యీ పూసపాటివారును తాము సూర్యవంశజుఁడైన మాధవవర్మ సంతతి వారమని చెప్పుకొందురు. కొండపల్లి సర్కారులోని పూసపాడను గ్రామనివాసముచేత వీరికి పూసపాటివారని యింటిపేరు గలిగినది. ఓరుగంటిసంస్థానము ప్రతాపరుద్రునితోఁ నశించినవెనుక వత్సవాయవారు పూసపాటివారు మొదలయినవారు మహమ్మదీయులకు లోఁబడిరి. రఘునాథరాజను మాఱుపేరుగల పూసపాటి తిమ్మరాజుగారు గోలకొండలో సరదారుగానుండి శ్రీకాకుళమునకువచ్చి, శ్రీకాకుళమునకు ఫౌఁజుదారుగా నుండిన షెర్ మహమ్మదుఖాన్ వలన ౧౬౫౨ వ సంవత్సరమున కుమిలిమి భోగాపురపుతాలూకాలను గుత్తకు పుచ్చుకొని పాలనముచేయ నారంభించెను. ఈయనపుత్రుఁడయిన సీతారామచంద్రరాజుగారు మఱికొన్ని తాలూకాలనుకూడ కవులునకు పుచ్చుకొని, పర్లాకిమిడి సంస్థానాధిపతియైన గజపతిదేవునితో మైత్రిసంపాదించి, ౧౨౫ గుఱ్ఱపు రౌతులతోను ౪౫౦ కాల్బలముతోను పొట్నూరు జయించి కలింగరాజని పేరువడసి యాయూరు నివాస మేర్పఱచుకొని ప్రబలుఁడయియుండెను. ఈయన యనంతరమున నానందరాజుగారు పరిపాలనమునకు వచ్చిరి. ఈయన పుత్రులు విజయరామరాజుగారు బహు ప్రసిద్ధపురుషులు. ఈయన మన్నె దొరలను గెలిచి వారి దేశము లాక్రమించుకొని మన్నెసుల్తానను బిరుదంది, పొట్నూరునుండి తనపేరట విజయనగరమను పేరఁబరఁగిన యూరికి రాజధానిని మార్చుకొని, ౧౭౧౨ వ సంవత్సరమునకు సరియైన

విజయసంవత్సర విజయదశమీ జయవారమునాఁడు కోటకట్టుటకు శంకు స్థాపనము చేసెను. ౧౭౫౩ వ సంవత్సరమున నిజాము కొండపల్లి యేలూరు రాజమహేంద్రవరము శ్రీకాకుళము సర్కారులను ఫ్రెంచి వారికిచ్చెను. అప్పుడు విజయరామరాజుగారు శ్రీకాకుళమునకు నాయి బయిన జాఫరల్లీతోఁ జేరి దేశము ఫ్రెంచివారికి స్వాధీనము కాకుండు నట్లు చేయుటకయి ప్రయత్నించెను గాని, వారు రాజమహేంద్రవరము శ్రీకాకుళపు సర్కారులను తక్కువశిస్తుకు కవులున కిచ్చెదమన్నందున జాఫరల్లీని విడిచి ఫ్రెంచివారితోఁ జేరెను. తరువాత సర్కారులలోని రాజులందఱును ఫ్రెంచివారికి లోఁబడక తిరుగఁబడినప్పుడు సహితి మీయన వారియెడల విశ్వాసముగలవాఁడయి యుండి ౧౭౫౫ వ సంవ త్సరమున ఫ్రెంచి సేనానాయకుఁడయిన బుస్సీకి కావలసిన ధనమును రహస్యముగాఁ బంపెను. తరువాత బుస్సీ సేనలతో దేశమును స్వాధీ నము చేసికొనుటకు కళింగదేశమునకు వచ్చినప్పుడీయన బొబ్బిలివారి తోటి తన పూర్వవైరమును సాధించుకొనుటకయి బుస్సీని పురికొల్పి యుద్ధము చేయునట్లుచేసి తానుగూడ సేనలతోఁబోయి ౧౭౫౭ వ వత్స రము జనేవరు నెల ౨౪ వ తేదిని తాండ్ర పాపయ్యచే పొడువఁబడి పరమపదము నొందెను. తరువాత విజయరామరాజుగారి పితృవ్యపుత్రుఁ డయిన యానంద గజపతిరాజుగారు సింహాసనమునకు వచ్చి, బుస్సీ విజయరామరాజుగారి యెడలఁ జూపిన యాదరమును తనయెడలఁ జూపక పోవుటచేత మనసులో ద్వేషము పెట్టుకొని బుస్సీ విశాఖపట్టణము మొదలయిన స్థానముల నన్నిటిని స్వాధీనముచేసికొని పై యధికారుల యుత్తరవు ననుసరించి యీ దేశమును విడిచి కర్ణాటకమునకు వెడలి పోఁగానే సేనలను గూర్చుకొనిపోయి విశాఖపట్టణమును పట్టుకొని దాని నింగ్లీషువారికి వశపఱిచెదనని యుత్తరములువ్రాసి ౧౭౫౮ వ సంవత్స రమున వారితో స్నేహము చేసికొనెను. తరువాత నతఁడు ఫ్రెంచివారి

ను త్తరపుసర్కారులనుండి తఱిమివేయు ప్రయత్నములో నింగ్లీషువారితోఁ జేరి, దొరికినకొల్లలోఁ దనకు భాగమిచ్చునట్లును జయించిన దేశములో నదీ సముద్రతీరపట్టణములును వాని చుట్టుపట్లఁగల దేశమును దక్క మిగిలిన భాగమును దన పాలనములో నుంచునట్లును యుద్ధవ్యయముల క్రింద తాను నెల కేఁబదివేలరూపాయల చొప్పున నిచ్చునట్లును ఏర్ప ఱుచుకొని, కర్నల్ ఫోర్డుగారిచే నడుపఁబడుచుండిన యింగ్లీషుసేనతోఁ దనసేనను జేర్చి దండయాత్ర వెడలెను. అవఱకే ఫ్రెంచిసేనానాయకుఁ డయిన కన్ఫ్లాన్సుగా, రానందగజపతిరాజుగారిని శిక్షించుటకయి దండ యాత్రవెడలి యింగ్లీషుసేన యాయనతోఁ జేరినదని విని రాజమహేంద్ర వరమున నిలిచిపోయెను. కర్నల్ ఫోర్డుగా రానందరాజుగారు వెంట రాఁగా రాజమహేంద్రవరమునకు వచ్చి ఫ్రెంచిసేనాధిపతియైన కన్ఫ్లాన్సు గారి నక్కడనుండి పాఱఁద్రోలి, మచిలీబందరునకుఁ బోయి దానిని స్వాధీనపఱుచుకొనెను. దండువెడలియున్న యింగ్లీషువారిని జయించు టకై నిజాము సలాబత్ జంగు మచిలీబందరుకు ౧౫ మైళ్ళ దూరము వఱకును వచ్చి వారిని జయించుట సాధ్యము కాదని తెలిసికొని ౧౭౫౯ వ సంవత్సరము మెయినెల ౧౪ వ తేదిని సంధిచేసికొని మచిలీ బందరు సర్కారును కొండవీడు నైజాముపట్టణము సర్కారులును ఇగ్లీషువారి కిచ్చివేసి, ఆనందగజపతిరాజుగారు ఫ్రెంచివారి కియ్యఁబడిన దేశమునుండి గ్రహించిన సొమ్ము విషయమయి తగవుపెట్టక విడిచిపెట్టి వారితండ్రి తాతలనుండి వా రనుభవించుచుండిన దేశమును వా రనుభ వించుట కంగీకరించెను. ఈ యొడంబడిక యయినతరువాత స్వదేశము నకు వచ్చుచు త్రోవలో రాజమహేంద్రవరమున నానందగజపతిరాజు గారు స్ఫోటకముచేత కాలధర్మమునొందిరి. అప్పుడాయన భార్య లిద్ద ఱును సహగమనము చేసిరఁట! తర్వాత బొబ్బిలిలో మృతులయిన విజయరామరాజుగారిభార్య చంద్రమ్మగారు సన్నిహితజ్ఞాతియైన పూస

పాటి రామభద్రరాజుగారి ద్వితీయభార్య పుత్రుఁడయిన పంద్రెండు సంవత్సరముల ప్రాయముగల వేంకటపతిరాజను చిన్నవానిని పెంచుకొని, ఆచిన్నవాని పేరు విజయరామరాజుగా మార్చి యాయనను పట్టాభిషిక్తుని జేసెను. ఈవిజయరామరాజు బాలుఁ డయినందున రాజ్యాధికారము నంతను సవతియన్నగారగు సీతారామరాజుగారు వహించి, తమ్మునకు యుక్తవయస్సు వచ్చినతరువాతసహిత మధికారమునంతను తానే చెల్లించుచువచ్చెను. ఈవిజయరామరాజుగారి కాలములోనే మనకవి యుండినది. ఆకాలమునందు విజయనగరమువారు నిజామునకు కట్టుపన్ను రెండులక్షల తొంబదివేల యేఁబదితొమ్మిదిరూపాయలు. అయినను దేశ మస్వస్థస్థితిలో నున్నందున నిజాము తనకు రావలసిన కప్పమును తిన్నఁగాఁ గైకొన శక్తుఁడుగాక పెక్కేండ్లూరకుండుచు వచ్చెను. ఈహేతువుచేతను, సీతారామరాజుగారు బలవంతులయి తమసేనలతో చిల్లరసంస్థానాధిపతుల నదిమి కప్పములు గొనుచుండుటచేతను, విజయనగరరాజ్య మాకాలమునం దించుమించుగా స్వతంత్రరాష్ట్రమువలెనే యుండెను. ఈసీతారామరాజుగారు బొబ్బిలిరా జయిన చిన్నరంగారావుగారిని పట్టుకొని విజయనగరములో చెరసాలయం దుంచెను; పర్లాకిమిడి రాజగు నారాయణదేవు జగన్నాథయాత్ర పోవుట సందుచేసికొని యతని రాజ్యముమీఁద దండెత్తి యాత్రనుండి తిరిగి వచ్చిన యాతని నరసన్నపేటవద్ద నోడించి యిప్పటి గంజాముమండలములో విశేషభాగమును విజయనగరరాజ్యములోఁ జేర్చెను. తన తమ్ముని వెంటఁగొని దండయాత్రవెడలి సీతారామరాజుగారు మొగలితుర్రు వఱకును వచ్చి స్థానికపాలకుఁడైన నవాబు బడ్డీఅబ్జమాఖానును జయించి కొంతకాలము రాజమహేంద్రవరము సర్కారును సహిత మాక్రమించినట్టు చెప్పుదురు. ఇట్లింకను పెక్కు విజయములను బొంది మహోన్నతదశయం దుండిన యీకాలములోనే యింగ్లీషువారు

నిజాామువలనఁ బొందిన సనదుప్రకారముగా నుత్తరపుసర్కారుల లోదము యధికారమును జెల్లించుట కారంభించిరి. ఇంగ్లీషుకంపెనీవారితో జేసి కొన్న యొడంబడికనుబట్టి సంవత్సరమునకు మూడులక్షల రూపాయలు పేష్కష్ చెల్లించుటకును పర్లాకిమిడి రాజయిన నారాయణదేవునలనఁ గైకొన్న రాజ్యమును విడిచిపెట్టుటకును విజయనగరము వా రొప్పు కొనిరి. ఇట్లు కొంతకాలము జరిగిన తరువాత విజయనగర సంస్థానము నకు లోఁబడియున్న కొండ జమీాందారు లందఱును విజయనగరము వారిమీాఁద తిరుగఁబడి స్వతంత్రులగుటకుఁ బ్రయత్నించిరి. కాని సీతా రామరాజుగా రన్నిటికిని దగినవాఁ డయినందున నింగ్లీషుసేనలను సహాయపఱచుకొని యాకొండ సంస్థానాధిపతుల నొక్కొక్కరినే జయించి కొందరిదేశములను తమరాజ్యములోఁ గలుపుకొనియు కొంద ఱిని విజయనగరమునఁ జెఱసాలలోఁ బెట్టియు నడఁచి సాధించెను. ఈకలహములో ఆంద్ర, పాలకొండ జమీాన్‌దారులు మాత్రము చేర లేదు. సీతారామరాజుగారిట్లు పరరాజులను జయించుట యేకాక తురకదొరలు మసీదుల కిచ్చిన భూములను పూర్వరాజులు బ్రాహ్మణుల కిచ్చిన మాన్యములనుగూడ లాగుకొని ప్రజలను సహితము క్షోభపెట్ట నారం భించెను. ఈయనపెట్టుబాధలే సూరకవిని రామలింగేశశతకము చెప్పు నట్లు చేసినవి. ఆకాలపు ప్రభువులయందు కవి కెట్టియభిప్రాయముండె నదో కొంతవఱకు క్రిందిరీతి పద్యములు వెల్లడిచేయవచ్చును—

సీ. పదుగురు కోఁతివెంబడి సంచరింపరే వాహకుల్ లేరె శవంబులకును
గంగిరెద్దుకు లేవె ఘనతూర్యరావముల్ కల్గి గల్గదె వారకామినులకుఁ
బులిగోవుఁజంపినక్కలనుబోషింపదే స్థూలకాయము లేదె మన్నులకును
బుస్సిపంటికి లేదె పుట్టంబుఁ జుట్టుట వేణుధరుఁ డెద్దువెంట రాఁడె
న్యాయపద్ధతినడువనియవనిపతికి
నెన్నిచిన్నెలు గలిగిన నేందుకొఱకు

నంత్యమునఁజూడవలయునాయయ్యసుఖము
రామలింగేశ రామచంద్రపురవాస.

కడువింత యగుఁస్థూలకాయంబు గల్గుట
చిత్రభూషాంబరస్థితిని గనుట
తూర్యరావంబులతోఁ జనుదెంచుట
వాలవీజనసమావాప్తి గనుట
శృంగవేత్రోద్ధతిఁ జేరరాకుండుట
చూపఱు పదుగురు చుట్టుకొనుట
స్వనియంతవాక్యంబు విని తలయూఁచుట
మౌనముద్ర వహించి మతము గనుట
గంగిరెద్దుకు మూర్ఖభూకాంతునకును
భేదమించుకయును గనిపించ దట్టి
ప్రభువు వేఁడిన సత్కవిపటిమ చెడదె
రామలింగేశ రామచంద్రపురవాస.

మాన్యంబు లియ్య సమర్థుఁడొక్కఁడు లేఁడు
మాన్యముల్ చెఱుప సామంతులంద
ఱెండినయూళ్ళగో డెఱిఁగింపఁ డెవ్వఁడుఁ
బండినయూళ్ళెన్నఁ బ్రభువులంద
ఱితఁడు పేద యటంచు నెఱిఁగింపఁ డెవ్వఁడుఁ
గలవారిసిరి యెన్నఁ గలరు దొరలు
తనయాలిచీఁకటి తప్పెన్న డెవ్వఁడు
పరకాంతలం కెన్నఁ బెద్ద లంద
ఱిట్టిదుష్టుల కధికార మిచ్చినట్టి
రాజు ననవలెఁగాక దుర్జనుల ననఁగ
నేమిపనియున్న దిఁక సత్కవీంద్రులకును
రామలింగేశ రామచంద్రపురనివాస.

ఇట్లుండఁగా సంస్థానమునందుండినరాచవారందఱు నొకటిగాఁజేరి ౧౭౭౫ వ సంవత్సరమునందు మంత్రిత్వమునుమాని రాజకార్యసంబంధము వదలుకొనునట్లు సీతారామరాజుగారిని నిర్బంధపఱిచిరి. తనపుత్రుఁడయిన నరసింహగజపతిరాజును స్వీకారముచేసికొని విజయరామరాజుగారు మరణానంతరమున సింహాసన మాతని కిచ్చునట్లు తమ్మునిచేతఁ బలికించి యాయన తాను మంత్రిత్వమును విడుచుట కంగీకరించెను.

విజయనగరమువారు చెల్లింపవలసిన మొత్తమును నిర్ణయించుటకయి కంపెనీవారి చెన్నపురిపరిపాలకుఁడు విజయరామరాజుగారిని చెన్నపురి రమ్మనికోరెను. కోరినప్రకారముగా విజయరామరాజుగారు చెన్నపురికిఁబోక ప్రయాణవ్యయములకు తనచేత సొమ్ములేదనియు, తన యన్నయైన సీతారామరాజుగారు తన్ను నాశనముచేయుటకయి తంత్రములు పన్నుచుండిన యాకాలములోఁ దాను రాజధానినివిడిచి దూరముగాఁ బోవుట యుచితము కాదనియు, విశాఖపట్టణములోని యధికారుల సమక్షమునఁ దాను వారు విధించెడు న్యాయమైనకప్పమున కంగీకరించెదననియు, చెప్పి తప్పించుకొనెను. అంతట చెన్నపురిపరిపాలకుఁడు సీతారామరాజుగారిని చెన్నపురికి రమ్మనికోరఁగానే యతఁడు తక్షణమేపోయి యక్కడివారిని వశపఱచుకొని రాజకార్యములు చక్కఁబఱుచుకొని, విజయనగరసంస్థానమునకు తన్ను దివానుగా నేర్పాటుచేయించుకొని తన పుత్రుని స్వీకారమును స్థిరపఱిపించుకొని, మరలవచ్చెను. ఈయేర్పాటుల వలన విజయరామరాజుగారు పేరునకురాజుగానుండినను నిజమయిన యధికారమంతయు సీతారామరాజుగారి చేతిలోనే చిక్కెను. ఈవిషయమయి విజయరామరాజుగారు కంపెనీవారికి మొరబెట్టుకోఁగా పెట్టుకోఁగా తుదకు వారాయనను దివానుపనినుండి తొలఁగించి విజయనగరము విడుచునట్లుత్తరువు చేసిరి. అందుపైని సీతారామరాజుగారు విజయనగరము విడిచి సింహాచలము నివాసముగా నేర్పఱుచుకొని యక్కడ కొంత

కాలముండి, తరువాత మరల తమ్ముని మంచిమాటలాడి ౧౭౯౦ వ సంవత్సరమునం దొకసారియు ౧౭౯౨ వ సంవత్సరమం దొకసారియు మరల సంస్థానములో దివానుగాఁ బ్రవేశించి, కడపటిసారి కంపెనీవారిచే చెన్నపురికిఁ బోవునట్లుత్తరువుచేయఁబడి నెలకయిదువేలరూపాయల యుపకారవేతనముమీఁద ౧౭౯౩ వ సంవత్సరమునందక్కడపోయి చేరెను. సీతారామరాజుగారి దుష్పరిపాలనము మొదలైన కారణములచేత విజయరామరాజుగారు ఋణములపాలగుటయేకాక కంపెనీవారికి కట్టవలసిన కప్పము సరిగా కట్టలేక యారులక్షల యిరువదియైదువేల రూపాయలవరకు బాకీపడిరి. అందుచేత కంపెనీవారు సంస్థానమును తమపాలనమునకుఁ దీసికొని, విజయరామరాజుగారిని స్వరాజ్యమువిడిచి మచిలీబందరులో వాసము చేయునట్లుత్తరువుచేసి, ఆయనకు ముప్పదివేలరూపాయ లొక్కసారిగా నొక్కమిచ్చెదమనియు నెలకు రు ౧౨౦౦ లు వ్యయముల కిచ్చెదమనియుఁ జెప్పిరి. ఆయన స్వదేశమును విడుచుట కిష్టములేనివారయి బందరుపురమునకుఁ బోవుమార్గమున బైలుదేరి యయిదారుక్రోసుల దూరముపోయి యక్కడనుండి పనివారలతో వెనుకఁదిరిగి పద్మనాభమునకుఁ బోయి యక్కడనుండి తాను ప్రయాణము చేయలేకపోవుటకు సాకులు వ్రాయనారంభించెను. విజయరామరాజుగా రక్కడనున్నకాలములో రాచవారును నాలుగువేల సైనికులునుబోయి యాయనను జేరిరి. కంపెనీవారి కీసంగతి తెలియఁగానే యిరువదినాలుగుగంటలకాలము గడువిచ్చి యాలోపల నతఁడు బందరుమార్గమున బైలుదేరనిపక్షమున, బలాత్కారముగాఁ బంపవలసిందని విశాఖపట్టణములోనున్న సేనానాయకునకుత్తరువుచేసిరి. పయివారి యుత్తరువును దెలియఁబఱిచి యింగ్లీషు సేనాధిపతియైన ప్రెండర్గాష్టుగారు కొంతసేన (౭౫౦ భటుల)తో పద్మనాభమునకుఁ బోయిరి. ౧౭౯౪ వ సంవత్సరము జూలయినెల ౧౦ వ తేదీ యుదయమున నింగ్లీషుసేనాధిపతి పద్మనాభపుకొండను జేరునప్పటికి, విజయ

రామరాజుగారును బంధువులయిన రాచవారును ఖడ్గపాణులయి లోఁబడక యుద్ధముచేసి వీరమరణమునొందుటకు నిశ్చయించుకొని యందరును పద్మనాభస్వామి ప్రసాదమునుస్వీకరించి యుద్ధోన్ముఖులయి నిలిచియుండిరి. నాఁడు సూర్యోదయకాలమున నింగ్లీషుసేనలకును రాజుగారి సేనలకును ముప్పావుగంటసేపు ఘోరయుద్ధము జరగినది. అంతట రాజుగారి సేనలన్నియు చెల్లాచెదరయి పారిపోయినవి. రణరంగమునకుఁబోయి చూడఁగా రణనిహతులయి వీరశయనము నొందినవారిశరీరము లక్కడ మున్నూటతొమ్మిది కనఁబడినవి. రణభూమినలంకరించిన మున్నూటతొమ్మిదింటిలో నిన్నూటయెనుబది రాచవారిదేహములు. రణరంగమధ్యమునఁ బడియుండిన విజయరామరాజుగారి శవముచుట్టును కోటకట్టినట్లుగా సంస్థానములో నున్నతస్థితిలో నుండిన యుత్తమక్షత్రియుల శవములు నలువది గుండుదెబ్బలతోఁ బడియుండెను. ఇట్లు మరణమునొందినవారుగాక పారిపోయినవారిలో నెందరికిగాయములుతగిలినవో తెలియలేదు. ఇంగ్లీషుసైనికులలో మృతులయినవారు పదుముగ్గురు; గాయపడినవారిరువదియొక్కరు. ముప్పదియేఁడేండ్లక్రిందట బొబ్బిలికోటముందు పెద్ద విజయరామరాజుగారు హతులయినట్లే మనకవీంద్రునికాలములోనుండిన యీ చిన్నవిజయరామరాజుగారు పద్మనాభపుకొండముందు నిహతులయిరి. మనకవికాలముతో సంబంధించినచరిత్రమింతే. తండ్రిమరణమును విని యప్పటి కెనిమిదిసంవత్సరముల ప్రాయమువాఁడయిన నారాయణబాబుగారు తల్లితోడఁగూడ కొండదేశమునకుపారిపోయిరి. కాని, కంపెనీవారాయనను పిలిపించి దొరతనమిచ్చిరి. ఆయన పండ్రెండులక్షలవరకును ఋణముచేసి ౧౮౦౨ వ సంవత్సరమునందు తనకు సంవత్సరమున కెనుబది వేలరూపాయలిచ్చు పద్ధతిమీఁద రాజ్యపాలనము నింగ్లీషువారి కప్పగింపఁగా వారు ౧౮౨౭ వ సంవత్సరమునాఁటి కప్పులన్నియుఁ దీర్చి రాజ్యము నాయనకు మరలనిచ్చిరి. నారాయణబాబుగారు మరల నేడు

లక్షలరూపాయలప్పుచేసి తనకు సంవత్సరమునకు లక్షరూపాయలిచ్చు పద్ధతిమీఁద ౧౮౨౭ వ సంవత్సరములో రాజ్యమును మరల నింగ్లీషు వారియధీనముచేసి కాశీయాత్రపోయి యక్కడనే వాసముచేసి ౧౮౪౫ వ సంవత్సరమున దేహము చాలించిరి. మరణకాలమున కాయన యప్పు ౧౧ లక్షలకుఁ బెరిగినది. పండ్రెండు సంవత్సరముల ప్రాయముగల నారాయణబాబుగారి కుమారుఁడగు విజయరామ గజపతిరాజుగారికి రాజ్యమిచ్చి ఆయన కాశీనగరమును విడిచివచ్చుట కిష్టము లేనివారుగా నుండినను ౧౮౪౪ వ సంవత్సరమునం దాయనను విజయనగరమునకు రప్పించిరి. ఋణముల నన్నిటిని దీర్చి ౧౮౫౨ వ సంవత్సరములో రు ౨౧౨౭౨౮ ల రొక్కముతో నింగ్లీషువారాయనకు రాజ్యమొప్పగించిరి. ఈ విజయరామగజపతిరాజుగా రాంగ్లేయోపాధ్యాయుల శిక్షచేఁ ప్రవీణులయి సత్పరిపాలన చేయుచు బాలికాపాఠశాలలు మొదలయిన జనోపయుక్తములగు ధర్మకార్యములకొఱకు ధనమును సద్వినియోగ పఱచుచు వచ్చిరి. విశాఖపట్టణములోని వైద్యశాలకు ముప్పదివేల రూపాయల నిచ్చినందున, దొరతనమువారాయనకు ౧౮౬౪ వ సంవత్సరములో "మహారాజా" యన్న బిరుదిచ్చిరి. ఈయన ౧౮౭౮ వ సం॥రమున స్వర్గస్థులుకాఁగా ౧౮౫౦ వ సంవత్సరమునందు జనించిన యీాయనపుత్రు లానందగజపతిరాజుగా రప్పటినుండి విజయనగరపరిపాలకులుగా నున్నారు. దొరతనమువారీయనకును ౧౮౮౬ వ సంవత్సరమున "మహారాజా" యన్నబిరుదము నిచ్చిరి.

సూరకవికి రేవయను గ్రామమున చెరువుగట్టుక్రింద నొకమాన్యముండెననియు, ఆగ్రామమును గుత్తచేసిన దంతులూరి యన్నమరాజు కవిమాన్యమునకు చెరువునీరు పెట్టుకోనీకపోఁగా, అతఁడు ప్రభువునకు మొఱ్ఱపెట్టుకొనియు కార్యముగానక తుదకు చెఱువులో నిలుచుండి

యీక్రింది నాలుగు సీసపద్యములును జెప్పఁగానే చెఱువు నాలుగు వైపులను గండి తెగి నీరాతని పొలముమీఁద పాఱెననియుఁ జెప్పెదరు-

సీ. బ్రహ్మాండభాండసంపత్తి కుక్షిసిగల్గు పద్మనాభునిపదాబ్జమునఁ బుట్టి
సకలరత్నాకరస్థానమై యుప్పొంగునంబుధీశునిచరణంబు ద్రొక్కి
పరమతత్త్వజ్ఞుఁడై పరఁగుశంతనుమహీరమణువామాంకభాగమునఁ జేరి
యఖిలలోకాధ్యక్షుఁడై మించివిహరించుశివుజటాజూటాగ్రసీమనిలిచి
తనరు నీవంటిధన్య కుత్తమముగాదు
పూసపాటి మహాస్థానభూమియందుఁ
గాలుద్రొక్కంగ నోడుఁ జండాలుఁడైన
గదలు మిటమాని దివిజగంగాభవాని.

సీ. ఆదిభిక్షుం డీతఁడనిరోసి విడియూకుగొనివచ్చి యిటనిల్వఁ గోరితొక్కొ
జగడాలచీలివై సవతితోఁ బోరాడి వీఁగివచ్చి యిచట డాఁగితొక్కొ
నిర్జరాంగనలెల్ల నీఱింకు వెలిపుచ్చు దూబవై యిచ్చోటదూఱితొక్కొ
బీదబాపలఁగష్టపెట్టుటకై మిన్నుదొలఁగి యిచ్చోటను నిలిచితొక్కొ
వలదు ద్విజభూమిఁ గాల్నిల్ప వరుసగాదు
రవ్వ నీకేల తగ దంబురాశికరుగు
నాతియతఁడెకాఁడటె పిన్ననాఁటి మగఁడు
కదలుమిటమాని దివిజగంగాభవాని.

సీ. భావింప నిలువెల్ల భంగంబులేకాని
భంగము ల్తొలఁగు టెప్పటికి లేదు
తిరుగుచో వంకరతిరుగుడింతియకాని
తిన్నగాఁదిరుగుట యెన్న డెఱుఁగ
మునసిరేయిపగల్లు మొరయుచుండుటెకాని
మొరయకూరకయుంట యెఱుఁగ మెపుడు
పాలకల్మినిరోసి పల్చనగుటేకాని
పలుచనిగతి మాని మెలఁగు టెఱుఁగ

మనుచు నీలోన నీవై నయవగుణంబు
లరసి లజ్జించి దివి నుండ కరుగుదెంచి
నిలువునీరైన నీవిందు నిలిచి శ్లోకా
కదలు మిటమూని దివిజ గంగాభవాని.

సీ. కృతకాద్రు లాయెనా కీలోగ్రఫణిఫణానేకఫూత్కారవల్మీకచయము
విరిదోటలాయెనా కఱకుకంటకకంటకాంకురవిస్ఫురితాగచయము
పువుఁబొన్పు లాయెనా నవమంజులశ్వేతలవణాలవాలమౌ చవుటినేల
బొమ్మరిండ్లాయెనా భూరిభేకాండజాధారమై తనరు కేదారచయము
నీకు విహరింప వసతులై నివ్వటిలెనె
చిన్నపొలములు బ్రాహ్మణక్షేత్రమునకు
ఘాతుకత్వంబు చేయుముష్కరులు గలరె
కదలుమిటమూని దివిజగంగాభవాని.

ఈసూరకవి విషయమున నిఁక దెలిసినసంగతు లతఁడు సమకాలికులగు కవులతోఁ బెట్టుకొన్న వివాదములును, కవు లొండొరులను దిట్టుకొన్న పద్యములును దక్క మఱి యేమియుఁ గానరావు. కాఁబట్టి యాకథలను విడిచి కవికృతగ్రంథములనుండి కొన్ని పద్యములనుమాత్రమిం దుదాహరించుచున్నాను.—

కవిజనరంజనము.

మ. అమరద్వీపవతీపయోవిహారణప్రాంచత్సురస్త్రీల వ
జ్రమయాభ్రంకషమంటపాగ్రముల నిచ్చల్ క్రీడఁగావించుత
ద్రమణీవారము వేఱ నేరుపఱుపన్ రా దంచుఁగా దివ్యరా
జముఖీపాళికిఁ దమ్మిచూలి యనిమేషత్వంబు గావించుటల్. ఆ-౧

శా. శయ్యాదంభమున న్మురాంతకుఁడు భూషాకై తవస్ఫూర్తిచే
నయ్యార్యారమణుండు దాల్చిరి భుజంగాధీశులన్ నీయసా
హాయ్యప్రస్ఫుటధాటి కోర్వ కనుచో నబ్జాస్యలా మోర్చుపా
రయ్యా గంధసమీరప్రోవఁగదవయ్యా యాకురంగేక్షణల్. ఆ-౨

మ. అలమన్ మైఁ బులకాంకురాళి దరహాసాంకూరము ల్కన్గవం
దొలఁకన్ ముత్యపుటొంట్లు గండయుగళిం దూఁగన్ గనత్కంకణం
బులు మ్రోయన్ భుజమధ్యసీమ రతనంపుందాలి తార్కాణగాఁ
దలఁబ్రాల్వోసెలతాంగియాదలపయిన్ ధాత్రీశుఁ డత్యాదృతిన్. ఆ 3

ఆంధ్రచంద్రాలోకము.

గీ. అక్రమాతిశయోక్తి ప్రఖ్యాతికెక్క
హేతుకార్యంబులకు సహావృత్తిగలుగ-
జ్యాపరీరంభ కైకదక్షత వహించె
నీశరంబులు నీశత్రునృపులతోడ.

క. ఏపారుఁ గృతులఁ బ్రతివ
స్తూపమ వాక్యములురెంటి కొగి సమత తగన్-
తాపమున నలరు సూరుఁడు
చాపంబున శూరుఁ డొనరు జగతినమక్రియన్.

రామలింగేశశతకమునందలి పద్యము లీవఱకే కొన్ని యుదాహరింపఁబడినవి. లక్షణగ్రంథము లగుటచే నాంధ్రనామశేష కవిసంశయవిచ్ఛేదములనుండి కవితాధోరణిని జూపుటకుఁ బద్యముల నుదాహరించుట యుచితము కాకపోయినను, అందుండియు నొక్కొక్క చిన్న పద్యమును గైకొనుచున్నాను—

క. వెన్ననఁగ బీజమంజరి । వెన్నన, జరమాంగమునకు వెలయునుబేరై
కన్నులనం బర్వంబులు । కన్నులనగ లోచనములు కంశేకాలా.

ఆంధ్రనామశేష.

గీ. ఎఱుకగలవారె యనుచోట నెఱుకగలరె
యిట్టివారెయనెడిచోట నిట్టిరెయగుఁ
జేయఁగలవారెయనుచోట జేయఁగలరె
యనుచు లోకప్రసిద్ధోక్తి యగునుశర్వ.

కవిసంశయవిచ్ఛేదము.

25. మంగళగిరి ఆనందకవి

ఈకవి వేదాంతరసాయనమనెడు నాలుగాశ్వాసముల పద్యకావ్యమును రచియించి దానిని నిడిమామిళ్ల దాసయామాత్యుని కంకితము చేసెను. కవి శ్రీవైష్ణవమత మవలంబించిన నియోగిబ్రాహ్మణుఁడు. ఈతఁడు తిమ్మయామాత్యుని పుత్రుఁడు; ఆత్రేయగోత్రుఁడు; కవి కృతిపతి తన్నుఁగూర్చి పలికినవిధము నిట్లు చెప్పుకొన్నాఁడు —

సీ. ఒకవంక నిగమాగమోజ్జ్వలాతిశయార్థవిధివాదకౌశలద్విజనికాయ
మొకచాయ న్యాయశాస్త్రోదాత్తవాక్యప్రసంగకృద్విద్వత్ప్రజావితాన
మొకక్రేవ సంస్కృతప్రకటాంధ్రభాషాకవిత్వప్రవీణకవిప్రకాండ
మొకచెంత సప్తస్వరోద్గీతగీతికావైచిత్రివిస్ఫురద్వైణికౌఘ
ముల్లసిల వజ్రకౌక్షేయకోపమాన
వైభవస్ఫూర్తి నొకశుభవాసరమున
మహితగుణపాళి దాసయామాత్యమౌళి
ప్రమదముప్పొంగఁ బేరోలగముననుండి.

మ. నను సర్వేశపదాంబుజద్వయనితాంతధ్యానపారీణు భూ
రినయోపేతచరిత్రు మంగళగిరి శ్రీవంశవారాశిపూ
ర్ణనిశానాథు సుధీజనాభిహితు నానందాఖ్యు సద్గ్రంథక
ల్పను సాహిత్యకళావిశారదుని బిల్వం బంచి పల్కెం గృపన్.

చ. తరుముఖసప్తసంతతు లుదారత నెచ్చట నిల్ప నచ్చటన్
బరఁగు సమస్తదిక్కులకుఁ బ్రాఁకగు భావరసానుకూలవా
గ్గరిమఁ దనర్చు సత్కృతిముఖంబున వానికిఁ దారకేందు
భాస్కరులు గలంతకాల మనిశంబుఁ గరంబుఁ బ్రసిద్ధి చెల్వగున్.

ఇతఁడు లాక్షణికాగ్రగణ్యుఁ డయిన ప్రబంధకవి. పేరునుబట్టి తోఁచున ట్లిది వేదాంతగ్రంథముగాక మతస్థాపకుఁడయిన యేసుక్రీస్తు

యొక్క చరిత్రముగా నున్నది. ఈపుస్తకము నిర్దుష్టమయి మృదుమధురమైన ప్రబంధపాకమునఁ జేయఁబడియున్నది. ఇందలి వర్ణన లేవిషయమునను బూర్వప్రబంధములలోని వర్ణనలకుఁ దీసిపోవు. బ్రౌన్ దొరగారీకావ్యము ౧౭౦౦ వ సంవత్సరప్రాంతమున రచియింపఁబడినట్టు చెప్పిరి. కాని, కవి కృతిపతి యయిన దాసామాత్యునిసోదరుఁడగు రాజప్పను వర్ణించుచో—

మ. మదిరాక్షీమదనుండు రాజపమహామంత్రీంద్రుఁ డుద్యన్మహా
మ్మదలీఖాను కృపానులబ్ధమదవన్మాతంగమాణిక్యహా
రదుకూలాదికసత్కృతిం ద్రిదశవర్యస్ఫారసామ్రాజ్యల
క్ష్మిఁ దనర్చె న్బుధకోటి పేర్కొనఁగఁ బుళ్చేర్పట్టణాధ్యాసియై.

అనుపద్యములో నతఁడు కర్ణాటకపు నబాబగు మహమ్మదల్లీ చేత సత్కారమును బొందినట్లు చెప్పియుండుటచేతను, ఈమహమ్మదల్లీ ౧౭౪౯ వ సంవత్సరమునఁగాని సింహాసనమునకు వచ్చి యుండకపోవుట చేతను, వేదాంతరసాయనము ౧౭౫౦ వ సంవత్సరమునకు తరువాతనే రచియింపఁబడినదని నిశ్చయింపవలయును. ఈకవి కూచిమంచి తిమ్మకవి మొదలయినవారి కాలములోనే కృష్ణామండలమున నుండినవాఁడు. కృతినాయకుఁడు బందరుపురములో నధికారము చేసినట్లీ క్రిందిపద్యమువలనఁ దెలియవచ్చుచున్నది.

మ. ప్రకటారాతిచమూభయానకఘనప్రాకారఖేయంబులన్
సుకరశ్రీఁ దగుబందరాఖ్యనగరిన్ సొంపొందుదీనార్థిక
ల్పకభూజం బన దాసమంత్రి రుచిశుంభద్రత్నజాంబూనదా
దికవస్త్రప్రకరాన్వితాయతనుఁడై ధీరుల్ ప్రశంసింపఁగన్.

వేదాంతరసాయనకృతికర్తయు కృతిభర్తయు నిరువురును క్రైస్తవమతప్రవిష్టులైన నియోగి బ్రాహ్మణులు. వేదాంతరసాయనముయొక్క

యొక్కొక్క యాశ్వాసమునుండి యొక్కొక్క పద్యము నిం దుదాహ
రించుచున్నాను—

చ. జగదుపకారకారకవిశాలసమస్తపదార్థకల్పకుం
డగునతనిం బరాత్పరు మహామహు సర్వశుభస్వభావు బ్రెము
కఁగఁ దగుఁగాక యాతఁడిలఁ గల్గఁగఁ జేసినవానిపూజ స
ల్పఁగ దురితంబు లంటునని పల్కుట యొప్పు నసంశయంబుగన్. ఆ-౧

చ. ఘనతరపాపపుణ్యముఖకార్యసమాచరణస్వతంత్రతన్
గొనినమనంబు మానవునకుం బొసఁగం దగు లేనిచో జగం
బున సుకృతాఘము ల్నరక మోక్షపదంబులు గల్గవం చనం
జను నుచితజ్ఞ సంతతి నసంశయవాక్యవిజృంభణంబునన్. ఆ-౨

చ. చని సెలయేటి మొత్తములఁ జందనశైలమురుద్విలోల కాం
చనకురువిందచందనరసాలముఖద్రుసమీపగోస్తనీ
ఘనతరగాయమానములఁ గ్రప్పుఁదిన్నియలన్ లతానికే
తనముల సంచరింపుచు నతండు పరాత్పరచింతనంబునన్. ఆ-3

ఉ. వారలవాక్యకౌతుకనివాసమనోంబుజులై జగజ్జనా
ధారు నయప్రచారు సముదారుని నమ్మరియాకుమారునిన్
భారపుస్లీవమ్రానున విపద్దశలం బొరయించినట్టిని
ష్కారణవైరులన్ సరకుగాఁ గొన కించుక యెల్లదిక్కులన్. ఆ-౪

26. కనుపర్తి అబ్బయామాత్యుఁడు

ఈకవి యాఱువేలనియోగిబ్రాహ్మణుఁడు; రాయన మంత్రి పుత్రుఁడు; కౌండిన్యగోత్రుఁడు. ఈతనితల్లి నరసమాంబ; అన్న యోగానందము. ఈకవి యనిరుద్ధచరిత్రము, కవిరాజమనోరంజనము అను రెండు ప్రబంధములను రచియించెను. ఇందు మొదట రచియింపఁబడిన యనిరుద్ధచరిత్రములో—

ఉ. నిండుమనంబు సత్యమును నీతియు శాంతియుఁ గల్గి కీర్తిమం
తుం డయి భోగభాగ్యములతోఁ జెలువొందుచుఁ గొండవీటిభూ
మండలనాయకుల్మిగుల మన్ననచేయఁగఁ బెంపుమీఱె స
త్పండితుఁ డబ్బమంత్రి కనుపర్తి పురాన్వయవార్ధి పూర్ణచం
ద్రుం డని లోకు లందఱు నెఱుంగుటకు న్నుతిచేయ నేటికిన్.

అని కవి తనతాతయైన యబ్బయ్య కొండవీటిరాజుల మన్నన నొందినట్లు వ్రాసికొనెను గాని యాతని కాలమునాటికిఁ గొండవీటి రాజ్యము తురుష్కులయధీన మయినది. ఈహేతువుచేతఁ గాఁబోలును కవి కవిరాజమనోరంజనములో—

చ. సుగుణకదంబ మెల్ల నొకచోటనె కాపుర మున్నయట్లుగా
నగునని వేయినోళ్లఁ గొనియాడుచు భూజను లెంచ ధన్యుఁడై
తగు కనుపర్తియబ్బనకుఁ దత్ప్రియసాధ్వికి లచ్చమాంబకున్
బాగడిక కెక్కు రిద్దఱుసుపుత్రులు రాయన నిమ్మనాహ్వయుల్.

ఉ. వేయనవచ్చుఁగాక సుఖవే యనపాయవదాన్యవై భవం
బాయనవద్యబుద్ధి తగు నాయనకే యనఁ గీర్తిచంద్రికల్
గాయ నయస్వగీతికలు గాయనశీలురు పాడ నొప్పు మా
రాయనమంత్రి మేలు బళిరాయన సూరిజనాభివంద్యుఁడై.

అను పద్యములయందుఁ దనతండ్రి తాతలు కొండవీటిరాజుల

యొద్ద నున్నట్లు చెప్పక తనతాతకు ముత్తాతయైన బసవవామాత్యుఁడు మాత్రమే కొండవీటిరాజులమంత్రియైన ట్లీక్రింది పద్యమునఁ జెప్పెను-

శా. శ్రీపేర్మిన్ శశివోలె బ్రహ్మకులవార్థిం బుట్టి కౌండిన్యగో
త్రాపస్తంబపవిత్రసూత్రకలితుండై రామసింహాసనా
ఖ్యోపేతస్ఫుట కొండవీటిపురరాజ్యోర్వీశ్వరు ల్మంత్రిగాఁ
జేపట్టన్ బసవప్రధానుఁ డిల మించెన్ భాగ్యసంపన్నుఁడై.

కవియొక్క తండ్రి తాతలు కొండవీటిసీమలోని కనుపర్తిగ్రామమునకు కరణములని తోఁచుచున్నది. కవికి మంగళగిరిలోనున్న పానకాలరాయఁ డిష్టదైవతము. మంగళగిరి కృష్ణామండలములో గుంటూరునకు సమీపమున నున్నది. అబ్బయామాత్యుఁడు పదునెనిమిదవ శతాబ్దమధ్యమున నుండినవాఁడు. ఇతఁడు ౧౭౮౦ వ సంవత్సరప్రాంతమువఱకును జీవించి యుండవచ్చును. ఇతఁ డాశతాబ్దమునం దుండిన ప్రబంధకవీశ్వరు లందఱిలోను మిక్కిలి ప్రౌఢుఁడు. వసుచరిత్రమునకుఁ దరువాత నీతని కవిరాజమనోరంజనముతో సరిపోఁగఁదగిన ప్రబంధము లొకటి రెంటికంటె నెక్కువగా లేవు. కవిరాజమనోరంజనములోని యీక్రింది పద్యమువలనఁ గవి సాహిత్యమునందు మాత్రమే కాక సంగీతమునందును బ్రవీణుఁ డయినట్లు కనఁబడుచున్నాఁడు-

క. శ్రీమంగళగిరి నరసిం । హామే యకృపావిజృంభితాద్భుతకవితా
శ్రీమంతుఁడఁ గానకళా । ధీమంతుఁడ దేవతాస్తుతివ్రతపరుఁడన్.

కవిరాజమనోరంజనమునకుఁ బురూరవశ్చరిత్రమని నామాంతరముగలదు. బాల్యమునందు రచియింపఁబడినదగుటచే ననిరుద్ధచరిత్రము పురూరవశ్చరిత్ర మంత ప్రౌఢముగా లేదు. ఈరెండు పుస్తకములనుండియు గొన్నిపద్యముల నుదాహరించుటకన్నఁ గవి విషయమున వ్రాయఁదగిన విశేషాంశము లేవియుఁ గానబడవు.

అనిరుద్ధచరిత్రము.

చ. విచికిలగంధియున్ విభుఁడు వేడుకతోఁ దెర రెండువైపులన్
రుచిరకటాక్షపంక్తుల మెఱుంగులు నిండఁగ నిల్చి రయ్యెడన్
బ్రచురతరానురాగరసబంధురతం దెరచీర దూరి పా
ఱుచు హృదయాబ్జముల్ మొగమెఱుంగని చుట్టఱికంబు సేయఁగన్. ఆ-౧

ఉ. కన్నులఱెప్ప లాఁగని వికాసపుఁజూపును మానముద్రతో
నున్న మొగంబు నిశ్చలత నొప్పుశరీరముఁగాఁ బటంబుపై
నున్నతలీల వ్రాసినప్రియుం గని సొక్కునఁ దాను నట్లయై
చిన్నెలు దక్కియుండె సఖి చేసినజంత్రపుబొమ్మకైవడిన్. ఆ-౨

ఉ. మీసముతీరుఁజూచి జిగిమేని పటుత్వముఁజూచి మోములో
హాసముఁజూచి చేతులయొయారముఁజూచి మనోజ్ఞరూపరే
ఖాసమలీలఁజూచి యహహా యనుచుం దలయూఁచి ముందు తా
వ్రాసినభావ మెంచి తల వంచుకొనెం జలజాక్షి సిగ్గునన్. ఆ-౩

చ. అనవుడు మందహాసముఖుఁడై హరి నీభుజశక్తి నీవె నె
మ్మనమున లజ్జలేక పలుమాఱును మెచ్చుకొనంగ నీతియే
యని మొన నిల్చినప్పుడు నిరర్థక మీవెడమాట లేల నాఁ
కొని భుజియింపఁబోవుచును గూరలమే లడుగంగ నేటికిన్. ఆ-౪

ఉ. భూసురవేదనాదములఁ బుణ్యసతీజనమంజులోక్తులన్
భాసురవృత్తగీతరసబంధురరావములం బురీవనీ
వాసశుకానులాపముల వారణబృంహితవాజిహేషలన్
శ్రీసముదంచితం బగుచుఁ జెల్వు వహించెఁ బురంబు నవ్యమై. ఆ-౫

కవిరాజమనోరంజనము.

చ. కొడుకులు గల్గుదాఁక నొక కొన్నిదినంబులు చింత నందనుల్
పొడమిన నాయువు న్బలము బుద్ధియుఁ జాలఁగల్గఁగా
నుడుగనిచింత కల్గి తను నోలభజింపనిచింత తండ్రికె .
ప్పుడుఁ గడుచింతసేయుదురు పుత్రులు శత్రులుగాక మిత్రులే. ఆ-౧

సీ. ధర నల్పులకుఁ బ్రభుత్వంబు వచ్చిన మనుష్యుల వికారపుఁజూడ్కిఁ జూచినట్లు
పల్లవు ల్తుది లేమిపడి యింటిచాయరా మొగిలంజెతల్లులు మూల్గినట్లు
పరదేశియతిలోభపరునియింటికిఁ బోవఁ దెగిక్రోఁతివలెను గద్దించినట్లు
వంతువాసికి హీనవైశ్యులు తమలోన నేకంబుగాఁ గలహించినట్లు
నెఱలి యొండొకట్టిటెసి రూక్షదృష్టిఁ జూచు
గొఱగొఱను మూల్గు గద్దించుఁ దటిమి తటిమి
కవిసి కలహించి ఘోకృతి కలకలముగ
జాగిలమ్ములు రోషభీషణము లగుచు. ఆ ౨

చ. కిర మనురక్తిఁ గొమ్మ కరకంజమునం దిడి మీకుఁ బాలుఁ జ
క్కెరలును బెట్టి పెంచి వలికింపుచు మాటలు నేర్పినందుకా
విరసపుఁగూఁతల న్నిగుల వేదన గొల్పెద రింతి కియ్యెడన్
గురువుకు బొమ్మవెట్టితిరి క్రూరవిచారమ కీరవారమా. ఆ. 3.

ఉ. నిప్పులురాలు గ్రీష్మమున నిక్కినగాడ్పులు వార్షికంబునన్
జప్పుడుసేయకే మరలసాఁగెఁ బ్రతీచికిఁ బ్రాచినుండి తా
రప్పటిపొంగుచేఁ బ్రజల నాపదఁ బెట్టి నిజాధికారముల్
దప్పినఁ జిన్నబోయి మరలం జనుచుండురుగాదె నుప్రభుల్.

చ. మలయజగంధి తాళపరిమాణమనోహరరాగగీతికా
కలనినదంబు జంత్రమున గాత్రమునన్ జెలఁగింపు నింపుచే
శిలలు ద్రవించెఁ జిత్రములు జీవకళల్ ధరియించె దారువుల్
పొలుపుగ నంచరించె మృగముల్మదిఁ జొక్కువహించె నెంతయున్-ఆ.ర

మ. తగునే రాజకుమారగ మన్మథ మనస్తాపంబుచే నింత నె
వ్వగలం బొందఁగ ధైర్యశాలివిగదా వారాంగనా స్నేహమో
హగుణంబు ల్చపలాయతాయతము లెంతైన న్నతం బేలగున్
నగరే లోకులు నీమనం బిటులు మగ్నంబైన రాగాంబుధిన్—ఆ.గి.

27. కొణాద పెద్దనసోమయాజి

ఈ కవి నిజామురాజ్యములోని గద్వాలసంస్థానాధిపతియైన ముష్టిపల్లి సోమభూపాలుని ప్రేరణముచేత ముకుందవిలాసమును, అధ్యాత్మ రామాయణమును రచియించెను. ఇతఁడు నందవరీక నియోగిబ్రాహ్మణుఁడు; ఆశ్వలాయనసూత్రుఁడు; ఆత్రేయ గోత్రుఁడు; తిమ్మనార్య పుత్రుఁడు. సోమభూపాలుఁడు తన్నుఁగూర్చి పలికినట్లు కవి చెప్పుకొన్న ముకుందవిలాసములోని యీ క్రిందిపద్యములలో "శేషశైలేశలీల" అను నామముతో అపంచవర్గీయ చిత్రకృతి మొదలయినవానినిగూడఁ దాను రచించినట్లు చెప్పెను గాని యవి యిప్పుడు కానరావు—

సీ. ననునందవరపురాన్వయపయోనిధిచంద్రుఁగొణాదవంశవిఖ్యాతిసాంద్రు
నాశ్వలాయనసూత్రు నాత్రేయమునిగోత్రు సకలవిద్వత్తవిప్రవరమిత్రు
ప్రౌఢలక్ష్మీపతిపండితసోదర్యు బాహాటగ్రంథానుభావధుర్యు
వేదశాస్త్రపురాణవివిధమర్మధురీణు వరచతుర్విధకవిత్వప్రవీణు
భోజచంపూప్రబంధార్థబోధనాను
బంధగీర్వాణటీకానిబంధనాది
పేశలవచోరచనచర్యు పెద్దనార్యుఁ
గాంచి దయమించి పలికె సగౌరవముగ.

గీ. కాదివర్ణంబు లిరువదియైదువిడిచి। చేసితి వపంచవర్గీయచిత్రకృతిని
శేషశైలేశ లీలాఖ్యచే నెసంగ। యాదిమితవర్ణనియతి శక్యంబుజగతి?

ఉ. శ్రీరమణీ యతఁడ సురపురీనగరీసగరీ యదేశభూ
భారధురీణుఁ డాబహిరిపామనృపాలు సభాంతరంబునన్.
మారమణాంకితంబులుగను మత్స్యపురాణ మొనర్పఁ బూనవే
పారసుధాప్రసారవిలసత్కృతి నాంధ్రవచశ్చమత్కృతిఁ.

ఈ కవి సంస్కృతాంధ్రములయందు బహుసమర్థుఁడు. ఈతని గ్రంథములలో నున్నన్ని శబ్దాలంకారములును చిత్రబంధకవిత్వ పద్యములును మఱి యేకవిగ్రంథములోను లేవు. ఈతనికవనము రసవంతమయి కవిజన హృదయరంజకముగా నుండును. తన కవిత్వమును గూర్చి వెన్నెల కంటి వేంకటపతి యీ క్రిందిపద్యమును జెప్పినట్లు కవి తన యధ్యాత్మ రామాయణమునందు వ్రాసికొనియున్నాఁడు—

ఉ. ఇద్దఱుజోడు నన్నకవి యెఱ్ఱన, తిక్కన సోమయాజి దా
నుద్దగు వారికిన్, ముగురి కొక్కఁడె దీటగు నల్లసానిమా
పెద్దన, వారిత్రోడుతను బేరువహించిన శ్రీకణాదమున్
బెద్దనసోమయాజి విను పెద్దనఁ బోల్పఁ గవిత్వసంపదన్.

ఇట్లితరులు పొగడనట్లు చెప్పుటయే కాక కవి తాను తన ముకుందవిలాసము నిట్లు పొగడుకొన్నాఁడు—

గీ. ఇందు సకలహితము నిచ్చు ముకుందుచి
త్రీయతుల్యమా మదీయకవిత
యుదుటఁజేవఁ దొలువనులిబోలు నళిమోము
మృదువుగా దె విరులమీఁద వ్రాలి?

క. కుందవిలాసము తావి ము
కుందవిలాసము సదాముకుందవిలాసం
బిందువిలాసమును సుధా
బిందువిలాసము హసించుఁ బేశలఫణితిన్.

ఈకవి కాలముగాని కృతిపతి యనఁదగు పెదసోమనృపాలుని కాలముగాని నిశ్చయముగాఁ దెలియలేదు. అయినను

ఉ. నన్నయభట్టు భీమన ననంతు నథర్వణుఁ దిక్కయజ్వ నె
ఱ్ఱన్నను సోము భాస్కరుని నయ్యలు నైషధకావ్యకర్తఁ బో

తన్నను బిన్నపీరుని౯ జినన్నను నూరప రామభద్రుఁ బె
ద్దన్నను దిమ్మనార్యు గరుడాంకుని మూర్తి సుకీర్తి నెంచెదన్.

అని బట్టుమూర్తివలెనే కును గలకవుల నీకవి పొగడి యుండుటచేత నీతఁడు పదునాఱవ శతాబ్దాంతమునకును పదునేడవ శతాబ్దాదికిని దరువాత నుండినవాఁ డయినట్టు స్పష్టమగుచున్నది. ముష్టిపల్లి సోమనృపాలునితాత మొదలయినవారు మహమ్మదీయులతో యుద్ధముచేసి వారిని జయించుట మొదలయిన సంగతులు చెప్పఁబడి యుండుటచేత నితఁడు పదుఁనేడవ శతాబ్దాంతమునందో పదునెనిమిదవ శతాబ్దారంభమునందో యున్న ట్లూహింపఁ దగియున్నది. గద్వాలసంస్థానమునందున్న మామిత్రులకొకరికిఁ గవికాలవిషయమునుగూర్చి వ్రాయఁగా ౧౭౫౦ సంవత్సర ప్రాంతములయం దుండినట్లు తెలిపి యున్నారు. ఇందలి కవిస్తుతిలోఁ జేర్కొనఁబడిన యయ్యలు రెట్టమతమును జేసినతఁడే యయినపక్షమునఁ గవి ౧౬౭౦ వ సంవత్సరమునకుఁ దరువాతఁగూడ నున్నట్టు చెప్పవలసి యుండును. ముకుందవిలాసమునకు భద్రాపరిణయ మని నామాంతరము గలదు. కవికృతములయిన రెండు గ్రంథములనుండియుఁ గొన్ని పద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

ముకుందవిలాసము.

ఉ. ఆటలు పాటలుం గలుగునందపుగందపుఁగూటవాటముల్
కోటలు పేటలుం బసిఁడిగోడలు మేడలుఁ గల్గవిందురా
తోటలు నీటులుం గులుకుచుక్కను జుక్కను నిండుఁజెల్వపుం
బోటులమేటులం దగినపొన్నలచెన్నులు గల్గువీటిలోన్. ఆ-౧

ఉ. చేరలఁగొల్వవచ్చు దయచిప్పిలు గొప్పకుగొప్పకన్నులుఁ
మూరలఁగొల్వవచ్చుఁ గడుముచ్చట లిచ్చువెడదందవక్షముల్
బారలఁగొల్వవచ్చుఁ గచపాళి బళీ హరికి న్సమీపపున్
మేరలఁగొల్వవచ్చు నిఁక మే లిత, డీగతిఁ బ్రీతిఁ జేసినన్. ఆ-౨

ఉ. కౌనునకౌనభంబుసరి కావిజగావిలసిల్లుమోవికిం
పానఁగఁ బౌనకంబు సమ మానన మాననవిల్లు మేనమా
మే నననమేననం గనకమేనన మీననఁగన్నవండగున్
వేనలి వేనలిన్విరుల వేయుఁజువే యువతీమతల్లికిన్. ఆ-3

మ. తనరన్ వ్యాకరణజ్ఞుఁ దంత్రిడియనుచుం దర్కజ్ఞునిన్ భ్రాతయం
చును మీమాంసకునిన్ నపుంసకుఁ డటంచు న్వీడి దూరంబునం
గని యస్పృశ్యుసిఁబోలె ఛాందసుని వేడ్కం గావ్యలీలారస
జ్ఞు నిజేచ్ఛం గవితావధూమణి వరించున్ భావగర్భంబునన్. ఆ-౪

అధ్యాత్మరామాయణము.

సీ. సంసారదావాగ్నిసంతప్తులకు సుధాస్తోమవర్షిణియుక్తి రామభక్తి
తాపత్రయామయతాపపీడితులకు రమ్యభేషజయుక్తి రామభక్తి
పంచమహాపాపపటలసర్పములకు రచితగారుడశక్తి రామభక్తి
భవవిపద్వారాశిపాతభీతులకును బ్రబలతరీయుక్తి రామభక్తి
ప్రేమబోధితగురుసూక్తి రామభక్తి। కామితాత్మజనాసక్తి రామభక్తి
శ్రీమదురుసంపదనురక్తి రామభక్తి। సామరస్యోదితవిముక్తి రామభక్తి.
బాల.

చ. సొరిదిఁ గళత్రపుత్రపితృసోదరబాంధవముఖ్యసంగమం
బరయ నదీప్రవాహపతితాగతకాష్ఠములట్లు కూడుచున్
బరిపరివీడు నైజము ప్రవాగతజంతులఁబోలి మోహముల్
బొరయకయుండఁగావలయుఁ బోవుచును న్నెడవచ్చుచున్నెడన్.
అయోధ్య.

ఉ. అంతట దైత్యకాంతుఁడు సురాదివిరోధి సరోధిదాటి య
త్యంతవిభాకలంకను శుభాంకను లంక నశోకకాననా
భ్యంతరసీమలో నిలిపె నాసురకాంతలు కాచియుండఁగా
సంతతపూత సాధుగుణజాతను నాక్షితజాత నెంతయున్. ఆరణ్య.

ఉ. అంచలుపాఱెఁ గేకులకు నాటలుగేరె ఘనంబు లూరెఁ గ్రొ
మ్మించులుకూరె శీతలసమీరమువారె మరుండు చేరి ము
న్మించుగ జాతిబాణతతి మాఱె నటం బధికాళిధైర్యముల్
గ్రించుకజాఱె మాఱె నలగ్రీష్మము మీఱె జలాగమం బిలన్.

కిష్కింధా.

చ. కమలవిరోధి కామజయకారి కిరద్యుతికీర్తనీయుఁడున్
కుముదహితుండు కూటమృగగోత్రకృతాంకుఁడు క్లృప్తసత్కళా
క్రముఁడును కేశవేక్షణము కై రవిణీశుఁడు కోకభేదనా
గముఁడు కౌముదీకరుఁడు కంధిభవుం డుదయించెఁ దూర్పునన్.

సుందర.

ఉ. దానవనాశనార్థముగఁ దత్సతిఁ దెచ్చితి వీవును న్మహా
మీనము నామిషం బనుతమి న్విషపిండము గ్రోలిసోలు నె
ట్లానెఱి నామహీసుతసమాహరణం బొనఁగూడె మీఁదటన్
గా నగునట్టికార్య మదికానగుచున్నది దానవాగ్రణీ. యుద్ధకాండ.

మ. శ్రవణానందకరంబు సుందరముగా షడ్జాదిసప్తస్వరా
ర్ణవమున్ జాతిగతుల్ త్రికాలకలితస్థానత్రయీపూర్ణ మా
ర్గవిధుల్ తోఁపఁగ వల్లకీచతురతన్ రంజిల్ల గాంధర్వసా
రవిదుల్గాన మొనర్చి రాకుశలవుల్ రామాయణం బాసభన్. ఉత్తర.

28. కుందుర్తి వేంకటాచలకవి

ఈ కవి మిత్రవిందాపరిణయమనెడి యారాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడారువేల నియోగిబ్రాహ్మణుఁడు, అపస్తంబసూత్రుఁడు; శాండిల్యగోత్రుఁడు; రామయామాత్యపుత్రుఁడు. ఈతని తాతయైన గోవిందామాత్యుఁడు ౧౬౫౦ వ సంవత్సర ప్రాంతముల యందు రాజ్యముచేసిన వీరవేంకటపతిరాయలవద్ద నుండి, భారతీపరిణయమను కావ్యమునుజేసి యాతనిని మెప్పించినట్లు కవి యీ క్రింది పద్యమునఁ జెప్పియున్నాఁడు—

ఉ. పటుతరగోస్తనీమధురపాకసమంచితమై రసోర్మిప
 ర్యటమగుభారతీపరిణయం బనుకావ్య మొసంగి వీరవేం
 కటపతిరాయలం దనిపి కాంచె మణీకనకాభిషేక ము
 త్కటగతి నమ్మహామతి సుఖస్థితిశోభి యశోభిరాముఁడై.

ఈ కవికాలమునాఁటికి విజయనగర సంస్థానప్రభువులు మిక్కిలి హీనదశకు వచ్చినందునఁ గవి ఈ రాజ్యమునువిడిచి పాండ్యమండలమును జేరి మధురలో నుండినట్టు తెలియవచ్చుచున్నది. గ్రంథావతారికలోఁ దాను పాండ్యమండలాధీశ్వరుఁడయిన విజయరంగ చొక్కనాథునిఁ గవిత్వము చెప్పి మెప్పించినట్లు కవియే యీ క్రింది పద్యములలో వ్రాసికొని యున్నాఁడు—

సీ. చదివినా వేమేమి చదువయోగ్యంబులో
 యవియెల్ల నిశ్శంశయంబుగాఁగ
 వచనకావ్యములుగా రచియించినావు భా
 రతభాగవతములు రామకథయు
 ఘటియించినావు ద్రాక్షాపాకముగ బహు
 నాటకంబులు సమున్నతిఁ జెలంగఁ

జాటించినావు దిక్కోటరంబుల బుధ
కోటిమెచ్చ నపారచాటుకృతులు
నర్థగుంభసముజ్జృంభితాశుమధుర
చిత్రవిస్తరకవితా ప్రసిద్ధి నీకు
సహజమేకద పాండ్యభూజానిసభఁగ
ధాశుకవియనఁగీర్తిఁ జెన్నలరినావు.

చ. కవిజనకల్పకం బఖిలకావ్యరసజ్ఞుఁ డఖండపాండ్యభూ
ధవుఁడు మహానుభావుఁ డతిధార్మికుఁ డర్యగవజ్రధారి యై
న విజయరంగచొక్కనరనాథుఁడు నీ కవితాసమగ్రవై
భవములు మెచ్చి నీ కొసఁగె భర్మ మణీశిబికాదిసంపదల్.

పయిపద్యములనుబట్టి యితఁడు కొన్ని నాటకములను మాత్రమే కాక భారత భాగవత రామాయణములను వచనకావ్యములుగాఁ గూడ రచియించినట్టు విశదమగుచున్నది. ఇతఁడు మాత్రమేకాక యితని కాలమునందుండిన యితరకవులనేకులు కూడఁ దాము వచనకావ్యము లను రచియించినట్టు తమ ప్రబంధములలో వ్రాసికొనియున్నారు. ఈ వచనకావ్యము లన్నియు మాకు దొరకకపోయినను, ఈ కాలములో రచియింపఁబడిన వచనకావ్య మొకటిమాత్రము మాకు లభించినది. ఆ వచనకావ్యమునుగూర్చియుఁ దత్కర్తనుగూర్చియు నింతకుముందే కొంత వ్రాయఁబడెను. పయి నుదహరింపఁబడిన వానిలోని కడపటిపద్య మునుబట్టి కవికాలము సహితము స్పష్టమగుచున్నది. విజయరంగ చొక్కనాథుఁడు ౧౭౦౪ వ సంవత్సరము మొదలుకొని ౧౭౩౧ వ సంవ త్సరమువఱకును రాజ్యముచేసి విద్వాంసుఁడై యాంధ్రకావ్యరచనను బ్రోత్సాహము చేసినవాఁడగుటచేతను, అతని కాలములోనే కవి యనేక గ్రంథములనుజేసి తర్వాత మిత్రవిందాపరిణయమును జేసియుండుటచేతను, ఇతఁడు హూణశకము ౧౭౪౦ వ సంవత్సర ప్రాంతమువఱకును జీవించి

యున్నట్లు తెల్లమగుచున్నది. కొంతకాలమునుండి యీతని పూర్వీకవు లాచరించుచు వచ్చిన యీయాచారమును మానక యీ కవియు రంగ నాథుఁడు తనకు స్వప్నమున సాక్షాత్కరించినట్లే క్రింది పద్యమున వ్రాసి కొనియున్నాఁడు—

సీ. నీలమేఘముడాలు చాలువించఁగఁజాలు
మేనువాఁడు జగంబు లీనువాఁడు
వేల్పురాఱాతల్పు విప్పుటందమదల్పు
బొమ్మువాఁడు కళాభరమ్మువాఁడు
వెలలేనిబంగారు వేవన్నెరంగారు
చేలవాఁడు మనోజ్ఞలీలవాఁడు
కడకంట సొంపారుకరుణారసమువీఱు
చూపువాఁడు భవంబుఁబాపువాఁడు
హీరకటకకిరీట కేయూరతార
హారమంజీరచాకచక్యములవాఁడు
కలనొకానొకపురుషుఁ డుత్కలికదొలుకఁ
బ్రేమ నాప్రోల వేకువజామువేళ.

గ్రంథమునం దక్కడక్కడ లక్షణవిరుద్ధములైన ప్రయోగము లనేకము లుండుటచేత నీతఁడు లాక్షణికకవి కాకపోయినను, మొత్తము మీఁద నీతనికవిత్వము రసవంతముగానే యున్నది. మిత్రవిందాపరిణ యములోని రెండుమూఁడు పద్యముల నిందుదాహరించుచున్నాము—

చ. అని వనితోక్తియుక్తిగతి నవ్వని జవ్వనిగుంపు సొంపుఁ జే
కొని తనివార సౌరభము గ్రోలుచు సోలుచు మిన్నగన్న క్రొ
న్ననల నవద్యహృద్య కల నగ్గని కన్గొని తావిమూని పెం
పొనరిన మేరఁ గీరరుతు లూకొని తూకొనినంత వింతగన్. ఆ.వె

ఉ. సారస మా మొగంబు జితసారస మాగమనంబు నాభికా
సారసమాభ మాకచమసారసమాజము మేఘు మాసుధా
సారసమావృతంబు నుడి సారసమానము తప్పతంబ మా
సారసమాననీయసువిసారసమాయత మాదృగబ్జముల్. ఆ. ౪.

చ. కనియె నుదారుఁ జారుతరకౌస్తుభహారు సుమేరుధీరు జీ
వనదశరీరు దుగ్ధమయవార్ధిగభీరు దురాపసారులో
చనసుఖదావతారు ఖలశైలశతారు నఘౌఘదూరు స
ద్వినుతయశోవిహారు వసుదేవకుమారు నతాబ్జసూరునిన్. ఆ. ౬.

---

29. ఈదురుపల్లి భవానిశంకరుఁడు

ఈ కవి ధర్మఖండమును దెనిఁగించెను. ఇతఁడు కూచిమంచి తిమ్మకవితోను వక్కలంక వీరభద్రకవితోను సమకాలికుఁడయినందున, ఇతఁడును పదునెనిమిదవ శతాబ్దారంభమునుండి ౧౭౫౦ వ సంవత్సర ప్రాంతములవఱకును జీవించియుండును. ఈ కవి తన ధర్మఖండమున వక్కలంక వీరభద్రకవినగూర్చి వ్రాసిన "హరిశౌర్యుండగు" నను పద్య మీ వఱకే యుదాహరింపఁబడియున్నది. దిట్టకవి వేంకటరాయకవి తన విద్యాగురువైనట్లు కవి ధర్మఖండమున నీ క్రింది పద్యముచేఁ జెప్పుకొని యున్నాఁడు—

ఉ. శ్రీమయవాగ్విలాసుఁడు నశేషలిపిప్రవణుండు భూరిశో
భామహనీయమూర్తియుఁ బ్రబంధనిబంధనబంధురక్రియా
భామహితోరుసూత్రుఁడు నృపాలకపూజ్యుఁడు నంచుఁ దప్పుధుల్
వేమఱు నెంచ దిట్టకవి వేంకటరాయకవీంద్రుఁ డొప్పుగున్.

ఈ కవి యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; భారద్వాజ గోత్రుఁడు, శంకరామాత్య పుత్రుఁడు. కవి తాను శృంగారమంజరి యను

కావ్యమునుగూడ రచించినట్లీక్రింది పద్యమునఁ జెప్పుకొనెను గాని మాకా గ్రంథము లభింపలేదు—

సీ. ధాత్రి భారద్వాజగోత్రపవిత్రుఁడై సురుచిరాపస్తంబసూత్రుఁ డగుచు
నిరతాన్నదానాభిసరతుఁడౌ నీదురుపలి నరసమాత్యుపౌత్రవరుని
సంతతపూజితశంకరుం డగుశంకరామాత్యవరాళికి నాత్మభవుఁడ
బ్రాజ్ఞుని నచ్చమాంబాగర్భశుక్తిముక్తామణి నీశ్వరధ్యాననిరతు
భవ్యశృంగారమంజరీకావ్యరత్న
మంధ్రభాష నొనర్చినయనఘచరితు
శంభునిభుఁడై నయివటూరి శంభుశిష్యు
నను భవానీశనాముఁగన్గొనుచుఁ బలికె.

ఈ కవి రచియించిన గ్రంథము సమగ్రముగా దొరకలేదు గాని దొరకినంతవఱకుఁ గవనము రసవంతమయి మధురమయి నిర్దుష్టముగా నున్నది. ధర్మఖండమునుండి రెండుమూడు పద్యముల నిందుదాహరించుచున్నాను—

చ. అనవిని వానిఁజూచి మునులారయఁ బుత్రకళత్రరక్షకై
యనయముఁ గ్రూరవృత్తిమెయి నర్థము నీవు గడించె దేని నీ
ఘనతర మైనకిల్బిషనికాయము భాగమువారు కొందురో
కొనరొ యెఱుంగఁ జెల్పు మలికుంటితలీల నటంచుఁ బల్కినన్.

చ. హరి భజియింపనైతి లలనావయవామితవర్ణనాప్తి న
స్థిరమతి నర్థిలోభరతిఁ జేయఁగనైతిఁ బరోపకార మి
ద్ధర శతతాదయాకలితతాగుణము ల్సహజంబు లయ్యె నె
ట్లరయుదు నీయపారకలుషాబ్ధికిఁ దారణయానపాత్రమున్.

చ. ఫలితతరుల్ ద్విజాతులకు భక్తి నొసంగుటయుఁ గత్తోదక
స్థలములఁ బ్రాణిలోకము హితంబునకై సరసీతటాకముల్
నిలుపుటయున్ మహాత్ములకు నెంజిలి దీర్చుటయున్ దలంప నీ
యలఘుసుకర్మపంక్తులు తదవ్యయమార్గసుఖైకహేతువుల్.

30. ధూర్జటి వేంకటరాయకవి

ఇతఁడు రత్నావళీపరిణయ మనెడు నాలుగాశ్వాసముల ప్రబంధమును రచించి చేకూరి రామస్వామిమంత్రి కంకితము చేసెను. ఈకవి కాళహస్తిమహాత్మ్యమును రచియించి కృష్ణదేవరాయల కాలములో నుండిన ధూర్జటికవి వంశమువాఁడు. ఇతఁడు తన గ్రంథమునందు ధూర్జటి నిట్లు స్తుతించి యున్నాఁడు—

మ. పటుగంగాలహరీతరంగసమశుంభత్ప్రౌఢతాంచత్కథా
ఘటనున్ బాదవినమ్రకృష్ణవరరాడ్గంభీరకోటీరవి
స్ఫుటరత్నద్యుతిపాటలీకృతపదాంభోజాతు సర్వజ్ఞ ధూ
ర్జటినిం గొల్చెద నస్మదీయకులకర్తన్ భక్తి రంజిల్లఁగన్.

ఈధూర్జటిపౌత్రుఁ డయిన వేంకటపతి కృష్ణరాజవిజయమును జేసెను. ఈవేంకటపతి కుమారుఁడును కవితండ్రియు నైన లింగరాజు కాళహస్తిరాజుల ప్రేరణముచేత మఱియొక పెద్దకాళహస్తి మహాత్మ్యమును రచియించెను. రత్నావళీపరిణయమునఁ గవి తన తండ్రిని గూర్చి యిట్లు వ్రాసియున్నాఁడు—

మ. ఘనగౌరీశకటాక్షలబ్ధకవితాగాంభీర్యసంతుష్టభూ
జనరాడ్దత్తసువర్ణచేలమణిభూషాగ్రామపల్యంకికా
ఘనదంతావళఘోటకాదిబహుసత్కారప్రతిష్ఠాత్ము మ
జ్జనకున్ ధూర్జటి లింగరాజకవిరాజశ్రేష్ఠుఁ గీర్తించెదన్.

ఈకవి పాకనాఁటి యార్వేలనియోగి బ్రాహ్మణుఁడు; భారద్వాజ గోత్రుఁడు. ఇతఁడు తన్నుఁగూర్చి చెప్పుకొనుచుఁ దానింతకుమున్ను నామలింగశాసన మనఁబడెడి యమరమునంతను బద్యకావ్యముగా రచించిన ట్లీక్రింది పద్యములలోఁ దెలిపియున్నాఁడు—

చ. స్థిరముగఁ గాళహస్తిగిరిజేశవరాగతసంస్కృతాంధ్రసుం
దరకవనంబు వ్యాకరణనాటక కావ్యవిచక్షణత్వముల్
గరిమవహింప భూవరశిఖామణు లెన్నఁ జెలంగి తౌర బం
ధురతనుకాంతిబాలరవి ధూర్జటి వేంకటరాయసత్కవీ.

మ. అమరం బంతయుఁ బద్యకావ్యముగ భవ్యంబై నయయ్యాంధ్రభా
ష మహాపండితసత్కవివ్రజము మెచ్చన్ సాహితీకౌశల
క్రమ మొప్పన్ దృఢభక్తితోడుతను శ్రీరామాంకితంబై తగన్
రమణీయంబుగఁ జేసినాఁడవు బళీ ప్రఖ్యాతివాటిల్లఁగన్.

ఈకవి కాలనిర్ణయమునుగూర్చి కొంచెము విచారింపవలసి యున్నది. ఈతనితండ్రియైన లింగకవి తా నురచియించిన పంచ్రెండాశ్వాసముల కాళహస్తిమహాత్మ్యమును కాళహస్తి రాజయిన దామెర్ల యక్కప్పనాయని పుత్రుఁడగు వేంకటపతిరాయని కంకితముచేసి యున్నాఁడు. అక్కప్పనాయని పుత్రుఁడయిన వేంకటపతినాయఁడు పదునేనిమిదవ శతాబ్దారంభమున నుండినవాఁడు. దీనినిబట్టి చూడఁగా కవి ౧౭౫౦ వ సంవత్సరప్రాంతమునం దుండినట్టు నిశ్చయింపవలసి యున్నది. అయినను మన మిప్పుడు నిర్ధారణముచేసిన యీకాలమున కొకబాధకము కనఁబడుచున్నవి. కవితండ్రియైన లింగకవి తన కాళహస్తి మహాత్మ్యమునందు—

సీ. శ్రీకాళహస్తీశ సేవనాన్వితచిత్త చిత్తజాకర లక్ష్మీవిహార
రమణీయశీల భారద్వాజగోత్రపవిత్ర యాపస్తంబసూత్రమహిత
ధూర్జటివంశపాథోధిచంద్ర కుమారధూర్జటినామ విస్ఫూర్జితాంక
సుత్రమతి వేంకటపతితనూభవ లింగరాజకులేంద్ర ధైర్యాచలేంద్ర.

అను సీసపద్యములోఁ దాను కృష్ణవిజయము నొనర్చిన కుమారధూర్జటికిఁ బుత్రుఁ డయినట్టు వ్రాసికొనియున్నాఁడు. ఈకుమారధూర్జటి తాను కృష్ణదేవరాయలకాలములోనుండి కాళహస్తిమాహాత్మ్యమును

రచించిన ధూర్జటికవికి మనుమఁడైనట్టు తనకృష్ణరాజవిజయమున వ్రాసికొని యున్నాఁడు. ౧౫౨౦ వ సంవత్సరప్రాంతమునందుఁ గృష్ణదేవరాయలకాలములో నుండిన ధూర్జటికవి మనుమని కొడుకగు లింగకవి ౧౭౩౦ వ సంవత్సరప్రాంతమునం దక్కరాజు వేంకటపతి కాలములో నన్నఁగా నిన్నూటయేఁబదిసంవత్సరములకుఁ దరువాత నుండుట పొసఁగనేరదు. కాఁబట్టి కుమారధూర్జటికి ధూర్జటి సరిగా తాతగాక తాతవరుసవాఁడయియుండవచ్చును. అందుచేతనే కాఁబోలుఁ గుమారధూర్జటియే యొకచోట ధూర్జటిని దనపెదతాతనుగాఁ జెప్పుకొన్నాఁడు. ఈలింగకవియుఁ దనతండ్రిని ధూర్జటి మనుమనిగాఁ జెప్పక 'ధూర్జటివంశపాథోధిచంద్ర' యని తద్వంశజునిగా మాత్రము చెప్పినాఁడు. కుమారధూర్జటి చినవేంకటాద్రీశ్వరుని యాజ్ఞాప్రకారముగాఁ దాను కృష్ణరాజవిజయము చేసితినని చెప్పుకొన్న చినవేంకటాద్రి నరపతి కృష్ణరాజవిజయకృతిపతియగు కోదండరామరాజుయొక్క రెండవకుమారుఁడగు చినవేంకటాద్రియైనచో నీకాలనిర్ణయ మించుమించుగా సరిపోవును. రత్నావళీ పరిణయకర్తయగు వేంకటపతి కవిత్వము ప్రౌఢ మయి హృద్యముగా నున్నది. కవిత్వరీతిని జూపుటకయి కొన్ని పద్యము లిందు క్రిందఁ బొందుపఱుపఁ బడుచున్నవి.

మ. మెఱుఁగుంబోఁడులు వీటసౌధచరలై మిన్నేటిబంగారుతా
మరపువ్వుల్ గ్రహియింపఁబోవ మదశుంభద్భంభరశ్రేణి త
త్తరుణీవక్త్రవితానముం గదియభీతస్వాంతలై కాంతలం
త రయప్రౌఢిఁ గవాటము ల్మొగుతు రుద్యన్ముగ్ధభావంబునన్. ఆ-౧

ఉ. ధన్యుఁడ వీవు సుమ్మని ముదమ్మునఁబల్కి సమస్తదేవమూ
ర్ధన్యుఁ డదృశ్యుఁడైన మది రంజిలఁగా వసుభూతి యంత సౌ
జన్యసమేతయైననిజజాయయుఁ దాను సమస్తభోగస
న్మాన్యము నైజమందిర మమందగతిం జని చేరెఁ గూరిమిన్. ఆ-౨

చ. ఘనతరలక్షణప్రతిభగాంచిన రాజనటంచుఁ బద్మినీ
జనములఁ గుందఁజేసి యనిశంబు ద్విజప్రతతిం గలంపఁగాఁ
దఃరు మహాప్రతాపమహితస్థితిఁ గాంచుచు వచ్చునట్టి న
య్యినకరమండలాగ్రహతి నెంతయు వెల్వెలనై త్రోలంగవే. ఆ-3

మ. చెలి రత్నేశ్వరు నొక్కనాఁ డిటువలెన్ సేవించి మోదంబుతో
లలన ల్మగ్గురు వెంటనంట నిజలీలామందిరాంచద్దిశా
స్థలిఁబోవన్ గ్రహియించె రక్కసుఁడు దోస్సారంబు మించంగ బె
బ్బులిచేఁ జిక్కకురంగుల ట్లతివ లింపు ల్దక్కి భీతిల్లగన్. ఆ-౫

---

31. అయ్యల రాజు - అయ్యల భాస్కరకవులు

అయ్యలరాజవంశసంభవు లయిన యయ్యలకవియు భాస్కరకవియుఁ జేరి కాలస్వరూపాదులను దెలిపెడి రెట్టమత మనుగ్రంథమును కన్నడభాషనుండి యైదాశ్వాసముల పద్యకావ్యమునుగా దెనిఁగించిరి. ఈకవు లిరువురును క్రీస్తుశకము ౧౭౭౬ వ సంవత్సరమునం దీపుస్తకమును దెలిఁగించినట్లుగా గ్రంథాంతమునందలి యీక్రింది పద్యమువలనఁ దెలియవచ్చుచున్నది—

సీ. కలియుగప్రథమభాగమునాల్గువేలయెన్మిదినూర్లపై నిడెబ్బదియునొకటి
శాలివాహనశక సము లిల వేయునార్నూటతొంబదిరెండు రూఢిగాఁగఁ
బ్రభవాదిగతములు పరఁగ నిర్వదిమూడు నేండ్లయ్యె నెంతయు
నెన్ను బుధులు
అట్టికాలంబున నయ్యలభాస్కర కవివర్యు లలరాజకమలహితుని
యాజ్ఞఁ బూర్వోక్త రెట్టమతాఖ్యకావ్య
మును నొనర్చిరి యాచంద్రముగను గీర్తి

వక్తృశ్రోతలకునుగల్గ వసుధమీఁద
నల యహోబలనృహరికి నర్పణముగ.

కవు లీగ్రంథమును కొండ్రాజు పెదతిమ్మరాజునకుఁ బుత్రుఁడును మంగయ గుర్వరాజునకు దౌహిత్రుఁడును నయినవేంకటరాజున కంకితముచేసిరి. ఈవేంకటరాజు కర్నూలుమండలములోని యెఱ్ఱపాలెము నకుఁ బాలకుఁడును అహోబలక్షేత్ర ధర్మకర్తయు నయినట్టును, అతఁడు కవులను బిలిపించి రెట్టమతమును దెనిఁగింపఁ బ్రార్థించినట్టును ఈపద్యములలోఁ జెప్పఁబడి యున్నది.—

సీ. శ్రీమదహోబిలస్వామి మహారాజ్యరక్షకుం డగుచు నేరాజువెలయు
నభిరామకామందకాఖ్యసత్కావ్యరత్నమునకు నేరాజు నాథుఁడయ్యె
జానకీనాయకచరణసంసేవనప్రౌఢిచే నేరాజు ప్రబలు సిరుల
నెరయూరిపురవరాధీశాదిబహుబిరుదాంకఁడై యేరాజు యశముగాంచె
నతఁడు కొండ్రాజు తిమ్మభూపతివరేణ్య
తనయ పెదతిమ్మరాయవతంసగర్భ
వార్థిచంద్రుండు సత్కులవర్ధనుండు
సతతవిభవుండు వేంకటక్ష్మావిభుండు.

క. ఒకనాఁడు నిఖిలకోవిద । సుకవిహితామాత్యబంధుసుతవీరభట
ప్రకరముకొలువఁగఁ గొలువుండి కథాప్రస్తావ మాత్మనివ్వటిలంగన్.

గీ. రాయకవిప్రైన యయ్యలరాజవంశ్యు
ననఘుఁబినయక్కవిభుపుత్రునయ్యలాఖ్యు
నాగఘనుసూను భాస్కరనామధేయుఁ
గరుణ దళుకొత్త రావించి గారవించి.

వ. తత్కాలోచితప్రసంగంబున నిట్లనియె.

గీ. ఘనతసుజ్ఞాననిధి రెట్టఘనుఁడు మున్ను
చెలఁగఁ గన్నడభాషను జెప్పినట్టి

శాస్త్రమంతయు నేను నీజనులుఁ బొగడఁ
దెనుఁగుభాష నొనర్పంగఁ దివురుఁడీరు.

ఈపుస్తకమునుబట్టి యీకవుల కాలమును నిర్ణయించుటకు మాత్రమే కాక తెనాలి రామకృష్ణుని కాలమును కనుఁగొనుటకు సహితము కొంతయాధారము కానవచ్చుచున్నది.

రెట్టమతమును దెనిఁగించిన యీకవుల యింటిపే రయ్యలరాజువారు. వీరిలో నొకఁడు పినయక్కయామాత్యపుత్రుఁ డయిన యయ్యలకవి; రెండవయతఁడు నాగయామాత్యపుత్రుఁ డయిన భాస్కరకవి. ఈకవుల కిద్దఱికి నెట్టిబంధుత్వమున్నదో తెలియరాదుగాని వీరన్నదమ్ముల బిడ్డలని తోఁచుచున్నది. వీరి పూర్వులలో నొకఁడైన తిప్పనార్యుఁ డొంటిమెట్ట రఘువీరశతక నిర్మాణ కర్తుఁడయి రాయల యాస్థానకవిగా నుండెను; ఆతని మునుమఁ డయిన రామభద్రకవి రామాభ్యుదయమును రచియించెను. ఈకవుల కవిత్వము నిర్దుష్ట మయినది కాదు. ఈపుస్తకముగాక కామందకమునుగూడఁ గృతిపతి గృతినందె నఁట. కవనరీతిని దెలుపుటకయి రెట్టమతమునుండి కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. పూవులు నక్షత్రంబులును బొందుగ దోయిటఁదాల్చి వానకై
భావములోన మానవుఁడు ప్రశ్నయొనర్పఁగఁ బక్షి యయ్యెడన్
వావిరి జేసెఁ గాఁ బలుక వారితవృష్టియుఁ గల్గునంద్రు గో
త్రావలయంబునందుఁ గవిరాజనుతింపఁగ వేంకటాధిపా. ఆ-౧

ఉ. పాఱెడు బండ్లిమ్రోఁతగతి బండులు చెల్వుగరొప్పురీతి వే
సారక గార్దభం బఱచుజాడను ఘంటలనాదుకై వడిన్
వారక తోముకుండలరవంబుగతిన్ స్తనితంబు పర్వినన్
ధారుణి వాన లేదనిరి ధన్యుఁడు రెట్టఁడు ప్రాజ్ఞులెన్నఁగన్. ఆ-౨

చ. అమరగురుండు లగ్నమునయందు వసింపఁగ విత్తుటల్ చతు
ర్థమున మెలంగఁ బైరు తటితప్పకయుండుట సప్తమంబునం
దమరఁగ వేగ నాపయిరు లాయతపెట్టుట మంచి దెంతయున్
విమలగుణాఢ్య తిమ్మపృథివీపతి వేంకటరాజశేఖరా. ఆ-3

చ. రవితనయుండు రోహిణీకరంబున నుండిన చైత్రకంబునన్
దవనము హెచ్చు మర్త్యులకుఁ దద్దయు నుబ్బెనఁగుం బెవుళ్లు సం
భవిలును గౌతమీనదిని బంటలు రాజిలు నన్యభూములన్
ధ్రువముగ వాన లే దనియెఁ బోడతనంబున రెట్టఁ డిమ్మహిన్. ఆ-ర

మ. బుధుఁ డబ్దాధిపుఁడైన వానకురియున్ భూమండలిన్ రక్తధా
న్యధరల్ శ్రీలు ఘటిల్లు రాజుల ప్రజ ల్మన్నింతు రెందున్ సమ
స్తధరామర్త్యులకున్ శుభం బొదవుఁ గాంతాశ్రేణిపైఁ గూర్మి య
త్యధికం బాయువకోటికి న్వినుము ధన్యా వేంకటక్ష్మాధిపా. అ-౫

---

32. అజ్జరపు పేరయలింగము

ఒడయనంబివిలాస మనెడి స్థలపురాణగాథను దెనుఁగున నాఱాశ్వాసముల గ్రంథముగా రచియించిన యీకవి శైవుఁడైన యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు. ఇతఁడు పదునెనిమిదవ శతాబ్దమధ్యమునందనఁగా నిప్పటికి నూటయేఁబది సంవత్సరములక్రిందట నుండినట్టు కనుపట్టుచున్నాఁడు. ఒడయనంబివిలాసముయొక్క యవతారికయందున్న—

ఉ. బమ్మెరవంశమందునను బ్రౌఢసరస్వతి పద్మగాంచి తా
నెమ్మె దలిర్పఁ గేసనకవీశ్వరు లప్పమనామసాధ్వియం
దిమ్మహిఁ గూర్మిఁ గన్నసుత యెల్లమయందును బేరయాఖ్యుఁడ
న్నమ్మతిఁ గంటి వీరనరసమ్మను గంగనమంత్రి యుగ్మమున్.

అను పద్యమునుజూచి భ్రమించి యొక రీకవీశ్వరుఁడు బమ్మెర పోతరాజుగారి బావమఱఁదియని వ్రాసియున్నారుగాని యీయంశ మంతవిశ్వాసార్హమయినదిగాఁ దోఁచదు. పయిపద్యము నాయొద్దనున్న వ్రాఁతపుస్తకమునం దిట్లున్నను ముద్రితప్రతిలోఁ దప్పుల కుప్పఁగా నచ్చొత్తింపఁబడి యున్నది. ఇందుఁ జెప్పఁబడిన కేసనకవీంద్రుఁడు బమ్మెర పోతనామాత్యుని తండ్రియైన కేసనకాఁడు. తనతండ్రి కవీశ్వరుఁ డయినట్లు పోతన భాగవతమునఁ జెప్పుకొనియుండలేదు; తనకన్న యొకఁ డుండినట్లు చెప్పుకొనలేదుకాని తోఁబుట్టినవాఁడుచున్నట్టును జెప్పుకొని యుండలేదు. అంతేకాక, "తనకు లక్కమాంబ ధర్మగేహినిగాఁగ" అని పోతన తనతల్లి లక్కమ యైనట్టు చెప్పుకొన్నాఁడు. ఈకేసన్న భార్య లక్కమాంబగాక యప్పమయైనట్టు కవియే వ్రాసియున్నాఁడు. అయి నను గవి మామగారు పోతనామాత్యుని తండ్రియైన కేసన యని సమ ర్థించుటకయి యొకరు పద్యములోని "కేసన కవీశ్వరు లప్పమనామ సాధ్వి" యన్నభాగమును "కేసనకవీంద్రుఁడు లక్కమసాధ్వి"నని దిద్దుట కయి సహితము ప్రయత్నము చేసినారు. ఈకవికి బమ్మెర పోతనామా త్యునివంటి కవిశ్రేష్ఠుఁడే బావయయి యుండినపక్షమున, అతఁడాబం ధుత్వమును దెలుపుకొన కుండఁడు. కవి యీగ్రంథమును వ్రాయునప్పటి కితని మనుమఁడుకూడ పెద్దవాఁ డయియున్నందున, ఆకాలమునకుఁ బోతన కవిత్వ మారంభింపని పిన్నవయసువాఁ డగుటచే నాతని పేర్కొన లేదని చెప్పుటకుసహిత మవకాశము లేదు. ఈకవి తనవంశమూల పురుషుఁడైన కొండన గజపతియైన వీరనృపాలునిచే గోదావరిమండ లములోని యజ్జరపుగ్రామము నగ్రహారమునుగాఁ బడసిన ట్లీక్రిందిపద్య మునఁ జెప్పియున్నాఁడు—

శా. శ్రీరంజిల్లఁ జెలంగుచున్న గజరాట్సింహాసనాధ్యక్షుసన్
ధారాళంబుగ వేదశాస్త్రబహువిద్యాసూక్తి మెప్పించి యీ

వీరాగ్రేసరుఁ డియ్యెఁ గొండన మహావిఖ్యాతిగా గౌతమీ
తీరక్షోణిని నజ్జరంబనఁగఁ దాఁ దెచ్చెన్మహాగ్రామమున్.

ఇందుఁ జెప్పఁబడిన వీరాగ్రేసరుఁడు—

మ. ధర కెంధూళులు కృష్ణరాయలచమూధాటీగతి న్వింధ్యగ
హ్వరము ల్దూఱఁగఁ జూచి తా రచటఁ గాపై యుండుటం జాల న
చ్చెరు వై యొత్తిసి వింతచీఁకటులు వచ్చెం జూడరే యంచు వే
సారిదిం జూతురు వీరరుద్రగజరాట్సంధ్యాంతమూర్ధాంగనల్.

అని మనుచరిత్రమునందుఁ గృష్ణరాయనిచే నోడింపఁబడినట్లు చెప్పఁబడిన వీరరుద్రగజపతియేమో యని యూహ పుట్టుచున్నది. ఆయూహయే నిజమయినచోఁ గవివంశమునకు మూలపురుషుఁడయిన కొండన పదునాఱవశతాబ్దాదియం దుండియుండవలెను. కవి కొండన కేడవపురుషుఁ డయినందున నొక్కొక్కపురుషునికి ముప్పదేసి సంవత్సరముల చొప్పునఁ జూచినచో నీపేరయకవి ౧౭౫౦ వ సంవత్సరప్రాంతములయం దుండియుండును. పలివెల మొదలయిన గ్రామములయం దిట్టి వలఁ జేరినవేశ్యలను వర్ణించి యుండుటచేతను, పదునేడవశతాబ్దమునందలి కవుల గ్రంథములలోని పద్యములను జూచి యటువంటిపద్యములను జేసియుండుటచేతను, మఱికొన్ని కారణములచేతను పేరయకవి పదునెనిమిదవ శతాబ్దమువాఁడని నిశ్చయముగాఁ జెప్పవచ్చును.

చ. మొదలను బద్మసూతి నవమోహనులౌ తెఱఁగంటికొమ్మలన్
ముదమునఁ దా సృజించి సుమనోహరమూర్తుల దక్షవాటికా
సుదతులఁ దానొనర్చి యట సొంపునఁ బల్వెల వారకాంతలన్
గదలక తా సృజించెఁ గిరకౌశల ముప్పొచునుండ మానినీ.

అని పలివెల వారకాంతలు వర్ణింపఁబడిరి. పదునేడవ శతాబ్దారంభమున సారంగు తిమ్మన వైజయంతీవిలాసమున—

ఉ. ఒక్కనిఁ బిల్వనంపి, మఱియొక్కనిచేతఁ బసిండిపట్టి, వే
ఱొక్కటియింటి కేగుచు, మఱొక్కని నానడుచక్కి నొక్కచోఁ
బొక్కిలంచి చూడ భ్రమఁ బొంది విటుల్తెలియంగలేరుగా
కెక్కడిసత్య మేడవల పెక్కడినేమము వారకాంతకున్ ?

అని వ్రాసిన పద్యము ననుసరించి యీపేరయకవి,

ఉ. ఒక్కని డాయరమ్మని మఱొక్కనిఁ గన్గొని ముచ్చటించి వే
ఱొక్కనిఁ బొంది రొక్కము మఱొక్కనిచేఁ గొని వేడ్కవారికి
ఎక్కడుప్రేమ లుండ వలపించుట ధర్మముగాక యయ్యయో
యొక్కనియందె తా వలచియుండుట న్యాయమె వారకాంతకున్.

అని వ్రాసియున్నాఁడు. ఈయొడయనంబివిలాస మనుస్థలపురాణము విప్రనారాయణ చరిత్రమునుజూచి దానిని మించునట్లుగా కల్పింపఁబడిన కథయే యయినను, ఇందలికథ వైజయంతీవిలాసములోని కథ కంటెను నెక్కువ నీతిబాహ్యమైనదిగా నున్నది. కవిత్వమునం దంతలి పారస్యమును నిందుఁ గానరాదు. ఇందుఁ దండ్రియే యొడయనంబికి వలసినంత ధనమిచ్చి యది వేశ్యపాలుచేసి దానినెప్పుడును విడువవలదని కొడుకునకు బుద్ధిచెప్పెను—

చ. నగవుచలిర్చుమోమున ఘనం బగువేడుక నివ్వటిల్లఁగా
నగపతిధైర్యు నయ్యొడయనంబిని గాంచి బుధేంద్రుఁ డిట్లనున్
బగలును రేయి నిమ్మగువఁ బాయకయుండు మటంచు నీకు నిం
పుగ నిరతవ్యయంబునకుఁ బొందుగ నిచ్చెదనూఱునిష్కముల్.

ఇందుఁ బాతివ్రత్యముకంటె వేశ్యావృత్తియే మేలయినదని ఈశ్వరుఁడే బోధచేసెను—

సీ. సర్వస్థలంబుల సరస మాడఁగరాదు వలసినప్పుడు రతిఁ గలియరాదు

* * * *

ధాత్రిపై దంపతుల కెల్లఁ దలిరుబోఁడి

* * * *

సీ. మగనిచే బాధలు మామచేఁ బీడలు నత్తచే నాడిక లరయ లేవు
మఱఁదులచేఁ గొట్లుమఱఁదండ్రచేఁదిట్లు వదినెల నరిపోట్లు బావపోట్లు
బంధుల కగపడు బాధ లింతయు లేవు
* * * *
కావునను వేశ్యతనువొంద * *
నిహముఁ బరమును దగఁ గల్గు నిందువదన. *

ఇందు వేశ్యవాటికలో అంకని పలికినవారి నందఱినిబట్టి యముఁడు దండించునని చెప్పఁబడినది—

ఉ. పంకజపత్రనేత్ర విను పల్లెలలోపల వేశ్యవాటిలో
అంకని యెవ్వఁడేఁబలుకు రంగుగ వానినిబట్టి మీఁద ని
శ్శంకను సౌరిదూత లురుచంద్రక తారకిశోరశూలబా
ణాంకవిశాలతోమరమహత్తరహేతులఁ గ్రుంతు రెంతయున్.

ఇఁక జగత్తున దుర్నీతి యింతకంటెను బయిఁకిఁబోవుట సాధ్యమగునా ? ఈపుస్తకమునందు దుర్నీతి పారమును కడముట్టినదని చెప్పవచ్చును. భక్తుల మహిమలను జూపెడి యిటువంటిపుస్తకములే లోకమున కనంతమయిన చెఱుపును గలిగించుచున్నవి. ఈస్థలపురాణమునం దీశ్వరుఁడు భోగముదాని చంటిలోనే ప్రత్యక్షమయినట్టు చెప్పఁబడినది.

ఈపేరయకవి భారద్వాజసగోత్రుఁడు; కొండనకును బాపమాంబకును బుత్రుఁడు. అక్కడక్కడ వ్యాకరణదుష్టములైన ప్రయోగములనేకములు కానఁబడుచున్నను మొత్తముమీఁద నీతని కవనచాతురి శ్లాఘ్యమైనదిగానే యున్నది. ఒడయనంబివిలాసమునుండి మఱి మూఁడు పద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. ఎక్కి మహేశుఁ డప్పురము నెక్కువమీఱినఫాలదృష్టిచే
నొక్కటిగాఁగఁ జూచుచు మహోజ్జ్వలరూఢిఁ బసిండికొండఁ దా

నెక్కఁగఁబెట్టి దేవత లహీనగుణుండని సన్నుతింపఁగాఁ
దక్కరిదైత్యులం దునుము తత్సమయంబున శంభుకన్నులన్. ఆ ౨

చ. ప్రియతనయామణీ ! చవువు ప్రీతిసజెప్పినబాపనయ్యనున్
నయముగ నాటపాటల ఘనంబుగనేర్పినగాయకోత్తమున్
జయముగ సత్కవిత్వమును జక్కఁగనేర్పినసత్కవీంద్రునిన్
నయమునఁ బారితోషికమునం దనియించితి వ్యర్థ మయ్యెఁగా. ఆ-౪

ఉ. కమ్మనిగోఘృతమ్ము తెలుగంటికి నర్పితమైన యన్నమున్
దిమ్మనము ల్రసావళులుఁ దేనెతొనల్ బహుశాకపాకముల్
కమ్మనిపిండివంటలును గాంచనవర్ణము గల్గునుప్పు మో
దమ్ముగవారలుం గుడిచి తద్దయు సన్నుతిచేసి రందఱున్. ఆ-౬

---

33. మరింగంటి సింగరాచార్యులు

ఈకవి దశరథరాజనందనచరిత్ర యనెడు నిరోష్ఠ్యరామాయణమును రచియించెను. ఇతఁడు శ్రీవైష్ణవబ్రాహ్మణుఁడు; మౌద్గల్యగోత్రుఁడు; తిరుమలాచార్యపౌత్రుఁడు; వేంకటాచార్యపుత్రుఁడు. ఈకవి తానేకైకదినప్రబంధరచనా ధురీణుఁడననియు, ఆంధ్రభాషా నిరోష్ఠ్యాది వింశతిప్రబంధనిర్మాణుఁడ ననియు, వ్రాసికొనెను గాని యితఁడు రచియించిన యితరగ్రంథము లేవియు నిప్పుడు గానరావు. ఇతఁడు నూటయేఁబదిసంవత్సరముల క్రిందటనుండిన ట్లితని వంశమువారు చెప్పుచున్నారు. ఈకవి వాసస్థలము దేవరకొండసీమ. ఈతని కవిత్వము సలక్షణమై హృదయంగమముగా నున్నది. దశరథరాజనందనచరిత్రములోని కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. కరిఘట లేల చిత్రగణికాచ్ఛట లేల హిరణ్యశాటికా
హారిధనధాన్యరత్నఘటితాచ్ఛదలంక్రియ లేల నల్దిశల్
స్థిరగతి నేలఁగాఁ దగినతే జది యేల యనేకచర్యలన్
సిరిగలయట్టిసంతతిని జెందిన యాయొడ లెన్న లన్నిటన్. ఆ-౧

చ. అనఘచరిత్ర నిన్గని జయక్రియఁ జెందితిఁగాన దాఁచకే
కనకకిరీటహారకరకంకణచిత్రకరత్నచేలచం
దనచేటికారజతదంతిశతాంగహయాదికాంతు లె
ల్ల నడిగినంతనే తనియు లాలన నిచ్చెదఁ గీర్తి హెచ్చఁగన్. ఆ-౨

చ. అని తృణలీలగాఁ దెలియనాడి తదాజ్ఞ ధరించి తాటకా
తనయనిశాచరాగ్రణి సదాగతి ధిక్కరణాచ్ఛశీఘ్రమున
ర్తన ఘటియిల్లఁగాఁ గదలి దండకకాననధాత్రి చేరఁగాఁ
జని ఖరహంతఁ గాంచి దృఢసాహసహర్షరసాతిశాలియై. ఆ-౩

మ. అగజాజాని ననేకకంధరలచే నర్చించి జన్యస్థలిన్
దిగధీశాదితినందనచ్ఛటల నర్థిన్ గెల్చి శంకించకే
తెగి కైలాసగిరిం దృణాకృతిగ నెత్తంగాన నీతం డహా
జగదారాధ్యత హెచ్చునేరఁడె సదాచారక్రియం జెందినన్. ఆ-౪

మ. గద కేలన్ ధరియించి చండతరనిర్ఘాతాట్టహాసక్రియల్
చదలంటం జరణాగ్రఘట్టనల నాశల్ లల్లడిల్లంగఁ దీ
క్ష్ణదశన్ దీర్ఘదృగంచలాగ్నికణసంక్రాంతిం జలించంగ నా
త్రిదశాలిం గని కీశసేన యధికారిన్ డాఁగె నాయాయెడన్. ఆ-౫

34. అనంతరాజు జన్నయకవి

ఇతఁడు రామకథాభిరామమను పదియాశ్వాసముల మహాకావ్యమును రచియించెను. ఈకవి నియోగిబ్రాహ్మణుఁడు; జన్నపమంత్రి పౌత్రుఁడు; అమ్మయామాత్యపుత్రుఁడు. ఇతఁడేకాలమునందుండినవాఁడో తెలియరాలేదు గాని నూటయేఁబదియేండ్ల క్రిందటివాఁడయి యుండవచ్చును. ఈపుస్తకమునందలికథ శ్రీరామచరిత్రమౌట దీనినామముచేతనే తెల్లమగుచున్నది. ఈతనికవిత్వము నాతికఠినమయి మృదుపదగుంభితమయి కర్ణరసాయనముగా నున్నది. రామకథాభిరామములోని రెండుమూఁడు పద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

చ. శ్రుతులకు భూషణంబు లగుచుం బరమానుభవంబు గల్గు నీ
శ్రుతులకు నెల్లలోకములఁ జూచిన సామ్యము లేదు మాధురీ
గతుల సుధారసంబు చిలుకన్ ఘనమోహనసుస్వరైక సం
గతుల మహాద్భుతంబు గులుకన్ విలసిల్లెఁ బ్రయోగపాఠముల్. ఆ-౧

మ. వికచాంభోరుహచారులోచనకుఁ బర్వెం గాంతిమీఱన్ లలా
టికముక్తాఫలభాసురంబగుచు సూటిం దన్ముఖేందూపచా
రకలాపాచరణంబుపొంటె నునుపారం జేరునక్షత్రమా
లికచందంబున నందమై కచతమోలీలాప్తతారాకృతిన్. ఆ-3

చ. దరము హరించి యాశ్రితవితానముఁ గాచున భేద్యవజ్రపం
జరము విపన్నదీనజనసంఘముఁ బ్రోచుసమీపమేరుభూ
ధరము మహార్తలోకపరితాపమడంచుసుధావిధానసా
గరము కరంబు రామవిభుకారుణికత్వమహత్త్వ మెన్నఁడున్. ఆ-౯

35. ముద్దుపళని

ముద్దుపళని పద్యకావ్యములు చేసిన స్త్రీలలో నొకతె. మొల్ల రచించిన రామాయణమునుగూర్చి రెండవభాగమునందే తెలుపఁబడినది. మోహనాంగి యను నామె మారీచిపరిణయమును రచియించినట్లు చెప్పటయేకాని పుస్తకము లభింపలేదు. మొదటఁ బద్యకావ్యములను రచించినవా రిరువురును కులాంగనలు; ఈముద్దుపళని వేశ్యాంగన. ఇది రాధికాస్వాంతనమను నాలుగాశ్వాసముల శృంగారప్రబంధమును రచించెను. దీని తల్లిపేరు ముత్యాలు. అది తంజావూరుసంస్థాన ప్రభువయిన ప్రతాపసింహుని యుంపుడుకత్తె యయినట్లు "చోళసింహాసనాధ్యక్ష ప్రతాపసింహ మహారాజ బహూకృతానేకచామీకరాంబరాభరణ ముత్యాలుగర్భశుక్తి ముక్తాయమాన" యని రాధికాస్వాంతనముయొక్క గద్యములో వ్రాయఁబడిన దానినిబట్టి యూహింపఁదగి యున్నది. ఈరాధికాస్వాంతమునకే యిళాదేవీయమని నామాంతరముగలదు. ప్రతాపసింహుఁడనెడి ఈమహారాష్ట్రప్రభువు ౧౭౬౫ వ సంవత్సరమునందు మృతినొందెను. కాఁబట్టి యీముద్దుపళని ౧౭౬౦ వ సంవత్సరప్రాంతమునందు తంజావూరులో నుండెను. ఇది సంగీతసాహిత్యభరతశాస్త్రములలోఁ బ్రవీణురాలయినట్లు తానే చెప్పుకొన్నది. దీనికవిత్వము నాతికఠినమయి మృదువుగా నుండినందునకు సందేహములేదు; దీనికి మంచి సంస్కృతాంధ్రసాహిత్యమును గలదు. అందందు తప్పులున్నవి కాని యట్టితప్పులు పురుషకవిత్వమునందు సహిత మనేకగ్రంథములలోఁ గానఁబడుచున్నవి. అయినను గ్రంథములోనిభాగము లనేకములు స్త్రీలు వినఁదగినవియు స్త్రీనోటినుండి రాఁదగినవియుఁగాక దూష్యములయి యున్నవి. ఇది జారత్వమే కులవృత్తిగాఁగల వేశ్యయగుటచేత స్త్రీజన స్వాభావికమయిన సిగ్గును విడిచి శృంగారరస మనుపేర సంభోగాదివర్ణ

నములను పుస్తకమునిండ మిక్కిలి పచ్చిగాఁ జేసినది. అయినను స్త్రీ కవిత్వమని తెలిపెదు,

గీ. తనదుమ ట్టొంత తా నెంత తానె యింత
చేయఁజూచిన నే నెంత చేయరాదు
వేలువాచిన రోలంతవిరివియైన
రోలువాచిన నదియెంతమేలు గనునొ.

గీ. కుట్టఁ దేలు కట్టకున్నఁ గుమ్మరబూచి
త్రోసిరాజటంచుఁ ద్రోఁచెఁ జెలియ
దానివేలుదీసి దానికన్నుపొడిచి
నటులు చేయకున్న నగునె చిలుక.

గీ. తగరు కొండమీఁద దాఁకఁ గోరినదారి
నెదిరిఁ దన్నుఁ జెలియ కింతపలికె
నెంతమీనువచ్చి యెంతమీనును మ్రింగెఁ
గానఁ ద్రుల్లి నెద్దె గంతమోచు.

గీ. కాని పదరకు మీఁకమీఁద దాని మొగము
కనఁగవలదని శౌరికిఁ గట్టుపెట్టి
బింకములు కూల నఱకాలఁ బెట్టి నేల
రాయకున్నను నాపేరు రాధగాదు.

గీ. లేనిపట్టింపు లెల్లను బూని చాన
నేనె యెదురైనఁగాని యింతైనఁ జూడ
దల్పునకుఁ గల్మివచ్చిన నర్ధరాత్రి
గొడుగు తెమ్మన్నకతగాను గోమలాంగి.

ఇత్యాది లోకోక్తులును జాతీయములును గలపద్యము లందంకు లేకపోలేదు. రాధికాసాంత్వనమునుండి మఱికొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను——

మ. యమునాతీరవిహార హారసదృశోద్యత్కీర్తిసంభార భా
రమణీయాకృతిమార మారసికతాప్రావీణ్యసంసార సా
రమరందోక్తివిచార చారణమదప్రఖ్యాతవిస్తార తా
రమహీభృత్సమధీర ధీరమునివారాధార రాధారతా. ఆ ౧.

ఉ. ఈయెడఁ గాయము న్విడిచి యేగెద నంచు విచార మొందలే
దా యదుసార్వభౌమునికి నాముఁదవైరికిఁ గాని కాయమై
పోయినఁ బోవ కున్న నిలఁ బుణ్యము పాపము గుడ్డికన్ను దా
పాయక యున్న నేమి మఱి యూసిన నేమి తలంచిచూడఁగన్. ఆ. ౩.

చ. మెలఁకువమాటలం గలుగుమేలము లచ్చట గచ్చు లిచ్చటన్
దలఁపులు దాఁపి పైని బలుతప్పులు నాపయి నేస్తమాడఁబే
రలుక మఱీడఁ గూర్మి వగ లక్కడ నిక్కడ టక్కు లద్దిరా
తెలియఁగవచ్చె నీనడత తెల్లము వింటిమి ప్రాణనాయకా. ఆ. ౪.

---

36. కంకంటి పాపరాజు

ఈకవి యాఱువేలనియోగిబ్రాహ్మణుఁడు. ఇతఁడు తనయుత్తర రామాయణమునం దాఱువేలవారి నిట్లు వర్ణించుచున్నాఁడు—

సీ. అఖిలరాజాధిరాజాస్థానజనహృద్యవిద్యావిహారు లార్వేలవారు
కల్పకబలికర్ణకలశార్ణవోదీర్ణవితరణోదారు లార్వేలవారు
సజ్జనస్తవనీయసతతనిర్వ్యాజపరోపకారు లార్వేలవారు
ఘనదుర్ఘటస్వామికార్యనిర్వాహణప్రవీణతాధారు లార్వేలవారు
విమతగర్వాపహారు లార్వేలవార
లట్టియార్వేలవారిలో నలఘుకీర్తి
వెలయు శ్రీవత్సగోత్రారవిందహేళి
మహితగుణశాలి వల్లభామాత్యమౌళి.

కవి శ్రీవత్సగోత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; అప్పయామాత్య పుత్రుఁడు. ఈతని తల్లి నరసాంబ; తమ్ముఁడు నరసింహాఁడు. ఈతని వాసస్థానము నెల్లూరు మండలము. అక్కడక్కడఁ గొన్ని వ్యాకరణ దోషము లున్నను మొత్తముమీఁద నీతని కవిత్వము మిక్కిలి రసవంత మయినది. ఇతఁ డుత్తరరామాయణమును బురాణశైలినిమాని ప్రబంధ పాకమునఁ జెప్పినవాఁడు. పూర్వ ముత్తరరామాయణము తిక్కనసోమ యాజిచేఁ దెలిఁగింపఁబడినను దాను గ్రొత్తఁగా మరలఁ దెలిఁగించుటకు రామకథ యగుటయే కారణమని కవి యీక్రిందిపద్యమునఁ జెప్పెను—

మ. వరుసం దిక్కనయజ్వనిర్వచనకావ్యంబై తగంజేసె ను
త్తరరామాయణ మందున న్మఱి ప్రబంధం బూని సర్మించు టే
సరసత్వం బని ప్రాజ్ఞులార నిరసించ బోకుఁడీ రాఘవే
శ్వరుచారిత్రము లెంద ఱెన్నిగతుల న్వర్ణించినం గ్రాలవే ?

కవి యుత్తరరామాయణమును రచించుటకుముందు విష్ణుమాయావిలాసమను యక్షగానమును రచించినట్లు తన్నుఁగూర్చి యిష్ట దైవము పలికినరీతిగా నీక్రింది పద్యమునఁ జెప్పుకొన్నాఁడు—

గీ. శ్రీవెలయ మున్ను విష్ణుమాయావిలాస
యక్షగానంబు మాకె సమర్పణముగఁ
జేసి తదియాదిగా మేము నీసుధాను
సారివాక్కులఁ జొక్కియున్నార మనఘ.

ఉత్తరరామాయణము కంకంటి పాపరాజు చెప్పినట్లున్నను నిజ ముగాఁ బుష్పగిరి తిమ్మన్న రచియించి యాతనిపేరు పెట్టెనని వాడుక గలదు. ఈతని కవిత్వమునకును, బుష్పగిరి తిమ్మనకవిత్వమునకును భేద మున్నందున, ఈలోకప్రవాదము సరియైనదిగా నుండదు. పుష్పగిరి తిమ్మన్న గొప్పకవి యగుటచేతను, పాపరాజునకు మిత్రుఁడును సహా శ్రోతయు నయియుండుటచేతను, కావ్యరచనయందుఁ గొంత తోడ్పడి

యుండుటచేతను ఇట్టిప్రవాదము కలిగి యుండవచ్చును. పుస్తకరచన యందుఁ బుప్పగిరి తిమ్మన్న తనకు తోడ్పడినట్లు కవియే యీక్రింది పద్యములలోఁ జెప్పియున్నాడు-

మ. హనుమద్దివ్యపదారవిందమకరందానందనేందిందిరా
త్మ నసేకాంధ్రకృతిప్రకల్పనసమర్థుం బుప్పగిర్యప్పనా
ర్యనిసత్పుత్రునిఁ దిమ్మనాఖ్యకవిచంద్రు న్మత్సహాశ్రోతఁ బ్రౌ
ఢ్దునసే పిల్పఁగఁబంచి కన్నకల సంతోషంబునం జెప్పినన్.

మ. అతఁ డానందముఁ జెంది నన్నుఁగని యన్నా జాళువాపైఁడికిన్
గృతవర్ణాంచితరత్న మబ్బినటు లయ్యో నీవు వాక్ప్రౌఢిమం
గృతి సేయంగఁదొడంగు రామకథకుం గృష్ణుండు రా జొట బ్ర
స్తుతి గావింపఁగ నాకు శక్యమె భవత్పుణ్యప్రభావోన్నతుల్.

గీ. అని కిరీటికి శౌరి తోడైనయట్టు
లమ్మహాకవిసాహాయ్య మాచరింపఁ
గృతి నొనర్పఁగఁబూనినయేను మొదట
నెంతు మద్వంశవిధమది యెట్టు లనిన.

కంకంటి పాపరాజు ప్రళయకావేరిపట్టణములో నవీనుగా లౌక్యాధికారమునం దుండినవాఁడు. ఆకాలమునందే యీయనవద్దఁ బుప్పగిరి తిమ్మన్న కొంతఋణముచేసి యాయప్పు తీర్పలేక యీపుస్తకమును దానిక్రిందఁ జేసి యియ్యఁగా, ౧౭౯౦ వ సంవత్సరప్రాంతమున నుత్తరరామాయణమును పాపరాజు తనపేరితోఁ బ్రచురించెనని చెప్పుచున్నారు. కవి యిప్పటికి నూఱుసంవత్సరములక్రిందట నుండినవాఁడు. కవిత్వశైలి తెలియుటకయి యుత్తరరామాయణమునుండి కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను——

మ. పలుమాఱుం దనువేఁడురామవిభుసిం బాటింప నుత్తుంగభం
గలసత్తోయభుజంగ సంఘఫణభంగప్రౌఢరంగ త్తిమిం

గిలవాలప్రహతప్రవాళశకలాకీర్ణారుణార్ణఃప్రభా
కలనం దేజము చూపె వార్ధి జడధుల్ గైకొందురే ధీరులన్. ఆ. ౧.

ఉ. ఓయినిశాచరప్రవర యొప్పుగ నిప్పుడు పల్కు నీరణా
న్యాయము లెందుఁబోయె సురనాథులఁదోలెడువేళఁ జాలుఁ జా
ల్న్యాయముచేతఁగాదె జయ మందుట మీరు జగం బెఱుంగదే
న్యాయము మేము దప్ప మొకనాఁటి కదెట్లనవిన్మ తెల్పెదన్. ఆ-౨

ఉ. తమ్ముఁడ వంచు నీకొకహితం బెఱిఁగింపఁగ దూతఁబంచినన్
వ మ్మొనరించి నాపలుకు వానినిజంపి ననున్ జయింపరే
ద్రిమ్మరిగుంపుతోడ నరుదెంచితి నిన్ననసేల నీకు డెం
దమ్మున మేలుగాఁదలచునన్నె యనందగుఁగాక దుర్మతీ! ఆ. 3.

మ. పలుతావు ల్వెదచల్లుతెమ్మెరలుపై పైడాయ రేరాజువె
న్నెలగాయన్ మధుపాళిమ్రోయఁ గలకంఠీపాళికూయన్ మరు
ల్లలనల్గానముచేయ నొంటి నిశివేళం దోఁటలో నైందవో
పలవేది న్వసియించుపాంథుని స్మరాపస్మారము ల్చేరవే? ఆ. ర.

చ. కిలకిలనవ్వి యచ్చెలి సఖీమణులంగని యమ్మలార విం
తలు కనుఁగొంటిరే యిదిగొ తానఁట యిక్కడ నున్నవారితోఁ
కలహ మొనర్పవచ్చెనఁట కాదనిపట్టిన నీఁడు చేతిలో
పలికిని లేఁడు నేఁడు బహుభంగులఁ బ్రేలెడు నంచుఁ జూపినన్.ఆ-౫

ఉ. మాటలఁ దాటకాంతకుఁడు మాటికిఁ దైనియ లొల్క వేఁడినన్
బాటలగంధిసిగ్గు ప్రతిభాషితచాతురి నడ్డగింపఁగా
గాటపుఁగాంక్షయన్ తరువుకత్తె మదిం ద్వరసేయ నల్లనన్
మీటినమ్రోయువీణవలె మించు నెలుంగున భర్తతో ననున్. ఆ.౬.

ఉ. ఈవెడబుద్ధి నీకెవ్వజనియింపెనో యేజడుఁడైనఁ దెల్పెనో
హా విధిద్రోహ నీకు వశమా లవణాసురుబారిఁబడ్డవా

రీవఱ కెవ్వరైన మనిరే యిఁక సూర్యుఁబ్రహ్మ లాఁగినన్
జావక పోదువోటు కొనసాగునె నీవిలువిద్య లిచ్చుటన్. ఆ. ౭.

చ. వలసినభోజనాభరణవస్త్రధనాదులఁ జెంది తృప్తులై
పలుమఱుఁ జాలుఁజాలు నని పల్కెడువారలె కాని మాకుఁ గా
వలయు నొసంగుమం చనెడువారల మందున కైనఁ గాన మా
స్థలమున జానకీవిభునిజన్నముపై భవ మెన్న శక్యమే. ఆ. ౮.

---

37. పుష్పగిరి తిమ్మన్న

ఈకవి సమీరకుమారవిజయ మనెడి యేడాశ్వాసముల కావ్యమును రచియించి, భర్తృహరి నీతిశతకమును తెనిఁగించెను. ఇతఁ డుత్తరరామాయణమును రచియించిన కంకంటి పాపరాజునకు సమకాలికుఁడు. ఇతఁడు రచియించిన సమీరకుమారవిజయ ముత్తరరామాయణమంత మధురముగా లేదు. భర్తృహరినీతిశతకము సహిత మేనుఁగు లక్ష్మణకవి తెనిఁగించినదానికి చాలదు. కవి సంస్కృతాంధ్రములయందసమానపాండిత్యము కలవాఁడే యయినను, కవనమం దక్కడక్కడ లక్షణవిరుద్ధములయిన ప్రయోగములు కానఁబడుచున్నవి. ఈకవి నివాసస్థలము నెల్లూరిమండలములోని మోడేగుంట యయినట్లు నెల్లూరిమండలచరిత్ర సంగ్రహమునందు వ్రాయఁబడియున్నది. ఇతఁ డాశ్వలాయనసూత్రుఁడు; విశ్వామిత్రగోత్రుఁడు; అప్పనార్యునిపుత్రుఁడు. ఇతఁడు సమీరకుమారవిజయమునందు తన్నుఁగూర్చి యిట్లు చెప్పుకొన్నాఁడు—

సీ. శ్రీహనూమత్పాదసేవాగతాధ్యాత్మ తత్త్వకవిత్వమహత్త్వవిదుఁడ
నాశ్వలాయనసూత్రపావనవిశ్వామిత్రగోత్రాబ్ధిచంద్రుఁడఁ గుశలమతిని
అలపుష్పగిరియప్పనార్యున కౌబళాంబకును సుపుత్రుండ బ్రహ్మవేత్త
యైన వేంకటకృష్ణయాగ్రణికిని వేంకటాఖ్యకవీంద్రున కవరజుండ

సరసగుణయుతుండ వరకవిఁ దిమ్మనా
హ్వాయుఁడ నేను జననమంది మనుట
కెల్ల ఫలముగల్గఁ గృతి యొక్కటిరచింప
నూహ సేయుచున్న నొక్కనాఁడు.

కవి పదునెనిమిదవ శతాబ్దమధ్యము మొదలుకొని ౧౭౬౦ వ సంవత్సరమువఱకును కవిత్వరచన చేసియుండవచ్చును. ఉత్తరరామాయణముయొక్క కర్తృత్వము నారోపించి నట్లే దశకుమారచరిత్రము యొక్క కర్తృత్వముగూడఁ గొంద ఱీకవి కారోపింతురు గాని యా యారోపణము కేవల నిరాధారముగా గనఁబడుచున్నది. ఈతని పుస్తకములనుండి కొన్ని పద్యము లుదాహరింపఁబడుచున్నవి—

భర్తృహరి నీతిశతకము.

చ. మతిఁగలజాడ్యము ల్చెఱుచు, మాటల సత్యము గూర్చు మాన ము
న్నతి నెనయించుఁ బాపములు నాశ మొనర్చు, మనంబునం బ్రస
న్నత గదియించు, దిక్కులఘనంబుగఁ గీర్తులు నించు, సాధుసం
గతి యిఁక నేవిశేషములు గల్గఁగఁ జేయదు మర్త్యకోటికిన్.

ఉ. నీతు లెఱుంగువారు తమ నింద ఘటించిన నెంచినన్, మహా
భూతులు సాయకున్న నవిపోయినఁ, జా వపుడైనఁ గల్పసం
ఘాతవిరామకాలములఁ గల్గిన గల్గుఁగా కొకప్పుడున్
నీతిపథంబునం జెదర నేరరు ధైర్యగమాధురంధరుల్.

సమీరకుమారవిజయము.

ఉ. ఆరజనీచరాగ్రణిల యావసరాసితనీరదాకృతిన్
దారుణ రాఁ గనుంగొని యథాయథలై సుర లద్రిరాడ్గుహల్
దూరెడువారు నిచ్చ విధి దూరెడువారుఁ గవీంద్రు వెన్కకున్
జేరెడువారుఁ గావుమని చీరెడువారునునై తలంకఁగన్. ఆ-౧

ఉ. ఎమ్మెయి జవ్వనంబుఁ గలయింతి పతిం బెడఁబాసి యొంటిగాఁ
బ్రిమ్మరుచోట గర్భము ధరించినదన్న ను గన్నవిన్నవా
రెమ్మెయిఁ గల్ల లేమిగణియింతురొ యెంతురొ బంధుకోటిలో
నమ్మకచెల్ల నానియమ మాగడ మాయె నికేమిచేయుదున్. ఆ.౨.

చ. రమణుఁ డొసంగె నుంగరము రాము కనుంగొను మన్నమాత్ర మే
ను మఱచి సొక్కి యొక్కటఁ గనుంగొనుచుండితిఁగాని తత్ప్రమో
దమునకు నాదికారణ మితం డని నిన్నన నైతి నెచ్చటన్
బ్రమద లెఱుంగ నేర్తు రె కృపాళు గొనర్చిన మేలు మారుతీ. ఆ. 3.

ఉ. ఇంతవిచార మయ్యెఁగద యేనును నీ వనుభేదయుక్తి నీ
స్వాంతమునందు వర్తిలుట నన్యుఁడు నేనను చింత యెంతప
ర్యంతము జంతుసంతతిహృదంతమునందు వసించు నంతప
ర్యంతము జన్మమృత్యువుల కంతము లేదు సమీరనందనా. ఆ. ౪.

ఉ. రావణుగీవణుఁ సమరరంగమునం గుదియించినట్లు నా
లావున కోహటింపక నిలం గలవే రఘురామ వేత్తవై
యీవెడక్రోఁతి నెక్కొని యేటికివచ్చితి వింతదూర మ
య్యోవిజయంబుచెందఁగలఁడొటుళితాస్యుఁగడంగి రుద్రుఁడున్.ఆ-౫

ఉ. హీనాధిక్యము లెంచి పంచితివొ నన్నే మాడ్కిఁ బొమ్మంటి వా
హీనాత్ముం గపిమాత్రుఁ బిల్చుటకుఁ బోనీ యొక్కవేగంబునం
దైనన్ నాకు సమానుఁడే పలుకు లేలా నీవె యిట్లాడఁగా
నేనా శా దనువాఁడ నం చపలుపక్షీంద్రు న్నిరీక్షించుచున్. ఆ. ౬.

శా. అన్నా నే ముదివాఁడ లేవ వడిలే దం డెందొ నీవేగఁగా
సన్నాహంబున వచ్చినాఁడవుగదా జాగేల నీకేల నీ
సన్నంబైన మదీయపుచ్ఛ మొకపార్శ్వంబందుఁ బొందించి పొ
మ్మన్నన్ దన్మహిమం బెఱుంగ కుదితాహంకారపంకాత్ముఁడై .ఆ-౭

38. ధరణిదేవుల రామమంత్రి

ఈకవీంద్రుఁడు నూఱుసంవత్సరములక్రిందట దశావతారచరిత్ర మను పదియాశ్వాసముల గ్రంథమును రచియించెను. ఇతఁడు బ్రాహ్మణుఁడు; తిమ్మయామాత్యుని పౌత్రుఁడు; ధరణిదేవుల నాగయామాత్యునకును పణియమ్మకును పుత్రుఁడు. అందందుఁ గొన్ని వ్యాకరణదోషము లున్నను, ఈతని కవిత్వము రసవంతమయి హృదయరంజకముగా నుండును. కవియే తన్ను సంస్కృతాంధ్రభాషా ప్రవీణునిగాను దిన్నైక ప్రబంధవిరచనదక్షునిగాను,

క. నను సంస్కృతాంధ్రభాషా
వినుతు దిన్నైకప్రబంధవిరచనదక్షుఁ
గనుఁగొని యిట్లని పలికెన్
వినయంబు నయంబు హెచ్చ విబుధులు మెచ్చన్.

అను పద్యములోఁ జెప్పుకొని, తన్నష్టభాషాకవిత్వ తత్త్వసంవేదినిగా కృతిపతి పొగడిన ట్లీక్రింది పద్యములోఁ జెప్పుకొన్నాఁడు—

సీ. శ్రీరామకరుణారసారూఢ సంస్కృతప్రాకృతాద్యష్ట భాషాకవిత్వ
తత్త్వసంవేదివి ధరణిదేవుల తిమ్మయామాత్యపౌత్రుండ వన్నదాన
ముఖ్యనానాదానముదితభూసురచంద్ర నాగప్రధానేంద్ర నందనుఁడవు
పణియమాంబాగర్భపాథోధిచంద్రుఁడ వాత్మవిద్రఘునాయకాద్యనుజుఁడ
వాప్తుఁడవుగాన వేఁడెద నందముగను
గృష్ణునిదశావతారముల్ గృతి యొనర్చి
యంకితముసేయు నాకుఁ బ్రఖ్యాతి నీకు
మహితగుణసాంద్ర రామయామాత్యచంద్ర.

కవి తన దశావతారచరిత్రము నాఱువేలనియోగి యగు మగదల కృష్ణమంత్రిందున కంకితముచేసి యాతఁడు విద్యానిధి యైనట్లు,

ఉ. నారదమౌని! యేమి? సురనాథ! విశేషము లేమి? వింటిరో
సారసగర్భుచెంగటను శారద లేదఁట! యెందుఁ బిల్చెనో?
యారసిచూడుఁ డామగదలాన్వయదుగ్ధపయోధిచంద్రమం
దారము కృష్ణమంత్రి రసనాస్థలినిల్చెను, యుక్తమే కదా!

ఇత్యాది పద్యములలో నభివర్ణించి యున్నాఁడు. కృతిపతియైన కృష్ణమంత్రి గతశతాబ్దాంతమునందు నెల్లూరిమండలములోని ప్రళయకావేరిపట్టణమునం దొలాందావారి ద్విభాషిగా నుండెను. కంకంటివారి యుత్తరరామాయణమువలెనే యీదశావతారచరిత్రమును పుష్పగిరి తిమ్మన్నచే రచియింపఁబడినదని కొందఱు చెప్పుచున్నారు గాని కవులిద్దఱు నేకకాలమునం దొక్కదేశములో నుండుటదక్క వారిమాటకాధారలేశమును గానరాదు. దశావతారచరిత్రకవిత్వము పుష్పగిరి తిమ్మన్నదైన సమీరకుమారవిజయకవిత్వమునకంటె మృదుతరముగాను మధురతరముగాను కనఁబడుచుండుటచే దశావతారచరిత్రరచనలోఁ బుష్పగిరి తిమ్మన్న కేమియు సంబంధములేదని నిశ్చయముగాఁ జెప్ప వచ్చును. దశావతారచరిత్రములోని పద్యములఁ గొన్నిటి నిం దుదాహరించుచున్నాను—

శా. ఆవార్తన్విని పింప దైత్యపతి రోషావేశ ముప్పొంగ నా
హా వేదంబుల యాగభాగము లమర్త్యశ్రేణికే కాని మా
కేవంకం బనిలేకయుండునటుగా నేర్పాటు గావించెఁ గా
నీ వేగంబ హరించి తచ్ఛ్రుతుల భగ్నీభూతము ల్చేసెదన్. ఆ. ౧.

ఉ. కన్నులు బ్రహ్మ రెం డొసఁగఁ గానఁగ లేవని గౌతముండు తాఁ
గన్నులు వే యొసంగె నధికంబుగ నష్ట మదాంధకార సం
ఛన్నము లౌటచేఁ దెలియఁజాలవు తన్మదకారణంబు నిం
క న్నినుఁగూడనీయ కుపకారము చేసెదఁ జూడు వాసవా. ఆ. ౨

ఉ. వీరుఁడ వంచు నిన్నుఁ బదివేలవిధంబులఁ బ్రస్తుతించుచున్
వారిధిభర్త తెల్పవిని వచ్చితి మెచ్చెద నేఁడుచూపు నీ
వీరతఁ గాందిశీకపదవీరతవృత్తిని మోరతోపునన్
జాతెదనన్నుఁ బో విడఁడు స్వర్ణవిలోచనుఁడంచు నుగ్రుఁడై. ఆ. 3.

చ. గెలిచితి సర్వదేవతలఁ గేశవుఁ డొక్కఁడె తక్క నాతనిన్
గెలిచినఁగాని యీగెలుపు గెల్పుటకా దది యెట్టు లంటిరేఁ
దొలుత వరాహమై యనుజుఁ ద్రుంచు టెఱుంగదె సూడుదీర్పఁగాఁ
గలుగనిగెల్పదేల బరగౌరవ మేటికి శౌర్య మేటికిన్. ఆ-౪

ఉ. ముక్కున గవ్వ కట్టినను ముందుగ నీడిచి తెమ్మటంచు మా
రక్కసితేఁడు పంచె వినురా దివిజర్షభ యింక నట్టిటున్
దిక్కులుచూచిన న్విడువ దేవర వైనను నీకువెర్క నే
మ్రొక్కెదఁగాని రమ్మనుచు ముందలఁ బట్టెఁగడంగ నుద్ధతిన్. ఆ-౫

శా. ఓరా నిప్రుఁడనంచు నన్ జలకసేయ న్వచ్చితే మంచిదే
రారమ్మా ధను వూని నీదయినశౌత్రం జేను వీక్షించెదన్
శూరత్వంబులు మీకెయంచు నజుఁ డేచ్చో ముద్ర గావించెనే
లేరా బ్రాహ్మణశూరు లిం కిటను గల్పింతు న్ననుం జూడుమా. ఆ-౬

శా. ఔనౌ నే వెలయాలనా యిటులు నీ వాడన్ బళా చాలుఁ బో
పో నవ్వే రెవరైన విన్న నిట నేర్పు లూన్పఁగా వచ్చితో
నానాథుం డిదివిన్నయంతఁ దనకు న్నాకు న్మహోపాని రా
దా నావంటికులాంగనామణికి న్యాయం బౌనె యీమార్గముల్. ఆ-౭

మ. ఎలనాగా ! తలయెత్తి చూడఁగదె వీ రెవ్వారు వీ రేమికా
వలెనే యంచని యమ్మలక్క లట త్రోవన్ వేఁడ నీపైఁడిచా
యలచే మించునతండు నామఱఁదియా నం చంటతన్ సిగ్గుచేఁ
దలవంచు న్మహికన్య వార లదె యాతం డెవ్వరంచు న్నగన్. ఆ-౮

ఉ. ఓయిగురాకుబోఁడి ! కనవో వినవో యిదియేమిచెల్ల నీ
ప్రాయపుఁదోయజాక్షులెడబాయ రోకప్పుడు ప్రాణనాధులం
బ్రాయము రిత్తఁబుత్తురటె పల్కవె నీమది నున్న యట్టియా
నాయకుఁ దెల్పవే త్రిదశనాయకుఁ గోరినఁ దెచ్చికూర్చెదన్. ఆ-౯

శా. రంభాభోగముఁగోరి యాగముల కర్థం బెల్ల వెచ్చించు టా
యంభోదమ్ములఁజూచి చెర్వ్వజల మాద్యంతంబు చల్లించుటల్
సంభోగేచ్ఛ జనించెనేని మఱి వేశ్యారత్నము ల్లేరొకో
సంభోగింపఁగరాదె కానరు జనుల్ జ్ఞానంబు సామాన్యమే. ఆ-౧౦

---

39. దిట్టకవి నారాయణకవి

ఇతఁడాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; కాశ్యపగోత్రుఁడు; పాపరాజకవిపుత్రుఁడు. ఇతఁడు రంగరాయచరిత్రమును ప్రబంధమునుజేసి దానిని కృష్ణామండలములోని నర్సారావుపేట జమీందారగు మల్రాజు రామారాయనింగారి కంకితముచేసెను. ఈగ్రంథము ౧౭౫౦ వ సంవత్సర ప్రాంతములయందు రచియింపఁబడినట్టు తెలియవచ్చుచున్నది. ఈ పుస్తకము ౧౭౫౭ వ సంవత్సరమున బొబ్బిలికోటవద్ద శ్రీరావు రంగారాయఁడుగారికిని ప్రెంచిసేనానాయకుఁడగు బుస్సీగారితో నచ్చటికేగిన పూసపాటి విజయరామరాజుగారికిని జరిగినయుద్ధము భారతయుద్ధమువలె వర్ణింపఁబడినది. బొబ్బిలికోటవద్ద జరిగిన యుద్ధక్రమములు బొబ్బిలి సంస్థాన చరిత్రమును కథా సందర్భమున నిందు కొంత వివరించుచున్నాను.

బొబ్బిలిసంస్థాన స్థాపకుఁడయిన పెద్దారాయనింగారును విజయనగర రాజ్యసంస్థాపకుఁడయిన పూసపాటి తమ్మిరాజుగారివరినే ౧౬౫౨వ సంవత్సరమునందు శ్రీకాకుళపు సర్కారు ఫౌజుదారగు షెర్ మహామదుఖాన్ యొక్క ప్రాపుచేత నక్కడకు వచ్చెను. పెద్దారాయనింగారు

మహాశూరుఁడయి ధ్రంగవాఁక యనుచోట జరిగినయుద్ధములో శత్రువుల సంహారించి షెర్ మహమ్మదుఖాన్ యొక్క పుత్రుని ప్రాణములు రక్షించినందున, షెర్ మహమ్మదాయనకు రాజామువాలుండా కవులున కిచ్చి రంగరావని బిరుదునిచ్చెను. రంగరావను బిరుదనామము నొందిన యీ పెద్దారాయనింగారు పద్మనాయకవంశజులయిన వెలమదొరలలోని వాఁడు. ఈయనయు వేంకటగిరి సంస్థానప్రభువులును పిఠాపుర సంస్థాన ప్రభువులును ఏకవంశములోనివారే. రాజామును కౌలునకుఁ బుచ్చు కొన్నతరువాత పెద్దారాయనింగారు క్రొత్తగా నొకపేటను కోటను గట్టి దానికి తన యుపకర్తపేరిట బెబ్బులియని నామకరణము చేసెను. షెర్ మహమ్మదులోని "షెర్" అను పదమునకు బెబ్బులియని యర్థము. బెబ్బులి యనునదే కొంతకాలమునకు బొబ్బిలిగా మారినదఁట! అప్పటి నుండియు క్షత్రియులయిన విజయనగరము వారికిని వెలమవారయిన బొబ్బిలివారికిని వైర మారంభమయ్యెనని చెప్పుదురు.

మన ప్రస్తుతచరిత్రారంభ కాలమున ౧౭౫౬ వ సంవత్సరమునం దుత్తరసర్కారులు ఫ్రెంచివారి కియ్యఁబడఁగానే ఫ్రెంచిసేనాధ్యక్షుఁడగు బుస్సీదొరగారు రాజమహేంద్ర శ్రీకాకుళ సర్కారులను విజయనగర సంస్థానాధిపతులగు విజయరామరాజుగారికి కౌలునకిచ్చుట కంగీకరించెను; అట్లు జరిగెనుపక్షమున, దనస్థితికి భంగము కలుగునని దూరాలోచన చేతఁ దెలిసికొన్నవాఁడయి యప్పటి బొబ్బిలి ప్రభువుగారగు రంగారావు గారు రాజ్యము ఫ్రెంచివారియధీనము కాకుండఁజేయుటకయి యితర సంస్థానాధిపతులతోఁ జేరి కృషిచేసెను. ఈ కృషికి శ్రీకాకుళపు నవాబగు జాఫరల్లీఖాన్ యొక్క ప్రోత్సాహముసహితము విశేషముగా నుండెను. తిరుగఁబడిన జమీందారుల నదిమి కప్పములు గొనుటకయి బుస్సీగారు ౧౭౫౬ వ సంవత్సరము నవంబరు నెల ౧౬ తేదిని ౫౦౦ యూరపియను లతోను ౪౦౦౦ సిపాయులతోను హైదరాబాదునుండి బైలుదేఱి

డిశంబరు ౧౯ వ తేదికి రాజమహేంద్రవరము వచ్చి చేరెను. విజయరామరాజుగారు పదివేల స్వసేనతోను, ఇతరరాజులతోను వచ్చి యచట బుస్సీని చేరెను. తమదేశములోనుండి విజయనగర రాజ్యములోనికిఁ బాఱెడు కొండకాలువలను మళ్ళించి బొబ్బిలి రంగారావుగారి కాపులు తమ భూములకుఁ బెట్టుకొన్నందునను, దేశస్వభావమునుబట్టి బొబ్బిలివారిని సాధించుట సుసాధ్యము కాకపోయినందునను, విజయరామరాజుగారు మనస్సులో బొబ్బిలిరంగారావుగారిపై ద్వేషము వహించి యాయనను శిక్షించుటకయి బుస్సీని తన యావచ్ఛక్తిని వినియోగించి బహువిధముల ప్రోత్సాహపఱిచి పురికొల్పెను. అందుమీఁద బుస్సీగారు బొబ్బిలిరాజ్యమును విడువవలసినదనియు, దానికి బదులుగా నధికవైశాల్యమును మూల్యమునుగల దేశ మియ్యఁబడునననియు రంగారావుగారికి వ్రాసిరి. రంగారావుగారు పితృపితామహాగత మయిన బొబ్బిలిరాజ్యమును విడుచుట కంగీకరింపక పోవుటయేకాక తక్కిన సంస్థానాధిపతులతోడిపాటుగా రాజమహేంద్రవరమునకు వచ్చి యాతనిని సందర్శింపక పోయెను. రాజమహేంద్రవరమున బుస్సీని దర్శించుటకయి విజయరామరాజుగారు మొదలగు సమస్త రాజులును వచ్చినప్పుడు రంగరావుగారు రాకుండుట లోనుగాఁగల కథను గవి యిట్లు చెప్పినాఁడు.

ఉ. రాజమహేంద్రపట్టణవిరాజదదూరతలంబున న్సము
త్తేజితమైన గౌతమనదీతటసీమను గోటిలింగవి
భ్రాజితమైన యొక్కనవపాదపమంజులనిష్కుటస్థలిన్
రాజితలీలఁజేరి శిబిరంబు వడి న్విడియించె వేడుకన్.

* * * *

ఉ. కారుణికత్వ మేర్పడ సికాకుల పున్నరకారులో జమీ
దారుల రామరాజవసుధావలయేశ్వరముఖ్యుల న్ముదం

బారఁగఁ బిల్వఁబంపుమని హైదరుజంగున కాసతీయుఁ ద
చ్చారువచఃక్రమంబునను సత్వరుఁడై పిలిపించె వారలన్.

ఉ. పాయనివేడ్క విద్విషదపాయకరాయతబాహుశౌర్యు లా
పాయకరాయఁడుం గినుడిపట్టణపుంబృథివీశ్వరుండు నా
రాయణదేవుఁడున్ నరసరాజు మఱిం గొలుగొండ మన్నెపున్
రాయఁడు నాదిగాఁగలధరావరు లందఱు వచ్చి రత్తఱిన్.

గీ. ఉద్ధతులమొల్క సందర్శనోత్సుకత్వ
మాత్మఁ జిట్టాడ నాడాడ నలరుమన్నె
దొరలువచ్చిరి మానుష ద్రోహప్రసంగ
కలితుఁడగు రంగరాయఁడొక్కరుఁడుదక్క.

సీ. నిజభుజాదండ నిర్నిద్రకోదండంబు గాండీవకార్ముకక్రమముఁ జూపఁ
జరమభాగస్ఫుటచ్ఛటులతూణీరముల్ కవదొనసొంపు సంఘటిలఁజేయ
నాసీరముఖరనానాశంఖకధ్వనుల్ దేవదత్తరవోద్వృత్తిఁ దెలుప
సూరెలఁ బరతెంచుజులుమతీ తేజీలు ధవళాశ్వములమస్తు ప్రస్తరింపఁ
గలియుగార్జునుఁడౌర యీ ఘనుఁడటంచుఁ
దను జగజ్జన మెన్న నుద్ధతులమొల్క
వీక్షణాపేక్ష నేతెంచె విజయరామ
రాజరాజన్యలోకమార్తాండమూర్తి.

* * * *

చ. నలువదివేలకాల్బలము నాలుగువేలతురంగమంబులున్
నలువదియేఁబదేన్గు లనంతములై నశతఘ్నికాచయం
బులు నొకవేయిలొట్టియ లపూర్వవిభావిభవంబు దెల్పుచున్
గొలువ పరాసుతేనిఁ గనుఁగోఁ జనుదెంచెను రాజతిత్వరన్.

ఇట్లీ కావ్యమునందు విజయరామరాజుగారు నలువదివేల కాల్బల
ముతో వచ్చినట్లు చెప్పఁబడినను, ఆయనవెంట నిజముగా వచ్చినసేన

పదివేలని చరిత్రకారుఁడైన యార్మ్దొరగారు వ్రాసియున్నారు. ఇట్లుండఁగా రంగారావుగారి యనుమతిమీఁదనే బుస్సిదొరగారు కొందఱు సిపాయిలను బొబ్బిలిరాజ్యముమీఁదుగా మఱియొకచోటికిఁ బోవుటకుఁ బంపిరి. విజయరామరాజుగారి తంత్రమువలననో రంగారావుగారి బుద్ధిపూర్వకమయిన యేర్పాటువలననో పంపఁబడిన సిపాయీలు త్రోవలో బొబ్బిలి భటులచే నెదిరింపఁడి ముప్పదిప్రాణములను గోలుపోయి మరలి రావలసినవారైరి. ఈయవమానము విజయరామరాజుగారి ప్రోత్సాహమునకు తోడుపడఁగా, బుస్సీగారు రంగారావుగారిని శిక్షించి వారిని కుటుంబసహితముగా బొబ్బిలినుండి వెడలఁదోలుటకు నిశ్చయించుకొనెను. ఇన్నూఁటయేఁబండ్రు గుఱ్ఱపు రౌతులును నాలుగు ఫిరంగులును గల ౭౫౦ యూరపియనులతోను, విజయరామరాజుగారి భటులును సిపాయీలును గలిసిన ౧౧౦౦౦ స్వదేశీయపదాతిబలముతోను బుస్సీగారు బొబ్బిలికోటమీఁదికి దండువెడలిరి. బొబ్బిలికోట యిన్నూరుగజముల వైశాల్యముగలిగి నలుచదరముగా నుండెను. నాలుగు మూలలను నాలుగు గుండ్రని బురుజులుండెను. వెలుపలిగోడల యెత్తు ఇరువదిరెండడుగు లయినను, లోపలిబురుజులయెత్తు పండ్రెండడుగులే యుండెను. పయిని గోడల వెడల్పును పండ్రెండడుగులుండెను. ఇట్టి మట్టికోటయొద్దకుఁబోయి బుస్సీగారు తన సేనలను నాలుగుభాగములు చేసి యొక్కొక్కభాగమున కొక్కొక్క ఫిరంగినిచ్చి నాలుగుభాగములను నాలుగు బురుజులను సాధింప నియమించెను. ౧౭౫౭ వ సంవత్సరము జనేవరు నెల ౨౪ వ తేదీని ప్రాతఃకాలముననే యుద్ధ మారంభమయినది. శత్రువులు కోట బురుజులమీఁద ఫిరంగులు కాల్పనారంభింపఁగానే, కోట లోపలివా రగ్నిభయముచేత బురుజులమీఁది కప్పుతీసి వేసిరి. ఉదయమున జాము ప్రొద్దెక్కువఱకు బురుజుల గోడలలో విశేష భాగము కంతలుపడినవి. అప్పుడు శత్రువులయొక్క నాలుగుభాగములు

నొక్కసారిగా నిచ్చెనలు గైకొని లగ్గలు పట్టుటకయి కోటగోడను సమీపించి గంటవఱకును బ్రయత్నించిరికాని కోటను రక్షించుచున్న భటులయొక్క శౌర్యమువలన నొక్కరయినను కోటగోడమీఁది కెక్క లేకపోయిరి. కోటలోపలివారు స్త్రీలుగూడ వేయింటికి లోవుగానే యుండిరఁట. కోటగోడల కెగఁబ్రాఁక ప్రయత్నించినవా రనేకులు గాయములతోఁ గ్రిందఁబడిరి. ఈయంశమును కవి యిట్లు వర్ణించు చున్నాఁడు—

ఉ. తగ్గపరాసుమండల ముదగ్రతమై బిరుదు ల్వచించుచున్
లగ్గల కెక్క రా బురుజులం దగుమన్నె కుమారసైన్యముల్
వెగ్గలమైన కోపమున వెన్కొనుచు న్నురుమాడువీఁకచే
నగ్గలికం దుపాకులఁ గిలార్చుచు నేయుచు రోయుచు న్వడిన్.

సీ. పొంగులురాఁగాఁగిపొరలునూనియుమంచిగరగలవంచియక్క ఱగఁబల్లి
జిగురుటంబలివేఁడి దిగుపాఱజాఱఁగా గుండలకోలఁదిగాఁ గ్రుమ్మరించి
వసియూడ్చుదారుయంత్రసముత్కరంబులు మేనులుచ్చిచనంగమీఁటివైచి
రొండొంటిఁ దోడుగాగుండియలొదలల్గుటిచేసిత్రుంపఁగాగుండ్లుదొలపి
బిరుసుల దెరల్చిక్రొంబొగల్గురియనినుప
గొట్టములదాల్చి మొద్దికెగములఁగ్రుచ్చి
చిచ్చుబుడ్లనగల్చి నిస్త్రింశతతులఁ
బొడిచి పడఁద్రోచిరానేనఁ గడిమితోఱఁగ.

లగ్గలెక్క కోటపట్టుటకు శక్యముకాకపోఁగా నంతట నాప్రయత్నమును మాని శత్రువులు వెనుకకు మరలి మరల కోటమీఁద ఫిరంగులను గాల్వనారంభించిరి. అట్లు ప్రయోగింపఁబడిన ఫిరంగిగుండ్లు నొకచోటఁ గవి యీవిధముగా వర్ణించెను—

సీ. తట్టుకోటయగల్చిదారుణోష్మలుగ్రమ్మ వంతదారుడాసి వ్రాలునవియు
నినుపతల్పుల ఘుణిల్లునఁదాఁకి పిటేఁదికి రవళిమైవచ్చిబిట్టవియునవియు

ద్వారబంధపుఁగమ్మిదూఁటి యవ్వలికంట డుస్సి పాఱఁగ నోడి
డొల్లునవియు
గుఱితప్పి పఱతెంచి కోటముంగలిహస్తినఖపుదుమ్ములరేఁచినట్టునవియు
నగుచునొండెడ నెడయాఱ యంటితూఁగి
బంతులాడినపగిది గుభాల్గుభాలు
నినదభయదార్భటులశతఘ్నిప్రయుక్త
తాళఫలసన్నిభాయస గోళతతులు.

ఈఫిరంగిప్రేట్లచేత కోటగోడ మఱింత పడిపోయి శత్రువుల కెక్కువ యానుకూల్యమును కలిగించినది. అయినను కోటగోడలు పగులుటచేత కోట కావలివారి ధైర్యకంచుకము పగులక వారినిమఱింత తెంపరులనుగాఁ జేసినది. కోటకావలిభటులు తమప్రాణముల కాశపడక తమగుహాలను కాపాడుకొను బెబ్బులులవలెఁ బోరాడిరి. ఫిరంగిగుండ్లు చిత్తజల్లులుగాఁ గురియుచున్నను వెనుతీయక వీరభటులు శత్రువులు కోటగోడల కెగఁ బ్రాఁకఁగానే యాపెలత్రోఁ గ్రుమ్మి క్రిందఁబడఁ ద్రోయవలెనన్న నిశ్చయముతో నిశ్చలులై కాలుగదల్పక బురుజుల మీఁద నిలువఁబడిరి. ఆగ్నేయాస్త్రముల నపహసించెడు శతఘ్నికా ప్రయోగములముందఱ కేవల భుజవీర్య మేమి పనికివచ్చును? క్రింద నున్న సైనికులు గుఱిచూచి తుపాకులు కాల్చి బురుజులమీఁద నున్న వారి ననేకులను రూపుమాపిరి. స్వదేశ సైనికులయం దీవఱ కెన్నఁడు నేయుద్ధములోను గనియుండని యిటువంటి యసమాన ధైర్యసాహసముల కద్భుతపడి శత్రువులు సహితము పలుమాఱు వారి కభయప్రదానము చేసిరిగాని యావీరభటులు శత్రువుల వాక్యములను తిరస్కారపూర్వకముగా నిరాకరించి తమదేహములలోఁ బ్రాణము లుండఁగాఁ దమతావు విడువమని యక్కడనే సుస్థిరులై పర్వతమువలె నిలువఁబడిరి. అప్పటికి మధ్యాహ్నము రెండుగంట లయినను శత్రువులలో

నొక్కరును కోటగోడ నెక్కలేకపోయిరి. అందుచేత శత్రువులు కొంత సేపు యుద్ధము నిలుపవలసినవారైరి. అప్పుడు రంగారావుగారు శత్రువులతోఁ బోరాడి గెలువఁగలనన్నయాశ వదలుకొని తనవారిని బిలిచి యాలోచించి యంతఃపురస్త్రీలు శత్రువులచేతులలోఁబడి మానముగోలుపోకుండ కాపాడవలెనని నిశ్చయించి శిశుసహితముగా వారినందఱిని సంహరించుటకయి కొందఱిని నియమించెను. వారప్పుడే చేతులలో బాకులతోను బల్లెములతోను గదలిపోయి యంతఃపురము వాకిట గడ్డి నించి గృహముల కగ్నితగిలించి యాసంఘాత మరణమునుండి తప్పించుకొని ప్రాణములఁ దక్కించుకొనఁ బాఱుతెంచిన శిశువులను సహితము పుత్రులనక దయాపాత్రులనక క్రూరులై పొడిచి చంపిరి. ఈదారుణ కృత్యమును గవి యిట్లు చెప్పియున్నాఁడు—

క. చెలికాని వంశసంభవు । నలఘుతరస్థైర్యు ననిచె నవరోధవధూ
కులకంఠనాళకృంతన । కలనాదారుణవిధానకఠినత నెఱపఁగ.

తే. అతఁడు నభిమానరక్షణార్థప్రచార
దారుణాకార సాహసౌదత్యమమర
నంతిపురి కేఁగ మొరసె దిగంతరములు
ధరణి వడవడవడఁకె భూతలము బెగడె.

తే. రాయమణిరాణి తనకుమారాగ్రయాయి
నపుష కొండొకదాదికి నప్పగించెఁ
గోటవెడలించి బ్రతికించుకొమ్మటంచు
నట్లు కావించె నాదాయియడలువోడమ.

* * * *

క. ఘననిశితఖడ్గధారన్ । మొనకొని చెలికానివంశమూర్ధన్యుఁడు పెం
పున వడివడి నంతఃపుర । వనితాజనతాతిచిత్రవధవిధి నడిపెఁ.

తే. తక్కఁగల యట్టియభిమానధనులువెలమ
లోకనూతింప్ల వా రనలోగ్రశస్త్ర
నిహతులై రంగనాశిశుసహితు లగుచుఁ
దద్విదారణమెంతని తలఁప వచ్చు.

మరభిమానజనితమైన వధూశిశుసంహారక్రూర కార్యము ముగియఁగానే ప్రాణములకు తెగించి వారందఱును మరల యుద్ధోత్సాహముతో వచ్చి తమస్థానముల నిలిచిరి. నాలుగు భాగములలో నొకభాగమునకు నాయకుఁడైన లాదొరగారు దూరమునుండి యగ్నిదాహమునుజూచి లోపలి కావలిసేనలు పలుచనగుట కనిపెట్టి యీలోపల లగ్గలు పట్టుటకయి మరలవచ్చెను. నిచ్చెనలతో పయికెక్కఁ బ్రయత్నించినవా రనేకులు నిహతులయి క్రిందఁగూలుచు వచ్చినను కొందఱు శూరు లొక్కబురుజుపై నెక్కి నిలువగలిగిరి. వారి వెంబడిని మఱి కొందఱును కోట గోడల కెగఁబ్రాకి బురుజు చేరిరి. రంగారావుగారు శత్రువులను బాఱఁద్రోలి యాబురుజు రక్షింపవలెనన్న యాశతో హతశేషులైన భటులతో వచ్చుచు నొకగుండుదెబ్బతో నేలఁగూలి వీరశయనము నొందెను. ఆయనపాటువలనఁ గలిగిన సక్రోధశోకోద్రేకముతో లోపలనున్న వీరభటబంధువర్గమంతయు పగదీర్చుకోవలెనన్న దృఢనిశ్చయముతో తక్కిన బురుజులను విడిచి యక్కడకు వచ్చిచేరెను. అంతట తక్కిన శత్రుసేనాభాగములు మూడును వరుసగ నాయాబురుజులనుజేరి యరక్షితము లయియున్న యామూడు బురుజుల ననాయాసముగా సాధించి లోపలఁ బ్రవేశించెను. ఇట్లు లెక్కకు మిక్కిలిగా శత్రుసేనలు నానా ముఖముల వచ్చి చుట్టు ముట్టినను లోపలనుండి కోటను సంరక్షించుచున్న వీరభటులలో నొక్కఁడైనను బాఱిపోవుటకుఁగాని శత్రువులకు లోఁబడి శరణు చొచ్చుటకుఁ గాని ప్రయత్నింపలేదు. ప్రతిభటుఁడును వీరరసము మూర్తీభవించినట్లాయుధపాణియై శత్రున కభిముఖముగా

నడిచి శత్రువును పొడిచి తాను పడిపోవుచు వచ్చెను; గాయపడి భూమి మీఁద నొరిగినతరువాత సహితము ప్రాణములు బొందిలోనుండి వెడలు వఱకును దనచేతిలోని ఖడ్గముతో దాపునకు వచ్చిన శత్రువును నఱకవలెనన్న ప్రయత్నమును మానలేదు. ఇది కావ్యమునందుఁ గవి చేసిన వర్ణనముగాక యింగ్లీషు చరిత్రకారుఁడు వ్రాసిన సత్యాంశమగుట చేత బొబ్బిలికోటలోని రణశూరులు చూపిన విచిత్రపౌరుష మత్యంత శ్లాఘాపాత్ర మయిన దనుటకు సందేహములేదు. ఇట్టి వీరవధ కొంత సేపటి కెల్లను సంపూర్ణ మయిపోయెను. కోటలో జరిగిన ప్రాణనాశన మునకుఁ గఠినహృదయులయిన శత్రువులు సహితము జాలిపడుచు విచారించుచున్న యీసమయమునందు గుంపులోనుండి వృద్ధుఁ డొకఁ డొక బాలునిఁ జంకఁ బెట్టుకొని తిన్నగా లాదొర యున్నచోటికి వచ్చి "ఈశిశువు రంగారావు కుమారుఁడు. తండ్రి యభీష్టమునకు విరుద్ధముగా నేనీబాలకుని ప్రాణములను గాపాడితిని" అని పలుకుచు, ఆ సేనా నాయకునకు బాలు నొప్పగించెను. లాదొర యప్పుడే యాబాలకుని బుస్సీదొర యొద్దకుఁ బంపఁగా, అతఁ డాశిశువును వృద్ధుని తనసేనానివేశమునం దుంచి యాదరించి యాశిశువుయొక్క సంరక్షణభారమును తాను వహించి శత్రుభయమువలన శిశువును గాపాడుటకయి తగిన కావలివారిని నియమించి యప్పుడే యాశిశువును బొబ్బిలిరాజ్యమున కభిషిక్తునిఁ జేయుచు లేఖ్యములు వ్రాయించెను.

నాఁటి రాత్రియు మరుసటిదినములు రెండును గాయములు తగిలిన భటులయొక్క చికిత్సలు మొదలయిన పనులతోఁ గడచెను. మూఁడవనాఁ డర్ధరాత్రమునందు విజయరామరాజుగారుండిన పటమందిరములో గొప్ప సంక్షోభ మొకటి పుట్టెను. రంగారావుగారు నిహతులయిన దినమునం దాయన నమ్మిన వీరభటులు నలుగురు కోటలో నేమూలలనో దాఁగియుండి చీకటి పడినతరువాత కోటదాటిపోయి

విజయరామరాజుగారి శిబిరముల వెనుకనున్న యడవిఁ జొచ్చి చేరువ పొదలలో దాఁగియుండిరి. సమయము నిరీక్షించుచు వా రక్కడ రెండు దినము లుండి మూఁడవనాఁటి రాత్రి స్కంధావారము సద్దడఁగిన తరువాత నిశీథసమయమునందు వారిలో నిద్దఱు పొదలలోనుండి వెడలివచ్చి కావలివాండ్రను మోసపుచ్చి గూఢముగా విజయరామరాజుగారు నిద్రించుచుండిన పటకుటీరములో వెనుకవైపునుండి ప్రవేశించి యిద్దఱు నొక్కసారిగా తమబాకులతో పొడిచి విజయరామరాజుగారి వక్షస్స్థలమును గంతలు చేసిరి. మొదటి పోటుతో మేలుకొని విజయరామరాజుగారు మూల్గఁగానే వెలుపలినుండి కావలిభటుఁడు వచ్చి తుపాకిత్రో కాల్చెనుగాని గుఱితప్పిపోయెను. ఇంతలో నితరభటులును వచ్చి వెంటనే యూహాంతకులను జంపి ముక్కముక్కలుగా నఱికివేసిరిగాని యీలోపలనే వారు విజయరామరాజుగారిని ముప్పదిరెండుచోట్లఁ బొడిచిరి. ఇట్లు విజయరామరాజుగారిని జంపినతఁడు తాండ్రపాపయ్య యని కవి యిట్లు చెప్పియున్నాఁడు—

గీ. కదిసి పైఁబడి యొకకేల నదిమిపట్టి
వాఁడివాలున వక్షఃకవాటపాట
నంబుఁ గావించె నతనియూనాభిఘహార
విదళితాంత్రవ్రజంబులు వెలికిచుఱుక.

* * * *

మ. అపు డాతాండ్రకులాభిమాననిధి యాహా రాజదేవేంద్ర నీ
విపులప్రాభవశక్తి నీనిఖిలపృథ్వీభారధౌరేయతా
నిపుణత్వంబును భాగ్యముల్ వృథ చనన్ నీచేయుదుశ్చేష్ట ని
ట్లుపభోగింపఁగనయ్యె నిట్టివెతయం చుద్వృత్తి వర్తిల్లఁగన్.

గీ. తాండ్రపాపయ్యపలుపు ధౌర్త్యంబువలన
క్షత్రవర్యుండుపులివాతికండయయ్యె

ననెడు రొదప్పుట్టె నంత నయ్యవనినాథు
బలము లాత్తరవంబునఁగలయ బర్వి.

సీ. తనచావు సర్వసిద్ధంబుగా మదిఁగోరి
సాహసకృతికినై చన్నవానిఁ
దని నౌలికవిరోధిదర్పంబుమాపుట
పరమార్థమని యెంచుకొనువానిఁ
దనపడినట్టిబన్నముల కిక్కార్యంబు
ఫలరూపమని యాత్మఁదలఁచువానిఁ
దనకులస్వాములందఱు మెచ్చుకొన నోర్చి
పగదీర్చుకొన్న సంభ్రమమువానిఁ
దాంధ్రకులజుని బొదివిరి దారుణముగ
ఘోరయుద్ధంబుసలిపి యవ్వీరవర్యుఁ
జిదిమివైచిరి కఠినని స్త్రింశతతుల
నతనిసహచరయుగళసంగతముగాఁగ.

ఇట్లు మొదటవచ్చిన యుద్ధము దమ పూనిక్కని సాధింపలేక పోయిన పక్షమున, పొదలలో దాఁగియుండిన తక్కిన యుద్ధమునువచ్చి విజయరామరాజుగారి ప్రాణములుగొని తమ స్వామిఋణము తీర్చుకొనుటకు శపథము చేసికొనిరఁట! విజయరామరాజుగారు భృత్యులకైదండ గొనక నడువలేనంత స్థూలకాయులని చరిత్రకారుఁడు వ్రాయుచున్నాఁడు. యుద్ధములోఁ బ్రాణము దక్కించుకొన్న రంగారావుగారి తమ్ముఁడు వెంగళ్రావుగారు భద్రాచలమునకు పాఱిపోయి, ఆనందరాజుగారు బందరు వెళ్ళి యున్నప్పుడు ౧౭౬౧ వ సంవత్సరమున మరలివచ్చి తనకుటుంబము నెడల విశ్వాసముగల తొంటిసేనను గూర్చుకొని రాజాముకోటను స్వాధీనము చేసికొనెను. వెంగళ్రావుగారు మూడుసంవత్సరములు ప్రభుత్వముచేసి మృతినొందఁగ, ఇంతకుముందొక వృద్ధునిచే ప్రాణరక్షణము

చేయఁబడినట్లు చెప్పఁబడిన గోపాలవేంకటరావుగారను చిన్న రంగారావు గారు రాజ్యమునకువచ్చి నాల్గుసంవత్సరములు పాలనము చేసిన తరువాత ౧౭౭౬ వ సంవత్సరమున సీతారామరాజుగారాయనను చెఱసాలలోఁ బెట్టించిరి. ఆయన ౧౭౯౦ వ సం॥రమునందందుండి తప్పించుకొని నిజాము రాజ్యమునకు పాఱిపోఁగా, ౧౭౯౪ వ సంవత్సరమునం దింగ్లీషువా రాయనను బిలిపించి పూర్వుల బొబ్బిలిరాజ్యమంతయు మరల నిచ్చిరి.

ఈ నారాయణకవియొక్క కవిత్వమునందు లక్షణదోషములు కొన్ని యందందుఁ గానఁబడుచున్నను కవనము రసవంతమయినది. ఈ ప్రబంధమునందు వీరరస మించుమించుగా భారతమునఁ దిక్కన సోమయాజిచే వర్ణింపఁబడినట్లు వర్ణింపఁబడినది.

40. అత్తలూరి పాపకవి

ఈ కవి చెన్నబసవపురాణమను నయిదాశ్వాసముల పద్యకావ్యమును రచియించి మా పూర్వులలో నొకరయిన కందుకూరి యమృతలింగముగారి కంకితము చేసెను. మా పూర్వులు మహామ్మదీయ ప్రభుత్వములో "దేశపాండ్యా" లయి ఘనతను బొంది పెక్కు కావ్యములను కృతులనంది కవుల నాదరించియున్నారు. పూర్వము కృతిపతులయిన వారిని గూర్చిన కొన్ని పద్యముల నీపుస్తకమునుండి యిందుదాహరించుచున్నాను.

ఉ. ఆతతకీర్తికై కువలయాశ్వచరిత్రకృతిఁ గ్రహించిప్ర
స్ఫీతము లైన కొత్తపలి యేలెటిపా డనునగ్రహారముల్
ఖ్యాతిగఁజేసి బంధులకు గ్రాససమృద్ధు లొసంగి శాంభవ
వ్రాతము గోర్కు లిచ్చి విభవంబున మల్లనమంత్రి వర్ధిలెన్.

కందుకూరి మల్లికార్జునమంత్రి కువలయాశ్వచరిత్రము కృతినందిన తరువాత.

సీ. మహితపంచాక్షరీమాహాత్మ్యమును గృతి
యంది త్రైలోక్యవిఖ్యాతిఁ గాంచె
నతిభక్తి శ్రీశైలమందు మాసులు మెచ్చ
సంవత్సరము నివాసంబు చేసె
నిష్ఠాగరిష్ఠుడై నేఁడు నాఁడనక య
సంఖ్యమాహేశ్వరార్చన మొనర్చె
హితుల రక్షించి యహితుల శిక్షించి భూ
పతుల వశ్యులఁజేసి చతురుఁడయ్యె
నితని కెనయైనమంత్రులీక్షితితలమునఁ
గలరెయని సర్వజనములుఁ బలుక నెగడె
గండుకూర్ మల్లికార్జుననందనుండు
సంగరగుహుండు వీరేశలింగవిభుఁడు.

వీరేశలింగమంత్రి పంచాక్షరీమహాత్మ్యము కృతినందెను. అటు తరువాత

సీ. నారదప్రభ మించి నారదప్రభ నెంచి యమరినకీర్తిదానములవాఁడు
చిత్రభానునిమీఱి చిత్రభానునిఁ గేరి పరఁగుశుచిప్రతాపములఁవాడు
భీముపేర్మినిగెల్చి భీముపేర్మినగల్చి వఱలినభూతిసత్త్వములవాఁడు
ధర్మగర్మముఁద్రోచిధర్మగర్వముఁబాచి తగుశివభక్తిసత్యములవాఁడు
జగతిఁ జెలువొందె నుదయాస్త్రశైలసేతు
శీతనగమధ్యరాట్సభాసీనవిబుధ
వినుతసుగుణుఁడుమల్లికార్జునసుతుండు
మహితధృతిశాలిబసవరాణ్మంత్రిమౌళి.

క. ఘనముగ నైతముపూడియు
మినుమించిలిపాడు సిరులు మించంగ నొసఁ

గెను గురుచరవరులకు బస
వనిత్రో నెనయైనమంత్రి వసుధం గలఁడే.

క. తన మేనయల్లుఁ డావృతి । వినయుం డగుబుద్ధిరాజు వీరనచేతన్
గొని సత్యవతీపరిణయు । మనుకృతి శ్రీబసవమంత్రి యతిసంప్రీతిన్.

కందుకూరి బసవరాజుగారు సత్యవతీపరిణయమును గృతినందిరి. అటుపిమ్మటఁ గందుకూరి యమృతలింగముగారి చెన్నబసవపురాణమును గృతినందిరి. కృతిపతియొక్క పెదతండ్రియైన సాళువపతి

సీ. సుగుణు లగుమల్లికార్జునసుతులలోన
నాలుగవనందనుండగుసాళువపతి
సంతతాత్మీయహృదయపద్మాంతరాళ
సంచరత్సాళువపతి ప్రశస్తిగాంచె.

శా. ఢిల్లీనాయకుచేత దంతిహయశాటీముఖ్యవస్తువ్రజం
బెల్లం గైకొని కాశికాప్రముఖగౌరీశావను ల్గాంచి ని
త్యోల్లాసంబున శంకరార్చనలు దివ్యంబొప్పఁ గావించి సం
ఫుల్లాంభోరుహలోచనామదనుఁడై పూర్వప్రభ న్వర్ధిలెన్.

అని ఢిల్లీనాయకునిచేత బహుమానము లందినట్లు చెప్పఁబడి యుండుటచేతను, ఢిల్లీరాజ్యము నశించి నూఱుసంవత్సరములకంటె నధికకాలమగుటచేతను, కృతిపతియు కృతికర్తయు నుండినకాలము నూఱుసంవత్సరములకుఁ బూర్వమని చెప్పవచ్చును. ఈ గ్రంథమునకుఁ గథానాయకుఁడయిన చెన్నబసవన్న వీరశైవమతమును స్థాపించి కళ్యాణనగరమునందు బిజ్జలరాజునకు మంత్రియైయుండి యాతనివధించిన బసవేశ్వరునకు మేనల్లుఁడు. బసవేశ్వరుఁడు తన యధికారబలముచేత శైవమతమును వ్యాపింపఁ జేసినను చెన్నబసవన్నయే యధికమతాభినివేశము కలవాఁడయి మతవ్యాపనమునకు ముఖ్యకారకుఁడయి యుండినవాఁడు. బసవేశ్వరుఁడు శ్రీశైలమునకు సమీపముననున్న యొక గ్రామములో

బ్రాహ్మణదంపతులకుఁ బుట్టి యుపనయన సంస్కారము చేసికొనక శివభక్తుఁడయి లింగమును కట్టుకొనెడి యాచారమును మొదట నేర్పఱచెను. ఈ చెన్నబసవపురాణములో నక్కడక్కడ లక్షణవిరుద్ధము లయిన ప్రయోగములు కానఁబడుచున్నను, కవి మిక్కిలి ప్రౌఢుఁడయి హృద్యముగా పద్యరచనను జేసియున్నాఁడు. కవితాత యక్కిరాజు; తండ్రి శ్రీగిరిమంత్రి. ఈతనిది కౌశికగోత్రము. చెన్నబసవపురాణములోని కొన్ని పద్యము లిందుదాహరింపఁబడుచున్నవి—

చ. కనుఁగవఁ గెంపునింప నలుకన్ బసవేశుఁడు జూచి బిజ్జలుం
డనియెఁ బ్రధానశేఖరుఁడవై నుతిగాంచుట వన్నె కెక్కె యి
ట్లనుచితవృత్తికిం దగిలి యగ్రజ చీఁకటితప్పు సైపఁ గూ
డు నె కులశీలమానములు డొంకిచనన్ ధరణీతలంబునన్. ఆ-౧

ఉ. ఎక్కడనుండివచ్చెనొకొ యీ ముదిజంగము వానిపూయలోఁ
జిక్కె తరాలనుండి యొకచీమకుఁ బోవఁగనీక దాఁచు నా
చక్కనిపిండి నన్నదిమి సర్వముఁ బెట్టఁగఁబంచె నింక నే
నెక్కరణి న్వసింతు మరు లెత్తి వ్యయం బొనరించు వీనితోన్. ఆ-౨

మ. ఇతఁడా శ్రీగిరిమల్లికార్జునుఁడు సామీ లెస్సబాగాయె నీ
మతిలో నేమితలంచి దైవ మని సంభావించి కాన్పింపఁ జూ
చితి నే వెఱ్ఱినిగాను వేలు పని దర్శింపంగ నాత్రోడనా
చతురత్వంబులు చాలు దేవు నిఁక దాఁచంబోక కాన్పింపవే. ఆ-3

చ. అతులనదీప్రవాహమున నాడది యీడది రెండుకాష్ఠముల్
జతపడి కొంతదవ్వరిగి లంక తటాలున నడ్డమైన నా
జత విడి యొక్క తేగు నటునాగక యొక్కటి నిల్చెఁ గావునన్
వెత కుడువంగ నేల నను వీడె నతండని నెమ్మనంబునన్. ఆ-౪

ఉ. నిద్దురలేచి యాఘనుఁడు నీలగళున్ స్మరియించు వేళ నా
పెద్దయ సంచరించునడిపినుల సోఁకిన నావుదూడయో

మొద్దా యటంచుఁ దాసియుని యేడ్చెబ ముమ్మఱుఁబల్క నాత్మఁడీ
ప్రొద్దుటి కబ్బె నాకు గురుబోధితమంత్ర మటంచు నాత్మలోన్. ఆ-౫

---

41. కస్తూరి - రంగకవి

ఈకవి లక్షణచూడామణియను నామాంతరముగల రంగరాట్ఛం దస్సును రచియించుటయేకాక సాంబనిఘంటును, కృష్ణార్జునసంవాదమ నెడి మైదాశ్వాసముల కావ్యమునుగూడ రచియించెను. ఇతఁ డార్వేల నియోగిబ్రాహ్మణుఁడు; ఈతనితండ్రి వేంకటకృష్ణయామాత్యుఁడు; తల్లి కామాతమ్మ. ఇతఁడు ౧౭౫౦ వ సంవత్సరప్రాంతములయందు తంజా పూరి సంస్థానమం దుండినవాఁడు. శంకరవిజయమును రచియించిన యాంధ్ర కాళిదాసు తా నీకవికి శిష్యుఁడయినట్టు తన గ్రంథమునందు వ్రాసికొనియున్నాఁడు. కస్తూరిరంగకవి విరచితమైన రంగరాట్ఛందములో ననేకాపూర్వగ్రంథములనుండి పెక్కు పద్యములు లక్ష్యములుగాఁజూపఁ బడియున్నవి. ఆ యాకవులకు కర్తృత్వమారోపింపఁబడిన యీగ్రంథ ములు కొన్ని యెంతవఱకు సత్యమైనవో యింకను విచారింపవలసి యున్నది. ఇతఁడు మంచికవి. ఈతని కవిత్వనైపుణి దెలుపుటకయి కృష్ణా ర్జున సంవాదములో నొక్కొక్క యాశ్వాసమునుండి యొక్కొక్క పద్యము నిందుదాహరించుచున్నాను.

ఉ. తమ్ములవ్రాలి పుష్పరసధారలుగ్రోలి సుగంధగంధవా
హమ్ములఁ గ్రాలి తేసియలయందపువాఁకలఁదేలి పువ్వుజొం
పమ్ములసోలి కింశుకసుమమ్ములవ్రేలి ప్రియాళినేలి ఝం
ఝుమ్మని క్రమ్మి తుమ్మెదలు చొప్పడుచున్నవి కాననంబునన్. ఆ-౧

ఉ. హా విధి యెంతచేసె నహహా యిపు డెంతటిమాట వింటి నా
హా విపరీతదుర్దశల నందితి హా యిఁకమీఁదఁ నన్ను సం

భావనచేసి ప్రోవఁగలవా రెవరం చని యూగయుండు నెం
తే వెతఁ జెంది కన్నుఁగవ నీ రొలుకం బలవించి వెంషియున్. ఆ-౨

మ. అతివ లోకొండలు సద్దఁజేరి యిదియేమమ్మా మహారాజుగా
సుతుఁ డం దుండఁగ సారెసారెకు నిటుల్ శోకించుట ల్మీకు సం
గతి కాదమ్మ సహించవమ్మ గయునిం గాంగేయు లెల్ల స్నయో
న్నతి రక్షించిరి నమ్మవమ్మ యని నానారీతులం దెల్పుచున్. ఆ-౩

శా. యుష్మత్సాంద్రచమూసమూహభుజగర్వోగ్రాంధ కారంబునన్
గ్రీష్మోద్యత్సమయప్రచండకరసంకీర్ణాంశుసంకాశము
ద్భీష్మాస్త్రంబుల నేసి మాన్చి తుది నీబీరంబు వారించెదన్
భీష్మాచార్య యొకింత సల్పుమని గంభీరాట్టహాసోగ్రుఁడై. ఆ-౪

చ. తరణి సుధాకరుల్ గతులు తప్పఁ గులాచలము ల్వడంక ది
క్కరులు చలింప సర్వసురకాండము లంబరవీథి భీతిచే
నొరగఁ బయోధు లింకఁగ మహోద్ధతి మంటలు గ్రక్కుకొంచుఁ దీ
వరముగఁ గ్రీడిపైని ఘనవైష్ణవసాయక మేఁగుదెంచినన్. ఆ-౫

---

42. ఆలూరి కుప్పనకవి

ఈకవి యానందగిరికృతమైన శంకరవిజయము నాఱాశ్వాసముల పద్యకావ్యమునుగా రచియించెను. ఇతఁడు వైదికబ్రాహ్మణుఁడు; వేంకటగిరిపౌత్రుఁడు; వేంకటేశ్వరార్యునకును నరసమాంబకును పుత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; కాశ్యపగోత్రుఁడు.

క. ఘనుఁ డగుతుళజేంద్రుఁడు దయ। తనరఁగ నీ కాంధ్రకాళిదాసాభిధ మ
న్ననగా నొసంగెనఁట నీ। యనుపమసాహిత్యమున కహో యెన గలదే?

అని కవి తనకు తంజావూరుమహారాజగు తుళజేంద్రుఁ డాంధ్రకాళిదాసను బిరుదిచ్చినట్లు చెప్పుకొనియున్నాఁడు. ఈతుళజేంద్రమహారాజు

ప్రతాపసింహమహారాజు పుత్రుఁడు. క్రీస్తుశకము ౧౭౪౦ వ సంవత్సరము మొదలుకొని ౧౭౬౩ వ సంవత్సరము వరకును తండ్రి రాజ్యమునుచేసి మృతినొందఁగా, తుళజేంద్రు డీకడపటి సంవత్సరమున సింహాసనమెక్కి ౧౭౮౭ వ సంవత్సరమునందు మృతినొందెను. ఈమహారాష్ట్ర ప్రభువు చేత నాంధ్రకాళిదాస బిరుదాభిదాన మందిన మనకవి నూరు నూట యిరువది సంవత్సరములక్రిందట నుండినవాఁడు. ఇతఁడు చెన్నపట్టణములో నుండిన నియోగుల ప్రార్థనమీఁద దాసీశంకరవిజయమును దెనిఁగించినట్లుకవి యిట్లువ్రాయుచున్నాడు.

సీ. శ్రీపార్వతీశలక్ష్మీశసేవాసముపార్జితమహనీయభాగ్యయుతులు
ఘటనాఘటనసముత్కటమనీషాతిచమత్కృతియాధోరణీమంజుమతులు
నతులితసామదానాద్యుపాయైకవిచక్షణాక్షీణశాశ్వతచరితులు
హితపురోహితనిజాశ్రితబాంధవావనామాననిస్తులితాన్నదానరతులు
కలితయజనాదిమహితషట్కర్మనిరతు
లగణితజగన్నుతాద్భుతసుగుణతతులు
సారలౌకికవైదికాచారభృతులు
చతురచెన్నపురీచరత్సచివతతులు.

* * * *

క. నను శ్రీనృసింహపాదా। ర్చనజనితలసత్కవిత్వచాతుర్యగుణా.
ధ్న్యుని నాంధ్రకాళిదాసా। ఖ్యునిఁబిల్వఁగఁబంచిపల్కిరున్నతకరుణన్.
సీ. లీలఁ బంచనదీస్థలీపురాణము తెలిఁగించితి వాహ్యాఢకీర్తి మెఱయఁ
బరఁగు రామాయణభాగవతంబులు యక్షగానముచేసి తద్భుతముగఁ
గరమొప్ప పరమభాగవతచరిత్రయన్ కృతియొనరించితున్నతిఁబలిర్పఁ
దెలివొందు నిందుమతీపరిణయ నామకృతి రచియించితి వతులగరిమ
గురుతరోజ్జ్వలసరణితో సురకథాసు
ధారసాభిధకావ్యముదారఫణితి

గా రచించితి వెనలేని గద్యపద్య
తతుల లెక్కింపఁదరమె త్వత్కృతులుజగతి.

* * * *

వ. కావున జగద్గురుండై విశేషించి మనకు గురుడైన యాచార్యునివిజ యంబు......నొనరించి మాకంపటికి నత్యానందం బొనఁగూర్పు మని యాశీర్వచన రూపంబుగా నిర్దేశించి పలికి యనేకరీతుల సత్క రించిన............

సీ: కార్యఖడ్గకవిత్వకరణికచాతురి యిలఁ బరికింప మీ యింట్లబిరుదు
సలలితయజనాదిసత్కర్మనిరతులు ఖ్యాతిరంజిల్లు మీ జాతిబిరుదు
ధైర్యదాతృత్వోచితజ్ఞ తాదిగుణైకసరణి మీసాంగత్యసహజబిరుద
మనుగతంబగుపాలనానూనచాతుర్యమమరుమీభవ్యగోత్రములబిరుద

మట్టిమీరలు నాపట్ల నతులకృపను
గురువిజయమిట్లు తెలిఁగింపఁగోరుకొనుటఁ
గలిగె నిలమీఁద యోగంబునిలువరముగ
సారెకునియోగ మెంతని సన్నుతింతు ?

పయిపద్యములలోఁ జెప్పఁబడినదానినిబట్టి కవి యాశంకరవిజయ మునుగాక యాంధ్రకృతులను మఱియుఁ బెక్కింటిని రచించినట్లు కను పట్టుచున్నది. రంగరాట్ఛందస్సును రచించిన కస్తూరి రంగకవి తనకు విద్యాగురు వయినట్లు చెప్పి కవి గ్రంథాదియందాతని నిట్లు స్తుతించి యున్నాఁడు—

సీ. భారతి కేవిప్రవర్యునిజిహ్వ నిత్యముగ వసించునాస్థానవాటి
వాణీవధూటి కెవ్వానిసుస్వలుకులు ధరియించినట్టిసుత్యములచాలు
శారద కేసుధీస్వామిచేతోవీధి యమరినరత్నసింహాసనంబు
పలుకులవెలఁది కేభాగ్యునిగృహంబు నెట్టుగా వసియించు పుట్టినిల్లు

నలువచెలువకు నెవ్వఁ డెన్నఁదగుపుత్రుఁ
డట్టికస్తూరిరంగార్యు నచలధైర్యు
నార్యనుతచర్యు మద్గురువర్యు నెంచి
ప్రణుతిగావింతుఁబలుమాఱుఁబస్తుతింతు.

మొత్తముమీఁద నీయాంధ్రకాళిదాసునికవనము సరసమైనదని చెప్పవచ్చును. శంకర విజయములోని కొన్ని పద్యముల నిందుదాహరించుచున్నాను—

శా. ప్రాచుర్యం బగుతావకీనకథితప్రఖ్యాతసంశుద్ధ వే
దాచారంబులు మాని తప్తతనులై యాయాకుచిహ్నాంబులన్
వైచిత్ర్యంబుగఁ దాల్చి విప్రముఖులో వారెల్ల నత్యంతమి
థ్యాచారంబున సంచరించెదరు దర్పారూఢులై యీశ్వరా. ఆ-౧

చ. అనయము నైజధర్మములయందుఁ జలింపక మిత్రశత్రుభా
వనల స్వపక్ష మంచుఁ బరపక్ష మటంచుఁ దలంప కెంతయున్
ఘనసమబుద్ధిమీఱఁ గలఁకంగొన కెవ్వరి నొవ్వనేయకే
పనుపడి స్వస్థచిత్తుఁ డగువాఁడుసుమీ హరిభక్తుడెంతయున్. ఆ-౩

మ. నను నీభక్తుఁ డటంచు నెంచ కిల విన్నాణంబుగా నిట్లొన
ర్చినయజ్ఞానుల నేమిపల్క నిఁక నీచిత్తంబు నా భాగ్య మో
యనుకంపానిధి నిన్ను నమ్మితిని నెయ్యంబొప్ప నీవేళ నీ
యనలార్తిం దొలఁగించి ప్రోవుము నృసింహా దీనకల్పద్రుమా. ఆ-౬

43. పింగళి ఎల్లనార్యుఁడు

ఈ కవి సర్వేశ్వరమాహాత్మ్యమను నామాంతరముగల తోభ్య చరిత్రమును రచియించెను. తోభ్యచరిత్రము నాలుగాశ్వాసములుగల క్రైస్తవగ్రంథము. "ఇది శ్రీమదివ్వటూరి శరభనారాధ్య సద్గురుప్రసాదలబ్ధాష్టవిధకవిత్వప్రవీణ" అని గద్యమునందు వ్రాసికొనుటచేతను,

సీ. భక్తిమై రేణుకప్రమథోత్తము నుతించి
మాయదేవాహ్వయుమహిమ పొగడి
చెలఁగి యథావాక్యముల నన్నమయగారి
భజియించి మ్రొక్కెడి పాలకురికి
సోమన్నగారిఁ బ్రస్తుతిచేసి ప్రియమంది
శివదేవముఖనవకవుల నెంచి
గణపతిదేవుని ఘనతసన్నుతిచేసి
వేమనఁ గీర్తించి విమలమతిని
వ్యాసవాల్మీకికాళిదాసాదిఘనుల
నన్నపార్యునిఁ దిక్కనయజ్వ నెఱ్ఱ
ప్రెగడ ధూర్జటిఁ బోతన భీమకవిని
జెలఁగి శ్రీనాథముఖకవిశ్రేణిఁ దలఁచి.

అని శివభక్తులను ముఖ్యముగా నుతించి యుండుటచేతను, ఈ కవి శైవుఁడయిన నియోగి బ్రాహ్మణుఁడని యూహింపఁదగి యున్నాఁడు. ఇతఁడు క్రైస్తవుఁడుగాక శైవబ్రాహ్మణుఁడే యైనపక్షమున, క్రైస్తవమతగ్రంథ మేల చేసెనో తెలియకున్నది. ఇతఁడు క్రైస్తవ మతావలంబనముచేతఁగాని, ధనాపేక్షచేతఁగాని యీ గ్రంథమును రచించి యుండును. కవి భారద్వాజగోత్రుఁడు; పింగళి నాగయామాత్యపుత్రుఁడు. ఇతఁడు కృష్ణామండలములోని కొండవీటిసీమయందుండిన నియోగి

బ్రాహ్మణుఁడు. ఈ కవి తుమ్మరాయపరెడ్డి ప్రేరణముచేత నీ గ్రంథమును రచియించెను. ఈ సందర్భమునఁ గవికృత్యాదిని వ్రాసిన పద్యములఁ గొన్నిటి నిందుదాహరించుచున్నాను—

చ. తనర విదర్భసీమ కవతంస మనందగుకొండవీటి కిం
క్రుని వెస రాజ్యలక్ష్మికి నిరూఢనివాస మనంగ భక్తవా
డనుపుర మొప్పు నుర్వరకు హారమణిస్థితిఁ బొల్చి సజ్జనుల్
ధనకనకాంబరామలసదావిభవోన్నతిఁ జెంది వర్ధిలన్.

వ. ఆ పట్టణంబున కధీశ్వరుండు.

సీ. తనకీర్తికామినుల్ దశదిశాభాగరంగస్థలంబుల నాట్యగతులు నెఱపఁ
దనశౌర్యవహ్ని దుర్దమభయంకరశత్రుధరణీశ్వరాటవుల్ దరికొనంగఁ
దనదానధారానితంబినీరత్నము లబ్ధినాయకులతో నలఁగి పెనఁగఁ
దనకరుణారసఘనతరావధ మఖిలార్థిదారిద్ర్యామయంబు లడఁప
ఘనతఁ జెన్నొందుజగనొబ్బగండబిరుద
భూషణుఁడుతుమ్మవంశాబ్ధిపూర్ణచంద్రుఁ
డలఘుచరితుఁ డనంతాధిపాత్మజుండు
రమ్యరుచి హేళి రాయపరెడ్డిమౌళి.

వ. ఒక్కనాఁ డమాత్యపురోహిత విద్వత్కవీంద్ర తార్కిక మీమాంసిక వందిమాగధ సుహృద్బంధు సేనాధీశ్వరసహితంబుగా నాస్థానమంటపంబున గీతవాద్యనృత్య వినోదలీలాకౌతూహలమానసుండై యుచితాసనంబున సుఖాసీనుండై

గీ. అనుఁగుఁదమ్ముఁడు పాపన్న వినయగరిమ
నాత్మధర్మప్రవర్తన ననుకరింపఁ
బరఁగ ధరమంత్రిపొత్తూరిపాపనార్యుఁ
డెలమివిద్యాప్రసంగములఁ దెలుపుచుండ.

మ. ఘను శ్రీసద్గురుచిత్కళేక్షణమహాసంధానుసంధానపా
వనకారుణ్యకటాక్షలబ్ధవరగీర్వాణాంధ్రభాషాకవి
త్వవిరోధక్రమచిత్రలక్షణచతుష్కారప్రబంధాళిక
ల్పనునిన్ బింగళి యెల్ల నార్యుని బిల్వంబంచి పల్కెం గృపన్.

చ. ప్రణుతియశోవిశాలుఁడవు భాసురశబ్దవిగుంభ నాదిల
క్షణములఁ జిత్రవైఖరుల సర్వనృపాలసభాంతరంబులన్
గణుతికి నెక్కినీకవితఁ గర్ణరసాయన మౌచు నిష్పురీ
గణకవితానమందు నతిగౌరవ మందితి వెంచిచూడఁగన్.

* * * *

శా. కొండారెడ్డిఘనుండు శౌర్యకటిమన్ గొట్టె న్నరాతీల ను
ద్దండుం డన్న యతండు మాకు సుకవీంద్రశ్రేణిఁ బ్రోచున్ సిరుల్
సిండన్ దామెర వేంకటాధిపుఁడు మన్నించంగఁ బామూరిలో
నుండు న్నిన్ను బహూకరింపఁగలఁ డేయుద్యత్కృతిశ్రేష్ఠతన్.

వ. ......మున్ను మజ్జనకాగ్రజుండును గొండారెడ్డికి జనకుండును నగు నోబళరెడ్డి భూకాంతునకుం దదీయాచార్యుండగు సంజీవనాథస్వామి పరాపరవిజ్ఞానమార్గోపదేశ ప్రసంగవశంబున నిత్యంబైనసత్యాధ్యయనవిధానప్రవర్తకుం డైనతోభ్యుండను నొక్కమహాపురుషునిదివ్య చరిత్రంబు గలసర్వేశ్వరమాహాత్మ్యంబు చిత్రంబుగా ముఖవచనంబులం దేటపఱిచి సంక్షేపరూపంబైనవాక్యగ్రంథంబొసంగె. దీనిం బరిశీలించి సర్వేశ్వరున కంకితంబుగాఁ దెనుంగున మృదువచన రచనాగౌరవం బేర్పడఁ బ్రబంధంబుగా నిర్మింపవలయు............

పయివానినిబట్టి యీకవి యంతకుమున్ను వచనకావ్యముగా రచియింపఁబడినదానినిబట్టి యీపద్యకావ్యమును రచించినట్లు తెలియ వచ్చుటయేకాక యితఁడు దామెర వేంకటాధిపునికాలములో నుండినట్లు కూడ స్పష్ట మగుచున్నది. బహుళాశ్వచరిత్రమును రచియించిన దామెర

వేంకటాధిపుఁడు పదునేడవశతాబ్దారంభమునం దుండినవాఁడు. ఇతఁడతఁడుగాక యాతనిమనుమఁడయినను, కవి పదునేడవశతాబ్దమధ్యమునం దున్నట్లేర్పడుచున్నది. దీనినిబట్టి చూడఁగా నీత్రోభ్యచరిత్రము వేదాంతరసాయనమునకంటెఁ బూర్వమున రచియింపఁబడినట్లు కానఁబడుచున్నది. ఈకవి కవిత్వము మృదుమధురపాకము గలదయి హృద్యముగా నున్నది. కవనపటిమ తెలియుటకయి త్రోభ్యచరిత్రమునుండి కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను —

మ. ఇల కంపించినఁ దారకల్ చెదరినన్ హేమాచలం బెంతయున్
దలక్రిందైనను భానుఁ డస్తగిరిమీఁదం దోఁచినన్ దిగ్గజా
వలి యల్లాడిన వార్ధు లింకిన మనోవాక్కాయకర్మంబులన్
బలుకంబూనఁ డసత్య మెప్పటికి మానం డాత్మధర్మస్థితిన్. ఆ. ౧.

మ. అకటా చేరెడుకూలిబియ్యమునకై యత్యంతనిత్యాన్నదా
నకళావైభవలక్ష్మికిన్ నిలయమౌ నాతల్లిహస్తాబ్జ మిం
తకృశీభావము నొంది క్రిందుపడఁగా నాగుండె యెంత్రే వికా
వికలై ప్రీలక నిల్చియుండెఁ గఠినోర్వీభృద్విపక్షోపమై. ఆ. ౨.

ఉ. బాలుఁడు వీని నింతకును బాముల నొందఁగనీక పెంచితిన్
దాళఁగఁజాలఁ డాఁకలికి దప్పికి వేళ యతిక్రమించినన్
మే లొనరింపఁ గై కొనిన మిమ్మిఁక నేమని వేఁడుకొందు నా
జాలి దొలంగు టెట్లు మునిసత్తమ సత్కృప నానతీయవే. ఆ. 3.

ఉ. సంతసమంది యప్పుడ వెసన్ మగుడంజని ప్రాణనాథ యా
వంతయుఁ జింతలేదు భవహాత్మజ మున్నుగలేచి పాదుకల్
కాంతునిమ్రోల నిడ్డ నెసకంబుగఁ దల్పము డిగ్గి నారతీ
కాంతునిబోలు నాథునిఁ గన్నులపండువుగాఁగ జూచితిన్. ఆ. ౪.

44. చింతకుంట కోదండరామకవి

ఈకవి సునందాపరిణయమను నామాంతరముగల ప్రదీపచరిత్రము నైదాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు నందవరీక నియోగి బ్రాహ్మణుఁడు, అక్కనమంత్రిపుత్రుఁడు. కవి తన వంశజులలో సుప్రసిద్ధుఁడయి యుండిన రాయనభాస్కరు నిట్లు వర్ణించియున్నాఁడు—

సీ. ఘనతరౌదార్యదీక్షాకల్పితానల్పకరవిబద్ధసువర్ణకంకణుండు
ఆసేతుశీతనగాంతరరాట్సభామధ్యవిశ్రుతకీర్తిమండలుండు
కొండపల్లి వినకొండ దుర్గద్వయీదేశప్రజావనధీయుతుండు
సకలావనీపక సంతానయాచితవస్తుప్రదానప్రవర్తనుండు
అన్నవేమమహీశదత్తాగ్రహార ।
మదకలాందోళి కాశ్వసన్మణివిశేష ।
భూషణాద్యష్టభూతివిభూషితుండు ।
భానుతేజుండు రాయనభాస్కరుండు.

ఈకవి ౧౭౭౦ వ సంవత్సర ప్రాంతమునం దుండినవాఁడు. ఈతని కవిత్వము మొత్తముమీఁద రసవంతమయి హృద్యముగానే యున్నది. సునందాపరిణయములోని కొన్నిపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

శా. సేవార్థాగతకామినీనికరకాంచీకింకిణీకంకణా
రావంబు ల్వివిధోరువాద్యపటలీరమ్యధ్వనుల్ భవ్యభూ
దేవాగ్రేసరగానసంయుతములై దిక్కుల్తగ న్నిండఁగా
దేవాగారము లొప్పు నప్పురమునన్ దేదీప్యమానంబులై. ఆ. ౧.

ఉ. ఇమ్మెయిఁబెట్టుచాయ లవియెన్నఁగ నేటికి నైజకాంతిచే
నిమ్మదిరాక్షి మోముసరి యిచ్చట నెచ్చట లేదు చూడ నీ
నెమ్మది సంశయం బయిన నిక్కము చేసెద నిప్పు డాన నా
తమ్ములమీఁదఁ బెట్టుకొనెదన్ ద్విజరాజుకుఁ జేయిసాఁచెదన్. ఆ. ౨.

ఉ. కుంజరయాన కాంచె నవకోరకనూనపరీతమంజరీ
మంజులపుంజరంజితసమంజసభవ్యనికుంజసంభ్రమ
ద్గుంజనమందషట్చరణకోటిరవాంచితసద్దిగంతమున్
గంజముఖీవిలాసపఖకాంతనిశాంతము నవ్వనాంతముఁ. ఆ. ౩.

ఉ. అన్నవులార నావలపు నంగడిఁబెట్టకు రమ్మ చాలు విరా
మన్నన లింక నన్నుఁ బలుమాఱును వేఁడకు రమ్మ ప్రాణముల్
గ్రొన్ననవింటిదేవతకుఁ గొంకక యిచ్చెద నమ్మవాసు నే
మున్న రవంత పోవిడుట మోసమువచ్చెఁగదమ్మ బుద్ధికిన్. ఆ. ౪.

ఉ. సంతమసంబుపోక నవసారసలక్ష్మికిఁ గేక యామినీ
కాంతకుఁ గాక కోకకుళకంబులజోక యులూకపంక్తికిఁ
జింతలమూఁక పద్మలకుఁ జెన్నగుఢాక ప్రభాతకాలమున్
వింతకురాక శోణరుచి విన్నగఁ బ్రాఁకి చెలంగె దిక్కులన్. ఆ. ౫.

---

45. కైప మాయనకవి

ఇతఁ డుషాకళ్యాణ మనఁబడెడి యైదాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఈతఁడు వైదికబ్రాహ్మణుఁడు; మహాదేవశాస్త్రికిని కామాక్షికిని బుత్రుఁడు. ఈకవి యుషాకళ్యాణమునందుఁ దనజనకుని నిట్లు స్తుతించెను—

క. కామాహంకృతిహరణుఁడు
కామాక్షీధవుఁడు విబుధగణవినుతగుణ
స్తోముఁడు సర్వజ్ఞుఁడు ని
స్సీమయశోధనుఁడు వృషవిశేషప్రియుఁడున్.

గీ. చిద్విలాసకళానిధిశేఖరుండు
శ్రీమహాదేవుఁ డాశ్రితశ్రీకరుండు

కైపకులవార్ధి చంద్రలింగనకవీంద్ర
పుత్రుఁడై యొప్పె నాకవిపుణ్యమేమొ.

గీ. ఆమహాదేవు నప్రమేయప్రభావు
ధర్మవర్ధను ననుఁగన్నతండ్రి నాత్మఁ
దలఁచి తద్దివ్యపదపద్మములను గొలుతు
నక్షులనతులను బ్రుధులవినుతతతులను.

ఈకవి నూఱుసంవత్సరములకుఁ బూర్వపువాఁ డగుటకు సందేహ ముండదు. ఇతఁడు తనపుస్తకమునందు శబ్దాలంకారములను విశేష ముగా సమకూర్చెనుగాని పుస్తకమునందు వ్యాకరణదుష్టములైన ప్రయోగము లనేకములు కానఁబడుచున్నవి. ఈశృంగార ప్రబంధము కొంతవఱకు రసపుష్టికలదిగానే యున్నది. ఉషాకళ్యాణమునుండి కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను—

మ. త్రిజగన్మోహనదీపమో బహుజయశ్రీపూర్ణనిక్షేపమో
యజనైపుణ్యకలాపమో తపనచంద్రాగ్నిత్రయీరూపమో
ద్విజముఖ్యస్తుతలగ్నమం దొకమహాతేజంబు తద్భీష్మకా
త్మజగర్భంబున నుద్భవించెను సమస్తానందసంధాయియై. ఆ. ౧.

ఉ. భంబులు గోళ్ళు పల్లవనిభంబులు కాళ్ళు మనోజకాహళా
భంబులు జంఘ లౌర కరభంబులు సక్థులు శాతకుంభకుం
భంబు లురోజముల్ దరనభంబులు కరవలగ్నముల్ ద్విరే
భంబులు కుంతలంబులు శుభంబు లుషాసతిలక్షణంబులున్. ఆ. ౨.

చ. అతఁడును మారుదారుణశరావళిహావళి కోర్వలేమి నో
నుతనుమణీ మనీష నిటు సోలుచు వ్రాలుచుఁ దూలనేల నీ
వితరపుఁజింతఁ దక్కి నుతి కెక్కిన పేలల నోలలాడుమా
దృతముగఁ జేతుఁగామితముఁ దెల్పుము సల్పుము బల్లుము న్బటల్ ఆ. 3

ఉ. ఇయ్యెడఁ దియ్యమావిచిగు రెంతయు వింతగఁ దేనె లొల్కుచున్
సయ్యనఁజాలుమేలుజిగిచాలునఁ గ్రాలు ననూనవైఖరిన్
దొయ్యలి తావకాధరముతోఁ సరికా దవునంచు సందియం
బయ్యెడిఁ దారతమ్య మరయంజను నీ నునుమోవి నియ్యవే. ఆ.౪.

ఉ. నాకులఁ బూర్వనాకుల వినంబడ నట్టివిధంబు లొప్పఁ దన్
దాఁకుచు మిన్ను ప్రాఁకుచును దద్దయు యుద్ధముసల్పుతన్మదో
ద్రేకులఁ దమ్మితేకులవలెన్ హాలకోటి కలంకరించి పె
ల్లాఁకలిగొన్నరోకలికి నాహుతిఁ జేసెను సీరి పోరిలోన్. ఆ. ౫.

---

46. వెలిదండ్ల వేంకటపతి

ఇతఁడు రాధామాధవసంవాద మను మూఁడాశ్వాసముల ప్రబంధమును రచియించి ప్రళయకావేరి నివాసుఁడగు మగదలరామదాసున కంకిత మొనర్చెను. ఈకవి తిరువేంగళాచార్యపుత్రుఁడు. కృతిపతియగు మగదల రామదాసామాత్యుఁడు గతశతాబ్దమధ్యమునకుఁ దరువాత నుండినవాఁడయినందునఁ గవి యిప్పటికి నూఱుసంవత్సరములక్రిందట నుండినవాఁడు. ఈతనికవిత్వము మనోహరముగానే యుండును. రాధామాధవసంవాదములోని మూఁడుపద్యముల నిందుఁ బొందుపఱుచుచున్నాను—

చ. పసుచులతోఁడ నాఁడఁ బసిబాలుఁడవా వలదన్న మాన వా
గడములు కొన్ని నేర్చితివి కల్లరి వైతివి కొల్లకాఁడవై
దుడుకులు చేయఁజాగితివి దొంగిలఁజొచ్చితి వేమిచెప్పినన్
వడిగఁ బరాకుచేసికొని వాకిటి కేగెదు పిల్వఁ బిల్వఁగన్. ఆ. ౧.

ఉ. ఏవగవారుచేసిన సహించి తనంతటివారిఁ జేయుచున్
దైవము దాత తల్లియును దండ్రియుఁ దానయి ప్రోవఁగా జగ
త్పావనమూర్తియౌ తనకుఁ బావనమే తనుఁగన్న దేవకీ
దేవిని దన్నుఁగన్నవసుదేవుని నాపదఁ బాచి ప్రోచుటల్. ఆ. ౨.

ఉ. ఒక్కతె భ్రాంతిచేఁ గొరల నొక్కఁడు మానుపఁబూఁటకాఁపె నే
నెక్కడిదాన నీవు మును పెక్కడివాఁడవు నాకు నీకు నే
మక్కఱ వెక్కనైన నొక రాడెడుపల్కులు నేన పల్కెదక్
గ్రుక్కఁగ నాయెఁబోయె నవి కొన్నిదినాలుబుణానుబంధముల్. ఆ-3

---

47. పట్టమెట్ట సరస్వతి సోమయాజి

ఇతఁడు పృథుచరిత్ర మను ప్రబంధమును రచియించి దాక్షా రామ భీమేశ్వరున కంకితముచేసెను. ఈకవి యాజువేలనియోగిబ్రాహ్మణుఁడు; హారితసగోత్రుఁడు; పోతనామాత్యపౌత్రుఁడు; పెద్దనార్యపుత్రుఁడు; శివలంక గౌరనార్యునిశిష్యుఁడు. ఈశ్వరుఁడు స్వప్నమున సాక్షాత్కరించి తన్నుఁగూర్చి యిట్లు పలికెనని కవి గ్రంథాదిని చెప్పుకొని యున్నాఁడు—

సీ. నవఘుంటసురతాణినామధేయమువాఁడు తాత, వెల్వలపల్లి పోతరాజు
కవిశేఖరుం డఁన గవిధూర్జటి యనంగఁ బెనుపొందుటనతండు పెద్దిరాజు
సవనదీక్షామహేశ్వరుఁడు శ్రీరఘునాధ సోమయాజి నిజాగ్రజుండు
గురుఁడు

తల్లి పాతివ్రత్యధర్మబుద్ధికదంబ కారుణ్యజగదంబ పేరమాంబ
నీకు మద్వరలబ్ధవాణీప్రసాద
మంగకవచంబు సకలవిద్యాస్థలములఁ

బట్ట మెట్టాంక వెల్వలకలివృషాంక
సోమయాజి సరస్వతీసోమయాజి.

ఉ. శైవులలోపలం బరమశైవుఁడు వేదపురాణవాణిచే
దైవగురుండు నీగురుఁడు ధన్యుఁడు శ్రీశివలంకవారిలో
దేవనిభుఁడు భక్తి శివదేవుఁడు గౌరయగారు తత్కృపా
పావనకీర్తిఁ గాంచితివి బాలసరస్వతి దీక్షితాగ్రణీ.

ఈకవి కవిత్వము శబ్దార్థాలంకార భూయిష్ఠమయి మృదుమధుర పదఘటితంబయి సలక్షణమయి హృదయాకర్ణ రంజకముగా నున్నది. ఈతని పృథుచరిత్రమునందలి శబ్దాలంకారరీతిని జూపుటకయి యొకపద్యము నిం దుదాహరించుచున్నాను–

సీ. హస్తకంకణములు హస్తకంకణములు పదసంపదధికసంపద లొసంగ
ముఖజాతవేదంబు ముఖజాతవేదంబు స్వర్గాపవర్గరాజ్యము లొసంగఁ
గళ్యాణతత్వంబు కళ్యాణతత్వంబు సగుణనిర్గుణవృత్తిచయ మొసంగ
సత్యానుకూల్యంబు సత్యానుకూల్యంబు సాధ్వీశ్వరత్వంబు సంఘటింపఁ
బరఁగుదైవతకులశిరః ప్రకటకుసుమ
మంజుమకరందధారాసమంజసాంఘ్రి
పద్మసన్నిధిసన్నిధిప్రభవవిభవ
శాశ్వతశ్రీకరుండు సర్వేశ్వరుండు.

ఈకవి గోదావరీ మండలములోనివాఁడనుట వేఱుగఁ జెప్పనక్కఱలేకయే కృతిదాతౌ రామభీమేశ్వరుని కంకితము చేయఁబడుటచేతనే తెలిసికొనవచ్చును. ఇతఁడు నూఱుసంవత్సరములకుఁ బూర్వమునందుండినవాఁడు. ఇతని పృథుచరిత్రములోనికొన్ని పద్యముల నిందుదాహరించుచున్నాను–

చ. మలయుఁ బురంబునన్ నిరుపమానవిమానసమానధామకో
మలలలనామనోరమసమాగమభోగమదాంతతాంతతా

జలకలికానికారముఖసారసగంధసుగంధసారముల్
మలయమరుత్కిశోరములు మారవిహారకరప్రచారముల్. ఆ. ౧.

శా. చూపుంజూపును వియ్యమయ్యె సతికిన్ క్షోణీతలస్వామికిన్
దూపుందూపును వియ్యమయ్యె రతికిన్ దోర్దర్పిరతిస్వామికిన్
జాపాభ్యాసము చూడుఁడీ సభ మహాచాతుర్య మన్నట్లు త
ద్రూపాభ్యాపారిష్లవచేష్ట లొప్పెఁ దమిచూపుల్ వ్రీడనుల్లింపఁగన్. ఆ.౨.

చ. కదలిరి పారకోత్తములు గాముకులుం గవులు న్మహాకవుల్
మెదలిరి సత్ప్రియాణమతి మిశ్రితమిశ్రితతుల్ నిజాశ్రితుల్
పొదలిరి వాంఛితార్థపరిపూర్ణసువర్ణసువర్ణసంతతుల్
తదనుమతిం బురంబులకుఁ దత్పరదత్పరతత్పరాగతిన్. ఆ. 3.

చ. అలసితి గమ్మఁదార కుసుమాపచయంబొనరించి దండ మీ
యాలయికి లేనఁడంతు నని యంబురుహాకరలక్ష్మిపంపు నె
చ్చెలు లనఁ జెల్వలం దరలిచెన్ జలజోత్పలపత్రవాసనా
లలితమదాళినీకలకలంబుల శీతలవాతపోతముల్. ఆ. ౪.

---

48. అవుడూరి కిచ్చయ్య

ఈకవి కాళిదాసప్రణీత మయిన రఘువంశమహాకావ్యమును పది యాశ్వాసముల గ్రంథముగా రచియించెను. కిచ్చయ్య నియోగిబ్రాహ్మణుఁడు; గురవయామాత్యుని పుత్రుఁడు; హారితసగోత్రుఁడు; చెన్న కృష్ణశాస్త్రిశిష్యుఁడు. ఇతఁడు నూఱు నూటయేఁబదిసంవత్సరములక్రిందట నుండినట్టు తెలియవచ్చుచున్నది. ఆంధ్రరఘువంశకావ్యము సంస్కృత కావ్యమంత మనోహరముగా లేకపోయినను మొత్తముమీఁదరసవంతము గానే యున్నది. కవిత్వశైలి తెలియుట కయి రఘువంశమునుండి రెండు మూఁడుపద్యముల నిందు బొందుపరుచుచున్నాను—

ఉ. ఉన్నతమ ర్త్యలభ్యపద మొందెదనన్మతి నూర్ధ్వబాహుఁడై
యున్న సగర్వఖర్వమనుజోత్తముకై వడి మందబుద్ధినై
కొన్నసరుండు సాధుకవికుంజరకీర్తి వహించ నెంచినన్
సన్నుతిచేయఁబోవుదురొకో సత్కవులైనసమస్తభూజనుల్. ఆ. ౧.

చ. పొల్పతిరో! విస్మ ముత్తియపుఁబూసలఁబోలెడుబొప్పవారిబిం
దులఁ బరిపంథిధాత్రిపవధూస్తనపాళిని బ్రస్తరించునీ
కలితమహాజుఁడై నమహీకాంతునిచేత సమర్పితంబులై
యలరె గృహీతసూత్రకములై తగుమౌక్తికతారహారముల్. ఆ.४.

మ. తనపై విశ్వసనంబు పంక్తిముఖధూర్తత్వంబునన్మాన్పచెం
దనియీభూజను లివ్యోడన్ నిజచరిత్రంబంకు విశ్వాస మొం
దినమీమాజ్ఞఁ బరిగ్రహింతుఁ దనయూ ప్రింగాంచి శోభిల్లు న
జ్జనకక్ష్మావిభుకూర్మిపుత్రినని కౌసల్యాతనూజుం డనన్. ఆ. ౮.

ఈకవి రఘువంశముగాక మాధవాభ్యుదయ మను మఱియొక ప్రబంధమునుగూడ రచియించెను. ఈక్రిది రెండుపద్యములును మాధవాభ్యుదయములోనివి—

ఉ. అంతట నొక్కనాఁడు చతురాస్యుఁడు వేదచయంబుఁగానమిన్
వంతదురంతచింత బలవంతము పంతముసంతసిల్ల శ్రీ
కాంతనితాంతకాంతశతకంజయుగంబు మదిన్ ఘటించి య
శ్రాంతభయైకభక్తిఁ గిరసారసముల్ముకుళించి యిట్లనున్.

శా. త్రుంతుర్ణ సోమకు నుద్ధరింతు నిగమస్తోమంబు లంచున్ రమా
కాంతుం డొందె సువర్ణసంఘటితజాగ్రత్పుష్పవల్లీకృతా
తాంతోత్తాలకరాళవాలహతి ఘూత్కారాదిసీకాస్పృశ
త్స్రోతానాహతినిష్పతత్సురతయాద్యఃపూస్వమీనాకృతిన్. ఆ. ౧.

49. తక్కెళ్లపాటి లింగన్న

ఆధునికుఁడైన యీకవియొక్క కాల మెప్పుడో నిశ్చయముగాఁ దెలియ లేదుగాని యితఁ డించుమించుగా నూఱు నూటయేఁబదిసంవత్స రములక్రిందట నుండినట్లూహింపఁదగియున్నది. నూఱుసంవత్సరములక్రిందట రచియింపఁబడిన లక్షణగ్రంథములలో సహిత మీతనిగ్రంథములలో నుండి లక్ష్యములుగాఁ గైకొనఁబడిన పద్యములు కానరావు. అట్లు కైకొనఁబడకపోవుట కీతనికవనము లక్షణవిరుద్ధముగా నుండుటయే కారణమయి యుండవచ్చును. కవి తాను రచియించిన గ్రంథములపేళ్ళను త్తరహరిశ్చంద్రకథలోని యీక్రింది పద్యమునఁ జెప్పికొనియున్నాఁడు—

సీ. తగ రచించితిని మదనమోహినీవిలా
సంబు మెప్పగ యౌవనంబునందు
భక్తిసూర్యతనయాపరిణయం బనెడు ప్ర
బంధంబుఁ జెప్పితిఁ బ్రాభవమున
నావెనక విద్యుత్ప్రభావిలాసము వేడ్క
ఘటియించితిని యక్షగానరీతి
నలువది నేండ్ల ప్రాయమున నుత్తరహరి
శ్చంద్రాఖ్యకథ యిది సారమతిని
వేంకటేశ్వర శ్రీరామవిభుల కెలమి
నంకితంబుగ మునుచెప్పినట్టికృతుల
రీతి నిది కృష్ణునకు సమర్పించి యిప్పు
డిలను ధన్యుండనైతి నార్యులు నుతింప.

వీనిలో మదనమోహినీవిలాసమును, సూర్యతనయాపరిణయమును, ఉత్తర హరిశ్చంద్రకథయు, పద్యకావ్యములనియు, విద్యుత్ప్రభావిలాసము యక్షగానమనియు, పైపద్యమువలననే తెలియవచ్చుచున్నవి.

ఈకవి నియోగిబ్రాహ్మణుఁడు; హరితసగోత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; చిట్టయ్య పౌత్రుఁడు; వేంకటపతిపుత్రుఁడు. ఈతని తల్లిపేరు సూరమ్మ. ఇతనిది రసవంతమైన ప్రౌఢకవిత్వముకాదు; యౌవనకాలమున రచియించిన గ్రంథములలోనేకాక యిరువదియేండ్లు వచ్చినతరువాత రచియించిన యుత్తర హరిశ్చంద్రకథలో సహితము లక్షణవిరుద్ధము లయినప్రయోగము లనేకములు గానఁబడుచున్నవి. ఈతనిగ్రంథములలోని రెండేసిపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి.

మదనమోహినీ విలాసము.

ఉ. అక్కట మానివర్యుఁ డమరాధిపుతోఁ బలుకంగ నూరకే
గ్రుక్కున నుండలేక ప్రతికూలుఁడనై పరుషంబువల్కి నే
నిక్కడి కేలవచ్చితి సహింపఁగరాని వియోగవహ్నిచేఁ
బొక్కఁగనేల దేవవిటపుంగవు లింతకు నవ్వకుందురే.

ఉ. కమ్మనివింటిబోయ యొడికంబుగ సంజమొఱుంగుటగ్గి చే
బమునఁ గోకదంపతులపై వడిఁ బుష్పవిమందు కాల్వఁగాఁ
వమ్మితుపాకినాళమున దారున వెల్వడునుక్కుగుండ్లనా
దొమ్మిగఁ జిమ్మరేఁగె నలతుమ్మెద లెల్లసరోవరంబులన్.

సూర్యతనయా పరిణయము.

ఉ. ఒచ్చెము లేనిరూపమహిమోన్నతి యాసతికే తగుంగదా
యచ్చున నొత్తినట్లు వెలయున్ లిఖియింపఁగ నీకుచెల్లుఁగా
కిచ్చెలువన్ వరింపఁగలఁడే యొకఁ డెందును నన్నుఁగన్న యా
పచ్చవిశాఖవాఁడె తగుఁ బంకజలోచనఁ బెండ్లియాడఁగన్. ఆ.౨.

చ. హరి యలధర్మసూతిపురి నప్పటి కుండెను వింటిరే రమా
వరుఁ డిటువచ్చునో యనుచు వారక చూచితి నిన్నినాళ్ళు నేఁ
డరుదుగ నొక్కమాట వినవచ్చె ముకుందుఁడు వేఁటవచ్చె ని
ర్గరవరసూరుతోడనని సత్యము లే కదియుక్ మృషోక్తియో. ఆ.౫.

ఉత్తరహరిశ్చంద్ర కథ.

చ. జలరుహబాంధవాన్వయనిశాధవ! యోనరనాథ! నేడుగా
ఫలితము లయ్యె మాక్రతుజవ్రతహోమతపఃప్రభావముల్
కలఁగి మహాపద ల్గడచి కాంతయు మీరును బుత్రరత్నముర్
వలనుగ సర్వరాజ్యవిభవంబు వహింపఁగఁ జూడఁగాంచుటల్.

మ. సకియా! యేను త్రిశంకసూనుఁడ హరిశ్చంద్రుండ నాపేరు పా
యక సైన్యావళితోడ ఘోరమృగయావ్యాసక్తచిత్తుండనై
ప్రకటారణ్యగిరీంద్రసానువులు చేర న్వచ్చి వర్తించుచో
నొకక్రోడం బలయించి చిక్క కరుదే నొక్కండఁ దీవ్రంబుగన్.

---

50. గుడిపాటి కోదండపతి

ఈకవి శృంగారరసమంజరి యనుపేర భానుమిశ్రవిరచిత మైన రసమంజరిని మూఁడు గుచ్ఛములనుగాఁ దెనిఁగించెను. ఈగ్రంథము శృంగారనాయికానాయకలక్షణములను దెలుపునది. కవి నందవరీక నియోగిబ్రాహ్మణుఁడు. పూర్వకాలమునందు నందుఁడను చంద్రవంశపు రాజొకఁడు కర్ణాటకదేశమును పాలించుచుండెనఁట. అతఁడు స్వీయ మహిమచేత "యోగవాగ" ముల నెక్కి రహస్యముగా బోయి ప్రతిదిన మును కాశీకాపురములో గంగాస్నానమును జేసి వచ్చుచుండెనఁట! ఈరహస్యము నతని భార్య కనిపెట్టి యొకనాఁడు తన్నుగూడ వెంటఁ గొనిపొమ్మని భర్తను నిర్బంధ పెట్టెనఁట. అతఁ డామె నిర్బంధమును మానుపుకోలేక భార్యను వెంటఁ గొనిపోగా, కాశీపురమును జేరిన తరు వాత నామె బహిష్ఠ యయ్యెనఁట. అందుచేత యోగవాగములు మయిలపోఁకి నడవకపోయినందున నతఁడు స్వపురమును జేరుట కుపా

యము త్రోవపక పరితపించి గంగాతీరమునందున్న బ్రాహ్మణులను ప్రార్థింపఁగా వారు తమకుఁ గర్ణాటక రాజ్యమునందు వృత్తుల నొసఁగు నట్లు చాముండేశ్వరీసన్నిధానమునం దాతనిచేతఁ బ్రమాణము చేయించు కొని స్నానము చేయించి యాతని భార్య నప్పుడే తమమంత్రప్రభావము చేత శుద్ధురాలినిజేసి యోగవాగములను నడిపించి యారాజదంపతులను స్వరాజధానికిఁ బంపివేసిరఁట. అటు తరువాతఁ గొన్ని సంవత్సరములకు కాశీదేశమున క్షామము సంభవింపఁగా నాశ్వలాయనసూత్రు లయిన యాబ్రాహ్మణు లేనూఱు కుటుంబములవారు బైలుదేఱి పదుమూఁడు గోత్రములవారు నందుని రాజధానికి వచ్చిరఁట! అప్పుడు రాజు తాను జీవనములు కల్పించెదనన్న బ్రాహ్మణులు వీరేయని చూపుటకై సాక్షులను దేవలయునని కోరఁగా వారు కాశీకాపురమునుండి చాముండేశ్వరీ మహాదేవినే గొనివచ్చి యామెచే సాక్ష్యమిప్పించిరఁట! అంతట రాజు వారిమహిమ కద్భుతపడి తనపేరిట నందవరమను గ్రామము గట్టించి వారి కగ్రహారముగా నిచ్చెనఁట. నందవరమునందుండిన బ్రాహ్మణులగుటచే వీరు నందవరీకు లనఁబడుదురు. వీరినే కరణకమ్మలనియు జెప్పుదురు. ఈ యోగవాగములకథ యెట్టి దయినను, వీరు క్షామకాలము సంభవించినప్పు డార్యావర్తమునుండి దక్షిణహిందూస్థానమునకు వచ్చి తెలుఁగుదేశములో వృత్తులను సంపాదించుకొన్న విషయములో సందేహముండదు. ఈ తెగ బ్రాహ్మణు లిప్పుడు కృష్ణా కర్నూలు బళ్లారి మండలములలో నధికముగా వ్యాపించి యున్నారు. వీరిలో నల్లసాని పెద్దన, రాయని భాస్కరుఁడు మొదలయినవారు మహాప్రసిద్ధులు. కవి మూడవ గుచ్ఛముయొక్క కడపటఁ దన్నుగూర్చి యిట్లు వ్రాసికొని యున్నాడు—

సీ. శ్రీకరనందవరీకాగ్రగణ్యుండు వహిమీఱు గుడిపాటివంశభవుఁడు
బిరుదుగా నవఖండసురతానిపేరంది మహితుఁడౌ వేంగళమంత్రిపౌత్రుఁడు

డతులితుఁడౌరంగయామాత్యతనయుండు వీరమాంబానందవృద్ధికరుఁడు
సింగన్న వెంగళ శ్రీనిధు లనుజులై భాసిల్లు కోదండపతిఘనుండు
సరసకవితాచమత్కారసార్వభౌముఁ
డవని శ్రీరంగధామదయాశ్రయుండు
నెలమి రసమంజరిని రచియించె నందు
సరవిగాఁగఁ దృతీయగుచ్ఛంబు తనరు.

ఈపద్యమునుబట్టి కవి వేంగళమంత్రి పౌత్రుఁడనియు, రంగయామాత్యునకును వీరమాంబకును బుత్రుఁడనియుఁ దెలియవచ్చుచున్నది. ఇతఁ డాశ్వలాయనసూత్రుఁడు; భారద్వాజగోత్రుఁడు. ఈతఁ డేకాలమున నుండినవాఁడో నిశ్చయముగాఁ దెలియదు. ఇన్నూఱుసంవత్సరముల క్రిందటనుండి యుండునేమో! ఈతని కవిత్వమునందుఁ గొన్నిదోషము లున్నను గవిత్వము రసవంతమయినదే. రసమంజరిలోని యొక్కొక్క గుచ్ఛమునుండి యొక్కొక్క పద్యము నిం దుదాహరించుచున్నాను—

చ. జలదము నాథులం గురియఁజాలెనె నీళ్లనె చిన్కుఁ, బచ్చికల్
కలయఁగ నించెఁగా గికులు కాంతుల నీనెనె, యెల్లవృక్షముల్
ఫలము లొసంగుఁ గాని పతిపంక్తుల నిచ్చెనె, నిద్దయాత్మ హా
కులటకుఁగాఁగ నేమి యొనఁగూర్పఁగ నేర్చితి వంబుజాసనా. గు. ౧.

చ. పదరుచు నీ విటూరికిని బైనము పోయెద నన్నమాత్రలో
నదటున మేను చిక్కి వలయంబులు జాఱెను నీది యుంగరం
బదిర యొసంగినం గరమునందు ధరించెదఁ గంకణంబుగాఁ
జెదరక యిమ్మటంచు వెలచేడియ దోఁచు నెటువ్విటుం బటుక్. గు. ౨.

చ. ప్రతిఫలితామృతాంశువుగు భామముఖంబని యెంచి నాయకుం
డతులితలీలవిూఁఱ బరిహాసముచేసిన నింతయేనియుఁ
బ్రతివచనంబు లేమిఁగని పైదలి మానముఁ జెందె నంచుఁ దా
నతిపులకాంకితంబయిన హస్తముచేఁ దడవుం బ్రియుం బునక్. గు. ౩.

51. మల్లవరపు వాలేశ్వరుఁడు.

ఇతఁడు భళ్ళాణచరిత్ర మను నైదాశ్వాసముల ప్రబంధమును రచించెను. సింధుకటక రాజయిన భళ్ళాణుఁడు జంగము లడిగినదెల్ల నిచ్చుచు భక్తి చూపుచుండెనఁట! అతని భక్తిని పరీక్షింపవలె నని శివుఁ డొకనాఁడు జంగమువేషముతో తనకుఁ బతివ్రత యగు యువతి కావలె నని యడుగఁగా, రాజు తన పట్టణమునం దట్టి స్త్రీ దొరకనందున నిన భార్య యగు చెల్లమ్మనే యా జంగమున కర్పించెనఁట! శయనగృహమున కేగినప్పుడా జంగ మామె నంట సందేహపడుచుండఁగా, చెల్లమ్మయే ముందుకుఁ బోయి యా యతిథిని కౌఁగిలించుకొనునప్పటి కతఁడు మూఁడు నేత్రముల శిశు వయ్యెనఁట! అంతట నా దంపతు లతఁడు శివుఁడని తెలిసికొని యారాధింపఁగా, ఈశ్వరుఁడు నిజస్వరూపముతో సాక్షాత్కరించి వారికి ముక్తి నిచ్చెనఁట!

వాలేశ్వరుఁడు పాకనాఁటి నియోగి యగు శైవబ్రాహ్మణుఁడు; గౌతమస గోత్రుఁడు; పోలనామాత్య పుత్రుఁడు. ఇతఁడు తన గ్రంథమును మల్లవరపు నాగేశ్వరస్వామి కంకితము చేసెను. కవి తన్నుఁగూర్చి భళ్ళాణచరిత్రమునం దిట్లు చెప్పుకొని యున్నాఁడు—

సీ. అనఁ బాడఁ జదువఁ జెప్పను నేర్పు సర్వజ్ఞ భోజుండు మా తాత పోతరాజు
బహుపురాణజ్ఞుఁడు బాంధవాశ్రితకల్పభూజంబు మా తండ్రి పోలమంత్రి
పరమశాంతుఁడు కృపాపాథోధి మా పినతండ్రి విహూపాకుదండనాథుఁ
డఖిలవిద్యానిధి యర్థార్థితతిఁ బ్రోచుదాత మత్సుతుఁడు సదాశివుండు
నే వితర్కింప వరకవితావిసేవ
వదనుఁడను బ్రాఁకనాఁ డింటివాఁడ శుద్ధ
శైవుఁడను గౌతమసగోత్రసంభవుండ
నెంచఁదగు మల్లవరపు వాలేశ్వరుండ.

* * * *

మత్తకోకిల. సన్నుతం బగునట్టివేల్పు ప్రసన్నుఁడై మముఁ బ్రోవగా
విన్నకోటవిలాతిలోఁ గడువేడ్క మల్లవరంబునన్
బన్నగేశ్వరసుప్రతిష్ఠను భక్తరక్షణ చేయుచున్.
వన్నెమీఱఁగ నాగలింగ మనన్ వసించు మహోదయన్.

ఈకవి నివాసస్థలము కృష్ణామండలమునందలి విన్నకోటసీమలోని మల్లవర మయినట్టు పయిపద్యమువలననే విస్పష్ట మగుచున్నది. కవి యెప్పటివాఁడో నిశ్చయముగా తెలియరాదుగాని యిన్నూఱుసంవత్సరములక్రిందటివాఁడయినట్టు కనుపట్టుచున్నాఁడు. భళ్ళాణచరిత్రములోనివి రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

మ. భువి రుద్రాక్షను నెవ్వ రేని మది శంభుం డంచు భావించుచున్
జెవులన్ వక్షమునన్ శిరస్స్థలమునన్ జేదోయిఁ గంఠంబునన్
వివరింపంగ ధరింతు రాజనులకున్ వీక్షింపఁగా సాటిలే
రు విరించ్యంబుజనాభకిన్నరమరుద్యక్షేంద్రలోకంబులన్. ఆ. ౨.

ఉ. కప్పురవీడెమున్ నొసటఁ గస్తురిబొట్టును జెంద్రకావియా
దుప్పటివల్లెవాటు కలదో మఱి లేదొ యనంగఁ జాల మైఁ
జిప్పిలు భూతిలేపనముఁ జేతను సన్నపుగోరిబెత్త మా
యొప్పులకుప్పరూపును మహోన్నతియు న్విలసిల్లఁ జెల్వుగన్. ఆ-౪

52. చింతలపల్లి వీరరాఘవుఁడు

ఈకవి మధురవాణీవిలాస మనెడి యైదాశ్వాసముల ప్రబంధమును రచియించి శ్రీవేంకటేశ్వరస్వామి కంకితముచేసెను. కవి నియోగి బ్రాహ్మణుఁడు; ఆశ్వలాయన సూత్రుఁడు; వీరరాఘవ పౌత్రుఁడు; వేంకటార్య పుత్రుఁడు. కవి తన్నుఁగూర్చి మిత్రు లన్నట్లుగాఁ దనగ్రంథమునం దీక్రిందిపద్యములను జెప్పికొనెను—

శా. సాహిత్యంబుఁ గవిత్వమున్ వివిధశాస్త్రప్రజ్ఞ సత్కర్మనా
సాహిత్యంబును దత్త్వబోధమును ద్రిస్కంధాత్మక జ్యోతిషం
బూహాచాతురి దేవభక్తియును నీకొప్పున్ స్వభావంబులై
యాహా చింతలపల్లి రాఘవకవీ యౌదార్యమంత వీ వర్ణనల్.

మ. అవధానంబు లనేకముల్ని అపి రాజస్థానముల్ చేరి వా
దవిధిన్ ధీరుఁడవై చతుర్విధకవిత్వప్రౌఢిమ ల్చూపి భూ
ధవదత్తద్విపఘోటకాదిబహుసత్కారంబు గైకొన్నని
న్నవు నీ కబ్రమె వేంకటేశ్వరుఁడు స్వప్నంబుం బ్రసాదించుటల్.

* * * *

సీ. జాములో శతకంబు సంధించి కంకణాదులఁ గొంటి వలరాయ
దుర్గమునను
బహుళావధానముల్ పఱపి నాలుగునగల్ తేజి నందితి మల్లధీరువల్ల
వాగ్ధాటిసంప్రీతి దిగ్ధరాధిపదత్తవస్తువాహనములవార్తఁ గంటి
కూపవాపీతటాకోపవనుల్చేసి స్థిరకీర్తి చెందితి వురుతరముగ
సకలభూపాలసంస్థానశంసనీయ। నిజచతుర్విధకవితాభినేయపాండి
తీసమాధాక నాపూర్ణదిక్ప్రదేశ। వీరరాఘవ నీసరి విబుధు లేరి?

పయిపద్యములయందుఁ జెప్పఁబడినవన్నియు నిజములయిన పక్షమున, కవి యసమానపాండిత్యమును గవిత్వకౌశలమును గలవాఁ

షయినందుకు సందియముండదు. కడపటిపద్యమునందుఁ జెప్పఁబడిన మల్ల ధీరుఁ డెవ్వఁడో యింకను విచారింపవలసియున్నది.* కవి తుంగభద్రా ప్రాంతప్రదేశములయం దుండినవాఁడు. ఈతనికాలమేదో స్పష్టముగాఁ దెలియరాదుగాని యీతఁడు పదునెన్మిదవశతాబ్దమధ్యమునందుండిన ట్లూహింపఁదగియున్నది. కవిపూర్వులలోఁ సహితము కొందఱు విద్వత్క-వులుండినట్లు మధురవాణీవిలాసములోని యీక్రిందిపద్యములు తెలుపుచున్నవి—

సీ. శ్రీధన్యహారితతత్వబోధాప్తి కలపుష్పగిరిదుర్గ త్రోడైనవరము సాక్షి
శ్రీవాగ్మిసుకుమారతావృత్తికిని బినాకినిచెంత సేవించుచునికి సాక్షి
యేమాన్యనైశ్వర్యసామాన్యతకు రాజ్యకృత్యశిరోభూషణ
క్ష్మాణియె సాక్షి
యేగ్రంధకారివంశాగ్రీయతకు ఘనప్రభుమానితం బైనబ్రతుకు సాక్షి
యట్టిఘనుఁ డేకులంబునఁ బుట్టి వారి
కలిమికపితయొకా వర మడిగికొనియె
నట్టిచింతలపల్లివంశాగ్రయాయి
పల్లకిపదస్థుఁడై మించు నెల్లనుకవి.

మ. చతురుండై యవధానము ల్సలిపి దేశాయీలు మెచ్చన్ మహో
న్నతుఁడై యప్పకవీశ్వరుండు గిరియానారీవతంసంబునం
దతివిద్యానిధి సాహితీనిపుణు రాజాస్థానసంపూజ్యు నం
చితవాగ్ధాటిఁ బ్రబంధకర్తఁ గవిసంజీవాఖ్యుఁ బుత్రుం గనెన్.

ఈకవి సంజీవాఖ్యుఁడు చంద్రాంగదోపాఖ్యానమును ప్రబంధమును రచియించెను. వీరరాఘవకవియొక్క కవిత్వము ప్రౌఢమైనది. ఈతని మధురవాణీవిలాసమునుండి రెండుపద్యము లిందుక్రింద నుదాహరింపఁబడుచున్నవి—

శా. కాసారస్థితిఁ బూని నీచులకు యోగ్యంబై విషప్రాయమై
గాసి న్మ్రాకొనుకంటకంబుల నిజాంగం బెల్ల సచ్ఛిద్రమై
యేసూత్రంబున బల్మినేని బిస మాహేలావతీబాహుశా
ఖాసామ్యం బెటువొందు నౌ నిజ మథఃపాతిన్ సిరు ల్పొందునే. ఆ-౨

చ. వలనగుపుష్పమంజరులు బంగరుతీఁగెలు ముత్యపున్సరుల్
వెలయు పునుంగుతావు లిడ వెన్నెలకుప్పలువోలె రాజభో
గులు నగుసవ్విలాసినులు క్రొట్నమునం దటు వట్టిధాన్యముల్
పొలసి సువాలు పాడుచును సుంకులు నించిరి మించి రమ్యతన్. ఆ-౫

53. రేచర్ల మాధవరాయకవి

ఈకవి చంద్రికాపరిణయ మనెడి యాఱాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు పద్మనాయకకులజుఁడు; సురభి మల్లభూపాల పుత్రుఁడు. ఈచంద్రికా పరిణయములోనికథ బాలసరస్వతికృతమైన చంద్రికాపరిణయములోనిదానికంటె వేఱయినది. ఇందు కథానాయకురాలగు చంద్రిక పాంచాలరాజుకూఁతురు. ఈకవి నూటయేఁబదిసంవత్సరములక్రిందట నుండియుండవచ్చును. ఈకవి కవిత్వము తెలియుటకయి చంద్రికాపరిణయములోని రెండుపద్యముల నిందుఁ జూపుచున్నాను—

శా. వింటే మన్మథ మత్ప్రభుత్వమున కుర్విం బుట్టువిఘ్నావళిన్
గెంటం దార్చుచు మామకాత్మహితభంగి న్మించు నీ వుండుటల్
కంటంగానక బ్రహ్మభావముకడుం గాంక్షించి యొక్కండు పెన్
గొంటుం దాపసుఁ డెచ్చినాఁ డిలఁ దపఃకుల్యాధ్వసంచారియై. ఆ-౨

చ. పలుచవివారికిం బొడమి భాసురపుణ్యజనాహితాత్మునిం
గలసి చెలంగ నొప్ప దని కల్మివెలంది తలంచి ధాత్రి ని
య్యలఘునకున్ జనించె సముదంచిత పుణ్యజనాప్తు నొక్కరా
జు లల్మి వరింపఁగోరియని పొంపుగ నెంచిరి కొంద ఱాత్మలన్. ఆ-౫

54. అనియాది గణపతిదేవుఁడు

ఇతఁడు శివయోగసార మనుగ్రంథమును రచియించెను. ఈవేదాంతగ్రంథము పూర్వోత్తరభాగములు గలదయి, భాగమొకటికి నాలుగేసి యాశ్వాసములుగలదిగా నున్నది. ఈకవి నియోగిబ్రాహ్మణుఁడు; మూలనామాత్యుని పుత్రుఁడు. ఈతనికవిత్వము ప్రౌఢమయి హృద్యముగానున్నది. ఈతఁడేకాలపువాఁడో సరిగా తెలియదుగాని యినూ్నఱుసంవత్సరములకుముందే యుండినవాఁడయిన ట్లూహింపఁదగియున్నాఁడు. శివయోగసారమునుండి కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాము—

పూ ర్వ భా గ ము.

చ. ప్రమదముతో నొకింతయినఁ బాత్రున కీగి మహాఫలం బగున్
బ్రమసి యపారవిత్తము లపాత్రున కిచ్చినఁ గీడు పొందు ఘూ
సము నొసఁగంగ దుగ్ధములఁ జాలఁగ ధేనువు లిచ్చు నట్టిదు
గ్ధములొసఁగన్ విసంబొలుకుఁగాదె భుజంగమయూథమిమ్మహిన్. ఆ. ౧

ఉ. ఈక్రియ గర్భ మేర్పడిన నెంతయు భీతి జనింపుచుండఁ జిం
తాకులచిత్తయై కటకటా యిదియేమిసమిత్తమో కదా
నాకని కన్నుఁదమ్ముల ఘనమ్ముగ బాష్పము లేగుదేరఁగా
శోకభరాబ్ధిలో మునిఁగి సుందరి కోకిలవాణి యేడ్వఁగన్. ఆ. ౨.

మ. ఎనయన్ జీవనచింతఁ బొట్టుపొరలై యేప్రొద్దువర్తించు నీ
చునియందుం గలశీలసూనృతగుణస్తోమంబు లిట్లన్నియున్
దనరం బక్వముగానికుంభమున యత్నంబార సిండంగఁ బో
సినవార్వారముభంగి నాశ మగుఁ జర్చింపంగ దేహంబుతోన్. ఆ-3

ఉ త్త ర భా గ ము.

శా. శాంతాకారుని నాత్మసంస్థితు శివున్ సత్కాంతిసంపన్ను న
శ్రాంతంబుం దమయాత్మలో సుజను లారాధింతు రాయీశు న

య్యంతర్యాగవిహీను లల్పమతు లుద్యద్బాహ్యకర్మైకవి
భ్రాంతుల్బాహ్యమునందుఁగొల్తురధికప్రాయాసముంబొందుచున్. ఆ.౧

శా. దేహం బస్థిరమాటఁ గన్గొని మదోద్రేకంబునం బొంద శా
దేహంబు న్మనమున్ ధనంబు నతిభక్తిన్ సద్గురుస్వామికిన్
నీహారాద్రిసుతామనోహరునకున్ నిత్యంబు సద్భక్తియు
క్తాహీనాత్ములకుఁ వివేకులకు వా రర్పింతు రెల్లప్పుడున్. ఆ. ౨.

మ. గుహలోన న్వసియించునొండెఁ దిరుగుఁ క్షోణీతలంబందు ని.
స్పృహావృత్తిన్ వివిధక్రియాకుశలుఁడై పెంపొందుఁ గాదేని ప్ర
త్యహము న్నిష్క్రియుఁడై నసా నిజసమాధ్యాసక్తచిత్తుండు స
ర్వహితైకస్థితిఁ బెక్కుచేష్టలమరన్ వర్తించు స్వేచ్ఛాగతిన్. ఆ. ౪.

ఉ. బోరన భేదవాదములు పుణ్యము పాపము సంశయంబు శా
రీరమునన్ బ్రవృత్తులఁ బరిభ్రమఁ దృష్ణను బాసి యెవ్వఁడే
ధారుణి నిర్గుణం బయినతత్త్వముఁ బోవఁ జరించుచుండు నా
ధీరున కేలగల్గును మదిం దలఁప న్విధియు న్నిషేధమున్. ఆ. ౪.

---

55. వేంకటాచార్యుఁడు

ఈకవి ముక్తిచింతామణి యనుపేర జగన్నాథమాహాత్మ్యమును నాలుగాశ్వాసములగ్రంథమునుగా రచియించెను. ఈకవి వైష్ణవబ్రాహ్మణుఁడు; యతిరాజకుల పెరుమాళ్ళాచార్యుల కుమారుఁడు.

"ఇట్లు గురుపరంపరానుసంధానపూర్వకంబుగా శ్రీజగన్నాయకుని కంకితంబుగా ముక్తిచింతామణిప్రబంధం తెనుంగు చేయుమని రాజమహేంద్రవరాధ్యక్షపద్మనాయకాగ్రేసర కోన తిమ్మరాయకృత కనకాంబరాభరణానులేపనపూర్వకసమర్చన ప్రేరితుండనై"

అని కవి వ్రాసికొనియుండుటనుబట్టి రాజమహేంద్రపుర ప్రభువైన కోన తిమ్మరాజు ప్రేరణముచేత నీగ్రంథము చేయఁబడినట్టు తెలియ వచ్చుచున్నది. ఈగ్రంథ మిన్నూఱు సంవత్సరములకు ముందే చేయఁ బడినదేమో! జగన్నాథమాహాత్మ్యకథిత్వము రసవంతముగానే యున్నది. ఇందుండి కొన్ని పద్యములఁ జూపుచున్నాను—

శా. ధర్మాధర్మవిచారము ల్విహితసంధ్యాపూర్వయజ్ఞాది స
త్కర్మంబుల్ నిరతాన్నదాన నియతుల్ కాలానుగుణ్యక్రియల్
మర్మం బీపురుషోత్తమస్థలములో మర్త్యాళి కెల్లన్ భవ
స్థిర్మాల్యగ్రహణం బటంటి రిఁక నీసత్యక్రియల్ వ్యర్థమే. ఆ. ౧.

ఉ. నిద్దురరాఁ బరుండుటయె నిక్కపుమ్రొక్కగు సిద్ధయోగమాఁ
దద్దయు వ్యర్థహింస క్రతుధర్మ మగున్ నిరతాన్నశిష్టమా
చద్ది మహాప్రసాద మగు సన్నుతియౌను నిరర్థకోక్తియే
ప్రొద్దును నిత్యవాసు లగుపుణ్యులకుం బురుషోత్తమంబునన్. ఆ-౨

ఉ. హీనుఁడు ముట్టినాఁ డనుచు నెంచి మదీయమహాప్రసాదమున్
దా నుపభుక్తియోగ్య మని తత్పరబుద్ధిఁ బరిగ్రహింపకే
మానిన సద్విజుండు హృతమంగళుఁడై భవరోగభారియై
న్యూనతఁ జెంది పంచమనియోగమునందు వసించు నెప్పుడున్. ఆ-3

మ. జలజాక్షుండు రథంబుపైఁ గదలఁ దచ్ఛాయాసమాక్రాంతుఁడై
ఖలుఁడైనన్ ఘనపాపము ల్దలఁగు సాకాంక్షన్ దదుద్యజ్జవా
కలనోద్భూతరజోభరాంకితుఁడు వాక్కాయాంతరాఘంబులన్
గెలుచుం దత్సరసింధుమజ్జనఫలోత్సాంద్రప్రభావుం డగున్. ఆ. ౪.

56. లింగకవి, గంగకవి

ఈయిరువురుకవులునుజేరి సీతావిజయ మనునామాంతరము గల శతముఖరామాయణమును రచించిరి. ఈయిరువురుకవులు వేదాద్రిపుర నివాసులు. వీరిలో నీలకంఠోపాసకుఁ డయిన లింగకవి తాను రచియించిన మొదటి మూడాశ్వాసములును చిన్నారెడ్డిపుత్రుఁ డగు పోచనృపాలున కంకితము చేసెను; నృసింహోపాసకుఁడగు గంగకవి తాను రచియించిన నాలవయాశ్వాసమును భోగనృపాలుని కంకితముచేసెను. ఈ యిరువురకవిత్వమును మొత్తముమీఁద రసవంతమయి నిర్దుష్టమయి హృదయంగమముగా నున్నది. ఈకవు లిన్నూఱుసంవత్సరములక్రిందట నుండినట్టు తెలియవచ్చుచున్నది. వీరి కవనధోరణి తెలియుటకయి శతముఖరామాయణములోని పద్యములొక్కొక్క యాశ్వాసమునుండి యొక్కొకటి యిం దుదాహరింపఁబడుచున్నది—

చ. శతముఖనామధేయుఁడొకచండనిశాచరలోకనాథుఁ డు
గ్రత నలపంక్తికంఠఘటకర్ణపురందరజిత్ప్రహస్తు లీ
క్షితిఁ బడు టంతయుఁ గ్ హితులచే విని రామునిమీఁద నాదటన్
ఘృతయుతపావకుండుబలెఁ గీలలు గ్రక్కుచుమండెఁగ్రక్కునన్. ఆ. ౧

ఉ. రాముని బంక్తికంధరవిరాముని నీలపయోదకోమల
శ్యాముని మానివృత్తిముదసంచయసోముని సత్యభాషణ
స్తోముని సార్వభౌముని విశుద్ధసుకీర్తిగుణాభిరామునిన్
ధీమణి యైనభానుజుఁడు దిగ్గనఁ గాంచి ముదంబు చేకొనెన్. ఆ. ౨.

శా. ఏరా యోరివనేచరాధమ భయంబింతైననున్ లేక ప్రా
కారంబు ల్వెసదాఁటి తెట్లు మఱి పీఁకందాఁటి దుర్భీషణా
కారం బొప్పఁగవచ్చి టెట్లు తగవల్కన్వచ్చి నాముందటన్
ధీరత్వంబున నిల్చు టెట్లు లిది చింతింప న్మహాశ్చర్యమా. ఆ. 3

ఉ. రాయనుఁ బోకుమంటిఁ గదరాయను నిన్నుఁ బాసి యోర్వలే
రాయను హా శితద్వ్యయఃకరాయను మమ్ముఁ బాధపెట్టవే
రాయను నీతనూజుఁ గనరాయను నెక్కడఁ గందురా కుమా
రాయను నల్ల నేల వినురాయను హా శితకంధరాయనన్. ఆ. ర.

---

57. అంగర నృసింహకవి

ఇతఁడు రాజరాజాభిషేక మను నైదాశ్వాసముల ప్రబంధమును రచియించి, కొప్పుల వల్లభూవరున కంకితము చేసెను. ఈకవి రామకృష్ణ భట్టారకుని కుమారుఁడు. ఈకవి యేకాలమువాఁడో నిశ్చయముగాఁ దెలియరాలేదు. ఇతఁ డల్లసాని పెద్దనాదులను బేర్కొనక శ్రీనాథునివఱకును గలకవులను మాత్రమే కవిస్తుతిలోఁ జెప్పియుండుటచేతను మధ్యకవులుమాత్రమే పేర్కొన్న చిమ్మపూడి యమరేశ్వరుని సంస్తుతించి యుండుటచేతను నృసింహకవి మధ్యకవులలోనివాఁ డేమో యని సందేహము కలుగుచున్నది. ఇతఁడు చేసినకవి స్తుతిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

క. భారతఘట్టోల్లంఘన । పారీణకళాధురీణబంధురధారా
ధీరప్రబంధగంధ । ర్వారూఢుని భట్టనన్నపార్యునిఁ దలఁతున్.

ఉ. అంజలిచేతుఁ బద్మజనిశాంతకరాంతనిరంతరోల్బణ
న్మంజులవల్లకీమధురమంద్రనినాదసముల్లసద్ధ్వని
వ్యంజకవాఙ్నిగుంభనసమంచితనూతనసృష్టిచాతురీ
రంజితసత్కవీంద్రబుధరాజికిఁ దిక్కనసోమయాజికిన్.

ఉ. ఇద్ధగుణుం బ్రబంధపరమేశ్వరు నెఱ్ఱనప్రెగ్గడన్ మనంగ
పద్ధతి నిల్పి సూక్తిరుచిభాస్కరుఁడై నహుళిక్కి భాస్కరున్

బుద్ధి ఘటించి సంతతము పూనిభజింతు వచఃప్రసాదనం
సిద్ధునిఁ జిమ్మపూడి కులశేఖరు నయ్యమరేశ సత్కవిన్.

క. పాథోధిపరయోభర ని। ర్మాథచలద్భుమఘుమాయమానలహరికా
పాథేయుదాయినూక్తి స। నాథున్ శ్రీనాథు నెమ్మనంబునఁ గొలుతున్

ఈగ్రంథ మొకవేళ మధ్యకవులకాలములోనిదై యెనను దీనియందు లక్షణవిరుద్ధములైన ప్రయోగములు కొన్ని కానఁబడుచుండుటచేత నప్పకవీయాదులు తమలక్షణగ్రంథములలో నిందలిపద్యముల నుదాహరింపక పోయియుండవచ్చును. కృతిపతినిబట్టి సహితము కవియొక్క కాలనిర్ణయమును జేయుట కిప్పు డాధారములు దొరకలేదు. కృతినాయకునకు కొత్తాపురము రాజధానియైన ట్లీక్రిందిపద్యమునఁ జెప్పఁబడినది—

సీ. కుదురయ్యె నేవీటికోటలోపల వైశ్యసుప్రతిష్ఠితుఁ డైనశూలపాణి
పాయలేఁ డేవీటిపర్యంతవనవాటి మిండరాయఁడు లక్ష్మీధవుండు
నిండారు నేవీట నెండకాలమునందు జలజాకరం బైనసాగరంబు
చదురొందు నేవీట సార్వకాలిక ఫలస్ఫురితంబు వేడంగి ప్రాఁకతోఁట
సురపురంబునకైన నబ్బురము లగుచుఁ|విఱ్ఱవీఁగుచునుండు నేవీటిసిరులు
వసుమతీపాదపద్మసంవలితరత్న। నూపురంబగునట్టి కొత్తాపురంబు

ఈకొత్తాపురము విశాఖపట్టణమండలములోని కొట్టాము గ్రామమేమో! ఈపురాధిపతియయిన కృతిపతి శూద్రకులసంజాతుఁడు.

సీ. మూర్ధాభిషిక్తులముకుటంబు లేరాజుపాదపీఠికకు సోపానపంక్తి
చతురబ్ధివలయితక్షితితలం బేరాజు బాహాదండమునకు బాహుదండ
భువనంబు లేలుకప్పురగంధి యేరాజులీలాకటాక్షపాళికకు నీడ
రజనికాంతజయంతరతికాంతు లేరాజురూపరేఖకుఁ బ్రతిరూపకంబు
లతఁడు పట్టుతలాటకేళాదిరాయ। రాజదేవేంద్రరాజాధిరాజచంద్ర
గాయిగోవాళజగనొబ్బగండబిరుద। శాలి కొప్పుల వల్లభూపాలమౌళి

మ. భరియించెం జతురర్ణవీవృతమహాభారంబు దోఃపీఠికన్
విరియించెన్ విమతాంధకారము సముద్వేలప్రతాపోన్నతిన్
గురియించెన్ ధనధాన్యరాశి కవిరాట్కోటీనివాసంబులన్
వరియించెన్ వరకీర్తికాంతఁ దనరన్ వల్లక్షితీశుం డిలన్.

ఇత్యాదిపద్యములలో బిరుదాంకములతో వర్ణింపఁబడి యుండుట చేతఁ గృతిపతి కవిచెప్పిన ట్లఖండభూమండలాధిపతి కాకపోయినను చిన్న సంస్థానాధిపతియైన నైనట్టు కనుపట్టుచున్నాఁడు. స్పష్టముగాఁ దెలియువఱకును గవికాలము నిప్పుడు పదునాఱువందలయేఁబదికి దరువాతికాల మనుకొందము. ఈకవిత్వమునందు లక్షణదోషము లనేకములు గలవు. ఇతఁడు ప్రబంధములోని యీ మొదటిపద్యములోనే వ్రాయుటయని యుండవలసినదానికి వ్రాసుట యని ప్రయోగించినాఁడు—

ఉ. శ్రీసతి చన్నుఁగ్రేవలను జెక్కుల నొక్కటఁ బత్రభంగముల్
వ్రాసుటకున్ విరించి నిటలంబుల నొక్కట భాగ్యవర్ణముల్
వ్రాసుటకున్ జతుర్భుజవిలాసము పూనినవేల్పు సత్కృపో
ల్లాస మెలర్ప బ్రోచు శుభలక్షణుఁ గొప్పుల వల్లభూవరున్.

ఇట్లు కొన్నిదోషములు కానఁబడుచున్నను మొత్తముమీఁదఁ గవిత్వము రసవంతముగానేయున్నది. రాజరాజాభిషేకములోని కొన్ని పద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

చ. పనివడి చెప్ప నేల శిశుపాలునివిక్రమచేష్టితంబు లా
తనిపనిపూని దానవపదాతులు వచ్చిరి వీరె వారె యం
చనిశము తెప్పవెట్టక సురావళి దిక్కులు చూచుచుండఁగా
ననిమిషనామ మొక్కటియు నర్థము దప్పకయుండె నిప్పుడున్. ఆ.౧.

ఉ. ఆగయ విన్నమాత్రమున నైనను జూచినమాత్ర నైన నె
వ్వారిమనంబులం బ్రణయవాసితమై యనురాగకందళం

బీరిక లెత్తుఁ గారణ మొకించుక లేకయుఁ బూర్వజన్మ సం
స్కారవిశేషమం ద్రదది వికస్వరమై కొనసాగు నుర్వరన్. ఆ. ౨.

చ. అమృతసరోవరంబుగ హిమాంశునిమూర్తి కరంగి లోనిచి
హ్నము వికచోత్పలప్రకరమై చెలువొందిన నందులోన సం
భ్రమమున నీఁదు లాడి జడిమంబున నంగము లూను నేని యూ
హిమమున నింద కేసి శమియించునొకో మదనాస్త్రవేదనల్. ఆ.౩

శా. శుద్ధాంతఃకరణైకయోగ్య మగుచుఁ శోభిల్లునస్మద్వచో
రాద్ధాంతం బిది యిచ్చగింపక వృథా ప్రజ్ఞాపరిజ్ఞానస
న్నద్ధు లొక్కండదఱు కేవలంబుగ వితండావాదులై తా రసం
బద్ధోక్తుల్వచియించి రేని మదమార్ప న్వారి ఖండించెదన్. ఆ. ౪.

మ. మహిలో నీ కిటమున్న నేము ఘిమతమ్మన్యత్వము ల్వానుటల్
సహియింపం దగునంచు నిప్పుడును విజ్ఞాపింప మాకేటికిన్
గుహనానాటకసూత్రధార భువి నీక్రొవ్వాడిమాయావిధుల్
బహురూపంబులుపన్నఁగాఁదిరుగ రేబ్రహ్మేంద్రచంద్రార్కులున్ ఆ-౫

---

58. సిరిప్రెగడ ధర్మనామాత్యుఁడు

ఈకవి నలచరిత్రము నాలుగాశ్వాసములపద్యకావ్యమునుగా రచి
యించి, శ్రీవేంకటేశ్వరుల కంకితము చేసెను. ఇతఁడు నియోగిబ్రాహ్మ
ణుఁడు; హారితసగోత్రుఁడు; తిప్పయామాత్యపుత్రుఁడు. ఇతఁడు నలచరి
త్రములోఁ దనదండ్రి నిట్లు వర్ణించియున్నాఁడు—

ఉ. సూరినుతుండు తిప్పనయశోజలజాక్షికిఁ గ్రీడ సల్పఁగా
మేరుధనుర్ధరాచలము మేడ సుధాజలరాశి కేళికా
సారము పువ్వుఁదోఁట దివిషద్ధరణీరుహసంచయంబు నీ
హారమహీధరంబు కృతకాద్రియు నై విలసిల్లు నెప్పుడున్.

తనతండ్రి యిందు రిసీమలోనివాఁడనియు, ఈ క్రిందిపద్యములలోఁ దనమేనమామ పేరూరి నివాసుఁడనియు, కవి చెప్పుకొనుటచేత నీతఁడు గోదావరీ కృష్ణామండలములలోనివాఁడని తోఁచుచున్నది—

సీ. తన కేశునుఁడు ప్రపితామహాం డగు లోహి
తసగోత్రుఁ డల పుల్లదండనాథుఁ
డెసఁగు నేఘునుతాత యసదృశోన్నతి పుట్ట
మాంబాధవుఁడుతిమ్మనాహ్వయుండు
పెనిచె నేఘునుతండ్రి తనకీ ర్తిలత లాశ
లంటఁ బెంపగు తిమ్మయప్రభుండు
వెలయు నేఘునుతల్లి విమలపతివ్రత
వివిధసద్గుణశీల వెంగళాంబ
యతఁడు తునురుగోటివరవంశాబ్ధివిధుఁడు
సతతపేరూరి కేశవస్వామ్యధీన
మానసస్థితిఁబరఁగు నామేనమామ
మతినిగురుసన్నిభుఁడు ధర్మమంత్రివిభుఁడు.

చ. విను మనఘాత్మ ధర్మసుకవీ భవదీయవచోవిలాసముల్
ఘనకవిహృద్వికాసములుగావె చమత్కృతిమీఱ నీవు నే
ర్చినగతి నిప్పు డానలచరిత్రము వేంకటశైలరాణ్నివా
సునకు సమర్పణంబుగను శోభనలీల రచింపు పెంపుగన్.

ఈకవికాల మేదో నిర్ణయించుటకుఁ బుస్తకమునం దాధారము లేవియుఁ గానరాలేదు. ఇతఁడు శ్రీనాథుని వర్ణించియుండుటచేతఁ బూర్వకవి కాఁడనుట నిశ్చయము. ఇతఁడాధునికుఁడయి యినూ్నఱుసంవత్సరములక్రిందట నుండియుండును. ఈతని కవిత్వము మొత్తముమీఁద నిర్దుష్టమయి యింపుగా నున్నది. నలచరిత్రములోనిపద్యములఁగొన్నిటి నిందు క్రిందఁ బొందుపఱచుచున్నాను.

ఉ. ధారుణి వీరసేనవసుధావరువా లటువాల వీరు లా
సారసమిత్రుఁ దూఱి తనసన్నిధిఁ జేరినవారి కెల్ల జం
భారి యిడన్ సురద్రుకుసుమావళియే యుడివోయె నన్నచో
నార గణింపఁగాఁ దరమె యాఘనుఁ డోర్చినశత్రుసంఘముల్.ఆ-౧

శా. లీల న్నీలపుటాలమేడకడ లాలిం గేలిమై నుంచి జో
జోలక్ష్మీశకటాక్షవీక్షణయుతా జోజోశుభాకార జో
జోలావణ్యరమాకుమార యనుచుం జోకొట్టుచుం బాడి ర
న్నానీకేక్షణ లానృపాలసుతు వీణాకోకిలాలాపలై. ఆ. ౨.

ఉ. వెన్నెల చందమామకును వెన్నెలకుం దగఁ జందమామయున్
సన్నుతలీల నంద మగుచందమునన్ ధరణీతలేశ యా
కన్నియ నీకు వేడ్క నలకన్నియ కీవును జోడుగూడ నేఁ
గన్నులఁ జూతు నేమొయని కాంక్షయొనర్చెద నెమ్మనంబునన్ ఆ-౩

ఉ. అర్థి ఫలప్రదాయక గుణాకర నైషధసార్వభౌమ కా
ర్యార్థుల మైన మమ్ములఁ గృతార్థులఁ జేయఁగదయ్య సర్వశా
స్త్రార్థము లెందు నీ వెఱుఁగనట్టివి లేవకదా పరోపకారా
ర్థమిదంశరీర మను టాత్మఁ దలంచఁగదయ్య ధీనిధీ. ఆ. ౪.

శా. నీతిం జూడు నరేంద్ర మీనతతుల న్మీనంబులే మ్రింగుటల్
ఘాతక్రీడఁ గుఠారకాష్ఠ మిల వృక్షవ్రాతముం ద్రుంచుటల్
జ్ఞాతిత్వంబునఁ గాదె జ్ఞాతు లెచటన్ సామాన్యులే చెల్లఁబో
జ్ఞాతిశ్ఛేదనలేనకిమ్మనెడుశాస్త్రంబుం బరీక్షింపవే. ఆ. ౫.

మ. లలనా ప్రాణసమాన వై ననిను నేలాపాయు దే నన్న నీ
పలుకే నమ్మి భవత్పదాంబుజసమీపక్షోణి నిద్రింపఁగాఁ
గలితవ్యాళమృగాదిజంతుభయదోగ్రం బైనయీకాననలో
పల న న్వీడఁగనాడి పో నధిప నీపాదంబు లెట్లాడెనో. ఆ. ౬.

59. గణపవరపు వేంకటకవి

ఇతఁడు శ్రీప్రబంధరాజవేంకటేశ్వరవిజయవిలాసమనెడి యేకాశ్వాసప్రబంధమును రచియించెను. ఇది యేకాశ్వాసగ్రంథమేయయినను, ఇందలి పద్యముల సంఖ్యమాత్రము నాలుగాశ్వాసముల గ్రంథములో సామాన్యముగానుండుదానికంటెఁ దక్కువగాలేదు. ఈకవి నందవరీకనియోగిబ్రాహ్మణుఁడు; ఆశ్వలాయనసూత్రుఁడు; వసిష్ఠగోత్రుఁడు; అప్పయామాత్యపుత్రుఁడు. ఇతఁడు కృష్ణామండలములోని కామెపల్లె సీమయందలి గణపవరగ్రామవాసుఁడు. ఇతఁడు పల్నాటిసీమవాఁ డగుటచేతనే స్వానుభవముచేతను గాఁబోలును 'పలనాటి గొల్లలపాటజాతి' యని యచ్చటిగొల్లల పాటను నిరసించియున్నాఁడు. ఇతఁడు మిక్కిలి యాధునికుఁడే యయినను, ఇతని కాల మిదియనిమాత్రము సరిగాఁ దెలియదు. ఇతఁడును దనకు వేంకటేశ్వరుఁడు స్వప్నమున సాక్షాత్కరించి తన్నుఁ గూర్చి పలికినట్లు చెప్పుకొన్న పద్యములలోని యీక్రిందిపద్యమువలన నితఁడు పదునాఱవశతాబ్దాంతమునకు లోపలివాఁడుకాఁడని స్పష్టమగుచున్నది—

సీ. అల నన్నయకోట పెద్దనలక్షణజ్ఞత శబ్దశాసనకవి శబ్దశుద్ధి
ప్రాబంధికపరమేశ్వరు నర్థమహిమంబు భయకవిమిత్రునిపదలలితత
శ్రీనాథువార్తాప్రసిద్ధి నాచనసోముభూరికాఠిన్యంబు పోతరాజు
యమకవిధము మల్లయమనీషిచిత్రంబు పింగళి సూరకవివరుశ్లేష
నాంధ్రకవితాపితామహునల్లికబిగి
ముక్కుతిమ్మనతేటయు భూషణునియ
లంకృతియు నీకె కలదౌ తలంపలక్ష
ణకవి యప్పయ వేంకటసుకవిచంద్ర.

ఈపద్యమునుబట్టిమాత్రమే కాక యితఁ డవతారికయందుఁ దన్నుఁ గూర్చి చెప్పుకొన్న యితర భాగములనుబట్టికూడ విచారింపఁగా స్వాతిశయమును జెప్పుకొన్న యాంధ్రకవులలో నెల్ల నితఁ డగ్రగణ్యుఁ డయినట్టు కనఁబడుచున్నాఁడు. పయిపద్యమునందుఁ బదునాఱవ శతాబ్దాంతమందున్న పింగళి సూరనార్యునిని (రాఘురాజ) భూషణుని బేర్కొనుటచేత నీతఁడు పదునేడవశతాబ్దమునకు లోపలివాఁడు కాఁడనుటకు సందేహము లేదు. మఱియొకచోట నితఁడు తన గ్రంథమునందు "లక్షణసారసంగ్రహ సరస్వతీవిలాస సాహిత్య చింతామణి సత్కవిజనసంజీవని" యని లక్షణసారసంగ్రహమును కవిసంజీవనిని బేర్కొని యున్నాఁడు. ఇందలి లక్షణసారసంగ్రహము చిత్రకవి పెద్దన్న రచియించినదై నపక్షముఁ గివి పదునేడవ శతాబ్దారంభమునకుఁ బదునెనిమిదవశతాబ్ద మధ్యమునకుఁ దరువాతివాఁడును అగును. ఈగణపవరపు వేంకటకవి తనకుఁబూర్వులయిన కవుల కావ్యములలోనుండి గ్రంథచౌర్యమును విశేషముగాఁ జేసినవాఁడయినందున, ఆలక్షణసారసంగ్రహము కూచిమంచి తిమ్మకవిదే యైన పక్షమునఁ దిమ్మకవి గ్రంథములనుండియు చౌర్యము చేసినాఁ డని చూపుటకుఁ దగిననిదర్శనములు లేకపోలేదు. ఇరువురకవుల గ్రంథములలోని యీపద్యములను జూడుఁడు---

సీ. బింబోష్ఠియని నీవు పెనఁగరాకు శుకంబ
సాంకవగంధి యీపంకజాక్షి
పంకజాక్షి యటంచుఁ బదరకు త్రేఁటి చం
పకజాలనాస యీపల్లవాంఘ్రి
పల్లవాంఘ్రి యటంచు బాధింపకు పికంబ
రామాంగి యీబిసప్రచయబాహ

బిసబాహ యని రాకు వెసనంచ జలద శి
రోరుహ యీ మహిరోమరాజి
యహిపరోమాళి యంచు డాయకుము నెమ్మి
కార్ముకభ్రూలతిక యీ చోకారపుఁ జెలి
యనుచు శుకభృంగ పరభృత హంస నీల
కంఠ నికురుంబములఁ దద్ద కనలి పలికె.

అని తిమ్మకవి తన రసికజనమనోభిరామములోని చతుర్థాశ్వాసమునఁ జెప్పియుండఁగా గణపవరపు వేంకటకవి

సీ. చక్రస్తని యటంచు జగడించకు శశాంక
గురుతమోవేణి యీకుందరదన
మధురాధర యటంచు మట్టుమీఱకు తేఁటి
చంపకనాస యీజలజవదన
బిసబాహ యని మాటు మసలకు రాయంచ
జలధరచికుర యీకలువకంటి
పల్లవకర యని త్రుళ్ళకు కోయిల
శ్రీరామమూర్తి యీకీరవాణి
వదన కుంతల రదాడ సుస్వర నఖత్వ
మెనసియుండుటకతన మీ కితవొనర్చు
ననుచు నళి చంద్ర పరభృత హంసములకు
భయము నయమునఁ దెలియఁగఁబలికి మఱియు.

అని చెప్పియున్నాఁడు. ఈయుభయులలో నెవ్వఁడు పూర్వుఁడో యాతని పద్యమును జూచి రెండవవాడు తనపద్యమునైనను వ్రాసికొని యుండవలెను, లేదా యిరువురుగూడఁ బూర్వమున్న యిటువంటి పద్యమును మఱియొకదానినిజూచియైనను వ్రాసికొనియుండవలెను. వేంకటకవి గ్రంథచౌర్యము చేయువాఁడగుట తెలియుటకయి నరసభూపాలీయ

మునుండియు వేంకటేశ్వరవిలాసమునుండియు నొక్కొక్క చిన్నపద్యము నిం దుదాహరించుచున్నాము—

క. ఔరా యోబనృపాలకు
మారా మను మదనసమరమాధుర్యుఁడవై
ధీరా నృసింహ కూడితి
మారామను మదనసమరమాధుర్యుఁడవై.

అని యీపద్యము కావ్యాలంకారసంగ్రహములో పాదయమకము నకు లక్ష్యముగా నీయఁబడియుండఁగా, వేంకటకవి.

క. ఔరా మాధవయజ్వకు
మారా మను మదనసమరమాధుర్యుఁడవై
ధీరా విటార్య యేలితి
మారామను మదనసమరమాధుర్యుఁడవై.

అని పైపద్యమునే పేరులుమాత్రముమార్చి పంచదశవర్ణయుక్త పాదయమకమని తన పుస్తకములో వేసికొనియున్నాఁడు. ఈకవి వేంక టేశ్వరుఁడు తన్ను ద్దేశించి పలికినట్లు కొన్నిటిని, తానే చెప్పుకొన్నట్లు కొన్నిటిని, ఇతరులు తన్ను మెచ్చి పొగడినట్లు కొన్నిటిని, స్వరచితము లైన గ్రంథముల నామములను జెప్పుకొనియున్నాఁడు. ఇట్లు చెప్పుకొనఁ బడిన తారావళులు, యమకశతకము, శృంగారరసమంజరి, కృష్ణమల్లకథ, బాలరామాయణ ద్విపదము, చాటుపద్యములు, లింగనిర్ణయము, ఆంధ్ర ప్రతాప రుద్రీయము, ఆంధ్రరసమంజరి, ఆంధ్రనిఘంటువు, ఆంధ్రకౌ ముది, గణయతి ప్రాసలక్షణ సీసమాలిక, ఆంధ్రప్రయోగరత్నాకరము, రేఫ ఱకారనిర్ణయము, షట్ప్రత్యయ ప్రస్తారసరణి, ఇరువదాఱు ఛంద ముల వచనము, అలంకారసారము, పరమభాగవతచరిత్ర, ఆంధ్రద్విరూప కోశము, కల్పితకల్పలత, ఆంధ్రవసంత తిలకబాణము, కఠిన ప్రాసశత కము, ఆంధ్రప్రక్రియాకౌముది, జాంబవతీవిలాసము, చండవిద్యావతీ

దండకము, చక్రవాళతారావళి, పురాణసారము, ప్రబంధరాజ వేంకటే శ్వరవిజయ విలాసము, అను గ్రంథములలో రెండుమూడుతక్క శేషిం చినవన్నియు నామమాత్రా వశిష్టములయినవి. అట్లగుటకుఁ గారణము లేకపోలేదు. ఈకవి తానుజేసినపుస్తకములు లోకమునకుపయోగపడవలె నన్న యుద్దేశముతోఁగాక తనసర్వతోముఖ పాండిత్య ప్రకర్షమును లోక మునకుఁ బ్రకటింపవలెనన్న యుద్దేశముతో విశేషభాగము చేసినందున నీతనిపుస్తకముల కిట్టిగతి పట్టియుండును.

సంస్కృతములోనున్న జ్ఞానధనమును జనులకువెదచల్లవలెనన్న పరమార్థచింతతో మొట్టమొదట నన్నయభట్టారకాదులగు మహాకవులు పదునొకండవశతాబ్దారంభమునుండి సులభశయ్యను సంస్కృతగ్రంథ ములఁ దెనిఁగింపఁదొడఁగిరి. ఈభాషాంతరీకరణకార్యము పదునేనవశతా బ్దాంతమువఱకును నవిచ్ఛిన్నముగా జరగుచువచ్చెనుగాని యిట్లు భాషాంతరీకరణమునకుఁ బూనుకొన్నవారిలోఁ గడపటివారగు శ్రీనా థాదులు తమపూర్వులకన్నఁ దాము ఘనులనిపించుకొనవలెనన్న చింత చేతనో మఱి యేహేతువుచేతనో సంస్కృతపదభూయిష్ఠము లైనదీర్ఘస మాసములతో నింపి రసమును జెఱుపక పోయినను తమగ్రంథములు బహుజనులకు దుర్గ్రాహ్య మైనకఠినశైలిని జేసిరి. ఇట్లాకాలములో భారత భాగవతరామాయణాదిముఖ్యగ్రంథము లన్నియుఁ దెలిఁగింపఁ బడఁగా, అటుతరువాతఁ బదునాఱవశతాబ్దారంభమునం దల్లసాని పెద్ద నాదు లొక క్రొత్తత్రోవఁద్రొక్కి కేవలభాషాంతరములు కాకుండఁ బురాణములలోని కథలను గైకొని స్వకపోలకల్పితములైన వర్ణనలను జేర్చి పెంచి శ్రీనాథాదులశయ్యనవలంబించి సరవంతముగా ప్రబంధము లను జేయ నారంభించిరి. ఈపని నూఱు నూటయేఁబదిసంవత్సరముల వఱకును జరగుచుండఁగా, ౧౬౫౦వ సంవత్సరములోపల బహుమార్గ ముల నూతనప్రబంధము లనేకములు తెలుఁగునఁ జేయఁబడినవి. అంత

టితో నూతనసృష్టి బహుతరముగా నంతరింపఁగా, ఈవలివారు వసుచరిత్రమును మాతృకనుగాఁ గొని దానికి పాఠాంతరములో యనునట్లు పూర్వవర్ణనములనే తలలుమార్చి ప్రయోగించుచు వెనుకటిప్రబంధముల ననుకరించి తమప్రబంధముల నల్లఁజొచ్చిరి. చేసినదానినే పేరులుమార్చి మరలఁ జేయుచుండుటచేత నూతనార్థకల్పనలనుజేయుట దుష్కరమయి నందున నిటీవలివారిలోఁ గొందఱు మహాపురుషులాయర్థలోపమును పదాటోపముతోఁ బూరింపఁబ్రయత్నించిరి. పూర్వపువా రక్కడక్కడ సముచితముగా శబ్దాలంకారములను జేర్చుచు వచ్చినను భాషావధూటికిఁ బ్రాణమైనయర్థసారస్యమును జెడఁగొట్టకుండిరి. ఇటీవలివారర్థసారస్యమునంతగాఁ బాటింపక నిఘంటువులవెదకి పదములేరికూర్చి బంధించి తమ సరస్వతిని హృదయాకర్షకముగాఁ గాకపోయినను కర్ణరంజకముగా నైనను జేయఁబాటుపడిరి. ఇట్టివారిలో నెన్నికగన్న కొందఱు బంధాదుల నతిమాత్రముగాఁజేర్చి యర్థసారస్యమును బూర్ణముగాఁ జెఱిచి యవయవములు విఱిచి తమభాషావధూటిని విరూపినిజేసి శవప్రాయను జేసిరి. మన యీవేంకటేశ్వరవిలాసకృతికర్తయు బలరామచరిత్ర కృతికర్తయైన గుడారు వేంకటదాసకవియుఁ గొంతవఱకీకడపటి తెగలోఁ జేరినవారు. ఒకఁడు తనపుస్తకమునకుఁ బ్రబంధరాజవేంకటేశ్వరవిజయవిలాస మని పేరు పెట్టుకొనఁగా నింకొకఁడు తనపుస్తకమునకుఁ బ్రబంధరాజశిరోభూషణ ప్రకృష్ట బలరామచరిత్రమని పేరుపెట్టుకొనెను. వేంకటదాసకవి

"నిరోష్ఠ్యమత్తేభవిక్రీడిత శార్దూలోత్పలమాలా తోటక మత్తకోకిల లయగ్రాహిమణిగణనికర పంచచామరస్రగ్విణీప్రమితాక్షర మణిభూషణ ద్రుతవిలంబిత కవికంఠభూషణ వినయస్వఘూతాద్భృష్టహర్షణి రథోద్ధతాంబురుహ కవిరాజవిరాజిత గణసమకదండకార్యాగీత సీస ద్విపదకంద శ్లోకచూర్ణికా వచనకైవార గద్య కలికోత్కలికామంజ

రీద్విపద ధవళసువ్వాలశోభనారాత్రిక నానారగడభేదసప్తతాళైలా మహార్ణవమిలాలిశారదద్వాత్రింశద్రాగ నానావిధవిచిత్ర నాగబంధ పుష్పమాలికా బంధసంయుక్తకల్పిత కల్పవల్లీ చంపకమాలికా వృత్తము."

అని పేరుపెట్టి యొక పద్యములో ననేకబంధ గర్భవృత్తముల నిమిడింపఁగా, మన యీవేంకటకవి దీనిని మించునట్లుగా,

"బహువిధచిత్రకంకణ బంధద్విగుణితసీసచరణచతుష్టయగర్భిత ద్విపదకందద్వయ సమవృత్తచౌపదయుగళాటవెలఁది తేటగీతి మదనవిలసిత తురంగవృత్త బహువిధతాళవృత్తాష్టక ధవళశోభనగానారాత్రికగాన జంపెత్రిపుటార్ధచంద్రిక సువ్వాలలాలిపదైలామంజరి సమతాడిండిమతాళవృత్తమణిగణనికర తురగవల్గన రగడోదాహరణసంబుద్ధి కళికోత్కళికార్ధాహిరీ రాగదళ ముఖారిరా గాటకతాళదళ కాంభోదిరాగ రూపకతాళదళకాంభోదిరాగ సమపద కన్నడరాగ సాంగత్య కొరవంజిదళ రేవగుప్తిరాగ సమపద సావేరిరాగైకతాళదళ బిలహరిరాగాటతాళ సమపద పుష్పమాలికాబంధ గోమూత్రికాబంధ శార్ఙ్గబంధ షోడశదళపద్మబంధ పాదుకాబంధ నవరంగబంధ ఖడ్గబంధ గుచ్ఛబంధ ఛత్రబంధ చామరబంధ గదాబంధ చక్రబంధ నాగబంధ రథబంధ శంఖబంధ మృదంగబంధ పాదభ్రమకబంధ పాదార్ధ భ్రమకవింశతిబంధ భేదకందానుష్టుప్ శ్లోకాంతర్గత చతుశ్ఛద్ర నవరంగ సర్వతోభద్రాందోళికాబంధ యుక్తానులోమవిలోమ కందభాషాశ్లేషకందకందాటవెలఁది గర్భితాంత్య త్రేటగీతియుక్తచౌషష్టిభేదచిత్రసీసము"

అని పేరు పెట్టి యొకపద్యములోనే బహుబంధ గర్భవృత్తముల నిమిడ్చెను. కవి మిక్కిలి కష్టపడి పయిని చెప్పఁబడినరీతి గర్భబంధకవిత్వమును, ఏకాక్షర నిఘంటులను వెనకి—

క. కై కోకీకా కైకుకై । కోకా కాకింకి కూకి కూకకుకోకీ
కాకుకకు కేకకేకిక । కూకో కొకు్కక కింక కోకై కోకా.

అనురీతి నేకాక్షరములతోడి చిత్రకవిత్వమును, ఒక్కదానిలో నేయితరపుస్తకములోను లేనంత యమితముగాఁ జెప్పి తనశిల్పివ్యాపార కౌశలము నెంత చూపినను, కాళ్లతో నడచి గమ్యస్థానమును చేరు సామాన్యమార్గము విడిచి యడ్డముగా భూమిమీఁదఁబడి కడుపుతో దొర్లి ప్రయాసపడి గమ్యస్థానమునుజేరి యసాధారణప్రౌఢిమను జూపిన బుద్ధిమంతుని శక్తిని మెచ్చుకొనునట్లే యిట్టి కవితాచమత్కృతులు మెచ్చు కొనఁ దగియుండునుగాని యంతకంటె నెక్కువ శ్లాఘాపాత్రములుగావు. నవరసరసికు లెప్పుడును హృదయాహ్లాదకరముగా నర్థకల్పనము చేసియు కర్ణరసాయనముగా మృదుమధురవాగ్గుంభనలతో భావములఁగూర్చియు మహోత్సాహోద్దీపకముగా నీతి బోధనమొనర్చియు వర్ణనలు చేయఁగలిగిన కవినిమాత్రమే మెచ్చుకొందురుగాని కావ్యదోషములకు లక్ష్యము లగు నట్లుగా నర్థగౌరవముఁ జెఱిచి పదముల విఱిచి పద్యములలోఁ బద్యము లను దూర్చినవానిని మెచ్చుకోరు. ఈవేంకటకవివర్యుని కవనమునందు వ్యాకరణదుష్టములయిన ప్రయోగము లనేకములు కానఁబడుచున్నవి. ఈకవికాల మేదో సరిగాఁ దెలియ రాకపోయినను, ఈతని గ్రంథము లోని సలాము సాహెబు ఫిరంగి తుపాకి మొదలగు పదప్రయోగము లీతఁ డాధునికుఁడని ఘోషించుచున్నవి. బంధగర్భచిత్రకవిత్వముల కొఱకై శ్రమపడి కూర్చినభాగములను విడిచినపక్షమున, ఈతని కవి త్వము మొత్తముమీఁద రసవంతమయి పదలాలిత్యము కలదయి మనో హరముగానే యున్నది. ప్రబంధరాజ వేంకటేశ్వరవిజయవిలాసములోని కొన్ని పద్యముల నిందుఁ బ్రదర్శించుచున్నాము—

చ. తగునె నృపాలకన్యలకు దవ్వులనవ్వుల పువ్వులాట లీ
వగలఁ జరింప నిందుఁ దగవా మగువా మగవార లుండఁగా

మగుడి పురంబుఁజేరఁ జనుమా వినుమా యనుమాన మేల నీ
సొగసు విలాస మంచమును సొంపును నింపును బెంపుమీఱఁగన్.

ఉ. వ్రేలిమి వ్రేల్వఁ జెప్పుడును వ్రేల్చుమొగంబు వధూలలామకై
చాలుగ సంధ్యవార్చఁడు త్రిసంధ్యలవార్చును వంటవార్పు లా
బాలికయింటఁ దండ్రి సలుపం గననొల్లఁడు దేవపూజ యే
వేళల లంజెతల్లి యిలువేలుపుమాత కిడుం బ్రణామముల్.

చ. అడిగినఁ దెచ్చువాఁడొ కడునందమునం గననైనవాఁడొ మే
ల్నడవడికాఁడొ వీటఁ దగునాయకమై చరియించువాఁడొ చే
విడిముడికల్గువాఁడొ తలవెంద్రుక లందఱు రాకుమారకుల్
ముద్దుపులు వానగాఁగురియ ముట్టవు కారణమేమి కూఁతురా.

శా. ఏమీ పల్కవు నేను బిల్వ దయ లేదే నీకు నాయయ్య ని
న్నేమంటిన్ సుకుమార నామెడను దప్పేదీ కుమారాగ్రణీ
నామీఁదన్ జల మేలరా తనయ నన్మన్నించరా పెన్నిధీ
నీముద్దు ల్గననోచినానుగద తండ్రీ నీతిపారంగతా.

---

60. వేముగంటి దత్తోజీపండితుఁడు

ఈకవి ప్రస్థానత్రయములో నొకటియైన భగవద్గీతా యోగశాస్త్ర
మును బద్యకావ్యముగాఁ దెనిఁగించెను. ఇతఁడు హారితసగోత్రుఁడు; నాగ
మాంబకును నాగోజీపండితునకును బుత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు;
మాధ్వమతస్థుఁ డని తోఁచుచున్నది. ఈయనకాలము మొదలయిన
వానినిగూర్చి యేమియు నిశ్చయముగాఁ దెలియదు. ఇతఁడు నూఱుసం
వత్సరముల లోపలివాఁడు కాఁడు. కృష్ణార్జునసంవాదమను నామాంత
రము గల యీయోగశాస్త్రములోని కొన్నిపద్యముల నిందుదాహరించు
చున్నాను—

ఉ. కోకలు జీర్ణమై చనఁగ గొబ్బున వానిఁ బరిత్యజించి తా
శ్రీకరనూత్నవస్త్రములఁ జెల్వుగఁ దాల్చినభంగి దేహి సు
శ్లోకుఁడు జీర్ణదేహములశోభకు రోసిన జీవమూర్తి యీ
లోకపుగోమలాంగముల లోలతఁ దాల్చును భద్రమూర్తియై. అ-౨

ఉ. సల్లలితంపుఁగర్మములు సాంద్రయశోనిధి సద్విరక్తిచే
నొల్లక సన్యసించి పటుయోగసుఖంబునఁ జెందుచుండుఁ దా
నెల్లెడ జీవుఁ బోలి కడు హేయపుఁదొమ్మిదితూంట్లమేనిలోఁ
ద్రుళ్లుచుఁ జేయనొల్లఁడు ప్రతోషముతో నియమింపఁడన్యులన్. అ-౫

ఉ. వేదములన్ మఖంబులను విశ్రుతదానతపంబులన్ సము
త్పాదితమైనపుణ్యము నధఃకరణం బొనరించుయోగి య
య్యాదిమపూరుషోత్తమునిజార్థము నెమ్మది సంగ్రహించి ని
ర్వేదన లేక యార్య మగు విష్ణుపదంబును జెందు నర్జునా. అ. ౮.

ఉ. ఇంద్రియసౌఖ్యసంపదల నేమియుఁ గోరక వీతరాగుఁడై
సాంద్రయశుం డహంక్రియలచక్కటిఁ బోవక దూరవర్తియై
యింద్రజ మేనికిన్ జరయు మృత్యువు జన్మము వ్యాధులున్ విని
స్తంద్రత దుఃఖదోషములుఁ జాలఁగఁగల్గుటెఱుంగఁగాఁదగున్. అ-౧౩

ఉ. కామము రాగముం బలముఁ గల్గి యహంకృతి దంభయుక్తుఁడై
యేమనుజుండు శాస్త్రవిధి నెంతయుఁ దుచ్ఛముగాఁ దలంపుచున్
భూమికి భీకరం బయినభూరితపం బొనరింపుచుండు నా
పామరు నాసురక్రియలఁ బర్వినవానిఁగ నిశ్చయింపుమా. అ. ౧౭.

61. గుడారు వేంకటదాసకవి

ఈకవి బలరామచరిత్రమని సామాన్యముగా వాడఁబడు ప్రబంధ రాజశిరోభూషణ ప్రకృష్ట బలరామచరిత్ర యను నాఱాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు బలిజవంశజుఁడు; పైడిపాలగోత్రుఁడు; ఈతని తండ్రి గురవేంద్రుఁడు; తల్లి రంగమాంబ. ఇతఁ డాధునిక కవియే యయినను, కాలనిర్ణయము చేయుట కాధారములేవియుఁ గానరాలేదు. ఇతఁడు నూటయేఁబది సంవత్సరములక్రిందట నుండెనేమో! ఈతని కవిత్వము ప్రౌఢమైనది. బలరామచరిత్రమునుండి రెండుపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

శా. నీరేజాక్షికి హారమౌక్తికతతుల్ నీలంబులై తైలముల్
జాలంగాఁ బగడంబులై పిదప వజ్రాకారము లూని వి
స్తారస్వేదకణంబులం దడిసి సున్నం బయ్యె నాదుర్దమ
స్మారస్ఫారశరాగ్ని హైమపట మచ్ఛచ్ఛాయమై తోఁచినన్. · ఆ-3

ఉ. వారిధిధీరమానసుఁ డవారితతేజుఁడు నైజరాజకం
఻రవభావభీతహరిణీభవదున్మదవైరివీరుఁ డు
ద్దారుణమార్గణప్రకరదైన్యవిదారణదానదక్షుఁ డీ
భూరమణాగ్రణిం గనుము పుష్కరనేత్ర విదూరకాహ్వయున్. ఆ.౫.

62. కామనూరి కృష్ణయ్య

ఇతఁ డిందుమతీపరిణయ మనెడి యైదాశ్వాసముల ప్రబంధమును రచించెను. రఘువంశములోని యజమహారాజు చరిత్ర నీప్రబంధరూపమునఁ జేసినట్టు కవియే యీపద్యమునఁ జెప్పియున్నాఁడు—

గీ. కాళిదాసకవిశ్రేష్ఠకల్పితంబు
భవ్యచరితంబు రఘువంశకావ్య మందు
నజునికథయాంధ్రభాషచేనలఘుమతిని
గృతిరచింపఁబూనితినలంకృతులుచెలఁగ.

ఈకవి నందవరీక బ్రాహ్మణుఁడు; గోవిందయామాత్య నందనుఁడు. ఇతఁడు నూటయేఁబదిసంవత్సరములనాఁటివాఁడయి యుండునేమో. ఈతనికవిత్వము మనోహరమైనదే. ఇందుమతీపరిణయములోని రెండు పద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. అందు దిలీపభూపతనుజాగ్రణిదేశము మేలుబంతి మ
ధ్యందినపంకజాప్తనిభుఁ డాధరణీశుఁడె మేటి తత్సుతుం
డిందు వసంత చిత్తజ సురేశ్వరసూనులకన్న మిన్న వా
నందముఁ జెప్పఁ జూప వశమా యసమానపరాక్రమక్రమా. ఆ. ౧.

ఉ. అన్నకు మ్రొక్కి తత్కరుణ నాయితపెట్టినదంతపుంబనిం
జెన్నలరారుపల్లకి వసించి చొకాటపుఁదేటకెంపురా
కన్నెమెఱుంగుఁగేలఁ బూనఁగంగ ధరించె మధూకదామ మ
త్యున్నతమంగళప్రకటతూర్యరవంబులు మిన్నుముట్టఁగన్. ఆ. ౪.

63. వేంకటాచార్యుఁడు

ఈకవి భద్రరాజపుత్రచరిత్రమను నైదాశ్వాసముల ప్రబంధమును రచియించెను. కళాపూర్ణోదయమునందు వలెనే యిందలికథలును కవిచే నూతనముగాఁ గల్పింపఁబడినవి; కాని కవిత్వ మంత ప్రౌఢమయినది కాదు. ఇందలికథలను బోలిన కథ లనేకములు కొన్ని వైష్ణవగ్రంథములలోఁ గానఁబడుచున్నవి. ఈకవి వైష్ణవబ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; ఆత్రేయసగోత్రుఁడు; శ్రీనివాసాచార్య పుత్రుఁడు. ఇతఁడు నూట నేఁబది సంవత్సరములక్రిందట నుండినవాఁడయినట్లు చెప్పుచున్నారు. భద్రరాజ పుత్రచరిత్రమునుండి రెండు పద్యముల నిందుఁ జూపుచున్నాను—

శా. ఏనుం జెప్పినభంగిఁ జేసితివె కాశీశుండు ప్రత్యక్షమై
తా నిన్మెచ్చితిఁ గోర్కె వేఁడుమనెనే ధన్యుండనైతిం గృపన్
నానాసౌఖ్యశుభాకరంబుఁ బుత్రము న్నాకిమ్మి యంటే శివుం
డానందించి యొసంగెనే వరము నీ వబ్బంగిఁ జేకొంటివే. ఆ. ౧.

ఉ. ఎవ్వరు నావిధంబు జలజేక్షణకుం దెలిపించి మేలు లో
నివ్వటిలం గరంగ సని నేర్పుదలిర్పఁగఁ దెచ్చి కూర్చి యీ
నెవ్వగఁ బాపువారె తమి నిల్వఁగఁగూడదు మేనఁ బ్రాణముల్
రవ్వడిఁ బోవుచున్నయవి రాదు భరింపఁగ నేమిచేయుదున్. ఆ. ౨.

---

64. మల్లంపల్లి నాగభూషణకవి.

ఇతఁడు బసవవిజయమను మూడాశ్వాసముల గ్రంథమును రచియించెను. ఇతఁడు వీరశైవమత స్థాపకుఁడైన బసవేశ్వరుని చరిత్రమును మాత్రమే కాక బసవచరిత్రాదులను రచియించిన పాలకురికి సోమనాథాదులనుగూర్చియు నిత్యాదిపద్యములలో వ్రాసియున్నాఁడు—

క. వీరప్రతాపరుద్రుఁడు । ధారుణిలోఁ గలుగుప్రజల ధర్మాత్ముండై
యారూఢి వెలయ నేలుచు । గారవమున నున్న యట్టికాలమునందున్.

సీ. ఫాలాక్షభక్తుండు భవపరిత్యాగి సమంచితభూతిరుద్రాక్షధారి
పంచాక్షరీమంత్ర పఠనపారీణుఁడు విమలఘనవ్రతవీరయశుఁడు
కావ్యకళాశాస్త్రకామితప్రవణుండు శాఖాగ్నిఫలపత్రజలము లైన
భవిచేతఁ జేకొనం డవి విననోపఁడు భాతిమీఱంగను బాలకురికి
సోమనాథుఁ డనఁగ సురలు ప్రస్తుతిచేయ
సకల శాస్త్రములను జదివిచూచి
ప్రకటితముగ శివుని భక్తి యధికమని
బసవదేవుమహిమ ప్రబలఁజేసె.

ఈ కవి శైవబ్రాహ్మణుఁడు, హారితసగోత్రుఁడు; త్రిపురాంతకారాధ్యపుత్రుఁడు; ఇతఁడు నూటయేఁబది సంవత్సరములక్రిందట నుండినట్లు తెలియవచ్చుచున్నది. ఈతని కవిత్వమంత మంచిది కాక, వ్యాకరణవిరుద్ధములైన ప్రయోగములతోఁ గూడియున్నది. ఈతని బసవ విజయము లోనివి రెండు పద్యము లిందుఁ బ్రదర్శింపఁబడుచున్నవి—

చ. బసవపురాణకావ్యమును బ్రాభవ మొప్పఁగఁ బద్యగద్యలన్
బాసఁగఁగ నాంధ్రకావ్యములు బుద్ధిని దారచియించి చెప్పఁగాఁ
బసిగొని భూసురుల్ వినియుఁ బాయక గుంపులు కూడి రాజుతో
మసలకపోయి పాల్కురికిమాన్యుఁడు సోమన చేయుశాస్త్రముల్. ఆ.౧

చ. అధములు మీరు బ్రాహ్మణులె యందఱుఁ జూడఁగ నొక్కచాకి యీ
పథమున వేదవాక్యములు పాడి పదంబుల మిమ్ము నందఱన్
బధిరులఁ జేసెఁగాని సరిపాల్పడి మీ రొకరైన వారితో
నెదుటను నిల్చి సంహితల నేర్పడఁ జెప్పఁగఁజాల రందఱున్. ఆ.౧.

65. చిత్రకవి సింగరార్యుఁడు

ఈ కవి బిల్హణీయమను మూఁడాశ్వాసముల ప్రబంధమును రచియించి శ్రీరామాంకిత చేసెను. ఈకవి యాఱువేలనియోగిబ్రాహ్మణుఁడు. ఈతని యనంతరమున నీతని పుత్రుఁడగు నారసింహకవి తనతండ్రి రచియించిన గ్రంథమును దెచ్చి బండిపెద్ది కృష్ణస్వామి కిచ్చి యాతనివలన ధనస్వీకారము చేసినట్టును, వా రిద్దఱును గలిసి కృత్యాదియందలి కొన్ని పద్యములను గద్యములనుమార్చి గ్రంథమును గృష్ణస్వామి రచియించి నట్లు దిద్దినట్లును జెప్పుచున్నారు. ఆ కొన్ని పద్యములను మార్చుటలోఁ గూడఁ గృష్ణస్వామికి నారసింహకవి సాహాయ్యమున్నదని తెలుపుటకుఁ గాఁబోలును బిల్హణీయమున నీ క్రిందిపద్యము వేయఁబడి యున్నది—

క. మ న్నింద్రతనూభవునకు। వెన్నుఁడు సహాయు మైనవిధమున నేనా
పన్నుతసద్గుణగణసం। పన్నుం డగుకవివరాధిపసహాయమునన్.

గ్రంథమునందుఁ బండి పెద్ది కృష్ణస్వామియే గ్రంథరచన చేసినట్లు చెప్పఁబడియున్నను నిజముగాఁ గృతికర్త సింగరయ్యయే యగుటకు నిదర్శనము ప్రథమాశ్వాసాంతమునందుండిన యీక్రింది చక్రబంధము నందుఁ గానఁబడుచున్నది—

శా. ధన్యా సింహాభచంద్రకీర్తి వరవిద్యాపండితార్యక్రమా
గణ్యా గర్వితధనంజయా శివదముక్తాకృత్పిగంకప్రభూ
జన్యారాజితభూరిశాత్రవసుభృజ్జావిద్రమావిక్రమా
మాన్యారాధన త్యాగభోగజయధామా నవ్యభాగోత్తమా.

ఈకావ్యము నూటయేఁబదిసంవత్సరములకుఁ బూర్వము రచియింపఁబడినట్టు తెలియవచ్చుచున్నది. ఇందలికథ మనోహరముగాను కవనము రసవంతముగాను గొంతవఱకున్నను దారాశశాంకమువలెనే యిదియు నీతిబాహ్యమైనందునఁ జదువఁ దగినదికాదు. మదనాభిరాముఁ

డను రాజు రూపయౌవనవతియగు యామినీపూర్ణతిలకకు సంగీతసాహిత్యములు చెప్పింపఁదలఁచి, సమస్తవిద్యలయందును సమర్థుఁడయిన బిల్హణుఁడను సంస్కృతకవీంద్రుని రావించి, అతఁడును రూపయౌవనసంపన్నుఁడయినందునఁ దనకూఁతు నాతనికడ నొంటిగానుంచి చదివించుట కిష్టము లేనివాఁడయి మంత్రితో నాలోచింపఁగా నతఁడు

మ. ఒకచిత్రవ్రత మున్న దిద్ధరకు రాజోత్తంస సిద్ధంబుగా
నకలంకాకృతి యైనసీతనయు జాత్యంధు స్వివిలోకింప దా
సుకవీంద్రుండును గుష్ఠగాత్రి నెపుడుం జూడ న్మదింగోరఁ డిం
దుకు నేమో వచియుంచు టే నెఱిఁగియుంగాన్మన్నుత త్కార్యమున్.

మ. కవిరాజాగ్రణి పుట్టుగుడ్డనుచు నీకంజాక్షికిం జెప్పి యా
కవికిన్ మీసుత కుష్ఠగాత్రియని వేడ్కం దెల్పి యవ్వారికిన్
భువి నన్యోన్యవిలోకనక్రియలు నేర్పుల్మీఱఁ గాకుండున
ట్లు విచారించెద నొక్కయుక్తి వినుఁ డిట్లున్ రాజదేవర్షభా.

అని రాజపుత్రి తాను జాత్యంధునిముఖముఁ జూడనని నియమముపట్టియున్నందున నామెతో నావిద్వాంసుఁడు పుట్టుగుడ్డివాఁడని చెప్పియు బిల్హణుఁడు కుష్ఠగాత్రిని జూడనని నియమముచేసికొనియున్నందున నాతనితో రాజపుత్రి కుష్ఠగాత్రియని చెప్పియు నిరువురకు నన్యోన్యముఖావలోకనము లేకుండ నడుమ తెర వేసి చదివింప వచ్చునని యుపాయము చెప్పెను. రాజాయుపాయమునకు సంతోషించి తనకొమారితతోను విద్వాంసునితోను నమ్మఁబలికి వారి నొడఁబఱిచి యిరువురిమధ్యను తెర వేయించి కూఁతునాతనివద్దఁ జదివింప నారంభించెను. కుశాగ్రమతియైన యామినీపూర్ణతిలక యాతనివలన సంగీతసాహిత్యాదివిద్యల నభ్యసించి యల్పకాలములోనే కవిత్వముచెప్ప నేర్చుకొనెను. ఇట్లు కొంత కాలము జరగఁగా నొకనాఁటిరాత్రి క్రొత్తగా నుదయించిన పూర్ణచందునిజూచి కవి.

చ. జలనిధిపంక్తి మంచు మఱి చాయయుఁ జిహ్నము లేడిపిల్ల కం
దళితసురేంద్రనీలమణిధామ మటంచు వచింతు రంద టీ
కలువలతేని యుందుఁ గలకందును నే ననుకొందు రాత్రియం
దలవడ మ్రింగినట్టితమ మంతరసంస్థ మటంచు నెంతయున్.

ఇత్యాదివాక్యములతోఁ జంద్రవర్ణనము చేయఁజొచ్చెను. ఆవ ర్ణన నాలకించి యామినీ పూర్ణతిలక

శా. అంధుం డెక్కడ చంద్రుఁ డెక్కడ తదీయంబైన యావర్ణనా
బంధం బెక్కడ యిట్టివింత గలదే భావింప నెచ్చోటనై
నం ధాత్రీంద్రుఁడు మాకు నిర్వురకు నందంబొప్ప నన్యోన్యవా
త్సంధానం బగు నంచుఁ జేసె నిటులం జర్చింప వేఱున్నదే.

పుట్టుగుడ్డివాఁడెక్కడ? చంద్రవర్ణనముచేయు టెక్కడ? రాజు మాకిరువురకు నన్యోన్యసంధానము కలుగకుండ నీమిష కల్పించెఁగాబో లునని తలఁచి, వ్రతభంగమయినను గానిమ్మని సాహసముచేసి తెరదీసి చూచెను.

ఉ. ఆకడ బిల్హణాఖ్యకవి యుత్తటిఁ దామరసారిఁగూర్చి యెం
తో కళ యుప్పతిల్ల వినుతు ల్పచరింపుచునుండి యంతలోఁ
బ్రాకటబద్ధకాండపటిపై రమణీమణిమోముఁ జూచి య
స్తోకమహోదయాద్రిపయిఁ దోచిన చంద్రునిఁ బోల్చి యిట్లనున్.

ఆయావనపురుషుఁడు పండువెన్నెలఁ గాయుచుండఁగా సంపూర్ణ పూర్ణిమాచంద్రబింబమును మీఱిన నిండుజవ్వనియొక్క ముఖచంద్రబిం బము నొంటిగాఁ జూచిన తరువాత జరగినపని చెప్పనక్కఱయే లేదు. ఇట్లుకొంతకాలము రాజపుత్రియుఁ గవీశ్వరుఁడును యథేష్టావిహారముల నానందించుచుండఁగాఁ దెలిసి కావలివారు రాజునకు విన్నవింపగా నతఁడు కూఁతుం జేరఁబిలిచి.

ఉ. కోరిన రాకుమారకునకుం బ్రియమారఁగ నిన్ను నిచ్చి యెం
తో రహిమీఱి సౌఖ్యమున నుండెదనంచుఁ దలంచియున్న నా
కోరిక లెల్లఁ బోఁగలఁచి కొంకుఁ గలంకము లేక మత్కులం
బారఁగ దుర్యశంబు మహి నందఁగఁజేసితివమ్మ బాలికా.

అని కోపముతో బిల్హణుని శిరశ్ఛేదముచేయ నియమించెను. రాజభటుల లాతనిని వధ్యస్థలమున కీడ్చుకొనిపోవుచున్నారని విని రాజపుత్రి యిట్లు విలపింపఁ జొచ్చెనట—

మ. అరవిందంబులరీతిఁ జెన్నలరుసీహ స్తంబు లెట్లోర్చె ము
ప్పురిగాఁ బెల్చిన కాలపాశమునకున్ ముగ్ధాంగనాగానభ
వ్యరసోత్కర్షము లైనసీశ్రుతియుగం బత్యుద్ధతోర్వీపకిం
కరనాదార్భటి కెట్లుతాళె మదనాకారా మనోనాయకా!

కవియును దన ప్రాణాపాయమును బాటింపక త్రోవపొడుగునను దన ప్రియురాలిని దలఁచుకొని యామెపయి నీరీతిని బద్యములఁ జెప్ప నారంభించెను—

ఉ. హా కమలాయతాక్షి చెలి హా సరసీరుహకుట్మల స్తనీ
హా కమనీయగాత్రి సతి హా నవమోహిని హా వధూమణీ
హా కనకాంగి నేను విడనాడితి నంచుఁ దలంచె దీవు నీ
లోకమునందు జీవునకు లోలతగాక స్వతంత్ర మున్నదే?

కవి తలవరులు తన శిరమును ఖండింపఁబోవునప్పుడొక పద్యమును వ్రాసి రాజునకంపఁగా నతఁ డది చదువుకొని కవిని క్షమించి, బిల్హణునికిని తన పుత్రికకును గల యన్యోన్యానురాగమును విచారించి, తన కూఁతు నాతనికిచ్చి వివాహముచేసెను.

మ. పొలుపొందన్ ద్విజరాజశేఖరునకున్ భూభృద్వతంసంబు ని
శ్చలభావోన్నతిఁ గన్య నిచ్చుపగిదిన్ క్ష్మానాకముఖ్యంబుగాఁ
బొలుపొందన్ ద్విజరాజశేఖరునకున్ భూభృద్వతంసంబు ని
శ్చలభావోన్నతిఁ గన్య నిచ్చె సుమనస్సంతానము ల్మెచ్చఁగన్.

66. రేవుణూరి వేంకటార్యుఁడు

ఇతఁడు శకుంతలాపరిణయమను మూఁడాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు నందవరీక వైదిక బ్రాహ్మణుఁడు; శ్రీవత్స గోత్రుఁడు; తిరుమల కొండయార్యపుత్రుఁడు. ఈతఁడు తన శకుంతలా పరిణయము నొకానొక రాజున కంకితము చేయ నుద్దేశించియుండఁగా నొక కరణము విఘ్నమాచరించినట్టును, అందుచేతఁ దనకృతిని వేంకటేశ్వరుని కంకిత మొనర్చినట్టును, ఈ క్రింది వాక్యములలో వ్రాసికొని యున్నాఁడు—

వ. అపూర్వాపూర్వకవిసుపర్వానుగ్రహంబునఁ బుణ్యగుణకథాశ్రవణకుతూహాలిక బుధసదానుబంధంబగు నొక్క ప్రబంధంబు సరసనుమనో నుబంధంబుగా నిర్మింపం బూనియున్న సమయంబున నతిప్రభావసంపన్నుం డగు కశ్చిత్ప్రభుండు—

శా. శ్రీవత్సాన్వయు రేవుణూరికులజున్ శ్రీపాదరేణుప్రభా
సావర్ణ్యస్ఫుటకావ్యకల్పకకవిన్ సంకీర్తనాచార్యపు
త్రీవంశోత్తము నందవైదికబుధాదిప్రోక్తవృత్తిప్రియుం
భావుకా దిర్మల కొండయార్యసుతు శుంభద్వేంకటాభిఖ్యునిన్.

క. పిలువంబంచి యెదుర్కొని । మిలమిల వలఘుప్రభానమిద్ధాస్థాన
స్థలిఁ జాఁగిలి మ్రొక్కి వటీ కలితసుఖాసీనుఁజేసి కలకల నగుచున్.

చ. కనుఁగొని చండికాభిసుముఖప్రదనందవరాగ్రహారపా
వన ఘన పెద్దిభట్టకులవార్ధిసుధాకర నీవు శ్రీసవా
సుసి యలమేలుమంగకృపఁ జొక్కిన దిక్కరి వాంధ్రభూమిరా
డ్వినుతసభాస్థలీవననవీనపికంబవు కాకలీకృతిన్.

శా. సల్లాలిత్యభవత్కవిత్వఘటిమాసందర్భవైదర్భికా
సల్లాపంబులు మామకీనసుకులస్వామీంద్ర కీలాద్రి రా

ణ్మల్లేశుండును మెచ్చ నొక్కకృతి నిర్మాణంబు గావింపుమా
నుల్లీఫుల్లసమోల్లసన్మధురఝరీమాధుర్యకౌదార్యతన్.

మ. అని హేమాంబరరత్నభూషణసుగంధాలంకృతుం జేసి స
ద్ఘనసారస్ఫుటవీటికాదు లొసఁగన్ గైకొంచు వాణీవధూ
వనజాతాంఘ్రిఘులద్ఘలన్నటనజిహ్వాస్థానవాగ్గోస్తనీ
జనితానందమరందకందళనదీజంఘాలవేలాస్యుఁడై.

వ. అమ్మహాకవివరుండును దదీయవంశావతారసర్ణయావర్ణనానుపూర్వంబుగాఁ దత్ప్రబంధబంధురానల్పకల్పనంబొనరించి తత్సముచితకృతికన్యాకరణంబునకు నవకరణంబుగా నుపకరణంబగు నొక్కకరణంబు కృతజ్ఞుండై విఘంబుచేసిన......శ్రీ వేంకటరమణునకు......దండప్రణామ పుష్పాంజలి ప్రపూర్ణ భర సమర్పణంబుగా సమర్పించెద.

ఇంత చెప్పినవాఁడు కశ్చిత్ప్రభుండనక యాప్రభుఁ డెవ్వఁడో పేర్కొనియుండిన పక్షమునఁ గవికాలనిర్ణయమున కనుకూలపడియుండు నేమో! అయినను కవి తన శకుంతలాపరిణయమునందుఁ జేసిన యీకవి వర్ణనమునుబట్టి యితఁ డాధునికుఁడగుట స్పష్టమగుచున్నది—

మ. పరఁగన్ భారతకల్పనారతులు శబ్దస్ఫూర్తి సంధింప ని
ర్భరవృత్తిన్ బరమేశపోతఘను లాలంకారము ల్గూర్పఁ జూ
పరులై నట్టి పితామహాద్యులు నుతు ల్పాటింప నర్తించు నీ
సరసాంధ్రోక్తివధూటి కేను సుమనస్సంపూర్తి గావించెదన్.

ఈ కవి నూఱు నూటయేఁబదిసంవత్సరములక్రిందట నుండియుండ వచ్చును. ఇతఁడు శబ్దాలంకారములనిమిత్త మమితముగాఁ బాటుపడి గ్రంథమునందు వ్యాకరణదుష్టములైన ప్రయోగముల ననేకములను జేసి యున్నాఁడు. వసుచరిత్రములోని కల్పనలనుబోలిన కల్పనల ననేకములఁ జేసినను మొత్తముమీఁద నీతని కవిత్వము శబ్దాలంకార భూయిష్ఠమయి హృద్యముగా నున్నది. ఇతఁడు తాను రామచంద్రోపాఖ్యానమను మఱి

యొకగ్రంధమును జేసినట్లు చెప్పుకొనెనుగాని యాగ్రంథము దొరకలేదు. ఈతని కవితారీతిని జూపుటకయి శకుంతలాపరిణయములోని కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. సింగము లెన్న వీరలకు సిద్ధముగా మొలబంటి మత్తమా
తంగశిర స్తటంబులు పదంపడి బొమ్మలబంటి యంచు సా
రంగచయంబు లెల్లను సరాసరిగా నెదిరింపలేక మా
వంగడపున్వ్యఘ్రామణుల వాలికచూపులకున్ భయంపడున్. ఆ. ౧.

ఉ. శ్రేణులుగట్టి మానిజనశీర్ష జటాచ్ఛట లుద్గమింప న
క్షీణవిరాగయోగములు చెందును బల్లవరాజకోటికిన్
స్థాణులకున్ సరాగగుణసారతరాంకురలబ్ధి గల్గు పూ
బోణులమేని వాసనలు పొర్లినమాత్రఁ దదాశ్రమంబునన్. ఆ. ౨.

ఉ. వారనిప్రేమ నేగి రటు వా రనిశన్ విని మారునిద్దపున్
వారుచు మొనయఁ క్కలికి వారు వసంబునకున్ ఫలంబుల
వ్వారిగఁ దేరఁగాఁ జనిరి వారిఁ గనుంగొను గారవంబునన్
మీర రరుదేరఁగాఁ దెలిసి మీఱరు వారిటవత్తు రింతకున్. ఆ. 3.

---

67. పోచిరాజు వీరన్న

ఈ కవి తాను కృష్ణార్జున సంవాదము, పంచకావ్యములు, విభూతిమహాత్మ్యము, మార్కండేయ చరితము, మనువంశపురాణము, ముక్తిదేవుకథ, ఆనందలహరి, సౌందర్యలహరి, సుభాషితము, అను గ్రంథములను రచియించినట్లు భల్లాణచరిత్రమున నీ క్రింది పద్యములలోఁ జెప్పికొన్నాఁడు—

సీ. పదునాలు గగునేట మొదటఁ గృష్ణార్జున
సంవాదము ప్రబంధసరణియయ్యెఁ
బదు నెన్మిదగునేటఁ బంచకావ్యము లాంధ్ర
పద్యకావ్యములుగాఁ బరిఢవిల్లె
నిరువది రెండగునేట విభూతిమా
హాత్మ్యంబు ద్విపదకావ్యముగ నొప్పె
నిరువదియాఱగునేట మార్కండేయు
చరితంబు రచితమై సంఘటిల్లె
ముప్పదగునేట మనువంశ ముఖ్యనృపపు
రాణము ప్రకల్పితంబయి ప్రకటమయ్యె
ముప్పదాఱగునేట శ్రీముక్తదేవు
కథ కథితమయ్యె నాచేతఁ గౌశలమున.

గీ. సంస్కృతంబై శంకరాచార్య విరచి
తంబు లానందలహరి సౌందర్యలహరి
భర్తృహరికృతమైన సుభాషితమును
శతకములుగాఁగ మత్ప్రకల్పితములయ్యె.

ఇందుఁ బేర్కొనఁబడినవానిలో నీపుస్తకముగాక మాకు మను వంశపురాణ మొక్కటిమాత్రము లభించినది. భల్లాణచరిత్రమును గవి బందరుపురములో నుండిన చిత్రకార (ముచ్చి) కులస్థుఁడయిన దాము ముగ్గన్న కంకితముచేసెను. బందరుపురమును చిత్రకారకులమును వర్ణించిన పద్యముల రెంటి నిందుఁ బొందుపఱిచెదను.

సీ. శ్రీకంఠవైకుంఠసేవావికుంఠ వందారుమందిరము బందారుపురము
నిరతోత్సవైశ్వర్యనికరాభిభూత బృందారకపురము బందారుపురము
సంతతాయాత యాచకజనవ్రాత మందారభాసురము బందారుపురము
సకలవర్ణాశ్రమాచార సంపత్యమందారతిభరము బందారుపురము

శిల్పివర్తక వర్తక చిత్రకార । సూత్రకారాదివివిధవిచిత్రకృత్య
దానధర్మపరప్రజోత్కరచకోర । కారవిందారికరము బృందారపురము.

ఉ. ఆపురి నుంద్రు దాముకులజాఢ్యులు మాక్తికసంప్రదాయులు
ద్దీపితకీర్తిరేఖలు రతిధిప్రియశీలురు శూలిపాదపూ
జాపరతంత్రమంత్రగుణశాలు లఘూటవికీలు లర్హా ధ
ర్మోపకృతిస్వభావమతియుక్తులు చిత్రవిధానశక్తులున్.

మనువంశపురాణము బెజవాడ మల్లేశ్వరస్వామి కంకితము చేయఁబడినది. దీనికి ఖండకపాలాఖ్యానమని నామాంతరము. కవి నియోగి బ్రాహ్మణుఁడు; తండ్రి వీరభద్రుఁడు; తల్లి మూర్తిమాంబ; నివాసస్థలము కృష్ణామండలములోని కొలకలూరు. ఇతఁడు కౌండిన్యగోత్రుఁడు. ఇతఁడు నూఱుసంవత్సరముల క్రిందటివాఁడయి యుండవచ్చును. ఈతనికవనధోరణి యీ క్రింది పద్యములవలనఁ దెలిసికోనచ్చును—

భల్లాణ చరిత్రము.

చ. కలువలసొంపు దాఱె భుజగంబులు పుట్టల దూఱెఁ దారకా
వళి రుచి జాఱెఁ జక్కవలవంతలు దీఱెఁ జకోరకవ్రజం
బులసుఖ మాఱె దమ్ములకు మోదము లూరె నిశాకరద్యుతుల్
వెలవెలఁబాఱెఁ దూర్పుదెస వెల్లడిగాఁ దెలవాఱె నయ్యెడన్. ఆ-౧

ఉ. ఇంటికిఁ దోడితెచ్చి యవనీశ్వరుఁ డప్పిటకూపుఁ డైనము
క్కంటిని బీతసంగతునిగా నొనరించి సపర్యసల్పి నే
జంటకు మాఱుగా దలఁచి జాజులు నించినసెజ్జఁ జేర్చి వా
ల్గంటినిజూచి పల్కెఁ గుతుకంబు మనంబునఁ దొంగలింపఁగన్. ఆ-౩

మనువంశపురాణము.

మ. ఖల! దుష్టాత్మ! మనుప్రభూత! బుధధిక్కారంబుఁ గావించి తీ
విల నీయన్వయ మింతనుండి వసుధాధీశత్వనిర్ముక్తమై

తిలఘాతవ్యవహారలక్షణముత్తో దీనత్వముం బూని సి
ష్కళమై యుండెడుఁగాత సర్వజనము లర్థింపహైన్యంబునన్. ఆ-౩

శా. భూనాథోత్తమ! మేదినీసురధనంబు ల్గోరఁగాఁ గూడ దీ
ధేనూత్తంసము యజ్ఞకార్యమున కాదిద్రవ్యమౌఁ గావునన్
దీనిం బట్టఁగరాదు మీ రఖిలధాత్రీపాలకుల్ ధర్మని
ష్ఠానైపుణ్యులు మీ రెఱుంగనికథాసంఘుం బిలం గల్గునే. ఆ-౪

---

68. అయ్యలరాజు నారాయణకవి

ఈకవి హంసవింశతికథల నయిదాశ్వాసముల పద్యకావ్యముగా రచియించెను. హంసవింశతియందు రెట్టమతమును రచియించిన కవు లీపద్యమునఁ జేర్కొనఁబడియున్నారు—

ఉ. అయ్యలరాజుఁ దిప్పసచివాగ్రణిఁ బర్వతరాజు రామభ
ద్రయ్యను భాస్కరాగ్రణిఁ బ్రధానవరుం డగుకొండధీరునిన్
జయ్యనఁ దిమ్మయప్రభుని సత్కవితారచనాఢ్యులైన మా
యయ్యలరాజువంశజుల నాదికవీంద్రుల సన్నుతించెదన్.

౧౭౫౯వ సంవత్సరమునందుండిన కవులను జేర్కొనియుండుటచేత నితఁడాకాలమునకుఁ దరువాత నుండినవాఁ డనుట స్పష్టము. ఇతఁ డిప్పటికి నూఱుసంవత్సరముల క్రిందట ౧౮౦౦ద సంవత్సరప్రాంతములయం దుండియుండును. పైపద్యమునఁ జేర్కొనఁబడిన యయ్యలరాజవంశజు లయినకవులలోఁ బర్వతరాజును గొండయ్యయుఁ దిమ్మయ్యయుఁ జేసిన గ్రంథము లేవియో తెలియరావు. ఈకవితండ్రి సూరనార్యుఁడు; తల్లి కొండమాంబ; గోత్రము కౌండిన్యసగోత్రము. ఈతనికవిత్వములో లక్షణవిరుద్ధము లయిన ప్రయోగము లనేకములు గలవుగాని మొత్తముమీఁదఁ

గవిత్వము ప్రౌఢమయి రసవంత మయినదిగా నున్నది. ఈపుస్తకమునం దన్యదేశ్యము లనేకములు వాడఁబడియున్నవి. ఈతఁ డాయాజాతులవారిని వర్ణించవలసివచ్చినప్పుడు మిక్కిలి కష్టపడి వారివారికుచితము లయిన యుపకరణాదులనామముల నన్నిటిని సంగ్రహించి వివరించియున్నాఁడు. ఈకథయొక్క ముఖ్యోద్దేశము

ఉ. మున్నలరావణాదుల సముద్ధతి సాధ్వులఁగోరి సోమిసౌ
ఖ్యోన్నతిఁ జెంది రట్లుగుట నుర్వ జనావళు లన్యకాంతలకా
బన్నుగఁ గోరరాదు కడుఁబాతక మంచుఁ దలంచి యింతిపై
నున్నమనంబు ద్రిక్కోని యుధోచితపద్ధతి నుండె భూవరా.

అన్న శ్లోకపురుషునిమనస్సు నన్యకాంతనుండి విముఖముచేయుటయే యయినను, పుస్తకమునిండ అంకుపోయి బొంకాడి తప్పించుకొన్న యుపాయములే వర్ణింపఁబడియుండుటచేత నిది దుర్నీతిబోధకమయి నీతిపరులకుఁ బఠనయోగ్యము కాసదయియున్నది. ఈపుస్తకమునుండి కొన్ని పద్యము లిందుదాహరింపఁబడుచున్నవి—

శా. పన్నీట న్నయనంబు లొత్తెఁ దనువుం బాటీరపంకంబుతోఁ
జెన్నారం బద నిచ్చి గీటి సిగ వేసెం దాయెతు ల్సొట్టె జీకా
సొన్నాపట్టెరుమాలు గట్టె జలతారుప్పట్టంచుడాల్మించు మేల్
మిన్నాసన్నపుదుప్పటంబు వగపాళిం గప్పెసొంపారఁగన్. ఆ-౧

చ. కమటము కట్లసంచి యొరగల్లును గత్తెర సుత్తె చీరముల్
ధమనియు శ్రావణంబు మొలత్రాసును బట్టెడ నీరుకారు శా
ణము పటుకారు మూస బలునాణెపరీక్షలమచ్చు నాదిగా
నమరఁగ భద్రకారకసమాహ్వయుఁ డొక్కరుఁడుండునప్పురిన్. ఆ-౨

శా. పున్నాగంబును గెల్వఁజాలు రుచిరాంభోజాస్యవేణీరుచుల్
పున్నాగంబును నవ్వనోపు నెఱయన్ లోలాక్షియానంబులుం

బున్నాగంబును గేరిమీఱి మెఱయుం బూఁబోఁడినూగారుడాల్
పున్నాగంబును మించు నాభిచెలువంబున్ సారెవర్ణింపఁగన్. ఆ.3

మ. చతురోపాయనమర్థుఁ డప్రతికళాచాతుర్యధుర్యుండు వి
శ్రుతశాస్త్రజ్ఞుఁడు రాజనీతిపదదక్షుం డింగితజ్ఞానుఁ డ
ద్భుతశక్తిత్రయపారగుండు గుణసంపూర్ణప్రభావుండు సం
తతభూపాదరణీయుఁడొక్కరుఁడమాత్యశ్రేష్ఠుఁ డుండుం బురిన్. ఆ.౨

---

69. వెణుతుర్ల వడ్డికవి

ఇతఁడు శృంగారరసాలవాల మనుపేరుగల మూఁడాశ్వాసముల యలంకారశాస్త్రమును రచియించెను. ఇతఁడు ప్రథమశాఖ బ్రాహ్మణుఁడయినట్టును రామభక్తుఁడయినట్లును శృంగారరసాలవాలములోని యీ క్రింది పద్యమువలనఁ దెలియవచ్చుచున్నది—

ఉ. శ్రీరఘువీరభక్తిరససింధువిహారుఁడ శుక్లయాజుషా
చారుఁడ దేశికాంఘ్రిపరిచారుఁడ నే వెణుతుర్లవంశవి
స్తారుఁడ వడ్డినామ కవిసత్తముఁడన్ రఘువర్యుపేర శృం
గారరసాలవాల మను కావ్య మొనర్తు జగద్ధితంబుగన్.

ఈ కవి కౌండిన్యసగోత్రుఁడు; వేంగనార్యపౌత్రుఁడు; మంగళగిరి పుత్రుఁడు. ఈతని కాలమేమో తెలియరాలేదుగాని కవిత్వము రసవంతమయినదిగాఁ గనుపట్టుచున్నది. శృంగారరసాలవాలములోని పద్యముల రెంటి నిందుఁ జూపుచున్నాను—

ఉ. కుందనముల్ హసింపఁగలకోమలి కోమలదేహవల్లి పెఁ
గందళితంబు లయ్యె సితకాంతులు సంతత మమ్మొకుందు నిం
పొంద మనంబులోన నిడియున్న మనోభవుఁడందు నాతనిన్
గ్రందుగనేయు పుష్పశరగాఢరుచుల్వాయిఁ దోఁచెనో యనన్. ఆ.౧

ఉ. ఆఁకలు బాన లిచ్చి కపటాత్మనఖు ల్పొదరిల్లు చేరగాఁ
దీసిన నందు నిందుముఖి తెల్లమిగా హరి లేమిఁజూచి వి
శ్వాసముతోడఁ తి న్మరలివచ్చునెడన్ మరలింప దచ్చటన్
భాసిలు చంచరీకములబారు గనుంగొను దృష్టిపెంపునన్. ఆ. 3.

---

70. కొత్తలంక మృత్యుంజయుఁడు

ఈకవి బృహన్నారదీయము, ధరాత్మజాపరిణయము, నిరోష్ఠ్యనల చరిత్ర, అనుపద్యకావ్యములను రచియించెను. ఇతఁడు శివబ్రాహ్మణుఁడు. శివాలయములలో నర్చకులుగానుండెడి యాతెగబ్రాహ్మణుల నీప్రాంతము లయందు శివలబ్రాహ్మణని వాడుదురు. ఈతని నివాసస్థలము గోదావరీ మండలములోఁ గౌశికీతీరమందున్న కొమరగిరిగ్రామము. ఈకవి బోధాయనసూత్రుఁడు; భారద్వాజగోత్రుఁడు; విశ్వనాథపుత్రుఁడు. ఈతఁడించు మించుగా నూఱుసంవత్సరములక్రిందట నుండినవాఁడు. ఈతని మునిమనుమ లిప్పటికిని గోడి యను గ్రామములో జీవించియున్నట్టు వినుచున్నాము. ఈతని కవిత్వము హృద్యమయి సలక్షణముగా నుండును. ఇతఁడు రచియించిన పుస్తకములలో బృహన్నారదీయపురాణ మారాశ్వాసముల గ్రంథము; ధరాత్మజాపరిణయము నాలుగాశ్వాసములద్వ్యర్థి కావ్యము; నిరోష్ఠ్య నలచరిత్ర మైదాశ్వాసముల చిత్రకావ్యము. ఈ కావ్యములలో ధరాత్మజాపరిణయమును కవి తన కాశ్రయుఁడైన యల్లూరి యప్పలరాజనుక్షత్రియుఁడు రచియించిన ట్లవతారికలోఁ

ఉ. ఎల్లజగంబులం గరుణ నేలెడువేలుపు నిందిరామనో
వల్లభు నాశ్రయించి యనవద్యశదీయకృపావిభూతి భూ
వల్లభసత్సభావిబుధవర్ణ్యకవిత్వనిరూఢిఁగన్న శ్రీ
యల్లురి వంశసంభవుఁడ నప్పనృపాలక నామధేయుఁడన్.

ఇత్యాదిపద్యములచేఁ జెప్పినను, ఆశ్వాసాంత గద్యమునఁదనపేరే వేసికొనియున్నాఁడు. ఈప్రాంతములయందలి క్షత్రియులు సామాన్యముగాఁ దాము మాధవవర్మసంతతివారమని చెప్పుకొనునట్లే యీయల్లూరివారును మాధవవర్మసంతతివారే యయినట్లు ధరాత్మజాపరిణయమునందు వంశకర్తగా మాధవవర్మ యిట్లు వర్ణింపఁబడెను—

ఉ. మాధవవర్మ నాఁగ నొకమానవభర్త జనించి విస్ఫుర
ద్బోధసమగ్రుఁడై కనకదుర్గను శ్రీజయవాటికాపురీ
సౌధవిహారిణిం గొలిచి చక్కఁగ దత్కరుణారసంబుచే
సీధర హేమవృష్టిఁ గురియించె నతిస్థిరకీర్తి మీఱఁగన్

కవినిగూర్చి వ్రాయఁదగిన విశేషము లంతగాఁ దెలియనందున, పూర్వోక్తగ్రంథములనుండి కొన్నిపద్యముల నుదాహరించి విరమించుచున్నాము—

బృహన్నారదీయము.

చ. హృదయమున న్వివేక మొకయించుక లేనిదురాత్మునింటిసం
పదలు శరన్నదీజలముభంగి నశించు ననూయ యాత్మలోఁ
బొదలినవానిసంపదలు పోఁడిమి దక్కును మారుతంబుతోఁ
గదియుతుషానలంబుక్రియఁ గంజభవాత్మజ యాలకింపవే. ఆ. ౨.

ఉ. ధ్యానవిహీనుఁ డయ్యు ననయంబు జితేంద్రియవర్గుఁ డయ్యెనా
యానరుఁ డెన్నఁడుం జెడనియట్టిపదంబున నుండు నిశ్చల
ధ్యానసమేతుఁ డింద్రియజయుం బొకయించుక లేకయుఁన్నఁ ద
ద్ధ్యానము నిష్ఫలం బగు నతండును మూఢుఁ డనం బ్రవర్తిలున్.ఆ.౧

ధరాత్మజాపరిణయము.

ఉ. అనఘ వసిష్ఠనారదముఖు లవ్విబుధౌఘముఁ గూడి యమ్మహా
వనివిభుఁ బూర్ణభూతిభవు వర్ణితతేజునిఁ జూచు వేడుకం

జని విలసిల్లుతద్వీపులసంజనితప్రమదాన్వితాధికా
ననసుషమం గనుంగొని మనంబున నుబ్బుచుఁ బల్కె రీగతిన్. ఆ. ౨

ఉ. ఆగ్రహబుద్ధిచేత విషయంబు లశేషముగా జయించి లో
కాగ్రియభావభాసురగతి యోగవిహింపకుఁడై తనర్చు న
య్యుగ్రునిమీఁద శాతశర మొక్కటి వేయఁగ సమ్మతింపుమా
నిగ్రహభూతవైరిగణ నీవగు పట్టికార్యసిద్ధికిన్. ఆ. ౩.

ఉ. అచ్చట నచ్చట న్వెలయునచ్చపుఁబచ్చలతోరణంబులన్
రచ్చల హెచ్చులై నెలరాలయరంగులరంగుల న్సదా
లచ్చికి నాటప ట్టయినలచ్చనము ల్పరికించి చూచుచో
నొచ్చెము లేనియచ్చెరువు నొందఁగఁజేసెఁ బురంబువారికిన్. ఆ-౪

నిరోష్ఠ్య నలచరిత్ర.

ఉ. అల్లలితాంగి చంచలకటాక్షనిశాతశరాళి నేయఁగాఁ
గల్లరి యైనచిత్తజుసిగాసిఁ దలంకిరిఁ ద్రాసరీతి సం
ధిల్లఁగఁ గీరసంతతికి దీనత గాంచితి రాకరాకకే
జల్లని తల్లడిల్లితిని జల్లనిగాలికి సంచలించితిన్. ఆ. ౨.

ఉ. చంచలరీతిగా నధికచంచలతం గనిపట్టియుండిరా
చంచలనేత్ర నెల్లెడ నచంచలఁగా నెసఁడం దలంచి యా
చించినయర్థిరాజి నిరసించిననిగ్రితకీర్తి కెంత చిం
తించిన నక్కటా తగిననిష్కృతి కల్గఁగ నేరదే గదా. ఆ. ౩.

చ. అలిగినయాత్తఁడం గలఁక నందక సారిదయానిరీక్షచే
నలరఁగఁ జేసినత్తఁడె నహంకృతిఁ జెందక ధాత్రిరీతి ని
శ్చలత నిజేశసన్నిధిని సంతతహర్షనిశాంతచిత్తయై
చెలఁగెడికన్య ధన్యగతిచే నలరాడెడి సారసాననా. ఆ. ౫.

అంతర్వేది నృసింహస్వామి కంకితము చేయఁబడిన యీనిరోష్ఠ్య
నలచరిత్రము కొన్ని వ్రాఁత ప్రతులలో—

"ఇది శ్రీమద్భవానీశ్వర శాశ్వత కృపాపాత్ర క్రొత్తలంక విశ్వనాథ పండితపుత్ర సకలసుకవి జనానుగ్రహసహాయ మృత్యుంజయనామ ధేయప్రణీతంబైన నలరాజచరిత్రము"

అను గద్యమునకు మాఱుగా

"ఇది శ్రీమదంతర్వేది లక్ష్మీనృసింహస్వామి చరణారవిందైక రుద్ర రాజాన్వయాభరణ ధనంజయగోత్రపవిత్ర కూనన్నృపాలపుత్ర నిరర్గళ కవితావిలాస సంతోషితాశేష విద్వత్కవిరాజ తిరుమలరాజ ప్రణీతంబైన నలరాజచరిత్రము"

అను గద్యము కానఁబడుచున్నది. మృత్యుంజయకవి యీగ్రంథ మునకుఁ గర్తృత్వమును ధనస్వీకారముచేత రుద్రరాజు తిరుమల రాజునం దారోపించి యుండును.

---

71. తిరుమలబుక్కపట్టణపు వేంకటాచార్యుఁడు

ధరాత్మజాపరిణయ మనుపేర మృత్యుంజయకవి రచించిన ప్రబంధమువంటి దానినే యీకవి "యచలాత్మజాపరిణయము" అను నామము గల మూఁడాశ్వాసముల ద్వ్యర్థిప్రబంధము నొకదానిని రచియించి యున్నాఁడు. ధరాత్మజాపరిణయముకంటె నచలాత్మజాపరిణయము ప్రౌఢతరముగా నున్నది. ఈగ్రంథకర్త మిక్కిలి సమర్థుఁడు. ఇతఁ డాశ్వాసాంత గద్యమునందుఁ దన్నుఁగూర్చి యిట్లు వ్రాసికొనియున్నాఁడు—

"ఇది సర్వతంత్ర స్వతంత్ర సకలభాషావిశేష కవితాధురంధర ప్రతినవప్రబంధపరమేశ్వర శ్లేషయమక చక్రవర్తిబిరుదాంక తిరుమల బుక్కపట్టణ శ్రీనివాస తాతాచార్యతనయ శ్రీమదణ్ణయాచార్య దీక్షితసుత పితృవ్య శ్రీనివాసాచార్య కృపాకటాక్షలబ్ధ

సకలపాండిత్య తర్కాలంకార వాగీశ్వర బిరుదాంక వేంకటా
చార్య ప్రణీతంబైన యచలాత్మజాపరిణయము."

ఈ వైష్ణవకవిగ్రామణి యేకాలపువాఁడో తెలియరాలేదుగాని మిక్కిలి యాధునికుఁడుకాఁడని తోఁచుచున్నది. అచలాత్మజా పరిణయములోని రెండు పద్యము లిందుక్రిందఁ బొందుపఱుపఁబడుచున్నవి—

ఉ. చల్లనివాఁడు పాదములచాయలఁ జేరిన నెల్లవారికిన్
గొల్లలుగాఁగ నూర్మికలుఁ గొబ్బున హంసకకంకణంబులున్
జల్లెడువాఁడు వాహినులసంఘటనం బ్రతికూలవర్తన
తుల్లకభూమిభృత్కులముఁ గ్రుంగఁగఁజేయునతండు మేదినిన్. ఆ-౧

ఉ. రాజకుమారశేఖరుఁడు రమ్యత నందిపయి న్వినోదమున్
రాజిల నార్యసంగతి యనంతసుఖాశ్రయ మంచు నెంచుచున్
దాఁ జనుదెంచెఁ దాపసహితస్థితి నవ్వల నివ్వల న్వసీ
రాజుల నుల్లసిల్లుమృగరాజులు తన్గని విస్మయింపఁగన్. ఆ-3.

72. కటికనేని రామయకవి

కువలయానందమని సాధారణముగా వాడఁబడెడి యలంకార శాస్త్రమును కువలయానందప్రకాశ మనుపేరితోఁ దెనిఁగించిన యీకవి చెలుకునూళ్ళగోత్రుఁడు; సూరనకును బుచ్చమకును బుత్రుఁడు. కవి తనది పద్మనాయకకులమగుట యీక్రిందిపద్యముచే నిట్లుచెప్పియున్నాఁడు.

సీ. సకలజగజ్జనస్వర్గసోపానోర్మిగంగ యెచ్చట సీఘ్రగతి జనించె
పతిశాపజాశ్మతాపతితసతీశుద్ధభావకృద్రజ మెందుఁ బరిఢవిల్లె
సనకాదినిఖలసన్మునిమనఃప్రకరములన్మధుకరంబులమాడ్కి మలయు నెచట
బలిబంధనోత్క్షేపకలితాబ్జజాండరోచులు కేసరాభ నెచ్చోటఁ గనియె
నట్టి నారాయణాంఘ్రిపద్మాంతరమునఁ
బుట్టినట్టి కులంబులఁ బూర్ణమహిమ

నాయకత్వముఁ గనుటచే నవ్యగరిమఁ
బ్రకటమయ్యెను పద్మనాయకకులంబు.

ఈ కవి గాలమేదో యెక్కడనుండినవాఁడో తెలియరాలేదు. ఆతఁడు నూఱు నూటయేఁబదియేండ్లక్రిందట నుండియుండవచ్చును—

గీ. సరసుఁ డకలంకవంశాబ్ధిచంద్రుఁ డనఘుఁ
డైన రంగార్యవర్య సాహాయ్యమునను
కువలయానంద మిలను దెన్గున రచింపఁ
గడఁగితిని మష్కరంబైన కార్యమునకు.

అను పద్యమువలనఁ గవి తానీగ్రంథమును రంగార్యుని తోడ్పాటుచేత రచించినట్లు చెప్పుకొనియున్నాఁడు. కవిత్వనైపుణి తెలియుటకయి కువలయానందప్రకాశముయొక్క మూఁడుఘట్టముల నుండియు మూఁడు పద్యము లిందుక్రింద నుదాహరింపఁబడుచున్నవి—

చ. అబలలయందుఁ గాంచనమునందు భ్రమి న్విధి కల్గఁజేసె నా
యబలలయందుఁ గాంచనమునందును భ్రాంతి దొలంగి నిష్ఠచేఁ
బ్రబలినవాఁడు చూడఁగ నరాకృతిఁ దాల్చి చెలంగుచున్నయ
న్నిబిడపరాక్రమక్రమవినిద్రుఁడు కేవలరుద్రుఁడే ధరన్. ఘ ౧.

చ. ధనికులమోము గన్గొనవు దబ్బఱ లాడవు వారి గర్వపు
ర్వినయవచస్తతు ల్వినవు వేమఱు వారల డాయఁబోవు క్ర
న్ననఁదిసెదిచ్చ నూతనతృణంబుల నిద్దురరాఁగ నిద్దురం
గొనియెద వెందు నేమి వ్రతగోష్ఠిని జల్పితొ తెల్పు మేణమా. ఘ-౨

చ. ధృతిని మధువ్రతంబులు నిజేష్టమధుప్రదమైన పద్మసం
తతి ముకుళింపఁజేసె వెసఁదా నిశఁ డంచుఁ దలంచి పంకజా
హింతతబింబముల్ బలిమి నేర్చి వడిం గడు నాక్రమించి యుం
చితముగ మేన వంకమునుచేసె నిజం బిది యెన్నిభంగులన్. ఘ-3.

73. కొండమడుగు పురుషోత్తమకవి

ఈ కవి సానందగణేశ్వర మను మూడాశ్వాసముల గ్రంథమును రచించెను. పుస్తకము దీబగుంట వీరేశ్వరస్వామి కంకితము చేయఁబడినను, కవి తన గ్రంథమును కుంజేటి బుచ్చయ్య యను కోమటియొక్క ప్రార్థన మీఁద రచియించి యందుఁ గోమటి నీవిధముగా వర్ణించెను—

శా. సాలంకాయనమౌని పూర్వమున భాస్వద్దివ్యతేజోధనుం
డాలీలానిధివంశసంభవులలో నత్యుజ్జ్వలోదారవా
గ్జాలు రన్యత్యధనుల్ కుబేరసదృశుల్ సౌభాగ్యభాగ్యోదయుల్
మే లింపొందిన వైశ్యవర్ధనులు గాంభీర్యామితౌదార్యులున్.

కవి నియోగిబ్రాహ్మణుఁడు; భారద్వాజగోత్రుఁడు; గిరియప్ప నందనుఁడు. కవి తన కయ్యలూరు మొదలయిన యగ్రహారము లుండి నట్టు వ్రాసికొనియున్నాఁడు. ఈతని కాలము సరిగా తెలియదు. నూఱు సంవత్సరముల క్రిందటివాఁడయి యుండును. సానందగణేశ్వరములోని రెండుపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి.

ఉ. ఇంటికి నేగుదెంచి తనయింతిని గాంచి ప్రపంచవృత్తిగై
కొంటకుఁ బూంచి రత్నరుచికుండలమండితగండ యోనవా
ల్గంటికి శంభుఁ డిచ్చినవరంబు కరం బనురక్తిఁ దెల్పిక
న్గొంటి భయంబుఁ దక్కు మికఁ గోమలికామునిలీలనేలెదన్. ఆ. ౧

ఉ. మానము లెత్తులం గడిమి మ్రింగుచు గాలములందు డిందు నెం
దేని పరాంగనారతికి దీకొని నేమి టులైతి మింతె కా
దా నలినాయతేక్షణలయబ్రపుగుబ్బల గోరు లుంచఁగా
సోనగ నల్లవారినుపసూదుల గ్రుచ్చిరి మచ్చరంబునన్. ఆ. 3.

74. నాగులూరి శేషనారాధ్యుఁడు.

ఈకవి శ్రీపర్వతపురాణమనెడి యాఱాశ్వాసముల గ్రంథమును రచియించెను. ఈపుస్తకమునకు శ్రీశైలమాహాత్మ్యమని నామాంతరము గలదు. ఇతఁడు గ్రంథాదిని తెలుఁగు నిట్లు పొగడియున్నాఁడు—

చ. జనని సమస్తభాషలకు సంస్కృతభాష ధరాతలంబునం
ఘనలలితార్థగౌరవవికాసి తెనుం గభిరమ్య మంతకున్
గనుఁగొనఁ జాతబీజమునకంటెను గోమల పత్రపుష్పశో
భనమృదుపల్లవాభినవబాలరసాలము సొంపు నింపదే.

ఆధునికుఁడే యయినను గవి యేకాలమునం దుండినవాఁడో సరిగా తెలియదు. ఇతఁడు నూటయేఁబదిసంవత్సరములక్రిందట నుండియుండ వచ్చును. ఈతనికవిత్వము సరసమయినది. శైలిని జూపుటకయి శ్రీపర్వతపురాణమునుండి రెండుపద్యముల నిందుదాహరించుచున్నాను—

ఉ. శ్రీనగకంధరంబున వసించి చరించుపుళిందబృందముల్
భూనుతభోగమోక్షములఁ బొందఁగఁ జూచి నిలింపసంఘముల్
శ్రీసలమాభిరామ మగుశ్రీగిరిమీఁదఁ జరింతు రిట్ల య
మ్మానితనాకసౌఖ్యమహిమంబుల నెల్లఁ దృణీకరింపుచున్. ఆ. 3.

శా. పాటింపందగు ముజ్జగంబులఁ బునర్భవత్వ్యర్థి జూటాటవీ
కోటీకోటరపావనామరధునీఘూర్ణోత్తరంగావళీ
వ్యాటీకాయతవేణికానికరసమ్యక్ప్రాప్త్యశోయచ్ఛటా
చాటుత్వంబు వహించుశ్రీనగముపైఁ జంచజ్జలశ్రేణికల్. ఆ 5.

75. వీణెము లక్ష్మీపతి

ఇతఁడభిమన్యు పరిణయము నెడి యైదాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు సృష్టికరణవంశజాతుఁడు. వీణెము కృష్ణరాజునకును రంగమాంబకును జనియించినవాఁడు. ఇతఁ డభిమన్యుపరిణయములోఁ దన్నుఁగూర్చి యిట్లు చెప్పుకొనుచున్నాఁడు.

ఉ. మాగధవంశసంభవుఁడ మానితవీణెకులావతంసుఁడన్
భోగబిడౌజుఁ డార్యజనపూజిత వేంకటకృష్ణరాజునన్
బాగుగ రంగమాంబకును నౌరసపుత్త్రుఁడ లక్ష్మణాఖ్యుఁడన్
శ్రీగలుగన్ రచించెదను నే నభిమన్యుచరిత్ర వేడుకన్.

ఇతఁ డెప్పు డెక్కడనున్నవాఁడో తెలియరాలేదు. దాదాపుగా నితఁడు నూఱుసంవత్సరముల క్రిందటివాఁడయి యుండును. ఈతనికవిత్వ మంత మంచిదికాదు. అందు ఛందోవ్యాకరణదోషము లనేకములు కానఁబడుచున్నవి. అభిమన్యుపరిణయములోని రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. పన్నినవీరయోధులను బాహుబలంబున నుగ్గుసేయు సం
పన్నుఁడ వార్యసత్వుఁడవు పాండవపౌత్త్రుఁడ వై ననిన్ననున్
జిన్నెల పువ్వులు న్సరులుఁ జెన్నుగఁ గూర్పను నేరనట్టియీ
కన్నియ లెట్లు నీమనసుకాంక్ష కరంగఁగఁ జేయువారలో. ఆ. ౧.

ఉ. నారదమౌనిమాట మది నమ్మితి నేఁడది కానిచందమై
దూరము నోట కానఁబడెఁ దుర్వ్యరవాదులఁ జుట్టపక్కముల్
వారును నీ రెదురొ్కనుచు వచ్చుటకిప్పుడి వేళ పోవుచు
న్నారిఁక విఘ్నము ల్గలవె నన్నిట దైవము మోసపుచ్చునే. ఆ. ౨.

76. వేమనారాధ్యుల సంగమేశ్వరారాధ్యుఁడు

శైవుఁడయిన యీకవి యహల్యాసంక్రందనవిలాసము నెడి మైదాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఒక యెత్తుగీతములో

గీ. అట్టిసాహసవిక్రమార్కాంకుఁడైన
వాసిరెడ్డ్యన్వయాంభోధివరవిధుండు
చంద్రమౌళికుమారపాలజనవిభుండు
కొలువుదీరి మహోత్సవాకుంఠగరిమ.

అని కవి వాసిరెడ్డి చంద్రమౌళిప్రభువు తన్నుఁబిలిపించి వేఁడఁగా తా నహల్యాసంక్రందనవిలాసము నారాజమౌళి కంకితము చేసినట్లు చెప్పెను. ఈవాసిరెడ్డిచంద్రమౌళి కృష్ణామండలములోని యమరావతీపురమును బరిపాలించిన కమ్మవంశజుఁడు. ఇతఁడు సుప్రసిద్ధుఁడయిన వాసిరెడ్డి వేంకటాద్రినాయని సోదరపుత్రుఁడు. ఈకవి కవిత్వము ప్రౌఢమయినదికాని యిందు వ్యాకరణదుష్టములైన ప్రయోగము లనేకములు కానఁబడుచున్నవి. ఈగ్రంథము నూఱుసంవత్సరములక్రిందట రచియింపఁబడినది. అహల్యాసంక్రందనవిలాసమునుండి రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

మ. పరకాంతారతిదోష మంచు మది సంభావింపఁడో యన్యులె
వ్వరు గన్నం దను నిందసేతు రనుభావం బెంతయుం బూనఁడో
నరుఁ డొక్కింత ధ్యైర్యమింగనేని సిలుగు ల్వాటిల్లునం చెన్నఁడో
పరమామోదమెకాని యింద్రునకుఁ బాపభ్రాంతి లే దేమియుణ్ ఆ. 3

చ. సరిసరి! నిన్నువంటి నెఱజాణలు పుట్టరె? వార లెల్ల నీ
కరణిఁ దలంతురే? చిఱుతకార్యము లిచ్చటఁ జెల్లునే? యయో
పరమపతివ్రతైనమునిభామినితో నెకసక్కె మేమి? నీ
గరిమము గానవచ్చె నిది కాదనరో వినరో బుధాగ్రణుల్. ఆ. ౫.

77. ములపాక బుచ్చన్నశాస్త్రి

ఈకవి వేంకటేశ్వరమాహాత్మ్యమును పద్యకావ్యమును రచియించెను. ఇతఁడు కోనసీమ ద్రావిడబ్రాహ్మణుఁడు. ఈబ్రాహ్మణులనే యారామద్రావిడు లనియు, పేరూరి యఱవ లనియు, వాడుదురు. వీరు మొట్టమొదట నఱవవారే యయినను చిరకాలము క్రిందటనే యీయాంధ్రదేశమునకు వచ్చి తోఁట దొడ్లను సంపాదించి యిచ్చటనే నిలిచిపోయినవారగుటచే నఱవభాషను మఱచిపోయి యించుమించుగాఁ దెనుఁగు భాషనే స్వభాషనుగాఁ జేసికొనియున్నారు. వీరు తెనుఁగున గ్రంథరచన చేయుటయే యీవిషయమును దెలుపుచున్నది. ఈకవి కోదండరాముని పుత్త్రుఁడు; భార్గవ గోత్రుఁడు; గుండ్లూరియం దుండినవాఁడు. ఇతఁడు తనపూర్వులను గూర్చియు, తన్నుఁగూర్చియు, వేంకటేశ్వరమాహాత్మ్యమునం దిట్లు చెప్పియున్నాఁడు:—

సీ. అనుపమకోనసీమాభిధాన ద్రావిడాన్వయంబునను విఖ్యాతిమీఱ
ములపాకవా రనుముఖ్యాన్వవాయులు కాశ్యప భార్గవ కౌశి కాత్రి
గోత్రజు ల్గల రందు గురుతర భార్గవగోత్ర సంజాతుఁడై కొమరుమీఱె
వేంకటపతి వాని కుంకువమీఱ వెంగాంబికయందు సుబ్బాభిధాన
విబుధవరుఁ డుద్భవించె నవ్విమలమతికి
బుచ్చమాంబికయందు సంపూర్ణచంద్ర
మండలమురీతి సత్కళామండనుండు
రహిఁ జనించెను గోదండరామవిభుఁడు.

సీ. మల్లవంశోద్భవక్ష్మాపాలపాలిత గుండ్లూరిపురి నుండు గురుయశోండ
నాంధ్రగీర్వాణభాషాష్టభాషాకవిత్వాభి నిర్మాణమహత్వవిదుఁడ,

గాళికావిశ్వేశకరుణాకటాక్షాభిభావితబహుళప్రబంధచయుఁడ
హితనాటకాంతసాహిత్యనిత్యాభ్య స్తసకలపురాణార్థసారవిదుఁడ
సాంద్రములపాక విద్వత్కవీంద్రవంశ
వార్థిచంద్రుండ సర్వసర్వంసహాభి
విశ్రుత కుకవికులగోత్రవిపులపక్ష
శాతపవియైన బుచ్చనశాస్త్రికవిని.

ఇతనికాలము తెలియదు. ఇతఁడు నూఱుసంవత్సరముల పయి వాఁడయియుండును. వేంకటేశ్వరమాహాత్మ్యమునుండి మఱి రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. సంగతిమీఱ విూచరణసారస మందు జనించినట్టి యా
గంగకు దక్షిణంబున నగాధతరం బగుదక్షిణాబ్ధికి
రంగగు నుత్తరంపుదెస రాజిలుపూర్వసముద్రపశ్చిమా
శం గన నొక్క తా వమరు సారతరోన్నతదండకాటవిన్. ఆ. ౧.

చ. గిరిజయు నీవు నెల్లపుడుఁ గిన్నర పన్నగ సిద్ధ సాధ్య భూ
సుర నరసంఘము ల్గొలువ సొంపు దలిర్పఁగ జేరి యీసరో
వరతటసీమనుండుఁ డభివర్ణన కెక్కు భవత్సమాఖ్య ని
గ్గిరియు సరోవరంబు ననఁ గేవలమోదముతో హరుం డనుఁ ఆ-౧

78. పాలవేకరి కదిరీపతి

ఈకవి శుకసప్తతియను కావ్యమును రచియించెను. ఈతని కవిత్వము హృద్యముగానే యున్నది కాని పుస్తకమంతయు దొరకలేదు. దొరకిన రెండాశ్వాసములనుబట్టి చూడఁగా నితఁడు ప్రౌఢకవి యగుటకు సందేహ మగపడదు. "ఇది శ్రీమత్కదిరీ నృసింహ కరుణాకటాక్ష వీక్షణ సమాగత కవితాధార పాలవేకరికుల కలశాంభోనిధి సుధాకర తాడిగోళ్ళ కరియమాణిక్య నృపహార్యక్షపౌత్ర పవిత్రచరిత్ర కదిరిధరామండలాఖండ పుత్ర విద్వత్కవిరకాను సంధాయక కదిరీపతినాయక ప్రణీతంబైన" ఇత్యాది గద్యమునుబట్టి చూడఁగా కవి నాయకకుంజుఁడయినట్టును, కరియమాణిక్యనృపపౌత్రుఁ డయినట్టును కదిరిరాజపుత్రుఁ డయినట్టును దెలియవచ్చుచున్నది. కవి నెల్లూరిమండలములోనివాఁడు. ఇతఁడు తనగ్రంథమును శ్రీరామాంకితము చేసెను. ఈతనికాల మేదో తెలియరాలేదు గాని యితఁ డాధునికుఁ డగుటకు సందేహములేదు. శుకసప్తతినుండి రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. అలజయకేతనుండు రుచిరాంగతిరస్కృతమీనకేతనుం
డెలమి మదిం దలిర్ప దయ నేలికయుం దలిదండ్రు లయ్యెడన్
దలఁచినకార్యభాగ ముచితజ్ఞులచే విని నీతికార్యవ
ర్తు లగునియోగపుంగవులతోడ రహస్య మొనర్చి యిట్లనున్. అ-౧

మ. అక్కట దోసతోఁట యిదియైనఁ దదీయఫలంబు లమ్మ యీ
డొక్కయు పాకఁ గోరితిఁ గడు న్నడు కేయిని వచ్చి యెవ్వరో
మక్కువలేక నాకడుపుమంటయుఁ బుచ్చుకొనంగఁ బూని యీ
చక్కెరవంటిపండ్లు తినసాగిరటంచుఁ గృశించు నెంతయున్.

79. మాధవమంత్రి

ఇతఁడు భగవద్గీతలను నాలుగాశ్వాసముల పద్యకావ్యమునుగా రచియించెను. ఇతఁడు గోదావరీమండలములోని నియోగిబ్రాహ్మణుఁడు. గిరిమనమంత్రి పుత్రుఁడు; కిడాంబి వేంకటాచార్యుల శిష్యుఁడు. ఈతని గ్రంథమునందు లక్షణవిరుద్ధములైన ప్రయోగము లనేకములు గానఁబడు చున్నవి. అయిన నితఁడు తనగ్రంథమునందు దత్తోజీ పండితవిరచిత మయిన భగవద్గీతలలోకంటె వృత్తముల నధికముగా వేసియున్నాఁడు. ఇతఁడు తనకృతిని భద్రాద్రిరాముని కంకితము చేసెను. ఈతని పుస్తకము నుండి రెండుమూఁడు పద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

మ. ధరఁ బాలియ్యక లోభకాంక్షయుతుఁడై ధాత్రీశుల న్మిత్రులన్
గురురాజీక్రితఁ జంపఁగాఁ దలఁచి తాఁ గ్రూరాత్ముఁడై యున్నచోఁ
బోరిగొన్నన్ దురితంబు చెందు విను మీపాప్తోల్ల నాకేల య
స్థిర మీకాయము దీనికై కులజులం ద్రెళ్ళింపఁగాఁ బాడి నే? ఆ. ౧

శా. విద్వన్ముఖ్యుఁడు కర్మపుంజములు తా విధ్యుక్త మార్గంబుచే
మద్వాక్యంబులరీతి సల్పుచును నాత్మం గాంచి యవ్వేళలన్
హృద్వ్యాసంబున మోహా ముప్పతిల వర్తించు న్మమత్వాది రా
గద్వేషంబులు లేక యోగి సమతన్ గంభీరుఁడై ఫల్గునా. ఆ. ౨.

చ. పరులు నుతింపఁ జాలు నని పల్కుచుఁ జిత్తములం దలంచి సు
స్థిర మగుబుద్ధి లేక ఫలసిద్ధిని గాంక్ష యొనర్చి దంభులై
యిరవగునట్టిజ్ఞానమున కెంతొవిరోధము చేయునట్టి యా
నరు లొనరించు యజ్ఞము ఘనంబుగ రాజసయజ్ఞ మర్జునా. ఆ. ౪.

80. గోపాలుని సింగయ్య

ఈకవి భారవికృతమైన కిరాతార్జునీయ మను సంస్కృతకావ్యమును నయిదాశ్వాసముల గ్రంథముగాఁ దెనిఁగించెను. ఇతఁడు నియోగి బ్రాహ్మణుఁడు; మౌద్గల్యగోత్రుఁడు; భాస్కరామాత్యపౌత్రుఁడు; వీరనమంత్రి పుత్రుఁడు. ఈకవి కర్నూలు మండలములోనివాఁడు. ఇతఁడు తనగ్రంథమును శ్రీమదహోబల లక్ష్మీనృసింహస్వామి కంకితము చేసెను. ఈకవిపుత్రుఁ డెనుబదిసంవత్సరములక్రిందట జీవించియుండెను. కాఁబట్టి కవి నూఱుసంవత్సరములక్రిందటివాఁడు. ఈతని కవిత్వము రసవంతమయి సలక్షణ మయినదిగా నున్నది. కిరాతార్జునీయకావ్యములోని కొన్ని పద్యముల నిందుఁ బొందుపఱుచుచున్నాను—

చ. కొలిచినభృత్యకోటి ననుకూలత నొప్పెడు మిత్రులట్ల మి
త్రుల మఱి బంధువర్గములతో సరిగాఁ గను బంధుజాలమున్
వెలయఁ గృతాధిపత్యమున విశ్రుతమౌతనుఁబోలె నాదరం
బలరఁగఁ దన్మయుం డగుచు నారయులెన్నగసంతతంబునున్. ఆ. ౧.

ఉ. భానుకరప్రసారపరభాగతలస్ఫురదింద్రనీలసం
తానవిరాజమానరజతస్ఫటికాంచితకుడ్యదీధితుల్
మానుగ నెంచిచూడ దినమధ్యమునందును గౌముదీభ్రమన్
భూనుత మాటిమాటికిని బుట్టఁగఁజేసెడుఁ జూడు మిగ్గిరిన్. ఆ. ౨.

ఉ. కొప్పులు వీడఁగా నడిచి గొజ్జఁగిదండలు జాఱఁగొట్టియున్
గప్పురగందము ల్చెదరఁగా వెసఁ దాఁకియుఁ బెక్కునేరముల్
తప్పక యిగ్గతి న్సలిపి తత్సతు లందలిభీతిచేఁబలెన్
దెప్పర మైనకంపమునఁ దేలుచునుండెను వీచు లత్తఱిన్. ఆ. 3.

మ. అటులైన న్మఱియేమియన్న వినుమీ యారాజు నీప్రాణసం
కట మహావేళను వచ్చిసూకరముఁ డా ఖండించి రక్షించె ని

న్నటుగానం బరమాప్తుఁ డంచు మదిలో హర్షించి వైరింప గొ
క్కటియైయుండు కృతజ్ఞతానిలయు లౌఁగా ధర న్సజ్జనుల్. ఆ. ౪

మ. జయవాంఛ న్విడనాడుచుం బఱచునా సైన్యంబులం జూచినన్
దయపుట్టె న్మదిలోన నర్జునునకుం దర్కింప నట్లే కదా
భయులై చిక్కిననీచశత్రులుల దయం బాటించి రక్షించినన్
నయమున్ గీర్తి మహాత్ములౌనరుల కెన్నంగావె యుద్ధంబులన్. ఆ-౫

---

81. గూళికల్లు వేంకటరమణకవి

ఇతఁడు కనకరంజితశిఖామణిపరిణయమను విక్రమార్కునిగూర్చిన యాఱాశ్వాసములపద్యకావ్యమును రచియించెను. ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; వేంకటమాత్యునకును రంగమాంబకును కుమారుఁడు. ఇతఁడు హరివంశమునుగూడఁ దెనిఁగించినట్లు కవినిగూర్చి వేంకటేశ్వరుఁడనినట్లున్న కనకరంజితశిఖామణీపరిణయములోని యీ క్రిందిపద్యము వలనఁ దెలియవచ్చుచున్నది—

సీ. నీయిష్టదైవంబ నినుఁ బ్రోచుచుండెడు శ్రీవేంకటేశుండ నీ వెఱుంగు
మోవత్స యిపుడు నీభావంబు తెలిసివచ్చితి గూళికల్వంశశేఖరుఁడవు
వేంకటామాత్యుఁడై వెలయుమంత్రికిఁజిక్కలేటివంశజయావధూటిరంగ
మాంబకుజనియించిమాపేరుగొన్న వేంకటరమణుఁడవుసత్కవివి మాకు
మునుపు హరివంశ మంతయుఁ దెనుఁగు చేసి
యంకిత మొనర్చితివి విక్రమార్కచరిత
మిఁకఁ బ్రబంధ మొనర్చి మాకిమ్ము సిరులు
శుభము లొసఁగెదనని పల్కె సుముఖుఁ డగుచు.

ఈ వేంకటరమణకవి నూఱుసంవత్సరములక్రిందట నుండినవాఁడు ఈతని కవిత్వము రసవంత మయినదే. కనకరంజితశిఖామణీపరిణయము లోని రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. అంత నితాంతమామకతపోగ్ని దహింపఁ బురంబుతో మహీ
కాంతుఁడు మిత్రబాంధవసకాయముతోఁ బరిదగ్ధుఁ డైన ని
శ్చింతయు ఘోరకాననము వృద్ధి వహించె మదీయజీవముల్
చింతిలి మస్తకాంతరముఁ జెందుట నేదరి గానకుండెదన్. ఆ-౧.

చ. తెలిపినవారు రంజిలుచు దేవర దేవరకు న్వరంబు ని
ర్మలమతి నిచ్చెఁ గావునఁ గుమారుని మారునివంటివాని న
ర్మిలి గలవాని సర్వజనమిత్రుని మిత్రునిమాడ్కి సత్ప్రతా
పలసితుఁ గాంచి యొప్పుము శుభంబుల భంబుల తేనిచాప్పునన్. ఆ-౨

82. కృష్ణకవి

ఇతఁడు శకుంతలాపరిణయ మనెడి మూఁడాశ్వాసముల ప్రబంధ మును రచించెను. ఈకవి మైత్రేయసగోత్రుఁడు; నారసింహార్యునిపుత్రుఁడు కవి తన యింటిపే రేదో తా నేతెగ బ్రాహ్మణుఁడో చెప్పకొలేదుగాని శకుంతలాపరిణయ ప్రథమాశ్వాసములోని యీ క్రింది పద్యములనుబట్టి చూడఁగ నితఁడు వైష్ణవుఁ డైనట్లూహింపఁదగి యున్నది—

మ. నను రామానుజపాదపద్మయుగళీనన్యాన్వయధ్యానపా
వనహృద్భాగవతావతంసపదసేవాసక్తచిత్తున్ మరు
త్తనయారాధనచారులబ్ధకవితాధారున్ సదారూఢభా
వన నాస్థానకవిన్ నిజాశ్రితుని, బిల్వంబంచి పల్కెం గృపన్.

క. పాత్రుఁడవై మైత్రేయస। గోత్రుఁడవై నారసింహగురువర్యునకున్
బుత్రుఁడవై వెలయుదు వీ। ధాత్రిన్ మాపనుపు సేయఁదగుఁ గృష్ణకవీ.

ఈ గ్రంథము చిఱుమామిళ్ళ పాపయ్య యను కమ్మనాయని ప్రేరణమువలన రచియింపఁబడినది. కవి నూఱుసంవత్సరముల క్రిందటివాఁడు. ఈ గ్రంథము పిల్లవసుచరిత్ర మని దాక్షిణాత్యులు కొందఱ అనుచున్నారు గాని యీ ప్రాంతములయందు దీని కట్టిప్రసిద్ధి లేదు. అబ్బనామాత్య విరచితమైన కవిరాజమనోరంజనమును, సూరకవి ప్రణీత మైన కవిజనరంజనమును, పిల్లవసుచరిత్రమని యిచ్చటివారు చెప్పుదురు. ఈ గ్రంథకవిత్వము శ్లాఘ్యమైనదే యైనను, పిల్లవసుచరిత్రమని చెప్పఁదగినంత శ్రేష్ఠముగా లేదు. ఈ కవి యనేక పద్యములను వసుచరిత్రాది ప్రబంధములనుజూచి వానిలోని పద్యములవలె రచియించి యున్నాఁడు. ఇందుకు నిదర్శనముగా వసుచరిత్రములోని పద్యము నొకదానిని శకుంతలాపరిణయములోని పద్యము నొకదానిని చూపుచున్నాను—

ఉ. కొండఁట విల్లు వేవలలకుండలిరాజఁట నారి యమ్మనం
తుండటఁ బైటిపల్లియలఁ దున్మినవాఁడఁట యొండు రెండు భ
ర్గుం డిది నింకుపౌరుష మోకో యని గెల్వవె ముజ్జగంబు లు
ద్దండత నొక్కతుంటవిలు దాలిచి యుంటివె గందుతూపులన్. వసుచ

ఉ. తుంటఁట కార్ముకంబు కరదొట్టిన తేంట్లఁట వింటినారి చే
నంటినవాడుతూపు లఁట యప్పులపాలఁట కేతనంబు వా
గంటిపులుంగు గుఱ్ఱమఁట కాయము లేదఁట నీకు లోకముల్
కొంకెటనంబున న్గలిచితో లిది యచ్చెరియంబు మన్మథా. శకుంత.

ఇందప్రశస్తంబులగుప్రయోగంబులును గొన్ని కానఁబడుచున్నవి.

క. ఆఖేటమునకు ధాత్రీ। శేఖర్ష భుఁ డనుమతింప శేలెం డనుచున్
శ్లాఖించుచుఁ బడవాళుల। లాఖవమునఁ బనిచి రగ్గలంబుగ వారల్.

ఇందు శ్లాఖించు 'లాఖవము' అను పదము లప్రయోగములైనను గావలెను, ఖఘుల కొండొంటికిఁ గూర్చిన యప్రశస్తప్రాసము లైనను గావలెను. ఈ పుస్తకములోని మంచిభాగము లనేకములు కాళిదాసుని

యభిజ్ఞానశాకుంతల నాటకమునుండి తెనిఁగింపఁబడినవి. అభిజ్ఞాన శాకుంత లములోని మనోహరములైన నాలుగు శ్లోకములలో రెంటిని కవి యీ క్రిందిరీతిని దెనిఁగించియున్నాఁడు—

చ. కనుఁగవ బాష్పపూరములు క్రమ్మెడు గద్గదభిన్నమై యెలుం
గనువున రాదుసూ హృదయ మాకులమయ్యెడు మేను ద్రాన్పడుం
బెనిచినవాని కింతవగఁ బిమ్మటిఁ గ్రమ్మెడుఁ గన్నవారలుం
దనయను బంపలేక పరితాపభరంబున నెట్లు సైతురో.

మ. గురు శుశ్రూషలు సేయుమీ సవతులన్గూర్మి న్విలోకింపుమీ
పరివారమ్ములఁ బ్రోవుమీ సిరుల గర్వస్ఫూర్తిఁ గైకోకుమీ
పురుషుం దూలకుమీ సతుల్ సకచు నేర్పు ల్మికు సూచించితిఁ
దరుణీ లోకమతల్లి చేకొనవె మాతల్లీ మదీయోక్తులన్.

ఇట్లున్నను మొత్తముమీఁదఁ గవిత్వము ప్రౌఢమనియే చెప్ప వచ్చును. కవిత్వప్రౌఢిమ తెలియుటకయి శకుంతలా పరిణయములోని రెండుపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

ఉ. మోద మొనర్చెఁ బుష్పాదుల ముగ్గులపై నొఱపైన ముగ్గలన్
దేదఁగి పూలబెక్కములఁ గెందలిరాకుల తోరణంబులన్
బ్రోది వహించు పక్వఫలపుంజములన్ శుకకోకిలాళి స
న్నాదములన్ నికుంజభవనంబుల నీలన్పపాలనూతికిన్. ఆ. ౧.

శా. పారుష్యంబులు పల్కు నేల నృపతీ పన్నీరకర్పూరక
ర్పూరస్ఫారపటీరసౌరభపయఃపూరంబె జంద్రాతపం
బారామానిలసేవనంబు మ్మును మీ రత్రాంతముం గాంతురా
హేరాళంబుగఁ బుత్రగాత్రమిళనం బెట్లుండునో చూడుఁడీ. ఆ. 3.

83. వల్లూరి నరసింహకవి

ఇతఁడు నాగ్నచిత్రీపరిణయమను మూఁడాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఈకవి యాపస్తంబసూత్రుఁడు; కౌండిన్యగోత్రుఁడు; హనుమత్కవిపుత్రుఁడు; ఆఱువేల నియోగికులపవిత్రుఁడు; నూఱుసంవత్సరములక్రిందటివాఁడని తోఁచుచున్నది. ఈతనికవిత్వము రసికజన హృదయాహ్లాదకరముగా నున్నది. కవితాపటిమ తెలియుటకై నాగ్నచిత్రీపరిణయములోని మూఁడుపద్యములనెత్తి చూపుచున్నాను—

చ. తనయునిముద్దుపల్కు చెవిఁ దార్కొన సంతసమందుచున్నత
జ్జనకునిరీతి మామకవచఃప్రకరంబు వినంగఁగోరి మీ
రెనసినవేడ్క నిట్లు సెల విచ్చుట నాయెడఁగూర్మిఁగాదె మీ
పనుపున విన్నవించెదను బద్మదళాక్షశుభప్రసంగముల్. ఆ. ౧.

ఉ. వందుర నేల యిట్లు మగువా తగనా నగువాన జూడ కీ
యందటిలోనఁ జెప్పవుగదా పగదాయగదా యటంచు నక్
గందు రటంచు నిట్ల యడుగక నుడుగం దొడఁగందలంచి నీ
కందువ లింక మాఱు కొఱగాదఱగా లెఱగాను నెచ్చెలీ. ఆ. ౨.

ఉ. కోసలుఁ డాత్మ నే నృపులకున్ వృషభంబులఁ బట్టరామికిన్
గాసిలి వీనిఁ బట్టుకొని కట్టినవానికిఁ గన్య నిత్తు నే
బాస యొనర్చినాఁడ నని పల్కతి నింకిటఁ దప్పి తేని పెన్
దోసము వచ్చు నీకొమరితో జతగూర్పఁగ నెవ్వఁ డబ్బునో. ఆ.3.

84. గొంతేటి సూరన్న

ఇతఁడు కృష్ణాభ్యుదయ మనెడి యైదాశ్వాసములపద్యకావ్యమును రచించెను. ఈకవి తన్నుఁగూర్చి కృతిపతి యైనబొల్లాప్రెగడ కామమంత్రి పలికినట్లుగా గ్రంథాదియం దీపద్యమును వ్రాసికొనియున్నాఁడు—

మ. ననుఁ గొంతేటిలసత్కులుం జెలిమియారాసన్ దాను వీక్షించిసూ
రన నీ వక్కజ మైనసత్కవివి యీర్యశ్రేణు లగ్గింప భ
క్తిని గృష్ణాభ్యుదయప్రబంధము జగద్దేయప్రమేయంబుగా
నానరం జెప్పుము మెప్పులుప్పతిల సన్యోగానురాగంబునన్.

ఈకవి నియోగిబ్రాహ్మణుఁడు; భారద్వాజగోత్రుఁడు; కామయామాత్యపౌత్రుఁడు; కాశిరాజపుత్రుఁడు. ఈతనికవిత్వ మంతశ్రేష్ఠ మయినదని చెప్పఁదగినది కాదు. ఇతఁడు నూఱుసంవత్సరములక్రిందట నుండినవాఁడు. కృష్ణాభ్యుదయములోని రెండుపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

ఉ. దేవకిగర్భగోళమున దేవశరణ్యుఁ డగణ్యపుణ్యనం
భావితభద్రమూర్తి యగుపంకజనాభుఁడు భవ్యలాభుఁడై
శ్రీవెలయం బ్రవిష్టత వసించె జగజ్జనరక్షణక్షమా
భావభవాబ్జభూప్రభవభావుకుఁ డయ్యును ధీవికాసతన్. ఆ. ౨.

చ. పదముల వ్రాలి బాలకునిపై దయసేయుము తప్పు చేసితిన్
సదమలచిత్స్వరూప యపుసత్తమ యుత్తమ మైననీకథా
భ్యుదయము గోరి నీదు పదపుష్కరము ల్గనవచ్చినాఁడ నా
కొదవలు దీర్ప దేవతలకున్ సిరిగూర్పఁ దనర్పనీవెకా. ఆ. ర.

85. వేతపూడి కృష్ణయ్య

ఈకవి జానకీరాఘవ మను నయిదాశ్వాసముల ప్రబంధమును రచియించి దానిని కమ్మప్రభు వయిన యడపానేరప్ప కంకితము చేసెను. ఈపుస్తకమునుగాక కవి యలమేలుమంగావివాహము, పండితమనోభిరామము, అనుగ్రంథములను రచించిన ట్లవతారికలోని యీక్రిందిపద్యము వలనఁ దెలియవచ్చుచున్నది—

సీ. మఱి శ్రీమదలమేలుమంగావివాహంబు
శ్రీజగన్నాయకార్పితము చేసె
రహిఁ బండితమనోభిరామశృంగారకా
వ్యము ధవళాద్రిరాయనికి నొసఁగెఁ
బహుకల్పనానల్పబంధురోక్తులతోడ
రచియించె జానకీరాఘవంబుఁ
బ్రాకటప్రసాదపంచాక్షరీమంత్ర
జపపరాధీనరసజ్ఞుఁ డితఁడు
హరికథలెకావ్యములుచేసెనాంధ్రభాష
యందుమద్భక్తుఁడితనిచెన్నొందుకావ్య
రత్న మైనట్టిజానకీరాఘవంబు
శ్రీకరం బగు నారధాత్రీతలేంద్ర

ఈకవి శ్రీవత్సగోత్రుఁ డైన యారువేలనియోగి. ఈతనికవిత్వము సరసముగానే యున్నది. ఇతఁడు నూఱుసంవత్సరములక్రిందటివాఁడయియుండును. జానకీరాఘవమునుండి రెండుపద్యము లిం దుదాహృతము లగుచున్నవి—

చ. పృథులకుచప్రకారములు బింబఫలాధరసద్రుచుల్ సుధా
మధురపికానులాపములు మత్తమయూరవిహారముల్ శుభ
గ్రథనవినీలవద్భ్రమరకంబులు కప్రపుఁజెక్కులున్ వనీ
మధుకరవేణికల్ దనరు మాధవుఁ డం దనురాగ మూనఁగన్. ఆ. ర.

శా. ఆకోదండము రామభద్రుడు సముద్యల్లీల నీక్షించి తాఁ
గైకోఁ జూచి ప్రదక్షిణంబుగ భుజాగర్వంబుతో వచ్చి పూ
జాకల్పంబుగ దానిఁ బుచ్చుకొని నిస్సారంబుగా నంతఁ దా
నాకర్ణాంతముగాఁగఁ దీసి విఱిచెన్ హరిప్రభావంబునన్. ఆ. ౪.

---

86. వనమరాజు నాగేంద్రకవి

ఇతఁ డానందసుందరీచాతుర్యవిలాస మను మూడాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఈకవి యాఱువేలనియోగి; పాపనామాత్యుని కుమారుఁడు. ఇతఁడు సుమారు నూఱుసంవత్సరములక్రిందట నుండియుండును. ఆనందసుందరీచాతుర్యవిలాసమునుండి రెండుమూడు పద్యములను గవి కవిత్వకౌశలమును జూపుటకయి యిందుఁ బొందుపఱుచుచున్నాను—

ఉ. క్షోణిప యాతఁ డక్కధరకూటశిఖాంతరమందుఁ గాంచె న
క్షీణజలోచ్చలన్మదజశీకరబంధురసింధురార్భక
శ్రేణిని హంసకోకబకచిత్రితరమ్యవిశాలసైకత
శ్రేణిని దీర్ఘవేణిని బహుప్రభురాణినిఁ గృష్ణవేణినిన్. ఆ. ౨.

ఉ. భూనుతయాతఁ డక్కమలపూరములోపలఁ గాంచె నుల్లస
ద్భానుసహస్రరమ్యమణిభాసితభోగవిభూషు నాననో
న్మానితకైటభారిగుణమంజరసౌఘనిరస్తదోషు నం
భోనిధికాననాకలితభూధరబాహువిశేషు శేషునిన్. ఆ. ౨.

ఉ. దైన్యముపక్కఁ జాపశరదారుణఖడ్గము లూనపట్టి య
న్యోన్యవధాశచేఁ బెనఁగునప్పుడు చూడు మురారిశక్తిన
త్యున్నతిఁ దద్బలంబు నధికోజ్జ్వలయోధులు పిచ్చలింపఁగా
జన్యమునందుఁ గూల్చెదను జక్రిని శుక్రుఁడు తల్లడిల్లఁగన్. ఆ ౩.

---

87. మాచవరపు పాపనామాత్యుఁడు

ఇతఁడు నందవరీకచరిత్రమను రెండాశ్వాసముల గ్రంథమును రచియించెను. ఈ నందవరీకులచరిత్ర మీావఱకే యింకు వ్రాయఁబడినది. కవి నందవరీక నియోగిబ్రాహ్మణుఁడు; శ్రీవత్సగోత్రుఁడు; వేంకటాచల మంత్రిపుత్రుఁడు. ఇతఁడు తన వాసస్థలాదులనుగూర్చి యిట్లు చెప్పుకొని యున్నాఁడు—

సీ. శ్రీమించు వినుకొండసీమలో నల్ల య
నంతవరం బనునగర మొకటి
కొమరొప్పు బెల్లముకొండ దేశంబున
మానితంబై యొప్పు మాచవరము
గ్రామద్వయంబునఁ గాణాచి యేకభో
గముమీాఱ వెలసిన ఘనయశుండు
పెద్దనామాత్యుండు ప్రియురాలు జ్ఞానాంబ
వారికి జనియించె వరసుతుండు
పాపనాహ్వయుఁ డనఁ బ్రఖ్యాతుఁడై యొప్పు
నాతనిభార్య శ్రీయచ్చమాంబ
వారికి ముగురుపుట్టిరి వరుస సుతులు
ముదముతోడుత వసుధఁ ద్రిమూర్తు లనఁగ
నగ్రజుఁడు వేంకటాచలం బనెడుపేరఁ
బ్రణుతి కెక్కెను విభవసౌభాగ్యగరిమ.

క. ఆతనిదేవి పతివ్రత । సీత నరుంధతినిబోలి సృష్టిని వెలసెన్
జేతోమోదంబున సం । ప్రీతిని శ్రీకొండమాంబ ప్రియము జనింపన్.

ఉ. శ్రీపరమేశుసత్కరుణ శ్రీవిలసిల్లఁగ వారికిన్ సము
ద్దీపతచారుమూర్తు లతిధీయుతు లిద్దఱుపుత్రు లందులోఁ

బాహన నగ్రజుండ నయి భాసిలి సత్యము దేవభక్తియున్
బ్రాపుగనమ్మి సద్గురుపపాదములే గతియంచు నున్నెడన్.

నందవరము లిప్పు డనేకములు కానఁబడుచున్నవి. పూర్వకాలమునందు నాఁడు దేలినట్టియు నందవరీకుల కియ్యఁబడినట్టియు నందవరము కర్నూలుమండలములోనిదయినట్లు కవి యీ క్రింది పద్యమున వర్ణించి యున్నాఁడు—

సీ. అందమై విలసిల్లుఁ గందనోలీమలో నందవరం బనునగర మొకటి
తత్పట్టణంబు సౌందర్యంబుఁ గొనిచూడఁ జిత్ర మెవ్వరికి విచిత్రమరయ
సుందరంబగుచు సంక్రందనపురిఁబోలి యిందిరాదేవికి మందిరముగఁ
గడురమ్యమై చాలఁ గర మొప్పుచుండును గూపతటాకములొప్ప—
మరుమిగులఁ
బంకజాకరవిలసిత పద్మనికర । మధుర మకరందరసపానమత్తమధుప
నరసఝంకృతసంగీత సంకులంబు।నగుచు రంజిల్లు మిక్కిలియవనియందు

పయిపద్యములోని యనావశ్యకములయిన పదముల ప్రయోగమునుబట్టియే యీ కవిత్వ మంత మంచిది కాదని చదువరు లెఱుఁగవచ్చు. ఇతఁడు నూఱు నూటయేఁబది సంవత్సరముల క్రిందటివాఁడేమో! నందవరీక చరిత్రము రెండాశ్వాసములనుండియు రెండేసిపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

మ. దివమం దెల్లను రాజ్యభారముఁ దగం దీర్చున్ మరిన్ రాత్రులం
దవలీలం జని జాహ్నవీసలిలమం దాకూఢిగా స్నానమున్
సవిశేషంబుగఁ జేయుచున్ నిరత మీచందంబునన్ రాజపుం
గవుఁ డంహోరహితప్రభావతనుఁడై గాంభీర్య మింపొందఁగన్. ఆ-౧

ఉ. ఒక్క మహానుభావుఁ డిటవచ్చి దయారస ముప్పతిల్ల నల్
దిక్కుల దివ్యతేజములు దీటుకొనం గడు సత్ప్రభావుఁడై

మక్కువ యోగవాగ మనుమంత్రము నా కుపదేశ మిచ్చి తా
జక్కఁగ నిచ్చి పాదుకల సంభ్రమ మొప్పఁగ నేగె నంతటన్. ఆ-౧
ఉ. నందవరంబు మాకును ఘనంబుగ నచ్చట ధారపోసె ద
త్సుందరిఁ దాను గూడుకొని శుభ్రతరం బగుజాహ్నవీజలం
బందుఁల గాన వచ్చితిమి యాతనితోడుతఁ దెల్పి వేగ మా
కుం దగఁజెప్పుమన్న ననుకూలత నచ్చెరియంబు తోఁపఁగన్. ఆ-౨.
ఉ. భూసురకోటి వచ్చుటకు భూపతి యాత్మఁ గలంగి దానముం
జేసితి మున్ను వీరల కజేయులు గావునఁ దప్పినన్ విప
ర్యాసముఁ బ్రత్యవాయమును రాఁగల దిచ్చిన విత్తహీనమా
మోసమువచ్చెనెట్లనుచు మోమొకయించుక వంచెనంతతోన్.ఆ-౨.

---

88. కృష్ణదాసకవి

ఇతఁడు రాధాకృష్ణవిలాస మనుపేర జయదేవ విరచితమైన గీత గోవిందమును మూడాశ్వాసముల కావ్యమునుగా రచియించెను. ఈతని తండ్రి వేంకటదాసుఁడు. ఈతఁడు శూద్రకులజుఁడని తోఁచుచున్నది. అయినను కవిత్వము హృద్యముగానే యున్నది. రాధాకృష్ణవిలాసము లోని మూఁడు పద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. అలఘుభుజాబలంబులు నొయారము లయ్యుసమానసాహసం
బులు నెర వైనసాదనలు పోటరిపంతము లేకవీరతల్
చలమరితెంపులున్ జవవిలంఘనముల్ విలసన్నియుద్ధతుల్
కలిగినకాల్బలంబు కటకంబున డంబున నొప్పు నెప్పుడున్. ఆ-౧.
ఉ. కూరిమిచేయు దిక్పతులకోరిక లీరిక లెత్త రావణో
ధారశిరంబులం దునిమి దద్దిశలన్ బలిపెట్టి సర్వభూ

భార మడంచి మానిజనభావనల న్విహరించినట్టి దు
ర్వారబలాభిరామ ధృతరాఘవరూప నినున్ భుజించెదన్. ఆ-౨.

ఉ. ధ్యానముచేతఁ జూచెద సుధానిధితోఁ బ్రతివచ్చునట్టిరా
ధానన మిష్టు కోపజనితారుణమై కడు వంకలై బొమల్
పైనమరంగ శోణకమలంబునఁ ద్రిమ్మరు చంచరీక సం
తానరమద్విలాసములు తాల్కొనియుండక మానసేర్చునే. ఆ-౩.

89. చెన్నూరి శోభనాద్రి

ఇతఁడు బిల్హణునికథను శృంగారసుధాసముద్రపూర్ణచంద్రోదయ మను పేరను నాలుగాశ్వాసముల ప్రబంధమునుగా రచించి గుమ్మడపు పాపన్నపతి కంకితముచేసెను. కృతిపతిగాని కృతికర్తగాని యెప్పు డుండిన వారో తెలిసినది కాదు. కృతిపతి పద్మనాయకకులసంభవుఁడయి గుళ్ళ పాటి పురాధీశ్వరుఁ డయిన జగన్నప్రభుని కుమారుఁడు; కృతికర్త యారువేల నియోగియైన చెన్నూరి రామచంద్రుని కుమారుఁడు. కవిత్వము ప్రౌఢముగా నున్నది. శృంగారసుధాసముద్ర పూర్ణచంద్రోదయ మనెడి యామినీపూర్ణతిలకకథనుండి రెండుమూఁడుపద్యముల నిందు దాహరించు చున్నాను—

చ. చక్కనివాఁడు మాటలకు జాణ కళాగమసాహితీచణుం
డక్కట బిల్హణుం డితనియందము చూచిన మందయాన ల
మ్మక్కయటంచు భర్తలను మాని పయింబయివచ్చి నిచ్చలుం
జొక్కకయుండురే రతులఁ జొప్పగునే మన కీతఁ డుండినన్. ఆ. ౨.

ఉ. అంధుఁడు బిల్హణుండు తనయా తెరచాటున నుండి నీవు స
ద్గ్రంథము లన్నియుం జదువఁగావలె నీతఁడు బుద్ధిదూతవా
తంధయుసార్వభౌముఁ డని తండ్రి విధించిన నమ్మియుంటి జా
త్యంధుఁడవేని యీతఁడుసుధాంశునిఁ గాంచనుశక్తుఁ డెట్టులో? ఆ-౩

మ. తనయా రాజకుమారుల న్విడిచి విద్వాంసున్ గ్రహింపంగ నీ
మన సెట్లొప్పెను రాజకన్యవుగదా మర్యాదయా నా ధరన్
వినవే పెద్దలు చెప్పుచుందురుగదా విద్వత్సుదారిద్ర్యతా
యని తద్వాక్యము వ్యర్థమయ్యెనుగదా హా శోధించేయుందగున్.

---

90. కోటీశ్వరుఁడు

ఈకవి భోజకన్యాపరిణయమనెడి మైదాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఈతనిది రసవంతమైన కవిత్వమేకాని యందందు వ్యాకరణవిరుద్ధము లయిన ప్రయోగములు కానఁబడుచున్నవి. భోజకన్యాపరిణయమునందు రుక్మిణికిఁ గృష్ణునితోడి వివాహకథ చెప్పఁబడియున్నది. కవి నియోగిబ్రాహ్మణుఁడు; చక్రప్పకును మంగమ్మకును నందనుఁడు. ఈతనికాలము మొదలయినవానినిగూర్చి యేమియుఁ దెలియదు. ఇతఁడు నూటయేఁబదిసంవత్సరములక్రిందట నుండియుండవచ్చును. ఈతని ప్రబంధములోని యొక్కొక్కయాశ్వాసమునుండి యొక్కొక్కపద్యము నిందుఁ బ్రదర్శించుచున్నాను—

ఉ. కోమలియోర్తు చందనము కుంకుమతోడనుగూర్చి యంత న
త్తామరసాక్షుమై నలఁదఁ దద్దయు నొప్పె మనోహరాకృతిన్
సోముఁడు నీరజాప్తుఁడును జూడ్కులయందు వసించియుండుటన్
గౌముదిఁగూడి యాతపము గ్రమ్మివెలింగెనునంద మొందుచున్. ఆ-౧

మ. జనభీతిప్రదఘోషపంకజననస్ఫారాయశఃప్రాప్తిసో
వనరాశిం దప మొంది శంఖముకలస్వానామృతౌఘంబు శో
భనరేఖాత్రయభాసురంబు నయి తద్భామాగళత్వంబు నొం
దిన ముక్తావళి తద్భవత్వమునసే చెందెన్ హారవామాకృతిన్. ఆ-౨

మ. అన నజ్జాస్య యనున్ వయస్యలకు నీయాజ్ఞాతిఁ గై సేయుమం
చని నే సొమ్ములపెట్టె తెచ్చి మణిభూషానేకము ల్వానఁబో
యిన నొండేనియుఁ బాటిగామిఁ జెలి యేమే చెల్ల నాసొమ్ము లే
వని ఖండించునుగాని నేర జెఱుఁగన్ స్వప్రాప్తశారోష్ఠనక్షత్రిక్. ఆ 3

శా. భద్రేభంబులఁగూల్చుసింహముగతిన్ బ్రత్యర్థిభూపాలురన్
రౌద్రోల్లాసవిలాసము ల్మెఱయఁ బోరన్ గెల్చి నానాదిగ
త్క్షుద్రశ్రీలకు నాటపట్టుగుచుఁ బొల్చు న్వాసవుండోయనన్
మద్రాధీశుఁ డితండు చూచితివె శ్రీమద్రాజబింబాననా. ఆ. ౪.

చ. సురవరదత్తమంజసవిశోభితుఁడై హరి యిట్లు రుక్మిణీ
పరిణయకాంక్ష నుండుటయు భానుఁడు కన్గొని తాను నట్లు యా
హరికి ననర్ఘ్యరత్నముల నర్పణ చేయఁదలంచియోయనన్
బరువడిఁ బశ్చిమాంబునిధిపారమున న్నిలిచెన్ ద్వరాద్భుతిన్. ఆ ౫

---

91. చల్లపిళ్ల నరసకవి

ఇతఁడు యామినీపూర్ణతిలకావిలాసమనుపేరితో బిల్హణచరిత్రము నాలుగాశ్వాసముల శృంగారకావ్యముగా రచియించినకవి. ఈతని కావ్యము పూర్వోక్తమయిన బిల్హణీయమునకంటె మిక్కిలి రమణీయముగా నుండును. ఈ కవి వైదిక బ్రాహ్మణుఁడు; ఆపస్తంబ సూత్రుఁడు; భారద్వాజసగోత్రుఁడు; కామకవి పుత్రుఁడు. ఈ కవి తాను గొంతకాలము క్రిందట మృతుఁడయిన పిఠాపురపు రాజుగారి పితామహుఁడగు శ్రీరావు నీలాద్రిరాయనింగారి కాలములోఁ దదాస్థానములోని కడియమను గ్రామమునం దుండినట్టు యామినీపూర్ణతిలకావిలాసములో నీ క్రింది పద్యమునఁ జెప్పికొనియున్నాఁడు—

సీ. త్రిభువనపూతకృతిక్రియగల్గు గౌతమీతీరవితీర్ణ ధాత్రీప్రసిద్ధ
తరమైన కంకణపురవరసంస్థానభూమిఁ జెందినవాఁడ భూసురుండ
శ్రీరామనామమంత్రారాధనపరుండ సకలవిద్వన్మహాజనహితుండఁ
బూజ్యతరప్రాజ్యరాజ్యసత్పిఠికాపురవరసామ్రాజ్యపరివృఢుండు
విమల రేచర్లగోత్రపవిత్రమూర్తి । రావు వేంకటనీలాద్రిరాయనృపతి
చేత సత్కృతినొంది ప్రసిద్ధినొందినట్టి నరసయనామవిఖ్యాతయశుఁడ.

కడియ మనెడి యీ గ్రామము రాజమహేంద్రవరమునకు మూఁడు క్రోసుల దూరమున కాకినాడకాలువయొడ్డున నున్నది. శ్రీ రావు వేంకట నీలాద్రిరాయనింగారు నూఱుసంవత్సరములక్రిందట నుండినవారైనందున నాతని కాలములో నుండిన కవియు దాదాపుగా నూఱుసంవత్సరముల క్రిందటివాఁడు. ఈయన కవిత్వము రసవంతమయి ప్రౌఢముగా నున్నది. ఈయన కవనరీతిని దెలుపుటకయి యామినీపూర్ణతిలకావిలాసములోని కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. నిరుపమసాహసాతిశయనిర్భరదుర్భరవైరివీరసం
హారణరణోత్సవోచితవిహారమహారథికప్రదత్తస
త్పరిణయకార్యధుర్యతరధాణధణంధణనాదఘంటికా
సురమితనిర్జరీజనమనోరథముల్ రథము ల్పురంబునన్. ఆ-౧.

చ. ఘనకబరీస్తనాకృతులు కంధరమై ధరమై రమైక్యమై
చను నొగిఁ గంఠవక్త్రములు సాదరమా దరమా రమాకమా
దినుసుగ వాఙ్ముఖాంగములు తేనెలతో నెలతో లతో క్షితో
నెనయగు నాభిజంఘగతి హేమకరిన్ మకరిన్ గరి న్నగున్. ఆ-౨.

ఉ. అమ్మకచెల్ల! చెల్ల నగు నల్లికజల్లికమాటలాడి చి
త్రమ్ములు పన్ని సన్నిటులు దారిచి మీ రిపు డంద ఱొక్కటై
గమ్మని గేలిసేయ నొడిగట్టితి రమ్మ పనేమి మాటలన్
నమ్మఁగరాదు మిమ్మనుచు నర్మిలి వేఱొకతీరు మీఱఁగన్. ఆ-3.

చ. కలువ లెసంగఁ దామరలు కంది ముడుంగ దెస ల్వెలుంగ వె
న్నెలలు చెలంగ జక్కవలు నెక్కొని సేగి మునుంగఁ జీఁకటుల్
బలిమి నడంగ వేకొమరుఁ బ్రాయపువారల డెంద మందమై
పోలు పలరంగ వారినిధిఁ బొంగఁగఁజేయుచు రాజు రాజిలెన్. అ-ర.

శా. స్వామీ నేరము లేదు నావలన నీసర్వంబు నీకృత్రిమ
స్తోమంబు న్నను భ్రాంతి ముంప సముదాసూర్త్రిన్ మదీయానన
క్షేమాలోకనబద్ధకాండపటరాజిం గూర్చి తోఁగాదె మ
త్ప్రేమానందకరాశయగ్రహణకారి ప్రాప్తిగా మున్నుగన్. అ-౫.

ఉ. రాముశరప్రయోగము సురప్రభువజ్రము చక్రిచక్రమున్
ధామనిధిప్రియాత్మజునిసంశము కామరిపుత్రిశూలముల్
భూమి నొకప్డు రిత్త యయిపోయినఁ బోవుసుగాక యాకవి
స్వాములవాక్ప్రయోగమును బ్రహ్మకు నైనఁ దరంబె త్రిప్పఁగన్.

---

92. అయ్యగారి వీరభద్రకవి

ఈకవి రాఘవ యాదవ పాండవీయ మను మూడాశ్వాసముల త్ర్యర్థి కావ్యమును రచియించెను. ఈతఁడాఱువేలనియోగి యైన శైవుఁడు; కౌండిన్య గోత్రుఁడు; సోమనారాధ్య పుత్రుఁడు. ఈతఁ డేకాలమునం దుండినవాఁడో నిశ్చయముగాఁ దెలియరాదు. ఇతఁడు నూఱు నూట యేఁబదిసంవత్సరముల క్రిందట నుండియుండవచ్చును. మూఁడర్థములు గల పద్యముఁనుబట్టి కవనసై పుణి యిట్టిదని చెప్పుటకు వలనుపడదు. ఇట్టికవిత్వ రచనయే కష్టము. అయినను గవి యవతారికలోఁ జెప్పిన—

ఉ. హారి కిరీంద్రవిగ్రహవిహారికి నాశ్రితబృందదుఃఖసం
హారికి ధూతదేవవివహారికిఁ గౌస్తుభసజ్జ్వలన్మణీ

హారికి నా స్తపద్మగమహారికి సాగరబాలికామనో
హారికి వాహనప్రణవహారికి శౌరికిఁ గేలు మోడ్చెదన్.

సీ. నిండు చందురుడాలు నీటు నేలఁగఁజాలు
మొగముపైఁ జిఱునవ్వు మొలకలొదవ,
జెలిమి తేనులమించు చేటునూటాడించు
నెలకూనయును దలఁ దళుకు లీనఁ,
గొదమతుమ్మెదబారు నదలించితనరారు
కడచూపు లక్కుటికింబు నించ
జోడులేదని తెల్పు సొగసుకత్తుకనల్పు
మేవన్నెలకు వింతమిసిమి నొసఁగ
నలువ మొదలైనవారు తన్గొలిచిరాఁగ
గిబ్బ బాబాపయింబొల్చియబ్బురముగ
నెలమి చెన్నారఁగా వాకఁగలనుఁగానఁ
బడియెముక్కంటికన్నులపంటవుగను.

ఇత్యాదిపద్యములనుబట్టి చూడఁగా నితఁ డాంధ్రగీర్వాణపద బహుళముగా మంచికవిత్వము చెప్పఁగలవాఁ డని తేటపడుచున్నది. ఈతనిగ్రంథములోనివి కొన్నిపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి.

శా. నానారత్నవిభూషితాఖిలజనానందదానుసంధాయిశ్రృం
గానూనంబులు చారుగంధసుమనఃప్రాచన్మహాపాదపా
ళీనవ్యంబులు సద్వ్రపాభిరతముల్ లీలార్థగోత్రాళు లెం
తో నేత్రోత్సవదంబు లౌదుఁ జెలువొందుందత్పురంబందునన్. ఆ-౧

ఉ. ప్రాంచితరీతి రాముఁడు పరాశరజాతుఁడు కృష్ణమూర్తి దా
మించినవేడ్కనంప జడిమింతఁగఁ బెంచి విరాధరాజితో
దంచదనూనలీలల నుదాత్తముగా యువనాభ్రము న్నతు
ల్గాంచుచు నింద్రకీలధరలాలితదీప్తి నతండు భాసిలన్. ఆ. ౨.

ఉ. రాముని ధర్మరాజు రణరంగవిరాజితు నచ్యుతప్రభున్
నీమది మర్త్యుగాఁ దలఁచి నీతివిహీనతఁ బోరఁబోకుమీ
సామము మేలు తద్విభుఁడు శస్త్రబలంబున మేటి భూమిలోఁ
గామిని రత్నయుక్తముగఁ గ్రక్కున నిచ్చి కులంబుఁ బ్రోవుమా. ఆ-3

---

93. ఘట్టుప్రభువు

ఇతఁడు సురాభాండేశ్వరము, కుచేలోపాఖ్యానము, యాజ్ఞవల్క్యచరిత్రము, అను మూఁడుపద్యకావ్యములను రచియించెను. ఇతఁడెల్లామాత్యునిపుత్రుఁడు. ఈకవి యాజ్ఞవల్క్య నియోగిబ్రాహ్మణుఁడయినట్టు కనఁబడుచున్నాఁడు. ఇతఁడు కుచేలోపాఖ్యానములోఁ దన్నుఁ గూర్చి యిట్లు వ్రాసికొనియున్నాఁడు—

సీ. భ్రమరాంబికావరప్రభవదివ్యకవిత్వ
విద్యాప్రవీణత వెలసినాఁడ
ఘటికాశతగ్రంథఘటనాసమంచిత
చాతుర్యమహిమకుఁ జాలినాఁడఁ
బ్రౌఢిమ నేకైకపత్త్రమాసమహాప్ర
బంధ కల్పనశక్తిఁ బ్రబలినాఁడ
మఱియు నాశువు చిత్రమాధుర్యవాక్య ప్ర
గల్భనంబున నుతు ల్గాంచినాఁడ
శ్రీకుధరమల్లికార్జున శ్రీపదాబ్జ
మత్తభృంగాయమానసన్మానసుండ
సత్కవీశ్వర కరుణాప్రసాదవశుఁడ
ఘట్టుప్రభునామధేయ విఖ్యాతయశుఁడ.

ఈ కవి నెల్లూరిమండలము గోసవాఁడయినట్టును, అప్పటి కెనుబది సంవత్సరములక్రిందట నుండినట్టును, నెల్లూరిమండల చరిత్రమునందు వ్రాయఁబడియున్నది. కాఁబట్టి కవి యిప్పటికి నూఱుసంవత్సరములక్రిందట నుండినవాఁడు. ఈతనికవిత్వ మంతగా నిర్దుష్టమయినదియు ప్రౌఢమయినదియుఁ గాకపోయినను, మంచి లోకోక్తులతోను న్యాయముల తోను నిండియుండి ద్రాక్షాపాకమునఁ జదువువారి కింపుగానుండును. ఈతఁడు రచియించిన యాజ్ఞవల్క్యచరిత్రము ప్రస్తుతమున నావద్ద లేదు. దక్కిన గ్రంథములనుండి కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను-

కుచేలోపాఖ్యానము.

శా. చిత్రం బెన్నఁగ, జిన్ననాఁడె తనయుల్ శిక్షానుగుణ్యుల్ తుదన్
బాత్రుల్గా రతిదండకార్యములకున్ బ్రాయంపువారైన ని
ర్ధాత్రిం జుట్టములల్ల చూతవలదా తండ్రుల్ త్వజాజాతులున్
బుత్రం మిత్రవదాచరేత్తనుచు నేప్రొద్దున్ శ్రుతుల్ చాటఁగన్. ఆ-౧.

ఉ. కామితవస్తుజాతములు గల్గి దయాపరులైన ధన్యులన్
బ్రేమత నిచ్చి పుచ్చుకొనుభావముచం దలపోయఁ డెంతయున్
గ్రామము క్రొత్తదైనఁ దన కర్మము క్రొత్తదె పెక్కుమాట లిం
కేమి యదృష్టహీనునకు నెచ్చటి కేఁగినఁ గల్గునే సిరుల్. ఆ-౨.

ఉ. అన్నము లేకయుండిన లయంబగు దేహము రక్తమాంసముల్
సున్నగు నింద్రియస్ఫురణ సుక్కు మదాశ్రయంబున దూరమౌ
నన్నులమీఁది ప్రేమ చెడు నచ్యుత నీపయి నిల్చుమానసం
బెన్నటికైన జ్ఞానులకు హెచ్చు దరిద్రతసాటి చేసే సిరుల్. ఆ-3.

సురాభాండేశ్వరము.

చ. తవిలినమోహపాశమున దైన్యముఁ బూని మనోవ్యథం గడుం
దిపురుచు విన్ననై యవనిదేవుఁడు ప్రార్థనచేసి మ్రొక్కఁగా

నవిదయుఁ జేరికి గొనక యూరక యేగెను నిర్గమాత్ములై
శివశివ యిక్కలిం గఠినచిత్తులుగారె లతాంగు లిమ్మహిన్.
చ. పరమవివేకశీలుఁ డవు బాపఁడ వుత్తమవంశజుండ వీ
వెఱుఁగవె యొండ్ల భామినుల నీగతిఁ గోరుట ధర్మమే మహా
దురితము లైనపట్లఁ గడుదూరముగా నెడలించి మోహముల్
మఱచుట ధర్మ మంద్రు మతిమంతులు వేదపురాణసమ్మతిన్.

94. ముప్పిరాల సుబ్బరాయకవి

ఇతఁడు కృష్ణాభ్యుదయమనెడి యైదాశ్వాసముల ప్రబంధమును రచియించి, చక్కలాల వేషయామాత్యున కంకితముచేసెను. ఆగ్రంథమునఁ గవి తన్నుఁగూర్చి యిట్లు చెప్పుకొనియున్నాఁడు.

మ. నను శ్రీనాథకథాసుధారససరిన్నాథాగ్రయోషాంబుగా
హానదూరీకృతసర్వకల్మషు హరిస్వామ్యనుగ్రహ ప్రాప్తసా
రనిరాఘాటసితాంతశోభికవితా రాజ్యాప్తతున్ సత్సుధీ
జనసంతానవిధేయుఁ జూచి పలికెన్ సంతోష ముప్పొంగఁగన్.

సీ. అఖిలమోత్ప్రేక్షోపమాద్యలంకారముల్
నొలఁకంగ ముద్దులు గులుకఫణితిఁ
బద్యకావ్యముగాఁగఁ బ్రద్యుమ్నచరితంబు
రసికు లౌననఁగను రచనచేసి
తలరుచు ద్విపదగా వెలయ సావిత్రిచ
రిత్ర యొనర్చితి చిత్రలీల
భద్రాద్రిఁ దగు రామభద్రునిపై నొక్క
శతకంబుఁ జేసితి చతురఫణితి
నేయెడ నరస్తుతులు నీవు నేయ వైన
భ్రాతృవాత్సల్యమెనఁగఁ బ్రబంధమొకటి

చెప్పినా కంకితంబుగఁ జేయుమిపుడు
సుకవినుతగుణసముదాయ సుబ్బరాయ

పయిపద్యములనుబట్టి యీకవి ప్రద్యుమ్నచరిత్రమును సావిత్రీచరిత్రమును భద్రాద్రి రామశతకమునుగూడ రచియించినట్టు తెలియవచ్చుచున్నది. ఈకవి యెప్పటివాఁడో తెలియరాలేదుగాని నూఱుసంవత్సరములకంటెఁ బూర్వపువాఁడు. ఈతని కవనము మృదువయి మధురముగా నున్నది. కృష్ణాభ్యుదయములోని కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. సంకుమదాదిగంధయుతసారసమీరము మీఱివీవఁగాఁ
గంకణఝంకృతు ల్వెలయఁగా సురసుందరు లొయ్య నొయ్యన
బొంకముమీఱ నూఁపఁగను భోగికులాధిపడోలికన్ రమా
పంకజగంధిఁ గూడుకొని బంధురహర్ష తరంగితాత్ముఁడై. ఆ. ౨.

చ. విను చెలి జోడుకోడెలగు వేఁడివెలుంగును రేవెలుంగునున్
వనజదళాయతాక్షునకు వారిరుహాసనుఁ డిం పొనర్పఁగాఁ
గనుఁగవఁజేయ నాసయనుకాంచనపుష్పము నాశ్రయించి వా
రనిశము పుష్పవంతు లనునాఖ్య వహించిరి ముజ్జగంబులన్. ఆ. 3.

ఉ. మారుశరాళికిన్ మలయమారుతపాళికి మంజులాళికిన్
మీఱుమరాళికిన్ జిగురుమెక్కెడునీలిగయాళికిన్ శశాం
కోరుకరాగ్రకేళికి మయూరకదంబము కేళికిన్ సితాం
భోరుహనేత్ర కుంది తలపోయఁదొడంగె మనంబులోపలన్. ఆ. ౪.

చ. కొనియెద రుక్మిణీసతిని గోపవధూవిటుఁ డడ్డమైన మా
ర్కొనియెద మద్భుజాబల మకుంఠితమైతగ నెల్లమీఱె క
న్గొనియెద రంచు బంధుజనకోటికిఁ దెల్పుచుఁ జైద్యుఁ డంతటన్
గని యెదురైనవారు నగఁ గ్రక్కునవచ్చె నృపాలుపీటికిన్. ఆ. ౫.

———

95. ప్రయాగ కామేశ్వరకవి

ఇతఁడు గోపాలలీలాసుధాలహరి యను మూఁడాశ్వాసముల ప్రబంధమును రచియించి రామతీర్థస్వామి కంకితము చేసెను. ఈకవి విశాఖపట్టణమండలపువాఁడు; వైదికబ్రాహ్మణుఁడు; కౌశికగోత్రుఁడు; నారసింహపౌత్రుఁడు; సర్వేశ్వరపుత్రుఁడు. ఇతఁడు నూఱు సం॥ రములక్రిందట నుండినవాఁడు. కవిత్వము మంచిదేయైనను శృంగారవర్ణనము నితఁడు మిక్కిలి పచ్చిగాఁ జేసినందునఁ బుస్తక మిప్పటివారు చదువుట కంతగా యోగ్యమయినదికాదు. ఈప్రబంధమునుండి రెండుపద్యముల నుదాహరించుచున్నాను—

ఉ. దుండగ మేలచేసెదవు తోయజనాయక దంచనిల్చి కో
దండము డించి మాచెలికిదండము పెట్టుము రెండుకన్నులన్
నిండిననీరు దోయిటను నించి శపించుఁ దదగ్రువారి నీ
దండనచేయుఫాలశిఖితండ్రిసుమీ కడుశిక్ష చేయఁగన్. ఆ. ౨.

మ. యమునాతోయము దోయిటంగొని సముద్యల్లీల వేఱొక్కభా
మముఖాబ్జంబునఁ జల్ల నానెలఁతయు న్మారోర్మము గావించుచో
దుమికెం దుమ్మెదచాలుఫుల్లనవపాథోజంబుపై నాఁగ శ
క్రమణీరోచులనీనుకొప్పు విడి వేగం గ్రమ్మెఁ దద్వక్త్రముల్. ఆ.౩.

---

96. అనంతనార్యుఁడు

ఈకవి గాధేయోపాఖ్యానమను నేకాశ్వాసశృంగారప్రబంధమును రచియించి కామాంబకును జిన్నప్రభునకును బుత్రుఁడగు కృష్ణభూపాలుని కంకితము చేసెను. ఇతఁడు తాళపలింపకవికుమారుఁడు. ఈ కవినిగూర్చియు నీతని కాలమునుగూర్చియు మఱేమియుఁ దెలియరాలేదు. ఇతఁడు నూఱేండ్లకు లోపలివాఁడుకాఁడు. ఈతని కవిత్వము హృద్యమయి యన

పద్యమయియున్నది. కవితామాధుర్యమునుజూపుటకై గాథేయోపాఖ్యానములోని పద్యముల రెంటి నిందుక్రిందఁ బొందుపఱుచుచున్నాను—

ఉ. మానక యింతవంత దరమా సురమాన్యపదంబుగన్న మ
స్నీని కిదేల పట్టివగ నీకృపచే వగ నేవగ న్జగ
న్మానిత తత్తపోమహిమ మానుష నాదువిలాసమోవు నీ
పూనికమోవు నాసయినిమోవు వెత న్విసుమోవురందరా.

చ. చిలుకలకు న్వచోగురుతఁ జెంగుచు సప్తవిధస్వరంబులన్
బలుమఱుఁ దేనియ ల్గులుకఁ బాడెడు నీలలితాంగిఁజూచి లో
కులు మఱి కీరవాణియును గోకిలవాణియనంగఁ దోన చి
ల్కలు మఱి రామరామయనుఁ గన్నులఁ గెంపు వహించుఁ గోవిలల్.

---

97. భైరవకవి

ఇతఁడు రత్నశాస్త్రమును దెనుఁగునఁ బద్యకావ్యమునుగా రచియించెను. ఇతఁడు గౌరనసుతుఁడు. ఇతఁడు భ్రమరాంబికా వరప్రసాదముచేతఁ దనకుఁ గవిత్వము వచ్చినట్లీ క్రిందిపద్యములలోఁ జెప్పుకొనియుండుటచేత కర్నూలుమండలములోనివాఁ డయినట్టు తోఁచుచున్నది—

క. తన్నుఁ బ్రియమూర వేఁడిన।మున్నుమునీంద్రులకగస్త్యముని చెప్పినయా
సన్నుతమణిలక్షణములు।చెన్నుగఁ గ్రోడీకరించి చెప్పెదఁ దెలియన్.

క. భ్రమరాంబికామహేశ్వర।సముచితనిరవద్యహృద్యసాహిత్యకళా
క్రమవిమలప్రతిభాసం।క్రమణుఁడ మతిశాలినైనగౌరనసుతుఁడన్.

"భైరవుఁడ నుభయభాషాపరీణుఁడ" నని కవియే తన సంస్కృతాంధ్రభాషాద్వయపాండిత్యము కలదని చెప్పుకొనెను. ఈతని కవిత్వము మొత్తముమీఁద చక్కఁగానే యున్నది. రత్నశాస్త్రములోని రెండు పద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి.

ఉ. నీరదము ల్దిగంతములనిండి తటిద్ఘనగర్జితంబు లిం
పార యహోగ్రవృష్టిఁ గురియం బ్రభవించు నితాంతకాంతితో
నారయఁ గుక్కుటాండసమమై పడుముత్యము లంతరిక్షసం
చారులు పట్టుకొందురఁట వెసన్ వసుధం బడకుండ నేర్పునన్.

ఉ. చేత ధరింప మానవులచెంతను జేరవు భూతకోటు లే
రీతిని దుష్టవిద్య లొనరించిన నెక్కువు క్రూరజీవముల్
ఘాతలు సేయ లేవు సతిగర్భమువోప సుఖప్రసూతియౌ
నాతత భాతితోఁ బ్రతిదినంబును బ్రీతి యొనర్పఁ గేతువున్.

98. అనముగుఱ్ఱి రంగయ్య

ఇతఁడు యాదవగిరిమాహాత్మ్య మనెడి యైదాశ్వాసముల పద్యకావ్యమును రచియించెను. ఇతఁడు నందవరీక నియోగిబ్రాహ్మణుఁడు; తిమ్మయామాత్య తనూభవుఁడు. ఈకవి తనగ్రంథమును రావూరి వేంగామాత్యున కంకితముచేసెను. కవియెప్పటివాఁడో సరిగా తెలియదుగాని నూఱుసంవత్సరములకుఁ బూర్వపువాఁ డనుటకు సందేహము లేదు. ఈ తనికవిత్వము శ్రావ్యముగానే యున్నది. యాదవగిరి మాహాత్మ్యములోని రెండుమూడుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. పిడుగులఁబోలు నెండసెగఁ బెట్టినపైరులు వాడిపోయినన్
మడిమడిఁ దప్ప కేతములు నాటుచు బావులు త్రవ్వి కారుపై
రిడి యొకకొన్ని బాన లటు లెత్తుచు గాడ్పులదూలి సారె నీ
రెడలినఁ జూచి యొక్కతడి యిత్తురు హాలికు లశ్రుధారలన్. ఆ-3

చ. బెళఁకులు నేర్చెఁ జూపు తిరిపెల్లు లవారిగఁ జల్లె మేనిడాల్
కెలఁకులఁ జూడఁజూడఁ బెరిగెం జనుఁబూపలు సిగ్గుదేరెఁ జె

క్కిలికవ సన్ననూలువడికె న్నడు మెక్కడనుండివచ్చెనో
చెలు లోకనాఁడు నేరుపనిసిగ్గు వధూటికి నాఁడునాటికిన్. ఆ. ౪.

ఉ. వాలికచాగుబ్రేఁగుజడ వారిపయింబడి తేలియాడుచున్
బ్రాలఁగ, నీలహంస మది వారిరుహంబని డాయ, నొక్క బ్రో
యాలి మెఱుంగుమోముమఱె నవ్వల నివ్వల రాహు కేతువుల్
బాళిని డాయ వారిమెడఁబర్వినపర్వసుధాంశుఁడో యనన్. ఆ. ౫.

---

99. తామరపల్లి తిమ్మయ్య

ఇతఁడు శేషధర్మమనెడి యైదాశ్వాసముల పద్యకావ్యమును రచియించి శ్రీరామాంకితముచేసెను. ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; శరణయామాత్యునిపుత్రుఁడు. ఇతఁడుండినకాలమేదో తెలియదు. నూఱు సంవత్సరములక్రిందట నుండియుండును. ఇతనికావ్యమునం దపప్రయోగములు కొన్నిగలవుగాని కవిత్వము మొత్తముమీఁద చక్కనిధారకలదయి శ్రావ్యముగా నుండును. ఈతనిశేషధర్మములలోని కొన్నిపద్యముల నిందుదాహరించుచున్నాను—

ఉ. తోడికులాంగన ల్మణులతోఁ గనకంబులతోడ వెండితో
వాడలవాడలన్ సిరికి వన్నెలు వెట్టుచు నాథపుత్రులం
గూడి సుఖింపఁగా మనము కూటికిఁ గూరకుఁ జిక్కి బిడ్డల
ల్లాడఁగ నెల్లకాలము మహాత్మకనుంగొనుచుండ శక్యమే. ఆ. ౧.

మ. మును పోషించినపుత్రమిత్రవనితాముఖ్యుల్ స్వకర్మంబులం
జని యెందేఁ జన వారికై జపతపస్స్వాధ్యాయము ల్మాని దు
ర్జనులం గూడి పరాపకారనియతిం బ్రౌఢత్వము ల్చూప నా
పెనుపాపంబున గర్భవేదనలు పై పెట్టెయ్యె నెట్లోగుదున్. ఆ. 3.

ఉ. అక్కడనున్న యాపశుమృగాదులు తావకపాదపద్మముల్
దిక్కని ముక్తికామినికి దీవన లిచ్చు సుపర్వు లింతయున్
నిక్కము యిగ్గిరీంద్రమున నిల్వఁగవచ్చును బుణ్యశాలికిన్
గక్కసమౌ మహాదురితకర్మలకుం వసియింప నిచ్చుటల్. ఆ. ౫.

100. నారన సూరన

ఇతఁడు వనమాలివిలాసమును కావ్యమునుజేసి, కొండూరి యక్కదండనాథున కంకితముచేసెను. నావద్దనున్న యీ గ్రంథముయొక్క ప్రతి యసమగ్రమయినది; అవతారిక లేదు. కృతిపతిమంత్రియు దండనాథుఁడు నయి యజ్ఞముచేసిన నియోగిబ్రాహ్మణుఁడు. కవి నారనామాత్యుని కుమారుఁడైన నియోగివిప్రుఁడు. ఇతఁ డాధునికుఁ డని చెప్పుటదక్కఁ గవికాల నిర్ధారణముచేయుటకుఁ బుస్తకమునం దాధారమేదియుఁ జిక్కలేదు. ఈతని కవిత్వము సలక్షణమయి మృదువుగానున్నది. వనమాలి విలాసములోని కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. గొజ్జఁగినీరుపోసి సమకూర్చినచందనవారిఁదోఁచి లా
మజ్జకతాళవృంతముల మాటికిఁ ద్రిప్పఁగ రాలుశీక రం
బజ్జలజాక్షుచెక్కిళుల యందుఁ దనర్చె ముఖేందుసుజ్వరం
బుజ్జనచేయఁ గూడఁబడియున్న యుడుప్రకరంబుచాడ్పునన్. ఆ-౧.

చ. మెఱయు కపోలపాళికలమీఁదఁ జలన్మణికుండలద్యుతుల్
గిఱికొన ఫాలభాగమునఁ గించి దుదంచితరత్నంబులై
నెఱికురు లింపుచేయఁ గమనీయవిలోచన లూఁచి రాదలల్
కొఱలి భవద్యశోమహిమ కోమలి మాటికిఁ జెప్పుచుండఁగన్. ఆ-౨

చ. కలమధురంబులైన కలకంఠివచోరచనానిగుంభనం
బులు విని సిగ్గునం బలుకుపూనిక లెల్లను బోవడించి మూఁ

గలవలె నోళ్లు మూసికొని కాననసీమలఁ జేరియున్న కో
కిలముల బుజ్జగించి పలికించు మధూదయు మాత్మసంగతిన్. ఆ-౩.

ఉ. తొల్లియు మోసపోయితివె తోయరుహానన పెక్కుమాటలో
చెల్ల మదీయధౌర్త్యములచేతనె యిప్పుడు నమ్మికొనె నీ
యుల్లము సారె నెత్తు లిడుచున్నది యాత్రికియు నాతుమించు నా
కల్లతనంబు లింతటివిగాఁ దలపోయ నరాళకుంతలా. ఆ-౮.

101. బోడూరి పెదరామామాత్యుఁడు

ఇతఁడు డాబు నేలని యోగిబ్రాహ్మణుఁడు; భారద్వాజగోత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; శివరామమంత్రికిని సీతమాంబకును బుత్రుఁడు. ఇతఁడు శివరామాభ్యుదయ మను ద్వ్యర్థికావ్యమును రచించెను. ఇతఁ డీగ్రంథమును గురజాల పేరయార్యుప్రేరణమునఁ జేసెను. కవి కృతి పేరకుని తన గ్రంథమునందు—

సీ. ఏమంత్రికులపూర్వుఁ డిలఁ జనుత్తారభారత మందె శ్రీరంగరాజునామ
మేమంత్రిముత్తాత యావల్లయజ్వ దాశౌయణీపరిణయగ్రంథమందె
నేమంత్రితాత యజ్ఞామాత్యుఁడొనరించె పస్తసంతానముల్ సరవితోడ
నేమంత్రిపిత పాగ్వతీశ్వరుఁ డాదిమదాత్తయై పద్యగద్యంబు లందె
నట్టి గురుజాలకులకలశాబ్ధివిధుఁడు
రసికుఁ డివటూరి మల్లనారాధ్యశిష్యుఁ
డభవపూజాధురంధరుఁడైన పేర
ఘనుఁడు సాంఖ్యాయనసగోత్రుఁడైనయు సిరుల.

ఇట్లు వర్ణించి, అతఁడు తన్నుఁగూర్చి పలికినట్లుగా నీ క్రింది పద్యములను జెప్పికొనియున్నాఁడు—

సీ. అనఘభారద్వాజమునిగోత్రజాతు నాపస్తంబసూత్రుఁ బ్రశస్తచరితు
ఘనుని-బోడూరి వేంకటమంత్రివరుని ప్రమహితధీబాపయమంత్రిపౌత్రు

శివరామమంత్రికి సీతమాంబకు సూనులై మించు బాపార్యరామరామ
ఘను ముద్ద్వురిలోన గణుతి కెక్కిన పెదరామకవీంద్రుఁడు శ్రీరమ్యచరితుఁ
జిత్రయమకాంధ్రసంస్కృతశ్లేషకవిత
రచనసేయంగ నేర్చి భారతికరుణను
రాజవిద్వత్సభలయందుఁ బూజితుఁ డగు
నన్నుఁ బిలిపించి పలికె బ్రసన్న ఫణితి.

సీ. నీవంశపూర్వాధీనిధి కొండకవి చెప్పె భార్గవాభ్యుదయప్రబంధ మలమి
నీయన్న బాపమంత్రి రచించె నోగిసుపాకన్యకాపరిణయకావ్య మొసఁగి
నీతమ్ముఁ డసమునం దె సిరోష్ఠ్యజానకీకళ్యాణకృతి రామకవి పరుండు
నీవు ప్రౌఢోక్తిని నిర్మించినావు కౌసల్యాపరిణయాది సరసకృతుల
మఱి యుదాహరణాది చమత్కృతులను
సంస్కృతాంధ్రకవితఁ జెప్పఁజాలినట్టి
ప్రౌఢసత్కవి వీవె ధరాతలమున
గళితగుణగణ్య పెదరామకవివరేణ్య.

ఈపెదరామకవి సంస్కృతాంధ్రకవులను స్తుతించినపిమ్మట శ్లేష కావ్యములకు మార్గదర్శియైన పింగళి సూరనామాత్యునిటు పొగడి యున్నాఁడు.

ఉ. శ్లిష్టకవిత్వవైఖరివిచిత్రత రాఘవపాండవీయము
త్కృష్టముగా రచించి జగదేకనుతు ల్గని ధాత్రిలో నవ
స్రష్ట యనంగఁ బద్మభవసన్నిభుఁ డైనమహాకవీశ్వరా
భీష్టనుప్రభావుఁ డగుపింగళిసూరకవీంద్రుఁ గొల్చెదన్.

కావ్యప్రేరకుఁడైన గురుజాల పేరయార్యుని యభీష్టప్రకారముగా నీగ్రంథమును గోదావరిమండలములోని యాచంటగ్రామమునందలి రామలింగేశ్వరస్వామి కంకితము చేయుటచేతనే కవి గోదావరిమండలములోని వాఁడగుట స్పష్టమగుచున్నది. ఈతనికాలము నిశ్చయముగాఁ దెలియ

రాదుగాని యితఁడు నూఱుసంవత్సరముల క్రిందటివాఁడని తోఁచుచున్నది. ఈతనికవిత్వధార యనర్గళమయి మృదువుగానున్నది. కవితాధోరణి తేటపడుటకయి శివరామాభ్యుదయములోని రెండుపద్యము లిందుదాహరింపఁబడుచున్నవి—

చ. తరమె నుతింపఁగా నగణితస్ఫురితాంకతఁ దద్ధరాధిసే
తరసికుఁడౌ ననంత వసుధారథుఁ డుగ్రపురారి భీముఁడు
ర్వర నుతి కెక్కిమించె వృషవాహసమాఖ్యుఁ డహీనసద్గుణో
త్కరవరుఁ డాజిభీకరనితాంతపరాక్రమశాలి యౌ ననన్. ఆ. ౧.

మ. అలరన్ దత్కుసుమారభాసురసహాయుంబొప్పఁగా దారకో
జ్జ్వలనామాహితదానకాంక్షు విబుధాంచద్భర్తమాదాన నా
కులసత్సంతతిఁ జూడవచ్చె నమితాతులు డింపుమీఱంగ మం
జులతారామమహాధ్వరాజితవరాఁశు ల్గల్గునవ్వీటికిన్. ఆ. ౨.

102. రామావఝ్ఝుల కొండుభట్టు

ఈకవి కపిలగోసంవాద మనుపేర నధ్యాత్మవిద్యాప్రతిపాదకమగు నాలాశ్వాసముల పద్యకావ్యమునురచియించి యహోబిలనృసింహస్వామి కంకితముచేసెను. ఇతఁడు వైదికబ్రాహ్మణుఁడు; హారితసగోత్రుఁడు; నరసావధానికిని అక్కమకును పుత్రుఁడు. ఇతఁడించుమించుగా నూఱుసంవత్సరములక్రిందటి వాఁడని తోఁచుచున్నది. ఈతని కవిత్వము మృదువయి నాతికఠినమయి శ్రావ్యముగానున్నది. కపిలగోసంవాదములోని యొక్కొక్క యాశ్వాసమునందలి పద్యము నొక్కొక్కదాని నిం దుదాహరించుచున్నాను—

ఉ. ద్వైతముచే ననిత్యసుతదారధనాద్యఖిలైహికోత్సవ
వ్రాతములందు దైవతనివాససుఖంబులయందు లోలుఁడై

పాతరలాడువారల కపారత నిత్యసుఖాబ్ధిదేల నే
భాతి లభించు సద్గురుకృపామహిమం బొడగూడ దేనియుక్. ఆ ౧

శా. ఔనా మీమదులం దసూయ యనసూయాదేవిపైఁ బూన మే
మానాతిం జెనకంగఁ జాలుదుమె మీయాలాపము ల్గూర్పరా
దైనం బోయెద మందు నేమగునొ యం చాదేవదేవోత్తముల్
గానంబోయిరి యమ్మునీంద్రమునిసతిక్ గాపట్యవేషంబులన్. ఆ. ౨

శా. వేదాంతార్థసముజ్జ్వలాగ్ని భవసద్విజ్ఞానదీపంబుఁ దా
నాదిక్ మానసముం గరంగఁగ సముద్యల్లీలమైఁ బూని స
మ్మోదం బొప్పఁగ హృద్గృహాంతరవసన్మోహాంధకారంబు వి
చ్ఛేదంబై చనఁజొచ్చియుండుఁగలయన్ శేషాహిభూషున్ బరున్ ఆ-3

ఉ. ఆపరమేశ్వరుండు సకలాంతరబాహ్యములందు నెల్లఁ దా
వ్యాపకుఁ డౌట లింగతనువందును బింబితుఁ డయ్యె నంతఁ జే
రూపరి జీవుఁడై మిగులరూఢిని గర్తను భోక్తనంచు సం
తాపము నొందుచుండుఁ దనుఁ దాఁ గనలేమిని నెల్లభంగులన్. ఆ-౪.

మ. ప్రతిబింబంబు లనంగ దుర్విషయతృష్ణాదిదుర్వాసనల్
సతతంబున్ మదిలోనఁ బాదుకొన నిశ్చాంచల్యముం బొంద నీ
కితరభ్రాంతులఁ ద్రిప్పుచున్ శ్రవణవాగిత్యాదిసంసర్గసం
గతులం బర్వికొనంగ లేనియవియౌఁ గౌటిల్యమాలిన్యముల్. ఆ-౫.

చ. చక్కెర పుచ్చకాయవలె సంతనగా నొనరించియుంచ నం
దెక్కడనైనఁ జేఁగు గలదే విను మాత్మయఖండరూపమై
పిక్కటిలంగ వే ఱొకటి భేదము తోఁచునె యెట్లు చూడఁ దా
నొక్కటి యొక్కటే నిజము నొక్కటి యన్నదియు న్విచిత్రమే. ఆ-౬.

---

103. హారయకవి

ఇతఁడు మైరావణచరిత్రమును పద్యకావ్యముగా రచియించెను. ఈ కవి నియోగిబ్రాహ్మణుఁడు; సర్వప్రధానామాత్యుని కుమారుఁడు. అక్కడక్కడ వ్యాకరణదోషములు కానఁబడుచున్నను మొత్తముమీఁద నీతని కవిత్వము మృదువయి మనోహరముగా నున్నది. కవనధోరణి తేటపడుటకయి మైరావణచరిత్రములోని రెండుమూఁడు పద్యముల నిం దుదాహరించుచున్నాను.—

ఉ. చెప్పఁగరానిమాయల విచిత్రపుఁజేఁతలు దాఁచి యింక వాఁ
డెప్పుడువచ్చునో యిటకు నేమఱియుండినఁ గార్యమంతయుం
దప్పునుగాన రాఘవులు తద్దయుఁ గాంచువిధంబు గొబ్బునన్
జొప్పడఁ జెప్పుఁడీ తెలియ సూనృతవర్తనులార నావుడున్. ఆ-౧.

ఉ. మారుని మోహనాంబకము మూడ్కని బ్రాణము లైదు నున్నబం
గారపుబొమ్మరీతిఁ దొలుకారుమెఱుంగులప్రోకభంగి శృం
గారరసంబునం దొలఁకఁగట్టిన పుష్పులమొత్తురీతి స
న్నీరజగంధివచ్చి తగ నిల్చెను బ్రీతిని భర్తముందటన్. ఆ-౧.

చ. దనుజ దురాత్మ నీకు నిఁకఁ దస్కరవృత్తిని జొచ్చి మాయలన్
దినకరవంశ్యులం దొడరి తెచ్చినపద్ధతిఁ బోవరాదు నా
ఘనతరవాలరోమమునఁ గట్టి జగంబులు మెచ్చ నిన్ను న
య్యనిమిషులెల్ల భీతి నిట కడ్డమువచ్చినఁ గావఁ జంపెదన్. ఆ-౨.

---

104. పరశురామపంతుల లింగమూర్తి

ఈకవి సీతారామాంజనేయమనెడు మూఁడాశ్వాసముల వేదాంత గ్రంథమును రచియించెను. ఈతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; రామమంత్రికిని తిమ్మాంబకును బుత్రుఁడు; మహాదేవయోగి శిష్యుఁడు. ఈగ్రంథము

ప్రథమాశ్వాసము తారకయోగమును గూర్చియు, ద్వితీయాశ్వాసము సాంఖ్యయోగమునుగూర్చియు, తృతీయాశ్వాసము రాజయోగ మనఁబడెడి యమనస్కయోగమునుగూర్చియు, దెలుపును. ఈ సీతారామాంజనేయ సంవాదము బహుజనులచేఁ జదువఁబడెడు జనప్రియమైన పుస్తకముగా నున్నది. కవిత్వము నిర్దుష్టమయి హృద్యముగా నున్నది. ఈకవి తన పాండిత్య ప్రకటనమునకయి యిట్టి వేదాంతగ్రంథమునందు సహితమేకాక్షరద్వ్యక్షర పద్యములను జొప్పించియున్నాఁడు. ఇతఁడు నూఱు సంవత్సరములకుఁ బూర్వమునం దుండినట్లు తెలియవచ్చుచున్నది. సీతారామాంజనేయ సంవాదమునుండి కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. ప్రాపుగ రామనామము నిరంతరమున్ భజియించువారికిం
బాపము లేదటంచుఁ బెనుపామును బట్టఁగవచ్చు నగ్నిసం
దీపితలోహఖండము నతిత్వరితంబుగ మ్రింగవచ్చు బ
లోపమ పెంచుపెద్దపులికోఱలు దీయఁగవచ్చునిద్ధరన్. ఆ-౧.

ఉ. నమ్మనమ్మనమ్ములో ననుదినమ్ము వెలుంగుచిదాత్మసత్ప్రభా
వమ్ము నిజమ్ము నేను నిధనమ్మును సంజననమ్ము రూపవ
ర్ణమ్ములుఁ గర్తృకార్యకరణమ్ములు వర్ణగుణాశ్రమాభిమా
నమ్ములు నాకు లేవనుఘనమ్మగు నావచనమ్ము నెమ్మదిన్. ఆ-౨.

శా. గానంబు న్నటనంబుఁ దాళగతులం గావించున్ జారు వి
ద్యానైపుణ్యముఁ జూపుచున్ శిరముమీఁదం గల్గు పెందొంతరన్
బూనం గైకొను నాట్యశీలునిగతిన్ బుంఖానుపుంఖోజ్జ్వల
న్నానార్థానుభవజ్ఞుఁడయ్యు బుధుఁడానందాత్ముఁ గాంచున్మదిన్. ఆ-3

105. పరశురామపంతుల రామమూర్తి

ఈ కవి శుకచరిత్రమనెడి యైదాశ్వాసముల వేదాంత గ్రంథమును రచియించెను. ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; సీతారామాంజనేయ సంవాదమును రచియించిన లింగమూర్తిపుత్రుఁడును శిష్యుఁడును; ఈతని తల్లి లింగాంబ. కవి తనతండ్రినిగూర్చియు దన్నుఁగూర్చియు నిట్లు చెప్పు కొనియున్నాఁడు—

సీ. ఆత్మభూతుఁడుగాని యాత్మభూతుఁడుగాఁడు
నిగమాగమాంతార్థనియతిదోఁప
బురుషోత్తముఁడుగాని పురుషోత్తముఁడుకాఁడు
సజ్జనానుగ్రహాసరణి మెఱయ
మృత్యుంజయుఁడుగాని మృత్యుంజయుఁడుకాఁడు
సర్వప్రపంచోపశమన మమర
నమృతసిద్ధుఁడుగాని యమృతసిద్ధుఁడుగాఁడు
ఘనరసనిధిసమంధనము దనర
ననుచుఁ దా వ్యతిరేకాన్వయప్రసిద్ధి
నలరి ప్రత్యక్షముగ నజుఁ డచ్యుతుండు
నభవుఁడమరేంద్రుఁడై యొప్పెనవనినతఁడె
లింగమూర్తియునాగురులింగమూర్తి.

గీ. అమ్మహాలింగమూర్తి లింగాంబికాకు
మారుఁడఁ దదీయసేవానుమతుఁడఁ బరశు
రామపంతులకులకంజరాజికర్య
మాకృతినిబొల్చు రామనామకుఁడ నేను.

ఇతఁడు నూఱుసంవత్సరములక్రిందటివాఁ డయినట్టు తోఁచుచున్నది. ఇతఁడు రచియించినది వేదాంతగ్రంథ మయినను కవిత్వము

మృదువయి హృదయరంజకముగా నున్నది. శుకచరిత్రములోని కొన్ని పద్యములను గవితాధోరణిని జూపుటకయి యిం దుదాహరించుచున్నాను—

ఉ. కాయవనంబునఁ ధనువుగా భ్రుకుటిం గుటిచేసి నారిగా
వాయువు గూర్చి చూపులను వాఁడిశరంబులఁ బూని షణ్ముఖిన్
బాయనిదృష్టి మాటుగొని మానసముఖ్యమృగంబులన్ సుఖో
పాయముగా వధించుమృగయారతు లుండుదు రప్పురంబునన్ ఆ-౧.

మ. లలనా యౌవనభూమి కెల్లప్పుడు వాలాయంబుగా నప్సరో
లలనారత్నము లేగి యార్ఘురులపాలం గల్గునేమంతిశా
లల నాతీరరసాలజాలముల నేలాందోలలం గేళిలీ
లల నాటల్గొని యాడుచుందురు బాలా కంటివే యిచ్చటన్. ఆ.౨.

ఉ. ఏనెటిన్నైనఁ ద్రిప్పిన హృదింద్రియబుద్ధు లహర్నిశంబు పూ
ర్వానుభవాభిలాషవిషయంబుల కే చను వాని మళ్ళి నా
నానిగమాంత శాస్త్రవచనశ్రవణాదుల నిల్పు తత్సమా
ధానమె మన్మనఃపరనిధానముగాఁగొని యభ్యసించెదన్. ఆ. 3.

ఉ. యోగిజనాశ్రితానిలనియోగము సాధకలక్ష్యలక్షణో
ద్యోగము దేవదత్తవినియోగము సంతతముక్తి కామినీ
భోగము నిత్యసత్త్వగుణపూగము దృష్టపరాత్మజీవసం
యోగమునొందఁజేయుభవయోగవియోగమురాజయోగమున్. ఆ-౪

మ. జనకుం గాంచితి భేదవాదమతముల్ చెండాడితిన్ శక్తివా
దిని భంగించితి నాగమాంతమతముక్తిన్ నిల్పి మెప్పింప న
న్గని మోదించినముక్తికాంతను మహాకల్యాణయుక్తంబుగా
నెనయంగూర్చె నతండు దానిఁగొని యే నేతెంచితి న్వేడుకన్. ఆ.౫.

106. వేగినాటి కొండనార్యుఁడు

ఈకవి వివేకసింధువ నెడి యైదాశ్వాసముల వేదాంతగ్రంథమును రచించెను. ఇతఁడు వేగినాటి నియోగిబ్రాహ్మణుఁడు; శ్రీవత్సగోత్రుఁడు. మొట్టమొదట నీవివేక సింధువును నాంధ్రవచనకావ్యమునుగా రచియించిన ముకుందయోగిని కవి యీక్రింది పద్యమున స్తుతించియున్నాఁడు—

మ. వినుతింపన్ భవరోగవైద్య మగునీవేదాంత శాస్త్రంబు పా
వనమైయుండఁ బ్రవీణతన్ వచనకావ్యం బొప్పఁగాఁ జేసి స
జ్జనులం బ్రోచినపుణ్యమూర్తి విమలస్వాంతుండు విజ్ఞానశా
సనుఁడై నట్టిముకుందమౌనికి నమస్కారంబు గావించెదన్.

ఈకవియు నూఱేండ్ల క్రిందట నుండి యుండవచ్చును. శుకచరిత్రము నందు వలెనే యీవివేకసింధువునందును వ్యాకరణ విరుద్ధములైన ప్రయోగములు కొన్ని కనఁబడుచున్నను మొత్తముమీఁద కవిత్వము మృదువయి శ్రావ్యముగానున్నది. కవనరీతి తేటపడుటకయి వివేకసింధువు నుండి కొన్నిపద్యము లిం దుదాహరింపఁ బడుచున్నవి—

చ. కడువడిఁ గర్మమార్గ మనుకాఱడవిం బడి విభ్రమించుచున్
జడమతి నింద్రియార్థఫలసంచితతిక్తకషాయసారముల్
దడఁబడఁగ్రోలి దుర్వ్యసనదాహమునన్ వెగ డొంది సుక్రి మీ
యడుగులు గాంచితిన్ ననుఁ గృపామృతమానఁగనిచ్చిప్రోవవే. ౧

మ. వడిగాఁదీసి ధనుర్ధరుండు విడువం బాణంబు నొందాఁక న
వ్వాడిగల్గున్ శర మంతదాఁక నడుచున్ వమ్మైన యచ్చోటనే
పడుఁ బ్రారబ్ధపుఁగర్మవేగమున నాపర్యంతమున్ దేహముల్
పడ వావేగము తూలినం బడును జూ భగ్నంబులై మేదినిన్. ౨

మ. సమతన్ మేఘుఁడు వారిధారలు మహిన్ సంప్రీతి వర్షింపఁ బ
ల్లములై యుండినచోట్ల నీరు నిలుచున్ రక్షింపఁగాబండపై

దుముకన్నగము నిల్వ దట్లగుట నెందుం బాత్ర మూహించి యు
త్తమునందుం దగ బ్రహ్మవిద్య నిలుపన్ ధర్మంబు చింతింపఁగన్. ఆ-౩.

మ. తనువుల్ స్వప్నమనోరథంబుల క్రియన్ దండోపతండంబులై
యనయంబుం బొడచూపుఁ బోవు నివి కర్మాధీనసంప్రాప్తముల్
ఎనయ న్నాకును వీనితోఁ దగులు లేదెల్లప్పుడున్ నే ఘనుం
డను నిత్యుండ నిరామయుండ విమలుండన్ సాక్షిచైతన్యుఁడన్. ఆ-౫

ఉ. అప్పుడు పుట్టినట్టిశిశువందును జవ్వనియై మిటారియై
యొప్పులకుప్పయైన వికచోత్పలలోచనయందు వార్ధకం
బుప్పతిలంగ నున్నముదియుగ్మలియందును నిర్వికారుఁడై
చెప్పెడి దేమి యొందు సమచిత్తుఁడు పండితుఁ డెంచిచూడఁగన్. ఆ-౮

107. వాసుదేవయోగి

ఈ కవి జీవప్రబోధమనెడు నాలుగాశ్వాసముల వేదాంతగ్రంథమును రచియించెను. యోగశాస్త్రములను పేర రచియింపఁబడిన వేదాంతగ్రంథములలో ననేకములకంటె నిందలి కవిత్వము సలక్షణమయి హృదయంగమముగా నున్నది. కవి యేకాలపువాఁడో తెలియదుగాని నూఱు సంవత్సరముల పయివాఁ డని తోఁచుచున్నది. జీవప్రబోధములోని రెండు పద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. అనవిని జీవుఁ డిట్లనుఁ బ్రయత్నముఁ బ్రాప్యపదంబు లేక తా
ననయము ఖండమై జగములందును గారణకార్యరూపతం
బెనఁగొనియున్న యాత్మ కొకపిండపదంబుఁ బ్రయత్నసాధన
బున నిఁ గల్గునే యనుచు బుద్ధికిఁ దోఁచెడి వీనిఁ జెప్పవే. ఆ-౩.

ఉ. అంధతమఃప్రకృత్యనుగతాత్ముల శుద్ధశరీరశుద్ధిచే
బంధవిముక్తిఁ గోరి కరిభంగిని నీట మునుంగ దేహదు
ర్గంధము వాయుఁగాక భవకర్మనిబంధవిముక్తి కల్గునే
బంధురరాగదోషములఁ బాసిన శుద్ధతఁ గాక జీవుఁడా. ఆ-౪.

108. కానాల నరసింహకవి

ఈ కవి హరివంశములోని యాశ్చర్యపర్వమునందలి శేషధర్మముల నెనిమిదాశ్వాసముల పద్యకావ్యమునుగా రచియించెను. ఈతఁడు నందవరీక నియోగిబ్రాహ్మణుఁడు; వాసిష్ఠగోత్రుఁడు; వేంకటేశయామాత్య పుత్రుఁడు; ఈతని వాసస్థలము తటిగొండగ్రామము; ఇతఁడు తన శేష ధర్మగ్రంథమును తటికొండ నృసింహస్వామి కంకితము చేసెను. ఈతనికాల మేదియో తెలియరాలేదు. ఇతఁడు తన గ్రంథమునందు—

"గీ. ఆంధ్రవిద్వజ్జనాచార్యు నన్నపార్యు
సుజనగుణమానసోత్పలసోము సోము
సురుచిరాలంకృతిభ్రాజి సోమయాజి
సత్కవిసనాథు శ్రీనాథు సన్నుతింతు."

అని యాంధ్రకవులకు వర్ణించుచోఁ దమనందవరీకులలో సుప్రసిద్ధులైన పెద్దనాదికవులనుసహితము వర్ణించియుండలేదు. ఇంతమాత్రముచేత నితఁడు పెద్దనాదికవులకంటెఁ బూర్వుఁ డనికాని వారితోడి సమకాలికుఁ డనికాని చెప్ప వలనుపడదు. ఇతఁ డించుమించుగా నూఱు నూటయేఁబది సంవత్సరముల క్రిందట నుండి యుండవచ్చును. అక్కడక్కడఁ గొన్ని విలక్షణములైన ప్రయోగము లున్నను కవిత్వము మొత్తము మీఁద మృదువయి నిరర్గళధార కలదిగా నున్నది. ఈతని శేషధర్మముల లోనుండి కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను.

చ. పటుతరమేఘమండలవిభాసితసౌధచయోపరిస్థితో
త్కటవరహేమకుంభసముదాయధగద్ధగితోరుకాంతివి
స్ఫుటచపలాకృతి న్నెఱయఁజూడఁగ వచ్చినవారలెల్ల ని
చ్చ్చటఁ గలచంచలల్ కడునచంచల లంచుభ్రమింతురెంతయున్. ఆ-౧

చ. ఘనవిషజంతుపూరిత మగాధము కూపము దీనిఁజూడు నీ
వొనరఁగఁ గూఁతు నియ్యవు తిఁకోదక మియ్యవు గాన దాన మా

తనువులు జీర్ణతం బొరసె దారుణరూప సమేతకూపమం
దును బడియున్నవార మతిదుఃఖసమాకులతన్ మహాత్మకా. ఆ-౨

శా. దారాపత్యయుతుం డకించనుఁడు విద్వాంసుండు వేదాంతమా
ర్గారూఢుండును వృత్తిహీనుఁడును నిత్యానందుఁడున్ శ్రోత్రియుం
డై రాజిల్లిన బ్రాహ్మణోత్తమున కత్యానందులై జీవనం
బీరే దాతలు పొందరే సుగతు లుర్వీశా ధరామండలిన్. ఆ-౩

ఉ. నీసము లెందఱో శమనునిం గనఁబోయిరి నీకుఁజావురా
దాసకుఁ బుట్టినిల్లయి మహాకలుషంబు లొనర్చి సభ్యులన్
మోసముచేసి నేఁ డిటులుమూల్గినఁ బోవునె తత్ఫలంబు నిన్
బాసినఁ గల్గు మా కఖిలభాగ్యము లేగుము కాలుప్రోలికిన్. ఆ-౪

మ. అనుచున్ దూతి మహీవరా సుతకళత్రార్థంబుగాఁ బాపచిం
తన లర్థార్జనఁజేసి వారి నిరవందం బ్రోతు రంతంబునన్
దనవెంటం జనుదెంతురే కడపటన్ దా నొక్కఁడే పోవుటల్
గనియున్ మోహాలతానిబద్ధు లగుచున్ గానంగలే రింతయున్ ఆ-౫

మ. సతియుం దానును బుత్రపౌత్రయుతుఁడై సంప్రాప్తసర్వేష్టుఁడై
యతిసంతోషమున్ముఱాఁగా మెలఁగి దేహాంతంబునన్ లోకపా
లతతుల్ పూజ లొనర్ప సర్వసుఖసంప్రాప్తుండునై బ్రహ్మలన్
క్షితిపైఁ బుట్టెను జక్రవర్తి యగుచున్ జిత్రోముదంబొప్పఁగన్. ఆ-౬

చ. పొలుపగు కాంచనంబుఁ దిలపుష్పము నచ్చెలి నాసికోపమం
బలరఁగవచ్చి దానిసమ మాటకుఁజాలక యూర్ధ్వదృష్టిఁ గొ
మ్మలఁ దలక్రిందుగాఁ దపము మానుగఁజేసి ఫలించువేళ మే
నులు విడిచెన్ నలంగఁడె ఘనుండయినన్ బలవద్విరోధియై. ఆ-౭

ఉ. నీవును దీపదానములు నెమ్మిగఁ జేయుము దాన మోక్షమున్
శ్రీవరుఁ డిచ్చుజ్ఞానమును జేకుఱు జ్ఞానముచేత మోక్షమున్
భూవర నీకుఁ గల్గు హరిపూజ లొనర్పుము కార్తికంబునం
దీవిలేతిహాసము మహిన్ వినువారికిఁ గల్గుసౌఖ్యముల్. ఆ-౮

109. రామనామాత్యుఁడు

ఈకవి గయోపాఖ్యాన మనెడి రెండాశ్వాసముల ప్రబంధమును మును రచియించెను. ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; తిమ్మనమంత్రి పుత్రుఁడు. గయోపాఖ్యానమునకు కృష్ణార్జున సంవాదమని నామాంతరము గలదు. ఈతఁడు నూఱుసంవత్సరముల క్రిందటివాఁడయి యుండ వచ్చును. ఇతఁడు తనగ్రంథమును శ్రీమదహోబిల నృసింహస్వామి కంకితము చేసెను. ఈతని గ్రంథమునందు లక్షణవిరుద్ధములైన ప్రయోగము లనేకము లున్నను, మొత్తముమీఁద కవిత్వము సరసముగానే యున్నది. గయోపాఖ్యానములోని పద్యములు రెండిందు క్రిందఁ జేర్పఁబడుచున్నవి.

ఉ. వారిజనాభ నీవనుప నాసవనందనుఁ డున్న చోటికిన్
జేరి హిమాద్రిధైర్యునకుఁ జెప్పితి బుద్ధులు పెక్కురీతులన్
భూరిదయార్ద్రి యాఘనునిబుద్ధికి నేమని యెంచిచూడ నీ
ధారుణిఁ బాండవేయులకు దాపుదండయు నీవెకా హరీ. ఆ. ౧.

ఉ. ఏమని చెప్పవచ్చు బళి యీబలపార్థుల బాహువీర్యముల్?
రామునిసాటి వత్తురు శరాసనవిద్యకు వీరిధైర్యముల్
హేమమహీధరంబునకు నెక్కువ వీరలతోడ మార్కొనన్
సోమధరుండు వాసవుఁడు సూర్యకులోద్భవుఁడైన నోర్తురే. ఆ. ౨.

110. పోచన

ఈకవి చంద్రాభ్యుదయ మను ప్రబంధమును. రచియించెను. ఇతఁడు వైదికబ్రాహ్మణుఁడు. ఈతనితండ్రి నృసింహసోమయాజి. ఈ చంద్రాభ్యుదయము అమ్మనమంత్రి కుమారుఁడగు చిన్నయామాత్యున కంకితము చేయఁబడినది. ఈకవికాల మేదో తెలియరాలేదు. ఇతఁడు నూఱుసంవత్సరములకంటెఁ బూర్వమునందుండినట్లు తోఁచుచున్నది. ఈప్రబంధము శబ్దాలంకారములతో నిండి శ్రావ్యముగా నున్నది. చంద్రా

భ్యుదయములోని పద్యములు రెం డిందుక్రిందఁ బొందుపఱుపఁబడు చున్నవి—

చ. తిమిరపుజవ్వనంబున నతీతసతీతనువృత్తమైనచి
త్రముతమి పౌరవారవనితాజనతాజనితానురాగయో
గమున మునింగి దర్పకవికారము ఘోరముగా ఘటింపన
క్కామరుమిటారిబారిపడి కుంతితివృత్తిఁ గ్రమక్రమంబునన్. ఆ. ౧.

చ. అన విని గుండె జల్లుమన నవ్వనితామణి యమ్మచెల్ల యీ
యన మదనాతురత్వమని యాత్మఁ దలంచి తలంచి సాధ్వసం
బున వెఱఁగుం దపంబడఁగఁ బొంపిరి నిట్లను భర్త తోడ ని
య్యనువున మిమ్ముఁ బ్రోవఁగ మహాత్మ యొరుల్ మన కెవ్వరియ్యెడన్ ఆ-౨

111. పెనుపల్లె బాపనామాత్యుఁడు

ఈకవి సీతావిజయమను నేకాశ్వాసప్రబంధమును రచించెను. ఇతఁడు నియోగి బ్రాహ్మణుఁడు; కోనయామాత్యపుత్రుఁడు. ఈతని కవిత్వమునందు లక్షణవిరుద్ధములైన ప్రయోగము లక్కడక్కడఁ గానఁబడుచున్నవి. కవనరీతి తెలియుటకయి సీతావిజయమునుండి రెండు పద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

ఉ. పోల శతాననుండు శివపూజ యొనర్చుచు నుండి యంతలో
నాలమువార్త కర్ణములయందు వినంబడ నుల్కి యుగ్రుఁడై
చాలును దేవపూజయని చారులఁ గన్గొని యేమి మత్పురిన్
జాలఁగ సందడుల్ గలుగుచందము తోఁచెను జెప్పుఁ డంతయున్.

ఉ. భూరిరయంబునం దొడరి భూసుత కన్నుల నెఱ్ఱచేసి యో
రోరి శతాస్య త్రుంగి తని యొక్కటి బాణసహస్రకోటి తా
నారజనీచరేంద్రు తనువందును గ్రుచ్చిన నెత్తు రొల్కఁగాఁ
బోరుచు వాఁడు నొప్పెసఁగఁ బూచిన మోదుగుచెట్టుకైవడిన్.

112. చదువుల సోమలింగయ్య

ఈ కవి మదనసాయక విలాసమనెడి యైదాశ్వాసముల శృంగార ప్రబంధమును రచియించి శ్రీశైలమల్లికార్జునున కంకితముచేసెను. ఇతఁడు శైవబ్రాహ్మణుఁడు; గారుత్మతద్యుతిగోత్రుఁడు. వేంకటాచలమహారాధ్యునకును అన్నపూర్ణమకును పుత్రుఁడు. ఇతఁడేకాలపువాఁడో సరిగాఁ దెలియరాదు. ఇతఁ డించుమించుగా నూఱుసంవత్సరములక్రిందట నుండి యుండును. ఈతని కవిత్వము మృదుమధురపాకమున వెలయుచున్నను నిర్దుష్టమైనది కాదు. ఒక్కొక్క యాశ్వాసమునుండియొక్కొక్కటిచొప్పున నిందుక్రింద నుదాహరింపఁబడిన పద్యములనుబట్టి కవియొక్క కవిత్వరీతి కొంతవఱకు తేటపడవచ్చును—

చ. చని శశికాంత సంఘటితచారుసువర్ణవికారసౌధమం
దును నెనలేని గద్దెపయి దోరముగాఁ గొలువుండి సాధుస
జ్జనపరివారయుక్తుఁడయి సత్యముఁ దప్పక మూఁడులోకముల్
తనదుయశంబు గప్పఁగను దద్దయు రాజ్యము చేయుచుండఁగన్. ఆ-౧

చ. అని దరిఁజేరి బాలకుని నక్కునఁజేరిచి చెక్కుదోయి ము
ద్దొనరిచి ముంచు దువ్వుచు మృదూక్తులు పల్కి కడింద్రివేసు నె
మ్మనమున నల్లిబిల్లికల మాటికి నల్లుకొనంగ నక్కుమా
రుసముఖచంద్రదర్శనవిలోచనకైరవుఁ డౌచు నయ్యెడన్. ఆ. ౨.

చ. తెలివాలురుమంజిముత్తెములు తీరుగనిల్పిన క్రేవఁ జక్కనా
బలువగు కెంపుగుంపుల శుభస్థిత కాంతులు చల్లుమేలుక
మ్మలకు నివాళులిచ్చు కనుమచ్చికలున్ జెలువొందఁ దాని పు
వ్వులసర మొక్కకేల నిడి యొప్పుగ నప్పురి కేఁగుచుండఁగన్. ఆ-౩.

ఉ. ఉల్లము చల్లగాఁ గనినయొప్పులకుప్పపయిన్ సుమాస్త్రముల్
పెల్లుగ నేసినట్టికడు పెద్దపు నీ కాకలక్ష్యమా నవా

త్ఫుల్లసరోజలోచనలపాంక మహించుట మచ్చ్రసూ ధరన్
తల్లికి ముక్కుకోసి పినతల్లికిఁ గన్ను లొసంగనేర్తురే. ఆ-౮.

ఉ. మారునిగేరు వీని సుకుమారశరీరము నవ్యచంద్రికా
సారముతీరు హాసము సుసారససారము లౌరు కన్నులిం
పారెడు గండుతుమ్మెదలబారులనే ల్కురు లౌర వీనిసిం
గారము నీరజాసనునికైన మదిం దలఁపంగ శక్యమే. ఆ-౫.

---

113. శ్రీధరమల్లె వేంకటస్వామి

ఇతఁడు బ్రహ్మోత్తరఖండము నయిదాశ్వాసముల పద్యకావ్యమునుగాఁ దెనిఁగించెను. ఇతఁడు బడగలనాటి కన్నడవంశజుఁడు; ఆశ్వలాయనసూత్రుఁడు; భారద్వాజగోత్రుఁడు; అయ్యనార్యతనూజుఁడు. కవి యీ గ్రంథమును జ్యోతిరామనాదుల ప్రేరణముచే రచియించి, సిద్ధవటమునకు సమీపమునను్న యంబాపురమందలి పార్థినేశ్వరస్వామి కంకితము చేసెను. ప్రేరకులగు న రామనయు లక్ష్మీనారాయణుఁడును జెంగల్వరాయఁడును దన్నుఁగూర్చి పలికినట్లుగాఁ గవి యీ క్రిందిపద్యములలోఁ జెప్పుకొన్నాఁడు—

శా. శ్రీమద్వేంకటరామనామునిఁ గవిశ్రేష్ఠున్ రమావల్లభ
ప్రేమాపాంగవిశేషలబ్ధకవితాభివ్యక్తసూక్తిస్ఫూర్తిం
గామారిస్తవభక్తియుక్తు విలసద్గాంభీర్యధైర్యాఢ్యు స
న్నామోదంబునఁ జూచి పల్కిరి సముద్యత్కౌతుకం బొప్పఁగన్.

* * * * *

క. ఖండేందుధరప్రియ మా । ఖండలభాగ్యప్రదంబు కల్మషలతికా
ఖండన మగుబ్రహ్మోత్తర।ఖండమురచియింపుపద్యకావ్యముగాఁగన్.

ఈ కవి యీ బ్రహ్మోత్తరఖండమును రచియించి యెనుబదిసంవత్సరము లయినట్టు గ్రంథాంతమునందలి యీక్రింది పద్యమునుబట్టి తెలియ వచ్చుచున్నది—

సీ. శరవర్గ గణనంబు శైలరామమునీందుపరిమితంబై ధాత్రిఁబరఁగుచుండు
యువనామసంవత్సరోపేత కార్తికమాసరాజిత పౌర్ణమాసియందు
ధన్యులు విష్ణువర్ధనసగోత్రులు జ్యోతిసుబ్బన్నపుత్రులు సుగుణమణులు
రామన్నలక్ష్మీనారాయణచెంగల్వరాయుఁడు ననమువ్వు రమలయశులు
చిత్తమున భక్తి వెలయ బ్రహ్మోత్తరాఖ్య
ఖండ మాంధ్రప్రబంధంబుగా ఘటించి
యెలమి సంబాపురపుఁ బార్థివేశ్వరునకు
భాసురముగ సమర్పణఁ జేసి రపుడు.

పయిపద్యమునుబట్టి శాలివాహనశకము ౧౭౩౭వ సంవత్సరము నందన్ఁగా క్రీస్తుశకము ౧౮౧౫వ సంవత్సరమునం దీగ్రంథము రచియింపఁ బడినట్టు స్పష్టముగాఁ దెలియవచ్చుచున్నది. ఈగ్రంథమునం దక్కడ క్కడఁ గొన్నివ్యాకరణదోషము లున్నను మొత్తముమీఁదఁ బుస్తకము హృదయరంజకముగానేయున్నది. బ్రహ్మోత్తర ఖండములోని పద్యములు కొన్ని యిం దుదాహరింపఁబడుచున్నవి—

ఉ. ఓమునిసార్వభౌమ మహిమోజ్జ్వల మీ రిట కేఁగుదెంచుటన్
నామది సంతసం బొదవె నాదుగృహంబు పవిత్ర మయ్యె మ
త్కామితము ల్ఫలించెఁ గడుధన్యుఁడ మాన్యుఁడ నైతి నంచు నా
భూమివిభుండు పల్కుచును బూజలొనర్చె మహాముదంబునన్ ఆ.౧

శా. ఆరాజేంద్రుఁడు కంఠసూత్రరహితన్ వ్యక్తాంజనాపాంగి శృం
గారప్రాభవహీనగాత్రి గళితగ్రైవేయహారాదికన్
దూరీభూతశుభాంగరాగతిలకన్ దుర్వారశోకార్దితన్
సారాచారపరాయణం గనియె నాసాధ్వి న్విచిత్రంబుగన్. ఆ. ౩.

మ. రణదుద్యన్మణిదీప్యమానకనకగ్రైవేయకోటీరకం
కణహారాంగదనూపురాదుల నలంకారంబు గావించినన్
క్షణమాత్రంబునఁ బాయఁద్రోచి కడువేడ్కన్ లక్ష్మిట రుద్రాక్షభూ
షణము ల్దాల్తురు వారలిర్వురు మహోత్సాహంబుదీపింపఁగన్. ఆ-౨

---

114. ఓరుగంటి సోమశేఖరకవి

ఈకవి రామకృష్ణార్జున రూపనారాయణీయమను నాలుగాశ్వాసములత్ర్యర్థి కావ్యమును రచియించి శ్రీపూసపాటి నారాయణరాజుగారి కంకితము చేసెను. పుస్తకముయొక్క పేరుచేతనే యిందు రాఘవయాదవపాండవార్థము లిమిడియున్నవని తెల్లమగుచున్నది. ఈకవి వైదికబ్రాహ్మణుఁడు; కౌండిన్యసగోత్ర సంభూతుఁడు. ఇతఁడు సంస్కృతాంధ్రములయందు చక్కని వైదుష్యము కలవాఁడయి కవితారచనయం దత్యంత సామర్థ్యము గలవాఁడుగా నుండెను. ఇతఁడు నూఱుసంవత్సరముల లోపలివాఁడు. ఈతని త్ర్యర్థికావ్యములోనివి కొన్నిపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

శా. సంభూతాతివిభూతి దర్శనకళాసంపన్నుఁ డారాజు స
ద్గాంభీర్యాంబుధి యేలె సర్వధరణిన్ గాంగేయచాపోరుసం
రంభప్రాఢిసహాయుఁడై విదురసారన్యాయమార్గంబుతో
శుంభత్కీర్తి మహోత్పలప్రియకులస్ఫూర్తుల్ విజృంభింపఁగన్. ఆ-౧

ఉ. సంతస మొప్పఁ దోఁచెను వసంతము మంజులకోకిలస్వనా
క్రాంతము కోరక ప్రకర కాంతము బంభరగానశోభితా
శాంతము సర్వమంగళసుశాంతము మోచితమానమానినీ
స్వాంతము ధూతసత్పథికశాంతము ఫుల్లలతాంతతాంతమై. ఆ. ౨.

చ. సుజనకృత స్తవా జనకసూక్తి యలంఘ్య మదెన్ని చూడఁడా
నిజము సమక్షమందుఁ దగనిన్ను సమర్థుఁగాఁ దలంచి త
ద్ద్విజము నుతింపఁ బంచుపని వారకచేయ సుధర్మసంస్థితిన్
గుజనులు ద్రుంక శ్రీహరిని గొల్చినవాఁడనయంబు నెమ్మదిన్. ఆ.3.

శా. కళ్యాణీభవదర్పితో గ్రవరసత్కారుణ్యతన్ సద్విపత్
కళ్యాణీధగవిష్ణువన్యవసతీకాండప్రభూల్లంఘనా
కళ్యాణాతిశయంబు నాకు నిచటన్ గల్గె న్నిరాఘాటమై
కళ్యాణాంబర కాంతుఁజేయుముకృపన్ గాంభీర్యధీప్రోత్కటన్. ఆ. ౪.

---

115. ముడుంబి వేంకటాచార్యుఁడు

ఈకవి రసప్రదీపిక యనెడు మూఁడాశ్వాసముల వైద్యగ్రంథమును జేసెను. ఇతఁడు శ్రీవైష్ణవుఁడు; శ్రీవత్సగోత్రుఁడు; వేదాంతాచార్యపుత్రుఁడు. ఇతఁడు గోదావరీమండలములో నూఱుసంవత్సరములకు లోపలనుండినవాఁడు. కవిత్వమునందుఁ గొన్ని స్ఖాలిత్యములు గలవు. రసప్రదీపికలోని రెండుమూఁడుపద్యముల నిందుదాహరించుచున్నాను-

ఉ. పారదగంధకంబు లొకభాగము నాలుగుభాగముల్ నవా
సారము కుప్పెఁబెట్టి పదిజాములు వండినఁ గెంపుసొంపుతో
ధారుణిఁ బుట్టు సిందుర ముదారత నద్దిగయెత్తు నిచ్చినన్
బోరన రోగపుంజములఁ బోవహరించు నమోఘవీర్యమై. ఆ ౧.

చ. ఘృతమునఁ గొండపిప్పలి మిరెంబులతోడుత నభ్రకంపు సం
తతమును జిన్నమెత్తు గొన దారుణమౌ కఫవాతపిత్తసం
యుతగ్రహణీక్షయంబుల వియుక్తప్రమేహగుదాంకురంబులన్
గతముగఁజేసి దీపనము గల్గఁగఁజేయు నమోఘవీర్యమై. ఆ-౨.

ఉ. మంచి సువర్ణ భస్మము క్రమంబునఁ గొన్నను రాజయక్ష్మముల్
సంచితకర్మజంబులగు సర్వరుజంబుల భూతవేధలల్
ద్రుంచి యమోఘవీర్యమయి దోర్బలముల్ ఘనకాంతి తేజము
త్యంచితబుద్ధిమార్గము చిరాయు వొసంగును మానిచంద్రమా. ఆ-3.

---

116. అక్కెనపల్లి నృసింహకవి

ఈ కవి యాదిలక్ష్మీవిలాసము, వల్లభాంబాపరిణయము, ఓఘవతీ పరిణయము, అను మూఁడు ప్రబంధములను రచియించెను. వీనిలో నోఘవతీపరిణయము శ్రీగోడే జగ్గారాయనింగారి పుత్రులగు శ్రీసూర్యప్రకాశ రాయనింగారి కంకితముచేయఁబడి తత్సోదరపుత్రులగు శ్రీమహారాజా గోడే నారాయణగజపతిరాయనింగారిచే ముద్రింపింపఁబడినది. ఈగ్రంథము శాలివాహనశకము ౧౭౩౯ వ సంవత్సరమునందు రచింపఁబడినట్లు గ్రంథాంతమందలి యీ సీసపద్యమువలనఁ దెలియవచ్చుచున్నది—

సీ. శాలివాహనశకసంవత్సరంబు లజాగ్ని భూధరతుషారాంశులైన
యీశ్వరాబ్దంబున నెసఁగు వైశాఖమాసంబున శుక్లపక్షమున మూర్తి
శశిసంఖ్య భౌమవాసరమున శుభవేళ నక్కెనేపలి నృసింహకవి యోఘ
వతిపెండ్లికథ సమున్నతిమీఱఁజెడి గోడెజగ్గారాయసూర్యప్రకాశరాయ
మణికిరాజ్యాయురారోగ్యమహితపుత్ర
పౌత్రనికరాభివృద్ధిగా భవ్యబుద్ధిఁ
గృతి యొసంగెను దద్యశం బతిశయిల్లి
జగతి నాచంద్రతారార్కముగఁ జెలంగ.

ఇతఁడు కృష్ణామండలములోని యెల్లమంద నివాసుఁ డయినను తన యాదిలక్ష్మీవిలాసమును గోదావరీమండలములోని యంతర్వేది

నృసింహస్వామి కంకితము చేసెను. ఆదిలక్ష్మీవిలాసము నాలుగాశ్వాసములుగల ప్రౌఢకావ్యము. వల్లభాంబాపరిణయ మను విఘ్నేశ్వరుని పెండ్లికథ మూడాశ్వాసముల ప్రబంధము. ఇది పులిపాక సీతయామాత్య పుత్రుఁ డయిన రామమంత్రి కంకితము చేయఁబడినది. ఈ కవి నియోగిబ్రాహ్మణుఁడు; కౌండిన్యగోత్రుఁడు; జోగయామాత్య పుత్రుఁడు. ఈకవి నూఱుసంవత్సరములకు లోపలివాఁడు. ఈతని కవిత్వము రసవంతముగా నున్నది. ఈతని పుస్తకములోని యీ క్రింది పద్యములవలన నీతని కవితాధోరణిని గొంత తెలిసికొనవచ్చును—

ఆ ది ల క్ష్మీ వి లా స ము.

ఉ. మాయలు నింద్రజాలములు మా కవి క్రొత్తలుగావు మామనో
నాయక యిప్పుడీవు రతినాయకసాయకభిన్నకాయనై
పాయని మోహమందుననుఁ బన్నుగఁ గౌఁగిటఁగూర్చి యొయ్యనన్
శ్రీయుతసౌఖ్యవైఖరులుచేరఁ దలంపులుదీఱఁ గూడుమా. ఆ-౧.

ఉ. ఎక్కడిగొల్లవాఁడ విది యెక్కడిజాణతనంబు దొంగవౌ
టెక్కడిపౌరుషంబు మది నింత తలంపక ప్రాలుమాలినన్
దక్కునె నీకుఁ గోక లవి తక్కకయిమ్మికఁ గామవలీవే
యక్కలతోడ నీసరసి నాడఁగఁ జీరలు దొంగిలింతువే. ఆ-౨.

ఉ. వారిజనేత్ర మీచరణవారిజముల్ హృదయాంబుజంబునన్
గూరిమినిల్పి యెల్లపుడుఁ గొల్చురమాసతియంచు రుక్మిణిం
దారయలేక చైద్యునకు నంగన నిచ్చెదనన్నమాట బ
ల్నారసమట్ల కర్ణమున నాఁటఁ ననుం గృపఁ గాంచి యిట్లనెన్. ఆ-౪.

వ ల్ల భాం బా ప రి ణ య ము.

చ. అరయఁగ సిద్ధసాధ్యగరుడామరకిన్నరనాగయక్షకిం
పురుషులయిండ్లలో నెలమిఁ బుట్టెదఁ జేనెడుపొట్ట మీ గణే

శ్వరునకుఁ బెద్ద దేల యనిశంబును బొట్టిగ బ్రహ్మచారియై
పరఁగెడిమేటికిం గతెనభావులతో నిల వియ్య మేటికిన్. ఆ-౨.

చ. ముద మొదవించు ముచ్చటల ముంచును గంధముఁ బెంచుసౌఖ్యము
ల్గనుఁగ నించు నించువిలుగొంచుఁ జరించువజీరుశాస్త్రసం
పద గడియించు నిష్ఠురసపద్ధతుల న్నిరసించు మించు ని
మ్మదిరయటంచు నెంచుచు నుమానుగ గ్రావ్విరిమించు బోండ్లఁగన్. ఆ-౨

ఓఘవతీపరిణయము.

ఉ. మేలగుమేలు గూర్చుటకు మీ రరుదెంచితి రంటివౌబళీ
చాలు భవన్మనోరథముచక్కఁ లభించుఫలం బటంచు నా
లోలవిశాలనేత్ర యెదలోఁ గలతియ్యనివిల్తు నొయ్యనన్
మేలుకొనంగఁజేసి యెలమిం జని సంయమిరాజు సయ్యనన్. ఆ. ౧.

ఉ. అంతట నేర్చె విద్య లినుమంత శిలాంత యలంతలేక భూ
కాంతునిముద్దుపట్టి యజుకాంతయె యంచుసమస్తసజ్జనుల్
వింతగ సంతసించి తను వేయివిధంబుల సన్నుతింప న
త్యంతకళావినోదమహిమాతిశయంబు శయంబుఁ జేరఁగాన్. ఆ. ౪.

---

117. పైఁడిపాటి వేంకటనృసింహకవి

ఈకవి నృసింహవిలాస మను మూఁడాశ్వాసముల గ్రంథమును రచియించెను. ఈతఁ డాఱువేలనియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; శఠమర్షణగోత్రుఁడు; లక్ష్మీపతికిని వేంకమాంబకును బుత్రుఁడు. ఈతఁడు నెల్లూరిమండలములోని పైఁడిపాటి గ్రామనివాసుఁ డయి గ్రామచతుష్టయమునందు స్థావరజీవనము కలవాఁ డయినట్లు నృసింహవిలాసములోని యీక్రిందివచనమువలనఁ దెలియవచ్చుచున్నది—

సీ. క్షితితలంబున నొప్పు కృష్ణాపినాకినీదివ్యనదీమధ్యదేశభూమిఁ
గడుఁబూర్వవార్థికిఁ బడమట యోజనదూరమై తగుఁ గందుకూరు మఱియు
నదియె సీమానామమైయొప్పు నాకందుకూరికిఁ దనరు వాయవ్యదిశను
బాలేట దానికిఁ బౌలస్త్యదిశఁ బైఁడిపా డొప్పు దానికిఁ బశ్చిమమున
నెగడుఁ జతుకుపాడు నైఋృతి వేంపాడుఁ
జెలఁగు గాడ్పుమూల నిలవరయన
నమరుపురచతుష్టయం బిది తృణకాష్ఠ
జలసమృద్ధి సిరుల నలరుచుండు.
గీ. గ్రహణవేళ గోపరాజు రామన గోల
కొండప్రభువుచేతఁ గొనినదాన
మహిమ దుష్టమతుల మడియించి స్థావర
జీవనములు ద్విజులఁ జేర్చె మున్ను
వ. తదీయానుగ్రహాలబ్ధం బైనయేతద్గ్రామచతుష్టయ స్థావరజీవనజీవితులయిన మదీయవంశజులు &c.

ఈకవియొక్క కాలమేదియో కానరాదుగాని యితఁ డాధునికుఁడయినట్టు తెలియవచ్చుచున్నది. నృసింహవిలాసములోని రెండుపద్యము లిందుఁ గ్రిందఁ బొందుపఱుపఁబడుచున్నవి—

మ. శశి పక్షక్షయ మెన్ని యక్షయకళాసంప్రాప్తికిన్ ధాతృహృ
ద్వశుఁడై దీని సృజించుకాలమున వక్త్రం బయ్యెనో తా మహ
ర్నిశ మూర్ధ్వస్థితి నుంట రోసి తొలఁగెన్ రేఱేఁ డటంచుం దదం
ఘ్రిశయాక్రాంతనఖాకృతిం బొలిచెనో క్రిందై క్వచిత్తారకల్. ఆ-౨
శా. పోరా వేఁటకు వేఁటకాండ్రు గహనంబు ల్గ్రిమ్మరన్? గ్రమ్మఱన్
రారా రాతిరి కైన? వారలస్తులై రాకున్న నారాత్రికై
యీరీతిం దపియించుబోంట్లు కలరే యెందైనఁ? జంద్రాస్యలా
ఘోరారణ్యముఁ జొచ్చి చూడఁగలరే గోవిందు రేజాములన్. ఆ-3

118. కొటికెలపూడి వేంకటకృష్ణకవి

ఇతఁడు శ్వేతాచలమాహాత్మ్యమను మూడాశ్వాసముల గ్రంథమును రచియించి, బొబ్బిలిపురాధీశ్వరుఁడగు రాయణప్ప రంగరాజున కంకితము జేసెను. ఈకవి వైదికబ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; హారితసగోత్రుఁడు; శివరామపౌత్రుఁడు; వేంకటరామపుత్రుఁడు. కృతిపతి తన్నుఁగూర్చి పలికినట్లు కవి తనగ్రంథములో నిట్లు వ్రాసికొని యున్నాఁడు—

మ. నను శ్రీమజ్జనకాత్మజాధిపపదన్యాసప్రఫుల్లాంతరం
గుని వాణీకరుణాకటాక్షకలనాంకూరత్సుధామాధురీ
వినుతాంచత్కవితాప్రతోషితమహావిద్వత్కవిగ్రామణీ
ఘనకార్తాంతికతాండిలేయుఁ గడువేడ్కం బిల్చి తా నిట్లనెన్.

చ. హితులు మదన్వవాయజుల కెల్ల బురోహితు లార్యలోకపా
లితకవితాప్రకల్పితదిలీపచరిత్రముఖోజ్జ్వలత్ప్రబం
ధతతులు హారికాగ్రణు లుదారగుణాన్వితచిత్తుల స్మదా
శ్రితులు సమస్తసూరినుతశేముషు లెన్నఁదరంబె మిమ్ములన్.

సీ. ధీరత మేఘసందేశంబు తెనిఁగించి ప్రీతి దిలీపచరిత్ర మనెడు
గొప్పప్రబంధంబుఁ జెప్పి శ్రీరాముల కర్పించితివి మున్న నేర్పుమీఱఁ
గార్తాంతికులు మెచ్చఁగా శ్రీపతిగ్రంథగతినిమామకజాతకము లిఖించి
మా కొసంగితి విప్పు డేకాగ్రచిత్తత నంచితంబుగఁ దెనిఁగించుచున్న
కూర్మమాహాత్మ్య మొసఁగుము కూర్మిమాకు
రమ్యచారిత్ర వేంకటరామపుత్ర
కీర్తిదౌదార్య వేంకటకృష్ణమార్య
యనుచు బహుమతిచేయ నాహ్లాదమునను

కృతిపతిపూర్వులు సర్వజ్ఞసింగమనాయని సంతతివారయిన రావు కులజులయినట్టును, వారిలో లింగప రంగనాయఁడు బొబ్బిలిసంస్థానమును స్థాపించినట్లును, గవి యీ క్రింది పద్యములలోఁ జెప్పియున్నాఁడు—

మ. హరిపాదంబునఁ బద్మనాయకులు గంగాస్వేతులై యుద్భవిం
చిరి తత్పాదజులం దతిప్రబలులై శ్రీరావువంశ్యు లై లం
గిరి తద్రావు కులీనులం దలరె గాంగేయసుతౌదార్యశౌ
ర్యరసోపేతుఁడు రాజశేఖరుఁడు సర్వజ్ఞుండు సర్వజ్ఞుఁడై.

క. ఆలలితాన్వయసంభవుఁడై లింగపరంగరాయఁ డలరె నిజభుజా
భీలాసిదళితరిపున్నృప। ఫాలాస్థూలస్ఫురత్కపాలుం డగుచున్.

క. బెబ్బులి రిపున్నృపు లసియెడు। గిబ్బల కీతఁ డంచు జనులుకీర్తింపఁగఁ దా
బొబ్బిలిపట్టణ మేలెను। నిబ్బరుఁడగు లింగపావనీవరుఁ డెలమిన్.

బొబ్బిలి చినరంగారాయనికి దత్తపుత్రుఁడును గృతిపతియునైన రాయణప్ప రంగారాయనింగారు ౧౮౦౧ వ సంవత్సరము మొదలు ౧౮౩౦ వ సంవత్సరము వఱకును రాజ్యపాలనము చేసినందునఁ దదాస్థాన కవియైన యీ వేంకటకృష్ణకవి యిప్పటికి డెబ్బదిసంవత్సరములకుముందే యీగ్రంథమును రచియించినట్లు చెప్పవచ్చును. ఈయన కవిత్వమునందు లక్షణదోషములు కొన్ని యున్నను కవనము మృదువయి మధురముగా నున్నది. శ్వేతాచలమహాత్మ్యములోని కొన్నిపద్యము లిం దుదాహరింపఁ బడుచున్నవి—

శా. ఆమాటల్విని భూవిభుండు నిజభార్యన్ సద్వ్రతాసక్తికిన్
శ్రీమన్మాధవభక్తికిన్ బొగడి ధాత్రిన్ మూఢచిత్తుండనై
భామారత్నముపాటిబుద్ధి గణుతింపం బూనఁగా లేక యీ
సోమార్కం బపకీర్తిపా లయితినంచున్ లోన జింతిల్లుచున్. ఆ-౧.

ఉ. వేదొకభూవరాత్మకుఁడు విద్రుమగుచ్ఛము రత్నకంకణో
దారకరారవిందమునఁ దాల్చె లతాంగి నను న్వరించినన్

భూరిశుభక్రమాకలన బొటిపదాంబుజ మీతెఱంగునం
గూరిమిత్రోడఁ బట్టుకొనఁ గోరెదనంచును దెల్పునై వడిన్. ఆ-౨.

శా. జంబాలుం డనువాని కొన్నిదినముల్ జాయాన్వితుండై తను
ర్వ్యం బుణ్యస్థితినుండి గర్భవతినారిం బాసి స్వర్గంబు చే
రంబోవంగ, శమీసమీక్షమున గర్భస్థార్భకుం బెట్టి నె
య్యం బొప్పారఁగఁ జేసెఁ దత్తరుణి దా నగ్నిప్రవేశంబొగిన్. ఆ-౩.

---

119. కాకరపర్తి కృష్ణకవి

ఈ కవి శశిరేఖాపరిణయము, ముఖలింగక్షేత్ర మాహాత్మ్యము అను కావ్యములను జేసెను. ఇతఁడు వైదికబ్రాహ్మణుఁడు; తిరుపతి పాత్రకవికిని సీతమాంబకును తనూజుఁడు. ఈపాత్రకవి సత్యభామాకృష్ణ సంవాదాది గ్రంథములను రచియించి శ్రీమహారాజా గొడే నారాయణ గజపతిరాయనింగారి పూర్వుఁడైన జగ్గారాయనింగారివలన నగ్రహారాదులను బడసెనఁట. ఈ కృష్ణకవి విశాఖపట్టణ మండలములోనివాఁడు. ప్రపౌత్రుఁ డిప్పుడు జీవించియుండుటచే నితఁడు నూఱుసంవత్సరముల లోపలివాఁడు. ఈయనకవిత్వము దోషరహితమయి హృదయంగమముగా నున్నది. కవికృతపుస్తకద్వయము నుండియు రెండేసిపద్యముల నుదాహరించుచున్నాను—

ముఖలింగక్షేత్ర మాహాత్మ్యము.

చ. అరుదుగ సర్వలోకనిచయం బతివేలఘనాంధకారభీ
కరవిపదబ్ధిలోఁ బడ నకారణవైరమునన్ వసూజ్జ్వల
త్తరణిముఖప్రచారములు తప్పఁగఁజేయుచు నన్నిదిక్కులన్
బెరిఁగెను వింధ్యభూధరము పేశమహాంబునిధీ తపోనిధీ. ఆ-౧.

ఉ. ఈనగవైభవాతిశయ మెన్నఁగ శక్యమె ధాతకైన జాం
బూనదరౌప్యరత్నముఖభూరిమనోహరవస్తువిస్ఫుర
త్సానుచరన్మరుద్దనుజచారణకిన్నరసిద్ధసాధ్యసం
తానసమృద్ధి నొప్పు వితతంబగు మేరునగంబుకై వడిన్. ఆ-3.

శ శి రే ఖా ప రి ణ య ము.

ఉ. మానుల నెట్లు ప్రోచితివొ మానసవీధిఁ దలంపఁ బాపముల్
మానకథాశ్రరాత్రుఁ డవమానమునుం దగఁజేయుచుండెఁ గృ
ష్ణానను గావవే యనెడునాపలు కిప్పు డొకించుకైన నీ
వీనుల సోఁకకుండు టిదివింత జనార్దన కంసమర్దనా. ఆ ౧.

చ. అనవిని వానితోడ విజయాత్మజుఁ డిట్లనియెన్ దురాత్మ యా
వనమును గుత్తగొంటివిర వచ్చినవారి నెఱుంగ కీవు పొ
మ్మనుటకు నీవె యీజగతియందును విక్రమశాలివా మదం
బున నిటుపల్కఁగాఁ దగదు పొమ్ము పుడూరక వైర మేటికిన్. ఆ-౨.

పయిపుస్తకముగాక కోనపల్లి నివాసుఁడగు వేంకటరంగకవి రచితమైన దొకటియు, అప్పప్పయను భట్టరాజ రచితమైన దొకటియు, శశిరేఖాపరిణయ మనుపేర రెండాధునికప్రబంధములు ముద్రింపఁబడి యున్నవి. వానినుండియు రెండేసి పద్యముల నిం దుదాహరించెదను—

వేంకటరంగకృత శశిరేఖాపరిణయము.

శా. శుద్ధాంతంబున భైరవార్చనకళాశుద్ధిన్ జరాసంధుఁ డు
ద్యద్ధైర్యంబున నిత్య మొక్కొక్కనృపుఁ గ్రోధావేశసంభూతస
ద్బుద్ధిం బట్టి కరుక్కరుక్కనఁగఁ దోడ్తో శీర్షముం ద్రుంచి శ
శ్వద్ధాత్రిం బలి యిచ్చుచుండె విలసద్బాహాబలోదగ్రుఁడై. ఆ. ౧.

ఉ. అందఱికంటె ముందుగనె హాయిగ మజ్జనభోజనంబు లం
దందు నొనర్చి సాత్యకిసహాయముగా వసుదేవదేవకీ

నందను లవ్విధంబు దళనాయకకోటి కెఱుంగఁ జేసి బల్
దుందుభికాహళాదిపటుతూర్యరవంబులు ఘోరుకల్గఁగన్. ఆ. 3.

అప్పప్పకృత శశిరేఖాపరిణయము.

ఉ. అన్నలు మాటలాడుసమయంబున లేచి సుభద్ర ప్రీతితో
నన్నయశాలి యైనముసలాయుధుఁ గన్గొని నీమఱాదియున్
నన్నిటఁ బంపుచుండి పరిణామము వేఁడె భవత్కుమారియా
కన్నియ మత్సుతాగ్రణికిఁ గారుణికోత్తమ పెండ్లి చేయవే. ఆ. ౧.

ఉ. పోరున ధార్తరాష్ట్రులను భూరిమదం బడఁగించి పిమ్మటన్
సీరిని మిక్కిలిన్ భయముఁ జెందఁగఁ జేసిననీపరాక్రమం
బౌర నుతింప వ్యాళపతి కైనను శక్యము గాదటంచు నా
మారుతిపుత్రునిం బొగడి మక్కువతోఁడఁ గిరీటి యంతటన్. ఆ.ర

---

120. కృష్ణయ్య

ఈకవి పార్వతీపరమేశ్వరపరిణయ మనెడి మూఁడాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఈతఁడు స్మార్తబ్రాహ్మణుఁడు; భారద్వాజ గోత్రుఁడు; చందయార్యపుత్రుఁడు. ఈతని వాసస్థలము పినాకినీతీరము నందలి కామలాపురము. ఈతఁడుండినకాల మేదియో తెలియరాదుగాని యితఁడేఁబది యఱువదియేండ్లక్రిందటనుండిన ట్లూహింపఁదగియున్నది. ఈతని కవిత్వమునందుఁ గొన్ని వ్యాకరణ దోషములు గలవుగాని మొత్తముమీఁదఁ గవిత్వము శ్రావ్యమయి కొంతవఱకు శ్లాఘ్యముగానే యున్నది. పార్వతీపరమేశ్వరపరిణయములోని పద్యములఁ గొన్నిటి నిం దుదాహరించుచున్నాను—

ఉ. ఆపురిఁ గాంచి నిర్జరు లహర్నిశమున్ మదిలోన నెన్నుచున్
గాపుర మున్న నాకమునకంటెను మేలని చూచువేడుకన్

దాపునఁ జేరిరో యనఁగఁ దత్పురసౌధసమీపవర్తులై
గోపవిభుండులోనుగను గొల్చినరీతిగ నుండు రాష్ట్రికుల్. ఆ. ౧.

ఉ. ఈవిధి వచ్చువిప్రుఁగని యీశ్వరుఁ డర్థ్యముసంగి యిట్లనున్
భూవినుతార్య మీధరను భూమిసురుల్ సుఖులై చరింతురా
మీావనమందుఁ బుష్పములు మేలగుకాయలు పండ్లు పత్రముల్
కావలెనన్నఁ గల్గుఁగద కారణ మేమిట రా విధాత్మజా. ఆ. ౨.

పంచశరుండు నిల్లనుచుఁ బల్కు విరించికి సమ్మదంబుగా
మించులమించుశంకరునిమేనిరు చుల్గన నాకు శక్యమే
మంచిది యేమియైన నీక మద్దళముల్ గొలువంగ నేగదన్
వంచనలేక న న్నిలను వర్తిలఁజూడుఁడు పోయివచ్చెదన్. ఆ. 3.

121. తరిగొండ వెంకమ్మ

ఈమె మంచి విద్వాంసురాలు. ఈమె చేసినపుస్తకములు తరిగొండ నృసింహస్వామి కంకితము చేయఁబడినవి. తరిగొండ కడపమండలములో వాయిల్పాడునకు నాలుగుమైళ్ళదూరములో నున్నది. ఈమెరచియించిన గ్రంథములలో రాజయోగసార మను ద్విపదకావ్యమును వేంకటాచలమాహాత్మ్యమను పద్యకావ్యమును ముద్రింపఁబడియున్నవి. ఈమె తాను భాగవతము ద్వాదశస్కంధములను ద్విపదకావ్యముగా రచియించినట్లు వేంకటాచలమాహాత్మ్యములోని యీ క్రిందిపద్యములోఁ జెప్పుకొన్నది.

సీ. దారునిర్మితవీణ నారూఢిఁ బల్కించు గాయక పురుషునికరణి గాను
బురుషోత్తముఁడు దయాపూర్ణుఁడై నాజిహ్వయందుఁ దావసియించి యరుదుగాను
బలికించుఁ గావున భాగవతపురాణ మనుర నే ద్విపదకావ్యంబుగాను
ద్వాదశస్కంధము లగఁ జెప్పి హరికిసమర్పించి శ్రీవేంకటాద్రిమహిమ

మతనిపై రమ్యపద్యకావ్యంబు చేసి
శ్రీనివాసునకే సమర్పింపనుంటి
నీఁగ త్రోయధిఁ దాటఁబోయినవిధమున
నాస్వతంత్రత కిల బుధు ల్నవ్విపోరె.

ఈ పుస్తకములోని—

క. అల కాశినుండి వెలువడి। వలనుగ మాకొలఁకు నందవరపురమందే
నెలకొని కులదైవతమై। యలరుచుచుమ్మెలుచౌడమాంబనుగొలుతున్.

అను పద్యమునుబట్టిచూడఁగా నీమె నందవరీక బ్రాహ్మణస్త్రీయైనట్లు తెలియనచ్చుచున్నది. ఈమె తనభర్తయొక్క నామగోత్రములను జెప్పుకొనక "వసిష్ఠగోత్రపవిత్ర కృష్ణయామాత్య తనూభవ" యని తాను కృష్ణయామాత్యుని కూఁతురయినట్టుమాత్రము చెప్పుకొనుటచేత నీమె బాలవితంతువయి తన కాలమును వేదాంతగ్రంథపఠనాదులయందుఁ గడపిన ట్లూహింపఁ దగియున్నది. ఈమె ౧౭౪౦ వ సంవత్సరమునందు జీవించి యుండినట్లు బ్రౌణుదొరగారు తమ నిఘంటువునందు వ్రాసియున్నారు. కాఁబట్టి యీామె యేఁబదిసంవత్సరములక్రిందట నుండినట్లు తెలియవచ్చుచున్నది. ఈమెకుఁ బూర్వమునం దుండినబ్రాహ్మణస్త్రీలు రచియించిన పద్యకావ్యము లేవియు నిప్పుడు కానరావు. ఈమెకవిత్వమునందల్పదోషము లక్కడక్కడఁ గానవచ్చుచున్నను మొత్తముమీఁద కవన మతికఠినముగాక మృదుమధురరచనను గలదయియున్నది. వారాంగన యయిన ముద్దుపళనివలె శృంగారవర్ణనమని యవాచ్యములు పలుకక కులాంగన కుచితమయినరీతిగానే వర్ణించుచు వచ్చుటయే కాక శృంగారవాక్యములు వచించుటసహితము తన కనిష్టమని సూచించుటకయి శృంగారరసాధిదైవతమయిన కృష్ణుని నిట్లు నుతించియున్నది—

శా. శృంగారాకృతిఁ గోడ వచ్చి పదముల్ శృంగారసారంబుతో
డం గూఢంబుగఁ జెప్పు నీవనఁగ నట్లేఁ జెప్పలే నన్న నః

ముంగోపంబునఁ జూచి లేచి యటు నే మ్రొక్కఁగ నున్నించి త
చ్ఛృంగారోక్తులు తానె పల్కుకొను నా శ్రీకృష్ణు సేవించెదన్.

ఈ పద్యమునుబట్టిచూడఁగా నీమె తాను బుస్తకమునం దక్కడక్కడ సందర్భోచితముగా రచించిన శృంగారపద్యములుకూడఁ దనవి గాక కృతిపతి విరచితములే యని లోకమునకుఁ జూప నుద్దేశించినట్లు కనఁబడుచున్నది. ఈమె కవిత్వరీతిని దెలుఁపుటకయి కొన్ని పద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

వేంకటాచల మాహాత్మ్యము.

ఉ. రామనృపాల ఘోరతరరావణశౌర్యవిఫాల భవ్యసు
త్రామసురార్యయోగిజనతాపసపాల కృపాలవాల శ్రీ
భూమిసుతాత్మలోల పరిపూర్ణసుకీర్తివిశాల వానర
స్తోమముతోడ వచ్చు మిముఁజూచి కృతార్థుల మైతి మిద్ధరన్. ఆ-౧

ఉ. ఇంతట యోగపూరుషుఁడు హెచ్చఁడు తగ్గఁడు సంతతంబునే
కాంతమున న్వసించుఁ దనయందుఁ బరాత్మను జూచుచుండు వి
భ్రాంతులు తన్నుఁ దిట్టినను గ్రమ్మఱ వారిని దాను దిట్టఁ డీ
శాంతుఁడు రాజయోగి ఘనసద్గురుఁ డంచు వచింపఁగాఁ దగున్. ఆ-3.

చ. అడవికి వేఁటఁబోయి విపులాద్భుతఘోరమృగాళి నచ్చటన్
బాడగని భీతి నొందితివొ భూతము సోఁకెనొ లేక తాళ్ళపై
వడి చెడజాతి మ్రొగ్గితివొ వాగులలోఁబడి లేచివచ్చితో
కొడుక నిజంబుఁ జెప్పు మిఁక గొబ్బున నొక్కచికిత్స చేసెదన్. ఆ-౪.

ఉ. ఆకురవంజి యిట్లనియె నాడకు రమ్మని పిల్వవచ్చినా
రాఁకొనినాఁడు బిడ్డఁ డిపు డమ్మల నక్కల నేడనైన నే
జోకఁగఁ జేరి వారలకు సోదె నిజంబుగఁ జెప్పకుండినన్
నాకడుపెట్లు నిండు నని నవ్వుచుఁ బల్కుచు మూల్గి యిట్లనెన్. ఆ-౫.

రాజయోగసారము.

ద్విపద. కాయ మస్థిరమని కానంగలేక
పాయక సంసారబద్ధులై మమత
వదలక కామార్థవాంఛితు లగుచు
మదమత్తు లగుచు దుర్మార్గత నొంది
మదిలోన నబ్బి కామక్రోధలోభ
మదమోహమత్సరా ల్మాటికిఁ బెంచి
సంపదగలిగిన సామర్థ్య మనుచు
సొంపుమీఱిన తుచ్ఛసుఖ మిచ్ఛగించి
కామాంధులై తమగతి గానలేక
భామలవలలోనఁ బడి లేవలేక
తఱగని యాపత్త్రయవార్ధిలోను
మఱిమఱి మునుఁగుచు మమత రెట్టింప
నాలుబిడ్డలకని యర్థంబుఁ గూర్చి
కాలంబు నూరకే గడపుచునుండి
యంతకాలము వచ్చినప్పుడు యముసిఁ
జింతఁజేయుచు హింసచేఁ గందికుంది
కూపంబులోఁ బడి కొన్నినాళ్లుండి
పాపాత్ములగుచుఁ బ్రపంచంబునందుఁ
బుట్టుచుఁ గిట్టుచుఁ బొరలుచుండెదరు.

ఈతఱిగొండ వెంకమ్మకుఁ దరువాతఁ దెలుఁగులోఁ బద్యకావ్యములను రచియించిన స్త్రీ లెవ్వరును గానఁబడరుగాని శతకములు రచించినవారు కొంద ఱందందుఁ గనఁబడుచున్నారు. ఇట్లు శతకములు రచియించిన స్త్రీలలో శ్రీరాజా గోడేనారాయణ గజపతిరాయనింగారి

మేనత్తయగు మదిన సుభద్రయ్యమ్మగారు గ్రంథకర్త్రీరాలుగాఁ గానవచ్చు చున్నది. ఆమె ౧౭౮౧వ సంవత్సరమునందు జననమొంది యించుమించుగా తరిగొండ వేంకమాంబతో సమకాలికురాలుగా నుండినది. ఈమె రచియించిన శ్రీరామదండకము, రఘునాయకశతకము, కేశవశతకము, కృష్ణశతకము, రాఘవరామశతకము మొదలయినశతకము లొకపుస్తకసంపుటముగా నీనడుమను బ్రకటింపఁబడినవి. ఈమె కవనకౌశలమును జూపుటకయి రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. శ్రీరమణీకళత్ర సరసీరుహనేత్ర జగత్పవిత్ర స
 త్సారసబృందమిత్ర సురసన్నుతిపాత్ర నరేంద్రపుత్ర శృం
 గారసమగ్రగాత్ర జనకర్మవిదారణకృచ్చరిత్ర శ్రీ
 నారదమౌనిగీతచరణా రఘునాయక దీనపోషకా.

ఉ. మన్ననదప్పియున్నయెడ మక్కువగల్గినవారి నేనియున్
 దిన్నఁగ మందలించినను దెల్లముగా మది నొవ్వకుండునే
 యన్నకు ధార్తరాష్ట్రునకు నాదరమొప్ప హితోపదేశ మి
 ట్టెన్నఁగఁజేసి యావిదురుఁ డేమిఫలంబును జెందెఁ గేశవా.

ఇప్పుడు తెలుఁగుదేశమునం దంతటను బాలికాపాఠశాలలు స్థాపింపఁబడి స్త్రీవిద్య ప్రబలుచున్నందున మంచిగ్రంథములను రచింపఁ గల కులకాంతలు శీఘ్రకాలములోనే బైలుదేఱుదురుగాక!

122. పిండిప్రోలి లక్ష్మణకవి

ఇతఁడు లంకావిజయమనఁబడెడు రెండాశ్వాసముల ద్వ్యర్థి కావ్యమును జేసెను. ఇతఁ డాఱువేలనియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబ సూత్రుఁడు; భారద్వాజగోత్రుఁడు; గోపాలామాత్యపుత్త్రుఁడు. ఈకవి గోదావరిమండలములోని రామచంద్రపురమునకు సమీపముననున్న కుయ్యేరను గ్రామమునకు కరణము. ఈగ్రామమును గుత్తచేసిన రావు ధర్మారాయఁడను పద్మనాయకకులజుఁ డీకవియొక్క లంకనేల మూఁడు పందుము లపహరింపఁగాఁ గోపావేశముచేత యౌవనమునం దితఁడు ధర్మారావును రావణాసురునితోఁ బోల్చుచుఁ దనక్షేత్రాపహరణకథను రామాయణపరముగా శ్లేషార్థము వచ్చునట్లు రచియించెను. ఇతఁడు తిట్టు కవిత్వమునకుఁ బేరుపడినవాఁడు. ఈవిషయమును గూర్చి లంకావిజయమునఁ గవియే యిట్లు వ్రాసికొనియున్నాఁడు—

క. తెలియుమిను రామకవ్యా । దులు సూరకవిప్రముఖపృథుప్రతిభావం
తులు భీమ శ్రీనాథు । ల్వెలయఁగ నాకరణిఁ దిట్టలే రూఢమతిన్.

ఇతఁ డిట్లు యౌవనదశయందుమాత్రమే కాక వార్ధకమువచ్చి యవసానదశ సమీపించువఱకునుగూడ నల్పములైన యైహికలాభముల నిమిత్తము పరులను దూషించుచు భూషించుచుఁ బద్యములను జెప్పి కాలము గడపుచుండెను. ఈలంకావిజయమునకు రావణదమ్మీయమని నామాంతరము. కవి సమర్థుఁడేయైనను రాఘవపాండవీయాదులవలె రావణదమ్మీయ మంతప్రౌఢముగా లేదు. కవి గ్రంథమునందు రామాయణకథ కనుకూలముగాఁ దనకథను మార్చుకొనుచు నల్పసంఖ్యగల రెండర్థముల పదములతోనే గ్రంథమునంతను బూరించినాఁడు. ఈగ్రంథములోని—

క. లేదమ్మా కష్టము నీ। కేదమ్మా నేగి భీతి ఘృణ నీ వొందన్
రాదమ్మా యిఁక మిన్నక। పోదమ్మాయుక్తి నిజముపోలుపుగదమ్మా.

గీ. ఏడుపంచు మల్లోకంబు లెఱుఁగ లంక
నేలకొల పరక్షేత్రాప్తి మేలుగాదు
పేర్మినాభూమిజాతసంప్రీతితోడ
వీడు మదిరెం సౌఖ్యము లిచ్చు వేయునేల.

ఉ. ప్రాజ్ఞత నెవ్విధంబునను రామునకుం దగుసాటి రావు స
ర్వజ్ఞ నృసింహుఁ డాయనసువంశమునన్ జనియించి చెప్పఁదు
ష్ప్రాజ్ఞుఁడ వీవు కానకు విచారము లన్నియుమాని ధర్మగో
ష్ఠిజ్ఞులు మెచ్చుచొప్ప కని సీతను వే విడుమంత మే లగున్.

గీ. జ్యేష్ఠుఁడా లక్ష్మణాగ్రజక్షేత్ర మిప్పు
వదలకుండిన మోసంబు వచ్చునింకఁ
జండనిర్భీకవనచారిపిండిప్రోలి
కవికులవరుతోఁరిపుత ముఖ్యముగ వలదు.

ఇత్యాదిపద్యముల ననేకులు మెచ్చుకొనుచున్నారు. లక్ష్మణకవి లంకావిజయమును క్రీస్తుశకము ౧౭౯౭ వ సంవత్సరమునందుఁ జేయ నారంభించెను. అప్పటి కితని కిరువదియైదుసంవత్సరములప్రాయ ముండిన పక్షమునఁ గవి ౧౭౭౦ వ సంవత్సరప్రాంతములయందు జనన మొంది యుండవలెను. ఈతఁడు ౧౮౪౦ వ సంవత్సరప్రాంతమువఱకును సజీవుఁ డయి యున్నందున నించుమించుగా డెబ్బదిసంవత్సరములు బ్రతికియుండెననుటకు సందేహము లేదు. ఇదియొక్కటితప్ప యితఁడు రచియించిన గ్రంథము వేఱొకటియు లేదు.

మ. అరయ స్వర్ణనఁజేతుఁ దారకవదవ్యాక్రాంతవర్తిన్ గురు
స్ఫురదుత్తుంగబలాతిరేకకలుషీభూతారిజీవున్ ఘనాం

గిరిసాఖ్యాతు బుధౌఘపూజితపదుం క్షేమంకరాంచత్తపో
భరసంతోషితసర్వమానిధిమణున్ వాచస్పతి న్నార్యునిన్.

ఈపద్యములో వాచస్పతినార్యుని ననియుండవలసినదానికి వచస్పతిన్నార్యునని యు,

చ. అని తలపోయుచో నల ప్రజాపతి చేసినమేర దప్పకం
బనివడి సద్విచారు లసమానమహారుణధామయుక్తితో
డన పరవాహినీశనికటంబున కేగ నరిప్రజంబుచే
యు నతను సంగిగింబునకు నోడక పాఱెను జొళ్ళువీడగన్.

ఈపద్యములోఁ దప్పక యని యుండవలసినదానికిఁ దప్పక నని యు, నందందుఁ గొన్ని వ్యాకరణదుష్టములయిన ప్రయోగములున్నను మొత్తముమీఁదఁ గవిత్వము సలక్షణమయి మృదుమధురపదఘటిత మయియున్నది. ఈతని రచనాకౌశలమును జూపుటకయి లంకావిజయములోని మఱిరెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. తమ్ములు నీదుపల్కులు హితమ్ములుగాఁ గొనిచేయ నార్యజా
తమ్ములు నీకుసద్గుణశతమ్ములు సంస్తుతిచేయుఁ బక్షపా
తమ్ములు లేక న్యాయకలితమ్ములుగాఁ గ్రియలొప్ప సర్వభూ
తమ్ములు విశ్వసింప సుకృతమ్ములు వర్ధిలునట్లు చేయుమీ. ఆ. ౧.

ఉ. తమ్ములు సద్గృహమ్ములు సుతప్రకరమ్ములు సొమ్ము లిష్టవ
ర్గమ్ములు వైభవమ్ములు జగమ్ములఁ గ్రమ్మఁగ నెమ్మి నుండి పా
ప మ్మనిశ మ్మెసర్చుటనెపమ్ముగఁ గీడగు నాదుపల్కు వే
దమ్మని రూఢినమ్మ విహితమ్ముఁ గులమ్ముబలమ్మునిమ్మగున్. ఆ-౨

ఈకవికాలములో సంస్కృతాంధ్రభాషాపాండిత్యమునందును సంగీతసాహిత్యముల యందును సుప్రసిద్ధుఁడయిన శిష్టు కృష్ణమూర్తినామక విద్వత్కవి యొకఁ డుండెను. అతనికిఁ దన కున్నంతపాండిత్యము తెలుఁగునందే కాని సంస్కృతమునందు లేదని లక్ష్మణకవియెడల ననాదరభావము

కలిగియుండెను. ఆయనకుఁగల గర్వమును తనయెడలఁ గలతిరస్కార భావమును గనిపెట్టి యీలక్ష్మణకవి యెట్లయిన నాతని గర్వభంగము చేయవలెనని సమయము వేచియుండెను. ఇట్లుండఁగాఁ గృష్ణమూర్తికవి తాను రచించిన సర్వకామదాపరిణయమను ప్రబంధమును రామచంద్ర పుర సంస్థానాధిపతియైన కాకర్లపూడి రామచంద్రరాజుగారి తమ్ముఁడైన జగన్నాథరాజున కంకితముచేయుటకయి కాజలూరు గ్రామమునకుఁ బోవుట తటస్థించెను. ఆపుస్తకమును జదివించి విద్వత్కవిసమ్ముఖమున వినుటకు నిర్ణయింపఁబడిన దినమునందు లక్ష్మణకవి యనాహూతుఁడ య్యును సభకుఁబోయి కృష్ణమూర్తికవిని బదుగురిలోఁ బరాభవింపవలె నన్నదృఢ నిశ్చయముతోఁ గూరుచుండియుండెను. సర్వకామదాపరిణ యములోని—

చ. తరణి శశాంకు లాభరణదంభమున న్వదనాత్మకైతవాం
బుజదళిత్వోత్పలాగ్రమున ముద్దియ కుంతలదేశ మాక్రమిం
చి రొకఫలంబు గాన నగుఁ జివ్వనుచుం బరహాపయుక్తి ని
బ్బరముగ నంతసాంతముగ బ్రహ్మ యొనర్చినసీమపాల్పగుణ్.

అనుపద్యమును జదివినప్పుడు లక్ష్మణకవి విని తలయూఁచి నవ్వి యిందలి నాయిక రోకాక్షియయిన యవలక్షణరాశియనియు, కన్నులు నల్లగలువలనిచెప్పి వానిపైని సూర్యచంద్రులున్నట్లు చెప్పుటచేత నొక కన్ను సూర్యకాంతిచే ముకుళించు కలువయై గ్రుడ్డిది కావలెననియు, ఆభరణదంభమునవచ్చి సూర్యచంద్రులు కుంతలదేశ మాక్రమింపఁగా నిరువురకును దగవురాకుండ బ్రహ్మ సరిహద్దేర్పాటుచేసినట్టుగా పాపట యున్నదని వర్ణించుటచే సూర్యచంద్రుల నలంకరించినపిమ్మటఁ బాపటఁ దీయుదురో ముందుగా పాపటదీసి తరువాత నే సూర్యచంద్రుల నలంక రింతురో యీకవి తెలియనివాఁడనియు, ఇటువంటిదూషణము లనేక ములుచేసెను. ఇవి సరళములైన సదాక్షేపములు కాకపోయినను సభకు

వచ్చినవా రనేకు లాయాక్షేపములకు హార్షించి చప్పటలు కొట్టినందు నను, జగన్నాథరాజుగా రాకృతినందుట కిష్టపడనందునను, కృష్ణమూర్తి కవిగా రవమానితులయి సభనుండి లేచిపోవలసినవారయిరి.

లక్ష్మణకవి యితరులమీఁదఁ బద్యములను జెప్పుచు వివాహాదు లకుఁబోయి కవీశ్వర సంభావములను గొనుచు ధనార్జనము చేయుచుం డెను. ఇతఁడు తన మేనల్లుఁడగు చింతలూరి మంగన్నకు విరోధముగా వ్యాజ్యము తీర్పు చెప్పినందునకయి యప్పటి పండిత సదరమీనగు శంకర మంచి యనంతశాస్త్రిని శ్లేషార్థముతోఁ దిట్టినపద్యములలో నొకదానిని, ఆవ్యాజ్యము నుపర్యభియోగము తెచ్చినప్పు డాకాలమునందు రాజమ హేంద్రవరమున మండలన్యాయాధిపతిగా నుండి తెలుఁగుఘంటువులను జేసిన బ్రౌనుదొరగారిమీఁదఁ జేసినపద్యములలో నొకదానినిమాత్ర ముదాహరించి యీతనినిగూర్చి యింతటితో విరమించెదను—

మ. అవురా శంకర మంచివాఁడవె యనంతాఖ్యుండవై తీర్పెఱుం
గవు మంగన్నరఁజేసి నీవు బుధమార్గభ్రష్టతన్ జోగిరా
గవరా లంది పినాకినిం బశుపతీకల్లోలునిం బట్టి స
త్యవధూసత్వము దానియం దిడితి వాశాయత్తు లిట్లేకదా.

ఉ. పస్పసచేసె నాబ్రతుకు పండితుఁ డిం కెటునిల్తు నంచు నే
నిస్పృహవృత్తి నుండఁగను నిన్నటి రేఁ గలలోనఁ గోర్టువా
రిస్పిసియాలుపట్టి రిఁక నేర్పడ న్యాయముతీర్తుమంచు దై
ర్యాస్పదమూర్తిఁ బల్కినటులైన మిముం జూడగానవచ్చితిన్.

123. అల్లమరాజు రామకృష్ణకవి

ఈ కవి కవిచకోరచంద్రోదయ మనెడు నాలుగాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁ డారామ ద్రావిడబ్రాహ్మణుఁడు; రంగానాధార్యపుత్రుఁడు; హారితసగోత్రుఁడు. తన గ్రంధమును దాక్షారామ భీమేశ్వరుని కంకితముచేయుటచేతనే కవి గోదావరీమండలములోనివాఁడగుట స్పష్టమగుచున్నది. తన్నుఁగూర్చి భీమేశ్వరుఁ డిట్లన్నట్టు కవి తన కవిచకోరచంద్రోదయమునందుఁ జెప్పుకొనియున్నాఁడు.

సీ. అమరఁగ వైనతేయవిజయంబును సత్యభామావిలాసంబు భాసురముగ
గౌతమీమాహాత్మ్యకథయును ద్రౌపదీపరిణయ మలసుశోభావివాహ
మసమానహనుమదాఖ్యానంబును సుకవిజనమనోరంజనంబ నెడుకావ్య
మవనిలో రచియించినట్టి ప్రోడవు నీవుగావున నీవాక్యకలితలలిత
మాధురిమఁ గ్రోలుచుండెడి నామానసంబు
తనివిదీఱదు నా భక్తుఁడనుచు నిన్ను
నెన్నుటలుగాదు కాని నీకన్న ధరణిఁ
గలరె కవితాసుధాధార లొలుకఁబలుక.

పయి పద్యమునుబట్టి కవి వైనతేయవిజయము, సత్యభామావిలాసము, గౌతమీ మాహాత్మ్యము, ద్రౌపదీ పరిణయము, సుశోభావివాహము, హనుమదాఖ్యానము, సుకవిజనమనోరంజనము అనుకావ్యములనుగూడ రచియించినట్లు తెలియవచ్చుచున్నది. ఈతని కవిత్వము నిర్దుష్టము కాకపోయినను ప్రౌఢమయి హృదయాహ్లాదకరముగా నున్నది. ఇతఁ డెనుబదిసంవత్సరముల క్రిందట నుండినవాఁడు. కవి యీకవిచకోరచంద్రోదయమును శాలివాహనశకము ౧౭౫౭ వ సంవత్సరమునకు సరియైన మన్మథాబ్దమునం దనఁగా క్రీస్తుశకము ౧౮౩౫వ సంవత్సరమునందు రచియించినట్లు గ్రంథాంతమున వ్రాసికొనియున్నాఁడు. ఈ కావ్యమునందలివి కొన్నిపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి.

ఉ. భారము నొప్పు పుష్పఫలభారవినమ్రమహీజరాజశో
భారమణీయసానుచరభవ్యనభశ్చరభామినీవిషం
చీరవమాధురీకలితజృంభిత గానఘుమంఘుమార్భటీ
పూరితనూత్న రత్నయుతభూరిదరిం గనిమెన్ మహాగిరిన్ అ-౧.

ఉ. మారుని మీఱు వీనిసుకుమారము మారమణీసహోదరున్
గూరిమి నోముమోము తపసు ల్బలుకల్ నెఱజాణవై ఖరిన్
గేరు నయారె నిర్జరులుఁ గిన్నరులు న్నరు లెన్న వీనియౌ
దార్యరమె చూడ నింపగు జయంతు జయింతు నటన్నరీతులన్. అ-౨

కవిచకోరచంద్రోదయమునకుఁ దరువాతఁ గవి రచియించిన గ్రంథములు కొన్ని నాకిటీవల లభించినవి. ఇతఁడు రచియించిన యితర గ్రంథములు—మదాలసా పరిణయము, శంతనువిలాసము, ఆధ్యాత్మ రామాయణము, అచ్చతెలుఁగు భాగవతము, రామకృష్ణీయము. ఇందలి కడపటి పుస్తకము ఆంధ్రశబ్దచింతామణికి వ్యాఖ్యానము. ఈరామకృష్ణీయములోని యీ క్రింది పద్యమువలన నీతని నివాసస్థానము పిఠాపురము నకు సమీపమునను న్న చేఁబ్రోలుగ్రామ మయినట్టు తెలియవచ్చుచున్నది.

సీ. సిరిమించు శ్రీపీఠపురసమీపంబునఁ బరఁగు చేఁబ్రోల్పురవాసి నగుచు
నల్లమరాజాన్వయాగ్రణి యగు రంగధామార్యవర్యుని తనయుఁడనయి
యెల్లపార్యాగ్రణి కెనయఁబౌత్రుండనై రామకృష్ణకవియన్ నామమెలమి
బూని శ్రీదక్షవాటీనికేతనుఁడైన భీమేశు కరుణచేఁ బెంపు నొంది
సకలజనులకుఁ దెలిసెడి సరణిగాఁగ
నన్నపార్యుఁ డొనర్చినయట్టి సూత్ర
ములను దెలిఁగింతు సూక్ష్మభంగులను బాల
బోధమగునట్లు సుకవు లుప్పొంగుచుండ.

ఈకవి కాలముచేసి యేఁబదిసంవత్సరములు దాఁటినవి. ఈతఁడు శంతనువిలాసమును శాలివాహనశకము ౧౭౬౩ వ సంవత్సరమునకు సరి

రైన క్రీస్తుశకము ౧౮౪౧వ సంవత్సరమునందు ముగించినట్లా పుస్తకాంత మందలి యీ పద్యములవలనఁ దెలియవచ్చుచున్నది.

సీ. అవనిలో శాలివాహనశకాబ్దము లగ్నిశాస్త్రశైలశశాంకసంఖ్య నెన్నఁ
బ్లవనామవత్సర ప్రథితకార్తికశుద్ధసప్తమీ భౌమవాసరమువఱకు
సిరిమించు శ్రీపీఠపురసమీపంబునఁ బోలుపొందుచేఁ బ్రోలుపురనివాసుఁ
డలరునల్లమరాజకులరత్నమునురంగధామార్యసుతుఁడనౌ రామకృష్ణ
కవివరుఁడు దక్షవాటికాగారవాసుఁడైన భీమేశు సత్కృపానూనగరిమ
శంతనువిలాసమురచించె సరసఫణితిలనఖిలసత్కవిబృందంబులౌననంగ.

ఈ కవికృతములైన గ్రంథములలోని పద్యములు కొన్ని యిం దుదాహరింపఁబడుచున్నవి—

మదాలసాపరిణయము.

ఉ. న్యాయముగా దయో లలన నవ్వెడనాడిచనంగఁ గోయిలల్
కోయనికూయఁ జందురుఁడు గొంకక వెన్నెలఁగాయ మారుఁడున్
సాయక జాలమేయఁ గడుషట్పదముల్ రొదసేయ నే నినుం
బాయఁగఁజాలఁజాలనను బాలకవుంగిటఁ జేర్చిపోవవే.

అచ్చతెలుఁగుభాగవతము.

సీ. కూఁకటిమూలడాల్గొన బెల్లనదలించి జమిలిముకాకలిరాసంతు నొంచి
కైగల్లుమొకపుమూఁకలనెల్ల నగిమించి కారుమబ్బుల నెఱసౌరుకుంచి
చిచ్చుకన్దొరయత్తి పెచ్చువన్నెఁగలంచి విప్పుగన్ దొరరాల చొప్పుద్రుంచి
చీఁకటిమ్రాఁకులగెలువ మెల్లను డించి కాటుకవులవన్నెఁగీటడంచి
పొగల తెగల జగాజిగి మిగులవంచి
దండితెక్కలికాండ్లకు మిండగీండ్ల
కింపుగా మబ్బు మసిచల్లునింపు దోఁప
నెల్లకడలందు నంతంత నిరులు గవిసె.

శంతను విలాసము.

చ. పగలును రేయి పద్మకులబాంధవసోములు తత్పురంబునన్
దగుమణివప్రముం గడిసి తారటుపోవఁగలేక యోరగా
నొగినిరువంకలం జనుచు నొప్పగ నుత్తరదక్షిణాయనా
ఖ్యగతిఁ జెలంగి రెంతయు నఖండవిలాసము తోఁచుచుండఁగన్. ఆ-౧

ఉ. హారము (?) సైచదాయె మణిహారములుం బొడియయ్యె నేఁడు నీ
హారముఁబోలి నాదు వ్యవహారము లెంతయు డిందె మేనిక
ల్హారము లెండె బల్జయవిహారమునన్ మరుఁ డేఁచసాగె నా
హారమణీలలామ యిఁకనైన ననున్ దయ నేలుకోఁగదే. ఆ-౫.

124. కాకరపర్తి బుచ్చిపాత్రకవి

ఈ కవి సత్యవతీపరిణయ మనెడి యైదాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు వైదికబ్రాహ్మణుఁడు; కాశ్యపగోత్రోద్భవుఁడు; ముఖలింగక్షేత్ర మహాత్మ్యాది కావ్యములను రచియించిన కృష్ణకవి పుత్రుఁడు. ఈ కవియొక్క మనుమఁడును సోదరపుత్రుఁడును జీవించియుండుటచేఁ గవి యేఁబది యఱువదిసంవత్సరములక్రిందట నుండినవాఁ డనుట స్పష్టము. కవి కథాంశమును రచియించి గ్రంథమును శ్రీరాజా (మహారాజా) గోడే నారాయణ గజపతిరాయనింగారి జనకున కంకితము చేయఁ దలంచెనుగాని యతఁడు కృత్యాదిపద్యములను, ఆశ్వాసాద్యంత పద్యములను రచియింపకయే మృతినొందెను. అటుతరువాత శ్రీమహారాజా గోడే నారాయణ గజపతిరాయనింగారి కోరికపయిని కవికి పారంపర్యమున సోదరపుత్రులగు వేంకటశాస్త్రిగారును పౌత్రులగు సీతారామశాస్త్రిగారును గ్రంథోపోద్ఘాతమును, ఆశ్వాసాద్యంత పద్యములను పూరించి కృతిని ౧౮౮౭ వ సంవత్సరమునందు శ్రీరాజా గోడే నారాయణ గజపతిరాయనింగారి కంకితము చేసిరి. వీరిచేఁ గృత్యాదియందు రాజాగారి

వంశాభివర్ణనము విశేషముగాఁ జేయఁబడినది. సత్యవతీచరిత్రమునందలి కవిత్వము నిర్దుష్టమయి హృద్యముగానున్నది. కవనమార్గమును జూపుటకయి సత్యవతీపరిణయములోని కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. ఇలఁ గలకోటలన్ గెలిచి యెన్నిక కెక్కఁ బురీలలామకో
జ్జ్వలమణివప్రమం చరసి వారిజసూతి తదంఘ్రిసీసఁ బ
చ్చలచెలువంపుటందియల సద్బిరుదాంకము సంఘటించె నా
నలరు నమేయశైవలయుతాంబుకదంబముఖేయ మస్ఫురిన్. ఆ ౧.

చ. పరమతపోధనప్రవరు భవ్యగుణప్రకరుం దపఃకృశాం
గరుచిరు భస్మభాసురు నఖగ్వతటిత్పటలోజ్జ్వలజ్జటా
భరు మృగకృత్తికాదరు సుపాణిధృతాక్షసరుం గమండలు
స్ఫురితకరుం గనుంగొనియె శోభితదండధరుం బరాశరున్. ఆ-౨.

చ. సమధికరాజ్యలక్ష్మి యనుచందనవల్లిక జాహ్నవేయదు
ర్దమఫణిరాజు చేరనివిధం బొనరింపఁగఁ జాలినట్టి మం
త్రముల తెఱంగుఁ జూపఁగను బ్రౌఢి నహించెనవేని రాజకా
ర్యము ఫలియించు మంత్రివర రాజహితప్రతిపాదనాదరా. ఆ-౩.

ఉ. ఎల్లెడలందుఁ జీఁకటుల హెచ్చులు చెల్లెఁ బయోధివృద్ధి పా
టిల్లెఁ జకోరభుక్తులు ఘటిల్లె నియోగిహృదంతరంబు భే
దిల్లె రథాంగదంపతుల తేజము డొల్లె రతీశునాజ్ఞ వ
ర్తిల్లెను జంద్రికాప్రతతి దిక్తరుకోటులవల్లె నయ్యెడన్. ఆ-౪.

మ. అవనీనాయకు లందఱు న్వినుఁడు గుర్వర్థానుసంధానగౌ
రవ మొప్పన్ సమయస్థితిన్ సలిపితిన్ బ్రవ్యక్తమౌనట్లు స
త్యవతీదేవికి నుద్భవించినసుతుం డర్థాండు ప్రస్ఫారకౌ
రవరాజ్యంబు భరింపఁగా సకలగోత్రావల్లభు ల్గొల్వఁగన్. ఆ. ౫.

125. శిష్టు కృష్ణమూర్తికవి

ఇతఁడు సర్వకామదాపరిణయము మొదలయిన యాంధ్రకావ్యములను రచియించినకవి. ఇతఁడు వైదికబ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; వాసిష్ఠగోత్రుఁడు; సర్వశాస్త్రిపుత్రుఁడు. సంవత్సరము సరిగా తెలియదుగాని యితఁడు గోదావరిమండలమునందలి రామచంద్రపురము తాలూకాలోని గొల్లపాలెమనుగ్రామమున ౧౭౯౦వ సంవత్సరమునకును ౧౮౦౦వ సంవత్సరమునకు మధ్యకాలములో జననమొందెను. ఈతనికి రెండుసంవత్సరములప్రాయము వచ్చినప్పుడు స్వగ్రామమువిడిచి తండ్రి కుటుంబసహితముగా రామచంద్రపురమునకు లేచివచ్చి యక్కడ నిల్లు కట్టుకొని స్థిరముగా కాపుర మేర్పఱుచుకొనెను. ఈబాలుఁడు కొంతకాలము రామచంద్రపురములోఁ జదువుకొని తరువాత అయినవిల్లి గ్రామమునకుఁ బోయి బులుసు అచ్చయ్యగారివద్దఁ గావ్యనాటకాదు లభ్యసించితరువాత నింకొకరివద్ద వ్యాకరణాలంకార శాస్త్రముల నభ్యసించి మరల రామచంద్రపురము వచ్చునప్పటికీతనికి సంస్కృతాంధ్రములయం దనర్గళపాండిత్యమును కవనసైపుణియుఁ గలుగుటయే కాక సంగీతమునందును నిరుపమాన సామర్థ్యము కుదిరెను. ఆశుకవిత్వమును జెప్పుటలోను గర్ణరసాయనముగాఁ బురాణమును జదువుటలోను కృష్ణమూర్తిగారిని మించినవా రాకాలములో మఱియెవ్వరును లేరు. ఇతఁడు పురాణము చెప్పునప్పుడు పుస్తకమునుచూసి చదువుచున్నను పయికథలు దడవుకొనక తన కవిత్వములో రసవంతముగాఁ జదువ సామర్థ్యము గలవాఁడఁట! ఈయనశక్తిసంపదను జూచి రామచంద్రపురపు జమీందారగు కాకర్లపూడి రామచంద్రరాజుగారును తదనుజుఁడగు జగన్నాథరాజుగారును కృష్ణమూర్తిగారి నాదరించి తమసంస్థానములో నుంచుకొనిరి. ఆయిరువురిలో జగన్నాథరాజుగారికిఁ గవియం దధికానురాగము.

వీరిరువురికంటెను కాకర్లపూడి వేంకటకృష్ణరాజుగారికి కృష్ణమూర్తిగారి యం దెక్కువదయ యగుటచేత నాతఁడీవిద్వత్కవి కయినవల్లిగ్రామములో పదిపుట్లభూమి దానము చేసెను. అయినను నీటియాధారము లేకపోవుటచేత భూమి లాకాలమునం దిప్పటివలెఁ బంజరుండెను. ఇట్లు కృష్ణమూర్తిగారు తనకు నలువదియైదు సంవత్సరములయినవచ్చువఱకును రామచంద్రపురములో నుండెను. ఈకాలములో రామచంద్రపురము తాలూకాలోని కుయ్యేరు గ్రామములో పిండిప్రోలి లక్ష్మణకవి యను సుప్రసిద్ధాంధ్రకవియుండెను. పండితులో కవులో యిద్దఱొక్కచోట నుండినప్పుడు పరస్పరస్పర్థ లేకుండుట మనలో నరుదు. లక్ష్మణకవి యావఱకే రావణదమ్మీయమును రచియించినవయస్సునందుఁ గృష్ణమూర్తిగారికంటె నిరువదియేండ్లు పెద్దవాఁడయి యాంధ్రకవిత్వమునం దాఱితేఱినప్రౌఢుఁడు. తన కున్నంతసంస్కృతపాండిత్యము లేదని యాతని నధిక్షేపించి కృష్ణమూర్తికవి పెత్తనీఁగుచుండెను; తనవలె నాంధ్రకవిత్వము చెప్పనేరఁడని యాతని నాక్షేపించి లక్ష్మణకవి తృణీకరించుచుండెను. కృష్ణమూర్తికవి పాండిత్య మెంత యెక్కువ కలవాఁడైనను లౌకికజ్ఞాన మధికముగా లేని శుద్ధశ్రోత్రియశిఖామణి; లక్ష్మణకవి యల్పపాండిత్యము కలవాఁడేయైనను లోకానుభవమును యుక్తిచమత్కారమును నధికముగాఁ గల లౌకికశిరోరత్నము. అగుటచే నిరువురుఁ దారసించి నప్పు డెల్ల లక్ష్మణకవియే మేలుచేయి యగుచుండెను. ఈవైరకారణమునుబట్టియే కాజలూరిలో సర్వకామదాపరిణయ పఠనకాలమునందుఁ గృష్ణమూర్తిగారికిఁ బరాభవము సంభవించెను. అట్లు శృంగభంగము నొంది యాయవమానమును సహింపలేక తరువాత నల్పకాలములోనె కృష్ణమూర్తిగారు రామచంద్రపురమును విడిచి వెడలిపోయిరి. జ్యేష్ఠుఁడగు రామచంద్రరాజుగారుండఁగా స్వరాజధానిలో ననుజుఁ డగుజగన్నాథరాజు కృతినందుట యనుచితమని యాసభ కాజలూరిలో జరపఁబడెను.

కృష్ణమూర్తికవి సేతుయాత్రకుఁ బోయి వచ్చుచుండఁగా నాతని ప్రఖ్యాతిని విని కాళహస్తిప్రభు వగు దామెర వేంకటపతిరాయనింగారాయనను తమసంస్థానమునం దుండవలసినదని వేఁడుకొన్నందున కృష్ణమూర్తిగా రక్కడఁ బదునాలుసంవత్సరములుండిరి. కవి నాదరించిన యీవేంకటపతిరాయనింగారు గోదావరీమండలమునందే జననమొందినవారయి కాళహస్తి రాజపత్ని చేత స్వీకరింపఁబడిన దత్తపుత్రుఁడై ౧౮౩౮వ సంవత్సరము మొదలుకొని ౧౮౮౧వ సంవత్సరమువఱకును రాజ్యముచేసెను. కాళహస్తి సంస్థానములో నీయనకు నెల కఱువదిరూపాయలు జీత మేర్పఱుపఁబడెను. కాళహస్తికి వెళ్ళకపూర్వమో వెళ్ళి వచ్చినతరువాతనో కాకినాడలో నైదుసంవత్సరములు గోదావరీమండల కరగ్రాహివద్ద సిరస్తాదారుగానుండిన తుళసింగసెట్టిగారియింటఁ బురాణము చెప్పుచునుండి యాయనప్రోత్సాహముచేత స్త్రీనీతిశాస్త్రము నెడి యేకాశ్వాసగ్రంథమును రచియించెను. ఆగ్రంథమునందుఁ గవి తుళసింగసెట్టి నిట్లు వర్ణించెను—

సీ. శార్ఙ్గభృచ్చరణాంబుజనిసేవ యొనరించు సజ్జనసంతతి సత్కరించు
నాశ్రితకోటి సమ్యగ్గతి నలరించు నాత్మబంధుజనాళి నాదరించు
సరళనీతిపథానుషంగాప్తి విహరించుఁ బరిజనాసత్కృతిఁ బరిహరించు
నగణితానుపమానగుణలీలఁ జరించు నార్యగురూక్తుల ననుసరించు
ననుయశంబున ననిశంబు ఘనతఁ బ్రబలు
నట్టి తుళసింగసెట్టి నన్నఖిలబుధుల
మ్రోలనుతియించి యోకృష్ణమూర్తిసుకవి
సంఘటింపుము స్త్రీనీతిశాస్త్రమనుచు.

ఈయన కవిత్వరీతిని దెలుపుటకయి మఱి రెండుపద్యము లీస్త్రీనీతిశాస్త్రములోనివి యిం దుదాహరించుచున్నాను—

ఉ. మన్ననచేయ నుబ్బ నవమానముచేయఁగ స్రుక్కకే పతిం
జెన్నలరంగఁ గొల్చుచు విశిష్టతమాత్మకులప్రతిష్ఠ సం
పన్నము చేయుచుం దనను బంధులచేతఁ బొగడ్తఁగన్న య
య్యన్నులమిన్నచే జగము లన్నియు నిల్చు నటంచు నెంచెదన్.

ఉ. ఎచ్చటనో ప్రయాసపడి యేమయినం బతి తెచ్చి వేడ్కతో
నిచ్చినఁ గొంచె మేనియు మహీయముగా మది నెంచి బాంధవు
ల్మెచ్చఁగ నొచ్చి మించుకయు లేనిసమగ్రగుణంబు పెంపునన్
హెచ్చఁగఁజేయు భర్తృయశ మిట్టిసతి న్వినుతింతు రందఱున్.

ఈ పుస్తకముగాక యేతత్కవికృతమైన వేంకటాచల మాహాత్మ్య మొకటికూడ ముద్రింపఁబడి యున్నదిగాని దానిరచన కవియొక్క ప్రఖ్యాతికిఁ దగినంత శ్రేష్ఠముగాఁ గనఁబడ లేదు. కాళహస్తిలోఁ బ్రవేశించిన కొంతకాలమునకే కవిచే రచియింపఁబడిన వేదారణ్యమాహాత్మ్యముకూడ శ్రీతుళసింగసెట్టికే యంకిత మొనర్పఁబడినందునఁ గాళహస్తి పోకముందే యాతనివద్ద నుండెనేమో యని సందేహముకలుగుచున్నది. కాళహస్తిలో నున్నకాలమున నీకవిపుత్రుఁడయిన సర్వశాస్త్రి యమరుకమును సంస్కృతమునుండి తెనిఁగించి కాళహస్తిసంస్థానాధీశ్వరుని కంకితము చేసెను. ఈయమరుకములోని రెండుమూడు పద్యముల నిం దుదాహరించుట కేవలాప్రస్తుతప్రశంస కాకపోవచ్చునని యట్లుచేయ సాహసించుచున్నాను.

శా. శ్రీమీఱం దగు కాళహస్తినగరీసీమంబు ధామంబుగా
నేమం బాశ్రితకోటి కీఁ దగు ప్రశస్తిం బొల్చు నాసామి యా
సామిరాకృత భూమిభృద్వరతనూజాకామి సేమంబుతో
శ్రీమద్దామెర వేంకటేంద్రులకు వాసింగూర్చు నిష్టార్థముల్.

చ. అవునవుఁ దెల్లమయ్యె హృదయామలపలుమాటు లేఁకేమి సామి నీ
వలనఁ జనంగవచ్చు నిటు లయ్యెను మావిధి దోస మెద్ది నీ

కిపురని నీదుప్రేమరస మిట్లగునేని స్వభావచంచలం
బవు హాతజీవితంబు చనునంతన మా కొకబాధ కల్గునే.

చ. మును మన కించుకంతయును మూర్తివిభేదము గానలేదు నె
మ్మనమున మీరు దక్కం బ్రియమానుషమ్ము గల్గెం బరస్పరంబు న
య్యె యిపుడు నీకు భర్తృపద మేనును భార్యయనంగ నైతి జీ
వనగతవజ్రకర్కశతం బాటిలె నిట్టిఫలంబు నేంటికిన్.

ఈకృష్ణమూర్తికవి కాళహస్తిలో నున్నప్పుడు చేయంబడిన ప్రధాన గ్రంథ మింకొకటి గలదు. ఆ కాలములో నీయూరనున్న చెన్నపురి శాస్త్ర పాఠశాలలో నాంధ్రపండితుండైన రవస్థు చిన్నయసూరిగారికిని సిద్ధాంత కౌముదిలోని సూత్రవిచారము కొంత నడచెను. మన పండితులు సాధార ణముగా మత్సరగ్రస్తులగుట సుప్రసిద్ధమేగదా? అట్టివా రీర్ష్యచేతం దమకు లాభము లేకపోయినను బరులకు నష్టము కలుగుటనే తమ యభీష్ట సిద్ధిగా భావించి కొన్నిసమయములయందుం బరుల కీర్తికి భంగము కలి గింపంజూతురు. అంతటం బూర్వము కొంతకాలముక్రింపటం జిన్నయసూరి బాలవ్యాకరణమును రచియించెను. దానితో సరిపోల్పందగిన యాంధ్ర వ్యాకరణ మావఱకు వేఱొకటిలేదు. ఇట్లుండంగాం గృష్ణమూర్తిగారిచేం జేయంబడిన వ్యాఖ్యానముతోం గూడిన హరికారిక లనంబడెడి యాంధ్ర వ్యాకరణ సూత్రగ్రంథ మొకటి యటుతరువాత నల్పకాలమునకు వెలు వడెను. అదియే హరిభట్టకృతమై యధర్వణాదులచేం జెప్పంబడిన కారికావళి యైనపక్షమునం జిన్నయసూరి తన వ్యాకరణములోని సూత్ర ములనన్నిటిని హరికృతగ్రంథమునుండి దొంగిలించి తనపేరిటం బ్రకటించి నట్లు స్పష్టమగును. అయినను మూలగ్రంథములోం జూపంబడిన లక్ష్య ములు కొన్ని యధర్వణాచార్యుల కీవలి యాధునిక గ్రంథములలోని వగుటచేత వ్యాఖ్యానమునుమాత్రమే కాక మూలగ్రంథమునుసహితము కృష్ణమూర్తిగారే రచియించి రేమోయనిపలువురు సందేహపడుచున్నారు.

అట్టి గ్రంథమును రచియింపఁగల సామర్థ్య మావిద్వత్కవికిఁ గలదనుటకు సందేహము లేదు. ఈయన యిటువంటి గ్రంథకల్పనముచేయ సంశయ పడువారుకారని చూపుటకయి చరమదశయందు మాడుగల్లులో నున్నప్పుడొక్కరాత్రిలోఁ జేసిన ట్టీయన కారోపింపఁబడిన యశ్వశాస్త్రకథ కొంత తోడుపడుచున్నది.

కృష్ణమూర్తికవిగారు కాళహస్తినుండి స్వదేశమునకువచ్చి శ్రీరాజా గంగాధర రామారావుగారిదగ్గ పిఠాపుర సంస్థానములోఁ బ్రవేశించుట కయి నాలుగయిదు మాసము లచటనుండి కృషిచేసిరిగాని ప్రయత్నము సఫలమయినదికాదు. శ్రీరాజాగారే నూఱురూపాయలును జోడుశాలువలు నిచ్చి యాయనకు సెలవిచ్చిరి. తరువాత నాతఁడు తనకుమారుని యత్త వారియూరయిన జగ్గమపేట గ్రామమునకుఁ బోయి యక్కడఁ గొంతకాలముండి తత్సంస్థానాధిపతి ననుసరించెను. పిఠాపుర సంస్థానాధిపతియయిన శ్రీరాజా రావు నీలాద్రిమాధవరాయనింగారి భోగ భార్యాపుత్రుఁడును జగ్గమపేట సంస్థానాధిపతియునగు శ్రీరాజారావు వేంకటరాయఁడుగా రాయనకు సంవత్సరమున కిన్నూఱురూపాయలు వచ్చు మాన్యమును రెండుశాలువలు నిచ్చి సత్కరించిరిగాని నెలజీత మేర్పఱిచి తమ యాస్థానపండితునిగాఁ జేకొనలేదు. తరువాత నీకవి మైనవల్లిగ్రామములోఁ గొంతకాలము వసించి యక్కడనుండి శ్రీజగన్నాథయాత్రకుఁ బోయి పురుషోత్తమక్షేత్రమును సేవించి మరల వచ్చునప్పుడు త్రోవలో మాడుగల్లుసంస్థానమునకుఁ బోయి తత్సంస్థానాధిపతియగు శ్రీకృష్ణభూపతి గారిని సందర్శించెను. ఆయన విద్వత్కవుల నాదరించు రసికాగ్రగణ్యుఁ డగుటచేత వేయిరూపాయలువచ్చు భూము లిచ్చి కృష్ణమూర్తిగారిని తమ సంస్థానములో నుంచుకొనెను. ఈకవి మాడుగల్లు ప్రవేశించిన తరువాతఁ దానుజేసినజగన్నాథయాత్రనుగూర్చి నీలశైలనాథీయ మనుపేర సంస్కృతములో నొకగ్రంథమును రచించెను. రెండుసంవత్సరము లాసం

స్థానములో నుండి కృష్ణమూర్తిగారు ౧ు౨౦ వ సంవత్సరమునకుఁ దరువాత నెనుబదియేండ్ల ప్రాయమున నక్కడనే కాలధర్మము నొందెను. ఈయన సంస్కృతమున యక్షోల్లాస మనుకావ్యమును, వల్లవీ పల్లవోల్లాసము, మదనాభ్యుదయము నను భాణములను, రామాయణకథను జెప్పు కంకణబంధమును, హారికారికలను, నీలశైలనాథీయమును, ఆంధ్రమున సర్వకామదాపరిణయమును, వేంకటాచలమాహాత్మ్యమును, పీఠారణ్యమాహాత్మ్యమును, పంచతంత్రమును, వసుచరిత్ర వ్యాఖ్యానమును, రచియించెను.

---

126. మంత్రిప్రగడ సూర్యప్రకాశకవి

ఈకవి మాడుగొల్లు సంస్థానమున కృష్ణభూపతిగారి యాస్థానకవిగానుండి, కృష్ణార్జున చరిత్రమును రెండాశ్వాసముల ద్వ్యర్థికావ్యమును సీతారామచరిత్ర మనెడి యాఱాశ్వాసముల ప్రబంధమును భీమలింగశతకమును రచియించెను. ఈయన యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; శరభరాజామాత్యపుత్రుఁడు. ఈయన నలువదిసంవత్సరములక్రిందటఁ గాలధర్మమునొందెను. ఈయన కవిత్వము మృదుమధుర పదగుంభితమయి మనోరంజకముగా నుండును. కవితారచనను జూపుటకయి యీకవి గ్రంథములలోనివి కొన్నిపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

కృష్ణార్జున చరిత్రము.

మ. రమణీ నీగుణరూపసంపదకు లో రంజిల్లి గోపాలకుం
డమితారాతివిదారితామరసపత్రాక్షుండు కాంత్యుజ్జ్వల
త్కమనీయాకృతి రాజదర్జునసమాఖ్యాశాలి ధీరుండు దా
సుమనోరత్నము నీయధీన మగుచున్ శోభిల్ల జేసెంజుమీ. ఆ. ౧.

చ. కుతలమునందు భాగ్యమునకుం దగుకార్యము చేయునంత వి
శ్రుతయశయౌ సుభద్ర కరిసూదనవిక్రముఁ డైనగోపరా
ట్సుతునకు సమ్మతంబుగ విశుద్ధగుణాకర భూరిపుణ్యక
వ్రత మొగిఁజేయఁగాఁ దగువివాహమహోత్సవమానసంబ్రజల్ ఆ-౨

సీ తా రా మ చ రి త్ర ము

శా. ధాత్రాదిక్రతుభుగ్వరుల్ ఘనతపోధారేయమౌ నీదుచా
రిత్రం బెన్న నశక్తులే జడుఁడ వర్ణింప న్సమర్థుండనే
పుత్రీభూతసరస్వతీధవసితాంభోజాక్షరుద్రుండ వో
యత్రీ యత్రివిగాక నీకు సరిమే యన్యాగ్రజన్మాగ్రణుల్. ఆ. 3.

చ. కనకకురంగ మేల వనిఁ గన్పడెఁ గ్రక్కున దానిఁ దేరఁ బో
మ్మని పతి నేలపంపితి నహమ్మతి నారఘుభర్త దానివెం
టను జన నేల యగ్రజుని డాయఁగ లక్ష్మణు నేలపంపితిన్
జనవరుఁ బాసి యే నిచటఁ జావఁగ నిన్నిపొసంగె దైవమా. ఆ-౪

చ. నను శర ణొందినన్ దనుజనాయకు రావణునైనఁ బ్రోతు నీ
తనిఁ గరుణించుటెంత శపథం బిదిగావున మీర లేగి చ
య్యనఁ గొనిరండు వీని కభయంబు నొసంగితినన్న భానునం
దనుఁడు కృపాంబురాశియగుదాశరథిం గని పల్కె నమ్రుఁడై. ఆ ౬

భీ మ లిం గ శ త క ము.

క. తత్పురుషబహువ్రీహుల । సత్పురుషులు రామదాసశబ్దార్థ మిలన్
ద్వత్పరముగఁ జెప్పుదురు జ । గత్పావన భీమలింగ కలుషవిభంగా.

క. ఏసురవరులందైనన్ । నీసామర్థ్యంబు గలదె నిఖిలాధీశా
దాసీకృత జననీకృత । కౌసల్యా భీమలింగ కలుషవిభంగా.

127. ఫక్కి వేంకట నరసయ్య

ఈ కవి శకుంతలాపరిణయ మనెడి మూడాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు సృష్టికరణవంశజుఁడు; భరద్వాజగోత్రుఁడు; నారాయణమంత్రి పుత్రుఁడు. ఇతఁడు విశాఖపట్టణములోని క్రైస్తవోన్నత పాఠశాలయం దాంధ్రోపాధ్యాయుఁడై యుండెను. ఈ కవి యీ శకుంతలా పరిణయము నలువది సంవత్సరముల క్రిందట ననఁగా ౧౮౩౬వ సంవత్సరమునందు ముగించెను. ఇతఁడు అమరపదకల్పద్రుమము, నారాయణ స్తవము, మదనసాయకాపరిణయము, కవిదర్పణచ్ఛందము, నారాయణశతకము, కుమారీశతకము అను గ్రంథములనుగూడ రచియించెను. ఈతని కవిత్వము సలక్షణమయి మనోహరముగానున్నది. శకుంతలాపరిణయములోని కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను—

మ. తనరన్ బున్నమరేలఁ దత్పురవరోద్యత్సౌధసంచారికల్
వనజారిన్ ఘనసారఖండమని కేలంబట్టి దీపాగ్రసీ
మను ధూపక్రియఁ జూపఁ గందె చెలులం బ్రార్థింపఁగా వీడినన్
జనియెన్వాసికిసాటనుండి కలిగెం జంద్రాఖ్యయుం జిహ్నమున్. ఆ-౧

చ. తొలకరికాదు మిం చనఁగఁ దోయజబాంధవుఁ డస్తమింపలే
దలజలజారిరేఖయన నంతటనంతట నాడుచుండె మే
ల్తళుకుకడానిబొమ్మయనఁ బావులపూవులదీవెయోయు నన్
గిలకిల చిల్కపల్కులనొగిం బదపద్యము లుగ్గడించునే? ఆ-౨.

చ. సరిసరి పొమ్ము బాల యొక చక్కని బాలునిఁజూపి వీఁడు నీ
వరసుతుఁ డేనురాణి నని నావిరిఁజెప్పఁ బొడంగుచుంటి వీ
దొరలును మంత్రులున్ ఘనబుధుల్ ననుఁ బాయక యుందు వెప్ప వీ
రెఱుఁగనిరీతిగా నడవి నెన్నఁడు నిన్నుఁ బరిగ్రహించితిన్? ఆ-3.

---

128. వేల్పూరి వేంకటేశ్వరకవి

ఇతఁడు గోవ్యాఘ్రచరిత్రమును, విచిత్రరామాయణమును పద్య కావ్యములుగా రచియించెను. ఈతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; మౌద్గల్య గోత్రుఁడు; బ్రహ్మనామాత్య పుత్రుఁడు. ఈతని నివాసస్థలము విశాఖ పట్టణ మండలములోని విజయనగర సంస్థానమునందలి రావివల్సయను గ్రామము. కవి ౧౮౫౧ వ సంవత్సరమున స్వర్గస్థుఁ డయినందున, దాదాపుగా నిప్పటి కేఁబదిసంవత్సరములక్రిందట నుండినవాఁడు. అక్కడక్కడ వ్యాకరణవిరుద్ధములైన ప్రయోగములు కానఁబడుచున్నను, మొత్తముమీఁద నీతని కవిత్వము మృదువయి శ్రావ్యముగానున్నది. కవికృతములైన రెండు కృతులనుండియుఁ గొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను.

గో వ్యా ఘ్ర చ రి త్ర ము.

చ. మధుకరపంక్తిఝుంకృతులు మత్తమయూరనిశాతషడ్జముల్
పృథుతరకోకిలధ్వనులుఁ బెంపలరారు శుకప్రసంగముల్
శిథిలముగాని శారికలచిందఱవందఱచే వనాళిఁ బెం
పొదవఁగ నొప్పెఁ బుష్పమధురోజ్జ్వలసత్ఫలసంకులంబులై.

ఉ. సంతతిలేక డెందమునఁ జాలఁగ డస్సి వ్రతోపవాసముల్
సంతత మేనొనర్చి కడుసంతస మొప్పఁగ వేల్పుతేండ్ల మ
త్యాంతమునందు నిల్చి హిమశైలసుతేశ్వరు నిందుమౌళి న
త్యంతసుభక్తిఁ గొల్చి సుతు నంచితవాంఛ ఫలించఁగాంచితిన్.

వి చి త్ర రా మా య ణ ము.

ఉ. మామ యిదేటిమాట వినుమా మనమాఱడిఁజెందె నింక నా
సామిపదంబులాన కొనసాగదు తొల్లిటిభంగి దానవ
గ్రామణియింట నున్న జనక ప్రభుకూఁతురి నేలుకొంట కా
రాముని కొప్పె నొప్ప దనరాదు ప్రభుత్వముగల్గువారలన్. ౮౧.

ఉ. పుట్టి జగంబులోఁగల భూసురుల న్మునులన్ నృపాలురన్
బట్టి వధించి వజ్రధరుపాలికి నేగి సుపర్వకోటులం
గొట్టి సమస్తలోకములకున్ ములుసూపె నతండు నారదుం
డట్టితఱి న్వైకుంఠపురమంకు మురారిని జేరి యిట్లనెన్. ఆ-౨.

చ. కళుకులు దేరుబల్మిసిమికాంచనరత్నమయూఖముల్ దిశా
వలయముఁ బర్వ నచ్చరలు వైభవలీల నటింపఁ గిన్నరుల్
బలసి రథంబు చుట్టుచు సభక్తిని గొల్వ సిరోజబాంధవుం
డిల కరుదెంచెనో యన ధనేశుఁడు రాఁగ వియన్నిరీక్షుఁడై. ఆ-3.

ఉ. ఇచ్చి నృపాలుఁ డిట్లనె మునీశ్వర నీ కెనురాడి నిల్వనా
చిచ్చరకంటిసామికిని జెల్లదు సేనన నెంత యీసుతుల్
సచ్చరితుల్ సురారు లతిసాహసు లాహవకోవిదుల్ కడుం
గుచ్చితు లస్త్రశస్త్రముల గోప్య మెఱింగినటింతు రెప్పుడున్. ఆ-౪

మ. ఎదిరిం దన్ను నెఱుంగలేక మదిలో నెవ్వాఁడు ని న్నిట్లు బె
ట్టిదుఁడై నాసయు పీనులుం దునిమె కాఠిన్యంబున న్మున్ను నేఁ
జెదరంజీఱిన దేవదైత్యవరులం జింతింపఁడో చూడు మా
కదనక్ష్మాస్థలిఁ గూల్తు వానిఁ దెలియంగాఁ బల్కువేనోదరీ. ఆ. ౫.

ను. శరసంధాన మొనర్చు ప్రౌఢిమను లక్ష్యం బూహగావించు నే
ర్పరు బాహాబలవిక్రమంబు సమరోద్యోగంబు సవ్యాపస
వ్యరిపుక్షీణమహాస్త్రపాతములు రౌద్రాకారముం గన్న నా
పౌరువుం బో వెఱపొందు నీశుఁ డయినంబ్రాణనిజంబింతయున్ ఆ-౬.

ఈవిచిత్రరామాయణము గోపీనాథరచితాంధ్రవచనకావ్యము ననుసరించి యీకవిచేఁ బద్యరూపమునఁ జేయఁబడినది. ఈవచనకావ్యము ననుసరించియే యిటీవల గోదావరీమండలస్థ వెలగతుఱ్ఱుగ్రామనివాసియు నాపస్తంబసూత్రుఁడును శ్రీవత్సగోత్రుఁడును సుమామహేశ్వర సూ పుత్రుఁడును నగు నరసింహదేవర వేంకటశాస్త్రియును వైదిక కవియు

నొక పద్యకావ్యమును రచియించియున్నాఁడు. ఈ వర్తమానకవిచే రచియింపఁబడిన విచిత్రరామాయణమునందును వ్యాకరణదుష్టము లైన ప్రయోగములనేకములు కానఁబడుచున్నను మొత్తముమీఁద నీతనిగ్రంథము మొదటిగ్రంథమునకంటె నధిక రసవంతముగానున్నది. ఇందలిపద్యములనుగూడఁ గొన్నిటి నిం దుదాహరించుచున్నాను—

ఉ. రామ విరాజమానరిపురాజకిరీటమణిప్రభాసుమ
స్తోమ సుపూజితాంఘ్రి యఘహారితారకనామ నీరద
శ్యామ సురేంద్రవందితవిశాలపరాక్రమ కీర్తికామినీ
కామ కఠోరరాత్రిచరకాండవిఖండనభండనప్రియా. బాల.

ఉ. తెల్లనిమేనివానిఁ గడుతియ్యనిమాటలవానిఁ గప్పడాల్
చల్లెడుగొంతువాని బులిచాఱలతోలు బుజాలపైని రా
జిల్లఁగఁజేయువాని దెసచీరెలసూసినవాని నెత్తిపైఁ
జల్లనివెల్గుఁ దాలిచినసామిని జూచియహీంద్రుఁడెంతయున్. అయో

ఉ. ఓసి యభాగ్యురాల పడియుండక యింటను నీటేలవచ్చినా
వే సకలంబుఁబోయె నినుఁ బెండిలియాడినపూఁటనుండి నే
బ్రాసివి నీవు వేశ్మమునఁ బాదము పెట్టితి వంతకంతకుం
గా సొక లైన బట్టకొనఁ గట్టఁగ లే దిఁక లేచిపోఁగదే—అరణ్య.

శా. ఆకంఠీరవనాదము న్విని మహాహంకారసంయుక్తుఁడై
నా కేశాత్మజుఁ డాహవంబునకు సన్నాహంబుతో నేగి నే
నాకయ్యంబున నింద్రపుత్రకసహాయార్థంబు శాఖామృగా
నీకంబు ల్గొలువంగ వెంటఁజనితిన్ స్నేహంబుపెంపొందఁగన్. కిష్కింధ

ఉ. ఎవ్వఁడవోరి యేమిపని కిచ్చటవచ్చితి నిల్వునిల్వు నీ
క్రొవ్వడఁగించి ప్రొద్దుకొమరుండువసించిన లెంకి కంపెదన్
మవ్వపుదెబ్బఁ జూడు మని మారుతివక్షమునందు మోఁదె నీ
వెవ్వతెవంచు గ్రుద్ది పడనీడ్చె సమీరసుతుండు రక్కసిన్—సుందర.

శా. ఏమీ దానవవీరులార యమవహ్నీంద్రాదులన్ గెల్చు సం
గ్రామోత్సాహము లెందుఁబోయెఁ బటుదర్పం బేటికిన్
మీమీయిమ్ముల కేఁగియుంటి రిదియేమీ వైరిత్రేజంబు మీ
సామర్థంబును విక్రమక్రమరణోత్సాహంబులం దెల్పఁగన్— యుద్ధ.

129. తిరుమలబుక్కపట్టణపు చినతాతాచార్యుఁడు

ఈకవి వడ్లమన్నాటి వెంకప్ప సోమయాజులగారి ప్రేరణముచేత విశ్వగుణాదర్శమును పద్యకావ్యమునుగాఁ దెనిఁగించెను. ఇతఁడు శ్రీనివాసాచార్యునిపౌత్రుఁడు; వేంకటాచార్యునిపుత్రుఁడు. ఇతఁడు నలువదియేఁబదియేండ్లక్రిందట కృష్ణామండలములో నుండినవాఁడు. కృతిప్రేరకుఁడైన వడ్లమన్నాటి వెంకప్పసోమయాజులగారి యజ్ఞమూలముననే కృష్ణామండలములోని వైదికనియోగిబృందములో రెండుకక్షలేర్పడినవి. ఈ కవియొక్క కవిత్వమునందుఁ గొన్ని వ్యాకరణదుష్టములైన ప్రయోగము లున్నను మొత్తముమీఁద కవనరచన సరసముగా నున్నదనియే చెప్పవచ్చును. ఆంధ్రవిశ్వగుణాదర్శములోని రెండుపద్యములిం దుదాహరింపఁబడుచున్నవి—

చ. ఘనవన భూముల న్మెలఁగి కన్నము వేసి గృహాళివిత్తముం
గొని చనువారి దొంగ లనఁగూడునె పోషకులైనవారిలె
క్కను గడుబొంకుపుచ్చి తదఖర్వధనంబులు దొంగిలింతు రీ
గణకులె దొంగ లీగణకకర్ములనే భజియింతు రీజనుల్.

చ. సురభితమాలము న్గుసుమశోభితసాలము వీక్షణార్హబం
ధురతిలకాతిసాలము విధూతమహాదురితౌఘమూలమున్
సరసరసాలమున్ బనసజాలము మాధవకేళిలోలమున్
బరమగుణాలవాలమును బాయక చూడుము శేషశైలమున్.

130. మాడభూషి నృసింహాచార్యుఁడు

ఈకవి పల్లవీపల్లవోల్లాస మను మూడాశ్వాసముల ప్రబంధమును సూజవీడు సంస్థానాధిపతి యగు శ్రీశోభనాద్రి అప్పారావుగారి ప్రేరణమువలన రచియించెను. ఇతఁడు శ్రీవైష్ణవ బ్రాహ్మణుఁడు; నైధ్రువకాశ్యపగోత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; వేదాంతాచార్యులపుత్రుఁడు. ఈకవి యిరువది ముప్పదిసంవత్సరముల క్రిందట నుండినవాఁడు. ఈయనకవిత్వము సలక్షణమయి నాతికఠినమయి శ్రావ్యముగానున్నది. పల్లవీపల్లవోల్లాసములోని రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. తనయులు పెక్కుగల్గినను దన్వికిఁ బుత్రిక పుట్టకున్న ని
  త్తనువు నిరర్థకం బని మదం దలపోయుదు రింతు లంచుఁ దా
  మనమునఁ గొంతసేపు నృపమానిని చింత యొనర్చి యేమినా
  ధనమునఁ గన్యకావదనదర్శనజన్యముదంబు గల్గునో. ఆ. ౧.

ఉ. పాండుతనూభవుండు తనబాంధవు లత్తఱి సంతసిల్లఁగా
  గాండివ మెత్తియందిగిచి కల్పకృశానుసమానుఁడై లస
  త్కాండముల న్నిగిడ్చి నృపకాండములం దెగటార్చి పేర్చి త
  త్కాండమునన్ ముదం బెసఁగ దద్దయునొత్తెను దేవదత్తమున్. ఆ 3

---

131. కోటమరాజు నాగయ

ఈకవి యధ్యాత్మరామాయణమును పద్యకావ్యమునుగా రచియించెను. ఇతఁడు వెలనాటి నియోగి బ్రాహ్మణుఁడు; కాశ్యపగోత్రుఁడు; భాస్కరమంత్రికిని శాయమాంబకును బుత్రుఁడు. ఇతఁడు కృష్ణామండలములో ముప్పది నలువదిసంవత్సరముల క్రిందట నుండినవాఁడు. కావ్యము పెద్దనకవికృతమైన యధ్యాత్మరామాయణమువలె కవిత్వమంత

ప్రౌఢముగా నుండకపోయినను మొత్తముమీఁద హృద్యమయి నిర్దుష్టమయియున్నది. అధ్యాత్మరామాయణములోని కొన్ని పద్యము లిందుఁ జూపఁబడుచున్నవి—

ఉ. ధరణీదేవ భవ త్తపోమహిమ చోద్యం బయ్యె నిన్మెచ్చితిన్
వర మే నిచ్చెద హైహయుం దునిమి గర్వగ్రస్తులౌ రాజులన్
ధరణిం జే రడఁగించి కశ్యపున కీధాత్రీతలం బిచ్చి శాం
తరుచిం దాల్చుమదంశనొందిపితృహృత్తాపంబువారింపఁగన్ - బాలకాం

ఉ. రామ త్రిలోకవిశ్రుతు విరాధు నెఱుంగవె మద్భయంబునన్
వేసులు మౌను లీవనము వీడి పలాయితు లైరి నీవు మా
సేమము గోరెదేని యిట సీతను డించి నిరాయుధుండవై
భూమినదృశ్యవై ఖరనిబొమ్మురయమ్మునఁదమ్ముతోడుతన్ - అర॥కాం

ఉ. పనెఱఁగించి నంతటనె యిమ్మకరాలయ మెంత దాటి లం
కానగరంబుఁ దుత్తుమురుగా నొనరింపఁగఁ జాలుఁ గార్ముక
జ్యానినదప్రము క్తశరజాలములన్ రఘుస త్తముండు నీ
పైని మనంబుపెట్టి యొకపంథనుదెమ్మనఁడారగింపఁగన్ - సుందరకాం

మ. మునివర్యుల్ విజయోస్తుతే యనఁగ సమ్మోదంబుతో నేగి య
న్న నియోగించినభంగి నాలవణునిం జక్కాడి నిర్భీతిమై
జను లెల్లన్ వసియించుపట్టణము లిచ్ఛం జేసి తద్రాజ్యపా
లన నై పుణ్యముతోడ నిం పెసఁగఁ గళ్యాణీభవానీసతీ. ఉత్తరకాం

132 కరాలపాటి రంగయకవి

ఈకవి భూతపురీమాహాత్మ్యము, కవిజనమనోహరము అను రెండు పద్యకావ్యములను రచియించెను. ఇతఁడు వైష్ణవ వైశ్యకుల సంజాతుఁడు. ఇతఁడు ౧౭౯౪ వ సంవత్సరమున జననమొంది ౧౮౫౩వ సంవత్సరమునందుఁ బరమపదము నొందెను. ఇతఁడు చెన్నపురిలోఁ గొంతకాలము పచ్చయప్పగారి పాఠశాలయందును గొంతకాలము రాజధానీ శాస్త్రపాఠశాలయందును నాంధ్రపండితుఁడుగానుండెను. మొట్టమొదట నాంధ్రభారత భాగవత రామాయణములను లేఖకప్రమాద జనితదోష రహితములుగాఁ బరిష్కరించి ముద్రింపించిన దితఁడే. ఇతఁడు తనతండ్రిని రామకవియని పేర్కొనుటయేకాక తనతాతయైన నారాయణ సూరికూడ కావ్యరచన మొనర్చి కర్ణాటరాజులను మెప్పించినట్లు భూతపురీమాహాత్మ్యమునం దీక్రిందిపద్యముతోఁ జెప్పియున్నాఁడు—

ఉ. పాయక యేనుహామహునిభవ్యవచోగరిమం బశేషభూ
నాయకగోష్ఠిసత్కవిజనంబులచే ననిశంబు వర్ణితం
బై యరవద్యతం బరఁగు నాగుణశాలి కరాలపాటి నా
రాయణసూరిమౌళి దనరారె సుధీజనపద్మహేళియై.

మ. సకలార్య స్తవనీయభవ్యకవితాసంప్రీతకర్ణాటభూ
పకులాధీశ్వరదత్తమత్తగజశశ్వద్దానధారాసము
త్సుకరోలంబకదంబఝూంకరణవద్భంభస్స్వహప్రాంగణుం
డకలంకాశయుఁ డమ్మహాకవికులాఢ్యుండు సామాన్యుఁడే.

ఈకవి భూతపురీమహాత్మ్యములో మూడాశ్వాసములు రచియించు నప్పటికే యవసానకాలము సంప్రాప్తమయినందున గ్రంథము ముగియలేదు. ఈతని కవిత్వము నిర్దుష్టమయి మృదుమధురపదభూయిష్ఠమై రసవంతముగానున్నది. అయినను వ్యతిరేకక్త్వార్థకముమాత్రము గ్రంథమునం

దక్కడక్కడ ద్రుతప్రకృతికముగాఁ బ్రయోగింపఁబడి యున్నది. శైలి తేటపడుటకయి యీతని గ్రంథములనుండి కొన్ని పద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి.

కవిజనమనోహరము.

ఉ. పోయెఁగదే ననుం గడచి పోటరియై యదె వాఁడు రారె రా
రేయని వారిఁ దాను సమిద్ధరయంబున వెంటనంటి య
గ్గాయకపుంగవుం గదిసి గట్టిగఁ బట్టుకొనందు నెమ్మెయిం
ద్రోయఁగ లేక చిక్కువడె దుష్టనిశాటుల నోర్వ శక్యమే.

ఉ. అక్కటికంబులేని దనుజాన్వయజాతుఁడ వయ్యు నాఁకటన్
స్రుక్కుచు ధార్మికత్వము విశుద్ధమనోగతిఁ బాయలేక న
న్నొక్కడు ప్రీతితోననిచి తీయుపకారము నీసుశీలముం
దక్కొరులందుఁ గల్గునె బుధప్రియవర్తన నీకుఁదక్కఁగన్.

భూతపురీమాహాత్మ్యము.

ఉ. జారులు లేరు పేరుకొనఁ జారులకాని యనారతం బనా
చారులు లేరు తత్త్వసువిచారులకాని సరోషభీషణా
కారులు లేరు నిచ్చ లుపకారుల కాని విమర్శచేయఁగాఁ
బౌరులలోన నమ్మనుజపాలధరా పరిపాలనంబునన్. ఆ-౧.

ఉ. ఈశ గిరీశ నేరమి సహింపుము డింపుము రోష మప్రతీ
కాశము నీమహత్త్వ మెఱుఁగం దగువారము కాము సత్కృపా
పేశలదృష్టిఁ గన్గొను మపేతకళంకులఁ జేయుమయ్య లో
కేశ శరణ్యదీనులము హీనుల మెంతటివార మల్కకున్. ఆ-౨.

ఉ. అమ్మునివర్యు భార్య వినయమ్ము భయమ్ముఁ బ్రియమ్ము నెప్పుడున్
నెమ్మది సందడింప మగనిం బరిచర్యలఁ దృప్తుఁ జేయుచున్
సమ్మద మారఁగా నతిథిసంఘముఁ దన్పుచు దేవతావితా
నమ్ముల భక్తిఁ గొల్చుచు గుణమ్ములు సాధుగణమ్ము లెన్నఁగన్. ఆ-౩.

133. దామరాజు లక్ష్మినారాయణ

ఇతఁడు బృందావనవిహార మనెడి మూఁడాశ్వాసముల పద్యకావ్యమును రచియించెను. ఇతఁ డాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; శ్రీవత్స గోత్రుఁడు; శివరామామాత్యపుత్రుఁడు. ఇతఁడు తన బృందావనవిహారమును మల్కాపురములోని సీతారామస్వామి కంకిత మొనర్చెను. ఇతఁడు తరువాత గోదావరిమండలములోని నేలూరునకు వచ్చి యచ్చట నివాస మేర్పఱుచుకొన్నట్టు తెలియవచ్చుచున్నది. ఈతసంతతివారు మూఁడు తరములనుండి నేలూరునం దున్నారు. ఇతఁ డఱువదిసంవత్సరముల క్రిందట నుండినవాఁడు. ఈతని కవిత్వమునందు వ్యాకరణదోషము లనేకములు గానవచ్చుచున్నను, మొత్తముమీఁదఁ గవిత్వము మృదువుగాను మనోహరముగానునున్నది. బృందావనవిహారములోని రెండుమూఁడు పద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. ధారుణిలోనఁ జూచి విశదంబుగ నెంచిన స్త్రీల కందముల్
చారుగుణప్రధానములు చక్కఁదనంబున కేమిలెక్క యీ
నారసగంధికిన్ మిగులఁ జక్కఁదనంబుకు భూషణంబుగా
మీఱె లసద్గుణావళియు మించుగ సొంపుగ నెన్నిభంగులన్. ఆ-౧.

మ. కులగోత్రంబుల లేక నిర్మలముగా గూఢీకృచాధిక్యని
స్తులమాధుర్యనిరూపదీపకలితస్ఫూర్తైకతాసిద్గుణో
జ్జ్వలులై జన్మములంచుఁ బూనుకొని కృష్ణస్వామి రాముండు గొ
ల్లలకుం జేతురు చేయరానిపనులన్ లజ్జించెదం జెప్పఁగన్. ఆ-౨.

చ. మొఱలిడువారి కొట్టు లవి ముందుగ వింటిను వెంటనుండు నా
కఱమఱలేదు వారియెడ న్యాయముగా విహరింతు నెంతుఁ ద
త్తఱమున వారియాపదలు దాటఁగఁ జేయుదుఁ దత్క్షణంబునన్
మఱవక నన్నుఁ గొల్చుటకు మాటుగనుండెద నింతె చూడరే. ఆ-౩.

---

134. త్యాగరాజమొదలి

ఇతఁడు శుద్ధద్రావిడియైనను దెనుఁగుభాషయం దత్యంతాభిమానము గలవాఁడయి యాంధ్రభాషయందుఁ జక్కని పాండిత్యము సంపాదించి పెక్కుగ్రంథములను జేసినవాఁడు. ఇతఁడు చేసినగ్రంథములలో విద్వత్కర్ణామృతమను నామాంతరముగల సుబ్రహ్మణ్యవిజయమనెడి యైదాశ్వాసముల ప్రబంధము ప్రధానమయినది. ఈకవిచే రచియింపఁబడిన పుస్తకములలో ఛందోరత్నాకరమను చిన్నఛందస్సుకూఁడ ముద్రింపబడియున్నది. ఇతఁడు ౧౮౩౦ వ సంవత్సరప్రాంతమునందు జననమొంది యిరువదియైదు సంవత్సరములక్రిందటఁ గాలధర్మమునొందెను. ఇతఁడు నారాయణమొదలారి కుమారుఁడు. ఈగ్రంథరచనకాలమునందితఁడు ఇంజనీరింగు డిపార్టుమెంటులో అసిస్టాంటు ఓవరుసీయరుగానుండెను. ఇతఁడు తాను మొట్టమొదట నాంధ్రభాషాభ్యాసముం జేయుటనుగూర్చి యిట్లు వ్రాసికొనియున్నాఁడు—

"బాల్యంబున ప్రథమం బాంధ్రభాష నభ్యసించుటమనోదర్పణపారదంబుగదా? నాలుగేఁడులు నిండినతోడనే లసదుచ్చారణసస్యవృద్ధిగోరు మానవహాలికులు జిహ్వావలజంబునకు హాలంబుగానొచు నాంధ్రభాష నాకు ప్రథమమునం దభ్యాసమయ్యె. సముధికోచ్చారణలేని ద్రవిడదేశస్థులలో నొకండ నయ్యు నాకలవారికిఁ గల లేమి లేమియయ్యె. సంస్కృత ద్రావిడ హూణప్రముఖభాషలనాయాసలభ్యంబులయ్యె."

ఇతఁడు తన చిన్నపాత్రములకు సహితము పెద్దపేరులుపెట్టి యాత్మస్తుతిని గొంతయధికముగాఁ జేసికొన్నను, మొత్తముమీఁద నీతని కవిత్వము సలక్షణమయి హృద్యముగా నున్నది. కవితారచనను జూపుటకయి సుబ్రహ్మణ్యవిజయములోని కొన్ని పద్యములిం దుదాహరింపఁబడుచున్నవి—

మ. భువనంబు ల్జడమయ్యె భంగతతులం బొందెం బురవ్రాత మెం
దవనత్వంబులు లేక చిక్కెముని ముఖ్యావాసముల్ జంతుసం
ఘవిభ ల్వారిత మయ్యె లోకరమవీక న్వంక రయ్యె న్నవైం
దవభూషా యికనైనఁ గర్బురకులోద్భూతిమాయించవే. ఆ. ౧.

ఉ. నెమ్మది యల్కఁ గొంత భయనీతిని వల్దనిపల్క మేనిపైఁ
గ్రమ్మెడిపుల్క లొల్క భయరాగముచిల్క మరుండు దైవకా
ర్యము దలంచి మోహనశరంబు కరంబునఁ బూని యిక్షుచా
పమ్మున నుంచినైవఁ దెగువం దివియంగ హరుంఁడు వేసుకన్ ఆ.౨.

చ. తన కపరాధసంచయశతం బొనరించిన నోర్చుఁగాని తాఁ
దనవతపాళి నేర్చినమదస్మయయుక్తుని నొప్పఁడైనఁ దు
న్మ నతఁడు గాన దేవతలు పొందినవా రతనిం దదీయులన్
సనయుతఁగూడి తద్వనతినల్పి సుఖింపుము దానవేశ్వరా. ఆ. 3.

ఉ. తారల నెన్నవచ్చు నలదైత్యబలేశుల నెన్నరాదు కాం
తారతృణాళి నెన్ననగుఁ దచ్చతురంగబలంబు నెన్నరా
దార పయోధియుం దిసుక నారసి యెన్నఁగవచ్చుఁ దద్బలో
దారమహాయుధాంబకకదంబము నెన్నఁగరాదు బ్రహ్మకున్. ఆ. ౪.

మ. ఘనమాయావులు నిత్యచంచలులు నిష్కాముల్ స్వకార్యానుకూ
లనవోపాయవిధిజ్ఞు లస్థిరమృషాలాపుల్ కృపాశూన్యు లెం
దునుఁ బుంవర్యులు దేవదేవు లెపుడున్ దుర్వారసంపత్సమా
ర్తినితాంతాంధులు పల్క నేల మగవారి న్నమ్మఁగా వచ్చునే.ఆ.౫.

135. ఓగిరాల జగన్నాధకవి

ఈకవి సుమనోమనోభిరంజన మనుపేర నైదుల్లాసముల ప్రబంధమును రచియించెను. ఈతఁడారువేలనియోగిబ్రాహ్మణుఁడు; గోదావరీ మండలములోని నీలపల్లిగ్రామ నివాసుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; భారద్వాజగోత్రుఁడు; వేంకటేశ్వరామాత్యపుత్రుఁడు. ఇతఁడు తనచరమదశయందు కాకినాడపురమునుండి సుధీరంజనియను మాసపత్రిక కధిపతియయి సుమారు పదునేనుసంవత్సరముల క్రిందట లోకాంతర గతుఁడయ్యెను. ఈయనయు నీయన పెదతండ్రికుమారుఁడైనరంగనాధకవియు మఱికొందఱును సుప్రసిద్ధులైన శ్రీమంత్రిప్రెగడ వేంకటరామపంతులవారి యొద్ద లక్షణ గ్రంథములను జదివి మంచికవీశ్వరులైరి. శ్రీమదోగిరాల రంగనాధకవినిగూర్చి యీజగన్నాథకవి తన సుమనోమనోభిరంజనమునం దిట్లు వ్రాసియున్నాఁడు—

గీ. వారిలో రంగనాధుండు పండితోప
    లాల్యమానసవీనకల్యాణకల్ప
    వల్లికాముఖ్యరసవత్ప్రబంధరాజ
    కల్పనాదక్షుఁడై ఘనఖ్యాతి మెఱసె.

ఈరంగనాథకవి జగన్నాధకవికంటెను సమర్థతరుఁడనియు నధిక లక్షణవేత్తయనియుఁ బేరువడసినను, ఇతఁడు చేసినగ్రంథము లేవియు ముద్రింపఁ బడకుండుట శోచనీయముగా నున్నది. ఏతత్కవికృతమయిన ద్విరేఫదర్పణ మిప్పు డముద్రితగ్రంథచింతామణి యందు ప్రకటింపఁ బడుచున్నది.

జగన్నాథకవి తన ప్రబంధమును ౧౮౭౭ వ సంవత్సరమునందు ముద్రింపించినను, ఆవఱకతఁడు ముప్పదిరెండుసంవత్సరముల క్రిందటనే దానిని ముగించియుండెను. ౧౮౭౬వ సంవత్సరమున నేను పాఠశాలలోఁ

జనువుకొనుచుండినకాలములో సుమనోమనోభిరంజనములోని మొదటి మూడాశ్వాసములను వ్రాసికొనియున్నాను. అయినను కవి యీయిరువది సంవత్సరములలోను గ్రంథమునకు మెఱుఁగువెట్టి సంస్కరించి యెక్కువ వన్నె తెచ్చెను. ఈ గ్రంథమును సర్వకలాశాలాధ్యక్షులు పట్టపరీక్షకుఁ బఠనీయ గ్రంథమునుగా ననేకపర్యాయములు నిర్ణయించి యుండుటచేతనే దాని ప్రాశస్త్యము వెల్లడి యగుచున్నది. కవిత్వము రసవంతమయి నిర్దుష్టమయి యనర్గళధార కలదిగా నున్నది. కవనరీతి తెలియుటకయి సుమనోమనోభిరంజనములోని పద్యములఁ గొన్నిటి నిం దుదాహరించుచున్నాను.

మ. నిరతానోన్యమనస్సముద్భవసపత్నీవైరమూలాపనో
దరతిన్ గొబ్బునఁ జిత్రభానునిఁ బ్రశాత్యాహితారాత్సాయికిన్
సరవిన్ స్వస్థితుల న్వచించుకొన నిచ్చం బోవు మార్తాండజాం
బరశైవాలినులో యనందగుఁ బురద్వార్శిలహింగప్రభల్. ఉ ౧.

చ. చందురునందుఁ గల్గురుచి సంపెగతావియుఁ బారిజాత మా
రందమునందుఁ గూరిచి హిరణ్యపరాగచయంబు చల్లుచున్
బొందుగ మేళవించి మెఱపుందళుకుల్ పయిఁబూసి యాళితా
నందుఁడు నేర్పుమీఱ జతనంబుగఁ జేయఁగఁబోలు నాసతిన్. ఉ-౨.

చ. చిలుకహుమావజీ రనుకృషీవలుఁ డంగనచి త్తవప్రమున్
జలజకలంబలాంగలములన్ దళనం బొనరించి కృష్ణు ను
జ్జ్వలగుణబీజ మంటి యతిబంధురరాగరసంబునింపఁ గో
మలసుమనోరథాంకుర మమందముగా జనియించి మించెడున్. ఉ-3.

చ. అరిదరపాణి యాననమునం దవదాతమృదూర్ధ్వపుండ్రకాం
తరవరవర్ణినీమృదులనవ్యపరాగవిధీయమానసుం
దరతరచిత్రకద్యుతి గనంగ మసారమణీధరాధరో
పంశరదభ్రమధ్యతలభాసితటిల్లతరీతి నొప్పెడున్. ఉల్లాస-౪.

చ. కలువలరాచరాచూసలు గాక్కొనువెన్నెలచేఁ గరంగఁగాఁ
దొలఁకు జలప్రవాహములు తోరపుఁ గ్రొవ్విరి తేనెసోనలం
గలయుచు సర్వతోముఖముగా నిలఁ బర్వుచు గానఁ గానశీ
తలగుణసారధంబులకుఁ దావలమై తనరారు మాధవా. ఉ-౫.

---

136. నడకుదుటి రామనకవి

ఇతఁడు ప్రభులింగలీలను, హరిమీడేస్తవము, ఆత్మానాత్మవివేక చూడామణి అను సంస్కృతగ్రంథములను దెనుఁగుసఁ బద్యకావ్యములనుగా రచియించెను. ఇతఁడారువేలనియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబ సూత్రుఁడు; కౌశికగోత్రుఁడు; లక్ష్మీనృసింహుఁడను నామాంతరముగల బుచ్చనామాత్యునిపుత్రుఁడు. ఈకవి ౧౮౨౧ వ సంవత్సరమునందు జననమొంది ౧౮౮౭వ సంవత్సరమున లోకాంతరగతుఁడయ్యెను. ఇతఁడు మొట్టమొదట గోదావరీమండలమునందలి రామచంద్రపురము తాలూకాలోని శహాపుర గ్రామమునకు కరణముగానుండి, పెద్దాపురమునకుఁ జేరువనున్న తిరుపతిగ్రామముయొక్క కరిణీకమును గ్రామమునందలి భూములును దన యత్తవారివిరాఁగా శహాపుర కరణికమును దన జ్ఞాతులకు వదలివేసి ౧౮౭౩వ సంవత్సరమున సకుటుంబముగాఁ దిరుపతిగ్రామమునఁ బ్రవేశించెను. ఇతఁడు రచియించిన గ్రంథములలోఁ బ్రభులింగలీల పాల్కురికి సోమనాథుని ద్విపదకావ్యానుసారముగా నైదాశ్వాసముల పద్యకావ్యముగా రచియింపఁబడినది. తక్కినవి రెండును శంకరాచార్యుల వారి సంస్కృతగ్రంథములనుండి యాంధ్రీకరింపఁబడినవి. ఇందు వివేక చూడామణియైదాశ్వాసముల గ్రంథము. ప్రభులింగలీల ౧౮౫౯వ సంవత్సరప్రాంతమునందును, హరిమీడేస్తవము ౧౮౬౫వ సంవత్సరమునందును రచియింపఁబడినట్టు కవివంశమువారు చెప్పుచున్నారు. వివేకచూ

డామణి శాలివాహనశకము ౧౭౯౩వ సంవత్సరమునం దనఁగా హూణ శకము ౧౮౭౧ వ సంవత్సరమున రచియింపఁబడినట్లు కవియే గ్రంథమునం దీపద్యమునఁ జెప్పుకొనియున్నాఁడు—

సీ. శాలివాహనశకమధ్యసాగరద్రగ
హార్షి శశిసంఖ్యవత్సరాభ్యర్హితంబు
నగు ప్రజోత్పత్తివత్సరంబాదు మాఖ
పూర్ణిమకు గ్రంథకల్పనపూర్తి యయ్యె.

ఈతని కవిత్వమునం దక్కడక్కడఁ గొన్ని వ్యాకరణవిరుద్ధములైన ప్రయోగము లున్నను మొత్తముమీఁద శైలి రసవంత మయియున్నది. ఇతనికవిత్వరీతి తెలియుట కయి యొక్కొక్క గ్రంథమునుండి రెండేసి పద్యముల నిం దుదాహరించుచున్నాను—

ప్ర భు లిం గ లీ ల.

ఉ. నే నొకమాట పల్కెదను నీ వటుచేసి మదిష్ట మిచ్చి నీ
దాసిఁగఁ జేసికొ మ్మవిశథప్రథవాక్యఁపవై చెలంగు కా
దేని భవత్ప్రతిజ్ఞ జగదీశ్వర పొల్లగు దానఁ బాతకం
బే నినుఁ జెందుఁగాని వినుము నను బొందఁగ లేవు నావుడున్. ఆ-౨.

శా. ఆవిజ్ఞాపన మాలకించి దయతో నాయయ్యవా రింటికిన్
దా విచ్చేయ నమాత్యవర్యులు మహాధర్మానుమ క్తుల్ శమ
ప్రావీణ్యుల్ బసవన్న చెన్నబసవప్రఖ్యాతనాముల్ దగన్
సేవ ల్చేయుచు వెంబడిం జనిరి తుష్టిం జెందు భావంబులన్. ఆ-3.

హ రి మి శ్ర స్త వ ము.

శా. దేహాదివ్యతిరిక్తుఁ డాత్మయని వే త్తృత్వంబు గైకొన్న నా
త్మేహార్హాత్మకబ్రహ్మమున్ దెలివియున్ దీపించుచున్నన్ ధరన్
దేహాలో కొందఱు ముక్తి లేక చెడి రింతేకాక యాత్మత్వధీ
దేహాద్యాకృతినుండి వెండియును సందేహంబు లేకుండఁగన్.

శా. ఏవిజ్ఞాశిఖాస్వరూపు రవివహ్నీందూపలబ్ధిస్థలిన్
భావిస్ఫూర్తినిభవ్యాద్విభాంతు నుతిసత్పాత్రున్ సమస్తార్థ్య సం
సేవ ల్భక్తి నొనర్చి యాత్మగతు నీజీవత్వమున్ దేమహా
భావు ల్పొత్తురొ వాని సంసృతితమోభానున్ హరిం గొల్చెదన్.

ఆత్మానాత్మవివేకచూడామణి.

చ. నియమయమాదియోగపరినిష్ఠితహృత్పరిభావితంబు ధీం
ద్రియవిగతానుభావితము దివ్యము నింద్యపడూర్మిహీన మ
వ్యయ మనవద్యభూతివిషయాగమ మెయ్యది యట్టిబ్రహ్మమీ
వయితివి డెందమం దరయుమంచు వచించె రఘూద్వహోత్తమా. ఆ-3

మ. పుటపాకంబునఁ గాంచనం బతులమై పూర్వద్యుతిం జెందునె
ట్లటులే ధ్యానముచే గుణత్రయమలత్యాగంబుగాఁగం బరి
స్ఫుటసచ్చిత్సుఖనిత్యదివ్యనిజసంపూర్ణ ప్రభన్ బొందు న
త్కటుఁడై కోవిదుఁ డంచుఁజెప్పె మతిసీతాదృక్చకోరాత్రిజా. ఆ-ర.

---

137. మాడభూషి వేంకటాచార్యకవి

ఈవిద్వత్కవి భరతాభ్యుదయ మనెడి నాలుగాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు శ్రీవైష్ణవబ్రాహ్మణుఁడు; నైధ్రువ కాశ్యపాన్వయుఁడు; నృసింహాచార్య నందనుఁడు. ఇతఁడు సంస్కృతాంధ్రములయం దత్యంతపాండిత్యము గలవాఁడయి, శతలేఖినీపద్యసంధాన సామర్థ్యమును అష్టావధాననైపుణియు వ్యస్తాక్షరీకౌశలమును గలవాఁడయి యుండెను. ఈ కవి గోదావరీమండలములోని పెంటపాడు గ్రామవాసియై కృష్ణామండలములోని నూజవీడు సంస్థానమునందు చిరకాల ముండి విద్వానభినవ పండితరాయాది బిరుదాంకముల నందినవాఁడు.

చిన్నతనమునం దీయన ధారణాశక్తి యత్యద్భుతమైనదిగా నుండెను. అప్పు డితఁడు ద్విసంధాగ్రాహియగుటయేకాక రెండుమాఱులు చదివినపద్యమును తలక్రిందుగా నొప్పగించుటకును నెనిమిదిభాషలలో వ్యస్తాక్షరి చెప్పుటకును సమర్థుఁడయి యుండెను. ఈయన రెండుసంవత్సరముల క్రిందట వైకుంఠపదస్థుఁ డయ్యెను. ఈయన కవిత్వము నిర్దుష్టమయి మధురమై శ్రావ్యముగానున్నది. కవిత్వరీతి భరతాభ్యుదయములోని యీ క్రిందిపద్యములవలనఁ గొంతవఱకు తేటపడవచ్చును.

చ. పిలిచిన నుత్తరం బిడదు పిల్వఁబడే యిటువత్తుఁ బంచుఁ దాఁ
బలుకును బల్కరించు చెలిపై నలుగుం గను నలుదిక్కు లార్తితోఁ
బలుమఱుఁ జూచు మస్తకము వంచు వెసం దలయూఁచు నాళికుం
తల ధరణీపురందరగతస్వాంతమానసప్రవృత్తియై. ఆ-౧.

చ. చానలు గాంచి రొక్కెడ ససారమసారమణిప్రణీతసో
పానపరంపరాసితవిభాపటలంబు తదంతరుల్లస
త్స్నానలతాప్రదత్తనవదోహదధూమవిలీలఁ దోఁప సు
శ్రీనలరారు చారుసరసీరుహధామశిరోలలామమున్. ఆ-౨.

ఉ. కాంచితె సూత యీమృగము గంతముఁ ద్రిప్పి రథంబు పారెకుం
గాంచుచుఁ బోవుచున్విశిఖఘాతభయంబునఁ బూర్వకాయముం
వంచి సగంబు మేసినతృణంబు శ్రమంబునఁ నేలవ్రాలఁగా
నించుక యుర్విఁ జాల దివి నేగెడు నందకగంతు వేయుచున్. ఆ-3.

చ. వనితలు పుట్టినింట బహువర్షము లుండఁగరాదు భర్తతో
నునికియె యుత్తమం బది యటుండఁగనిమ్ము సమస్తరాజశో
భనమకుటార్చితాంఘ్రి యగు పార్థివశేఖరు ధర్మపత్నివ
య్యు నిటులు బీదరాలివలె నుండఁగ నేల సతీశిరోమణీ. ఆ-౪.

138. పెనుమచ్చ బుచ్చిరాజు

ఈకవి పరతత్త్వప్రకాశిక యనెడి యెనిమిదాశ్వాసముల వేదాంత గ్రంథమును రచియించెను. ఇతఁడు క్షత్రియుఁడు; ధనంజయగోత్రుఁడు; వేంకటపతిరాజకుమారుఁడు. ఈ కవి తాను కర్లపాలెము గ్రామనివాసుఁ డయినట్టును, సూర్యవంశపు రాజయినట్టును వ్రాసికొనియున్నాఁడు. భాగవతములోని కపిల దేవహూతి సంవాద మాధారముగా నీ గ్రంథము పెంచి వ్రాయఁబడినది. ఇతఁడు తొంబదిసంవత్సరములు జీవించి కొన్ని యేండ్లక్రిందటనే కాలధర్మమునొందినట్లు తెలియవచ్చుచున్నది. అక్కడక్కడ లక్షణవిరుద్ధములైన ప్రయోగములు పెక్కులున్నను, కవిత్వము చక్కఁగానే యున్నదని చెప్పవచ్చును. పరతత్త్వప్రకాశికలోని రెండు పద్యము లింక్రిందఁ బొందుపఱుపఁ బడుచున్నవి—

ఉ. కోరి భుజింపఁగాఁ దగినకోవిదు నాత్మవివేకశీలసం
చారు వికారదూరు శ్రుతిశాస్త్రపరీవృతనిశ్చయూర్థస
త్సారమరందబిందువిలసన్మధుపానవికాసభాసురున్
ధారుణి సర్వసంశయవిదారుని ధీరుని సద్గురూత్తమున్. ఆ-3.

చ. మనసు సుషుప్తి నొక్కవడి మానుగ గ్రుంగినఁ జేయుకార్యముల్
కనఁబడ వేమియున్ మనసు క్రమ్మఱ మేల్కని యాతఁ డాతఁడుల్
మన మనుచుండఁగాఁ గల సమస్తముఁ దోఁచు మనోవినాశమై
తనరినఁ జిత్తమింద్రియసదాగతులున్ లయ మౌను దానితోన్. ఆ-2.

—

139. మండపాక పార్వతీశ్వరకవి

ఈ విద్వత్కవి శతకములు మొదలైనవి యెనుబది గ్రంథములవఱకును రచియించినను, ఈయనచే రచియింపఁబడి ముద్రింపఁబడియున్న గ్రంథములలో శ్రీరాధాకృష్ణ సంవాదమను నాలుగాశ్వాసముల ప్రబంధము ప్రధానమైనదిగానున్నది. ఈయన వైదికబ్రాహ్మణుఁడు; పారాశరగోత్రుఁడు; కామేశ్వరపండితపుత్రుఁడు. ఈకవియొక్క తండ్రితాతలుకూడ కవీశ్వరు లయినట్టు రాధాకృష్ణసంవాదమునందు కవి యీక్రింది పద్యమునఁ జెప్పియున్నాఁడు.

సీ. శ్రీమీఱ నుభయభాషామిశ్రసత్కృతుల్
తద్జ్ఞు లెన్న మదంకితములు చేసి
యశముఁ గాంచినపేరి యమనీషిమణికిఁ బౌ
త్రత్వంబుఁ గార్తికవ్రత మహత్త్వ
శివమహాత్మ్యాద్యనేక విధప్రబంధంబు
లొనరించి సత్కవివినుతిఁ గనిన
పారాశరసగోత్రపావనుం డగుమండ
పాక కామేశ్వరపండితునకు
మహితపుత్రత్వమును గాంచి బహువిచిత్ర
చిత్రిశతిముఖ్యసత్కృతుల్ చెప్పి మెప్పు
వడసితివి గద కులకీర్తి వర్ధిలంగ
సరసగుణసాంద్ర పార్వతీశ్వరకవీంద్ర.

ఈ కవి విశాఖపట్టణమండలములోని బొబ్బిలిసంస్థానమం దాస్థానకవీశ్వరులలో నొకఁడుగా నుండినవాఁడు. ఈ పార్వతీశ్వర శాస్త్రిగారు ౧౮౩౩ వ సంవత్సరమునందు జననమొంది ౧౮౯౭ వ సంవత్సర మధ్యమున పరమపదమునొందిరి. ఈ కవి సంస్కృతాంధ్రములయందు మంచి పాండిత్యము గలవాఁడయి మృదుమధుర నిరర్గళ ధారతోఁ జతుర్విధ కవి

త్వమును జెప్పుచు వచ్చుటయేకాక వినయ సౌశీల్యాది గుణసంపత్తిగల వాఁడయి యుండెను. పూర్వోక్తమయిన రాధాకృష్ణసంవాదము రావు వారను నామాంతరముగల వెలుగోటివార నెడి గృహనామముచే వెలయు శ్రీ వేంకటగిరి సంస్థానాధిపతుల వంశానుక్రమమును వర్ణించెడు గ్రంథము. శతకములును, దండకములును గాక యీకవి రచియించిన గ్రంథములలో కాంచీపురమాహాత్మ్యము, అమరుకకావ్యము, ప్రబంధసంబంధనిబంధన గ్రంథము, శ్రీకృష్ణాభ్యుదయము, కొంతపెద్దవి. ఇప్పు డీయున్న గ్రంథములలో నొక్క రాధాకృష్ణసంవాదమునుండి మాత్రము కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

శా. సాంగోపాంగముగా శతం డఖిలవిద్యల్ నేర్చినాఁ డోర్చినాఁ
డంగీకారము నింతవట్టు మృదుచర్యం బేర్చినాఁ డేర్చినాఁ
డంగారప్రతిమాత్రపంక్తి నరిసైన్యారణ్య మిట్లయ్యు నే
సాంగత్యంబుననో వృథాకపటభాషం దీర్చినాఁ డత్తఱిన్. ఆ-౧.

ఉ. ప్రాయఁడు లెక్కలోఁ గుటిల రంగతరంగ మెఱుంగుపూఁతలన్
బాయఁడు భిత్తిభాగముల ముఖ్యవిధానములందు మందతం
బాయఁడు బాంధవానులకువారికిఁ జేయఁగలట్టి సత్కృతుల్
చేయఁడు వేఱె మీ కిప్పుడు చెప్పఁగ నేటికి మీ రెఱుంగరే. ఆ-౨.

మ. అసభూలోకధురంధరత్వ మిపు డీశ్రీరాజగోపాలకృ
ష్ణనరేంద్రుండు వహించె నాకభర మెనం బూనుదుంగాక యం
మి నృపానుజ్ఞను గోరవచ్చిన ఫణీశుండో తదేకేచ్ఛ వ
చ్చినప్రాక్కచ్ఛపమో యనం దనరెఁ దచ్ఛ్వేతాతపత్రంబటన్. ఆ-3

ఉ. తత్సభర్త ఘట్టితకతమ్మునఁ బ్రాభవమొందివోలె నం
దుత్సవ మయ్యె నింక సుర లుండఁగ నేటికిఁ బోం డటంచు నం
చత్సుమధన్వనిం గసరుజాత గనంబడఁ దామ్రచూడముల్
తత్సమయంబునన్ మొరసెఁ దామరసప్రతిమానలోచనా. ఆ. ౪.

140. సత్యవోలు భగవత్కవి

ఈకవి నాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు జగన్నాథామాత్య పుత్రుఁడు; భారద్వాజగోత్రుఁడు. ఈతఁడు గోదావరీమండలములో నించుమించుగా నూటయేఁబది సంవత్సరముల క్రిందట నుండినవాఁడు. ఇతఁ డేనుఁగు లక్ష్మణకవి మొదలగువారికి సమకాలీనుఁ డని చెప్పుదురు. ఈకవి రచియించినగ్రంథములలో రుక్మిణీపరిణయ మనెడు నాలుగాశ్వాసముల ప్రబంధము ప్రధాన మయినది. తాను నూఱుశతకములను జేసినట్టు కవి తనగ్రంథమునం దిట్లు చెప్పుకొనియున్నాఁడు—

క. ధీరత శతశతకంబులుఁ । దారావళులున్ దశావతారావళులున్
 జారూదాహరణంబులు । శ్రీరాజితదండకములుఁ జెప్పినవాఁడన్.

ఇతఁడు చెప్పిన రుక్మిణీపరిణయములోని దశావతారపద్యములు తెలుఁగుదేశములోఁ బలువురచేఁ జదువఁబడుచున్నవి. కవిత్వమునం దల్పదోషములు కొన్ని యున్నను మొత్తముమీఁద నీతనికవనము మృదుమధురపదగుంభిత మయి రసవంత మయి శ్రావ్యముగా నున్నది. రుక్మిణీపరిణయములోని యీక్రిందిపద్యములు కవియొక్క సామర్థ్యమును దేటపఱుచును—

ఉ. ఏసతి నాత్మలోఁ దలఁప నెల్లజగంబుల జంతుకోటి కా
 యాసము లేక కల్గు సరసాన్నము లాసతి యవ్విదర్భసిం
 హాసనవాసియింట శిశు వౌట నొసంగిరి పాయసాన్నము
 ల్లాసముమీఱ నాఱవనెలన్ నెలఁతల్ ద్విజబంధుకోటితోన్. ఆ. ౧.

ఉ. శ్రీకరమూర్తి వైన నినుఁ జేరి భజింపఁ దలంపుచుండుటన్
 నీకృపఁ గోరుచుండు టది నేరము గాదు సమస్తదేవతా
 నీకము చూడ మున్న సిరి నీదగుపేరెదఁ జేరఁ గోరదే
 నాకడనే జనించెను ఘనాఘనధామసమూహమోహముల్. ఆ. ౨.

చ. అరయుచు రుక్మిముఖ్యనిఖిలాధిపు లాధిపురోగరోగని
ర్భరుల తెఱంగునన్ బాగవి క్రమ్మఱ మున్నుర మైనధైర్యవి
స్ఫురణ మెలర్ప దర్పయుతశూరత ఘోరతరాస్త్రశస్త్రభీ
కరకరులై సముజ్జ్వలితనిర్జితగర్జితభూతజాతులై. ఆ. ౩.

సీ. జమదగ్నిగర్భవాసమునఁ బుట్టి వివిధవిద్యాతపోధనుర్విద్యల కధి
పతివై ప్రబలి యుదంబ్రాహ్మ్య మిదంక్షాత్ర మని మునిరాజచిహ్నముల శాప
చాపనైపుణిఁ జూపి పాపభూపతుల శతారికఠోరకుఠారధార
నస్రధారాప్రవాహములుగా శతధా సహస్రధా ఖండించి యానదులను
దర్పణము భూమిభూదేవతర్పణమును
జేసినపరశురాము నీవె యని నిను భ
జింతు వైకుంఠనాథ లక్ష్మీసనాథ
రక్షణపరాయణుండ నారాయణుండ. ఆ. ౪.

141. గురురాజకవి

ఈకవి శేషధర్మములను తొమ్మిదాశ్వాసముల గ్రంథమును రచియించి బళ్ళారిమండలములోని జోహారాపురాధిపతి యైన సంజీవి రెడ్డిగారి కంకితము చేసెను. ఇతఁ డిరువది ముప్పదిసంవత్సరముల క్రిందట నుండినవాఁడు. కవిత్వము నిర్దుష్ట మని చెప్పుటకు వలను పడక పోయినను మొత్తముమీఁదఁ బుస్తకము రసవంతముగా నున్నదని చెప్పవచ్చును. కవికృతము లయినకావ్యాదులనుగూర్చి కృతిపతి పలికినట్లుగా గ్రంథము నందీక్రిందిపద్యములు చెప్పఁబడినవి—

గీ. అలఘుతరభద్ర పడకండ్లకులసముద్ర
వరకుముదమిత్ర శుభభరద్వాజగోత్ర

విపులదాక్షిణ్య సౌజన్యవినయధన్య
కావ్యనై పుణ్య గురురాజకవివరేణ్య.

సీ. ప్రతిపద్యయమకచిత్రశ్లేష పద్మావతీపరిణయనామదివ్యనాట
కంబు నెంతయుఁ దాదృశం బగురుక్మిణీపరిణయాభిధగద్యపద్యకృతిని
గుణయుతాలంకారమణిమాలికను రాఘవేంద్రాష్టకంబుఁ బ్రాసైకతగను
జాటుధారాసహస్రంబులఁ గావించి యనిరుద్ధచరితాహ్వయాంధ్రనాట
కంబు నొనరించి తెనుఁగించి కలితభర్తృ
హరిశతకముల మృదులకర్ణాటకృతుల
సలిపి భూరుణీపాలాదిసభలలోన
గరము బహుమతు లందితి ఘనుఁడ వీవు.

కవియొక్క కవనరీతి తెలియుటకై శేషధర్మములనుండి రెండు పద్యముల నింకుదాహరించుచున్నాను—

శా. సత్యంబే పిత మాత భ్రాత మిగులన్ సత్యంబె సంభోక్తయున్
సత్యంబే తగుపాపహంతయు నొగిన్ సత్యంబె శ్రీధారియున్
సత్యంబే జగతిన్ సుహృత్తు సుఖమున్ సత్యంబె బాంధవ్యమున్
సత్యంబే యని చెప్పుచుందు రెపుడున్ సంఖ్యావదగ్రేసరుల్. ఆ-3.

ఉ. నాసవవంద్య నీ కిదియె వందన మంబుజలోచనా చతు
ర్మాసములందు నే రతిని మానసచాపలముం దృజించి బ
ల్వాసిగ సద్వ్రతంబు నిఁక వారక మీఱి యహర్నిశం బొగిన్
జేసెద నీకృపన్ విహగశేఖరకేతన శ్రీనికేతనా. ఆ-౯.

142. అల్లమరాజు సుబ్రహ్మణ్యకవి

ఈ కవి యల్లమరాజు రామకృష్ణకవి తమ్ముఁడు. ఈతఁడు చేసిన గ్రంథములలో శ్రీ బచ్చు రామేశనామునకు వైశ్యశిఖామణి కంకితముచేయఁబడిన శ్రీకృష్ణకళ్యాణ మనెడి మూఁడాశ్వాసముల ప్రబంధ మొకటి యచ్చుపడి యున్నది. ఈ గ్రంథములోఁ గృతిపతి కవిచేఁ జేయఁబడిన పుస్తకములను బేర్కొనినట్లీ క్రింది పద్యమునఁ జెప్పఁబడినది—

సీ. ప్రత్యక్షరశ్లేషపద్యాళి నగ్గల కృష్ణభూపతిసభఁ గీర్తిఁ గంటి
రహి మణిధ్వజచరిత మొనర్చి యెన్ములరామనద్రొంచేతభూమిఁ గొంటి
రసవదలంకారవసతియై చతురాప్రబంధఁ గూర్చితిని భద్రాపరిణయ
మమరంగ దొరఁగించి తాత్మబోధము నపారమగు ప్రశ్నోత్తరరత్నమాల
శేషధర్మేతిహాసవిశేష మంధ్రభాషగ నొనర్చి యుడుతల పాపయసచి
వప్రతిష్ఠితలింగమహరి రామవిభున కర్పించితిని పుణ్యవిభవ మొసఁగ.

ఈ కవి వాసస్థలము గోదావరీమండలములోఁ బిఠాపురమునకు సమీపమున నున్న చేబ్రోలను గ్రామము. ఈతఁడు ద్రావిడ బ్రాహ్మణుడు; హరితసగోత్రుఁడు; రంగనాథార్యపుత్రుఁడు. ఈకవి వృద్ధదశలోఁ గొన్నిసంవత్సరముల క్రిందట లోకాంతరగతుఁ డయ్యెను. ఈతనికవిత్వము నిర్దుష్టమయి మనోహరముగా నుండును. కవిత్వప్రౌఢిమ తెలియుటకయి శ్రీకృష్ణకళ్యాణములోని కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను.

చ. చెలిమినిగాదె క్రొత్తలు వచించెదవో యదువంశనాథ నీ
యలఘుభుజాబలశ్రితులమా మముబోటుల మీవు లేనిచోఁ
జెలువుఁడు లేనియింతులటు చింతిలుచుందుము నీవు చెంగటన్
వెలసిన నింద్రునితోడఁ దగువేల్పులరీతి సుఖింతు మెంతయున్. ఆ-౧.

మ. చనునే కృష్ణ భయప్రకంపితులమై శత్రుప్రిదుల నీవుడి యా
తనితో సంధికి నేఁగుటల్ మనకు శుద్ధక్షత్రవంశంబునన్

జననం బందియు నాత్మబాహుబలమున్ శౌర్యంబుఁ గోల్పుచ్చి భీ
తి నోరుం గూడుట రాజధర్మ మగునే ధీరు ల్విన న్నిత్తురే. ఆ-౨.

ఉ. ముద్దుల మూటఁగట్టు నగుమోముఁ గొంగు తరఁగి పాళికిన్
హద్దులుదిద్దు ముత్తరులఁగుందము కుందమిళిందబృందమున్
సద్దణఁగించిమించు రదనంబుల చక్కఁదనంబు వేణిడా
లద్దిర యుద్ది దీని కిదియా నిధియా గుణరత్నరాజికిన్. ఆ-3.

---

143. గోపీనాథము వేంకటకవి

ఈ కవి వైదికబ్రాహ్మణుఁడు; నెల్లూరిమండలములోని కావలి తాలూకాలోని లక్ష్మీపుర గ్రామవాసి. ఇతఁడు శ్రీ వేంకటగిరి సంస్థానమునం దాస్థానకవీశ్వరుఁడుగా నుండి ప్రసిద్ధి కెక్కినవాఁడు. ఈకాలపుఁ గవులలో నితఁడు బహుమహాగ్రంథములను రచియించినవాఁడు. భాస్కర రామాయణాదులు వాల్మీకివిరచిత మూలగ్రంథానుసారముగా నుండలే దని మూలగ్రంథములో నున్న గాసికంటె నెక్కువ గాని తక్కువ గాని లేకుండునట్లు సరిగా వాల్మీకిరామాయణ మంతయు నితఁడు పద్యకావ్యముగాఁ జేసెను. మఱియు నితఁడు బ్రహ్మకైవర్త పురాణములోని కృష్ణజన్మఖండము నెనిమిదాశ్వాసముల పద్యకావ్యముగాను, మాఘకవి కృత మయిన శిశుపాలవధను నాలుగాశ్వాసముల పద్యకావ్యముగాను, శ్రీ భగవద్గీతాశాస్త్రమును, తెనుఁగున రచియించి మెప్పించి వేంకటగిరి సంస్థానాధీశ్వరులచే నొక యగ్రహారమును బడసెను. ఇతఁడు మిక్కిలి వృద్ధుఁడయి కొన్ని యేండ్లక్రిందటఁ బరమపదము నొందెను. ఈతని కవిత్వము మొత్తముమీఁద సలక్షణ మయి నాతికఠినమయి హృద్యముగా నున్నది. ఈయన గ్రంథములలోని కొన్ని పద్యము లిం దుదాహరింపఁ బడుచున్నవి.

రామాయణము.

చ. ఘనగుణశాలి ప్రాణమునకంటెఁ బ్రియుం డగురామచంద్రునిన్
జనసుతు నొంటిఁ బంపి నిమిషం బయినన్ మనఁజాల వంశవ
ర్ధనుఁ డగునట్టి యీతలిరుఁ బ్రాయపుముద్దులకుఱ్ఱఁ డేల నీ
యనుమతి నేన వచ్చెద సురారులఁ జంపి మఖంబు గావఁగన్. బా॥ కాం.

ఉ. చంద్రునివంటి నెమ్మొగము చాఁగెడుకన్నులు వృత్తదంష్ట్రికముల్
సుందరపల్లవాధరము సొగసౌరు ల్మణికుండలప్రభా
బంధురకర్ణయుగ్మమును బారెడుచేతులుఁ గల్గురాము నిం
పొందఁగఁ జూడకన్న నిలుపోపఁ దరంబెసుమంత్రయి త్తటిన్. అయో

చ. యిసకిరణాళికిం జొరవ యీక సదాగతిరాక కైనఁ బ
ల్చనపడ కర్థి సైకతముఁ జల్లిన రాలఁగనీక దట్టమై
దనుజవిముక్తకాండములఁ దట్టుచు దిక్కుల రామకాండముల్
సునిసితభంగి నిండుటయుఁ జూచి సురల్వెఱఁగందిరయ్యెడన్. అరణ్య.

ఉ. భూవరవర్య యెవ్వని సముద్ధతిఁ జావుటకై కడంగి సు
గ్రీవునితోడ నెయ్య మొనరించి తదీప్సితసిద్ధిఁ గోరి న
న్నీవిధిఁ జంపి తట్టెదనుజేంద్రుని రావణుఁ గీటడంచి నీ
దేవిని నెందుడాఁచినను దెచ్చియొసంగనెయొక్కవ్రేల్మిడిన్. కిష్కింధా

ఉ. ఓరిదురాత్మ యిందు బుధు లుండగొ యుండిన నీవు వారలం
జేరవొ సాధువాక్యములు చేకొన నొల్లవొ శిక్ష లేమి నా
చారవిహీనమై సకలసజ్జనగర్హిత మయ్యె నీమతం
బారయ నీకతంబున నిశాటకులంబు చెడు న్నిజంబుగన్. సుందరకాం.

మ. మరియున్ రావణి సాయకంబులు ధనుర్మౌర్విం దగంగూర్చి బ
ల్గరులాడం దెగనిండఁదీసి వెస వక్షం బుచ్చిపో నేసినన్
గురుబాణక్షతజాతరక్తకలితాంగుండై సుమిత్రాసుతుం
డరయం బొల్చె విధూమవహ్నిగతిఁ బుష్పాఢ్యద్రుమప్రక్రియన్.
యుద్ధకాం.

కృష్ణజన్మఖండము.

ఉ. పల్లవితప్రదేశయములు చారుమణీదళపద్మకైరవో
త్పలకలితాళి గంధలుబ్ధసుతానమధువ్రతగీతనాదముల్
కలరవచక్రకుక్కుటమరాళమనోహరమంజుశబ్దముల్
గలిగి మనోజ్ఞసంపదలఁ గ్రాలు విశాలసరోవరం బొగిన్. ఆ. 3.

మ. పరికింపం గడు దుర్లభం బవనిలోఁ బ్రాణేశకాంతామణీ
పురుషప్రేమగుణాళిరీక్ష మనిశంబుం బాతిచారిత్రయుక్
స్మరసారజ్ఞయు సాధ్వియుక్ రసికయున్ జాతుర్యసంయుక్తయా
తరుణీరత్న మెఱుంగు సత్పురుషుఁడుక్ దక్ష్యంబుచింతింపఁగన్. ఆ. ౮

శిశుపాలవధము.

శా. సామర్థ్యంబున మాఱులేనిబల మస్మాకం బనివ్వాధి స్త్రీతవి
ద్యామర్యాద నెఱిఁగి పోవుబల మస్మాం బెట్టు లీరెంటికిన్
నేమం బెవ్వడు భూరితేజమునకుం జీకట్లకుం బోలె బ
ల్సామానాధికరణ్య మెట్లు గలుగున్ జర్చింప లోకంబునన్. ఆ. ౧.

చ. అలఘుధనుష్ప్రభావము గుణాధిమహత్త్వము ముష్టిశక్తియో
యిలయు దిగంతముల్ గగన మీను మనస్సువో నేమిచిత్రమో
తెలియఁగరాదు శౌరిసముద్గ్నిశరంబులు చిత్రజల్లుల
ట్లలవడ నొక్కరీతిఁ గురియుం దొడఁగెన్ ధ్వనిపూర్వకంబుగన్. ఆ. ౪.

భగవద్గీత

ఉ. మెండుగ వృష్టికాలమున మిన్నక వాఱునదీప్రవాహముల్
నిండి చలింపకున్న యలనీరధిఁ జేరినమాడ్కి నెవ్వఁడుం
దండిగ సర్వకామములు తప్పక చేరు సతండు శాంతుఁడై
యుండు సకాముఁడై సనరుఁ డొందఁడు శాంతిని బాండునందనా.

చ. అలయక యోగరీతిని బ్రయత్నము సేయుచు నాత్మయందు ని
శ్చలముగ నున్నవానిఁగ నిజంబు నెఱుంగుదు రజ్ఞులైనని
శ్చలమతిహీను లొక్కమొగిఁ జాలఁ బ్రయత్నము చేసియున్ సము
జ్జ్వలుఁ డగునీశ్వరుం దెలియఁ జాలరు భారత నిక్కమింతయున్.

5. సతీ[illegible] విలాసము
6. సుమిత్ర చరిత్రము
7. రఘుదేవరాజీయము
8 కురంగేశ్వర వర్తక చరిత్రము
9. కళావతి పరిణయము
10 గయ్యాళిని సాధుచేయుట
11. చిత్రకేతు చరిత్రము
12. దానకేసరీవిలాసము
13. వైదర్భీవిలాసము
14. భానుమతీ కళ్యాణము
15. సరసిజనయనోభిరామము
16. ధర్మకవచోపాఖ్యానము
17 కుమారద్వయవిలాసము
18. పద్మనీప్రభాకరము
19. మాలతీమధుకరము

స్త్రీలకుపయోగించు పుస్తకములు

ఆఱవ సంపుటము

1. శ్రీ విక్టోరియా మహారాజ్ఞి చరిత్రము
2. సతీహితబోధిని
3. పత్నీహితసూచని
4. స్త్రీ నీతిదీపిక
5. సత్యాద్రౌపదీ సంవాదము
6. మాతృపూజ పితృపూజ
7. నీతికథామంజరి ప్ర॥ భాగము
8. డిటో ద్వి॥ భాగము
9. దేహారోగ్యధర్మబోధిని

ఉపన్యాసములు

ఏడవ సంపుటము

1. జన్మాంతరము
2. అతిబాల్య వివాహము
3. విగ్రహారాధనము
4. ఈశ్వరదత్త పుస్తకములు
5. ఈశ్వరోపాసనము
6. ప్రార్థన
7. మానుషధర్మము
8. విద్యాధికుల ధర్మములు
9. మనుష్యజీవితముల యొక్క పరమార్థము
10. వైరాగ్యము
11. విద్యాధురీణుల యవశ్యకృత్యములు
12. వర్ణము
13. హిందూమతములు
14. స్వయంకృషి
15. సకాయకష్టకర్మలు
16. వేశ్యాకాంతల యుప॥
17. ఐకమత్యము
18. దానములు
19. స్త్రీ పునర్వివాహచరిత్రం
20. స్త్రీ పునర్వివాహవిషయకోపన్యాసం
21. స్త్రీ పునర్వివాహ విషయక ప్రథమ విజ్ఞాపనము
22. స్త్రీ పునర్వివాహ విషయక ద్వితీయ విజ్ఞాపనము
23. స్త్రీ పునర్వివాహశాస్త్ర సంగ్రహము
24. స్త్రీ పునర్వివాహ భూతవర్తమాన స్థితులు

ఉపన్యాసములు-జీవచరిత్రలు

ఎనిమిదవ సంపుటము

1. దేశీయమహాసభ దాని యుద్దేశము
2. శంకరాచార్యులు

ఎనిమిదవ సంపుటము (contd)

3. బసవరాజు గవర్రాజుగారి జీవ చరిత్రము
4. జీసస్ చరిత్రము
5. స్వదేశసంస్థాన చరిత్రాదులు
6. విగ్రహతంత్రవిమర్శనము
7. ఉపన్యాసమంజరి
8. వివేకవర్ధని మొదటిభాగము
9. „ రెండవభాగము
10. „ మూడవభాగము

సాహిత్యగ్రంథములు

తొమ్మిదవ సంపుటము

1. సంగ్రహవ్యాకరణము
2. కావ్యసంగ్రహము
3. అలంకారసంగ్రహము
4. నీతిచంద్రిక - విగ్రహము
5. నీతిచంద్రిక - సంధి
6. తర్కసంగ్రహము
7. సత్యవాదిని
8. ఉత్తమస్త్రీ చరిత్రములు

ఆంధ్రకవుల చరిత్ర

పదియవ సంపుటము

పూర్వకాలపు కవులు 1 వ భాగము
మధ్యకాలపు కవులు 2 వ భాగము
అధునిక కవులు 3 వ భాగము

స్వీయచరిత్రము

పదకొండవ సంపుటము

1, 2 భాగములు కలపి

N. B. పై గ్రంథములన్నియు వాల్యూములుగాను విడిగాను కూడ దొరకును.

పుస్తకములు వలయువారు :—